Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీ సత్యసాయి ప్రబోధామృతము

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీ సత్యసాయి ప్రబోధామృతము

1

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీ సత్యసాయి ప్రబోధామృతము

ప్రథమ భాగము

(అ నుండి న వరకు)

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

© సర్వహక్కులు సంకలనకర్తలవే

సంకలన
తూములూరు కృష్ణమూర్తి
తూములూరు ప్రభ

'అనసూయ'
C-66 దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ
హైదరాబాదు - 500 007
ఫోన్ : 7631904, 7614083
emial tumuluru@hdl.vsnl.net.in

డి.టి.పి.
ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్, బాగ్‌లింగంపల్లి
హైదరాబాద్ - 44 ఫోన్ : 7660000

ముద్రణ

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

సమర్పణ

విఘ్నేశ్వరాయనమ ఓం
విఘ్నహరాయ నమ ఓం
విశ్వేశ్వరాయ నమ ఓం
సాయీశ్వరాయనమః

ఆది దేవాయ పరమపురుషాయ
పురుషోత్తమాయ సచ్చిదానంద (మూర్తయే) రూపిణే
పర్తి దేవాయ పరమపూజ్యాయ
శ్రీసాయి దేవాయ నమోనమః

అనాథ నాథం దేవం
ఆది దేవం నమోస్తుతే
పరమేష్ఠిం పరంధామం
పరమాత్మం పరమేశ్వరం
సాయినాథం నమస్తుభ్యం
పర్తి పురీశ్వరం సద్గురుం
శ్రీసత్యసాయినం నమోస్తుతే.

కనకాంబర ధర నీలకుంతలసాయి నమోనమో
కోటి మన్మథ లావణ్య నవసుందరాకార
శ్రీసాయి రామ ప్రభో నమో నమో॥

శ్రీశ్రీశ్రీ భగవాన్ శ్రీసత్యసాయి బాబావారి కృపానుగ్రహములతో 'సాయిఅవతార్' రెండవ భాగము కీ.శే. సి.ఎల్. గాంధి గారి సి.జే.గాంధి వెల్ఫేర్ ట్రస్టు ద్వారా ముద్రింపబడినది. మూడవభాగము కీ.శే. టి. యస్. సదాశివంగారిచే ముద్రింపబడినది. వారే స్వామికి సమర్పించినారు. తరువాత ఆంగ్లభాషలోనే Digest 1,2,3 లు సంకలనం చేయబడినవి. వాటిని ఇటలీవాస్తవ్యులు శ్రీ ఆంటోని క్రాక్సీ గారు ప్రచురించినారు. సనాతన సారథి సంపాదకులు కీ.శే.వి.కే.నరసింహంగారు ముందుమాట వ్రాసినారు.

1976, 1978లలో 'శ్రీసత్యసాయి సూక్తులు' తెలుగులో సంకలనం చేయబడినవి. కీ.శే.సి.ఎల్.గాంధి గారిచే ప్రచురించబడినవి. సనాతన సారథి సంపాదకులు కీ.శే.నా. కస్తూరి గారు వాటికి ముందుమాట వ్రాసినారు. ఇవి గాంధిగారే స్వామికి సమర్పించినారు.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

'తెలుగు తేనెలొలుకునటుల' దైవభాషగా ఉపయోగింపబడుతున్న మాతృభాషలో సుమధురంగా, కమ్మగా శ్రావ్యంగా పండితులకు పామరులకు అర్థమయ్యేరీతిగా అతి సులభశైలిలో బాబావారు బ్రహ్మసూత్రములు, గీత, ఉపనిషత్తులు, రామాయణ, భాగవతములు, మొదలగు నవి 'వాహినులుగా రచించినారు. వారి దివ్యోపన్యాసములు, పలికినపలుకులు, ఆంగ్ల భాషలో తర్జుమా అయినవి. అవుతున్నవి.

స్వామి తెలుగులో మాట్లాడటం, సంభాషించటం, వ్రాయటం తెలుగువారి అదృష్టము. అందుమూలముగా ఆంగ్లభాషలో Digest 1,2,3 పద్ధతిగా 'అక్షరక్రమ'ముగా శ్రీబాబావారి అనుగ్రహముతో, వారి రచనలనుండి దివ్యోపన్యాసములనుండి కొన్ని ప్రబోధములు "శ్రీసత్యసాయి ప్రబోధామృతము"గా సంకలనం చేయబడినది.

స్వామి పలికిన ప్రతి పదమూ, వ్రాసిన ప్రతి అక్షరమూ మంత్రములే, అమృతబిందువులే. వాటిలో ఇవి రుచికరములు, అవి కావు అనుటకు వీలు లేదు. అన్నియు ఆచరణీయములు. శిరసావహించవలసినదే. వారి ప్రబోధములు అనేకములు. అన్నియు ఇందు చేర్చుటకు వీలుకాదు. మాకు స్ఫురించి నటుల ప్రబోధములు కొన్ని పదములు క్రింద సంకలనం చేయబడినవి. అవియే వేరొక పదముక్రింద సేకరించవచ్చును. అందులకు వీలైనంత వరకు ... (చూ॥) అని ఆ పదముల క్రింద చూపబడినవి. ఇందు క్రోడీకరింపబడిన పదములకు సూచిక ఇవ్వబడినది.

ఇందు క్లుప్తముగా షిరిడి సాయి బాబావారి జీవిత చరిత్ర, స్వామివారి బాల్యము గురించిన విషయములు, షడ్ దర్శనములు దైవిక (మత) ఆరాధనలు, వివిధోపాసనలు, అష్టపుష్పములు, అష్టాంగ యోగములు, సందేహములు - సమాధానములు అవతార దివ్యప్రకటనలు, అవతార కార్యక్రమములు మొదలగునవి సేకరించబడినవి.

ఇందు కొరకు ఉపయోగించిన ప్రమాణ గ్రంథముల పట్టీ ఇందు చేర్చబడినది. ఆ ప్రచురణ వివరములు సంకేతాక్షరములతో సూచించబడినవి. క్రొత్త ముద్రణలను చూచిన పుట నెంబర్లు మారవచ్చు. ఈ పుస్తకము వీలుగా వాడుకునేందుకు రెండు భాగములుగా 'అ' నుండి 'న' వరకు ప్రథమ భాగముగా 'ప' నుండి చివరి అక్షరమువరకు రెండవ భాగముగా చేయబడినది.

ఆచార్య శ్రీ జి.వి.సుబ్రహ్మణ్యంగారు స్వామి సేవగా భావించి సలహాలనిచ్చి నన్ను ప్రోత్సహించారు. వీరే పీఠిక వ్రాసినారు. శ్రీ వి.యస్.ఆర్. మూర్తిగారు శ్రీ బి.ఆర్.ప్రసాదుగారు ప్రూఫులు దిద్దినారు. శ్రీ బి.వి. సత్యమూర్తి, శ్రీ వై. శ్రీనివాస్ ఇందుండు చిత్రములను అందించారు. ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్ వారు శ్రీమతులు నిర్మల, సునీత, పద్మలు డి.టి.పి. చేసినారు. స్వామి వీరందరిని ఆశీర్వదించమని ప్రార్థించుచున్నాము.

కలియుగంలో భగవాన్ శ్రీసత్యసాయి బాబావారు పూర్ణావతారముగా వచ్చారు. మనము వారి సమకాలికుల మగుట మన పూర్వజన్మ సుకృతము. స్వామివారి బోధామృతము, శ్రవణ, మనన నిదిధ్యాసములతో అవతార సేవాకార్యక్రమములో పాల్గొని ఆచార మానవులుగా మెలుగుతూ వారి ప్రేమానురాగములకు పాత్రులమై ప్రేమామృతమును గ్రోలి మనజీవితములను ధన్యము గావించుకోవలెను.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

స్వామివారు తమ దివ్యసేవాపథంలోని అనేక కార్యక్రమములలో మా దంపతులకు ఈ సేవాభాగ్యము కలగించినారు. ధన్యులము. సర్వవేళల స్వామిపాదములకు దూరముకాకుండునటుల, సాయిసేవలో, సాయిరామనామరసం గ్రోలు నటుల, ఎల్లప్పుడు వారి ప్రేమానుగ్రహములకు పాత్రులగు నటుల మాకృతజ్ఞతా పూర్వక సాష్టాంగ దండప్రణామములు ఆచరించి వారిని ఈ విధముగా ప్రార్థించుచున్నాము.

ఏమని వేడుకొందురా రామ శ్రీరామ
జయరామ, శ్రీసత్యసాయిరామ
ఏమని మొరలిడుదురా రామ
శ్రీరామ, శ్రీసత్యసాయిరామ
ధన ధాన్యము లాశించలేదు
నీచరణ దాస్యమే వేడుకొంటిమిరా రామ
శ్రీరామ, జయరామ, శ్రీసత్యసాయిరామ
ఆలించి పాలించి, పోషించుమురా రామ
శ్రీరామ, జయరామ, శ్రీసత్యసాయిరామ

దయజూడరా, దయగనరా
దయాబ్ధివని, కృపాబ్ధివని
నెరనమ్మితిరా రామ, శ్రీరామ
జయరామ శ్రీసత్యసాయిరామ

లోకాస్సమస్తాస్సుఖినోభవంతు.

హైదరాబాదు
27.5.2002

తూములూరు కృష్ణమూర్తి
తూములూరు ప్రభ

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీ సత్యసాయి సూక్తి సుధామాధురి

"యుగ యుగంబులనుండి యీ యుర్విపైన
ఖ్యాతి గన్నట్టి భరత భూమాత కీర్తి
సాయి బోధల మిగులంగ సానబెట్టి
వన్నె బెట్టుడు మీరింక సున్నితముగ". -బాబా.

భగవంతునికి చేసే అక్షరార్చన - ఒక ఆరాధనా విశేషం. క్షరం కానిది అక్షరం. 'ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ.' నశించని అక్షరతత్త్వం ఓంకార రూపమైన బ్రహ్మం. ఓంకార రూపుడైన సచ్చిదానంద పరబ్రహ్మ భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు. వారి నోట వెలువడిన మాట అక్షర సత్యం, పరమార్థ తత్త్వం.

"సాయి మాట సకల సౌభాగ్యముల మూట
సాయి దృష్టి పారిజాత వృష్టి
సాయి చేయి తల్లి ప్రేమలోపలి హాయి
ఉన్నమాట తెలుపుచున్నమాట".- బాబా.

సాయి మాట ప్రత్యక్షంగానూ, గ్రంథరూపంలో పరోక్షంగానూ వినపడుతుంది. వినేదీ, వినిపించేదీ, ఆలోచించేదీ, ఆచరించేదీ సాయిమాట. వినటంవలన శ్రవణానందాన్నీ, వినిపించటం వలన మననానందాన్నీ, ఆలోచించటం వలన అమృతానందాన్నీ, ఆచరించటం వలన ఆత్మానందాన్నీ అందిస్తుంది సాయిమాట. ఈ నాలుగు ప్రక్రియల ద్వారా సాయి మాట ఆధ్యాత్మికంగా ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థాల ఫలాలను కలిగిస్తుంది. అదే సకల సౌభాగ్యాల మూట.

సాయిదృష్టి స్వామి అనుగ్రహానికి చిహ్నం. అది పారిజాత పుష్పవృష్టి వంటిది. వాడదు, చెడదు, సువాసన వీడదు. అక్షయంగా అనంతంగా భక్తుల మీద అమృత వృష్టి కురిపిస్తుంది. సాయిమాటను విన్నా, పలికినా, పఠించినా, పాటించినా సాయి దృష్టి (కటాక్షం) లభిస్తుంది. సాయిమాటను స్మరిస్తే సాలోక్య ముక్తి. సాయి దృష్టిని పొందగలిగితే సామీప్యముక్తి.

సాయి చేయి స్వామి ప్రేమకు ప్రతీక. చేయి అభయహస్తం, వరప్రదాన హస్తం, సర్వరక్షామంత్రహస్తం, సర్వశుభాల ప్రేమహస్తం. తల్లి ప్రేమలోని హాయి ఆ చేయి అందించే అనుభవస్థాయి. సాయి చేయి సారూప్య ముక్తి ప్రదాయి.

ఈ మూడు ముక్తులూ పొందిన సాధకుడికి సాయుజ్యముక్తి అక్షరసత్యం. ఇదే ఉన్నమాట! సాయి తెలుపుతున్న మాట!

అక్షర పరబ్రహ్మయే ప్రేమావతారులుగా రూపొంది మనమధ్యకు విచ్చేసిన దివ్య రూపులు భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు. వారి ప్రతి మాటా పరమ ప్రమాణం. అవతార పురుషులుగా వచ్చి ఈ లోకాన్ని పరమాత్మవైపు నడిపించే మహోద్యమాన్ని పరమ దయాళువై చేపట్టారు. ఆ మహత్తర దివ్య కార్యక్రమంలో వారి అక్షయ తత్త్వాన్ని అవనిమీద అక్షరంగా నిలిపే అంశాలలో వారి ప్రబోధలు అజరామరంగా నిలుస్తాయి. అందుకే వారి వాఙ్మయ మధురధార ప్రబోధామృత వాహిని.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

అవతారమూర్తి అక్షర జగత్తును భద్రపరచి ప్రచార ప్రసారాలు చేసే ఏ ప్రయత్నమైనా అక్షరార్చనము. స్వామి మాటలు నోటు చేసుకోవచ్చు, టేపు చేసుకోవచ్చు. పత్రికలలో ప్రచురించుకొనవచ్చు. గ్రంథాలుగా వెలువరించవచ్చు. వీడియోలలో భద్రం చేసుకోవచ్చు. ఇంకా ఎన్నో రకాలుగా స్వామి మాటను మూట కట్టుకొని, మనం వాడుకోవచ్చు. భావితరాల వారికి అందించవచ్చు. ఇది మనం సాధనగా చేసే అక్షరార్చన.

అవతార వాఙ్మయాన్ని భద్రపరచటంలో వినియోగించడంలో 'డైజెస్ట్'ల తయారీ ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఆకలి అయినప్పుడు అన్నం తిని జీర్ణించుకోవటం కర్తవ్యం. అలాగే 'జీర్ణమంగే సుభాషితమ్' అని న్యాయం, మనిషి కడుపుకే కాక మనసుకూ, బుద్ధికీ, ఆత్మకూ కూడా ఆకలి వేస్తుంది. వాటి ఆకలి తీరాలంటే అక్షర రూపమైన ఆహారమే కావాలి. శ్రీ సత్యసాయి ప్రబోధాలు అనంతమైన అక్షర నిధులు. వాటిలో నుండి కావలసినంత గ్రహించాలంటే ఒక వ్యవస్థీకృత గ్రంథసంచయం కావాలి. అకారాది క్రమంలో, అన్వయ బంధురంగా, విశ్లేషణ వివేకంతో శ్రీ సత్యసాయి ప్రబోధాంశాలను ఎన్నిక చేసి, మన్నిక కలిగేటట్లు వరుసగా కూర్చి, పాఠకుడికి (సాధకునికి) పండొలిచి చేతిలో పెట్టినట్లు అందించగల ఒక విషయ సంగ్రహ విజ్ఞాన సర్వస్వం వంటి గ్రంథం కావాలి. అదే 'డైజెస్ట్'. తెలుగులో దానిని 'అమృతం' అనే పారిభాషిక పదంతో పిలువ వచ్చునని ఈ గ్రంథం చెపుతున్నది. 'డైజెస్ట్'లో (జీర్ణించుకొనటంలో) పదార్థం నశించదు కాని శక్తిగా మారుతుంది. కాని, పదార్థం నశించేదిగా, శక్తి నశించనిదిగా తోస్తుంది. భుక్తి జీర్ణించి శక్తిగా మారటం లోకధర్మం. సూక్తి జీర్ణించి ఆలోచనామృతంగా ఆచరణగా నిలవటం అక్షర సంప్రదాయం. ఈ మర్యాదతో 'శ్రీ సత్యసాయి ప్రబోధామృతము' వెలువడుతున్నది.

ఈ అక్షరార్చన సంప్రదాయాన్ని జీవితవ్రతంగా, సాధన మార్గంగా, ఆరాధనా విశేషంగా భావించి అనుక్షణం ఈ సాధనలో స్వామికి తమ శక్తి యుక్తులు ధారపోస్తున్న పుణ్య దంపతులు తూములూరు ప్రభాకృష్ణమూర్తులు. కలకత్తాలో తమ కలాన్నీ, గళాన్నీ ఈ ప్రక్రియకు అంకితం చేశారు. స్వామి సూక్తులను సంపుటీకరించి, తెలుగువారికి మేలు చేశారు. మూడు డైజెస్ట్ సంపుటాలు ఇంగ్లీషులో వెలయించి ప్రపంచానికి పరమానందాన్ని కలిగించారు. సాయి డైజెస్ట్ అంటే తూములూరు వారే అన్నంత కీర్తి సంపాదించారు. అయినా, ఆ దంపతులకు ఆపంత అహంకారం లేదు. వ్రాసేదీ, వ్రాయించేది ఆ సత్యసాయి భగవానుడే అని త్రికరణ శుద్ధిగా నమ్మిన భక్త దంపతులు వారు. వారు హైదరాబాదుకు నివాసం మార్చారు. తెలుగువారికి స్వామి ప్రబోధామృతాన్ని పంచిపెట్టి, వారి కది డైజెస్ట్ అయ్యేటట్లు చేసే ప్రయత్నమే ఈ పవిత్ర గ్రంథం. వేద వాక్కులు సంస్కృతంలో మొదట పలక బడ్డాయి. అట్లాగే సత్యసాయి వాక్కులు తెలుగులో వెలుగుచూచాయి. తెలుగుకు దేవభాషా గౌరవం కలిగించిన పరమాత్మ శ్రీ సత్యసాయి. ఆ భాషలో సరాసరి స్వామి పలికిన మాటలను ప్రోగు చేయటమే ఒక పుణ్యం. మొట్టమొదటిసారి తెలుగు డైజెస్టును రూపొందించటం ఒక అపూర్వాంశం. దీనితో తూములూరు దంపతులు అటు ఇంగ్లీషులో, ఇటు తెలుగులో డైజెస్ట్ తయారీ శిల్పంలో మొదటి తాంబూలం అందుకున్న అదృష్టవంతులయ్యారు. తమ గ్రంథాలన్నీ తమ బ్రతుకుల్లాగానే స్వామికి అంకితం చేసిన ధన్యులు కూడా అయ్యారు. అక్షరార్చనగా మొదలైన వారి కృషి అక్షర యజ్ఞంగా పరిణమించింది. అందుకు వారు అభినందనీయులు !

ప్రబోధామృతం ఒక విలక్షణ ప్రయోగం

'శ్రీ సత్యసాయి ప్రబోధామృతం' ఒక విలక్షణ ప్రయోగం. ఎలాగంటే -

1. ఇది ఒక శాస్త్రానికి అనువుగా ఏర్పరచిన పారిభాషిక పదవివరణ సూచి కాదు. ఒక అవతార పురుషుని మహోద్యమ చైతన్య స్ఫూర్తి ప్రతిఫలించే సంకేతపద వివరణ సూచి. శతాధిక గ్రంథాలనుండి సేకరించిన విలువైన అంశాల సంకలనం!

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

2. యుగయుగాలుగా వస్తున్న సనాతన ధర్మ విజ్ఞానాన్ని సమకాలీన యుగ చైతన్యానికి అనువుగా సమన్వయించి అభినవంగా ఆవిష్కరించే చైతన్యం శ్రీ సత్యసాయి ప్రబోధనలలో సృజనాత్మక చైతన్యంతో ప్రకాశిస్తుంటుంది. ఆ సమకాలీనతలోని విశ్వజనీనతను వివేచించడానికి అనువైన పద్ధతి ఆ గ్రంథ ప్రవృత్తికి స్వరూపస్వభావాలను సంతరించి పెట్టింది. కాబట్టి ఇది సత్యసాయి వాఙ్మయ పరిచయ భూమిక కాదు. పరిశీలన గ్రంథం కాదు. వర్గీకృత విషయ ప్రబోధ సంపుటి.

3. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి నోట వెలువడిన ప్రతిమాటనూ ప్రచురించే ప్రయత్నం ఒకవైపు సాగుతున్నది. ఆ ప్రచురణలన్నీ మేఘం వర్షించిన నీటిని చెరువుల్లో నిలిపే ప్రయత్నం లాంటివి. ఇది ఒక రకం. నిండిన చెరువులలోని నీటిని వినియోగించుకొనే ప్రయత్నం మరొకరకం. ఇది వినియోగదారుల అవసరాల మీదా, వారి వివేక విజ్ఞానాలమీదా, వారు ఆశించే ప్రయోజనాల మీదా ఆధారపడి ఉంటుంది. మొదటి రకం విజ్ఞానకోశం లాంటిది. రెండోరకం వినియోగ విజ్ఞాన ప్రయోగం లాంటిది. ఈ గ్రంథం ఈ రెండో కోవకు చెందింది.

4. ఈ గ్రంథం వినియోగదారుల అవసరాలను ఆధారంగా చేసికొని రూపొందించిన విజ్ఞాన కోశం. సాధకుడికి కావలసిన అవతారవాణి అందుబాటులోకి వచ్చేటట్లు రూపొందించిన ప్రక్రియ ఇది. అంటే ఇది ప్రయోగ విజ్ఞాన కోశం వంటిదన్నమాట!

5. శ్రీ సత్యసాయి ప్రబోధామృతాన్ని పాఠకులు (సాధకులు) పది ప్రయోజనాల కోసం వినియోగించుకొంటారు. అవి - 1. విజ్ఞానం 2. వివరణం 3. విశ్లేషణం 4. వివేచనం 5. విచక్షణం 6. విలక్షణం 7. విచారణం 8. వికాసం 9. వినిమయం 10. వినియోగం

1. విజ్ఞానం : భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ప్రబోధలు ఒక పరిపూర్ణ తత్త్వ విజ్ఞాన కోశం. ఆ స్వామి చెప్పిన మాటలలోనే అవతార పురుషుడు అందించిన విజ్ఞానాన్ని అందుకోవాలని తరతరాల సాధకులు భావించటం సహజం. అందుకు అనువుగా ఈ గ్రంథంలో ప్రతి ఆరోపమూ, దానిని గురించి వివరించిన ప్రతి అంశమూ భగవాన్ శ్రీ సత్యసాయి వచనామృతమే. అందువలన ఈ గ్రంథం దేవుని పవిత్ర వాక్కుల పుణ్య ప్రబంధం. జిజ్ఞాసువులకు ఇది విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞాన భాండారం.

2. వివరణం : భగవాన్ బాబా వారు తమ దివ్యోపన్యాసాలలో ఎన్నో విశేషాలకు ఎన్నో సందర్భాలలో వివరణలు ఇచ్చి ఉన్నారు. అవి సమయ సందర్భాలను బట్టి, దేశ కాలపాత్రాలను బట్టి, భక్తుల చిత్తవృత్తులను బట్టి, సాధన స్థాయిలను బట్టి వివరించే పద్ధతులలో వైవిధ్యం కనపడుతుంది. కాని, తత్త్వం మాత్రం ఒక్కటే. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి' అనే సూక్తికి ఉదాహరణ ప్రాయంగా వివరణాలు సాగుతాయి. శ్రీ సత్యసాయి వివరణానికి ఒక ప్రత్యేక ముద్ర ఉంటుంది. ఆ ముద్రతో ఆ వివరణం పఠిత హృదయంలో భద్రంగా నిలుస్తుంది. అటువంటి వివరణలు తెలుసుకోదలచుకొన్న వారికి ఈ గ్రంథం పారిజాత కల్పవృక్షం.

3. విశ్లేషణం : భగవాన్ బాబా వారు ఎంత గాఢమైన, క్లిష్టమైన, సంశ్లిష్టమైన అంశాన్నైనా పండొలిచి చేతిలో పెట్టినట్లు చెప్పటంలో వారు అనుసరించే విశ్లేషణ విధానం అపూర్వం. సమగ్ర దర్శనం ఉన్న ద్రష్ట మాత్రమే విషయ విశ్లేషణను విజయవంతంగా చేయగలడు. బాబా పరిపూర్ణ విజ్ఞాన మూర్తి. వారి విశ్లేషణను తెలిసికొనగోరే సాధకులకు ఈ గ్రంథం వివేక చూడామణి.

4. వివేచన : సదసద్వివేకం వివేచన. జీవితంలో మంచి చెడులను గురించి, ఆధ్యాత్మికంగా నిత్యానిత్య పదార్థ వివేకం గురించి, సాధనలో సవ్యాపసవ్య మార్గాలను గురించి స్వామి నిరంతర బోధ చేయటం వారి మాటలలో

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

వినపడుతుంది. వాటిలో ఏ అంశాన్ని గురించి వివేచనాత్మక వివేక పరిజ్ఞానాన్ని పొందాలన్నా ఈ గంథం కరతలామలకంలా ఉపయోగపడుతుంది.

5. విచక్షణం : వివేకం వలన విచక్షణ కలుగుతుంది. దేన్ని పరిత్యజించాలో తెలియటం ఒక ఎత్తు. ఆ పద్ధతిని అమలులో పెట్టటం మరొక ఎత్తు. దేన్ని పరిగ్రహించాలో తెలిసిన తరువాత దానిని సాధించే మార్గం కూడా తెలియటం మరొక ఎత్తు. వివేచన విజ్ఞాన స్ఫూర్తి నందిస్తే విచక్షణ అనుభవస్ఫూర్తిని అలవరుస్తుంది. స్వామి తమ దివ్యోపన్యాసాలతో ఆధ్యాత్మిక ప్రవృత్తిలో విచక్షణ కుండే విశిష్టతను ఎన్నో విధాలుగా సాధకులకు బోధించారు. వాటిని తెలిసికొన గోరే వారికి ఈ గ్రంథం ముంజేతి కంకణం.

6. విలక్షణం : వ్యక్తి విశిష్టత ఆయన అభివ్యక్తి పద్ధతి మీద ఆధారపడి ఉంటుంది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు ఏ అంశాన్ని చెప్పినా వారిదైన ఒక అద్భుత పద్ధతిలో ఆవిష్కరిస్తారు. అది సర్వజన హృదయామోదంగా ఉంటుంది. భగవాన్ వాక్కులో దివ్యానుభవస్ఫూర్తి ముత్యంలో నీరులా రసనిర్భరంగా ఉంటుంది, ప్రేమమధురంగా ఉంటుంది. స్వామి మాట సరాసరి శ్రోత మనసులో ప్రసరిస్తుంది. సాధకుల మనసులలో పరిణామాన్ని కలిగిస్తుంది. బాబా సూక్తి మహామంత్రం. అది వారి మాటలోని విలక్షణత. దాన్ని కోరేవారికి ఈ గ్రంథం సర్వార్థ సిద్ధి క్షేత్రం.

7. విచారణం : విచక్షణా జ్ఞానం వలన మనిషి చెడును కాదని మంచి బాటలో మంచి మాటతో నడుస్తాడు. మంచిని తెలిసికొన్న తరువాత దానిని సాధించటంలో ఎంతో విచారణం కావాలి. శ్రవణ, మనస, నిదిధ్యాసల సాయంతో బ్రహ్మ విజ్ఞాన విచార ధార మొదలౌతుంది. అలా విచారమార్గంలో పయనించే సాధకునికి భగవాన్ మిత్రునిగా, గురువుగా, అండదండలుగా వెంట జంట నిలిచి ముందుకు తీసికొని పోతారు. సాధన మార్గ సద్విచారమే విచారణం. స్వామి ఉపన్యాస ధోరణిలో సాధారణంగా కానవచ్చే విశిష్ట లక్షణం విచారణం. దానిని తెలియగోరిన ఏ విజ్ఞులకైనా ఈ గ్రంథం పెరటిలో నాటిన కల్పవృక్షం.

8. వికాసం : అవతార పురుషులైన భగవాన్ బాబావారు అనాది నుండి వస్తున్న సనాతన ధర్మ విజ్ఞానాన్ని ఈ యుగానికి అనుగుణంగా వ్యాఖ్యానించి చెప్పి, మానవాళిలో ఆధ్యాత్మిక వికాసాన్ని కలిగించే మహాకార్యాన్ని సాగిస్తున్నారు. ఆధ్యాత్మిక వికాస స్ఫూర్తికి అనువైన ఆధునిక సందేశాలను ఎన్నో స్వామి ప్రబోధిస్తున్నారు. దైవత్వానికి దూరమౌతున్న నేటి భౌతిక భోగదశను ఆధ్యాత్మిక వికాస దశగా పరిణమింప చేసే సత్యసాయి ప్రణాళిక ఆధునిక ఆధ్యాత్మిక యుగ చైతన్య వికాసానికి ఆదర్శ రూపం. దానిని తెలియగోరే వారికి ఈ గ్రంథం ముంగిట దొరికే ముత్యాల మూట.

9. వినిమయం : యుగావతారులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు పలికిన మాటలన్నీ ప్రచురించడం బీరువాలలో భద్ర పరచటానికి కాదు. ప్రతి మాటా ఆచరణలో వినిమయం కావటానికి. శీలంగా పరివర్తనం చెందటానికి మాటను బ్రతుకులోని వెలుగుబాటగా మార్చుకొనాలనే పరితాపం గల సాధకులకు సాయి మాట వినిమయంలో సవ్యమైన బాట. ఆ బాటను కోరే వారికి ఈ గ్రంథం కరదీపిక.

10. వినియోగం : భగవాన్ బాబా వ్యష్టి సాధన కంటె సమష్టి సాధనకు పెద్దపీట వేస్తారు. స్వామి తత్త్వాన్ని గురించి కాని, వారు అనేకాంశాలపై తెలిపిన విజ్ఞాన వీచికలను గురించి గాని అధ్యయనం చేయాలన్నా, తరాల తరాల ప్రజలు తెలుసుకోవాలన్నా ఈ గ్రంథం పరామర్శ గ్రంథంగా తోడ్పడుతుంది. శ్రీ సత్యసాయి సాధన గోష్ఠులలో, అధ్యయన మండలులలో సామూహిక సమాలోచనలు జరుపుకొనేటప్పుడు ఆయా అంశాలలో అవసరానికి అక్కరకు వచ్చే అక్షర కోశం ఈ గ్రంథం. ఉపన్యాసకులకు వండి వడ్డించిన విస్తరి. చదువరులకు పాఠ్యసారసంగ్రహం. సాధకులకు మిత్ర వాక్యం. బోధకులకు గురువాక్యం. సామాన్యులకు నీతివాక్యం.

దశవిధ ప్రయోజనాలు సాధించే ఈ గ్రంథం సర్వదర్శన సంగ్రహం.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

నిర్మాణంలో నిండుదనం : ఉపయోగంలో ఉల్లాసం

ఇటువంటి గ్రంథాన్ని బహుళార్థసాధకంగా తయారు చేయాలని మాన్యులు తూములూరు దంపతులు భావించటం చెప్పుకోదగిన విశేషం. విషయ సూచిని తయారు చేసికొనటంలోనే వా రెదుర్కొన్న సమస్య లెన్నో ఉన్నాయి. దానికి కారణాలను కొన్నింటిని ఈ క్రిందివిధంగా భావించవచ్చు.

1. భగవాన్ బాబా వారి ప్రవచనాలు ఆకర్షణీయమైన ఆధ్యాత్మిక ఇంద్ర ధనుస్సులు. ఏడు రంగులు పొందికగా, పొరుపు లేకుండా నిలిచి, ఒక సమైక్యతను, సమగ్రతను సంతరించే పరిపూర్ణ దివ్యానుభవ సంపుటులు. వాటిని విడిగా చెప్పుకోవాలంటే 1. నాంది వంటి పద్యం, 2. పూర్వరంగం వంటిముందుమాట, 3. రంగంవంటి ప్రతిపాద్యాంశం, 4. వివరణంలో వివిధాంశాల విచారణం, 5. మనసుకు హత్తుకొనే కథలు, గాథలు దృష్టాంతాలు, ఉదాహరణలు, అనుభవాలు, ఆచరణలు మొ॥ 6. శాస్త్రాధారాలు, 7. ఛలోక్తులు, హితోక్తులు. ఈ ఏడంశాలూ ఒక సూర్య రథాన్ని లాగుతున్న సప్తాశ్వాల లాగా కలిసిసాగుతాయి. వీటిలో పేర్కొనబడే అంశాలు పరస్పరాశ్రితాలై ఉండటం చేత, విడదీసి చెప్పటానికి వీలు కలిగించే విధంగా ఒక్కొక సారి అనిపించవు. సాలెగూడు వలె అల్లుకొని ఉంటాయి. అందువలన ఈ గ్రంథంలో ఆరోపాలను ఎన్నుకొనటం ఒక సంశ్లిష్ట సమస్య.

దీనిని శ్రీ తూములూరు కృష్ణమూర్తిగారు నిపుణంగా పరిష్కరించారు. స్వామి ఉపన్యాసంలోని ప్రధానాంశాన్ని ఆరోపంగా ఎన్నికచేసి, దాని వివరణంలో వచ్చే అనుబంధాంశాలను కూడా ఉపాంశాలుగా ఉటంకించి, పరస్పరం కలిపి చదువుకొనేటట్లు ఒక సమర్థవంతమైన లంకెబిందెల లింకును నిర్మాణంలో అమర్చారు. ఈ పద్ధతి గ్రంథనిర్మాణానికి జిగి,బిగి కలిగించింది.

2. ఒక అంశాన్ని - వినేవారి హృదయాలలో నాటుకొనటానికి లోకంలో వక్తలు ఎన్ని వాఙ్మయ శిల్పాలను వాడుతారో వాటినన్నిటిని బాబావారు తమ దివ్యోపన్యాసాలలో దేదీప్యమానంగా వెలిగించి చూపించారు. ఆ పద్ధతిలో పద్యసూక్తులు, మధుర పదవిన్యాసాలు, నిర్వచనాలు, నినాదాలు, నిరూపణలు, కొత్త కొత్త ఉపమానాలు, లోకోక్తులు, దివ్యోక్తులు బాబావారు కల్పిస్తారు. అమూర్తాలు, దివ్యాలూ, ఆధ్యాత్మికాలూ, అనుభవైకవేద్యాలూ, సంశ్లిష్టాలూ అయిన అంశాలను లౌకిక ఉపమానాలతో పోల్చి అందరికి అనుభవయోగ్యమయ్యేటట్లు అపూర్వంగా నిరూపిస్తారు. ఒక్కొక సారి ఉపమేయం కంటె ఉపమానమే మనసును బాగా ఆకర్షిస్తుంది. అటువంటి స్వామి అలంకారోక్తులను కూడాప్రజల దృష్టికి తీసికొని వచ్చి, బాబావారు కొత్తగా రూపొందించిన సూక్తులకు ప్రాచుర్యం కలిగించాలనే భావం శ్రీ తూములూరు కృష్ణమూర్తి గారికి రావటం, దానిని ఈ గ్రంథ నిర్మాణంలో పొందుపరచటం నిజంగా అభినందనీయం.

3. ఈ గ్రంథవిషయాంశ సూచికి రెండు ముఖాలున్నాయి. చదువరి ప్రసిద్ధమైన విషయాలను గురించి బాబావారు ఏమి చెప్పారో తెలిసికొనాలని ప్రయత్నించే ముఖం (మార్గం) మొదటిది. అటువంటి వారు సరాసరి అకారాది క్రమంలో ఉన్న అంశాలను గ్రంథంలో చూచుకొని విషయాన్ని గ్రహించవచ్చు. అంతేకాక - మరికొన్ని విశేషాంశాలు కూడా ఈ గ్రంథంలో ఉన్న వని సూచికల క్రింది సూచనల ద్వారా తెలిసికొన్న పఠిత, బాబావారి ప్రబోధాలలో ప్రతిఫలించిన వివిధాంశాలను ఆయా స్థలాలలో చదివి తెలిసికొన వచ్చు. ఎన్నుకొన్న అంశాన్ని బట్టి అనువైన సాపేక్ష నిర్మాణ విధానాన్ని అనుసరించే శాస్త్ర పద్ధతిని అనుసరించి శ్రీ కృష్ణమూర్తి గారు తమ ప్రతిభను ప్రదర్శించారు. తరువాతి వారికి మంచి బాట వేసి చూపారు.

4. ఈ గ్రంథంలో విషయసూచిక అత్యవసరం. ఎందువల్లనంటే - భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి ప్రబోధామృతంలో మాత్రమే కనపడే అనేకాంశాలు విషయసూచికలో గోచరిస్తాయి. అది ఈ గ్రంథాని కేర్పడిన ప్రత్యేకత.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

5. ఒక్కొక్క అంశం క్రింద ఎంత విషయం వివరణాత్మకంగా ఇవ్వాలనే ప్రశ్న కూడా సంకలన కర్తలకు ఎదురై ఉండవచ్చు. విషయాన్ని చెపుతున్న బాబావారి భాషణంలో ఆ అంశాన్ని గురించి ఒక ఏకవాక్యతతో కూడుకొన్న సమగ్రత కలిగేంత వరకు ఉన్న భాగాన్ని గ్రహించటం జరిగింది. అది ఔచిత్యపోషకంగా ఉన్నది.

6. స్వామి ఉదాహరణలు ఉల్లాసంతో పాటు వివేకాన్ని, వినోదాన్ని కలిగిస్తాయి. వాటిని యథావకాశంగా పొందుపరిచిన ఈ గ్రంథం హృదయాహ్లాది.

7. వివరణాంశాలను సంపాదించటం ఒక కత్తిమీది సాము. దానిని అర్థవంతంగా, సమర్థవంతంగా నిర్వహించారు తూములూరువారు.

8. వివరణాంశాలలో ముఖ్యవిశేషాలను పెద్దక్షరాలతో సూచించి పఠితకు సహాయపడ్డారు.

9. ఆరోపాలు ఎన్నుకొనే పద్ధతిలో తూములూరు వారు స్వీయాభిరుచిని ప్రదర్శించారేమో అని కొన్ని చోట్ల అనిపించినా, పఠితకు సత్యసాయి ప్రబోధ విశేషాన్ని ఏ విధంగానైనా పరిచయం చేయాలన్న వారి తహతహ దాని వెనుక మెరుపులా మెరిసి మనమెప్పును పొందగలుగుతుంది.

10. మొత్తం గ్రంథ సంకలనంలో తూములూరు దంపతుల నిరంతరకృషి, శ్రద్ధాభక్తులు, చిత్తశుద్ధి, శరణాగత భావం గోచరిస్తాయి. ఈ గ్రంథాన్ని ఒక అక్షరార్చనగా అనుభవానికి అందిస్తాయి. నిజంగా వారు ధన్యులు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్యాశీస్సులు వారికి సదా అందించాలని స్వామిని మనసారా వేడుకొంటున్నాను.

శ్రీ సత్యసాయి ప్రబోధామృతం సత్యసాయి సూక్తి మౌక్తిక హారం!
సత్యసాధకుల విజ్ఞానాంశాల విలువైన సమాహారం!
అవతార పురుషుని వాఙ్మయామృత తరంగ మధుర ప్రవాహం!
తెలుగులో జాలువారిన పరమాత్ముని వాక్య సుధా బిందుసందోహం!
భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి పాదపద్మాలకు అంకితమైన అక్షర ప్రపంచం!!
స్వామి కరుణారస సింధువులో పునీతులైన పుణ్యదంపతుల భక్తి ప్రబంధం!

స్వామి పాదపద్మాలకు నమస్కరిస్తూ

జి.వి. సుబ్రహ్మణ్యం
వైస్‌చాన్స్‌లర్
పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము

హైదరాబాద్
27-5-2002

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీసత్యసాయి ప్రబోధామృతము ఒక అమూల్యమైన గ్రంథరాజము, భగవాన్ బాబావారు అపార జ్ఞాన, విజ్ఞాన, సుజ్ఞాన ప్రజ్ఞాన ప్రబోధకులు, ప్రసారకులు. ఆవిజ్ఞానాంబుధిని మథించి అందులోని రత్నాలను, అకారాదిఅక్షర క్రమంగా విషయీకరణచేసి, ఆ విషయాలకు సంబంధించినస్వామి యొక్క వచన కాంతిరేఖలను కూర్చి, పేర్చి, అమర్చి పాఠకులకు సులభంగా అందుబాటులో యుండునట్లు తీర్చి దిద్దిన సంకలనకర్తలకు ఎన్నో ధన్యవాదములు.

ఈ సంకలనయజ్ఞంలో, బాబావారి వాక్యామృతమున్న శతాధిక(గ్రంథములను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగినది. ఇవన్నీ కలిపితే వేలకు వేలపుటలగును! ఎన్నో ఏళ్ళ క్రితం నుంచి ప్రచురణ అయిన సాయి గ్రంథములను సాయి వాక్య విభూతులను పట్టుదలతో సేకరించి, సమీకరించి, సమన్వయపరచి అందులోని నిగ్గును, అరటి పండునువొలిచి అరచేతిలోపెట్టినట్లు, మన కందించిన సంకలనకర్త దంపతులకు మనమెంతో ఋణపడియున్నాము.

ఉదాహరణకు, ఒక్కకకార అక్షరం క్రింద ఇంచుమించు 130 పదాలు, అంశాలు చూపబడినవి. వాటిలో పరస్పర సంబంధితవిషయాలను ఏ మకుటంలో ఉన్నవో అదికూడ చూపబడినది. ఉదా. **కర్మ/కర్మలు** అనే విషయములు ఎనిమిది మకుటాల పదాల క్రింద వివరించబడినది.

అటులనే, **గకార అక్షరం** క్రింద 63 పదాలు/ అంశాలు చూపబడినది. **గాయత్రీ** అనే పదం క్రింద 3 పుటల వాక్యసముదాయం ఏడు మాలకముల నుండి కూర్చబడినది. ముఖ్యమైన వాక్యాలు ముద్దచ్చులో వేయబడినవికూడా!

ఈ గ్రంథంలో విషయవివరణ అతిహెచ్చుగాను, లేక అతికుదించిగాను ఉండక, సమ తూకంలో యుండుట చేత, పాఠకులకు ఎంతో సదుపాయముగా నున్నది.

ఈ గ్రంథంలో విషయవివరణ పరిమాణం విషయ ప్రాధాన్యాన్ని బట్టి సమకూర్చబడుట ఇంకొకవిశేషం.

ఇంకొక ముఖ్యవిషయం: ఇదొక ప్రామాణిక(గ్రంథం: ప్రతి వాక్యసముదాయానికి అడుగున దాని మూలకం, పుటలతో సహా ఉటంకరించబడినది. ఇది ఈ గ్రంథవిశిష్టత.

ఈ విధంగా పాఠక జిజ్ఞాసువులకు సులభోపయోగంగా అమృతతుల్యమైన ఈ పుస్తకాన్ని సంకలనకర్తలు మలచినారు. అందుచే ఈ బృహత్ గ్రంథం, సాయి విజ్ఞానసారాన్ని సాధకులకు, భక్తులకు పరిశోధకులకు, విద్యార్థులకు, వక్తలకు పంచి, వారికి ఎంతో సహాయపడుననుటలో ఏ విధమైన అతిశయోక్తి లేదు.

ఈ సందర్భంలో ఒక స్వవిషయం ప్రస్తావించుచున్నందుకు పాఠకులు మన్నించుదురుగాక! నేను పదేళ్ల పాటు ఇంచుమించు ప్రతివారం స్వదేశీయ, విదేశీయ సాయిభక్త బృందాలకు, శ్రీసత్యసాయిబాబావారి మహిమలు, కార్యక్రమాలు, సిద్ధాంతాలు, వారి అవతారవిశిష్టత, వారి బోధలు, ప్రబోధలను గూరి\.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

ప్రశాంతినిలయం లోను, బృందావనం (బెంగ్లూరులోని బాబా ఆశ్రమం)లోను ఉపన్యసించు మహద్భాగ్యమును స్వామి నాకు ప్రసాదించారు. అందుకు, నా ఉపన్యాససాధనా మూలకంగా శ్రీతూములూరు కృష్ణమూర్తిగారు ఆంగ్లంలో సాయిసూక్తుల సంకలనం చేసిన, DIGEST- Vols 1,2,3 గ్రంథములు ఎంతయో ఉపయోగపడినవి. అటులనే, ఈ శ్రీసత్యసాయి ప్రబోధామృత గ్రంథము (రెండుభాగాలు) అందరకూ ఎంతయో ప్రయోజనకరం కాగలదని విశ్వశిస్తున్నాను.

ఈ సంకలన కర్తల భక్తి తాత్పర్యములవల్లనూ, వారి శ్రద్ధా, నైపుణ్యములవలననూ ఇట్టి గ్రంథరాజము మనమాతృభాషలో మనకు లభ్యమగుచున్నది: అందుకు వారికి మన కృతజ్ఞతలు.

ఇది శ్రీసత్యసాయి ప్రత్యక్షవచనాత్మక ఆధ్యాత్మిక సాధనాగ్రంథము కదా! అందుచే భగవాన్ శ్రీసత్యసాయి బాబావారు ఈ సంకలనకర్త లిద్దరకు ఆయురారోగ్యములను ప్రసాదించుగాత! అని ప్రార్థిస్తూయున్న:

ఘండికోట వెంకట సుబ్బారావు
(విశ్రాంత) ఐక్యరాజ్యసమితి ఇంధనశాఖాధిపతి
ప్రశాంతి నిలయం, వృషమహాశివరాత్రి.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

సంప్రదించిన ప్రమాణ గ్రంథ సూచి

ఇందుండు శ్రీ సత్యసాయి బాబావారి దివ్యోపన్యాసములు(ది.ఉ), ప్రవచనాలు, రచనలు, ఈ క్రింది పుస్తకముల నుంచి సంకలనము చేయబడినవి.

నెం.	పుస్తకము పేరు	ప్రచురించినవారు	ముద్రణ	సంకేతాక్షరము
1.	అక్షర కుసుమ సమర్పణ	శ్రీవాణి 28.4.1996	శ్రీవాణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ మచిలీపట్నం.	అ.కు.స
2.	అక్షరకుసుమ సమర్పణ	శ్రీవాణి 4.12.1996	శ్రీవాణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్	అ.కు.స.
3.	అద్భుతసృష్టి	శ్రీప్రశాంతి పబ్లికేషన్స్ ట్రస్ట్	శ్రీ సాయి ఆఫ్‌సెట్ ప్రాసెస్, హైదరాబాద్	అ.సృ.
4.	అన్యధాశరణం నాస్తి	శ్రీమతి విజయకుమారి	సాయిశ్రీరాం ప్రింటర్స్, చెన్నై	అ.శ.నా.
5.	అష్టావక్రసంహిత	ప్రథమ ముద్రణ 1992	సాయిశ్రీనివాస్ ప్రింటర్స్ విజయవాడ	అ.స.
6.	ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక	నవంబరు 25-1 డిసెంబరు 1992		ఆ.ప్ర.
7.	ఆత్మశాంతి 1982	రొబ్బి లోవరాజు	శ్రీపతిప్రెస్, కాకినాడ	ఆ.శా
8.	ఆత్మారాముము	★★	అరుణప్రింటర్స్ నెల్లూరు	ఆ.రా.
9.	ఆధ్యాత్మిక దీపిక	శ్రీసత్యసాయి సేవాసంస్థలుఆంధ్రప్రదేశ్	పేపరు అండ్ పేపరు ప్రొడక్ట్సు	ఆ.దీ.
10.	ఆధ్యాత్మికభారతి	★ ప్రథమ ముద్రణ సె.2000	విప్ల కంప్యూటర్ సర్వీసెస్ హైదరాబాద్	ఆ.భా.
11.	ఉదయం ప్రత్యేక అనుబంధం		వివరములు లేవు	ఉ.అ.
12.	ఉపనిషద్బృందావనమ్	భగవాన్ శ్రీసత్యసాయిబాబా సేవాసంస్థలు హైదరాబాదు	శ్రీ కళా ప్రింటర్స్ హైదరాబాద్	ఉ.బ.
13.	గర్గ భాగవతము - కృష్ణ కథామృతము	డాక్టర్ జంధ్యాల సుమన్‌బాబు ప్రథమ ముద్రణ 1994	గ్రాఫిక్‌ప్రింట్స్ కాకీనాడ	గ.క.
14.	చిన్నకథ	★	విప్ల ప్రింటర్స్ ప్రై. లిమిటెడ్	చి.క.
15.	జయభేరి	★ ప్రథమముద్రణ	శ్రీ అరుణోదయ ప్రింటింగ్ ప్రెస్ విజయవాడ	జ.
16.	తపోవనము	★	ప్రింట్‌వేవ్ విజయవాడ	త.
17.	త్వమేవ శరణం మమ	భాట్టం సత్యవతి ప్రథమముద్రణ విశాఖపట్నం	శ్రీసత్యఆఫ్‌సెట్ ప్రింటర్స్ తాడేపల్లిగూడెం	త.శ.మ.
18.	త్రిమూర్తి సాయి	మొదటిముద్రణ 2000, డా. సి.ఎల్.ఎన్. మూర్తి ప్రశాంతినిలయం	వివరములు లేవు	త్రి.సా.
19.	దసరాయజ్ఞసప్తకం 1997	★	రమేష్ ప్రింటింగ్ ప్రెస్, అనంతపురం	ద.య.స.97
20.	దసరాయజ్ఞసప్తకం 1998	★	వివరములు లేవు	ద.య.స.98
21.	దీనసేవే దైవసేవ	★	రమేష్ ప్రింటింగ్‌ప్రెస్ అనంతపురం	దీ.
22.	దేశభవితవ్యం - యువతకర్తవ్యం	ప్రథమముద్రణ భాట్టం సత్యవతి	సాయిసర్వీసెస్ విశాఖపట్నం	దే.యు.
23.	దైవతం మానుషాకారం	జి. పార్వతి	ఆంధ్ర యూనివర్సిటీ ప్రెస్, విశాఖపట్నం	దై.మా
24.	దైవము - దివ్యవాణి	జి. పార్వతి	శర్మాణి ప్రింటర్స్ విశాఖపట్నం	దై.ది.
25.	దైవము - మనసు	జి. పార్వతి ప్రథమ ముద్రణ	శార్వాణి ప్రింటర్స్, విశాఖపట్నం	దై.మ
26.	నామస్మరణ విశిష్టత	జంధ్యాల బాలగంగాధర్ తిలక్, నాగేశ్వరరావు	శ్రీ సత్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్, తాడేపల్లిగూడెం	నా.వి.
27.	నా బాబా - నేను	శ్రీ ప్రశాంతి పబ్లికేషన్స్ ట్రస్ట్	శ్రీసాయి ఆఫ్‌సెట్ ప్రాసెస్	నా.నే
28.	నీలగిరి వేసవి వెన్నెల 1976	★	వెల్డన్ ప్రెస్, ఆఫ్‌సెట్ ప్రింటర్స్ మద్రాస్	నీ.వె.
29.	నేను - నేనే	భగవాన్ శ్రీసత్యసాయిబాబా సేవాసంస్థలు	శ్రీ కళాప్రింటర్స్ హైదరాబాద్ నే.నే.	నే.నే.
30.	పరిప్రశ్న	దినిశేయమ్మ వెలుదుర్తి ప్రథమముద్రణ	సాయిగ్రాఫిక్స్ గుంటూరు	ప.
31.	పర్తీశునితో పంచదశాబ్దాలు	శ్రీ ప్రశాంతి పబ్లికేషన్స్ ట్రస్ట్	శ్రీకళా ప్రింటర్స్	ప.పం.ద.
32.	ప్రభాత పారిజాతములు	★	విప్ల ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్	ప్ర.పా.
33.	ప్రేమజ్యోతి	కె. చంద్రశేఖర్	స్పందన ప్రింటర్స్, మచిలీపట్నం	ప్రే.జో.
34.	ప్రేమబంధం	శ్రీసత్యసాయి భక్తిసేవాసంఘం ట్రస్ట్	క్లీన్‌ప్రింట్, ఆఫ్‌సెట్ డివిజన్, హైదరాబాద్	ప్రే.
35.	బద్రియాత్ర (శ్రీవారితో)	శ్రీమతి విజయమ్మ	సాయిశ్రీరామ్ ప్రింటర్స్ చెన్నై	బ.
36.	బాబాజీవితమే జగతికి సందేశం	భాట్టం సత్యవతి, భాట్టం భారతి	శ్రీసత్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్, తాడేపల్లిగూడెం	బా.జీ.జ.స.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

37.	బృందావనములో త్రయీనాదం	★ 1990 ప్రథమముద్రణ	జయశ్రీప్రెస్-హైదరాబాద్	బృత్ర.
38.	భక్తోద్ధారకసాయి	★	విప్లాప్రింటర్స్ (ప్రై) లిమిటెడ్	భ.సా.
39.	భగవాన్ శ్రీసత్యసాయి ప్రబోధపంచామృతం	★	శ్రీ పద్మనాభ ప్రింటింగ్ వర్క్స్ విజయవాడ	భ.స.ప్ర.పం.
40.	భగవాన్ శ్రీసత్యసాయి మధురోపన్యాసాలు 1995	★ ప్రథమముద్రణ - 1998	విప్లప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్	భ.స.మ.
41.	భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి పూజావిధానం	★★	వివరములు లేవు	భ.స.పూ.
42.	భగవాన్ శ్రీసత్యసాయి బాబావారి వేసవి ప్రబోధలు 1973	★★	శ్రీ బాలాజీ ప్రెస్ అనంతపురం	భ.స.వే.ప్ర.
43.	భగవాన్ శ్రీ సత్యసాయి బాలవికాస్ గురువుల శిక్షణ-బృందావనము 1978	శ్రీసత్యసాయి సేవాసంస్థలు ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముద్రణ 1978	శ్రీశోభనాచల ప్రెస్ విజయవాడ	గు.శి.బృ1978
44.	భగవాన్ శ్రీ సత్యసాయి స్త్రీ ధర్మప్రబోధం	ఆర్. సీతాలక్ష్మి	విజయవాడ ఆఫ్‌సెట్ ప్రింటర్స్	భ.స.స్త్రీ.ధ.ప్ర.
45.	భద్రా కళ్యాణం	డా.కె. కృష్ణకుమారి	శాండిల్య ఆర్ట్ ప్రింటర్స్ హైదరాబాద్	భ.
46.	మనసు - మర్మము 1976	★★	వివరములు లేవు	మ.మ.
47.	మూఢమతి - ముక్తమతి	ఆర్. సీతాలక్ష్మి	శ్రీపద్మనాభా ప్రింటింగ్ వర్క్స్	మూ.ము.
48.	యుగఅవతారి సాయీశా	★ ఆర్. సీతాలక్ష్మి	సాయిరామ ప్రింటర్స్	యు.అ.సా.
49.	రామకథ సాయిసుధ	డాక్టర్‌జి.వి.సుబ్రహ్మణ్యం	వికాస్ ప్రింటర్స్ ప్రై.లిమిటెడ్	రా.సా.
50.	లోకనాధసాయి	శ్రీసత్యసాయి మండలి ట్రస్టు	సాయిశ్రీరాం ప్రింటర్స్ చెన్నై	లో.
51.	లీలానాటక సాయి	శ్రీ ప్రశాంతి పబ్లికేషన్స్ ట్రస్ట్	శ్రీ కళా ప్రింటర్స్, హైదరాబాద్	లీ.నా.సా.
వాహినులు :				
52.	ఉపనిషత్ వాహిని	★	లేజర్‌ప్రింట్స్ ప్రై.లిమిటెడ్ హైదరాబాద్	ఉ.వా.
53.	గీతావాహిని	★	లేజర్ ప్రింటర్స్ ప్రై లిమిటెడ్	గీ.వా.
54.	జ్ఞానవాహిని	★	విప్లప్రింటర్స్ ప్రై లిమిటెడ్	జ్ఞా.వా.
55.	ధర్మవాహిని	★★ 1970	సాయిబాబా ప్రెస్ విజయవాడ	ధ.వా.
56.	ధ్యానవాహిని	★★	సాయిబాబా ప్రెస్ విజయవాడ	ధ్యా.వా
57.	ప్రేమవాహిని	★★	పేపర్ అండ్ పేపర్ ప్రొడక్ట్స్	ప్రే.వా.
58.	ప్రశాంతి వాహిని	★★	శ్రీసాయి బాబాప్రెస్ విజయవాడ	ప్ర.వా.
59.	ప్రశ్నోత్తరవాహిని	★	కృష్ణసత్యసాయిప్రెస్ రామచంద్రపురం	ప్ర.శో.వా.
60.	భాగవతవాహిని	★★	విజయప్రెస్ విజయవాడ	భా.వా.
61.	రామకథారసవాహిని మొదటిభాగం	శ్రీసత్యసాయిబుక్స్ అండ్ పబ్లికేషన్స్	రమేష్ ప్రింటర్స్ హైదరాబాద్	రా.వా.మొ.
62.	రామకథా రసవాహిని రెండవభాగం	శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్	రమేష్ ప్రింటర్స్ హైదరాబాద్	రా.వా.రె.
63.	లీలా కైవల్యవాహిని	★	విప్లకంప్యూటర్ సర్వీసెస్ హైదరాబాద్	లీ.కై.
64.	విద్యావాహిని	★	శ్రీకృష్ణ సత్యసాయిప్రెస్	వి.వా.
65.	సత్యసాయి వాహిని	★ శ్రీసత్యసాయిబుక్స్‌అండ్ పబ్లికేషన్స్ శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు	వ్రజ్ బృందావన్ ప్రెస్ బెంగుళూరు	స.వా.
66.	శ్రీసత్యసాయి విద్యార్థి వాహిని	డా.బి. రుక్మిణి	కిరణ్ ప్రింటర్స్ హైదరాబాద్	శ్రీ.స.వి.వా.
67.	సూత్రవాహిని	★	విప్లకంప్యూటర్ సర్వీసెస్	సూ.వా.
68.	వేసవి ప్రబోధలు 1972	శ్రీసత్యసాయి సేవా సంస్థ	పేపర్‌అండ్‌పేపర్ ప్రోడక్ట్స్ విజయవాడ	వే.ప్ర.
69.	శ్రీ భగవాన్ ఉవాచ	★	ఎన్.వి.ఎన్. గ్రాఫిక్స్, హైదరాబాద్	శ్రీ.భ.ఉ.
70.	శ్రీవాణి (సాంస్కృతిక మాసపత్రిక)	శ్రీ కొమరగిరి కృష్ణమోహనరావు	శ్రీవాణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ మచిలీపట్నం	శ్రీ
71.	శ్రీవారి సందేశామృతము (16-20జులై 1997)	★	విప్లాప్రింటర్స్ ప్రై. లిమిటెడ్	శ్రీ.స.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

72.	శ్రీ సత్యసాయి గీతామృతము	★		
73.	శ్రీ సత్యసాయి దివ్యబోధ జూలై 1978	★	విప్లకంప్యూటర్ సర్వీసెస్, హైదరాబాద్	శ్రీ.సా.ది.
74.	శ్రీసత్యసాయి దివ్యబోధ 1993	★	లేజర్ ప్రింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్	శ్రీ.స.ది.
75.	శ్రీసత్యసాయి దివ్యవాణి (సత్యసందర్శనము)	శ్రీ ప్రశాంతిపబ్లికేషన్స్ ట్రస్టు	కళాజ్యోతి ప్రెస్‌ప్రై.లిమిటెడ్, హైదరాబాద్	శ్రీ స.ది.వా.
76.	శ్రీసత్యసాయి దివ్య లీలామృతం-1	★	శ్రీకళా ప్రింటర్స్ హైదరాబాద్	శ్రీ స.ది.లీ.
77.	శ్రీ సత్యసాయి ప్రేమసుధాప్రవంతి	★	విప్లకంప్యూటర్స్ సర్వీసెస్, హైదరాబాద్	శ్రీస.ప్రే.ప్ర.
78.	శ్రీ సత్యసాయిబాబా ప్రబోధములు	భగవాన్ శ్రీసత్యసాయి సేవాసంస్థలు హైదరాబాద్	శ్రీ కళా ప్రింటర్స్, హైదరాబాద్	శ్రీ స.ప్ర.
79.	శ్రీసత్యసాయి వచనామృతం 1961-62	★ ప్రథమముద్రణ న. 2000	విప్లకంప్యూటర్ సర్వీసెస్, హైదరాబాద్	శ్రీ.వ. 61-62
80.	శ్రీసత్యసాయి వచనామృతము రెండవ భాగము (1963/64)	★★	పోగ్రెసివ్‌ప్రెస్ ప్రై.లి. హైదరాబాద్	శ్రీ.స.వ.63/64
81.	శ్రీ సత్యసాయి వచనామృతం (63/64)	★ తృతీయముద్రణ 1995	పవిత్ర ప్రింటర్స్ మద్రాస్	స.వ.
82.	శ్రీసత్యసాయి వచనామృతము 1984	★	విప్లాకంప్యూటర్ సర్వీసెస్ హైదరాబాద్	శ్రీ.స.వ. 84
83.	శ్రీ సత్యసాయి వచనామృతం - 1990	★	విప్లాకంప్యూటర్ సర్వీసెస్ హైదరాబాద్	శ్రీ.వ. 90
84.	శ్రీ సత్యసాయి వచనామృతం-1991	★	విప్లాకంప్యూటర్ సర్వీసెస్ హైదరాబాద్	శ్రీ.వ. 91
85.	శ్రీ సత్యసాయి సూక్తులు	సిజె. గాంధి వెల్‌ఫేర్ ట్రస్టు	1976 భారతముద్రణాలయం	స.సూ.
86.	శ్రీసత్యసాయి సూక్తులు	★ 1999	గాయత్రి ఆర్ట్ ప్రింటర్స్ హైదరాబాద్	శ్రీ.స.సూ.
87.	శ్రీ సత్యసాయివాణి	శ్రీసత్యసాయిసేవా సంస్థలు ఆంధ్రప్రదేశ్	పవిత్ర పింటర్స్ మద్రాసు	స.సా.వా.
88.	శ్రీసాయిగీత	★ శ్రీవేదభారతి హైదరాబాద్	క్యాక్స్‌టన్ ప్రింటర్స్ హైదరాబాద్	శ్రీ.సా.గీ.
89.	శ్రీ షిరిడీ సాయిబాబా	★	రమేష్ ప్రింటింగ్ ప్రెస్, అనంతపురం	షి.సా.
90.	సందేహనివారిణి	★★	సాయిబాబాప్రెస్, విజయవాడ	స.ని.
91.	సత్యంశివంసుందరం ప్రథమ భాగం	శ్రీ సత్యసాయి ఎడ్యుకేషనల్ ఫౌండేషన్	ప్రోగ్రెసివ్ ప్రెస్ ప్రై.లిమిటెడ్, హైదరాబాద్	స.శి.సు. ప్ర.
92.	" ద్వితీయభాగం	★	ప్రోగ్రెసివ్ ప్రస్ ప్రై.లిమిటెడ్, హైదరాబాద్	స.శి.సు.ద్వి.
93.	" తృతీయభాగం	★	విప్లాకంప్యూటర్ సర్వీసెస్ హైదరాబాద్	స.శి.సు.తృ.
94.	" నాల్గవభాగం	★	విప్లకంప్యూటర్ సర్వీసెస్ హైదరాబాద్	స.శి.సు.నా.
95.	సత్యప్రభ	భగవాన్ సత్యసాయి సమితి గుంటూరు	పయినీర్ ప్రింటర్స్ గుంటూరు	స.ప్ర.
96.	సనాతన సారథి	••		స.సా.
97.	సాయిక్లోపీడియా - 1	★ ఆర్. సీతాలక్ష్మి	వివరములు లేవు	సా.యీ
98.	సాయిత్రి	శ్రీ ఘండికోట వెంకట సుబ్బారావు		సా.
99.	సాయిదర్శన్	బొగ్గరరపు వెంకట రామకుటుంబరావు	సవితా ప్రింటర్స్ విజయవాడ	సా.
100.	సాయి మాట సాయి బాట 1	శ్రీ సత్యసాయి బాలవికాస్ ఎడ్యుకేషన్‌ట్రస్ట్	వికాస్ ప్రింట్, విజయవాడ	సా.మా.సా.బా.
101.	సాయి మాట సాయి బాట 2	"	శ్రీకృష్ణసత్యసాయి ప్రెస్, తూ.గో.జిల్లా	సా.మా.సా.బా.రె.
102.	సాయి బాబా అవతారము	శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్	వికాస్ ప్రింటర్స్, సికిందరాబాద్	సా.అ.
103.	సాయిలీలా తరంగిణి	★ ప్రథమ ముద్రణ ఆ. 2000	శ్రీవాణి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ మచిలీ పట్నం	సా.లీ.త.
104.	సాయి శృతిలో సాయివాణి	★ ప్రథమ ముద్రణ	రమేష్ ప్రిటింగ్ ప్రెస్. అనంతపురం	సా.శ్రు.
105.	స్వామి (ప్రథమ భాగము)	ESKEBY&Co.	కాశ్యప్ ఎంటర్‌ప్రైజెస్, మద్రాస్	స్వా.
106.	స్వీయ చరిత్ర	పెద్దబొట్టు	శ్రీ బృందావన్ ప్రెస్, హైదరాబాద్	స్వీ.
107.	సుధాబిందువులు	★★	శ్రీసత్యమాంబా ముద్రణాలయం, కాకినాడ	సు.
108.	సేవాయోగము	పాతూరి ప్రసన్న	దక్షిణభారత ప్రెస్, హైదరాబాద్	సే.యో.
109.	75 విజ్ఞేట్స్ ఆఫ్ వివేక	శ్రీసత్యసాయి సేవా సమితి విశాఖపట్నం	శర్వాణి ప్రింటర్స్, విశాఖపట్నం	75 వి.

★ శ్రీసత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్.

★★ శ్రీ సత్యసాయి ఎడ్యుకేషన్ అండ్ పబ్లికేషన్ ఫౌండేషన్.

•• జ - జనవరి; ఫి - ఫిబ్రవరి; మా - మార్చి; ఏ - ఏప్రిల్; మే - మే; జూ - జూన్; జూ - జూలై; ఆ - ఆగస్టు; సె - సెప్టెంబర్; అ - అక్టోబర్; న - నవంబర్; డి - డిసెంబర్.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదసూచిక

పదము	పు.నం.
అంగములు	1
అంగవతీ ఆరాధన	1
అంగహీనుడు	1
అంగీరసుడు	2
అంటువ్యాది	2
అంతఃకరణ/అంతఃకరణము	2
అంతరాత్మ	3
అంతరార్థాలు	3
అంతర్దర్శనము	3
అంతర్దృష్టి	3
అంతర్ముఖము	4
అంతర్భూతము	4
అంతర్జ్యోతి	4
అంతర్వాణి	4
అంతర్ సంబంధం	6
అంత్యకాలం	6
అంత్యము	6
అంథోని	6
అందము	6
అకార పంచక అరిష్టములు	7
అకీర్తికరము	7
అక్టోబరు 20వ తేది	7
అక్షరం	7
అక్షరోపాసకుడు	7
అగస్త్యుడు	7
అగ్ని	7
అగ్నిపర్వతం	8
అగ్నులు	8
అజ్ఞాతము	8
అజ్ఞాతవాసము	8
అజ్ఞానం	8
అజ్ఞానము యొక్క తత్వం	9
అజ్ఞాని	9
అడవిజంతువు	9
అడుగక	10
అడ్రసు	10
అణకువ	10
అణువు	10
అణుస్వరూపము	10
అతీతశక్తులు	11
అథాతోబ్రహ్మజిజ్ఞాసా	11
అదంభిత్వం	15
అదృశ్యంగా సందేశం	15
అదృష్టవంతులు	16
అద్భుతాలు	16
అద్వైత దర్శనం	16
అద్వైత దర్శనం జ్ఞానం	17
అద్వైతద్వైతవిశిష్టాద్వైతములు	18
అద్వైతమతము	19
అద్వైతము	20
అద్వైతసిద్ధాంతము	20
అధర్వవేదము/అధర్వణవేదము	20
అధికారము	21
అధిపతి	22
అధ్యాపకులు	22
అనంతం	22
అనన్యభక్తి	22
అనపేక్ష	24
అనల్‌హక్	27
అనవరతము	27
అనహంకారము	27
అనసూయ	27
అన్నం/అన్నము	27
అన్నదమ్ములు	28

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము	పు.నం.
అన్నదానము	28
అన్యభావన లేని భక్తి	28
అన్యవతీ ఆరాధన	28
అనాథ	28
అనాథుడు	29
అనాది	29
అనార్యజుష్టము	29
అనాహతధ్వని	29
అనాహతము	30
అనిత్యములు	30
అనిరుద్ధుడు	30
అనుకరణ	30
అనుగ్రహము	30
అనుబంధాలు	31
అనుభవజ్ఞానము	31
అనుభవము	31
అనుభవించుట	32
అనుభవిస్తారు	32
అనుమానం	32
అనుశ్రవం	32
అనుశాసితుడు	32
అనుష్ఠానము	32
అనుసరించు	32
అనృతపుత్రుడు	32
అనేకత్వము	32
అన్యవతీఆరాధన	32
అన్యాయార్జితము	32
అపకారం	33
అపకారి	33
అపరవిద్య	33
అపరాపరాకృతి	33
అపరోక్ష బ్రహ్మజ్ఞానము	33
అపేక్ష	33
అప్రమేయము	33
అబల	33
అబూబెనాదమ్	34

పదము	పు.నం.
అభయము	34
అభిన్నత్వం	34
అభిమానం	35
అభిరుచులు	35
అభేదజ్ఞానము	35
అభ్యాసము	35
అమనస్కుడు	35
అమరత్వము	35
అమానిత్వము	35
అమాయకుడు	36
అమూల్యరత్నం	36
అమృతత్వము	36
అమృతపుత్రులు	36
అమృతము	37
అమెరికా	37
అమోఘుడు	37
అమ్మ	37
అయస్కాంతశక్తి	38
అయిదవపురుషార్థము	41
అయిదులక్షణములు	42
అయోధ్య	42
అరటిచెట్టు	42
అరణ్యకాలు	42
అరవిందుడు	43
అర్చన	43
అర్థము	43
అర్ధనారీశ్వరతత్వం	43
అర్ధనారీశ్వరుడు	43
అర్జునుడు	43
అరిషడ్వర్గములు	46
అరిష్టపంచకము	47
అరిష్ట సూచకము	47
అరిస్టాటిల్	47
అర్పితము	47
అలర్కుడు	47
అలవర్చుకోవాలి	48

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

అలవాట్లు 49
అలెగ్జాండర్ 49
అవకాశం 49
అవగాహన చేసుకో 50
అవతరించుట 50
అవతారతత్త్వము 51
అవతారపురుషుడు/లు 51
అవతారప్రకటనదినం 52
అవతారము 55
అవతార లక్షణము 61
అవధానం 62
అవసరం 62
అవస్థలు 63
అవిద్య 63
అవినాభావసంబంధం 63
అవినీతి 63
అవిభక్తమైనభక్తి 64
అవ్యాకృతుడు 64
అశాంతి 64
అశుచి 65
అశుభలక్షణము 65
అశోక చక్రవర్తి 65
అశ్వత్థము 65
అశ్వము 66
అశ్వమేధము 66
అష్టక్లేశములు 66
అష్టభార్యలు 66
అష్టమదములు 66
అష్టవిధ పుష్పములు 66
అష్టాంగ యోగములు 69
అష్టాంగ విద్యలు 74
అష్టాక్షరి 74
అష్టావక్రుడు 74
అష్టైశ్వర్యమయి 74
అసంతృప్తి 75
అసతో మా సద్గమయ 75
అసత్య ప్రచారములు 75
అసభ్యత 75
అసురసంపత్తి 75
అసూయ 75
అస్తి 76
అస్తి భాతి ప్రియం 76
అస్త్రశస్త్రములు 76
అస్థిరములే 76
అస్వర్గము 77
అహం 77
అహంకారము 77
అహందేహో ఽస్మి 79
అహంబ్రహ్మ ఽస్మి 80
అహింస 80
ఆందోళన 81
ఆకలి 81
ఆకారం 82
ఆగమ 82
ఆగమనము 82
ఆగామి 82
ఆచరణ 82
ఆచరించు 83
ఆచారములు 83
ఆచార్య 84
ఆచార్యుడు 84
ఆచార్యోపాసన 85
ఆజ్ఞ 85
ఆటంకములు 85
ఆటంబాంబులు 86
ఆటలు 86
ఆడంబరభక్తి 87
ఆడంబరము 87
ఆడవారు 87
ఆత్మ(రేడియేషన్) 87
ఆత్మగౌరవము 90
ఆత్మజ్ఞానము 90

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

ఆత్మజ్ఞానముయొక్క పరాకాష్ఠ 93
ఆత్మచింతన 94
ఆత్మజ్యోతి 94
ఆత్మతత్త్వము 95
ఆత్మతృప్తి 96
ఆత్మదర్శనము 96
ఆత్మదృష్టి 96
ఆత్మధర్మం 96
ఆత్మనివేదనం 97
ఆత్మనిష్ఠ 97
ఆత్మబలం 97
ఆత్మబోధ 97
ఆత్మభ్రాంతి 98
ఆత్మయజ్ఞము 98
ఆత్మరామాయణము 99
ఆత్మవిద్య 100
ఆత్మవిశ్వాసము 101
ఆత్మసాక్షాత్కారము 102
ఆత్మస్వరూపస్వభావము 102
ఆత్మస్వరూపుడు 102
ఆత్మానందము 103
ఆత్మానాత్మవివేకజ్ఞానము 103
ఆత్మాన్వేషణ 103
ఆత్మార్పణం 103
ఆత్మారాముడు 104
ఆధిదైవికము 104
ఆధిదైవికశాంతి 104
ఆధిభౌతికము 104
ఆధిభౌతికశాంతి 104
ఆదర్శగురువులు 104
ఆదర్శప్రాయుడు 104
ఆదర్శమార్గము 104
ఆదర్శము 104
ఆదర్శమూర్తులు 106
ఆదర్శవంతమైన చరిత్ర 106
ఆదర్శవంతమైన జీవితము 106

పదము పు.నం.

ఆదిత్యవర్ణుడు 106
ఆదిత్యహృదయం 106
ఆదిత్యుడు 106
ఆద్యంతములు 106
ఆధారము 106
ఆధేయము 107
ఆధ్యాత్మరామాయణము 107
ఆధ్యాత్మిక గణితం 108
ఆధ్యాత్మిక చింతన 108
ఆధ్యాత్మిక తత్త్వము 108
ఆధ్యాత్మిక ప్రేమ 108
ఆధ్యాత్మిక మయం 108
ఆధ్యాత్మిక మార్గము 109
ఆధ్యాత్మికము 109
ఆధ్యాత్మికవైద్యులు 111
ఆధ్యాత్మికశాంతి 111
ఆధ్యాత్మిక సంస్కృతి-స్త్రీలు 111
ఆధ్యాత్మిక సాధన 112
ఆధ్యాత్మిక సూత్రములు 112
ఆనందపిపాసి 112
ఆనందము 113
ఆనందస్వరూపుడు 115
ఆపద్బంధువు 115
ఆమ్నాయము 116
ఆయుర్దాయము 116
ఆయుర్వేదము 116
ఆరాధన 117
ఆరుగుణములు 118
ఆరుదుర్గుణములు 118
ఆరోగ్యఅనారోగ్యములు 118
ఆరోగ్యము 118
ఆరోగ్యమే మహాభాగ్యము 121
ఆర్తి 122
ఆర్తుడు 122
ఆర్యవాఙ్మయము 122
ఆర్ష 123

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము	పు.నం.
ఆలయములు	123
ఆలోచనలు	123
ఆవరణ	124
ఆవేశము	124
ఆశయం	124
ఆశలు	124
ఆశ్రమములు	125
ఆసక్తి	125
ఆస్తి	125
ఆస్తికుడు	125
ఆస్పత్రులు	126
ఆహతధ్వని	126
ఆహారము	126
ఆహుతి	130
ఆహ్లాదిని శక్తి	130
ఇంట	131
ఇంటగెలిచి రచ్చ గెలువు	131
ఇంటర్‌నెట్	131
ఇంటర్వ్యూ/ఇంటర్వ్యూలు	131
ఇండియా	132
ఇంద్రధనుస్సు	132
ఇంద్రియనిగ్రహము	132
ఇంద్రియపటుత్వం	133
ఇంద్రియములు/ఇంద్రియాలు	133
ఇంద్రుడు	135
ఇచ్చిపుచ్చుకో	135
ఇటలీ	135
ఇరువది గుణములు	136
ఇల్లాలు	136
ఇస్లామ్	136
ఇహము	137
ఇహాముత్రఫలభోగవిరాగము	137
ఈక్షతే ర్నా శబ్దం	138
ఈనాటి విద్య	139
ఈనాటి స్త్రీలు	140
ఈశావాస్యము	140
ఈశ్వర	141
ఈశ్వర చంద్రవిద్యాసాగర్	141
ఈశ్వరతత్వము	142
ఈశ్వరత్వం	142
ఈశ్వరమ్మ/ఈశ్వరాంబ	142
ఈశ్వరస్మరణ	143
ఈశ్వరార్పితం	143
ఈశ్వరుడు	144
ఉగాది	145
ఉత్తమపుత్రుడు	145
ఉత్తమమైన మానవుడు	145
ఉత్తముడు/ఉత్తములు	145
ఉత్తరమీమాంస	145
ఉత్తరాయణపుణ్యకాలం/ఉత్తరాయణము	146
ఉత్పత్తి	148
ఉత్సవములు	148
ఉద్ధవుడు	148
ఉదాసీనత	148
ఉన్నతస్థాయి	148
ఉన్నతస్థాయికి పోవాలి	148
ఉన్నతుడు	148
ఉన్నది ఒక్కటే	148
ఉన్నాడయ్యా	148
ఉపకరణము	149
ఉపకారం	149
ఉపదేశం	149
ఉపనిషత్తులు	149
ఉపప్రాణులు	150
ఉపయుక్తమైన సాధన	150
ఉపరతి	151
ఉపవాసము	151
ఉపాదాన కారణము	151
ఉపాధ్యాయుడు/ఉపాధ్యాయులు	151
ఉపాసన/ ఉపాసనలు	152
ఉపేక్షాఅపేక్షలు	155
ఉమెన్	155

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

ఊర్వశి 155
ఋగ్వేదము 156
ఋజూత్వం 157
ఋణము/ఋణములు 157
ఋతము 159
ఋషి ఋణము 159
ఋషులు 159
ఎంజాయి 160
ఎండమావి 160
ఎచటికి 160
ఎటాచ్‌మెంట్ 160
ఎడ్యుకేషన్ 162
ఎనర్జీ 162
ఎప్పటికైనా 163
ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి 163
ఎరుక 163
ఎలక్ట్రాన్, ప్రోటాన్ 164
ఎవరుగొప్ప 164
ఎస్ 164
ఏకత్వము 165
ఏకాంతభక్తి 168
ఏకాంతముక్తి 168
ఏకాంతవాసము 169
ఏకాగ్రత 169
ఏకాత్మభావము 169
ఏకాదశి 169
ఏడుపు సుఖం 170
ఏడుస్తున్నారు 170
ఏడువర్ణములు 170
ఏడ్పు 170
ఏది? 170
ఐకమత్యము 171
ఐతరేయోపనిషత్తు 173
ఐశ్వర్యము 173
ఒక్కటే 174
ఒక్కడే 177
ఒక్కరే 178
ఒట్టిచేతులు 178
ఓం/ఓమ్ 179
ఓంకారము 180
ఓటమి 182
ఓర్పు 183
ఔషధములు 184
కంకణములు 185
కంటి అద్దాలు 185
కంఠమాల 185
కంప్యూటర్లు 185
కఠోపనిషత్ 186
కథం 186
కనిపించనిది 186
కన్నతల్లి 187
కన్నతల్లిప్రేమ 187
కన్నులు 187
కబంధుడు 187
కమ్యునెక్స్ట్ 187
కమ్యూనిజం 187
కమ్యూనిస్ట్ 188
కరణపాటవము 188
కరుణ 188
కరుణారసము 188
కర్తవ్యము 189
కర్తవ్యపాలన 190
కర్తవ్యధర్మము 190
కర్తృత్వము 191
కర్మ/కర్మలు 191
కర్మ, వికర్మ, అకర్మ 194
కర్మకాండలు 195
కర్మజోగి 195
కర్మతత్త్వము 195
కర్మదాటవశమా! 195
కర్మఫలత్యాగము 196
కర్మఫలము 197

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

కర్మభూమి 198
కర్మభ్రష్టులు 198
కర్మయోగము 198
కర్మయోగి 198
కర్మయోగులు 198
కర్మసన్యాసం 199
కర్మాచరణ 199
కర్మాతీతులు 199
కర్మాధికారి 199
కర్ణుడు 199
కర్పూరము 199
కర్మేంద్రియములు 199
కర్మోపాసన 199
కట్టుబొమ్మ 199
కల/కలలు 200
కలకంఠి 200
కలి కాలము 200
కలియుగము 200
కల్నల్ జోగారావు 201
కల్పవృక్షము 201
కల్పవృక్షమువంటివాడు 201
కల్లోలం 201
కళలు 201
కళ్యాణము 202
కవి 202
కశ్మలము 202
కష్టము/కష్టములు 202
కష్టనిష్కారములు 203
కష్టసుఖములు 203
కాంక్షయ 203
కాంక్షించు 203
కాకులు 204
కానుక/కానుకలు 204
కాన్సరు 204
కామక్రోధలోభములు 205
కామక్రోధాదులు 205
కామధేనువు 205
కామము 205
కామము -క్రోధము 206
కాయము 206
కారణము/కారణములు 207
కార్యము 207
కార్యాచరణము 207
కార్మికులు 208
కాలము 208
కాలస్వరూపుడు 210
కాలుడు 211
కాలేజి 211
కాళింగుడు 211
కాళీయ మర్దనము 211
కావడికుండలు 211
కాశి 211
కాషాయి వస్త్రము 211
కాస్మిక్ డివైన్ 212
కీర్తనము 212
కీర్తి 212
కీళ్ళవాతము 212
కుంకుమపూజ 212
కుంతీదేవి 212
కుంభకము 213
కుక్క/కుక్కలు 213
కుటుంబములు 213
కురుక్షేత్రయుద్ధము 214
కురునందనుడు 214
కులమతద్వేషములు 215
కులము /కులములు 215
కుల్వంత్‌రాయ్ 216
కుశలబుద్ధి 216
కృతఘ్నత/కృతఘ్నుడు 216
కృతజ్ఞత 216
కృష్ణతత్త్వము 218
కృష్ణతృష్ణ 219

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.న
కృష్ణపక్షం 219
కృష్ణార్పణం 219
కృష్ణుడు 219
కృష్ణుడుపుట్టినదినము 222
కృష్ణుని లీలలు 222
కేనోపనిషత్తు 225
కేశవ 225
క్లేశము 225
కైక/కైకేయి 225
కైలాసము 226
కొండమరాజు 226
కొదువ 229
కొబ్బరికాయ 229
కొలబద్ద 230
కోతి 230
కోపము 230
కోరిక/కోరికలు 230
కోశములు 231
కోహం 231
కౌసల్య 231
క్రమశిక్షణ 231
క్రిస్మస్ 231
క్రిస్టియన్/క్రైస్తవుండు/క్రైస్తవుడు 232
క్రీస్తు 232
క్రోధము 232
క్షణభంగురము 232
క్షత్రియజాతి 233
క్షత్రియుడు 233
క్షమ 233
క్షమాగుణము 234
క్షమార్పణ 235
క్షయం 235
క్షాంతి 235
క్షీరసాగర మధనము 235
క్షీరసాగరము 235
క్షేత్రజ్ఞుడు 235
క్షేత్రము/క్షేత్రములు 236
ఖజజ 238
ఖురాన్ 239
గంగానది 240
గంట 240
గంధము 240
గజతెలివి 240
గజానన 241
గడపలు(గుమ్మాలు) 241
గడియారము 241
గణపతి 241
గణపతితత్త్వము 241
గతము 242
గతవ్యథ 242
గమ్యం ఒక్కటే 242
గమ్యము (గమ్యస్థానము) 242
గర్భవతి 243
గర్వము 243
గవర్నమెంట్ 243
గహనకర్మణోగతిః 243
గాంధి 243
గాంబ్లింగ్ 243
గానము 244
గానప్రియుడు 244
గాయత్రి 245
గాయపరచవద్దు 247
గాలి 247
గిఫ్ట్ 247
గీత 248
గీతయొక్కవిలువ 248
గీతలోని గురుశిష్యులు 249
గీత-విశిష్టత 249
గుండె 249
గుడాకేశుడు 251
గుడిగోపురాలు 251
గుణము/గుణములు 251

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.
గుణలక్షణము 254
గుణవంతుడు 254
గుమ్మడికాయ 254
గురి 255
గురుకులము 255
గురునానక్ 255
గురుపూర్ణిమ 255
గురువారము 256
గురువు/గురువులు 256
గుర్తుంచుకొనవలెను/గుర్తుంచుకోండి 259
గృహం అబ్బాయి(తండ్రి) 259
గృహం అమ్మాయి (తల్లి) 259
గృహప్రవేశము 260
గృహలక్ష్మి 260
గృహస్థ 261
గృహస్థుడు 261
గృహిణులు 261
గౌణశ్చేన్నాత్మశబ్దాత్ 261
గైడ్‌పోస్టు 263
గొప్పతనము 263
గొబ్బిళ్ళు 263
గోపరాజు 264
గోపికలు 264
గోపురములు 266
గోల్డ్‌స్మిత్ 266
గోల్డ్‌స్టీన్ 266
గోవిందం 267
గోవిందుడు 267
గోవు 268
గ్రంథము/గ్రంథములు 268
గ్రామసేవ 268
గ్రామస్థులు 268
చంచలము 269
చంద్రవంక 269
చంద్రుడు 269
చక్కచేసుకోండి 269
చట్టము 270
చతుర్విధపురుషార్థాలు 270
చతుష్పాద మహాసభ 270
చదువు 274
చమత్కారము 275
చరిత్ర 275
చర్చిల్ 276
చర్మకారులు 276
చాడీలు 277
చాతకపక్షి 278
చాతుర్వర్ణ్యవ్యవస్థ 278
చారిత్రము 282
చావు 282
చింత 282
చింతన 283
చింతామణి 283
చిత-చింత 284
చిత్తచోరుడు 284
చిత్తము 284
చిత్తశుద్ధి 284
చిత్రము 284
చిత్తాపహారి 284
చిన్మయమూర్తి 284
చిన్ముద్ర 285
చిహ్నములు 285
చీపురు 285
చూతమురారే! 285
చెడ్డది 285
చెఱకు 286
చెవులు 286
చేపచీమ 286
చైతన్యము 286
చైతన్యస్వరూపుడు 287
ఛందస్సు 288
ఛాందోగ్యోపనిషత్తు 288
జంట 289

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

జంతులక్షణం/జంతులక్షణాలు 289
జగడము 289
జగత్పతి 289
జగత్తు/జగము 289
జగత్సేవకుడు 290
జగదీశుడు 291
జగన్మాత 292
జడజగత్తు 292
జడభరతుడు 292
జడము 292
జనకమహారాజు 292
జననము 292
జననమరణములు 292
జనని 292
జననీజన్మభూమి 293
జన్మ/జన్మము 293
జన్మభూమి 294
జన్మమృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనము 295
జన్మసార్థకమార్గము 295
జన్మహక్కు 295
జన్మాద్యస్యయతః 296
జనులు 298
జపము 298
జపసహితధ్యానం 298
జపాన్ 298
జయభేరి 298
జరగవలసిం దేదో జరిగేతీరాలి 298
జర్నలిస్ట్ 299
జర్మనీ 299
జరుగుచునేయున్నవి 299
జలము 299
జవాబు 299
జాగరణ 299
జాగ్రత్ 299
జాగ్రత 299
జాతి 299
జాతిగౌరవం 299
జాతీయభావము 299
జాలిహృదయము 300
జితేంద్రియుడు 300
జిజ్ఞాస 300
జిజ్ఞాసువు 300
జిహ్వ 300
జిహ్వచాపల్యం 300
జీరో 301
జీవదృష్టి 301
జీవన్మరణము 301
జీవన్ముక్తి 301
జీవన్ముక్తుడు 301
జీవయాత్ర 301
జీవాత్మపరమాత్మల యొక్క సంయోగము 302
జీవించాలి/జీవించు 302
జీవితము 302
జీవితంలో జీరోలు 303
జీవిత అంతరార్థము 303
జీవితకాలము 303
జీవితఖైదు 304
జీవిత పరమార్థము 304
జీవితపరమావధి 304
జీవితమంటే 304
జీవితసంగ్రామము 305
జీవితానందము 305
జీవుడు 305
జీవేశ్వరప్రకృతి 305
జీసస్ - జోరాష్టర్ 306
జూదము 306
జైమినీమహర్షి 306
జైలు 306
జోడి ఆదిపల్లి సోమప్ప 306
జోరాష్టర్ 306
జ్యోతి 306
జ్యోతిధ్యానము/జ్యోతిర్ధ్యానము 307

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం
జ్యోతిశ్చరణాభిధానాత్ 308
జ్యోతిష్యశాస్త్రము 309
జ్ఞాతుం 310
జ్ఞానము 310
జ్ఞానగుణము 311
జ్ఞానజ్యోతి 312
జ్ఞానదేవతుకైవల్యము 312
జ్ఞాననేత్రము 312
జ్ఞానబోధ 312
జ్ఞానమార్గము 312
జ్ఞానయజ్ఞము 312
జ్ఞానయోగము 313
జ్ఞానసిద్ధి 313
జ్ఞాని/జ్ఞానులు 313
జ్ఞానులలక్షణము 314
జ్ఞానేంద్రియములు 315
జ్ఞానోదయము 315
జ్ఞాపకము 315
టానిక్కులు 316
టిబి 316
టివి 316
టెంకాయ 317
టెక్నాలజీ 317
టెట్టురిష్టులు 317
టెలివిజన్ 317
ట్రిక్‌నాలెడ్జి 317
డంబము 318
'డ' కారత్రయములు 318
'డ' కారపంచకము 318
డాక్టర్లు 320
డియర్ (ప్రియము) 320
డివైన్ సోర్సు 320
డ్రిల్లు 320
డ్రిల్లు టీచరు 320
డైమండ్/డైమండు 321
డైమండ్‌రింగ్ 321
తటస్థ లక్షణము 322
తత్త్వమ్‌అసి తత్త్వమసి 322
తత్తుసమన్వయాత్ 323
తత్త్వములు 324
తత్త్వజ్ఞానము 324
తత్త్వభావము 325
తత్త్వవిచారణ 325
తత్ప్రేవాహం 325
తథాస్తు 325
తనవాడు 325
తపస్సు 325
తపస్సులు మూడు విధములు 327
తప్పు/తప్పులు 328
తప్పులెన్నకు 328
తమస్సుకు అతీతుడు 328
తమాషాలు 328
తమ్ముడు 328
తమోగుణము 329
తయారుగా వుండు 329
తరమా! 329
తరించాలి 329
తలంపులు 329
తలంబ్రాలు 330
తర్కీదు 330
తల్లి/తల్లులు 330
తల్లి ఆశీర్వాదము 332
తల్లితండ్రులు 332
తవైవాహం 333
తామరపువ్వు 333
తామసము 333
తామసిక 334
తామసిక శ్రవణదృశ్యములు 334
తార 334
తారకమంత్రము 334
తితీక్ష 334
తిరుక్కురళ్ 334

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.న

తిరుపతి 335
తిరుప్పండార్ 335
తిరువళ్ళువరు/తిరువళ్ళువర్ 335
తీర్థయాత్ర 335
తుంగభద్ర 336
తుమ్మెద 337
తులసీదళము/బిల్వపత్రము 337
తులసీదాసు 338
తృప్తి 338
తృప్తిరావాలి 338
తృష్ణ 339
తెలిసినవారు 339
తెలివితేటలు 339
తెల్లనివస్త్రాలు 339
తేజస్సు 339
తైజసుడు 340
తైత్తిరియోపనిషత్తు 340
తొమ్మిది 340
తోలుబొమ్మ 341
త్యజ 341
త్యజించండి 342
త్యజించవలసింది 342
త్వమేవాహం 342
త్యాగము 342
త్యాగరాజు 346
త్యాగరాజుకీర్తనలు 347
త్యాగభూమి 347
త్రయి 347
త్రికరణములు 347
త్రికరణశుద్ధి 347
త్రికాండస్వరూపము 348
త్రికోణాత్మకం 349
త్రిగుణములను అరికట్టు 349
త్రిగుణములు 350
త్రిపుటి 351
త్రిమతస్థాపకులు 351
త్రిమూర్తి/త్రిమూర్తులు 351
త్రిమూర్తిస్వరూపులు 352
త్రిరాత్రులు 353
త్రివిధదృష్టులు 353
త్రివేణి 354
త్రివేణీసంగమము 354
దక్ష 355
దక్షత 355
దక్షిణామూర్తి 355
దక్షిణాయనము 355
దక్షుడు 355
దదధ 356
దమము 356
దయ 357
దయాధర్మములు 357
దయ్యము 357
దరిద్రనారాయణసేవ 357
దరిద్రనారాయణుడు 357
దర్శనం 358
దర్శనములు 359
దర్శించాలి 359
దర్శించు 359
దశదథాత్మజుడు 359
దశరథుడు 359
దశవిధపాపములు 359
దశసూత్రములు 359
దశేంద్రియములు 359
దాంతుడు 361
దానము 361
దానవుడు 362
దారి 362
దారులుమూడు 362
దాస్యం 362
దాసోహం 362
దిక్సూచి 363
దినము 363
దిల్‌మే రామ్ హాత్‌మే కామ్ 363
దివ్యతత్వం 364

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

దివ్యత్వము 364
దివ్యత్వాన్ని గుర్తించడం 366
దివ్యప్రకటనలు (సాయి) 366
దివ్యవాణి 392
దివ్యలీలలు 392
దివ్యశక్తి 392
దీక్ష 392
దీనుడు 392
దీపం 392
దీపారాధన 393
దీపావళి 393
దుఃఖము 394
దున్నపోతా! 394
దురహంకారము 394
దురాచారములు/దురాచారాలు 394
దురాచారుడు 394
దురాత్ముడు 394
దురాలోచనలు 394
దుర్గ 395
దుర్జనులు 395
దుర్భావము/దుర్భావములు 395
దుర్మార్గము/దుర్మార్గుడు/దుర్మార్గులు 395
దుర్మార్గమైనమార్గం 395
దుర్వాసనలు 395
దుర్యోధనుడు 396
దుర్గుణము/దుర్గుణములు 396
దుర్బుద్ధులు 397
దుశ్శాసనుడు 397
దుష్టచతుష్టయము 397
దుష్టచేష్ట 397
దుష్టపుత్రుడు 397
దుష్టశిక్షణ 397
దుష్ట సంకల్పము 397
దుష్టులు 398
దుష్ప్రచారములు 398
దుస్సంగము 400
దూపాటి తిరుమలాచార్యులు 400
దూరము 400
దూరంగా ఉంచు 400
దూషణభూషణలు 400
దూషించుట 401
దృఢనిశ్చయము 402
దృశ్యము 402
దృష్టి 403
దేనికైనా రెడిగా ఉండాలి 403
దేవతలు 403
దేవయానము 403
దేవాలయము/దేవాలయములు 403
దేవుడు 404
దేవుడు ఒక్కడే 405
దేవుడున్నాడు 405
దేవుడెక్కడున్నాడు? 405
దేవునికోసం 406
దేశము 406
దేశరక్షణ 406
దేశశ్రేయస్సు 406
దేశసంరక్షణ 407
దేశసేవ 407
దేశాభివృద్ధి 408
దేహము 408
దేహతత్వము 413
దేహభ్రాంతి 413
దేహమే దేవాలయము 414
దేహాభిమానము 414
దేహి 414
దైవము 415
దైవంకోసం 417
దైవకర్మ 417
దైవకుటుంబము 417
దైవగుణము 418
దైవచింతన 418
దైవతత్వము 418

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

దైవతృప్తి 418
దైవత్వము 418
దైవప్రజ్ఞ 419
దైవప్రసాదాలు 419
దైవప్రార్థన 419
దైవప్రీతి 419
దైవబలము 419
దైవభ్రాంతి 420
దైవమానవత్వము 420
దైవము ఒక్కడురా! 420
దైవమును నిందించకండి 421
దైవమును విమర్శించకండి 421
దైవలక్షణాలు 421
దైవలీల/దైవలీలలు 422
దైవవిశ్వాసము 422
దైవశక్తి/దైవశక్తులు 425
దైవశాసనము 425
దైవసంకల్పము 425
దైవసంపత్తి 426
దైవసాన్నిధ్యము 427
దైవస్వరూపులు 427
దైవాంశసంభూతుడు 428
దైవాజ్ఞ 428
దైవానికి చిహ్నములు 428
దైవానుగ్రహము/దైవానుగ్రహమే 429
దైవాన్వేషణ 429
దైవారాధన 430
దైవోపాసకులు 430
ధ్వైతము 430
దౌర్బల్యము 430
దోషము/దోషములు 430
ద్రష్టం 431
ద్రష్టలు 431
ద్రౌపది 431
ద్వందములు 431
ద్వేషము 431

ధనసంకల్పము 432
ధనము 433
ధనవంతుడు/ధనవంతులు 434
ధన్యతముడు 435
ధన్యమైనది 435
ధన్వంతరి 435
ధన్యుడు/ధన్యులు 435
ధర 435
ధరణి 435
ధర్మము/ధర్మములు 435
ధర్మకర్తలు 439
ధర్మక్షేత్రము 439
ధర్మతత్వము 439
ధర్మత్రయము 440
ధర్మదీపము 440
ధర్మనాశనము 440
ధర్మపత్ని 440
ధర్మపథము 440
ధర్మబలము 440
ధర్మమే మూలము 441
ధర్మయుద్ధము 441
ధర్మరక్షణ 441
ధర్మరాజు 441
ధర్మవిరుద్ధము 442
ధర్మశాస్త్రము 442
ధర్మశిక్షణ 442
ధర్మసంస్థాపన 442
ధర్మసాధన 442
ధర్మస్థాపన 442
ధర్మసూక్ష్మము 443
ధర్మసూత్రములు 443
ధర్మాచరణ 443
ధర్మాష్టకము 444
ధర్మోద్ధరణ 444
ధారణ 444
ధీమంతుడు 444

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.
ధీరుడు 445
ధూమాదిమార్గము 446
ధృతరాష్ట్రప్రేమ 446
ధృతరాష్ట్రుడు 446
ధ్రువతార 446
ధ్యానమార్గము 446
ధ్యానము 447
ధ్యాన యోగము 449
ధ్యేయము 449
ధ్వని 449
నందీశ్వరుడు 450
నగరసంకీర్తనము 450
నగ్నసత్యము 451
నచికేతుడు 451
నటరాజు 452
నదిమూలము 452
నదీస్నానం 452
నదులు 452
నన్ను చేరగోరువారు 452
నన్నే పొందుదురు 452
నమస్కారము 453
నమ్మకము 454
నమ్మిచెడినవారు లేరు 454
నరక చతుర్దశి 454
నరకము 455
నరకమునకు పోవుమార్గము 456
నరకాసురుడు 456
నరజన్మ 456
నరపశువు 457
నరసింహావతారము 457
నరుడు 458
నర్తకి 458
నవద్వారము 458
నవనీతచోరుడు (శ్రీకృష్ణుడు) 459
నవవిధభక్తిమార్గములు 459
నవవిధభక్తులు 459
నా ఆయుధం 459
నా ఆశయము 459
నా కర్తవ్యము 459
నా జీవితము 459
నా జీవితమే నా సందేశము 460
నాడీకేంద్రము 460
నాడీ గ్రంథము 460
నాదబిందుకళలు 460
నాదములు 461
నాధుడు 461
నా మంచికే 461
నామమహిమ 462
నామము 463
నామరసము 463
నామస్మరణ 463
నాయకుడు 465
నారద/నారదుడు 466
నారాయణునిబోధ 466
నారాయణ/స్వరూపములు 467
నారాయణుడు 467
నారికేళ నివేదన 467
నాలుక 467
నాలుగు 468
నాలుగు ఆటంకములు 468
నాలుగు ఆలయములు 468
నాలుగు గుణములు 469
నాలుగు జన్మలు 469
నాలుగు మార్గాలు 469
నాలుగు F లు 470
నాలుగు S లు 470
నాలుగు ముఖ్యమైన అంశములు 470
నాలుగుయుగాలు 471
నాలుగు స్థాయులు 472
నాలెడ్జి 472
నావ 472
నావాళ్ళే 472
నాశనం 472
నాసందేశము 472

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

నాస్తి 472
నాస్తికుడు/నాస్తికులు 473
నిందాస్తుతులు 473
నిందించుట 473
నిగ్రహము 473
నిజతత్త్వము 473
నిజమైన బంధువులు 473
నిజ సన్యాసి 474
నిత్యజీవితము 474
నిత్యము 474
నిత్యుడు 474
నిదర్శనము 475
నిద్ర 475
నిదానవతీ ఆరాధన 476
నిదిధ్యాసము 476
నిన్ను నీవు తెలుసుకో 476
నిన్ను నీవు మరచిపోవద్దు 477
నిప్పు 477
నిమిత్తకారణము 477
నియమనిబంధనలు 478
నియమబద్ధజీవితము 478
నియమములు 478
నియర్ (సమీపం) 479
నిరంతరము 479
నిరర్థకములు 479
నిరాకారము 479
నిరాకారోపాసన 479
నిర్మమత్వము 479
నిర్యాణము 479
నిర్వాణము 479
నిర్వికల్పసమాధి 481
నిర్విరామము 481
నిర్గుణోపాసన 481
నిలకడ 481
నివాసము 481
నివాసస్థానము 481
నివృత్తి 482
నిశ్శబ్దము 483
నిశ్చలమానచిత్తుడు 483
నిష్ఫలము 483
నిష్కామకర్మ 483
నిష్కామకర్మయోగము 485
నిస్సంగత్వం 485
నీచుడు 486
నీడ 486
నీతి 486
నీరు 487
నీవే 487
నీవే నేను - నేనే నీవు 487
నూతనజబ్బు 487
నెగిటిన్ 487
నెమలి 487
నెహ్రూ 488
నేటివిద్యలు 488
నేటి విద్యావిధానము 488
నేత్రలింగము 488
నేను 489
నేను-మనము 493
నేనెవరు? 493
నేర్చుకో 494
నేర్పునది 495
నైతిక 496
నైతికపతనము 496
నైతిక సూత్రములు 496
నైపుణ్యము 496
నైవేద్యము 497
నో 497
నోరు 497
న్యాయ 497
న్యాయసూత్రములు 497
న్యూన్ 497

అంగములు

(చూ॥ అంగహీనుడు, పాదములు, సాయి శరీరం)

అంగవతీ ఆరాధన

(చూ॥ దైవారాధన)

అంగహీనుడు

మీ దేహంలోని ప్రతి అంగమును భగవత్ప్రీత్యర్థమై, భగవదనుగ్రహం పొందే నిమిత్తమై వినియోగించాలి. అప్పుడే మీ జీవితం సార్థక మవుతుంది. ఒకానొక సమయంలో **తులసీదాసు తాను అంగహీనుడనని చాల బాధపడ్డాడు.** ఈ మాట విని కొందరు."అదేమిటి! మీకు కాళ్ళుచేతులు మొదలైన అంగములన్నీ బాగానే ఉన్నాయి కదా! మీరు అంగహీనులు కావడ మేమిటి?" అని ప్రశ్నించగా తులసీదాసు, "అవును నాకు కాళ్ళుచేతు లున్నాయి. **కాని ప్రయోజన మేమి? భగవంతుని సేవ చేయలేకపోతున్నాను. కన్నులున్నాయి కాని భగవంతుని దర్శించలేకపోతున్నాను. చెవులున్నాయి కాని భగవద్వాణిని వినలేక పోతున్నాను. కనుక నేను అంగహీనుడనే"** అన్నాడు. త్యాగరాజు కూడా ఇదే భావాన్ని వ్యక్తం చేస్తూ, "కన్ను లేలరా? రాముని చూడని కన్ను లేలరా?" అని పాడినాడు. అంతేకాదు. తాను రాముని విడిచి ఒక్కక్షణమైనా ఉండలేనన్నాడు.

"రార మా ఇంటిదాక
రఘువీర, సుకుమార నీకు మ్రొక్కెద
రార మా ఇంటిదాక
రారా దశరథ కుమారా
నన్నేలుకోర, నే తాళలేర
రార మా ఇంటిదాక..."

అని ఎంతో ప్రేమతో తన పాతస్నేహితుని పిలిచినట్లుగా రాముని 'రారా' అని పిలిచాడు. ఆధ్యాత్మిక మార్గంలో ఏకవచనం తప్ప బహువచనం లేదు. కారణ మేమిటి? భగవంతుడు మీ పాతమిత్రుడు. కనుకనే త్యాగరాజు రాముని ఏకవచనంతోనే సంబోధించాడు. మీ ఇంటికి ఎవరైనా క్రొత్తవారు వస్తే, "రండి, దయచేయండి" అంటారు

అంగీరసుడు

కాని **పాతమిత్రుడే గనుక వస్తే "రారా"** అంటూ చనువుగా పలుకరిస్తారు కదా! అదేవిధంగా భగవంతుని కూడా మీ స్వంతవానిగా, పాతమిత్రునిగా భావించండి.

(స.సా.ఫి. 97 పు. 42/43)

అంగీరసుడు

భగవంతుడు మానవదేహంలో ప్రతి అణువునందు, ప్రతి అంగమునందు రసస్వరూపై నివసిస్తూ క్షణ క్షణమూ మానవుణ్ణి కాపాడుతూ, పోషిస్తూ వస్తున్నాడు, కనుకనే భగవంతుణ్ణి 'అంగీరసుడు' అన్నారు. భగవంతుని నుండి ఇట్టి రక్షణ పొందడంచేత మానవుడు భగవంతునికి ఋణపడి యుంటున్నాడు. ఈ ఋణమును తీర్చుకోవాలంటే మానవుడు తన శక్తికొలది సత్కర్మల నాచరించాలి, తోటి మానవునికి తోడ్పడాలి, సమాజ సేవలో పాల్గొనాలి. అయితే. సేవ చేయడం పరులకు సహాయపడటం కోసమని భావించకూడదు, తన ఋణవిముక్తి కోసమే అని గుర్తించాలి. ఏ సేవ చేసినప్పటికీ దైవఋణం కొంతవరకు తగ్గిపోతుంది. **సేవకుడే నిజమైన నాయకుడు. భగవంతుడు దేహము నిచ్చినది సేవ చేయడానికే అని గుర్తించి సేవలో పాల్గొని దైవ** ఋణమును తీర్చుకొని మానవుడు ధన్యుడు కావాలి.

(స.సా.మే 2000 పు. 141/142)

(చూ॥ భద్రము)

అంటువ్యాధి

అనుమానమే ఆస్తికునకు అంటువ్యాధి. అనుస్థానం ఉంటే అనుగ్రహం లభిస్తుంది. అన్నింటియందు కల ఆత్మశక్తి ఒక్కటే అని తెలుసుకొనుట బ్రహ్మజ్ఞానము, మిగిలినవి కర్మ జ్ఞానము. అభిమాన శూన్యమే **ఆనందనిలయం.** అవివేకికి మనస్సే భూతం, వివేకికి మనస్సే దైవం. దోషంకంటె దోషములను చర్చించువాడు **దోషి.** దైవముపైన భక్తి, జీవులపైన రక్తి, సేవపైన ఆసక్తి పెంపొందించండి. దేవతలు భోగస్వరూపులు, అమృతము త్రాగిరి. దేవుడు త్యాగస్వరూపుడు, గరళమును కంఠమున చేర్చి లోకాన్ని రక్షించినాడు.

(స.సా.ఏ 91 పు. 109)

అంతఃకరణ/ అంతఃకరణము

మనస్సే అనేక విధములైన సూక్ష్మరూపములు ధరించి అంతఃకరణ అనే పేరును అందుకుంటున్నది. మనసు బుద్ధి చిత్తము అహంకారము ఈ నాలుగు ఆకారములు మనసే ధరిస్తుంటుంది. బుద్ధి చిత్తము అహంకారము మనసు యొక్క సూక్ష్మ స్వరూపములే. ఒక్కొక్క కర్మయందు ప్రవేశించినప్పుడు ఒక్కొక్క పేరును పొందుతుంది. ఒకే బ్రాహ్మణుడు, మందిరమునందు పూజ చేస్తున్నప్పుడు పూజారి బ్రాహ్మణుడు అంటారు. వంట చేస్తున్నప్పుడు వంట బ్రాహ్మణుడు అంటారు. విద్యార్థులకు విద్య బోధించుచున్నప్పుడు అధ్యాపక బ్రాహ్మణుడు అంటారు. పంచాంగము చెప్పుతున్నప్పుడు పంచాంగ బ్రాహ్మణుడు అంటారు. బ్రాహ్మణుడు ఒక్కడే ఐనప్పటికిని చేసే వృత్తులను పురస్కరించుకొని అతనికి ఇట్టి నామములు కలుగుతూ వచ్చాయి. అదే విధముగనే సంకల్ప వికల్పములతో కూడినపుడు దీనికి మనస్సు అనే పేరు వచ్చింది. వివేచన చేసే సమయమునందు దీనిని బుద్ధి అనే పేరుతో పిలిచారు. ఇది విచక్షణా జ్ఞానముతో కూడిన విచారణ, దీనిని డిస్క్రిమినేషన్ నాలెడ్జి అంటారు. మూడవది చిత్తము. ఇది స్మృత్యాత్మకము కనుకనే దీనికి చిత్తము అని పేరు వచ్చింది (మెమొరి). మెమొరి దేహముతో తాదాత్మ్యము పొందే సమయమునందు కలిగే స్వరూపమును అహంకారము అని పిలుస్తూ వచ్చారు. ఒకే మనసు ఇన్ని కర్మలయందు ఇన్ని స్థానములయందు అన్ని పేర్లను పొందుతూ ప్రకటిస్తూ వచ్చింది. అన్నింటికిని మనసే కారణము. ఈ ప్రపంచమంతయు మనసుచేత కట్టబడి ఉంటుండాది.

(బృ.త్ర.పు. ౯౯)

మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము ఈ నాల్గింటి చేరికనే అంతఃకరణ. కరణమనగా పనిముట్టు, ఇంద్రియము,

అంతఃకరణమనగా లోపలి యింద్రియములు, కన్నులు బయట చూస్తున్నాయి. చెవులు బయట వింటున్నాయి, నోరు బయట మాట్లాడుతున్నది. చేతులు బయట పనిచేస్తున్నాయి, ముక్కు బయట వాసన చూస్తున్నది. వీటిన్నిటికి రూపములంటున్నాయి. మనస్సునకు రూపము లేదు. బుద్ధికి రూపము లేదు. చిత్తమునకు రూపము లేదు. అహంకారమునకు రూపము లేదు, రూపము లేని వీని సమ్మిళిత స్వరూపమే దీని స్వరూపము. దీనికి నాలుగు విధములైన దోషము లుంటున్నాయి. ఒకటి భ్రాంతి, రెండవది ప్రమాదము, మూడవది కరణ పాటవము. నాల్గవది విప్రలిప్స. ఈ నాల్గు దోషములు అంతఃకరణను మాలిన్యపరుస్తున్నాయి.

(బృ.త్ర.పు ౯౯)

పంచభూతములు యొక్క సమిష్టిస్వరూపమే అంతఃకరణ. అంతఃకరణ శబ్ద స్పర్శ రూప రస గంధములు అన్నీ అనుభవించే అధికారముంటున్నది. అంతఃకరణము. శబ్దస్పర్శ రూపరస గంధాదులు జ్ఞానేంద్రియములకు మాత్రమే సంబంధించినది. ఈ జ్ఞానేంద్రియములు దేహమునకు వెలపలివా లోపలివా అని విచారిస్తే ఇవి అంతర్బహిస్స్వరూపాలు.

(బృ.త్ర.పు ౧౧౩)

(చూ॥ అసూయ, త్రిగుణములు, నన్నేపొందుదురు, పొత్తు, వ్యష్టితత్వము.)

అంతరాత్మ (The Conscience)

నీ అంతరాత్మయే నిన్ను ప్రేరిపిస్తుంది. మంచి పనులు చేయునప్పుడు, చెడ్డపనులు చేయునప్పుడు చెప్పుతుంది. **నీ అంతరాత్మ చెప్పినదానిని వింటే ఎప్పుడూ చెడిపోవు.**

(సా. పు. 585)

అంతరాత్మ కన్న అధ్యాపకుడు లేడు
అరయ కాలమొకటె పరమ గురువు
గ్రంథరాజం బేది ప్రత్యక్ష లోకమే
ఎవడు స్నేహితుండు, ఈశ్వరుండె!

(స.సా.ఫి. 2000 పు. 50)

అంతరాత్మ

ప్రేమస్వరూపులారా! మీ హృదయాన్ని కడిగి పరిశుద్ధ పరచుకొని, పవిత్ర భావములతో నింపుకొని సత్కర్మల నాచరించండి. హృదయంలో భగవన్నామాన్ని నింపుకోండి; చేతులతో సేవ చేయండి. "దిల్ మే రామ్, హాత్ మే కామ్", ఇదే సరియైన మార్గము. అప్పుడు మీకు దైవమే సహాయం చేస్తాడు. పూలు, సూది, దారముంది. పుష్పమాల తానగునా? కూర్చేవాడొక డుండాలి కదా! ప్రమిద, నూనె, పత్తి కలవు. దీపపు వెలుగు కలుగునా? వెలిగించేవా డొక డుండాలి కదా! **అదేరీతిగా, దేహమును, మనస్సును, బుద్ధిని చిత్తమును పనిలో ప్రవేశపెట్టడానికి ఒక యజమాని ఉండాలి కదా! ఆ యజమానియే ఆత్మ.** అదియే మీ Conscience (అంతరాత్మ). దేహ మొక నీటి బుడగ, మన స్సాక పిచ్చికోతి. కాబట్టి, దేహాన్ని, మనస్సును అనుసరించకండి. అంతరాత్మను అనుసరించండి. అంతరాత్మ సలహాను పాటించండి, ఇతరుల సలహాలు మీకక్కర్లేదు.

(స.సా.మే2000 పు.154/155)

(చూ॥ దైవసంకల్పము, బ్రహ్మవిద్య)

అంతరార్థాలు

(చూ॥ ఆచారములు, స్థైర్యము)

అంతర్దర్శనము

(చూ॥ షడ్ దర్శనము)

అంతర్దృష్టి

నీలోనే ఉన్న స్వర్గాన్ని సాక్షాత్కారించుకో. వెంటనే నీ కోరికలన్నీ నెరవేరుతాయి. బాధ, వ్యధ అంతా అంతమవుతుంది. నీవు శరీరానికి, పరిసరాలకు, మనసు దాని ప్రేరణలకు జయాపజయాలనే భావాలకు అతీతుడవుగా భావించుకో. ఈ ప్రపంచంలో బాధలకు కారణం అంతర్దృష్టి లేకపోవడమే. బయట శక్తులపై ఆధారపడటమే.

(అ.ష.పు. 24)

(చూ॥ హృదయము)

అంతర్ముఖము

(చూ॥ నిశ్చల సమాన చిత్తుడు)

అంతర్భూతము

ఈనాటి మానవుడు "అందరినీ ప్రేమిస్తున్నాను" అని పలుకులలో ఉచ్చరిస్తుంటాడు. కాని, నిజంగా ప్రేమ అంటే ఏమిటో అర్థం చేసుకోవటం లేదు. మా పిల్లలు కూడా స్వామికి వ్రాస్తుంటారు - "I Love You...I love you..." అని. కాని, ఏమిటీ ప్రేమ? తెల్లవారినది మొదలు రాత్రి వరకు కనిపించే ప్రక్కింటి వానిని ప్రేమించకుండా, కనిపించని భగవంతుని ప్రేమిస్తున్నామంటే-ఇది ఏమైనా నమ్మదగిన విషయమేనా? కంటికి కనిపించే వ్యక్తులనే నీవు ప్రేమించటం లేదు. **వ్యక్తిని ప్రేమించి నప్పుడే శక్తిని ప్రేమించిన వాడవపుతావు**. అందరి యందు **అంతర్భూతముగా** ఉన్నది దివ్యత్వ మొక్కటే?

పరిపూర్ణమైన దివ్యత్వాన్ని గుర్తించాలంటే, అనుభవించాలంటే, మీరు కూడా పరిపూర్ణ హృదయులు కావాలి. అదే నిజమైన భక్తి ప్రపత్తుల యొక్క ప్రభావము. కాని, ఈనాడు మన భక్తి పరిపూర్ణంగా లేదు. ఐతే ఏ విధంగా ఉంది? ఏదో కొంత కొరత కలిగియున్నది. "C" అనే అక్షరం మాదిరిగా ఒకచోట ప్రారంభమై మరొక చోట నిలిచిపోతున్నది. మధ్యలో పెద్ద అగాధమైన, అర్థరహితమైన లోయ ఉంటున్నది. కనుకనే, పరిపూర్ణము కానిదానికి ఫలితంగా పరిపూర్ణంగా ఉండదు. పరిపూర్ణ హృదయులకు ఫలితం పరిపూర్ణంగానే ఉంటుంది. పరిపూర్ణ హృదయంతో ఆఫీసులో "Day and Night" పని చేసే వారికి నెలసరి జీతం ఇస్తారు; వారికి Pension కూడా ఇస్తారు; వారికి Dearness allowance కూడా ఇస్తారు కాని, Part time భక్తులకు, Part time workers కు పూర్తి జీతం రాదు; ఇంత మాత్రమే కాదు. వారికి Pension ఇవ్వరు; Dearness allowance కూడా ఇవ్వరు. అనగా పూర్ణమైన హృదయము కలవారికే భగవదనుగ్రహము పరిపూర్ణంగా ఉంటుంది.

(శ్రీ.భ.ఉ.పు.151)

అంతర్జ్యోతి

జ్యోతికి ప్రమిద నూనె వత్తి అగ్గిపెట్టె అవసరమైనట్లే **అంతర్జ్యోతిని వెలిగించుటకు వైరాగ్య మనే ప్రమిద, భక్తి** అనే తైలము, చిత్తైకాగ్రత అనే వత్తి తత్వజ్ఞానమనే అగ్గిపెట్టె కావాలి. ఈ నాల్గింటిలో ఏ ఒక శక్తిని కోల్పోయినను ఆత్మజ్యోతిని వెలిగించుకోలేము. పరమాత్మతత్వం ఎక్కడున్న దనగా అశాంతి లోనే ఉన్నది; అజ్ఞానమునందే ఉన్నది; అశాంతిలో ప్రశాంతి, ప్రశాంతిలో ప్రకాంతి, ప్రకాంతిలో పరంజ్యోతి. పరంజ్యోతియే పరమాత్మ స్వరూపము. అజ్ఞానము ప్రత్యేకంగా ఉండేది కాదు. జ్ఞానము అభావమే అజ్ఞానము. వెలుతురు అభావమే చీకటి. రెండింటియందున్న ఏకత్వాన్ని గుర్తించి వర్తించడమే మన ప్రధానకర్తవ్యము.

(స.సా.ఆ 87 పు.210)

అంతర్వాణి

నేను అప్పుడప్పుడు చెపుతుంటాను - భగవంతునితో చేరికయే ఆనందమని. ఎందుకంటే, భగవంతుడు ఆనంద స్వరూపుడు "నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం...." ఇట్టి ఆనందమయుడైన భగవంతుణ్ణి దూరం చేసుకోవటం దురదృష్టం.

"చిక్కిన సాయిని వక్కచేయక చక్క చేసుకోండి
పోయిన చిక్కదు పర్తీశ్వరుని పాదసేవయండి
భక్తిని ఇచ్చి శక్తిని పెంచి ముక్తి జేర్చునండి
ఇతరుల మాటల నింపుగ నమ్మి కొంప తీయకండి"

మీ అంతర్వాణిని మీరు నమ్మండి. అదియే ఆత్మసాక్షి. అత్మను నమ్మినవారికి ఎప్పుడూ ఏ కొరత కూడా ఉండదు. కనుక, ఆత్మ విశ్వాసాన్ని పెంచుకొని, దైవాన్ని ఆరాధన చేసి దివ్యత్వాన్ని పొందండి. జగత్తుకు ఆ ధర్మాన్ని ఆందించండి. అదియే చదువులోని నిజమైన సారము. "తరచి చదువు చదువ తర్కవాదమెగాని పూర్ణ జ్ఞానం బెపుడు పొందలేడు" ఈనాడు చదువుకున్నవారు అనేకులు తర్కవాదంలో కాలాన్ని వ్యర్థం చేస్తున్నారు. అది అజ్ఞాన

చిహ్నము. వాదనలో ప్రవేశించకండి. వాదన 'ఎనిమిటీ'ని (వైరమును) పెంచుతుంది. ఈనాడు మీకు కావలసినది 'యూనిటీ, ప్యూరిటీ, డివినిటీ,

(స.సా.జూ 99 పు. 162)

విద్యార్థులారా! మనయందు అంతర్వాణి (Conscience) సో ఽహంతత్వము క్షణక్షణమునకు బోధిస్తుంది. ఒక దినమునకు 24 గంటలు. ఇరవై నాలుగు గంటలలోపల యీసో ఽహం అనేది దినమునకు 21,600 సార్లు చెప్తుండాది. 21,600 సార్లు నేనే బ్రహ్మ, నేనే బ్రహ్మ, అని అంతర్వాణి నీకుపదేశము చేస్తూవుంటే ఈ వుపదేశమును ఒక ప్రక్క కట్టిపెట్టి నేనే బ్రహ్మ అనేది మరచిపోయావు. సో ఽహం అనేది పుట్టిన పేరు. పుట్టిన పేరు శాశ్వతముగాని పెట్టిన పేరు శాశ్వతమా? పెట్టిన పేరు కృత్రిమము (ఆర్టిఫిషియల్). పుట్టినది రియల్. అదే సత్యం. ఆ సత్యమునే ఋతముగా భావించుకోవాలి. ఈ సత్య ఋతములను రెండింటిని యేకము గావించుకొని, దివ్యత్వమైన సచ్చిదానందమును పొందాలి, కనుక బుద్ధి అనేది లోకరీత్యా ఉచ్చరించేది గానీ, అనుభవించేదిగానీ, ఉపయోగించేది గానీ కాదు. బుద్ధియొక్క రహస్యాన్ని చక్కగా గుర్తుంచుకొని యీ రథ సారథి తర్క విషయాన్ని తద్వారా పూర్తిగా తెలుసుకొన్నప్పుడే మన జీవిత రథాన్ని అతనికి అర్పితము చేయటానికి అవకాశముంటుండాది.

(బృ.త్ర.పు ౧౦౨/౧౦౩)

ఆత్మ సర్వులయందు ఎట్లు వుంటున్నది? జ్ఞానమనేది సర్వులయందు ఏవిధముగా ఉంటున్నది? అని ఏకాంతముగా కూర్చుని విచారణ చేసినప్పుడు శాశ్వతమైన, సత్యమైన, మార్పుచెందని శబ్దము మననుండి ఆవిర్భవిస్తుండాది. జగత్తునందున్న సమస్త పదార్థములు మార్పు చెందుతున్నాయి. సమస్త ఆకారములు మార్పు చెందుతున్నాయి. ప్రతి పదార్థము అణుమాత్రమే. ఈ అణువులు చేరికనే పదార్థ స్వరూపము. కాలక్రమేణా యీ అణువులు వేరైపోతుంటాయి. అణువుల స్వభావము, సంయోగ వియోగముల తత్త్వమే. కానీ మార్పు చెందని కూర్పు కలుగని ఒక దివ్యవాణి సర్వులయందు ఒక్కటిగానే వుంటున్నది. బాల్యమునందు, యౌవనమునందు, వార్ధక్యమునందు దేహము మార్పు చెందుతున్నది కాని. ఆ వాణి మార్పు చెందటం లేదు. జాగ్రత్‌స్వప్న, సుషుప్తులు మూడు అవస్థలు. మనము అనుభవిస్తున్నామే కాని యీ వాణి మార్పు చెందటం లేదు. స్థూలసూక్ష్మ కారణములు మనము అనుభవిస్తున్నామే గాని యీవాణి మార్పు చెందటం లేదు. ఏమిటి ఆ వాణి? ఆత్మతత్వము నుండి వెలువడిన దివ్యమైన అంతర్వాణి. అదియే నేను, నేను, నేను. అహం, అహం అహమ్. ఇదే సత్యమైనది. ఈ సత్యము అణువుకంటె చాల సూక్ష్మమైనది Truth is more fundamental than atom. ఇలాంటి సత్యస్వరూపమైనది అహం అహం అహం. ఈ అహం చేత స్ఫురింపబడిన తత్వమే సో ఽహం. ఈ అహం దేహముతో తాదాత్మ్యము పొందినప్పుడు అహంకారముగా మారుతున్నది. అహంకారము ప్రాకృతమైన భావము. అహం దివ్యమైన వాణి. దీనిని పాండిత్యము చేతగాని ధీశక్తిచేగాని గుర్తించటము అసాధ్యము.

(బృ.త్ర.పు ౧౩౪)

బుద్ధికి అంతర్వాణి అని మరొక పేరు. ఆ అంతర్వాణిని పురస్కరించుకొనియే మానవుడు తన జీవిత మార్గమును అనుసరిస్తుంటాడు. సమస్యలు చెలరేగినపుడు అంతర్వాణి జవాబులకు కాచుకొని వుంటాడు. తన అంతర్వాణి సంతృప్తిగా లేకుండిన సంతృప్తిని ప్రకటించలేడు. అంతర్వాణి సంతృప్తిగా నుండిన బాహ్య జగత్తునందును సంతృప్తి ప్రకటిస్తాడు. నిత్యజీవితములో నా కాన్షియస్ నాకు తృప్తిగా లేదు, నా కాన్షియస్ దీనిని వొప్పుకోవటం లేదు అంటారు. ఇక్కడ Conscience అనగా అంతర్వాణి. Follow the master అన్నారు. Master ఎవడు? అంతర్వాణియే నీ Conscience యే నీ Master. ఈ కాన్షియస్‌ను అంతర్వాణిని అనుసరించిన మనము సరియైన స్థాయిని చేరుకోగలము.

(బృ.త్ర.పు ౯౩)

(చూ॥ ఐకమత్యం, దివ్యత్వం, పవిత్రత)

అంతర్ సంబంధం

అంతర్ సంబంధం

బ్రాహ్మణుడు ~~ఈ~~ దేహములో ముఖము వంటివాడు. ~~ఈ~~ దేహాన్ని, దేశాన్ని రక్షించే నిమిత్తమై అందించబడిన హస్తములే "క్షత్రియులు". ఇంక వైశ్యు డెవరు? ఇతడు ఆహారాన్ని చక్కగా ఎగుమతి, దిగుమతి చేసుకుంటూ శరీరంలోని సర్వాంగములకూ ఆహార రసాన్ని సరఫరా చేస్తాడు. ~~ఈ~~ దేహము అన్నము పై ఆధారపడియున్నది. కనుక, దేహము నిలబడాలంటే అన్నమును అభివృద్ధి చేసుకోవాలి. దీని నిమిత్తమై "శూద్రులు" అనే తెగ ఏర్పడినది. కనుక, మన దేహంలో కాళ్ళే శూద్రులు, బ్రహ్మణుడు - తల, క్షత్రియులు - భుజములు, వైశ్యుడు- ఉదరము. ఐతే, ~~ఈ~~ నాలుగూ వేరే వేరే ఉన్నాయా? లేక అన్నీ కలిసే ఉన్నాయా? పనులు వేరు వేరు, కాని, అన్నీ కలిసి ఒక్కటే! ఒకదానితో నొకదానికి ఎంతో సన్నిహిత సంబంధబాంధవ్య మున్నది. దారిలో నడుస్తుంటే కన్ను ముల్లును చూస్తుంది. తక్షణమే కాలు దానిని దాటుతుంది. ~~ఈ~~ విధంగా కన్నుకు, కాలుకు ఎంత సన్నిహిత సంబంధబాంధవ్యమున్నదో చూడండి! కాలు కేదైనా దెబ్బ తగిలితే కన్ను ఏడుస్తుంది. అనగా శూద్రుని కేదైనా అపాయం జరిగితే బ్రహ్మణుడు బాధపడతాడు. బ్రహ్మణుడు ఏదైనా ముల్లును చూస్తే "నాయనా! దానిని దాటుకో, దెబ్బ తగిలించుకోవద్దు." అని శూద్రుని హెచ్చరిస్తాడు. ఒకరితో నొకరికి ఉండే ~~ఈ~~ విధమైన అంతర్ సంబంధాన్ని ~~ఈ~~నాడు భారతీయులు మరచిపోయారు.

(శ్రీ.భ.ఉ.పు.158)

అంత్యకాలము

(చూ॥ యాంతే మతి స్సాగతిః)

అంత్యము

(చూ॥ బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము)

అంథోని

పూర్వం ఇటలీ దేశంలో ఆంథోనీ అనే వ్యక్తి వయోలిన్లను తయారు చేసేవాడు. ఆంథోనీవయోలిన్ చాలా ప్రసిద్ధి గాంచినది. ఒక్కొక్క వయోలిన్‌ను తయారు చేయడానికి అతడు ఒక్కొక్క సంవత్సరం తీసుకునేవాడు. ఒకనాడు అతని మిత్రుడు వచ్చి, "ఆంథోనీ! ఒక్క వయోలిన్ చేయడానికి ఒక సంవత్సరం తీసుకుంటే దానిపై వచ్చే ఆదాయంతో నీ జీవితం జరగడం కష్టం కదా!" అన్నాడు. అప్పుడు ఆంథోని, "బ్రదర్! భగవంతుడు పూర్ణస్వరూపుడు. అతని హృదయం పరిపూర్ణమైనది. కనుక, అతనిని సంతృప్తి పరచాలంటే మనం తలచే తలపులు, పలికే పలుకులు, చేసే పనులు అన్నీ పరిపూర్ణమైనవిగానే ఉండాలి. అందుచేత, నేను **పరిపూర్ణమైన వయోలిన్ తయారుచేయకపోతే భగవంతునికే ద్రోహం చేసినవాడ నౌతాను. దానిని చేయడానికి ఎంత సమయం పట్టినా ఫరవాలేదు"** అన్నాడు. ఆ కాలంలో పాశ్చాత్యులు కూడా ~~ఈ~~ విధమైన పవిత్ర భావముతో దైవాన్ని ఆరాధిస్తూ వచ్చారు. పరిపూర్ణుడైన భగవంతుని మెప్పించాలంటే అతని పరిపూర్ణతలో పావుభాగమో లేక, ముప్పావు భాగమో పొందితే సరిపోదు. పూర్తిగా **పరిపూర్ణుడవు కావాలి. ఎందుకంటే - నీవు అతని అంశమే. సముద్రమునకు, అందులోని నీటిబిందువునకు క్వాంటిటీ భేదము కాని, క్వాలిటీ ఒక్కటే కదా!** కనుక, నీవు భగవంతుని పరిపూర్ణతను పొందాలి. నీ నడత భగవంతుని పరిపూర్ణతను పొందాలి. నీ నడత భగవంతుని పరిపూర్ణతను నిరూపించాలి. నీవు తలచే తలపు, పలికే పలుకు పరిపూర్ణ సత్యంగా ఉండాలి. కాని, ~~ఈ~~నాడు **'కృష్ణార్పణం' అంటూ 'తృష్ణార్పణం' గావిస్తున్నావు. చెప్పే దొకటి, చేసే దొకటి! కనుకనే, బాధలను దూరం చేసుకొలేక పోతున్నావు.**

(స.సా.సె 95 పు.232/233)

(చూ॥ పరిపూర్ణ ఆరాధన)

అందము

(చూ॥ భూషణం)

అకార పంచక అరిష్టములు

ఆనాటి విద్యార్థులు ఆ శిక్షణకు కట్టుబడి తూ.చ. తప్పక నియమములను పాటించేవారు. ఆజ్ఞను ఉల్లంఘించే విద్యార్థిని ఆ పరిసర ప్రాంతమునకు రానిచ్చేవారు కాదు. ఆకార పంచక అరిష్టములు కలిగిన వ్యక్తిని గురువులు సహించేవారుకారు. **అకారముతో ప్రారంభమయ్యే అరిష్ట పంచకంలో మొదటిది అలక్ష్యము, రెండవది అవినయము, మూడవది అహంకారము, నాలుగవది అసూయ, ఐదవది అసభ్యత -ఈ ఐదింటిని కూడినవాడు విద్యార్థిగా తగిన వాడు కాదు. అలక్ష్యము చేయకూడదు.** అవినయము ప్రకటించ కూడదు, అహంకారం అంతకంటె ప్రమాదమైనది, అసూయ మహాపాపస్వరూపమైనది, ఇంక అసభ్యత - మానవుడుగా ఉండికూడా సమాజమునందు ఏ విశిష్ట భావముతో జీవించాలో, దానికి విరుద్ధముగా జీవించుటయే **అసభ్యత.**

(స.సా.జూ. 91 పు.164)

అకీర్తికరము

(చూ॥ మోహము)

అక్టోబర్ 20వ తేది

(చూ॥ అవతార ప్రకటన దినము)

అక్షరం

"అర్జునా! 'అక్షరం బ్రహ్మపరం' పరమైన అక్షరమే బ్రహ్మము! అక్షరమంటే నాశనము కానటువంటిది. **బ్రహ్మమనగా పెద్దది అని కూడా అర్థము.** అనగా, యెంత పెద్దదని ప్రశ్న పుట్టునేమో; ఎంత పెద్దదనుకొన్న దానికంటె పెద్దది! **అక్షరమంటే మరొక అర్థము కూడా కలదు. దానిని సర్వవ్యాపకమనికూడా అందురు. బ్రహ్మమనగా కేవలము అక్షరమే కాదు.** పరమైన అక్షరం దేశకాల జ్ఞానములతోనూ, మరేవిధమైన సాధనలతోనూ తెలియని, యేమి చేసిననూ నశించిక, కృశించక వుండి నాశనము కానిదే అక్షరం.

అట్టి స్థిరమైన బ్రహ్మమును పొందుటే మానవజాతికి లక్ష్యం, అక్షరమనియు, బ్రహ్మమనియు, రెండు పదములుగ శబ్దములుగ గోచరించిననూ అవి రెండూ ఒకటే. అవి బ్రహ్మముయొక్క సగుణ నిర్గుణములను సూచించును. అక్షర శబ్దము బ్రహ్మవాచకమగు 'ఓం కారము'ను తెలుపును. అందువలననే దీనిని 'అక్షర పరబ్రహ్మయోగ' మని పిలుతురు. బ్రహ్మమునకు పరమము, అక్షరము అని రెండు విశేషణములు కలవు. అక్షరమను మాటకు ప్రణవము అనియూ,మాయ అనియు, అర్థము వచ్చును, అక్షరమని చెప్పబడే మాయ కూడ ప్రణవానికి శ్రేష్ఠమయిన వస్తువే. ఇవి సవిశేషము. ఇట్టి బ్రహ్మమును తెలుసుకొన్నవాడే నన్ను పొందును.

(గీ.పు. 125/126)

కాగితంబు మీద కలిగిన అక్షరాల్
చదివినంతనె ధరణి చతురు డగునె?
అక్షరముల యందు అర్థంబు నెరుగుచు
చదువునట్టి వాడె శ్రేష్ఠు డగును ॥

(సా. పు. 326)

అక్షరోపాసకుడు

(చూ॥ నిర్గుణోపాసన)

అగస్త్యుడు

(చూ॥భగవంతుడు)

అగ్ని

అగ్రి : సర్వమునకు అగ్రమున అనగా పూర్వమున సృజింపబడిన వాడు అని అర్థము. అగ్ని: పరోక్షనామము. **"అగ్నిర్వై దేవయోనిః" అనేది శ్రుతి** ననుసరించి అగ్నియొక్క దేవతాత్మకత్వమును అటులనే యజమానికి కలుగు

అగ్ని పర్వతం

దివ్యత్వమును ఎవరు తెలిసికొనగలరో అట్టివారికి అమృతత్వము సిద్ధించును.

భోక్త, భోగ్యము అని జగత్తు ద్వివిధము. భోక్త, భోగ్యరూపమగు ఈ జగత్తు ఏకీభూతమగునపుడు, ఈ రెండింటినీ కలిపి అత్తా అనియో లేక భోక్త అనియో వ్యవహారము. భోగ్యము అను వ్యవహారము వేరు. **భోక్త యెవరు? అగ్నియే హవిస్సులను గ్రహించేది.**

ఆధి దైవికము ఆదిత్యుడు. ఆధ్యాత్మికముగ ప్రాణము. ప్రాణాగ్ని ఇట్లు అగ్నియందు ఆజ్య, సోమ ఆది హవిస్సులకు "అహితయుః" అని పేరు, పరోక్షముగా ఆహుతులు అని చెప్పబడినది. దేవతలు పరోక్ష ప్రియులు.

(లీ.వా॥ పు. 22)

అగ్ని - "బిడ్డా! నేను మంచి చెడ్డ వ్యత్యాసము చూడను. చెడ్డను కాల్చి నేను చెడిపోవటం లేదు. మంచిని కాల్చి అభివృద్ధికి రావటం లేదు. ఈ రెండింటిని సమత్వంగానే భావిస్తున్నాను. కనుక మంచి చెడ్డలనే విచారము నీయందు ఉంచుకోవద్దు. అన్నియు భగవంతు డను గ్రహించిన ప్రసాదములే. మంచిచెడ్డలను నీవు వ్యత్యాసము చేసుకొనక అన్నింటియందు సమత్వము వహించు. ఇదియే ఆత్మజ్ఞానము" అనింది. దీనిని పురస్కరించు కొనియే నేను అప్పుడప్పుడు చెబుతుంటాను. **ప్రకృతియే మనకు పెద్ద గ్రంథము.** ఈ గ్రంథము నుండి మనము ఎన్నియో నేర్చుకొనవలసినవి వున్నాయి.

(ద.య.స. 97 పు 64)

(చూ॥ అధర్వవేదము, ఋగ్వేదము, పంచభూతములు, వేదము, స్వాహా)

అగ్ని పర్వతం

(చూ॥ దూరంగా ఉంచు)

అగ్నులు

(చూ॥ పంచాగ్నులు)

అజ్ఞాతము

(చూ॥ బ్రహ్మస్వరూపము)

అజ్ఞాత వాసము

(చూ॥ బ్రహ్మస్వరూపము)

అజ్ఞానం

ఈనాడు చదువులు పెరుగుతున్నాయిగాని, మనస్సులు కుంచించు కు పోతున్నాయి. మనుష్యులు మరీ సంకుచితులుగా తయారవుతున్నారు. విశాల భావాన్ని పెంచుకోవాలి. ఇదే నిజమైన విద్యకు సారం, లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరి తీరాలనే పట్టుదల మనలో ఉండాలి. దేశ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, భారతదేశ విశిష్టతను పెంచుకోవాలి. ఈ రెండు చేరినప్పుడు ఆనందం లభిస్తుంది. సైన్సు వేరు, ఆధ్యాత్మికత వేరు అని విభజించరాదు. రెండిటిని సమన్వయపరచాలి. ఈనాడు విజ్ఞానం పెరిగిపోయిందని విఱ్ఱవీగుతున్నాము గాని, విజ్ఞానంతోపాటు అజ్ఞానం అంతకంటె పెరిగిపోతున్నది. ఈనాటి విజ్ఞానం కేవలం స్వార్థ స్వప్రయోజనాలతో అభివృద్ధి చెందుతున్నదేగాని జగత్కళ్యాణంకోసం కాదు. **విజ్ఞానం ఎంతో పెరిగినా, దురాలోచనలు, దురలవాట్లు, దుర్బుద్ధులు, దుష్కర్మలు పోవటంలేదు. పవిత్ర భావాలు రావటంలేదు. ఒక దేశం వారు మరొకదేశాన్ని భస్మం చేయాలని కక్షవహిస్తున్నారు. ఇదేనా సైన్సు సాధించిన అభివృద్ధి? ఇది విజ్ఞానం కాదు, పరిపూర్ణమైన అజ్ఞానం. ఈ స్థితికి కారణ మేమిటి? సైన్సుకు జీవిత సామర్థ్యాన్ని పెంచే స్తోమత, ఆధారం లేదు. జీవిత సమగ్రతను పోషించే అధికారం ఒక్క ఆధ్యాత్మికతకు మాత్రమే ఉన్నది. మానవతా విలువలు ఒక్క ఆధ్యాత్మికత్వంతో జోడించినప్పుడే అభివృద్ధి కాగలవు. కేవలం సైన్సుతో ముడిపెడితే ఏమాత్రం అభివృద్ధి కావు.** విత్తనాన్ని భూమిలో పెట్టినప్పుడే మొక్క మొలుస్తుంది. డబ్బాలో పెట్టి నీళ్ళు

పోస్తే కుళ్ళిపోతుంది. మానవతా విలువలు పెరగడానికి ఆధ్యాత్మికత్వమనే సైన్సు చాల అవసరం. కనుక మొట్టమొదట ఆధ్యాత్మిక భావాలను అభివృద్ధి గావించుకోవాలి.

(శ్రీ.జూ. 97 పు. 34)

ఏదో నాకు తెలియని మహత్తరమైన శక్తి ఒకటి నాకంటె నేరుగా ఉంది అని కొంతమంది విశ్వసించి ధ్యానము చేస్తారు. గోప్యముగా రహస్యముగా ఏదో ఒక దివ్యమైన శక్తి నాకంటె వేరుగా వున్నది, దీనిని పొందాలి అని అనేక దీక్షలు పూనుతారు. ఇది కేవలము అజ్ఞానము. నీకంటె వేరైనది ఒకటి వున్నదనుకున్నంతవరకును నీవు అజ్ఞానములో మునిగినవాడవే. నీకంటె మించినది లోకములో మరొకటి లేనే లేదు.

(బృ.త్ర. పు.౧౨౭)

(చూ॥ అవతారము, క్షేత్రజ్ఞుడు, దేవుడు, శుభ్రము)

అజ్ఞానముయొక్క తత్త్వం

కస్తూరీ మృగము తననాభినుండి పుట్టే సుగంధాన్ని అనుభవిస్తూ అది ఎక్కడ నుంచి వస్తుందా అని అడవంతా తిరుగుతుంది. అడవంతా తిరిగి అలసిపోయి కట్ట కడపటికి ఒక వృక్షచ్ఛాయలో విశ్రాంతి తీసుకుంటుంది. విశ్రాంతి తీసుకునే సమయములో తన ముక్కును తన నాభి దగ్గర ఉంచుకొని పవళిస్తుంది. తన నాభినుండి వచ్చే సుగంధమును గుర్తించి అయ్యో ఈ సుగంధం ఎక్కడ ఉన్నదా అని అడవంతా సంచరించాను. అలసిపొయ్యాను అనుకుంటుంది. అదే అజ్ఞానము యొక్క తత్త్వము. మానవుడూ అంతే. **నిత్యానందము. బ్రహ్మానందము అద్వైతానందమనేది మానవుని స్వభావము, స్వరూపము. బాహ్య, భౌతిక ప్రాకృత సంబంధమైన విషయ వాసనలకు లోబడి ఆ దివ్యమైన భవ్యమైన నవ్యమైన తత్త్వాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాడు.** అనుభవించలేకపోతున్నాడు. అన్వేషించలేక పోతున్నాడు. తన **ఆత్మయే సర్వవిధములైన మార్గములను అందిస్తూ నిరంతరము ఆనందింపజేయు చున్నది.** దుఃఖ విచారము ఏమాత్రము లేదు. పాత్రలో

అజ్ఞానముయొక్క తత్త్వం

పాయసము పోసి ఈ పాత్రకు ఎన్ని రంధ్రములు కొట్టినా ఏ రంధ్రమునుంచి వచ్చినా పాయసమే వస్తుంది. కాని మరొక చేదు రాదు. **ఆత్మ ఆనందమయము. కనుకనే ఋషులు ఆత్మకు ఆనందము అని పేరు పెట్టారు.**

(బృ.త్ర.పు.౧౬౩)

అజ్ఞాని

తనదు దోషములను తరచంగ మజ్ఞాని
పరుల దోషములను పట్టువాడు
తనను తానెరుగడు తన తత్వమెరుగడు
అట్టివాని తెలివి బుట్ట తెలివి

(సా. పు 607)

(చూ॥ సుగుణములు)

అడవిజంతువు

మనస్సు అడవి జంతువు వంటిది. అడవి జంతువులను యుక్తులచేత పట్టవలెను. తొందర పడకూడదు. బోను పెట్టవలెను. ఆ బోనులో ఎఱ పెట్టవలెను. ఎఱను చూచి మృగము బోనులో పడును. ఆ పడిన మృగమునకు కొన్ని రోజులు ఆహారము పెట్టకయుండవలెను. అంతట క్రమముగా ఆ మృగమును మచ్చిక చేసికొనవలెను. ఆహారము నీళ్ళు యిచ్చుచు బోనులోనే కొంతకాలము మచ్చిక చేసికొని పిమ్మట మెల్ల మెల్లగా బైటకి గొలుసుతో కట్టి విడిపించుచు, పూర్తి నిర్బంధము నుండి కొంతవరకు తప్పించి మచ్చిక జేసికొనుచు రాగా రాగా కడపట ఆ వన్య మృగము సాధువుగ మారి యజమానుడు చెప్పినట్లు నడుచుకొనును. ముఖ్యముగా ఏనుగుల విషయమునను, ఆ పిమ్మట పులి మొదలగు క్రూరమృగముల విషయమునను పై మచ్చిక చేయు విధానము చెల్లును. ఇట్లే మనస్సు కూడ అడవిజంతు వెట్లు ప్రారంభములో దగ్గఱ చేరనివ్వక, తొందర యిచ్చునో, **అట్లే మనస్సును బలవంతముగా నిలుప చూసిన తిరుగబడి కష్టపెట్టును. కాబట్టి అలంకరింపబడిన విగ్రహములనో, పటములనో,**

అడుగక

గురువులనో మృగములకు నెరవలె మనస్సునకు ఆలంబనముగ నుంచుకొనిన, మృగము బోనులో పడినట్లు మనస్సు ఆ యాలంబన పదార్థములను పట్టుకొని యుండును. అట్లే కొన్ని దినములు వన్య మృగముల కాహారము లేక జేసి, ఆవల నాహార మిచ్చినట్లు మనస్సు నట్లే యా యాలంబన వస్తువునందే యుంచుచు, (ఇదియే ధ్యానము లేక యేకాంత భక్తి) ఆ పిమ్మట క్రమ క్రమముగ నితరమును జూపి, అదియే ఇదియు నను అభేద భావమును మనస్సునకు కలుగు నట్లు చేయవలెను. మృగమును పూర్తిగ మచ్చిక చేసికొనిన పిమ్మట, తన యిష్ట ప్రకారము ఆడించుకొనునట్లు, మనస్సును ఏకాగ్ర ఏకాంతభావమునను పిమ్మట అభేద దృష్టితో కలిగిన శాంత భావమును, సహజ భావమును పొందించి, తన యిష్టానుసారము ఆనందానుభూతిని మనస్సుచే అనుభవింప జేయుచు, ఆపిమ్మట లోక సంగ్రహ కర్మను జంతువులచే (సర్కసున) ప్రదర్శన మిచ్చినట్లు చేయించవలెను.

(స.శి.సు.రె.పు.223/224)

అడుగక

అడుగకవే ఓ మనసా!
అడుగుకొలదిని అది అడుగున పడునని
అడుగ కున్న పని వడిగా నగునని
అడుగని శబరిని, ఆదరించడే
అడుగక, తనకై మడసిన జటాయువు కడకునేటికి
సద్గతి కలిగించడే అడుగకవే, ఓ మనసా.

(సా. పు. 237)

అడ్రసు

ఫ్రం (from) అడ్రసు నుంచి నువ్వు వచ్చినావు. ఇంక టు (to) అడ్రస్ అనే గమ్యస్థానానికి చేరే తీరాలి. మధ్య మార్గములో నువ్వు ఎక్కడ పోయిననూ యెన్ని జన్మలెత్తినను అక్కడక్కడ మొహరు నీపైన పడాలి. అవన్నిటిని అనుభవించి ఎంత ఆలస్యమైనను కట్టకడపటికి గమ్యం చేరేతీరాలి. ఆ మొహరుతో కొట్టేటప్పుడు అయ్యో కొట్టాడే అని యేడ్చి ప్రయోజనం లేదు.

(సు. పు. 3/4)

అణకువ

చిన్న పిల్లలను బ్రహ్మముహూర్తమునందే లేచి కొన్ని సక్రమమైన దైవ కార్యములందు పాల్గొనేటట్లు మనం బోధించాలి. పూర్వము గురువులు చెప్పేవారు.
కొక్కొరకోయని కోడి కూయగానే
చక్కగా నిదురమంచము నుండి లెమ్ము
పలు దోముకుని దేహబాధ తీర్చుకుని
జలకమాడి ధరించి చల్లి భుజించు
హితమైన వస్తువులు యెంతయు
మితముగా తినుచుండు మేలౌను నీకు
బడి కేగి శ్రద్ధగా పాఠముల నేర్చి
అణుకువ గలవాడ వనిపించుకొనుము.
ఈ విధమైనటువంటి ప్రబోధలు ఆనాడు బిడ్డలకు తల్లులు బోధించేవారు.

(గు.శి.పు.14.)

అణువు

(చూ॥ ఆత్మ, బ్రహ్మ)

అణుస్వరూపము

అణుస్వరూపమే మానవాకారాన్ని ధరించి జగత్తులో సాక్షాత్కరిస్తున్నది. రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, ఏసు, జొరాష్ట్ర ఇలాంటి రూపములన్నీ ఏవిధంగా వచ్చాయి? ఇక్కడ ఒక విషయమును చక్కగా విచారించాలి.గాలిది ఏ రూపము? నీటిది ఏ రూపము? ఏ రూపమూ లేదు. గాలిని బెలూన్‌లో నింపితే అది బెలూన్ రూపాన్ని

ధరిస్తుంది. **నీటిని ఏ పాత్రలో పోస్తే అది ఆ పాత్ర రూపాన్ని ధరిస్తుంది. అదేవిధంగా, పవిత్రమైన పరిపూర్ణమైన దివ్యత్వము ఏ ఆకారంలో చేరితే ఆ స్వరూపాన్ని ధరిస్తుంది. బుద్ధుడు, రాముడు మున్నగువారు కేవలం ఆకారంలో వేర్వేరుగాని, వారిలో ఉన్నదంతా దైవత్వమే. ఇదేవిధంగా, ప్రతి మానవునియందు అణుతత్త్వమనే దివ్యత్వం వ్యాపించియుంది.** ఇట్టి అణు స్వరూపమైన దివ్యత్వమును గుర్తించడానికి మీరు ఏ సాధనలూ చేయనక్కర లేదు. దైవము సర్వస్వరూపుడనే సత్యాన్ని గుర్తించుకుంటే చాలు. భారతము, భాగవతము, రామాయణము, గీత అన్నింటి ఏకత్వము దివ్యమైన ఆత్మతత్త్వమే. ఇదియే దైవత్వము. మీరు పెద్ద పెద్ద తలదిండులవలెనున్న ఎన్నో గ్రంథాలను చదువుతున్నారు. కానీ, ఇలాంటి గ్రంథము ప్రపంచంలో మరొకటి లేనే లేదు (శ్రీవారు అగ్గి పెట్టె సైజులో ఉన్న ఒక బంగారు పుస్తకాన్ని సృష్టించారు) ఇదియే ఆ గ్రంథము, చూడండి. ఇందులోనే రామాయణము, భారతము, భాగవతము, గీత సర్వము ఏకమై ఉంటున్నాయి. **అణుమాత్రమైన ఈ గ్రంథమునందే అఖండ స్వరూపమైన దైవత్వం ఇమిడి ఉన్నది.** ఇవన్నీ శ్లోకములే. ఒక్కొక్క పేజీలో 700 శ్లోకాలుంటున్నాయి. ఇది ఎక్కడ ఉండినది? సామాన్య మానవుల దగ్గర ఉండినది కాదు, **వ్యాస మహర్షి చెంత ఉండినది. అతను దీనిని తన కుమారుడైన శుకునకు అందించాడు. ఇందులోనే స్వామియొక్క అవతారాన్ని గురించి తెలిపే శుకనాడి ఉంటున్నది.**

(సా.శ్రు.పు.42/43)

అతీతశక్తులు

మానవత్వం సర్వోత్కృష్టమైనది. మానవునికి పార్థుడని కూడా పేరు కలదు. **పార్థ డనగా పృథ్వీ పుత్రుడని అర్థం.** భూమి యందు ఎన్ని శక్తులు కలవో ఆ శక్తులన్నీ ఈ భూమి నుండి ఆవిర్భవించిన మానవునియందు కూడా కలవు. అవి అనంతమైనవి, అప్రమేయమైనవి, అగోచరమైనవి.కాని, అవి అతనికి గోచరించకుండా అణిగి మణిగి అజ్ఞాతంగా ఉంటున్నాయి. వాటిని **'అతీత శక్తులు'** అని కూడా అన్నారు. మానవునిలో ఆయస్కాంత శక్తి, విద్యుచ్ఛక్తి, రసాయనిక శక్తి, కాంతి శక్తి మున్నగు అనంతమైన శక్తులు ఉండటంచేతనే మానవుడు నిత్యజీవితంలో అనేక కర్మలను ఆచరించగల్గుతున్నాడు. తనయందు ఈ శక్తులే లేకున్న తాను నడువ లేడు, నవ్వలేడు, తినలేడు, త్రాగలేడు, ఏ పనీ చేయలేడు అయితే, ఇన్ని శక్తులు తనయందున్నప్పటికీ మానవుడు పశువుగానే ప్రవర్తిస్తున్నాడు. కారణ మేమిటి? బుద్ధి దోషముచేతనే మానవునిలో దివ్యత్వం అణగిపోయి పశుత్వం ప్రబలిపోయింది. **బుద్ధి దోషముచేత మానవుడు సత్యమేమిటో, ధర్మమేమిటో తెలిసినప్పటికీ వాటిని పాటించలేకపోతున్నాడు.** పాటించ లేకపోవడమే కాకుండా అనర్థాలను పెంచుకుని యథార్థాన్ని మరచిపోతున్నాడు.

(స.సా. నం.99 పు. 285)

అథాతో బ్రహ్మ జిజ్ఞాసా

స్వల్ప అక్షరపదాలతో సారభూతమైన అనంత అర్థాన్ని చాలా తక్కువగా సూచించేవి సూత్రాలు. సర్వోపనిషద్వాక్య సుమములను కూర్చిన, చేర్చిన, వేదాంత శాస్త్రము ఈ బ్రహ్మసూత్రము. ఒక్కొక్క సూత్రము ఒక్కొక్క విధముగా వ్యాఖ్యానింపబడినది. ఒక్కొక్కరు తమ తమ విశ్వాసములను అభిరుచులను అనుభవాలను ఆనందాన్ని పురస్కరించుకొని ఈ సూత్రాలకు వాఖ్యానాలు వ్రాశారు. ఇందులో మొదటి సూత్రము:

అథాతోబ్రహ్మ జిజ్ఞాసా

'అథ' శబ్దమునకు ఎన్నియో అర్థములు కలవు. **ఇచ్చట 'తరువాత' లేక 'అనంతరము'** అను అర్థమునే మనము తీసుకోవలసి వచ్చును. అయితే దేని తరువాత అని మరొక ప్రశ్న వేసుకొన్న **బ్రహ్మను గురించి జిజ్ఞాస కలిగిన తరువాత** అని తెలియును.

అట్టి **జిజ్ఞాసకు ఎట్టివాడు అధికారి?** అని తిరిగి మనము ప్రశ్నించుకొన్న ఆ అధికారములు ఏవి అను విచారణ

వచ్చును. వీటినే 'అథ' శబ్దము సూచించుచున్నది. ఇట్టి జిజ్ఞాస కేవలము వేదాధ్యయనము కాజాలదు. ఇది కేవలము ధర్మజ్ఞానమునకు, బ్రహ్మజ్ఞానమునకు అవసరమైనది. అయితే వేదాంత అధ్యయనము వలననే బ్రహ్మజిజ్ఞాస కలుగును.

బ్రహ్మజిజ్ఞానకు పూర్వాంగములలో మొదటిది వివేకము అనగా నిత్య అనిత్యవస్తువిచారణ. అంటే, ఆత్మ మాత్రమే నిత్యమనియూ, దృశ్యకల్పితమైన వన్నియూ అనిత్యమనియూ, అన్నియూ మార్పు చెందునవే కాని ఏదియూ శాశ్వతమైనది లేదనియూ, వీటన్నింటికి ఆధారమైన ఆత్మ నిత్య సత్యమనియూ, దీర్ఘ విచారణ వలన నిర్ణయము గావించుకొని సత్యాసత్యములను విడదీయునదే వివేకము.

ఇక **రెండవది ఇహాముత్ర ఫలభోగ విరాగము.** అనగా మాలిన్యమునూ దుఃఖమునూ అనిత్యతను విచారించి, అంతా అస్థిరత్వమేనని భావించి, సర్వం ధుఃఖం సర్వం క్షణికం అను సత్యమును గుర్తించిన, **వైరాగ్యము ఉదయించును.** వైరాగ్యమనగా ఇల్లూ వాకిలి, ఆలు బిడ్డలను వదలి అడవి కేగుట కాదు. **జగత్తు యొక్క అనిత్యత్వమును గుర్తించి అభిమాన మమకారములను త్యజించుట.**

ఇక మూడవది శమదమాది గుణ సంపత్తి ఇవి ఆరు. 1. శమము; 2. దమము; 3. ఉపరతి; 4 తితీక్ష; 5. శ్రద్ధ; 6 సమాధానము. శమమనగా మనోనిగ్రహము. ఇది చాలా కష్టముతో కూడినది బంధమోక్షములకు కారణమైనది మనసు. రజో తమో గుణములతో మిశ్రమమైనది, మలినమైనది ఈ మనసు. వస్తువు యొక్క సహజ స్థితిని మరుగు పరచునది మనసు. కనుక మొదట ఈ మనసును నిగ్రహించుకొనవలెను.

దీనికి రెండు స్వభావములు కలవు. ఒకటి ఇంద్రియముల వెంట పరుగిడిపోవుట, మనసు ఏ ఒక్క ఇంద్రియమునకు లోబడినను ప్రతికూలము కలుగును. పాత్రలోని నీరంతయూ కారిపోవలెనన్న పాత్రకు పదిరంధ్రములు ఉండనక్కరలేదు. ఒక్క రంధ్రముండిననూ చాలు, పాత్రలోని నీరంతయూ కారిపోవును. అటులనే ఇంద్రియాదులలో ఏ ఒక్క ఇంద్రియము వశమునందు లేకపోయినను అతనిని బంధములో త్రోయును. కనుక అన్ని ఇంద్రియములనూ నిగ్రహించుకొనవలెను.

ఇక **రెండవ లక్షణము.** సదభ్యాసములతో, అనగా ధ్యాన, జప, భజన, పూజాది సత్కర్మలచే మనసు యొక్క శక్తి అధికమగును. అట్టి స్థితిలో మనసుతో కావలసినంత లోకోపకారమును లోకాపకారమును గానీ చేయవచ్చును. అయితే అట్టి సాధనలచే లభించిన మనశ్శక్తిని చెడు త్రోవలు పోనీయకుండా **శమము అనగా ఇంద్రియములను నిగ్రహించవలెను.** అంటే ఇంద్రియములు మనసును అనుసరించక బుద్ధిని అనుసరించిన శ్రేయస్కరమగును. మనసనగా తలంపుల సమూహమే. కోరికల యొక్క మూటయే. **ఈ కోరికలు తలయెత్తిన క్షణమందే ఇది మంచిదా లేక చెడ్డదా, దీనివలన ఉపకారమా, అపకారమా, దీని పర్యవసానమేమి, అని విచారణ చేయవలెను.** అట్లు విచారణ చేయని మనసే పెడ మార్గము పట్టును. విచారించి బుద్ధిశక్తితో అనుసరించిన సరైన మార్గము ననుసరించును. **మానవునకు ముఖ్యమైన ఉపకరణములు మూడు. ఒకటి బుద్ధి, రెండవది మనసు, మూడవది ఇంద్రియములు.** మనసు ఇంద్రియముల వశమైన బంధ ప్రాప్తి. ఇదే మనసు బుద్ధివశమైన ఆత్మప్రాప్తి. అందువలననే మనసు బంధమోక్షములకు కారణమని తెలుపబడెను.

ఇక రెండవది దమము. అనగా శరీరమును ఇంద్రియములను స్వాధీనము చేసుకొనుట. కేవలము సాధనవలననే శరీరమును అదుపులో ఉంచుకొన వచ్చునేగాని వేరు మార్గము లేదు. వృధా కాలయాపనకు గానీ, అజాగ్రత్తకు కానీ అవకాశము నివ్వకూడదు. కర్మేంద్రియములకు జ్ఞానేంద్రియములకు శరీరమునకు అనుకూలమైన ఉత్తమమైన నియమిత కర్మలను ఏర్పరచుకొనిన తామసమునకు అనగా సోమరత్వమునకు తావు ఉండదు. తాను చేయు సకల కార్యములను

లోపరహితముగా చేయవలెను. స్వధర్మాచరణచే శరీరమును. ఇంద్రియములను స్వాధీనము చేసుకొనవచ్చును.

మూడవది ఉపరతి - అనగా ద్వందాతీతుడగుట. సుఖ దుఃఖములు, ఇష్టాయిష్టములు, మంచి చెడ్డలు, శీతోష్ణములు, నిందాస్తుతులు - ఇవన్నియు సామాన్య మానవులకు నిత్యానుభవములు. అయితే, ఈ సామాన్యమైన అనుభవములను, సాదన ద్వారా విచారణ ద్వారా అతిక్రమించి, వాటికి లోబడక, అతీతుడై నిశ్చలుడై యుండవలెను. **దీనినే ఉపరతి అని అందురు.** సామాన్య జీవితములో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర అను తెగలను అనుసరించిన కుల గోత్రాది బంధములయందు కానీ, లేక బాల్య యౌవన కౌమార వార్ధక్యములను అవస్థలందు కానీ స్త్రీ పురుష లింగ భేదములందు తగులుకొనక, ఆత్మ భావమును మాత్రమే దృష్టియందుంచుకొని ఉపరతిని సాధించవచ్చును.

ప్రపంచమును ప్రపంచదృష్టితో చూడక, **ఆత్మదృష్టితో చూచిన, ద్వంద్వములకు అతీతుడు కావచ్చును.** నామ రూపములను మనోకల్పితముగా భావించవలెను. అయితే ఈ ఉపరతి నివృత్తికే కాని ప్రవృత్తి మార్గమునకు కాదు. **నివృత్తి జ్ఞానమార్గము. ప్రవృత్తి కర్మమార్గము.** వైదిక కర్మలు మోక్షసాధనలు కావు; కేవలము చిత్తశుద్ధిని మాత్రమే చేకూర్చును. స్వర్గ ప్రాప్తి లభించునని అందురు కాని, అదీ ఒక బంధనే, కాని మోక్షము కాదు. జ్ఞానము, శ్రవణ మనన నిదిధ్యాసల వలననే లభించును. నిష్కామికి మాత్రమే, శ్రవణమునందు అధికారము కలదు. చిత్తశుద్ధి కలిగిన పిమ్మట, కర్మలు నిరుపయోగము. కనుక ఆత్మాభిమానులై, సర్వం ఆత్మమయం అను విశ్వాసమును అభివృద్ధి పరచుకొన్న, ద్వంద్వములను అతిక్రమించ వచ్చును.

నాలుగవది తితీక్ష. అనగా, తనకు సంభవించిన దుఃఖమునకు, లేక అపకారమునకు కీడునకు నష్టమునకు విచారించక, సంతోష శాంతులతో, ఇవన్నియు తాను పూర్వము చేసుకొన్న కర్మల ఫలితములే కాని వేరు కాదని తలంచి, అట్లు అపకారము చేసిన వారిని కూడా ఆప్యాయతతో చూచుచు, ఓర్పుతో సహనముతో సంతోషముతో ఉండుట.

ఎంతటివాడైనా ప్రారంభదశలో కీడు చేసిన వారికి తిరిగి కీడు చేయవలెననియు, **అపకారము చేసినవానికి తిరిగి అపకారము చేయవలెననియు,** తనను అవమాన పరచిన వానికి తిరిగి ఏదో ఒక విధముగా అపకారము జరుగవలెననియు **తలంచుట సహజము. అయితే ఇది ప్రవృత్తి లక్షణము. కాని, నివృత్తి మార్గమును అనుసరించు వారికి ఇట్టి తలంపులు ఉండరాదు.** ప్రత్యపకారము **మరొక తీరని కర్మ కాగలదు. ఇట్టి దానినే ఆగామి అందురు. ఉత్తరోత్తరంగా, దీనిని తిరిగి అనుభవించక తప్పదు.** ప్రత్యపకారము వలన సాధనకు, తాత్కాలిక తృప్తి కలుగునేమో కాని ముమ్మందు అది తనను బాధించును. కాన అపకారికి ఉపకారము చేయుట **తితీక్ష అర్థము. నివృత్తి మార్గము.**

ఐదవది శ్రద్ధ, అనగా శాస్త్రముల యందు లేదా శాస్త్రవాక్యములయందు, ఆత్మయందు, గురువులయందు అచంచలమైన విశ్వాసము - నమ్మకము ఉండవలెను. నమ్మకమే శ్రద్ధ లక్షణము. గురువులు పూజనీయులు. శ్రేయోమార్గమును చూపువారు. శాస్త్రములు లోకక్షేమమును ప్రజా శ్రేయస్సును కోరునవి, చూపునవి. కనుక అట్టి పవిత్ర శాస్త్రములపై గురువులపై పెద్దలపై నమ్మకము కలిగి యుండవలెను. గురువులనగా సర్వ జీవాత్మైక్య జ్ఞానమును మాత్రమే బోధించవలెను. దీనిని, తు.చ. అనుసరించి నమ్మి ఆచరించుటలో శ్రద్ధను పొంది యుండవలెను. **"శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్".**

ఆరవది సమాధానము. శాస్త్రమునందు తెలుపబడినది గురువు ఉపదేశించినది రెండూ ఒక్కటే అని నిశ్చతమును పొందవలెను. సర్వకాల సర్వావస్థలయందును బుద్ధిని ఆత్మయం దుంచుకొనవలెను. **సాధకుడు నిత్య చైతన్యమునే ఆశ్రయించవలెను. సర్వకర్మలు**

భగవత్ప్రీత్యర్థము చేయవలెను. సమస్త ప్రాణులు ఈశ్వరాంశమే అన్న శాస్త్ర వాక్యమును ధృఢముగా విశ్వసించవలెను. సర్వులయందు సమదృష్టిని సారించుటే విశ్వాసమునకు బలము. **పై ఆరింటినే సాధన సంపత్తి అని అందురు.**

ఇక ముముక్షుత్వము. అనగా మోక్షాపేక్ష కలిగియుండుట. ఇది ధనము చేతగాని, దానివలన పొందబడు చదువుచేత కాని, సంపదలతో కాని, సంతతితో కాని, యజ్ఞ యాగాది క్రతువులచే కాని దాన ధర్మాది కార్యములచే కాని అభించునదికాదు. **అజ్ఞాన నివృత్తి రూపమైనదే మోక్షము.** సర్వ శాస్త్రములనూ వ్యాఖ్యాన సహితముగా పఠించినను, సత్ కర్మలచే దేవతలను తృప్తిపరచినంత మాత్రముననూ ఈ కామ్య కర్మలు మోక్షమార్గములు కావు. **జ్ఞానాదేవతు కైవల్యమ్.** ఆత్మజ్ఞానము తప్ప మరే మార్గములు మోక్షమును అందించలేవు. వంటకు కావలసిన పదార్థములనన్నింటిని సమకూర్చుకొన్నను అగ్ని లేకపోయినచో వంట ఎట్లు వండలేమో అటులనే పొట్టకూటి విద్య లెన్ని నేర్చినను, కామ్యకర్మ లెన్ని చేసినను ఆత్మజ్ఞానము లేకుండిన ముక్తి లభించదు.

పుణ్యనదీ జలములో స్నానము చేసినంత మాత్రమున ముక్తి లభించునన్న, నిరంతరం ఆ నదిలోనే జీవించు జల చరముల స్థితి ఏమి? గుహలలో జీవించినంత మాత్రమున ముక్తి లభించునన్న అందులోనే వాసము గావించుకొని జీవించుచున్న ఎలుకలు, క్రూర మృగములకు లభించునదేమి? కందమూలాదులతో జీవించి, ఆకులలములు మేసి తపించిన మోక్షమన్న, ఆకులను తుంగ గడ్డలనే తిని జీవించు మేకలు పందులు ముక్తికి పోవలసినదేనా? ఒడలు నిండా బూది పూసుకొనుటయే తపస్సన్న బూడిదలో పొర్లాడు కుక్కలూ గాడిదలూ మోక్షార్హత కలిగినవే కదా? ఈ మూర్ఖత మోక్షాపేక్ష కాదు. ఆత్మజ్ఞానం సంపాదించాలి.

'అథ' అను శబ్దమునకు అనంతరమని తెలుపబడెను. అయితే దేని అనంతరం అని విచారించిన, పై చెప్పిన **సాధన చతుష్టయ సంపత్తి కలిగిన తరువాత.**

అతః - ఈకారణముచేత, అంటే ఏ కారణము వలన? శాస్త్రములను పరిశోధించి విచారణ సలిపి, కర్మలవలన కానీ, వస్తువులవలనకానీ వ్యక్తులవలనకానీ, మోక్షము లేదా బ్రహ్మ ప్రాప్తి లభించదు. కారణ మేమన, వస్తువులు, వ్యక్తులు, కర్మలు అనిత్యములు. అన్నియూ నశించునవే. చిత్తశుద్ధిని కలిగించు కర్మద్వారా ముక్తి లభించదని, బ్రహ్మప్రాప్తి చేకూరదని తెలుసుకొన్న కారణమువలన బ్రహ్మజిజ్ఞాసకు అధికారి కాగలడు.

మొత్తమున ఈ సూత్రము ముఖ్యముగా బోధించునదేమన ఆధ్యాత్మజ్ఞానమును తన జీవితములో అభ్యసించు మానవుడు శీల పవిత్రుడై యుండవలెను. అతని ప్రవర్తన పవిత్రమై యుండవలెను. **గుణమునకు మించిన జ్ఞానము మరొకటి లేదనియు, గుణమే నిజమగు బలమని, జ్ఞానాన్వేషణకు అర్పితమైన మానవునకు శీల సంపత్తి ప్రధానమని నిరూపించుచున్నది.** సమస్త శాస్త్రముల సారము సర్వ ధర్మమయమైన శీలము ప్రధాన సాధనము. శీలము ఒక్క జాతికి, మతమునకు, సంప్రదాయమునకు సంబంధించినది కాదు. దీనిని సర్వ సమన్వయపద్ధతిలో బోధించబడినది. దీనిని ఆశ్రయించినవారు ఏనాటికైననూ చెడరు. పుణ్యాత్ములు కాగలరు. జీవుల అంతఃకరణశుద్ధికి గుణములు ప్రధాన మార్గము. ఈ గుణము, ఏది చేయవలెను ఎట్లు చేయవలెను అని చక్కగా విచారించును. **నావంటి వ్రాత మంచిదయిన వారికే ఈ గుణము ప్రాప్తించును. ఈ గుణమే భవసాగరమును దాటించు భద్రమైన నావ.** గుణమును ఆశ్రయించిన వారికి మోక్షమున స్థలము కలదు. ఎంతటి ప్రారబ్ధ కర్మ లనుభవించువాడైననూ, శీలపోషణ కలవానిని కర్మఫల మంటదు. ఇతను పరమానంద రూపమైన బ్రహ్మను చేరును.

ఎన్ని యజ్ఞయాగాది కర్మల నాచరించి, ఎన్ని విధములైన శాస్త్రములను చదివి వివరములను బోధించు మహా మహా పండితులైననూ, వేదాధ్యయనము గావించు

విప్రుడైనను, ధనధాన్యయశస్సులతో కూడిన శ్రీమంతుడైనను, వేద వేదాంగములను అర్థ సహితంగా బోధించువాడైననూ, శీలమే లేకుండిన అట్టి వానికి బ్రహ్మవిచారమున స్థానమే లేదు - అని ఈ సూత్రము బోధించు చున్నది.

మోహపంకిలముల నుండి బుద్ధి ఎప్పుడు విముక్తిచెందునో, అప్పుడే సమత్వస్థితి కలుగును. సమత్వస్థితి కలిగినంతనే బుద్ధి ఆత్మానుసారము నడచుకొనును. ఆత్మానుసారము అనుసరించు బుద్ధికే గుణము అని పేరు. అట్టి గుణవంతునకే ఆత్మ ప్రాప్తి లభించును. ఒక్కమారు ఆత్మజ్ఞానము లభించెనా తిరిగి అట్టివాడు మోహమున ప్రవేశించడు, మోహము అంటదు. ఆశాపాశాది గుణములు జీవలక్షణములే కాని ఆత్మగుణములు కావు. మమకార అభిమానములు కామ క్రోధాది ఆవేశములు, శరీర మనో వ్యాపారములచే ఆవిర్భవించునవి. ఇవి అణచిన తరువాతనే సద్గుణములు ప్రారంభమగును.

పైన తెలిపిన **కర్తృత్వ, భోక్తృత్వ లక్షణము, ఆత్మయందు ప్రతిబింబించినంత మాత్రాన అవి ఆత్మ గుణములు కావు.** అద్దములో వస్తువులు ప్రతిబింబించినంత మాత్రమున అద్దము యొక్క పారిశుధ్యమునకు ఎట్లు భంగము ఉండదో అటులనే గుణవంతునిలో పూర్వపు ప్రారబ్ధముచే లభించిన కొన్ని దోషములు ప్రతిబింబించిననూ వాటివలన అతని ప్రస్తుత శీలమునకు భంగము కలుగదు. జీవునకు నైజగతమైన స్వచ్ఛము, శాంతము, సంతోషము, గుణము గలవాని యందు తొణకుచుండును.

ఆకాశమున ఎగురు పక్షికి రెండు రెక్కలు ఎట్లు అవసరమో, భూమిపై సంచరించే వ్యక్తికి రెండు కాళ్ళు ఎట్లు అవసరమో, మోక్షసాధనము చేరువానికి విషయ వైరాగ్యము ఆత్మజ్ఞానము అట్లు అవసరము. పక్షికి ఒకరెక్క లోపించిన, ఆ పక్షి ఆకాశమున ఎగురలేదు కదా! అటులనే జ్ఞాన వైరాగ్యములో ఏ ఒక్కటి లోపించినను బ్రహ్మను పొందలేడు. మమకారము మహా పాశము. ఎంతకాలము ఈ మమత్వము నాది, నాది అనకొన్న, సర్వస్వమునూ ఎప్పుడో ఒక నాడు వీడిపోవలసివచ్చును. ఇది సత్యము, ఇతి తప్పదు. ఇట్టి కల్పిత సంబంధ బాంధవ్యములను విచారణ ద్వారా త్యజించి సత్యమును గుర్తించి సాధ్యమైనంత త్వరలో మమత్వమును వీడుట మంచిది - అని వైరాగ్యము వివేకము బోధించుచున్నది. సంఘత్వము భయమునకు, స్వార్థమునకు సూచకము. అజ్ఞానులు ఈ లౌకికమునకు లోబడుదురు. జ్ఞానులైన వారు ఇట్టి మోహమునకు బద్ధులు కారు. సర్వ క్షణికం క్షణికం - అని, సర్వం అనిత్యం అనిత్యం - అని సత్యమును గుర్తించి ఆత్మగుణములైన అమర భావములను అనుసరించువాడే గుణశీలుడు. **అట్టి వాడే బ్రహ్మ ప్రాప్తికి అధికారి.**

ఈ సూత్రము ఆ బ్రహ్మమునే మరొక రూపమున నిర్దేశించుచున్నది. మొదటిది సత్యం, జ్ఞానము స్వాతంత్ర్యము.

(సూ.పు.4/13)

అదంభిత్వం

అదంభిత్వం అంటే డంబము లేకుండా వుండుట. ఇది మానవునకు గొప్ప సుగుణం. తాను గొప్పవాడు కాకపోయిననూ గొప్పగా నటించుట, ఏ శక్తి సామర్థ్యములు లేకపోయినా సర్వశక్తులు వుండినట్లు ప్రవర్తించుట, ఏ అధికారములు లేక పోయిననూ సర్వాధికారిగా చలాయించుట - **ఇవే డంబముయొక్క గుర్తులు. ఇట్టివి లేకుండా వున్నవి వున్నట్లు సంచరించుట అదంభిత్వం అనబడును.**

(గీ.పు. 206/207)

అదృశ్యంగా సందేశం

అధిక సంఖ్యాకులు అభయమును సూచించే రక్షలను కోరుతున్నారు. కాబట్టి నేను ఇస్తున్నాను. ఆపదలో వున్నప్పుడు నే నిచ్చిన వుంగరమునూ, కంకణమునూ, గడియారమును స్పృశించి నన్ను తలుచుకొని నా

అదృష్టవంతులు

సహాయమును అర్థిస్తూ వుంటారు. ధరించటానికి వీలు లేని వస్తువును ఇచ్చినట్లయితే వాటిని ఎక్కడో దాచుకొని పోగొట్టుకుంటారు.

నేను ఇచ్చే ఈ చిన్న చిన్న వస్తువులు ప్రజలకు భద్రత, రక్షణ, కలిగినప్పుడు, ఆపదసమయాలలో ధైర్యము చెదరనీయవు. ఎంతో దూరాన వున్న వారికి నాకు మధ్య వీటి వల్ల అనుసంధానము ఏర్పడుతుంది. భక్తులు ఆపదలో వున్నప్పుడు నా సహాయం కోరినప్పుడు ఈ వస్తువుల ద్వారా అదృశంగా సందేశం నాకు విద్యుత్ వేగంతో అందుతుంది. వెంటనే నేను వారిని అందుకుంటాను.

కంపెనీలు తయారు చేసిన గడియారాలను నేను తెచ్చి యివ్వటం లేదు. నేను వాటి సృష్టి చేస్తున్నాను. నేను ఏది సంకల్పించినా క్షణంలో అది తయారు అవుతుంది.

(స.ప్ర.పు. 16/17)

అదృష్టవంతులు

నీలో నున్న దివ్యకాంతి నీచుట్టూ ప్రసరించి, అంతటా వెలుగునింపి, అన్ని దేశాలలోను, అన్ని కాలాలలోను లక్షలాది దివ్వెలను వెలిగిస్తోందని తెలుసుకో. భగవంతుడు అవతార స్వరూపుడై దిగివచ్చి ప్రపంచానికి బోధ చేసే ఈ తరుణంలో ఆయనను ప్రత్యక్షంగా దర్శించుకుని ఆయనే ప్రత్యక్షంగా దారి చూపించే అదృష్టమును పొందిన ఈ తరంలోని భక్తులు నిజంగా అదృష్టవంతులు.

(దై. పు. 360)

(చూ॥ హిరణ్యగర్భతత్వం)

అద్భుతాలు

నీకు నా పుట్టుపూర్వోత్తరాలను గురించీ అర్హతా యోగ్యతలను గురించీ తెలయపరచిన తర్వాత మాత్రమే నిన్ను సరిదిద్దడానికి నిశ్చయించుకొన్నాను. అందుకనే నేను అప్పుడప్పుడు నా ప్రకృతిని మానవశక్తిచే తెలియబడనేరని, మానవ గ్రాహ్యాతలకు అందని అద్భుతాలనబడే క్రియలద్వారా ప్రకటిస్తూ ఉంటాను. ఇది నా శక్తులను ప్రదర్శించడానికి అతుర పడుచున్నానని కాదుగాక నా ధ్యేయము మిమ్మల్ని నాకు మరింత సన్నిహిత పర్చుకోవడానికి, మీ హృదయాల్ని నాకు మరింత గట్టిగా అనుబంధించుకొనడానికి మాత్రమే.

(సా.అ.పు. 255/256)

అద్వైత దర్శనం

ఇంద్రియముల కంటె యింద్రియార్థములు బలమైనవి. కన్నులు చూస్తున్నవి. చూడటం తప్పు కాదు. కాని చూచిన వస్తువుపై వాంఛ పుడుతుంది. ఆ వాంఛలు కలగడం తప్పు. నాలుక వున్నది. నాలుకలో దోషము లేదు కాని కఠినమైన పలుకులు పలికితే తప్పు. **ఇంద్రియములను అరికట్టినంత మాత్రమున లాభము లేదు. ఇంద్రియార్థములను అరికట్టాలి.** కనుక మంచి దృష్టి, మంచిమాట, మంచి శ్రవణము, మంచి వాసన, మంచి స్పర్శను గురించి అందరికి తెలియచేయాలి. ఎవరినంటె వారిని తాకకూడదు. శారీరకంగా రోగము రావడమే కాక, ఆధ్యాత్మికంగా కొన్ని రోగాలు ఏర్పడుతాయి. శాస్త్ర గ్రంథాలు వున్నాయి. సాంఖ్య, న్యాయ, వైశేషిక, యోగ, పూర్వమీమాంస, ఉత్తర మీమాంస శాస్త్రములు వున్నాయి. వీటిని దర్శనములు అని కూడా అంటారు. ఉత్తర మీమాంస (వేదాంతం) తప్ప తక్కినవన్నీ ద్వైతాన్ని బోధిస్తాయి. ఇవి (శాస్త్రాలు) అన్ని పురాణములను ఆధారము చేసుకొని వచ్చాయి. వేదాంతము వేదమును ఆధారము చేసుకొని వచ్చింది. మిగిలిన దర్శనములకును వేదాంతమునకు గల వ్యత్యాసము యిదే. వేదాధారమైన వేదాంతము కట్టకడపటిది. **"నకర్మణా నప్రజయా, ధనేన, త్యాగేనైకే అమృతత్వమానశుః (కై.ఉ) అని చెప్పింది. వేదాంతము అమృత తత్వమైన, ఆత్మ తత్వము అనుభవించాలంటే త్యాగము చెయ్యాలని బోధించింది (అన్నీ ఉన్నంతవరకు బంధమే). అప్పుడే ఏకత్వం ఏర్పడుతుంది. అదే "అద్వైత దర్శనం". అద్వైత దర్శనమే జ్ఞానమన్నారు. దానినే ఏకమేవా ద్వితీయం" అని వేదం శాసించింది.** ఏతావాతా అన్ని దర్శనాలు కూడా ఒక గమ్యమునే నిరూపిస్తూ వచ్చాయి.

అన్నిటిలోను "నేను" అనే తత్త్వాన్ని అర్థం చేసుకోడమే విశిష్టత. "నేను" అనేది కేవలము మూలాధారమైనది. నేను దేహమును కాను. నేను అనగా "అహం" ఆత్మతత్త్వము నుండి ఆవిర్భవించింది. కర్తవ్య కర్మలను ఆచరిస్తూ ఆచరింపచేసే నాయకుడు నాయందున్నాడన్న సత్యాన్ని విశ్వసించాలి. అప్పుడే నిజమైన ఆనందము కలుగుతుంది. అది నిత్య సత్యమైనది. **ఆత్మ దర్శనముగా తన్ను తాను తెలిసికోడానికి ప్రయత్నించడం. అదే దుఃఖ నివృత్తి. అదే ఆనంద ప్రాప్తికి మూలము.**

(సా.పు.29, 30)

జ్ఞానమనగా ఏమిటి? లౌకికజ్ఞానమా? భౌతిక జ్ఞానమా? కాదు, కాదు. అద్వైత దర్శనమే నిజమైన జ్ఞానం. అదియే ఆనందం. ప్రకృతి సంబంధమైనది జ్ఞానం కాదు. "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" ఉన్నది ఒక్కటే జ్ఞానం. అదియే అనంతమైన తత్త్వం. అదియే సత్య స్వరూపం. అట్టి జ్ఞానమును ప్రబోధించాడు మాణిక్యవాచకర్. తిరువళ్ళువరు శాంతిని ప్రబోధించాడు. చలించని మనస్సును, భ్రమించని దృష్టిని పెట్టుకోవాలని చెప్పాడు. కష్టములు వచ్చినప్పుడు క్రుంగిపోవద్దు, సుఖములు వచ్చినప్పుడు పొంగిపోవద్దు. పొంగి క్రుంగని సమత్వస్థితి పొందాలని ప్రబోధించాడు. ఈనాడు భగవంతుని ఆరాధించేవారు ఎలాంటి స్థితిలో ఉంటున్నారు? ఏ కించిత్తైనా శాంతిని అనుభవించవద్దా? కానీ, శాంతి ఏ మాత్రము కనిపించటం లేదు. ఎక్కడ చూచినా అల్లర్లు! ఇది మానవులయొక్క గుణమే కాదు, రాక్షసులయొక్క గుణము. దైవాన్ని స్మరిస్తున్నప్పుడు దైవభావమే మీలో ప్రవేశించాలి. అదియే నిజమైన జ్ఞానము. "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి", బ్రహ్మతత్త్వమును స్మరించేవాడు. బ్రహ్మయే కావాలి. యజ్ఞోపవీతమును ధరించినంత మాత్రమున బ్రాహ్మణుడు కాడు, బ్రహ్మజ్ఞానమును సంపాదించినవాడే బ్రాహ్మణుడు. కానీ, **ఈనాడు భ్రమ సాధన చేస్తున్నారు గాని, బ్రహ్మసాధన చేయటం లేదు. బ్రహ్మకు, భ్రమకు ఉన్న వ్యత్యాసం ఏమిటి? ఏకత్వమును అనేకత్వంగా విభజించేది భ్రమ. అనేకత్వమును ఏకత్వముగా విశ్వసించేది బ్రహ్మ. ఇట్టి ఏకత్వాన్ని ప్రబోధించినవాడు తిరువళ్ళువరు.** ఏకత్వాన్ని గుర్తించినప్పుడే మనస్సుకు శాంతి లభిస్తుంది. మీరు **"శాంతిః శాంతిః శాంతిః" అన్నారు. దేనికోసం? శారీరక శాంతి, మానసిక శాంతి, ఆత్మ శాంతి - ఈ మూడు విధములైన శాంతి నిమిత్తమై మూడు పర్యాయములు చెపుతున్నారు.** ఈ మూడింటిని ఒక్క దైవానుగ్రహంవల్లనే పొందడానికి అవకాశ ముంది. ఒక్క దైవప్రేమను మీరు సాధించారంటే సర్వమును సాధించినవారవుతారు. శాంతి ఎక్కడో బయట లేదు, బయట ఉన్నదంతా పీస్! శాంతి మీలోనే ఉన్నది, మీ ఆత్మ స్వరూపము నుండియే ఆవిర్భవిస్తుంది.

ఈనాటి భక్తులు **భగవద్గీతనో,** లేక **రామాయణమునో** చూచిన తక్షణమే కన్నుల కద్దుకుంటున్నారు, శిరస్సుపై పెట్టుకుంటున్నారు, పూజాపీఠంపై పెట్టి పూజిస్తున్నారు. ఐతే, ఈ గ్రంథములు **పూజల నిమిత్తం వచ్చినవి కాదు, ఆచరణ నిమిత్తమై వచ్చినవి.** కానీ, మీరు కాగితాలను గౌరవిస్తున్నారుగాని, ఆ కాగితాలలోని విషయాలను గౌరవించడం లేదు. కాగితాల కిచ్చిన గౌరవంలో కించిత్తైనా వాటిలోని విషయాలకు ఇవ్వకూడదా? ముఖ్యంగా ఆచరణ కావాలి. ఆచరణలో పెట్టకుండా పుస్తకాలను పూజించినంత మాత్రమున ప్రయోజనం లేదు. ఒకటి రెండయినా ఆచరణలో పెట్టి చూడండి. ఆచరణే ప్రధానమైనది. ఆచరణరూపమైన ప్రచార ప్రబోధలు లేకపోవడంచేతనే ఈనాడు ప్రపంచంలో శాంతిభద్రతలు కరువైనాయి.

(సా.శ్రు.పు.73,74)

(చూ॥ దర్శించు)

అద్వైత దర్శనం జ్ఞానం

(చూ॥ పురుషార్థము)

అద్వైతద్వైతవిశిష్టాద్వైతములు

అద్వైతద్వైతవిశిష్టాద్వైతములు

అద్వైత వేదాంతమొక్కటే సరియైన వేదాంతమని అనేకులు భారత దేశమున భావింతురు. ఇది సరికాదు. మత సిద్ధాంతముల సవగాహన పరచుకొన జూచువారి కందరకును ప్రస్థానత్రయములనబడు శ్రుతులు, బ్రహ్మసూత్రము, భగవద్గీత ఈ మూడును ముఖ్యమేఅను సత్యమును మరువరాదు. ఈశ్వరవాణి అయిన శ్రుతులు, ఉపనిషత్తులు, రెండవ దైన బ్రహ్మసూత్రములు వ్యాసునిచే ప్రతిపాదించబడిన తత్త్వ సిద్ధాంతములన్నిటి యొక్క పరమ స్వరూపము. ఇది తత్త్వ వాఙ్మయమునందు అత్యంత ప్రాముఖ్యము గలిగినది. **ఆ అపూర్వ సిద్ధాంతములు పరస్పరవిరుద్ధములు కావు. అందు ప్రతిదీ పూర్వ సిద్ధాంతములపై ఆధారపడియున్నది.** వ్యాస సూత్రములలో వాటికి పరిపూర్ణస్వరూపము సిద్ధించినది. నడుమ వేదాంతమునకు ఈశ్వర నిర్మిత వ్యాఖ్యానరూపమగు భగవద్గీత యిమిడియున్నది. ఆస్తిక మతములని చెప్పుకొను హైందవ మతములన్నియూ ద్వైతము కానీ, విశిష్టాద్వైతము కానీ, అద్వైతము కానీ, ఉపనిషత్తులను, వ్యాససూత్రములను, భగవద్గీతనూ ప్రమాణములుగా అంగీకరించుచున్నవి. వాటన్నిటికీ ప్రస్థానత్రయమే ఆధారము. నూతన సిద్ధాంతమును ఒకదానిని ప్రతిపాదింప సంకల్పించినవారందరునూ అనగా శంకర, రామానుజ, మధ్వాచార్య, వల్లభాచార్య, చైతన్య ఇత్యాది వారందరునూ ఈ ప్రస్థాన త్రయమునకు ఇంకొక భాష్యమును రచించవలసివచ్చెను. కావున ఉపనిషత్తుల ఆధారముపై నిర్మింపబడిన ఒక్క సిద్ధాంతమునకు మాత్రమే వేదాంత శబ్దము వర్తించునని చెప్పుట కేవలము పొరబాటు. అన్నియూ వేదాంత మతములే. వేదాంత నామమును వహించుటకు అద్వైతి కెంత అధికారము కలదో అంత అధికారము విశిష్టాద్వైతికి కూడా కలదు. అంతేకాదు ద్వైతికి కూడా కలదు. ఇదియే పవిత్ర అపురూప అంతరార్థముతో కూడినది. **యేకాత్మ భావన నిరూపించునది భారతీయ పరమార్థ వాహిని.**

ఆవు శరీరమునందు పాలున్నాయి. ఆ పాలలో నెయ్యి ఉన్నది. అయినా ఆ నెయ్యితో బలముారాదు. ఆ పాలను ఆవునుండి వేరుచేసి, అనగా పితికి కాచి, తోడుపెట్టి, పెరుగు అయిన తరువాత దానినే చిలికి వెన్న వేరుచేసి, దానినే తిరిగి కాచిన నెయ్యి కాగలదు. **ఆ నెయ్యినే మళ్ళీ ఆవునకు త్రాపించిన ఆవుకు చక్కని బలము కలుగును. అలాగే సర్వేశ్వరుడు సర్వాంతర్యామి అయినా, సాధనోపచారములు లేకుండా మానవులలో హితము చేయజాలడు.** నువ్వులలో నూనె, పెరుగులో వెన్న, భూమిలో నీరు, కట్టెలో నిప్పు కలసి వుండినటుల, సర్వాంతర్యామి మానవ శరీరములోను, మనసులోను కలిగియున్నాడు. అతనిని వేరు చేయాలంటే ప్రయత్నము, సాధన చేయాలి. అపుడు ఆ రెంటి అభేదత్వము అద్వైతంలో తెలుస్తుంది. అదే మోక్షము అని శంకరులవారు దీనినే అద్వైతోపాసన అని అన్నారు.

ఇక **విశిష్టాద్వైతోపాసన** : ఉపాసించతగిన పరమాత్మ తనకు వేరుగా ఉన్నట్లు భావించాలా? లేక తనతో కలిసి వుండినట్లు భావించాలా సాధకుడు? ఇదీ ప్రశ్న.

ఇక జవాబు : **జీవుడు శరీరానికి ఆత్మ, అలాగే దేవుడు జీవునకు ఆత్మ. అలా భావించి ఉపాసించుటే రామానుజాచార్యుల విశిష్టాద్వైతోపాసన.** ఈ సమస్త భూతజాలము ఎవనిలో ఉన్నాయో, యెవడు ఈ సమస్తానికి అంతర్యామిగా వ్యాపించియున్నాడో ఆ పరమపురుష పరమాత్మ అనన్యభక్తి (ప్రపత్తి)తోనే లభ్యమవుతాడు, అని పరజ్ఞాన ప్రపత్తి పూర్వకంగా పరమ పురుషోపాసన చేయుటయే విశిష్టాద్వైతము. **"త్వమేవ సర్వం మమ దేవదేవ" నీవే నా గతి, నీవే నా పతి, అనే అనన్య భావముతో ఉపాసించుట.**

ద్వైతోపాసన, పతీ పత్ని సంబంధమే, జీవాత్మ పరమాత్మ సంబంధం కూడను. అవ్యయుడై విష్ణుభగవానుని తన పతిగా, భర్తగా భరించే వానిగా, తాను భరింపబడే వానిగా, ద్వైతభావముతో ఉపాసించుటయేయని మధ్వాచార్యులు ప్రబోధించిరి.భగవంతుని చరణాసక్తి లేనిదే జీవన్ముక్తి

మాట అటుంచి, కనీసం బుద్ధిశుద్ధి కావటం కూడా అసంభవము అంటారు మధ్వాచార్యులు. మునులూ, ఆత్మారాములు అయినవారికి లౌకిక గ్రంథాలు లేకపోయిననూ సూదంటురాయిలాంటి శ్రీహరి కల్యాణగుణముల విశేషంవల్ల భక్తి పారవశ్యం వారికి కలుగుతూ వస్తుందనియూ, ఆ పారవశ్యములో సిగ్గూ, బిడియములు వదలి శ్రీహరిలో ఐక్యత కు సంసిద్ధుడగు ననియూ, నృత్యము చేయుననియూ, బిగ్గరగా కీర్తనలు చేయుననియూ, అసలైన ఆనందాన్ని అనుభవిస్తాడనియూ, ఈ విశ్వాసాన్ని ఉపాసనం చేస్తూ ఉంటారు. ఈ విధంగా పరానురక్తితో ప్రధానత కలిగి ఉపాసనను జరుపుటే మధ్వాచార్యులవారి అభిమతమని వేనోళ్ళ చాటేరు. పతిని పొందు నిమిత్తమై సతీపతి పరితాపమే అద్వైతోపాసన అన్నారు.

భారతగీతోపాసన : భారతం పంచమ వేదము. అది ఐహిక, ఆముష్మిక ధర్మాల నిధి. మాధవుడు భారత ధర్మక్షేత్ర రంగస్థలములో తన నాటక సామాగ్రి దింపుకొని ఆడిన అద్భుతమైన ఆట మహాభారతము. భారత నాటకానికి పాత్రధారులును, మాటలును, పాటలును, సమకూర్చిన రచయిత, నటకుడు, దర్శకుడు, నిర్మాత, అంతా ఒక్క మాధవుడే, ఒక వైపున అధర్మవృద్ధమైన అపార భౌతిక బలం, మరొకప్రక్క ధర్మవృద్ధమైన పరిమిత ఆత్మబలము. ఈ రెంటి ఘర్షణలో పర్యవసానరూపమైన ధార్మిక విజయజ్యోతిగా తనను నిర్దేసించుట ఇదే భారతామృత సర్వస్వం. అదే భగవద్గీత. మహాభారత సారాంశమంతయూ భగవద్గీతలో వున్నది. **"కరిష్యే వచనం తవ" నీవు చెప్పినట్లే చేస్తాను. "స్వధర్మే నిధనం శ్రేయః" ఇదే ఐహిక ధర్మానికి గీటురాయి.** సర్వ శ్రేయస్సులను ప్రసాదించే నీ భక్తిని నిర్లక్ష్యము చేసిచేసి **కళ్ళు మూసుకుని "అహం బ్రహ్మాస్మి" అనే అహంకారముతో బాధపడే నకిలీ బ్రహ్మలకు క్లేశమే ఫలితము.** పొట్టు దంచితే బియ్యము రావు కదా? అసలు కృష్ణుని మాటను నమ్మక, బుద్ధికి తోచినట్లు పోవుట బ్రహ్మతత్వమునకు మార్గము కాదని. **కృష్ణుడే సాక్షాత్ పరబ్రహ్మ అనీ, అనేక విధముల ఉపమాన, ఉపమేయాదులతో నిరూపించి, నిదర్శనమొసగి, ప్రబోధించిన సర్వవేదాంతసారము భగవద్గీత. సమస్త శాస్త్రములలోనూ మధించి, అందించిన సుధానిధి, భారతీయ పరమార్థ వాహిని, దానిని కాదనువారుందురా? ప్రకృతి, కాల, కర్మలు మూడునూ ఈశ్వరుని పరతంత్రములు, సత్య స్వరూపుడగు భగవంతుడు, అసత్యములను దేనినీ కల్పింపజాలడు.** కనుక ఒక విధంగా చూస్తే ప్రకృతికూడా సత్యమనే చెప్పవచ్చును. ప్రళయావస్థయందు చేతన అచేతనములు ఈశ్వరునిలో లీనమైయుండును. కాలము ఆద్యంత రహితము అగు ఈశ్వరశక్తి. కర్మసహితము ప్రధాన సత్యమే.

(స.వా. పు. 72/76)

అద్వైత మతము

ఆనాడు బస్సులు, కార్లు, ఏరోప్లేన్లు లేవు కదా! శంకరులవారు కాలినడకన యావద్భారత దేశంలో కాశ్మీరు మొదలుకొని కన్యాకుమారి వరకు పర్యటించి అద్వైత సిద్ధాంతమును ప్రబోధించాడు. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" - "ఉన్నది ఒక్కటే,రెండు కాదు. చెఱుకులోని రసమువలె భగవంతుడు అందరియందు రసస్వరూపుడై ఉంటున్నాడు. కాని మీరు కేవలం రూపనామములను ఆధారం చేసుకోవడంచేత భిన్నత్వాన్ని భ్రమిస్తున్నారు. బంగారము లేక నగలు లేవు, మట్టి లేక కుండలు లేవు. అట్లే ఈ జగత్తులోని రూపనామము లన్నింటికి మూలాధారమైన దివ్యత్వం ఒక్కటే" అని పండితులతో వాదించి ఒప్పించాడు. మండనమిశ్రుని కర్మ సిద్ధాంతమును ఖండించి అతనిని అద్వైత సిద్ధాంతములో ప్రవేశపెట్టాడు. క్రమేణ శంకరులవారి అద్వైత సిద్ధాంతమును అందరూ అంగీకరిస్తూ వచ్చారు. కాని 32వ ఏటనే శంకరులవారు తన శరీరాన్ని త్యజించాడు. కారణమేమిటి? తాను వచ్చిన పని అయిపోయింది గనుక, శరీరాన్ని వదిలేముందు పూరీ, ద్వారక, కంచి, శృంగేరి,

అద్వైతము

బెనారస్ క్షేత్రాలలో ఐదులింగమును పెట్టాడు. మండన మిశ్రునికి సురేశుడని పేరు పెట్టి అతనిని కంచి పీఠాధిపతిగా చేశాడు. విద్యారణ్యులవారు కూడా శంకరుని శిష్యులే. శంకరులవారు అద్వైతమతమును స్థాపించి, లోకంలో అల్లర్లను చల్లార్చి, ద్వేషాన్ని నిర్మూలించి ఏకాత్మభావముచేత ఆనందమును అభివృద్ధి పర్చడానికి కృషి చేశాడు. కాని తరువాత ఆయన శిష్యులలో ఏమాత్రము ఐకమత్యము లేకుండా పోయింది. శంకరులు చెప్పిన దానినే తాము వ్రాసినట్లుగా వ్రాసుకొని పేరు ప్రతిష్ఠల నిమిత్తమై అనేక పాట్లు పడుతూ వచ్చారు. ఒకరు చెప్పినది ఇంకొకరు అంగీకరించలేదు. క్రిష్టియన్ మతములో కూడా ఇంతే! **జీసస్ పోతూనే** అతని పదకొండుమంది శిష్యులలో భేదాభిప్రాయములు బయలుదేరాయి. ఒక్క మేథ్యూ మాత్రమే జీసస్ చెప్పినవి ప్రచారం చేస్తూ వచ్చాడు. మొట్టమొదట జీసస్ శిష్యునిగా చేరిన పీటర్ కూడా అధికారులు తనను పట్టుకోవడానికి వచ్చేసరికి, "నేను క్రీస్తుఫాలోయర్‌ను కాదు" అన్నాడు. ఈ విధంగా శిష్యులలో స్వార్థస్వప్రయోజనాకాంక్ష బయలు దేరడంచేత వారి ఉపదేశములన్నీ ఛిన్నాభిన్నముగా మారిపోయాయి.

(స.సా.జులై 96. పు.172/173)

(చూ॥ త్రిమత స్థాపకులు)

అద్వైతము

ఈ దేశపు ప్రజల దృష్టి అంధకారముచే నావృతమై యున్నందున వారు దారితప్పి, ఏవేవో లక్ష్యములు పెట్టుకొని, వాటి నన్వేషించుటలో - ముఖ్య లక్ష్యమును చేరలేకపోయినారు. అట్టి వారికి శంకరులు అద్వైతము బోధించి, వేదములు, ఉపనిషత్తులు, శాస్త్రములు ఏకగ్రీవముగా నంగీకరించిన మార్గమది యొక్కటియేయని తెలియజెప్పినారు. **జీవుడు, ఈశ్వరుడు - ఒకడే గాని ఇద్దరు కాదని చెప్పు మతము అద్వైతము.**

(స.వ పు ॥ 12)

(చూ॥ దాసోహం, భక్తిప్రపత్తులు, శంకరాచార్యులు)

అద్వైత సిద్ధాంతము

అద్వైత సిద్ధాంతమే ఆధునిక విజ్ఞాన వేత్తల పరిశోధనల కనుగుణ్యముగ నుండుట చేత, వీరు అద్వైతము నంగీకరింతురు. **సర్వకాల సర్వదేశములందును ఈ యేకైక సత్యమే యనుభూతికి వచ్చునట్టిది. ఈ విశ్వమునందు దోచు వైవిధ్యము అజ్ఞానము వలన కలిగినది మాత్రమే యనియు, ఉండునది యంతయు యేకైక సత్యమే ననియు, (సర్వం ఖల్విదం బ్రహ్మ)** నీకు జ్ఞానోదయమైనంతనే నీవే బ్రహ్మ వగుచున్నావు. శోక, మోహ భయము లుండవు. సంసారము నుండి విముక్తి కలుగును."

(స.శి.సు.రె. పు. 66)

(చూ॥ క్షమ, ప్రేమ)

అధర్వ వేదము/అధర్వణవేదము

అధర్వవేదమునకు అనేక పేర్లు ఉన్నవి. అంగిరోవేదము, అధర్వాంగిరోవేదము, భృంగిరోవేదము, క్షత్రవేదము, భైషజ్యవేదము అని ప్రసిద్ధం.

కాళిదాసు వశిష్ఠుల వారిని అధర్వనిధి అని కీర్తించినాడు. అట్లు కీర్తించుట ద్వారా ఋగ్వేద యజుః సామవిదుడే కాక అధర్వ వేదాభిజ్ఞుడు కూడ నగువాడే పౌరోహిత్య కుశలుడు, కర్మ నిర్వహణ సమర్థుడు, రాజగురు పదమునకు అర్హుడు అని తెలియజెప్పెను.

అధర్వ మంత్రములకు సిద్ధమంత్రములని ప్రసిద్ధి. **గాయత్రీ దేవికి ఋగ్యజుస్సామములు పాదములు,** మీమాంసా శాస్త్రము తటస్థ లక్షణము. అధర్వవేదము చేష్ట అని అర్థము.

అధర్వము ఒక వృక్షము వంటిది. ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలు స్కంద శాఖలు. స్మృతి పురాణములు వర్ణములు. ఒక ఆదిత్యుడు యజుర్వేదమున యజుః అనియు, సామవేదమున సామ అనియు, ఋగ్వేదమున ఊర్ధ్వమనియు, అధర్వవేదమున యాతుః అనియు ఉపాసింపబడుచున్నాడు.

అధర్వుడనగా నిశ్చలుడు లేక స్థిర ప్రకృతి కలవాడు అని అర్థము. అధర్వమునకు ప్రాణాత్మ లేక ప్రజాపతి అని వేద ప్రసిద్ధము. ప్రాణాత్మ అగు ప్రజాపతి అధర్వుడని కీర్తింపబడినాడు. ఈ ప్రజాపతియే మొదటి అగ్నిని మధించెను. **ప్రతి వేదమంత్రమునకు ఆదియందును అంత్యమందును ఉచ్చరింపబడె ప్రణవము అభివ్యక్తము చేయునది అధర్వ వేదము.**

'యాతో రుద్ర శివాతనోరఘోర పాప నాశిని' అని పరమేశ్వరునకు శాంతము, ఘోరము అని రెండు రూపములున్నట్లు తెలిపెను.

ఉదాహరణ! స్తంభమునుండి వెడలి ప్రత్యక్షమైన **నరసింహుని రూపము భక్తాగ్రేసరుడగు ప్రహ్లాదునకు శాంతరూపమున అఘోర రూపమున సాక్షాత్కరించెను. ప్రబల ద్వేషియైన హిరణ్య కశిపునకు ఘోర రూపమున గన్పట్టినట్లు ప్రసిద్ధి కదా!**

పరమేశ్వరుని శక్తి రూపమగు ప్రకృతియు, శాంత, ఘోర రూపము జీవులకు ఉపభోగ్యమైన జలము జీవన హేతు వగునపుడు భేషజమగును. అదియే మృత్యు హేతు వగునపుడు ఘోరము అగును.

సర్వ ప్రాణులకు జీవన హేతువు అన్నము. అది శాస్త్రము ఉపదేశించినటుల సాత్త్విక, రాజసిక, తామసి కాద్యఘోర భేదములను గుర్తించి పరిమితముగా సేవించినచో అది జీవన హేతువు, సుఖప్రదమగు భేషజమగును. అట్లుగాక అధికంగా సేవించునపుడు వ్యాధి హేతువై అది దుఃఖ ప్రదమగును. ఘోర రూపమగును.

దీనినే అన్న శబ్ద నిర్వచనము ద్వారా శ్రుతి వివరించింది. అద్ (తినుట) అను ధాతువు నుండి అన్న శబ్దము నిష్పన్నమైనది. **తినబడునది (అద్యతే) కావున అన్నము. తినునది (అత్తి) కావున అన్నము అని అర్థము.** అన్నమునకు గల శాంత ఘోర రూపములను సంరక్షింపజేయుట శాంత ఘోర రూపములగును. అధర్వాంగిరో మంత్రముల దర్శించిన ఋషులే అధర్వాంగీరసులు దృష్టి భేదములేక అధికార భేదముల ననుసరించి శాంత, ఘోర రూపములుగా భిన్నముగా కన్పట్టినను మొత్తంమీద పరమార్థమున ఈ మంత్రములన్నియు ఆత్మవిచికిత్స కొరకే, లోకకళ్యాణమునకే యేర్పడినవి.

(లీ.వా.పు 24, 25)

జపాన్ వారు, జర్మనీ వారు ఈనాడు **అధర్వణ వేదమును** అనేక విధములుగ పరిశోధిస్తూ ఉన్నారు. గొప్ప సైంటిస్టు అయిన విశ్వామిత్రుడు గాయత్రీ మంత్రమును ఈ వేదము నుండియే ఆవిర్భవింపజేశాడు. ఇంతే గాకుండా అదిత్య తేజస్సును పరిశోధించి, గొప్ప అస్త్ర శస్త్రములను కనిపెట్టారు. ఇది ఎన్నోవేల సంవత్సరములకు పూర్వం జరిగినటువంటిది. కనుక భారతీయులు విజ్ఞాన శాస్త్రము నందు వెనుకబడిన వారు కాదు. భారతీయులు శోధించి సాధించి విడిచి పెట్టిన దానినే, ఈనాడు విదేశీయులు ఆధారంగా చేసుకుంటున్నారు. ఇంత మాత్రమే కాదు. **గణితశాస్త్రము కూడా భారతదేశం నుండి వచ్చినదే. ఇంక వైద్య శాస్త్రంలో ఈనాటి శస్త్ర చికిత్సలను భారద్వాజ మహర్షి అనాడే కనిపెట్టాడు.ధర్మశాస్త్రమును మనుచక్రవర్తి వ్రాశాడు. న్యాయ శాస్త్రమును గౌతముడు, అర్థశాస్త్రమును చాణక్యుడు వ్రాశారు. ఈనాడు చాణక్యుని అర్థశాస్త్రాన్ని అనుసరించకపోవడం చేతనే దేశం ఇన్ని అవస్థలకు గురి అవుతున్నది.** ఈవిధంగా విచారణ చేస్తే అన్నింటిలోను భారతదేశమే ముందంజ వేసిందని స్పష్టమవుతుంది. కాని, దురదృష్టవశాత్తు భారతీయులలో ఐకమత్యం లేక పోవడం చేతను, అసూయ పెరిగి పోవడం చేతను దీనిని సరియైన రీతిలో ప్రచార ప్రబోధలు సలుపలేక పోయారు.

(దే.యు. పు.54/55)

అధికారము

వృద్ధుడైన దశరథుని సేవలు చేస్తూ, పరిపాలనా విధానాన్ని చక్కగా తీర్చిదిద్దారు. రాముడు తండ్రికి ఏ మాత్రము శ్రమ కల్గించేవాడు కాదు. ఒకనాటి రాత్రి దశరథునికి దాహం వేసింది. ఒక జగ్గును తీసుకొని టంబ్లర్‌లోకి నీరు పోసుకోవాలని ప్రయత్నించాడు. జగ్గును పట్టుకునేటప్పటికి

అధిపతి

చేయి అదిరింది. ఇక **దశరథుడు నిద్ర పోలేదు. "నా దేహమే నా అదుపులో లేనప్పుడు ఇంక రాజ్యపాలన చేసే అధికారం నాకు లేదు"** అనుకున్నాడు. చూశారా! ఆనాటి రాజులు ధర్మాన్ని ఏ రీతిగా అనుసరిస్తూ వచ్చారో! కాని, **ఈనాటివారు మాత్రం వ్రాయటానికి చేతులు రాకపోయినా, ఫైల్స్ చూడటానికి కన్నులు లేకపోయినా ఇంకా రాజ్యము నేలాలని ఆశిస్తున్నారు.**

(శ్రీ.భ.ఉ.పు.61)

అధిపతి

(చూ॥ హృషీకేశుడు)

అధ్యాపకులు

అధ్యాపకుడు యిచ్చేవాడు, విద్యార్థి పుచ్చుకునేవాడు. అయితే ఇచ్చేందుకు టీచరు దగ్గర ఏమైనా సరుకు ఉండాలిగదా! అయితే ఈనాడు పుచ్చుకోవటానికి విద్యార్థి సిద్ధంగానూ లేడు. ఇవ్వటానికి టీచరు దగ్గర సరుకూ లేదు. అధ్యాపకులు వాటర్ ట్యాంక్ లాంటి వారు. విద్యార్థులు ట్యాప్ ల వంటివారు. సహజంగా ట్యాంక్ లో ఎటువంటి నీరు ఉంటే, అటువంటి నీరు ట్యాప్ లోనికి వస్తుంది. అదే విధంగా అధ్యాపకుడు ఎట్టి వాడో విద్యార్థి అట్టివాడుగా తయారవుతాడు. ఉపాధ్యాయుడు క్రమ శిక్షణతో తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించకపోతే వేలమంది విద్యార్థులు చెడిపోతారు. **అధ్యాపకులు ఆదర్శ జీవితాన్ని గడిపినప్పుడు, విద్యార్థులు సత్ప్రవర్తనను అలవరచు కుంటారు. వాటర్ ట్యాంక్ లో పరిశుద్ధమైన నీరు ఉంటే ట్యాప్ లోనికి మంచినీరు వస్తుంది. అదేవిధంగా అధ్యాపకుడు పవిత్రమైన జీవితాన్ని గడిపితే విద్యార్థులు కూడా సచ్ఛీల సంపన్నులవుతారు. కనుక విద్యార్థులకు అధ్యాపకులు మార్గదర్శకులుగా ఉండాలి.**

(శ్రీ.జూ. 97 పు.21)

అధ్యాపకులు దేశమునకు ఆదర్శవంతమైన జ్యోతులు. ఒక విద్యార్థి చెడితే కేవలం అతను మాత్రమే చెడగలడు. ఒక అధ్యాపకుడు చెడితే అనేకమంది విద్యార్థులు చెడటానికి అవకాశము ఉంటుంది. అధ్యాపకులు గైడ్ పోస్టు వంటివారు. విద్యార్థులకు సరియైన ఆదర్శము నందించటంలో అధ్యాపకులు నిశ్చల మనస్సుతో వ్యవహరించాలి. గైడ్ పోస్టు ఊరికే అటూ, ఇటూ. ఇటూ, అటూ తిరుగుతుండటంతో తప్పుదారి పట్టిస్తుంది. గైడ్‌పోస్టు స్థిరంగా నిల్చొని దృక్పథాన్ని చక్కగా ఇతరులకు వివరించాలి. అధ్యాపకులు కూడా నిశ్చలమైన మనస్సుతో, నిస్వార్థమైన హృదయంతో ప్రేమ తత్వాన్ని పెంచుకోవాలి. భక్తి ప్రపత్తులను కూడా అభివృద్ధి గావించుకోవాలి. విద్యార్థుల అభివృద్ధిని, దేశాభివృద్ధిని సమాజక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అధ్యాపకులు ప్రవర్తించాలి. ఉన్నత భావాలను పెంపొందించుకొని మంచి ఆదర్శమును లోకమునకు చాటుటకు అధ్యాపకులు పూనుకోవాలి.

(శ్రీ. జూ. 97 పు. 69)

(చూ॥ అవతారము, ఆచార్యుడు, విద్యార్థులు)

అనంతం

(చూ॥ త్రిగుణములు, దైవబలము)

అనన్యభక్తి

ఉద్ధవుని ఉపదేశం విని గోపికలు హేళనగా నవ్వినారు. "కృష్ణుడు సర్వత్ర ఉన్నాడని మాకు చెపుతున్నావుగాని, మొదట నీవు అనుభవిస్తున్నావా? నీవు మాత్రం సగుణ సాకార స్వరూపుడైన కృష్ణుని సామీప్యాన్ని తనివితీర అనుభవిస్తూ మాకు నిర్గుణ నిరాకార తత్వాన్ని బోధిస్తున్నావు. నీవు చెప్పేదంతా అనుకూల వేదాంతమే గాని, అనుభూతికి సంబంధించినది కాదు. నీ వేదాంతము మాకు అక్కర్లేదు. ప్రత్యక్ష దైవమైన కృష్ణుణ్ణి మాకు చూపించు, చాలు" అన్నారు. అయితే, వారు ఉద్ధవునివైపు చూడటం లేదు, అతనితో నేరుగా మాట్లాడటం లేదు. వారి హృదయాలు కృష్ణునికి ఏనాడో అర్పితమైపాయాయి. పరపురుషుణ్ణి కన్నెత్తి చూడటంగాని, అతనితో

మాట్లాడటంగాని వారికి ఇష్టం లేదు. కనుక, ఒక తుమ్మెదను మధ్యవర్తిగా పెట్టుకుని, ఆ తుమ్మెదను సంబోధిస్తూ మాట్లాడుతున్నారు. "కృష్ణుడు మా హృదయాలను అపహరించాడు. మాకున్నది ఒకే మనస్సు, అది కృష్ణునితోపాటు ఏనాడో మధురకు వెళ్ళిపోయింది. ఇప్పుడు నీ ఉపదేశాన్ని వినడానికి మావద్ద మరొక మనస్సు లేదు. మా కన్నులకు కృష్ణుని రూపం కనిపిస్తే చాలు; మా కర్ణములకు కృష్ణుని మురళీ నాదం వినిపిస్తే చాలు. కృష్ణుని ప్రేమతత్త్వం ఒక్కటే మాకు ఆనందాన్నివ్వగలదు. కృష్ణునికోసం ఏడ్చి ఏడ్చి మా కన్నులు కాయలు కాసినవి; మా హృదయాలలోని నీరు ఇంకిపోయినది. నీరు లేని మా హృదయాలలో కృష్ణుని సందేశమనే పడవను ఎలా నడవడానికి వీలవుతుంది? ఇసుకలో పడవను నడపగలవా? కనుక, నీ 'పడవ'ను తీసుకుని వచ్చినదారినే తిరిగి వెళ్ళు. మాకు నిరాకార నిర్గుణ బ్రహ్మం అక్కర్లేదు. సగుణ సాకార బ్రహ్మమే మాకు కావాలి" అన్నారు. అప్పుడు ఉద్ధవుడు తెలివి తెచ్చుకొని "నేను గొప్ప జ్ఞానినని భావించాను. కాని, నేను పరమ అజ్ఞానిని" అని అనుకొని, "గోపికలారా! దీన్ని మీరు చదవండి, అంతేచాలు" అని కృష్ణుడు ఇచ్చిన లేఖను వారికి ఇవ్వబోయాడు. కాని, వారు దానిని స్వీకరించక "అయ్యా! మేమున్నది పట్టణంలో కాదు, కుగ్రామంలో నివసిస్తున్నాము. కనుక, మాకు అక్షర జ్ఞానం లేదు. మా జీవితమంతా అక్షర స్వరూపుడైన కృష్ణ పరమాత్మకు అంకితమైపోయింది. అక్షర జ్ఞానమే లేనివారము ఈ లేఖను ఏరీతిగా చదవగలము? కాబట్టి, ఈ లేఖ మాకు అక్కర్లేదు" అన్నారు. "ఇదేమి ఈ గోపికలు కృష్ణుని లేఖను కూడా తిరస్కరిస్తున్నారే!" అని ఉద్ధవునికి కొంత ఉద్రేకం కల్గింది. అది గుర్తించిన గోపికలు "అయ్యా! మేము కృష్ణుని లేఖ వద్దన్నది, దానిని చదవడం ఇష్టం లేక కాదు. మాకు చదువు రాదు. ఒకవేళ అంతో ఇంతో అక్షరజ్ఞానం కలిగినవారు మాలో ఉన్నప్పటికీ, మేము కృష్ణుని లేఖను చదవలేము.ఎందుకంటే, ఆ లేఖను చూసినప్పుడు మేము కన్నీరు ఆపుకోలేము. మాకన్నీరు ఆ లేఖపై పడి అందులోని అక్షరములు చెదరిపోవచ్చును అంతేకాదు, కృష్ణ వియోగంచేత మా హృదయం దగ్ధమైపోతున్నది; మా శరీరం వేడెక్కిపోయింది. కనుక, మా హస్తములతో ఆ లేఖను ముట్టుకుంటే అది భస్మమైపోవచ్చును. నీవు మా అవస్థను అర్థం చేసుకోలేక పోతున్నావు" అన్నారు. అక్కడున్న తుమ్మెదను సంబోధిస్తూ వారు కృష్ణునికి ఒక సందేశాన్ని పంపారు.

"తుమ్మెదా! ఒకసారి కన్నెత్తి చూడమని
చెప్పవే మా మాట శ్రీ కృష్ణునకు
మబ్బు గ్రమ్మిన మాదు మానస వీథిలో
కృష్ణభానుని తేజము నిలుపుమనుము
ఎండబారిన మాదు జీవిత వృక్షమునకు
చిగురు పెట్టగ వేగ చేయమనవె
చెదరిపోయిన మాదు జీవిత సుమమాల
చెల్వార కూర్చి ధరియించమనవె"

చివరికి రాధిక ప్రార్థించింది: "కృష్ణా! నీ చింతనలో మేము మరణిస్తాం. అయితే, నీవు ధర్మసంస్థాపనకై తిరిగి ఈ లోకంలో అవతరించినప్పుడు మమ్మల్ని కూడా నీ వెంట తీసుకొనిరా!"

"వృక్షంబువై నీవు వర్ధిల్లుచుండిన
వల్లికనై నేను అల్లుకొందు
పుష్పంబువై నీవు పాలుపొందుచుండిన
తుమ్మెదనై నేను తిరుగుచుందు
అనంతమైనట్టి ఆకాశ మీవైన
చిన్ని చుక్కగ నేను చెలగుచుందు
నిండు సముద్రుడే నీవయి యుండిన
వాహినియై నేను ఐక్యమగుదు
మేరు పర్వత భవ్య మేదిని నీవైన
సెలయేటినై నేను చెలగుచుందు"

ఇదే నిజమైన భక్తి. వ్యష్టి, సమిష్టియొక్క ఏకత్వాన్ని గుర్తించమని బోధిస్తున్నది వేదాంతము. వ్యష్టి జీవత్వము, సమిష్టి - దైవత్వము. అందరియందు దైవత్వమున్నదనే విశ్వాసాన్ని పెంచుకోవాలి. అంతా దైవస్వరూపమే. గోపికలు

చెప్పారు - "ఉద్ధవా! 'నేను, 'నేను' అని నీవు పలుకుతున్నావు. ఈ 'నేను' అనే భావం నీలో ఉన్నంత వరకు నీకు దైవత్వం ప్రాప్తించదు. మాకు 'నేను' అనే భావమే లేదు. 'నేను' అనేది ఉన్నప్పుడు 'నీవు' అనేది బయలుదేరుతుంది. 'నేను', 'నీవు' అనే భేదం ఉన్నచోట ప్రపంచమంతా చేరిపోతుంది. కనుక, మాకు అనేకత్వము అక్కర్లేదు, ఏకత్వమే కావాలి. అదే సత్యము, నిత్యము".

(స.సా. జూ. 2000 పు. 10/12)

(చూ॥ అన్యభావనలేని భక్తి, భాగవతము)

అనపేక్ష

అనపేక్ష శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః
సర్వారంభ పరిత్యాగీ, యో మద్భక్తః స మే ప్రియః
ప్రేమ స్వరూపులారా!

అనపేక్ష అనగా ఎట్టి అపేక్షలు లేకపోవటం

శరీరమనోబుద్ధులతో కూడిన మానవునకు ఎట్టి అపేక్షలు లేకపోవటం చాలా ఆశ్చర్యము. ఇది సాధ్యమా? కాదు కాదు. మానవునకు జీవితములో ఎన్నియో విధములైన అపేక్షలుంటున్నవి. కొన్ని శ్రేష్ఠమైనవి, కొన్ని ఇష్టమైనవి. కానీ ఈనాటి మానవునకు ఇంద్రియ సంబంధమైన ఫలితముచేత తాత్కాలిక ఆనందములు కలుగుతూ ఉంటాయి. ఇవి సత్యమైనవి కావు. క్షణభంగురమైనవి. ఇట్టి భౌతికమైన అపేక్షలచేత మానవుడు తన జీవితములో సత్యమును గుర్తించుకోలేక పోతున్నాడు. **ఇట్టి క్షణభంగురమైన అభీష్టములను నెరవేర్చుకొనుటనే "ప్రేయస్సు" అని అన్నారు. రెండవది దీనికి పూర్తివిరుద్ధమైనది. అందరికి అర్థముకానిది. అందరికి అందుబాటులో లేనిది. అంతర్భావముతో కూడిన అభీష్టమే. దీనినే "శ్రేయస్సు"** అన్నారు.

ఒకవైపున ప్రేయస్సు మరొకవైపు శ్రేయస్సు. ఇవి రెండూ మానవుని తమ వైపు లాగుకునే నిమిత్తమై రెండూ పోటీ పడుతుంటాయి. కానీ ఈనాటి మానవుడు ప్రేయస్సు వైపే తన దృష్టి మరల్చును గానీ శ్రేయస్సు వైపు తన దృష్టి మరల్చడు. ఈ ప్రేయస్సునే వాంఛలు అమితమైన రీతిగా మానవుని ఆనందపరుస్తాయి. కారణము తానీ భౌతికమైన దేహముతో, భౌతికమైన లోకములో, భౌతికమైన భ్రాంతులతో, భౌతికమైన జీవితము గడుపుతున్నాడు. ఈ ప్రాకృత జగత్తునకు ఈ ప్రేయస్సునే అభీష్టములే తనను ఆనందింపచేస్తాయి. ఇవి ఇంద్రియములతో కూడిన ఆనందమే.

ఇంద్రియములు శాశ్వతమైనవి కాదు. రోగమయమైనవి ఇంద్రియములు. రోగమయమైన ఇంద్రియముల ద్వారా అనుభవించే ఆనందము రోగమయముగానే ఉంటుంది. కంటితో చూచాము. చూచినది సత్యమని విశ్వసిస్తున్నాము. కానీ నీవు చూచిన వస్తువు అనేక రంగులతో కనిపిస్తున్నది. కానీ జాండిస్ రోగము వచ్చినపుడు అంతా పచ్చగా కనిపిస్తుంది. నాలుక ఉంటున్నది; నీవు భుజించే సమయములో కారము కారముగను, తీపి తీపిగను, చేదు చేదుగను గోచరిస్తాయి. కానీ మలేరియా జ్వరము నీలో ప్రవేశించిందంటే ఆ నాలుక పైన తీపి పెట్టుకున్నా చేదుగానే ఉంటుంది. అప్పుడు నీ నాలుక దోషమా! లేక తీపి దోషమా! కనుక ఇట్టి రోగమయమైన ఇంద్రియముల చేత మానవుడు భ్రాంతులనే రోగములను అభివృద్ధి పరచుకుంటున్నాడు. కనుక ప్రపంచమంతయు ప్రేయస్సు వైపే ప్రయాణము చేయుచున్నది. కానీ శ్రేయస్సు వైపున నూటికొక్కరో కోటికొక్కరో ప్రయాణమవుతుంటారు.

అంతర్భావములు అభివృద్ధి పరచుకోవటము శ్రేయస్సు. అంతఃకరణ పవిత్రముగావించుకోవటం. అంతర్ దృష్టిని అభివృద్ధి చేసుకోవటము. ఆత్మానందమును అనుభవించుకోవటం, అద్వైతానందము పొందటము- ఇవియే శ్రేయస్సుయొక్క పద్ధతులు. దీనిని కోరేవారు చాలా తక్కువ.

మనము ఈనాడు అభీష్టము లేకుండా ఎట్లా చేసుకోవాలి. **అపేక్షలేని వాడంటే నాకు ప్రీతి అన్నాడు కృష్ణుడు.** శరీర మనోబుద్ధులతో కూడిన మానవుడు అపేక్ష లేకుండా ఏ రీతిగా ఈ జగత్తులో జీవించగలడు? ఏదో ఒకటి

ఇష్టమైనదో లేక శ్రేయస్సును కలిగించేదో కోరే తీరాలి. మిగిలిన కోరికలు అన్నీ ఈ రెండు కోరికలలోనే సమ్మిళితమై ఉంటాయి. కోరికలు లేని మానవుడు జగత్తులో కానరాడు. కనుక అపేక్ష లేకుండా ఎట్లా ఉండేది? దీనికే చక్కని ఉపమానము చెప్పాడు. నాయనా! నీవు ప్రేయస్సుపైన ప్రయాణము చేయవద్దు. ప్రేయస్సుపై దృష్టి నిలుపవద్దు. సర్వకర్మ భగవత్ప్రీత్యర్థమని నీకర్మలు నీవు ఆచరించు. ఈ ఫలితము నీకు ఉండదు. కనుక ఏ విధమైన ప్రేయస్సు లేకుండా ఉంటుంది. అప్పుడు నీవు అపేక్షలేని వాడుగా ఉంటావు. నీవు కర్మ లాచరించు. మానవుడు కర్మ లాచరించే నిమిత్తమే కాయము ధరించాడు. **"కర్మణ్యేవాధికారస్తే" అని గీత ప్రబోధించింది. 'కర్మానుబంధీని మనుష్యలోకే'** ఉపనిషద్వాక్యము ప్రతి దేహము కర్మ చేత బంధింపబడుతున్నది. కాయముచే సర్వకర్మలు ఆచరిస్తున్నాడు మానవుడు.

అనపేక్ష ఉండాలంటే ఎట్లా వీలవుతుంది? **నీవు కర్మలు వదలనక్కరలేదు. కర్మ ఆచరించు. ఫలితము నీవు ఆశించకుండా ఉండు. అదియే అనపేక్ష.** ఈ ఫలితము నీవు ఏ రీతిగా అర్పితము గావించాలి? **కర్మము ప్రారంభించక పూర్వమే ఇది భగవత్కర్మగా విశ్వసించు. అప్పుడు ఇదంతా భగవత్కర్మగా రూపొందుతుంది. ఈ అపేక్ష భగవదపేక్షగా మారుతుంది. కనుక ఉపనిషత్తులు 'తస్మైనమః కర్మణే' మొట్టమొదట కర్మకు నమస్కారము చేయి అన్నాయి.** ఎందుకోసం చేయాలి కర్మకు నమస్కారం? "ఓ కర్మా! నేను ఆచరించే దాంట్లో ఎట్టి దోషములు లేకుండా చూచుకోవాలి. ఏ విధమైన పాపములు రాకుండా చూచుకోవాలి. కనుక నీకు నమస్కారము చేస్తున్నాను. నీవు ఈ మార్గములో సహాయము చేయు"మని కోరటం. కనుక **అపేక్ష లేని వాడంటే నాకు ప్రీతి అన్నాడు భగవంతుడు.** ఇప్పుడు మనం చేయవలసింది ఏమిటి? కర్మను నీవు వదలనక్కరలేదు. కర్మను వదలి మానవుడు ఒక్క క్షణమైనా జీవించుటకు వీలుకాదు. **కరచరణాది అవయములతో చేసే కర్మలే కాదు. సంకల్పములు కూడా కర్మలే. దృష్టి కూడా కర్మయే. శ్రవణము కూడా కర్మయే. ఈ పంచేంద్రియములతో కూడిన సర్వ కర్మలు కర్మల క్రింద చేరుతుంటాయి.** ఈ సర్వము భగవత్ప్రీత్యర్థముగా ఆచరించటమే కర్మలేనట్టుగా తోస్తుంది. నీవు ఎట్టి అభీష్టము లేనివాడుగా రూపొందుతావు. అప్పుడే అనపేక్ష అనే సార్థకనామము వస్తుంది.

రెండవది. శుచిః - శుచి అనగా పరిశుద్ధము. ఏమిటి ఈ పరిశుద్ధము? శరీరము పరిశుద్ధముగా ఉంచుకోవటమా? లేక బట్టలను పరిశుద్ధముగా ఉంచుకోవటమా? ఇది కూడా అవసరమే. ఇది బహిశ్శుద్ధి దీనికంటె అంతశ్శుద్ధి అత్యవసరము. బహిశ్శుద్ధి మాత్రమే ఉండి అంతశ్శుద్ధి లేకపోతే సర్వము మాలిన్యమైపోతుంది. భగవంతుని వంచన గావించినట్టుగా ఉంటుంది. కనుక అంతశ్శుద్ధి నీవు చూచుకోవాలి. అనగా దుర్భావములు, దుశ్చింతనలు, దురాలోచనలు, రాగద్వేషములు ఇట్టి మాలిన్యమయమైన భావములు మనస్సుకు లేకుండా చూచుకోవాలి. ముఖ్యంగా పాత్ర లోపలనే మహాపవిత్రంగా ఉంటుండాలి. ఈ టంబ్లరులో నీరు పోసుకున్నాము. లోపల పరిశుద్ధముగా నున్నప్పుడే నీరు త్రాగటానికి వీలవుతుంది. బయట మాత్రము శుభ్రముగా ఉండి లోపల మాలిన్యముంటే త్రాగుటకు వీలుకాదు. కనుక అంతర్ శుద్ధి అత్యవసరము. దీనినే యింకొక రీతిగా చెప్పాలనుకుంటే కళాయి లేని పాత్రలో పప్పు పులుసు వండితే అదంతా చిలుము పట్టిపోతుంది. అదే విధముగా **లోపల పరిశుద్ధము లేనప్పుడు నీవు బాహ్యముగా ఎన్ని పవిత్రమైన కర్మలు చేసినా మాలిన్యమైపోతాయి. కనుక నీవు శుద్ధిగా ఉండమని చెప్పాడు.**

మూడవది శుచితోబాటు దక్షత. అనగా ఒక విధమైన ప్రతిజ్ఞ పూనాలి. ఈ జగత్తులో ఏ సమయమునందైనా **నేను ఒక ఆదర్శమును సాధించాలి అని ఒక దీక్ష పూనాలి.** మానవ జీవితము దేని కోసం వచ్చింది? మానవ

లోకమునకు ఆదర్శము నిరూపించాలి. ఆ విధముగా నిరూపించటమే కాక ఆత్మతత్త్వమునకు అత్యంత సమీపుడు కావాలి. మొట్టమొదట సాలోక్యం; - రెండవది సామీప్యం; సారూప్యం మూడవది; నాల్గవది సాయుజ్యం. ఈ నాల్గింటి యొక్క తత్త్వమందే పవిత్రమైన చిత్తము నిల్చిపోతున్నది. కనుక నేను కర్మలు చేయక తప్పదు. కర్మ కోసమే కాయము అవతరించింది. కాయము చేత కర్మలు చేసి కాయము పవిత్రము గావించాలి. కనుక కాల కర్మ కారణ కర్తవ్యములు నిర్వర్తించటమే మానవుని ప్రధాన కర్తవ్యము. "నా జీవితమంతా, కట్టకడపటికి ప్రాణము విడుచునంతవరకు పవిత్ర కర్మలు నేను ఆచరించాలి." ఈ విధమైన దీక్ష మనం పట్టాలి. నేడు ఒక భావము, రేపొక భావము ఈ విధంగా మార్పు చెందుతూ రాకూడదు. నీ అనుకూలములు పురస్కరించుకొని నీవు కర్మలు ఆచరించకూడదు. నీ హృదయ సాక్షిగా కర్మలు ఆచరించుటకు పూనుకోవాలి. మనము మన హృదయ సాక్షిగా కర్మలు ఆచరించుటకు ఒక దీక్ష పూనాలి. 'ఓ భగవంతుడా! ఈ కాయము ఎందుకోసం ఇచ్చావు? నీ సేవ నిమిత్తమై నేను కాయము ధరించాను. నా తల్లిదండ్రులు నీసేవ నిమిత్తమే ఈ కాయము నందించారు. కనుక నిన్ను, నా తల్లిదండ్రులను తృప్తిపరచటమే నాకు ప్రధానమైన దీక్ష. కనుక మాతృదేవో భవ! పితృదేవో భవ! అని వారిని దైవస్వరూపులన్నారు.

నాల్గవది ఉదాసీనత : ఉదాసీనమనగా దేనిని పట్టించుకోకుండా పోవటం కాదు. **మంచి, చెడ్డ రెండింటిని త్యజించటమే.** ఇది మంచే అని స్వీకరించటం కాదు. ఇది చెడ్డ అని విసర్జించటం కాదు. **రెండింటిని విసర్జించాలి** - ఎట్లా? నీవు దారిని నడుస్తుంటే దారిలో ఒక ముల్లు కాలికి గుచ్చుకొంది. ఆ ముల్లును మనం తీసి వేయాలంటే మనం యింకొక ముల్లును సంపాయించుకోవాలి. ఇంకొకముల్లు సంపాయించి ఆ విరిగిన ముల్లును యీ ముల్లుతో తీసి రెండు ముల్లులు పారవేయాలి. ఒక ముల్లు విరిగి నిన్ను బాధిస్తున్నది. యింకొకముల్లు దానిని తీసి సంతోషపరచింది. సంతోషపరచింది కదా అని ఆ ముల్లు నీ దగ్గర పెట్టుకో కూడదు. ఇది నన్ను బాధించిందని దానిని మాత్రమే దూరము పారవేయ కూడదు. రెండూ ముండ్లే. రెండింటిని తీసి పారవేయవలసిందే. ఉదాసీనత చాలా ప్రధానమైనది. **ఎలాంటి విషయమునందు రాగముగానీ, ద్వేషముగానీ ఉండకూడదు.** ఇంతే కాదు. **"సంబంధ బాంధవ్యములందు అత్యంత సంబంధము కల్గించుకోకూడదు". ప్రాకృతమునందు అనేక బంధనలు మనం అభివృద్ధి పరచుకుంటున్నాం. ముఖ్యంగా రాజకీయములలో మనం ప్రవేశించకూడదు. కారణ మేమనగా మన రాగము మరింత రాగముగా మారిపోయి రోగంగా తయారౌతుంది.** దేనియందు ఆపేక్ష లేకుండా చూచుకోవాలి.

తరువాత సర్వారంభ పరిత్యాగి : సర్వము త్యజించాలి. ఎట్లా త్యజించాలి? **అహంకారమమకారములు దూరము గావించుకోవటమే సర్వారంభ పరిత్యాగము. మానవుని అనేక కష్టములకు గురిచేయునది రాగద్వేషములే. మానవునికి భ్రమలు కల్గించేది అహంకారమే.** ఈ అహంకారము ఉండినంత వరకు మానవునికి ఆనందము అత్యంత దూరంగా ఉంటుంది. ఈ అహంకారమును, ఆడంబరముచేత అభివృద్ధి గావించుకుంటున్నాడు. ఆడంబరము లేకపోతే అహంకారమునకు కళయే ఉండదు. కనుక అహంకారముచేత ఆడంబరము పెంచుకుంటున్నాం. **అహంకార ఆడంబరములను త్యజించటమే సర్వారంభపరిత్యాగము.**

యో మద్భక్తః స మే ప్రియః ఇటువంటివాడు నాకు ప్రియుడు అని చెప్పటం చాలా సులభమే. కానీ, సాధించటము చాలా కష్టము. ఇది ప్రతిమానవునికి వచ్చే సందేహమే. నా ఉద్దేశ్యము ఏమంటే చెప్పుట కష్టము, చేయటమే సులభము. ఇవన్నీ మంచి మార్గము అని గాఢమైన విశ్వాసముంటే ఎంతసులభముగానైనా

ఆచరించవచ్చును. ఈ విశ్వాసము గాఢముగా లేక పోవటంచేత కష్టం కనిపిస్తున్నది. ఏ అపేక్షలు లేకుండా ఉండాలి ఇది చాలా మంచిది అనే గాఢ విశ్వాసము నీలో లేదు. మంచిదని చెప్పుతున్నావుగానీ విశ్వాసము లేదు. ఇదియే దైవ ద్రోహమునకు మూల కారణము. The proper study of mankind is man లోపల యిది మంచిదేయని తలచుకుంటున్నావు. కానీ యిది మంచిదని చెప్పలేక పోతున్నావు. చెప్పలేకపోవటమే కాదు చేయలేకపోతున్నావు. ఇది మంచిదని తెలిసినప్పుడు ఎందుకు నీవు చెప్పకూడదు? ఎందుకు నీవు చెప్పినప్పుడు చేయకూడదు? **దీని పైన పూర్ణ విశ్వాసము లేకపోవటం మానవత్వము రాక్షసత్వంగా రూపొందుతుంది. అహంకారము, అభిమానము, ఆడంబరము రజోగుణము యొక్క లక్షణములని బోధించాడు కృష్ణుడు. నాయనా! నీవు నా భక్తుడు కావాలనుకుంటే ఈ రాక్షసగుణములను నీలో చేర్చుకోవద్దు. ఆడంబరము మహా ప్రమాదము. అహంకారము మరింత ప్రమాదము. ఈ ఆడంబరము, అహంకారము త్యజించాలి. ఆశలుండినా ఉండవచ్చు. కానీ ఆడంబరము, అహంకారము ఉంటే తనను తాను ద్రోహము చేసుకోవటమే.** ఎవరికో చేస్తున్నామని కాదు. తనను తాను కించపరచుకుంటున్నాడు. తనకు తానే ద్రోహము చేసుకుంటున్నాడు. ఇది ఆత్మ మార్గమునకు విరుద్ధమైనది. మొట్టమొదట తనను తాను తరింపచేసుకోవాలి. తనను తాను రక్షించుకోవటానికి ప్రయత్నించుకోవాలి.

(ద.య.స.97 పు. 102/108)

(చూ॥ భక్తుడు)

అనల్‌హక్

(చూ॥ మన్సూర్)

అనవరతము

(చూ॥ నిశ్చల సమాన చిత్తుడు)

అనహంకారము

అహంకారము యెన్ని అవగుణము లున్నవో వాటన్నిటికినీ పుట్టినిల్లు వంటిది. అహంకారికి మంచి, పుణ్యము, పాపము, సత్యము, దైవము యేవీ లేవు, వుండవు. ధర్మము వానికి యే మాత్రము తెలియదు. న్యాయము వానికి నరివడదు. ఇట్టి **దుర్గుణములు లేకుండుటే అనహంకారము.** అహంకారము మిత్రునివలె వుండు శత్రువు అని తెలుసు కోవలెను.

(గీ. పు. 209)

అనసూయ

మొట్టమొదట అసూయ మానవునియందు లేకుండా చూచుకోవాలి. ఇతరుల మంచిని చూచి, ఇతరుల అభివృద్ధిని చూచి, ఇతరుల మేలును చూచి నీవు ఆనందించు. ఇదే నిజమైన సద్గుణము. పరుల మంచిని చూచి వారి మంచిని కోరటమే సరియైన సద్గుణమని భగవద్గీత బోధిస్తూ వచ్చింది. మానవుడు అనుభవించే సమస్తదుఃఖములకు మూలకారణము అసూయనే. కనుకనే **తొమ్మిదవ అధ్యాయమునందు అర్జునా నీవు అనసూయుడవు కమ్ము; అసూయుడవు కాకు అన్నాడు. అనసూయ తత్వము దైవత్వాన్ని పసిపాపలుగా చేస్తుంది. అనసూయను పరీక్షించుటకై వచ్చిన బ్రహ్మ విష్ణు మహేశ్వరులను పసిపాపలుగా చేసుకుంది.** అనగా మన గుణములను కూడను మనము వశము చేసుకోవచ్చును. సత్వరజస్తమోగుణములను మనము జయించవచ్చు. అనసూయవల్ల ఎంతైనా సాధించటానికి వీలవుతుంది.

(శ్రీ.గీ. పు. 217)

(చూ॥ అసూయ)

అన్నం/అన్నము

మానవునియందున్న దివ్యశక్తి ఇట్టిది, అట్టిది అని వర్ణించుటకు వీలుకాదు. అదియే విష్ణుశక్తి, అదియే బ్రహ్మశక్తి. **వేదము "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ"**

అన్నదమ్ములు

అన్నది. త్రికాలములందు మార్పు చెందని, కూర్పు చెందని జ్ఞానమే బ్రహ్మతత్త్వము. వేదము 'ప్రజ్ఞానం బ్రహ్మ'' అని కూడా తెల్పింది దీనినే. ఈ బ్రహ్మ నుండియే ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలము నుండి పృథ్వి, పృథ్వి నుండి ఓషధులు, ఓషధుల నుండి అన్నము ఆవిర్భవించాయి. అన్నము నుండియే మానవుడు పుట్టాడు. ఈ విధంగా విచారణ చేసినప్పుడు మానవునికి, బ్రహ్మకు సన్నిహిత సంబంధ బాంధవ్యమున్నదని స్పష్టమవుతుంది. కనుకనే, **కృష్ణుడు "మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః" (ఈ ప్రపంచమునందలి జీవులందరూ నా శాశ్వతాంశములే)** అన్నాడు. బ్రహ్మయే లేక ఆకాశమే లేదు; ఆకాశమే లేక గాలియే లేదు; గాలియే లేక అగ్నియే లేదు; అగ్నియే లేక జలమే లేదు; జలమే లేక పృథ్వియే లేదు; పృథ్వియే లేక ఓషధులే పండవు; ఓషధుల పంట లేక అన్నము లభించదు. మానవునికి అన్నమే మూలాధారం. దీనిని పురస్కరించు కొనియే **వేదము "అన్నం బ్రహ్మ"** అన్నది. బ్రహ్మ అనగా ఎవరు? మీరు పిక్చర్లలో చూసే చతుర్ముఖ బ్రహ్మ కాదు. బృహత్తరమైన శక్తియే బ్రహ్మ. సర్వత్ర వ్యాపించిన శక్తియే బ్రహ్మ. శబ్దమే బ్రహ్మ, గాలియే బ్రహ్మ, నీరే బ్రహ్మ, భూమియే బ్రహ్మ, అగ్నియే బ్రహ్మ స్వరూపములు, అవన్నీ మానవ దేహమునందే ఉన్నవి. కనుక, మానవుని కంటే దైవం ప్రత్యేకంగా లేడు. మానవుడే సాక్షాత్తు బ్రహ్మస్వరూపుడు. మానవుడే సత్యస్వరూపుడు. మానవత్వమునందే దైవత్వాన్ని ప్రకటించాలి. దైవత్వాన్ని ప్రకటించడమే మానవుడు చేయవలసిన సాధన.

(స.సా. ఫి.2000 పు. 34)

(చూ॥ అనృతపుత్రుడు, ఆదర్శం, అధర్వవేదము, జీవించాలి)

అన్నదమ్ములు

(చూ॥ ఆదర్శము, దైవాజ్ఞ)

అన్నదానము

"అన్నదానముకన్న నధిక దానంబేది?
తల్లిదండ్రులకన్న దైవమేది?
జపతపంబులకన్న సత్యశీలంబేది?
దయకంటె ఎక్కువ ధర్మమేది?
సుజనసంగతికన్న చూడ లాభంబేది?
క్రోథంబుకన్న శత్రుత్వమేది?
ఋణముకంటెను నరులకు రోగమేది?
ధరణి నపకీర్తికంటెను మరణమేది?
సర్వదా కీర్తికంటెను సంపదేది?
స్మరణకంటెను మించు ఆభరణమేది?"

(ఆ.రా. పు. 421)

అన్యభావన లేని భక్తి

అన్య భావనలేని భక్తి కలిగియుండుట. సంకట సమయమున వెంకట రమణుని తలంచి, సుఖము ప్రాప్తించగనే శ్రీనివాసుని చిత్తము నుండి తొలగించుట వంటిది కాదు. లేక నోరు చెడినపుడు రుచికొరకై యేవైన పుల్లటి ఊరుగాయలు నంజుకొనినటుల అప్పటి కప్పుడు ఉపయోగ పెట్టు వ్యంజనమువంటిది కాదు. ఏమి వచ్చినను సర్వకాల సర్వావస్థల యందును భగవంతునితో విభక్తుడు కాని వాడుగా వుండవలెను. అట్టి అనన్య యోగమునే అన్యభావన లేని అనన్య భక్తి అని అందురు. ఏ పని చేసినా, యే మాట ఆడినా, యే పాట పాడినా భగవంతుని అనురక్తిని కలిపినదే అనన్య భక్తి.

(గీ.పు. 211/212)

అన్యవతీ ఆరాధన

(చూ॥ దైవారాధన)

అనాథ

"నేను **అనాథను"** అనడానికి బదులు, మొరటు మాటలలో "నేను అనాదిని'' అని బిచ్చగాళ్లు మీ వాకిళ్ళలో నిలబడి

అనటం మీరు విని ఉంటారు. తనకు దిక్కు లేదని చెప్పబోతూ తనకు మొదలు లేదు అని అంటారు. **తనకే కాదు. మీ అందరికీ మొదలు లేదనే పరమ రహస్యం అతను వెల్లడిస్తున్నాడు.**

"భిక్షాం దేహి" అన్నప్పుడు బిచ్చం వెయ్యి మనడమే గాక శరీరంలో ఉన్న "దేహి"ని సంబంధిస్తున్నాడని మీరు తెలుసుకోవాలి. దేహి అంటే ఆత్మ - మీరు శరీరంలో ఉన్న ఆత్మ స్వరూపులు. తానూ ఆత్మస్వరూపుడే - తానూ మీరూ ఒకటే ఈ సత్యాన్ని అతను బోధిస్తున్నాడు - భ్రాంతి కలిగించే బాహ్య వేషమే యీ శరీరం. ఎప్పుడూ ఉన్నత భావాలతో ఉండండి.

(త.శ.మ.పు.156)

అనాథుడు

ఒకనాడు సమర్థ రామదాసు ఇంటిలో తినడానికి తిండి లేక భార్యాపిల్లలు ఆకలి బాధచే అల్లాడిపోవుటచేత భిక్షమెత్తవలసి వచ్చింది. ఈ సంగతి విని శివాజీ మహారాజు ధన కనక వస్తువులను ఒక పల్లకీలో పెట్టి బంటులతో వారి గృహమునకు పంపించాడు. ఆ పల్లకీని చూసి రామదాసు భార్య "పతి ఆజ్ఞ లేక నేను ఏ వస్తువునూ స్వీకరించను" అన్నది. కొంతసేపటికి ఇంటికి వచ్చిన రామదాసు ఆ పల్లకీని చూసి " ఈ నరవాహనమును ఇంటి ముందు ఎవరు పెట్టారు?" అని అడుగగా, "మీరంతా ఈ అనాథ పరిస్థితిలో బాధ పడుతున్న విషయము విని మహారాజు శివాజీకి మీపైన ఎంతో దయ కలిగింది" అని బంటు అన్నాడు. అప్పుడు రామదాసు " ఏమి! నాకు శ్రీరామ చంద్రుడే నాథుడుగా ఉండగా నేను అనాథుడ నెట్లవుతాను? ఆ శ్రీరామచంద్రునికి ఎవరూ నాథులు లేరు. అతడే అనాథుడు. కనుక, ఈ ధన కనక వస్తువులన్నింటినీ ఆ శ్రీరామునికే అర్పించండి."అన్నాడట.

(స.సా. డి. 99 వెనుకపుట)

మానవుని విషయ వాంఛలు, ఉద్రేకములు అదుపులో నున్న అతనిలోని సద్గుణములు పెంపొందును. అప్పుడు భగవంతుడే బాధ్యత వహించి అతనివైపు నడిచి వచ్చును. లేని ఎడల మానవుడు ఎదురు చూడవలసి వచ్చును. 'నాకు నాథుడు లేడు, నేను 'అనాథుడను' అని నీవు విచారించకుము. దేవు డొక్కడే అనాథుడు. మిగిలిన వారందరకు నారాయణుడు నాథుడు, పోషకుడుగా నున్నాడు. భగవంతు డెప్పుడును మానవుని చెంత అతని సహచరుడుగా, పోషకుడుగా నుండును.

(శ్రీ.సా.సు. పు. 94)

అనాది

(చూ॥ విద్య)

అనార్య జుష్టము

(చూ॥ మోహము)

అనాహత ధ్వని

మానవుని దేహమందు ప్రాముఖ్యమయిన ఆరు నాడీ కేంద్రములు వున్నవి. **అవి కమలాకారమును చెంది వుండును. ఆ ఆరు కమలాకారములు చేరి మొత్తము యేబది రెండు రేఖలు వుండును.** ఒకొక్క రేఖపై కూడా ఒకొక్క అక్షరము యేర్పడి యుండును. వాయించు హార్మోనియంలో వుండు 'రీడ్సు' వలె ఒక్కొక్క రేఖయు కదలు సమయమున ఒక్కొక్క విధమైన శబ్దము బహిర్గతమగుచుండును. ఇచ్చట బుద్ధిమంతులకు ఒక సందేహము కలుగవచ్చును. ఈ రేఖలందలి అక్షరములు కదలవలెనన్న యేదో ఒక కదలించు శక్తి ఆధారమై యుండవలెను కదా! అది నిజమే. ఆ కదలించుశక్తియే ప్రణవము. ఇది అనాహతమైన ధ్వని. ఇది అప్రయత్నముతో కలగునని **ప్రయత్నములతో కలిగే ధ్వనిని ఆహత ధ్వని అందురు.**

దారములో పూసలు గ్రుచ్చబడినట్లు అనాహత ధ్వనియైన ప్రణవములో వేదములనెడి పూసలు గ్రుచ్చబడినవి.

అనాహతము

రసస్వరూపమైన తనలో జలము చేర్చబడినది. ఇట్టి సర్వాధారమైన ప్రణవములోనే మనసును లీనము చేయవలెనని కృష్ణపరమాత్మ యొక్క బోధ. శబ్దములో మనసును లయముచేసే స్వభావము కలదు. మనసు యేది చూచిన అది అంతా కావాలని కోరును. ప్రతిదానిని ఆశించడమే దానికి పని. అట్టి చంచల మనసును శబ్దమున లయము చేయవచ్చును. అందు వలననే మనసును సర్పముతో పోల్చిరి.

(గీ. పు. 105/106)

అనాహతము

భగవంతుడు ఏస్థానమందున్నాడన్నది వేదం చక్కగా నిరూపించింది. దైవం హృదయవాసి అని నిష్కర్షగా చెప్పింది. అయితే అందరికీ కనిపించడు. దేవాలయంలో దీనికి చిహ్నంగా ఒక గంటను పెట్టారు. **హృదయములో అనాహత స్థానములో ఉండేవాడు అని దీని అంతరార్థం.** మూలాధారం నుండి బయల్దేరే అనాహతమునకు ఈ హృదయం స్థానంగా నిర్వచించేరు. **భగవంతుని నివాసము అనాహతము.**

అనాహతి అనగా ఏమి? ఒకరి చేత కొట్టబడేది కాదు. తనంతట తానే కొట్టుకుంటూ ఉంటుంది అని దీని అర్థము. దేహమనే దేవాలయములో ఉన్న గంటను ఎవ్వరూ కొట్టనక్కర్లేదు.ఎప్పుడూ అదే కొట్టుకుంటూ ఉంటుంది. భగవంతుడు శబ్దస్వరూపుడు ఎవ్వరూ ఉచ్ఛరించకుండానే తనకు తానే ఉచ్ఛరించుకుంటూ ఉంటాడు.

(త.శ.మ.పు.60)

అనిత్యములు

దృశ్య కల్పితమైన చరాచర ప్రపంచమంతయు కాలావాహిని లో కలిసి పోతుంది. **"యద్దృశ్యం తన్నశ్యతి".** ఏది మనకు కనిపించుచున్నదో అది కొంతకాలములోనే మనకు మరుగై పోతుండాది. ఈ చర్మచక్షువులకు గోచరమయ్యే ఈ దృశ్య కల్పిత జగత్తంతయు కాలగర్భములో కలిసి పోతుండాది. చూచే నేత్రము, చూడబడే విశ్వము, రెండు అనిత్యములు.

(బృ.త్ర.పు. ౧౫౮)

అనిరుద్ధుడు

(చూ॥ భగవంతుడు)

అనుకరణ

(చూ॥యోగం)

అనుగ్రహము

ఒక చేపకు పైన, క్రింద, చుట్టూ నీళ్ళు ఉన్నప్పుడే శాంతి! అదేవిధంగా మీ చుట్టూ భగవంతుని అనుగ్రహం ఉండాలి. ఈ అనుగ్రహం పొందటానికి దగ్గర దారు లేవీ లేవు. నామస్మరణ అనేది అన్నిటికన్నా క్షేమమైన మార్గము. కొందరు ప్రాణాయామం, హఠయోగం దగ్గర దారులని చెప్పారు. అవి ప్రమాదకరమైనవి. జాగ్రత్తగా ఉండండి. అటువంటి వాటిని వినకండి, ఆ పుస్తకాలు చదవకండి, వాటిని నమ్మకండి, వాటిని అభ్యాసం చేయకండి. పుస్తకాలు చదివి వాటిని ఆచరించటం వల్ల పిచ్చెక్కిన వారిని, అనారోగ్యం పొందినవారిని నేను ఎందరినో చూశాను.

(వ.61-62 పు.164)

పతి క్షేమము, పతి ఆనందము, పతి అభీష్టము, పతి సద్గతే తనకు సర్వరక్షగా భావించవలెను. అట్టి స్త్రీకి పరమాత్మ అనుగ్రహము అప్రయత్నముగా లభించును, వర్షించును. అట్టి స్త్రీకి పరమాత్ముడు సర్వవిధములా అండయై, నిండు దయను జూపును. అట్టి స్త్రీ సద్గుణముల చేత పతికూడను సద్గతి పొందును

(ధ. పు : 34, 35)

దైవము యొక్క అనుగ్రహము ఒక కిరణము మనకు వచ్చిందంటె ఎంతైనా సాధించవచ్చు. నీ కిరణములలో

ఒక అణుమాత్రమైనా ప్రసాదించమని కోరుతూ వచ్చారు ఆనాటి మహర్షులు. దైవము యొక్క శక్తి కించిత్తు మనము సాధిస్తే అనంతమైన దానిని మనము సాధించవచ్చు. దైవానుగ్రహము లేకపోతే ఏమీ సాధించటానికి ఎవరికీ వీలుకాదు. ఎగరటానికి యిష్టము లేకపోతే గ్రద్ద ఒక యించైనా ముందుకు పోలేదు. నడచటానికి ప్రయత్నిస్తే చీమైనా కొన్ని మైళ్ళు పోతుంది. **ప్రయత్నము అత్యవసరం. "యత్న ప్రయత్నముల్ మానవ ధర్మము, జయాపజయములు దైవాధీనము" నీవు దైవాధీనమునైన వెళ్ళు అన్నీ Success. Success begets Success. మనము అన్నింటినీ సాధించాలంటే అనుగ్రహాన్ని సాధించాలి.**

(ఉ.బ.పు.25)

(చూ॥ అంటువ్యాధి, నిష్కామకర్మ, ప్రార్థనలు, సాధన)

అనుబంధాలు

(చూ॥ దూరంగా ఉంచు)

అనుభవజ్ఞానము

దేనిని తెలిసికొనిన మానవులు జననమరణ రూపమగు సంసార బంధము నుండి విముక్తులు కాగలరో, అదియే అనుభవజ్ఞానము; అట్టి అనుభవజ్ఞానము కలవారే భవబంధములనుండి దూరమై మోక్షార్హులు కాగలరు.

(గీ.పు. 160/161)

(చూ॥ త్యాగరాజు)

అనుభవము

మీ అనుభవమే మీకు ప్రధానము. మీ ఆనందమే మీకు ఆధారం. ఒక ద్రౌపదిని రక్షించాడు, ఒక అహల్యను ఉద్ధరించాడు, ఒక ప్రహ్లాదుని కాపాడినాడు అని చెప్తారే. కాని ఇంక ఎంతమంది ద్రౌపదులున్నారో, యెంతమంది అహల్యలున్నారో, యెంత మంది ప్రహ్లాదులున్నారో యెన్ని గజేంద్రులున్నారో, అనుగ్రహము పొందినవారు మీకే తెలుసు? పరమాత్ముని ప్రేమ ప్రవాహము ప్రవహిస్తూనే వుంటుంది. అది అంతులేని విషయము. అయితే మీరు హార్టులో చూస్తారు.

(సు. పు. 49/50)

నాయనా! **నదిమూలము, ఋషిమూలము వెతుకరాదు. కావలసిన వాటి సారము, అనుభవము ప్రధానము. వాటి ఫలమును అనుభవించిన ధన్యులగుదురు మూలము వెతుకుటలో సారము అనుభవించలేరు.** కాని, నీవు అడుగుచున్నావు కనుక తెలుపుచున్నాను వినుము!

వ్యాసమహర్షి జాలరి కులమున పుట్టెను. వసిష్ఠమహాఋషి వేశ్యయగు ఊర్వశికి జన్మించెను. శౌనక మహాముని శునక వంశమున పుట్టెను. అగస్త్యుడు ఘటమున జన్మించెను. విశ్వామిత్రుడు క్షత్రియ కులమున పుట్టెను. ఖగోళ మహాముని వైశ్యవంశమున జన్మించెను. సూతమహాముని చతుర్థ వంశమున (శూద్ర) జన్మించెను. ఇక సహజులుగా జన్మించి, సద్గుణములలో జాతి ధర్మమును దేహ ధర్మములను కొంతకాలము పాటించి సత్యమును యెరింగి తదుపరి సర్వమునూ దూరీకరించి సర్వదా ముక్తిని స్వవశము చేసుకొన్న విదురుడు, సంజయుడు, సత్యకాముడు మొదలగు వారలు కూడా అనేక మంది వున్నారు. నాయనా! పురుష ప్రయత్నము, వివేకము, తపస్సు వీనివలన కలుగు గుణములే మహోన్నత స్థితికి కారణములు. మానవ జాతికి **ఆత్మశుద్ధి లేకయే జాతియందు జన్మించిననూ ముక్తిని పొందలేరు.** మలినమైన రాగిలో కూడిన బంగారము వెల తగ్గినదగుచున్నది. అలాగుననే తాను శుద్ధ విరాడ్రూపుడయినను, సంసార సంసర్గములచే అహంకారముతో కూడిన జీవుడగును. జీవుడును తపోవ్రత సంస్కృతుడై శుద్ధ బుద్ధియుతుడై నిజస్థానమగు పరమాత్మ స్వరూపమును పొందును. కాలని కుండ జలస్పర్శముచే కరిగి మట్టి యగునటుల తపస్సుచే

అనుభవించుట

పరిపక్వము కాని వారి మనసు విషయ దోషముల సంబంధముచే విషయములో ప్రవేశించుచున్నది. **తపోగ్నిచే దహించబడిన కుండను సముద్రమున పడవేసిననూ కరుగక వుండును. తీవ్ర తపోవహ్నిచే నిశ్శేషముగా దహింపబడిన కర్మ బీజములు కలవారు గనుకనే జ్ఞానసంపత్తి గలవారై, నిర్మల తత్వముచే ముక్తులై జనన మరణముల జెందనివారగుచున్నారు.**

(ప్రశ్నో.వా. పు.58/59)

(చూ॥ ప్రబోధము, మనసు)

అనుభవించుట

ఎవరు చేసిన కర్మ వా రనుభవించక
ఎవరికైనను తప్పదన్నా!
ఏనాడు ఏ తీరు ఎవరు చెప్పాగలరు
అనుభవించుట సిద్ధమన్నా!

(స.సా. అ. 99 పు. 254)

అనుభవిస్తారు

నిద్ర లేచినదాది నిద్రపోయెడిదాక
ఆస్తికై కుస్తీలు పడతారయా
దనము కోసం ధైవధ్యానాలు బోనాలు
కోటి పన్నాగములు పన్నేరయా
రూపాయి కొరకై లోపాయికారిగా
అడ్డమైన గడ్డి తింటారయా
రంగరంగాయంచు దొంగ మ్రొక్కులు మ్రొక్కి
పంగనామము ప్రజలకు పెడతారయా
ఇతరు లెరుంగకయున్న ఈశ్వరు డెరుంగడా
తగిన ఫలములు అనుభవిస్తారయా.

(స.సా.వా. పు.164)

అనుమానం

(చూ॥ అంటువ్యాధి)

అనుశ్రవం

(చూ॥ వేదం)

అనుశాసితుడు

(చూ॥ పండితుడు, స్మరింతురు)

అనుష్ఠానము

(చూ॥ అంటువ్యాధి, శ్రద్ధ)

అనుసరించు

సత్యం దిక్కుగా నిశ్చల బుద్ధితో జ్ఞాన మార్గాన్ని అనుసరించు. శివం యొక్క ఆనందోత్సాహాలతో భక్తి మార్గాన్ని అవలంబించు సుందరం యొక్క మనోహరమైన సామరస్యంతో కర్మమార్గాన్ని అనుకరించు.

(లో.పు.188)

అనృత పుత్రుడు

(చూ॥ అమృత పుత్రుడు)

అనేకత్వము

(చూ॥ అమృతపుత్రుడు, గమ్యం ఒక్కటే)

అన్యవతీ ఆరాధన

(చూ॥ దైవారాధన)

అన్యాయార్జితము

అందరూ అధిక ధనము నాశిస్తున్నారు. ఈ ధనం కోసమే నీతి నీజాయితీలను కోల్పోతున్నారు. నీతి నీజాయితీలను కోల్పోయి సంపాదించే ధనం మట్టితో సమానము. ధనము మనవెంట ఏనాటికీ రాదు. కేవలం, ధనమును ప్రోగు చేసికొని, భద్రపరిచినంత మాత్రమున సంతోషము వస్తుందా? లేదు, లేదు.

తేనీటీగలు తేనెను ఏ మాత్రం అనుభవించక ఒక దగ్గర చేరుస్తాయి. కాని, వేటగాడు వాటిపై పొగను గాని, వేడి నీటిని గాని చల్లి వాటిని సంహరించి తేనెను అపహరిస్తున్నాడు. అదే విధంగా అన్యాయార్జితమైన ధనం మనకే మాత్రము దొరకదు. దీనికి నలుగురు దొంగలుంటున్నారు. మొట్ట మొదటిది ప్రభుత్వము. వాళ్ళు ఏదో ఒక "టాక్స్" నెపంతో దాడి చేసి, ఆ ధనమును కొంత వరకు స్వాధీన పరచుకొంటారు. రెండవది అగ్ని. ఈ అగ్ని ఏదో విధంగా దహించివేసి, అన్యాయముతో సంపాదించిన ధనమును అపహరిస్తుంది. మూడవది దొంగ. ధనము మన దగ్గర చేరినదంటే దొంగ దృష్టిమనపైన పడుతుంది. ఎట్లైననూ మన నుండి ధనమును దొంగిలించడానికి ప్రయత్నిస్తాడు. ఇంక, నాల్గవది రోగము, అన్యాయార్జితమైన ధనమును క్షీణింప జేయడానికి అనేక విధములైన రోగాలు మనకు ప్రారంభమౌతాయి.

కొంతమంది నోరు తెరుచుకొని అడిగిన భిక్షగానికి ఒక్క నయాపైస కూడా వేయలేదుగాని, రోగమే వచ్చినదంటే డాక్టర్లకు వేలకొలది రూపాయిలు ఇవ్వడానికి వెనుకొడరు. కనుక, అన్యాయముగా సంపాదించిన ధనం ఈ రకమైన మార్గములో వ్యర్థమైపోతుంది. మీరు ఈ విషయాన్ని దృష్టియందుంచుకొని. నీతి నీజాయితీలను కలిగియుండి, సత్యప్రేమల చేత ధర్మమును అభివృద్ధి గావించాలి.

(ధే.యు. పు. 74/75)

అపకారం

(చూ॥ గృహం అమ్మాయి)

అపకారి

(చూ॥ దైవస్వరూపులు)

అపరవిద్య

(చూ॥ ముండకోపనిషత్తు)

అపరాపరాకృతి

(చూ॥ తత్త్వ జ్ఞానము)

అపరోక్ష బ్రహ్మజ్ఞానము

(చూ॥ జ్ఞానము)

అపేక్ష

(చూ॥ ధనవంతులు)

అప్రమేయము

(చూ॥ నేను)

అబల

యాజ్ఞవల్క్యునితో తర్కించి
తనధీశక్తి నిరూపించిన గార్గి అబలనా?
వేదాంత జ్ఞాన సంపదతో
జనక మహారాజును పరీక్షించిన సులభ అబలనా?
భౌతిక సంపద వలదంచు
ఆత్మజ్ఞాన సంపత్తినే ఆశించిన మైత్రేయి అబలనా?
పతికి వైరాగ్య పాఠముల్ నేర్పిన
మహారాజ్ఞి చూడాల అబలనా?
నాథుడు మూర్ఛిల్లినవేళ
నరకు నెదరించి పోరాడిన సత్యభామ అబలనా?
శంకరాచార్యునితో తర్కము సలిపి
సహధర్మచారిణి బిరుదును నిలిపిన ఉభయభారతి అబలనా?
ప్రాణంబుకంటె మానమే ఘనమని నిరూపించిన
'జోహార్' అగ్ని గుండాన దూకిన రాణపద్మిని అబలనా?
పాశ్చాత్యసీమ నుండి తరిలి వచ్చి
భారతదేశమునకై శక్తి యుక్తుల ధారపోసిన ఆనీబెసెంటు
అబలనా?
స్వరాజ్యసిద్ధికై సర్వస్వమును అర్పించి

అబూబెనాదమ్

మహిళాస్ఫూర్తికై చెరసాల కేగిన కస్తూరిబాయి అబలనా?
మాతృదేశ విముక్తికి పోరాడి
కలమును, గళమును సమర్పించిన సరోజినీదేవి అబలనా?
పరిపాలన యంత్రాంగ నిర్వహణలో
పురుషుల కన్న స్త్రీలే మిన్నయని నిరూపించిన
విక్టోరియా మహారాణి, ఇందిరాగాంధీ - అబలలా?
కలరు నాటికినేటికి, ఏ దేశమందైన స్త్రీలు, సబలలని నిరూపింప.

(భ.స.స్త్రీ.ధ.ప్ర. పు. 144)

అబూబెనాదమ్

(చూ॥ అష్ట విధ పుష్పములు, సేవ)

అభయము

సమస్త సద్గుణములందు అభయము మకుట ప్రాయమైనది. ఆదర్శపూరితమైనది. లౌకిక క్షేత్రమునందుగాని, అలౌకిక పారమార్థిక క్షేత్రమునందుగాని అభయమనేది లేకుండిన మానవుడు జీవించటము దుర్లభము. ఆధ్యాత్మిక సంగ్రామమునందుగానీ భయమునకు యే మాత్రము అవకాశము లేదు. భయశీలుడు పిరికిపంద, ఎట్టి చిన్న కార్యము సాధించలేడు. భయశీలుడు జగత్తునందు ఏ మాత్రము రాణించడు. నిర్భయము మూర్ఖముగా వుండవచ్చును. అభయము సత్యమును గుర్తించిన శక్తిగా మారుతుంది. భయశీలుడు అడుగడుగునకు మరణిస్తాడు. అభయమునకు ఒక తూరే మరణము. కనుక అభయుడవు కమ్మని ఆదేశించాడు అర్జునుని. భయముండినంతవరకు మానవుడు మహాత్కార్యములు సాధించలేడు. అభయ శీలుడు మాత్రమే మహత్కార్యములందు జయము సాధించగలడు. అర్జునా నీవు భయమును పారద్రోలు. అభయమును నేర్చుకో. "విగత భయః" అనగా భయము నుండి దూరము కమ్ము అన్నాడు.
భయస్థుడు హిరణ్యకశిపుడు అభయశీలుడు ప్రహ్లాదుడు. అభయత్వము మేరు పర్వతము వంటిది. మన భయము శ్వాసగాలివంటిది.

(శ్రీ..గీ. పు. 242/244)

అభయమునకు, భయమునకు, నిర్భయమునకు చాలా వ్యత్యాసముంటుండాది. భయమునకు నిర్భయము విరుద్ధమైన పదము. భయము పోతే నిర్భయము దీనికొక చక్కని ఉదాహరణము. దారిలో ఒక త్రాడు పడి వుంటుండాది. చీకటి ఆవరించిన తక్షణమే ప్రయాణము చేయు వ్యక్తి ఈ త్రాడును చూచాడు. త్రాడును చూచి పామని భయపడ్డాడు. టార్చి వేసి చూచినాడు. ఇది పాము కాదు త్రాడు అని తెలిసింది. భయము పోయింది. భయము రావటము, భయము పోవటము, కొన్ని క్షణాలు మాత్రమే వుంటుంటాది. భయమునకు భ్రమనే, నిర్భయమునకు భ్రమనే. **వస్తువును వేరే రీతిగా భావించుకోవటమే భయము. వస్తువు యొక్క స్వరూపాన్ని గుర్తించుకోవటమే నిర్భయము.** ఇది భయనిర్భయముల విషయము. అభయము యీ రెండింటికి సంబంధము లేనటువంటిది. నిరంతరము స్వస్వరూపసంధానములో వుండినవానికి భయ నిర్భయములకు అవకాశమే లేదు. అభయత్వము భయమునకు విరుద్ధమైనదిగా భావించరాదు. అభయత్వములో అనేకత్వము లేదు. ఏదో రెండవ వస్తువు ఒకటి వున్నది అన్నప్పుడే మనకు భయమేర్పడుతుంది. రెండవది లేనేలేదు. అలాంటి స్థితియందే అభయము. ఏకత్వముతో కూడినది. "ఏక మేవ అద్వితీయం బ్రహ్మ". "Not two, only one" తనను తాను మరచినవానికే భయము. **జగత్తును దృష్టి యందుంచుకున్న వానికే భయము. విషయాపేక్షకలిగిన వానికే భయము. పదార్థములతో భ్రమించేవారికే భయము. పరార్థములో మునిగిన వానికి యేమాత్రము భయము లేదు. ఇతనే అభయుడు.**

(శ్రీ.గీ.పు.258)

అభిన్నత్వం

భిన్నత్వంలో అభిన్నత్వం చూడటం నేర్చుకోవాలి. అన్నిటిలోను వ్యత్యాసమున్నట్లు కనబడుచున్నది. దీనికి

కారణమేమి? తనకును, భగవంతునకును మధ్యయున్న సంబంధమును గూర్చి భావించడంలో, కల్పన చేసికొనడంలో, అనుసరించు మార్గంలో భిన్నత్వము కలిగియుండుటయే - మానవుడు ఏ మార్గమైనా నిష్కల్మష హృదయంతో, నిర్మల భావంతో, ప్రేమతో నిండిన మనస్సుతో శరణాగతుడై అనుసరించిన యెడల గమ్యమైన దైవత్వము చేరుకొనుట తథ్యము.

(సా. పు ॥ 44)

అభిమానము

(చూ॥అమానిత్వము, అహంకారము)

అభిరుచులు

(చూ॥ అవధానము)

అభేదజ్ఞానము

"నహి జ్ఞానేన సదృశం" జ్ఞానముతో సమానమైనటువంటిది వేరొకటిలేదు. సంసార సముద్రమును దాటించి పరమప్రాప్తిని యేది కలిగించునో దానినే జ్ఞానమని అందురు. అట్టి జ్ఞానము కూడనూ రెండు విధములుగా ఉన్నది. అందులో **మొదటిది విషయజ్ఞాన మనియూ, రెండవదానిని అభేద జ్ఞానమనియూ అందురు. అనగా మొదటిది లౌకికిమైనది; రెండవది "అహం బ్రహ్మాస్మి" అనే బ్రహ్మాత్మ విజ్ఞానమే; దీనినే అభేదజ్ఞానమందురు.** ఇది అనాది. సంసార భయాన్ని నివారించి, మానవుని నిర్భయ స్వరూపుని చేసి బ్రహ్మప్రాప్తిలో ప్రవేశ పెట్టును. ఇది బుద్ధికి సాక్షియై యుండును. అందువలన దీనికి నమ్యక్ జ్ఞానమని పేరు.

(గీ.పు. 122)

అభ్యాసము

"శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్, ధ్యానాత్ జ్ఞానం విశిష్యతే ధ్యానాత్కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతి రనంతరం"

ప్రతి ఒక్కదానికి అభ్యాసము చేయాలి. అభ్యాసము లేకుండా దేనిని సాధించలేము.

(బృ.త్ర.పు ౬౧)

(చూ॥ అంత్యకాలము, ధ్యానం, పాము, భాగవతుని లక్షణములు, యోగము)

అమనస్కుడు

మనలో లేని శక్తి జగత్తులో లేదు. జగత్తులో లేని శక్తి దైవములో లేదు. దైవశక్తియే జగత్తునందుంటున్నది. జగత్తు శక్తియే మానవుని యందుంటున్నది. కానీ మనకు తెలియని స్థితిలో ఉంటున్నది. ఈ అజ్ఞాత శక్తిని ప్రయత్నపూర్వకంగా సాధిస్తే ఎంతైనా మనం సాధించవచ్చును. ఏ మాత్రము దీనికి సందేహము లేదు. అయితే, మనము కొన్ని దురభ్యాసములకు గురై పోతూ వచ్చాము. దేవుని పొందాలనుకుంటే రాంరాంరాం అనుకుంటే చాలదా అనుకుంటాం. ఈ రామ నామముతో మనం దేవుని పొందలేము. ధ్యానము చేస్తే రామతత్వం పొందవచ్చు కదా. అనుకుంటాం. ధ్యానము చేసేది, నామము సల్పేది, **యజ్ఞయాగాదులు చేసేది మనస్సు యొక్క తృప్తి, మనస్సును అమనస్కంగా భావించుకోవాలి. మనస్సుండినంత వరకు ఈ విచారములు తప్పవు. మనస్సుండినంతవరకు దైవత్వము గుర్తించలేము. అమనస్కుడు కావాలి.**

(శ్రీ. స. పు. 79/80)

(చూ॥ఆత్మజ్ఞానము)

అమరత్వము

(చూ॥ వర్తమానము)

అమానిత్వము

అమానిత్వము అనగా అభిమానము లేకుండుట. మానమున్నంత వరకూ జ్ఞానము కలుగదు. మానవుని వృత్తులు నీటివలె వుండవలెను. అంటే నీటిలో యేరంగు

అమాయకుడు

చేర్చిన నీరు ఆ రంగుగా మారును, ఆ రంగుతో నీరు చేరి పోవును. **నీటికి అభిమానము శూన్యము. మానవుని ప్రవృత్తి దీనికి పూర్తిగా విరుద్ధము.** ఏ చిన్న ఉపకారమో, యే కించిత్ దాన ధర్మమో చేసిన అది పదిమందికీ తెలియ వలెను. అట్లు తెలియుటకు వీలులేకున్న తనకు తానైననూ చెప్పుకొని తిరుగును. లేక ఏపేపర్లలో నైనా వేయించుకొనును ఇట్టి అభిమానము లేకుండుటే అమానిత్వము.

(గీ.పు. 206)

అమాయకుడు

(చూ॥ సంసార జీవితము)

అమూల్యరత్నం

భగవంతుడు భక్తునకు యిచ్చు అమూల్యరత్నం భక్తి. ప్రభువు దాసుల పాటి పారిజాతం. ప్రతి మనిషికి శాంతము అవసరం. అందుకే త్యాగరాజు "శాంతము లేక సౌఖ్యము లేదు" అని పాడారు.

(అ.శ.నా. పు. 127)

అమృతత్వము

కులమత ద్వేషాలు కూలద్రోయుడటంచు
చేయెత్తి బోధనల్ చేయవలయు
దీనుల సేవయే దివ్య మార్గమటంచు
పలుమారు గట్టిగా పలుకవలయు
నామ చింతన చేయునరుని నామి సన్నిధిచేర్చి
అమృతత్వము నందించునని నెరుగవలయు,

(బా.జీ.జ.స. పు. 9)

అమృతత్వమును చేరే మార్గము యేమిటి? అనేక పర్యాయములు చెప్పాను.....మానవునియందున్న బలహీనతలు అనగా కోపము, తాపము, ఈర్ష్య, అసూయ, దంభము యిత్యాది వికారగుణములను దూరము చేసుకున్నప్పుడే అమృతత్వమనే సత్యము అర్థమవుతుంది. గీతయందు బోధించిన యిరువది ఆరు గుణములలో ప్రధానమైన కొన్ని గుణములైనా అభ్యసించునప్పుడే యీ నిత్యసత్యమైన ఆత్మతత్వము కొంతవరకైనా అర్థము చేసుకునేందుకు సాధ్యమవుతుంది. ఇందులో ఓర్పు అత్యవసరమైనది.

(శ్రీ.గీ. పు.౨౦౬ / ౨౦౭)

(చూ॥ గుండె, సుఖము)

అమృతపుత్రులు

మానవ దేహమే ఒక యంత్రము, హృదయమే ఒక తంత్రము, శ్వాసయే మంత్రము. అదే 'సోఽహం, సోఽహం' అనే మంత్రము. **'సోఽహం' అనగా 'నేనే దైవం' దీనిని మించిన మంత్రము మరొకటి లేదు.** ఈ పవిత్రమైన మంత్రాన్ని స్మరించుకుంటూ పవిత్రమైన జీవితాన్ని గడపండి. సమాజమనే పెద్ద రైలులో దీర్ఘప్రయాణం చేసేవారు యువతీ యువకులే. మిగిలిన వారు 'ప్రక్క స్టేషన్ల'లో దిగిపోతుంటారు. కనుక, సమాజానికి శాంతి, భద్రతలను చేకూర్చవలసిన బాధ్యత యువతీ యువకులదే. భగవన్నామమనే బీజాన్ని ప్రతి హృదయంలో నాటండి. అందరూ దైవ నామాన్ని స్మరించాలి, దైవత్వాన్ని వరించాలి. అప్పుడే అందరూ ఆనందంగా ఉంటారు. ఈ ప్రపంచమే స్వర్గంగా మారిపోతుంది. అలాంటి అమృతమయమైన జీవితాన్ని గడపండి. **ఉపనిషత్తులు "శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాः" అన్నాయి. మానవుణ్ణి "ఓ అమృత పుత్రుడా!' అని సంబోధించాయి. మీరందరూ అమృత పుత్రులే. అనృత పుత్రులుగా మారకండి.** పేరుకు తగిన సార్థకతను నిలబెట్టుకోండి.

(స.సా.జూ. 99 పు. 62)

మానవుడిని 'అమృతస్యపుత్రాः' అన్నారు. 'అమృతపుత్రుడు' మానవుడు. ఈ నిజతత్వాన్ని గుర్తించుకొనలేక 'అనృతపుత్రుడు' గా మారిపోతున్నాడు. కాని మనం అనృతపుత్రులం కాకూడదు. అమృత పుత్రులమే కావాలి. మనం దైవాంశసంభూతులం కాకూడదు. దైవములమే

కావాలి. మనలో ఉండవలసినది ప్రేమాంశముకాదు. ప్రేమయే మనం అభివృద్ధి పరచుకోవాలి. ఇట్టి ప్రేమ తత్త్వాన్ని మనం అనుభవించి నప్పుడే, పరమాత్మ తత్త్వమును మనం సులభంగా గాంచవచ్చును.

(శ్రీ. సె.2000 పు.8)

మీలో ప్రతిఒక్కరును ఇనుప కండరములను, ఉక్కు నరములను కలిగిఉండవలెను! దౌర్బల్యము అనునది - ఏమాత్రం లేని వీరులుగా !ధీరులుగా!ఉండవలెను. మేము నీచులం తక్కువ వారం అన్నభావం ఎన్నడూ చెంతకు రానీయకండి. మేము పాపాత్ములము అను భావం తగదు. మీరు ఎన్నటికీ పాపాత్ములు కారు. మీరు అమృతాత్ములు. అమృత పుత్రులు.మీ హృదయము నందు భగవంతుడు అధిష్ఠించి యున్నాడు. కావున మీరు పాపులు-పాపాత్ములు ఎన్నటికీ కారు!

(దే.యు.పు.36)

(చూ॥ బ్రహ్మస్వరూపుడు)

అమృతము

(చూ॥ గోపికలు, ప్రేమ)

అమెరికా

(చూ॥ ప్రధానమైన అస్త్రము, భగవంతునిబిడ్డలు, వివేకానందుడు)

అమోఘుడు

వేదము భగవంతునికి 'అమోఘుడు' అని పేరు పెట్టింది. అమోఘుడనగా శాశ్వతమైన వాడు, వర్ణనాతీతమైనవాడు అని అర్థం. ''నేను అమోఘమైన ఆనందాన్ని అనుభవించాను.'' అంటారు కొంతమంది. **అమోఘమైన ఆనందమంటే అంత్యం లేని ఆనందమని అర్థం.** భక్తుల మనోభీష్టములను నెరవేర్చడానికి తాను నిరంతరం సంసిద్ధంగా ఉంటాడు. కాబట్టి, భగవంతునికి 'సిద్ధుఁ' అని కూడా పేరు పెట్టారు. కాని, భక్తుల ప్రార్థనలు సక్రమంగా లేకపోవడంచేత ప్రయోజనం లేకపోతున్నది. పరిపూర్ణ భక్తితో భగవంతుణ్ణి ప్రార్థించినప్పుడే మీ సర్వాభీష్టములు నెరవేరగలవు. **భగవంతుడు సర్వజీవులయందు, సర్వత్ర ఉంటున్నాడు. అతనికి కావలసింది ఏమీ లేదు. అతనికి ఎలాంటి కోరికలూ లేవు.** అతడు ఏది కోరినా, ఏది సంకల్పించినా భక్తుల శ్రేయస్సు నిమిత్తమే. భగవంతునికి నిరుపేద మొదలు చక్రవర్తి వరకు అందరూ సమానమే. సర్వ మానవులకు నిజమైన స్నేహితుడు భగవంతుడొక్కడే. **సర్వ మానవులకు సమానమైన 'ప్రాపర్టీ' (ఆస్తి) భగవంతుడొక్కడే; దివ్యత్వాన్ని అనుభవించడానికి అందరికీ సమానమైన హక్కు ఉంది.** అయితే అందుకు తగిన హృదయ పవిత్రతను మానవుడు అభివృద్ధి పర్చుకోవాలి. **'కంపేషన్' (దయ)తో నిండినదే హృదయము. కాని, ~~ఈనాడు~~ 'ఫ్యాషన్' తప్ప 'కంపేషన్' అనేది కనిపించడం లేదు. మనస్సున్నవాడే మానవుడు.** సంకల్పము లెలా ఉండాలి? నత్యనంకల్పములుగా ఉండాలి. సత్యసంకల్పములు లేనివాడు మానవుడే కాదు.

(స.సా.జూ. 2000 పు. 163)

అమ్మ

కౌసల్య సతి సూక్తి గర్భమౌటను కదా,
రాముడు దేవుడై రమణ గాంచె!
సీత మహాసాధ్వి చెలగి పెంచుట కదా,
కవలు కుశలవులు ఘనులు అగుట!
జిజియా లలామ చెలగి పెంచుట కదా,
వీర శివాజియు పేరు గాంచె!
పుతలిబాయి రంజిలి పెంచుట కదా,
గాంధి మహాత్ముడై ఘనత తెచ్చె!
ప్రాణికోటికి ఈ విధి పరిమళించె
అహరహంబున బ్రోచెడి అమ్మకంటె
ఆదరంబగు వస్తువు అవని గలదె!
అమ్మ ప్రథమాక్షరంబె ఆద్యక్షరంబు.

(స.సా.జూ. 99పు. 141)

మరియు (స.సా.డి.96 పు.329)

(చూ॥ నేను)

అయస్కాంతశక్తి

అయస్కాంతశక్తి

భూగోళమంతయును అయస్కాంతమయమై ఉన్నది. భూగోళమునకు సమీపించినటువంటి సర్వజీవులు, సర్వపదార్థములన్నియూ అయస్కాంతస్వరూపమై ఉన్నవి. ప్రవహించే నదులు, భూమి యొక్క అయస్కాంతశక్తి చేతనే భూమిని అంటిపెట్టుకొనే ప్రవహిస్తున్నవి. సర్వత్రా నిండి యున్నది అయస్కాంతమే. **మనం పెద్ద పెద్ద దేవాలయములకు వెళ్ళుతున్నాం.** ఈ దేవాలయములకు వెళ్ళేది ఎవరు? భక్తి ప్రవత్తులతో కూడినటువంటివారే. కనుక **ఈ భక్తి ప్రవత్తులు కూడనూ అయస్కాంతమయమే. వేలాదిమంది భక్తులు ఈ మందిరంలో ప్రవేశించడం చేత, వారి యొక్క అయస్కాంతశక్తి అంతయూ, ఈ మందిరంలోన నిలిచి పోతున్నది. వారు అర్పించే పుష్పములుగాని, ఫలములుగాని అన్నీ అయస్కాంతమయమై ఉన్నది. కనుకనే ఆ అయస్కాంత శక్తి ఆ మందిరంలో ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ అయస్కాంత శక్తి దినదినమునకూ పెరుగుతూ ఉంటుందే గాని తరగదు.** అయస్కాంతకిరణముల యందు ఒక ఇనుపమూలికను వేసినప్పుడు, కొన్ని దినములకు ఆ ఇనుప మూలిక కూడనూ అయస్కాంతమైపోతుంది. కనుక మందిరంలో ప్రవేశించే వ్యక్తులు గాని, వారు అర్పించే పదార్థములు గాని అన్నియూ అయస్కాంతమయమైపోతాయి. మందిరం యొక్క మహత్తర శక్తులు ఎక్కడ నుంచి ఆవిర్భవించాయి? భక్తుల యొక్క అయస్కాంతశక్తుల వలననే వచ్చింది. ప్రతి వ్యక్తి యందునూ ఈ అయస్కాంత శక్తి యిమిడి ఉన్నది. అయితే ఈ శక్తిని వారు గుర్తించుకోలేక దేవాలయంలో వుండే శక్తి కోసం ప్రయత్నిస్తున్నారు. దేవాలయం నుండి ప్రత్యేక శక్తులు మనకు ప్రాప్తించవు. నీ నుండి వెళ్ళిన అయస్కాంత శక్తియే నీకు ప్రతిబింబిస్తూ ఉంటున్నది. తిరుపతి, హరిద్వారం మొదలగు పవిత్ర క్షేత్రములు వెళ్ళుతుంటారు. ఈ పవిత్ర క్షేత్రముల యందు, వెళ్ళేటటువంటి భక్తుల భక్తిప్రపత్తులు, భక్తి యొక్క తత్వములు ఈ శక్తికి మూలకారణం.

మానవుడు సకల ఐశ్వర్యస్వరూపుడు. భగవంతుడు కూడనూ సకల ఐశ్వర్యస్వరూపుడే. ఐశ్వర్యము, **దానము, యశస్సు, జ్ఞానం, సంపద, ఆనందం - ఇవన్నీ భగవంతుని అనుగ్రహ ప్రసాదములే. ఈ ఆరు శక్తులూ ప్రతి మానవుని యందునూ ఉన్నాయి.** అట్టి శక్తులను మానవుడు సద్వినియోగపరచక, దుర్వినియోగం చేయటం చేతనే, ఆ శక్తులను కోల్పోతున్నాడు. కనుక ప్రతి మానవుడూ ఆ సర్వేశ్వరస్వరూపమైనటువంటి శక్తులను సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టి, వాటిని సద్వినియోగపరచిన, తన యందే ఆ దివ్యత్వము ప్రకాశిస్తుంది. ప్రతి మానవుని ముఖమునందునూ ఆ తేజస్సు ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. వెంకట్రామన్ చెప్పారు మొదటి శక్తి **Materialisation.** అనగా శరీరములోని అవయవములు, కండరములు, మాంసములన్నీ చేరి ఒక పదార్థము యొక్క స్వరూపమే. దీనినే **The one you think you are** అని చెబుతూ వచ్చారు. దీనికి **vibration** 'ప్రాణశక్తి' చేరినప్పుడు అదియే **'యశస్సు'**. ఈ రెండింటినీ సమన్వయం చేసేటటువంటి ఒక గొప్ప శక్తి ఉన్నది. అదియే **'ఆత్మశక్తి'**. దానినే **Radiation (ప్రకాశము) అన్నారు. Materialisation, Vibration, Radiation - ఈ మూడింటి యొక్క స్వరూపమే మానవుడు.** దైవము నందు ఏ శక్తులున్నవో ప్రతి వ్యక్తియందునూ ఆ శక్తులు తాండవమాడుతున్నాయి. కాని మానవుడు ఆ శక్తుల మీద దృష్టిని పెట్టటం లేదు, మరల్చటం లేదు. కేవలం దేహతత్వమునే లక్ష్యము నందుంచుకొని, 'నేను దేహము' అని భ్రమిస్తున్నాడు. కాని తాను దేహము కాదు. దేహము కంటే నీవు ప్రత్యేకంగా ఉంటున్నావు. నీవు ఈ భౌతికమైన ఈ దేహము కాదు. నీవు కాని దేహమును నాది ... నాది అని భ్రమిస్తున్నావు. ఈ భ్రమల చేతనే మానవుడు ఆ దివ్యమైన క్రాంతిని కోల్పోతున్నాడు.

ఇక Vibration; ఇది ఉచ్ఛ్వాస నిశ్వాసముల యొక్క తత్వశక్తి. ఇది కేవలం గాలి వలన జరుగుతున్నదని భావిస్తున్నారు. కాదు.... కాదు.... ఇదియే నిజమైన శ్వాసశక్తి,

ప్రాణశక్తి. నా శ్వాస సరీగా రావటం లేదంటావు. నీ శ్వాస కాదు, నా శ్వాస అంటున్నావు. శ్వాస కంటే నీవు ప్రత్యేకంగా వున్నావన్నమాట. కనుక తనది కానటువంటి దానిని, తనదిగా భావిస్తున్నాడు. ఈ విధంగా భావించటమే మూఢత్వము.

మూడవది Radiation. ఇదియే దివ్యశక్తి. ఇది 'నా దివ్యశక్తి' అని చెప్పటం లేదు. 'దివ్యశక్తి' అంటాడు. కనుక నీవు వేరు, ఈ దివ్యశక్తి వేరు కాదు ఇక్కడ. రెండింటి యొక్క ఏకత్వమే. కనుక ప్రతి మానవుని యందునూ వున్నటువంటి శక్తి ఈ అయస్కాంతమే. దేవాలయముల యందు ఆవిర్భవించి, సర్వవ్యక్తులనూ ఆకర్షించి, సర్వశక్తులను ప్రకటింపజేసేది ఈ దివ్యశక్తియే. ఈ అయస్కాంతమనేటటు వంటి కేవలం దైవశక్తితో కూడినటువంటిదే. దీనినే మందిరం యొక్క స్వభావము అన్నారు. దీనిని సైన్స్‌లో ముక్కలుగా చేసినటువంటి అయస్కాంతంగా భావిస్తుంటారు. దీనిని Materialistic Magnet అన్నారు. ఇది మానవుని యందునూ ప్రకాశిస్తూ ఉంటుంది. అసలు ఈ ప్రకాశించేటటువంటి శక్తి ఎక్కడ నుంచి వస్తున్నది? అంతా తన నుండియే వస్తున్నది.

ప్రపంచమంతా గాలితో నిండి ఉంటుంది. గాలిలో, నీటిలో కూడా మాగ్నెట్ ఉంటుంది. ప్రతి దానిలో మాగ్నెట్ వుంటుంది. ఇలాంటి సర్వశక్తివంతమైన తత్వాన్ని మనం గుర్తించాలి. **'దైవాధీనం జగత్ సర్వం'** జగత్తంతా భగవంతుని ఆధీనంలోనే వుంటుంది. **'సత్యాధీనం తు దేవతం'** ఇలాంటి శక్తి ఒక సత్యంతో ఇమిడి వుంటుంది. **'తత్ సత్యం ఉత్తమాధీనం'**. అటువంటి సత్యం ఉత్తముని అధీనంలో వుంటుంది. ఉత్తముడనగా ఎవరు? శాంతస్వభావం, ప్రేమ, మనస్సు, దయా హృదయం గలవాడు. **'ఉత్తమో పరమోగతిః'** అటువంటి ఉత్తముడే మార్గదర్శకుడు, పరమస్థితికి మార్గం. కనుక మానవుని యందు కూడనూ ఈ పవిత్రమైన శక్తులు లేకపోలేదు. దైవశక్తి కోసం యాత్రలు చేస్తుంటారు. ఈ పవిత్రమైన శక్తి తన యందు లేదనే భావం వుండటం వలననే యాత్రలు చేస్తుంటారు. కేవలం శక్తి వుండినంత మాత్రం చాలదు. దానిని కంట్రోల్ చేయగల శక్తి కూడా ఉండాలి. రష్యాలో ఒక బ్రిగిట్ అనే మహిళ ఉండేది. ఆమెలో సర్వశక్తులూ ఉండేవి. మాగ్నెట్ పుష్కలంగా ఉండేది. ఆమె రోడ్డు మీద నడిచి వెళ్ళుతుంటే, ప్రక్కన వున్న ఇనుపముక్కలు వచ్చి కరుచుకొనేవి. షాపుకు వెళ్ళితే అక్కడ వున్న సామాన్లు కూడా ఆమెను కరుచుకొనేవి. అందువలన ఏ షాపు వారు ఆమెను రానిచ్చేవారుకాదు. ఇటువంటి పరిస్థితులలో భోజనం కూడా చేయలేకపోయేది. ఆమె కొంత కాలానికి ఆహారం తినలేక మరణించింది. ఈ శక్తిని సంపాదించిన తరువాత, దానిని జీర్ణించుకునే శక్తిని కూడా కలిగి ఉండాలి. కేవలం శక్తి ఉండినంత మాత్రమున ప్రయోజనం లేదు. ఆ శక్తిని కంట్రోల్ చేయగల శక్తిని కూడా సంపాదించాలి. ఆ శక్తిని వశం చేసుకోగల శక్తిని కూడా సంపాదించాలి. ఆ వశం చేసుకొనే శక్తి ఆమెలో లేకపోవటం వలన ఆమె మరణించింది. కారుని నడిపేవానికి, ఆ కారును కంట్రోల్ చేయగల శక్తి ఉండాలి. అది లేకపోతే ప్రమాదాలు జరుగుతాయి. ఈ దేహమనేది కూడా ఒక మాగ్నెట్ కారు. కన్నులు లైట్లు, నోరు హారన్, మైండ్ స్టీరింగ్. ధర్మ, అర్ధ, కామ, మోక్షాలు అనేవి ఈ కారుకు టైర్స్. ఈ టైర్స్ లోపల faith (విశ్వాసం) అనే గాలి ఉండాలి. ఈ టైర్స్‌లో గాలి ఎక్కువగా ఉండరాదు. తక్కువ ఉండరాదు, సరిపోనూ ఉండాలి. మన పొట్టే ఈ కారుకు పెట్రోల్ టాంకు. దీనిలో పెట్రోల్ పోయాలి. అదే విధంగా ఈ పొట్టకు ఆహారం అందివ్వాలి. పరిశుద్ధమైన ఆహారం ఇవ్వాలి. మలినమైనది ఇస్తే ఆరోగ్యం దెబ్బ తింటుంది. అదే విధంగా కారు టాంక్‌లో పరిశుద్ధమైన పెట్రోల్ పోయాలి. నలకలు వుంటే కారు నడవదు. ఇంజన్ ఆగిపోతుంది. జలము కూడా పరిశుద్ధమైనది పోయాలి. అప్పుడే ఈ దేహము అనే కారు చేరవలసిన గమ్యానికి సరీగా సకాలములో చేరుతుంది. ప్రతి ఒక్కరూ ఈ కారు యొక్క తత్వాన్ని చక్కగా గుర్తించి, వర్తించినప్పుడే మన జీవితం సార్ధకమవుతుంది.

అయస్కాంతశక్తి

మానవుని యందు ఏది కూడను చెడ్డది లేదు. అంతా పవిత్రమైనటువంటిదే ఉంటుండాలి. కారణము? అంతా Magnet యొక్క power. ఇది అయస్కాంత మందిరము యొక్క చిహ్నములు. **మన దేహము ఒక అయస్కాంత మందిరం.** ఈ మందిరంలో పవిత్రమైన కార్యాలు చేయాలి. ధర్మవిరుద్ధమైన కార్యాలు ఆచరించినప్పుడు, ధర్మవిరుద్ధమైన ఫలితాలే వస్తాయి. మన దేహమంతా అయస్కాంతమే. ఈ అయస్కాంత మందిరమైనటువంటి మన దేహాన్ని పవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. ధ్యానములు, జపములు చేస్తూ వుంటారు. ఇవన్నీ కూడా కేవలం తాత్కాలిక తృప్తినిమిత్తమై చేసేటటువంటివే కాని ఈ అయస్కాంతమును control చేసేటటువంటివి కావు. .... నవ విధమార్గములుగా చెప్పారు. శ్రవణము, కీర్తనము, విష్ణుస్మరణం, వందనం, అర్చనం, దాస్యం; ఈ దాస్యం ఎప్పుడు దొరుకుతుంది. స్నేహం దొరికింతరువాత దాస్యం వస్తుంది. కనుక మొట్టమొదట సేహాన్నికోరాలి. ఈ friendship ఆశించి, friendship ని బలపర్చుకొన్నప్పుడే మనకు సరియైన బద్ధము లభిస్తుంది. Friendship అయిన తరువాత ఆత్మనివేదనము. అంతవరకు surrender రాదు. అంతా magnet power అనే తెలియదు. అంతా అయస్కాంతమనే భావం మనలో రావాలి.

ఏది చేసినా కూడా అయస్కాంతమే కనుక ఈ అయస్కాంత మందిరాలే ఈ యొక్క దేవాలయములు. ఎక్కడ ఎక్కడ దేవాలయములు ఉంటున్నవో ఆ దేవాలయములలో ఉంటున్నటువంటి power లు అంతయూ అయస్కాంతము యొక్క శక్తులే. తిరుపతిలో గొప్పశక్తివుంది అనుకుంటాము. అది వెంకటేశ్వరస్వామి యొక్క శక్తికాదు. మీరు తీసుకొని పోయి నటువంటి భక్తుల యొక్క ప్రపత్తులు, శక్తులు అక్కడ వదలిపెట్టుతున్నారు. ఆ Magnet కి ఆకర్షణ శక్తి ఉండాలి. 'రమయేతిః రామః రమింప చేసేటటువంటి శక్తి ఉంది. అది రమింపచేయటంవల్ల అక్కడ అయస్కాంతశక్తి ఉంటున్నది. ఇది దైవత్వము యొక్క శక్తి. ఇది దేవాలయములో మాత్రమే అనుభూతి పొందవచ్చు. దీనికి కారణమేమిటి? దేవాలయములలో ప్రతిష్ఠించిన దేవుళ్ళు, అభిషేకమునకు ఉపయోగించునీరు పువ్వులు, ఆరాధనకు వాడే పసుపు అక్షతలు అన్నీ కూడా పూర్తి అయస్కాంత శక్తియే. అందువలనే ప్రజలు, దేవాలయములకు ఆకర్షింపబడుతారు.

మనం అనవసరంగా ఇతరులను కోప్పడినప్పుడు, మనలో వున్న అయస్కాంతం వృధా అయిపోతుంది. ఇతరులను ద్వేషించినప్పుడు, అసూయపడినప్పుడు కూడా మనలో వున్న అయస్కాంతం తరిగిపోతుంది. కనుక మనం పవిత్రమైన కార్యాలను ఆచరించాలి. పవిత్రమైన కార్యాలను చేయాలి. ప్రతి మానవుడు దైవశక్తి మీద విశ్వాసం ఉంచాలి. ఇదంతా మన వలననే జరుగుతున్నదనే అహం భావమును విడనాడాలి.

ప్రేమస్వరూపులారా!

ఈనాడు మానవుని యందు ఈ **అహంకారం** ఉండటం వలననే అసలు విషయాన్ని తెలుసుకోలేకపోతున్నాడు. పండిన వడ్లు, వడ్లుగా ఎవడూ తినలేడు. దానిపై పొట్టును తీసివేయగా వచ్చిన బియ్యమును ఉడికించాలి. ఉడికిన అన్నానికి రుచికరమైన పదార్థమును చేర్చాలి. అప్పుడే భుజించి ఆనందాన్ని అనుభవించగలడు. ఇదంతా మన ప్రయత్నం చేత జరుగుతున్నది. **సృష్టి మాత్రం అంతా దైవముతోనే జరుగుతున్నది.** కనుక ప్రతి మానవుడు దైవసృష్టి మీద విశ్వాసమును పెట్టుకోవాలి. తెలియని వారు దైవమే లేడని భావిస్తారు. ఇంకా ఏముందయ్యా! అంటే ఏదో ఒక శక్తి ఉన్నదంటారు. ఆ శక్తికే 'దైవము' అని పేరు పెట్టారు. మానవుడు ఏ విధంగా మాట్లాడుతున్నాడు? ఆ శక్తి ఎక్కడ నుంచి వస్తున్నది? అదే దివ్యమైనటువంటిది. అందుకోసమనే **Meterialisation, Vibration, Radiation - యీ మూడు శక్తులూ చేరినటువంటిదే 'మానవుడు' అన్నారు. రేడియేషన్‌ను తీసుకొనివచ్చి, వైబ్రేషన్‌ను తన యందు చేర్చుకొని మెటీరియలైజేషన్**

దేహరీతిగా పనులు చేయగలుగుతున్నాడు. ఈ దేహంతో పనులు చేయటం కర్మయోగం. చింత చేయటం వైబ్రేషన్. అన్నింటినీ చైతన్యం గావించడానికి రేడియేషన్. దీనినే వేదమునందు 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నారు. దీనినే Constant integrated awareness అన్నారు. ఇది ఎప్పుడూ జరుగుతునే వుంటుంది. **"సర్వదా సర్వకాలేషు సర్వత్రా హరిచింతనమ్".** దానికి రాత్రి పగలు అనేటటువంటిదే లేదు. అన్ని కాలములూ ఒక్కటే. **'ఏకం సత్ విప్రా బహుధా వదన్తి'.** కనుక అట్టి సత్యస్వరూపమైనటువంటిది ఈ మాగ్నెట్. అయస్కాంత మనేది ప్రతి మానవుని యందునూ ఉన్నది. ప్రతి దేవాలయమునకు వెళ్ళి దానిని ప్రవేశపెడుతున్నాడు. కనుక దేవాలయమంటే ఏమిటి? అయస్కాంత మందిరమే. అక్కడ ఏ రూపాన్ని అయినా దర్శించవచ్చును. కాని దివ్యత్వానికి ఏ రూపమూ లేదు. నీటికి ఏ రూపం ఉన్నది? దానికి రూపం లేదు. కాని గ్లాసులో పోస్తే గ్లాసు ఆకారాన్ని పొందుతుంది. గాలికి కూడా రూపం లేదు. బెలూన్ లోనికి పంపుతే బెలూన్ రూపం ధరిస్తుంది. కాబట్టి నీరుకు, గాలికి రూపంలేదు. అదే విధంగా పంచప్రాణములకు, పంచ భూతములకునూ ఎట్టి రూపం లేదు. రూపములను మనం కల్పించు కుంటున్నాం. కల్పించుకున్న రూపములు, కనిపించ కుండానే మధ్యలో పోతున్నాయి. కనుక ప్రయత్నం చేత సాధించినవన్నీ భౌతికములే. వీటన్నింటికీ ఆధారమైన శక్తి ఒక్క దైవత్వమే.

ప్రేమస్వరూపులారా!

దేనినైనా మరువండి. దేనినైనా వదలవచ్చు. కాని దైవత్వాన్ని మాత్రం మరువకండి. దైవత్వాన్ని మరచినవాడు తనను తానే మరచిపోతాడు. అట్టివాడు ఎక్కువ కాలం జీవించలేడు. ప్రాచీన కాలంలో దైవం మీద భక్తితో నిరంతరమూ స్మరిస్తూ ఉండేవారు. అట్టి వారు 120 సంవత్సరాల దాకా బ్రతికారు. వారికి ఎట్టి రోగములూ రాలేదు. వారు తినిన తిండి సామాన్యమైనదే. ఇప్పటి వారిలాగే విటమిన్లు తినేవారు కాదు. అసలు విటమిన్లు అంటే వారికి తెలియనే తెలియదు. భగవత్ భావంతో అర్పితం గావిస్తూ వచ్చేవారు. భగవంతునికి అర్పితం గావించి తినటంచేత అన్ని ప్రొటీన్స్, విటమిన్సు అందులో ప్రవేశించేవి. కనుక దైవ విశ్వాసాన్ని మనం పెంచుకుంటే, సర్వమునూ మనం సాధించవచ్చును. సర్వరూపాలను మనం పొందవచ్చును. మనమే దైవస్వరూపులం కావచ్చును. దైవం ప్రత్యేకంగా లేడు. నీ కంటే దైవము వేరు కాడు. నీవూ దైవం ఒక్కటే. దీనిని గుర్తించి వర్తించినప్పుడు ఏకత్వం ప్రాప్తిస్తుంది.

పరమాత్మ చింతన చేయని శక్తి వలన ప్రయోజనం లేదు. కనుక దినమునకొక పర్యాయమైనా భగవంతుని చింతించండి. ఎవరు ఏమి చెప్పినా వినకండి. ఎవరి నమ్మకం వారిది. కాని ఈనాడు **'నమ్మకమను రెండు నయనంబులే లేని అంధులైరి మనుజులవని యందు' జీవితాన్ని సార్థకం చేసుకునే నిమిత్తమై దైవ విశ్వాసాన్ని పెంచుకోండి.** ఆ నమ్మకమే మిమ్ములను రక్షిస్తుంది. **కాని ఈనాడు రక్షించే దానిని వదిలిపెట్టి, శిక్షించే దానిలో మనం ప్రవేశిస్తున్నాం.** ఈనాడు పిల్లలు దుర్భావనలు పెంచుకుంటున్నారు. చెడ్డ భావాలను లోపల చేర్చకండి. పరులకు అపకారం చేయు పనులలో ప్రవేశించకండి. పరులను విమర్శించకండి, హింసించకండి. ఆ హింసకు మించిన హింస మీకు తగులుతుంది. మీ కుటుంబానికి కూడా తగులుతుంది. ఈ సత్యమును మీ మనసులలో ఉంచుకోండి. **అందరి క్షేమాన్ని మనం కోరినప్పుడే, మన క్షేమాన్ని, మన కుటుంబ క్షేమాన్ని భగవంతుడు కోరుతాడు. కనుక మంచి భావాలు పెంచుకొని, మంచి చింతన చేస్తూ కాలాన్ని సార్థకం చేసుకోండి!**

(శ్రీ.ఏ. 2002 పు. 7/11 మరియు ది.ఉ. 13.3.2002) (చూ॥ లింగోద్భవము)

అయిదవపురుషార్థము

పరమప్రేమ తత్వము అయిదవ పురుషార్థము. ఇదే నారదుడు బోధించిన అమృతత్వం. వేద వేదాంగములు

అయిదులక్షణములు

శాస్త్రములు నాలుగు పురుషార్థములను మాత్రమే బోధిస్తున్నాయి. కాని, ఉపనిషత్తులు అమృతతత్వాన్ని, **'జ్ఞానాదేవతు కైవల్యమ్'** అనంతమైన అమరత్వమనే జ్ఞానాన్ని బోధిస్తున్నాయి. **జ్ఞానమనగా అద్వైత దర్శనమే.** ఇక రెండో పదార్థమే లేదు. ఉన్నది ఒక్కటే. మనకంటికి కన్పించేవన్నీ దాని అంగములు. అన్నింటిలోనూ ఉన్నది ఒక్కటే.

(త.శ.మ.పు.48)

అయిదులక్షణములు

(చూ॥ జన్మాద్యస్యయతః)

అయోధ్య

అయోధ్య అనగా ఏమిటి? **విరోధులు చొరబడ లేని ప్రదేశమే ఆయోధ్య అదే హృదయము.** ఈ దేహము దశేంద్రియములతో కూడిన రథమువంటిది. కనుక, **దేహమే దశరథుడు.** ఇతనికి కౌసల్య, సుమిత్ర, కైకేయి అని ముగ్గురు భార్యలు, ఈ ముగ్గురినీ వరించినవాడు దశరథుడు. దేహధారియైన ప్రతి మానవుడు సత్వరజస్తమో గుణాలను వరించాడు. సాత్విక గుణమే కౌసల్య, రజోగుణమే కైక, తమోగుణమే సుమిత్ర. ఈ ముగ్గురికీ నల్గురు బిడ్డలు పుట్టారు. ఆ నల్గురు బిడ్డలే నాల్గువేదములు. ఋగ్వేదమే రాముడు, యజుర్వేదమే లక్ష్మణుడు, సామవేదమే భరతుడు, అథర్వణ వేదమే శతృఘ్నుడు. ఈ నాలుగు వేదములే నల్గురు పిల్లలుగా పుట్టి దశరథుని ఇంట్లో అడుకున్నాయి. ఇలాంటి పవిత్రమైన అంతరార్థాన్ని గుర్తించినప్పుడే మీయందు భక్తిప్రపత్తులు అభివృద్ధి అవుతాయి.

(స.సా. మే 2000 పు. 143)

వ్యక్తి ధర్మమును, సంఘధర్మమును, కుటుంబధర్మమును రాముడు నిరూపిస్తూ వచ్చాడు. ఈ ధర్మత్రయ త్రివేణి సంగమమే రామచరితము. ఈ త్రివేణీ సంగమము నందు స్నాన మాచరించిన వారికి పాపములు పరిహారమౌతాయి. శాపములు నిర్మూలమౌతాయి. ఈ దివ్యచరితమును ప్రతి మానవుడు స్మరించాలి. వరించాలి,తరించాలి. రాముని చరిత్ర ఇట్టిది, అట్టిది అని వర్ణించుటకు వీలుకానిది. సముద్రములోని తరంగములనైనా లెక్కించవచ్చునుకాని, రాముని గుణగణములను ఎవ్వరూ లెక్కించలేరు. రాముడు ఆయోధ్యను పరిపాలించాడు. **ఆయోధ్య అనగా ఏమిటి? యోధులు, విరోధులు చేరరానటువంటి ప్రదేశము. అదే మానవ హృదయం. అక్కడే రాముడుంటున్నాడు.** ఈనాటి మానవహృదయంలో క్షణక్షణమూ ఏదో ఒకవిధమైన ఆవేదనలు ఏర్పడుతున్నాయి. మొట్టమొదట మానవహృదయం ఆయోధ్యగా మారాలి. నిర్మలమైనదిగా, నిశ్చలమైనదిగా, కలతలు లేనిదిగా ఉండాలి. అప్పుడే రాముడు అందులో ప్రవేశించి సరియైన మార్గాన్ని చూపుతాడు. రాముడు తాను దేవుడైనను సామాన్య మానవునివలె సంచరించాడు. కనుక ఈనాడు సామాన్య మానవుడు రామునివలె సంచరించాలి. అప్పుడే నిజమైన భక్తిప్రపత్తులు అభివృద్ధి కాగలవు.

(స.సా.మే.97, పుట.128/129)

(చూ॥ రాముని జన్మస్థానము)

అరటిచెట్టు

అరటి చెట్టు యొక్క ఆకులు, పువ్వులు, దూట, నార (పీచు) యివన్ని మనకు అనేక రకాలుగా ఉపయోగపడుతాయి. కాని, అరటి చెట్ల ప్రధాన ప్రయోజనం అరటిపండ్లు. అటులనే మానవులు ఎన్నో తెలుసుకొనడానికి తమ జీవితాలను వెచ్చిస్తారు. కాని మానవులు తమను తాము తెలుసుకోవడమే మానవత్వ ధ్యేయమని గుర్తించాలి.

(భ.ప్ర.స.పు.29)

అరణ్యకాలు

అరణ్యకాలు పద్యగద్యరూపమైనవి. వానప్రస్థ ఆశ్రమము స్వీకరించినవారు, అరణ్యములలో జీవించుచు,

అధ్యయనము చేయుట వలన వీటికి అరణ్యకాలని పేరు వచ్చినది. అనగా ఒంటరిగా ప్రశాంతముగా కాలము గడుపువారు, ఈ సంహితను అధ్యయనము చేయుటచేత అరణ్యకమైనది. అనగా జనసమూహములో కాక ఒంటరి జీవితము గడుపువారు. అధ్యయనము చేయునవి అరణ్యకాలు. వీటిలో కర్మకాండ యొక్క చరమదశ, బ్రహ్మకాండ ప్రారంభమవుతుంది.

(లీ.వా. పుట 6, 7)

(చూ॥ వేదము)

అరవిందుడు

(చూ॥ దివ్యత్వాన్ని గుర్తించడం)

అర్చన

(చూ॥ ఆనందము)

అర్థము

స్వాహుతి అనగా వస్తువులను అగ్నిలో చక్కగా దగ్ధము చేయుట లేక జీర్ణము చేయుట అని మాత్రమే కాదు. లౌకికముగా వస్తువులు అగ్నిలో దగ్ధమై పోవుట మాత్రమే చూతురుకాని అగ్నికి దేవతా స్వరూపము, భౌతిక స్వరూపము రెండునూ కలవని తెలిసికొనరు. దేవతా శరీరము అతీంద్రియ మగుటచే కర్మానుష్ఠాన సమయమున ఆయా దివ్యరూపముల ఆరాధించుట శ్రుతి సమ్మతము.

(లీ.వా.పు 21, 22)

(చూ॥ పురుషార్థము)

అర్ధనారీశ్వరతత్త్వం

ఆ అధునిక యుగంలో "అర్ధనారీశ్వర తత్త్వాన్ని" ఎవ్వరూ చక్కగా గుర్తించుకొన లేకపోతున్నారు. ఏ సైంటిస్టు కూడా చక్కగా వివరించి చెప్పడం లేదు. ప్రతి పదార్థము అణువులతో కూడినటువంటిది. ప్రతి అణువు నందు 'ఎలక్ట్రాన్, ప్రోటాన్' అనే రెండు శక్తులుంటున్నాయి. సంస్కృతంలో ఎలక్ట్రాన్ అనేది ఋణభాగమును, ప్రోటాన్ అనేది ధనబాగమును సూచిస్తాయి. ఎలక్ట్రాన్ స్త్రీ తత్త్వాన్ని, ప్రోటాన్ పురుషతత్త్వాన్ని గుర్తింపజేస్తాయి. ఈ రెండింటి చేరిక ద్వారానే అణువు లేర్పడుతున్నాయి. ప్రపంచము నందలి ప్రతి పదార్థమూ అణువుల యొక్క స్వరూపమే. కాబట్టి, ఈ జగత్తు "అర్ధనారీశ్వరస్వరూపం" అని మన పూర్వీకులు నిర్ణయించారు. ఈ విధముగా మన పూర్వీకులు నిర్ణయించారు. ఈవిధముగా మన పూర్వీకులు తెలిపిన 'అర్ధనారీశ్వరతత్త్వాన్ని' నేటి సైన్సు ద్వారా పరిశీలిస్తే, ఈ రెండింటికి ఎంతో సన్నిహిత సంబంధము ఉన్నదని గుర్తించవచ్చును.

(స.సా.అ. 91. పు.261)

అర్ధనారీశ్వరుడు

ఈ ప్రకృతిలో ఆకారమును ధరించిన వారందరూ స్త్రీలే. **భగవంతుడొక్కడే పురుషుడు.** ప్యాంటు, షర్టు వేసుకున్నంత మాత్రమున పురుషుడనీ, చీర కట్టుకున్నంత మాత్రమున స్త్రీ అనీ చెప్పడానికి వీల్లేదు. దేహమునకు 'పురము' అని పేరు. ఈ పురములో నఖశిఖపర్యంతము సంచరించే చైతన్యమునకే పురుషుడని పేరు. కనుక లోపలున్నది చైతన్యము, బయట ఉన్నది జడము. **ఈ జడ చైతన్యముల ఏకత్వమే అర్ధనారీశ్వర స్వరూపము.** కనుక ప్రతి మానవుడూ అర్ధనారీశ్వరుడే. దేహము ప్రకృతి (స్త్రీ); చైతన్యము - పురుషుడు (ఈశ్వరుడు) ఈ రెండింటి ఏకత్వంచేతనే మానవత్వం ఏర్పడుచున్నది.

(స.సా.జులై.98, పు.187)

అర్జునుడు

అర్జునునకు అనేక పేర్లున్నాయి. అర్జున, ఫల్గుణ, పార్థ,శ్వేతవాహన, బీభత్స, కిరీటి, సవ్యసాచి, ధనుంజయ. ధనుంజయ అనేది కడపటి బిరుదు. ఈ బిరుదులు ప్రతి ఒక్కటి లోకరీతిగా సంపాదించుకొన్నవి. ప్రపంచములోపల

అర్జునుడు

అనేక మందికి అనేక బిరుదులుంటాయి. పద్మశ్రీ, పద్మవిభూషణ లాంటివి. ఎవరిస్తున్నారు? ఇవి ప్రభుత్వమునుండి వస్తుంటాయి. **అర్జునకు యీ టైటిల్సు యెవరిచ్చారు? సాక్షాత్ కృష్ణుడే యిచ్చాడు.** కట్టకడపటి టైటిలు యేమిచ్చాడు? **'శ్రుణ్వంతు విశ్వే అమృతస్యపుత్రా' అన్నాడు. నాయనా నీవు అనృతపుత్రుడు కాదు, అమృతపుత్రుడవు అని** అనృతాన్ని యేమాత్రము నీవు లెక్క చేయవద్దు అని చెప్పాడు. గాండీవమును పొందే నిమిత్తమై ఏకస్తంభము పైన అనేకవర్షములు తపస్సు ఆచరించాడు. కట్టకడపటికి తీవ్రవైరాగ్యముచేతను, తీవ్రమైన దీక్షచేతను పట్టుదలచేతను దృఢముచేతను, ధైర్యము చేతను, అనేక యిబ్బందులు అతనిని వెంటాడినప్పటికినీ యెదుర్కొని యీ ధనుస్సును సాధించాడు. ఈ ధనుస్సును సాధించుటకు పూర్వము పంచభూతములు అతనికి యెదురు తిరిగినాయి. కానీ లెక్క చేయక సాధిస్తూ వచ్చాడు. ధనుస్సును **సాధించినవాడు కనుక అర్జునా నీవు ధనుంజయుడవు అన్నాడు.** దానినే లోకరీతిగా దనంజయా అని పిలుస్తూ వచ్చారు. దీనికి అర్థము లేకపోలేదు. రాజసూయ యాగము చేయటానికి ధర్మరాజు పూనుకున్నాడు. కానీ ధూర్తులైన దుర్మార్గులైన ధృతరాష్ట్రుని కొడుకులు దుశ్శాసన, దుర్యోధనాదులు రాజ్యమేలుతున్నారు. పాండవులకు ఖజానాలో పైసా లేదు. ధర్మజుడు అర్జునునకు చెప్పాడు. తమ్ముడా! మనము రాజసూయయాగము చేయటమంటే సామాన్యమైనది కాదు. కృష్ణుడేమో చేయుమని చెబుతున్నాడు. దీనికి తగిన ధనము మనకవసరమే కదా! దీనిని ఎక్కడ ప్రోగు చేసుకోవటము అన్నాడు. అప్పుడు అర్జునుడు చెప్పాడు. **'కల్పవృక్షమును దగ్గర పెట్టుకొని మనకు యీ కంగారు యెందుకన్నా! సర్వరక్షకుడైన కృష్ణుడే మనకు రక్షకుడుగా వుంటున్నప్పుడు ధనమునకు యేమి తక్కువ? తను ఒక తూరి ఆశీర్వదించి పంపితే కావలసినంత ధనమును తెస్తా' నన్నాడు.** అర్జునుడు రాజసూయయాగ నిమిత్తమై ధనము నిమిత్తమై డొనేషన్లకు బయలుదేరాడు. ధర్మజుడు రాజసూయయాగము చేస్తున్నాడనేది వినేటప్పటికి యెవ్వరూ వెనుకంజవేయలేదు. ఎవరి తలపుల వద్దకు పోనక్కర లేదు. రాజులే వచ్చి అర్జునుని చూచి కావలసినంత ధనమును యిచ్చారు. ఈ ధనమును అర్జునుడు ఏనుగులతో తీసుకొని వచ్చాడు. ధనము రాసులుగా బయలుదేరినది. కృష్ణుడు వచ్చి చూచాడు. ఏమి తెలియనట్లు "ధర్మజా! యింత ధనమెక్కడ నుండి వచ్చింది?" అన్నాడు. అప్పుడు ధర్మరాజు మన సోదరుని ప్రభావమని అర్జునుని చూపించాడు. అప్పుడు కృష్ణుడు **ధనంజయా అని పిలిచాడు. ధనమును ప్రోగుచేసినాడు కనుక ధనమును జయించినాడు కనుక, దనంజయుడని, ధనుస్సును జయించినవాడు కనుక ధనుంజయుడని యీ విధమైన పేర్లు రావటం చేతనే కృష్ణుడు మాటిమాటికి ధనంజయా,** పార్థా అనే పేర్లతో అతనిని సంబోధిస్తూ వచ్చాడు. అర్జునునకు పార్థా యనేది ప్రధానమైన ఒక పేరు. పృథ్వీ (పృథా) పుత్రుడు కనుక అతనికి పార్థుడు అని పేరు.

(శ్రీ.గీ పు. 47/48)

భగవద్గీత విన్నవాడు అర్జునుడు.పాండవులలో ఎంత గొప్ప వారుంటున్నారు. మహాధర్మమూర్తి అయిన **ధర్మజుడే వుంటున్నాడు. దర్మజునికి యింత పవిత్రమైన గీత ఎందుకు బోధించి వుండకూడదు?** అతనికి సర్వబలములు వుంటున్నాయి. పోనీ భుజబలము, బుద్ధిబలము, గజబలము వుండేవాణ్ణి చూస్తామా అంటే భీముడున్నాడు కదా! భీమునికి ఎందుకు బోధించి వుండకూడదు? అర్జునికి మాత్రమే ఎందుకు బోధించాలి? దీనిని మొట్టమొదట యోచించాలి. **ధర్మజుడు మంచివాడే, ధర్మమూర్తియే. అయితే అతనికి పూర్వతాపము లేదు. పశ్చాత్తాపము వుంది. అనగా ముందు జరగబోయే దానిని గురించి తాను యేమాత్రము విచారించడు. జరిగిన తరువాత అయ్యో! యావిధముగా జరిగిపోయిందే అని విచారిస్తాడు. ఇంక భీమునకు భుజబలముంది, కండబలముంటుండాది గాని బుద్ధిబలము లేదు. తనకేమైనా కోపము వచ్చెనా పెద్ద వృక్షమును వేళ్లవరకు పెరికి అందరితోనూ పోట్లాడటానికి సిద్ధమవుతాడు; కాని**

బుద్ధిబలము తక్కువ. అర్జునునికి పూర్వతాపమే వుంటుండాది. యుద్ధమునకు పూర్వమే అర్జునుడు "కృష్ణా యింతమంది బంధువులను మిత్రులను చంపి యీ రక్తపు కూడు భుజించుటకంటె నేను బిచ్చమెత్తటానికైనా వెడతాను. నేను యుద్ధము చేయను" అన్నాడు ముందుగానే. పూర్వతాపమే తాను అనుభవించాడు అర్జునుడు. ధర్మరాజు అట్లా చేయలేదు. యుద్ధమంతా ఆయిన తరువాత విశ్రాంతిగా యింటిలో కూర్చుని అయ్యో! నాబంధువులందరు పోయారే. నావారందరూ వెళ్లారే ఇంక నేను రాజ్యము యేలి ప్రయోజన మేమిటి? అని అప్పుడు విచారిస్తూ వచ్చాడు పాపం. వేగిరించినచో అది విషమగును. కనుకనే

తమరు చేయంగవలయు కార్యమునుగూర్చి
మంచి చెడ్డలు చక్కగా నెంచి చూచి
చేయుచుందురు గాక యే చింత లేక
వేగిరించినచో నది విషమె యగును.

ఇది దశరథ మహారాజు యొక్క స్వభావము కూడ. దేవాసుర యుద్ధమునందు తోడ్పడుటకై తన మూడవ భార్యకైకను తీసుకొని వెళ్ళాడు. కైకేయి కేకయరాజపుత్రిక. ఆమె అస్త్రశస్త్రవిద్యలు గొప్పగా తెలిసినది. అసలు రామునకు అస్త్రశస్త్ర విద్యలంతా నేర్పినది కైకేయి. **కృష్ణావతారములో సత్యభామ, రామావతారములో కైకేయి అస్త్రశస్త్రవిద్యలలో ఆరితేరినవారు.** దశరథుడు యుద్ధము చేస్తున్న సమయములో, రథచక్రమునకు ఒక సీల వుంటుంది అది పూడిపోయింది. అది పూర్తిగా వూడి పోయిందంటే చక్రము క్రింద పడిపోతుంది. ఆసమయములో తన భర్తకు అపజయము కలుగుతుందో యేమోనని తన వ్రేలిని రంధ్రములో పెట్టి కాపాడింది. ఈ విజయమును సాధించిన తరువాత దశరథ మహారాజు చూచాడు కైకేయి చేతి నుంచి రక్తము కారిపోతుండాది. ఈ దృశ్యమును చూచి కైకా! నీవలన నేను విజయమును సాధించాను, కనుక నీవు యేమైనా రెండు వరములు కోరుకో యిస్తాను అన్నాడు. సమయమూ చెప్పలేదు. ఆ కోరికలూ చెప్పలేదు. నీయిష్టమొచ్చిన సమయములో నీ యిష్టమొచ్చిన కోరికలు కోరుకోమని రెండూ ఆమెకే అప్పచెప్పాడు. ఒక కాలమైనా నిర్ణయము చేయాలి. లేదా కోరికలైనా నిర్ణయం చేయాలి. ముందు వెనుకలు యోచించుకొనకుండా వరము లిచ్చేశాడు. ఆమెకు యిష్టము వచ్చిన సమయములో యిష్టమొచ్చిన కోరికలే కోరుకుంది. అప్పుడు ఎవరిది తప్పు? కైక తప్పా? **దశరథుని తప్పా? దశరథుని తప్పు. కనుకనే 'వేగిరించినచో అది విషమె యగును' అన్నారు. తొందరపడటము కొన్ని విషయములలో ప్రమాదమవుతుంది.**

అదేవిధముగనే యిక్కడ అర్జునునియందుండిన ప్రేమచేత ముందూ వెనుక యోచించకుండ కృష్ణుడు పనిచేయలేదు. అర్జునుడు ముందు వెనుకలు యోచించి యుద్ధమునకు సిద్ధమయ్యాడు. యుద్ధములో ఎంతమంది బంధుమిత్రులు పోతారో! ఇదంతా జరిగిన తరువాత నేను యెవరి కోసము యుద్ధము చేయాలి. ప్రజలే లేనప్పుడు రాజ్యమేమిటి? అని ముందు రాబోయే విషయాన్ని యోచిస్తూ వచ్చాడు. పశ్చాత్తాపము కాక పూర్వతాపముతో వుండినవాడు అర్జునుడు. ఈ పూర్వతాపము పరిశుద్ధ హృదయమున్న వారికే వస్తుంది. అందువల్లనే **అర్జునుడనగా పవిత్రము, పరిశుద్ధ హృదయము కలవాడని అర్థము. శ్రీశైలము యిక్కడకు దగ్గరగా వుంటుంది. అక్కడ మల్లికార్జున-భ్రమరాంబ అని వుంటున్నారు. దీనికి పార్వతీపరమేశ్వరులని అర్థము చెబుతారు. మల్లికార్జున-మల్లి అనగా మల్లెపువ్వు. ఎలాంటి మల్లెపువ్వు అది? అర్జున తెల్లని మల్లెపువ్వు. తెల్లని మల్లెపువ్వువంటివాడు యీ మల్లికార్జునుడు. ఈతడే ఈశ్వరుడు. భ్రమర అంబ. పార్వతి యెవరంటే ఒక భ్రమరము - తుమ్మెదట. అంబయైన భ్రమరము తెల్లని మల్లెపూవులో చేరి ఆ మల్లె యొక్క మకరందమును తీసుకుంటుందట.** ఈ పార్వతమ్మ మల్లికార్జున అనే ఈశ్వరత్వములో ప్రవేశించింది. భ్రమరాంబ పార్వతి. తెల్లని మల్లెపువ్వులోని మకరందము ఈశ్వరుడు. మల్లెపువ్వులోని మకరందమును గ్రోలేది కనుక ఆమెకు

అరిషడ్వర్గములు

అర్ధభాగములో అధికారముంటుండాది. దీని అర్థము పురస్కరించుకొనియే శ్రీశైలములో మల్లికార్జున భ్రమరాంబయని పేరు పెట్టారు.

ఏతావాతా అర్జున అనగా పవిత్రము, నిర్మలము అని అర్థము. అలాంటి నిర్మలమైన పవిత్రమైన హృదయము కలిగిన అర్జునుడు కనుకనే ఆనాటినుండి యుద్ధకాలము వరకును అనగా 75 సంవత్సరములు విడనాడని జంటగా కలసిమెలసి ఉంటున్నారు కృష్ణార్జునులు 75 సంవత్సరములు కలసిమెలసి వుండినప్పటికిని యేనాడును భగవద్గీత బోధించలేదు. కారణమేమిటి? **అంతకాలము బంధుత్వము అనుసరిస్తూ బావా బావమరదులుగా అనగా దేహాత్మభావముతోనే జీవిస్తూ వస్తున్నారు. ఏనాడు అర్జునుడు నేను నీకు శరణు జొచ్చినవాడను అని శరణాగతి పొందినాడో అప్పుడు కృష్ణుడు గురువయ్యాడు. అర్జునుడు శిష్యుడయ్యాడు. ఆ సమయంలోనే గీతను బోధించటానికి ప్రయత్నించాడు. అనగా పవిత్రమైన జ్ఞానమును బడయవలెనన్న గురుశిష్యుల సంబంధము రావాలి.**

(శ్రీ.గీ. పు, 127/130)

(చూ॥ అహంకారము, ఓర్పు, హృషీకేశుడు, సత్యం)

అరిషడ్వర్గములు

మానవుడు తనలోని అరిషడ్వర్గములనే (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యము) పశువులను సంహరించి తన పరిశుద్ధాత్మను విశ్వేశ్వరునకు సమర్పించుట అనేదే ధర్మము.

(ధ.పు 4)

పండులా వుండు. చేదుగా యున్నదాని తోలును తీసిపారవెయ్యి. లోపల తియ్యటి రసాన్ని త్రాగి అనుభవించు - అరిషడ్వర్గాలు అనే తోలును తీసిన తరువాత మిగిలేది నేనే. తియ్యటి రసమే నేనన్న ప్రేమ రూపుడను. త్రాగి అనుభవించు.

(సా॥ పు 469)

శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప జాయతే
సంగాత్ సంజాయతే కామ: కామాత్ క్రోధాభిజాయతే
శ్లో॥ క్రోధాత్ భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః
స్మృతి భ్రంశాత్ బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి
శ్లో॥ విహాయ కామాన్య స్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః
నిర్మమో నిరహంకారః స్శాన్తి మధిగచ్ఛతి

(భ.గీ. పు. 2-62, 63, 71)

అరిషడ్వర్గములలో మొట్టమొదటివి - కామక్రోధములు. మానవునకు కామ, క్రోధములు అని రెండు పదములు ఉండినప్పటికిని మొదటిపదము యొక్క పరిణామమే రెండవ పదము లోభ, మోహ, మద, మాత్సర్యములు మొదటి వదము యొక్క పరిణామములే. అరిషడ్వర్గములనగా కామము యొక్క పరిణామము. కామము యొక్క పరివర్తనే వీటియొక్క స్వరూప స్వభావములకు మూల కారణము. కామము వల్ల అపేక్ష పెరుగుచున్నది. ఈ అపేక్ష ఫలించకుండిన అనగా విఫలమైనచో అది క్రోధముగా మారుచున్నది. ఈ క్రోధమే సమ్మోహనంగా తిరుగుచున్నది. ఈ సమ్మోహనమే కడపటికి పెరిగి పెరిగి స్మృతిభ్రష్టుని గావించుచున్నది. ఈ స్మృతి భ్రష్టుడే కష్టము వల్ల బుద్ధి క్షీణత పొందుచున్నాడు. ఈ బుద్ధి నాశనము వలన సర్వమూ నాశనమగుచున్నది. సర్వదుఃఖములకు, సర్వ నాశనమునకు, అపకీర్తికి ఈ కామమే మూలకారణము. మనము వాంఛలను తగినంత అదుపులో ఉంచుకొని తగినరీతిగా జీవించటానికి ప్రయత్నించాలి.

సర్వ మింటియందు సంచరించుచుండ
ఎవరు సుఖనిద్ర చెందగలరు?
విషయసర్వ ముండు విషమయ దేహాన
జీవయాత్ర దేహి సల్పుచుండ
కోపము కలిగిన వానికి
ఏపనియు ఫలింపకుండ ఎగ్గులు కలుగునో
పాపము పనులనే చేయుచు
ఛీ పొమ్మనిపించు కొనుట చేకూరును సుమీ.
సాధనలు చేసి ఫల మేమి శమము లేక
యోగములు పూని ఫలమేమి ఓర్పులేక

జపము లొనరించి ఫలమేమి శాంతి లేక.
చవిటి భూమిని దున్నిన సరళి కాదె
విషయములు ధ్యానించు వానికి వాటియందు ఆసక్తి కలుగును. అట్టి విషయాసక్తి వలన **కోరిక, కోరిక వలన కోపము కలుగును. కోపము వలన అవివేకము, అవివేకము వలన స్మరణ భ్రంశము కలుగును. స్మరణ జ్ఞానము పోవుట వలన బుద్ధి నశించును. బుద్ధి నశించిన తోడనే తానే నశించును. కాన, విషయచింతన యుండరాదు.** ఎవడు సమస్త కోరికలను, శబ్దాది విషయములను త్యజించి వాని యం దే మాత్రము ఆశ లేక, అహంకార మమకార వర్జితుడై ప్రవర్తించునో అట్టివాడే శాంతిని పొందుచున్నాడు.
కోరు కోరికలన్నియు తీరుచున్న
భక్తి దైవమున హెచ్చు, రక్తి హెచ్చు
కోరు కోరిక లెవ్వేని తీరకున్న
భక్తి తరుగుచు, దైవ విరక్తి పెరుగు.

(శ్రీ.భ.ఉ.పు.12/13)

(చూ॥ అకార పంచకము, కళలు, తమోగుణములు, తామరపువ్వు, శ్రవణం)

అరిష్టపంచకము

(చూ॥ అకారపంచక అరిష్టములు)

అరిష్టసూచకము

ఆకారముతో ప్రారంభమయ్యే అరిష్టపంచకంలో మొదటిది అలక్ష్యము, రెండవది అవినయము, మూడవది అహంకారము, నాలుగవది అసూయ, ఐదవది అసభ్యత. ఈ ఐదింటినీ కూడినవాడు విద్యార్థిగా తగినవాడు కాదు.

(శ్రీ.భ.ఉ.పు.114)

అరిస్టాటిల్

(చూ॥ ఆరోగ్యమే మహాభాగ్యము)

అర్పితము

మీరు భగవంతునికి అర్పించవలసినది ఏమిటి? ఏ హృదయం ఇచ్చాడో దానిని తిరిగి భగవంతునికే ఇవ్వాలి. **భగవంతుడు కోరేది ప్రేమ ఒక్కటే.** పరిశుద్ధమైన ప్రేమతో ఏది ఇచ్చినా చాలు. శ్రీకృష్ణతులాభార ఘట్టంలో రుక్మిణి "పత్రమో పుష్పమో ఫలమో తోయమో భక్తి కల్గినవారికి వశుడవగుట సత్యమేని కృష్ణా! నీవు ఈ తులసీ దళమునకు తూగుదువు గాక!" అని ప్రార్థించి త్రాసులో ఒక తులసీ దళమును వేసి కృష్ణుని తూచగల్గింది. **దేహమే పత్రము, హృదయమే పుష్పము, మనస్సే ఫలము, ఆనందబాష్పాలే తోయము.** ఇవి భగవంతునికి అర్పితం చేయకుండా మీరు ఎన్ని చదువులు చదివినప్పటికీ, ఎన్ని శ్లోకాలు కంఠస్థం చేసినప్పటికీ మీకు శోకనివారణ కాదు. శోక నివారణ కావాలంటే మీరు భగవంతునికి అర్పితం కావాలి.

(స.సా.నం.99 పు. 321)

(చూ॥ క్షేత్రములు, పురాణములు, భక్తుని లక్షణము, యజ్ఞం)

అలర్కుడు

ఋతుధ్వజుని భార్య మదాలస మహాసాధ్వీమణి. త్యాగ, జ్ఞాన, వైరాగ్యములలో ఈమెకు సాటి మరొకరులేరు. ఈమెకు దివ్యత్వమనేది పుట్టిన ఇల్లు. పెట్టిన పేరు. వీరిరువురికి మొదట ఒక పుత్రుడు పుట్టాడు. పుట్టిన బిడ్డకే ఏమీ లేనప్పుడు పెట్టిన పేరుకు ఏముంటుంది? కాని ఈ ఋతుధ్వజుడు పేరు పెట్టడం కోసం చాలా తాపత్రయపడ్డాడు. కట్టకడపటికి 'విక్రాంతుడు' అని పేరు పెట్టాడు. మదాలస ఫక్కున నవ్వింది. పేరు కోసం ఈ మహారాజు ఇంత ప్రాకులాడుతున్నాడేమిటని లోపల అనుకుంది. మదాలస. ప్రాకృతమైన శరీరమునకు ఒక భౌతికమైన శరీరమునకు ఒక భౌతికమైన పేరు కావాలి గాని, ఈ మలమూత్ర దుర్గంధ మాంస రక్తములతో కూడినటువంటి ఈ దేహమునకు పేరుకోసం అంతగా ప్రాకులాడటం వ్యర్థమని భావించింది. కొంతకాలానికి రెండవ కుమారుడు పుట్టాడు. 'సుభాహుడు' అని పేరు

అలవర్చుకోవాలి

పెట్టారు. అనగా మంచి హస్తములు కలవాడని అర్థము. అప్పుడుకూడా మదాలస ఫక్కున నవ్వింది. రాజు అవమానంగా భావించాడు. తాను పెట్టిన పేర్లకు ఏమాత్రం విలువలేనట్లుగా మదాలస హాస్యం చేస్తున్నదని భావించాడు రాజు.

మరి కొంత కాలానికి మూడవ పుత్రుడు పుట్టాడు. అప్పుడు ఆ రాజు 'మదాలస! నేను పెడుతున్నపేర్లు నీకు అంత ఇష్టముగా వున్నట్లులేదు. ఈ తడవ ఈ పిల్లవానికి నీవే పేరు పెట్టు' అని ఆమెకు వదలిపెట్టాడు. అప్పుడు ఆ పిల్లవానికి 'అలర్కుడు' అని పేరు పెట్టింది. రాజుకు కోపం వచ్చింది. మేము క్షత్రియులం, రాజపుత్రులం, ధీరులం. నా కుమారునికి 'అలర్కుడు' అని పేరుపెట్టడం అవమానకరమన్నాడు. 'అలర్కుడు' అనగా పిచ్చికుక్క. అప్పుడు మదాలస 'మహారాజా! తన స్వస్వరూపాన్ని తాను గుర్తించుకోలేనటువంటివాడు, తన దివ్యత్వాన్ని తాను అర్థం చేసుకోలేనటువంటివాడు, ఏకత్వాన్ని భావించలేనటువంటివాడు, 'కుక్క' కంటే హీనమే'' అన్నది. కనుక తన స్వరూపాన్ని తాను గుర్తించుకోలేనటువంటి మానవులకు పేర్లవలన ప్రయోజనమేమిటి? ఏకత్వాన్ని భావించలేనటువంటి మానవులకు ఈ పేర్లు ఎందుకు? దివ్యత్వాన్ని చింతించలేనటువంటి మూర్ఖులకు ఈ పేర్లు ఎందుకు? ఇది మానవదేహము. కాని వీరు మానవులు కాదు. ఆత్మ స్వరూపులే, ధర్మ స్వరూపులే, నిర్గుణ నిరాకార తత్వములే. నిర్మల స్వరూపులే. నిష్కళంక స్వరూపులే. ఇలాంటి ఆత్మకు పేర్లు పెట్టడం ఎంత అజ్ఞానం?

(శ్రీ.గీ.పు.359/361)

అలవర్చుకోవాలి

పొలమును దుక్కి దున్ని, నారు పెట్టి, నీరు పోసి, కలుపు మొక్కలను పెరికివేసి, సాగు చేసినప్పుడే పంటధాన్యమును అందుకోగలవు. ఎఱువు వేయక, నారు పెట్టక, నీరు పోయక, పొలమును దున్నక కేవలం విత్తనాలు నాటిన ఏమీ ప్రయోజనం లేదు. అదేవిధంగా, చతుర్విధ పురుషార్థములను సాధించవలెనన్న నవవిధ భక్తిమార్గముల ననుసరించవలెనన్న అష్టాంగయోగముల నభ్యసింప వలెనన్న ఏతావాతా ఏ ఆధ్యాత్మిక సాధన సల్పవలెనన్నను ప్రధానంగా నాల్గు గుణములను అలవర్చుకోవాలి. అప్పుడే సాధనకు తగిన ఫలితాన్ని పొందగలవు. అనందాన్ని శాంతిని, సంతృప్తిని అందుకోగలవు. ఏమిటా నాల్గు గుణములు? **మొదటిది మైత్రి, రెండవది కరుణ, మూడవది ముదిత, నాల్గవది తితీక్ష.**

మొదటిది మైత్రి. నీ వయస్సుకు నీ సంపదకు, నీ ఆరోగ్యమునకు, నీ చదువుకు నీ పరిస్థితికి తగినవారితోనే నీవు స్నేహం చేయాలి. నీవు అధికులతో స్నేహం చేస్తే వారు నిన్ను లొంగదీసుకునే ప్రయత్నం చేస్తారు. నీకంటే చిన్నవారితో స్నేహం చేస్తే నీవు వారిని అదుపులో పెట్టే ప్రయత్నం చేయవచ్చు. తద్వారా స్నేహం చెడిపోతుంది. కనుక, **సమానులతోనే స్నేహం చేయాలి. ఇతరులకు కీడు చేసేవారితోను, దురాలోచనలతో, దుష్ప్రవర్తనతో మెలగే వ్యక్తులతోను స్నేహం చేయకూడదు. రెండవది కరుణ.** దీనిని ఇష్టం వచ్చినట్లుగా ప్రసరింపజేయకూడదు. నీకంటె చిన్నవారిపైన, వయస్సునందు, సంపదయందు, ఆరోగ్యమునందు, పరిస్థితులందు తక్కువ స్థాయిలో ఉన్నవారిపైన నీ కరుణను ప్రసరింపజేయాలి. దీనివల్ల కరుణయొక్క విలువ పెరిగి స్థాయి బలపడుతుంది. **మూడవది ముదిత.** నీకంటె అధికులను చూసి అసూయ పడకుండా, వారిపట్ల ఎట్టి దుర్భావములకు చోటివ్వకుండా వారి అభివృద్ధిని చూసి ఆనందించడమే 'ముదిత' అని చెప్పవచ్చు. **నాల్గవది తితీక్ష.** అనగా, సుఖదుఃఖములపట్ల, నిందాస్తుతులపట్ల, లాభనష్టములపట్ల సమదృష్టి వహించడం. ఈ నాల్గింటినీ ఆచరిస్తే పురుషార్థములను సాధించినట్లే. వీటిని అలవర్చుకోవడానికి చిత్తశుద్ధి అవసరం. ప్రతి జీవియందు ఉన్నది భగవంతు డొక్కడే అనే విశ్వాసాన్ని అభివృద్ధి పర్చుకుంటే చిత్తశుద్ధి కల్గుతుంది. చంచలత్వానికి కారణములైన రజోగుణ తమోగుణములను

దూరం చేసుకుని నిశ్చలత్వాన్ని సాధించాలి. పాత్రలోని జలము మలినంగా ఉన్నప్పుడు అందులో సూర్యుని ప్రతిబింబం సరిగా కనిపించదు. కదిలే జలములో ప్రతిబింబము కూడా కదిలినట్లుగా కనిపిస్తుంది. పాత్రలోని నీరు పరిశుద్ధంగా, నిశ్చలంగా ఉన్నప్పుడే అందులో సూర్యునియొక్క ప్రతిబింబమును చక్కగా దర్శించగల్గుతావు. **నీ దేహమే ఒక పాత్ర. మనస్సే జలము, ఆత్మయే సూర్యుడు.** తామసిక మనస్సును మలిన జలముతోను, రాజసిక మనస్సును కదిలే జలముతోను, సాత్విక మనస్సును పరిశుద్ధ జలముతోను పోల్చవచ్చును. అందరియందు ఒకే ఆత్మ ఉన్నప్పటికీ ఉపాధి భేదముచేత నీవు నిశ్చలత్వమును, నిర్మలత్వమును సాధించలేకపోతున్నావు. నీయందున్న దోషములను, ఇతరులయందున్న మంచిని గుర్తించడానికి ప్రయత్నించినప్పుడే నీ మనస్సు పరిశుద్ధం కాగలదు. దోమతెర వేసుకుంటే దోమలు నిన్ను బాధించవు. కానీ, దోమతెరలోనే దోమలు చేరితే దోషం ఎవరిది? కనుక, మొట్టమొదట నీలో దోషములు లేకుండా చూసుకో. ఇక్కడ మరొక విషయాన్ని నీవు గమనించాలి. ఆధ్యాత్మిక సాధనలు నీ భక్తి ప్రపత్తులను నిలబెట్టే నిమిత్తమై ఏర్పడినవని గుర్తుంచుకోవాలి. **స్వార్థస్వప్రయోజనముల నిమిత్తమై చేసే సాధనలు ఆనందాన్ని, శాంతిని, సంతృప్తిని ప్రసాదించలేవు.** అప్పుడు నీవు దేనినీ స్థిరంగా, నియమం ప్రకారం చేయలేవు. రామాయణం దీనిని చక్కగా వివరించింది. కేకయ రాజ్యము నుండి తిరిగి వచ్చిన భరతుడు దశరథుని మరణవార్తను విని, తల్లియైన కైకవద్దకు వచ్చి కారణ మడిగాడు. దానికి సమాధానంగా కైక "నాయనా! దీనికి నేనే కారణం. నీ ఉన్నతి నిమిత్తమై, నిన్ను రాజును చేయదలచి నేను ఈ కోరిక కోరినాను. రామవియోగముచేత నీ తండ్రి మరణించినాడు" అన్నది. ఆమె దృష్టికి ఈ కోరిక చాల గొప్పదిగా అనిపించింది. కానీ, భరతునికి అది చాల కఠినంగా తోచింది. వెంటనే తల్లితో **"క్రూరురాలా! చెట్టును కొట్టి కొమ్మలను నాటడానికి ప్రయత్నిస్తున్నావు. ఇది బుద్ధిహీనుల లక్షణం"** అన్నాడు. అదేరీతిగా ఈనాటి మానవుడు దైవత్వమనే చెట్టును త్రుంచి, ప్రకృతి తత్వమనే కొమ్మలను నాటుతున్నాడు. భక్తి ప్రపత్తులు లేని సాధనలు మిక్కిలి హేయమైనవి. అలాంటి సాధనలు సత్ఫలితాలను అందించలేవు. మైత్రి, కరుణ, ముదిత, తితీక్ష అనే సద్గుణాలు లేకపోతే సాధనలు సంతృప్తిని, శాంతిని ఆనందమును అందించలేవు. కనుక, ఆధ్యాత్మిక సాధనలకు ముందుగా ఈ మూలసూత్రాలను అలవర్చుకోవాలి.

(స.సా.అ. 99 పు. 279/280)

అలవాట్లు

సాధనకు క్రమబద్ధమైన 'అలవాట్లు' ఆహార నిద్రా వ్యాయామాలలో పరిమితి అవసరం. ఉపవాసాలవల్ల బుద్ధి బలహీనమౌతుంది. వివేచనా శక్తి నీరసిస్తుంది. దేహమునూ బుద్ధినీ ఆత్మనూ సమానంగా పోషించుకోవాలి. ఇనుపకండరములూ, ఉక్కు నరములూ వుంటే కాని మీతలలో అద్వైత భావన నిలుపుకోజాలరు. విశ్వజనీన శక్తీ, శాశ్వత సత్యమూ మీరూ ఒకరే అనే భావన అద్భుత పరిణామాలు చేకూర్చగలదు. ఆ శక్తిలేనివారు దాస్యభావమును, ఆనుషంగిక పాత్రలను మాత్రమే ఊహించుకోగలుగుదురు. సత్యమును సత్యముగా అసత్యమును ఆసత్యముగా దర్శించుటకు స్పష్టమైన దృష్టి ధైర్యవంతమైన దృష్టీ అవసరం.

(వ.1963 పు.39)

అలెగ్జాండర్

(చూ॥ వట్టిచేతులు)

అవకాశం

దైవత్వము మానవాకారము ధరించినంత మాత్రమున అలక్ష్యంగా చూడటం మంచిది కాదు.

అవగాహన చేసుకో

చిక్కిన అవకాశము దక్కించుకొని దన్యులు కావటానికి కృషి చేయాలి. తిరిగి చిక్కేది కాదు .

చిక్కిన సాయిని వక్కలేయక చక్కచేసుకోండి.
పోయిన చిక్కదు పర్తీశుని పాదసేవయండి
భక్తిని పెంచి శక్తిని ఇచ్చి ముక్తి ఇచ్చునండి
ఏక మనసుతో నమ్మి సాయిని ఎంచి కొలవండి.
ఇతరుల మాటలు ఇంపుగ విని కొంప తీయకండి.
చెడుమార్గములో మీరు జీవితము నాశనము చేసుకోకండి.
అవకాశమును సద్వినియోగం చేసుకోండి. సన్మార్గములో ప్రవేశించండి. ఆనందమును అనుభవించండి. దివ్యమైన భారతదేశము. పవిత్రమైన భారతదేశము. భగవదవతారములు కలిగిన దేశము. పుణ్యభూమి. యోగభూమి, త్యాగభూమి అని లోకమునకు చాటండి. **ఈ విధమైన ప్రచారము చేయటమే మీ ప్రధానమైన సేవగా భావించాలి. సేవ అంటే** ఏమిటి? గ్రామాలు ఊడ్చటం, రోడ్లు వేయటము కాదు సేవ. **భగవత్సేవ సత్సంకల్పములు అలవరచుకుంటే అదే సేవ. భగవంతుని కేది ఇష్టమో దానిని మీరు అనుసరించండి.** భగవంతుడు కోరేది ఒక్కటే. ధన కనక వస్తువాహనాదులు కోరడు. నిర్మలమైన నిశ్చలమైన, నిస్వార్థమైన ప్రేమను మాత్రమే కోరుతున్నాడు. ఈ ప్రేమకు ఎంతైనా తిరిగి బదులు ఇస్తాడు భగవంతుడు. అయితే ప్రతిఫలము నిమిత్తము ప్రేమిస్తే అది వ్యాపారంగా మారుతుంది. 'ఓ భగవంతుడా! రెండు కొబ్బరికాయలు కొడతాను' అని కండిషన్ పెట్టకూడదు. భగవంతుడు కోరేది ఒక్కటే. అదే నిశ్చలమైన నిర్మలమైన ప్రేమ. ప్రపంచమే ఇందులో లీనమై ఉంటున్నది. ఆ విధమైన భావాన్ని మీరు అభివృద్ధి పరచుకొని, గోపి గోపాలుర భక్తి పవిత్రమైన భక్తిగా మీరు విశ్వసించి అందులో వేయింట ఒక భాగమైన మీరు అనుభవించటానికి కృషి చేయండి.

(భ. స. మ. పు.151)

(చూ॥ దివ్య ప్రకటనలు)

అవగాహన చేసుకో

సముద్రం నుంచి రత్నాలు గ్రహించదలచుకున్నవారు లోతుకు దిగి మునిగి వాటిని సేకరించాలి. ఒడ్డున నిలబడి లోతుకు పోకుండ సముద్రములో రత్నాలు లేవని, వాటిని గురించి విషయాలన్నీ అభూతకల్పనలనీ చాటించటం వల్ల లాభం లేదు. అల్లాగే అవతారమూర్తి ప్రేమానురాగాలు పొందగోరినవారు సాయితత్వం గాఢంగా అవగాహన చేసుకోవాలి. అందులో తలమునకలుగా తేలినప్పుడే నాతో ఏకీభావం పొందగలరు. నన్ను తమ హృదయాంతరాళాలలో స్థాపించుకోగలరు.

(స.ప్ర.పు.2)

అవతరించుట

అవతరించుట యనుటలో అర్థమేమి?
ప్రజలపై ప్రేమవాత్సల్య పరతతోడ
వారి స్థాయికి దైవంబు వచ్చు భువికి
జీవ ప్రజ్ఞతో బాటుగా దైవ ప్రజ్ఞ.

(శ్రీ. స.వా. పు.98)

అవతరించటం అనగా దైవము మానవస్థాయికి దిగి రావటమే. ఆ స్థాయికి దిగినంత మాత్రమున అవతార తత్వమునకు ఎట్టి కళంకము ఉండదు. ఆ అవతారములకు ఎట్టి విలువలు, ఏమాత్రమూ క్షీణించవు. దీని కొక ఉదాహరణ. చంటిబిడ్డ భూమిపై ఆడుకుంటూ ఉంటుంది. ఆబిడ్డ యొక్క తల్లి తాను పెద్దదాన్ని కదా! అని అహంకరించి ఆ బిడ్డతో "నీవు ఎగిరితే" నేను ఎత్తుకుంటాను అంటే? ఆబిడ్డ ఎగర గలదా? కాని, ఆ బిడ్డపైన ఉన్న ప్రేమతో ఆ తల్లియే వంగి బిడ్డను ఎత్తుకుంటుంది. కేవలము ఆ తల్లి వంగినంత మాత్రమున, ఆ బిడ్డకు, ఆ తల్లి లొంగిపోయినట్లవుతుందా? కాదు. **కాబట్టి, దివ్యస్థానాన్ని పొందలేని అశక్తులైన మానవులను అనుగ్రహించే నిమిత్తమై, దైవం మానవాకారమును ధరించి వారి స్థాయికి దిగి వస్తుంది.** దైవము మానవాకారమును

ధరించి, వాని స్థాయికి దిగి వచ్చినంత మాత్రమున ఆ అజ్ఞానికేవలం తన కోసమే లొంగి వచ్చినట్లుగా భావిస్తాడు. ఆ రీతిగా వచ్చుట **"వంగటమే"** కాని **"లొంగటం"** కాదు.

(శ్రీ.భ.ఉ.పు.112)

అవతారతత్వము

దైవము కూడా దేహధారి అవుతున్నాడు. మానవత్వము అవతారతత్వము సమానముగా గుర్తించినప్పటికినీ, అంతర్భావములందు వ్యత్యాసమున్నది. దేహదారియైన మానవుడు అపేక్షతో నిండి ఉంటాడు. ఫలాపేక్షతో కూడి ఉంటాడు. దేహధారియైన దైవత్వము నిరపేక్షతో నిండి ఉంటుంది. మమత్వముతో కూడి ఉంటుంది మానవత్వము. బ్రహ్మత్వముతో అర్థమయ్యేదేగానీ, దృశ్యములోగాని, ఆలకింపులతోగాని అర్థమయ్యేది కాదు. రాగద్వేషములకు అతీతమైనది; అభీష్టమమకారములకు దూరమైనది; నిరంతరము బ్రహ్మలక్ష్యమునందే **ఉండేది అవతార తత్వము**. ఇది ఎట్లనగా!

ఫిలుము రికార్డగు ప్లేటును చూచిన
ఒక్క రీతిగానే ఒనరియుండు
సొండు బాక్సు నందు సవరించి చూచిన
పదములెన్నో రీతుల పలుకుచుండు

అదే విధముగనే బాహ్యదృష్టిలో విషయంలో ఇరువురూ రెండుగా కనిపించవచ్చును. కానీ అంతర్భావములు వేరువేరుగా ఉంటాయి. **అవతారతత్వము పూర్ణత్వము. మానవత్వము శూన్యత్వము. కనుకనే మానవత్వమందు పూర్ణత్వమున్నదనే నత్యాన్ని గుర్తించినప్పుడు మానవత్వము దైవత్వముగా రూపొందుతుంది.**

(త.శ.మ.పు.267)

అవతార పురుషులు

తక్కిన బాలురతో పాటు రాముడు కూడా వశిష్టుని పాదాల చెంత కూర్చుని విద్యనభ్యసించాడు. కృష్ణుడు కూడా సుదాముడు మొదలైన మిత్రులతో కలసి సాందీపుని గురువుగా స్వీకరించి విద్యనభ్యసించాడు. నిర్గుణనిరాకార పరబ్రహ్మము, మానవాకృతి ధరించి భూమిపై అవతరించినప్పుడు, ఆ అవతారము యొక్క ప్రవర్తన తక్కిన వారికి ఆదర్శప్రాయంగా ఉండాలి.

(స.శి.సు.నా. పు.5)

అవతారపురుషులు కూడా అధ్యాపకుల వద్ద శిక్షణ పొంది, విద్య నేర్చి గురువుల ఆదేశానుబద్ధులై యుండవలెను. దైవ స్వరూపులైన వారు స్వతస్సిద్ధముగా సర్వజ్ఞులై యున్ననూ, వారు విద్యార్థులుగా వ్యవహరించి నంతకాలము విద్యార్థి విధులను, కర్తవ్యములను చక్కగా పాటించి ప్రపంచమునకు ఆదర్శముగా నుండెదరు. శ్రీరామచంద్రుడు వసిష్ఠ మహామునివద్ద, శ్రీకృష్ణుడు సాందీపని మహర్షివద్ద గురుకులవాసము చేసి విద్యనభ్యసించిరి. స్వామియూ, అదే విధముగా నాలుగు ఊళ్ళలో వుట్టవర్తిలో, బుక్కపట్టణంలో, కమలాపురములో, ఉరవకొండ స్కూళ్ళలో చదివారు.

(లీ.వా. సా.పు.49)

భూకంపములు, వరదలూ, అనావృష్టి, కరువులూ, అంటువ్యాధులు అటువంటి విపత్తులను ఎదుర్కొనగల దివ్యశక్తిని మానవులలో ఆవిర్భవింపచేయటమే ఇప్పుడు నేను కొనసాగిస్తున్న ఉద్యమము. తాత్కాలిక సమస్యలను పరిష్కరించటము, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించటమూ, ప్రజలకు **అలవరచటంద్వారా అవతారపురుషుడు రెండు విధాలుగా మానవజాతికి సాయపడగలడు.** తాత్కాలికమైన పరిష్కారము అన్నిటికీ మూలమైన కర్మసూత్రమునకు భిన్నంగా వర్తించవలసి వస్తుంది. ప్రజలలో అధికసంఖ్యాకులు స్వార్థముతో కోరికలతో కూడిన కర్మ సూత్రమునకు లోబడిన భౌతిక ప్రపంచంలో జీవిస్తున్నారు. తమ కర్మఫలమును అనుభవిస్తున్నారు. దీనినిబట్టి వారికి పురోగతికానీ, అధోగతికానీ లభిస్తున్నవి. **అవతార పురుషుడు** తాత్కాలిక సమస్యల పరిష్కారంలో జోక్యంకల్పించుకుంటే ప్రజల కార్యకలాపములు, అభ్యున్నతి, పరిణామమూ నిరోధించినట్లు అవుతుంది. సహజమయిన ప్రకృతి

అవతార ప్రకటనదినం

నియమాలకు ఆటంకం కలిగించే ఇటువంటి తాత్కాలిక పరిష్కారాలు పనికిరావు.

ఇంతకంటే ప్రయోజనకరమైన మార్గము ఇంకొకటి వున్నది. **అవతారపురుషుడు ప్రజల చైతన్యస్థాయిని పెంచి ఆధ్యాత్మిక సూత్రముల స్వరూపమును గుర్తింపజేయాలి. అప్పుడు ప్రజలు ధర్మమార్గమును అనుసరించి ఉత్తమమైన పరిస్థితులను ఏర్పరుచుకోటానికి దృఢసంకల్పముతో కృషిచేయుగలరు.** అప్పుడు వారికృషి ప్రకృతి నియమములతో కర్మ సూత్రములతో సమన్వయము పొందుతుంది. అప్పుడు వాళ్లు యీ కారణ కర్మల చక్ర పరిధిని దాటుకుని, ప్రకృతి శక్తులను వశపరచుకొని, యీ విపత్తులనుంచి తప్పించుకో గలుగుతారు.

సరిగ్గా వాళ్లు నా సంకల్పశక్తిలో భాగస్వాములౌతారు. నేను వాళ్ల ద్వారా పనిచేసి, వారిలో అంతర్గతంగా ఉన్న దివ్యత్వాన్ని మేల్కొలిపి, ప్రకృతిశక్తులను వశపరచుకునే విధంగా వున్నతమైన సత్యం వైపు వాళ్లని మళ్లించాల్సి వుంటుంది, అట్లాగాక, వున్నపాటుగా ప్రజ లీ స్థితిలోనే వుంచి, అన్నీ నేనే సరిచేసినట్లయితే, అన్ని వ్యవహారాలు ఆస్తవ్యస్తం అయి వెనకటి అసందిగ్ధ పరిస్థితి తిరిగి నెలకొంటుంది. కష్టాలు, బాధలూ దివ్యలీలలోని భాగాలే. ఇవి భగవంతుడు కల్పించేవి కావు. మానవులే తమ పాపకార్యాలకు ప్రతిఫలంగా వీటిని ఆహ్వానిస్తారు. ఇది మానవుని బాగుచేసే శిక్ష. దీనివల్ల మానవుడు దుర్మార్గాన్ని విడిచి, సచ్చిదానంద తత్వంవైపు పయనిస్తాడు. ఇదంతా మహాసమ్మేళనంలోని భాగం. దాన్లోని ప్రతికూలాలన్నీ అనుకూలాల్ని పెంచటానికి దోహదం చేస్తాయి. **మృత్యువువల్ల అమృతత్వం, అజ్ఞానం వల్ల జ్ఞానం, బాధలవల్ల సంతోషం, రాత్రివల్ల పగలూ విశేషంగా ప్రకాశిస్తున్నాయి.**

అందువల్ల, ఒకవేళ అవతారాలు యీ విపత్తులన్నీ తొలగించేటట్లయితే, కర్మసూత్రంలో కూడిన యీ సృష్టి నాటకమంతా ఆగి పోతుంది. అయితే అవసరం వచ్చినప్పుడు నేనేదైనా చెయ్యగలను. చేస్తాను. **కానీ, యీ ఆపదలన్నీ మానవుడు కల్పించేవే గాని, దేవుడు కల్పించేవి కావనిమాత్రం జ్ఞాపకం వుంచుకో. అందువల్ల మనిషిలోని అహంకారం తొలగించి, కర్మచక్రాన్ని అతిక్రమించే విధంగా అతనిలో చైతన్యం వికసించి, ప్రకృతిని వశపరచుకునే విధంగా దానిని పునర్నిర్మించాలి. ఇదే అవతారంయొక్క కార్యక్రమం.** దీన్నే నేనిప్పుడు అమలు పరుస్తున్నాను.

(స.ప్ర.పు.21/23)

(చూ॥ ఆత్మ/ఆత్మారామాయణము)

అవతార ప్రకటనదినం

"నేను సాయిని తెలియుము నిక్కముగను. మమత బాయుము, యత్నముల్ మానుకొనుము. బాసె నాకు మీ తోటి బాహ్యసంబంధమింక, కాదు నను బట్ట ఎటువంటి ఘనునకైన" అని అక్టోబరు, సామవారం 20 వతేదీన ఈ పలుకులు పలికినప్పుడు తమ్మిరాజు కుటుంబము, హనుమంతరావు కుటుంబము, భోజరాజు కుటుంబము, శేషమరాజు కుటుంబము వీరందరూ అనేక విధములుగా అడ్డుపడి "మీరు వెళ్ళకూడదు" అన్నారు. ఇది ఉరవకొండలో జరిగిన వృత్తాంతము. ఇక్కడ ఎటువంటిదైనప్పటికీ జీవప్రజ్ఞతో పాటుగా దైవ ప్రజ్ఞ అని, దైవప్రజ్ఞతో పాటుగా జీవప్రజ్ఞ అని ఈ దేహమునకు కొన్ని సంబంధములు దూరము కావలెనన్నప్పుడు ఒక ఆదర్శాన్ని ఒక వైరాగ్యంతో నిరూపించాలి.

ఉరవకొండలో ఉండగా బళ్ళారి నుండి మున్సిపల్‌ఛైర్మన్ రాంరాజు అనే ఆయన వచ్చి స్వామిని చూచాడు. అప్పుడు స్వామిని "రాజు, రాజు" అని పిలిచేవారు. రాంరాజు శేషమరాజును చూచి ఈ విధముగా ప్రార్థించాడు. "ఈ పిల్లవానిని హాలిడేస్ లోపల మా ఇంట్లో పెట్టుకుంటాము. బళ్ళారికి తీసుకొని పోతాము. అంతేకాదు. శేషమరాజూ! నీవు ఈ బాలుణ్ణి సామాన్యమైన సోదరుడిగా భావిస్తున్నావు. కాదు, కాదు. ఇతని ముఖవర్చస్సు పవిత్రత నా హృదయాన్ని కదిలించి, కరిగించింది. ఇతని లోపల ఏదో ఒక మహత్తరమైన దివ్య తేజస్సు కనిపిస్తోంది. నీవు వేరు విధముగా భావించి మోసపోతున్నావు, నీవు కూడా కొన్ని

దినముల పాటు అబ్బాయితో వచ్చి, మా ఇంట్లో ఉండు'' అని కోరినాడు.

మున్సిపల్ చైర్మన్ స్వస్థలము నుండి హంపికి మమ్ములను తీసికొని వెళ్ళినాడు. నేను చెప్పబోయే విషయం ఒక అతిశయోక్తి అని కాని, అహంకారమని కాని, మరొక విధమైన వర్ణన అని కాని భావింపరాదు. మాతో వచ్చిన వారందరూ విరూపాక్ష దేవాలయంలో ప్రవేశించినారు. ''నేను రాను'' అని చెప్పితే వారు నన్ను ఒత్తిడి చేయవచ్చును, కోపము పొందవచ్చును. ''నాకు కడుపులో సరిలేదు, నేను లోపలకు రాను'' అన్నాను. కాని రాంరాజునకు మాత్రం స్వామి చింతతప్ప అన్య చింతలేదు. కాబట్టి అనేక పర్యాయములు నన్ను చాలా వినయంగా లోపలికి రమ్మని కోరుతూ వచ్చాడు. అప్పుడు నేను చిన్నవాడి నైనప్పటికీ, **ఆ మున్సిపల్ చైర్మన్ వచ్చి "ప్లీజ్, ప్లీజ్, ప్లీజ్, రాజు, రాజు" అని బ్రతిమాలుకుంటూ "తప్పక మీరు రావాలి"** అని నా చేతులు గట్టిగా పట్టుకొని బాధపడ్డాడు. కాని నా గట్టితనాన్ని గమనించి, తా నింక ఎక్కువ తొందర పెట్టలేకపోయాడు.

ఆ విరూపాక్షుని గుడిలో పూజారి హారతి ఇస్తున్నాడు. ఆ సమయమందు ఆ గుడిలోపల **"అక్కడ విరూపాక్షుడు లేడు, కేవలం రాజు ఉన్నాడు"**. ఆ దృశ్యమును చూచేటప్పటికి శేషమరాజుకు చాలా కోపం వచ్చింది. తాను గుడిలోనికి రానని చెప్పి, ఎప్పుడో వెనకనుండి పోయి విగ్రహం వెనుక నుంచున్నాడు. ఇది ఎంత పొరపాటు. ఎంత తప్పు, అని అతనికి చాలా కోపము వచ్చింది. కాని రాంరాజు ఆ విధంగా భావించలేదు. **"విరూపాక్షుడే రాజు, రాజే విరూపాక్షుడు"** అనుకొన్నాడు. శేషమరాజు వెంటనే వెనుకకు వచ్చాడు. చూచాడు. నేను చెట్టుక్రింద కనిపిస్తున్నాను. ఆయనకు అనుమానం చాలా ఎక్కువ. రాజు నిజంగా ఆ గుడిలో ఉన్నదీ, లేనిదీ తెలుసుకునేందుకు మరి ఒకరిని పంపి, తాను మాత్రం చెట్టు క్రింద ఉన్న రాజు లోపలకు వెళ్ళకుండా చూస్తూ నిలబడినాడు. కాని రాజు గుడిలోనూ ఉన్నాడు, చెట్టు క్రిందనూ ఉన్నాడు. **పట్టరాని ఆనందముతో "రాజు అక్కడా ఉన్నాడు, ఇక్కడా ఉన్నాడు"** అని చాలా ఆనందించారు. ఈ విషయాన్ని తిరిగి నా దగ్గర చెప్పితే బాగుండదనుకొని, కేవలం తన మనస్సులో ఉన్న ఆవేదనే, ఈ రీతిగా కని పించినదని శేషమరాజు భావించాడు. అక్కడ నుండి నేరుగా నన్ను బళ్ళారికి తీసుకొని వచ్చారు. బళ్ళారిలో నేను కొన్ని దినములు ఉండి నప్పుడు ఆ మున్సిపల్‌చైర్మన్, ఆఫీసర్స్ అందరిని స్వామికి పరిచయం చేయడం చూచి, ''ఈ మున్సిపల్ చైర్మన్ ఈ చిన్న పిల్లవానిని ఎందు కింత గౌరవిస్తున్నాడని'' కొంత మంది హాస్యాస్పదం చేశారు.

నేను బళ్ళారి నుండి తిరిగి వచ్చే సమయానికి ముందుగా నాకు ఒక చిన్న నిక్కరు, ఒక షర్టు ఆ మున్సిపల్ చైర్మన్ కుట్టించాడు. అప్పటికి నా వయస్సు కేవలం 14 సంవత్సరములు మాత్రమే. ఇప్పుడే ఇంత ఎత్తుగా ఉన్నానంటే, అప్పుడు ఇంకా ఎంత చిన్నగా ఉండేవాడిని? 50 సం॥ పూర్వము యువకులందరికీ ఒక విధమైన ఫ్యాషన్ ఉండేది. ''కాలర్''కు ఒక పిన్ను వేసుకొనేవారు. అది "కాలర్‌పిన్ను'' అనేటటువంటిది. ఇప్పుడా కాలర్‌పిన్ ఎక్కడా కనిపించుటలేదు. కాని ఆనాడు కాలర్ పిన్ పెట్టుకొనేవారిని ఒక ఉన్నతమైన స్థానమునకు చెందిన వారుగా భావించేవారు. ఒక్క గంటలోపలనే అతడు కంసాలి దగ్గరకు పోయి **"గోల్డ్"తో "కాలర్ పిన్" చేయించుకొని వచ్చి, నా కాలర్‌కు తగిలించాడు. "రాజు! ఈ పిన్నును చూచి నప్పుడల్లా, నేను నీకు జ్ఞాపకము రావాలి" అని చేతులు పట్టుకొని ప్రార్థించాడు.**

ఊరవకొండలో బస్సు దిగి, ఇంటికి వచ్చాము. రెండవ దినమే స్కూలు ప్రారంభము. **నేను స్కూలుకు వెళ్ళుతున్నాను. మార్గమధ్యములో కాలర్ పిన్ పోయిన తక్షణమే ఒక బంధన వీడింది అన్నాను.** అప్పుడు నే నొక పాట ఈ విధంగా పాడినాను. **"అక్టోబరు సోమవారం, 20వ తేదీ, హంపి నుండి వచ్చి స్కూలు కరుగుచు బాబా"కాలర్ పిన్కొ"కటి జారి కనపడలేదు. మార్పు**

కలిగెను నాడు. ప్రాపంచిక సంబంధము "పిన్నై" తొలగెన్, క్షేత్ర దర్శనము కూడా చెల్లెను. హంపిన్. మాయ తొలగెనని గృహమును వీడెను''. అనాడే గృహాన్ని విడిచి పెట్టినాను. ఇదొక మాయ, అనగా ప్రాపంచిక సంబంధమైన వస్తువులే ఒక మాయ. వీనాడు ఈ వస్తువులు మననుంచి విడిపోతాయో, ఆ నాడే మాయ తప్పడం.

ఆనాడే వెళ్ళి ఆంజనేయుని గృహ మందున్న ఒక పెద్ద గుండుపైన కూర్చున్నాను అత డొక ఎక్సైజు కమీషనరు. స్వామిని చూస్తే ఆయనకు కూడా, ఏమో తెలియనటువంటి ఆధ్యాత్మిక భావనలు కలుగుతుండేవి. నేను స్కూలుకు వెళ్ళే త్రోవలోనే వారి యిల్లు. నా కోసం కాఫినో, పకోడానో, ఏదో చేసి పెట్టుకొని, వారింటి ద్వారము దగ్గర ఆయన, ఆయన భార్య కాచిపెట్టుకొని ఎదురు చూస్తుండేవారు. నేను చిన్నగా వారి ద్వారములోనికి ప్రవేశించే టప్పటికి వారిద్దరూ నాకాళ్ళు పట్టుకొని నమస్కారము చేసేవారు. "సార్! మీరు పెద్దవారు. ఈ విధంగా చేయకూడ''దని ఎంతో చెప్పేవాడిని. **"రాజు! కేవలం వయస్సులో మేము పెద్దవాళ్లుగా ఉంటున్నాము. కానీ జ్ఞానములో చాలా అల్పులుగా ఉంటున్నాము. నీవు సాక్షాత్తు కృష్ణుడవే",** ఈవిధంగా వాళ్ళు వర్ణించేవారు. అందరి ఎదుట ఆ రీతిగా వర్ణిస్తే వారేదైనా హాస్యము చేస్తారేమో అని, నన్ను ఒంటరిగా పిలిచి చెప్పేవారు.

ఈ 20వ తేది అక్టోబరు సోమవారము. ఆనాడు ఎక్కడికీ పోలేదు. స్కూల్‌నకు పోలేదు. ప్రతి దినము ఆ స్కూలులో నేనే ప్రార్థన చేసేవాడిని. సర్వ మత సమన్వయంతో కూడిన ఒక ప్రార్థన చేసేవాడిని. **"అహరహ తవ ఆహ్వాన ప్రచారిత, సునిత ఉదారవాణి హిందు, బౌద్ధ, సిక్, జైన, పారసీక, ముసల్మాను, క్రిస్తానీ".** ఈ పిల్లవా డేమిటి? అని టీచర్లు విసుగుపడేవారు. ఆనాడు స్కూలునకు పోకుండా ఉండుటచేత ఎక్కడ రాజు? ఎక్కడ రాజు? అని ఒక పెద్ద విచారణ ప్రారంభమయింది. పిల్లలెవరూ ప్రార్థనలో లేరు. అందరూ ఆ అంజనేయుల గృహానికి పరెగెత్తుకొని వచ్చారు. ఎవ్వరినీ నేను చూడలేదు. ఒక గుండుపై నేను ఊర్కే కూర్చున్నాను. "ఏదో మార్పు కలిగింది. లేక మతిభ్రమ కలిగింది, హంపి నుండి రావడం చేత ఇంట్లో ఏమైనా జరిగిందేమో''నని పిల్లలు ఒక్కొక్కరు ఒక్కొక్క రకంగా ఊహిస్తూ వచ్చారు. "నే నెవరో మీరు ఫోటో తీసుకోండి'' అని చెప్పాను. **ఆ ఫోటో తీసుకుంటే, నా ముందు షిర్డీ బాబా ఉంటున్నాడు ఫోటోలో. ఆనాడు సాయిబాబా అంటే ఎవ్వరికీ ఏమీ తెలియదు. ప్రార్థనచేసి మీరు స్కూలు ప్రారంభించండి అని చెప్పాను.**

ఇంతలోపలనే, యింత మార్పు కలిగిందని **శేషమరాజు పుట్టపర్తికి టెలిగ్రాం ఇచ్చాడు. టెలిగ్రాం చూసుకొని వాళ్ళందరూ వెంటనే పరుగెత్తుకొని వచ్చేశారు.** అక్కడ ఉండకూడదని, పుట్టపర్తికి తీసుకొనిపోవాలని వారంతా వచ్చారు. ఆనాడు బుక్కపట్టణము వరకు బస్సులు లేవు. కేవలం పెనుగొండ వరకు మాత్రమే బస్సు ఉండెడిది. అక్కడ నుండి పుట్టపర్తికి రెండెడ్ల బండిలో రావాలి. ఆనాటి పరిస్థితి ఈ విధంగా ఉంటున్నది. ఈ పిల్లలంతా మేము కూడా రాజుతో వస్తామని బయలుదేరినారు.

ఇక్కడ ఒక విచారకరమైన సంఘటన జరిగింది. పాఠశాల యందు తరగతి గదిలో నేను కూర్చునే బెంచిలో ఒక శిరస్తదార్ కుమారుడు, **ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుమారుడు కూర్చునేవారు. నేను మధ్యలో కూర్చునేవాడిని, వారిరువురు నాకు ఇరువైపులా కూర్చొనేవారు.** ఈ విధంగా నాయొక్క దర్శన స్పర్శన, సంభాషణలచేత, వారియందు అధ్యాత్మిక భావము అభివృద్ధి చెందినది. నేను బస్సు ఎక్కుట చూచి, శిరస్తదార్ కుమారుడు **"రాజు నుండి దూరమైపోతున్నానే" అనే బాధ భరించలేక వెళ్ళి బావిలో పడి మరణించాడు.** ఇంక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుమారుడు ఎల్లప్పుడూ "రాజు, రాజు, రాజు'' అని కలవరిస్తూ, నిద్రాహారములు త్యజించి, పిచ్చి పట్టి మరణించాడు. ఇది ఒక ఆధ్యాత్మిక భావనలో కలిగే ఉన్మత్తత.

మా స్కూలులో **లక్ష్మీపతి అనే హెడ్‌మాస్టర్ ఉండేవాడు. ఆ లక్ష్మీపతి నేను స్కూలుకు వచ్చిన తక్షణమే నన్ను అతని ఆఫీసుకు రమ్మని చెప్పేవాడు.** నేను లోపలికి

వెళ్ళిన తక్షణమే తలుపులు వేసేవాడు. నన్ను తన కుర్చీలో కూర్చోమని చెప్పేవాడు, తాను నా పాదాల చెంత కూర్చుని ఒత్తేటటువంటి వాడు. "సార్! మీరు ఈ విధంగా చేయకూడదు" అని అమాయకుడిగా అతనితో చెప్పేవాడిని. నన్ను చూచి లక్ష్మీపతి ఈవిధంగా అనేవాడు. "ఇవన్నీ నీకు తెలియదు. నాకు తెలుసు. నీలో ఒక పెద్ద శక్తి ఉన్నది"అని పల్కేవాడు. ఆనాడు ఉరవకొండలో యిన్ని విధములైన అలజడులంతా జరిగిపోయినాయి. **కాబట్టి ఈ అక్టోబరు 20వ తేది అంటే, ఆ ఉరవకొండకు పూర్తిగా మార్పు తెప్పించిన దినము.** అంతేకాదు విద్యార్థులందరిలోనూ గొప్ప మార్పు కలిగింది. వారి ఆప్యాయత, ప్రేమతత్వము, నాపైన ఎంత పెరిగిందంటే ఒక చిన్న ఉదాహరణ చెపుతున్నాను. నేను స్కూలు విడిచి వచ్చిన రెండవ దినం, క్రొత్త పిల్లవాడు ప్రేయర్ ప్రారంభించినాడు, ఇంతలో స్వామి జ్ఞాపకము వచ్చి, గట్టిగా ఏడ్చేసాడు. ఆ పిల్లవాడు ఏడ్చేటప్పటికి అందరూ ఏడ్చేసినారు. ప్రేయర్ అంతా ఏడుపుకింద మారిపోయింది. "ఇంక ప్రేయర్ వద్దు! లోపలికి పోదాం పదండి"అన్నాడు- **ఇదే మన ప్రేయర్ అతని నిమిత్తమై ఏడ్చినటువంటి ఏడ్పే మన ప్రేయర్. ఆనాటితో, ఆ రూముకు పూర్తిగా తాళం వేసి, ఒక పెద్ద "షోరూం"గా తయారు చేసుకొన్నారు.**

(స.సా.న. 90 పు.299/303.)

అవతారము

భగవంతుని అవతారములకు అంతులేదు. లెక్కలేనన్ని అవతారములు; అందులో కళావతారములు కొన్నియు, అంశావతారములు కొన్నియు, ఆవేశావతారములు కొన్నియు, యుగావతారములు కొన్నియూ ఈ విధముగ మొదలుకొని వివిధ నామములతో అవతరించుచుండును. **యుగావతారము యొక్క కథా శ్రవణమునకే, భాగవతసేవ అని అందురు. భక్తుల యొక్కయు, భగవంతుని యొక్కయు, లీలా నాటకమైనది భాగవతము.** కనుక అట్టి శ్రవణము ఆత్మ సాక్షాత్కారమునకు మూలాధారమని భావించి, అనేకమంది మహాఋషులు భాగవతశ్రవణమునకు ఇంతటి పవిత్ర స్థానమును భావసారమును కలిగించిరి అందించిరి.

(భా.వా. పు. 3)

అవతారములలో కొన్ని అంశావతారములు, కొన్ని పూర్ణావతారములు. అవే కాక ఆదేశావతారములు కూడా కలవు. వారే నారద, సనత్కుమారులవంటి మహాత్ములు. ఈశ్వర సమస్తగుణములూ వారలకు లేవు. కనుక వారలను ఆరాధించరు. **జీవుడు స్వభావముచేత నిత్యుడు అనగా అద్యంతరహితుడు. జనన మరణములు లేనివాడు. స్వప్రకాశకుడు. జ్ఞానమును, జ్ఞాతయును, భోక్తయును, కర్తయునూ అతడే.** బంధమోక్షముల రెండింటి యందును ఈ గుణములు జీవునకుండును. ఏమైననూ జీవుడు ఈశ్వరునివలె స్వతంత్రకర్త కాడు. ప్రతి కర్మమునందూ ఆత్మ, శరీరము, నానా ప్రకారములగు శ్రోత్రాదులగు ఇంద్రియములు ప్రాణాపాదులైన వివిధ చేష్టలు, దైవమును కలిసియున్నవి. ఏమైననూ జీవుడు సంకల్పరహితుడుగా వ్యవహరించు యంత్రము వంటివాడు కాడు. పూర్వజన్మమందలి కర్మములు ప్రస్తుత జన్మమందలి కర్మములనూ నిర్ణయించునట్లు ప్రస్తుత కర్మల వలన కర్త యగు జీవుడు భవిష్యత్తును రూపొందించుకొన గలడు. ఈశ్వరుడు వాని స్వభావానుసారముగా నిర్ణయించును. వాని స్వభావాలను మార్చుశక్తి ఈశ్వరునికున్ననూ, తానట్లు చేయడు. జీవుని స్వతంత్రేచ్ఛకే ఈశ్వరుడు వదలును. శిలాశకలము, శిలయందు భాగమైనట్లు జీవుడు ఈశ్వరుని యందు భాగము కాడు. ఒక విషయమున జీవ జగత్తులు రెండును బ్రహ్మముకంటె భిన్నములు. మరొక విషయమున బ్రహ్మముతో అభిన్నములు. ఈ భేదాభేదసంబంధము బుద్ధికి తోచునది కాదు. శ్రుతుల వలన మాత్రమే వేద్యమగు చున్నది. ఇది పరమార్థవాహిని ప్రధాన సారము.

(స.సా.న.78పు196)

మీరందరూ అవతారులే రక్తమాంసములతో కూడిన ఈ శరీరమును కవచమును ధరించిన దివ్యతత్వములే.

అయితే అది మీకు తెలియదు. జన్మాంతర కర్మల ఫలితముగా ఈ శరీరములలో మీరు తరించేరు. అయితే నేను నా సంకల్పముతో ఈ శరీరము స్వీకరించినాను. మీరు మీ శరీరములతో త్రిగుణములను త్రాళ్ళతో బంధింపబడ్డారు. నేను గుణాతీతుడను, బంధ రహితుడను. మీరు కోరికలతో ఇటూ అటూ చలిస్తారు. మిమ్మల్ని కోరికలు లేని నిశ్చల స్వభావులను చేయవలెనని కోరిక తప్ప నాకు కోరికలు లేవు.

కాలకరణ వ్యవధానములను శృంఖలములచేత బంధించబడిన దైవత్వమే మానవుడు "నీవు నీ ఆత్మతత్వమును ప్రకటించిన క్షణమందే నీవు భగవంతుడవయ్యెదవు మీరు ప్రతి ఒక్కరూ ప్రత్యగాత్మను పరమాత్మలో లీనము చేయగలిగినపుడు భగవత్స్వరూపు లగుదురు.

(స.శి.సు.తృ.168/169)

ప్రతి అవతారమునకు **రెండు కారణాలు వుంటున్నాయి. ఒకటి భక్తుల ప్రార్థనలు, రెండవది దుర్మార్గుల యొక్క చేష్టలు.** ఈ రెండింటి ఏకత్వము అక్కడ చేరాలి. ఇప్పుడు చిన్న ఉదాహరణము: **ప్రహ్లాదుడు నిరంతరము హరినామము చింతస్తూ వచ్చాడు. హరిప్రీతి కల్గినవాడు ప్రహ్లాదుడు.** అతని తండ్రి హరిద్వేషి. దుర్మార్గుని ద్వేషము,సన్మార్గుని భక్తి చేరికవలననే నరసింహుని అవతారము వచ్చింది. మంచి చెడ్డలు రెండూ ఏకం కావాలి. కేవలం ప్రహ్లాదుడు "ఓం నమో నారాయణాయ" అంటే అతనినే రక్షిస్తూ వచ్చాడు. అయితే అతనిని రక్షించడానికి కారణం ఏమిటి? అతడిని ఏ చిక్కులలో ఉంటే రక్షించాడు. తండ్రి పెట్టే బాధలే భరించుకోలేనప్పుడు భగవంతుడు రక్షిస్తూ వచ్చాడు. తండ్రి పెట్టే బాధలు ప్రహ్లాదుని రక్షగా మారిపోయాయి. అతని ద్వేషమే ఇతనికి భగవంతుని యొక్క సన్నిహిత సంబంధ బాంధవ్యము, కూర్చినది. దైవత్వములో అనేక రహస్యాలు కూడి ఉంటాయి.

(భ.స.మ. పు. 42)

అవతార పురుషులకు జన్మాంతర పుణ్యపాప కర్మలు లేవు. సామాన్యమైన **మానవ దేహములకు కలిగిన కారణములు అవతార పురుషులకు లేవు. పాపాత్ముల పాపములు పుణ్యాత్ముల పుణ్యములు రెండునూ చేరే లీలా జన్మకు కారణమగును.** ఉదాహరణమునకు ఒకటి చూడుడు. నరసింహావతారమునకు కారణమేమి? హిరణ్యకశిపుడు చేసిన పాపకర్మ, ప్రహ్లాదుడు చేసిన పుణ్యకర్మలే కదా! ఈ రెండూ చేరే కదా నరసింహుడు అవతరించుటకు తోడ్పడినది. అటులనే, అవతార పురుషుల జన్మలకు కారణములను వెదుకనక్కరలేదు. అవతార జన్మముల ద్వారా ధర్మాత్ములు సుఖపడుదురు. పాపాత్ములు దుఃఖపడుదురు. తన జన్మకు, ప్రత్యేకించిన పుణ్య పాపకర్మలు కారణములు కావు. తనకాయముతో తనకు దుఃఖము కాని సుఖము కాని లేదు. అవతార జన్మలకు వెనుకజన్మ కారణముకాదనియూ, దానికి పంచ భూతముల యొక్క వికారములు లేవనియూ, ఇది చిన్మయస్వరూపమే కాని మృణ్మయము కాదనియు, అహంకార మమకారములు అందులో లేశమాత్రమయినా నిలువలేవనియు, అవిద్యావరణము అవతారములందు కానరాదనియు, సామాన్య మానవులవలె లోకులు తరించిన అది కేవలము అజ్ఞాన దోషమేననియు, కృష్ణుడు చెప్పెను.

(గీ.పు. 63)

మానవుని జన్మము ఎన్నో జన్మలపై ఆధారపడి యుంటుంది. అయితే దైవము మానుషాకారము ధరించటానికి ఏ కర్మ ఆధారము? దైవమునకు ఎట్టి కర్మలు లేవు. అవతారమునకు దుష్టులు చేసికొన్న దుష్కర్మలు - సజ్జనులు చేసికొన్న సత్కర్మలు ఆధారము. సజ్జనులు చేసికొన్న సత్కర్మలే కారణము. ఈ యిరువురి వలన అవతారము వస్తుంది. నృసింహావతారమునకు కారణము హిరణ్యకశ్యపుడు చేసిన దుష్కృత్యములు. ప్రహ్లాదుడు చేసిన సత్కర్మలు. **కాని దైవ భౌతిక కాయమునకు కర్మలు ఆధారము కాదు.** దైవము తన కాయమును ఏవిధముగానైనా మార్పు చేసికొనవచ్చును. దీనిని నిర్ణయించడ మనేది ఎవరితరము కాదు. ఇది

అంతా సంకల్ప బలము. దైవత్వమును అర్థము చేసుకోటానికి కేవలము మానవత్వమును ఆధారము చేసికోవడం వలన సాధ్యము కాదు. ఇటువంటి **పవిత్రములైన ప్రబోధములు హృదయానికి హత్తుకునేటట్లుగా బోధించి దివ్యాత్మజన ఆత్మతత్వాన్ని సందర్శింపచేసి కొనుటకు గురువు అత్యంత అవసరము.** నిజముగా గురువన్నవాడు, కంటి డాక్టరు వంటి వాడు. కంటి డాక్టరు కంటి పొరను తీసివేసి పూర్వపుదృష్టిని తీసుకువస్తాడు. అదేవిధముగా అజ్ఞానము అనెడి పొరను తొలగించి పూర్వమున్న సహజజ్ఞాన దృష్టిని కలిగించాలి. ఇదే యీనాడు చేయవలసిన పని. **"గురు" అనే పదములో "రు" కారము అంధకారమును తెలియ చేస్తుంది. "గు" కారమనగా అజ్ఞానమును దూరము చేస్తుంది. అది అర్థము. అజ్ఞానము దూరముచేసి ప్రజ్ఞానమును ప్రకటింపచేసేవాడు గురువు.** చంద్రుడు పూర్ణముగా ప్రకాశించినపుడు పూర్ణిమ అని చెప్పుకుంటున్నాము. అదేవిధముగా **మనస్సు పూర్ణత్వాన్ని పొందిన రోజు గురుపూర్ణిమ.** పూర్ణిమ కొంతకాలము వుంటుంది. కాని బ్రహ్మజ్ఞానం అట్లు కాదు. మానవుడు ఈ 3 విధములైన తత్వాలు అర్థం చేసికోవాలి. **(1) అజ్ఞానం - ఒకతూరి పోయెనా మరలరాదు. (2) బ్రహ్మజ్ఞానము - ఒకసారి వచ్చెనా మరలపోదు. (3) ఆత్మతత్వమే పూర్ణత్వము - రాదు - పోదు.**

(సా. పు 520, 521)

"అవతారముయొక్క కార్యక్రమంలో ప్రతి అడుగూ ముందే నిర్ణయింపబడి ఉంటుంది. రాముడు సత్యధర్మాల వేళ్ళను పోషించడానికి వచ్చాడు. కృష్ణుడు ప్రేమను శాంతిని పెంపొందించడానికి వచ్చాడు. ఇప్పుడా నాలుగూ ఎండి పోయే ప్రమాదం సంభవించింది. అందుచేతనే ఈ ప్రస్తుతావతారం వచ్చింది. అరణ్యాలకు పారిపోయిన ధర్మాన్ని తిరిగి పల్లెల్లోకి పట్టణాల్లోకి తీసుకొనిరావాలి. అంటే, పల్లెలను పట్టణాలను **నాశనం చేస్తున్న అధర్మపరులను అడవులకు తరిమివేయాలి."**

(లో.పు.89)

రామావతారమునందు మానవ ధర్మం నిమిత్తమై తాను అనుభవించి, ఆచరించి అన్యులకు అందిస్తూ వచ్చాడు. సామాన్య మానవునివలె ప్రవర్తిస్తూ తన ఆచరణ ద్వారా దైవత్వాన్ని ప్రకటిస్తూ వచ్చాడు. కృష్ణుడు అట్లా కాదు. ఆదేశంగా తాను తీసికొని, బోధించడంలో మానవత్వానికి తగినట్లు విశిష్టతను కల్పించాడు. కనుకనే **'రాముడు చేసినట్లు చెయ్యి', 'కృష్ణుడు చెప్పినట్లు వినుఁ' రామునకు పనిముందు, నువ్వు వెనుక, కృష్ణునకు నువ్వు ముందు పని వెనుక. అందుచేత కృష్ణుడు స్త్రీలను ఏడిపించాడు. రాముడు స్త్రీల నిమిత్తము పరితపించాడు.** అందుచే వారి చర్యలు విరుద్ధంగా కనిపిస్తాయి. దేశకాల ప్రభావములను పురస్కరించుకొని, వారు అవతరించడం జరిగింది.

రామావతారము సత్యధర్మములు తాను ఆచరించి యితరులను ఆచరింప చేయుటకు వచ్చింది. కృష్ణావతారం, ప్రేమ శాంతులను ఉద్ధరించుటకు వచ్చింది. అసలు అవతారాలు ఎందుకు వచ్చాయి? భాగవతం సప్తమ స్కంధంలో శుకమహర్షి పరీక్షితునకు బోధించాడు. వైకుంఠుడు దేవతలను ఎందుకు రక్షించాలి. రాక్షసులను ఎందుకు శిక్షించాలి? విష్ణుమూర్తి వ్యక్తుడు గాడు, గుణములు లేవు. ప్రకృతికి చెందడు. భావముల నొందడు. కాని పరమేశ్వరుడు తన మాయవలన ఆయన గుణముల నాదేశించి, బాధ్య బాధకత్వముల నొందును. అతడు గుణరహితుడు. సత్వరజ, తమములు ప్రకృతి గుణములు. ఆ గుణములకు ఒక్కొక్క కాలమున హానివృద్ధులు గలవు. **ఆ ఈశ్వరుడు సత్యమున దేవ ఋషులను, రజోగుణమువలన అసురులను, తమోగుణము వలన యక్షరక్షో గణములను విభజించెను.** ఆ విభుడు సర్వగతుడయ్యెను. భిన్నుడు గాడు, జీవాత్మకు పరుడైన సర్వమయుడు. తన మాయచేత విశ్వమును సృజింపగోరి, రజమును క్రీడింపగోరి, సత్యమును నిద్రింపగోరి తమమును నుత్పాదించి, చరాచరమైన కాలమును సృజించును. ఆ కాలమున సర్వదర్శనుడైన ఈశ్వరుడును కాలాయ్యుండునునై, హరి సత్వగుణమైన వృద్ధియు,

రజస్తమో గుణంబులైన రాక్షసులకు హాని చేయుచుండును. తత్త్వవిదులైన పెద్దలు, తమలో పరమాత్మ స్వరూపములో వున్న ఈశ్వరుని, సర్వగతుండయ్యును భిన్నుడు గాడని ఎరుగుదురు. హరిద్వేషుడైన శిశుపాలుని కృష్ణుడు చక్రముచే చంపగనే అతని తేజస్సు కృష్ణునిలో చేరెను. ఆశ్చర్యమే! **దూషణ భూషణ తిరస్కారములు శరీరమునకు గాని పరమాత్మకు లేవు**. శరీర అభిమానము చేత వాక్పారుష్యములు శరీరమునకు గాని పరమాత్మకు లేవు. శరీర అభిమానము చేత వాక్పారుష్యములు హింసయై తోచు తెరంగును నేను నాయది యనియెడు వైషమ్యమును భూతములకు శరీరమునందు సంభవించును. **సర్వభూతాత్మకుడైన ఈశ్వరునికి వైషమ్యము లేదు. అందుచే హరిని చేరేటందులకు అలుకనైనా, చెలిమినైనా, కామంబునైనా, బాధమునునైనా, భీతినైనా, అఖిలాత్ముడైన హరిని చేరవచ్చును. హరి కాదనడు.** అందుచేతనే గోపికలు కామముతోను, కంసుడు భయముతోను, విరోధముతో శిశుపాలుడును, బంధువులై వృష్ణులు, ప్రేమతో పాండవులు, భక్తితో మునులు, సేవాతిరేకముగల చిత్తము చేత ఎవ్వరైనను హరిని చేరవచ్చును. ఎతావాతా **రామ, కృష్ణ అవతారములు వేరువేరుగా కనబడినప్పటికిని, వారు చేసిన కర్తవ్యము ఒక్కటే. వారిలో చేర్చుకొనడమే.**

(సా. పు 79, 80)

దేహధారి అయిన నేను అవతరించి ఈ లోకమున ఆచరించు కృత్యములు యేవో చెప్పెద వినుమన్నాడు. అవి సాధువులను రక్షించుట, దుష్టశిక్షణ, ధర్మోద్ధరణ. సాధువులనగా సామాన్యమానవుల దృష్టియందుండు సాధుసన్యాసులు కారు. సాధుగుణము ప్రతి ప్రాణి యందునూ అనగా క్రిమి కీటకములందు సహితము కలదు. సూక్ష్మముగా చెప్పవలెనన్న, నత్వగుణపోషణే సాధుసంరక్షణ. ఇట్టి పవిత్రగుణము పరమపురుషుల యందు ప్రధాన పాత్ర వహించియుండును. కనుక సాధురక్షణ అనగానే సామాన్యముగా సన్యాసుల రక్షించుట కని తలంతురు. సత్వగుణాభివృద్ధికి యెవరు ప్రయత్నింతురో సదాచార పరాయణులయి, సత్సీల వంతులై, సత్యవాక్పరిపాలకులయి, సర్వేశ్వర సాన్నిధ్యాభిమానులై, సద్ధర్మ పరాయణులై, సర్వజనసమాన ప్రేమ కలవారయి యందురో అట్టి వారందరూ సాధుసంతతివారు. అట్టి **సాధుత్వము పశువునందునూ పక్షియందునూ మృగము నందునూ కలదు. అందువలననే రామాయణ మందు జటాయువును రక్షించెను; గజరాజును కాపాడెను; కోతులను అనుగ్రహించెను ఉడుతను ప్రేమించెను.** ఇవన్నియూ సాధుత్వము కలిగినవేకదా! **కంఠమాల ధరించి కాషాయము కప్పి దండము పట్టినంత మాత్రమున సాధువు కాజాలడు.** వేషభాషలకంటె సుగుణ స్వభావమే సాధుత్వమునకు ముఖ్య లక్షణము, సమస్త జీవులందునూ సాధుత్వమనుగుణము కలదు. కనుక లోకసంరక్షణే, ప్రధాన సాధుపోషణ అని తలంచవలెను.

ఇక, దుష్టశిక్షణ యెవరిని? **యేయే జాతి జీవులకు నియమించిన హద్దులను దాటి అక్రమ ప్రవర్తనలతో అన్యాయ అనాచార ఆలోచనలతో, అహంకార ఆవేదనలతో క్రమమును తప్పి సంచరించుదురో అట్టివారిని శిక్షించుట అనగా రజో తమోగుణ బలిష్ఠులను. దయా ధర్మ దమములు లేనివారలను శిక్షించుట. ఇక ధర్మరక్షణ.** ఈ మూడు విధములైన ఆచరణలే తన అవతార లక్షణమని శ్రీకృష్ణపరమాత్మ తన అవతార ధర్మమును అర్జునునకు చెప్పెను.

(గీ.పు.63/64)

"ప్రతి అవతారమునకు కొన్ని నియమనిబంధనలుంటాయి.
వాటిని ఆ అవతార పురుషుడు అతిక్రమించడు.
మానవమాత్రులు భగవంతుని లీలలను ఆర్థము చేసికొనలేరు".

(భై. ది. పు. 319)

ప్రదర్శించే మహిమలు, అద్భుతాలు సహజంగా వాటంతట అవి వ్యక్తమయ్యే అవతారాల చిహ్నాలు :

"రమయతీతి రామః" రమింప చేసేవాడు అనగా ఆనందాన్ని కలుగ చేసేవాడు రాముడు. అందరినీ ఆకర్షించేవాడు కృష్ణుడు. ప్రతిహృదయాన్ని ఆనందింప చేయటానికి,

ఆకర్షింప చేయటానికి నేను ప్రతి పనినీ మీ పరిభాషలో అద్భుతాలు, మహిమలు అంటున్నారు. **మానవాళిని సంస్కరించి, పునర్నిర్మాణం చేయటం అవతారం యొక్క ముఖ్యలక్షణం. నేను చేసే ప్రతి చర్య, ప్రతి మహిమ ఈ లక్ష్యాన్ని నెరవేర్చి ఫలితాన్ని సాధిస్తుంది. "చమత్కారము" యొక్క లక్ష్యము మానవ జాతి సంస్కారము.** ఈ మానవ జాతిని సంస్కరించుట అనబడే లక్ష్యమును ఈ అవతారం ఏ విధంగా సాధిస్తున్నది?

అద్భుతాలకు, మహిమలకు ఆకర్షించబడిన ప్రజలు నా పట్ల ప్రేమతో సన్నిహితులౌతారు. నేను పంచే ప్రేమతో వారు జీవులన్ని ఒక పరమాత్మ అంశాలన్న విషయాన్ని గుర్తించి అందరికీ తమ ప్రేమను పంచటం గురించి తెలుసుకుంటారు. ఆ ప్రేమ పరోపకారంగా మారుతుంది. ఫలితంగా వారి మనస్సులు ప్రక్షాళనమై, పవిత్రమై, వారి బుద్ధి వికసించి హృదయం నిర్మలమవుతుంది. అప్పుడు వారు తమ నిజతత్వమైన ఆత్మతత్వమును గుర్తించుతారు. విశ్వసృష్టికర్తయైన పరబ్రహ్మ మనబడే సాగరంలో తాము అలలవంటి వారమని, ఆ పరమాత్మ అంశమే తామని గుర్తించి మానవ జీవిత చరమలక్ష్యము, పరమ లక్ష్యము అయిన "సాక్షాత్కారమును" పొందగలుగుతారు.

(స.శి.సు.నా. పు. 56/57)

నేను ధర్మోద్ధరణకై వచ్చాను కాబట్టి సాధారణంగా నేను ఎప్పుడూ ధర్మం గురించే మాట్లాడతాను. నాకు ఇక్కడ వేరే పని ఏమీ లేదు. **నేను అజ్ఞానులకు పానకం, జ్ఞానులకు అమృతం ఇస్తాను. భగవంతుడు అవతారములను ఎత్తినది ఇక్కడ అయినప్పటికీ ధర్మం ఒక్క భారతదేశంలోనే తగ్గిపోతున్నదే అని భావించకండి. ధర్మం ఇక్కడ ఉన్నది కాబట్టే, ధర్మం గురించి ఇంకా అధ్యయనం జరుగుతున్నది. కాబట్టే ధర్మానికి ఇక్కడ విలువ ఉన్నది కాబట్టి అవతారపురుషులు ఇక్కడ అవతరించటం జరుగుతున్నది. మిగిలిన ప్రపంచమంతా ఈ మహావృక్షపు శాఖలు మాత్రమే.** నాకు స్వదేశమని, పరదేశమని లేనేలేదు. మానవాళి మొత్తాన్ని ధర్మమార్గంలోకి తీసుకు రావాలి. వేదములు అపౌరుషేయములు. అవి మానవమాత్రులచే రచింపబడినవి కావు. వేదపురుషుడు ఒక దేశానికి మాత్రమే సంబంధించినవాడు కాదు. ఎక్కడ నుండి మీరు ఆర్తి పొందితే అక్కడ వేదం ఆవిర్భవిస్తుంది. అన్ని మతములు, ధర్మములు వేదసత్యముల నుండి ఆవిర్భవించినవే.

(వ. 61-62 పు. 214/215)

నేను సరిగ్గా చేస్తున్న పని ఇదే. లోనున్న దైవత్వాన్ని మేలుకొలిపి భూకంపాలు, వరదలు, కరువులు, అంటువ్యాధుల జాడ్యాల నుండి బయట పడేటట్లు చేస్తున్నాను. అవతార మూర్తులు రెండు రకాలుగా సహాయం చేయగలరు. ఒకటి తాత్కాలిక సహాయం, రెండవది దీర్ఘకాల ప్రణాళిక.

తాత్కాలిక సహాయం ప్రకృతికే విరుద్ధం. కార్యకారణాల మీద నడిచే ఈ ప్రకృతికే వ్యతిరేకం. చాల మంది మానవులు వారి కోర్కెల అహంకార పూరితమైన ప్రపంచంలో నివసిస్తుంటారు. **వారి కార్యాలను బట్టి ఫలితాలను అందుకొంటారు. వారు పురోగతి కాని తిరోగతి కాని దీని మీద ఆధారపడి ఉంటుంది. అవతారమూర్తి వెనువెంటనే వారి సమస్యలను పరిష్కరిస్తే, కర్మ, పురోగతి, ఆధ్యాత్మిక అభివృద్ధి ఆగిపోతుంది. సృష్టిమూల సూత్రాలకే ఇది విరుద్ధం.** కాబట్టి దీని సంగతి విస్మరించవచ్చు. ఇంకొక సత్ఫలితాల నిచ్చే మార్గం దీర్ఘకాల ప్రాతిపథిక. అవతార మూర్తి ప్రజలను ఉన్నత మానసిక స్థితిలోనికి నడిపించి, ఆధ్యాత్మిక సూత్రాలను అర్థం చేసుకొని సత్ప్రవర్తనతో పరిస్థితులను బాగు చేసుకొనేటట్లు చేయడం సృష్టి, కర్మ సిద్ధాంతాలను ఈ పని విశదీకరిస్తుంది. అప్పుడు కార్య కారణాల చక్రం నుండి అధిరోహించి, ఇప్పుడున్న దైన్యస్థితికి గురియైన వారే ప్రకృతిని అదుపాజ్ఞలలో పెట్టుకొని మీరు చెప్పే బాధల నుండి విముక్తి కలుగజేస్తారు. మానవాళి మనస్సును భగవంతుని దశకు ఎదిగేటట్లు చేసి, వారి భవిష్యత్తును వారే నిర్ణయించు కొనేటట్లు చేస్తున్నాను.

నా ఇచ్ఛా శక్తిలో భాగస్వాములవుతారు, వారి ద్వారా నా పని సాగించాలి. వారిలో దైవశక్తిని మేల్కొలిపి ప్రకృతిలో చట్టాలను, శక్తులను బాగా అర్థం చేసుకొని వాటిపై ఆధిపత్యం వహించాలి. తక్షణం వారి అవసరాలు తీరుస్తుంటే వారు ఇప్పటి మానసికస్థితిలోనే ఉండి, అన్నింటిని కలగా పులకం చేసి, ఒకరిగొంతు లొకరు కోసుకోవడానికి సిద్ధమవుతారు. ఫలితంగా అల్లకల్లోల పరిస్థితి ఏర్పడుతుం దీ ప్రపంచంలో.

బాధ, వ్యధ భగవంతుని నాటకంలో తప్పనిసరి అంకాలు. దైవం ఈ కష్టాలను వాళ్ళ మీద రుద్దడు. తన దుష్కృత్యాలను దిద్దికొనేందుకు మానవుడే వానిని ఆహ్వానిస్తాడు. ఈ సరి చేసే శిక్ష చెడు మార్గం వీడి, సన్మార్గంలోకి ప్రవేశించి, దైవం వంటి సత్‌చిత్ ఆనందాన్ని అనుభవించడానికి, విజ్ఞత పొంది, శాంతి చేకూరడానికి దోహద పడుతుంది. ఇదంతా చెడ్డ మంచిని పైకి తేవడానికే ఈ రమ్యమైన ద్వంద్వాల మేలు కలయిక. అదేవిధంగా మృత్యువు అమరత్వాన్ని అవివేకం జ్ఞానాన్ని, బాధ శాంతిని, రాత్రి పగలును కాంతివంతం చేస్తాయి.

ఆఖరిగా చెప్పేదేమిటంటే అవతార మూర్తి మీరు చెప్పిన కష్టాలను వెనువెంటనే ఆపుచేస్తే నాటకీయమైన సృష్టిలోని కర్మ సిద్ధాంతాలు కుప్ప కూలతాయి. అత్యవసర పరిస్థితులలో నేను ఆ బాధను ఆపగలను, ఆపుతున్నాను. ఇవి భగవంతుడు మనుష్యులకు కల్పించినవి కాదని జ్ఞాపకముంచుకో, మానవుడు మానవుడికోసం చేసినది. అందుచేత మానవత్వంలోని అహంకారం తొలగించి, ఉన్నతమైన వికాసానికి తీసుకొని వెళ్ళి కర్మ తన ఆధీనంలో ఉండేటట్లు చేయాలి.

ఒక్క మాటలో చెప్పాలంటే సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని ప్రేమ సిద్ధాంతం ద్వారా నెలకొల్పడమే.

మరిం కేమి ఈ అణు విధ్వంసక అగ్ని నుండి ప్రపంచాన్ని కాపాడుతుంది? రాబోయే ఆ భయానక ప్రళయాన్నే సూచిస్తున్నాయి. నా సంకల్పం ఆ అగ్ని జ్వాలలను నిరోధించడం, ధర్మాన్ని పునఃప్రతిష్ఠచేయడం, **భగవంతుని ఆధ్యాత్మిక చట్టాలను తిరిగి ప్రవేశ పెట్టడం, ఒకే భగవంతుడు, ఒకే మతం, మానవాళి నంతటిని కౌగిలించుకోనే ఒకే భాషను నెలకొల్పడం.**

నేను ఒకే ప్రేమ మతాన్ని మానవులందరిని అన్న దమ్ములుగ, భగవంతుని తండ్రిగా సంఘటిత పరచేటట్లు, బోధిస్తాను. **నాకు తెలిసిన ఒకే భాష-హృదయ భాష.** ఇది మెదడును తెలివిని దాటి మనిషికి మనిషికి మధ్య, మానవునికిదైవానికి మధ్య ఒకరినొకరు అర్థం చేసుకొనేటట్లు, సహాయం చేసుకొనేటందుకు, సమాజము సుఖ సంతోషాలతో గడిపేందుకు ఉపకరిస్తుంది. ఈ ప్రాతిపదికపై మతం, కులం లేని సమాజాన్ని నిర్మించి, విశ్వమానవ ప్రేమతో నా భక్తులు ప్రపంచంలోని ప్రజలంతా వారి కుటుంబం అనుకొనేటట్లు చేయ సంకల్పించాను. హిందూ మతం ప్రాతి పదికగా గలది, మిగిలిన సుస్థిర ఇతర మతాలతో విభేదించడం ఎన్నటికి జరగదు. **ఎందు చేతనంటే నేను నిర్మించబోయేది సనాతన ధర్మం - అన్ని మతాల స్థాపకులు నమ్మిక ఒకే దైవం అన్న సిద్ధాంతం పై నిర్మించింది. అందు చేత ఎవ్వరూ కూడా వారి మతాన్ని కాని నమ్మిన మూర్తిని గాని విడనాడ నక్కరలేదు.** వాని ద్వారా అందరిలో ఉన్న ఏకైక దైవాన్ని పూజించనియ్యండి. నేను ఉన్న నమ్మకాలను ఛిన్నాభిన్నం చేయడానికి కాని, నాశనం చేయడానికి కాని రాలేదు. ప్రతి ఒక్కరిని వారి నమ్మకాన్ని స్థిరీకరించడానికి నిర్దోషమని నిరూపించడానికి వచ్చేను.

ఉన్న కరాణాలు ఉత్పన్న మయ్యే చోట్ల, అడ్డులు, జాతి, కుల, మత తారతమ్యాలను తొలగించి, పగ, దౌర్జన్యం స్థానంలో ప్రేమ, అహింసలను ప్రతిష్ఠించడం ద్వారా అణుయుద్ధాన్ని నివారణ జరుగుతుంది. ఒకరి నొకరు చంపుకొనే విధానంకు బదులుగా మానవాళికి శాంతి, సౌఖ్యాలతో పరస్పర సహకారంతో నింపాలని ఆశిస్తున్నాను.

(నా.నే.పు.102/105)

మూర్ఖత్వము, దుష్టప్రవృత్తి ప్రతి హృదయంలోను గూడు కట్టుకొని ఉన్నాయి. అందువలన ప్రతి ఒక్కరినీ

సంస్కరించవలసి యున్నది. ప్రతి ఒక్కరూ సన్మార్గములో నడిచేటట్లు బోధించి, వారిని ఆ మార్గములో నడిపించవలసిన అవసరమున్నది. **అవతార పురుషులు వేసే ప్రతి అడుగునూ, వారు చేసే ప్రతి ఒక్క పనినీ, కార్యక్రమమును గమనించండి. లోకమునకు ఆదర్శమును నిరూపించుటకై అవతరించిరి. అవతార పురుషుల జీవితములను గమనించి తదనుగుణంగా నడుచుకోండి. వారి దివ్యప్రేమను, కరుణను జ్ఞానమును గుర్తించి వాటిని మీ మీ జీవితాలలో అనుభవమునకు తెచ్చుకోవడానికి ప్రయత్నించండి. మానవజాతిని సన్మార్గములో నడువమని హెచ్చరించడానికి, వారికి మార్గదర్శకత్వము నెరపడానికి, వారికి వెలుగుబాటను చూపించడానికి, వారిపై ప్రేమకాంతిని ప్రసరింప జేయడానికి ఈ అవతారము వచ్చింది.** అయితే, మానవులు ఆయన బోధలను భక్తివిశ్వాసములతో ఆలకించి, వాటిని అర్థము చేసుకుని, ఆచరించడానికి సిద్ధముగా ఉండాలి. ప్రపంచమనే రంగస్థలముపై నిర్వహింపబడే **ఈ దివ్యలీలా నాటకములో జీవులందరి పాత్రను ఆ పరమాత్ముడే ప్రత్యక్షంగా దర్శకత్వము వహించి నడిపిస్తున్నాడు. ఆధునిక జీవితమును పౌరాణిక కాలమునాటి జీవితముతో పోల్చి చూచి మధ్యగల తేడాను మీరే స్వయంగా గమనించండి.**

(దై. ది. పు. 292)

ఏ అవతారము ఈ విధముగా చేయలేదు. గ్రామసీమలలోని ప్రజల మధ్యకు వెళ్ళుట, నిద్రావస్థలో వున్న వారిని మేల్కొల్పుట, స్తబ్ధులైనవారిని ఉత్తేజపరచుట, ఆపదలో వున్నవారిని కాపాడుట, లక్షలాదిమందికి అనుగ్రహము ప్రసాదించుట, సత్యధర్మ శాంతి ప్రేమ పథములలో నడిపించుట, ముందెన్నడూ జరుగలేదు. నేను గురువును కాను, దైవము కాను, నేను సముద్రమును, మీరందలి అలలు. మీరే నేను. మీరు గమ్యమును చేరునప్పుడు, ఈ సత్యమును గ్రహించ గలరు''.

(స.శి.సు.తృ.పు.167)

భగవదవతారమునకు ఆరు విధములైనటువంటి శక్తులుంటున్నాయి. ఒకటి సమగ్రమైన **ఐశ్వర్యము, రెండవది ధర్మము,** మూడవది **కీర్తి,** నాల్గవది **సంపద,** ఐదవది **జ్ఞానము,** ఆరవది **వైరాగ్యము.** ఈ ఆరు గుణములతో కూడినటువంటి షడ్గైశ్వర్య సంపన్నుడు భగవంతుడు. ఆ ఆరు గుణములను ఒకదాని వెంటనొకటి అనుసరించి సమత్వమైన స్వరూపమును ధరించిన వాడు శ్రీరామచంద్రమూర్తి. ఏ యుగము నందుకాని, ఏ జగమునందు కాని ఈ అవతారములు ఈ షడ్గైశ్వర్యముల స్వరూపములను ధరించియే భగవంతుడు అవతరిస్తూ ఉంటాడు.

(స. సా. జూ 1989, పు 142)

(చూ॥ కోరికలు, దివ్య ప్రకటనలు, ధర్మస్థాపన, ప్రేమనేర్పటంకోసం, భగవంతుడు, లీనమైపో, సాయి అవతార్)

అవతారలక్షణము

మహాభారత యుద్ధ సమయంలో ఒకనాడు అశ్వత్థామ ఒక ప్రతిజ్ఞ పట్టాడు. ఈనాడు సూర్యాస్తమయంలోపలనే పాండవుల శిరస్సులు ఖండిస్తానన్నాడు. ఈ మాట విని ద్రౌపది కృష్ణునివద్దకు వెళ్ళి ''కృష్ణా! నాకు రాజ్యము అక్కరలేదుగాని, పతుల ప్రాణభిక్ష పెట్టు'' అన్నది. కృష్ణుడు ''ద్రౌపది! ఇది నా చేత కాదు. అశ్వత్థామ మాటకు తిరుగు లేదు. దానిని మార్చుటకు ఎవరి తరమూ కాదు'' అన్నాడు. అప్పుడు ద్రౌపది **''కృష్ణా! నీకు చేతకానిది ఒకటున్నదా? ఏమైనా చేయగలవు, ఎన్నైనా చేయగలవు. నీకు చేతకానిది జగత్తులో ఒక్కటీ లేదు. సర్వమూ నీ హస్తమునందే ఉన్నది. సంకల్పించుకుంటే నీవు ఏమైనా చేయగలవు''** అని పాదాలపై పడింది. కృష్ణుడు ఈ రాత్రికి రాత్రే పాండవు లైదుమందిని తీసుకుని దూర్వాసుని కుటీరానికి వెళ్ళాడు. వారిని బయట ఉంచి తాను మాత్రం లోపలికి ప్రవేశించాడు. భగవంతుడు భక్త రక్షణకు కొన్ని కొన్ని సందర్భాలలో కొన్ని నాటకములు ఆడవలసి వస్తుంది. భగవంతుడు యాక్టింగ్ చేయకపోతే ఈ నాటకానికి

అవధానము

అందమే ఉండదు. కృష్ణుణ్ణి చూసి దూర్వాసుడు ఆనందంతో, "స్వామీ లోపలకు దయచేయండి" అని ఆహ్వానించాడు. కృష్ణుడు "దూర్వాసా! నేను వచ్చిన పని చాల కఠినమైన పని. నీవు నాకు సహాయం చేయాలి" అన్నాడు. దూర్వాసుడు "స్వామీ! ఏమైనా సహాయం చేస్తానుగాని, అసత్యమాడను" అన్నాడు. అప్పుడు కృష్ణుడు "దూర్వాసా! నేను మాత్రం నీచేత అసత్యమాడిస్తానా? నేను దైవ స్వరూపుడను. **"సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం"**. నేను సత్యమునే పలికేవాడను. కనుక, నిన్ను అసత్యమాడ మని ఎప్పుడూ బోధించను. కానీ, నా ప్లాను ఏమిటో నీవు చక్కగా విచారించి అర్థం చేసుకో. దానికి అనుగుణంగా ప్రవర్తించు. నా మనోభీష్టం నెరవేరుతుంది" అన్నాడు. దూర్వాసుడు "స్వామీ! మీకు కూడా ఒక అభీష్టం ఉన్నదా? మీరు ఏది చేసినా, ఏమి చెప్పినా, ఏది చూసినా మా నిమిత్తమేగాని, మీ నిమిత్తం కాదు కదా. **మీ అభీష్టమే నా అభీష్టము.** కనుక, నేను ఏమి చేయాలో చెప్పండి" అన్నాడు. కృష్ణుడు అక్కడ పెద్ద గుంట త్రవ్వించాడు. దానిపైన ఒక పలక వేయించాడు. ఆ పలకపైన దూర్వాసుని సింహాసనం పెట్టాడు. "దూర్వాసా! నీవు ఇక్కడ కూర్చో పాండవులను ఈ క్రింది గుంటలో కూర్చోపెట్టు. అశ్వత్థామ వచ్చి పాండవు లెక్కడ అని ప్రశ్నిస్తాడు. నీవు అసత్యం చెప్పనక్కర లేదు. నా క్రిందనే ఉంటున్నారని చెప్పు. అయితే, సౌండు మాత్రం మార్చు"అన్నాడు. దూర్వాసుడు ముక్కోపి, అతని వాక్కు చాల కఠినంగా ఉండేది. అశ్వత్థామ పాండవుల కోసం అంతా వెతికాడు. కానీ, పాండవు లెక్కడా కనిపించలేదు. దూర్వాసుడు త్రికాలజ్ఞాని. కనుక, పాండవు లెక్కడున్నారో అతనిని అడిగితే తెలుస్తుందని అతని దగ్గరకు వచ్చాడు. "స్వామీ నమస్కారం" అన్నాడు. "ఏమి కావాలి?" అని అడిగాడు దూర్వాసుడు అశ్వత్థామ "పాండవు లెక్కడున్నారు?" అని అడిగాడు. దూర్వాసుడు కోపం నటిస్తూ "పాండవులా? నా క్రింద ఉన్నారు" అన్నాడు గట్టిగా. తాను సత్యమే చెప్పాడుగాని, సౌండు మార్చాడు. దూర్వాసుని కోపం చూసి, తననేమైనా శపిస్తాడో ఏమోనని భయపడి అశ్వత్థామ పరుగెత్తుకొని పోయాడు. పాండవులను రక్షించే నిమిత్తమై దూర్వాసుడు ఆవిధంగా సౌండు మార్చాడేగాని, అసత్యం చెప్పలేదు.

పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే

భగవంతుడు అవతరించేది సాధువులను రక్షించేకోసం కాదు, సాధుత్వాన్ని రక్షించేకోసమని. అందరియందూ సాధుత్వముస్నది. ధర్మానికి నాశనమే లేదు. నశించేది అయితే అది ధర్మం ఎట్లా అవుతుంది? ఏ యుగమందైనా ధర్మం నాశనం కావటానికి వీలుకాదు. ధర్మము ఉంటుంది. కానీ, మరుగున పడిపోతుంది. ఆ మరుగునపడిన దానిని తీయుటయే అవతార లక్షణము.

(సా.శు.పు.33/35)

అవధానము

అభిరుచులు ఎట్టివైనను సరే వారి వారి ఆవధానము నడుపజాలినదై యుండును. అభిరుచియందు అవధానమును ప్రోత్సహించు శక్తి యుండును. **అభిరుచి యనునది గుప్తరూపమునన్న అవధానమనియు, అవధానము క్రియా రూపమునన్న అభిరుచి అనియు అందురు. అభిరుచి లేకున్నచో అవధానము చక్కగా నడువజాలదు. ఈ రెండింటికిని వాగర్థములవలె విడరాని సంబంధము. అవధానముయొక్క వృద్ధి క్షయములు అభిరుచియొక్క వృద్ధిక్షయములమీద అధారపడి యుండును. వీటన్నింటికి ఏకాగ్రత ముఖ్యము. ఏకాగ్రత జన్మస్థానమే ధ్యానము.**

(ధ్యా.వా.పు.19)

అవసరం

ప్రతి సాధకునకు Devotion, Discipline, Duty మూడు అవసరం. అయితే Devotion లేక ఎంత Duty చేసినా, ఎంత Discipline గ వున్నా ప్రయోజనం లేదు. ఒక

Governor వస్తే అతనితో అతని A D C లు వస్తారు. A D C లు విడిగా వస్తే వారికి గౌరవం వుండదు. Governor తో వస్తేనే గౌరవం. Devotion Governor, Discipline and Duty A D C లు.

(భ.ప్ర.ప.పు.5)

అవస్థలు

ఆత్మవిచారమునకు ఆశ్రమధర్మము లెంతయో అవశ్యము. ఆశ్రమ ధర్మజ్ఞానము స్వార్జితము. బాల్యావస్థ అనంతరము వరకూ మనుజుడు ఆశ్రమవాసి కానేరడు. అంతవరకూ వానికి ప్రాప్తించు జ్ఞానవిశేషము లేవియూ లేవు.

జీవశరీరమునకు బాల్య, కౌమార, యౌవన వార్ధక్యావస్థలున్నటుల జ్ఞానమునకు కూడను నాలుగు అవస్థలు కలవు. అందు మొదటిదగు బాల్యావస్థయందు జీవితము అజ్ఞానదశయందుండి శిష్యత్వమునంగీకరించి, దాశ్యమునకు, శిక్షణకునులోనై యెట్టి బాధ్యతలును లేక జ్ఞానార్జన జేయుచుండవలెను. రెండవదశయగు యౌవనమున సంఘనిర్వహణాబాధ్యతను వహించి ధనార్జనమందును దాని వినియోగమునందును జాగరూకత కలిగి, తనకంటేపిన్నలకు తగిన శిక్షణనొసంగు ఆదర్శములను అందించుచు, పెద్దలను అనుసరించుచూ, జ్ఞానాభివృద్ధిని గడించుచుండవలెను. మూడవదశయగు కౌమారమునందు కేవలము స్వీయసంఘ కుటుంబమే కాక ప్రజాసౌఖ్య నిర్వహణాభారము సైతము వహించి లోక శ్రేయమునకు తన సౌఖ్యమునైనా లక్ష్యపెట్టక, పాటుపడుచూ అంతర్‌జ్ఞానమును సంపాదించు చుండవలెను. నాల్గవదియగు వార్ధక్యమునందు తనకు పూర్వము కలిగిన అనుభవమూలమున ఇహలోక సుఖాదులు నిస్సారములనియు, అనిత్యములనియు గ్రహించి విజ్ఞానవంతుడై, దయాపరుడై, సర్వభూతహితుడై తనయనుభవజ్ఞానమును ఇట్లు లోకమునకు చాటవలెను. జీవుల గుణములను, వృత్తులను నాలుగు తరగతులుగా గనుపించుచున్నవి.

తెలివిని పెంచుటకు చదువువలే జ్ఞానమును పెంచుకొనుటకు ప్రవర్తన ముఖ్యము. బాల్యావస్థయందు విద్యతోపాటు, వినయ, విధేయత, భక్తి, శ్రద్ధ, పరిశ్రమయు నుండవలెను. యౌవనావస్థయందు ధనార్జనమే కాక సంఘనిర్వహణమేకాక, సదాచారశీలసంపన్నతను, ధార్మిక, ఆధ్యాత్మిక భావములను, చిత్తమును తీర్చిదిద్దుకోవలెను. కౌమారమున, కేవలము సంఘ కుటుంబ పోషణతో పాటు, నీతి నిజాయితీలను, పెంపొందించుకొని తన బిడ్డలకు ఆదర్శవంతమైన జీవితాన్ని అందించి సమాజమున అట్టి, సదాచారమును నిరూపించవలెను. సంఘమును ధిక్కరించి స్వకుటుంబ పోషణను మాత్రమే లక్ష్యమందుంచుకోరాదు.

(స.వా.పు. 163/165)

(చూ॥ అంతర్వాణి, వేదము)

అవిద్య

(చూ॥ మనసు)

అవినాభావసంబంధం

ప్రతిమానవుడూ ప్రేమ స్వరూపుడే! ఏదో అప్పుడప్పుడు ఆహార విహారాదుల దోషంవల్ల మీలో కోపము, తాపము, అసూయ, డంబము ఇత్యాది దుర్గుణాలు కల్గుతుంటాయి. ఎట్టి 'ఫుడ్డో'' అట్టి ''హెడ్డు''. ఎట్టి ''హెడ్డో'' అట్టి 'గాడ్'. ఫుడ్, హెడ్, గాడ్ - మూడూ అవినాభావ సంబంధం కల్గినవి. కాబట్టి, మీరు మొట్టమొదటి నుంచి ఆహారాన్ని తీసుకోవాలి. మంచి ఆహారం అంటే విలువైన ఆహారం కాదు. సాత్త్వికమైన ఆహారం. సాత్త్వికాహారం భుజించటం వల్ల మీలో సాత్త్వికమైన భావాలే కల్గుతాయి. మీరు పలికే ప్రతి పలుకు పవిత్రమైనదిగానే ఉంటుంది.

(స.సా.ఆ 2000 పు. 232)

అవినీతి

ఈనాడు దేశములో ఉన్న అశాంతి అక్రమాలకు, అనాచారములకు, అసత్యమునకు, అధర్మమునకు మనమే

అవిభక్తమైన భక్తి

కారణము. ఎంత చదువుండినప్పటికీ చదువుకు మానవత్వమున కే మాత్రము సంబంధము లేదు. నైతిక రాజకీయ వైజ్ఞానిక, ఆర్థిక పరివర్తనలన్నిటి కంటే మానసిక పరివర్తనే ప్రధానమైనది. **మనస్సు మార్చుకొనకుండా ఏది మార్చినా జగత్తు బాగుపడదు. 'స్వయం తీర్ణ, పరాం తారయతి' అన్నారు. తాను తరించి పరులను తరింపజేయువాడే మానవుడు.** మనకు ఎన్నో సుఖదుఃఖముల కష్టనష్టములు వస్తుంటాయి. కాని, ఇవన్నీ కదలి పోయే మేఘముల వంటివి. శాశ్వతమైనవి కావు. ఇట్టి అశాశ్వతమైన వాటి కోసం మన మెందుకు విచారించడం? ఏనాటికైనా మనం ఇవన్నీ త్యజించవలసిందే, తప్పదు. కనుకనే మానవత్వములో ఉన్న యథార్థ స్వరూపాన్ని గుర్తించాలి. నీవు ఒక్క మానవుడవు మాత్రమే కాదు. నీవు ఒక్కటిగా మాత్రమే రూపమును ధరించలేదు. దేహరీతిగా నీవు ఒక రూపనామమును ధరించవచ్చును. మానసికరీతిగా మంచి చెడ్డ పేరు పొందవచ్చును. కాని, ఆత్మరీతిగా నీవు సాక్షీభూతుడవుగా ఉంటున్నావు. నీవు సాక్షీభూతుడవైన మానవుడవు. అన్యాయ, అక్రమ, అధర్మములకు **మనమే మూలకారణముగా ఉంటున్నాము. మనలను పరిపాలన చేసే ప్రభుత్వ దోషము కూడా లేదు, ప్రజల దోషమే ప్రధానముగా రూపొందుతున్నది.** ప్రజలు వోటుతోనే ప్రభుత్వము ఏర్పడుతున్నది. కనుక ప్రజలలోనే ఉంటున్నవి మంచి చెడ్డలు.

ఒక చిన్న ఉదాహరణ. **ఎక్కడ చూచినప్పటికీ అవినీతి, అవినీతి అంటున్నారు. ఈ దేశంలో అవినీతి ఎప్పుడు అంతమొందుతుంది? అని అందరూ అడుగుతుంటారు. ఈ అవినీతికి ఎవరు కారణం? ప్రభుత్వమా కారణం? కాదు, వ్యాపారస్థులే దీనికి మూలకారణం. వాళ్ళ స్వార్థము, స్వప్రయోజనములను ఫలింపజేసుకోవడం కోసమని అన్ని విధముల అధికారులకు అందిస్తూ వాళ్ళను పెద్దగా చేసుకొంటూ వస్తున్నారు. మీరు నీతి నిజాయితీలతో జీవిస్తే ఈ అవినీతి క్షణంలో పోతుంది. ధనాశ లేని మానవులు లోకంలో లేరు. ఇచ్చే వాడిని చూస్తే చచ్చేవాడు కూడా లేచి వస్తాడని ఒక సామెత. మన మిస్తుంటే అధికారులు పుచ్చుకోక ఏంచేస్తారు? కనుక మన వ్యాపారం - మన ఆదాయం ఒక పరిమితిలో పెట్టుకుంటే జగత్తంతా నిత్యకల్యాణం పచ్చతోరణంగా కళకళలాడుతుంది. నీతిని హృదయంలో ప్రధానంగా పెట్టుకొని దివ్యమైన భావంలో ఆదాయానికి ఒక హద్దు పరిమితి పెట్టుకుంటే మీకు, సమాజమునకు, దేశమునకు శాంతి భద్రతలు సమకూరుతాయి.** కాని, ఈనాడు ప్రతివాడు నాకు కావాలి నాకు కావాలి అన్నపాటే, వచ్చింది పోతే పోయిందే అని ఏడుస్తారు. నిరంతరము స్థిరచిత్తుడుగా ఉండాలి. సంకుచితత్వాన్ని పెంచుకోరాదు, మానవునికి మానవునికి మధ్య నున్న సంబంధ బాంధవ్యాన్ని పెంచుకొంటూ రావాలి. ఇలాంటి విశాలమైన భావాన్ని పెంచుకుంటూ వచ్చినప్పుడే దివ్యత్వమైన భావాన్ని తాను కూడా అనుభవించగలడు.

(వ.1984 పు. 85/86)

అవిభక్తమైన భక్తి

(చూ॥ శరణాగతి)

అవ్యాకృతుడు

(చూ॥ బ్రహ్మవిద్య)

అశాంతి

కాలము కూడా వ్యర్థము చేస్తున్నాము. తద్వారా మనము అశాంతికి గురికాగలము. తొందరపాటు లేకుండ జీవించడానికి ప్రయత్నించాలి. **నిత్యానిత్య పరిశీలన సల్పాలి.** దీనికే Haste makes waste. Waste makes worry, so don't be in a hurry. దైవ విషయము లందు మాత్రము అతి శాంతముగా, నిశ్చలముగా, నిర్మలముగా, ప్రశాంతముగా దానిని పొందటానికి దగిన కృషి చేయాలి.

"అశాంతస్య కుతః సుఖః" అశాంతి కల్గినటువంటి వానికి సుఖమే లేదు. ఈ శాంతి మన కే రీతిగా లభిస్తుంది? అశాంతికి మూలకారణము అసంతృప్తి. **"అసంతృప్తో ద్విజోనష్టః"** అసంతృప్తి వలన రెండు నష్టము లుంటున్నాయి. అశాంతి ఒకటి. అసుఖం ఒకటి, ఏర్పడుతాయి. కనుక, మానవుడు ఉన్న దానితో తృప్తిపడి, దానితోనే అనుసరించి, ఆనంద మనుభవించే స్థితికి రావాలి. మితిమీరిన ఆశలతో మతి చెడప కూడదు. త్యాగరాజు "శాంతము లేక సౌఖ్యము లేదు" అని గానం చేశాడు. త్యాగరాజు మహా రామభక్తుడు. అటువంటి శ్రీరామచంద్రుని యొక్క భక్తుడైనటువంటి త్యాగరాజు ఎన్ని విధములైనటువంటి అనుభూతులను తాననుభవించి లోకానికి అందిస్తూ వచ్చాడు.

(స.సా. జూ. 1989 పు 144)

(చూ॥ ఏకత్వము, జగత్తు, వర్తమానము, విశ్వాసము)

అశుచి

(చూ॥ మనసు)

అశుభ లక్షణము

పురుషులకు ఎడమభాగము, స్త్రీలకు కుడిభాగము అదురుట అశుభలక్షణము.

(భా.వా. పు. 54)

అశోకచక్రవర్తి

(చూ॥ శిరస్సు)

అశ్వత్థము

సంసార వృక్షము చాలా విచిత్రమైన అశ్వత్థము ప్రపంచమున చూచు వృక్షమునకును, ఈ విచిత్రమైన సంసార వృక్షమునకును చాలా వ్యత్యాసము. ప్రపంచమున చూచు వృక్షములకు కొమ్మలు పైభాగమునందును, వేర్లు లోభాగమైన భూమియందును వుండును అయితే, సంసార అశ్వత్థమున అట్లు కాక పూర్ణవిరుద్ధమైనదే, వేర్లు పైభాగమునందును కొమ్మలు క్రింది భాగమునందునూ కనుపించుచుండును! అనగా, **తలక్రిందులు వృక్షముగా నుండును. దీనికి అశ్వత్థమని పేరు.**

అందులకు అర్జునుడు "దీని కీ పేరు యెట్లు వచ్చినది? ఆ పేరు వచ్చుటకు ఆధార మేమి, స్వామీ? మరేపేరైననూ పెట్టవచ్చును కదా? అని అన్నాడు. అందుకు కృష్ణుడు **"అర్జునా! విచిత్రమైన వృక్షమునకు పేరే పవిత్రము; అదే ఈ చిత్రము. విను అశ్వత్థమనగా. అనిత్యము, క్షణికము, అని అర్థము. లోకమున దీనినే రావి చెట్టు అందురు.** దీనిలోని ఫలపుష్పాలు తినుటకుగాని, వానన చూచుటకుకాని పనికి వచ్చునవిగావు. అంతియేకాక ఎల్లపుడూ దాని ఆకులు ఆడుచునే యుండును. వృక్షము విశాలమై యుండును. దీనికి మరొక పేరుకూడనూ కలదు. **చలదళమని కూడనూ పేరు: చలించు దళములు కలదని అర్థము.** ప్రపంచ వస్తువులుకూడనూ నిరంతరమూ చలన శీలములు. ప్రపంచముయొక్క అనిత్యత్వాన్ని. నిష్ఫలత్వాన్ని నిరూపించుట కోసం, దీనికి అశ్వత్థమనే పేరు వచ్చినది. **ప్రపంచముపై వైరాగ్యమును నేర్పి ఊర్ధ్వదృష్టి కలిగించి బ్రహ్మనిష్టను నెలకొల్పుటే ఈ అశ్వత్థముయొక్క ప్రయోజనము.**

(గీ. పు. 220)

అశ్వత్థవృక్షమును చూచే వుంటారు. గాలి లేకపోయినా ఆకులు యెప్పుడు ఆడుతూనే వుంటాయి. స్థిరత్వము లేనిది కనుకనే అశ్వత్థము అని దానికి పేరు వచ్చింది. స్థిరత్వము లేకపోవుటవలననే గుఱ్ఱమునకు అశ్వము అని పేరు వచ్చింది.గుఱ్ఱము ఎప్పుడైనా చూడండి. చెవి తప్పితే తోకనో,తోక తప్పితే కాలునో యేదో ఒకటి ఆడిస్తూనే వుంటుంది. కనుకనే అశ్వమేదయాగము చేయాలన్నారు. బుద్ధికూడ చాలా తిరుగుతుండేటటువంటిది. అశ్వమువలె కదలుతుండేదానిని స్థిరము చేసే యాగమే అశ్వమేధ యాగమని అంటారు. రజోగుణములో అధికభాగము

అశ్వము

పశుత్వము, కొంతభాగము దానవత్వము చేరి వుంటుంటాది. తమోగుణమునకు గురువు కుంభకర్ణుడు. రజోగుణమునకు గురువు రావణాసురుడు. సాత్వికమునకు గురువు విభీషణుడు. ఈ ముగ్గురును అన్నదమ్ములే. కానీ యీ యిరువురు మాత్రము హృదయములో వుంటుంటే చాలా ప్రమాదమును తెప్పిస్తారు.

(శ్రీ.గీ.పు 265)

అశ్వము

(చూ॥ అశ్వత్థము)

అశ్వమేధము

(చూ॥ ధీమంతుడు)

అష్టక్లేశములు

శోకించతగనిదానికై నీవు శోకిస్తున్నావు. దానికంతా నీవు శోకించవలసిన వాడవు కాదు. నీ హృదయము అజ్ఞానముతో నిండివుంటుంది. ఈ అజ్ఞానమును ముందు పారద్రోలాలి. దీనికి ఎనిమిది విధములైన స్థితులుంటున్నాయి. ఈ క్లేశము నీ హృదయములో వున్నంతకాలము నీవు అజ్ఞానములో మునిగే వుంటుంటావు. క్లేశము లేకుండా వుండే స్థితిని యెప్పుడు పొందుతావో అప్పుడే జ్ఞానమునకు అర్హుడవవుతావు. **ఈ యెనిమిది క్లేశములను నీ హృదయములో లేకుండా చూసుకోమన్నాడు. మొదటిది వాసన, రెండవది అగ్ని, మూడవది ఋణము, నాల్గవది రోగము, ఐదవది ద్వేషము, ఆరవది రాగము, ఏడవది విచారము, ఎనిమిది విషము.** ఇవన్నీ పోయి యేదో విషము కొంచెముగా నీ హృదయములో శేషముగా వున్నప్పటికినీ నీ కిది తప్పినది కాదు. అగ్ని అంతా ఆరిపోయింది. కొంచెము యెక్కడో మిగిలింది. ఈ చిన్న అగ్ని గాలి వీచటంవలన పెద్దదై బ్రహ్మాండమైన మంటగా బయలుదేరుతుంది. కనుక యీ **చిన్న శేషము కూడను వుండకూడదు.** రోగమంతా నయమై పోయింది. కాళ్ళపైన కొంచెము వాపు వుంటుండాది. కాని, పేషంటు యింటికి వచ్చి యేదైనా అపథ్యము చేసినప్పుడు తిరిగి ఒళ్ళంతా నీరు పట్టవచ్చు. రోగశేషము, అగ్ని శేషము యేమాత్రము వుండకూడదు. ఇక ఋణశేషము అప్పుల బాధ. అంతా తీరిపోయింది. ఏదో యిరవై రూపాయలు మాత్రము అప్పు వుంది. అంటే వడ్డీ పెరుగుతూ కూర్చుంటుంది. కనుక అ యిరవై రూపాయలు తీర్చేయాలి. అదేవిధముగనే శేషమనేది కొంచెం వుంటుండాదంటే కృష్ణుడు యెంత బోధించినప్పటికి ప్రయోజనము లేదు. **నీ అజ్ఞానశేషమును పూర్తి నిర్మూలనము గావించాలి.** కనుకనే యీ సాంఖ్యమును అర్జునకు బోధిస్తున్నాను అన్నాడు.

(శ్రీ.గీ.138-139)

అష్టభార్యలు

(చూ॥కృష్ణతత్త్వము)

అష్టమదములు

(చూ॥ ఆవరణ)

అష్ట విధ పుష్పములు

అహింసా ప్రథమం పుష్పం పుష్ప మింద్రియనిగ్రహం
సర్వభూత దయాపుష్పం క్షమాపుష్పం విశేషతః
శాంతిపుష్పం తపఃపుష్పం ధ్యానపుష్పం తథైవచ
సత్య మష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్.

ప్రేమస్వరూపులారా! భగవంతుడు మీనుండి ఆశించునది షోడశోపచారములు కాదు; అష్టాదశ పురాణపఠనం కాదు; పవిత్రమైన **అష్టవిధ పుష్పములను** మాత్రమే తాను మీనుండి ఆశిస్తున్నాడు. ఆ అష్టవిధ పుష్పములు ఎలాంటివి?

మొదటిది అహింసాపుష్పం. మనోవాక్కాయములతో ఏ జీవినీ హింసించకుండా ఉండటమే అహింస. కొందరు కూరగాయలను కోయటం హింస కాదా? అని ప్రశ్నిస్తారు. అది హింస కాదు. ఎందుకంటే, వాటికి బాధ తెలియదు. కొన్ని చెట్లలో కాయ కోసినచోటినుండి నీరు కారుతుంది. దానిని చూసి కొందరు "అయ్యో పాపం, కాయను కోయటంచేత చెట్టు ఏడుస్తుంది," అనుకుంటారు. కాని, అది ప్రకృతిసహజమైన ప్రక్రియయేగాని, శోకబాష్పము కాదు. మనుష్యులకు మాత్రమే **అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయకోశము, విజ్ఞానమయ కోశము, ఆనందమయకోశము అనే పంచకోశము లున్నాయి. మనస్సున్నవారికే సుఖ దుఃఖములుంటాయి. మానవునికి, పశుపక్షి మృగాదులకు, క్రిమికీటకాదులకు మాత్రమే మనస్సుంది.** కూరగాయలకు, వృక్షములకు ప్రాణముందిగాని, మనస్సు లేదు. కనుక, వాటికి బాధ తెలియదు.

రెండవ పుష్పం ఇంద్రియనిగ్రహం. ఇంద్రియ నిగ్రహం లేకుండా ఎన్ని సాధనలు చేసినప్పటికీ అవి నిరుపయోగమై పోతాయి. ఇంద్రియాలలో మొట్టమొదట అనేక రుచులకు అలవాటు పడిన జిహ్వాను అరికట్టుకోవాలి. "హే జిహ్వా! నీవు పుట్టినప్పటినుండి ఎన్ని బస్తాల గోధుమలు తిన్నావో, ఎన్ని పిండి పదార్థములను ఆరగించావో, ఎన్ని కూరగాయలను భుజించావో! ఇంకనూ నీకు తృప్తి లేదా?" అని మందలించాలి. **గోవిందా, దామోదరా, మాధవా అనే మధురాక్షరములను ఉచ్చరించుమని బోధించాలి. "భిక్షాన్నం దేహరక్షార్థం", దేహరక్షణకోసం భుజించాలి;** ఆకలి వేస్తే భుజించాలి. అంతే గాని, రుచులకోసం భుజించకూడదు.

మూడవది సర్వభూత దయాపుష్పం. సర్వ ప్రాణుల పట్ల దయ కలిగియుండాలి. ఎవ్వరినీ ద్వేషించరాదు. దీనినే భగవద్గీత "అద్వేష్టా సర్వ భూతానాం," అన్నది. అందరి పట్ల ప్రేమతో జీవించాలి. **అబూబెనాదమ్** అనే వ్యక్తి నిరంతరము దీనులకు, దిక్కు లేనివారికి సేవలు సల్పుతూ ఉండేవాడు. ప్రతి రోజూ బజారులో కనిపించే వృద్ధులకు, వికలాంగులకు సేవలు చేసి రాత్రి చాలా ఆలస్యంగా ఇంటికి చేరుకునేవాడు. ఒకనాటి రాత్రి అతను ఇంటికి చేరుకునేసరికి ఒక దేవతాస్త్రీ ఏదో వ్రాస్తూ కనిపించింది. కొంతసేపు వేచి, వినయవిధేయతలతో "అమ్మా! మీ రెవరు? మీరు వ్రాసేదేమిటి?" అని ప్రశ్నించాడు. ఆమె "నాయనా! నేను దేవతా కన్యను. భగవంతుణ్ణి ఎవరు ప్రేమిస్తున్నారో వారి పేర్లు వ్రాస్తున్నాను," అంది. "అందులో నా పేరేమైనా ఉందా?" అని అడిగాడు. ఆమె లేదని సమాధానం చెప్పింది. మరునాటి రాత్రికూడా అతడు ఇంటికి చేరుకునేసరికి ఆ దేవతాకన్య మళ్ళీ ఏదో వ్రాస్తూ కనిపించింది. "అమ్మా! ఇప్పుడు మీరు వ్రాస్తున్నదేమిటి?" అని అడిగాడు. "నాయనా! నిన్న భగవంతుణ్ణి ఎవరు ప్రేమిస్తున్నారో వారి పేర్లు వ్రాశాను. ఇప్పుడు భగవంతుడు ఎవరిని ప్రేమిస్తున్నాడో వారి పేర్లు వ్రాస్తున్నాను," అంది. "ఇందులోనైనా నా పేరు ఉన్నదా?" అని అడిగాడు. "ఈ లిస్టులో నీ పేరే ఫస్టు," అన్నది. దీని అంతరార్థమేమిటంటే, **అన్ని పూజలకంటే పరులకు చేసే సేవయే గొప్పది. శ్రవణం, కీర్తనం, విష్ణోస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహ మాత్మనివేదనం - అనే నవవిధ భక్తి మార్గములు కంటె సేవయే చాలా గొప్పది.** అబూబెనాదమ్ నిరంతరము పరులకు సేవ చేయటంచేతనే భగవత్ప్రేమకు పాత్రడైనాడు. **భగవంతుడు లోకంలో అందరినీ ప్రేమిస్తాడు. ప్రేమయే అతని స్వరూపము. అయితే, సర్వ భూతములపట్ల దయ కలిగి సేవ చేసేవారికి తనను తానే ఇచ్చుకుంటాడు.**

నాల్గవది క్షమాపుష్పం. 'క్షమా పుష్పం విశేషతః' అన్నారు. ఇది చాలా ప్రధానమైనది; భగవంతునికి అత్యంత ప్రీతికరమైనది. కౌరవులు తమను ఎంతగా బాధించినప్పటికీ, తమ ధర్మపత్నియైన ద్రౌపదిని నిండుసభలో పరాభవించినప్పుడు కూడా ధర్మజుడు ఏ మాత్రమూ క్షమను కోల్పోలేదు. **ఆ క్షమయే పాండవులను రక్షించి, వారిని ఆదర్శప్రాయులుగా తనరారజేసింది.**

అష్ట విధ పుష్పములు

ఐదవది శాంతిపుష్పం. ఎన్ని బాధలు కల్గినప్పటికీ, ఎన్ని ఆటంకములు ఎదురైనప్పటికీ శాంతం వహించాలి. త్యాగరాజు, ద్రౌపది, తుకారాంవంటి పరమభక్తులకు ఎన్ని బాధలో కలిగాయి. కాని, అన్నింటియందు వారు శాంతం వహించారు. శాంతము గలవారికే భగవత్కృప లభ్యమౌతుంది. **త్యాగరాజు "శాంతము లేక సౌఖ్యము లేదు,"** అన్నాడు. శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా మానవునికి శాంతి కావాలి. అయితే, శాంతి ప్రాపంచిక విషయాలలో లేదు, వస్తువాహనాదులలో లేదు. శాంతి మీయందే ఉన్నది. శాంతిపుష్పము మీ నుండియే ఆవిర్భవించాలి గాని, బయటనుండి లభించేది కాదు. ఈ ప్రాకృత జీవితంలో ఎన్నో ఇక్కట్లు కల్గుతుంటాయి. వాటిని మీరు లెక్కచేయకూడదు. మానవజన్మ పశుపక్షి మృగాదులవలె ప్రాకృతమైన సుఖాలను అనుభవించే నిమిత్తం రాలేదు. హృదయము నుండి ఆవిర్భవించే శాంతిని మీరు అనుభవించాలి.

నిండుసభలో ద్రౌపదికి పరాభవం జరుగుతున్నప్పుడు భీముడు ఉగ్రుడై గద తీసికొని దుశ్శాసనునిపైకి పోయాడు. అప్పుడు ధర్మజుడు అడ్డుకొని "నాయనా! మనం ఓడిపోయినవారము, వారి స్వాధీనంలో ఉన్నవారము. మనకు వారితో యుద్ధం చేసే అధికారం లేదు. కాబట్టి, నీవు **శాంతం వహించు. ఏనాటికైనా ధర్మమే జయిస్తుంది,"** అన్నాడు. ఇలాంటి శాంతము అందరికీ ప్రాప్తించదు; ఏకొద్దిమందికో ప్రాప్తిస్తుంది. శాంతము గలవారికే దైవబలము చేకూరుతుంది, చిరకీర్తి లభిస్తుంది. కౌరవులు నూరుమంది పుట్టారు. పాండవులు ఐదుమందియే. కాని, పాండవులకీర్తి సమాజంలో శాశ్వతంగా నిలిచి పోయింది. **ధర్మజుడంటే అందరికీ ప్రీతి. "ధర్మ-జ". ధర్మమునుండి పుట్టినవాడు అతను. ధర్మమును ఆచరించాడు కాబట్టే శాంతమును** అనుభవించాడు. ఈనాడు ఎక్కడ చూసినా అధర్మమే, అసత్యమే. కనుకనే, **అశాంతి, అలజడి చెలరేగుతున్నాయి.**

ఆరవది తపఃపుష్పం. తపస్సనగా ఏమిటి? అడవులకు పోయి కందమూలాదులను భుజిస్తూ భగవంతుణ్ణి స్మరించటమా? అది నిజంగా తపస్సనే చెప్పవచ్చు. త్రికరణశుద్ధియే తపస్సు. "మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం" - అన్నారు. మనస్సును నిరంతరం దైవమునందు ఉంచాలి. సత్వరజస్తమో గుణములచేత మనో వాక్కాయములలో కలిగే ఉద్రేకములను అరికట్టాలి. సంతోషాన్ని, దుఃఖాన్ని, ఉత్సాహాన్ని, కోపాన్ని అరికట్టుకోవాలి. **'సుఖదుఃఖే సమేకృత్వా లాభాలాభౌ జయాజయౌ', సుఖదుఃఖములను సమదృష్టితో స్వీకరించాలి. అదియే నిజమైన తపస్సు. ఏ సేవ చేసినా వాంఛారహితంగా చేయాలి. వాంఛారహితమైన భావమే తపస్సు.**

ఏడవది ధ్యానపుష్పం. ధ్యానమంటే ఏమిటి? పద్మాసనం వేసుకొని, కన్నులు మూసుకొని భగవంతుణ్ణి స్మరించడమా? అది ప్రాకృతమైన ధ్యానము. అదికూడా అవసరమే. కాని, ధ్యాన మంటే అది కాదు. **పాలలో నీరు ఏకమైనట్లు, మీ మనస్సు భగవంతునిలో లీనం కావాలి. నిప్పులో వేసిన ఇనుము పూర్తి నిప్పుగానే మారిపోతుంది. అట్లే, మీ మనస్సు భగవద్భావంలో ఏకమైపోవాలి. దీనినే "బ్రహ్మవిద్ బ్రహ్మైన భవతి", అన్నారు.** ఉదయం, సాయంకాలం పద్మాసనం వేసుకొని ఏదో కొన్ని నిమిషాలు భగవచ్చింతన చేస్తే, అది ధ్యానమెలా అవుతుంది? **సర్వదా సర్వ కాలేషు సర్వత్ర భగవచ్చింతన చేయాలి. ఏ పని చేసినా భగవంతుణ్ణి లక్ష్యంలో పెట్టుకోవాలి. అదియే నిజమైన ధ్యానము.** ఏదో కొంత కాలపరిమితి పెట్టుకొని భగవంతుణ్ణి స్మరిస్తే అది **'పార్ట్-టైం' భక్తి అవుతుంది.** అలాంటివారికి **'పార్ట్-టైం'** అనుగ్రహమే లభిస్తుంది. **భగవదనుగ్రహం శాశ్వతంగా లభించాలంటే 'ఫుల్-టైం' భక్తిని అభివృద్ధిపరచుకోవాలి.**

ఎనిమిదవది సత్యపుష్పం. ఇది చాలా ముఖ్యమైనది. ఈ ప్రపంచము సత్యము నుండియే పుట్టింది. సత్యముచేతనే పోషింపబడుతున్నది, సత్యమునందే ఐక్యమైపోతున్నది. **'త్రికాలాబాధ్యం సత్యం', ఎప్పటికీ మారనిది సత్యం.**

ఎప్పటికీ ఉండునది సత్యం. సర్వమూ అంతర్ధానమైనా సత్యం మాత్రం శాశ్వతంగా ఉంటుంది. అట్టి సత్యమే భగవంతుడు. కనుక, మీరు సత్యముతోనే జీవించాలి. సత్యముతోనే అంత్యమైపోవాలి.

ఆ అష్టవిధ పుష్పములతో మీరు భగవంతుణ్ణి పూజించినప్పుడే భగవంతుడు వాటిని ప్రీతితో అందుకొని, మీరు కోరిన వరముల ననుగ్రహిస్తాడు. భగవంతునికి ప్రీతికరమైన పుష్పములను అర్పించకుండా, వాడి పోయే, రాలిపోయే, కాలిపోయే, కూలిపోయే పుష్పములను ఎన్ని అర్పించినా ప్రయోజనం లేదు.

(స.సా.సె.2000పు.265/269)

అష్టాంగ యోగములు

1. **యమము:** అహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహయమాఃు.

అహింస, సత్యము, దొంగిలింపకుండుట, బ్రహ్మచర్య మవలంబించుట. దానమును పట్టకుండుట అని అయిదు అంగములతో కూడు కొన్నది యమము; అయితే నేను అట్లుకాక, దేహమునందు, ఇంద్రియములందు కలుగు విరక్తియే యమమని తెలుపుదును. నామరూపరహితమై నిర్గుణమై అనంతమై సంతాపదుఃఖశూన్యమై, భావవర్జితమై, శాశ్వతమై సచ్చిదానందస్వరూపమై వెలుగు బ్రహ్మపదార్థ మొండు కలదు. అదియే భ్రాంతిదశలో ఈ సమస్త విశ్వముగాను, పర్యుక్తగుణములకు వ్యతిరేకమైన గుణములతో కూడబడినట్లు, అనగా నామరూపసహితమై, సంతాపదుఃఖభావయుతమై, వివిధ వికృతగుణములు కలదై, అశాశ్వతమై, పరిమితమై, జ్ఞానశూన్యమైయుండు సంసారమువలె కన్పించు చున్నది. ఇట్లు పరబ్రహ్మవస్తువు మహామహా పండితులను కూడా భ్రాంతి జెందింప జేయునట్లు వ్యష్టి సమిష్టిరూపముగా కనిపించుచుండును. దేహభ్రాంతులందు జిక్కి, తల్లి, తండ్రి, ఆలు, పిల్లలు, సంసార మని, బంధు బలగములని, నానావిధబంధముల జిక్కి దుఃఖించుచుండును. కాన, సచ్చిదానందరూపుడైన పరబ్రహ్మమును చింతించి, **నిత్యానిత్యవస్తు వివేకమువలన, సత్సంగమువలన, పెద్దల సేవలవలన, నిర్మలబుద్ధి వలన దేహేంద్రియములు నాకు లేవు: వ్యష్టి సమష్టి దేహత్రయమంతటికిని అధిష్ఠానమై అలరు బ్రహ్మమునే నేను అనెడి భావము పూని యుండుటయే, దేహేంద్రియములందు వైరాగ్యము, జ్ఞానయోగమునందు దీనినే యము అని పిలుతురు.**

సుఖమునకై మోదము, దుఃఖమునకై ఖేదము చెందకుండుట దేహేంద్రియములయొక్క బాధను తనబాధయని గలంగకుండుట మొదలుగాగల ద్వంద్వాతీతస్థితి లభించవలయును. **క్రమక్రమముగా దేహేంద్రియములను మరచి మెలగవలయును. ఇవియే యమాంగము సిద్ధించిన దనుటకు లక్షణములు. పై లక్షణము క్రమశిక్షణలు ఉన్ననే యమమని పిలువబడును.** అయితే ఈ యమాంగము జ్ఞానయోగ భావమునకు పునాది. యమాంగము సిద్ధించనిదే, సాధన అటులనే కొనసాగుతూపోయిన వారికి చాలా ప్రమాదము కాన, సాధకులు పై విషయమున కడు జాగ్రత్తతో మెలగవలెను.

2. **నియమము: అనగా పరిశుద్ధుడై యుండుట. సదా సంతోషముగా నుండుట, తపస్సు చేయుట, మంత్రజపము చేయుట నియమమని రాజయోగము తెలుపును.** దానినే రాజయోగమున **"శౌచ సంతోషతపఃస్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాఃు" అని తెలిపినారు. అయితే దానిని నేను ఈ క్రిందిరీతిగా తెలుపుచున్నాను. సర్వ కాల సర్వావస్థలయందును శ్రేష్ఠమైన సత్యమునందు, అనగా పరమాత్మ తత్త్వమునందు మిక్కిలి ప్రేమ కలిగియుండుటయే నియమమని అందును. "సా పరమ ప్రేమరూపా"** అని నారద భక్తి సూత్రమున చెప్పినటుల, భక్తి అనగా పరమాత్మునియందు మిక్కిలి అనురాగము కలిగియుండుట. ఇట్టి పరతత్త్వానురక్తి కలిగినంతనే, రాజయోగమున తెలిపిన శౌచ, సంతోష, తపస్స్వాధ్యాయేశ్వర ప్రణిధానాదులు వాటంతటవియే కలుగును. పైన చెప్పినరీతి యమాంగము సిద్ధించిన తదుపరి సచ్చిదానంద

పరబ్రహ్మ వస్తువులననే నిజముగా ఈ ప్రపంచమున మన మనుకొను ఆనందము, శాంతము, సుఖము కొలదియైనను మానవ అర్హతల ననుసరించి, మానవులకు లభించుచున్నది. కాని, సాధకులు భావించునట్లు శాంతి ఆనందములకు నిజమైన కారణము మిథ్యాభూత శుష్క భౌతికవస్తుసమూహము కాదు. **"రసోవై సః" "ఆనందోవై బ్రహ్మ", అను ఉపనిషత్ శాసనము ననుసరించి ఆ పరబ్రహ్మము వలననే ఈ విశ్వమునందు, సంసారము రసభరితమనిపించును.** ఆ పూర్ణ రసస్వరూపుడే లేకున్న ఈ సంసారము మానవుల కింత మధురంగా కన్పించదు. కడు చేదయి వుండును. ఈ మధురమునకు ఆ అమృతస్వరూపుడే కారణము.

బ్రహ్మజ్ఞులుచేరి వేదాంతవాక్యార్థములను వినయ విధేయతతో వినుచుండుట, అపరవస్తువును పొందుటకై మిక్కిలి జ్ఞానపిపాసుడై పరితపించుట ఇట్టి నిర్హేతుకమైన ప్రేమ బ్రహ్మయం దెల్లప్పుడును కలిగియుండుటయే **నియమ సిద్ధిలక్షణములు.** అది సిద్ధించినవాడు, లోకుల నిందలు నిష్కారములు, వాన, గాలి, ఎండ, సిగ్గు యెగ్గులను పాటించక, ఆత్మ వల్లభుని చేరుటకు, మిక్కిలి లోకవాసనా విపత్తుల బాటింపక ముముక్షువు అసంగబద్ధుడై బ్రహ్మమునందు ప్రేమతో చరించును.

నియమాంగము సిద్ధించినవాడు జ్ఞానార్జనమునకై తన సర్వస్వమును **ధారపోయుటకు సిద్ధపడును.** ఎంతదూరమైనను శ్రమయని తలంచక బ్రహ్మవార్తలు వినుటకు పరుగిడిపోవును. విజ్ఞానుల అజ్ఞలన్నియు శిరసా వహించును. తన కపూర్వమగు చిన్మయతత్త్వములు చెప్పువారే పరమాప్తులని, వారి కోరికల, ఎన్నికష్టములకైనను వోర్చి, తీర్ప ప్రయత్నించును. **ఇవియే నియమసిద్ధికి లక్షణములు.**

3. **ఆసనములు:** మనము కూర్చొనుస్థితి స్థిరముగా నుండవలెను; అనగా కదలక మెదలక యుండవలెను. అయితే కదలక మెదలక అనగా కూర్చొన్నతరువాత కీళ్లు, తొడలు తిమ్మిర్లుపట్టి పక్షవాతమువంటి రోగరూపముగా పరిణమించి, స్వతస్సిద్ధముగా కదలలేనివాడై మనసులో బాధపడుచు, కదలక కూర్చున్న, ఆసనమనరు. అది ఆసనలక్షణము కాదు. దేహ స్థిరత్వముతోపాటు హృదయమునకు ప్రసన్నత్వమును ప్రసాదించు సుఖముకూడా ఆసనమందుండవలెను. కాన యోగాభ్యాసకారుడు కూర్చొనుస్థితి ఏదైనను మిక్కిలి స్థిరముగా సుఖముగా నుండవలెను, **అందుకని పతంజలి "స్థిరసుఖమాసనమ్" అన్నాడు. అయితే దీనినే మరొక మార్గమున తెలుపుచున్నాను. 'అన్నివస్తువుల'యందూ ఉదాసీనమైనభావము కలిగియుండుటే ఉత్తమోత్తమమైన ఆసనము అని.** లౌకిక వైదిక విషయములకు అనుకూలమైన ఆచరణ కలిగియుండుటయే పరమాత్మేతర విషయములందు ఉదాసీనత. మనకు సరిపడనివాడు మన దగ్గరకు వచ్చెననుకో. అట్టి సమయమున అతనిని మనము దూషించ నవసరములేదు; పరిహసించ నవసరములేదు; చులకనగా భావించనవసరము లేదు. మన పనులలో మనము నిమగ్నులమై యుండిన చాలును.

మనకు సరిపడనివాడు, అతని త్రోవ నతడు చూచుకొనును. ఇదియే ఉదాసీనభావమందురు. పరానురక్తి కలిగిన తరువాత పరబ్రహ్మ మందలి మధుర ప్రేమ, ఇతర ప్రాపంచిక సంఘమునందు ముముక్షువు నుదాసీనునిగా జేయును.

నిజముగా **"బ్రహ్మ సత్యం జగన్మిథ్యా"** అను భావము సదా మననము చేయుచుండవలెను. **మంచివానితోగాని, చెడ్డవానితోగాని పొత్తే అంత గాఢముగా పెట్టుకొనరాదు. ఇట్టి స్నేహమువలన ముముక్షువు నివృత్తి పథమునుండి ప్రవృత్తికి మరలును. కావున ఈ క్షణిక వస్తువు లందు మోజు విడిచి నామరూపాత్మకమైన ఈ మహా జగంబుతోడ నిస్సంగత మెలగుటయే ఉదాసీనత.** ఈ విషయమున సిద్ధించినవాడు జగముయొక్కయు, శరీరముయొక్కయు, ఇంద్రియములయొక్కయు, మంచి చెడ్డలనుగూర్చి చింతించకుండుట, శాంతుడై, దాంతుడై, నిర్మలుడై

చరించుట. ఇట్లుండిన ఇవి **ఆసనము సిద్ధించినవారి లక్షణము అనబడును.**

4. **ప్రాణాయామము:**

శ్వాసప్రశ్వాసముల రెంటియొక్క గతి విచ్ఛేదనమే ప్రాణాయామ మనబడును. దీనిని యోగసూత్రమున, రేచక పూరక కుంభకాదుల శ్వాస ప్రశ్వాసరతివిచ్ఛేదనము వివిధముగా జెప్పి, దానిని ప్రాణాయామ మనును. అయితే నే నిట్లు తలంచను. ~~ఈ~~ సర్వజగత్తు మిథ్యమే అను భావమే ప్రాణసంయమము అని వివరింతును. మనము వివిధరూపములతో వివిధ పేర్లతో వుండు బంగారు సొమ్ములు చూచుచున్నాము. ఆ వస్తువు లన్నియూ బంగారుతో చేయబడినవే కదా అని. అన్నిటియందు మనకు సమభావముండదు. మనమై మనము తయారుచేసుకొన్న వివిధ రూపములపై, మన వినియోగ సౌకర్యార్థము మనము పెట్టుకొన్న పేర్లపై ఏదో వెట్టిమోజు మనకు జనించును. ~~ఈ~~ నగలయొక్క నామరూపములు పుట్టకముందు, పుట్టినపుడు, పెరిగినపుడు తుదకీ సొమ్ములరూపములు కరిగించి బంగారుముద్దలోనికి మార్చి వారి వారి పేర్లను మార్చినపుడు ఆ బంగారము మాత్రము నిర్వికారముగా అట్లే ఉన్నది కదా! ఇదే విధముగానే నామరూపములెన్నియో ~~ఈ~~ జగతియందు పుట్టి, పెరిగి అణిగి పోవుటను మనము గాంచుచునే యున్నాము.అయిననూ శాశ్వతమైన దేదో శాశ్వతముగానే యున్నది. అది నిర్వికారమే. ఏవిధముగా సొమ్ముల రూపనామములు అసలు బంగారుకంటే వేరుగా కన్పించుచు మనలను మోహావశుల జేయునో, అట్లే నామరూపములు పరముకంటె వేరై చెప్పుటకు చూచుటకు సౌకర్యము కలిగించుటకు ఏర్పడినవయ్యును, అవియే మన సమస్త సుఖము, శాశ్వతములు అన్నట్లు తోచును. అయితే అనంత అకళంక అనాద్యమునైన బ్రహ్మమే ధ్రువమని చాటుచున్నవి శ్రుతులు; తెలియదా? కావున నగలరూపము లరయక, సర్వమును బంగారమేయని అరయునట్లు, మనకు కన్పించునట్టి ~~ఈ~~ సమస్తమైన నామరూపములందు మతిని చొనుపక అంతయును బ్రహ్మమేయని తెలుసుకొనవలెను. ఎట్లున్ననూ అది మాయాకల్పితమేనని, సద్వివేకబుద్ధితో నిజముగా దివ్యత్వమును తెలిసికొనుటయందు మిక్కిలి కాంక్షగలవాడై రాత్రి పగలు సమస్తంబును బ్రహ్మమే అను దృష్టితో చూడవలెను. భ్రాంతిదశలో, వ్యక్తమగు ~~ఈ~~ జగమే సత్యమనియు, బ్రహ్మమే మిథ్యమనియు తోచును. వివేకదశలో జగమే మిథ్య యను భావము వచ్చును. మోహదేవత సౌందర్యముగా అలంకరించుకొని నామ రూపముల నాధారము చేసుకొని మోహనాస్త్రముల విడుచుచున్నది. పై విధముగ జ్ఞానదృష్టిగల వివేకియే ఆ అస్త్రముల బారినుండి తప్పించుకొనును. ~~ఈ~~ నామ రూపములందేవి జూచిననూ కొలదికాలము క్రిందట మాత్రమే పుట్టి కొలదికాలము తర్వాత అంతరించునవిగా కన్పించును. వీటికి మొదలు తుది లేవు. మధ్యకాలమున వ్యక్తమగునవి కావు. ఇవి ఎంతమాత్రమునూ శాశ్వతములు కావు. వివేకముతో ఆలోచించిన ~~ఈ~~ జగత్తులో మనము విను నామముగాని, రూపముగాని ఇదివరకు వున్నది ఇకముందుండబోవునదికాదు. జగత్తు పరిణామశీలము. గీతలో చెప్పలేదా, "వ్యక్త మధ్యాని భారత"అని?

అయితే ఒక్క విషయము. మాయికముగా కనబడు ~~ఈ~~ అఖిల జగంబపుడు నశించి చననక్కరలేదు. **~~ఈ~~ జగత్తునందలి సత్యత్వదృష్టి ఒక్కటే మారిన చాలును. అంతటితో కృతార్థత, అదియే జగన్మిథ్యాపతీత రూపమైన ప్రాణసంయమము.** ఇట్టి ప్రాణాయామసిద్ధుని ~~ఈ~~ రీతిగా నుండవలెను; పెక్కేండ్ల క్రిందట వ్రాసిన పెన్సిలు వ్రాత చెడీచెడనట్లు, కలలోచూచిన వెన్నియో వస్తువులు మతికి తోచినట్లు ఏ వివేకి బ్రహ్మమే సత్యము జగత్తు మిథ్యమని భావించునో అతనికి చుట్టుప్రక్కల గల ఏవియును చూపులోనికి వచ్చి లెక్కలోనికి రాకోరడు. **పుట్టుట గిట్టుట, సమస్త సంపదలూ లోకములన్నియు వట్టివే అను భావము పూని యుండవలెను. ఇదియే ప్రాణాయామము.**

5. **ప్రత్యాహారము:**

నాలుక రుచి చూచుటకునూ కన్ను రూపము కాంచుటకునూ, చెవులు ధ్వనిని వినుటకున్ను, చర్మము

స్పర్శసుఖమనుభవించుటకున్ను, ముక్కు వాసన చూచుటకున్నూ ఈ విధముగా ఇంద్రియములు తమతమ విషయములందు సదా పనిచేయుచున్నవికదా! అట్టియెడ ఇంద్రియములను తమతమ విషయములనుండి మరల్చి, చిత్తస్వరూపమును అనుకరించునట్లు చేయవలయును. ఇది పతంజలి నిర్వచనము. కాని **నేనట్లుకాక మరొక విధమును కూడ సూచింతును.**

చిత్తముయొక్క అంతర్ముఖభావము (అనగా చిత్తము, బయట గన్పించి మానవులను మోహింపజేయు నామరూపాత్మకమగు మిథ్యా జగద్వస్తువులలో ఏకీభవించకుండా సర్వకాల సర్వావస్థలయందు లోపలి వైపునకు మరలుట) **ప్రత్యాహారమనబడును.** చిత్తము ఎప్పుడైతే మాయాయత్తమని కనునో, అప్పుడే తన ప్రవర్తనమును మార్చుకొనును. తన ప్రాపంచికాహంకారము వట్టి బూటకమని నిస్సందేహముగా తెలుసుకొనును.

చిత్తము సహజముగా మిక్కిలి చంచలస్వభావము కలది. ఇది సుఖమును, శాంతిని కోరుచు, ఒకదానిని విడిచి మరొకదానిపై పరుగు లిడుచుండును. ఇట్టి చిత్తము సకల వస్తువులను కలలో కనిపించిన వస్తువుల చందమున, మాయికములని తెలిసికొనినవెంటనే, స్థిరముకాని వానిపై అనవసరముగా తనకు కలిగిన మిక్కిలి మోహమునకు ఇంత కాలము ఇట్టి మోహముచే అవివేకముగా కాలముబుచ్చుటకు ఆశ్చర్యము, భయము, సిగ్గును బొందుచు బయట కనిపించు సర్వపదార్థములను విడచుచు లోపలిమొగంబగును. తదుపరి ముందటిదారికి పోవ భయపడును. **బైట వస్తువులన్నియు భ్రాంతి అని తక్షణము వాటిపై భ్రాంతి విడిచి, చిత్తమంతర్ముఖమైన తరువాత,** ఆ చిత్తము మునుపటివలె మూల ముసుగిడును. అప్పటి సాధకుని మనఃస్థితిని వినోదలీలల జూపుచు దారిని తప్పించును. చిత్త మంతర్ముఖమైన వెంటనే శాంతము, సౌఖ్యము, జ్ఞానమును గూర్చిపెట్టునవి ఇవియేయను ఆశచే పట్టి అభూతవస్తువులపై మోహంబుచే రేయింపగలు కష్టించి వృథా కాలయాపన చేసితినని సాధకుడు పశ్చాత్తాపము చెందును. వెట్టి పట్టుదలతో బయటి మాయావస్తువుల గూర్చుకొనుటకై అచ్చటి కచ్చటికేగుచు, సదా అనర్థముల బొందితిని; వ్యర్థ పరిశ్రమమున శాంతిని కాంచనైతిని; అను విచారమున మునుగును. అది సిద్ధించిన, పైవిధమైన పరితాపముచే బయటి వస్తువులకై చేయిని చాపక మిక్కిలి విశదమయిన వివేకమున తాను వెలసియుండును. రానున్న కోటి వస్తువులవంక చూడక చిత్తము సూటిమీర అంతర్ముఖమై యుండుటయే **వారి లక్షణములుగా ఉండును.**

6 ధారణ:

చిత్తము ఒకచోట అవలంబనమున నిల్పుటయే ధారణయని పతంజలి నిర్వచించెను. నాభావము, చిత్తముయొక్క నిశ్చలమైన భావమే ధారణయని చెప్పుదును. ఎప్పుడు చిత్తము బైట వస్తుసమూహము నందలి స్నేహమువిడిచి పశ్చాత్తాపము, వైరాగ్యము, విజ్ఞానమునందభిలాష అను సద్గుణముల ప్రోత్సాహమున లోముఖమగునో అపుడే తన ధ్యేయస్వరూపముతో గూడుకొని మాటిమాటికి వుబ్బుచుండును. **ఇట్టి నిల్కడనే ధారణ యందును.** కాన చిత్తమెచ్చటెచ్చటి కేగునో అచ్చటచ్చట బ్రహ్మమునే భావించి కనుచు, చిత్త మెట్టి కల్పనలు చేసిననూ అవి అన్నియూ బ్రహ్మమే అనుచు, చిత్తము నొక బాలునిగా తలంచి, ఆచిత్తబాలునకు జ్ఞానబలముచే నయమగు లాలనచే బయట కన్పించు వస్తువులన్నియును బ్రహ్మమందు నిశ్చయముగ కల్పితములనిజెప్పి అతనిని పరితృప్తుని జేసి నిర్భయునిగా జేసి పట్టుదలతో నిశ్చలత్వమును సాధించవలయును. **ఎప్పుడు కూడ చిత్తమును బలాత్కారముగా బట్టరాదు. దాని చాంచల్యమును విరక్తిబుద్ధిచేత, దాని అజ్ఞానమును ఆత్మబోధనవశమున చక్కగా బోవు నట్లు నచ్చజెప్పుము.** బ్రహ్మమునం దనురాగమును ప్రబలజేయుట, లోని కల్పనా రమణమును మానచేయుట, చిత్తమును బాహ్యసంచారవిముఖ మొనర్చుట ఈ మూడు విషయములచే మనస్సును ధారణాయోగమున నిల్పవలెను. చిత్తము జాగ్రత్ స్వప్నావస్థలయందు

ఎన్నేనియు చిత్రకల్పనలు చేయును. అట్టి ధారణసిద్ధికి చిహ్నమేమన, సకల లౌకికవిషయ సంచారము విడిచి, గండిలోపోవు నీటిధారవలె గట్టి పట్టుబట్టి చిత్తమును బ్రహ్మమునందు నిల్పుటే, కనుబొమ్మలనడుమ అంటింపబడిన చిల్లిగింజవలె చిత్తము ప్రాణముతోకూడి బ్రహ్మాత్మకముగ నిల్చును. ఉన్నదగ్గరే తిరుగు బొంగరమురీతి మనసు ద్విదళపంకజమున ప్రాణముతో కూడి **బ్రహ్మచింతనలో నుండుట, బ్రహ్మముదక్క ఇతరమేమియూ రవంతైన విచారింపకుండట. ఇవియే ధారణ సారము.**

7. **ధ్యానము:**

ఒకచోట ఏకభావ ప్రవాహరూపమైన జ్ఞానమే ధ్యానము. **కాని, నేను ఎన్నివిధములుగనో దీనిని గూర్చి చెప్పితిని. నేను కేవలజ్ఞానస్వరూపుడనను చింతనే ధ్యానము. ఈ సమస్తము బ్రహ్మము. అమృతసాగరమంతయు అమృతమే. అందలి ఒక బిందువుకూడ అమృతమే.** సర్వము బ్రహ్మము. బ్రహ్మమే సర్వము అనినపుడు సరోవరములందు, గుంటలయందు, సముద్రమునందు, బావులయందు, వాగులయందు, కాల్వలయందు, చెరువులయందు ఎచ్చట నున్ననూ నీరు నీరే అయినట్లు, పలు నామరూపములతో కూడుకొని విశ్వవ్యాప్తమై నానారీతుల వ్యక్తమగు సర్వమును బ్రహ్మస్వరూపమైన ఏకపదార్థమే. ఘటములోపల ఆకాశము, ఘటము ఇవతల ఆకాశము, రెండు వేరుగా తోచుచున్ననూ నిజమునకు ఆకాశము ఒక్కటేకదా! అటులే ఈ వ్యావహారికుడు ఎన్ని దేహములందున్ననూ, జీవసంపదయొక్క ప్రభావము, విశిష్టత, విమలత్వము ఒక్కటే. సారమైనట్టి ఆ బ్రహ్మమే బైట లోపల ఒక్కడే. అట్టి సర్వం బ్రహ్మమయ మను అనుభవమును గుర్తించి భేదభావములు లేక చరించుటే ధ్యానలక్షణము, ధ్యానానుభవములు అనేకము. అవి వారివారి ఇచ్ఛా శక్తిని అనుసరించి వుండును. కాన **దానికి సారము అంతా బ్రహ్మమయము.**

8. **సమాధి :**

రూపమును విడిచి అర్థమును మాత్రమే భాసింపజేయు చుండి నపుడు అది సమాధి అనెను పతంజలి; దానికి మరొక విధానము తెలుపుదును. ధ్యానము చేయువాడు తనను, తన ధ్యానమును మరచి పోవుటయే (ధ్యేయవస్తువునందు లీనమగుటయే) సమాధి అని. ధ్యానమందు పరిపూర్ణత ఏర్పడి మరచుటయే సమాధి. ఈ ధ్యానము ప్రయత్నముచేయగా లభించునది. సమాధి ప్రయత్నము లేకనే లభించునది, అదియే అష్టాంగములందు శ్రేష్ఠమయినది, చివరిది. **జీవాత్మల కావంతయూ భేదములేదని మిక్కిలి అనుభవమునకు వచ్చు దశయే చక్కని సమాధి.** ఇదియే చక్కని ధ్యానసిద్ధికి ఫలితము. యోగీంద్రులకు ప్రియము, అజ్ఞానధ్వంసిని. ఈశ్వరుని పరమ కృపాఫలము, దృఢముగా ఆత్మను తెలిసికొనుటకు ఆలవాలము, ఆదరించదగినది, సర్వ సంశయ విచ్ఛేదిని. **ఇట్టి సమాధి సవికల్పసమాధి నిర్వికల్పసమాధి అని రెండు కలపు. బాగుగా ముదిరిన ధ్యానమే సవికల్పము. ఇందు జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అను త్రిపుటిభావము పదలడు. నిరంతర మదియే భాసించును. ఈ త్రిపుటి భావముతోనే నిరంతరము చిత్తము బ్రహ్మమందు నెలకొని యుండును. ఇదియే సవికల్పము.** జ్ఞాతనగు నేను బ్రహ్మమునే, జ్ఞానము బ్రహ్మమే, జ్ఞేయము బ్రహ్మమే అని త్రిపుటియందు సమాధారణయుండును.

సమాధి అన్నింటి సాధనసారమును చేర్చుకొన్న సాగరము వంటిది. సప్త అంగములైన యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానములను సముద్రములను రూపనామములు లేక లీనముచేయునట్టి అష్టాంగసాగరమే సమాధి. సముద్రమునచేరిన పుణ్యనదుల రూపనామరుచులు ఎట్లు తెలియవో సమాధిలో చేరిన ఏ అంగసాధనకూడ రూప, నామ, సారములు తెలియకుండును. అదియే సమాధి. సేవకుడూ సేవగాని, ధ్యానము, ధ్యానపరుడుకానీ, రెండును తెలియకుండును.

అష్టాంగవిద్యలు

తను అను భావమే, చేయుట అను భావమే యుండదు. సేప్యుడొక్కడే, అభావమొక్కటియే అంతతప్ప అన్యము గోచరించదు. అట్లు అన్యము గోచరించుచున్న అది సమాధి అనబడదు. స్వప్న మనబడును. **బ్రహ్మముతప్ప అన్యము లేనిదే సమాధి. అందులోని లీనభావము సమాధి.**

(ప్ర.వా.పు.77/88)

అష్టాంగవిద్యలు

(చూ॥ నిశ్చలమానచిత్తుడు, మనసు)

అష్టాక్షరి

దైవాన్ని పట్టాలనుకొన్నప్పుడు యీ దేహమనస్సుల తత్వాన్నంతా సాధనమార్గముతో సాధిస్తూ రావాలి. భూతదయను పెంచుకోవటం, సర్వాత్మభావమును అభివృద్ధి పరచుకోవటం, దేహము యొక్క పరిశుద్ధతను, మనసు యొక్క పవిత్రతను అభివృద్ధి పరచుకోవటం, యీ విధమైన నిత్యచర్యలలోపల నిత్య జీవితములోపల సాధనలు సలిపినప్పుడే దైవత్వము సులభముగా అర్థమవుతుంది. 'సర్వజీవనమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' సర్వులయం దుండిన భగవంతునకు నమస్కరిస్తున్నాను అని భావించాలి.

మన సాధన అంతటితోనే అపకూడదు. **"సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి"** దానిని కూడ రెండవ అడ్డుగా పెట్టుకోవాలి. మన జీవితము ఒక పెద్ద ప్రవాహము. ఈ ప్రవాహము విచ్చలవిడిగా వదలిపెట్టిన అన్ని గ్రామములు, అన్ని భూములు, అన్ని జీవులు, అన్నింటిని ధ్వంసము చేస్తుంది. గ్రామములను ముంచివేస్తుంది. కాని, దీనిని భరించే సాగరం దగ్గరికి దానిని పంపే ఉపాయం మనం తీసుకోవాలి. ఈ నదులను అనుగ్రహించేవాడు, భరించేవాడు, వరించేవాడు, తరించేవాడు ఒక్క సాగరుడే. దీనిని సాగరముతో యేరీతిగా చేర్చాలి? దీనికి భగవద్గీత రెండు గట్టులను కట్టుకోమని చెప్పింది. ఈనదికి ఇటువైపున అటువైపున గట్లు వుండినప్పుడే, యేభూములు యేగ్రామములు ముంచకుండా నేరుగా సముద్రములో పోయి చేరిపోతుంది. ఏమిటి యీగట్లు? **అదే అష్టాక్షరనామము అని బోధించాడు. ఏమిటి అష్టాక్షరినామము? 'ఓం నమో నారాయణాయ' కాదు "సంశయాత్మా వినశ్యతి". నీవు నిస్సంశయుడుగా వుంటుండు. అదే గట్టును ఒకవైపున కట్టుకో. రెండవవైపున 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'. ఇవి ఎనిమిది అక్షరాలు. ఈ శ్రద్ధను ఒకవైపున పెంచుకో. నిస్సంశయము అనేది ఒక గట్టు. శ్రద్ధ ఒక గట్టు. ఈ రెండిటిని మనము గట్లుగా తీసుకుంటే మన జీవితమనే ప్రవాహము అనుగ్రహమనే సాగరములో లీనమవుతుంది.**

(శ్రీ.గీ.పు. 240-241)

అష్టావక్రుడు

(చూ॥ఆత్మజ్ఞానము, చర్మకారులు)

అష్టైశ్వర్యమయి

శబ్ద బ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి
వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి
శ్రీమయి, అష్టఐశ్వర్యమయి, సదాశివమయి
శ్రీ శివశక్తిమయి; సాయిమయి.

(సా॥ పు 623)

కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము అరిషడ్వర్గము లనబడును. ఈ యారును మానవునికి శత్రువులు. అవి నిశాచరములయిన - గ్రుడ్లగూబలు, గబ్బిలముల వంటివి. వెలుగును సహింపవు. మానవుని మనసు అజ్ఞానమను చీకటితో నిండి యుండును. కావున నవి యందులో ప్రవేశించి యుండును. చీకటిలో రాళ్ళు రువ్విన పారిపోవు. కత్తితో నరికినను, తుపాకీతో కాల్చినను అంతమొందవు. దీపము వెలిగించినపుడే అవి నశించును. సామాన్యమైన యీ చిన్న సత్యము కూడా శంకరులు బోధించువరకు పలువురికి తెలియలేదు.

(స.వ.పు. 12)

అసంతృప్తి

(చూ॥ అశాంతి)

అసతో మా సద్గమయ

మానవుడు అది మంచిచేసేది ఒకే ప్రార్థన. **"అసతో మా సద్గమయ, తమ సోమా జ్యోతిర్గమయ. మృత్యోర్మా అమృతంగమయ"** - ఇదే జీవికి నిరంతర శాంతి మంత్రము. దీనికి అనేక దేశములలో, అనేక మతములలో అనేక అర్థములను చెప్పుదురు. కాని దీనికి నిజమైన అర్థము మానవుని ఆవేదన. **"ఓ దేవా, బాహ్య ప్రపంచ సుఖములచే ప్రలోభ పెట్టబడిన సమయమున నన్ను శాశ్వత సుఖశాంతుల నొసగు సత్య మార్గమువైపు నడిపించు"**- ఇది మొదటి ప్రార్థన.

"ఓ ప్రభూ: ప్రాపంచిక విషయముల అంధకారముచే ఆవరింపబడినపుడు అతి ముఖ్యమైన ఆత్మ తత్వమును అర్థము చేసికొను జ్ఞానజ్యోతని వెల్గించు" - ఇది రెండవ ప్రార్థన.

"ఓ దేవా: నీ అనుగ్రహముతో లోకభ్రాంతులను చీకటినుండి తప్పించుకొని, నిత్యమైన, సత్యమైన జ్ఞానజ్యోతిని వెలిగించుకొని, ఇహమును జయించి. పరమును పొంద గలుగునట్లు చెయ్యి" ఇది మూడవ ప్రార్థన.

(స.సా.ఫి.85 పు.వెనుక కవరు.)

(చూ॥ శాంతిమంత్రము)

అసత్య ప్రచారములు

(చూ॥ హృదయ సంబంధము)

అసభ్యత

(చూ॥ అకారపంచకము)

అసురసంపత్తి

(చూ॥ దైవసంపత్తి)

అసూయ

అసూయ భావమును నిర్మూలము చేసుకోవాలి. నీవు పరిశుద్ధాత్మ స్వరూపుడవు. ఇదే వేదము. "శృణ్వంతు విశ్వే అమృతస్యపుత్రాః" నీవు అమృత పుత్రుడవు నాయనా అని వర్ణిస్తుంది. కనుక నీవు విశాల భావమును అభివృద్ధి పరచుకో. ఈ ఇంద్రియములను అదుపులో పెట్టుకో .. తద్వారా మానసిక శుద్ధి ఏర్పడుతుంది. అప్పుడే త్రికరణ శుద్ధి కలిగిన మానవుడుగా తయారవుతావు. మనసునందున్న మాలిన్యమును, అంతఃకరణమునకు పట్టిన మాలిన్యమును, సత్కర్మలు సద్బుద్ధి సదాలోచన సచ్చింతన చేత, సత్కర్మలచేత నిర్మూలించి పరిశుద్ధము చేసుకోవచ్చు. **కనుకనే చెడ్డను చూడవద్దు. మంచిని చూడు అన్నారు. చెడ్డను వినవద్దు మంచిని వినుమన్నారు.** ఈ విధమైన భావాలు మనము అభివృద్ధి పరచుకోవాలి.

(బృ.త్ర.పు ౯౦)

ద్వైమునందు కూడను దోషములు కనిపెట్టటం అసూయకు ఒక ప్రధానమైన గుణమన్నారు. **అసూయకు ప్రధానగుణములు కొన్ని వుంటున్నాయి. తమకంటె అధికకీర్తిని సంపాయించేవారిపైన** అసూయ కలుగుతుంది. తనకంటె **అధికసంపద కలిగినవానిపైన** అసూయ కలుగుతుంది. తనకంటె **అందముగా వున్నవానిపైన** అసూయ కలుగుతుంది. **తనకంటె అధిక మార్కులు తీసుకొనేవానిపైన అసూయ కలుగుతుంది. తనకంటె యే విషయమునందైనా అందమునందు కాని, అధికారమునందు గాని, నంవదయందుగాని, గౌరవమునందుగాని, ప్రతిష్ఠయందుగాని అధికమైనచో అసూయ కలగటం మానవుని బలహీనత. అసూయ మానవునిలోపల ప్రవేశించగనే ఎంతో కాలమునుండి సాధించి, నంపాదించుకున్న నద్గుణములు భస్మమైపోతుంటాయి.** ఈ అసూయ వూరికే వదిలేది కాదు. మానవునియందున్న సమస్తసద్గుణములు నాశనము చేస్తుంది. **రాక్షసత్వాన్ని అభివృద్ధి పరుస్తుంది. మానవత్వాన్ని మాయం చేస్తుంది. పశుత్వాన్ని బలపరుస్తుంది.** ముందు వెనుక యోచన చేయదు.

అస్తి

అసూయ ఉంటే మన సమస్తమును నాశనం చేస్తుంది. పరులను మాత్రమే నాశనం చేయుట కాదు. తనను తాను నాశనం చేస్తుంది. **అసూయాపరునకు సుఖముగాని నిద్రగాని ఉండవు. కంటినిండ నిద్ర కడుపునిండ తిండి ఉండవు. ఏవిధమైన రోగము లేకపోయినప్పటికిని అసూయ మనిషిని క్షీణింపచేస్తుంది. అంతఃక్షయమని దీనిపేరు.** క్షయరోగము దేహాన్ని క్రమక్రమేణ కనుపించేరీతిగా తగ్గిస్తుంది. కానీ ఈ అసూయ లోపల చేరి అనేక విధములుగా భస్మము చేస్తుంది. **ఇది మహాఘోరమైన వ్యాధి. మనము తక్కువ స్థాయిలో వుండినా, ఎక్కువ స్థాయిలో వుండినవారిని చూచి ఆనందపడితే దైవము మనలను అనుగ్రహిస్తాడు.** మనకు లేదని వున్నవారిని చూచి అసూయపడితే తనయొక్క స్థితి మరింత దిగజారిపోతుంది. ఇది యీనాడు కలియుగములో సర్వత్ర వ్యాపించి వుంటుండాది. యోగియందు, భోగియందు, జోగియందు, విరాగియందు, బైరాగియందు, సర్వులయందు యీ అసూయ అనే వ్యాధి వ్యాపించి వుంటుండాది.

అసూయచేతనే మానవుడు అశాంతికి గురియైపోతున్నాడు. అసూయ మానవుని అనేకవిధములుగా హింసిస్తుంది.

(శ్రీ.స.గీ.పు. 216/218)

ఏ సమయంలో యెక్కడ అసూయ అహంకారము వుంటుందో, అక్కడ ఏ రూపములో దేవుడు వచ్చి సరిదిద్దటానికి ప్రయత్నిస్తాడో చెప్పుటకు వీలుకాదు. కనుక మొట్టమొదట అసూయ, ద్వేషము, అహంకారములకు అవకాశము యివ్వకుండా చూచుకోవాలి.

అసూయ అనేది గ్రంథపఠనముచేత నాశము చేసుకోవటానికి కాదు. **స్వప్రయత్నముతో సాధనలు సలిపి, హృదయమునందు పరివర్తన గావించుకొని, పరిపూర్ణమైన ప్రేమతో, దైవార్పితమైన బుద్ధితో అసూయను హతమార్చుకోవాలి.** అసూయ వుండినంతకాలము మనలను యేమాత్రము రాణింపచేయదు. అది మనలోని సమస్తసద్గుణములను హతమార్చివేస్తుంది. మానవునియందు **అసూయ లేకుండా చేసుకోవటము ప్రధాన లక్షణమని గీత బోధించింది.**

(శ్రీ.గీ.పు.220)

(చూ॥ అనసూయ, ఏకత్వము, టెట్టురిష్టులు, దూషించుట, భగవత్ప్రేమ, విప్రలిప్స)

అస్తి

(చూ॥ జ్యోతిశ్చరణాభిధానాత్)

అస్తి భాతి ప్రియం

(చూ॥ జ్యోతిశ్చరణాభిధానాత్, చైతన్యము, బ్రహ్మ)

అస్త్రశస్త్రములు

(చూ॥ అహింస, ప్రధాన అస్త్రములు)

అస్థిరములే

అస్థిరం జీవనం లోకే, అస్థిరం యౌవనం ధనమ్
అస్థిరం దారాపుత్రాది, ధర్మ్మః కీర్తిద్వయం స్థిరమ్.
ఏమి తాకొని వచ్చె ఏమితా కొనిపోవు
పుట్టినపుడు తాను గిట్టినపుడు
ధనము ఎచటి కేగు తా నేగు నెచటికి
చెప్పరయ్య మీరె చిత్త మొప్ప.

మనము జీవించు లోకము స్థిరమైనది కాదు. యౌవనము మధ్యలో వచ్చి మధ్యలో పోయేది. ఇట్టి మిడిమేలపు యౌవనమును చూచి మిడిసి పోవటం విద్యావంతుల లక్షణము కాదు. ధనమా! స్థిరమైనది కాదు. ఇది వదిలిపోయే మేఘముల వంటిది. ఇక దారాపుత్రాదులు. మధ్యలో ఆదరించి మధ్యలో విడిపోయేవారే. పెండ్లికి పూర్వము భార్య ఎవరు? భర్త ఎవరు? తెలియదు. మధ్యలో వచ్చి, మధ్యలోనే ఒకరినొకరికి వియోగము సంభవిస్తుంటాది. బిడ్డలు అంతే. పుట్టక పూర్వము తల్లి ఎవరు? బిడ్డ ఎవరు? పుట్టిన తరువాతనే ఈ విధమైన సంబంధ

బాంధవ్యములు. ఇవి అన్నీ అస్థిరములే. మరి స్థిరమైనది ఏమిటి? **ధర్మము, కీర్తి. ఇవి రెండే మానవులకు స్థిరమైనవి.**

(బృ.త్ర.పు.౧౫౮)

(చూ॥ త్యాగము)

అస్పర్గము

(చూ॥ మోహము)

అహం

(చూ॥ అంతర్వాణి, అహంకారము,ఆత్మ, ఎరుక, నేను, ముక్తి, శబ్దము)

అహంకారము

ఎరుకనే సర్వభూతములందు నేను నేను అనే స్ఫురణను కలిగిస్తుంది. ఈ స్ఫురణ శక్తియే అహం అహం అహం. ఈ అహం దేహముతో తాదాత్మ్యము పొందినప్పుడు అహంకారముగా రూపొందుతుంది. ఇదే మిథ్యా నేను. అది సత్యమైన నేను కాదు.

(బృ.త్ర.పు ౧౨౩)

ఆత్మకూ, అహంకారమునకూ ఉన్న వ్యత్యాసము గుర్తించాలి. **ఇది ఆత్మ నుండియే ఆవిర్భవించినది. ఆత్మ నుండియే తలంపు బయలు దేరింది. తలంపు నుండియే వాక్కువ వచ్చినది. ఏతావాతా వాక్కు, తలంపు, అహంకారము ఈ మూడు ఆత్మ సంబంధమైన కుటుంబమే. అహంకారము ఆత్మకు పుత్రుడు, అహంకారమునకు తలంపు పుత్రుడు, తలంపునకు వాక్కు పుత్రుడు, వాక్కు ఆత్మకు** great grandson, grand son, son, father వీరంతా ఒక కుటుంబమునకు చెందినవారా కాదా? ఈ అహంకారము వస్తూ పోతూ వుంటుంది. **రాకపోకలతో కూడిన అహంకారము; రాకపోకలు లేనట్టిది ఆత్మతత్వము.** ఆత్మకు అహంకారమునకు వున్న వ్యత్యాసము గుర్తించాలి. అహంకారమును ఈగో అంటాము. ఇది తప్పు. అహంకారము అనగా శరీరమునకు సంబంధించిన అహంకారమని భావిస్తున్నారు. కాదు. దేహమే నేను అనే భ్రాంతియే నిజమైన అహంకారము. ధనమును బట్టి కులమునుబట్టి, గుణమునుబట్టి, విద్యనుబట్టి వచ్చేది అహంకారము కాదు. అది వట్టి భ్రమ, ధనమును చూచి అహంకార పడుతున్నావా? అంటారు. ధనమును చూచి అహంకారము కాదు. భ్రమపడుతున్నారు. విద్యను చూచి నేను గొప్ప విద్యావంతుడను అనుకుంటున్నావు. అది వట్టి భ్రమ. వీటిని అహంకారమని చెప్పకూడదు. ఒకరికి విద్య ఉండి కూడాను ఈవిధమైన భ్రమలేకుండా ఉండవచ్చు. ధనముండి కూడాను ఇట్టి భ్రమ లేకుండా ఉండవచ్చును. కాని, అందరియందు సమముగా అహంకార మనేది ఉంటుండాది. అహంకారము బుద్ధిని ఆవరించి దేహాన్ని పెడమార్గములు పట్టిస్తుంటుంది. కనుక ఈ బుద్ధికి శ్రద్ధను అలవర్చాలనుకుంటే మొట్టమొదట అహంకారాన్ని దూరం చేయాలి.

(బృ.త్ర.పు. ౯౮/౯౯)

దోషాలకు అన్నిటికి మూలము అహంకారం. సేవ ద్వారా మొట్టమొదట అహంకారమును దూరం చేసుకోవాలి. అంతేకాదు బియ్యమునకు పై పొట్టు వున్నంతవరకు (ఊక), ఎక్కడవేసినా, మొక్కలుగా, పెరిగి, ఒక్క గింజకు అనేక గింజలుగా తయారు అవుతాయి. మానవుని యందు ఏ కించిత్, అహంకారము వున్నా, అది అనేక మార్పులు చెందుతుంది. అనేక దోషాలను కూర్చి అనేక జన్మలను వృద్ధి చేస్తుంది. కావున మొదట అహంకారమును నిర్మూలన చేసుకోవాలి. చంద్రుడు దిన దినమును అభివృద్ధి చెంది పౌర్ణమి నాటికి, పరాకాష్ఠనందు కుంటాడు. **"చంద్రమా మనసో జాతః" అదేవిధముగనే మానవుని మనస్సు కూడా, దినదినాభివృద్ధి గాంచి విశాలమైన దివ్య మార్గమును అనుసరించి పూర్ణముగా రూపొందాలి.** పరిపూర్ణమైన మానవ జీవితమునందే పరిపూర్ణమైన దివ్యత్వము కూడా ప్రకాశిస్తుంది. మానవుని పూర్ణత్వమంటే ఏమిటి? విశాలమైన హృదయమే సంకుచిత భావములతో

నింపుకున్న మనస్సు ఏనాటికి శాంతి సంతోషముల నందుకోలేదు. సర్వసాధనముల తత్త్వ శాస్త్రముల మూలము సమస్త ధర్మముల గమ్యము హృదయ విశాలత్వమే. కావున మానవుడు విశాల హృదయుడు కావాలి. అప్పుడే పరిపూర్ణత్వాన్ని అందుకోటానికి అర్హుడౌతాడు.

(సా.పు 42/43)

అభిమానం - ఆడ పిశాచి. అహంకారము - మగపిశాచి. కోటీశ్వరుడు మొదలు కూటికి పేదవరకు ఇవి పట్టిపీడిస్తున్నాయి. అహంకార అభిమాన రహితులై, స్వామి సన్నిధినే పెన్నిధిగా భావించి చిక్కిన సమయాన్ని సార్థకం చేసుకోండి.

(సా.పు 116)

అహంకారము మనస్సును వికలంచేస్తుంది. అంతఃవిచారణ లేకుండా చేస్తుంది. **సాధకుడు తన సాధనలో జయం పొందాలంటే తాను చేసిన తప్పులు చెప్పే వారికి కృతజ్ఞుడై యుండాలి.** ఉపయోగకరములైన వ్యాఖ్యానాలు, సలహాలు, సూచనలు, ఎక్కడనుండి వచ్చినా స్వీకరించాలి. అహంకారం తగ్గించుకోవడానికి యిదే దారి.

(సా॥ పు 224)

నేను తక్కువ వాడను, నీచుడను, పనికిమాలిన వాడను, దరిద్రుడను, పాపిని, అధముడను - ఇత్యాది భావములును అహంకార లక్షణములే. ఆ అహంకారము పోవలె. అప్పుడె గొప్పవాడను, కొద్దివాడను అను భావములు నీకు పుట్టనే పుట్టవు.

(స.వ.పు 29)

ఆత్మనిందకూడా అహంకార లక్షణమే.

(స.వ.పు 30)

నీలోని అహంభావమును నరికి వేసి నీ యొక్క అహంకారమును శిలువపై మరణించేటట్లు చేసి నీవు అమరుడవుగా బయల్వెడలుము.

(దై.మ. పు. 70)

అహంకారి దైవాన్ని ఏమాత్రము గుర్తించలేడు, దైవానుగ్రహమునకు పాత్రుడు కాలేడు. పైనున్న నీరు క్రిందికే ప్రవహిస్తుంది. అదేవిధంగా, అహంకారికి అధోగతి తప్పదు. మీరు భగవంతుణ్ణి ప్రేమిస్తున్నా మంటున్నారు. మంచిదే. కానీ, దానిని భగవంతుడు అంగీకరించాడా? చిన్న ఉదాహరణ: మీరు మీ స్నేహితునికి ఒక రిజస్టర్డ్ లెటర్ వ్రాశారనుకోండి. అది అందినట్లుగా అతని నుండి మీకు 'ఎక్నాలెడ్జ్‌మెంట్' రావాలి కదా. అదేవిధంగా, భగవంతుణ్ణి మీరు ప్రేమించినప్పుడు భగవంతుడు కూడా మిమ్మల్ని ప్రేమించాలి. మీలో అహంకారమున్నంత వరకు ఇది అసంభవం.

ఒకానొక సమయంలో అర్జునుడు అహంకారంతో తనను మించిన భక్తుడు లేడని భావించాడు. కృష్ణుడు అతనికి కనువిప్పు కలిగించాలని సంకల్పించుకున్నాడు. ఒక సాయంకాలం ఇరువురూ మారువేషంలో వాహ్యాళికి వెళ్ళి కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. మార్గమధ్యంలో ఒక బ్రాహ్మణుడు కత్తిని పట్టుకొని సంచరించడం చూశారు. **బ్రాహ్మణుడు కత్తిని పట్టుకున్నాడేమిటని ఆశ్చర్యపోయి, అతనిని సమీపించి కారణమడిగారు. ఆ బ్రాహ్మణుడు "నేను కత్తితో నల్గురిని చంపాలని నిశ్చయించుకున్నాను" అన్నాడు. "ఎవరా నల్గురు?" అని కృష్ణుడు ప్రశ్నించగా, ఆ బ్రాహ్మణుడు "మొట్టమొదట ఆ నారదుణ్ణి చంపాలి.** ఎందుకంటే, త్రికాలములందు, త్రిలోకములందు నా భగవంతుని నామాన్ని స్మరిస్తూ నా స్వామికి విశ్రాంతి లేకుండా చేస్తున్నాడు. **తరువాత ఆ ప్రహ్లాదుణ్ణి చంపాలి.** ఎందుకంటే హిరణ్యకశిపుడు అతనిని అగ్నిలో పడవేసినప్పుడు, సముద్రంలోకి నెట్టినప్పుడు, పాములచేత కరిపించినప్పుడు, ఏనుగులచేత త్రొక్కించినప్పుడు, ప్రతి పర్యాయము నా స్వామి అతని ప్రార్థన విని తక్షణమే వెళ్ళి అతనిని రక్షించవలసివచ్చింది. నా స్వామిని ఇంతగా శ్రమ పెట్టినందుకు అతనిని తప్పక చంపాలి. **తరువాత ద్రౌపదిని చంపాలి.** ఆమె నిండు సభలో కౌరవులు తనను అవమానిస్తున్నప్పుడు నా స్వామిని ఎలుగెత్తి పిలిచింది. తక్షణమే నా స్వామి తన చుట్టూ

ఉన్న అష్ట భార్యలను, పరివారమును వదిలిపెట్టి ఎవ్వరకీ చెప్పకుండా ద్రౌపది మానసంరక్షణార్థం తన సౌధం నుండి పరుగెత్తుకుంటూ వచ్చేశాడు. ఈ రకంగా నా స్వామిని అకస్మాత్తుగా పిలిచి ఇబ్బంది పెట్టినందుకు ఆ ద్రౌపదిని చంపాలి. ఇంక, యుద్ధభూమిలో **నాస్వామిని రథసారథి చేసి అనేక శ్రమలకు గురి చేసిన ఆ అర్జునుణ్ణి కూడా చంపాలి"** అన్నాడు. కృష్ణుని ప్రక్కనే నిలబడి ఈ మాటలు వింటున్న అర్జునుడు ఆ బ్రాహ్మణుని యొక్క భక్తిప్రపత్తులను గమనించి తన అహంకారమునకు సిగ్గు పడి తల దించుకున్నాడు.

(స.సా.సె. 99 పు.248)

మానవుడు పలువిధములైన అహంకారములతో అశాంతిని తనకు తాను అభివృద్ధిచేసుకొనుచున్నాడు. దీనికి కారణము అస్థిరమయిన అధికార వ్యామోహములే. న్యాయముగా యోచించిన యేవిషయమందూ మానవునకు శాశ్వత, సంపూర్ణ అధికారములేదు. యెందుకన ప్రపంచ అధికారమునకు ఆది అంత్యము లున్ననూ, శాశ్వతాధికారికి ఆది అంత్యములే లేవు. శాశ్వతాధికారి సర్వేశ్వరుడే. లోకమున కొందరు విద్యాధికారియనియూ, మరి కొందరు ధనాధికారి యనియూ, శాస్త్రాధికారియనియూ తలంచవచ్చు. అయితే ఈ అధికారమునకు కొంతవరకు మాత్రమే హద్దు కలదు. పోనీ కొంతవరకైనా అధికార మున్నదికదా అని తలంచవచ్చును. ఈ విద్యలనూ ఈ ధనమునూ ప్రసాదించువా రొకరున్నారుకదా? అట్లు ప్రసాదించు వారికంటె వీరు అధికారులుకారు కదా? ఆ రీతిగా యోచించిచూడ ఒకరి కొకరు అధికులయి కడకు సర్వులకూ అనుగ్రహించు సర్వేశ్వరుడే సర్వాధికారి కాని క్షణకాలమునకు సంప్రాప్తమైన అధికారమునకే, నేనధికారి అన్న అదియే ఆహంకారము.

నిజాధికారి స్వరూపములు, సత్యము, దయా, ప్రేమ, సహనము, కృతజ్ఞత. ఇత్యాది స్వరూపములుకలవారికి అహంకారమే రాదు. అట్టి వానిలో చోటే లేదు.

అహంకారమే ఆత్మ ప్రకాశమును మరుగు పరచుచున్నది. అహంకారము నశించెనా అన్నిబాధలూ తొలగిపోవును. ఆనందము ప్రాప్తించును. మబ్బు సూర్యుని ఆవరించిన రీతి అహంకారము ఆనందమును ఆవరించినది.

కన్నులు విప్పి ఆ కన్నులకు అడ్డుగా ఒక గుడ్డను లేక అట్టనో పట్టుకొనిన చెంతనే యున్న వస్తువులనుకూడా చూడలేము. అట్లే భగవంతుడు మానవునకు అన్నింటికంటె సన్నిహితుడుగా వున్ననూ అహంకార తెరవలన మాధవుని చూడలేకున్నారు. యెంతోమంది సాధకులూ, సన్యాసులు కూడను ఇట్టి అహంకారమునకు చోటిచ్చి సాధించిన సద్భావములనుకూడా కోల్పోవుచుందురు. వట్టి పాండిత్య మూలమున ప్రయోజనము లేదు. ప్రకృతి పేరు ప్రతిష్ఠలు పొందవచ్చును ఆత్మానందము లేని పేరు ప్రతిష్ఠలు పునాదిలేని గోడలు.

(ప్రే.వా. 8/9)

(చూ॥ అంతఃకరణ, అంతర్వాణి, అయస్కాంతశక్తి, ఆత్మ, డకారపంచకం, దూరంగా ఉంచు, దేహభ్రాంతి, దేహం, నగరసంకీర్తనం, నమస్కారం, భక్తుడు, మనస్సు, శాంతి, శిష్యుడు, సంసారం, సూక్ష్మం, సృష్టి, సేవ)

అహందేహోఽస్మి

రావణుడు, భస్మాసురుడు, కంసుడు ఇత్యాదివ్యక్తులు నిరంతరము **భగవన్నామమును స్మరిస్తూ ఉండినప్పటికిని వారి అసురత్వము ఏ మాత్రము తగ్గలేదు.** దీనికి కారణ మేమిటి? వారి మనోయంత్రములు నిరంతరము **"అహం దేహోఽస్మి"** అనే భావముతో కూడినవి. వీరు ఎంతో కాలము తపస్సులు చేశారు. ఈ తపస్సుయొక్క యంత్రము కూడను అహం దేహోఽస్మి, అహం దేహోఽస్మి, అహం దేహోఽస్మి నేను దేహమును అనే భావము చేతనే ఈ నామస్మరణ తపస్సులు ఆచరిస్తూ వచ్చారు. ఎంత కాలము నామస్మరణ చేసినప్పటికి దేహాత్మబుద్ధిని మనము ఉంచుకున్నప్పుడు ఇది

అహంబ్రహ్మాఽస్మి

ఏమాత్రము మార్పు చెందదు. అనేకమంది వారివారి సంస్కారములను సంప్రదాయములను పురస్కరించుకొని అనేక విధములైన రీతిగా సాధనలు సలుపుతుంటారు. ఎంతకాలము సాధన చేసినప్పటికిని వారిలో కొంతైన మార్పులు కనిపించవు. దీనికి తగిన ఫలము నందుకోలేకపోతున్నామే అనే నిరాశానిస్పృహలచేత వారు **అనేక నామములు మార్చుకుంటుంటారు. నామములు మార్చుకోవటమే కాకుండా మతములు కూడను మార్చుకుంటారు. మతమును మార్చుకున్నంత మాత్రమున భగవదనుగ్రహము ప్రాప్తించదు. మతిని మార్చుకోవాలి. గుడ్డలు మార్చుకున్నంత మాత్రమున భగవంతుని గుణములు మనలో అలవడవు. గుణమును మార్చుకోవాలి. మనస్సును మార్చుకున్న వ్యక్తికి మాత్రమే మనుష్యత్వము ప్రాప్తిస్తుంది.**

(శ్రీ.స.వి.వా.పు.44)

అహంబ్రహ్మాఽస్మి

(చూ॥ అభేదజ్ఞానము, నేను)

అహింస

ఈ నాటి అశాంతికి మూలకారణం సైన్స్. దేనికైనా ఒక పరిమితి ఉండాలి. సైన్స్-టెక్నాలజీ చాలా-అవసరమే. కాని అది మితి మీరి పోవడము చేత ఆటంబాంబులు, హైడ్రోజన్‌బాంబులు అభివృద్ధి అవుతున్నాయి. ఇవన్నీ మనిషిని చంపడానికి భయపెట్టడానికి చేసే సాధనాలే. కీడు కీటకమైనా చేయగలదు. చంపడానికి ఇన్నికోట్ల ఖర్చు పెట్టాలా? ఇంత పెద్ద బాంబులు తయారు చేయాలా? వీటికి ఖర్చుపెట్టే ధనం ప్రజా సంక్షేమం కోసం వినియోగిస్తే ఎంత బాగుంటుంది? ఒకదేశం వారిని చూచి మరొక దేశం వారు పోటీలుపడి బాంబులు తయారుచేస్తే ప్రపంచమే భస్మం అయిపోతుంది.

"అహింసా పరమోధర్మః" ఈధర్మాన్ని అనుసరిస్తే మనకు ఇంకా అస్త్ర, శస్త్రాలతో గాని ఏటం, హైడ్రోజన్ బాంబులతో గాని పనే ఉండదు. ప్రపంచమంతా ప్రేమపైనే ఆధారపడి ఉంది.

(దే.యు.పు.5)

అహింసా పద్ధతి నవలంబించుటవలన హిందూ దేశము రెండుగా విభజింపబడి ఆరెండు దేశములను పరస్పరము ద్వేషించు కొనుచున్నవి కదా అన్న, అది అహింసా పద్ధతి వలన కలిగిన తప్పుకాదు. ప్రజలకు అహింసా పద్ధతియందు నమ్మకము లేకపోవుట వలన కలిగినట్టిది ఆ తప్పు. నమ్మకము లేక అహింసా వాదులమని చెప్పుచుండుట వట్టి బూటకమే. దేశములు, దేహములు దగ్గర యైనంతమాత్రమున హృదయములు దగ్గర అయినవని భావించుటకు వీలు లేదు. మనము దూరదేశములందుండి నప్పటికిని అన్యోన్యము ప్రేమించుకొంటిమేని మిక్కిలి దగ్గర అయినట్లే. **దగ్గర నుండిననూ దూరమున నుండిననూ ప్రేమించుటయే మానవ ధర్మము. దేహములను దేవాలయములని భావించినప్పుడే అన్యోన్య ప్రేమ కలుగుటకు కారణ మగును.**

(స.శి.సు.ద్వి.పు.315/316)

(చూ॥ క్షమ, ప్రేమ)

ఆందోళన

పుట్టుక మీకు ఆందోళన కలిగించే క్షణం;
బాల్యం మీకు ఆందోళనతో కూడిన పోరాటం;
జీవితం ఆందోళన కలిగించే అనుభవాల పరంపర;
ఎంతో ఆందోళనకరమైన ప్రయత్నంతోకాని
జీవనోపాధి లభించదు;
వార్ధక్యం, మృత్యువు భయంకరమైన బాధతో,
ఆందోళనతో కూడినట్టివి;
ఆఖరికి ఆనందం కూడా ఏ క్షణంలో తిరిగి దానిని కోల్పోతామోనన్న ఆందోళనే కలిగిస్తుంది. జీవితమంతా ఆందోళనతో కూడి ఉంటుంది.
అందుచేత మీ ఆందోళననంతా ఒక విషయం వైపు మళ్ళించండి - "స్వామి అనుగ్రహము ఏ విధంగా పొందాలి? అన్న ఆందోళన మాత్రమే పెట్టుకోండి. అప్పుడే మీరు అన్ని విధములైన ఆందోళనలు, బాధలు, దుఃఖాలనుండి ముక్తిని పొందుతారు."

(స.శి.సు.నా. పు. 122)

ఆకలి

ప్రతిక్షణము యీ జగత్తునందు కర్మలు జరుగుతూనే వున్నాయి. పుణ్యములు, పురుషార్థములు, చావులు, పుట్టుకలు, పెండ్లిండ్లు, పేరంటములు యివి నిర్విరామముగా జరుగుతూ జీవితము నవ్వులతో యేడ్పులతో ముగిసిపోతూ వుంటుండాది. దీనికి అంతమే లేదు. **మానవుడు పుట్టగనే ఆకలి అతనిని వెంటాడుతుంది.** నాభినాళమును త్రుంచగనే శిశువు కెవ్వు కెవ్వుమని ఏడుస్తుంది. ఏ తేనో, గ్లూకోజో, పాలో నాలుకకు రాసినప్పుడు ఆ ఏడుపు చల్లారుతుంది. మొట్టమొదట మానవుని ఏడిపించేది ఆకలి. **~~ఈ~~ ఆకలికి ధాన్యము అత్యవసరము. ~~ఈ~~ ధాన్యము నీటివలననే లభ్యమవుతుంది గాని మరొక మార్గములో లభ్యము కాదు. ఎన్ని యంత్రములు, ఎన్ని తంత్రములు కనిపెట్టినప్పటికిని ఆకలి తీర్చునది అన్నమేగాని యంత్రములు తంత్రములు గాదు.** భూమి నీరును త్రాగి మానవులకు ధాన్యము నందిస్తుంది. ఆహార విహారములు అభివృద్ధికాగా మానవుల జనాభా

ఆకారం

దినదినమునకు పెరుగుతూ వచ్చింది. తరువాత పాడిపంటలు, గుడిసెలు, యిండ్లు, పల్లెలు, పట్టణములు పెరుగుతూ వచ్చాయి. ఈ విధముగా మానవ సంఘము దినదినాభివృద్ధి నొందుతూ తమ జీవితమునకు అవసరమైన దానిని అర్థము చేసుకుంటూ అవసరమైన వాటిని ప్రోగు చేసుకుంటూ కొన్ని రహస్యములను గుర్తించుకుంటూ వచ్చింది. ఇంతేకాక తమకు తెలియనివి అనేకముగా వున్నవని కూడను గుర్తించింది.

(ఉ.బ. పు. 15/16)

ఆకారం

(చూ॥నిరాకారం)

ఆగమ

(చూ॥ వేదం)

ఆగమనము

సర్వప్రాణకోటికి మూలాధారమైన ఆత్మను గూర్చిన జ్ఞానమే నేడు విస్మృతమైనది. అదే ఈనాటి అశాంతికిని, విప్లవమున కును, అవనీతికిని ముఖ్యకారణం. నిద్రాముద్రితమై యున్న ప్రజానీకమును మేలు కొలిపి, ఈ సందేశము నందించుటకే నా ఈ **ఆగమనము.**

(సా.అ.విషయసూచిక తరువాత పుట)

ఆగామి

ఎంతటివాడైనా, ప్రారంభదశలో కీడుచేసిన వారికి తిరిగి కీడు చేయవలెననియు, అపకారము చేసినవారికి తిరిగి అపకారము చేయవలెననియు, తనను అవమానపరిచిన వానికి తిరిగి ఏదో ఒక విధముగా అవమానము జరుగవలెననియు తలచుట సహజము. అది ప్రవృత్తి లక్షణము. కాని నివృత్తి మార్గమును అనుసరించువానికి ఇట్టి తలంపులు ఉండరాదు. ప్రత్యపకారము మరొక తీరని కర్మ కాగలదు. ఇట్టి దానినే 'ఆగామి' అందురు. ఉత్తరోత్తరంగా దానిని తిరిగి అనుభవించక తప్పదు. ప్రత్యపకారము వల్ల కర్మక్షయము కాదు. అభివృద్ధి అగును. ప్రత్యపకారము వలన సాధనకు తాత్కాలిక తృప్తి కలుగునేమో కాని, మున్ముందు అది తనను బాధించును. కాన, అపకారికి ఉపకారము చేయుటే తితీక్ష. అది దైవమానవత్వము యొక్క లక్షణము.

(శ్రీ.భ.ఉ.పు.11/12)

ఆచరణ

మన భక్తులు, మన ఆర్గనైజేషన్‌కు చెందిన వారందరూ ఆచరణ, ఆచరణ ఆచరణ. Be good, See good, Do good, That is the way to God - చాలమంది ఆడంబరాలు. ప్రయోజనమేమిటి? కొంతమంది లెక్చర్లు, లెక్చర్లు - ఒట్టిగాస్! ఇవన్నీ పుస్తకాలు చదివేది, నోటు చేసుకునేది లెక్చర్లు చెప్పేది. ఆచరణ చూస్తే జీరో. లెక్చర్లు చూస్తే హీరో''.

(సా ॥ పు 328)

భగవద్గీత కాని, బైబిల్‌కాని, ఖురానుకాని, గ్రంథ సాహీబ్‌కాని ఇంక ఏ పవిత్ర గ్రంథములైనప్పటికి పారాయణ నిమిత్తమై ఆవిర్భవించలేదు. **ఆచరించే నిమిత్తమై అందించినట్టివి. మనము ఆచరణలో పెట్టాలి.** శ్లోకాలు చదివి ప్రయోజన మేమిటి? ఎన్ని వాఖ్యానములు చేసి ప్రయోజన మేమిటి? "గంగ గోవు పాలు గంటె డైనను చాలు, కడివెడైన నేమి ఖరము పాలు''. భగవద్గీతను పారాయణము చేస్తూంటాము. ఏడునూర్లు శ్లోకాలు కంఠస్థము చేస్తున్నారు. ఇది భక్తి అనుకుంటారా? కాదు కాదు. ఇది ఆడంబరమైనటువంటి తత్వము. ఈనాడు ఆకార మానవునికంటె, ఆచార మానవుడు అత్యవసరము.

(బృ.త్ర.పు ౧౯౭)

భ్రమకు, బ్రహ్మకు ఉన్న వ్యత్యాసాన్ని మీరు గుర్తించాలి. **ఏకత్వమును అనేకత్వముగా విభజించటమే భ్రమ;**

అనేకత్వమును ఏకత్వముగా స్వీకరించడమే బ్రహ్మ. కనుకనే వేదము

"సహనా వవతు సహనౌ భునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మా విద్విషావహై"
అని ఏకత్వాన్ని ప్రబోధిస్తూ వచ్చింది. ఏమిటి దీని అర్థం? కలసి మెలసి పెరుగుదాం, కలసి మెలసి తిరుగుదాం కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం కలసి మెలసి కలత లేక చెలిమితో జీవించుదాం.
వేదము బోధించే ఇట్టి పవిత్రమైన, నిత్యసత్యమైన సూక్తులను మీరు గుర్తించి ఆచరణలో పెట్టాలి. సర్వ జీవులకు ప్రాణసమానమైనది వేదము. "వేదోఖిలో ధర్మమూలం", సర్వ ధర్మములకు మూలమైనది వేదము. ఇది అనంతమైనది విశాలమైన భావములతో కూడినది. జాతి, మత భేదము లేమాత్రము లేనిది. ఇట్టి పవిత్రమైన వేదములో ఉన్న సత్య సూక్తులను ఎవ్వరూ సరిగా గుర్తించటం లేదు. ఎవరికి తోచిన అర్థాన్ని వారు చెప్పుకుని కాలాన్ని వ్యర్థం చేస్తున్నారు. మీ జీవితం సార్థకం కావాలంటే వేదం లోని సత్యసూక్తులను ఆచరణలో పెట్టాలి. **"సత్యాన్నాస్తి పరో ధర్మః" సత్యమునే** పునాది దృఢంగా ఉన్నప్పుడే ధర్మమనే భవనం భద్రంగా నిలుస్తుంది. ఎలాంటి పరిస్థితియందైనా అసత్యమాడితే దానివల్ల ముమ్ముందు అనేక బాధలకు గురి కావలసివస్తుంది. "ముందున్నదిరా తొందరలోనే ముసలితనమ్మను ముసళ్ళ పండుగ!" **ఈ దేహం దేవుని వరప్రసాదం. దీనిని సద్వినియోగపర్చుకోవాలి. "దేహో దేవాలయః ప్రోక్తో జీవో దేవ స్సనాతనః". ఈదేహంలో దేవుడు నివసిస్తున్నాడు. జీవునికి, దేవునికి గల వ్యత్యాసం ఏమిటి? వ్యష్టియే జీవుడు, సమిష్టియే దేవుడు. కనుక, మీరు వ్యష్టితత్వం నుండి సమిష్టి తత్వంలోకి ప్రవేశించాలి.** అప్పుడే మీకు దైవత్వం ప్రాప్తిస్తుంది. **'ఈశావాస్య మిదం జగత్', 'ఈశ్వర స్సర్వ భూతానాం', 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి"** మున్నగు పవిత్రమైన వేదసూక్తులను మీరు అర్థం చేసుకోవాలనుకుంటే మొట్టమొదట సద్గుణాలను పెంచుకోవాలి. సదాచారములను అలవర్చుకోవాలి; సత్ప్రవర్తనతో జీవించాలి.

(స.సా. నం. 99 పు.320/321)

వ్యాసుల వారు అన్ని తెలివితేటలు, విద్యావినయములు కలిగిన వాడైనప్పటికిని తన వ్రాతలయందు **తనకే నమ్మకం లేక పోయింది. కారణ మేమిటి? ఆచరణమందు, అనుష్ఠానమందు ఏ మాత్రము కూడను అనుభూతికి రాలేదు.** చక్కెరకు చక్కరతీపి ఏమాత్రము తెలియదు. జిహ్వ మాత్రమే చక్కెర తీపి తెలుసుకోగలదు. నాలుకకు అనుభవముంది. అదే విధంగా భగవంతుని గుణగణ విశేషములను వర్ణిస్తూ వచ్చాడు, కాని తనయొక్క **ఆనందానుభూతిని అందుకోలేక పోయాడు వ్యాసుడు.** అదే విధంగానే మనం కూడ పిల్లలకు బోధించవచ్చు. కాని ఆ బోధించినటువంటి మనలో జీర్ణమైనపుడే ఈ బోధించే అధికారం, కాని ఈ బోధించిన దానికి తగినటువంటి ఫలితాన్ని మనం అందుకోటానికి అవకాశం ఉంటుంటాది. **కనుక మనం ఏది చెప్పినా ప్రీతి పూర్వకంగా వారి భవిష్యత్తును హృదయమునందుంచుకుని శాంతమైనటువంటి భావంతో ప్రేమ తత్వంతో వారికి ప్రబోధలు చేయటానికి పూను కోవాలి.** దీనివల్ల ఎంతైనా ఫలితం కొంత అధికంగా ఉంటుంది.

(గు.శి.పు.68/69)

(చూ॥ ఆత్మతత్వము, ఆద్వైతదర్శనము, దేవాలయం, యాక్స్‌స్స్, లైబ్రరీ, స్వాతంత్ర్యము)

ఆచరించు

(చూ॥ బెస్ట్‌ఫ్రెండ్స్)

ఆచారములు

భారతీయ సంస్కృతి చాల పవిత్రమైనది. కాని, ఈనాటి పిల్లలకు అర్థం కావటం లేదు. పర్వదినాల్లో భారతీయులు తమ ఇళ్ళకు పచ్చని మామిడి తోరణాలు కడుతున్నారు. ఎందుకోసం? మామిడాకులు మంగళకరమని

ఆచార్య

భావిస్తున్నారు. కేవలం మంగళకరమే కాదు; ఆకులు మనం వదిలిన కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకొని, పవిత్రమైన ఆక్సీజన్‌ను అందించి ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఈ సత్యాన్ని గుర్తించుకోలేక ఈనాటి పిల్లలు "ప్లాస్టిక్ ఆకులతో తోరణం కట్టుకోవచ్చు కదా! ప్రతి రోజు బయటికి పోయి ఆకులు ఎవరు తెస్తారు? అని విసుక్కుంటారు. ఈ రోజుల్లో పెళ్ళిళ్ళు జరిగేచోట అలంకారంగా షామియానాలు కడుతున్నారుగాని, పూర్వము అలాంటివేమీ లేవు. కట్టలు పాతి, వాటిపై పచ్చని ఆకులు వేసి పందిరి ఏర్పాటు చేసేవారు. పెళ్ళిళ్ళలో అనేకమంది గుమికూడటంచేత వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ పెరిగిపోతుంది. దానిని నిర్మూలించి పవిత్రమైన ఆక్సీజన్‌ను అందించడానికి ఆకులతో పందిరి ఏర్పాటు చేసేవారు.

విద్యార్థులారా! భారతీయ సంస్కృతిని చక్కగా అర్థం చేసుకొని ప్రవర్తించండి. ఆధునిక చదువులు చదువవద్దని నేను చెప్పను. నేనే మన యూనివర్సిటీని ప్రారంభించాను. అలాంటప్పుడు మిమ్మల్ని చదువుకోవద్దని నే నెందుకు చెపుతాను! చదువుకోండి. కాని, దానితోపాటు ఆత్మతత్త్వాన్ని కూడా అర్థం చేసుకోండి; హృదయాన్ని విశాలం చేసుకోండి. ఒక ఆధునిక విద్యార్థి ఇంటి వరండాలో ఇంకు బుడ్డి పెట్టుకుని అందులో పెన్ను అద్దుకుంటూ హోమ్ వర్క్ చేసుకుంటున్నాడు. అతని తాతగారు అదే వరండాలో కూర్చుని ఒక చిన్న గ్లాసు నుండి స్పూన్‌తో నీరు తీసుకుంటూ "కేశవాయ నమః నారాయణాయ నమః మాధవాయ నమః గోవిందాయనమః..... అని సంధ్యవార్చుకుంటున్నాడు. ఈ విద్యార్థితాను చేస్తున్న హోమ్ వర్క్ మానివేసి తాతగారివైపు ఆశ్చర్యంగా చూస్తూ కుర్చున్నాడు. "ఈ తాతగారు ఎంత పిచ్చివారు! స్పూనుతో నీరు త్రాగుతున్నారేమిటి?!" అని అనుకున్నాడు. అంతటితో ఊరుకోలేదు. "తాతగారూ! మీకు అంత దప్పికగా ఉంటే ఒకేతూరి ఆ గ్లాసు ఎత్తుకుని నీరు త్రాగవచ్చు కదా!" అన్నాడు. ఆ తాతగారు చిరునవ్వుతో "నాయనా! నా పని నాకు వదలిపెట్టు. నీ పని నీవు చూసుకో" అన్నాడు. కాని, ఈ పిల్లవాడు ఊరుకోలేదు. ఈనాటి పిల్లలు పెద్దవారి మాటల నేమాత్రము అర్థం చేసుకోలేరు. పైగా మొండితనంతో వాదించటానికి పూనుకుంటారు. "లేదు, తాతగారూ! ఎందుకోసం మీరు ఆవిధంగా చేస్తున్నారు?" అని అడిగాడు. అప్పుడాయన "ఒరే పిచ్చివాడా! నీవు ఇన్ని పర్యాయములు ఇంకు బుడ్డిలో పెన్ను అద్దుకునే బదులు ఒకేతూరి బాటిల్‌లోని ఇంకునంతా పేపరు మీద పోయవచ్చు కదా!" అని చక్కగా చురక వేశాడు. దానితో ఆ పిల్లవానికి బుద్ధి వచ్చింది. తాతగారు "నాయనా! కవరుపై అడ్రసు సరిగా వ్రాసినప్పుడే అది చేరవలసిన వారికి చేరుతుంది. అదేవిధంగా, కేశవాయ నమః నారాయణాయ నమః.. అని భగవంతుని పేరు చెప్పుకుంటూ తీర్థం త్రాగినప్పుడే అది భగవంతునికి చేరుతుంది" అని వివరించాడు.

(స.సా. జ. 2000 పు. 19/20)

ఆచార్య

మీరు ఆచార్యుడు అన్న పేరుతో సార్థక నామ ధేయులై ఉండాలి. **ఆచార్య అనగా ఆచరించేవాడు.** కాని మనం చెప్పినవి ఆచరించకుండా ఉంటే? అది Artificial జీవితముగా ఉంటుంది. ఇది సరియైనది కాదు. Heart is inside, Art is outside కనుక మనం Heart గా ఉండాలి కాని Art గా ఉండకూడదు. మన పిల్లలను కూడా ఈ విధమైన ఆదర్శవంతులుగా తయారు చేయాలి. అదే నిజమైన సాధన.

(శ్రీ.భ.ఉ.పు.153)

ఆచార్యుడు

అధ్యాపకులు ఆదర్శమైన జీవితాన్ని గడపాలి. వారు ఆచరించి, అనుభవించి, పిల్లలకు అందించాలి. ఆచరించేవాడు ఆచార్యుడు. ఆచరించకుండా ఆచార్యుడనుపించుకోవాలనుకోవటం కేవలం ఆర్టిఫిషియల్

(కృత్రిమమైన) జీవితమే అవుతుంది. తాను ఆచరిస్తూ, ఆచరించిన విషయాలను మాత్రమే విద్యార్థులకు బోధిస్తూ 'ఆచార్యుడు' అనే పేరును సార్థకం చేసుకోవాలి. విద్యార్థులను ఆందోళన దిశకు మరలించకుండా, వారికి నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక శీల సంపత్తులను ఇనుమడింప చేసే ఎడ్యుకేషన్‌ను అందిస్తూ వారిని ఎలివేట్ చేయాలి.

(శ్రీ. జూ. 97 పు. 68)

ఆచార్యోపాసన

లౌకిక విద్యలకు ఎట్లు గురువు అవసరమో వేదాంత విద్యలకు కూడనూ ఇది అవసరము. గురు భక్తి వలన గురువునకు కలిగిన శిష్యవాత్సల్యము శిష్యుని ఉత్తమ స్థితికి తేగలదు. అయితే గురిలేని గురుత్వము భ్రష్టమై పోవును. దూడను చూచి ఆవు చేపుకు విడచినటుల శిష్యుని చూచి గురువు అనుగ్రహమును అందించవలెను. భగవంతుని పొందగోరుటకు మోక్ష ప్రాప్తి నొందుటకు గురుబోధనలే ఆధారములు అని తెలిపెను.

(గీ.పు. 208)

ఆజ్ఞ

(చూ॥ నామస్మరణ)

ఆటంకములు

జ్ఞాన స్వరూపుడైన పరమాత్మను పొందుటకు నాలుగు ఆటంకములు కలవు. లయ, విక్షేప, క్షయ, రసాస్వాదములనెడివి. అవి కేవల పదార్థములు.

1. లయ : లయ అనగా నిద్ర. బాహ్య విషయముల నుండి లోనికి త్రిప్పిన మనసు గాఢ నిద్ర (సుషుప్తి) అనే సంసార ప్రభావమువలన గాఢ నిద్రలో ప్రవేశించుచున్నది. సాధకుడు మనస్సును నిద్రలోకి పోనివ్వకుండగ ఆత్మ విచారమందు నిలుపవలయును. అతడు అతి జాగ్రత్తగా మెలకువ కలిగియుండవలెను.

2. విక్షేపము : జాగ్రత్తయొక్క సంస్కారము, సుకృతమువలన మనస్సును బాహ్యేంద్రియ విషయముల మీదనుండి మళ్ళించుటకు ఎన్నియో కష్టములు పడుచుండును. **దీనినే విక్షేపము లేక మనశ్చంచలము అనికూడా అందురు.** విచారణాశక్తి మూలమున మనస్సును బాహ్య విషయములనుండి లోనికి ద్రిప్పు కొనుచుండవలెను. మనసు అతి సూక్ష్మమైన తన ఆత్మలో ఉండజాలక వెలుపలి ప్రపంచమున తిరుగాడుటకై పరుగెత్తును. విక్షేపమే వెలుపల తిరుగవలెనని తోచెడి మనోవృత్తి. లయ విక్షేపములనుండి మరలించిన మనసు మరల ధ్యానమందు లగ్నము కాగలదు. బలవత్తరమైన అంతర్గత రాగద్వేషములను వాసనలచే బాహ్య విషయములలో కలసి పోవును. దుఃఖములో మునిగి యుండును. అప్పుడు ఏక దృష్టి కలిగియుండును కాని, ఈ స్థితిని సమాధి అని తలపరాదు. ఇది క్షయమే. ఇది మనోరాజ్యము, లేక మేడలు కట్టు మనస్సు.

3. కాంక్షయ : మనస్సే లోకవాంఛలను కోరును. ఇది బాహ్యానురాగము. తనలో తాను పూర్వస్థితిని గురించి చింతించుచూ ఉత్తరస్థితికొరకు ప్రణాళికలు వేయు చుండును. ఇది అంతరానురాగము. దీనిని **కాంక్షయ** అని అందురు. బాహ్యాకర్షణ శక్తియే విక్షేపము. అనురాగమనెడి సంస్కారము వలన లోపల నుండి సంభవించునదేదియో అదియే కాంక్షక్షయ మనబడును. ఈ కాంక్ష క్షయమే సమాధికి బలము.

4. రసాస్వాదము : విక్షేపము తొలగిపోగానే సవికల్పానందము సంభవించును. **దీనినే రసాస్వాద మనెదరు.** ఇది నిర్వికల్ప సమాధి లేక బ్రహ్మానందమును బొందుటకు ఆటంకము.

5. నిర్వికల్ప సమాధి - విక్షేపమును రూపుమాపుట : పెద్ద బరువును మోయుచున్న వ్యక్తి బరువును క్రిందికి దింపి, ఎట్టి ఆనందమును అనుభవించునో ఒక ధనరాశి నాశించువాడు దాని చుట్టును తిరుగుచున్న సర్పమును చంపిన ఎట్టి ఆనందమును పొందునో, అట్టి ఆనందమును రసాస్వాదనము వలన పొందుచున్నాము. అయితే సర్పమును చంపినంతనే మనస్సు తృప్తి జెందునా?

లేదు, ఆ ధనమును స్వీకరింప గలిగినగాని మనస్సు నిజమైన ఆనందమును అనుభవింప జాలదు. కాని, ఈ నిర్వకల్ప సమాధిని రుచి చూచినపుడు మానవుడు పైమెట్టు ఎక్కినట్లు లెక్క. సర్పమును చంపుటే విక్షేపమును రూపుమాపుట.

(శ్రీ.సా.సూ. పు. 131/132 మరియు జ్ఞా.వా. పు. 2/5)

ఆటంబాంబులు

(చూ॥ విజ్ఞాన శాస్త్రము)

ఆటలు

"నిర్భయత్వం ఆటల వల్ల కలుగుతుంది. అటల యందు ఆధ్యాత్మికభావాన్ని, దివ్యమైన సంకల్పాన్ని, పవిత్రమైన నడవడికను అలవరుచుకోవాలి. ఆటల్లో ఆధ్యాత్మికమునకు ఆవకాశం ఎట్లా ఉంటుంది? అని మీరు సందేహించవచ్చు. మనం పుట్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్, త్రోబాల్ అడుతున్నాం. ఈ ఆటలకు మన నిత్య జీవితానికి సన్నిహిత సంబంధమున్నది.

మన జీవితం ఒక 'పుట్‌బాల్' లాంటిది. కష్టసుఖాలనే ఆటగాండ్రు, అహంకారమనే గాలి వున్నంతవరకు జీవితమనే బంతిని తన్నుతూనే వుంటారు. బాల్‌లో గాలి వున్నంత వరకు కాలికి దెబ్బలు తప్పవు. అహంకారమనే గాలిపోతే ఈ కాలిదెబ్బలు వుండవు. కోర్టులో కామ, క్రోధ, మోహ, మద, మాత్సర్యాలనే ఆటగాండ్రు ఒకవైపు; సత్య,ధర్మ, శాంతి,ప్రేమ, అహింస, క్రమశిక్షణలు అనే ఆటగాండ్రు మరొకవైపు వుంటారు. వీరికి పొత్తు కుదరదు. మంచితనమును జయించాలని చెడ్డతనం, తప్పును ప్రక్కకునెట్టాలని మంచితనం, నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఈ జయాపజయాలే ఒక విధంగా సంతోషాలు కష్టాలు, సుఖదుఃఖాలు, పాపపుణ్యాలు, ఈ ఆటలో రెండు హద్దుల మధ్యగా బాల్ పోయినప్పుడు 'గోల్' అవుతుంది. ఈ హద్దులు ఒకటి ధర్మమార్గము రెండవది బ్రహ్మమార్గము. జీవితమనే బంతి ఈ రెండు హద్దుల మధ్యనుండి పోవాలి. అప్పుడే విజయం. పుట్‌బాల్ బ్రహ్మచర్య జీవితానికి ప్రతీక. **"బ్రహ్మచారీ శత మర్కటః"** అంటారు. మంచికి, చెడ్డకు పోరాటం! అడుగడుగునా జీవితమనే బంతికి దెబ్బలే దెబ్బలు తగిలినా విజయం సాధించడానికి ప్రయత్నించడం బ్రహ్మచర్య లక్షణము.

రెండవది బాస్కెట్‌బాల్. ఇందులో కూడా మంచి, చెడు రెండు విభాగాలుగా ఏర్పడి, కజీవితమనే బంతిని సంసారమనే వలలో పడవేయటానికి ఇరుపక్షాల ఆటగాండ్రు ప్రయత్నిస్తూ వుంటారు. జీవితమనే బంతిని 'వల' అనే సంసారబంధనలో వేయడమే వారికి ఉత్సాహకరంగా వుంటుంది. జీవిత బంధనలో పడకపోతే వారికి నిరుత్సాహం కలుగుతుంది. బ్రహ్మచర్యంలో అపజయం కలిగినచో గృహస్థుడైపోతాడు. విజయం సాధించినచో జగత్తుకు ఆదర్శవంతుడవుతాడు. కనుక బాస్కెట్ బాల్ గృహస్థాశ్రమ ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని ప్రస్ఫుటం చేస్తుంది.

మూడవది వాలీబాల్. ఈ ఆటలో బంతి క్రిందపడకుండా ఇరుపక్షాల ఆటగాండ్రు ఎగిరెగిరి కొడుతుంటారు. ఉభయ పక్షాల మధ్య ఎత్తైన వల కట్టి వుంటుంది. వలకు తగులనీయకుండా ఇవతలివారు అటు, అవతలివారు ఇటు బంతిని కొడుతుంటారు. బంతిని క్రింద పడనిచ్చిన వారు ఓడిపోయినట్లు అవుతుంది.

నాలుగో ఆట త్రోబాల్. ఇందులో బంతి బరువుగా వుంటుంది. బంతి బరువైనది కాబట్టి దూరంగా విసరాలని ప్రయత్నించినా దగ్గర గానే పడుతుంది. అంటే రాగద్వేషబంధనలు గాఢంగా వుంటాయని, అయినా వాటిని దూరంగా విసిరివేయటానికి ప్రయత్నిస్తుండాలని ఈ ఆట సందేశము.

"బ్రహ్మచర్యంలో మంచి చెడ్డలతో పారాడటం పుట్‌బాల్ అంతరార్థం. గృహస్థాశ్రమంలో భోగభాగ్యాలలో బంధితుడు కావాలని ఆశించడం బాస్కెట్ బాల్ అంతరార్థం. వానప్రస్థంలో నీతి నిజాయితీలతో, బంధనతో సంబంధం లేకుండా జీవితం గడపాలని

ఆశించడం వాలీబాల్ అంతరార్థం. ఈ ఆటలు నాలుగు ఆశ్రమ స్థితులను చూచిస్తున్నవి. ఈ నాలుగింటిలోను విజయం సాధించడానికి మానవుడు ప్రయత్నించాలి".

(ఉదయం ప్రత్యేక అనుబంధం పు.8)

ఆడంబర భక్తి

ఒక గ్రామంలో ఒక వ్యక్తి నిత్యం పట్టుబట్టలు ధరించి, విభూతి పిండికట్లు పెట్టుకుని, చేతిలో రుద్రాక్ష మాల త్రిప్పుతూ ఉదయం నుండి రాత్రి పది గంటల వరకూ శివాలయంలో కూర్చుని కన్నులు మూసుకుని జపం చేయడం మొదలు పెట్టాడు. మధ్యాహ్నం తలుపులు మూయడానికి పూజారికి కొంత ఇబ్బందిగా ఉండి, అసలు ఈ వ్యక్తి ఎంతటి భక్తుడో తెలుసుకుందామన్న ఉద్దేశ్యంతో రహస్యంగా ఒక రాత్రి అతడు శివలింగం వెనుక దాగి ఉండి, "భక్తా! నీ జపధ్యానాలకు మెచ్చాను. నీ ప్రాణాలను నాలో లీనం చేసుకుని నీకు మోక్షం ప్రసాదిస్తాను. నువ్వు లేచి ఇలా దగ్గరకు రా నాయనా!" అన్నాడు. అంతే! ఆ వ్యక్తి లేచి జపమాల అక్కడే పారేసి ఆలయం బయటికి పరిగెత్తాడు. **జీవిత పరమావధి గ్రహించకుండా, లౌకిక వాంఛలు తీరడానికి తాత్కాలిక ఆవేశంతో జపాలు, వ్రతాలు మ్రొక్కులు అంటూ చూపే ఆడంబర భక్తి** ఆత్మవంచనే అవుతుంది. భగవంతుడు భావప్రయుడు. భగవంతుడు కట్టుబడేది భక్తుని ప్రేమపాశానికి మాత్రమే.

(స.సా.ఏ. 99 వెనుకపుట)

ఆడంబరము

(చూ॥భక్తుని లక్షణము)

ఆడవారు

బెంగుళూరులో టెలిఫోన్ ఫ్యాక్టరీ ఉన్నది. ఆ ఫ్యాక్టరీలో పనిచేసేవారు అందరూ ఆడవారే. "ఎందుకు మగపిల్లల్ని తీసుకోరు"? అని ఆ ఛైర్మన్‌ను ప్రశ్నించాను. అప్పుడు ఆ ఛైర్మన్ **"ఒక ఆడపిల్ల చేసే పని పదిమంది మగపిల్లలు కూడా చేయరు"? అన్నాడు. ఆడవారు పట్టుదలపడితే దానినిసాధించేదాకా నిద్రపోరు.** ఇంకా ఒక చిన్న విషయం గమనించండి. మగవారు కారు నడుపుతారు, ఆడవారు నడుపుతారు. కాని ఎక్కువ యాక్సిడెంట్లు మగవారు నడిపే కార్లకే అవుతుంటాయి. ఎందువలన? **ఆడవారు మగవారికన్నా ఏకాగ్రతతో కారు నడుపగలరు. ఈ ఏకాగ్రత మగవారిలో కూడా వచ్చినప్పుడు దేశం అన్ని రంగాలలో బాగుపడుతుంది.** ప్రత్యేకంగా సత్యసాయి సంస్థలలో పనిచేసేవారు కడు జాగరూకతతో వుండాలి. ఇక్కడపని చేసేవారు మంచి చేసినా చెడ్డచేసినా అది సత్యసాయికే వస్తుంది. కనుక సత్యసాయికి పేరు తీసుకొని రావాలంటే మీరు సత్యమైన మార్గమును అనుసరిస్తూ రావాలి. మన సంస్థలో ఓకరినొకరు కలహించుకుంటున్నారనే నింద రాకూడదు. మనలో ఏమాత్రం బేధభావములు పెట్టుకోకూడదు. ఐకమత్యంతో సాధించడానికి ప్రయత్నం చేయాలి. **అన్నింటికీ ప్రేమయే ఆధారము. ప్రేమయే దైవము. ఆ ప్రేమయందే జీవించడానికి ప్రయత్నం చేయండి లవ్ ఈజ్ గాడ్, లివ్ ఇన్ లవ్.**

(శ్రీ. డి. 98 పు.9)

ఆత్మ (రేడియేషన్)

ముందు లేకుండి తరువాత కలుగుట జన్మమని అందురు. ఉండి లేకపోవుట మరణమని అందురు. జన్మము సావయవ వస్తువులకే కానీ నిరవయవ వస్తువుకు కాదు! ఆత్మ నిరవయవం కదా! కనుక **ఆత్మకు జన్మ మెక్కడిది? అట్టి జన్మమే లేనిదానికి మరణము యెట్లు సంభవించును?** అట్టి ఆత్మ యెవరిని చంపును? యెవరిని చంపించును? అది అజము, నిత్యము, శాశ్వతము, మలినమైన, జీర్ణమైన వస్త్రములను మనుజుడు విడిచి నూతన శుభ్రమైన వస్త్రములను యే రీతిగా ధరించునో అటులనే **దేహి జీర్ణములైన దేహములను విడి నూతన దేహములను ధరించుచున్నది.** వస్త్రము దేహమున కెట్టిదో,దేహము దేహి కట్టిది. దేహములకు సాక్షియైన ఈ ఆత్మను

తత్వతః తెలిసి కొనినచో నీవు ఈ రీతిగా శోకించియుండెడి వాడవు కావు. నీ సర్వాయుధములు ఈ శరీరములను జడములను కొట్టగలవే గాని నిర్వకారమైన ఆత్మను యే రీతిగానూ సమీపించలేవు. ఈ సత్యమును తెలిసి కొని శరీరమందలి శోకమును త్యజించుము.

(గీ.పు.32)

ఆత్మకూ చావుకూ ఎట్టి సంబంధం లేదు. మరణము యొక్క అనుభవము దేహమునకే కానీ నిత్య, సత్య, నిర్మలమైన ఆత్మకు అంటదు. అందువలననే మరణమన్న యిష్టపడదు; ఇష్టపడనిది ఆత్మకానీ దేహము కాదు. **మరణమన్న యేది ఇష్టపడకుండా వున్నదో ఆ ఆత్మే నీవు. నీవు సత్, స్వరూపుడవు.** దేహముపై ఆరోపించే అమరధర్మం అవివేకము. దేహము సత్ కానేకాదు. ఆ సత్ పేరున నున్న నీవే ఆత్మ కానీ ఆత్మకు మరణము రాదు, లేదు. అట్టి మరణము లేని ఆత్మ, సర్వ ఉపాధులందూ వుండును. కనుక, ప్రతి దేహము లోనూ సత్‌పదార్థశక్తి సార్థకమైయున్నదని తేట తెల్లమగుచున్నది. ఇక రెండవదైన చిత్ **అన్నింటినీ తెలిసికొనవలెనను శక్తి, ప్రతి మానవుడు దేనిని చూచినను ఇది యేమి? అది యేమి? అని ప్రశ్నించి దాని స్థితిగతులను తెలిసికొనగోరును.** ఆవిధముగా ప్రయత్నించి దీనిని తెలుసుకొనువారు కొంతమంది ఉండవచ్చును. కేవలము తెలుసుకొనవలెనని మాత్రము ఆశించి, ప్రయత్నించి తెలుసుకొన లేకుండా పోవచ్చును. ఎటులయిన నేమి ప్రతివాడూ తెలిసికొన వలెనని ఆసక్తితో, ప్రయత్నము సలుపును.

స్వయముగా చైతన్యమైన చిత్‌శక్తికి జడవస్తువులను కూడా చైతన్యవంతముగా ప్రకాశింపచేసే స్వభావము సహజముగ వున్నది. అందుకనే ఈ లక్షణము మానవునియందు మెరయుచున్నది, మెరిపించు చున్నది. మానవునియందు చిత్‌శక్తి వున్నదనుటలో పైవిషమయు విచారించిన స్పష్టమగుచున్నది.

మానవుడేకాక పశు పక్షి మృగాదులు కూడనూ తమంతట తాము సుఖముగా వుండవలెననియే కోరు చుండును. సుఖమునకై ప్రయత్నములుకూడనూ చేయుచుండును. దుఃఖమునుకానీ కష్టమునుకానీ అవి ఆశించవు. వచ్చిననూ తప్పించుకొనుటకు ప్రయత్నించును. ఇక మానవుల విషయము తెలుపనక్కరలేదు. నిరంతరము సర్వకర్మల యందు సర్వత్రా సుఖముగానే యుండవలెనని కోరుదురుకానీ ఒక సమయమందైనా, వేరొక స్థాన మందైనా, వేరొక కాలమందైనా దుఃఖమును ఆశించరు.

(గీ.పు. 127/129)

ఆత్మ అతి సూక్ష్మమయినది: దానిని తెలుసుకొనుట చాలా కష్టము. పంచభూతములగు భూమి, జలము అగ్ని, వాయువు, ఆకాశము, ఇవి నీకు తెలియును కదా! ఇవి మొదటినుండియూ విచారించిన వకదానికంటే మరొకటి తేలిక అగుచున్నది. అనగా, భూమికంటే జలము, జలముకంటే అగ్ని, అగ్నికంటే వాయువు, వాయువు కంటే ఆకాశము తేలిక అగుటయే కాక విశాల మగుచున్నవి కూడను, అనగా భూమియందున్న గుణములు శబ్దస్పర్శ రూప రస గంధములనబడు అయిదు గుణములు; రెండవదనబడు జలమునందు గంధము తగ్గిపోయినది; అగ్నియందు గంధము రసము తగ్గిపోయినవి; వాయువునందు రూప రస గంధములు తగ్గి పోయినవి. అందువలన భూమికంటెను, జలముకంటెను, అగ్నికంటెను మరింత తేలిక అయి వ్యాపకమయి సంచరించుచున్నది. ఇక అయిదవదయిన ఆకాశమున స్పర్శ, రూప, రస గంధములు లేక కేవలము ఒక శబ్దము మాత్రమే యున్నది. ఒక్క గుణముగల **ఆకాశమే అంత సూక్ష్మమయి నపుడు నిర్గుణమైన ఆత్మ మరెంత సూక్ష్మమో యోచించుకొనలేక పోవుచున్నావు.** అంత సూక్ష్మమగుటచే బహిర్ముఖమున తెలిసికొన లేకపోవుచున్నారు. అది అంతర్ముఖులకు మాత్రమే అతి సమీపమున నుండును.

(గీ. పు. 217/218)

సూర్యుని వేడిమినుంచి ఏర్పడిన మేఘ సముదాయము. సూర్యుని కప్పివేసినట్టుగా, ఆత్మ నుండి పుట్టిన మానసిక మేఘసముదాయము ఆత్మనే కప్పివేస్తుంది.

(బృ.త్ర.పు ౧౩౮)

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః
అహ మాదిశ్చ మధ్యంచ భూతానామంత ఏవచ.
అర్జునా! నేను ఆత్మను. సర్వభూతములయందుండిన వాడను నేను. ఆది మధ్య అంతము నేనే. ఈ చరాచర ప్రపంచమునందు గోచరించునదంతయు ఆత్మ తత్వమే. ఆధ్యాత్మిక క్షేత్రమునందు అడుగడునా వినిపించునది కనుపించునది. అనిపించునది మైమరపించునది ఆత్మనే. లోకమునందు ఆత్మ కానిది మరొకటి లేదు. ఈనాడు మానవుడు సాధించవలసినది ఆత్మనిష్ఠనే. స్వస్వరూపాను సంధానమే ఆత్మనిష్ఠ. తనను తాను గుర్తించుకోవటమే ఆత్మ జ్ఞానము. మానవత్వమునందు ప్రప్రథమముగా సాధించవలసినది ఆత్మానందమే. నిరంతరము జ్ఞప్తి యందుంచుకోవలసినది ఆత్మ తత్వమే. **ఆత్మనే ఎరుక అని పిలువబడుతుంది.**

(బృ.త్ర.పు ౧౨౩)

ఈ పాంచ భౌతికమైన దేహము బుడగవంటిది. ఈ దేహమునందు ఆత్మ అణుస్వరూపము ధరించుట చేత, దేహత్మ అన్నారు. ఈ సర్వ చైతన్యము, సమస్తములైన పదార్థములను కదిలిస్తుంది. దేహము, జీవుడు పరమాత్మ. అను 3 తత్వములున్నాయి. కాని దేహత్మ, జీవాత్మ, పరమాత్మ -ఆత్మ మూడింటి యందు ఒక్కటిగనే యున్నది.

(సా. పు. 287)

ఈగ అన్నింటిపైన వ్రాలును. అగ్నిపై మాత్రము వ్రాలదు. వ్రాలిన జీవించదు. అటులనే **మనసు** అన్నింటిని చింతించును. ఆత్మను మాత్రము చింతించదు. **ఆత్మను చింతించెనా లోక చింత ఉండదు.**

ఆత్మ సాక్షాత్కారమునకు లోచూపే ప్రధానము. మౌనమే స్వభావము. ధ్యానమునననములే దానికి సాధనలు.
వశమందు లేని మనోశక్తి ఆత్మకు పరమ శత్రువు.

(ఆ.దీ.పు. 179)

కొంత లవణమును (ఉప్పును) పాత్రలోని జలములో వేస్తే, కొంత సేపటికి అది కరిగి సర్వత్రా వ్యాపిస్తుంది. లవణము సర్వత్రా వ్యాపించినప్పటికి, కంటికి కనబడదు. చేతికి చిక్కదు. అయితే లేదని చెప్పుటకు ఏమాత్రము వీలుకాదు. జిహ్వాయందు వేసుకొనిన దాని రుచి తెలుస్తుంది. **సర్వత్రా వ్యాపించిన రుచివే నీవు. అదే ఆత్మ.** అదే సత్యము. అదే తత్వమసి.

(సా॥ పు॥ 393)

చావు పుట్టుక లేని శాశ్వతుండు! ఆది మధ్యాంత రహితుడనాదివాడు!
తాను చావక చంపబడక అంతటను సర్వసాక్షియై ఆత్మయుండు ॥

(సా. పు 433)

కంటికి గ్రుడ్డును కాటుక నంటనట్టి
జిడ్డు ఏమాత్రము అంటక జిహ్వయుండు
బురదనంటక తామరపువ్వులుండు
ఏది అంటక యుండెడి అదియె ఆత్మ ॥

(సా. పు 439)

వాక్కు, మనస్సు, ప్రాణము, ఈ మూడింటి సమ్మిళిత స్వరూపము ఆత్మ. దీనికి మూడు అవస్థలు. జాగ్రత్, స్వప్న, సుషుప్తులు మేల్కొని యుండి, దృశ్య జగత్తులో అన్నిటిని చూడటం, వినటం మాట్లాడటం, అనుభవించడం. ఇలాంటి పంచేంద్రియములతో కూడిన తత్వం జగత్తు. **ఇది విశ్వతత్వానికి సూక్ష్మ రూపం కనుక నిజానికి, విశ్వుడు అని మరియొక పేరు. విశ్వుడు 24 తత్వాలతో కూడి వుంటాడు.** 5 కర్మేంద్రియములు, 5 జ్ఞానేంద్రియ ములు, 5 కోశములు, 5 పంచ ప్రాణములు, 4 అంతః కరణములు - మనస్సు, అహంకారము, చిత్తము, బుద్ధి. **ఈ 24 తత్వాలతో కూడినది బాహ్య జగత్తు లేక విశ్వుడు.** ఇది జాగ్రదవస్థ రూపము.

మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అను 4 గింటితోటి కూడుకొని స్వప్నావస్థ ఉంటుంది. బాహ్యమైన కర్మేంద్రియములతో దీనికి పనిలేదు. ఇటువంటి పరిస్థితులలో, తేజోమయ రూపాన్ని ధరిస్తుంది. కనుక **స్వప్నావస్థకు, తైజసుడు అని పేరు.** సుషుప్తి. ఇదే కారణావస్థ అనగా మంచి సుషుప్తి అనగా నిద్ర. మంచి గాఢనిద్రయని సుషుప్తి అర్థము. గాఢనిద్రలో, కేవలము ప్రజ్ఞ మాత్రమే

ఆత్మగౌరవము

మిగిలి యుంటుంది. కనుక సుషుప్తిలో ఉన్నవానికి ప్రాజ్ఞుడని పేరు. విశ్వుడు, తైజసుడు, ప్రాజ్ఞుడు, యీ మూడు కూడా ఆత్మకు గల పేర్లు మాత్రమే.

(సా. పు. 290)

అణువు కంటెను సూక్ష్మమై అణువు ఉండు
ఘనము కంటెను ఘనమై కనిపించుచుండు
అణువె ఘనముగా, ఘనమె అణువుగనుండు
అణువె, ఆత్మయై, ఆత్మయే అణువుగనుండు.

(శ్రీ. ఏ. 1996 పు. 5)

(చూ॥ అంతరాత్మ, అంతర్వాణి, ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞానము యొక్క పరాకాష్ఠ, ఆహారము, గౌణశ్చేన్నాత్మశబ్దాత్, చదువు, చైతన్యము, జ్ఞానము, త్రిగుణములు, దివ్యప్రకటనలు, దేహము, బుద్ధి, బ్రహ్మ, భక్తి, రాజబాట, శబ్దము, శరీరము, సాక్షాత్కారము, హిరణ్యగర్భ తత్వం)

ఆత్మగౌరవము

(చూ॥ లింకన్)

ఆత్మజ్ఞానము

"తరతి శోకమాత్మవిత్" అన్నారు. అనగా **శోకమును దాటే మార్గము ఒక్క ఆత్మజ్ఞానముచేతనే లభిస్తుంది.** అన్యమార్గములచేత శోకమును నివారణ చేసుకోవటానికి వీలుకాదు. శోకమును తప్పించి ఆనందమును చేకూర్చేది ఆత్మ విద్య. అదే ఆధ్యాత్మిక విద్య. కనుకనే యీ ఆత్మవిద్యకు ఎవరు అర్హులు అనే విషయాన్ని విచారించాలి. దీనికి బాలురా వృద్ధులా స్త్రీలా పురుషులా యింకే తెగకు సంబంధించినవారు అని విచారణ చేస్తే ఆత్మజ్ఞానమును వెలిగించుటకు అందరూ అర్హులే. లౌకికవిద్యలచేత కీర్తి, ప్రతిష్ఠ, గౌరవములను అందుకోగలరు; కానీ ఆత్మవిద్య చేత దైవానుగ్రహమునకే పాత్రులై దివ్యత్వమైన ఆత్మతత్వాన్ని పొందే అవకాశముంటుండాది. ఇట్టి విద్యను పొందుటకు లౌకికవిద్యలయందుగాని, లౌకిక ధనకనకవస్తువాహనాదుల యందుగాని, కులమత, సౌఖ్యములందు గానీ యేమాత్రము అవకాశము లేదు.

"వాల్మీకి యెవ్వని వంశమందలివాడు
నందుండు ఏ పల్లెయందు పుట్టె
ధర కుచేలుం డెంత ధనము గలిగియుండె
గజరాజు ఏవిద్య కల్గియుండె
వసుధ ధ్రువుండెంత వయసు గలిగియుండె
తిన్నని కెంతటి తెలివి యుండె?"

ఈ విధముగా మీరు విచారణ చేస్తే **జాతి మత కుల ధనకనక వస్తు వాహనాదులతో దైవత్వమునకు ఎట్టి సంబంధమును లేదు.** "భక్తి కల్గినవానికి వశుడవగుట సత్యమేని నీవు నా యీ తులసీదళముతో తూగుదువు గాక" అన్నది రుక్మిణి. ఈ భక్తి మానవత్వములో ఒక విశిష్టమైన స్థానమును ఆక్రమించినట్టిది. **"యో మద్భక్తః నమేప్రియః" నన్ను భక్తితో కొల్చేవానియందే నాకు అధికమైన ప్రేమ అన్నాడు భగవంతుడు.**

(శ్రీ.గీ.పు.2,3)

ఒకానొక సమయమున జనకమహారాజు తన రాజ్యము లోపల యెవరైనా పండితులుగాని, ఋషులు గాని, యోగులు గాని, జోగులు గాని, బైరాగులు గాని, విరాగులుగాని, యెవరైనా సరే, **నాకు ఆత్మజ్ఞానమును** బోధించాలి అని అందరికి వర్తమానము పంపాడు. గుట్టమును యెక్కి ఒక రికాబులో కాలుపెట్టి రెండవ రికాబులో కాలుపెట్టేలోపలనే ఆత్మానందము చేకూర్చాలి; బ్రహ్మప్రాప్తి చేకూర్చాలి అన్నాడు. ఈవిధముగా యెవరు చేయరో అలాంటి పండితులనుగాని అలాంటి వేదాంతులనుగాని, అలాంటి యోగులనుగాని నా రాజ్యములో వుంచుకోను. వారిని రాజ్యమునుండి బయటకు తరుముతాను అన్నాడు. ఈ పండితులకు, ఋషులకు, యోగులకు భయమేర్పడినది. ఇది మన విద్యకు పరీక్షా ఘట్టమనుకున్నారు. కాని యెవరూ దీనికి సాహసించలేదు. అష్టావక్రుడు ఆ రాజ్యములో

ప్రవేశించాడు. మిథిలాపురము దాటుకొని ప్రయాణము చేస్తున్న సమయములోపల వూరిబయట పండితులు యోగులు విచారముగా కూర్చొన్నారు. **అష్టావక్రుడు మీ విచారమునకు కారణమేమిటి** అని ప్రశ్నించాడు. వారు జరిగిన విషయము చెప్పారు. అతను నేరుగా జనక మహారాజు ఆస్థానములో ప్రవేశించాడు. రాజా! **నీకు ఆత్మజ్ఞానమును బోధించటానికి నేను సిద్ధముగా వున్నాను. ఆత్మజ్ఞానబోధ ఈ రాజభవనములో చేయటానికి వీలుకాదు. ఈ రాజభవనమంతా రజోగుణతమో గుణములతో నిండివుంటున్నాది. నేను నిన్ను శుద్ధసాత్వికములో ప్రవేశపెట్టాలి. కనుక నావెంట రమ్మన్నాడు. అతనితో తీసుకొని వెళ్ళాడు.** రాజు వెంట గుఱ్ఱములు, సైన్యములు, అంతా వెళ్ళింది. పరివారమునంతా ఒక చోట నిలబెట్టాడు. **జనకమహారాజు అష్టావక్రుడు మధ్య** అరణ్యములోపల ప్రవేశించారు. అప్పుడు అష్టావక్రుడు జనకమహారాజును కోరాడు. రాజా నేను యిప్పుడు ఆత్మజ్ఞానము బోధించేవాడను. నీవు వినేవాడవు. వినేవాడు శిష్యుడు, బోధించేవాడు గురువు. ఇది నీకు ఒప్పుకొనదగిన విషయమేనా అన్నాడు. దీనిని నీవు అంగీకరించుటే నిజమైన గురుదక్షిణ. నాకు ఒకటి యివ్వు. గురుదక్షిణ యిచ్చిన తరువాతనే వుపదేశము ప్రారంభించాలి అన్నాడు. "నాకు కావలసినదిబ్రహ్మప్రాప్తి. కనుక యేదైనా యివ్వటానికి నేను సిద్ధముగా వుంటున్నాను. సర్వమూ నేను త్యజించివేస్తాను" అన్నాడు జనకమహారాజు. **'నాకు యేమి అక్కరలేదు. నీమనస్సు నివ్వు' అన్నాడు అష్టావక్రుడు.** 'ఇచ్చినాను. ఇది నామనస్సు కాదు, తమ మనస్సు' అన్నాడు జనకుడు. అష్టావక్రుడు జనకుని గుఱ్ఱమును రప్పించాడు. అక్కడ నిలబెట్టాడు. రాజును కొంచెము సేపు కూర్చోమన్నాడు. మహారాజును తన రాజ్యములోనే దారి మధ్యన కూర్చోబెట్టాడు. అష్టావక్రుడు రాజును మధ్యమార్గములో కూచోపెట్టి తాను అరణ్యములోకి వెళ్ళిపోయాడు. ఒక చెట్టుక్రింద ప్రశాంతముగా కూర్చున్నాడు.

ఈ సిపాయిలందరు యెంతసేపో చూశారు. మహారాజుగాని, అష్టావక్రుడు గాని రాలేదు. ఏమైపోయారో యేమోనని ఒక్కొక్కరు బయలుదేరి వచ్చారు. వచ్చేటప్పటికి గుఱ్ఱము నిలచివుంది. మహారాజు రోడ్డుపై కూర్చున్నాడు. కన్నులు మూసుకున్నాడు. కదలటం లేదు, మెదలటం లేదు. అష్టావక్రుడు అసలే లేడు. అయ్యో యీ అష్టావక్రుడు మహారాజునకు యేమంత్రమో, తంత్రమో, యంత్రమో యేమి వేశాడో మారాజు స్తంభించి పోయాడని చాలా దిగులుపడ్డారు. ప్రధానమంత్రి దగ్గరకు వెళ్ళారు. ఆయన వచ్చి మహారాజా! మహారాజా! అని యెంతో పిలిచాడు. ఏమీ జవాబు లేదు. కన్నులు తెరువలేదు. నోరు తెరువలేదు. ఏమాత్రము కదలలేదు. అందరూ యోచించారు. చాలా భయపడి పోయారు. మహారాజుకు యేదో కొంచెము మధ్య మధ్య పానీయం, ఏదో కొంచెము తిండి వేయవచ్చు కదా! మహారాజుకు యింత సమయమైనప్పటికి కించిత్ ఆహారము అందించలేక పోతున్నామే యని బాధపడ్డారు. తెల్లవారి పోయినవారు యిక సాయంసమయమైపోతుండాది. ఇంక విధి లేక మంత్రి అంతఃపురమునకు రథమును పంపించాడు. రాణులు కూడా వచ్చారు. వారేమన్నా పిలిస్తే పలుకుతాడేమోనని మంత్రికి భ్రమ. మహారాణి వచ్చింది. రాజా!రాజా!అని పిలిచింది. రాజా లేదు రౌతూ లేదు. ఏమీ జవాబు లేదు. ఈలోపల అష్టావక్రుడు ఎక్కడకు వెళ్ళాడని సైనికులు అరణ్యమును శోధించి వచ్చారు. ఒక చెట్టు క్రింద ప్రశాంతముగా కూర్చున్నాడు అష్టావక్రుడు. మహారాజుగతి యేవిధముగా వుంటుందో చూడమని అతన్ని పట్టితెచ్చారు. అష్టావక్రుడు చిరునవ్వు నవ్వుతూ మహారాజు కేమి? క్షేమముగానే వున్నాడు అన్నాడు. నీవే వచ్చి చూడమని పిలుచుకొని వచ్చారు. ఇంతవరకు మంత్రులు, రాణులు, యింకా సమీపులు అయిన వారందరు పలుకరించినప్పటికిని ఒక్క పలుకైనా పలుకలేదు. కన్నైనా తెరవలేదు. కానీ అష్టావక్రుడు వచ్చి రాజా! అని పిలిచాడు. కన్ను తెరచి స్వామీ! అని జవాబు

యిచ్చాడు. మహారాణులు వచ్చారు. మంత్రులు వచ్చారు. సిపాయిలు వచ్చారు. పరివారమంతా వచ్చారు. నీ వెందుకు యింతకాలము మాట్లాడలేదు? అని అష్టావక్రుడు ప్రశ్నించాడు.

'వాక్కాయములు మనసుతో చేరినవి. మనసు తమకర్పితము చేసిన తరువాత తమ ఆజ్ఞ కావాలికదా వారితో మాట్లాడటానికి! నాకే మనస్సుమీద అధికారము యేమీ లేదు. తమ కర్పితము చేశాను. ఇది తమ మనస్సు. తమ ఆజ్ఞ లేకుండా యేదీ చేయుటకు వీలుకాదు' అన్నాడు. అప్పుడు అష్టావక్రుడు నీవు యిప్పుడు **అమనస్కుడవు. మనోనాశము అయినప్పుడే నీకు మహత్తరమైన బ్రహ్మ ప్రాప్తి చేకూరుతుంది.** మహారాజా! ఎక్కు. రికాబులో కాలుపెట్టు. ఒక రికాబులో కాలుపెట్టాడు. రెండవ రికాబులో కాలుపెట్టే లోపలనే ఆత్మానంద ప్రాప్తి కలిగింది. మనోవాక్కాయములు అర్పితము గావించినప్పుడు యింక తన కేమాత్రము అధికార ముంటుండదు. అదేవిధముగ **కృష్ణుడు అర్జునుని,**

'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ'

నీ సర్వస్వము నాకు ధారపోయి. నీ సర్వధర్మములు నాకర్పితము చేయి. మోక్షమును నే నిస్తానని అన్నాడు. ఇక్కడ సర్వధర్మాన్, అన్ని రకములైన ధర్మములు అనగా నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక అన్నిరకములైన లౌకికమైన ధర్మములు నాకర్పితము చేయమన్నాడు.

(శ్రీ.గీ. పు. 266/269)

మానవుడు గుర్తించలేని ఆత్మశక్తిని, ఆత్మ జ్ఞానమును చిత్తశుద్ధి చేత గుర్తింపగలుగుతున్నాడు.

వివిధ శాస్త్రచయము వేదవేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చలేవు
తెరకు యీవల జీవి, దేవు డవ్వల నుండు
కార్య మివల, అవల కారణంబు

మనస్సుకు యీవలనుండి చూచినంతవరకు మనకు జగత్తే గోచరిస్తుంది. మనస్సుదాటి ఆవల చేరితిమా ఆత్మ గుర్తింపబడుతుంది. మనము అనుభవించే జ్ఞానములు, అనుభవించే అనుభూతులు సర్వము మనస్సుకు యివ్వల నుండియే అనుభవిస్తున్నాము. మనస్సుకు ఆవల చేరలేవు. **సముద్రములో చేరిన నదికి ప్రత్యేక రూపనామములుండవు. ఎప్పుడు సముద్రములో చేరిపోయెనో అప్పుడు తన రూప నామములు కోల్పోతుంది. సముద్రము ఒక్కటే నిలుస్తుంది. అదియే 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి' బ్రహ్మతత్వము కనుగొనుటకు బ్రహ్మ జ్ఞానమే కావాలి.** ఆత్మ తత్వమును అర్థము చేసుకోవటానికి ఆత్మజ్ఞానమే కావాలి.

(బృ.త్ర.పు ౧౩౪)

కోరికలన్నియు నశింపగనే ఆత్మజ్ఞానము కలుగును. మనస్సును అరికట్టనిదే కోరికలు అణగవు. కోరికలు, అణగనిదే మనస్సును అరికట్టుట సాధ్యము కాదు. మనస్సు కోరికలు, విత్తనము చెట్టు, వంటివి. ఆత్మజ్ఞానము కలుగకుండు నంతవరకు మనస్సు, దాని చంచలత్వము నశింపవు. కాన ఈ మూడునూ, అనగా కోరిక, మనస్సు, ఆత్మజ్ఞానము ఒకదానిపై ఒకటి ఆధారపడి యున్నవి.

(జ్ఞా.వా.పు.7)

జ్ఞానియొక్క ఘనత వర్ణించుటకు వీలుకానిది: ఊహించుటకుకూడా వీలుకానిది; **"బ్రహ్మవిత్ బ్రహ్మైన భవతి, బ్రహ్మవిత్ పరం ఆప్నోతి" అని శ్రుతులు ఘోషించెను; అనగా, బ్రహ్మను తెలిసికొనువాడు బ్రహ్మ అగుచున్నాడు.** బ్రహ్మతత్వమును పొందినవాడు ఉత్కృష్ట డగుచున్నాడు అని అర్థము.

ఎట్లు అన్ని రకములైన బుడగలు నీరుతప్ప మరేమీ కావో అట్లే అన్ని విధములైన నామరూపములుగల ఈ ప్రపంచము బ్రహ్మము తప్ప మరేదియును కానేరదు. ఇదే జ్ఞానియొక్క విశ్వాసము. అతని అనుభవము కూడా ఇదియే.

నదులన్నియు సముద్రమున కలియునట్లు అన్ని కోరికలు జీవన్ముక్తుని ప్రశాంతమందు లయమగుచున్నవి. అదియే ఆత్మ సాక్షాత్కారము. ఆత్మకు మృత్యువు అనునది లేదు కదా! జనన మొందని ఆత్మకు సద్గుణము లెక్కడనుండి వచ్చును? రాను వీలేకాదు; అందుకనే

శ్రుతులు **ఆత్మను 'ఆ' (అనగా జననము లేనిది). "అజరా" (వార్ధక్యము లేనిది). "అమర" (మృత్యువు లేనిది). "అవినాశి" (నాశము లేనిది) అని ఘోషించినవి.**

కావున షడ్వికారములన్నియూ నశించు దేహమునకేకాని ఆత్మకు ఉండవు. వాటికి షడ్భావ వికారములు అనిపేరు. అనగా, ఉండుట, జన్మించుట, పెరుగుట, మార్పుజెందుట, క్షీణించుట చివరకు మరణించుట, ఆత్మకిట్టి షడ్భావ వికారము లుండవు. అతడు కూటస్థుడు; కాలపరిస్థితులవలన కలుగు; మార్పు లన్నింటిని సాక్షీభూతునిగా గమనించుచూ, తామరాకుపై నున్న నీరువలె, గాలిలోని ప్రాణవాయువువలె, అంటకుండ, ఆత్మ నిస్సంగుడుగా నుండును.

మనస్సుయొక్క పోకడలనుండి విముక్తి బ్రహ్మజ్ఞానము వలన సంభవించును. అట్టి విముక్తికే నిజమైన స్వరాజ్యము, లేక మోక్షమని పేరు, ఎవరు ఈలోకమున యదార్థమును గ్రహించి అసత్య మనెడి దృష్టితో చూచెదరో వారికి వాసన లన్నియు మాయమగును. అజ్ఞానము పటాపంచలగును. **ఆధ్యాత్మిక రత్నమును దొంగిలించినది మనస్సే! కాన, మనస్సనెడి దొంగను శిక్షించినచో ఆ రత్నము దొరుకును. వెంటనే బ్రహ్మస్థాన మలంకరింపవచ్చును.**

అట్టి ఆత్మజ్ఞానమునొందిన మహాత్ములను పూజించి, అనుభవముల తెలిసికొని ఆనందించుటే **సాధకుల లక్ష్యము;** అట్టి సాధకులు పరమ పవిత్రులు. అందరునూ ధ్యాన సాధనలవలన పొందవలసిన **స్వరాజ్యము ఇదియే; ఇదియే బ్రహ్మరహస్యము, ఆత్మజ్ఞానము.**

(జ్ఞా.వా.పు.13/14)

ఒకానొక సమయమున ఏదో మాటల సందర్భములో లోకానుభవ నిమిత్తమై వసిష్ఠమహర్షి శ్రీరామచంద్రునితో ఈ క్రింది రీతిగా తెలిపెను.

ఓ పరాక్రమ రామా! జీవుడను వృషభము సంసార మనెడి అరణ్యము నందుగల పెద్ద ఛాయగల చెట్టుక్రింద మోహమనెడి నీడలో నిద్రించుచున్నాడు. కోరికలనెడి త్రాళ్ళచేత బంధింపబడి యుండుటవలన వ్యాధులనెడి క్రిమికీటకాదులు కరచుచున్నవి. అజ్ఞానమనెడి అంధకారములో కళంక భూయిష్ఠమగు విషయాసక్తులచేత తన్న బడుచూ ఇంద్రియభోగము లనుభవించుటకొరకై పాపకర్మలనెడి బురదయందు పొరలుచున్నాడు. అట్టి సమయమున వివేకవంతులు సజ్జనులైన విజ్ఞానుల సహవాసమువలన సంసారమను ఘోరారణ్యము దాటగలుగుచున్నారు. కాన **వివేక విచారణచే విజ్ఞానమును సాధించి విజ్ఞానముతో యదార్థమును గ్రహించుటే ఆత్మసాక్షాత్కారమనియు, ఆత్మజ్ఞానమనియు పిలువబడుచున్నది. అట్టి ఆత్మజ్ఞానమే జీవితమునకు అంత్యము, అదియే తురీయాతీతము.**

(జ్ఞా.వా.పు.24/25)

(చూ॥ క్షేత్రజ్ఞుడు, గుణములు, దైవబలము, నన్నేపొందుదురు, బ్రహ్మచింతన, మనసు, రాజబాట, సాక్షాత్కారము, సాధకుడు)

ఆత్మజ్ఞానము యొక్క పరాకాష్ఠ

పట్టుదలనూ శ్రద్ధనూ యముడు గ్రహించి ఆత్మజ్ఞానమునకు సచికేతుడర్హుడని నిశ్చయించి, నాయనా! **శ్రేయస్సు అనియు ప్రేయస్సు అనియు రెండు పురుషార్థములు. అవి రెండును పురుషుని బంధించునవియే. శ్రేయోమార్గము నవలంబించువాడు శుభమును పొందును. ప్రేయోమార్గమునవలంబించు వాడు పరమ పురుషార్థము నుంచి విదూరుడగును. ఈ రెండును విభిన్నములు.** రెండునూ పురుషాధీనములే, ఒకటి వివేకముచే లభించును మరియొకటి అవివేకముచే లభించును. విరుద్ధములగుటచే, అవి ఒక దానినొకటి త్రోసివేయును. ఒకటి మోక్షకారణము; రెండవది సంసారహేతువు. ప్రేయోమార్గము అవిద్యాకల్పిత మనియు, శ్రేయోమార్గము విద్యాకల్పితమనియు, అయితే, శ్రేయస్సును కోరువారు చాల అరుదనియూ యముడు చెప్పెను. ఆత్మ వికల్పరహితమగు అఖండరస ఘనస్వరూపము కనుక, అతను అస్తి నాస్తి, కర్త అకర్త మొదలగు వికల్పముల కాస్పదుడు కాడు; అతను జ్ఞేయవస్తువు కాడు. కనుక అతనిని గూర్చి జ్ఞాతృ, జ్ఞానజ్ఞేయ

భేదము లేదు. **ఇదియే ఆత్మజ్ఞానముయొక్క పరాకాష్ఠ.** ఉపదేశికుడే బ్రహ్మము, శ్రోతయే బ్రహ్మమని తెలియుచున్నది. ఈ విధమగు జ్ఞానము, సర్వసంసారనివారకమగుటచే జన్మ రాహిత్యము నిశ్చిత మగుచున్నది. **శ్రుతిసమ్మతము కాని, కేవలము తర్కమునకే పరమ రహస్యము అందదనియూ, సాధ్యము కాదనియూ, కఠోపనిషత్తు తెలుపుచున్నది.**

(ఉ.వా.పు. 16/17)

ఆత్మచింతన

(చూ॥ బ్రహ్మాభ్యాసము)

ఆత్మజ్యోతి

ఒక్క ప్రేమ పాశము తప్ప అందరిని ఐక్యము చేయుటానికి వేరే మార్గము లేదు. దీనికి ఒక చిన్న ఉదాహరణము. ఒక కేండిల్ లైట్ పెట్టావు. దానిపైన అనేక రంధ్రములున్న పాత్రను మూసినావు. అందువలన ఉన్నది ఒకే లైటు. అయినప్పటికి ఆ రంధ్రముల ద్వారా అనేక లైట్లుండినట్లు కనిపిస్తున్నది. దానిపైన దట్టమైన వస్త్రమును కప్పినాము. అందులో నుండి ఏమాత్రము లైటు కనుపించటం లేదు. ఈ దట్టమైన టర్కీ టవలు తీసి పక్కన పెట్టామంటే అప్పుడు అనేక జ్యోతులుగా కనుపిస్తుంది. అనేకముగా కనుపించే ఆ పాత్రను మనము పగలగొట్టామంటే ఒక జ్యోతిగానే కనుపిస్తుంది. అదే ఏకజ్యోతి, అదే ఆత్మజ్యోతి. ఉన్నది ఒక్కటే. దానిపైన నవరంధ్రములతో కూడిన దేహమనే పాత్రను కప్పినాము కనుక అనేక విధములుగా కనుపిస్తున్నది. దేహము యొక్క రంధ్రముల ద్వారా యివి అనేక జ్యోతులుగా కనుపిస్తున్నాయి. దీనిపైన మమత్వమనే దట్టమైన వస్త్రము కప్పిపెట్టాము. నాది అనే మమత్వము. నేను అనే అహంకారము ఈ రెండింటితో నేసిన వస్త్రము యిది. ఆ రెండింటిని తీసి పారవేస్తే దేహభ్రాంతిని అదుపులో పెట్టుకుంటే అదే "ఏకో ఽహం బహుస్యామ్"

(బృ.త్ర.పు ౯౯)

జ్యోతిని మనం వెలిగించాలంటే? ఒక ప్రమిద కావాలి. దాని లోపల తైలం పోయాలి. దానిలో ఒక వత్తిని పెట్టాలి. దీపం వెలిగించేందుకు ఒక నిప్పు పెట్టె కూడా ఉండాలి. కనుక, ప్రమిద, నూనె, వత్తి, నిప్పుపెట్టె ఈ నాలుగూ ఉండినప్పుడే మనం జ్యోతిని వెలిగించగలం. ఈ జ్యోతి బాహ్యమైన చీకటిని దూరం గావిస్తుంది. వత్తి వెలిగే కొలదీ తైలం తరిగిపోతుంది. ఈ తైలం అయి పోయేటప్పటికి, వత్తి కూడా నిలచిపోతుంది. దీనినే రామదాసు చెప్పాడు.

"సారమైనది చమురురా! సత్యమైనది వత్తిరా!
ఈ వెలుగు పోయేటప్పుడు వెంట ఎవరూ రారురా!"

ఈ వెలుగు పోయేటప్పుడు దాని వెంట వత్తిగాని, తైలముగాని వెళ్లవు. అట్లే మన అంతరంగమునందు గల చీకటిని దూరం గావించుకోవాలంటే, దానికి ఒక ప్రమిద, వత్తి నూనె, అగ్గిపెట్టె కావాలి. మన హృదయమే ఒక ప్రమిద, మన మనస్సే ఒక వత్తి, ప్రేమయే తైలం, వైరాగ్యమే నిప్పుపెట్టె, ఈ నాలుగూ చేరినప్పుడే "ఆత్మజ్యోతి" ప్రకాశిస్తుంది. అప్పుడే "అజ్ఞానమనే" అంధకారం దూరమవుతుంది.

(శ్రీ.భ.ఉ.పు.130)

దీనినే వేదము **"వేదాహమేదం పురుషం మహాంతం, ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్"తమస్సుకు అవలనున్న పరంజ్యోతిని నేను చూడగిలిగాను అని వర్ణించినది.** తమస్సంటే సుషుప్తి స్థితి అనగా స్వప్నము లేని స్థితి. ఈ పరంజ్యోతి తమమునకు అంధకారమునకు ఆవల వుంటుండాది. అన్నింటిని జాగ్రత్ స్వప్న సుషుప్తులందు కూడను, సర్వస్వమును ప్రకాశింపచేసేదే ఆత్మశక్తి. ఒక చిన్న ఉదాహరణ. జాగ్రత్తయందే మనము యోచించుకోవచ్చు. మీరందరు కన్నులు మూసుకోండి. ఒక్కతూరి మీరందరు జాగ్రత్తగా కన్నులు గట్టిగా మూసుకున్న తరువాత, నీవు యేమి చేస్తున్నావని నేను ప్రశ్నిస్తాను. ఏమీ లేదు చీకటిగా వుంది అంటారు. ఈ చీకటిని చూసినవా డెవరు? ఈ చీకటిని నీవు చూసి

వుంటేకదా చీకటిగా వుందంటున్నావు. కనుక చీకటిని చేసే జ్యోతి నీలో ఒకటి వుంది. ఆ జ్యోతియే ఆత్మజ్యోతి. అట్టి **ఆత్మజ్యోతుల ద్వారానే సమస్త విషయజ్యోతులు, సమస్తవ్యక్తిజ్యోతులు అనేకమైన యింద్రియ జ్యోతులు ప్రకాశిస్తున్నాయి.**

దీపావళి పండుగ చూస్తుంటాము. ఒక కాండిల్‌ను ముట్టించుకొని అనేక కాండిల్స్ జ్యోతులనంతా అంటిస్తూ వుంటారు. ఈ ఆధారజ్యోతి ఒకటి వుండటం వలననే కదా అధేయమైన అనేకజ్యోతులను వెలిగించగలుగుతున్నాము? **ఆధారజ్యోతియే యీ ఆత్మజ్యోతి. అంటింపబడినటువంటివే ఈ జీవనజ్యోతులు. సమస్తజీవన జ్యోతులు ఆత్మజ్యోతుల ద్వారానే వెలుగుతున్నాయి.** కన్నులు చూడగలుగుతున్నాయి.

(శ్రీ.గీ.పు.166/167)

ఆత్మతత్త్వము

పంచ భూతముల, పంచ ప్రాణముల, పంచకోశముల లోపల యున్నది ఆత్మతత్వము. దానిని సాధన ద్వారా అనుభూతిలోకి తెచ్చుకోవలయును. విలువైన సొమ్ము ఇంటిలోపల భద్రం చేస్తారు. అట్లాగే ఆత్మ తత్వమును అంతరంగంలో వెతకాలి. నౌకరు స్థితిలోయున్న వారికి అది దొరకదు. యజమానుడుగా తయారు కావాలి ... అప్పుడే ఆత్మ రత్నమునకు అర్హుడు. **బహిర్దృష్టి వున్నంతవరకు బానిసలే. అంతర దృష్టిని సంపాదించిన తక్షణమే గుహలోని ఆత్మాకారము నందు జ్యోతి ప్రకాశించి ప్రకటమగును.**

(సా. పు. 270)

చిన్న చిన్న విషయాలలో కూడా మనం విచారణ చేస్తే, సత్యం ఉండదని సులభముగా అర్థమవుతుంది. I want peace, నాకు కావాలి శాంతి అంటారు. ఇక్కడ మూడు పదాలు ఉన్నాయి. I అంటే Ego దీనిని తీసివెయ్యి. Want అంటే కోరిక. ఇది కూడా తీసి వెయ్యి. మిగిలినది peace. Ego and Desire ప్రక్కన పెట్టుకొని, peace కావాలంటే ఏవిధంగా లభిస్తుంది? కనుక మనము ఆధ్యాత్మిక విషయాలలో కూడా, సరియైన రీతిగా అద్వైత భావంతో యోచిస్తే ఆత్మ తత్వము ఎంత సులభమైనదో ఎంత సున్నితమైనదో, ఎంత గౌరవమైనదో, మనకు సులభంగా అర్థమవుతుంది.

(సా. పు. 278)

నిజముగా ఆత్మతత్వము వస్తువులను ప్రకాశింపచేసేదే గాని మరొక చైతన్యము చేత ప్రకాశింపబడేది కాదు. ఇది సమస్తమునకు ద్రష్టస్వరూపమును ధరిస్తుంది. వస్తు స్వరూపమును చూచిన సమయమందు సమస్త జగత్తు కూడా దృశ్యముగా రూపొందుతుంది. కన్నులుండి కూడా ఆలోచనా నిమగ్నుడగుట చేత, ఎవరెదురున్నారో, ఏమి చెప్పుచున్నారో వినటముగాని, చూడటముగాని జరుగదు. కన్నులు కూడా దృశ్యమే! మరొక స్థితి యందు మనస్సు కూడా దృశ్యముగా రూపొందుతుంది. సర్వసంకల్పముల చేరికయే మనస్సు. బుద్ధి కూడా మనస్సును అనుసరించియే ఉంటుంది. **దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణము ఇవన్నీ ఆత్మ యొక్క ఉపాధులే!** ఆత్మతత్వమునకు మార్పులు ఉండవు. అది శుద్ధ చైతన్యము. దేహమునకు చావు పుట్టుకలు; పరిణామ క్షీణములు; అభివృద్ధి, అసంతృప్తులు. **ఆత్మకు ఇట్టి పరిణామములు గాని, క్షీణదశలుగాని, చావు పుట్టుకలు గాని ఉండవు.**

(శ్రీ.భ.ఉ.పు.7)

ఒకసారి పోతే తిరిగి రానిది, ఒక్కసారి వస్తే తిరిగి పోనిది, రాకుండా-పోకుండా స్థిరంగా ఉండేది- ఈ మూడు విషయాలను గూర్చి మానవుడు తెలుసుకొనుటకు ప్రయత్నించాలి. **ఒకసారి వస్తే తిరిగి పోనిది - అదే జ్ఞానం.** వచ్చి పోయేది జ్ఞానం కాదు. జ్ఞానం వచ్చిన తరువాత స్థిరంగా నిలిచిపోవాలి. ఒక్కసారి విశ్వాసం కలిగితే, ఆ విశ్వాసాన్ని పెంచుకొనుటయే మానవ కర్తవ్యం. **మానవుడనగా "విశ్వాసం కల జీవి" అని ఉపనిషత్తు తెలిపియున్నది. కాని, నేటి మానవులలో శ్వాస ఉన్నది కాని, విశ్వాసం లేదు. ఏమి ప్రయోజనం? విశ్వసించిన దానిని ఆచరణలో పెట్టాలి.** కొంతమంది "పూర్వం నాకు

ఆత్మతృప్తి

భక్తి చాలా ఉండేది గాని, ఇప్పుడు ఎందుకో సన్నగిల్లి పోతోంది'' అని అనుకొంటారు. ఇది చాలా పొరపాటు. ఇప్పుడు నీలో భక్తి సన్నగిల్లి పోతోందంటే, పూర్వంకూడా ఆ భక్తి నీలో స్థిరంగా ఉండి యుండదు. **భక్తి ఉంటే ఎప్పటికీ తగ్గిపోదు. తగ్గిపోతే భక్తి ఉండినది కాదు.**

ఇంక రెండవది: ఒక్కసారి పోతే తిరిగి రానిది, అదే--అజ్ఞానం. మూడవది: పోకుండా-రాకుండా స్థిరంగా ఉండేది **అదే - "బ్రహ్మతత్వం". ఇది నిర్గుణం. నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్యశుద్ధ, బుద్ధ, ముక్త నిర్మల స్వరూపం. అదే ఆత్మ తత్వం.**

(శ్రీ.భ.ఉ.పు.125)

(చూ॥ అవతారము, ఆత్మ, ఇస్లామ్, ఒక్కడే, చైతన్యము, తత్వజ్ఞానము, త్రిగుణములు, దేహము, బుద్ధి, భ్రాంతి, మానవ జీవితము, విచారణ శక్తులు, శాస్త్రయోనిత్వాత్, సమానత్వము)

ఆత్మతృప్తి

మనము ఏ పనిచేసినా, బయటవారి తృప్తికోసము కాక, ఇతరుల ఆనందము కోసము కాక **నీ ఆత్మ తృప్తి నిమిత్తమై చేయాలి. అదియే దైవతృప్తి. దానినే Conscience అన్నారు.** కాని, ఇలాంటి తృప్తి మనము పొందాలంటే, తనపై తన కొక విశ్వాసము కల్గాలి. ఎప్పుడు ఈ Satisfaction వస్తుందో అప్పుడే Sacrifice చేస్తాడు. ఎప్పుడు త్యాగము చేయునో అప్పుడే దైవత్వాన్ని పొందుతాడు. కనుక Self-confidence ఆత్మ విశ్వాసమే ఒక పునాది. Self satisfaction యే ఒక Wall, Self Sacrifice - ఒక రూఫ్. సెల్ఫ్ - రియలైజేషన్ - లైఫ్. మొట్టమొదట Self - Realisation కు Self-Confidence కావాలి. మన విశ్వాసము క్షణక్షణమునకు కదులుతూ, మొదలుతూ ఉండకూడదు. ఎట్టి కష్టములు వచ్చినా, ఎన్ని బాధలు సంభవించినా, ఎన్ని నిందలు, నిష్కారాలకు గురియైనా మన విశ్వాసము ఒక్కటిగా, స్థిరంగా పెట్టుకోవాలి.

(స.సా.జూ 1989 పు 146)

(చూ॥ ధనవంతులు, పరమభక్తి)

ఆత్మ దర్శనము

(చూ॥ మనసు)

ఆత్మదృష్టి

(చూ॥ హేయత్వావచనాచ్చ)

ఆత్మధర్మం

దేహములతో కలసియుండిననూ ఆత్మ గుణధర్మాలకు అతీతమై యుండును. **దేహములోని బాల్య, కౌమార, యవ్వన, వార్ధక్యాదు లెట్టులో దేహ తదనందరము ప్రాప్తి కూడ అట్టిదే. ధీరుడు ఇందుకై శోకింపడని, కృష్ణుడు గట్టిగా రథమును వూపించి చెప్పెను.**

దానికి అర్జునుడు సందేహ మనస్సుతో ప్రశ్నించును: "స్వామి! అవస్థాంతరాల వల్లనే దేహాంతరాలు కూడనూ, అని అంటిరి కదా! కాని, అవస్థాంతరాలలోని విషయములు జ్ఞాపకమందుండునుకదా! దేహాంతరాల విషయములు జ్ఞాపకమందుండవే! నీవు చెప్పినది దీని కెట్లు పొసగును?'' "యేకదేశీ అంతమే గ్రహించవలెను.సర్వాంశ గ్రహణము సరిపోదు. అవస్థలు మారినా, ఆత్మ మారదు! అట్లే, దేహములు మారినా ఆత్మ మారదు! దృష్టాంతములో ఇంతవరకే గ్రహించవలెను.''

కానీ, అర్జునుడు మరో అంశానికి దిగినాడు. ఇది అర్జునున కొక్కనికే కాదు, సామాన్య మానవులకు ఈలాంటి అనుమానములు వచ్చుననే భగవంతుడు **"ధీరస్తత్ర సముహ్యతే"** అంటూ ఆ అనుమానమునకు అక్కడికక్కడే వెంటనే సమాధానము తెలిపెను. ''అర్జునా! **అవస్థాంతరాలలో బుద్ధి కొంతవరకు జ్ఞాపకము పెట్టుకోగలుగుతుంది; మరణకాలములో** అనగా, **దేహాంతర పరిస్థితులలో బుద్ధి వికలమై పోతుంది. ఆ దెబ్బతో గడచిన వన్నింటిని ఒక్కపెట్టున మరచి పోతుంది. ఎరుక మరపులు బుద్ధి ధర్మము కాని ఆత్మధర్మము కాదు.** ఇప్పుడు మరొక విషయము తీసుకో;

"అనగా నీకు పాతిక సంవత్సరముల వయస్సు అనుకో, గడచిన పది సంవత్సరముల మునుపు యేదో వక దినమున నీవు యెక్కడుంటివని అడిగిన నీవు చెప్పలేవు. కానీ, నీవుండియుండుట సత్యమే కదా? నేను లేనని మాత్రము అనలేవుకదా? అటులనే దేహాంతర విషయాలు కూడనూ! నీవున్నావు కానీ విషయములు మాత్రము జ్ఞాపకమందు లేవు. **ఈ విషయమందే బుద్ధిబలము కలవాడు భ్రమ చెందడు; అట్టివానినే 'జ్ఞాని' అందురు. ఆత్మ పోయేది కాదు; దేహము వుండేది కాదు.** పోనీ వారి మరణము కోసమైనా దుఃఖించినవారి ఆత్మకేమైనా సంతోషమా! అది మరింత పిచ్చిమాట! **ఆత్మకు యేమి చేసినా దుఃఖము లేదు.**

(గీ.పు. 27/28)

(చూ॥ పురుషార్థము)

ఆత్మనివేదనం

(చూ॥ ఆనందము)

ఆత్మనిష్ఠ

(చూ॥ ఆత్మ)

ఆత్మబలం

ఆత్మబలం: Cosmic Energy - ఎప్పుడు ఎవ్వరికి ఏవిధంగా వస్తుందో చెప్పుట ఎవ్వరికీ సాధ్యము కాదు. ఇది ప్రతి వ్యక్తి యందూ కలదు. పదార్థ మానసిక శక్తుల మీద ఆధారపడినంత వరకూ cosmic energy ను తెలుసుకొనలేము. శరీర శక్తి నుండి మానసిక శక్తికి - మానసిక శక్తి నుండి cosmic energy కు ప్రవేశించుటకు ప్రయత్నం చేయవలెను.

సముద్ర తరంగములలో కూడా ఒక విధమైన బలముండును. తరంగములు తక్కువగా నుండుటచే బలము తక్కువగా నుండును. సముద్రములో సుడిగాలి వచ్చినపుడు ఆ తరంగములు పడవలను ముంచి, కొండలను కూల్చివేయును. కాని ఆతరంగములకు ఈ విధమైన శక్తి ఎక్కడ నుండి వచ్చినది? దీనినే శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేసుకుంటూ వెళ్తున్నారు.

లక్షల మైళ్ళ కొలది అంతరిక్ష యానము చేసేశక్తి అతని హృదయంలో అంగుళంలోనే ఉంది. ఈ ఆత్మశక్తే లేకపోతే లక్షల లక్షల మైళ్ల కొలది ప్రయాణము చేసే శక్తి ఉండేదికాదు.

బ్రతుకు బ్రహ్మ నుండి వచ్చినది. కానీ బాహ్యం నుండి వచ్చినది కాదు అన్నము నుండి జీవిస్తున్నామని అనుకుంటున్నాము. కాదు ఆత్మనుండే జీవిస్తున్నాము. అన్నము, అన్నీ ఉండికూడ జీవించ లేనివా రెందరు లేరు? కూటికి లేనివారు ఎంతమంది జీవించుటలేదు? కనుక **జీవితమునకు అన్నము ప్రధానం కాదు, ఆత్మ ప్రధానము.**

మన చదువు సంధ్యలు ధనబలము, భుజబలము సర్వబలములూ బుద్ధిబలముచే సంపూర్ణంగా ఆధారపడి ఉంది దైవానుగ్రహం లేకపోతే ఎన్ని విధములైన శక్తి సామర్థ్యము లున్నప్పటికీ అవన్నీ నిరూపయోగమే.

(త.శ.మ.పు.55)

ఆత్మబోధ

జడభరతుడు తత్వమును అనేక విధములైన మార్గములందు ప్రచారప్రబోధలు సల్పాడు. ప్రధానమైనది ఇంద్రియ నిగ్రహము. పదార్థములు ఎక్కువగా మనము ఆశించకూడదు. కోరికలు తగ్గించుకోవాలి. మన సుఖదుఃఖములకు కారణము **కోరికలే. కోరేవాడు భక్తుడు కాదు. ఫలాపేక్షతో పని చేసేవాడు భక్తుడు కాదు.** లోకహితమునకై సాధన చేయాలి. గొప్ప వేదాంతి అయినప్పటికి, నిరంతరము వేదము ఉచ్చరిస్తున్నప్పటికి, శాస్త్రములు క్షుణ్ణముగా తెలిసిన వాడైనప్పటికి సాధనలు సలుపుతూ ఉండే వాడైనప్పటికి, యజ్ఞయాగాదులు క్రతువులు చేసినా వానివలన భగవంతుడు చిక్కడు అనేది జడభరతుడు చాటుతూ వచ్చాడు. ఇవన్నీ మానసిక తృప్తికై ఆచరించే ఆచరణలే. ఈ వాంఛ లుండినంత

ఆత్మభ్రాంతి

కాలము ఏనాడు దైవాన్ని ఆశించలేడు. దైవాన్ని పొందలేడు అనే సత్యాన్ని గుర్తిస్తూ వచ్చాడు. దానికి చక్కని ఉదాహరణము బోధిస్తూ వచ్చాడు. కర్పూరము పెట్టిన పెట్టె ఆ కర్పూరము కొంత కరిగిపోయినప్పటికి ఆ పెట్టె ఉండినంతకాలము కర్పూరవాసన పోదు. విషయ వాసనలతో కూడిన పెట్టె ఈ దేహము. కోరికలు నశించినా వాసన దేహమునుండి పోదు. వాసనలుండినంత వరకు దైవము మనకు కనిపించడు. ఇదే ఆత్మబోధ.

(భ.స.మ. పు.99)

ఆత్మభ్రాంతి

జీవితమంతా పంచభూతములతో, పంచ ప్రాణములతో, పంచేంద్రియములతో, పంచకోశములతో నిండియుంటున్నది. కనుక, పంచభూతములతో కూడిన ఈ శరీరమునకు 50 సం॥ల వరకు ఒక విధమైన enjoyment ఉండాలి. అదే యౌవనము. ఈ యౌవనంలో ఉండవలసిన Enjoyment ఏమిటి; ఏదో పెండ్లి చేసుకోవడం, డజన్ల కొలది పిల్లలను కనడం కాదు. ఈ యౌవనంలో కార్యాచరణలో తగిన శక్తిని నిరూపించాలి. ఈ యౌవనం కదలిపోయే మేఘం వంటిది. దీనిని చూసి గర్వించరాదు. ఈనాడు ఏదో దేహ ప్రమాణమును పురస్కరించుకొని **20 నుండి 40 సు॥ల వరకు యౌవనము అని నిర్ణయిస్తున్నారు.** కాని, ప్రాచీనకాలంలో యౌవనమనగా ఏమిటి? కేవలం దేహానికి సంబంధించిన వయస్సే ప్రమాణం కాదు, మానసిక సంబంధమైన శక్తి కూడా ఉండాలి. మహాభారత యుద్ధంలో **భీష్మునికి 112 సం॥ల వయస్సు అయినా అతడు కమాండర్-ఇన్-చీఫ్‌గా నిలిచాడు. అప్పుడు అది యౌవనం! దేహాన్ని బట్టి 112 సం॥ల వయస్సు యౌవనమవుతుందా? కాదు, కాదు. మనో శక్తిని బట్టి అది యౌవనము.** కాబట్టి అట్టి మనోశక్తిని పోషించుకొని మన జీవితమంతా యౌవనంగానే బ్రతకాలి. అదే Will-power ఇది దైవం నుండి ప్రారంభమయ్యేదే! ఆ will-power చేతనే మనం సరియైన స్థితిని సాధించాలి. కనుక, 50 సం॥ల వరకు నీవు సంసార సంబంధమైన బాధ్యతలు వహిస్తూనీ కర్తవ్యాన్నీ నీవు నిర్వర్తించాలి.

ఇంక 60 సం॥లు వచ్చేటప్పటికి భారతీయులు "శాంతిపూజ" చేస్తారు. ఏమిటి శాంతిపూజ? అరిషడ్వర్గాలను అదుపులో పెట్టుకోవడమే శాంతి పూజ. తరువాత 70 వ సంవత్సరం వస్తుంది. ఇది సప్త ఋషుల స్థానము, సప్త సముద్రముల స్థానము, సప్త స్వరముల స్థానము, సప్తరంగుల స్థానము. కనుక, **70వ సం॥లో ఋషిత్వాన్ని పొందాలి. ఇంక, 80వ సం॥లో ఏమిటి? అష్ట గ్రహములలో నీవు ఒక గ్రహముగా ఉండాలి. 90వ సం॥లో నవగ్రహములలో నీవొక గ్రహం కావాలి.** గ్రహములనగా ఏమిటి? **శక్తివంతమైనవి కనుక, నవగ్రహములలో నీవొక శక్తిమంతుడిగా ఉండాలి.** అనగా ఏమిటి? నెగటివ్‌ను మర్చిపోయి పాజిటివ్ లోనే నీవు జీవించాలి. **ఇంక 100 సం॥లో దశేంద్రియాలను దైవంలో లీనం చేయాలి.** అప్పుడు నీకీ దేహభ్రాంతి ఉండదు. దేహభ్రాంతి ఉండినంతవరకు నిత్యానందాన్ని పొందడానికి వీలు కాదు. దేహభ్రాంతి పెతుగుతుంది. కనుక, కోరికలను తగ్గించుకోవాలి.

(స.సా.డి.95 పు.300)

ఆత్మయజ్ఞము

సాక్షిమాత్రుడగు నా చేతనే ప్రకృతి యీ జంగమ స్థావరములతో కూడిన ప్రపంచమగుచున్నది. ఈ హేతువు చేతనే నానా విధములుగా ప్రపంచము ప్రవర్తించుచున్నది. ఇట్టి సర్వోత్తమ మైనట్టిదియును సర్వ భూతములను నియమించునట్టిదియును, అగు నాతత్త్వమును తెలిసికొనలేని మూఢులు నన్ను సామాన్య మనుష్యునిగా తలంచుచున్నారు! కొంతమంది **మహానీయులు నన్ను బ్రహ్మముగా ఉపాసించుచున్నారు. మరికొంత మందినన్నే వేరు వేరు రూపనామములతో కొలుచుచున్నారు. ఇంకా కొందరు జ్ఞానయజ్ఞమనియు, ఆత్మయజ్ఞ మనియు ఆయా రూపముల ఉపాసించుచున్నారు.**

"ఎవ రెట్లు ఉపాసించిననూ యెవ రేపేరు పెట్టిననూ పరమాత్ముడైన నేను మాత్రమే దానిని అందుకొను చున్నాను. నేనుతప్ప మరెవ్వరూ లేరు. నేనే నానా రూపనామములతో ఆయా ఉపాసనా స్థానములను నేర్చుకున్నాను. ఇంతియే కాదు. **సర్వకర్మ ఫలమును, ఫలప్రదాతయును, సర్వమున కధిష్ఠానమును, వేయేటికి, ఉత్పత్తి, స్థితి లయములు మూడింటికిని స్థానమైనవాడను నేనే;** ఎట్టినాశము లేని కారణమునూ నేనే అయివున్నాను. "అట్టి కారణ స్వరూపుడైన నన్ను పొందుటే మోక్షము. అట్టి మోక్షప్రాప్తిని అనుభవించుటే జీవన్ముక్తి అని అందురు. కాన, జీవన్ముక్తుడవు కావలెనన్న, మోక్షమును పొందవలెనన్న, కొన్ని సాధనలు నలుపవలెను; సర్వసంగ పరిత్యాగులు కావలెను. అనగా దేహాభిమానమును నిర్మూలము చేసుకొనవలెను.

(గీ.పు. 161/162)

ఆత్మరామాయణము

ప్రాచేతనుడు 100 కోట్ల శ్లోకములతో ఆత్మరామాయణమును వ్రాసి ముల్లోకవాసులకు సమానముగా పంచడానికి ప్రయత్నించేడు. ఒక్కొక్క లోకవాసులకు 33 కోట్ల 33 లక్షల వందల 33 శ్లోకాలను పంచాడు కాని చివరకు ఒక శ్లోకము మిగిలిపోతుంది. ఈ శ్లోకములో కూడా 32 అక్షరములున్నాయి. ఈ అక్షరాలను ముల్లోకవాసులకు సమానముగా పంచి పెట్టడానికి ప్రయత్నం చేసాడు. ఈ ఒక్క శ్లోకములో 32 అక్షరాలున్నాయి. ఈ అక్షరాలను 10 చొప్పున పంచగా రెండు అక్షరములు మిగిలిపోయేయి... ఈ రెండు అక్షరములు ముల్లోకవాసులకు పంచడం సాధ్యం కాకపోయింది. అప్పుడు ఈ రెండు అక్షరములను ముల్లోకవాసులకు సమముగానే అనుభవించమన్నాడు ఈశ్వరుడు.

రామ-కృష్ణ-సాయి: ఈ రెండు అక్షరములే ప్రేమ. ప్రేమ దైవంగా మారిపోయింది. ఈ ప్రేమనే రామ, కృష్ణ, హర, సాయిగా వచ్చింది. ఈశ్వరుడు యీ ప్రేమను దైవలోకవాసులు నరలోకవాసులు నాగలోకవాసులూ సమానంగా పంచుకోమన్నాడు. ఈ ముల్లోకములే విష్ణులోకము, బ్రహ్మలోకము, శివలోకము. ఇవే జాగ్రత్ స్వప్న సుషుప్తిలోకములు. ఈ ముల్లోకములు మనలోనే ఉన్నాయి.

(త.శ.మ.పు.293)

ప్రేమ స్వరూపులారా! రామాయణ మంటే సీతాపహరణం జరగటము, రామలక్ష్మణులు రావణ కుంభకర్ణాదులను హతమార్చడం కాదు. **ఆధ్యాత్మిక అంతరార్థమును మనం గుర్తించాలి. ఆత్మారామాయణమును ఒక్కతూరి మననం చేయాలి.** రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు దశరథుని కుమారులు. ఎవరీ దశరథుడు? **ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములతో కూడిన ఈ దేహమే దశరథుడు. ఇతడు అయోధ్యా నగరానికి రాజు. అయోధ్య అనగా విరోధులుప్రవేశించడానికి వీలుకాని చోటు. అదే మన హృదయం** ఈ దేహమనే దశరథునకు సత్వరజస్తమో గుణములనే ముగ్గురు భార్యలున్నారు. **సాత్వికము-కౌసల్య; రాజసికము-కైక; తామసికము-సుమిత్ర; ఈ దశరథునికి ధర్మార్థకామ మోక్షములనే నల్గురు కొడుకులు పుట్టారు. వారే రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు. ధర్మము ప్రజ్ఞానమును ఆశిస్తుంది. ప్రజ్ఞానమే సీత. కనుకనే రాముడు సీతను వరించాడు. ఈ ప్రజ్ఞానమనే సీతను తీసుకుని అజ్ఞానమనే అడివికి వెళ్ళాడు. అక్కడ దుర్మార్గమనే రావణుడు ప్రజ్ఞానమనే సీతను అపహరించాడు.అప్పుడు రామునికి వివేకమనే సుగ్రీవుడు సహాయం చేశాడు. అవివేకమనే వాలిని రాముడు సంహరించాడు. ధైర్యమనే హనుమంతుని సహాయంతో సంపారమనే సాగరాన్ని దాటాడు. అక్కడ సత్వగుణమనే విభీషణుడు, రజోగుణమనే రావణుడు, తమోగుణమనే కుంభకర్ణుడు ఎదురయ్యారు. రజస్తమో గుణములను సంహరించి, సాత్వికమునకు పట్టాభిషేకం చేసి అనుభవజ్ఞానమనే సీతను తీసుకుని వచ్చాడు. ఇన్ని కష్టాలు పడితేగాని ప్రజ్ఞానం అనుభవ జ్ఞానంగా మారదు.**

ఆత్మవిద్య

రాముడు సర్వజ్ఞుడు, సర్వశక్తి మయుడు కదా! మరి తాను కూడా ఎందుకు ఇన్ని కష్టాలను అనుభవించవలసి వచ్చింది? అని మీరు ప్రశ్నించవచ్చు. భగవంతుడైనా శరీరము ధరించిన తరువాత ప్రవృత్తి ధర్మాన్నే అనుసరించాలి. అవతార పురుషులు కొన్ని సమయము లందు **మాత్రమే దైవత్వాన్ని వెల్లడి చేస్తారుకాని, మిగిలిన అన్ని సమయములందు మానవత్వం యొక్క ప్రవృత్తినే ప్రకటిస్తూంటారు.** రాముడు మానవాకారము ధరించినప్పటికీ తాను మానవుడు కాదనే సత్యము తనకు తెలుసు. అయితే శారీరకంగా లోకానికి ఆదర్శాన్ని అందించే నిమిత్తమై తాను కూడా సామాన్య మానవుని వలె మాయచేత కప్పబడినట్లు, భార్యావియోగంతో కుమిలి పోయినట్లు, యుద్ధము చేసి విజయాన్ని సాధించినట్లు నటిస్తూ వచ్చాడు. సత్యాసత్యములకు, ధర్మా ధర్మములకు, మంచి చెడ్డలకు మధ్య జరిగిన సంఘర్షణే రామరావణ యుద్ధం, మహాభారత యుద్ధం కూడా. **ఈ యుద్ధములు నిరంతరము మానవ హృదయాల్లో జరుగుతూనే ఉన్నాయి.** దీనిని నివారణ గావించుకున్ననాడే మానవ జన్మ ధన్యమవుతుంది. రేపటి దినము రాముని యొక్క పట్టాభిషేకం గురించి తెలుసుకుందాం. **ఏ రాముని పట్టాభిషేకం? ఆత్మారాముని పట్టాభిషేకం!**

(శ్రీ.భ.ఉ.పు.86/87)

ఆత్మవిద్య

"అధ్యాత్మ విద్యా, విద్యానాం" అని గీతయందుకూడా విభూతియోగమున తెలుపబడెను. **'విత్' అను ధాతువునకు 'య' అను అవ్యయము చేర్చినప్పుడు "విద్య" అను పదము ఏర్పడును. య = ఏది? విత్ = వెలుగు - ఏది వెలుగు నిచ్చుచున్నదో అది విద్యయని యుత్పత్తి అర్థము. కనుక, విద్యయను పదము బ్రహ్మవిద్యకే తగినది.** జ్ఞానము వెలుగుగా, అజ్ఞానము చీకటిగా, వర్ణించారు మన పూర్వీకులు. ప్రకాశ అంధకారములు ఒకే కాలమున నిలువజాలవు. కావున **ప్రగతి పథమును పయనించు ప్రతి మానవుడు ఆత్మవిద్యను లేక బ్రహ్మవిద్యను అభ్యసించి పరిశుద్ధాత్ముడు కావలెను.** అన్ని నదులు సముద్రమున కలియునటులే అన్నివిద్యలు, ఆత్మవిద్యలు ఆత్మ విద్యలో లీనమగుచున్నవి. అంతే కాదు. సాగర సంగమ సమయమున నదులన్నియు తమ ప్రత్యేక నామ రూపములన్నీ కోల్పోయి అఖండ సముద్ర ఆకృతి అయినట్లు బ్రహ్మ విద్యాసాగర సమ్మేళనమున బాహ్య విద్యలన్నియు, స్వరూపనామ రూపాదుల పరిత్యజించు చున్నవి. **"విద్యా తపోభ్యాం పూతాత్మ". విద్యవలనను, తపస్సు వలనను మానవుడు విప్రుడగుచున్నాడు. విద్య - బాహ్యవిద్య, బ్రహ్మవిద్య అని రెండు విధములు.** బాహ్యావిద్య కేవలము మానవుని జీవుని ఉపాధికి ఏర్పడినది. పొట్టకూటి చదువులు అని పేర్కొనబడినవి. ఇక బ్రహ్మవిద్య సమస్త మానవులను కృతకృత్యునిగా చేయు సామర్థ్యము కలదియై యున్నది. ఇహలోక, పరలోక సంబంధము కలిగించును. కల్పించును. అందరిని కడతేర్చగల దివ్యశక్తి బ్రహ్మవిద్యకు తప్ప బాహ్య విద్యలకు లేదు. **బ్రహ్మవిద్య బ్రహ్మమును తెలుపును. తపస్సు పరబ్రహ్మలో కలుపును.**

(సా॥ పు 596/597)

ఆత్మజ్ఞానమన్నను, బ్రహ్మజ్ఞానమన్నను, ఆధ్యాత్మిక జ్ఞానమన్నను ఒక్కటే. అయితే అనేకత్వములోని యేకత్వాన్ని నిరూపించేది, మృత్యుత్వములో అమృతత్వమును నిరూపించేది ఆత్మజ్ఞానము. పవిత్రమైన సృష్టిస్థితులను పవిత్రమైన దివ్యమార్గమును ప్రసాదించేది ఆధ్యాత్మికజ్ఞానము. ఈ జ్ఞానమునకు ఆధారమేమిటి? దీనికి నిర్మలమైన చిత్తము, చిత్తశుద్ధి అత్యవసరము. **"చిత్తస్య శుద్ధయే కర్మ:" చిత్తశుద్ధికి** పవిత్రమైన కర్మలు అత్యవసరము. ఈ కర్మలు సదాచారముచే, సత్ప్రవర్తనచే, సద్గుణములచే, సత్సంగముచే ఆచరించే పవిత్రమైన కార్యములు. ఇంతియే కాక పవిత్రమైన భారత, భాగవత, రామాయణ, గీత, ఉపనిషత్తు, బ్రహ్మసూత్రం ఇత్యాది గ్రంథములు పఠించుట కూడను సత్కర్మలే. దాన ధర్మాదికర్మలు, యజ్ఞయాగాది క్రతువులు సత్కర్మల

క్రిందనే రూపొందును. లోకసంబంధమైన విద్యలు అభ్యసించినవాడు పండితుడు కావచ్చును, మేధావి కావచ్చును, విద్వాంసుడు కావచ్చును, కానీ సర్వజ్ఞుడు కాలేడు. **శోకమును నివారణ చేసుకునే మార్గమునకు ఉపాయము బోధించేదే యీ ఆత్మవిద్య.**

(శ్రీ.గీ.పు. 1,2)

"సత్య జన విరోధాయ అసత్యం జనరంజనం సురావిక్రేయతే స్థానే దధ్యాధికం పీత్వా గృహే గృహే" మీకు పాలు కావాలా? పెరుగు కావాలా? అని ఇంటింటికి వచ్చి అడిగినప్పటికీ వాటిపై ఆశ పుట్టదు. కానీ ఎక్కడో **ఊరి బయట మద్యవిక్రయ కేంద్రం ఉంటే ఎంత దూరమైనా నడచివెళ్ళి మద్యం సేవిస్తారు.** అదేవిధంగా సత్యమంటే ఎవ్వరూ ఇష్టపడరు. అందరూ అసత్యమువైపే సులభంగా ఆకర్షితులవుతారు. ఈనాటి విద్యార్థుల పరిస్థితి కూడా ఈవిధంగానే ఉన్నది. భారతీయ విద్యను విస్మరించి విదేశీ విద్యకోసం ప్రాకులాడి పోతున్నారు. **"ఎన్ని విద్యలు నేర్చిన ఏమి ఫలము? నాసటివ్రాతను తప్పింప నెవరి తరము? చెడ్డ బుద్దులు తలలో చేరెనేని? ఎండబారును, బుద్ధులు బెండుబారు!"** మన బుద్ధులు సరియైనవి కానప్పుడు ఎన్ని విద్యలు నేర్చి ఏమి ఫలము?మొట్టమొదట ఆత్మవిద్యను నేర్వాలి.

(స.సా.ఫి. 98 పు.40)

(చూ॥ ఆత్మజ్ఞానము, లక్ష్యము)

ఆత్మవిశ్వాసము

ఆత్మవిశ్వాసము మనము బలపరచుకోవాలి. ఈ ఆత్మ విశ్వాసము ఉండినప్పుడే మనకు ఆనందము లభ్యమవు తుంది. ఏ మాత్రము విచారము చేయకూడదు. వచ్చిన కష్టములు, నష్టములు, దుఃఖములు ధైర్యముతో ఎదుర్కోవటానికి తగిన బలమును సంపాదించుకోవాలి. అందుకనే మన Education system లోపల (4) నాలుగు F లు బోధించాను.

మొదటిది Follow the master

రెండవది Face the devil

మూడవది Fight to the end

నాల్గవది Finish the game

ఇది నీ నిజమైన తత్వము. ఈ విషయములో నీవు నిరంతరము చదువును సాధిస్తూ రావాలి. ఏమిటి యీ చదువులు. ఆంగ్లములో ఎబిసి అని వుండాది. ఈ ABC అంతరార్థము ఏమిటి? Always be careful. ఇదే వేదాంతమునందు **"ఉతిష్ఠత జాగ్రత ప్రాప్యవరా న్నిబోధత, జాగ్రత జాగ్రత"**. ఇలాంటి చదువుల సంస్కృతికి సంబంధించిన చదువులు చదవాలి. విద్యార్థులారా! ఎంతకాలము బ్రతికినప్పటికిని ఎన్ని విజ్ఞానములు తెలుసుకున్నప్పటికిని, ఎన్ని పదవులు ఏలినప్పటికిని ఏనాటికైనా మన తత్వాన్ని మనము గుర్తించక తప్పదు. ఎప్పటికో తెలుసుకోవలసిన ఈ సత్యాన్ని ఇప్పుడే తెలుసుకో. ఎప్పటికప్పుడే గుర్తించుకో. ఎప్పటికప్పుడే జాగ్రత్తగా ఉండు - భగవదనుగ్రహముగాని భగవంతుని ఆగ్రహముకాని భగవంతుని ప్రేమగాని భగవంతుని ఆశీర్వాదముగాని ఎప్పుడూ ఎక్కడ ఏ విధంగా లభిస్తుందో: భౌతికమైన లౌకికమైన ప్రపంచమందు కొన్ని కొన్ని మనకు తెలుస్తుంటాయి. అర్థమవుతుంటాయి. కాని ఆధ్యాత్మికములో మనకు ఏమి తెలియదు. అర్థము కాదు. మన కర్తవ్యమును మనము ఆచరిస్తూ పోతుంటే ఎప్పటికప్పుడు అదే మనకు ఆనందము చేకూరుస్తుంది.

(బృ.త్ర.పు. 3౫)

పునాది లేనిదే భవనం నిలవదు. పునాది భద్రంగా వుండాలి. జీవిత భవనానికి **ఆత్మవిశ్వాసమే పునాది.** చాలామందికి ఇది వుండటం లేదు. అందువల్ల ప్రయత్నమే చెయ్యరు. ఇంక విజయాన్ని ఎలా సాధిస్తారు? కనుక ఆత్మవిశ్వాసం చాల ప్రధానం. **ఈ పునాదిపైన గోడలు నిర్మించు. ఏమిటా గోడలు? అదే ఆత్మతృప్తి (సెల్ఫ్ సేటిస్ ఫేక్షన్).** ఆత్మవిశ్వాసం ఉన్నవాడికే ఆత్మతృప్తి కలుగుతుంది. విశ్వాసం లేనివాడికి ఈ జన్మలో తృప్తిరాదు. కనుక ఆత్మతృప్తి అనే గోడలు ఆత్మవిశ్వాసమనే పునాదిపైననే నిలుస్తాయి. **ఇంక రూఫ్ (పైకప్పు)** వెయ్యి. ప్రతి ఇంటికి

ఆత్మసాక్షాత్కారము

రూఫ్ ఉండాలి కదా! ఏమిటా రూఫ్? అదే **స్వార్థత్యాగం (సెల్ఫ్‌సేక్రిఫైజ్)** ఆత్మతృప్తి గలవాడే స్వార్థత్యాగం చేయగలడు. మీలో త్యాగం లేకపోవడానికి కారణం తృప్తి లేకపోవడమే! ఆత్మ విశ్వాసమనే పునాదిపై ఆత్మతృప్తి అనే గోడలపై సార్థత్యాగం అనే పైకప్పు వేశాక బిల్డింగ్ తయారైంది. ఇంకేం చేస్తావు? ఆ బిల్డింగ్‌లో నివసిస్తావు. **అదే లైఫ్. సెల్ఫ్ రియలైజేషనే లైఫ్.సెల్ఫ్‌రియలైజేషన్. (ఆత్మానుభూతి)** లేనిదే అది లైఫ్ కాదు. ఈ ఆత్మానుభూతి అనేది ఆత్మవిశ్వాసం, ఆత్మతృప్తి, స్వార్థత్యాగములపై ఆధారపడియున్నది. వీటిని అందరూ అలవర్చుకోవాలి. రాష్ట్రపతి **వెంట ఇద్దరు ADC లు (అంగరక్షకులు) ఉంటారు.** అలాగే డ్యూటీ అనే రాష్ట్రపతికి డిసిప్లిన్ (క్రమశిక్షణ), డివోషన్ (భక్తి) రెండూ అవసరం. డిసిప్లిన్ లేనిదే జీవితంలో ఏదీ సాధించలేవు. మన టెంపరేచర్‌గాని, బ్లడ్ ప్రెషర్‌గాని, వాటిహద్దులను దాటాయంటే రోగం ప్రారంభమవుతుంది. కనుక మన దేహమంతా డిసిప్లిన్‌తోనే ఉన్నది. డ్యూటీకి డిసిప్లిన్ చాల ముఖ్యం. రెండవది డివోషన్. డివోషన్‌తో డ్యూటీని బాగా నిర్వర్తించగలవు. డివోషన్ అంటే ప్రేమ. ప్రేమతో చేసే డ్యూటీ తప్పక విజయాన్నందిస్తుంది. **Duty with love is desirable. Duty without love is deplorable. ప్రేమ చాల అవసరం అయితే ఇక్కడ ముఖ్యమైన దొకటుంది. భగవంతుని ప్రేమ ఎప్పుడూ డ్యూటీ కాదు Love without duty is divine.**

(స.సా.ఫి98 పు. 53)

(చూ॥ భక్తి, లింకన్, సత్యవిద్య)

ఆత్మసాక్షాత్కారము

(చూ॥ అవతారములు, ఇరువది గుణములు)

ఆత్మస్వరూప స్వభావము

"నిత్యానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యం ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షి భూతం భావాతీతం త్రిగుణ రహితం సద్గురుం తం నమామి" ఇవి ఆత్మస్వరూప స్వభావముల సరియైన గుర్తులు. ఇట్టి ఆనందము ఏనాడు దుఃఖమునుకాని కష్టములు కాని బాధలు కాని విచారములుకాని అందించదు. అట్టి పెన్నిధి మీ సన్నిధినే యుండగా దుఃఖములు విచారములు కష్టములు కలిగించే ఈ జగత్తునకై మీ రెందుకు ఆరాటపడుతున్నారు?

(బృ.త్ర.పు ౧౬౩/౧౬౪)

(చూ॥ అజ్ఞానము యొక్క తత్త్వం.)

ఆత్మస్వరూపుడు

ప్రతి మానవుడు తన కర్తవ్యాన్ని నిర్వర్తించుకొంటూ భగవంతునిపై భారం వెయ్యాలి.

నాయందున్న ఆత్మస్వరూపుడు నన్ను యీ విధంగా ఆడిస్తున్నాడని విశ్వసించాలి.

ఎక్కడ విశ్వాసమో - అక్కడ ప్రేమ
ఎక్కడ ప్రేమనో - అక్కడ శాంతి
ఎక్కడ శాంతియో -అక్కడ నే సత్యము
ఎక్కడ సత్యమో - అక్కడనే దైవము
ఎక్కడ దైవమో - అక్కడ నే ఆనందము.

కడపటిది ఆనందం - మొదటిది విశ్వాసం. విశ్వాసం ఉండిన వానికే ఆనందము లభ్యమవుతుంది. విశ్వాసం లేని వారికి ఆనందం లభ్యంకాదు Duty is God -work is worship.

నేను చేసే పనులన్నీ భగవంతుని యొక్క సేవలే అన్న భావంతో చెయ్యి. అప్పుడు Work will be transformed into worship.

నీవు చేసే సని అంతా భగవంతుని పనిగా భావించు. అదే సరియైన మెడిటేషన్.

నాదేహమే ఒక పనిముట్టు - ఈ పనిముట్టు ద్వారా భగవంతుడే ఈ పని చేస్తున్నాడు. అనే విశ్వాసాన్ని పెంచుకో. ఈ సాధన ఎంతో ఉపకారంగా ఉంటుంది - ఆదర్శవంతంగా ఉంటుంది.

(దే.యు.పు.109-110)

(చూ॥ ఆరుగుణములు, దేవుడు)

ఆత్మానందము

(చూ॥ ఆత్మ)

ఆత్మానాత్మ వివేకజ్ఞానము

ఆత్మానాత్మ వివేక జ్ఞానము నందు నిరంతరాసక్తి కలిగియుండ వలెను. "నేనే నిత్యుడను కనుక నన్ను నిరంతరమూ స్మరించుచూ చిత్తము నాయందు లగ్నముచేసిన యెడల దేహేంద్రియములు యేమి చేసిననూ అవి ఆత్మాభిముఖమై యుండును. మానవ జీవితమే ఒక పోరాటము కాన చిత్తము నాపై పెట్టి యుద్ధము చేయు'' మని బోధించినాడు.

(గీ.పు. 214)

(చూ॥ఇరువది గుణములు)

ఆత్మాన్వేషణ

మానవుడు సాధనలు చేస్తున్నాడంటే కేవలము మానసిక సంతృప్తి నిమిత్తమై చేసే ప్రక్రియలే. **మనస్సునే నిర్మూలనము గావించుకొనవలెనని వేదాంతము బోధించుచుండగా, మనసునసంతృప్తి పరిచే సాధనలు చేయడం, దానిని బలపరచినట్లపుతుంది.** సాధనలు చెయ్యాలని సంకల్పించుకొంటే, **అనాత్మ భావమును దూరము గావించుకో.** అత్మానందమును అందుకొన గోరినప్పుడు దృష్టిని ఆత్మవైపు మరల్చు. **మోక్ష ప్రాప్తి నిమిత్తమై, ఆత్మానుగ్రహ నిమిత్తమై, ఆత్మజ్ఞాన నిమిత్తమై, ఆత్మానంద నిమిత్తమై సాధనలు చేయటం భ్రాంతియే. నీవే ఆత్మ వై యుండి నీవు ఆత్మ నిమిత్తమై మరొక దానిని ప్రార్థనగాని సాధనగాని చేస్తే, నీ యొక్క తత్వమును ఏరీతిగా గుర్తించగలవు?** ఈ సాధనలన్నీ మనస్సును చల్లబరుస్తాయి. మనస్సును చల్లబరచి ప్రయోజనం ఏమిటి? మనస్సే లేకుండా చేసుకోవాలి. **మనోనాశన నిమిత్తమై ఆచరించే సాధనలే ఆత్మాన్వేషణకు సరియైన సాధన.**

(శ్రీ.భ.ఉ.పు.7)

(చూ॥ భగవదన్వేషణ)

ఆత్మార్పణం

స్వధర్మమును శౌర్య వంతముగా నిర్వర్తించుట యనునది సర్వోన్నత దర్మమే గాని, విధి అనగా నేమి? ఈ సందిగ్ధ సమస్యా సంబంధ మయిన మతమునకు, నైతిక విధానమునకు మధ్య అటు వంటి వివాద మొకటి కలదు. **"గహన కర్మణోగతిః"** అనగా కార్యవిధానము సాంద్రమైనది, క్లిష్టమైనది, **భగవానుని దృష్టిలో యేది విధియో, యేది కాదో, యేది కర్మమో, యేది కర్మము కాదో నిర్ణయించుటకు మేధావులు కలవరపడిరి, పడుచున్నారు.** కానీ మీకు ఆచరణ యోగ్యమైన మార్గమును గుర్తించుటకు కావలసిన జ్ఞానమును భగవానుడు తానే దెలిపెద ననెను. ఆ పరమరహస్యమై పరమ శ్రేష్ఠమూ అయిన పద మిది:

"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామే వైష్యసి సత్యంతే ప్రతిజానే ప్రియో సిమే"
"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచః"

తా॥ **మన్మనరస్కుడవు, మత్ప్రియుడవు, మదారాధకుడవు కమ్ము.** నా కొర కొక త్యాగివి కమ్ము. నాకు నమస్కరించుము. నీవు నా దగ్గరకే వచ్చెదవు. ఇదే నీకు నా బోధన, నా వాగ్దానము. నాకు ప్రియుడవు కమ్ము, త్యజించి సర్వ ధర్మములను పొందుము. **నాతోనే శరణ్యం, దుఃఖించకు, సర్వ పాపముల నుండీ, కీడుల నుండి నిన్ను విముక్తుని చేతును**

ఆహా! సూక్షముగా ఈ పై రెండు శ్లోకముల భావము **ఆత్మార్పణ,** ఇది చాలదా తరించుటకు, స్వామిని రమించుటకూ, ముక్తిని పొందుటకు! **"మన్మన" యనగా అతనిని ప్రతి జాతి యందు చూచుట,** అతనిని సర్వదా జ్ఞప్తి యందుంచు కొనుట, యెరుకతో నుండుట, ఆనందముతో నుండుట. **"మద్భక్త" అతనితో అఖండమైన భక్తి ప్రేమలపై నిర్మింపబడిన** యేకత్వమును విశదీకరించుట. **"మద్యాజి" పెద్ద, చిన్న, అన్ని విధములైన పనులనూ పరమాత్ముని** అనగా కృష్ణునిపై పరిత్యాగమువలె అర్పణ చేయుట, ఆ ఆనందమునకై అహమును

ఆత్మారాముడు

కర్మఫలమును త్యజించి యెల్లవేళలలో సత్యక్రమమయిన కర్మలో మునిగియుండుట అని తెలిపెను. పరిపూర్ణార్పణము చేయుట యనునది మానవునకు కష్టమయిన పనే కానీ అదియును, లేశమాత్రమైననూ ప్రయత్నించినచో భగవానుడే అతనికి తగిన సర్వమును విజయ నిశ్చయమును సూచింపగలడు, ప్రసాదించగలడు. ప్రక్కతోడై గురుడు, రక్షకుడు, స్నేహితుడు కాగలడు. **'స్వల్పమల్పస్య దర్మస్యత్రాయతే మహతో భయాత్'-ఈ ధర్మములో స్వల్ప మాత్రమైననూ నరే మానవుని మహాభమయు నుండి తొలగించును.** ధర్మమును ఆచరించుట ఆనందకరమని సులభమని కూడ కృష్ణ పరమాత్మ తెలిపెను. **"మమే వైష్యసి" (నాదగ్గరకు నీవు వత్తువు)** అనగా అతడు నన్ను తెలిసికొనును, నాలోకి వచ్చును, నా ప్రకృతిని పొందును ఈ పదము లందు **"సాదృశ్యము" భగవత్ప్రకృతి "సాలోక్యము" భగవానునితో నివాసము, "సాయుజ్యము" భగవంతునితో ఐక్యతా అనుభవములు వివరించెను.** ఈ పవిత్ర గీత దేవునిలో నివసించుటను వివరించెను.

(గీ.పు. 7/9)

ఆత్మారాముడు

(చూ॥ ఆత్మరామాయణము, భగవంతుని అడ్రస్సు)

ఆధిదైవికము

(చూ॥ ఎడ్యుకేషన్, దేహము, దైవమానవత్వం)

ఆధిదైవిక శాంతి

(చూ॥ ఎడ్యుకేషన్)

ఆధిభౌతికము

(చూ॥ ఎడ్యుకేషన్, దేహము, దైవమానవత్వం)

ఆధిభౌతిక శాంతి

(చూ॥ ఎడ్యుకేషన్)

ఆదర్శ గురువులు

(చూ॥ స్త్రీలు)

ఆదర్శ ప్రాయుడు

(చూ॥ హనుమంతుడు)

ఆదర్శమార్గము

బాలగంగాధర్ తిలక్ స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో కృషి సలిపిన వ్యక్తి. పూణేలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ వుండేవాడు. అయ్యా! స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మీరు ప్రధాని పదవి చేపడతారా అని అడిగితే - నే నొక్కడినే ప్రధానినైపోతే ప్రయోజనమేమిటి? అనేక మంది ప్రధానులను చేయగలిగే ఉపాధ్యాయుడుగానే ఉంటానన్నాడు. భారత దేశాన్ని రక్షించే యువకులను తర్ఫీదుచేసే **ఉపాధ్యాయుడుగానే ఉండి పోతానన్నాడు. భారతదేశాన్ని రక్షించే యువకులను తర్ఫీదుచేసే స్థానమే నాకు గొప్ప పదవి అన్నాడు. ఉపాధ్యాయుడంటే చిన్నపాటి ఉద్యోగమని, ఏ పని లేక ఈ పనిలో చేరినామని భావించరాదు. ఆచార్య స్థానము అందరికీ లభించేది కాదు. ఇది పూర్వజన్మ సుకృతమనే చెప్పవచ్చు. భారతదేశంలో ఇప్పటికి ఇలాంటి మానీయులు, త్యాగశీలురు, ఔదార్యవంతులు ఉన్నారన్న సత్యాన్ని మీరు నిరూపించాలి. మీకు ఒకరో ఇద్దరో కామపుత్రులు ఉండవచ్చును. కాని ప్రేమపుత్రులు అనేకమంది.** ఈ ప్రేమ పుత్రులపైన లక్ష్యముంచి భారతదేశ సౌభాగ్యాన్ని, ఔన్నత్యాన్ని, కీర్తిని మీ ద్వారా నిలబెట్టడానికి ప్రయత్నించాలని నేను ఆశిస్తున్నాను. **మానవతా విలువలను అతి త్వరితంగా దేశమంతటా వ్యాపింపజేస్తారని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.**

(జ.పు. 153)

ఆదర్శము

మీరు కష్టాన్ని భరించుకోలేరు. కనుకనే అన్నీ ఇస్తాను. నేను దేనికైనా భరించుకోగలను, సహించుకో

గలను. నాకేదీ అక్కర్లేదు.

నిజానికి అవతారాలన్నీ అంతే కదా! రాముడు అరణ్యవాసంలో అనేక కష్టాలను భరించుకున్నాడు. కృష్ణపరమాత్మ పార్థసారథిగా 'కింగ్‌మేకర్' గా ఉన్నాడేగాని, తాను 'కింగ్' కావాలని ఏనాడూ ఆశించలేదు. సుగ్రీవ పట్టాభిషేకంగాని, విభీషణ పట్టాభిషేకంగాని రాముని కటాక్షమే కదా! అవతారమూర్తుల క్షమ అనండీ, లేదా భరించుకునే శక్తి, లేదా సహించుకునే ఓర్పు మనకు **ఆదర్శాన్ని** చాటుతుంది.

(స.సా. జూలై 2000 పు. 214)

సత్యనిత్య సుకృతులన్ని వికృతిరూపు పొందుచుండె
పవిత్రప్రకృతి ప్రతిదినము ప్రజల వీడిపోవుచుండె
దయా ధర్మాచరణ సతతము వికృతిరూపు పొందుచుండె
ఆర్యవేదవిద్యలణగె దుర్విద్యలు పెరుగుచుండె.

ప్రాచీన కాలమునుండి భారతదేశము ఆధ్యాత్మిక సంపత్తి చేత అన్ని దేశములకు శాంతి సుఖముల నుందిస్తూ వచ్చింది. కనుకనే నాటికి నేటికి **'లోకా స్సమస్తాస్సుఖినో భవంతు' అన్నదే భారతీయుల యొక్క ఆదర్శము.**

(భ.స.మ. పు.3)

భారతదేశం ఎప్పుడూ లోకహితాన్నే కోరింది! ప్రపంచ శ్రేయస్సునే కాంక్షించింది! విశ్వశాంతినే అభిలషించింది! వసుధైక కుటుంబమే లక్ష్యంగా ఉంచుకుంది! దేశకాల పరిస్థితులకు అతీతమైన మన పవిత్ర సాంప్రదాయ సంపదను సుసంపన్నం చేసుకోవాలి! ఎంత దివ్యమైన దేశం మనది! ఎలాంటి ఆదర్శవంతమైన దేశం మనది! ఎంతటి ప్రేమ పూరితమైన దేశం మనది!

యోగభూమి - త్యాగభూమి అయిన భరత ఖండంలో పుట్టిన మనం. అన్నం కోసం కాదు - ఆదర్శం కోసం జీవించాలి! జీవనోపాధి కోసంకాదు - జీవిత పరమావధి కోసం జీవించాలి! లోకహితం - యువకుల వ్రతం కావాలి!

ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరూ - మానవాళి పునరుద్ధరణ కోసం పని చెయ్యాలి.

మానవత్వ విలువలకోసం ధర్మ సమ్మతమైన మానవ సమాజ నిర్మాణము కోసం ఉద్యమించాలి.

(దే.యు.పు. 47)

ఒకానొక సమయంలో రామలక్ష్మణభరతులు బంతి ఆట ఆడుకుంటున్నారు. కొంతసేపటికి రాముడు ఆడి ఆడి అలసిపోయి చెమట కార్చుతూ వచ్చి తల్లి కౌసల్య ఒడిలో కూర్చున్నాడు. రాముడు చాల ఆనందంగా కనిపించాడు. కౌసల్య అడిగింది - "ఇంత శ్రమపడి వచ్చావు! ఏమిటి నీ ఆనందానికి కారణం?" అప్పుడు రాముడు "అమ్మా! ఈనాడు బంతిఆటలో భరతుడు గెల్చాడు. నాకు చాల సంతోషంగా ఉంది" అన్నాడు. "ఓహో! తమ్ముడు గెల్చాడని అన్నకు ఇంత ఆనందమా! అన్నదమ్ములంటే ఇలా ఉండాలి" అని తల్లి ఆనందించింది. కొంత సేపటికి భరతుడు పరుగెత్తుకుంటూ వచ్చాడు. కాని, చాల విచారంగా కనిపించాడు. "నాయనా! గెల్చినందుకు ఆనందంగా ఉండాలి కాని, ఎందుకు విచారిస్తున్నావు?" అని అడిగింది కౌసల్య. "అమ్మా! నేను ఓడిపోయే పరిస్థితిలో నన్ను గెలిపించాలని అన్న కావాలని ఓడిపోయి నాకు గెలుపు నందించాడు. నా నిమిత్తమై అన్న ఓడి పోవడం నాకు చాల కష్టంగా ఉన్నది" అన్నాడు భరతుడు. అన్న ఓడిపోయినందుకు తమ్ముడు దుఃఖించాడు. తమ్ముడు గెల్చినందుకు అన్న ఆనందించాడు. ఎంతటి అన్యోన్యత చూడండి! ఆనాటి అన్నదమ్ముల ఐకమత్యం ఇంత పవిత్రంగా ఉండేది. సమత, సమగ్రత, సమైక్యత, సౌభ్రాతృత్వము - ఈ నాలుగూ అత్యవసరమన్నాడు రాముడు. వీటిని పొందినప్పుడే వ్యక్తిత్వము ప్రకాశిస్తుంది. ఇలాంటి వ్యక్తిత్వము కల్గిన కుటుంబము దేశానికి ఆదర్శాన్ని అందిస్తుంది. **ఇది రామాయణంలోని ఆదర్శం. అనాటి అన్నదమ్ములు సుప్రీం స్టేజికి వెడితే ఈనాటి అన్నదమ్ములు సుప్రీంకోర్టుకి వెడుతున్నారు! ఇది సరియైనది కాదు. అన్నదమ్ములు ఐకమత్యంగా ఉండాలి; అన్యోన్యంగా, అనుకూలంగా ఉండాలి.** కాని, ఇలాంటి అండర్‌స్టాండింగ్, అడ్జస్ట్‌మెంట్ ఎక్కడా కనిపించడం లేదు.

(ది.ఉ. మరియు స.సా.ఏ. 1996 పు. 97)

(చూ॥ ఆత్మస్వరూపుడు, గణపతి, జననీ, జీవించాలి, డకారపంచకం, తల్లి, త్యాగం, దేశసంరక్షణ, ధర్మరాజు, పంచపాండవులు, విశ్వకుటుంబము, సాధన)

ఆదర్శమూర్తులు

ఒకానొక సమయంలో ఒక శిల్పి భోజరాజు వద్దకు మూడు విగ్రహాలను తీసుకు వచ్చాడు. ఆ మూడు విగ్రహాలు చూడటానికి ఒకే మాదిరి కనిపించాయి. భోజరాజు మంత్రిని పిలిచి "మంత్రీ! ఈ మూడు విగ్రహాలలో ఏది శ్రేష్ఠమైనదో చెప్పగలరా? అని అడిగాడు. మంత్రి ఒక ఇనుప తీగను తెప్పించి దానిని మొదటి విగ్రహంయొక్క చెవిలో దూర్చాడు; అది రెండవ చెవిద్వారా బయటికి వచ్చింది. "ఇది శ్రేష్ఠమైనది కాదు", అని దానిని ప్రక్కన పెట్టాడు. ఆ ఇనుప తీగను రెండవ విగ్రహంయొక్క చెవిలో దూర్చగా అది నోటి నుండి బయటకి వచ్చింది. "ఇది మొదటి విగ్రహంకంటే కొంత మేలుగాని, శ్రేష్ఠమైనది కాదు," అన్నాడు. ఆ తీగను మూడవ విగ్రహం చెవిలో పెట్టేట్పటికి అది లోపలికి పోయింది. "ఇదే శ్రేష్ఠమైనది", అన్నాడు. దీని అంతరార్థ మేమిటి? మొదటి విగ్రహము ఒక చెవితో విని మరొక చెవితో వదలి పెట్టేవారికి చిహ్నము. అలాంటివారు అధములు. రెండవ విగ్రహము - విన్న విషయాలను అనుభవించకుండా కేవలం మాటలలో చెప్పేవారికి చిహ్నము. అలాంటివారు మధ్యములు. ఇంక, మూడవ విగ్రహము - విన్న విషయాలను హృదయంలో చేర్చుకుని ఆచరించి అనుభవించేవారికి చిహ్నము. అలాంటివారే ఉత్తములు. మీరందరూ అలాంటి ఉత్తములుగా, ఆదర్శమూర్తులుగా తయారు కావాలి.

(స.సా.జూన్ 2000 పు. 186)

ఆదర్శవంతమైన చరిత్ర

(చూ॥ శ్రీరాముడు)

ఆదర్శవంతమైన జీవితము

ఒక్కతూరి మనము ఇది చెడ్డ అని తెలుసుకొన్న తరువాత, ఇది పాపము అని విశ్వసించినతర్వాత, రెండవపర్యాయము అట్టి చెడ్డకాని, పాపముకాని ఏమాత్రము కూడను ఆచరించటానికి ప్రయత్న పూర్వకముగా ముందుకు పోకూడదు, ఈ విధమైనటువంటి ప్రతిజ్ఞయందు మనజీవితమును సాధించినప్పుడే, మనజీవితము పవిత్రమైనజీవితముగా, ఆదర్శవంతమైన జీవితము గాకూడను రూపొందుతుంది.

(ఆ.రా.పు.236)

(చూ॥ ద్వేషం)

ఆదిత్యవర్ణుడు

(చూ॥ స్మరింతురు)

ఆదిత్యహృదయం

(చూ॥ విశ్వామిత్రుడు)

ఆదిత్యుడు

(చూ॥ యుజుర్వేదము)

ఆద్యంతములు

(చూ॥ భాగవతము)

ఆధారము

కొందరు బోర్ల పండుకుంటారు. దిండుపైన బుక్స్ పెట్టుకుంటారు. వేళ్ళను అంబులవలె వంచుతారు. ఇలాంటివారు ఎన్ని గంటలు చదవినప్పటికినీ వారి కేమి తలకెక్కదు. ఇక్కడ ఎత్తితే అక్కడ ఎత్తితే అమ్మూల పొదిగినట్టుగా ఉంటుంటాది. ఇలాంటి వికారమైన చేష్టల వలననే విద్యార్థులు జ్ఞాపకశక్తి లేకుండా పోతుండాది. సరియైన జ్ఞాపకశక్తి కుదరాలంటే చక్కగా కూర్చోని చదవాలి. అలసటగా ఉంటే బుక్స్ కట్టి నిదురపో. తప్పులేదు. ఈ నిర్బంధ మాఘస్నాన మెందుకు? చదవాలి, చదవాలి అని టీ త్రాగుతూ, నిద్దరపోతూ చదువుతుంటే యేమాత్రము ప్రయోజనము లేదు. జ్ఞాపకశక్తి పోవటమే కాకుండ ముందు

ముందు భయంకరమైన వ్యాధులు సంభవిస్తాయి. చేతులు కాళ్ళు అదురుతాయి. రోమోటిక్ పేన్స్ మొదలవుతాయి. ఏ ఘన కార్యమును సాధించవలె నన్ననూ దేహముతోనే సాధించాలి. దైవానుగ్రహము పొందాలనుకున్ననూ దేహము ఒక పనిముట్టు ధర్మార్థ కామమోక్షములు సాధించవలెనన్ననూ ఈ దేహము ఒక ఆధారము

(బృ.త్ర.పు ౬౩)

మన చర్మచక్షువులకు ఏ రంగు అద్దాలు ధరింతుమో ప్రకృతి అంతయు అదే రంగుతోనే కనిపిస్తుంది. కనిపించేవన్నీ మార్పు చెందునవే. మార్పుచెందే ఈ దృశ్యములకు మార్పు చెందని బ్రహ్మత్వము ఆధారమై ఉంటున్నాది. మనము కారులో లేక బస్సులో ప్రయాణమై పోతున్నాము. బస్సు, కారు కదులుతుండాది. రోడ్డు కదలటం లేదు కదా! కదలనిరోడ్డుని ఆధారం చేసుకొని కదిలే బస్సు కారు ప్రయాణం సలుపుతున్నాము. **కదలే ఈ జగత్తుకు, మార్పు చెందే ఈ జగత్తుకు, కదలని మార్పు చెందని దివ్యత్వము ఆధారమై ఉంటున్నది.** అట్టి ఆత్మతత్వాన్ని గుర్తించుకుంటేనే ఈ జగత్తు యొక్క రహస్యమంతయు మనకు సులభంగా అర్థమౌతుంది. ఈ జగద్భావం అర్థం కాకుండా పోవటానికి కారణము మన మనస్సే. ప్రవృత్తి మనస్సు యొక్క లక్షణము.

(బృ.త్ర.పు ౧౫౯)

హైడ్రోజను, ఆక్సిజన్ రెండూ చేరినప్పుడు నీరు అవుతుంది అంటారు. అయితే, నీరుని నీవు సృష్టించవచ్చు. హైడ్రోజను, ఆక్సిజనులను ఎవరు సృష్టించారు? హైడ్రోజను, ఆక్సిజను రెండూ ఉండినప్పుడు కదా నీవు నీరుగా మార్చగలుగుతున్నావు? **ఈ నీరు అధేయము. హైడ్రోజను, ఆక్సిజనులు ఆధారము. ఆధారములేకుండా ఆధేయము ఉండటానికి వీలు కాదు.** ఈ ఆధేయము క్రమక్రమేణా మార్పు చెందుతూ వస్తుంది. ఈ మార్పు చెందునదే సైన్సు. మార్పు చెందనిదే spiritualityఅనగా **ఆధ్యాత్మికము**. ఆధ్యాత్మికమనగా కేవలము పూజలు చేయడము, కొన్ని సత్కర్మలు ఆచరించడము, దైవకార్యములలో పాల్గొనడము అనుకుంటున్నాము మనము. Spiritualityఅనగా spirit of love. Science అనగా split of love. Split of love changes. Sprit of love permanent. Spirituality లేక culture లేదు. కల్మషమే అయిపోతుంది. Culture and spirituality అనగా ప్రేమతో కూడిన శక్తి.

(భ.స.మ. పు. 21)

(చూ॥ జగదీశుడు, జన్మాద్యస్యయతః, చైతన్యము, బ్రహ్మ, సమాజము)

ఆధేయము

(చూ॥ ఆధారము, జన్మాద్యస్యయతః)

ఆధ్యాత్మరామాయణము

ఇదే రామాయణమును వేదవ్యాసుడు కూడను రచించినాడు. ఆధ్యాత్మికరామాయణమని దాని పేరు. ఆరామాయణమునందు, రాముడు కేవలము భగవంతుడని స్పష్టంగా ప్రకటిస్తూ వచ్చాడు వేదవ్యాసుడు. వాల్మీకి రామాయణమునకు, వేదవ్యాసుని రామాయణమునకు ఉన్నటువంటి తారతమ్యాన్ని మనము చక్కగా ఉదాహరణలతో నిరూపించవచ్చు. మనము ఒక డ్రామా (Drama) వేస్తున్నామనుకోండి. ఆనాటకమునందు ఎల్లయ్య అనే వ్యక్తి ఒక రాముని వేషమును ధరించి, స్టేజి (Stage) పైన యాక్ట్ (Act) చేస్తున్నాడు. ఆరాముని అభినయము. ఆరాముని గానము, యాక్టింగు (Acting), చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. చూస్తున్నటువంటి ప్రేక్షకులు "రాముడు చక్కగా యాక్ట్ (Act) చేశాడు; రాముడు చక్కగా పాడినాడు" అని మాత్రమే హర్షిస్తూ ఉంటాడు. కాని తెరవెనుక ఉన్నటువంటి వ్యక్తులందరూ "ఎల్లయ్య చక్కగా యాక్టు (Act) చేసి నాడు; ఎల్లయ్య చక్కగా పాడినాడు" అని అతనిని వర్ణిస్తూ ఉంటారు. కనుక ఈ రెండింటియందున్న తారతమ్య మేమనగా, వాల్మీకిరామాయణము ప్రేక్షకుల ఆనందమును నిరూపిస్తుంది. వేదవ్యాసుని రామాయణము తెరవెనుక

ఆధ్యాత్మిక గణితం

ఉన్నవారు గ్రహించిన రహస్యాన్ని నిరూపిస్తుంది.

(ఆ.రా.పు.3)

(చూ॥ లోకనాటకము)

ఆధ్యాత్మిక గణితం

సైన్సు, ఆధ్యాత్మికం, మేథమేటిక్సు - గణితం - ఆధ్యాత్మికం - ఇట్లా అన్ని విషయములనూ ఆధ్యాత్మికంతో సమన్వయం చేయాలి. ఈ మేథమేటిక్సు - గణిత శాస్త్రం ఉంది. గణితానికి ఆధ్యాత్మికానికి ఏమిటి సంబంధం? ప్రాకృతిక సంబంధమైన గణితానికి ఆధ్యాత్మిక సంబంధమైన గణితానికి చాలా తేడా ఉంది. వ్యావహారిక గణితంలో 3-1=2. **ఆధ్యాత్మిక గణితంలో 3-1=1. ఏమిటి? 3-1=2 అవుతుంది గాని 1 ఎట్లా అవుతుందని మీరు సందేహించవచ్చు. ఈ ప్రశ్నకు ఆధ్యాత్మికం సరైన సమాధానం చెప్తుంది. ఒక అద్దముంది. అద్దం ముందు నీవు నిలుచున్నావు. అందులో నీ ప్రతిబింబం చూస్తూన్నావు. ఇక్కడ ఎన్ని ఉన్నవి? అద్దము, నీవు, నీ ప్రతిబింబము. ఈ మూడింటిలో ఒక అద్దము తీసి వేస్తే ఒకటి పోయింది. దానితో పాటు ప్రతిబింబము కూడా పోయింది. ఇక మిగిలింది ఒకటే.** ఈ ప్రకృతి ఒక అద్దము, దైవము బింబము, జీవుడు ప్రతిబింబము. జీవుడనే ప్రతిబింబము అద్దమనే ప్రకృతి ఉంటేనే కన్పిస్తుంది. అద్దమనే ప్రకృతిని తీసివేస్తే జీవతత్వము కూడా దానితో పాటే పోతుంది. ఇక **ఉన్నది ఒక్కటే దైవత్వం.**

(వ.1984.పు.21)

ఆధ్యాత్మిక చింతన

(చూ॥ త్రికరణ శుద్ధి)

ఆధ్యాత్మిక తత్త్వము

Spirituality begins where science ends. ఆధ్యాత్మిక తత్త్వము పరిమితమైన భౌతిక విజ్ఞాన శాస్త్రమునకు అతీతమైనది.

(ప్రే.బ.పు.1)

ఆధ్యాత్మిక ప్రేమ

Split of love is wordly. Spirit of love is spiritual. మీరు మీ కుంటుంబానికి మీ బంధు మిత్రులకు పంచి ఇచ్చేది ప్రాపంచిక ప్రేమ. అదే split of love కాని, జగదాధారమై సృష్టికి మూలసూత్రమై నిలచినట్టిది దైవప్రేమ. అదే spirit of love అదే ఆధ్యాత్మిక ప్రేమ.

(స.సా. ఫి. 2000 పు. 61)

ఆధ్యాత్మిక మయం

పుణ్యం పాపాన్ని క్యాన్సల్ చేయదా? అన్న ప్రశ్నకు బాబా మీరు ఎకౌంట్ స్టూడెంట్స్ కదా, అందుకని ఇలా అడిగారు. మీ ఆలోచనంతా క్రెడిట్, డెబిట్‌లలోనే ఉంటుంది. కానీ, భగవంతుడు మీ కన్నా గొప్ప ఎకౌంటెంట్. ఆయనది మీవంటి బ్యాలన్స్ షీట్ కాదు. పుణ్యానికి పుణ్యాన్ని, పాపానికి పాపాన్ని అనుభవింప జేస్తాడు. దేంట్లోంచి దేన్నీ మైనస్ చేయడు. ఒక చిన్న ఉదాహరణ: మీరు ముండ్ల చెట్టు విత్తనాలను, పండ్ల చెట్టు విత్తనాలను తెచ్చి నాటినారనుకోండి. ఏమవుతుంది? ముండ్ల చెట్టు విత్తనాలు ముండ్ల చెట్లుగాను, పండ్ల చెట్టు విత్తనాలు పండ్ల చెట్లుగాను పెరుగుతాయి. అందుకు విరుద్ధంగా జరుగదు కదా. పాపపుణ్యాల విషయంలో కూడా అంతే. **ఒకడు ఎన్నో దుష్కర్మలను చేసి, పది లక్షల సంపాదనను ఆశించి, వేంకటేశ్వర స్వామికి పదివేలిస్తానని మొక్కుకున్నాడట. తనకు పది లక్ష లివ్వగలిగిన స్వామి తన నుండి పదివేలు ఆశించడనే ఆలోచన వానికి రాలేదు.** ఈ విధంగా, కొంతమంది ఆధ్యాత్మికంలో కూడా లౌకికాన్ని ప్రవేశపెడతారు. కానీ, లౌకికాన్ని కూడా ఆధ్యాత్మిక మయం చెయ్యాలన్నది స్వామి సందేశం.

(స.సా.జూ.99పు.192/193)

ఆధ్యాత్మిక మార్గము

మానవుడు ఆశించవలసింది దీర్ఘ జీవితము కోసము కాదు. దివ్య జీవితము కోసము ఆశించాలి. దివ్యమైన ఈ ప్రకృతియందు మానవుడు దివ్యత్వమును పొందటమే ప్రధాన కర్తవ్యము. **సృష్టి రహస్యము సృష్టికర్తకు తప్ప అన్యులకు అర్థము కాదు. సృష్టి రహస్యమును గుర్తించటానికి ప్రయత్నించేవారే సైంటిస్టులు.** ఈ సృష్టి రహస్యమును పరిపూర్ణముగా ఎవ్వరూ గుర్తించలేదు. **ఈ విజ్ఞానమునందు ఈనాటి పరిశోధన రేపటికి పాతదైపోతుంది.** రేపటి పరిశోధన ఎల్లుండికి పాతదైపోతుంది. వైజ్ఞానికుడు పాతదంతా రోతదిగా భావిస్తుంటాడు. సృష్టి అంతయు క్షణ క్షణమునకు మార్పు చెందునదే. ఇది నిత్యమైనది సత్యమైనది కాదు. నిత్య సత్య నిర్మలమైన తత్వము సృష్టికర్తనే. సృష్టికర్తను పరిశీలనచేసి పరిశోధన చేసి సృష్టికర్తను పొందేదే ఆధ్యాత్మికమార్గము.

(బృ.త్ర.పు ౧౧౧/౧౧౨)

(చూ॥ తల్లి యొక్క ఆశీర్వాదములు)

ఆధ్యాత్మికము

ఆత్మభావమును లక్ష్యమునందుంచుకొని ఏ కార్యమైనా చేయి. నీవు తప్పక స్వాతంత్ర్యముగా వుంటావు. Individual freedom అనిగాని Spiritual freedom అనిగాని రెండు వేరు వేరుగా లేవు. **ఆధ్యాత్మికమే స్వాతంత్ర్యము, స్వాతంత్ర్యమే ఆధ్యాత్మికము.** ఇవి రెండు వేరు వేరుగా ఉండటానికి వీలుకాదు. ఒక పదార్థము భిన్న స్వరూపాలను ధరించింది. పాలున్నాయి. పాలు పెరుగు చేసుకున్నాము. పెరుగు చిలికినాము వెన్న వచ్చింది. మజ్జిగ వచ్చింది. పాలుగా వున్నది పెరుగుగా కావటము వెన్నగా కావటము మజ్జిగగా కావటము ఇన్ని రూపాలు చెందింది. ఐతే యిన్ని రూపములోనున్న పాలు ఒక్కటే. అదే విధముగనే **సాలోక్యము, సారూప్యం, సామీప్యం, సాయుజ్యం ఈ నాలుగు భిన్న భిన్న రూపనామములు గాని, నాలుగు చేరి ఒక్కటే. ఐతే ఒకదాని కొకటి సోపానములు. సాలోక్యం -**

ఆధ్యాత్మిక మార్గము

భగవత్ చింతన చేస్తున్నాం. భగవత్ లోకం, భగవంతుని చింతన చేస్తూ చేస్తూ ఏమైపోతుంది? సామీప్యం స్వామి చింతన చేస్తూ స్వామికి దగ్గరగా పోవాలి అని ఒక ఆశ పుడుతుంది. సామీప్యం పోయిన తరువాత స్వామిలో ఐక్యము కావాలి స్వామివలె వుండాలని ఆశిస్తావు. సారూప్యం పొందాలని ఆశించిన తరువాత సాయుజ్యం కావాలని ఆశిస్తావు. ఇవన్ని ఒకదానియొక్క భిన్న స్వరూపములే కాని వేరు వేరు కాదు.

(బృ.త్ర. పు. ౧౪౯/౧౫౦)

ఆధ్యాత్మికమనగా సంకుచితమైన స్థాయిలో విచారించ రాదు. పూజలు చేయటము, భజనలు చేయటము, ధ్యానము చేయటము యివన్నీ ఆధ్యాత్మికమునకు చిహ్నములుగా మనము భావిస్తున్నాము. ఇవన్నీ మానసిక వికారములే. మనస్సు తృప్తి నిమిత్తము ఆచరించే చర్యలే. మానసిక వికారములే. భగవంతుడే మాకు మాత, భగవంతుడే మాకు పిత, భగవంతుడే మా స్నేహితుడు - యీ విధముగా అనేక రకములుగా భగవంతుని వర్ణిస్తుంటాము. దేవుడే దైవము, తల్లి, తండ్రి స్నేహితుడు యీ విధమైన భావాలు ఎందుకు? **నీవే నేను నేనే నీవు. అనుకుంటే పోతుంది కదా. You and I are one. అంటే యిక్కడ సరిగా సరిపోదు. ఆధ్యాత్మికము ఖండిస్తుంది. You and I are We. అవుతుంది. గాని one కాదిక్కడ. We and we are one. నీలోన నేనువున్నాను. నాలోన నీవు వున్నావు. ఇరువురు చేరినప్పుడు ఒకటైపోతాము.** అక్కడ రెండు వుంది. ఏమంటే భౌతికమైన దేహమును ధరించిన శరీరము ఒకటి వుంది. అందులో ఆధారమైన ఆత్మతత్వము ఒకటి వంటున్నాది. అదే వుయ్. ఇక్కడ కూడను భౌతిక సంబంధమైన దేహమును ధరించటం చేత యిది ఒకటి వుంటున్నాది. ఇందులో ఆత్మతత్వము వుంటున్నది. ఇది కూడా వుయ్. కనుకనే యీ రెండింటియొక్క తత్వాన్ని గుర్తించుకుంటే, తల్లి, తండ్రి స్నేహితుడు యీ రకమైన సంబంధములే అక్కరలేదు. ఇరువురు ఒక్కరే. ఇరువురు అనే లేదు. రెండుగా

కనుపించినప్పటికి అందులో ఒక్కటే. ఇక్కడే నీకు ప్రత్యక్షం. ఇవి (మైకులు) రెండుగా కనుపిస్తున్నాయి. కానీ యీ రెండు చేరి ఒకటిగానే వినిపిస్తున్నాయి. కనుపించటం రెండు, వినిపించటం ఒక్కటే. కనుక దేహాత్మ భావము ఈ హృదయ తత్వము రెండింటిని ఒక్కటిగా చేర్చాలి. అదే మనము చేయవలసిన సాధన. ఆధ్యాత్మికమనగా దైవముతో ఏకము కావటమే. **దైవము నీవు వేరు కాదు. నీవే దైవము దైవమే నీవు.** ఈ విశ్వాసమును యీ స్థాయినుండి అభివృద్ధి గావించుకున్నప్పుడు యింక యేవిధమైన సాధనలు చేయనక్కరలేదు.

(బృ.త్ర - పు ౧౫౩)

లౌకిక విద్యలతోపాటు ప్రాచీన సంస్కృతిని మనము సరియైన మార్గములో అనుభవించాలి. Culture and spirituality అంటున్నారు కానీ **నా ఉద్దేశ్యం Spirituality యొక్క సారమే Culture.** అంతేకాని కల్చర్ వేరు **spirituality** వేరు అని రెండు వేరుగా విభాగము చేయరాదు. **ఆధ్యాత్మికము ఆనందముల యొక్క రసస్వరూపమే మన సంస్కృతి.** సంస్కృతి సంస్కృతము నుండి వచ్చినదె. సంస్కృతము సంస్కారముతో ఏర్పడినదే. ఈ సంస్కారమే ఆధ్యాత్మికము. ఈ ఆధ్యాత్మిక మార్గము చేతనే అన్ని సంస్కృతులు ఆవిర్భవించినాయి. అన్నింటియందూ ఉన్నది ఒక్కటే. అదే "ఏకం సత్". అన్ని దేశముల సంస్కృతి ఈ ఆధ్యాత్మిక మార్గములోనే అణిగి ఉంటున్నది. మనము ఎన్నిరకములైన తీపులు (Sweets) చేసుకొన్నప్పటికీ - గోధుమ హల్వా, బాదంఫీరు, గులాబ్‌జామ్, జిలేబి, లడ్డు అన్నింటిలో ఉన్నది చక్కెర ఒక్కటే అని ఏవిధముగా గుర్తించగలమో అదే విధముగా ఏ దేశము సంస్కృతి యైననూ ఆధ్యాత్మికము నుండి ఆవిర్భవించినదే. Culture అనీ Spirituality రెండూ వేరు చేయుట మంచిది కాదు. Spirituality లోనే Culture ఉంటుంది.

(బృ.త్ర. పు. ౬౬)

ఆధ్యాత్మికము అనేది ఒక "రిలిజన్" కాదు. అన్ని దేశాలకు ఆధ్యాత్మికము అవసరము. అసలు "రిలిజన్" అంటే ఏమిటి? **To Realise is religion. అనగా తనను తాను తెలుసుకోవాలి. "నేను" ఎవరో గుర్తించాలి.** రిలిజన్ పేరుతో మానవులను విడదీస్తున్నారు. మానవులందరూ ఒక్కటే! ఇట్టి ఏకాత్మభావాన్ని మీరు పెంచుకోవాలి. ప్రేమ నుండే ఏకాత్మ భావం కలుగుతుంది.

(దే.యు.పు.9)

1. ఆత్మ విచారణ చేసి దేహము, మనస్సు, బుద్ధి, ఆత్మల గురించి తెలుసుకోవడమే ఆధ్యాత్మికము.

2. ఆత్మ విచారణ చేయుట ఉత్తమ లక్షణము, తనను తాను తెలిసికోవడమే ఆధ్యాత్మికము.

3. ఆత్మ దివ్యాత్మ అని, సర్వవ్యాపకమైన విశ్వాంతరాత్మ అని తెలిసికొనుటే సరియైన తత్త్వవిచారణ, ఆత్మవిచారణ.

4. అన్ని రూపాల్లోనూ, అన్ని ఖనిజాల్లోనూ, అన్ని వృక్షాలలోనూ సర్వత్రా ఆత్మను దర్శించుటే సరిఅయిన ఆధ్యాత్మికము.

5. నేను, నాది అనుభవాలను విడనాడి, నామరూపాల నుండి దూరముగా ఉండడమే ఆధ్యాత్మికము. (ఇక్కడ సంకుచిత బుద్ధిని కలిగించే నేను, నాది అనే మనోభావాలకు దూరంగా ఉండి, నామరూపాలకు అతీతమైన ఆధ్యాత్మిక భావన కలిగియుండడమే ఆధ్యాత్మికత.)

6. ఆత్మానందాన్ని అనుభవించడమే అత్యుత్తమమైన ఆధ్యాత్మికము. (ఇచ్చట ఆత్మ, దానినుండి లభించే ఆనందము ఇంద్రియాతీతము అని అర్థమవుతుంది.)

7. దేహములోని ప్రతి అణువు దివ్యత్వముతో పని చేయుచున్నదని తెలిసికోవడమే సరైన ఆధ్యాత్మికము. (దేహము మృణ్మయము. అత్మే చైతన్యమై దేహాన్ని నడిపించేదని స్పష్టమవుతుంది. దృశ్యము, దృష్టి ద్రష్ట మూడు ఒకటేనని యు, మనసు, యోచన, యోచించేవారు, ఒకటేనని తెలుసుకోవడమే నిజమైన ఆధ్యాత్మికము.)

8. ఏకత్వమే దివ్యత్వమనే భావన కలిగియుండడమే నిజమైన ఆధ్యాత్మికము. ఏకత్వములో అనేకత్వాన్ని అనేకత్వములో ఏకత్వాన్ని గుర్తించుటే ఆధ్యాత్మికము.

"మీరు జన్మించినది మరల మరల జన్మించడానికి కాదు. జన్మించిన తరువాత ఆధ్యాత్మిక మార్గములో గడిపినట్లయితే మీకు తిరిగి జన్మించే అవకాశము కలుగదు. పుట్టుక పుట్టుకను కలుగచేయకూడదు. మృత్యువు తిరిగి మృత్యువును కలిగించకూడదు.

(ప్ర.పా.పు.132/133)

(చూ॥ అజ్ఞానం, ఆటలు, ఆత్మవిశ్వాసము, ఆధారము, ఎడ్యుకేషన్, దివ్యప్రకటనలు, దైవమానవత్వము, నగర సంకీర్తనము, భయం, విచారణ, విజ్ఞానము, శక్తులు, శ్రీసత్యసాయి అంతర్జాతీయ కేంద్రము, Ceiling on desires)

ఆధ్యాత్మికవైద్యులు

(చూ॥ వ్యాసమహర్షి)

ఆధ్యాత్మిక శాంతి

(చూ॥ ఎడ్యుకేషన్)

ఆధ్యాత్మిక సంస్కృతి - స్త్రీలు

"భగవదవతారము ఇది చేయగలదు. అది చేయలేదు. అని నిర్ణయించు అధికారమెవ్వరికీ లేదు." నేను కాలేజి (శ్రీసత్యసాయి మహిళాకాలేజి అనంతపురము) ప్రారంభించుటకు (22.7.1968) అడ్డమేమి యుండును? పుష్పము తన సహజ పరిమళమును మారుతమున కందించుట నెవరు నిరోధించగలరు. **జ్ఞాన బోధయే నా సంకల్పము. మానవుడు తన సహజ దివ్యతత్వమును తెలుసుకొనునట్లు చేయుట కవసరమైన అన్ని మార్గములూ అవలంబించెదను." "తమసో మా జ్యోతిర్గమయ అని మీరు ప్రార్థించుచుందురు కాదా!"**

జాతి యొక్క ఔన్నత్యమూ, సుస్థిరతల స్త్రీల యొక్క ఆధ్యాత్మిక సంస్కృతి మీద ఆధారపడి వుండును. నేడు సమాజములో ప్రబలుచున్న అన్యాయ అధర్మ అక్రమ అత్యాచారములకు కారణము తల్లుల పెంపకములోని లోపమే. దానికి కారణము వారి ఆశ్రద్ధ కావచ్చును. లేదా వారి యజ్ఞానము కావచ్చును. లేదా **పిల్లలలో సదాలోచన సత్ప్రవర్తన పెంపొందించు బాధ్యతను పురుషులు స్త్రీలకిచ్చి యుండురు. జరిగినదేదో జరిగిపోయింది. భావి తరముల వారి శ్రేయస్సు దృష్ట్యా ఇకనైనను స్త్రీలను ఆదర్శమైన మాతృమూర్తులుగా రూపొందించు విద్యను వారికి అందించుట అత్యవసరము.** వారు నిర్వహించ వలసిన బాధ్యతల కనుగుణ్యమైన జ్ఞానమూ, సహనమూ, విశ్వాసమూ అందించు విద్య వారికి గరపవలెను.

"క్షేత్రజ్ఞానము భుక్తికీ, ఆత్మజ్ఞానము ముక్తికీ మానవుల కవసరము. ఏకైక ఆశ్రయమూ బంధువూ, సఖుడూ, రక్షకుడూ అయిన భగవంతుని దూరముచేయు విద్యను గరపు విద్యాలయము వెలుతురు కోరివచ్చిన వారి కండ్లు పొడిచి అంధులను చేయు అంధుల నడుపు సంస్థవంటిది. "ఆధ్యాత్మిక సంస్కృతికి స్త్రీలు కోట బురుజులు వంటివారు. కాని, నేటి విద్యావంతులయిన స్త్రీల ప్రవర్తన, వారి అభిరుచులు, వారి చదువు సాహిత్యము, వారు చూచు అసభ్యమైన చలన చిత్రములు జుగుప్స కలిగించక మానవు.

"పుట్టిన ప్రతివ్యక్తి తన జీవితమున కొక అర్థమూ పరమార్థమూ లభింపజేసినందుకు ఐదుగురు మాతృ దేవతలకు ఋణపడివుండును. మొదటిది దేహమాత అనగా కన్నతల్లి, రెండవది గోమాత, పాలిచ్చు గోవు, భూమిని దున్ను ఎద్దు, మూడవది భూమాత, తినుటకు తిండి ఉండుటకు చోటు యిచ్చి రక్షించిన తల్లి, నాలుగవది దేశమాత: సంస్కారం, సాంప్రదాయం, జీవితమున కొక లక్ష్యం అందించిన తల్లి, అయిదవది వేదమాత, ఆధ్యాత్మిక జ్ఞాననిధి. జన్మ యిచ్చి మిగిలిన మాతృదేవతలతో సంబంధము కలిగించిన దేహమాత అత్యంత పూజ్యురాలు, అందువలననే ప్రప్రథమముగా మహిళలకు కళాశాల స్థాపించి సర్వతోముఖమైన సనాతన ధర్మమునకు నాందీవచనము పలుక సంకల్పించితిని"

ఆధ్యాత్మిక సాధన

"ఆత్మ విద్య యొక్కటే మనస్సును ధర్మమందు నిలుపగలుగును."

(స.శి.సు.తృ.పు.7/9)

భారతదేశ మీనాడు ఆకాశము నందుకొను భవనములతో, నిల్వచేసిన ఆహారములతో రేడియో, టెలివిజన్ మొదలయిన యంత్రములతో భోగ భూమిగా తయారగుచున్నది. భారతీయులు అనుకరణకు బానిసలై క్రమశిక్షణా రహితులై నిర్లక్ష్యమైన మూకగా తయారగుచున్నారు. వేరులు లేని మొక్కల వలె వారు ఇతర దేశముల జీవన విధానమును పట్టుకుని ప్రాకులాడుచున్నారు. ఇది **భారతీయ సాంప్రదాయమునకే అవమానము, చరిత్ర పట్ల ద్రోహము.** పవిత్రమైన కాలమును, కాయమును వృధా చేయుచూ భ్రష్టులగుచున్నారు. అందుకే గురుకులము వంటి ఈ కళాశాలను, **గురువారము నాడు గురు పూర్ణిమ పర్వదినమున ప్రారంభించ సంకల్పించితిని.**

(స.శి.సు.తృ.పు.164)

ఆధ్యాత్మిక సాధన

ఆధ్యాత్మిక సాధనలో విశ్వాసము ఊపిరివంటిది. సందేహము సాధన యొక్క పునాదులను సైతం కదలించి వేస్తుంది. అందువలన దానిని తొలగించాలి. మనపూర్వుల యొక్క విజ్ఞాన సంపదయందు విశ్వాసము కలిగి యుండుము. మన మహర్షుల యొక్క స్వయం ప్రేరితమైన మనస్సును (Intution) గాని, తద్వారా వారు కనిపెట్టిన గొప్ప గొప్ప విషయాలు గాని నీ అల్పబుద్ధితో శంకించకు. నీ యందు నీవు విశ్వాసము ఏర్పచుకో. ఇటువంటి విశ్వాసము ఏర్పరచుకోవటానికి అనేక సంవత్సరాలు పట్టవచ్చు. ఈ విశ్వాసము జీవితంలో నీకు ఉపయోగ పడాలంటే, నీ మనసులో గల విశ్వాసము నిరంతరాయము గాను, అచంచలమైనదిగాను ఉండాలి. సాధనలో ఎదురయ్యే నిరాశా నిస్పృహలవంటి ఆటంకములను, భగవంతుని యందు మనకు గల విశ్వాసమును గట్టిపరచి, మనలను ఉన్నత స్థితికి తీసికొని వెళ్ళడానికి ఆయనే కల్పించిన పరిస్థితులుగా ఆత్మ సంయమనముతో స్వీకరించాలి.

(దై.పు. 328)

ఆధ్యాత్మిక సూత్రములు

1. ప్రతిరోజు నియమితకాలంలో జపధ్యానాలు చేయటం.
2. ప్రతివారం ఒక రోజయినా కొద్దిసేపు కుటుంబ సభ్యులతో భగవన్నామ సంకీర్తన చేయటం.
3. కుటుంబంలోని పిల్లలను బాలవికాస్ తరగతులకు పంపటం.
4. సేవా కార్యక్రమాలలో గ్రామీణ సేవా కార్యక్రమాలలో పాల్గొనటం.
5. భగవాన్ శ్రీ సత్యసాయి సేవాసంస్థలు నిర్వహించే సంకీర్తన, నగర సంకీర్తనలలో నెలకొకసారి అయినా పాల్గొనటం.
6. సాయి సారస్వతం చదవటం, ప్రతిరోజు అధ్యయనం చేయటం.
7. మృదువుగా మాట్లాడటం.
8. మనుషుల వెనుకవారిని గూర్చి చెడుగా ప్రస్తావించటాన్ని మానుకోవటం.
9. ఆహారం పారవేయకూడదు. ప్రతిరోజూ కొన్ని బియ్యం గింజలను "నారాయణ సేవ" కోసం దాచి వుంచుతూ, నెలకొకసారి అయినా నారాయణ సేవ కోసం ఆహారం తీసుకు వెళ్ళటం.

(సే.యే.పు. 16/17)

ఆనంద పిపాసి

మానవుడు **ఆనందపిపాసి.** మానవుడు నిరంతరము ఆనందమునే ఆశిస్తాడు. దుఃఖమును యేమాత్రము ఆశించడు. నిరంతరము లాభమునే ఆశిస్తాడు కానీ నష్టమును ఆశించడు. కారణము? ఆనందమే యితని స్వభావము. వ్యాపారులు యేదైనా ఒక తూనిక వేస్తూనో, లేక కొలతలు వేస్తూనో మొట్ట మొదట ఒకటి, ఒకటి

యని వారు ఎంచరు. లాభం, లాభం, లాభం అంటూ లాభంతో ప్రారంభిస్తారు. ఆరో అంకె దాటి పోయేటప్పటికి యేడు అని చెప్పరు. **ఆరునొక్కటి, ఆరునొక్కటి, ఆరునొక్కటి అంటారు.** ఏడు అనరు. **ఏడు అంతా దుఃఖము. దుఃఖమును ఆశించడు.** దీనిలోవున్న అతరార్థము యేమిటి? ఈ యేడు అనే తెలుగు పదము వుపయోగపెట్టటానికి యిష్టముండదు. ఆరునొక్కటి అంటున్నాడు. ప్రారంభములో లాభము. మధ్యలో ఆనందము.

ఈ జగత్తు ఆనందము. ఇంద్రియానందము, విషయానందము హృదయానందములనుండి ఆవిర్భవిస్తున్నాది. ఇట్టి ఆనందము బ్రహ్మస్థాయినుండి లభించుచున్నది. కనుకనే దీనికి బ్రహ్మానందమని పేరు. ఇంద్రియ విషయానందముల కంటె అనేకరెట్లు అధికమైన ఆనందమును చతుర్ముఖానందము అన్నారు. చతుర్ముఖానందము అనేది బ్రహ్మానందసాగరములో ఒక బిందువువంటిది. ఈ బ్రహ్మానందమనే మహాసాగరము దైవానందములో ఒక్క అణుమాత్రమే వుంటుందట. కనుకనే దైవానందమనేది ప్రధానమైనది, నిజమైన హృదయానందము. ఈ హృదయానందము సర్వత్ర ప్రకాశించే దేదీప్యమానమైన జ్యోతి.

(శ్రీ.గీ.164 - 166)

(చూ॥ స్వస్థానము)

ఆనందము

నారదుడు నాల్గు వేదాలను, ఆరు శాస్త్రాలను పఠించాడు; ఉపనిషత్తులను కంఠస్థం చేశాడు; బ్రహ్మసూత్రాలను వల్లించాడు. కానీ, అతనికి శాంతి కలుగలేదు, భ్రమ తొలగలేదు. తన అశాంతిని దూరం చేసుకునే నిమిత్తమై అతడు సనక సనందన సనత్కుమారులను ఆశ్రయించాడు. సనత్కుమారుడు "నారదా! శాంతిని పొందడానికి నీకున్న అర్హత ఏమిటి? అని అడిగాడు. నారదుడు, 'సనత్కుమారా! నేను నాల్గు వేదాలను, ఆరు శాస్త్రాలను పఠించాను. సమస్త ఉపనిషత్తులను కంఠస్థం చేశాను" అన్నాడు.

"అంధకారం బెల్ల హతమారునే జూడ వసుధలో దీపపు వార్తవలన?

రోగ పీడితుని బల్ రోగంబు తీరునా ఔషధ మహిమంబు అంత విన్న?

నిరుపేదవాని పేదరికము పోవునా విత్త ప్రభావంబు విన్నయంత?"

ఆకలి తీరాలంటే ఆహారాన్ని చేతితో తీసికొని, నోటిలో పెట్టుకుని భూజించాలిగాని, ప్లేటులో ఉన్న ఆహార పదార్థముల పేర్లు వెయ్యి పర్యాయముల వల్లించినా పొట్ట నిండుతుందా? ఆచరణలో ప్రవేశించినప్పుడే 'ఆకలి' తీరుతుంది.

సనత్కుమారుడు "నారదా! నీవు వేదములను వల్లించావు శాస్త్రములను పఠించావుగాని, వాటిని ఆచరణలో పెట్టావా? మొట్టమొదటి ఉపనిషత్తులోని మొట్టమొదటి వాక్యం **"ఈశావాస్య మిదం సర్వం."** ఈ ఒక్కదాన్నైనా అనుభూతిలోకి తెచ్చుకున్నావా? అన్నింటియందు ఈశ్వరత్వమున్నదనే సత్యాన్ని గుర్తించావా? కేవలం గ్రంథ పరిచయంచేత శాంతిగాని, ఆనందముగాని లభించుననుకోవటం చాల పొరపాటు. **ఆచరణలోనే ఆనందమున్నది"** అన్నాడు. ఈనాటి సాధకులు కేవలం గ్రంథ పరిచయాన్ని పెంచుకుంటూ కాలమును వ్యర్థం చేసుకుంటున్నారేగాని, ఆచరణలో ప్రవేవించి జీవితాన్ని సార్థకం గావించుకునే ప్రయత్నం చేయటం లేదు.

"శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మనివేదనం"

ఇందులో ఏ ఒక్కటైనా నిత్యజీవితంలో ఆచరణలో పెట్టి అనుభవించడానికి ప్రయత్నించాలి. ఈనాటి మానవుడు మంచిని వింటున్నాడు, మంచిని చెపుతున్నాడుగాని, మంచిని చేసి చూపించటం లేదు. **మానవునిలో త్రికరణ శుద్ధి లోపించింది.** అయితే, మంచివారు కూడా లేకపోలేదు. "జగతియందు పుణ్యపురుషులు లేకున్న జగము లెట్లు వెలుగు పగలుగాను?" కనుక, మంచివారు కూడా ఉన్నారు.

కానీ, ఈనాడు సమాజంలో మంచివారికి విలువ లేకుండాపోయింది.

(స.సా.మే 99 పు. 128/129)

తెలుసుకొనుట అనగా జ్ఞానమును సంపాదించుకొనుట. మానవుడు తన నిజస్వరూపమును మరచి, దేహేంద్రియాదులనే తానని భావించి వాటికి కావలసిన విషయ భోగములు తనకు కావలసిన వాటిని సంపాదించుకొంటే ఆనందము కలగదు. ఆనందానికి బదులు అనర్థములే కలుగుచుండును. విషయభోగములు దుఃఖ పర్యవసానములుగనే ఫలించుచున్నవి. ఇట్టి మానవునకు సరియైన ఆనందమార్గము కావలసియున్నది. ఆనందము ఎచట లభించును? ఇది బయట వస్తువులలో లేదు. బయటవస్తువుల యందలి ఆనందము విపరీత ఫలము నిచ్చును. ఆనందము నీ స్వరూపమే అన్న సత్యమును తెలుపుచున్నవి. **బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, గీత, జ్ఞానప్రాప్తికి ప్రస్థాన త్రయములు.** త్రిమూర్తి స్వరూపముల బ్రహ్మసూత్రములను అర్థము చేసుకొనుట కఠినమైన విషయము. ఇది అధికార పురుషులకు తప్ప అన్యులకందునది కాదు. **అధికార పురుషులనగా సాధన చతుష్టయసంపన్నులు.** అట్టి వారికిది కరతలామలకము. **మానవుడు తనను తాను ఉద్ధరించుకొనవలెనన్న మొదట సాధన చతుష్టయమును సాధించి తీరవలెను.**

ఈ బ్రహ్మసూత్రము శారీరక శాస్త్రమనియు, వేదాంత దర్శన మనియు చెప్పబడుచున్నది. అంటే శరీర సంబంధితమైన ఆత్మ, జీవుడు, ఇంద్రియాది భూతాలను గూర్చిన శ్రేష్ఠమైన పరిశీలన జరుపుట. అనగా బ్రహ్మమే శరీర ఇంద్రియాలకు ఆధారమని గుర్తించుట. ఏతావాతా ఆనంద ఘనమే నీ స్వరూపమని తెలుపుకొనుట.

(సూ.వా.పు.2,3)

మానవుని స్వభావము స్వరూపము ఆనందమే. అతను సుఖ స్వరూపుడు. తన స్వభావమైన ఆనందమును సుఖమును ఆశించుటకు అతని అధికారమున్నది.

(బృ.త్ర.పు ౧౧౪)

స్వాతంత్ర్యమునకు సంబంధించినది ఆనందమే. ఆనందము ఏవిధముగా లభిస్తుంది? దేహముచేత, మనసుచేత లభిస్తుందా? కాదు. ఈ దేహ మనస్సులచేత లభించే ఆనందము తాత్కాలికమైనట్టిది. ఇలాంటి ఆనందము నిమిత్తమై మానవుడు సృష్టింపబడలేదు. **శాశ్వతానందమును అనుభవించే నిమిత్తమై మానవుడు తానే తన రూపాన్ని ధరించుకున్నాడు. ఇది అంతయు దైవ సంకల్పమే.** నీకు నీవు ఏకార్యమును ప్రయత్నముతో సాధింపలేవు. మానవుని ప్రయత్నముచేత సాధింపబడని కార్యములు ఎన్ని లేవు? ఏ ప్రయత్నము చేయక పోయినప్పటికిని ఫలించే కార్యములు ఎన్ని లేవు? **ఇది నేను సాధించాననే కర్తృత్వ భోక్తృత్వానికి మూలకారణము అహంకారము. ఆనందము నీ స్వరూపము. నీవే ఆనంద స్వరూపుడవు.** ఐతే నీ ఆనందాన్ని నీవు గుర్తించలేక పోతున్నావు. రాగద్వేషములచేత అహంకార, మమకారములచేత అనుమాన ఆహ్లాదములచేత, ఈ ఆనందము కప్పబడి వుంటుండాది. రాగద్వేషములు దట్టమైన బట్టలు. ఇవియే మన ఆనందాన్ని అడ్డుపరుస్తున్నాయి. ఈ రాగద్వేషములను దూరం గావించుకున్నప్పుడు మన స్వస్వరూపాన్ని మనం దర్శించగలము. **మనమే ఆనందమై తిరిగి ఆనందాన్ని తెలుసుకొనుటకై ప్రయత్నిస్తున్నాము. ఇది ఎంత వెఱ్ఱితనము.** తనయందే సర్వము ఉండినప్పటికిని విషయ వాంఛలచేత దృశ్య కల్పిత జగత్తునందు అనేక రకములైన వాంఛలను అనుభవించటానికి ప్రయత్నిస్తున్నాము.

"కోరిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ పెరిటి పుష్పమునకై ప్రీతియేల.
అడిగిన పాలిచ్చు కామధేనువే వుండ ధనమిచ్చి ఆవును కొనగనేల,
మెండగు కాంతితో మేరు పర్వతముండ వెండి బంగారుకై వెతకనేల"

సర్వము తానై యుండగ ఈ అల్పమైన విషయాలకు మనం ఎందుకు ఆరాటపడుతున్నాము. తానే ఆనంద స్వరూపుడనే సత్యాన్ని తెలియకపోవటం చేతనే.

(బృ.త్ర.పు ౧౬౨)

The secret of happiness is not in doing what one likes; but in liking what one has to do.

ఆనందము పొందుగకు మార్గము, తాను చేయవలసినపనిని ప్రేమతో చేయుటగాని, తన కిష్టమైనపనిని ప్రేమతో చేయుటకాదు. ఆవిధమైన ప్రేమను ఆధారముగా చేసుకొని, తన ప్రభువైన రామచంద్రుని ఆజ్ఞలను శిరసావహించినవాడు హనుమంతుడు.

(ఆ.రా.పు.209)

యోగియైన మరిభోగియైన సంసారియైన సన్యాసియైననూ శాంతము సత్యము ననుభవించితే ఆనందమె ఆనందమానందము.

(భ.ప్ర.పు.42)

ఆనందము లౌకికంగా కూడా ప్రతి జీవియొక్క స్వభావము కనుకనే ఆనందమును ప్రతి మానవుడూ కోరుచున్నాడు. ఇట్టి ఆనంద నిమిత్తమై జీవులు యెన్నింటినో త్యాగము చేయుచున్నారు. అయితే ఆనందమును బాహ్యవస్తువుల యందు వెదుకుట ఒక అజ్ఞానము. **"సర్వం పరవశం దుఃఖం, సర్వ ఆత్మవశం సుఖం"** సూక్తి ననుసరించి బాహ్యవస్తువులపై తన సుఖము ఆధారపడియున్నదని భావించినపుడు ఆ జీవుడు పరవశమై వుండును. తన సుఖమునకు దృశ్యవస్తువులు ప్రధానమని తలంచి, తాను వస్తువులకు వశుడై, లేని దుఃఖమును అనుభవిస్తాడు. అనేక అశాంతులకు గురి అవుతాడు. కనుక ఆనంద ప్రాప్తికై బాహ్య వస్తువులను బాహ్యక్రియలను ఆశ్రయించుట సరియైన మార్గము కాదు. ఇది దుఃఖమునకు దారి. నిజమైన ఆనందమును కోరువాడు తన వాంఛలను ఆత్మ వశం చేయాలి. కావాలి. బాహ్య వస్తువులచే ఆనందమును వెదుకుట యెండమావులను ఆశ్రయించి, కడకు దాహము తీరక, ప్రాణమును కోల్పోవుట జరుగును.

(సూ.వా. పు.47/48)

(చూ॥ అజ్ఞానము యొక్క తత్త్వము. అద్వైత దర్శనము, అసూయ, ఆత్మవిశ్వాసము, ఆత్మస్వరూప స్వభావము, ఆశలు, ఏకత్వము, కర్తృత్వము, గమ్యస్థానము, గౌణశ్చేన్నాత్మ శబ్దాత్, చిత్తశుద్ధి, దివ్యప్రకటనలు, దేహభ్రాంతి, దైవము, పండితుడు, పర్వదినము, భగవత్ప్రేమ, మమకారము, మానుష్యత్వము, లైబ్రరీ, వసంతఋతువు, శాంతి)

ఆనంద స్వరూపుడు

జీవుని స్వయముగా సుఖ స్వభావుడు, ఆనంద స్వరూపుడు; వాడు దేహ స్వరూపమున లేడు. దేహము తాను కాడు. ఆత్మే తాను, ఆత్మకు సుఖం సహజము. ఆ కారణముచే దుఃఖమునకు తాను ఇష్టపడడు. ఆ సుఖమునకు ఆశ్చర్యము లేదు. లేనిది చూచినపుడే లోకమునకు ఆశ్చర్యము. నిత్యమూ చూచువాటిపై యెవ్వడూ ఆశ్చర్యము పొందడు. సహజమునకు విరుద్ధమయిన, అపుడు ఆశ్చర్యమునకు గురి అగును.

(గీ.పు. 129)

ఆపద్బంధువు

"శరీర మాద్యం ఖలు ధర్మ సాధనం" ఏది మన ధర్మము? సత్యమే మన ధర్మము, శాంతమే మన ధర్మము, ప్రేమయే మన ధర్మము తీపి లేనిదే చక్కెర కాదు. దహన శక్తి లేనిది నిప్పు కాదు. అదేవిధంగా ప్రేమ లేనివాడు మానవుడే కాదు. మానవుని యందు ప్రేమ ఉన్నది. కానీ దానిని భార్యాబిడ్డలపై, బంధుమిత్రులపై ప్రసరింపజేస్తున్నాడు. **ఆపద్బంధువైన భగవంతుణ్ణి విస్మరించి, లోకసంబంధమైన బంధువు లను విశ్వసిస్తున్నాడు మానవుడు.**

బంధువలందరు వాకిటిదాకను
వల్లకాటికిని వత్తురుగా
బంధమణచి నిను బాయని
ఆపద్బంధువు భగవన్నామమెరా!

మానవుడా! నీవు మానవత్వాన్ని ధరించినందుకు ఎంతో ధన్యత పొందాలి. **"జంతూనాం నరజన్మ దుర్లభం"**. మానవ జన్మ అతి దుర్లభమైనది ఇలాంటి జన్మ నెత్తినందుకు నీవొక ఆదర్శాన్ని అనుసరించి, అందరికీ అందించాలి. ప్రాపంచిక సంబంధమైన పనులను చేసుకో, తప్పు లేదు. కానీ చిత్తమునందు నివృత్తిని నింపుకో, నర్తకి నాట్యం చేసే సమయంలో చేతులు, కన్నులు త్రిప్పుతూ ఎన్ని విధాలుగా అభినయం సల్పి నప్పటికీ తాళం ఏమాత్రము తప్పకుండా నృత్యం చేస్తుంది. అదేవిధంగా,

అమ్నాయము

మానవుడు ఎన్ని పనులలో మునిగియున్నప్పటికీ దివ్యత్వాన్ని మరచిపోకూడదు. మాయను ఒక నర్తకితో పోల్చవచ్చు. ఆ 'నర్తకి' మనకు వశం కావాలంటే కీర్తన చేయాలి.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైన కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యే గతిరన్యథా.

(స.సా.మా. 99, పు.77)

ఈనాటి యువతీయువకులు ప్రేమ అంటే ఏమిటి, సత్యమంటే ఏమిటి, దైవమంటే ఏమిటి అని చక్కగా గుర్తించినప్పుడే మీ జీవితముకూడా రాజమార్గములో ప్రయాణమవుతుంది. ఏమిటి ఈ **నీటి బుడగ వంటి దేహమునకు,** పిచ్చికోతి వంటి మనస్సుకు ఏమి సంబంధముంటున్నది? ఏదో మన భ్రాంతి చేత యిన్ని అవస్థలకు గురైపోతున్నాము. ఈనాటి మానవుని మనస్సు ధనముపైనే Concentration చేస్తున్నది. ఏమి చేసినా ధనము. ఎక్కడికి పోయినా ధనము. ఎక్కడ చూచినా ధనము. ఈనాటి యువతీయువకులంతా విదేశములకు బయలుదేరిపోతున్నారు. ఎందుకోసం పోతున్నారు? ధనము కోసం పోతున్నారు. ధనము యిక్కడుండి సంపాదించుకోకూడదా! దనము కావలసినదే. అవసరమే. ఎంతవరకు కావాలి? మీరు బ్రతకటానికి ధనము కావాలి. ఈ దేశములో నీవు బ్రతకటానికి వీలులేదా! నారు పెట్టినవాడు నీరు పోయడా? **మితిమీరిన ధనము సంపాదించటము వలన suffering. రెండు చేతులిచ్చాడు. ఒక కడుపు యిచ్చాడు. రెండు చేతులతో నీవు పనిచేస్తే కడుపు నిండదా? ఇదే నీవు చేయవలసిన తపస్సు. hands in the society, head in the forest.అంతే గానీ శాంతిఅంటే ఎక్కడ చిక్కుతుంది?** దండిగా ధనము సంపాదించుకొని I am enjoying. Enjoy అంటే ఏమిటి? అన్ని సుఖములు పొందటమా enjoy అది కాదు. ఈ పదమునకు సరియైన అర్థము **తీసుకోవాలంటే enjoy ..enjoy** కథ చెప్పాడు. సాయినాథ్. రామ, కృష్ణ గోవింద, మాధవ పేర్లు పెట్టుకుంటున్నాడు నలుగురు కుమారులకు, అందరికి ఎక్కడ దూరమైపోతానేమోనని అందరికి షాపులు కట్టించాడు. కానీ కట్టకడపటికి ఏమైపోయింది? రాముడు వచ్చాడా, కృష్ణుడు వచ్చాడా, మాధవుడు వచ్చాడా, గోవిందుడు వచ్చాడా? ఎవరు పోలేదు. కట్టకడపటికి తానే పోయాడు. తాను సంపాదించిన ధనము గానీ, తాను సంపాదించిన గృహము గానీ ఏదీ తన వెంట రాలేదు.

బంధువులందరు వాకిటిదాకను
వల్లకాటికిని వత్తురుగాని
బంధమణచి నిను బాయని **ఆప**
ద్బంధువు భగవన్నామమెరా!
అదొక్కటే మన వెంట జంటగా - యింట ఉండేది.

శ్రీ.స. పు. 26-27)

అమ్నాయము

(చూ॥ వేదము)

ఆయుర్దాయము

(చూ॥మృత్యువు)

ఆయుర్వేదము

ఆనాటి వేదపురుషులంతా యేమీ తెలియని మూర్ఖులుగాను జ్ఞానములేని వారుగాను, సైన్సు తెలియని అమాయికులుగాను ఈనాటివారు భావిస్తున్నారు. వారు ఈనాటి సైన్సులో తెలిసిన దానికంటె మరింత అధికముగానే తెలిసినవారు. ఆనాటి హిరణ్యకశిపుడు గొప్ప సైంటిస్టు. ఆ సైంటిస్టు పొందినదాంట్లో వేయింట ఒక భాగము ఈనాటి సైంటిస్టు పొందలేదు. అతడు సముద్రము అడుగుభాగమున సంచరించినాడు. భూమినంతా శోధించినాడు. గగన మార్గములో సంచరించినాడు. ప్రతి అణువునందు పరిశోధనలు సలిపినాడు. పంచభూతములను హస్తగతము చేసుకున్నాడు. అంత తెలుసుకున్నప్పటికి తనను తాను తెలుసుకోలేకపోయాడు. ఆనాటి మహర్షుల తత్వము ఈ విధంగా కంపేర్ చేసుకోటానికి వీలుకాదు. ఒక్కొక్క

మహర్షి ఏ విధమైన తపస్సునాచరించి ఎంతటి 'దివ్యమైన' శక్తిని సాధిస్తూ వచ్చారు? ఆనాటి డాక్టర్సు అందరూ ఆపరేషన్స్ చేసినారు. ఎన్నిరకములైన ట్రైనింగులు పొందో, ఎన్ని దేశములకు వెళ్లో, ఎన్ని ప్రాణములు తీసో ఈనాటి వారు పెద్ద పెద్ద డాక్టర్సుగా తయారౌతున్నారు. ఎన్నిరకములైన ఉపకరణములనో తీసుకున్నారు. ఆనాటి శస్త్రచికిత్స వైద్యములో మహాప్రవీణుడైనవాడు భరద్వాజ మహర్షి. భరద్వాజ మహర్షి శస్త్రచికిత్సను చక్కగా చాలా సులభంగా ప్రపంచమున కందించినారు. ఇదియే ప్రకృతి చికిత్స; ఆయుర్వేదము. ఆయువునందించే వేదము ఆయుర్వేదము. ఐతే ఇది క్విక్‌గా పనిచేయటం లేదని మనం తొందరపడుతున్నాం. మనకు ఎప్పుడు ప్రతిదానికి క్విక్ రిజల్ట్ రావాలి. క్విక్ రిజల్ట్‌లో క్విక్ అనే దానికి విరుద్ధంగా రిజల్ట్‌వుంటుంది. ఈనాడు ఆంటీబయాటిక్సు మాత్రలు వచ్చేసినాయి. క్విక్ రిజల్ట్ కోసం రెండుమాత్రలు వేసుకుంటే టెంపరేచరు తగ్గిపోతుంది. కానీ తరువాత ఎక్కువ పెరుగుతుంటాది. దీని రియాక్షన్ అధికంగా మారుతున్నాయి. ఆనాటి తపశ్శక్తిలో ఈ రియాక్షన్, రిగ్రెషన్ అండ్ రీసౌండ్ ఏమాత్రం ఉండదు. అది తపశ్శక్తివల్ల జరిగేది. ఎన్నివేల మైళ్లలో వుండి తపస్సు చేస్తున్నప్పటికిని వారికి దూరదర్శనము ప్రాప్తించింది. ప్రకృతితో ముఖాముఖీగా సంభాషణ సల్పేవారు. కోట్లు ఖర్చుపెట్టి యంత్రాలు పంపించి మనము దూరదర్శనము, దూర శ్రవణము ఈనాడు అనుభవిస్తున్నాము. ఆనాడు ఒక్కపైస ఖర్చులేదు. మనస్సు పవిత్రమైన దివ్యత్వముగా మార్చుకోటం చేతనే ఇట్టి శక్తులంతా వారికి చేకూరుతూ వచ్చాయి.

(ఉ.బ.పు. 23/24)

ఆరాధన

నవరాత్రులందు దేవీ భాగవతము, రామాయణము, భారతము చదువుతుంటారు. **దుర్గ, లక్ష్మి, సరస్వతి అనే త్రిమూర్తులను ఆరాధన చేస్తుంటారు. ఈ త్రిమూర్తులు ఒక్క సత్యములోనే యిమిడిన వారు.** గాయత్రికి మూడు పేర్లున్నాయి. గాయత్రి, సావిత్రి, సరస్వతి. గాయత్రి ఇంద్రియములకు 'మాష్టరు'. సావిత్రి ప్రాణములకు మాష్టరు. సరస్వతి వాక్కునకు మాష్టరు. **వాగ్దేవతా స్వరూపిణి సరస్వతి, ప్రాణములకు అధిపతి సావిత్రి. ఇంద్రియముల కధిపతి గాయత్రి.** ఈ మూడూ ఒక్క సత్యమందే యిమిడి ఉన్నాయి. "ఓం భూర్ భువః సువః" భూర్ అనగా materialisation ఈ దేహములో అంతా matter ఉంటున్నది. మన వెంకట్రామన్ చెప్పారు. 'matter-energy గా మారుతుంది. energy matter గా మారుతుంది.' ఆయన (scientist) సైంటిస్టు కాబట్టి మీరు ఆయన చెప్పింది సత్యమనుకోవచ్చును. కానీ నా దృష్టిలో అదిసత్యము కాదు. matter, energy అని రెండు వేరులేవు. అంతా ఒక్కటే మేటరు ఎనర్జీ, ఎనర్జీ మేటరు. ఎనర్జీ లేక మేటరు లేదు. మేటరు లేక ఎనర్జీ లేదు. కనుక 'రెండు' అని చెప్పటం చాలా పొరపాటు. ఈ నవరాత్రి మహోత్సవములందు శక్తి పూజలు చేస్తున్నాం. శక్తి అనగా ఏమిటి? సత్యము, ధర్మము, శాంతి, క్షమ - ఇవన్నీ శక్తులే. వీటిని ఆరాధించి అనుసరించడమే శక్తియొక్క ఆరాధన.

(ద.య.స. 98 పు. 5/6)

పరమాత్మ ఆరాధన కుపయోగకరమైన ప్రధాన పరికరములు మూడున్నవి. ఆ పరికరములను భక్తుడు ముఖ్యముగా సాధించవలెను.

1. రాగద్వేషములతో దూషితముకానట్టి చిత్తము
2. అసత్యాదులతో దూషితముగానట్టి వాక్కు.
3. హింసాదులతో దూషితముగానట్టి కాయము.

సుఖమనునది శాంతి అనునది బాహ్యవస్తువులం దెచ్చటనులేదు. అది నీలోనే యున్నది. శాంతికొరకు ప్రపంచ విషయములందు వెదకుట పిచ్చి, తన అంతఃకరణయందూ ఆనందమైన స్మరణయందూ లభించును. మానవుడు ప్రపంచమును ఈవేళకాకున్న రేపటికయినా విడచిపోవలసినదే, కనుక తెలివి కలిగి అన్నిటిలోని సారమును తెలిసికొని స్థిరమైన సత్యమునూ ప్రియమైన పరమాత్మనూ పొందుటకు యేవి

ఆరుగుణములు

ఆటంకములుగా వచ్చునో అట్టివాటిని విమర్శించి అందులోని సత్యమును తీసుకొని మిగిలినవి వదలి పెట్టుడు. మానవునకు ప్రపంచ ఆశలున్నంత వరకూ దుఃఖము తప్పదు.

మూర్తిపూజ

ఎక్కువమంది మూర్తిపూజలపై దాడివెడలుదురు. మూర్తిపూజ అనగా ఒక చిన్న వస్తువులో బ్రహ్మాండమును దర్శించుశక్తియే. ఇది ఊహాభావముకాదు అనుభవసిద్ధమే. విరాట్స్వరూపములో యేమున్నదో అది అంతయూ ఒక చిన్న స్వరూపమందు కూడా వున్నది. కావ్యములో ఉపమానములు దృష్టాంతములూ మొదలైన వానికున్న ఆధారములే మూర్తిపూజకున్నవి.

(ప్రే.వా.పు. 12/13)

(చూ॥ దేవాలయం, దైవారాధన, పరికరములు, ప్రసన్నుడు, భగవదన్వేషణ, హిరణ్యగర్భతత్త్వం)

ఆరుగుణములు

ఆత్మ స్వరూపుడైనా పరమాత్మకు సహితము అరుగుణములు కలవు. అవియే **పరిపూర్ణ జ్ఞానము, వైరాగ్యము, సౌందర్యము, ఐశ్వర్యము, కీర్తి, శ్రీ,** ఈ గుణస్వరూపుడు సత్ (సంపూర్ణస్థితి) చిత్ (పరిపూర్ణ జ్ఞానము), ఆనందము (పరిపూర్ణానందము), ఇవి కేవలము భూత ప్రేత పిశాచులకు సంబందించినవి కాదు. పవిత్రులైన మానవులకు సంబంధించినవి కాన ఇట్టి సత్, చిత్, ఆనందస్వరూపుని చూడగోరుట సర్వ మానవకోటికి సమాన హక్కు. అదియే వాని విధ్యుక్త ధర్మము.

(ధ్యా. వా. పు.30)

ఆరుదుర్గుణములు

(చూ॥ మంచితనము)

ఆరోగ్య అనారోగ్యములు

ఆరోగ్య అనారోగ్యములకు మనస్సే కారణము. మానవుని భావమే ప్రధానము. దానిని గురించి ఆలోచించునది కూడా అతడే. కావున రోగ నివారణకు కావలసిన మనోబలము, విశ్వాసము అతని యందే ఉద్భవించాలి.

(శ్రీ.స.ది.వీ.పు.24)

మానవుడి ఆరోగ్యానికి అనారోగ్యానికి మనస్సే కారణం. వ్యాధి నివారణ కావాలంటే గాఢమైన విశ్వాసం మనస్సులో నాటుకోవాలి. వ్యాధిని నివారించుకోగలను అనే సంకల్పమునూ, విశ్వాసమునూ రోగి మనస్సులో నేను ప్రతిష్టిస్తాను. అపారమైన నా ప్రేమ అనుగుణంగా భక్తుని హృదయంలో గాఢమైన విశ్వాసం నెల్పుకొనగలదు. అప్పుడు ఆశించిన ఫలితం లభిస్తుంది.

(స.ప్ర.పు. 19)

ఆరోగ్యము

ఆహార విహారముల వలన ఆరోగ్యము చెడునని వైద్యులందరూ హెచ్చరించుచున్నారే కాని, ఆహార మంటే ఏమిటో వారు విశదముగా తెలుపరు. పంచేంద్రియముల ద్వారా అనుభవించే, అందుకొనే, అన్నియూ ఆహారములే. నోటితో స్వీకరించినదానిని మాత్రము ఆహారమందురు; **అయితే, చూచే చూపు, వినే విషయములు, తీసుకొనే వాసనలు, అనుభవించే స్పర్శములు, అన్నియూ ఆహారములే. అవి కూడా దేహారోగ్యమున కు మూలకారణములే!** కొన్ని దృశ్యములను చూచినపుడు కడుపు త్రిప్పినట్లు వాంతి వచ్చును; కొన్ని విషయములను విన్నప్పుడు తక్షణమే షాక్ కొట్టినట్లయి మనిషిపడిపోతాడు: వాసనలు, స్పర్శములు, వీటివలన అజీర్తి బయలుదేరును అని డాక్టర్లు చెప్పుచున్నారు. ఆరోగ్యవంతమైన దేహము ఆరోగ్యవంతమైన మనస్సుకు యెంత ముఖ్యమో, ఆరోగ్య వంతమైన మనస్సు కూడ దేహారోగ్యమునకు అంత ముఖ్యము. ఆహారములు నోటికి రుచికరముగానూ సంతృప్తి సంతోషములను కలుగజేయునట్టివిగానూ వుండవలెను;

అతి కారముగానూ అతి ఉప్పుగానూ వుండకూడదు. దేహమును ఎందు నిమిత్తమూ భగవంతుడు అనుగ్రహించినాడో సదా గమనించుకొనవలెను; జీవిత లక్ష్యాన్ని మరువక, జాగ్రత్తగా గట్టు చేరువరకూ దానిని పోషించి పరిపాలించుకొనవలెను. రాజసతామస ఆహారములకన్న, సాత్వికాహారమే సాధకుల కత్యగత్యము. సృష్టి రహస్యము అతి విచిత్రమైనది. గోచరించు పదార్థముల మంచి చెడ్డలను మాత్రము మానవులు నిర్ణయించుకొనగలుగుచున్నారు. కానీ, అగోచరమైన వాటియొక్క గుణదోషములను నిర్ణయించజాలక పోవుచున్నారు. ఒక విషయమును మీరు ముఖ్యముగా తెలుసుకొనవలెను; ప్రతి పదార్థము నుంచి కూడ, అతి సూక్ష్మమైన రేణువులు అణువులు అలల రూపములో యెల్ల కాలములందు బయలుదేరుతూ వుంటాయి. ఒక సూది మొనయంత చిన్న బిందురూపమునుండి కొన్ని లక్షల అణువులు బయలు దేరును; ఇవి అతి సూక్ష్మములు కాబట్టి, చూడలేక పోతున్నారు.

ఒక కర్పూరపు ముక్కను ఒక డబ్బాలో పెట్టి, మూత వేసినా కూడ, కొంత కాలమునకు అది పూర్తిగా శూన్యమగును, కదా? దీనికి కారణమేమి? దానినుంచి సతతము ధారావాహినిగా బయలుదేరు చున్న అణువులే దాని నాశనమునకు కారణమయ్యెను. పరుల దేహములనుంచి వెలువడే అణురేణువులు గాలిలో చేరి, మీరు పీల్చుకొనే గాలితో మీ దేహములందు ప్రవేశించును. మీ దేహమునుండి కూడ అదే విధముగా, లక్షలాది అణురేణువులు బయలుదేరుచున్నవి. ఈ రీతిగా విసర్జించటము స్వీకరించటము అనే రెండు క్రియలను అందరూ ఎల్లప్పుడూ చేయుచుందురు. దేహముయొక్క పటుత్వము ఆరోగ్యము క్షీణించుటకు తరుగుటకు పెరుగుటకు అన్నిటికీ ఈ రెండు క్రియలే మూలకారణములు.

మలమూత్ర విసర్జనము దంత ధావనము స్నానాదులు, వీటివలన కొన్ని ప్రదేశములందు రోగముల నభివృద్ధిజేయు రేణువులు అధికముగా అభివృద్ధియగును. అక్కడంతా కోట్లకొలది రేణువు లుద్భవించి, ఆ ప్రదేశములలో తిరుగువారియందు ప్రవేశించి వారి ఆరోగ్యమును క్షీణింపజేయును. ఇటువంటి మలిన ప్రదేశములు, మురికి నీరు ప్రవహించే స్థలములు. అనారోగ్యమునకు పుట్టినిళ్ళుగా వుండును.

ఈ రేణువులను నిరోధించుటకై పూర్వ కాలమందు ఐదు రకముల స్నానములను నియమించినారు. మొదటిది, మృత్తికాస్నాము. మట్టిని దేహమంతా పూసుకొని, తరువాత స్నానమాచరించిన, అణువులన్నీ దానితోనే ధ్వంసమై దేహము పరిశుద్ధమగును దానికే **"మృత్తికే హర మే పాపం" అనే ప్రార్థన కూడ బయలుదేరినది. రెండవది** : ఆతప స్నానము; దీనిని ... అంటారు. ఇది సూర్యకిరణములను దేహమందు సర్వత్రా ప్రసరింపజేయును. సూర్యుని ప్రకాశము క్రూరమైన రేణువులు ధ్వంసమగుటకు బాగా సహాయమొసగును. **మూడవది** : వారి (నీటితో) స్నానము : పైభాగమునందు చేరిన రేణువులు లోపలి ఉద్భవించే రేణువులు రెండూ పుణ్య తీర్థములందు భక్తి భావముతో స్నానమాచరించుట వలన మాయమగును. **నాల్గవది** : వాయుస్నానము : చల్లని గాలి దేహముపై వీచటము వలన రేణువులు నశించటానికి సహాయకారిగా వుంటుంది. **ఐదవది** : నగ్నస్నానము : దేహంతా విభూతి రాసుకొనిన, ఆ విభూతితోనే ఆరోగ్యమును చెడిపే అణురేణువులు వదలిపోయి ఆరోగ్యము రక్షింపబడునని ఋషులు బోధించినారు.

ప్రాచీనకాలమందు ఋషులు శౌచమునాచరించి నిత్యము స్నానమును చక్కగా చేసేవారు! దీనిని ఈ నాటి విద్యావంతులు అనాగరికమని హేళన గావించుచున్నారు. ప్రాచీనులు తమ నెవ్వరైనా ముట్టినప్పుడు, యేదైనా తాకినప్పుడు స్నానమాచరించి దేహ నైర్మల్యమును మనశ్శాంతిని సంపాదించేవారు! **"మడి"** అనే సంప్రదాయము కూడ ఆరోగ్యము నిమిత్తమై చేసే కర్మ

కాని వేరు కాదు. వీరిని ఆధునికులు హేళన చేయు సమయమున, శౌచవాదులు ఎదిరించి, సమర్థించుటకు దురదృష్ట వశమున అసమర్థులై పోవుచున్నారు. వారు కూడ కేవలము బాహ్యమునందు మాత్రమే 'మడి' ని ఆచరించుచున్నారే కాని, దాని ఉద్దేశమేమిటి, ఫలితమేమిటి, సక్రమముగా దానిని పాలించు విధానమేమిటి అని నిర్ణయించుటకు వారు అసమర్థులు! అయితే, పూర్వీకుల ఆచారములందు అంతరార్థము లేకపోలేదు. పురుషాయస్సు ఎంత కాలమో అంత కాలము జీవించి, తమ ఆశలు ఆశయములు అన్నింటినీ పూర్తి గావించుకొనుటకు వీలుండవలెననునదే వారి వాంఛ! **ఆహార విహారములలో చక్కని మార్గము ననుసరించితే ఆయుస్సు వృద్ధియగును,** శాంతి సంతోషములు చేకూరును అని వారు నిశ్చయించుకొనిరి. పరాధీనములో పడక, ఆయుష్కాలమంతా సుఖ సంతోష సంతృప్తులతో గడిపి, అనాయాసముగా మరణమును పొందుటకు ఋషులు యుక్తాహార విహారములను విధించిరి. ఆహార పదార్థములందున్న స్థూలభాగము మలముగా విసర్జింపబడును; వాటి యొక్క సూక్ష్మభాగము మాంసము కండరములు రక్తము మొదలగు పదార్థములుగా మారును. సూక్ష్మాతి సూక్ష్మమైన కారణ భాగము మనస్సును తీర్చిదిద్ది, భావములలోని మంచి చెడ్డలను నిర్ణయించును. **దీనివలననే, పెద్దలు ఆహారము వలన ఆరోగ్యము ఆరోగ్యమువలన ఆధ్యాత్మికాభిరుచి, అభిరుచివలన సాధన, సాధనవలన సంకల్పము, సంకల్పమువలన ఫలసిద్ధి లభించునని ఘోషించిరి.**

అయితే, ఈనాడు మలినాహారము వలన, మలిన మనస్సులు అభివృద్ధియగుచున్నవి! కాలముయొక్క మహాత్మ్యమేమిటో కానీ, శౌచాదులను వర్జించి మాలిన్యమును భుజించి, మలిన మనస్సులతో తాము బాధపడి, ఇతరులకు బాధనందించుచున్నారు; దంత ధావనము స్నానము వీటిని కూడ విసర్జించినారు. **దేహముయొక్క సింహద్వారమే నోరు! ఆ సింహద్వారమే మలినముగా నుండిన అచ్చట నివసించే వారి గతి ఏమిటి? ఇట్టివారలను విద్యావిహీనులనే చెప్పవలెను.** మలిన భాష, మలిన అభ్యాసములు, మలిన చర్యలు, మలిన చింతనలు వీటిలో పడినవారి సాంగత్యము చేయక, వారినుండి దూరముగా వుండుటయే మంచిది. వారు ధనములో కోటీశ్వరులుగా వుండిననూ గుణమున కూటికి పేదలతో సమానమే, వారిని సమీపించినచో, మీ ఆరోగ్యము చెడును, మీ బుద్ధులు పాడగును.

ఆరోగ్యమునకు ఆహారమెంత ప్రధానమో, దేహ పరిశుభ్రత కూడ అంత ప్రధానము. పూర్వ కాలమందు ఋషులు యోగులు మహా పరిత్యాగులుగా వుండి, దేహ బుద్ధి లేక ఇంద్రియ నిగ్రహముతో తపము నాచరించుట వలన వారి ఆరోగ్యము ఆయువు అభివృద్ధి చెందినవని తెలుసుకొనలేక, వారిని అనుకరించి దేహముయొక్క పరిశుభ్రతను గమనించక కొందరు సాధకులు మెలగుచున్నారు. అయితే అనుకరణమునకు కూడ అధికారముండవలెను. బలహీన హృదయులకు అనుకరణ అపాయము కలిగించును. శాశ్వతమైన సమచిత్తమును సంపాదించి తదుపరి ఋషులను అనుసరించుటకు పూనుకొనిన మంచిది, కానీ స్వార్థమును అభిలషించి, నేను చేయుటలో తప్పేమియున్నది? వారు చేయలేదా? వీరు చేయలేదా? అనుటలో వెర్రి తనమే కనబడుచున్నది. మీ బుద్ధియొక్క తప్పొప్పులను పరీక్షించుకొనక, ఈశ్వరుడు విషము త్రాగినాడని మీరు కూడ త్రాగితే ఫలితము తెలిసియేయున్నది. సామాన్య జనులు ధ్యాన సాధనల వలననే విజయమును సాధించవలసియున్నది. **దేహమును నిర్లక్ష్యపరచుట కూడ చాలా పొరపాటు, ఏరు దాటిన పిమ్మట తెప్పను తగులవేయవచ్చు. కానీ, గట్టు చేరు వరకు దానికి తగిన విలువనిచ్చే తీరవలెను. జీవుడు వచ్చినది దేవుని కొరకే కాని డాక్టర్ల కొరకు కాదు! డాక్టర్లకు దాసుడై వారినాశ్రయించక, ఆరోగ్యవంతుడై ఆనందము ననుభవించుటకు పట్టుదల ఉండవలెను. దేహమనునది పండుపై నున్న తోలు; దానిలోని గుజ్జు మనస్సు; మాలిన్యము తినుటకు వీలులేక పారవేసే విత్తనము;**

ఆనందమే పండులోని రసము! బాహ్యము కూడ ఆకర్షణీయముగా నుండవలెను. వర్ణము చూచి ఫలమును ఆశించుచున్నాము. రుచిని భావించి తరువాత ఆశించుచున్నాము; దేహమును సత్ భావములు సత్ చింతనలనే అందముగా వుంచుకొనవలెను. విశ్వమందు కర్మ; విశ్వేశ్వరునియందు భావములు, ఈ రీతిగా మానవుడు నిత్య జీవన యాత్రను సాగించుచున్నాడా అని పరమాత్ముడు వేయి కన్నులతో చూచుచుంటాడు. **పూర్వము మనుష్యులు ప్రకృతి సంబంధమైన మందులు, చికిత్స, ఉపశాంతి, వీటితోనే ఆరోగ్యమును రక్షించుకొనువారు! ~~ఈ~~ నాడు మందులూ మాత్రలు ఇంజక్షన్‌లు ఆపరేషన్‌లు యెక్కువ అయినాయి. అయితే, వీటివలననే రోగము కుదిరి జబ్బు నయమయినది అని భావించిన అది పిచ్చి భ్రాంతి! డాక్టర్ల వలన, మందుల వలన, ఆరోగ్యము పిద్దించును అనునది నిజమయినచో, గతించిన వారందరూ జీవించియే యుందురు!** పోనీ, ఎదురు, వారలకు ~~ఈ~~ డాక్టర్లు వుపదేశించు రీతిగానైనా వారు ఆచరించుచున్నారా; లేదు! దేనివలన ఆరోగ్యము చెడనని వారు ఇతరులకు బోధించుచున్నారో, ఆ దురభ్యాసములన్ని వారిలోనే ప్రబలముగా పెరిగి, వారి చర్యలు హాస్యాస్పదముగా తయారైనవి. మత్తు పదార్థము సేవించిన అతి త్వరగా మనోలము దేహబలము చెడును అని బోధించు వారూ డాక్టర్లే! కానీ, వాటిని వుపయోగించు వారిలో వారే యెక్కువ! ఆహార విహార పద్ధతులలో డాక్టర్లే పెడమార్గమును పట్టము వలన, వారు సరైన మార్గదర్శకులు కారనే నిందలకు పాత్రులగుచున్నారు! **~~ఈనాడు~~ దైవిక క్షేత్రములో, ఆధ్యాత్మిక క్షేత్రములో, లౌకిక క్షేత్రములో కూడ, మార్గదర్శకులైన నాయకులు లేరు; దేశముయొక్క శోచనీయ పరిస్థితికి ఇదియే మూలకారణము.** చెప్పునదొకటి. చేయునది యొక్కటి, అన్నట్లు మాట్లాడే వారు యెక్కువైనారు కానీ ఆచరణలో శూన్యముగా నున్నది;

దివ్యాత్మ స్వరూపులారా! భగవద్దత్తమైన మన జీవితమును, జన్మాంతర పుణ్యవిశేషము వలన దొరికిన **~~ఈ~~ దేహమును. భోగభాగ్యముల నిమిత్తమని తలంచి వ్యర్థము చేయుక, యోగత్యాగములకే వినియోగించి సార్థకతను పొందండి, పరులమెప్పుకొరకు పని చేయకూడదు; ఆత్మ తృప్తికై ప్రాకులాడాలి!** ఇతరుల కర్పణము కాదు ముఖ్యము; ఆత్మార్పణము గావించుకోవలెను. **ఆత్మతృప్తి అనునది ప్రారంభస్థితిలో లక్ష్యము కావచ్చు; అయితే, గమ్యస్థానము మాత్రము ఆత్మదర్శనము అని జ్ఞప్తియందుంచుకొనవలెను.** మధ్య మధ్య వచ్చి అడ్డు పడుచున్న కష్టనష్టములు నిందానిష్ఠూరములు కేవలముప్రధానము. ఆత్మను కోరి నా తనను పరమాత్ముని కోరినట్లే, కాబట్టి కోరటమే అనవసరము. కావలసినదానినంతా, భగవంతుడే అందించును.

(స.సా.డి.74 పు. 298/300)

(చూ॥ ఆహారము, దివ్యప్రకటనలు, వసంత ఋతువు, రోగము, సీలింగ్ ఆన్ డిజైర్స్)

ఆరోగ్యమే మహాభాగ్యము

"శరీరమాద్యం ఖలు ధర్మ సాధనమ్" ఈ శరీరం ధర్మాచరణ నిమిత్తమై అందించిన వరప్రసాదం. కనుక ~~ఈ~~ శరీరమును పవిత్రమైన కర్మలచేత పవిత్రం గావించుకోవాలి. ~~ఈ~~ శరీరమునకు ఆరోగ్యం పునాదివంటిది. **~~ఈ~~ ఆరోగ్యమును కోల్పోయిన యెడల మనం అనేకవిధములైన బాధలకు గురికావల్సివస్తుంది.** మానవజీవితంలో ఆరోగ్యమునకు మించిన మహాభాగ్యం మరొకటి లేదు. అన్ని అంగములు చేరికే ~~ఈ~~ శరీరము. కనుక పరిపూర్ణమైనటువంటి ~~ఈ~~ శరీరమును పవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. ప్రతి అంగమును పవిత్రమైన కర్మములో ప్రవేశపెట్టాలి. అప్పుడే ~~ఈ~~ శరీరము పుష్టిని సంతుష్టిని అందుకుంటుంది. శరీరము ఆరోగ్యముగా లేకుండిన మనసు ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉండదు. **ఆరోగ్యమైన దేహము నందే ఆరోగ్యమైన మనసుకూడా ఉంటుంది. ఆరోగ్య శరీర మనసుల యొక్క పరిస్థితిని పురస్కరించు కొనియే ఆత్మ తనవ్యక్తిత్వాన్ని పోషించుకుంటుంది. కనుక మానవ శరీరము సర్వ ధర్మములకు, సర్వకర్మలకు మూలాధారం. 'ధర్మ అర్థ**

ఆర్తి

కామమోక్షాణాం ఆరోగ్యం మూలముత్తమమ్' ధర్మ అర్థకామమోక్షములనే పురుషార్థములకు కూడా ఆరోగ్యమే ప్రధానమైన పునాది. కనుక నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక లౌకిక మార్గములలో ఈ శరీరమును ప్రవేశ పెట్టటానికి ముందుగా ఆరోగ్యమును కాపాడుకోవాలి.

అసలు ఈ ఆరోగ్యము చెడటానికి మూలకారణములను మనం విచారించాలి. అమితమైన ఆలోచనల చేతనూ, అమితమైన చింతలచేతనూ, అమిత మైన చదువుల చేతనూ - ఈ ఆరోగ్యమును మనం కోల్పోతున్నాం. అధికంగా చదవటంచేతనూ ఆరోగ్యం దెబ్బతింటుంది. **ప్రతిదానికి ఒక నియమం ఉంటుండాలి. ప్రతికర్మకు ఒక పరిమితం ఉంటుండాలి.**

గ్రీసు వేదాంతి అరిస్టాటిల్ జీర్ణకోశము మీద అనేక పరిశోధనలు చేస్తూవచ్చాడు. నిరంతర పరిశోధనల చేత, కట్టకడపటికి అతనికి కూడా ఆనారోగ్యం ఏర్పడి, అజీర్ణ వ్యాధికి గురియై మరణించాడు. అదే విధముగనే 'ఫెరిన్' అనే డాక్టర్ గుండెజబ్బుల మీద అనేక పరిశోధనలు చేస్తూ వచ్చాడు. కట్టకడపటికి గుండె వ్యాధి తోనే అతను మరణించాడు. కనుక మనం ఏవిషయము నందైనా అమితంగా విచారించ కూడదు. శరీరము కొన్ని పరిమితులతో ఏర్పడినటువంటిది. ఈ పరిమితిమై నటువంటి దేహమునకు పరిమితమైనటువంటి పనినే చెప్పాలి. పరిమితమైనటువంటి పనులుచేస్తూ పరిమితమైన ఆనందాన్ని పొందాలి.

ఈనాడు మానవతా విలువలను గురించి బాల బాలికలకు బోధిస్తున్నాం. కాని ఆ పిల్లల స్థితిగతులను విచారించి, వారికి బోధించటానికి ప్రయత్నం చేయాలి. బలహీనులైన బిడ్డలకు బలమైన విషయాలు అమితంగా వారిలో ప్రవేశపెట్టటానికి ప్రయత్నించకూడదు. మొట్టమొదట బలహీనులైన బిడ్డలను బలమైన వారిగా చేయటానికి కొన్ని ప్రయత్నములు చేయాలి. శారీరకంగా, మానసికంగా వారిని అభివృద్ధిచేయాలి. మొట్టమొదట వారికి Health is Wealth (ఆరోగ్యమే మహాభాగ్యము) ను గురించి బోధించాలి. తరువాతనే ఈ విద్యావిధానమును వారిలో ప్రవేశపెట్టాలి.

(శ్రీ. డి. 98 పుట.5)

ఆరోగ్యమును మనం కాపాడుకుంటే మానవతా విలువలను అది పోషిస్తుంది. ఏ అంగమూ ప్రధానం కాదు. అన్ని అంగముల ఏకత్వమే ఈ శరీరము. కనుక అన్ని అంగములయందు ఐకమత్యం అత్యవసరం.

(శ్రీ. డి. 98. పు.97)

(చూ॥ రోగం)

ఆర్తి

మీరు ఎప్పుడు ఎక్కడ ఆర్తిపొందుతారో అప్పుడు అక్కడ ఆ భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. ఆయన శరీరధారిగా అంటే సాకారముగా రావాలని మీరు తపించినట్లయితే ఆయన అదేవిధంగా వస్తాడు. మీ కోరికను అంగీకరించటానికి ఆయన ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. కాకపోతే మీరే ఆయనను మీ హృదయంలోకి ఆహ్వానించటానికి సిద్ధంగాలేరు. మీరు మీ హృదయంలోని అసూయ, ద్వేషము, అసహ్యములనే ముళ్ళను తొలగించి హృదయాన్ని పరిశుభ్రంగా ఉంచటంలేదు. **పాలు త్రాగినక పాపాయి ఏడుస్తుంటే బాధపడనవసరంలేదు. అది అరగటానికి చాలా మంచిది. అలాగే మీరు ఏడవండి, దాని వల్ల మీరు భగవంతుణ్ణి తెలిసికొనటం అనే ఆనందాన్ని అరిగించుకోగలుగుతారు.** ఆనంద బాష్పాలు పొంగి పొరలే విధంగా ఏడవండి. మీకు కన్నీటిని ఇచ్చింది ఇతరుల యెదుట **చేతులు జాపి దీనంగా ఏడవటానికి కాదు. కృతజ్ఞతా పూర్వకంగా భగవంతుని శ్రీచరణములపై ఆనంద బాష్పాలను విడవటం కోసం.**

(వ. 61-62 పు. 172)

ఆర్తుడు

(చూ॥ నన్ను చేరగోరువారు, భగవదాసక్తులు)

ఆర్యవాఙ్మయము

(చూ॥ భారతీయ మతము)

ఆర్ష

వేదము ఋషి యగుటయేకాక ఋషి ద్రష్ట అగుటచే ఇది ఆర్ష అని చెప్పబడినది. ఈ వేదమంత్ర జాతము ఆర్షయధీనమని ఋగ్వేదము స్వయముగా వివరించినది. ఇంతేకాదు. సకారన్త పదము వేద బ్రహ్మకు మరొక నామము. దానికే వేదః అనగా ధనము, జ్ఞానము లేక పరమైశ్వర్యము అని అర్థములు.

లౌకిక ధనము కంటె వేదమాతా ప్రసాదరూప మగునట్టి ధనమే విలక్షణమై పురుషార్థ సాధకమగును. దీనినే పరమైశ్వర్య జ్ఞానము అనికూడా అందురు. ఇది వేదరూప బ్రహ్మమును దర్శింపచేయును.

దీనినే వేదములో కూడా **'దేవా! నీవు వేద స్వరూపుడవు పశుపుత్రాది ధనముతో లేక పరమైశ్వర్యముతో, జ్ఞానముతో నన్ను నింపుము. అట్టి ధనముతో నేను తృప్తుడనగుదును. ఆ ధనము నీ కైంకర్యమునకు వినియోగింపబడినది అగుటచే నీవునూ తృప్తుడగుదువు' అని ప్రార్థించిరి వేదఋషులు.**

(లి.వా. పు. 16, 17)

(చూ॥ ప్రథమజా)

ఆలయములు

ఇటుకతో సున్నంతో కట్టిన - దేవాలయంలో రాతితో చేసిన విగ్రహంలో దివ్యత్వం చూడ దలచుకున్నారు మీరు. అంతకంటే సులభంగా నడిచే మనిషిలో దైవాన్ని చూడగలరు - **నరునిలో నారాయణుని చూడటం మొదటి మెట్టు - పిదప ఆలయంలో ప్రతిమలో దేవుని చూడగలరు.** మానవుని గౌరవించడమే దైవారాధనకు మొదటి మెట్టు- **మానవుడు ప్రత్యక్షం - దైవం పరోక్షం.**

(త.శ.మ.పు.147)

"సమాజంలో ప్రధానమైన ఆలయములు నాలుగు **1.విద్యాలయం 2.వైద్యాలయం 3.భోజనాలయం 4.దేవాలయం.** విద్యాలయంలో విద్యకు సంబందించిన విషయాలనే మాట్లాడుతాము. వైద్యాలయంలో ఆరోగ్యము, మందుల గురించే చర్చిస్తాము. భోజనాలయంలో తిండి ప్రసక్తి తప్ప మరొకటి ఉండదు. అదేవిధంగా, దేవాలయానికి వెళ్ళినప్పుడు జనం దైవానికి సంబంధించినవి మాత్రమే చర్చించాలి. కాని, దురదృష్టవశాత్తు ఈనాడు జనులు దేవాలయంలో దైవసంబంధమైన విషయాలు తప్ప అన్నింటినీ ఆలోచిస్తున్నారు. చర్చిస్తున్నారు. పూర్వం దేవాలయాల గోపురాలను ఎత్తుగా కట్టేవారు. ఎందుచేత? ఊరికే డబ్బులున్నాయనా? కాదు, కాదు. ఆగోపురాలను చూసినప్పుడల్లా ఊరిలోని జనులకు దైవం జ్ఞాపకం రావాలనే సదుద్దేశ్యంతోనే గోపురాలను ఎత్తుగా నిర్మించేవారు."

(స.సా.ఏ.96 పు.100/101)

(చూ॥ నాలుగు ఆలయాలు)

ఆలోచనలు

ఆలోచనలు, వాంఛలు ఒకటి కావు. ఎన్నో వాంఛలు కాని ఆలోచనలు ఉన్నాయి. విషయముల పట్ల గల ఆలోచనలు గాఢమయిన వాంఛలు తలయెత్తును. వాంఛ ఉన్నది అనిన దానికి పూర్వము ఆలోచన ఉన్నట్లే. కాని అన్ని ఆలోచనలు వాంఛలు కావు. కారు మేఘములు వర్షమును కురిపించును. కాని, వర్షము లేకపోయినా మేఘములుండవచ్చును. భగవదనుగ్రహము వర్షబిందువుల వంటిది. ఆ బిందువులన్నీ కూడినపుడు కుంభవృష్టి యగును. భగవంతుని పట్ల గాఢమైన వాంఛ ఉన్నట్లయిన చెడు తలపులు కలగినా కదలిపోవును, అంటిపెట్టుకొని ఉండవు. భగవంతుని వైపుకు మరల్చిన వాంఛ విచక్షణకు దారి తీయును. **బుద్ధి సూక్ష్మత యనగా వివేకము, మనస్సు కాదు, ఆలోచన కాదు. వివేకము నేరుగా ఆత్మశక్తియే.** ఆలోచనలను అడ్డగించుట వలన గాని, ఎదురించుట వలన గాని ప్రయోజనము లేదు. అణచివుంచిన బలహీనమైన క్షణములో బుట్టలో కప్పి ఉంచబడిన సర్పము, మూత వదులు అయినపుడు పైకిలేచునటుల, ఉవ్వెత్తున పైకి ఎగయును. భగవద్భావన పెంపొందించు

ఆవరణ

కొనుట ద్వారా, వివేకవంతులతో సద్భాషణ చేయుట ద్వారా, సత్కార్యములను చేపట్టుట ద్వారా, దురాలోచనలను, ఉద్వేగములను అధిగమించవచ్చును. సత్కార్యముల, సదాలోచనల ప్రభావము దురాలోచనలను అణగద్రొక్కును. మంచి, చెడు ఆలోచనలు, ఉద్వేగములు మానస క్షేత్రములో నాటుకున్న బీజములు. భూమిలో విత్తనములను బాగా లోతుగా నాటిన అవి మొలకెత్తలేవు. క్రుళ్ళి వ్యర్థమై పోవును. ఆ విధముగనే మంచి నడత, మంచి ఆలోచనలు, చెడు నడతను, చెడు ఆలోచనలను పూడ్చి వేయును. అవి ఇంక మొలకెత్తలేవు.

ఆలోచనలు సంకటములుగా తయారయినపుడు, నేను **"ఇది నీ మనస్సు, స్వామి, నాది కాదు" అని అనుకొనుటతో ఆ ఆలోచనా ప్రవాహము ఆగిపోతున్నది.**

అది మంచి పద్ధతే. సులభ మార్గము కూడా. ఆ క్షణములో నీవు అహంకారమునకు చోటివ్వడము లేదు.

(ప.ప్ర.పు.96/97)

ఆవరణ

ఇంక ఆవరణము. అద్దముపైన దట్టమైన బట్టను కప్పినప్పుడు అందులో మన ప్రతిబింబము కనుపిస్తుందా? ఏమాత్రము కనుపించదు. మలముచేత స్వస్వరూపాన్ని మాలిన్యముగా చూస్తున్నాము. చంచలత్వము నేచర్ అనుకుంటున్నాము. నేను Human body కనుక యిది సహజమనుకుంటున్నాము. సమర్థించుకుంటున్నాము. విద్యార్థులారా! మనము చేసేది అనుభవించేది ఆనందించేది యివన్నీ Reflection, Reaction and Resound, Reality ఒకటి ఉంటున్నది. ఆ Reality ని మరిచిపోతున్నాము. Reaction అనుసరిస్తున్నాము. Re-sound ను వింటున్నాము. Reflection ను చూస్తున్నాము. ఈ అద్దము దట్టమైన బట్టతో మూయబడింది. **ఏ బట్ట? కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములనే అరిషడ్వర్గములనే బట్ట. ఇవి మానవ దేహమునకు కొంత సహజములే. అయినప్పటికి భుజబలమదము, ధనమదము, విద్యామదము కులమదము, ఐశ్వర్యమదము, సౌందర్యమదము, యౌవన మదము, తపోమదము ఇలాంటి అష్ట మదముల చేత ఈ అద్దము కప్పబడి వుంటున్నది.** ఈ బలము ఎంతవరకు వుంటుంది? చెప్పటానికి వీలు కాదు. మన యౌవనము ఎంతసేపు వుంటుంది? మించునట్టుగా ఒక్క నిమిషము లోపల మారిపోతుంది. మన విద్యా మదమా? నీకంటె గొప్ప విద్యావంతులు లోకములో ఎంతమంది లేరు? నీ విద్య వారి దానిలో ఎంత? ఇవన్నీ విచారణ చేస్తే మదమునకు ఏమాత్రము అవకాశము లేదు. ఇది భ్రాంతి; భ్రమ. "చదువుల్ నేర్చితి నంచు గర్వము వహించన్ రాదు, నీకున్న ఆ చదు వేపాటిది విద్యకున్ వినయమే స్వస్వరూపము". మానవుని యందు వినయము రావాలి. విద్యార్థులయందు వినయ విధేయతలు లేక పోవటంచేతనే మదము తలకెక్కుతున్నది. **ఈ అష్టమదములు మానవత్వమును మరుగుపరచే దుష్ట గుణములు.** ఈ మదములే మనస్సనే అద్దమును కప్పిపుచ్చినవి. ఈ దట్టమైన బట్టను తీసివేయాలనుకుంటే ప్రేమను పెంచుకోవాలి. ఈ ప్రేమనే ప్రథానము. అదే ప్రత్యక్ష పరమాత్మ. Love is God. Live in Love ఈ పవిత్రమైన ప్రేమచేతనే సర్వులను ఒక్క రీతిగా కట్టుకోవచ్చును.

(బృ.త్ర.పు 73)

ఆవేశము

(చూ॥ పంచభూతములు)

ఆశయం

(చూ॥ మాతృదేవోభవ)

ఆశలు

క్రమక్రమేణ కోరికలను తగ్గించుకుంటూ రావాలి. దీనినే వేదాంతమందు **వైరాగ్య మన్నారు. వైరాగ్యమంటే ఆలుబిడ్డలను వదలిపెట్టి అడవికి పోవటం కాదు. "భావమందు దుష్టభావంబు వీడుటే త్యాగమగును, అదయే యోగమగును"** కోరికలను ఎంత తగ్గించుకొంటావో

నీవు అంత ఆనందమును అనుభవిస్తావు. ఒక చిన్న ఉదాహరణ: నీవు దినానికి 20 సిగరెట్లు త్రాగుతున్నావనుకో, ఆరు పర్యాయములు టీ తీసుకుంటున్నావనుకో, సిగరెట్లు అధికంగా తీసుకోవడంచేత, టీ అధికంగా త్రాగడంచేత నీలో అశాంతి అభివృద్ధి అవుతున్నది. కనుక, ఒక్కొక్క దినము రెండు సిగరెట్లు, ఒక కప్పుటీ చొప్పున తగ్గించుకుంటూరా. ఈ విధంగా కోరికలను తగ్గించుకున్న కొద్దీ నీ మనస్సు ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. టీ కావాలంటే ఒకతూరి త్రాగు. అంతేగాని, ఇష్టం వచ్చినట్లు త్రాగితే నరాలు బలహీనమైపోతాయి. విచారణా శక్తి, జ్ఞాపకశక్తి కూడా తగ్గిపోతాయి. నీవు ఆశలను అమితంగా పెంచుకోవడం చేతనే ఆనందమును కోల్పోతున్నావు. **ఆశలను ఎంత తగ్గించుకుంటే ఆనందము అంత పెరిగిపోతుంది.** దైవం పట్ల రక్తిని ప్రపంచంపట్ల విరక్తిని పెంచుకోవాలి. కానీ ఈనాడు దైవప్రీతి తగ్గిపోతున్నది. మానవుడు పాపభీతి లేకుండా ప్రవర్తిస్తున్నాడు. ఎట్టి ఘోరకృత్యాని కైనా సిద్ధమవుతున్నాడు. ఇది మానవత్వం కాదు. పరులను హింసించకుండా, తాను హింసకు గురి కాకుండా జీవితాన్ని గడపాలి.

అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచన ద్వయం
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్.

అష్టాదశ పురాణములయొక్క సారమును వ్యాసుడు ఈ రెండు వచనములలో చెప్పాడు - **పరోపకారమే పుణ్యము. పర పీడనమే పాపము. కనుక .... (అందరికీ సహాయం చేయాలి. ఎవ్వరినీ బాధ పెట్టకూడదు.)**

(స.సా. అ.99 పు. 274/275)

(చూ॥ కాలము, దూరంగాఉంచు, మనసు)

ఆశ్రమములు

(చూ॥ అంత్యకాలము, మనవజీవితము)

ఆసక్తి

(చూ॥ తయారుగావుండు, శ్రద్ధ)

ఆస్తి

భగవంతుడు లేడంటే నువ్వు లేనట్లే. దేవుడు లేడనే వారుకూడా నేను వున్నాను అంటారు. అయితే వున్నాను అనే నేను ఎవరు? శారీరక మానసిక, పరిణామాలలో సుఖదుఃఖాలలో మార్పుచెందకుండావుండేది నేను. నేను అనేదే దైవం అని నమ్మండి. కళ్లతో చూస్తూ, నాలుకతో రుచిచూస్తూ కాళ్లతో కదులుతూ ఆలోచనతో తర్కిస్తూనే వున్నది ఆ నేను. ఇవి నావేకాని నేను వేరు అనే భావం నిరంతరమూ మెదలుతూవుంటుంది. నాస్తికలు కూడా ముందుగా ఆస్తి అని తరవాత నాస్తి అంటారు. న+ఆస్తి నాస్తి అవుతున్నది. ఆస్తిలేకుండా నాస్తి అనటానికి వీలులేదు. నేను అనేది ప్రత్యేకం కాదు. పరమాత్ముడనే సముద్రంలో ఒక తరంగం నేను అనే సంకుచిత భావంవల్ల భయమూ దురాశా నిండిన ప్రపంచంలో సంచరిస్తారు. నాయిల్లూ నావూరూ, నాకులం, నామండలం, నాభాష అనే చిక్కువలలో బిగిసిపోయి బైట పడలేరు.

(వ.1963 పు.164)

ఆస్తికుడు

ఒక ఆస్తికుడు దేవు డున్నా డంటాడు. 'There is God' నాస్తికుడైనటువంటి వాడు 'There is no God' అంటాడు. 'There is no God' అనే పదములలో ఉన్న అంతరార్థమును మనము చక్కగా సూక్ష్మబుద్ధితో విచారణచేస్తే, అందులోనే మనకు స్పష్టమవుతుంది. ఉన్నదానినే లేదని చెపుతున్నాడు కాని, లేనిదానిని లేదని చెప్పటములేదు. ఇక్కడ ఈ పదమును మనము చూచినపుడు 'There is' అని మొదట వచ్చినది. తరువాత 'No God' అని వస్తుంది. ఇంకా కొంతస్థాయి పైకిపోయినపుడు 'God is no where' అంటాడు నాస్తికత్వముతో ముదిరినటువంటి వాడు. 'God is no where' ఇక్కడ నాలుగు పదములు ఉన్నవి. ఇందలి where లోని 'W' ను, No కు చేర్చితే 'God is now here'

ఆస్పత్రులు

అవుతుంది.'No' కు 'W' దూరము చేస్తే 'No where' అవుతుంది. 'No'కు'W' దగ్గర చేస్తే
'Now here' అవుతుంది. ఇది words magic తప్ప సత్యము కానేరదు.

(ఆ.రా.పు. 53)

ఆస్తికుడనగా ప్రహ్లాదుని వంటివాడు. ఇది జన్మతో ప్రారంభమైన పవిత్రభావము. ఒకరి బోధనచేతగానీ, ఒకరి నిర్బంధముచేతగానీ ప్రారంభించినది గాదు. స్వాభావికమైన తత్వం చేత స్వరూపాన్ని దర్శించ గలిగాడు. ప్రహ్లాదుడు. హృదయవాసి అయిన పరమాత్ముని తాను నిరంతరము అనుభవిస్తూ వుండటము చేతనే ఆనందానికి గురి అయ్యాడు. అందువలననే అతనికి ప్రహ్లాదుడనే పేరు సార్థకమైంది. **ప్ర+హ్లాద=ప్రహ్లాద. నిరంతరము ఆనందముతో వుండేవాడు కనుక ప్రహ్లాద అని పేరు. హ్లాద మనగా ఆనందము. ఆహ్లాదమనగా ఆనందము. ప్ర అనగా వికాసము. ప్రపంచము అన్నారు. అనగా పంచభూతములతో కూడి ప్రకాశించేది ప్రపంచము అని. అదే విధముగా ప్రహ్లాద అనగా ఆనందముతో వికసించబడినవాడే ప్రహ్లాదుడు అని. నిరంతరము దైవచింతన చేయుటచేత మనలో ఆనందమనేది తేజరిల్లుతుంది. మన పర్చ్సే మారిపోతుంది. బ్రహ్మత్వముతో ఏకమైపోతుంది.**

(శ్రీ.స.గీ.పు.73)

ఆస్పత్రులు

(చూ॥ రోగవిముక్తుడు)

ఆహతధ్వని

(చూ॥ రూపనామములు)

ఆహారము

ఆహారమే అన్నిటికి మూలము. ఈ దేహము ఆహారము ద్వారా తయారవుతుంది. ఆరోగ్యము లేకపోయిన ఏ పని చేయాలన్నా కష్టమే. ఉదరమును నాలుగు భాగములుగా విభజింపవచ్చును. **అందు 1/4వ వంతు గాలి, 1/4వ వంతు ఆహారము, మిగిలిన సగము నీరు ఉండాలి.** ఈరోజులలో ఆహారమును అమితముగా తీసికొనడము జరుగుతున్నది. ఆ కారణముగా నీటికి చోటుండడము లేదు. భారతదేశములో వరి, గోదుమ ముఖ్య ఆహారము, మితంగా భుజించిన మంచిదే. కాని ఎక్కువగా భుజించి మందమతులవుతున్నారు. అమితాహారము బుద్ధి మాంద్యమును కలిగిస్తుంది. **మితాహారము ఆరోగ్యము చెడకుండా చూస్తుంది.** నేను భారతదేశములో అనేక ప్రాంతములకు వెళ్ళి వస్తుంటాను. ఆహారము వలన నేనెప్పుడూ అనారోగ్యమునకు గురికాలేదు. భక్తుల వ్యాధులను తీసికొన్నపుడే నేను వ్యాధిగ్రస్తుడనగుతాను కాని ఇంకొక విధముగా కాదు. అమితముగా పాలు తీసికొనడము చెరుపు చేస్తుంది. అది రాజసమును పెంచుతుంది. దేహమునకు ఆహారము చాలా ముఖ్యము. పుట్టుటకు కారణము కూడా ఆహారమే. తల్లిదండ్రులు ఆహారము వలన పోషింపబడి బిడ్డకు జన్మ ఇస్తారు. తల్లిదండ్రుల పెరుగుదలకు ఆహారమే ఆధారము. దేహము ఆహారపు మూట మాత్రమే. నీ ఆలోచనలు నీవు భుజించే ఆహారముపై ఆధారపడి ఉంటాయి. సాత్వికాహారము సాత్వికమైన ఫలితాలను ఇస్తుంది. రాజసము పెంచే ఉల్లిపాయల వంటివి కాక సత్వగుణమును పెంచే పండ్లు, పాలు వంటివేనైనా సరే మంచివే. మాంసము రక్తముపై పనిచేసి మోహమును, రేకెత్తించును. చేపలను తినుటవలన నీచమైన ఆలోచనలు వస్తాయి. చేప ఎప్పుడూ నీటిలోనే ఉన్నా అది దుర్వాసన వేస్తుంది.

దేహదారుఢ్యమునకు ప్రాముఖ్యమునిచ్చువారు మాంసమును భుజించవచ్చును. కాని **ఆధ్యాత్మిక జీవనమును గడపవలెనని అభిలషించు వారికి మాంసాహారము ఏమాత్రమూ మంచిది కాదు.**

అవును. మాంసము శరీరమున కవనరమైన ప్రోటీన్లనందిస్తుంది. కాని మానసిక వికాసమునకవసరమైన ప్రోటీన్లుండవు. **ఆధ్యాత్మిక జీవితమును గడుపవలెననే**

కృతనిశ్చయము నీకున్నట్లయితే మాంస భక్షణము కూడదు. అట్లుకాక ప్రాపంచిక జీవితమును గడుపవలెనను కుంటే మాంసభక్షణమును చేయవచ్చును. దీని కింకొక ఆధ్యాత్మికమైన కారణము కూడా ఉన్నది. నీవొక జంతువును సంహరించునపుడు దానికి ఎంతో బాధను, దుఃఖమును, హానిని కలిగించుచున్నావు. భగవంతుడు సర్వజీవులలో అంతర్యామియై యున్నాడు కదా! **ఎవరైనా ఒక కుక్కను కొట్టినపుడు అది బాధతో విలవిలలాడును. కొడితేనే అంత బాధ ఉంటే ఇక మరణించే ముందు ఎంత బాధ ఉండాలి? జంతువులు మనుషులకు ఆహారము కావడానికై సృష్టింపబడలేదు.** అవి వాటి జీవితములను గడుపుటకై ఏతెంచాయి. ఒక మనిషి మరణించినపుడు, నక్కలు, ఇతర జంతువులు శవమును తినవచ్చు. వాటికి ఆహారము కావడానికై మనము జన్మించలేదు. అట్లాగే **జంతువులు మనిషికి ఆహారము కావడానికై జన్మించలేదు.** కాని మాంస భక్షణము నొక అలవాటుగా చేసికొనుట మానవులకు పరిపాటి అయినది.

(ప.పు.29/31)

మన రాగద్వేషములు గాని అభిమాన మమకారములుగాని ఆహారము చేతనే సంభవిస్తున్నాయి. ఆహార నియమమనేది మనోబుద్ధులు అత్యవసరము. మనస్సు యొక్క తత్వము చాల విచిత్రము. శాస్త్రములన్నియు దీనిని యేవిధముగా నిర్ణయించాయంటే :-

మానవుడు ఇంద్రియముల ననుసరించటంచేత పశువైపోతున్నాడు; బుద్ధిని అనుసరించుటచేత మహనీయుడౌతున్నాడు; ఆత్మను అనుసరించినవాడు తానే బ్రహ్మగా మారుతున్నాడు. మనము యింద్రియముల ననుసరించటం చేతనే పశువులుగా మారుతున్నాము. మనసునైనా అనుసరించి మానవుడిగానైనా నిలువు. బుద్ధిననుసరించి మహనీయుడు కాకపోయినప్పటికిని మనసు ననుసరించే మానవుడిగానైనా జీవించు. ఐతే చాలామంది మనసు కూడా చాలా చెడ్డదె కదా అని యిక్కడ సందేహించవచ్చును. మనసు ఎప్పుడు పరిశుద్ధమైనది. ఇంద్రియములను అనుసరించటంచేత మాలిన్యమును పొందుతుండాది.

(బృ.త్ర.పు ౮౧/౮౨)

పరిశుద్ధమైన దోషరహితమైన ఆహారమును భుజించాలి. ఎటువంటి పరిస్థితులయందైన దోషముతో కూడిన ఆహారమును స్వీకరించరాదు. **"భిక్షం దేహోర్థం, వస్త్రం శీతలార్థం"** - మన దేహరక్షణకై, కానీ అనారోగ్యము కలిగించే ఆహారము సరియైన ఆహారము కాదు. **భగవద్గీతయందు పాత్ర శుద్ధి, పాకశుద్ధి, పదార్థశుద్ధి అత్యవసరమన్నారు.** మనము భుజించే పదార్థములు ఏవిధముగా మనకు లభించినవి? అన్యాయార్జితమా లేక న్యాయార్జితమా అని విచారించాలి. ఈనాటి మానవుడు అనారోగ్యమునకు అశాంతికి గురికావటానికి అన్యాయార్జితమైన ఆహారమే మూల కారణము. మనము సక్రమమైన ధర్మమైన న్యాయమైన రీతిలో ఆహారమును సేకరించటం లేదు. తాత్కాలికమైన లౌకికమైన తృప్తి నిమిత్తమై విచక్షణలేక, విచారించక అనేక పెడమార్గములు అనుసరించుచు అన్యాయార్జితమైన ఆహారమును సేకరించుకుంటున్నాము. మొట్టమొదట మలశుద్ధి నిమిత్తమై పరిశుద్ధమైన ఆహారాన్ని సేకరించాలి. ఏది అన్యాయము, ఏది న్యాయము అనే విచక్షణా జ్ఞానము సామాన్యులకు చాల తక్కువ. పాత్రశుద్ధి ఉన్నదో లేదో తెలియదు. పదార్థ శుద్ధి అంతకంటె తెలియదు. పాకశుద్ధి - వంటపని భావములు ఏవిధముగా ఉన్నవో మనకు ఏమాత్రము తెలియదు. ఈ అన్నింటి పరిశుద్ధి కోసము ప్రయత్నము చేస్తుంటే మన ఉదరము క్షీణించిపోతుంది. కనుకనే **ఆహారము సేకరించిన తరువాత భగవర్పితము చేసినచో యిది పరిశుద్ధమవుతుంది.** ఎవరికి వారు **భగవంతుడు ఎక్కడున్నాడని ప్రశ్నించుకున్నప్పుడు తనలో నుండియే జవాబు వస్తుంది.**

"అహం వైశ్వానరోభూత్వా ప్రాణినాందేహమాశ్రితః
ప్రాణా పానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్"

నేను వైశ్వానర రూపములో నీ ఉదరము నందుండి నీవు భుజించిన ఆహారమును జీర్ణింపచేస్తున్నాను. అని చక్కని

జవాబు. మనము భుజించుటచేత అనేక మాలిన్యములు, అనేక దోషములు, అనేక పాపములు దీనిలో ప్రవేశిస్తున్నాయి. కనుకనే **"బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం" బ్రహ్మార్పణ భావముతో భుజించటంచేత అది ఆహారము కాదు ప్రసాదమౌతుంది.** అందులో నుండిన దోషములన్నియు పరిహారమవుతాయి. తద్వారా మన మనస్సుకు అంటిన మాలిన్యములు క్రమక్రమేణా పరిశుద్ధము కాగలవు. తిరిగి మనస్సనే అద్దము పరిశుద్ధముగా మారుతుంది. ఐతే ఒక్క దినముతో ఒక నెలతో ఒక్క పర్యాయముతో పరిశుద్ధమయ్యేది కాదు. **నిరంతరము అభ్యాసము చెయ్యాలి. పుట్టిన ప్రతిమానవుడు Walking, talking, eating, reading, writing అన్నీ అభ్యాసము చేతనే పొందగలుగుతున్నాడు. దీనికి కూడను అభ్యాసము అవసరము. "అనగ ననగ రాగ మతిశయిల్లుచునుండు, తినగ తినగ వేప తియ్యనుండు,** సాన రాపిడి చేత సగమై పోవును''. ఒక వజ్రమునకు వెల కావాలనుకుంటె అనేక రకముల కోతలు కొయ్యాలి. బంగారు పరిశుద్ధమైన అపరింజిగా ఉండాలనుకుంటే అనేక పర్యాయములు కాల్చి పరిశుద్ధము గావించాలి. అదేవిధముగనే మనస్తత్వాన్ని సంస్కరింపచేసుకోవాలి. ఈవిధముగా చేయటంచేత మనస్సునకు అంటిన మాలిన్యము తొలగగలదు.

(బ్ర.త్ర.పు. ౯౦/౯౨)

జగత్తునందు పుట్టిన 84 లక్షల జీవ రాసులలో 83 లక్షల 99 వేల 992 జీవాలు తన సహజ ఆహారాన్ని అనుభవిస్తున్నాయి. పశుపక్షి మృగాదులు భగవంతుడు అందించిన సహజాహారాన్ని తింటున్నాయి. వీటికి అధిక జబ్బులు చేయటంలేదు. కాని మానవుడు జిహ్వా చాపల్యము చేతనే అనేకమైన రుచులకు మరిగి, కల్పితమైన పక్వాలుగా మార్చుకుంటూ వస్తున్నాడు. **టేస్టు నిమిత్తమై కుర్మాలు, బర్మాలు అన్నీ చేసుకుంటున్నాడు. కాని ఆయువు ప్రమాణము ఎంత బర్న్ అయిపోతున్నదో యోచన చేసుకోవటం లేదు. కూరగాయలు ఆహారము తినేవారికి తక్కువ జబ్బులు వస్తున్నాయి. మాంసాహారము తినే వారికి ఎక్కువ జబ్బులు వస్తున్నాయి. కారణం ఏమిటి? ఇది హ్యూమన్ బాడీ అది యానిమల్ బాడీ. ఈ రెండింటికి చేరిక కుదరదు. డాక్టర్లు చెప్పుతుంటారు దీంట్లో ప్రోటీన్సు ఉంటాయి భుజించండి పుష్టిగా అవుతారని. ఇది వారి బలహీనత. త్రాగే పాలలో ప్రోటీను లేదా? తినే పెరుగులో ప్రోటీను** లేదా? కూరగాయలలో ప్రోటీను లేదా? బేడలలో ప్రోటీను లేదా? ప్రోటీను ఎక్కడైన వుంటున్నది. ఇది శారీరకమైన అనారోగ్యమే కాకుండా మానసిక సంబంధమైన అనారోగ్యమును కూడా పెంచుతున్నది. మన మైండ్ ఎట్లా పోతున్నదంటే food, head, god. ఈ మూడింటికి సన్నిహిత సంబంధము అవుతున్నది. ఈ animal food ను మనం భుజించటంచేత animal thoughts మనలో ప్రారంభమవుతున్నాయి. **ఎట్టిఆహారమో అట్టి భావము.** ఈనాడు మానవత్వమునకు విరుద్ధమైన అమానుషత్వమును అనుభవిస్తున్నారంటే ఎంత ఘోరం? మానవుని మనస్సు అడవులలో సంచరించే మృగములకంటే హీనమైపోతున్నది. నిర్దాక్షిణ్యముగా నిర్మోహంగా. అప్రీతిగా మానవత్వమును హింసిస్తుండాది. మానవునికి మానవునికి మధ్యనే సన్నిహిత సంబంధ బాంధవ్యము కోల్పోతున్నది. కారణము మన ఆహార దోషమే. కనుక విద్యార్థులారా! ఆహార విహారాన్ని సరియైన దృష్టిలో మీరు ఉంచుకోవాలి. **ఏ ఆహారము సరియైన ఆరోగ్యమునకు, ఆనందమునకు అవకాశము నందిస్తుంది అనే విచారణ చెయ్యాలి. పూర్వీకులు దినమునకు రెండు పర్యాయములు భుజించేవారు. మహర్షులు దినమునకు ఒక్క పర్యాయమే భుజించేవారు. ఒక్క పర్యాయము భుజించేవాడు యోగి అన్నారు. రెండు పర్యాయములు భుజించేవాడు భోగి అన్నారు. మూడు పర్యాయములు భుజించేవాడు రోగి అన్నారు.** ఈనాడు మూడు కాదు ఎన్నో పర్యాయములు పొట్ట లోపలవేస్తుంటారు. మధ్యమధ్య పానీయం సమర్పయామి. కాఫీలు, టిఫిన్లు ఇవన్నీ

వేస్తున్నాం. ఈరకంగా జడమైన దేహమునకు అజీర్ణ వ్యాధి సంభవించక ఏమవుతుంది? ఒక్కొక్క నిమిషమునకు ఒక్కొక్క క్యాలరీ ఖర్చు అవుతున్నది. జీర్ణమవుతున్నది. యువకులైనవారు 2000 క్యాలరీస్ చక్కగా తినవచ్చు. సరైన రీతిగా మనము బాలెన్స్ వుండాలంటే దినమునకు 1500 క్యాలరీస్ చక్కని ఆరోగ్యమనందిస్తుంది. కానీ ఈనాడు 4000, 5000 క్యాలరీస్ తింటున్నాము. తద్వారా నిద్ర పట్టదు. నిద్రలేనివారు క్షుద్రాలు పన్నుతారు. వికారమైన భావాలంతా వస్తువుంటాయి. ఈ వికారమైన భావము లోపల తన ఆహారమును మరచి పోతున్నాడు. అనారోగ్యమునకు గురి అవుతున్నాడు. దేహమును సాధ్యమైనంత వరకు హద్దులో వుంచుకొని, ఆరోగ్యము పెంచుకొని, సక్రమమైన మార్గములో కర్తవ్య కర్మలు నిర్వర్తించటానికి పూనుకోవాలి.

(బృ.త్ర.పు ౩౯/౪౦)

అన్నదోషము చేతనే మనస్సు కల్మషము బొందుచున్నది కలుషమైన విత్తమందు ధర్మరహస్యము ప్రకాశించదు. ఎట్లన, మలిన జలముగల పాత్రలో ముఖబింబము శుద్ధముగా ప్రకాశించనట్లు మాలిన్య హృదయమున దైవసాక్షాత్కార ముదయించదు. అర్జునా! ఆహారము చేతనే మానవులు దృఢగాత్రు లగుచున్నారు. నీతివంతు లగుమన్నారు. విరుద్ధ ఆహారముచే రోగగ్రస్తులూ, అవినీతి పరులూ నీచులూ అగుచున్నారు. కాన ఆహారమునుబట్టే వారిగుణము లిట్టివని చెప్పవీలగును"అని పలికెను.

"స్వామీ !సాత్త్విక ఆహార మెట్టిదో, రాజసి కాహార మెట్టిదో, తామసిక ఆహార మెట్టిదో ప్రీతితో అనుగ్రహించి తెలుపు మన్నాడు. అర్జునుడు.

అర్జునా! సాత్వికుల యాహారము మనసుకు, దేహమునకు, బలము చేకూర్చునదై యుండవలెను అధిక ఉప్పుకాని అధిక కారముకానీ, అధిక పులుపుకానీ అధిక తీపికానీ, అధిక వేడికాని వుండకూడదు. ఇంతియే కాక దాహమును కలిగించునట్టిదైనదిగా కూడనూ వుండ కూడదు. అన్నింటియందునూ మితమై యుండవలెను. కొంత మంది నీటితో ఉడికిన పదార్థములు రెండవదినమున తినుచుందురు. అనగా ముందుదినము వండిన అన్నమునుకూడానూ తినకూడదు.

నూనెలో నేతిలో వుడికిన పదార్థములు రెండవదినము మూడవదినమూ నిలువపెట్టిన పదార్థములు అన్నమునకు, అనగా నీటిలో ఉడికినవాటికి సంబంధములేదు. కాని అవి కూడానూ దుర్వాసన వచ్చిన తరువాత తినుట మంచిది కాదు. దుర్వాసన రాకపూర్వమే తినుటలో తప్పులేదు. రజోగుణ ఆహారము చెప్పిన సాత్విక ఆహారము లన్నింటికినీ విరోధమై యుండును. అనగా అతి ఉప్పు అతికారము, అతితీపి, అతివేడి, అతిపులుపు, దుర్వాసన కొట్టు పదార్థములు, ఇవి అన్నియూ రజోగుణమును పెంపొందింప జేయును.

పరమాత్మా; తెలియక అడుగుచున్నాను, క్షమింపుడు.ఇంత మాత్రము ఆహార మార్పులు చేసినంత మాత్రమున గుణములు సాత్వికము కాగలవా! లేక ఇంకనూ ఈ ఆహారమునకు శుద్ధిచేయు మార్గము లున్నవా? అట్లు ఉండిన కరుణించుము" అని అర్జును డడిగెను.

"బావా అర్జునా! ఇంత సులభముగా గుణములు సాత్వికముగా మారుచుండిన లోకమున దానగుణములు నిమిషమున నిర్మూలమయి వుండెడివి. దీనికి ఇంకనూ కొన్ని శుద్ధములు కావలసి యున్నవి. మొదటిది వస్తుశుద్ధి, రెండవది పాత్రశుద్ధి, మూడవది వండువారి లేక వండించువారి శుద్ధిప్రధానములు" అని యింకను క్రింది విషయములు చెప్పెను.

వస్తువులు మంచివిగానూ, శుద్ధముగానూ వున్నంత మాత్రమున చాలదు. ఆ వస్తువులు ఏవిధముగ లభించినవి, అవి లభించు మార్గము నందును అన్యాయము, అనత్యము, అక్రమము, అధర్మము వుండి యుండకూడదు అట్టి మాలిన్యములతో ఆ వస్తువులు చేరియుండకూడదు. లభించిన మార్గము కూడనూ

ఆహుతి

శుద్ధమైనదై సత్యమైనదై యుండవలయును. పాత్ర శుద్ధమైనదై చిలుముపట్టనిదై వుండవలెను. వండువాడు కూడనూ శుద్ధమైన బట్టలతో శుద్ధమైన హస్తములతో శుద్ధమైన ప్రవర్తన కలిగి అనగా దురభ్యాస, దుస్సంగ, దుర్బుద్ధులు, దుర్నడతలతో మాలిన్యమైన వాడుగా వుండకూడదు. వంటచేయుచూ అపవిత్రమైన మాలిన్యమైన వాడుగా వుండకూడదు. వంటచేయుచూ అపవిత్రమైన చింతనలు చేయక, విసుగు,కోపము, ద్వేషము మొదలగు భావములతో మాటలాడక నగుముఖముతో విశ్వాస విధేయతలతో ప్రీతిగా వండుచుండవలెను. వండునంతవరకూ చెడ్డతలంపులు లేక వుండువాడై యుండవలయును. అట్లుకాక వండువాడు. చూచుటకు శుద్దముగావుండి, తన చింతనలు జూదములపైనా, దుర్నడతపైనా వుంచుకొని విసుగుతో ఇంకా పని పూర్తికాలేదే అను కోపముతో చిటపటమని గొణుగుతూ చేసిన పంట సాధకులకు ఏకాగ్రత చేకూర్చదు. అంతటితో పోక ధ్యానమందు, జపమునందు, వండువాడు తలంచిన దుష్టభావములు దృశ్యముగా వచ్చి నిలుచును. కాన వండువాడు కొన్ని మంచి నడవడికలు కలవాడై యుండవలయును. అట్టివానినే విచారణ సలిపి నియమించుకొనవలయును. ఏదో మంచి రుచిగా వండు వాడనియూ సులభముగా దొరకినాడనియూ చూచుటకు పరిశుద్ధముగా నున్నాడనియు,ఈపై పై పూతలను మాత్రమే చూడక, బైట వాని ప్రవర్తనలను కూడనూ జాగ్రత్త చూచుట చాల అవసరము, మనోనిర్మలముపై జెప్పిన ఆహార శుభ్రతనుపట్టి యుండును. మనోనిర్మల, మొక్కటుండియూ ఉపయోగముండదు. దానికి దేహము, వాక్కు నిర్మలము కూడనూ అవసరము; వీటినే శారీరక మానసిక వాక్కు తప్పనిసరి కూడనూ అందురు.

(గీ.పు. 230/232)

(చూ॥ దేహము, నియమములు, ప్రసాదము, మందిరము, రాగద్వేషములు, సాంఖ్యదర్శనము)

ఆహుతి

దేవతలనుద్దేశించి హోమము చేయబడునది. అంతమాత్రమే గాక దేవతా ఆహ్వాన రూపమని విశేషార్థము. స్వాహాకార వషట్కార పూర్వకము కాని ఆహుతులు దేవతలకు చెందనే చెందవు. సరస్వతి శబ్దము ఒక దేవికని, వేదవాక్కునకు ప్రసిద్ధము. అంతేకాదు. ఆత్మను గురించి చెప్పునది కనుక స్వాహా అని అర్థము. దేవీ భాగవతమునందు పరదేవతయే గాయత్రి అనియు స్వాహా అనియు చెప్పబడినది. లలితా సహస్రనామములో పరాదేవత, స్వాహా, స్వధా అను శబ్దములతో పేర్కొనబడినది. స్వాహా అను శబ్దము హవిర్దాన వాచకము కూడా.

(లీ.వా. పు. 22, 23)

ఆహ్లాదిని శక్తి

(చూ॥ గోపికలు)

ఇంట

(చూ॥ ఆపద్బాంధవుడు)

ఇంట గెలిచి - రచ్చ గెలువు

చాలామంది తమ భార్యను గాని, భర్తను గాని, పిల్లలను గాని సంతృప్తి పరచలేరు. అటువంటి వారంతా ఏదో చేసి ఇతరులను సంతృప్తి పరచుట గొప్పతనం కాదు. **"ఇంట గెలిచి - రచ్చగెలువు."** మీ ఇల్లును చక్కబెట్టుకున్న తరువాత వీధిలోనికి పోయి సేవలు చేయాలి. అంతేగాని ఇంటిని విసర్జించరాదు. మన ఇంట్లో వారిని సంతృప్తి పరచుట మన కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించగా మిగిలిన కాలాన్ని సమాజసేవలో ఉపయోగ పెట్టాలి. మీ ఇంట్లో వారిని బాధపెట్టి, వీధిలోనికి పోయి సేవ చేయడమనేది - సాయి ఒప్పుకోడు. పునాది గట్టిగా లేకుండా గోడలు నిలువలేవు కదా! కనుక మొదట self చూసుకో, తరువాతనే help చేయి.

(శ్రీ.భ.ఉ. పు.124)

ఇంటర్‌నెట్

(చూ॥ హృదయసంబంధము)

ఇంటర్వ్యూ/ఇంటర్వ్యూలు

అనేక మంది భక్తులు స్వామి తమను ఇంటర్వ్యూకి పిలవాలని ఆశిస్తున్నారు. నేను మాత్రం ఎంతమందికని ఇంటర్వ్యూ ఇవ్వడానికి వీలవుతుంది? కనుకనే, ఈ సమావేశాలను ఏర్పాటు చేసి అందరికీ సమానంగా ఇంటర్వ్యూ ఇస్తున్నాను. మాటలు తగ్గించుకోండి. అప్పుడే మీ నుండి మృగలక్షణాలు దూరమైపోతాయి. మృగలక్షణాలను మీలో నింపుకొని మనిషిలా ప్రవర్తించాలంటే సాధ్యం కాదు. ముందు వాటిని తరిమివేయండి. మీలో ఏవైనా దుర్గుణాలు ప్రవేశించాయంటే, **"నేను పశువును కాదు, నేను రాక్షసుడను కాదు, నేను మానవుడను" అని మిమ్మల్ని మీరు పదేపదే హెచ్చరించుకోండి. మానవుడే దేవుడుగా మారతాడు. భగవత్ప్రేమను పెంచుకోండి. స్వామిదయను తెలుసుకోవడానికి ప్రేమ ఒక్కటే రాజమార్గం.**

(స.సా.సె.96 పు.242)

ఇండియా

నేను ఎప్పుడూ ఇంటర్వ్యూలు ఇస్తూనే యున్నాను. అంతరాత్మ కాబట్టి మీరే నాకు ఇంటర్వ్యూలు ఇవ్వడం లేదు. నేను మీలో యున్నాను. నేను ప్రేమ స్వరూపుణ్ణి. మీరూ ప్రేమ స్వరూపులే. ఇద్దరము ప్రేమ స్వరూపులమే.

(సా॥ పు 449)

(చూ॥ ప్రేమ)

ఇండియా

(చూ॥ గమ్యం ఒక్కటే, భగవంతుని బిడ్డలు)

ఇంద్రధనుస్సు

ఇంద్రధనుస్సు అందమైన రంగులతో మురిపించుతుంది. మనలో కూడా సద్భావములు, సత్కర్మలూ అనేవి వెల్లివిరిస్తే మన జీవితము ఒక అందమైన ఇంద్రధనుస్సు వలె రూపొందుతుంది. ఆనందం అందిస్తుంది. మహాత్మునిగా రూపొందిస్తుంది.

(శ్రీ.స.ది.వా. పు. 23)

ఇంద్రియనిగ్రహము

ఒకానొక సమయంలో బుద్ధుడు ఎక్కడికో ప్రయాణమై వెళుతుండగా మార్గమధ్యంలో ఒక పెద్ద యజ్ఞంలో అనేక మేకలను, గొట్టెలను బలి యిస్తున్నారు. బుద్ధుడు చూచాడు. "అహింసా పరమో ధర్మః", నోరు లేని జీవులను ఎందుకు బలిస్తున్నారు? ఇది మంచిది కాదని అరికట్టటానికి ప్రయత్నం చేశాడు. అక్కడ చేరిన పెద్దలందరూ "ఆయ్యా, ఈ బలిని మీరు ఎందుకు ఆపుతున్నారు? ఈ గొట్టెలను, మేకలను బలి ఇవ్వడం ద్వారా వాటికి మేము మోక్షం ప్రసాదిస్తున్నాం" అన్నారు. "ఓహో! ఇదా మీరు చేసే పని. అయితే, మీ తల్లి మోక్షాన్ని కోరుతున్నది, మీ తండ్రి మోక్షాన్ని కోరుతున్నాడు. వారిని కూడా ఎందుకు బలి యివ్వకూడదు? మోక్షం కోరేవారికి మోక్షం ఇవ్వకుండా, ఈ మూగ జీవులకు మోక్షం ఇవ్వడం ఎందుకు?" అని ప్రశ్నించాడు. "ఏ ప్రాణినీ హింసించకూడదు. ఇంద్రియాల నరికట్టుకోవాలి. అదే నిజమైన సాధన అదే మోక్షమార్గం" అన్నాడు. దీనిని పురస్కరించుకొనియే **బుద్ధుడు ఐదు సూత్రాలను బోధించాడు. మొదటిది సమ్యక్ దృష్టి, రెండవది సమ్యక్ శ్రవణం, మూడవది సమ్యక్ వాక్కు, నాల్గవది సమ్యక్ భావం, ఐదవది సమ్యక్ కర్మ - వీటిని అలవర్చుకున్నప్పుడే నిర్వాణం ప్రాప్తిస్తుంది.** మొట్టమొదట బుద్ధుడు ఎన్ని దినములు సాధన చేసినప్పటికీ తృప్తిని పొందలేకపోయాడు. ఇదంతా ప్రయోజనం లేని పని అని గుర్తించాడు. ఎన్ని గ్రంథములు చదివినా, ఎంతమంది పెద్దల బోధనలు విన్నా ఎన్ని సాధనలు చేసినా మోక్షం లభించదు. భగవంతుడిచ్చిన పంచేంద్రియాలను సక్రమమైన మార్గంలో వినియోగించుకోవడమే మోక్షమునకు మార్గమని తెలుసుకున్నాడు. దానికి తగిన ప్రయత్నంచేస్తూ వచ్చాడు. సమ్యక్ దృష్టి, సమ్యక్ భావం, సమ్మక్ వాక్కు, సమ్యక్ శ్రవణం, సమ్యక్ కర్మ - ఈ ఐదింటిద్వారా తాను నిర్వాణం పొందాడు. మొట్టమొదట మంచి దృష్టిని అలవర్చు కోవాలి. తద్వారా మంచి భావాలు కలుగుతాయి. మంచి భావాలు కలిగినప్పుడు మంచినే పలుకుతాము. మంచినే చేస్తాము. మంచినే పొందుతాము. కనుక, మంచిని పొందాలంటే **మొట్టమొదట ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. దీనినే "యోగః చిత్త వృత్తి నిరోధః" అన్నాడు పతంజలి.** ఇంద్రియాలను నిగ్రహించు కోకుండా ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు.

(స.సా.అ.99 పు.276/277)

"నీకొరకు ఇంద్రియము లున్నవి కానీ నీవు ఇంద్రియముల కొరకు లేవని తలంచవలెను. వాటికి దాసుడుకాక, నీకు అవి దాసులగునట్లు చేసుకొనవలెను."

(గీ.పు.209)

(చూ॥ అష్టవిధ పుష్టములు, ఇంద్రియములు, ఇరువది గుణములు, జిహ్వా, దమము, దేహము, నిర్వాణం, వివాహం, హృషీకేశుడు)

ఇంద్రియపటుత్వం

ఇంద్రియ పటుత్వం లేనివాడు రాజ్యపాలనకు అనర్హుడని రామాయణం బోధిస్తున్నది. ఒకనాటి రాత్రి దశరథ మహారాజుకు దాహం వేసి ఒక జగ్గులో నుండి టంబ్లర్‌లోకి మంచినీరు పోసుకొనుచుండగా తన చేయి అదరడం గమనించి తనకు వృద్ధాప్యం ప్రారంభమైనదనీ, ఇంద్రియ పటుత్వం సన్నగిల్లిందనీ గ్రహించాడు. ఇంక తనకు మహారాజుగా కొనసాగే అధికారం లేదని భావించి, వెంటనే వశిష్ఠులవారిని రప్పించి, **శ్రీరామ పట్టాభిషేకానికి ముహూర్తం పెట్టించాడు. కానీ, ఈనాటి పాలకులను క్రేనుతో ఎత్తి ప్లేనులో కూర్చోపెట్టవలసివచ్చినా, కనీసం సంతకం చేయడానికి కూడా శక్తి లేకపోయినా తమ పదవిని మాత్రం వదులుకోవడానికి ఇష్టపడరు.**

(స.సా. జూలై.98, పుట,172)

ఒకనాటి రాత్రి దశరథుని కొక కల వచ్చింది. సముద్రంలో నీరంతా ఇంకిపోయి నట్లుగా, చంద్రుడు క్రిందపడి ముక్కలు ముక్కలై పోయినట్లుగా, మదపుటేనుగు క్రిందపడి ప్రాణం విడిచినట్లుగా, దానిపై నున్న సింహాసనము క్రింద కూలినట్లుగా అతనికి కనిపించింది. వెంటనే అతడు లేచి కూర్చున్నాడు. "ఏమిటీ విచిత్రము! నాల్గన ఝాములో వచ్చిన స్వప్నం నిజమౌతుం దంటారు. ఇది నాల్గవ ఝామే కనుక ఈ స్వప్నము యొక్క అంతరార్థ మేమిటో!" అని తనలో తాను చాల బాధపడుతున్నాడు. పడకపై నుండి క్రిందికి దిగి ప్రక్కనే ఉన్న నిలువుటద్దములో తన ప్రతిబింబాన్ని తాను చూసుకున్నాడు. తలపై అక్కడక్కడ తెల్లవెంట్రుకలు కనిపించాయి. అనగా తనకు వృద్ధాప్యము ప్రారంభమైనదని గుర్తించాడు. **ప్రక్కనే ఉన్న జగ్గు నుండి కప్పులోకి నీరు పోసుకోవడానికి ప్రయత్నించగా చేతులు కాస్త అదిరాయి. అంటే ఇంద్రియశక్తి కూడా క్షీణించినదని గమనించాడు. "ఇంద్రియశక్తి ఉన్నంతవరకు ఈ రాజ్యాన్ని పరిపాలించాను. ఇప్పుడు నా ఇంద్రియశక్తి క్షీణించింది. కనుక, నేనింక రాజ్య పరిపాలన చేయుటకు అనర్హుడను" అని భావించాడు. వెంటనే తన గురుదేవులను, మంత్రులను పిలిపించాడు. "నేనింత కాలము ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలించాను.** ప్రజాభీష్టమే నా అభీష్టమని భావించాను. ఇప్పుడు నా ఇంద్రియశక్తి క్షీణించింది. కనుక నా జేష్ఠపుత్రుడైన రామునికి పట్టాభిషేకం చేయ దల్చుకున్నాను" అన్నాడు. కాని ప్రజలు, మంత్రులు "మహారాజా! మీకింకా రాజ్యపాలన చేయగల శక్తి ఉన్నది. కనుక మీరే ఇంకా కొంతకాలం పరిపాలిస్తే బాగుంటుంది" అన్నారు. ఈ మాటలు విని దశరథుడు రామునికి పట్టాభిషేకం చేయడం వీరెవ్వరికీ ఇష్టం లేదేమో అనుకున్నాడు. పాపం! మంత్రులు వెంటనే, "మహారాజా! రాముడు మహాగుణవంతుడే. కాని, మీకున్న అనుభవం అతనికి లేదు కదా! ముందు రాముని యువరాజుగా చేసి రాజ్యపాలనలో అతనికి మార్గదర్శకత్వం వహించండి" అన్నారు. చూశారా! **ఇంద్రియ పటుత్వం లేనివాడు రాజ్యపాలనకు అర్హుడు కాడన్నాడు దశరథుడు. కాని ఈనాటి నాయకులు కన్నులు కనిపించకపోయినా, చెవులు వినిపించకపోయినా, చేతితో సంతకం చేయడానికి వీలుకాకపోయినా ఇంకా రాజ్యం ఏలాలని ఆశిస్తున్నారు.**

(స.సా.మే.97 పు130/131)

ఇంద్రియములు/ఇంద్రియాలు

"ఇంద్రియంబులు మనసు నిల్పిన
అంధుడైనను మోక్ష మందును
ఇంద్రియంబు నిలకడలేనిది
చంద్రుడైన పసందు పొందడు."

(శ్రీ.స.వే.ప్ర పు.59)

ఒక యింద్రియము ఒక విషయముపై పరుగెత్తునప్పుడు ఆ విషయమునుండి తప్పించి యింకొక విషయముపైన మరలించటానికి తగిన శిక్షణ యివ్వాలి. ఇంద్రియమునకు అధికమైన విషయమును నిరూపింపచేసినప్పుడు దాని మార్గము వదలి సరైన మార్గములో ప్రవేశిస్తుంది. ఒక దొంగపశు వుందనుకోండి. అది పంటలో పడి మేయటానికి

పోతుంటాది. అంతకంటె మంచి పచ్చిగడ్డిని మనము యింటిలో వేస్తే అది పంటకే పోదు. ఇంటి దగ్గరనే వుండి మేస్తుంది. ఆశించిన దానికంటె వుత్తమమైన దానిని మనము అందిస్తే ఉత్తమమైన మార్గములో ప్రవేశిస్తుంది. **ఇంద్రియములను పశువులు అన్నారు. బయటి దృష్టి కలిగినది పశువు; లోదృష్టి కలిగినవాడు పశుపతి అన్నారు.** మానవుడు పశుపతి కావాలిగాని పశువు కాకూడదు. మాస్టర్ కావాలిగాని స్లేవ్ కాకూడదు. ఇంద్రియానికి బానిసలైపోతే స్లేవ్ అయిపోతాయి. ఇంద్రియానికి నీవు మాస్టర్.

(బృ.త్ర.పు ౫౦)

ఈ యింద్రియములను నియమించటానికి అనేక రకములైన మార్గములుంటున్నాయి. ఈ యింద్రియములు భోగము ఎక్కడనుండి పుట్టింది అని విచారణ చెయ్యాలి. ఇవి దుఃఖమునుంచే పుట్టాయి.

(బృ.త్ర.పు ౫౧)

మన యింద్రియములను సరైన రీతిగా అదుపులో పెట్టుకోవటమే కాదు. **వానిని సమన్వయ పరుచుకోవాలి. "యోగః చిత్తవృత్తి నిరోధః" అన్నారు.** చిత్తవృత్తి నిరోధించటము మహాకష్టము. అసాధ్యము. సమన్వయము గావించుకోవటము సులభము. మంచిని స్వీకరించు. చెడ్డ తనంతతానే దూరమై పోతుంది.

(బృ.త్ర.పు ౫3)

ప్రతివ్యక్తియందు తన యింద్రియములచేత కలిగే ప్రమాదము లధికముగా వుంటాయి. కనుక మానవుని యందు యీభ్రమ పూర్తిగా పోవాలి. ఈభ్రమ మానవుని చాలా క్రుంగదీస్తుంది.

(బృ.త్ర.పు.౫3/౫౪)

ఇంద్రియములు మహాశక్తివంతమైనవి. సమస్త సుఖ దుఃఖములకు ఈ ఇంద్రియములే మూల కారణము. కనుక వీని స్వభావాన్ని గుర్తించి వీని రూపనామములు అనుభవించి వీనిని సరియైన మార్గములో ప్రవేశపెట్టటానికి తగిన కృషిచేయాలి. ఒక గొప్పకవి ఇంద్రియముల గురించి గానం చేసాడు.

దుర్బుద్ధులు తలలున్నా దూరులు చెప్పే నోరున్నా
పొంచి చూచుకనులున్నా పంచలవిను చెవులున్నా
వంచనగుణ చిత్తమున్న వంచించే మనసున్నా
ఈ వికృతులు చూడగనే న్యాయము ఇక బ్రతుకదన్నా.

(బృ.త.పు. ౫౮)

ఇంద్రియములకు మాత్రా అను పేరు గలదు. "మీయతే అనయామాత్రా". అనగా కొలతలను నిర్ణయము గావించుటయే యీ యింద్రియముల ప్రభావము. ఇంద్రియములు కొలత ఏవిధముగా గావించు చున్నవి? ఈ ఫలము తీయగా ఉన్నది, లేక పుల్లగా ఉన్నది అని నిర్ణయించే అధికారము దేనికున్నది? దీనిని కొలతవేసే యింద్రియము ఏమిటి? అదియే నాలుక. ఈ చిత్రములను నిర్ణయించే కొలత దేనికి వున్నది? దీని కొలతబద్ద కన్ను మాత్రమే. ఇది దుర్గంధము యిది సుగంధము అని నిర్ణయించే కొలతబద్ద ముక్కు. ఇది సుస్వరము యిది దుస్వరము అని నిర్ణయించే కొలతబద్దకర్ణము. ఇంద్రియములకు నిర్ణయించే అధికారమున్నది కనుకనే వీనికి మాత్రా అని పేరు.

ఇంద్రియములకు మాత్రా అనగా పరిమిత మని మరొక అర్థము. ఒక్కొక్క యింద్రియమునకు ఒక్కొక్క పరిమితిని మాత్రమే నియమించినాడు భగవంతుడు. కన్ను చూడగలదే గాని వినలేదు. నోరు మాట్లాడగలదే గాని చూడలేదు. ఇట్లా ఒక్కొక్క యింద్రియమునకు ఒక్కొక్క విధమైన, నిర్ణీతమైన నిబంధన ఉంది. ఈ నియమములను ఎవరు సక్రమముగా నడచుకొందురో వారే భగవదాజ్ఞను పరిపాలించిన వారవుతారు. ఎవరీ నియమముల నుల్లంఘింతురో వారు శిక్షకు గురి అవుతారు. కనుక ఒక్కొక్క యింద్రియమును దాని నిర్ణయానుసారముగా ఉపయోగించుకొని దానిని రక్షించుకోవటానికి ప్రయత్నించాలి.

(బృ.త్ర.పు ౪౪/౪౫)

ఇంద్రియములను సమన్వయపరిచే మార్గము ఒకటి వున్నది. మంచి చెడ్డలు రెండును సమత్వముగా భావించి ఆనందముగా కాలము గడపాలి ...

ఇంద్రియములను నిగ్రహించుకోవటం ఎవరిచేతకాదని నిరుత్సాహ పడనక్కరలేదు. **భక్తి ప్రపత్తులచేత యింద్రియములను స్వాధీన పరచుకోవచ్చును.** వాతావరణము యేమాత్రము అడ్డురాదు. **మన భావము పరిశుద్ధముగా వుండాలి.** మనం బయటి వాతావరణమును యేమాత్రము పాటించరాదు. **నీయొక్క చిత్తము, నీయొక్క పవిత్రమైన భావము పరిశుద్ధమైన సమన్వయము గావించుకోవాలి.**

(బృత్ర.పు ౪౮/౪౯)

ఇంద్రియములకు లొంగినవాడు Mister.

ఇంద్రియములకు లొంగనివాడు Master.

(భా.ప. పు. 1)

(చూ॥ ఆహారము, కోరికలు, క్షేత్రము, ధీమంతుడు, నిర్గుణోపాసన, ప్రసాదము, బుద్ధి, భయం, మాత్ర, యజ్ఞము, రాజబాట, సాధన జీవితము, సూక్ష్మము, హృషీకేశుడు)

ఇంద్రుడు

ప్రప్రథమముననే మనకొక వింత భావము కానవచ్చును. ఇవియే ఋక్కులు. అనగా తేజోరూపులను గూర్చినవి. ఇట్టి దేవుళ్ళ అనేకులు కలరనియు, ఇంద్రుడు, వరుణుడు, మిత్రుడు, పర్జన్యుడు అనునవి కొందరి పేర్లు. వీరు ఒకరి వెనుక ఒకరు కనుపింతురు. ఇట్టివాడే వజ్రాయుధుడగు ఇంద్రుడు. భూలోకమునకు వర్షము వచ్చునట్లు చేసిన ప్రతీతుడు. అందువలన భారతీయులు ఇంద్రుని పూజింతురు. **ఇంద్రు డనగా ఇంద్రియములకు అధిపతియైన మనస్సును ఇంద్రుడని పిలిచిరి. ఇతనికి పురుహూతుడని రెండవ పేరు. పురు అనగా అనేక పర్యాయములు; హూతుడు అనగా ఆహ్వానింప బడువాడు. మనస్సు ఇంద్రునిగా రుద్రునిగా వేదములలో కీర్తింపబడినది. ఇంద్రియములను జయించి తాము వానిలోనికి సర్వాంతర్యామిత్వం పొందుచున్నపుడు ఆ మనస్సే రుద్రుడు.**

అందువలననే వేదములోని ఇంద్రుడు, రుద్రుడు, రెండు నామములుగా వైభవముగల ఒకే దేవతగా వర్ణించిరి. తక్కిన దేవతలను గూర్చి కూడా ఇట్టి వర్ణనముల నెన్నియైన ఉదాహరింపవచ్చును. చివరి కొకే విధమున అంతా వర్ణింపబడుచుందురు.

(స.వా. పు.13)

ఇచ్చిపుచ్చుకో

ప్రేమ్‌చంద్ పేరు ప్రఖ్యాతులు గాంచిన రచయిత. ఒక రోజున అతడు సతీసమేతంగా నైనిటాల్‌కి ప్రయాణమై వెళుతుండగా, వారికి వీడ్కోలు చెప్పడానికి అతని ఇద్దరు కుమారులు అలహాబాద్ రైల్వే స్టేషన్‌కి వచ్చారు. ట్రైన్ బయల్దేరే ముందు పెద్ద కుమారుడు తలిదండ్రు లిద్దరికీ పాదాభివందనం చేశాడు. రెండవ కుమారుడు మాత్రం పంట్లాము జేబుల్లో చేతులు పెట్టుకుని మాట్లాడుతూ రైలు బయల్దేరగానే ''టాటా'' అంటూ వారివైపు చేతులూపాడు. రైలు బయల్దేరిన తరువాత ప్రేమ్‌చంద్ ముభావంగా ఉండటం గమనించి అతని భార్య కారణం అడిగింది. ''చూశావా, చిన్నవాడు మనకి నమస్కరించ లేదు'' అన్నాడు. ''పోనిద్దురూ, వాడు నమస్కారం చేయక పోతే మనకొచ్చిన నష్టమేమిటి?'' అన్నది. దానికి ప్రేమ్‌చంద్ ''మనకి నమస్కరించ లేదని కాదు, వాడి మనస్తత్వాన్ని గురించి, వాడి భవిష్యత్తు గురించి ఆందోళన పడుతున్నా'' అన్నాడు. కాలక్రమేణ అతని పెద్ద కుమారుడు అలహాబాద్ హైకోర్టులో న్యాయమూర్తిగా నియమితు డయ్యాడు. చిన్న కుమారుడు అదే కోర్టులో గుమాస్తా పనిలో చేరాడు. హైకోర్టుకి వచ్చినవారందరూ పెద్ద కుమారునికి నమస్కరిస్తుంటే, వచ్చినవారందరికీ చిన్న కుమారుడు నమస్కరించవలసి వచ్చింది. తల్లిదండ్రులను గౌరవించలేని వ్యక్తి సమాజంలో గౌరవాన్ని పొందలేడు.

(స.సా. మా99, వెనుక కవరుపుట)

ఇటలీ

(చూ॥ త్రికరణ శుద్ధి)

ఇరువది గుణములు

1. అమానిత్వము, 2. అదంభిత్వం, 3. అహింస, 4. క్షమ, 5. ఋజుత్వము, 6. ఆచార్యోపాసన, 7. శౌచము, 8. స్థైర్యము, 9. ఇంద్రియనిగ్రహము, 10. వైరాగ్యము, 11. అనహంకారము, 12. జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనము, 13. ఆసక్తి, (మమకారమే మహాపాశము), 14. స్నేహము, 15. సమత్వస్థితి, 16. జ్ఞానగుణము, 17. అన్యభావనలేని భక్తి కలిగియుండుట, (అనన్యభక్తి), 18. జ్ఞానగుణము (జనసంఘమున ప్రీతి లేకుండుట) 19. ఆత్మానాత్మవివేక జ్ఞానము, 20. తత్త్వజ్ఞాన దర్శనము.

పైన చెప్పిన యిరువదింటిలో **ప్రయత్న పూర్వకముగా రెండు మూడు సాధించినను మిగిలినవి ఆప్రయత్నముగా సమకూరును.** అన్నింటికినీ ప్రయత్నించ సాధ్యము కాదు; అవసరము లేదు అయితే, అమానిత్వాది జ్ఞాన గుణములు ఇవియే యని కూడనూ తలంచ వీలు లేదు; ఇంకనూ యెన్నియో కలవు. అయితే మానవుడు వీటిని సాధించ సాధనలు సలిపిన చాలును. అన్నింటి యందునూ ప్రధాన మైన ఉపాంగములు ఇవి. వీటిని ఆధారము చేసుకొని గమ్యమును చేరవచ్చుననియే కృష్ణుడు ఈ ఇరువది జ్ఞానగుణములను బోధించినాడు.

వీటిని కలిగినవాడు సాక్షాత్కారమును తప్పక పొందగలడు. సందేహము లేదు. ఇన్నింటి విచారణ మూలమున మానవుడు దేహము, బుద్ధి, ఇంద్రియములు, అంతఃకరణము ఇవి అన్నియూ ప్రకృతి సంబంధములని తెలుసుకొనును. వీటన్నింటికి భిన్నముగా నున్నవాడే పురుషుడనియూ తేలిపోవును. పురుషుడనగా క్షేత్రమును తెలుసుకొను వాడేకాని క్షేత్రము కాదని ఋజువగుచున్నది. ఎపుడు ఈ ప్రకృతి పురుషుల విషయములు విజ్ఞాన విచారణచే తేలినవో అపుడు వాంఛా రహితుడైన సాక్షి స్వరూపుడు తానే ననికూడను తెలియును.

అన్నింటికి సాక్షీభూతుడు తానేనని తెలుసుకొనుటయే **ఆత్మ సాక్షాత్కారము,** తన సత్యమును తానే అని తెలిసి కొనుటకు తనను తాను తెలిసికొనుట, అంతా వక్కటే ఆత్మయని నిరూపించుట, జీవుడు వేరు, దేవుడు వేరు కాదని అనుభవముతో తెలిసికొనుట, వీటినన్నింటిని సాక్షాత్కారమనియే పిలుతురు. ప్రతి మానవుడు సాధించవలసినదియును, తెలుసుకొనవలసినదియును ఇదియే. కేవలము పుట్టి పెరిగి చచ్చునంత మాత్రమున అట్టివాడు మానవుడు కానేరడు. పశు పక్షి మృగాదులవలె కాక మానవుడు తెలియని సత్యాన్ని తెలిసికొనుటే వానికి కల దివ్య శక్తి. అట్టి అనుగ్రహ శక్తిని వృధా చేయరాదు. (గీ.పు.214/215)

ఇల్లాలు

(చూ॥ గృహలక్ష్మి)

ఇస్లామ్

ఇస్లామ్ మతమునకు చంద్రుడు, నక్షత్రము ప్రధానమైన చిహ్నములు. దీనిని హిందువులు కూడా అను సరిస్తున్నారు. "చంద్రమా మనసో జాతః" మనస్సు అనేది చంద్రుడని చల్లగా, తెల్లగా ప్రకాశిస్తూ సర్వులకు శాంతి భద్రతలు కల్పించేది అని దీనికి సరియైన అర్థము.

హజరత్ మహమ్మద్ వాక్యాన్ని అనుసరించి ఈనాటికి రంజాన్ నెల మొదటి చంద్రుని దర్శనముతో ప్రారంభించి రెండవ చంద్రుని దర్శనముతో ఉపవాసదీక్షను విరమిస్తుంటారు మహమ్మదీయులు.

ఖురాన్‌లో అందరూ ఐకమత్యముతో, ప్రేమతో అన్యోన్యమైన అనురాగముతో దైవత్వమును మాత్రమే చింతించాలని ఉంది. ఆధునిక యుగములో దేహసంరక్షణ నిమిత్తమై దినమునకు ఐదు పర్యాయములు మానవుడు భుజిస్తున్నాడు. అస్థిరము, అశాశ్వతము అయిన దేహము కోసము 5 పర్యాయములు మనము భుజిస్తుంటే, నిత్య సత్యమైన ఆత్మ తత్వమునకు కూడా ఆహారమును అందించవలసిన అవసరము లేదా అని ఇస్లామ్ వాదిస్తుంది. ఆత్మ ప్రకాశమునకు కూడా ఆహారము అవసరమని

చెప్పింది. ఏమిటి ఈ ఆహారము? ప్రార్థన, 5 పర్యాయములు ప్రార్థన చెయ్యాలి. బుద్ధి వచ్చి బాలుడు మొదలుకొని, **అంతిమ శ్వాస విడువనున్న వృద్ధునివరకు రోజూ ఐదు పర్యాయములు ప్రార్థన విధిగా చెయ్యాలని ఇస్లామ్ నిబంధన.** అందు లో ఏకాంత ప్రార్థన కేవలము స్వార్థ పరమైనదని సామూహిక ప్రార్థన సరియైనదని కూడా ఇస్లామ్ బోధించింది.

ఎంత ద్వేషము, విరోధ మున్నప్పటికీ - ఒకరిమీద ఒకరు కక్షలు సాధిస్తున్న వారుకూడా సమాజమునందు ప్రార్థనలోనూ, అంత్యసమయములోనూ ఏకము కావాలని ఇస్లామ్ శాసించింది. ఏకాభిప్రాయమును ఆచరించి అనేకత్వములో ఉన్న ఏకత్వాన్ని నిరూపించడమే ఇస్లామ్ పరమ లక్ష్యము.

దీక్ష ఇస్లామ్‌కి మాత్రమే పరిమితమైనది కాదు. హిందువులు కూడా మాఘమాస వ్రతమని, శ్రావణమాస వ్రతమని ఒక్కొక్క మాసమునందు ఒక్కొక్క వ్రతమును పాటిస్తుంటారు. అదేవిధముగ ఇస్లామ్ మతమేకాక, పర్షియన్ మతమునందు, జోరాష్ట్ర మతమునందు, క్రైస్తవ మతమునందు ఒక్కొక్క మాసములో ఒక్కొక్క ఉపవాస దీక్షను అనుసరిస్తున్నారు. ఈ విషయాన్ని అర్థము చేసికొనక, భేదాభిప్రాయములను పెంచుకొని కక్షలకు దిగుతున్నారు. అన్ని మతములు ఐకమత్యమునే బోధిస్తున్నాయి. ఐకమత్యములేని మతము మతము కాదు. దైవము అన్నిటియందు ఒక్కటిగా ఉంటూ ఒకే మార్గాన్ని బోధిస్తున్నాడు.

ఇస్లామ్ మతము నీతీ, నిజాయితీలను నిరూపిస్తూ వస్తున్నది. భగవంతుని ప్రసన్నుని గావించేవి పాండిత్యము గాని, ధనము గాని, దేహశక్తులు గాని కావు. నీతి నిజాయితీలతో కూడిన ప్రేమే భగవంతుని ప్రసన్నుని గావిస్తుందని ఇస్లామ్ చెప్పింది. పవిత్ర ప్రేమను ప్రతి మతము కూడా బోధిస్తున్నది. అయితే ఈనాడు మనము ప్రేమ తప్ప అన్నింటిని అనుసరిస్తున్నాము: ఈ రంజాన్ సమయములో దూరపు బంధువులంతా చేరుతుంటారు. ద్వేషమున్న వారంతా ఏకమై పోతుంటారు. ఇదంతా కూడా మానవత్వ ఏకత్వాన్ని నిరూపించడం కోసం. **మసీదు దాని కొక చిహ్నము. దేహజీవతత్వాలను విసర్జించి ఆత్మతత్వాన్ని స్థిరముగా నిలుపు కోవడమే అమరత్వమునకు చిహ్నమని ఈరంజాన్ దిన సందేశము.** అనిత్యమైన దేహ భావములను, జీవితత్వాన్ని సాధ్యమైనంత వరకు అదుపులో పెట్టుకొని, సత్యమైన ఆత్మతత్వమును ప్రకటింప జేయడానికి, ప్రకాశింప చేసు కోవడానికి తగిన కృషి చెయ్యడమే రంజాన్ అంతరార్థము. **దీనిని గుర్తించి నేటినుండీ, ఏ మతమైనా, అన్నీ సమత్వాన్ని గురించి చెప్పేవే గనుక - అందరూ ప్రేమను సహనాన్ని, సానుభూతిని సత్యమును ప్రకటించుకోవాలని,** స్థిరము చేసుకోవాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

(స.సా.ఆ.83, పు. 186/187)

(చూ॥ ఖురాన్, హిందువు)

ఇహము

ఇహలోకం అనగా యీ లోకం.

(సా॥ పు 528)

(చూ॥ కనిపించనిది)

ఇహాముత్ర ఫలభోగ విరాగము

(చూ॥ అథాతోబ్రహ్మజిజ్ఞాసా)

ఈక్షతే ర్నా శబ్దం

వేదము బ్రహ్మమే జగత్కారణమని చెప్పుచున్నది కాని, అచేతనమును గురించి చెప్పుట లేదు. అది యెట్లనిన, సద్ వస్తువు జగత్కారణమగు సంకల్పము చేసెనని ఆ వేదము చెప్పుచున్నది. సంకల్పములు చేయుట చేతనముల పనికానీ, అచేతనముల పనికాదు. కాన జ్ఞాన స్వరూపుడైన బ్రహ్మమే జగత్కారణముకాని, అచేతనము కాదు. వేదము అప్రధానము గురించి చెప్పుటలేదని ఈ సూత్రము స్పష్టపరచుచున్నది.

సంకల్పము సృష్టికి కారణమని శ్రుతులు తెలిపెను. కనుక సంకల్పమే సృష్టికి పూర్వకము. ఈసంకల్పము ప్రధాన గుణమగు సత్వము యొక్క ధర్మము అని సాంఖ్యము తెలుపుచున్నది.

గుణములు సామ్యస్థితి యందున్నపుడు సత్వ దర్మమనియు, దీనికి జ్ఞానము సంభవము కాదనియు తలంచిరి. సాక్షియగు చేతన తత్వము లేకున్న జ్ఞాన ముండ జాలదు. కనుక సాక్షియైన ఈశ్వరుని వలననే ప్రధాన జ్ఞానగుణమును పొందుచున్నది. **ఏతావాతా బ్రహ్మమే జగత్తుకు ముఖ్యకారణమని తలంచుట సరియైనది. పరమ సత్యము నిర్గుణ బ్రహ్మమే కాదు; సగుణ బ్రహ్మమూ అగుచున్నాడు. చేతనాచేతనాత్మకమగు ఈ విశ్వము భగవంతుని శరీరముగా ఉన్నది.**

సంకల్పించుట చేతన లక్షణమని జడముల లక్షణములు కాదని తేలినది. సంకల్ప కారణముచేత జగత్తు సృష్టింపబడుటకు ఈశ్వరుడే కారణము. **ఈశ్వర సంకల్పమే ఈ జగత్తు.** స్థూలదృష్టితో చూచిన రెండునూ వేరువేరుగా కన్పించునను సూక్ష్మంగా పరిశీలించిన, పదార్థానికి పరమార్థానికి ప్రాణికి ప్రాణానికి తాత్వికంగా భేదం లేదు. **ప్రాణమే ప్రాణిగా మారుతుంది. ప్రాణిలోనుండి ప్రాణం ఉదయిస్తుంది.**

ప్రపంచములో బ్రహ్మకాని పదార్థము లేదు. ఈ ప్రపంచమంతా బ్రహ్మతత్వంనుండే ఉదయించింది. అందులోనే లయ మొందుతుంది. అందులోనే సంచరించుతుంది. అని **'తజ్జలాత్'** అన్న సూత్రం వర్ణిస్తుంది. తత్=దానినుండి, జ=జన్మించి; ల=లయించి; అత్=వృద్ధి పొందుట - ఈ నాలుగు పాదాలతో కూర్చబడి

చేర్చబడినది ఈ సూత్రము. అసలు పురుషుడే ఒక యజ్ఞ స్వరూపుడు. మానవ జీవితమే ఒక యజ్ఞము.

ప్రపంచమంతా పరమాత్మ తత్వంలోనుండి ఆవిర్భవిస్తుంది. పరమేశ్వరుడు లేని చోటు ఈ ప్రపంచములో ఎక్కడా లేదు. కదిలేది జగత్తు. కదిలించేవాడు జగదీశ్వరుడే. ప్రాపంచికమైన అనురాగాలు నిజమైన అనురాగాలు కావని ఇతరులమీద అనురాగాలకు మూలము **ఆత్మానురాగమేనని** యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి బోధించుట ఉపనిషత్ తెలుపుచున్నది. ఒకరిమీద ఒకరికి ప్రేమ ఉండి ప్రేమించుట లేదు. ఎవరి ఆనందమును వారు ఆశించి ప్రేమవల్ల కలిగే ఆనందాన్ని పురస్కరించుకొని నడచుచున్నారు. అనురాగము ఆత్మోన్ముఖంగా ఉంటుంది. కాబట్టి ఆత్మతత్వాన్ని అవగాహన చేసుకొని పరిశీలించితే సమస్తం బ్రహ్మ చైతన్యము నుండే జరుగుతున్నదని స్పష్టమవుతుంది.

చరాచరములన్నియు దైవ **సంకల్పములే. సంకల్పము చేతనమే కాని అచేతనము కాదని ఈ సూత్రము స్పష్టపరచుచున్నది. ఎవరెన్ని వాదోపవాదములు చేసినా దైవసంకల్పము సమస్తమునకు మూలము.**

భ్రాంతి చేత వారి వారి భావాలను ధృడపరచుకొనుటకై ప్రయత్నింతురు. మర్త్య శరీరం ఆత్మకు ఆలంబనం. **శరీరముతో పనిలేని పర్జన్యం - వాయువు - ప్రాణం - శరీరానికి కట్టుబడి వుంటుంది. అందువలన అది ఆత్మతత్వము, బ్రహ్మతత్వమును అందుకోలేక పోవుచున్నది.** అర్థము చేసుకోలేక పోవుచున్నది. అశరీర తత్వమే బ్రహ్మం, అదే ఆత్మ. కన్నులకు చూచే శక్తి చెవులకు వినే శక్తి నిచ్చేదే ఆత్మ. అట్టి ఆత్మను కన్నులు ఏ రీతిగా చూడగలవు? చెవులు ఏ రీతిగా వినగలవు? కన్నులు చెవులు ఆధేయములు. సర్వచైతన్యమైన బ్రహ్మనే వీటికి ఆధారము. అదే ఆత్మ అదే తత్వం, అదే నీవు, అంతా చైతన్యమే, సంకల్పమే.

ఈ ప్రపంచములో పంచభూతములు **ప్రజ్ఞానం** వలననే సంచరించుచున్నాయి. దేవతలు ప్రజ్ఞాన బలముతోనే రాణించుచున్నారు. సమస్త ప్రాణికోటికి ప్రజ్ఞనే ఆధారము. స్థావర జంగమమంతా ప్రజ్ఞానంతోనే ప్రతిష్ఠితమై యున్నది. ప్రజ్ఞానమే ఆత్మ. ప్రజ్ఞానమే బ్రహ్మ, ప్రజ్ఞానమే లోకం. ప్రపంచమంతా ప్రజ్ఞయొక్క చైతన్యమే. సత్ అను శబ్దముచేత వేదములు జగత్తుకు కారణము బ్రహ్మనే అని చెప్పుచున్నవి. అచేతనమైన పదార్థమును గురించి వేదము ఎక్కడా చెప్పుట లేదు.

(సూ.వా. పు.31/34)

ఈనాటి విద్య

ఒకనాడు గాంధీ చాలా విచారంగా కూర్చొని యుండగా ఒక విదేశీయుడొచ్చి - "గాంధీజీ! ఏమిటి మీరు విచారిస్తున్నారు? మిమ్మల్ని విచారపరుస్తున్న సమస్య ఏమిటి?" అని అడిగాడు. అప్పుడాయన చెప్పాడు - "ఈనాటి విద్య మానవునికి మృదు మధురమైన జీవితాన్ని లేకుండా చేసి కఠినమైన శిలాహృదయునిగా మారుస్తున్నది" అన్నాడు. ఇలాంటి విద్యలు నేర్చి ప్రయోజనమేమిటి? పల్లెలలో పూర్వంఅనేవారు - "చదువు కున్న వాళ్ళ కంటె చాకలివాడు మేలు" నీవు రెండు ట్రౌజర్లు, రెండు ప్యాంట్లు, రెండు టవల్సు చాకలి వానికి వేస్తే ఒక బుక్‌లో వ్రాసుకుంటావు. కాని, చాకలివాడు ఎంత మంది గుడ్డలో తీసుకొని పోతాడు కాని, ఎక్కడా వ్రాసుకోడు, వాటిని తిరిగి జాగ్రత్తగా తెచ్చి ఇస్తాడు. వాని తెలివి తేటలు ఎంత గొప్పవి! ఈ చదివిన వానికి, ఆ చదవని వానికి ఎంత వ్యత్యాసమో తెలుసుకోండి.

(స.సా.డి.93 పు.317/318)

ఈనాటి విద్యావిధానంలోని పొరపాట్లను అధికారులు గుర్తించి కొంత మార్పులు తెప్పించాలి. ఏమి మార్పులు తెప్పిస్తున్నారు? ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క ఎడ్యుకేషన్ మినిష్టర్ వచ్చి రూల్స్ అన్నింటినీ మారుస్తున్నారు. కనుక మారని, కూడని, చెరగని ఒక్క సిద్ధాంతమును మనం స్థిరం చేసుకోవాలి. విద్యా విధానమును మార్చటానికి వీరు అనేక కమిటీలను పెడుతూ వచ్చారు. ఏమిటి ఈ కమిటీ? "కమ్ ఫర్ టీ" (come for tea)! ఇంత కంటే మించి లేనే లేదు. ఏ కమిటీయైనా ఒక్కదానిని స్థిరంగా

~~ఈనాటి~~ స్త్రీలు

ఉంచిందా? ఏమీ లేదు. కమిటీ వేసి నందుకు ఒక మీటింగు ...! ఒక రిపోర్టు!! ఆ రిపోర్టు ఎక్కడ పోతున్నదో ఏమో ప్రజలకు తెలియటం లేదు. ప్రపంచమంతా విద్యా రంగంపై ఆధారపడి యున్నది. ఆఫీసర్ కావాలన్నా, క్లర్కు కావాలన్నా, బ్యాంకుకు పోవాలన్నా, వ్యాపారం చేయాలన్నా విద్య చాలా అవసరం. అట్టి ప్రాణ సమానమైన విద్యను ఈనాడు సరిగా అర్థం చేసుకోవటం లేదు.

(స.సా.డి.93 పు.318/319)

~~ఈనాటి~~ స్త్రీలు

~~ఈనాడు~~ స్త్రీలు చాలా మంది విద్యావంతులుగా, విద్యాభిమానులుగా, విద్యాధికారులుగా రూపొందు తున్నారు. కానీ వీరివలన లోకానికి కలుగుతున్న మేలు ఏమిటి? అనే విషయాన్ని ఆలోచిస్తే ... కేవలం వీరిలో 100 కి నూరుశాతం స్వార్థమే నిండియున్నది వీరిలో స్వార్థమును వీడి, దివ్యభావముతో సేవ చేసెడి వారు అరుదు. జీవితములో కొంత సుఖాన్ని, ఆనందాన్ని అందుకోవాలనే భావనతో **ఉద్యోగము లందు ప్రవేశించి విద్యాలయాలకు వస్తున్నారు. ~~ఈనాటి~~ స్త్రీలు.**

ఉద్యోగము చేయ ముదితలందరు పోగ
గృహ కృత్యములను తీర్చు గృహిణు లేరి?
ఆలు మగ లిరువురును ఆఫీసులకు పోవ
బిడ్డలను పోషించు తల్లు లేరి?
పుస్తకాల్ చేఁబట్టి పురుషులవలె పోవ
వంట యింటిని దిద్దు వనిత లేరి?
దుడ్డు వలన గలుగు ఇబ్బంది తీరిన
ఇంటిలోని పనుల కొఱత లెంతయుండు?
సుఖము చూడబోగ సున్నయే
ఉద్యోగ పదవియం దున్న పడతికి.

ఇట్లు ఉద్యోగము చేయు **స్త్రీలకు సుఖము కరువగుచున్నది. ఇంట గెలచి రచ్చ గెలువ మన్నారు. మన పెద్దలు. గృహ కృత్యాలు సక్రమంగా నిర్వర్తించుకొన్న తరువాత ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించాలి. వివాహితయైన స్త్రీని గృహిణి, ఇల్లాలు, ధర్మపత్ని, గృహలక్ష్మి అని అంటారు.** ఇల్లాలున్నది దేనికోసం? **ఆమె విద్యకు ఉపయోగం ఏమిటి? తన బిడ్డలకు వినయం, విధేయత, క్రమశిక్షణ, విద్యా బుద్ధులను గరపాలి, వారిని పవిత్రభావాలతో ఆదర్శపౌరులుగా తీర్చిదిద్ది దేశానికి అందించాలి. కుటుంబ గౌరవాన్ని కాపాడాలి. తమ కుటుంబాన్ని ఆదర్శవంతమైన కుటుంబంగా నిరూపించాలి. అంతేగాని కేవలం ధనం సంపాదించడము ముఖ్యాంశము కాదు.** ~~ఈనాడు~~ మానవునిలో నీతినిజాయితీలు బొత్తిగా కనిపించక పోవుటకు గల ముఖ్యకారణం దురాశ. అధికంగా ధనం సంపాదించాలనే కోరిక.

ధనము హెచ్చిన మదము హెచ్చును
మదము హెచ్చిన దుర్గుణము మానక హెచ్చు
ధన ముడిగిన మదముడుగును
మద ముడిగిన దుర్గుణంబు మానును వేమా!
"అసంతృప్తో ద్విజో నష్టః"

(స.సా. అ. 78 పు.179)

~~ఈశావాస్యము~~

యాజ్ఞవల్క్యుని భక్తి శ్రద్ధలకు సూర్యభగవానుడు సంతసించి వాజి రూపమునవచ్చి యజుర్గణములను యాజ్ఞవల్క్యునికి బోధించెను. ~~ఈ~~ యజుర్గణములనే యాజ్ఞవల్క్యుడు తనశిష్యులకు బోధించెను. ~~ఈ~~ కారణముచేతనే ~~ఈ~~ శాఖకు వాజసనేయి అని పేరు వచ్చెను. వేదవ్యాస ప్రవర్తితమగు యజుర్వేదశాఖ కృష్ణ యజుర్వేదమనియు, యాజ్ఞవల్క్య సంవర్తితమగు యజుశ్శాఖ శుక్ల యజుర్వేద మనియు పిలువబడుచున్నవి. వీనియందలి మొదటికొన్ని అధ్యాయములు కర్మకాండ సంబంధమగు మంత్రములతోనూ, చివరి అధ్యాయములు జ్ఞానకాండతోనూ సమన్వయింపబడినవి. ~~ఈశావాస్యము~~ జ్ఞానకాండలో చేరినది. ~~ఈ~~ ఉపనిషత్తునందు మొదటి మంత్రమున ~~ఈశావాస్యము~~ను రెండు పదములచేత ప్రారంభించుటచే ~~ఈ~~ ఉపనిషత్తుకు ~~ఈశావాస్యము~~ను పేరువచ్చినది.

శ్లో॥ ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్
తేన త్యక్తేన భుంజీథా మాగృధః కస్య స్విద్ధనమ్ ''
నశ్వరభావముగల వస్తువులు ఏవేవి కలవో ఈ భూమియందు అవి అన్నియు స్వస్వరూపమగు భగవంతునిచే ఆచ్ఛాదింపబడి యున్న వనియు, అట్టివానిని త్యాగబుద్ధితో అనుభవించవలెననియు, పరుల ధనమును ఏ మాత్రము ఆశించకూడదనియూ, ధనము ఎవ్వరిదీ కాదనియు పై శ్లోకము తెలుపుచున్నది. అనగా బ్రహ్మాండమంతయు ఈశ్వర స్వరూపము, ఈశ్వరుడు కానీ, అతనిచే శాసించబడిన బ్రహ్మాండముకానీ, వేరువేరని, భావించుట కేవలము భ్రాంతి. నీటియందు కనిపించు ప్రతిబింబము ఎట్లు బింబము కంటే భిన్నము కాదో అటులనే ఈశ్వరుడునూ అతనిచే శాసించబడిన బ్రహ్మాండమును వేరుకాదు.

(ఉ.వా. పు.9)

(చూ॥ నాద బిందు కళలు)

ఈశ్వర

'ఈశ్వర' అనగా సకలైశ్వర్య స్వరూపుడు. ఐశ్వర్యమనగా ఏమిటి? కేవలం ధన కనక వస్తు వాహనాదులు మాత్రమే కాదు. ఆరోగ్యము ఒక ఐశ్వర్యమే. మేధాశక్తి ఐశ్వర్యమే. భుజబలమూ ఐశ్వర్యమే. కాబట్టి మానవుని యందున్న సర్వస్వమూ ఐశ్వర స్వరూపమే. కనుకనే 'ఈశ్వర' అనగా సకల ఐశ్వర్యములను చేకూర్చేటటు వంటిది ఈశ్వర తత్వము.

(శ్రీ.వా. ఏ 1995 - పు. 8)

ఈశ్వరః అనగా నిఖిలైశ్వర్యము కలవాడు. ఏమిటి ఈ ఐశ్వర్యము? ధనము ఒక ధనమే. ఆరోగ్యము ఒక విధమైన ధనమే. విద్య ఒక ధనమే. గుణము ఒక ధనమే. తెలివి ఒక ధనమే. సర్వము ధనములక్రిందనే పోల్చు కుంటూ వచ్చారు. ఇవన్నీ ధనములే. సకలైశ్వర్యస్వరూపుడు ఈశ్వరుడు అనే సత్యానికి దిగారు. తరువాత యిందులో వున్న రహస్యాన్ని గుర్తించి శివః అన్నారు. **శివఃఅనగా త్రైగుణ్యరహితుడని అర్థము. సత్వరజస్తమోగుణములకు అతీతమైనవాడు, గుణములు లేనివాడు కనుక శుద్ధసత్వుడు అనియు పిలుచుకుంటూ వచ్చారు. శుద్ధసత్వుడే శివుడు. అదే మంగళకరమైన తత్వము. గుణములు లేనప్పుడే మంగళత్వము.** గుణము లుండినప్పుడే ఆమంగళము ఏర్పడుతుంది కనుక శివః అనగా మంగళ స్వరూపుడు. క్రమక్రమేణా మానవుడు ఇంకా వున్నతస్థాయికి వెడుతూ వచ్చాడు. **సంభవః** అని నాల్గవపేరు. తన యిష్టప్రకారము ఏ నియమములు లేకుండా ఎప్పుడు అవసరమో ఎక్కడ అవసరమో ఏ కాలములో అవసరమో అప్పుడంతా తాను ఉద్భవించే భావము కలవాడిని సంభవః అన్నారు. అందువల్లనే భగవద్గీతలో

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్.
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ **సంభవామి** యుగే యుగే.

ఎక్కెడెక్కడ అవసరమో అక్కడక్కడంతా తాను ఉద్భవిస్తూ వుంటాడు. అలాంటి స్వాతంత్ర్యము కలవాడు కనుకనే అతనికి సంభవః అని పేరు. ఈ విధముగా ఒక్కొక్క అంతరార్థమును పురస్కరించుకొని పేర్లు పెడుతూ వచ్చారు. ఈశ అని మరొక పేరు పెట్టారు. మానవుని తెలివితేటలు ఎంతఘనముగా అభివృద్ధి పొందుతూ వచ్చాయో ఆనాటి ఋషులయొక్క తత్వము చక్కగా గుర్తించి ప్రయత్నించాలి. **ఐశ్వర్యము, ధనము, కీర్తి, యశస్సు, జ్ఞానము, వైరాగ్యము షడైశ్వర్యస్వరూపుడే ఈశుడు.** ఈ షడైశ్వర్యస్వరూపుడు అనే తత్వానికి ఈశ అని పేరు పెట్టినారు.

(ఉ.బ్ర పు. 17/18)

ఈశ్వరచంద్ర విద్యాసాగర్

లోకంలో ఎట్టి సిరిసంపదలు లేకపోయినప్పటికీ తల్లియొక్క అనుగ్రహ ధనాన్ని సంపాదిస్తే చాలు. తల్లి అనుగ్రహాన్ని పొందినవాడే ధన్యుడు. పూర్వం బెంగాల్‌లో ఈశ్వర

ఈశ్వరతత్వము

చంద్ర విద్యాసాగర్ అనే గొప్ప వ్యక్తి ఉండేవాడు. వారిది చాల బీద కుటుంబము. తన తల్లి పాతబడిన చీరలు కట్టుకోవడం చూసి చాల బాధ పడేవాడు. అతడు విద్యాభ్యాసం పూర్తి చేసుకుని ఒక చిన్న ఉద్యోగంలో చేరిన తరువాత ఒకనాడు తల్లిదగ్గర కూర్చుని, "అమ్మా! నా వద్ద కొంత ధనమున్నది. నీకేమి కావాలో చెప్పు" అన్నాడు. **"నాయనా! నాకు ఏ ఆశలూ లేవు. నీవు మంచి గుణవంతుడివైతే నాకంతే చాలు"** అన్నది. ఇంకా కొంత కాలమైన తరువాత అతడు గొప్ప ఉద్యోగంలో చేరాడు,జీతం పెరిగింది. అప్పుడు మళ్ళీ తల్లివద్దకు వచ్చి "ఆమ్మా! ఇప్పుడు నావద్ద కావలసినంత ధనమున్నది. నీకేమైనా కోరికలుంటే చెప్పు" అన్నాడు అప్పుడామె, **"నాయనా! నాకు మూడు కోరికలున్నాయి. అవి తీరినప్పుడే నాకు శాంతి కలుగుతుంది. మొదటిది -మనగ్రామంలో చాలమంది బీద పిల్లలు చదువు సంధ్యలు లేక కాలమును వ్యర్థం చేస్తున్నారు. కాబట్టి, నీవు సంపాదించిన ధనంతో ఒక చిన్న స్కూలును కట్టించు"** అన్నది. తల్లి కోరిక మేరకు అతడొక స్కూలును కట్టించాడు. **"రెండవ కోరిక ఏమిటమ్మా?"** అని అడిగాడు. **"నాయనా ! ఈ పల్లెలో ఒక ఆసుపత్రి లేకపోవడంచేత ప్రజలు జలుబు వచ్చినా, దగ్గు వచ్చినా చాల అవస్థ పడుతున్నారు. కాబట్టి ఒక చిన్న ఆసుపత్రి కట్టించు"** అన్నది. ఆసుపత్రిని కూడా కట్టించాడు. మరి కొంతకాలం జరిగిన తరువాత, "అమ్మా! **నీ మూడవ కోరిక ఏమిటి?"** అని అడిగాడు. "నాయనా! **ఈ గ్రామంలో త్రాగటానికి నీరు లేక ప్రజలు చాలా బాధ పడుచున్నారు. మురికి నీరు త్రాగి అనారోగ్యానికి గురి అవుతున్నారు. కనుక, ఒక బావిని త్రవ్వించి ప్రజలకు నీటిని అందించు"** అన్నది. అతడు ఆ అభీష్టాన్నీ కూడా నెరవేర్చాడు.

దినదినానికి ఈశ్వర చంద్ర విద్యాసాగర్ కీర్తి పెరుగుతూ వచ్చింది. అతడు ఎక్కడైనా ఉపన్యాస మిస్తున్నాడని తెలిస్తే ప్రజలు గుంపులు గుంపులుగా ప్రోగయ్యేవారు. అతడు నిత్య జీవితానికి అవసరమైన విషయాలనే మాట్లాడేవాడుగాని, కేవలం పుస్తక జ్ఞానాన్ని ప్రకటించేవాడు కాదు; చాల వినయ విధేయతలతో ప్రవర్తించేవాడు. ఒకనా డతడు ప్రక్కగ్రామంలో ఉపన్యాసమివ్వడానికని రైలులో ప్రయాణమైపోతున్నాడు. అతని ఉపన్యాసం వినాలని ఎవరో ఒక ఉన్నతాధికారి అదే రైలులో ప్రయాణమయ్యాడు. అతనివద్ద ఒక చిన్న పెట్టె ఉన్నది. అతను అంతకు పూర్వం ఈశ్వర చంద్ర విద్యాసాగర్‌ను చూసి ఉండలేదు. అతడు రైలు దిగిన **తక్షణమే 'కూలీ, కూలీ'** అని అరవడం మొదలు పెట్టాడు. "ఎక్కడుంది మీ లగేజి?" అని అడిగాడు. అతడు తన చిన్న పెట్టెను చూపించాడు. "దీనిని మోయడానికి మీకు కూలీ కావాలా? ఎందుకు ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు? నేను మోసుకొని వస్తాను, రండి" అన్నాడు. ఆ **పెట్టెను విద్యాసాగర్ మోసుకొని వెళ్ళాడు. ఆ అధికారి "ఎంత కూలీ? " అని పర్సు తీశాడు. "నాకేమీ కూలీ అక్కర్లేదు, నేను ఇదొక సేవగా భావిస్తున్నాను. అదే నాకు తృప్తి"** అని విద్యాసాగర్ వెళ్ళిపోయాడు.

సరే ఆ ఉన్నతాధికారి సభ జరుగుతున్న చోటికి వెళ్ళాడు. "ఇప్పుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్ మాట్లాడుతారు" అని ప్రకటించబడింది. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వేదిక నెక్కాడు. అతనిని ఆ ఉన్నతాధికారి చూసి ఆశ్చర్యపోయాడు. "ఇతనే కదా నా పెట్టె మోసుకు వచ్చింది. ఎంతటి వినయ విధేయతలు కల్గిన వ్యక్తి!" అనుకున్నాడు. తాను చేసిన పొరపాటుకు సిగ్గుతో తలదించుకున్నాడు.

(స.సా. జూన్ 99 పు.146/147మరియు సా.శ్రు. పు.124/126)

ఈశ్వరతత్వము

(చూ॥ త్రిమూర్తి స్వరూపులు)

ఈశ్వరత్వం

(చూ॥ ఈశ్వరుడు, ఏకత్వం)

ఈశ్వరమ్మ / ఈశ్వరాంబ

ఈశ్వర చంద్ర విద్యాసాగర్ తల్లి కోరిన కోరికలే ఈశ్వరమ్మ కూడా కోరింది. "స్వామీ! మన పుట్టపర్తి గ్రామం చాల చిన్నది. ఈ గ్రామంలోని పిల్లలు ఎక్కడికో పోయి చదువుకోవలసి వస్తున్నది. మీరు దయాసాగరులు. చిన్న స్కూల్ కట్టించండి" అన్నది. "ఎక్కడ కట్టించ మంటావు?" అని అడిగాను. "స్వామీ! నా ఇంటి వెనుక కొంత స్థలం ఉన్నది. అక్కడ కట్టించండి" అన్నది. ఆమె కోరినట్లుగా స్కూల్ కట్టించాను. స్కూలు చిన్నది అయినా దాని ప్రారంభోత్సవం పెద్ద ఆర్భాటంగా జరిగింది. భక్తులందరూ వచ్చారు. మరునాడు ఈశ్వరమ్మ నావద్దకు వచ్చి "నిన్నటి దినము కార్యక్రమం చాల బాగా జరిగింది. ఐతే, నాకు మరొక కోరిక ఉన్నది. మన పల్లె ప్రజలు సరియైన వైద్యసౌకర్యం లేక బాధ పడుతున్నారు. కనుక, ఒక చిన్న ఆసుపత్రి కట్టించు అన్నది. సరే కట్టించాను. ఆసుపత్రి ప్రారంభోత్సవానికి బెజవాడ గోపాల రెడ్డిని పిలిపించాము. ప్రారంభోత్సవం చాల ఘనంగా జరిగింది. ఇంత గొప్పగా జరుగుతుందని ఈశ్వరమ్మ అనుకోలేదు. మరునాడు నావద్దకు వచ్చింది. "స్వామీ! ప్రజల బాధలు తగ్గించి నా మనోభీష్టమును నెరవేర్చారు. ఇంక నేను చచ్చినా ఫరవాలేదు" అన్నది. "ఇంకా ఏమైనా కోరికలుంటే అడుగు" అన్నాను. "స్వామీ! ఇంకొక్క చిన్న కోరిక ఉన్నది. మన చిత్రావతి వర్షాలు వచ్చినప్పుడు పొంగిపోతుందిగాని, లేనప్పుడు కనీసం త్రాగటానికైనా నీరుండదు. కాబట్టి, ఒక బావిని త్రవ్వించండి" అన్నది. ఆ అభీష్టాన్ని కూడా నెరవేర్చాను. "చిన్న బావి కాదమ్మా, ఈ రాయల సీమకే నేను నీరందిస్తాను" అని ఆ దినమే చెప్పాను. "అదేమిటో నాకు తెలియదు. ఈ ఊరికి నీరిచ్చావు, అదే నాకు సంతోషము" అన్నది.

తరువాత శివరాత్రి వచ్చింది. నేను ఉపన్యాసం ఇచ్చిన తరువాత లింగోద్భవం జరిగింది. లింగోద్భవమునకు ముందు నేను చాల బాధ పడటం చూసి ఈశ్వరమ్మ అంతమంది జనంలో నుండి లేచి వేదికపైకి వచ్చేసింది. "ఏమిటి ఇంత అవస్థ పడుతున్నారు? ఎందుకోసం ఈ అవస్థ? లోపలకు రండి" అంది. "నే నిప్పుడు రాను" అన్నాను. చాల ఏడ్చింది. ఆమె ఎంత ఏడ్చినా నేను లోపలకు పోలేదు. ఆమె లోపలకు వెళ్ళిపోయింది. అప్పుడు లింగాలు ఉద్భవించాయి, హిరణ్య గర్భ లింగము కూడా వచ్చింది. అందరూ చప్పట్లు కొట్టారు. ఆ చప్పట్లు విని ఆమె బయటికి వచ్చింది. అప్పుడు నేను లింగమును అందరికీ చూపుతూ ఉన్నాను. భక్తులందరూ లేచారు. అందు చేత ఆమెకు కనిపించలేదు. మరునాడు నావద్దకు వచ్చి, "స్వామీ! మీరు లింగము తీసినారట. నేను చూడనే లేదే. నాకు చూడాలని ఉంది" అన్నది "అప్పుడు తీసి ఎవరికో ఇచ్చాను. ముమ్ముందు చూస్తావులే" అన్నాను. సరే, మిమ్మల్ని తొందరపెట్టనని వెళ్ళిపోయింది. ఈవిధంగా, ఆమె ఏ విషయంలో నైనా స్వామిని కించిత్తు కూడా బాధ పెట్టేది కాదు. "స్వామీ! మిమ్మల్ని కష్టపెట్టడం నాకిష్టం లేదు. మీరు కష్టపడితే జగత్తే కష్టపడుతుంది. మీరు ఆనందిస్తే జగత్తంతా ఆనందిస్తుంది". అనేది ఒక్కొక్క పర్యాయం ఏదైనా అడిగి, తిరిగి వెళ్ళి పోయేటప్పుడు రెండు మెట్లు దిగి మరల వెనక్కి వచ్చి, "స్వామీ! మీకేమైనా కష్టం కలిగిస్తున్నానా?" అని అడిగేది. నాకేమీ కష్టం లేదంటే సంతోషంగా వెళ్ళిపోయేది. వచ్చిన ప్రతి ఒక్కరికి, "స్వామిని కష్టపెట్టకుండా మీరు సంతోషపడండి" అని చెప్పేది. ఎవరైనా మినిష్టర్లు వస్తున్నారంటే, ఎట్టి టోపి పెట్టుకొని పోలీసు వస్తున్నాడంటే చాల భయపడేది. "స్వామీ! మినిష్టరు వస్తున్నాడట. ఎక్కడ ఉంటాడో ఏమో, ఏమి అడుగుతాడో, ఏమో" అనేది. నీవేమీ భయపడవద్దు, నేను చూసుకుంటాను అనేవాడను. తల్లి ప్రేమ ఆవిధంగా ఉంటుంది. ఆమెకు ఏవిధమైన కొరతలూ లేకుండా ఆమె ఉన్నంత వరకు సంపూర్ణ శాంతిని అందించాను. తల్లి ప్రేమను పదిమంది దృష్టికి తెప్పించే నిమిత్తమై ప్రతి సంవవత్సరం 'ఈశ్వరమ్మ డే' జరుపుతున్నాము. ప్రతి ఒక్కరూ తల్లిని సంతోష పెట్టాలి. తల్లిని సంతోష పెడితే స్వామిని సంతోష పెట్టినట్లే.

(స.సా.జూన్.99. పు.147/148 మరియు సా.శ్రు. పు.127/128)

"తెలుగులో ఒక సామెత ఉంది. నిజమైన భక్తి చివరి క్షణంలోనే కనపడుతుందని. ఈశ్వరమ్మ మంచితనం గురించి ఒక చిన్న సంఘటన చెపుతాను. ఎండాకాలపు క్లాసులు బెంగుళూరులో జరుగుతున్నవి. ఉదయం ఏడు

ఈశ్వరస్మరణ

గంటలకు విద్యార్థులు నగర సంకీర్తనకు చుట్టూ వెళ్ళి తిరిగి వచ్చారు. ఈశ్వరమ్మ స్నానం ముగించింది. సంతోషంగా కాఫీ తీసుకుంది. బాత్ రూం వేపుకు పోతూ "స్వామీ! స్వామీ!" అని కేక వేసింది. "వస్తున్నా! వస్తున్నా!" అని నేను పలికాను. ఆ సమయంలోనే ఆమె తుది శ్వాసను విడిచింది. ఇంతకంటె ఆమె మంచి తనానికి ఏమి నిదర్శనం కావాలి? ఆమెకు ఒకరు ఉపచారం చేయవలసిన అవసరం కలుగలేదు. **ఆ సమయంలో స్వామి జ్ఞాపకం రావడమనేది ఏ కొద్దిమందికో జరుగుతుంది. అది గజేంద్రుని పిలుపు, ప్రభువు రాకవలె జరిగిపోయింది. ఇట్టి ప్రామాణికమైన సమాప్తి కొరకే అందరూ ప్రయత్నం చేయాలి.** ఆ సమయంలో ఆమె ప్రక్కన కుమార్తె వెంకమ్మ, మనుమరాలు శైలజ ఉన్నారు, కాని స్వామినే పిల్చింది. అలాంటి ఆర్తితో జీవితం సమాప్తం కావడం పవిత్రతకు, నిర్మలత్వానికి నిదర్శనం. బలవంతం మీద కాకుండా ఆ దృష్టి దానంతట అదే రావాలి".

(స.సా. మే 2000 పు.139/140)

(చూ॥ కొండమరాజు, ప్రవేశము)

ఈశ్వరస్మరణ

(చూ॥ స్వధర్మాచరణ)

ఈశ్వరార్పితం

ఈశ్వరార్పితం చేస్తే మీ కార్యక్రమాలన్నీ పావనంకాగలవు. అన్ని కార్యకలాపాలకు భగవంతుడే ప్రేరకుడు. తగిన శక్తియుక్తులు ప్రసాదించి పనులు జరిపించేది ఆయన. పనులవల్ల కలిగే ఫలమును ఆస్వాదించే భోక్త ఆయన. అన్ని కర్మలకూ ఆయనే కారకుడు. సర్వమూ ఆయనదే. నాది అనేది లేనేలేదు అనే దృష్టితో చేసేకర్మ లన్నిటినీ ఆయనకు నివేదించే స్వభావం మీకు ఏర్పడాలి. మీరు నిర్వర్తించే సమస్త కార్యకలాపాలనూ నడిపించేవాడు ఆయనే అన్న విశ్వాసబలంతో పనులు చేయటమే మీవంతు.

(వ 1963 పు.154/155)

ఈశ్వరుడు

ప్రతి మానవుని యందునూ ఒక 'విశ్వాసం' ఉన్నది. ఆ విశ్వాసమే లేకుండిన దేనినీ ఆశించలేడు. కనుక ప్రతి ఒక్కరూ ఆ విశ్వాసమును అభివృద్ధి పరచుకోవాలి. **"ఈశావాస్యం మిదం జగత్"**. ప్రతి జీవి ఈశ్వర స్వరూపమే.

"ఈశ్వర సర్వభూతానాం" ఈశ్వరత్వం అన్ని జీవులలోనూ చైతన్యంతో కదులుతునే ఉన్నది. **'ఈశ్వరుడు' అనగా ఏమిటి?** సకల ఐశ్వర్య స్వరూపుడే. ఇది ఆరు రకముల గుణములతో కూడి ఉంటున్నది. **1. ఐశ్వర్యము 2. దానము 3. యశఃస్సు 4. జ్ఞానము 5. రసము 6. ఆనందము - ఈ ఆరింటి తత్త్వములనే 'ఈశ్వరత్వము'** అంటున్నారు. కనుకనే 'షడ్ఐశ్వర్య స్వరూపుడు' ఈశ్వరుడు అన్నారు. ఇతనినే 'శంకర' అని పిలుస్తూ వచ్చారు. **'శం' అనగా చిదానందం,** ఆత్మానందం, **'కర' అనగా అందించేటటువంటివాడు. ఆత్మానందమును, చిదానందమును అందించేటటువంటి వాడు 'శంకరుడు'** . కనుక దైవత్వముతో అన్ని రకముల నామముల స్వరూపం కూడనూ ఇమిడి ఉంటున్నది. ప్రతి మానవుని యందునూ ఈశ్వరత్వము అనేది తాండవమాడుచున్నది.

(శ్రీ.ఏ. 2002 పు.22)

ప్రేమస్వరూపులారా! ఈ రాత్రి అంతా చక్కగా నామస్మరణ చేసి, పవిత్రమైన శక్తినంతా ప్రపంచానికి ప్రసరింపజేయండి. అదియే ఈశ్వరత్వానికి సరియైన గుర్తు. **గాలివలె సంచరించేవాడు 'ఈశ్వరుడు'. గాలి ఏ విధంగా సర్వత్రా సంచరిస్తుంటుందో, అదే విధంగా ఈశ్వరుడు సంచరిస్తుంటాడు.** కనుక మీ ప్రేమను ప్రపంచమంతా ప్రసరింపజేయండి. 'నామస్మరణ'ను ప్రపంచంలో చక్కగా ప్రచారం చేయండి!

(శ్రీ.ఏ. 2002 పు.24)

(చూ॥ కాలస్వరూపుడు, బ్రహ్మవిద్య, భగవంతుడు, వరలక్ష్మివ్రతము, సంవర్కము, శంఖనాదము, హిమాచలం)

ఉగాది

(చూ॥ నాల్గుయుగాలు)

ఉత్తమపుత్రుడు

ఉత్తమపుత్రుడున్నప్పుడు తన కుటుంబమే కాక, వంశమునకు కూడా చక్కని గౌరవమర్యాదలు చేకూర్చుకుంటాడు. ఒక పరిమళ వృక్షము వనమున ఉన్నప్పుడు వనమున కంతటికి పరిమళాన్ని అందిస్తూ ఉంటుంది. అదే వనమునందు ఒక చెట్టు తొఱ్ఱలో అగ్ని ప్రవేశించినప్పుడు ఆ చెట్టును కాల్చడమే కాకుండా వనమును కూడా కాల్చి వేస్తుంది. కనుక **వంశమునందు దుష్ట పుత్రుడు పుట్టినపుడు మంచి వారికి, చెడ్డవారికి అపకీర్తి కలిగిస్తాడు.** మంచి పుత్రుడు జన్మించినపుడు తన వంశమునకు, తన గృహమునకు, తనతోటి వారికి కూడా సత్కీర్తి నందిస్తాడు. ఈనాడు గుణవంతుడైన పుత్రుని కనటము, పోషించటము జగత్తునకు అందించటము అత్యవసరము. **ఇది ఎవరి బాధ్యత? తల్లి తండ్రులది, అధ్యాపకులది కూడా.**

(స.సా.అ. 89 వెనుక కవురు పుట)

ఉత్తమమైన మానవుడు

చందనపు కట్టను అరగదీసిన కొలది అది పరిమళం వెదజల్లుతుంది. చెఱుకును బాగా నమిలిన కొలది అది మధురమైన రసమును అందిస్తుంది. బంగారమును నిప్పులో వేసి బాగా కాల్చిన కొలది అందులోని మాలిన్యము తరిగిపోయి అది ప్రకాశవంతమైన అపరంజిగా రూపొందుతుంది. అదే విధంగా, **ఉత్తమమైన మానవుడు** తాను ఎన్ని కష్టనష్టములకు గురియైనప్పటికీ తన యొక్క **నైతిక విలువను కోల్పోక, ఆదర్శవంతుడుగా రాణిస్తాడు.**

(ప. పు.125)

ఉత్తముడు/ఉత్తములు

(చూ॥ ఆదర్శమూర్తులు, మంచివాడు)

ఉత్తరమీమాంస

(చూ॥ పంచమవేదము, వేదము)

ఉత్తరాయణపుణ్యకాలం/ఉత్తరాయణము

ఉత్తరాయణపుణ్యకాలం/ఉత్తరాయణము

ప్రాణము వదులుటకు ప్రాణము పుట్టుటకు కూడనూ పవిత్రకాలము ప్రామాణము, ప్రధానము బావా! యోగులు పవిత్ర కాలము వచ్చు నపుడే ప్రాణము వదలుదురు. అందుకనే **"మంచివారికి మరణమే సాక్షి"**అని అందురు, మరణమునకు కూడా మంచికాలము అవసరము. ఇట్లు వచించిన శ్రీకృష్ణుని మాటలనే ఆధారముగా చేసుకుని అర్జునుడు క్రింద ప్రశ్న అడిగినాడు.

"కృష్ణా! **యే కాలమున దేహమును వీడిన పునర్జన్మము ఉండదో, యే కాలమున ప్రాణము విడచిన పునర్జన్మము కలుగునో దానిని నాకు తెలుపుము,"** పార్థా! నీవు అడిగిన ప్రశ్న, ఈ సమయమున చాలా అవసరమైనది. ఒక్కొక్క సమయమున నీ తెలివితేటలు నాకే ఆశ్చర్యమును ఆనందమును కలిగించును. మరొక సమయమున అసహ్యమనిపించును. అజ్ఞానమని తలంతును. దీనికి కారణము నీ అభిమాన మమకారములే అజ్ఞానపు గుర్తులు. పోనీ! తిరిగి ఆ విషయము చూచుకొందుము.

నీ ప్రశ్నకు జవాబు వినుము. నిష్కామకర్మయోగులు, ఉపాసకులు, అగ్ని జ్యోతిస్సు, పగలు, శుక్లపక్షం; ఆరునెలలు ఉత్తరాయణ కాల మార్గమున ప్రయాణము చేస్తూ బ్రహ్మమును పొందుదురు. వీరికి మొదటి మజిలి అనగా మొదటి స్థానము అగ్ని. **దీనినే దేవయాన మనికూడ అందురు. ఈ అగ్నినే వేదములలో అర్చి అంటారు, అర్చి రాది మార్గమని కూడనూ అంటారు.** వీరు ప్రకాశములో ప్రారంభమై ప్రకాశములోనే ప్రయాణము సలిపి ప్రకాశ మందే చచ్చుదురు. వీరు **తిరిగి జన్మమెత్తరు. ఇట్టివారికే బ్రహ్మప్రాప్తి.**

"ఇక రెండవవారు సకామ కర్మయోగులు; దేహమును వదలి ధూమము, రాత్రి, కృష్ణపక్షం, ఆరునెలలు దక్షిణాయనము, ధూమాది మార్గమున ప్రయాణము సలిపి, స్వర్గలోకం చేరి భోగములు అనుభవించి పై చెప్పిన విధముగా ఆ పుణ్యము నశించగనే పునర్జన్మ మెత్తుచున్నారు. అయితే ఈ యిద్దరినీ యోగులనే చెప్పవచ్చును. ఈ రెండు మార్గములు అనాదికాలము నుండీ వచ్చుచున్నవి. జగత్తునందు ఇవి శాశ్వతముగా నిలిచి యుండును. ఎంతవరకని? నీకు సంశయము రావచ్చును; బావా! ఉపాసకులు, **కర్మాధికారులు ఈ లోకమున యెంతకాలం ముందురో ఈ మార్గములు కూడనూ అంతకాల ముండును"** అన్నాడు కృష్ణుడు.

ఇచ్చట మనము కొంత యోచించ వలసి వచ్చును. ఏమన, శుక్లపక్ష దేవతా అనుగ్రహము కానీ, కృష్ణపక్ష దేవతా అనుగ్రహము కానీ ఉన్నదని యెట్లు తెలియును? ఈ రెండు పక్షములకూ మధ్య లోను, రెండు వేళలకూ సంబంధములేని కాలములోను, దేహమును వీడిన వారికి యేలోకము? వారిగతేమి? స్థితేమి? అని సంశయము సరియైనదే, సర్వులకూ ఇది తెలిసికొన వలసిన విషయమే. ఇపుడు శుక్లపక్షమన్న యేమో విచారింతము. చంద్రునియొక్క ప్రకాశము, దిన దినమునకు వృద్ధిపొందు కాలమును శుక్లపక్షమని అందురు. అట్లయిన దానికినీ మానవుని మరణమునకూ ఎట్టి సంబంధమని సంశయింతురేమో! చంద్రునకూ మనసునకూ ఎట్టి సంబంధమని సంశయింతురేమో! చంద్రునకూ మనసునకూ సన్నిహిత సంబంధము కలదు. చంద్రుడు మనసునకు సంకేతం **'చంద్రమా మనసోజాతఃచక్షో సూర్యో అజాయతః'**, అన్నట్లు మనము అంతరార్థమును విచారించిన స్థూల చంద్రుని ప్రకాశము దిన దినమునకు వృద్ధికాంచి నటులనే, మనసులోని పవిత్రమైన దైవీభావములు దిన దినమునకు వికసించి అంత్యకాల మప్పటికి, అనగా దేహమును విడచునప్పటికి పూర్ణత్వము నొందినవైన అట్టి పవిత్రమైన కాలమును శుక్లపక్ష దేవత యొక్క అనుగ్రహమనే తలంచవచ్చును.

అది బాహ్యరూపమున ఏ కాలమైననూ కావచ్చును, అది పవిత్ర కాలమే; అందులో సందియము లేదు. దేహమునకు పవిత్ర కాలము స్థూల చంద్రుని ప్రకాశము, మనస్సుకు పవిత్రకాలము దైవభావన వికాసమే సరియైన ప్రకాశము. ఈ స్థూల సూక్ష్మ సంబంధమైన భావముల రెండింటినీ

యోచించుట సాధకులకు సరియైన భావము. అభివృద్ధికినీ అది చక్కని మార్గము.

తరువాత ఉత్తరాయణమని కూడనూ అందురు. దానికి అర్థమేమో విచారించిన ఆ సందియం తీరును! విషయం తెలుసు. తెలిసిచేయు పూజ, తెలిసి చేయు సాధనా హృదయమును శుద్ధిచేయును. సంశయమును బద్ధకమును వీడును. ఉత్తరాయణమన్న నిర్మల ఆకాశమని అర్థము. అనగా ఆకాశమున మేఘములు, మబ్బులు, మరేవిధమైన ధూమములు లేక, రాక, **సూర్యుడు స్పష్టంగా ప్రకాశించే సమయమునే ఉత్తరాయణమని అందురు.** ఇది స్థూలార్థము. అనగా దేహసంబంధమైన కాలనిర్ణయం.

ఇక సూక్ష్మమైన అంతర్‌భావ మెట్టిదని విచారించిన, మానవహృదయమే అంతర్ ఆకాశము. ఆ హృదయా కాశమున అజ్ఞాన, అభిమాన, మమకార మేఘములు లేక, జ్ఞానసూర్యుడైన బుద్ధి ప్రకాశించు చుండుట. అనగా నిశ్చలమైన బుద్ధియే ప్రకాశించు చుండుట. అనగా **నిశ్చలమైన బుద్ధియే ప్రకాశ సూర్యుడన్న మాట. అట్టి శుద్ధబుద్ధి మమకార అజ్ఞానములకు చిక్కువడక నిర్మల హృదయమున స్థిరమగుటే, ఉత్తరాయణమని తలంచ వలెను. అది యేకాలమైననూ సరే, అట్టి సమయమున దేహమును వీడిన వారు ఉత్తరాయణ కాలమున దేహమును వీడినవారే అనవచ్చును.**

జ్ఞానమునే సూర్యుడని అందురు. జ్ఞానభాస్కరుడని శుద్ధిబుద్ధికి పేరు.ఈ విధమైన స్థితిలో ప్రయాణము చేసిన వ్యక్తికి పునర్జన్మము లేదు. దీనినే అర్చిరాది మార్గమని కూడా అందురు. ఇట్టివారు బ్రహ్మమును చేరిపోదురు. ఇక దక్షిణాయన మన్న పై రెండింటికి పూర్తి విరోధమైనది. అనగా, ఆకాశమందు దట్టమైన మబ్బులూ మేఘములూ సంచరించుచు ధూమముతో ఆకాశము కప్పబడి, సూర్యుడు స్పష్టముగా కనుపించక, ప్రకాశించక యుండుట. ఇక కృష్ణపక్షమన్న చంద్రుడు దిన దినము నకు క్షీణించు కాలము.

దీనినే సూక్ష్మరీతిగా తెలుపవలెనన్న మనసునందలి దైవీభావములు దిన దినమునకు క్షీణించుచుండుట. **అంత్యకాలమప్పటికి అమావాస్య చంద్రునివలె హృదయాకాశమున కనుపించక ధూమముతో చీకటితో అనగా పూర్ణ అజ్ఞానస్థితియందున్న సమయము. దీనినే కృష్ణపక్షమని అందురు. అట్టి సమయమున దేహమును వీడినవానికి ధూమమార్గమే అనగా తిరిగి జననమరణ ప్రాప్తి యే సిద్ధించును.**

(గీ.పు.154/158)

ఉత్తరాయణ మార్గము పవిత్రమైన జ్ఞాన ప్రకాశమగుటచే దానిని శుక్లమార్గ మనియును దక్షిణాయన మార్గము తమోమయమై జ్ఞానప్రకాశము కాక అంధకార మయమైనదగుటచేత దానినికృష్ణ మార్గమనియును చెప్పబడినది. మొదటి మార్గమైన శుక్లమార్గమున పయనము చేసినవారు అనగా, (శరీరమును వదలి వెళ్ళినవారు)జనన మరణములేక అనగా (తిరిగి దేహములు ధరించక) బ్రహ్మానంద నిలయమైన మోహరహితమైన స్థానమగు మోక్షమును పొందగల రనియు, రెండవ మార్గమయిన కృష్ణ మార్గమున ప్రయాణమయిన వారికి, (దేహమును వీడిన వారికి) తిరిగి జనన మరణ కారణమగు దేహము ప్రాప్తించుననియు తెలిసికొనవలెను.

జ్ఞానమైన స్వబోధమగు ప్రకాశముతో దేహమును విడిచిన వారు ఉత్తరరాయణ మార్గ ప్రయాణీకులనియు, ఆత్మజ్ఞానము లేక మూఢత్వముగా దేహమును విడచినవారు పితృయాన మార్గమున వెళ్ళిన వారనియు తెలియదగును. సత్యగుణమును నిర్మలమైన, ప్రకాశమైనదిగను, తమోగుణము అంధకారమును, కృష్ణవర్ణమును కూడినదనియు తలంచవలెను.

మరియును **ఇడా, పింగళ అను రెండు నాడులు కలవు; కుడి ప్రక్కనుండినది పింగళ అనియు, ఎడమ ప్రక్కన నుండుదానిని ఇడానాడి యనియును పిలుతురు. యోగి అయిన మహానుభావులు తమ యోగశక్తితో సూర్య**

ఉత్పత్తి

మార్గమయిన పింగళనాడి మార్గమున వెళ్ళుదురు. యోగ శక్తిలేక సామాన్యస్థితి గలవారు చంద్రమార్గ మనబడు ఇడానాడి మార్గమున వెళ్ళుదురు. ఇదియునూ మరొక అంతరార్థము.

(గీ.పు.159)

(చూ॥ హిమాచలం)

ఉత్పత్తి

(చూ॥ ఆత్మజ్ఞానము)

ఉత్సవములు

(చూ॥ శరన్నవరాత్రులు)

ఉద్ధవుడు

(చూ॥ భక్తిపరమావధి)

ఉదాసీనత

(చూ॥ అనపేక్ష, భక్తుడు)

ఉన్నతస్థాయి

ఉన్నతస్థాయికి కొనిపోయే మూడు w లు work-worship-wisdom.

(భ.ప్ర.పు.3)

ఉన్నతస్థాయికి పోవాలి

నీవున్న స్థానమును కాలమును పరిస్థితులను బట్టి అనాటి దేశకాలపరిస్థితులను స్మరించినచో రెండింటికి పొత్తు కుదరదు. అదే విధముగా ఈ వస్త్రము దేవుడు, ఈ ప్లేటు దేవుడు, ఈటంబ్లరు దేవుడు, ఈ టేబులు దేవుడు అని వస్త్రమును, ప్లేటును, టంబ్లరును, టేబులును దేవుని దగ్గరకు తీసికొనిపోవు. అందుకే "You may worship a picture as a God; but not God as a picture" అన్నారు. కాని ఆదేవుడే టేబులు, అదేవుడే ప్లేటు, ఆదేవుడే వస్త్రము, అని దేవుణ్ణి మాత్రము ఈస్థానానికి దింపకండి. అదేవిధముగా నీవు కృష్ణుని విశ్వసించాలె, కృష్ణుని ఆదర్శాన్ని నీవు అనుసరించాలె అని అనుకున్నప్పుడు నీవు కృష్ణుని దగ్గరకు పో. నీభావములు కృష్ణునితో చేర్చు, నీ తలపులంతా భారతముతో చేర్చు. అప్పుడే భారతముయొక్క స్వరూపాన్ని నీవు గ్రహించటానికి అధికారము ఏర్పడుతుంది. - నీవు ఎప్పుడు ఉండవలసినది ఉన్నతస్థాయిలోనే. "Be on, not be low " కనుక నీవు ఉన్నత స్థాయికి పోవలె ననుకొన్నచో పవిత్రచరిత్రలు పఠించునప్పుడు ఉన్నత భావముల స్థాయికే వెళ్ళవలెను.

(నీ.వే. పు.95/96)

ఉన్నతుడు

(చూ॥ మానవత్వము)

ఉన్నది ఒక్కటే

(చూ॥ ఒక్కటే)

ఉన్నాడయా

"ఉన్నాడయా దేవు డున్నాడయా
కన్నులకు కనిపించకున్నాడయా
లోకాల చీకట్లు పోకార్చ రవిచంద్ర
దీపాలు గగనాన త్రిప్పుచున్నాడయా
లక్షలాదిగ నున్న నక్షత్రముల నెల్ల
నేలరాల్పక మింట నిల్పు చున్నాడయా
జీతబత్తెము లేక ప్రీతితో నరులకు
గాలికోసం తానే విసరేనయా
ఆధారమే లేక అల్లాడుచున్నట్టి
ఆకాశమును ఆపుచున్నాడయా
పొంగిపొరలుచు వచ్చి భూమిపై
పడకుండా కడలి కాళ్ళు విరిచాడయా

ఉన్నాడయా దేవుడున్నాడయా
కన్నులకు కనిపించకున్నాడయా
కనిపించక ఏమి చేస్తున్నాడయా?
తెరచాటు తా నుండి, తెరముందు ప్రజలనుంచి
తైతక్కలాడించుచున్నాడయా
కన్నులకు కనిపించకున్నాడయా.''

(దై. ది. పు.26)

ప్రేమస్వరూపులారా! అర్పితమనేది చాల కష్టమని భావిస్తున్నారు మీరు. కానీ నా దృష్టిలో భగవదర్పితంకంటే సులభమైనది మరొకటి లేదు. పుష్పముయొక్క రేకులను నలపడం చాల సులభం. కానీ అంతకంటే సులభమైనది భగవంతునికి అర్పితం చేయడం. ఇంత సులభమైన దానిని వదలిపెట్టి ఎందుకు కష్టాలకు గురి అవుతున్నారు? మీకు భగవంతునిపై విశ్వాసం ధృఢంగా లేకపోవడంచేతనే ఇది కష్టంగా తోస్తున్నది. **భగవంతుడున్నాడు. "ఉన్నాడయా దేవుడున్నాడయా", దేవుడు లేని స్థానం లేదు, దేవుడు కాని జీవుడే లేడు,** దేవుడు లేని పదార్థమే లేదు. ఈ సత్యాన్ని మీరు హృదయ పూర్వకంగా విశ్వసించినప్పుడు అర్పితము చాల సులభమవుతుంది. అట్టి విశ్వాసం మీలో లేకపోవడంచేతనే ఇది మీకు కష్టంగా కనిపిస్తున్నది. ప్రేమస్వరూపులారా! ప్రేమయే భగవంతుడని విశ్వసించండి. భగవద్విశ్వాసంతో ఎంతటి కఠినమైన కార్యమునైనా సులభంగా సాధించవచ్చు.

(స.సా.మా.99 పు.70/71)

ఉపకరణము

నామస్మరణ గొప్ప ఉపకరణము. అది నిజంగా మిమ్మల్ని రక్షిస్తుందని, మీకు ఆరోగ్యం చేకూరుస్తుందని మీరు నమ్మలేరు. అదే విచారకరమైన విషయము. మానవులు ఖరీదైన తళతళలాడే పాకెట్లలో ఉన్న మందులనే నమ్ముతున్నారు. అంతేగాని సులభంగా లభించే, అందరి దగ్గర ఉన్న చక్కని ఔషదాన్ని పనికిరానిదిగా భావిస్తున్నారు. **నిజంగా మీకు నామం మీద నమ్మకం ఉన్నట్లయితే మీ కోరికలు నాకు చెప్పుకొనే అవకాశం కోసం సతమతం కానక్కరలేదు. వాటిని మీరు నాకు చెప్పకుండానే నేను తీరుస్తాను. రామదాసు మీవలె వరండాలో సీటు కోసం, ఇంటర్వ్యూ అవకాశం కోసం ఎదురుచూశాడా? భగవంతుడే అతనికి కావలసినవాటిని అతని తలుపు దగ్గరకు తీసికొనివెళ్ళాడు.** నెరవేరినంత మాత్రంలో కోరిక నశించిపోదు. విత్తనం వలె అది అనేకరెట్లు అవుతుంది. ఒక గింజ నాటితే వృక్షం అవుతుంది. దానికి కొన్ని వేల గింజలు పుట్టటంవల్ల అవి మరల వృక్షాలై అడవి ఏర్పడుతుంది. వాటన్నిటికి లక్షల గింజలు పుట్టి దట్టమైన కీకారణ్యం తయారవుతుంది. **కోరికలు కూడా అంతే.**

(స. వ. 61-62 పు. 164/165)

ఉపకారం

(చూ॥ దైవస్వరూపులు)

ఉపదేశం

ఉపదేశమనగా - "ఓం నమశ్శివాయ, ఓం నమో నారాయణాయ'' అనే పంచాక్షరి కాని, అష్టాక్షరి కాని ఉపదేశించడం కాదు. ఉపదేశమునకు రెండు అర్థములుంటున్నవి. ఒక వ్యక్తిని స్వస్థానమునకు చేర్చడమే ఉపదేశము. రెండవ అర్థమేమనగా "నేను ఆత్మకు భిన్నంగా ఉన్నాను.'' అనే భావంతో కూడిన వానిని "నాయనా! ఆత్మ నీ కంటె భిన్నము కాదు. నీవే ఆత్మ!'' అని అతనికి స్వస్వరూప సందర్శనమును నిరూపించడమే ఉపదేశము.

(శ్రీ భ. ఉ. పు.170)

ఉపనిషత్తులు

ఇవి విద్యావివేకాదులచే సాధించగలిగినవి. సాధించ దగినవి. ఇవి ధర్మార్థ కామమోక్షములను నాలుగు పురుషార్థములతో కూడినవి. **విద్యలలో కూడా పరవిద్య అని, అపరవిద్య అని రెండుగలవు. నాలుగు వేదములు అపరవిద్యలే. అందులో మూడు అనగా ధర్మ, అర్థ**

ఉపప్రాణములు

కామములవలన పురుషార్థములు సాధించుకొనవచ్చును. ఉపనిషత్తులలో చెప్పిన పరవిద్య ద్వారా, నాలుగవదయిన మోక్షము సాధ్యము.

(లీ. వా. పు. 7)

"కాండత్రయాత్మకం వేదం" అన్నట్లు వేదమువలెనే ఉపనిషత్తులు కూడా కాండత్రయాత్మకమై యున్నవి. జ్ఞాన కాండ, ఉపాసనాకాండ, కర్మకాండములు ఇందులోకూడా కలవు. ఈ మూడు పవిత్ర కాండములూ ఒక్కొక్కటి దృష్ట్యా అద్వైత విశిష్టాద్వైత మతాలను సమన్వయించుచున్నవి. "ఉపనిషత్తు" తో స్థితిరూప నిష్ఠను, "బ్రహ్మవిద్య" తో నిదిధ్యాసమును, "యోగశాస్త్రము" తో మననమును గ్రహింపవలెను. ఇన్నింటిమూలమున చేయునదేది? తెలిసికొనునదేది? అది తన నిజస్థితినే. తన స్వరూపమునకు ఏయే ప్రాప్తిని చేకూర్చునో, యెట్లు చేకూర్చునో సంపూర్ణ అర్థముతో ఇచ్చుటవలన, **ఉపనిషత్ అని పేరు వచ్చినది.** అసలు ఉపనిషత్ యొక్క అర్థము కడు సారవంతము. **"ఉప" అనగా సమీపములో, "ని" అనగా నిష్ఠతో శ్రవణము చేసినవారి అజ్ఞానమును శిథిలముచేసి, షత్ అనగా పరమాత్మ ప్రాప్తిని చేకూర్చుట. ఈ కారణములను పట్టి ఉపనిషత్తులని పేరువచ్చినది.** ఉపనిషత్ కేవలము విద్యను బోధించుటే కాక ఆ విద్యను ఆచరణలో పెట్టే ప్రక్రియను కూడా బోధించుచున్నది. ఏకర్మ విధిధర్మముగా చేయవలెనో తెలుపుటే కాక, యే కర్మ చేయదగినదో, యే కర్మ చేయరానిదో అను విషయమునుకూడా తెలుపుచున్నది. అసలు గీతను తీసికొన్న ఉపనిషత్ సారమే కదా? ఉపనిషత్ శ్రవణముద్వారా కలుగవలసిన ఫలితము గీతాబోధ ద్వారా అర్జునునకు కలిగినది. ఉపనిషత్తులలోని "తత్త్వమసి" గీతలో "పాండవానాం ధనంజయ" అను వాక్యముగా బోధింపబడినది. అనగా పాండవులలో ధనంజయుడవైన నీవే నేను అని కృష్ణపరమాత్మ జీవేశ్వర ఐక్యాన్ని తెలిపెను.

(ఉ. వా. పు.2/3)

(చూ॥ ధర్మము, నాద బిందు కళలు, బుద్ధి, భగవద్గీత, విద్య, వేదము, వేదాంతము, సంపర్కము, స్వస్థానము)

ఉపప్రాణములు

నాగ, కూర్మ కృకర, దేవదత్త, ధనంజయాలని ఉప ప్రాణముల పేర్లు కలవు.

నాగవాయువు త్రేపులను కలిగించును, కూర్మవాయువు వలన రెప్పపాటు సంభవించును, కృకర వాయువువలన తుమ్ములు వచ్చును. దేవదత్త వాయువువలన ఆవులింతలు కలుగును, ధనంజయ వాయువు శరీరమంతటినుండి దేహమును స్థూలముగా చేయును. ఇంతేకాదు దేహము మరణించిన తర్వాతకూడా దేహములో నిల్చియుండి కళేబరాన్ని వుబికించును. ఇట్లు పంచప్రాణములు, ఉపప్రాణములు కలసి ప్రాణమయకోశ మనబడును.

(ప్ర.శో.వా. పు.28)

ఉపయుక్తమైన సాధన

శస్త్ర వైద్యుడు కత్తి నుపయోగించును. అట్లే ఒక దుష్టుడు కూడా కత్తి నుపయోగించును. శస్త్ర వైద్యుడు కత్తితో పెట్టు గాటు వ్యక్తికి మంచిని చేకూర్చును. కాని దుష్టుడు తన కత్తిని దుష్కార్యముల నిమిత్తమై ఉపయోగించును. ఒక కసాయివాడు మాంసమును నరుకుటకై కత్తి నుపయోగించును. ఒక గృహిణి పండును కోయుటకు కత్తి నుపయోగించును. ఈ కత్తుల నన్నిటినీ ఒక వలయాకారములో ఉంచి మధ్యలో అయస్కాంతము నుంచిన, అన్ని కత్తులూ సమానముగా ఆయస్కాంతముచే ఆకర్షింపబడును. **మంచి, చెడు ఆ కత్తులలో లేవు. భగవంతుడు అయస్కాంతము వంటివాడు. అందరూ భగవంతునిచే ఆకర్షింపబడుదురు. మంచి, చెడు మానవులలో లేవు. అవి మనస్సును ఉపయోగించు విధానము పైన ఆధారపడి యున్నవి.**

ప్రపంచము వేనిని దుష్కార్యములుగా పరిగణించునో, ఆ చర్యలను ప్రేరేపించు ఆలోచనలతో నీ మానసమును నింపవద్దు. ప్రతి వస్తువులోనూ దివ్యత్వమును చూడగలుగు విధముగ **మనస్సుకు శిక్షణ ఇచ్చుటయే అన్ని సాధనల పరమోద్దేశ్యము. అదే యథార్థమైన "ఉపయుక్తమైన సాధన."**

దీనిని నీవు చేయు ప్రతిపని యందునూ ప్రవేశపెట్ట వచ్చును.

(ప. పు.286/287)

ఉపరతి

(చూ॥ ఆథాతోబ్రహ్మజిజ్ఞాస)

ఉపవాసము

''ఉపవాసం చెయ్యడమంటే ఇంద్రియనిగ్రహం అలవరుచుకోవటం, భగవంతునికి దగ్గరవడం అని అర్థం. అంతేకాక మహమ్మద్‌కు పవిత్ర ఖురాన్‌ను బోధించిన మాసం రంజాన్ మాసం''.

(స.శి.సుం.నా.పు. 71)

(చూ॥ సనాతన సాంప్రదాయములు)

ఉపాదానకారణము

(చూ॥కారణములు, హేమత్వావచనాచ్చ, సంపర్కము)

ఉపాధ్యాయుడు/ఉపాధ్యాయులు

ఉద్యోగులందరికన్నా ముఖ్యంగా ఉపాధ్యాయుడు సత్యంగా ప్రవర్తించాలి. లేకపోతే సంఘం చెడిపోతుంది. ప్రపంచానుభవంలేని పిల్లలు అతని చేతులలో వేలాదిమంది ఉంటారు. వారి లేత మనస్సులపై అతని ఉపదేశ ప్రభావాలు ఎక్కువగా ఉంటాయి. అందువలన ఉపాధ్యాయునికి దురలవాట్లు ఉండరాదు; ఎందుకనగా పిల్లలు పెద్దవాళ్ళను చూచి అలవాట్లను అవలంబించే ప్రమాదము ఉన్నది. ఒక్కొక్క ఉపాధ్యాయుని దగ్గర తయారయ్యే విద్యార్థులు కొన్ని వేలమంది ఉంటారు. వారందరికీ ఆ చెడ్డ అలవాట్లు అలవడితే సంఘం చెడిపోతుంది. క్రమంగా సంఘంలోని దురలవాట్లు ఇంకో విధంగా ఉపాధ్యాయుణ్ణే బాధిస్తాయి. నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష. తన విద్యార్థులచేతనే ఉపాధ్యాయుడు ఒకానొకనాడు వెక్కిరింపబడతాడు.

(వి.వా. పు.30/31)

ఒక విద్యార్థి చెడిపోతే, ఒక్క విద్యార్థే అనుభవిస్తాడు. ఒక ఉపాధ్యాయుడు చెడిపోతే చాలమంది విద్యార్థులు చెడిపోతారు.

(సా. పు 636)

ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైన వృత్తి. ఆత్మజ్ఞానమును సంపాదించడానికి కూడా ఇది పరమ పవిత్రమైన సాధనముగా ఉపయోగపడుతుంది. నిస్వార్థప్రేమను అలవరచుకోవడం, దానిని ఇతరులపై ప్రసరింపజేయడం. వారితో కలసి పంచుకోవడం ఈ సాధనలో అంశములు, ఉపాధ్యాయుడు భావిపౌరులను ఆత్మవిశ్వాసము, ఆత్మప్రకాశము, ఆత్మచైతన్యముగల వ్యక్తులుగా తీర్చి దిద్దాలి. ఉపాధ్యాయుడు ఆనందమయమైన గృహములను, సిరిసంపదలతో తులతూగే సమాజములను, శాంతియుతమైన జాతులను తీర్చిదిద్దే శిల్పకారుడు. పెద్దవాళ్ళు, ఉపాధ్యాయుల అలవాట్లను, నడవడికను, ప్రవర్తనను, వారి నమ్మకములను పిల్లలు పుణికి పుచ్చుకుంటారు. అందువలన ఉపాధ్యాయులు ఎల్లప్పుడు ఆదర్శవంతమైన జీవితమును గడపాలి. వినయము, నిరాడంబరత, నైతిక విలువలు, నిజాయితీ - వీటిలో అతడు ఇతరులకు ఆదర్శమూర్తిగా ఉండాలి. తద్వారా అతడు బోధించే విద్య అత్యుత్తమ మైనదిగా ఉంటుంది. అటువంటి ఉపాధ్యాయుల శిక్షణలో పెరిగిన పిల్లలు వారి వారి యిళ్ళలోను, సమాజములోను కూడా ప్రేమజ్యోతులై ధైర్యసాహసాలు, సుఖ సంతోషాలను వెదజల్లే ఆశాజ్యోతులుగా నిలుస్తారు. అటువంటి జ్ఞాన జ్యోతులు ఎల్లప్పుడు వెలుగుతూండుగాక! వాటి దివ్యకాంతి ఎల్లప్పుడు ప్రకాశవంతమై నిలుచుగాక! ఉత్తములైన ఉపాధ్యాయులు, ఉత్తములైన విద్యార్థులు కలసి ఉత్తమమైన జాతిని నిర్మించగలుగుతారు.''

(ధై. ది. పు. 377/378)

(చూ॥ ఆదర్శ మార్గము, విద్యార్థులు)

ఉపాసన/ఉపాసనలు

వైదికోపాసన : ఇది నాలుగు విధములుగ వున్నది. (1) సత్యవతి (2) అంగవతి (3) అన్యవతి (4) నిదానవతి అని.

"సర్వవ్యాపిన మాత్మానం క్షీరేసర్పిరివార్పితమ్" పాలలో నెయ్యి కలసివున్నట్లే ఆత్మ సర్వవ్యాప్తమై ఉన్నదనే భావముతో చేసే సాధనే **సత్యవతీ ఉపాసన** అంటారు. **"మాయాతీత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా"** నేనీ సమస్తంలో అవ్యక్తంగా వ్యాపించివున్నాను. నన్ను అంతటా నాలో అంతటినీ చూస్తూ ఉండే సత్యవతి ఉపాసకునకు నేను కనిపించకుండా ఉండను. నాకు ఆ ఉపాసకుడు కనుపించకుండా ఉండడు అంటూ ఉన్నాడు మాధవుడు. **ఆ సర్వాత్మనే నిప్పు, గాలి, సూర్యుడు, చంద్రుడు (మొదలైన వన్నీ) అనే భావముతో చేయబడే అంగవతీ ఉపాసన.** ప్రాణరూపమై అందరికీ ఆత్మీయమైన ఆ గాలి అన్నింటినీ వెలిగించు అగ్ని ప్రాణములకు వివిధ జీవనాధారములైన అన్నము ఉత్పాదనచేయటానికి కావలసిన వరుణ (వర్షము) అని పరమాత్మను పొగుడుట **అంగవతీ ఉపాసన.**

"శంఖచక్రగదాపాణి" అని విష్ణువును, "ఏకదంతగజాననా" అని విఘ్నేశ్వరుని, "శూలపాణి" అని ఈశ్వరుని, "కోదండపాణి" అని రాముణ్ణి, "శిఖిపింఛమౌళి మురళీధర" అని కృష్ణునీ, "వీణాపాణి" అని సరస్వతిని ఇలా ఆయా **దేవతల చిహ్నములను ధ్యానపూర్వకంగా మనస్సును తన్మయము చేసుకొని హృదయంలో ఆరాధిస్తూ ఉండటం అన్యవతీ ఉపాసన** అని అందురు.

"శ్రవణం, కీర్తనం, విష్ణోస్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం తన్మయాసక్తి, పరమ విరహాసక్తి" అని పదకొండు **భక్తిసాధనలు కూడా నిదానవతీ ఉపాసనలో చేరును.**

సత్యవతీ, అంగవతీ, అన్యవతీ. నిదానవతీ ఉపాసనలు అనుక్రమేణా ఒకదానికంటే ఒకటి అత్యుత్తమ స్థితికి కారణా లై విశ్వనియంతతో తాదాత్మ్యాన్ని ప్రసాదిస్తాయి. **ప్రతీకోపాసన** అని మరొకటి ఉన్నది. అది అంగవతీ ఉపాసన లాగానే. ప్రతిరూపోపాసన: - "సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖమ్", ఆత్మయైన మాధవునికి అంతటా చేతులూ, కళ్ళూ; చూస్తాడు, ఆలోచిస్తాడు, తింటాడు, వింటాడు. **సర్వోన్నత ఆదర్శభావముతో ప్రతిరూపోపాసన జరుగుతూ వుంటుంది.**

భానోపాసన: - మంచి గుణములన్నింటినీ మాధవుని లో అమితంగా వుండినట్లు చూడటమే.

గీతోపాసన: - భారతం పంచమ వేదం. అది ఐహిక అముష్మిక ధర్మాలనిధి. మాధవుడు భారతదేశ ధర్మక్షేత్ర రంగస్థలంలో తన నాటిక సామగ్రిని దింపుకొని ఆడిన అద్భుతమైన ఆట, మహాభారతము. భారత నాటకానికి పాత్రధారులును, మాటలను, పాటలను సమకూర్చిన రచయిత, నటకుడు, దర్శకుడు, నిర్మాత అంతా ఒక్క మాధవుడే. ఒకవైపున అధర్మవృద్ధమైన అపార భౌతిక బలం, మరొకవైపున ధర్మవృద్ధమైన పరిమిత ఆత్మబలం. ఈ రెంటిఘర్షణలో పర్యవసాన రూపమైన ధార్మిక విజయ జ్యోతిగా తనను నిర్దేశించుట, ఇదే భారతామృత సర్వస్వం, అదే భగవద్గీత. మహాభారత సారాంశమంతయూ భగవద్గీతలో ఉన్నది. **"కరిష్యే వచనం తవ" నీవు చెప్పినట్లే చేస్తాను. "స్వధర్మే నిధనం శ్రేయుః"** ఇదే ఐహిక తత్వానికి గీటురాయి. సర్వశ్రేయస్సులను ప్రవహించే భక్తిని నిర్లక్ష్యము చేసి కళ్ళు మూసుకొని "అహం బ్రహ్మాస్మి" అనే అహంకారముతో బాధపడే నకిలీ బ్రాహ్మలకు క్లేశమే ఫలితము. పొట్టదంచితే బియ్యము రాదుకదా: **అసలుబ్రహ్మయే కృష్ణుడు.**

అద్వైతోపాసన ఆదిశంకరులు - ఆవు శరీరములో పాలు ఉన్నాయి. ఆపాలలో నెయ్యి ఉన్నది.అయినా ఆ నెయ్యితో ఆవుకు బలము రాదు. ఆ పాలను పితికి,కాచి, తోడుపెట్టి, చిలికి, వెన్నతీసి, కాచి, ఆ నెయ్యిని మళ్ళీ ఆవుకు త్రాపించిన బలము కలుగుతుంది. అలాగే సర్వేశ్వరుడు సర్వాంతర్యామి అయినా, సాధనోపచారములు లేకుండా, మానవులలో హితం చేయజాలడు. నువ్వులలో నూనె,

పెరుగులో వెన్న, భూమిలో నీరు, కట్టెలో నిప్పు కలసి వుండునటుల సర్వాంతర్యామి మానవుల శరీరములలోను, మనసులోను కలసివున్నాడు. వాటిని వేరుచేయాలంటే ప్రయత్నం, సాధన చేయాలి. అపుడు **ఆ రెంటి అభేదత్వం, అద్వైతం తెలుస్తుంది. అదే మోక్షం.**

విశిష్టాద్వైతం: - రామానుజుడు; ఉపాసించదగిన పరమాత్మను తనకు వేరుగా వున్నట్లు భావించాలా? లేక తనలో కలిసివుండినట్లు భావించాలా? సాధకునిది ప్రశ్న. ఇక జవాబు: - జీవుడు శరీరానికి ఆత్మ. అలాగే దేవుడు జీవునకు ఆత్మ. అలా భావించి ఉపాసించుటే రామానుజాచార్యుల విశిష్టాద్వైతోపాసన. ఈ సమస్తభూతజాలము ఎవనిలో ఉన్నాయో యెవరు ఈ సమస్తానికి అంతర్యామిగా వ్యాపించి యున్నారో ఆ పరమపురుష పరమాత్మ అనన్యభక్తి (ప్రపత్తి)తోనే లభ్యమవుతారు. అని పరజ్ఞాన ప్రపత్తిపూర్వకంగా పరమ పురుషోపాసన చేయటమే విశిష్టాద్వైతం. **"త్వమేవ సర్వం మమ దేవ దేవ", నీవే నాగతి, పతి అనే అనన్యభావంతో ఉపాసించుటే.**

ద్వైతోపాసన: - మధ్వాచార్యులు - పతిపత్ని సంబంధమే జీవాత్మ పరమాత్మ సంబంధంకూడా. అవ్యయుడైన విష్ణుభగవానుని భర్తగా **ద్వైతభావముతో ఉపాసించుట.**

చైతన్యోపాసన: - శ్రీకృష్ణచరణాసక్తి, భక్తిలేనిదే జీవన్ముక్తి మాట అటుంచి కనీసం బుద్ధి శుద్ధం కావటం కూడా అసంభవము అని అంటాడు చైతన్యుడు, మునులూ, ఆత్మారాములు అయినవారికి లౌకిక గ్రంథాలు లేక పోయినా సూదంటురాయిలాంటి శ్రీహరి కల్యాణ గుణగణ విశేషంవల్ల నిష్కామంవల్లా భక్తిపారవశ్యం వారికి కలుగుతూ వుంటుందట. ఆ పారవశ్యముతో సిగ్గూ, బిడియాలు వదలి బిగ్గరగా శ్రీహరి నామ సంకీర్తనం, చేస్తూ గగుర్పాటుతో, కంటిధారలతో నృత్యంచేస్తూ అసలైన ఆనందాన్ని అనుభవిస్తూ వుంటారు. శ్రీచరణులు ఈ విశ్వాన్ని పావనం చేస్తూవుంటారు. ఈ విధంగా పరానురక్తితో నామసంకీర్తనలలో, ప్రధానంగా కలిగింది. చైతన్యుల ఉపాసన, **నామసంకీర్తనలలో, తన్మయత్వంతో నృత్యం చేస్తూ తదాత్మ్యభావముతో నిలిచి వుండుట ప్రధానలక్ష్యము.**

గౌడీయోపాసన: - అవ్యక్త పురుషోత్తమ రూపములో కృష్ణపరమాత్మను, వ్యక్తపరాశక్తి ప్రకృతిరూపములో రాధను దర్శనము చేస్తూ ఈ కలిలో రాధామాధవ నామసంకీర్తన చేస్తూవుంటే పొందే ఆనందమే కేవలము మోక్షము అంటారు గౌడపాదాచార్యులు. ఆయన సనాతన గోస్వామి. ఆపరమాత్మ ఆనందరస స్వరూపుడు. ఆ రసాన్ని పొందితేనే ప్రాణికి నిజమైన ఆనందం కలుగుతుంది. అనే శ్రుతి వచనానుసారం - **ఆ రసానంద నిధిని అనుభవించాలంటే శ్రీ రాధామాధవ నామమే శరణ్యం అంటారు.**

నింబార్కాచార్యులు - ద్వైతోపాసనలో పురుషప్రకృతి సంబంధం వలెనే, జీవాత్మ పరమాత్మ సంబంధంగా భావించి ఉపాసించా లంటారు. వల్లభాచార్యులు. శుద్ధాద్వైతోపాసనలో **"కృష్ణస్తు భగవాన్ స్వయం" - కృష్ణభగవానుడు స్వయంగా పరమాత్మ. ఆ సర్వాత్మను పొందటమే శుద్ధాద్వైతమోక్షము.**

శైవోపాసన - "లింగం సర్వకాలం" పృథివ్యాధి తత్వాల స్థితి గతులకు మూలకారణమైన **లింగము.** అదే **పరమశివస్వరూపం. ఆ యిష్ట లింగప్రాప్తినే మోక్షము అని అంటారు.**

శివాద్వైతోపాసన - జీవాత్మ తనను కర్తగాను, భోక్తగాను భావించుకొని ప్రకృతి బద్ధుడు అవుతున్నాడు, శివప్రాప్తి కలిగితేనే జీవునకు మోక్షము కలుగుతుంది, అంటే, శివైక్యత కలుగుతుంది అంటారు. వీరశైవోపాసన - (జంగములు) **ఒక ఈశ్వరుడుతప్ప వేరు యేమీ లేదంటారు. ఈశ్వర విభూతిని (శక్తి) పొందటమే ముక్తి అంటారు.**

పాశుపతోపాసన - జీవుడు ప్రకృతి గుణాలనే పాశాలతో కట్టివేయబడిన పశువు. ఆ పశువుకూ, ఆ పాశాలకూ, ఆ ప్రకృతికీ నియంత పరమేశ్వరుడు. అందుకే **పశుపతిని పొందటమే ముక్తి అంటారు.**

శాక్తోపాసన : - "సర్వదేవమయీ దేవీ" ఆదిపరాశక్తి సర్వదేవమయి. ఈ వివిధ విచిత్ర రూపములకు నామములకు కారణమైన ప్రకృతియే మాయాశక్తి. ఈ శక్తి కలిగినవాడే మహేశ్వరుడు. ఈ జంట అవయవాలతో ఈ నింగి, నేల నిండిఉన్నై. **అవ్యక్తంగా పురుషరూపంలో వున్న పరమేశ్వరతత్వమే వ్యక్తంగా స్త్రీ రూపములో మాయగావున్న పరాశక్తి. ఆమే జగన్మాత. అమ్మలగన్న యమ్మ.** ఆ పరాశక్తి మనలో స్వాభావికమై తెలిపినా బలముగా, క్రియగా అనుభవమౌతుంది.

జైనోపాసన: - జైనులు (మార్వాడీలు) వైష్ణవ ప్రాధాన్యంగా వుంటుంది. శంఖచక్రధారుడైన విష్ణుభగవానుని ప్రతిమలు దేవాలయములలో పూజిస్తారు.

ణమో అరి హరితాణమ్ ణమో సిద్ధాణమ్:
ణమో అయిరియాణమ్ ణమో ఉనర్ఝాయాణమ్ఃి
ణమో లోప సబ్య సాహూణమ్
ఇవే జైనుల మంత్రాలు.

కామాది వైరులను జయించే మహావీరులకు, సిద్ధులకు, ఆచార్యులకు, ఉపాధ్యాయులకు **లోకములో వున్న సర్వసాధువుల కూ నమస్కారములు. ఈ పంచనమస్కారములూ పాపపరిహారం చేస్తాయి. ఈ మంత్రధారిణి సర్వశుభం. ఈ మంత్ర భావంలోనే ముక్తి పొందాలంటారు జైనులు.**

సిక్కులు: సాంప్రదాయోపాసన ఆత్మతత్వోపదేశాన్ని చేసే గరువునూ, ఆయన ఉపదేశాల సమ్మేళనమయిన "గ్రంథసాహెబు" నూ పూజిస్తూ, కీర్తిస్తూ ఉండటమే పరమధర్మం. భారతీయ సంప్రదాయంలో సిక్కు సంప్రదాయము అంతర్భావం.

క్రైస్తవోపాసన - ఏసుప్రభువే రక్షకుడు. తెలిసియో, తెలియకనో పాపాలు చేయటం మనిషికి పరిపాటి. మానవుల పాపాలను తొలగించి పరిశుద్ధులను చేయడానికి ఏసుప్రభువు శిలువపై రక్తాన్ని చిందించాడు. ఆ **ప్రభువునూ, ఆయన ఉపదేశాలనూ, "బైబులు" అనే మతగ్రంథములోని సూత్రాలను ఆచరిస్తూ ఉపాసిస్తూ ఉండటమే మనిషికి మంచి దారి.** క్రైస్తవోపాసనలో స్తోత్రము చేయటమే ముఖ్యంగా ఉపాసనా నియమం.

మహమ్మదీయోపాసన - ఈమాన్‌దారీ భైదామే తో - పైగంబర్ మే భరోసా. ఆత్మవిశ్వాసం కలిగి ఉండటం దైవముపై సర్వభారము పెట్టి యుండటం, దైవశక్తి అడుగడుగునా గుర్తించుచూ ఉండటం - ఇవి లోకములో ప్రధాన నియమాలు. దేహత్యాగం చేసిన తరువాత పరలోకంలో దేవుని దర్బారులో తన వాస్తవికతను నిరూపించుకొనటం అంటే - అందుకు తగిన రుజువర్తన జీవితాంతంవరకూ కలిగియుండటం. **దైవవాణియైన ఖురాను గ్రంథబోధనలను అక్షరాల ఆచరించటం.** ఇవి మహమ్మదీయోపాసనలో పారలౌకిక నియమావళి.

"అల్లా హో అక్బర్" "లా యిలాహ్" "ఇల్లల్లాహ్" - ఇవి మహమ్మదీయుల ప్రధాన మంత్రాలు. (భగవంతుడు సర్వోత్తముడు. అంతకంటే మించిన విశ్వనియంత లేడు. అతడే ఆరాధించ తగినవాడు అని ఈ మంత్రముయొక్క అర్థము)

నాకంటే మించినది లేదు. **"నా పర మస్తి కించిత్ " అనే భగవద్గీతార్థము.** మహమ్మదీయ మంత్రార్థానికి సామ్యాలే. అందువలన మహమ్మదీయ సంప్రదాయముకూడా భారతీయ హైందవ సంప్రదాయములో అంతర్ భాగమే. ఈ విధంగా మానవుడు ఆత్మపరిశోధనకు **ప్రారంభించి నప్పటినుండీ తరతరాల నరజాతికి తారకమైన అనంత విజ్ఞాననిధిగా ఎరింగిన భారతీయుల సంస్కృతి అనంతగంభీరం కావటంవల్ల, భిన్న భిన్న సంప్రదాయల రూపాలలోనదులెన్ని వచ్చిననూ, చేరిననూ పొంగక, కృంగక ధర్మసీమలో నిలచియున్నది.**

అంతేకాక విశ్వాత్మకమై సార్వభౌతికమై సర్వకాలికమై, పెంజీకటి కవ్వల నేకాకృతియై వెలిగే విజ్ఞాన విజయ జ్యోతియై వెలుగుచున్నది. ఇట్టి **పవిత్రమహా సాంస్కృతిక క్షేత్రమైన భారత ధాత్రిమీద మనిషిగా పుట్టుటకంటె సుకృతము లేదని తెలిసికోగలిగిన, మనిషికి కలిగే ఆనందం అపారం.**

(స. వా. పు.171/178)

(చూ॥ త్రికాండస్వరూపము)

ఉపేక్షా అపేక్షలు

"శత్రువు, మిత్రుడు, పుత్రుడు, బంధువు
అనుచు ఉపేక్షాపేక్షలు మానుము
అన్నింటిలోను ఆత్మనే చూడుము
భేదమనే అజ్ఞానము వీడుము."

(భ. స. సా. వే. ప్ర. పు.67)

ఉమెన్ (women)

ఈనాడు లోకంలో నాస్తికత్వానికి, ఆస్తికత్వానికి మూలకారణం ఎవరంటే 'ఉమెన్'(women) అని నిర్ణయమైపోయింది. లోకకల్యాణమునకుగాని, లోకములో బాధలకు, గాని వారే మూలకారణమని కూడను నిర్ణయమైపోయింది. లోకములో పవిత్రమైన స్థితిని కల్పించాలనుకున్నా స్త్రీలే ఆధారం. కనుకనే, ఆడవాళ్ళకు ప్రత్యేకమైనటువంటి ఒక దివ్యమైన శక్తికలదని భగవద్గీతలో నిర్ణయంచేశారు. దీనిని పురస్కరించుకొనియే, "సీతారామ, లక్ష్మీ నారాయణ, పార్వతీ పరమేశ్వర, రాధాకృష్ణ" అని వారికే మొట్టమొదటి స్థానం ఇస్తున్నారు. అంతవరకును పోనక్కరలేదు. భారతదేశమునే 'భరతమాత' అని మాతృమూర్తిగా నిర్ణయిస్తూ వచ్చారు. ప్రకృతి మాతృమూర్తి. మనం క్రిందపడినామంటే **"అమ్మా" అంటున్నాము కానీ, "అప్పా" అని మనం అనము.** కనుకనే మాతృమూర్తులైన స్త్రీలకు ప్రత్యేకమైనటువంటి స్థానము ఈ లోకములో మన భారతదేవములో ఉంటుండాది. కనుక, "ఉన్నతస్థాయికి కొనిపోవునదీ 'w' నే; అధమ స్థాయికి కొనిపోవునది 'w' నే." **'work, worship and wisdom—ఈ మూడింటియందు 'w' ప్రధానంగా ఉంటుంటాది. ఇది ఉన్నతస్థాయికి తీసుకొనిపోతున్నాది. ఇంకా మూడు పదములు (words) ఉంటున్నాయి. ఈ 'w' తో ఉండేటువంటివి. 'wine, women, and wealth' ఈ మూడూ, లో (low) స్థానానికి తీసుకొనిపోతుంటాయి.**

(ఆ. పు. 72/73)

ఊర్వశి

(చూ॥ మోహము)

ఋగ్వేదము

దేవతాస్తుతివదాలైన మంత్రాల సమూహము. ఋగ్వేదమనగా దేవతలు అని కూడా చెప్పవచ్చు.
దేవతలు అనేకమంది కలరు. అయితే ఋగ్వేదములో ముఖ్యమైన దేవతలు (33) ముప్ఫైమూడు మంది. వారికి మానవులవే శరీరములున్నవి.

సూర్యుడు. ఇతనికి కిరణములే హస్తములు; అగ్నిజ్వాలలు నాలుకలని వర్ణింపబడినది. **అగ్ని.** అరణి మధనముచేత పుట్టినది. అగ్నికి తల్లితండ్రులున్నారు. మధనానికి ఉపయోగించే కట్టలేవారు. అగ్ని పుట్టగానే తల్లి దండ్రులను భక్షిస్తాడు. ఇతనికి పదిమంది స్త్రీలు. అనగా వ్రేళ్ళచే సృష్టింపబడిన వారు. ఆరణిమధనముచేత సృష్టింప బడుటచేత అతనికి బహుజన్ముడని కూడా పేరు. ధూమమే ఇతని ధ్వజం; అందువలన ఇతని **ధూమకేతుడని** పిలుస్తారు. ఇతనికి **యజ్ఞసారథి** అని కూడా పేరు. కారణమేమన దేవతలను తన రథముమీద తీసుకొని వస్తాడు. యజ్ఞములో సమర్పించిన ఆహుతులను దేవతలకు సమర్పిస్తాడు. యజ్ఞమునకు ఇతడే ముఖ్యుడు. అందుచేత ఋత్విక్కులు, హోతలు, పురోహితులుగాను, బ్రహ్మగాను, స్తుతింపబడుతాడు. ఇతడు మానవులకు అత్యంత సన్నిహితుడు. అనగా అగ్ని లేక మానవ దేహము నిలువజాలదు. ఏ పనియు చేయజాలరు. సమస్త కర్మలకు దేహమందు, దేహమునకు వెలుపల అగ్ని ఉండియే తీరవలెను. కనుక అతనిని **గృహపతి అని, అతిథి అని** పిలుస్తారు. అగ్ని అన్ని ప్రాణులను, అన్ని జాతులను సమానముగా చూచుచుండెడిది కనుక అగ్నికి **సమమిత్రుడని** కూడా **పేరు.**

మన అందరి ఆశలు ఒకటిగా ఉండాలనియు, అందరి హృదయాలు, అందరి ఆలోచనలు మంచివిగా ఉండాలనియు, ఒక్క సత్యమార్గమున నడువవలెననియు, అందరూ, ఒక్కటే అని ఏకత్వము బోధిస్తుంది. ఈనాడు మానవులందరు ఒక్కటే అని బోధించుట క్రొత్తగా ఉన్న మార్గముగా భావిస్తున్నారు. ఇట్టి భావము క్రొత్తది కాదు. **'ఋగ్వేదము** ఇంతకంటే గొప్పగా **సమానభావము బోధించినది. ఇదే** ఋగ్వేదములోని **ప్రధాన ఆశయము. అందరూ ఒక్కటే. అందరూ భగవంతుని అంశములే, శక్తులే. అందరి యందు ఉన్న ఆత్మ స్వరూపుడు ఒక్కడే,**

భేధములుండరాదు అని శాసించినది. ఇట్టి విశాల భావాన్ని ఈనాటి మానవులు కోల్పోయి, భేదములు అభివృద్ధి పరుచుకొని సంకుచిత జీవితాన్ని గడుపుచున్నారు. ఆనాడు సంకుచితమును కూలద్రోసి విశాలత్వమును, ఏకత్వమును చాటినది ఋగ్వేదము.

(వీ. వా. పు 11, 12)

(చూ॥ ఆర్ష వేదము, స్వాహా)

ఋజుత్వం

ఋజుత్వం, సామాన్యముగా **దీనిని నిజాయితీ అని కూడానూ అందురు.** కల్లాకపటములు మాయా మర్మములు లేక చేసేపనికి చెప్పేమాటకు తలచే తలంపుకూ యేకరూపము కావలెను. అది లౌకిక, అలౌకిక జీవితముల రెండింటి యందునూ ప్రధానముగా పాటించవలసి వచ్చును. ఇది బహుశా అదంభిత్వము యొక్క మరొక పాదముగా తెలియుచున్నది.

(గీ. పు.208)

(చూ॥ ఇరువదిగుణములు)

ఋణము/ఋణములు

మానవుడు మూడు విధములైన ఋణములతో జన్మిస్తున్నాడు. ఈ మూడు ఋణములను నివృత్తి చేసుకోవడం మానవుని కర్తవ్యం. మొదటి ఋణము దేవ ఋణము, రెండవది ఋషి ఋణము, మూడవది పితృఋణము.

వీటిని ఋణములని చెప్పడంలోని అంతరార్థమేమిటి? మనకేదైనా ఒకరు ఆర్జించి, అందించినప్పుడు అది ఋణమవుతుంది. తమ దివ్యత్వము, తమ పవిత్రత మొదలైన దివ్య సంపదలను మనకందించినప్పుడు అది ఋణముగా రూపొందుతుంది.

మానవ దేహమును సర్వత్రా అనేక విధములైన దైవశక్తులు ఆవరించి యున్నవి. ఎట్టి ప్రమాదములు సంభవించకుండా ఏ విధమైన అవాంతరములు వాటిల్లకుండా అవి ఈ దేహమును పోషిస్తుంటాయి. ఈ దైవశక్తి రస స్వరూపమై సర్వాంగములందు సంచరిస్తుంది. అందుచేతనే **దైవత్వమునకు "రసోవైసః" రస స్వరూపుడని పేరు.** ఈ దైవత్వము దేహము నందు సర్వత్రా వ్యాపించియున్నది. సర్వత్రా వ్యాపించడమే కాకుండా సర్వాంగములను కూడా చలింప చేస్తున్నది. **దేహమే మానవునకు ప్రధాన సాధనము. 'జంతూనాం నరజన్మ దుర్లభం'** పవిత్రమైన, ఆదర్శమైన, అమూల్యమైన మానవాకారమును అందించి, దానిని అనేక విధముల పోషిస్తున్న దైవానికి కృతజ్ఞత చెప్పవలసిన బాధ్యత మనకెంతైనా ఉన్నది. ఈ విధమైన కృతజ్ఞతా మార్గమును అనుసరించినప్పుడే దైవము అనుగ్రహించిన ప్రాప్తిని మనము కొంతవరకైనా అనుభవించగలము. **మనలను సంరక్షిస్తున్న దైవము ఋణమును తీర్చుకున్నప్పుడే మన జన్మ సార్థక మవుతుంది.**

అయితే ఈ ఋణమును తీర్చుకొనే విధానమేమిటి? **దేహము చేత పరోపకారములు, పవిత్ర కార్యములు. దివ్య భావముతో సమాజములో సలిపినప్పుడు మనము దైవ ఋణమును తీర్చుకొన్నవారమవుతాము.** కేవలం తిండి, నిద్రలను అనుభవించడానికి ఈ దేహము రాలేదు. తిండి, నిద్ర, భయ, మైధునాదులు దీని లక్ష్యములు కావు. వీని నాధారము చేసుకొని దేహమును పోషించుకొని, దేహము ద్వారా ఆదర్శవంతమైన కర్మ లాచరించాలి. పవిత్రమైన పరోపకార కార్యముల నాచరించినప్పుడు, దేహమును సంరక్షించిన దైవము ఋణమును తీర్చినవారమవుతాము. దైవ సంరక్షణ లేకుండిన ఈ కాయము క్షణమైనా జగత్తులో నిలువ వీలుకాదు. సత్కర్మల నాచరించిన కాల కర్మ కారణ కర్తవ్యాల చేతనే ఈ జన్మను సార్థకం చేసికోవాలి. **సత్కర్మల చేత ఈ ఋణమును తీర్చుకొనని ఎడల అనేక జన్మలు ఎత్తవలసి వస్తుంది.** ఎంత త్వరగా ఈ ఋణమును తీర్చుకొంటామో అంత త్వరగా పవిత్రమైన దివ్యత్వమును అనుభవించగలుగుతాము.

రెండవది ఋషి ఋణము. ఋషులు మనకిచ్చిన సంపద ఏమిటి? వీరు స్వార్థ రహితులై తాము తరించి, తోటి

మానవులను కూడా తరింప జేయాలని అనేక పరిశోధనలు సలిపి ఇహమునకు పరమునకు సాధనా మార్గములను కనిపెట్టారు. ఐహిక జీవితమునందు మానవుడు ఏవిధముగా దోషరహితమైన కార్యముల నాచరించుటకు సాధ్యమవుతుందో విచారించి, దివ్య సందేశముల నందించారు. **జీవనోపాధి నిమిత్తమై చేయ తగినవేవో చేయరానివేవో విధి విధానములను వివరించి, వీటికి శాస్త్రములని పేరు పెట్టారు.** మానవుడు ఏ విధమైన మార్గము ననుసరించాలో ఏ విధమైన మార్గమును అనుసరించ రాదో నిర్ణయించి తద్వారా శాసించారు. ఇహమునే గాక పరమును కూడా పొందడానికి మానవుడు ఏ మార్గమును అనుసరించాలో నియమముల నేర్పరచి బోధించారు. భగవత్ ప్రీతికరమైన కార్యముల నాచరించి, యజ్ఞ యాగాది క్రతువులు సలిపి తద్వారా పరమును పొందే అధికారము మానవున కున్నదని నిరూపించారు. మానవ లక్ష్యాన్ని మరువక, మానవత్వాన్ని విడువక, మానవుల యందు మానవుడుగా జీవించే దివ్య తత్వాన్ని వారు బోధించారు.

మానవత్వాన్ని ప్రకటించే నిమిత్తమై అనేక విధములైన మార్గములను బోధిస్తూ, శాసిస్తూ వస్తున్నవి శాస్త్రములు. ఇతర దేశములలో వీటిని శాస్త్రములని పిలువక పోయినప్పటికీ ఏవో కొన్ని నియమముల పేరుతో వాటిని పరిగణిస్తూనే ఉన్నారు. ఈ **నియమములే లేకున్న మానవులు జగత్తులో క్షణమైనా జీవించ సాధ్యము కాదు.** నియమము తప్పిన మానవుడు అనేక బాధలకు గురి అవుతాడు. ఈ బాధలు మనకు అప్పటికప్పుడు కనిపించక పోయినప్పటికినీ, వాటికి ఏనాడో ఒకనాడు గురికాక తప్పదు. **మానవుడు పరిపూర్ణుడు కావలెనన్న ఈ శాస్త్రములను, నియమములను అనుసరించి ఋషి ఋణమును తీర్చుకొని దివ్యత్వమైన దైవత్వమును అనుభవించాలి.** ఏతావాతా మానవత్వాన్ని నిలుపుకొనే నిమిత్తమై అనేకమైన ఆధారములను, ఆదర్శములను అందించి నటువంటివారు ఋషులు గనుక, వారి ఋణమును తీర్చుకొనడము రెండవ ప్రధాన కర్తవ్యము. అయితే ఈ ఋణమును తీర్చుకొనే మార్గమేమిటి? ఈ శాస్త్రములను ఉల్లంఘించక, వాటి ప్రకారము తూ.చ తప్పక నడచుకొంటూ విరుద్ధ మార్గముల ననుసరించకుండా ఉండడమే వారి ఋణమును తీర్చుకొనుటకు సరియైన రాజ మార్గము. దురదృష్ట వశాత్తు మానవుడు ఈనాడు శాస్త్రములను ఉల్లంఘించడమే కాకుండా, వాటిని నిర్మూలించడానికి అనేక పాపములకు పూనుకొని, కష్టములకు నష్టములకు దుఃఖములకు గురి అవుతున్నాడు. కనుక శాస్త్ర నియమములను, పెద్దలు అనుభవించిన ఆదర్శములను, తూ.చ. తప్పక నడచుకొని తద్వారా మానవత్వమును ప్రకటింప చేయడానికి, వికసింప చేయడానికి, తగిన కృషి చేయాలి.

ఇంక **మూడవది పితృఋణము.** సామాన్యముగా ప్రతి మానవుడు తనకు కుమారులు కావాలని ఆశిస్తాడు. పుత్రులు లేని జీవితము పున్నామ నరకమునకు మార్గమని అంటారు. కాని ఇది సరియైనది కాదు. **సరియైన ఆదర్శాన్ని, తండ్రి పేరును, సత్సంపత్తిని అభివృద్ధి పరచి ఋషి ఋణమును దైవ ఋణమును తీర్చుకొనేందుకు సహకారులుగా ఉండాలని ఆనాడు కుమారులను కోరేవారు.** పుత్రుని భవిష్యత్తుకు తండ్రి అనేక విధములైన ఆదర్శములను అందిస్తూ, తన పుత్రుని అభివృద్ధి కోరుతుంటాడు. **పుత్రుడు పెడమార్గము పట్టిన అది తండ్రి దోషమే.** కనుకనే దశరథ మహారాజు ఈ మూడు ఋణములను తీర్చుకొనే నిమిత్తమై అనేక యజ్ఞ యాగాది క్రతువులు సలిపి, ఆ యజ్ఞములు ఆచరించే సమయమునందు తన నలుగురు కుమారులను చెంత నుంచుకొని వారికి అనేక ఆదర్శములను బోధించేవాడు. **కొమరునకు తండ్రి ఆస్తిపాస్తులయందు మాత్రమే కాదు. అతని ఆస్తిక్యమునందు కూడా అధికారమున్నదని పిల్లలకు బోధించాలి. అయితే ఉత్తమ ఆదర్శములను పాటించడం మాత్రమే పుత్రుని ప్రధాన కర్తవ్యం గాని,** అతని

ఋతము

వక్షికి కుడిరెక్క ఋతం. **ఋతము అనగా వేదాంతమునందు సత్యము అన్నారు.** ఋజుమార్గమును చూపేదే ఋతం. సత్యమునకు ఋతమునకును వ్యత్యాసమున్నది. సత్యమే ఋతము. ఋతమే సత్యమని చెప్పరాదు. **మాటతో చెప్పిన దానిని చేతితో చేయుటను, చేతితో చేసిన దానిని మాటతో చెప్పటము సత్యం.** ఋతం అది కాదు. **మనస్సులో పుట్టినదానిని మాటతో చెప్పటము, మాటలో చెప్పిన దానిని చేతితో చేయటము, ఇట్లా త్రిగుణాత్మకమైన దానిని ఋతము అన్నారు.** ఋతము మానసిక సంబంధమైనదనీ, సత్యము లౌకిక సంబంధమైనదనీ నిర్ణయించుకోవచ్చు. సత్యం త్రికాలాబాధ్యం అంటారు కానీ ఋతం త్రిలోకాబాధ్యం. మనస్సునందు వాక్కునందు క్రియయందు ఏకత్వాన్ని పొందేది ఋతము. ఋతము, సత్యము ఈ రెండు రెక్కలు చేరినప్పుడే బుద్ధిసరియైనదిగా వుంటుంది. శ్రద్ధ మాత్రముండి ప్రయోజనము లేదు. శ్రద్ధకు ఋతసత్యములు ఏకం కావాలి. కనుక బుద్ధి అంటే సామాన్యమైన బుద్ధిగా భావించరాదు. **శ్రద్ధ ఋతం సత్యములతో కూడినట్టిది. ఈ బుద్ధి.**

(బృ.త.పు ౯౯)

(చూ॥ బుద్ధి, విలియమ్ గ్లాడ్‌స్టన్, సత్యము)

ఋషిఋణము

(చూ॥ జ్ఞానయజ్ఞము)

ఋషులు

(చూ॥ అధ్వరవేదము, ఆర్ష, పరమార్థకము, వశిష్టుడు)

దుర్గుణములను, దురభ్యాసములను అనుసరించడం పితృఋణం తీర్చుకోవడం కాదు. తండ్రి చెడ్డవాడైనప్పటికీ పుత్రుడు సుపుత్రుడుగా అభివృద్ధిచెంది సత్సంగంలో చేరి, సదాలోచనలు సలిపి, సత్కార్యాలలో పాల్గొని, సత్కీర్తిని ఆర్జించినప్పుడు తండ్రి పాపములను కూడా పరిహారము చేసిన వాడవుతాడు.

ఒకప్పుడు వశిష్ఠులవారు దశరథునికి ఈ విధముగా బోధించారు : మహారాజా! నీ జీవితములో అనేక విధములైన పాపములను తెలిసో, తెలియకనో జరిగినవి. అజ్ఞానం చేతనో, అహంకారం చేతనో, భ్రాంతి చేతనో శ్రవణ కుమారుని హతమార్చావు. వృద్ధులైన అతని తల్లిదండ్రులు ఎంతో పరితపించి ప్రాణములు వదలినారు. ఇంకా దేవాసురుల యుద్ధములందు అనేక పాపములు చెయ్యడానికి నీవు వెనుదీయలేదు. ఇట్టి పాపములన్నీ శ్రీరామచంద్రుడు శివధనుస్సును విరచి, రాక్షస సంహారం చేసి, ఋషులకు బలమును, రక్షణను కల్పించడం వల్ల పరిహారమైనాయి. ప్రజలను సరియైన మార్గములో నడిపి, ఋషులకు భద్రత చేకూర్చి వారి ఆజ్ఞలను శిరసావహించిన రామచంద్రుని సద్గుణమే నీ సర్వపాపములకు సరియైన ఔషధమైనదన్నాడు. కనుకనే **తరతరములనుండి పితృఋణమును తీర్చుకొనే నిమిత్తమై భారత దేశమందు పితృ తర్పణములని ఏ కొద్దిమందో ఆచరిస్తున్నారు.** మన దేహము, దేహమునందున్న రక్తము, మన తల్లిదండ్రుల రస స్వరూపమే. అలాంటి వారి రక్తమును మనమనుభవించి తిరిగి వారికి కృతజ్ఞత నందించకపోవడం ఒక పాపముగా పరిగణించారు మన పూర్వీకులు. **మన కృతజ్ఞత నందించే నిమిత్తమై ఏర్పడినవే ఈ దైవ ఋణము,** ఋషి ఋణము పితృఋణములు. అయితే ఈ మూడు ఋణములను యజ్ఞయాగాదుల ద్వారా తీర్చుకొన వచ్చునని ఋషులు బోధించారు.

(స.సా.న. 83 పు.261/263)

(చూ॥ అంగీరసుడు, జనని)

ఎంజాయి

భగవంతుడు మీకు రెండు చేతులు ఒక కడుపు ఇచ్చాడు. రెండు చేతులతో పని చేస్తే ఒక కడుపు నిండదా? 'మనీ' కావాలంటే ఇక్కడే ఉండి సంపాదించుకోవచ్చు కదా? మీరు జన్మించిన దేశం పట్ల మీ కర్తవ్యం నిర్వహించవద్దా? మీ సేవలు అందించవద్దా?

ఈనాడు అనేకమంది డబ్బులు దండిగా సంపాదించుకొని తామే enjoy "(ఎంజాయి)" చేస్తున్నారు. "ఎంజాయి" చేయడమంటే - భౌతిక సుఖాలు అనుభవించడమా? అది కాదు. End-Joy **ఇది - మీరు సంపాదించవలసింది.** అలాగే అంత్యంలో మీరు ఆనందాన్ని అనుభవించాలి "శాంతి - శాంతి" అని ఊరికే నోటితో ఉచ్చరిస్తే ఏమిటి ప్రయోజనం? "పీస్" (Peace) బయిటలేదు. మీలోనే ఉంది. బయిట ఉన్నదంతా (Pieces) "పీసెస్"

(దే. యు. పు.3)

ఎండమావి

(చూ॥ వివాహం)

ఎచటికి

ఏమితాకొని వచ్చె ఏమితా కొనిపోవు
పుట్టునపుడు తాను గిట్టునపుడు
ధనము ఎచటికేగు తానెచటికేగునో
చెప్పరయ్య మీరు చిత్తమొప్ప!

(ము.ము.పు. 97)

ఎటాచ్‌మెంటు (Love)

నీకు Love (ప్రేమ) ఉన్నదనుకుంటున్నావు. చాల పొరపాటు. నీకున్నది Attachment. ఈ రెండింటికీ చాల తేడా ఉన్నది. నీ ప్రేమను వివిధములైన లౌకిక మార్గాలలో ప్రసరింపజేసి, వినియోగించుకొని Attachmentలో మునిగిపోయావు. కనుకనే, అసలైన ప్రేమను విస్మరించావు. **బిడ్డలపై గల ప్రేమను వాత్సల్యమంటారు; భార్యపై గల ప్రేమను అనురాగమంటారు;వస్తువులపట్ల గల ప్రేమను మమకారమంటారు; స్నేహితులపై గల ప్రేమను మైత్రి అంటారు. ఈ ప్రకారం వాత్సల్యము, అనురాగము,**

మమకారము, స్నేహము అను విభిన్న మార్గములలో ప్రసరించే ప్రేమ నిజమైన ప్రేమ కాదు. దీనిని Attachment అనవచ్చును. ఇది ప్రాపంచికమైనది. భౌతికమైనది, లౌకికమైనది. స్వార్థ సంకుచితమైనది. దీని వల్ల నీకు లభించేది భౌతికానందము, లౌకికానందము, ప్రాపంచికానందము, ఇంద్రియానందము, మానసికానందము, మనోభీష్టములను ఇంద్రియముల ద్వారా అనుభవించినప్పుడు కలిగేది సంతోషము. ఈనాడు నీకు సంతోషాన్నందించినది రేపు అసౌకర్యాన్ని కల్గించవచ్చును. ఉదాహరణకు, లడ్డు నీకు ఇష్టమే. కాని, మలేరియా జ్వరం వచ్చినప్పుడు అది అయిష్టంగా ఉంటుంది. ఉన్నికోటు నిన్ను చలికాలంలో సంతోషంగా ఉంచుతుంది. అదే కోటు వేసవిలో ఇబ్బందిని కల్గిస్తుంది. ఈ ప్రకారం సంతోషము కాల, స్థితి, గతులపై ఆధారపడి యున్నది. Attachment నుండి లభించేది కూడా ఇలాంటిదే. Attachment దుఃఖానికి కూడా కారణమౌతుంది. రామునిపై గల Attachment వలన దశరథుడు పుత్రవియోగమును భరించలేక మరణించాడు. కైకకు తన పుత్రుడైన భరతునిపై గల Attachment రాముని వనవాసమునకు కారణమైనది. ధృతరాష్ట్రుడు తన పుత్రులైన కౌరవులపై గల Attachment చేత వారి చర్యలన్నింటినీ సమర్థిస్తూ రావడంచేత తుదకు వారు దుర్మరణం పాలైనారు. మహాభారతయుద్ధంలో ధర్మజుడు "అశ్వత్థామ హతః కుంజరః" అన్నప్పుడు, "కుంజరః" అనే మాట వినిపించకపోవడంచేత ద్రోణాచార్యుడు, తన పుత్రుడైన అశ్వత్థామపై గల Attachment వలన, ప్రాణం వదిలాడు. యశోదకు కృష్ణునిపై గల Attachment వలన ఆమె అతని దివ్యత్వాన్ని గుర్తించలేకపోయింది. కనుక, Attachment **అనేది సత్యాన్ని పూర్తి గ్రహించనీయక మానవణ్ణి మాయకు లోబడేటట్లు చేస్తుంది. ఈ Attachment ను మోహం అనవచ్చును. కాని, ప్రేమ దీనికి పూర్తిగా భిన్నమైనటువంటిది.** దశరథుడు కైకపై గల Attachment వలన, కుమారుడైన రామునిపై గల Attachment వలన దుర్గతి పాలైతే, రాముడు సత్యధర్మములపై గల ప్రేమ చేత పితృవాక్య పరిపాలన నిమిత్తం, రాజ్యముపై ఎట్టి మమకారమూ లేక వనమున కేగినాడు. తాను ప్రజావాక్య పరిపాలకుడగుటచేత ఒక చాకలివాని మాటలకు స్పందించి సీతను పరిత్యజించాడు. ఇదే Loveకు, Attachmentకు గల వ్యత్యాసం. **దశరథునిది Attachment. రామునిది Love. ఒకటి ప్రమాదమును తెప్పించింది, రెండవది శాశ్వత కీర్తి నందించింది.** కృష్ణుడు వ్రేపల్లెను వదలిన తరువాత తిరిగి అందులో ప్రవేశించలేదు. అయినా కృష్ణునిపట్ల గోపికలకు గల ప్రేమ ఏమాత్రమూ చలించలేదు. ప్రేమ దేనికీ లొంగదు, వొంగదు, క్రుంగదు, పొంగదు. సిద్ధార్థుడు తన భార్య అయిన యశోధరపైన, కుమారుడగు రాహులునిపైన, Attachment ను కలిగియుండిన తాను బుద్ధుడయ్యేడివాడా? శిలువపై హింసకు గురి అవుతున్నప్పుడు క్రీస్తు తన దేహముపై Attachmentను వీడి, "Father, they know not what they do. forgive them" (తండ్రీ, వారు చేసేదేమిటో వారికి తెలియదు. వారిని క్షమించు) అని ప్రేమమూర్తియై తనను శిక్షించినవారిని కూడా రక్షించమని భగవంతుణ్ణి ప్రార్థించాడు. **ఇది ప్రేమకు పరాకాష్ఠ.** Attachment స్వార్థంతో కూడినది. బంధనను చేకూర్చుతుంది. కాని, **Love స్వార్థరహితమైనది,** బంధవిమోచన కల్గిస్తుంది. Love lives by giving and forgiving: Attachment lives by getting and forgetting. ప్రేమ ద్వంద్వాతీతమైనది, అనంతమైనది, అపూర్వమైనది. అద్వితీయమైనది, నిరుపమానమైనది, ఆధ్యాత్మికమైనది, దివ్యమైనది. **ప్రేమయే దైవం, దైవమే ప్రేమ. కాబట్టి, ప్రేమలో జీవించండి. Attachment సంతోషమును అందిస్తే, ప్రేమ Bliss (ఆనందము)ను అనుగ్రహిస్తుంది.** పుట్టిన బిడ్డకు తల్లి తప్ప మరొక ధ్యాస ఉండదు. కాని, పెరుగుతున్న కొలది మానవుడు బాల్యములో ఆటపాటలపైన, విద్యార్థి దశలో చదువు సంధ్యలపైన, యౌవనంలో కోరికలపైన, మధ్యవయస్సులో ధనముపైన

ఎడ్యుకేషన్

తన ప్రేమను మరల్చి Attachmentలో మునిగి మాయామోహితుడై జీవితమును వ్యర్థం గావించుకొనుచున్నాడు. **భగవంతునిపై గల ప్రేమను భక్తి అన్నారు.** ఇది వినయ, విధేయతలను, శీలమును కాపాడి, ఆనందమును అనుభవింపజేసి జన్మను సార్థకం గావిస్తుంది. "ప్రేమను ఎట్లా పెంచుకోవాలి?" అని అడిగినావు. **~~ఈనాడు కావలసినది~~ Expansion of love (విశాలమైన ప్రేమ). నీవు ప్రారంభంలో కుటుంబాన్ని, తరువాత ఇరుగుపొరుగువారిని, అటుపిమ్మట సమాజాన్ని, క్రమేపి దేశాన్ని, చిట్టచివరికి విశ్వాన్ని ప్రేమించడం లక్ష్యంగా పెట్టుకో. ప్రేమమయుడైన భగవంతుణ్ణి ప్రేమ ద్వారానే అనుభవించగలవు.** ~~ఈ~~ జగత్తులో ఏది లేనివారైనా ఉంటారేమోగాని, ప్రేమ సహజము, భగవత్ప్రసాదము.

(స.సా.ఆ. 2000 పుట 255/256)

ఎడ్యుకేషన్

~~ఈ~~నాటి విద్యార్థులు వాక్ శక్తిని, మనో శక్తిని సాధించడానికి తగిన కృషి చేయాలి. అనేక పర్యాయములు నేను చెపుతుంటాను Talk less, study more. Study అంటే ఏమిటి? మన దివ్యమైన శక్తిని ఎడ్యుకేషన్ గా మార్చుకోవాలి. Values for Education: Education for Life; Life for Love; Love for Man; Man for Service; Service for Spirituality; Spirituality for Society; Society for Nation; Nation for World; World for Peace.

దీనిని మీరు చక్కగా గుర్తించాలి. విద్య జీవిత పరమావధికే కాని, జీవనోపాధికి కాదు. విద్య అనేది జీవనోపాధికి కాదు. విద్య అనేది జీవనోపాధికే అని అనుకుంటే ఏ విద్యలూ నేర్వని పశు పక్షి మృగాదులు కూడా జీవిస్తున్నాయి కదా! కనుక, Education for Life(విద్య జీవితం కొరకు),Life for Love (జీవితం ప్రేమ కొరకు)~~ఈ~~ Lifeలో Love అనేది లేకపోతే అది Living death తో సమానం. Love is God; Live in Love.

ఐతే, ~~ఈ~~ Love (ప్రేమ) దేనికోసం? మనిషి కోసం(for Man) **మనిషికి ప్రేమయే ప్రధానం.** ఇంక మనిషి దేని కోసం? తిని, నిద్రించి, ఇంద్రియలోలుడై పశువుగా మారటానికి కాదు. Man for Service (మనిషి సేవ కొరకు). ~~ఈ~~ సొసైటిలో జీవిస్తూ అనేక విధాలుగా ఉపకారముల నందుకొంటున్న మానవుడు దానికి తగిన ప్రత్యుపకారం చేయనక్కర లేదా? కృతజ్ఞత చూపనక్కర లేదా? కనుకనే, Man for Service. ఇంక Service for Spirituality (సేవ ఆధ్యాత్మికత కొరకు). ~~ఈ~~ Spirituality (ఆధ్యాత్మికత) అనేది అమృతత్వాన్ని అందిస్తుంది. ~~ఈ~~ సేవయే Spiritualityగా మారిపోతుంది. Spirituality for Society (ఆధ్యాత్మికం సమాజం కొరకు) Society for Nation (సమాజం దేశం కొరకు). ~~ఈ~~ సమాజం మన దేశం కోసమే ఉన్నది. కనుక, ~~ఈ~~ సొసైటీ దేశాభివృద్ధికై, దేశ సౌభాగ్యానికై పాటు పడాలి. Nation for World (దేశం ప్రపంచం కొరకు). **~~ఈ~~ Nation అంటే ఏమిటి? అన్ని అంగాలూ చేరినప్పుడే మానవ దేహము ఏర్పడినట్లుగా, అన్ని దేశాలు చేరినప్పుడే ఇది ప్రపంచమౌతుంది. ~~ఈ~~ ప్రపంచం (World) దేని కోసం? ఏదో క్షణ భంగురమైన జీవితాన్ని గడుపుటకే ఇంత పెద్ద వ్యర్థంగా ఏర్పడిందా? కాదు, కాదు. World for Peace (ప్రపంచ శాంతి కొరకు). అందు చేతనే, "శాంతిః శాంతిః శాంతిః"** అని అంటుంటాము. ఐతే.దీనిని మూడు పర్యాయములెందుకు చెప్పాలి? రెండు పర్యాయములే చెప్పవచ్చు కదా....! లేక, నాల్గు పర్యాయములు చెప్పవచ్చు కదా...! కాదు,కాదు, దీనిని మూడుపర్యాయములే - చెప్పాలనేది ఒక ప్రధానమైన నిర్ణయం. ఎందుచేత? **ఒకటి ఆధిభౌతిక శాంతి, రెండవది ఆధిదైవిక శాంతి, మూడవది ఆధ్యాత్మికశాంతి. ~~ఈ~~ మూడింటి యందూ శాంతి ఉండాలి.** శారీరక మానసిక ఆధ్యాత్మిక శాంతుల నిమిత్తమై - "శాంతిః శాంతిః శాంతిః" అని చెప్పారు.

(స.సా. ఏ. 94 పుట 105/106)

ఎనర్జీ

(చూ॥ ఆరాధన)

ఎప్పటికైనా

నిజానికి మీరంతా **ప్రేమస్వరూపులైనా** కర్మ వాసన వలన జన్మించి, త్రిగుణాలకు పూర్తిగా కట్టుబడి, దేహాభిమానంలో యిరుక్కుపోయి, **మమకారమే** జీవనంగా బ్రతుకు చున్నారు. మీరందరు నా అంశములే, ఎప్పటికైనా నన్ను చేరవలసినవారే దీనిని మీరు సంపూర్ణముగా **మరచి పోయినారు.**

(సా.పు.241)

ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి

ముందుగా మాట్లాడిన ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి దక్షిణామూర్తి స్తోత్రంతో తన ప్రసంగాన్ని ప్రారంభించింది. **దక్షిణామూర్తి ఎవరు? మన మేధాశక్తియే!** కనుక మన మేదస్సును పవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. **ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి పూర్వం సినిమాలో మీరాగా నటించింది.** ఒకానొక సమయంలో మహారాణా మీరాను మందిరం నుండి వెళ్లిపొమ్మన్నాడు. కాని ఆమె ఎక్కడికి పోగలదు? "చలో రే మన్ గంగా యమునా తీర్....", ఓమనసా! నీవు గంగాయమునా తీరానికి వెళ్ళు" అని తన మనస్సుకు బోధించింది. ఏమిటి గంగాయమునా తీరము? **ఇడ, పింగళ రెండూ చేరిన భ్రూమధ్య స్థానమే! ఇదే ప్రయాగ.** ఈ ప్రయాగకు వెళ్ళాలంటే టికెట్ బుక్‌చేసుకోనక్కరలేదు. కాని ఈనాడు మనం ప్రయాగకు వెళ్ళడమంటే ప్రాకృతమైన రీతిగా టికెట్ తీసుకుని ప్రయాణిస్తున్నాము. ఈ బాహ్యమైన అభ్యాసములచేత నిత్యసత్యమైన హృదయస్థాయిని విస్మరిస్తున్నాము. బాహ్యమైన పూజలు, భజనలు, వ్రతములు ఇవన్నీ తాత్కాలికమైన మానసిక తృప్తిని మాత్రమే చేకూర్చగలవు. మనస్సున్నంత వరకు మహత్తరమైన దివ్యబోధలు మనకు అర్థం కావు. మనస్సును మాధవునివైపు మరల్చాలి. భగవంతుడు ఏ హృషీకేశ్ యందో, ఏ బదరీనాథ్‌యందో ఏతిరుపతియందో ఉన్నాడని భావించడం తప్పు. ఇవన్నీ మనోకల్పితములే. భగవంతుడు హృదయవాసి. కాని మనం హృదయాన్ని

ఎప్పటికైనా

మూసిపెట్టి మాటలను అధికం చేయడంవల్ల అశాంతికి గురియౌతున్నాము. నోరు ముయ్యాలి, **హృదయం తెరవాలి.అప్పుడే ఆత్మజ్ఞానం అర్థమవుతుంది, ఆనందం ప్రాప్తిస్తుంది.**

(స.సా.డి. 96 పు. 330/331)

(చూ॥ గానము)

ఎరుక

'ఆత్మ' అంటే ఏమిటి? దీనినే 'ఎరుక' అని చెప్పారు. ఇది ప్రతిమానవుని యందలి 'అహం'. ఈ అహం అనేది దేహములో చేరినప్పుడు అంకురముగా మారుతుంది. ఇది **దేహాత్మ భావము పొందినప్పుడు అహంకారముగా రూపొందుతుంది.** ఈ అహం కేవలం దేహాత్మతో చేరినది కాదు. దేహాత్మతాదాత్మ్యము పొందినప్పుడే అహంకారమనేది రూపొందుతుంది. అనగా ఆకారమే నేను అని భావించటమే అహంకారము. అహమునకు ఆకారము లేదు. అదియే శుద్ధ సత్వముతో కూడినది. మొట్టమొదట ఈ ఆత్మ తత్వమును అనేక విధములుగా మరపింపచేసి అడ్డు తగిలేదే మనస్సు. సూర్యుని ప్రకాశముచే రూపొందిన మేఘసముదాయము సూర్యునే కప్పివేస్తున్నాయి. మేఘ సముదాయము సూర్యుని ఏ విధముగా కప్పి వేస్తున్నాయో, అదే విధముగా ఆత్మయందు పుట్టిన ఈ మనస్సు కూడా ఈ ఆత్మనే కప్పివేస్తున్నది. కనుక మనస్‌తత్వమునకు అడ్డు తగిలేది. కనుక మనస్సును మరపింపచేసే మార్గమును మనము వెతకాలి. మానవత్వములో 'నేను' అనే పదము మొట్టమొదట ఆవిర్భవించినది. **ఈ 'నేను' అనేదే 'అహం స్వరూపము' అహం, పరమాత్మ, దేవుడు, ఉనికి, ఎరుక, యోగము ఇత్యాది పదములన్నీ ఆత్మకు పర్యాయ పదములే.** నేను అనే పదము ఆత్మకు పర్యాయ పదమే. ఈ నేను అనే పదమును సరిగా అర్థము చేసుకున్నప్పుడే ఆత్మజ్ఞానము కలుగును. నిజమైన 'నేను' అనే తత్వమును ఏ మానవుడు గ్రహించునో అదే నిజమైన ఆత్మతత్వమవుతుంది.

ఎలక్ట్రాన్, ప్రోటాన్

ఆత్మతత్వమును తిష్ఠగా వేసుకొని దైవత్వముతోకూడిన అహం తత్వాన్ని విచారణ చేసినప్పుడే ఆత్మనిష్ఠ అవుతుంది. **ఈ 'నేను' అనే పదము మూలములో ఏకమైనప్పుడే ఆత్మసాక్షాత్కారమౌతుంది.** 'నేను' అనే భావమును కేవలం దేహముతో మాత్రమే కాదు. **మూలాధారతత్వములో లీనము చేయాలి. అదియే ఆత్మసాక్షాత్కారము.**

(ద. య. స. పు.82/83)

(చూ॥ ఆత్మ)

ఎలక్ట్రాన్, ప్రోటాన్

(చూ॥ అర్ధనారీశ్వర తత్వం)

ఎవరు గొప్ప

ఒకానొక సమయంలో నారదుడు వైకుంఠానికి వెళ్ళి విష్ణువును దర్శించాడు. విష్ణువు నారదుణ్ణి పరీక్షింపగోరి, "నారదా! నీకు ఎట్టి బాధ్యతలూ లేవు. ఎట్టి ఆటంకములూ లేవు. సర్వ కాల సర్వావస్థలయందు 'నారాయణ, నారాయణ' అని నామస్మరణతో నీకాలాన్ని పవిత్రం గావించుకుంటున్నావు. కానీ, ఈ సృష్టి రహస్యాలేమైనా నీవు తెలుసుకున్నావా? నేను పంచభూతములను సృష్టించాను. వీటిలో ఏది గొప్పదో నీవు గుర్తించావా?" అని ప్రశ్నించాడు. నారదుడు, "స్వామీ! అనంతమైన అగమ్యగోచరమైన ఈ సృష్టి రహస్యాన్ని నేను తప్ప ఇంకెవరు గుర్తించగలరు"? అన్నాడు. "అయితే, ఈ పంచభూతములలో ఏది గొప్పదని నీవు భావిస్తున్నావు నారదా?" అని ప్రశ్నించాడు నారాయణుడు. "స్వామీ! జలము చాల గొప్పది. ఎందుకనగా, అది ఈ విశాలమైన భూమండలంలో మూడు భాగములు మ్రింగివేసింది" అన్నాడు. "మంచిది, బాగా గమనించావు. అయితే, యింత జలాన్ని ఆగస్త్యుడు ఒక్క గుటకలో మ్రింగినాడు. కనుక, జలము గొప్పదా, అగస్త్యుడు గొప్పవాడా?" అడిగాడు. "స్వామీ! అగస్త్యుడే గొప్పవాడు" అన్నాడు. "అట్టి గొప్పవాడయిన అగస్త్యుడు ఆకాశంలో చిన్న చుక్కగా ఉన్నాడు. కాబట్టి, అగస్త్యుడు గొప్పవాడా, ఆకాశం గొప్పదా? అని అడిగాడు. "స్వామీ! ఆకాశమే గొప్పది" అన్నాడు నారదుడు. "సరే! కానీ, వామనమూర్తికి బలి చక్రవర్తి మూడడుగుల నేల దానమిచ్చినప్పుడు ఒక్క అడుగుతో భూమిని, రెండవ అడుగుతో ఆకాశమును ఆక్రమించాడు. మూడవ అడుగుకు స్థానం లేకపోవడంచేత బలి చక్రవర్తి తన శిరస్సుపై పెట్టు కున్నాడు. కనుక, ఆకాశం గొప్పదా? భగవంతుడు గొప్పవాడా?" అన్నాడు. "స్వామీ! భగవంతుని పాదమే విశ్వమంతా వ్యాపించినప్పుడు భగవంతుని స్వరూపం ఇంకెంత గొప్పదో! కనుక, భగవంతుడే గొప్పవాడు" అన్నాడు నారదుడు. "నారదా! విశ్వవ్యాపకుడు, అనంతుడు, అఖండుడైన భగవంతుడు భక్తుని హృదయంలో స్వాధీనుడై ఉన్నాడు. కనుక, భగవంతుడు గొప్పవాడా, భక్తుని హృదయం గొప్పదా?" అని అడిగాడు నారాయణుడు. **"భక్తుని హృదయమే గొప్పది స్వామీ!" అన్నాడు నారదుడు. అనంత స్వరూపుడైన భగవంతుణ్ణి అణుమాత్రంగా తన హృదయమందు ఇముడ్చుకున్నాడు భక్తుడు. కనుక, ఈ జగత్తునందు అన్నింటికంటే భక్తుని హృదయమే గొప్పది. "అణోరణీయాన్ మహతో మహీయాన్".** భగవంతుడు అణువులో అణువుగాను, ఘనములో ఘనము గాను ఉన్నాడు. ఇట్టి భగవత్తత్వాన్ని గుర్తించాలంటే భారతీయ సంస్కృతి తత్వాన్ని అర్థం చేసుకోవాలి.

(స.సా. జులై 99 పు. 187/188)

ఎస్

(చూ॥ దేవుడెక్కడున్నాడు?)

ఏకత్వము

యువకులు ఈనాడు Unity in diversity అనేకత్వములోని ఏకత్వమును అనుభవించటానికి ప్రయత్నించాలి. **ఈ ఏకత్వమును అనేకత్వముగా భావించటంచేతనే ఈ లోకము అశాంతికి గురైపోయింది.**_పాకిస్తాన్ వేరు. ఇండియా వేరు; రష్యా వేరు, చైనా వేరు, అమెరికా వేరు అని ఈ రకంగా బేధములుండవచ్చుకాని అన్ని కలిసి ఒకే భూమిపైన వున్నయికదా! ఈ రకమైన ఏకత్వమును మనము పెంచుకుంటె ఈ భిన్నత్వములో ద్వేషములు కాని అసూయలు గాని క్రోధములు గాని వుండటానికి వీలుకాదు.

Sky is one but stars are many
Nations are many but earth is one
Beings are many but breath is one

ఈరకమైన ఏకత్వమును భావించుకుంటే నిజమైన ఆనందము మనలో ఆవిర్భవిస్తుంది.

(బృ.త్ర.పు.౩౬)

శరీరమంటే ఏమిటి? కన్ను, ముక్కు, చెవి, కాలు, నోరు, కడుపు, తల అన్నీ చేరినట్టిదే - శరీరము. ఒక్కొక్క అంగము ప్రత్యేకించి ఒక్కొక్క శరీరము కానేరదు. **అన్ని అంగములతో కూడిన మన శరీరమే "విశ్వం". విశ్వం విష్ణుస్వరూపం. స్వరమూ మనయందే ఉంటుండాది.** దీనిని విభాగము చేయటము మంచిది కాదు. ఇది లౌకికము, ఇది ఆధ్యాత్మికము అని విభాగము చేయకూడదు. ఈ రెండింటి ఏకత్వమే దివ్యసృష్టికి మూలకారణము. ఒక విత్తనముండాది. ఆ విత్తనములో రెండు బద్దలుంటాయి. ఆ రెండు బద్దలు చేరినప్పుడే అది మొక్కగా, వృక్షంగా అభివృద్ధి అవుతుంది. రెండూ రెండు బ్రద్దలుగా చీల్చివేస్తే సృష్టే ఉండదు. ఈ రెండు బ్రద్దలపైనను ఒక పొట్టు. చర్మము ఉండాది. దానినే సంస్కృతి అన్నారు. దీనిని అది, అది దీనిని వదలి ఉండటానికి వీలులేదు. ఈ రెండింటి ఏకత్వమే భారతీయ సంస్కృతి.

(బృ.త్ర.పు ౬౬)

తనను తాను మరచిన వ్యక్తి సరియైన సత్యాన్ని గుర్తించలేడు. నీవే ఆత్మయై వుండి నీవు ఆత్మ నిమిత్తమై మరొక దానికి ప్రార్థన సాధనగాని చేస్తే నీతత్వము

ఏకత్వము

యేరీతిగా గుర్తించగలవు? "ఏకోహం బహుస్యాం'' ఒకటే అనేకముగా మారిపోవటం చేత భిన్నత్వములోని అభిరుచిని అభివృద్ధి పరచుకొని ఏకత్వమును విస్మరిస్తున్నావు. ఇవన్నియు అద్దములో కనుపించే ప్రతిబింబములవలె నీ ప్రతిబింబములే. బింబమును వదలి ప్రతిబింబమును విశ్వసిస్తున్నావు. నీవు భ్రమతో కట్టబడుతుంటున్నావు. **భ్రమతో కట్టబడిన వానికి బ్రహ్మచిక్కడు.** ఆత్మభావము అనుభవించాలనుకుంటే మనము చేసే సాధనలన్నీ నిరుపయోగమైనవి. ఐతే ఈ సాధనలన్నీ మనస్సును చల్లబరుస్తాయి. మనసును చల్లబరిచి ప్రయోజనము ఏమిటి? **మనసే లేకుండా చేసుకొనుకోవాలి.** గాని మనసును చల్లబరుస్తే తిరిగి వేడి ఎక్కవచ్చు.

(బృ.త్ర.పు.౧౨౫/౧౨౬)

పూర్వము అనేకత్వమైన ఏకత్వముగా వుండేది.

మానవుడు ఏకత్వాన్ని అనేకత్వముగా మార్చటానికి కారణం ఏమిటి? అభీష్టములే మూలకారణము. అభీష్టములు క్రమక్రమేణ మితిమీరి పంచభూతములకు సంబంధించిన వాంఛలు మితిమీరి పోవటంచేత మతిభ్రమణ జరిగింది. ప్రతిది అప్పటికప్పటికే ఫలితము లభించాలి. కాలము కోసము తాను కాచుకోడు. త్రికాల స్వరూపమైనదే ఈ త్రిగుణము. ఈ కాలము వచ్చిందంటే ఎవ్వరు ఆపటానికి వీలుకాదు.

"పోక న్మానదు దేహ మే విధమునన్ పోషించి రక్షించినన్ రాక న్మానపు హానివృద్ధులు మహారణ్యంబునన్ డాగినన్".

ఈ సత్యాన్ని గుర్తించి కూడను వ్యక్తులు ఆక్రుత పడుతుంటారు. అక్కడికి పోతే ప్రమాదము తప్పుతుందో అని, యిక్కడవుంటే ఆదాయము లభిస్తుందోమో అని అనుకుంటారు. ఎక్కడ వుండినా వచ్చేది రాక తప్పదు. ఐతే **పురుష ప్రయత్నం అత్యవసరము.**

(బృ.త్ర.పు ౧౧౫/౧౧౬)

జీవ బ్రహ్మములయొక్క ఏకత్వమును దృఢముగా గుర్తెరిగి అసంభావన - విపరీతభావములనుండి సంశయ నివృత్తి గాంచుటయే దృఢ **అపరోక్ష బ్రహ్మజ్ఞాన** మనబడును. అట్టి దివ్యమయిన జ్ఞానోదయము వలన అభాస అవర్ణము తొలగిపోవును.

(జ్ఞా.వా. పు.9)

మనిషి మాత్రం ప్రశాంతి నిలయంలో ఉండి మనస్సు మార్కెటంతా తిరుగుతుంటే ప్రయోజనం లేదు. భరతుడు రామునికి దూరంగా నందిగ్రామంలో ఉన్నప్పటికీ అతని మనస్సంతా రామునిపైనే ఉన్నది. కనుకనే, శ్రీరామ పట్టాభిషేక సమయంలో రాముడు, భరతుడు ఇరువురూ ఒకే రంగులో, కపిలవర్ణంగా,ఉన్నారు. దీని అంతరార్థ మేమిటి? **భరతుని మనస్సు రామునిలో లీనమైంది. అదియే సరియైన ఏకాగ్రత. అయితే, లక్ష్మణుడు మానసికంగా మాత్రమే కాదు, శారీరకంగా కూడా రామునితో ఏకమైపోయాడు.** అతడు రాముని చెంతనే ఉన్నాడు, రామచింతనే చేశాడు; శారీరకంగా రాముణ్ణి సేవించాడు, మనస్సుతో రాముణ్ణి స్మరించాడు. కనుకనే, రామలక్ష్మణులు ఇరువురూ ఒక్కటై పోయారు. యుద్ధభూమిలో లక్ష్మణుడు మూర్చిల్లినప్పుడు రాముడు చాల బాధపడ్డాడు. అయితే, రాముడు కూడా సామాన్య మానవునివలె బాధ పడటమేమిటని మీరు అనుకోవచ్చు. లక్ష్మణునియొక్క భక్తిప్రవత్తులను,ఏకత్వమును నిరూపించడంకోసమే రాముడు ఆవిధంగా ప్రవర్తించాడు. **"లక్ష్మణా! నీవు లేక నేను జీవించలేను. ఈ ప్రపంచంలో వెతికితే నాకు కౌసల్యవంటి తల్లియైనా చిక్కవచ్చు, సీతవంటి భార్యయైనా చిక్కవచ్చు. కానీ, నీవంటి సోదరుడు చిక్కడు" అన్నాడు. అంతటి దైవప్రేమను ఆర్జించాడు లక్ష్మణుడు. అతడు రామునితో ఏకత్వం పొందాడు.** ఒకపర్యాయం ఎవరో అడిగారు - స్వామీ! అనేక చోట్ల రామమందిరాలు కడుతున్నారు. హనుమంతుని మందిరాలు కడుతున్నారు. మరి లక్ష్మణునికి మందిరాలు ఎందుకు కట్టకూడదు?'' అని. నేను చెప్పాను - పిచ్చివాడా! **రాముణ్ణి ఒక్కడినే ఎక్కడా ప్రతిష్ఠ చేయడం లేదే! రాముడెక్కడున్నాడో లక్ష్మణుడు అక్కడే ఉన్నాడు. రాముని ప్రక్కన లక్ష్మణుడు ఉండే తీరాలి. రామునితో లక్ష్మణుడు ఏకమైనాడు".**

(స.సా.అ. 99 పు.258)

"సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్ర పాత్", భగవంతుడు వేలాది శిరస్సులతో, వేలాది నేత్రములతో, వేలాది పాదములతో కూడినవాడు. అనగా అన్ని శిరస్సులూ, అన్ని నేత్రములూ, అన్ని పాదాములూ భగవంతునివే. వేదము **"ఏకోహం బహుస్యాం," అన్నది. ఉన్నది ఒకటే; అనేకత్వం మీ భ్రమనే. దీనిని పురస్కరించుకొనియే వేదము చెప్పింది.-**

సహనా వవతు సహ నౌ భునక్తు సహ వీర్యం కరవావహై
తేజస్వి నావధీతమస్తు మా విద్విషావహై

దీని అర్థమిది-

కలసి మెలసి పెరుగుదాం - కలసి మెలసి తిరుగుదాం
కలసి మెలసి తెలుసుకున్న తెలివిని పోషించుదాం
కలసి మెలసి కలత లేక చెలిమితో జీవించుదాం

ఇదే భారతీయ సంస్కృతి బోధించినది. దీనిని మీరు ఆచరణలో పెట్టి అనుభవించండి. విద్యార్థులారా! మీరు పెద్దపెద్ద డిగ్రీలు పొందినప్పటికీ మీ మాతృదేశ సంస్కృతిని మరువకండి. **అనేకత్వంలోని ఏకత్వాన్ని బోధించినదే భారతీయ సంస్కృతి.** ఏకత్వమును విభజించటం మన సంస్కృతి కాదు.

(స.సా.జూ. 2000 పు.173)

దుర్జనుడు త్రాచుపాముపంటివాడు. అట్టి వానితో సంబంధం పెట్టుకుంటే మీ జీవితం కూడా విషమయమై పోతుంది. కనుక, **"త్వజ దుర్జన సంసర్గం,"** దుస్సంగమునకు దూరంగా ఉండండి, అయితే, దుస్సంగమునకు దూరంగా ఉన్నంత మాత్రమున ప్రయోజనం లేదు; **"భజ సాధు సమాగమం,"** సత్సంగంలో ప్రవేశించాలి. **"కురు పుణ్య మహోరాత్రం,"** రాత్రింబవళ్ళు పుణ్య కార్యముల నాచరించాలి. **"స్మర నిత్య మనిత్యతాం,"** ఏది నిత్యము? ఏది అనిత్యము? ఏది సత్యము? ఏది అసత్యము? అని చక్కగా విచారణ చేసి, ఏది నిత్యమో దానిని వరించాలి; ఏది అనిత్యమో దానిని త్యజించాలి. ఇదొక వెండి ప్లేటు, ఇదొక వెండిగ్లాసు, ఇదొక వెండి భరిణ. ఈ మూడిటి యొక్క రూప నామములు వేరువేరు గాని, వీటికి మూలాధారమైన వెండి ఒక్కటే కదా? రూపనామములు మార్పు చెందవచ్చును. కాని, మూలాధార తత్త్వం ఎన్నటికీ మార్పు చెందదు. **శృంగారములు వేరు, బంగార మొక్కటే. పశుల వన్నెలు వేరు, పాలు ఒక్కటే. జీవరాశులు వేరు, జీవుండు ఒక్కడే. పూల జాతులు వేరు, పూజ ఒక్కటే.** అదేరీతిగా, మనుష్యులు వేరు వేరు రూపనామములను ధరించి యున్నారు గాని, **అందరి యందున్న దైవత్వమనే మూలాధార శక్తి ఒక్కటే. అదే బ్రహ్మత్వం, అదే ఈశ్వరత్వం.** రూప నామములు అనిత్యమైనవి. వాటిని చూసి మీరు భ్రమించకూడదు; నిత్యసత్యమైన మూలాధార తత్త్వమును వరించాలి. ఇలాంటి ఏకత్వాన్ని గుర్తించినప్పుడు జాతి, మత, కుల భేదములు దూరమైపోతాయి. **ఉన్నదొకే కులం, అదే మానవకులం. ఉన్నదొకే మతం, అదే ప్రేమమతం, ఉన్నదొకే భాష, అదే హృదయ భాష. కనుక,** భిన్నత్వాన్ని దూరం చేసుకొని దివ్యత్వాన్ని అనుభవించండి. అల్లా అనవచ్చు, జీసస్ అనవచ్చు, రామా అనవచ్చు, కృష్ణా అనవచ్చు. ఏ నామాన్నైనా స్మరించవచ్చు, ఏ రూపాన్నైనా పూజించవచ్చు. కాని, దేవుడొక్కడే అనే సత్యాన్ని గుర్తించాలి.

(స.సా.జూ. 2000 పు.180)

భారతీయులకు రాయి మొదలు రత్నం వరకు, పక్షి మొదలు పారిజాతము వరకు, చీమ మొదలుకొని ఏనుగు వరకు, పామరుడు మొదలుకొని పరమహంస వరకు -- సకల పదార్థాలు పరతత్వాన్ని ప్రబోధించునవే. దీనిని పురస్కరించుకొనియే -- **"సర్వం ఖల్విదం బ్రహ్మ", సర్వం విష్ణుమయం జగత్", "ఈశా వాస్య మిదం సర్వం" మొదలగు మహావాక్యములు పరమ సత్యాన్ని ప్రబోధిస్తూ వచ్చినవి. భారతీయుల సాంఘిక న్యాయం,** ఏ ఇతర దేశములందును కనిపించదు. దైవత్వమును, ప్రేమ తత్వమును కేవలం మానవుల వరకే పరిమితం గావించకుండా, సమస్త జీవులయందు వ్యాపింప జేసే విశాల తత్త్వం భారతీయులది. ఇట్టి పవిత్రమైన సంస్కృతిని గుర్తించుకొనలేని అజ్ఞానులు భారతీయులను హేళన

ఏకాంత భక్తి

చేస్తుంటారు. భారతీయులు రాళ్లను, రప్పలను, వృక్షములను, కొండలను పూజిస్తుంటారని వారు హాస్యాస్పదముగా మాట్లాడుతుంటారు. ఏకత్వమునందు అనేకత్వమును చూడటం మానవ సహజం. **కాని భారతీయుల సంస్కృతియందు అనేకత్వంలోని ఏకత్వమును గుర్తింపజేసే పరతత్వం ఇమిడి ఉంటున్నది.**

(శ్రీ భ. ఉ. పు 127/128)

పరిపూర్ణమైన దైవత్వాన్ని పొందడానికి మీరు కూడా పరిపూర్ణమైన వారుగా తయారు కావాలి!

"పూర్ణ మదః పూర్ణ మిదం
పూర్ణా త్పూర్ణ ముదచ్యతే
పూర్ణ స్య పూర్ణ మాదాయ
పూర్ణమే వావశిష్యతే".

భగవంతుడు పరిపూర్ణుడు కాబట్టి నీవు చేసే పనికూడా పరిపూర్ణంగా ఉండాలి.

ఇది పూర్ణమైన పెద్ద సర్కిల్. ఈ సర్కిల్ లోపల చిన్న సర్కిల్ వుంటున్నది. ఆసర్కిల్ లోపల యింకో చిన్న సర్కిల్ వుంటున్నది. ఆ చిన్న సర్కిల్ దేహము. ఆ పెద్ద సర్కిల్ మైండ్. అన్నింటికన్నా పెద్ద సర్కిల్ ఆత్మ. ఆత్మసర్కిల్ ఏనాటికి మారదు. దేహమనే ఈ చిన్న సర్కిల్ చాలా విశాలం చేసుకుంటూ ఒక విశాలమైన భావంలో ప్రవేశించాలి. ఈ చిన్న సర్కిల్‌ను విశాలం చేసుకుంటూ మధ్య సర్కిల్‌లో ప్రవేశించాలి. మైండ్‌తో కూడాలి. ఈ మైండ్‌ను కూడా విశాలమైన మైండ్‌గా చేసుకొని ఆత్మలో లీనం కావాలి. **అప్పుడే అన్నిటియొక్క ఏకత్వం ప్రాప్తిస్తుంది.**

(దే.యు.క. పు.24)

అందరికి తప్పనిసరి అయినవి కొన్ని ఉంటాయి. వీటి **ఏకత్వాన్ని గుర్తించాలి.** కోటీశ్వరుడైనా ఆకాశాన్నుంచి ఊడిపడ లేదు. కూటిపేద మట్టి నుంచి పుట్టి రాలేదు. **ఇద్దరూ తల్లి గర్భము నుండే పుట్టారు.ఇది ఏకత్వము. రెండవది ఆకలి.** కూటి పేద అంబలి త్రాగవచ్చు. కోటీశ్వరుడు పంచభక్ష్యపరమాన్నములు భుజించవచ్చు. అన్నములు వేరు కాని, **ఆకలి ఒక్కటే.** ఈ ఏకత్వాన్ని మనం చూడాలి. **మూడవది మరణం** - కోటీశ్వరునకు, కూటిపేదకు మరణము ఒక్కటే. ఇది ఎవరైనా గుర్తించటానికి ప్రయత్నించవచ్చు. **నాల్గవది దాహము** - ఇరువురికీ దాహము ఒక్కటే. కోటీశ్వరుడు మంచి కూల్ డ్రింక్స్ త్రాగవచ్చు. కూటిపేద కాల్వలో ప్రవహించే జలమును త్రాగవచ్చు. కాని, దాహములో భిన్నత్వము లేదు. కనుక అనేకత్వములోని ఏకత్వాన్ని మనము విచారణ చేస్తే ఇదే నిజమైన దివ్యత్వానికి మూలాధారము.

(శ్రీస. ది. పు.90/91)

(చూ॥ గమ్యం ఒక్కటే, చైతన్యము, తెలివితేటలు, దైవబలము, ప్రేమసందేశము, మనసు)

ఏకాంత భక్తి

(చూ॥ భక్తి)

ఏకాంతముక్తి

(చూ॥ ముక్తి)

ఏకాంతవాసము

ఏకాంతవాసము దీనియందు అభిరుచి కలిగియుండవలెను. అనగా కేవలము శరీరమును మాత్రము ఎవ్వరూ జన సంచారము లేని స్థానమున అడవులయందు వుంచినంత మాత్రమున ఏకాంత వాసము కానేరదు. మనస్సును నిర్విషయం చేసుకొనుట అభ్యంతర ఏకాంతం. ఒక్క భగవంతుని తప్ప అన్య చింతలకు కానీ అన్య వ్యక్తులతో కానీ చేరక, ఒక వేళ పెద్దలైన సాధకుల దగ్గర చేరిననూ నిర్విషయ సంబంధమును కలిగియుండుట.

(గీ. పు. 212)

ఏకాగ్రత

చంచలత్వము పోయి మనస్సు క్రమక్రమేణా స్థిరపడటానికి కృషిచేయాలి. అదే ఏకాగ్రత. **~~ఈ ఏకాగ్రతకై చేయవలసిన పని యేమి? Bend the body, mend the senses, end the mind, this is the process of attaining immortality. కనుక దేహము వంచి శ్రమించి కర్తవ్య కర్మ లాచరించాలి. మనస్సును అదుపులో ఉంచుకోవాలి. మనస్సు దేహము, యింద్రియములను సరైన స్థితిలో పెట్టుకోవటానికి తగిన బలమును సంపాదించాలి.~~** మనస్సును అదుపులో ఉంచుకోవాలి. మనస్సు, దేహము, యింద్రియములు మన అధీనము నందుంచుకున్నప్పుడే మనము మాస్టర్స్ అవుతాము లేకపోతే స్లేవ్స్ అవుతాము. ఇంద్రియములను వశము చేసుకున్నవాడే మాస్టర్. ఇంద్రియములకు లోబడి పెడమార్గము పట్టకూడదు. **విద్యను అర్థించాలి. ఇతర చింతలపైన మనసు పెట్టకూడదు. లౌకిక, భౌతిక, ధార్మిక, రాజకీయములందు ప్రవేశించకూడదు. అప్పుడే నీవు విద్యార్థి అవుతావు. లేకపోతే విషయార్థి అవుతావు.**

(బ్ర.త్ర.పు. ౮౩)

పూర్ణ ఏకాగ్రత కలుగవలెనన్న పూర్ణముగా ఆశాపాశములు దూరము కావలెను. ఎపుడు పూర్ణ ఏకాగ్రత కుదరలేదో తాను అన్ని ఆశాపాశములు విడువలేదనియే అర్థము. అందులకే కామ క్రోధలోభములు మానవునకు పట్టిన కఠిన రాక్షసులని అందురు. రాక్షసులు వికార ఆకారములు కలిగియుందురు కదా అని తలంతురేమో! ఆకార మాత్రమున వికార ముండిన ప్రమాదమంత వుండెడిది కాదు; దానిని వికార ఆకారమని మాత్రమే చెప్పవచ్చును.

(గీ.పు. 228)

(చూ॥ అవధానము, ఆడవారు, ఏకత్వము, ధ్యానము, మనసు, మెడిటేషన్)

ఏకాత్మ భావము

"ఓ భగవంతుడా! నీవే నా తల్లి, నీవే నా తండ్రి, నీవే నా మిత్రుడు, నీవే నా బంధువు..." అని మీరు ప్రార్థిస్తున్నారు.

"త్వమేవ మాతా చ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవదేవ"

ఈ ప్రార్థన సరియైనది కాదు. ఇది మీకు, భగవంతునికి భిన్నత్వము కల్పిస్తున్నది. లౌకికమైన బంధుత్వాలను నిత్యమూ మీరు అనుభవిస్తూనే ఉన్నారు. ఇంక దైవంతో కూడా ఈ విధమైన బంధుత్వం ఎందుకు పెట్టుకోవాలి? బంధుత్వము చేత బంధింపబడిపోతారు. "తత్ త్వం అసి." **నీవే నేను. నేనే నీవు అనే ప్రార్థన చాల ఉత్తమమైనది. ఇదే ఏకాత్మ భావం.**

ఉన్నది ఒక్కటే కాని, ఉపాధి భేధము చేత అనేకత్వాన్ని అభివృద్ధి పర్చుకుంటున్నారు. అందరిలోను ఉన్నది ఒకే భగవంతుడు. అన్ని రూపములూ తానే, అన్ని నామములూ తనవే. దేవాలయాలలో కేశవ నామాలు చెబుతుంటారు. ఎన్ని నామాలు చెప్పినా ఉన్నది ఒకే విగ్రహము కదా! ఇట్టి దివ్యత్వమనే ఏకత్వము వల్లనే జగత్తులోని భిన్నత్వమునకు విలువ వస్తుంది. ఒక చిన్న ఉదాహరణ: ఒకటి ప్రక్కన సున్నా పెడితే పదవుతుంది. ఇంకొక సున్నా పెడితే వందవుతుంది. ఇంకొక జీరో పెడితే వేయి అవుతుంది. ఈ జీరోలకు ఇంత విలువ దేని వల్ల వచ్చింది? ఒకటి **వల్లనే. "వన్ ~~ఈజ్~~ హీరో, వరల్డ్ ~~ఈజ్~~ జీరో", దైవ మొక్కని వల్లనే అన్నింటికీ విలువ వస్తుంది. దైవము లేక జగత్తే లేదు.**

(స.సా. అ. 96 పుట 260)

ఏకాదశి

ఏకాదశి అంటే ఏమిటి? అనగా కేవలం నెలకు రెండుసార్లు వచ్చే పవిత్రమైన కాలమని మాత్రమే భావించరాదు. అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు, ఒక మనసు - ఈ పదకొండు తత్వములతో కూడినటు వంటిదే "ఏకాదశి" రుద్రస్వరూపము

(శ్రీ సా. గీ పు 22)

ఏడుపుసుఖం

ఏడుపుసుఖం

(చూ॥ ఏడుపుముఖం)

ఏడుస్తున్నారు

ఏడు ప్రాకారాల కోట
రామదాసు చెప్పాడు -
కోట ఏడుచుట్లురా కోటలోపల తోటరా
తోటలోనికి పోదమంటే దారి తెలియదు ఎట్లరా
పాటువైనది చెట్టురా పట్టు అయినది కొమ్మరా
పాటుతప్పి పట్టువిడిచితె పరబ్రహ్మయె చేరురా!
మానవత్వానికి ఏడురకములైన కోటలుంటున్నాయి. ఏమిటవి? కామక్రోధ మోహ మద మాత్సర్యములనే ఆరుకోటలుంటున్నాయి. అన్నింటికంటె పెద్ద కోట **ఏడవది దేహాభిమానము**. ఈ ఏడు కోటలకు మధ్యలో ఉంటున్నాడు భగవంతుడు. క్రింద ఉన్నది చెట్టు. చేతితో పట్టుకొన్నది కొమ్మ. కొమ్మ విరిగిపోతే నీకేమి గతి? భగవతుడే చెట్టువంటివాడు. గురువులు కొమ్మలవంటివారు. చెట్టును ఆశ్రయించిన వారికి ఏమి ప్రమాదము జరగదు. **దైవమే నిజమైన గురువు.**

(శ్రీ స. పు.84/85)

(చూ॥ దైవంకోసం)

ఏడువర్ణములు

సూర్యుని ప్రకాశములోని **ఏడువర్ణములు సమానమైనపుడు తెల్లదనమే కనిపించును. త్రిగుణములు సమానముగా ఉండిన శాంతి చేకూరును. ప్రశాంతి నిలయ మనునది మీ హృదయమే కానీ ఈ కట్టడము కాదు.** ధన వ్యయము చేసి ఇక్కడికి మీరు అనేక పర్యాయములు రానక్కరలేదు. ఉన్నచోటనే ఉండి ప్రేమతో భజించిన, దీనుల సేవచేసిన అనుగ్రహము ఆనందము దొరుకును.
స్వామి అంతటా ఉన్నాడు. ఎక్కడ చూచిన కనిపించేవన్నీ ఈ పరమాత్ముని స్వరూపమే. పరబ్రహ్మము తప్ప వేరేమియూ ఎక్కడనూ లేదు. సర్వమూ భగవంతుడే. సర్వ భూతాంతరాత్మ అంటే అదే అర్థము. తనది కాని రూపము లేదు. తనదికాని పేరు లేదు. **రాతిలోనూ భగవంతుని చూడవలెను కాని రాతినే భగవంతుని చేయకూడదు.**

(జ. పు. 186)

ఏడ్పు

పుట్టినప్పుడు యేడ్చుతారు చచ్చునప్పుడు యేడ్చుతారు
మధ్య మధ్య విషయాలకు ఎందుకెందుకో యేడ్చుతారు.
ధర్మగ్లాని కలుగుచుండ వుద్ధరింప యేడ్చినారా!
ఎందుకోస మేడ్చినారు? **ఏడ్పుకోస** మేడ్చినారా!

(శ్రీ స. గీ. పు.131)

ఏది?

అన్నదానముకంటె అధికదానం బేది ?
తల్లితండ్రులకన్న దైవమేది ?
జపతపంబులకన్న సత్యశీలం బేది ?
దయకంటె నెక్కువ ధర్మమేది ?
సుజన సంగతి కన్న చూడ లాభంబేది ?
క్రోధంబుకన్న శత్రుత్వమేది ?
ఋణము కంటెను నరునకు రోగమేది ?
ధరణి నపకీర్తి కంటెను మరణమేది ?
సర్వదా కీర్తికంటెను సంపదేది ?
స్మరణ కంటెను మించు నాభరణమేది ?

(స.సా.జూ. 1989 పు 164)

ఐకమత్యము

చీమలయందు ఐకమత్యము ఉంటున్నది. ఒక చీమ ఎక్కడైనా చక్కెరను చూసిందంటే, తానే వంటిరిగా మెక్కడానికి ప్రయత్నించదు. వెంటనే వెనుకకు పరుగెత్తుకొనిపోయి అన్ని చీమలను తీసుకువస్తుంది. అన్ని చీమలు **ఐకమత్యంగా** ఆ చక్కెరను భుజిస్తాయి. అట్లే మనం ఎక్కడైనా అన్నం మెతుకులను జల్లితే ఒక కాకి చూసిందనుకోండి. ఆ కాకి మాత్రమే స్వార్థంగా ఆ మెతుకులను తినడానికి ప్రయత్నించదు. "కావ్, కావ్!" అని అది అరచుకుంటూ పోయి, అనేక కాకులను పిలుచుకొని వస్తుంది. ఈ విధంగా కాకులలో, **చీమలలో ఐకమత్యం ఉన్నది కాని మనుష్యులలో లేదు. ఇదే ఒక పెద్ద దోషము.** ఒకే తల్లి గర్భంలో పుట్టిన పుత్రుల యందు కూడా ఈనాడు ఐకమత్యం లేదు. ఐకమత్యమే విజయానికి కారణమవుతుంది. ఐకమత్యం వల్లనే పాండవులు దిగ్విజయం సాధించారు. రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు ఆదర్శప్రాయులుగా నిలిచారు. కాని, వాలి సుగ్రీవులలో ఐకమత్యం లేకపోవడం చేత, అనేక దుఃఖాలకు గురి అయినారు. కనుక, **ఐకమత్యమే మహాబలము.** అయితే ఇది ఏవిధంగా సాధ్యమవుతుంది? అందరి యందున్న ఆత్మ తత్వం ఒక్కటే అని గుర్తించాలి. ఈనాడు జాతిమతకుల భేదములను ఏమాత్రం విచారించకూడదు. మానవు లందరిదీ మానవజాతియే. ఇంకొక దానితో పోల్చడానికి వీలు లేదు. **ఈ ప్రపంచానికి ప్రధానమైన పంచభూతములలో - గాలి దే కులం? నిప్పు దేకులం? నీటి దేకులం? పృథ్వి దేకులం? కనుక, మానవునిది మానవకులమే.** ఈ కులములో మరల కులభేదము లెందుకు? **ఈ యూనిటీ లేకపోవడం చేత ప్యూరిటీ అంతర్ధానమయింది. దానితో డివినిటీ అట్టడుగున పడిపోతున్నది. ఈనాడు యూనిటీ, ప్యూరిటీ, డివినిటీ ఈ మూడు పోయానాయి, కమ్యూనిటీ మాత్రం మిగిలింది.** ఈ కమ్యూనిటీని పట్టుకోవడం చేతనే కలహాలు బయలు దేరుతున్నాయి. కర్మమయమైన ఈ శరీరమునకు ధర్మమయమైన ఆహారాన్ని అందించాలి. అనగా ఆహారము సాత్వికమైనదిగా, స్వార్జితమైనదిగా, పవిత్రమైనదిగా, భగవదర్పితమైనదిగా ఉండాలి. అప్పుడే

ఐకమత్యము

మానవుని యందు సాత్వికమైన గుణములు ఆవిర్భవిస్తాయి.

అధర్మార్జితమైన ఆహారము మనలను అధర్మ మార్గములో ప్రవేశపెడుగుంది. ఏ విధముగా నంటే - మనము తినే ఆహారము స్థూలరూపంలో మలంగా విసర్జింప బడుతున్నది. సూక్ష్మమైన ఆహారము కండరాలుగా రక్తంగా మారుతున్నది. ఇంక అతి సూక్ష్మమైన ఆహారమే మనస్సుగా మారుతున్నది. కనుక ఎట్టి ఆహారమో అట్టి మనస్సు రూపొందుతుంది.

(శ్రీ.బా.ఉ. పు. 138/139)

చీమల్లో కాకుల్లో ఉన్న ఐకమత్యం మానవుల్లో లేదు. ఒకే తల్లి గర్భాన్ని పుట్టిన బిడ్డల్లోకూడా యిట్టి ఐకమత్యం కనబడదు. ఐకమత్యము లేకపోవుట చేత పూర్వం స్వాతంత్ర్యాన్ని కోల్పోయాము. అనేక కష్టనష్టాలకు గురి అయ్యాము. ఐకమత్యమే మహాబలమని తెలియదా?

మాపైన ఎవరైనా పరరాజు. దండెత్తి వచ్చినప్పుడు మేమంతా 105 మంది అన్నదమ్ములము. కాని, మాలో మాకే ఏమైనా అభిప్రాయ భేధాలు కలిగితే మేము 5 మంది మాత్రమే అన్నాడు ధర్మరాజు. ఇదెంతటి ధర్మమో చూడండి!

మన దేశం పైకి ఎవరైనా దండెత్తి వస్తే అన్ని పార్టీలు వారు ఏకం కావాలి. **"నాపార్టీ, నీపార్టీ" అంటు దేశాన్ని ముక్కలు ముక్కలుగా చేయకూడదు. మీలో మీరు చావండి. కాని దేశంపైకి ఎవరైనా వస్తే, అందరూ కలిసి దేశం కోసం ప్రాణాలు విడవవలసిందే! దేశాన్ని రక్షించవలసిందే. ఇదే నిజమైన స్వాతంత్ర్యము. ఇదే నిజమైన ఐకమత్యము.** ఇది లేకుండా "నీది - నాది" అని పోట్లాడుతూ కూర్చుంటే ఇంక దేశం ఏ విధముగా అభివృద్ధి చెందుతుంది?

ప్రేమ స్వరూపులైన భక్తులారా...! **ప్రతీ ఒక్కరు ఐకమత్యమును ప్రేమను పెంచుకొని, దేశక్షేమాన్ని, యావద్విశ్వ క్షేమాన్ని కోరాలి. ఇదియే నిజమైన భారతీయ సంస్కృతి.**

"లోకా స్సమస్తా స్సుఖినో భవంతు" "నా భారతదేశం మాత్రమే బాగుండాలి అని అనుకోకూడదు" అన్ని దేశాలు బాగుండాలి అని అనుకోవాలి. ప్రపంచములోని 575 కోట్ల మంది ప్రజలందరూ భగవంతుని బిడ్డలే! ఈ దేశము, ఆ దేశము అని భేధాలు పెట్టుకోకూడదు.

(దే. యు.క. పు. 40/41)

ఐకమత్యమే బల మందరి క్షేమంబు
ఎంత కార్యమైన నెగ్గవచ్చు
చిన్న చీమలన్ని సర్పంబునున్ బట్టి
చంపుచుండ లేదె జగతియందు!

(స.సా.జూ.2000 పు. 182)

"దేశం సమైక్యంగా ఉండాలి. విచ్ఛిన్నం చేయకూడదు. మానవ దేహంలో కాలు, చెయ్యి మున్నగు అనేక అంగాలు ఉన్నాయి.దీనిని ముక్కలుముక్కలు చేస్తే ఎంత రక్తం పోతుంది! ఎంత బలహీనత ఏర్పడుతుంది! యోచించండి. దేహమెంతో దేశమూ అంతే. హక్కులను అడుగవచ్చు. అందులో దోషం లేదు. కాని, వేర్పాటువాదం మంచిది కాదు. దారాలు విడిగా ఉంటే చిటికెన వ్రేలుతో సులభంగా కట్ చేయవచ్చు. కాని, దారాలతో నేసిన బట్ట దృఢంగా ఉంటుంది. ఐకమత్యమే మహాబలం. కనుక, అందరూ సమైక్యంగా జీవించాలి."

(స.సా.సె. 2000 పు.280)

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాదులు
ఏక గర్భ జాతులటంచు కాంచరయ్య
అన్నలు ద్విజులు శూద్రాదులు తమ్ములు
బలు ప్రేమ చూపుటే భావ్యమయ్యా
గుణముచే క్రియలచే తనరు వర్ణము లెల్ల
గుణమున్న గ్రహింయింప కూడునయ్యా
ద్విజుడు దుర్గుణుడైన కనగ శూద్రుడు కాదె
సుగుణి శూద్రుండు భూసురుండు కాడే
తనయులకు పితరులకు భేదంబు కలదే
ఐకమత్యంబు అన్నింట అభివృద్ధి పరచి
కలత విడనాడి ఐక్యంబు కాంచరయ్యా
అపుడే ఈ దేశ మభివృద్ధి నొందునయ్య.

(భ. స. ప్ర. ప. పు. 23)

(చూ॥ అధర్వణ వేదము, బాబర్‌లేఖ, మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి, విశ్వకుటుంబము, సమాజము, హిందువులు)

ఐతరేయోపనిషత్తు

ఈ ఉపనిషత్తు ఋగ్వేదాంతర్గతమైనది, ఆత్మతత్త్వ ప్రతి పాదకమగు కాండషట్కముతో అలరారుచున్నందున ఆత్మషట్కమని ప్రసిద్ధిగాంచినది. అవిద్యానాశన పూర్వక మగు ఆత్మదర్శనము సంప్రాప్తమయ ఆత్మజ్ఞానము కలుగునటుల శిష్యునిచే చేయబడినది. "ఆత్మ" "వ్యవహార విశిష్టము" అనబడు రెండు విధములుగా ఆత్మ నిర్వచించబడెను. వ్యవహార విశిష్టుడయినపుడు అతడు జీవుడని పిలువబడుచున్నాడు. ప్రతి మనుజునియందూ **ఆత్మజ్ఞానేంద్రియముల ద్వారా బాహ్యములకు స్ఫురించు చున్నాడు. ఆత్మ శబ్దము అత్ అను ధాతువునుండి ఉత్పన్న మగుచున్నది.** ఆ ధాతువునకు సర్వవ్యాపకత్వము, సర్వభోగము, భక్షణము, గమనమని మూడర్థములు కలవు. సర్వవ్యాపకత్వము, సర్వభోగము, సతతగమనము లక్షణములుగా గలది ఆత్మ. ఇవియే బ్రహ్మలక్షణములు. జాగ్రత్ అవస్థ యందు సర్వభోగములుగా గలది ఆత్మ. ఇవియే బ్రహ్మలక్షణములు. జాగ్రత్ అవస్థ యందు సర్వభోగములు అనుభవించుచున్నాడు, కనుక ఆత్మ శబ్దమునకు భోగపరుడనియు, స్వప్నమందు సర్వేంద్రియములు స్వస్వవ్యాపారములు మాని పరమావస్థను జెందినపుడు జాగ్రదనుభవవాసనలను స్వీయకాంతిచే జాగ్రద్రూపమున జయింప స్వీకరించు వాడనియు, సుషుప్తియందు సర్వేంద్రియములు మనస్సు గూడ చరమావస్థను పొందినపుడు సర్వవ్యాపియై ఏమియూ తెలియని కేవలము సుఖస్వరూపమును పొందు వాడనియు, ఇట్లు జాగ్రత్స్వప్న సుషుప్త్యాది అవస్థా త్రయములను బట్టి ఆత్మ శబ్దార్థము నిర్వచింపబడినది. ఉపాధివిశేషముచే ఆత్మ పరిచ్ఛిన్నముగా గాన్పించిననూ పరమార్థముచే అతడు నిరుపాధికుడు. దేశ కాల వస్తు పరిచ్ఛిన్నములు లేనివాడు, అనగా అనంతుడు, ఇదియూ ఆత్మ శబ్దమునకు అర్థము. ఇట్టి ఆత్మ సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు, సర్వధర్మవర్జితుడు, నిత్యశుద్ధ బుద్ధముక్త స్వభావుడు, అద్వయుడు, ఆత్మకు అవయవ భేదములు లేవనియు తెలియుచున్నది.

ప్రత్యక్షాదిప్రమాణములచే నీ జగత్తంతయు అనుభవ గోచరమగు చున్నది. కనుకనే మూల మంత్రమునందు అది "ఇదం" "ఇది" అని హస్తవిన్యాసముల చేతనే అనునట్లు నిర్దేశింపబడుచున్నది. ఇది వివిధ నామ రూప సంకులమై సృష్టియని ప్రసిద్ధిగ జెప్పబడుచున్నది. సృష్టి శబ్దము ఒక కార్యమును తెలుపుచున్నది. సృష్టి కార్యమునకు పూర్వము ఈ జగత్తు ఏరూపముననున్నది? **"ఇదం అగ్రే ఆత్మా ఏవ అసీత్" అనగా మన ఎదుట కాన్పించుచున్న ఈ జగత్తు సృష్టికి పూర్వము ఆత్మ గానే యుండెను.** శ్రుతికూడా ఈ విషయమును తెలిపి యేయున్నది. సృష్టికి పూర్వమున నున్న జగత్తు, తరువాత నున్న జగత్తు రెండూ ఒకటే. సృష్టికి పూర్వము అవ్యాకృతమై కేవలమాత్మ రూపమున నుండెను.

(ఉ. వా. పు.65/66)

ఐశ్వర్యము

(చూ॥ సాధకుడు)

ఒక్కటే

స్వీట్లు వేరుగా నుండినా! అందులోని చక్కెర అంతా ఒక్కటే
వ్యక్తులందరు వేరు వేరుగా నుండినా అందరిలో తత్త్వమంతా ఒక్కటే.

(సా॥ పు 613)

లక్ష్యము ఒక్కటే. మార్గములు వేరు వేరైనప్పటికి గమ్యం ఒక్కటే. కనుకనే -

శృంగారములు వేరు బంగార మొక్కటె
పశుల వన్నెలు వేరు పాలు ఒకటె
జీవజంతులు వేరు జన్మ మొకటె
జాతి నీతులు వేరు దైవమ్ము ఒక్కడె
పూల జాతులు వేరు పూజ లొకటె
తెలియలేకను మానవుల్ తెలివి తప్పి
బ్రతుకు కోసము బహుబాధ బద్దులైరి

ఈ బ్రతుకు కోసము ఇన్ని మార్గములు పడుతున్నారేకాని నిజముగా యోచిస్తే అన్నీ ఒకటే. ఏ మతాన్ని మనము విమర్శించకూడదు. నా మతము గొప్పది, నీ మతము తక్కువని వాదోపవాదములు చేయటము సంకుచిత బుద్ధులు స్వభావము. అన్ని మతములు ఒక్కటే, అన్ని మతముల బోధలు ఒక్కటే, అన్ని మతములు సత్యము ఒక్కటే, ఈ విధమైన సమత్వాన్ని మనము అనుసరిస్తూ పోతుంటే తప్పక మనలో దివ్యత్వము ఆవిర్భవిస్తుంది.

(బృ.త్ర.పు. ౧౬౮)

క్రమక్రమేణ **గాయత్రీ మంత్రమందు సూర్యుని ప్రధానమైన దేవతగా విశ్వసిస్తూ వచ్చారు. 'ధీయో యో నః ప్రచోదయాత్'. సూర్యుడు ప్రకాశించునట్లుగా మానవుని బుద్ధి అమితంగా ప్రకాశించాలి;** సూర్యప్రకాశము బుద్ధిలో ప్రవేశించాలనే ప్రార్థనలు సలుపుతూ వచ్చారు. గాయత్రీ మంత్రముచ్చరించుకుంటూ **గాయత్రి వేదమాత అని విశ్వసించినారు. గాయత్రి ఒక కాలమునకు ఒక దేశమునకు ఒక పాత్రకు సంబంధించినది కాదనియు, భూర్భువస్సువః మూడులోకములకు మూడు కాలములకు సంబంధించిన దనీ విశ్వసించారు. "తత్సవితుర్ వరేణ్యం భర్గో దేవస్య ధీమహిః ధియో యో నః ప్రచోదయాత్" చీకటిని రూపు మాపేది వెలుగు. వెలుగు లేకుండా చీకటి దూరము**

కాదు. చీకటిని రూపుమాపే సూర్యుడు గాయత్రీరూపములో ప్రధానస్థానమును ఆక్రమించాడు. ఈ విధముగా యేదో ఒక శక్తి వున్నదని, ఈ శక్తియే దైవమని విశ్వసించుకుంటూ వచ్చారు.

క్రమక్రమేణా అంకెలను నేర్చుకోటానికి ప్రయత్నిస్తూ వచ్చారు. ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది. ఈ పది అంకెలలోపల ఒకటే ప్రధానముగాని మిగిలినవన్నీ దానికి భిన్న స్వరూపములే. రెండు అనే అంకె రెండు ఒకట్లు చేరడం వల్లనే రెండు అయిపోయింది. తొమ్మిది అనే అంకె తొమ్మిది ఒకట్లు చేరటం వల్లనే సంభవిస్తుంది. మిగిలిన నెంబర్లన్నీ ఒకటికి రూపాంతరములే అనే సత్యాన్ని గుర్తించారు. కనుక ప్రధానముగా ఒక్కటే వున్నది. **"ఏకం సత్ విప్రాः బహుధా వదంతి"** ఉన్నది ఒక్కటే అయినప్పటికిని వ్యక్తులు అనేకముగా భావిస్తున్నారనే సత్యాన్ని గుర్తిస్తూ వచ్చారు. దీనినే వేదమునందు **"ఏకోహం బహు స్యాం"** ఉన్నది ఒక్కటే అనేక లక్షలు మిలియన్లుగా మారిపోతుంటున్నాది. ఒకటి లేక రెండుగాని, పదిగాని, మిలియన్లుగాని కావటానికి వీలుకాదు. ఈ అంకెల ద్వారా దైవము కూడను ఒక్కటే అనే సత్యమును మానవులు గుర్తించినారు. ప్రపంచములో మనకు అతీతమైన శక్తి ఒకటి వున్నదనియు ఆ శక్తి ఒకటేగాని రెండు కాదనీ విశ్వసించినారు. **ఆ ఒక్కటే అనేక రూపముల ధరించి అనేక రూపనామములతో జగత్తున వ్యాపించి వుంటున్నది.**

మానవుడు గుర్తించవలసినది ఒక్కటే. ఒక్కదానిని గుర్తించుకుంటే అన్నీ అందులో లీనమైపోతాయి. ఆ ఒక్కటి ఏమిటి? అదే ఆత్మతత్వము ఈనాడు ఆత్మవిశ్వాసము కోల్పోతున్నాము. ఆత్మగాని అనాత్మ భావములన్నియు తెలుసుకుంటున్నాము. మనము చేయవలసిన సాధనలు ఏమి టిప్పుడు? ధ్యానమా? యోగమా? తపమా? జపమా? యజ్ఞమా? యాగమా? క్రతువులా? ఇవి యేమియు కాదు. ఒక్కటి మాత్రమే మనము గుర్తించాలి. **అనాత్మభావమును వదలిపెడితే ఆత్మ సాక్షాత్కారమవుతుంది. ఏ సాధనలు చేయనక్కర లేదు.** ఈ సాధనలు కేవలము మనస్సు తృప్తికోసం చేసేవి. సాధనలన్నీ మనస్సుద్వారానే చేస్తున్నాము. మనస్సుద్వారా చేసే సాధనలు మనస్సు నేవిధంగా అరికట్టగలవు? దొంగను దొంగ పట్టగలడా? తానే దొంగయైనప్పుడు తనను తాను పట్టటానికి యేమాత్రము ప్రయత్నించడు. అదేవిధముగనే మనస్సు మనస్సును పట్టటానికి యేమాత్రము ప్రయత్నించదు. **మనసును మనము అమనస్కము చేసుకోవాలి.** అమనస్కమనగా ఏమిటి? సంకల్పరహితమే అమనస్కము. సంకల్పములు క్రమక్రమేణా తగ్గించుకుంటే తప్పక మనస్సు యొక్క ప్రభావము తగ్గిపోతుంది.

(ఉ. పు. 35)

ప్రేమ, ప్రేమించువాడు, ప్రేమింపబడువాడు మూడు ఒక్కటే, ప్రేమ లేక ప్రేమించువా డుండడు. ప్రేమ, ప్రేమించువాడు ఉండియూ, ప్రేమింపబడువాడు లేనిది ప్రేమ వినియోగము లేదు. ఈ మూడింటి యందు ప్రేమ ప్రధానవస్తువుగా తేలుచుండును. అట్లు సమానముగా, ప్రధానముగా ఏది అన్నింటియందు ఇమిడియున్నదో అదే పరమాత్ముడు.

(ప్రే.వా. పు. 44)

"అంకె తరువాత సున్నల కబ్బు విలువ
అటులె ఒక్కడొ దేవుని కనిన పిదప
నీవు లెక్కగొను అనేక జీవగతుల
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు
సాధుసద్గుణ గణ్యులొ సభ్యులార!"

(ఆ. పు.273)

"లవ్ ఈజ్ మై ఫామ్, ట్రూత్ ఈజ్ మై బ్రెత్, బ్లిస్ ఈజ్ మై ఫుడ్
మై లైఫ్ ఈజ్ మై మెస్సేజ్, ఎక్స్‌పేన్షన్ ఈజ్ మై లైఫ్
నో రీజన్ ఫర్ లవ్, నో సీజన్ ఫర్ లవ్, నో బర్త్, నో డెత్"
(పై ఆంగ్ల గీతాన్ని శ్రీవారు భక్తులందరిచేత పాడించారు.

అనంతరం తమ దివ్యోపన్యాసాన్ని కొనసాగిస్తూ) 'లవ్ ఈజ్ మై ఫామ్' అనగా, ప్రేమయే నా స్వరూపం అనే మాట కేవలం కేవలం స్వామికి మాత్రమే కాదు, మీ అందరికీ వర్తిస్తుంది. కేవలం భగవంతుడు ప్రేమస్వరూపుడు అని మాత్రమే అనుకుంటే ప్రయోజనం లేదు. మీరందరూ ప్రేమ స్వరూపులే. 'లవ్ ఈజ్ మై ఫామ్, ట్రూత్ ఈజ్ మై బ్రెత్' (ప్రేమయే స్వరూపం, సత్యమే నా శ్వాస) అని మీకు మీరే అనుకోవాలి. అప్పుడే మీరు స్వామితత్వంతో ఏకత్వాన్ని అనుభవిస్తారు. 'ఐ అండ్ యు ఆర్ వన్' (నీవు, నేను ఒక్కటే) అనే పరిపూర్ణస్థితికి చేరుకుంటారు. దీనినే వేదాంతము. 'తత్ త్వం అసి, అహం బ్రహ్మాస్మి...' అని చాటింది. బైబిల్, ఖురాన్ మున్నగు పవిత్ర గ్రంథములన్నీ ఈ సత్యాన్నే బోధించాయి. కనుక ఏ మతమునూ అపహాస్యం చేయవద్దు. All are one, be alike to every one. అందరు ఒక్కటే అని సత్యాన్ని మీరు ప్రపంచమంతా చాటాలి.

(స.సా.జ. 97 పు.5)

ఉన్నది ఒక్కటే. ఆ 'ఏకాత్మా సర్వ భూతాంతరాత్మా.' అనేక తత్వంగా మీరు భావిస్తున్నారు. అనేకత్వములోని ఏకత్వమును మనం గుర్తించాలి. దీనికి ఉదాహరణ. ఒకటి ఇక్కడ పెట్టండి; యిక్కడ తొమ్మిది పెట్టండి. ఏ పిల్లవానినైనా 1 పెద్దనెంబరా 9 పెద్దనెంబరా? అని అడగండి ఏ చిన్న పిల్లవాడైనా 9 పెద్ద నెంబరు అంటాడు. ఇదికాదు.**Mathematics లో 9 పెద్దది గాని 1 biggest నంబరు.** ఈ ఒకటి లేక తొమ్మిది ఎక్కడునుంచి వచ్చింది. 1+1+1+1+1....= 9. ఒకటి లేక తొమ్మిది లేదు. కాబట్టి ఉన్నది ఒక్కటే. ఒకటి పెట్టి, దాని ప్రక్కన సున్న పెట్టండి; యింకొక సున్న పెట్టండి నూరు. యింకో సున్న పెట్టండి వెయ్యి. యింకో సున్న పెట్టండి పదివేలు. కానీ ఒకటి ఉండినంత వరకే సున్నలకు విలువ. ఆ ఒకటి హీరో. అతనేGod. World is zero. Moon is zero, Earth is Zero, Sun is Zero. అన్ని జీరోలు పెట్టుకున్నపుడు వాటికి విలువ వస్తున్నది. కట్టకడపటికి Life is zero.కానీ ఉన్నది ఒక్కటే ఆ ఒక్కదానికి ఏనాడు ముప్పురాదు. **"ఏకోహం బహుస్యాం"** తానొక్కడే అనేకంగా రూపొంది నాడు. అదియే ఆత్మతత్వము.

జగత్తంతా నిండినది ఒక్కటే. ఆ ఒక్కటే అనేక రూపములుగా గోచరిస్తున్నది. కనుక ఆత్మతత్వము మనం గుర్తించాలనుకుంటే జీవతత్వమును ఏకత్వముగా భావించాలి. మన పిచ్చికోతి వంటి మనస్సును సక్రమమైన మార్గములో నడిపింపచేయాలి. అప్పుడప్పుడు పిల్లలకు చెబుతాను. Mind is like a mad monkey. Body is like water bubble. Don't follow the mind, follow the conscience.

అదియే ఆత్మ **Conscience ని follow చేస్తూరావాలి దీనినే తెలుగులో 'ఆత్మసాక్షి' అన్నారు.** ఈ ఆత్మసాక్షిగా ఒక పని మనం చేసినామంటే విజయమే సాధిస్తాము. కానీ ఆత్మ సాక్షి మనం ఏనాడూ తీసుకోవటం లేదు. పరుల సాక్షిని మనం తీసుకుంటున్నాము. ఇతను నాకు సాక్షి అని. కాదు కాదు ఆత్మయే సాక్షి. అట్టి self-confidence మనలో రావాలి.

(ద. య.స. పు. 96/97)

నీవు అజ్ఞానము నుండి లెమ్ము లెమ్ము. **ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్నిబోధత. ఈ అజ్ఞానమనే నిద్ర నుంచి నీవు మేలుకో. ఈ ప్రాకృత భావమునుంచి నీవు మేలుకో. లౌకిక జీవితము నుండి నీవు మేలుకో. దివ్యభవ్యమైన ఆత్మతత్వములో నీవు మేలుకో. స్వస్వరూప సంధానము. ఇదే ఆత్మ నిష్ఠ, ఆత్మ సందర్శనము. ఇదే self realisation. ఆత్మసాక్షాత్కారము ఇదే. నిన్ను నీవు ఎవరో తెలుసుకో. నిన్ను నీవు తెలుసుకొనక అన్నింటిని తెలుసుకున్నానంటే అజ్ఞానమే.** తనను తాను తెలుసుకొనక అన్నింటిని తెలుసుకున్నానంటే అజ్ఞానమే. **తనను తాను తెలుసుకోవటానికి ప్రయత్నించిన వాడే నిజమైన జ్ఞాని.** ఇక్కడ రెండు లేవు. తెలుసుకునేవాడు, తెలుసుకోబడేది రెండు లేవు. రెండు ఉంటే ద్వైతమే అవుతుంది. గానీ అద్వైతము కాదు. ఒక్కటే ఉండాలి. ఉన్నది ఒక్కటే. నేను రెండుగా లేను. నేను రెండుగా ఎట్లా కనిసిస్తున్నాను? నిలువుటద్దము ముందు ఉండటం చేత రెండుగా కనిపిస్తున్నాయి. ఇది కేవలం భ్రాంతి కానీ సత్యము కాదు.

నిలువుటద్దములో నీడ చూచుటకు జోడేల?
వియత్పథములో చంద్రుని విలోకించుటకు వెలుగేల?
ఆత్మతత్త్వము తెలుసుకొనుటకు గురువేల? అన్నారు. నీవు ఎప్పుడు ఒకటి అయిపోతావు? రెండులేనటువంటి తత్త్వాన్ని మనం పొందాలి. ఎన్ని రూపములైనా ఇది ఒక్కటే. ఎన్ని చలనములు పొందినా ఇది ఒక్కటే.

(ద. య. స. పు.98)

జగత్తునందు రెండులో ఒక్కటి ఉంటున్నది. జడము చైతన్యము, దేహము - దేహి, క్షేత్రము - క్షేత్రజ్ఞుడు. ఇది రెండుగా ఉండినప్పటికీ, రెండూ చేరి ఒక్కటే. మనము ఒక మోసంబీ పండును తీసుకొన్నాము. దానిపైన చేదు చర్మము, లోపల స్వీట్ జ్యూస్, రెండూ ఉన్నప్పటికీ అది ఒకటిగానే మనకు కనిపిస్తున్నది. పైన చేదు చర్మము తీసివేస్తే లోపల స్వీట్ జ్యూస్ మనకు లభ్యమవుతుంది. ఇటువంటిదే క్షేత్ర- క్షేత్రజ్ఞ విభాగయోగము. దేహము - క్షేత్రము. లోపల ఉన్నవాడు. క్షేత్రజ్ఞుడు. ఐతే రెండూ చేరి ఒక్కటే! కాని, అనుభవించవలసినది ఒకటి, త్యజింపవలసినది మరొకటి. మోసంబీ పైన చర్మమును పారవేస్తున్నాము. స్వీట్ జ్యూస్‌ను స్వీకరిస్తున్నాము. కనుక, త్యజించవలసింది ఒకటి, వరించవలసింది మరొకటి. ఇదే ఈనాడు మనం తెలుసుకోవాలి. **జగత్తును త్యజించాలి. పరమాత్ముని ప్రేమించాలి. ఇదే మన జీవిత లక్ష్యము.** నిజంగా భగవంతుని ప్రేమను అర్థం చేసుకొంటే, చేతిలో నున్న కర్చీఫ్‌ను వదిలినంత సులభంగా జగత్తును త్యజించవచ్చును. కర్చీఫ్‌ను చేతిలో పట్టుకోవడం చాలా శ్రమకాని వదలటం చాలా సులభం. అదేవిధంగా ప్రేమను అర్థం చేసుకున్నవారికి జగత్తును త్యజించడం సులభం. అర్థం చేసుకోలేని వారికే ఇది కష్టం.

(శ్రీ.భ.ఉ.పు. 163)

(చూ॥ ఆధ్యాత్మికము, కర్తృత్వము, క్షేత్రజ్ఞుడు, చైతన్యము, నాప్రక్కన నడచిరా, మనసు, ముక్తి, మూలాధారము, వేరు, స్వాతంత్ర్యము)

ఒక్కడే

సముద్రము ఒక్కటే: దిక్కులను పట్టి సాగరమునకు అనేకపేర్లు ప్రకటింతురు. అదేవిధమున అనుగ్రహ సాగరుడైన పరమాత్మ ఒక్కడే; ఆయా యుగములనుపట్టి అనేక రూపనామములు కల్పించుకొనుచున్నాడు, పుణ్యనదులు సాగరమున చేరుటకు అనేక మార్గములుగా అనేక దిక్కులు ప్రవహించుచూ (అనగా ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర, వాయవ్య, ఈశాన్య; ఆగ్నేయ,నైఋతి ఈ అష్టదిక్కుల ప్రవహించిననూ) కట్టకడపట చేరునది ఒకే సాగరము: కాన మానవజాతి కూడా అనేక సాధన మార్గముల భగవంతుని కొల్చినను, కడకు కృష్ణ పరమాత్మయందే లీనము కావలెను.

(ప్ర. వా. పు.38)

ఒక కొయ్య ఏనుగు ఎంత కళాత్మకంగా జీవం ఉట్టిపడేటట్లు చెక్క బడినప్పటికీ అది బొమ్మే. అది ఎప్పటికీ నిజమైన ఏనుగు కలిగించే అనుభూతి కలిగించలేదు. అనేక గ్రంథములున్నప్పనటికీ **లైబ్రరీ** ఎన్నటికీ అధికారపూర్వకమైన గురువు స్థానం పొందలేదు. మీరు పది **దేవాలయాలు** తిరిగి చివరకు పదకొండవదిగా భావించి ఇక్కడకు వచ్చారు. అంటే తెలివితక్కువగా పది లైబ్రరీలు వలెనే భావించి ఈ పదకొండవ లైబ్రరీకి వచ్చినట్లున్నారు. ఇక్కడ **మీరు చూడండి, వినండి, శోధించండి, పరిశీలించండి, అనుభవం పొందండి, ప్రతిఫలించండి. అప్పుడు మాత్రమే మీరు నన్ను తెలిసికొనగలరు. అప్పుడు నేను ప్రేమ స్వరూపుడనని మీరు గ్రహిస్తారు.** నేను **ఇవ్వగలిగింది ఒక్కటే- ప్రేమ ద్వారా ఆనందం. మీకు ఓదార్పు, ధైర్యము, శాంతి ఇవ్వటం నా కర్తవ్యం. అంటే నా గుణాలు సనాతనమైనవి, అధికార పూర్వకమైనవి. నేను సృష్టించుకొన్న ఈ రూపం మాత్రమే నూతనమైనది.** నా కోరిక ఒక్కటే, విశదంగా చెప్పాలి అంటే మీరు నన్ను అధికంగా అధికంగా ఆశించండి, అపేక్షించండి. నేను ఈ రూపం ధరించి మీ మధ్యకు ఇలా రావటంలోనే నా కోరిక మీకు అర్థమయి ఉండాలి.

(శ్రీ స. వ. 61-62 పు.143)

ఒకరే

సర్వులకు భగవంతుడు ఒక్కడే. ఏకస్వరూపాన్ని ధరించిన భగవంతుని అనేక భావములచేత అనేక నామములచేత అనేక రూపములలో ఆరాధిస్తాడు. **"ఏక ప్రభుకే అనేక నామ్" దైవము ఒక్కడే.** హిందువులు కాని మహమ్మదీయులు కాని క్రిష్టియన్స్‌కాని బౌద్ధులు కాని పార్సీలు కాని సిక్కులు కాని వేరు వేరు రూపములు ధరిస్తున్నా అందరికీ భగవంతుడు ఒక్కడే. ఏ పేరు పెట్టుకొని ఏ రూపమున ఆరాధించినా దైవానికే చెందుతుంది. కనుకనే **"సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి"** అన్నారు. ఎవరికి నమస్కారం చేసినప్పటికిని అదంతా భగవంతునికే చెందుతుంది. పాత్రలు వేరు వేరు కాని ప్రతిబింబము ఒక్కటే. అదేవిధంగా దేహమనే పాత్రయందు ఆత్మ తత్వమనే ప్రతిబింబము విడివిడిగా కనిపిస్తూ ఉంటుండాది. **"ఒక సూర్యుండు సమస్త లోకములకున్ ఒక్కక్కడై తోచు!" సూర్యుడు ఒక్కడే.** అమెరికన్ సూర్యుడని, బ్రిటిష్ సూర్యుడని, పాకిస్తాన్ సూర్యుడని, చైనా సూర్యుడని, భారతదేశం సూర్యుడని, పేరు ప్రత్యేకం లేదు కదా! ఐతే ఒక్కక్క దేశమువారు ఒక్కొక్క సమయములో ఆ సూర్యుని చూడవచ్చు. అందరూ ఒక్కతూరి చూడటనికి సాధ్యము కానంత మాత్రమున వేరువేరు సూర్యులని భావించటము వెట్టితనము కదా!

(బృ.త్ర. పు ౧౯౨)

విష్ణువే గొప్పని వైష్ణవు లనుచుండ
శంభుండు గొప్పని శైవు లనగ
గణపతి గొప్పని గాణాపత్యులు పల్క
శారద గొప్పని చదువరు లన
అల్లా ఘనుం డనుచు అల్ల తురకలు చెప్ప
క్రీస్తుయే గొప్పని క్రైస్తవు లన
బుద్ధుడే గొప్పని బౌద్ధు లనుచుండ
మహావీరుడే గొప్పని జైనులనగ
జోరాష్ట్ర గొప్పని పారశీలు చెప్ప
నానక్ గొప్పని సిక్కులనగ
సాయియే గొప్పని బాబా భక్తులు చెప్ప
అంద రొక్కటే యని కొందరనగ
సర్వమత సమ్మతంబైన దేవు డొక్కడే
అతడె సత్యము, అతడె ధర్మము
అతడె శాంతియు, అతడె ప్రేమ.

(స.సా.జ. 97 పు.1)

(చూ॥ అయిదవ పురుషార్థము, ఏకత్వము, త్రికాండ స్వరూపము, ప్రేమమతం, భక్తిమార్గము, మార్పు, సగుణ భక్తి)

ఒకరే

"విష్ణువు చతుర్భుజములలో శంఖు, చక్ర, గదా పద్మములను ధరించియుంటాడు. శంఖము శబ్దమునకు, చక్రము కాలమునకు, గద శక్తికి, పద్మము హృదయమునకు చిహ్నములు. శబ్దమునకు, కాలమునకు, శక్తికి, జీవరాసులన్నిటియొక్క హృదయకమలములకు ఆయన అధిపతి. అదే విధముగా, శివుడు ఒక చేతిలో డమరుకము రెండవచేతిలో త్రిశూలమును ధరించి యుంటాడు. డమరుక నాదమునకు, **త్రిశూలము త్రికాలాత్మకమైన కాలమునకు చిహ్నములు. శబ్దమునకు, కాలమునకు ఆయన అధిపతి. ఈ విధముగా శివుడు, విష్ణువు ఇద్దరూ ఒకరే. రూప,నామములు మాత్రమే వేరు. వారిరువురూ ఒకటేనని భావించకపోవడం భక్తుని యొక్క సంకుచితత్వమును తెలియజేస్తుంది."**

(ధ్రై. ది. పు.64)

ఒట్టి చేతులు

మీరు నాదగ్గరకు వచ్చేటప్పుడు చేతుల నిండా వ్యర్థపదార్థాలు తీసికొని రాకండి. మీ చేతులు ఆ విధంగా ముందుగానే నిండి ఉంటే నేను నా అనుగ్రహాన్ని మీకు ఎలా అందివ్వగలను? ఒట్టిచేతులతో రండి. నా ప్రేమనిధిని తీసికొని వెళ్ళండి.

(శ్రీస. వ. 61-62 పు.107)

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

ఓం/ఓమ్

ఓంకారోచ్చారణ మనసులో జరగవలెను. కానీ, వాక్కుతో కాదు అని తెలియజెప్పెను. తరువాత, అర్జునునకు మరొక సంశయము మొలకెత్తెను. "కృష్ణా! **'జపతోనాప్తి పాతకం'** అన్నావుకదా, జపముచే పాపము మాత్రము పోవును, పరమాత్మప్రాప్తి యెట్లు లభించును?" అని అడిగెను, అపుడు పరమాత్ముడు అర్జునుని ప్రశ్నకు సంతసించి, "పార్థా! నీవడిగిన ప్రశ్న చాల అవసరమైనదే కానీ, అది ప్రత్యేకించి వేరు క్రియగా చేయనక్కరలేదు, ఓంకార మంత్రమును ఉచ్చరించుచూ, ఆ ఓంకార మంత్రార్థ మైన పరమాత్ముని భావన చేసినంత మాత్రమున పరమాత్మ ప్రాప్తికూడా చేకూరును"

(గీ॥ పు.146)

మనసును ఇంద్రియముల నుండి ఉపసంహరించు అభ్యాసమును చాలా కాలము పాటించిన దానికి అట్టి శక్తి సామర్థ్యములు అలవడును. ఓంకారోచ్చార పూర్వకంగా పరమాత్మను స్మరిస్తూ ప్రాణమును వదలినట్టివాడు తప్పక భగవంతుని పొందుచున్నాడు."

(గీ.పు.147)

ప్రణవము లేక 'ఓమ్' ఆధ్యాత్మిక శిశువు మూడు చక్రముల బండి. ఆ మూడు చక్రములు ఆ,ఉ,మ్. ఆ మూడు కలిసి ఓమ్ అయినది. ఇది జీవిత ఉచ్ఛ్వాస నిశ్వాసములలో అంతర్గతముగా నున్న ప్రధాన (మొదటి) శబ్దము. **ప్రతి శ్వాసతోను సోఽహం ఉచ్చరించబడును. గాలి పీల్చునపుడు 'సో' అనియు, విడుచునపుడు 'హం' అనియు అందుము. దాని అర్థము 'అతడు - నేను ఈ బాహ్య ప్రపంచమంతటను వ్యాపించియున్న 'అతడు' సర్వభూతాంతరాత్మయైన 'నేను' గా ఉన్నాడను విశ్వాసము కలిగించుచున్నది.** గాఢసుషుప్తిలో నున్నప్పుడు ఇంద్రియములు, మెదడు, మనస్సు వాటి కార్యములు చేయక, ప్రచ్ఛన్న స్థితిలో నున్న సమయములో 'అతడు', 'నేను' విడిగా నుండక, క్రమముగా క్షయమై, 'సోహం' శబ్దము 'ఓమ్' శబ్దముగా మారిపోయి, బాహ్యము అంతరములో కలిసిపోవు ఏక సత్యమును నిరూపించును.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

ఓంకారము

'ఓమ్' కి ఇతర ప్రాముఖ్యతలు చాలా కలవు. సత్యాన్వేషకునకు 'ఓమ్' ప్రణవోచ్చారణ విలువైన సాధనగా ఉపకరించును. అది సూర్యకిరణములలోని సప్తవర్ణములు కలసిపోయిన వర్ణ రహిత ప్రకాశము వంటిది. మానవుడు ఏ దివ్యత్వము నుండి వచ్చెనో ఆ దివ్యత్వపు హద్దులు చేరుకోవలెను.

(శ్రీస. సూ. పు.85)

జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలను ప్రాజ్ఞులు క్రమముగా అకార, ఉకార, మకారములకు సరిపెట్టుచున్నారు. ఈ మూడింటి పర్యవసానమే ఓంకారము. అకార ప్రధానమగు ఓంకారోపాసనము వలన సర్వ కామ్య ప్రాప్తి సిద్ధించును. ఉకార ప్రధానముగా చేయు ఓంకారోపాసనము వలన జ్ఞానసంపద కలుగును. మకార ప్రధానముగా చేయు ఓంకారోపాసనము వలన లయమగుచున్నది. ఇట్లు తెలుసుకొని ఓంకారోపాసన చేయువారు జగత్తుయొక్క యథార్థమును తెలిసికొనగలరు.

అకారాది మాత్రాత్రయము ఓంకారమున లయ మగుటచే అది అమాత్ర అగుచున్నది. ఓంకారము శాంతము, శివము, అద్వైతము. ఇట్టి జ్ఞానము వలన బ్రహ్మాత్మైక్యము పొంద వచ్చును. ప్రణవము సృష్టి, స్థితి, లయ కారణమనియూ సర్వశోకనాశక మనియు 24-29 కారకలతో స్తుతింపబడుచున్నది. ఇంతియే కాదు, ఓంకార తత్త్వమును తెలిసికొని మననము చేయువాడు పరమాత్మ తత్త్వమును తెలిసికొనినవాడగుచున్నాడు.

(శ్రీస.సూ. పు.147/148)

(చూ॥ పంచభూతములు, భక్తి, శాస్త్ర యోనిత్వాత్)

ఓంకారము

ఓంకారమనేది దివ్యమైన ప్రథమ శబ్దము. **అకార, ఉకార, మకారముల చేరికనే ఓంకారము. అకారమే లక్ష్మణుడని, ఉకారమే భరతుడని, మకారమే శత్రుఘ్నుడని ఈ మూడు శబ్దములు చేరిన ఓంకారమే రాముడని నిరూపిస్తూ వచ్చింది.** రామా అనేది ఆత్మకే సంబంధించిన నామము కాని అన్యమునకు సంబంధించినది కాదు. ఆత్మారామ అనేది భారతీయులు నిరంతరము ఉచ్చరిస్తూ ఉంటారు. రమింపచేసేది కనుకనే దీనికి రామ అనిపేరు. దీనికి సంఖ్యాశాస్త్రమునందు ప్రత్యేకమైన అర్థమున్నది. **నామ అనేది రెండక్షరములు కాదు. మూడక్షరములు. న,అ,మ=నామ. గణితశాస్త్రమునందు అనగా సాంఖ్య యోగమునందు దీనికి అక్షరశాస్త్రమని నిరూపిస్తూ వచ్చారు. న=0, అ=2, మ=5, న+అ+మ, 0+2+5=7 దీనినే సప్తస్వరములుగా భావిస్తూవచ్చారు. దీనిని సంగీత శాస్త్రమునకు ఆధారముగా తీసుకుంటూ వచ్చారు. అదే స,రి,గ,మ,ప,ద,ని, ఏడు శబ్దములు. దీనిని అధారము చేసుకొని సప్తసముద్రములు సప్తనాళములు, సప్తఋషులు అని ఈ విధంగా సప్తదినములని, సప్తాహమని యజ్ఞమును ప్రారంభిస్తూ వచ్చారు.** భగవన్నామమునుగూర్చి ఎంతైన చెప్పడానికి వీలుంటుండాది. జగత్తంతా భగవన్నామముతో నిండి ఉన్నటువంటిదే. అంతయు శబ్దరూపమైన తత్త్వమే. అలాంటి శబ్దరూపమైన భగవత్స్వరూపాన్ని మనం ఈనాడు గుర్తించుకోలేక పోతున్నాము. భగవన్నామమును ఉచ్చరించాలంటే ఏదో అలక్ష్యంగా మనం కాలమును వ్యర్థం చేస్తున్నాము. **సంకీర్తన మనేది జీవితమునకు ఆధారమైన నాదము. మన దేహమునకు వెన్నెముక ఎట్టి ఆధారమో జీవితమునకు నాదము అట్టి ఆధారము.** ప్రతి శబ్దము భగవన్నామముతో కూడినదే. మన ఉచ్ఛ్వాసనిశ్వాసములు కూడను భగవన్నామముతో కూడినవే. సో ఽహం సోఽహం అదీ భగవన్నామమే. అదే **దైవత్వమునకు మూలాధారము.** మానవజీవితమంతయు దైవశబ్దములచే అధారపడి ఉంటుండాది. ఐతే ఈనాటి మానవులు అనేక విధములైన మార్గములను అనుసరించి అనేక విధముగా స్మరిస్తూ వస్తున్నారు.

(శ్రీస.వి.వా. పు.70/71)

"ఓం" కారము "అ" కార, "ఉ" కార, "మ" కారముల సమ్మేళనము. **"అ" కార శబ్దము కంఠము నుండి మృదువుగా మొదలగును. అది ధరిత్రి. "ఉ" కారము నోటినుండి ఉచ్చస్వరములో వెలువడును. "మ"కారము**

తగ్గు స్వరములో పెదిమల నుండి వెలువడును. ప్రణవనాదములోని హెచ్చుతగ్గులను విమాన శబ్దముతో పోల్చ వచ్చును. మొదట సుదూరములో నున్న విమాన శబ్దము వలె, విమానము సమీపించు కొలది హెచ్చు శబ్ద తీవ్రత వలె, మరల విమానము దూరమగుకొలది శబ్ద తీవ్రత క్రమముగా సన్నగిల్లునట్లు ఉండును. **"అ" కారము ప్రపంచము. "ఉ" కారము స్వర్గము. "మ" కారము ఇంద్రియాతీతమైన దివ్యత్వము.**

ఓం కారమును ప్రేమతో పలికినట్లయిన,కచ్చితమైన ఉచ్చారణ అంత ముఖ్యము కాదు. తల్లికి, శిశువుకు మధ్య ఉన్నది ప్రేమ బంధము. శిశువు ఏడ్వ మొదలిడిన, ఆ ఏడ్పు శ్రుతి సరిగా ఉన్నదా, లేదా యనే చింత తల్లికి ఉండదు. వెనువెంటనే శిశువు వద్దకు పరుగున వెళ్ళి అక్కున చేర్చుకొనును. దివ్యమాత అన్ని ప్రదేవములలోనూ కలదు. స్వామి ఇక్కడ ఉన్నారు, కాని, దివ్యమాత ఎల్లెడలా కలదు. కాబట్టి, ప్రతి ఒక్కరికి అవకాశమున్నది. ఒక వ్యక్తిలో భగవంతుని కొరకై ఆవేదన ప్రారంభమయిన వెంటనే అనుగ్రహముతో ప్రతిస్పందించుటకు దివ్యమాత కలదు. ఈ విషయములన్నిటిలో ప్రేమ అత్యావశ్యకమైనది. భగవంతుని ప్రేమించుటయే భగవంతుని పట్ల భక్తిని ప్రదర్శించుట. ఇక యథార్థమైన ప్రణవ నాదము సహజ సిద్ధమైనది; అది నాశికారంధ్రముల ద్వారా ప్రవేశించి ఫాల భాగములో కేంద్ర స్థానమును చేరి చెవుల ద్వారా ప్రపంచములోకి వచ్చును. రేడియో కేంద్రమునుండి వచ్చు ప్రసారము వలె.

(ప. పు. 176/177)

21 పర్యాయములు ఎందుకు ఓంకారము చెయ్యాలి. మనయొక్క జీవితము 21 తత్త్వములతో కూడినటువంటిది. కర్మేంద్రియములు ఐదు, జ్ఞానేంద్రియములు ఐదు, పంచప్రాణములు, పంచకోశములు ఈ 20 తత్త్వములతో మనదేహము మిశ్రమమై ఉంటుండాది. దానిపైన జీవతత్త్వము అనేటువంటిది సవారి చేస్తుండాలి. అనగా ఈ **20 గుఱ్ఱాలపైన జీవి అనేటటువంటి రథసారధి గుఱ్ఱాలను నడుపుతూ వస్తున్నాడు. కనుక ఈ జీవ తత్త్వమును పరమ తత్త్వానికి మరలింపజేసే నిమిత్తమై, ఈ జీవతత్త్వములన్నిటిని కూడను శబ్దస్వరూపంగా మార్చుకుని తద్వారా జీవతత్త్వమును పరతత్త్వము లోపల ప్రవేశింప జేసుకునే నిమిత్తమై 21 పర్యాయములు మనం ఓంకారము చేయటం. కట్టకడపటికి 'శాంతి శ్శాంతి శ్శాంతిః' అంటున్నాము.** అవి మీరు వ్రాయలేదు. మూడు పర్యాయములే మనము శాంతి ఎందుకు చెయ్యాలి? నాలుగు పర్యాయములు ఎందుకు చేయకూడదు? లేక ఒకే పర్యాయము శాంతి ఎందుకు చెప్పకూడదు? ఈ కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ, పంచకోశ, పంచ ప్రాణములతోను ఈ శబ్దము మిళితంచేసి ఆ శబ్దంపైననే Concentration చేసినపుడు అవి కూడను కొంత తర్ఫీదైపోయి తద్వారా మన సాధనకు కొంత సహాయకారులుగా ఉంటాయి. జీవతత్త్వాన్ని పవిత్రం గావించుకునే అంతరార్థం కూడను యిందులో ఉంటుండాది. Work will be transfromed into worship. మన ఇంద్రియములు మన కర్మలన్నీ భగవంతుని వైపున మరల్చే నిమిత్తము ఆచరించే ఉపాధి యొక్క తత్త్వము ఈ ఓంకారము. దీని తరువాత శాంతి శ్శాంతి శ్శాంతిః.

(భ.స.బా.గు.శి.బృ.పు. 53/54)

ఓంకారము మూడు పర్యాయములే ఎందుకు చెప్పాలి? శాంతిః శ్శాంతి శ్శాంతిః అని మూడు పర్యాయములే ఎందుకు చెబుతారు? రెండు లేక నాలుగు పర్యాయములు ఎందుకు చెప్పుటలేదు? అనే సందేహం చాలామందికి సహజంగా వస్తుంటుంది. 'ప్రణవము ఆధారశబ్దం. సర్వశబ్దములకు మూలాధారము. ప్రణవంలేని మంత్రం మందులేని తుపాకి వంటిది. దేహముగన్ను, 'ఓం' బుల్లెట్. మూడుపర్యాయాలెందు కంటే - ఆధి భౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక శాంతి నిమిత్తం. దేహశాంతి, మానసిక శాంతి, ఆత్మశాంతి నిమిత్తం. ఆత్మశాంతిలేనిదే, దేహశాంతి ఉండి లాభం లేదు. నీవనుకునే నీవు, ఇతరులనుకునే

ఓటమి

నీవు, నీవైన నీవు. (The one you think you are, The one others think you are, The one you really are). **నీవనుకునే నీవు దేహం - ఆధి భౌతికం. ఇతరులనుకునే నీవు - ఇది మానసికం. ఆధి దైవికం. నీవైన నీవు నీ ఆత్మస్వరూపం. ఇది ఆధ్యాత్మికం.** ఈ మూడు స్థితులలోనూ 'శాంతి' కావాలని మూడుసార్లు శాంతి పాఠం చెబుతున్నాం. త్రికాల త్రిమూర్తులవలె మూడు స్థానాలలో ఓంకారము నిలిచి ఉంటుంది. త్రికాలముల పవిత్రతను, త్రిలోకముల దివ్యత్వమును ఉచ్చరించడానికి ప్రణవం చేర్చాలి. ప్రణవం పవిత్ర జ్యోతివంటిది. దీనిని శ్రద్ధావిశ్వాసాలతో చేయడం ముఖ్యం.

(శ్రీ.న.2000 పు.65)

శబ్దము ప్రతిచోట వ్యాపించి వున్నది. అన్ని శబ్దములు ఒక దానితో ఒకటి కొన్ని చోట్ల కలుసుకుంటాయి. పురాతనమయినటువంటి (ప్రథమ) తొలి శబ్దము ఓంకారము. మిగిలిన అన్ని శబ్దములు ఆ ప్రథమ శబ్దము నుండి వేరైన వికారములు. శబ్దము మూడు విభిన్న ప్రకృతులలో వుంటుంది. ఈ మూడు ఏకత్వంలో విలీనమైపోతాయి. ఈ మూడు దశలు.-

1. సృష్టి, 2. స్థితి 3. లయ

1. సృష్టించుట, కాపాడుట, నశింపచేయుట

ఈ మూడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కార్యములను తెలుపుతాయి. ఈ మూడు ఆకార-ఉకార-మకారములను శబ్దములలో యిమిడినవి. ఈ మూడు శబ్దముల ఐక్యతే ఓంకారము.

ఆకార శబ్దము కంఠము నుండి తగ్గు స్వరములో మొదలుపెడుతుంది. ఉకారము నాలుక నుండి మొదలు పెట్టి క్రమముగా ఎక్కువ అవుతుంది. మకార శబ్దము పెదవుల నుండి మొదలయి నెమ్మదిగా తగ్గిపోతుంది. మనము ఉచ్చరించునపుడు ఆకారము దూరమున ఉన్న విమాన శబ్దము ఉకారము దగ్గరకు వస్తున్న విమాన శబ్దము. మకారము తిరిగి దూరముగా వెళుతున్న విమాన శబ్దమువలే ఉంటుంది. ఈ మూడు శబ్దములు ఒక దానితో ఒకటి కలిసినపుడు ఒకే శబ్దమయిన ఓంకారము నాభి స్థానము నుండి వస్తుంది. మనము ఓంకారము "21" సార్లు ఉచ్చరిస్తాము. ఎందుకంటే మన శరీరము "21" తత్వములతో చేరినటువంటిది. అవి "5" జ్ఞానేంద్రియములు "5" కర్మేంద్రియములు, పంచ ప్రాణాలు, పంచ కోశములు ఇవి "20" మనస్సుతో చేరి 21 తత్వములతో మన జీవితము ఏర్పడినది. చివర మనము 3 సార్లు శాంతి అని చెప్తాము.

1. ఆధి భౌతిక (ఆత్మ)
2. ఆధి దైవిక (మనస్సు)
3. ఆధ్యాత్మిక (ఆత్మ)

శాంతి ఇవ్వమని ప్రార్థిస్తాము.

(శ్రీ.స.ప్ర.పు.32/33)

ఓటమి

ఒక ప్రయత్నమున **సాధకునకు** ఓటమి కలిగిన అట్టి **ఓటమి** ఏ కారణమువల్ల కలిగినది అని విమర్శించు కొనవలెను. తరువాత, రెండవ విషయమందు ఆకారణమును జాగ్రత్తగా చూచుకొనవలెను. అపజయము కలిగించిన కారణమును జాగరూకతతో గమనించి నిన్ను నీవు కాపాడుకొనుటకు ప్రయత్నించవలెను. తిరిగి అట్టి కారణమునకు చిక్కుకొనక, లొంగక ఉండవలెను. ఇట్టి విషయమునందు మాత్రము సాధకుడు ఉడుతవలె చురుకుదనమును కలిగియుండవలెను. చురుకుతనముతోపాటు తెలివి సమర్థతకూడా కలిగి, తప్పులు చేయకుండుటకు ప్రయత్నించవలెను. ఇదియును **శాంతి** సహాయముననే ప్రాప్తించును.

(ప్ర. వా. పు.16)

బ్రూసు మహాశయుడు సాలెపురుగువల్ల నీతి నేర్చుకొని, ఏడుసార్లు తాను యుద్ధమందు అపజయమునుపొంది, **శాంతి** ప్రభావముతో ఎనిమిదవసారి గెలిచెను.

(ప్ర. వా. పు.14)

ఓర్పు

హర్రీ (తొందరపాటు), వర్రీ (చింత), కర్రీ (క్రొవ్వుపదార్థం) - ఈ మూడు అనేక రోగాలకు కారణమవుతాయి. **ఓర్పు చాల ప్రధానం**. షిర్డి అవతారంలో కూడా శ్రద్ధ, సబూరి (ఓర్పు) ముఖ్యమైనవని చెప్పటం జరిగింది. బస్‌స్టాండ్‌లోను, సినిమా హాలులోనూ మీరు ఎంత సేపైనా 'క్యూ' లో నిలబడతారు. కానీ, ఇక్కడ 'స్వామి దర్శనం ఇంకా కాలేదా' అనుకుంటారు. అర్జునుడు కృష్ణునితో ఎంతో స్నేహంగా ఉన్నా అతనికి 74వ సంవత్సరం వచ్చేదాకా గీతాబోధ జరుగలేదు. మీరు కూడా వెంటనే 'స్వామి నాతో మాట్లాడలేదే' అనుకోకూడదు. దేనికైనా తగిన సమయం రావాలి. చూడండి - పండు పక్వం కాగానే చెట్టు నుండి రాలిపోతుంది. కానీ, అంతదాకా ఆగాలి కదా!

(స.సా.మే.99పు 139)

(చూ॥ నరుడు)

ఔషధములు

"ఆరోగ్యమునకు ఔషధములు ప్రధానము కాదు. మంచి మాటలు, మంచి నడతలు, మంచి చూపులు, మంచి తలపులు, మంచి వినికిడి అవసరము. ఇవే దేహమునకు అమృతత్వాన్ని అందించే టానిక్కులు. దుర్భావములు, దుశ్చింతలు, దురాలోచనలు హృదయమున నింపుకొని, ఎన్ని విలువైన ఔషధములను సేవించినప్పటికీ, రోగ నివారణ కాదు. ఏ ఔషధము లేకపోయినప్పటికీ, ఏ డాక్టర్లు మనకు చిక్కకపోయినప్పటికీ, సద్గుణములను కలిగి ఉన్నామంటే, సదాచారములను ఆచరించినా మంటే, సచ్చింతనలను సంకల్పించుకున్నా మంటే - అవే మనకు సరియైన ఆరోగ్యమును అందిస్తాయి, ఆత్మానందమును చేకూరుస్తాయి. ఆత్మ సందర్శనమును కూడా కలిగిస్తాయి.

(శ్రీ న. పు.39)

(చూ॥ మందులు, రోగవిముక్తుడు)

కంకణములు

(చూ॥కృష్ణుడు)

కంటి అద్దాలు

(చూ॥సంసార జీవితము)

కంఠమాల

జనని గర్భమునుండి జన్మించినప్పుడు
కంఠమాలలవేవి కానరావు
మంచిముత్యపు సరుల్ మచ్చునకును లేవు
మేల్మి బంగరు దండ మెడకు లేదు
రత్నాల హారముల్ రంజిల్లగా లేవు
పచ్చలు, కెంపులు పొదగ లేదు
వజ్రాల హారముల్ వర్థిల్లగా లేవు
గోమేధికంబులు తోడు లేవు
కలదు కలదొక్క మాల మీ కంఠమందు
ఎన్ని చేసిన అవి యన్ని ఎంచి ఎంచి
మంచియైనను చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల

(స.సా. మే 2000 పు. 142)

కంప్యూటర్లు

ఈనాడు మీకందరికి బాగా తెలుసు కంప్యూటర్సు గురించి, వైజ్ఞానికులు వీటిని సృష్టిస్తున్నారు. ఈ కంప్యూటర్లు ఎలాంటివి? కేవలం ఒక రబ్బిష్ వంటివి. పిండిమరలో పైన బియ్యం వేస్తే క్రింద బియ్యంపిండి వస్తుంది. పైన బేడలు వేస్తే క్రింద బేడలపిండి వస్తుంది. ఎలాంటిది వేస్తే లాంటిది వస్తుంది. అట్లే, కంప్యూటర్‌లో ఈ సైంటిస్టు ఏమి అడ్జస్టుచేస్తే ఆవిధముగా ఫలితమొస్తుంది. ఆ అడ్జస్ట్‌మెంటులో ఏదైనా కొంత పొరపాటు జరిగినా అంతా ప్రమాదమే. కంప్యూటర్స్ సరియైన ప్రమాణము కాదు. ఈ కంప్యూటర్సుతో తెలిపే అన్నీ రిజల్ట్స్ సరికాదు. పాసయినవారిని ఫేల్‌గాను ఫేల్ అయినవార్ని పాస్‌గాను తెలుపుతుంటాయి

కఠోపనిషత్

ఒక్కొక్కసారి. కనుక ఈ యంత్రప్రమాణములంతా అల్పప్రమాణములే. కానీ పరీక్ష వ్రాసిన వాని హృదయమే ప్రమాణము. నేను తప్పక పాసవుతాను అనే విశ్వాసమే అతనిని పాస్‌గావిస్తుంది. ఈనాడు మూర్ఖ ప్రమాణాలన్నీ అభివృద్ధి అయిపోతూ వస్తున్నాయి. వీటన్నిటికీ మనస్సే కారణము.

(శ్రీస. ది. 1993 పు. 109)

ఈనాడు మానవుడు Computer ని సృష్టించాడు. "వర్షము ఎప్పుడు రాబోతున్నది? నేను క్షేమముగా ఇల్లు ఎట్లు చేరగలను?" మొదలగు ప్రశ్నలను మనం Computer ని అడిగినప్పుడు "నీవు ఒక గొడుగుపట్టుకో, ఇలా నడుచుకో, నీవు క్షేమంగా ఇల్లు చేరగలవు" అని జవాబు ఇస్తుంది.Computer ఇట్టి, జవాబును తనంతట తానే చెప్పుతుందా? కాదు, కాదు. మానవుడు దానిని తగిన రీతిలో క్రమ పరుస్తున్నాడు. ఈ Computerకేవలం ఒక చెత్త వంటిది. ఇట్టి యంత్రముపై విశ్వాసము పెట్టి, ఎన్నికోట్ల రూపాయలను వ్యర్థం చేస్తున్నారు. మానవుడు సహజసిద్ధమైన తెలివి తేటలు కలిగియున్నాడు. ఈ కంప్యూటర్ పని చేయడానికి కూడా మానవుని తెలివితేటలే కారణం. ఇట్టి తెలివితేటలను విశ్వసించకుండా, మనచే నిర్మింపబడ్డ యంత్రాలను మనం నమ్ముతున్నాము. పిండిమరలో గోధుమలు వేస్తే గోధుమ పిండిమనకు లభిస్తుంది; బియ్యం వేస్తే బియ్యపు పిండే మనకు లభ్యమవుతుంది. కంప్యూటర్ పని తీరు కూడా ఇంతే. మనము దానిని ఏవిధంగా క్రమపరుస్తే, ఆవిధంగానే అది పనిచేస్తుంది. ఒక వేళ కంప్యూటర్ తనంతట తాను పనిచేయగలదని నీవు భావిస్తే దాని దగ్గరకు పోయి "నెనెప్పుడు చస్తాను?" అని అడుగు, చెబుతుందేమో చూద్దాం: కంప్యూటర్‌కు ఈ ప్రశ్నయొక్క జవాబు తెలియదు.కారణమేమనగా, ఈ యంత్రాన్ని నిర్మించిన మానవునకు కూడా దీని జవాబు తెలియదు. కనుక, Scientist తనకు తెలిసిన దానినే తిరిగి Computer లో పెడుతున్నాడు. సైంటిస్ట్ బింబం, కంప్యూటర్ ప్రతిబింబం, తనను తాను నమ్మటంలేదు గాని, తనద్వారా ఏర్పడిన ప్రతిబింబాన్ని మానవుడు నమ్ముతున్నాడు.

(శ్రీ.భ.ఉ.పు.121/122)

కఠోపనిషత్

ఈ ఉపనిషత్తున యమునిచే బ్రహ్మతత్త్వోపదేశము నొంది కృతార్థతను గాంచిన నచికేతుని చరిత్రమున పేర్కొనబడినది. ఇంతియేకాక, ఈయాఖ్యాయిక తైత్తిరీయ బ్రాహ్మణమునను, మహాభారతము అనుశాసన పర్వము నూటఆరవ అధ్యాయమునకూడ తెలుపబడినది. ఇది విషయ విమర్శనమునకు, **భావకల్పనా** గాంభీర్యములకును ప్రసిద్ధికెక్కినది. దీని యందలి అనేకమంత్రముల రూపములు భగవద్గీతయందు కనుపించుచున్నవి. కృష్ణయజుర్వేదీయ చరకశాఖాన్తర్గత మగు కఠశాఖా బ్రాహ్మణమునకు చెందియుండుటచేత ఈ ఉపనిషత్తునకు కఠోపనిషత్తు అనికూడను పేరువచ్చినది.

(ఉ. వా. పు.14)

కథం

(చూ॥మోహము)

కనిపించనిది

పక్షికి రెండు రెక్కలవలె బండికి రెండు చక్రాలవలె మానవునకు ఇహము, పరము ఉండాలి. పరం అంటే ఏమిటో అర్థం కాదే. అర్థం కాని దాన్ని ఎందుకు పట్టుకోవాలి. అని అనుకోవచ్చు. అర్థం కానిదే అర్థాన్ని చూపిస్తుంది. **మీరీ జగత్తును చూస్తున్నారు. ఇదే స్వర్గం అంటారు. నా దృష్టిలో స్వర్గం శూన్యము. శూన్యమే స్వర్గం.** దీనిని మీరు చక్కగా గుర్తించాలి. ఏది కంటికి కనిపించడం లేదో, చెవులకు వినిపించడంలేదో ఏది అర్థం కావడం లేదో, అదే కనిపింపచేస్తుంది వినిపింపచేస్తుంది. అర్థాన్ని చూపిస్తుంది. కనిపించనిదే స్వర్గం. ఏది కనిపించడం

లేదో, అదే అనుభవింప జేస్తుంది. కనిపించనిదానినే పట్టాలి. కనిపించినదానిని పట్టిన ప్రయోజనమేమిటి.

(సా॥పు 527)

కన్నతల్లి

పుడమి కన్నతల్లి పూజనీయురాలు కదా!
వారి మించు వారు వసుధ లేరు
కన్నతల్లి సేవ కన్న మించినదేది!
జన్మభూమి కన్న స్వర్గమేది!

(సా॥పు.487)

కన్నతల్లి ప్రేమ

సన్న జాజి కన్న సంపంగి లత కన్న
జున్ను గడ్డ కన్న వెన్న కన్న
నెమలి కన్ను కన్న నిండు వెన్నెల కన్న
కన్న తల్లి ప్రేమ సున్నితంబు.

(స.సా. డి. 99 పు. 359)

కన్నులు

(చూ॥ నరజన్మ)

కబంధుడు

రామాయణంలో ఒక విచిత్రమైన వ్యక్తి ఉన్నాడు. **అతని పేరే కబంధుడు. అతని తల భుజములపై లేదు. పొట్టపై ఉన్నది.అతని హస్తములు చాల పొడవైనవి. వాటి సహాయంతో ఆహారాన్ని సేకరించి భుజించడమే** అతని పని. ఈనాడు ప్రైమ్‌మినిష్టర్ మొదలుకొని భిక్షగాని వరకు అందరూ పొట్టకోసమే పాటుపడుతున్నారు. ఇంక ప్రైమ్‌మినిష్టర్‌కు, భిక్షగానికి మధ్యగల వ్యత్యాసమేమిటి? భిక్షగాడు తన పొట్టకోసం పాటుపడతాడు. ప్రైమ్‌మినిష్టర్ ప్రపంచంకోసం పాటుపడాలి. వ్యష్టిజీవితాన్ని గడుపుతాడు భిక్షగాడు, సమిష్టి జీవితాన్ని గడపాలి అధికారి.

కన్నతల్లి

ప్రేమస్వరూపులారా! మన జీవితం సమిష్టి జీవితమేకాని, వ్యష్టి జీవితం కాదు. **'నేను, నావారు' అనే సంకుచితమైన భావనలో మునిగిపోకూడదు. అందరూ ఒక్కటే. కలసి మెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం, కలసి మెలసి కలత లేక చెలిమితో జీవించుదాం. ఐకమత్యమే మానవ జీవితం. ఆచరణే దీని అభివృద్ధికి మూలకారణం**

(స.సా.మే 96పు. 122)

కమ్‌యు నెక్స్‌ట్

ఆంధ్రప్రదేశ్‌లో సుందయ్య అనే కమ్యూనిస్ట్ లీడర్ ఉండేవాడు. అతను పుట్టపర్తికి వచ్చాడు. "నేను కమ్యూనిస్ట్‌నండీ" అన్నాడు. నేను "come you next" (కమ్ యు నెక్స్‌ట్) అన్నాను. ఐదు సంవత్సరాల తరువాత ఎలక్షన్‌లో ఓడిపోయాడు. తరువాత అనంతపురం కాలేజీలో కలిశాడు. "పార్టీ పేరుతో వ్యక్తి స్థాయికై నేనీ పేరు పెట్టుకొన్నానండీ, కాని, **మీరు చేసే పనులు ఏ గవర్నమెంట్‌గాని ఏ వ్యక్తి గాని చేయలేరు. ఇదే పెద్ద డివినిటి. మేం అధికారం ఉండీ డబ్బు ఉండీ, మంచి పనులేమి చేయలేకపోతున్నాం. ప్రజల డబ్బును ప్రజల కందించడానికే వెనుకంజ వేస్తున్నాం. మీరు ఒక్క వ్యక్తి ఇంత జరుపుతున్నారు. ఇదే 'బిగ్గెస్ట్ మిరకిల్' అన్నాడు. "ఆనాడు** నీకు come you next అని చెప్పింది దీనికోసమే. నీకిప్పుడు అర్థమయిందా?" అన్నాను. నా దృష్టిలో ఆస్తికుడు నాస్తికుడు ఒక్కటే. **ఆస్తికుడు విచ్చిన పువ్వువంటివాడు. నాస్తికుడు మొగ్గవంటివాడు. అయితే ఆ మొగ్గ కూడా ఒక రోజు వికసిస్తుంది. ఈనాటి నాస్తికుడే రేపటి ఆస్థికుడు.**

(అక్షర సుమాంజలి 70వ జన్మదినోత్సవ సమర్పణ పు. 22)

కమ్యూనిజం

(చూ॥సోషలిజమ్)

కమ్యూనిస్ట్

కమ్యూనిస్ట్

(చూ॥ కమ్‌యునెక్స్‌ట్)

కరణాపాటవము

ఇంద్రియముల దౌర్బల్యము బలహీనత. ఇంద్రియములకు ఒక జబ్బు ఉంటుండాది. ఈ జబ్బుతో కూడిన ఇంద్రియముల ద్వారా మనసు అనుభవిస్తుండాది. కనుక మనసుకూడా రోగిగా మారిపోతుంది. ఈ యింద్రియముల రోగము ఎట్టిది? ఇంద్రియము ఏనాడు ఉన్నది ఉన్నట్టుగా చూపించదు. సమయానుకూలముగా ఇంద్రియములు ప్రవర్తిస్తుంటాయి... ఈ విధమైన ఇంద్రియముల సమయానుకూల మార్పులు జగత్తులో పెరిగిపోవటంచేతనే చెడ్డమంచిగా మంచి చెడ్డగా మారిపోతున్నాయి....

కరణాపాటవము చేత అనగా - ఇంద్రియముల దోషముచేత మానవత్వము మరుగు పడిపోతుండాది.

(బృ.త్ర.పు. ౮౮/౮౯)

కరుణ

సర్వజీవులయందునూ, కరుణను మనము సమానముగా ఆచరింపచేయటానికి తగినటువంటి ప్రయత్నమే ఆత్మసాక్షాత్కారానికి మూలకారణము. **"కారుణ్యమ్ పరమమ్ తపః". అనగా సర్వజీవులయందు చూపు కారుణ్యమే తపస్సు.**

(నీ. వే. వె. పు. 115)

(చూ॥ అలవర్చుకోవాలి , ప్రేమ)

కరుణారసము

రామనామము వేదసారము. రామచరితము పాలసంద్రము. నాడు మొదలు నేటివరకు యే యితర దేశములందు కాని, ఏ యితర భాషలందు కానీ, ఇంతటి మహాకావ్యము పుట్టలేదనియే చెప్పవచ్చును. అన్ని దేశములకు, అన్ని బాషలకు అంతర్ వాహినిగా ఆధారమై నిలచిన ఈ ప్రధాన కావ్యము భారతీయుల భాగ్యమా అన్నట్లు హిందువుల ఇలవేల్పయి, ఇంటి పేరనో, వంటి పేరనో, ఈ రామ రసమును గ్రోలని భారతీయుడు లేడనియే చెప్పవచ్చును. పండితులు మొదలు పామరుల వరకును, కోటీశ్వరుడు మొదలు కూటిపేదవరకును, రోగులు మొదలు యోగులు వరకును, రామాయణము పారాయణగ్రంథమై ప్రకాశించుచున్నది. సమస్త దోషములను హరించి, పాపములను రూపుమాపి, తన ప్రాపును రూపముతో చూపునట్టి సుందర నామము ఈ రామం. సమస్త జలము సాగరమునుండియే పుట్టినటుల, సమస్త జీవులు రామం నుండియే పుట్టు చున్నవి. జలములేని సాగరము, రామ లేని జీవనం, లోకమున లేదు, రాదు. సాగరమునకు, సర్వేశ్వరునకు సన్నిహిత సంబంధము కలదు. **సాగరమే సర్వేశ్వరునికి ఆవాసము. పాలకడలి శయనుడు అను పదమునకు ఇది ప్రధాన ప్రమాణము; కనుకనే ప్రచేతసుని కుమారుడగు మహాకవి వాల్మీకి రామాయణ భాగములకు కాండములని పేరిడెను. కాండమున జలమనియు, చెరకనియూ అర్థములు కలవు. చెరకు యెన్ని వంకరలు తిరిగినను రసమునందలి తీపికి యెట్టి మార్పునూ లేనటుల "రామకథా రసవాహిని"** అనేక వంకరులు తిరిగి ప్రవహించినను **అందులోని కరుణా రసమున కెట్టి** మార్పును లేదు రామకథా ప్రవాహము విచారము, విషాదము, వింత, హాస్యము, అద్భుతము, రౌద్రము, శృంగారము ఇత్యాది వంకరలతో ప్రవహించినది. దీని అంతర్ మర్మము ధర్మ ప్రధానమై యున్నది.

సరయూనది వంటిది రామ కథా రస ప్రవాహము. మానససరోవరమే దీని జన్మస్థానము. లక్ష్మణుడు గంగ వంటి వాడు. ఇది చిత్తమను శిరస్సున పుట్టినది. **రామవాహిని కరుణారసము, లక్ష్మణ ప్రేమ భక్తిరసము. సరయూనది గంగలో చేరినటుల కరుణారసము భక్తిరసమున లీనమగును,** రాముడు లక్ష్మణునితో యేకత్వమయినాడు. కరుణా ప్రేమల మిళితమే రామ అభిమతము; **అదే భారతీయుల మతము, భక్తుల వ్రతము.**

(రా.ర.వా. మొ. పు.1/2)

సర్వ రసముల సారం కరుణరసం!
సర్వ మతముల ధర్మం చిత్తైర్మల్యం!
సర్వ సాధనలగమ్యం శాంతి సౌధం!

(భ.శ్రీ స. పు. 69)

(చూ॥ సర్వేశ్వరపూజ)

కర్తవ్యము

కర్తవ్యమునకు స్వాతంత్ర్యమునకు వ్యత్యాసముంటుండాది. ఇది మూడు రకములు. **ఒకటి సంబంధము, రెండు నిర్బంధము మూడు కర్తవ్యము.** ఈ మూడింటికి వ్యత్యాసము ఏమిటి? ఒక ఆదివారం వచ్చింది. స్నేహితులను పిలిచి టీపార్టీ పెట్టాలనుకున్నావు. ఆనాడు నాలుగు గంటలకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నావు. నీకు తీవ్ర జ్వరం వచ్చింది. అప్పుడు స్నేహితులకు ఫోన్ చేస్తావు. నాకు జ్వరంగా వుంటుండాది. ఈనాడు టీపార్టీ మానుకుంటాను అన్నావు. ఇది స్వాతంత్ర్యము అనుకుంటున్నాము. ఇష్టమైతే పెట్టుకో వచ్చు లేకపోతే మానుకోవచ్చు. ఇది **సంబంధము.**

ఇక **నిర్బంధము.** నీవు ఆఫీసులో ఉంటున్నావు. అక్కడ అధికంగా జ్వరం వచ్చింది. అదే నాడు నీ డైరెక్టర్‌ని ఆఫీసును విజిట్‌చేస్తున్నాడు. నీవు సెలవు తీసుకోవటానికి వీలు కాదు. డాక్టరు దగ్గరకు పోయి యింజక్షను తీసుకొని మాత్రలు వేసుకొని ఆ జ్వరముతోనే ఆఫీసుకు పోయి తీరాలి. ఇది నిర్బంధము. మూడవది **కర్తవ్యము.** ఏదో కొన్ని కారణాలవల్ల భార్యాభర్తలు పోట్లాడుకున్నారు. కోపము చేత భర్త ఆమెను రెండు కొట్టాడు. ఆమె ఏడ్చుకుంటూ బెడ్ రూంకి పోయి పడుకుంది. వంట చేయలేదు. పురుషుడు డ్రాయింగు రూములో కూర్చున్నాడు. చాల కోపంగా ఉన్నాడు. విషయముతో వచ్చిన కోపం ఒకటి, ఆకలితో వచ్చిన కోపం మరొకటి. ఈ రెండూ చేరి తాను చాలా రెస్ట్‌లెస్‌గా వుంటున్నాడు. ఆసమయమున ఒక స్నేహితుడు వచ్చాడు. నవ్వుతూ హలో హలో కమాన్ అన్నాడు. కూర్చోమని చెప్పాడు. స్నేహితునితో నవ్వుతూ వుత్సాహంగా మాట్లాడుతూ

కాలము గడిపి లోపలికి పోయాడు. నా ఫ్రెండ్ వచ్చాడు. కాఫీ చెయ్యి అన్నాడు. కోపంగా. భార్యతో కోపంగా వున్నాడు. ఫ్రెండుతో ఆనందముగా వున్నాడు. ఫ్రెండ్‌తో ఆనందంగా వున్నది భార్యకు తెలియకూడదు. భార్యతో కోపంగా వున్నది ఫ్రెండ్‌కి తెలియకూడదు. **ఇది కర్తవ్యము. ఈనాడు సంబంధమూ పోయింది, నిర్బంధమూ పోయింది. ఈ కర్తవ్యము అంతకంటె కనిపించటం లేదు. ఇదే ధర్మనాశనము, యిదే ధర్మగ్లాని.**

(బృ.త్ర.పు. ౧౪౮/౧౪౯)

విలువలేని యినుపపెట్టె యీదేహంబు
పెట్టెయందు నగలు పెట్టినటుల
దేహమందు "ఆత్మ" దేవుండుండెనుసుమా
సత్యమైన మాట సాయి మాట

విలువలేనిదైనప్పటికిని, అస్థిరమైనది అయినప్పటికిని మానవ దేహము ఆత్మ దేవునకు నివాసమగుట చేత దీనిని సక్రమమైన మార్గములో కాపాడుకోవటం ప్రతి మానవుని కర్తవ్యం. దేహ పోషణ మానవుని ప్రధాన కర్తవ్యము ధృడత్వము లేని దేహమునందు మానవత్వము అనేక చిక్కులపాలు కాగలదు. మానవజీవితము దేహమనే పునాదిపైన ఆధారపడి వుంటున్నది. కనుకనే ఆధునికమైన విజ్ఞానమునకు కారకులైన రోమనుదేశము వారు ఈ దేహము యొక్క విశిష్టతను గుర్తించి దేహ పోషణ నిమిత్తమై అనేక విధములైన శ్రద్ధను తీసుకొనెడివారు. ఈ దేహము తనంత తనైన ఒక ప్రత్యేకమైన ప్రపంచము. **దేహమనగా కేవలము ఒక ఆకారము మాత్రమే కాదు. అనేక అంగములతో కూడిన సమిష్టి స్వరూపము.** ఏ అంగమునకు ఆ అంగము లావణ్యమైనది. అన్ని అంగముల సౌందర్యమును మనము కాపాడుకోవలసిన కర్తవ్యము. అనారోగ్యమునకు గురియైన, బలహీనతకు గురియైన దేహము ధృఢమైన సంకల్పమును చేయలేదు. పవిత్రమైన, దివ్యమైన, భవ్యమైన భావములు మానవుని నుండి ఆవిర్భవించవలెనన్న శరీరము ధృఢమైనదిగను, ఆరోగ్యమైనదిగను ఉండాలి. అన్ని మతములవారు

కర్తవ్యపాలన

దేహముయొక్క పోషణను అంగీకరించినవారే. ఇది అనిత్యము అశాశ్వతము అయినప్పటికిని సత్యనిత్యమైన దివ్యత్వము యిందునివాసముగా ఉండటం చేత ఈ దేహముపైన ప్రత్యేకమైన శ్రద్ధను చూపాలి.

(బృ.త్ర.పు. ౨౭)

ఒకవైపున యింద్రియములు మరొక వైపున విషయములతో కూడిన గుణములు - ఈ రెండిటిని అభివృద్ధి గావించుకోవటమే విద్యావంతుని ప్రధాన కర్తవ్యము.

(బృ.త్ర.పు. ౫౩)

(చూ॥ ఆత్మవిశ్వాసము, ఆధ్యాత్మికమార్గము, జన్మహక్కు, దివ్యప్రకటనలు, దేశము, ప్రత్యక్షదైవము, ప్రకృతి, మనదేశము, యోగము, సమాజము)

కర్తవ్యపాలన

(చూ॥ గోల్డ్‌స్టీన్)

కర్తవ్య ధర్మము

భగవంతుని యందు మనస్సు నిలుపుట చిత్త నిరోధము జరుగవలయును కదా! అట్టి నిరోధమునకు త్రిగుణములైన సత్వరజస్తమో గుణవైషమ్యమేర్పడకుండా చేయుటకు **భగవత్ ప్రార్థన ఆయా కాలములందు చేయవలెను. ఇది పురుషులకు మొదటి కర్తవ్య ధర్మము.** ప్రాతః కాలము సత్వగుణ కాలమనియు, మధ్యాహ్నము రజోగుణ కాలమనియు, సాయంత్రము తమో గుణ ప్రకోపకాలమనియు, సృష్టియందలి ధర్మము నీయమము. **మొదటి సత్వగుణ కాలమైన ప్రాతఃకాలమున నిద్రానందమును జెంది మనోవ్యాకులత నుండి విడువబడి, మొట్టమొదట మెలకువ బడు సమయముగావున, మనస్సు పరిశుభ్రముగా, ప్రశాంతముగా నుండును. ఈ కాలములో భగవద్ధ్యానము చేయవలయుననుట అందరకూ విశదమే. ఇదియే ప్రాతఃసంధ్యావందనమనబడును. సంధ్యావందనమును అర్థము తెలియక కూడనూ యేదో ఒక సాంప్రదాయముగ పెద్దలు చెప్పినవి వినిగుడ్డి గుర్తులతో ఆచరించుచున్నారు. ఈ మూలార్థమును తెలిసికొని చేయుట పురుషుని రెండవ ధర్మము.**

పిమ్మట రెండవదైన రజోగుణము జెంది, వ్యవహారములలో ప్రవేశించి, అలసట జెంది, ఆకలి గలిగి భోజన ప్రయత్నము చేయునపుడు, భోజనమునకు ముందుగా భగవత్ చింతన, లేక ధ్యానముచేసి వండిన పదార్థములను భగవదర్పితముచేసి, పిమ్మట భుజింప వలయునను నదియు అవశ్యకము. దీనినే మధ్యాహ్నిక సంధ్యావందన మందురు. దీనిని ఆచరించుటవలన రజః ప్రకోపమేర్పడక, సత్వమే వృద్ధియగును. ఇది పురుషునకు మూడవ కర్తవ్య ధర్మము. ఇక మూడవ గుణమైన తమోగుణమును జెంది, సాయం కాలము ప్రదేశమగునప్పటికి ప్రతి పురుషుడును తన యిల్లు చేరి చక్కగ వండిన పదార్థములను భుజించి నిద్రించ ప్రయత్నించును. ఇది కాదు. వాని కర్తవ్య ధర్మము, ఇది సోమరి పోతులక్షణము! గుణములలో నిజమైన తమోగుణము ప్రవేశించినపుడు తాను చెడిపోకుండా నుండుటకై భగవత్ ప్రార్థన, సత్‌కాలక్షేపము, లేక సద్గుణ పోషణ, సదాచారము ఆవశ్యకము. ఇదియే సంధ్యావందన మనబడును.

కనుక నిద్రానందము నుండి వెలువడు మనస్సునకు బుద్ధి చెప్పి అవిలేక నిద్రానందమునకే యింత సంతోషమును, బడలిక తీరుటకు కలిగిన, ఇక వివేక నిద్రయనుక భగవద్ధ్యానానందమున కెంత సుఖము కలుగునో, చక్కగ యెవరికి వారు యోచించిన తెలియును. ఈ యదార్థమును తెలిసికొని సత్వగుణముల వృద్ధి పొందించవలెను. ఇది పురుషుని నాల్గవ కర్తవ్య ధర్మము. జీవించియున్నంత వఱకూ, త్రికాలములందు సంధ్యావందన మాచరించు ద్విజుడు ఉత్తమ పురుషుడు, మహాతేజోమయుడై సకలాభీష్ట సిద్ధినొందును, అంతియే కాదు. జీవన్ముక్తుడగును. ఊరికే సంధ్యావందనమని నిత్యకృత్య కర్మలలో దీనినొక కర్మగా భావించరాదు. దీని యదార్థమును తెలిసికొని చేయుటలో, చెప్పుటలో విశేష ఫలమున్నది. దీనికి గాయిత్రి మంత్రార్థమును చక్కగా భావన చేయుట అతి ముఖ్యము. అట్లోనర్చుటలో

గూడా, ఆ తేజోరూపుడైన ఆత్మ స్వరూపుడు. మూలపురుషుడునే నగుచున్నానని యభేదముగా నెంచుట మరొక ధర్మము.

(ధ.వా. పు 53, 55)

కర్తృత్వము

ప్రతి ఒక్కటి దివ్యత్వముగాని, పవిత్రతగాని, అపవిత్రతగాని దుఃఖముగాని, ఆనందముగానిమనలో వుండినట్టివే. ఇది నీకు స్వాతంత్ర్యము కాదు, వున్నదే అది. ఇది స్వేచ్ఛ అనుకుంటే యిది స్వేచ్ఛకాదు కర్తృత్వము. కనుక ఫ్రీ విల్ అని చెప్పటములో దీనికి అర్థము లేదు. ఫ్రీ విల్ అనేది ఒక్కటే! **అదే హృదయస్థాయి.** అది ఎప్పటికి వున్నది. ఒక్క తూరి వచ్చి ఒక్కతూరి పోయేది కాదు. మనోభావము వుండినంతవరకు మానవునకు భిన్నభావములు అభివృద్ధి పొందుతుంటాయి. ఇవి మనస్సు యొక్క స్వాతంత్ర్యములే గాని మనిషి యొక్క స్వాతంత్ర్యము కాదు.

(బృత్ర.పు. ౧౪౭/౧౪౮)

(చూ॥ ఫ్రీవిల్)

కర్మ/కర్మలు

"తస్మై నమః కర్మణే"

ఎవరికి నమస్కారము చేసినా, చెయ్యకపోయినా, తాము చేసే కర్మలకు మాత్రము నమస్కారము చేయాలి. మానవుని జీవితమంతా కర్మ మీదనే ఆధారపడి యున్నది.

కర్మమున పుట్టు జీవుడు
కర్మమునే వృద్ధి పొంది కర్మమున చనున్
కర్మయే మనకు దైవము
కర్మయే సుఖ దుఃఖములకు కారణమిలన్॥

(సా॥ పు. 357)

పువ్వులేక కాయ పుట్టదు చెట్టున । కాయలేక ఫలము కలుగబోదు।
కర్మనిష్ఠలేక కలుగదు భక్తియు । భక్తి లేక జ్ఞాన ఫలము లేదు ॥

(సా॥ పు. 368)

కర్మ మార్గంబు, విడరాని కాలినడక
భక్తి మార్గంబు, సులువైన బండి త్రోవ
జ్ఞాన మన, విమాన ప్రయాణ మరయ
యోగమన వార్థిపై చను ఓడ కాదే.

(సా॥ పు. 447)

జగత్తు బ్రహ్మమయం బ్రహ్మమయమైన జగత్తు కర్మమయం సృష్టియే పెద్ద కర్మ. మానవుడనగా జీవశక్తి. ఉపాధి శరీరం. మానవుడు సృష్టిలో భాగం. కనుక మానవుడే కర్మ. శరీరమే కర్మమయం. కర్మానుసారంగా శరీరము ప్రాప్తించుచున్నది. కావున మానవ శరీరమునకు, సమస్తసృష్టికి కర్మయే ఆధారము కర్మతత్వాన్ని గుర్తించడానికీ, కర్మలాచరించాలి. కర్మలాచరించడానికి కూడా కర్మలను సమగ్రంగా అర్థముచేసుకోవలసి యుంటుంది.

(సా॥ పు. 132)

కర్మ మూడువిధములు కలవు, కాని మరికొంతమంది నాలుగు విధములని అందురు. **దుష్కర్మ, సత్కర్మ, మిశ్రమ కర్మ, నాలుగవది జ్ఞానకర్మ.**

భగవంతుడన్నను, పాపమన్నను భయములేక, మంచిచెడ్డల తారతమ్యము యించుకైనను తెలుసుకొనక, అరిషడ్వర్గములకు వశుడై సంసారమోహ నిమగ్నుడై, ఈషణత్రయము లనుభవించుచు, పశుప్రాయుడై, వివేక వైరాగ్య విచక్షణలను మనసున స్మరించక, దయ, ధర్మ, సత్య శాంతి ప్రేమలు లేక చేయునట్టి యే కర్మలయినను **దుష్కర్మలే.**

భగవంతుడన్నను, పాపకార్యములన్నను భీతికలవాడై, సత్య, ధర్మ, దయా, శాంతి ప్రేమలతో యెట్టి కర్మలు చేసినను అవి **సత్కర్మలగును.**

ఇవి చాలా విచిత్ర స్వరూపములు దాల్చియుండును. పరోపకార కార్యములను చేయుచు, దైవభీతి, పాపభీతి వుండియు, వాటికి విరుద్ధమైన దుష్కర్మలు,

దుర్మార్గములు, దురాలోచనలు చేయుచునే వుందురు. కొంతమంది పేరు ప్రతిష్టలకొరకు దాన ధర్మములు చేయుచుందురు. పరోపకారమైన సత్రములు, చలివేంద్రము లేర్పరచుచు, అచ్చట పని చేయువారలకు కూలి సైతము సరిగా నివ్వక బాధపెట్టుచుందురు. పేరుకొరకు ప్రాకులాడుచుందురు. ధర్మము ధర్మమని భిక్షగాండ్లకు తనకు పనికి రాని పదార్థములనో, చెల్లని కాసులనో యిచ్చుచుందురు. అనగా యే కర్మను చేసినను తన స్వార్థమును ఆశించి చేయు యెట్టి మంచి కర్మలయినను అవి **మిశ్రమ కర్మలే.**

జనన మరణాది వస్తువాహన బంధు బలగాది సుఖ దుఃఖాది ద్వంద్వములను బాగుగా తెలిసికొని వాటినుండి దూరమగు మార్గమును శాస్త్రగ్రంథములవలనను, పెద్దల బోధలవలననూ అనుభవజ్ఞుల ననుసరించుచూ, సత్య ధర్మ శాంతి ప్రేమలచే మెలగుచు సర్వేశుని సాయుజ్యమును కోరి యే కర్మలు ఆచరించినను అవి **జ్ఞానకర్మలే అగును.**

(ప్ర. వా. పు.16/17)

కర్మలు మూడు విధములు, **భూత, వర్తమాన, భవిష్యత్కర్మలు.** వర్తమానము నందలి కర్మ కొనసాగును. దీనిని, వాహనమును వెంబడించు ధూళితో పోల్చవచ్చును. వాహనము ఆగినప్పుడే ధూళి దానిపై బడును. ఇక్కడ ఒక సందేహము రావచ్చును. వాహనము, ధూళి నుండి తప్పించుకొనుటకై నిరంతరము ముందుకు సాగిపోతూనే ఉండుట సాధ్యము కాదు. కాని, వాహనము ఎప్పుడూ, ధూళి, ధూసరితమైన మార్గములోనే ప్రయాణించవలసిన అగత్యము లేదు. దుమ్ము ధూళి లేని నున్నటి రాజ మార్గమును చేరవచ్చును. రాజ మార్గము భగవదనుగ్రహము వంటిది. అనుగ్రహము వలన కలుగు ప్రయోజనమునకు, భక్తివలన కలుగు ప్రయోజనమునకు భేదము కలదు. నొప్పితో బాధపడు రోగికి మత్తుమందు నిచ్చి నొప్పిని తగ్గించవచ్చును. కాని అనుగ్రహము శస్త్రచికిత్స చేసి నొప్పిని పూర్తిగా నివారించుట వంటిది. **భగవదనుగ్రహము కర్మను పూర్తిగా తుడిచివేయును.** ఈ విషయములో ఎటువంటి పొరపాటు భావనకు లోనుకావద్దు. ఒక మందుపై 1968వ సంవత్సరము వరకు వాడవచ్చు అని వ్రాసి ఉందను కుందాము. ఆ మందును 1973లో వాడిన దాని ప్రభావమేమీ ఉండదు. శరీరము ఆ మందు సీసా వంటిది. కర్మ ఆ సీసాలోని మందు వంటిది. భగవంతుడు ఆ మందుకు ఒక తేదీని నిర్ణయించును. కావున దాని ప్రభావమేమీ ఉండదు.

(ప. పు.208/209)

మానవునియొక్క జన్మకు అతని మంచి చెడ్డ కర్మలే మూలకారణమైనట్లుగా, నారాయణుడు మానవుడుగా అవతరించుటకును, అతని మంచిచెడ్డ కర్మలే మూలకారణము. కాని, అందులో కొంత వ్యత్యాసము కన్పించును. **మానవుడు చేసిన కర్మలు, అతనికి మాత్రమే వర్తిస్తుంటాయి. అవతారలక్షణము అట్టిది కాదు. దుష్టులు చేసిన దుష్కర్మ, సజ్జనులు చేసిన సత్కర్మ, ఈ రెండుకూడను, అవతారములకు మూలకారణమవుతవి.** ఇది నరసింహావతారము నందు మనకు చక్కగా గుర్తుకు వస్తుంది. **ప్రహ్లాదుడు చేసిన సత్కర్మ, హిరణ్యకశిపుడు చేసిన దుష్కర్మ ఈరెండుకర్మలూ నారాయణుడు నరసింహరూపము ధరించుటకు కారణమైనవి.** అదే విధముగనే, ప్రతి అవతారమునకు, ఏవో ఇట్టి కారణములు లేకుండా కార్యము జరిగేటువంటిది కాదు. రామావతారమునకు కూడను, అనేక కారణములుంటున్నాయి. పూర్వము దేవాసురులకు యుద్దము జరుగుచున్న సమయములో, అసురులు భృగుమహర్షి భార్యను ఆశ్రయింపగా, ఆమె వారికి కొంతసహాయపడింది. వారిని ఆమె ఆదుకోటంచేత, వారికి కొంతవరకును అపాయం తగ్గింది. ఈ విషయము నారాయణునకు తెలిసినతక్షణమే, **నారాయణుడు భృగుమహర్షియొక్క భార్యశిరస్సు ఖండించాడు. వెంటనే, భృగువు భార్యావియోగము భరించలేక "మానవావతారముతో భూలోకమునకు దిగివచ్చినపుడు, నీవు కూడను, భార్యావియోగమును అనుభవింతువు**

గాక" అని నారాయణునికి శాపమిచ్చాడు. ఇందులో ఉన్నటువంటి అంతరార్థమేమనగా, ప్రతికర్మకు కూడను రియాక్షను(Reaction) , రిఫ్లెక్షను (Reflection) రీసౌండ్ (Resound) **అనగా ప్రతీకారము, ప్రతిఫలము, ప్రతిధ్వని ఏర్పడుతూనే ఉంటుంటవి.** నారాయణుడైనప్పటికీ నరావతారంలో వచ్చినప్పుడు. తాను కూడను, తనయొక్క కర్మల ప్రతిఫలాన్ని లోకానికి ఆదర్శవంతంగా అనుభవిస్తూ వస్తుంటాడు.

(ఆ. పు.60/61)

కర్మలు మూడు విధములు-కర్మ, అకర్మ, వికర్మ అని...వికర్మ సూక్ష్మమైనది. సూక్ష్మమై, సాత్వికమై, ఆత్మ సందర్శన నిమిత్తమై సర్వసంగపరిత్యాగమును చేయునది. ఇది ఏది చూచినా, ఏది పలికినా, ఏది అనుభవించినా ఈశ్వరత్వముగానే అనుభవించును. అకర్మ అనునది దానికి పూర్తిగా విరుద్ధమైనది. అంతర్ కర్మలను గాని, బహిర్ కర్మలను గాని ఏమాత్రము చేయక తమోగుణములో స్తంభించి ఉంటుంది. ఇది తన స్వార్థము తప్ప అన్యము ఏ మాత్రము ఆశించదు. ఇక కర్మ అనేది రజోగుణ సంబంధమైనది. ఇది స్థూలమై, స్వార్థమును తరింప జేసుకునే నిమిత్తమై కర్మలను ఆచరిస్తుంటుంది. ఈ కర్మలను చేసేవారు తమ మనోవృత్తుల నిమిత్తమై కర్మల నాచరిస్తుంటారు. ఈ కర్మ క్రమేణ ఉన్నతస్థాయిలోనికి పోయి విశ్వకర్మలలోనికి, చేర్చుటకు వీలుగా ఉంటుంది.

కర్మ, అకర్మ, వికర్మలను ఆధారముగా చేసికొని మానవత్వమును మూడు విధములుగా విభజించారు. అవి పశుమానవత్వము మానవమానవత్వము, దైవ మానవత్వము. స్వార్థమును తప్ప అన్యమే మాత్రము విచారించనిది పశుమానవత్వము. ఇందులో భక్తిప్రపత్తులే మాత్రము లేవు. వీరు పరోపకార కార్యములందు పాల్గొన్నరు. పరుల బాధలు, కష్టములు, చింతనలు వీరు ఏ మాత్రము తలంచరు. కన్నబిడ్డలను గాని కట్టుకున్న వారి కష్టములు గాని వీరు గుర్తింపరు. తన కడుపే కైలాసముగా వర్తించే తత్వము **పశు మానవత్వము.** ఇక **మానవత్వము;** తన సుఖమును, తనవారి సుఖమును, కొంత పరివార సుఖమును హద్దులో ఉంచుకొని జీవించే తత్వము మానవత్వము. ఇది అంత విశాలమైనదికాదు. అయితే ఇది క్రమక్రమేణ విశాలము కావడానికి అవకాశము ఉంటుంది.

(శ్రీ.భ.ఉ.పు.9/10)

జగత్తులో మానవుడనుభవించే సమస్త దుఃఖములకు ఆపదలకు, తాను చేయు పనులే కారణము. మానవుడు తాను సుఖపడుతున్నానని, విచారపడుతున్నానని, కష్టపడుతున్నానని భావిస్తుంటాడు. దీనికంతా ఎవరో కారకులు అని విశ్వసిస్తుంటాడు. ఇది చాలా పొరపాటు. మనకర్మలే దీనికి కర్త. **మనము నమ్మినను నమ్మకపోయినను, కర్మలు ఫలితమును అనుభవించక తప్పదు.** ఇది ప్రకృతి నిలయము. వేడి, చలి, నిప్పు, వర్షము, వీటిని నమ్మినను నమ్మకపోయినను, వాటి ప్రభావము మనపై ప్రసరిస్తుంది. అదే విధముగనే మనము చేసిన కర్మల ఫలితము మనపై ప్రసరించక తప్పదు.

ఇది చేతు, అదిచేతు, ఇంకెన్నియో
చేతు ననుచు ఊహలు అల్లి అలిసిపోకు
ఏ విత్తులను నాటి యిచ్చోట నుంటిరో
ఆ ఫలములే మీకు అందుచుండు
విత్తనం బొక్కటైన వేరయిన ఫలములు
సమకూరుటెట్లది సాధ్యమగును?
ఎన్ని చేసిన అవి యన్ని ఎంచి ఎంచి
మంచియైన, చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మమీకిచ్చి పంపును బరువుమాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల
వేసుకుందురు మీరు విషయమిచ్చు విత్తులు
ఆశింతురు నేడు అతి రుచ్య ఫలములు
కాసిన కడు చేదు కాయలు తినలేక
దోషము నాపైన ద్రోసి వాదింతురు.
కనుక మనము కర్మలను సక్రమ మార్గములో

కర్మ, వికర్మ, అకర్మ

ప్రవేశపెట్టాలి. కర్మలకు హస్తములు మాత్రమే కాదు, శరీరమంతా ప్రధానము. ఏది చేసినా ఏది చూచినా, ఏది విన్నా త్రికరణ శుద్ధితో చేయాలి. అనగా మనోవాక్కాయ పరిశుద్ధితో, త్రికరణ శుద్ధితో పలకాలి, వినాలి, ఆనందించాలి.

సమాజము యొక్క ప్రవేశము చేతను, సత్పురుషుల సంవదర్శనము చేతను, సత్కార్యముల ప్రభావము చేతను, మనము విశాలముగా మారుటకు వీలుంటుంది. కనుక ఈ **మానవత్వమనేది దైవమానవత్వములో ప్రవేశించుటకు ఎంతైనా అవకాశము ఉంటుంది. "సతతం యోగినః"** సర్వమూ భగవంతుని స్వరూపమే; సర్వత్ర భగవంతుడు ఉన్నాడు. **ఏది చేసినా, ఏది చూసినా, సర్వమూ, దైవత్వముగా భావించుటే దైవమానవత్వము. అట్టి కర్మలు చేయువారే దైవమానవులు;** తమకు సంభవించిన దుఃఖమునకు, లేక అపకారమునకు, కీడునకు, నష్టమునకు విచారించక, సంతోష శాంతములతో, ఇవి అన్నియూ తాము పూర్వము చేసుకున్న కర్మల ఫలితమేగాని, వేరుకాదని తలచి, అట్లు అపకారము చేసినవారిని కూడా, ఆప్యాయతతో చూచుచూ, తనకు చెడ్డచేసిన వారికి, తిరిగి చెడ్డచేయకుండా, ఓర్పుతో సహనముతో ఉండువారు.

(శ్రీ.భ.ఉ.పు.10/11)

(చూ॥ అనుభవించుట, కర్మఫలము, జ్ఞాని, తత్తు సమన్వయాత్, త్యాగం, త్రిగుణములు, త్రివేణి, ధర్మపథము, నమస్కారము, పండితుడు, ప్రేమ, ప్రేమస్వరూపుడు, బ్రహ్మ, సమానత్వము, సూర్యుడు)

కర్మ, వికర్మ, అకర్మ

మనస్సును భగవదర్పితము గావించినప్పుడు సర్వమూ లయమైపోతుంది. మన సమస్తకర్మలకు మూలకారణము మనసే కనుక నీ మనసును భగవదర్పితము చేసినప్పుడు సర్వము అందులో లీనమై పోతుంది. భగవంతుని చింతనలో మనసును యిమడ్చినప్పుడు సర్వము నిష్కామకర్మగా మారిపోతుంది. కర్మ, వికర్మ, అకర్మలని మూడురకములుగా వుంటున్నాయి.

సారమైనది చమురురా సత్యమైనది వత్తిరా
వెలుగు తీరిపోయేటప్పుడు వెంట నెవ్వరు రారురా
రామభజన చేయరా రాజ్యమంతా వెలుగురా.

సారమైనది చమురు, సత్యమైనది వత్తి. ఈ రెండు చేరినప్పుడు వెలుగు వస్తుంది. వెలుగు తీరిపోయేటప్పుడు వెంట ఎవ్వరు రారు. చమురు రాదు, వత్తిరాదు. సారమైనది చమురు, సత్యమైనది వత్తి. ఈ రెండింటికి ఒక ప్రమిద వుండాలి కదా! అదియే మనదేహము. మన కోరికలు చమురు. మన జ్ఞానమే వత్తి. ఆనందమే వెలుతురు. వత్తి ఒక్కటి మాత్రమే అంటిస్తే బుట్టున కాలిపోతుంది. ఆయిల్‌ను అంటిస్తే అంటుకోదు. ఆయిల్ వత్తి రెండు చేరినదానిని వెలిగిస్తే వెలుగుతుంది. కర్మ అనేది ఆయిల్. మనస్సనే వత్తి బుద్ధితో చేరివుంటుంది. ఈ రెండు చేరేటప్పటికీ అకర్మగా మారిపోతుంది. ప్రకాశము వస్తుంది. ఈ జ్యోతికి అనేక గుణములుంటున్నాయి. కాని ప్రకాశమునకు ఒకే గుణము. గాలి వస్తే ఈ జ్యోతి అటూ ఇటూ ఆడుతుంది. నీళ్లు పడితే చిటపటమని శబ్దమిస్తుంది. పొగ వస్తుంది. వేలు పెడితే కాలుతుంది. జ్యోతి మాత్రము అందరికి వెలుగునిస్తుంది. వెలుతురు నందించటమే దాని ముఖ్యగుణము. అందరికి సమానముగా వెలుతురును ఇస్తుంది. అదే నీలో ఆత్మజ్యోతి. అది అందరి యందు సమానముగనే వుంటుండాది. ఈ జీవనజ్యోతి అనే దానిలో యీ విధమైన చిటపటలు, పొగలు ఆడటము, పాడటము, చంచలత్వము యివన్నీ వుంటున్నాయి. స్థిరంగా వుండే జ్యోతి కర్మ, ఆడేదే వికర్మ. వెలుతురే అకర్మ. దీనికి యేవిధమైన ఫలము వుండదు. అకర్మ అంటే కర్మను ఆచరించకుండా వుండడము కాదు. కర్మను ఆచరించి ఫలితమును కోరకుండా అందరికి సమత్వముగా అందించే స్వభావమే నిజమైన అకర్మ. అకర్మ అనగా కర్మ చేసియు కర్మ చేయనివాడుగా తయారౌతాడు. ఇది ఆధ్యాత్మికమునకు మాత్రమే సంబంధ మవుతుంది గాని లౌకికమైన దానికి పోల్చుకోరాదు.

(శ్రీస. గీ. పు 280/281)

కర్మకాండలు

మతపరమైన కర్మకాండలన్ని నిస్సందేహముగా సత్కర్మలే. అయితే, బాహ్యమైన ఇంద్రియములతో నిర్వర్తించే సత్కర్మలు అన్నీ ఆధ్యాత్మిక పరమైనవి అని చెప్పడానికి వీలులేదు. అవి కేవలం మానవుని మర్కట బుద్ధిని సరియైన క్రమశిక్షణలో పెట్టే కర్మలు. మనం ఏ పేరుతో పిలిచినా, వీటన్నిటి వెనుకనున్న ఆధ్యాత్మికతత్త్వమొక్కటే. **ఆత్మనాశము లేనిది, మార్పు లేనిది. ఈ విషయాన్ని ప్రతి నిత్యము స్మరించడమే ఆధ్యాత్మిక తత్త్వము.** ఎంత చదువుకున్నా, ఎన్ని తెలివితేటలు, సంస్కారము, వాదపటిమ కలిగియున్నా మానవుడు తాను ఎక్కడినుండి వచ్చాడో ఆ మూలస్థానమును మరచిపోతున్నాడు. అందువలననే, అతడు **"నేనెక్కడి నుండి వచ్చాను?" అనే అతి చిన్న ప్రశ్నయొక్క అర్థమును కూడా తెలుసుకొనలేక పోతున్నాడు. మానవుని యొక్క మనస్సు నుండి కాక ఆత్మనుండి ప్రవహించే అనంతమైన శక్తిని గుర్తించడమే ఆధ్యాత్మిక తత్త్వము.** ఆధ్యాత్మిక తత్త్వమునకు, నిత్య జీవితానికి సంబంధము లేదని భావించడం చాలా పొరపాటు. **హిందూ ధర్మశాస్త్రముల ననుసరించి ఆధ్యాత్మిక తత్త్వము మానవజాతి అంతటికీ వర్తించే ఒక జీవన విధానము.** నిజమైన ఆధ్యాత్మికతత్త్వము అంటే ఏమిటి? **భిన్నత్వములో ఏకత్వమును దర్శించడమే నిజమైన ఆధ్యాత్మిక తత్త్వము. అందరిలోను ఒకే పరమాత్మను దర్శించడమే నిజమైన ఆధ్యాత్మికతత్త్వము. అందరిలోను ఒకే పరమాత్మయొక్క ఉనికిని గుర్తించే సమభావమును మనం అలవరచుకోవాలి."**

(దై. ది. పు. 46)

కర్మజోగి

జీవితంలో ఏది సాధించాలన్నా మానవ ప్రయత్నము అవసరం. గత ఇరవై సంవత్సరాలుగా ప్రశాంతి నిలయములో భక్తులకు వసతి సౌకర్యములను పెంచి అనేక సదుపాయములను కల్పించిన ఘనత జోగారావుకు దక్కుతుంది. గత ఇరవైయేళ్ళుగా సత్యసాయి సెంట్రల్ ట్రస్టులో సభ్యునిగా ఉన్న జోగారావు విసుగు, విరామం లేకుండా రాత్రింబగళ్ళు శ్రమించి ప్రశాంతి నిలయంలో ఈ సదుపాయములను సమకూర్చడానికి కృషి చేశాడు. అతడికి పని అంటే ఇష్టము. అంతేకాదు, గత పన్నెండు నెలలుగా రాత్రింబగళ్ళు నిర్విరామంగా అతడు ఏమి చేస్తున్నాడో నాకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. **అతడు కల్నల్ జోగారావు కాదు - కర్మజోగి'**

(దై.ది. పు.339)

కర్మతత్త్వము

(చూ॥ కర్మ)

కర్మదాటవశమా!

కర్మ దాట వశమా!
నరుడా, కర్మ దాట వశమా!
ఘన పాఠంబులు చదివినగానీ
కులదేవతలను కొలచినగానీ
కారడవులకే పోయినగానీ
కఠిన తపస్సులే చేసినగానీ
కర్మ దాట వశమా!
చిన్న చెలమలో ముంచినగానీ
ఎన్ని సముద్రముల్ నింపినగానీ
కడవెంతోరా! నీరంతేరా!
కావాలన్నను ఎక్కువ రాదురా!
కర్మ దాట వశమా!

అయితే దైవానుగ్రహాన్ని పొందితే ఎలాంటి కర్మలూ అడ్డు తగలవు.

సూర్యుడు ప్రకాశిస్తున్నప్పుడు అనేకమంది అనేక రకములైన కర్మలు చేస్తుంటారు. కానీ, ఆ కర్మల ఫలితం సూర్యునికి అంటదు. సూర్యుడి నుండి ఆవిర్భవించిన మేఘాలు సూర్యుడినే కప్పివేస్తాయి. అంతమాత్రాన సూర్యునికి వచ్చిన నష్టమేమీ లేదు. అదేవిధంగా, దైవం నుండి ఆవిర్భవించిన మానవుడు దైవాన్నే

కర్మఫలత్యాగము

విమర్శిస్తుంటాడు. అంతమాత్రంచేత దైవానికి ఏమీ నష్టం లేదు. **సూర్యప్రకాశంచేత మేఘములు పుట్టినట్లుగా, ఆత్మప్రకాశంచేత మనస్సు బుద్ధి, చిత్తము పుడుతున్నాయి. కష్టనష్టములకు మనస్సే కారణం. పునర్జన్మకు కూడా మనస్సే మూలం. కనుక, మనస్సును దైవంవైపు మరల్చాలి. అప్పుడు ఎట్టి కర్మలూ మిమ్మల్ని బాధించవు. పర్వతములవలె వచ్చిన బాధలు కూడా మంచువలె మాయమౌతాయి.** దైవకృపచేత ఎట్టి బాధలనైనా పరిహారం గావించుకోవచ్చు. ఇక్కడ "కర్మ దాట వశమా!"అనేది వర్తించదు. అయితే, కర్మకు తగిన ఫలితములు వస్తుంటాయి. వచ్చినప్పటికీ దైవానుగ్రహంవల్ల వాటి నుండి తప్పించుకోవచ్చును.

మృకండు మహర్షి కుమారుడైన మార్కండేయునికి ఈశ్వరుడు 16 సంవత్సరాల ఆయుస్సును ప్రసాదించాడు. ఈ రహస్యం మార్కండేయునికి తెలియదు. ఒకనాటి రాత్రి మృకండుడు, అతని భార్య ఇంట్లో కూర్చుని విలపిస్తున్నారు. మార్కండేయుడు "అమ్మా!నాన్నా! మీ విచారమునకు కారణమేమిటి?" అని ప్రశ్నించాడు. "నాయనా! ఈశ్వరుడు నీకు 16 సంవత్సరముల ఆయుస్సును మాత్రమే అనుగ్రహించాడు. ఈనాటితో నీకు 16 సంవత్సరములు నిండుతున్నాయి. ఇంక నీకు, మాకు ఎట్టి సంబంధమూ ఉండదు." అని చెప్పారు. "ఈ మాట నాకు ముందే ఎందుకు చెప్పలేదు? ఈశ్వరానుగ్రహంచేత ఎలాగైనా నా ఆయుస్సును పొడిగించుకుంటాను" అని పలికి అతడు తక్షణమే ఈశ్వరాలయానికి వెళ్ళి, శివలింగాన్ని గట్టిగా కౌగలించుకుని, **"ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ..." అని నామస్మరణ చేస్తూ కూర్చున్నాడు.** అర్ధరాత్రి సమయంలో యముడు వచ్చి మార్కండేయునిపై తన పాశం విసిరాడు. ఆ సమయంలో మార్కండేయుడు శివలింగాన్ని గట్టిగా కౌగిలించుకుని ఉండడంచేత యమపాశం ఈశ్వరునిపై కూడా పడింది. తక్షణమే ఈశ్వరుడు ప్రత్యక్షమై "ఓయముడా! నాపై కూడా పాశం వేసేటంత ధైర్యం ఉందా నీకు!" అని అతనిని భస్మం చేశాడు. ఈవిధంగా, మార్కండేయునికి రావలసిన చావు యమునికి పోయింది: యముని యొక్క చిరంజీవత్వం మార్కండేయునికి వచ్చింది. కనుక, **దైవస్పర్శచేత, దైవానుగ్రహంచేత దైవప్రార్థన చేత మీరు ఎటువంటి కర్మలనైనా మార్చుకోవచ్చును. అందుచేత, దైవాన్ని నిరంతరం ప్రార్థించడం, స్మరించడం, పూజించడం అత్యవసరం.** దైవం ఎక్కడో ప్రత్యేకమైన స్థానంలో లేడు: మీయందే ఉన్నాడు. దేహమే దేవాలయం అట్టి అంతర్ముఖమైన **దైవాన్ని మీరు నిరంతరం స్మరిస్తూ రావాలి.**

(స.సా. న. 99 పు.286/288)

కర్మఫలత్యాగము

సమస్తదుఃఖములకు **మూలకారణము** యింద్రియముల బలహీనతే. వీటిని బలముగా వుంచుకొని, తగిన కార్యములలో ప్రవేశింపచేసుకొని, పెడమార్గము పట్టకుండా చూసుకొనే విషయములో మనము నిగ్రహించుకోవాలి. భగవద్గీతలో **యింద్రియనిగ్రహము అన్నారే కాని యింద్రియనిర్మూలనము అనలేదు. కర్మత్యాగమని చెప్పలేదు. కర్మఫలత్యాగము అన్నాడు.** భగవద్గీతలో చెప్పినారని కర్మలు చేయకుండా వుండటానికి వీలు కాదు. **కర్మ చేసే తీరాలి.** శ్రీకృష్ణుడు,

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన,
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి.

ఏ ఫలితము లేకపోయినా నేనే చేస్తున్నాను. నాకే కర్మలు లేకపోయినా నేనే కర్మ చేస్తున్నాను. నీవెందుకు చేయకూడదు? అన్నాడు. మనము అన్ని కర్మలు చేయవలసినదే. అన్ని యింద్రియములను ఉపయోగపెట్టుకోవలసినదే. **మాత్రః అని చెప్పినట్లుగా యే పరిమితిలోనో యే కొలతతోనో దీనిని ప్రవేశ పెట్టుకోవాలి.** దీనిని పెడమార్గము పట్టించుకోకుండా

యింద్రియములను వుపయోగించుకోమని చెప్పాడు. ఇదియే భగవద్గీతయొక్క ప్రధానమైన సందేశము.

(శ్రీస. గీ. పు. 180)

కర్మలు చేయండి కాని, వాటిఫలాల కోసం ప్రాకులాడవద్దు. ఏదైనా ధర్మసంస్థకు విరాళం ఇచ్చినప్పుడు తగినంత గుర్తింపు రాలేదని ఫిర్యాదు చేయకండి. సత్ఫలములైనా, దుష్ఫలములైనా ఆరగించవలసిన భోక్తలు మీరే...! ఐతే, కర్మఫలానుభవం నుండి తప్పించుకోవాలంటే - **కర్మ కోసమే కర్మను చేసి దాని ఫలితం సంగతి విస్మరించడం ఉత్తమమైన మార్గము. ఫలాపేక్ష లేకుండా కర్మలు చేస్తే పాపపుణ్యాల ఫలితం మిమ్మల్ని బాధ పెట్టదు.** లాభం కావాలని కోరితే నష్టానికి కూడా నీవు సిద్ధంగా ఉండాలి. ప్రేమతో నీవు ఎవరికైనా విసనకర్రతో విసురుతున్నప్పుడు నీ ఇష్టం వచ్చినప్పుడు ఊరుకోవచ్చును. కాని, జీతం పుచ్చుకొని ఫంకా లాగే జవాను ఇష్టం ఉన్నా లేకపోయినా ఆ పని చేస్తూ ఉంటే బాధ కలుగుతుంది. **ప్రతిఫలాన్ని అడిగినా పుచ్చుకొన్నా నీకు బంధన తప్పదు. కర్మఫలం త్యాగంలో ఉన్న రహస్యమిదే...!**

(ప్రే.బ. పు. 86)

కర్మఫలము

కారణంబున కలుగు ఘన మోహ బంధంబు
మోహమందు పెరుగు, మూర్ఖ బుద్ధి
మూర్ఖబుద్ధి యందు మరియును కర్మంబు
కర్మఫలమువలన కలుగు జన్మ॥

(సా॥ పు. 153)

విద్యార్థులారా! మీరు పవిత్రమైన సంకల్పాలను అభివృద్ధి పరచుకుంటూ పవిత్రమైన భావాలతో మీ జీవితాన్ని సార్థకం గావించుకోండి. ఆదర్శవంతమైన జీవితాన్ని ఇతరుల కందించండి. తాత్కాలికమైన సుఖసంతోషముల నిమిత్తమై దుస్సంకల్పములను దుర్భావములను దుశ్చేష్టలను అభివృద్ధి పరచుకోకండి. అవి మీకు అప్పటికప్పుడే తగిన ఫలితమందిస్తున్నాయి. కాని అంతకుమించి పదిరెట్లు నూరురెట్లు ప్రమాదము సంభవిస్తాది. భవిష్యత్తును మీరు లక్ష్యములో పెట్టుకొండి ప్రతిదానికి రియాక్షన్, రీసౌండ్, రిఫ్లెక్షన్ అనే సత్యాన్ని విశ్వసించండి. నీవు చేసినవన్నీ నీకు తత్ఫలితంగా అందుతాయి.

ఏ విత్తులను నాటి ఇచ్చోట నుంటిరో
ఆఫలములే మీకు అందుచుండు
జననిగర్భమునుండి జన్మించినప్పుడు
కంఠమాలలనేవి కానరావు
మంచిముత్యపు సరుల్ మచ్చునకునులేవు
మేల్మి బంగరు దండ మెడకు లేదు
రత్నాలహారముల్ రంజిల్లగా లేవు
పచ్చల పేర్లను వెదకలేరు
కలదు కలదొక్క మాల మీ కంఠమందు
పూర్వ జన్మలకర్మలు పొందుపరచి
మంచియైనను చెడుగైన త్రుంచకుండ
బ్రహ్మ మీకిచ్చి పంపును బరువుమాల
కర్మలన్నియు చేర్చిన కంఠమాల.

అదే వనమాల. కనుక మనము మంచిని చేసి మంచి మాలను ధరిస్తాము. చెడ్డ పనులు చేసి చెడ్డమాలను ధరించనక్కర లేదు.

(బృ.త్ర. పు. ౭౭/౭౮)

కర్మ ఫలితమనేది ఎప్పుడు వస్తుందో, ఎక్కడ వస్తుందో, ఎలా వస్తుందో, ఎలాంటిది వస్తుందో ఎవ్వరికీ తెలియదు. ప్రతి కర్మకు ఒక ఫలితం ఉంటుంది. అది అప్పటికప్పుడే రావచ్చు, కొన్ని గంటలలో రావచ్చు, కొన్ని దినములలో రావచ్చు, కొన్ని నెలలలో రావచ్చు, కొన్ని జన్మలలో రావచ్చు. ఒక చిన్న ఉదాహరణ : పొరపాటున చేయి కోసుకుంటే తక్షణమే రక్తం వస్తుంది. భోజనం చేసిన తక్షణమే ఆహారం జీర్ణం కాదు, జీర్ణం కావడానికి రెండు మూడు గంటలు పడుతుంది. విత్తనం నాటిన తక్షణమే అది వృక్షం కాదు. మూడు నాల్గు దినములకు మొక్క బయలు దేరుతుంది. అది వృక్షం కావడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఆ తరువాతనే ఫలము లభ్యమవుతుంది. కనుక, కర్మఫలితం ఈ జన్మలోనే గాక వచ్చే జన్మలో కూడా వెంటాడుతుంది. మంచిగాని,

కర్మభూమి

చెడ్డగాని కర్మఫలితం తప్పదు. అయితే, కర్మఫలితం తప్పనప్పుడు ఇంక, దైవాన్ని ప్రార్థించటం ఎందుకు? అని మీరు ప్రశ్నించవచ్చు. **దైవాన్ని ప్రార్థించవలసింది ఈ బాధల నివారణ కోసం కాదు : మనశ్శాంతికోసం దైవాన్ని ప్రార్థించాలి. అది మీకు లభ్యమైతే ఈ కష్టములు, నష్టములు దూరమైపోతాయి. దైవానుగ్రహం మీ కర్మఫలితాన్ని రద్దు చేయగలదు. అది రద్దు కావటానికి మీ ప్రార్థన అవసరం. దైవప్రార్థనవల్ల మీకు ఎన్నో విధములైన మేలు జరుగుతుంది. అయితే, ఆ ప్రార్థన మీరు హృదయ పూర్వకంగా చేయాలి.** ప్రేమస్వరూపులారా! మీ కష్టములకు, నష్టములకు భగవంతునిపై నింద వేయకండి. ఎలాంటి పరిస్థితులందైనా భగవంతుణ్ణి ప్రార్థించటం మీ కర్తవ్యం. ఎంత వరకు? 'నేను జీవుడను, తాను దేవుడు' అనే భేదం ఉన్నంత వరకు ప్రార్థించాలి. నేనే అతడు, అతడే నేను అనే ఏకత్వ స్థితి వచ్చినప్పుడు ఇంక ప్రార్థించ నవసరం లేదు.

(స. సా. మే 99. పు. 135)

ఒకానొక సమయంలో మండోదరి "రావణా! నీవు చేయరాని పనులను చేస్తున్నావు. పవిత్రమైన స్త్రీలను బాధిస్తున్నావు. ఇది మంచిది కాదు. స్త్రీలు అగ్నితో సమానం. వారిని చూపులతో గాని, మాటలతోగాని, చేష్టలతో గాని హింసించడం మహాపాపం. ఈనాటి నీ చెడ్డ చూపులు, చెడ్డ భావములే రేపు చెడ్డ ఫలితముల నందిస్తాయి. కర్మ ఫలితము తప్పదు. నేడో రేపో కాకపోయినా వచ్చే జన్మకైనా తప్పించుకోలేవు. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించు. నేను చాల గొప్పవాడనే, నాతండ్రి రాక్షస చక్రవర్తి, నాభర్త రాక్షస చక్రవర్తి, నా కుమారుడు ఇంద్రుని జయించిన మహావీరుడు. అయినప్పటికీ ఎప్పుడే ప్రమాదం ముంచుకొస్తుందో అనే భయం నన్ను పట్టి పీడిస్తున్నది. కనుక నీవు కొంత జాగ్రత్తగా ఉండటం మంచిది" అని హెచ్చరించింది. కాని రావణుడు మండోదరి మాటలను లెక్క చేయలేదు.

చివరికి మండోదరి భయపడినట్లుగానే యుద్ధంలో రాక్షస వీరులందరూ మరణించగా రావణుడు మాత్రమే మిగిలాడు. మండోదరి ఇంక అఖరియత్నంగా మళ్ళీ రావణుని వద్దకు వెళ్ళి, "రావణా! రాముడు సామాన్యుడు కాడు. కోతులను పట్టుకొని సముద్రంపై వంతెన కట్టాడంటే ఇది మానవమాత్రునికి సాధ్యమయ్యే పనేనా? ఇప్పటికైనా కాలం మించిపోలేదు. నా మాట విని సీతను రామునికి అప్పజెప్పి అతని పాదము పట్టి క్షమించమని ప్రార్థించు" అని బోధించింది. "నా ప్రాణమునైనా విడుస్తాను కాని, రాముని పాదం మాత్రం పట్టను" అన్నాడు రావణుడు. మండోదరి "వినాశకాలే విపరీత బుద్ధిః" అని చింతిస్తూ వెళ్ళిపోయింది.

(శ్రీ.భ.ఉ.పు.83)

(చూ॥ త్రిగుణములు, త్యాగము)

కర్మభూమి

(చూ॥ భారతదేశము)

కర్మభ్రష్టులు

(చూ॥ నాల్గు మార్గములు)

కర్మయోగము

(చూ. సార్థకత)

కర్మయోగి

కర్మయోగికి సంగబుద్ధికంటే, సమబుద్ధి ప్రధానమని కూడనూ అన్నాడు. సంగబుద్ధి వద్దన్నాడు; యెందుకన, బంధమునకు మూలకారణము సంఘమే, "ఈ కర్మనాది, ఈ చేసే కర్మఫలము నాది, ఈ కర్మకు కర్త నేనే" అను సంఘము బంధమునకు గురి అగును. సంగబుద్ధికి అతీతుడయిన, మంచిదన్నాడు కృష్ణపరమాత్మ. సమత్వమే యోగమన్నాడు. అందుకనే కృష్ణపరమాత్మ 'సమత్వం యోగముచ్యతే' అని అన్నాడు.

(గీ.పు. 37)

కర్మయోగులు

(చూ॥ ఉత్తరాయనము, నాల్గుమార్గములు)

కర్మసన్యాసం

(చూ॥ ఆదిశంకరులు)

కర్మాచరణ

''తస్మై నమః కర్మణే'' అని మొదట కర్మకు నమస్కరించాలి. మంచికానీ, చెడ్డకానీ, పాపముగానీ, పుణ్యముగానీ రెండూ భగవద్విభూతులే. యోగియైనవాడు మంచిచెడ్డలను లక్ష్యము చేయక యేది లభించినప్పటికిని అది భగవద్విభూతిగనే భావించి అనుభవించుటకు సిద్ధముగా వుంటాడు. కర్మను ఆచరించటమే ప్రధానమైన కర్తవ్యముగా గుర్తిస్తాడు. ఈ కర్మాచరణ జన్మసార్థకత కోసము. ఇది భగవంతుని అనుగ్రహముచేతనే లభిస్తుంది.

(శ్రీస. గీ. పు. 304)

కర్మాతీతులు

(చూ॥ నాల్గు మార్గములు)

కర్మాధికారి

(చూ॥సూర్యుడు)

కర్ణుడు

(చూ॥సంగము)

కర్పూరము

ఒక కర్పూరపు ముక్కను ఒక డబ్బాలో పెట్టి, మూత వేసినా కూడ. కొంత కాలమునకు అది పూర్తిగా శూన్యమగును, కదా? దీనికి కారణమేమి? **దానినుంచి సతతము ధారావాహినిగా బయలుదేరు చున్న అణువులే దాని నాశనమునకు కారణమయ్యెను.** పరుల దేహములనుంచి వెలువడే అణురేణువులు గాలిలో చేరి, మీరు పీల్చుకొనే గాలితో మీ దేహములందు ప్రవేశించును. మీ దేహమునుండి కూడ అదే విధముగా, లక్షలాది అణురేణువులు బయలుదేరుచున్నవి. ఈ రీతిగా విసర్జించటము స్వీకరించటము అనే రెండు క్రియలను అందరూ ఎల్లప్పుడూ చేయుచుందురు. దేహముయొక్క పటుత్వము ఆరోగ్యము క్షీణించుటకు తరుగుటకు పెరుగుటకు అన్నిటికి ఈ రెండు క్రియలే మూలకారణములు.

(స.సా.డి. 74 పు. 298/299)

కర్మసన్యాసం

(చూ॥ ఆత్మబోధ)

కర్మేంద్రియములు

(చూ॥ వ్యష్టితత్వము)

కర్మోపాసన

మానవులు తమ ఆత్మస్వరూపమైన తన్ను ఉపాసించుట మాని నన్ను చేరకోరుట విడచి అనిత్య అశాశ్వతమైన ఫలప్రదానమును అందించు అల్పశక్తులను ఆశ్రయింతురు. దీనికి కారణము చెప్పెదను వినుము. కర్మోపాసనవలన ఫలసిద్ధి త్వరలో లభించును. ప్రత్యక్షముగా అగుపించు వాటినే ప్రజలు ఆశింతురు. అవి కేవలమూ శరీర యింద్రియములకు మాత్రము సంబంధించియుండును; సామాన్య మానవులు సత్యమును తెలిసికొనలేక క్షణికమయిన ప్రత్యక్షానందమునకు పాటుపడుదురే కాని శాశ్వతమయిన పరోక్షానందమునకు ప్రయత్నింపరు.

(గీ. వా. పు.68)

కట్టబొమ్మ

బుట్టుమనుచు జీవుండనుపిట్ట
బుట్ట బొమ్మను విడిపోగా
బిట్టుగ నీల్గిన కట్టబొమ్మయిది
బట్టున బైటికి పట్టి లాగేరు

(ము.ము. పు. 19)

కల/కలలు

మీ శరీరము, మనస్సు, బుద్ధి అంతా ఒక కల. మీరంతా సచ్చిదానంద స్వరూపులు. మీరె ఈ జగత్తు అంతా సృష్టిస్తున్నారు. మీరే ఈ జగత్తులో పరమేశ్వరస్వరూపులు. మరల సంహరిస్తున్నారు.

(సా॥ పు. 522)

నేనొక విషయము చెప్పెదను. భగవంతునికి సంబంధించిన కలలన్నియు నిజమే. మీరు నన్ను కలలో చూతురు. నేను మీకు నమస్కరించు అవకాశమిత్తును, మిమ్ములను ఆశీర్వదింతును. నా అనుగ్రహము అందింతును. ఇవన్నియూ నిజమే. అది నా యొక్క ఇచ్ఛ. మీ యొక్క సాధనాశక్తి వలన సంభవించును. భగవంతుడుగాని, మీ గురువుగాని కలలో కనిపించిన అది నా సంకల్పము వలననే కాని, ఇతర కారణములవలన కానేరదు. మీ ఇచ్ఛ వలన అది ఎన్నటికీ జరుగదు.

(స.సా॥ మే 1992, పు. 101)

(చూ॥ మదాలస)

కలకంఠి

'కలకంఠి కంట కన్నీరొలికిన సిరియింట నుండ నొల్లదు' - అని పెద్దలు చెప్పారు. శ్రీరామకృష్ణ పరమహంస తన భార్యను ఆట పట్టించేటప్పుడు కూడా హాస్యం ముదురు పాకాన పడి ఆమె నొచ్చుకొని కంట తడి పెట్టేదాకా తీసుకొనిపోకుండా జాగ్రత్త పడేవాడు.

(శ్రీ.సా.గీ. పు. 38)

కలికాలము

(చూ॥ స్మరణము)

కలియుగము

గోవునుంచి తీసిన పాలు, ఇక మీగడ, వెన్న సాధకునికి మంచివే. ఇక్కడ గోవుకు ఎటువంటి హానీ కలుగక పోగా ఇంకా మంచే జరుగుతున్నది. ద్వాపర యుగములో, కలియుగమునకు 5680 సంవత్సరముల క్రితమే పాలు వాడుకలో ఉన్నాయి. కలియుగము పూర్తి కాలపరిమాణము 11000 సంవత్సరములు.

(ప. పు. 32)

జ్యోతిశ్శాస్త్రమును పురస్కరించుకొని కృష్ణుడు పుట్టిన దినమును సరిగా నిర్ణయించవచ్చును. జూలై 20వ తేది క్రీస్తుకు పూర్వము 3228వ సంవత్సరము శ్రీముఖనామ సంవత్సరము శ్రావణ బహుళ అష్టమి రోహిణి నక్షత్రమందు అర్ధరాత్రి 3 గంటల సమయమందు కృష్ణుని జననం. ఇది సరియైన దినము. ఈనాటికి కృష్ణుడు నిర్యాణముచెంది 5078 సంవత్సరములు అయినది. దీనిని మీరు సరిగా కూడుకొన్నప్పుడు 3102+1976 = 5078 వస్తుంది. ఈనాటికి కలియుగము ప్రారంభమై 5078 సంవత్సరములు అయినది. కృష్ణుడు దేహమును చాలించినదినమే కలియుగ ప్రారంభము. దీనినే మనము యుగాది (కలియుగమునకు ఆదిదినము కనుక) పర్వదినముగా భావించి పండుగ చేసికొనుచున్నాము. కలియుగము ప్రమాదీచనామ సంవత్సరములో ప్రారంభమగుటచే ప్రమాదమైనదిగానే గోచరిస్తున్నది. **కలియుగ మనుటకంటే కలహయుగమనుట సహజముగా నుండును.** ఎక్కడ చూచినా కలహమే. గృహమునందు కలహమే. సమాజమునందు కలహమే. దేశమందు కలహమే. వ్యక్తికి వ్యక్తికి కలహమే. కనుక దీనిని కలహయుగమనుటలో సార్థకత ఉంది.

(నీ. వే. వె. పు. 131/132)

ఈనాడు కలియుగం కలహయుగంగాను, కలుషిత యుగంగాను మారిపోతున్నది: ప్రేమ శూన్యమై పోతున్నది. బంధుమిత్రుల ప్రేమ చూపించినట్లుగా కనిపిస్తున్నారు గాని, నిజమైన ప్రేమ ఎవ్వరియందూ లేదు. మీకు లౌకికమైన మిత్రులు అనేకమంది ఉండవచ్చును. వారి స్నేహం 'హలో, హౌ ఆర్ యు, గుడ్‌బై...' ఇంతటితోనే అంత్యమైపోతుంది. కాని, భగవంతుడు అలాంటి మిత్రుడు కాదు. తాను ఎల్లప్పుడు మీ ఇంటనే, వెంటనే, జంటనే,

కంటనే వుండి మిమ్మల్ని కాపాడుతుంటాడు. భగవంతుడే సత్యనిత్యమైన మిత్రుడు కాని, అట్టి మిత్రుణ్ణి విస్మరించి, లౌకికమైన మిత్రులను విశ్వసించి మీరు భ్రమలో మునిగిపోతున్నారు.

(స.సా.న.99పు. 320)

(చూ॥ కురుక్షేత్ర యుద్ధం)

కల్నల్ జోగారావు

(చూ॥ కర్మజోగి)

కల్పవృక్షము

(చూ॥ చింతామణి, సూర్యుడు)

కల్పవృక్షము వంటివాడు

(చూ॥ నాకర్తవ్యము)

కల్లోలం

(చూ॥ కార్యాచరణ)

కళలు

మానవత్వాన్ని పశుత్వంగా అనుభవించటం మానవత్వానికి కళంకం. కామక్రోధ లోభ మొహమదమాత్సర్యములనే అరిషడ్వర్గములు మానవుణ్ణి హతమార్చి వేస్తున్నవి. **వేదము "చంద్రమా మనసో జాతః చక్షుస్సూర్యో అజాయత" అన్నది. చంద్రునికి పదహారు కళలు. ఈ పదహారు కళలు పూర్ణమైన స్థితిని పొందినప్పుడే తనలో ఎట్టి మచ్చలు లేకుండా ప్రశాంతమైన ప్రకాంతినిలో కాంతినందిస్తుంది.** చంద్రుడు పదహారుకళలను పెంచుకున్నప్పుడే జగత్తుకు చక్కని ఆదర్శం. మానవుని యందు పదహారు గుణములున్నాయి. కాని ఈ పదహారు గుణములను నిర్మూలము చేసినప్పుడే మానవత్వానికి గొప్ప ప్రకాశము. ఏమిటి ఈ **పదహారు? అరిషడ్వర్గములు ఆరు, మదములు ఎనిమిది. రజస్తమోగములు రెండూ చేరిస్తే పదహారు గుణములౌతాయి.** వీటిని నిర్మూలము గావించు కోవాలి. కర్తృత్వ భోక్తృత్వాలను తగ్గించుకోవాలి. అన్ని విధములా భగవంతునికి అర్పితంచేసి సర్వం బ్రహ్మమయమనే స్థితిలోపల సత్కర్మలు ఆచరిస్తూ పోయినప్పుడు సర్వము భగవంతుడే సహాయపరుస్తాడు.

(బృ.త్ర. పు.౧౭౩)

మనిషికి 16 గుణాలు. వీటినే ఆధ్యాత్మికమందు షోడషకళలు అన్నారు. ఈ పదహారు కళలు ఏమిటి? **ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, ఉద్భవించిన పంచభూతములు, మనస్సు ఒకటి - ఇవే పదహారు కళలు.** కేవలము భగవంతుని యందే పదహారు కళలుంటున్నాయని భావించటము వెట్టితనము. ప్రతివ్యక్తి పదహారు కళలతో వుంటున్నాడు. "ఈశావాస్యమిదం సర్వం" అని "ఈశ్వర స్సర్వ భూతానామ్" అని ఈశ్వరుడు సర్వత్ర ఉంటున్నాడు.

(బృ.త్ర. పు. ౧౧౫)

కళలలోన కలుగు కాంతియె దేవుడు
పిలుపు లోన కలుగు ప్రియము నతడె
మేధయున్న దనుచు మీరకు దైవాజ్ఞ
కూలద్రోయబడును కుత్సితుండు.

(భ స ప్ర పం. పు. 16)

కృష్ణావతారం పదహారు కళలు నిండినటువంటి సంపూర్ణావతారం. రాముడు తన కళలను సోదరులతో పంచుకున్నాడు. రాముడు గుణసహితుడు. కృష్ణుడు గుణరహితుడు. ఎటువంటి విపత్తు వచ్చినా కృష్ణుడు ప్రార్థించలేదు. రాముడు ఆదిత్యుని ప్రార్థన చేశాడు. కృష్ణుడు గుణాతీతుడు కాబట్టి గోపికలతో ఆయన సంబంధం పవిత్రం. స్వచ్ఛం. అందువల్లనే ధర్మజుడు రాజసూయయాగ సందర్భంలో ఆనాటి ఋషులనూ యోగులనూ కాదని కృష్ణునికి ప్రత్యేక పూజలు సమర్పించాడు.

(వ. 1963 పు. 191)

(చూ॥ కృష్ణతత్వము, పురుషుడు)

కళ్యాణము

జనక మహారాజు వివాహానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తున్నాడు. అనేక రథములను పంపించాడు అయోధ్యకు. జరిగినదంతా లిఖిత పూర్వకంగా తెలియజేశాడు. ఇక వస్తున్నారందరూ. స్త్రీలంతా ఆనందంతో పాడుతున్నారు.

"రారె చూడగ పోదాము రాముల పెండ్లి
రారె చూడగ పోదాము రమణులందరు జేరి
మించి మగల్ కడనుంచి సిగ్గున తలవంచి
వశిష్ఠ రప్పించి ఖడ్గములు తెప్పించి
దూలాలపై గుప్పించి గుప్పించి
ఇప్పించి మెప్పించి రప్పించుట
రారె చూడగ పోదాము".

~~ఈ~~ మహాపవిత్రమైన సన్నివేశానికి అందరం వెడదాం. రండి' అని అడవారంతా బయలుదేరుతున్నారు. ఇంక మిథిలాపురం వారు మరొక రీతిగా పాడుకుంటున్నారు.

"కళ్యాణము చూతము రారండి
కౌసల్యతనయుని కల్యాణము
చూతము రారండి
పిల్లనగ్రోవులు, భేరిమృదంగము
రథములు గజములు తురగములేనట
వారివెంట వృద్ధ కౌశికుడు
కౌశికు వెంట వృద్ధ దశరథుడు
దశరథు వెంట మంత్రి సుమంతుడు
అత్యద్భుతముగా ఆనందముగా
అయోధ్య అంతయు కదలివచ్చెనట
కల్యాణము చూతము రారండి
అంబారిపై అరుగు తేజమట
ధగధగ మెరిసెడి దివ్యరాముడట
రామ అంకమున రమణి సీతయట
చిరునవ్వుల మన క్షేమ మడుగునట
కదలరె కదలరె బదులిక పలుకక
కల్యాణము చూతము రారండి".

నాల్గవదినమున దశరథ మహారాజు, సామంతులు రథములలో వచ్చి దిగారు. వివాహమునకు రంగం సిద్ధమైంది. వారు మహారాజులు కనుక, తలంబ్రాలు పోయటానికని ముత్యములను తెచ్చి తట్టలలో పెట్టుకున్నారు. భారతీయ సంస్కృతియందు ఇది ప్రధానమైన ఆచారము. సీత తలంబ్రాలు తీసుకొని దోసిలి పట్టినప్పుడు గోరింటాకు వలన తెల్లని ముత్యములన్నీ ఎఱ్ఱగా కనిపించాయి. వాటిని తీసి రాముని తలపై పోసింది. **రాముని తలపాగా తెల్లగా ఉండటం చేత ఆ ముత్యములు కూడా తెల్లగా కనిపించాయి. రాముని వర్ణము నీలవర్ణము. కనుక, అవి క్రింద పడేటప్పటికి నీలంగా మారిపోయినవి. చేతిలో తీసుకున్నప్పుడు ఎఱ్ఱగా, తలపై పోసినప్పుడు తెల్లగా క్రింద పడినప్పుడు నీలంగా మారుతూ వచ్చాయి ముత్యములు. ~~ఈ~~ కళ్యాణము జగత్కల్యాణముగా రూపొందింది. మంగళకరంగా జరిగింది.**

(శ్రీ.భ.ఉ.పు.55/57)

(చూ॥ కృష్ణుని లీలలు)

కవి

(చూ॥ పండితుడు, స్మరింతురు)

కశ్మలము

(చూ॥ మోహము)

కష్టము/కష్టములు

పాండవుల రణ్యములో నుండగా, కృష్ణుడొకప్పుడు వారిని చూచుటకు వెళ్ళెను. అప్పుడు ధర్మరాజు, తమకు కలిగిన కష్టములను, వాటి మూలమున తమ మనసుకు గలిగిన యాందోళనను చెప్పుకొని "కృష్ణా నీవు మాతో కొన్నిదినములుండుము అట్లయిననే నా చిత్తమున కింత శాంతి యేర్పడునని" ప్రార్థించెను. కృష్ణుడు చిరునవ్వు నవ్వి "బావా! నేనెక్కడ నున్నను, మీతో నున్నట్లే యనుకొనుము. కష్టసుఖములు మానవులకుగాక, మానులకు వచ్చునా? అధైర్య పడకుము, దీనిని

చూచుకొనుము. అదియే నీకు మనశ్శాంతి నియ్యగలదు" అని చెప్పి, చీటి వ్రాసి, సీలుకవరులో పెట్టి యిచ్చిపోయెను. ధర్మజుడా కవరును కన్నుల కద్దుకొని, దేవతార్చన పేటికలో నుంచుకొనెను. చీటిలో నున్నమాట ఒక్కటే. **"ఎల్లకాలమును ఉండబోదు"** అన్నమాట అందున్నది. 'వచ్చిన కష్టముగాని, సుఖముగాని మరలపోవునవే గాని, స్థిరముగా నుండునవి కా'దని భావము. ఆ రెంటిచేతను మనస్సును చెదరనియ్య గూడదని కృష్ణుడు చేసిన బోధ.

(త్వ. శ. మ. పు. 262)

కష్టం లేనిదే సుఖం రాదు. **"న సుఖాల్లభ్యతే సుఖమ్", సుఖం నుండి సుఖం రాదు. కష్టం ఫలిస్తేనే సుఖం అంటారు.** కష్టం లేకపోతే సుఖం విలువ తెలియదు. ఉదాహరణకి నువ్వు ఎయిర్ కండీషన్డ్ గదిలో కూర్చున్నావు. ఆ చల్లదనం విలువ నీకు ఎప్పుడు తెలుస్తుంది? కాస్త బయట ఎండలో చుట్టి వస్తేనే కదా! మరణ భయం లేకపోతే తల్లైనా బిడ్డను ప్రేమించదు. నారింజపండు పైనున్న చేదైన చర్మం లోపలున్న తీయని రసాన్ని రక్షిస్తోంది. అనగా ఇందులో మంచి, చెడ్డ రెండూ కలిసే ఉన్నాయి. కదా! అసలు ఒకప్పుడు సుఖాన్నిచ్చింది మరొకప్పుడు బాధనిస్తుంది. ఏదీ ఎప్పుడూ కేవలం సుఖాన్నే ఇవ్వదు, లేక కేవలం దుఃఖాన్నే కలిగించదు. ఉదాహరణకు, వులన్ కోటు శీతాకాలంలో సుఖం, ఎండాకాలంలో దుఃఖం. హీటరు శీతాకాలంలో సుఖం, ఎండాకాలంలో దుఃఖం. సుఖదుఃఖాలు దేశ కాల మాన ప్రభావాలపై ఆధారపడి యుంటాయి. నిజానికి సుఖంగాని, దుఃఖంగాని శాశ్వతంగా ఉండేవి కావు. Pleasure is an interval between two pains. కష్టకాలంలో కష్టాన్నే తల్చుకుంటూ ఉంటే అది ఇంకా అధికమవుతుంది. కష్టకాలంలో సుఖంగా ఉన్న రోజుల్ని తల్చుకోవాలి. భగవంతుడు పెట్టే పరీక్షలుగా కష్టాల్ని ఎదుర్కోవాలి. భక్తుడు అలాంటి టెస్టులకు స్వాగతం పలకాలి. పరీక్షలు పెట్టనిదే విద్యార్థి పైక్లాసుకు ఎలా పోగలడు? రోగికి టెస్టులు చేయకుండా డాక్టరు రోగాన్ని నిర్ధారించగలడా? బంగారం అందమైన నగగా తయారు కావాలంటే దానిని ఎంత కాల్చాలి?! దానికి ఎన్ని సుత్తి దెబ్బలు పడాలి?! చెరుకును పిప్పిగొట్టి రసమును తీసి బాగా కాచి సంస్కరించినప్పుడే పంచదార తయారౌతుంది. నీ కాళ్ళ క్రింద మన్నును త్రొక్కుతుంటావు, దానిపై నడుస్తుంటావు. అదే బంకమన్నును బాగా సంస్కరించి కుండగా తయారు చేస్తే దానిని నెత్తిన పెట్టుకుంటావు. మన్నుగా ఉన్నప్పుడు అది కాళ్లక్రింద ఉంది, కుండగా మారినప్పుడు శిరస్సుపైకి ఎక్కే స్థితిని పొందింది. ఎందువల్ల? **బాగా సంస్కరింపబడడంవల్ల.** కనుక కష్టాలకు వెఱువకూడదు. కష్టాలు వద్దనకూడదు. **కుంతీదేవి కూడా కష్టాలనే కోరుకుంది. "కృష్ణా! నీ సన్నిధానం, నీ చింతన కష్టకాలంలోనే ఎక్కువగా లభిస్తాయి. కనుక నాకు కష్టాలనే ప్రసాదించు"** అన్ని ప్రార్థించింది.

(స.సా. ఫి 98 పు. 55/56)

(చూ॥ ప్రేమనేర్పుకోసం)

కష్టము నిష్ఠూరములు

(చూ॥ నిర్గుణోపాసన)

కష్టసుఖములు

(చూ॥ నిర్గుణోపాసన, నేను)

కాంక్షయ

(చూ॥ ఆటంకములు)

కాంక్షించు

చాతకముగోరు యేవేళ చంద్రకాంతి
భక్తుడు చూచునెపుడు, భగవంత, చేర
రోగి కాంక్షించు నిత్యమ్ము రుచిరమందు
పర్తివాసుడు కాంక్షించు భక్తజనుల.

(అ శ పు. 6)

కాకులు

గద్ద ముక్కుతో చేపను కరుచుకున్నంతసేపూ కాకులు వెంటపడి వేధించుతవి. చివరికి ఆ గద్ద చేపను వదిలేస్తుంది. - అప్పుడు కాకులు గద్ద వెంట పడటం మానేసి దిగబడిపోతాయి - కాబట్టి విషయ సుఖాలు వదిలిపెట్టండి - గర్వం - అసూయ - ద్వేషం అనే కాకులు వెంటపడవు. వాటికి శవాల మాంసమే యిష్టం.

(త్వ. శ. మ. పు. 150)

కానుక/కానుకలు

అహంకారముతో కలుషితం కానటువంటి కానుకలు భగవంతుడు సంతోషంగా అందుకుంటాడు. గర్వంగా దర్పంగా ఇచ్చేకానుకలు ఆయన నిరాకరిస్తాడు. ఎంతో పరిమళం వెదజల్లే పుష్పాలు ఆయన పాదాలవద్ద నివేదించినప్పటికీ దుర్భర దుర్గంధ పూరితమైన చందంగా వాటిని తిరస్కరిస్తాడు.

(వ. 1963 పు. 54/55)

ఈ పుట్టిన రోజున స్వామికి ఇవ్వవలసిన కానుకను గురించి మీరాలోచించాలి. తోటి మానవులను ప్రేమించి వారి బాధలలో భాగం వహించి వారికి సేవలందించినప్పుడే స్వామికి మీరు సరియైన కానుక లిచ్చినట్లవుతుంది. నేను మీ నుండి దేనినీ ఆశించటం లేదు, అడగటం లేదు. ప్రేమను పెంచుకోండి. చాలమంది నాకు 'హ్యాపీ బర్త్‌డే' అని చెపుతున్నారు. నేను విచారంగా ఉన్న క్షణం లేదు; నాకు అనంతమైన ఆనందం ఉన్నది. కనుక, హ్యాపీగా లేనివారికి సంతోషాన్నివ్వండి. స్వామి సైన్యంలో మంచి ధీరులైన, సుశిక్షితులైన యోధులుగా మారి జయభేరి మ్రోగించండి. **రామకృష్ణాద్యవతార సమయంలో బ్రతికి యుండియు అవతార రహస్యాన్ని తెలియలేక, వారిని పూజించక జీవితాన్ని గడిపినవాళ్ళ కన్న మీ అదృష్టం ఎంతో గొప్పది. భగవంతుడనే భావంతో మీరు దర్శన స్పర్శన సంభాషణ అవకాశములను పోగొట్టుకొనకుండా ఆ భావంతోనే పూజిస్తున్నారు. కదా! అది మీ భాగ్య విశేషమే!**

(స.సా.న. 99 వెనుక కవరు)

ప్రేమ స్వరూపులారా! ఇది ఈ దేహం యొక్క పుట్టిన రోజేగాని, నాకు పుట్టిన రోజు లేదు. నేడు స్వామి మీకు అందించే సందేశం ఏమంటే, స్వామియే మీరు, మీరే స్వామి. స్వామి ప్రత్యేకంగా లేడు. మిమ్మల్ని ఇక్కడికి ఎవరు ఆహ్వానించారు? స్వామిపై వున్న ప్రేమచేతనే మీ రిక్కడకు వచ్చారు. మీకు, నాకు మధ్య గల ప్రేమచేతనే ఇన్ని వేలమంది ఇక్కడకు చేరారు. I am always ready. నేనెప్పుడూ సిద్ధంగానే ఉన్నాను, తీసుకొని పొండి. ఎవరు హృదయ పూర్వకంగా ప్రేమిస్తారో వారి సొత్తునే నేను. I want only love, నాకు కావలసింది ప్రేమ ఒక్కటే. కనుక, ప్రేమచేత జీవితాన్ని గడపండి, ప్రేమలో మీ జీవితాన్ని లీనం చేయండి. ఇదే మీరు స్వామికి ఇవ్వవలసిన కానుకగా భావించండి. ఎవ్వరినీ ద్వేషించకండి. ఎందుకంటే, ఎవరిని ద్వేషించినా దైవాన్ని ద్వేషించిన వారౌతారు. మంచిగాని, చెడ్డగాని మీ సర్వస్వమును దైవానికి అర్పించండి.

(స. సా. డి. 99 పు. 354)

కాన్సరు (Cancer)

ఈనాడు ఎక్కడ చూచినా (Cancer) అనే వ్యాధి ప్రబలంగా ఉంది. దీనికి కారణమును గుర్తించలేకున్నారు. దీనికి ఔషధమును కనిపెట్ట లేకున్నారు. **దీనికి ఔషధము లేకపోలేదు. అయితే దీనిని చెపితే హాస్యాస్పదంగా ఉంటుంది. మీ కందరికీ తెలుసు. మన ప్రధానమంత్రి రోజూ తన మూత్రమును తానే స్వీకరిస్తారు. ఇది Cancer కు సరియైన మందు. దినమునకు కొన్ని ఔన్సులు తీసుకుంటే వ్యాధి నివారణ అవుతుంది. అయితే కాన్సరు లేని వారు తీసుకోనక్కరలేదు. ఈ కాన్సరు వ్యాధికి మూలకారణము పొగాకు. ఈ పొగాకులో ఒక్కొక్క ఆకులో క్రింది భాగమున అంచులలో కాన్సరు పురుగు లుంటాయి.** పూర్వకాలములో మనవారు ఆ కాన్సరు పురుగులున్న భాగము తీసివేయటం చేత ఆ పురుగులు వేరు పర్చటం జరిగేది. కానీ ఈనాడు ఈ విధంగా

ఆకులను కత్తిరిస్తే, ఆకు విలువ తగ్గిపోతుందని అట్లా చేయడంలేదు. అందువలన కాన్సర్ క్రిములతోనే చుట్టలు,బీడీలు, సిగరెట్లు తయారవుతున్నవి. అవి త్రాగే వారికి, ముక్కుపొడి పీల్చేవారికి, త్వరగా గొంతులో, ఊపిరి తిత్తులలో కాన్సరువ్యాధి వచ్చే అవకాశములున్నాయి. ఇది మీరు చక్కగా గమనించాలి, మన ఆరోగ్యము కంటే, మనము ఆనందముగా జీవించడానికంటే, మనకు కావలసినదేమీ లేదు. మన జీవితమును సార్థకము చేయాలనుకుంటే తక్షణము యీ దురభ్యాసమును దూరం చేయాలి. ఈవిధంగా ఆహార విహారములను గురించి మీరు తెలుసుకుని అందరికి తెలపాలి.

(శ్రీస. ది. పు.96/97)

కామక్రోధ లోభములు

రామాయణంలో రావణుడెంత గొప్పవాడు! అరువది నాల్గు విద్యలను అభ్యసించాడు. కఠోర తపస్సును ఆచరించి దైవానుగ్రహాన్ని పొందాడు. అంతటి గొప్ప వ్యక్తి ఒక్క కామానికి లోనుకావడంచేత సర్వమును నాశనం గావించుకున్నాడు. ఇంక భాగవతంలో హిరణ్యకశిపుడు కూడా చాల గొప్పవాడే. అతడు పంచ భూతములను అదుపులో పెట్టుకున్నాడు. కానీ క్రోధాన్ని మాత్రం జయించలేక పోయాడు.

కోపము కలిగినవానికి
ఏ పనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్
పాపపు పనులను చేయుచు
ఛీ, పొమ్మనిపించుకొనుట చేకూరు సుమీ!
తన కలిమి భంగపుచ్చును
తనకుంగల గౌరవంబు దగ్ధము చేయున్
తనవారల కెడ సేయును
జనులకు కోపము వలన సర్వము చెడున్

ఇంక, భారతంలో దుర్యోధనుడు పరమ లోభి.
లోభివానిని చంప లోకంబు లోపల
కొట్టవద్దు, వానిని తిట్టవద్దు.
డబ్బు అడిగినంత దబ్బున తా చచ్చు..

ఇలాంటి లోభియైన దుర్యోధనుడు కడపటికి సాధించిన దేమిటి? కనుక కామ క్రోధ లోభములు మూడూ సాధకునకు పరమ శత్రువులు. **ఎన్నో సంవత్సరాలు చేసిన సాధన ఒక్కతూరి కోపం రావడంవల్ల నాశనమై పోతుంది.** విశ్వామిత్రుడు గొప్ప తపస్సంపన్నుడు, అనేక అస్త్ర శస్త్రములను సాధించినవాడు. అలాంటివాడు భగవద్భక్తుడైన వశిష్ఠులవారిపై క్రోధం పూనాడు. వశిష్ఠులవారు నిరంతరం బ్రహ్మతత్వాన్ని చింతించేవాడు కాబట్టి ఆయనకు 'బ్రహ్మర్షి' అనే బిరుదు వచ్చింది. విశ్వామిత్రుడు రజోగుణంతో కూడిన వాడు కనుక, అతనిని 'రాజర్షి' అన్నారు. విశ్వామిత్రుడు తాను కూడా బ్రహ్మర్షి అనిపించుకోవాలని పట్టుపట్టాడు. గొప్ప తపస్సు చేశాడు. కానీ వశిష్ఠుల వారిపై క్రోధం పూనటంచేత సర్వ శక్తులనూ కోల్పోయాడు.

(స.సా. ఏ. 99 పు. 99)

(చూ॥పురాణములు)

కామక్రోధాదులు

(చూ॥ ఏడుప్రాకారాల కోట)

కామధేనువు

(చూ॥ చింతామణి, మర్త్యుడు)

కామము

"కామమనే పిశాచము నశించగానే ప్రేమ అనే దేవత ఉద్భవించుతుంది. ఇదే విభూతి యొక్క విశిష్టత. పుట్టి నశించే ప్రతి పదార్థము యొక్క ఆఖరి దశ యీ బూడిద". "నీవు బూడిదలోనుండి వచ్చినావు తిరిగి బూడిదలో చేరుతున్నావు."

(శ్రీస. ది. లీ. పు. 22)

కామము-క్రోధము

కామమనగా లభించే అవకాశం దాని చిహ్నాములు కనిపించకున్ననూ, లేకపోయిననూ వస్తువులు కోరే ఆశను కామమందురు.

(గీ. పు. 108)

(చూ॥ త్యాగము, పురుషార్థము, మంచితనము, రక్కసి)

కామము - క్రోధము

కామశక్తియే అధికమీకాలమందు
వాని మిత్రుడు క్రోధుడు వారిరువురు
చేర్చుకొనునట్టి జనునకు చేటుకల్గు
సత్యమును చూపు బాట యీ సాయిమాట॥

(సా.పు. 220)

"చిత్రకూటపర్వతంమీద ఉన్నప్పుడు శూర్పణఖ రావటం లక్ష్మణుడు ముక్కు, చెవులు కోయటం, రావణునితో చెప్పి సీతను లంకకు తీసుకురావటానికి కారణం అయింది శూర్పణఖ. రామాయణంలో మంధర, శూర్పణఖ పేర్లు కొన్ని లైన్లలో మాత్రమే చూపినారు కాని అంతకంటె ఎక్కువ చెప్పలేదు. **ఇంత చిన్న శూర్పణఖ, మంధరల ద్వారానే రామాయణమంతా జరిగింది. అయోధ్యలో రాముడు అరణ్యానికి పోవటం, అరణ్యంలో సీత లంకను చేరటానికి ఈ శూర్పణఖ, మంధర కార్యకర్తలుగా ఉంటున్నారు. ఇంతకీ వీరెవరు? శూర్పణఖ కామము,మంధర క్రోధము. వీరిరువురే మన జీవితరామాయణానికి కారకులు. అయితే వీనిని జయించుట యెట్లా? అని నిరాశ పడనక్కరలేదు.**

నర్వవిధములైన వాంఛలు భగవద్భావంతో అనుభవించుటతో కొంత ఆనందం కలుగుతుంది. ప్రకృతిని విశ్వసించి పరమాత్మని వేరుచేసినపుడు ఆనందం అందుకోలేము. **కామత్యాగాన్ని రామాయణం మనకు నిరూపణ చేసింది.** సర్వసుఖములు త్యజించిన సీత, కామమును త్యాగము చేయుటచేత రామునితో పోవటానికి అవకాశం కలిగింది. తిరిగి త్యాగం కామంగా మారింది. మధ్యలో బంగారు లేడిపై కామం కలిగింది. అపుడు రాముడు దూరమైపోయినాడు. ఇట్టి పవిత్ర అంతరార్థాన్ని బోధించింది రామాయణం కాని, అది ఏదో FAMILY FIGHT కాదు. ఉపనిషత్తులు, రామాయణ, భారత భాగవతాలు పవిత్రమైన అంతరార్థాన్ని బోధిస్తున్నాయి.

(రా.ర.వా. మొ.భా. అంతరార్థము ముందరపుట)

కాయము

పాంచ భౌతికము దుర్బల కాయము
ఎప్పుడు విడిచేది ఎఱుకలేదు
శత వర్షముల దాక మితము చెప్పిరిగాని
నమ్మరాదా మాట నెమ్మనమున
బాల్యమందో మంచి ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
ఊరనో అడవినో ఉదక మధ్యంబునో
ఎక్కడో విడిచేది ఎఱుక లేదు"

(స. సా. ఏ. 99 పు. 98)

రాముడు,"ఓ తారా! ఎందులకు విలపింతువు? వీరపత్ని అయిన నీకు ఈ విలాపము కీర్తినందించదు. శాంతిని చేకూర్చదు. శరీరములనిత్యములు. ఇది నికృష్టము. **వాలియే ఈ కాయమును తుచ్ఛముగా భావించెను. ఏనాటికైననూ కాయములు కూలక తప్పదు, రాలక తప్పదు. పరమలక్ష్యము నిమిత్తము కాయము కాని లక్ష్యమును వీడిన కాయము, బొగ్గుతో సమానము,** పోనీ ఆత్మ నిమిత్తమని దుఃఖించు చున్నావా? ఆత్మ నిత్యమైనది దానికెట్టి పరిణామములు వుండవు. యెట్టివారికైననూ **ఆత్మతత్వము తెలియనంతవరకే కాయముపై భ్రాంతి. దేహ భ్రాంతి అజ్ఞానము, ఆత్మభ్రాంతి జ్ఞానము. మట్టిలో మాణిక్యము లభించినటుల, మాంసపు దేహములో దేహి నిమిత్తము దేహి రాడు.** క్షణభంగురమైన, మలినమైన, దుర్గంధములతో, మలమూత్రాదులతో నిండిన ఈ దేహము యెట్టివాడైననూ ఒకానొక దినము వీడక తప్పదు. ఆ కాయముతో సాధించునట్టి కార్యమే మానవత్వమునకు

శోభ నందించును. మీ రతి మహోన్నతకార్యములు చేసినను. పరిపాలనలో తాను. అనుచరులను, నమ్మినవారలను ప్రాణసమముగా చూచుకొనెను. రాక్షసులను **హత మార్చెను. దైవభక్తి మెండు. యెటుతిరిగీ తన సోదరునకు అపకారము చేసెను. అదొక్క పాపము తప్ప మరే పాపమును చేయలేదు. ఆ పాపమునకు తగినఫలముగా నా చేతులలో ప్రాణములు వీడెను.** కనుక, ఆ పాపము కూడా పరిహారమయినది. ఇక నీవు చింతించకూడదు'' అని అనేక విధముల తారకు జ్ఞానోదయమగునట్లు బోధించెను.

(రా. వా రెం భా పు. 81/83)

కారణము/కారణములు

కారణములు రెండు విధముల నుండును. అవియే **ఉపాదాన కారణము, నిమిత్తకారణము.**

ఉపాదానకారణము - ఇది వస్తువునకు పూర్వమే పూర్ణమైన ఆధారముగ నుండును. ఒక వెండి గిన్నె ఉన్నదనుకొనుడు. దీనిలో నున్న వెండి, గిన్నెకు పూర్వమే ఉన్నది. అదే ఉపాదాన కారణము. అనగా, గిన్నె అనగా, గిన్నె చేయుటకు ఆధారమైన వెండియే లేకున్న గిన్నె చేయలేరు. వెండిని వదలి, ఆగిన్నె ఉండలేదు. వెండిని, గిన్నెను, వేరు చేయుటకు వీలుకాదు. అంటే ఒక రూపమునకు పూర్వమే, ఆ రూపమునందున్న పదార్థము, ఆధారముగా నున్నది. రూపము కల్పితము; వెండి పూర్వ సిద్ధము. అయితే గిన్నెకు నిమిత్త మాత్రము, ఒక కంసాలి. గిన్నె తయారైన తరువాత నిమిత్త కారణమైన కంసాలిని వదలి, ఆ గిన్నె వేరై ఉండవచ్చు. కానీ, వెండిని వదలి వేరుగా నుండుటకు వీలుకాదుగదా!

అటులనే ఈ ప్రపంచమను పెద్ద పదార్థమును ఒక రూపముగ తయారు చేయుటకు, దీనికి ఆధారము భగవంతుడే. అతడే ఉపాదాన కారణము. దీనికి నిమిత్త కారణము కూడా భగవంతుడే. వెండిగిన్నెలో వెండి వ్యాపించియున్నట్లుగా, ప్రపంచమను ఈ భాండములో ఉపాదానకారణమైన భగవంతుడు వ్యాపించియున్నాడు. దీనికి నిమిత్త కారకుడు కూడా భగవంతుడే. సమస్త పదార్థముల యందు పరార్థము అంతర్లీనమై యుండును. పరార్థములేని పదార్థము ప్రపంచమున ఉండుటకు వీలులేదు. ప్రతి పదార్థమునకు ఒక పరార్థము ఉండియే తీరవలెను.

(సూ.వా. పు. 38/39)

వివిధ శాస్త్ర చయము వేద వేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చ లేవు
తెరకు యీవల జీవి దేవుడవ్వల నుండు
కార్యమివల ఆవల కారణంబు ॥

(సా. పు. 589)

నిజముగా దుఃఖమునకు కారణము జన్మ. జన్మకు కారణము కర్మ. కర్మకు కారణము రాగద్వేషములు. రాగద్వేషములకు కారణము పరిస్థితుల ప్రభావము. పరిస్థితుల ప్రభావమునకు కారణము బుద్ధి. బుద్ధికి కారణము ద్వైతము. ద్వైతమునకు కారణము అజ్ఞానము. కావున అజ్ఞానమే దుఃఖమునకు కారణము. దృష్టి ఎప్పుడైతే జ్ఞానమయమవుతుందో, అప్పుడు సృష్టి అంతా బ్రహ్మమయంగా గోచరిస్తుంది.

(శ్రీభ. ఉ. పు.12)

(చూ॥ జన్మ, జ్ఞాని, దివ్యప్రకటనలు, రోగము, సంపర్కము)

కార్యము

(చూ॥ తెలివితేటలు)

కార్యాచరణము

విప్లవాలతో మనం ఎట్టి కార్యమును సాధించలేదు. **ఈనాడు కావల్సింది కల్లోలం కాదు. కార్యాచరణ.** కల్లోలమునకు దారితీయక, కార్యమును సాధించడానికి ప్రయత్నించాలి. శాంతముతో శాశ్వత లాభమును పొందుతాం. సమాజమునకు నష్టం కలుగజేయటం అంటే, తనకు తాను నష్టం కలుగజేసికోవటమే. వేళ్ళు మనవి,

కార్మికులు

కన్నులు మనవి. ఏ వ్రేలుతో పొడుచుకున్నా మన కన్నులకే ముప్పు. **ఏదో కంపెనీ అని, ప్రభుత్వ ఆస్తి అని, అది మనదికాదనే భావంతో విధ్వంసానికి పూనుకుంటున్నారు కొందరు. నిజానికి అది అంతా మనదే. దానికి నష్టం కలిగితే మనకు నష్టం కలిగినట్లే. కనుక ప్రేమలో జీవించి, ప్రేమతో కార్యం చేసి, ప్రేమతో అన్యోన్య అనురాగములు పెంచుకొని మానవత్వాన్ని అభివృద్ధి పరుచుకోవాలి. ప్రేమతో మానవత్వం దైవత్వముగా మారిపోతుంది. ప్రేమ ఉన్నచోట ద్వేషమునకు అవకాశమే ఉండదు.**

(శ్రీ. డి. 2001 పు. 26)

కార్మికులు

ప్రేమొక్కటే భగవంతుని అనుగ్రహమును పొందుటకు ఉత్తమ మార్గము. నీ స్వంత సోదరీ సోదరులను నీవెట్లు దగ్గరకు చేర్చుకొనెదవో ప్రతివారిని అట్లే చేరదీసి వారియెడల శ్రద్ధా బాధ్యతలను వహింపుము. **నిజముగా కార్మికుని జీవితము చాలా విలువైనది, ప్రధానమైనది.** కర్మభక్తి జ్ఞానములు భగవంతుని చేర్చునట్టి మార్గమున మూడు ఘట్టములు. చిత్తశుద్ధితో, పరులయెడల గౌరవముతో, భక్తితో చేసిన కర్మ ప్రధానమైనది. **శరీరము, మనస్సు ఎంత సన్నిహితముగా నుండునో యజమాని కార్మికుడు అంత సన్నిహితముగా నుండవలెను. యజమాని హృదయము, కార్మికుడు శరీరము వంటివాడు. శరీరము లేక హృదయము, హృదయము లేక శరీరము ఉండజాలవు. రెండూ ఒకదాని కొకటి అవసరము. యజమాని సేవకుల సంబంధము తండ్రి బిడ్డల సంబంధము వంటిదిగా నుండవలెను.** అటువంటి ఆదరానురాగము సహజముగా వుండి, భ్రాతృత్వ వాతావరణముతో కార్మికులు పనిచేసిన పరస్పర సహాయ సహకారములతో పరిశ్రమ వృద్ధిగాంచును. యజమాని సేవకులూ అన్యోన్య భావముతో శాంతి సంతోషములు పొందగలరు.

"ఈ సాంఘిక సంక్షేమ భవనాన్ని ఇప్పుడే ప్రారంభించితిని. మీరందరు నెలకొక పర్యాయము, అంతకంటే తరచుగా, పక్షమునకో, వారమునకో, ఒకసారి మీరందరు యిక్కడ సత్సంగము కొరకు కాని, భజన కొరకు కాని, ఆధ్యాత్మిక కార్యకలాపముల కొరకు కాని, సమావేశము కావలెనని నాఅభిమతము. కార్మికుల బిడ్డల కిక్కడే ఒక పాఠశాలను ఏర్పాటు చేసి క్రమశిక్షణ, భగవద్భక్తి, సచ్ఛీలసంపద వారిలో అభివృద్ధి అగునట్లు చూడ గోరుచున్నాను. క్రమశిక్షణ మానవుని ప్రతి ప్రయత్నమందును అత్యంత అవసరమైన పరికరము. క్రమశిక్షణతో మెలగినప్పుడే మానవుడేయైన సాధించి జీవితము సార్థకము చేసుకొనగలుగును."

(స. శి. సు. తృ. పు.156)

కాలము

కాలము వృధా చేయకు. ఉదయం వస్తుంది. మానవునకు ఆశ పెరుగుతుంది. సాయంకాలము వస్తుంది. కోరికలు బంధిస్తాయి. జీవితము అంటే యిదేనా? యిదేనా నీ లక్ష్యం? ఇట్లా ఒక రోజు గడిచిందంటే ఆ రోజు వృధా అయిందన్నమాట. మృత్యువునకు ఒక రోజు సమీపం అవుతుంది. ఎప్పుడైనా యీ విషయం గురించి ఆలోచించావా? ఒక రోజు వృధా అయినదని పశ్చాత్తాపపడతావా?"

(సా॥ పు. 20)

కాలమను సర్పము కబళించను దేహమను పాదలో పొంచియుండగా నీవు కన్నులు మూసుకొని కాలమును మ్రింగ తలంచుచున్నావు. కాలమును మ్రింగినవారు ఈ లోకమున యెవ్వరూ లేరు. కాలమే అందరినీ **మ్రింగుచున్నది.** అది తెలుసుకొలేక అజ్ఞానమున మునిగి అర్థకామములతో అలమటించుచున్నావు. **వశు జీవితమును** గడుపుచున్నావు. **మానవ జీవితమును వ్యర్థము చేయుచున్నావు. సార్థకము చేసుకొనుటకు ప్రయత్నించు కాలము మించలేదు. ఇకనైననూ ఇల్లువిడచి, ఇహమును మరచి, పరమును స్మరించుట, తరించు,** పరుల పంచలపడి ప్రాణమును విడువక పరమాత్మ చింతనతో ప్రాణముల విడచుట పరమ పవిత్రము.

(భా వా పు.38/39)

ఈశ్వరునకు ఒక చేతి యందు డమరుకము, రెండవచేతియందు శూలము, విష్ణువునకు ఒకచేతియందు శంఖము. రెండవ చేతిలో చక్రము. శంఖము అనగా శబ్దము. చక్రమనగా కాలమును. **అనగా శబ్దమును. కాలమును చేతిలో ఉంచుకొన్నారు.** శంకరులు-డమరుకమునకు శబ్దము. త్రిశూలమునకు త్రికాలములు. రెండూఒకటే. రూప, నామములందు భేదమే కాని శక్తిఒకటే. **వేదము, ఖురాను Bibleఅద్వైతం బోధించినది. "ఈశ్వర స్సర్వ భూతానాం" 'ఈశా వాస్య, మిదం సర్వం' వాసుదేవ స్సర్వ మిదమ్' అని వేదము బోధించినది. Bible - All life is my love dear son. Be alike with every one."**

(వే. ప్ర. పు. 105/106)

దివ్యాత్మస్వరూపులారా: ఈ యుగస్వరూపుడైన కాలాన్ని మనం వ్యర్థము చెయ్యకూడదు. సంవత్సర స్వరూపుడైన కాలాన్ని వ్యర్థము చెయ్య కూడదు. **కా+ల=కాల. "క" అనగా శుభము, సుఖము. "ల" అనగా అందించే టటువంటిది. సర్వ శుభములను అందించేటటువంటిదే కాలము. కాలము కాయాన్ని మ్రింగుతుంది. కాలుడు కాలాన్నే మ్రింగుతాడు.** కనుక భగవత్ స్వరూపమైన కాలాన్ని మనము అలక్ష్యము చెయ్యరాదు.

ఈనాడు 24 గంటల లోపల అధిక కాలమును వ్యర్థము చేస్తున్నారు. కాలమును వ్యర్థము చెయ్యక **కాలమును సార్థకము చేసుకోవాలి. విరామకాలములో భగవన్నామ స్మరణ చెయ్యి. ఈ కలియుగములో నామ స్మరణకు మించినది మరియొకటి లేదు. నీ చేతులతో కర్మలు చేస్తు, నామ స్మరణ చెయ్.** ప్రాపంచిక సంబంధమైనవి తలలో చేర్చుకోనక్కరలేదు. **Hands in the Society, Head in the forest. That is the real rest.**

(స.సా. మే. 89 పు. 119)

"తస్మాత్ సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్యచ,
మయ్యర్పిత మనోబుద్ధి ర్మామే వైష్య స్యసంశయః"

'అర్జునా! ఎల్లకాలము నన్ను స్మరించు, నీ మనోబుద్ధులు నాకు అర్పితము గావించి, నీ స్వధర్మమయిన యుద్ధమును నీవు ఆచరించు. తప్పక నన్ను పొందగలవు. ఇందులో సంశయములేదు' అని కృష్ణుడు అర్జునునికి బోధించాడు. **ప్రపంచములోగల విలువైన వస్తువులన్నింటిలో కాలము చాల విలువైనది.** ఇట్టి విలువైన కాలమును యే విధముగా వుపయోగించుకుంటున్నామో ఎవరికి వారు యోచించు కోవచ్చు.

'కాలకాలప్రపన్నానాం కాలః కిం కరిష్యతి' - కాలమును కూడ మ్రింగే దైవత్వానికి కాలరూపమైన కాయమును కర్తవ్యరూపములో కర్మలద్వారా సార్థకము గావించు కోవటమే మానవుని ప్రధానకర్తవ్యము. గడచిపోయిన కాలమును యేమాత్రము వెనుకకు మరల్చలేము. కోల్పోయిన ఆరోగ్యమునైన ధనమును వ్యయము చేసయినా ఒక విధముగా సంపాదించుకొనవచ్చును. కాని గడపుకొన్న కాలమును యేమాత్రము ముందుకు తెచ్చుకొనటానికి వీలుకాదు. ఇటువంటి పవిత్రమైన విలువైన కాలమును సద్వినియోగ పరచుకొనుటకై తగిన కృషి చేయాలి.

(శ్రీస. గీ. పు. 110)

పాము నోటబడ్డ కప్ప పురుగులను తిన యత్నించును. కప్పను పట్టిన పామును నెమలి తిన యత్నించును. నెమలిని వేటగాడు పట్ట యత్నించును. ఇట్లే లోకమున ఒకరి నొకరు మ్రింగడానికి యత్నించుచున్నారేగాని కాలము తమను మ్రింగుచున్నదని తెలుసుకోవడం లేదు.

(స.సా.ఆ. 98 పు. 218)

ఈ దేశంలో దేనికి కొరత లేదు. ఈ దేశంలో లేనిది ప్రపంచంలోనే లేదు. పూర్వం విదేశీయులు ఇక్కడి సిరిసంపదలచేత ఆకర్షితులై ఈ దేశంపై దండయాత్రలు చేసినట్లు చరిత్ర చెపుతున్నది. కాని, **ఈనాడు ఈ దేశంలో కాలాన్ని వృధా చేసే సోమరులు అధికమైపోయారు. జీతానికి తగిన పని చేసేవారు చాల అరుదుగా ఉన్నారు. అనేకమంది వేలకు వేలు జీతాలు తీసుకుంటూ పని మాత్రం చాల తక్కువ చేస్తున్నారు. ఇది దేశ ద్రోహం.** కాలం దైవస్వరూపం. నిన్ను కాలం అనుసరించదు. నీవే కాలాన్ని అనుసరించాలి. దైవాన్ని "కాలాయనమః

కాలస్వరూపుడు

కాలకాలాయనమః కాలాతీతాయనమః కాలదర్పదమనాయనమః'' అని వర్ణించారు. కనుక, **కాలమును వృధా చేయడం దైవద్రోహమన్నమాట. కాలాన్ని సద్వినియోగపర్చుకోవాలి. చెడు చూడకూడదు, మంచినే చూడాలి. చెడు వినకూడదు. మంచినే వినాలి. చెడు తలంచకూడదు, మంచినే తలంచాలి. చెడు చేయకూడదు, మంచినే చేయాలి. మంచి చూపులు, మంచి మాటలు, మంచి చేతలు, మంచి ఆలోచనలు - వీటివల్లనే కాలం సద్వినియోగమవుతుంది.** కండలు కరిగేటట్లుగా పని చేస్తే పండ్లు అరిగేటట్లుగా తినవచ్చు. కాని, ఈనాటి యువకులు "తిండికి తయార్, పనికి పరార్'' అన్నట్లుగా ఉన్నారు. ఇలాంటి సోమరిపోతులు సాధించేది ఏమీ లేదు. నిజానికి రెండు చేతులతో పని చేస్తే ఒక్క పొట్ట నింపుకోలేరా? ఫొటో గ్రాఫర్ ఏమి చేస్తాడు? కెమెరాను చక్కగా సిద్ధం చేసుకుని మిమ్మల్ని 'రెడీ'గా ఉండమని చెప్పి మీ ఫొటో తీస్తాడు. కాని, **కాలుడు మీకు Be ready (సిద్ధంగా ఉండు) అని చెప్పడు. అకస్మాత్తుగా తీసుకుపోతాడు. అందువల్ల, మృత్యువుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉండాలి. ఉన్న కాలాన్ని సద్వినియోగపర్చుకోవాలి.** భగవంతుని సృష్టిని గమనించండి. సూర్యచంద్రాదులు, నక్షత్రాలు, వృక్షసంపద, నదీనదములు మున్నగునవన్నీ కాలాన్ని అనుసరించి తమ కర్తవ్యాన్ని నిర్వర్తించి, మానవాళికి ఆదర్శాన్ని అందిస్తున్నాయి. కనుకనే, **Nature is the best teacher (ప్రకృతియే పరమ గురువు)** అన్నారు. మీకు ఆదివారం సెలవుందిగాని, స్వామికి ఒక్క సెలవు దినము కూడా లేదు. ఎన్నో వేల ఉత్తరాలు వస్తుంటాయి. అన్నింటినీ చదువుతాను. అన్ని పనులు నేనే స్వయంగా చూసుకుంటాను. హాస్పిటల్, యూనివర్సిటీ, వాటర్ ప్రాజెక్ట్, ఆశ్రమ నిర్వహణ, అధికారులు, అసంఖ్యాకమైన భక్తులు, ప్రపంచవ్యాప్తమైన సాయిసంస్థలు అన్నింటినీ నేనే చూసుకుంటాను. స్వామికి విరామము, విశ్రాంతి అనేవి లేవు. మీ అందరి ఆనందమే నాకు ఆనందము. **జనులకు ఆదర్శాన్ని అందించే నిమిత్తమే ఈ అవతారం వచ్చినది. కనుక, కాలాన్ని వృధా చేయక కర్మ ద్వారా ధర్మమును పోషించుకుని జన్మను సార్థకం చేసుకోండి.**

(స.సా.నం. 99 పు. 343)

(చూ॥ కర్తవ్యధర్మము)

కాలస్వరూపుడు

ఈశ్వరుడు కాలస్వరూపుడు. అందుకే 'కాలాయ నమః, కాలస్వరూపాయ నమః, కాల గర్భాయనమః, కాలాతీతాయనమః 'అంటూ ఋషులు వర్ణించేరు. జననం, జీవనం, మరణం - ఇవి కాలంలోనే ఇమిడివున్నాయి. అందుచేత కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **Time wasted is life wasted**. కాలముయొక్క గమనం, వేగం తెలుసుకోడానికి మీరు చేతికి వాచ్ పెట్టుకుంటారు. కాలాన్ని ఏవిధంగాపవిత్రం చేసుకోవాలో కూడా వాచీయే చెబుతుంది.

W : Watch Your Word
A : Watch Your Action
T : Watch Your Thoughts
C : Watch Your Character
H : Watch Your Heart

మీరు 'టైమ్ తెలుసుకోటానికి వాచ్‌కేసి చూసినప్పుడల్లా ఈ పంచాక్షరీ సందేశాన్ని గుర్తుచేసుకుంటూవుండండి. పశుపక్షి మృగాలవలే ఆహార నిద్రాభయమైథునాదులకే మీ జీవితాలను అంకితం చేస్తూ కాలాన్ని దుర్వినియోగం చెయ్యకుండా దివ్యమైన మీ నిజతత్వాన్ని గ్రహించి మీ జీవిత పరమావధి సాధించే ప్రయత్నంలో కాలాన్ని పవిత్రంగా వినియోగించండి. సత్సంభాషణతో, సత్కర్మలతో, సదాలోచనలతో, సచ్ఛీలముతో, విశాల హృదయంతో పరమాత్మ స్వరూపమైన కాలాన్ని పవిత్రం కావిస్తూ మీ జీవితాల్ని సార్థకం చేసుకోండి.

(శ్రీస. వా. పు.45/46)

(చూ॥ నాల్గుయుగాలు)

కాలుడు

(చూ॥ మృత్యువు)

కాలేజి

"కాలేజీలంటే ఇటుక, సున్నముతో కట్టిన భవనములు కావు. తరగతులు నిర్వహింపబడే పెద్ద పెద్ద భవనాలను చూచి వాటిని అంచనా వేయకూడదు. ఆ తరగతులలో చదువుకునే విద్యార్థుల యొక్క శీలము, సమాజమునకు వారు ఉపయోగపడే తీరు, ఆటస్థలము లలోను, బయట వారియొక్క ప్రవర్తన, తల్లితండ్రులు, పెద్దలు ఉపాధ్యాయుల యెడ వారికి గల గౌరవభావము, కాలేజీ చదువు పూర్తయిన తరువాత జీవితంలో వారు ఆచరించే ఆదర్శములను బట్టి కాలేజీలకు విలువ కట్టాలి."

(దై. మా. పు. 318)

కాళింగుడు

మీ మానస సరోవరములో వాంఛ అనే కాళింగుడు నివసిస్తున్నప్పుడు, పైపై ఈత పనికిరాదు. బుద్ధియొక్క సహాయముతో జీవి దానిలో దుముకవలెను. దానిని పట్టి పైకితీసి, కాళ్లక్రిందపెట్టి త్రొక్కవలయును. ఒక పడగ తరువాత మరొకటిని తృంచవలయును.

(సు. పు. 11)

కాళీయమర్దనము

ఆ కాళింది మడుగు ఎక్కడో లేదు. మీమనసే మడుగు! ఆమడుగులో ఆరుతలల పాముంటుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద,మాత్సర్యాలు అరూ ఆ పాము పడగలు. మీరు చేసే భగవన్నామమే మనసనేమడుగు అడుగున ఎక్కడో దాక్కున్న ఆ పామును బయటికి లాగి భంగపరచే బాలకృష్ణుడు!

కృష్ణుడు కాళీయునిపై కెక్కిపడగల పై నాట్యం చేశాడు. అప్పుడు కాళీయుని గర్వం నశించింది. మీలోని పరమాత్మను కూడ కామక్రోధాదుల పడగలపై కెక్కి, ఆడమని వేడండి! అప్పుడు గాని, ఆ పాముతన విషాన్ని కక్కి వేసి, సాత్విక మై కూచోదు.

(శ్రీ.సా.గీ.పు.99)

కావడికుండలు

జీవితంలో కష్టసుఖాలు కావడికుండల్లా వుంటాయి. ఒకటి లేక మరొకటి వుండదు. సంతోషానికీ, సంతోషానికీ మధ్య విచారం, విచారానికీ, విచారానికీ, మధ్య సంబరం. గులాబీ వెంటనే ముల్లుంటుంది. సాధకుడు ముల్లు తగలకుండా గులాబీని కోసుకోవాలి. తేనిటీగలు కుట్టకుండా తేనె తీసుకోవాలి. అడ్డంకులకు భయపడి నీదారి నుండి తొలగరాదు. సాహసంతో ముందుకు సాగు.

(శ్రీ.సా.గీ.పు. 73/74)

కాశీ

(చూ॥ రాముని జన్మస్థానము)

కాషాయి వస్త్రము

ఒకసారి కరణం సుబ్బమ్మగారి ఇంట్లో నేనుండగా, అప్పుడు నాకు 12వ సంవత్సరం. అప్పుడు నేను 'నాకు ఒక పొడుగాటి గౌను కుట్టించు' అని అడిగాను. ఆమెకు కూడా ఇష్టంలేదు. **'స్వామీ, మీరు పంచకట్టుకోండి. గౌను ఎందుకు వేసుకుంటారు'?** అన్నది. లేదు, లేదు. సమయం వచ్చింది అన్నాను. స్వామి మాటకు ఎందుకు అడ్డు చెప్పాలని ఒక గౌను కుట్టించుకొని వచ్చింది. అప్పుడు రెండు అణాలకు ఒక గౌను వచ్చేది. కుట్టేవానికి ఒక బొట్టు యివ్వాలి. రెండు అణాల ఒక బొట్టుకు ఒక గౌను తయారైంది. అది నేవేసుకున్న తక్షణమే ఈశ్వరమ్మకు కబురుపెట్టింది. ఆమె నన్ను చూచి కంటినీరు పెట్టింది. 'ఏమి స్వామి! ఈ రూపాన్ని చూడటానికే నన్ను యిక్కడకు

కాస్మిక్ డివైన్

పిలిపించింది' అని అడిగింది. చాలు. చాలు... '**ఈ జగత్తునకంతా ఆదర్శమైన దానిని అందిస్తున్నాను. కాషాయివస్త్రము కట్టినప్పుడు కషాయము బుద్ధులంతా పోతుంటాయి' అని ఈ విధంగా బోధించాను.**

(శ్రీ.డి. 2001 పు. 32)

కాస్మిక్‌డివైన్

(చూ॥ హంసగాయత్రి)

కీర్తనము

(చూ॥ సంతృప్తి)

కీర్తి

ఈ కాయం శాశ్వతం కాదు. మనం చేసే సర్వ కర్మల యందు ఫలితం కూడా శాశ్వతం కాదు. అన్నీ కదిలిపోయే మేఘములే ఇలాంటి కదలిపోయే మేఘముల నిమిత్తమై మనం ఎందుకు ఇంత శ్రమ పడటం? నిత్యసత్యమై నటువంటి దైవత్వానికి ప్రాకులాడటంలేదు. ఈనాడు భుక్తికోసం చదివే చదువులు చాలా శ్రద్దగా చదువుతున్నారు కాని ముక్తికోసం చదివే చదువుల మీద శ్రద్ధ చూపటంలేదు ఈనాటి చదువులు లోక సంబధమైన మర్యాదలను, స్థానాన్ని గౌరవాన్ని అందించ వచ్చును. కాని **ఈ ప్రాకృతమైన జీవితంలో కూడా మనం నిలబెట్టుకోవలసినవి రెండే రెండు. 1) సత్యం, 2) కీర్తి.**

(శ్రీ. అ. 96 పు. 31)

(చూ॥ అస్థిరము)

కీళ్ళవాతము

వయస్సు మళ్ళిన శరీరాలలో ఇడ్లీలోని మినపపదార్థం కీళ్లవాతాన్ని పెంచుతుంది.

(శ్రీ.స. ప్రే. ప్ర. పు. 250)

కుంకుమ పూజ

ఈ లోకములో మానవులు స్వార్థ స్వప్రయోజనాలతో, ప్రేమరహితులై ప్రవర్తించే సమయంలో ఈ శక్తి స్వరూపిణియైన ఆత్మతత్వము రజోగుణమును ధరించి దుర్గుణాలను నాశనం చేసింది. ఇదియే "దసరా" పండుగ యొక్క అంతరార్థము. ఈ విధముగా దుర్గుణాలను నిర్మూలించినప్పుడు దేవి మహా రౌద్రాకారమును ధరించింది. ఈ దేవి యొక్క ఉద్రేకాన్ని చల్లార్చే నిమిత్తమై ఆమె సంతతి వారైన స్త్రీలందరూ ఎఱ్ఱ కుంకమతో అర్చనలు గావించారు. దీని అంతరార్థమేమనగా - ఆ తల్లి ఈ రక్త వర్ణంతో కూడిన కుంకుమను చూచి దుర్మార్గులందరూ అణగిపోయారని తలంచి, శాంత పడుతుందట. కనుక, ఈ కుంకుమపూజ దేవి యొక్క రౌద్రాన్ని చల్లార్చే నిమిత్తమై జరుపబడుతుందని దీనికి అర్థము.

(స.సా. న. 91 పు. 306)

కుంతీదేవి

ఒకానొక సమయంలో కుంతీదేవి తనకు జీవితమంతా కష్టాలనే ప్రసాదించమని కృష్ణుణ్ణి ప్రార్థించింది. "కృష్ణా! కష్టాల్లోనే నిన్ను స్మరించడానికి వీలౌతుంది. పాండురాజు జీవించియున్నప్పుడు, సుఖసంతోషాలను అనుభవిస్తున్నప్పుడు నేను ఏనాడూ నిన్ను స్మరించలేదు. పాండురాజు గతించిన తరువాత కష్టసమయమందే నిన్ను అనేక పర్యాయములు స్మరిస్తూ వచ్చాను. **కాబట్టి, కష్టములే నాకు మంచివనిపిస్తోంది. నేను ఎన్ని కష్టములనైనా అనుభవించానికి సిద్ధమే. కాని, నీ ప్రేమ మాత్రం కించిత్తైనా చలించకూడదు.** నిన్ను మరువని భక్తిని, కష్టాలను అనుభవించే శక్తిని నాకు ప్రసాదించు" అని కోరింది. ఆమె తన ప్రాణమంతా కృష్ణునిపైనే పెట్టుకొంది. పాండవులు అనుభవించిన కష్టాలు ఎవ్వరూ అనుభవించలేదు. కనుకనే, వారు నిరంతరము దైవసన్నిధిలో నిలువగల్గారు.

(స. సా. ఫి. 2000 పు. 43)

(చూ॥ భక్తుని లక్షణం)

కుంభకము

(చూ॥ ప్రాణాయామం)

కుక్క/కుక్కలు

ఒకసారి రాముని దగ్గరకు ఒక కుక్క ఏడుస్తూ వచ్చింది. దాని ఒంటి నిండా దెబ్బలున్నాయి. వాటివల్ల దానికి రక్తం కారుతున్నది. రాముడు లక్ష్మణుని పంపి అది ఆవిధంగా ఎందుకున్నదో విచారణ చెయ్యమన్నాడు. ఒక బ్రాహ్మణుడు కర్రతో దానిని ఆవిధంగా కొట్టాడని తెలిసింది. అతనిని పిలిచి అడిగితే ఆకుక్క తనదారికి అడ్డంగా వచ్చినందువల్ల కొట్టానని చెప్పాడు. అప్పుడు రాముడు "ఆ బ్రాహ్మణుణ్ణి ఏవిధంగా శిక్షించమంటావు?" అని ఆ కుక్కను అడిగాడు. అప్పుడా కుక్క అతనిని ఒక దేవాలయం మేనేజరుగా నియమించమని అన్నది. "అది బహుమానము కాని శిక్ష ఎలా అవుతుంది?" అన్నాడు రాముడు.అప్పుడా కుక్క రామునితో **"నేనిది వరకు ఒక దేవాలయం మేనేజరునే. ఆ దేవుని డబ్బు తినటం వల్ల కుక్కగా పుట్టాను. కుక్కగా పుట్టటం వల్ల అందరూ కొడుతున్నారు.** అతనిని కూడా దేవాలయం మేనేజరుని చేస్తే అతడు దేవుని డబ్బు తిని తరువాత కుక్క జన్మ ఎత్తుతాడు. అప్పుడు అందరూ దానిని కొడతారు" అని చెప్పింది.

కేవలం ఆ కుక్క, బ్రాహ్మణుడే కాదు, ప్రతివ్యక్తి దేవుని డబ్బు తింటున్నవారే. లోకంలోని సమస్తము భగవంతునికి చెందినదే కదా! భగవంతుని డబ్బువాడుకొని మీరు లాభం పొందుతున్నందుకు ప్రతిగా మీరు భగవంతునికి ఏమిస్తున్నారు? ఊరకనే కూర్చొని తినకూడదు. కనీసం కొంత శారీరకంగానైనా భగవంతునికి సేవ చేయవద్దా? పనిచేయకుండా తినేవాడు మోసగాడు. భగవంతునికి మీరుచేసే సేవ ఎంతమాత్రమూ అక్కరలేదు. కాని అది మీ హృదయాన్ని పవిత్రం చేస్తుంది. అందువల్ల ఊరకనే దేనినీ తీసికొనవద్దని బోధించండి. వారికి కావలసినది కష్టపడి సంపాదించుకోనివ్వండి.

(స.వ. 61-62 పు.188/189)

కుంభకము

తెలుగులో ఒక సామెత ఉన్నది! దుష్టుడు తప్పులు వెతుకుతాడు, కుక్క చెప్పులు వెతుకుతుంది అని. కుక్క ఎల్లప్పుడూ చెప్పులనే వెతుకుతుంది. దుష్టుడు ఎల్లప్పుడూ పరుల తప్పులనే వెతుకుతుంటాడు. కనుక దుష్టునికి, కుక్కకు ఎట్టి వ్యత్యాసములేదు. అలాంటి వారు కుక్కలతో సమానం. "మనం డాగ్ కాకూడదు గాడ్‌కావాలి."

(శ్రీ.సా.గీ.పు.241)

(చూ॥ అలర్కుడు, దుష్టులు, శ్రీమంతులు)

కుటుంబములు

రెండు రకములైన కుటుంబాలుంటున్నాయి. న్యూక్లియర్ కుటుంబమని ఒకటి, సమూహమనే కుటుంబ మొకటి ఉంటుండాది. ఈ న్యూక్లియర్ కుటుంబములో అమ్మ, నాన్న, బిడ్డ, కొడుకు అంతే. ఈ న్యూక్లియర్ కుటుంబము చాలా నారో. (Narrow) సామూహిక కుటుంబము తల్లి తండ్రి బిడ్డ కొడుకు తాత అవ్వ ముత్తాత వీరందరు చేరినటువంటిది. ఈనాడు ఏమైపోతుండాది? న్యూక్లియర్ కుటుంబము లోపల అమ్మ నాన్నలు ఆఫీసుకు పోతారు. బిడ్డలను ఆయా దగ్గరో డ్రైవరు దగ్గర్నో ఫ్యూన్ దగ్గర్నో విడిచిపెడ్తారు. ఈ పిల్లలకంతా ఆయా బుద్దులు డ్రైవర్ బుద్దులు ఫ్యూన్ బుద్దులు వస్తుంటాయి. వీళ్ళ దమ్మిడీకి పనికిరాకుండా పోతున్నారు. ఏదో డబ్బులిచ్చేసి చదివిస్తుంటారు. వీడు ఏం చేస్తున్నాడు? ఎక్కడ పోతున్నాడు? ఎట్ల పెరుగుతున్నాడు? అనే విచారం తల్లిదండ్రుల కేమాత్రం పట్టటం లేదు. ఈ సామూహిక కుటుంబము లోపల ఎట్ల ఉంటాదంటే అమ్మానాన్నలు ఆఫీసుకు పోయినాగాని అవ్వాతాతలు ఇంటిలో ఉంటారు. ఈ తాతలు అవ్వలు వాళ్ళకు మంచినంతా బోధిస్తూ ఏవో కథలు చెప్పుకుంటూ సరైన అభివృద్ధికి తగిన ఉపదేశాలు చేస్తుంటారు. ఒకవేళ అమ్మానాన్నలు పోట్లాడితే న్యూక్లియర్ కుటంబములో వాళ్ళకు దిక్కు లేరు. ఎవరు చెప్పేవారుకూడా ఉండరు. ఈ సామూహిక కుటుంబములో ఏమౌతుంది? వాళ్ళ అత్తమామలుంటారు. లేక తల్లిదండ్రులుంటారు. వాళ్ళు వస్తారు. ఏమిట్రా నాయనా

కురుక్షేత్ర యుద్ధము

ఇట్ల చేస్తున్నావు? ఇది మంచిది కాదు, ఇట్ల చెయ్యకూడదు. అని బుద్ధులు చెప్తుంటారు. ఈనాడు జాయింటు ఫామిలీ పూర్తి పతనమైపోయింది. తమ ఫామిలీనే పతనం చేసుకుంటున్నటువంటి వాళ్ళు ఇంక ప్రపంచం యొక్క విశాలమైన బుద్ధి వాళ్ళకెక్కడనుండి వస్తుంది? తల్లిదండ్రులనే లెక్క చెయ్యటంలేదు. ఇంక 'లోకాస్సమస్తా స్సుఖినో భవంతు' కేవలం గాలివార్తలు. మొట్టమొదట మనము **ఈ న్యూక్లియర్ కుటుంబమును విశాలం చెయ్యాలి. జాయింట్ ఫామిలీగా ఉండాలి.** ఈ జాయింట్ ఫామిలీ లోపల ఎంతనో మనకు అభివృద్ధి ఉంటుండాది. ఎంతనో ఉత్తమమైన మార్గాలున్నాయి. ఎంతనో ఉత్తమమైన బుద్ధులు అభివృద్ధి ఔతాయి. ఈ జాయింట్ ఫామిలీ గౌరవమర్యాదలకు పాటుపడుతూ వచ్చింది ఆనాడు. ఈనాడు న్యూక్లియర్ ఫామిలీ ఏమీ ప్రయోజనం లేదు. కేవలము ఆడంబరాలు, 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్‌స్టార్, హౌ ఐ వండర్ వాట్యూ ఆర్'' ఇది మనం చూపిస్తుండేది. ఈ వేషాలచేత జగత్తునంతా మోసం చేస్తున్నారు. ఇది కాదు మనం నేర్చవలసినది. మన సమాజమును మనం చక్కబరచుకోవాలి. మనదేశాన్ని మనం చక్కబరచుకోవాలి. మన కుటుంబాన్ని మనం చక్క బరచుకోవాలి. ఎవరికి వారు వారి వారి కుటుంబాలను సమాజాన్ని చక్కబరచుకుంటే దేశమెంత సులభంగా చక్కబడుతుంది? ఈనాడు కుటుంబ విషయమై వీరికేమాత్రము బాధ్యత లేదు.

విద్యార్థులారా! మొట్టమొదట మీ కుటుంబాన్ని మీరు పోషించుకోండి. మీకుటుంబాన్ని మీరు గౌరవంగా నిలబెట్టుకోండి. మొట్టమొదట మీ తల్లిదండ్రులను సంతృప్తి పరచండి. ఆ శక్తియే మీలో లేనప్పుడు ఎన్ని విద్యలు చదివి ఏమి ప్రయోజనము?

(శ్రీ స. వి. వా. పు. 91/92)

కురుక్షేత్ర యుద్ధము

కురుక్షేత్ర యుద్ధము జరిగినపుడు, కృష్ణునికి 84 సం॥ల వయస్సు. కీ.పూ. 3138 సం॥లో ధర్మరాజు యొక్క పట్టాభిషేక మహోత్సవము జరిగింది ఆతరువాత కృష్ణుడు ద్వారకకే విజయము చేసి, ప్రజల కోరికలను మన్నించి, 36 సంవత్సరములు ప్రజలకు ఆనందమందించి. కీ.పూ.3102 ఫిబ్రవరి 17-18 అర్ధరాత్రి సరిగ్గా పాంచ భౌతిక శరీరమును త్యజించినాడు. ఆ వార్తవిని పాండవులు దుఃఖించిరే కానీ, కృష్ణుడు నిత్య స్వరూపుడు, ఆనంద స్వరూపుడు, ప్రేమ స్వరూపుడు అని సున్నితముగా తెలుసుకున్న గోపికలు ఏ మాత్రమూ చలించలేదు, విచారించలేదు. వారిది నిర్మల చిత్తము, నిశ్చల భక్తి, నిస్స్వార్థ సాధన.

(స.సా. జులై 78 పు. 100/101)

కురునందనుడు

కృష్ణుడు అర్జునుని కురునందనా యని సంబోధించాడు. కురునందనా అంటే యేమిటి? కురు+నందన=కర్మను ఆచరించటములో ఆనందమును అనుభవించేవాడట అర్జునుడు. పనిపున్న సమయమున మనము చాలా బేజారుగా వుంటాము. పనియందే అర్జునునికి ఆనందమట. మనకు ఆదివారం వచ్చిందంటే చాలా ఆనందము. ఎందుకంటే పని వుండదు. పనిలేనినాడు అర్జునుడు చాలా విచారిస్తాడట. **ఎంత పని అధికముగా వుంటే అంత ఆనందించేవాడు అర్జునుడు. కర్మయందు ఆనందమును అనుభవించేవాడు కనుక "కురునందన" అని పేరు పెట్టాడు. అర్జున, ఫల్గున, పార్థ, కిరీటి, శ్వేతవాహన, బీభత్స, సవ్యసాచి, విజయకృష్ణ, ధనుంజయ యీ పేర్లకు ఒక్కొక్క దానికి ఒక్కొక్క అంతరార్థమును కృష్ణుడు నిరూపించాడు.** ఈ ఇరువది ఆరు గుణములలోపల నిత్యము ఒక్కొక్క గుణమును గూర్చి చక్కగా గుర్తించటానికి ప్రయత్నించినప్పుడే దివ్యత్వమైన ఆత్మతత్వము మనకు ఆర్థమవుతుంది.

(శ్రీస. గీ. పు. 251)

కులమతద్వేషములు

కులమత **ద్వేషాలు** కూలద్రోయుడటంచు
చేయెత్తి బోధనల్ చేయవలయు
దీనుల సేవయే దివ్యమార్గమటంచు
పలుమారు గట్టిగా పలుక వలయు
నామ చింతన చేయు నరుని నామి సన్నిధి చేర్చి
అమృతత్వము నందించు నని నెరుగవలయు
భక్తి విశ్వాసములు బాగుగా కలిగిన వారలు
మనవారలని వచించవలయు
జ్ఞాన బోధలు నరులకు చేయువారు
ఇష్టులవుదురు ఎంతైన స్పష్టముగను
భేద భావంబు విడనాడి ప్రీతి తోడ
కలసి యుండుటయే మీరంత
సాయికి కలుగు ప్రేమ
ఇంతకన్న వేరెద్ది ఎఱుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా

(భ ప్ర. పు. 16/17)

కులము/కులములు

ప్రపంచానికి ప్రధానమైనవి ఐదు ఉన్నాయి. అవియే పంచభూతాలు.గాలిది ఏకులం? నిప్పుది ఏకులం? నీటిది ఏ కులం? భూమిది ఏ కులం? ఒక మానవునికే వచ్చిందా ఈ కులతత్వం?

కులమత ద్వేషాలు పోవాలి. యూనిటి లేక పోవుట చేత, డివినిటి (divinity) కూడాఉండదు.

(Unity, Purity, Divinity) యూనిటి, ప్యూరిటి, డివినిటి. ఈ మూడూ విడిచి కమ్యూనిటీని పట్టుకుంటావా? అది నిన్ను రక్షిస్తుందా? దేశాన్ని కాపాడుతుందా? అందరిలోఉన్నది ఒక్కటే ఆత్మతత్వము అని గుర్తించాలి. జాతిమత కులబేధాలు పాటించకూడదు.

మానవులందరిదీ ఒక్కటే జాతి - మానవజాతి.

(దే.యు. పు. 41)

కులమతద్వేషములు

ఒకే దైవమునకు అనేక నామములు, రూపములుండ వచ్చును. కాని దైవత్వము మాత్రము ఒక్కటే. అన్ని మతముల వారు భారతదేశము నందున్నారు, అనేక కులముల వారు వున్నారు. కులము అంటే ఏమిటి? ఒక చిన్నవిషయం మీరు గుర్తించాలి. ఈనాడు రెడ్లనీ, కాపులనీ, కమ్మవారనీ, బ్రాహ్మణులని చెప్పుతుంటాం. ఈ భేదములు ఎట్లు ఏర్పడినవి?

బ్రాహ్మణోస్య ముఖమాసీత్ । బాహూరాజన్యఃకృతః
ఊరూ తదస్య యద్వైశ్యః పాద్భ్యాగ్ం శూద్రో అజాయత॥

ముఖం అనేది బ్రాహ్మణులు, భుజం అనేది క్షత్రియులు, ఊరువు(తొడలు) అనేది వైశ్యులు, పాదం అనేది శూద్రులు, అని దీని అర్థము. అంతేకానీ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులనేవి తెగలు కావు. అయితే యిందులో ఏది ప్రధానం? ఏది ఆధారము అంటే మానవ దేహమునకు కాళ్ళు ప్రధానం. కాళ్ళు లేకుండా తొడలుండులకు వీలుకాదు, తొడలు లేకుండా భుజములు, భుజములు లేకుండ తల ఉండుటకు వీలులేదు.

ఇందులో తల చేయవలసిన పని ఏమిటి? తల లోపల పంచభూతము లుంటున్నాయి. అంటే తల చాలా ప్రధానమైనది. (శబ్ద స్పర్శ, రూప, రస, గంధ) చూచే నేత్రములు, వినే చెవులు, వాసన చూసే ముక్కు, రుచిచేసే నోరు, యివన్నీ ముఖమునందే వుంటున్నాయి. కనుక యీ బ్రాహ్మణత్వమనే ముఖానికి చాలా (Responsibility) జవాబుదారి అంటే బాధ్యత ఉంటుంది. ఈ ముఖమనే బ్రాహ్మణత్వం ఏం చేస్తున్నది? పంచ భూతములతో పంచేంద్రియములకు తగిన క్రియలను అందిస్తుంది. ఇట్టి ప్రధాన బాధ్యత కలిగిన ముఖాన్ని రక్షించే నిమిత్తమేర్పడినవి భుజములు. భుజబలము చేత జీవితాన్ని పోషించే నిమిత్తమై ఏర్పడనవి తొడలు. ఈ రెండింటిని ఆధారం చేసుకుని అక్కడివి యిక్కడ - యిక్కడవి అక్కడ అనేక రకములుగా ప్రోగు చేసుకొని యీ దేహమును పోషించేవి పాదములు. దీనివలననే చెప్పారు.

శాస్త్రంబు నెప్పుడు సత్యంబుగా నెంచు
వేదసమ్మతంబగు విప్రులారా!

కుల్పంత్‌రాయ్

దేవంబు కొరకునై దేహమర్పణచేసి
రక్షించే రాజాధి రాజులారా!
వ్యవసాయ వృద్ధిచే వర్ధిల్లు చుండెడి సుఖజీవనము చేయు శూద్రులారా!
ధన ధాన్యములు కలిగి ధర్మగుణంబుచే వరలు చుండెడి ఆర్యవైశ్యులారా!

మనము చేయవలసిన కర్తవ్యము లనేకము లుండినపుడు, మనము ఏ విధమైన అపోహలకు గురికాకూడదు. బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య శూద్రత్వ మన్నవి ఒక్క దేహంలోని అంగాలే. ఈ అంగములలో ఏ ఒక్కటైనా పని చేయకపోతే మరొకటి చేయదు. కనుక దేహంలో వున్న అంగములు వేరైనప్పటికినీ అన్నీ కలిసి పని చేయాలి. ఒకచిన్న ఉదాహరణ: గుండెల్లో, ముఖములో, భుజములో, పాదములలో ప్రవహించేది ఒక రక్తమే. కాని బ్రాహ్మణుడనే ముఖానికి ఒక గుండెలేదు. వైశ్యుడనే తొడల లోపల ఒక గుండె లేదు. క్షత్రియుడనే భుజములలో ఒక గుండె లేదు. ఈ నాలుగు అంగములు ఒకే గుండెపై ఆధారపడి వున్నవి. **కనుక గుడిలేని గ్రామము, గుండెలేని దేహము ప్రయోజనము లేనట్టివే.**

స్వరూపములు వేరైనా సర్వులలో ఐకమత్యమును, అన్యోన్యత్వమును, సమత్వమును నిరూపించే నిమిత్తమై దేశరక్షణ నిమిత్తమై ఆనాడు యివన్నీ యేర్పడినవి. కొంతమంది వాదిస్తూంటారు. ఒక్క మన భారతదేశములోనే ఈ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే కులాలున్నాయి అని. ఇది చాలా పొరపాటు. మిగతా దేశములలో లేవనుకోరాదు. ఈనాడు భారత దేశములో బ్రాహ్మణులనే వారిని పాశ్చాత్య దేశాలలో ఫాదర్స్ (Fathers) అంటుంటారు. మనం క్షత్రియులం అంటుంటే వారు సైన్యం (Army) అంటున్నారు. మనం వైశ్యులంటే వారు Business men అని పిలుస్తున్నారు. శూద్రులను (Labour) కార్మిక వర్గమని పిలుస్తున్నారు. ఈ నాలుగు భాగములు సర్వదేశములందు ఉంటున్నాయి. అయితే ఈ నాలుగు భాగాలు ఆత్మపరిశీలన నిమిత్తమై దేశ సౌభాగ్య నిమిత్తమై మానవత్వమును కాపాడే నిమిత్తమై ఏర్పడినవి. యీ విధమైన తెగలుగా భావించుకొనుట చాలా పొరపాటు. ఇది మన అజ్ఞానము. శూద్రత్వ మనగా నేమిటి? శ్రమించి పనిచేసేవారు అని అర్థము. అంతే గానీ ప్రత్యేకమయిన తెగగా భావించరాదు. ఇటువంటి ధర్మస్వరూపాన్ని నిరూపించేది భారతీయ సంస్కృతి. కనుక మనము పిల్లలకు **"నాయనా! దైవత్వము ఒకటే దివ్యత్వము ఒక్కటే. దేశములు భిన్నములు, ఆచారములు భిన్నములు, మతములు భిన్నములు, మార్గంబులు భిన్నములు. కానీ గమ్యము మాత్రము ఒక్కటే".** ఈ సత్యాన్ని సమత్వాన్ని మనం పిల్లలకు బోధించాలి.

(శ్రీస. ది. పు. 46/49)

కుల్పంత్‌రాయ్

(చూ॥ శ్రీసత్యసాయి అంతర్జాతీయకేంద్రము)

కుశలబుద్ధి

(చూ॥ సాధకులు)

కృతఘ్నత/కృతఘ్నుడు

(చూ॥ కృతజ్ఞత, స్త్రీలు)

కృతజ్ఞత (Thanks)

అనిత్యము అశాశ్వతము, అసత్యమైనటువంటి, ప్రాకృతమైనటువంటి విషయములకు మనము ఎన్నియో Tax (పన్నులు) లు కట్టివేస్తున్నాము. ఎంతయో కృతజ్ఞత తెలుపుకుంటున్నాము నిత్యమైన, సత్యమైన శాశ్వతమైన జీవితమునకు అవసరమైన సమస్తశక్తులను మనం అనుభవించుటకు అందిస్తున్న భగవంతునికి మనం ఏమి Tax యిస్తున్నాం? మనం ఏమి Thanks (కృతజ్ఞతలు) చెబుతున్నాం? ఇంకా భగవంతుడు అది యివ్వలేదే? ఇది యివ్వలేదే? అని దూషిస్తుంటాం. Tank లో ఉన్న

నీరు పంపుల ద్వారా మన ఇంటికి సప్లయి చేసినందులకు మున్సిపాలిటీవారికి Water Tax కడుతున్నాం. మన స్థలంలో మనం ఇల్లుకట్టుకొని, మున్సిపాలిటీవారికి House Tax కడుతున్నాం. కరెంటు Fan ను మన ఇంట్లో ఉపయోగించుకుంటే Electricity Tax కడుతున్నాం. ఎవరైనా చిన్న సహాయం చేస్తే Thanks చెబుతాం. మన కర్చిఫ్ క్రిందపడితే, దానిని ఎవరైనా తీసియిస్తే వారికి Thanks చెబుతాం. అయితే భగవంతుడు మలయ మారుతంగా గాలిని అందిస్తుంటే ఈ గాలిని అందిస్తున్న భగవంతునికి మనం ఏమి Thanks చెబుతున్నాం? ఏమి Tax ను భగవంతునికి కడుతున్నాం? దేదీప్యమానంగా ప్రకాశిస్తూ జగత్తునంతా వెలుగునిస్తున్న ఈ సూర్యునికి ఏమి Thanks చెబుతున్నాం? ఏమి Tax కడుతున్నాం? కుంభవర్షం కురిపించి, చెరువులను, వాగులను, నదులను నింపి జలమయం గావిస్తున్న భగవంతునికి ఏమి Thanks చెబుతున్నాం? ఏమి Tax కడుతున్నాం. ఎన్ని పంపుసెట్లు పెట్టుకుంటే ఇంత నీరు మనకు లభ్యమవుతుంది? అల్పమైన, స్వల్పమైన వాటికి మనం ఎంతో Tax కడుతున్నాం. అయితే భగవంతుడు అనుగ్రహించేవన్నీ Free (ఉచితం) భగవంతుడు అందించే గాలి Free నీరు Free లైట్ Free ధ్వని Free అంతా Free గా అందిస్తున్నాడు భగవంతుడు. అట్టి భగవంతునికి మాత్రం మనం ఏమి Tax కడుతున్నాం? కనీసం Thanks (కృతజ్ఞత) కూడా చెప్పటం లేదే?

(శ్రీ. అ. 1996 పు. 2/3)

కృతఘ్నత అన్నదే ఒక పెద్ద పాపం. ఈ పాపమే మానవుని తలవంచి అనేక విధములైన బాధలకు గురిచేస్తుంది. ఎవరివలన నేను ఈ స్థాయికి రాగలిగితిని ఎవరి వలన నేను ఈ కీర్తిని అనుభవించగలిగితిని, ఇంతటి అభివృద్ధికి ఎవరు కారణం? అనే ఉపకారమును మరచిపోతున్నారు. ఈ ఉపకారమును మరచినాడు దైవదృష్టిలో చచ్చినవానితో సమానము. కనుక, కృతజ్ఞతలేని వాని జీవితము చావుతో సమానము. ఎవరి వల్ల నీవు ఈ ఉపకారమును పొందావో, వారికి నీవు కృతజ్ఞతను చూపించాలి. ఈనాడు నీవు పెద్దవాడు కావచ్చును. విద్యావంతుడు కావచ్చును, నీవు ధనవంతుడు కావచ్చును, అధికారివి కావచ్చును - కాని ఈ స్థాయి ఎవరి వలన వచ్చింది? అనే విషయం మరచి పోతున్నాడు. కనుకనే, మానవుడు తన విలువలనన్నింటినీ నిర్మూలనం చేసుకుంటున్నాడు. ఈ అహంకారము, ఆడంబరము, అత్యాశ, మానవత్వాన్ని పూర్తిగా భస్మం చేస్తోంది.

(శ్రీభ. ఉ. పు.109/110)

ఒక రైతు ఒక ముసలి అవును అంగట్లో కసాయి వానికి అమ్మి తిరిగి తన పొలానికి వచ్చాడు. అక్కడ అతనికి ఒక పాము ఎదురయింది. అప్పుడతడు "విషపు ప్రాణిని చంపండి" అని అరిచాడు. అప్పుడు పాము అతనితో "నేను విషపు ప్రాణిని కాదు, నీవే విషపు ప్రాణివి" అన్నది. "కాదు"అన్నాడతడు. అప్పుడు పాము "నీవు వెళ్ళి దూడను అడుగు" అన్నది. ఆ దూడ అతని ద్వేషము, క్రూరత్వములకు సంబంధించి విషాదకరమైన విషయాలు చెప్పింది.

తనను తల్లి దగ్గర పాలు త్రాగనీయకుండగా బలవంతంగా లాగి త్రాటితో కట్టటము, తనచేత బరువులు లాగిస్తూ తనను దెబ్బలు కొట్టటము, తన తోకను అతడు గట్టిగా మెలిపెట్టటము వివరించి చెప్పి **మానవుడు కృతజ్ఞత లేని జంతువు.** అతడు ఎంతో హీనముగా ఉంటూ ఇతరులను పశువు అంటాడు అని అన్నది.

నిజానికి మనిషిని కాని, జంతువును కాని చెడుమాట అనకండి, కారణం అన్ని జీవులలోను భగవంతుడున్నాడు. మీరు పలికే కఠినమైన మాట లోపల ఉన్న భగవంతునికి తగులుతుంది.

(వ. 61-62 పు.163/164)

పట్టాభిషేక సమయంలో ప్రప్రథమంగా రాముడు హనుమంతునికి కృతజ్ఞతలు తెల్పుకున్నాడు. "ఈనాడు ఇట్టి కళ్యాణకరమైన పట్టాభిషేకము జరుగుతున్నదంటే దీనికి కారణం ఎవరు? సీత జాడను తెలిపి అనేక విధములుగా తోడ్పడిన హనుమంతుడే. కనుక

కృష్ణతత్వము

మొట్టమొదట అతనికి నా కృతజ్ఞతాభినందనల నర్పిస్తున్నాను'' అన్నాడు. సీతను రావణుని బారి నుండి రక్షించడానికి ప్రాణాలకు తెగించి పోరాడిన జటాయువును జ్ఞాపకం చేసుకున్నాడు. సీతాన్వేషణలో సహాయం చేసిన సుగ్రీవునికి, యుద్ధంలో రాక్షసమాయలను కనిపెట్టి తోడ్పడిన విభీషణునికి కృతజ్ఞతలు చెప్పాడు. అంతేగాక సీతారాములతో తనుకెట్టి సంబంధమూ లేకపోయినప్పటికీ యుద్ధంలో అమితోత్సాహంతో పాల్గొని ప్రాణత్యాగం చేసిన వానర వీరులందరినీ గుర్తుచేసుకున్నాడు. ఈ విధంగా ఎవరెవరు తనకు సహాయం చేశారో వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. సీత కూడా హనుమంతునికి కృతజ్ఞతలు తెల్పుతూ, ''నీకు ముల్లోకములను పట్టం కట్టినప్పటికీ నీ ఋణమును నేను తీర్చుకోలేను. ఇంతటి భక్తి, త్యాగము నీలో ఉండటం చేత నీవు ముల్లోకములలోను సంచరించగలవు. నీ సంచారముచేత ముల్లోకములూ సుభిక్షంగా ఉంటాయి.'' అని ఆశీర్వదించింది. అనగా **ఉపకారం చేసినవారికి తగిన కృతజ్ఞత చూపించాలని రామాయణం బోధిస్తున్నది. కృతజ్ఞత చూపేవాడు మానవుడు. కృతఘ్నుడైనవాడు దానవుడు.** మానవత్వమునకు, దానవత్వమునకు రూపములు ప్రత్యేకంగా లేవు. **ప్రవర్తనను పురస్కరించుకొనియే వీడు మానవుడు, వాడు దానవుడు, ఇతడు దేవుడని నిర్ణయించవచ్చును.**

(శ్రీ.భ.ఉ.పు.94)

(చూ॥ దేశసేవ)

కృష్ణతత్వము

కృష్ణ తత్వము నందు వివిధ విషయాలు అనేక అంతరార్థములతో కూడి ఉంటున్నాయి. ప్రజలు తమతమ భావములను పురస్కరించుకొని యదార్థమును విస్మరించి, అనర్థాలను తెచ్చుకుంటున్నారు.

శ్రీకృష్ణునికి అష్టభార్యలుండి రనియు, అంతేగాక అతడు 16 వేలమంది గోపికలను కూడా కలిగియుండెనని చాలమంది భావిస్తున్నారు. దీనియందున్న అంతరార్థము ఏమిటి? ఈ ఎనిమిదిమంది కృష్ణునికి ప్రాపంచిక సంబంధమైన భార్యలు కారు. మన దేహానికి హృదయమే అత్యంత ప్రధానమైనది. మన దేహము నందు గల షట్చక్రములలో రెండు ప్రధానమైనవి. **ఒకటి సహస్రార చక్రం, రెండవది హృదయ చక్రం.** ఈ హృదయ చక్రం అష్టదళములు గల పుష్పముతో కూడినది. ఇదే హృదయపుష్పం. దీనియందలి అష్టదళములకు 'అష్టభూములు' అని మరొక పేరు. భూమికి నాథుడు. భగవంతుడు. అనగా, ఈ ప్రకృతికి పరమాత్మయే నాథుడు. కనుక అష్టదళములతో కూడిన **హృదయ పుష్పానికి నాథుడు భగవంతుడే;** అతడే శ్రీకృష్ణుడు. ఇతనినే **'మాధవ' అన్నారు. మ - అనగా మాయ, లక్ష్మి, ప్రకృతి; ధవ - అనగా నాథుడు. కనుక, 'మాధవ' అనగా హృదయానికి నాథుడు, ప్రకృతికి నాథుడు అని అర్థం** శ్రీకృష్ణునికి ఎనిమిదిమంది భార్య లుండిరన్న మాటలో గల అంతరార్థం ఇదే.

మనదేహములో నుండిన మరియొక ప్రధానమైన చక్రం - సహస్రారం. ఇది వేయి దళములతో కూడినది. ఒక్కొక్క దళము నందు భగవంతుడు షోడశకళాపరిపూర్ణుడై ప్రకాశిస్తుంటాడు. కనుక, వేయి దళములకు మొత్తం 16000 కళలుంటున్నాయి. దీనిని పురస్కరించుకొనియే కృష్ణునికి పదహారువేల మంది గోపికలుండిరని భావిస్తున్నాము. కనుక **గోపికలనగా కళలే.** ఈ పదహారు కళలు మన లోపల పరిపూర్ణం కావాలి. భగవదాజ్ఞను శిరసావహించినప్పుడే, ఈ షోడశకళలు మన యందు రాణిస్తాయి. కాబట్టి, కృష్ణునికి 16 వేలమంది గోపికలు, ఎనిమిదిమంది రాణులు అనెడి పిచ్చిపిచ్చి భావాలకు చోటివ్వరాదు. ''ఆనాడు కృష్ణునికే 16 వేలమంది ఉన్నప్పుడు, నాకు పదహారు మందైనా ఎందుకుండ కూడదు'' అనెడి భావము నేటి పిల్లలలో ప్రారంభమౌతుంది. కనుక భాగవతము నందుండిన మహాపవిత్రమైన సూక్ష్మార్థములను గుర్తించడానికి ప్రయత్నించాలి.

(స.సా.అ. 91 పు.260)

గోకులంలో కృష్ణుడు జన్మించాడు. బృందావనంలో పెరిగి పెద్ద వాడైనాడు. తరువాత ద్వారకా నగరంలో పరిపాలన చేశాడు. అంటే ఈ మాటలకు అర్థం? మనస్సు అనే గోకులంలో పుట్టాడు. ఆధ్యాత్మిక మార్గం అనుసరించిన మనస్సులో ఇప్పుడు కూడా కృష్ణుడు జన్మిస్తాడు. ప్రేమకు నెలవైన హృదయమే బృందావనం. అక్కడ ఆయన పెరుగుతూ ప్రేమను పెంపుచేస్తాడు. చిత్తమనే మధురాపురిని పరిపాలిస్తాడు. నిర్వికల్పస్థితి అనే ద్వారకలో చక్రవర్తిగా స్థిరనివాసం ఏర్పరచుకుంటాడు. ఈ వివిధదశలలో కృష్ణతృష్ణను పెంచుకుంటే మీరు తరించ గలరు. రాధ, మీరాబాయి, సక్కుబాయి ప్రభృతుల శ్రేణిలో చేరి పోగలరు.

శ్రీస.వ. 1963 పు.73)

కృష్ణపక్షం

(చూ॥ ఉత్తరాయనము)

కృష్ణార్పణం

ఒకానొక సమయంలో రుక్మిణి రాధను తన ఇంటికి ఆహ్వానించింది. ఆనాడు ఇంటికి వచ్చిన అతిథులకు పెట్టడానికి ఇడ్లీ దోసెలవంటి టిఫిన్లు లేవు. అందరి ఇళ్ళలో పాలు, పెరుగు, వెన్న సమృద్ధిగా ఉండేవి గనుక, వాటినే ఇచ్చేవారు. రాధ ఇంటికి వచ్చిన ఆనందంలో రుక్మిణి తానేమి చేస్తున్నదో తనకే తెలియక వేడివేడి పాలను గ్లాసులో పోసి రాధకు అందించింది. రాధకు దేనినైనా ముందు కృష్ణునికి అర్పించి తరువాత తాను తీసుకోవడం అలవాటు. అదే ప్రకారంగా 'కృష్ణార్పణం' అని ఆ ఉడుకుడుకు పాలను త్రాగేసింది. పాయంకాలము కృష్ణుడు పవళించగా రుక్మిణి పాదసేవ చేస్తున్నప్పుడు పాదాలపై బొబ్బలు కనిపించాయి. "ఏమిటిది స్వామీ! ఏమి జరిగింది? ఎవరు నిన్నీ విధంగా హింసించారు?" అంటూ ఆదుర్దాగా ప్రశ్నించింది. "ఇది నీపనే! ప్రొద్దున్న రాధ ఇంటికి వచ్చినప్పుడు ఆమెకు వేడివేడి పాలు ఇచ్చావు. వాటిని రాధ నాకు అర్పితం చేసింది. దానితో నా కాళ్ళు కాలి పోయాయి" అన్నాడు. కొంతమంది ఇవన్నీ కట్టుకథలని భావిస్తారు. కాని, కథలు కావివి, భక్తుల వ్యథలను నిర్మూలించే నిమిత్తమై కృష్ణుడు చేసిన లీలలు. మీరా అక్బర్ చక్రవర్తి నుండి కృష్ణునికోసం పూల మాలను స్వీకరించిందని మహారాణాకు కోపం వచ్చి ఆమెకు పాలలో విషం కలిపి పంపించాడు. అది త్రాగిన తక్షణమే దేహమంతా నీలంగా మారిపోయి రక్తం నిల్చిపోతుంది. మీరా ఆ పాలను **'కృష్ణార్పణం' అని త్రాగింది.** విషమంతా కృష్ణుడు తీసుకున్నాడు, మధురమైన పాలను మీరాకు అందించాడు. కనుకనే, మనం ఏ పదార్థమునైనా భుజించే ముందు **బ్రహ్మార్పణం చేయాలి. అప్పుడది పదార్థముగా ఉండదు, ప్రసాదంగా మారుతుంది.**

(స.సా.అ 96 పు. 255/256)

కృష్ణుడు

మేలు మేలు పాండవుల గాచి నావు
కంసుని మద మణచినావు
వసుదేవ, దేవకీల, చెరవిడిపించినావు
పదహారువేల, రమా మణుల సుభ్రోచినావు

(సా॥పు. 107)

కృష్ణుడు అంత నలుపూ కాదు, అంత తెలుపూ కాదు! **మూడు భాగాలు నలుపు, ఒక భాగము తెలుపు, కలిపితే ఎంతో అంత, అతనిది శ్యామల రూపము!** నందుడు వైష్ణవుడు కాబట్టి, అబ్బాయికి, స్నానము చేయించి ఒకే ఒక గీత కస్తూరీ తిలకము పెట్టేవాడు. **నందుని తల్లి ఆమె యొక్క కంఠాభరణమును శ్రీకృష్ణునికి ధరింపచేసినది. అదే కౌస్తుభము.** ఆ కాలములో దానికి చాల గొప్ప వెల! ఆ పతకము మధ్య ఒక పెద్ద పచ్చ, మరకత రత్నము వుండెను. దాని చుట్టూ విలువైన వజ్రములు పొదగబడినవి. అది శ్రీకృష్ణుని వక్షస్థలమందు తళతళ లాడుతూ వుండేది.

కృష్ణుడు

చేతికి కంకణములు, అంటే వెండి కడియములు, పల్లెలోవాళ్ళు, గొల్లపిల్లలు ఆ కాలములో వేసుకొనే వారు. అయితే కృష్ణుడు వేసుకున్న కంకణములకు వేరే అంతరార్థమున్నది. యజ్ఞనమయమందు, పెండ్లి సమయమందు కట్టుకునే దీక్షా కంకణములు కావు. అవి ప్రతిజ్ఞా కంకణములు-మూడు! గీతలో వాటిని గురించి కృష్ణుడు వెల్లడించినాడు. మొదటిది: పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం: ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే. రెండవది: అనన్యాశ్చింత యంతోమాం - యే జనాః పర్యుపాసతే: తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం. మూడవది: సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ. అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ. చూడండి, రెండవ దాంట్లో యేజనాః అంటాడు! ఎవరినైనా సరే, అనన్యభక్తితో భగవంతుని భజించిన, ఉపాసన చేసిన, వాని యోగక్షేమమును వహిస్తాడు. ఏదేశము వారైనా, ఏమతము వారైనా, పండితులైనా, పామరులైనా సరే, అని దీని కర్థము. "నేను జగత్తును సంరక్షిస్తాను; **ధర్మ సంస్థాపన చేస్తాను; అన్యాయ** అక్రమ అసత్యములనే అహంకారజన్య కల్మషము లన్నియునూ నాశనము చేస్తాను; భక్త రక్షణ సలుపుతాను, అనేది కంకణముల భావార్థము. దానివలననే శ్రీకృష్ణుని ప్రేమావతారము అంటారు! తిరిగి **అట్టి పూర్ణ ప్రేమావతారము వచ్చి నపుడు, మీరందరూ దర్శనభాగ్యమునందుకొంటున్నా రంటే, మీ జన్మములు ఎంత పుణ్యము, ఎంత సార్థకము! దానికే! ఇదిగో! పరమ పవిత్రమైన ఈ కౌస్తుభమాల,** శ్రీకృష్ణుడు తన మెడలో వేసుకున్న పతకము! చూసి ఆనందపడండి! (శ్రీవారి హస్త మందు ప్రత్యక్షమైన ఆ దివ్య కంఠాభరణమును, విద్యార్థులందరికీ, ఉపాధ్యాయులకు, సమావేశమైన ఇతర భక్తులకూ శ్రీవారే సమీపమునకు వచ్చి, చూపించి ఆనంద పరచిరి. తరువాత, శ్రీవారే దానిని శ్రీకృష్ణుని చందన విగ్రహము యొక్క మెడలో వేసిరి).

(స.సా.అ. 77 పు. 181/182)

బలరాముడు ఇంటికి వచ్చి, "అమ్మా! తమ్ముడు బజార్లో మట్టి తింటున్నాడు" అని తంటాలు చెప్పినప్పుడు యశోద కృష్ణుని చెవి పట్టుకొని మందలించగా కృష్ణుడు, **"అమ్మా! మన్ను తినడానికి నేనేమైనా చిన్నపిల్లవాడినా? వెఱ్ఱివాడినా?" అన్నాడట. అనగా, నేను చిన్న పిల్లవాడను కాదు సుమా, సాక్షాత్ భగవంతుడినే నని ఇన్‌డైరెక్ట్‌గా తెలియజేశాడు.** భగవంతుని మాటలు చాల విచిత్రంగా ఉంటాయి. అంతేకాదు, అనేక అంతరార్థములతో కూడి యుంటాయి. భగవంతుని చర్యలన్నీ నివృత్తికి సంబంధించినవి. ప్రవృత్తిలో జీవితాన్ని గడిపే మానవులకు అవి అర్థం కావు. కొందరు తమ ప్రాకృతబుద్ధిని ఆధారంగా చేసుకొని, కృష్ణుడు వ్రేపల్లెయందు గోపికలతో అసభ్యంగా ప్రవర్తించాడని విమర్శిస్తూ వచ్చారు. ఇది చాల పొరపాటు. కృష్ణుడు వ్రేపల్లెలో ఉన్నది ఐదవ సంవత్సరం వరకు మాత్రమే, తరువాత మధురకు వెళ్ళి పోయాడు, తిరిగి వ్రేపల్లెకు రానేలేదు. ఐదు సంవత్సరాల బాలుడు అసభ్యంగా, సంఘవిరుద్ధంగా ప్రవర్తించాడనటంలో అర్థం లేదు. **"యద్భావం తద్భవతి." పవిత్రమైన దివ్యత్వాన్ని అర్థం చేసుకోలేక కొందరు తమ భావాలనే భగవంతునిపై ఆరోపించి తద్ద్వారా భగవంతునికి దూరమై పోతున్నారు. కృష్ణుడు తమాషాగా చెప్పినా, ఇంకే విధంగా చెప్పినా అంతా సత్యమే. నవ్వులకైనా అసత్యం చెప్పలేదు.** అర్థం చేసుకోలేనివారు కృష్ణుడు అబద్దాలు చెప్పాడని అనుకుంటున్నారు. ఇది అన్ని యుగములందు ఉన్న రోగమే. **ఒకనాడు గోపికలు వచ్చి యశోదకు ఫిర్యాదు చేశారు.**

"అర్ధరాత్రి వేళ మా మిద్దెలెక్కి వచ్చి
నిద్రపోవు స్త్రీల జడలెత్తి కట్టి వచ్చె
అడుగవే తల్లీ ! అడుగవే,"
కృష్ణుడు యశోదతో నవ్వుతూ చెబుతున్నాడు.
"అమ్మా! నేను నీదు పక్కలో
కదలక మెదలక పడుకొనియుంటినె
అర్ధరాత్రి వేళలొ నేనెపుడు
వెళ్ళివస్తినో తెలుపవే తల్లీ! తెలుపవే"

"నేను నీ పక్కలోనే పడుకుని ఉన్నాను కదా! నేనెప్పుడు వెళ్ళి వచ్చాను? నీవే చెప్పు" అన్నాడు. **దీని అంతరార్థ మేమిటి? తాను ఇక్కడా ఉన్నాడు, అక్కడా ఉన్నాడు. ఇక్కడ అక్కడ ఎక్కడ చూసిన ఒక్కడే ఉన్నాడనే మహత్తర తత్వాన్ని నిరూపించాడు.**

మరొకనాడు మరికొందరు గోపికలు వచ్చి కృష్ణునిపై మళ్ళీ ఫిర్యాదు చేశారు.

"గొల్ల భామలంత గూడి చల్లనమ్మబోవుచుండ
చల్లబానలకు సుంకమిమ్మని చిల్లుల పడగొట్టినవాడు
అడుగవె తల్లీ అడుగవె"

అప్పుడు యశోదతో కృష్ణుడు చెబుతున్నాడు.

"దేవుడేమొ కొట్టిపోతే తెలియక నా మీద వైచిరి
ఇందు నా దోసమేమి చెప్పవే తల్లీ! చెప్పవే"

"దేవుడే కొట్టినాడుకాని, నేను కొట్టలేదు" అన్నాడు. అనగా తానే దేవుడనని ఇన్‌డైరెక్ట్ (పరోక్షం) గా చెబుతూ వచ్చాడు. అనేక పర్యాయములు కృష్ణుడు గొల్ల ఇండ్లకు పోయి వెన్న దొంగలించి తప్పించుకుని వచ్చేవాడు. ఒకనాడు **యశోద అతనిని పట్టుకున్నది.**

"పెట్టినవి తినవు గొల్లల
పట్టులకుంబోయి వెన్న పట్టెడులుగ లో
గుట్టున తినెదవు నీతో
పుట్టెను రట్టులు కృష్ణా..."

"నోరంతయు వెన్నవాసన
ఊరంతయు ఆగడంబు ఒకటే రద్దుల్
గోరంతయు లేవు బాలా
గారాబము మానుమింక కట్టెద రోటన్"

"మన ఇంట్లో వెన్న నీకు రుచించదా? పరుల ఇంట్లో వెన్న నెందుకు దొంగిలిస్తున్నావు? అని దండించింది. అప్పుడు కృష్ణుడు, "అమ్మా! నీ హృదయం వాత్సల్యమనే స్వార్థంతో నిండినది. కాని, గోపికల హృదయం నిస్స్వార్థమైనది, పవిత్రమైనది. కనుకనే, నేను వారి హృదయమనే వెన్నను దొంగిలిస్తున్నాను. నీ ఇంటి వెన్న నాకు అక్కర లేదు" అన్నాడు. లోకులు సరిగా అర్థం చేసుకోలేదుకాని కృష్ణుడు అపహరించింది వెన్న కాదు, పవిత్రమైన గోపికల చిత్తమును. మీరు భజనలో కూడా "చిత్త చోర యశోదాకె బాల్ నవనీత చోర గోపాల్..." అని పాడుతున్నారు కదా! ఒకనాడు కృష్ణునికి గోపికలపై జాలి కలిగింది. "అయ్యో పాపం! గోపికలు చిత్తశుద్ధి గలవారు, స్వార్థ రహితులు, అమాయకులు. అలాంటి భక్తులను కష్టపెట్టడం మంచిది కాదు. నేను భక్త పరాధీనుడను కదా! ఈతూరి వారికి తప్పక చిక్కిపోవాలి" అని సంకల్పించుకున్నాడు.

ఒక గోపిక ఇంట్లో ప్రవేశించి ఉట్టిపైనున్న పాలన్నీ క్రిందపోశాడు. అందులో తన రెండు పాదములను తడుపుకొన్నాడు. గోపికలు తనను పట్టుకోవడానికి వచ్చేసరికి పరుగెత్తి పాయాడు. గోపికలు కృష్ణుని పాదముద్రలను ఆధారంగా చేసుకొని వెతుకుతూ పోయేసరికి కృష్ణుడు దొరికి పోయాడు. "గోపికలారా! మీరు నా పాదములను ఆశ్రయించండి. అప్పుడే నేను మీకు చిక్కుతాను" అని ప్రబోధించే నిమిత్తమై కృష్ణుడు ఈ నాటక మాడాడు.

(స.సా. అ 96 పు.253/255)

నరరూపముతో వచ్చిన భారతస్వరూపమే శ్రీకృష్ణుడు. హిందూ మతమునకు, హిందూసమాజమునకు, హిందూజాతికి అంతరాత్మగా ఉండేవాడే శ్రీకృష్ణుడు. ఈ కృష్ణతత్వమును రాజకీయ, సాంఘిక, నైతిక, భౌతిక మార్గములతో సామాన్యులకు కూడ విషయములను సామాన్యమార్గములో ప్రబోధించిన వ్యక్తి కృష్ణుడు.

కృష్ణ అనగా యశోదకుమారుడని, నందుని కుమారుడని భావిస్తున్నారు. ఇది బాహ్యమైనది మాత్రమే. **"కర్షతీతి కృష్ణ" అనగా ఆకర్షంచువాడు కృష్ణుడని అర్థము; "కృషతీతి కృష్ణ" అనగా సేద్యము చేసేవాడు కృష్ణుడు. హృదయమనే ధర్మక్షేత్రమును సాగుచేసి ఆనందమనే పంటను పండించి శాంతిఅనే ఫలమును సమాజమునకు అందించువాడు కృష్ణుడని రెండవ అర్థము.** మానవకోటి మధ్య ప్రేమ బీజములను నాటి సహస్రప్రసూనములను వికసింప జేసి శాంతి ఫలములను సమాజమునకు అందించిన మహా

కృష్ణుడు పుట్టిన దినము

తపస్వరూపుడు కృష్ణమూర్తి. ఇతని దీక్షయే ఆనాడు పవిత్రమైన తపస్సుగా మారింది. ఇదియే భారతీయ మతమని, కృష్ణుని అభిమతమని, ఉత్తమ వ్రతమని బోధించిన మహావీరుడు. **"కృశ్యతీతి కృష్ణః" - ఎన్ని విధములైన కష్టములు, నష్టములు, దుఃఖములు సంభవించినను, యుద్ధభూమియందు, రుద్రభూమి యందు, భద్రభూమియందును నిరంతరము ఆనందముగా ఉండే ఉల్లాస స్వరూపమును దరించినవాడని అర్థము.** యుద్ధభూమిలో అర్జునకు బోధించినది గీత.

(నీ.వే.వె. పు. 16/17)

(చూ॥ అంతరార్థము, అనన్యభక్తి, అన్నం, ఓర్పు, కళలు, కుంతీదేవి, కురుక్షేత్రం, గోపికలు, గురువు, త్యాగం, దుర్గుణములు, దేశసంరక్షణ, నరకచతుర్దశి, భక్తుని లక్షణము, భావములు, మురళి, మూఢమతి, మెసెంజర్స్ ఆఫ్ సత్యసాయి, షడ్చక్రములు, సంకల్పము, హృషికేశుడు)

కృష్ణుడు పుట్టిన దినము

(చూ॥ కలియుగము)

కృష్ణుని లీలలు

కృష్ణుని లీలలు సామాన్యమైనవి కావు. అన్నింటిలోను అంతరార్థము, ఆనందము, ఆదర్శము నిండియుంటాయి. యశోదకు చుట్టుప్రక్కల ఇండ్లవారంతా వచ్చి కృష్ణుని ఆగడాల గురించి ఫిర్యాదు చేస్తారు. అప్పుడామె అంటుంది కృష్ణా! మన ఇంట్లో నేను పెట్టిన వెన్న తినవుకాని పొరుగిండ్లలో జొరబడి వెన్న దొంగిలించి ఆరగిస్తున్నావు. మన ఇంటి వెన్నకంటే పొరుగింటి వెన్న నీకంత రుచిగా ఉందా?'' దీనికి సమాధానంగా కృష్ణుడు "అమ్మా! నేను ఎక్కడికీ వెళ్ళలేదు, వెన్న తినలేదు. కావాలంటే నా నోరు వాసన చూడు'' అంటూ తన చిన్నారి ముద్దుముద్దు మాటలతో తల్లిని **ఆనందపరుస్తాడు.** కాని ఒకనాడు యశోద ఇరుగు పొరుగువారి ఫిర్యాదులు వినలేక కృష్ణుణ్ణి పట్టి ఒక **రోటికి కట్టివేయాలని నిశ్చయించుకుంది.** కానీ కృష్ణుణ్ణి పట్టుకోవడం సాధ్యమా! **చివరకు కృష్ణుడు తనంతట తానే యశోదకు పట్టుబడాలని సంకల్పించుకొని,** ముంతల నుండి పాలు, పెరుగులను గ్రుమ్మరించి, వాటిలో తన పాదాలను అద్దుకొని ఒకవైపుగా పరుగెత్తాడు. ఆ పాదముద్రలను అనుసరించి యశోద కృష్ణుణ్ణి పట్టుకొన్నది. ఇక్కడ అంతరార్థాన్ని గమనించాలి. **పాదముద్రలను అనుసరించడంచేతనే యశోద కృష్ణుణ్ణి పట్టుకోగల్గింది. కృష్ణుని పాదముద్రలే ఆమెకు మార్గాన్ని చూపాయి.** అలాగే మీరు కూడా దైవాన్ని అనుసరిస్తే దైవం చూపే బాటలో ప్రయాణిస్తే దైవాన్ని చేరుకోగలరు. **అందుకే నేను "మై లైఫ్ ఈజ్ మై మెస్సేజ్" అంటాను "ఫాలో ది మాస్టర్" అని కూడా చెపుతుంటాను.** ప్రేమమూర్తిని చేరుకోవాలంటే ప్రేమమార్గంలోనే ప్రయాణించాలి.

ఒకనాడు యశోద కృష్ణుణ్ణి పట్టుకోవాలనుకుంది. ఏం చేసింది? ఒక చేతిలో వెన్న ముద్దను చూపిస్తూ మరొక చేతిలో బెత్తమును పట్టుకొని వెనుకగా దాచుకొంది. వెన్న చూసి కృష్ణుడు దగ్గరకు వస్తే పట్టుకొని కట్టతో కొట్టి శిక్షించాలనుకొంది. అలాగే ఈనాడు **నేను కూడా విద్యాసంస్థలనే వెన్నను చూపి యువతను ఆకర్షించి, ఆ తరువాత శిక్షణ అనే బెత్తంతో వారిని సరి చేస్తున్నాను.** ఒక రోజున ఒక గోపిక బావి దగ్గర రెండు కడవల నిండా నీరు నింపుకొంది. వాటిని తన నెత్తిన ఒక దానిపై ఒకటి పెట్టుకోవడానికి ఆమెకు సహాయం అవసరమైంది. ఇంతలో కృష్ణుడు అటువైపుగా నడుచుకొంటూ వస్తున్నాడు. "కృష్ణా! ఈ కడవలను నెత్తిన పెట్టుకోవడానికి సహాయం చెయ్యి'' అని దీనంగా అడిగింది. కానీ కృష్ణుడు పట్టించుకోకుండా వినిపించునట్లు వెళ్ళిపోయాడు. కొంతసేపయ్యాక ఆమె ఏదోవిధంగా రెండు కడవలను నెత్తిన పెట్టుకొని ఇంటి దాకా వచ్చింది. ఈ సమయానికి అక్కడే ఉన్న కృష్ణుడు వెంటనే ఆమెను సమీపించి ఆమె నెత్తిమీద కడవలను క్రిందికి దింపడంలో సహాయపడ్డాడు.

అప్పుడా గోపికా 'కృష్ణా! బావి దగ్గర వీటిని నా నెత్తిమీద పెట్టమని అడిగినప్పుడు మాట్లాడకుండా వెళ్ళిపోయావు. మరి ఇప్పుడేమో అడక్కుండానే సహాయం చేస్తున్నావు. ఏమి కారణం?'' అని అడిగింది. దానికి **కృష్ణుడే "అమ్మా! నేను బరువులను దింపేవాడినేకాని పైన వేసేవాడిని కాను' '** అని చక్కని సమాధానం చెప్పాడు. **అనగా భగవంతుడు మీ బరువు. బాధ్యతల్ని తగ్గించేవాడేకాని పెంచేవాడు కాడనే అంతరార్థాన్ని మీరు గుర్తించాలి.**

భాగవతంలోని కథలు నవవిధ భక్తిమార్గాలను చక్కగా బోధిస్తాయి. తరించే మార్గాన్ని సూచిస్తాయి. అందువల్లనే వ్యాసుడు అష్టాదశ పురాణాలను రచించినా మనశ్శాంతి లేక బాధ పడుతుంటే నారదుడు భాగవతం రచింపుమని అతనికి సలహా ఇచ్చాడు. **కనుక శాంతి సౌఖ్యాలకు సంతోష సౌభాగ్యాలకు భాగవతాన్ని మనసారా ఆలకించాలి, ఆచరించాలి. భాగవతం అంటే భగవత్కథ అంటారు. కానీ భాగవతం అంటే 'బాగవుతాం' అనే చెప్పాలి. భాగవతము అనే ఐదక్షరాలలో భ - అనగా భక్తి, గ - అనగా జ్ఞానము వ - అనగా వైరాగ్యము, త - అనగా తత్వము, ము - అనగా ముక్తి. వీటిని గమనించి ఆచరించి తరించాలి.**

(స.సా.అ 98 పు. 273/274)

వ్యాసమహర్షి పరీక్షిత్తునితో "నాయనా! **వాసుదేవునిలీలలు వక్కటే రెండు కలవని తలంచితివా, లెక్క కతీతమైన అతనిలీలలు యేమని తెలుపగలను? ఫలానాసమయమున ఫలానావారితో జరిగిన లీలలు తెలుపమని కోరిన, దానికి సంబంధించిన విషయమును చక్కగా ముచ్చటింతును"** అని మహాఋషులు తెలుపగనే పరీక్షిత్ శ్రద్ధాళుడై చేతులు జోడించు కొని "స్వామీ! **మొదలు మా తాతలకు కృష్ణపరమాత్మకు యెట్లు స్నేహము కుదిరెనో** ఆ విషయమును గురించి తెలుప''మని కోరెను.

అంత వ్యాసులవారు ఫక్కుననవ్వి, "నాయనా! నీ శ్రద్ధ నా కెంతయో ఆశ్చర్యమును కలిగించుచున్నది. ఇట్టి శ్రద్ధగలవారికే జ్ఞానము సిద్ధించును. కాన, శ్రద్ధాళుని చూచిన, వారికి ఆనందమును, తృప్తిని అందించుటే నాకు ఆనందము; కాన తెలిపెదను, వినుము'' అని ఆసనముపై స్థిరముగా సుఖాసనమువైచి కూర్చొనెను. పరీక్షితుడు కూడనూ తన హృదయమును వికసింపజేసుకొని చెవులను చాటలువలె నిక్కపరచుకొని వినుటకు సిద్ధమాయెను. "నాయనా! దృపద మహారాజు తన యేకైక పుత్రికయైన ద్రౌపదికి పెండ్లిచేయతలంచి యెన్నియో సంబంధములు విచారించెను. అయితే తన కూమార్తెకు తగిన వరుడు చిక్కకుండుటచే తాను స్వయంవరమును వక దానిని యేర్పరచెను. అందులో అనేకమంది బలవంతులగు రాజులు, సౌందర్య వంతులైన విద్యావంతులు, పాల్గొని యెవరికివారు ఆ త్రైలోక్య సుందరని పెండ్లాడవలెనని వారివారి ధన, దేహబలములను ప్రదర్శించుకొనుచూ సభలో చేరుచుండిరి. ఆ సభలో పైభాగమున వక యంత్రము గట్టబడియుండెను: ఈ యంత్రమున కట్టబడిన మత్స్యమును లక్ష్యము తప్పక యెవరు భేదింతురో వారలకు ద్రౌపదినిచ్చి వివాహమొనరింతునని దృపద మహారాజు సంకల్పము. ఇట్టి మహారాజుగారి నిబంధన ననుసరించి భేదించి ద్రౌపదిని వివాహమాడవలెనని రాజ్యమున యెటుచూచిననూ పరరాజులు క్రిక్కిరిసి తిరుగాడుచుండిరి.

ఈ వింత విషయము బ్రాహ్మణుల వేషమున నున్న మితాతలకు తెలిసియూ, వారికి తగిన సమయము కానందున ప్రయత్నించలేకపోయిరి. కానీ, ఇట్టి వీర పోరాటము జరుగుచుండ చూచుచూ వూరకుండుట క్షత్రియ లక్షణము కానందున, అర్జునుడు అనగా మితాతగారు, అన్నగారితో సంప్రతించి స్వయం వరమునకు వెళ్ళుటకు సంసిద్ధులై బ్రాహ్మణవేషములతోనే సభా మధ్యమున ఐదుగురు సింహములవలె వారి తేజస్సు కాంతిగ్రమ్ముచుండ, సభలో చేరిన వారి దృష్టి అంతయూ వీరలపై పడి కొందరు వారి తేజస్సును చూచి, మహా వీరులనియూ, వారి వేషములను చూచి యెవరో వంట

బ్రాహ్మణులవలె వున్నారనియూ ఈ రీతిగా పరిపరి విధముల సంభాషణలు, గుసగుసలు మొదలుపెట్టిరి. ఆ సమావేశమునకు కృష్ణబలరాములు కూడనూ వచ్చి యుండిరి. అయితే సభలో ఉన్నంతకాలము కృష్ణుని దృష్టి అర్జునిపై పడుట బలరాముడు గ్రహించి, వారిలో వారు, బలరామ కృష్ణులు యేదో చెవులలో చెప్పుకొను చుండెడివారు.

కడకు స్వయంవరవ్రతము ప్రారంభమాయెను. ఒక్కొక్కరూ ఛాయదగ్గరవెళ్ళి, వారి శక్తి సామర్థ్యములను ప్రవేశపెట్టి విఫలులై తెల్లమొఖములతో అవమానముతో నిరాశతో వెనుకకు తిరిగి వచ్చి వారి వారి స్థానమున తలలు వంచి, విచారగ్రస్తులై కూర్చొను చుండెడివారు. **అయితే కృష్ణుడు స్వయంవరమునకు వచ్చెను. కానీ యంత్రమును కొట్టుటకు పూనుకోలేదు. అతనే సంకల్పించియుండిన అవలీలగా భేదించి యుండెడివాడు, కానీ అతని సంకల్పము యేమో యెవరు చెప్పగలరు?** అంతలో మీ తాతగారైన అర్జునుడు లేచి యంత్రమునకు సమీపమున వచ్చుచుండ, సభ అంతయూ యేదో వక మెరుపు మెరసినట్లు తేజస్సు ప్రకాశించెను. **ద్రౌపది తలయెత్తి చూచెను. ఆమె మనసు ఆ ప్రకాశమున లీనమాయెను. క్షణకాలములో ద్రౌపది పుష్పమాలాలంకృతురాలై మీ తాత మెడలో మాలనువేసి చేయిపట్టెను.** అందరి రాజులమధ్య బ్రాహ్మణవేషమున నున్న అర్జునుడు ద్రౌపది చేయిపట్టి సభామంటపమున వచ్చిన తక్షణమే పరాజయులైన రాజులు సోర్వలేక, ఇది న్యాయమైన స్వయంవరము కాదని యునూ, ఈ బక్క బ్రాహ్మణుడు ఈ స్వయంవరమున ప్రవేశింప వీలులేదనియునూ సాకులు కల్పించకొని రాజులందరూ యేకమై మీతాతయైన అర్జునిపై పడిరి. ఇంతలో భీముడు వక పెద్ద వృక్షమును లాగి, చేరిన రాజులందరినీ బాద ప్రారంభించెను.

కానీ మీతాత ద్రౌపదిని తీసుకొని తమ వసతి గృహమైన కుమ్మరివారింటికి చేరగనే అన్నయైన ధర్మజుడు జరిగిన విజయమునకు సంతసించుచూ, ఆనందముగ వకరికొకరు ముచ్చటించు చుండగ, పీతాంబరధారులై బలరామకృష్ణులు ఆ కుమ్మరి గృహమును ప్రవేశించి వృద్ధురాలైన మీతాతల తల్లి **కుంతికి నమస్కరించి, "అత్తా మేము మీ అల్లుళ్ళము;** కృష్ణబలరాములము; నందయశోదల పుత్రులము.'' అని వారికి వారే తెలుపుకొనుచూ తరువాత ధర్మజునకు నమస్కరించి చిన్నబాలునివలె అమాయకునివలె అర్జునిని చెంతవచ్చి. "బావా! నేను నిన్నెరుగుదును. కానీ, నన్ను నీవెరుగవు. ఇదే నిన్ను చూచుట మొదలు. నేను వసుదేవుని కుమారుడను. నా పేరు శ్రీకృష్ణుడు. మీకంటే నేను చిన్నవాడనే. అయినా మీరు ఈనాడు దిగ్విజయమును గాంచుటచూచి వీరు నిజముగా పాండవులే అయివుందురనియూ మీరు లక్కగృహమునుండి తప్పించుకొని క్షేమముగా యున్నారనియూ తలంచితిని. మిమ్ములను ఆ సభలో చూచినది మొదలు నా కెందులకో మీరు అర్జునుడే అయివుందురన్న నిశ్చయము నన్ను ఆనందపరచి అన్నతో అనగా, బలరాములతో తెలుపు చుంటిని.

"కడకు మిమ్ములను కలిసికొన గలిగితిని చాలా ఆనందము. **అమ్మాయి చక్కని గుణవంతురాలేకాక మహా తెలివితేటలుగలది", అని పలకరించి,** మీ తాతయైన అర్జునుని మాత్రమే వక ప్రక్కకు పిలిచి, మెల్లగా చెవిలో ఈ రీతిగా తెలిపెను. యేమన, "బావా! మీరిప్పుడే ప్రకటమగుట మంచిదికాదు. ఇంకనూ కొంతకాలము అందందు నివసింపుడు'' అని ప్రేమతో తెలిపి శెలవు తీసుకొని బలరామకృష్ణులు బయలుదేరిరి.

"ఆనాటితో కృష్ణార్జునుల ప్రేమ పెరిగి అది వృక్షమై కాయలై ఫలములై మధురమైన రసమును ఆరగించి ఆనందించి, అందులో లీనమయిరి; వింటివా? మొదలు కృష్ణుడు మీతాతను చూచుట ద్రౌపది స్వయంవర మంటపమందే, చూచితివా? **వారిచేరిక కల్యాణ మంటపమున కనుకనే, అర్జునుడు జీవిత మంతయూ**

నిత్య భగవత్ సన్నిధియను కల్యాణమున పారమార్థ ప్రాప్తిని అనుభవించెను, అంతియేకాక అతని నిమిత్త మాత్రునిగ నిలబెట్టి లోకమునకే జ్ఞానమును బోధించెను. వింటివా? కొంటి కృష్ణుడు మీ తాతలతో యెంత ఆప్యాయముగ నుండెడివాడో''! అని, బయలుదేరుటకు నడుచుకొను చుండినటుల కనుపించిన వ్యాసులవారిని చూడగనే పరీక్షిత్ తన కన్నులవెంట కారుచుండిన నీరును అంగవస్త్రముతో తుడుచుకొనుచు,

"స్వామీ! మీరు కృష్ణపరమాత్ముని చరిత్రను చెప్పి భావజగత్తులో అతనిని సాక్షాత్కరింప చేయుచున్నారు. మీరు పూరకుండుటచే నాకు చాలా బాధకలుగుచున్నది. ఆలీలామానుష విగ్రహుడైన శ్రీ కృష్ణుడు మాతాతలతో ఇంకా యే యే సమయములందు యేరీతిగా కలసిమెలసి కాపాడుచుండెనో తెలిపి, నన్ను కృతార్థుని చేయుము. నా నిద్ర నేత్రములను విడచి భగవంతుని వెతుక బోయి నట్లున్నది. ఈ రాత్రి పూర్తిగా, తమరు అతని స్మృతి కలుగ జేయుడు; నాపై కొంత అనుగ్రహము చూపుము." అని ప్రార్థించు పరీక్షితుని శ్రద్ధాభక్తిని చూచి వ్యాసులవారు మనసు మార్చుకొని, ''నాయనా! **కృష్ణుని అమానుష లీలలు వకటి రెండైన చెప్పవచ్చును. వక్కొక్క రోమ రోమమునకు కోటి కోటి జిహ్వలుండి కల్పాంతమువరకూ వర్ణించిననూ అతని లీలలు తరుగవు, సర్వదేవతలు అతనిచెంత చేతులు జోడించి నిలుచుండెడివారు. అతడు వకతూరి తమ భక్తులను ఆకాశముపై నెక్కించెడివాడు. అంతలోనే క్రిందికి పెట్టెడివాడు, లోకమునే వక బొమ్మలాటగ ఆడించెడివాడు. అతను యెట్టి సమయమందైననూ చిరునవ్వులు చిందులు గొలుపు వాడేకానీ విచారములుకానీ, సంతాపములు కానీ, అతను యెరుగడు. వకప్పుడు సామాన్య మానవునివలె అమాయకునివలె బంధువునివలె మిత్రునివలె రాజువలె గొల్లబాలునివలె వకటేమి అన్నిటియందూ అన్ని విధముల మెలగగల శక్తి యుక్తులుగల పామరునివలె వ్యవహరించెడివాడు.**

(భా.వా. పు.97/101)

కేనోపనిషత్తు

సామవేదీయ తలవాకారాన్తర్భాగమునకు సంబంధించి యుండుట వలన దీనికే తలవాకారోపనిషత్తనికూడా పేరుకలదు. ఈ ఉపనిషత్తు మొదటి ఖండమున మొదటి శ్లోకము **కేన అను పదముతో ఆరంభమగుట వలన కేనోపనిషత్తనికూడా పిలువబడుచున్నది.**

శ్లో॥ కేనేషితం పతతి ప్రేషితం మనః కేన ప్రాణాః ప్రథమః ప్రైతియుక్తః
కేనేషితాం వాచమిమాం వదన్తి చిక్షుః శ్రోతం క ఉదేవో యునక్తిః॥

శ్రోత్రత్వ క్చక్షుర్జిహ్వా ఘ్రాణములను పంచేద్రియము లకు శబ్ద, స్పర్శరూపరసగంధము లనునవి వరుసగా విషయములగుచున్నవి. ప్రపంచమునందు జ్ఞేయములగు విషయములన్నియు, ఈ ఐదింటిలో అవాంతర భేదములనందున్నవి. విషయములను తెలిసికొనగల అంతఃకరణ శక్తి మనస్సని పిలువబడుచున్నది. **అట్టి మనస్సు జ్ఞానేంద్రియములద్వారా బహిర్గతమై ఆ విషయములతో సంబంధించినపుడు ఆ ఆకారమును పొందును. వివిధ విషయాకారములను పొందిన మానసికస్థితి వృత్తి అనబడును.**

(ఉ. వా. పు. 50)

కేశవ

కేశవా అనగా త్రిమూర్తి స్వరూపుడని అర్థం.

(గీ.పు.37)

క్లేశము

(చూ॥ పంచక్లేశములు)

కైక/కైకేయి

దుస్సంగానికి దూరంగా ఉండాలి. దుస్సంగములో చేరితే మీలో ఉన్న పవిత్రమైన భావములు నిర్మూలమైపోతాయి.

కైలాసము

కైక మంధర మాటలను వినడంచేత తన స్వంత కుమారుడైన భరతుని కన్న మిన్నగా ప్రేమించిన రామున్ని అరణ్యానికి పంపించింది. మంధర మాటలచేత ఆమె బుద్ధిలో మార్పు కలిగింది. అనగా, బుద్ధిదోషము కలిగినప్పుడు అసత్యం సత్యంగా గోచరిస్తుంది. సంగ దోషముచేత బుద్ధిదోషం ఏర్పడుతుంది. కనుకనే నేను అప్పుడప్పుడు పిల్లలకు చెపుతుంటాను - ఇతరులతో ఎక్కువగా కలవకండని. చిన్న వయస్సు నుండియే దుస్సంగానికి దూరంగా ఉండాలి. సత్సంగంలో చేరాలి. అహోరాత్రములు పుణ్యకార్యముల నాచరించాలి. నిత్యానిత్య విషయ పరిశీలన చేయాలి.

(స.సా. న. 99 పు. 288)

(చూ॥ మంథర)

కైలాసము

కైలాసం అంటే స్వచ్ఛమైన పరిశుద్ధ స్ఫటిక స్వరూపం, నిష్కళంక పరమ పవిత్ర హృదయానికి ప్రతీకం. కైలాసగిరి నివాసుడు శంకరుడు. ఈశ్వరుడు పవిత్ర హృదయవాసి.

(త.పు.39)

"మనసులో ఆనందాన్ని అభివృద్ధి **పరచుకుంటే అదే కైలాసం. కైలాసమును హిమాచల పర్వతమన్నారు. 'హిమ' అంటే మంచుగడ్డ.** చల్లదనం మంచు స్వభావం. తెల్లగా వుంటుంది. మంచు. తెలుపు పవిత్రతకు చిహ్నం. 'అచలము' అనగా స్థిరంగా ఉండేవి. చల్లదనమంటే ప్రశాంతము. అనగా పరిశుద్ధము. ప్రశాంతము, నిశ్చలము అయిన హృదయమే హిమాచలము. మనలో ఎప్పుడు ప్రశాంతత ఏర్పడుతుందో, ఎప్పుడు నిశ్చలత్వం కలుగుతుందో, అప్పుడే మన హృదయం ఈశ్వరుని నివాసమైన హిమాచల పర్వతమవుతుంది."

(సా లీ.త పు.119)

మీ హృదయమే కైలాసం. అదే భగవంతుని నివాసం. అదే భగవంతుని విలాసం. కనుక, హృదయాన్ని పవిత్రంగా ఉంచుకోవాలి. నిత్యమూ దానిని విశ్వాసమనే 'విమ్'వేసి తోమాలి, ప్రేమ అనే 'జలం'తో పరిశుభ్రం చేయాలి. అప్పుడే అందులో దివ్యత్వం ప్రకాశిస్తుంది. మీ హృదయాన్ని దైవంతో ఏకం చేసినప్పుడు మీకు కలిగే ఆనందం ఇంత, అంత అని వర్ణించడానికి వీలుకాదు. అది అనుభవిస్తేనే తెలుస్తుంది.

(స.సా జ. 2000 పు. 22)

(చూ॥ హృదయవాసి)

కొండమరాజు

ఈ శరీరమునకు తల్లి ఈశ్వరమ్మ. మొట్టమొదట ఆమె పేరు నామగిరమ్మ. కానీ, వివాహమైన తరువాత ఈ శరీరమునకు తాత అయినటువంటి కొండమరాజు ఆమెకు ఈశ్వరమ్మ అని పేరు పెట్టాడు. ఆయన మహా జ్ఞాని, దివ్యదృష్టి గలవాడు. నిరంతరము వెంకావధూతను ఆరాధన చేసేవాడు. ఆయనకు పెద వెంకమరాజు, చిన వెంకమరాజు అని ఇరువురు కుమారులు. **పెద వెంకమరాజు ఈ శరీరమునకు తండ్రి.** కొండమరాజు తమ్మునికి కూడా ఇరువురు కుమారులుండేవారు. మొదటివాడు సుబ్బరాజు, రెండవవాడు వెంకట్రామరాజు. ఈ నలుగురు కుమారులు కలసిమెలసి జీవించేవారు. వారిది ఉమ్మడి కుటుంబం. ఐతే, కుమారులు అన్నదమ్ములవుతారుగాని, వచ్చిన కోడళ్ళు అక్కచెల్లెళ్ళు అవుతారా? కొంతకాలానికి ఆడవారివలన ఆ నల్గురు అన్నదమ్ములలో అభిప్రాయ భేదాలు కలిగి, విడిపోవాలని సంకల్పించుకున్నారు. "ఉన్నదంతా మీరు నల్గురూ పంచుకోండి, నాకేమీ అక్కర లేదు" అన్నాడు కొండమరాజు. "మీరు మాలో ఒక్కొక్కరి దగ్గర ఆరేసి నెలల చొప్పున కాలం గడపండి" అని కోరారు కొడుకులు. కానీ, కొండమరాజు అంగీకరించ లేదు. "నేను మీ ఇళ్ళకు రాను, మీ అన్నము నాకు అక్కర లేదు. నేను సంపాదించినది మీరు నల్గురూ సమంగా పంచుకోండి. ఐతే ఒక్క ఆస్తిని మాత్రం నాకివ్వండి" అన్నాడు. ఏమిటది? అని కుమారులు అడుగగా, "సత్యంను నాకివ్వండి. ఈ అబ్బాయి ఒక్కడూ నా దగ్గరుంటే చాలు, నాకింక ఎవ్వరూ అక్కర్లేదు" అన్నాడు. "సత్యం! నా వెంట వస్తావా?" అని అడిగాడు. తప్పక వస్తానని

అతని వెంట వెళ్ళాను. అప్పుడు ఈ శరీరమునకు ఎనిమిది సంవత్సరములు.

ఆయన ఒక చిన్న గది తీసుకున్నాడు. ప్రతి రోజూ నా పని ఏమిటి? తెల్లవారి లేవటం, పాత్రలు తోమటం, అన్నము, కూరలు వండటం, తిరిగి బుక్కపట్నం స్కూలుకు పరుగెత్తుకుని పోవటం. అక్కడ మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనానికి గంట కొట్టేవారు. అప్పుడు అక్కడి నుండి పుట్టపర్తికి పరుగెత్తుకొని వచ్చి ఆయనకు వడ్డించి, నేను భుజించి తిరిగి పరుగెత్తుకొని పోయేవాడిని. ఈ విధంగా, ప్రతి రోజు టైమ్ తప్పకుండా చేస్తూ వచ్చాను. పుట్టినప్పటి నుండి నేను తీపి ముట్టలేదు. ఎందుకంటే, నేను తీపి తీసుకుంటే వేలాది భక్తులు తీపులు తీసుకొని వస్తారు. నేను ఒక ఫలమును కూడా తీసుకునేవాడను కాదు. పాలుగాని, పెరుగుగాని ముట్టేవాడను కాదు. అతి సామాన్యమైన ఆహారం - ఇంత సంకటి, ఇంత వేరుసెనగ పచ్చడి - భుజించేవాడిని. కొండమరాజు కూడా దీనికి తృప్తి పడేవాడు. "నీవు ఏది తింటావో అదే నాకు పెట్టు నాయనా!" అనేవాడు.

నేను తెల్లవారు ఝామున లేస్తూనే సంకటి చేసి, పచ్చడి, లేక ఆకు కూర వండి పెట్టేవాడిని. నా వంట అంటే ఆ వీధివారందరికీ చాల ఇష్టం. నేను బుక్కపట్నం నుండి ఇంటికి వచ్చేటప్పటికి ఆ వీధిలో జ్వరం వచ్చినవారందరూ వణుకుతూ ఇంటి ముందు లైనుగా కూర్చునేవారు. నేను వస్తూనే కొండమరాజు "నాయనా! వారందరూ జ్వరంతో బాధ పడుతున్నారు. నీవు పెట్టే మిరియాల చారు కావాలట. తక్షణమే చేసి వారికిచ్చి పంపించు" అనేవాడు. తక్షణమే నేను మిరియాల చారు చేసి వారి గ్లాసుల్లో పోసేవాడిని. దానితో జ్వరం తగ్గిపోయిందని వారు ఆనందించేవారు. పాత కాలంలో పల్లెల్లో ఉన్న పద్ధతులకు, ఇప్పుడున్న పద్ధతులకు చాల వ్యత్యాసం ఉన్నది. ఉగాది, సంక్రాంతి మొదలైన పండుగలు వచ్చినప్పుడు ఇళ్లకు చాకలి, మంగలి వచ్చి భోజనం తీసుకుపోయేవారు. ఇంట్లో నేను, కొండమరాజు తప్ప ఎవ్వరూ లేరు. కనుక, పండుగ రోజుల్లో నేనే అందరికీ వంట చేసేవాడిని. పండుగలు వచ్చినప్పుడు పార్వతమ్మ, వెంకమ్మ, ఈశ్వరమ్మ వారి వారి ఇళ్ళలో బొబ్బట్లు చేసుకునేవారు. వారు చేస్తున్నప్పుడు నేను మాత్రం ఎందుకు చేయకూడదని నేను కూడా ముసలాయనకు బొబ్బట్లు చేసి పెట్టేవాడిని. చాకలికి, మంగలికి కూడా బాగా పెట్టి పంపేవాడిని. ఒక పండుగ రోజున నేను, ముసలాయన భోజనం చేస్తున్న సమయంలో ఏదో పనిపైన పెద వెంకమరాజు ఇంటికి వచ్చాడు. కొండమరాజు, "నాయనా! ఈ పండుగ రోజున నీవు కూడా ఇక్కడే మాతోపాటు భోజనం చేయి" అన్నాడు. ఆయన కూడా కూర్చుని భోజనంచేశాడు. వంటకాలు చాల రుచిగా ఉన్నాయని మెచ్చుకున్నాడు. "ఈ ఆడవారికి ఏమి జబ్బోగాని, వంట రుచిగా చేయనే చేయరు" అన్నాడు. ఇంటికి పోయి ఈశ్వరమ్మను, వెంకమ్మను ఊరికే తిట్టాడు. "సత్యంను చూడండి, ఎంత బాగా చేస్తున్నాడు! రేపటి నుండి మీరు సత్యం వద్దకు వెళ్ళి అతను ఏమి చేస్తే అది తీసుకు రండి. అదే నేను తింటాను" అన్నాడు. వారు వచ్చి, "నీవల్ల ఇంట్లో మాకుతిట్లు పడుతున్నాయి. ఎందుకింత మంచిగా చేస్తావు వంట?" అని నన్ను తిట్టారు.

ఈ విధంగా కొంతకాలం జరిగింది. ఈ దేహానికి 9వ సంవత్సరం వచ్చింది. అప్పుడు ఈ దేహానికి శేషమరాజు అనే సోదరుడుండేవాడు. కొండమరాజు నన్ను దగ్గర పెట్టుకొని నాకు చదువు లేకుండా చేస్తున్నాడని భావించి, నన్ను తీసుకుపోయి కమలాపురంలో చదివిస్తానన్నాడు. ఈ చదువు సంధ్యలు ఏమీ అక్కర్లేదని కొండమరాజు అడ్డుపెట్టాడు. కొండమరాజుకు నేనంటే చాల ఇష్టంగా ఉండేది. అతడు దివ్యదృష్టి కల్గినవాడు, మహాజ్ఞాని కాబట్టి, నన్ను మాత్రమే కోరుకున్నాడు. **ఒకనాడు ఆయన పెద వెంకమరాజును పిలిచి, "నీ భార్య పేరు ఈశ్వరమ్మ అని మార్చుకో" అన్నాడు. అతని ఉద్దేశ్యమేమిటి? ఆమె ఈశ్వరునికి అమ్మ కాబట్టి ఆ పేరుపెట్టమన్నాడు. పెద వెంకమరాజుకు ఇదేమీ అర్థం కాలేదు. అయినా, నాన్నగారు చెప్పారు కదా అని ఆమెకు ఆ పేరు పెట్టాడు.**

కొండమరాజు

కొండమరాజు 112 సంవత్సరాలు జీవించాడు. ఆ వయస్సులో కూడా ఆయన కన్నులు, చెవులు, కాళ్ళు, చేతులు చక్కగా ఉండినాయి. ఆయన పాతమందిరం నుండి క్రొత్త మందిరానికి కట్టు సహాయమైనా లేకుండా నడచి వచ్చేవాడు. "ఎందుకు ఇలా వస్తావు? దారిలో పశువులు అడ్డురావచ్చు. ఒక కట్టు వెంట తెచ్చుకోవచ్చు కదా" అనేవాడిని. "నాకెందుకు స్వామీ కట్టు? భగవంతుడిచ్చిన కాళ్ళు చక్కగా ఉన్నాయి" అనేవాడు. ఆయనకు స్వామి అంటే చాల భక్తి. తెల్లవారు ఝామునే ఐదు గంటలకు వచ్చేవాడు. ఆయన వస్తున్నాడని చూసి నేను ఊరికే దుప్పటి కప్పుకుని నిద్ర పోతున్నట్లుగా నటించేవాడిని. ఆయన మెల్లగా వచ్చి నా పాదాలపైన దుప్పటి తీసి నమస్కారం చేసుకుని వెళ్ళిపోయేవాడు. ఆయన నా పాదాలకు నమస్కరించడం ఎవరైనా గ్రామస్థులు చూస్తే, 112 సంవత్సరాల వృద్ధుడు ఈ చిన్న పిల్లవానికి నమస్కారం చేస్తున్నాడే, అని ఏమైనా అనుకుంటారేమోనని ఆవిధంగా చేసేవాడు.

నేను ఒక సాయంకాలం పుట్టపర్తికి వెళ్ళాను. ఆయన మంచంపైన కూర్చుని పాటలు పాడుతున్నాడు. ఆయనకు రామాయణంలో లక్ష్మణ మూర్ఛకు సంబంధించిన సన్నివేశమంటే చాల ఇష్టం. యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు రాముడు, **"లక్ష్మణా! ఈ ప్రపంచంలో వెతికితే సీతవంటి భార్యయైనా చిక్కవచ్చు, కౌసల్యవంటి తల్లియైనా చిక్కవచ్చు. కానీ, నీవంటి సోదరుడు నాకు చిక్కడు"** అని ఎంతగానో విచారించాడు. ఈ సన్నివేశాన్ని వర్ణించుకుంటూ ఆయన పాటలు పాడుతున్నాడు. అప్పుడు నేను వెళ్ళాను. "ఏమి చేస్తున్నారు తాతగారూ?" అని అడిగాను. "స్వామీ, వచ్చారా!" అని ఆనందంతో మంచంపై నుండి దిగి పాదాలపై పడ్డాడు. **"స్వామీ! నాకు తెలుసు - మీరు సామాన్యమైన బిడ్డ కాదు, సాక్షాత్తు ఈశ్వరుడే. మమ్మల్ని తరింపజేసే నిమిత్తమై మా వంశంలో ఉద్భవించారు. నాకొక చిన్న కోరిక ఉన్నది. అలనాడు దశరథుడు రాముని చేతులతో నీరు త్రాగి ప్రాణం వదలాలని ఆశించాడు. కానీ, అతనికి అట్టి ప్రాప్తి లేకపోయింది. జటాయువుకు మాత్రమే అట్టి ప్రాప్తి చిక్కింది. నాకు కూడా అట్టి ప్రాప్తిని అనుగ్రహించమని ప్రార్థిస్తున్నాను. నేను ప్రాణం వదిలే ముందు మీ అమృత హస్తంతో నా నోటిలో నీరు పోయాలి" అన్నాడు. తప్పక అదే విధంగా జరుగుతుందని అతనికి మాట ఇచ్చాను.**

ఒక వారం తరువాత నేను సుబ్బమ్మ ఇంటికి వెళ్ళి, అక్కడి నుండి తిరిగి కొండమరాజు ఇంటికి వెళ్ళాను. అతను నేను వస్తున్న విషయాన్ని గుర్తించి, ఈశ్వరమ్మను పిలిపించాడు. "ఈశ్వరమ్మా! నేనింక ఉండను. కనుకనే, భగవంతుడు తన మాటను నిలబెట్టుకోవడానికి వస్తున్నాడు" అన్నాడు. **"ఏమిటి మామా, ఎక్కడున్నాడు భగవంతుడు? ఎట్లా వస్తాడు?" అని లౌకికమైన రీతిలో అమాయకంగా మాట్లాడింది ఈశ్వరమ్మ. "పిచ్చిదానా, ఇంకా సత్యం నీ కుమారుడనే భ్రాంతిలోనే ఉన్నావా? అదిగో, దేవుడు వస్తున్నాడు, చూడు" అని నన్ను చూపించాడు. ఆమెకు కూడా తెలుసు. స్వామియొక్క మానవాతీత శక్తులను ఆమె కూడా చాల పర్యాయములు చూసింది. కానీ, భ్రాంతి చేత పుత్ర వాత్సల్యంలో మునిగిపోయేది. యశోద కూడా అట్లనే. కృష్ణుని నోటిలో పదునాల్గు లోకములు చూసినప్పటికీ అది "కలయో, వైష్ణవమాయయో..." అనుకుంది.**

కొండమరాజు "ఈశ్వరమ్మా! నన్ను తీసుకుపోవడానికి దేవుడొస్తున్నాడు. నాకిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి వస్తున్నాడు. ఒక గ్లాసులో నీరు తీసుకురా. అతను నా నోట్లో పోస్తాడు, నేను వెళ్ళిపోతాను" అన్నాడు. "మీకు జ్వరము లేదు, జబ్బు లేదు. ఎట్లా పోతారు?" అన్నది ఈశ్వరమ్మ. "మరణమునకు కారణాలు లేవు. అది దైవాజ్ఞ ప్రకారం జరుగుతుంది. కాబట్టి నీవు కొంచెం నీరు తీసుకురా" అన్నాడు. ఈ ముసలాయనతో వాదించడ మెందుకని ఈశ్వరమ్మ ఆయన కోరినట్లుగా ఒక గ్లాసులో నీరు తీసుకు వచ్చింది.

కొండమరాజు క్రింద కూర్చున్నాడు. నన్ను మంచంపైన కూర్చొమ్మన్నాడు. నా మోకాళ్ళపైన తన తల పెట్టు

కున్నాడు. **"స్వామీ! నా మొర ఒకటి ఆలకించండి" అన్నాడు. ~~ఈశ్వరమ్మ~~ కూడా వింటున్నది. "ఏమిటి, ఇంత పెద్దాయన మనుమణ్ణి ఇంతగా గౌరవిస్తున్నాడే"** అని తనలో తాను ఆశ్చర్యపోయింది. కొండమరాజు **"స్వామీ! నేను చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ వచ్చాను.** ఏ పూటకాపూట సంపాదించిన డబ్బుతో మనమిద్దరం తినేవారము. కానీ, నేను ఎవరికైనా కాసో, బొట్టో, అణానో అప్పుగా ఉండవచ్చు. కనుక, **నేను ఋణంలో పోకుండా నన్ను రక్షించండి"** అన్నాడు. **తప్పక నేను రక్షిస్తానని చెప్పి, టంబ్లరు తీసుకొని ఆయనకు నీరు త్రాపుతూ వచ్చాను. త్రాపుతూ ఉండగనే ఆయన ప్రాణం పోయింది. ఆయన మనోభీష్టం నెరవేరింది.**

పోయే ముందు కొండమరాజు, **"~~ఈశ్వరమ్మా~~! నీవింకా భౌతిక దేహాన్ని ఆధారం చేసుకుని బంధుత్వమనే భ్రాంతిలో ఉన్నావు. శరీర సంబంధ బాంధవ్యములన్నీ కదలిపోయే మేఘముల వంటివి. ఆత్మసంబంధం మాత్రమే శాశ్వతమైనది. కనుక, దేహాభిమానమును తగ్గించుకో, ఆత్మాభిమానమును పెంచుకో"** అని పలుకుతూ ఆమె తలపై చేయి పెట్టాడు. ఆనాటి నుండి ఆమె ఇంటిని వదలిపెట్టి ప్రశాంతి నిలయంలో వచ్చి నివసించసాగింది. ప్రశాంతి నిలయంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వచ్చి స్వామితో మాట్లాడేది. **ఆమె కూడా స్వామి యొక్క ~~ఈశ్వరత్వమును~~ చక్కగా గుర్తించింది.** ఒక్కొక్కతూరి స్వామి ~~ఈశ్వరు~~నివలె కనిపిస్తే, "స్వామీ, ఈ పాములన్నీ ఏమిటి?" అని కంగారు పడేది. "నేనేమీ వేసుకోలేదే!" అని ఏమీ తెలియనట్లుగా నటించేవాడిని. తరువాత చూస్తే ఏమీ ఉండేది కాదు. ఈ విధంగా **ఆమె అనేక పర్యాయములు స్వామియొక్క దివ్యత్వాన్ని ప్రత్యక్షంగా చూసింది. కౌసల్య కూడా అట్లనే, యశోద కూడా అట్లనే.** కానీ, **వీరందరూ పుత్రవాత్సల్యంచేత మాయ కప్పినట్లు జీవిస్తూ వచ్చారు.**

(స. సా. జూన్ 99 పు. 143/146)

కొడువ

సాధుజనులను చూచి చొకను చేతురు
వారికేమి కొడువ వసుధయందు
కుంజరమును జూచి కుక్కలెన్నో మొరుగు
దానికేమి కొడువ ధరణియందు

కోకిలయొక్క గానము విని కాకులు ఎంతో అరుస్తాయి. అంత మాత్రంచేత కోకిల తన గానం మానుకోవడం జరగదు. హంసలను చూసి కొంగ లెంతో పరిహసిస్తాయి. అంత మాత్రం చేత హంస ఘనత ఏమీ తగ్గిపోదు. అదేవిధంగా, మానవత్వంయొక్క దివ్యత్వమును గుర్తించుకున్న వ్యక్తి మానాభిమానములకు, కీర్తిప్రతిష్ఠలకు ఏ మాత్రము లొంగడు, పొంగడు.

(స. స్రా. ఏ. 99 పు. 97)

కొబ్బరికాయ

కొబ్బరికాయలోని నీటిని ప్రాపంచిక వాంఛతో పోల్చవచ్చును. కాయలో ఈ నీరు ఉన్నంత వరకూ, కొబ్బరి పెంకును అంటి పెట్టుకొని ఉన్నంత వరకూ, కాయను నాటిన మళ్ళీ మొలకెత్తును.కాయను నాటకుండా ఉంచిన, **కొంతకాలమునకు అందులోని నీరు ఇగిరిపోవును. కొబ్బరి, పెంకునుండి విడివడును. అటువంటి కాయను నాటినా మొలకెత్తదు. కొబ్బరి కాయకు ఉన్న మూడు నేత్రములు దానిని ఎంచుకొనుటకు కారణము. రెండు నేత్రములను భౌతిక నేత్రములతో పోల్చవచ్చును. మూడవది జ్ఞాన నేత్రము (ఇది అచ్ఛాదితమైనది).** కాయను పగులగొట్టుట అనగా ముకుళించిన హృదయమును ఛేదించి అంతర్భాగములను భగవంతునికి అర్పించుట. అదే సంపూర్ణసమర్పణ. అనగా భగవంతుని ముందు ఏదీ మరుగుపరచబడుట లేదు. ఒక పర్యాయము పగులగొట్టబడిన కొబ్బరి కాయ ఇక ఎన్నటికి మొలకెత్తదు.

(ప. పు.135)

కొలబద్ద

కొలబద్ద

గొప్పతనమునకు కొలబద్ద: మానవుడు విషయ వాంఛలను ఎంతవరకు అదుపులో పెట్టుకొన్నాడనునదే అతని గొప్పతనమునకు కొలబద్ద.

(ఆ.శా పు.48)

కోతి

(చూ॥ మనస్సు)

కోపము

(చూ॥ నన్నేపొందుదురు, క్షమ)

కోరక/కోరికలు

కోరు కోరికలన్నియు తీరుచున్న
భక్తి దైవమున హెచ్చురక్తి హెచ్చు
కోరు కోరికలెవ్వేని తీరకున్న
భక్తి తరుగును దైవ విరక్తి పెరుగు॥

(సా॥ పు. 563)

కోరిక తీరిన వేళ ననుగొప్పగ పొగడెదరోయి
కోరిక తీరకపోతే ఊరక తెగడుదురోయి.

ఏదైనా కోరిక తీరితే ఎంతో పొగుడుతారు. కోరిక తీరకపోతే ఊరక తెగడుదురోయి. ఇది మానవుని బలహీనత. ఆత్మలో ద్వేష భావములకు, క్రోధ భావములకు ఏ మాత్రము అవకాశములేదు. నిర్మలంగా ఉంటుంది. ఆ నిర్మలత్వమే నిన్ను రక్షిస్తుంది.

(ద. య. స. పు.94)

కొలది కొలదిగ పుట్టును తొలుత చెదలు
కొరికి తిని వేయు త్వరలోనే కొయ్యనంత
దుష్టగుణములు సూక్ష్మమై తోచు మొదలు
పిదప నాశంబు చేయు నేపెద్దనయిన

కోరికలనే దారాల చేరికచేతనే మనస్సనే వస్త్రం తయారవుతుంది. కోరిక అనే ఒక్కొక్క దారం తీసేస్తే మనస్సనే వస్త్రం ఉండదు. మనస్సుయొక్క వికృత రూపమే మోహం. మోహక్షయమే మోక్షము.

"మనయేవమనుష్యాణాం కారణం బంధమోక్షయోః" మానవుడు లౌకిక జీవితంలో బంధితుడవ్వటానికీ, విముక్తుడవ్వటానికీ మనస్సే కారణం. తీరిన ప్రతికోరికా మరో కొత్త కోరికకు అంకురమై చెదలవలె పెరిగి మానవుడు దుర్భావ, దుర్మార్గం, అశాంతికి గురౌతాడు.

రైల్వేప్లాట్‌ఫారమ్స్‌మీద "Less luggage more comfort; make travel a pleasure"అనే ప్రకటనను చూస్తూ ఉంటారు. జీవితమనే ప్రయాణంలో కోరికలనే Luggage ఎంత తక్కువ వుంటే ప్రయాణం అంత సుఖంగా సాగుతుంది.

ఆహార నిద్రాభయమైథునాదులు మానవులకేకాదు. పశుపక్షి మృగాలకి కూడా ఉంటాయి. జీవితం వీటికే పరిమితం చేసుకున్న మానవునికీ, మృగానికీ తేడాలేదు. మానవుడికి బుద్ధి దైవమిచ్చిన వరం. **"బుద్ధిగ్రాహ్యమతీంద్రియం"** ఆత్మయొక్క ప్రేరేపణే బుద్ధి. ఇది సదాలోచనలను సత్కర్మలనే ప్రాత్సహిస్తుంది. దీనినే వాడుక భాషలో అంతరాత్మ అని కూడా అంటాము. ఇంద్రియాల ప్రేరణవల్ల కలిగిన కోరికలే మనస్సు. శరీర ఇంద్రియాల ఆధీనంలో ఉంటుంది.

మన దేహమనేటటువంటి రథానికి ఇంద్రియాలనే గుర్రాలుకట్టి, బుద్ధి అనే సారధి, మనస్సనే కళ్ళెం పట్టి నడిపిస్తే సక్రమమైన మార్గంలో పయనించి శాంతి అనే గమ్యం చేరతాము. దురదృష్టవశాత్తూ రథానికి మనస్సునే సారధిగా పెట్టుకోవడం చేత ఇంద్రియాలు స్వైరవిహారం చేస్తూవుంటే మానవుడు చెడుమార్గంలో భోగభాగ్య విలాసాలవైపు పయనిస్తూ అశాంతికి గురౌతున్నాడు.

స్వార్థం, అహంకారం, దురాశలే అశాంతికి కారణం. మనస్సుయొక్క ఉద్రేకాలను బుద్ధి సహాయంతో, సకాలంలో ప్రయత్నపూర్వకంగా అణగద్రొక్కి సన్మార్గ వర్తనుడై మానవుడు జీవితంలో సంతృప్తి, శాంతి సాధిస్తాడు.

(శ్రీ స. వా. పు. 29/30)

పుట్టుకకు చావుకు మూలకారణము కోరిక. కోరిక లేని వారికి పుట్టుకచావులేవుండవు. విత్తనమే లేకుండిన

మొక్కనేలేదు. చెట్టే వుండదు. పునర్జన్మముయొక్క నైజము ఈ జన్మములో తీరని కోరికలవల్ల నిర్ణయించబడుతుంది. వస్తువులపై యెట్టికోరికా లేనివారికి ఆత్మజ్ఞానము సాధ్యమవుతుంది. దైవజ్ఞానమును దైవప్రేమను పొందాలనే కోరిక, కోరిక కాదు. అది పరవిద్యయొక్క పవిత్ర సంకల్పము. ఇదే బ్రహ్మవిద్య. దైవజ్ఞానమను మంటలో సర్వలౌకిక కోరికలూ భస్మమయి పోతాయి. కోరికలు ముగించి పోగానే జీవాత్మపరమాత్మవైపునకు కదలుతుంది. ఆత్మలో పరమ శాంతిని అనుభవిస్తుంది జీవాత్మ. అనాత్మతోబంధనాలు తెంచుకొన్నట్లు అయితేనే జీవాత్మ చిరంజీవత్వమును పొందుతుంది.

(వి.వా. పు. 22)

(చూ॥ ఆశలు, కాలము, మనసు, రాధ)

కోశములు

(చూ॥ అష్టవిధపుష్పములు, బ్రహ్మవిద్య)

కోహం

(చూ॥ చదువు)

కౌసల్య

(చూ॥ రాముని జన్మస్థానము)

క్రమశిక్షణ

మదపుటేనుగును సర్కసులో తర్ఫీదు చేసి ఆడించు విధమున మనసునకు శమము, దమము, తితిక్ష, శ్రద్ధ, సమాధానములతో తర్ఫీదు నీయవలెను. మానవునకు అక్కర కలిగించు పనులలో మనసు లొంగునట్లు క్రమశిక్షణతో దానికి తర్ఫీదు నీయవలెను.

(ఆ.శా. పు.4)

ద్వేషము అసూయ యనెడి కారు మేఘములు నిన్ను చుట్టుముట్టినప్పుడు, నీవు విశ్వసించిన వారు నీ దరిచేరక నిన్ను విడిచిపెట్టినప్పుడు, ఒక్క క్రమ శిక్షణే నీకు రక్ష. **కరుణ అనే సిలువ మీద నీ అహంకారమును బలియిచ్చి,** నీ శక్తి సామర్థ్యములతో ఇతరులకు సేవ చెయ్యి. నీ వెట్టి కార్యములందు నిమగ్నుడవైనప్పటికీ నామ స్మరణ, జపధ్యానముల ద్వారా అహంకారమును విసర్జించు".

(స. శి. సు. తృ. పు. 158)

బిడ్డల క్రమశిక్షణ తల్లుల దగ్గరనుండే ప్రారంభమవు తుంది. అందువల్ల తల్లులు తగు జాగ్రత్తగా బిడ్డలకు మంచి అలవాట్లు చెప్పాలి. తాము ఒకటిచేస్తూ బిడ్డలకు యింకో రకంగా చేస్తే వాండ్లు చేయరు. బిడ్డలు తల్లులనుజూసే నేర్చుకుంటారు. తల్లి దండ్రులు బిడ్డల క్రమశిక్షణకు బాధ్యులు, తర్వాత గురువుల బాధ్యత.

(సు.బి. పు. 7)

(చూ॥ గోల్డ్‌స్టోన్, విద్య, శ్రీసత్యసాయి విద్యాలయము)

క్రిస్మస్

ప్రేమస్వరూపులారా! మనం ప్రతి సంవత్సరం ఇక్కడ క్రిస్మస్ పండుగ చేసుకొంటున్నాము. మీరు ఎన్ని దేశాల నుండియో వస్తున్నారు. అయితే నిజమైన క్రిస్మస్ పండుగ ఒక్క ప్రశాంతి నిలయంలో తప్ప మరెక్కడా జరగదు. ఎందుకంటే, **బయట క్రిస్మస్ పండుగను క్రిష్టియన్లు మాత్రమే చేసుకొంటారు: హిందూ పండుగలను హిందువులు మాత్రమే చేసుకొంటారు: ముస్లిం పండుగలను ముస్లింలు మాత్రమే చేసుకొంటారు. కానీ ఇక్కడ అట్లా కాదు, అన్ని మతములవారు ప్రవేశిస్తున్నారు. సర్వమత సమన్వయమైనది మన ప్రశాంతి నిలయం.** అనేకమంది అనేకచోట్ల మద్యపానంతో, మాంస భక్షణతో క్రిస్మస్ పండుగను జరుపుకొంటున్నారు. కానీ మన క్రిస్మస్ అలాంటిది కాదు: తెల్లవారు ఝామున మూడు గంటలకు ప్రారంభమై రాత్రి పన్నెండు గంటల వరకు దైవచింతనచేత నిండిపోతున్నది. **క్రిస్మస్ పండుగ ప్రశాంతి నిలయంలో ఒక 'హోలిడే' యేగాని 'హాలీడే' కాదు.** ఇలాంటి పవిత్రమైన భావాలను మీ హృదయంలో నింపుకొని, మీమీ స్వస్థానములకు వెళ్ళిన తరువాత

క్రిస్టియన్/క్రైస్తవుండు/క్రైస్తవుడు

వాటిని ఆచరణలో పెట్టండి. **"మేము భగవంతుని దూతలం" అనే భావాన్ని దృఢపర్చుకోండి. ఎక్కడికి వెళ్ళినా భగవత్సందేశాన్ని చాటుకొంటూ పొండి: భగవంతుని సువాక్యములను అందరికీ పంచండి. అదే మీ ప్రధానమైన కర్తవ్యం. అంతకు మించిన సేవ మరొకటి లేదు.** శిలా హృదయులను కూడా మీరు అమృత హృదయులుగా మార్చివేయాలి. ప్రేమచేత ఎలాంటి కఠిన హృదయులనైనా మార్చవచ్చును. అయితే కొన్ని హృదయాలు ఇనుప కడ్డీలవలె మరింత కఠినంగా ఉంటాయి. అవి మారటానికి కొంత టైమ్ పడుతుంది. కనుక మీరు కొంత ఓపిక పట్టండి. కొంతకాలానికి అవి కూడా మారిపోతాయి. స్వామి తత్వాన్ని స్వామిపవిత్రతను ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. ఇరవై సంవత్సరాల క్రితం **ఇక్కడ మొట్టమొదటిసారిగా క్రిస్మస్ జరిగినప్పుడు ఒక పాట పాడాను.**

"లవ్ ఈజ్ మై ఫామ్
ట్రూత్ ఈజ్ మై బ్రెత్
బ్లిస్ ఈజ్ మై ఫుడ్
మై లైఫ్ ఈజ్ మై మెస్సేజ్
ఎక్స్‌పేన్షన్ ఈజ్ మై లైఫ్
నో రీజన్ ఫర్ లవ్, నో సీజన్ ఫర్ లవ్
నో బర్త్, నోడెత్"

(ప్రేమయే నా స్వరూపం: నాజీవితమే నా సందేశం: వ్యాపకత్వమే నాజీవితం: ప్రేమతత్వం రీజన్‌కు, సీజన్‌కు అతీతమైనది: ప్రేమకు చావు లేదు. పుట్టుక లేదు).

మీరు ఎవరికైనా సాయిబాబా సమాచారం చెప్పాలను కొన్నప్పుడు ఈ పాట పాడండి అప్పుడు వారు చక్కగా అర్థం చేసుకోగలరు. **మానవ సోదరత్వాన్ని దైవ పితృత్వాన్ని దృఢంగా విశ్వసించండి.** దైవచింతనచేత లోక కల్యాణమునకు పాటుపడండి. కేవలం నా దేశం మాత్రమే సుఖంగా ఉండాలనే సంకుచితమైన భావమును పెట్టుకోకండి. ప్రపంచమనే పెద్ద గృహంలో వివిధ దేశాలు చిన్నచిన్న రూమ్‌లవంటివి. కనుక ప్రపంచ మంతా సుఖంగా ఉండాలని ఆశించండి. దీనిని పురస్కరించుకొనియే **"లోకాస్సమస్తా సుఖినో భవంతు"** అన్నారు. ముఖ్యంగా మీరు చేయవలసిన సాధన ప్రేమను పెంచుకోవడమే.

(స.సా. జ. 99 పు. 7/8)

(చూ॥ ప్రేమమతం)

క్రిస్టియన్ / క్రైస్తవుండు/క్రైస్తవుడు

(చూ॥ ప్రేమమతం, మానవుడు కాడు, హిందు / హిందువు, హిందువులు)

క్రీస్తు

క్రీస్తు జననము 25వ తేదీన జరుగలేదు. అది 24వ తేదీన అర్ధరాత్రి సమీపించుచుండగా సంభవించినది.

(ప. పు. 154)

జీసస్ తాను క్రీస్తునని తన 25వ యేట గుర్తించెను. తన 16వ యేట నుండి ఎనిమిది సంవత్సరములు భారత దేశములో, టిబెట్, ఇరాన్, రష్యాలలో పర్యటించెను. అతను బిక్షుకుడిగా, సన్యాసిగా భావింపబడెడివాడు. జీసస్ వద్ద ధనము ఉండేడిది కాదు. అతని తల్లిదండ్రులు కడు బీదవారు. పిన్న వయసులోనే అతనిని యధేచ్ఛగా వదలివేసిరి.

(ప. పు.162)

క్రోధము

(చూ॥ ఏది? లోభము, జీవితమంటే, టెట్టరిష్టులు, నన్నేపొందుదురు, భగవత్ప్రేమ, మంచితనము, రక్కసి)

క్షణభంగురము

ఈ భౌతికమైన వన్నీ క్షణభంగురమైనవి. దీనినే శంకరులవారు చెప్పారు. **"మా కురుధన జన యౌవన**

గర్వం హరతి నిమేషాత్ కాలాస్సర్వం". ఇదంతా క్షణంలోనే పోతుంటాయి. ఈ సుఖములు, ఈ ఆనందములు, ఈ ఆహ్లాదములు ఒక్క క్షణములో కనుమరుగై పోతుంటాయి. ఇట్టి క్షణ భంగురమైన సుఖముల నిమిత్తమై మానవుడు గొప్ప విలువైన జీవితమును నాశనము చేసుకుంటున్నాడు.

(ద.య.స 97 పు. 33)

క్షత్రియజాతి

(చూ॥ మోహము)

క్షత్రియుడు

(చూ॥ ధర్మయుద్ధము, సూర్యుడు)

క్షమ

"క్షమ సత్యం సత్యవతాం క్షమా యజ్ఞః క్షమా శమః"
సత్యవంతుల సత్యమే క్షమ. యజ్ఞమే క్షమ, క్షమయే యజ్ఞము. తేజోవంతుల తేజమే క్షమ. తపస్వుల బ్రహ్మమే క్షమ.

క॥ క్షమ సత్యము క్షమ ధర్మము
క్షమ వేదము క్షమ మహింస క్షమ ధర్మంబౌ
క్షమ సంతోషము క్షమ దయ
క్షమయే ఆధారమగును సర్వంబునకున్

ప్రతి మానవుడు తన జీవితమును ప్రధానముగా సాధించవలసిన సద్గుణము ఓర్పు.

(శ్రీ స గీ పు. 206)

క్షమతత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి. క్షమకు మించినది జగత్తులో మరొకటి లేదు. క్షమ సత్యం, క్షమ ధర్మం, క్షమ వేదం, క్షమ అహింస, క్షమ సర్వం, క్షమ సంతోషం, క్షమ దయ, క్షమ సర్వస్వం సర్వలోకములందు అన్నారు. **క్షమ అనగా ఓపిక, ఓర్మి. ఓరిమిని సాధించినప్పుడే దైవాన్ని సాధించినవారమౌతాము. ప్రతి చిన్న విషయమునకు ఒక tension, temper, ఒక విధమైన ఆవేదన, ఆవేశమును అభివృద్ధి పరచుకొంటున్నాము. ఈ ఆవేశము చాలా ప్రమాదము. ఇది మానవుని జీవితమునే క్షీణింప జేస్తుంది.**

కోపము కలిగినవానికి
ఏ పనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్
పాపపు పనులను చేయుచు
ఛీ పొమ్మనపించుకొనుట చేకురుచుండున్.
ఇంతే కాక కోపము వలన
తన కలిమి భంగ పుచ్చును
తనకున్ గల గౌరవంబు దగ్ధము చేయున్
తనవారల కెడసేయును
జనులకు కోపంబువలన సర్వమును చెడున్.

(గీ. పు. 39/40)

క్షమ, దీనినే క్షాంతి అనికూడనూ అందరు. సహనమని కూడనూ అందరు. అనగా పరులు తనకెట్టి అపకారములు, కీడులు, ద్రోహములు చేసియుండిననూ, తనను ద్వేషించుచుండిననూ, వాటనన్నిటినీ, స్వప్నదృశ్యములుగా తలంచి, యెండమావులుగా భావించి మరచిపోవుట. అయితే **ఆ వోర్పు చేతకాక, శక్తిలేక, విధిలేక వోర్చుకోవటము కాదు, హృదయపూర్వకమైన శాంతితోపాటు బైట క్షాంతి కలసి రావలెను** లోకుల యొక్క మెప్పులకై తనకు ధన, జన బలములు లేకనో, చాలకనో, లేక తానేమి చేసినా చెల్లదనో వోర్పుతో వుండుట క్షాంతి కాజాలదు. క్షమయును అహింసవలె ప్రధానమైనది.

(గీ.పు. 208)

మానవునికి క్షమాగుణం చాల ప్రధానమైనది. క్షమ సత్యము. క్షమ ధర్మము. క్షమ వేదము. క్షమ అహింస. **సర్వలోకములందు క్షమను మించినది లేదు.** ఎవరైనా మీకు అపకారము చేసియుంటే వారిని క్షమించండి. అది నా మంచికోసమే అనుకోండి. ఎవరైనా మిమ్మల్ని తిడితే **"దేహాన్ని తిట్టాడా, లేక ఆత్మను తిట్టాడా?"** అని విచారణ చేయండి. ఒక వేళ వాడు మీ దేహాన్ని తిడితే, ఒక విధంగా మీకు ఉపకారం చేసినట్లే. ఎందుకంటే, దేహం అనిత్యమైనది. మలమూత్రదుర్గంధమాంస రక్తములతో

క్షమాగుణము

కూడినది అని మీరే తిట్టుకుంటున్నారు. ఒకవేళ ఆత్మను తిడితే - వాని యందు, మీ యందు ఉన్నది ఒకే ఆత్మ కాబట్టి, తనను తాను తిట్టుకున్నాడనుకోండి. ఎంత గొప్ప క్షమ ఇది! ఇట్టి హృదయవిశాలతను మీరు కల్గియుండాలి.

(స.సా.ఆ. 2000 పు. 231)

(చూ॥ ఇరువది గుణములు, తల్లులు)

క్షమాగుణము

అశ్వత్థామ ఉపపాండవుల గొంతులు కోసి నప్పుడు అర్జునుడు అతనిని బంధించి తెచ్చి "ద్రౌపదీ! నీ కుమారులను చంపిన ఈ దుర్మార్గుని గొంతు కోస్తాను. వీని రక్తముతో తలంటుకొని స్నానం చేయి," అన్నాడు. అప్పుడు ద్రౌపది "అర్జునా! అశ్వత్థామ నా కుమారులను చంపి నందుకు నేనెంతగా దుఃఖిస్తున్నానో, నీవిప్పుడు అశ్వత్థామను చంపితే అతని తల్లికూడా అంతగా దుఃఖిస్తుంది కదా! కాబట్టి, నీవీ పనికి పూనుకోవద్దు," అని వేడుకున్నది. అంతేగాక, అశ్వత్థామ పాదాలపై పడి "నా కుమారులు పసిపిల్లలు, నీకెట్టి ద్రోహమూ తలపెట్టనివారు. అలాంటివారిని చంపటానికి నీకు చేతులెలా వచ్చినాయి తండ్రీ?" అన్నదేగాని, పరుషవాక్యము లాడలేదు. అట్టి శాంతము, సహనభావమే ఆమెను అన్నివిధాలుగా సంరక్షిస్తూ వచ్చింది. **కష్టసమయములందు కూడా మానవుడు శాంతం వహించాలి. ద్రౌపదికి ఇంతటి క్షమాగుణం కృష్ణుని ప్రబోధవల్లనే చేకూరింది.** ఎలాంటి పరిస్థితియందైనా ఆమె కృష్ణుని మాటను జవదాటేది కాదు. **ఇలాంటి పరమ భక్తులు పతివ్రతామతల్లులవల్లనే, భారతదేశం ఈనాటికీ సుక్షేమాన్ని అనుభవిస్తోంది.**

(స.సా.అ2000పు.295)

భారతము, భాగవతము మున్నగు పవిత్రమైన భారతీయ గ్రంథములన్నీ ఆధ్యాత్మికమైన ప్రబోధలే అందిస్తూ వచ్చాయి. **ద్రౌపది గొప్ప గుణవంతురాలు. ఆమెకు పాంచాలి అని పేరు. అనగా, ఐదు మందికి భార్య అని అనుకోరాదు; శబ్ద స్పర్శ రూప రస గంధాదులకు తాను సమస్వయమైనది. కోపము, అసూయ, డంబములతో కూడిన అర్జునుణ్ణి, భీముణ్ణి ద్రౌపదియే సరియైన మార్గంలో పెడుతూ వచ్చింది.** నిండు సభలో తనకు పరాభవం జరిగినప్పటికీ శాంతమును వహించింది. తన కుమారులను అశ్వత్థామ చంపినప్పుడు ఆ దుఃఖంలో కూడా శాంతమునే వహించింది. అశ్వత్థామను చంపుతానని అర్జునుడు ముందుకు వచ్చినప్పుడు ద్రౌపదియే అతనిని శాంతపరచింది. వీరి అందరి మధ్య కృష్ణుడు కూర్చొని నవ్వుతూ ఉన్నాడు. అప్పుడు ద్రౌపది చెప్పింది -

వెరచినవాని దైన్యమున వేదన నొందినవాని నిద్రమై
మరచినవాని సౌఖ్యమున మద్యము ద్రావినవాని భగ్నుడై
పరచినవాని సాధుజన భావమువానిని కావుమం
చఱచినవాని కామినుల చంపుట ధర్మము కాదు అర్జునా!

"ఫల్గుణా! నీవు చాల ఆవేశంతో, ఉద్రేకంతో, క్రోధంతో ఈ పనికి పూనుకుంటున్నావు. **క్రోధము మానవునికి చాల ప్రమాదకరమైనది".**

కోపము కలిగినవానికి
ఏ పనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్
పాపపు పనులను చేయుచు
ఛీ పొమ్మనిపించుకొనుట చేకురు సుమీ!

భీముడు కూడా చాల క్రోధంతో నున్నాడు. అప్పుడు అతనికి కూడా బోధించింది.

తన కలిమి భంగపుచ్చును
తనకుం గల గౌరవంబు దగ్ధము సేయున్
తన వారలకెడ సేయును
జనులకు కోపంబు వలన సర్వము చెడున్

అశ్వత్థామ ఉపపాండవుల గొంతు కోసినప్పుడు మాతృదేవి అయిన ద్రౌపది ఎంత కఠినమైన భావంతో ఉండాలి. కానీ, **ఆమెకు అట్టి కఠిన భావమే లేదు. పరుగెత్తి పోయి అశ్వత్థామ పాదాలపై బడి,**

ఉద్రేకంబునరారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం
చిద్రోహంబును నీకు చేయరు బలోత్సేకంబుతో చీకటిన్

భద్రాకారుల పిన్నపాపల రణప్రౌఢ క్రియా హీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా నీ చేతు లెట్లాడెనో?
ఆ పసికందులను చంప మీకు మనసెట్లా వచ్చిందని అన్నదేగాని, కఠినమైన వాక్కు ఉపయోగపెట్టలేదు. అంతటి **కఠిన పరిస్థితియందు కూడా ఆమె మృదు మధురంగానే మాట్లాడింది. అట్లే, మీ వాక్కు కూడా మధురమైన వాక్కుగా ఉండాలి. అప్పుడే మీరు మానవులనిపించుకోగలరు. ఎప్పుడు ఈ మధురమైన వాక్కు వస్తుంది? దైవ చింతన చేసినప్పుడే మధురమైన వాక్కు వస్తుంది.** ఐతే, అప్పుడప్పుడు దుర్బుద్ధులతో, దుర్గుణములతో ప్రవర్తించే మానవులలో పరివర్తన తెప్పించడానికి కఠినమైన వాక్కులను ఉపయోగపెట్ట వలసివస్తుంది. ఐతే, ఆ వాక్కు కూడా ప్రేమతో కూడినదే. పైకి కఠినంగా అనిపిస్తుందిగాని, అది ప్రేమమయమైనదే. వర్షము కురిసే సమయంలో కఠినమైన వడగళ్ళు కూడా పడుతుంటాయి. **వర్షబిందువులచేత ప్రమాదం లేదుగాని, వడగళ్ళచేత చాల ప్రమాదముంది. కానీ, వడగళ్లలో ఉన్నది నీరే కదా. అదేవిధంగా, ప్రేమచేతనే కొన్ని సమయాలలో కఠినమైన మాటలను ఉపయోగించవలసి వస్తుంది.**

(సా.శు.సా.99 పు.31-33)

ద్రౌపది అశ్వత్థామపాదాలపై పడి ఈ రీతిగా పలికింది :

పరగన్ మామగవారలందఱునుమున్
బాణప్రయోగోపసం
హరణాద్యా యుధవిద్యలన్నియును
ద్రోణాచార్యుచేనభ్యసిం
చిరి; పుత్రాకృతి నున్న ద్రోణుడవు;
నీ చిత్తంబులో లేశముం
గరుణాసంగము లేక శిష్యసుతులన్
ఖండింపగా బాడియే?

(స.సా.జూ.2001 పు. 167)

క్షమార్పణ

(చూ॥ మైలురాళ్ళు)

క్షయం

(చూ॥ బ్రహ్మసాక్షాత్కారజ్ఞానము)

క్షాంతి

(చూ॥ క్షమ)

క్షీరసాగరమథనము

క్షీరసాగరమును మథించినప్పుడు ప్రప్రథమములో విషము ఆవిర్భవించింది. కాని, దానితో ఆగక, నిరాశకు గురికాక, ధైర్యముతో, సాహసముతో దానిని తిరిగి మథించినప్పుడు విలువైన వస్తువులన్నీ దాని నుండి ఆవిర్భవించాయి. అదేవిధముగా ఆధ్యాత్మిక తత్వమునందు హృదయమనే క్షీర సాగరమును జ్ఞానముతో మథించినప్పుడు మనసు బాధించే కష్టనష్టములు, నిందలు, నిష్కారములు ప్రప్రథమంలో ఆవిర్భవిస్తాయి. కాని ధైర్యంతో, సాహసంతో, విశ్వాసంతో గట్టిగా పట్టుబట్టి మథించినప్పుడు అందులో దయ, ప్రేమ, కరుణ, క్షమ, శాంతి ఇత్యాది విలువైనవి ఆవిర్భవిస్తాయి. కనుక, మానవుడు నిరాశకు గురికాక, ధైర్యసాహసములతో ఆత్మ, విశ్వాసముతో కార్యములలో పాల్గొనాలి.

(శ్రీ.భ.ఉ.పు.170)

క్షీరసాగరము

(చూ॥ హృదయము)

క్షేత్రజ్ఞుడు

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత
క్షేత్రక్షేత్రజ్ఞయోఃజ్ఞానం యత్తద్ జ్ఞానం మతంమమ
ప్రపంచమంతయు క్షేత్రక్షేత్రజ్ఞుల సమ్మిళిత స్వరూపము. ప్రకృతి ప్రతిబింబమే మానవుని శరీరక్షేత్రము. విశ్వమునందున్న చేతనా చేతనములన్నీ మానవుని

క్షేత్రము/క్షేత్రములు

దేహమునందే యిమిడి వున్నవి. ఈ ప్రపంచమంతయు మానవుని యందుండిన ప్రతిబింబములే. Reflection of the inner being. క్షేత్రజ్ఞుని తెలుసుకోవాలంటే జ్ఞానము కావాలి. ఏమిటీ జ్ఞానము? కేవలము పుస్తక జ్ఞానము కాదు. సూఫర్‌పిషియర్ నాలెడ్జినా? కాదు. జనరల్ నాలేడ్జినా? అసలే కాదు. డిస్క్రిమినేషన్ నాలెడ్జా? ఇది వ్యక్తిగతమైనది. ఎక్స్పీరియన్స్ నాలెడ్జా? ప్రాక్టికల్ నాలెడ్జి కూడను వ్యక్తిగతమైనది. ఇవన్నియు భౌతికమైన లౌకికమైన జ్ఞానములు. వస్తువిచారణ గుర్తింపబడే జ్ఞానము పదార్థ జ్ఞానము. విషయమును ఆధారము చేసుకొని దాని విశిష్టతను గుర్తించే జ్ఞానము విషయజ్ఞానము. ఈ విధమైన జ్ఞానముల చేత దివ్యమైన ఆత్మతత్వమును ఎవ్వరు గుర్తించలేరు. **వజ్రము కోయవలెనంటె వజ్రమే కావాలి. కాలులో విరిగిన ముల్లును తీయాలంటే ముల్లే కావాలి. ఆత్మతత్వమును గుర్తించాలంటే ఆత్మజ్ఞానమే కావాలి.** ఈనాడు భౌతికమైన యీ ప్రపంచమునందు దేనిని జ్ఞానమని భావిస్తున్నామో అది అంతా అజ్ఞానమే. **ఆత్మజ్ఞానమే సత్యజ్ఞానము. ఆత్మ అన్నా జ్ఞానమన్నా రెండూ ఒక్కటే. నిజమైన ఎరుకయే జ్ఞానము.** పదార్థములను క్రోడీకరించుకొని విషయాలను సంగ్రహించుకొని తద్ద్వారా తెలుసుకొనే జ్ఞానము అజ్ఞానముతో సమానమే. ఈ జ్ఞానమునకు జ్ఞానము జ్ఞేయము జ్ఞాత అనే త్రిపుటి ఉండదు. ఇవి మానసిక వృత్తులు. **మనోనాశమైన తరువాత ఏర్పడే మూలాధారమైన తత్వమే జ్ఞానము.**

(బృ.త్ర.పు. ౧౭౧,౧౭౨)

(చూ॥ క్షేత్రము, పురుషుడు)

క్షేత్రము/క్షేత్రములు

ఈ దేహము ద్వారానే అనేక పుణ్యములు సంపాదించి జ్ఞానమును పొంది మోక్షమును పొందుదురు కదా! అట్టి భగవద్విభూతులు నెలకొన్నచోటు కనుక ఇది క్షేత్రమని పిలువబడును. **క్షేత్రమన్న కవచమువలే జీవుణ్ణి కాపాడేదని మరొక అర్థము; భూమి అని మరొక అర్థము, పొలమనుటకు వక ఆధారము వున్నది. పొలమున యే విత్తనములు చల్లుదుమో నాటుదుమో అదే పంటను మానవులు తీసుకొందురు. కోనుకొందురు. శరీరం క్షేత్రం, క్షేత్ర పాలకుడు జీవుడు, పుణ్యబీజములను చల్లి సుఖసంతోషములను పంటను పండించుకొనును. పాపబీజములను చల్లి దుఃఖమును అశాంతి అను పంటను పొందుచున్నారు.** జ్ఞాన విత్తనములు నాటి మోక్షమను ఫలమును పొందుచున్నారు. **పొలమును రైతు తెలిసికొనునట్లు క్షేత్రమను దేహతత్వమును క్షేత్రజ్ఞుడను జీవుడు తెలుసుకొనును. క్షేత్రమునకు క్షేత్రజ్ఞునకు వక్కటి మాత్రమే వ్యత్యాసము అది 'జ్ఞ' అను శబ్దము 'జ్ఞ' అనగా జ్ఞానము అని అర్థము. అనగా జ్ఞానము కలవాడే క్షేత్రజ్ఞుడనియు, జ్ఞానము లేనిదే క్షేత్రమనియూ చెప్పవచ్చును".**

(గీ.పు.200/201)

కాశీ, ప్రయాగ, గయ మొదలగు క్షేత్రములకు వెళ్ళినప్పుడు తమకు ఇష్టమైన ప్రీతికరమైన వస్తువులను వదలిపెట్టాలంటారు పెద్దలు. నీకు ఏది ఇష్టమో, నీకు ఏది అమితమైన ప్రీతిగా ఉంటుందో, దానిని భగవంతునికి అర్పితం చేయి అట్టి అర్పణే నిజమైన అర్పణగాని, నీకు ఇష్టములేనిది ఇస్తే అర్పణకాదు. కూరగాయల యందుగాని, ఫలములయందుగాని, నీకు అమిత ఇష్టమైన వాటిని భగవంతునికి అర్పితం చేయాలి. అర్పితం చేసిన తరువాత, జీవితంలో తిరిగి ఆ ఫలమునుగాని, ఆ కూరగాయనుగాని భుజించ కూడదు మన భారతీయులు ప్రాచీన కాలమునుండి పవిత్రమైన క్షేత్రములలో ఇలాంటివి అర్పితం చేస్తూ వస్తున్నారు. **మన దేహమే కాశి. ఈ కాశి మధ్యలో గంగ ప్రవహిస్తున్నది. ఆ గంగయే మనయొక్క జ్ఞానము. ఈ జ్ఞానమనే గంగయందు భక్తి శ్రద్ధ అనే యమునా సరస్వతులులోనై పోతున్నాయి. భక్తి, శ్రద్ధ, జ్ఞానము - ఈ మూడింటియొక్క ఏకత్వమే ప్రయాగ మన హృదయ స్థానమే.** కాబట్టి హృదయానికి

పవిత్రమైనటువంటి, ప్రీతికరమైనటువంటి ఫలమును అర్పితం చేయాలి. కాని దురదృష్టవశాత్తు ఈనాడు, సాంప్రదాయములన్నియు కూడనూ, ఆధునికమైన ఫ్యాషన్ క్రింద మారిపోయినాయి. ప్రయోగ పోతున్నాం. **నీ కిష్టమైన పదార్థమును పరమాత్మకు అర్పితం చేయమని అక్కడ పండాలు చెబుతారు.** ఇష్టమున్న దానిని గురించి యోచన చేయనవసరం లేదు ఇష్టంలేనిది ఏదాయని యోచించి, ఇష్టములేని కూరగాయను, ఇష్టంలేని ఫలమును అక్కడ అర్పితంచేసి వస్తున్నారు. ఇది కాదు, ఏది బాగా ఇష్టమైనదేదో, దానినే అక్కడ అర్పితం చేయాలి. నా భగవంతునకు, నా ప్రేమ స్వరూపునకు నాకు అత్యంత ప్రీతికరమైన పదార్థమును అర్పితం చేయాలనే దీక్ష మనలో ఆవిర్భవించాలి కాని ఆ విధంగా చేయటం లేదు. **నీ అయిష్టాన్ని అర్పితం చేస్తున్నావు.** కనుకనే హృదయమునందున్న హృదయేశుడు **'తథాస్తు' 'తథాస్తు' అని ఆశీర్వదిస్తున్నాడు.** నీవు చేసినట్లుగానే జరుగుగాక! అనగా ఏమిటి? భగవంతునకు ద్రోహం చేస్తున్నావు. నీకు ఇష్టం ఉన్నది ఒకటి, అర్పితం చేసుకున్నది మరొకటి కనుక భగవంతునికి కూడాను తనకు ఇష్టములేనిది ఒకటి, ఇష్టమైనది మరొకటి ఇష్టములేనిదే వానికి కూడా అనుగ్రహిస్తుంటాడు. 'నాకు ఆరోగ్యం కావాలి స్వామీ!' అంటే అనారోగ్యాన్ని అందిస్తున్నాడు. 'నాకు ధనం కావాలి స్వామి!' ప్రార్థించే వానికి దారిద్ర్యాన్ని అందిస్తున్నాడు. ఎందుకంటే, **నీ ప్రార్థనలకు తగినటువంటి ఫలితమే. "యద్భావం తద్భవతి" నిజంగా నీ హృదయ పూర్వకంగా మంచిని అందిస్తే, భగవంతుడు మంచిని ఎందుకు అందించడు? నీవు చెడ్డను అందిస్తున్నావు గనుకనే, నీవు చెడ్డనే పొందుతున్నావు కనుక నీకు పరిపూర్ణమైనటువంటి, ప్రేమతో వుండినటువంటిదానినే భగవంతునికి అర్పితం చేయాలి.**

(శ్రీ.అ. 95, పు. 7,8)

శరీరేంద్రియ మనోబుద్ధులు నాల్గింటి ఎకత్వస్వరూపమే క్షేత్రము అన్నారు. ఈ క్షేత్రము కేవలము జడమైనది. మనస్సు జడమైనదే. ఇంద్రియములు జడమైనవే. దేహము జడమైనదే. ఈ జడమైన వాటి స్వభావమును కంట్రోల్ చేసేది క్షేత్రజ్ఞుడు. ఈ క్షేత్రక్షేత్రజ్ఞులకు మధ్య కొంత అవకాశముంటుండాది. అదే సృష్టి యొక్క పరిణామము. ఈ క్షేత్రము మరికొన్ని మాలిన్యమైనవానితోను శుద్ధమైనవానితోను స్నేహము కల్గి వుంటుంది. అవియే సత్వరజస్తమము అనే త్రిగుణములు. ఈ సత్వరజస్తమోగుణములు చాలా విచిత్రమైనవి. చాలా ఆశ్చర్యమైనవి.

(బృ.త్ర.పు. ౧౧౦)

(చూ॥ ప్రకృతి, మూలాధారం)

ఖజజ

పాండవులంతా కూర్చొని ఒక విచారణ చేస్తున్నారు. రేపటి దినము యుద్ధము ప్రారంభము అవుతుంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు వహించాలి? ఎవరెవరు ఏఏ దిక్కుకు బయలు దేరాలి. అనే సంగతులు చర్చించి ప్లాన్ వేసుకుంటున్నారు. వీరు ప్లాన్ వేసుకుంటునప్పుడు దుర్యోధనుడు వచ్చాడు. ఎందుకు? గురువుగారయిన ద్రోణాచార్యుడు పాండవులకు తెలియని ఒక పదాన్ని దుర్యోధనునికి చెప్పి పంపించాడు. ఈనాడు వీళ్ళు ఆ పదం యొక్క అర్థం కనుక్కోలేక ఓడిపోతారు. వాళ్ళకు అవమానం అయిపోతుంది అనుకున్నాడు రారాజు పరిగెత్తి వచ్చాడు. పాండవులు ఉన్నచోటుకి వచ్చి 'ఖజజ'! నాతోడ పోరాడదగునే నీకు? అన్నాడు. నీకు నాతో పోరాడవీలవుతుందా? అంటే అర్థమయేది. కాని పాండవులకు 'ఖజజ' అంటే ఎవరో తెలియదు. ఖజజ అంటే తామే అనుకొని ఎవరో పొరపాటున అర్జునుడు - గాని, లేక ధర్మరాజు గానిలేస్తే అవమానమైపోతుంది. ఈ పదానికి అర్థం తెలియని మూర్ఖులుగా ఉన్నారెమెనని భావిస్తాడేమే! ఈ సంగతిని అర్థం చేసికొన్న కృష్ణుడు భీముని వైపు తిరిగి సంజ్ఞచేశాడు. "లే" అన్నట్లు. అప్పుడు భీముడు లేచాడు. దుర్యోధనునికి దీని అర్థము తెలియదు. తిరిగి వెళ్ళిపోయాడు కట్టకడపటికి ఈ ఐదమంది పాండవులు కృష్ణుని అడిగారు. 'స్వామి! ఏమిటిది? ఎప్పుడూ కూడనూ మా తల్లి పెట్టిన పేరు కాదే ఇది! ఎవరు పెట్టిన పేరు? ఖజజ అంటే భీముడెలా అయాడు? ఏమిటి? అని అడిగారు. అప్పుడు 'ఖ- ఆకాశము జ-దానితో పుట్టినది వాయువు జ- తిరిగి వాయువులో పుట్టినది వాయుపుత్రుడు, కనుక ఖజజ అనగా 'భీముడే' అన్నాడు కృష్ణుడు. ఈ విధముగా సర్వమూ దైవమునకే తెలుస్తుంది కాని అందరికీ తెలిసేదికాదు. ఈ విధంగా సర్వరక్షకుడైన కృష్ణుడు పాండవులను రక్షించుతూ వచ్చుచుండుట చేతనే పాండవులు దిగ్విజయాన్ని సాధిస్తూ వచ్చారు. పాండవులు కూడనూ కృష్ణుని శరణుజొచ్చారు. అదే విధంగానే దైవాన్ని మనం శరణు జొచ్చినప్పుడు ఏ మాత్రమూ ఎందులో కూడనూ, అపజయమనేదే ఉండదు. అన్నింటి యందునూ జయమునే పొందుతాం.

(శ్రీ.సా.గీ.పు.380)

ఖురాన్

ఆత్మతత్వాన్ని గుర్తింప చేయడానికై, అన్ని మతములందు మహనీయులు ఆశరీరవాణిని శ్రవణము చేస్తూ వచ్చారు. ఏ విధముగా వేదముల నాదమును సారస్వతుడు విని సర్వులకు బోధించాడో అదే విధముగ ఇస్లాము మతములో కూడా **హజరత్ మహమ్మద్ పదునాలుగు వందల సంవత్సరములకు పూర్వము ఈ వాణిని 'ఖుర్ ఆన్' రూపములో పొందుపరచాడు. దీనిని 'ఖురాన్' అని అంటారు.** కాని దీని సరియైన స్వరూపము 'ఖుర్ ఆన్' రూపములో పొందుపరచాడు. ఇందులోని రెండు పదములు **'సలాత్', 'జకాత్' అను, రెండు నేత్రములుగా హజరత్ మహమ్మద్ నిరూపించాడు. 'సలాత్' అనగా ప్రార్థన, 'జకాత్' అనగా దానధర్మములు. దానము, ధర్మము, స్మరణ, ప్రార్థన. వీటిని ఆచరించే సమాజ ధర్మమునకు "ఇస్లామ్" అని పేరు పెట్టారు. ఇస్లామ్ అనేది కేవలము ఒక మతమునకు మాత్రము సంబంధించినది కాదు. దీనికి అరబీ భాషలో శరణు. శాంతి అని అర్థము, ఎవరు భగవంతునకు శరణాగతులై నిరంతర శాంతితో తోటి మానవులతో జీవించడానికి పూనుకుంటారో అట్టి సమాజమే ఇస్లామ్. ఏకత్వములోని అనేకత్వాన్ని విస్మరించి. దివ్యత్వమైన దైవత్వాన్ని స్మరించే సమాజము ఇస్లామ్.**

(స.సా.ఆ. పు. 186)

(చూ॥ ఉపవాసం)

గంగానది

"రామచంద్రా! ఈ గంగానది భూమిపై దిగుటకు మీ పూర్వీకులే కారణము. వారి పుణ్యము, భూమిపై బుట్టిన మానవులు అందులో స్నానసంధ్యాదులాచరించి పునీతులగుచున్నారు. గంగానది పరమ పవిత్ర వాహిని. జన్మరాహిత్య మొనర్చు అమృత జలరూపిణి, శివుని జటాజూటమే ఈమె నివాసస్థానము. అందుచే ఈమె మంగళకారిణి. శుభదాయిని" అని అనేక రీతుల గంగను కొనియాడెను విశ్వామిత్రుడు.

(రా.ర.వా. మొ.భా. పుట. 100)

సకల సన్మంగళమునకును ఆనందమునకును గంగానది మూలమని రామచంద్రుడు నుడివెను.

(రా.ర.వా. మొ.భా. పుట. 260)

(చూ॥ సీత)

గంట

(చూ॥ అనాహతము, భగవంతుని దృష్టి)

గంధము

(చూ॥ గ్రంధము, పంచభూతములు)

గజతెలివి

నేను హాస్టల్‌కు వచ్చినప్పుడు 'సాయిగీత' (ఏనుగు) అరచుకుంటూ వచ్చింది. కంటిధారకారుస్తూ, అరుస్తూ వచ్చింది. నాకారు వెనక ఎనభైకార్లు వచ్చాయి. నా కారు శబ్దమువిని అరచుకుంటూ నా దగ్గరకే వచ్చింది. ఎంత తెలివి! ఎంతటి మేధాశక్తి! **మంచి తెలివితేటలు గల మానవుణ్ణి చూచి వీడివి ఏనుగు తెలివి తేటలురా! అంటారు. 'గజతెలివి' అంటారు.** ఏనుగు చాల తెలివితేటలు కలిగినటువంటిది. విఘ్నేశ్వరునకు గజ శిరస్సు పెట్టటానికి కారణమేమిటంటే, తెలివైనటువంటి వాడని ప్రజలకు చాటిచెప్పేందుకే! అందుకు ఏనుగుతలను ఒక చిహ్నంగా పెట్టారు.

(శ్రీసా.గీ.పు. 24)

గజానన

మనము కోరే కోరికలయందు మంచీ చెడు విచక్షణ చేసి ఆ విఘ్నేశ్వరుని అనుగ్రహానికి పాత్రులు కావాలి. విఘ్నేశ్వరుడని వ్యవహరిస్తున్నారు కాని సరియైన పేరు **గజానన. గ అనగా గమ్యమును నిర్ణయించేది. జ అనగా జన్మమును ప్రసాదించేది. ఆనన అంటే ముఖము, అనగా సన్మార్గమును ప్రసాదించి గమ్యమును నిరూపింపజేసే ముఖమే. గజానన** అని. గమ్యాన్ని మరుస్తున్నారు. ఈ **గకారమును తీసేస్తే జానన అవుతుంది. అనగా పుట్టేది చచ్చేది!**

గమ్యమును గుర్తించడానికి పుట్టినాము గాని, జన్మను జన్మంగానే అనుభవించడానికి పుట్టలేదు. మానవుని జీవితమంతా ఏదో ఒక లక్ష్యాన్ని అనుసరించుకొనే ఉంటుంది. అయితే లక్ష్యాన్ని మాత్రమే గుర్తుంచు కొంటున్నాము. లక్ష్యకారణాన్ని మరచిపోతున్నాము. సాధనే అతి ప్రధానమైనటువంటిది. సాధనను లక్ష్యమున పెట్టుకొని ప్రయాణం చేసినప్పుడు **గమ్యము చేరగలము.**

(వ. 1984 పు. 175)

గడపలు (గుమ్మాలు)

(చూ॥ వినయం)

గడియారము

(చూ॥ త్యాగం, భద్రము, సర్వమూ భగవంతుడే!)

గణపతి

గణపతి తత్వమనేది సర్వులకూ 'పతి' (నాయకత్వ) తత్వాన్ని బోధిస్తున్నది. ఈ నాయకత్వం లోపలవున్న గొప్పతనాన్ని మనం గుర్తించాలి. ముఖ్యంగా గణపతి సర్వులకూ నాయకుడు. ఈ వినాయకచవితి శుభదినాన భారతీయులు అనేక విధములైన పిండి వంటలు చేసుకొని, గణపతికి నైవేద్యం పెట్టటం మన సంప్రదాయం. కొంత బియ్యం పిండి తీసుకొని, దీనిలో కొంత నువ్వుల పిండి కలిపి ఆవిరిలో ఉడకబెట్టి, ఉండ్రాళ్ళు చేసి, గణపతికి నైవేద్యం పెడుతారు. **ఇది ఆరోగ్యమునకు, ఆనందమునకు ఇది ఒక ఆదర్శంగా నిరూపిస్తూ వచ్చింది. ఆవిరిలో ఉడకబెట్టిన ఈ పదార్థము కన్నులకు ఆరోగ్యము నిస్తుంది. ఉబ్బస వ్యాధులను నివారిస్తుంది. అయితే ఈనాడు ఆరోగ్య ఆనందములను అందించేటటు వంటి, ఇట్టి ఆహారమును విస్మరిస్తున్నాం.** విసర్జిస్తున్నాము. భగవంతుని యొక్క తత్వము ప్రతి ఒక్కటీ, కారణములేని కార్యంగా ఉండదు. కాని మానవుడు ఈనాడు ఈ సత్యమును గుర్తించుకొనలేక, కేవలం భౌతికమైన వాటిల్లో కాలాన్ని గడుపుతున్నాడు. ఇది సరియైనటు వంటిదికాదు. **గణపతి పండుగ ఉత్తమమైన ఆరాధన. కేవలం మానవులకే కాదు, పశుపక్షి మృగాదులకు కూడనూ, ఈ పండుగ చక్కటి ఆదర్శమును అందిస్తున్నది. ఇలాంటి పవిత్రమైన దినమును మనం ఈనాడు అపవిత్రం గావించు కుంటున్నాం.**

(శ్రీ. అ. 2000 పు.8)

(చూ॥ విఘ్నేశ్వరపూజ, వినాయకుడు, తల్లులు)

గణపతి తత్వం

గణపతి అనగా గణమునకు అధిపతి. ఇహ పరములకు సంబంధించిన కర్మలను నిర్మూలం గావించేవాడు గణపతి. దశేంద్రియములకు, పంచ భూతములకు, పంచ కోశములకు అధిపతి గణపతి. ఏనుగు చాల తెలివైనది. కనుకనే, **'గజతెలివి' అనే పదం వాడుకలోకి వచ్చింది. వినాయకుడు మహా బుద్ధిశాలి యని, గొప్ప తెలివితేటలు కలిగినవాడని నిరూపించడానికే అతనికి ఏనుగు ముఖం పెట్టబడింది. సిద్ధి, బుద్ధి - ఈరెండింటికి నాయకుడు వినాయకుడు.** కనుక, **మీకు సిద్ధి, బుద్ధి ప్రాప్తించాలంటే వినాయకుణ్ణి ప్రార్థించాలి.** మీ తెలివితేటలను సద్వినియోగపర్చినప్పుడే మీరు వినాయకుణ్ణి పూజించిన వారవుతారు. **మీ తెలివితేటలను దుర్వినియోగం చేయకూడదు.**

(స.సా. న 99 పు. 288)

(చూ॥ గణపతి)

గతము

గతము

(చూ॥ వర్తమానము)

గత వ్యథ

(చూ॥ భక్తుడు)

గమ్యం ఒక్కటే

ఈ ప్రపంచంలో దైవం ఎవరంటే - సత్యమే దైవము. కనుక, సత్యాన్ని అనుసరించినప్పుడే దైవాన్ని ఆరాధించిన వాడవుతావు.

"క్రమము తప్పక మింట ప్రతిదినంబు భాను
డుదయాస్తమయముల నందనేల?
గగనంబునకు కాంతి కైసేయు తారలు
పగలు మాత్రము దాగు భంగియేల?
క్షణమైన విశ్రాంతి గొనక తా పవనుండు
జీవకోటిని బ్రోవ వీవ నేల?
అనిశంబు కలకల ధ్వనుల నవ్వుచు నది
సలిలమై ప్రవహించు చందమేల?
ప్రకృతిలో నెందు జూచిన ధన
కుల మత జాతి విభవ భేదమేల?
ఎవరి ఆజ్ఞకు బద్ధులో ఎవరు ప్రభువొ
అతని ఆజ్ఞను పాలింప అరయ రండు.

అంతటికీ దైవాజ్ఞయే మూలకారణం. "కదలదు తన సంకల్పము లేనిదే గడ్డిపోచయును." మంచి చెడ్డలు నీ భావము యొక్క ప్రభావములేగాని, దైవములో ఉన్నదంతా మంచిదే, సమత్వమే. భారతీయ సంస్కృతి ప్రాచీనకాలము నుండి ఇట్టి పవిత్రమైన ఉపదేశములనే అందిస్తూ వచ్చింది. "విశ్వం విష్ణుస్వరూపం". విష్ణువనగా సర్వత్ర వ్యాపించిన వాడు. కనుక, ఈ జగత్తునందు దైవత్వము లేనిది లేదు. అలాగయితే దైవాన్ని చూపుమని అడుగుతారు కొందరు. **"పశ్యన్నపిచ న పశ్యతి మూఢో," చూస్తున్నదంతా దైవమే.** అయినా దైవాన్ని చూపుమని అడగటం మూర్ఖత్వం. దైవం యొక్క రూపమేమిటి? అన్ని రూపములూ దైవానివే. చూసేదంతా దైవస్వరూపమే. ఇందులో మంచి చెడ్డలనే భేదం లేదు. సాయంకాలం ఫలము తిన్నావు. తెల్లవారేటప్పటికి అది మలంగా మారింది. ఫలము మంచిదంటున్నావు. మలము చెడ్డదంటున్నావు. నీ దృష్టిలో ఇవి మంచి చెడ్డలుగా కనిపిస్తున్నాయి కాని, దైవదృష్టిలో రెండూ సమానమే. కాలమార్పుచేతనే ఈ మంచిచెడ్డలు ఏర్పడుతున్నాయి. కాలము చాల ప్రధానం. ఇట్టి విశాలమైన తత్వాన్ని నిరూపించినది భారతీయ సంస్కృతి. కనుకనే, **'ఇండియా ఈజ్ ది టీచర్ ఆఫ్ ఆల్ ల్యాండ్స్,'** అన్నారు. భారతదేశము అన్ని దేశములకు ఉపాధ్యాయ స్థానములో ఉన్నటు వంటిది. ఇది దివ్యత్వమును ఏ భేదమూ లేకుండా ఒక్కటిగా భావించినది. దైవం ఒక్కడే, గమ్యం ఒక్కటే. ఈ ఏకత్వంలోనే అనేకత్వం వ్యాప్తి చెందినది.

(స.సా.మా. 96 పు. 59)

గమ్యము (గమ్యస్థానము)

మన అందరి గమ్యస్థానము దైవత్వము. అది ఎట్లా చేరేది? తేలిక మార్గము చూచుకోవాలి. గమ్యస్థానం చేరటానికి షడ్దర్శనాలు అనే 6 శాస్త్రాలువున్నాయి. అవి ముళ్ళబాట వంటివి. కఠినమైన రాళ్ళలో పడి కష్టములకు గురికావడం. ఇది కత్తిపై సాము వంటిది. నిప్పుతో చెలగాటము వంటిది. ఏ పవిత్రులైన మహర్షులో వీటిని సాధించగలరు గాని, సామాన్య మానవులు దీనిని సాధించలేరు. **రాచబాట - దగ్గర త్రోవ "ప్రేమతత్వము" ఆ ప్రేమతత్వాన్నే అర్థము చేసుకొని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించండి.** ప్రేమచేత ఎంతైనా సాధించవచ్చు. షడ్దర్శనముల ప్రభావము గొప్పదే. అనుభవించినప్పుడే ఆనందం. **అన్నిటికి ఆధారమైన ఆత్మ "నేను" అనే లక్ష్యమునందే సర్వరూపములు ఇమిడి యున్నవి.** ఒకటి ఒక అంకె. దాని ప్రక్కను సున్నాలు పెట్టితే కొద్ది విలువలు కోటాను కోట్లకు పెరుగుతుంది. ఆ ఒక్కటీ తీసివేస్తే అంతా సున్నా అవుతుంది.

(సా.పు. 31/32)

(చూ॥ అభిన్నత్వం, అహంకారము, గజానన, గౌణశ్చేన్నాతశబ్దత్, భక్తి పరమావధి, మహావాక్యములు, స్వధర్మాచరణ)

గర్భవతి

ఆడవారు పవిత్రమైన గ్రంధాలు చదవాలి. పవిత్రమైన దృశ్యములనే చూడాలి. ఈనాడు ఆడవారు గర్భవతులుగా ఉన్నప్పుడు రోజుకు మూడు, **నాలుగు సినిమాలు చూస్తుంటారు. అందుచేత వారికి పుట్టే పిల్లలు కూడా "సినిమా పిల్లలు'గా** ఉంటున్నారు. దీనికి కారణం ఏమిటి? మన భారతదేశ చరిత్ర నుండి దీనికొక చిన్న ఉదాహరణను మీరు గుర్తించాలి. సుభద్ర గర్భవతిగా ఉన్నప్పుడు ఒకనాడు అర్జునుడు ఆమెకు "పద్మవ్యూహమును" గూర్చి కొంత చెప్పినాడు. ఆమె గర్భంలో నున్న అభిమన్యుడు ఈ పద్మవ్యూహాన్ని గూర్చిన విషయాలు విన్నాడు. అదే విధంగా **లీలావతి గర్భవతిగా ఉన్నప్పుడు ఒకనాడు నారదుడు ఆమెకు పవిత్రమైన "బ్రహ్మభావమును" గురించి బోధించినాడు. అదంతా ప్రహ్లాదుడు చక్కగా విన్నాడు. కనుక, గర్భములో ఉన్న శిశువునకు ఈ విధమైన భావములు చేరిపోతాయి.** అందుచేత తల్లులు తగిన శ్రద్ధబూని పవిత్రమైన దృశ్యములను చూచుటకు పవిత్రమైన పలుకులు శ్రవణము చేయుటకు తగిన ప్రయత్నం చేయాలి.

(శ్రీ.భ.ఉ.పు.131/132)

గర్వము

(చూ॥ విద్య)

గవర్నమెంట్

గవర్నమెంట్ అంటే ప్రతి వ్యక్తి తనకు తానుగా నియమ నిబంధనలను పాటించేలా చూసుకోవటం. గవర్నమెంట్ కంటే గొప్పది 'గాడ్-మెంట్'. ఆదర్శవంతమైన గవర్నమెంట్ కావాలంటే ప్రతి ఒక్కరు తమ బాధ్యతలను గుర్తించాలి. కానీ, ఈనాడు అందరూ బాధ్యతలను విస్మరించి **'రైట్స్' కోసం ఫైట్' చేస్తున్నారు.** సోమరితనానికి చోటివ్వరాదు. **ఉద్యోగస్థులందరూ తాము తీసుకునే జీతాలకు తగినంత పని చేస్తున్నామా లేదా అని ప్రశ్నించుకోవాలి. జీతానికి తగిన పని చేయకపోతే దేశానికి ద్రోహం చేసినట్లే. సమత,** సమగ్రత, సమైక్యత, సౌభ్రాతృత్వములను అలవర్చు కోవాలి. ఈ వస్త్రమును చూడండి. చాల గట్టిగా ఉంది. దారాలను విడదీశామనుకోండి. వాటిని చిన్న వ్రేలుతో కట్ చేయవచ్చు. ఐకమత్యంలో ఎంతో బలమున్నది. **భారత దేశము స్వాతంత్ర్యాన్ని సాధించిందిగాని, ఐకమత్యాన్ని సాధించలేదు. వ్యక్తి స్వేచ్ఛ ఉండవలసిందే. ఎంతవరకు? ఎదుటి వ్యక్తికి అడ్డు తగలనంతవరకు మాత్రమే.** ఒక గృహస్థుడు ఒకనాటి ఉదయం వాకింగ్ స్టిక్ (చేతి కట్ట) పట్టుకుని పబ్లిక్ గార్డెన్‌లో పచార్లు చేస్తున్నాడు. ఆ కట్టను అటూ ఇటూ ఊపుకుంటూ నడుస్తున్నాడు. ప్రక్కనే వస్తున్న వ్యక్తి ఎందుకలా చేస్తున్నావని ప్రశ్నించాడు. ఈయన "ఇది నా చేతి కట్ట. నాకు స్వేచ్ఛ ఉన్నది. అందుకని ఊపుకుంటూ నడుస్తున్నాను" అన్నాడు అప్పుడా వ్యక్తి, "అయ్యా! నీకు స్వేచ్ఛఉన్న మాట నిజమే చేతి కట్ట కూడా నీదే, కాదనటం లేదు. కానీ, దానిని అటూ ఇటూ ఊపటంచేత అది నా ముక్కుకు తగిలే ప్రమాదముంది. నీ స్వేచ్ఛ నా స్వేచ్ఛకు అడ్డు రానంతవరకే అని గుర్తించు" అన్నాడు. **వ్యక్తి మాత్రమే ప్రధానమని భావించకూడదు, సమాజాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. ఉద్యోగాలకోసం ప్రభుత్వంపై ఆధారపడక "స్వీయ దేశీయ శ్రేయ సౌభాగ్యమరసి శ్రామిక విద్యలన్ నేర్వవలయు" మీ చదువులను సామాజిక సౌభాగ్యానికి, వికాసానికి వినియోగించాలి.**

(స.సా.జూలై.99 పు. 193/194)

గహనకర్మగోగతిః

(చూ॥ ఆత్మార్పణ)

గాంధి

(చూ॥విద్య)

గాంబ్లింగ్

"శారీరకముగానూ మేధస్సుతో గానీ ఏమాత్రమూ శ్రమించక ఈ విధముగా డబ్బుపెట్టి **'లక్కీ ప్రైజ్' ను**

గానము

గెలుచుట 'గాంబ్లింగ్' (Gambling) జూదము, ఇది స్వామికి ఏమాత్రమూ సమ్మతము కానేకాదు. (పుష్పగిరిలో 'స్కాట్సు' సేవ చేయుచుండిన సంతకు పోయే దారిలో సత్యాకు ఒక బీడికట్ట, ఒక అణాదొరకినవి, ఆ అణా నాణెమును మాత్రమే తీసుకొన్న సత్యా, దానిని పందెము కాసి, 'కాయ్ రాజా కాయ్' ఆటలో 'కాంపు' ఖర్చులకు అవసరమైన డబ్బును గెలుచుకొనెను). సందర్భవశాత్తు పరిస్థితుల ప్రాబల్యము చేత స్వామి ఈ విధముగా చేయవలసి వచ్చింది. కానీ ఈ కారణము చేత మీరెవరూ దానిని అనుకరించరాదు.''

(లీ.నా.సా. పు. 42)

గానము

భగవంతుడు గానప్రియుడు. తుంబుర, నారదులు గానంచేస్తుంటే భగవంతుడు తన్మయుడవుతుంటాడు. గానములోనే భగవంతుడు లీనం అవుతాడు. అందువల్లనే సామూహిక భజన అనేది ఏర్పడి మీకు గానం చేయడం తెలియదని మీరు నిరుత్సాహ పడనక్కరలేదు. **మీ హృదయంలోనే మీరు గానం చేసుకోండి. పదిమంది వినాలని శ్రుతిలయ రాగతాళములను చూసుకోవద్దు. గానములో నున్న ఆకర్షణ మరోక దానిలో కనిపించదు.** అనేక మంది కవులు ఎన్నో పద్యాలు వ్రాస్తుంటారు. 'ఓరామా! నన్ను కాపాడు'' అని పద్యంలో చెబుతుంటాడు. మరి కొందరు వచనంలో చెబుతుంటారు. ఈ రెండు అంత ఆకర్షణీయంగా ఉండవు. ''రామా... నన్ను కాపాడు'' అని గానం చేస్తే అది హృదయాన్ని కరిగిస్తుంది. **గానము భగవంతుని వరప్రసాదమే.** చక్కగా గానం చేయాలని ఎంత మందో ప్రయత్నిస్తున్నారు. కాని విఫలమై పోతున్నారు. కొందరు ఏ ప్రయత్నమూ చేయకపోయినా సులభంగా, సున్నితంగా మధురంగా, ఆనందంగా గానం చేయగల్గుతున్నారు. ఇది భగవంతుని వరప్రసాదమే. ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి ఉన్నదిక్కడ. గానమువల్ల ఆమె హృదయం మధురంగా మారిపోయింది. ఇది ప్రాక్టీసు చేస్తే వచ్చేది కాదు. ఇది భగవదనుగ్రహప్రసాదమే. బాహ్యంగా భజన చేస్తే పదిమందికి ఆనందము నందించవచ్చును. అట్లచేయలేకపోయినా **మీలో మీరు భగవంతుని ప్రార్థిస్తూ గానం చేసుకోండి. అది మీ హృదయాన్ని మధురంగా మార్చుతుంది.**

(స.సా. డి. 96 పు. 313, 314)

తేజోమయుడైన భగవంతుని యందు మంత్ర పూర్వకమైన ఆరాధన చేత సామవేదమనే గానం చేత లీనం కావాలి. లీనం కావడానికి గానం తప్ప మరొక దారి లేదు. చాలామంది పద్యాలు చదువుతుంటారు. మాటలు చెపుతుంటారు. కాని పద్యముల చేత, మాటలచేత హృదయం ఆకర్షింపబడదు. రాముని ముందుకుపోయి ''రామా నన్ను కాపాడు'' అని మాటలతో చెపితే హృదయం ఏమాత్రం కరుగదు. పద్యంలో చెపితే అది కూడా హృదయాన్ని ఏమాత్రం కరిగించదు. కాని, ''రా..మా...నన్ను కా..పా..డు...'' అని గానం చేస్తే, అది హృదయాన్ని ఎంతగానో ఆకర్షిస్తుంది. **గానంలో ఈ విధముగా లీనం కావడానికి అవకాశముంది.** కాని, ఈ లీనతత్వాన్ని అర్థం చేసుకోలేని వ్యర్థజీవులందరూ గానాన్ని వినలేకపోతున్నారు. గానంలో ఏమైనా కొంత అవస్వరం వస్తే అది భ్రష్టుపట్టిస్తుంది. ఏకాగ్రతను చెడగొట్టుతుంది. కనుక, మనం పాడే సమయంలో సుస్వరంగా పాడగల్గితేనే మైకుముందు కూర్చోవాలి. లేకపోతే మైకునకు దూరంగా ఉండి శ్రవణం చేస్తే మంచిది. అపస్వరంతో పాడే భజనలు, అపస్వరంతో చేసే గానము మన హృదయాన్ని కొంతవరకు చలింపజేస్తున్నాయి. నీకు పాడాలని ఇష్టముంటే ఒంటరిగా ప్రాక్టీసు చేయి, తరువాత మైకు ముందుకు వచ్చి కూర్చో. భగవంతుని ఆకర్షింపజేసేది, హృదయాన్ని రంజింపచేసేది గానమే. ఇదే శబ్దప్రమాణము.

(స.సా. అ. 93 పు. 274)

(చూ॥ సాక్షాత్కారము)

గానప్రియుడు

ఎవరైనా వచ్చి, ''నీవు దొంగవురా'' అంటే నీకు కోపం వస్తుంది. ''నేనేమి దొంగతనం చేశాను? ఎందుకు నన్ను

దొంగ అంటున్నావు?'' అని వానితో పాట్లాడతావు. అదే పదములో భగవంతుని కీర్తిస్తూ, "బడా చిత్తా చోర బృందావన సంచార... '' అనే పాట పాడితే అందరూ తన్మయులౌతారు. **గానములో ఇంతటి మాధుర్య మున్నది. భగవంతుడు గానప్రియుడు.** "హే రామా! ఎంతటి దయామయుడవయ్యా నీవు!'' అని మాటలలో చెపితే మనసు కరుగదు. "ఓ రామా!నన్ను కాపాడు'' అని పద్యంలో చెప్పినా అంత గొప్పగా ఉండదు. కాని, "రామా! నన్ను కాపాడు...'' అని గానం చేస్తే హృదయాన్ని ఆకర్షిస్తుంది. కనుకనే, భజనకు ఇంతటి ప్రాధాన్యత ఇవ్వబడినది.

(స.సా. సె.96 పు. 242)

గాయత్రి

గాయత్రి ఎవరు? ఏదో ఒక స్త్రీ అని, ఆమె శక్తివంతురాలని కాదు. సర్వత్ర ఉండేది గాయత్రి. ఎక్కడ నీవు గానం చేస్తే అక్కడ గాయత్రి ఉంటున్నది. ఈమెకు గాయత్రి, సావిత్రి, సరస్వతి అని మూడు పేర్లు ఉంటున్నవి. **ఇంద్రియములకు నాయకత్వం వహించినది గాయత్రి; సత్యమును పోషించేది సావిత్రి; వాగ్దేవతా స్వరూపిణి సరస్వతి. అనగా హృదయము, వాక్కు, క్రియ - ఈ త్రికరణశుద్ధి గావించునదే గాయత్రి, సర్వదేవతాస్వరూపిణి గాయత్రి. ఈమెకు "పంచముఖి" అని మరొకపేరు.** పంచముఖి అనగా, ఐదు ముఖములు కల్గినది. **ఓం - ఇది ఒక ముఖము; భూర్భువస్సువః - రెండవముఖము; తత్సవితుర్వరేణ్యం - మూడవముఖము; భర్గోదేవస్యధీమహి - ఇది నాల్గవది; ధీయోయోనః ప్రచోదయాత్ - ఇది ఐదవది. అంతేకాదు. ఈమెకు, తొమ్మిది వర్ణన లున్నాయి. ఓం, భూః, భువః, సువః, తత్, సవితుర్, వరేణ్యం, భర్గో, దేవస్య - ఇవి వర్ణనలు. ధీమహి - ధ్యానించడం, ధీయోయోనః ప్రచోదయాత్ - ప్రార్థించడం. కనుక వర్ణన, ధ్యానము, ప్రార్థన - ఈ మూడూ ఒక్క గాయత్రీ మంత్రములోనే లీనమై ఉంటున్నది.**

(స.సా. జూ 1995 పు. 164)

ప్రతి మనిషికి ఒక్కటికాదు నాలుగు జన్మదినము లున్నాయి. మొదటిది శిశువుగా జన్మించినపుడు, ఆ స్థితిలో ఆహారము రక్షణలను మాత్రమే ఆ శిశువు కోరుతుంది. కనుక అది పాప పుణ్యము లెరుగని స్థితి. **రెండవ జన్మదినము** ఈనాడు మీకు ప్రాప్తించిన **ఉపనయనము.** ఇప్పుడు మీరు ద్విజులు అంటే రెండు సార్లు జన్మించినవారు. ఇపుడు మీరు అంధకారము నుండి వెలుగులోనికి తీసుకువచ్చే మంత్రోపదేశము పొందారు. **ఈ యజ్ఞోపవీతము మీ కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంది. మూడవ జన్మదినము** ఎప్పుడనగా మీరు మహార్షులు బోధించిన మార్గములలో ఆత్మ సాక్షాత్కారమునకు అవసరమైన **ఆధ్యాత్మిక పరిజ్ఞానమును ఆర్జించినరోజు.** ఆరోజుననే ఆత్మ విశ్వాసముతో నీవు అమృత పుత్రుడవని గ్రహించి నిజమైన విప్రుడుగా అనగా వివేకవంతుడిగా మారగలవు. అంతేకాదు. **నాలుగవ జన్మదినోత్సవము** చేసుకునే రోజుంది. బ్రహ్మసాక్షాత్కారము పొంది ఏ పరబ్రహ్మముయొక్క ప్రతిబింబములో **అవర బ్రహ్మములో లీనమయ్యే పర్వదినమది.** అపుడే నువ్వు స్వస్వరూపమును పొందుతావు. జీవితమనే యజ్ఞములో పాల్గొనుటకు అత్యవసరమైన పవిత్రతకు **యజ్ఞోపవీత** మొక చిహ్నం. జీవితమనునది అల్పమైన వాటిని త్యజించి ఉన్నతమైన స్థితిని పొందు నిర్విరామ త్యాగము. **ఉపనయనమనగా మరొక నేత్రమును పొందుట,** ఆత్మ సామ్రాజ్య వైభవమును తిలకించుటకు ఈ రెండు చర్మ చక్షువులూ పనికిరావు. ఈ కండ్లతో అనిత్యమైన ప్రాపంచిక వస్తువులను తిలకించుటకు వీలగును. **గాయత్రి మంత్రము అంతర్‌దృష్టిని ప్రసాదించు దివ్య నేత్రము. గాయత్రి మంత్రమును స్త్రీలు కూడా జపించవచ్చును. గాయత్రిని దేవిగా పూజించునప్పుడు స్త్రీలకు జపించు అధికార మెందుకు ఉండదు?**

మూడవకన్ను అనగా జ్ఞాననేత్రము. శివునకు త్రినేత్రుడని పేరు.అతడు భవిష్యత్తును కూడ చూడ గలుగు త్రికాలజ్ఞుడు. అతనిని బిల్వపత్రములతో పూజింతురు.

బిల్వపత్రము మూడు కన్నులకు చిహ్నముగా ఉపపత్రముల కలయిక. అతడు త్రిశూలమును ధరించును. మూడు శూలముల కలయికయైన త్రిశూలము యొక్క అంతరార్థమూ అదియే. శివలింగమును బిల్వపత్రముతో పూజించునపుడు మీరు మీ త్రిగుణముల ప్రాబల్యమునూ త్రిశూలముతో ఛేదించి గుణాతీతమైన చిన్మయ స్థితిని మీకు ప్రసాదించమని ప్రార్థించవలెను.

గాయత్రి జీవితాంతము మీరు సంరక్షించు కోవలసిన పెన్నిధి అని జ్ఞప్తి యందుంచుకోవాలి. ఈ మంత్రం యొక్క స్వరముల ఉచ్చారణ మీకు సరిగ్గా పట్టుపడక పోయినట్లయితే మీ తండ్రి వద్ద కానీ మీ కుటుంబ పౌరోహితుని వద్ద కానీ విని నేర్చుకొనండి బహుశః అశ్రద్ధ వలన వారు కూడా మరచిపోయి ఉండవచ్చు. అట్టివారిని మీవద్ద నేర్చుకోమంటాను. **ఏ మంత్రం మరచిపోవద్దు. నిత్యం వీలయిననన్నిసార్లు జపించండి మీరు బస్సులో ఉన్నా, రోడ్డు మీదవున్నా బజార్లో ఉన్నా, కార్లో ఉన్నా, రైల్లో ప్రయాణం చేస్తున్నా, ఎప్పుడైనా, ఎక్కడైనా సరే అది మీకు హాని కలుగకుండా కాపాడుతుంది.** పాశ్చాత్యులు గాయత్రి మంత్రము యొక్క ప్రాశస్త్యమును పరిశోధించగా వేదోక్తమైన స్వర బద్ధముగా ఉచ్చరించునప్పుడు వెలువడు శబ్దతరంగముల ప్రభావముచే కాంతి వలయము ఏర్పడునట్లు కనుగొన్నారు. స్వరబద్ధముగా లేకున్న అంధకారమే తప్ప ఆ కాంతివలయము కనబడదు. **మంత్రోచ్చారణ ద్వారా బ్రహ్మతేజస్సు తద్వారా జ్ఞానప్రకాశము పొంది మీరు కాంతి పథములలో ఉంటారు. గాయత్రి అన్నపూర్ణ, తల్లి, జీవశక్తి.** అందుచేత అశ్రద్ధ చెయ్యకండి, పెద్దలు పూరోహితులు దీనిని నిర్లక్ష్యము చేస్తున్నారు. భారతీయ సంస్కృతికి వారసులైన మీరు గాయత్రి యొక్క పవిత్ర శక్తి ప్రభావములను ఆచరణ రూపములో చాటవలసిన బాధ్యతను వహించండి.

(స.సా.ఆ. 77 పు. 141/142)

క్రమక్రమేణ గాయత్రీ మంత్రమందు సూర్యుని ప్రధానమైన దేవతగా విశ్వసిస్తూ వచ్చారు. 'ధీయో యో నః ప్రచోదయాత్'. సూర్యుడు ప్రకాశించినట్లుగా మానవుని బుద్ధి అమితంగా ప్రకాశించాలి; సూర్యప్రకాశము బుద్ధిలో ప్రవేశించాలనే ప్రార్థనలు సలుపుతూ వచ్చారు. గాయత్రి మంత్రముచ్చరించుకుంటూ గాయత్రి వేదమాత అని విశ్వసించినారు. **గాయత్రి ఒక కాలమునకు, ఒక దేశమునకు ఒక పాత్రకు సంబంధించినది కాదనియు, భూర్భువస్సువః మూడులోకములకు మూడు కాలములకు సంబంధించినదనీ** విశ్వసించారు. **"తత్సవితుర్ వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియో యో నః ప్రచోదయాత్". చీకటిని రూపు మాపేది వెలుగు. వెలుగు లేకుండా చీకటి దూరము కాదు. చీకటిని రూపుమాపే సూర్యుడు గాయత్రీరూపములో ప్రధానస్థానమును ఆక్రమించాడు. ఈ విధముగా యేదో ఒక శక్తి వున్నదని, ఆ శక్తియే దైవమని విశ్వసించుకుంటూ వచ్చారు.**

(ఉ.బ్ర పు. 16)

గాయత్రి మంత్రము వేదసారము. సమస్త వేదములకు గాయత్రియే మూలము. "గాయత్రీ ఛాందసాం మాతా" ఒక్కొక్క వేదము ఒక్కొక్క మహావాక్యము అందిస్తుంది. (1) తత్త్వమసి (2) ప్రజ్ఞానబ్రహ్మ (3) అయమాత్మా బ్రహ్మ (4) అహం బ్రహ్మాస్మి ఈ నాల్గింటిని ఈ నాలుగు మహావాక్యములు జత చేస్తే అవి గాయత్రి రూపము ధరించును. గాయత్రి సమస్త దేవతా స్వరూపము. గాయత్రి ఉపదేశమును అందుకున్న తరువాత ధరించే **యజ్ఞోపవీతములో మూడు త్రాళ్ళు చేరి వుంటాయి. త్రికాలము సంధ్యా వందనము చేయవలయునని దీని యర్థము. ప్రాతః సంధ్య, మధ్యాహ్న సంధ్య, సాయం సంధ్య, ఈ మూడు కాలములను బ్రహ్మ, విష్ణు, రుద్ర స్వరూపములుగా భావించి, త్రిలోకములందు, త్రికాలములందు, సార్థక జీవితమును సాధించ వలయుననే గాయత్రి ప్రార్థన. అంతరార్థం. గాయత్రి పంచభూత స్వరూపిణి. పంచ ప్రాణ పోషిణి, పంచేంద్రియ విధాయిని. కనుక సర్వజ్ఞానములు గాయత్రి యందు వుంటున్నది. అందువలననే గాయత్రి దేవిని పంచముఖి**

యని ధ్యానించుచున్నారు. గాయత్రి ప్రథమ ముఖం "ఓం, ద్వితీయ ముఖం" భూర్భువస్సువః" మూడవ ముఖం "తత్సవిత్వరేణ్యం" నాల్గవ ముఖం "భర్గోదేవస్య ధీమహిః" ఐదవ ముఖం "ధీయోయోనః ప్రచోదయాత్".

గాయత్రి మంత్ర పారాయణద్వారా పంచభూతముల, పంచ ప్రాణముల, పంచ కోశముల తత్త్వమును పొందుటకు వీలుండును. ఆధ్యాత్మికము, ఆధిదైవికము ఆధిభౌతికము అని మూడు ఉన్నట్లుగా **గాయత్రికి కూడా గాయత్రి, సావిత్రి, సరస్వతి అని మూడు పేర్లున్నాయి. ప్రాణమును పోషించునది గావున గాయత్రి, ఇంద్రియములను పోషించునది గావున సావిత్రి, వాక్కును రక్షించునది గావున సరస్వతి యని పేరు.** వాక్కు, ఇంద్రియములు, ప్రాణములు ఇవి త్రికరణములుగా యుండును. ఇట్టి త్రికరణములు శుద్ధీకరించునుగాన గాయత్రి మంత్రము త్రికరణ శుద్ధికొరకు కర్మ లాచరించునపుడే విజయము సాధించుటకు వీలగును. గాయత్రి జప సాధనవలన త్రికరణ శుద్ధి సులభమగును.

(సా॥పు॥ 564)

గాయత్రికి నాలుగు పాదములు, ఆరు విధములును కలవు. ఆ విధము లెవ్వి అనః **వాక్కు, భూతము, పృథివి, శరీరము, హృదయము, ప్రాణము.** ఇట్టి పవిత్ర గాయత్రిచే చెప్పబడిన పురుషుడు మిక్కిలి శ్రేష్టుడు; మిగుల పవిత్రత గలవాడు, మిగుల మహిమకలవాడు. సకల భూతములు ఆయన శరీరమున అల్ప భాగముగా పరిగణింపబడుచున్నవి. గాయత్రిచే పేర్కొనబడిన పురుషుడే బ్రహ్మయని చెప్పబడువాడు. అతడే పురుషునికవతలనుండు ఆకాశమై యుండును. అప్పుడు "బహిర్ధా పురుషాకాశః" అని చెప్పబడుచున్నది. ఇదియే జాగ్రదావస్థ. అతడు పురుషుని లోపల నుండు ఆకాశమై యున్నాడు. అప్పుడు "అన్తఃపురుషాకాశః" అని చెప్పబడును. దీనిని స్వప్నావస్థ అందురు. అతడు హృదయములోపల నుండు ఆకాశమై యున్నాడు. అది పూర్ణము. సర్వత్ర నిండియున్నది. అదియే సుషుప్తి అనబడును.

(శ్రీస. సూ. పు. 111)

(చూ॥ ఆహుతి, కర్తవ్యధర్మము,వాల్మీకి, విశ్వామిత్రుడు)

గాయపరచవద్దు

"ఉద్దేశ్యపూర్వకంగానయినా, కాకపోయినా ఎవ్వరి ఆత్మాభిమానాన్ని గాయపరచవద్దు.

(శ్రీస. ప్రే.సు. స్ర. పు. 244)

గాలి

గాలి అన్ని ప్రదేశములకు వెడుతున్నది. ఏ దుర్గంధమును ఏ సుగంధములను ఏ మాత్రము తాను స్వీకరించటంలేదు. సర్వ ప్రాణులకు ఉచ్ఛ్వాస నిశ్వాసములందిస్తున్నది. కానీ దేనితోను సంబంధము లేదు. "అన్నింటి యందు ఉన్నాను. అందరిలోను ఉన్నాను. కానీ నాలో ఏమీ లేదు!" ఇది గొప్ప బోధ. అందరి యందు ఉంటున్నాడు భగవంతుడు. కానీ భగవంతునిలో ఏమీ లేదు. అదే **"నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణిం" అని ప్రబోధించింది వేదము.**

(ద. య. స. పు. 64)

(చూ॥ మానుషాకారము)

గిఫ్ట్

నీవు ఎంత గొప్పవాడవైనప్పటికిని, ప్రైమినిస్టరువే అయినప్పటికిని నీ తల్లికి నీవు కుమారుడవే. కనుక **మొట్టమొదట నీవు తల్లిని గౌరవించాలి, తండ్రిని గౌరవించాలి.** తల్లితండ్రులనే గౌరవించలేని వ్యక్తిని లోకము ఏమాత్రము గౌరవించదు. ఎవరికి వారు మౌనంగా కూర్చొని విచారణ చెయ్యాలి. **నీ బ్లడ్, నీ ఫుడ్, నీ హెడ్, నీ దుడ్డు అంతా పేరెంట్స్ గిఫ్ట్. ముందుగా పేరెంట్స్‌కు గ్రాటిట్యూడ్ యివ్వాలి.** ఈ నాటి అనేకమంది విద్యార్థులు పేరెంట్స్‌కు గ్రాటిట్యూడ్ యివ్వటం లేదు. తల్లితండ్రులను ఫ్రెండ్స్ మాదిరి చూస్తున్నారు. ఇలాంటిదానిని తల్లి తండ్రులు అంగీకరించకూడదు కారణము ఏమంటే తల్లితండ్రులు ఆ పిల్లవాని భవిష్యత్ జీవితము పాడుచేస్తున్నారు.

(ఉ.బృ పు. 12)

గీత

ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు,భగవద్గీత వేదాంత భాష్యములందు గల సమస్త బోధలకు కేవలము కీలకము ఒకే ఒకటి. అదే మనో నిగ్రహము. ఆ మనో నిగ్రహాని కివన్నీ కొమ్మలు రెమ్మలు. ఏదిచేసినా విశ్వాసంతో చేయాలి. గీతలోని 700 శ్లోకాలు కంఠస్థం చేసినంత మాత్రాన కంఠశోష తప్ప సుఖంలేదు. వేదం 80 పన్నాలు వల్లిస్తున్నాము. ఇది కూడా కసరత్తు మాత్రమే. ఉపనిషత్తులు కథలు చదివినట్లు చదువుతున్నాము. ఆ మహర్షి అట్లన్నాడు ఈ మహర్షి ఇట్లన్నాడు - అని కథల మాదిరి చదివితే ప్రయోజనం లేదు. విశ్వాసంతో చదివినప్పుడే కథలుగా కాకుండా వెతలను మార్చే స్థితులుగా బోధపడతాయి. కథలు మన వెతలను దూరం చేయలేవు. వెతలను దూరం చేయాలంటే పూర్తి శక్తి సామర్థ్యాలతో స్వయంకృషి సలుపాలి. కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. కథలను కూడా తెలుసుకొని వాటిలోని పవిత్రతను తీసుకోవాలి.

(జ. పు. 207)

"గేయంగీతా నామ సహస్రం ।
ధ్యేయం శ్రీపతి రూపమజస్రం।
నేయం సజ్జన సంగేచిత్తం ।
ధ్యేయం దీనజనాయత విత్తం ''
పవిత్రాత్మస్వరూపులగు విద్యార్థులారా :
ఈ శ్లోకము శంకరుల కడగొట్లు శిష్యుడు గీతను గురించియు, ధ్యానమును గురించియు, సహస్ర నామమును గురించి, త్యాగమును గురించి భజగోవింద తత్వమునందు యిమిడ్చి సంతృప్తినొందాడు. "గేయంగీత" అనగా గీతను పాడుట. గీతను పాడుటవలన ఫలితమేమి? మానవుడు విషయ భాగములకు గురి అగుటచేత అశాంతికి లోనవుతాడు. అట్లుకాక అశాంతినుంచి దూరము చేయుటకు గీతయే భగవానుని దూత, గీతయే జగదేకమాత, గీత సాధనకు పూత. గీత సంసారికొక ఈత. గీతయే మంత్రాలమూట, గీతయే వేదాంతపూట, గీతయే ఘనరాజ బాట, గీతయే పుష్పలబాట. యిదియే శ్రీసాయిమాట.

(భ.ప్ర.పు. 148)

గీతయొక్క భావార్థము గ్రహించిన అది ఎంత గాంభీర్యమో తెలియును. **ఉపనిషత్తులు గోవులుగను, అర్జునుడు దూడగను, పితుకు వాడు గోపాలుడుగను, మంచి బుద్ధి గల వారలు త్రాగు వారుగను పవిత్ర గీతామృతమే పాలుగానూ, రూపించిరి.** ఆహా ఎట్టి అద్భుత రూప కల్పన!

(గీ పు. 1)

గీతయొక్క విలువ

గీత యొక్క విలువను తెలుసుకొనవలెనన్న మొదట గీతపై పూజ్యభావము కలుగవలెను. గీతకు బహిరంగ పరీక్షణము, బాహ్యనిరీక్షణము అత్యవసరము. తలపై నుంచుకొవలసినది గ్రంధముకాదు, అందులోని భావములను, పూజగ్రంధమునకు కాదు, అందలి విషయమునకు పీఠములపై పెట్టుటకాదు, హృదయపీఠమున ప్రతిష్టింపవలెను. అట్లు చేసిననే గీత యొక్క సత్యము నిత్యము, నిర్మలమై నిలుచును.

ఆకొన్నవాని ఆకలి తీరునా
పంచభక్ష్యముల పాకమువిన్న?
నిరుపేదవాని పేదరికంబు పోవునా
విత్త ప్రభావంబు విన్నయంత?
రోగపీడుతు వాని రోగము తీరునా
ఔషధమహిమంబు అంత విన్న?

భవరోగ నివారణ కావాలంటే, భగవంతుడు మన మనస్సులో నిలిచిపోవాలి. మన రక్తములో కలిసిపోవాలి. సర్వత్రా ఉన్న ఈశ్వరతత్వాన్ని హృదయస్థానమున అభివృద్ధి పరచుకొని అంతర్ దృష్టి ద్వారా దర్శించుకోవడానికి ప్రయత్నించాలి.

హృదయము లేని మాటల కంటే, మాటలు లేని హృదయములుగా మనము తయారు కావాలి. మానవుడు ఈనాడు అభివృద్ధి పరచుకోవలసింది మాటలు లేని హృదయము. ప్రేమ స్వరూపులారా! మనము వేద, ఇతిహాస, పురాణములను పఠించవచ్చు. భగవద్గీతను పారాయణము చేయవచ్చును. ఇవి పవిత్రకర్మలే! కాని, మన

నిత్యజీవితములో అనుభవించవలసిన అనుభూతులు, చేయవలసిన పనులు, కర్తవ్యములు సక్రమమైనటు వంటివిగా ఉండాలి. మన ప్రవర్తన సక్రమముగా లేకుండా, ఎన్ని భగవద్గీతలు చదివినా, ఎన్ని ఉపనిషత్తులు పఠించినా మనకు వచ్చిన ఫలితమే మాత్రము ఉండదు.

కాషాయ వస్త్రము కట్టిన మాత్రాన
కరతలామలకంబు కాదు భక్తి
నోటితో మంత్రంబునుచ్చరించిన లోన
చేసిన పాపంబు చెదిరిపోదు
గీతల చేబట్టి కేకలు వేసిన
పుణ్యంబు మన ఇంట ప్రోగుపడదు
చెప్పుమాటలకు చేసెడి చేతలకున్
సామ్యముండెడి వాడె సాధువగున్

మనలో ఉట్టినటువంటి, ద్వేష అసూయాదులనే కంపునుండి, మననుండి ఎప్పుడు విడదీస్తామో, అదే నిజమైన భక్తి ప్రవీణత లక్షణము. కావున గీతా ప్రచారకులు గాని, గీతాపారాయణులు గాని బాహ్యాడంబరములకు పోక, విషయమునకు హృదయ స్థానమిచ్చి, ఆచరణ యందనుభవించుకొని, ఆనందము పొందుట ధర్మము.

(శ్రీ.భ.ఉ.పు.37/38)

(చూ॥ఓర్పు, భగవద్గీత)

గీతలోని గురుశిష్యులు

పరమాత్ముని పలుకులు ప్రతిఒక్కటియు, ఆచరణ ప్రధానమైనవే గాని, కేవలము ప్రచారరూపము లైనవికావు. కృష్ణపరమాత్మ చెప్పిన ప్రతి పదము అర్జునుడు అనుభవమున నిరూపించినాడు. **గీతలోని గురు, శిష్యులు ఆదర్శమూర్తులు, అధికారమూర్తి శిష్యుడు, అవతారమూర్తి గురువు, నరోత్తముడు శిష్యుడు, పురుషోత్తముడు గురువు. మహాత్ముడైన అర్జునుడు శిష్యుడు, పరమాత్ముడైన కృష్ణుడు గురువు, ధనుర్ధరుడైన వాడు శిష్యుడు. యోగీశ్వరుడైనవాడు కృష్ణుడు గురువు. ఇట్టి గురుశిష్యులు అయినప్పుడే బ్రహ్మ విద్య లభ్యమగును. 'యధేచ్ఛసి తథాకురు" అని గురువు అంటే? "కరిష్యే వచనం తవ"** అని అహంకారమును వీడిన శిష్యుడు అంటాడు. అందుకే పరమ కృపాళువైన శ్రీకృష్ణభగవానుడు మానవ ప్రతినిధియగు అర్జునుని నిమిత్త మాత్రునిగా చేసి, పవిత్రమగు గీతామృతమును ప్రపంచమున కందించినాడు.

(శ్రీ.భ.ఉ.పు.37)

గీత - విశిష్టత

స్వార్థము, రాగము, ద్వేషము, మమకారము, అహంకారము యివి నిర్మూలనము గావించే నిమిత్తమై యీ గీత యిన్ని శిరస్సులు ధరించి అనేకరూపములుగా అనేకమందిని ఆదరిస్తూ వచ్చింది. ~~ఈ~~ **~~గీత~~ కల్పవృక్షము వంటిది.** ఎవరు యేవిధమైన అర్థమును తీసుకుంటే ఆ అర్థముగా అన్వయిస్తుంది. దీనికి యిదే అర్థము, అదే అర్థము, అని నిర్ణయించే అధికారము యెవరికి లేదు. కల్పవృక్షములో యీ పంటనే పండాలి, యీ ఫలమే రావాలి యని యెవరు నిర్ణయించగలరు? **కోరినదాన్నంతా అందిస్తుంది.** కనుకనే

గీతయే భగవానుని దూత, గీతయే జగదేక మాత
గీతయే సాధకుని ఊత, గీతయే సంసారికి ఈత
గీతయే మంత్రాల మూట, గీతయే వేదాంతపు ఊట
గీతయే మంచి పూలబాట, గీతయే ఘనరాజ బాట
ఇదియే శ్రీసాయి మాట
ఇష్టము లేనివాడు గీతను గీతగా కూడ గీయవచ్చు.

(శ్రీస. గీ. పు. 291)

గుండె

మనం నిర్విరామ కృషి చేయడం వలన చాలా విసుగెత్తుతున్నాము, అలసట చెందుతున్నాము. కాని, మన గుండె ఏమని ప్రబోధిస్తున్నది? "ఓరి పిచ్చివాడా! **నిర్విరామ కృషియే నీ జీవిత ప్రధాన లక్ష్యము"** అని అంటున్నది. **"కర్మాను బంధీని మనుష్య లోకే"** మనుష్యులు కర్మచేత కట్టుబడినవారు. నీవు కర్మాచరణ నిమిత్తమే జన్మించావు. కనుక, నీవు అలసిపోయినావని Imagina-

tion కు అవకాశము ఇవ్వరాదని గుండె బోధిస్తున్నది. ఏవిధంగా? గుండె నిరంతరం కొట్టుకుంటూనే ఉన్నది. ఐతే, దానికి ఒక 'రెస్టు' ఉన్నది. ఏమిటిది? రక్తం గుండెకుపోయి చేరినప్పుడు అక్కడ ఆ Cell full అయ్యేంతవరకు దానికి రెస్టు ఉంటుంది. అది full అయిన తక్షణమే దానిని పంపుకొట్టి ఊపిరితిత్తులకు పంపిస్తున్నది. ఈవిధంగా **"నా పనిలోనే నాకు రెస్టు ఉన్నది" అని గుండె చెపుతున్నది.**

ఒక్కొక్క పర్యాయం మా పిల్లలు - స్వామీ! మేము ఉదయం నాల్గు గంటలకే లేచి రాత్రి పదకొండు గంటల వరకు చదువు తుంటాము. మాకు అసలు రెస్టు లేనేలేదు" అని అంటుంటారు. **"Rest అంటే ఏమిటి?** పరుపు వేసుకొని పడుకోవటం Rest కాదు; **Change of work is Rest" అని నేను చెపుతుంటాను. గుండెలో కూడా ఈ విధమైన Change of work జరుగుతున్నది. Cell full అయ్యేంతవరకు గుండెకు రెస్టు.** ఈ తరువాత తిరిగి పంపుకొడుతున్నది. ఇది ఎంతో సూక్ష్మముగా జరిగి పోతున్నది! మన Blood cells లో ఎంతో పని జరుగుతోంది. ఈ సృష్టిరహస్యాన్ని ఎవ్వరూ గుర్తించలేరు. మన దేహమంతా Blood cells తేనే కూడి ఉంటున్నది. ఒక్క Cell లోపల ఏ Power అయితే ఉన్నదో మిగిలిన అన్ని Cells లో కూడా అదే ఉన్నది.

మన గుండె చాలా గొప్ప కృషి చేస్తున్నది. **రక్తము purify అయిన తరువాత తక్షణమే దానిని పంపుకొట్టి త్యాగం చేస్తున్నది, ఈ విధంగా మానవునికి త్యాగమును బోధిస్తున్నది.** మన దేహంలో నిరంతర Blood circulation జరుగుతునే ఉంది.ఇట్టి త్యాగమే లేనిచో రక్తం ఉన్నచోటే ఉండిపోయి అక్కడ boil ఏర్పడుతుంది; అది మనకు రోగంగా రూపొందుతుంది. త్యాగం వలన ఎంతో క్షేమము కలుగుతున్నది. కనుక, మన జీవితంలో ముందుకు నడవాలంటే త్యాగము అత్యవసరము. **"నకర్మణా న ప్రజయా ధనేన త్యాగే నైకే అమృతత్వ మానశుః".** కనుక, త్యాగము చేతనే అమృతత్వం (Immortality) చేకూరుతున్నది. **What is the way to immortality? Removal of immorality is the only way to immortality. కనుక, Immorality ని మనము దూరం చేసుకోవాలి.** పిల్లలకు బాగా తెలుసు - **ఈత కొట్టేటప్పుడు ముందరున్న జలాన్ని వెనుకకు నెట్టినప్పుడే నీవు ముందుకు పోగలవు.** లేకపోతే ఉన్నచోటనే ఉంటావు. అదేవిధంగా జీవితంలో త్యాగం చేస్తూ రావాలి. మంచినిగాని, చెడ్డనుగాని అన్నింటినీ త్యాగం చేయాలి. మన శరీరం ఎంత గొప్పగా పనిచేస్తున్నదో యోచించింది. ఇందులో అన్నీ స్వార్థ రహితంగా పని చేస్తున్నవి దీనికొక చక్కని ఉదాహరణ: ఈ టంబ్లర్‌లో పళ్ళరసం ఉంటున్నది. కాని, దీని రుచి టంబ్లర్‌కు తెలియదు. దీనిలో స్ట్రా (Straw) వేసి దాని ద్వారా జ్యూస్‌ను నోటి లోనికి పీల్చుకొంటాము. దాని రుచి స్ట్రాకు కూడా తెలియదు కాని, నాలుకకు మాత్రం తెలుస్తుంది. ఐతే, నాలుక రుచి చూస్తుందే గాని, Enjoy చేయటం లేదు. "ఆహా...! ఈ జ్యూస్ తీయగా ఉంటున్నది" అని గుర్తించి దానిని జఠరాగ్నికి పంపుతున్నది. ఒకవేళ అది రుచికరమైనది కాకపోతే దానిని బయటకు పంపివేస్తుంది. కనుక, నాలుక రుచి చూస్తున్నదేకాని, అనుభవించటం లేదు. అట్లే, మన గుండె కూడా టంబ్లరు వంటిది. దీనిలో life అనే Juice ఉంటున్నది. కాని, గుండెకు ఏమీ తెలియదు. తనలో ఉన్న పైపులవంటి స్ట్రాల ద్వారా దానిని శరీరమంతటా సరఫరా చేస్తున్నది. కాని, బుద్ధి మాత్రం Taste చేస్తుంది. ప్రతీ విషయాన్ని ఇది మంచిదా? చెడ్డదా? అనే విచక్షణతో విచారిస్తుంది. కాని, తాను అనుభవించదు. అంతటినీ Life source కి పంపిస్తుంది. బయట ఉండేది - **Force, లోపల ఉండేది - Source. ఆ Source కోసం మన జీవితాన్ని అర్పితం చేయాలి.**

మన దేహంలో ఎన్నో రకములైన cells ఉన్నాయి; ఎన్నో రకములైన Nerves ఉన్నాయి. **ఈ Divine source వాటి ద్వారా ఎంతటి పని చేయిస్తున్నది!** ఒక వైపున కండరాలను పెంచుతున్నది. మరొకవైపున Nerves కు తగిన శక్తి నందిస్తున్నది. పంచేంద్రియాలను ప్రకటింపజేస్తున్నది. కన్నులకు చూపునిస్తున్నది. చెవులకు

వినికిడి నిస్తున్నది, నాలుకకు రుచినిస్తున్నది. దీనికంతటికి కారణం - **Divine source మాత్రమే.** దాని రహస్యాన్ని ఎవ్వరూ చెప్పలేరు. **కాని, నేటి వైజ్ఞానికులు దానిని - "Law of Nature" అంటున్నారు. ఐతే, ~~ఈ~~ 'Law' అనేది ఎక్కడి నుండి వచ్చింది?** దీనిని ఏర్పరచినవాడొకడు ఉండాలి కదా! ఈ వెండి గ్లాసు Ready made గా రాలేదు. దీనిని తయారు చేసినవాడొకడు ఉంటున్నాడుకదా! ఐతే, వెండి అనేది భగవత్ సృష్టి కాని, గ్లాసు మాత్రం మానవ సృష్టి, అదే విధంగా, ప్రపంచంలో నీటిని, మట్టిని సృష్టించినవాడు - భగవంతుడు. కాని, ~~ఈ~~ రెండింటినీ కలిపి కుండలను తయారు చేస్తున్నాడు కుమ్మరి. కనుక, **పంచభూతముల సృష్టికర్త భగవంతుడే. ~~ఈ~~ విధమైన సృష్టి వేరొకరు చేయలేరు.**

(స.సా.మా. 93 పు. 63/65)

(చూ॥ ప్రధానమైన కారణములు)

గుడాకేశుడు

(చూ॥హృషీకేశుడు)

గుడి గోపురాలు

మానవ దేహం ఒక దేవాలయం వంటిది. ఇటువంటి దేహాన్ని మనం సద్వినియోగం పరచు కోవాలి. మానవుడు సద్గుణాలను కలిగియుండి, సదాచార సంపన్నుడై, దేహాన్ని సరియైన మార్గంలో ప్రవేశ పెట్టాలి. మానవ దేహమనే మందిరము యొక్క పవిత్రతను పురస్కరించుకొనియే దైవము యొక్క శక్తి సామర్థ్యాలు వ్యాప్తమౌతుంటాయి. **దేహమును చూసిన తక్షణమే మనకు దేవుడు జ్ఞప్తికి రావాలి. దేవాలయము భగవంతుని జ్ఞప్తికి తెప్పిస్తుంది.** అందు చేతనే మానవుడు దేవాలయాన్ని చూసి దానిలోపల ప్రవేశిస్తాడు గాని, దేవుని చూసి కాదు.

ఇట్టి పవిత్రమైన ప్రబోధలు సల్పే నిమిత్తమై ప్రాచీన భారతీయులు గ్రామ గ్రామములందు దేవాలయాలను చాలా ఎత్తైనవిగా కట్టేవారు. కాని, వారు వెట్టితనంతో ధనమును వ్యర్థం చేసే నిమిత్తమై **పెద్ద పెద్ద గోపురాలను కట్టించలేదు. గ్రామములో నున్న ప్రజలకు ఆ ఎత్తైన గుడి గోపురాలు కనిపించిన తక్షణమే తెలియకుండానే వారియందు దైవభావము ఆవిర్భవించేది. ~~ఈ~~ విధంగా మానవునియందు నిరంతరం దైవత్వాన్ని ఆవిర్భవింపజేసే తలంపులు ఉద్భవింపజేయాలనే ఉద్దేశ్యంతోనే ఆనాటివారు ఎత్తైన గోపురాలను నిర్మింప జేసారు.**

(స.సా.న 91 పు. 304)

(చూ॥ నాలుగు ఆలయములు)

గుణము/గుణములు

మానవ జన్మము వుత్కృష్టమైనది. అట్టి పవిత్ర జన్మమును సార్థకము చేసుకొనుటకు, పవిత్ర ప్రవర్తనలు ప్రధానము. అట్టి ప్రవర్తనకు గుణము ముఖ్యము. మనుజుడు చనిపోయిన తరువాతకూడా వాని స్వభావములు నిలిచేయుండును. కాన నడవడిక ప్రతి మనుజునకూ నిజబలము. లోకమున చాలామంది జ్ఞానము శక్తి అందురు. కాదు, కాదు, **గుణమే శక్తి,** గుణములేక జ్ఞానము కుదరదు నిర్ధుష్ట మయిన గుణము కలిగియుండవలెను. చూడు **బుద్ధుడు, క్రైస్తు, శంకరాచార్యులు, వివేకానంద ఇట్టి గొప్పగొప్ప మహనీయులూ, ఋషులు, మహాభక్తులు, వీరందరూ, ఇప్పటివరకూ మానవులకు జ్ఞాపకంగా వుండుటకు కారణమేమి; వారి స్వభావములు (గుణములు). గుణము యెదుట యే ధనమూ, విద్యా, పదవులూ, పనికిరావు.**

గుణము సువాసన వెదజల్లు పుష్పము వంటిది. ఆ పుష్పము యెచ్చటనున్ననూ దాని వాసనను మనము పొందుచున్నాము: లోకమున కొందరు కవులూ, మరికొందరు మహా కవులూ, ఇంకా యెందరో విద్వాంసులు, విజ్ఞాన శాస్త్రజ్ఞులూ కావచ్చు, కాని గుణము మాత్రము లేనిదే సంఘమున చోటేలేదు. ఇప్పటి సంఘములో చోటున్నవారి కెల్లరకునూ గుణమున్నదా? అని శంకింపవచ్చును.

అట్టి గుణములు, అట్టి సంఘములూ, నేను తెలుపునట్టి గుణముల కు అన్వయించవు. అటువంటి

గుణములయందు క్షణక్షణమునకూ, మార్పు వచ్చు చుండును. నిజమైన నిర్దుష్టగుణము జీవితాంతము వరకూ, యుగయుగముల వరకూ అమరత్వమై ఆత్మతో నుండును. **ఇట్టి అమరత్వమును పొందునట్టి గుణములే దయా, దాక్షిణ్యము, ప్రేమ, క్షమాపణ, నిజాయితీ, ఓర్పు, ఇవియే లోకమునకు గొప్ప యోగ్యత.** కాని వేరు స్వభావములు ఈ స్థానమును పొందవు.

(ప్రే వా పు. 20/21)

అన్ని జ్ఞానములందు ఆత్మజ్ఞానము చాలా ప్రధానమైనది. దానిని పురస్కరించుకొనియే **జ్ఞానములలో ఆత్మజ్ఞానము ఉత్తమము అన్నారు. అంతకంటే ఉత్తమమైన జ్ఞానము మరొకటి లేదు.** లోకములో అనేక జ్ఞానములున్నవి. పదార్థజ్ఞానము, సాహిత్యజ్ఞానము, చిత్రజ్ఞానము, శిల్పజ్ఞానము. ఈ విధమైన జ్ఞానములన్నింటిలోకి ఆత్మజ్ఞానము ప్రధానమైనది. భౌతిక జ్ఞానములు కేవలము పాండిత్యమును అందించవచ్చు. భౌతిక జగత్తునందు గౌరవ మర్యాదలనందుకోవచ్చును. **'శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాः, ఇదియే ప్రధానమైన బిరుదు.** నాయనా! ఇవన్నీ ప్రాకృతమైనవి. చలించేటటువంటివి. భ్రమించు నటువంటివి. నీవు అమృతపుత్రుడవు. కనుక చలించినది. భ్రమించినది ఆత్మజ్ఞానము అని బోధిస్తూ వచ్చారు ప్రాచీనులు. అయితే దీనికి కొన్ని గుణములు అత్యవసరము.

సద్గుణంబులు, సత్యరతి విద్యకు అవసరమైన గుణములు, సర్వమును గౌరవించి, ప్రేమించి అనుభవించే మనస్సు మానవునియందు ఆవిర్భవించాలి. మానవుడు చదివిన విద్య సేవలో వినియోగించాలి.**'సర్వే లోక హితే రతాः' ఇది ప్రధానమైన గుణము. ఇది మొదటి గుణము 'సర్వేజ్ఞాన సంపన్నై' రెండవ గుణము. మూడవది సర్వే సముచితాగుణైాः'** - సర్వమానవులను హితముగా ప్రేమించి, వారికి అవసరమైనప్పుడు **ఆదుకొని వారిని సేవించటానికి ప్రయత్నించాలి. 'సర్వేజ్ఞాన సంపన్నాः'** - విద్యార్థి సర్వజ్ఞానములందు ఉత్తీర్ణుడై ఉండాలి. పదార్థజ్ఞానము, లౌకిక జ్ఞానము తీసుకుంటే అది కేవలం ఒక Subject మాత్రమే అవుతుంది. సర్వజ్ఞానములు హితముగా గుర్తించాలి. అనుభవించాలి. అతను సర్వజ్ఞానిగా రూపొందాలి. మిగిలిన Subjects అంతా ఏదో కించిత్ జ్ఞానమే కలిగి, తద్వారా ఈ జగత్తునందు పేరు ప్రఖ్యాతులకు పాటుపడుతుంటారు. (స్వామి చేతిలో రూమాలు మూసివుంచి చూపించి) ఇది ఏమని ప్రశ్నించినపుడు piece of cloth అంటారు. ఇది అల్ప విద్యల యొక్క ప్రమాణము. ఇదంతా విప్పి చూపినప్పుడు కర్చీఫ్ అంటారు. ఇదియే పరిపూర్ణ జ్ఞానము. ఈ విధమైన పరిపూర్ణత్వ స్వరూపాన్ని నిరూపించిన జ్ఞానమే పరిపూర్ణ జ్ఞానము. **ఇదియే సర్వేజ్ఞాన సంపన్నాः'** అన్ని విధములైన మార్గములందు గుర్తింపదగినది ఈ ఆధ్యాత్మిక జ్ఞానము. **'సర్వే సముచితా గుణైాः** ఏమిటి గుణమంటే? గుణమనగా చక్కని నడత, త్రిగుణముల సమ్మిళితమైన పదము. పరుల యొక్క దోషమునుగానీ, పరుల తప్పులునుగానీ గుర్తించక తనలోనున్న దివ్యభావములను ప్రకటింప చేయుటయే సరైన గుణము. **విద్యార్థులకు అత్యవసరమైన గుణములు నేర్పునదే విద్య.**

(భ. శ్రీ స. మ. పు. 179/180)

గుణములు మూడు రకములు ఒకటి సాత్వికము, రెండవది రాజసికము మూడవది తామసికము. ఇవి అంతఃకరణముపై ఆధారపడి యుండును అంతఃకరణము ఆహారంపై ఆధారపడియున్నది. ఎట్టి గుణములు కలుగునో అట్లు ప్రవర్తించగలరు; కాన జన్మాంతర పుణ్య పాప సంస్కారములచే కొన్ని దైవ దానవ ప్రవర్తనలు కలిగియుండిననూ ఈ జన్మమున నైననూ అట్టి దానవ గుణములను బలపరచు ఆహార విషయములు అరికట్టి సాత్విక ఆహార విషయమును అభివృద్ధి పరచుకొన్న, తప్పక ఎట్టి దానవ సంస్కారములనైననూ కొంత మార్చుకొనవచ్చును.

(గీ.పు.229)

సత్వరజస్తమో గుణము లనబడు మూడు గుణములు అనేక పరిణామములు కలిగి ప్రకృతియందు

వ్యక్తమగుచుండుటచే ప్రకృతికిట్టి మార్పులు కలుగుచున్నవి. ఆత్మ తేజోరూపమైన, చైతన్యము; దానికెట్టి గుణవికారములు లేవు; దానికెట్టి కళంకము రాదు. బుద్ధి, మనస్సు, శరీరము మొదలగునవన్నియు ప్రకృతి రూపములగుటచే తమ యందలి గల గుణాధిక్యమును బట్టి వానిలో లోపములుండును.

సత్వగుణము నిశ్చల నిర్మల నిస్వార్థ తేజస్సు కాన ఈ గుణము కలవారికి యెట్టి కోరికయు లేక యుండును. **కోరికలు లేనివాడే ఆత్మ జ్ఞానమునకు అర్హుడగును.** రజోగుణము కలవాని కర్మలయందు కొంత కళంకము కలిగి పరోపకార బుద్ధి యుండియు అందులో ఫలమును కీర్తిని కోరి పరోపకారముతోపాటు స్వార్థమును సైతము అపేక్షించును; తమోగుణము కలవాని జ్ఞానము అంధకారమగుటచే యేది చేయతగినది యేది చేయతగనిది అని తెలుసుకొనలేడు. ఈ మూడు గుణములుండు వరకును నిర్వికారుడై గుణాతీతమైన మోక్షమును పొందలేడు. పురుషుడు ప్రకృతి యందున్న వాడు కనుక ఆ కారణమున ప్రకృతి సంబంధమగు గుణము లనుభవించుచుండినటుల కనుపించుచున్న భ్రమను తొలగించు కొనుటే క్షేత్రవిచారణ అని తేలినది. సాధకునకు జ్ఞాన, జ్ఞేయములు ప్రధానమైన అంశములు **జ్ఞానికి నుగుణములే ప్రధానమనియు, దైవసాక్షాత్కారమునే జ్ఞేయమనియు గ్రహించవలెను.**

(గీ. పు. 204)

మొదట నీతినీ, నిష్ఠనూ ఉపదేశించక పూర్వమే బ్రహ్మము నుపదేశించుట, తైలము, వత్తి, ప్రమిదయు లేకనే దీపమును వెలిగించ ప్రయత్నించినట్లుండును. తైలాదులు మూడును సిద్ధముచేసిన తదుపరే బ్రహ్మజ్ఞానజ్యోతి వెలుగును. ఇచట సాధకులు అతిజాగ్రత్తగా విచారించవలెను. అనగా వత్తి, ప్రమిద చిన్నవై నూనె అధికమైననూ జ్యోతి వెలుగదు. ప్రమిద పెద్దదై నూనె ఎక్కువై, వత్తి చిన్నదయిననూ జ్యోతి వెలుగదు. వత్తి, ప్రమిద పెద్దవయిననూ నూనె తక్కువుండిన జ్యోతి వెలుగదు. ఒకదానికి తగినట్లు మరొకటి వుండినపుడే, సమానప్రమాణములు కలిగినపుడే స్వచ్ఛమైన వెలుతురును అనుభవించగలరు. అటులనే **పైమూడు గుణములును సమస్థితియందుండిననే జ్ఞానజ్యోతిని పొందగలరు. దానిద్వారా మోక్షానందమును అనుభవించగలరు.** మోక్షప్రాప్తికి పై మూడు గుణములలో యేవక్కటి వుండినను ప్రకృతి జన్య దేహములో బంధించు మూడు గుణములు మూడు బంధనలే. ఏ బంధన వుండిననూ స్వతంత్రుడు కాలేడు. పశువునకు ముందు కాళ్లు రెండును వక పగ్గముతో కట్టివైచి వెనుకకాళ్ళను మరొక పగ్గముతో కట్టివైచి, కొమ్ములను మెడను మరొక త్రాడుతో కట్టివైచిన ఆ పశువు యెట్లు స్వేచ్ఛగా వుండగలదు! అటులనే మానవునకు సత్వ, రజస్త మోగుణములు మూడు బంధించు త్రాళ్లవంటివి, సత్వగుణము కూడనూ త్రాడే; బంధనే. సత్వము బంగారు త్రాడు వంటిది; రజస్సు రాగిత్రాడు వంటిది; తమస్సు ఇనుపత్రాడు వంటిది. త్రాళ్ళ విలువ హెచ్చు తగ్గులుండునే కానీ బంధన దృష్టిలో మూడును స్వేచ్ఛా రహిత సాధనములే.

(గీ పు. 205/206)

గుణముయొక్క స్వభావమును బట్టి రాక్షస సంతతికి చేర్చడమైనది. **అసుర గుణములన్నిటికినీ కామము, క్రోధము, లోభము, అనెడి మూడు గుణములనూ హేతువైయున్నవి. ఆత్మ వినాశమునకునూ, అసుర వికాసమునకునూ మూలకారణము పై మూడు గుణములే, వాటిని జయించుటకు దైవగుణములైన వైరాగ్యము. శాంతము, త్యాగము అను ఉత్తమ గుణములే సరియైన సైనికులు,** ఈ సైనికులను చక్కని శ్రద్ధతో బలపరచిన నిమిషమాత్రములో కామ క్రోధ లోభమును రాక్షస మూలాధార సారధులను నిర్మూలము చేతురు. దైవత్వమును నిర్మాణము గావింతురు. **కామ, క్రోధ, లోభములనబడు అసురులలో ఏ ఒక్కడు మిగిలియుండిననూ, జీవితమునకు ప్రమాదమే కాన మూడింటిని మంట గలుపవలెను.** అపుడే జీవితము ధన్యము కాగలదు.

(గీ. పు. 227)

గుణ లక్షణము

గొప్ప చదువులుండి గుణము లేకున్నను
విలువయేమి వాని ఫలమేమి?
పంట పండని భూమి పది యెకరములేల
కొంచెమైన చాలు మంచి భూమి

గొప్ప విద్యావంతులగుట కంటె గుణవంతుడు కావటం అత్యవసరము. ఈనాడు కలిమి, చెలిమి చేకూర్చు కొనుటకు తగినకృషి చేస్తున్నారేగాని గుణమును పోషించుటకు ఎవ్వరు ప్రయత్నం కావించటం లేదు. **కలిమి, చెలిమి, బలములు కదలిపోయే మేఘములు. శాశ్వతముగా సత్యమార్గమును నిరూపించునది గుణము. గుణమునందు ఆదర్శవంతులు కావాలిగాని బలమునందు ధనమునందు ఆదర్శవంతులు కారాదు.**

(బృ.త్ర. పు. 3)

గుణము లేని సుతులు గురివేని విద్యలు। నీతిలేని జాతి నిష్ఫలంబు!
శాంతి లేని జీవి శశిలేని నిశిసుమీ। వినుము భారతీయ వీరసుతుడ॥

(సా.పు.350)

మనదేహము తెలుపు, ఎరుపు, నలుపు, సత్వరజో, తమో గుణములతో కూడినది. ఈ గుణములు ఎట్టి కాలమునందుగాని, ఎట్టిస్థితియందుగాని ఈ దేహమును వదులునవి కావు. వీనియందు గుణాతీతమైన జీవతత్వము చెలగాడుచున్నది. జీవతత్వమునకు గుణములకు సంబంధముండదు. ఒక్కొక్క సమయమున సత్వగుణము ప్రకోపిస్తుంది. అట్టి సమయమున రజో, తమో గుణములు అడుగున పడి ఉంటాయి. మరొక్క సమయమున రజోగుణము ప్రకోపిస్తుంది. ఆ సమయమున సాత్వికము, తమోగుణము అడుగున పడి ఉంటాయి. **సాత్విక సంగము కలిగినప్పుడు మానవత్వానికి సుఖప్రాప్తి చేకూరుతుంది.**

(శ్రీ.భ.ఉ.పు.10)

(చూ॥ అవతారములు, అహందేహాస్మి, ఆరుగుణములు, ఈక్షతేర్నాశబ్దం, కర్తవ్య ధర్మము, కర్తవ్యము, కళలు, తమోగుణము, త్రిగుణములు, దుర్గుణములు, దైవగుణము, దైవము, నిష్ఫలము, నిష్కామకర్మ, పంచభూతములు, పాము, భ్రమ, మానవత్వము, రజోగుణము, విద్య, శోభ, సముద్రము, స్త్రీతత్వములు)

గుణ లక్షణము

కౌరవులు పుణ్యకర్మఫలమగు భోగము లనుభవించుచు పాపకార్యములు చేసిరి, పాండవులు పాపకర్మఫలమగు కష్టములనుభవించుచు పుణ్యకార్యములు చేసిరి. ~~ఈ~~ **రెండే వివేకము లేనివారికి వివేకము ఉన్నవారికి భేదము.** కష్టములనుభవించు సమయమున పాపకర్మఫలమని తలంచి భగవంతునిపై విసుగు, కోపము రానీయక, ఆ కష్టములనే తలంచక పుణ్యకార్యములు, పరోపకారములు చేయుచు, భగవంతుని నామము తలంచుచుండిన అదియే **వివేక గుణమునకు గుర్తు;** అట్టివారు పాండవులను పోలినవారగుదురు. ఇట్టి పవిత్రభావమును బలపరచుటకు శాంతికి మించిన సహాయకారి వేరులేదు. పుణ్యఫలమని శుభము లనుభవించుచు పాపకార్యములు తలపెట్టరాదు. అట్టి పుణ్యఫలమును అనుభవించు సమయమున మరింత పుణ్యకార్యములే చేయుచుండిన అట్టి వారి జన్మము భగవత్సాన్నిధ్యమున చేరగలదు. **ఇది ఉత్తమ గుణ లక్షణము.** ఇట్టి గుణములలో శాంతిని సాధించి మోక్షము పొందుటే జీవిత రహస్యము, ధర్మము. చూచినవి, విన్నవి, చదివినవి, నేర్చినవి, చేసినవి, చేయించినవి **అన్నియు మరచి చిత్తశుద్ధుడై యుండుటే సమాధి అనియు, మోక్షమనియు అందురు.**

(ప్ర. వా. పు. 35-36)

గుణవంతుడు

(చూ॥ భగవత్ప్రేమ, వరలక్ష్మీ వ్రతము)

గుమ్మడికాయ

సంక్రాంతి దినమునాడు గుమ్మడి కాయలను ఇతరులకు దానము చెయ్యాలి అనేది మన సంప్రదాయం. **కూరగాయలలో పెద్ద స్వరూపము గలది గుమ్మడికాయ. ఉన్నత స్థాయికి చెందినటు వంటిది గుమ్మడికాయ,** అనగా మనము ఇతరులకు **ఉన్నత భావములనే అందించాలి గాని, అల్పమైన భావములను కాదు** - అని

గోపికలు దీని ద్వారా చక్కని ఆదర్శాన్ని నిరూపిస్తూ వచ్చారు. గుమ్మడి **కాయ స్వల్ప కాలంలో చెడిపోవునది కాదు.** ఇది చాలా కాలం నిలువ ఉంటుంది. దీనిని ఎన్నో రకాలుగా వండుకోవచ్చును. ఈ పర్వదినము నాడు **ఇట్టి ఉన్నతమైన, ఉత్తమమైన ఫలాన్ని ఇతరులకు అందించాలి. అనగా, ఉన్నతమైన గుణాన్ని ఇతరులకు అందించాలి** అని అర్థం.

(స.సా. ఫి-మా 92 పు. 33)

గురి

"చీమకూడా అడుగు ముందర అడుగు వేస్తూ పోతే **గురిని** చేరుతుంది. గరుత్మంతుడు కూడా తన రెక్కలను ముడుచుకొని కూర్చుంటే, గురిని చేరడు. కాబట్టి అడుగు వేయండి. **ఈనాడే ఇపుడే, నిజమయిన ఆవేదనతో వివేక విచక్షణలతో సాధన మొదలు పెట్టండి!**

భగవంతుని అనుగ్రహము మీపైన అపుడే వెలుగును, త్రోవ చూపించును. ప్రయాణము సులభమగును. భగవంతుడు **అవతరించినదే** దీని కోసం కదా?"

(జ్ఞా. వా. పుట 78)

గురుకులము

వ్యాసులవారి దగ్గర అనేకమంది శిష్యులు వేదధ్యయనము నిమిత్తమై చేరేవారు. అందులో మొదటివాడు వైశంపాయనుడు. ఇతను భక్తిశ్రద్ధలతో, వినయ విధేయతలతో గురువాజ్ఞను పాటించి తన జీవితమును సార్థకము గావించుకొన్న వ్యక్తి. **"సద్గుణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమ శిక్షణ, కర్తవ్యపాలనము" మున్నగునవి నేర్పునదే విద్య.** అట్టి విద్యను విద్యార్థి నేర్వవలయును. ఈ విధముగా గురువుదగ్గర వైశంపాయనుడు విద్యను నేర్చుకొని, తిరిగి తాను వేదమును బోధించే నిమిత్తమై ఒక గురుకులమును స్థాపించినాడు. గురుకులమనగా అభ్యాసముల చేత, ప్రత్యేకమైన నిబంధనల చేత ఏర్పడినదని భావిస్తారు. అది కాదు గురుకులము. **గురుకులము అనగా గురువుగారి ఇల్లే శిష్యులకు నిలయం.** గురువు భుజించునదే శిష్యులకు ప్రసాదంగా ఇచ్చేవారు. రాత్రింబవళ్ళు గురువుతోనే జీవితము గడిపేవారు.

(స.సా.జూన్ 91 పు.164)

గురునానక్

(చూ॥ యుక్తులు)

గురుపూర్ణిమ

లోకానికి ఎన్నియో **బోధలు చేశాడు వ్యాసుడు. వ్యాసోనారాయణో హరిః** అన్నారు. అతను నారాయణ స్వరూపుడే అన్నారు. **వ్యాస పౌర్ణిమ అన్నారు.** అనేక వేదములుగా నున్నదానిని ఉద్ధరించుటకు చాలా కష్టమవుతుందని నాలుగు వేదములుగా విభజించి లోకమునకందించాడు. అలాంటి విభాగము గావించిన వ్యాసునికి హృదయము పవిత్రంగా మారిపోయింది. ఈ ప్రపంచమునకు పవిత్రమైన వేదమాతను అందించాను కదా యని తృప్తి పడ్డాడు. **ఆ సంతృప్తి పడిన దినమే పూర్ణిమ. పూర్ణముగా ఉంటున్నాడు చంద్రుడు.** చంద్రునకు, మానవుని మనస్సునకు సంబంధము ఉంటున్నది. ఈ వేదమే **"చంద్రమా మనసోజాతః చక్షో సూర్యో అజాయత" - చంద్రుడు, మనస్సు రెండు ఒక్కటే, బింబ ప్రతిబింబములే,** పూర్ణిమ దినమున పూర్ణ చంద్రుడు ఏ విధముగా పూర్ణముగా ఉంటాడో ఆ విధముగా మనసు పూర్ణముగా ఉంటుండాలి. ఎట్టి దోషములు లేకుండా, ఎట్టి మచ్చలు లేకుండా ఎట్టి దురభ్యాసములు లేకుండా, పవిత్రముగా స్వచ్ఛముగా ఉంటుండాలి. ఈనాడు **పవిత్రమైన భావముతో వేదములు విభజించినవాడు కనుక వ్యాస పూర్ణిమ అని పేరు పెట్టారు.** గురుపూర్ణిమ కాదు. హృదయమును **ఏనాడు పరిశుద్ధము గావించుకుంటామో అనాడే గురుపూర్ణిమ. 'మర్మమెరిగిన మరు నిమిషములో మనసే వారికి గురువండి'** అన్నారు.

గురువారము

మర్మము ఏనాడు తెలుసుకుంటాడో **ఆనాడు తన మనస్సే గురువు అవుతుంది.**

(శ్రీ.స. పు.84)

గురువారము

(చూ॥ నేను)

గురువు/గురువులు

సర్వసద్గుణములు। చక్కగా లేకున్న।
వారు గురువులుకారు వాస్తవమున
నవినయుడుగాక। సచ్ఛాత్రుడెట్లగు?
ఉన్నమాట తెలుపుచున్నమాట॥

(సా.పు. 332)

భుక్తి విద్యలన్ని బోధించి, చెప్పేది, తెల్పేది।
గురువులెల్ల। ఫలము మార్చగలరా।
భుక్తి విద్యలెల్ల ముక్తి విద్యలు చేసి
మోహంబు తెగటార్చు గురువుకలడు॥
గురుతు తెలియ సద్గురువరండు॥

(సా॥ పు. 158)

గురువును ఆధారముగా చేసుకొని అతని సుబోధనల చేత మనము ఉన్నత స్థాయికి చేరుతామనే విశ్వాసము మన భారతీయులది. శాస్త్ర సమ్మతమైన గురువులు ఎనిమిదిమంది - బోధగురువు, వేదగురువు, నిపాతగురువు, కామ్యగురువు, వాచకగురువు, సూచకగురువు, కారణగురువు, విహితగురువు అని. **బోధగురువు** కేవలము శాస్త్రార్థము మాత్రమే బోధించి దానియొక్క నిబంధనలు తగిన రీతిగా ఆచరించటానికి ఉత్సాహప్రోత్సాహముల నందించేవాడు. **వేదగురువు** తత్త్వార్థమును బోధించి, తత్త్వదర్శనమును గావించి మనస్సును దైవమువైపునకు మార్చేవాడు. **నిపాత గురువు** అనేక విధములైన సందేహములను రూపు మాపి మనస్సును పరిశుద్ధము గావించి చిత్తశుద్ధిచే ఆత్మతత్త్వాన్ని గుర్తింపచేసేవాడు. **కామ్యగురువు** కొన్ని కామ్యకర్మలను బోధించి యిహ పరములందు మోక్షము నందించేవాడు. పుణ్య కార్యములను ఆచరింపచేసేవాడు. తద్ద్వారా యిహపరములందు సుఖమునందించేవాడు. **వాచకగురువు** యోగతత్త్వము బోధించి దివ్యత్వమైన ఆత్మతత్త్వమును అనుభవింప చేసేవాడు. **సూచకగురువు** శమదమాది సంపత్తిని బోధించి మానవుని యొక్క ఇంద్రియములను నిగ్రహింపచేసేవాడు. **కారణగురువు** జీవ బ్రహ్మైక్యానుసంధానము కలిగింప చేసేవాడు. జీవతత్త్వాన్ని దైవతత్త్వముగా మార్చగలిగేవాడు. **విహిత గురువు** ఈ రెండింటి సంబంధము బింబ ప్రతిబింబముల యొక్క సంబంధమని బోధించేవాడు. జీవునకు దేవునకు భేదము లేదని నిరూపించేవాడు. ఆచరణ రూపమైన ప్రబోధములు సల్పేవాడు. **ప్రత్యక్ష ప్రమాణములు నిరూపించేవాడు. ఈ గురువు ఒక్క దైవము మాత్రమే.**

(శ్రీ సి. బా. పు. 22/23)

ప్రతి మానవునకు **వృక్షములే ప్రధాన గురువు.** దేహము యొక్క తత్త్వాన్ని మానవుడు అనేక మమకార, **అభిమానములచే పెంచుకొని దానికి బద్ధుడై, దాసుడై తన దివ్యత్వాన్ని తాను మరిచిపోతున్నాడు. ఈ అభిమాన మమకారముల చేతనే మానవుడు ఈ తుచ్ఛమైన శరీరమును అనేక విధములుగ ఆధారము చేసుకొని,** దివ్యత్వమైన అధేయమైన ప్రకృతిని విస్మరించి తాను స్వార్థమునందు మునిగి పోతున్నాడు.

సుఖ దుఃఖములు సమానత్వాన్ని వహించి దివ్యత్వాన్ని లక్ష్యమునందుంచుకొని పవిత్రమైన జీవితమును గడపమని పర్వతములు కూడను బోధిస్తూ ఉన్నాయి. చలి యని పర్వతములు ఏ రగ్గును ధరించటము లేదు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని ఏ hill stationకో వెళ్ళటం లేదు, air conditioners వేసుకోవటము లేదు. వానలు ఏవిధంగా భరించాలనే భ్రాంతిచేత ఏ గొడుగులు పట్టటము లేదు. చలి, ఎండ, వానలు దేహమునకు గానీ, ఆత్మకు సంబంధించినవి కావనే సత్యాన్ని గుర్తించుకున్న కొండలు మానవునకు అనేక విధములుగా ప్రబోధలు సల్పుతూ వచ్చాయి. **ఇది రెండవ గురువు.**

పక్షులు ఎప్పటికప్పుడు, ఆకలివేసినప్పుడు ఏదో ఒక ప్రదేశముకు వెళ్ళి, ఏదో తిని ఆనందముగా, సుఖముగా, శాంతిగా జీవితము గడుపుతూ ఉంటాయి. అంతేకాని రేపు, మాపు అని ఈ Five year plans వేసుకుని ఆ తిండి తీర్థాలకై తాను శ్రమలకు పాటుపడటము లేదు. మానవ జీవితానికి రేపు, మాపు అని చెప్పుటకు ఏమాత్రము ఆధారము లేదు. రేపు వరకు మనము నిలిచే సత్యమేమిటి? ఈ విధమైన నీటి బుడగవంటి జీవితమునకు రేపు మాపు అని అనేక విధముల ప్రాకులాడి, ఈ జీవితమును కాలమును మనము వ్యర్థము గావించుకుంటున్నాము. ఇదే మానవత్వముకు తగినటువంటి దివ్యత్వము కానేరాదని పక్షులు కూడను ప్రబోధిస్తూ వచ్చాయి.

మన కంటి ఎదుట ఎంత మంది మరణిస్తున్నారు. ఎంత మంది జన్మిస్తున్నారు, ఎంత మంది మనలను వదలి వెళ్ళుతున్నారు? ఇవి మనం గుర్తించటానికి ప్రయత్నించడము లేదు. ఎన్ని చూచినప్పటికీనీ, ఎన్ని విన్నప్పటికినీ, ఎన్ని అనుభవించినప్పటికినీ మానవుడు ఈ శరీర భ్రాంతిని వదులుకోవడము లేదు. కనుక దేహ తత్వానికి బాధ్యతలు తప్పించుకోవడము అత్యవసరము. **ఏది మన ఇల్లు, ఏది మన భూమి, ఏది మన వస్తువు,** ఏది మన తత్వము అని విచారించుకోకుండా, అన్నీ నాదీ, నేను అని స్వార్థ స్వప్రయోజనములతో కాయాన్ని విస్మరింప చేస్తున్నాము, ప్రకృతి యొక్క తత్వమే మనకు చక్కగా ప్రబోధిస్తూ వస్తున్నది. గడచిన వసంత కాలము తిరిగి వస్తున్నది. అనేక ఋతువులు తిరిగి వస్తున్నాయి. క్షీణించిన చంద్రుడు తిరిగి ప్రకాశిస్తూ ఉన్నాడు. కానీ నదీ జలము, నరుని యౌవ్వనము తిరిగి రావు **అని జగత్తే మనకు ప్రబోధిస్తున్నది.**

గురువు - ఎవరు మనకు నిజమైన గురువు? ఈ విధమైన అంతర్ ప్రబోధనలు తెల్పునటువంటి ప్రకృతి మనకు నిజమైన గురువు కాదా? **ఈ విశ్వమే మనకు గురువు. విశ్వమే కార్యము, విష్ణువే కారణము. కార్య కారణ సంబంధ స్వరూపమైనటువంటిదే ఈ విశ్వము. "హరిమయము విశ్వమంతయు హరి విశ్వమయుండు,** సంశయము పనిలేదు, హరిమయము కాని వస్తువు పరమాణువు లేదు ఇలలో పరికించినచో" - ప్రపంచ మంతయూ భగవంతుని యొక్క లీలా మానుష విశేషమే.

(స.సా.ఆ. 1989 పు. 197/198)

మీరు పవిత్రమైన భావము చేత దైవము మీ హృదయమునందే ఉండినట్లుగా విశ్వసించి,సర్వము నాకు భగవంతుడే, నిజమైన గురువు ఎవరు లేరు జగత్తులో. **అందరికి గురువు ఒక్కడే దైవము. అన్ని దేశముల వారికి దైవము ఒక్కడే.** కానీ ఆ దైవాన్ని అనేక పేర్లతో పిలవవచ్చు. పేర్లు, రూపములు వేరు కావచ్చు. ఎన్ని టెస్టులు మీరు చేసినా అందులో మూలాధారతత్వము గుర్తించుకుంటూ పోవాలి. గులాబ్‌జాం, మైసూర్‌పాక్, పాలకోవ ఎన్నెన్నో పేర్లు చెబుతుంటారు. అన్నింటిలో ఉన్నది చక్కెర. అదే విధముగా దైవత్వము అన్నింటియందు ఉంటున్నది. పిండిలో ఏ మాత్రము రుచి లేదు. దీనిలో చక్కెర కలిపినప్పుడు ఆ పిండే తీయగా ఉంటుంది. బేడల పిండి ఏ మాత్రము రుచి లేదు. దీనిలో చక్కెర వేస్తే లడ్డు తీయగా ఉంటుంది. గుణ సంపర్కము చేత ఈ రీతిగా మారిపోతున్నది. మీరు భగవత్ సంపర్కముతో మీ జీవితాల్ని సార్థకము చేసుకోండి.

(శ్రీ. స. పు. 87)

అల్పగురువుల చెంత చేరకు - స్వల్ప గుణములు చింత చేయకు - తలపులన్నియు నిలిపివేసిన - తనువుకెప్పుడు జన్మ లేదు - కన్ను విప్పి చూడరోరన్నా!

(శ్రీ స. వి. వా. పుట. 68)

"గురుచరణాంబుజ నిర్భరభక్తిః
సంసారాదభిరాద్భవ ముక్తిః
దశేంద్రియ మానస నియమాదేవం
ద్రక్షసి నిజహృదయస్థందేవః
దివ్యాత్మ స్వరూపులైన విద్యార్థులారా:
గురుచరణములందు నిశ్చలభక్తి, సంసారమునుంచి విరక్తి, యింద్రియ నిగ్రహము, మనస్సును వశమునందుంచు

కొనుట, ఈ నాలుగు గావించిన వ్యక్తికి హృదయ స్థానమునందు వున్న దైవత్వము సాక్షాత్కరించవచ్చు అని శంకరుల కట్టకడపటి శిష్యుడు యీ శ్లోకమును అందించి కాశీనించి తిరిగి రావడానికి ప్రారంభించాడు.

(భ. స.బా. వే.ప్ర. పు. 162)

గురువులు విత్తాపహారులు కాకూడదు; చిత్తాపహరులుగా మెలగాలి. అర్జునుడు కృష్ణుడు ఇరువురూ ఆదర్శ మూర్తులు, అర్జునుడు తపస్సంపన్నుడు; మహాశక్తి మంతుడు. కృష్ణుడు అవతారమూర్తి. పురుషోత్తముడే గురువు: నరోత్తముడే శిష్యుడు. కాబట్టి ఆధ్యాత్మిక బోధ నిరర్గళంగా జరిగినది.

చివరకు **"నష్టోమోహः స్మృతిర్లబ్ధా కరిష్యే వచనం తవ" అని శిష్యుడు ఒప్పుకొన్నాడు.**

ఈ కాలంలో అట్టి గురువులూ శిష్యులూ ఏ దేశములోనూ దొరకరు. గురువులు ఈనాడు శిష్యులకు బానిసలై వారినాశ్రయించి అనుసరించుచున్నాడు. శిష్యుల అభీష్టములనే గురువులు పురస్కరించాలి; లేకపోతే, శిష్యులు గురువులపై విశ్వాసరాహిత్యా తీర్మానమును తెచ్చిపెట్టుదురు. గురువులు కూడ స్వార్థపరులు; అహంకారము, అసూయ, ద్వేషములు నిండిన వ్యక్తులు; కాబట్టి, వారిలో పటుత్వముండదు.

శిష్యులకు విద్యాసంస్థలలో భారతీయసంస్కృతిని పోషించిన దివ్య వ్యక్తుల చరిత్రలను అందించుటలేదు. వారి ఆదర్శములను పవిత్ర సూక్తులను యువకులకు బోధించుటలేదు. భావి భారతోద్ధారకులైన యువతీ యువకులు, అమెరికన్ యవతీయువకులనూ, రష్యా దేశపు యువతీ యువకులనూ ఆదర్శములుగా అంగీకరించి అనుసరించుచున్నారు. దీనికి మూలకారణము భారతీయ బోధకుల అశ్రద్ధ; వారికి భారత సంస్కృతి యొక్క ఘనతను గురించి యేమీ తెలియకుండుటే: పిల్లలకు అర్థరహితమైన, నిస్సారమైన విషయములనే వారు బోధించుచున్నారు. పిల్లల నిర్మల నిశ్చల నిస్వార్థ హృదయములలో పవిత్ర ఆదర్శములను నాటి పోషించిన భవిష్యత్తులో వారికి సుఖశాంతులు, దేశానికి అభివృద్ధి నెమ్మది కలుగును. **ప్రప్రథమములోనే అర్థములేని అనర్థకారీ పదములను పిల్లలచే వల్లింప జేయుచున్నాము. "బాబాబ్లాక్ షీప్" అనే వాక్యములే ఈనాటి ప్రారంభపాఠము. "ఓం నమో నారాయణాయ" "ఓం నమశ్శివాయ" అనే పవిత్ర మంత్రములు కావు. దీనివలన పిల్లలు షీపుగా అంటే గొర్రెలుగా తయారవుచున్నారు. ఈ దుర్గతినుంచి వారు తప్పించుకొనుటకు. మన వేదశాస్త్ర పురాణేతిహాసములనుంచి, బైబిల్ ఖురాన్ మొదలైన పవిత్ర గ్రంథములనుంచి, పార్సీ బౌద్ధమత గ్రంథములనుంచి మహాత్ముల కథలను వారికి అందించవలెను.**

ఇప్పటి దుర్భర పరిస్థితికి పెద్దలే మూలకారణము. తల్లుల **వాత్సల్యము పోషణ శిక్షణ ఇవి పిల్లలకు లభించుటలేదు. కాన్వెంట్లు, బోర్డింగ్ స్కూళ్లు, కాలేజీలు అన్నీ తల్లిదండ్రులకు దూరముగానే వుండి వారి ముఖములనే చూడకుండ వారు పెరిగి పెద్దలగుచున్నారు. వారు నిజముగా దురదృష్టవంతులే; మాతృప్రేమ అనే అమృతరసమును గ్రోలక, కోల్పోవుచున్నారు.** 'ఆయా' చచ్చిన వార్త వింటే పిల్లలు కంటినీరు కార్చుదురు కానీ తల్లి చచ్చిన, వారికి కంటిలో చుక్క నీరురాదు. ఇట్టివాళ్లు మాతృదేవోభవ. పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అనే పవిత్ర సూక్తులను ఆచరణలో అనుభవింతురా?

"గురుర్బ్రహ్మా గురుర్విష్ణుర్గురుర్దేవో మహేశ్వరः" అని గురువులను భారతీయులు ఆరాధింతురు. అయితే ఈనాడు గురువులు ఉత్తమ స్థానమునుంచి హీనమైన హాస్యాస్పదమైన స్థితికి దిగజారిపోవుచున్నారు. వారిలో దురలవాట్లు, దురభ్యాసాలు, దుర్గుణములు, దుశ్చింతనలు ప్రవర్ధమానముగా పెరిగిపోవుచున్నవి. పిల్లలు చిన్న తనమందే ఉత్తమభావములను పెంచుకోవలెనన్న ఆధ్యాపకులు తల్లితండ్రులు సరైన రీతిగా తీర్చిదిద్దుకోవలెను.

(స.సా. జ. 76 పు.257/258)

స్వబోధే నాన్య బోధేచ్ఛా బోధ రూప తయాత్మనః।
నదీపస్యాన్య దీపేచ్ఛా యథాస్యాత్మ క్రాశనే॥
ప్రేమ స్వరూపులారా!
వెలుగుతున్న దీపమును చూచుటకు మరొక వెలుగు మనకెందుకు? ఈనాటి మానవుని హృదయము నిరంతరము ప్రకాశించుచునే ఉన్నది. కాని అట్టి సత్యనిత్యమైన ప్రకాశమును తెలుసుకొనలేక మానవుడు దీనిని తెలుసుకొనుటకు **జ్ఞానము కావాలని ఆశిస్తున్నాడు. ఇట్టిదే పెద్ద అజ్ఞానమని చెప్పవచ్చు. ఇట్టి అజ్ఞానమును పోగొట్టుకొనే నిమిత్తమై మనము అనేక మంది గురువులను చేరుతున్నాము. నిజముగా ఆత్మ జ్ఞానమునకు గురువు అక్కరలేదు.** ఇట్టి ఆత్మ జ్ఞానమును ఏ గురువు అందించలేడు. ఎందుకనగా ఈ ప్రకృతియే తన బిడ్డలను సంరక్షించే నిమిత్తమై అనేక ఆదర్శములను గైకొని వచ్చింది.

(ద. య స పు. 62)

సద్గుణములు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్య పాలనములు నేర్పునదే విద్య, **నెర్పునదే గురువు.** విద్యార్థి నేర్వవలయును.

ఇంతకన్నను నేనేమి ఎరుకపరతు
సాధు సద్గుణ గణ్యులౌ! అధ్యాపకులారా॥

(సా॥పు. 533)

(చూ॥ అవతారము, ప్రపంచము, భగవతత్వము, విద్య, శుక్రుడు-ద్రోణుడు)

గుర్తుంచుకొనవలెను/గుర్తుంచుకోండి

(చూ॥ మరచిపోవలెను, మానవజీవితము)

గృహం అబ్బాయి (తండ్రి)

(చూ॥ గృహం అమ్మాయి,స్వామి బాల్యం)

గృహం అమ్మాయి (తల్లి)

ప్రేమను పెంచుకోండి. మీ విరోధిని కూడా ప్రేమించండి. లేనిపోని మాటలచేత ఇతరుల మనస్సును నొప్పించకండి. ఈనాడు మీరెవరినైనా నొప్పిస్తే భవిష్యత్తులో దానికి పదింతలు మీరు నొప్పి పడవలసి వస్తుంది. అప్పుడు ఏడ్చి ప్రయోజన మేమిటి? **మీరు ఎవరికి అపకారం చేసినా దాని ఫలితం పదిరెట్లు భవిష్యత్తులో మీరే అనుభవించవలసి వస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించిన వ్యక్తి ఎవ్వరికీ అపకారం తలపెట్టడు.** తోటివారికి చేతనైనంత ఉపకారం చేయండి. పల్లెలలోను, పట్టణములలోని మురికివాడలలోను ప్రవేశించి, వాటిని పరిశుద్ధ పరచి, చిన్న పిల్లలకు తగిన సహాయం చేసి, వారికి కడుపుకింత అన్నము, కట్టటానికి ఇంత బట్ట అందిస్తే మీరెంతో మేలు చేసినవారవుతారు. నేను ఇప్పుడే కాదు. చిన్నతనం నుండియే ఇతరులకు సహాయం చేస్తూ వచ్చాను. ఎవరైనా బిక్షగాడు ఇంటి ముందుకు వస్తే, ఇంటివారు 'ఇప్పుడు లేదు, ఫో, ఫో'అనేవారు. **కానీ వారికీ తెలియకుండా నేను మెల్లగా బయటకు తెచ్చి పెట్టేవాడిని. ఎవరికైనా గుడ్డలు కావాలంటే నా దగ్గరున్న పాత వస్త్రములను ఇచ్చేవాడిని. యథార్థం మీకు చెపుతున్నాను - సంవత్సరమంతా ఒక షర్టు, ఒక నిక్కరే ఉండేవి నాకు. స్కూలుకు పోయేటప్పుడు మాత్రం వాటిని వేసుకుని, ఇంటికి వచ్చిన తరువాత విప్పేసి, టవల్ కట్టుకొని, వాటిని ఉతికి ఆరబెట్టుకొని, ఒక పాత్రలో నిప్పులు వేసుకొని ఇస్త్రీ చేసుకునేవాడిని.** ఇంట్లో గృహం అబ్బాయి(తండ్రి) ఉండేవాడు. ఆయన నన్ను ఎప్పుడూ తిట్టేవాడు కాదు. ఎప్పుడూ తిట్టలేదు. ఎప్పుడూ కొట్టలేదు. **"మహా త్యాగివిరా నీవు, నీ వైరాగ్యం మాకెక్కడొస్తుంది."** అని తమాషా చేసేవాడు. నన్ను "వేదాంతి" అని పిల్చేవాడు. గృహం అమ్మాయి (తల్లి) కూడా అంతే! ఆమె కూడా నన్ను చాల ప్రేమతో చూసేది. అనేకమంది భక్తులు ఆమెకు తమ బాధలు చెప్పుకునేవారు. "అమ్మా! స్వామితో మీరైనా చెప్పండి" అని ఆమె పాదాలపై పడేవారు. ఆమె అవన్నీ నాతో చెప్పడానికి వస్తే "వారి సుద్దులు, వీరి సుద్దులు నీవెందుకు పట్టించుకుంటావు? ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకో" అనేవాడిని. **"స్వామీ! నేనింత మాత్రమైనా వారికి సహాయం చేయకపోతే నేను పుట్టి ప్రయోజనం మేమిటి? వారి బాధలు మీకు చెపితే**

గృహప్రవేశము

చాలు, అవి కొంత పరిహారమవుతాయి. కాబట్టి, మీరు నన్నెంత కోప్పడినా నేను మాత్రం చెప్పటం మానను" అనేది. ఈ విధంగా పవిత్రమైన భావాలతో వారు జీవితాన్ని గడిపారు. కుటుంబమును బట్టి వంశమంతా అభివృద్ధి అవుతుంది. కనుక మీరు ఇంటియందుగాని, బయట గాని మంచిగా ప్రవర్తించాలి. మంచి గుణాలను పెంచుకోవాలి.

(స.సా.మా 99 పు. 63/64)

గృహప్రవేశము

'ధనం' పునాదిగా జీవితాలను నిర్మించుకొంటున్నవారు ఇసుకలో యిల్లు కట్టినట్లే. 'ధర్మం' పునాదిగా కట్టుకొనెవారు రాతిపై యిల్లు కట్టుకుంటునట్లు!

మీరంతా యిళ్ళు కట్టుకోవాలి. అందులో ఆత్మారాముని ప్రతిష్టించుకోవాలి. ఇదేనా కోరిక. ఐతే నేననుకునే యిళ్ళు యిటుక సున్నం, సిమెంటుతో కట్టేవి కావు. మంచి ఆలోచనలు, మంచి మాటలు, మంచి చేతలు, మంచి సాంగత్యం వీటితో నిర్మించుకొనే గృహాలు. అక్కడ ప్రశాంతత రాజ్యం చేస్తుంటుంది. అలాటి యిళ్ళు మీరు కట్టండి! అందులో గృహ ప్రవేశానికి నన్ను ఆహ్వానించండి! నేను తప్పకవస్తా. నిజానికి ఆ యిల్లు నాదే! అక్కడకు రావటానికి నాకు ఆహ్వానం కూడా ఎందుకు? మీరనుకొనే యిల్లు ప్రాపంచిక సుఖాల కోసం. నేను చెప్పే యిల్లు ఆధ్యాత్మిక ఆనందంకోసం! నా నివాసం ఎప్పుడూ ముముక్షువుల పవిత్ర హృదయాలలోనే!

(శ్రీ. స. గీ. పు. 172)

గృహలక్ష్మి

అర్థములేని మర్యాదలకు లొంగక ఆత్మగౌరవమునకు ఆహుతి కాకుండుటయే, **లజ్జగలస్త్రీ యొక్క లక్షణము. ఇట్టి లక్షణమే గృహమునకొక లక్ష్మి. అందువల్లనే ఇల్లాలును గృహలక్ష్మి అనికూడ వాడుచుందురు.**

(ధ.వా. పు. 32)

వివాహమైన స్త్రీకి గృహలక్ష్మి, ఇల్లాలు, ధర్మపత్ని, అర్ధాంగి మున్నగు గొప్ప బిరుదులు ఇవ్వబడినాయి. ఇలాంటి గొప్ప బిరుదులు కలిగిన **స్త్రీలను ఈనాడు పురుషులు చులకన భావంతో చూస్తున్నారు. ఇది చాలా పొరపాటు.** స్త్రీలను గౌరవించినప్పుడే పురుషులకు కూడా గౌరవం పెరుగుతుంది. **స్త్రీల హృదయాన్ని నొప్పించకూడదు; వారికి కన్నీరు తెప్పించకూడదు. స్త్రీలు కన్నీరు కార్చితే కుటుంబం అనేక కష్టాలకు గురి అవుతుంది. కాలిలో విరిగిన ముల్లును బయటికి తీయవచ్చుగాని, హృదయానికి గ్రుచ్చుకున్న కఠినమైన మాటను వెలికితీయటానికి వీలు కాదు.** కనుక, కఠినమైన మాటలతో స్త్రీల హృదయాలను బాధపెట్టకూడదు. "ఈమె నా భార్య కదా, ఈమెను ఇష్టమొచ్చినట్లు తిట్టే అధికారం నాకుంది", అనుకోకూడదు. భార్య ఏమైనా **తప్పు చేస్తే సరిదిద్దవచ్చును.** అంతేగాని, **ఆమెను ఇష్టమొచ్చినట్లు తిట్టడానికి భర్తకు అధికారం లేదు.** అయితే, మగవారందరూ ఆవిధంగా ఉండరు. కాని, కొంతమంది ఉంటారు. మగవారికి కొంచెం కోపం ఎక్కువ. ఆ కోపాన్ని హద్దులో పెట్టుకోవాలి. అది వారికే మంచిది.

(స.సా. సె. పు. 262/263)

లోకానుభవములో **'ఉద్యోగము పురుష లక్షణం'** అని గానీ, కర్మ 'పురుష లక్షణమని' గానీ అందురు. **అది యేమాత్రము సమ్మతించవలసినది కాదు.**

సర్వులకూ సమానమైనది, **"ధర్మం పురుష లక్షణం"** ప్రతి పురుషుడు కూడా ధర్మార్థ కామమోక్షములందు ధర్మ కర్మల ననుసరించవలెను. అవే పురుషార్థ ధర్మములు. **స్త్రీలకు పతివ్రత ధర్మమెట్లో, పురుషులకు బ్రహ్మచర్యమట్లు. స్త్రీకి ఏకపతి యెట్లో, పురుషునకు యేక సతి అట్లు;** స్త్రీ పతిని ఏ రీతిగా దైవముగా తలంచి అతని మనసు ననుసరించి ప్రవర్తించుట ఎట్లు పతివ్రత ధర్మమో, పతి కూడనూ తన సతిని గృహలక్ష్మిగా భావించి, ఆమె మనసు ననుసరించి ప్రవర్తించవలెను. అప్పుడే పురుష లక్షణములకు తగినవాడగును.

(శ్రీ. స. సూ. పు. 110/111)

(చూ॥ స్వర్గము)

గృహస్థ

(చూ॥ మానవజీవితము)

గృహస్థుడు

పెండ్లిచేసుకొని భార్యాబిడ్డలతో వుండినంత మాత్రమున **గృహస్థుడు** కాడు. వర్ణాశ్రమధర్మంబులు వర్జింపక, తనవారు పరాయి వారను భేదము లేక, పిన్న పెద్దలను తారతమ్యము లెరింగి, సర్వభూతములను తనవలె భావించి, సమరస భావము కలవాడై తన్నా శ్రయించిన ప్రాణికోటి యందు ఆదరణ చూపుచు లోకజ్ఞాన విశేషములను తెలిసికొని శాస్త్రజ్ఞానము సంపాదించి, ఇహపర చింతనలలో ధర్మమును తప్పక, సమయా సమయములనక సర్వవేళలయందు తన వర్ణధర్మములను వీడక, బంధు మిత్రుల యందును, భార్యాబిడ్డల యందును, ప్రీతి గలవాడై ఆదరించుచు, అష్టమదముల ద్రుంచి, ధర్మార్థ కామ మోక్ష చతుర్విధ పురుషార్థముల యందు, బహునేర్పరియై మసలు కొనుచు, ధన కనక వస్తు వాహనములతో తులతూగుచూ, ఎందును గర్వితుడు కాక, దానధర్మ పరోపకారార్థము కొంత కాలమును వినియోగించుచు, పరగృహముల పంచల పడక, తన యిల్లాలు తనను నమ్మినట్లును తన సతిని తాను నమ్మినట్లును, **ఒకరి కొకరు తెలుసుకొని మెలగుటయే గృహస్థమని పిలువబడును.**

(ప్ర. వా. పు. 9, 10)

గృహిణులు

గృహిణులు, మీ ఇంటి పనులను మీరు చక్కగా చేసుకొండి. మీ ఇంటిని శుభ్రంగా ఉంచుకోండి. మీ భర్తను, పిల్లలను చక్కగా చూసుకొండి. దీనిని మించిన కర్తవ్యం మరొకటి లేదు. అంతేగాని, ధ్యానమని ఊరికే కూర్చుంటే, మీ మనస్సంతా మార్కెట్‌లో తిరుగుతుంది. కనుక, మీరు నిర్మలంగా భగవన్నామస్మరణ చేసుకుంటూ అన్ని పనులు

చేసుకోవాలి. మీరు ఇల్లు ఊడ్చే సమయంలో **'నా హృదయాన్ని పరిశుద్ధం చేస్తున్నాను'** అని అనుకోండి. ఎంతహాయిగా ఉంటుంది! మీరు చపాతీలు గాని, పూరీలు గాని చేస్తుంటారు. అయితే, వాటిని చేస్తున్నంతసేపూ "ఈ పూరీలు చేసే ఖర్మనాకు పట్టింది. దీనివలన సత్సంగమునకు పోలేకపోతున్నాను" అని తిట్టుకోనక్కరలేదు. **"నేను చేసేది పూరీలు కాదు, నా హృదయాన్ని విశాలం చేసుకుంటున్నాను"** అని అనుకుంటే? ఎంత బాగుంటుంది! వంట ఇంట్లో కూరగాయలు కోసేటప్పుడు, "ఇది నాతల వ్రాత, నాకీ వంటిల్లేనా గతి" అని దూషించుకోరాదు. **"నేను కోసేవి కూరలు గాదు నాలోని అరిషడ్వర్గాలనే దుర్గుణాలను జ్ఞానమనే కత్తితో కోస్తున్నాను. ఈ కూరలను 'ప్రేమ' అనే జలములో తడిపి, జ్ఞానమనే 'అగ్ని'లో ఉడుకబెడుతున్నాను"** అని భావించండి. అప్పుడా పని ఎంతో పవిత్రతను పొందుతుంది. **మీరు బియ్యంలోని రాళ్ళను ఏరివేస్తుంటారు. ఈ విధంగా బియ్యంనుండి రాళ్ళను వేరు చేసేటప్పుడు "దుర్గుణాలను దూరం చేసి, సద్గుణాలను పెంచుకుంటున్నాను - ఇది నా యోగం అని భావించండి. దానినే - "క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగము" గా "ఆత్మానాత్మ విభాగయోగము"గా భావించుకోండి. ఈ విధంగా మీరు చేసే ఇంటి పనులను కూడా భగవత్కర్మలుగా స్వీకరించాలి.**

(శ్రీ.భ ఉ. పు. 124)

గౌణశ్చేన్నాత్మ శబ్దాత్

'ఆత్మ శబ్దాత్ - ఆత్మ అను శబ్దమును వినియోగించుట వలన **'అగ్ని ఈక్షించెను'** అని కొన్నింటియందు శ్రుతులు 'ఈక్షతి' శబ్దమును గౌణముగా తెలియబరచెను. నిజముగా అచ్చట ఆత్మ శబ్దమే ప్రయోగింపబడినది. ఈక్షించునది. **సంకల్పించునది ఆత్మనే కాని మరకొటి కాదు.** ఈ దృశ్యగోచరమైన జగత్తు నంతయు సద్వస్తువే అయివుండెను - అని ఆరంభించి క్రమముగా ఈ

సమస్తము సద్వస్తువే, అదియే ఆత్మ అని వేదములు తెలుపుచున్నవి. ఈ వస్తువు జడవస్తువు కాదు. ఒక్కొక్క పరి ప్రధానమునకు కడా ఆత్మ శబ్దము ఉపయోగింప బడుతుంది. ఎందుకన అది చేతన పురుషుని యొక్క కార్యములన్నింటిని చూచుకొంటుంది. ప్రకృతి చేయు కార్యములకు పరమాత్మ కారణముగా నున్నందున ప్రకృతికి కూడా చేతనత్వము ఆపాదింపబడుతుంది.

జీవుండంటే రాగద్వేషాలకు కష్ట సుఖాలకు ప్రపంచము యొక్క ఆకర్షణకు లొంగినవాడు. అట్టివానినే బద్ధుడని అందురు. కావున ప్రతి జీవికి మోక్షము అవసరము. ఈ మోక్షము కావాలంటే ప్రకృతినే ఆశ్రయించరాదు. అది గ్రుడ్డివాడు గ్రుడ్డివానిని ఆశ్రయించునట్టుండును. లేక దరిద్రుడు మరొక దరిద్రుని ఆశ్రయించినట్లగును. అట్టి ఆశ్రయము వలన వాని దరిద్రము గాని లేక బాధగాని విముక్తి కాజాలదు. దరిద్రము పోవాలంటే ధనవంతుని ఆశ్రయించాలి. సరియైన దారిని నడువవలెనన్న దృష్టికల వానిని అనుసరించాలి. అట్టి జ్ఞాన దృష్టి, అఖండ ఐశ్వర్యము కలవానిని, దయాళువును ఆశ్రయించవలసి వుంటుంది. అతడే ఆత్మ స్వరూపుడు. అట్టి పరమాత్మను ఆశ్రయిస్తేనే దుఃఖమనే దరిద్రమును తొలగించుకొనవచ్చును. **ఆనందమనే ఐశ్వర్యమును పొందవచ్చును, గమ్యమును చేరవచ్చును.**

కనుక ఈ విధమైన స్థితిని పొందుటకు బ్రహ్మ అనుగ్రహం ఆత్మ ప్రాప్తి లభించవలెను. ఈ ఆత్మ ఎక్కడున్నది? దానిని తెలుసుకొను విధానమేమి? అని చింతించిన, ఆచేతన వస్తువునందు భక్తి కలిగియుండినపుడే అట్టి నిష్ఠ మోక్షకారణము కాగలదు. సద్గుణ బ్రహ్మపై ఆధారపడిన వానికే ఆత్మతత్వము అర్థము కాగలదు. అట్టి ఆత్మ సగుణసాకారమునందు కూడనూ కలదను దృష్టాంతమె లెన్నియో వున్నవి. **ఆత్మపదార్థమే బ్రహ్మపదార్థమని అనుభవ పూర్వకంగా తెలిసికొనుటయే బ్రహ్మ విద్య.**

ప్రపంచంలో ప్రతి మానవుడు నాలుగు దశలను ప్రతిదినము అనుభవిస్తాడు. **మొదటిది జాగ్రదవస్థ; రెండవది స్వప్నావస్థ; మూడవది సుషుప్త్యవస్థ; తదుపరి తురీయావస్థ.** ఈ నాలుగు అవస్థలు లేక నాలుగు పాదములుగా వర్ణించింది వేదము. జాగ్రతావస్థ - ఇందులో వ్యక్తిమేల్కొని ఉంటాడు. ఆత్మ బహిర్ముఖంగా ఉంటుంది. ప్రపంచములోని వస్తువులన్నియు కంటికి కనిపిస్తాయి. శబ్దాలు వినిపిస్తాయి. రుచులు, వాసనలు, స్పర్శలు అనుభవంగా ఇంద్రియాలకు గోచరిస్తాయి. సమాజములో సమిష్టి జీవితాన్ని గడుపుతాడు. **కర్మేంద్రియాలు ఐదు, జ్ఞానేంద్రియాలు ఐదు, పంచ ప్రాణములు ఐదు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారం అనే నాలుగు అంతఃకరణములు - మొత్తము పందొమ్మిది - ముఖములతో జాగ్రదవస్థలో,** సుఖ దుఃఖాదులలో లాభ నష్టములను, విజయ అపజయాలను స్థూలంగా అనుభవిస్తాడు. శరీరము స్థూలంగా ఉండుటచేత అనుభవములు కూడా స్థూలంగానే ఉంటాయి.

అయితే స్వప్నలోకం దీనికి భిన్నంగా ఉంటుంది. **స్వప్నావస్థలో** ఆత్మ అంతర్ముఖంగా ఉంటుంది. తన అనుభూతి తన వరకే పరిమితమై ఉంటుంది. పదిమంది గదిలో పరుండి ఉండినా ఎవరి కలవారికే, ఎవరి అనుభూతి వారిదే, కాని ప్రక్కనున్నవారికి సంబంధముండదు. ఎవరి స్వప్నములు వారినే బాధించును, ఆనందింపజేయును. బాహ్యసంబంధము ఏమాత్రము ఉండదు. అసలు బాహ్యజగత్తే కానరాదు. స్వప్నావస్థలో మరొక ఊహా ప్రపంచమును సృష్టించుకొని అందులోనే అనుభవిస్తాడు. అయితే వస్తువు కల్పితమైనా ఆనందానుభూతిలో భేదముండదు. **జాగ్రదవస్థలో ఉన్న పందొమ్మిది ముఖములు స్వప్నావస్థలో కూడా ఉంటాయి.** ఇవి భౌతికంగా కనుపించవు. మానసికంగా మాత్రము పనిచేస్తాయి. **అందులో కూడా ఒక వెలుగు ఉంటుంది. దానిని తైజసుడు అని అంటారు.** ఈ తేజోమయ ప్రపంచములో వ్యక్తి తనకు తోచిన రూపాలను, శబ్దాలను, రుచులను సృష్టించుకొంటాడు. ఈ స్వప్నలోకము ఆత్మకు రెండవపాదం లేక దశ.

గాఢ నిద్ర. దీనినే సుషుప్తి అని అంటారు. ఇందులో కలలు కనుపించవు. మంచి నిద్రయందుంటాడు. సుషుప్తిలో మనిషికి అవయవాలు కానీ, శబ్ద, స్పర్శ, రూప, రస గంధాలు కానీ ఏవియు ఉండవు. **అన్ని అవయవాలు, వాటి గుణములు మనసులో లీనమై ఉంటాయి. అనుభూతి ప్రజ్ఞాన రూపంగా ఉంటుంది.** ఇక్కడ వ్యష్టిగా కానీ, సమిష్టిగా కాని ఉండడు. ఆత్మతో పాటు పరమానందమును అనుభవిస్తాడు.

తూరీయావస్థ - ఇది పూర్తి ఆత్మమయముగా ఉంటుంది. సకల జీవ జగత్తుకూ మూలాధారమైన సర్వాత్మ కల్పించుకొన్న సామ్రాజ్యము ఇది. **ఈ స్థానమును అందుకొన్న ఆత్మ జీవిని గురించి ఏమీ చింతించదు.** ఇందులో తెలివితేటలు ఉన్నాయని కాని, లేవని కాని, చెప్పేందుకు అసలే వీలుండదు. **తురీయావస్థలో పరమానందాన్ని అనుభవిస్తూ ఉంటాడు.**

ఆత్మ కంటికి కనిపించదు. పట్టుకొనుటకు వీలుకాదు. ఆత్మ సారమనేది ఒకటి ఉన్నదనేది మాత్రము తెలుస్తుంది. అందులో మంచి తప్ప మరొకటి ఉండదు. ప్రాపంచిక వాసనలన్నియు ఉపశమించిన తరువాతనే ఈ ఆత్మప్రత్యయం ఏర్పడుతుంది. **ఆత్మలోని నాలుగు పాదములు ఓంకారములోని నాలుగు మాత్రలను పోలి వుంటాయి. ఆత్మ అనుభవించే జాగ్రత్, స్వప్న, సుషుప్తి, తురీయావస్థలే ఓంకారంలోని ఆ,ఉ,మ అధిగత మాత్రలు, ప్రణవమాత్రలే పరమాత్మకు పాదాలు. జాగ్రత్తలో నేత్రమునందు, స్వప్నమునందు, సుషుప్తిలో హృదయము నందు, తురీయావస్థలో అంతా తానై ఉంటుంది ఆత్మ.** ఏతావాతా ఆత్మ అన్ని అవస్థలయందు, అన్ని స్థానములందు అన్ని క్రియలయందు ఉన్నది. అంతా ఆత్మే, ఆత్మే అంతా అని సమన్వయింపజేస్తుంది సూత్రము, సమన్వయమే లేకుండిన సంతోషమే లేదు. సంతోషమే లేకున్న సర్వం శూన్యం. అయితే జగత్తంతా పూర్ణమే కానీ శూన్యము కాదు.

(సూ.వా. పు. 35/38)

గైడ్‌పోస్టు

గ్రంథములు కాని, గురువుకాని, దైవముకాని నిన్ను గమ్యానికి చేర్చలేరు. గమ్యానికి చేరడానికి నీకు నీవే నడవాలి. రహదారులపై **'గైడ్ పోస్టు'** ఉంటుంది. "ఈ గ్రామములకు ఇది మార్గము" అంటూ మార్గమును చూపించడమే దాని తత్వము కాని, నిన్ను నడిపించడము కాదు. అదే విధముగా ఎవరికి వారే, స్వశక్తి చేత సుఖాన్ని, ఆనందాన్ని పొందడానికి కృషి చేయాలి.

(శ్రీ భ.ఉ. పు. 170)

గైడ్‌పోస్టు అని నాలుగు మార్గములు పోయే ఒక ప్రదేశములో పెట్టి ఉంటారు. ఒక వైపున ఫలానా చోటికి. ఒక వైపున మరొక చోటికి పోతుందని వ్రాసి పెడతారు. ఫలానా గ్రామమునకు ఈదారి పోతుందని గైడ్‌పోస్టు పైన వ్రాసి ఉంటుంది. కాని అది మనలను తీసుకొనిపోయి గ్రామాలకు చేర్చదు. నడువవలసింది మనం. చేరవలసినది మనం. అది కేవలం దిశను చూపేది మాత్రమే. అదేవిధముగ భగవద్గీత సాక్షాత్కార ప్రాప్తిని విశ్వరూప సందర్శన మార్గమును, విభూతుల శక్తి సామర్థ్యములను నిరూపిస్తుందే కాని ఆచరించవలసింది మనం. కనుక గ్రంథములు చదివి. అనేక విధములుగా పరిశ్రమించి నిరాశా నిస్పృహలకు గురియై దీనిపైన నిరుత్సాహము పెంచుకోవటం మంచిదికాదు.

(స.సా. న 84 పు. 297)

గొప్పతనము

(చూ॥ మంచితనము)

గొబ్బిళ్ళు

ద్వాపరయుగంలో గోపి గోపాలుడు శ్రీకృష్ణుని తమ ఆరాధ్య దైవంగా విశ్వసించి, అతని సన్నిధియే తమకొక పెన్నిధిగా భావించి అనేక విధాలుగా ఆనందాన్ని అనుభవిస్తూ వచ్చారు. ఈ పవిత్రమైన సంక్రాంతికి తగిన అంతరార్థమును కూడా వారు ప్రబోధిస్తూ వచ్చారు.

గోప రాజు

వారు మూడు పేడ ముద్దలను ఒక చోటపెట్టి, వాటిపై మూడు గుమ్మడి పువ్వులను ఉంచి, వాటి చుట్టూ అనేక విధములుగా ఆడుతూ, పాడుతూ శ్రీకృష్ణుని ప్రార్థించేవారు. మనం పేడముద్దను చాలా హీనమైనదిగా భావిస్తున్నాము. కాని, గోపికలు దీనిని చాలా పవిత్రమైనదిగా భావించారు. కొందరు తమ ఇంటి ముందు పేడ నీరును చల్లుతుంటారు. కొన్ని **విషక్రిములు ఈ పేడనీటి వలన మరణిస్తాయి. అంతేగాక, మనం పీల్చే గాలిలోని క్రిములను కూడా ఇది నాశనం గావించి ఆరోగ్యాన్ని చేకూర్చుతుంది.** కనుక, గోపికలు ఈ పేడను ఆరోగ్యానికి, ఆనందానికి ప్రధానమైన చిహ్నంగా భావించారు.

గోపికలు **మూడు పేడ ముద్దలను** పెట్టడంలో గల అంతరార్థం ఏమిటి? అందరికీ **ఆనందాన్ని, ఆరోగ్యాన్ని అందించేవాడు శ్రీకృష్ణుడు. అట్టి శ్రీకృష్ణునికి ఒక ముద్ద.** ఇతడు తన శక్తి సామర్థ్యాలను జగత్ వ్యాప్తి గావించడానికి - 'గోవర్ధనగిరి' నెత్తి "నేను మానవుడను కాదు, మాధవుడను" అనే సత్యాన్ని నిరూపించాడు. కనుక, **ఆ గోవర్ధన గిరికి ఒక ముద్ద.** ఇంక, మనకు **నిత్యజీవితంలో ఆరోగ్యవంతమైన ఆహారాన్ని చేకూర్చేవి గోవులు.**

ఈ గోవులు మానవునికి వుష్టిని, సంతుష్టిని చేకూర్చుతున్నవి. కనుక, గోవులకు ఒక ముద్ద. ఈ విధంగా, గోపాలుడు-గోవర్ధనగిరి-గోవులు - ఈమూడింటి యొక్క గుకారతత్వాన్ని గోపికలు తమ ఆరాధ్య దైవంగా విశ్వసించారు. కనుక, గోపికలు అనే పేరు ఆధారంగా ఈ పెడ ముద్దలకు 'గొబ్బిళ్ళు' అనే పేరు వచ్చింది.

(స.సా.ఫి మా. 92 పు. 33)

గోప రాజు

(చూ॥ మంచి వాడు, ముగ్గురు రాజులు)

గోపికలు

గోపికలంటే ఇంద్రియ నిగ్రహం. ఇంద్రియాలను నిగ్రహించుకున్న వాళ్ళు గోపికలు. గోపిక స్త్రీ పేరుకాదు.

(స.సా.ఏ. 1988 పు. 137)

మానవులను భగవంతుని సన్నిధికి తోడ్కొనిపోగల గ్రంథము భాగవతము. దుఃఖం నుంచీ వేదన నుంచీ విముక్తి కలిగించగల బోధ అంతా ఈ ఒక్క గ్రంథంలో లభిస్తుంది. ఇందులో ప్రేమ మాధుర్యం తొణికిసలాడుతున్నది.

పరమాత్మునికోసం గోపికలు ఏవిధంగా పరితపించేవారో పరిశీలించండి. వారు ప్రభువును నిరంతరం స్మరించేవారు. భక్తిమార్గమును ఎన్నడూ వీడలేదు. మీకు ఏదైనా బాధకలిగితే అయ్యో అబ్బా అంటారు. కాని **గోపికలు సుఖంలో దుఃఖంలో కూడా "కృష్ణా! కృష్ణా!" అనేవారు.** ఒక గోపిక బృందావన వీథుల్లో ఒకనాడు నెయ్యిపాలు, పెరుగు అమ్ముతూ పోతున్నది. తాను అమ్ముతున్న వస్తువుల పేర్లకు బదులుగా, "గోవిందా! దామోదరా! మాధవా!" అంటూ బిగ్గరగా కేకలు పెడుతున్నది. బృందావనమునకు ఎందుకు వచ్చామనే విషయంకాని, పాలు పెరుగు అమ్ముకొని జీవనోపాధి సంపాదించుకోవాలనే సంగతి కాని వాళ్ళకు స్పృహలో ఉండేది కాదు. కృష్ణుని గురించి తప్ప మరే విషయం మీదా వాళ్ళు మాట్లాడలేరు. వేదనపడే గోపిక చుట్టూచేరి వారు కృష్ణనామ కీర్తనం సాగించేవారు. **ఆ తృష్ణను చల్లార్పగలవాడు కృష్ణుడే.** తపించిపోయే దాహంతో "కృష్ణా!" అని మొరపెట్టుకొంటే ఆ నీలమేఘశ్యాముడు కనికరించి కనబడతాడు.

ఆ తృష్ణ ఎంత తీవ్రమో తెలిసికొన్నప్పుడే మీకు రాధాతత్త్వం అర్థమవుతుంది. కృష్ణుడే ఆధారమని గ్రహించి నిరంతరధారగా ఆరాధన చేసింది రాధ. ఆమె ధర. అంటే ప్రకృతి. కృష్ణుని మాధుర్యం ప్రకృతిలో నిండారి ఉన్నది. ఆ మధురిమను రాధ ఆస్వాదించి పరవశురాలయింది. ఆమె మాయాశక్తి, శ్రీకృష్ణసంభూతమైన హ్లాదినీశక్తి. ఆమె కృష్ణుని మహాభావము. ప్రకృతిరూపంలో ప్రకటితమైన కృష్ణుని ఆనందమును రాధ తన హృదయంలో భద్రపరచుకున్నది. దుష్టప్రవృత్తులతో మలినవాంఛలతో నిండిన మనస్సులకు ఈ సంబంధం ఎలా అర్థమవుతుంది? కృష్ణుడు పరమాత్ముడనే విశ్వాసం పెంచుకుంటే ఆయన

లీలలకు భౌతికమైన వ్యాఖ్యానాలు చెప్పే వైఖరి నుంచి కాపాడగల కవచం మీకు దొరుకుతుంది.

అసలీ గోపికలెవరు? అవతారమహిమలో పాల్గొనుటకు, భగవంతుని సేవించుటకు, భగవల్లీలలకు సాక్షులై అందులో తాము భాగస్వాములై ఆనందమును భవించుటకు భూలోకమునకు వచ్చిన దేవతలు. వారొక ప్రత్యేక ప్రయోజనార్థము పుట్టిన దివ్యకాంతలు. కృష్ణుడు గోపకాంతల యిండ్లలో దొంగిలించినది మామూలు వెన్న కాదు, **భక్తి భావితమైన హృదయమును వెన్న. కృష్ణుడు చిత్త చోరుడు,** చోరుడు యజమానికి తెలియకుండా దొంగిలిస్తాడు. యజమాని దుఃఖంపొందుతాడు. కాని ఈ చోరుడు యజమాని మెలకువగానున్నప్పుడే దోచుకుంటాడు. ఆ దోచుకొనబడినవాడు పరమానంద భరితుడౌతాడు.

కృష్ణుడు తమకు గుర్తుకురావటానికై గోపికలు నీలవర్ణపు కుంకుమ పెట్టుకొనేవారు. నీలమణుల హారమునే నిత్యము ధరించేవారు. ఆమణులలో కృష్ణుని రూపం వారికి కనులపండువుగా కనిపిస్తూ ఉండేది. (ఈ మాటలు చెప్తూ సత్యసాయి భగవానుడు భక్తులు తన కర్పించిన ఒక దండలోని మల్లెపూల రేకులు కొన్ని లాగి పైకి ఎత్తి రెండవచేతిలో పోయగా అవి నీలమణులుగా మారిపోయినాయి. "గోపికలేరికోరి అలంకరించుకొన్న మణులివే" అని అక్కడి వేలాది భక్తులకామణులను చూపించారు. ప్రతిమణిలోను స్పష్టంగా అందంగా కనబడుతున్న శ్రీకృష్ణుని రూపం చూచి అందరూ అపూర్వానందమును పొందారు). **ఆ వల్లెటూరి గొల్లభామలేకాదు, వృద్ధుడును జ్ఞానియు మహావీరుడునైన భీష్మునకు కూడా కృష్ణుడటువంటి ప్రేమస్వరూపుడే.** ఆనాడు అన్ని జాతుల, అన్ని తరగతుల, అన్ని వృత్తులవారును ఆయన నట్లే భజించి కృతార్థులయ్యారు. అదే కృష్ణుడవతారమనుటకు గుర్తు!

కృష్ణావతారం వదహారు కళలు నిండినటువంటి సంపూర్ణావతారము. నీ మనసును కృష్ణుని లీలలతోను, ఆయన మహిమలతోను నింపుకో. ఆయన ప్రేమమూర్తి. భక్తవత్సలుడు. నీవు నీ హృదయమును ఆ ప్రభువునకు పీఠము గావించు. అప్పుడు దానికి విలువ హెచ్చు. అభ్రకపు చాళ్ళుగల భూమికి విలువ హెచ్చు. బంగారు చాళ్ళుగల భూమి కంతకంటెను విలువ హెచ్చు. భూమి విలువ దానిలో నుండు లోహముల ననుసరించి ఉంటుంది. అలాగే హృదయం విలువ దానిలోని విషయముల ననుసరించి ఉంటుంది. **మీరు మీ హృదయంలో భగవంతుని నిలువుకుంటే అది అత్యధికమైన విలువగల స్థితిని పొందుతుంది.**

ఈ కలియుగంలో ప్రేమ తత్వం ఎక్కడా కనబడదు. ఈ వ్యాసంగంలో కాలం గడిపితే మాకు జీవనోపాధి ఎట్లా దొరుకుతుంది? అని మీరు అడుగవచ్చు. భగవంతుని పట్ల నిర్మలనిశ్చల విశ్వాసం మీకు ఏర్పడితే ఆయన మీకు అన్నమే కాదు, అమృతం కూడా అందింపగలడని నేను అభయమిస్తున్నాను.

(గ.భా.కృ.జ.ప్రశాంతి నిలయం 12.8.63)

యాదవులకు, గోపికలకు ఉన్న వ్యత్యాసము గుర్తించాలి. యాదవులు కేవలము కృష్ణుడు మావాడు, మా బంధువు, మా మిత్రుడు అనే అభిమానము చేత కృష్ణుని అహంకారముగా అనుభవించేవారు. మేము కృష్ణుని బంధువులము. కృష్ణుడు మావాడు అనే అభిమానము పెంచుకుంటూ వచ్చారు. ఆ అభిమానముచేత అహంకారము పెరుగుతూ వచ్చింది. ఆ అహంకారము చేత యాదవులు క్షీణించటానికి మార్గము ఏర్పడింది. కానీ గోకులము వారు అట్లు కాదు. 'కృష్ణా! మేము నీవారము' అని అర్పితము గావించుకుంటూ వచ్చారు. మేము మీ వారమని అర్పితము గావించుకోవటంచేత గోపికలందరూ నుక్షేమంగా ఉండగలిగారు. వినయవిధేయతలు వారి యందు ఉట్టిపడ్డాయి. మానవునకు ప్రధానమైనది వినయ విధేయతలు.

(భ. స. మ. పు. 172)

ఈ ప్రపంచంలో జలమునకు ఏ మాత్రము కొదువ లేదు. ఎక్కడ చూసినా ట్యాంకులున్నాయి. నదులున్నాయి,

గోపురములు

సముద్రాలున్నాయి. కానీ చకోర పక్షులు ఈ మలిన జలము నాశించక కేవలం ఆకాశం నుండి పడే స్వచ్ఛమైన, నిర్మలమైన జలమును మాత్రమే గ్రోలి తృప్తి పడతాయి. అదేవిధంగా గోపికలు కూడా తమ లక్ష్యమును నీల మేఘశ్యాముడైన కృష్ణునిపైనే పెట్టుకొని జీవిస్తూ వచ్చారు. నీలిరంగులో మేఘం కనిపించినా సరే, అది కృష్ణుడే అని భావించేవారు. **అసలు గోపికలనగా ఎవరు? 'గుహ' అనే ధాతువు నుండి 'గో' అనే అక్షరం ఏర్పడింది. 'గో' అనగా వేదమనీ, గోవు అని, భూమండలమనీ, వాక్కు అనీ నాలుగర్థములున్నాయి. కనుక గోపికలనగా వేదము నుచ్చరించినవారనీ, గోవులను సంరక్షించినవారనీ, భూమిని పోషించినవారనీ, వాక్కుచేత భగవత్స్వరూపాన్ని నిరూపించినవారనీ నాలుగు రకములైన అర్థములను తీసుకోవచ్చు. "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజనవల్లభాయ స్వాహా" అని వారు కృష్ణుణ్ణి వర్ణిస్తూ వచ్చారు. ఈ ఐదు పదములకు వారు ఏ అర్థములను స్వీకరించారనేది మనం కొంత విచారించాలి. 'క్లీం' - అనగా భూమి, 'కృష్ణాయ' - జలము, 'గోవిందాయ' - అగ్ని 'గోపీజనవల్లభాయ' - వాయువు, 'స్వాహా' - ఇది ఆకాశము.** అనగా భగవంతుడు లేని స్థానం లేదు. ప్రతి కణమునందు, ప్రతి అణువునందు చిద్రూపుడైన భగవంతుణ్ణి దర్శించారు గోపికలు.

(స.సా.ఫి.98 పు. 43)

(చూ॥ అనన్య భక్తి, కృష్ణుడు, నరకాసురుడు, నరుడు, ప్రేమ, ప్రేమతత్వము, భక్తిపరమావధి, మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి, రాధాకృష్ణులు, లింగము, విశ్వాసము, వేణుగానము,)

గోపురములు

నేడు ఆధునికులు కొందరు ఈ గోపుర నిర్మాణమేమిటి, డబ్బు "వేష్టు" అని లెక్కింతురు: అది కేవలము దూరదృష్టిలేని దుండగుల లక్షణముకాని, ఊర్ధ్వదృష్టి ఉన్నతభావము ఉన్నత గుణము కాదు. దాని యథార్థమును గమనించిన యెంత గూఢమై, పవిత్రమై, మార్గదర్శకమై యున్నదో చూడుడు! **ఊరిబైట అనగా, గ్రామమునకు ప్రక్కల మార్గమున (వెలుపలి భాగమున) బాహ్య కర్మకలాపములలో సత్యమును మరచి, దారితప్పిపోతున్న పాంథులను, 'ఓయీ! శారీరక మోహబద్ధుడవై, అహంకార మమకారివై అశాశ్వత అసత్య అనిత్య భౌతికసుఖములకు బానిసవై నీ స్వస్వరూపమైన, నీ జన్మహక్కైన సత్య, నిత్య, నిర్మల నిస్వార్థమైన, సర్వసుఖ నిలయుడైన నన్ను మరచినావు. అందువలన నీవు లోకానికే దుఃఖాన్ని కూర్చుకొంటున్నావు. మిథ్యా ప్రపంచ మోహితుడుకాకు, సత్యమైన పరమాత్మను నమ్ము, ఆ వెలుగులలో నడచు; జీవితశాంతికిదేమార్గము; ఇదే ధర్మము; రారారారాఅని పిలుచుచున్న గోపాలదేవుడెత్తిన హస్తమువలె, ఊరియందున్న భవనము లన్నింటికంటే యెత్తైనది గావుండి, గోపురము కనిపించును.**

ఈ ఉన్నతభావముతో చేర్చిన గోపురములు మానవుని అధోదృష్టిని తొలగించి ఊర్ధ్వదృష్టిని కలిగించును. **ఇదే గోపురము నిర్మించుటలోనున్న ధర్మము.** ఇట్టి పరమాశయములతో గోపురములుండును. ఇది సత్యమైన అనుభవధర్మము. అందులో వున్న అఖండజ్యోతియే జీవకోటికి శరణ్యము; ఆ అఖండజ్యోతి స్వరూపుని స్మరింపజేయుచిహ్నము. అది నిత్యశాంతిని చేకూర్చే మహాదీపము. అదే అంతర్ముఖత్వం; **అదే బ్రహ్మనిష్ఠ; అదే హరిమయత.**

(ధ.వా.పు. 92/93)

(చూ॥ ఆలయములు, గుడిగోపురాలు)

గోల్డ్‌స్మిత్

(చూ॥ లైఫ్‌స్మిత్)

గోల్డ్‌స్టోన్

ఈనాడు ముఖ్య అతిథిగా వచ్చిన **గోల్డ్‌స్టోన్** సామాన్యమైన వాడు కాదు. ఆయనకు ధనమునందు తక్కువ లేదు. విద్యయందు తక్కువలేదు. గొప్ప పేరుప్రతిష్ఠలు

కల్గినవాడు. అతని ఎదురుగా చెప్పకూడదుగాని, అతనిలో చాల సద్గుణాలున్నాయి. అతడు ప్రతి నెల ఇక్కడికి వస్తున్నాడు. ఎందుకోసం తరచుగా వస్తున్నావని నేను అడిగాను. "స్వామీ! నాకు ఆనందం కావాలి. **ఆనందం ఇక్కడే ఉంది,** బయట లేదు" అన్నాడు. అతనికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారునికి గొప్ప సినిమా యాక్టర్ బిడ్డతో వివాహం నిశ్చయమైంది. వారు కూడా గొప్ప శ్రీమంతులే. గోల్డ్‌స్టీన్ తన కుమారుని వివాహం అమెరికాలోనే ఏ చర్చిలోనైనా చేసుకోవచ్చు. ఎంత ఆడంబరంగానైనా చేసుకోవచ్చు. కాని, అతనికి ఆడంబరమేంటే ఇష్టం లేదు. **అతనికి మంచితనం కావాలి, గొప్పతనం అవసరం లేదు.** ఆ సినిమా యాక్టర్ కూడా తన బిడ్డను తీసుకుని ఇక్కడికే వచ్చింది. గోల్డ్‌స్టీన్ తన కుమారుణ్ణి తీసుకు వచ్చాడు. ఇక్కడే చిన్న కోర్కెల రూమ్‌లో వారి వివాహం జరిగిపోయింది. ఇప్పుడా బిడ్డలు ఎంతో ఆనందంగా జీవిస్తున్నారు. రెండవ కుమారుడు కూడా "నాన్నా! నా వివాహం స్వామి ఎక్కడ చెపితే అక్కడ చేయాలి" అన్నాడు. ఆరు సంవత్సరముల నుండి చాల ప్రయత్నం చేశారు. ఒకరోజు గోల్డ్‌స్టీన్‌ను పిలిచి అబ్బాయిని ఇక్కడికి తీసుకురా అని చెప్పాను. గొప్ప శ్రీమంతులు, మంచి గుణవంతులు, ఆదర్శవంతులైన వారి కుమార్తెతో అతని వివాహం నిశ్చయం చేశాను. సాధారణంగా వివాహమైన తరువాత ఆడపిల్లలు అమ్మ ఇంటి నుండి అత్తవారింటికి పోయే సమయంలో చాల ఏడుస్తారు. ఆ అమ్మాయి కూడా ఇక్కడి నుండి వెళ్ళేటప్పుడు చాల ఏడ్చింది. "కొడుకును ఎత్తుకొని రామ్మా!" అని నేను ఆమెను ఆశీర్వదించి పంపాను. ఇప్పుడామెకు ఒక కొడుకు పుట్టాడు. వారిని ఇక్కడికి ఎప్పుడు తీసుకొని రావాలని అడగటానికి అతడు వచ్చాడు. ఈవిధంగా ప్రతి విషయంలో వారు స్వామి ఆజ్ఞానుసారం వర్తిస్తూ ఆనందంగా జీవితాన్ని గడుపుతున్నారు. గోల్డ్‌స్టీన్ కుమారులిద్దరూ చాల మంచి పిల్లలు. సాయి సంస్థలతో సంబంధము పెట్టుకోవడంచేతనే వారికి మంచితనం అలవడింది. వారి భార్యలు కూడా చాల మంచివారు. ఆమెరికాలోని సాయిసంస్థలను ఇప్పుడు గోల్డ్‌స్టీనే చూసుకుంటున్నాడు. **భక్తి, క్రమశిక్షణ, కర్తవ్య పాలన ఈ మూడు అతనిలో ఉన్నాయి.** మీరు కూడా అట్టి ఆదర్శవంతమైన జీవితాన్ని గడపండి. మంచి పేరు తెచ్చుకోండి. మీరు భవిష్యత్తులో బాగుపడాలనుకుంటే వర్తమానంలో మీ తల్లిదండ్రులను గౌరవించండి. గతాన్ని గురించి చింతించకండి. వర్తమానంలో మంచిగా జీవించండి. భూత భవిష్యత్కాలములను వృక్షములతోను, వర్తమానమును విత్తనముతోను పోల్చవచ్చును. భూత కాలమనే వృక్షము నుండియే వర్తమానమనే విత్తనం వచ్చింది. వర్తమానమనే విత్తనము నుండియే భవిష్యత్తనే వృక్షం రూపొందుతుంది. కనుక, మీరు ఏ చెడ్డ పని చేసినా, ఒకే మంచి పని చేసినా వాటి ఫలితమును అనుభవించక తప్పదు. కనుక, మంచినే చూడండి, మంచినే చేయండి, మంచిగా ఉండండి. దివ్యత్వానికి మార్గం ఇదే.

(స.సా.జ. 2000 పు. 21/22)

గోవిందం

(చూ॥ విద్య)

గోవిందుడు

సృష్టికి పూర్వము జలమునందు అవ్యక్తముగా నుండిన భూమిని వెలుపలకు తీయుటం చేతనే **విష్ణువునకు గోపాల అనే పేరు సార్థకమౌతూ వచ్చింది. గో అనగా భూమి. గో అనగా స్వర్గము. గో అనగా వాక్కు. గో అనగా గోవు. భూమిని జలమునుండి తీయటం చేతనే ఇతనికి గోవింద అనే సార్థకనామం కలిగింది. వింద అనగా పొందటం. భూమిని పొందినవాడు కనుక ఇతనికి గోవిందుడు అని పేరు.** భూమిని సంరక్షించిన వాడు కనుక ఇతనికి గోవింద అని పేరు. గో అనగా జీవుడని మరొక అర్థం. జీవులను పాలించువాడు కనుకనే ఇతనికి గోపాల అని మరొక సార్థకనామము. లౌకిక దృష్టితో గోవులను ఆవులను కాచినవాడు కనుక గోపాలుడని మరొక పేరు. గోలోకవాసి అనగా జీవలోకవాసి. జీవుని నివాస స్థానము హృదయము.

గ్రంథము/గ్రంథములు

ఏతావాతా హృదయవాసియే గోపాలుడు అనే సార్థకనామాన్ని వేదాంతము ప్రబోధిస్తూ వచ్చింది.

(స.వ. 1984.పు. 228)

(చూ॥బృందావనము)

గోపు

(చూ॥ బలరామకృష్ణులు)

గ్రంథము/ గ్రంథములు

గ్రంథము నుండి గంధమును విషయమును తీయవలెను, పుస్తకమునుకూడ మస్తకముగా మార్చవలెను, గానీ మస్తకమును పుస్తకముగా మార్చరాదు.

(గీ పు. 171)

(చూ॥అద్వైత దర్శనము)

గ్రామసేవ

భారతదేశమ్ము - వేదాల పట్టు కొమ్మ,
యజ్ఞయాగది - క్రతువుల ఆటపట్టు,
పెక్కు అవతారములగన్న - పెద్దతల్లి
నీతినియమాల - యోగ, త్యాగభూమి!

(దే.భ. యు.క. పు. 46.)

"గ్రామాలలో సేవ చేయడం నేర్చుకోవాలి, పట్టణాలలో ఏమున్నది? అక్కడ ఈర్ష్యాద్వేషాలు, బాగుపడితే ఓర్వలేరు, చెడిపోతే చేయి అందించరు. అది అక్కడ పరిస్థితి. కనుక గ్రామసీమల ప్రజలను పైకి తీసుకొని రావాలి. గ్రామసేవే రామసేవ గదా!

(ప్రే.జ్యో. పు.36)

గ్రామసేవయన్న రామసేవయె సుమా!
రామరాజ్యమున ప్రేమ మయమే
ప్రేమలేక ఉద్ధరించుటయే లేదు,
సేవలేని నరుడు బాగుపడడు.
నరుడు బాగుపడవలెనన్న సేవలోనే ప్రవేశించాలి.
కరుణ ప్రేమయె లేకున్న నరుడె కాదు
స్నేహతత్వంబె వారికి చేయుమేలు.

(స.సా.డి. పు. 308)

గ్రామస్థులు

గ్రామ ప్రజలలో అనేక విధములైన భేదభావము లుంటుంటాయి. కొన్ని పార్టీలు గ్రామాల్లో చేరి సమాజ జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తుంటాయి. వాళ్ళకు మనం చక్కగా నచ్చచెప్పాలి. పార్టీతో వ్యక్తికి మాత్రమే సంబంధం కాని, గ్రామానికి సంబంధము లేదు. గ్రామాభివృద్ధికి సంబంధించిన పనులలో అందరూ, అన్ని పార్టీల వారు ఏకమై పని చేయాలి అని బోధించాలి. నీ వ్యక్తిత్వము ఏ పార్టీకైనా అనుకూలముగా ఉండవచ్చును. కాని గ్రామాభివృద్ధి సమస్యలను మాత్రం పార్టీ విషయం చేయకూడదు. అందరూ ఐకమత్యంగా పని చేయాలి. కొన్ని గ్రామాలలో అపరిశుభ్రత కారణంగా అనారోగ్యం పెరిగిపోతున్నది. అలాంటప్పుడు గ్రామానికి కొన్ని అనుకూలాలు చేయాలి. దొడ్లు కట్టించాలి. నీటి వసతులు కల్పించాలి. ఈ రకమైన పనులకు మనము పూనుకుంటే గ్రామస్థులు అందులో చేరి మనకెంతో సహాయంగా నిలుస్తారు. గ్రామస్థులతో చేరుకొని మనం పని చేయాలి.

(ఆ.ప్ర న. - డి. 1992 పు.27)

చంచలము

(చూ॥ ఆవరణము, ఏకాగ్రత, ధీమంతుడు, భక్తి, విక్షేపము)

చంద్రవంక

చంద్రవంకనుండి ఎట్టి పరిస్థితులలోను
దూరముగా తొలగి పోని నక్షత్రము వలె
భగవంతుని యందు ధృడ విశ్వాసమును పెంపొందించుకో.
(ధై. మ. పు. 96)

చంద్రుడు

(చూ॥ సీత)

చక్క చేసుకోండి

పూర్వం పుట్టపర్తి ఒక చిన్న పల్లె. అప్పుడు దీని జనాభా వందల్లో ఉండేది. అలాంటి చిన్న పల్లెలో యూనివర్సిటీ రావడ మేమిటి! ఎయిరోడ్రమ్ రావడ మేమిటి! సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రావడమేమిటి! రైల్వేస్టేషన్ రావడమేమిటి! ఇవన్నీ చూస్తుండగానే ఈ పల్లెలో జరిగిపోతున్నాయి. ఇంకా ఎన్నెన్నో ఎన్నెన్నో జరుగునున్నాయి. మీకు తెలుసు, స్వామి చెప్పనక్కర లేదు. ఈనాడు మీరు ఇంత దగ్గరగా కూర్చున్నారు. ఇంకా కొంత కాలమునకు కొన్ని మైళ్ళ నుండి మీరు స్వామిని చూడవలసి వస్తుంది. కనుక,

చిక్కిన సాయిని వక్కలేయక చక్క చేసుకోండి
పోయిన చిక్కదు పర్తీశుని పాదసేవయండి
భక్తిని ఇచ్చి శక్తిని పెంచి ముక్తి చేర్చునండి
ఇతరుల మాటలు ఇంపుగ నమ్మి కొంపతీయకండి
నేర్చుకోండి ఈ బుద్ధులన్నీ, తీర్చుకోండి కర్మను.

విద్యార్థులారా! ఈ ప్రమాదాన్ని తెప్పించుకోవడమే మీకోసం తెప్పించుకున్నాను. మీ అందరి ప్రార్థనలను ఆలకించి, ఇప్పుడు మీకోసమే దీనిని నయం చేసుకుంటున్నాను. దీని గురించి ఇంకేమీ యోచన పెట్టుకోకండి. నేను100% పర్‌ఫెక్ట్‌గా ఉన్నాను. మీరు స్వామిచెప్పినట్లు నడుచుకొని, మంచి మార్కులతో

చట్టము

ఉత్తీర్ణులై, చక్కని పేరు ప్రతిష్టలు తెచ్చుకొని ప్రపంచానికి ఆదర్శాన్ని అందిస్తూ రండి. అదే నేను ఆశించేది.
వాలంటీర్లకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడంతో పాటు భక్తులకు కూడా నూరు షెడ్లు ప్రత్యేకంగా వేయిస్తున్నాము. విదేశీయులకోసం కొండపై 150 ఎకరాల స్థలంలో షెడ్లు వేస్తాము. రాబోయే 75వ 'బర్త్‌డే'కి ఎవరికి ఎక్కడ చోటు చిక్కుతుందో! అయితే స్వామిదయ ఉన్నప్పుడు మీరు ఎక్కడున్నా స్వామివారే అవుతారు. ఎల్లప్పుడు స్వామిమీ వెంటనే ఉంటాడు. కనుక స్వామి దూరమవుతాడనే భ్రాంతికి ఏమాత్రం అవకాశ మివ్వకండి. స్థిరత్వాన్ని పెంచుకోండి.

(స.సా. ఫి. 99 పు.36/37)

చట్టము

(చూ॥సనాతన ధర్మము)

చతుర్విధ పురుషార్థాలు

నేను పిల్లలకు ఎప్పుడూ చెబుతుంటాను. **మొదటిది: 'ఫాలో ది మాస్టర్'**. ఎవరీ మాస్టర్? కాలేజిలో పాఠాలు బోధించే మాస్టర్ కాదు, ధర్మమే. కనుక ధర్మాన్ని అనుసరించు. అన్నింటికీ ధర్మం ప్రధానమైయుండాలి. నీ కర్మలన్నీ ధర్మపరమైయుండాలి. నీవు ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మమే నిన్ను రక్షిస్తుంది. అందుకే **"ధర్మోరక్షతి రక్షితః "** అన్నారు. ఇంక **రెండవది; "ఫేస్ ది డెవిల్"**. ఏది 'డెవిల్' అంటే? **అర్థమే 'డెవిల్' ఈ అర్థంకోసమే మానవులు నానా యాతనలు పడుతున్నారు.** అన్యాయ అక్రమ ఆనాచారాలన్నీ చేస్తున్నారు. **'ధనంమూల మిదం జగత్' అనుకుంటున్నారు. ఇది తప్పు. ధనం కాదు, ధర్మమే జగత్తుకు మూలం. అందుకనే 'వేదోఖిల్ ధర్మ మూలమ్' అన్నారు. ధనార్జన ధర్మపరంగా ఉండాలి,** అన్యాయార్జన తగదు. ఇక **మూడవది: 'ఫైట్ టు ది ఎన్డ్'**చివరి వరకు పోరాడు. దేనితో? **నీలో కామము లేదా కోరిక పూర్తిగా నశించేంతవరకు దానితో పోరాడు. ఒకనాడు దక్షిణా మూర్తి సముద్రపుటొడ్డున నడుస్తుండగా సముద్రుడు అలలతో ఒక గడ్డిపోచను ఒడ్డుకు నెట్టివేయడం కనిపించింది.** అప్పుడాయన అనుకున్నాడు: ఓ సముద్రుడా! నీకెంత అహంకారం! అనంతమై అగాథమైయున్న నీవు ఒక చిన్న గడ్డిపోచపై నీ ప్రతాపం చూపిస్తున్నావా?!" అనుకున్నాడు. తక్షణమే సముద్రుడు ప్రత్యక్షమై, "స్వామీ! నాపైన గడ్డిపోచపై **కళంకాన్ని భరించలేక నెట్టినాను కాని, గడ్డిపోచపై కినుకతో కాదు"అన్నాడు. అలాగే మనిషి కూడా తనలో గడ్డిపోచ ప్రమాణం కల కామమునకు కూడా చోటివ్వకూడదు. ఇదీ 'ఫైట్ టు ది ఎన్డ్' అంటే!** ఇంక **నాల్గవది: 'ఫినిష్ ది గేమ్' మోక్షప్రాప్తితో ఈ జీవితమనే గేమ్ పూర్తవుతుంది. ఇదే లక్ష్యం. చతుర్విధ పురుషార్థాలలో నాల్గవదైన మోక్షమిదే.** ఇందులో ఒక ముఖ్యమైన అంశమును గమనించాలి. **పురుషార్థల్లో మొదటిది ధర్మం, నాల్గవది మోక్షం.** మధ్యలో అర్థ కామాలున్నాయి. ఈ అర్థకామాలు రెండూ ధర్మపరమైనప్పుడే మోక్షం సిద్ధిస్తుంది. **సహజంగా అయితే పంచమ పురుషార్థం కూడా ఒకటున్నది. దాన్ని ప్రేమ అంటారు. అదే దైవం. ప్రేమతో సాధించలేనిది లేదు.**

(స.సా.ఫి. 98 పు.53/54)

(చూ॥ మహాభాగ్యం, సోహం తత్వము)

చతుష్పాద మహాసభ

నిజముగా మానవుడు భయస్వరూపుడు కాడు. మానవత్వమనే పదమునందే దివ్యత్వమనే అర్థము యిమిడి వుంది. దీనికి ఒక చిన్న కథ. ఒక భయంకరమైన అరణ్యములో సర్వవిధములైన జంతువులు నివసిస్తూ వుండేవి. ఏ అడవిలో సింహములు నివసిస్తాయో ఆ అడవిలో ఏనుగులు నివసించవు. ఏనుగులు సంచరిస్తూ వుండే అడవిలో సింహములుండవు. కాని యీ అడవియందు సింహము మొదలుకొని నక్క కుక్క వరకు సమస్త ప్రాణులు సంచరిస్తూ వున్నాయి. ఒక నక్క అనేకవిధములుగా యోచిస్తూ వచ్చింది. మానవత్వమును

ఆదర్శజీవితముగా లోకులు భావిస్తున్నారు. మానవ జన్మము చాలా దుర్లభమైనదని చెప్పుకుంటున్నారు. మానవుడు పుట్టినట్లుగానే జంతువులు కూడా పుట్టినాయి. తల్లిగర్భమునుండి జన్మించిన ప్రతిదీ ఒకవిధమైన జంతువే. మానవునికి కూడను జంతువు అని పేరు పెట్టకుండా మానవుడనే పేరు ఎందుకు పెట్టారు? మాకంటె తాను యేమంత గొప్పవాడు? వారికంటె మేము యేమి తీసిపోయినవారము? ఈ విధముగా తర్జనభర్జన చేసుకొని విచారణ సల్పి యిది వూరికే విడిచి పెడితే ప్రయోజనము లేదు దీనిని సాధించాలి అని ఆ నక్క గట్టిపట్టు పట్టింది. ఆనాటి నుండి నక్క కాన్వాసింగ్‌కు బయలుదేరింది. ప్రతి జంతువు దగ్గరకు వెళ్లింది. మానవునికంటె మనము యెందుకు తక్కువగా వుండాలి? **జంతుజాతి మానవజాతికంటె హీనజాతియని భావిస్తున్నారు. ఈ పేరును మనము తుడిచివేసుకోవాలి. అని బోధిస్తూ ప్రతీ జంతువుకు వుద్రేకమును వుత్సాహమును చేకూరుస్తూ వచ్చింది.** శరీరపుష్టిగల ఏనుగు మొదలుకొని మృగరాజైన సింహము హీనస్థాయియందున్న నక్క కుక్కలవరకు దీనిని టాంటాం వేయించి అందరికీ యీ విషయమును బోధించింది. అందరూ చేరి ఒక మహాసభను యేర్పరచుకోవాలని నిర్ణయం జరిగింది. సభకు **'చతుష్పాద మహాసభ' యని పేరుపెట్టుకున్నారు.** ఫలాని కాలములో ఫలాని సమయానికి అందరూ యీ మహాసభలో పాల్గొనాలని చెప్పింది. దీనికి ఎజెండా మూడు విషయాలు నిర్ణయము చేసుకుంది. **మానవులు జంతువులు తల్లి గర్భమునుండి పుట్టినవారే. అందుచే మానవులకు జంతువులకు 'జంతువు' అని ఒకే పేరు వుండాలి** రెండు పేర్లు ఉండటానికి వీలులేదు. **జంతువులకు మానవుడు అనైనా పేరుండాలి లేదా మానవునకు జంతువు అనైనా పేరుండాలి.** ఈ రెండు సమానము, భిన్నముగా వుండటానికి వీలుకాదు అని నిర్ణయము చేసుకోవాలి. ఇంక **రెండవది మానవుడు జ్ఞానవంతుడని, జంతువులు అజ్ఞానముతో కూడినవని మనకొక చెడ్డపేరు.** దీనిని మనము అంగీకరించరాదు. మనకున్న జ్ఞానముకంటె మానవునికి యేమంత అధికముగా వుంటుండాది? మానవునకున్న జ్ఞానముకంటె మనకేమి తక్కువగా వుంటుండాది? ఇరువురికీ ఒకే జ్ఞానము అనే దానిని మనము స్థిరము చేసుకోవాలి. **ఇక మూడవది మనము నోరులేని వారమని, మానవుడు నోరున్నవాడని, మనము మూగజంతువులమని, వారు మాటకారులని పేరు ప్రతిష్ఠలు కలిగినాయి.** మనం మూగజంతువులమైనప్పటికీ మనకు యేమి కొరతగా వున్నది. మాటలు నేర్చిన వాడైనప్పటికిని వాడేమి సుఖమును అనుభవిస్తున్నాడు. కనుక మాటలకు, మూగతనమునకు యేమాత్రము బేధము వుండకుండా చూచుకోవాలి. **మనము క్రూరులమని భావిస్తున్నారు. మానవుడు తాను సాత్వికుడని విశ్వసిస్తున్నాడు. దీనికి మనము అంగీకరించరాదు.** మనలో వున్న సాత్వికత్వము మానవులెవరియందు కూడ లేదు. మానవునికంటె మృగము సాత్వికమైనదనే సత్కీర్తిని మనము తీసుకురావాలి. ఇప్పుడు చెప్పిన నాలుగు పాయింట్లు మనము యీ సమావేశము లోపల చర్చించాలి. ఈ మీటింగుకు ఎవరిని అధ్యక్షుని చేయాలి? అప్పుడు నక్కనే చెప్పింది. మన అడవి లోపల కొంతమంది యోగులు, ఋషులు తపస్సు ఆచరించుకుంటున్నారు. అందులో **ఉత్తముడైన ఒక ఋషిని మనం ఆహ్వానిద్దాము అని విశ్వసించి నక్కనే ఆ ఋషి దగ్గరకు వెళ్ళింది. స్వామీ! మా జంతురాజ్యములో చతుష్పాదమహాసభ యనే గొప్ప సభను జరుపుకుంటున్నాము. తమరు దీనికి అధ్యక్షత వహించాలి అని కోరింది. సర్వభూత సమానత్వమును గుర్తించిన ఆ యోగి మీ సభకు తప్పక వస్తానని అంగీకరించాడు.**

మంచి ముహూర్తములో ఆ సభను ప్రారంభించుకున్నారు. విశాలమైన ఒక ప్రదేశములో ఆనాడు అడవిలో వున్న చిన్న జంతువు మొదలుకొని పెద్ద జంతువు వరకు తల్లితండ్రులు మొదలుకొని మునిమనుమలు వరకును అన్నీ ప్రయాణమై వచ్చినాయి. అక్కడ

కలకలలాడుతుండాయి, కిలకిలా నవ్వుతున్నాయి. ఈ మృగములంతా కూడను అధ్యక్షునిపై కొంతవరకు విశ్వాసమున్నవే, కనుక **ఆ ఋషికి ఉన్నతాసనమును యేర్పరచినాయి.** అదే విధముగా అధ్యక్షుని పక్కన సింహమునకు వున్నత స్థానము అమర్చినాయి. మహర్షి తన ప్రక్కనున్న **సింహమును చూచి యేమాత్రము అదరలేదు. బెదరలేదు. సర్వభూతములందుండిన దైవత్వమనే యేకత్వమును కలిగినవాడు యీ మహర్షి. ఈతని యందు అభయత్వమే వుందిగాని భయత్వము లేదు.** అందరూ కూర్చున్న తరువాత స్వాగతం చెప్పాలి. ఈ **మహాసభకు సెక్రట్రీ యీ నక్కనే కనుక ఇట్లా ప్రారంభించింది.** ఈనాడు మనకందరికి సువర్ణాక్షరములతో లిఖించవలసిన దినము. ఇది మరువరానటువంటి దినము. మన అందరి సమావేశము ఒక దిగ్విజయమును సాధించబోతుంది. మీకు యెన్నో పనులున్నప్పటికినీ అన్నియును వదలి యీ సమావేశములో పాల్గొన్నారు. మీ అందరికి నా ధన్యవాదములు అంది. తరువాత మీటింగ్ యొక్క మూడు విషయాల ఎజండాను చెప్పింది.

ఎజెండాను చెప్పిన తరువాత సింహరాజు లేచాడు. లేచి నా సోదరుడైన నక్క చెప్పిన విషయము మీరంతా విన్నారు. నిజముగా మన **జంతువులయందుండే శౌర్యసాహసములు, ధైర్యము, పటుత్వము మానవుని యందు లేవు. దీనికి నేను ప్రత్యక్ష ప్రమాణము. నాయందున్న ధైర్యము, బలము మానవునిలో యేఒక్కరికైనా వుంటుందా చూపించండి.** నేను మృగరాజునైనప్పటికి అన్యాయఅక్రమ అనాచారములలో యేమాత్రము అడుగుపెట్టలేదు. **నిష్కారణముగా పరజీవులను హింసించటము లేదు. ఆకలైనప్పుడు మాత్రము యేదో ఆహారమును భుజిస్తాను.** వ్యర్థముగా నేను యే ప్రాణిని తినటం లేదు. ఈ ధైర్యము, యీ సాహసము, యీ నీతి మానవుని యందు వుందా? లేదు. కనుక మనము మానవులకు యెందుకు వెరవాలి. అతనికంటె అల్పజాతి అని మనము యెందుకు అన్వించుకోవాలి. దీనిని యీనాడు నిర్ణయం చేసుకోవాలి అంది. తరువాత ప్రక్కనున్న **ఏనుగు లేచింది. 'మానవుడంటే నా మోకాలంత కూడ లేడు.** ఆకారములో నాది గొప్ప ఆకారము. **తెలివితేటలలో నాది గజతెలివి అనిపించుకున్నాను.** నన్ను రాజులు, రారాజులు విశ్వసిస్తూ అన్వేషిస్తూ వచ్చారు. రాజుకు పట్టాభిషేకము చేసే సమయములో నేను లేకపోతే పట్టాభిషేకము జరుగదు. నాకంటె మానవులు గొప్పవారని నేను ఎట్లా చెప్పాలి. నా తెలివితేటలకు నా బలమునకు నాయొక్క ఆకారమునకు మానవుడేనాటికి సాటిరాడు' అన్నది.

అంతలో నక్క ఒక యోచన చేసింది. మృగరాజు లేచి చెప్పాడు. ఆమహారాజు ప్రకనున్న మంత్రి సమానమైన ఏనుగు లేచి చెప్పింది. చిన్నవాడు ఒకనిని పైకి లేపి మాట్లాడించాలి అనుకుంది. **పక్కనున్న అడవికుక్కను లేపింది. అడవికుక్క లేచి** అధ్యక్షునికి నమస్కరించి, మృగరాజుకు నమస్కరించి, సమావేశములో చేరిన వారందరికీ నమస్కరించి, **"గొప్ప వారిముందు అల్పుడను,** నేను మాట్లాడవలసి వచ్చిందిగాని నా యల్పత్వము నందుండిన మహాగుణము మానవునియందు లేదు. **విశ్వాసములో నాకు మించినవాడు మరొకడు లేడు.** నన్ను సాకి సంరక్షించినవానిపైన నేను యెంతో విశ్వాసమును పెంచుకుంటాను. **నా ప్రాణము పోయేంతవరకు వానికి కృతజ్ఞుడైవుంటాను.** నన్ను హింసించినప్పటికినీ నేను అతనిని యేమాత్రము బాధించను. **మానవలోకమునందు కూడను "కుక్కకున్న విశ్వాసము లేదురా'** యని అనిపించుకుంటాను. **విశ్వాసములో మానవునకే మాత్రము నేను తీసిపోను.** మానవుడు తన మాష్టర్ని హింసించటానికి ప్రయత్నిస్తాడు. **ఉపకారము చేసినవానికే అపకారము చేస్తున్నాడు.** తనకు అన్ని విధములుగా సహాయము చేసినవానికే ద్రోహం చేసి దూషిస్తున్నాడు మానవుడు. తన యజమానిపై కుట్రపన్ని హింసకు పాల్పడుతున్నాడు. మానవుడు. **మానవునికి కృతజ్ఞత అనేది లేదు. విశ్వాసము కూడను**

లేదు. తన అక్కర తీరేంతవరకు యెంతైనా వినయ విధేయతలు ప్రదర్శిస్తాడు. తన అక్కరి తీరిన తరువాత మాస్టర్నే హింసించటానికి పూనుకుంటాడు. మానవునికంటె మనమేమాత్రము తక్కువజాతి వారము కా''మన్నది. ఈ విధముగా మిగతా జంతువులు వాటి వాటికి తగినట్లుగా ఉపన్యాసాలిచ్చినవి. తరువాత అధ్యక్షుని ఉపన్యాసము వచ్చింది.

ఆ ఋషి చెప్పాడు. ' ఓ మృగములారా! **మీరు చెప్పిన విషయములన్నియు సత్యములే. ''కూరిమి గల దినములలో నేరములెన్నడును కలుగనేరవు''** ఇష్టంగా ఉండే రోజుల్లో మాస్టర్ చేసేవి అన్నీ మంచివే అనుకుంటాము. ''కూరిమి విరసంబైనను నేరములే తోచుచుండు''. ఈ మాస్టర్ పైన యేమైనా కొంచెము అయిష్టము బయలుదేరిన అతను మంచిపని చేసినా చెడ్డగా భావించుకుంటాము. **మానవుడు, ఎదురుగా నమస్కరిస్తాడు. మరుగున పోయి దూషిస్తాడు. ఎదురున ఒకమాట, మరుగున ఒకమాట.** ఎదురుగా వర్ణించి వెనుకగా పోయి హతమార్చటానికి ప్రయత్నిస్తాడు. ఇలాంటి తెలివితేటలకంటె మృగము చెప్పిన తెలివితేటలు చాలా గొప్పవి. మీరు చెప్పిన దోషములు మానవునియందు లేకపోలేదు. **ఆహారనిద్రాభయమైథునేచ్ఛలు నాల్గింటి యందును మృగమునకు మానవునకు యెట్టి వ్యత్యాసము లేదు.** అయితే జంతువులకంటె మానవుని యందు ప్రత్యేకత ఒకటి వున్నది. **మృగములయందు పుట్టుకతో వచ్చిన క్రూరత్వమును మృగములు మార్చుకొనలేవు. ఎంత ఆకలిగొన్నప్పటికి పులి పూరీ పలావు తినదు. పులి మాంసాన్నే ఆరగిస్తుంది. టిఫిన్, కాఫీలు త్రాగదు.** ఎంత ప్రయత్నము చేసినప్పటికి దాని స్వభావము మారటానికి వీలుకాదు. మానవుడు ప్రయత్నము చేస్తే ఎటువంటి క్రూరత్వమును గాని, ఎటువంటి దుర్గుణములు గాని మార్చుకొనగలడు. **ప్రయత్నముచేత పరివర్తన కలిగే శక్తి మానవునియందు వుంది. ఎట్టి ప్రయత్నము చేసినప్పటికినీ మృగమునందు పరివర్తన కలిగే శక్తిలేదు. ఇదే రెండింటికి భేధము. ఈవిధమైన శక్తి సామర్థ్యములు మనిషియందుంటున్నవి' అన్నాడు.** అప్పుడు నక్క లేచి 'స్వామీ! మీరు చెప్పినది వాస్తవమే. అయితే అలాంటి మార్చుకొనే శక్తిమానవుని యందుండినప్పటికినీ మార్చుకోలేని మానవుడు ఎలాంటివాడు?' అన్నది. **''శక్తి వుండి కూడా అలా మార్చుకోలేని మానవుడు మృగము కంటే హీనము'' అన్నాడు అధ్యక్షుడు.** అప్పుడు అన్ని మృగములు చప్పట్లు కొట్టాయి. **మానవునియందు వివేకశక్తి వుండినప్పటికీ వినియోగించక సన్మార్గములో ప్రవేశించ కుండా వుండే మానవుడు మృగము కంటే హీనము అని మహర్షి నిర్ణయించాడు.**

ఇంక మానవుడు చదువు సంధ్యల లోపల మహా గొప్పవాడుగా వుంటున్నాడు. చదువులు చదివినందువలన కల్గిన ఫలితమేమి? ఇవి కేవలము పొట్టకూటి కోసమేకదా! ఆ పొట్టను మనము కూడా నింపుకుంటున్నాము కదా. పొట్టను నింపుకునే నిమిత్తమై మానవుడు యిన్ని విధములైన శ్రమలు పడుతున్నాడు. **శ్రమ పడకుండా మనము పొట్ట నింపుకుంటున్నాము. వారికంటే మనమే గొప్ప అన్నది నక్క.** నక్క స్వాతంత్ర్యము మరీ మితిమీరిపోతున్న సమయంలో అధ్యక్షుడైన **మహర్షి దానిని నివారించి రెండవ భేదము చెబుతూ వచ్చాడు. ''మానవుడు మాయను సాధించగలడు. మానవుడు ఆత్మను చూడగలడు. మానవుడు నిర్వాణమనే ఆనందమును చేరగలడు. మానవునకు మాయను జయించే అధికారము వుంటుండాది. ప్రయత్నము చేసి ఆత్మను ఉద్ధరించుకోగలడు. సాధనసంపత్తివలన నిర్వాణమును చేరగలడు. ఈమూడు మీ మృగములయందులేవు అన్నాడు.** ఆ మహర్షి ఇంకా చెప్పాడు. 'నాయనా! **ఆంగ్ల భాషలోపల MAN అని చెబుతున్నారు. తెలుగులో మానవ అని చెబుతున్నారు.** మాయయనే అజ్ఞానమును దూరము చేసుకొని ఆత్మతత్వమును దర్శించి విజ్ఞానమనే ఆనందములో లీనమవుతాడు. మానవుడు. అదే అర్థము యీ MAN లోపల వుంది. **M అనగా మాయ. మాయను**

చదువు

తొలగించు. Aఅనగా ఆత్మ. ఆత్మను దర్శించు Nఅనగా నిర్వాణము. నిర్వాణము పొందుము. ఆనందములో లీనముకా. అజ్ఞానమును దూరము చేసుకొని ఆత్మను దర్శించి ఆనందములో లీనము అయ్యేవాడు నిజమైన వాడు' అని చెప్పాడు. మృగములన్నియు తలలు వంచుకున్నాయి. అది తమకు చేతకానిపని యని ఒప్పుకున్నాయి. అయితే అందరు మానవులు యీ పని చేయగలుగుతున్నారా? ~~ఈవిధమైన ప్రయత్నము చేయని~~ **మానవుడు మా Friend అని మృగములన్నీ అంగీకరించాయి. కనుక మానవునకు మృగమునకు యెక్కువ వ్యత్యాసము లేదు.** మానవునియందు విజ్ఞాన ప్రజ్ఞాన సుజ్ఞానములు వుండి కూడను సరియైన రీతిలో అనుభవించుట లేదు. మహర్షి తాను అరణ్యమునకు వచ్చిన కారణమును నిరూపించాడు. మృగములు తమను హింసించినవానిని మాత్రమే హింసించగలవు. తమను హింసించనివాని జోలికి యేమాత్రము పోవు. కాని మానవుడు తనను హింసించనివానిపైన కూడ హింసకు ప్రయత్నయు చేస్తాడు. నిష్కారణమైన నిందలు మోపుతాడు. నిరపరాధులను హింసిస్తాడు. కారణములేని కార్యములో పాల్గొంటాడు. కనుకనే ఆ మానవులనుండి దూరముగా యీ సాత్వికగుణము కల్గిన మృగముల మధ్య సుఖముగా జీవించగలమని ఋషులంతా అరణ్యమునకు వస్తున్నారు. మానవుడు కేవలము స్వార్థపరుడై పోతున్నాడు. ఏది చేసినా, ఏది చూసినా, **ఏది చెప్పినా తన స్వార్థమునందే మునుగుతున్నాడు.** మృగమున కేమాత్రము స్వార్థము లేదు. ఈ మృగములు మనుమలను మునిమనుమలను అమెరికాకు, జపానుకు, ఫ్రాన్సుకు, ఇటలీకి, జర్మనీకి పంపించాలని డబ్బు బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ చేయటం లేదు. మోసగించి, పరులను హింసించి, పరులను బాధించి తమ పొట్టను నింపుకోవటము లేదు. కొంపలు కట్టుకోవటం లేదు. మానవుడు కూడను ఒక జంతువుతో సమానమే అని ఒక నిర్ణయం చేసుకున్నాయి. అదే విధముగనే యిక్కడ **కృష్ణుడు అర్జునిని నాయనా! నీవు భయపడటానికి మృగము కాదు అని రెండు మృగముల తత్వమును అర్జునునికి బోధించాడు. "భయపడే గొట్టె కాదు నీవు. భయపెట్టే పులికాదు నీవు. నీవు గొట్టె కాదు. పులీ కాదు. నీవు మానవుడవు.** మానవునియందు యీ మృగత్వము శేషించి వుండిపోవటము వలననే మానవుడు యీవిధమైన ప్రవర్తనకు గురి అవుతున్నాడు. కనుక నీవు **అభయుడవు కమ్ము. భయుడవు కాకూడదు" అన్నాడు. అప్పుడు అర్జునుడు "కరిష్యే వచనం తవ" స్వామీ! మీ ఆజ్ఞను శిరసావహిస్తాను అన్నాడు.**

(శ్రీ.స.గీ.పు.244/250)

చదువు

"చదువులన్ని చదివి చాల వివేకియై
మగిడి తన్నెరుగడు మందమతుడు
ఎంత చదువుచదివి ఏ నీతి యున్నను
హీనుడవగుణంబు మానలేడు"
"తరచి చదువు చదవ తర్కవాదమెగాని
పూర్ణ జ్ఞానంబెపుడు పొందలేడు
చదువు చదివి చదివి చావంగనేటికి
చావులేని చదువు చదువవలయు"

అదియే సత్యమైన చదువు. అదియే ధర్మమైన చదువు. ఆ ధర్మము ఆ సత్యమే సత్పురుషుల చెంత వుంటుంది. ఎవరు సత్యాన్వేషణ సలుపుతుంటారో, ఎవరు సత్యవ్రతులుగా ఉంటారో ఎవరియందు సద్గుణములు వికసిస్తూంటాయో వారి సన్నిధి యందే ఉంటుంటాది సత్యము. **ఆత్మకు సత్య అని మరొక పేరు. ~~ఈ~~ ఆత్మనిత్యమైనది కనుకనే ఆత్మకు సత్య అని పేరు.** సర్వులయందు ఉండునది అది ఒక్కటే. ఇంక అన్ని కూడను మార్పు చెందునవే. వ్యక్తి గాని విషయముకాని పదార్థముకాని కదిలిపోయే మేఘములే. **అట్లని లౌకికమైన చదువులు చదవవద్దని కాదు. ~~ఈ~~ చదువులతోపాటు ఆ చదువులు కూడను చదవటానికి తగిన కృషి చేయాలి.**

(బృ.త్ర. పు. ౯)

"కోహం, కోహం" (నేనెవరు?) అని పుట్టిన మానవుడు **"సోహం, సోహం" (నేనే దైవం)** అని మరణించాలి. మానవుని ఉచ్ఛ్వాస నిశ్వాసములు దినమునకు 21,600 పర్యాయములు "సోహం, సోహం" అంటున్నాయి. **'సో...' అనగా ..(అది) అంటే దైవము; 'హం' అనగా నేను. కనుక, 'సోహం' అనగా, "నేనేదైవం".** ఈ సత్యాన్ని మీ అంతర్వాణి దినమునకు 21,600 పర్యాయములు మీకు బోధిస్తున్నదిగాని, దానిని మీరు శ్రవణం చేయడం లేదు. "కోహం?" అనే ప్రశ్నకు మీ అంతర్భావం నుంచి ఆవిర్భవించే జవాబును మీరు ఏ మాత్రం లక్ష్యం చేయడం లేదు. ప్రతి దినము వార్తాపత్రికలలో వివిధ దేశముల నుండి వచ్చే 'న్యూస్' ను చదువుతున్నారుగాని, మీ నుండియే వచ్చే 'న్యూస్'ను మీరు గమనించడం లేదు. ప్రపంచంలోనున్న సమస్త పదార్థములను గురించి, విషయములను గురించి మీరు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారుగాని, **మిమ్మల్ని మీరు తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు.** మిమ్మల్ని మీరు తెలుసుకొనక ఎన్ని తెలుసుకొని ఏమి ప్రయోజనం? మిమ్మల్ని మీరు తెలుసుకుంటే సర్వమును తెలుసుకున్నవారవుతారు. మానవ జీవితం చాల ఉన్నతమైనది. మానవునికున్న శక్తి, సామర్థ్యములు ఏ జీవికీ లేవు. భగవత్సృష్టిలో మానవ జీవితం చాల చిత్రమైనది, విచిత్రమైనది.

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతా లవిత్రంబులు స
న్మిత్రంబులు ముని జన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

ప్రతి మానవుని చరిత్ర విష్ణుదేవుని చరిత్రయే. మానవుని నుండి ఆ దైవంయొక్క చరిత్ర ఆవిర్భవించాలి. మానవుడు, **దైవము వేరు కాదు. జీవుడే దేవుడు, దేవుడే జీవుడు.** కాని, మానవుడు దేహభ్రాంతిచేత తాను వేరు, దైవం వేరని భావిస్తున్నాడు. ఈ దేహాభిమానంచేతనే సర్వవిధములైన అజ్ఞానం ఆవిర్భవించుచున్నది. క్రమక్రమేణ దేహాభిమానమును తగ్గించుకుని ఆత్మాభిమానమును అభివృద్ధి పర్చుకోవాలి. **ఎంతకాలం ఈ దేహం?**

పాంచ భౌతికము దుర్భలమైన కాయంబు
ఎప్పుడో విడిచేది ఎఱుక లేదు
శతవర్షముల దాక మితము చెప్పిరి కాని
నమ్మరాదా మాట నెమ్మనమ్మున
బాల్యమందో లేక ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
ఊరనో అడవినో ఉదక మధ్యంబునో
ఎక్కడో విడిచేది ఎఱుక లేదు
మరణమే నిశ్చయమ్మది మానవునకు
బుద్ధిమంతుడై తన దేహమున్నయపుడే
తన్ను తా తెలియుట ధర్మతత్త్వమరయ.
మీ ప్రాణమున్నంతలో మీ సత్యమును మీరు తెలుసుకోవాలి. ఇదియే మీరు చదువవలసిన చదువు.

(స.సా. అ. 99, పు. 262/263)

"చదువు చదివి చదివి సద్గుణంబులు లేక
పరుల మోసగించి బ్రతుకువాడు
వాని కంటె మేలు వసుధలో గాడిద
బరువు మోసి తాను బ్రతుకుచుండు"

(శ్రీ. జూ. 97, పు. 103)

హెచ్చు చదువు చదివి యింద్రియలోలురై
చచ్చువారికన్న స్వల్పమైరి,
ఇంద్రియముల శక్తియినుమడించును గాని
అట్టి చదువు చదివి ఆర్యుడౌనె?
చచ్చు చదువు చదివ సంతసమును లేక
ఆత్మచింతనొందువాడు చదువరుండు.

(శ్రీ స.ది. 1993 పుట. 127)

చమత్కారము

(చూ॥ అవతారము, నిదర్శనము)

చరిత్ర

(చూ॥ భాగవతము, రామలక్ష్మణులు)

చర్చిల్

చర్చిల్

ఒక పర్యాయం **చర్చిల్ చెప్పాడు, "Man has conquered all but he has not conquered himself** అన్నాడు. మానవుడు అన్నింటిని సాధిస్తున్నాడు. అన్నింటిని అనుభవిస్తున్నాడు. తనను తాను సాధించుకోలేనటువంటి వాడు, ఎన్ని సాధించి ఏం ప్రయోజనం? ఇదేవిధంగా ఆనాటి బాలుడు **ప్రహ్లాదుడు కూడా చెప్పాడు. "నాయనా! పంచభూతములను హస్తగతం గావించుకొని ఆడుకొంటున్నావు. కాని నిన్ను నీవు జయించుకోలేక పోతున్నావు. ప్రపంచాన్నంతా సాధిస్తున్నావుగాని, నిన్ను నీవు సాధించుకోలేనటువంటి వాడవు ప్రపంచాన్ని సాధించి ప్రయోజనం ఏమిటి? అన్నింటిని సాధిస్తున్నావు. కానీ ఇంద్రియాలను నీవు అదుపులో పెట్టుకోలేకపోతున్నావు. నీ మనసును నీవు స్వాధీనంలో పెట్టుకోలేకపోతున్నావు.** అది లేనప్పుడు ఎన్ని సాధించి ఏం ప్రయోజనం?" అన్నాడు. కనుక **మొట్టమొదట మనసును స్వాధీనం చేసుకోవాలి. ఇది ఒక్క ఆధ్యాత్మిక మార్గంలో తప్ప అన్యమార్గంలో ఇది స్వాధీనంకాదు.**

(శ్రీ ఆ 98 పు. 13)

చర్మకారులు

ఒకానొకసమయంలో జనకమహారాజు పండితమహాసభను యేర్పాటు చేశాడు. ఇందులో గొప్పగొప్ప పండితులంతా ప్రవేశించారు. ప్రతివాది భయంకరులు ప్రవేశించారు. వాగ్ధోరణితో జగత్తునంతా ఆడించే శక్తిసామర్థ్యములు కలిగినవారు ప్రవేశించారు. భూమిని కదిలింపజేసేవారు ప్రవేశించారు. వారి ప్రతిభలు, పట్టుదలలు చాలా భయంకరమైనవి. సామాన్యమానవుడు అందులో ప్రవేశించుటకు యేమాత్రము అవకాశములేదు. జనకమహారాజు సమావేశములో గొప్పగొప్ప వారికే అవకాశముంటాది గాని సామాన్యులకు అవకాశముండదు. ఇటువంటి మహాసభలోపల అష్టావక్రుడు ప్రవేశించటానికి ప్రయత్నించాడు. అష్టావక్రుని లోనికి వదలేవారెవరు? అతనికి యెట్టి రెకమెండేషను లేదు, యెట్టి సహాయము లేదు. అతనికున్నది దైవసహాయము ఒక్కటే. దానిని నమ్మినవారికి యెవరికి యేవిధమైన నష్టకష్టములు ప్రాప్తించవు. తాత్కాలికముగా అడ్డులు తగిలినప్పటికిని మున్ముందు విజయమును సాధిస్తుంది. మూడు దినములు జనకమహారాజు ద్వారము దగ్గర కావలి కాచాడు. ఈ సమావేశములో పాల్గొనుటకై వేళ్లే వారలను పండితులను చూస్తూవచ్చాడు. మహనీయులకంతా యిట్టి ప్రాప్తి లభిస్తుండాది. నాకు కూడను సాధ్యమైతే లభించవచ్చని సంకల్పాన్ని బలహీనము చేసుకోకుండా వున్నాడు. ఎవరో ఒక మహనీయుడు ఇతని పరిస్థితిని చూచి జనకమహారాజునకు చెప్పాడు. ఇతను వయోవృద్ధుడుకాదు. మధ్యవయస్కుడుగా వుంటున్నాడు. ఇతనికి యేమాత్రము అనుభవము లేనట్టుగా కనుపిస్తుండాది. అనుభవమో నిరనుభవమో అనేది నిర్ణయించటము సాధ్యము కాదు. ఏపుట్టలో యెట్టి పాముండునో యెలాంటి వ్యక్తియో యెలాంటి పవిత్రమైన విషయములు వెలువడుతున్నాయో గుర్తించుకోవాలని జనకమహారాజు అతనిని లోపలకు ప్రవేశపెట్టాడు.

సమావేశము చాలా నిండుగా, పవిత్రమైన వాతావరణముతో వుంటుండాది. జనక మహారాజు తన స్థానములో ఆసీనుడయ్యాడు. ఈ సమయములో **అష్టావక్రుడు ప్రవేశించాడు. ఇతని రూపమును చూచి సమావేశములో వుండిన గొప్పగొప్ప పండితులందరూ ఘక్కున నవ్వారు. కానీ జనకుడు కన్ను వాల్చకుండా చూస్తున్నాడు. ఆయన నవ్వలేదు. ఈలోపల అష్టావక్రుడు పండితులకంటె అధికముగా గట్టిగా నవ్వాడు. పండితులకు ఆశ్చర్యమేసింది.** మేము నవ్వటము లోపల కారణము లేకపోలేదు. ఇతను నవ్వటానికి కారణము యేమిటి? అని ఒక పెద్దసమస్యగా యేర్పడింది. ఇలాంటి వికార ఆకారమును చూచిన యెట్టి మనుష్యునకైన తనకు తెలియకుండానే నవ్వు రావచ్చు. ఇది అమాయకత్వముగా మనము భావించవచ్చు. ఒకతల్లి చంటిబిడ్డను యెత్తుకొని పోతుంటే యెవరైనా వస్తుంటే వారిని చూచి చంటి బిడ్డ నవ్వుతుంది. **చంటిబిడ్డ నవ్వితే యెలాంటివారైనా**

తెలియకుండా వారు కూడ నవ్వుతారు. ఇది అమాయకత్వములో వుండిన పవిత్రత. కాని యిక్కడ పవిత్రతలో వుండిన అమాయకత్వము. పండితులంతా చాలా గొప్పవారు, అమాయకత్వం లేనివారు. ఈ వ్యక్తి నవ్వటములో కారణమేమిటో గుర్తించాలని అందరూ కాచుకొని వున్నారు. అందులో ఒక పండితుడు సాహసించి నాయనా నీవు యెవరవు? నీ రూపము చేస్తే మాకు నవ్వు వస్తుంది. దీనివల్లనే మేమందరము నవ్వాము. కానీ నీవు నవ్వటానికి కారణము యేమిటి? అన్నాడు. అయ్యా! **యిక్కడ యేదో గొప్ప పండితుల మహానభ జరుగుతుండాదని ప్రవేశించాను.** ఈ సమావేశములో ఇటువంటివారంతా వుంటున్నారంటే యీ సమావేశమునకే వచ్చివుండేవాడిని కాను. గొప్పగొప్ప పండితులు వుంటారని నేను ప్రవేశించాను. కాని యిక్కడంతా **చర్మకారులు** మాత్రమే వుంటున్నారు. అన్నాడు. ఈమాట వినేటప్పటికి పండితులకు చాలా కోపము వచ్చింది. **చర్మకారులంటే చెప్పులు కుట్టేవారిని అర్థము.** అందరు ఉగ్రులైనారు. అష్టావక్రుడు మీ చర్యలకు యీ పదమే సరియైన పదము అన్నాడు. చెప్పులు కుట్టేవానికే చర్మము విషయము తెలుస్తుంది. మిగతావారికి యేమాత్రము తెలియదు. కాబట్టి మీరందరు నా చర్మమును చూచి నవ్వుతున్నారు. నా పాండిత్యమును చూడటానికి మీరు ప్రయత్నము చేయలేదు. అన్నాడు. కనుక పండితులైనవారు అంతర్దర్శనము కలిగివుండాలి.

అంతర్దర్శనము లేని తత్వము పాండిత్యమునకు అవకాశము కాదన్నాడు. సత్యమును గుర్తించిన జనకుడు యితనిని ప్రవేశపెట్టి యితని పాండిత్యమును చర్చించుమని కోరాడు. అదేవిధముగనే లోకములో యెంత గొప్పవారైనప్పటికిని **బాహ్యదృష్టిని** అభివృద్ధి పరచుకుంటారు. గాని **అంతర్దృష్టిని** ప్రయత్న పూర్వకముగా సాధించటము లేదు. దేహసౌందర్యము, దేహపటుత్వము, దేహము శక్తిసామర్థ్యములు నీవు వూహించవచ్చును. కాని **దైవము మానసికపరిశుద్ధినే హృదయముయొక్క శాంతస్వభావమునే పరిశీలిస్తాడు. అంతర్దృష్టిని అభివృద్ధిపరచుకొని అంతర్భావములను ప్రశాంతమైనరీతిగా చూచుకోవాలి.** ఎట్టిసమయమునందు గాని వుద్రేకములకుగాని యింకేవిధమైన ఆవేశములకు గాని గురికారాదు. ఎవరైనా నిన్ను దూషించారనుకో దూషించటము వలన నీకు ఒరిగేది తరిగేది యేమీ లేదు. వారియందుండిన భావములు బయటకు రానీ. నీవే మాత్రము ఆవేశముతో వుద్రేకమును తెప్పించుకోరాదు. శాంతముగా వుండు. నీపైన అతనికి కలిగిన ద్వేషము యేమిటో అదంతా ఒక్కతూరి బయట పడిపోనీ. నీవు నిలపటానికి ప్రయత్నిస్తే అది ప్రమాదమును చేకూరుస్తుంది.

(శ్రీ స. గీ. పు.299/302)

ఒకానొక సమయంలో జనకమహారాజు ఆస్థానంలో పండితుల సభ ఏర్పాటు చేయబడినదని తెలుసుకొని అష్టావక్రుడు వచ్చాడు. అతడు సభలో ప్రవేశించగానే ఎనిమిది వంకరలతో కూడిన అతని దేహాన్ని చూసి పండితులంతా ఫక్కున నవ్వారు. కాని అష్టావక్రుడేమీ సామాన్యుడు కాదు. వెంటనే అతడు కూడా వారికంటే గట్టిగా నవ్వసాగాడు. ఆ పండితులందరికీ ఆశ్చర్యం వేసింది. "మేము నీ రూపమును చూసి నవ్వాము. దానికొక కారణముంది. మరి నీవు నవ్వటానికి కారణ మేమిటి?" అని ప్రశ్నించారు. అప్పుడు అష్టావక్రుడు దానికి చక్కని జవాబు చెప్పాడు. "నేను ఇక్కడేదో పండితుల సభ జరుగుతున్నదని భావించి వచ్చాను. కాని ఇంతమంది మూర్ఖులు ఇక్కడ సమావేశమయ్యారని అనుకోలేదు. మీ **మూర్ఖత్వాన్ని చూసి నాకు నవ్వు వచ్చింది. 'పండితాः సమదర్శినः సమత్వమైన ఆత్మతత్వాన్ని చూసేవారు పండితులు, చర్మముయొక్క మంచి చెడ్డలను చూసేవారు చర్మకారులు.** పండితుల సభకు మీలాంటి చర్మకారులను మహారాజు ఎందుకు అహ్వానించాడా అని నవ్వు వచ్చింది" అన్నాడు.

(స.సా.ఏ. 97 పు.88)

చాడీలు

తాను చేయకున్న తగవు పుట్టదుగాని
పరులు చేయ జూచి ఓర్వలేరు

చాతక పక్షి

దాతదరిని చేరి తన సొమ్ము చెడినట్లు
జిహ్వతోడ చాడీలు చెప్పుచుండ్రు.

(శ్రీ షి సా పు.33)

చాతక పక్షి

భగవంతునికి నివాసమైన శుద్ధమానసం ప్రతి భక్తునకు పవిత్రమైన పెన్నిధి. మానవుని మనస్సున పవిత్రమైన, శాశ్వతమైన, నత్యమైన తలంపులు ఆవిర్భవింప చేసుకోవాలి. ఇట్టి పవిత్రమైన భావములను ఏ మానవుడు తనయందు ఆవిర్భవింప చేసుకొనునో, అట్టి వాని జన్మయే సార్థకము. **చాతకపక్షి స్వాతి వర్షబిందువునకై అనేక కష్టములను అనుభవిస్తుంది.** కారుమేఘములు చూచినంతనే, తన దీక్షను ప్రారంభిస్తుంది. ఈ ధరణిలో కావాలసినంత జలము ఉంటున్నది. కానీ, **ఈ చాతకము ఈ మలినజలమును ఆశించదు. స్వాతి కార్తిలోని స్వాతిబిందువుకై, జలధరం నుండి కురిసిన ఈ శుద్ధమైన వర్షబిందువునే ఆశించునుగానీ నిల్చిన నీరునుగానీ, ప్రవహించే నీరునుగానీ తాను ఆశించలేదు. భయంకరమైన ఉరుములకు తాను ఏమాత్రము భయపడదు. మిరుమిట్లుగొలిపే మెరుపులకు తాను వెరువదు. అదరక-బెదరక, కదలక స్థిరమైన భావముతో మేఘబిందువులకై తాను తపస్సు చేస్తుంది. ఆ జలబిందువుకై "పీ-పీ"** అని తన ఆనందమును వ్యక్తం చేస్తుంది. **ప్రీతికి ప్రతి నిధి ఈ చాతకము. నిజమైన భక్తుడు ఇట్టి తపస్సును ఆచరించాలి. ఇట్టి దీక్షను వహించాలి.** ఆశించిన ఆనందమును అనుభవించటానికి ఈ కఠోరమైన సాధన చెయ్యాలి. లోక సంబంధమైన వాసనలకు గాని, పరువు ప్రతిష్టలకు గాని తమ పవిత్రమైన జీవితమును పాడు చేసుకోరాదు. **బంగారమువంటి మానవ జీవితమును భగవత్ నామమనే 'గీటురాయి' పైన గీటుపెట్టాలి.** ఇట్టి సులలితమైన మార్గమును అనుభవించక, అతికష్టతరమైన మార్గమునే తాను ఆచరిస్తూ తనయొక్క విలువైన జీవితమును నిరుపయోగము చేసుకొంటున్నాడు. **మానవుడు మానవుడే కాదు. మానవుడే దేవుడు.** తనయందున్న దైవత్వాన్ని క్రమ క్రమేణా విషయ వాసనలలో వ్యర్థము చేసుకొంటున్నాడు. అందుచేత తనలో ఆవిర్భవించిన దివ్యమైన భావాన్ని సాత్వికమైన మార్గములో ప్రవేశపెట్టాలి.

(స.సా.మా1991 పు.59)

బలమైనటువంటి తుఫాను చెలరేగినప్పుడు అనేక రకములైన ఉరుములతో, మెరుపులతో, భయంకరమైన పెనుగాలులతో ఏకధారగా వర్షము కురుస్తూ ఉంటుంది. ఇటువంటి కృత్యములు జరుగుతున్నప్పటికిని **చాతక పక్షి వీటిని ఏ మాత్రము లెక్క చేయక మొగమును ఆకాశమువైపు త్రిప్పి, పై నుండి పడే వర్షపు బిందువులను మాత్రమే గ్రోలాలని, తన లక్ష్యమంతా వర్షపు బిందువులపైన ఉంచును. ఆ పక్షి బోధించే దీక్షను ఆధారము చేసుకున్నప్పుడు, ఆనందము అనే దాహము నివారణ కాగలదు.**

భూమిపైన సర్వత్ర నిండిన జలమును ఆ పక్షి గ్రోలటానికి అంగీకరించదు. భూమి సంబంధము లేని సమయము నందే, ఆ బిందువును త్రాగటానికి తాను ఇష్టపడుతుంది. అదే రీతిగా, భూమికి సంబంధించిన విషయవాసనల ఆనందములను ప్రక్కకు నెట్టి **ఎన్ని కష్టములు, నష్టములు, దుఃఖములు, నిందలు, నిష్ఠూరములు వచ్చినప్పటికినీ, వాటిని లెక్కచేయక దైవముపైన సంపూర్ణ విశ్వాసము కలిగియుంటివా, ఆనందము తప్పక గ్రోలవచ్చును.**

(త్వ శ మ పు. 61/62)

చాతుర్వర్ణ్యవ్యవస్థ

ధర్మసంస్థాపనకు తగినది ఒకటి కలదు విను; దానినే చాతుర్వర్ణ వ్యవస్థ యని యందురు. **ఇది ప్రజల కర్మలనూ గుణములనూ అనుసరించి నాలుగు విధముల సృజించి యున్నాను.**

"ఈ వర్ణవ్యవస్థ సృష్టిసంచాలనమునకు అత్యావశ్యకము. దీని అంతరార్థమును ప్రజలు అంత సులభముగా గ్రహించుకొనలేరు. ఏదో ఈవర్ణములు మానవులను

అనేక విధముల బాధించి భేదములు కల్పించుచున్నవని అజ్ఞానులు తలంతురు. విషయ విచారణద్వారా పరిశోధించిన పదార్థముయొక్క యదార్థము బైటపడును. **కాని పరిశోధన సలుపక వర్ణ భేదము సరియైనదికాదని వాదించిన, విషయము తెలియని వాదన, వివేకములేని రోదన, విశ్వాసములేని వేదనగా మారును, లోకక్షేమమునకే ~~ఈ~~ వర్ణములు నేను కల్పించితిని కాని లోక క్షామమునకు కాదు. ~~ఈ~~ వర్ణమువలన మానవుడు తన కభిరుచియగు కర్మల నాచరించి పూర్ణమును పొందుచున్నాడు.** వర్ణ నిబంధనలు లేనిది మానవుడు ఒక నిమిషమూ సుఖపడడు. **మానవుని కర్మలకు వర్ణములు ప్రాణము వంటివి.**

"సాత్విక గుణము ద్వారా బ్రహ్మతత్త్వమును తెలిసికొని లోకమునందు ఆధ్యాత్మిక, నైతిక, ప్రగతిజీవనమును ప్రేరేపించి న్వన్వరూప సందర్శన భాగ్యమును కలిగించునట్టివారలను బ్రాహ్మణులనియు, రాజ నీతిని, శాసన వ్యవస్థను, దేశ క్షేమమును, ధర్మమును రక్షించెడి దృష్టితో దుష్టులను దుర్మార్గుల నుగ్గడించుచూ అసహాయ దీనులైన దుర్బలులను కాపాడుచూ అట్టివారలకు చేదోడు వాదోడుగా వుండి పరిపాలన చేయు వారలను క్షత్రియులనియూ, పాడి పంటతో న్యాయబద్ధమైన వృత్తి వ్యాపారములతో వృద్ధినొందించుచూ లోకములో సామాన్య ప్రజలకు తగిన ఆహార సదుపాయములను అందించుచు, ప్రజా దేహ పోషణకు సాధ్యమైనంత సదుపాయములను కల్పించువారలనే వైశ్యులనియు;

ప్రపంచ శ్రేయమునకు పునాదులు వేయుచు సేవాకర్మల నాశ్రయించి పైమూడు వర్ణముల వారినీ అనుసరించి వారలకు తగిన బలమును అందించువారలను శూద్రులనియూ, నాలుగు వర్ణములను నిర్మించితిని. ఇట్లు వారి వారి విహిత విధాన కర్మలను ఆచరించుచున్న లోకము కాని సమాజము కాని సర్వతోముఖ వికాసమును పొందును. ఇట్టి నిబంధనలు ఉండుటచే శ్రమ విభాగములు జరిగి వ్యక్తి సమాజ జీవితములో ఒడు దుడుకులు లేక హాయిగా వుండగలడు" అని వర్ణవ్యవస్థను వివరించెను. ఇట్టి వర్ణ విభాగములు **భగవంతుడు భారతీయులకొసగిన వర ప్రసాదము.** భారతీయులెంతటి అదృష్టవంతులో! భగవంతుని అనుగ్రహమునకు పాత్రులై ప్రతిచర్య భగవదాజ్ఞకు బద్ధమైనదై యుండుట మహా భాగ్యము. ఈ విషయమున మనము కొంత యోచించ వలసిన విషయము కలదు. ఇది ప్రధానమైన సమస్య. భగవత్ ప్రసాదమైన వర్ణవ్యవస్థకు నేడు భయంకరమైన ప్రమాదము కలుగుచున్నది. పాలకులు గూడనూ వర్ణవ్యవస్థను రూపుమాపిన కాని లోకమునకు క్షేమమేర్పడదని వర్ణవ్యవస్థ వలననే భారతదేశ మింతటి దుస్థితికి వచ్చినదని అనేకమంది వాదించుచూ బోధించుచున్నారు.

మంచిదే! సర్వులకూ లోకక్షేమమే ప్రధానము. కాని వర్ణవ్యవస్థ వలన లోకము ఇంతమాత్రమైనా నిలువ గలిగినదా, లేక వర్ణవ్యవస్థ క్షీణించుటచేత ఈ దుర్గతి పట్టినదా? అని బుద్ధిమంతులు శాంతముగా విచారణ సలిపి పరిశోధనల ప్రమాణములచే వీటిని ప్రక్కకు నెట్టిన, తప్పక అందరూ ఒప్పుకొనదగినదే. అట్లుకాక, విచారణలు సలుపక, వివేకదృష్టితో పరిశోధించక అనుమాన ప్రమాణములతో వర్ణవ్యవస్థను నిందించుట సహించలేని విషయము.

కొంతమంది పెద్దలు చెప్పినట్లు వర్ణవ్యవస్థలు సక్రమమార్గమునుతప్పి వక్ర మార్గమును పట్టినది వాస్తవమే. అంతమాత్రాన దానిని పారద్రోలుట న్యాయముకాదు. చేతులు చేయవలసిన పనులు కాళ్ళు, కాళ్ళు చేయవలసిన పనులు తల చేయుచున్నదని చేతులు, కాళ్ళు, తెగగొట్టుట మంచిదికాదు. అట్లు దారితప్పిన వాటిని క్రమముతప్పినవాటిని, ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించవలెను. కాని అసలుకే మోసము చేసిన అన్యాయమునకు గురియగును. అసలు యింత అరాజకమునకు మూలకారణము వర్ణవ్యవస్థ యేర్పడి కాదు. **వర్ణవ్యవస్థను నరియించిన మార్గమున పోషించకుండుటే కారణము.** వర్ణవ్యవస్థ భగవత్ ప్రసాదితమైనది. తగినరీతిగా గౌరవించక, సక్రమ

చాతుర్వర్ణ్యవ్యవస్థ

మార్గమున నడిపించక, ఇష్టమొచ్చినట్లు వుపయోగించు కొనుటచే ఈ విధమైన అవలక్షణములకు దారితీసినది. **ఈ చాతుర్వర్ణ వ్యవస్థ ఒక మన భారతీయులకే కాక యావత్ ప్రపంచమునకు అవసరమైనది. విదేశములలో మాత్రము ఈ పద్ధతి లేకపోలేదు.** అక్కడికీ ఇక్కడికీ ఒక్క పేరు మాత్రమే వ్యత్యాసము. అక్కడ కూడనూ శిక్షక వర్గమని,రక్షక వర్గమని, వణిగ్వర్గమని, శ్రామిక వర్గమని నాలుగు రకములు కలవు.

అయితే **మన భారతవర్ణములు జన్మతో నిర్ణయింపబడినవి. విదేశీయులకు కర్మతో నిర్ణయించబడినవి. ఇదే వాటికీ వీటికీ భేదము.** ఇప్పుడు ప్రథమస్థానము ప్రతిష్ఠించబడిన బ్రాహ్మణులయందు దారి తప్పి తుచ్ఛమార్గములకు వడిగట్టినవారు లేకపోలేదు. నాలుగవ స్థానమున శూద్రులనువారలయందు పవిత్రభావములు అభివృద్ధి అయి. చిత్తశుద్ధి కొరకు పాటుపడువారు లేకపోలేదు. ఇంతమాత్రమునకే వర్ణము పనికిరాదనుట ఒప్పుకోదగినది కాదు.

(గీ పు.69/72)

ఇదే వర్ణవ్యవస్థను మరి కొంతమంది వేరొక రకమున ప్రచారము నల్పుదురు. ఏదెట్లున్ననూ ఒక దేహమందుండిన అంగములవలె ఈ నాలుగు వర్ణములూ నాలుగు అంగములుగా నిలచినవి. భగవంతుడను దేహమునందే ఉద్భవించిన అంగములే ఈ వర్ణములు. ముఖము నుండి బ్రాహ్మణులనియూ, భుజముల నుండి క్షత్రియులనియూ, తొడల నుండి వైశ్యులనియు, పాదముల నుండి శూద్రులనియు చెప్పబడుచున్నది. అయితే దీనికి సూక్ష్మార్థము వేరు కలదు. **గురుపులవలె జ్ఞానమును ఉపదేశించుటకు వాక్కువంటివాడు బ్రాహ్మణుడనియు భూభారము వహించువాడు బాహుబలుడగు క్షత్రియుడనియు, శరీరమును నిలబెట్టు తొడలవలె సంఘ సౌధమును నిలబెట్టుసమర్థుడు వైశ్యుడనియు, తిరిగి పనీ పాటు చేయుటకు పాదము లుపయోగమగునట్టితరి కృత్యములు చక్కబెట్టువాడు, శూద్రుడనియు భావము. శరీరమునకు యే అవయవములు లోటు వచ్చిననూ దాని కది కొఱతయే యగునట్లు సంఘమున కే కార్యములు చేయువారిలో నెవరు లోటయిననూ లోపము వచ్చి క్షేమము చెడును. శరీరావయవములు అన్నియూ ఉత్తమములయినట్లు వర్ణములన్నియూ శ్రేష్ఠములయినవే.** కాలుచేతులు కడుపుపై కోపించి పనిమానుటవంటిదే వర్ణ వైషమ్యము. ఒక చక్కెర బొమ్మ నుండి వచ్చిన పదార్థములే కదా! తల గిల్లుకొని నోటిలో వేసుకొన్ననూ తీపే, కాలు గిల్లుకొని నోటిలో వేసుకొన్ననూ తీపే. అన్నీ ఒక పరమాత్మ దేహము నుండే వచ్చిన ఈ వర్ణములను అంగములు వేరువేరుట్లగును! కర్మలు వేరు వేరు కాని రక్తనాళములూ సుఖదుఃఖములూ, అందఱికి ఒక్కటే. దేహమంతా సమాన రక్తమే ప్రవహించును కానీ చేతులకొక రక్తము, పాదముల కొక రక్తమూ, ముఖమునకు మరొక రక్తమూ ప్రవహించదుకదా! ఇది వేదవిహితమైన సమానధర్మము కానీ కల్పితమైన మానవ నియమములు కావు. కనుక వర్ణవ్యవస్థను అర్థము చేసుకొనక, వాటివలన లోకమునకు అనేక భేదభావములు కలుగుచూ ద్వేషములకు గురి యగుచున్నట్లు తలంచుట అజ్ఞానము తప్ప వేరుకాదు. వర్ణవ్యవస్థను నిర్మూలము చేసిన లోకక్షేమము కలుగునని వాదించు వారు మాత్రమే లోకక్షేమమును కోరుచున్నారని వారు భావింతురు కాబోలు; వర్ణవ్యవస్థ మంచిదని వాదించువారు లోకమునకు హాని కోరువారని వారి ఉద్దేశ్యమై యుండవచ్చును; ఇవి రెండనూ భ్రమలే. వర్ణవ్యవస్థను వ్యతిరేకించువారికంటే వర్ణవ్యవస్థను కాపాడవలెనను వారలలోనే లోకక్షేమము నిండుగా దండిగా నుండును. అది వారు తెలసికొనలేకున్నారు. ఏదో వర్ణవ్యవస్థను నిర్మూలము చేసిన మేము దేశాన్ని కాపాడినవార మగుదమని భ్రాంతిపడుచున్నారు. అది అమాయకపు తృప్తి. వర్ణవ్యవస్థను వ్యతిరేకించువారు కానీ, పోషించవలెనను వాంఛకలవారు కానీ, చక్కగా విచారణ సల్పి మంచి చెడ్డలు స్పష్టముగా దెల్పి తదుపరి

పరిపాలించుటో పాడుచేయుటో చూచు కొనవచ్చును. కాని, వూరికే విషయము తెలియని వాదనలలో విపరీతార్థములు చెలరేగించిన వింతమార్పు కలుగును. ద్వేషము పెరుగును. అది యెవరికీ క్షేమము కాదు. యెండమావుల జలమును భ్రాంతిచేత తరుముకొని పోయినట్లు సర్వం సమానమను భ్రాంతితో సర్వులకూ అశాంతిని కలిగించుచున్నారు. ప్రజా ప్రతినిధులయిన పండితులునూ, అనుభవజ్ఞులయిన పెద్దలను చేరి పరిపాలకులు పరిశోధనలు సలుపుట చాలా మంచిది. కానీ వీటి విషయమే తెలిసికొనక బాహ్యకర్మలనే ప్రధానముగా పట్టుకొని ఇందులో యేదో విషయమున్నదని అదిరిపడుట అవివేక లక్షణము. **పరిపాలకులకు, పండితులకు ప్రజాక్షేమమే ప్రధానము. అసలు ఈ వర్ణములు అందరి క్షేమమునకే అవతరించినవి.** దీనిని వినియోగించు విధానములు అనుభవజ్ఞులద్వారా యోచించక, ఆచరించక ఇన్ని అపోహలకు దారి తీసినవి. ఒక చిన్న ఉదాహరణము యోచించుడు. ఇపుడు పరదేశీయులు లక్షల మందిని చంపే బాంబులు తయారుచేసినారు. అవి చెడ్డవనే తెలుసు. వాటికి ప్రభుత్వమే అనేక విధముల తోడ్పడుచున్ననూ చేసిన శాస్త్రజ్ఞుడు తెలివి తేటలు గల వాడైననూ వినియోగించే విషయమున, తిరిగి ప్రభుత్వపు అనుమతి అవసరము కదా! చెడ్డవాటికి ప్రభుత్వము సర్వసహాయము చేసిననూ అది అవసరమును బట్టి వినియోగించవలెనేకాని చేసితిమి కదా యని యిష్టమొచ్చినట్లు ఉపయోగించిన అందరికి ప్రమాదమే! లోకమున అరాజకము సంభవించినపుడు ఆత్మరక్షణకొరకు వారివారి దేశరక్షణ కొరకు వాటిని ఉపయోగింతురేకాని లోకమునే నాశనము చేయవలెనను దృష్టి కాదుకదా!

అట్లే వర్ణములను తీక్షణమైన రక్షణలను, వారివారి కర్తవ్యములను కొనసాగించి దేశమును రక్షించునట్టి ఆయుధములనే భావించవలెను. వాటిని యే యే విధముగా క్రమము తప్పక వినియోగింతువో భద్రపరతుమో అట్లే వాటిని ఆచరించి భద్రపరచవలెను. కానీ వాటిని హద్దూ పద్దూలేక ఇష్టమొచ్చినట్లు ఉపయోగించుటచే ఇంతటి అరాజకమునకు గురి అయినవి. కనుక పూర్వపురుషులు, మహారాజులు, ఉత్తమ పండితులు, అనుభవజ్ఞులయిన మహానుభావులు, వీటి నెంతటి పవిత్రముగావాడి, తరించి ఇంతకాలము కాపాడుకొని వచ్చిరో ఒకపరి యోచించిన అవి మంచివా చెడ్డవా బుద్ధిమంతులకు గోచరము కాగలదు. అవి లోకమునకు అపకారమే చేయునవయినా వారల కేమీ తెలివి లేకనా, లేక ఇప్పటి కాలపు చదవు సంధ్యలు లేకనా, అసలు అమాయకులా? కాదు కాదు. వారి తెలివితేటలు, వారి బుద్ధికుశలతలు వారి ఆత్మ విద్యలూ, వారల పరిశోధనాబలములూ, ఇప్పటివారలలో వెతకిననూ కొటికొక్కరిలో చిక్కవు. వారు కందమూలాదులు భక్షించి, కాయకష్టములు సలిపి, లోకక్షేమమును ప్రాణముగా భావించి, తమ తమ సర్వశక్తులనూ ధారబోసిన మహాత్యాగులు, యోగులు, యోధులు. నిజమున దేశక్షేమమునుకోరి, ఆశించి అన్ని విధములా ధీకొట్టిన మహోఋషులు, ఇప్పటి వారలవలె మాటలతో క్షేమమును కోరుచూ చేతలతో అంతా నాశనమే చేయుట పూర్వీకులకు తెలియని విద్య. ఇట్టివే నేటి నూతన భావములు, నవీన ప్లానులు; వీరి ప్లానులు గాలి మేడలు. వారివి వారికే తెలియునుతప్ప అన్యులకు అర్థము కాదు. ఒక వైపు కట్టుచూ వచ్చుచుండిన మరొక వైపున కూలుచూ వచ్చుచుండును: వూహామేడలు.

జీవునకు దేహమెట్లు ప్రధానమో దేవునకు దేశమట్లు ప్రధానము. దేహమునందలి యే భాగమున యేమి జరిగిననూ జీవునకెట్లు సంబంధమో దేశమున యే భాగమున యేమి ప్రమాదము జరిగిననూ, దేవునకట్లే సంబంధించి యుండును. దేహములోని సర్వాంగములూ యెట్లు క్షేమముగా నుండకోరుదుమో, దేశములో సర్వ ప్రాంతములూ అంత క్షేమముగా నుండవలెననే దేవుని భావము. దేశమంతా దేవుని దేహమయినపుడు, తన

చారిత్రము

అంగముల నాశమును దైవము కోరుకొనుననుట వివేకమా? దైవవిషయమున సర్వులూ సమానులే. దైవమును పొందే విధానమునకు సర్వులకు అధికారమున్నది. కాని యే యే కర్మలు చేసి తమ తమ కర్తవ్యములను జరుపవలెనో ఆయా అవయవములు అట్లుచేయవలెను. అట్లే ఆయా వర్ణములవారు తమ తమ హద్దులను దాటక తమ తమ కర్తవ్యములను సలిపి దేశ క్షేమమునకు పాటుపడవలెను. దేహమునకెట్లు అవస్థాభేదములున్నవో అట్లే దేశమునకు వర్ణములు, అవస్థాభేదములు. అట్లుకాక వ్యాపారము చేయువారే అందరూ వుండిన కొనువారవరు? అందరూ యుద్ధము చేయువారే వుండిన వారికి తగిన తిండి, తీర్థములు, సరఫరా చేయువారెవరు? అందుకనే ఒకరు ఒక వర్గమను వర్ణమును నియమించుకొని, వారి వారి పనులు వారు చేయుచూ, తమ తమ కర్మలన్నియూ దేశ రక్షణ నిమిత్తమని భావించుట చాలా ఉత్తమ మార్గము. చేయవలసిన వెన్నియో ఉండగా అనవసరంగా వర్ణములను అడ్డుపెట్టుకొని మనలో మనము యుద్ధము చేయుచున్నాము. మన మన దేహములనే హద్దులో పెట్టుకొనలేని వారలము, ఇక దేశము నేమి హద్దులో వుంచగలము? వర్ణకలహములు మాని దేశ క్షేమమును యోచించుట మంచిది. ఇంత కాలమూ మన పూర్వీకులు యెట్లు కాపాడుకుంటూ వచ్చారో అటులనే నేడునూ మన వర్ణములను కాపాడుకొనుట దేశమునకే పరమ శ్రేయస్సు.

ఈ వర్ణవ్యవస్థలో పరమాత్ముడు యెట్టి పక్షపాతమూ చేయలేదు. అతనిలో అట్టి గుణమేలేదు భగవంతునికి కూడా ఈ భేదమెందుకని కొందరు తలంతురు. అతనిలో భేదము యేకొననులేదు. చక్కెర ముద్దవంటి చల్లనివాడు, తియ్యనివాడు దేవుడు. సర్వభేధములూ, బాధలూ, అనాత్మ భావముగల జీవుల కల్పనలేకానీ దేవుని కల్పనలు కావు. ఉదాహరణమున కొకవిషయము యోచింతము: ఒక తల్లికి నలుగురు పిల్లలు గలరు. నలుగురూ ఒకే తల్లి గర్భము నుండి జన్మించినవారే! కాని,తొట్టిలో పరుండబెట్టిన బిడ్డ యోగక్షేమములు చూచినట్లు మిగిలిన పిల్లలను ఆ తల్లి చూడదు. అంతేకాక పిల్ల పిలువక పోయిననూ కాలకాలములకూ తగిన ఆహార సదుపాయములు తల్లియే గమనించుచుండును. మిగిలిన ముగ్గురు బిడ్డలు వచ్చి అడిగిననే అన్నము పెట్టును. ఆటబొమ్మలిచ్చును. అంతమాత్రముచేతనే తల్లి భేదబుద్ధిగలదనికాని, తన ప్రేమంతా కడగొట్టుబిడ్డపై నున్నదనికాని చెప్ప వీలులేదుకదా! బిడ్డలయొక్క శక్తి సామర్థ్యమునూ, పరిస్థితులనూ పట్టి తల్లి యెట్లు మెలుగునో అటులనే లోకమంతా తనవారైనప్పటికినీ అందరూ తన సంతతే అయినప్పటికినీ ఒక్కొక్కరి శక్తి సామర్థ్యములను పట్టి ఒక్కొక్క రక్షణ బాధ్యతను దేవుడు నియమించినాడు. అట్టి నిస్స్వార్థమైన, నిర్దోషియైన నిరాడంబరుడైన నిత్యానందునిపై నిందలు మోపుట సూర్యునిలో చీకటిని వెతుకుటవంటిది. తన కిరణములు పడిన వెంటనే చీకటి పటాపంచలయైపోవును. అట్టిది ఇక తనలో చీకటి నిలుచుటకు వీలగునా! ఇది యెంత అజ్ఞానము! ఇట్టివారలను సూర్యుని విషయమే తెలియని వారనవచ్చును.

అసలు ఆధ్యాత్మిక దృష్టిలో ఈ వర్ణములను మరొక రీతిగా భావించ వలసియుండును.

(గీ పు.74/79)

చారిత్రము

(చూ॥ చదువు)

చావు

(చూ॥ భీష్ముడు)

చింత

ఈనాటి మానవుడు అనేక చింతలతో జీవిస్తున్నాడు. అయితే, ఇవన్నీ తనకు తాను కల్పించుకున్నవే.

పుట్టుట ఒక చింత, భూమినుండుట చింత
సంసార మొక చింత, చావు చింత
బాల్యమంతయు చింత, వార్ధక్య మొక చింత
జీవించు టొక చింత, చెడుపు చింత
కర్మలన్నియు చింత, కష్టంబు లొక చింత
సంతస మొక చింత, వింత చింత

ఈ పన్నెండు చింతల 'చింత చెట్టు' క్రింద కూర్చొని, సంతోషం కావాలంటే ఎట్లా లభిస్తుంది మీకు? ఈ చింతలన్నీ మీరు కల్పించుకున్నవేగాని, భగవంతుడిచ్చినవి కావు. **ఇవన్నీ మీ భ్రమయే సృష్టిస్తున్నది. భ్రమను దూరం చేసుకున్నప్పుడే బ్రహ్మ చిక్కుతాడు. ఎక్కడో కాదు, మీయందే సాక్షాత్కరిస్తాడు.** నిప్పును అలక్ష్యం చేస్తే దానిని నివురు కప్పివేస్తుంది. నివురును తొలగిస్తే నిప్పు కనిపిస్తుంది. అట్లే, మీలో ఉన్న దివ్యత్వాన్ని గుర్తించుకోవాలంటే, దేహాభిమానమనే 'నివురు'ను దూరం చేసుకోవాలి. శంకరులవారు చెప్పారు. "భజ గోవిందం" అని. అదే మీరు చేయవలసినది.

(స.సా. మా 99, పు. 78)

నీ దృష్టి ప్రేమ మయము కానప్పుడు ఈ ప్రపంచమంతయు చింతలమయంగా మారిపోతుంది. ప్రపంచములో ఎన్నిరకములైన చింతలుంటున్నాయి?

"పుట్టుట ఒక చింత, భూమి నుండుట చింత,
సంసారమొకచింత, వార్ధక్యమొక చింత,
జీవించుటొకచింత, చెలిమి చింత,
కర్మలన్నియు చింత, కష్టంబులొక చింత,
సంతసమొకచింత, వింతచింత"

కనుక **సర్వచింతలను తొలగించెడి సర్వేశ్వరునిపై మీరు భక్తిని పెంచుకొని అతని యొక్క ప్రేమను ఇకనైనా అందుకోండి.**

(స.సా. మే 1992 పు. 95)

ఇన్ని చింతలతో కూడిన మానవునికి చింతలు లేకుండా పోవాలంటే ఎలా సాధ్యమౌతుంది. ఈ చింతలన్నీ మనస్సు నుండి ఆవిర్భవించినవే. అటువంటి మనస్సును మీరు బానిసగా చేసుకోగల్గితే ఇక ఈ చింతలకు అవకాశమే ఉండదు. **మనస్సే స్వాధీనమైతే ఇతరమైన మంత్రాలు, తంత్రాలు మనకు అక్కరలేర్లేదని త్యాగరాజు కూడా చెప్పాడు.**

'సర్వచింతలు బాపెడి సాయిప్రేము
గొనుడు ఇకనైన ప్రజలార ప్రేమతోడ"

సర్వచింతలూ దీనివల్లనే పరిహారమౌతాయి. కనుక, మీరు సాయి ప్రేమను పొందడానికి కృషిచేయండి. దైవ ప్రేమచేత మీరు దేనినైనా సాధించవచ్చు.

(ది. ఉ. 23-11-2001 పు.7)

దోషచింతనమున దోషి యౌచిత్తము
సద్గుణములచింత శాంతి యొసగు
దైవ చింతనమున దైవమేయగున యా
ఉన్నమాట తెలుపుచున్న మాట

(శ్రీ స. గీ. పు. 9)

(చూ॥ ఓర్పు, విశ్వాసము)

చింతన

(చూ॥ కృష్ణుడు, రాధ, స్మరణ)

చింతామణి

చక్కగా విచారించగా, **కల్పవృక్షమనునది ఒక వృక్షమని కానీ, కామధేనువనునది ఒక గోవుకానీ, చింతామణి అనునది ఒక మణి కాని కాదు. ఇవి తపస్సు యొక్క ప్రభావములు. యోగి నిర్వికల్ప స్థితిని పొందినపుడు కామములను సకల సిద్ధులు నొసగును. దానిని కల్పవృక్ష రూపసిద్ధి అనియు, ఎప్పుడు జితకాముడగునో అప్పుడు కామధేనుసిద్ధి అనియూ, పిలువబడుచున్నవి. బహు దుఃఖముల దూరము చేయునట్టి నిశ్చింతభావమే, చింతామణి యనబడును. ఎప్పుడు చింతలుడిగి పరమానందము కలుగుచున్నదో, అప్పుడే చింతామణి సిద్ధించును.** ఇవి మనో వాక్కాయములను మూడు విధములుగా వున్నవి.

(శ్రీ.స.సూ. పు. 243/244)

చిత-చింత

శరీరమనగా జీర్ణించునది. ఈ శరీరమునకు **'చిత'** అని పేరు పెట్టారు. **చిత అనగా అగ్ని. అగ్ని మరణించినవారిని దహిస్తుంది. చింత ఇది జీవించినవానినే దహించి వేస్తుంది. చితకు, చింతకు ఉన్న వ్యత్యాసమిదియే.**

(ద. య. స. పు. 2)

చిత్త చోరుడు

(చూ॥ కృష్ణుడు)

చిత్తము

"అనన్య చిత్తముతో నిత్యయుక్తుడై. సతతము నన్ను యెవరు స్మరింతురో అట్టివారి ప్రాణము ఊర్ధ్వద్వారము నుండి వదలనీ, మరే ద్వారమునుండి వదలనీ, వాడు నన్ను తప్పక పొందుచున్నాడు. అట్టి వానికి నాలో స్థానమున్నది. వాడు నాకెంత సమీపమో నేనునూ అతనికంత సమీపమే. నన్ను మరువని వానిని నేను మాత్రము మరతునా? బావా! అసలు, మరపు మానవత్వమునకే కానీ దైవమునకు లేదు.

"యోగము వద్దు, తపస్సు వద్దు, జ్ఞానము వద్దు. ఇన్ని చేయుశక్తి లేకపోయిననూ సరే, శక్తి యుండియూ చేయకపోయిననూ సరే, నేను యోగమును తపస్సునూ కోరుటలేదు. **కేవలము చిత్తము నాపై పెట్టమనియు, చిత్తము నాకర్పితము చేయుమని మాత్రమే అడుగుదును.**

(గీ. వా. పు. 149)

(చూ॥ అంతరాత్మ, సంకల్పములు)

చిత్తశుద్ధి

చిత్త శుద్ధికి కావలసినది ఒక్కటే
See no evil see what is good
Hear no evil hear what is good
Think no evil think what is good
Talk no evil talk what is good
Do no evil do what is good.

ఇవీ పంచభూతములు పంచేంద్రియముల ప్రసాదములు. ఈ ప్రసాదమును అభివృద్ధి పరచుకుంటె చిత్తశుద్ధి కలుగుతుంది. జ్ఞానశుద్ధి కూడా కలుగుతుంది. దివ్యమైన ఆనందము అనుభవించగలము.

(బృ.త్ర.పు. ౯౦/౯౧)

(చూ॥ తత్తు సమన్వయాత్, మంచిమాట, సత్యవిద్య)

చిత్రము

(చూ॥ చదువు)

చిత్తాపహారి

త్యాగం లోనే క్షేమం ఉంటున్నది. పర్వదినములన్నీ త్యాగము నిమిత్తమై ఏర్పడినవేకాని, భోగము నిమిత్తమై కాదు. భోగమునకు రోగమే స్నేహితుడు, త్యాగమునకు యోగమే స్నేహితుడు.

"భగవంతుడు నీ భక్తిని చూస్తాడు కాని, నీ శక్తిని చూడడు; నీ చిత్తమును చూస్తాడు కాని, నీ విత్తమును చూడడు; నీ గుణమును చూస్తాడుకాని, నీకులమును చూడడు; నీ మతిని చూస్తాడు కాని,నీ మతమును చూడడు".

భగవంతుడు చిత్తాపహారి కాని, విత్తాపహారి కాదు. కాని, ఈనాడు భగవంతుని విత్తము చేత తృప్తి పర్చటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇదియే- భక్తుని అజ్ఞానము! కొన్ని రకములైన forceతో భగవంతుని **అనుగ్రహమునకు పాటుపడుతున్నారు. కాని, భగవంతుడు** force**కు ఏనాడూ చిక్కడు, source కే చిక్కుతాడు.** లోకంలో అనేక సత్కర్మలు జరుగుతూ ఉంటాయి. ఈ సత్కర్మలలో పాల్గొని సరియైన సహాయం సల్పి తద్వారా సంతృప్తిని అనుభవించడమే జీవితములో **సాధనగా భావించుకోవాలి.**

(స.సా.ఏ. 94 పు.97)

చిన్మయమూర్తి

కన్నీరు తప్పించు, కన్నీరు తెప్పించు
చిన్మయ మూర్తి । ఓ చిన్నరామ

యోగి భోగిగజేయు - భోగి తాజోగిన।
భాగవతాలీన బాలరామ॥

(సా॥ పు. 601)

చిన్ముద్ర

వేదాంతరహస్య మంతయు నీ చేతిలోనే యున్నది. ఎట్లందువా? నీ చేతి బొటనవేల (అంగుష్ఠము) పరమాత్మ. చూపుడువేలు (తర్జని) జీవాత్మ. తక్కిన మూడు వ్రేళ్ళను (మధ్యమము, అనామిక, కనిష్ఠిక) సత్వరజస్తమో గుణములు. అంగుష్ఠము - తక్కిన వ్రేళ్ళతో చేరక, యెడముగా నుండును. అట్లే, పరమాత్మయు, ప్రపంచముతో చేరక యెడముగా నుండును.

తర్జని - తక్కిన మూడువ్రేళ్ళతోను చేరియుండును. అట్లే జీవాత్మయు, త్రిగుణాత్మక ప్రపంచముతో చేరియుండును.

మధ్యమాదులు మూడును - కలిసియే పని చేయు చుండును. అట్లే త్రిగుణములును కలసియే పనిచేయుచుండును.

నీ కుడిచేతిని, నీ వక్షముముందు నిలువుగా పెట్టి చూడు. బొటనవ్రేలు నీ హృదయమును చూపుచుండును. నీవు పరమాత్మాంశవనుటకు అది సూచన.

తర్జనిని అంగుష్ఠముతో చేర్చితివేని, అప్పుడు దానికి తక్కిన మూడువ్రేళ్ళతో సంబంధము వదలిపోవును. అది, జీవుడు, ప్రపంచ సంబంధము వదలి, పరమాత్మతో చేరుటను తెలుపును. అది సామీప్యము అను దశను తెలుపును.

తర్జని యంగుష్ఠముతో చేరినపుడు అది **చిన్ముద్రయగును. ఆ ముద్ర పరిపూర్ణ జ్ఞానమునకు చిహ్నము.**

మీరు మీ శ్రద్ధను, మీ సర్వ ప్రయత్నములను, మీలో నున్న యాత్మమీదనే కేంద్రీకరింపుడు. అట్టి యుత్సాహము మీకు కలుగునట్లనే నాశీర్వదించుచున్నాను. ఆ విధముగా మిమ్ము సంస్కరించుటకొరకే ప్రశాంతి **విద్వన్మహాసభ** స్థాపింపబడినది.

(శ్రీస.వ. 1995 పు. 235/236)

బొటనవేలు పరమాత్మకూ, చూపుడువేలు జీవాత్మకు సంకేతాలు. ఈ రెండు వేళ్ళ కలయికను "చిన్ముద్ర" అంటారు. అది జీవాత్మ పరమాత్మల ఏకత్వమును సూచిస్తుంది.

(శ్రీ స. ది పు.47)

చిహ్నములు

"అద్వేష్టా సర్వభూతానాం" అని శ్రీకృష్ణపరమాత్మ గీతయందు బోధించినాడు. కావున ప్రతివానిని తోటియాత్రికునిగా ప్రేమించుట నీ కర్తవ్యము. ఒకే మతమున్నది ప్రేమమతము; ఒకే కులమన్నది మానవకులము; ఒకే భాష ఉన్నది, హృదయభాష; ఒకే పరమాత్మ, అతడు సర్వ వ్యాపకుడు. ఈ ఏకత్వములోని సత్యమును సూచించు చిహ్నము ధర్మక్షేత్రములోని స్థూపము.

(స.సా.జూ. 75 పు. 108)

చీపురు

(చూ॥ యాంతేమతిస్సాగతిః)

చూతమురారే

(చూ॥ దివ్య ప్రకటనలు)

చెడు

ఒకటి చెడు అటంచు । ఒకటి మంచి అటంచు ।
సృష్టియందు నిర్ణయింపదగునే ।
ఇదియు, అదియు ఒక్క ఈశ్వరుడే చేసె ।
ఉన్నమాట తెలుపు చున్న మాట॥

(సా. పు. 192)

(చూ॥ హీనుడు)

చెడ్డది

(చూ॥ సృష్టి)

చెఱకు

ప్రేమతత్వాన్ని అనుభవించే నిమిత్తమై మనం అనేక శ్రమలకు ఓర్చుకోవలసి వస్తుంది.

"పిలిచి అడుగ చెఱకు పెట్టునా బెల్లంబు?
పిప్పి గొట్టి రసము పీల్చుకున్న"

చెఱకును బాధపెట్టడం ఎందుకని ఊరు కుంటే దానిలోని రసము దక్కుతుందా? మన దేహము కూడా మధురమైన ప్రేమతో కూడిన "చెఱకు" వంటిది. ఈ శరీరమునకు అనేక విధములైన బాధలు కలిగినప్పుడే ఆదివ్యమైన ప్రేమ మన నుండి ఆవిర్భవిస్తుంది. శరీరమునకు బాధలు కలుగక మనస్సుకు నొప్పి కలుగక, భావములకు విరుద్ధముగాక దివ్యమైన తత్వము మనకు లభించాలంటే ఎలా లభిస్తుంది. "కాలు కదపకూడదు, గడపదాటకూడదు, నయాపైస ఖర్చుకాకూడదు, కైవల్యం ఒళ్ళో ఉట్టిపడాలి" ఇది ఈనాటి మానవుని భ్రాంతి. భగవంతుని ప్రేమ ఇంతసులభంగా లభించేది కాదు. ఈ ప్రేమ అనే మహావిలువలైన రత్నం త్యాగమనే బజారునందు మాత్రమే లభ్యమౌతుంది.

(స.సా.జ.94.పు.3)

చెరకుగడ తాను నరకబడ్డం, ముక్కలుగా చేయబడ్డం రసంగా పిండబడడం సహించాలి. ఈ కష్టాలే లేకపోతే ఆగెడ ఎండిపోయి ఊరుకుంటుంది. జిహ్వకు తీపి చేకూర్చలేదు. అట్లాగే మానవుడు యిబ్బందుల్ని ఆహ్వానించాలి. అది మాత్రమే అతని ఆత్మకు ఆనందాన్ని సమకూరుస్తుంది.

(సా.అ. పు. 86)

చెవులు

(చూ॥ నరజన్మ)

చేప-చీమ

ప్రతి ఒక్కడు "దేవుడు - దేవుడు"అనే పదములను మాత్రమే ఉచ్చరిస్తున్నాడే గాని, "దేవుడు" అన్న ఆపదమును తెలుసు కోవటానికి తగిన కృషి చేస్తున్నాడా! మంచి తనమునకు మారుపేరే దేవుడు. ఆ మంచితనము మనలో ఎంత ఉంది? అది లేనప్పుడు ఈ దైవత్వం ఎట్లా అర్థమవుతుంది?ప్రతీదానికి ఒక స్వానుభవం కావాలి. లోతుగా ప్రవహించే గంగాజలంలో చిన్నచేప పైన తేలుతూ ఆనందముగా ఆడుకుంటూ ఉంటుంది. **ఆ ఈత తెలిసిన చేపకు లోతు సంగతి అక్కరలేదు. కానీ పెద్దశరీరమైన ఏనుగైనా గంగలో మునిగినప్పుడు కొట్టుకొనిపోతుంది.** ఆ జలప్రవాహము నుండి రక్షింపబడే శక్తి సామర్థ్యములను గుర్తించాలి. **మట్టిలో చక్కెర కలిసినప్పుడు చిన్న చీమ ఆ చక్కెరను తాను వేరుగా విభజిస్తుంది. చక్కెర రుచి ఈ చీమకు తెలిసినది కనుకనే, ఆ చక్కెరను ఇసుక నుండి వేరుచేస్తుంది.** కాని, ఆ చక్కెర మాధుర్యమును, రుచిని తెలియని ఎంత పెద్దప్రాణి అయినా ఆ చక్కెరను వేరుచేయుటం సాధ్యముకాదు. ఆవిధముగనే దైవ ప్రేమను, దైవానందమును, సచ్చిదానందమును చక్కగా అనుభవించిన వాడు, ఈ అనవనరమయిన, లౌకికమయిన మార్గములో పోగలడా? అది తెలియనివాడే ఈ లౌకికములోపల ప్రవేశిస్తాడు. అది తన యందే వుంటున్నది. అన్ని పవిత్రమైన, **దివ్య మయిన భావములు తన నుండియే ఆవిర్భవిస్తాయి.**

(స.సా.మా. 1991 పు.59/60)

చైతన్యము

లోక సంబంధమైన విషయాలకు, కర్త కర్మ క్రియ యీ మూడు వుంటాయి. కానీ ఆత్మ సంబంధమైన విషయమునకు **ఆధ్యాత్మిక సంబంధమైన విషయమునందు కర్త తప్ప, క్రియ, కర్మ ఉండవు. చేసేవాడు తానే, చేయించేవాడు తానే, చేయింపబడినదీ తానే. ఈ మూడింటి ఏకత్వముతో కూడిన ఆత్మతత్వమే సర్వత్రా నిండిన చైతన్యము.** ఒక దగ్గరవుండి మరొక దగ్గర లేకుండా వుండటానికి వీలులేదు. ఈ చైతన్యమునే మూడు భాగములుగా విభజించి సామాన్య లోకానికి

చైతన్య స్వరూపుడు

(చూ॥ దివ్య ప్రకటనలు)

సంతృప్తిపడె నిమిత్తమై సత్‌చిత్ ఆనందము అని పేరు పెట్టినారు. దాని ప్రతిబింబము యిది దీని ప్రతిబింబము అది అని వేదాంతులు చూపుతూ వచ్చారు. దీనినే వేదాంతమునంది **అస్తి భాతి ప్రియం అన్నారు. ఈ మూడు కూడా ఒక్కటే.** ఈ టంబ్లరు యిక్కడ వున్నది. ఇది అస్తి, సత్. ఇంక చిత్ అది మనము చూస్తున్నాము. చూడటమే కాకుండా యిది టంబ్లరని తెలుసుకున్నాము. ఇదే చిత్. ఇంక ఆనందము దీనిని మనము అనుభవిస్తున్నాము. ఇదే ఆనందము. సత్‌చిత్ ఆనందము మూడైందా యిది? లేదే? ఒక్కటే. ఉన్నది ఒక్కటే, ప్రకాశించేదీ ఒక్కటే, ఆనందింపచేయునది ఒక్కటే, ఒక దాని యందు అనేక భ్రాంతులచేత అనేకత్వముగా అనుభవించి అనేక రూపనామములు కల్పిస్తున్నాము. కనుక **ఆత్మతత్వము అనగా ఏకత్వముతో కూడిన దివ్యత్వమనే సత్యాన్ని గుర్తించాలి. ఆత్మ అనగా రూపములేనిది. అనేక రూపములు ధరించేది.**

(బృ.త్ర. పు. ౧౨౮)

చైతన్య తత్వము తత్వాన్ని అర్థము చేసుకోవటం చాలకష్టము. ఈ చైతన్యమును Consciousness అన్నారు. ఈ Consciousness ను గుర్తించటానికి, అర్థము చేసుకోవటానికి దాని భాగమైన Conscienceను తయారు చేసుకున్నాము. దీనినే witness అని, awareness అని, సాక్ష్యము అని, చెప్పారు. ఈ సాక్ష్యమునకు ఏదైనా ఆధారము కావాలి కదా? దానివల్లనే ఈ conscience నుండి conscious వచ్చేసింది. **Consciousness, conscience, conscious ఈ మూడింటి తత్వము మూడు గుణములుగా మారిపోయినది. conscious అనేది senses తో కూడినది. conscience అనేది మనసుతో కూడినది. Consciousness అనేది ఆత్మతో చేరినది. ఈ మూడింటి తత్వములనే లోకాచార నిమిత్తమై ఈ రకముగా విభజించినాము.**

(బృ.త్ర. పు. ౧౨౮)

(చూ॥ ఆనందము, ప్రకృతి)

ఛందస్సు

(చూ ॥ వేదం)

ఛాందోగ్యోపనిషత్తు

ఈ ఉపనిషత్తు సామవేదాన్తర్భాగమైనది. ఇందు ఎనిమిది అధ్యాయములున్నవి. మొదటివైన అయిదు అధ్యాయములు వివిధోపాసనములకును, కడపటి మూడధ్యాయములు జ్ఞానోపదేశమునకును వినియోగమైనవి. **ఉపాసనకు చిత్తశుద్ధియూ బ్రహ్మజ్ఞానమునకు చింతైకాగ్ర్యము నియతములగు పూర్వాంగములు. కర్మచే చిత్తశుద్ధియు ఉపాసనచే చిత్తైకాగ్ర్యము లభించును.** ఇట్లు కర్మోపాసనలు బ్రహ్మ జ్ఞానమునకు కారణము లగుచున్నవి. కనుకనే **ముందు కర్మలు, తరువాత ఉపాసనలు పిమ్మట జ్ఞానము ఒకదాని తరువాత ఒకటి, శాస్త్రములందు వివరింపబడినవి.** ఛాందోగ్యము ప్రథమాధ్యాయమున సామమున కవయవ మగు ఉపాసనలు చెప్పబడినవి. ద్వితీయాధ్యాయమున **సమస్త సామము యొక్క ఉపాసనము వివరించబడినది.** తృతీయాధ్యాయమున **మధువిద్య అని ప్రసిద్ధిగాంచిన సూర్యోపాసనలు, గాయత్రి ఉపాసనము, శాండిల్య విద్యయు ప్రస్తావించబడినవి.** చతుర్థాధ్యాయమందు సంవర్గవిద్యయు **షోడశకళాబ్రహ్మ విద్యయు** ఉపదేశించబడినవి. **పంచమాధ్యాయమున ప్రాణ విద్యా, పంచాగ్ని విద్యా, వైశ్వానర విద్యలు తెలుపబడినవి.**

(ఉ. వా. పుట. 57)

జంట

(చూ॥ ఆపద్బాంధవుడు)

జంతులక్షణం/జంతులక్షణాలు

(చూ॥ బలి, యజ్ఞము, యోగం)

జగడము

(చూ॥ మతము)

జగత్పతి

కృష్ణుడు గోపికల యింటికి వేళ్ళేవాడు. వారు పనులు చేసుకుంటూ తలుపులు వేసుకునేవారు. తలుపులకు చిన్న చిన్న రంధ్రములు పెట్టుకునేవారు. అత్తలు యింట్లో వున్నపుడు గుడ్డలు పెట్టేవారు. వారు లేనపుడు అవి తీసి కృష్ణుడేమన్నా వస్తున్నాడేమో చేసేవారు. ఒకనాడు రాత్రి కృష్ణుడు ఒక గోపిక యింటికి వచ్చాడు. భర్త భోజనం చేసి పడుకున్నాడు. కృష్ణుడు చప్పుడు చేస్తున్నాడు. ఏం చేయాలో తోచలేదు. మాట్లాడేందుకు వీలుగా చిన్న **pipe ను తయారు చేసి పెట్టుకునేవారు. గోపిక చెప్పింది.**

తలుపు తీయనంత లోనె తత్తరమది యేలనోయి
తలుపు తీతు కొంతసేపు తాళుము కృష్ణా
తలుపు తీతు కొంతసేపు ఆగుము కృష్ణా
పతి నిద్దురపోవలేదు మది సంశయ మందునేమొ॥

ఒకవైపు పతికి, మరొకవైపు జగత్పతికి సంతృప్తి నందిస్తూ వచ్చారు. ఆ నాటి గోపికలు ఇహ ధర్మము నాచరిస్తూ పర ధర్మానికి ప్రాణము లర్పిస్తూ వచ్చారు.

(వే.ప్ర. పు.85/86)

జగత్తు/జగము

దేహముయొక్క విశిష్టమును అలక్ష్యము చేయకూడదు. ఈ జగత్తునందు అన్ని అనిత్యమే. ఐతే అన్నింటిని అలక్ష్యము చేస్తున్నామా? లేదు. **"అనిత్యం అసుఖంలోకమి మం ప్రాప్య భజస్వమామ్"** అనిత్యం అసుఖం ఈ రెండు రూపములతో చేరినది జగత్తు. దీనిని సరియైన రీతిలో

అనుభవించి సరిగా వినియోగపెట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి. దేహమంటే ఒకదేవాలయము. ఎలాంటి దేవాలయము? నడిచే దేవాలయము. moving temple. ఇలాంటి దేవాలయమును మనము సార్థకమైన రీతిగా అనుభవించాలి. ఏది చేసినా దేవుడున్నాడు లోపల అనే ఆత్మవిశ్వాసమును పెంచుకోవాలి. ఈ ఆత్మ విశ్వాసము లేకుండా లోక విశ్వాసము చేతనే జీవితము గడవటంచేత అశాంతికి గురై పోతున్నాము. గోడ కట్టాలంటే పునాది భద్రముగా వుండాలి. అప్పుడే గోడ భద్రముగా వుంటుంది. గోడ భద్రముగా వుండినప్పుడే మనము రూఫ్ భద్రముగా వేయవచ్చు. రూఫ్ భద్రముగా వుండినప్పుడే అందులో వాసము ధైర్యముగా చేయవచ్చు. Self confidence foundation, self satisfaction wall, self sacrifice roof, self realisation life అన్నారు. self అంటే ఏమిటి? రెండు రకములైన self లు వుంటున్నాయి. ఏకాక్షరకమైన ***I*** ఒక self. రెండవది eye. ఇది మూడక్షరముల ***I***, three latters eye నే body. ఏకాక్షర ***I*** ఆత్మ. "ఏకం సత్యం విమలమచలం సర్వధీసాక్షీ భూతం". ఈ ***I*** అనే ఏకాక్షరముసర్వుల యందు వుంటుండాది. మూడక్షరముల ***I*** కొంతమందికి లేకుండా వుండవచ్చును. కొంతమందికి ఉండికూడను క్యాటరేక్టు రావచ్చును. ఇంకా వేరు వేరు దోషములు అందులో ప్రారంభముకావచ్చును. యోగి భోగి జోగి. విరాగి బైరాగి సర్వులయందు ఏకాక్షర ***I*** సమంగానే ఉంటుంది. ఇప్పుడు భగవతీ అని నేను పిల్చాను. ఆయన నేను ***I*** అంటాడు. హక్సర్ అని పిల్చాను. ఆయన నేను ***I*** అంటాడు. అర్జున్ సింగ్ అని పిల్చాను. ఆయన నేను ***I*** అంటాడు. బిబ్బర్ అని పిల్చాను. ***I*** అంటాడు. భగవతీ, హక్సర్ సింగ్ బిబ్బర్ రూపనామములు వేరు అయినప్పటికిని అందరినుండి ***I*** అనే జవాబు ఒక్కటిగానే వచ్చింది. రూపనామములు వేరు అయినప్పటికి ఈ ***I*** అనేది **అందరియందున్నది ఒక్కటే. దానినే వేదాంతము "ఏకంసత్ విప్రాఃబహుధా వదంతి" అన్నది.**

(బృ. త్ర. పు. ౩౫/౩౬)

తన కంటె వేరైనది జగత్తు నందు లేదు - ఉన్నదంతా వున్న దాని యొక్క ప్రతిబింబములే.

(బృ.త్ర.పు. ౧౨౮)

జగత్తు అంతయు "అనిత్యం అసుఖం లోకమిమం ప్రాప్యభజస్వమాం" ఈ ప్రపంచములో ప్రతి ఒక్కటి మార్పు చెందునదే, శిథిలమయ్యేదే, క్షణించునదే, అనే దోషమును చక్కగా గుర్తించినచో అనిత్యమైన దోషభరితమైన ఈ జీవితమునకు ఏమాత్రము ముందంజవేయము. రోగనివారణమునకై భుజించే ఆహారములన్నియు భోగములు కానేరవు. **ఆకలి రోగానికి అనుభవించే అన్నమంతా భోగమవుతుందా? ఇది ఒక రోగమునకు సంబంధించిన ఔషధమే.** కొంత మంది మధురమైన ఔషధాన్ని సేవించాలని ఆశిస్తూ వుంటారు. అదే విధముగనే యీ ఆకలి అనే రోగానికి రుచికరమైన మందు అనే అన్నము కావాలని ఆశిస్తుంటారు. జగత్తులో మనము అనుభవించే ప్రతి విషయముగానీ ప్రతి భోగముగానీ రోగ నివారణకై సేవించే మందులు మాత్రముగా భావించాలి. ఈ జగత్తునందు అనేక విధములుగా సుఖశాంతులతో భోగభాగ్యములతో జీవించుచున్నట్టుగా భావిస్తుంటాము. ఇవి భోగములుగా విశ్వసిస్తుంటాము. కానీ యివి నిజముగా భోగములు కానేరవు. దీని ప్రతిఫలము ముమ్ముందు మనలను యెన్నో విధములుగా బాధింపజేస్తుంది.

(శ్రీ. గీ. పు.78)

(చూ॥ అంతర్వాణి, అమనస్కుడు, అవతారము, ఆత్మజ్ఞానము, ఆధారము, ఆహారము, ఈక్షతేర్నాశబ్దం, ఋతువు, కల, జగదీశుడు, జన్మాద్యస్యయతః, తమోగుణము, దివ్యత్వము, దేవుడు, దైవము, ధర్మము, ధీమంతుడు, నాలుక, ప్రత్యక్షదైవము, బ్రహ్మస్వరూపము, భగవంతుడు, భవానీశంకర, మనసు, వసంతఋతువు, విశ్వాసము, సంపర్కము, హృదయము)

జగత్సేవకుడు

జగత్సేవకుడైన సూర్యనారాయణుడు సదా మీ వాకిటముందు నిలిచి యేయుండును. మూసియున్న

తలుపులను బ్రద్దలు కొట్టి సూర్యుడు లోపల ప్రవేశించడు, ఏలయన అతడు సేవకుడు. అతడు స్వామి హద్దులను, తన హద్దులనూ గుర్తెరిగి మెలగును. తలుపు తట్టనైనా తట్టడు. యజమానుడు తలుపులు కొంచెము తెరవగానే సూర్యుడు పూర్ణతేజముతో లోపలికి జొరబడి, అంధకారమును పారద్రోలును. పురమాత్ముని స్థితికూడా ఇట్టిదే. తన సాయము సమర్థించినంతనే చాచిన చేతులతో జీవులచెంతనే కనుపించును.

సత్యాసత్య వివేకముతో ప్రవర్తింపనంతవరకూ దేహాత్మల పృదుఃకరణ శక్యముకాదు.ఈ వివేకము ఈ జ్ఞానమూ మానవ రోమ రోమమునకూ వ్యాపించవలెను.

(ప్రే.వా. పు.30)

జగదీశుడు

జగత్తంతయూ నిండియుండినది జగదీశుడే "ఈశావాస్యమిదం సర్వం" అని ఉన్నది.

ఉన్నది ఒకటే అయినప్పటికినీ అనేకములుగా గోచరించునని కృష్ణపరమాత్మ చెప్పిన విషయములో మనమొక ఉదాహరణమును స్మరింతుము. ఒక సాయంకాల సమయమున మసక మసక గల మబ్బులలో మనము ప్రయాణముచేయు దారిలో మధ్య మడతలు మడతలుగా చుట్టుకొన్న త్రాడు పడి యుండును. అది నిజమునకు త్రాడు.త్రాడుగనే యున్ననూ ఆదారిని నడచు ప్రయాణీకులు ఒక్కొక్కరూ ఒక్కొక్క విధమైన వస్తువుగా భ్రాంతి పడుదురు. ఒకరు అది దండ అని తలంచి దాటిపోవుదురు. మరొకరు జలధార అని తలంచి తొలగి పోవుదురు. మరొకరు యేదో తీగ పడినదని తలంతురు. మరికొందరు పామేమో, అని దూరము దూరమే నిలచి పరీక్షించుచూ భయపడుదురు కదా!

అటులనే పరబ్రహ్మ, తన స్వరూపమునకు భంగము లేకనే, మాయ వలన నానా నామరూప ప్రపంచముగా భాసిస్తాడు. యెన్ని రకములుగా కనుపించిననూ, భావించిననూ, భ్రమించిననూ త్రాడు తప్ప అన్యమెట్లు కాదో, అటులనే భగవంతుని యెన్ని విధములుగా తలంచి, భావించి, భ్రమించిననూ, అతను బ్రహ్మము తప్ప అన్యము కాడు. పరమాత్ముడు అన్నింటికీ ఆధారమైయున్నాడు. అతని ఆధారము లేక ప్రపంచము నిలువజాలదు. పూలమాలకు దారమెట్లు ఆధారమో, కట్టిన అంతస్థుల మేడకు పునాది ఎంత ఆధారమో, పరమాత్ముడు కూడనూ జీవులను పూలకూ ప్రకృతి సౌధమునకూ అంత ఆధారము. అయితే పూలమాలలోని పూలు, కట్టిన అంతస్థుల మేడ ముందు కనుపించును. కానీ, మాలలోని దారమూ, భూమిలోని పునాది ముందుగా కనిపించవు. కనుపించనంత మాత్రమున అవి లేవనరాదు. వాటి ఆధారమే లేకున్న పూలమాల లేదు. అంతస్తుల భవనము లేదు.

అయితే, వాటిని మనము చూడవలెనన్న కొంత విచారణ అవసరము. పరిశీలన చేయక అవి కనుపించవు. మాలలో పరిశీలించి చూచిన దారము, భూమిలో త్రవ్విచూచిన పునాదులూ మనకు తెలియునే కానీ కనుపించు పై అంతస్తులందూ, కట్టిన పూలమాలపైనా పునాదులు, దారము కనుపించవు. **కనుక కనుపించు ఆధేయాన్ని మనము ప్రధానముగా తీసుకొని అంతటితోనే ఉండి మన బుద్ధిని పరిశీలనకు దింపకున్న మనకు నిత్యమేమాత్రము తెలియదు. కనుపించినదానికి కనుపించని ఆధారమొకటి వున్నదని,** దీనిని తెలుసు కొనుటకు విచారణ సలుపుట చక్కని మార్గము. దీనిని అనుభవమునకు తెచ్చుకొనువారలకు అనేక విధముల చెప్పనవసరము లేదు. అంతే కాని పూసలైన జీవుల యోగ్యతా, అయోగ్యతా మనకు ప్రధానముకాదు. **దీనికి ఆధారమైన సూత్రము బ్రహ్మము;** అదే మనకు ప్రధానము. కేవలము మాల అందమునకు అయోగ్యమైన పూవులు కూడనూ చేర్చవచ్చును. అనగా జీవులు తామాసిక, రాజసిక సాత్త్వికములైన భేదములలో వున్ననూ పరమాత్మ వాటిని పాటించక అతీత స్థాయిలో సత్య నిత్య నిర్మలుడై నిండియుండును. దండకు దారము అండయై యుండును. దారము లేక పూవులు దండ కాలేవు

జగన్మాత

అటులనే బ్రహ్మములేక జీవులను వేరు చేయ వీలులేదు, సాధ్యము కాదు.

(గీ. పు.102/104)

జగన్మాత

తల్లి తన పిల్లలముందు ఆట వస్తువులను పడేసి తన పని తాను చూచుకుంటుంది, పిల్లలు ఆడుతూ అప్పుడప్పుడు 'అమ్మ' అని పిలుస్తారు. కానీ ఆమె పలుకదు. కొంతసేపటికి పిల్లలు ఆకలితోనో, ఆటలయందు విసుగుతోనే ఆమ్మా అని ఏడుస్తారు. అప్పుడామె వచ్చి వారిని ఓదారుస్తుంది. అటులనే జగన్మాత మానవుల ముందు జగత్తులో ఎన్నో వస్తువులు, వ్యవహారములనే వాటిని వుంచుతుంది. మానవులు లౌకిక వ్యవహారములనే ఆటలు ఆడుకుంటూ అప్పుడప్పుడు జగన్మాతను తలచుకుంటారు. **ఆమె పలుకదు. చివరకు విసుగుపుట్టి ఇంకా ఏదో కావలెనని ఏడుస్తూ ఎలుగెత్తి జగన్మాతను పిలుస్తారు. అప్పుడామె పలుకుతుంది.**

(భ.ప్ర. పు. 38)

జడజగత్తు

(చూ॥ సృష్టి)

జడభరతుడు

(చూ॥ ఆత్మబోధ)

జడము

(చూ॥ ప్రకృతి, క్షేత్రము)

జనక మహారాజు

(చూ॥ ఆత్మజ్ఞానము)

జననము

(చూ॥ జ్ఞాని)

జనన మరణములు

~~ఈ~~ జనన మరణములు దేహమునకు మాత్రమే గాని ఆత్మకు లేవు. సత్యములో చేరిపోతే మనకు ఇంక అంతా ఆనందమే.

దేనిని వదలవలెనో దానిని వదిలిపెట్టినప్పుడే ఆనందం దేనిని చేరవలెనో దానిని చేరినప్పుడే ఆనందం.

వదలవలసింది జగద్భావము. తెలుసుకోవలసింది జీవతత్వము, చేరవలసింది బ్రహ్మత్వము, ఈ మూడూ చేరినప్పుడే మనిషికి ఆనందం. అది తెలియనంత వరకూ దుఃఖమే.

అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ

~~ఈ~~ 3 పదములు ముచ్చటగా జీవతత్వమును నిరూపిస్తున్నవి.

అసతోమా సద్గమయ అనగా 'అసత్తు' అనే జగత్తునుండి దైవత్వమనే "సత్తునకు" చేరాలి.

తమసోమా జ్యోతిర్గమయ అనగా దేహమే నేను అనే అజ్ఞానం నుండి 'జీవుడే నేను" అనే జ్ఞాన జ్యోతిలో చేరాలి.

"మృత్యోర్మా అమృతంగమయ" అనగా దేహమనే మృత్యువు నుండి ఆత్మ అనే అమృతత్వంలో చేరిపోవాలి. మృత్యువు దేహమునకే ఉన్నదిగాని దివ్వత్వమునకు లేదనే విషయము తెలుసుకోవాలి.

(త్వ.శ .మ.పు.42)

(చూ॥ అనుభవజ్ఞానము)

జనని

విదేశాలు సుఖసంతోషాలతో, భోగభాగ్యాలతో, ఎంత నిండి యుండినా, భారతదేశము ఏమీ తక్కువకాదు. భారతదేశం మహా భాగ్యభూమి. అన్నపూర్ణాదేవి. భోగభాగ్యాలకు ఏమీ తక్కువ లేదు. నీ దేశాన్ని నీవు గౌరవించు. రాముడు రావణుని చంపి విజయం సాధించిన తర్వాత విభీషణుడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు,

జాంబవంతుడు అంతా కలసి రాముడినే లంకారాజ్యానికి అధిపతిని చేయాలనుకున్నారు. ఆయోధ్యలో లేని సిరిసంపదలు లంకలో ఉన్నాయి. ఇక్కడ భవనాలు అన్నీ స్వర్ణమయంగా ఉన్నాయి. స్వర్గాన్ని కూడా మరుపిస్తున్నాయి. ఇక్కడే ఉండి లంకను పాలించమని చెప్పేరు. ఈ లంకలన్ని సిరిసంపదలతో ఉన్నా ఆయోధ్య నాజన్మభూమి. దాన్ని ఎన్నడూ మరువను, విడువను. **జననీ జన్మభూమిశ్చ: స్వర్గాదపి గరీయసి అన్నాడు. రాముని ఆదర్శం ముందుంచుకొండి.** జన్మభూమిని మరువకండి. మాతృదేశం ఋణం తీర్చుకోండి.

(దే. యు.పు.46)

జననీ జన్మభూమి

రావణ వధ జరిగిన తరువాత, విభీషణ, సుగ్రీవ, జాంబవంత, అంగద మున్నగువారు ముందుకు వచ్చి "రామచంద్రా" నీవు ఈ విజయమును సాధించినావు. అయోధ్యను భరతుడేలుచున్నాడు. ఈ లంక స్వర్గం కంటె మించినదిగా ఉంటున్నది. స్వర్ణమయముగా ఉంటున్నది. కనుక తమరిక్కడనే ఉండి ఈ లంక యొక్క పరిపాలన సాగించండి" అన్నారు. **అప్పుడు రాముడు : "పిచ్చివాడా! కేవలము తన తల్లి కురూపిగా ఉంటుందని, ఏదో ఒక అందమైన దానిని తన తల్లి అని పిల్వడానికి సాధ్యమౌతుందా? నా భారతదేశము పేదరికముగా ఉండవచ్చు. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" స్వర్గం కంటె మించినటువంటిది నా జన్మభూమి. నా కన్న తల్లి, నా జన్మభూమి ఆ స్వర్గము కంటే మించినది. ఇది మాత్రము నేను వదలను"** ఇటువంటి వన్నియు సామాన్య మానవునకు ఒక ఆదర్శమును అందించిన మూర్తి శ్రీరామచంద్రమూర్తి.

(స.సా. జూ. 1989 పు. 147)

జన్మ/జన్మము

"మనిషి జన్మించేది మరల జన్మ పొందకుండా ఉండే మార్గం తెలుసుకోవటానికే"

(శ్రీ. స. ప్రే. ప్ర పు.1)

ఏ వ్యక్తి అయినా భారతదేశంలోకాని మరేదేశంలోనైనా కాని ప్రమాదవశాత్తూ జన్మించడు. అతనిజన్మకు ప్రత్యేకమైన సార్థకత పొందవలసిన విధి ఒకటి ఉంటుంది. తన తెలివితేటలను, శక్తియుక్తులను వృద్ధిపరచుకొని వాటిని తనసోదరమానవుల అభ్యుదయం కోసం, దేశాభ్యుదయంకోసం అంకితం చెయ్యాలి.

(శ్రీ స. ప్రే. ప్ర. పు.402)

జన్మమున నెనిజజనులై జన్మించిన వారుండరు।
జన్మము తరువాత। మిగిలి జన్మించిన వారెందరు?।
జన్మమెత్తి ధర్మ కర్మ శూన్యులైన వారెందరు?।
జన్మమంత తిరిగి।,నరజన్మము కనుగొనగలెరు।
జన్మించిన వారెందరు? జన్మమెత్తిన వారిందరు?

(భ.ప్ర.పు.117)

జనన మరణ మధ్యమందు! జగన్నాటక రంగమందు।
కామక్రోధగానములు। లోభమోహ గీతములు।
మదమాత్సర్య వేషములు। వ్యామోహముల ప్రదర్శనలు।
నవరకముల ప్రదర్శనలు।తుదకు శాంతి పాఠములు.

(భ.ప్ర.పు.125)

మువ్వగోపాలుడు ముసిముసి నవ్వులు నవ్వుచూ కాచిన కాలము సమీపించినదని సంతసించి, ''బావా! విను,లోకులు సూర్యోదయము, సూర్యాస్తమయమని అనుటలో అర్థమేమి? అదికేవలము **లోకుల దృష్టియందే కాని సూర్యుని దృష్టియందు కాదు. సూర్యుడు, ఉదయించుటాలేదు, అస్తమించుటాలేదు, అవునా,కాదా? నేనునూ అంతే, నాకు జన్మమే లేదు. సామాన్యమానవుల దృష్టికి నేను అనేక కాయములను ధరించి అనేక జన్మల నెత్తితనని తలంతురు.** లోకోద్ధరణమునకు అవసరమొచ్చినపుడంతా ఒక కాయము ధరించి లోకమునకు రూప నామములతో గోచరించిననూ, యెన్ని జన్మల విషయమయిననూ నాకు జ్ఞాపకముండును. **నేను సర్వజ్ఞుడను, సర్వశక్తుడను.** నాకే కాదు, నీకు కూడనూ అంతా తెలియును. అయితే నీ జ్ఞానశక్తిని అజ్ఞానముచే ఆవరించుటవలన నీకు తెలియజాలకున్నది. **నేను జ్ఞానమయుడును. కనుక నాకు సర్వవేళలయందునూ**

స్పష్టముగా తెలియుచుండును. బావా! సూర్యుడు అద్దములో అగుపించినంత మాత్రమున స్థానభంగము కాని, అధికారభంగము కానీ యేర్పడునా? ఉన్నవాడు ఉన్నట్లే ఉండి అద్దమందు ప్రతిబింబించు చున్నాడు. అటులనే నేను కూడను ప్రకృతి అను అద్దమందు ప్రతిబింబించుచున్నంత మాత్రమున నా సరజ్ఞత్వమునకు, సర్వశక్తికి, భంగముగాదు; లేదు. నేను జన్మ రహితుడను. **మానవ జన్మమునకు మునుపు చేసిన పుణ్య పాపకార్మలు కారణములగును. అయితే,అవతార జన్మలకు కూడనూ అవే కారణమని తలంతువేమో? కాదు కాదు. మానవజన్మ కర్మ జన్మ, నాజన్మ లీలా జన్మ. ప్రార్థనలు, సాధుకృత్యములే. నాజన్మకు కారణము,దుష్టుల దుష్కర్మలు, సజ్జనుల యొక్క సత్కర్మలే నా జన్మకు కారణము" అని కృష్ణుడుపదేశించెను.**

(గీ.పు.61/62)

నిజముగా దుఃఖమునకు కారణము జన్మ. జన్మకు కారణము కర్మ. కర్మకు కారణము రాగద్వేషములు. రాగద్వేషములకు కారణము పరిస్థితుల ప్రభావము. పరిస్థితుల ప్రభావమునకు కారణము బుద్ది. బుద్ధికి కారణము ధ్వైతము, ధ్వైతమునకు కారణము అజ్ఞానము, కావున **అజ్ఞానమే దుఃఖమునకు కారణము.** దృష్టి ఎప్పుడైతే జ్ఞానమయమవుతుందో, అప్పుడు సృష్టిఅంతా బ్రహ్మమయంగా గోచరిస్తుంది.

శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప జాయతే
సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధాభిజాయతే
శ్లో॥ క్రోధాత్ భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః
స్మృతి భ్రంశాత్ బుద్దినాశో బుద్దినాశాత్ ప్రణశ్యతి
శ్లో॥ విహాయ కామాన్య స్సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః
నిర్మమో నిరహంకారః స్సశాన్తి మధిగచ్ఛతి

అరిషడ్వర్గములలో మొట్టమొదటివి - కామక్రోధములు. మానవునకు కామ, క్రోధములు అని రెండు పదములు ఉండినప్పటికిని మొదటిపదము యొక్క పరిణామమే రెండవ పదము. లోభ, మోహ, మద మాత్సర్యములు మొదటి పదము యొక్క పరిణామములే. **అరిషడ్వర్గము లనగా కామము యొక్క పరిణామము.** కామము యొక్క పరివర్తనే వీటియొక్క స్వరూప స్వభావములకు మూల కారణము. కామము వల్ల ఆపేక్ష పెరుగుచున్నది. ఈ అపేక్ష ఫలించకుండిన అనగా విఫలమైనచో అది క్రోధముగా మారుచున్నది. ఈ క్రోధమే సమ్మోహనంగా తిరుగుచున్నది. ఈ సమ్మోహనమే కడపటికి పెరిగి పెరిగి స్మృతిభ్రష్టుని గావించుచున్నది. ఈ స్మృతి బ్రష్టుడే కష్టము వల్ల బుద్ధి క్షీణత పొందుచున్నాడు. ఈ బుద్ధి నాశనము వలన సర్వమూ నాశనమగుచున్నది. సర్వ దుఃఖములకు, సర్వనాశనమునకు, అపకీర్తికి ఈ కామమే మూలకారణము. మనము వాంఛలను తగినంత అదుపులో ఉంచుకొని తగినరీతిగా జీవించటానికి ప్రయత్నించాలి.

సర్పమింటియందు సంచరించుచుండ
ఎవరు సుఖనిద్ర చెందగలరు?
విషయ సర్పముండు విషమయ దేహాన
జీవయాత్ర దేహి సల్పుచుండ
కోపము కలిగిన వానికి
ఏ పనియు ఫలింపకుండ ఎగ్గులు కలుగునో
పాపము పనులనే చేయుచు
ఛీపొమ్మనిపించు కొనుట చేకూరును సుమీ.
సాధనలు చేసి ఫలమేమి శమము లేక
యోగములు పూని ఫలమేమి ఓర్పులేక
జపము లొనరించి ఫలమేమి శాంతిలేక
చవిటి భూమిని దున్నిన సరళి కాదె

విషయములు ధ్యానించు వానికి వాటియందు ఆసక్తి కలుగును. అట్టి విషయాసక్తి వలన కోరిక, కోరిక వలన కోపము కలుగును. కోపము వలన అవివేకము, అవివేకము వలన స్మరణ భ్రంశము కలుగును. స్మరణ జ్ఞానము పోవుట వలన బుద్ధి నశించును. బుద్ధి నశించిన తోడనే తానే నశించును. కాన, విషయచింతన యుండరాదు. ఎవడు సమస్త కోరికలను, శబ్దాది విషయములను త్యజించి,

వాని యందే మాత్రము ఆశలేక, అహంకార మమకార వర్జితుడై ప్రవర్తించునో అట్టివాడే శాంతిని పొందుచున్నాడు.

కోరు కోరికలన్నియు తీరుచున్న
భక్తి దైవమున హెచ్చు, రక్తి హెచ్చు
కోరు కోరికలెవ్వని తీరకున్న
భక్తి తరుగుచు, దైవ విరక్తి పెరుగు.

(శ్రీ.భ.ఉ.పు.12/13)

బాల్యంబున పలువురితో కూడి
ఆట పాటల యందు ఐక్యుడగును
యవ్వనంబలరిన అలరు విల్తుని పోల్కి
కామనీ లోలుడై క్రాలుచుండు
అర్ధవయస్సున ఐహికంబున మున్గి
ద్రవ్య మార్జించుట దవిలియుండు
ముదమి వచ్చిన యంత మురహరి తలవక
అది ఇది లేదని ఆలపించు
వివిధ దుర్వ్య సనంబుల వీడలేక
భక్తి మార్గంబు వెతుక ఆసక్తి లేక
కర్మ పంకిలమున క్రాలుచుండు
మట్టి కల్పును జన్మంబు మానవుండు

(ము.ము.పు.27)

(చూ॥ అవతారము, ఆత్మ, కర్మఫలము, త్రిగుణములు)

జన్మభూమి

(చూ॥ జనని, తల్లి)

జన్మ మృత్యు జరా వ్యాధి దుఃఖ దోషానుదర్శనము

జన్మ మృత్యు జరావ్యాధి దుఃఖ దోషానుదర్శనము అన్నింటి కంటెను ప్రధానమయినది. జన్మ దుఃఖము, మరణ దుఃఖము, వ్యాధి దుఃఖము చూచుచుండియూ వాటి సత్యమును తెలిసికొన పోకుండుట మహా ఆశ్చర్యము. దీని పుట్టుపూర్వోత్తరాలు విచారించిన యేది తప్పిననూ మృత్యువు తప్పదని తేలుచున్నది. **మానవులు దేనిని సుఖమని తలంచుచున్నారో అవి సుఖ వేషముతో కనబడు దుఃఖాలే.** నిజమును తెలిసికొనిన విషయ దోషములను మననము చేసినపుడు వైరాగ్యము చేకూరి జ్ఞానము సిద్దించును.

(గీ.పు.209/210)

జన్మసార్ధక మార్గము

ఒకసారి పుట్టిన తరువాత మళ్ళీ ఇంకొకసారి పుట్టకూడదు. **మళ్ళీ పుట్టకుండా ఉండటానికే మనం పుట్టింది. ఇదే మనం తెలుసుకోవలసింది. ఇదే ఆత్మజ్ఞానం.** దొంగతనం చేసి పట్టుబడ్డ ఒక వ్యక్తికి పదేళ్ళు కఠిన కారాగార శిక్ష పడింది. శిక్ష పూర్తి కాగానే జైలు అధికారి, "నిన్ను వదలివేస్తున్నాం, నీ తట్టా బుట్టా మూట గట్టుకొని ఇంటికి వెళ్ళు" అన్నాడట. ఆ దొంగ, "ఇవన్నీ ఎందుకు సార్! అన్నీ ఇక్కడే ఉండనీయండి, రేపే మళ్లీ వస్తాను" అన్నాడట. పదేళ్ళు శిక్ష అనుభవించినా మళ్ళీ జైలుకు రావాలనే ఉందతనికి, దృష్టి దొంగతనం మీదే ఉంది. ఈవిధంగా మనం దొంగలం కారాదు. ఈ ప్రపంచమనే జైలుకు మళ్ళీ రాకూడదు. **అజ్ఞానమే దొంగతనం. అజ్ఞానం నాశనమైతే మళ్ళీ జన్మలేదు. పరమాత్ముని స్మరించాలి. భజించాలి. అదే జన్మసార్థక మార్గం.**

(స.సా.ఫి. 98 పు. 46)

జన్మహక్కు

ముక్తి మానవుని జన్మహక్కు. మరచిపోయిన ఈ హక్కును గురువు జ్ఞాపకం చేస్తాడు. ఒకాయన రోజూ గీతాపారాయణం చేస్తాడు. ఎప్పుడో అందులో ఒక పది రూపాయల నోటు పెట్టి ఆ సంగతే మరచి పోయాడు. ఒకనాడు అతనికి డబ్బు అవసరం వచ్చి ఒక స్నేహితుడివద్ద పదిరూపాయలు బదులడగటానికి వెళ్ళాడు. అప్పుడు కూడా అతని చేతిలో గీతా పుస్తకం ఉంది. ఆ స్నేహితుడు పది రూపాయలు బదులిచ్చి ఆ పుస్తకం ఏమిటో చూసిస్తానని తీసుకున్నాడు. పేజీలు తిరగవేస్తుంటే అందులో పది రూపాయల నోటు కనబడింది. నీ దగ్గర

జన్మాద్యస్యయతః

పది రూపాయలుంచుకొని బదులుకి వచ్చావేమిటి? అన్నాడు. అందులో నోటు పెట్టిన సంగతి మరచిపోయానని అతనన్నాడు. **అట్లా మరచిన నోటులాంటిది ముక్తి. ఆ మరపును తొలగించుటయే గురువు కర్తవ్యం.**

(స.సా.జూలై 2000 వెనక కవరు)

జన్మాద్యస్యయతః

జన్మాద్యస్యయతః - ఉత్పత్తి, స్థితి, ప్రళయములు - అనగా దృశ్య కల్పితమైన ఈ జగత్తంతయూ ఎక్కడ పుట్టుచున్నదో, యెవరివలన కలుగుచున్నదో, ఎవనివలన రక్షింపబడుచున్నదో, కడకు ఎవరి యందు చేరుచున్నదో అనగా లయమగుచున్నదో అదే బ్రహ్మమని తెలియవలెను. ఈ జగత్తును ఒక విధమైన క్రమ పద్ధతిలో నియమించువారు ఒకరుండవలెను కదా! **ఈ మూడింటికి నియతి, జ్ఞానము, అకృతి (అనగా అజ్ఞానము) అవసరము.** అస్య - ఈ కనిపించుచున్న ప్రపంచమునకు. జన్మాది- ఉత్పత్తి, స్థితి, ప్రళయములు. యతః ఎవరి వలన కలుగుచున్నదో అది బ్రహ్మము.

జగత్స్వభావమును గూర్చి మనము అధికముగా తెలుసుకొనవచ్చును. అయితే చూచినది మానవనేత్రమే కదా! భౌతికశాస్త్రము సాధించిన వన్నియూ మానవుని మనస్సు యొక్క ఫలితములే కదా! భౌతికశాస్త్రము వున్న విషయములను వర్ణించి వివరించును. అయితే ఈ వివరములు యెంతకాలము నిలిచియుండును? ఇవి మాటిమాటికి మారుచునే యుండును. ఎన్ని మారినా మారని తత్వము ఒకటి యున్నది.దానిని ఆధారముగా చేసుకొనే ఈ మారు వస్తువులు ఆధేయముగా ఉన్నవి. ఆ ఆధారమైన, ఆచరమైన, **సత్యమైన పరతత్వమే బ్రహ్మము. ప్రపంచమునకు ఒక ఉత్తమ ఆదర్శము కలదు. అదే బ్రహ్మము.**

ఈ ప్రపంచోత్పత్తికి, స్వభావము నియతి, ఆకస్మిము, కాలము, కారణమని భావిస్తారు. వీటి యొక్క సంయోగములు జగత్కారణములు కాజాలవు. కారణమేమన ఇవన్నియూ జడములు. జీవుడు కూడా సుఖ దుఃఖములకూ, వృద్ధి క్షీణములకూ, జనన మరణములకూ లొంగియుండును. కనుక జీవుడు పరతంత్రుడే. కావున జగత్ ఉత్పత్తికి కారణము కాదు. సూత్రము మనలను ప్రామాణిక ఆధారముల చెంతకు తీసుకొని పోవుచున్నది. జగదస్తిత్వమునకు, స్వభావమునకు, క్రమతకు, పరిపూర్ణతకు కారణభూతమైన ఒక మహత్తరమైన ప్రమాణము వలన నిరూపించుచున్నది. **వస్తువులు యెట్లు కలుగునో భౌతిక శాస్త్రము వివరించవచ్చును. అయితే అవి ఎందుకు అట్లు కలుగుచున్నవో భౌతిక శాస్త్రము తెలుపలేదు.** అయితే ప్రతికార్యమునకు కారణము కలదు. అణువుగాని, అభావముగాని, జీవుడుగాని, ప్రపంచమునకు కారణము కాదు. సత్తు విషయావిషయ భేదముల నతిక్రమించి వున్నది. అయితే బ్రహ్మమును గురించి చెప్పినపుడు మనము వ్యావహారిక శబ్దములను ఉపయోగించవలసి యుండును.**సృష్టికర్తగా, లోకపాలకునిగా భావించినపుడు బ్రహ్మము దైవము అని చెప్పుచున్నాము.**

విశ్వము వైపునుండీ మనము కార్యకారణవిచారణ చేయునపుడు, కారణవస్తువు దైవము అని భావించుచున్నాము. కార్యవస్తువు జగత్తుని నిరూపించుచున్నాము. విషయా విషయ భేదములను అతిక్రమించినపుడు శుద్ధ చైతన్యమనే బ్రహ్మమునే స్వరూపలక్షణముగను, తటస్థలక్షణముగాను ద్వివిధ లక్షణములుగాను భావించుచున్నాము. **ఏల యన మాయా సంబంధము వలననే బ్రహ్మము జగత్తుయొక్క ఉత్పత్తి, స్థితి** ప్రళయాదులకు కారణమని చెప్పబడుచున్నది. మరికొందరు మాయ, బ్రహ్మము ఇరువురూ కలసి జగత్కారణమని అందురు. మరికొందరు **మాయ ఒక్కటే జగత్కారణమని యందురు.**

ఇంకా జగత్తు విష్ణువునుండి యుద్భవించినది, అతనియందే ఉన్నది; **జగత్తుయొక్క ఉత్పత్తి, స్థితి, లయములకు విష్ణువే కర్త అని అందురు.**

లోకమునందు ప్రతి వస్తువునందును అయిదు లక్షణములు కలవు. అవి అస్తి భాతి, ప్రియం, రూపము, నామము. ఒక వస్తువు 'ఉన్నది' అనునది అస్తి అనే శబ్ద లక్షణము. ఆ వస్తువు ఉన్నట్లు మనకు కన్పింపజేయునది ప్రకాశము. కనుక ఆ ప్రకాశింపజేయు శక్తి 'భాతి' అను శబ్దలక్షణము. ప్రతి పదార్థము. మనయొక్క వినియోగమునుబట్టి, మనము ఆ వస్తువును ప్రియముగా చూతుము. అట్టి ప్రియమే మూడవ లక్షణమైన ప్రీతిగా చెప్పబడుచున్నది. మిగిలిన రూప నామములున్నవి. అవి మార్పు చెందే మాయారూపములు. ఉండినట్లుండి మార్పు చెందును. మార్పు చెందినట్లు తోచి తిరిగి స్వరూపమును ధరించును. **దీనినే మాయ అని యందురు.** ఇవి కేవలము ఆధేయములు మాత్రమే. నామరూపములు అనేకము. వాటిలో అస్తి భాతి ప్రియ నామరూపములతో గోచరించు భగవంతుడే ఏకము. అదే సర్వవస్తువులకూ ఆధారము. మణులలో దారము చేరినట్లు. మణులు అనేకము, దారము ఏకము.

సమస్త జీవకోటికి ఆధారము, శాశ్వతము అయినది పరబ్రహ్మమే. భగవంతుని స్వరూపము నామరూపమున కంటే భిన్నమైనది కాదనియు, అదియే బ్రహ్మమనియు, సో..హం అని భావించుటలో, పరమాత్ముని స్వరూప లక్షణము ద్వారా తెలుసుకొనుటయే 'బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి'' అని శ్రుతి. ఇదియే స్వరూప లక్షణము. ప్రపంచ ఉత్పత్తికి బ్రహ్మయే కారణము. నీటిలో పుట్టిన నీటిబుడగ నీటియందే ఉండి నీటియందే లయమగుచున్నది. ఈ దృశ్యగోచరమగు సమస్తము నీటిబుడగల వంటివి. అయితే నీరు బ్రహ్మము. బ్రహ్మమను నీరు నుండే నీటిబుడగలు పుట్టుచున్నవి కాదా? నీటి యందే నిలిచియున్నవికదా? తిరిగి నీటిలోనే చేరిపోవుచున్నవి. **ఉత్పత్తిస్థితి లయములకు నీరే ఆధారము. నీరు ఏకము. బుడగలు అనేకము. నీరు సత్యము, బుడగలు మిథ్యము. నీరు ఆధారము, బుడగలు ఆధేయము.**

మొదటి సూత్రము బ్రహ్మమును నిర్దేశించుచున్నది. రెండవ సూత్రము ఆ బ్రహ్మమనే మరొక రూపమున నిర్దేశించుచున్నది. మొదటిది సత్యము, జ్ఞానము స్వాతంత్ర్యము. బ్రహ్మమే సృష్టి ముఖము. సృజనాత్మకుడగు భగవంతుని ఏకాభివ్యక్తమగు జగత్తునకే దృష్టిని పరిమితము చేయరాదు.

జన్మాద్యస్యయతః దృశ్యకల్పితమైన చరాచర ప్రపంచమంతయు అదృశ్య కల్పింతమైన చరాచర ప్రపంచమంతయు ఎవరివలన ఉదయించుచున్నదో, దేని ఆధారము వలన అభ్యుదయము పొందుచున్నదో అనగా రక్షింపబడుచున్నదో చివరకు దేనిలో లయమగుచున్నదో అదే బ్రహ్మయని తెలుసుకొనవలెను.

తైత్తిరీయోపనిషత్తులో 'యతోవా ఇమాని భూతాని జాయంతే, యేన జాతాని జీవంతి, యత్ప్రయం త్యభిసంవిశంతి తద్విజిజ్ఞాసస్వ, దద్బ్రహ్మేతి' అన్నారు. అనగా దేని నుండి సమస్తభూతములు పుట్టుచున్నవో వృద్ధి చెందుచున్నవో చివరకు దేనియందు లయమందు చున్నవో అది బ్రహ్మము అని.

ప్రపంచములో ఏ వస్తువును కానీ నిర్మింపవలెనన్న కర్త ఉండియే తీరవలెను. కర్త లేని నిర్మాణము కలుగబోదు. అయితే మనకు కనిపించే అనంత నిర్మాణములో సూర్యచంద్రాదులు నక్షత్ర మండలాలు వాటి కాంతులు కాల గతులు ఇవన్నియు కర్త లేకుండా ఎట్లు వ్యవహరించుచున్నవి? ఇవి సామాన్య శక్తులకు సాధ్యమగునవా? సృష్టింపబడిన సృష్టికే మానవాతీతమైన అద్భుత శక్తులుండగా ఇక సృష్టించిన కర్త ఇంకెంతటి శక్తి మయుడో విజ్ఞులైన వారు విచారించవచ్చును. సృష్టియొక్క చిత్రము అతి విచిత్రమైనది. ఒక దానికి మరొక దానికి పోలిక లేదు. ఒకరికి మరొకరికి పోలిక లేదు.

ఇది ఒక అనంత మహిమాన్వితుడైన భగవంతుని లీల తప్ప అన్యము కాదని ఎట్టివానికైనా తెలియక పోదు. సృష్టిని బట్టి సృష్టికర్త ఎంతటివాడో సులభంగా ఊహించవచ్చును. సృష్టిని అర్థం చేసికొనలేనివారు సృష్టి కర్తను అర్థము చేసికొనలేరు. సృష్టి యనగా బ్రహ్మేచ్ఛకు ప్రకటనే. అంతా ఈశ్వర సంకల్పమే.

(సూ.వా పు.13/21)

జనులు

"జన్మాద్యస్యయతః అనే సూత్రములో ఆకాశాది సంపూర్ణ జగత్తు యొక్క కారణరూపము బ్రహ్మయని చెప్పబడినది. సమస్త జగత్తు యొక్క కారణ రూపము బ్రహ్మమే. ప్రాణ శబ్దము పరబ్రహ్మ యందే వర్తించును.

(సూ.వా.పు.54)

జనులు

"తప్పుగానక సర్వమొప్పుగా భావించి
ప్రకటించుచుందురు పరుష జనులు
తప్పులే గైకొని ఒప్పులు దిగద్రొక్కి
ప్రకటించుచుందురు ప్రాప్తజనులు
ఒప్పులన్నియు బల్మి తప్పులుగా మార్చి
కలహించుచుందురు కలుష జనులు
ఒప్పులే దిగద్రొక్కి తప్పుల నెక్కించి
దూషించుచుందురు దుష్టజనులు
మొదటి మూడింటివారి కొక విధము కలదు
నాల్గవ లక్షణమందున నరుని నరయ
ఇతని కంటెను ఘనరాక్షసుండె మేలు"

(శ్రీ.న 93 పు.54)

జపము

(చూ॥ నరుడు, విధులు, శరణాగతి, సాధన)

జప సహితధ్యానం

మీరు దివ్యత్వంలో వర్తిస్తున్నారు. దివ్యత్వమే మిమ్ములను నడిపించే శక్తి పరమాణువు మొదలుకొని మహత్తర నక్షత్రం వరకూ సమస్తమూ నిఖిల విశ్వసమూ దివ్యత్వ పరిపూరితమే. సకల చరాచరపరివ్యాప్తమైన ఈ తత్వమునకు మీకు నచ్చిన నామరూపాలు కిల్పించు కోండి. మనోనేత్రం ముందు ఆ రూపం నిలుపుకొని నాలుకతో నామం స్మరించండి. **అదే జప సహితమైన ధ్యానం.**

(వ. 1963 పు.66/67)

జపాన్

(చూ॥ అధర్వణవేదము, భగవంతుని బిడ్డలు)

జయభేరి

(చూ॥ సనాతనసారథి)

జరగవలసిందేదో జరిగేతీరాలి

రామబాణము తగులుతూనే మారీచుడు తన నిజస్వరూపాన్ని ధరించి, "హా సీతా! హా లక్ష్మణా!" అని అరుచుకుంటూ పడిపోయాడు. ఈ అరుపును సీత విన్నది. "లక్ష్మణా! ఇది రాముని గొంతువలె ఉన్నది. ఆయనకు ఏ ఆపద సంభవించిందో ఏమిటో! నీవు తక్షణమే మీ అన్నగారికి సహాయంగా వెళ్ళు" అన్నది. కాని, లక్ష్మణుడు సీత మాట వినలేదు. "వదినా! ఇది రాముని గొంతు కాదు నీకింత మాత్రము తెలియదా! ఇది రాక్షసుల మాయ. రాముడు సాక్షాత్తు శ్రీమన్నారాయణ మూర్తి. అతనికి ఎట్టి ప్రమాదమూ సంభవించదు. నీవు దిగులు జెందవద్దు" అని ధైర్యం చెప్పాడు. **సీతకు తెలుసు - రామకార్యము జరగటానికి తానొక ఉపకరణమని.** లక్ష్మణుని ఎట్లాగైనా బయటికి పంపాలి. కాని, మంచిమాటలతో ఈ లక్ష్మణుడు కదలడని గుర్తించి, "లక్ష్మణా! ఈ అరణ్యంలో నీవు, నేను, రాముడు తప్ప మరెవ్వరూ లేరు. రాముడు మరణిస్తే నీవు నన్ను పొందాలనుకున్నావా?" అని కఠినోక్తులాడింది. ఈ మాటలు వినలేక లక్ష్మణుడు తక్షణమే బయలుదేరాడు. వెడుతూ వెడుతూ పర్ణశాల ఎదురుగా ఒక గీత గీసి, "తల్లీ! ఎట్టి పరిస్థితుల్లోను నీవీ గీత దాటి బయటికి రావద్దు" అని హెచ్చరించాడు. కాని, **జరుగవలసిందేదో జరిగే తీరాలి కదా!** రావణుడు మారు వేషంలో వచ్చాడు. సీతను అపహరించాడు. రామలక్ష్మణులు తిరిగి వచ్చేటప్పటికి పర్ణశాల ఖాళీగా ఉన్నది.

సీతకు కూడా తెలుసు. ప్రపంచములో బంగారు జింక ఉండదని. సర్వమును త్యాగం చేసిన సీతకు బంగారు

లేడిపై ఆశ కల్గడమేమిటి'' ''త్యాగేనైకే అమృతత్వ మానశుః'' **త్యాగము చేసినప్పుడు రాముడు దక్కాడు. ఆశలు పెంచుకున్నప్పుడు రాముడు దూరమయ్యాడు.**

(శ్రీ.భ.ఉ.పు.71)

జర్నలిస్ట్

జర్నలిస్ట్ అంటే ఎవరు? 'జనరల్ లిస్ట్' వ్రాసేవాడు. News అంటే ఏమిటి? NORTH EAST WEST SOUTH నుండి వచ్చే సమాచారమే News బయటి నుండి వచ్చే న్యూస్‌ను తెలుసుకుంటున్నావు. మంచిదే. మరి నీలో నుండి వచ్చే న్యూసెన్స్ మాటేమిటి? దానిని కూడా గమనించి సరిదిద్దుకో.

(స.సా.ఏ.99 పు.110)

జర్మనీ

(చూ॥ అధర్వణవేదము)

జరుగుచునేయున్నవి

ఒకవైపున భారతయుద్ధమూ, ఒకవైపున రామాయణమూ, ఒకవైపున భాగవతమూ ఈ రీతిగా జీవితమునందు నిత్యమూ జరుగుచునేయున్నవి. ఇవి సూక్ష్మ రామాయణ భారత భాగవతములు.

(స.ని పు.91/92)

జలము

జలము కూడా ప్రకృతిలో ఉండినటువంటిదే. ఇవన్ని దైవము యొక్క అనుభూతులే. అంశములే. ఆజలము చెబుతున్నది. ''నాయనా నీవు కాలమున కు మార్పుచెందుతున్నావు' నేను ఎన్నియోరీతులుగా మధురముగా, నిర్మలంగా ఉంటున్నాను. నాకు సహజమే యిది. నిర్మలత్వము నా స్వభావము. మాధుర్యము నా స్వరూపము. పవిత్రత నాకు సహజము. మూడింటిని నీవు అనుసరిస్తూ రా. శాంతము అత్యవసరము. అదియే నేను కోరుతున్నది. మనసులో మాధుర్యము, చల్లదనము పెంచుకో. దీనినే నేను three Ps అని చెప్పాను. purity, patience, perseverence అని. ఈ మూడింటిని నీవు సాధించు. ఆత్మ జ్ఞానము. నీకు ప్రాప్తిస్తుంది అని బోధిస్తుంది జలము.

(ద.య.స.97 పు.63/64)

జవాబు

(చూ॥ ఆహారము, జగత్తు)

జాగరణ

(చూ॥ సనాతన సాంప్రదాయములు)

జాగ్రత్

(చూ ॥ ఆత్మ)

జాగ్రత

(చూ॥ తల్లి ఆశీర్వాదము)

జాతి

(చూ॥ మానవజీవితము, భరత)

జాతిగౌరవం

''జాతి గౌరవంబు నీతిపై నిలుచును
నీతి లేకయున్న జాతి చెడును
నీతి గల్గు జాతి నిజమైన జాతిరా
వినుము భారతీయ వీర సుతుడా!''

(శ్రీ.జూన్97 పు.104)

జాతీయభావము (Nationality)

(చూ॥ హిందువులు)

జాలి హృదయము

ప్రేమ లేని హృదయము పాషాణ హృదయము. ప్రేమలేని హృదయము కఠిన హృదయము. హృదయం లేని వారికి ఎన్ని విద్యలు నేర్పి ఏమి ప్రయోజనము?

"చదువు వలన లేదు
తర్క శాస్త్ర వాదమునందు లేదు
వివిధ మతములందు లేదు
వేద వాదములందు లేదు
కలదు...కలదు...ఒక్క జాలి హృదయమందె"

కనుక, ఆ జాలి హృయమనేటటువంటిది, ప్రతి మానవునికి అత్యవసరము ఈ జాలి హృదయము లేనటువంటి మనస్సు ఎన్ని చదువులు చదివి ఎన్ని పదవులను ఏలి, ఎన్ని విధములై నటువంటి ధనమును ఆర్జించినప్పటికీ ప్రయోజనమేమి?

(శ్రీ.మా 95 పు.7)

(చూ॥ప్రేమ)

జితేంద్రియుడు

(చూ॥మోహము)

జిజ్ఞాస

ప్రప్రథమమున జిజ్ఞాస కలిగినవారికి భగవత్ రక్తిని పెంపొందించుకొను భక్తిభావములు, బాహ్య, అంతర్ ఇంద్రియములద్వారా అనుభవించుటకు ఆరాటపడుదురో, అట్టివారిని భాగవతులని అందురు.

(భా. వా. పు. 1/2)

జిజ్ఞాసువు

(చూ॥ నన్ను చేరగోరువారు, భగవదాసక్తులు)

జిహ్వ

"యోగస్య ప్రథమం ద్వారం వాఙ్ని రోధః"

జిహ్వేంద్రియనిగ్రహమునే యోగమునకు ప్రథమ ద్వారముగా పేర్కొన్నది గీత. జిహ్వేంద్రియమును నిగ్రహించక దైవత్వమును పొందటము యోగద్వారములో ప్రవేశించటము ఆసాధ్యము అని గీత శాసించినది.

(శ్రీ.గీ పు.49)

(చూ॥స్వేచ్ఛ)

జిహ్వ చాపల్యం

మానవుడు జిహ్వాచాపల్యం చేత రుచికరమైన పదార్థాలనే అనుభవించాలని ఆశిస్తున్నాడు. 84 లక్షల జీవరాసులలో మానవుడొక్కడే ప్రాకృతమైన ఆహారాన్ని మార్చుకొంటున్నాడు. ఇంక పశు పక్షి మృగాదులన్నీ సహజమైన ఆహారమునే భుజిస్తున్నాయి. కనుకనే, పశు పక్షి మృగాదులకు ఎక్కువగా రోగములు రావటం లేదు. కాని, మానవుడు తన జిహ్వ చాపల్యం చేత ఆహారమును అనేక రకములుగా ఉడుకబెట్టి, అందులోని ప్రాణశక్తిని చంపివేసి, ఒట్టి పిప్పిని మాత్రమే భుజిస్తున్నాడు. మానవుడు జిహ్వ చాపల్యమునకు లోనయ్యాడు. కనుక, రుచి చూడకూడదు. మనం ఔషధాలను సేవిస్తుంటాము. ఎందుకోసం? రోగనివారణ కోసం వాటిని సేవిస్తుంటాము. అయితే, రోగ నివారణమే లక్ష్యంలో ఉంచుకోవాలి గాని, డాక్టరు ఇచ్చే ఔషధము తీయగా ఉండాలనుకుంటే వీలుకాదు. ఈ ఆహారం కూడా ఔషధము వంటిదే. ఏమిటీ ఔషధము? **ఆకలి అనే రోగమునకు అన్నము ఒక ఔషధము. దాహమనే రోగమునకు నీరు ఒక ఔషధము.** ఈ ఔషధములలో మనం రుచుల నెందుకు చూడాలి? ఎంతవరకు మంచిదో అంతవరకే మనం రుచిని చూడాలి. రోగములు రాకుండా, భావములు మారకుండా, బుద్ధులు కదలకుండా ఉండే నిమిత్తమై ఆహారం అతి శుద్ధమైనదిగా ఉండాలి. చాలా మంది డాక్టర్లు - మాంసమును, చేపలను భుజించమని, వాటిలో మంచి 'ప్రొటీన్సు' ఉంటాయని చెబుతూంటారు. వారు ప్రొటీన్సుని, దేహబలమును చూస్తారే తప్ప, ఆధ్యాత్మిక తత్వాన్ని ఏమాత్రం విచారించరు. పాలలో ప్రొటీన్సు లేవా? పప్పులలో, పెరుగులో ప్రొటీన్స్ లేవా? తుచ్ఛమైన మాంసమును తిని

అట్టి బుద్ధులను మనము ఎందుకు పెంచుకోవాలి? అటువంటి ఆహారము వలన మనం కూడా Animals గా తయారైపోతాము. Food ని బట్టి Head, Head ని బట్టి God కనుక, Food, Head, God ఈ మూడింటికీ సన్నిహిత సంబంధము ఉంటుంది. చేపలు చాలా చురుకు తనాన్ని తెలివితేటలను ఇస్తాయి. నిజమే కాని కంపు స్వభావములను పుట్టిస్తాయి. వీటి వలన Bad Thoughts (చెడ్డ ఆలోచనలు) వస్తాయి. చేపలు ఇచ్చే Bad Thoughts మరేవీ ఇవ్వవు కనుక, వీటిని కొంతవరకు అరికట్టుకోవాలి.

(శ్రీ.భ.ఉ.పు.140/141)

జీరో

"Hero becomes zero, if he forgets God (దేవుని విస్మరిస్తే హీరో కూడా 'జీరో' అయిపోతాడు)" 'ఏకాదశి' పదము యొక్క నిజార్థము 'దశలో ఏకము' అని గాని పదకొండు కాదు. దశము అనగా పది (10) దానిలో ఏకము ఒకటి (1) ఆ ఒకటి ('1') అనేది భగవంతుడు. దాని తరువాత వచ్చేది సున్న ('0') ప్రకృతి, ప్రపంచం, సృష్టి. ఆ ఒకటి ('1')..., Hero తరువాత వచ్చే సున్న ('0') Zero అంటూ "జీరోను త్యజించి, హీరోను భజించు అనేదే ఏకాదశి యొక్క దివ్య ప్రబోధము" "వేదికలమీద హీరోలు, నిజ జీవితంలో మాత్రమే జీరోలు".

(ఆ.కు.స.పు.3-బి)

(చూ॥ ఆచరణ, ఒక్కడే, జీవితంలో జీరోలు)

జీవదృష్టి

(చూ॥ తత్త్వజ్ఞానము)

జీవన్మరణము

"I" అనే దాని నుండి "We" అనే దానికి చేర్చినప్పుడు I and You ఒకటి అవుతుంది. ఈ విధమైన సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని ఏర్పరచుకోవడమే ఆధ్యాత్మికము యొక్క సరియైన అర్థము. కనుక ప్రేమ తత్వాన్ని పెంచుకోవాలి. ఈ ప్రేమలేకున్న జీవన్మరణమే. 'Living Death'.

(సా॥ పు. 259)

జీవన్ముక్తి

(చూ॥ వాసనలు, సత్సంగము)

జీవన్ముక్తుడు

జీవన్ముక్తునికి రాజస తామసములు నశించి సత్వము మాత్రము మిగిలియుండును. అట్టి శుద్ధసత్వగుణముచేత అతడు మైత్రికరణ కలవాడై యుండును. **విదేహ ముక్తునియందు శుద్ధసత్వము కూడా నశించును. శుద్ధసత్వముయొక్క ముఖ్య చిహ్నము ప్రకాశము, జ్ఞానము, ఆనందము, శాంతము, నమత్వము ఆత్మవిశ్వాసము, పవిత్రత, శుద్ధభావము మొదలైనవి, శుద్ధసత్వమందే ఆత్మ ప్రతి బింబమును చూడగలుగ వచ్చును.** రాజసతామసములు శుద్ధసత్వముతో కలిసినపుడు, అది అపవిత్ర సత్వమగును. అట్టి అపవిత్ర సత్వమువలననే అవిద్య, అజ్ఞానము కలుగుచున్నది. అదే జీవునికి ఉపాధి అగుచున్నది, కావున మార్పు కలుగును. రాజసము నిక్షేపశక్తిని కలిగియుండును. గోచరమగు జగత్తు వృద్ధి చెందుచుండును. రాజసము ఎక్కువ అనురాగమును కలిగించి తద్వారా అనేక కర్మలు చేయించి, సుఖ దుఃఖములను కలిగించును. **రాజసము జీవుని బంధించి క్రోధము, దురాశ, గర్వము, అసూయ దంభము. కపటము మొదలగు దుర్గుణములను బలపరుచుచున్నది.**

(జ్ఞా.వా. పు.16)

జీవయాత్ర

సత్యధర్మప్రేమ శాంతులతో, మీ నిత్య జీవన యాత్ర సాగించు కర్మయోగమే జన్మధర్మము। సాధనే భక్తుల సాధులక్షణంబు ॥

జీవాత్మ పరమాత్మల యొక్క సంయోగమే

సత్యమనే విద్యుత్తు ధర్మమనే తీగ ద్వారా, శాంతి అనే బల్బులో ప్రవేశించి, ప్రేమ అనే కాంతిని ప్రసరిస్తుంది.

(సా॥ పు. 78)

మానవునికి **హృదయమే - నిజబోధకుడు:**
కాలమే - నిజగురువు.
ప్రపంచమే - పెద్దగ్రంథం.
భగవంతుడే - గొప్పమిత్రుడు.
ఈ నాల్గింటిని విశ్వసించి ఈ జగత్తు అనే కర్మక్షేత్రంలో మానవుడు తన జీవనయాత్ర సాగించాలి. ప్రేమ తత్వమే ఏకత్వాన్ని - అనుభవించడానికి నిజమైన రాజమార్గము.

(దే.యు. పు. 6)

జీవాత్మ పరమాత్మల యొక్క సంయోగమే

(చూ॥ సేవాతత్వము)

జీవించాలి/జీవించు

విద్యార్థులారా! **ఆదర్శముకోసము మనము జీవించాలి కాని అన్నము కోసము కాదనే సత్యాన్ని గుర్తించాలి. ఆదర్శము శాశ్వతమైనది.** ఇట్టి ఉత్తమమైన ఆదర్శముచేత ఎంతైనను మున్ముందు అభివృద్ధి కాగలరు. "కాకి నగచు కలకాలము తిరగక హంసవైక్షణము ఆడుమురా." ఆదర్శవంతమైన విద్యార్థులుగా ఒక పది సంవత్సరములు బ్రతికినా చాలు. ఆదర్శవంతమైన జీవితము అనుభవించటానికి దేశాభిమానము, ఆత్మాభిమానము అత్యవసరము. పుట్టిన ప్రతివ్యక్తి మొట్టమొదట గుర్తించేది తల్లిని తండ్రిని, తల్లిని. తండ్రిని గుర్తించని వ్యక్తి యీ జగత్తులో ఉండడు. దేశాభిమానము, ఆత్మాభిమానము గుర్తించినవాడే నిజముగా తల్లితండ్రులను గుర్తించినవాడౌతాడు. మనదేశమంటే ఎలాంటిది. ఎంత పవిత్రమైన దేశము. ఎంత దివ్యమైన దేశము, ఎలాంటి ఆదర్శవంతమైనదేశము, ఎంతటి ప్రేమపూరితమైన దేశము, ఎంతటి విశాలమైన దేశము? విద్యార్థులు మొట్టమొదట మనదేశము యొక్క విశిష్ఠతను గుర్తించాలి.

(బృ.త్ర. పు. ౧౦)

ఎట్టి విద్యలు, నియమము లెరుగనట్టి
పక్షి, జంతువు, పశువులు, పరమమైన
నీమమును బూని, జీవించనేర్చియుండ
తెలివి గలిగిన నరునకే తెలివిలేదే!

(సా॥ పు. 6)

కోటీశ్వరులకైన కూడు గుడ్డయోగాని
బంగారమును తిని బ్రతుకలేరు
కాలమే గాకున్న కష్టయే పామగు
కలసి వచ్చిన మట్టి కనక మగును
పండితుడొక చోట పశువుగా మారు
మూర్ఖుండొక తరిని మునిగమారు
ధనవంతు నొకపరి దారిద్ర్యదేవత
ప్రేమించి వానితో వరుసలాడు
ప్రాకులుడుటయెగాని ప్రాప్తియే లేకున్న
దమ్మిడీయైనను దరికి రాదు
వద్దురా బాబు, వద్దు ఏ ఆశ హద్దు మీరి
బుద్ధి కలిగి జీవించుమో పెద్దమనిషి!

(ద. య.స. 98 పు. 48)

జీవితము

మనస్సనే యజమానికి ఇంద్రియములనే భార్యలు అధికంగా ఉండటంచేత భార్యలకు మనస్సువశమై పోయింది.
ఈ ఇంద్రియములకు మనస్సు స్వాధీనమై పోయి బుద్ధికి ఏ మాత్రమూ వశము కావటం లేదు. దేహముకంటె అతి సూక్ష్మములు ఇంద్రియములు. ఇంద్రియములకంటె అతిసూక్ష్మమైనది ఆత్మ. సర్వము ఆత్మ వశము కావలసిందే, తప్పదు. ఇంద్రియములు బలవత్తరమైనవి. ఈ ఇంద్రియములను అరికట్టినపుడే ఈ జీవితము ఆదర్శవంతమైనదిగా రూపొందుతుంది.

(బృ.త్ర. పు. ౬౦)

జీవితము ఒక (Musical chair) అనే ఆటవంటిది. ఈ ఆటలో ఎంతో మంది పాల్గొంటారు. భగవంతుడు band (Music) వాయిస్తాడు. ఎప్పుడు (band Music) వాయిస్తూ,

వాయిస్తూ ఆపివేస్తాడోనని జాగ్రత్తగ గమనించి, ఆగిపోయిన వెంటనే కుర్చీలో కూర్చోవాలి. **ఏమరుపాటుగ వుంటే సీటు అనే అనుగ్రహము లభించదు.**

(ప్ర.ప. పు.28)

(చూ॥ దూపాటి తిరుమలాచార్యులు, నియబద్ధజీవితం, పరుగు, బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి, యాంతేయతిస్సాగతిః, విద్య)

జీవితంలో జీరోలు

ఈనాడు మనం వినరాని మాటలు వింటున్నాము. కనరాని దృశ్యాలను చూస్తున్నాము, చేయరాని పనులను చేస్తున్నాము. ఇంక శాంతి మనకు ఏ రీతిగా లభిస్తుంది? ఎన్ని పవిత్రమైన ప్రబోధలు విన్నప్పటికీ మానసిక పరివర్తన కలగటం లేదు, హృదయం పరిశుద్ధం కావటం లేదు. ఇంక ఎందుకోసం వినాలి? ఎందుకోసం భజనలు చేయాలి? సత్సంగములో చేరినా దుర్భావములు వదలకపోతే ప్రయోజనం ఏమిటి? కొన్ని విషయాలు చెడ్డవని తెలిసినప్పటికీ అందులో ప్రవేశిస్తున్నాము. ఇది మంచిది కాదు. అనేక జన్మల పుణ్యఫలంతో మనం కొనుక్కున్న జీవితమే ఈ మానవజీవితము. దీనిని కేవలం లౌకికమైన వాంఛలకు అంకితం చేసి దుర్వినియోగం చేసుకోరాదు. రామాయణంలో రావణుడు, భాగవతంలో హిరణ్యకశిపుడు, భారతంలో దుర్యోధనుడు గొప్ప గొప్పవాళ్ళే తక్కువ వాళ్ళేమీ కాదు. వాళ్ళు గొప్ప గొప్ప హీరోలైనప్పటికీ **కామ వాంఛవల్ల రావణుడు, క్రోధం వల్ల హిరణ్యకశిపుడు, లోభం వల్ల దుర్యోధనుడు జీవితంలో జీరోలైపోయారు.** పాత్ర ఎంత పెద్దది అయినప్పటికీ దానికి చిల్లుంటే నీరు ఒక్క చుక్క అయినా నిలువదు గదా!

(శ్రీ.భ.ఉ.పు.196/197)

జీవిత అంతరార్థము

జలమునందు పుట్టిన బుడగ జలమునందే సంచరించి, జలమునందే జీవించి, జలమునందే ఐక్యమైనట్లుగా, ఆనందమునందు పుట్టిన మానవుడు ఆనందమునందే జీవించి, ఆనందమునందే సంచరించి ఆనందమునందే లయమందుటయే **నిజమైన జీవిత అంతరార్థము.** ఈ దృశ్యకల్పితమైన జగత్తు నందు పంచభూత మిళిత మైన జగత్తు నందు పంచభూతములలో పంచకోశములలో జీవించు మానవుడు నిజముగా నిరంతర ఆనందం అందుకోవడం నిమిత్తము. సామాన్యమా? అని సందేహింపనక్కరలేదు. మనము ఎక్కడ నివసిస్తున్నాము? భూమా, చాందోగ్య ఉపనిషత్తునందు చెప్పబడినది. **భూమా అంటే దైవత్వము. బ్రహ్మత్వము,** ఆత్మ యొక్క సహజరూపమే ఆనందము. అది నిరంతరము ఆనంద స్వరూపమే.

నిత్యానందం పరమసుఖం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాదిలక్ష్యం
ఏకం నిత్యం విమల మచలం సర్వధీసాక్షి భూతం
భావాతీతం త్రిగుణ రహితం సద్గురుం తంనమామి!

కనుక భూమానందం పొందుతూ, దుఃఖమునకు కొంచమైనా అవకాశం ఇవ్వకూడదు. కేవలము మాయ యందు మునిగి, అజ్ఞానమును జయించలేక, స్వార్థమునకు క్రుంగి మానవుడు దుఃఖమునందు కుమిలి పోవుచున్నాడు. ఆశలన్నీ క్రమక్రమముగా తృష్ణగా మారిపోతున్నాయి. తరువాత విచారముగా మారి పోతున్నాయి. విచారములన్ని వాసనగా నిలిచి పోతాయి. వాసనల యందు దుఃఖము మరింత అనివార్యమగును.

(సా.పు.307/308)

జీవితకాలము

జీవితకాలము అత్యల్పము. లోకము అతివిశాలము. కాలము అనంతము. అయిననూ అనంతకాలమునందే మానవుడు తనలోని దివ్యత్వమును కనుక్కొని ప్రకటించి అభివృద్ధి చేసుకొనవలెను. జనులు కామక్రోధద్వేషములను దూరముచేసి శాంతము, సౌమ్యము, సంతోషము మొదలైన సద్గుణములను అభివృద్ధి చేసికొనవలెను. వారు

జీవిత ఖైదు

ప్రేమోన్మత్తులై, కార్యతత్పరులై, ఉత్సాహభరితులై తమతమ కర్తవ్యములను నిర్వహించినపుడే దేశమునకు క్షేమము.

(స్వీ పు.328)

జీవిత ఖైదు

పరమాత్మ సముద్రమయితే నీ ఆత్మ అందులో చెలరేగే ఒక అలలాంటిది. సముద్రం వేరు, అలవేరు కాదు. కాని వేరు గా కనిపిస్తున్నాయి. ఆ రెంటి మధ్యా సంబంధాన్ని సరిగా అర్థం చేసుకోవటం లోనే జీవిత పరమార్థం వుంది. ఆహార నిద్రా భయమైథునాలవంటి కార్యక్రమాలు పశుపక్ష్యాదులకు కూడా సామాన్య ధర్మమే. **మానవ జన్మ విశిష్టత ఆత్మ దర్శనమే.**

పుట్టినప్పటి నుంచి గిట్టేదాకా పశుపక్ష్యాదులలాగా పొట్టపోసికొనే తాపత్రయమే అయితే జీవితం వృధాగా గడిచిపోతుంది. **మళ్ళీ ఇంకొక జీవిత ఖైదు. (జన్మ) తప్పదు.**

(శ్రీ.సా.గీ.పు.67)

జీవిత పరమార్థము

'సర్వమున్ కదలన్ జేసెడి కాలమూర్తికి నమస్కారము ' అన్నాడు భర్తృహరి. కాలము ఎవరినీ అనుసరించదు; ఎవరికోసమూ ఆగదు. **'శతమానం భవతు శతాయుః'** అన్నా అది విశ్వసించ దగినది కాదు. కారణము **'నిత్యం సన్నిహితో మృత్యుః'** క్షణక్షణము కాయము మృత్యువును సమీపిస్తూనే ఉన్నది. గడచి పోయిన కాలమును క్షణమైనా వెనుకకు త్రిప్పలేము. కాల ప్రవాహమును గుర్తించి వర్తించడమే కర్తవ్యము. మానవత్వమును మరువక, లక్ష్యమును విడువక, మానవ సంఘమునందు మానవునిగా జీవించడమే జీవిత పరమార్థము.

(స.సా.సె. పు.20)

(చూ॥ మతకర్తలు)

జీవిత పరమావధి

ఈనాటి విద్యలు లౌకికసంబంధమైనవి అయినప్పటికిని **"ఇహమున సుఖియింప హేమతారకవిద్య, పరమున సుఖియింప బ్రహ్మవిద్య". ఇది జీవనోపాధి; అది జీవిత పరమావధి.** జీవనోపాధివిద్య లేకుండిన జీవిత పరమావధియందును, జీవితపరమావధి మార్గమునందును మానవునకు అన్నివిధముల అభిరుచి కలుగనేరదు. కనుకనే **లౌకిక విద్యలను కూడను మీరు అలక్ష్యము చేయరాదు. చదువులతో పాటు సంస్కారము అత్యవసరము.** వాల్మీకి వ్యాసుడు ఈలాంటి మహర్షులందరూ ఆనాటి సంస్కారముతో పాటు లౌకికమైన చదువులు కూడను నేర్చుకోవటంచేతనే లోకమునకు పవిత్రమైన గ్రంథములను అందించి లోకమిత్రులు కాగలిగారు. 18 పురాణములు, వేదముల యొక్క విభాగములు ఆనాటి మహర్షులు చేయగలిగారంటే లౌకికవిద్యలు కూడను కొంత ఆదరణ తీసుకుంటున్నాయి.

(శ్రీ .గీ పు.3)

(చూ॥ ఆడంబరభక్తి)

జీవితమంటే

"లోభత్వమును మించిన వ్యాధి లేదు
క్రోధమును మించిన శత్రువు లేడు -
జ్ఞాన దారిద్ర్యమును మించిన దుఃఖం లేదు
ఆధ్యాత్మిక జ్ఞానమును మించిన సుఖం లేదు"

జ్ఞానములు ఐదురకములు 1. బుకిష్ నాలెడ్జ్ 2. సూపర్ ఫిషియల్ నాలెడ్జ్ 3. జనరల్ నాలెడ్జ్ 4. డిస్క్రిమినేషన్ నాలెడ్జ్ 5. ప్రాక్టికల్ నాలెడ్జ్. ఈనాడు ప్రాక్టికల్ నాలెడ్జ్ అత్యవసరం. ఈ జ్ఞానమే మానవునకు మూడవ నేత్రము వంటిది. ఈ జ్ఞానమే మానవునకు సుఖము నందించునది. **లోభమనే రోగమును, క్రోధమనే శత్రువును, దారిద్ర్యమనే దుఃఖమును దూరం గావించుకొనుటకు తగిన జ్ఞానమును మనం పెంచుకోవాలి. ఈ మూడింటి నివారణ నిమిత్తమై మనమీ సమావేశంలో పాల్గొంటున్నాము. జీవితమంటే ఏమిటో మనం కొంత అర్థం చేసుకోవాలి.**

"పని పాటలందునే మీ బ్రతుకంత తెల్లారే
ఇదియె జీవితమని ఎంచినారా?

మూడు పూటల మీరుభుజియించి తృప్తిగా
ఇదియె జీవితమని ఎంచినారా?
అలసట తీరగ హాయిగా నిదురించి
ఇదియె జీవితమని ఎంచినారా?
పనికిరాని కబుర్లు పగలంతా మాట్లాడి
ఇదియె జీవితమని ఎంచినారా?
ఇందుకా దేవుడీ జన్మ ఇచ్చినాడు?
తెలివితేటలు కలిగియు తెలియ లేక
కాలమును వ్యర్థంబుగా గడుపదగునె?
మనిసిగా మీరు ఇకనైన మసలరయ్య''

మీకు **కావలసినంత తెలివితేటలు ఉంటున్నాయి. కాని, వీటిని మీ జీవిత రహస్యాన్ని జీవిత లక్ష్యాన్ని గుర్తించడానికి ఉపయోగించే బదులు సుఖపడటానికి, ధనం సంపాదించడానికి,** పదవుల నందుకోడానికి ఉపయోగిస్తున్నారు. మీ జీవిత గమ్యాన్ని గుర్తించడానికి ఉపయోగించని తెలివితేటలు సార్థకం కావు.

(స.సా.డి. 95 పు.294)

జీవిత సంగ్రామము

"చారిత్రాత్మకమైన ఏడు సంవత్సరముల యుద్ధము. ముప్పది సంవత్సరముల యుద్ధము. నూరు సంవత్సరముల యుద్ధమునుగురించి మనము వినియున్నాము. అంతేకాకుండా మనిషికీ మనస్సుకూ మధ్యనూ, జీవికి మాయకూ మధ్యనూ, వ్యక్తికీ సామాజిక జీవితము మధ్యనూ యుద్ధము అనాదిగా నిరంతరమూ జరుగుచునే యున్నది. ఆదిమానవుడు మొదలు ఆఖరి మానవుని వరకూ ఈ సంఘర్షణ తప్పదు. **అర్జునునివలె భగవంతునే జీవిత రథసారథిగా భావించి, ఇంద్రియములు, కోరికలు, మనస్సు, బుద్ధివాటి ఆద్యంతములూ భగవంతునికి అర్పణము చేసిన కాని జీవిత సంగ్రామములో విజయము సాధించుట సాధ్యము కాదు.** ఆత్మ విద్య బోధించు పాఠమే యిది. ఈ పాఠమును నేర్చుకొను హక్కు ఈ యువతరమునకున్నది."

(స.శి .ను తృ.భా. పు.10)

జీవితానందము

(చూ॥ నిష్కామకర్మ)

జీవుడు

(చూ॥ తత్తు సమన్వయాత్, శివుడు)

జీవేశ్వర ప్రకృతి

నీవు దేహమును ఆధారముగా తీసుకుంటే యిది జడమైనది. ఈ దేహము యేరీతిగా తయారవుతుండాది? ఏడు బకెట్లు సున్నపునీరు, రెండించిల ప్రమాణముతో నున్న నాలుగు ఇనుప మేకులు,1100 అగ్గిపుల్లల్లో వున్న భాస్వరం, నాలుగు పెన్సిళ్లలో వున్న సీసము, రెండు లక్సు సబ్బులు ఇవన్నీ చేరితే ఒక దేహము తయారవుతుంది. సున్నపు నీరే రక్తముగా మారిపోతుండాది. దీనిలోనే ఐరన్ వుంటుండాది. ఈవిధముగా జడపదార్థములతో యేర్పడిన దేహము జడముకాక చైతన్యం ఎట్టవుతుంది? కనుకనే యిది దేహము అన్నారు. దేహి అనేవాడు దేహములో వుండటం చేతనే యిది నడుస్తూ వుంటుండాది. అదొక గోడగడియారం. అందులో మూడు పిన్ను లుంటున్నాయి. **ఒకటి సెకండ్లది, రెండవది మినిట్లది, మూడవది గంటలది.** కీ ఇస్తే మూడు తిరిగుతునే వుంటాయి. ఎంతవరకు తిరుగుతాయి? కీ వుండినవరకు తిరుగుతాయి. కీ నిలచిపోతూనే దానిని ఇది దీనిని అది కదల్చుకోదు. ఎక్కడివక్కడే నిలిచిపోతాయి. మన దేహమునేది ఒక గోడ. ఈ దేహమునకు హృదయము అనే గడియారం తగిలించారు. అక్కడ శ్వాసననే కీ, మనకర్మలే సెకండ్ల ముల్లు. మన భావములే మినిట్లముల్లు. మన ఆనందమే యిందులో గంటల ముల్లు. కర్మలు ఎందుకు చెయ్యాలి? సెకండ్ల ముల్లు తిరిగితే మినిట్సు ముల్లు ఒక్కయింటికి వస్తుంది. మినిట్సు ముల్లు అరవై యిండ్లు చుట్టేటప్పటికి గంటల ముల్లు ఒక్కయింటికి వచ్చేస్తుండాది. సెకండ్సు ముల్లు, మినిట్సు ముల్లు తిరిగేది మనకు కనిపిస్తుండాది. గంటల ముల్లు తిరిగేది కనుపించటము లేదు. **అక్కడే**

జీసస్ - జోరాష్టర్

మనలోపుండే సూక్ష్మత. ఈ మూడు కూడను గంటకొకతూరి కలుస్తున్నాయి. ఇదే జీవేశ్వర ప్రకృతి.

(శ్రీ .గీ. పు.277)

జీసస్ - జోరాష్టర్

జీసస్ మొట్టమొదట తాను దేవుని దూతనని చెప్పుకున్నాడు. క్రమక్రమేణ అంతరాత్మ తత్వాన్ని గుర్తించి, "నేను దేవుని కుమారుడను" అన్నాడు. తాను భగవంతుని కుమారుడైనప్పుడు భగవంతుని ప్రాపర్టీలో తనకు హక్కు ఉంటుంది కదా! కనుకనే భగవత్సంబంధమైన సదాలోచనలు, సచ్చింతనలు, సద్గుణములు ఆతనిలో ఆవిర్భవిస్తూ వచ్చాయి. ఈ ఆస్తి ఎప్పుడు లభ్యమైందో తండ్రియైన భగవంతుడుతన ఆస్తినంతా కుమారునికి అప్పజెప్పాడు. అప్పుడు జీసస్ అందులోను, ఇందులోను ఉన్నది ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించి, "నేను, నా తండ్రి ఒక్కటే" అన్నాడు. **అదే ఏకాత్మభావము.**

అదేవిధంగా పర్షియన్ మతప్రవక్తయైన జోరాష్టర్ కూడా మొదట 'నేను వెలుగులో ఉన్నాను' (I am in the light) అన్నాడు. అనగా భగవంతుడు స్వర్గములో ఉన్నాడనీ, అతని వెలుగులో తాను జీవిస్తున్నాననీ భావించాడు. తరువాత బయట కనిపించునదంతా రిఫ్లెక్షన్ ఆఫ్ ది ఇన్నర్ బీయింగే అన్న సత్యాన్ని గుర్తించి, 'వెలుగు నాలో ఉన్నది' (The light is in me) అన్నాడు. చిట్టచివరికి, 'నేను వెలుగును' (I am the light) అన్నాడు. **ఈ మూడింటినీ ద్వైత విశిష్టాద్వైత అద్వైత సిద్ధాంతములతో పోల్చవచ్చును.**

(స.సా.జూలై. 97 పు.171)

జూదము

(చూ॥ గాంబ్లింగ్)

జైమినీ మహర్షి

(చూ॥ మీమాంస)

జైలు

(చూ॥ జన్మ సార్ధక మార్గం)

జోడి ఆదిపల్లె సోమప్ప

(చూ॥ షిర్డీ సాయిబాబా)

జోరష్టర్

(చూ॥ జీసస్, పర్షియనులు)

జ్యోతి

ఒక జ్యోతి ఉంది. జ్యోతిపైన పది చిల్లులున్న కడవను బోర్లించాము. ఉన్నది ఒక జ్యోతి. పది రంధ్రాల నుండి పది జ్యోతులు కన్పిస్తాయి. కుండను బ్రద్దలు కొడితే లోపల ఉండేది ఒకే జ్యోతి. దేహం పది చిల్లుల కుండ. పది చిల్లులే పది ఇంద్రియములు. ఐదు కర్మేంద్రియములు. ఐదు జ్ఞానేంద్రియములు. పది ఇంద్రియములున్న దేహములో జ్యోతి కప్పివేసి ఉన్నది. దీనిపై మాయ అనే దట్టమైన వస్త్రమున్నది. కనుక ఆత్మజ్యోతి మొదట మాయను తొలగించాలి. అదే దట్టమైన వస్త్రము. దానిని తీసివేయగానే పది ఇంద్రియాలనే జ్యోతులు కన్పిస్తుంటాయి. అప్పుడు దేహ భ్రాంతిని బ్రద్దలు కొట్టాలి. వెంటనే జ్యోతి దర్శనమవుతుంది.

(త్వ.శ పు. 47)

దృష్టి నొక జ్యోతి లేక దీపిక మీద కేంద్రీకరించుము, ఆ జ్యోతి భ్రూమధ్యము ద్వారా నీ హృదయ కుహరము ప్రవేశించుచున్నట్లూహింపుము. నీ యందున్న ఈర్ష్య, ద్వేష, అసూయ, అహంకారములు ఈ జ్యోతిచే భస్మీపటలమైనవని ఊహింపుము. ఈ జ్యోతి అంగ అంగమునందూ నీ శరీరమంతటా వ్యాపించనిమ్ము. తదుపరి ఆ జ్యోతిని కపాలము ద్వారా బహిర్గతము చేసి

దానిని సమస్త మానవాళికీ, మిత్రులూ, శత్రువులూ అను భేదము చూపక అందరికీ ప్రసరింపజేయుము.

(శ్రీ సూ. పు.44/45)

(చూ॥ జ్యోతిశ్చరణాభి ధానాత్, ప్రకాశము, భగవన్నామము, భారతదేశము)

జ్యోతి ధ్యానము/జ్యోతిర్ధ్యానము

జ్యోతినే ఎందుకు తీసికోవాలి? ఇసుకనుండి కొంత తీసికుంటే ఇసుక తరిగి పోవును. ఒక తొట్టి నుండి తలా కొంత నీరు తీసికుంటే తొట్టి ఖాళీ యగును. కాని ఒక కొవ్వొత్తి మంట నుండి **వేయి మంది వేయి కొవ్వొత్తులను వెలిగించుకున్నా ఆ మంట తరగదు. దీపమును కాని,కోవ్వొత్తిని కాని వెలిగించు. ఆ జ్యోతి వైపు తదేక దృష్టితో చూడు. ఆ జ్యోతిని నీ హృదయములోకి గొనిపోయి హృదయ కమలములో దళముల మధ్య దర్శించు.** ఆ దళములు విప్పారుటను, ఆ జ్యోతి హృదయమును ప్రకాశమానము చేయుటను గమనించు, అప్పుడు దురాలోచనలు తొలగిపోవును. తరువాత జ్యోతిని హస్తముల లోకి ప్రవేశపెట్టుము. ఇక ఆ హస్తములు దుష్టకార్యములలో నిమగ్నము కావు. క్రమముగా జ్యోతిని నేత్రములలో, శ్రవణేంద్రియములలో ప్రవేశ పెట్టు. ఇక అవి ఉల్లాసకరమైన, విశుద్ధమైన స్పందనలను మాత్రమే గ్రహించును. జ్యోతిని శరీరములోని ఇతర భాగములలో ప్రవేశ పెట్టు. తదుపరి జ్యోతిని బయటకు తీసికొని వచ్చి నీ స్నేహితులయందు, బంధువులయందు, శత్రువులయందు, జంతువులయందు, పక్షుల యందు, వృక్షములయందు, ఇంకా ఇతర వస్తువులయందు, ప్రవేశ పెట్టుము. సర్వమూ ఆ జ్యోతి ద్వారా ప్రకాశవంతమగును. **క్రీస్తు "అందరూ ఒకటే. అందరి పట్ల సమరసభావముతో వ్యవహరించు"**,అని నుడివెను. ఆ విధముగా, నీవు నీ దేహమునకు మాత్రమే పరిమితుడవు కాక విశ్వమంతా వ్యాప్తి చెందెదవు. ఇప్పుడు విశాలముగా నున్న ప్రపంచము అప్పుడు ఎంతో చిన్నది యగును. ఆత్మ స్థాయినుండి ఎదిగి నీలోని జ్యోతిని పరమాత్మగా నెరుగటయే మోక్షము. మోక్షము ఈ స్థితికి భిన్నమైనది కాదు.

నిటారుగాకూర్చొనుట ముఖ్యము. వెన్నెముకలో ప్రాణ శక్తి తొమ్మిది, పన్నెండు పూసల మధ్య కలదు. ఆ భాగములో దెబ్బ తగిలిన అది పక్షవాతమునకు దారితీయును. దేహము నిటారుగా నున్న జాగృతమైన ప్రాణ శక్తి పైకిలేచి ఏకాగ్రత లక్షణమును మనస్సున కందించును. పిడుగుపాటునకు వాహకముగా నుపయోగించు లోహపు కడ్డి (lightning conductor) పిడుగు నెట్లు ఆకర్షించునో ఆ విధముగనే నిటారుగా నున్న దేహము, దివ్య శక్తి ప్రవేశించుటకు వాహకముగా పనిచేయును. ఆ దివ్య శక్తినీ కార్యము సఫలీకృతమగుటకు, నీవు గమ్యస్థానమును చేరుటకు వలసిన శక్తిని నీకు ప్రసాదించును. ఇంకొక ఉదాహరణ - రేడియో సంకేతముల వలె దివ్య శక్తి ఎల్లవేళలా ఉండును. రేడియో సంగీతమును వినవలెనంటే సంకేతములను గ్రహించుటకు యాంటెన్నా ఉండవలెను. అంతే కాదు సరిగా ట్యూన్ (tune) చేయకపోయిన యెడల శబ్దము వచ్చును కాని సంగీతము రాదు. ఆ విధముగానే అన్ని వేళలా ఉండు దివ్య శక్తినీ దేహము నిటారుగా నున్న, నీ ధ్యానము సక్రమముగా నున్న నీ యందు ప్రవేశించును. **బ్రహ్మ ముహూర్తమనగా తెల్లవారు ఝామున, మూడు నుండి ఆరు గంటల మధ్య కాలము. ఆ సమయములో ఇంద్రియములు నిశ్చలముగానుండును. పగటిపూటలో వలె చంచలముగా నుండవు. నిద్రించుటచే, మనస్సు కూడా ప్రశాంతముగా నుండును. సమయమును మార్చక, ప్రతిదినమూ అదే సమయములో ధ్యానము చేయవలెను. తెల్లవారు ఝామున అరగంట, సాయంకాలము అరగంట కాలము ధ్యానము చేసిన చాలును.** దినమంతా ధ్యానము చేసిన యడల రెండు సంవత్సరములలో దానిపై శ్రద్ధాసక్తులు సన్నగిల్లును. ఉత్సాహమును కలిగించుటకై ఆధ్యాత్మిక సాధన పలుతీరులుగా నుండవలెను. **కొంత భజన, కొంత నామస్మరణ కొంత సత్సంగము - ఆ**

జ్యోతిశ్చరణాభిధానాత్

విధముగా మార్పు ఉండవలెను. నిత్య జీవితములో మార్పు ఏ విధముగా ఉత్సాహమును రేకెత్తించునో అట్లు. **మొదట నీవు జ్యోతి యందున్నావు. తరువాత నీలో జ్యోతి యున్నది. చివరగా నీవే జ్యోతివి. ఆ జ్యోతి సర్వత్రా కలదు.ఆ ఆనందమును కొంతసేపు అనుభవించి ఆ జ్యోతిని తిరిగి నీ హృదయకమలములో నిడుకొని దినమంతా ఆ విధముగానే ఉంచుకొనుము.** భగవద్రూపమును కూడా జ్యోతిలో కలుపవచ్చును. కృష్ణ రామ, జీసస్, సాయి - నీ అభీష్టమునకు అనుగుణముగా ఇష్టదేవతా రూపమును జ్యోతి మధ్య భాగములో దర్శించవలెను. అప్పుడు నీవు భగవంతునితో పాటే ఉంటావు.

ఈ యెగమా, ఆ యోగమా అనునది దీనికి సమాధానము కాదు. ఇతర ధ్యాన పద్ధతులను అవలంబించు వారు కూడా సాయి కేంద్రములో చేరవచ్చును. అందరూ ఒకే గమ్యస్థానము నాశించి కలసి ప్రయత్నము చేయవచ్చును. ప్రేమ ద్వారానే భగవంతుని చేరవచ్చును. ప్రాణాయామము, హృదయమును, ఊపిరితిత్తులను ప్రయాసకు, వత్తిడికి గురిచేయును. ప్రాణాయామము చేయవలెనంటే మంచి ఆరోగ్యముండవలెను. భక్తియోగము అత్యుత్తమమైనది. అతి సంకీర్ణత గందరగోళమునకు దారితీయును. **జ్యోతి ధ్యానము నిరపాయకరమైనది, నిస్సందేహముగా నిన్ను గమ్య స్థానమునకు చేర్చును.**

(ప.ప్ర పు.266/269)

జ్యోతిశ్చరణాభిధానాత్

ఇది భౌతిక జ్యోతిని నిర్దేశించుటలేదు. జ్యోతికి భౌతికమగు హద్దు చెప్పబడిన సర్వాత్మకము కాదు కదా! కాన అది ఉపాసనా విషయము కాజాలదు. ఈ జ్యోతి శరీరమందున్న ప్రాకృత లక్షణమగు జ్యోతియే అన్న బ్రహ్మ ప్రత్యభిమానము సాధ్యము కాదు. **"పాదోస్య విశ్వ భూతాని"** అని పురుషసూక్తములో చెప్పబడుటచేత దీనికి ఒక ప్రమాణము, కొలత అంటూ లేదు. కావున ఇక్కడ పరబ్రహ్మము కాదు. ఇది స్వర్గము లోకముకంటే పరమై, దీప్తమవుతుంది. ఏదైతే సర్వప్రాణుల సృష్టి భాగములకంటే పూర్వమున వెలుగుచున్నదో, దేనికంటే మించిన లోకము లేదో అట్టి ఉత్తమోత్తమ లోకములో ప్రకాశించు జ్యోతి యిది. **ఈ జ్యోతి సర్వప్రాణులయందూ, సర్వత్రా, సర్వదా ప్రకాశించు చున్నది. అస్తి, భాతి, ప్రియ, రూపమైనది ఈ జ్యోతి.** ఈ పరబ్రహ్మమే ప్రపంచమును ప్రకాశింపజేయు చున్నాడు. జ్యోతి శబ్దములో చెప్పబడిన పరమాత్మ యిట్టిదికాని, లౌకిక జ్యోతులుకావు. **ఇదే పరంజ్యోతి అద్వైతజ్యోతి. అదే పరబ్రహ్మము.** అతని వలననే ఈ సమస్తమును ప్రకటితమగుచున్నది. అయితే ఈ జ్యోతి పరబ్రహ్మమును గురించి చెప్పినది కాదని వాదించుట తగనిది. సరికానిది.

ఉపనిషత్తులు బ్రహ్మమునకు నాలుగు పాదము లున్నవని చెప్పుచున్నవి. జ్యోతి శబ్దము బ్రహ్మమునకు అన్వయించునని కూడా చెప్పబడినది. అందులో ఒక పాదము సర్వ భూతముల అంతర్గత మొనరించుకొనుచున్నది. మిగిలిన మూడు పాదములు దివియందు అమృతము. ఈ అమృతము సాధారణజ్యోతి కాజాలదు. మరొక పక్షము వారు **ఉపనిషత్తునందు గల 'జ్యోతిః' 'దీప్యతే' అను పదములు బ్రహ్మమునకు అన్వయింపక ప్రాకృత జ్యోతికి మాత్రము అన్వయించునని వాదించు చున్నారు. ఇది అర్థము లేనిది.** దీప్యమానమగు తన కార్యజ్యోతి ఉపాధిగా గల బ్రహ్మమునందే ఆ పదములన్వయించుచున్నవి. ఒక దానిని ప్రకాశిపచేయునది 'దీప్యతే' అని తెలుపుచున్నది. అయితే సమస్త జగత్తునకు ప్రకాశము నొసగు బ్రహ్మమును జ్యోతి అని తెలుపుట శ్రుతి వాక్యము. **కదిలే జగత్తుకు ఆధారమై, మూలమై, కీలకమై స్థిరముగా కదలక సత్యమై యుండునది. అదే బ్రహ్మ, అదే జ్యోతి. కదిలే జగత్తుకు ఆధారమైన బ్రహ్మకూడా కదిలిన అదే ప్రళయము.** చిన్న ఉదాహరణము రైలు కదలిపోతూ వుంటుంది. దానితో పాటు పట్టాలు కూడా కదిలిన

ప్రయాణీకుల గతి యేమవుతుంది? అటులనే మనము కదలుచుండినను, మనము నడచేదారులు కదలవు. అందువలననే మనము క్షేమంగా ఉండగలుగుతున్నాము. **సమస్తజ్యోతులను అనగా ఒక్కొక్కదానిని వెలిగించే జ్యోతిని దీపమని యందురు. సమస్తమునూ వెలిగించి, నిరూపించే దానిని జ్యోతి యందురు.** లోకములోని అగ్నిని, జఠరములోని అగ్నిని, కన్నులలోని చూపును, చంద్రునిలోని కాంతిని వెలిగించేది సూర్యుడు. ఆసూర్యుని వెలిగించేది బ్రహ్మ. **అట్టి బ్రహ్మనే జ్యోతి అని చెప్పబడినది** కాని, పదార్థములను వెలిగించే దానిని కాదు. **జగత్తునే వెలిగించే దానిని జ్యోతి అని చెప్పనగును.**

(సూ.వా పు.49/51)

జ్యోతిష్య శాస్త్రము

జ్యోతిష్య శాస్త్రము ప్రకారము నిర్ణయించే భవిష్యద్విషయములలో ఒకదానికింకొక దానికి పొంతన ఉండదు. ఇది కొంత వరకు పొరపాటుకు దారితీస్తుంది. కాలమును కచ్చితముగా గుణించడము కష్టము. ఇది పొరపాట్లకు దారితీస్తుంది. జ్యోతిష్యము గ్రహములను ఒక కోణములో నుంచి మాత్రమే చూడగలుగుతున్నది. గ్రహము లను సంపూర్ణముగా వీక్షించలేకపోవడము పొరపాట్లకు మూలము. సృష్టిలో ప్రతివొక్కటి మార్పు చెందును. మనుష్యులు మార్పు చెందుతారు. అట్లాగే గ్రహముల కూడా. జ్యోతిష్యులు ఈ మార్పులను పరిగణించరు. ఇది పొరపాట్లకు దారితీస్తుంది. జ్యోతిష్కులకు శాస్త్రము లపై సరియైన అవగాహనుండదు. అందువలన అనేక పొరపాట్లు జరుగుతాయి. జ్యోతిష్కులు పవిత్రమైన జీవితములను గడుపకపోవుటచే వారికి ఆధ్యాత్మికపరమైన సహాయము అందుబాటులో ఉండడము లేదు. ఇది కొన్ని పొరపాట్లకు దారితీస్తున్నది. ఇన్ని పొరపాట్లు జరుగుచున్నందు వలన జ్యోతిష్యము ఆధారపడదగినది కాదు. దానిని గురించిన ఆలోచన వ్యర్థము.

(ప.ప్ర పు.33)

జ్ఞాతుం

భక్త్యా త్వనన్యయా శక్య అహమేవం విధోర్జున।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరన్తప॥
ఈ వాక్యము సాధకుని పారమార్థిక క్రమవికాసమును చక్కగా చిత్రించుచున్నది. భక్తియోగములో ముముక్షువునకు యీ వాక్యములు ప్రధానసోపానములు. **జ్ఞాతుం అనగా శాస్త్రము గురుపుద్వారానో లేక యేమహనీయుని వాక్యముచేతనో యే గ్రంథ పఠనముచేతనో భగవంతుడున్నాడు అనే విషయాన్ని విశ్వసింపజేస్తుంది. శ్రవణము చేతను, పఠనము చేతను భగవంతుడున్నాడు, అనే విషయాన్ని మాత్రమే విశ్వసిస్తాడు సాధకుడు.** భగవంతుడున్నాడు అనే విషయాన్ని తెలుసుకున్నంత మాత్రమున వానికి తృప్తి చేకూరదు. ఇది ప్రాథమికస్థానము.

(శ్రీ.స.గీ. పు. 41)

జ్ఞానము

మనోనాశనము వలన కలిగిన మౌనమనేది నిజమైన జ్ఞానము. ఈ జ్ఞానము తెలివితేటల వల్ల గాని లేక బుద్ధి కుశలత వలన గాని మరియే విధమైన ఆదర్శము వల్లగాని లభించేది కాదు. ఇది సహజము. ఇది కొత్తగా మనము సంపాదించుకొనే వస్తువు కాదు. నిగురు గప్పిన నిప్పువలె పాచికప్పిన జలమువలె, పొరకప్పిన కన్నువలె, మడినో భ్రాంతి కప్పిన ఆత్మగా నుండుటచేతనే యీ జ్ఞానమును మనము గుర్తించలేకపోతున్నాము. ఈ నివురు నిప్పుపైన ఎట్లా వచ్చింది? ఎక్కడ నుండి వచ్చింది? నిప్పు నుండి వచ్చింది? జలము పైన కప్పిన యీ పాచి ఎక్కడ నుండి వచ్చింది? జలము నుంచే వచ్చింది. మనకంటిలో పుట్టిన పొర బయట నుంచి వచ్చిందా? లేదు. మన కన్ను నుండియే ఆవిర్భవించింది. కప్పిన పొరను తీసివేస్తే స్వస్వరూపమైన తత్వము సాక్షాత్కరిస్తుంది.

జ్ఞానము గ్రంథాలవల్ల లభించేది కాదు. గురువులు ప్రసాదించేది కాదు. పరమాత్ముడు అందించేది కూడా కాదు. **తానేపరమాత్మ, తానే జ్ఞానము తానే ఆత్మ.**

(బృ.త్ర.పు. ౧౩౩)

తమ నిమిత్తము తాము ఆచరించే కర్మలు, కర్మజీవులు ఆచరించే కర్మలు, లోక కళ్యాణనిమిత్తమై ఆచరించే

కర్మలు జ్ఞానానికి సంబంధించినవి. జ్ఞాన జ్ఞానముల సమన్వయమును మనము చక్కగా గుర్తించడానికి ప్రయత్నించాలి. దేహాభిమానము త్యజించి, ఆత్మాభిమానమును అభివృద్ధి పరచుకొని, అహంకారమును నిర్మూలనము చేసికొనడమే నిజమైన జ్ఞానము - ఇది సంసారికిగాని, సన్యాసికిగాని, సహజమైనదే. విత్తనము మొక్కై, వృక్షమై, అది ఆకులు, కొమ్మలు, పువ్వులు, కాయలు మొదలయిన వివిధ నామ రూపములుగా గోచరించినప్పటికిని, అన్నియు విత్తనమునుంచే ఆవిర్భవించినవియే. ఇదే సత్యము ఇదే నియమము ఇదే తత్త్వమసి.

(సా॥ పు. 382)

"జ్ఞానేన హీనాः పశుభిస్సమానాः" అనగా జ్ఞానహీనులయిన వారు పశువులతో సమానము అనబడుచున్నారు. జ్ఞానమే సర్వానర్థ నివృత్తికరమైన శాశ్వతానందమోక్షమని కూడా వేదము ఒప్పుకొనుచున్నది. అట్టి స్థానమునకు అనేక మార్గములున్ననూ, భక్తి ముఖ్యసాధనమై వెలసియున్నది. అందుకనే వశిష్ఠ, నారద, వ్యాస, జయదేవ, గౌరాంగ, ఇత్యాది మహాపురుషులు, మహానీయులు కూడ ఆ మార్గమును అవలంబించిరి.

(జ్ఞా వా పుట 33)

జీర్ణకోశాలు దేహాన ఎవరు చేర్చె
జనన మరణాలు ఎవరిచే కలుగు చుండు
వాని నెరుగంగ నేర్చుటే జ్ఞానమగును
ఉన్నమాట తెలుపు చున్న మాట.

(భ స ప్ర పం పు.18)

తనకంటే భగవంతుడు అన్యముగా యెక్కడో ఉన్నాడను భావమే పరోక్షజ్ఞానము. సర్వవ్యాపి అయిన పరమాత్ముడు నాలోనే ఆత్మ స్వరూపమున ఉన్నాడను భావమే అపరోక్షజ్ఞానము. సర్వకర్మలూ భగవత్పరముగా నొనర్చినవారికి చిత్తబుద్ధి కలుగునని తెలిపెను. భగవంతుని జన్మకర్మలు దివ్యములని తెలిసికొమ్మనెను. అయితే మహనీయులు మాత్రమే దివ్యకర్మ జన్మలను గుర్తెరుగుచున్నారు. అందరికీ సాధ్యమయ్యేది కాదు. అట్లని అంతటితో ప్రయత్నమును మానకూడదు. సాధ్యమైనంతవరకు ప్రయత్నలోపము లేకుండా రాకుండా చూచుకొనవలెను.

(గీ.పు. 65)

(చూ॥ అంతర్వాణి, అమానిత్వము, అవస్థలు, ఆత్మజ్ఞానులు, కర్మ, క్షేత్రజ్ఞుడు, జీవితమంటే, జ్ఞాని, త్రికాండస్వరూపము, దివ్యప్రకటనలు, దైవబలము, నమస్కారము, పశువు, పురుషార్థము, ప్రకాశం, బుద్ధి, బ్రహ్మసాక్షాత్కారజ్ఞానము, భాగవతము, మనసు, మంచినడత, లోభం, విశ్వాసము, వేదములు, సత్యము, హరినామము)

జ్ఞానగుణము

పొంగుట కృంగుట పనికిరాని వృత్తి. సుఖదుఃఖములు, కష్టనష్టములు, నిందాస్తుతులు భగవత్ ప్రసాదములేనని భావించవలెను. ముండ్లు వున్నచోట చెప్పులు వేసుకొని ముండ్లబారి నుండి తప్పించుకొన్నట్లు, వర్షము కురియు సమయమున గొడుగును పట్టి వానకు తడువకుండునట్లు, దోమలు వుండు స్థానమున దోమతెర కట్టుకొని వాటి బాధనుండి దూరమయినట్లు, వచ్చే నష్టకష్టములకు, నిందాస్తుతులకూ యిష్టా అయిష్టములకూ ఈశ్వర అనుగ్రహమేనను సమాధాన చిత్తమును ధరించిన అవి మానవులను యేమియూ బాధించలేవు! అందులకే సమ చిత్తత్వము అవసరము.

(గీ. పు. 211)

జ్ఞానగుణము జనసంఘమున ప్రీతి లేకుండుట. అనగా, విషయాసక్తి కలవారితో పొత్తు చేరకుండుట. క్రూరమైన మృగముల మధ్యనుండియైననూ క్షేమమైన స్థితిని పొందవచ్చును కానీ, సామాన్యమైన పామరుల మధ్య సంచరించుచు సాధనను కొనసాగించ సాధ్యము కాదు. అట్టి సాధన, సంఘమును వట్టి సంబంధ మేర్పరచును. మంచి వారితో చేరిన మంచి సంబంధం, చెడ్డవారితో చేరిన చెడ్డ అలవాట్లు సంభవించును.

జ్ఞాన జ్యోతి

మొదలే, మంచీ చెడ్డ నిర్ణయించుట కష్టము కనుక సామాన్య మానవులకు దూరముగా వుండి సాధన సాగించుట యెంతో ఉత్తమము. మానవుని మనసు ఇనుమునకు పోల్చబడినది. మానవుడను ఇనుము, మట్టితో చేరిన త్రుప్పుపట్టి, తుండ్లవుతుంది. అగ్నితో చేరిన నిర్మల మవుతుంది. అందువలననే జ్ఞానుల సంఘము చేరిన, సత్ పురుషుల సంఘము చేరిన, యేకాంతమునకంటే నెక్కుడు ఫలమును పొందవీలుండును. దానీ పుత్రుడయిన నారదుడు కూడనూ సత్ సంఘముచే దేవఋషి అయ్యాడు. కిరాతక వృత్తిలో సంచరించుచున్న రత్నకారుడు సప్తఋషుల సాంగత్యముచే ఆదికవి యైన వాల్మీకిగా మారినాడు. దుస్సంగత్వము అతి ప్రమాదము. అగ్నిని ముట్టిననూ అంత కాల్చదు కానీ అగ్నిలో కాలిన ఇనుము దారుణము. అటులనే, **పాపమునకంటే, పాపాత్ముని సంఘము మరింత పాపము కాగలదు.** కాన సాధకుడు ఈ విషయమున అతి జాగ్రత్తగా మెలగవలసి యుండును.

(గీ. పు. 213)

(చూ॥ ఇరువది గుణములు)

జ్ఞాన జ్యోతి

దేవాలయంలో నిత్యం దీపం పెడుతారు. ఆదీపం ఎవరికోసం? దేవుని కోసమా? ఆయనకీ ప్రమిద ఎందుకు? ఆయనే జ్యోతిస్వరూపం. కోటి సూర్య ప్రభాసమానుడు కదా! ఆయన తేజాలన్నిటికీ అతీతం. ఈరాతి మందిరాన్ని ప్రకాశమానం చేయటం కోసం కాదుదీపం! నీ హృదయాంతరాళంలో జ్ఞానజ్యోతిని వెలిగించుకో అని గుర్తు చేస్తుంది. ఆ దీపం! గుడి అంటే నాలుగు రాతి గోడలు కాదు. 'దేహో దేవాలయ ప్రోక్తః' దేహమే దేవాలయము అని చెప్పారు. మరి ఆ గుడిలో దేవుడెవరు? 'జీవోదేవస్సనాతనః' సనాతనంగా వున్న దైవం జీవుడే.

(శ్రీ.సా.గీ.పు.8)

జ్ఞానదేవతుకైవల్యము

"జ్ఞానాదేవతు కైవల్యం" ఆత్మ తత్త్వజ్ఞానం, సమ్యగ్దర్శనం లభించినదా, మోక్షము నీలోనే వుండును! ప్రకృతి అనాది అయినను అనంతం కాదు. పురుషుడైన క్షేత్రజ్ఞుడు అనాది, అనంతుడు అతనే పరబ్రహ్మము.

(గీ. పు. 215/216)

(చూ॥ పరిక్షిత్ ప్రార్థన)

జ్ఞాన నేత్రము

(చూ॥ భక్తసులభుడు)

జ్ఞానబోధ

(చూ॥ సత్సంగము)

జ్ఞానమార్గము

(చూ॥ మాయ)

జ్ఞానయజ్ఞము

మనో వాక్కాయములను ధర్మసాధనల కొరకు వినియోగించిన అది తపోయజ్ఞమగును. ఒకవేళ శరీరమునకు అన్నము దొరకక పస్తుపరుండిన, అది తపస్సగునా? కాదు. **చిత్తవృత్తులను అణచుకొనుట యోగమందురు, సర్వకర్మలూ చేయుచూ కర్మ బంధములకు చిక్కకుండుటే యోగమందురు, మనస్సును భగవంతునితో లగ్నము చేయు సాధనే యోగము.** ఇక స్వాధ్యాయమన, మోక్షశాస్త్రములను భక్తి శ్రద్ధలతో వినయ భయ విశ్వాసములతో పఠించుట. వీటివలన ఋషి రుణము తీరును. దీనివలన పుణ్యము లభించుటయే గాక పాపము నశించును. తరువాత జ్ఞాన యజ్ఞము. ఇది అపరోక్ష జ్ఞానము కాదు. సాధన రూపమైన పరోక్ష జ్ఞానము. వీటికి సంబంధించిన శాస్త్రములను శ్రద్ధతో విని, పఠించి యుక్తి ప్రయుక్తులతో మననము సలుపవలెను ఇది

సిద్ధరూపము కాదు. ఇట్టి దానినే జ్ఞానయజ్ఞమందురు. పెద్దలవలననూ ఆత్మవిచారణ సలిపి, ఆత్మతత్త్వమును యెరుగవలెనను ఆశనే జ్ఞానమని అందురు. జ్ఞానయజ్ఞమని పిలుతురు. విహితమైన కర్తవ్య కర్మల నొనర్చవలెను. అర్జునా! ఇట్టి పవిత్రజ్ఞానము అందరికీ లభ్యమగునా అని సంశయింతువేమో! లేక ఇది లభించు వుపాయమేది అని ప్రశ్నింతువేమో! విను, ఈ పవిత్రమైన తత్వమును బడయ గోరువారు తత్వవేత్తలగు మహనీయుల చెంతచేరి వారి చిత్తములు ప్రసన్నము లగునట్లు చేసి, సమయ సందర్భములు చూచుకొని వారి మనసు నెరింగి మెలగవలెను."

(గీ.పు.86)

జ్ఞానయోగము

(చూ॥ శ్రేష్టుడు)

జ్ఞానసిద్ధి

"జ్ఞానసిద్ధి కేవలమూ అంతఃకరణ సంబంధము. అది ఆలస్యముగా సిద్ధించును. అంత వోపిక మానవునియం దుండుటలేదు. స్థూల శరీరానికే ప్రాధాన్యత యిత్తురు **సామాన్యమానవులు దాని సంబంధమునే బలపఱచుకొందురు కామనాసక్తులగుటవలన వారు జ్ఞానసిద్ధిని ఆశించక కర్మసిద్ధిని ఆశింతురు.** లోకమున విషయగ్రస్తులు యెక్కువగాని విచారగ్రస్తులు తక్కువ. విషయగ్రస్తులు నిరంతరమూ శరీరపుష్టిని మాత్రము, ప్రత్యక్ష గోచరమును మాత్రము ప్రమాణముగా పాటింతురు. ఆ చింతనయందే తత్పరులై యుందురు. **విషయగ్రస్తులు ఆత్మీక పుష్టిని ఆశించి నిరంతర సాక్షాత్కారప్రాప్తికై సర్వం బ్రహ్మతత్త్వమును ప్రదర్శించుటకై ప్రయత్నింతురు అందులోనే వారి కాలమును, కర్మను చేర్తురు. ఇది సక్రమమార్గము! కర్మోపాసన సక్రమ మార్గము కనుక సక్రమమార్గమయిన ధర్మ కర్మలనూ జ్ఞాన విచారణనూ సరియైన హద్దులలో ఇమిడ్చి, వాటిని నిలబెట్టి లోకమునకు వాటియొక్క సత్యమును తెలుపుటే నా కర్తవ్యము.**

(గీ. పు. 68/69)

జ్ఞాని/జ్ఞానులు

జ్ఞానికి పునర్జన్మలేదు. ఏమిచేసినా తాను చేసినానని అనుకోడు. అందుచేత అతనికి బంధములేదు. అజ్ఞాని ఏ పనిచేసినా, తానే చేశాననుకుంటాడు. తెలిసికోవలసినది తాను తెలిసికోడు. పూర్వ జన్మ కర్మల యొక్క బాధ్యత యిద్దరికి సమమే. దీనికంతటికి కారణము మనస్సే. జనన మరణములకు మనస్సే కారణం. మోక్షానికి మనస్సే కారణము. అన్ని విషయాలకు కారణం మనస్సే.

(సా॥ పు. 429)

జ్ఞానులలో నాలుగు విధములు కలరు, 1) బ్రహ్మవిత్ 2) బ్రహ్మ విద్వరః 3) బ్రహ్మవిద్వరీయాన్ 4) బ్రహ్మవిద్వరిష్ఠః - ఇది జ్ఞాని యొక్క సాత్విక గుణాభివృద్ధి ననుసరించి నాలుగు విధములుగా చేసిన విభజన.

ఇందులో మొదటివాడు బ్రహ్మవిత్తనెడి జ్ఞాని పత్యపత్తి అనేడి నాలుగవ భూమికలో నుండును. రెండవ వాడైన బ్రహ్మ విద్వరః అనెడి జ్ఞాని అసంసక్తి అనేడి ఐదవభూమిక యందుండును. మూడవవాడైన బ్రహ్మవిద్వరీయాన్ అను జ్ఞానిపదార్థభావన అనేడి ఆరవ భూమిక యందుండును. నాలుగవవాడైన **బ్రహ్మవిద్వరిష్ఠః అనెడి జ్ఞాని ఏడవ భూమికయందు తురీయావస్థలో నుండును. ఏడవ భూమికయందున్న బ్రహ్మ విద్వరిష్ఠుడు ఎల్లప్పుడు సమాధిస్థితి యందుండును. బ్రహ్మవిద్వరిష్ఠుడు విదేహముక్తుడు,** అతనికి అన్న పానాదులు సహితము బలాత్కారముచే తినిపించ వలసివచ్చును. లోకమునకు ఏ పనియూ చేయడు. అట్టివారికి దేహస్పృహ యుండదు. బ్రహ్మవిత్తుగాని, బ్రహ్మవిద్వరుడుగాని, కొంత దేహజ్ఞానమును కలిగియుందురు. వారి వారి యొక్క సంస్కారమును అనుసరించి ప్రపంచమున పనిచేయుదురు. ఇట్టివారికి మనోనాశనము ప్రధానము. మనోనాశనమనగా మనస్సును అంతమొందించుట. ఇవియు రెండు విధములు. 1. స్వరూప నాశమనగా చిత్తముతో కూడా రూపమును నాశనమొనరించుట. 2. అరూపనాశము అనగా చిత్తమును మాత్రమే నశింపజేయుట.

జ్ఞానుల లక్షణము

ఎవనియందు రాగద్వేషములు మద మాత్సర్యములు ఉండవో, ఎవనికి ఇంద్రియ భోగములందాసక్తి యుండదో, అట్టి మానవుడు ఎవడైనను సరే, వాడు మనోనాశము కలవాడని చెప్పబడును. అతని చిత్తము ఏ విధముగను వృత్తులు కలిగి యుండదు. స్వరూప నాశమనెడి చిత్తముకల జీవన్ముక్తునికి రాజస తామసములు నశించి సత్వము మాత్రము మిగిలి యుండును. అట్టి శుద్ధ సత్వగుణముచేత అతడు మైత్రి కరుణ కలవాడై యుండును. విదేహ ముక్తుని యందు శుద్ధ సత్వము కూడా నశించును.

(జ్ఞా. వా. పుట 15)

శాస్త్రజ్ఞానమును ఆచార్యులద్వారా శ్రవణముచేసిన కొంత సహాయ కారులే కానీ నిజాకారమును చూపించలేరు. అనుభవజ్ఞానముతో పాటు అసూయరహితుడై పరమ రహస్యమైన ఆత్మ తత్వమును యెవడు తెలుసుకొనునో వాడే పరిపూర్ణ జ్ఞాని అని తెలుపవచ్చును.

(గీ. పు. 161)

మట్టి రోడ్డుపై బస్సు ప్రయాణిస్తుంటే దాని వెనుకనే మట్టి కూడా లేస్తూ వస్తుంటుంది. అయితే, బస్సును నిలుపకుండా పోయినంత కాలం ఈ మట్టి బస్సుపైన పడలేదు. కాని, ఎక్కడైన బస్సు నిలిపితే, వెంటనే వెనుక మట్టి వచ్చి బస్సుపై పడుతుంది. అయితే, బస్సును తారు రోడ్డుపై నిలిపితే ఇంకదానిపై మట్టి పడదు. అదేవిధంగా మనం, మొట్టమొదట కర్మ మార్గంలో ప్రయాణం చేస్తూ క్రమ క్రమంగా ఉపాసనా మార్గంలో ప్రవేశించాలి. ఉపాసనా మార్గం "కంకర రోడ్డు" వంటిది. ఇక్కడ మట్టికూడా తక్కువగా ఉంటుంది. ఈ ఉపాసనా మార్గం నుండి మరల ప్రయాణిస్తూ జ్ఞాన మార్గమనే "తారు రోడ్డులో" చేరాలి. అంతవరకూ మనం కర్మలను మానకూడదు. అదే ఒక దీక్ష. కర్మతో ప్రారంభమై, జ్ఞానముతో అంత్యము కావాలి. కర్మలను ఆచరిస్తూనే ఉండాలి. అప్పుడు ఆకర్మయే జ్ఞానంగా మారి పోతుంది. ఇది ఎట్లంటే - పుష్పమును మనం పోషిస్తూ వస్తే అది కాయగా మారుతుంది. కాయను మనం సంరక్షించుకుంటూ వస్తే అదే పండుగా మారుతుంది. కాబట్టి పుష్పం -కర్మ మార్గం, కాయ - ఉపాసనా మార్గం, పండు - జ్ఞాన మార్గం. కాని ఈ మూడు ఒక్కటే. కనుక, కర్మనుండియే జ్ఞానం లభిస్తుందనే విశ్వాసాన్ని పెంచుకోవాలి. **కర్మమార్గంలో ప్రవేశించకుండా జ్ఞానాన్ని పొందలేము.** చాలమంది "నాకు జ్ఞానం ఉంటే చాలులే" అని భావిస్తుంటారు. అటువంటి వాడే అజ్ఞాని, **కర్మలో మునిగిన వాడే నిజమైన జ్ఞాని.**

(శ్రీ.భ.ఉ. పు. 124/125)

(చూ॥ఆత్మధర్మము, నన్ను చేరగోరువారు, పండితుడు, బ్రహ్మసాక్షాత్కారజ్ఞానము, వెలుగు, శివుడు, శుభేచ్ఛ భూమిక, సంశయము)

జ్ఞానుల లక్షణము

అర్జునుని దృష్టి కేవలము దేహముల పైన వుండుటచే ఆత్మ దృష్టిని అనుగ్రహించుటయే, **దేహ, ఆత్మలను విడదీయుటయే సమస్త సాధనల యొక్క లక్ష్యము. దీనిని బోధించుటయే కృష్ణబోధ.** అర్జునుడు సందేహముల నూహించకున్ననూ తానే ఆ సందేహముల నూహించి సమాధానమును చెప్పెను. అర్జునా! నీవూ, నీకు సంబంధించిన బంధు రాజులూ. నీ మూలమున చచ్చెదరని దుఃఖించుచుంటివి. ధర్ములను వల్లించితివి కానీ పండితులు చచ్చిన వారి కొరకును బ్రతికిన వారి కొరకును దుఃఖించరు. యేల దుఃఖింప రందువా? నీవు దుఃఖించునది దేహముల కొరకు కదా! యిది వరకటి పూర్వపు దేహమునకు జరిగిన అవస్థలకు (మార్పులు) దుఃఖించితివా? శిశుత్వము నుండి బాల్యత్వము, బాల్యత్వము నుండి కౌమారము. కౌమారము నుండి యవ్వనము, యవ్వనము నుండి వృద్ధాప్యము, తరువాత మరణావస్థ, మరణము కూడ పై అవస్థలలో ఒక్కటి కదా! పై నాలుగవస్థలకు నీవే మాత్రముదుఃఖించితివి? ఈ మరణావస్థకు దుఃఖించు టెందుకు? ఏది? నీ

బాల్యమున నీ సోదరులతో ఆటలాడిన దేహము లేదు కదా! ఆనాడు దృష్టద్యుమ్నుని కట్టి తెచ్చిన బాల్య దేహము నేడున్నదా? కాని ఆ విషయము నేటికి కూడనూ నీకు జ్ఞాపకమున్నది కదా! అటులనే **నీ దేహావస్థలో మార్పు కలిగిననూ ఆత్మయయిన ప్రజ్ఞానము యే నాటికీ అమృత స్వరూపమును కలిగి యుండును, ఇదే జ్ఞానుల లక్షణము.**

(గీ.పు. 4,5)

జ్ఞానేంద్రియములు

(చూ॥ పరిపూర్ణమానవుడు, వష్టితత్వము)

జ్ఞానోదయము

"సూర్యరశ్మిభిః తుహినపటలమివ జ్ఞానభాభిః అజ్ఞానం నశ్యతి" అన్నట్లు సూర్యకిరణములచే మంచు ఎట్లుకరుగునో అట్లే జ్ఞానకిరణములచేత అజ్ఞానము కరిగిపోవును. ఎడతెగని ఆధ్యాత్మిక విచారణచేత జ్ఞానోదయము చేకూరును. సంపూర్ణ జ్ఞానోదయమెప్పుడు కలుగునో అప్పుడే మోక్షప్రాప్తి కలుగును.

(జ్ఞా వా పు.1)

జ్ఞాపకము

(చూ॥ ఈశ్వరమ్మ)

టానిక్కులు

ఆరోగ్యమునకు ఔషధములు ప్రధానముకాదు. మంచి మాటలు, మంచి నడతలు, మంచి చూపులు, మంచి తలపులు, మంచి వినికిడి అవసరము. ఇవే దేహమునకు అమృతత్వాన్ని అందించే టానిక్కులు.

దుర్భావములు, దుశ్చింతలు, దురాలోచనలు. హృదయమున నింపుకొని, ఎన్ని విలువైన ఔషధములను సేవించినప్పటికీ రోగ నివారణకాదు. ఏ ఔషధము లేకపోయినప్పటికీ, ఏ డాక్టర్లు మనకు చిక్కకపోయినప్పటికీ, సద్గుణములను కలిగి ఉన్నామంటే, సదాచారములను ఆచరించినామంటే, సచ్చింతనలను సంకల్పించు కున్నామంటే అవే మనకు సరియైన ఆరోగ్యమును అందిస్తాయి. ఆత్మానందమును చేకూరుస్తాయి. ఆత్మ సందర్శనమును కూడా కలిగిస్తాయి.

(శ్రీ.న. 2000 పు. 39)

టీ.బి.

(చూ॥ టివీ)

టి.వీ.

విద్యార్థులారా! మీరు ఇక్కడ ఉన్నంత కాలము అన్ని విధములుగా మంచిగా ప్రశాంతంగా జీవించి, మీ గృహములకు తిరిగి వెళ్ళిన తక్షణమే టీవీలను, వీడియోలను తెచ్చిపెట్టుకుంటారు. అవి మీ హృదయాన్ని ఎంతగా మాలిన్యపరుస్తున్నాయో మీరు గుర్తించుకోవడం లేదు. ముఖ్యంగా ఈనాటి మనిషి జీవితాన్ని నాశనం చేస్తున్నవి టీవీలు, **వీడియోలే! విద్యకు సంబంధించిన విషయాలను, నీతికి సంబంధించిన విషయాలను చూడండి, తప్పులేదు. అంతేగాని, అపవిత్రమైన దృశ్యాలను చూడకండి. నేడు టీవీలవల్ల వచ్చే రోగాలు నివారణ కానీ రోగాలుగా ఉంటున్నాయి. టీవీ అనేది టిబి.గా తయారౌతున్నది.** మీయందు పవిత్రమైన భావాలు లేనప్పుడు రోగాలు రాక మరేమి వస్తాయి?! మీకు ఏ పనీ లేకపోతే బయటకు వెళ్ళి కొంతసేపు 'వాకింగ్' చేయండి. లేకపోతే, మీ తల్లికి ఇంటి పనిలో సహాయం చేయండి. అంతేగాని, ఊరికే టీవీ వేసుకుని కూర్చోకండి.

(స.సా.జ. 2000 పు.20)

ఈ టీవీలు ఏనాడైతే ప్రారంభమైనవో ఆనాడే మానవుని మనస్సు మాలిన్యమైపోయింది. మీరు చక్కగా యోచించండి. టీవీలు రాక పూర్వము మానవుని మనో దౌర్భల్యము, ఇంతగా ఉండేది కాదు. ఇవి ప్రారంభించక మునుపు ఇటువంటి దుశ్చర్యలు కనీవినీ ఎరుగము. కొందరు డైనింగ్ హాలులో టీవీలు పెట్టుకొని భోజనం చేసే సమయంలో వాటిని చూస్తున్నారు. వారు భుజించేది టీవీలో వచ్చే మాలిన్యమునే గాని, ఆహారమును కాదు. ఆ దృష్టిచేతనే సృష్టికూడా మారిపోతున్నది. ఎలాంటి దృశ్యములను, ఎలాంటి చర్యలను మీరు చూస్తున్నారో అవే మీలో ప్రవేశిస్తున్నాయి. కనుక మీలో తెలియకుండానే ఆవేదనలు, ఆవేశములు అనేకము అభివృద్ధి అవుతున్నాయి. అది మీకు తెలియదు. "నేను ఏనాడూ చింతించని భావాలు నాకు ఎందుకు రావాలి" అని మీరు విచారిస్తారు. కాని, టీవీలో చేసే దుశ్చర్యలు బీజరూపంలో మీ హృదయంలో నిలిచిపోతాయి. అవన్నీ సమయాన్ని పురస్కరించుకొని మొక్కలుగా వచ్చి మీలో దుర్భావాలను అభివృద్ధి చేస్తాయి; అంతేకాదు, మీరు భుజించే సమయంలో భయంకర విషయాలను గూర్చి మాట్లాడకూడదు, వాదోప వాదములు చేయకూడదు, నిశ్శబ్దంగా ఉండాలి. ఈ మాటల తరంగములు మన హృదయంలో ప్రవేశిస్తాయి. ఎలాంటి తరంగములు ప్రవేశిస్తాయో అలాంటి ఊహలే మీలో ఆవిర్భవిస్తాయి. ఈనాడు స్టార్ టీవీలు వచ్చి మనిషిని పూర్తిగా మసి చేస్తున్నాయి. మాణిక్యము వంటి మానవ జీవితాన్ని మసి బొగ్గులకు అమ్ముకుంటున్నారు. ఇది మీకు మానసిక ప్రశాంతి నందిస్తుందని భావించి, చూసి ఆనందిస్తున్నారు. కాని, తదుపరి ఇది మీలో ప్రవేశించి ఎన్ని విధములుగా తిప్పలు పెడుతుందో మీకు తెలియదు. ఇది తేనె పూసిన కత్తి వంటిది. ఇందులో కనిపించే దృశ్యములన్నీ యువతీ యువకులలో ప్రవేశించడం చేత ఈనాడు భారత దేశమే కాదు, యావత్ ప్రపంచమంతా అల్లకల్లోలంగా ఉంటున్నది. ఆవేశమయంగా ఉంటున్నది, ఉద్రేక మయంగా ఉంటున్నది, ఉత్సాహము ఎక్కడా కనిపించడంలేదు. మానవుడు ఉత్సాహంగా ఉన్నట్లు నటిస్తున్నాడు. కాని, అది ఉత్సాహం కాదు, కేవలం సినిమా నవ్వు! ఈనాడు బాధలు లేని మానవుడు ఎక్కడా కనిపించడం లేదు.

(శ్రీ.భ.ఉ.పు.189/190)

(చూ॥సాంఖ్యదర్శనము)

టెంకాయ

గుళ్లోకి వెళ్లి టెంకాయ పగలగొట్టినప్పుడు మీ అహంకారమును బద్దలు కొట్టినట్లు అనుకోవాలి. కొబ్బరి దేవుడు ఆరగిస్తాడని కాదు. వివేకమనే ఒక్క దెబ్బతో అహంకారమును **రెండు ముక్కలు చెయ్యటానికి అది సంకేతం. టెంకాయ మీది పీచు తీసినప్పుడే అది ఒక్క దెబ్బకు పగులుతుంది.** అలాగే మనిషి తన హృదయం చుట్టూ పీచులాగా పట్టిన కామక్రోధాలూ అసూయా తొలగించుకోవాలి.

మానవుడు మహాశక్తి సంపన్నుడు. దుర్వాసనలమూలాన దుర్బలుడు అవుతున్నాడు. మీలోవున్నదివ్యశక్తిని గుర్తించి ఉత్తేజం పొందండి. అప్పుడు మీకు మంచితనమూ త్యాగ గుణమూ నిజాయితీ ఆప్యాయతా ఆలవడగలవు. మంచి మాటలు వినండి. మంచి దృశ్యలు చూడండి. మంచి ఆలోచనలు చేయండి. మంచి పనులు ఆచరించండి. అప్పుడు దుష్ట ప్రవృత్తులన్ని నిర్మూలమైపోతవి.

(వ.1963 పు. 223/224)

టెక్నాలజీ

(చూ॥ ప్రవృత్తి)

టెట్టరిష్టులు

అమెరికా ప్రెసిడెంటు టెట్టరిష్టులను అంతమొందించి తీరాలి అన్నాడు. టెట్టరిష్టులు ఎవరు? క్రోధము మరియు అసూయలే టెట్టరిష్టులు. ఈ దుష్ట లక్షణములు ప్రతి మనిషి అందు ఉంటాయి. మానవుడు వీటిని నాశనం చేసేందుకు ప్రత్యేకంగా కృషిచేయాలి. మనుష్యులు ఒకరి నొకరు చంపుకోకూడదు. దానికి బదులుగా తమలో అంతర్గతముగా ఉన్న టెట్టరిష్టులను నాశనము చేయాలి. మంచి నడతలను అలవర్చుకోవాలి. ఇదే నేను మీ నుండి కోరేది. ఎప్పుడైతే అసూయా క్రోధములు పూర్తిగా నిర్మూలమౌతాయో అప్పుడు దేశము సంపదలతో ప్రపంచమునకు ఒక ఆదర్శంగా ఉంటుంది.

(ది.ఉ. 19.01.2002)

టెలివిజన్

Television నిజముగా Tele విషమని గుర్తించండి.

(భ.ప్ర.పు.5)

ట్రిక్‌నాలెడ్జి

(చూ॥ ప్రవృత్తి)

డంబము

(చూ॥ అదంభిత్వము)

డకారత్రయములు

(చూ॥ అవసరము, దైవము)

డకార పంచకము

ఆధ్యాత్మికంలో కూడ కొన్ని విషయములు Subjects ఉన్నాయి. ప్రత్యేకమైన గ్రూపులున్నాయి. అవి డకార పంచకములు: ఇందులో మొట్ట మొదటిది ప్రపత్తి అనగా Dedication. రెండోది భక్తి Devotion. మూడోది నియమము Discipline. నాలుగోది విచారణా శక్తి Discrimination. ఐదోది పట్టుదల Determination. ఇవియే డకార పంచకములు.ఈ ఐదింటిని గ్రూపుగా తీసుకొని ఉత్తీర్ణులైన వారికి భగవత్ ప్రేమ పొందే అధికారముంటుంది.

మొదటిది Dedication ప్రపత్తి - సమర్పణము. స్వామి ఇక్కడకు రావడంతోటే ప్రతి అధ్యాపకుడు ప్రతి విద్యార్థి పుష్పాన్ని అర్పించి నమస్కరిస్తున్నాడు. **పుష్ప మనగా హృదయ పుష్పము.** ఈ పుష్పం మీద కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములనే పురుగు లేవీ ఉండకూడదు. పురుగులున్న పుష్పమును భగవంతునికి అర్పించము. దానిని తీసి పరిశుభ్రము చేసి ఆ తర్వాత భగవంతునికైనా పెద్దలకైనా అర్పిస్తాము. పుష్పముల మీద ప్రధానమైన మాలిన్యములు, పురుగులు రెండు ఉంటాయి. **ఇవి పుష్పముల మీద వ్రాలిన తుమ్మెదలను దురవస్థల పాలు చేస్తాయి. మొదటిది అహంకారము. రెండోది అసూయ. అహంకారము ఎనిమిది విధములుగా ఉంటుంది. ధన అహంకారము, బల అహంకారము, కుల అహంకారము. విద్యా అహంకారము, సౌందర్య అహంకారము. రాజ్య అహంకారము, తపో అహంకారము.** అనేక విధములైన అహంకారములలో ఈ ఎనిమిది ప్రధానమైనవి. ఇందులో ధన విద్యా అహంకారములు నీచమైనవి. అహంకారమనే అడ్డు గోడ ఉన్నంత వరకు భగవత్తత్వాన్ని గానీ, ఆత్మ తత్వాన్ని గాని గుర్తించడం సాధ్యంకాదు. కనుక జీవునికి దేవునికీ మధ్య నున్న ఈ అహంకారమనే అడ్డు గోడను

మనము తీసి వేయాలి.
కలిమి కలిగిన నాదు కైలాసపతినైన
లెక్కచేయక పాపి తిరుగుచుండు
కలిమి తీరగానె కనిపించు దైవంబు
....

కలిమి ఎంత కాలముంటుంది? ఈ ధన అహంకారం వల్లనే మానవుడు దీనావస్థను చేరుకొంటున్నాడు. కనుక మొట్ట మొదట ఈ అహంకారాన్ని భగవంతునికి అర్పించాలి. ధన బల యవ్వన సౌందర్య కుల తపో అహంకారమేదీ కూడా ఉండరాదు. **అహంకారాన్ని మనమేనాడు భగవంతునికి అర్పిస్తామో ఆనాడే ఆత్మ స్వరూపులముగా రూపొందుతాము. ప్రపత్తి dedication లో మొట్ట మొదట చేయవలసినది అహంకార సమర్పణమే. రెండోది Devotion భక్తి.** ఇది పవిత్రమైన ప్రేమకు సంబంధించినది. "హృషీకేశ సేవనం భక్తి రుచ్చతే" అన్నారు. **భక్తి అనగా నిరంతరం భగవంతుని తలంపుతో ఉండడం. భజ్ అనే ధాతువు నుండి పుట్టినది భక్తి. అనగా ప్రేమతో భగవంతుని తలచుకోవడం, స్మరించడం, భజించడం, తపించడం భక్తి. ఈ భక్తిలో సేవ అతి ప్రధానమైనది. ఈ సేవ వల్ల లభించే ఫలితము ఇట్టిది అట్టిది అని నిర్ణయించడానికి వీలులేదు.** తులసీదాసు ఒకానొకప్పుడు త్రివేణి సంగమంలో భగవచ్చింతన సలుపుతున్నాడు. రామ లక్ష్మణులు ఇరువురూ చిన్న పిల్లల రూపం ధరించి "కాకాజీ క్యా కర్‌తేహై" కాకాజీ ఏం చేస్తున్నారు అన్నారు. తులసీదాసు "బేటా! రామ్‌కా సేవాకరతాహూఁ" నాయనా! రాముని సేవ చేస్తున్నానన్నాడు. సేవాసే క్యా ప్రయోజన్? సేవవల్ల ఏం లాభం? అని అడిగారు. సేవాసే మేవా మిల్తాహై; సేవవల్ల ఫలం దొరుకుతుంది: అన్నాడు తులసీదాసు. మేవా మిల్తా హైతో క్యా ప్రయోజన్? ఏకోహి దఫాజీర్ణ హోజాయేగా: ఫలం దొరికితే ఏం లాభం. ఒకేసారి జీర్ణమై పోతుందిగా అన్నారు పిల్లలు. అప్పుడు చెప్పాడు తులసీదాసు. ప్రాకృతమైన ఫలం తాత్కాలిక మాధుర్యాన్నే ఇస్తుంది. క్షణకాలంలో జీర్ణమైపోతుంది. **భగవంతుడిచ్చే ఫలం ప్రేమ ఫలం. అది జీర్ణమయ్యేది కాదు. అది తింటే ఆకలే కాదు. సేవవల్ల ఆ ప్రేమ ఫలం దొరుకుతుంది. ఆ ప్రేమ ఫలమే జ్ఞాన జ్యోతిని వెలిగిస్తుంది.** అంతఃకరణమనే ప్రమిదలో భక్తి అనే తైలాన్ని పోసి ప్రజ్ఞ అనే వత్తిని నిలిపి విచారణ అనే నిప్పును అంటించినప్పుడు ప్రకాశవంతమైన ఆత్మజ్ఞానము వెలుగుతుంది.

భక్తి అనగా కేవలం భజనలు పూజలు చేయడం మాత్రమే కాదు. ఈనాడు మన భక్తి పూజలు భజనలు స్వార్థ స్వప్రయోజనాలతో కూడి ఉంటున్నాయి. **నిస్వార్థంతో కూడినదే భక్తి.** పైకి చూడటానికి అందరూ భక్తులవలెనే కనిపిస్తారు. చాలా వినయ విధేయతలతో ప్రవర్తిస్తారు. కాని హృదయం చూస్తే అందుకు విరుద్ధంగా ఉంటుంది. మార్కులు చూస్తే ర్యాంకు. ప్రవర్తన చూస్తే బ్లాంకు: ఆచారం చూస్తే భక్తిగా కనపడుతుంది. కాని హృదయంలో తలంపులను చూస్తే మహా ఆసహ్యంగా ఉంటుంది. ఇలాంటి తత్వాన్ని మనము అలవరచుకోరాదు. **లోపల వెలుపల ఒకే భావం. ఒకే విధమైన ప్రేమ తత్వం ఉండాలి. భక్తి ప్రకటితం చేసేదీ, ప్రదర్శించేదీ కాదు ప్రదర్శించే భక్తి ప్రమాదానికి గురి చేస్తుంది.** కనుక మనమీ ప్రమాదానికి గురికాకుండా **లోపల వెలుపల ఒకే విధమైన భావాన్ని కలిగి ఉండాలి. ఇదే నిజమైన భక్తి.**

మూడోది నియమం Discipline. ఇది చాల అవసరం. తెల్లవారి లేచిన తక్షణమే కాల కృత్యములు తీర్చుకొని భగవంతుని స్మరించి తదుపరి ఏవో నిత్య విధి కర్మలు ప్రతి నిత్యం ఆచరిస్తూ వీటిలో ఎట్టి మార్పులు చేర్పులు లేకుండా ఒక నియమాన్ని పాటించాలి. ఒక్కొక్కనాడు ఒక్కొక్క మార్పు చేసుకోరాదు. ఈనాడు ఒకగంటకు లేవడం రేపు మరొక గంటకు లేవడం, ఈనాడొక పనిచేయడం. రేపు మరొక పని చేయడం ఈ విధమైన మార్పులు ఉండకూడదు. నియమాన్ని సక్రమంగా అనుసరించాలి. లేచిన తక్షణమే కాలకృత్యములు ముగించుకొని ప్రశాంత వాతావరణంలో కొన్ని నిముషములైనా హృదయ పూర్వకంగా ప్రేమతో

డాక్టర్లు

పరమాత్మని స్మరించాలి. **మానవత్వం నియమ నిష్ఠలపైన ఆధారపడి ఉన్నది. నిత్య జీవితంలో ఈ నియమాన్ని కఠినంగా పాటించాలి.**

తరువాత విచారణా శక్తి Discrimination. ప్రపంచం మంచి చెడ్డలతో కూడి ఉంటుంది. సుఖ దుఃఖములతో కూడి ఉంటుంది. జయాపజయాలతో కూడి ఉంటుంది. ఈ రెండింటితో కూడిన ప్రకృతి యందు ఏది మంచి ఏది చెడ్డ ఏది చేయదగినది, ఏది చేయదగనది అని మనం విచారణచేయాలి. **ఈ విచారణా శక్తిలేని మానవుడు పశువనే చెప్పవచ్చు. మనము మనసును ఆధారం చేసుకోరాదు. మనసును అనుసరించరాదు. బుద్ధిని అనుసరించాలి. మనసును అనుసరించినంత కాలం మాధవులము కాలేము. ఏనాడు బుద్ధిననుసరిస్తామో ఆనాడే మానవత్వం నుండి దివ్యత్వానికి చేరుకోగలము. మనసు నాధారము చేసుకున్న మానవుడు పశువుగా మారుతాడు. బుద్ధి నాధారం చేసుకున్న బుధజనుడు పశుపతిగ మారుతాడు.**

ఈ లేత వయస్సులో ఉన్న విద్యార్థులు మనస్సును మాత్రమే అనుసరిస్తారు. బుద్ధి వరకు ప్రయాణం చెయ్యరు. కనుకనే అనేక విధములైన కష్టములకు ఆశాంతులకు అసంతృప్తులకు నిరాశా నిస్పృహలకు గురి అవుతుంటారు. కనుకనే బుద్ధిద్వారా విచారణ సలుపాలి. నేను మానవుడను. విద్యార్థిని విద్యావంతుడను. ఈ స్థాయిలో ఉన్న నేను ఏ విధంగా చేస్తే గౌరవంగా ఉంటుంది. అని విచారణ చేయాలి. ఏది చెయ్యాలి ఏది చేయకూడదు. ఎక్కడికి ఎప్పుడు పోవాలా వద్దా ఆలోచించుకోవాలి. విద్యావంతుడై ఆవిద్యావంతునివలె ప్రవర్తించడం విరుద్ధ మార్గం. విద్యకు తగినమార్గాన్ని అనుసరించాలి. **విద్యకు వినయమే శోభ.** వినయం లేకుండాపోతే విద్య కేమాత్రం కళాకాంతీ ఉండదు. ఈ విచక్షణ భక్తునికి అత్యవసరము.

Determination అనేది పట్టుదల. ఈ పట్టుదల పగ్గము వంటిది. **తలచిన దానిని సందేహానికి అవకాశ మివ్వక పట్టుదలతో సాధించడానికి ప్రయత్నించాలి.** సాధించ దలచినది సాధిస్తానో లేదో అనే సంశయానికి స్థానమివ్వరాదు. **పట్టుదల గట్టిగా ఉంటే మీరు సాధించలేనిది జగత్తులో ఒక్కటీ ఉండదు. మొట్టమొదటిది ప్రపత్తి Devotion చిట్ట చివరిది పట్టుదల Determination. కేవలము తెలివితేటలపైన, మేధాశక్తిపైన మాత్రమే ఆధార పడరాదు. సర్వమునకు దైవమే ఆధారమన్న తత్వాన్ని గుర్తించాలి. అప్పుడే భక్తితత్వాన్ని చక్కగా గ్రహించగలము.**

(స.సా. ఫి. 1988పు. 51/53)

డాక్టర్లు

(చూ॥ రోగము, గుండె)

డియర్ (ప్రియము)

(చూ॥ ఉపవాసము, బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి)

డివైన్ సోర్సు

(చూ॥ గుండె)

డ్రిల్లు

(చూ॥ప్రేమ, భక్తియోగము)

డ్రిల్లు టీచరు

ఒక విద్యార్థికి ఒక క్లాసునందు ఒక అధ్యాపకుడు చరిత్రను ఇంకొక అధ్యాపకుడు భూగోళము బోధించ వచ్చును. యింకొక అధ్యాపకుడు లెక్కలు నేర్పవచ్చును. భూగోళము బోధించు టీచరు ఏదో ఒక మ్యాప్‌ను చూపించి ఫలానా దేశములో జనులు ఫలానా రీతిగా వుంటున్నారని చెప్పవచ్చును. లెక్కల టీచరు 3+3+3=9 అని వ్రాసి చూపవచ్చును. చరిత్రను బోధించు టీచరు వివరింప వచ్చును, కాని ఒక్క డ్రిల్లు టీచరు మాత్రము one, two three, four **అని EXERCISE చేసి చూపించును. ఇది ఆదర్శవంతమైన విధానం.** ఈ విధముగనే ప్రతి అధ్యాపకుడు తన Subjectలో డ్రిల్లు టీచరుగా

తయారవ్వాలి. తానుచేసి చూపించాలి. విద్యార్థులను బీడీలు, సిగరెట్లు తాగకూడదని దండిస్తాము. కాని **మనమే బీడీలు, సిగరెట్లు త్రాగుతున్నప్పుడు యింక వారిని త్రాగవద్దని చెప్పే అధికారము మనకు యెక్కడ వుంది?** ఇట్లు అనధికారమును పెంచుకొనుట వలన విద్యార్థుల వద్దనుండి గౌరవము నందుకోలేని స్థితిలో మనము వుంటున్నాము. మనమే ముందుగా ఆచరించి బోధించినపుడు వారు యే మాత్రమూ మనమాట, మన మార్గమును తప్పక అనుసరించే అవకాశమున్నది.

(శ్రీస. ది. పు 6/7)

డైమండ్/ డైమండు

అందరు భగవంతుని కోరువారే కాని భగవంతుడు శ్రద్ధాభక్తులను కోరుతాడు. మానవుడు తన చుట్టూ అల్లుకొనిన అసత్యమును భయమును అధిగమించ వలసి ఉన్నది. నిత్య సత్యములందు స్థిరముగా ఉండుట. ఇది ఒక్కటే మీ ముక్తికి మీ సంఘము యొక్క సంక్షేమమునకు అభయ మివ్వగలిగినది. అప్పుడప్పుడు మీరు కోరవలసిన **అమూల్య పరార్థము డైమండు (వజ్రము) కాదు. డైమైండ్ (మనో నాశనము) తెలుసుకొండి.**

(స.సా.మే77 పు.58)

డైమండ్ రింగ్

ఎవరికైనా డైమండ్ రింగ్
ఇచ్చినప్పుడు **'డై-మైండ్'**
అంటుంటాను. అనగా, "నీకు
మనోనాశనమగు గాక! నీకు
మానవత్వంతో కూడిన మనస్సు
పోయి దైవత్వం కూడిన మనస్సు
ప్రాప్తించు గాక!" అని అర్థం.

(స.సా.జూలై.2000పు.201)

తటస్థలక్షణము

(చూ॥ స్వరూపలక్షణము)

తత్త్వమ్ అసి/తత్త్వమసి

జీవుడు జీవుడుగానే యెప్పుడూ వుంటాడు. దేవుడు దేవుడుగానే యెప్పుడూ ఉంటాడు. జీవుడు దేవుడు కాలేడు అని కొంతమంది అంటారు. అయితే అది చాలాతప్పు. అది విషయవిజ్ఞానరహితులు చేసిన తీర్మానము. **జీవుడు యెన్నడూ దేవుడుగా మారక పోతే సత్కర్మలకు, సద్భావాలకు, సంత్సంగములకు,సత్ చింతనలకు, యేమి ఫలితము? జీవుడు దేవుడౌతాడు; నిస్సందేహముగా అవుతాడు. నరుడు నారాయణు డౌతాడు. తత్, త్వం, అసి, అని చెప్పిన తరువాత, త్వం, తత్, అయ్యే తీరాలి."**

(జ్ఞా. వా. పు.79)

"పార్థాయెప్పుడుకూడనూ నేను లేనిదిగానీ లేకుండినది గానీలేదు. ఇంతేల నీవునూ ఈ రాజులును ఈ సైన్యమును కూడ అంతే. యెప్పుడునూ మనమందరం లేకుండ పోలేదు" అని "తత్" పదమైన పరమాత్మకు 'త్వం' పరమైన జీవాత్మకూ యేకత్వము చెప్పి 'తత్త్వమసి' మహావాక్యార్థాన్ని బోధించెను. కుండకు పూర్వము మట్టి యెట్లువుండునో కల్పితమునకు పూర్వము అధిష్టాన ముండియే యున్నది.

అప్పుడు అర్జునుడు కొంత స్పృహలోనికివచ్చి "కృష్ణా! నీవు భగవంతుడవు కావచ్చు. నీకు నాశనము లేకుండవచ్చు. కానీ నేను యేడ్చుట నీకొరకు కాదుకదా, నిన్నపుట్టి, నేడు వుండి, రేపు గిట్టే మా సంగతి తెలుపుము" అని ప్రార్థించెను. ఇక్కడ చక్కగ గమనించవలెను. **తత్ పదార్థమైన భగవంతుడు నిత్యుడు, ఇక పున్నదంతా త్వం పదార్థము. త్వం పదార్థము కూడా నిత్యమే. కానీ నిత్యమంటే** పామరులు అంత త్వరగా గ్రహించుకొనలేరు. కానీ ఈ విషయము కృష్ణపరమాత్మ అందుకొని "బావా! **మీరునూ నిత్యులే 'తత్త్వం' పదార్థములు పరిచ్ఛిన్నాలుగా కనుపించినను ఉపాధి వదలి చూచిన రెండూ వకటే. యేరీతిగా** నగకు ముందు బంగారమున్నదో, నగలోనూ

బంగారమున్నదో, నగ చెడగొట్టిననూ బంగార మున్నదో, అటులనే చిదాకారమైన ఆత్మ దేహముల వెంటరాదు. దేహముల వెంట పోదు'' అని అర్జునునకు భోదించెను.

(గీ.పు.26)

నది ప్రవహిస్తూ సముద్రములోనికి చేరుతుంది. సముద్రములోని జలము ఆవిరిగా మారి, మేఘంగా రూపొందుతుంది. మేఘమునుండి వర్షబిందువులు రాలుతాయి. అయితే ప్రవాహమునకు ఈ జలము, తనదని తెలియదు. నదిలోని జలము, సముద్రములోని జలము, మేఘములోని జలము, వర్షములోని జలము, ప్రవాహములోని జలము అంతా ఒకటే. ఇదే ఆత్మ. ఇదే తత్త్వమసి.

(సా॥ పు.388)

ఓంకారమనియేటి ఒకతొట్టెలోను
తత్త్వమసి అనియేటి పరుపు పరచి
ఎఱుకనే బాలుణ్ణి ఏమరక ఉంచి
ఏడు జగములు వీరు ఏకమై ఊప ॥జో॥జో॥

(స.సా.జూలై 2001, పు. 208)

(చూ॥ గాయత్రి, జ్ఞానము, భాగవతము)

తత్తు సమన్వయాత్

మానవుల కోరికలు, వాంఛలు, సంకల్పాలు, అభీష్టాలు కర్మప్రేరితములు. ఇవి అన్నియూ అజ్ఞానము వలన కలుగుచున్నవి. అట్టితరి అజ్ఞానము జ్ఞానము నేరీతిగా చేకూర్చును? చీకటి చీకటిని దూరము చేయలేదు కదా! అటులనే అజ్ఞానము అజ్ఞానమును యేరీతిగా పొగొట్టగలదు? ఇది ఆసాధ్యము. అందువలన ఆత్మబోధతో అనగా జ్ఞానము చేతనే అజ్ఞానమును పొగొట్టుకొనవచ్చును - అని శంకరులవారి వాదము. సమన్వయము ప్రపంచమున యెంత అవసరమో జ్ఞానమునకు సహితము అంత అవసరం.

బ్రహ్మ విషయము ఇతరులకు అందజేయటమంటే అంత సులభము కాదు. బ్రహ్మ విద్యా ఫలమునకు కర్మ ఫలమునకును మధ్య బేధము కలదని చెప్పబడినది. పుణ్యఅపుణ్యములకు సుఖదుఃఖములు ఫలితములు. మనుష్యలోకమునుండి బ్రహ్మలోకమువరకు సుఖ తారతమ్యములున్నవి. అటులనే మనుష్యలోకమునకు క్రిందుగా నరకలోకమనియు అది దుఃఖములతో కూడినదనియూ అనే తారతమ్యములున్నవి. అయితే అవన్నియూ ఉత్పత్తి వినాశములచే కూడినవే. అట్లయిన ఆత్మజ్ఞానము స్వభావసిద్ధముగా నిత్యము, సత్యము. ఇది ఉపాసన విషయమగు విధిఫలము కాదు. మోక్షావస్థ శరీరమునకు అతీతమైనది. అశరీరత్వము మోక్ష స్వభావమయినచో, ఇది సాధించవలసినది గాదు. జ్ఞానముదయించిన తక్షణమే అజ్ఞాన మంతరించును. దీపము వెలిగించిన తక్షణమే చీకటి వుండదుకదా!

బ్రహ్మజ్ఞానము పురుషప్రయత్నమున లభించునది కాదనుట అంత సమంజసము కాదు అని కొందరి వాదము. అయితే దీనిని శంకరులవారు సమన్వయపరిచిరి. ఇది అనగా జ్ఞానము స్వభావ సిద్ధముగా అందరికీ అంతర్లీనమయి వున్నది. అయితే కర్మకాండ వలనగానీ లేదా విచారణవలనగానీ అది అధిగతమగునది కాదు అని నిర్ణయించిరి. కర్మ ఆవిద్యతో విరోధము లేనిది. కావున **కర్మ ఆవిద్యను దూరము చేయజాలదు. అయితే జ్ఞానము ఆవిద్యను దూరము చేయగలదు. కేవలము కర్మచేత మానవునకు ముక్తి లభించదనియు కర్మచేత చిత్తశుద్ధి కలుగదనియూ ప్రమాణమును తెలుపుచున్నది.** కర్మచేత జీవుడు **బంధమునకు** గురికాగలడు. **విద్యచేత విముక్తుడు కాగలడు.** అందువలన కర్మయందు ఆసక్తులు కారాదని తెలియవచ్చును. అయితే శాస్త్రము ఒక్కొక్క దగ్గర కర్మనుకూడా బోధించుచున్నది. **శాస్త్రము తల్లివంటిది.** బిడ్డల యోగ్యతలను బట్టి తగిన రీతిగా, సమయ సందర్భములలో వారికి బోధించును. ఇద్దరు బిడ్డలున్న తల్లి, ఒకనికి పూర్ణ ఆరోగ్యమునూ మరొకరికి అజీర్ణరోగమునూ సంభవించినపుడు తల్లి ఆరోగ్యవంతున కడిగినవన్నీ అందిస్తుంది. అయితే అజీర్ణరోగము గల

తత్త్వభావము

బిడ్డకు, పథ్యము పెట్టి అధికంగా తిననివ్వకుండా చూచుకొంటుంది. అట్లు చేయుటచే తల్లికి ఒక బిడ్డపై ప్రేమ, మరొకబిడ్డపై ద్వేషమా? కాదు. అదేవిధముగా **శాస్త్రముకూడా, కర్మ రహస్యము తెలుసుకొన్నవారికి కర్మ విధానమును తెలుపుతుంది. కారణము? జీవితాన్ని బాగుపరచుకొనుటలో కర్మ చాలా ఉపయోగపడుతుంది.** కర్మను సత్‌కర్మగా మార్చుకొనే తెలివితేటలు అందరికీ ప్రధానము. అయితే అదే సర్వస్వము కాదు.

అన్నమయ దేహాన్ని ఆధారము చేసుకొని ఆనందమయ స్వరూపమునకు ప్రయాణము చేయించునదే విచారణ అని ఈ సూత్రము తెలుపుచున్నదది. అయితే ఒకటి స్థూలము. రెండవది మూలము. ఒకటి అధేయము, మరొకటి ఆధారము.

జగత్తుయొక్క అంతరార్థమును గురించి తమ జ్ఞానము ప్రకటించిన మహాద్రష్టల యొక్క అనుభవములను, భావములనూ, ఈనాటి వారు అంగీకరించుటలేదు. అంగీకరించినచో, కొన్ని మత సిద్ధాంతములు తప్ప మిగిలినవన్నియు సమన్వయత్వమును సృష్టీకరించు చున్నవి. వివిధ మతములందు, వివిధ నియమములందు ఒకే భగవంతుడు వ్యవహరింపబడుచున్నాడు. వివిధ యుగములలో వివిధ జాతుల కొరకు వివిధ ప్రవక్తలను భగవంతుడే పంపినట్లు సమన్వయపరుచుచున్నవి అనేక మతములు. నేడు మత పరిస్థితులు ప్రపంచవ్యాప్తము లగుట వలన జీవన్మతముల మైత్రీభావము, ప్రమాణిక తనూ సామరస్యము లేక సమన్వయము కలుగవలసి యున్నది. **మహానీయులందరు పరమాత్మ ప్రతిరూపములు. పరమాత్మయందు వారందరూ ఒక్కటే జాతి, ఒక్కటే దేశము. ఆచారములు, విశ్వాసములు మొదలైన వాని ద్వారా, ఎవరి మత ధర్మములు వారు ఇతరులకు తెలియజేయవలసియున్నను,** అప్పుడే పరమాత్మ సాన్నిధ్యమును, చిత్తశుద్ధితో, నిండు హృదయముతో సమన్వయపరచవచ్చును. **సర్వ ధర్మ హృదయమే ఈ సమన్వయ తత్త్వము.**

(సూ.వా. పు.28/31)

తత్త్వములు

(చూ। ప్రేమతత్వము, భగవత్తత్వము, రామతత్వము, సాంఖ్య దర్శనము, స్త్రీతత్వము)

తత్త్వజ్ఞానము

పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా?
తనువును తాదండించిన విషయభోగములడుగునా?
ఆకలిదప్పులు మానినంత ఆత్మజ్ఞాని తానగునా?
తానెవరో తెలియకున్న తత్వజ్ఞానమెటు కుదురును?

తత్వజ్ఞానము కుదురవలెనన్న తానెవరో మొట్టమొదట గుర్తించ ప్రయత్నించాలి. మానవుడంటే యేమిటో అర్థము చేసుకోవాలి. ఎన్ని జన్మలు ఎత్తినప్పటికి దేహము నూతనముగానే వుంటుంది. మానవత్వము. దివ్యత్వముతో కూడిన ఆత్మతత్వమనియిది నిరూపిస్తుంది. విచారణ సల్పినప్పుడే దీని నిజస్వరూపము మనకు గోచరమవుతుంది. స్వస్వరూపసంధానమే దీనినిష్ట. ఇట్టి నిష్ఠనే జ్ఞానమునకు సరియైన ద్రష్ట. ఈ ద్రష్ట యొక్క సందర్శనమే భక్తి ప్రభావము. ద్రష్టాధారము చేతనే దృష్టిని అభివృద్ధి పరచుకొని సృష్టిని అనుభవించాలి. అంతేకాని ఆకారము కూడినంత మాత్రమున మానవత్వమని అనుకోవటం అవివేకము.

(బృ.త్ర.పు. 28, 29)

ధర్మవిరుద్ధ కామ, క్రోధ, లోభములు కూడనూ భగవత్ స్వరూపములని కృష్ణపరమాత్మ అన్నాడు. కానీ, వేయేటికి, **"సర్వభావములు, సర్వరూపములు, సర్వవస్తువులూ, నా అపరా పరాకృతివల్ల సంభవించినవే"** అని అన్నాడు. కానీ ఉపాసకునకు ఉత్తమ భావన లేర్పడుటకోసం మొట్టమొదటిది, ఉత్తమభావం, ఉత్తమరూపం, ఉత్తమభూతంలో నా స్వరూపమని తెలిపెను. ఇంత మాత్రమునకే మంచిది మాత్రము భగవత్ స్వరూప లక్షణములనియూ, తతిమావన్నియూ కాదనియూ తలంచుట తత్వజ్ఞానము కాదు. త్రిగుణములయిన

రాజసిక, తామసిక, సాత్వికి వస్తువులు, భూతములూ, భావములూ భగవంతునియందే ఉద్భవించినవని స్థిరము చేసుకొనుటకు విచారణా, ప్రయత్నమూ జరుపవలెను. ఇట్టు ఆ భగవంతుడే స్వయముగా తెలిపెను.

"అర్జునా! అన్నియూ నాయందే పుట్టి, నాయందే వుండును. కాని నేను మాత్రము వాటి ఆధీనమందుండక వాటితో ఏ సంబంధమూ లేనివానివలె యుందును". ఇచ్చట రెండు దృష్టులు కలవు. **ఒకటి జీవదృష్టి. రెండవది భగవత్ దృష్టి. జీవదృష్టిలో చూచినపుడు మంచి చెడ్డలను ద్వంద్వాలు కలవు. భగవత్ దృష్టిలో చూచినపుడు ద్వంద్వములు లేక సర్వమూ భగవంతుడే.** మరేమీ లేదని సర్వ భూతాంత రాత్మ తత్వమును బోధించును.

(గీ.పు.108/109)

తత్త్వజ్ఞాన దర్శనము - మోక్షాపేక్ష దృష్టి తప్ప మరేమీ లేకుండట.

(గీ.పు.214)

తత్త్వభావము

"సత్వసారము తెలిసికోరన్నా -
ఈ తత్త్వమెరిగి జన్మమొందన్నా -
ఈ ధర్మమెరిగి మర్మమొందన్నా -
సామరత్వము పాడుచేసి -
నియమనిష్టల నెత్తినిలిపి -
దేహభావము వీడరోరన్నా -
అందమెందు ఇందులేదన్నా -
అందమైన ఆత్మవిడిచి -
నింద్యమైన తనువునేనని -
తలపువీడి శాశ్వతంబుగ -
తత్త్వభావము ఎరుగరోరన్నా" -

(యు. సా. పు.97)

తత్త్వవిచారణ

(చూ॥ భాగవతము)

తత్ప్రేవాహం

(చూ॥ భక్తిప్రపత్తులు)

తథాస్తు

(చూ॥ అర్పితం)

తనవాడు

"శ్రీ కృష్ణుడు కేవలం తనని గురించి మాత్రమే చింతించమనీ మరేదీ చెయ్యవద్దనీ కాదు చెప్పింది. ఆయన ఉద్దేశ్యం ఏమిటంటే మీరు **ఇతరమైన (అనన్యమైన) దానిని గురించిన ఆలోచన విడిచి పెట్టండి. అన్యమైనది అంటూ వేరే ఏదీ లేదు. అన్నీ ఒక్కటే. అంతా ఒక్కటే అన్యము అనేదానిని వదిలేస్తే ప్రేమమూర్తి అయిన భగవంతుడు నిన్ను తనవాడిగా ప్రేమిస్తాడు"**

(శ్రీస. ప్రే. సు. స్ర. పు. 248)

తపస్సు

శారీరిక, వాచిక, మానసికముల సమన్వయమైన పరివర్తనే, ప్రభావమే తపస్సు. త్రిగుణముల ఏకత్వాన్ని, త్రిగుణముల త్రివుటి యొక్క సంపూర్తిని అనుభవించినట్టు మహనీయుడే మహాత్ముడు.రజోగుణ, తమోగుణముల యేకత్వాన్ని నిర్మూలం గావించి, యింద్రియముల దోషములు నిర్మూలము చేసి, మూడుగుణముల యేకత్వాన్ని అనుభవించే పరిస్థితికే తపస్సు అని పేరు. సాత్వికముచేత రజస్సును అరికట్టి,రజస్సు ద్వారా తమస్సును అరికట్టి మూడింటి తత్వమును యేకత్వముగా భావించే స్థితియే తపస్సు. కట్టకడపటికి సాత్వికమును కూడ తీసివేయాలి. కాలిలో ముల్లు విరిగింది. ఆ ముల్లును తీయాలంటే గొడ్డలో కొడవలో యింకే విధమైన కత్తో తీసుకోనవసరము లేదు. తిరిగి యింకొక ముల్లు ద్వారానే యీ ముల్లును తీయాలి. ఒక ముల్లుతో మనకు విరిగిన ముల్లును తీశాము. తీసిన తరువాత విరిగిన ముల్లును,

తపస్సు

తీసిన ముల్లును రెండింటిని పారవేయాలి. అదే విధముగనే యీ రజస్తమోగుణములనే ముండ్లు బాధిస్తుంటాయి. వీటిని సాత్వికమనే ముల్లుతో తీయాలి. ఈ రెండింటిని తీసేవరకు మాత్రమే యీ ముల్లును భద్రము చేసుకోవాలి. **ఈ రెండు ముండ్లు తీసిన తరువాత యీముల్లును కూడా త్యాగము చేయాలి. సత్వగుణము బంగారుగొలుసు వంటిది.రజోగుణము రాగిగొలుసు వంటిది. తమోగుణము యినుప గొలుసు వంటిది.మూడు బంధనలే. బంధమేమో సమానమే.** ఈ గొలుసుల విలువలు మాత్రము హెచ్చుతగ్గులుగా వుంటున్నాయి. బంగారు గొలుసుతో చేతులు కట్టేశారని ఆనందిస్తారా? బంధన బంధనే. బంగారు గొలుసుగానీ రాగి గొలుసుగానీ యినుప గొలుసుగానీ బంధనే. ఈ బంధనను విడిపించుకోవాలి. విలువలు హెచ్చు తగ్గులుగా వుండవచ్చును గానీ బంధన బంధనే. **సాత్వికము కూడ ఒక బంధనే. సత్వగుణము దైవత్వానికి చేరేంతవరకు అవసరము. దైవత్వముతో చేరిన తరువాత యే గుణము అక్కరలేదు.** ఈ అమరత్వపు స్థితిలోపల యింకా గుణము లెక్కడివి? ఈ మూడింటిని దైవార్పణగా భావించినప్పుడే సర్వకర్మలు భగవత్ ప్రీత్యర్థంగా అయిపోతాయి.

(శ్రీస. గీ. పు.97/98)

స్వేచ్ఛగా తిరుగుచున్న మనో బుద్ధీంద్రియ ప్రవర్తనలను, జీవుడు నెమ్మదిగా బోధించి ప్రవర్తనలను భగవత్ గుణ గానములయందు లీన మొనర్చుటకు పూనుకొనును.లేక ఒక విధమైన నిష్టయందు నీమించును. ఒక విధమైన ఉత్తమ మార్గమున ప్రవేశింప జేయును.

"ఈ రీతిగా స్వేచ్ఛను అణగద్రొక్కి, ఇంద్రియములను, పవిత్ర పరమాత్మ విషయములందు అంకితముచేసి, జపమో, ధ్యానమో, సత్ కర్మనో, లేక, యింకేవిధమైన పవిత్ర కార్యములందో-ఒకేమాట, ఒకే భావము, ఒకే చేతతో, మనో బుద్ధీంద్రియములను **తపింప జేయుటనే, తపస్సని అందురు.**

దాని ద్వారా సర్వ పాపములు నశించును. అంతఃకరణము శుద్ధి యగును. అపుడు భగవంతుడు అందే నివసించును. తపస్సు ద్వారా, సర్వ మంగళములూ సమకూరును. కడకు సర్వేశ్వరుడే సాక్షాత్కరించును.

(భా. వా. పు.182)

తపస్సులు భావములను పట్టి, రాజసిక, తామసిక, సాత్విక మను మూడు విధములు కలవు. అయితే దైవ ప్రాప్తికి, సాత్వికమే ప్రధానము, వసిష్ఠ, విశ్వామిత్రాది మహర్షులు, సాత్విక మార్గమున అద్భుత శక్తిని సాధించిరి. కడకు బ్రహ్మఋషి స్థాయికి చెందిరి. వాటిలో మరి మూడు విధములు కలవు. మానసిక, కాయిక, వాచికములను తపస్సులు. ఈ మూడింటియందూ, యేది ప్రధానమని నీవు సంశయించ వచ్చును. మూడూ ప్రధానములే. అయిననూ మానసిక తపస్సును ఆధారమే చేసుకొనక, మిగిలనకాయిక, వాచికములు అందులోనే యిమిడి పోవును.

(భా. వా. 182/183)

శారీరక తపస్సు: పరోపకార కార్యములలో పాల్గొనుట, పరమాత్మపూజ, భజన, ప్రదక్షిణ, అసన, బ్రహ్మచర్య, ప్రాణాయామములతో పవిత్రముచేయుట, దీనులకు రోగులకు సేవజేయుట, సదాచార ప్రవర్తనలతో దేహమును పవిత్రము చేయుట ఇత్యాది సత్ కర్మలకొరకు దేహమును వినియోగించుకొనవలెను.

అతిభాషలేకుండుట, అనృతములాడుకుండుట, చాడీలు చెప్పకుండుట, పరులను దూషించకుండుట, కఠినోక్తు లాడకుండుట, మధుర మయిన పలుకులు మాధవస్మరణ లతో వాక్కులను పవిత్రమును చేయుచుండుట, ఇట్టి మనో వాక్కాయములను ఉత్తమమైన మార్గమున వినియోగించిన, నిజమయిన తపస్సనబడును.

ఇందులో యే ఒకటి పవిత్రము కాకపోయిననూ అనగా మనో తపస్సు గాని, శారీరక తపస్సుకానీ, వాక్ తపస్సుకానీ పవిత్రముగా లేకుండిన ఆత్మజ్యోతి ప్రకాశించదు, ఎట్లన, దీపము వెలిగించుటకు వత్తి, నూనె ప్రమిద, యెట్లు అవసరమో, అటులనే దేహము, ప్రమిద, మనస్సు నూనె, వాక్కు వత్తి; ఈ మూడింటి నమ్మేళనే జ్యోతి ప్రకాశమునకు మూలాధారము.

(గీ.పు.232/233)

తనస్సు అనగా కాళ్ళు పైకి, తలక్రింద పెట్టి గబ్బిలము వలె వ్రేలాడుట కాదు. లేదా, ఆస్తిపాస్తులు వీడి, ఆలుబిడ్డల వీడి, ముక్కుమూసుకుని, డొక్కలు కొట్టుట కాదు. **కాయిక, వాచిక, మానసికములు మూడింటిని ఒక్కటిగ చేసి, త్రికరణశుద్ధిగా ప్రవర్తించుటే తపస్సు అనబడును.** ఇది కర్తవ్యరహితముగా చేయవలయును. ఆత్మతృప్తి నిమిత్తమై పడు ఆరాటమే తపస్సు. లౌకికములైన సుఖభాగ్యములన్నీ కూడా సత్యమని, నిత్యమని భావించి, దాని నిమిత్తమై అర్రులుచాచి వాటికి మన జీవితమును అంకితము గావించుచున్నాము. ఇవన్నీ మధ్యలో చేరినట్టివే గాని శాశ్వతమైనది దైవమొక్కటే! **అనుగ్రహమునకు దూరమైన తర్వాత అన్ని గ్రహములు నెత్తిన కూర్చుంటాయి. అనుగ్రహమే ఉండిన అన్ని గ్రహములు పటాపంచలయిపోతాయి.**

(శ్రీ.భ.ఉ.పు.14)

(చూ॥ అష్టవిధ పుష్పములు, ఆత్మవిద్య, ఆహారము, పృశ్ని, బ్రహ్మయజ్ఞము, మనో తపము, శాంతము)

తపస్సులు మూడువిధములు

శారీరక, వాచిక, మానసికములని ఈ తపస్సులు మూడువిధములు. శారీరక తపస్సు అనగా శరీరమును మంచికార్యములలో ప్రవేశపెట్టి, దేవతలను, ఋషులను, మహనీయులను గౌరవించి, ప్రార్థించి వారికి కృతజ్ఞులుగా వుండేమార్గము. వారి అనుగ్రహమునకు పాత్రుల కావటంచేత మానవుని యందున్న అహంకారము, మమకారము, క్షణిస్తుంది. ఈ అహంకారమమకారములు క్షీణించినచో వినయవిధేయతలు పెరుగుతాయి, సదాచారసంపన్నుడౌతాడు. సత్కర్మలలో ప్రవేశిస్తాడు. సత్సంగముల యందు చేరుతాడు. తద్ద్వారా భగవద్గీత, రామాయణము, భాగవతము, భారతము యిత్యాది గ్రంథముల నంతా పఠిస్తాడు. ఇలాంటివే కాకుండా కొన్ని దానధర్మ కర్మలయందు పాల్గొంటాడు. విద్యాదానము, వైద్యదానము,శ్రమదానము, అన్నదానము, యీ విధముగా భూదానము, గోదానము, సువర్ణదానము, యిలాంటి దానము లనేకముగా చేసి శారీరకమైన పవిత్రతను పెంచుకుంటాడు. అనగా శరీరమును పవిత్రమైన కర్మలలో ప్రవేశపెట్టటం, ఎట్టి దోషములకు కూడను తాను గురికాకుండా చూసుకోవటం, భౌతిక ప్రపంచమునందు యెట్టి దుర్మార్గమునకు పాల్పడకుండా వుండటం, రజోగుణము తమోగుణములకు తప్పుడు కాకుండా వుండటం. **వీటి బారినుండి సాధ్యమైనంతవరకు తప్పించుకోవటానికి ప్రయత్నించటము శారీరక తపస్సు. ఇంక వాచికతపస్సు. వాచికమనగా పవిత్రమైన, ప్రియమైన, సత్యమైన మాటలు. సత్యము కదాయని తీవ్రముగా కటువుగా యితరులను బాధించేదిగా, ఇతరులను హింసించేదిగా, ఉండకూడదు. సత్యము కదాయని అప్రీతికరమైనది చెప్పకూడదు.** దీని నాధారమే చేసుకొని **"అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్, స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్చతే"**

అని చెప్పింది గీత. పవిత్రమైన నాలుకను పరులను సంతోషపెట్టి, అనుకూలపరచి, ఆనందంచే రీతిగా వుపయోగించుకోవాలి. మనస్సు నేమాత్రము నొప్పించ రాదు. ఈ వాక్కు దైవము యొక్క లీలాగుణవిశేషములను వర్ణించాలి. పరులకు సహాయకరమైన పదములను వుపయోగపెట్టాలి. ఇతరులకు సరియైన మార్గాన్ని బోధించాలి. నీకు అనుకూలించే సత్కర్మలయొక్క ఫలితములను యితరులకు అందించటానికి ప్రయత్నించాలి. ఇతరులు పెడమార్గమున పోతుంటే సాధ్యమైనంతవరకు వాక్కు ద్వారా సంస్కరింప చేయటానికి ప్రయత్నించాలి. సత్యములో యేమాత్రము అసత్యము ప్రవేశించకుండా చూసుకోవాలి. సత్యవ్రతుడు కావాలి. అహింసావరుడు కావాలి.

(శ్రీస. గీ. పు.94/95)

తప్పు/తప్పులు

తప్పు/తప్పులు

ఈనాటి మానవుడు తనలో ఉన్న దోషాలనే ఇతరులపై ఆరోపిస్తున్నాడు. "తప్పు లెన్నువారు తమ తప్పులెఱుగరు". మీలో చెడ్డ భావాలను నింపుకొని ఇతరులను చెడ్డవారిగా భావించటం ఎంత పొరపాటు! నిజంగా మీయందు మంచి భావములే ఉంటే అందరిలోను మీకు మంచి భావములే కనిపిస్తాయి. మీరు ఏది తిన్నారో దాని వాసనే మీకు త్రేన్పుగా వస్తుంది. మీరు మామిడి పండు తిని, దాని త్రేన్పు తీసుకుంటూ అది ఇతరుల మామిడి పండు తింటే దాని త్రేన్పు మీకెలా వస్తుంది? మీరు తిన్నటువంటి పండు త్రేన్పే మీకు వస్తుంది. కాబట్టి **ఇతరులలో దోషాల నెంచుతూ, వారిని విమర్శించటం చాల పొరపాటు. ఎప్పుడూ ఇతరులలోని చెడ్డనే చూస్తూ, వారిని విమర్శిస్తూ ఉంటే వారికంటే మీరే చెడ్డవారైపోతారు. కనుక, పరులలోని చెడ్డను చూడకండి, మంచినే చూడండి. మీలో ఉన్న చెడ్డను తీసివేయండి. పరుల నుండి మంచిని స్వీకరించండి,** మీలో ఉన్న చెడ్డను దూరం చేసుకోండి.

"పరుల తిట్టినంత పాపఫలంబబ్బు
విడువ దెన్నటికిని విశ్వమందు
పరులు పరులు కారు, పరమాత్ముడేయగు
సత్యమైన బాట సాయిమాట"

అందరియందూ ఉన్న భగవంతుడు ఒక్కడే. **పరులను దూషిస్తే పరమాత్ముణ్ణి దూషించినట్లే.** కాబట్టి ఎవ్వరినీ దూషించకూడదు, విమర్శించకూడదు. అందరినీ గౌరవించండి, మీరు కూడా అందరిచేత గౌరవింపబడతారు.

(స.సా.మే99 పు.130)

"నీలో లేని తప్పులకు ఎవరేమన్ననూ బాధపడకుము. నీలో ఉన్న తప్పులకు, ఇతరులతో అనిపించు కొనకమునుపే, వానిని సరిచేసికొనుటకు నీలో నీవు ప్రయత్నించు. నీ తప్పులు, నీకు తెలుసు వారిపై నీవు కోపముగాని, ద్వేషము గాని పూనక - **'నాతప్పులు తెలిపిరే' అని తెలిపిన వారిలో వున్న తప్పులను వెదకక, తెలిపిన వారికి కృతజ్ఞత చూపు. అట్లుగాక, వారి తప్పులను వెదికి తెలుపుటలో, మరింత నీదే తప్పగును. నీ తప్పును, నీవు తెలిసికొనుటలో మంచియున్నదిగాని, నీ తప్పు చెప్పినవారి తప్పులు వెదకటంలో ఏ మంచీలేదు. దాని వలన ఏ ఫలమూ ఉండదు.**

(సా. లీ. త. పు. 22)

(చూ॥ పాపకృత్యము, శరణాగతి, శిష్యుడు)

తప్పులెన్నకు

ఒకచూపుడు వేలితో ఇతరుల తప్పులను చూపించితే నీలోని తప్పులను మూడువేళ్ళు చూపెడుతున్నాయి అని తెలుసు కోవాలి. అప్పుడే ఇతరులలోని తప్పులను ఎన్నుట మాని నీలోని తప్పులు నీవు గుర్తించగలవు.

'ఇతరుల తప్పులెన్నడం మహాపాపం
ఇతరుల దోషాలను చూపెట్టడం చేత
వారి పాపాలను పాపఫలములను
కూడా మనలో కలుపు కుంటాము"

(శ్రీ.స.ది.వా. పు.45)

తమస్సుకు అతీతుడు

(చూ॥ స్మరింతురు)

తమాషాలు

(చూ॥ తృప్తిరావాలి)

తమ్ముడు

(చూ॥ నరజన్మ, మూర్ఖుడు)

తమోగుణము

తమోగుణమనగా ఏమి? సత్యాన్ని అసత్యముగా భావించడం, అధర్మాన్ని ధర్మముగా విశ్వసించడం చెడ్డను మంచిగా భావించడం - తమోగుణము యొక్క సహజ లక్షణములు. ఈ జగత్తు అనిత్యమైనప్పటికి, దీనిని

మనము నిత్యముగా, సత్యముగా విశ్వసిస్తున్నాము. ఇదియే ప్రధానమైన తమోగుణము.

(స.సా.జూ 1989. పు. 144)

తమోగుణమునకు **ఆరు లక్షణము లుంటున్నాయి. నిద్ర, కునుకు, భయము,** క్రోధము, **సోమరితనము, తమస్సు.** పంటను పండించగోరినరైతు ఆ పొలములో మొట్టమొదట కలుపును తీయాలి. పంటకాని గడ్డి,తుంగ, అనే పదార్థములు పెరగటముచేత పంటపైరు అణగి పోతుంటాది. అట్లుకలుపు తీయకున్న పంటను అందుకొనలేము. అధిక పంటను పొందవలెనన్న మొదట కలుపు తీయాలి. అదేవిధముగనే ఆత్మానందము అనే పంటను **అందుకోగోరిన సాధకుడు తన హృదయ క్షేత్రములో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే రజస్తమోగుణముల స్వభావముతో కూడుకున్న మొక్కలను మొదలు పెరికి పారవేయాలి. అరిషడ్వర్గములు రజస్తమోగుణముల సంతతి.** కనుక మొదట తమోగుణ, రజోగుణములను దూరము చేసుకోమని చెప్పాడు కృష్ణుడు.

(శ్రీ. గీ. పు. 262)

తయారుగా వుండు

ఆసక్తి మారకం. అనాసక్తి తారకం. కోటీశ్వరుడు ఆదాయపు పన్ను ఏడుస్తూ చెల్లిస్తాడు. బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు తన పాఠశాల తాలూకు బల్లలూ, కుర్చీలూ ప్రయోగశాల సామగ్రీ సంతోషంగా అప్పగించి వెళ్తాడు. ఎందువల్ల? ఈ ఆస్తికి తాను అధిపతిని కాననీ ధర్మకర్తగా వ్యవహరిస్తున్ననీ హెడ్మాస్టరుకు తెలుసు. స్కూలులో వస్తువులన్నీ ప్రభుత్వానివి. కాబట్టి వాటిమీద మమకారం పెంచుకోలేదు. ఆవిధంగానే కుటుంబం, ఇల్లూ, పొలాలు, కార్లూ ఇవన్నీ భగవంతుని సొత్తు. వాటికి మీరు ధర్మకర్తలు మాత్రమే. అతి స్వల్ప వ్యవధిలోనే వాటిని వదిలిపెట్టి వెళ్ళిపోవటానికి తయారుగా వుండండి.

(శ్రీ స సూ పు. 56)

తరమా!

పదపదమంచుకింకరులు పాశము
లాగెడు వేళ బంధువుల్
దబదబమంచు బైటపెట్టుడిక లాభములేదని
చెప్పువేళ
ఆలుబిడ్డలు లబలబ ఏడ్చువేళ
తరమా! హరినామము నోట బల్కగన్.

(ము.ము.పు.5)

తరించాలి

(చూ॥ కృష్ణలీలలు)

తలంపులు

మనస్సు నందు రెండు విధములైన తలంపులు జరుగుతూ ఉంటాయి. **ఒకటి ఆలోచన. రెండవది మానసిక సంభాషణ.** మన సమస్యలను పరిహారము గావించుకొనే స్థితిని పొందేవి ఆలోచనలు. సమస్యలను మరింత అభివృద్ధి గావించి, మానవుని అనేక విధములైన పెడమార్గములను పట్టించేవి మానసిక సంభాషణలు. అట్లు అవి రెండూ భిన్న భిన్నముగా ప్రవర్తిస్తున్నవి. ఈ మానసిక సంభాషణలలో, పరుల దూషణలను, చెడ్డను, పరిస్థితిని, ప్రవేశపెట్టుచున్నాము. మనకున్న అనారోగ్యమునకు త్వరలో ప్రవేశిస్తున్న వృద్ధాప్యమునకు, సమస్త దుఃఖములకు ఈ మానసిక సంభాషణలే కారణము. ఇవి మనస్సునందు కారుమబ్బుల వలె చీకటిని క్రమ్ముచున్నవి. ఈ సంభాషణలు పెరిగి, పెద్దవై, మానవత్వమును కూడా మరపింపజేయుచున్నవి. జాగ్రదావస్థయందనుభవించిన సంభాషణలను, స్వప్నావస్థయందు కూడా ప్రారంభమవుతున్నందున, నిద్రలోని మానసిక విశ్రాంతిని కోల్పోయి బాధలను, దుఃఖములను, విషాదములను అరికట్టలేని బలహీనులము అగుచున్నాము. వాటివలన లభించే ఫలితము ఏమాత్రము లేదు. **ఏ మానవుడు ఈ మానసిక**

తలంబ్రాలు

సంభాషణలను స్తంభింపజేసి విశ్రాంతినందు కోగల్గునో, అట్టి మానవుడే పరిపూర్ణ మానవుడు.

(శ్రీ.భ.ఉ.పు.23)

తలంబ్రాలు

తలంబ్రాలు పోయటానికని ముత్యములను తెచ్చి తట్టలలో పెట్టుకున్నారు. భారతీయ సంస్కృతియందు ఇది ప్రధానమైన ఆచారము. సీత తలంబ్రాలు తీసుకొని దోసిలి పట్టినప్పుడు గోరింటాకు వలన తెల్లని ముత్యములన్నీ ఎఱ్ఱగా కనిపించాయి. వాటిని తీసి రాముని తలపై పోసింది. రాముని తలపాగా తెల్లగా ఉండటం చేత ఆ ముత్యములు కూడా తెల్లగా కనిపించాయి. రాముని వర్ణము నీలవర్ణము. కనుక, అవి క్రింద పడేటప్పటికి నీలంగా మారిపోయినవి. చేతిలో తీసుకున్నప్పుడు ఎఱ్ఱగా, తలపై పోసినప్పుడు తెల్లగా, క్రింద పడినప్పుడు నీలంగా మారుతూ వచ్చాయి ముత్యములు. **~~ఈ~~ కళ్యాణము జగత్కల్యాణముగా రూపొందింది. మంగళకరంగా జరిగింది.**

(శ్రీ.భ.ఉ.పు.56/57)

తర్ఫీదు

(చూ॥ క్రమశిక్షణ)

తల్లి/తల్లులు

పుడమిని కన్నతల్లి పూజనీయులు కదా।
వారి మించువారు వసుధ లేరు
కన్నతల్లి సేవకన్న మించినది లేదు
జన్మభూమి కన్న స్వర్గమేది?

(సా॥ పు. 362)

ప్రేమస్వరూపులారా! ~~ఈ~~ ప్రపంచములో అనేక విధములైన సంబంధ బాంధవ్యములున్నాయి. కానీ, తల్లితో గల బాంధవ్యమును మించినది మరొకటి లేదు. దీనిని పురస్కరించుకొనియే స్వదేశమును మాతృదేశం అన్నారు. స్వభాషను మాతృభాష అన్నారు. తల్లికి ఉన్న ప్రాముఖ్యత మరెవరికీ లేదు. తల్లిదండ్రుల పేర్లలో తల్లి పేరే మొదట వస్తుంది. అదేవిధంగా భార్యాభర్తల పేర్లలో కూడా భార్య పేరు వస్తుంది. సీతారాములు అంటారేగాని రామసీతలు అనిఎవరైనా అంటారా?అదే విధంగా రాధాకృష్ణులు అంటారేగాని, కృష్ణరాధ అని అనరు. ఇది లౌకిక జీవితానికి మాత్రమే పరిమితం కాదు. ఆధ్యాత్మిక మార్గము నందు కూడా స్త్రీలకు, తల్లులకు ప్రథమ స్థానం అందించబడింది. దయ, సహనము, శాంతి, సత్యము, సానుభూతి ఇత్యాది సద్గుణములను మొట్టమొదట నేర్పించేది తల్లియే. పవిత్ర హృదయులైన తల్లుల అడుగు జాడల ననుసరించియే కుమారులు గుణవంతులుగను, కీర్తివంతులుగను, మేధావంతులుగను అభివృద్ధి గాంచుతారు. **~~ఈ లోకంలో~~ దుర్మార్గుడైన కుమారుడు ఉన్నాడు గాని, దుర్మార్గురాలైన తల్లి లేదు.** ప్రత్యక్షంగా, భౌతికంగా మిమ్మల్ని పోషించి అభివృద్ధికి తెచ్చేది మీ తల్లియేగాని దైవం కాదు. ప్రత్యక్షంగా కంటికి కనిపించే వారు మీ తల్లిదండ్రులు, మిమ్మల్ని కనిపెంచి పెద్దచేసినవారు మీ తల్లి దండ్రులు అలాంటి వారిని విస్మరించి, కంటికి కనిపించని విష్ణువును, శివుణ్ణి, రాముణ్ణి, కృష్ణుణ్ణి ఆరాధిస్తే ప్రయోజనం లేదు. **మీ పుడ్డు, మీ హెడ్డు, మీ బ్లడ్డు, మీ దుడ్డు అంతా తల్లిదండ్రులయొక్క వరప్రసాదమే.** వీటిని ఏ దేవుడూ మీకు ప్రత్యక్షంగా అందించటం లేదు కదా. కనుక, మొట్టమొదట మీరు తల్లిదండ్రులను దైవంగా విశ్వసించాలి. ప్రత్యక్షంగా కనిపించే తల్లిదండ్రులను ప్రేమించి గౌరవించినప్పుడే పరోక్షమైన దైవత్వం మీకు సాక్షాత్కరిస్తుంది. **తల్లి తండ్రిని చూపుతుంది. తండ్రి "నాయనా!ఇతడు నీ గురువు ఇతను చెప్పినట్లు వినుఅని గురువును చూపుతాడు. గురువు దైవాన్ని చూపుతాడు. కనుకనే తల్లి,తండ్రి, గురువు, దైవము - ~~ఈ~~ నల్గురిలో తల్లికి ప్రథమ స్థానం అందించబడినది.**

(స.సా.జూ 99 పు. 141/142)

తల్లులే దేశమునకు వెన్నెముకవంటివారు, హృదయంవంటివారు, శ్వాసవంటివారు.ఈ ప్రపంచ నాటకంలో తల్లుల పాత్రయే ప్రధానమైనది, పవిత్రమైనది. కనుక, తల్లులే జాతిని, నీతిని నిర్మించుటకు కృషి చేయవలెను. ప్రతి మానవునికి **తల్లి ఒడియే బడి, ఒడియే ప్రథమ గుడి. ప్రతి స్త్రీ ఉత్తమ మాతృమూర్తిగా తయారు కావడం అత్యవసరం. మంచి భార్య, భర్తకు మాత్రమే ఆదర్శం. మంచి హృదయం గల మాతృమూర్తి ప్రపంచానికే ఆదర్శం.**

(స.సాజూ 99 పు. 148)

ద్రౌపది ఎట్టి పరిస్థితులలోను కృష్ణుని మాటలను ఉల్లంఘించేటటువంటిదికాదు. **అలాంటి పతివ్రతామ తల్లులు, ఈ పవిత్ర భారతావనిలో ఉండటంచేతనే భారతదేశము ఈనాటికీ ఎంతో క్షేమాన్ని అనుభవిస్తున్నది.** కనుక క్షమాభావము ప్రతి మానవునికి అత్యవసరం అప్పుడే క్షమారూపంలో సాక్షాత్కరిస్తాడు దైవము. ఈ గణపతి పండుగ కూడనూ క్షమాతత్త్వాన్ని ప్రకటింపచేసి, దివ్యతత్త్వాన్ని ఆచరింపజేసి, ఆనందాన్ని అనుభవింపజేసే టటువంటిది.

(శ్రీ అ. 2000 పు.11)

ఆనాటి పవిత్ర హృదయులైన తల్లులు ఏది చెప్పినప్పటికీ అది తప్పకుండా జరిగేది. అలాంటి తల్లులు తమ కుమారులను ఆశీర్వదించేటప్పుడు దైవం కూడా, "తథాస్తు తథాస్తు'' అనేవాడు. కేవలం తల్లి యొక్క ఆశీర్వాదం మాత్రమే చాలదు, దైవానుగ్రహం కూడా అత్యవసరం. నెగెటివ్, పాజిటివ్ చేరిక వల్ల కరంటు ఏర్పడినట్లుగా తల్లి ఆశీర్వాదం, దైవానుగ్రహం రెండూ చేరినప్పుడే విజయం ప్రాప్తిస్తుంది. కనుక ప్రతి వ్యక్తి తన తల్లి హృదయాన్ని సంతృప్తిపరచడానికి ప్రయత్నించాలి. దానితోపాటు దైవానుగ్రహం కోసం పాటుపడాలి. దైవానుగ్రహం లేకపోతే తల్లి ఎంతగా ఆశీర్వదించినప్పటికీ ప్రయోజనం ఉండదు. మహాభారతయుద్ధానంతరం శ్రీకృష్ణుడు గాంధారీ ధృతరాష్ట్రులను చూడడానికి వెళ్ళాడు. ధృతరాష్ట్రుడు చాలా బాధపడ్డాడు. గాంధారి పట్టలేనంత దుఃఖంతో, కోపంతో "కృష్ణా! కౌరవులు, పాండవులు అన్నదమ్ముల బిడ్డలేకదా! మరి నీకు కౌరవులపై అంత ద్వేషం ఎందుకు? ఐదుమంది పాండవులనూ సురక్షితంగా కాపాడావు. కానీ నా నూరు మంది కుమారులలో ఒక్కడైనా మిగలకుండా చేశావు. ఎంతటి పక్షపాతం నీకు!'' అన్నది. అప్పుడు కృష్ణుడు నవ్వుతూ, "గాంధారీ! నీకు నూర్గురు కుమారులు కల్గినప్పటికీ ఏనాడైనా ఒక్కడినైనా నీ కంటితో చూశావా? తల్లి దృష్టికే నోచుకోలేనివారు దైవ దృష్టికి ఏరీతిగా నోచుకోగలరు?'' అన్నాడు. కనుక కుమారుడిపైన తల్లి దృష్టి పరిపూర్ణంగా ఉండాలి. **నేటి కాలంలో దుర్మార్గుడైన కుమారుడు ఉన్నాడేమో గాని దుర్మార్గురాలైనా తల్లిలేదు. మాతృదేవిని ఎంతగా ఆనందపర్చితే మాతృదేశం కూడా అంతగా ఆనందాన్ని అనుభవిస్తుంది. ప్రతి వ్యక్తికి జనని, జన్మభూమి రెండూ చాలా ప్రధానమైనవి.**

భారతీయుల పవిత్రమైన సంస్కృతిని మనము చక్కగా అర్థం చేసుకోవాలి. భవిష్యత్తులో మాతృస్వరూపులుగా తయారయ్యే విద్యార్థినులు ఉంటున్నారు. కనుక, మీరు ఈ విషయాలను శ్రద్ధగా విని, మీ పిల్లలను సరియైన పద్ధతిలో పోషించి, అభివృద్ధి పరచి, ఆదర్శపుత్రులగా తయారుచేయాలి.

పూర్వము మదాలస అనే స్త్రీ తనకు పుట్టిన పిల్లవానికి నిరంతరం భగవచ్చింతన బోధించేది. తన పిల్లవానిని ఉయ్యాలలో ఊపుతూ. "ఓంకారమనే ఒక తొట్టిలోన, తత్వమసి అనే పరుపు పరచి, ఎఱుక అనే బాలుని ఏమరక ఉంచి, ఏడుజగముల వారు ఏకమై ఊయల ఊపగా, లాలి....!'' "ఓ కుమారుడా! అప్పుడే నీ ప్రజ్ఞానం వికసిస్తుంది. నిరంతరం నీవు దివ్యమైన భావాన్ని కలిగియుండుము. ఈ లోకముక్తికై నీవే మాత్రము వెరువవద్దు. నీవు దివ్యత్వాన్ని పొందుము.'' అని ఆశీర్వదిస్తూ ఆమె జోలపాట పాడేది. కాని ఈనాటి వారు పిల్లవానిని ఊయలలో పరుండబెట్టి "నీవు గొప్ప విద్వాంతుడవు కావాలి. నీవు విదేశాలకు వెళ్ళి డబ్బు

తల్లి ఆశీర్వాదము

సంపాదించాలి.'' అని దీవిస్తూ జోలపాట పాడుతుంటారు. ఇటువంటి భావాలతో పిల్లలను పోషిస్తున్నారు. పిల్లవాడు పుట్టిన వెంటనే పెండ్లి గురించి ఆలోచిస్తారు. ''నీకు లక్షాధికారి బిడ్డ నిచ్చి పెళ్ళి చేస్తాము. అప్పుడు మంచి వరకట్నం కానుకలు వస్తాయి. వాటి ద్వారా మనం మిద్దె కట్టుకోవచ్చు.'' ఇటువంటి ఆశలను ఈనాటి తల్లులు తమ పిల్లలకు చిన్నతనం నుండియే బోధలు చేస్తున్నారు.

(శ్రీ.భ.ఉ.పు.132/133)

(చూ॥ మాతృదేవోభవ, సరస్వతి)

తల్లి ఆశీర్వాదము

ప్రాచీనకాలంలో అనేకమంది మహనీయులు తల్లి ఆశీర్వాదము తీసుకున్న తరువాతనే తమ కర్తవ్యకర్మలను ఆచరించడానికి పూనుకునేవారు. యుద్ధమునకుగాని, తపస్సుకుగాని బయలుదేరే ముందు కుమారుడు తల్లిపాదములపైపడి ఆశీర్వదించుమని ప్రార్థించినప్పుడు,

"తారకాఖ్యాసుత దోర్దర్ప మణచు వేళ
గౌరి తనయుని కిడ్డ వీరరక్ష
శంభరాసుర వీర జంపగా జనువేళ
భార్గవ సుత కిడ్డ భవ్యరక్ష
మాతృదాసీత్వంబు మాన్ప నఱుగు వేళ
వినత పుత్రున కిడ్డ విమలరక్ష
జనకు యానతి పాలింప వనికేగెడున్ వేళ
తల్లి రాఘవు కిడ్డ ధన్యరక్ష
అట్టి శ్రీరక్ష, ధీరక్ష, అంగరక్ష
రక్షలందున దివ్యమౌ రామరక్ష
తోడు నీడయై నిన్ను కాపాడుగాకఃఁ

అని తల్లి ఆశీర్వదించి పంపేది. ఇట్టి ఆశీస్సులచేతనే కుమారులు యుద్ధములో పోరాడి విజయాన్ని సాధించగల్గేవారు, అరణ్యంలో కఠోరమైన తపస్సు చేసి దైవానుగ్రహాన్ని పొందగల్గేవారు. **తల్లి ఆశీస్సులు పొందలేనివారు అనేక జన్మల నెత్తవలసి వస్తుందని శంకరులవారు అన్నారు. తల్లి ఆశీస్సులు పొందినవారికి పునర్జన్మ లేదని కూడా అన్నారు.** కనుక మొట్టమొదట తల్లి యొక్క అనుగ్రహానికి పాత్రులు కావాలి. అయితే ఇది ప్రాకృతమైన జీవితానికి మాత్రమే సంబంధించినది.

(స.సా. జూ. 1997 పు. 141)

పాండవులు యుద్ధానికి బయలుదేరేటప్పుడు తల్లి కుంతీదేవి చక్కటి ఆశీర్వాదమును అందించింది. "నాయనలారా! మీరు యుద్ధమునకు పోతున్నారు. యుద్ధములో విజయమును సాధించడానికి వెళ్ళుతున్నారు. ధర్మం కొద్దీ విజయం లభిస్తుంది'' అన్నది.

మాతృప్రేమను నిరూపించే నిమిత్తమై స్వామి కూడనూ జన్మ యొక్క ఆదర్శమును అందించే నిమిత్తమై నా తల్లి సమాధికి పుట్టిన దినం వెళ్ళుతుండే వాడను. ఎందుకోసం వెళ్ళుతూ వచ్చాను? నేను ఏది చేసినప్పటికిని ఇతరులకు **ఆదర్శవంతమైనదిగా నిరూపిస్తూ వచ్చాను.** ఈ భావమును పురస్కరించుకొనియే తల్లుల యొక్క ఉత్తమ మనస్సులు కూడా కరిగి పోతుంటాయి.

(శ్రీ జూలై. 98 పు.10/11)

(చూ॥ తల్లి/తల్లులు)

తల్లి తండ్రులు

నిత్యజీవితంలో సంభవించునటువంటి స్వల్పమైనవానికే మానవుడు ఋణపడి ఉండినపుడు, జన్మనిచ్చి పోషించిన తల్లితండ్రులకు ఋణపడి ఉండటంలేదా? కన్నతల్లికి, పెంచిన తండ్రికి ఎంతో ఋణపడి ఉంటాము. ఇది మన కర్తవ్యమే. కాని జన్మించినంత మాత్రమున, పోషించినంత మాత్రమున ప్రయోజనంలేదు. **సమాజంలో వ్యక్తిగా మానవత్వాన్ని ప్రకటించి సత్కీర్తిని ఆర్జించి గుణవంతునిగా చేసినటువంటిదే విద్య. ఈ విద్యను అందించినవాడు అధ్యాపకుడు. కనుక "తల్లి తండ్రుల కంటె అధ్యాపకులకు అతి ఋణపడి ఉంటున్నాను' అన్నాడు లెగ్జాండరు.** కాని ఈనాడు అట్టి గుణవంతుడైన పుత్రుడు అరుదుగా కనిపిస్తున్నాడు. వారు చేసే పనులయందుకాని, వారి నడతల యందుగాని

తల్లిదండ్రులు సరియైన బాధ్యత వహించటంలేదు. అధ్యాపకులు కూడ వారిని గుర్తించటంలేదు. **ఇది అధ్యాపకులకు, తల్లితండ్రులకేకాక యావత్ మానవజాతికి వ్యాధి సంభవిస్తుంది.** తన కుమారుడు ఎట్టివాడైనప్పటికి ధనార్జనచేసి, అతనికి అందించటమే తల్లి దండ్రులయొక్క కర్తవ్యమని భావిస్తున్నారు. ధనమును సంపాదించి, లేక గృహమును కట్టించి, సదుపాయములు చేయటమే తల్లిదండ్రుల కర్తవ్యము కాదు. **గుణవంతునిగా పుత్రుని తీర్చి దిద్దాలి. అట్టి విద్యను ఈనాటి బాలబాలికలయందు, యువకులయందు ప్రవేశపెట్టాలి. గుణముకంటె మించిన బలముకాని, ధనముకాని లోకములో లేదు.**

కంచునందు మ్రోత ఘనముగా పలుకును
కనకమందు మ్రోత కానరాదు
అల్పులయందున ఆడంబరము హెచ్చు
పైన పూతలేల భక్తులకును॥

కనుక ఈనాటి **అణుకువలయందు** నిజత్వము, మానవత్వము అంతర్లీనమై ఉంటుంది. కాని ఈనాడు గొప్పగొప్పవారు, విద్యావంతులు అభిమానమును, స్వార్థమును అభివృద్ధి గావించుకొని కుమారుల భవిష్యత్తును పెడమార్గము పట్టిస్తున్నారు. పుత్రాభిమానము చేత స్థానగౌరవాన్ని కోల్పోతున్నారు. కనుక మొట్టమొదట అధ్యాపకులు బాలబాలికలు హృదయములందు గౌరవమర్యాదలను అభివృద్ధి గావించాలి. తల్లిదండ్రులను గౌరవించే విధానము నేర్పాలి.

(సా.మా.సా.బా. 2 పు. 50/51)

చిన్నతనంలోనే ఆధ్యాత్మిక సాధనలో ప్రవేశించినందుకు తమ బిడ్డలను దండించే హిరణ్యకశిపులవంటి తల్లిదండ్రులు నేడు ఉన్నారు. అంతేకాదు. వారిలో కొందరు తమ పిల్లల దుష్ప్రవర్తనను గమనించనట్లు, వారు సత్ప్రవర్తనే కలిగియున్నారని ఇతరులను భ్రమింపజేయడానికి కూడా ప్రయత్నిస్తారు. తమ పిల్లలను మంచి మార్గంలో పెట్టడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయరు. **తల్లిదండ్రులయొక్క ఇటువంటి స్వభావమువలన విద్యార్థులు దుర్మార్గంలో ప్రవేశించి ధృతరాష్ట్ర కుమారులవలె చెడిపోతారు.** ఇందుకు విద్యార్థులను నిందించవలసిన పని లేదు. **వారి దుష్ప్రవర్తనకు తల్లిదండ్రులే బాధ్యులు.** ఆ దుష్ప్రవర్తనే విద్యాసంస్థలలో క్రమశిక్షణా రాహిత్యమునకు కారణభూత మవుతుంది.

(స.సా.న. 99 పు. 338)

(చూ॥ గురువులు, ధృతరాష్ట్రప్రేమ, సంపద, హృదయవాసి)

తవైవాహం

(చూ॥ భక్తి ప్రపత్తులు, శరణాగతి)

తామరపువ్వు

తామరపువ్వు బురదలో పుట్టుతుంది. వాసనగల ఆ నీటిలో నుంచే పైకి వస్తుంది. తామరాకు మీద నీరు వేసినా అంటదు. అట్లే బురద చెడునీరు అనే అరిషడ్వర్గాలను తీసివెయ్యి. స్వచ్ఛమైన, ఆనంద మైన తామరాకు మిగులుతుంది. అది "నేనే". తామరాకు మీద నీటి బొట్టువలె సంసారములో యుండి సంసార వాసనలు అంటుకోబోకు. మిగిలేది 'నేనే' సర్వ శేషిని ప్రేమస్వరూపుడను. అనుభవించి ఇతరుల కందించు.

(సా. పు.462)

తామసము

తామసము,కన్నులు కప్పించి అజ్ఞానము తెలివి తక్కువ, అజాగ్రత్త, నిద్రమత్తు, బద్ధకము, మాంద్యము మొదలగునవి తామసముయొక్క ఉపాధులయి తప్పుత్రోవలకు తీసుకొనిపోవుచుండును. **తెలివిని లేదా జ్ఞానమును కప్పిపుచ్చి కనిపించుదానిని కనిపించనట్లు చేయును. దాని నిక్షేపశక్తిని గొప్ప గొప్ప పండితులకూడను దాటలేరు.** సరియైన తీర్మానమునకు రాలేరు. తామసము కలవాని మనస్సు అనేక శంకలతో నుండి అర్థముకాని భోగములందాసక్తి కలవాడై జ్ఞానము కోల్పోవుచుండును. అట్టి వారికి వారి ఆస్తి పాస్తి భార్యాబిడ్డలే, ఆత్మగా

తామసిక

కనిపించుచుండును. అట్టి వారికి అసత్యము సత్యము గానూ, సత్యము అసత్యముగానూ కనిపించును.

(జ్ఞా. వా. పు. 16/17)

తామసిక

(చూ॥ గుణములు, జగదీశుడు, తత్త్వజ్ఞానము)

తామసికశ్రవణదృశ్యములు

భగవదారాధకులను, భగవత్ చిత్రములను భగవత్ స్వరూప శిలలను, సాత్విక మార్గమున ప్రవర్తించు సాధనలు సలుపు మహనీయులను చూచుట, అట్టివారి కథలను వినుట, వారల చిత్రములను స్వరూపములను, ప్రతిమలను ఇంటియందుంచుకొనుట, ఇవ్విధములైన చూపులు, శ్రవణములు సాత్వికములగును. విలాస దృశ్యములు, విలాస చిత్రములు చూచుట కానీ, వాటిని గురించి వినుట కానీ, ఆడంబరములతో అధికారుల వెంట తిరుగుట కానీ, అట్టి వారలతో చేరిన చిత్రపటములను వర్ణించుట కానీ, అట్టి చిత్రములే ఇంటిలో యెటుచూచినా ప్రదర్శించుటకానీ, అనగా విలాస, ఆడంబర, అహంకార, అధికార చిత్రములు చూచుట కానీ, పూజాగృహములందుంచుట కానీ, రాజసిక మగును. ఇక **దుర్మార్గ, దురాచార, క్రూర విషయములను వినుట కానీ, చూచుట కానీ, అట్టివారలతో సంభాషించుట కానీ, అట్టివారి చిత్రములను ఇంటియందుంచుకొనుట కానీ, భూత ప్రేత, పిశాచారాధనలు కానీ, తామసిక శ్రవణ దృశ్యములగును.**

(గీ.పు.235)

తార

(చూ॥ కాయము)

తారకమంత్రము

(చూ॥ ప్రేమ)

తితీక్ష

తితీక్ష యనగా ద్వంద్వములలో సహనము. సహనము బలవంతులకే తగినది: అది వారి సొత్తే, వారి పొత్తే. దుర్బలుడు ద్వంద్వాల తాకిడికి నిమిషము స్థిరములేక, నెమలి పింఛమువలే కదలుచునే యుండును. గడియారము పెండ్యులమువలే అటూ ఇటు కదలు చునే యుండును; అనగా, ఒకతూరి సుఖమువైపున మరొకతూరి దుఃఖమువైపునా చూచుచుండును.

(గీ.పు.29)

(చూ॥ అథాతోబ్రహ్మజిజ్ఞాస, అలవర్చుకోవాలి)

తిరుక్కురళ్

తమిళ భాషలో **"తిరుక్కురళ్" అనే ఒక వేద సమానమైన గ్రంథం ఉన్నది. దీనిని రచించినవాడు తిరువళ్ళువర్.** ఇతడు ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరిస్తూ లోక శ్రేయస్సు కోసం పాటు పడుతూ, నియమబద్ధమైన జీవితాన్ని గడుపుతూ వచ్చాడు. **ప్రతిరోజూ భోజనం చేసే సమయంలో ఒక కప్పులోనీరు, ఒక సూది తన ప్రక్కన పెట్టమని భార్యను కోరేవాడు.** కానీ, ఒక దినమైనా ఆ నీరునుగాని, సూదినిగాని అతడు ఉపయోగించకపోవడం గమనించి ఆమె ఒకనాడు "నాథా! మీరు కోరినట్లుగా ప్రతి దినమూ భోజన సమయంలో ఒక కప్పులోనీరును, ఒక సూదిని మీ ప్రక్కన పెడుతున్నాను. కానీ, ఒక్క దినమైనా మీరు వాటిని ఉపయోగించటం లేదే!" అని అడిగింది. దానికి సమాధానంగా తిరువళ్ళువర్ **"భోజనం చేసే సమయంలో ఒక్క మెతుకునైనా వ్యర్థం చేయటం నాకు ఇష్టం ఉండదు. పొరపాటున కంచం నుండి ఒక మెతుకు క్రింద పడితే, దానిని సూదితో గ్రుచ్చి, నీటిలో ముంచి శుభ్రంచేసి తీసుకోవాలని నా ఉద్దేశ్యం.** కానీ, ప్రతిరోజు నేను ఒక్క మెతుకు కూడా క్రింద పడకుండా జాగ్రత్త వహించడంచేత ఇంతవరకు ఈ నీటిని గాని, సూదినిగాని ఉపయోగించవలసిన అవసరం నాకు కలుగలేదు" అన్నాడు.

(స.సా.మే. 99 పు. 127/128)

(చూ॥ అద్వైతదర్శనము, తిరువళ్ళువర్)

తిరుపతి

(చూ॥ అయస్కాంతశక్తి)

తిరుప్పండార్

(చూ॥ సర్వాంతర్యామి)

తిరువళ్ళువరు / తిరువళ్ళువర్

కావేరి నదికి అతి సమీపంలో కూపం అనే గ్రామము ఉండేది. ఆ గ్రామంలో ఒక వ్యక్తి బట్టల వ్యాపారం చేస్తూ ఉండేవాడు. అతడు తెల్లవారినది మొదలుకొని రాత్రి పరుండునంతవరకు "రాం, రాం" అని రామనామాన్ని స్మరిస్తూ వస్త్రములను నేసి, ఆ వస్త్రములను బజారులో పెట్టి అమ్మి, తద్వారా వచ్చిన ధనంతో కుటుంబమును పోషించుకునేవాడు. ఒకనాడు ఎవరూ అతనివద్ద వస్త్రమును కొనటానికి రాలేదు. సాయంకాలమైనది. ఆ గ్రామంలోనే ఒక శ్రీమంతుని కుమారుడుండెడివాడు. వాడు చదువుసంధ్యలు లేక ఎప్పుడూ బజార్లవెంట తిరుగుతూ ఉండేవాడు; చాల తుంటరి మనిషి, పోకిరీ మనిషి. ప్రతి ఒక్కరినీ బాధించేవాడు. ఈ శ్రీమంతునికి ఎంతోమంది ఫిర్యాదు చేశారు. కానీ, అతడు ఆ పిల్లవానిని అదుపులో పెట్టుకోలేకపోయాడు. ఆనాడు సాయం కాలమయ్యేటప్పటికి ఆ పిల్లవాడు ఈ వ్యాపారస్థుని దగ్గరకు వచ్చి "అయ్యా! ఏమిటి ఈ బట్ట"? అని అడిగాడు. "నాయనా! ఇది ఒక చీర" అన్నాడు. "దీని వెలయెంత?" అని అడిగాడు. "పది రూపాయలు నాయనా!" అని చెప్పాడు. ఆ పిల్లవాడు ఆ చీరను సగానికి చించి "ఇది ఎంత?" అని అడిగాడు. వ్యాపారి ఏమాత్రము కోపగించుకోకుండా "ఇది ఐదు రూపాయలు నాయనా" అన్నాడు. ఆ పిల్లవాడు తిరిగి మరొక ముక్క చించి "ఇది ఎంత?" అని అడిగాడు. "రెండున్నర రూపాయలు నాయనా" అన్నాడు. పరమశాంతంగా. దానితో ఆ పిల్లవాని మనస్సు మారిపోయింది. ఎవరైనా యీవిధమైన తుంటరి పని చేస్తే వ్యాపారస్థుడు కోపపడటమో, లేక దూషించటమో, లేక రెండు కొట్టటమో జరుగుతుంది. కానీ, ఈ వ్యాపారి ఏమాత్రము కోపగించుకోలేదు. ఇంతటి పవిత్రమైన శాంతము ఈ వ్యాపారికి ఏరీతిగా లభించిందని ఆ పిల్లవానిలో ఆశ్చర్యం కల్గింది. "అయ్యా! నేను నీ వస్త్రమును ముక్కలు ముక్కలుగా చేసినప్పటికీ నీవు పరమ శాంతంగా ఉన్నావు. నీ హృదయం చాల పవిత్రంగా ఉన్నది. ఈ పవిత్రత, ఈ శాంతము నీకు ఎట్లా లభ్యమైనాయి?" అని అడిగాడు. **"నాయనా! భగవంతుడు శాంతస్వరూపుడు. అట్టి శాంతస్వరూపుణ్ణి నేను స్మరించటంచేత భగవంతుడు నాకు కూడా అట్టి శాంతమును అందించాడు."** అన్నాడు. మీరు ఎవరిని ఆరాధిస్తుంటారో వారి భావములే మీయందు ఆవిర్భవిస్తాయి. భగవంతుడు సత్ చిత్ ఆనంద స్వరూపుడు, శాంతస్వరూపుడు. **భగవంతుణ్ణి కోరవలసింది ఏమిటి? మీ దగ్గర లేని ఆనందమును, శాంతమును అందించమని కోరాలి. అంతేగాని ఈ ప్రపంచంలో లభ్యమయ్యే ఈ సుఖమును, ఆ సుఖమును, ఈ సంతోషమును, ఆ సంతోషమును కోరకూడదు. ఎందుకంటే, అవన్నీ తాత్కాలికమైనవే. శాంతిని అందించేది పరమాత్ముడు ఒక్కడే. సత్యమును ప్రబోధించేది పరమాత్ముడు ఒక్కడే. కనుకనే, "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అన్నారు. అట్టి భగవచ్చింతన చేతనే నాకీ శాంతి లభ్యమైంది అన్నాడు.** ఆపిల్లవాడు అతని పాదములపై పడి "అయ్యా!ఇక నుండి మీరే నాకు గురువు. ఇంతకాలం నా జీవితాన్ని చాల దుర్మార్గంలో గడిపినాను. నన్ను క్షమించి నాకు కూడా అట్టి పరమ శాంతము ప్రసాదించండి" అని కోరాడు. **అగురువే తిరువళ్ళువరు.**

(సా. శ్ర. పు. 69/70)

తీర్థయాత్ర

నీవు భగవంతుని సమీపించడానికి వేసే ప్రతి ఒక్క అడుగుకు, భగవంతుడు కూడా నీవైపు పది అడుగులు

తీర్థయాత్ర

వేసి ముందుకు వస్తాడు. ఈ తీర్థయాత్రలో ఆగడమనేది లేదు. ఇది నిరంతర ప్రయాణము. రాత్రింబవళ్ళు, లోయల గుండా, ఎడారుల గుండా, కన్నీళ్ళతో, చిరునవ్వులతో, జనన మరణాలతో గర్భకోశం నుంచి సమాధుల వరకు సాగే ప్రయాణం. రోడ్డు చివరకు వచ్చి, గమ్యం చేరుకొన్నప్పుడు, యాత్రికుడు తన నుంచి తనలోనికే పయనించినట్లు తెలుసుకొంటాడు. ఆ దారి సుదీర్ఘం, ఒంటరి ప్రయాణం, కాని ఆదారిలో నడిపించిన భగవంతుడు అంత సేపు తనలోనే ఉన్నాడు, చుట్టూ ఉన్నాడు, తనతోనే ఉన్నాడు, తన ప్రక్కనే ఉన్నాడు!

(ప. పం. ద. పు. 65)

జీవితం ఒక తీర్థయాత్ర. దానిపై మానవుడు కాళ్ళీడ్చుకొంటూ మెఱుకపల్లాలు ఉన్నా, ముళ్ళ పొదలున్నా ఆ దారిలో పయనిస్తుంటాడు. **భగవన్నామం పెదవులపై ఉంటే** దప్పిక అనేది ఉండదు. భగవంతుడి రూపం మనసులో ఉంటే మార్గాయాసం ఉండదు. పవిత్ర మూర్తుల (సహకారం) సహవాసం ఉత్తేజాన్ని కలిగించి ఆశను, నమ్మకాన్ని కలుగజేస్తాయి. **పిలుపు నందుకొనేటంతలో భగవంతు డున్నాడు అనే అభయం, ఎల్లప్పుడు దగ్గరనే ఉన్నాడనే భావం రావడానికి ఆలస్యం కాదనే విషయం, కరచరణాలకు బలం చేకూరుస్తాయి, కళ్ళకు ధైర్యాన్నిస్తాయి.**

(అ. ష. పు. 32)

(చూ॥ నదీస్నానం)

తుంగభద్ర

వేదాంతమునందు మానవశరీరమునకు తుంగభద్ర అని ఒక పేరు. తుంగభద్ర అని ఒక నది కూడా ఉంటున్నది. తుంగ, భద్ర రెండూ చేరటంచేతనే తుంగభద్ర అని పేరు వచ్చింది. భద్ర అనగా మంచి, పవిత్రము, కళ్యాణము, శోభ అనే అర్థాలుంటున్నాయి. తుంగ అనగా చాల బలమైన, గొప్ప, విశాలమైన యీ విధమైన అర్థములు తీసుకోవచ్చు. మంచి కార్యములు చేసేది, గొప్ప కార్యము ఆచరించేది కళ్యాణ కార్యములలో ప్రవేశించేది, దివ్యమైన ఆదర్శమునందించేది యీ దేహము. కనుకనేపనికి తుంగభద్ర అని పేరు వచ్చింది.

(బృ.త్ర.పు.౧౩౯)

మానవుని యొక్క శరీరము ఒక వెదురు కర్ర వంటిది. ఈ వెదురు కర్రకు అనేక గణుపులు ఉంటాయి. ఆ గణుపులే కామ, క్రోధ,లోభ,మోహ మద మాత్సర్యములు. **మానవుని యొక్క దేహమును 'తుంగభద్ర' అని పిలుస్తూ వచ్చారు. అది నది కాదు. ఈ తుంగ్రభద్రకును, మానవుని యొక్క శరీరమునకు పుండినటువంటి సంబంధ బాంధవ్యమేమిటి? 'భద్రము' అనగా కళ్యాణము, మంగళకరము. 'తుంగ' అనగా అమితమైన. 'తుంగభద్ర' అనగా అమితమైనటువంటి ఆనందమును, మంగళమును, కళ్యాణమును చేకూర్చేటటువంటిది. అదే ఈ మానవశరీరము.** అట్టి దివ్యమైన, భవ్యమైన పవిత్రమైనటువంటి ఈ మానవ దేహమును మనం ఏ విధమైన మార్గంలో వినియోగిస్తున్నామో, ఎవరికి వారు ఆలోచించాలి. మంగళకరమైన, పవిత్రమైన, కళ్యాణ కరమైన ఈ దేహమును ఎట్టి తుచ్ఛమైన మార్గంలో మనం వినియోగపరుస్తున్నామో. ఎవరికి వారు యోచించాలి. అనేక విధముల పరిశీలించి, పరిశోధించి, ఈ దేహమునకు **'తుంగభద్ర'** అని నారదుడు పేరు పెట్టాడు.

'నారదుడు' అనగా కేవలం కలహప్రియుడని భావిస్తుంటారు. లోకులు, కాదు.. కాదు.. ఇది కేవలం లోకుల భ్రాంతి. సమస్త దుఃఖములను పరిహారం గావించి, జ్ఞానమును అందించేటటువంటి మహానుభావుడే నారదుడు. జ్ఞానభాస్కరుడే నారదుడు. అట్టి త్రికాల బాధ్యుడైనటువంటి నారదుడు, విష్ణుప్రియుడైనటువంటి నారదుడు, ఈ నూతనమైన పేరును కలిపించాడు. అదియే 'తుంగభద్ర'. ఇట్టి పవిత్రమైన నామమును సరియైన అర్థమును గుర్తించి, సక్రమమైన మార్గంలో వినియోగించి, ఆనందించడానికి తగిన కృషి చేయాలి.

(శ్రీ సె. 2000 పు.7)

తుమ్మెద

(చూ॥ ఆనందము)

తులసీదళము, బిల్వపత్రము

తులసీదళము, బిల్వపత్రము. ఇవి ఒక్కొక్క దానికి చెప్పాలంటే ఒక్కొక్క దినమంతా పడుతుంది. కనుక మీకు ఎంత అవసరమో అంత చెప్పటం మంచిది. తులసి దళము, బిల్వ పత్రము త్రిగుణముల యొక్క ఏకత్వాన్ని నిరూపించేటటువంటిది. **త్రిమూర్తి స్వరూపాన్ని నిరూపించే టటువంటిది. త్రికాలములకు చిహ్నము. త్రిలోకములకు గుర్తు.** కనుకనే మనలో ఉన్నటువంటి త్రిగుణములను ఏకత్వము గావించుకునే నిమిత్తమై ఈ బిల్వపత్రి, తులసీదళము భగవంతునికి అర్పితం గావిస్తుంటాము. ఈ మూడింటికి కూడను ఆధారము ఒక్కటే. ఒక దళము ఒక వైపును, రెండవవైపున ఒక దళము, నడుమ ఒకటి ఉంటుంటాది. అన్నిటికీ చేరిక ఒక్క చోటనే ఉంటుంటాది. అదే విధముగనే సాత్త్వికమునకు, రాజసికమునకూ, తామసికమునకు ఒకే మానసిక తత్త్వము. కనుకనే ఈ ఏకత్వమును నిరూపించడానికి ఈ మూడు గుణములు మూడు పత్రులుగా నిరూపిస్తూ వచ్చారు. కనుక పురుష సూక్తములో **"త్రిగుణం, త్రిదళాకారం, త్రినేత్రంచ, త్రియాయుధం, త్రిజన్మ పాప సంహారం ఏక బిల్వం శివార్పణం" అన్నారు. అనగా "నా త్రిగుణములు కూడను నీకు అర్పితం గావిస్తున్నాను" అనేటువంటిదే ఇందులో అంతరార్థం.**

ఇంక తులసీ దళమునందు పతివ్రతా ధర్మాలు నిరూపిస్తూ వచ్చారు. జలంధరుని యొక్క భార్య ఈ తులసి. ఆమె పేరు బృంద. ఈ జలంధరుడు అనేక రకములైనటువంటి క్రూర కృత్యములలో పాల్గొనేటటువంటి వాడు. పరస్త్రీలను హింసించటానికి ప్రయత్నించేటటువంటి వాడు. కనుకనే ఏ మహా పతివ్రత శాపానికి నా భర్త గురియైపోతాడోనని నిరంతరము కూడను పతివ్రతలను ప్రార్థించి, నా పతికి శాపమివ్వకుండా చూడమని, నిరంతరము ప్రార్థనలో మునిగి ఉండేటటువంటిది ఈ బృంద. ఈ విధమైనటు వంటి వరప్రసాదాన్ని విష్ణువు దగ్గర కూడను పొందింది. నా యొక్క పతికి పరస్త్రీల వల్ల ఏ విధమైన అపకారమూ జరగకుండా ఉండాలి అని ప్రార్థించింది. అప్పుడు విష్ణువు చెప్పాడు. "నీ పాతివ్రత్యమునకు భంగము కలిగినపుడు తప్పక అతని ప్రాణం పోతుంది" అని చెప్పాడు. "నా పాతివ్రత్యమునకు ఎట్టి అడ్డము జరగటానికి వీలులేదు. ఈ వరము నేను సాధిస్తాను" అని ఆమె ధృడము చేసుకుంది. ఈ వరప్రసాదము యొక్క ఆధారాన్ని పురస్కరించుకుని జలంధరుడు నాకింక ఎట్టి పతివ్రతల వల్ల ఎట్టి ప్రమాదమూ జరుగదని స్వేచ్ఛా విహారము సలుపుతూ వచ్చాడు. పార్వతి, లక్ష్మి, సరస్వతులను కూడా తరుమడానికి ప్రయత్నించాడు. ఈ విధమైనటు వంటి మితిమీరిన స్థితిని గమనించి విష్ణువు ఇక యితనిని బ్రతికించటం మంచిది కాదనుకున్నాడు. ఒకనాడు జలంధరుని వేషం వేసుకుని తులసి దగ్గరకు వచ్చాడు. మంచి మాటలాడుతూ సతిదగ్గరకు వచ్చేటప్పటికి "అయ్యో! ఈనాడు నా భాగ్యం పండింది. నాపతి నా దగ్గరకు వచ్చాడని" తట్ట, చెంబు తీసుకొని పోయి పాదములు కడిగి పతియొక్క జలము అని శిరస్సున చల్లుకుంది. ఈ సమయంలో జలంధరుడు ఎక్కడో బయట ప్రదేశంలో స్త్రీలను తరుముతూ ఉంటున్నాడు. ఇతడు నా భర్త అని ఆమె ఎప్పుడైతే భావించిందో తక్షణమే అతని శిరస్సు ఖండింపబడింది. తక్షణమే జలంధరుని రూపంలో వచ్చిన విష్ణువు శంఖ చక్ర గధా ధారిగా నిలిచాడు. "బృందా! నీ పతియొక్క చేష్టలే మితిమీరి పోవటంచేత జలంధరునికి ప్రమాదం సంభవించే సమయం కూడను రావటంచేత నేను ఈ విధంగా వేషం ధరించవలసి వచ్చింది." అని చెప్పేటప్పటికి "విష్ణూ! నీ యొక్క పొరపాటేమీ కాదు. నా పతియొక్క దోషమే. కనుక నాకు ఈ నిమిషంలో నా పతితో సహగమనానాకి అనుమతి యిమ్మని." అడిగింది "నీవు ప్రాణం విడిచి నప్పటికిని నీవు పతివ్రతగా శాశ్వతంగా, చిరంజీవిగా నిలిచిపోదువుగాక" అని అనుగ్రహించి సహగమనానికి అనుమతి యిచ్చాడు. జలంధరుని యొక్క దేహము అగ్నిలో వేసినపుడు **అందులో ఈమెయొక్క దేహం**

తులసీదాసు

కూడను చేర్చినారు. ఆ చేర్చిన తరువాత రెండవ దినము ఆ భస్మములో ఒక తులసీదళము చిక్కింది. అందువలన ఆ బృంద యొక్క పరివారమంతా ఆ తులసీదళమును తీసికొని క్రింద ఒక చిన్న కట్టగా కట్టుకుని ఈ తులసిని పూజిస్తూ వచ్చారు. క్రింద నున్నది బృంద. పైనతులసి. బృందావనము లేక తులసి ఉండదు. కనుక తులసీ బృందావనము అని పిలుస్తూ వచ్చారు. అనగా తాను నిత్య ప్రతివ్రతగా, చిరంజీవిగా అనుగ్రహించేటటువంటి శక్తిసామర్థ్యములు కలిగినటువంటిది కనుక స్త్రీలు ఇంటిలో బృందావనము కట్టుకుని, దాని పైన తులసిని పెట్టుకుని ప్రార్థిస్తూ ఉండటము ఒక సాంప్రదాయము.

(గు శి బృ 78 పు. 49/52)

తులసీదాసు

(చూ॥ అంగహీనుడు)

తృప్తి

భగవత్ప్రేమను పెంచుకోండి. భగవంతుడు సర్వులయందు ఉంటున్నాడనే విశాలత్వము అభివృద్ధి పరచుకోవాలి. **భగవంతుడు ఏనాడూ మిమ్ములను మరవడు. మరచేది భక్తుడే.** God never leaves his devotees, olnly devotees leave God. God never goes away from his devotees but devotees go away from God. పోయేది భగవంతుడే అనుకుంటారు. కాని భగవంతుడు పోవటం లేదు. భక్తులే పోతున్నారు. భగవంతుడు విడచటం లేదు. భక్తులే విడుస్తున్నారు. ఈ సత్యాన్ని మీరు గుర్తించుకోలేక పోతున్నారు. లోకవాసనల చేత లోక భ్రాంతులచే కట్టబడటం చేత మానవత్వము బంధింపబడి పోతున్నది. ఈ సత్యాన్ని మీరు గుర్తించు కోండి. అదే నిజమైన Conscience. అదే మీ witness. దానిని తృప్తి పరచుకుంటే జీవితమంతా తృప్తి అవుతుంది.

(బృ.త్ర.పు.౯౧)

తృప్తి యేలాభము: తృప్తి కన్న మనుజునకు లాభము చేకూర్చుపదార్థము వేరొకటిలేదు. ఈ సంతృప్తిని మూడులోకములకంటే మిక్కిలి ధనమని చెప్పవచ్చును; అట్టి వాడు అనుభవించు భగవత్ విభూతులు ఇతింత అని చెప్పరానివిగా ఉండును. నీ ఇష్టప్రకారము నడవవలెనేకాని, నీవు దానికి లొంగిపోవలదు.

(ఆ.శా.పు.50)

(చూ॥ ద్రౌపది, ధనవంతులు, పానీయం, సంతృప్తి)

తృప్తి రావాలి.

మానవత్వములో తృప్తిరావాలి. అసంతృప్తి ఉండకూడదు. **Who is the richest man in the world అని ప్రశ్నించుకోండి. He, who has much satisfaction is the richest man. He, who has much desires is the poorest man.** ఏ ఆశలు లేకుండా ఉంటే అదే నిజమైన greatness. **మీకందరకు తెలియదుగానీ ఈ birth and death నాకు తమాషాలు.** స్వామీ మావారు చనిపోయినారంటే సంతోషము సంతోషమంటాను. యజమాని చనిపోతే నీకేమి సంతోషము? నాకన్నింటికి సంతోషమే. ఒక వ్యక్తి "స్వామి నాకడుపుకోతనేను భరించుకోలేను దుఃఖముతోనున్నాను. బాధను సహించు కోలేను" అంది. చాలా సంతోషము అన్నాను. అన్నింటికి సంతోషమే.

(ద. య. స.97 పు. 77)

తృష్ణ

ఒకటి శ్రద్ధగా గ్రహించవలెను, గమనించవలెను. బాహ్యావిషయములందలి మోహము వదలిననూ అంతరంగమందుండు కోరికలు నశించనిదే లాభములేదు. దీనినే **"తృష్ణ"** అందురు. లోపల వెలుపల నుండు వాసనలు నశించిన పిదప కలుగు **ఆశ ముక్తతృష్ణ**

అనబడును. తృష్ణలు వృద్ధి పొందుకొలది, మనస్సు అలజడిచెంది అశాంతి కలిగియుండును. ఆత్మజ్ఞానోదయ మొక్కటే అన్ని తృష్ణలను నిర్మూలింపగలదు.

(జ్ఞా వా పు.25)

(చూ॥ గోపికలు, శాంతము)

తెలిసినవారు

అన్నియును తెలిసినవారు అవనియందులేరు
ఏమియు తెలియనివాడెవ్వడుండు
కొంచమెరిగిన వాడు కించజ్ఞుడయా
ఉన్నమాట తెలుపుచున్నమాట ॥

(సా॥ పు. 147)

తెలివితేటలు

మనకు తెలివి తేటలు అధికముగా వుంటున్నాయి. తెలివి తేటలుండి సక్రమమైన మార్గములో ప్రవేశించకుండా పోతే అవి నిరుపయోగమై పోతాయి. తెలివితేటలు లేకుండా కార్యములో ప్రవేశిస్తే కార్యము నిష్ప్రయోజనమై పోతుంది.

Knowledge without action is foolishness
Action without knowledge is useless

ఈ knowledge ను మన action ను రెండింటిని ఏకముచేయాలి. ఇదే దివ్యత్వము. ప్రకృతి తత్వము. రెండింటి యొక్క ఏకత్వము ఈ creation భగవంతునికి వేరుగా లేదు. భగవంతునితోనే కూడి వుంటుండాది. జీవ, ఈశ్వర, ప్రకృతి అని త్రిమూర్త్యాత్మక స్వరూపము. ఈ మూడు వేరు కాదు. వేరు వేరు రూపనామములుగా మనకు గోచరిస్తుందే గాని మూడు చేరి ఒకటే.

(బృ. త్ర. పు. ౧౧౯/౧౨౦)

తెల్లనివస్త్రాలు

తెల్లని వస్త్రాలు పవిత్రతను, నిర్మలత్వమును తెలియ జేస్తాయి. బుద్ధి పరిశుద్ధమైన అద్దం లాంటిది. అద్దం పైన మాలిన్యం చేరితే నీ స్వరూపాన్ని నీవు చూసుకోలేవు. మంచి బుద్ధితో ఉన్నప్పుడు విచక్షణా జ్ఞానం కల్గుతుంది. అప్పుడు నీలోని లోపాలు నీకు తెలుస్తాయి. వాటిని సరిదిద్దుకోగల్గుతాయి. కానీ ఈనాడు అట్లా జరగడం లేదు. ఎదుటి వ్యక్తిలోని లోపాలు నీకు కనబడుతున్నాయిగాని నీలోని లోపాలు నీకు కనబడటం లేదు. అద్దాన్ని నీ ముందుంచుకుంటే నీ రూపం కనబడుతుందిగాని ఎదుటి వ్యక్తివైపు మరల్చితే నీ రూపం ఎలాకనబడుతుంది? బుద్ధి అనే అద్దంలో నీ లోపాలు నీకు కనపడాలి. కానీ కనబడడం లేదు. ఎందువల్ల? దానిని ఎదుటి వ్యక్తివైపు త్రిప్పావు.

వైట్ డ్రెస్ వేసుకుంటే అది ఏ మాత్రం మురికి అయినా కనబడుగుంది. అదే కలర్ డ్రెస్ వేసుకుంటే కనబడదు. అంటే నీలో ఉన్న మాలిన్యాన్ని కవర్ చేసుకుంటున్నా వన్నమాట. ఇది తప్పు. మాలిన్యాన్ని కవర్‌చేసుకోకూడదు, దానిని శుభ్రం చేసుకోవాలి. మంచినిగాని, చెడునుగాని ఏదైనా నీలో ఉంచుకోకూడదు. చెడును వదిలేయాలి. మంచిని పంచుకోవాలి. కానీ కొందరు మంచిని దాచుకుంటారు. చెడును పంచిపెడతారు. ఇది పొరపాటు. శివుడు **చెడ్డదైన విషాన్ని కంఠంలో దాచుకొని** తన శిరస్సుపైన చంద్రుణ్ణి ధరించి చల్లని **వెన్నెలను అందరికీ వెదజల్లాడు. కనుకనే శివుడు నీలకంఠుడైనాడు.**

(స.సా.జూలై 98 పు.189)

తేజస్సు

నీవు వెలుతురు చూచినప్పుడు ఉత్తేజుడవు కానట్లయితే నీవు నాకు చాలా దూరంగా వున్నావనే అనుకోవాలి. నీకు నాకు వున్న సంబంధములో ఇదే సత్యము.

(సా॥ పు. 598)

దివ్యత్వమునుండి వచ్చినదే ఈ పవిత్రమైన మానవ జీవితము. ఈ లక్షణాన్ని కొంతమంది ఋషులు గుర్తించి దీక్షను బట్టి సాధిస్తూ వచ్చారు. "ఈ దివ్యమైన తేజస్సు మీరు చూడండి" అని లోకానికి చాటినారు. **"అంతర్బహిశ్చ**

తైజసుడు

తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అతడు ఎట్లా ఉన్నాడంటే, "వేదాహ మేతం పురుషం మహాంతం అదిత్యవర్ణం తమసః పరస్తాత్" అని అన్నారు. ఆ మహాపురుషుని ఏ విధంగానూ వర్ణించడానికి వీలుకాదని, సూర్యతేజస్సువలె ప్రకాశిస్తున్నాడని పేర్కొన్నారు.

(శ్రీ.భ.ఉ.పు.30)

(చూ॥ ప్రణవతత్త్వము)

తైజసుడు

(చూ॥ ప్రాజ్ఞ)

తైత్తిరియోపనిషత్తు

ఈ ఉపనిషత్తులో బ్రాహ్మవిద్యోపదేశముపక్రమింప బడినది. ఈ తైత్తిరీయము శిక్షావల్లి, బ్రహ్మానందవల్లి, భృగువల్లి అని మూడు భాగములుగా నున్నది. ఇందు బ్రహ్మజ్ఞానోపదేశికలగు చివరి రెండు వల్లులు ముఖ్యము. బ్రహ్మవిద్యకు దేవబుష్యాదులుకూడా విఘ్నకారులగు చున్నారు. అట్టి విఘ్నము లుపశమించుటకును చిత్తైకాగ్రత లభించుటకు నుపయోగించు కొన్ని ఉపాయములు శిక్షావల్లి యందుపదేశింప బడినవి. ఈ వల్లియందు పండ్రెండు అనువాకములు గలవు. చివరి రెండు బ్రహ్మానందవల్లి, భృగువల్లియను ప్రత్యేక నామములచే వ్యవహరింప బడుచున్నవి. ఈ వల్లీద్వయము మోక్షమునకు సాక్షాత్సాధన భూతమగు వారుణీ విద్యయని ప్రసిద్ధిగాంచినది. రెండింటియందును విషయ మొక్కటియే అగుచున్నది. పఠన సౌకర్యమునకు మాత్రము ప్రత్యేక వల్లులుగా పరిగణింపబడుచున్నవి.

(ఉ.వా. పు. 72)

ఈ ఉపనిషత్తునందు బ్రాహ్మణమున వివిధ ధర్మములు వివరింప బడినవి. అవి కామ్యములు, నైమిత్తికములు, నిమిత్తములు అని మూడు విధములు. కర్మల నాచరింపుమని శాస్త్ర మెవ్వరినీ వినియోగింపదు. మనుజునకు కర్మాచరణము సహజ రాగప్రాప్తము. కామన ప్రవృత్తికి ముఖ్య కారణము, కామనానురూపముగ మనుజుడు ప్రవర్తించి యద్దాని ఫలము అనుభవించును. సహజసిద్ధములగు కోరికలను పడయు మార్గమును మాత్రము శాస్త్ర ముపదేశించుచున్నది.

అధ్యయనాధ్యాపనములను గూర్చి ప్రమాదములను పొందకుము. సత్యమును గూర్చి ప్రమాదమును పొందకుము. ధర్మమును గూర్చి ప్రమాదమును పొందకుము. **తల్లినే దైవముగా భావించుము. తండ్రియే దైవముగా భావించుము.** ఏ పనులు నింద్యములు కావో అవియే నీకు సేవింపతగినవి; తదితరములు సేవ్యములు కావు.

శ్రవణ, మనన, నిదిధ్యాసములను మూడు ఆత్మ సాక్షాత్కారోపాయములుగ మనకుపదేశింపబడినవి. వీనిలో మొదటిది అగు **శ్రవణము** వేదములయందు సంపూర్ణ విశ్వాసము కలిగి గురుసన్నిధియందు జేయతగినది. అందువలన బ్రహ్మముయొక్క పరోక్షజ్ఞాన మబ్బును. మననాత్మకమగు తపస్సు భృగువల్లి యందు పదేశింపబడుచున్నది. **మననముచే** నిశ్చితమయిన నిర్గుణ బ్రహ్మాత్మస్వరూపమును మనమునందు నిలిపి బ్రహ్మ నన్యమగు స్వరూపమున నవరతము భావించుటయే **నిధిధ్యాసము.** బ్రహ్మవిద్యయే బ్రహ్మభృగువల్లీ ద్వయము నందు వివరింపబడినది. ఉప దేశాత్మకము బ్రహ్మవల్లి; అనుభవాత్మకము భృగువల్లి.

(ఉ.వా.పు. 75/76)

(చూ॥ పంచాగ్నులు, ప్రేమ మార్గం, మంత్రము, శిక్షావల్లి)

తొమ్మిది

108 సంఖ్యకు ప్రాముఖ్యమేమిటో మీలో చాల మందికి తెలియక పోవచ్చును. దేవతల స్తోత్రాలన్నీ, 108 సంఖ్యను మించవు. 110 కాని 112 కాని, 50 కాని 60 వుండవచ్చు కదా! అల్లా వుండక 108 వుండటానికి కారణము వుంది. అటువంటి సంఖ్యలకు సంకేతార్థం వుంది.

(శ్రీ.స.వ. 63/64 పు. 183)

మనిషి ఒక గంటలో 900 సార్లు ఊపిరి పీల్చుకుంటాడు.

అంటే రోజుకు 21,600 సార్లు, పగటివేళ 10,800 సార్లు శ్వాస తీసుకుంటాడు. అంటే ప్రతి శ్వాసలోనూ సోహం అని ఉచ్చరించుకోవాలి. కాబట్టి 216 అనే దానికి, అందులోసగం 108 కే ప్రాధాన్యం ఉన్నది. తొమ్మిదిని పండ్రెండు సార్లు హెచ్చవేస్తే 108 అవుతుంది. **9 బ్రహ్మమునకు సంకేతం.** ఏ సంఖ్యతో హెచ్చవేసినా దాని మొత్తం. తొమ్మిదే. 9×12=108. కూడితే 1+8=9; 9×9=81; కూడితే తొమ్మిది; 12 అనేది ద్వాదశసూర్యులను సూచించగలదు. సూర్యుడు 12 రాసులలో 12 మాసాలలో సంచరిస్తాడు.

అదే విధంగా **8 మాయకు సంకేతం.** ఎనిమిదిని ఏ సంఖ్యతో హెచ్చవేసినా మొత్తం కూడినప్పుడు 8 కంటే తక్కువగా ఉంటుంది. తరిగిపోతూ ఉంటుంది. (2×8=16; కూడితే 7; 3×8=24, కూడితే 6; 4×8=32, కూడితే 5; 5×8=40 అంటే నాలుగు మిగులుతున్నది. 6×8=48 కూడితే 12, మొత్తం 3; 8×7=56, కూడితే 11, మొత్తం 2; 8×8=64 కూడితే 10, మిగిలేది ఒకటి) ఈ విధంగా దాని విలువ తరిగిపోతూ వుంటుంది. **కాబట్టి 8 మాయకు సంకేతం.** మీకు మీరు ద్రోహం చేసుకోవద్దు. మీరు ఒకటి చెప్పి మరొకటి చేస్తే మీ అంతరాత్మ మిమ్మల్ని ద్రోహులుగా నిరూపించి ఖండిస్తుంది.

(శ్రీ స.సూ. పు. 65)

తోలుబొమ్మ

విద్యార్థులారా! ఈ లౌకిక విద్యలందు మీరు చక్కగా ఉత్తీర్ణులు కావలసిందే! కాని, దీనితోపాటు ఆత్మవిద్యయందు కూడా మీరు ఉత్తీర్ణులు కావాలి. **"ఆధ్యాత్మ విద్యా విద్యానాం" సంపూర్ణమైన తత్వం ఆత్మవిద్యయే.** మీరు గొప్పగొప్ప చదువులు చదవవచ్చు, గొప్పగొప్ప పదవులు ఏలవచ్చు. కాని, అవన్నీ ఎంతకాలం? మీ అందచందములెంతకాలం? అన్నీ కొంతకాలమే!

అందము ప్రాయము ఇంద్రియ శక్తియు
ఉందని నిక్కకురోరన్నా
ముందున్నదిరా తొందరలోనే
ముసలితనమ్మను ముసళ్ళ పండుగ
మసలలేవు, కనుమసకలు, మోమున
మడతబడె. తల నెరిసెనుగా
ముసలి కోతియని పసివారలు నిన్
ముసిముసి నవ్వగ కనరే బొమ్మా!
తై తై తై తై తై బొమ్మా!
దీని తమాష జూడర మాయబొమ్మా!

ఈ దేహం ఒక తోలుబొమ్మ. ఎంతకాల మీ యౌవనం? ఎంతకాల మీ ఇంద్రియ పటుత్వం? ఎంతో కాలం ఉండవు. మెరుపు మెరిసినప్పుడు గొప్ప వెలుతురు వస్తుందిగాని, మరుక్షణంలోనే దట్టమైన చీకటి కమ్ముకుంటుంది. ఉదయం వికసించిన పూవు సాయంకాలానికి వాడిపోతుంది. అదేరీతిగా, దేహం కూడా యవ్వనం నుండి వార్ధక్యం లోకి ప్రవేశిస్తుంది. ఇట్టి శరీర తత్వాన్ని మీరు అర్థం చేసుకోవాలి.

(స.సా.ఏ. 2000 పు. 102)

త్యజ

చెడ్డవానిని చూసినప్పుడు మీలోని చెడ్డ జ్ఞాపకం వస్తుంది. మంచివానిని చూసినప్పుడు మీలోని మంచితనమంతా బయట పడుతుంది. కాబట్టి, అందరితో స్నేహం చేయకూడదు. స్నేహం చేసే ముందు మంచి, చెడ్డలు విచారణ చేయాలి. **భగవంతు డొక్కడే మీ నిజమైన స్నేహితుడు.** మీ కందరికీ తెలుసు - కృష్ణుని స్నేహంచేత కుచేలుడు ఎంతటి ఉన్నత స్థాయిని పొందాడో! అలాంటి స్నేహం ఈనాడు ఎక్కడా కనిపించడం లేదు. మీ జేబులో నోట్లు కనిపిస్తే అందరూ 'హలో, హలో..' అంటూ దగ్గరికి వస్తారు. మీ జేబులు ఖాళీ అయితే మిమ్మల్ని తప్పించుకు తిరుగుతుంటారు. ఇలాంటిది స్నేహం ఎలా అవుతుంది? రెండు దేహాలు, ఒక్క ప్రాణంగా జీవించాలి. అదే నిజమైన స్నేహము. **"త్యజ దుర్జన సంసర్గం", దుస్సంగమునకు దూరంగా ఉండండి. దుస్సంగములో చేరితే మీరు కూడా**

త్యజించండి

దుర్మార్గులుగా తయారౌతారు. కనుక, "భజ సాధు సమాగమం", సత్సంగంలో ప్రవేశించండి. "కురు పుణ్య మహోరాత్రం", రాత్రిబవళ్ళు పుణ్య కార్యము లాచరించండి. మంచి గుణములచేత మంచి పేరు తెచ్చుకోండి. ఆదర్శ మానవులుగా బ్రతకండి. ఇదియే ఈ స్నాతకోత్సవంలో స్వామి మీకు అందించే సందేశం. దైవాన్ని మాత్రం మరువకండి. దైవమే మీ ప్రాణము. **దైవమే మీ సర్వస్వము. కనుక, దైవాన్ని హృదయంలో పెట్టుకొని సేవలో ప్రవేశించండి. తప్పక మీకు అన్నింటియందు జయమే కల్గుతుంది.** అన్నింటి యందు మీరు విజయం పొంది ఆనందమయమైన జీవితాన్ని గడపాలని నేను ఆశిస్తున్నాను.

(స.సా.జ 2000 పు.20/21)

త్యజించండి

ప్రేమస్వరూపులారా! ముఖ్యంగా ఈ విజయ దశమి రోజున మీరు **ఒక ప్రతిజ్ఞ పట్టాలి. ఏమిటా ప్రతిజ్ఞ? ధూమపానము, మద్యపానము, మాంసభక్షణ - ఈ మూడింటినీ త్యజించాలి.** చాలా మందికి తెలియదు. ధూమపానం వలన అనేక రోగములు ప్రారంభమవుతున్నాయి. **ధూమపానము** చేసేవాడు ఒక్కతూరి పొగను పీల్చి తెల్లని బట్టపైన విడిచిన అది పచ్చగా మారిపోతుంది. **అదియే Cancer కి మూలకారణం.** ధూమపానం వలన ఆరోగ్యము పాడైపోతుంది, మానసిక పవిత్రత నిర్మూలమవుతుంది. ఇంక **మద్యపానము మహా పిశాచము.** తనను తానే మరపింప చేస్తుంది. మద్యపానం చేసినవాడు తానేమి మాట్లాడుతున్నాడో తనకే తెలియదు. ఇది మానవుణ్ణి ఉన్మత్తునిగా మారుస్తుంది. కనుక మద్యాన్ని ఏమాత్రము సేవించకూడదు. **మాంస భక్షణ** కూడా చాల చెడ్డది. నీ దేహమే మాంసముతో కూడినది. దీనికి తిరిగి మాంసము వేయడ మెందుకు?

దీనికి పవిత్రమైన ఆహారమునందించాలి. తద్వారా పవిత్రమైన కర్మలు ఆచరించటానికి వీలవుతుంది. మనం మంచి పనులు చేయటానికి, మనకు మంచి ఆలోచనలు రావటానికి పవిత్రమైన ఆహారము చాలా అవసరము. భీష్ముడంతటి మహాజ్ఞానియే ఆహార దోషముచేత చెడిపోయాడు.

(ద. య. స. పు. 109/110)

త్యజించవలసింది

త్యజించవలసింది ప్రపంచాన్నికాదు. ఇక్కడే చాలమంది పొరబడుతుంటారు. రామానందతీర్థ స్వామి సన్యసించిన తరువాత భార్యని చేరినపుడు ముఖమును ప్రక్కకు త్రిప్పుకున్నాడు. అది గమనించి ఆమె, "స్వామి! మీరు నన్ను చూసినపుడు భార్య అన్న భావం కలగటం వల్ల ముఖాన్ని ప్రక్కకు త్రిప్పుకున్నారు. కాని నాకా భావంలేదే!" అన్నది. ఆ తర్వాత ఆమెనే ఆయనకూ దీక్షా వస్త్రాల నిచ్చింది. **కనుక లోకాన్ని కాదు. లోకభావాన్ని విసర్జించాలి. Properties ను త్యజించనక్కరలేదు. భగవంతునితో Proper ties ఉండాలి.**

(స.సా.ఫి. 97 పు.47)

త్వమేవాహం

(చూ॥ భక్తిప్రపత్తులు, శరణాగతి)

త్యాగము

"నకర్మణా నప్రజయాధనేన త్యాగేనైక అమృతత్వమానశుః" ఇది వేదములోని ప్రధాన మంత్రము. నీవు ఎన్ని సత్కర్మలు ఆచరించినప్పటికిని, ఎన్ని విధములైన ఐశ్వర్యాన్ని అభివృద్ధి పరచినప్పటికిని, సిరిసంపదలతో తులతూగుతున్న ప్పటికిని ఇవన్నీ అస్థిరములు, అశాశ్వతములు, ఇవన్నీ నీకు అమృతత్వాన్ని అందించవు. **త్యాగమొక్కటే అమృతత్వమును అందించునది.** ఏది త్యాగము? ఆస్తిపాస్తులను, ఆలుబిడ్డలను త్యాగం చెయ్యటమా? కాదు కాదు. నీకు బంధన ఏమిటి? బంధన ఏమిటో

గుర్తించినప్పుడే ఆ బంధన విసర్జించటానికి తగిన కృషి చేస్తావు. **దేహమనే (భ్రాంతియే ఒక పెద్ద బంధన**. నేనే దేహమనే భావమును విసర్జించాలి. అప్పుడే మోక్షము లభిస్తుంది. దేహ భ్రాంతి వదలి పెట్టి, ఆత్మభ్రాంతితో కూడటమే బంధవిమోచన, **దేహవిరక్తి, దైవ ఆసక్తి, ఈ రెండింటి సమీపసంబంధముచేత బంధవిమోచన, మోక్షప్రాప్తి, రెండు సంభవిస్తాయి.**

(బృ.త్ర.పు. ౧౬౧)

మనదుర్గుణాలను త్యాగం చేయటమే నిజమైన త్యాగము

(బృ.త్ర. పు. ౧౭౩)

రాముడు అరణ్యానికి వెళ్ళే ముందు సర్వసంపదలను బీదలకు దానం చేశాడు. సీత కూడా తన నగలను ఆభరణాలను బీదలకు దానం చేసి, నారవస్త్రములను ధరించి రామునివెంట అరణ్యానికి బయలుదేరింది. ఈవిధంగా, **సీత తన సర్వ సంపదలను త్యాగం చేసినప్పుడు రాముణ్ణి పొందగల్గింది. కాని, అరణ్యానికి వెళ్ళిన తరువాత ఏనాడూ బంగారాన్ని కోరని సీత బంగారు లేడిని ఆశించింది.** బంగారు లేడిపై ఆమెకు ఎప్పుడు ఆశ కల్గిందో అప్పుడు ఆమె రామునికి దూరమైనది. దీని అంతరార్థమేమనగా, వాంఛల చేతనే మానవుడు బంధితుడౌతున్నాడు; భగవంతునికి దూరమౌతున్నాడు. **కనుక, భగవంతుడు లభ్యం కావాలంటే వాంఛలను త్యాగం చేయాలి. దీనిని పురస్కరించుకొనియే వేదము "నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః"** అన్నది. రామాయణము నుండి ముఖ్యంగా నేర్చుకోవలసింది త్యాగనిరతి. రామాయణంలోని ఇలాంటి పవిత్రమైన ధర్మ సూక్ష్మములను గ్రహించి ఆచరణలో పెట్టినప్పుడే మీ జీవితం సార్థకమౌతుంది.

(స. సా. మే 2000 పు.148)

నిండు సభలో ద్రౌపదిని పరాభవించుటకు దుర్యోధన, దుశ్శాసనులు పూనుకున్నప్పుడు ఆమె 'కృష్ణా!కృష్ణా!" అని ప్రార్థించగా కృష్ణుడా ప్రార్థన విని ఆమెను తాను రక్షించడానికి ఏ పవిత్ర కర్మలు చేసింది? అని యోచించాడు. అతనికి ఒక సంఘటన స్ఫురించింది. ఒక భోగి పండుగనాడు ద్రౌపది, సత్యభామ, రుక్మిణి మొదలగువారు పరివేష్టించియుండగా కృష్ణుడు చెరుకును కోయడానికి ప్రయత్నించినప్పుడు అతని వేలు కోసుకుని రక్తం స్రవించింది. దానిని నివారించడానికి రుక్మిణీ, సత్యభామలు దాసీలను రకరకాలుగా ఆజ్ఞాపిస్తూ తొందర పడసాగారు. కాని, ద్రౌపది వెంటనే తాను కట్టుకున్న నూతన వస్త్రాన్ని చించి కృష్ణుని వేలికి కట్టింది. ఆనాడు ద్రౌపది చేసిన త్యాగానికి ఫలితంగా కృష్ణుడు ఆమెకు అక్షయ వలువ లిచ్చి ఆమె మానం కాపాడాడు. కనుక, మీరు చేసే కర్మలను బట్టి భగవంతుడు ఫలాన్ని అందిస్తాడు. త్యాగంవల్లనే దైవానుగ్రహాన్ని పొందడానికి వీలౌతుంది.

(స.సా.జూన్.2000 పు. వెనుక కవరు)

భావమందున తుచ్ఛవాంఛలు వీడుట
త్యాగమగును - అదియే యోగమగును
ఆస్తి, ఆలివీడి, యడవి కేగుట కాదు
ఉన్నమాట చెప్పుచున్నమాట

(సా॥ పు. 234)

మానవుని ప్రత్యేక గుణము త్యాగము. దాని ద్వారా కలుగు ఫలితమేమిటి? **"నకర్మణానప్రజయా ధనేన । త్యాగేనైక అమృతత్వమానశుః"**. అమృతత్వము అందుకొనుటకై మానవుని ధర్మస్య రూపమును త్యాగము దర్శించినది. అయితే త్యాగమును మానవుడు కోల్పోయి దానికి విరుద్ధమైన స్వార్థమునే వరించినాడు. ఈ స్వార్థమును వరించినప్పుడు పరార్థము 'శూన్యమై పోయింది. పరార్థము శూన్యమై పోయినప్పుడు **అర్థము** మిగిలిపోయింది. ఈ అనర్థములతో అనేక అశాంతులు అనుభవించుచున్నాడు, నేటి మానవుడు. ఈనాటి విద్యార్థులు యదార్థమును గుర్తించి, సత్యాన్ని పొందటానికి ప్రయత్నించాలి.

(సా॥ పు. 602)

ఈనాడు **మనము చేయవలసిన త్యాగము కేవలము**

త్యాగము

ధనమును మాత్రమే కాదు. మనలో ఉన్న దుర్గుణాలను త్యాగం చేయాలి. మన దుర్గుణములను త్యాగం చేయుటమే నిజమైన త్యాగము. అంతేకాని, ఆస్తిని, ఆలిని వీడి అడివికేగుట కాదు. భావమందు దుష్టభావములు వీడుటే త్యాగమగును; అదియె యోగమగును. అప్పుడే మానవత్వము పరిపూర్ణత్వము కాగలదు.

(శ్రీ.భ.ఉ.పు.114)

వ్యాసుడు బోధిస్తూ ఉంటే వినాయకుడు మహాభారతమును వ్రాస్తూ వచ్చాడు. తన వ్రాతకు ఏదీ అడ్డు కలుగ కుండా ఉండాలని తానెంతగానో ప్రయత్నించాడు. కాని, మధ్యలో కలము కూలి పోయింది. తక్షణమే తన దంతమును పెరికి దానినే కలముగా తీసుకొని వ్రాస్తూ వచ్చాడు. అనగా, జ్ఞానమునకు తన దేహమునైనా త్యాగం చేసి **ఆదర్శాన్ని** అందిస్తూ వచ్చాడు. కాని, ఈనాడు జ్ఞానమునకు మనమేమి త్యాగం చేయుట లేదు. అజ్ఞానాంధకారమునకు మాత్రం సర్వమునూ త్యాగం చేస్తున్నాము! నిత్యమూ గృహములో దైవానికి పెట్టేనైవేద్యం కూడా తిరిగి తనకే దక్కునన్న ఉద్దేశ్యంతో పెడుతున్నాడుకాని, నిజంగా భగవంతుడు అంతో ఇంతో తింటే మానవుడు నైవేద్యం కూడా పెట్టేవాడు కాదు! ఈవిధమైన స్వార్థ బుద్ధితో మానవుడు పూజలు, పునస్కారములు సల్పుతున్నాడు. ఇటువంటి ఇంక నూరు జన్మల పాటు చేసినప్పటికీ ఫలితం ఏమాత్రమూ దక్కదు. **బాహ్యమైన మార్పులు జరిగినంతనే అంతరానందము లభ్యము కాదు. మనస్సు మారాలి, హృదయము మారాలి, ఆధ్యాత్మిక దివ్యత్వములో లీనమై పోవాలి.**

(స.సా.న. 93 పు. 294)

ఈనాడు మీకొక ఆనందకరమైన విషయాన్ని చెపుతున్నాను. ఐతే, నాకెప్పుడూ ఆనందమే! ఇది ఆనందము, అది దుఃఖము, ఇది శుభవార్త, అది అశుభవార్త అనే భేదం నాకు ఏనాడు లేదు. అన్నీ శుభమే! శుభాశుభములు రెండూ మనస్సు కలవానికే! నాకుశుభము, అశుభము ఒక్కటే! రాత్రి న్యూయార్క్ నుండి ఒక communication వచ్చింది. ఏమని? **"స్వామి చేసే సత్కర్మలు, స్వామి చేసే సేవలు, స్వామి స్థాపించిన అసుపత్రి ప్రభావము జగద్వ్యాపి అయినవి.** దీనిని భారతీయులే గుర్తించడం లేదు. ఏవిధమైన ప్రచారమూ చేసుకోకుండా **ఆచరణ రూపంలో మీరు సహాయము నందిస్తున్నారు.** మీరు చేస్తున్నటువంటి సేవలు ప్రపంచంలోనే ఎక్కడా జరగటం లేదు. **ఇలాంటి సేవల కయ్యే ఖర్చులో ఏ కించిత్ భాగమైనా మేము భరించడానికి అవకాశము నందించాలని కోరుతున్నాము"** అంటూ వారు నూను కోట్ల రూపాయలు సత్యసాయి ట్రస్ట్‌కు పంపించారు. అంతేకాదు, ఇది కేవలం First instalment **(మొదటి విడత)** అని, small token of love అని పేర్కొన్నారు. **ఇందులో యాభైకోట్లు ఆసుపత్రి పేరుతో** fixed deposit **లో పెట్టి దానిపై వచ్చే ఆదాయంతో ఆసుపత్రి చక్కగా జరుగుతూ రావాలని కోరారు.** ఇంకా 25 కోట్లు విద్యాసంస్థ పేరుతో పెట్టి ఈ విద్యావిధానంలో **నూతనమైన విలువలను** అభివృద్ధి పరచి నిజమైన విద్యా స్వరూపాన్ని నిరూపించాలని అన్నారు. మధ్య మధ్య స్వామి చేసేటటువంటి ప్రాకృతమైన సహాయము లెన్నో ఉంటుంటాయి. **వాటికంతా 25 కోట్లు సెంట్రల్ ట్రస్ట్ పెట్టుకోవాలని కోరుతూ, ఇది కేవలం** first instalment **అని వ్రాసారు.**

"స్వామి చేస్తున్న సత్కర్మలలో భాగం వహించే మహద్భాగ్యం మాకు లభించటం, దానికి స్వామి అంగీకరించటం మా అదృష్టం. మాకు పేరు ప్రధానము కాదు. కనుక, మా పేరు ఎవ్వరకీ చెప్పకూడదు. మాకు సేవయే ప్రధానము. అందులో సాక్షాత్తు భగవంతునికి చేసే సేవ మహాపవిత్రమైనది" అని పేర్కొన్నారు. ఇదే నిజమైన త్యాగము. ఈనాడు ఎవరైనా పది రూపాయలు దానం చేస్తే నా తలంత అక్షరాలతో న్యూస్‌పేపర్‌ల్లో పబ్లిష్ చేస్తుంటారు. ఈనాటి వరకూ మేము ఎవ్వరినీ ఒక్క నయాపైసా అడుగలేదు. కారణమేమి? నిస్వార్థ సేవయే పవిత్రమైన ఫలితాలనందిస్తున్నది. కనుక, మీరు

కూడా నిస్స్వార్థ సేవ చేయండి. దానికి తగిన సహాయం దానంతటదే వరించి వస్తుంది. దీనికి ఏమాత్రమూ సంకోచించ నక్కరలేదు. **మనం చేసేపని హృదయ పూర్వకంగా చేయాలి. మానసిక తృప్తిగా చేయాలి. ఆ తృప్తియే మనకు సర్వ సౌఖ్యములనూ అందిస్తుంది,** సర్వశక్తి నీ చేకూర్చుతుంది. ఇదే నిజమైన గుణం. ఇట్టి గుణమే నిజమైన ధనము.

ప్రేమ స్వరూపులారా...! సత్యసాయి సంస్థల ప్రభావం జగద్వ్యాప్తి అయిపోయింది. కాని, దురదృష్టవశాత్తు భారతీయులకు ఈ **"దీపము" క్రింద ఉన్న క్రీనీడ మాత్రమే కనిపిస్తున్నది.** యావత్ప్రపంచమంతా దీని వెలుతురులో ఆనందాన్ని అనుభవిస్తున్నది. **దానికి వారి విశ్వాసమే మూలకారణము, కాని మనకు విశ్వాసం వస్తుంది, పోతుంది...! ఇది కేవలం గడియారం పెండ్యులం మాదిరిగా ఉంటున్నది**

"విశ్వాసమెక్కడో ప్రేమ అక్కడ
ప్రేమ ఎక్కడో శాంతి అక్కడ
శాంతి ఎక్కడో సత్యమక్కడ
సత్యమెక్కడో ఆనందమక్కడ
ఆనందమెక్కడో దేవుడక్కడ"

కనుక, విశ్వాసమే లేకపోతే ఆనందం ఎక్కడి నుండి వస్తుంది? కొంతమంది ఏదైనా విచిత్ర మైన చర్యలు చూసినప్పుడు మాత్రం మహాభక్తి ఏర్పడుతుంది. కాని మరునిమిషంలోనే తిరిగి మార్పు కలుగుతుంది. ఇది సరియైన విశ్వాసం కాదు. విశ్వాసమనేది రాక పోకలు లేని స్థిరమైన గుణము; కదలిపోయే మేఘము కాదు. హరిశ్చంద్రునికి ఎన్ని కష్టములు కలిగాయి!! "అయ్యో! సత్యకోసం నేనెంత పాటుపడితినే! నాకు కలిగిన ఫలితమిదా....? అని ఏమాత్రం విచారించలేదు. భగవంతుడిదే ఇచ్చినప్పటికి దానిని ప్రసాదంగా భావించి అనుభవించాడు. కనుకనే, కట్టకడపటికి అతని భార్య, మరణించిన కుమారుడు, పోయిన రాజ్యము తిరిగి వచ్చాయి. ఇలాంటి స్థిర చిత్తముతో మనము జీవితాన్ని గడపాలి.

నిన్నటి దినమున అందిన ధనమును శాశ్వతమైన కార్యక్రమాలలో ప్రవేశ పెట్టాలని నిర్ణయించుకొన్నాను. ఇంకా ఎంతో అభివృద్ధిని సాధించాలని సంకల్పించు కొన్నాను. **నా సంకల్పములకు ఏనాడూ భిన్నం కాదు, స్వామి సంకల్పం వజ్ర సంకల్పం. దీనిని ఎవ్వరూ మార్చటానికి వీలు కాదు. స్వామి యొక్క ప్రభావము కాని, పవిత్రత కాని, కీర్తి కాని కేవలం ప్రచారంతో వచ్చినవి కాదు, స్వామి యొక్క ఆచరణ చేత వచ్చినవే! నాకు ప్రచారం అక్కరలేదు, ఆచరణే చాలా అవసరం.** ప్రచారంతో వచ్చినది ప్రచారం తోనే పోతుంది. కాబట్టి, నా పేరు పోవాలని ఎంతమంది ఎన్ని ప్రచారములు చేసినప్పటికి పోవటానికి వీలేకాదు. కాగితంపై చిత్రింపబడిన పూలతీగ గాలికి కదులుతుందా? అదేవిధంగా లోక భావములు చేత, లోక ప్రచారముల చేత లోకమే కదలవచ్చు కాని, సాయి ఎప్పటికీ కదలడు. ప్రచారం చేత కించిత్తైనా చలనం రాదు. ఆచరణ చాలా అవసరము. సాయి సంస్థలలో ప్రతీ ఒక్కరూ ఆచరణ ద్వారా సరియైన ప్రచారం చేయండి. మీరు చేస్తూ ఉంటే ఇంకొకరు చూసి దానిని అనుసరించాలి. **మీరు చేసి చూపించి ఇతరులకు ఆదర్శాన్ని అందించండి. ఇదే నేను కోరేది.** నాకు ఏ విధమైన ఆశ కూడాలేదు. ఐతే దేశాన్ని బాగు పరచాలి, దేశానికి అనుకూలం చేయాలి. బీదలు ఎక్కడైనా ఉంటున్నారు. మీరు ఎక్కడ సేవ చేసినా అది సాయి సేవగా భావించాలి. ఈవిధమైన త్యాగ భావాన్ని మీరు అధికంగా పెంచుకోవాలి. ఇక్కడకు వచ్చి నప్పుడు మాత్రమే త్యాగాన్ని ప్రదర్శించడం, బయటకు పోతూనే కాంక్షలు పెంచుకోవడం సరియైనది కాదు. ఎక్కడికి వెళ్ళినా సేవాభావాన్ని కలిగియుండాలి. ఈ సేవాభావము చేతనే మన జీవితాన్ని సార్థకం చేసుకోవాలి.

(స.సా.ఏ.94 పు.97/99)

పరోపకారాయ ఫలంతి వృక్షాః పరోపకారాయ వహంతి నద్యః
పరోపకారాయ దుహంతి గావః పరోపకారార్థమిదం శరీరం.

త్యాగరాజు

ఈ ప్రపంచమందు ఎట్టి ఫలాపేక్ష లేకుండా వృక్షములు జీవులకు మధురమైన ఫలముల నందిస్తున్నవి. నదులు ఎట్టి ఫలాపేక్ష లేకుండా జలమునందించి సర్వ జీవులను పోషిస్తున్నవి. గోవులు ఎట్టి ప్రతిఫలాపేక్ష లేకుండా మానవులకు మధురమైన క్షీరము నందించుచున్నవి. ఈ వృక్షములు, నదులు, గోవులు లేకుండిన జగత్తే లేదు. వృక్షములు, నదులు, గోవులు ఫలాపేక్ష రహితంగా ఈ జగత్తును పోషించుచున్నవి గాని, మానవుడు ఫలాపేక్ష లేకుండా తోటి మానవునకు ఉపకారం చేయటం లేదు. వృక్షములకు, నదులకు, గోవులకు ఉన్న త్యాగం ఈనాటి మానవునికి లేకపోతున్నది. మానవుడు నిరంతరము స్వార్థ స్వప్రయోజనములందె కాలమును గడుపుతున్నాడుగాని, పరోపకార సంబంధమైన సత్కార్యములందు క్షణమైనా త్యాగము చేయుటం లేదు.

(సాశ్భు.పు.26)

శ్రీరాముని నిరంతరసాన్నిధ్యము నాశించిన సీత, తన సర్వాభరణములను, తన సర్వస్వమును పరిత్యజించి, రాముని వెంట అరణ్యమునకు వచ్చినది. ఒక్క కామమును త్యాగము చేయుటచేతనే, శ్రీరాముని నిత్యసన్నిధి చేరుటకు ఆమెకవకాశమేర్పడినది. కాని, ఈ అరణ్యములో, పంచవటిదగ్గర, బంగారుజింకపైన ఆశ తలచూపగానే, సీతకు రాముడు దూరమైపోయాడు. ప్రపంచ వాసనలు పెరుగుతూపోవు కొలది, పరమాత్మ సన్నిధి దూరమవుతూ వస్తుంది. ప్రపంచవిషయ వాసనలు తగ్గించుకొలదీ పరమాత్మ అతిసమీపమవుతాడు.

(ఆ. రా. పు.34)

ఈనాడు మానవుడు దివ్యత్వాన్ని పొందే నిమిత్తమై ఏవో కొన్ని రకముల సాధనలు ప్రారంభిస్తున్నాడు. చెట్టు కొట్టదలచిన వాడు తల్లివేరును కొట్టాలిగాని కొమ్మలు రెమ్మలు కొట్టినంత మాత్రమున చెట్టు చావదు. పుట్టపైన మర్దించిన పాము మరణ మొందునా? తనువును తానిందించిన విషయ భోగము లణుగునా? ఆకలిదప్పులు మానినంత ఆత్మజ్ఞాని తానవునా? తానెవరో తెలియకున్న తత్వజ్ఞానమెట్లు కలుగును? కేవలము కొన్ని భజనలు దాన ధర్మములు చేసినంత మాత్రమున దైవత్వము అంత సులభముగా లభ్యము కాదు. అట్లని ఈ కర్మలను మానకూడదు.

చినుకులు పడినంత చెరువులు నిండునా?
ఉమ్మి మింగ దాహముడుగు నొక్కో?
ఊపిరి బిగబట్ట ఉదరంబు పెరుగునా?
బొచ్చు కాల్చినంత బొగ్గులగునా?

బొగ్గులు కావాలంటే కట్టెలనే కాల్చాలి. చెరువులు నిండాలంటే కుంభవర్షమే కురవాలి. దాహము తీరాలంటే చల్లని నీరే తాగాలి. అదే విధముగ **దైవత్వము లభించాలంటే త్యాగము చేయాలి**. దీనినే ఆధారము చేసుకొని వేదము **"త్యాగేనైకే అమృతత్వమానశుః** అన్నది. త్యాగమనగా ఏమి? ఇల్లు వాకిలి వదలడమా త్యాగము? ఆలు బిడ్డలను త్యజించడమా త్యాగము? కాదు. మనమున్న చోటనే ఉండి, చేయవలసిన కర్తవ్యములను **సర్వమూ దైవార్పితమనే భావములతో ఆచరించడమే నిజమైన త్యాగము**. దీనికి హృదయ పవిత్రత అవసరము, హృదయ పవిత్రత కలిగినప్పుడే సర్వము మనకు లభ్యమవుతుంది.

(త్వ శ మ పు.269)

(చూ॥ గుండె, చిత్తాపహారి, దేశసంరక్షణ, దైవము, దైవముకోసం, ధనము, పుణ్యకర్మలు, భారతదేశము, యోగము, లక్ష్యము, శ్రీసత్యసాయి అంతర్జాతీయ కేంద్రము)

త్యాగరాజు

ఒకానొక సమయంలో త్యాగరాజుకు మహారాజు ధనమును, తిండి పదార్థములను పంపించాడు. త్యాగరాజు, **'నిధి చాల సుఖమా? ఈశ్వర సన్నిధి చాల సుఖమా?** నిజముగ తెలుపుము మనసా!' అన్నాడు. "నాకు ఈశ్వర సన్నిధే కావాలి. రాముడే నా ధనము. అతని పాదసేవయే నా నిధి. ఈ ధనము నాకు అక్కరలేదు, తీసుకు పొమ్మ"న్నాడు. అప్పుడు వారు చెప్పారు 'పేరుకు తగినట్లు త్యాగము నీలో ఉంటున్నది'

అని. **అతని పేరే త్యాగరాజు. పేరుకు తగిన త్యాగము పూనాడు.** ధనమును తీసుకుంటే **అతడు భోగరాజు అయిపోయేవాడు, తరువాత రోగరాజు అయిపోయేవాడు. భోగము వద్దు, రోగము వద్దు, త్యాగం కావాలి.** మన మందరము త్యాగమయ జీవితమును గడపాలి. అదే మనకు భోగము, స్వర్గము. త్యాగముకంటె మించినది మరొకటి లేదు. కనుక త్యాగజీవులై, శాంతముగా జీవించండి.

(ద య స 98 పు.100/101)

(చూ॥ అంగహీనుడు, దైవవిశ్వాసము, పాతస్నేహితుడు, ముగ్గురు రాజులు)

త్యాగరాజుకీర్తనలు

జగత్తులో చాలమంది భక్తి గీతాలను రచించినవారున్నారు. భగవంతుని కరిగించి కదిలించిన రచనలు చేసిన వారున్నారు. భక్త్యానంద పారవశ్యంలో తన్మయులను గావించే భక్తి గీతాలు జగత్తులో ఉన్నాయి. అయితే, **త్యాగయ్య కీర్తనలకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రతి కీర్తన తన జీవితంలో ఒక సంఘటనకు సంబంధించినదే.** ఉదాహరణకు, తంజావూరు రాజు ధన కనక వస్తు వాహనాదులను అతని గానపటిమకు బహుమతిగా పంపినప్పుడు వానిని తిరస్కరిస్తూ, **"నిధి చాల సుఖమా, ఈశ్వర సన్నిధి చాల సుఖమా?"** అనే కీర్తనను రచించి గానం చేశాడు. తన సోదరుడు రఘునాథుడు రామ విగ్రహాన్ని కావేరి నదిలో పారవేసినప్పుడు ఎంతో విలపిస్తూ, తీవ్ర ఆవేదనతో, పరితాపంతో సంధ్యావందనం గావించు చుండగా దోసిలికి అందిన ఆ విగ్రహాన్ని చూస్తూ, **"రార మా ఇంటి దాక, రఘువీర సుకుమార.." అనే కీర్తనను గానం చేశాడు.** రాజాస్థానంలో **"ఎందరో మహానుభావులు."** అనే కీర్తనను ఆలపించాడు. ఈ ప్రకారం ప్రతి కీర్తన ఒకానొక సంఘటనకు సంబంధించినదే. **ఆ కారణంచేత ఈ కీర్తనలు భక్తిని అనుభవ జ్ఞానాన్ని శరణాగతి తత్వాన్ని** స్పష్టంగా ప్రకటిస్తాయి.

(స.సా.జూ. 99 పు.166/167)

త్యాగభూమి

(చూ॥ భారతదేశము)

త్రయి

(చూ॥ వేదం)

త్రికరణములు

Science and Technology మానవునికి Head (తల) వంటిది" అని అన్నాడు మన ప్రెసిడెంట్. అయితే, మానవునికి కేవలం హెడ్ ఉండినంతమాత్రాన ప్రయోజనం లేదు. **Spirituality (ఆధ్యాత్మికము) అతనికి హృదయం (Heart) గా తయారు కావాలి. హృదయం (Heart)లో ఆధ్యాత్మికము, తల (Head)లో సాంకేతిక వైజ్ఞానం, చేతుల (Hands)తో ధర్మం - ఈ మూడు "H"లను మనం అభివృద్ధి పరచుకోవాలి. అదే నిజమైన విద్య_EHV అనగా Education in Human Values అన్నారు. కాని, ఇక్కడ మూడు 'H' లు ఉన్నాయి అవే Heart, Head, Hand. ఈ మూడింటినీ ఏకం చేయడమే మానవత్వం. వీటినే వేదాంత పరిభాష యందు "త్రికరణములు" అన్నారు.** ఈ త్రికరణ శుద్ధి ద్వారానే జ్ఞానసిద్ధి కలుగుతుంది.

(స.సా. ఆ. 92 పు.186)

(చూ॥ గాయత్రి)

త్రికరణశుద్ధి

ఒక గృహమునందు ముగ్గురు వ్యక్తులు నివసించు సమయములో ఒకరి నొకరు అర్థము చేసుకొని, ఒకరి నొకరు అనుసరించి అన్యోన్యముగ జీవించినప్పుడు అదియే స్వర్గము. అదియే అమృతము. అదియే ఆనందము. ఈ విధముగా గాక గృహములో ముప్పురూ మూడు మార్గములను అనుసరిస్తూ, ఒకరి నొకరు అర్థం చేసుకొనక, ఒకరినొకరు భిన్నభావములను అనుసరిస్తూ ద్వేషిస్తూ, జీవించినప్పుడు ఇంతకంటె నరకము మరొకటి లేదు. **స్వర్గనరకములు రెండును కూడనూ మానవుని**

త్రికాండ స్వరూపము

యొక్క ప్రవర్తనలపై ఆధారపడి ఉంటున్నవి. మన దేహమే గృహము. ఈ గృహములో మనోవాక్కర్మలనేటటువంటి ముగ్గురు వ్యక్తులు జీవిస్తున్నారు. కనుక ఈ మనస్సు, వాక్కు, ప్రవర్తన ఈ మూడింటిఏకత్వమే నిజమైన మానవత్వము. దీనినే వేదాంత పరిభాషయందు 'త్రికరణశుద్ధి' అన్నారు. మనస్సు తలంచిన దానిని మాట రూపకంగా వెల్లడి చేయడం మాటతో వెల్లడిచేసిన దానినిహస్త రూపకముగా ఆచరింరంచటము. ఈ మూడింటి ఏకత్వమే నిజమైన మోక్షము.

(శ్రీ. ఫి. 1995 - పు. 2)

ఆధ్యాత్మిక చింతన ఒక్క భారత దేశంలోనే కాదు, విదేశాలలో కూడా అభివృద్ధి అవుతున్నది. అనేక మంది విదేశీయులు ఉపనిషత్తులను, బ్రహ్మ సూత్రము లను, భగవద్గీతను అధ్యయనం చేస్తున్నారు. ఇటలీలోని సాయిసంస్థల అధ్యక్షుని కుమార్తె రుద్రమును, భగవద్గీతను ఎంతో స్పష్టంగా చెపుతుంది. ఆమెకు కావలసినంత ధనం ఉన్నది. స్వామి ఏనాటికైనా అక్కడికి రాగలడనే ఉద్దేశ్యంతో 'మదర్‌సాయి' అనే పేరుతో 25 ఎకరములలో ఒక భవనమును నిర్మించింది. పూర్ణచంద్ర హాలువలె ఒక పెద్ద హాలును, స్వామివెంట వచ్చే విద్యార్థులకు, పెద్దవారికి అనేక గదులను కూడా కట్టించింది. మన ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న విదేశీ పిల్లలు ఎంతో చక్కగా వేద పారాయణం చేస్తారు. దీనికి కారణమేమిటి? **సత్సాంగత్యమే.** భజన, జపము, ధ్యానము ఇవన్నీ సత్కర్మలేగాని, దైవానికి అంత ప్రీతికరమైనవి కావు. **దైవానికి ప్రీతి కలిగించాలంటే దేహమును పరోపకార సంబంధమైన కర్మలలో ప్రవేశ పెట్టాలి; మనస్సుతో పవిత్రమైన చింతన చేయాలి; వాక్కు పవిత్రమైనదిగా ఉండాలి.దీనినే భారతీయులు 'త్రికరణ శుద్ధి' అన్నారు. మీ హృదయమే ఒక ట్యాంకు. మీ చూపులు, మాటలు, నడత ఇవన్నీ ట్యాప్స్‌వంటివి.** కాబట్టి, హృదయాన్ని ప్రేమతో నింపుకున్నప్పుడు మీ సర్వకర్మలూ ప్రేమమయం అవుతాయి.

(స.సా.మే.99పు.137)

(చూ॥ సత్యం)

త్రికాండ స్వరూపము

కర్మకాండ, ఉపాసనకాండ, జ్ఞానకాండ అని వేదం త్రికాండస్వరూపం. మానవుడు కర్మాధిపతి. "కర్మణ్యే వాధికారస్తే" మానవుడు కర్మాధికారముతో కాయమును ధరించాడు. ఈ కర్మలు ధర్మమయమైనవిగా ఆచరించాలి. **"శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్"** ధర్మసాధన నిమిత్తమై ఈ కాయము ఆవిర్భవించినదనే సత్యాన్ని గుర్తించాలి. మానవుడు ఆచరించే కర్మలు పరిపక్వస్థితికి వచ్చినప్పుడు ఇదియే ఉపాసనగా మారుతుంది. ఉపాసన దైవార్పిత భావముతో ప్రేమ మయమైన దివ్యతత్వముతో ఆచరించినపుడు ఇదియే పూర్ణ జ్ఞానంగా రూపొందుతుంది. ఏతావాతా కర్మోపాసనాజ్ఞానములు మూడు ఒక్కటే. పుష్పముగా పుట్టి కాయగా మారి ఫలముగా రూపొందినట్టుగా కర్మపుష్పము, ఉపాసన కాయ, జ్ఞానము ఫలము. సామాన్య మానవులు కర్మోపాసనాజ్ఞానములు ఆచరించే నిమిత్తమై పురాణేతిహాసములు ఉపాంగములుగా సృష్టింపబడినవి. ఈ వేదము యొక్క అంతమే ఉపనిషత్తు. కనుకనే వేదాంతము అని దీనికి పేరు. ఉపనిషత్తులు యోగత్రయములు అని మూడుగా విభజించి మూడు యోగములను మానవులకు ప్రబోధిస్తూ వచ్చాయి. **యోగమనగా అర్పిత భావము.** మనము ఏ కర్మలు చేసినా అర్పిత భావముతో ఆచరిరంచాలి. దైవార్పిత భావముతో ఆచరించటం చేతనే ఇది దైవార్పిత భావమనే పేరు పొందింది. సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం అనే మార్గమును అనుసరిస్తూ వచ్చింది. యోగత్రయములో రెండవది ఉపాసనాయోగము. భగవంతుని హృదయ పూర్వకంగా ప్రేమ పూర్వకంగా త్రికరణ శుద్ధిగా ప్రేమించుటే ఉపాసనా యోగము. కేవలము అభీష్టసిద్ధికై కార్యసిద్ధికై లౌకికమైన భ్రాంతులసిద్ధికై ప్రేమించుట ప్రేమ కాదు. ప్రేమనిమిత్తమై ప్రేమించాలి. అదే ఉపాసనా యోగము. ఇంక మూడవది జ్ఞానయోగము. **"సర్వం విష్ణు మయంజగత్"** అంతా భగవంతుని స్వరూపమే. సర్వుల యందు ఉండినవాడు

భగవంతుడు ఒక్కడే. **ఏకాత్మభావమే, అద్వైత జ్ఞానమే, నిజమైన** జ్ఞానమన్నారు. సర్వులయందు దైవత్వము ఆత్మస్వరూపంలో ఉన్నదని విశ్వసించటమే జ్ఞానము.

(బ్ర.త్ర.పు. ౧౯౦/౧౯౧)

త్రికోణాత్మకం

ప్రతిమానవునికి దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము-యీఐదు శాంతి అనే సుఖనిద్ర పొందే నిమిత్తము వచ్చాయి. శాంతి అందించనప్పుడు దేహము ఎందుకు? మనస్సు ఎందుకు? బుద్ధి ఎందుకు? ఇవన్నీ చేరి నీకు శాంతి నందించాలి. కానీ అశాంతి నందిస్తున్నాయి. ఆశాంతి నిమిత్తమై ఏర్పడినవి కావు ఇవి. ఈ యింద్రియములు శాంతి నిమిత్తమై ఏర్పడినవి. ప్రతి వ్యక్తి యీ సత్యమును గుర్తించాలి. ఏనాడు ఇవి సరైన మార్గములో ప్రవేశిస్తాయి? **నిర్మలమైన, నిస్వార్థమైన ప్రేమను పంచుకున్నప్పుడే శాంతి నందిస్తాయి. కనుక ప్రేమ ఇచ్చుకునేదే గానీ పుచ్చుకునేది కాదు. ప్రాపంచిక సంబంధమైన ప్రేమకు, దివ్యమైన ప్రేమకు ఉండిన వ్యత్యాసమిదియే.** ప్రాకృతమైన ప్రేమ పుచ్చుకుంటుంది గాని యిచ్చుకోదు. కానీ పరమాత్మ ప్రేమ యిచ్చు కుంటుందిగానీ పుచ్చుకోదు. **ఎప్పుడూ ఇచ్చుకోవటమే. ఇదే పరమాత్మ ప్రేమకు ఉన్న ప్రధాన గుణము. రెండవది పరమాత్మ ప్రేమకు ఎట్టి భయము లేదు. ప్రాకృతమైన ప్రేమకు ఎవరేమి చెబుతారో ఎవరేమంటారోననే భయముంటుంది. కానీ పరమాత్మ ప్రేమకు స్వార్థము లేదు. అందువలన భయము లేదు. ఇంక మూడవది. ప్రేమకు ప్రేమయే గమ్యము. ప్రేమ ప్రేమయే గాని పదార్థము కాదు. అందువల్లనే ప్రేమ త్రికోణములతో కూడినదన్నారు. ఒకటి ప్రేమ యిచ్చుకోవటం. రెండవది నిర్భయం, మూడవది ప్రేమకు ప్రేమయే ఫలము. ఇదే దివ్యమైన ప్రేమ.**

(శ్రీ. స. పు.21/22)

త్రిగుణములను అరికట్టు

మోక్షములో ప్రవేశించే సమయంలోపల సాత్వికమును కూడ దూరము చేసుకోవలసినదే. ఈ మూడు (సత్వ, రజస్తమో గుణములు.) సోదరత్వమును పొందిన ఒకేజాతికి చెందినవే. త్రిగుణములకు అతీతమైన స్థితిని పొందుమని చెప్పి బోధిస్తూ వచ్చినది వేదాంతము.

'త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం
త్రిజన్మపాపసంహారం ఏకబిల్వం శివార్పణం'

ఈమూడింటిని అర్పితము చేయాలి అన్నారు. ఒక ముల్లు మన కాలిలో విరిగినప్పుడు దానిని తీయటానికి గొడ్డలి, కొడవలి తెస్తే ప్రయోజనము లేదు. తిరిగి ముల్లునే తీసుకురావాలి. ఒకముల్లుతో యింకొక ముల్లును తీసిన తరువాత యిది తీసినముల్లే, యిది విరిగిన ముల్లే యని భేదము చేసుకోము. రెండింటిని తీసిపారవేస్తాము. అదేవిధముగనే తమోగుణమును రజోగుణముతో తీసివేయాలి. రజోగుణమును సాత్వికముతో తీయాలి. కట్టకడపటికి బ్రహ్మానందమనే భవనంలో ప్రవేశించే సమయములో యీ మూడింటిని పారవేయాలి. ఇందులో యేగుణముండినప్పటికినీ ఆనందము ప్రాప్తించదు. అందువలననే త్రిగుణములకు అతీతమైనవానిగా నీవు కమ్మని అర్జునునకు ఆదేశించాడు. **"నిస్త్రైగుణ్యో భవ' 'ఈ త్రిగుణములను అరికట్టుకొనే** సమయములో దూరము గావించుకొనే సమయములో తగిన జాగ్రత్త వహించుమన్నాడు.

(శ్రీ గీ పు. 265/266)

త్రిగుణములు

ఈ చరాచర ప్రపంచమంతయు త్రిగుణాత్మకమైనది. గుణాతీతమైన తత్వాన్ని గుర్తించే వ్యక్తిత్వమే నిజమైన మానవత్వము. భగవంతుడు ఆత్మ స్వరూపుడు. **"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని బ్రహ్మమన్నా, సత్యమన్నా, అనంతమన్నా, ఆత్మ అన్నా, భగవంతుడన్నా దేవుడన్నా పర్యాయపదములే.** మొట్టమొదట **ఆత్మ నుండి**

పంచభూతములు ఆవిర్భవించాయి. పంచభూతములు పంచతత్వములను యిముడ్చుకొని వుంటున్నాయి. పంచభూతముల నుండి పంచీకృతము ఆరంభమైనది. పంచీకృతభావము నుండి ఆవిర్భవించినవే త్రిగుణములు. త్రిగుణముల యొక్క ఆకారమే ఈ విశ్వము. విశ్వమునందు సత్వరజస్తమోగుణములు నిండి ఉంటున్నాయి. సర్వ సృష్టియొక్క రహస్యాన్ని మొట్టమొదట గుర్తించాలి. సత్వసృష్టి యొక్క సమిష్టి సత్వాంశమే అంతఃకరణ. ఆకాశ సత్వసృష్టి అయిన యిది వ్యష్టి తత్వాన్ని అనుభవిస్తూ వచ్చింది. పంచభూతములలో ఆకాశము మొదటిది. ఈ ఆకాశము యొక్క వ్యష్టితత్వము నుండి శుద్ధ సత్వాంశము ఒకటి బయలు దేరింది. ఇదియే మానవాకారములకు ప్రథమస్థానము. ఆకాశము యొక్క వ్యష్టి సత్వము నుండి చెవి పుట్టింది. పంచభూతములలో రెండవది గాలి. ఈ గాలి వ్యష్టి సత్వమైన అంశమే చర్మము. పంచభూతములలో మూడవది అగ్ని. అగ్ని యొక్క వ్యష్టి సత్వాంశమే కన్ను, పంచభూతములలో నాల్గవది నీరు. దీని వ్యష్టిసత్వాంశమే నాలుక, ఐదవ భూతము భూమి - ప్రకృతి. ప్రకృతి వ్యష్టి సత్వాంశమే ముక్కు. **శబ్దస్పర్శ రూపరస గంధములు ప్రథమున పంచభూతముల శుద్ధ సత్వమునుంచి ఆరంభమైనాయి.** ఒక్కొక్కటి వ్యష్టి భూతము కనుక ఆ వ్యష్టి నుండి ఆవిర్భవించిన యీ అంగములు (ఇంద్రియములు) ఒక్కొక్క పనికి మాత్రమే ఉపయోగించుకోవటానికి వీలవుతుంది. ఆకాశము గుణము శబ్దము. శబ్దమునకు చిహ్నము (ఇంద్రియము) చెవి. చెవి వినుట మాత్రమే తప్ప అన్యము ఎరుగదు. అదే విధముగనే రెండవ భూతమైన గాలి గుణము స్పర్శ - చర్మము ఇంద్రియము. దీనికి శ్రవణశక్తి లేదు. మూడవది అగ్ని. దీని అంశము కన్ను. ఇది చూడగలదే కాని స్పర్శించలేదు. నాల్గవది నీరు. దీని అంశము నాలుక. నాలుక రుచి చూడగలదే కాని వ్యక్తిని చూడలేదు. ప్రకృతి యొక్క అంశము ముక్కు. ఇది వాసన చూడగలదే కాని రుచిని చూడలేదు. ఈ అంశముల ప్రతిబింబము లగుటచేత ఒక్కొక్క గుణము మాత్రమే యిది స్వీకరిస్తూ వచ్చింది. (బృ.త్ర.పు. ౧౧౨/౧౧౩)

ప్రపంచం త్రిగుణాత్మకమైనది. ప్రతి వ్యక్తి త్రిగుణములతో కూడినట్టివాడే. సూర్యోదయాన్ని గమనించండి. తెలుపు, చుట్టూ ఎరుపు, ఆపైన నలుపు రంగులు కనపడతాయి. మీ కనుగ్రుడ్డును గమనించండి. అందులో కూడా తెలుపు, ఎరుపు నలుపు రంగులు కనపడతాయి. ఈ మూడు రంగులే సత్వరజస్తమో గుణాలను సూచిస్తాయి. **ఈ జగత్తంతయు త్రిగుణాత్మకమే. గుణములలో దైవమున్నప్పటికీ దైవమునందు గుణములు లేవు. కనుకనే దైవాన్ని త్రిగుణాతీతుడన్నారు.** ఈ గుణములలో ఏది అధిక భాగమున్నదో దానిని బట్టి వ్యక్తిత్వము, చర్యలు, ఫలితములు ఆధారపడి ఉన్నవి. తమోగుణమును సత్కార్మాచరణ ద్వారా జయించవచ్చును. రజోగుణము ద్వంద్వానుభవమును అందించునట్టిది. కోపతాపాలకు, నిందాస్తుతులకు, జయాపజయములకు, లాభ నష్టములకు, సుఖదుఃఖములకు, రాగద్వేషములకు స్పందించునట్టిది రజోగుణము.నిర్మల, నిస్స్వార్థ కర్మల నాచరించి, సర్వ కర్మలను భగవదర్పితం గావించి, సర్వ జీవులయందున్న సర్వేశ్వరుని సేవించి, భజించాలి. **ఆత్మతత్వముయొక్క ఏకత్వమును గ్రహించాలి.** అట్టి జ్ఞానముచేత రజోగుణ ప్రధానుడైనవాడు సాత్వికుడు కాగలడు. **"కర్మానుబంధీని మనుష్య లోకే" కర్మఫలితంగానే జన్మ వచ్చింది. జన్మ కర్మాచరణ నిమిత్తమై ఏర్పడింది. "తస్మై నమః కర్మణే" అన్నారు. "నేను చేయు కర్తవ్య కర్మలకు నమస్కరిస్తున్నాను." అని అర్థం.** ఏతావాతా, **తమోగుణమును కర్మచేత రజోగుణముగను, రజోగుణమును భక్తి జ్ఞానములచేత సత్వగుణముగను తీర్చి దిద్దుకొనుటయే సాధన.** వ్యక్తి స్థాయిలో విచారణ ద్వారా మీ తత్వమును మార్చుకొనవచ్చును. **జంతు లక్షణాలైన సోమరత్వము, చంచలత్వము వచ్చినప్పుడు "నేను జంతువును కాను, నేను మనిషిని" అని పదితూర్లు అనుకోండి. ఈవిధంగా,**

జంతులక్షణాలను తొలగించుకోవచ్చును. ఇక, మీరు ఆఫీసులో చేసే పని మీకు సంతృప్తిగా ఉండాలి. ఏదీ ఆడంబరంగా చేయవద్దు. **ఎవరు గమనించకపోయినా భగవంతుడు గమనిస్తున్నాడని తెలుసుకో. మీ కర్తవ్యాన్ని మీరు సక్రమంగా, ప్రేమతో నిర్వర్తించండి.**

Duty with Love is desirable. Duty without love is deplorable. Love without duty is divine. చేసే పనిని భగవదర్పితం గావించినప్పుడు అదే పూజగా మారుతుంది. ఇంక మీ ఆఫీసులో తోటివారితో కలిసి పని చేసేటప్పుడు వారివారి ప్రవృత్తుల ననుసరించి స్పర్థలు, కలహాలు సంభవించి మీరు అశాంతికి గురి అయ్యే అవకాశముంది. కనుక, **ఇతరులతో అనవసరమైన సంబంధాలు పెట్టుకోకండి.**

(స.సా.డి. 99 పు. 374/375)

(చూ॥ కర్తవ్య ధర్మము, క్షేత్రము, త్రిమూర్తులు, త్రివేణి, దైవము)

త్రిపుటి

(చూ॥ క్షేత్రజ్ఞుడు)

త్రిమత స్థాపకులు

శంకరుల తరువాత వచ్చిన **రామానుజులవారు అద్వైతమును ఖండించలేదు కాని, దానిని కొద్దిగా సవరించి దానికి, "విశిష్టాద్వైతము" అని పేరు పెట్టాడు. అద్వైతమును చెఱకు రసముతోను, విశిష్టాద్వైతమును చక్కెరతోను పోల్చవచ్చును. మూడవది ద్వైతము. దీనిని మధ్వాచార్యుల వారు ప్రతిపాదించారు. దివ్యత్వము చక్కెరవంటిదైతే తాను ఆ చక్కెరను తినే చీమగా పుట్టాలని ఆకాంక్షించాడు. "నేనే చక్కెరనైతే నాకు కలిగే ఆనందమేమిటి? కనుక నేను చక్కెర కాకూడదు, చక్కెరను తినేవానిగా ఉండాలి"** అన్నాడు. **మానవుడు తనను తాను దైవానికి అర్పితం చేసుకోకుండా ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని గ్రంథములు చదివినా ఈ 'చక్కెర' ను తినే అధికారము రాదు.** ఇదిగో అమ్మ ఉప్పు అంటే పట్టమ్మ పప్పు అన్నట్లుగా, **"ఓ భగవంతుడా! ఇదిగో నా హృదయమును నీకు అర్పిస్తున్నాను" అన్నప్పుడు భగవంతుడు. "నాయనా! ఇదిగో నీకు 'చక్కెర' ను అందిస్తున్నాను" అంటాడు. "యద్భావం తద్భవతి". భగవంతుడు ఎన్నటికీ మారడు. కాని మన భావములు మారితే భగవంతునిలో మార్పు కనిపిస్తుంది.** కనుక మొట్టమొదట మన భావములను చక్కగా స్థిరంగా పెట్టుకోవాలి.

(స.సా.జూ. 97 పు.173)

త్రిమూర్తి/త్రిమూర్తులు

సృష్టిస్థితి లయము లనేవి మానవునియందు అంతర్భూత మైన శక్తులే. సృష్టి అనగా సంకల్పము యొక్క స్వరూపమే; స్థితి అనగా సృష్టించినదానిని రక్షించడమే; లయమనగా రక్షింపబడినదానిని తనలో చేర్చుకోవడమే. ఈ **సృష్టిస్థితి లయములు రజోగుణ తమోగుణ సాత్వికములకు సంబంధించినవి.** మానవుడు త్రిగుణాత్మక స్వరూపుడు. **ఈ త్రిగుణములే త్రిమూర్తులు. త్రిమూర్తులే త్రిలోకములు.** ఈ ప్రపంచంలో **బ్రహ్మవిష్ణుమహేశ్వరులను దర్శించినవారు ఎవ్వరూ లేరు. ఎవరు బ్రహ్మ? ఎవరు విష్ణువు? ఎవరు మహేశ్వరుడు? మానవునియందున్న త్రిగుణములే ఈ త్రిమూర్తి స్వరూపములు.**

త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం
త్రిజన్మ పాపసంహారం ఏక బిల్వం శివార్పణం"

ఈ త్రిమూర్తి తత్వమును ఏకత్వం గావించుకున్నప్పుడే మానవత్వంలో మంగళత్వము ఏర్పడుతుంది. రాజకీయ రంగమునందు ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, ఆర్థికశాఖ మున్నగు అనేక శాఖలుంటాయి. ఇదేవిధంగా, ఆధ్యాత్మిక రంగంలోను సృష్టిస్థితి లయములనే శాఖలు ఉంటాయి. ఒక్కొక్కశాఖకు ఒక్కొక్క నాయకుడు ఉంటాడు. ఎవరి శాఖను వారు సక్రమమైన మార్గంలో చూసుకూంటూ ఉంటారు. ఈ మూడింటిపై అధిపతి ఒకడు ఉంటాడు. అతడే ప్రైమ్ మినిష్టర్ అనుకోండి. లేక, చీఫ్‌మినిష్టర్

త్రిమూర్తి స్వరూపులు

అనుకోండి. అతని పేరే God (భగవంతుడు). అతనినే 'అల్లా' అని కూడా అన్నారు. సృష్టిస్థితిలయములు మూడింటినీ తన హస్తమునందు ఉంచుకొన్న భగవంతునికి అనేక రూపనామములు కల్పిస్తూవచ్చారు. ఆంగ్లములో భగవంతుని God అన్నారు. **G అనగా Generation (సృష్టి); O అనగా Organisation (స్థితి); D అనగా Destruction (లయము). ఈ మూడింటి ఏకత్వమునే God అన్నారు.** కనుక, సృష్టిస్థితిలయములకు దివ్యత్వమే మూలకారణం. కాని, ఈ దివ్యత్వమును మానవులు అర్థం చేసుకోలేక పోతున్నారు. **బ్రహ్మవిష్ణు మహేశ్వరులు మానవునిలో అంతర్భూతమై ఉన్న శక్తులే.** దీనిని అర్థం చేసుకోవలెనన్న ఆధ్యాత్మిక తత్వము ఆత్యవసరము.

(స.సా.మా. 86 పు.58)

(చూ॥ ఆరాధన, దైవము, భగవదన్వేషణ)

త్రిమూర్తి స్వరూపులు

మానవ ఆకారములే వారి ఆకారములు, వారికి ప్రత్యేకమైన ఆకారములు లేవు. ఆత్మకు ఎట్టి ఆకారము? అదియే చైతన్య స్వరూపము. కనుక అట్టి చైతన్య స్వరూపుడైన ఈశ్వరత్వానికి ఏరూపమూ లేదు. **ఈ చైతన్య స్వరూపానికే 'ఈశ్వరత్వము' అని పేరు పెట్టారు. ఈ కాన్షస్‌నెస్ నుంచి కాన్షెస్ వచ్చి హృదయములో చేరింది.** అదియే మైండ్. ఆ మైండు నుంచి 'కాన్షెస్' అనేటటువంటి వాక్ స్వరూపుడై పోయినాడు. అనేక పర్యాయాలు చెప్పాను.

The one you think you are

(నీవనుకుంటున్న నీవు)

The one others think you are

(ఇతరులు భావించే నీవు)

The one you really are

(నిజంగా నీవైన నీవు)

ఈ మూడింటి యొక్క ఆకారములే బ్రహ్మ విష్ణుమహేశ్వర స్వరూపులు. కనుక **బ్రహ్మ వాక్ స్వరూపుడు. విష్ణువు మనో స్వరూపుడు.** విష్ణువుకు వున్న సర్వవ్యాపకత్వం మనస్సుకు కూడా ఉంటున్నది. విష్ణువు అనగా సర్వ వ్యాపకత్వంతో కూడినటువంటివాడు. మనసు కూడా అంతే. **'మనోమూల మిదం జగత్'.** ఏ క్షణమందైనా, ఏ ప్రదేశము నందైనా ఏ కాలమునందైనా, ఏ దేశమునందైనా సంచరిస్తుంటుంది మనసు. దేశకాల పరిస్థితుల ప్రభావములకు ఏమాత్రం యీ మూడునూ లొంగునవి కావు. కనుకనే బ్రహ్మ అనగా వాక్ స్వరూపమైనటు వంటివాడు. ఇతని ఆకారమునకు గాని, పేరుకుగాని ఒక పరిమితము అనేది లేదు. విష్ణువు అనగా విశ్వమంతా వ్యాపించినటు వంటివాడు. కనుక ఇతనికి ఒక ఆకారము లేదు. ఇక వాక్కు. ఇదే శబ్దబ్రహ్మమయి. దీనికి కూడనూ ఒక పరిమితము లేదు. కనుక బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనగా పరిమిత రహితమైనటువంటి సర్వాంతర్యామి స్వరూపులు. ఈ సర్వవ్యాపకమైనటువంటి బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపులు అణుమాత్రమైన దేహమునందు ఆవిర్భవించారు. **'అణోరణీయాం మహతో మహీయాం' మహత్తరమైనటువంటి ఈ శక్తులు అణుశక్తియగు ఈ దేహమునందు లీనమై ఉన్నవి.**

(శ్రీ. జూ. 2000 పు. 27/28)

సత్యవాక్కు బ్రహ్మ స్వరూపము. సత్యముకంటే మించినది మరొకటిలేదు. మనసు విష్ణు స్వరూపము. **హృదయమే శివస్వరూపము. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఆకార స్వరూపులుగా కాకుండా, గుణస్వరూపులుగా ఉంటున్నారు.** భగవంతుడు అభీష్టాలను నెరవేరుస్తుంటాడు. చెడ్డను సంహరిస్తుంటాడు. భక్తులు చేసే పూజలను పరిగణనలోనికి తీసుకొని, భగవంతుడు అనుగ్రహిస్తు ఉంటాడు. ఎలాంటి పరిస్థితులలోనైనాసరే తప్పక రక్షిస్తాడు. ఏమాత్రం సందేహించవద్దు. కనుక ఈ సత్యమును గుర్తించి, హృదయాన్ని పవిత్రమైన మార్గంలో ప్రవేశ పెట్టండి. **నా హృదయమే ఈశ్వరుడు, నామనసే విష్ణువు, నా వాక్కే బ్రహ్మ - ఈ మూడింటిని పూర్తిగా నమ్మి, ఆ మూడింటిని సద్వినియోగపరచుకుంటూ రండి. మీకు సద్గతి తప్పక కలుగుతుంది.** అన్నివిధాల మీరు దైవములోనే

లీనమవుతారు.

ప్రేమస్వరూపులారా!

మీరందరూ త్రిమూర్తి స్వరూపులే, త్రిమూర్తాత్మక స్వరూపులే, త్రిగుణస్వరూపులే, త్రినేత్రస్వరూపులే. ఈ సత్యాన్ని విస్మరించకండి. కాలము చాలా పవిత్రమైనటు వంటిది. ఈ కాలాన్ని పవిత్రంగావించడానికి మంచి మాటలు, మంచిమనసు, మంచి హృదయము కలిగి ఉండండి. ఈ అన్నింటికన్నా ప్రేమను ప్రధానంగా పెట్టుకోండి.

(శ్రీ. జూ. 2000 పు.32)

వాక్కే బ్రహ్మ, మనస్సే విష్ణువు, హృదయమే ఈశ్వరుడు. ప్రతి మానవుడు త్రిమూర్త్యన్వరూపుడే. కనుకనే, అతనియందు త్రిగుణములు ఆవిర్భవిస్తున్నాయి.

త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం
త్రిజన్మ పాపసంహారం ఏకబల్వం శివార్పణం.

ఈశ్వరునికి త్రినేత్రం ఉందనటంలో అంతరార్థమేమిటి? మానవుడు గతాన్ని, వర్తమానాన్ని చూడగలడుగాని, భవిష్యత్తును చూడలేడు. **భవిష్యత్తును చూడగల్గే నేత్రమే త్రినేత్రము.** వర్తమానాన్ని సరియైన స్థితిలో పెట్టుకుంటే భవిష్యత్తు మానవుని చేతిలోనే ఉంటుంది. ఈనాటి మానవుడు ఎప్పుడు చూసినా గడచిపోయినదాన్ని గురించి, గడువబోయేదాన్ని గురించి చింతిస్తుంటాడు. కనుకనే, వర్తమానాన్ని మరిచి పోతున్నాడు. **'పాస్ట్' (గతము) నుండి వచ్చినదే 'ప్రెజెంట్' (వర్తమానం); 'ప్రజెంట్' (వర్తమానం); 'ప్రజెంట్' యొక్క ఫలితమే 'ఫ్యూచర్' (భవిష్యత్తు) 'పాస్ట్' అనే వృక్షము నుండియే 'ప్రజెంట్' అనే విత్తనం ఏర్పడింది; 'ప్రెజెంట్' అనే విత్తనము నుండియే 'ఫ్యూచర్' అనే వృక్షం ఆవిర్భవిస్తుంది.** కాబట్టి, **'పాస్ట్', 'ఫ్యూచర్' రెండూ 'ప్రెజెంట్' లోనే ఇమిడియున్నాయి.** ఈ సత్యాన్ని గుర్తించి వర్తమానాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే భవిష్యత్తు సత్ఫలితాల నిస్తుంది. కాబట్టి, మీ మనస్సును వాక్కును పవిత్రంగా పెట్టుకోండి.

(స.సా.జూలై 2000 పు. 202/203)

త్రిరాత్రులు

(చూ॥ భగవదన్వేషణ)

త్రివిధ దృష్టులు

మానవునకు మూడు విధములైన దృష్టి కలదు. ఒకటి దేహదృష్టి. ఇది బాహ్యమునకు మాత్రమే పరిమితము. తన రూపసౌందర్యమును మాత్రమే తన ఒడ్డు పొడుగు మాత్రమే చూచేటటువంటి స్వభావము. ఇది దృశ్యకల్పిత మైన దృష్టిప్రసారము. రెండవది మానసికదృష్టి. అతని భావములను, అతని చర్యలను అతని ప్రవర్తనను ఆధారము చేసుకొని యీ భావములు హృదయమునుండి ఆవిర్భవించినవి అనే సత్యాన్ని గుర్తిస్తూ వుంటారు. మానవునకు మనసు మరుగునున్న యీభావములే చర్యలయందు కనుపిస్తుంటాయి. లోపల వుండినదాని ప్రతిబింబములే యీ బయటి చర్యలు.Reflection of inner being.ఈ చర్యలను దృష్టియందుంచుకొని మానవుడు మెలుగుతుంటాడు. **మూడవది ఆత్మదృష్టి.** తన చర్యలనుగాని, తన రూపురేఖలనుగాని, ఒడ్డుపొడుగులుగాని, తన ప్రవర్తనగాని యేమాత్రము యోచించడు, గుర్తించడు.రూపనామములు చేసే సిద్ధాంతములు ప్రత్యేకముగా వుండినప్పటికిని అందరియందుండే ఆత్మతత్వము ఒక్కటే అనే సత్యాన్ని నిరూపించేది. రూపములు కానీ చర్యలు కానీ మార్పు చెందునట్టివి, పరిణామము కలిగినవి, షడ్వికారములతో కూడినవి. ఇట్టి అనిత్యము, అసత్యము, అశాశ్వతము అయిన చర్యలయందు రూపములయందు దృష్టిని అభివృద్ధి పరచుకోవటం సమ్యక్ దృష్టికాదు.

(శ్రీ.గీ. పు. 253)

త్రివేణి

కర్త, కర్మ, క్రియ లన్నియు పరమాత్మను ఆశ్రయించి యున్నవని నమ్మకము కలిగి దైవమునకు భక్తులు కావలెను. కానీ, ధనమునకు దారాదులకు, పుత్రాదులకు,

త్రివేణీ సంగమము

భక్తులు రక్తులు కారాదు. అభిమాన మెక్కడో అక్కడ దైవభక్తి అని చెప్పచెల్లదు. **భక్తి పరిశుద్ధమైన గంగ వంటిది. కర్మ యమునవంటిది. జ్ఞానము గుప్తగామినియైన సరస్వతి వంటిది. ఇది బైటికి కనుపించునది కాదు. ఈ మూడింటి సమ్మేళన త్రివేణి అని పిలువ బడును.**

అట్టి త్రివేణి, అనగా త్రిగుణముల యేకత్వమే మనోలయము, అదియే మమకార రహితమని అందురు.

(గీ.పు.190)

త్రివేణీ సంగమము

(చూ॥ అయోధ్య, శ్రీసత్యసాయి విశ్వవిద్యాలయము)

దక్ష

(చూ॥ భక్తుడు)

దక్షత

(చూ॥ అనపేక్ష)

దక్షిణామూర్తి

(చూ॥ ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి, చతుర్విధపురుషార్థాలు, సముద్రుడు)

దక్షిణాయనము

(చూ॥ ఉత్తరాయణము)

దక్షుడు

మానవుడు క్రిమి కీటాకాదులుగా తయారయిపోతున్నాడు. మృగంగాను, క్రిమికీటకాదులుగాను తయారుకావటానికి ఏమి కారణము? మనయొక్క వాంఛలే దీనికి మూలాధారము. మృగతనాలు చేరడానికిగానీ క్రిమి కీటకాదులవలె ఇతరులను హింసించడానికిగానీ, వచ్చేటువంటి గుణములన్నీ కూడను. ఈ వాంఛలద్వారా ఏర్పడినటువంటివి. ఈ ఘాతుక చర్యలకు, పరస్పర భేదములకు, అసూయా స్వభావములకు, ఈ అన్నింటికినీ మూలాధారము దుర్‌వాంఛలే. **దుర్వాసనలే మనము మృగములకు సమీపము కాకుండా, పరమాత్మకు సమీపము కావలెననే వాంఛను అభివృద్ధి గావించు కోవడానికి తగినటువంటి ప్రయత్నము చెయ్యాలి.**

అట్టి అధికారికే దక్షుడు అని కూడను మరొక పేరు. మనము సామాన్యంగా ఏదైనా కొన్ని లోక వ్యవహారములందు మాట్లాడినప్పుడు "అయ్యా! నేను దానిని సాధించడానికి దక్షుడు కావాలి. **అనగా అధికారిని కావాలి"** అని ఉచ్చరిస్తుంటాడు. మన భారతీయ చరిత్ర యందున్న యొక దక్షుడు, దక్ష మహాయజ్ఞమును చేశాడు. దక్షుడు అనేటటువంటివాడు ఎవరు అనగా, **సర్వవిద్యలు నేర్చినవానికే దక్షుడు అనికూడను పేరు.** అతనికి సతీదేవి అనేకుమార్తె. **సతీదేవి అనగా జ్ఞానమూ, బ్రహ్మజ్ఞానము**

దదధ

అని ఆమెకు పేరు. కనుక ఈ దక్షునకు బ్రహ్మజ్ఞానమనే కుమార్తె కలగడంచేతనే ఈశ్వరుని యొక్క సన్నిహిత సంబంధము, బాంధవ్యము అతనికి ఏర్పడినవి. కనుక ఈనాడు మనము అధికారమనే దక్షుడు అయినప్పుడు సతీదేవి అనే, బ్రహ్మజ్ఞానమును పుత్రికగా పొందినామంటే అప్పుడే ఈశ్వరునితో మనకు సన్నిహిత సంబంధము ఏర్పడుతుంది. కానీ బ్రహ్మజ్ఞానమనే పుత్రికను మనము పొందక కేవలము ఈశ్వరునితో సంబంధాన్ని కలిగించుకోవాలనే వాంఛను మాత్రము పెంచుకుంటూ, **అజ్ఞానమనే దుర్మార్గపు పుత్రుడిని పొందటంచేతనే భగవంతుడయిన ఈశ్వరునికి సన్నిహిత సంబంధముకాక విరోధులుగ తయారయి పోతున్నాము.** నిజముగా ఆనాటి దక్షుడు బ్రహ్మజ్ఞానమనే పుత్రికను పొందటంచేతనే పరమాత్మునితో సంబంధం ఏర్పడినది. ఈశ్వరుడతనికి చాలా ఆత్మసంబంధమైన అల్లుడుగ తయారయినాడు. **కానీ ఈనాటి సన్‌ఇన్‌లాలు (Sons-in-law) ఏరీతిగా ఉంటున్నారో తెలుసునా?**

పిల్ల నిచ్చువరకు పిల్లిగా నటియించు,
పిల్ల నివ్వగానే పులిగ మారు

కనుక మనము నిజముగా భగవంతుని సన్నిహిత సంబంధము ఉండాలను కొన్నప్పుడు జ్ఞానమనే, బ్రహ్మజ్ఞాన తత్వాన్ని కొంత అనుభవించడానికి పెద్దల సన్నిధిచేరి, వారి ప్రబోధనలను ఆలకించి, **వారి ఆచరణలంతాకూడను అనుష్ఠానములో పెట్టి, తద్వారా మనము సాధ్యమైనంతవరకును సాధనపూర్వకంగా మనస్సును అరికట్టుకోవటానికి ప్రయత్నము చెయ్యాలి.**

(మ.మ. పు.38/40)

దదధ

ఉపనిషత్తులలో ఉరుము "దదధ" అన్నట్లు వర్ణించారు. **రాక్షసులకు దమము - దేవతలకు దయ - మానవులకు ధర్మము.** ఈ మూడు అంశాలు నరులలో ఉన్నవి. కాబట్టి - దయ - దమము - ధర్మమూ నరులు అలవరుచుకోవాలి. భగవన్నామం స్మరిస్తూ - నీరసమైన పేలవమైన విషయాలలో నాలుకా భగవంతుని వైభవాన్ని మనస్సులో భావిస్తూ మనస్సు చొరబడకుండా అరికట్టి, నిజతత్వం గ్రహించడమే మీ ప్రథమకర్తవ్యం.

(త.శ.మ.పు.147)

దమము

మాటచెప్పినట్లు మనుజుండు నడచిన
మనిషి కాదు వాడు మహితుడగును
మాట చెప్పినట్లు మనిషి నడువడేని
మనిషి కాదు వాడు మృగమె కాని.

ఈనాటి మానవ సమాజములో మాటకు క్రియకు సంబంధములేదు. మాట క్రియతో కూడిన సత్యము. మనసు మాట క్రియతో కూడిన ఋతము. విద్యార్థులు దేశాభిమానాన్ని దేశౌన్నత్యాన్ని దేశకళ్యాణాల్ని మనసునందుంచుకొని ప్రవర్తనయందు ఆదర్శ జీవితాన్ని అందించాలి. ఈనాటి విద్యార్థులు ఇంద్రియ నిగ్రహమంటే ఏమిటో తెలియదు. దీనికి సంయమము అని పేరు. సంయమము మానవునికి మాత్రమే చెందినది. ఇంద్రియములను అనుసరించి స్వేచ్ఛా విహారం జరపటంచేత మానవుడు తన దివ్యత్వాన్ని కోల్పోతున్నాడు. ఇట్టి **ఇంద్రియ నిగ్రహమునకు సంస్కృతమునందు దమము అని పేరు. ఈ దమమును సాధించిన వాడే దాంతుడు. ఈనాడు లోకానికి దాంతులు కావాలి కాని వేదాంతులు అక్కరలేదు.** ఈనాటి వేదాంతము మాటలతో మాత్రమే జరిగి పోతున్నది. వాచాలత్వము అధికమై పోతుండాది. ఆడంబరములు అధికమై పోతున్నాయి. ఆచారములు సన్నగిల్లుతున్నాయి? కనుకనే ఆనందము శూన్యమౌతుండాది.

(బృ.త్ర.పు. ౧౯౧)

దమమనగా యింద్రియనిగ్రహము. దమమనేది లేకపోతే యేమవుతుంది? మొన్న చెప్పినట్టుగా **'దమ' ను త్రిప్పి చదివితే 'మద' అయిపోతుంది. మదమనగా యేమిటి?**

ఒక దుర్గుణమును పెంచుకోవటము. దమమును సంపాదించుకున్న వానికి రెండవపేరు 'సాక్షర' అని యింకొకటి వుంటుండాది. **సాక్షర యనే దానిని కూడను త్రిప్పి చదివితే 'రాక్షస' అవుతుంది. మనము రాక్షసత్వమునకు పోకుండా దమమును అనగా యింద్రియములను అదుపులో పెట్టుకున్నామంటే నిజమైన ధర్మమును పోషించినవారమవుతాము.** అన్నింటికి యింద్రియనిగ్రహము అత్యవసరమని కృష్ణుడు అర్జునునికి బోధించాడు. అర్జునునితో ఇంద్రియనిగ్రహము గావించుకొని నీవు స్థిత ప్రజ్ఞుడవు కమ్మని చెప్పాడు.

(శ్రీ.గీ.పు.233)

(చూ॥ అథాతోబ్రహ్మజిజ్ఞాస)

దయ

దయచేత ధన్యులు కావలెరా
ఎంతటి వారైనా దయచేత ధన్యులు కావలెరా
అసురులైన భూసురులైనా అఖండ తెలివి కలవారైనా
దయచేత ధన్యులు కావలెరా
విద్యనేర్చి వాదాడినగాని - పద్యములెంతో పాడినగాని
కొండ గుహలలో నుండినగాని - కుర్చొని జపములు చేసినగాని
దయచేత ధన్యులు కావలెరా
యోగాభ్యాసము చేసినగాని - భాగవతాదులు చూచినగాని
బాగుగ గడ్డము పెంచినగాని - పట్టెనామములు పెట్టినగాని
దయచేత ధన్యులు కావలెరా.

(సు॥సా॥ డి. 96 పు. 335)

(చూ॥ అమోఘుడు, విద్య, శాంతము)

దయాధర్మములు

(చూ॥ అవతారములు)

దయ్యము

(చూ॥ దుర్గుణములు)

దరిద్రనారాయణసేవ

ఎట్టివారికి సేవ సలిపినను దైవానికే యనుభావముండవలెను. భగవంతునికి రెండు రూపములున్నవి. అవి లక్ష్మీనారాయణ, దరిద్రనారాయణ స్వరూపములు. **లక్ష్మీనారాయణునికి ఎట్టి సేవయు చేయనక్కరలేదు.** పేరునందే తెలియుచున్నది. లక్ష్మి ప్రక్కనే ఉండుటచేత లక్ష్మీనారాయణునికి మన సేవలు అనవసరము. కాని **దరిద్రనారాయణుడు పేరునందే యున్నట్లు దీనుడు, ఒంటరివాడు, కనుక అట్టి దరిద్రనారాయణునికి సేవ చేయుట అవసరము.**

సంస్థలయందున్నను, లేకున్నను సమస్తము ఈశ్వరత్వమేయను భావము కలిగియుండవలెను. సంస్థలు నిర్దేశించినవి కనుక నేను చేయుచున్నాను అన్న భావముండరాదు. **ఎవరు చూచినను, చూడకున్నను నీ అంతరాత్మ గమనించుచునే యున్నది. నా సంతృప్తికి, నా ఆనందమునకు, నా ముక్తికొరకు సేవచేయుచున్నానని భావించవలెను.**

(స.సా.అ. 85 పు.267)

దరిద్రనారాయణుడు

"విత్తము" అనగా కేవలము ధనమునకు సంబంధించిన పదం మాత్రమేకాదు. "విద్యతే లభ్యతే ఇతి"అని వ్యుత్పత్తి అర్థము. అనగా పొందబడినది అని అర్థం. భుజబలం పొందబడినటువంటిదే. విద్యా బలము పొందబడినటువంటిదే. ధనబలం పొందబడినటువంటిదే. **ధనబలం, దేహబలం, విద్యాబలం మూడు బలములతో కూడినటువంటి దానినే విత్తము అని చెప్పవచ్చును. పొందబడిన ఈ మూడు శక్తులు సమాజమునకు అర్పితము కావించి, సద్వినియోగము చేసుకొనుట మానవుని ప్రధాన లక్ష్యము.** కష్ట సుఖములు కావడి కుండలు. ఎప్పుడు ఎవరికి ఏ స్థాయిలో ఏ కాలమునందు ఎట్టి స్థితి లభ్యమవుతుందో ఎవ్వరును చెప్పలేరు. కోటీశ్వరుడు కూటిపేద కావచ్చును. కూటిపేద

దర్శనం

కోటీశ్వరుడు కావచ్చును. ఇవి ప్రాకృత మైనటువంటి చర్యలు. ప్రకృతియొక్క స్వభావములు. మానవుడు ఎన్ని యజ్ఞ యాగాది క్రతువులు ఆచరించి నప్పటికినీ, ఇవి ప్రకృతి బద్ధమైనటువంటివి. ఇవన్నీ మోహముతో కూడినటువంటివి. ఈ మోహం ఏనాటి కైనా తిరిగి కాల చక్రములో నెట్టక తప్పదు. కనుక ఈ సత్యాన్ని గుర్తించి ప్రతి మానవుడు తన కర్మలు సక్రమమైనవిగను, సదుపయోగ మైనవిగను, ఇతరులకు సహాయకర మైనవిగను రూపొందింపజేసుకోవాలి. ధనవంతులు దరిద్రనారాయణ సేవ చేస్తున్నామని భావిస్తారు. దరిద్రనారాయణులంటే ఎవరు? కేవలము మానవ దృష్టిలో, తినుటకు తిండిలేనివారు, ఉండుటకు కొంపలేనివారు, కట్టుటకు బట్టలులేనివారని మనము భావిస్తున్నాము. **దరిద్రనారాయణుడంటే, దరిద్రుని హృదయవాసి అయినటువంటి నారాయణసేవనే చేసినట్లు భావించాలి. రూపములేని భగవంతునకు ఈ రూపమనే మార్గములో మనము ప్రవేశించి తద్వారా మన కర్మలను సార్థకము గావించుకోవాలి. ఎవడు తన హృదయమునకు బీదవారియొక్క చింతలు కొంత వరకు ప్రవేశపెట్టుకొని, ఏదో తనకు తగినటువంటి సేవచేయాలి అని సంకల్పించుకొనునో - అట్టివాని హృదయమునందే భగవంతుడు నివసిస్తూ ఉంటాడు.**

(స.సా.జ. 91 పు.10)

"అమ్మా! ధర్మం చెయ్యండి, బాబూ! ధర్మం చెయ్యండి' అని బిచ్చగాడు నీ ముందు చెయ్యి జాపుతాడు. **అతనిని నీవు నీ కర్తవ్యము బోధించే గురువుగా భావించు". "క్రిందటి జన్మలో దానధర్మాలు చెయ్యక ఈ జన్మలో ఇటువంటి నికృష్టమైన దారిద్ర్యం అనుభవిస్తున్నాను. మేల్కొనండి. కళ్ళు తెరిచి నా దీనస్థితి చూడండి. ధర్మం చెయ్యండి" అంటూ నీ దానం స్వీకరించి నిన్ను తరింప చెయ్యడానికొచ్చిన ప్రత్యక్ష నారాయణునిగా గుర్తించు.** చెయ్యగలిగితే దానం చేసి సర్వభూతాంతరాత్మ అయిన భగవంతుని అనుగ్రహం సంపాదించు. అంతేకాని అతడిని అసహ్యించుకునో, దూషించో అవమానించకు. **'సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి'** ఎలాగు సత్ఫలితాన్ని అందిస్తుందో **'సర్వదేవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి'** అలాగునే దుష్ఫలితాన్ని అందిస్తుంది.

(ప్రే.బ.పు.24)

దర్శనం

స్వామి దివ్య స్వరూపాన్ని దర్శించటం ద్వారా అవతారాన్ని గుర్తించటమే దర్శనం. స్వామి దివ్యత్వాన్ని స్పృశించటం ద్వారా వారి దివ్యత్వాన్ని అందుకోగలగటం స్పర్శనం. స్వామిబోధనలను సరిగా అర్థంచేసుకుని జీర్ణంచేసుకోవటం సంభాషణం. ఇవన్నీ మానవజాతిని అధోగతి నుండి కాపాడటానికి ఉపయోగించే సాధనలు.

(శ్రీ.స.స.పు.257)

నాదర్శనంవల్ల మీరు పొందు లాభమును ఎన్నటికీ చులకనగా చూడకండి. ఇది మీకు పూర్వపుణ్యమువలన అబ్బిన వరప్రసాదము. నా దర్శనార్థము దేవలోకములోని దేవతలు కూడా ఆతురతతో వేచియుందురు. అంతటి మహా దర్శనభాగ్యము మీకు సులువుగా దినదినమూ అబ్బుతూ వున్నది. **ఇది జన్మాంతర పుణ్య విశేషము మరువకండి:** సరియైన సమయ మాసన్నమైనప్పుడు నా దర్శన భాగ్యము వలన మీకు యిచ్చిన దీవెనలు ఫలించును.

(ప్రే.జో.పు.171/172)

నా దర్శనం లభించిన తదుపరి మీరంతా ఏకాంత ప్రదేశమునకేగి అక్కడ నిశ్చల నీరవమైన మౌనం పాటిస్తూ - నా దీవెనలను పరిపూర్ణంగా పొందండి. **నేను మీ ముందుగా నడచి వెళ్ళినప్పుడు నాలోని శక్తి మీ పైన ప్రసరించును. వెంటనే, మీరు ఇతరులతో సంభాషించుటకు ప్రారంభించిన ఆ శక్తి మీచే ఉపయోగింపబడక తిరిగి నన్ను చేరును. నా దృష్టి దేనిపైన ప్రసరించునో, అది చైతన్యవంతమై దివ్య మైన పరివర్తన**

పొందుచుండును. నాదర్శనభాగ్యమును ఎన్నటికీ తక్కువ అంచానా వేయవద్దు. "నేను మీ మధ్య నడయాడుట" అనే కార్యము దేవతలు కూడా సదా ఆకాంక్షించునట్టి అపూర్వమైన అవకాశము. ఇట్టి అవకాశమును మీరు ప్రతీ నిత్యం పొందుతున్నారు. అందులకై సదా కృతజ్ఞులై ఉండవలె. నిర్దిష్ట సమయమాసన్నమై నప్పుడు, నానుండి మీరందుకొంటున్న దీవనలు తమ విలువలను వ్యక్తం చేయగలవు. కాని, ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి. మీలో - ఎవ్వరికి ఎంత తక్కువగా ఇవ్వబడునో, వారి నుండి అంత ఎక్కువగా స్వీకరింపబడును.

(స.సా.జ. 93 వెనుక పేజి)

దర్శనములు

బ్రహ్మసూత్రము శారీరకశాస్త్ర మనియు, వేదాంత దర్శన మనియు చెప్పబడుచున్నది. అంటే శరీర సంబంధితమైన ఆత్మ, జీవుడు, ఇంద్రియాది భూతాలను గూర్చిన శ్రేష్టమైన పరిశీలన జరుపుట. అనగా బ్రహ్మమే శరీర ఇంద్రియాలకు ఆధారమని గుర్తించుట. ఏతావాతా ఆనంద ఘనమే నీ స్వరూపమని తెలుసుకొనుట. **ఇక దర్శనము అనగా చూపు అని అర్థము నిచ్చుచున్నది.** ఇది సత్యదర్శనమునకు తోడ్పడుచున్నది. దర్శనములన్నియు సుప్రసిద్ధులు, ద్రష్టలునగు మహర్షులచే ప్రతిపాదింపబడినవి. **న్యాయము గౌతమునిచేతను, వైశేషికము కణాదుని చేతను, పూర్వమీమాంస జైమినిచేతను, ఉత్తరమీమాంస వేదవ్యాసుల చేతను ప్రతిపాదింపబడినవి. వీరిలో కపిలుడు, వ్యాసుడు విష్ణ్వంశమనియు మునుల విశ్వాసము.** వీరేమిటి, అందరూ విష్ణ్వంశలే అని బ్రహ్మసూత్రము నిరూపించుచున్నది. బ్రహ్మసూత్రములద్వారా ఉత్తర మీమాంస వేదవ్యాసమునిచే ప్రతిపాదింపబడెను. ఈ సూత్రము పూర్వ పక్ష, సిద్ధాంతములతో గూడి బ్రహ్మవిద్యను ఈ విధముగా ఆక్షేపణ సమాధానములతో బోధించుచున్నది. శరీరమును ఉపాధిగా చేసుకొని పురుషుని గురించి విదితము చేయును గనుక శారీరక మీమాంస అనీ, వేదాంతమును గురించి వివరించునది గాన వేదాంత దర్శనమనీ ఈ ఉత్తర మీమాంస పేరెన్నిక గన్నది.

(సూ.వా.పు.3)

(చూ॥ షడ్‌దర్శనములు)

దర్శించాలి

కార్య కారణ స్వరూపమైన భగవంతుని విశ్వరూపములోనే దర్శించాలి.

(శ్రీ.వ.1990 పు.8)

దర్శించు

నీలో వున్న ఆత్మను దర్శించు. దానివలన ప్రపంచములో యున్న ప్రతిదాని యందు భగవంతుని దర్శించగలవు.

(సా. పు. 81)

(చూ॥ ప్రేమ సందేశము)

దశరథాత్మజుడు

"వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రచేతసా దాసీత్, సాక్షాత్ రామాయణాత్మనా."
"చక్కెరకంటెతీపి; ఘనసారముకంటెను రుచ్యమౌను;
పెంపెక్కిన తేనెకన్న అతిరుచ్యము; నోటను పల్కపల్కగా
మిక్కిలికమ్మనౌ అమృతమే యనిపించును; కాన నిత్యమున్
చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్"

(ఆ.రా.పు.1)

దశరథుడు

(చూ॥ అలవర్చుకోవాలి, ఇంద్రియపటుత్వం, రాముని జన్మస్థానము, రామరాజ్యం)

దశవిధపాపములు

ధ్యాని శరీర మానసిక వాక్కులందు కొన్నింటిని కట్టు దిట్టము చేసుకొనవలెను. అవియే దశవిధ పాపములు.

దశ సూత్రములు

కాయకంగా త్రివిధములైన పాపములు, వాక్కున చతుర్విధములైన పాపములు, మానసికంగా త్రివిధములైన పాపములు. అందులో కాయక పాపములు 1. ప్రాణాతి పాతము 2. పరదారాసక్తి 3. దొంగతనము. ఇంక వాక్కునందాచరించు పాపములు: 1. యావత్ ప్రలాపములు 2. పారుష్యము 3. పైసున్యము 4. అసత్యము. అటులనే మానసికంగా కూడను: 1. పరధనాసక్తి 2. పరుల యెడ అసూయ, 3. నాస్తికత్వము. ఈ విధములైన దశవిధ పాపములనూ ధ్యానసాధకుడు చెంతచేర్చక చూచుకొనవలెను. వాటిని పూర్తిగా పరిత్యజించవలెను.

(శ్రీ స.సూ. పు. 122)

దశ సూత్రములు

1. దేశాభిమానము కలిగి వుండాలి.
2. ఏ మతాన్ని ద్వేషింపక సర్వమతములను గౌరవించాలి.
3. ప్రతి మానవుని సోదరునిగా భావించి ప్రేమించాలి. మనది మానవ జాతి.
4. గృహమును, గృహ పరిసరములను పరిశుభ్రముగా ఉంచుకోవాలి
5. బిచ్చగాళ్ళను ప్రోత్సహించక ఉపాధి కల్పించాలి. సోమరితనాన్ని పెంచవద్దు.
6. లంచము ఇవ్వవద్దు - పుచ్చుకోవద్దు.
7. జాతి మత భేదభావాలు ఏ మాత్రము పెంచుకోరాదు.
8. ప్రతి సభ్యుడు తన పనిని తనే చేసుకోవాలి. ఇంకోకరితో చేయించుకోరాదు.
9. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి ప్రతివారికి ఉండాలి.
10. ప్రభుత్వ చట్టాన్ని నిబంధనలను ఏ మాత్రము అతిక్రమించరాదు.

(శ్రీ.స.ప్ర.వెనుక కవరు పేజి)

దశేంద్రియములు

ఎట్టి గుణములైనా ఇంద్రియసంబంధము లేక చలించవే: గుణములకు పుట్టుక స్థానమే అది. కర్మేంద్రియములు ఐదు జ్ఞానేంద్రియములు ఐదు. ఈ రెండూ చేరేకదా మనో సహాయమున ఆత్మను చేరుచున్నవి: లేకున్న లయమే లేదు. **'మాయలోనే పుట్టి, మాయలోనే పెరిగి, మాయను దాటుట మనిషినీతి'** అన్నట్లు వాటిలోనే పుట్టి వాటిలోనే పెరిగి, వాటిని దాటుట జడచైతన్యముల లక్షణములుకదా: అందుకనే రాముడు జీవిరూపుడై ఎక్కడ జనించెనో తెలియునా? ఎవరికుమారుడు? దశేంద్రియ మను రథమున పుట్టినవాడు కనుక రాములతండ్రికి దశరథుడను నామము. తెలిసినదా? ఏ రూపములు ఏ గుణము దాల్చిననూ అవి దశేంద్రియసంబంధము లేక ఉండవు. కాన, ఇప్పుడు అవి కర్మేంద్రియ జ్ఞానేంద్రియ రూపమున ఉన్నవి; ఆనాడు దశరథ రూపమున ఉండెను. దశరథునకు నలుగురుకుమారులు పుట్టిరే, వారు ఏ రూపము?

దశేంద్రియములందు నాలుగే కాదు. ఎన్ని గుణరూపము లైనను పుట్టవచ్చును. అయితే ముఖ్యముగా పుట్టవలసిన గుణరూపములు నాలుగు ముఖములనియూ, పరమాత్ముడు చతుర్ముఖుడు కనుక, తనను తాను సంకల్పించుకొని నాలుగుభాగములుగా విభజించి, నాలుగుముఖములూ నాలుగురూపములుగా జన్మించిరి. వారే రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు. వారు సూక్ష్మరూపమున సత్య ధర్మ శాంతి ప్రేమ స్వరూపులై యున్నారు. పరమాత్మునియొక్క చతుర్ముఖములు ఇవియే.

స్వామీ: ఇందులో సత్య మెవరు, ధర్మ మెవరు, శాంత మెవరు, ప్రేమ ఎవరు?

అంతమాత్రము తెలియదా: **రాముడే సత్యస్వరూపుడు. ఎవరి స్థానము వారిదేకాని, నాకు అర్హతకాదని నిరూపించిన భరతుడే ధర్మ స్వరూపుడనియూ, ఆత్మపై(అనగా రామస్వరూపుని పై) సంపూర్ణభారమువేసి, దానికంటె మించిన ఆనందము వేరులేదని సర్వకాల సర్వావస్థల యందును ఎడబాయక నిరూపించిన లక్ష్మణుడే ప్రేమస్వరూపుడనియూ, ఈ మూడింటిని అనుసరించి**

అవి ఏఏ మార్గమున నడుచునో అంతవరకూ తాను ఏ ఉద్దేశ్యములు పడక, శాంతముగా ఈ మూడింటిజాడలలో నడచి నిరూపించిన శత్రుఘ్నుడే శాంతస్వరూపుడు.

మాయలోనే పుట్టి, అందులోనే పెరిగి, తిరిగి దానినే జయించవలె నన్నట్లు వీరు గుణములందే పుట్టి, గుణములను జయించి, గుణాతీతులు అయ్యే అర్థమును నిరూపించుటకే ఈ ముగ్గురు తల్లులూ మూడు గుణములుగా ఉండిరి. **అందులో కౌసల్య సత్వగుణము, కైక రజోగుణము, సుమిత్ర తమో గుణముగా నటించినవి.** దశరథుడు దశేంద్రియరూపుడై ఈ గుణములను కూడియుండుటవల్ల వారు ఇంద్రియ గుణస్వరూపులను పేరున నిల్చియుందురు. ఈ ఇంద్రియగుణముల మూలమున మానవులు సులభముగా గ్రాహ్యము చేసుకొనలే రని మానవబోధనార్థము పరమాత్ముడు ఇన్నిన్ని రూపములతో ఇంత రామాయణమును జరిపి బోధించినాడు: బోధించుచున్నాడు. ఆనాటి స్థూల రామాయణమును ఈనాటి మానవహృదయరంగ మున గుణరూపములతో సూక్ష్మరామాయణముగ జరుపుచున్నాడు.

(సం. పు.93/94)

దాంతుడు

(చూ॥ దమము)

దానము

దీనజనులకు శక్తికొలది దానముచేయాలి. అయితే యెవరు దానమునకు పూనుకొనుటకు అర్హులు? సన్యాసులకు ధనముండదు. అందుకే దానము చేయనవసరములేదు. గృహస్తులే ధనమును దానముచేయుటకు అర్హులు. గృహస్తుడు ధర్మమార్గమున ధనమునార్జించి తనకు. తనబిడ్డలకు వుపయోగించుకొనుచు కొంచము ధర్మము చేస్తూవుండాలి. ధనమును దానముచేయుట పవిత్రమైనది. అందువలన పిల్లలకు భవిష్యత్తులో మంచికలుగును, దైవముయొక్క యేకత్వమును, మానవత్వముయొక్క సమత్వమును అభివృద్ధిపరచుకొనే నిమిత్తము ప్రయత్నించాలి. రెండూ లభించుటకు హృదయమును నిర్మలముగా ప్రేమమయముగా తీర్చిదిద్దుకోవాలి.

(భ.ప్ర.పు.151)

కొందరు ఆస్తికులు దాన ధర్మాదులు కూడనూ దేహతపస్సుగా భావింతురు; మంచిదే. అయితే దేశ కాల పాత్ర ననుసరించి కూడనూ దానము చేయవలెను. ఎట్లన యే ప్రదేశమున విద్యావిధానము లేక కష్టపడు చుందురో ఆచట పాఠశాలలును, ఆరోగ్యహీనులై రోగ పీడితులై బాధపడు ప్రదేశములందు ఆరోగ్య సౌకర్యములు కలిగించుట, అతివృష్టి అనావృష్టులనే అల్లాడు వారలకు ఆకలి దప్పులను తీర్చి ఆదుకొనవలెను. బ్రహ్మవిద్య, ధర్మప్రబోధనలు, పరోపకార ప్రవర్తనలు, పాత్రతచూచి నేర్పవలెను. అట్లు విచారణచేసి దేనియందు **యే వ్యక్తి శక్తిహీనమయి వ్యధనొందుచుండునో అట్టివానికి అవసర మయిన దానిని ఇచ్చుట సాత్విక దానమని అందురు.**

దానము చేయు వారలలో యెక్కువమంది ప్రతిఫలాపేక్షచే చేయుచుందురు. కొంతమంది మాత్రమే భగవత్ కటాక్షమునే ప్రతిఫలాపేక్షగా భావించు చుందురు. **భగవదనుగ్రహ ఫలమును కోరి చేయు దానము సాత్వికమే అగును. అట్లుకాక ప్రత్యుపకారము నాశించియో, పేరు ప్రతిష్టను పొందగోరియో, లేక పదిమంది దానపరుడని తలంచుటకై మెప్పునకు అందరి ముందు యిచ్చి తదుపరి పరితపించుటయో, లేక మనఃక్లేశమువలననో ఇచ్చిన దానము రాజసిక మందురు.** సత్కార పూర్వకముకాక, తిరస్కారభావముతో దానమునకు తగని వ్యక్తికికానీ, స్థానమునకుకానీ అనగా తిండి తీర్థములకు కొదవలేని స్థానమున అన్నదానము, తగని స్థానమే అగును. రోగులు వెళ్ళుటకు సాధ్యముకాని ప్రదేశములలో వైద్యాలయములు నిర్మించుట, వృధానేయగును. కడుపునిండుగా తిని కదలలేనివానికి అన్నము **ఉదరభార మనిపించును.** వానికి అవసరములేని దానిని వాడు పొందియూ దుర్వినియోగ పరచును. కాన ఇట్టి సార్థకము కాని **దానములు తామసికమని అందురు.**

దానవుడు

దానమున జాగ్రత్తగా మెలగవలసి యుండును. వూరకే అడిగినవారందరికి తలంచిన స్థానము లన్నింటియందూ దాన ధర్మముచేయరాదు. అట్లు చేయతలచిన పై చెప్పిన రాజసిక, తామసిక, సాత్వికములలో దేనికి సంబంధించి యున్నదో యోచించి చేయవలెను సుమా; పేరు ప్రతిష్టలకు గానీ, ఆడంబరములకు గానీ, ప్రయోజనము కానిది కానీ అయివుండకూడదు. అన్ని ప్రవృత్తులయందునూ సాత్వికము చాలా పవిత్రము. అనగా దృష్టియందుకానీ, శ్రవణమందుకానీ, వాక్కులందు కానీ సాత్వికమయి వుండవలెనని దీని భావము

(గీ.పు.233/234)

(చూ॥ ఏది, గుమ్మడికాయ, ధనము, నరజన్మ)

దానవుడు

(చూ॥ మానవుడుకాడు)

దారి

కాగడాలుగాని, కరదీపములుగాని
దారిచూపలేవు ధరణియందు
ధర్మదీపమొకటె దారి చూపును సుమీ
సత్యమైనమాట సాయిమాట

(స.సా.జూలై 2001 పు. 206)

దారులు మూడు

సహృదయత, సానుభూతి, సహనం - తనలోనూ యితరులలోనూ కూడా దైవత్వాన్ని చూసేందుకు దారులు ఈమూడే. దయార్ద్ర హృదయాన్ని జనం ఈనాడు బలహీనత కిందా, పిరికితనం కిందా, అమాయకత్వంకిందా పరిగణిస్తున్నారు. జాలి గుండె పనికి రాదట! గుండె రాయి చేసి కోవాలట! కఠినమైన ఆదోవన నడిస్తే తటస్థించేవి ఏమిటి? అశాంతి, కల్లోలం, యుద్ధం, పతనం, నాశనం! శాశ్వత సుఖశాంతులు లభించేది ప్రేమ వల్లనే. విచారాన్ని పంచుకొని తగ్గించవచ్చు - సంతోషాన్ని పంచుకొని పెంచవచ్చు. **మనిషి పుట్టింది తోటివారితో కష్టసుఖాలు పంచుకోటానికీ ఆర్తులను ఆదుకోడానికి దీనులను సేవించటానికీ, జీవిత పరమార్థం ఇవ్వడమే గాని గుంజుకోవడం కాదు.**

(శ్రీ.సా.గీ.పు.137)

దాస్యం

(చూ॥ ఆనందము)

దాసోహం

విద్యారణ్యులవారు దాసోహం దాసోహం అనే చింతనలో సాధన ప్రారంభించాడు. దాసోహం అనే మంత్రములో ప్రారంభించిన ఈ సాధన క్రమక్రమేణ కొంతకాలం తరువాత **సోహంగా మారిపోయింది.** ఒకనాడు విద్యారణ్యులవారు తన శిష్యులకు బోధిస్తున్నాడు. శిష్యులు గురువును ప్రశ్నించారు. "స్వామీ! యింతకాలము దాసోహం దాసోహం అనే సాధనచేత తాము యింత స్థాయికి వచ్చారు. కానీ యీనాడు శివోహం శివోహం శివోహం లేదా సోహం సోహం సోహం అంటున్నారు. ఈ మార్పునకు కారణమేమిటి?" అన్నారు. "బిడ్డలారా! యింతకాలము నేను దాసోహం దాసోహం దాసోహం అని భగవంతునికి దాసుడనై పూజిస్తూ వచ్చాను. ఒకనాటి రాత్రి చిత్తచోరుడు, బృందావనవిహారి, గోపీమానససంచారి, వచ్చి ఆ 'దా'ను అపహరించాడు. దాసోహం దాసోహం అనే పదములో కృష్ణుడు దాకారాన్ని అపహరించటం చేత సోహంగా మారిపోయింది" అన్నాడు. **ప్రారంభములో నీవు దానుడుగా ప్రయాణము సలిపావు. నాయనా యిప్పుడు నన్ను సమీపించావు. నాతో ఐక్యుడై పోతున్నావు. కనుక నీవు సోహం సోహం అనే మార్గమును అనుసరించు"** అన్నాడు.

రామకృష్ణ పరమహంస దగ్గర ఒక గృహస్థుడైన భక్తుడు, ఒక సన్యాసియైన భక్తుడు వుండేవారు. నాగమహాశయుడు గృహస్థభక్తుడు. వివేకానంద సన్యాసిభక్తుడు.

నాగమహాశయుడు నిరంతరము దాసోహం దాసోహం నేను దాసానుదాసుడను అని సాధన ప్రారంభించాడు. దాసోహం అనే పదముతో సాధనను ప్రారంభించినప్పుడు మానవునియందు అహంకారవృత్తులు శూన్యమవుతాయి. అహంకారముండినంతవరకు ఆత్మజ్ఞానము ప్రాప్తించదు. **ఈ అహంకారమనే గాండీవమును పారవేసి "కరిష్యే వచనం తవ" అని శరణాగతుడు కావటంచేతనే అర్జునునికి కృష్ణుడు అనేక విధముల ధైర్యము ప్రోత్సాహము అందిస్తూవచ్చాడు.** అహంకారముండినంతవరకు ఆత్మస్థాయిలో పరమాత్మ స్వరూపము లభ్యముకాదు. పరమాత్మ అనుగ్రహము చిక్కినా అహంకారముండుటకు వీలులేదు. ఒకే సమయమునందు ఒకే ప్రదేశములో వెలుతురు చీకటి వుండుటకు వీలులేదు కదా! కనుకనే నాగమహాశయుడు మొదలు దాసోహం దాసోహం అని తనను అల్పస్థాయికి తీసుకొని వెళ్ళాడు. కానీ వివేకానందుడు శివోహం శివోహం శివోహం లేక సోహం సోహం సోహం అనే సాధనలో విశాలహృదయుడుగా తయారయ్యాడు. ఈ యిరువురిని గురించి నిరంజనానందస్వామి చెప్పాడు. నాగమహాశయుడు, వివేకానందుడు యిరువురు కూడను మాయ అనే బంధనచేత కట్టుబడినారు. ఈ కట్టులో నుంచి నాగమహాశయుడు దాసోహం దాసోహం అని స్వల్ప రూపాన్ని ధరించి తప్పించుకొని వెళ్ళాడు. కానీ వివేకానంద శివోహం శివోహం శివోహం అని తన అఖండస్వరూపాన్ని విశాలమైనతత్వాన్ని అభివృద్ధి గావించుకొని ఆ మాయాబంధనలు ఛేదించుకొని వెళ్ళాడు. నేనే దేవుడను అనే ఉన్నతభావమును, ఉత్తమభావమును అభివృద్ధి పరచుకొన్నవానికి యేవిధమైన బంధనలు బాధించవు. ఇది మాటలతో చెప్పినంత మాత్రమున ప్రయోజనము లేదు. అనుభూతికి రావాలి. **దేహభ్రాంతిని వీడాలి. ఇంద్రియనిగ్రహం చెయ్యాలి. 'సతతం యోగినః' అనే ఏకాత్మభావం పెంచుకోవాలి.** అట్టివారే యీవిధమైన జ్ఞానమును పొందగలరు. అయితే భక్తుడైనవాడు అహంకారమును దూరము చేసుకొని ఆత్మానందములో లీనమవుతాడు. దీనికి ద్వైత విశిష్టాద్వైత అద్వైతమనే మూడు మార్గములను బోధించాడు.

(శ్రీ.గీ.పు.59/61)

(చూ॥ హనుమంతుడు)

దిక్సూచి

ప్రేమ దిక్సూచివంటిది. దిక్సూచిని ఎక్కడ పెట్టినా దీని ముల్లు ఉత్తర దిశకే ఉంటుంది. అదేవిధముగా ప్రేమ, ఏ ప్రదేశమునందైనా, ఏ పరిస్థితులందైనా దైవముపైపునే మరలి ఉంటుంది. ఈ ప్రేమకు దేశకాల పరిస్థితుల ప్రభావము ఏమాత్రము వర్తించదు. ఇట్టి పవిత్రమైన ప్రేమతత్వమే దైవత్వమునకు ప్రధాన చిహ్నము.

(ద.స.98 పు.85)

దినము

సద్భక్తులందరూ భగవంతుడా యంచు
చెపులకింపుగస్మరణ చేయు దినము
బీదల వెతలన్ని ప్రీతితో నెరవేర్చి ।
అన్నదమ్ముల మాడ్కినున్న దినము
దైవచింతన చేయుదాస బృందములను
ప్రీతి మృష్టాన్నంబు పెట్టు దినము
మహనీయుడెవడైన మనకడకే తెంచి
చెవి భగవత్కథ చెప్పుదినము

ఈ దినములే నిజమైన దినములు. మిగిలినవి తద్దినములు. స్వార్థము కోసము ప్రయత్నము చేసే దినములు.

(సా॥ పు. 269/270)

దిల్‌మేరామ్‌హాత్‌మేకామ్

ఒకానొక సమయంలో హనుమంతుడు లంకలో విభీషణుని కలుసుకొన్నాడు. ఇరువురు రామ భక్తులే. కనుక, వారు రామతత్వాన్ని గూర్చి చక్కగా ముచ్చటించుకొన్నారు. రాముని యొక్క తత్వాన్ని హనుమంతుడుచక్కగా

దివ్యతత్త్వం

బోధిస్తుండగా విభీషణుడు కంటిధారలు కార్చుతూ.... "హనుమాన్...! నీవు ఎంతటి అదృష్టవంతుడివోయి! శ్రీరాముని చెంతనే ఉండి రామదర్శనము చేసుకొంటూ దివ్యానందాన్ని అనుభవిస్తున్నావు. కాని, నాకింకా రామదర్శనము ప్రాప్తించలేదు. నా దురదృష్టమేమిటో!" అని అన్నాడు. ఆ మాటలు విని హనుమంతుడు ఫక్కున నవ్వాడు. "విభీషణా! నీవు రామనామాన్ని స్మరిస్తున్నావు కాని, రామ సేవలో పాల్గొంటున్నావా? నామమును స్మరించినంత మాత్రాన చాలదు. స్వామికార్యాన్ని కూడా ఆచరించాలి. సీతాదేవి అశోకవనములో చేరి ఇప్పటికి పది నెలలైనది. ఆమెను రామసన్నిధికి చేర్చడానికి నీవేమైనా పూనుకొన్నావా? రామకార్యములో ప్రవేశించకపోతే నీకు రామదర్శనము ఏరితిగా లభించగలదు?" అని ప్రశ్నించాడు.

(స.సా.ఏ. 93 పు. 105)

దివ్యతత్త్వం

(చూ॥ దివ్యప్రకటనలు, ప్రతిష్ఠించు)

దివ్యత్వము

Good లో నుంచి ఒక జీరోని తీసివేయండి. ఆ జీరోనే ప్రకృతి. అది పోతే 'గుడ్' అనేది 'గాడ్' అవుతుంది. Wఅనే అక్షరాన్ని 'డబల్ యు' (Double You) అని ఉచ్చరిస్తాము. అదే జీవాత్మ, పరమాత్మ, ఆ రెండింటి ఏకత్వానికి అడ్డు వచ్చేది మాయ. My (నాది) అనే పదాన్ని నాలుగైదు సార్లు ఉచ్చరించండి, అది మాయ అవుతుంది. "నాది" అన్నదే అన్ని దుఃఖాలకు మూలం. ప్రక్కవాని కారుకు ఏమైనా ఫరవాలేదుగాని, నీ కారుకు కొద్దిగా దెబ్బ తగిలితే విలవిలలాడిపోతావు. ఎందుకు? "ఆ కారు నాది" అనుకోవడంచేత, ప్రక్కవాడు తన ఇంటిని అమ్మితే నీకేమీ బాధ అనిపించదు. కానీ, నీ ఇంటిని నీవు అమ్మవలసివస్తే ఎంతో బాధ పడతావు. ఎందువల్ల? "ఆ ఇల్లు నాది" అనుకోవడంచేత. ఈ **"నాది" అనేదే మాయ.** అది పోయినప్పుడే ఏకత్వంలోని దివ్యత్వం అనుభవంలోకి వస్తుంది.

(స.సా.జూలై 99 పు.193)

మీకు శక్తి ఆహారం నుండి వస్తుంది. అది తగ్గిస్తే శక్తి తగ్గుతుంది. కానీ, స్వామికి శక్తి ఆహారం నుండి లభించేది కాదు. నేను ఉదయం ఏదీ తీసుకోను. ఒక గ్లాసు నీళ్లు. అంతే! ఉదయం 10 గంటలకు చాల కొద్ది ఆహారం తీసుకుంటాను. పెరుగు, నెయ్యి, స్వీట్లు, ఐస్‌క్రీమ్స్, నూనెలు ఏవీ తీసుకోను, పేదవాని ఆహారమైన రాగిసంకటి కొద్దిగా తీసుకుంటాను. సంవత్సరం నుండి మీరు చూస్తూనే ఉన్నారు కదా, సాయంకాలం ఏమీ తీసుకోవడం లేదు. ఎంతో పని. అన్నీ నేనే చూసుకోవాలి. ఇన్ని విద్యాసంస్థలు, హాస్పిటల్స్, వాటర్ ప్రాజెక్ట్, లక్షలాది భక్తులు - **అన్నీ నేనే స్వయంగా చూసుకుంటాను. నాకు భక్తునకు మధ్య ఎవరూ లేరు. అంతా డైరెక్ట్** - లవ్ టు లవ్, హార్ట్ టు హార్ట్ - అంతే! నేను చేసే పనికి కనీసం 1500 కేలరీలు కూడా లేవు. మరి ఈ శక్తి ఎక్కడిది? ఇది ఆహారం నుండి వచ్చేది కాదు. **I do not get energy. I am energy (నాకు శక్తి ఎక్కడి నుండో రాదు, నేనే శక్తిని)** నాకు దేహరీత్యా 70 సంవత్సరాలు, చక్కగా చూడగలను. కానీ మీకు 40 సంవత్సరాలు దాటగానే చత్వారం, కళ్ళద్దాలు కావాలి. చాల దూరంగా ఉన్నవాటిని కూడా నేను స్పష్టంగా చూడగలను. చీమ చిటుక్కుమన్నా వినపడుతుంది నాకు. నా పళ్ళు చాల దృఢంగా ఉన్నాయి. ఒక్క వెంట్రుక కూడా నెరిసింది లేదు. భక్తులకు అసౌకర్యంగాని, నాకు చాల నడవాలనిపిస్తుంది. నా పనులన్నీ నేను చేసుకుంటాను. భోజన సమయంలో మీరు చేసే ప్రార్థన ఏమిటి? "అహం వైశ్వానరో భూత్వా..." అంటారు కదా! మీరు భుజించే ఆహారాన్ని గ్రహించి, జీర్ణం చేసి సర్వాంగాలకు పంపే వైశ్వానరుడు దేవుడే కదా! కనుక, ఇంతమంది మీరు తింటూండగా నేను ప్రత్యేకించి తీసుకోనక్కరలేదు. దేహరీత్యా ఆలోచిస్తే, **మీ ఇంద్రియాలు బలహీన మవటానికి కారణ మేమిటి? ఇంద్రియ దుర్వినియోగం,**

స్వార్థ స్వప్రయోజన సంకుచితత్వం. నాకు ఆపాద మస్తకం నఖ శిఖ పర్యంతం స్వార్థమనేది ఏనాడూ లేనే లేదు. లోక కల్యాణం, మీ ఆధ్యాత్మిక ప్రగతి - ఇవే నా ఆలోచనలో ఉన్నాయి. నాదంటూ ఏమీ లేదు. మీరే నావారు.

(స.సా.జూన్ 99 పు.165)

విద్యార్థులారా! మీరు పవిత్రమైన భావాలను హృదయంలో నింపుకొని ఈ ప్రపంచంలో వీధి వీధిలోను, వాడ వాడలోను ఆధ్యాత్మిక తత్త్వమును వ్యాప్తి గావించాలి. ఈనాడు ప్రపంచంలో నిండిన అశాంతిని, భయాన్ని దూరం చేయాలంటే దైవభక్తిని చాటుతూ పోవాలి. ఈనాడు ప్రతి ఒక్కరు డబ్బుకోసం, పేరు ప్రతిష్టలకోసం ప్రాకులాడుతున్నారు. ఇది మంచిది కాదు. **Money comes and goes; Morality comes and grows.** కనుక మీరు ఉద్యోగాలతోపాటు సమాజసేవ కూడా చేయండి. **ఎవరికి సేవ చేసినా దైవానికే చేస్తున్నామని భావించండి. "పరులు పరులు కాదు పరమాత్ముడగునయా!" అందరూ పరమాత్మ స్వరూపాలే అని విశ్వసించాలి.** ఎందుకంటే దైవత్వం లేని జీవిత్వం లేదు. అసలు దైవమే లేడని వాదించే నాస్తికులు కూడా ఒక్కొక్కసారి తమకు తెలియకుండానే, **"మై గాడ్!" అంటారు. ఒకానొక సమయంలో నెహ్రూ మధుర మీనాక్షి ఆలయానికి వెళ్ళాడు. అక్కడ మీనాక్షి విగ్రహం అతి పెద్ద విలువైన పచ్చతో అలంకరింపబడి ఉండినది.** అతని వెంట వెళ్ళిన భక్తులంతా ఆ విగ్రహంలో దివ్యత్వాన్ని దర్శించారు. కానీ దేవుడంటే నమ్మకంలేని నెహ్రూమాత్రం లౌకిక దృష్టితో, **"ఆ పచ్చ విలువ ఎంత?" అని అడిగాడు. "దీని విలువ చాల లక్షలుంటుంది"** అని ఎవరో జవాబివ్వగా నెహ్రూ వెంటనే "ఓహ్ మై గాడ్!" అన్నాడు. అసలు 'గాడ్' అంటేనే నమ్మకం లేని నెహ్రూ నోటి నుండి 'మైగాడ్' అనే పదం ఎలా వచ్చింది? అనగా అతనియందు కూడా 'గాడ్' ఉన్నాడు. అట్లే **ప్రతి మానవునియందు దివ్యత్వం ఉంటున్నది.**

(స.సా.ఫి.98పు.42)

దివ్యత్వము నుండి వచ్చినదే ఈ పవిత్రమైన మానవ జీవితము. ఈ లక్ష్యాన్ని కొంతమంది ఋషులు గుర్తించి దీక్షను బట్టి సాధిస్తూ వచ్చారు. "ఈ దివ్యమైన తేజస్సు మీరు చూడండి." అని లోకానికి చాటినారు. **"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అతడు ఎట్లా ఉన్నాడంటే, "వేదాహ మేతం పురుషం మహాంతం అదిత్యవర్ణం తమసః పరస్తాత్"** అని అన్నారు. ఆ మహాపురుషుని ఏ విధంగానూ వర్ణించడానికి వీలుకాదని, సూర్యతేజస్సువలె ప్రకాశిస్తున్నాడని పేర్కొన్నారు.

అతడు ఎక్కడ ఉన్నాడంటే, **తమస్సుకు ఆవల ఉంటున్నాడని, తమస్సు వదిలితేగాని ఈ తేజస్సు మనకు ప్రాప్తించదని, ఋషులు మనకు భోదించారు. తమస్సును దూరం చేయాలి. ఈ దేహము కేవలము తిండి, తీర్థాలకై వచ్చినది కాదు. ఆహార, నిద్ర, భయములతో కూడి ఉండేదే పశుత్వము.** దీనికి అతీతమైన గుణము మరియొకటి యున్నది. అదే దివ్యమైన శక్తి. జ్ఞానము; తమస్సు పోతేనేగాని పవిత్రమైన జ్ఞానము కలుగదు, తమస్సు పోయిన తర్వాత రాజసము ఉంటుంది. ఈ రాజసమనేది అనేక కోరికలతో నిండియుంటుంది. ఈ రాజసమును దూరం చేయాలి. అప్పుడు సాత్వికము ఆవిర్భవిస్తుంది. ఈ సాత్వికము ఆవిర్భవించినప్పుడే తేజోమయమైన దివ్యత్వము మనకు కనిపిస్తుంది.

వేదము మహా ఆగాధమైనది, రహస్యమైనది. శ్రద్ధాభక్తులు కలిగిన వారికి ఇది చాలా సులభమార్గం. కన్నులు తెరచిన వానికి లక్షలమైళ్ళలో అంతరిక్షంలో ఉన్న నక్షత్రాలు కనిపిస్తాయి. కనుక, మనశ్రద్ధ భక్తి అనే నేత్రాలను విప్పాలి. విప్పవలసినవి **చర్మచక్షువులుకావు; జ్ఞాన చక్షువులు. వాటిని మనము తెరచినప్పుడు దివ్యత్వమైన ప్రకాశం సర్వత్రా మనకు గోచరిస్తుంది.**

(శ్రీ.భ.ఉ.పు.30/31)

మనము ఆశించేది ఫలపుష్పాలు. అవి వృక్షముపై ఉండునట్టివి. కనిపించే ఫలపుష్పములు ఆశించే ఫలపుష్పములు కనిపించని వేర్ల పైన ఆధారపడి ఉంటున్నవి. మనము వేర్లను పోషించినప్పుడే ఫలపుష్పములు మనకు ప్రాప్తిస్తాయి.

దివ్యత్వాన్ని గుర్తించడం

కనుక మనము నీరు ఎరువులు పోసి పోషించవలసినది. వేర్లను మాత్రమే కాని ఫలపుష్పములను కాదు. ఈ జగత్తనే వృక్షమునకు దివ్యత్వమనే ఆత్మతత్వమే. వేర్లు, దీనినే భగవద్గీతయందు **"బీజం మాం సర్వ భూతానాం"** అన్నాడు. ఎట్లు ఈ బీజము తానౌతాడు? తానే బీజమైన వాడు సర్వులయందు బీజరూపములో ఏ విధముగా ఉంటున్నాడు అనే విషయాన్ని విచారించాలి. ఒక విత్తనము నాటినాము. అది క్రమక్రమేణ మొలకై వృక్షమైంది. అనేక శాఖోపశాఖలు బయల్దేరాయి. ప్రతి శాఖయందు పుష్పములు వికసించాయి. పుష్పములన్నీ కాయలుగా రూపొందాయి. కాయలన్నీ ఫలములుగా మారినాయి. ఒక్కొక్క బీజము పోయి చేరి పోయింది. మనము నాటినది ఒక్క బీజమే, కొన్ని వందల ఫలముల లోపల వందల బీజములు బయల్దేరాయి. అనగా ఏ విత్తనము నాటినామో ఆవిత్తనము యొక్క జాతియే సర్వఫలములలో విత్తనముగా రూపొందిపోయింది. ఇది జగత్తు. **ఈ జగత్తు కు బ్రహ్మ ఆత్మనే ఒక బీజము. ఈ విశ్వము ఒక పెద్ద వృక్షము. విశ్వమనే వృక్షమునకే ఒక్కొక్క దేశము ఒక్కొక్క కొమ్మ. ఒక్కొక్క కొమ్మలోపల అనేక విధములైన జీవరాసులు ఫలములుగా బయల్దేరాయి.** ఈ ఒక్కొక్క జీవరాశియందు ఆత్మ అనే బీజము తిరిగి విత్తనంగా చేరిపోయింది. కనుక ఒక్కొక్క వ్యక్తియందు ఆత్మస్వరూపుడై తానుంటున్నాడు. "ఏకోవశీ సర్వభూతాంతరాత్మ" అందరి యందు ఉండనది నాటిన బీజమె.

(బృత్ర.పు.౧౬౦)

ఒకేజాతి - అదే మానవ జాతి
ఒకే కులము - అదే ఆధ్యాత్మిక కులము
ఒకే భాష - అదే హృదయ భాష
ఒకే దైవము - అదే నిజమైన **దివ్యత్వము.**

(భ.స.మ.పు.8)

(చూ॥ అమోఘుడు, ఆధారము, ఆధ్యాత్మికమార్గము, ఒక్కటే, కర్తవ్యము, గోల్డ్‌స్టోన్, తెలివితేటలు, దైవగుణము, దైవము, ధీరుడు, భగవదన్వేషణ, మనుష్యత్వము, స్వాతంత్ర్యము, హిందువులు)

దివ్యత్వాన్ని గుర్తించడం

ఎవరి హృదయం పరిశుద్ధంగా ఉంటుందో అట్టివారికే దివ్యత్వాన్ని గుర్తించడానికి సాధ్యమవుతుంది. 1926 నవంబరు 24వ తేదీన అరవిందుడు మౌనవ్రతాన్ని వీడి గొప్ప సభను ఏర్పాటు చేయించాడు. **"నిన్నటి దినమున దైవం ఈ ప్రపంచంలో అవతరించాడు"** అని చెప్పాడు. ఈ విషయాన్ని చెప్పడానికే తాను మౌనవ్రతాన్ని వీడానని అన్నాడు. ఈవిధంగా ప్రకటించిన తరువాత తాను తిరిగి మౌనం వహించాడు.

(స.సా.న 99 పు.302)

దివ్య ప్రకటనలు (సాయి)

సారములేని యట్టి, భగసాగరమందున ముగ్గితేలుచున్
దారియు, తెన్నునుగనక, తత్తర మందెడు మానవుండా
యోరిమి యించుకంత, మది మానుచు, భక్తిని కొల్తువేని, శ్రీ
కారుడు, సత్యసాయి, నిను కావగ, వచ్చిన నావ కాంచవే॥

(సా.పు.319)

స్వామి మాట సకల సౌభాగ్యములమూట,
స్వామి దృష్టి పారిజాత వృష్టి,
స్వామిచేయి తల్లిప్రేమలోని హాయి,
సాయికాదు ఒతల్లి హాయి,
వేయితల్లుల ప్రేమలోని హాయి,
అట్టి ప్రేమసాయి సత్యసాయి.

(సా.పు.532)

నేను మీ ప్రక్కనే యున్నాను.మీలోయున్నాను. మీ హృదయంలో యున్నాను. నేను మీకు సహాయం చేస్తాను. మీకు దారిచూపుతాను. భగవంతుని వైపుకు దారి మళ్ళించండి. అదే మీరు చేయాలి. మీరు నా దగ్గరకు రావాలి. మీరు నాతో ఏకం కావాలి. ప్రతి అణువులోని భగవంతుని చూడాలి. భగవత్ప్రేమను అందిరిలోను దర్శించాలి. ఆ ప్రేమను అనుభవించాలి. **నేనే ప్రేమ స్వరూపుడను.**

(సా.పు.497)

"వ్యక్తులు కష్టాలు తొలగించి వ్యాధులు నివారించి ఓదార్చటమే నా లక్ష్యం అనుకోవద్దు. అంతకంటే ముఖ్యమైన ఉద్దేశ్యం వేరొకటి ఉన్నది. మామిడి పళ్ళను అందించడమే మామిడి చెట్టు యొక్క ముఖ్యప్రయోజనం. దాని ఆకులు, కొమ్మలు, మ్రానుు వేరు వేరు ప్రయోజనాలను కలిగి యుండవచ్చు. కాని, ఫలమే దాని ప్రధాన ప్రయోజనం. వ్యక్తుల దుఃఖములను ఉపశమింపచేయడం నా ఉద్యమంలో అనుషంగికమైన అంశం మాత్రమే...! **భారతవర్ష హృదయంలో వేదశాస్త్రాలను పునఃప్రతిష్ట చేసి ప్రజలలో వాటి పట్ల అభినవేశం కలిగించడమే - నా ప్రధానలక్ష్యం!** ఈ ఉద్యమం విజయవంతం కాగలదు. దీనికి ఏ ఆటంకాలూ అడ్డు రాలేవు, ఎటువంటి అవరోధాలూ ఉండవు. **ఇది దైవ నిర్ణయం, ఇది దైవ సంకల్పం."**

(ప్రే.బ.పు.45)

ఆనందము భగవంతుని దగ్గర ఉన్నప్పుడు ఎందుకు నీవు బయట వెతుకుతున్నావు? ఆనందమయుడైన భగవంతుని దూరం చేసుకోటం ఎంత దురదృష్టం!
చిక్కిన సాయిని వక్కచేయక చక్క చేసుకోండి
పోయిన చిక్కదు పర్తీశుని పాదసేవ యండి
భక్తిని ఇచ్చి శక్తిని పెంచి ముక్తి జేర్చునండి
ఇతరుల మాటలు ఇంపుగ నమ్మి కొంపతీయకండి.

(ద.స.98 పు.97)

అఖిల మానవుకు ఆనందమొనగూర్చి
రక్షించుటొక్కటే **దీక్ష** నాకు
సన్మార్గమును వీడి చరియించువారల
చేపట్టి కాపాడుటే **వ్రతము** నాకు
బీదసాదలకైనను పెను బాధ తొలగించి
లేమిని బాపుటే **ప్రేమ** నాకు
మంచి చెడ్డలు కూడ మనసులో సమముగా
భావించుచుండుటే భక్తినాకు"
నియమ నిష్టలతోడ ననుు గొల్చు వారిని
కాపాడుచుండుటే **ఘనత** నాకు
ఆశ్రితావను డీతడె **ఆప్తబంధు**
వనగ పేరొంది నాయండ నలరు వారి
నెన్నడును మరువని వాడ నిదియెనిజము
నెట్టి కుచితము మదిని నేర్పకుండు
ఇట్టి నా పేరు చెడుట ఎట్లగును భువిని?

(యు.ఆ.సా.పు.31, బా.జీ.జ.స.పు.82, స.సా.పు.11)

"ప్రపంచములోని ప్రతి ఒక్కరూ తమకిష్టమైన ఏదో ఒక మతాన్ని అనుసరించవచ్చు, కాని, వివిధ మతములను, మతవిశ్వాసములను అనుసరించే ప్రజలందరికీ సంపదను, సంక్షేమమును ప్రసాదించి బ్రోచే రూప, నామములు లేని సృష్టికర్తఒక్కడే, **"మతము" అనే పదమునకు "సాధన" అని ఒక అర్థమున్నది.** ఎవరు ఏమతమును అనుసరించినా దివ్యత్వసాధన అనేది ఒక్కటే కాబట్టి మతములన్నీ ఒక్కటేనని, నిజానికి ఉన్నది ఒక్కటే మతము అని తెలుస్తుంది. **నాపేరు సత్యసాయి. అనగా, "సత్యముపై పవ్వళించేవాడు" అని అర్థము. ఏ మతమును తొలగించడానికి గాని, లేక నిర్మూలించడానికి గాని నేను రాలేదు. క్రైస్తవ మతాన్ని అనుసరించేవ్యక్తి మరింత ఉత్తమమైన క్రైస్తవునిగా, హిందూ మతమును అనుసరించే వ్యక్తి మరింత ఉత్తమమైన హిందువుగా, ఇస్లాం మతమును అనుసరించే వ్యక్తి మరింత ఉత్తమమైన ముస్లిముగా వారి వారికి ఆయా మతములలో మరింత విశ్వాసమును నెలకొల్పడానికే నేను అవతరించాను.**

(దై.ది.పు.VIII)

"నాయీ జీవితములోని మొదటి 16 సంవత్సరాలు బాలలీలలను, తరువాత 16 సంవత్సరాలు మహిమలను చూసి ఈ తరం ఆనందమును కలిగించడానికి వినియోగించడం జరిగింది. 32వ సంవత్సరము తరువాత రానున్న కాలములో దారి తప్పి సంచరిస్తున్న మానవజాతికి సన్మార్గమును ఉపదేశించడంలోను, ఈ ప్రపంచమును సత్య ధర్మ, శాంతి, ప్రేమల మార్గములో నడిపించడానికి కృషి చేయడంలోను నాసమయమును ఎక్కువగా వినియోగించడం మీరు చూస్తారు. అనగా దాని అర్థము ఆ తరువాత నేను లీలలను, మహిమలను చూపించడం పూర్తిగా మానివేస్తానని కాదు. ధర్మమును పునరుద్ధరించడం, వక్రమార్గములో నడుస్తున్న మానవుని

మనస్సును సరిదిద్దడం, మానవజాతిని మళ్ళీ సనాతన ధర్మమువైపు నడిపించడం అనేవి ఇకనుండీ నేను నిర్వర్తించవలసిన కార్యములని నా అభిప్రాయము''.

(దై.ది.పు.348/349)

నేను నిక్కముగ సాయియని తెలియుడు. మీతో నాకు గల ప్రాపంచిక సంబంధము ఈ నాటితో తెగిపోయింది. ఇక ప్రపంచములో ఏ శక్తికూడా నన్ను బంధించలేదు.''

(దై.ది.పు.201)

"నాలో శివశక్తి స్వరూపములు రెండింటిని మీరు చూడవచ్చు. నాశక్తిని, నా అనుగ్రహమును ఏ ఒక్క స్థలమునకో పరిమితము చేయవలసిన అవసరము లేదు. **నా శక్తికి అవధులు లేవు. అనంతమైన శక్తి, అనంతమైన అనుగ్రహము నా హస్తములలో ఉన్నవి."**

(దై.ది.పు. 285)

"మౌళిగుల్కెడు చంద్రమఖండ కళల తోడ
బెడగారు గుంపెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి బిగితోడ
డంబైన ఫాల నేత్రంబుతోడ
అల్లనేరేడు వంటి నల్లని మెడతోడ
కరమున నాగ కంకణము తోడ
నడుమును చుట్టిన నాగచర్మముతోడ
మైనిండ నలదు భస్మంబుతోడ
ఆరు శాస్త్రములందున నందగించి
నల్ల కలువల ఆశ్రయించి కోలలాడు
మెరుగు చామన ఛాయల మేనితోడ
ప్రశాంతి వాసుడు నేడు సాక్షాత్కరించె.

(బా.జీ.జ.స.పు.80)

"ప్రస్తుతావతారంలో నిరాకారుడై దివ్యమూర్తి యొక్క సమగ్ర సంపూర్ణవ్యక్తి సమన్వితుడనైన మానవజాతి సంరక్షణ కోసం అవతరించాను.

(స.ప్ర.పు.1)

"సర్వ ప్రాణికోటికిని మూలాధారమైన ఆత్మను గూర్చిన జ్ఞానమే నేడు విస్మృతమైనది. అదే ఈనాటి అశాంతికిని విప్లవమునకును, అవినీతికిని ముఖ్య కారణము. నిద్రాముద్రితమై యున్న ప్రజానీకమును మేలుకొలిపి, ఈ సందేశము నందించుటకే నా ఈ ఆగమనము.''

(సా.అ.విషయసూచిక తరువాత పుట)

"ఎక్కడైతే మానసిక శాంతికోసం ఆకాంక్ష
ఉంటుందో అచ్చట శాంతి ప్రసాదించడానికి
వేగిరపడతాను. ఎక్కడైతే నిరాశానిస్పృహలు
ఉంటాయో అక్కడ క్రుంగిపోతున్న హృదయాన్ని
లేవనెత్తడానికి త్వరపడతాను. ఎక్కడైతే ఆత్మవిశ్వాస
ముండదో అక్కడ విశ్వాసము తిరిగి కల్పించడానికి
బహుతొందరపడతాను. నేనెందుకైతే వచ్చానో ఆపవిత్ర
ధ్యేయాన్ని నెరవేర్చుకోవడానికి నిరంతరం కదులు
తుంటాను.

(సా.అ. పు. 33)

"మీరంతా కూడా నాచే సృష్టించబడిన అద్భుతమైన సృష్టికి ప్రతీకలే" (అని స్వామి అన్న మాటలు నాకు ఒక ప్రఖ్యాత క్రైస్తవగీతం "ఓల్డ్ టెస్టామెంట్" లో చెప్పబడినది గుర్తుకు తెచ్చాయి.)

(శ్రీ.స.స.పు.102)

ఎంతటి దుర్మార్గులైనా, మూర్ఖులైనా, కపటులైనా, ఎటువంటి వారైనా సరే నానుండి దూరంగా వేరుగా ఉండలేరు.

(శ్రీ.స.స.సు.264)

"మానవజాతి మొత్తం ఏకమై **ఏళ్ళతరబడి కఠినమైన పరిశోధన చేస్తూ ప్రయత్నించినా నా నిజతత్వాన్ని యిప్పుడు కాని, కొన్ని వేల సంవత్సరాల తరువాత కాని తెలుసు కోలేదు. నేను కూడా మీతో కలిసి మీలాగే ఉంటూ, మీలాగే తింటూ, మీతో మామూలుగా మాట్లాడుతూ ఉండటం వలన మీరు నన్ను సాధారణమైన మానవుని గానే భావిస్తున్నారు. 'ఇది' అన్ని భగవంతుని రూపాలూ, అన్ని దివ్యతత్వాలూ కలసి ఉన్న మానవరూపం. అనగా ఏ ఏ నామ రూపాలతో మానవుడు భగవంతుని వర్ణించి ఉన్నాడో అవన్నీ కలిసి దాల్చిన అవతారం"**

(శ్రీ.స.స.పు.282/283)

"అసత్యం నుండి సత్యం వైపుకు, చీకటినుండి వెలుగులోనికి, మృత్యువు నుండి అమృతత్వానికి, మిమ్మల్ని నడిపిస్తాను. మీరు తొట్రుపాటు పడకూడదు. మూర్ఛపోకూడదు."

(శ్రీ.స.స.పు.363)

నారదుడు ఎల్లప్పుడూ భగవంతునితో సన్నిహితంగా ఉంటూ సన్నిహితంగా మసులుతాడు. అయినప్పటికీ అతడు తనకు అగ్రాహ్యుడుగానే ఉన్నాడనుకొంటాడు. శ్రీకృష్ణభగవానుని స్వంతసోదరుడుగా అవతరించిన బలరాముడు తనసహోదరుని వ్యక్తిత్వపు లోతుల్ని అందుకోలేక పోయాడు. అట్లాంటప్పుడు **మీరు నన్నుగూర్చిన పరమరహస్యాన్ని ఎట్లు అవగతం చేసుకోగలరు?** విశ్వాసముంటే నీకు నా అంతస్థితుడైన భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. అతడు నీకు అందుబాటులోనే ఉన్నాడు. నిరంతర సాక్షీభూతుడుగా **ఉండే ఆ భగవానుని ఎరుక గలిగి యుండును. అతడు సర్వద్రష్ట. సర్వజ్ఞుడు.**

(సా.అ.పు.153)

"శ్రీ పుట్టపర్తి నిలయుడు కాపాడు నిన్నెప్పుడు కరుణాకరుడు; చేయి పట్టి బ్రోచునెపుడును ఎచ్చటను మరువకుడు"

"నాలో మిమ్మల్ని దర్శించుకోండి; ఎందుకంటే మీ అందరిలో నేను నన్నే చూస్తాను కనుక,

మీరే నా జీవితం, మీరే నా ఊపిరి, మీరే నా ఆత్మ మీరందరూ కూడా నా ప్రతిరూపాలే, మిమ్మల్ని మీరు ప్రేమించినప్పుడు నన్నే ప్రేమిస్తున్నారు, నేను నన్ను ప్రేమించినప్పుడు మిమ్మల్నే ప్రేమిస్తున్నాను. **'నన్ను' నేను ప్రేమించడం కోసమే 'నా' నుండి 'నన్ను' వేరు చేసుకున్నాను.** ప్రేమ స్వరూపులారా! మీరంతా నా ఆత్మ స్వరూపాలే!"

(శ్రీ.స.ప్రే.స్ర.పు.428)

చూతమురారే! సుదతులార! సాయిబాబాను॥
నిలువంగీ తొడుగునట - నీలి పీతాంబరుడట - పరం
జ్యోతి రూపుడట పరమాత్ముడు సాయిబాబా ॥చూ॥
పుట్టపర్తి పురమునందు భక్త జనుల భవనమందు - ముక్తి
నిచ్చెదననుచు తాను ముఖ్యముగ నిలచినాడట ॥చూ॥
చిత్రావతి తీరమందు చిరుకొండ చివరియందు - పర్తివాస
ప్రత్యక్షము పదుగురెదుట చూపునట ॥చూ॥
షిరిడివాసుడట చిన్నిసాయీశుడట - హస్త
లాఘవమున్నదట - అడుగునన్ని యిచ్చునట ॥చూ॥
శివరామ కృష్ణుడట చిందులందు మారుతట - సర్వ
రూపములతడట - సద్భక్తులకు చూపునట ॥చూ॥
కలిగియుగమున పుట్టి నట్టి కలికాల దేవుడట -
కలుషములను బాపునట కరుణా సముద్రుడట ॥చూ॥
భక్తులతని పరుపులట, తన శక్తియే ఊయలట - నరుల
పాటలే నాలుగు నాణ్యమైన గొలుసులట ॥చూ॥
భక్తులెచట పిలచినను పారిపోవుచుండునట - గోపువెంట
దూడవోలె దుముకుచును వెళ్లునట ॥చూ॥
కన్నులందున నెపుడు కారుణ్యపు చూపునట
ముద్దులొలుకుచుండునట - ముచ్చటైన మాటలట ॥చూ॥
వారి మహిమ తెలియలేక మాయ వలలోనచిక్కి
మందభాగ్యులగుటకన్న - మంచిదారి దొరికెనట ॥చూ॥
తాను తలచినంతనె విభూతి - తన హస్తము తగులునట
తక్షణమున దానితీసి తల్లడిల్లెడి వారి కొసగు ॥చూ॥
ఎన్ని పనులుండినను దండిగ శ్రీ సాయినాథుని
నెలవునకు పట్టువీడక సాగిపోదము ॥చూ॥
రండి రండి మీరు రమ్యమైన పర్తిపురికి
శృంగారించినట్టి సాయిని - చూడ్కులలర చూడబోదాము॥చూ॥
తెలివిలేని మూఢులారా! తెలివితెచ్చుకొని నేడు
తరలి తరలి వేగ మీరు తరలిరండు పర్తిపురికి ॥చూ॥
ముసి ముసి నవ్వుతోను ముద్దైన యిసుక నేడు
మూసి చూడగానే అదియు లడ్డై క్రిందపడెను ॥చూ॥
మంత్ర తంత్రమనుచు కొందరు మందభాగ్యులను కొందరు
మతిలేని మూఢజనులు మరుగునందు తలచుచుండ్రు ॥చూ॥
ఇవి అన్నియు వదలి మీరు యిష్టముతో భజనసలిపి
కష్టమైన భరియించుక కదలిరండు కరువుతీర ॥ ॥చూ॥
భక్త బృందముతో నేడు బాబ మందిరమ్మునందు

కీర్తి కలిగినట్టి తులసి ఖ్యాతితో హారం కట్టుచుండగా॥చూ॥
కుషితో సాయీశుడు నేడు కుప్పం భక్తులతో కూడి
కోర్కెమీర చెప్పేపాట - కాని యాడుచూ యిందురండి ॥చూ॥
అవనిలో యీ పాటనెవరు పాడినను వినిననుగానీ
పర్తీశుడటకు వచ్చి పరంజ్యోతి రూపు చూపు ॥చూ॥
జయమంగళమిదెసాయి శుభమంగళంబు మీకు
సర్వమంగళంబు మీకు - సాయినాథ గైకొనుము॥ ॥చూ॥

(యు.అ.సా.పు.23/26)

యుగధర్మ పద్ధతుల్ విగళితమై యుంట
నయ మార్గమున ద్రిప్పినడుపు కొరకు
లోకంబులెల్ల కల్లోలమై చెడియుంట
నిష్కల్మషము జేసి నెగడు కొరకు
దుర్మార్గబద్ధులై తొలగి దీనిత నుంట
సాధు సంరక్షణ సలుపు కొరకు
కాలసంద్రిద్ధ విగ్రహ సూక్తులై యుంట
భాష్యార్థ గోప్యముల్ తెలుపు కొరకు
క్ష్మాభారముబాపి భూదేవి మనువు కొరకు
త్రేతనొసగిన కోర్కెలదీర్చు కొరకు
అవతరించెను అచ్యుతడవని యందు
ఇంత కన్నను వేరెద్ది యెఱుక పరతు॥

(యు.అ.సా. పు. 44)

ప్రశాంతి నిలయమునకు రండు. అచ్చటనే కొలది కాలమైనను నివసింపుడు, నాతో కలిసియుండుడు. నా సాహచర్యమువలన కలుగు అనుభవమును సంపాదింపుడు. **సంభాషణమును లేక యుపదేశములను వినుడు. నన్నే గమనించుడు.** ఆ పిమ్మట మీ యిష్టానుసారము తీర్మానమునకు రండు. **లోన ప్రవేశించి లోతు తెలిసికొనుడు. తిని రుచిని తెలియుడు.**

(స.శి.సు.ప్ర.పు.223)

నే నెవ్వరినిగాని నాస్తికుడనను. భగవద్విశ్వాస హీనుడనను. కారణమేమనగా, అందరును భగవంతుని సృష్టియే. అందరును భగవదనుగ్రహమునకు పాత్రులే. ప్రతివానిహృదయమునందును సత్యమను రాయి (సుస్థిరమైనది) యున్నది. ఆ రాతి ననుసరించి, ప్రేమ యను ఊట బుగ్గ లేక చెలమ యున్నది. **ఆ ప్రేమయే దైవము. ఆ సత్యమే దైవము.** దైవత్వము, లేక దైవ భావము ప్రతివాని యంతరంగములో నిమిడి యున్నది. అనగా ప్రయత్నముచేత గాని, ఆ దైవత్వమును, లేక దైవభావము వెలుపలికి రాదు (ప్రకాశింపదు). **సాధన వలన బైటికి వచ్చి ప్రకాశించును. భూగర్భములోని నీటి యూటను త్రవ్వి త్రవ్వి బైటకి దెచ్చునట్లు, నిరంతర రామనామ స్మరణవలన నంతరంగము త్రవ్వినట్లు కాగా, దైవత్వమను ఊట బైట పడును.** బ్రహ్మానందానుభూతి ప్రకాశించును. ఇట్టి బ్రహ్మానుభూతి నుండి, లేక పరమాత్మానుగ్రహమును సంపూర్ణముగా పొందిన భక్తుని నుండి ప్రారంభదశలోని సాధకులు సహాయమును పొందుదురు.

(స.శి.సు.ప్ర. పు. 225)

"మీలాగే తింటూ, మీలాగే మీభాషలోనే మాట్లాడుతూ, మీవీనులకు విందు కలిగించేలా పాటలు పాడుతూ ఈ జగన్నాటకంలో ఒక అంతర్నాటకాన్ని ప్రదర్శిస్తున్నాను"
"అంతేకాదు. మరొక్క విషయం కూడా మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. 'మీరు నేనే' అన్న పరమసత్యంవైపుకు నడిపించే పాత్రనే నేను ధరించానన్న విషయం జ్ఞాపకం ఉంచుకోండి."

(శ్రీ.స.స. పు. 396)

కొంతమంది భగవంతునికి మానవరూపంలో అవతరించటం ఎంతో అందమైన ఆనందకరమైన విషయం అని అనుకుంటారు. కాని మీరు నాస్థానంలో ఉంటే అది అంత అందమైనదిగా భావించరు. ప్రతి ఒక్కరికీ గతంలో జరిగిందీ, వర్తమానంలో జరుగుతున్నదీ, భవిష్యత్తులో జరగబోయేదీ అంతా నాకు తెలుసు. నాకు ప్రపంచంలో ఏవ్యక్తి అయినా ఎందువల్ల బాధపడుతున్నాడో తరువాత అతనికి ఏంజరగబోతున్నదో, అంతేకాక ఈబాధను అనుభవించటానికే ఈజన్మనెత్తాడనీ, అంతా నాకు తెలుసు."

(శ్రీ.స.ప్రే.స్ర. పు. 401)

భక్తిరసానంద పారవశ్యముచేత
భవబంధ భూతముల్ వదలిపోవు
భవబంధ భూతముల్ వదలినతోడనే
మోక్షాభిమానంబు మొలకెత్తు
మోక్షాభిమానంబు మొలకెత్తినంతనే
జ్ఞానోదయప్రాప్తిగలుగు వెంట
జ్ఞానోదయ ప్రాప్తికలిగిన వెంటనే
తన్ను తానెరిగెడి తత్త్వమబ్బు
జగము మాయమైపోవుచో నిగమవినుతు
నిత్యసౌభాగ్యరూపంబు నిలుచుగాదె
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

(యు.సా. పు. 59)

"పతితులైన మానవాళి నుద్ధరించుటకై **తిరిగి యవతరించిన సాయిబాబాయే నేను.** ఆధ్యాత్మిక సాధనలో మొట్ట మొదటి మెట్టయిన పూజా విధానమును **ప్రతి గురువారమును మత్ప్రీతి కరముగ మదను గ్రహము కొఱకు సల్పుడు."**

(స.శి.సు.ద్వి.పు.4)

ప్రజానీకము నుద్ధరించి, శాశ్వతానందమును సమకూర్చుటయే నా యవతార ప్రయోజనము. ధర్మమార్గము నుండి దూరులైన మానవులను సంస్కరించి, పునఃధర్మాచరణ పరాయణులను జేసి సంరక్షింప వలయుననే నా నిర్ణయము: నా ప్రతిజ్ఞ. నిరుపేదల బాధలను నివారణజేసి, సుఖసంతోషము లందును, లాభ నష్టములందును, మానవ మానములందును, సమదృష్టిగల్గి ధీరులై యుండవలయు ననునదే నే బోధించు భక్తి మార్గమునందలి రహస్యము. **అనన్యగతికులై నన్నే నమ్ము నా భక్తుల నెన్నడును విడువను.**

(స.శి.సు.ద్వి.పు.10/11)

"నా తత్త్వము ఆగమ్యమును, ఆగోచరమును నైనది. ఇప్పుడే కాదు. ముందెప్పటికైనను, ఎంత శ్రమించి విచారించినను నా తత్త్వము సర్వమానవులకును గ్రహించుటకు ససాధ్యమైనది. కాని నా యానందానుభూతి మాత్రము నమ్మినవారి కెల్లరకును, ఖండాంతర మతాంతర మానవులకు సహితము అనుభవైకవేద్యముగ నుండును. మాయామనుషదేహినై యుండుటవలన మానవులు నన్ను గుర్తింపరైరి. నా నిజ స్వరూపమును గుర్తింపుడు. మానవులు పూజించు యితర దైవ రూపములను పోలినదే యీ దివ్యమానవ రూపోపాధియు నని తెలియుడు. ఈ సత్యసాయి నామ రూపోపాధి శ్రీ భగవానుని దివ్యావతార మనియే మీ రెఱుంగుడు. ముందెన్నటికో గాక వర్తమానములనే ఈ లీలోపాధిని కేవలము సత్యతత్త్వముగ గుర్తించి, గ్రహించి, విశ్వసించి, పూజించుచుండుట మీ జన్మాంతర పుణ్యఫలము వలననే మీకు లభించెనని తెలిసికొనుడు. విశ్వమెల్లను నచిరకాలముననే శ్రీసత్యసాయి దివ్యావతారమును సందర్శించి బ్రహ్మానంద సాగరమున నోలలాడగలరు."

(స.శి.సు.ద్వి.పు.265)

"అదిగో అటుచూడు. అక్కడేమి కనిపించుతుంది? కొండలు, చెట్టు, ముండ్ల పొదలు, అక్కడపగలు కూడా పాములు సంచరించుతుంటవి. చీకటి సమయములో ఎవ్వరు అటుపోరు. కానీ రాగల సంవత్సరములలో అక్కడ మహానగరమొకటి వెలుస్తుంది; ప్రపంచమందన్ని ప్రాంతములనుండి నా భక్తులు అసంఖ్యాకముగా నా దర్శన, స్పర్శన, సంభాషణకొరకు రాగలరు. ఆనాడు మీరందరూ చాలా దూరమునుండే నన్ను చూచి ఆనందించుతారు. ప్రపంచమే మారిపోతుంది."

(శ్రీ.స.లీ.పు.59)

సోదరులారా రండి! సోదరీమణులారా తరలి రండి!
పోదాము పదండి ఇప్పుడే ఆ పవిత్ర పుణ్యస్థలి పుట్టపర్తికి
ధరిస్తాడట ఆయన మనోహరమైన కాషాయంబరాన్ని!
దివ్యమైన తేజస్సట ఆ మహానుభావునిది!
భగవంతుడేనట ఆయన
చిత్రావతీ నదీ తీరపు ఇసుక తిన్నెలపై

దివ్య ప్రకటనలు

కొండల అంచుల నీడలలో
"మానవ రూపంలో అవతరించిన దైవమే"
తానని వెల్లడి చేస్తుంటాడు ప్రతిదినమూ
ఇంతకు ముందాతడు షిరిడీ వాసుడట
మరల ఈనాడు మనకోసం పర్తి వాసుడైనాడట.
రండి సోదరులారా! తరలిరండి...సోదరీమణులారా! రండి..రండి
మనమంతా వెళదాము పుట్టపర్తికి.
చూపుతాడట అభయహస్తాన్ని
అనుగ్రహిస్తాడట కోరినవన్నీ
కొరతలేకుండా ప్రసాదిస్తాడట ఆ
అభయ హస్తాలు
శివుడు...రాముడు: కృష్ణుడూ...మారుతీ....
రండి సోదరులారా: తరలి రండి....సోదరీమణులారా!
ధగద్ధగాయమాన కాంతులో ప్రకాశించు కాంతిమంతుడట
పూలతూగుటుయ్యలలో విశ్రమించునట.
ప్రతిధ్వనించుచుండునట సతతం భగవన్నామ సంకీర్తనం
ఆరాధనే ఆధారం అ ఊయెలకట;
అభిమానమే గొలుసు ఆ ఊయెలకట,
భగవత్ ప్రార్థనా గీతాలే ఆ పూల పరిమళమట,
ఆర్తితో అర్థిస్తే, వేదనతో విలపిస్తే
కలత బాపునట కనికరించి తక్షణమే
'అంబా' అని లేగదూడ పిలిచినంతనే
పరుగున చెంతనే చేరే గోమాత వలె బ్రోచునట
చల్లనైన చూపట; మనోహరమైనరూపట
మకరంద మాధుర్యమును బోలు మృదుమధురమైన పలుకట;
మాయలో చిక్కుకుని, విడిపించే వాడు లేక
విధిని శపించుకుంటూ సందులగొందుల తిరిగే వారికి
పుట్టపర్తి బాట రాచబాటయట
దారి తప్పి తిరిగే వారికి, బాధలతో కృంగిన వారికి
సమస్యలతో సతమతమవుతూ పోరాటం సలుపుతున్న వారికి
సంకల్పమాత్రమున సృష్టించబడే 'విభూతి'ని
ప్రసాదించి కష్టములను బాపునట తక్షణమే.
అందుకే...
సోదరులారా ! త్వరపడండి.
ఇప్పుడు తీరికలేదు... "కొంత కాలం గడిచాక చూద్దాంలే...
అని మీనమేషాలు లెక్కిస్తూ ఆలసించకండి.
తరలిరండి... సోదరులారా! సోదరీమణులారా
తరలిరండి.... తరలిపోదాము త్వరత్వరగా
పుట్టపర్తి పవిత్రయాత్రాస్థలికి పయనమవుదాము.
పొందుదాము ఆ భగవానుని దివ్య సందర్శనభాగ్యం
కదలిరండి కట్టి బెట్టి మిథ్యావాదాన్ని
కలసిరండి మాతో .... తెలుసుకోండి కొంచమైనా
ఆదివ్యతేజోమూర్తి దివ్యకీర్తి వైభవాన్ని
పెదవులపై మెరిసే చిరునగవుతో
కనులలో తళతళ మనే కాంతితో
ఇసుక తిన్నెలలో ఆయన తన వేళ్ళను చొప్పించగనే
మారుతాయట తడి మట్టి ఉండలు
గుండ్రని తియ్యని మిఠాయి ఉండలుగా!!
దివ్యత్వానికి సుదూరంగా వారు అంటూ వుంటారు.
ఇదంతా "మంత్రమనీ ...వట్టి తంత్రమనీ"
చెవిని పెట్టకండి ఆ మాటలను
లేచి వే వేగ సాగించండి మీ ప్రయాణం
బెదరకండి కష్టాలకు, కృంగకండి నష్టాలకు
మీరు పొందబోయే బహుమానం బహు దొడ్డది నమ్మండి!
ఈ పవిత్ర శుభదినాన ఈ పర్తిమందిరంలో
తులసి దళాల మాలలు గ్రుచ్చి సమర్పించే శుభవేళలో
భక్త కోటిని ఆశీర్వదించటానికై ఆలపిస్తున్నాడు
భగవానుడు భక్తులపట్ల అనుగ్రహంతో,
రండి సోదర సోదరీమణులారా! తరలి రండి
భగవానుని అనుగ్రహాన్ని పొంది తరించండి!

(స.శి.సు.నా.పు.XI - XIV)

"మానవ జాతినంతటినీ ఏకం చేసి వసుధైకకుటుంబంగా చెయ్యటానికే, మీ నిజతత్వమైన ఆత్మతత్వాన్ని మీకు తెలియచెప్పటానికే నేను వచ్చాను... తుచ్ఛమైన, లౌకికమైన భౌతిక సుఖాలను, సంపదలను నానుండి ఆశించకండి.... వాటికి బదులు నన్నే మీరు కోరుకోండి... అందుకు తగిన ప్రయోజనం మీకు తప్పక చేకూరుతుంది.

(స.శి.సు.నా.పు.47/48)

"నా ఆనందం కోసం ఒక్క మాటలో ఈ ప్రపంచాన్ని సృష్టించేవరకూ నేనెవరో తెలుసుకోవటానికి ఎవ్వరూ లేరు. **నాసంకల్పముచేత పుడమి అవతరించింది, అకాశం వెలిసింది; పర్వతాలు తలలెత్తాయి; నదులు ప్రవహించ సాగాయి; ఏమీలేని శూన్యం నుండి నా ఉనికిని నిరూపిస్తూ సూర్యుడు చంద్రుడు, నక్షత్రాలు ఉద్భవించాయి.** అన్నిరకాల జీవరాసులూ జనించాయి. నా ఆదేశంప్రకారం వారికి వివిధ రకములైన శక్తులు ప్రసాదించబడినాయి. మానవునికి ప్రథమస్థానాన్ని కల్పిస్తూ నాజ్ఞానం మానవ మస్కిష్కంలో ప్రవేశ పెట్టబడింది."

(స.శి.సు.నా.పు.118)

"రండి, అందరూ దగ్గరగా రండి, వచ్చి నాలో మిమ్మల్ని చూసుకోండి. ఎందుకంటే నేను మీలో నన్నే చూస్తున్నాను. కనుక మీరే నాజీవితం, నాఊపిరి, నాఆత్మ.... అంతా మీరే. మీరంతా కూడా నా ప్రతిరూపాలే. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నప్పుడు నన్ను నేనే ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని మీరు ప్రేమించేటప్పుడు మీరు నన్నే ప్రేమిస్తున్నారు. నన్ను నేను ప్రేమించుకోవటం కోసమే నానుండి నన్ను నేనే వేరుచేసుకున్నాను. నా ప్రియాతి ప్రియమైన బాలలూ! మీరే నా "నిజమైన ఆత్మ"

ఒకేమాటలో ఈ విశ్వాన్ని అంతటినీ నేను సృష్టించాను. (ఏకోహంబహుస్యాం)

విశ్వంలోని ప్రతిప్రాణియందలి చైతన్యము ప్రేరణ శక్తి నేనే.

"నా ప్రియమైన బాలలారా!

పక్షి మీ దగ్గర ఉంటే రెక్కలు నావద్ద ఉన్నాయి; పాదాలు మీవైతే పథం నాది; కన్ను మీదైతే రూపం నాచెంత ఉంది; వస్తువు మీవద్ద ఉంటే 'కల' నావద్ద ఉన్నది; ప్రపంచం మీతో ఉంటే స్వర్గం నాతో ఉంది. మనం బంధాన్ని ఎలా కలిగి ఉన్నామో, స్వేచ్ఛకూడా అలాగే కలిగి ఉన్నాము; ఎలా ప్రారంభిస్తామో అలాగే అంతం చేస్తాము. నేను మీలో ఉన్నాను. మీరు నాతో ఉన్నారు.

(స.శి.సు.నా.పు.159/160)

"నేను నిర్వర్తించవలసిన కార్యము కేవలము వ్యక్తులయొక్క రుగ్మతలను తొలగించటం, వారికి ఉపశాంతిని కలిగించటం, **వారి యొక్క దుఃఖమును, బాధలను పారద్రోలడం వరకూ మాత్రమే పరిమితమైనది కాదు.** ఇవన్నీ సందర్భవశాత్తూ నిర్వర్తించే కార్యములే. అయితే **నా ప్రధాన కర్తవ్యము. వేదాలలోను వైదికమైన కర్మానుష్ఠానములోను గల అంతరార్థమును వివరించి భారతదేశములోను ప్రపంచమంతటా ధార్మికజీవనాన్ని పునరుద్ధరించటమే."**

(ధై.పు.183)

"కేవలం మానవ శరీరంలా కనబడుతున్న **ఈ దేహము మానవాతీతమైన శక్తులను** ప్రదర్శిస్తున్నప్పుడు విస్మయకరమైన ఈ సంఘటన వలన అందరి దృష్టి ఈ దేహములోగల దివ్యతత్త్వము పై లగ్నమవుతుంది. అయితే, **ఇదే దివ్యతత్త్వము సమస్త మానవులలోను అంతర్లీనముగా ఉన్నది. మానవజీవికి అప్పుడప్పుడు ఈ విషయాన్ని మరొకమారు గుర్తు చేయవలసిన అవసరము వస్తూంటుంది.** ఇలా చేయటం వలన మానవులకు భగవంతుని యందు విశ్వాసము పెంపొంది వారు **భగవతత్త్వమును** గుర్తించగలిగే స్థాయికి చేరుకుంటారు. అటువంటప్పుడే మానవుల యొక్క మనస్సు ప్రాపంచిక విషయాలనుండి విశ్వాధినేతయైన భగవంతుని వైపు మళ్ళుతుంది."

(ధై.పు.205)

మీరు చూస్తున్న ఈ మానవరూపములో **ప్రతి ఒక్క దివ్యరూపము,ప్రతి ఒక్క దివ్యతత్త్వము, అంటే మానవుడు భగవంతునికి ఆపాదించే సమస్తరూపనామములు ఇమిడి ఉన్నాయి.**_నా యొక్క దివ్యతత్త్వము ఇలా ఉంటుంది. అలా ఉంటుంది అని ఎరుకపరచడానికి ప్రయత్నము చేస్తూ మీరు అమూల్యమైన మీ కాలాన్ని ఎందుకు వృధా చేస్తారు? **నీటిలో మునిగియుండే చేప అనంత మైన ఆకాశముయొక్క వైశాల్యాన్ని కొలువగలదా? నా యొక్క దివ్యతత్త్వము ఇది, అది అని నిర్ణయించడానికి ప్రయత్నము చేయకండి. అది ఫలించదు.** అంతకంటె మీలోనే అంతర్గతముగా నున్న దివ్యతత్త్వమును

గుర్తించడానికి ప్రయత్నము చేయండి. అప్పుడు నాయొక్క దివ్యతత్త్వమును గుర్తించడములో మీరు కృతకృత్యులవుతారు.''

(దై.పు.215)

"మీరు నన్ను చూచి ఆశ్చర్యపడిపోతున్నారు. నేనెవరినో తెలుసు కోవాలని మీరు అనుకుంటున్నారా? శ్రీ సత్యసాయిబాబా అవతార పురుషుడు, ఆయన సాక్షాత్తూ భగవంతుని అవతారమే. ఈ అవతారమును గురించి ఏ విధమైన పొరపాటు పడకండి, నా లక్ష్యము నెరవేరి తీరుతుంది. **నేను మిమ్మల్ని నా దగ్గరకు పిలిపించు కుంటాను, ప్రాపంచికమైన కొన్ని వరాలు కూడా ఇస్తాను. అయితే, ఇవన్నీ మీ దృష్టిని భగవంతుని వైపు మళ్ళించడానికే.** జనబాహుళ్యము మధ్యకు వెళ్ళటం, వారికి తగు సలహాలు ఇచ్చి, వారిని సవ్యమైన మార్గములో నడిపించటం, వారికి కష్టము కలిగి నప్పుడు ఓదార్చటం వారిని ఉద్ధరించటం, వారిని సత్య, ధర్మ, శాంతి, ప్రేమలనే మానవతా విలువలను పాటించే మార్గము వైపు మళ్ళించడం - **ఇటువంటి పనులను ఇంతవరకూ ఏ అవతారమూ చేయలేదు. ప్రస్తుత సమయంలో భగవంతుడు అవతరించినది సరిగ్గా ఈ కార్యము నెరవేర్చటానికే."**

(దై.పు.286)

దేహంబు క్షీణించు దినమెవ్వరెరుగరు
కష్టంబు లొచ్చుట గాంచలేరు
జగతిపై నెవరైన జన్మించుటెరుగరు
దివి భువి సుఖములన్ దెలియలేరు
మాయలోపల జిక్కి మమత వీడగజాల
రించుక తమ మర్మమెరుగ లేరు
మానవధర్మంబు మాటయే మరతురు
దేని నొనర్తురో తెలియ లేరు
ఇన్ని తీరులు కూడ దైవేచ్ఛగాన
దీన వత్సలు డతని ప్రార్థింతురేని
సృష్టి చిత్రంబు లెంత విచిత్రమైన
భక్తి శక్తియు ముక్తియు బాబయిచ్చు.

(షి.పు.39)

"మీరు చూస్తున్న ఈ మానవ రూపములో **ప్రతి ఒక్క దివ్యరూపము, ప్రతి ఒక్క దివ్యతత్త్వము, అంటే, మానవుడు భగవంతునికి ఆపాదించే సమస్త రూపనామములు ఇమిడియున్నాయి. సర్వదేవతా సర్వరూపములు ధరించిన మానవకారము ఈ అవతారము. సాయిబాబా అనే పేరుకు గల అర్థమును గమనించండి. "సా" అనగా "దివ్యమైన", "అయి" అనగా "మాత" మరియు "బాబా" అనగా "పిత" అని అర్థము. "సాంబశివా" (స+అంబ+శివా) అనే పదమునకు దివ్యమాతాపితలని అర్థమున్నట్లే "సాయిబాబా" అనే పదమునకు దివ్యమాతాపితాస్వరూపుడని అర్థము. మీకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు ఎంతో కొంత స్వార్థముతో మిమ్మల్ని ప్రేమిస్తారు. కాని దివ్యమాతా పితా స్వరూపుడైన ఈ సాయిబాబా మీపై సదా అనుగ్రహ వర్షమును కురిపిస్తూ ఆత్మ సాక్షాత్కారము కొరకు మీరు చేసే సాధనలో మీకు విజయమును చేకూర్చేందుకు మాత్రమే అప్పుడప్పుడు మీపై కోపమును నటిస్తాడు."**

(దై.ది.పు.288)

"ఈ అవతారములో నాకు జన్మనిచ్చిన కుటుంబ సభ్యులతో నేను ఎటువంటి సంబంధము పెట్టుకోలేదు. గతంలో ఎక్కువగా కుటుంబ సభ్యుల మధ్య, కుటుంబసభ్యుల కొరకు తమ జీవితమును గడిపిన శ్రీ రామావతారము, శ్రీ కృష్ణావతారముల వలెగాక, **ఈ అవతారము కేవలం భక్తుల కొరకే." రామావతారములో శ్రీ రామచంద్రుడు సత్యధర్మములకు ప్రతీకగా నిలిచి "రామో విగ్రహవాన్ ధర్మః" అని పేరు పొందాడు. శ్రీ కృష్ణుడు శాంతి, ప్రేమలను నెలకొల్పడానికి కృషి చేశాడు. గౌతమ బుద్ధుడు అహింసా తత్త్వమును బోధించాడు. నా ఈ ప్రస్తుత అవతారము సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే ఐదు మానవతా విలువలను పునరుద్ధరించ డానికి ఉద్దేశింపబడినది.** మీకు తెలిసిన నా ప్రతి ఒక్క అనుగ్రహ పూర్వకమైన దివ్యలీల వెనుక మీకు తెలియని వేలకొద్దీ దివ్యలీలలు ఉన్నాయి.

(దై.ది.పు.289/290)

జన బాహుళ్యము మధ్యకు వెళ్ళడం, వారికి తగు సలహాలు ఇచ్చి వారిని సవ్యమైన మార్గములో నడిపించడం, వారికి కష్టము కలిగినప్పుడు ఓదార్చడం, వారిని ఉద్ధరించడం, వారిని సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే మానవతా విలువలను పాటించే మార్గము వైపు మళ్ళించడం, ఇటువంటి పనులు ఇంతవరకు ఏ అవతార పురుషుడూ చేయలేదు.

నేను శంఖు చక్రగదాధరుడైన కమలహస్తుడనై చతుర్భుజములతో నారాయణునిగా మీ మధ్యన అవతరించినట్లుయితే బహుశా మీరు నన్ను ఏదైనా ఒక మ్యూజియంలో పెట్టి నాదర్శనం కొరకు వచ్చేవారినుండి కొంత పైకము వసూలు చేసేవారు. అలాకాకుండా నేనుకేవలం మానవ మాత్రుడిగా మీ మధ్యకు వచ్చినట్లయితే నా బోధలకు విలువనివ్వకుండా వాటిని మీ స్వలాభము కొరకు వినియోగించుకునేవారు. అందువలన నేను మానవరూపముతో మానవాతీతమైన జ్ఞానముతో, శక్తులతో మీ మధ్యన అవతరించి అప్పుడప్పుడు మీకు కొన్ని లీలలను, మహిమలను చూపుచున్నాను. **నేను పురుషడను కాను, స్త్రీను కాను, వృద్ధుడను కాను, యువకుడను కాను, ఈ అన్ని రూపములు నావే. ఈ చరాచర ప్రపంచమంతటిలోను అంతర్లీనముగా నున్న శక్తిని నేనే.** మీరు ఎక్కడున్నా ఏమి చేస్తున్నా ఒక విషయమును గుర్తుంచుకోండి. **మీరు చేస్తున్నదంతా నాకు తెలుస్తుంది. నేను మీ హృదయపీఠముపై అధివసించియున్న దైవమును. నేను సర్వాంతర్యామిని, మీ హృదయవాసిని. మానవజాతిని ఉద్ధరించడానికి అవతరించిన ఈ అవతార పురుషునికి సాధకుని గురించి అతడు చేరవలసిన గమ్యమును గురించి పూర్తిగా తెలుసు.** సృష్టికర్తయైన ఆయనకు తన శక్తిని గురించి క్షుణ్ణముగా తెలుసు. సమస్త మానవుల భూత భవిష్యద్వర్తమానములు ఆయనకు తెలుసు. ఆయన **వారిని ఆధ్యాత్మిక మార్గములో నడిపించి, చివరకు మోక్షప్రాప్తిని కలిగిస్తాడు.** భగవంతుని అవతారమును గురించి ఆయన అవతార లక్ష్యమును గురించి నిర్వచించడం చాలా కష్టము. అందువలన నన్ను గురించి నేనే ప్రకటించుకుంటున్నాను. **నా అవతార లక్ష్యము, నేను నిర్వర్తించవలసిన కార్యము, గత అవతారములకంటె భిన్నమైన ఈ అవతారముయొక్క ప్రత్యేక లక్షణములు, గుణగణములను నేనే స్వయంగా వివరిస్తున్నాను."**

(దై.ది. పు. 290/291)

"చెంత చేరెనటంచు సంతసించెదరన్న
వెంటనే ఎడబాటు చింత గూర్చు
ఏడిపించుటె సాయి వేడుక యందురా
కడుపుబ్బ నవ్వించు నడుమ నడుమ
పొగడుచున్నారని పొంగిపోయెదరేమో
తప్పకప్పుడె ఎగతాళి సేయు
అభయమిచ్చెను గాన హాయిగా నుండెదరన్న
పడు బాధలకు అంతు పట్టకుండు
వెనుకకేగనీడు చననీడు ముందుకు
మనసు మరులు గొల్పి మధనబెట్టు
ఇట్టి చిన్నసాయి చిన్మయమూర్తిని
ఎట్టలెరుగ గలరు ఇలనుమీరు".

(దై.ది.పు.292/293)

"ఇంత వరకూ నా కార్యక్రమము ప్రారంభదశలోనే ఉన్నది. ఇకనుండీ ఈ కార్యక్రమము శరవేగముతో కొనసాగుతుంది. మానవుని అజ్ఞానము నుండి విముక్తి కలిగించే ఈ కార్యక్రమములో పాలు పంచుకోవడం ఇక మీ వంతు. గతంలో ఏ యుగంలోను కూడా భగవంతుని అవతరణను గురించి ఇంత స్పష్టముగా ఇన్ని సార్లు మానవజాతికి తెలియజేయడం జరుగలేదు.

(దై.ది.పు.303)

"నాకు సంబంధించినంతవరకూ నేను సృష్టించే అనేక వస్తువులు విజిటింగు కార్డుల వంటివి. నా భక్తులయందు నాకుగల ప్రేమభావమును వ్యక్తపరచడానికి, దీనికి బదులుగా వారి యొక్క భక్తిని స్వీకరించడానికి మాత్రమే వీటిని ప్రసాదించడం జరుగుతుంది. **ప్రేమకు రూపము**

అంటూ ఏదీ లేని కారణంచేత నా ప్రేమకు నిదర్శనముగా నా దివ్యసంకల్పముచేత ఉంగరములు, లాకెట్లు, జపమాలలు, హారములు, కంకణములు మెదలగు అనేక వస్తువులను సృష్టించి భక్తులకు ఇస్తుంటాను. వాటిని ధరించే భక్తులు **ఏదైనా ప్రమాదకర పరిస్థితిలో చిక్కుకున్నప్పుడు లేక వారికి నా సహాయము అవసరమైనప్పుడు అవి వెంటనే మెరుపులాగా నాకు వార్తలు పంపిస్తాయి. నేను వెంటనే వారి ఆపదలు నివారించి వారికి సహాయము చేస్తాను. అనేక మైళ్ళ దూరములో నున్న ఆ భక్తులకు, నాకు మధ్య అవి ఒక లింకులా పనిచేస్తాయి. అయితే, ఈ బహుమతులను అందుకునేవారు మాత్రమే నా అనుగ్రహమునకు పాత్రులనీ, ఇతరులు కాదనీ భావించురాదు. ఏరూప, నామములతోనన్ను ప్రార్థించినా నా అనుగ్రహము అందరికీ అందుబాటులో ఉంటుంది. దీనిని పొందడానికి సాధనము మీకు, నాకు మధ్యనున్న ప్రేమబంధమే.**

నన్ను గురించి నేను చెప్పవలసిన అవసరము వచ్చినది కనుక చెప్పుచున్నాను. అనంతశక్తి, అనంతత్వము, అనంత వ్యక్తిత్వము నాచేతులందున్నవి. నా శక్తులనేవి ఏనుగు ప్రమాణము కలిగి ఉంటే, యీ మహిమలనేవి దానిపై వ్రాలే దోమ ప్రమాణము కలిగి యున్నవి. కర్మ చక్షువులతో సత్యమును దర్శించడానికి వీలుపడదు. జ్ఞాన చక్షువులతో మాత్రమే సత్యస్వరూపమును దర్శించడానికి వీలవుతుంది. చాలామంది సాయి తత్త్వమును బాహ్యదృష్టితో చూచి సాయి ఇట్టివాడు, అట్టివాడు అని ప్రకటిస్తూంటారు. వీరు సాయిలోని పవిత్రతను, యదార్థమును, నిత్యసత్యమును ఏ మాత్రము గుర్తించలేకున్నారు. సాయి శక్తి అపారము, అనంతము, సర్వశక్తులు సాయి హస్తగతమై యున్నవి. నేను ఏది సంకల్పిస్తే అది జరిగి తీరుతుంది. నేను ఏ కార్యమును తలపెడితే అది విజయవంతమవుతుంది. నేను సత్యస్వరూపుడను, **కనుక, నేనెవ్వరికీ లొంగను.".**

(దై.ది.పు.309/310)

"నాలో ఉన్నట్టిది, ఎటువంటి **కొలత**లకు అందనిది, పరిమాణమునకు అతీతమైనది, పరిశోధనలకు గురికానట్టిది ప్రేమ ఒక్కటే. ఇది యింత అంత అని ఎవ్వరూ చెప్పలేరు. ఈ ప్రేమ తత్వమును గుర్తించి, అనుభవించినవారు మాత్రమే నన్ను కొంతవరకు తెలుసుకొనగలరు.

పరమాత్మను చేరుటకు ప్రేమ ఒక్కటే రాజమార్గము. ప్రేమ అనే మకరందము పరమాత్ముని పాదపద్మములందే దొరుకుతుంది".

(ప్రే. వా. విషయసూచిక తరువాతపేజి)

పశ్చాత్తాపమనే ప్రాణసారం అందులో ప్రవహిస్తూ వుంటే ఈ వృక్షాన్ని నేను చిగురింపజేయగలను. **మీరు ఒక్క అడుగు ముందుకువేస్తే నేను మీవైపుగా వంద అడుగులు వేస్తాను. మీరు ఒక అశ్రువు చిందిస్తే నేను మీ కన్నులనుంచి వంద బాష్పాలు తుడిచివేస్తాను.** మీ ఆనందం అభివృద్ధి కావాలని నేను ఆశీర్వదిస్తాను. రాత్రి చలి ఎక్కువైతే కంబళి మరింత గట్టిగా కప్పుకుంటారు. అల్లాగే **విచారం అధికమైనవేళ నామమనే రత్నకంబళంతో మీ మనస్సును కప్పుకోండి. ఇన్ని కోట్ల మంది భారతీయులలో మీ భాగ్య విశేషంవల్ల ఈ సన్నిధి మీకు లభించింది.** అనుగ్రహమనే అమృతంతో నింపటానికి దుర్వాసనల మాలిన్యాన్ని తొలగించి పాత్రను శుద్ధి చేయాలి. పాత్రను పరిశుద్ధం చేసుకున్న తరవాత అనుగ్రహామృతాన్ని అర్థించండి. తరుణం దాటిపోయిన తరవాత అవకాశం జారిపోయిందని విచారించకండి. **నన్ను గురించి ఒక్క క్షణంలో కాని, కొన్ని దినాలలో కాని మీరు తెలుసుకోలేరు. క్రమంగా కొన్ని దశలు దాటుతూ పోతే మీరు గ్రహించగలుగుతారు. వివేకవైరాగ్య, విచక్షణలద్వారా నన్ను తెలుసు కోగలుగుతారు.**

(వ.1963 పు.41/42)

మీయందు దివ్యత్వమనే జ్యోతి వెలగాలంటే అహంకార మమకారము లుండకూడదు. దీనికి నేనే చక్కని ఆదర్శం. ఎట్లా? ప్రతి రోజు మీరందరూ కూర్చున్న దగ్గరకు నేనే నడచి వచ్చి, నడుము వంచి, చేయి జూచి మీ నుండి ఉత్తరాలు తీసుకొంటూ ఉంటాను. అట్లుగాకుండా నేను అహంకారంతో ఒకచోట కూర్చుని, మీరే నాదగ్గరకు వచ్చి ఉత్తరాలివ్వండని అనవచ్చు కదా! అలా చేయను.

ఎందుకంటే **నాకు అహంకారం లేదని నిరూపించి మీకు కూడా అహంకార ముండకూడదని ప్రబోధించేందుకు. మీరు నావారు, వారు పరాయివారు అనే అభిమానం కూడా నాకు లేదు. అందరూ నావారే, నేను మీవాడనే.** ~~ఈ~~ **సత్యాన్ని గుర్తించండి.**

(స.సా.అ. 96 పు. వెనుక కవరుపేజి)

మీ దుఃఖములను, రోగములను, సందేహములను, బాధలను నాకు సమర్పించి, వాటికి బదులు ఆనందమును నానుండి పొందండి. నే నానంద స్వరూపుడను. రండి. **మీరు నన్ను విస్మరించినా, మిమ్ము నేను వదలి పెట్టను. దారి తెలియనట్టి, తెలిసినా విశ్వాసము లేని మీ వంటి వారికొరకే నేను వచ్చినది. దాహముతో మీరు దోసిలి పట్టితే, మీరెక్కడ ఉన్నా, ఏ వేళకైనా నేను వచ్చి అమృతము పోస్తాను. నేను మీ వెంటనే ఇంటనే, కంటనే, కంటికి రెప్పవలె యున్నాను. మీరు కలవరపడనవసరము లేదు.**

స.సా.మే.77 పు.68)

"ధర్మ నాశన మగుచున్న ధరణి యందు
ప్రభవ మందెను శ్రీ సాయి పర్తియందు
ఇంతకన్నను వేరెద్ది ఎరుకవఱుతు!
సాధు సద్గుణ గణ్యులౌసభ్యులార!"

(ఆ.ప్ర.న.92 పు.23)

అడవిలో నున్నను । ఆకాశమునన్నున్న
పట్టణమునున్న । పల్లెనున్న
గట్టుమీదను నున్న । నట్టేట నున్నను
మరువడు నీసాయి । మదిలోన నెప్పుడు ॥

(సా.పు. 2)

భక్తరక్షణమే నా ధర్మము. పెక్కు మంది భక్తులను ఒక్కని కాపాడుటకై, దుఃఖ సాగరమున ముంచుట ధర్మమా? యని నన్నొకరు ప్రశ్నించిరి. అట్టి కార్యమువలన యితరులకు కించిత్ బాధ కలిగినను లెక్కచేయను. శ్రీరామచంద్రమూర్తి తండ్రి ఆజ్ఞను పరిపాలించెనే గాని అయోధ్య ప్రజల దుఃఖమును శమింపజేయుటకు ప్రయత్నించెనా? నేనిటుల భక్తరక్షణకు, కష్టములు సహించియైనా, చేసినపుడే భక్తులు నా ఆదర్శమును గ్రహించి, తామును అట్లే యాచరింతురు.

(సా. పు. 9)

యావత్ మానవకోటిని నా దివ్య ప్రబోధములచే దైవోపముఖులుగా మార్చెడి మానసిక పరివర్తనమును, ఉత్తేజమును, సంచలనమును, నా ప్రేమ ప్రభావముతో కలుగజేసి వారి నందరిని లాలించి, పాలించి, **నాలో ఐక్యము చేసికోటమే నాలక్ష్యము.** మానవత్వము నుండి మాధవత్వమునకు దారి చూపుటయే నా సంకల్పము.

(సా॥ పు. 3)

సత్యమే నా ప్రచారము
ధర్మమే నా ఆచారము
శాంతియే నా స్వభావము
ప్రేమయే నా స్వరూపము

(సా॥ పు. 24)

ధర్మము అడవికి పారిపోయింది. పట్టణములలో అధర్మము పాతుకుపోయింది. ధర్మాన్ని మరల తీసుకువచ్చి, అధర్మాన్ని అడవికి తోలటమే నాకర్తవ్యం.

(సా॥ పు. 120)

రిక్త హస్తాలతో రండి, నావద్ద నుండి ఆనందాన్ని నింపుకు వెళ్ళండి.

(సా॥ పు. 125)

నేను అందరి యందువున్నాను. నేను లేని చోటు లేదు. మీరు ఏ నామముతో పిలచినా పలుకుతాను. ఎందుకనగా, అన్ని నామములు, అన్ని రూపములు నావేగా!

(సా॥ పు. 129)

నేనుండగా భయమెందుకు.

(సా॥ పు. 141)

రాముడు, కృష్ణుడు వారి అవతారాలలో ఆయుధాలు ధరించారు. అప్పుడు దుష్టశక్తులు కొద్దిగా యుండేవి. అందుచేత ఆయుధాలు ధరించవలసి వచ్చింది. ధర్మ స్థాపన కోసం కలియుగంలో కలి ప్రభావంచేత, కుల ధర్మములు పాటించక, పాపభీతి లేక స్వార్థపరులై

అసత్యము, అన్యాయము, అక్రమ మార్గముల యందు, వారి ధీశక్తిని ఉపయోగించి యిహలోక సౌభాగ్య అమరక్తులై యుండునపుడు అవతార పురుషుడు రక్షించేదెవరిని? శిక్షించేదెవరిని? శిక్షార్హులందరిని శిక్షించిన, **రక్షింప బడెటందుకు ఒక్కడు మిగలడు. కనుక యావత్ మానవకోటిని, నాదివ్య బోధనలచేత దైవోన్ముఖులుగా మార్చెడి, మానసిక పరివర్తనమును, ఉత్తేజమును, సంచలనమును, నా యొక్క ప్రేమ భావముతో కలుగుజేసి, వారినందరను లాలించి, పాలించి నాలో ఐక్యము చేసుకొనుటయే నా లక్ష్యము.**

(సా॥ పు. 144/145)

నేనే షిర్డీసాయిని - సర్వ ప్రాణులకు శరణ్యుడను, భరద్వాజుని గోత్రమున అవతరించుటకు అనుగ్రహించిన శివశక్తి స్వరూపుడను. నేనే భారద్వాజ ఋషిగోత్రీకుడను, ఆపస్తంబ సూత్రుడను.

(సా॥ పు. 147)

సత్యమే నా ప్రచారం, ధర్మమే నా ఆచారం శాంతియేనా స్వభావం, ప్రేమయే నా స్వరూపం. ఇందులో ఏఒక్కదానిని, జీవిత పర్యంతం నా యందు పూర్ణ విశ్వాసముంచి, నిశ్చయింతురో, ఆ క్షణమునుండి మీరు నా వారలు, నేను మీ వాడనని పేర్కొనుటే గాని, మీరు ఏ సమయమున, ఏ చోట నుండినను, ఎట్టి కష్ట పరిస్థితులలో నున్నను పిలవకయే రక్షించెదను.

(సా॥ పు. 172)

నేను మీతో కలసి తింటున్నాను. మాట్లాడుతున్నాను. మీతో తిరుగుతున్నాను. మీరు భ్రమపడుతున్నారు. నేను మీ వలె సామాన్యుడనని, నేను పాడుతున్నాను, ఆడుతున్నాను మీతో బాటు. మీకు భ్రమ కల్పిస్తున్నాను. **ఏ క్షణమైనా, నా స్వరూపం మీకు తెలియవచ్చు. ఆ సమయంకోసం మీరంతా తయారుగా యుండాలి.** దైవత్వం మానవునిలో వుంది. మీరు మాయను అధిగమించాలి. మానవాకారంలోనే దివ్యత్వం వుంది. అది నామరూపాలతో వుంది. సర్వదైవత్వ, స్వరూపమును ధరించిన మానవాకారమే యీ ఆకారము. మీరు సంశయింపవద్దు. మీరు నన్ను మీ హృదయాలలో స్థాపించుకున్నట్లయితే, నా నిజస్వరూపము మీకు గోచరిస్తుంది.

(సా॥ పు. 181)

చతుర్భుజములతోడను, శంఖచక్రములతోడను, నారాయణ రూపధారినై యవతరించి యుండిన నన్ను మీరొక విలాస మందిరమున బంధించి నన్ను చూడ దలచిన వారి యొద్దనుండి సుంకమును వసూలు చేసి యుందురేమో? సామాన్య మానవుని వలె బోధకుడనై మీకడకు వచ్చి యుండిన, నాశుభ సందేశములను, నుపదేశములను మీరు తిరస్కరించి యుందురేమో? కావున యిట్టి మహిమలను, మానవాతీత ప్రజ్ఞా వైభవమును, మానవాకారముతోనే ప్రదర్శించుచుంటినని గ్రహింపుడు. సంపూర్ణ ప్రేమానంద స్వరూపుడనై, నా నిజబోధనలచే లోకమందలి యశాంతిని పరస్పర విరోధ భావములను రూపుమాపుటకు నిరంతరము కృషి సల్పుతున్నాను.

(సా॥ పు. 189/190)

నాకు ఉన్న సంపద ప్రపంచములో ఏ చక్రవర్తికి లేదు. ఆ సంపద ఏమిటి? **నానిస్వార్థ ప్రేమ.**

(సా॥ పు. 201)

మానసికంగా ప్రార్థించు నాకు పూలదండలు అక్కరలేదు. పండ్లు అక్కరలేదు. అవి యేవినీవికావు. బజారులో కొనుక్కొని వస్తారు. **మీ నుంచి వచ్చిన వస్తువేదైనా యివ్వండి. పరిశుభ్రముగా యున్నది. పరిమళమైన మంచి గుణాలు. అమాయకత్వం నాకివ్వండి. అవి పశ్చాత్తాపము అనే కన్నీటితో కడిగి యుండాలి.** దండలు, పండ్లు మీ గొప్ప తనాన్ని తెలియజేస్తాయి. బీదవారు వాటిని తేలేరు. పైగా వారు మానసికంగా బాధపడతారు. **పరమేశ్వరుని మీ హృదయాలలో స్థాపించుకోండి, మంచి పనులు అనే పండ్లు, హృదయనిర్మలమనే పువ్వుల దండలు నాకర్పించండి. అటువంటి ప్రార్థనయే నాకు చాల యిష్టమైనది. అటువంటి**

భక్తియే నన్ను పూర్తిగా ఆకర్షిస్తుంది. నేను యింతవరకు వ్యక్తిగతంగా సలహాలు యిస్తూ వుండే వాడిని. ఇప్పుడు ఉపన్యాసాల ద్వారా సలహాలు యిస్తున్నాను. ఇది మీకు కొత్తగా యుండ వచ్చును. నాకు ఏమియు క్రొత్త కాదు. నిరాకారుడు, సాకారుడు అయినప్పుడు వచ్చిన కర్తవ్యం, అనేక రీతులలోనేరవేర్చాలి. ఏ యుగంలోనైనా సరే, మానవునకు క్రొత్తగా విద్య నేర్పవలసి వస్తుంది.

(సా॥ పు. 202)

నిన్ను నీవు నమ్ము భగవంతుడిని నమ్ము అదే రాజమార్గము.

(సా॥ పు. 624)

నేను పురుషులలో పురుషుడిని, స్త్రీలలో స్త్రీని, చిన్న పిల్లలలో చిన్న వాడను. ఎవ్వరు లేక ఏకాంతంగా యుంటే దేవుడను.

(సా॥ పు. 632)

నా అనుగ్రహము మెరుపులాగా వస్తుంది. అనుకోకుండానే నే పని చేస్తా.

(సా॥. పు. 644)

వెంట, జంట ఇంట వుండి కంటి రెప్పవలె కాపాడుచున్నాడు. కనుక ఈ విశాల తత్వాన్ని మీరు గుర్తిస్తే, భగవంతుని వెదకటానికి మీరెంత మాత్రము ప్రయత్నించరు. తాను లేని స్థానము, తనది కాని రూపము, జగత్తులో కానరాదు. ఈ విశ్వాసాన్ని మనము బలపరుచుకోవాలి. సరియైన భక్తుని లక్ష్యమిదే. **జపములు, ధ్యానములు, పూజలు, యోగములు ఇవి అన్నీ కాలమును పవిత్రము కావించుకునే కర్మలు మాత్రమే.** ప్రేమ దైవము ఇటువంటి ప్రేమను అభివృద్ధి పరుచుకొని దైవత్వాన్ని ఎక్కడ చూచినా, అక్కడ ఉన్నాడనే విశ్వాసముతో అతనిని ధ్యానిస్తూ ఉంటే ఎక్కడంటే అక్కడే కనిపిస్తాడు.

(సా॥ పు. 650)

నేను కాపాడదలచితినా, పూర్తిగానే కాపాడుదును. మొదలు బబ్బే రానీయను. అది వచ్చిన పిమ్మట, అందులో కొంత కుదిర్చి, కొంత మిగిల్చి, యతని నందరు గుర్తించునట్లు పడకలో పడియుండు స్థితిలో - విడుచుట యుండనే యుండదు.

(స.వ. పు. 24)

అవతారము యొక్క ప్రతిపని, ప్రతి కార్యము ముందే నిర్ణీతమై యున్నాయి. సత్యాన్ని, ధర్మాన్ని నిలబెట్టుటకు రామావతారం వచ్చింది. ప్రేమశాంతులను నెలకొల్పె టందులకు కృష్ణావతారము వచ్చింది. కాని యిప్పుడు చూస్తే ఈ నాలుగు పూర్తిగా ఎండిపోయే అపాయస్థితిలో వున్నాయి. అందుచేతనే యీ ప్రస్తుత అవతారం వచ్చింది. అరణ్యంలో యున్న ధర్మాన్ని మరల పల్లెల పట్టణాలకు తరలించుకు రావాలి. మనలను నాశనము చేస్తున్న అధర్మాన్ని అరణ్యానికి పారద్రోలాలి.

ఆనందము, శాంతి పేటికలో యున్నది. దాని తాళపు చెవిని మీకు అందివ్వటానికి నేను వచ్చాను. ఆ సెలఏళ్ళు, ఎక్కడ తాకితే వస్తాయో అది చూపించడానికి వచ్చాను. మీరు వాటిని పూర్తిగా మరచిపోయారు. ఈ శుభసమయం మీరు ఉపయోగించుకోలేకపోతే అది మీ దురదృష్టము. మీరు నా వద్దకు చిన్న చిన్న విషయాలకు వస్తున్నారు.

(సా. పు. 216)

నన్ను సేవింపుము నాలోయున్న శక్తి తీసికో, నన్ను శరణాగతి పొందుము. అది నీవుత్సాహమును బట్టి ఆతురతను బట్టి వుంటుంది. నీవు గ్లాసు పట్టుకువస్తే గ్లాసే నింపుతాను. బిందె పట్టుకువస్తే బిందేనింపుతాను. అంటె అంతటి ఆనందమే అందిస్తాను. నీ ఆదుర్దాలు, బాధలు, కోరికలు అన్నీ నాకు విడిచిపెట్టు, నానుండి ఆనందం, శాంతి, శక్తి తీసుకువెళ్ళు.

(సా॥ పు. 424)

నిశ్చలమైన భక్తి, నమ్మకం యున్నవారికి నా అనుగ్రహం ఎల్లప్పుడు వుంటుంది. నేను వారితో సంభాషిస్తాను. పాడుతాను. కాని మేధావులు నా సత్యమును గాని, నాశక్తిని గాని, నా మహోన్నతాన్నిగాని నా అవతార కర్తవ్యాన్ని గాని అర్థం చేసుకోలేరు. నేను ఎట్టి జటిల సమస్యనైనా పరిష్కరిస్తాను. ఎంత గట్టి పరీక్షలు చేసినా

వారికి అందను. నన్ను అంచనా వెయ్యలేరు, నా ప్రేమ రుచి చూచిన వారికి ప్రేమానుభవమువున్నవారికి మాత్రమే నన్ను గురించి ఈ షన్మాత్రమైన తెలిసికోగలరు. **ప్రేమ అనేదారి మాత్రమే మానవాళిని నా దగ్గరకు తీసుకు వస్తుంది. అదే రహదారి.**

(సా॥ పు. 592)

ఈ అవతారములో దుష్టులను సంహరించను. వారిని బాగు చేస్తాను. వారి మనసునను సన్మార్గానికి త్రిప్పుతాను. చెదపట్టిన చెట్టును నరికి వెయ్యను. దానిని రక్షిస్తాను. ఈ అవతారము భక్తులకోసం వచ్చింది. సాధువులకు, సాధకులకు మాత్రమే వచ్చింది. ఈ అవతారమునకు జపమక్కరలేదు. ధ్యానం గాని, యోగం గాని అక్కరలేదు. ఎవ్వరిని ప్రార్థించదు. ఎవ్వరికి పూజ చెయ్యదు. ఎందుకనగా **ఇదే "మహాతో మహీయాన్" అన్నింటి కంటె గొప్పది.** పెద్దది కనుక. ఎట్లా పూజచెయ్యాలో, ప్రార్థించాలో మీకు నేర్పుతుంది.

(సా॥ పు. 398)

ముఖ్యమైనవిషయమేమిటంటే, మీరు అనుగ్రహము పొందటానికి దైవత్వంలో నమ్మకాన్ని వృద్ధి చేసుకోవాలి. సమస్యలను మనో వేదనలను మీరు నిజంగా ఆహ్వానించాలి. అవియే మీకు నమ్రతను, అణకువను దైవత్వాన్ని అందిస్తాయి. **బాహ్య విషయాల వెంట తిరగడం, పరుగెత్తడం అసంతృప్తికి కారణమవుతుంది. కోరికలకు అంతులేదు. ఇంద్రియములకు ఒకసారి బానిస అయిపోతే, చచ్చేటంతవరకు అవి నిన్ను విడిచిపెట్టవు. అది తీరని దాహము.** కాని నేను మిమ్ములను పిలుస్తున్నాను. ప్రాపంచిక వరాలు కూడా యిస్తాను. దానిచేతనైన మీరు నమ్మి భగవంతుని వైపుకు తిరుగుతారు. ఇంతవరకు ఏ అవతారము యిట్లా చెయ్యలేదు. ప్రజల మధ్య తిరగటం, సలహాలు ఇవ్వడం, మంచి మార్గాలు చూపడం, ఓదార్చడం, ఉన్నత స్థితికి వెళ్ళడం.

(సా॥ పు. 270)

నా శక్తిని ఎవ్వరు కొలవలేరు. మీరు నన్ను ఎంత గట్టిగా పరిక్ష చేసినా తెలుసుకోలేరు. నాసత్యాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు. అది అంతులేనిది. నన్ను ఏ పనిముట్టుతోను కొలవలేరు. నాకు తెలియనిది లేదు. **నేను పరిష్కారము చెయ్యలేని సమస్యలేదు. నా పరిపూర్ణతకు అంతులేదు. నేను పరిపూర్ణుడను.**

(సా॥పు. 340)

నా శక్తికి పరిమితి లేదు. ఇది అవ్యయము. సముద్రమువలె అనంతము. ఎవరైననూ, ఎక్కడున్ననూ, ఏమి కావలెనన్ననూ, కావలసినంత తీసికొనవచ్చును.

(స.సా.జూ.85, పు. 181)

నేను మీ హృదయంలో వున్నాను. కాబట్టి, మీ బాధలు నాకు తెలుసు. మీసంతోషాలు తెలుసు. నేను ప్రతివారి హృదయదేవాలయములోనే నివసిస్తూ వుంటాను. నన్ను మరచి పోవద్దు. **నన్ను అంటిపెట్టుకునే ఉండండి. ఎందుకంటే, నిప్పు ఉన్న ఒక బొగ్గు ముక్కను, ఇంకొక బొగ్గుముక్క అంటి పెట్టుకుని ఉంటే, అది కూడా నిప్పు ఉన్న బొగ్గుగా మారుతుంది. మీహృదయంలో, మీరు నా దగ్గరగా యుండునట్లు అలవాటు చేసుకోండి. మీరు బాగుపడతారు. మీరు కూడానా అనంతమైన ప్రేమనుండి కొంత ప్రేమను పొందుతారు. ఇది యొక గొప్ప అవకాశం. మీరందరును, మోక్షము పొందుతారని నమ్మండి. మీరంతా రక్షింపబడతారని తెలుసుకోండి.** చాల మంది ఇంతకంటె మంచి పరిస్థితులు వస్తాయని నమ్మటం లేదు. జీవితం సుఖమయం అవుతుందని, ఆనందమయం అవుతుందని, మరల స్వర్ణ యుగం వస్తుందని నమ్మటానికి చాలా మంది జంకుతున్నారు. **నేను మీకు వాగ్దానం చేస్తున్నాను. ఈ ధర్మ స్వరూపుడు ఈ దివ్య శరీరము నిష్కారణంగా రాలేదు. మానవ సమాజమునకు వచ్చిన సంక్షోభం నివారించటంలో జయము పొందుతాడు.**

(సా॥ పు. 290)

నాకు కోరికలు లేవు. అందుచే పుట్టవలసిన పని లేదు.

(సా॥ పు. 442)

నేను భగవంతుడను. మానవ రూపములో వచ్చినాను. నేను మానవుల మధ్య తిరుగుతున్నాను. నా మాటలు

వింటారని, నా సమీపమునకు వస్తారని, ప్రేమిస్తారని, ఆజ్ఞ పాలిస్తారని, నేను మానవ భాషలోనే మాట్లాడాలి. మానవుడిలా ప్రవర్తించాలి. అట్లా ఉండకపోతేక నన్ను నమ్మరు. తోసివేస్తారు. లేక భయపడి దగ్గరకు రారు. **ప్రేమాస్పదుడను. అందుకే ప్రేమ బోధిస్తాను.** నన్ను ఎవ్వరు తెలుసుకోలేరు. ఈ ప్రపంచాన్ని సృష్టించాను. పర్వతాలు వచ్చాయి. నదులు ప్రవహిస్తున్నాయి. భూమి ఆకాశములు అప్పుడే వచ్చాయి. సముద్రాలు, సూర్యుడు, చంద్రుడు, అడవులు ఎడారులు ఏర్పడ్డాయి. ఇవన్నీ కూడా నన్ను జ్ఞాపకం చేయడానికే. అప్పుడు ప్రాణకోటి అంతా వచ్చింది. మానవులు, పక్షులు, జంతువులు. **మొదటి స్థానము మనుష్యులకే ఇచ్చాను. నన్ను గూర్చిన జ్ఞానము మొట్టమొదటిగా మానవుని హృదయంలో పుంచాను.** నా ప్రేమకించితులోనే మీరంతా జీవిస్తున్నారు.

(సా॥ పు. 483)

ప్రేమనా స్వరూపము, సత్యం నా ఊపిరి, ప్రచారం, ఆనందం నా ఆహారం నిస్వార్థసేవ నా సందేశం, విశాల హృదయం నా జీవితం, ధర్మం నా ఆచారం, శాంతి నా స్వభావము.

(సా॥ పు. 515)

మీరంతా దివ్యాత్మ స్వరూపులు, ప్రేమాత్మ స్వరూపులు, స్వచ్ఛమైన ప్రేమ మూర్తులు. దివ్య ఆత్మ అవతారమూర్తులు.

(సా॥ పు. 535)

నేను మీ హృదయాలను వెలిగించటానికి వచ్చాను. అది రోజురోజుకు ప్రకాశవంతంగా చేస్తాను. ప్రేమను స్థాపించు, ప్రేమలో నివశించు. ప్రేమను వెదజల్లు. ఈ ఆధ్యాత్మిక జీవితమే ఆనందాన్ని ఇచ్చేది.

(సా॥ పు. 541)

ప్రేమించు, ప్రేమిస్తూనే యుండు. అన్ని విషయాలు అవే బాగుపడతాయి.

(సా॥పు. 547)

నాబలవత్తర శక్తి ఏమంటే నా ప్రేమ. నేను ఆకాశాన్ని భూమిగాను భూమిని ఆకాశంగాను మార్చగలను. కాని అది దైవత్వముకాదు. అనుపమానమైనది దైవత్వమే.

(సా॥ పు. 553)

నా అనుగ్రహము కోసం పట్టుపట్టుము. ఆదేశించుము. కోరుకొనుము. పొగడవద్దు. **మీహృదయాలను నావద్దకు తీసుకురండి. నా హృదయం జయించండి. మీరెవ్వరు నాకు క్రొత్త కాదు. మీ కోరికలను నావద్దకు తీసుకురండి. మీ కోరికలలోని నిజాయితీని స్వచ్ఛతతో బాటు మీ హృదయాలు నిర్మలంగా ఉండాలి. నాకు అంతే చాలు.**

(సా॥ పు. 559)

నా జీవితమే నా సందేశము.

(సా॥ పు. 569)

ప్రపంచంలో ఒక్కటే కులం వుంది. అది మానవకులం ఒక్కటే మతం - అది ప్రేమ మతం. ఒక్కటే భాష - అది హృదయంలో నుంచి వచ్చిన భాష. ఒక్కడే భగవంతుడు- అతడు సర్వాంతర్యామి.

(సా॥ పు. 559)

ఏ దేశ మేగినా ఈ నామమే సుమీ
సత్యసాయీ అనుచు నిత్యస్మరన.
ఏ ఊరు చూచిన ఈ నామమే సుమీ
సత్యసాయీ అనుచు నిత్య జపము.
ఏ నోట విన్ననూ ఈ నామమే సుమీ
సాయిరామా అనుచు సత్యజపము.
ఎచ్చోటో విన్ననూ ఈనామమే సుమీ
సత్యసాయీ అనుచు నిత్యభజన.
ఇట్టు విశ్వమెల్లడ వ్యాప్తియై వెలయునట్టి
భక్త జనులకు ప్రాపునై బరగునట్టి
భక్తినొసగి రక్షించెడు శక్తిమయుడు
పర్తివాసుడు మిమ్మేల ఎత్తుకొనడు?
ఏ గుణంబు గణించి ఏతెంచెనోనాడు
ప్రహ్లాదు పాలింప పరమ పురుషుడు
ఏ గుణంబు గణించి ఏతెంచె నోనాడు
కరిని గాచెడు తరి కమలనయనుడు

ఏ గుణంబు గణించి ఏతెంచె నోనాడు
పేద కుచేల బ్రోవ వేదచరితుడు
ఏ గుణంబు గణించి ఏతెంచెనోనాడు
ధృవ కుమారుని సాక వైకుంఠవాసి
ఆ గుణంబె గణించి అమరవంద్యుడు
ఆర్త జనార్త నాథుడు అనాథ నాథుడు
శ్రీ సత్యసాయి నాథుడు శ్రీనాథు లోకనాథు
సచ్చితానంద మూర్తి పుట్టపర్తి షడ్చక్రవర్తి.

(శ్రీ.స.ప్ర.పు.71)

ప్రేమతత్త్వము ప్రబోధించి
మమత సమతను పొందుపరచి
మానవత్వపు విలువ దెల్పిన
ప్రేమమూర్తియె సాయిదేవుడు.

(స.సా.ఫి.95పు.29)

"వేద శాస్త్రాలను భారత సామ్రాజ్య హృదయంలో తిరిగి స్థాపించి, ప్రజలకా విజ్ఞానాన్ని వెల్లడి చేయడం నాముఖ్య కార్యం! ఈ నిర్ణీత కార్యం (మిషన్) నెరవేరుతుంది. ప్రభువు నిశ్చయించుకొని సంకల్పించి నపుడు దానికి ఎటువంటి విఘ్నాలు సంభవించినా అది ఆగిపోదు. మందగించదు. ఆయన దివ్యానుగ్రహానికి ఆటంకం ఎన్నటికీ ఉండదు,"

(లో.పు.88)

"ప్రేమ నా ప్రత్యేకమైన చిహ్నంకాని; **విభూతి ఇతర భౌతికవస్తువులు సృష్టించడం, సంకల్పమాత్రం చేతనే ఆరోగ్యాన్ని ఆనందాన్ని కలిగించడం మొదలైన వేవీకాదు. ఈ మహిమలనే వాటిని దివ్యత్వానికి చాలా స్పష్టమైన గుర్తుగా మీరు భావించవచ్చు**. కాని, మిమ్మల్నందరినీ సంతోషంతో ఆదరించేదీ ఆశీర్వదించేదీ; అన్వేషకులు, బాధలు పడుతున్నవారు, ఆపదలలో చిక్కినవారు ఇక్కడఉన్నా దూరప్రాంతాల్లో ఉన్నా ఎక్కడున్నా వారివద్దకు నేను పరుగెత్తి వెళ్ళేలా చేసేదీ అయిన ప్రేమే నిజమైన గుర్తు!"

(లో.పు.26)

"నాకు నిశ్చింత, విశ్రాంతి సంతృప్తి ఎప్పుడు కలుగునో తెలియునో. మీరందరూ ఆధ్యాత్మిక చింతన, వైరాగ్యము, సేవాతత్పరత అలవరచుకుని ఆనందముగా వున్నప్పుడు. నేను నిరంతరము ఏదో ఒక కార్యకలాపము నందు నిమగ్నుడనై యుండుట మీ మేలుకొరకే, నేనేమీ చేయక పోయినను నన్నడుగ గల వారెవరును లేరు. నాకు వచ్చు నష్టమూ లేదు. నేను ఎట్టి కర్మనూ ఆచరించ నిచ్చగించను. అయిననూ, నిరంతరమూ మీ కుత్సాహము, **ఉత్తేజమూ కలిగించి మిమ్ము దైవోన్ముఖులుగా చేయు నుద్దేశ్యముతో ఆచరణ రూపమున మార్గదర్శిగా యుండుటకిట్లు సదా కార్యాచరణ యందు నిమగ్నుడనై యుండెదను."**

(స.శ.సు.తృ.పు.20)

"ఏ దీర్ఘరోగ నివారణకొరకో నా వద్దకు వచ్చెదరు. నా తత్వమును గ్రహించిన పిదప భవరోగ నివారణ కొరకు నన్నా శ్రయించెదరు. దానికి నేనెప్పుడూ సిద్ధముగనే వున్నాను."

"నేను ప్రేమపూర్వకముగా మీ శ్రేయస్సు కొరకు దివ్యౌషధము వంటి సలహాల నిచ్చినాను. వాటిని గూర్చి నిత్యమూ మననము చేసుకొనుడు. పశ్చాత్తాపముతో మీహృదయములను పరిశుద్ధము చేసుకొనుడు. దుశ్చింతలను దరిచేరనీయకుడు. దృఢ సంకల్పముతో మీ జీవితములను సంస్కరించుకొనుటకు పూను కొనుడు. భగవదనుగ్రహముతో మీ నిండు హృదయములు పుష్పించు మార్గమును త్రికరణ శుద్ధిగా అవలంభించుడు."

(స.శి.సు.తృ.పు.23)

సమస్తము నాకు అర్పించి నన్ను శరణువేడిన భక్తుల బాధలను స్వీకరించుట నాకర్తవ్యము. నాకు బాధలేదు. నాకర్తవ్యమును నిర్వర్తించుటలో నేను అనుభవించు బాధ నాకు ఆనందదాయకమైనది. ఆ పరిస్థితులలో నా బాధను జూచి మీరు బాధ పడకూడదు. తనయందు విశ్వాసము చూసిన వారి కొరకు క్రీస్తు తన ప్రాణమునే త్యాగము చేసెను. **సేవాధర్మమే భగవత్స్వరూపము. త్యాగమే ప్రేమకు పరాకాష్ట ; అదే దైవము.**

(స.శి.సు.తృ.పు.49)

"నేను మానవుడను కాను, మానవాతీతుడను కాను, భగవంతుడను కాను, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుడను కాను, నేనెవరివని మీరడుగవచ్చు, **నేను సత్య ప్రబోధకుడను, నేనే సత్యం, శివం, సుందరం"**

(స.శి.సు.తృ.పు.98)

నానుంచి ప్రసారమయ్యే కిరణాలు మూడు రకాలు. ఒకటి స్థూలము. అవి ప్రశాంతి నిలయమంతా నిండి ఉంటాయి. రెండవది సూక్ష్మము. అవి భూమి అంతటా వ్యాపించి ఉంటాయి. మూడవది కారణము, అవి విశ్వమంతటా పరివ్యాప్తమై ఉంటాయి. ఇక్కడ నిలయంలో నివాసం ఉండేవారు ఈ కిరణాలకు అత్యంత సన్నిహితంగా ఉంటున్న కారణంగా వారెంతో అదృష్టవంతులు. స్థూల కిరణాలు మానవుణ్ణి సాధకునిగా తయారు చేస్తాయి. సూక్ష్మకిరణాలు మహాత్మునిగా తయారు చేస్తాయి. కారణ కిరణాలు మానవుణ్ణి పరమ హంసగా మార్చివేస్తాయి. అందువల్ల మీరు సమయాన్ని ప్రాపంచికమైన కోరికలతో, వాటిని నెరవేర్చుకొనే ఆలోచనలతో వృథా చేసుకోకండి. ఈ విషయంలో జయాపజయాల గురించి, సుఖ దుఃఖాల గురించి యోచించవద్దు. మీ కోసము షడ్రసోపేతమైన విందు సిద్ధంగా ఉంటే మీరు వారి టేబుల్ దగ్గర. వీరి టేబుల్ దగ్గర పడిన చుక్కలు రుచి చూడటానికి ఎందుకు వెళతారు? అది సరియైన పద్ధతి కాదు. దానివల్ల మీకు ఎటువంటి ప్రయోజనమూ లేదు.

(వ.61-62 పు.179/180)

"సాయి శక్తి అనంతము, అపారము. సర్వశక్తులూ సాయి అరచేతి యందున్నవి. 'తమకు అన్నియు తెలుసు' అనుకొనే పండితుడు, యోగులు, జ్ఞానులు - వీరందరూ ఆ మహాశక్తిలో అత్యల్పభాగాన్ని మాత్రమే అర్థం చేసుకోగలిగారు. అన్ని యుగములలోనూ ఇదే పరిస్థితి. శారీరకంగా అవతార పురుషునికి సన్నిహితముగా ఉండవచ్చును. కానీ, అట్టివారు తమకు దొరికిన లబ్ధిని గుర్తించి, వర్తించలేకున్నారు. పైగా నా మహిమలను గురించి అతిశయోక్తులుగా చెబుతారు. ఇవన్నీ నా విభూతితో పోల్చిన, ఏనుగుతో పోల్చిన దోమవంటిది. అందుచేత. నా నిజ తత్వమును మరచి, మీరు ఈ మహిమలనే తలుచుకుంటే, నాలో నేను నవ్వుకుంటుంటాను. **మహిమలను గురించి అంత ప్రాముఖ్యత నివ్వవద్దని హెచ్చరించుచున్నాను. వీటన్నిటికన్న అతి ప్రధానమైన శక్తి నాలో ఒకటి ఉన్నది. అదే నా ప్రేమ".**

"ఏను దైవంబు - తద్భిన్న మేమికాను
ఆయఖండ పరబ్రహ్మ మౌదునేను
వ్యధలు క్లేశాలు నను స్పృశింపంగ లేవు
సచ్చిదానందుడను సత్యసాయి విభుడ.
'నేను దైవాన్ని - పరబ్రహ్మమూర్తిని
సచ్చితానందుణ్ణి - నేడు సత్యసాయిగా
అవతరించాను.

(స.సా.న.99 పు.309)

ఉత్తమాటలచేత చిత్తము-సత్తుచిత్తానంద మొందరు
విత్తనంబులు లేని భూమిలో-మొత్తముగ పంటేమి పండదు
కన్నువిప్పి చూడరోరన్నా-శ్రీసాయిదేవుని
ఎన్నగా ఎందైన గలడన్నా!
మున్ను షిరిడీ నేడు పర్తి-ఉన్నవాడని పేరే కానీ
తన్ను భావనచేయు భక్తుల-కన్నులందే మెలగునన్నా!

(శ్రీ.స.వి.వా.పు.1)

రాగమును అరికట్టనేరక-యోగియైనను పతనమందును
భోగమును విడనాడువారికె-యోగమది లభియించునయ్యా
కన్ను విప్పి చూడరోరన్నా! శ్రీసాయిదేవుని
ఎన్నగా ఎందైన గలడన్నా.
గట్టు జేర్చుమటన్న వారికి-గట్టి యోడను పట్టి చూడగ
పట్టుబట్టలు గట్టి-చుట్టు తిరిగే పుట్టుస్వామిని
కన్ను విప్పి చూడరోరన్నా! ఒట్టిమాటలవాడు కాడన్నా
ఈ సాయిదేవుడు బొట్టబొమ్మల చూడబోడన్నా!

(శ్రీ స. వి. వా. పు. 14)

ఇంద్రియంబుల మనసు నిలిపిన-అంధుడై నను ముక్తి పొందును
ఇంద్రియంబుల నిగ్రహించని-చంద్రుడైన పసందు లేదను
కన్ను విప్పి చూడరోరన్నా!

ఈ సాయిదేవుని - యెన్నగా యెందైన కలడన్నా!
మున్ను శిరిడీ నేడు పర్తీ - ఉన్నవాడని పేరెగాని తన్ను
భావన చేయు భక్తుల - కన్నులందే మెలగునన్నా
కన్నువిప్పి చూడరోరన్నా!

(శ్రీ.స.వి.వా. పు. 29)

ఒట్టి మాటలవాడు కాడన్నా - ఈ సాయిదేవుడు
బుట్టబొమ్మల చూడబోడన్నా
గట్టుజేర్చుమటన్న వారిని - గట్టి ఓడను పట్టిచూడగ
పట్టు బట్టలు కట్టి భక్తుల - చుట్టు తిరిగే పొట్టి స్వామిని
కన్ను విప్పి చూడరోరన్నా:

(శ్రీ.స.వి.వా. పు. 38)

నీతి నియము లేక తిరిగిన - ధాతకైన అజ్ఞాన మొదగదు
జ్యోతిలేనిది అంధకారము - భూతలంబున లేదటంచును
కన్ను విప్పి చూడరోరన్నా - ఈ దేవదేవుని
యెన్నగా యెందైన కలడన్నా!

(శ్రీ.స.వి.వా.పు.47)

బుద్ధి నిలకడలేని మనుజుడు - పొంద జాలడు శాంతి సుఖములు
విషయసుఖములు వెంట పరిగిడు - వెట్టి జీవికి ఎచట శాంతి?
కన్ను విప్పి చూడరోరన్నా!

(శ్రీ.స.వి.వా.పు.54)

అల్ప గురువుల చెంత చేరకు - స్వల్ప గుణములు చింత చేయకు
తలపులన్నియు నిలిపి వేసిన - తనువుకెప్పుడు జన్మలేదు!
కన్నువిప్పి చూడరోరన్నా!

(శ్రీ.స.వి.వా.పు.68)

అన్ని మతములు తననె చూపును - అన్ని మూర్తులుతనవె రూపులు
అన్నిటందున తానె యుండుగ - అదియె గదరా బ్రహ్మపదము
కన్ను విప్పి చూడరోరన్నా! ఈ సాయిదేవుని
ఎన్నగా ఎందైన గలడన్నా!
మున్ను షిరిడీ నేడు పర్తీ - ఉన్నవాడని పేరెగాని
తన్ను భావనచేయు భక్తుల - కన్నులందే మెలగునన్నా
కన్ను విప్పి చూడరోరన్నా!

(శ్రీ.స.వి.వా. పు. 95)

మతము మతముకు మధ్య ద్వేషము - జాతి జాతికి మధ్య జగడము
దేశదేశములందు రగడలు - దేనికయ్యా! మత ప్రబోధలు
కన్నువిప్పి చూడరోరన్నా - ఈ సాయి దేవుని
ఎన్నగా ఎందైన గలడన్నా!
మొన్న షిరిడి నేడు పర్తీ - ఉన్నవాడని పేరెగాని
తన్ను భావన చేయు భక్తుల - కన్నులందే మెలుగునన్నా!

(శ్రీ.స.వి.వా. పు. 190)

కనుల కగుపించు దృశ్యంబు కాంచి మీరు
సత్యమని ఎంచబోకుడి సంబరమున
తెరను దాగిన సత్యంబు తెలసికొనగ
విశ్రమింపక నాతోడ వెడలిరండు.

(శ్రీ.స.వి.వా. పు.80)

"రండి పరీక్షించండి, అనుభవించి ఈ తరువాత విశ్వసించండి. అంతే కాని, ఎవ్వరో ఏదో చెప్పినారని, విశ్వాసముపోగొట్టుకొనవద్దు"

(స.సా. ఫి. 75 పు. 372)

ఆనంద బాలుడే ఆనంద బాలుడై
తన వారి గుర్తింప తరలి వచ్చె;
ఆ రామచంద్రుడే ఈ రామచంద్రుడై
తన బంటులను కనుగొనగవచ్చె;
ఆ యీ శుడే బాల సాయీశుడై నేడు
తన గుంపుతో ఆడుకొనగవచ్చె;
ఆ మహావిష్ణువే యీ మహావిష్ణువై
తన ఆయుధములు చే కొనగవచ్చె
అల్ల పరమాత్మ యను బొమ్మలాటగాడు
తాను జీవుల రంగస్థలాన నిలిచి
ఆడు ఆనాటి ఈనాటి ఆట జూచి
సుంత వర్ణించి కొంత సంతసము గనుడు.

(స. సూ. ప్ర. భా. 1976 పు.2/3)

నేను ప్రతి ప్రాణి హృదయమునందున్నాను. ఈ ప్రాణికి తెలిసినా తెలియకున్నా, నేనక్కడ ఉన్నాను. నేను వానిని ప్రేమించి, వాడా ప్రేమను తిరిగి నాకిచ్చిన యీ రెండు ప్రవాహము లొక దాని లోనికి మరొకటి ప్రవహించుతవి. ఆ విధముగా అవి సంగమించటముతో రోగ నివారణ కలుగుతుంది. ఈ విధముగా నా భక్తుల యొక్క సవ్యమైన లౌకిక వాంఛలను తీర్చి, తర్వాత ఆధ్యాత్మిక కోరికలు కోరునట్లు చేయగలను. ఈ లీలలు నేను గావించుట లేదు. అవి నాలో నుండి ప్రకటిత మవుతున్నది. ఈ విధముగా నా ప్రేమ నిర్గమించుచున్నది.

(శ్రీ.స.సూ. 5/6)

మీరు నన్ను పొందే ప్రయత్నము చేయనక్కర లేదు. **మీకు నా అవసర మున్నదని విశ్వసించిన చాలు.** అనగా మానవుడు నాకు శ్రీసత్యసాయి బాబా కావలెను. కావున నాకు వారిని పొందే అర్హత ఉన్నది అని గ్రహించ వలెను.

(శ్రీ.స.సూ. పు.6)

నాకు ఊరు లేదు; పేరూ లేదు. ఏవీ పేరుతో పిలిచినను పలుకుదును; ఏ ఊరికి పిలిచిననూ పోవుదును. నేను బాలుర నడుమ నున్నపుడు బాలుడను. స్త్రీల నడుమ నున్నపుడు స్త్రీని. **ఒంటరిగా నున్నపుడు పరమాత్మను.**

(శ్రీ.స.సూ.పు.7)

మీరు నన్ను వదిలినా, నేను మిమ్ము వదలను. ఒక్కసారి పట్టుకొనిన నా పట్టు నుండి మీరు తప్పించుకొనలేరు. **మీరు నాకు సన్నిహితులు, ప్రేమ పాత్రులు అయ్యేకొలది మీరు దహింపబడే అవకాశము అధికముగా ఉంటివి. (దహింపబడుట అనగా అమితముగా పరిశుద్ధముగావలసి యండుట).**

కేకి పించాక్షములవలె దుర్భలులు చలించుతూ ఉంటారు. క్షణకాలము కూడ నిశ్చలముగా ఉండలేరు. వారి మనస్సు లోలకము వంటిది. లోలకమువలె ఆనంద దుఃఖముల మధ్య అటు నిటు భ్రమించుతుంటారు. విశ్వాస అవిశ్వాసముల మధ్య కంపించుచుంటుందా లోలకము. ఒకసారి స్వామియందు విశ్వాసముంటుంది మరుక్షణమే సందేహము కలుగుతుంది. సంశయములో చలించుతూ ఉంటారు. హృదయమును స్థిరముగా ఉంచుకొనుట నేర్చుకొనవలెను. వచ్చి, పరీక్షించి, అనుభవించి ఆ తర్వాత విశ్వసించండి, అంతే కాని ఎవ్వరో, ఏదో చెప్పేరని విశ్వాసము పోగోట్టుకొనవద్దు.

(స.సూ. పు.17/18)

నా రహస్యమును నెవ్వరు తెలిసికొనలేరు. నా నిజతత్వమును గురించి మీరు వాదోపవాదములు చేసియు లాభములేదు. తింటే రుచి, మునిగితే లోతు తెలియునట్లు సత్యము, ప్రేమ అభివృద్ధి చేసికొనిన **నాకు ఇది కావలెను, అది కావలెను అని మీరడుగనక్కరలేకయే నేను మీ కోర్కెలను తీరుస్తాను. మీరడుగకుండనే నానుండి అన్నియు మీరు పొందగలరు.** నరుడు నారాయణుడు అనునవి రెండు విద్యుత్ తీగలు. ఆరెంటిని కలిపిన, విద్యుచ్ఛక్తి దానంతటదే ప్రవహించును. సత్యము, ప్రేమ అను సద్గుణములలవరచుకొని నరుడు నారాయణునితో సహకరించిన, దివ్యశక్తుల సాధనగా తయారుగును.

(శ్రీ స.సూ. పు. 7)

మీరందరును నాకడకు వచ్చి, నేను చెప్పు విషయములు శ్రద్ధతో వినుచున్నారు కదా! అట్లు వినుటవలన మీరు పొందుచున్న లాభమేమి? **ఏదో యానందము ననుభవించు చున్నారు.** అదుగో ఆ యానందము కొరకే సత్సాంగత్యము చేయవలసినది. మంచి పనులు, మంచి యాలోచనలు చేయవలసినదియు అందుకొరకే. ఇంకొకమాట; నేను మీకానందము నిచ్చుచున్నానని మీరంగీకరింతురు కదా. మరి యందుకు ప్రతిగా మీరు నాకిచ్చునది యేమి? నాకేమియు నియ్యనక్కరలేదు.మీరు, నేను చెప్పినట్లు చేయుడు; నా యుపదేశముల నభ్యాసములో పెట్టుకొనుడు. అది చాలును. అంతమాత్రమే నేను మిమ్ము కోరునది.

(శ్రీ.స.సూ..పు.13/14)

మీరు మీకు మార్గదర్శిగా నన్నెన్నుకొనుట, **యెంత గొప్ప యదృష్టమో, మీరిప్పుడు తెలిసికొనలేరు.**

మిమ్మందరిని చక్కగా సంస్కరించు వరకును నేను **విశ్రాంతి** తీసికొనను.

(శ్రీ.స.సూ.పు.15)

మీరందరు నూతన గృహములు నిర్మించి, **వాటిలో భగవానుని ప్రవేశ పెట్టవలెనని నా కోరిక. గృహములనగా డబ్బుతోను ఇటుకలతోను కట్టునవి కాదు. నా భావములు, మంచి యాలోచనలతోను, మంచి మాటలతోను, మంచి పనులతోను, మంచి సహవాసము తోను సౌశీల్య మను గృహము నిర్మించుకొని, అందులో శాంతముగను, నిర్విచారముగను జీవింపవలె.** అట్టి గృహప్రవేశమునకు మీరు నన్ను ఆహ్వానింపుడు. తప్పక వత్తును. **వాస్తవానికి, ఇంతకు పూర్వమే అది నా ఇల్లు. కనుక, ఆ గృహమునకు వచ్చుటకును, అందు ప్రవేశించుటకును, మీ యాహ్వానము కూడా అక్కరలేదు. నాకై నేనే వత్తును.** ఇపుడు మీరు నివసించుచున్న గృహములు ప్రాపంచిక సుఖముల కొరకు, ఆ గృహము ఆధ్యాత్మికానందము కొరకు; పవిత్రమును, నన్నభిషించు నదియు నైన హృదయమే నా నివాస స్థలము.

(శ్రీ.స.సూ. పు.15/16)

తమ తమ శక్తి కొలదిని, అవకాశముకొలదిని కృషి చేయుచున్న అన్ని సభలును, అన్ని సంఘములును నాకు ప్రియములే. విడి విడిగా పని చేయుచున్న వ్యక్తులను నా ప్రేమకు పాత్రులే. నన్ను పూజింపవలెనని గాని, నన్నే నమ్మవలెననిగాని నేను మిమ్ము శాసించను. మీ యందు మీకు నమ్మకము వృద్ధి చేసికొనుడు. మిమ్ము తన సేవ కుపయోగించు కొనుచున్న ప్రభువును పూజింపుడు. ఇంతమాత్రమే **నేను మిమ్ము కోరునది. అన్నింటికిని ప్రభావమైనది ఆత్మయని తెలిసికొనుడు. అది నాకు చాలు.**

స్తోత్రములకూ, బూటకములకూ నేను విముఖుడను. అవి నా స్వభావమునకును, నాయాశయమునకును కేవలము విరుద్ధములు.

(శ్రీ.స.సూ. పు.16)

నన్ను గూర్చి, నా మహిమల గూర్చి, దానియొక్క **నిజా నిజములను గూర్చి వృధాగా తర్కములెందుకు? అకాశమును చేపలు గుర్తింప గలవా?** స్థూలవస్తువును స్థూలవస్తువే గ్రహించును. కంటి దగ్గరనే చెవి యుండినను కన్ను చెవిని చూడలేదు కదా! నీ వెవరైనది తెలిసికొనలేక యుండునట్టి నీవు భగవానుని రహస్యముల కనిపెట్టుటకు ప్రయత్నించి కాలయాపనము జేసెదవు. భగవానుని జగన్నాటక ప్రదర్శనములోని యంతరార్థములను మానవుడెన్నటికి గ్రహింపలేడు. భగవదనుగ్రహమును బొందుటకు తగిన ఉపాయములను, సాధనములను, శ్రద్ధాభక్తులతోడను, పట్టుదలతోడను నాచరించుచుండిన యెడల **నీ సుకృతము వలనను, నా యనుగ్రహము వలనను అణుమాత్రము నన్ను తెలిసికొందువు.**

(శ్రీ.స.సూ.పు.34/35)

నా బోధనలననుసరింపుడు. **శ్రేయోమార్గమున మిమ్ముల గొంపోయెద. నా సందర్శన, స్పర్శన, సంభాషణములు మొదలగు వానివలన మీ కష్టములు నివారణమై మనశ్శాంతి కలుగును.** ఎవ్వరైన మిమ్ములను శ్రద్ధతో భగవానుడెందున్నాడని ప్రశ్నించిన తక్షణమే పుట్టపర్తికి పోయి భగవానుని దర్శించి యానందింపుడని జవాబు నొసంగుడు.

(శ్రీ.స.సూ.పు.36)

మానవుడు నమ్మకముతో వినయ విధేయుడై యుండవలెను. ఎవ్వరెట్టి కండ్లద్దములు ధరించి విశ్వమును చూతురో, యట్లే విశ్వమును వారికి కనబడును. అసూయ, ద్వేషము, విసుగు మొదలగు గుణములతో చూచిన విశ్వమును నట్లే దృశ్యమగు చుండును. **ప్రేమతత్వ సులోచనములను నేను ధరించి విశ్వమును చూచు చున్నందున, నాకు ద్వేషాదులు లేవు. ద్వంద్వాతీతుడను. ఎట్టి వ్యాధియు నన్నంటదు.** ఇతరులను బుజువర్తనులను గావించుటకే నేను వారియెడ కోపమును నటించుదును. అంతియే! నేను సంపూర్ణానంద స్వరూపుడను. **జ్ఞానానందశాంతులే నా స్వభావము. ప్రతి యొక్కని హృదయ నివాసియైన సాయిని నేను.**

నా శక్తి, నా సామర్థ్యము నా మహిమ నెవ్వరుగాని, ఎప్పుడు గాని యెంత ప్రయత్నించినగాని, యే యపాయములచేతగాని **కనుగొనజాలరు.**

నా దర్శనమునకై వ్యయ ప్రయాసలతో దూరదేశముల నుండి, ఖండాంతరములనుండి యేల రావలెను? మీరుండుచోటనే యుండి మీ హృదయములను పవిత్రము లుగ జేసికొని ప్రార్థనతో, ప్రేమతో నన్నాహ్వానింపుడు. తక్షణమే నేను మీ హృదయములలో సాక్షాత్కరించి, మీకు దర్శనభాగ్య మొసంగి, మీ కోర్కెలను దీర్చెదను. **నన్ను సర్వాంతర్యామియని తెలిసికొనుడు. నిరంతరము మీ హృదయవాసినై యున్నాను.** కేవలము యీ మానవ దేహమునకే కట్టుబడి యుండను. దివ్య దేహముతోనే మీ యెడల ప్రకాశించుచున్నాను. మీ హృదయములను గూడ ప్రశాంతి నిలయములుగ జేసికొనుటయే మీ సాధనగ నుండవలెను.

(శ్రీ.స.సూ.పు. 36/37)

నా జన్మ దినోత్సవము జరుపుట కంటె, మీ హృదయములలో బాబాను వెలయింపజేసికొనుటకు ప్రయత్నించుటయే మీ ముఖ్య కర్తవ్యము. భక్తుల హృదయములలో 'అహమహ' మని ప్రకాశించుచుండు సచ్చిదానందాత్మ స్వరూపుడు బాబా, జన్మదినోత్సవమని భక్తులు ప్రయత్నించి గ్రహింపవలెను. నా జన్మ దినోత్సవములను జరుపుకొనుటకు భక్తులకనుమతి నొసంగుటలో నా భావమిద్దియే.

(శ్రీ.స.సూ.పు.38)

నా సందేశమిది: "ప్రేమ స్వరూపులు కండు; భయము, ద్వేషము దరి రానీయకుడు. అందరి యెడల ప్రేమను అభివృద్ధి పరచుకొనుడు. ఇతరుల సుఖ దుఃఖములను అర్థము చేసుకుని ఇతరుల సుఖమే మీ సుఖముగ, ఇతరుల దుఃఖము మీ దుఃఖముగ భావించుడు''

(శ్రీ.స.సూ. పు. 40)

అన్ని రూపములు నావే; ఇతర రూపనామములను పూజించు వారిని వారి విశ్వాసములకు దూరము చేసి నావైపు మరల్చుట నా అభిమతము కాదు. లీలలూ, మహిమలూ చూపి వారు నా దరికే చేరునట్లుగా ఆకర్షించు చున్నానని మీరు భావించవచ్చు. ఇవన్నీ కీర్తి ప్రతిష్టల కొరకు చేయు ప్రదర్శనకాదు; భూమిని ఆకాశముగను, ఆకాశమును భూమిగను మార్చగల దివ్యశక్తికి నిదర్శనము. మీకు ఇష్టమైనా లేక పోయినా **నేను మీవాడినే. మీరు నన్ను ద్వేషించినా, దూరముగా తొలగిపోయినా మీరు నావారలే.** కనుక నా ప్రేమ, నా కరుణ నా శక్తి ప్రదర్శనలతో మిమ్మాకర్షించ వలసిన అవసరము నా కున్నది? **నేను మీలో నున్నాను. మీరు నాలో వున్నారు.** మన మధ్య భేదము లేదు. దూరము లేదు. మీరు మీ స్వగృహమునకు వచ్చిరి. **ఇది మీ యిల్లు; నాది కాదు. మీ హృదయమే నా యిల్లు.**

(శ్రీ.స.సూ.పు.41/42)

పట్టి చేతులతో రండి. మీ చేతులలో వున్న సర్వస్వమునూ ఆవల పారవేయండి. జయాపజయములనే జీవిత రంగంలోని ఆటవస్తువులను గిరాటు వెయ్యండి. ఆ ఖాళీ చేతులను నా ప్రేమామృతముతో నింపుదును. నేను ప్రేమ స్వరూపుడను. నీ సంకల్పముతో ఆనందా రోగ్యములు ప్రసాదించుటవలన మీ మెప్పు పొందుటకాని, మీనుండి వేరు విమర్శలు పొందుట కాని నా ప్రత్యేక లక్షణము కాదు. అవి నా సహజ లక్షణములు. వాటివలన నేను పొంగుటకాని, క్రుంగుటకాని జరుగదు. మీరుకూడ మీ ప్రతిచర్యను ప్రేమపూరితము కావించండి. **నేను మీ హృదయ జ్యోతులను ప్రకాశింపజేతును. ఆ వెలుగునందు మీరు ప్రతి వారిలోను సాయిని చూడగలరు.**

ప్రేమ, గౌరవము, సహనము, పరస్పర సహకారములు ప్రతి హృదయము నుండి మరొక హృదయము లోనికి ప్రవహించవలెను. మీరందరూ ఒకే ఒక శరీరమందలి, సాయి శరీరమందలి, అంగములే.

(శ్రీ.స.సూ.పు.43)

నేను సముద్రమును. మీరందలి అలలు. **మీరే నేను. మీరు గమ్యమును చేరునప్పుడు ఈ సత్యమును**

గ్రహించగలరు. ఇదే తత్తము. నీవు నీ ఈ ఆత్మ తత్వమును ప్రకటించిన క్షణమందే నీవు భగవంతుడవయ్యెదవు. మీలో ప్రతి ఒక్కరూ ప్రత్యగాత్మను పరమాత్మలో లీనము చేయగలిగినపుడు భగవత్స్వరూపు లగుదురు. అందరివలె సాధారణ మానవునిగా వుండివుంటే నేను చెప్పెడిది యెవరు వింటారు? అందుచేత మానవ రూపములో మానవాతీతమైన శక్తి జ్ఞానములతో అవతరించినాను. మీరందరూ అవతారులే. రక్త మాంసములతో కూడిన ఈ శరీరమను కవచమును ధరించిన దివ్య తత్వములే. అయితే అది మీకు తెలియదు. జన్మాంతర కర్మల ఫలితముగా ఈ శరీరములలో మీరవతరించారు. **అయితే నేను నా సంకల్పముతో ఈ శరీరమును స్వీకరించాను.** మీరు మీ శరీరములతో త్రిగుణములను త్రాళ్లతో బంధింప బడ్డారు. **నేను గుణాతీతుడను, బంధరహితుడను. మీరు కోరికలతో ఇటూ అటూ చలిస్తారు. మిమ్మల్ని కోరికలు లేని నిశ్చల స్వభావులను చేయవలెనను కోరిక తప్ప నాకు కోరికలు లేవు. నేనిక్కడ వుండగా మీకు భయమెందుకు! బాధలతో నుండు వారందరూ నా వద్దకురండు. మీరు నావైపు ఒక అడుగు వేస్తే నేను మీవైపు పది అడుగులు వేసెదను. శ్రీ బాబాయే జగజ్జనని, ఆమెయే పరాశక్తి. సరస్వతి, లక్ష్మి, అన్నపూర్ణ, దుర్గ, కాళి మొదలగువారు ఆయా దివ్యశక్తి స్వరూపిణులే. ఆ జగన్మాత యంశములే. మానవకోటికి సనాతన ధర్మమే తల్లి.**

(శ్రీ.స.సూ. పు. 46/47)

నేనుండ మీకు భయమెందుకు? మీ భారమంతయు నాపైనవైచి, దృఢముగ **నన్ను నమ్మిన, మీ యోగక్షేమముల నేను వహించి, అన్ని వేళల కంటిని రెప్పగాచునట్లు మిమ్ము నేను కాపాడుదును.**

నేను ప్రతి మనుజుని సేవకుడను. **నన్నే పేరున పిలిచినను మారు పల్కెదను. అన్ని పేర్లును నావే.** నాకు నిర్ణీతమైన పేరు ఏయొక్కటియు లేదు. **మీరు నన్ను విడిచినను, నేను మిమ్మువిడువను. నీడవలె మీ వెంటనే యుందును.** నాస్తికులే లేరని నా యభిప్రాయము. భగవంతుని పైననేయాధారపడి, భగవానుని కొఱకే యందఱున్నారు. సూర్యుడు లేడన్న మాత్రమున ఆయన యదృశ్యుడగుట లేదు. కాబట్టి, భగవన్నామ కీర్తనము జేయుడు.

షిర్డీ సాయిబాబా నేడు సత్యసాయిబాబాగా అవతరించిరి. **ఈ 'సాయి'లు ఒక వరుసలో వత్తురు. ఈ అవతారము తర్వాత మైసూరు ప్రాంతమున 'ప్రేమ సాయి' గా మరొక 'సాయి' ఉద్భవింతురు.**

(శ్రీ.స.సూ.పు.48/49)

మీరందరు నా యొక్క అవయవములు. సాయి శరీరము యొక్క అంగములు. సద్గుణము, విశ్వాసము, సుశిక్షణ, వినయము మొదలగు మధురమైన, వాంఛనీయమైన విషయములను సాయికి మీరిచ్చిన, మరేమి చేయుచున్నను, ఎక్కడున్నను, సాయి మీకు సహాయ సహకారము లందించును.

(శ్రీ.స.సూ.పు.95)

నాయొక్క ప్రేమయే అతి ప్రధానమైనది. ముఖ్యమైనది. నేను ఆకసమును భూమిగను, భూమిని ఆకాశముగను మార్చగలను. కాని అది కేవలము నా దివ్యశక్తులకు చిహ్నము కాదు. ఎల్లప్పుడు విశ్వవ్యాప్తముగా నున్న నా ప్రేమయే చాల శక్తివంతమైనది, లోకోత్తరమైనది, అద్వితీయమైనది.

మీతో సమానముగా, మీవలె తినుచు, తిరుగుచు, మాట్లాడుచున్నందున, ఈ ఆకారముకూడ సామాన్య మానవాకారమే అను భ్రమను కలుగచేయును.

(శ్రీ.స.సూ.పు.101)

నేను ఎల్లప్పుడు నీకంట, యింట, వెంట, జంట ఉండి, నడుపుచు కాపాడుచుందును.

పురోగమించు...

...భయభీతి విడుపుము...

(శ్రీ.స.సూ. పు. 360)

నేను భక్తపరాధీనుడను. సామాన్య మానవ రూపంలో మీతో కలసి మెలసి సంచరిస్తూ అడుతూ పాడుతూ ఉన్నప్పటికీ ఎంతటి మేధావులైనా నా శక్తిని, నా స్వభావమును అర్థం చేసుకోలేరు. మానవత్వమును

ఏకత్వపరచి, ఆత్మతత్త్వమును నిరూపించి దైవత్వ స్థానములో చేర్చటమే నా లక్ష్యము. నాలో ఉన్నటువంటిది ఎటువంటి కొలతలకూ అందినది, పరిమాణమునకు అతీతమైనది, పరిశోధనలకు అంతుపట్టినిది. అదియే ప్రేమ. ఈ ప్రేమతత్త్వమును గుర్తించి అనుభవించినవారు మాత్రమే నన్ను కొంతవరకు తెలిసికొనగలరు. స్వామి అనుగ్రహము చిక్కినప్పుడు మీకు అనంతమైన జగత్తే లభిస్తుంది. **అమూల్యమైన వజ్రమును నేనుండగా తుచ్ఛమైన అశాశ్వతమైనవాటి కొరకు ఎందుకు ప్రాకులాడుతారు. మీరు నన్నే కోరండి. ప్రేమతో, భక్తితో కోరినట్లయిన నేను తప్పక లభించుతాను.**

(స.సా. న. 99 పు. 300)

పరులను నిందించేవారు పరమ పాపులనే చెప్పవచ్చు. "పాపములన్నింటికంటే మించినది పరులను నిందించే దన్నా" కాబట్టి, ఎవ్వరినీ నిందించకూడదు. అందరి యందున్నది భగవంతుడే. ఒకవేళ ఎదుటివారిలో మీకేదైనా దోషం కనిపిస్తే, ఆ దోషాన్ని వారికి తెలియజేసి మంచి మాటలతో సరిదిద్దాలేగాని, వారిని దూషించడానికి పూనుకోకూడదు. **ఆధ్యాత్మికమంటే సర్వమును త్యజించి ముక్కు మూసుకొని జపమాల త్రిప్పుతూ కూర్చోవడం కాదు.** మొట్టమొదట మీలో సద్భావములు ఆవిర్భవించాలి. నిరంతరము మీ మోముపై చిరునవ్వులు చిందులాడాలి. ఎలాంటి పరిస్థితి యందైనా 'కేస్ట్రాయిల్ ఫేస్'(ఏడుపు ముఖం) పెట్టుకోకూడదు. **Happiness is union with God. భగవంతునితో చేరినప్పుడే ఆనందం ప్రాప్తిస్తుంది.** భగవచ్చింతన చేసేవాడు ఎప్పుడూ ఆనందంగా ఉంటాడు. లోకంలో అనేక కష్టాలు వస్తూనే ఉంటాయి. ఎన్ని వచ్చినప్పటికీ మీరు లెక్కచేయకూడదు. నిజంగా మీరు నమ్ముతారో లేదోగాని, నాకు ఉన్నన్ని దూషణ, భూషణలు ఎవ్వరికీ లేవు. కోరికలు నెరవేరినవాడు గొప్పగా వర్ణిస్తుంటాడు. కోరికలు తీరనివాడు దూషిస్తుంటాడు. ఈ దూషణ, భూషణలు రెండూ వారి పెదవులకే పరిమితంగాని, అవి నావరకు ఏమాత్రం చేరవు. Sri Sathya Sai (శ్రీసత్యసాయి) అనే పేరులో మూడు S లున్నాయి.

Yes అనువారికి Yes అనురా సాయి
No అనువారికి No అనురా సాయి
No, Yes లు మీ నోటికెగాని
సాయికి సర్వం Yes ,Yes, Yes!

గట్టిగా దూషిస్తే అది గాలిలో కలిసిపోతుంది. తనలో తాను దూషించుకుంటే అది తనకే చెందుతుందిగాని, నావరకు రాదు. నేనెప్పుడు ఆనందంగానే ఉంటాను. ఆనందమే నా స్వరూపం. దేహాభిమానం కలవారే సుఖదుఃఖాలకు గురి అవుతుంటారు. కాని, నాకు సుఖము లేదు, దుఃఖము లేదు. ఎందుకంటే, నాకు దేహాభిమానమే లేదు. **దేహానికి సంబంధించినది Conscious. ఆత్మకు సంబంధించినది Consciousness. నేను Conscious ను కాదు, Consciousness ను, అనగా, చైతన్య స్వరూపుడను.** మీరందరూ చైతన్య స్వరూపులే. అందరూ దైవస్వరూపులే. **"నేను దైవస్వరూపుణ్ణి" అనే సత్యాన్ని మీరు గుర్తిస్తే మీరింక దుర్మార్గంలో ప్రవేశించరు. జ్ఞానము ఒక్కతూరి వస్తే తిరిగి పోదు, అజ్ఞానము ఒక్కతూరి పోతే తిరిగి రాదు. బ్రహ్మ తత్త్వము రాదు, పోదు. అదే చైతన్య స్వరూపము. అది రాకపోకలు లేనిది, శాశ్వతంగా ఉండేది.**

(స.సా.మే 2000 పు.134/135)

స్వామి! 75 సంవత్సరాల వయస్సులో కూడా మీరెంతగట్టిగా ఉన్నారు! ఎంత కళకళలాడుతున్నారు!" అని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తుంటారు. అప్పుడు నేను చెపుతుంటాను, "దీనికి కారణం నాలో **ఉన్న మూడు P** లు. మొదటి **P - Purity (పవిత్రత), రెండవ P - Patience (సహనం), మూడువ P - Perserverance (పట్టుదల).** ఈ మూడు మీలో ఉంటే మీరు కూడా ఎంత వయస్సు వచ్చినా గట్టిగా ఉంటారు. **అందమనేది దేహానికి సంబంధించినది కాదు; గుణానికి సంబంధించినది, పవిత్రతకు సంబంధించినది."**

(స.సా. మే.2000 పు. 134)

హంపినుండి తిరిగి వచ్చిన తరువాత నేను ఉరవకొండ విడిచిపెట్టాను. బంధన వీడి పోయింది. అప్పుడు చెప్పాను -

నేను సాయిని తెలియుము నిక్కముగను
మమత బాయుము యత్నముల్ మానుకొనుము
బాసె నాకు మీతోడి బాహ్యసంబంధమింక
కాదు నన్నట్ట ఎటువంటి ఘననకైన.

(స.సా.ఏ.2001 పు. 126)

మీ ఆరోగ్యాన్ని శ్రద్ధగా కాపాడుకోవాలని చెప్పటంలో నాముఖ్య ఉద్దేశం ఏమిటంటే ముందు మీరు ఇంతకంటె అద్భుతమైన మహిమలను, లీలలను దర్శించి ఆనందించాలి. కనుక మీరు మీ ఆరోగ్యాన్ని శ్రద్ధగా కాపాడుకోవాలి! ఇంతవరకూ చూపిన, విన్నవాటి కంటె అధికమైన మహత్తరమైన అద్భుతాలను, సాధించబోయే విజయాలను భవిష్యత్తులో సందర్శించబోతున్నారు. అందుచేతనే మీ ఆరోగ్యాన్ని శ్రద్ధగా కాపాడుకోండి! మంచి ఆరోగ్యంతో మీ హృదయాలను ఎల్లప్పుడూ ఆనందంతో నింపుకోండి.

(స.శి.సు.నా. పు. 72)

"మౌళి గుల్కెడు చంద్రమఃఖండ కళతోడ
బెడగారు గుల్కెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ
డంబైన ఫాలనేత్రంబు తోడ
నల్ల నేరేడు వంటి నల్లని మెడ తోడ
కరమున నాగకంకణము తోడ
నడుమున చుట్టిన నాగచర్మము తోడ
మైనిండనలదు భస్మంబు తోడ
నుదుట దీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో
తాంబూల రాగాధరంబుతోడ
ఆరు శాస్త్రములందున నందగించి
నల్లకలువలు హసియించి కొల్లలాడు
మెరుగు చామనిఛాయల మేనితోడ
శైలరాజేంద్రుడు నేడు ప్రత్యక్షమాయె"

(స.సా.ఏ. 2002 పు. 108)

"రక్తము మాంస శల్యముల రాసియుదేహము నేను కాను సువ్యక్తముగాని కోరికలు వ్యర్థ మనస్సు నేను కాదు. ముక్తికి భంగకారి యగు మోహపు భావన నేను కాదు నా శక్తి నన్నెరుంగగల శాశ్వతుడే పరమాత్మ నేనుగా"

విద్యార్థులారా! అందుకోండి ఆశీర్వాదములు. అందె మీరంపిన వందనములతోటి అందలి విషయ సుమములు. అవియే ఈ కమ్మని కమ్మను మీకందించుటకు కారణమైనది. ఈ కమ్మ సాయికి హాయిని మీకు సాయిని అందించుచున్నది. నేడు కావలసినది సుఖోద్యాన వాటికగా భావించే ప్రేమ కలాపము కాదు. జీవన సంగ్రామ రంగములో మహాయోధులై నిలువ గలిగిన వీరుల ఆదర్శము. ప్రస్తుత పరిస్థితులలో మాటల క్రీడలు మీకు ఉపక్రమించవు. చదువులు చదివి ఉన్నత పట్టములు అందుకొన్నంత మాత్రమున దేశమును ప్రకాశింపజేయ చాలదు, మీరు వికసించలేరు. **సత్యాన్వేషణకై త్యజించి, ప్రాణాలొడ్డగల ధీరులు, త్యాగులు, పరమభక్తులు దైవ ప్రేమానురక్తులు కావాలి.** ప్రేమనే ధనస్సు, విజ్ఞానమే కరవాలముగా కలిగి విజృంభించి, స్వార్థము స్వప్రయోజనాలకు స్వస్తి చెప్పి, పరార్థము, యదార్థాన్ని విశ్వసించి, వీర విద్యార్థులు కావాలి.

ఈనాడు మీరందరు మహత్కార్యములను సాధించుటకు జన్మించితిరి. చిల్లర, అల్లరి పిల్లలుగా కాక దైవబిడ్డలుగా, కార్యసూరులుగా, కలివీరులుగా, కరుణా రేఖలుగా, ప్రేమ పాత్రులుగా ప్రపంచములో దైవత్వమును ప్రతిధ్వనింప వలెను.

ఇది నిద్రించ వలసిన సమయం కాదు. మీ పై భవిష్యత్తు భారతావతరణం ఆధార పడి యున్నది. ఆ తల్లి మీకై నిరీక్షించు చున్నది. **భారతనీతి నశిస్తే, ప్రపంచమే నశిస్తుంది. భారతీయ ఆధ్యాత్మికమే క్షీణించిన విశ్వమే క్షీణిస్తుంది. దేశ సమగ్రత పూర్తిగా మరుగుపడుతుంది.**

మధురాత్మమైన ప్రేమానుభూతి భారత జాతియొక్క నీతి. భగవత్ రతిగల భారతి రక్తములో ప్రసరించాలి ప్రవహించాలి. ఆదర్శవంతమైన అలలు మీలో ఉప్పొంగాలి. బాహ్య విద్యలతో బాహ్య ప్రభావాలకు దాసులై మీలోని ఆధ్యాత్మిక మోసులను తృంచి వేయకండి. మీలోని సత్ పదార్థాన్ని వెలగించి దుర్బల భావాలను దూరం చెయ్యండి. మీరు దైవదూతలు. కాదు యమదూతలు. భక్తి సామ్రాజ్యాన్ని నెలకొలపండి. దైవ ప్రేమకు పాత్రులుకండి. భౌతిక విద్యలతో పాటు ఆధ్యాత్మిక శక్తిని అభివృద్ధి చేసుకోండి. గుణప్రేరితమైన ప్రేమ పరిణామం చెందుతుంది. గుణాతీతమైన ప్రేమను గురిగా తీసికొండి. అల్ప భావాలకు, అల్ప కోరికలకు దాసులుకాక, ఆత్మానందం మీనిలయంగా భావించండి. సకల పదార్థములు క్షణభంగురాలే. ఆత్మానందమే అంత్యము లేనిది. దానికై ప్రయత్నించండి. అన్ని లాభములకంటె గొప్పలాభం ఆత్మానందం. అది దైవ ప్రేమ వలననే లభించు. ఫలించును. కృష్ణ తులాభారం యొక్క అంతరార్థము ధన కనక వస్తు వాహనాలు కాదు, వజ్రవైఢూర్యాలు కావు, అవి ఏవియునూ భగవంతునితో తలతూగక పోయినవి. కేవలం భక్తి (ప్రేమఒక్కటే) దానిని పెంచుకోండి.

సాయి తత్వాన్ని మీలో చాలా మంది అర్థము చేసుకొనలేదు, చేసుకొన లేరు. సాయి ప్రేమను అర్థం చేసుకోండి. సాయిలో స్వార్థము ఏ కొసన కానరాదు. ఏది చేసినా మీ కోసమే. సాయికి కావలసినవి ఈ లోకములో ఏదియు లేదు.

కప్పురంబు తెలుపు, కామధేనువు తెలుపు
చుక్క తెలుపు, హంస రెక్క తెలుపు
అందమైన సాయి మందహాసము తెలుపు
ఇక్షురసముకన్న ద్రాక్షరసముక్న సాయి ప్రేమ హాయి
సాయి మాట సకల సౌభాగ్యముల మూట.
సాయి దృష్టి పారిజాత వృష్టి
సాయి చేయి తల్లి ప్రేమలోపల హాయి
ఇదియే హాయి మీకు ప్రేమదాయి

మీ నుండి నేను కోరేది ఒక్కటే. మీరు ఆదర్శ జీవులుగా, ఆనంద ప్రాణాలుగా, ఆత్మ స్వరూపులుగా లోకానికి నడతలలో నిరూపించండి. అదే నిజమైన విద్య. దానికి అంగాలే లౌకిక విద్యలు.

నిగమముల్ హరియించి హరిదూషణలు చేసి
సోమకాసురుడే మి సుఖము నొందె
పరసతిని కోరిన పదితలల వాడేమి
పట్టుకపోయెను గట్టిగాను
ఇల సూది మొన యంత నీయ జాలనటన్న
దుర్యోధనుండేమి దోచుకొనియె
పసి పిల్లలను కూడ కసిపట్టి చంపిన
కంసుడేమైనను గాచు కొననె
నేడు యెదిరించు వారికి నిదియె ఫలము
ఇంతకంటెను వేరెద్ది ఎఱుగ పరతు -
బాగా గుర్తించి వర్తించండి ప్రవర్తించండి.
ఇట్లు మీ హృదయ స్థాయి సాయి
యెవరెవరి భావాలు యెంతెంత స్థాయిలో వుండునో దానికి తగినట్లు స్వీకరిస్తారు.
"యద్ భావం తత్ భవతి"

(విద్యార్థులకు కమ్మ 23.9.88)

(కూర్చొనుటకు వీలు లేక అక్షరాలు సరిగా వ్రాయలేక పోయాను.)

ప్రియమైన విద్యార్థినులారా!

అందుకొండి ఆశీర్వాదములు. పది దినములకు పూర్వము సమ్మరు క్లాసులకు సంబంధించిన యేర్పాట్లు విషయమై మీటింగు పెట్టుకొని, మద్రాసు నుండి ఊటీ నుండి ప్రధాన వ్యక్తులను ప్రశాంతి నిలయం రమ్మనమని తెలిపి యుండుటచేత, నిన్నటి రాత్రి వారందరు ప్రశాంతి నిలయం చేరుకొన్నారు. అందుచేతనేను కండలను కరిగించు ఎండలో భోజనము చేసిన తక్షణమే బయలు దేరవలసి వచ్చెను. మిమ్ములను సంతోష పెట్టలేకపోయినందుకు చాలా విచారంగానే ఉంది. ఏమి

దివ్యవాణి

చేతు? కర్తవ్యానికి కట్టుపడిన సాయి ఏమి చేసిన మీ కొరకే కాని సాయి కోసం కాదు. మీ ఆనందమే నా ఆహారం. మీ ఉత్సాహమే నా ఉయ్యాల. మీ సంతోషమే నా సర్వస్వం. నా పని అన్నది ఒక్కటి లేదు. సరిగా బయలుదేరు సమయాన కంటి ధారలు వీడుచున్న బాలికలను చూచి నా మనస్సు కరిగినది. వారల భక్తి ప్రపత్తులు సాయిని కదిలించినవి. కాని అవసరాన్ని బట్టి రావలసి వచ్చెను. వారలకన్నీరే నా హృదయానికి పన్నీరుగా భావించి వస్తిని. నేను తక్షణమే వారల మనస్సును శాంత పరచు ఉద్దేశము నాలో అమితంగా చెలరేగి, అసలు నీరైనను త్రాగక ఈ కమ్మను వ్రాయించెను. అసలు వ్రాయుచుండగా చేతి నుండి చెమట వుట్టి పడుచు అక్షరాలను కూడా పాడుచేయుచున్నను, రెండు కాగితములు పాడయినను, నా పట్టు విడువక మీపైనున్న దయానుగ్రహంబులచేత ఈ కమ్మ ద్వారా మిమ్ములను సమ్మరింపచేయ పూనుకొంటిని. ఇక పై మీకు నా ఆనంద బిందువులు కమ్మ ద్వారా పంపి మిమ్ములను ఆనందింప చేయుదును.

బంగార్లూ, బాగా చదివి సాయి ఆశయాలను ఆచరణ రూపేణా ప్రపంచమునకు చాటి నవయుగంగా తయారు చేతురని ఆశించుచున్నాను. అమ్మ,నాన్నలకు గానీ, సమాజానికి కానీ మన ఆచరణే ప్రధాన ప్రబోధగా మారాలి. అదే సాయి ఆశ. భారతీయ పవిత్ర చరిత్రను పునరుద్ధరింప చేయాలి. ఇంక నేను ఈ కమ్మను ముగించుచున్నాను. ఇంకా కాలము తీసుకొన్న మొఖము నుండి కూడా చెమట పడునేమో అని ఊహించుచున్నాను. కారణం కరెంటు కూడా లేదు. చాలా వేడిగా ఉన్నది. మీ పై గల దయతో ఈ మాత్రము వ్రాసి మిమ్ముల చల్లబరచాలని సంకల్పించితిని. సాయినిరంతరం - మీ వెంట, జంట, వెంట ఉండి కంటి రెప్పవలె సంరక్షించును. అందరూ బాగా చదువుకుని, ఉన్నత స్థాయిలో మార్కులు తీసి, కాలేజీ పేరును నిలబెట్టండి. ఇట్లు మీసాయి

సాయీ, నీవు లేనిచో మేము అనాధులం; నీవు లేని జీవితం మాకు అయోమయం.

(విద్యార్థులకు కమ్మ 2.5.1986)

దివ్యవాణి

(చూ॥ అంతర్వాణి)

దివ్యలీలలు

(చూ॥ దివ్యప్రకటనలు)

దివ్యశక్తి

(చూ॥మానవరూపము)

దీక్ష

(చూ॥ దివ్యప్రకటనలు, సఫలం, స్థైర్యము)

దీనుడు

(చూ॥ ధీరుడు)

దీపం

దీపం విశిష్టమైన శక్తి గలది. మరే పదార్థమునకు ఈ శక్తి లేదు. వెలుగునందించి చీకటిని దూరము చేస్తుంది దీపం. కనుకనే భారతీయులు ప్రాచీన కాలమునుండి దీపమునకు ప్రాధాన్యము యిస్తున్నారు. పుణ్య కార్యములకు మొదట దీపారాధన జరుపుతారు. **దీపానికి నమస్కరిస్తారు. దీనికి మరొక గుణమున్నది. ఊర్ధ్వగతేగాని అధోమార్గం లేదు. ఊర్ధ్వమార్గము బ్రహ్మ మార్గము. అధోగతి పాప మార్గము, అయితే ఈ వెలుగు బాహ్యమైన చీకటిని దూరము గావించగలదుగాని లోపలి చీకటిని దూరము గావించలేదు.** ఎన్నో జన్మల నుండి మానవ హృదయమునందు కరుడు గట్టుకొని ఉన్న చీకటిని ఈ వెలుగు దూరము చేయలేదు. రాగద్వేషముల మలినమును కూడా ఈ వెలుగు తొలగించలేదు. మనస్సు తత్వాన్ని కూడా ఇది మార్చలేదు. హనుమంతుడు లంక నంతా కాల్చి వేసిన అర్ధరాత్రి, అగ్ని జ్వాలలలో లంకా పట్టణము పట్టపగలుగా కన్పిస్తున్నప్పటికీ, రావణుని హృదయము

మాత్రం చీకటిగానే ఉన్నది. **దుష్ట భావములు, దుష్ట గుణములు హృదయంలో దాగి ఉండటం చేతనే అతని యందెంతమాత్రము ప్రకాశము కన్పించలేదు. మానవుడు తన తత్వమును నిర్మలముగ, నిస్వార్థముగ రూపొందించు కోవాలి.**

(స.సా.ఆ. 87 పు. 210 మరియు జ.పు.177)

(చూ॥ దారి)

దీపారాధన

పూర్వకాలంలో ప్రజలు "పెద్ద ఇంటి వారి జ్యోతి మనింటికి తెచ్చుకుంటే, మనమూ పెద్ద ఇంటివారమౌతాము, పవిత్రులమౌతాము" అనే విశ్వాసము కలిగియుండిరి. ఇప్పటికి పల్లె ప్రజలు ఇంటి ముందు చిన్న గూడు అమర్చుకొని, ఒక దీపాన్ని వెలిగించుతారు. ఇట్టి ప్రాచీన సాంప్రదాయాన్ని పురస్కరించుకొని వ్రేపల్లెవాసులందరు యశోద ఇంటి నుండి దీపం వెలిగించి, తెచ్చుకొనే వారు. ఒకనాడు వ్రేపల్లెకు **'సుగుణ' అనే ఒక క్రొత్తకోడలు వచ్చింది.** ఆనాడు యశోద ఇంటికిపోయి దీపం వెలిగించుకొని రావలసిన వంతు ఆమెకు వచ్చింది. "ఎన్ని దినముల నుండియో కృష్ణుని చూడాలని అనుకుంటున్నాను. ఇప్పుడు యశోద ఇంటికి దీపం వెలిగించుకోవడానికి వెళ్ళుతున్నాను. అక్కడ కృష్ణుడు కనిపిస్తే బాగుండును కదా!" అని కృష్ణచింతన చేసుకుంటూ, యశోద ఇంటికి సుగుణ చేరుకున్నది. కృష్ణుడినే ధ్యానిస్తూ, తాను తీసుకొనివెళ్ళిన దీపమును వెలిగించడానికి యశోద ఇంట్లో ఉన్న దీపం ముందర పెట్టింది. కాని, పొరపాటున సుగుణ వ్రేలు కూడా ఆ దీపంలో పడి కాలిపోసాగింది. కాని, సుగుణకు ఎట్టి బాధ తెలియలేదు. "కృష్ణా! కాష్ణా!" అని స్మరిస్తూ, ఆనందంగా ఉండినది. ఈ దృశ్యాన్ని చూసిన యశోద పరుగెత్తి వచ్చింది. "ఏమిటమ్మా! నిద్రపోతున్నావా? శరీరం కాలిపోతుంటే ఏమిటీ నిద్ర" అంటూ సుగుణని వెనుకకు లాగింది. "అమ్మా! కృష్ణుని చూస్తూ మైమరచాను" అని పారవశ్యంతో అన్నది సుగుణ. ఆనాడు సుగుణకు దీపంలో కృష్ణుడు కనిపించినాడట. గోపిక లందరూ ఇట్టి దివ్యమైన భక్తి ప్రపత్తులను కలిగియుండినారు.

(స.సా.అ.91 పు.262/263)

దీపావళి

నరకాసురుడు స్త్రీలను ఎక్కువగా హింసిస్తూ వచ్చాడు. **ఇది రాక్షసత్వమునకు మొదటి గుణం.** కనుకనే నరకాసుర వధ జరిగినప్పుడు స్త్రీలందరూ చాల ఆనందించారు; **తమ ఇళ్ళలో దీపాలను వెలిగించుకొన్నారు. అంతకు పూర్వం వారి ఇళ్ళలో దీపాలను వెలిగించుకోనేవారు కాదు.** ఎందుకంటే ఆ జ్యోతుల వెలుగులో నరకాసురుడు తమను గుర్తించి ఎత్తుకుపోతాడేమోనని వారికి భయం! ఏనాడైతే నరకాసురవధ జరిగిందో ఆనాటి నుండి అన్ని ఇళ్ళలోను జ్యోతులు వెలుగుతూ వచ్చాయి, అంతేకాదు, ప్రజలు సత్యభామకు కృతజ్ఞతలు తెల్పుతూ ఆనందముతో నృత్యం చేశారు. మతాబులను కాల్చారు. **శ్రీరాముడు రావణ సంహారం చేసి అయోధ్యలో ప్రవేశించిన దినము కూడా దీపావళి దినమేనని ఇంతకు ముందు మన వైస్-చాన్స్‌లర్ తన ప్రసంగంలో పేర్కొన్నాడు. నరకాసుర వధ జరిరగినది ద్వాపర యుగంలోనైతే త్రేతాయుగంలో దీపావళి ఎక్కడి నుండి వచ్చింది?! కనుక దీపావళి అనగా కేవలం ఈ నరక చతుర్దశి మాత్రమే కాదు, ఎప్పుడు దుఃఖనివృత్తి అయి ఆనందప్రాప్తి కల్గుతుందో అదే నిజమైన దీపావళి. బాహ్యంగా దీపాలను వెలిగించినంత మాత్రమున అది దీపావళి కాదు, మనలో నిరంతరము వెలుగుతున్న ఆత్మజ్యోతిని మరువకుండా ఉండాలి. ఆత్మజ్యోతిని మరచినవాడే నరకాసురుడు, దానిని నిరంతరము స్మరించేవాడే నరుడు.**

(స.సా.జ 98 పు.17)

(చూ॥ నరకచతుర్దశి)

దుఃఖము

మానవత్వంలో దుఃఖానికి మూలకారణ మేమిటో మనం విచారించాలి. ఒక ఇంటిలో ఒకరి మృత్యువు సంభవించింది; ఇంటిలోని వారందరూ బాధపడుతున్నారు. కాని, ఈ బాధకు మృత్యువా కారణం? కాదు, కాదు. ఆ మరణించిన వ్యక్తిపై నుండిన అభిమానమే బాధకు మూలకారణం. అంతేకాదు ఏ ఇంటిలో మరణం సంభవించిందో ఆ ఇంటివారే దుఃఖిస్తారుకాని,మరెవ్వరూ దుఃఖించరే! మరణమే దుఃఖమునకు మూలకారణమైతే అందరూ దుఃఖించాలి కదా! కనుక, దుఃఖానికి కారణం మరణించిన వ్యక్తిపైనున్న అభిమానమేకాని, మరణం కాదు. అనగా, **అభిమానమే దుఃఖమునకు మూలకారణం కనుక, ఈ అభిమానమును క్రమక్రమేణ తగ్గించుకొంటూ రావాలి. ఈ బాధ్యతల నుండి క్రమక్రమేణ తప్పించు కొంటూ రావాలి. దీనినే వేదాంత పరిభాష యందు "వైరాగ్యము" అని చెపుతూ వచ్చారు.** Less luggage, more comfort make travel a pleasure అన్నారు. కనుక,మన జీవిత ప్రయాణంలో వాంఛలనే లగేజిని తగ్గించుకొంటూ రావాలి. ఐతే, వీటిని ఏవిధంగా తగ్గించుకోవాలి? వాంఛలు లేక మానవుడు జీవించుటకు వీలుకాదే! కనుక, వాంఛలను తగ్గించుకోవడమంటే **వాంఛలలోని మమత్వాన్ని తగ్గించుకోవడమని అర్థం.**

(స.సా.ఫి.95 పు.30/31)

(చూ॥ జన్మమృత్యుజరవ్యాధి దుఃఖ దోషానుదర్శనం, దౌర్బల్యము, మనోబలం, మమకారము, ముఖ్యకారణము, లోభము, సుఖము)

దున్నపోతా!

మిమ్మల్ని సరిదిద్దడానికి అప్పుడప్పుడు నేను కోపం నటిస్తానుకాని, నిజంగా నాకు కోపం లేదు. కోపం వచ్చినప్పుడు ఏ తిట్టు తిడగాను? "దున్నపోతా!"అంటాను, అంతే! అదే నా తిట్టు. నీవు మంచి కార్యాలు చేయకపోతే నిజంగా నీవొక Buffalo (దున్నపోతు) అనే చెప్పవచ్చు. మంచి **పనులు చేసినప్పుడే నీవొక Good fellow (మంచి వ్యక్తి) అవుతావు.** ఈనాడు అందరూ **దున్నపోతులుగానే ఉంటున్నారు. కారణమేమిటి? మంచి పనులు చేయటం లేదు. వర్షం కురిసినప్పుడు ఆవులు, దూడలు పరుగెత్తుతాయి కాని, దున్నపోతు పరిగెత్తదు. ఉన్నచోటే తడుస్తూ ఉంటుంది.** మీరు దున్నపోతులు మాదిరి తయారు కాకూడదు. **మీలో పరివర్తన రావాలి.** నేను అందరినీ ప్రేమిస్తాను. ప్రేమయే నా స్వరూపము. ప్రేమయే నిజమైన శక్తి. నేను నా ప్రేమను అందరికీ ఏ రీతిగా పంచుతున్నానో, **మీరు నా అంశమే కనుక, మీరు కూడా మీ ప్రేమను అందరికీ పంచండి.** అప్పుడు నేను చేసినదే మీరు చేసిన వారౌతారు. అప్పుడు మీరు కూడా భగవత్స్వరూపులే! ఇట్టి పవిత్రమైన భావాన్ని మీరు అనుసరించినప్పుడు జగత్తంతా నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా వర్థిల్లుతుంది.

(స.సా.ఆ. 2000 పు. 232/233)

దురహంకారము

(చూ॥ భగవదన్వేషణ, మోహము)

దురాచారములు/దురాచారాలు

(చూ॥ దుర్గుణములు, శివరాత్రి, సద్గుణములు)

దురాచారుడు

(చూ॥ మోహము)

దురాత్ముడు

(చూ॥ పాపం, మహాత్ములు)

దురాలోచనలు

(చూ॥ దుష్ప్రచారములు)

దుర్గ

(చూ॥ ఆరాధన, శరన్నవరాత్రులు)

దుర్జనులు

(చూ॥ త్యజ)

దుర్భావము/దుర్భావములు

(చూ॥దుర్గుణములు)

దుర్మార్గము/దుర్మార్గుడు/దుర్మార్గులు

నిగమములు హరించి నిండు దూషణచేసి ।
సోమకాసురుడేమి సుఖము నొందె।
పరసతి నాసించి పది తలలవాడేమి।
పట్టుకుపోయెను గట్టిగాను ।
ఇల సూది మొనమెప ఇయ్యజాలనటన్న।
దుర్యోధనుడేమి దోచుకొనియె।
పసి పాపలను కూడ పసికట్టి చంపిన ।
కంసుడే పాటి కాచుకొనియె।
నేటి దుర్మార్గులకు కూడ యిదియె గతి ।
సత్యమును తెల్పుమాట ఈ సాయి మాట॥

(సా॥ పు. 526)

(చూ॥ తల్లి, దుష్ప్రచారములు, మోహము)

దుర్మార్గమైనమార్గం

మానవులు ఏదో సుఖించాలని, తమ సుఖము కోసం అనేకమైన పెడమార్గములకు పోవుచున్నారు. ఆధునిక యుగమందు ఆంగ్ల విద్యా ప్రభావముచేత విద్యార్థుల తత్వములు, విద్యావంతుల ప్రభావములు వికార మార్గమును అనుసరిస్తున్నాయి. మీ అందరికీ తెలుసు, అనేకమంది అధికారులు ఆఫీసులకు పోతారు. తమ తమ పనులు తాము చేస్తూ ఉంటారు. ఏదో పెద్ద శ్రమపడి వచ్చినట్లుగా ఇంటికి వస్తారు. **మాకు సుఖము లేదు - మాకు శాంతి లేదు.** అని అనుకుంటారు. ఆఫీసు పనులుచేసి, మా వ్యాపారము పనులుచేసి, మా కర్తవ్య కర్మలు ఆచరించి, మాకు ఏమాత్రము సుఖ-శాంతులు లేకుండా ఉంటున్నాయని వాపోతారు. ఇంటికి వచ్చిన వెంటనే డ్రస్సులు విసర్జించి, ఇంకొక డ్రస్సులు ధరించి Happy నిమిత్తమై క్లబ్బులకు వెళుతారు. దేనికోసం వెళుతున్నారు? అని ప్రశ్నిస్తే - **"సంతోషము కోసము పోతున్నాము, Rest కోసము పోతున్నాము"** అని జవాబు చెబుతారు. అక్కడ నిజంగా సంతోషం దొరుకుతుందా? శాంతి లభిస్తుందా? **అక్కడ సుఖమున్నదా? ఆ క్లబ్బులకుపోవటం, కార్డు ఆడటం, మత్తు పదార్థములు తీసుకోవటం మున్నగునవి చేస్తారు.** ఇవి కేవలము ప్రపంచమునే మరచిపోయి కూర్చోవటమని చెప్పవలె. ఇవన్నీ సుఖ-శాంతి నిమిత్తమై ఆచరించే సత్కర్మలుగా భావిస్తారు. **ఇది చాలాదుర్మార్గమైన మార్గం.** ఈ సుఖము సుఖమనే ఆపేక్షతో, వారు దుఃఖమును కొనుక్కొంటున్నారు. **వారికి వారు చెడిపోవుటయే కాక, వారు సమాజాన్ని కూడా చెడగొట్టుచున్నారు.** ఇది మొదట చాలా సుఖముగానే కనిపిస్తుంది, కానీ, ఇది పోను పోను **క్రమక్రమేణా ఎక్కడికి దిగజారుతుందంటే -**

First the Man drinks the Wine
Second the Wine drinks the Wine
Third the Wine drinks the Man.

ఈ రీతిగా, మానవుడు పతనము పొందుతాడు. కేవలము 'తాను - తాను' తీసుకుంటున్నానిన భ్రమిస్తున్నాడు. కాదు కాదు. అదే తనను తీసుకుంటున్నది. **ఈ విధమైన శాంతినికోరి, పెడమార్గమును పట్టి జీవితమును భ్రష్ట పట్టించుకొంటున్నారు.**

(స.సా.అ.90 పు.272/273)

దుర్వాసనలు

హృదయమును వీడి దుర్గుణములు యెపుడు కదలి పోవునో అపుడు వాటికి పరివారముగా అనుసరించిన **దుర్వాసనలు కూడనూ వాటితోపాటు గూడుగుడారములు**

దుర్యోధనుడు

యెత్తివేసి ఉత్తచేతులతో పత్తా లేకుండా పారిపోవుదురు. అపుడు మానవుడు తన నిజస్వరూప స్వభావములైన సాయుజ్యమును పొందును; మాయను వీడును; మనసును బాయును; మర్మము నెరుగును; మాధవత్వమును గాంచును.

(భా. వా. పు.7)

దుర్యోధనుడు

(చూ॥ కామక్రోధలోభములు, పాపం, బలహీనుడు, మంచితనము, మోహము, శిరస్సు)

దుర్గుణము/దుర్గుణములు

ప్రేమస్వరూపులారా! నిన్నటి దినము మీరు డ్రామాలో చూశారు - భస్మాసురుడు తాను చేయి పెట్టిందల్లా భస్మమై పోవాలని ఆశించాడు. కాని, కట్టకడపటికి ఏమైంది? తన హస్తం తననే భస్మం చేసింది. అదేరీతిగా, ఎవరి దుర్గుణాలు వారినే బాధిస్తాయి; భస్మం చేస్తాయి. కనుక, మీరు పరులలోని దుర్గుణాలనుగురించి యోచించకూడదు. **పరులను దూషించేవాడు పాపి; పరులను గౌరవించేవాడే పుణ్యుడు. "సర్వ జీవ నమస్కారం కేశవం ప్రతి గచ్ఛతి". అట్లే, "సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి,"** ఎవరిని విమర్శించినా మీ దేవుణ్ణి మీరు విమర్శించినట్లే; ఎవరిని గౌరవించినా మీ దేవుణ్ణి మీరు గౌరవించినట్లె. భగవద్గీతలో కృష్ణుడు చెప్పినట్లు, దేహమే దేవాలయం, జీవుడే ఇందులోని దేవుడు. కనుక, మానవుడు ఏ దేహాన్ని చూసినా దేవాలయాన్ని చూసినట్లుగా భావించి గౌరవించాలి. అప్పుడే తన జీవితం సార్థకమౌతుంది. ఇతరులు కూడా తనను గౌరవిస్తారు. కాని, ఈనాటి మానవునిలో అట్టి విశాల భావాలు అడుగంటి పోయాయి. తాను ఇతరులను గౌరవించడుగాని, తనను అందరూ గౌరవించాలని ఆశిస్తున్నాడు. ఇది ఆసాధ్యం.

(స.సా.అ. 2000 పు.299/300)

దయ్యంగాని భూతంగాని ఈ జగత్తులో సృష్టింపబడలేదు. వీటిని మానవుడు తనకు తానే సృష్టించుకొంటున్నాడు. దీనికి ఒక చిన్న ఉదాహరణ: పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో కృష్ణుడొకనాడు వారియొక్క స్థితిగతులను గురించి, యోగక్షేమాలను గురించి తెలుసుకోవాలని అరణ్యానికి వెళ్ళి వారితో ఒక రాత్రి గడిపాడు. పాండవులు తమమధ్య పాంచాలి కూడా ఉండడంచేత ఆమెను సంరక్షించే నిమిత్తమై ప్రతి రాత్రి ఒక్కొక్కరు ఒక్కొక్క గంటసేపు తాము ఉన్నటువంటి పర్ణశాల చుట్టూ పహారా చేస్తూ వచ్చారు. మాటల సందర్భంలో కృష్ణుడు ధర్మజునిద్వారా ఈ విషయం తెలుసుకొని "బావా! ఈ రాత్రి నాకు కూడా ఒక గంటసేపు ఈ డ్యూటీ చేసే అవకాశం ఇస్తావా?" అని అడిగాడు. ధర్మజుడు నవ్వుతూ "కృష్ణా! సర్వ లోకములను రక్షించే మీకు ఈవిధమైన వాంఛ ఎందుకు కల్గిందో నాకు అర్థం కావటంలేదు. పైగా, ఈ అడవిలో ఒక భయంకరమైన దయ్యం ఉన్నది. దానిని ప్రతి రాత్రి నేను చూస్తున్నాను. నా సోదరులు కూడా చూస్తూన్నారు. అది మాతో యుద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నది. మీరు గనుక వెళ్ళినట్లయితే అది మిమ్మల్ని కూడా బాధించవచ్చు. మీరు మా యోగక్షేమాలను చూసే నిమిత్తమై ఇక్కడకు వచ్చారు. కాబట్టి మీరు క్షేమంగా, ఆనందంగా నిద్రించండి" అని కోరాడు. అప్పుడు కృష్ణుడు "ధర్మజా! ఇంతకాలమైనప్పటికీ నన్ను ఇంత మాత్రమేనా తెలుసుకున్నావు! ఒకవైపున నన్ను నేను రక్షించుకోలేనటువంటి ఆబలునిగా భావిస్తున్నావు: ఆ దయ్యం నన్ను ఏవిధమైన బాధలకు గురి చేస్తుందో అని భయపడుతున్నావు. ఏ దయ్యంగాని, ఏభూతంగాని నన్నేమీ చేయలేవు. కనుక మీరందరూ చేస్తున్నట్లుగా ఈ పర్ణశాలను సంరక్షించడానికి నేను కూడా ఒక గంట డ్యూటీ తీసుకుంటాను" అన్నాడు. సరే, కృష్ణునికి కూడా డ్యూటీ ఇచ్చారు. కృష్ణుడు ఆ ఒక్క గంట పర్ణశాల చుట్టూ తిరిగాడు. తరువాత అర్జునునివంతు వచ్చింది. 'కృష్ణుణ్ణి ఆ దయ్యం ఎన్ని

బాధలు పెట్టిందో ఏమిటో' అని భయపడుతూ అర్జునుడు కృష్ణునివద్దకు పరుగెత్తుకొని వెళ్ళాడు. కానీ కృష్ణునికి ఏ బాధలూ లేవు; ఒక రాతిపైన కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ కనిపించాడు. అర్జునుడు పరుగెత్తుకొని పోయి కృష్ణుని పాదాలపై పడి. "స్వామీ! ఆ దయ్యం మిమ్మల్ని ఎంత బాధ పెట్టిందో ఏమిటో! అయితే దానిని మీరు హతమార్చినారు కాబోలు కనుకనే ఇంత సంతోషంగా కనిపిస్తున్నారు" అన్నాడు. అప్పుడు కృష్ణుడు "అర్జునా ! **నా సృష్టిలో దయ్యాలు, భూతాలనేవి లేవు. వాటిని నేను సృష్టించలేదు. సృష్టిలోనే లేని దయ్యం ఈ అడవిలో ఏవిధంగా ప్రవేశించగలదు? ప్రతి రాత్రి మీకు కనిపించేది దయ్యం కాదు. మీ యందున్న క్రోధమే మీకొక దయ్యంగా కనిపిస్తున్నది.** దానిని చూసి మీ క్రోధం మరింత పెరిగిపోతున్నది. **మీ క్రోధం బలపడే కొలది ఆ దయ్యం కూడా తన స్వరూపాన్ని పెంచుకొంటున్నది" అన్నాడు. మానవునియందున్నటువంటి దుర్గుణములు, దురాచారములు దుర్భావములే దయ్యము, పిశాచము వంటి రూపాలను ధరించి మానవుణ్ణి బాధ పెడుతున్నాయి, భక్షిస్తున్నాయి. ఇవన్నీ ఇమేజినేషన్లే. 'నా సృష్టియందే ఈ దయ్యాలు, భూతాలు లేవు. ఇవన్నీ మీ భావములు సృష్టించుకొన్న స్వరూపములే" అన్నాడు కృష్ణుడు.** ఆ మాటలచేత అర్జునుడు చక్కగా ధైర్యం తెచ్చుకున్నాడు. ఈ తరువాత అతనికి ఎక్కడా ఏ దయ్యమూ కనిపించలేదు. "కృష్ణా! ఈ దయ్యాలు, భూతాలు మా భావాలయొక్క ప్రతిబింబాలేనన్న సత్యాన్ని మాకు ప్రబోధించే నిమిత్తమే మీ రీనాడు మావద్దకు వచ్చారు. ధన్యులం, ధన్యులం" అని కృష్ణుని పాదాలకు నమస్కరించాడు.

(స.సా.మా 99 పు.57/58)

మనుజుడైన వాడు, మంచిగా తనలోని
దుర్గుణములు మొదట త్రుంచవలయు ।
పశుగుణంబులు వీడి, పశుపతి కావలె
సత్యమైన బాట సాయి మాట.

(సా. పు. 583)

(చూ॥ ధనము, భగవదన్వేషణ, రావణుడు)

దుర్బుద్ధులు

రాముని కంటే రావణుడే ఎక్కువ విద్యలు చదివాడు, అయితే రాముడు తాను నేర్చిన విద్యలను ఆచరణలో పెట్టి జీర్ణించుకున్నాడు. కనుకనే అవి అతనికి శక్తిని, పుష్టిని అందించాయి. కాని రావణుడు తాను నేర్చిన విద్యలను ఆచరణలో పెట్టకపోవడం వలన 'అజీర్ణరోగం' బయలు దేరింది. 'అజీర్ణరోగం'వల్ల అన్నీ అప్రమాణ బుద్ధులే అభివృద్ధి అయినాయి. దేహానికి కడుపే కేంద్రము. కడుపు చెడిపోతే దేహమంతా చెడినట్లే! అదేవిధంగా తలలో దుర్బుద్ధులు ప్రవేశిస్తే జీవితమే నాశనమవుతుంది.

(శ్రీ.భ.ఉ.పు.84)

(చూ॥ దుష్ప్రచారములు, శివరాత్రి)

దుశ్శాసనుడు

(చూ॥ పాపం)

దుష్టచతుష్టయము

(చూ॥ సంగము)

దుష్టచేష్ట

(చూ॥ భగవదన్వేషణ)

దుష్టపుత్రుడు

(చూ॥ ఉత్తమ పుత్రుడు)

దుష్టశిక్షణ

(చూ॥ అవతారము)

దుష్టసంకల్పము

దుష్టసంకల్పములచేత దుఃఖితుడగు
సత్యసంకల్పములచేత సాధువగును

దుష్టులు

సకల సంకల్ప రహితుడే శాంతినొందు
ఉన్నమాట తెలుపుచున్నమాట.

(స.సా.న. 99 పు. 297)

దుష్టులు

ఈనాటి నుండి స్త్రీలు పురుషులు కాని ఇతరుల తప్పు పెద్దదైననూ చిన్నదిగా తీసుకోండి, మీ చిన్న తప్పును పెద్దదిగ భావించండి. అప్పుడింక తప్పులే చేయరు. పరులలో ఉన్న మంచిని చూడండి. పరులలో ఉన్న మంచిని చూస్తే మీరు కూడా బాగుపడగలరు. మీలో ఉన్న చెడును చూస్తే మీరు సరిదిద్దుకోగలరు. కాని, ఈనాడు పరులలో ఉన్న తప్పులనే వెతుకుతున్నారు. తెలుగులో ఒక సామెత ఉంది. "దుష్టులు తప్పులను వెతుకుతారు. కుక్క చెప్పులను వెతుకుతుంది" దుష్టునికి కుక్కకు ఏమీ వ్యత్యాసం లేదు. కనుక, మీరు కుక్కలు కాకూడదు.Dog కాకూడదు. God కావాలి. మనం చక్కదిద్దుకొని, తిరిగి అలాంటి తప్పులు రాకూండా చూసుకోవాలి. మనం ఏ తప్పు చేసినప్పటికీ దాని ఫలితం మననే బాధిస్తుంది. ఎవరికో చెడ్డ చేస్తున్నామని భావించరాదు. మనకు మనమే చెడ్డ చేసుకుంటున్నాము. మనమే చెడిపోతున్నాము. మనకు చెడ్డ పేరు సంపాదించుకుంటున్నాము. కనుక, మనమంతా మంచి మనసుతో జీవించాలి.

(శ్రీ.భ.ఉ.పు.185/186)

(చూ॥ ధర్మోద్ధరణ, రాక్షసత్వం)

దుష్ప్రచారములు

ప్రాచీనకాలంలో అనేక **మంది మహనీయులు ప్రపంచానికి ఆదర్శమును అందించుటకు అనేక బాధల ననుభవించారు.** ఎన్ని కష్టనష్టములెదురైనను వారు తమ దీక్షను విడనాడలేదు. అట్టి ఆదర్శమూర్తులలో ఒకడైన జీసస్‌యొక్క తత్వాన్ని ఈనాడు మీరు జ్ఞాపకం చేసుకోవాలి. జీసస్ జన్మించిననాటినుండి అనేక విధములైన కష్టములకు, నష్టములకు గురియౌతూ వచ్చాడు. తరతరాలనుండి, యుగయుగాలనుండి **ఇలాంటి మహనీయులు, మహత్తరమైన శక్తి సంపన్నులు. దివ్యమైన భావములచేత ప్రజలకు ఉపదేశములు చేస్తూ, ఉపకారములు సల్పుతూ జగత్తును ఉద్ధరించుటకు పాటుపడ్డారు. కాని, మూర్ఖులైన మానవులు వారి చర్యలలోని అంతరార్థమును గుర్తించలేక ఆ మహనీయులను, వారి ఆధ్యాత్మిక తత్వమును అవమానపరుస్తూ వచ్చారు.**

ఉత్తమ పురుషులయొక్క దివ్యత్వం జగద్వ్యాప్తి అయినప్పుడు అనేకమందికి **అసూయ** బయల్దేరుతుంది. **అసూయ, అనసూయ ఇరుపురూ అక్కచెల్లెళ్ళు. అనసూయయొక్క పుత్రులు బ్రహ్మ విష్ణుమహేశ్వరులు.** అసూయయొక్క పుత్రులు జీసస్‌ను అనేక విధములుగా హింసించారు. సమాజానికి శాంతిభద్రతలనందించగోరి జీసస్ అనేక పాట్లుపడ్డాడు. బీదసాదలను, కష్టజీవులను కరుణతో ఆదుకున్నాడు. జీసస్ చేసే పవిత్ర కార్యములను చూసి సహించుకోలేక కొంతమంది అతనిని అనేక ఇక్కట్లకు గురి చేస్తూ వచ్చారు. దిన దినమునకూ అతనిపై ద్వేషం పెంచుకున్నారు. అతని పేరుప్రఖ్యాతులు పెరిగిపోతున్నాయన్న అసూయతో అర్చకులుకూడా అతనికి విరుద్ధంగా ప్రచారం చేస్తూ వచ్చారు. బెస్తవారు మాత్రం అతనికి శిష్యులై, అతనిని ప్రేమిస్తూ, ఆరాధిస్తూ వచ్చారు. ఓర్వలేనివారు అతనికి అనేక ఆటంకములు కల్పించి బాధలు పెట్టారు. కట్టకడపటికి అతని ప్రాణం తీయటానికికూడా ప్రయత్నించారు. ఇందులో జూడాస్ అనే శిష్యుడుకూడా పాల్గొన్నాడు. జీసస్‌కు పన్నెండుమంది శిష్యులుండేవారు. వారిలో పన్నెండవవాడు జూడాస్. ఆనాడు ఒక్క జూడాస్ ఉండినాడు. ఈనాడు అనేకమంది జూడాస్‌లు బయల్దేరినారు. కనుకనే, జగత్తులో ఆశాంతి పెరిగిపోయింది. కొంతమంది అసూయపరులు అల్పబుద్ధి గల జూడాస్‌కు ధనాశ కల్పించి అతనిని లోబర్చుకున్నారు. కేవలం కొన్ని వెండి నాణెములను ఆశించి జూడాస్ తన గురువుకు ద్రోహం చేశాడు. **"ధనమూల మిదం జగత్" అనే భావన ప్రజలలో రెండువేల సంవత్సరములకు పూర్వమే ప్రారంభమైంది.**

ధనంకోసం పరులకు అపకారం చేయడం, అన్యాయ, అక్రమ, అనాచారములకు పాల్పడటం, లేని చెడ్డను సృష్టించి పవిత్రమైన, నిత్యమైన సత్యమునకు విరుద్ధంగా ప్రచారం చేయడం - ఇది ఆనాడే కాదు, ఈనాడూ జరుగుతూనే ఉన్నది. ఇది లోకసహజం. దీనికి ఎవ్వరూ వెఱువకూడదు. మనలో లేని దోషాలకు మనమెందుకు భయపడాలి? మనలో లేని తప్పులకు మనమెందుకు వెఱువాలి? **సత్యనిత్యమైన భావములచేత ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దివ్యపురుషులకు విరుద్ధంగా దుర్మార్గులు, అసూయాపరులు దుష్ప్రచారం చేయడం అనాది కాలమునుండి జరుగుతూనే ఉన్నది. ~~ఈనాడుకూడా~~ అలాంటి దుష్ప్రచారాల కేమీ తక్కువ లేదు.** సాయియొక్క పేరుప్రతిష్ఠలు దినదినమునకూ పెరిగిపోవడం చూసి అనేకమందికి అసూయ కల్గుతోంది. పోనీ, వారేమైనా మంచి పనులు చేస్తున్నారా అంటే, కనీసం ప్రయత్నమైనా చేయడం లేదు.

ప్రఖ్యాతి గాంచిన రాయలసీమకు బ్రిటీషువారి కాలమునుండి ఒక్కరైనా త్రాగునీరు అందించలేక పోయారు. ఎంతమందో శ్రీమంతులు, నాయకులు ఉండినారు. కాని, ఒక్కరైనా ఈ మంచి కార్యమునకు పూనుకోలేదు. **మనిషికి నీరే ప్రాణం కాబట్టి, ఇంటింటికీ నీరు అందించాడు సాయిబాబా.** ~~ఈనాడు~~ ఒక హార్ట్ ఆపరేషన్ చేయించుకోవాలంటే లక్షల రూపాయలు కావాలి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను కట్టించి లక్షలాదిమందికి ఉచితంగా హార్ట్‌ఆపరేషన్లను చేయిస్తున్నాడు సాయిబాబా. ~~ఈ~~ రోజుల్లో పసి పిల్లవానిని స్కూల్లో చేర్చాలంటే మొట్టమొదట 20 వేల డొనేషన్ కట్టాలి. కాని, సాయిబాబా కె.జి. మొదలు పి.జి వరకు ఉచిత విద్య నందిస్తున్నాడు. ఇందులో వేయింట ఒక భాగమైనా ఎవరైనా చేస్తున్నారా? ఏ గవర్నమెంటు అయినా విద్యను, వైద్యమును ఉచితంగా అందిస్తున్నదా? లేదు, లేదు. **ఒక్క సత్యసాయిబాబా మాత్రమే స్వార్థమనేది లేకుండా పరార్థంకోసం పాటుపడుతున్నాడు. కాని, అయోగ్యులైన మానవులు కొందరు సాయికి విరుద్ధంగా దుష్ప్రచారమును ప్రారంభించారు. సాయి చేస్తున్న పనులెలాంటివి, అనే జ్ఞానం వారికి లేకుండాపోతున్నది. మహా అల్పజ్ఞులైపోతున్నారు ~~ఈ~~ విద్యావంతులంతా. సాయిది చాలా పవిత్రమైన హృదయం, నిర్మలమైన భావం, నిస్వార్థమైన ప్రేమ. Purity (పవిత్రత), Patience (శాంతము), Perseverance (పట్టుదల) - ~~ఈ~~ మూడు P లు సత్యసాయి బాబాలో ఉన్నాయి. ~~ఈ~~ మూడింటి ద్వారా స్వార్థరహితసేవ చేస్తున్నాడు సత్యసాయిబాబా.** సత్యసాయిబాబాలో కాలిగోటినుండి తలవెంట్రుకవరకు ఎక్కడా స్వార్థమనేది లేదు. తలలున్నవారు ఇంత మాత్రం యోచించుకొనలేరా? **ఎందుకోసం వీరి దుష్ప్రచారములు? ధనంకోసమే! ~~ఈ~~ దుర్బుద్ధులంతా ధనంకోసమే, ~~ఈ~~దురాలోచనలంతా ధనం కోసమే.** ఇంతేకాకుండా, డబ్బులు ఇచ్చి ఒక మతమునుండి మరొక మతములోకి మార్పిడి చేస్తున్నారు. **కాషాయ వస్త్రములను ధరించిన స్వాములుకూడా ఒకరి గురించి మరొకరు దుష్ప్రచారమునకు పాల్పడుతున్నారు.**

"కాషాయ వస్త్రంబు కట్టిన మాత్రాన
కరతలామలకంబు కాదు ముక్తి
నోటితో మంత్రంబు నుచ్చరించినయంత
చేసిన పాపంబు చెదిరిపోదు
గీతను చేబట్టి కేకలు వేసిన
పుణ్యము మన ఇంట ప్రోవుపడదు"

కొందరు స్వాములుకూడా దుర్మార్గంలో ప్రవేశించి దుష్ప్రచారం చేస్తున్నారు. ఇంక, పీఠాధిపతుల సంగతి చెప్పనక్కర్లేదు. ఎవ్వరినీ మనం విమర్శించకూడదుగాని, సమయం వచ్చింది కాబట్టి, చెబుతున్నాను. ~~ఈ~~ దుష్ప్రచారం గురించి మీరు ఎలాంటి భయమూ పెట్టుకోకండి.

బలహీనతకు లోనయ్యేవారు భక్తులు కాజాలరు

ఇప్పుడు బెంగుళూరులోకూడా 300 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కడుతున్నాము. ఇలాంటి పవిత్రమైన కార్యంలో ఏ నాయకుడైనా ప్రవేశిస్తున్నాడా? లేదు. పైగా గొప్పలు చెప్పుకుంటూ

దుస్సంగము

కూర్చుంటున్నారు. సిగ్గుచేటు! కొందరు అసూయతో దుష్ప్రచారానికి పాల్పడుతున్నారు. **ఇతరులు చేసే పవిత్రకార్యాలకు అసూయతో అడ్డు తగిలేవారు రాక్షసులేగాని, మానవులు కారు.** ఇలాంటి రాక్షసులు లోకమంతా బయల్దేరినా సాయిప్రతిజ్ఞ ఎప్పటికీ మారదు. అసూయపరులు దుష్ప్రచారంచేత సాయిబాబా గౌరవమును తగ్గించాలని ప్రయత్నం చేస్తున్నారు. నాకు గౌరవం కావాలనే ఆశ లేదు. కాని, అది పెరుగుతూనే ఉన్నది. **మన భారతదేశమంత అక్షరాలతో ఈ ప్రపంచమంతా ప్రచారం చేసినా నా గౌరవం కించిత్తైనా తగ్గిపోదు. దుష్ప్రచారం చూసి కొంతమంది భక్తులు బలహీనతకు లోనవుతున్నారు. వారు సరియైన భక్తులు కారు. సాయిశక్తులను ఇన్ని గమనించికూడను** ఈ పిచ్చిపిచ్చి కాకికూతలకు ఎందుకు భయపడాలి? గోడలపై వ్రాసే వ్రాతలను, వేదికపై వేసే కేకలను, పేపర్లలో వ్రాసే బూతుకూతలను మీరు లెక్క చేయనక్కర్లేదు. మన సత్యాన్ని, మన ధర్మాన్ని, **మన ప్రేమను మనం ప్రచారం చేస్తూ రావాలి.**

(స.సా.జ. 2001 పు.1/3)

(చూ॥ సంకల్పము)

దుస్సంగము

దుస్సంగానికి దూరంగా వుండాలి. దుస్సంగములో చేరితే మీలో ఉన్న పవిత్రమైన భావములు నిర్మూలమైపోతాయి. కైక మంథర మాటలను వినడంచేత తన స్వంత కుమారుడైన భరతుని కన్నమిన్నగా ప్రేమించిన రాముణ్ణి అరణ్యానికి పంపించింది. మంథర మాటలచేత ఆమె బుద్ధిలో మార్పు కలిగింది. అనగా, **బుద్ధి దోషము కల్గినప్పుడు అసత్యం సత్యంగా గోచరిస్తుంది. సంగ దోషముచేత బుద్ధిదోషం ఏర్పడుతుంది.** కనుకనే, నేను అప్పుడప్పుడు పిల్లలకు చెపుతుంటాను - ఇతరులతో ఎక్కువగా కలవకండని. చిన్న వయస్సునుండియే దుస్సంగానికి దూరంగా ఉండాలి. సత్సంగంలో చేరాలి. అహోరాత్రములు పుణ్య కార్యముల నాచరించాలి. నిత్యానిత్య విషయ పరిశీలన చేయాలి.

(స. సా. న. 1999 పుట. 288)

దూపాటి తిరుమలాచార్యులు

పూర్వం ఇక్కడ దూపాటి తిరుమలాచార్యులనే భక్తుడుండేవాడు. **సుప్రభాతం వ్రాసినది అతడే.** అతడు గొప్ప సంస్కృత పండితుడు, వెంకటగిరి సంస్థానంలో పని చేశాడు. అతడు 90 ఏళ్ళ వయస్సులో బదరికి నాతో ప్రయాణమై వచ్చాడు. "తిరుమలాచారీ! నీ దేహం చాల శుష్కించిపోయింది. అంతదూరం ప్రయాణం చేయగలవా?" అని అడిగాను. "స్వామీ! మీరు నా వెంట ఉంటే ఎంత కాలమైనా, ఎంతదూరమైనా ప్రయాణం చేస్తాను. మీకు అయినవాడనైతే జగత్తుకంతా నేను అయినవాడనౌతాను. మీకు కానివాడనైతే నా జీవితమే వ్యర్థం."

"నీకు కానివాడనైతే లోకమాత!
నేను లోకమందు లోకువౌదు లోకమాత!"

అన్నాడు. ఇంతటి భక్తి ప్రపత్తులతో జీవించినవాడు ఆ తిరుమలాచారి. అతడు తన కాలమంతా స్వామితోనే గడిపాడు. బృందావనానికి వెళితే అక్కడ కూడా అతడు నాతోనే ఉండేవాడు. అతను చాల గొప్ప భక్తుడు. ఆ భక్తికి ప్రమాణము చెప్పడానికి వీలుకాదు. కట్టకడపటికి అతనికి మరణం కూడా చాల సునాయాసంగా లభించింది. ఒకరోజున "స్వామీ! ఇంక నా పని అయిపోయింది." అన్నాడు. "నీకెట్లా తెలుసు?" అన్నాను. "లోపలున్న మీరే నాకు బోధిస్తున్నారు" అన్నాడు. వెళ్ళి స్నానం చేశాడు, కొంత జలము తీసుకు వచ్చి నాపాదాలకు అభిషేకం చేశాడు. నాలుగు బొట్లు తీర్థం తీసుకున్నాడు. "స్వామీ! ఇంక నేను పరిపూర్ణుడనైనాను.

పూర్ణమదః పూర్ణ మిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణ మేవావశిష్యతే!

నా దేహము, మనస్సు ఆత్మ పరిపూర్ణమైపోయాయి. ఇంక మీలో చేరిపోతున్నాను" అన్నాడు. తన ప్రాణాలను

వదిలాడు. చూశారా! తన మరణం ఎప్పుడు వస్తుందో ముందే తెలుసుకోగల్గాడు. అతడు నిరంతరము 'సాయిమాతా! సాయిమాతా! అని స్మరించేవాడు. **ఇలాంటి భక్తి కల్గినవారు లోకంలో ఎంతమందో ఉంటున్నారు. "జగతియందు పుణ్య పురుషులు లేకున్న జగము లెట్లు వెలుగు పగలుగాను!" ఇలాంటి పరమ భక్తులు ఉండటం వల్లనే జగత్తంతా దేదీప్యమానంగా వెలుగుతున్నది.**

(స.సా.ఫి.2000పు.39)

దూరము

(చూ॥ నామస్మరణ, ప్రేమోదయము)

దూరంగా ఉంచు

అసహ్యించు కోవటం అనే ముల్లును నీమనసులో ఉంచుకోకు. అందరిని ప్రేమించడం నేర్చుకో. **కోరిక తుఫాను వంటిది, ఆశ సుడిగుండం, గర్వం కొండవాలు, అనుబంధాలు జారిపోతున్న మంచుచరియలు, అహంకారము అగ్ని పర్వతం. నీవు భగవంతుని నామాన్ని జపించినప్పుడు, ధ్యానంలో ఉన్నప్పుడు వాటి నన్నింటిని దూరంగా ఉంచు.** అప్పుడు నీ సమసత్వం చెదరదు. ప్రేమ నీ హృదయ సింహాసనాన్ని అదిష్టించని అప్పుడు సూర్య ప్రకాశం, చల్లని గాలి, తృప్తి అనే సెలయేటి గలగలలునీ నమ్మకమనే వ్రేళ్ళను పోషిస్తాయి.

(అ.ష.పు.130)

దూషణ భూషణలు

(చూ॥ దివ్య ప్రకటనలు)

దూషించుట

అసూయచేతనే మానవుడు అశాంతికి గురియైపోతున్నాడు. ఒకప్పుడు బుద్ధుడు భిక్షాటనకై బయలుదేరి వెళ్ళుతున్నాడు. తాను చేరవలసిన గ్రామము సమీపిస్తుండాది. ఆ గ్రామములోపల అందరూ బుద్ధినిపైన అమితమైన విశ్వాసము గలిగినవారు. ఆగ్రామము సమీపిస్తుండగనే కొంతమంది దుర్మార్గులు చేరి యితనిని అడ్డగించి అనేక విధములుగా దూషిస్తూ వచ్చారు. కానీ బుద్ధుడు ప్రయాణము చేయకుండా ఒక రాతిపైన కూర్చున్నాడు. నాయనా! నన్ను మీరు దూషించటములో వున్న ఆనందమేమిటి? అని ప్రశ్నించాడు. వారు కారణాలు చెప్పకుండా మరింత హేళనగా అతనిని దూషించటానికి ప్రారంభించారు. సరి. మీకు యెంతసేపు యిష్టంగా వుంటుందో దూషించమని కూర్చున్నాడు. తిట్టి తిట్టి వారికి నోరు నొప్పి వచ్చింది. వారు యింక వెళ్ళిపోవుటకు సిద్ధముగా వుంటుండారు. వెళ్ళిపోయేముందుగా వారికి బుద్ధుడు చెబుతున్నాడు. "నాయనలారా! రాబోయే గ్రామములోపల అందరూ నా పైన అమితంగా ప్రీతి కలిగినవారు. నేను ఆ గ్రామములో చేరిన తరువాత మీరు యీ విధముగా ప్రవర్తిస్తే మిమ్ములను ముక్కలు ముక్కలు చేస్తారు. కనుక మీ ప్రమాదమును తప్పించే నిమిత్తమై మీరు యెంతవరకు నన్ను **దూషించాలని యిష్టముంటుండాదో అంతవరకు దూషించటానికి మీకు అవకాశమిచ్చేకోసం యింతసేపు నేను యిక్కడ కూర్చున్నాను. ఇతరులను సంతోషపెట్టాలి అంటే మనము ఎన్నో విధములుగా శ్రమలు పడాలి.** ధనము వ్యయము చేయాలి. నేను యీనాడు నయాపైసా ఖర్చుకాకుండా, యేవిధమైన శ్రమపడకుండా మీకు యింతమందికి యింత ఆనందాన్ని అందిస్తున్నాను. ఈనాడు ఎంత హాయి నాకు అన్నాడు. నన్ను **దూషించటం** మీకు ఆనందంగా వున్నదంటే ఆ ఆనందానికి నేనే కదా కారణం. ఏదో ఒక విధముగా మీకు తృప్తి కలిగించాను. ఈ తృప్తి కలిగించటంచేత నాకు చాలా ఆనందం. పరులను సంతృప్తి పెట్టేకోసమని అనేకమంది సత్రాలు కట్టిస్తారు. బావులు త్రవ్విస్తారు. ఇంకా అనేకవిధములైన పుపకార కర్మలాచరిస్తారు. ఏమీ శ్రమలేకుండా యీ విధముగా యీ దుర్మార్గులను సంతోష పెడుతున్నానంటే నేను యెంతో గొప్పపని చేసినవాడనే" అన్నాడు. మరి యింకొక

దృఢ నిశ్చయము

విషయమును చక్కగా హృదయానికి హత్తుకునేటట్లు బోధించారు. "నాయనా! నీ యింటికి ఒక బిచ్చగాడు వచ్చాడు. భవతీ భిక్షాం దేహి అని అడిగాడు. నీవు బిచ్చము తీసుకొని వచ్చావు. కాని అతను అడిగిన బిచ్చము తేలేదు. మరొక బిచ్చము తెచ్చావు. అది అతను తిరస్కరిస్తాడు. అపుడు ఆ బిచ్చము యెవరికి చెందుతుంది?" అన్నాడు. నేనే వెనుకకు తీసుకుపోతాను. ఆ బిచ్చము నాకే చెందుతుంది అన్నాడు. అదే విధముగనే నీవు దూషణ అనే బిచ్చము తెచ్చి నాకివ్వటానికి ప్రయత్నించావు. దానిని నేను తీసుకొనలేదు. అప్పుడు యీ భిక్షము ఎవరికి చేరుతుంది! నీకే చేరుతుంది. కనుక నిన్ను నీవు దూషించుకుంటున్నావు. నన్ను కాదు. మనము ఒక రిజిష్టరు కవరు ఒక మిత్రునికి పోస్టులో వేస్తే ఆ ఫ్రెండు ఆ రిజిష్టరు కవరును తీసుకోకుండా పోతే పోస్టల్ డిపార్టుమెంటులో యేమవుతుంది ఆ కవరు? అది ఎవరు పంపించారో వారికే రీడైరెక్టై చేరుతుంది. అదే విధముగనే నీవు ఒకరిని **దూషిస్తూ** వచ్చావంటే లేదా ఒకరిని విమర్శిస్తూ వచ్చావంటే వారు దానిని **లక్ష్యము** చేయకపోతే ఆ విమర్శ నీకే రీడైరక్ట్ అయిపోతుంది. కనుక ద్వేషమనే దానితో అసూయ అనేదానితో తమను తాము బాధించుకోవటమే తప్ప అన్యులను బాధిస్తూ వున్నాననుకోవటం కేవలం అల్పత్వం.

(శ్రీ.స.గీ. పు. 218/219)

దృఢ నిశ్చయము

'దృఢ నిశ్చయః' ఇది దృఢమైనదిగను, స్థిరమైనదిగను, నిశ్చలమైనదిగను ఉంటుండే తత్వము. ధైర్యసాహసములు దృఢశక్తులు మానవునకు సహజంగానే ఉంటాయి. ఈ దృఢత్వమును, ధైర్యసాహసములను అనేక విధములై నటువంటి మార్గములలో అనుభవిస్తుంటాడు జీవుడు. దృఢమైన **ధైర్యసాహసములను కొంత మంది పర్వతమును యెక్కే విషయములో వినియోగిస్తారు; మహాధీరులై వుంటుంటారు.** ఇట్టి ధైర్యసాహసములను దృఢశక్తిని అనంతమైన సముద్రమును దాటే విషయములో ఈదే విషయములో కొందరు ప్రవేశపెడతారు. స్థిరచిత్తులై వుంటుంటారు. మరికొందరు భీకరారణ్యములో ప్రయాణము చేసే ధీరులై వుంటారు. దయాదాక్షిణ్యములు లేకుండా యితరుల హింసించి ధనమును ప్రోగుచేసుకొనే విషయములో కొందరు ధైర్యసాహస దృఢశక్తులను కలిగి ప్రవర్తిస్తుంటారు. మానవత్వమునే మరచి దైవత్వమును విస్మరించి దానవులుగా ప్రవర్తించి క్రూరులుగా ప్రవర్తించే ధీరత్వము కలిగినవారు మరికొందరుంటారు.

ఈ ధీరత్వమును దృఢత్వమును మంచిగను ఉపయోగించు కొనవచ్చును చెడ్డగను ఉపయోగించు కొనవచ్చును.

వాల్మీకి రత్నాకరుడుగా నుండినప్పుడు తన ధైర్యసాహస దృఢశక్తుల నన్నింటిని దుర్మార్గములో ప్రవేశపెట్టాడు. సప్తఋషుల సంపర్కముచేత వారి ప్రబోధలచేత ధైర్యమును సాహసమును దృఢశక్తులను పవిత్రమైన రామనామములో ప్రవేశపెట్టాడు. కనుక వాల్మీకి రామాయణమునకు దాతగను కర్తగనూ రూపొందినాడు. కేవలము లౌకికమైన ప్రాపంచికమైన వ్యావహారిక సంబంధమైన విషయములందు ప్రవేశపెట్టుటకంటె యింద్రియనిగ్రహమునందు, దైవాపేక్షయందు, దివ్యమైన ప్రపత్తిమార్గమునందు ధైర్యసాహస ధీరత్వములను ప్రవేశపెట్టటముతో **మానవత్వము సార్థకమవుతుంది. ఇది మానవత్వమునకు ఒక విధమైన విశిష్టతను రూపొందింప జేస్తుంది.**

(శ్రీ.గీ.పు.19/20)

దృశ్యము

పగటిదృశ్యంబు స్వప్నాన పారిపోవు
స్వప్నదృశ్యంబు పగటిలో వాలిపోవు
పగటి రే కలలందున పరిణమించు
ఇంతకన్న వేరెద్ది ఎఱుకపరతు

(ము.ము.పు. 92)

(చూ॥ ప్రకృతి)

దృష్టి

మట్టినుండి పుట్టిన చెట్టు మట్టి యగును।
బ్రహ్మ నుండి పుట్టిన సృష్టి బ్రహ్మమగును।
కాని, దృష్టికి భిన్నమై కనిపించు।
సత్యమును తెల్పు బాట - యీ సాయి మాట।
దృష్టి భేదమేగాని, వస్తు బేధము లేదు.

(సా. పు. 129)

(చూ॥ తత్వజ్ఞానం, మాయ, మెడిటేషన్, సర్వత్రా ప్రసిద్ధోపదేశాత్)

దేనికైనా రెడిగా ఉండాలి

ఫోటోగ్రాఫరు ఫోటో తీసేముందు 'రెడీ' అంటాడు. అతను 'రెడీ' అన్నప్పుడు మనం 'స్టెడీ'గా ఉంటే ఫోటో చక్కగా పడుతుంది. అతడు రెడీ అని చెప్పక మునుపు ఎటు తిరిగినా ఫరవాలేదు. కాని, భగవంతుడనే ఫోటోగ్రాఫర్ ఎప్పుడు రెడీ అంటాడో తెలియదు. ఎప్పుడు తీస్తాడో ఏమిటో! **కాబట్టి మీరు ఎప్పటికీ రెడీగా ఉండాలి.** అప్పుడే ఆ హృదయంలో మీ చిత్రము చక్కగా చేరిపోతుంది. **భగవంతుడొక పెద్ద ఫోటోగ్రాఫర్. కాని, రెడీ అని చెప్పడు.** ఎప్పుడు తీస్తాడో మీ పిక్చరు! కనుక, మీరు ఎప్పుడూ రెడీగానే ఉండాలి, దేనికైనా రెడీగా ఉండాలి.'Always be ready' అదే సరియైన తత్వము.

(శ్రీ.భ.ఉ.పు.200)

దేవతలు

(చూ॥ భగవంతుడు)

దేవయానము

(చూ॥ ఉత్తరరాయణము)

దేవాలయము/ దేవాలయములు

"నా కొఱకు దేవాలయముల కట్టించుట నా కంగీకారము గాదు. ఇప్పుడుండు దేవాలయములనే **జీర్ణోద్ధరణము గావించి, పూజాపునస్కారములతో వృద్ధిచేయవలెను.** మందిరములను కట్టించ వలయునని చందాల కొఱకు ప్రజలను పీడించుచుండుట మంచి పద్ధతి కాదు. ఇందువలన అసూయ ద్వేషములును, ఆశయును, గురువునకు నపకీర్తియు కలుగును. కావున భక్తులు జాగ్రత్తగా నడుచుకొనుట మంచిది. **"జపధ్యానములకు ప్రత్యేక మందిరము లెందుకు? తమ తమ గృహములలోనే నొక గదిని పూజా గృహముగ నేర్పాటుజేసికొని, యందే హాయిగా బిడ్డలు మొదలగు కుటుంబీకులందఱు కలసి ప్రార్థన, భజనలను చేసికొనవచ్చునుగదా?** ప్రియమైన మాటల తోను, వినయ విధేయతలతోను, ప్రేమతోను, ఆచంచలవిశ్వాసముతోను, సత్య సంధతతోను భక్తులు ప్రవర్తించుచుండిన నితరులు వీరిని చూచి నేర్చుకొనగలరు. వృద్ధికి రాగలరు. అంతియేగాని, కేవలము మాటలవలన లాభము తనకుగాని, యితరులకుగాని కలుగదని గ్రహింపవలెను.

(స.శి.సు.ద్వి.పు.186/187)

దేహానికి హృదయమెట్టిదో, గ్రామానికి లేక జన సమూహానికి **దేవాలయం అట్టిది.** దేవాలయాలు కట్టడం వాటిలో విగ్రహాలను ప్రతిష్టించడం, అక్కడి **ఆరాధనకు** సంబంధించిన అనేక ఉత్సవాలు చేయడం... మొదలైనవన్నీ సత్కర్మలు. అవి సేవలో శిక్షణ నిస్తాయి. త్యాగానికి, అనాసక్తికి అవకాశాలను కలిగిస్తాయి. అది ఒక విధమైన తపస్సు!

ఆత్మజ్ఞానమార్గం సంపూర్ణానందానికి మార్గమని ఉపదేశం ద్వారాను, ఆచరణ ద్వారాను మీరు నిరూపించాలి. కనుక మీపైన గొప్ప బాధ్యత ఉంది. మీరు చేస్తున్న సాధన మిమ్మల్ని మునుపటికంటె మంచిగా, సంతోషంగా, ఎక్కువ ఉపయోగకరమైన వ్యక్తిగా చేసిందని - మీ నిశ్చలత, శాంతం, నమ్రత, పవిత్రత, సౌశీల్యం, ధైర్యం, ఎట్టి పరిస్థితులలోనయినా చెక్కుచెదరని నమ్మకం ద్వారా నిరూపించవలసిన బాధ్యత ఉంది. ఆచరించి నిరూపించండి. అంతేకాని, కేవలం మాటలతో నొక్కి చెప్పి చేతలతో కాదనకండి.

(లో.పు.231)

దేవుడు

ఇది మానవులందరు అద్భుతమైన ప్రశాంతిని పొందే ఒక దేవాలయం. **ఒక చర్చి, ఒక మసీదు, ఒక యూదుల ప్రార్థనా మందిరం.** మానవ రూపంలో అవతరించిన భగవంతుని అపారమైన ప్రేమలో లీనమై అత్యున్నతమైన ప్రశాంతిని ఇక్కడ అందరూ పొందవచ్చు. **ప్రతి మానవుని హృదయం ప్రశాంతి నిలయంగా మార్చటమే నాలక్ష్యం. ఈ లక్ష్యం నెరవేర్చటం కోసమే నా ఈ అవతారం వచ్చింది.**

(త.పు.27)

(చూ॥ అనాహతము, అయస్కాంత శక్తి, ఒక్కటే, గుడిగోపురాలు, దేవుడు, నిరాకారం, నీవే)

దేవుడు

అంకె తరువాత సున్న కబ్బువిలువ ।
అటులే దేవుని తరువాత అగును జగతి ।
కాన ఒక్కడే దేవుని గాంచి పిదప ।
నీవు లెక్కగొనుక అనేక జీవి జాతి ॥

(సా॥ పు. 459)

దైవత్వంలోని ఆదర్శాలను మనం అందుకోవాలి. దేవుని దేవుడుగా పూజించడం ప్రధానము కాదు. దేవుడు ఏ ఒక్క ప్రత్యేక స్థలములో లేడు, అంతటా యున్నాడు. అందుకే తరచుగా చెప్పుతూ వుంటాను. ఒక చిత్ర పటాన్ని దేవుడుగా భావించి పూజింపవచ్చును గాని, దేవుడు చిత్రపటంగా కాదు. ఒక ఆదర్శం కోసం చిత్రపటాన్ని పెట్టుకున్నామేగాని, చిత్రపటమే దేవుడు కాడు.

(సా॥ పు. 618)

శ్రీకరుండగు దేవుండు నీకు నరుడ
పగటి వేళ చుక్కలు కనబడని రీతి।
కాన రాకున్న అజ్ఞాన కారణమున।
అంత మాత్రాన అతడు లేడనకు సుమ్మి॥

(సా॥ పు 343)

పూలయందు పరిమళమెట్లుకలదో
అటుల దేవుండు నీలోన కలడు జూడ
మేది చెడినట్టి కస్తూరిమృగము వోలె
ఏలవెతికెదు దేవుని వెట్టివాడ!

(స.ది.పు.81)

ఒకడు **దేవుడున్నా డంటాడు.** ఒకడు లేడంటాడు. ఉన్నాడనేవాడు దేవుని చూసే ఉంటాడు. లేడనేవాడు కూడా చూసే ఉండాలి. చూడకుండా లేదని చెప్పే అధికారం వానికి లేదు. ఇతను నంజుండయ్య - చూసినవాడు ఇతను నంజుండయ్యే అని గట్టిగా చెపుతాడు. చక్రవర్తిని పిలిచి నంజుండయ్య అంటే ఇతను నంజుండయ్యకాదు. చక్రవర్తి అంటాడు వాడు. ఇతను నంజుండయ్య అనే వాడు కాని, ఇతను నంజుండయ్య కాదనే వాడు కాని నంజుండయ్యను చూసే ఉండాలి. చూడకుండా నంజుండయ్యే అనడానికి, కాదనడానికి గాని వీలులేదు. అదే విధంగా దైవాన్ని చూసిన వానికే ఇతను దైవం కాడని చెప్పే అధికారం ఉంది. ఈ అవును, కాదు అనేది మాటల గారడీ! అవునన్నా, కాదన్నా మాటల మార్పే తప్ప **ఉన్నదాన్ని ఎవరూ కాదనడానికి లేదు.**

(ఆ.ప్ర.న.1992పు.60)

దేవుడెక్కడనుచు దేవులాడగ నేల?
హృదయమందు లేడె ఈశ్వరుండు!
ఇచ్చుకొనుము సేవ పుచ్చుకొనుము ప్రేమ
అటుల చేసి ఆత్మతత్వ **మనుభవించు!**

(స.సా.డి. 85 పు. 306)

ప్రేమస్వరూపులారా! మానవ జన్మ అత్యంత ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది. మానవుడు దైవసమానుడు. **దైవం ఎక్కడున్నాడు?** మీరందరూ దైవస్వరూపులే! **"దేహో దేవాలయప్రోక్తో: జీవో దేవస్సనాతనః దేహమే దేవాలయం, జీవుడే దేవుడు.** ఈ సత్యాన్ని గుర్తించడమే సమస్త సాధనల గమ్యం. మానవ దేహం కదిలే దేవాలయం. **ఇందులో ఆత్మ అనే దేవుడు ప్రతిష్టయై యున్నాడు. అతనిని వేదము,**
"నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం
నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం"

అని వర్ణించింది. అట్టి దేవుడు మీయందే ఉండగా మీరు ఎక్కడో దేవుణ్ణి వెతకడానికి పోవడం వెట్టితనం కాదా? ప్రస్తుతం ఈ ప్రపంచంలో 600 కోట్ల దేవాలయములున్నాయి. ఏమిటా దేవాలయములు? మానవ దేహములే! ప్రతి దేహమూ ఒక దేవాలయమే. **దేహములో ఉన్న చైతన్య శక్తియే భగవంతుడు. కనుకనే వేదము "ఈశ్వరస్సర్వ భూతానాం" అని బోధించింది.** సర్వ భూతములందు ఈశ్వరత్వం ఉంటున్నది. కనుక, మీరు ఎక్కడే మనిషిని చూసినప్పటికీ ఒక దేవాలయాన్ని చూసినట్లుగానే భావించాలి. ప్రతి మనిషిలోను ఆత్మస్వరూపుడైన భగవంతుడున్నాడు. **'దేవాలయము' యొక్క అంద చందములను కాదు మీరు చూడవలసింది; అందులో ఉన్న ఆత్మస్వరూపుడైన దేవుణ్ణి చూసి ఆనందించాలి.** ఎవ్వరినీ దూషించకూడదు, హింసించ కూడదు, బాధించకూడదు. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించేవాడే నిజమైన భక్తుడు. ఇష్టమొచ్చినట్లు ఇతరులను దూషించేవాడు, పరిహసించేవాడు భక్తుడెలా అవుతాడు? **అట్టివాడు పరమ నీచుడనే చెప్పవచ్చు.**

(స.సా.మే2000 పు.130/131)

(చూ॥ చదువు, ప్రధమకర్తవ్యం, భగవంతుడు)

దేవుడు ఒక్కడే

అల్లాయంచు మహమ్మదీయులు, యహోవాయంచు సత్
క్రైస్తవుల్
పుల్లాబ్జాక్షుడంచు వైష్ణవుల్, శంభుడంచు శైవుల్,
ఉల్లాసంబుల గొల్వ నెల్లరును ఆయుర్భాగ్యభోగ్యాది సం
పల్లాభంబు లొసంగి, బ్రోచు పరమాత్మ ఒక్కడంచు ఎంచుడీ॥

(సా.పు.29)

దేవుడున్నాడు

నేను ఏ అష్టాక్షరీ, పంచాక్షరీ, మంత్రాలనో మీకు ఉపదేశించ దలచుకోలేదు. ఏ భగవద్గీతనో, ఏ బ్రహ్మసూత్రాలనో చదవమని నేను బోధించడం లేదు. దేవుడున్నాడు... ఈ ఐదక్షరాల వాక్యాన్ని మీరు ప్రధానంగా తీసుకోండి. దినమంతా దీనినే చింతిస్తూ భావిస్తూ ఆచరిస్తూ ఆనందిస్తూ అందరికీ అందిస్తూ రండి. ఎక్కడి కెళ్ళినా ఎల్లాంటి పరిస్థితులందైనా దేవుడున్నాడు, ఉన్నాడు, ఉన్నాడని బల్లగ్రుద్దిచాటండి. **ఈ విశ్వాసాన్ని బలపర్చుకుంటే లోకమంతా నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా కళకళలాడుతూ కిలకిలనవ్వుతుంది. దేవుడున్నాడన్న విశ్వాసమే మీకు బ్రహ్మాస్త్రంగా పని చేస్తుంది.** ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కొనే ధైర్యసాహసాలు కలుగుతాయి. **రామమంత్రము, కృష్ణమంత్రము, శివమంత్రముకంటే 'దేవుడున్నాడు' అన్నదే చాల బలమైన మంత్రం.** ఈ విశ్వాసం లేకుండా ఎన్ని మంత్రాలు చెప్పినా ప్రయోజనం లేదు.

(స.సా. డి. 96 వెనకకవరు)

ఉన్నాడయా దేముడున్నాడయా కన్నుల కనిపించకున్నాడయా।
లోకాల చీకట్లు పోకార్చు రవిచంద్రు దీపాలు గగనాన త్రిప్పుచున్నాడయా॥
లక్షలాదిగనున్న నక్షత్రములనెల్ల నేల రాల్చకమింటనున్నాడయా।
ఈధారుణీచక్రం యిరుసు లేకుండగను ఎల్లనేళల త్రిప్పుచున్నాడయా॥
జీతభత్యములు లేక ప్రీతితో మనవైపుగాలిలో సురటేలు విసిరేనయా।
ఆధారమేలేక అలరుచున్నట్టి ఆకాశమును ఆపుచున్నాడయా!
పొంగి పొరలుచు పృథ్విపై పడకుండ కడలిరాజు కాళ్ళముడిచాడయ్యా।
తెరచాటు తానుండి తెరముందు జనముంచి తైతక్కలాడించుచున్నాడయ్యా।
విశ్వమును వింత సృష్టించే విశ్వకర్త తానై పోషించి నడిపించే ధర్మమూర్తి
దివ్యచైతన్యవంతమై దీప్తికలుగ విశ్వశాంతి యొనగూర్చె విశ్వవిభుడు॥

(సా.పు. 42)

(చూ॥ ఉన్నాడయ్యా)

దేవుడెక్కడున్నాడు?

అనేక మంది దేవుడెక్కడున్నాడు? అని ప్రశ్నిస్తారు. అలాంటివారికి ఏమని జవాబు చెప్పాలి?

"ఇందు గలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం

దేవుని కోసం

డెందెందు వెదకి చూసిన
అందందె గలడు...''
అని ధైర్యంగా చెప్పాలి. భగవంతుడు లేడన్నవారికి లేడు, ఉన్నాడన్నవారికి ఉన్నాడు.
'నో' అనువారికి 'నో' అనురా
'ఎస్' అనువారికి 'ఎస్' అనురా
'నో', 'ఎస్'లు మీ నోటికెగాని
సాయికి సర్వం 'ఎస్, ఎస్, ఎస్'
దేవుడు లేడని వాదించేవారికి మీరు చెప్పవలసిన సమాధానమేమిటి? "అయ్యా! నీ దేవుడు నీకు లేకపోవచ్చు. కాని, నా దేవుడు నాకున్నాడు. నా దేవుడు లేడని చెప్పడానికి నీకు అధికారం లేదు'' అని వారికి బుద్ధి చెప్పాలి. ఎలాంటి పరిస్థితిలోనైనా మీరు అవిశ్వాసానికి చోటివ్వరాదు. ధైర్య సాహసాలతో సమాజ ధర్మాన్ని, ప్రాచీన సంస్కృతిని నిలబెట్టడానికి కంకణం కట్టుకోవాలి. **భగవంతుడు మూడు ప్రతిజ్ఞలు చేశాడు - "సంభవామి యుగే యుగే" (ధర్మ సంస్థాపనార్థం నేను ప్రతి యుగమునందును అవతరిస్తాను). "యోగ క్షేమం వహామ్యమ్" (అనన్య భక్తితో నన్ను ఉపాసించినవారి యోగక్షేమాలను చూసుకుంటాను), "మోక్ష యిష్యామి మా శుచః" (నన్ను శరణుజొచ్చినవారికి మోక్షం ప్రసాదిస్తాను).** భగవంతుని బిడ్డలైన **మీరు కూడా మూడు ప్రతిజ్ఞలు చేయాలి - దైవం ఉన్నాడనే అచంచల విశ్వాసాన్ని కల్గియుంటామనేది మొదటిది, దైవాన్ని చూడగల్గుతామనేది రెండవది, దైవంతో ఏకం అవుతామనేది మూడవది.**

(స. సా. ఫి. 2000 పు. 41/42)

దేవుని కోసం

ఒక నాడు అక్బర్‌కు తన ఆస్థాన గాయకుడైన తాన్‌సేన్ గురువు ఎలా పాడతాడో వినాలనిపించింది. కాని, ఆయన తన గ్రామాన్ని వదలి బయటికి రాడని తాన్‌సేన్ వివరించగా ఇరువురూ మారువేషంలో ఆ మహాపురుషుని ఇంటికి వెళ్ళారు. ఆయన తన పూజామందిరంలో చేసిన గానం విని ఇరువురూ బ్రహ్మానంద భరితులైనారు. "ఇంతటి గొప్పవ్యక్తి దగ్గర శిక్షణ పొందిన నీవు ఒక్కనాడైనా ఆ రకంగా పాడలేదే!'' అన్నాడు ఆక్బర్. **"మహారాజా! ఆయన దేవుని కొరకై పాడుతున్నాడు. నేను నీకొరకు పాడుతున్నాను. కనుకనే, నా గానం అమితానందము నీయదు"** అన్నాడు తాన్‌సేన్. అనగా **పరమాత్మ ప్రీతిగా చేసిన కర్మలే మధురంగా హృదయానందంగా ఉంటాయి.** కనుకనే, **కర్మలను కృష్ణార్పణంగా చేయమని గీత బోధిస్తున్నది.**

(స.సా.ఆ. 95 చివరి కవరుపేజీ)

దేశము

(చూ॥ ఐక్యమత్యము, దివ్యత్వము, దేశశ్రేయస్సు, దైవబలము, మాతలు, మానవ జీవితము, శృంగారము)

దేశరక్షణ

(చూ॥ దేశ సంరక్షణ)

దేశశ్రేయస్సు

విద్యార్థులారా! ఉన్న సత్యాన్ని చెపుతున్నాను. మీరు మరోలా భావించకూడదు. ఈనాడు దేశం అనుభవిస్తున్న కష్టనష్టములకు మూలకారణం ఎవరు? విద్యావంతులే! ఎందుకంటే, వారు తమ విద్యను దేశశ్రేయస్సుకోసం ఉపయోగించకుండా కేవలం స్వార్థంకోసం ఉపయోగపెడుతున్నారు. మన భారత దేశంలో ఎంతోమంది విద్యావంతులున్నారు; ఎంతో గొప్ప మేధావులున్నారు. కాని, వారిలో పరోపకార బుద్ధి లేకపోవడంచేత దేశం దురవస్థల పాలవుతున్నది. వారందరూ ఏకమై ప్రజాక్షేమం కోసం పాటుపడితే దేశం ఎంత బాగుపడుతుంది! కాని, వారు తమ మేధాశక్తిని విదేశాలలో ఉపయోగపెడుతున్నారు. మనదేశంలో పది వేల రూపాయల జీతం తీసుకొని కనీసం పది రూపాయల పని కూడా చేయకుండా దేశద్రోహానికి పాల్పడుతున్నారు.

కాని, విదేశాలకు పోతే అక్కడ రాత్రింబవళ్ళు పని చేస్తారు. అక్కడ చేసే పని స్వదేశంలో ఎందుకు చేయకూడదు? మొట్టమొదట స్వదేశంపై ప్రేమను ప్రకటించాలి.

(స.సా.మే 2000 పు.154)

దేశసంరక్షణ

వ్యక్తులు, సిద్ధాంతములు, పార్టీలు వేరువేరుగా ఉండవచ్చును. కానీ, దేశానికి ఏదైనా ఆపద సంభవించినప్పుడు వ్యక్తిగత భేదాలను, పార్టీ పరమైన భేదాలను ప్రక్కకు నెట్టి, దేశసంరక్షణకై అందరూ ఏకం కావాలి. ఈవిషయంలో ధర్మరాజు చక్కని ఆదర్శాన్ని అందించాడు. ఒకానొక సమయంలో అతడు కృష్ణునితో మాట్లాడుతూ 'కృష్ణా! మాకు, కౌరవులకు ఏమైనా భేదాభిప్రాయములు వచ్చినపుడు వారు నూరుమంది, మేము ఐదుమందిమి. కానీ, భారతదేశముపైనే ఎవరైనా దండెత్త వస్తేమేము నూటయిదుమందిమీ ఏకమైపోతాము' అన్నాడు. అదేవిధంగా, **దేశంయొక్క సంక్షేమానికి ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు అన్ని పార్టీలూ ఏకమై దేశాన్ని రక్షించడానికి పాటుపడాలి. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" జనని, జన్మభూమి స్వర్గముకంటే మిన్నయైనవి అన్నాడు శ్రీరామచంద్రుడు. మాతృభూమిని ప్రేమించనివాని జన్మ నిరర్థకం.** "ఇది నాదు మాతృదేశము, ఇది నా ప్రియ మాతృభాష, ఇది నా మతమంచు ఎదగొట్టి నుడువ నేరని బ్రతికిన పీనుగొకండు వసుధన్ కలడా?" మాతృదేశాన్ని ప్రేమించాలి. ఐతే, ఇతర దేశాలను ద్వేషించకూడదు. "అద్వేష్టా సర్వభూతానాం", ఎవ్వరినీ ద్వేషించకూడదు, దూషించకూడదు. మన భారత దేశమునకు స్వాతంత్ర్యం వచ్చి 50 సంవత్సరాలు గడిచి పోయాయి. ఈ 50 సంవత్సరాలలో మనం సాధించిన దేమిటి? హత్యలు, కిడ్నాప్‌లు, హైజాక్‌లు - ఇవేనా? ఈనాడు మనిషికి కారులో పోవాలన్నా భయమే, ట్రైనులో పోవాలన్నా భయమే, ప్లేనులో పోవాలన్నా భయమే, ఎక్కడికీ పోకుండా ఇంట్లో కూర్చున్నా భయమే! **లోకమంతా భయభ్రాంతులతో నిండియున్నది. కారణ మేమిటి? మానవుని మనస్సు కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములతో కలుషితమైపోయింది.** మన ప్రాచీన ఋషులు సత్యానికి స్వాగతం పలికారు, ధర్మాన్ని అందల మెక్కించారు, న్యాయానికి కంకణం తొడిగారు, త్యాగానికి పట్టం కట్టారు. కానీ, ఈనాడు త్యాగము కనిపించడం లేదు, ఎక్కడ చూసినా భోగమే! భోగమువల్ల కలిగేది ఏమిటి? రోగమే. త్యాగమువల్లనే యోగము సిద్ధిస్తుంది.

(స.సా. మే 99 పు. 125)

దేశసేవ

పాపభీతి దైవప్రీతి సంఘనీతి కోల్పోయిన తరువాత ఇంక మనకు శాంతి ఏరీతిగా లభ్యమవుతుంది? సంఘంలోనే పుట్టాము. సంఘంలోనే పెరిగాము. సంఘంలోనే అనేక విద్యలు నేర్చుకున్నాము. సంఘం నుండి ఇంత ఉపకారం పొందినందుకు కృతజ్ఞతలు మనము సంఘానికి ఏ రీతిగా చూపగలము? సంఘానికి ఏ రీతిగా ఉపయోగపడగలము అనే విచారణ ఎవరైనా చేస్తున్నారా?

ధైర్యంగా దేశసేలో మీరు పాల్గొనాలి. సేవచేయడం చాలా గొప్పదనం.

తపస్సు చేయక పోయినా ఫరవాలేదు. తీర్థయాత్రలు చేయకపోయినా ఫరవాలేదు. సేవలు మాత్రం చేయండి. **సేవకత్వము నందె నాయకత్వం ఇమిడి ఉంది. సేవలు సల్పిన వారికే శాంతి చేకూరుతుంది.**

యువతీ యువకులు నిర్మల చిత్తంతో సమాజానికి సేవచేయాలి. ఇదే సమాజానికి అందించవలసిన కృతజ్ఞత.

(దే.యు.పు.10/11)

యువకులు కార్మోన్ముఖులు కావాలి! నవ భారత నిర్మాణానికి కంకణం కట్టుకోవాలి! దేశమాత సౌభాగ్యాన్ని కళ్ళారా చూసేవరకు విశ్రమించకూడదు. **భరతమాత భవితవ్యం యువతరం మీద ఆధారపడియుంది.**

పదవీ వ్యామోహం బంధు, ప్రీతి, అవినీతి అంతరించాలి. ఉన్నత జాతీయ లక్ష్యాలు కోసం దేశసౌభాగ్యం

దేశాభివృద్ధి

కోసం,జాతీయ స్వచ్ఛీలత కోసం కృషిచేయాలి. దుర్గణాలు వదలాలి. సద్గుణ సంపద పెంచుకోవాలి.

ధేశభక్తి, సేవానురక్తి, త్యాగ శీలం అలపర్చుకోవాలి. దేశం కోసం శరీరాన్ని త్యాగం చేయడానికి సంసిద్ధంగా ఉండాలి. లోక కళ్యాణానికి, సమాజాభివృద్ధికి, సర్వప్రాణికోటి సంక్షేమానికి తమసర్వస్వాన్నీ అర్పించడానికి సిద్ధం కావాలి. త్యాగానికి మించిన సుఖం మరి ఒక్కటిలేదు. అట్టి త్యాగే అమృతపుత్రుడు. అతడు చిరంజీవి.

(దే.యు.పు.33)

ఇక మనము చేయవలసింది దేశసేవ. సేవను మించినది మరొకటి లేదు. తపస్సు కంటే, జపధ్యానముల కంటే, తీర్థయాత్రలు కంటే విలువైనది సేవ. ఇట్టి సేవలు విస్మరించరాదు.

తోటి మానవులను కష్టములో ఆదుకొని వారిని సేవించి, ప్రేమించి, విశాలమైన ప్రేమ తత్వాన్ని పెంచుకోవడమే భారతీయ సంస్కృతి.

భారతీయులు స్వాతంత్ర్యము తెచ్చుకొన్నారు. సాధించవలసింది అంతర్ముఖమైన స్వాతంత్ర్యము. ఈనాడు బాహ్యమైన దానినే అనుభవిస్తున్నారు. బయట ఉన్నదంతా లోపల ప్రతిబింబమే! కనుక మొట్టమొదట పవిత్రతను నింపుకోవాలి!

(దే.యు.పు. 37/38)

దేశాభివృద్ధి

ఈనాడు ఒక పార్టీని మరొక పార్టీ విమర్శించుకోవడం, దూషించుకోవడం మితిమీరి పోతున్నది. ఇవన్నీ అల్పబుద్ధి కలవారి లక్షణాలు. చేతనైతే మంచి చేయాలిగాని, ఇంకొక పార్టీని విమర్శించడ మెందుకు? ఇతర పార్టీలో ఏదైనా దోషముందంటే ఆ దోషం మీలో లేకుండా చూసుకోండి. మీ మంచిని మీరు అభివృద్ధి పర్చుకోండి. అంతేగాని ఏ పార్టీని కూడా విమర్శించకండి. నా ఉద్దేశ్యమేమిటంటే - **ఈనాడు అన్ని పార్టీలవారూ వ్యక్తి గత భేదాలను ప్రక్కకు నెట్టి ఏకం కావాలి. అప్పుడే మన భారత దేశం దివ్యమైన స్థితిని పొందుతుంది.** పూర్వం బ్రిటీషువారు భారత దేశంపై పెత్తనం చెలాయించడానికి కారణ మేమిటి? భారతీయులలో ఐకమత్యం లేక పోవడమే. జరిగిందేదో జరిగిపోయింది. **ఇంకా భవిష్యత్తులోనైనా మన భారత దేశంలో మళ్ళీ విదేశీ పరిపాలన రాకుండా చూసుకోవాలి. లౌకికమైన శక్తులు కదిలిపోయే మేఘాల వంటివి. వాటిని ఆధారం చేసుకుంటే అధోగతి తప్పదు. దైవశక్తిని ఆధారం చేసుకోవాలి. నైతిక విలువలను అభివృద్ధి పర్చుకోవాలి.** మంచి సంఘాన్ని ఏర్పరుచుకోవాలి. మంచి ప్రభుత్వాన్ని పోషించాలి. **సమాజం లేకపోతే నాయకుడే లేడు. సమాజాభివృద్ధికి పాటుపడేవాడే నిజమైన నాయకుడు.** అలాంటి నాయకులను పోషించి వారిని అభివృద్ధి పరచాలి. **అదే ప్రజలయొక్క ప్రధాన కర్తవ్యం.** ప్రజలు క్షేమంగా ఉన్నప్పుడే ప్రభుత్వం క్షేమంగా ఉంటుంది: **ప్రభుత్వం క్షేమంగా ఉన్నప్పుడే ప్రజలు క్షేమంగా ఉంటారు. కనుక, దేశ ప్రజలు, ప్రభుత్వం ఐకమత్యంగా, అన్యోన్యంగా పని చేస్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలి.** వ్యక్తిగతమైన భేదాభిప్రాయాలతో ప్రభుత్వంపై ద్వేషం పూనటం చాల తప్పు.

(స.సా.మే 99 పు. 124/125)

దేహము

రక్తము మాంసశల్యముల రాశియు దేహము. మీరు కాదు సు వ్యక్తము కానికోరికలు వ్యక్త మనస్సును మీరు కాదు ఆ ముక్తికి భంగకారియగు మోహపు భ్రాంతియు మీరు కారుమీ

శక్తిని మీరెరుంగగల శాశ్వతుడే పరమాత్మమీరెగా.

దేహము ఇంద్రియములు మనస్సు బుద్ధి యీ నాలుగు మానవుడు ధరించిన ఉపాధులు మాత్రమే. ధరించిన పదార్థముల రహస్యమును గుర్తించినప్పుడే ఆ పదార్థములను సరియైన స్థితిలో మనము ఉపయోగించుకోవచ్చును....

ఏ విధముగా దీనిని అనుభవించాలి? ఏ విధముగా దీనిని వినియోగించాలి? అనే విషయమును మొట్టమొదట

గుర్తించినప్పుడే యీ దేహము సద్వినియోగమవుతుంది. **"దహ్యతే ఇతి దేహః" అని దీని వుత్పత్తి, అనగా దహింపబడేది యీ దేహము అని.** మరణించిన తరువాత దహింపబడుటము అందరికి తెలుసు. అట్లు కాక జీవితసమయమునందే యిది దహింప బడుతున్నది. చింతలచేత యీ దేహము దహింప బడుతున్నది. ఇది జడస్వరూపమైనట్టిది. మాలిన్యముతో కూడినట్టిది.

మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవకగంప జాతసం చలనము పొందు దుంప భవసాగరమీదగలేని కంప అం బుల పొది లెమ్ము చూడ మనమెప్పు దలంపగ దేహ మింకనిశ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే.

''దేహము పాంచ భౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధనల ముద్రలు లేవు నిజంబు చూడ నా
దేహియె దేవదేవుడు''

ఆదేవ దేవుడైన మీరు ధరించినదే యీ దేహము. ధరించిన దేహము వరించ వచ్చు, అనుభవించవచ్చు కాని ఏ విధముగా వరించాలి? ఏ విధముగా అనుభవించాలి అనే విచక్షణజ్ఞానముతో దీనిని పొందాలి. దీనికి **మరొక పేరు శరీరము అని. దీని వుత్పత్తి "శీర్యతే ఇతి శరీరః"** అనగా జీర్ణించునది, క్షీణించునది యీ శరీరము. ఇది పుట్టినప్పుడు రక్తపు ముద్దగా ఉంటుంది. కోమలత్వముతో ఆకర్షింపచేస్తుంది. క్రమక్రమేణా యిది యౌవనములో ప్రవేశిస్తుంది. అందానందములచేత అహంకారమును ప్రకటిస్తుంది. తదుపరి వృద్ధాప్యములో ప్రవేశిస్తుంది. వికారత్వాన్ని పొందుతుంది.

ఈ శరీరమునకు మూడవ పేరు మందిరము అని. ఈ మందిరము దేని నిమిత్తమై ఏర్పడినది? **"దేహోదేవాలయ ప్రోక్తో జీవోదేవ స్సనాతనః"** దేవుడైన జీవునకు ఈ దేహము ఒక మందిరముగా నిర్మించబడినది. మందిరమును ఏ విధముగా ఉపయోగించాలి? ఇది పవిత్రమైన దివ్యమైన భగవంతుని నిలయము. భగవంతుని నిలయమైన దేహమును దుర్వినియోగపరచుటకు ఏ మాత్రము వీలుకాదు. సక్రమమైన మార్గములో పవిత్రమైన మార్గములో వినియోగించాలి. నత్కర్మలు, సదాచారములు సచ్చింతనలు సలిపే నిమిత్తమై ఏర్పడినదే యీ దేహము. **"శరీర మాద్యం ఖలు ధర్మసాధనం". ధర్మాచరణ నిమిత్తమై ఏర్పడినదే యీ దేహము.** ఈ దేహమును సరియైన స్థితిలో ఉంచుకోవాలి. ఈ దేహము ఒక పని ముట్టు వంటిది. పని ముట్టు సరియైన స్థితిలో వుండినప్పుడే మనము సంకల్పించుకున్న పనిలో సరియైన రీతిగా ఉపయోగించుకోవచ్చును.... దీనిని వినియోగించుకోవా లంటే సరియైన స్థితిలో పెట్టుకోవాలి. ఈ దేహమును ఏయే కార్యములయందు సద్వినియోగము గావించుకోవాలో విచక్షణాజ్ఞానముతో వినియోగించు కోవాలి. ఏ కార్యము చేయటానికి పూనుకున్నా అక్కడ ఒక ప్రశ్న వేసుకోవాలి.

ఆత్మ స్వరూపుడైన బ్రహ్మను నేను. ఈ కాయములో నివసిస్తున్నాను. కనుక ఆత్మ స్వరూపుడైన నేను బ్రహ్మస్వరూపుడైన నేను ఈ కాయముతో ఈ కర్మలు ఆచరించవచ్చునా ఆచరించకూడదా? అని విచారణ చేసుకోవాలి.

ధర్మాచరణ నిమిత్తమై ఏర్పడినదీ దేహము **దైవమందిరముగా నిర్ణయించ బడినదీ దేహము. దీనికి మరొక పేరు క్షేత్రము. "క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానమ్"** అనగా క్షేత్రమనే దేహము దీనిని గుర్తించేవాడు క్షేత్రజ్ఞుడు. నీవు క్షేత్రాన్ని గుర్తించే వాడవేకాని గుర్తింపబడేది దేహమే.... పవిత్రమైన స్థితిలో దీనిని ఉంచుకోవాలి. కాశీని క్షేత్రము అంటారు. బదరీని క్షేత్రము అంటారు. తిరుపతిని క్షేత్రము అంటారు. **పవిత్ర స్థానము కనుక క్షేత్రమనే సార్థకనామము.** ఆ క్షేత్రములో నిరంతరము పూజలు సత్కర్మలు మంత్రములు దీక్షలు జరుగుతుంటాయి. అదే విధముగా యీదేహమనే క్షేత్రము నుంచి సత్కర్మలు, సదాచారములు, సచ్చింతనలు ఇలాంటి సేవలు

చేసుకోవాలి. **సత్కర్మల యందు ప్రవేశింపచేయుటమే క్షేత్రము యొక్క అంతరార్థము. క్షేత్రము అంటే పొలము అని రెండవ అర్థము. పొలములో మనము ఎట్టి విత్తనములు నాటుదుమో అట్టి ఫలమేమనకు లభిస్తుంది.** సత్సంకల్పములనే విత్తనములు నాటినప్పుడు సత్ఫలము లభ్యమవుతుంది. దుస్సంకల్పములు అనే విత్తనములు నాటినప్పుడు దుష్ఫలములే లభిస్తుంటాయి.

పాపపుణ్యములనే బీజములు నాటుకొనే ప్రదేశమే యీ దేహమనే క్షేత్రము... ఫలాని ఋతువునందు ఫలాని విత్తనములు నాటాలి అనే పద్ధతి వుంటుండాది. ఏ క్షేత్రమునందు ఏ పంటను పెట్టాలి అనే నియమం ఉంటుండాది. ఎప్పుడు పడితే అప్పుడంతా పొలములో విత్తనములు చల్లటానికి వీలుకాదు. ఒక నిర్ణీత కాలముంటున్నాది. **కానీ యీ శరీరమనే పొలములోపల నిర్ణీతమైన కాలములేదు. సర్వకాల సర్వావస్థల యందు దీనిని సాగుచేసే అనుకూలమున్నది.** రాత్రింబవలు దీనిని సాగు చేసుకోవచ్చును. పొలములో విత్తనములు నాటినప్పుడు పంటలు పండవచ్చు లేకపోతే ఎండవచ్చును. ఆశించిన ఫలములు మనము పొందలేకపోవచ్చును. కానీ ఈ శరీరమనే క్షేత్రమందు నాటుకున్న సత్సంకల్పములు, దుస్సంకల్పములు అవి ఏమి చేసినా తప్పేది కాదు. ఆ ఫలము తప్పక అనుభవించవలసి వస్తుంది. నూటికి నూరుపాళ్ళు పంట పండుతుంది. ఏ మాత్రము తక్కువ కాదు.

ఇది చేతు అది చేతు యింకెన్నియో చేతు
ననుచు ఊహలు అల్లి అలసి పోకు
ఏ విత్తులను నాటి యిచ్చోట నుంటిరో
ఆఫలములే మీకు అందుచుండు
విత్తనంబొకటైన వేరైన ఫలములు
సమకూరుటది ఎట్లు సాధ్యమగును?

కనుక యీ దేహమనే పొలమందు యేవిత్తనములు నాటుతున్నామో అదే పంట మనము అనుభవించ వలసి వస్తుంది. పంట మన సంకల్పములపైన ఆధారపడి ఉంటున్నది. మనకర్మలపైన ఆధారపడి వుంటున్నది.... దేహమును ఏ విధముగా వినియోగించుకోవాలి అనే విచారణ అత్యవసరము. సద్వినియోగము గావించాలని ఆశించేవారు, సద్భావములు అభివృద్ధి గావించుకోవాలని ఆశించేవారు సత్ఫలములు పొందాలని ఆశించేవారు, రెండు విధములైన మార్గములను తూ.చ తప్పకుండా అనుసరించాలి. **ఆహార విహారములు సరియైన మార్గములో అనుభవించాలి...**

(బృ. త్ర. పు. 12-16)

~~ఈ~~ **దేహము అనిత్యము అశాశ్వతము** అయినప్పటికిని నిత్యసత్యాన్ని గుర్తించేవరకు యీ దేహమును ఆధారముగా తీసుకోవాలి. అనేకమంది దేహపోషణలో అలక్ష్యము చేస్తున్నారు. కనుకనే అనేక రోగములకు గురౌతున్నారు. దివ్యమైన ఆనందమును అందుకోలేక పోతున్నారు. **"ధర్మార్థకామమోక్షాణాం ఆరోగ్యం మూలముత్తమం"**. చతుర్విధపురుషార్థములైన ధర్మార్థకామమోక్షములను ఆశించవలెనన్నను అనుభవించవలెనన్నను ఈ దేహమునకు ఆరోగ్యము అత్యవసరము. దీనికి ఏ విధమైన మార్గాన్ని అనుసరించాలి? సరైన విచారణచేత ప్రవర్తనలో మార్పులు తెప్పించుకోవాలి. **ఆహారములో కలిగే ఆనారోగ్యముకంటే మానసిక సంబంధమైన అనారోగ్యమే యీనాడు అభివృద్ధి అవుతుండాది. మానవుడునిరంతము యోచించటము చేస్తున్నాడు.** ~~ఈ~~ యోచనకు రూపము ఏమిటి? ~~ఈ~~ విచారమునకు రూపము ఏమిటి? What is the shape of worry? It is only mentally created fear. మానసిక సంబంధమైన ఆలోచనల చేతనే అనారోగ్యమునకు గురౌతున్నాము. మనము ఏ మాత్రము ఆలోచన చేయకూడదు. ఈ ఆలోచన ఒక్కొక్క సమయములో హద్దు మీరి పోతుంటాది. ఇది హద్దు మీరి పోయినప్పుడు అస్తవ్యముగా మారిపోతుంది. తద్ద్వార మానసిక వ్యాధులు సంభవిస్తాయి. అనేకమందికి మతి భ్రమణము కలగటానికి కారణం ఇదియే. **ఎంత వరకో అంతవరకు చింతించాలి.**

మితిమీరిన చింతన చేయకూడదు. గడిచిపోయిన దానిని, రాబోయేదానిని అనవసరముగా చింతించి అనారోగ్యమునకు గురి అవుతున్నాము. ఈ నాటి యువకులు ఈ విధమైన వ్యాధులకే గురి అయిపోతున్నారు. ఒకొక్క యూనివర్శిటీలో ఫలపరీక్ష చేసి చూచినప్పుడు 80%, 90% మానసిక సంబంధమైన భ్రాంతులచేతనే అనారోగ్యము పొందుతున్నట్లు తేలింది. పవిత్రమైన ఈ వయస్సునందు ఏ మాత్రం అనారోగ్యమునకు గురికాకూడదు. సాధ్యమైనంతవరకు మానసిక సంబంధమైన **విచారణలు తగ్గించుకోవటానికి చూచుకోవాలి. అధికముగా చదవటముగాని, అధికముగా ఆడటముగాని, అధికముగా పాడటం గాని అధికముగా నిద్రించటముగాని శరీరమునకు హాని కలిగిస్తుంది.**

(బృ.త్ర.పు. ౩౨/33)

మలమూత్ర దుర్గంధ మాంసరక్తములతో కూడిన యీ దేహమునందే దివ్యభవ్యనవ్యమైన ఆత్మ తత్వము రాణిస్తూ వుంటున్నది. ఇది దేహ బలహీనము చేత తరగదు, దేహ బలము చేత పెరగదు. **పెరిగి తరగని తత్వమే ఆత్మతత్వము. ఇది నిరంతరము పవిత్రమైనది,** విలువైనది, బలమైనది. ఎట్టి పరిస్థితుల యందు దీని విలువ యేమాత్రము తగ్గదు.

పెద్ద వజ్రమొకటి పెంటలో దొరికిన
విలువ మారబోదు వెలుగు పోదు
మంచి గుమ్మడి పండు కంచెలో వేసిన
రుచియు పోదు రూపు పోదు
గొప్ప నెమలి గ్రుడ్డు కోడితా పొడిగిన
వన్నె పోదు దాని చిన్నె పోదు.

దేహము అనేక మాలిన్యములతో కూడినదైనప్పటికిని **యిందులో నిశ్చలము, నిర్మలము, నిస్వార్థమైన ఆత్మ తత్వము నిరంతరము ప్రకాశిస్తూనే వుంటుంది.** అన్ని మతములవారు యీ దేహములో వుండిన పుష్టిని, సంతుష్టిని కోరటంలో అర్థము ఏమిటి? **"దేహో దేవాలయ ప్రోక్తో" దేహమనేది భగవంతుని దేవాలయము అనే విశ్వాసమే దీనికి మూలకారణము. కనుక ఈ పవిత్ర దేహమును అలక్షము చేయక, అశ్రద్ధ పూనక, తగిన శ్రద్ధతో దీనిని సరియైన మార్గములో ప్రవేశపెట్టి కర్తవ్యకర్మలు ఆచరించటము మానవుని ప్రధాన ధర్మము.** ఇట్టి సత్యమును గుర్తించలేని వ్యక్తులు వ్రతములని, నోములని, ఉపవాసములని దేహమును కృశింప చేసుకొంటున్నారు. తద్వారా నిత్యసత్యమైన ఆత్మతత్వము గుర్తించలేము.

(బృ.త్ర.పు. ౨౭/౨౮)

"దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడనగ తనదు దేహమందె
పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల తగిలి యుండు"

(స.సా.డి. 96 పు 326)

ఈ దేహము భగవంతుని నివాసమని విశ్వసించాలి **"దేహోదేవాల యప్రోక్తో జీవోదేవ స్సనాతనః "ఈ దేహము నూతన మైన మందిరము ఇందులో సనాతనుడైన భగవంతుడు నివసిస్తున్నాడు.** ఈ దేహము ఎలాంటిది? పవిత్రమైనది కాదు. అయితే దేహం లోపల ఉన్నంత వరకు ఇది పవిత్రమే కాని దేహి ఈ దేహాన్ని వదలి పోతే? "మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవక గంప జాత సం చలనము పొందు దుంప భగసాగర మీదగ లేని కంప అం బుల పొది లెమ్ము చూడమన మెప్పు దలంపగ దేహమింకని శ్చలమని నమ్మ బోకు మనసా హరిపాదము లాశ్రయింపవే"। కనుక హరి పాదముల నాశ్రయించండి. అది సుఖము, ఇది దుఃఖము వీడు శత్రువు, వాడు మిత్రుడు అనే భేద భావాలకు అవకాశ మివ్వకండి మిమ్మల్ని ఎవరైనా దూషిస్తే అరూపములో భగవంతుడు నన్నీ విధంగా దూషిస్తున్నాడని అనుకోండి. అరూపము, మీరూపము రెండూ అస్థిరములే ఆ రూపములో నున్నదీ మీ రూపములో నున్నదీ రెండూ స్థిరములే ఇట్టి ఆత్మ భావాన్ని పెంచుకోండి. అదే మీరు చేయవలసిన తపస్సు. అప్పుడే మీకు శాంతి చేకూరుతుంది. దేహాన్ని చక్కగా పోషించుకోండి, దేహశక్తిని దైవానికి అంకితం చేయండి.

(స.సా.డి.96 పు. 328)

దేహము

మానవ జీవితం చాల దుర్లభమైనది, చాల పవిత్రమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమౌనది. కనుక, శరీరమును ఎన్ని శ్రమలకోర్చియైనా కాపాడుకోవడం మీ కర్తవ్యం. ధన, కనక, వస్తు, వాహనాదులకంటే శరీరమే చాల విలువైనది. ఈ శరీరమును సరియైన మార్గంలో ప్రవేశపెట్టి సార్థకం గావించుకోవాలి. గడచిన రాత్రి తిరిగి రాదు; సముద్రంలో పరిపూర్ణంగా లీనమైన గంగ ఎంత పిలిచినా వెనుకకు రాదు: బాగా నమిలి మింగిన ఫలము ఎంత ప్రయత్నించినా తిరిగి రాదు. అదేరీతిగా, గడచిపోయిన జీవితాన్ని ఎంత ప్రయత్నించినా తిరిగి సాధించలేము. Men are more valuable than all the wealth of the world. (ప్రపంచములోని సమస్త సంపదల కంటే మానవుడే అత్యంత విలువైనవాడు). ధనానికి, డైమండ్స్‌కి, బంగారానికి, భూమికి ఎవరు విలువనిస్తున్నారు? మానవుడే కదా! అన్నిటికీ తాను విలువ నిస్తున్నాడుగాని, తన విలువను తాను గుర్తించుకోలేకపోతున్నాడు.

విలువ లేని ఇనుపపెట్టె ఈ దేహము
పెట్టెలోన నగలు పెట్టినట్లు
దేహమందు ఆత్మదేవుడుండెను సుమా!
సత్యమైనట్టి మాట ఈ సాయిమాట.

ఈ దేహమునందు విలువైన గుణములను దాచుకొని యున్నాము. దయ, ప్రేమ, సహనము, సానుభూతి, త్యాగము ఇత్యాది మానవతా గుణములు ఉండటంచేతనే మానవత్వానికి గొప్ప విలువ ఏర్పడింది. కాని, ఈనాటి మానవుడు ఈ మానవతా విలువలంటే ఏమిటో అర్థం చేసుకోలేకపోతున్నాడు. కాలమనే గడియారమునందు సంవత్సరములనే గంటల ముల్లు, నెలలనే నిమిషముల ముల్లు, దినములనే సెకన్ల ముల్లు తిరుగుతూనే ఉన్నవి. ఏ క్షణంలో ఇది 'ఘన్, ఘన్' మని గంటలు కొడుతుందో, ఎప్పుడీ దేహమును వీడవలసివస్తుందో ఎవ్వరూ గుర్తించుకోలేరు. కనుక, దేహాన్ని సరియైన మార్గంలో వినియోగించుకోవాలి. జీవిత ప్రయాణమునకు దేహమే ప్రధానమైన పనిముట్టు. దీనిని సక్రమంగా ఉపయోగించ కున్న, మార్గమధ్యంలో అనేక అవస్థలకు గురి కావలసి వస్తుంది.

ఈనాటి మానవుడు మానవతా గుణములంటే ఏమిటో, దివ్యత్వమంటే ఏమిటో విచారణ చేయకుండా విలువైన తన శరీరాన్ని స్వార్థ స్వప్రయోజనాలకై దుర్వినియోగ పర్చుతున్నాడు. భగవంతుడు మీకు శరీరాన్ని అందించినది మీ స్వార్థ, స్వప్రయోజన నిమిత్తం కాదు. **"పరోపకారార్థ మిదం శరీరం".** కాబట్టి, మిమ్మల్ని మీరు రక్షించుకోవడంతో పాటు తోటి మానవులను కూడా రక్షించడానికి కంకణం కట్టుకోవాలి. పరోపకార నిమిత్తం ప్రాకులాడినప్పుడే మీ స్వార్థంకూడా నెరవేరుతుంది. వ్యాసుడు పద్దెనిమిది పురాణాల సారాన్ని రెండు వాక్యాలలో ఇమిడ్చాడు - **"పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం."** కాని, ఈనాటి మానవుడు స్వార్థం చేతిలో కీలుబొమ్మగా జీవిస్తున్నాడు. స్వార్థం చేతిలో కీలుబొమ్మగా ఉన్న మానవుడు స్వతంత్రు డెట్లవుతాడు? **స్వార్థాన్ని త్యజించాలి. పరార్థాన్ని వరించాలి. అప్పుడే శరీరం సార్థకమవుతుంది.**

(స.సా.జూలై. 2000 పు.206/207)

"దహ్యతే ఇతి దేహః దహింపబడేది దేహము. మరణించిన తరువాత దహింపబడేది. ఇట్టి దేహతత్త్వమును మనము నిత్యజీవితంలో అనుభవించే నిత్యకర్మలందు చక్కగా గుర్తించవచ్చు. దేహమనగా ఆకారమును మీరు భావించవచ్చు. కేవలం ఆకారము మాత్రమే కాదు ఇది మలినపుకొంప రోగముల మ్రగ్గెడు సేవక గంప జాతసం చలనము పొందు దుంప భవసాగరమీదగ లేని కంప అంబుల పొది లెమ్ముచూడ మన మెప్పు దలంపగ దేహమింక నిశ్చలమని నమ్మబోకు మనసా! హరిపాదము లాశ్రయింపవే!

ఈ దేహమునకు మరొకపేరు కూడా ఉన్నది; శరీరము. జీర్ణింపబడేది శరీరము.

(ద.య.స. పు.1/2)

భగవంతుని నివాసము ఈ దేహము. ఇలాంటి పవిత్రమైన దేహమును ఈనాడు అపవిత్రమైన, విచిత్రమైన మార్గములందు ప్రవేశ పెట్టి, తాత్కాలికమైన సుఖములు అనుభవింపగోరి అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన జీవితాన్ని గడుపుతున్నారు మానవులు.

విలువ లేని ఇనుప పెట్టె ఈ దేహంబు
పెట్టెలోన నగలు పెట్టినట్లు
దేహమందు ఆత్మదేవుడుండెను సుమీ!
సత్యమైన బాట సాయిమాట.

ఏవిధంగానైతే విలువలేని ఇనుపపెట్టెయందు విలువైన రత్నమును దాచుకుందురో అదే విధముగా ఈ విలువలేని దేహమందు విలువైన, **ప్రకాశవంతమైన ఆత్మ అనే రత్నమును దాచుకున్నారు. ఈ ఆత్మ అనే రత్నము నిమిత్తమై దేహాన్ని మనం ఆశించి, ఆరాధించి దాన్ని సరైన మార్గములో వినియోగించుకోవాలి.** రత్నములు మట్టిలోనే చిక్కునుగాని ఘ్రానులో చిక్కవు. రత్నములు కావలెనన్న మట్టిలో వెతకాలిగాని ఘ్రానులో వెతికితే రావు. కనుక ఈ మృణ్మయమైన దేహమునందే ఆత్మ అనే రత్నమును వెతకాలి.

(ద.స.98.పు.4)

"ద" అను పదమునందే "దేహ" ము పుట్టినది. **"ద" అనగా దహింపబడునదని అర్థము.** సామాన్యముగా మరణాంతరము దహింప బడుచున్నది. కానీ, జ్ఞానియందు కారణ సూక్ష్మ శరీరములు మూడు విధములందు హృదయ కాష్టము నందు దహింపబడును. అనగా **ఆధ్యాత్మికము ఆధిదైవికము, అదిభౌతికము, అనెడి మూడు హృదయ కాష్టములు.ఇవి సూక్ష్మ కారణ శరీరములను అగ్నికన్న త్వరలో నశింపజేయగలవు.తలంపు ఎట్టుండునో మనిషి అట్లె మారును. దేహధ్యాస కలవారు పామరులుగనే యుందురు.**

(ఉ. వా. పు. 87)

(చూ॥ అంతర్వాణి, అయస్కాంత శక్తి, ఆత్మ, ఆధ్యాత్మికము, ఆహారము, ఉత్తరాయణము, కర్తవ్యం, కాయము, క్షేత్రము, చదువు, తోలుబొమ్మ, త్యాగము, దేవాలయము, దేహభ్రాంతి, దైవంకోసం, దోషములు, ద్వారములు, నేను, పండితుడు, పరమాత్మ, పిండదానము, బుద్ధి, బ్రహ్మవిష్ణుమహేశ్వరులు, భగవదన్వేషణ, భయం, మనస్సు, మనుషత్వము, మాయ, రాజబాట, విద్య, సుఖానందము, హిరణ్యగర్భతత్వం)

దేహతత్వము

(చూ॥ నవద్వారములు)

దేహభ్రాంతి

దేహ భ్రాంతిని వదలటం **ఎట్లా? దేహభ్రాంతి అంటే అన్న పానాదులు విసర్జించి, శుష్కించి, అస్థిపంజరంగా మరణించటం కాదు. దేహమే నేననేభావము విసర్జించు. నేను దేహము కాదు. ఇది నా ఉపాధి.** దేహేంద్రియ మనోబుద్ధులన్నియు నా ఉపాధులు, నేను ధరించిన డ్రస్సులు, డ్రస్సుల్ని ఏ విధంగా మార్చుకుంటున్నామో, ఏ విధంగా విసర్జిస్తున్నామో అదే విధంగానే ఈ దేహ భ్రాంతిని విసర్జించాలి. ఆకలిదప్పులకు సంబంధించిన ఆహార నియమములు పాటించాలి.

(బృ. త్ర.పు. 161)

ఆనందమనే నిధికి ఒక భద్రత ఏర్పడింది. దీనిని అహంకారమనే సర్పము సర్వత్రా సంచరిస్తూ నిర్విరామంగా తిరుగుతూ కాపాడుతుంది. దానిదగ్గరకి ఎవ్వరూ పోలేకపోతున్నారు. ఎవడు ఈ అహంకారమనే సర్పమును నిర్మూలము గావించునో వానికే ఈ ఆనందమనే నిధి లభ్యమౌతుంది. అహంకారము అజ్ఞానము చేత ఆవరించినట్టిదే. ఈ అహంకారమునకు కారణమేమిటి? ధనమా? బలమా? స్థానమా? అధికారమా? విద్యనా? ఇవి ఏవీ కారణం కాదు. ఇవన్నీ అల్పమైనశక్తులు. **దేహభ్రాంతియే దీనికి మూలకారణము.** ఇవన్నీ ఎంత కాలము? అందుకోసమే శంకరాచార్యులు **"మాకురుధన జన యౌవనగర్వం హరతిని మేషాత్కాల స్సర్వం"** అన్నారు. ఇవి క్షణములో మార్పు చెందుతాయి. ఇవన్నీ అనుభవించిన వ్యక్తులు స్థిరంగా ఎక్కడున్నారు? గొప్ప గొప్ప పదవులనంతా ఏలి సిరిసంపదలను అనుభవించి ప్రఖ్యాతిని పొంది, రారాజులుగా చక్రవర్తులుగా ఉండిన వ్యక్తులంతా ఎక్కడున్నారిప్పుడు? వారున్నారా? లేక వారి స్థానము లున్నాయా? వారి ధనముందా? ఏదీ లేదు. ప్రాచీన కాలము నుండి భారత దేశమునందు అనేక మంది అనేక

దేహమే దేవాలయము

రకములైన సాధనలు సలిపి ఇవన్నీయును అనిత్యమని లోకానికి చాటుతూ వచ్చారు. అదే భగవద్గీత కూడను **"అనిత్యం అసుఖం లోకం" అని చాటింది.**

(బృ.త్ర.పు. ౧౬౪)

అమితముగా దేహభ్రాంతి పెంచుకోరాదు. **ఇదినాది అనే మమత్వము నేను అనే అహంకారము ఈ రెండే సమస్త అనర్థములకు మూలకారణము.**

(బృ.త్ర.పు. ౪౦)

దేహభ్రాంతి ఉన్నంతవరకు దైవభ్రాంతి అభివృద్ధికాదు. ఇదీ భ్రాంతే అదీ భ్రాంతే. దేహ భ్రాంతి ఉన్నంతవరకు బ్రహ్మ ప్రాప్తించదు. దేహ భ్రాంతిని క్రమ క్రమేణా తగ్గించుకొంటూ రావాలి. దైవముపై వ్యామోహం పెంచుకొంటూ పోవాలి. సమస్త ప్రేమను భగవంతునికే అంకితము చేయాలి.

త్వమేవ మాతా చ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవ దేవ.

ఎప్పుడు ఈ తత్వాన్ని అభివృద్ధి గావించుకొని దృఢమైన నిర్ణయము చేసుకొంటామో అప్పుడే అనుకున్న ఆనందము లభ్యమవుతంది. మనసు నిండా ఏవో సందేహాలు పెట్టుకొని జీవితాన్ని వ్యర్థము చేసుకొంటూ చిక్కిన దానిని కూడా దక్కించుకోలేక పోతున్నారు.

చిక్కిన దానిని అనుభవించడానికి తగిన కృషి చేయాలి. విరోధులను కూడా ప్రేమించిన తగిన మార్గములలో వారిని మార్చుకోవటానికి వీలవుతుంది. ప్రేమ సమత్వాన్ని సమైక్యతనూ సాధిస్తుంది.

(స.సా.జ.87 పు.29/30)

(చూ॥ ఆత్మభ్రాంతి)

దేహమే దేవాలయము

దేవాలయమునకు ప్రాకారమని ఒకటుంటుంటాది. దీనిలో అక్కడక్కడ కొన్ని రంధ్రములు పెట్టి వుంటుంటారు. **'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవస్సనాతనః'** ఈ జీవుడనే దేవునకు యీదేహము దేవాలయము వంటిది. ఇదే దీని ఆవరణము. ఇందులో మమత్వమనేదే ఒక దట్టమైన కాంపౌండు. దీనిద్వారా అనేక యింద్రియములు ప్రచురితమైపోతూ వుంటాయి. కనుకనే యీ దేహికి దేవాలయము అనే యీ దేహము ఒక హద్దుగా నియమిస్తూ వచ్చారు. గొప్పగొప్ప రాజులు నివసించే భవనములకు పెద్ద కోటగోడలు కడుతూ వుంటారు. ఈ కోటగోడకు నవద్వారములని పెట్టి వుంటారు. అదేవిధముగనే ఆత్మసామ్రాజ్యమనేదానికి మహారాజయిన దివ్యత్వముతో కూడిన ఆత్మతత్వమునకు దేహము ఒక కోటగోడ మాదిరిగా వుంటుండాది. దీనికి నవద్వారములు వుంటున్నాయి. **'నవద్వారే పురే దేహే'** అన్నాడు కృష్ణుడు. ఆగోడ జడమైన రాతితోనో, సిమెంటుతోనో, యిటుకతోనో కట్టబడి వుంటుండాది. కాని యీ కోటగోడ రక్తమాంసములు, ఎముకలతో కట్టబడి వుంటుంది. ఈ దేహములో దేహి వుండినంత వరకును యిది అనేక విధములైన సుగంధములు విరజిమ్ముతూ వుంటుంది. ఈ దేహి దేహమును వదలిన తత్క్షణమే యిది దుర్గంధములతో కుళ్ళిపోతుంది. ఇది **'తొమ్మిది చిల్లుల తోలుతిత్తియే** గాని, కాంతి కలిగిన వజ్రఘటము కాదు. నిముషనిముషమునకు నీచులూరునే గాని, పునుగు జవ్వాదులు పుట్టబోవు'. ఇలాంటి దీనిని దైవత్వముగా మార్చుకోవటములో యెంతైనా దివ్యత్వముగా మారిపోతుంది.

(శ్రీ.గీ. పు. 185)

దేహాభిమానము

(చూ॥ ఏడుప్రాకారాలకోట)

దేహి

(చూ॥ కాయము, దేహము)

దైవము

ఎద్ది కలదని యంటి మో అద్ది లేదు
ఎద్ది లేదని యంటి మో అద్ది కలదు
ఉన్న దొక్కటే దైవంబు ఎన్నటికని
లేనిదయ్యెను లోకంబు కానరయ్యా॥

(సా. పు. 415)

మనకు, దైవానికి ఎంత దూరమో, దైవానికి మనకు అంతే దూరము నీకు నీ వెంత దూరము? దగ్గరే కదా? దైవానికి, నీకు కూడా అంతే దగ్గర. "దూరాత్ దూరే అంతి కేచ" అని చెప్పింది వేదము. నేనెంత దూరము లో నున్నానని భావిస్తే అంత దూరములో వుంటాను. ఎంత దగ్గరగా భావిస్తే అంత దగ్గరగా యుంటాను.దూరానికి దగ్గరికి మీ భావమే కారణం నేను కాదు-ఒక్క మనస్సును చక్కగ చేసుకుంటే చాలు. సర్వము సరి అయిపోతాయి.

(సా.పు. 417)

యజ్ఞయాగాదులను ఏ లక్ష్యముంచుకొని యాచరించు చున్నాము? స్వర్గ ప్రాప్తి నిమిత్తము. స్వర్గ ప్రాప్తి కూడా శాశ్వతము కాదు **"క్షీణే పుణ్యేమర్త్య లోకం విశంతి"** యసంబ్లీకి ఎన్నిక అయిన వారు 5 సంవత్సరములు యసంబ్లీ సభ్యులుగా యుంటారు. 5 సంవత్సరములు అయ్యాక వారు వెనుకకు తిరిగి రావలసినదే. అదే విధముగా స్వర్గమునకు వెళ్ళిన మానవుడు తన పుణ్యము తీరగనే స్వర్గము వదలి పెట్టవలసినదే. చివరకు స్వర్గము కూడా శాశ్వతము కాదు. శ్రౌతకర్మలే శాశ్వతములు కానపుడు, స్మార్త కర్మలు, పౌరాణిక కర్మలు ఎట్లు శాశ్వతములగును? వేదములు మానవుని భగవంతుని సమీపమునకు మాత్రమే తీసుకొని పోగలవు **"నకర్మణా నప్రజయాధనేన! త్యాగేనైకే అమృతత్వమానశుః"**॥ అని వేదాలు చెప్పుచున్నవి. నీవు ఎటువంటి కర్మల నాచరించినప్పటికిని ఎటువంటి ధర్మము లాచరించినప్పటికిని త్యాగము లేక అమృతత్వము అందుకోలేవు. కర్మలు, చిత్తశుద్ధి కలిగించును. కాని శాశ్వత ఆనందాన్ని ఇయ్యలేవు. దైవత్వమనేది బయట ప్రపంచములో లేదు. **దైవము తనలో వున్నదను తత్వము అభివృద్ధి చేసుకోవాలి.**

(సా. పు. 578)

శైలే శైలే విహరద్దైవం, విపనే విపనే విచరద్దైవమ్
గ్రామే గ్రామే ఖ్యాతందైవం, నగరే నగరే ప్రచలద్దైవమ్.

పర్వతములందు, ఉన్నతమైన స్థాయియందు, ఉత్తేజమైన భావములతో ఉర్రూతలూగుతూ విహరించేదంతా దైవమే. అడవుల యందు ప్రశాంతమైనవాతావరణమునందు దివ్యమైన విను వీధులందు, చల్లని గాలులయందు, పిల్ల వాయువునందు విహరించేది దైవము. ప్రతి గ్రామము నందు, దివ్య ప్రకాశముతో, మానవత్వముతో అన్యోన్యమైన అనుకూలముతో దివ్య వాతావరణమున గడిపే వాడు దైవమే. పట్టణములయందు, అందచందములతో అనుకూల వాతావరణముతో, దివ్యానుభూతులతో, మానవులను వికసింపజేసి, ప్రకటింపజేసి దివ్యమైన తత్వాని వెదజల్లెవాడు దైవమే. **కర్నాటక దేశమున మల్లమ్మ దైవము యొక్క సర్వాంతర్యామి తత్వాన్ని చక్కగా ప్రకటింప జేసింది.**

నీరిగెనైదిలెశృంగార, ఊరింగె ఆదరవె శృంగార
గగనక్కె చంద్రమనే శృంగార, సముద్రక్కె ఆలయె శృంగార

కొలనుకు తామరపుష్పమే శృంగారము. గ్రామమునకు గృహములే శృంగారము. సముద్రమునకు తరంగములే శృంగారము. ఆకాశమునకు చంద్రుడే శృంగారము అన్నది. సర్వత్ర సౌందర్యవంతమైన శృంగారమే దైవస్వరూపము. కనుకనే ఉపనిషత్తులు సత్యం. శివం, సుందరం అని వర్ణిస్తున్నాయి.

(బృ.త్ర.పు. ౧౬౯)

మృదుహృదయానాదం సౌమ్యం దైవం
ప్రియరూపాణాం రమ్యం దైవమ్
తత్వ జ్ఞానాం విశ్వందైవము
గుణరుచిహేనాం శూన్యందైవము.

(బృ.త్ర.పు. ౧౨౩)

దైవము

భాస్కరచిందే దీప్తం దైవం
లోచనమధ్యే సుప్తం దైవమ్
సితకరమండల గుప్తందైవం
త్రిగుణితభువనం వ్యాప్తం దైవము.

'స్వరం ఖల్విదం బ్రహ్మ' - 'విశ్వం విష్ణుస్వరూపం' సూర్యుని కిరణములయందు ప్రకాశించేవాడు, ప్రకటించేవాడు దైవము. ప్రతిమానవుని యొక్క నేత్రముల మధ్య జగత్తును చూపించి ప్రకటింపజేసి వికసింపజేసి ప్రకాశింపజేసేవాడు దైవము. చంద్రుని మధ్య నున్న చల్లదనము తెల్లదనములోనే శాంతిని అందించేవాడు దైవము. త్రికాలాత్మకమైన యీ జగత్తునందు త్రిమూర్త్యాత్మకమైన యీ జగత్తునందు త్రిగుణ స్వరూపములో ప్రకటించే దివ్యత్వము భగవంతుడే. ప్రకృతి మహావిచిత్రమైనది. ఎవ్వరును దీని రహస్యమును గుర్తించ లేరు. ముంచినా, తేల్చినా, అనుగ్రహించినా, ఆగ్రహించినా ప్రకృతియే. జీవికోటిపైన ఆధిపత్యము ప్రకృతిదే. **~~ఈ~~ ప్రకృతి త్రిగుణాత్మకమైనది. త్రిగుణాత్మకమైన ప్రపంచమే త్రిమూర్తి స్వరూపము. సృష్టిస్థితి లయములకు త్రిగుణములే మూల కారణము. తమ స్వరూప స్వభావములతో, విశేషములతో, వికారములతో లోకాలను ప్రకాశింపచేసేది ప్రకటింపచేసేది త్రిగుణములే.**

(బృ.త్ర.పు. ౧౧౧)

మీ కర్మలు పరిహారం కావాలంటే దివ్యమైన ఆత్మతత్వాన్ని చింతించాలి. పుట్టించునదీ తానే, పోషించునదీ తానే, అంత్యం గావించునదీ తానే. దైవమును ఆంగ్లంలో God అంటారు.G అనగా,Generation (సృష్టి) సృష్టి దైవము నుండియే జరుగుతున్నది. O అనగా Organisation (స్థితి). ~~ఈ~~ సృష్టి దైవంచేతనే పోషింపబడుతున్నది. D అనగా Destruction (లయము) ఇది దైవం చేతనే లయం గావింపబడుతున్నది. కనుక సృష్టి స్థితి, లయములన్నీ God అనే పదమునందే లీనమైయున్నవి. ~~ఈ~~ మూడింటిచేతనే జగత్తు జరుగుచున్నది.

(స.సా.అ.99 పు. 266)

తిలమధ్యే యథాతైలం క్షీరమధ్యేయథాఘృతమ్
పుష్పమధ్యే యథాగంధం ఫలమధ్యే యథారసమ్
కాష్ఠాగ్నివత్ప్రకాశతల్లింగ మచలం ప్రభో!

తిలల యందు తైలము ఉండినట్లు పాలలో వెన్న ఉండినట్లు, పుష్పము నందు చక్కని సుగంధము ఉండినట్లు, ఫలములో రసము ఉండినట్లు కట్టెలలో నిప్పు ఉండినట్లు విశాలమైన, అనంతమైన ~~ఈ~~ జగత్తునందు దైవము కూడి ఉన్నాడు. జగత్తునందున్న మాధవుడు మానవ శరీరమందు కూడా ఉన్నాడు. ఏ విధంగా ఉన్నాడు మానవుని యందు? **కన్నులలో చూపు ఉండినట్లుగా, చెవులలో శబ్దము ఉండినట్లుగా దేహమునందు చైతన్యస్వరూపుడై ఉంటున్నాడు. సృష్టి అనగా ~~ఈ~~శ్వరేచ్ఛకు రూపమే. దీని పేరే ప్రకృతి. ~~ఈ~~ ప్రకృతి ~~ఈ~~శ్వరుని నుండియే ఆవిర్భవించింది. ~~ఈ~~ ప్రకృతి యందు జన్మించిన ప్రతి మానవుడు ~~ఈ~~శ్వరభావమునే కల్గి ఉండాలి. మానవుని యందున్న చైతన్యమును ఆవిర్భవింపచేసే నిమిత్తమై మూర్తీభవించినవాడే మానవుడు.** మానవునకు ప్రధానమైన గుణములు కూడా ఉండాలి. ప్రకృతిలో సత్వ, రజో, తమో గుణములుండినట్లు, ప్రకృతి నుండి ఆవిర్భవించిన మానవునకు యీ మూడు గుణములు ఉండాలి. **అవియే 'డ' కారత్రయములు, Devotion మొదటిది Discipline రెండవది Duty మూడవది.**

(శ్రీ.స. పు. 50)

జీవితమును అనంతములో హెచ్చించినప్పుడు అదే దైవత్వముగా మారిపోతుంది. Life x 00 = God ఇంకా విరాట స్వరూపుడనగా ఏమి? Body x 00 = విరాట స్వరూపము Mind x 00 = హిరణ్యగర్భుడు. కనుక దైవము, విరాట స్వరూపుడు, హిరణ్య గర్భుడు అనేవి ప్రత్యేకముగా ఎక్కడో ఒక లోకములో లేవు. అన్ని మానవుని యందే ఇమిడి ఉన్నాయి.

(శ్రీ.వ.1991 పు.84)

(చూ॥ అనంహకారము, అసూయ, ఆధ్యాత్మికము, ఏది, ఒక్కటే, కర్మ, కోరికలు, చదువు, త్రిగుణములు, ప్రత్యక్షదైవము, రోగవిముక్తుడు, విద్య, సమాజసేవ)

దైవం కోసం

రూపనామములు వేరు వేరుగా ఉన్నాయి గాని, అందరియందున్నవి పంచ భూతములే. దేహం అస్థిరమైనది కనుక, ఇది ఉన్నంతలోనే దివ్యత్వాన్ని అనుభవించడానికి తగిన సాధన చేయాలి. **దేహంద్వారానే దైవాన్ని పొందగల్గుతారు. దేహమే లేక మీరు ఏ కర్మలూ ఆచరించలేరు. దేహము కర్మక్షేత్రము, హృదయం ధర్మక్షేత్రము.** హృదయంలో నివసించే దైవాన్ని తెలుసుకోవాలంటే హృదయాన్ని పవిత్రం చేసుకోవాలి. దైవాన్ని పొందటం కంటే సులభమైనది జగత్తులో మరొకటి లేదు. ఎందుకు మీరింత కష్టపడుతున్నారు? ఎందుకింత నిరాశ, నిస్పృహలకు గురౌతున్నారు? క్రిందటి రాత్రి విద్యార్థులు ప్రదర్శించిన డ్రామాలో మీరు చూశారు - బిజినెస్ లైసెన్స్ దొరకనందుకు ఆ వ్యాపారస్థుడు ఎంతగా ఏడ్చాడో! ఈనాటి మానవుడు ఇట్టి లౌకికమైన విషయాలకోసం ఏడుస్తున్నాడుగాని, **దైవంకోసం ఏడ్చటం లేదు. ఒక పర్యాయం నరేంద్రుడు రామకృష్ణునివద్దకు వెళ్ళి "స్వామీ! మీరు దైవాన్ని చూశారా?" అని అడిగాడు. "ఆ చూశాను" అన్నాడు రామ కృష్ణుడు "ఎట్లా చూశారు?" అని మళ్ళీ ప్రశ్నించాడు నరేంద్రుడు "నిన్ను నేను, నన్ను నీవు చూస్తున్నట్లుగా దైవాన్ని కూడా చూశాను"** అని రామకృష్ణుడు బదులు చెప్పాడు. "మరి అందరికీ ఎందుకు కనిపించటం లేదు?" అని ప్రశ్నించాడు నరేంద్రుడు. అప్పుడు రామకృష్ణుడు చక్కని జవాబు చెప్పాడు: "అయ్యా! లోకులు ధనంకోసం ఏడుస్తున్నారు, భార్యాపిల్లలకోసం, ఏడుస్తున్నారు, ఇండ్లకోసం ఏడుస్తున్నారు. **కాని, దైవం కోసం ఏడుస్తున్నారా? దైవంకోసం ఏడ్చినప్పుడు తప్పక దైవం కనిపిస్తాడు".**

మీరు దైవాన్ని పొందాలంటే దైవం కోసం మీ సర్వస్వాన్ని త్యాగం చేయాలి. త్యాగము ద్వారానే అమృతత్వము ప్రాప్తిస్తుందని చెప్పింది వేదము. మీరు గాలిని పీల్చుకుంటున్నారు. దానిని తిరిగి వదలకపోతే మీ ఊపిరితిత్తులు పాడైపోతాయి. అట్లే, మీరు భుజించిన ఆహారాన్ని విసర్జించకపోతే మీ కడుపు చెడిపోతుంది. అంతవరకూ పోనక్కరలేదు. మీ శరీరంలో రక్తము ప్రసరిస్తున్నది. అది రోజుకు 12 కోట్ల మైళ్ళ దూరం ప్రయాణం చేస్తుంది. అటువంటి రక్తం ఒకచోట నిలుస్తే అక్కడొక పుండు ఏర్పడుతుంది. కనుక, త్యాగంలోనే క్షేమం ఉన్నది. కాని, నేటి మానవుడు త్యాగానికి పూనుకోవటం లేదు. ఆకలితో అలమటించే భిక్షగానికి పిడికెడు అన్నం పెట్టడానికి కూడా వానికి మనసొప్పటం లేదు. ఆకలితో బాధపడేవానికి పిడికెడు అన్నం పెడితే వాడు ఎంత ఆనందిస్తాడో కదా! కాని, మానవునిలో ఇట్టి విశాలమైన భావములు క్షీణించిపోయాయి.

(స.సా.డి.99 పు.350/351)

దైవముకోసము యేరీతిగా ఆరాటపడాలి?

మందలో మరిగిన మాతకై లేదూడ అంబ అంబాయని అరచినట్లు

విభుని బాసిన కాంత విరహవేదన సొక్కి మూలమూలల దాగి మూల్గినట్లు

ఆకలిచేతను నల్లాడుచున్నట్టి నిరుపేద తా భిక్షమడిగినట్లు

బిడ్డలు లేక అల్లాడుచూ ఆవేదన పడుచున్నవాడు, ఒక్క సుపుత్రుడు కావాలని ఏవిధంగా ప్రార్థించుతూ వుంటాడో ఆవిధంగా ప్రార్థించాలి. ఆర్తుడై తాదాత్మ్యతత్వాన్ని అనుభవిస్తూ దైవత్వములో ఏకము కావటానికి తగిన పరితాపమును పొందాలి.

(శ్రీ.గీ.పు.39)

దైవకర్మ

(చూ॥ ప్రాపర్టీ)

దైవకుటుంబము

ప్రతివ్యక్తి సంకుచిత భావంతో సాయి కుటుంబమనే పదాన్ని ప్రయోగిస్తున్నారు. "సాయికుటుంబ సోదరీ సోదరులారా" అని సంబోధిస్తున్నారు. **మన్ముందు సాయి కుటుంబమనే పదంలో సాయి అనే మాట ఉపయోగించకండి. అందరూ మానవకుటుంబమే.** ఒకరికి సాయి ఇష్టమైతే

దైవగుణము

మరొకరికి రాముడంటే ఇష్టముండవచ్చును. ఇంకొకరికి కృష్ణుడంటే ఇష్టముండవచ్చును. ఈ సమావేశంలో అనేక అభిరుచులతో ఉన్న వారున్నారు. నాలో అట్టి సంకుచిత భావాలు లేవు.

(స.సా.డి.85 పు.322)

దైవగుణము

ప్రేమ ప్రేమ ప్రేమ అనబడే దైవగుణమును మానవుని వరకు మాత్రమే పరిమితి గావించరాదు. ఈ ప్రేమను పశుపక్షి మృగాదులకు కూడను ప్రసరింప చెయ్యాలి. ఇలాంటి విశాలత్వము పెంచుకోవటమే నిజమైన సంస్కృతి. సంకుచిత భావాన్ని విస్మరించి, విశాలభావమును అభివృద్ధి పరచి, తనకుతాను అనుభవించి, పది మందికి పంచినప్పుడే యీ మానవత్వము దివ్యత్వముగా మారగలదు.

(బృ.త్ర.పు. ౬)

దైవచింతన

(చూ॥ శాస్త్రయోనిత్వాత్)

దైవతత్వము

"కానిదిదియని చెప్పంగ గలరు గాని,
బ్రహ్మమిదియని చెప్పంగ వలనుకాదు.
సత్యనిత్యంబు జ్ఞానమనంతమయిన
అదియే బ్రహ్మంబు; వాక్కున కలవికాదు."

"యతోవాచో నివర్తంతే అప్రాప్యమనసానహ."

దైవతత్వమును గురించి చెప్పటము అసాధ్యము. రామ చరిత్ర యెంత పవిత్రమోఅంత విచిత్రముకూడా. కానీ, వేదశాస్త్ర ఇతిహాస పురాణములు, నారాయణుని యొక్క కల్యాణ గుణగణములను ఘోషించి, ఘోషించి, **'నఇతి' - 'నఇతి'; ఇదికాదు, ఇదికాదు అని చెప్పి చెప్పి, 'ఇది బ్రహ్మము' అని నిర్ణయించి చెప్పలేని పరిస్థితిలో నిలిచిపోయినవి. ఇది స్మృతి యొక్క స్మరణ.** భగవంతుని యొక్క కళ్యాణ గుణగణములను వర్ణించుటకూ, **'అది-ఇది' అని చెప్పుటకూ, నాటికి, నేటికి, ఏనాటికైనను ఎవ్వరికిని సాధ్యము కాదు.** అట్టిది, ఇట్టిది అని ఎట్టివారైననూ గట్టిగా చెప్పుటకు, ఊహించుటకు కూడను వీలుకాదు. అనేక మంది కవులు భగవంతుని యొక్క లీలాగుణగణవిశేషములను, భగవంతుని మహత్తరమైన శక్తులను వర్ణించుచు, వేదికలపైన ప్రచార(ప్రబోధనలను సల్పవచ్చునే తప్ప, ఆచరణయందు వాటిని అనుభవించుటకు సాధ్యము కాదు. ఇంతవరకు భగవంతుని యొక్క సత్యస్వరూపాన్ని నిరూపించినటు వంటి గ్రంథము కానీ, వ్యక్తి కానీ కానరాడు. కేవలము వారి భక్తి ప్రపత్తుల యొక్క ప్రభావము చేతను, వారి విశ్వాసము చేతను భగవంతుని కొంతవరకును, అందని చందమామను వ్రేళ్ళతో చూపించినట్లుగా వాక్కులతో ఉచ్చరించ వచ్చునే తప్ప సత్యస్వరూపమును నిరూపించుటకు వీలుకాదు. ప్రాచీన కవులు, ప్రాచీనఋషులు అట్టిపనికి పూనుకొనక, తాము **త్రికాల జ్ఞానులు, త్రికాలదృష్టికలిగినవారు** కనుక, **పరమాత్ముని యొక్క శక్తి సామర్థ్యములు అంతయో, ఇంతయో తెలుసుకొని, ప్రపంచమునకు చాటడానికి పూనుకొన్నారు. వారు మహాశక్తి వంతులు.**

(ఆ.రా. పు. 20/21)

దైవతృప్తి

(చూ॥ ఆత్మతృప్తి)

దైవత్వము

మానవులలో దైవత్వము, పశుత్వము యీ రెండు ఉన్నాయి. **మానవునిలో కోతి,ఎద్దు, నక్క, పాము, నెమలి, ఎలుగ గొడ్డు, తోడేలు ఇవన్ని ఉన్నాయి. వీటి అన్నిటి క్రిందా దైవత్వమున్నది.** కళలే యీ దైవత్వాన్ని ప్రకటించాలి. దృశ్యము, నాటకము, లలిత కళలు ఇవి అన్నీ దైవత్వానికి దారి చూపాలి. ఆత్మను ప్రతిష్ఠింప చేయాలి. మానవులకు లక్ష్యము దగ్గరకు తీసుకొని వెళ్ళాలి. అప్పుడే ప్రేమ

వస్తుంది. సత్యము, ధర్మము, శాంతి ఎచ్చట నుండునో అచ్చట ప్రేమ యుండును. **అందులకే నేను ప్రేమ స్వరూపుడను.**

(సా. పు. 503)

మానవుడు కేవలము తన తత్వము తాను నమ్మలేని స్థితిలో, దుర్బలుడైపోతున్నాడు. దీనినే మానవత్వముగా మనము భావిస్తున్నాము. ఇమిటేషన్ (Imitation) మానవత్వము. క్రియేషన్ (Creation) దైవత్వము. Imitation is human. Creation is divine.కాని ఈ కృత్రిమమైనటువంటి అనుకరణ మనలను ఎంత బలహీనులను గావిస్తుందో విచారణ చేయాలి.

(ఆ.రా.పు.47)

బీజం మాం సర్వభూతనాం! కొమ్మలు రెమ్మలు పూవులు కాయలు. అన్నీ ఆ ఒక బీజమునుండి బయలుదేరినవే. దైవత్వమే బీజం. ప్రకృతి, వృక్షం; జీవజంతువులు పుష్పములు; కొమ్మలు రెమ్మలు నన్నిహిత సంబంధములు, బంధు బాంధవులు, ఆనందమే ఫలము; దానిలోని తీయదనమే, శీలము! ఆత్మ విశ్వాసమే, దాని వేరు. వేరులేక వృక్షము జీవించదు; కాయలో తీయదనము లేనియెడల అది ఎంత పెరిగి పెద్దదైననూ, పొయ్యిలో వెయునట్టి కట్టె క్రింద పనికి వచ్చును కానీ వేరెట్టి ఉపయోగము దానినుండి వుండదు. కనుక, ఆత్మను ఆధారముగా స్వీకరించి, దైవజీవులుగా బ్రతుకవలెను.

(స.సా.ఆ. 75 పు.133)

(చూ॥ అయస్కాంతశక్తి, దివ్య ప్రకటనలు, పుణ్యకర్మలు, వివాహము)

దైవప్రజ్ఞ

(చూ॥ అవతరించుట)

దైవప్రసాదాలు

అంతా సవ్యంగా నడిచిపోతున్నప్పుడు మీరు నన్ను స్తుతించెదరు. కాని ఏదైనా దుఃఖం ఎదురైనప్పుడు మీరు నన్ను పాషాణ హృదయుడని అంటారు. భగవంతుడు కష్టం కలిగించినా, సుఖం అందించినా రెండూ దైవ ప్రసాదాలుగా నిశ్చల చిత్తంతో మీరు స్వీకరించాలి.

(వ.1963 పు.23)

దైవప్రార్థన

(చూ॥ స్మరించు)

దైవప్రీతి

(చూ॥ పాపభీతి, మూడుసూత్రాలు, విప్లవము)

దైవబలము

భుజబలంబు మంచి బుద్ధిబలంబుండి
దైవబలములేక దాసుడగును
కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె
మరువబోకుడిట్టి మంచిమాట.

కర్ణునకు భుజబలము, బుద్ధిబలము, శస్త్ర బలము, సర్వబలములుండి కూడను దైవబలము లేకపోవుటంచేత కట్టకడపటికి ఏమయ్యాడు? దైవబలము నిజమైన బలము, ప్రాకృతబలము దుర్బలము. శరీరమానసిక బుద్ధిని అనుసరించుకొని అనిత్యము అశాశ్వతమైన బలమునే ఆధారము చేసుకొని ఆత్మ తత్వాన్ని పొందుటకు ప్రయత్నం చేయటము వెట్టితనము. ఆత్మజ్ఞానము లభ్యముకావాలనుకున్నప్పుడు దివ్యమైన ఏకత్వమును అభివృద్ధి పరుచుకోవాలి. ఈనాడు, ఏకత్వమును కోల్పోవటంచేతనే భిన్నత్వము అభివృద్ధి అయిపోయి దేశము అల్లకల్లోలమై పోతున్నది. జ్ఞానమును భిన్నత్వముగాని విభాగముగాని చేయుటకు వీలు కాదు. ~~ఈ~~ **దివ్యజ్ఞానము మనమే.** మనలో వున్నదనిగాని మనము సంపాయించేదని గాని భావించరాదు. **మనమే జ్ఞానము మనమే అనంతము. మనమే సత్యము. మనమే బ్రహ్మము. దీనిని పురస్కరించుకొని "సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ" అన్నారు.**

(బృ.త్ర.పు. ౧౩౬)

దైవభ్రాంతి

ఏవీరుడైనా ఎంత భుజబలము ఉన్నా దైవబలము లేనివాడు దాసుడై చెడును.

(సా. పు 121)

దైవభ్రాంతి

(చూ॥ దేహభ్రాంతి)

దైవమానవత్వము

"సతతం యోగినం" సర్వమూదైవమే నని, సర్వత్ర దైవము నిండివున్నాడని భావించేది దైవ మానవత్వము. అయితే దీనియందు ఒక్కొక్కదానికి ఒక్కొక్క అవాంతరం పట్టి పీడిస్తున్నది. దీనినే ఆధిదైవికము, ఆధిభౌతికము, ఆధ్యాత్మికము అని మూడు తెఱగులుగ విభజించారు.

1. ఆధిభౌతికము: పంచభూతములతో కూడిన మానవత్వము వల్ల అతనికి బాధలు కలుగవచ్చు. మృగములవల్ల, క్రిమి కీటకాదుల వల్ల బాధలు సంభవించవచ్చును.

2. ఆధ్యాత్మికము: వాత పిత్తశ్లేష్మాదులచే, రోగములచే, దుర్గుణములచే, దురాలోచనలచే కలుగుబాధలకు ఆధ్యాత్మికము అని పేరు.

3.ఆధిదైవికము: ఇది కేవలం దైవికంగా సంభవించేది. అనగా అతివృష్టి, అనావృష్టి, పిడుగు ఇత్యాదులచే మానవునికి కలుగు కష్టములు దైవికములు.

ఇట్టి మూడు బాధలనుండి విముక్తిపొంది ఆనందం అనుభవించటానికి ప్రేమ అవసరము. మానవునియందున్న ప్రేమను దివ్యప్రేమగా మార్చటానికి కొన్ని సాధనములు సలపాలి. వ్యక్తి అనే స్థానమునుండి సమిష్టికి చేసే ప్రయాణము మానవత్వము. "స్వం" స్థానమునుండి "సోహం" స్థానమునకు చేసే ప్రయాణమే మానవత్వము. కనుక మన స్వార్థమును పదార్థముగా మార్చుటయే త్యాగము అని పిలిచింది వేదాంతము. ప్రతి కర్మ పదార్థభావంచేత అనుభవించిననే ప్రేమ తత్త్వము అభివృద్ధి అవుతుంది. అట్టిదే ప్రేమ. **ఇచ్చేదే ప్రేమ. కాని తిరిగి యివ్వమని కోరేది ప్రేమకాదు.** మనము యిచ్చినప్పుడే ప్రేమను అందుకుంటాము. తైలము జ్యోతిని వెలిగిస్తుంది. ప్రేమ జీవితాన్నే వెలిగిస్తుంది. **ప్రేమ ఆల్‌జిబ్రా లెక్కలవంటిది.** ఎన్ని వరుసలు వేసినా అటుఇటు రెండు ఒక్కటిగా ఉంటుంది. **ప్రేమ మహా శక్తివంతము. ప్రేమ త్యాగాన్ని కోరితో, Self ప్రేమను కోరుతుంది.** కనుక నిజముగా **స్వార్థరహితమైనది ప్రేమయే. అనగా మొదట నే నెవరు? అని గుర్తించిన ఆత్మతత్త్వము అర్థమవుతుంది.** సంస్కృత అక్షరములన్ని తెలుస్తాయి. **అట్లే "అహం" స్వరూపాన్ని తెలుసుకున్నపుడు చిత్త శుద్ధి కలుగుతుంది. "నేను" అనగా ఎవరు?** అది గుర్తించిన అహంకార నిర్మూలన, ఆత్మశాంతి కలుగుతుంది. ఈ రెండు ప్రేమవల్లనే సాధ్యము.

(సా.సా.1.పు.26/27)

దైవము ఒక్కడురా!

హెచ్చు సంపద లొచ్చిన కానీ ఏనుగు గుట్టములెక్కిన కానీ
పిచ్చోడు అని పేరొచ్చిన గానీ ప్రియముతో పెద్దలు పొగడినగానీ
దేవుని మరువకురా ఉన్నది దైవము ఒక్కడురా॥
దుష్టజనులు దూషించినగానీ దోషరహితుడై వుండినగానీ
కష్టములెన్నో వచ్చినగానీ కాయము వ్యాధుల చిక్కినగానీ
దైవము వదలకురా ఉన్నది దైవము ఒక్కడురా॥
యోగాభ్యాసము చేసినగానీ భాగవతాదుల చూచినగానీ
పండితుడని బిరుదులిచ్చినగానీ పాపిష్టి అన్ననుగానీ
దేవుని వదలకురా ఉన్నది దైవము ఒక్కడురా॥
నిందకులోబడి నిలిచినగానీ నిండు చదువులే చదివినగానీ
నిండుకుండవై యుండుమురా నీవు ఎండిన కుండగా వుండకురా
దైవము వదలకురా ఉన్నది దైవము ఒక్కడురా॥

(య.సా. పు. 96)

దైవమును నిందించకండి

(చూ॥ దైవమును విమర్శించకండి)

దైవమును విమర్శించకండి

ఈ ప్రపంచములో ఇంతమంది యువకులుండినప్పటికి ఈ కొద్ది మంది యువకులు మాత్రమే ప్రశాంతి నిలయము చేరటంలో ఎంత అదృష్టవంతులో మీరు. మీకు లభించిన ఈ ప్రాప్తిని మీరు వ్యర్థము చేసుకోకండి. మీరు ఎక్కడికి పోయినా నేను వెంట ఉన్నాను. **మీకు ఏ విధమైన బాధలు వచ్చినా నేను చూచుకుంటాను.** ధైర్యముతో దైవానుభావము మీరు అభివృద్ధిపరచుకొని సేవలలో పాల్గొనండి. నష్టములైనా సహించుకొని సేవలు మానకండి. లాభనష్టములు, సుఖదుఃఖములు వస్తుంటాయి. పోతుంటాయి. దీనికి మనము వెరువకూడదు. దైవచింతన చేస్తూ కూర్చోవాలి. **మహాభక్తుడు త్యాగరాజు. కానీ** అతనికి చాలా కష్టములొచ్చాయి. ఎంతో భరించుకునే త్యాగరాజు కూడా రామవియోగము భరించుకోలేక బాధపడుతూ రాముని నిందిస్తూ వచ్చాడు. నిందించటమే కాక ఒక విధమైన ద్వేషము వచ్చింది. ~~ఈ ద్వేషముతో ఏమన్నాడు?~~ **రామా! నేను ఇన్ని కష్టములు పడుతుంటే నీవు నివారణ చేయలేకపోతున్నావా?** ~~ఈ కష్టములు నివారణ చేసే శక్తి~~ **నీకు లేదా, లేక నిన్ను కరిగించే భక్తి నాకు లేదా? లేదు, లేదు. నాకు భక్తి ఉంది. నీలో శక్తి లేదన్నాడు. తక్షణమే మేలుకున్నాడు. ఛీ ఛీ, దైవమునకు శక్తి లేదా? మనతో ఆడుతూపాడుతూ** ఆనందముగా తిరుగుతుంటే మానవరూపంగా మనము భావిస్తున్నామే. భగవంతుని శక్తి సామర్థ్యములు చాలా గొప్పవి అని విచారము చేశాడు. తిరిగి కన్నులు మూసుకున్నాడు. చేతులు కట్టుకున్నాడు, రామా -

కపి వారధి దాటునా కలికి రోటగట్టునా
లక్ష్మిదేవి వలచునా లక్ష్మణుండు కొలుచునా
సూక్ష్మబుద్ధిగల భరతుడు చూచి చూచి మొక్కునా
అబ్బ రామ శక్తి ఎంతొ గొప్పరా!

రామా! నీ శక్తి యింత అంత కాదు, ఎంతో గొప్పది. నా బుద్ధి చాలా చిన్నదై పోవటం చేత మందలించాను. నా తప్పే తప్పు. అదే విధముగా మీలో యిలాంటి పరిస్థితి ఏర్పడినప్పుడు **దైవమును నిందించకండి. - దైవమును విమర్శించకండి. మిమ్మల్ని మీరు విచారించకోండి. మిమ్మల్ని మీరు విమర్శించుకోండి. మీలో దోషములు మీరు చూచుకోండి.** అప్పుడే మీరు బాగుపడతారు. కనుక ఈనాడు విద్యలు నేర్చితిరని విఱ్ఱవీగటం కాదు. అధికమైన ఉద్యోగములు చేస్తున్నామని విఱ్ఱవీగటం కాదు. **భగవంతుని ప్రేమను సాధించామనే దానికి ఆనందించాలి. ఆ ప్రేమయే సర్వమునకు మూలాధారము.** ఏ సాధనలు చేసినా ప్రేమ ఆధారంతోనే చేయాలి. నవవిధ భక్తులుంటున్నాయి.

శ్రవణం కీర్తనం విష్ణుస్మరణం పాదసేవనం
వందనం అర్చనం దాస్యం స్నేహం ఆత్మనివేదనం.

ఈ నవ విధ మార్గములలో ప్రేమ చేతనే సాధించాలి. ప్రేమయే అన్నింటికి మూలాధారము. **ప్రేమ అంతర ప్రవాహము. ఆ ప్రవాహము మనము పెంచుకుంటే ఏ బాధలనైనా సులభంగా సాధించుకోవచ్చు.**

(శ్రీ.స.పు.67/68)

దైవలక్షణాలు

భగవంతుడు ఎక్కడున్నాడు. ఏవిధముగా ఉంటాడు? అనే దైవ లక్షణాలను అర్థం చేసుకున్న తర్వాతనే అతని అన్వేషణను మనం ప్రారంభించాలి. అయితే సర్వోపనిషత్తులు, సర్వ వేదాంతములు, వేదములు భగవంతునికి ఆకారమును నిరూపింపక కేవలము వర్ణనలద్వారా మాత్రమే అతనిని సంస్కరించాయి. **నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం అనే పదముల యందుండే అంతరార్థమేమిటి?** ఇట్టి పదములను మనము సులభముగా వల్లిస్తున్నామే కాని పదములకు ఆకారమును నిరూపించలేక పోతున్నాము. **పదములు చెప్పుట**

దైవలీల/దైవలీలలు

సులభము. రూపములు నిరూపించుట కష్టము. ఈ పదములకు అంతరార్థాన్ని గుర్తించినప్పుడే ఆత్మ స్వరూపమైన భగవత్తత్వము మనకు అందుబాటులో ఉందన్న సత్యము మనకు అర్థమవుతుంది. అతని స్థానము, అతని మూలము, అతని కీలకము, అతని గమ్యము మనకు అర్థముకాక అట్టి పరతత్వమును మనము అన్వేషించడమంటే కాలమును వ్యర్థము చేయటమే. మంత్రపుష్పము అనేక విధములుగా దైవత్వాన్ని వర్ణిస్తుంది. నారాయణ సూక్తము కూడా ఇదియే. **"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థితః' అని భగవంతుడు లోపల వెలుపల సర్వత్రా ఉంటున్నాడు అనే విలాసమును జగత్తున కందించింది.** సర్వత్రా ఉన్న దైవత్వాన్ని అన్వేషణ చేయడమంటే ఎక్కడికి వెళ్ళటం? **'సర్వతః పాణిపాదం సర్వతోక్షి శిరోముఖం. సర్వతః శ్రుతిమల్లోకే, సర్వమావృత్య తిష్టతి.' సర్వత్రా ఉన్న చైతన్యమును, సర్వ వ్యాపకమైన చైతన్యమును, అంతర్బహిర్ తత్వములందు ఇమిడియుండే చైతన్యమును వెలుపలి ప్రదేశమునందు వెదకుటకై మనము ఆరాటపడుతున్నాము.** ఇదే ఆ జ్ఞానమునకు ప్రథమ లక్షణము.

(స.సా.న.84 పు.293)

దైవలీల/ దైవలీలలు

మకరము తిరుగాడు మడుగులో దిగవచ్చు
పాము పుట్టలపైన పరుండవచ్చు
పులులు సంచరించు పొదల తిరుగవచ్చు
నట్టేట యిల్లు కట్టవచ్చు
మద గజములతో మసలవచ్చు
కొండలన్నియు చేర్చి పిండి కొట్టవచ్చు
అయ్యోట తలదూర్చి ఆనవచ్చు
గాలిలో లీనమై తిరుగాడవచ్చు
చుక్కలను లెక్క గొనవచ్చు
సుంతయేని దైవలీల కనుగొనలేరు.
సత్యమైనమాట సాయిమాట!

(బ. పు. 57)

(చూ॥ దివ్యప్రకటనలు)

దైవవిశ్వాసము

కన్నులకు చూపు నిచ్చునటువంటివారు ఎవరు? "రసోవైసః" సర్వాంగములందును రస స్వరూపుడై ఈ దేహాన్నంతా నడిపిస్తున్నాడు. ఈ సత్యాన్ని గుర్తించుకొనలేక మానవుడు గొప్ప విద్యావంతుడనుకొని "నేను చేసాను, నేను చూసాను, నేను చెప్పాను" అని తన యొక్క అహంకారాన్ని కర్తృత్వాన్ని అభివృద్ధి పరచుకుంటున్నాడు. మనము సామాన్యమైనటు వంటి విషయములోపల మన జీవితాన్ని కేవలము అంకితము చేస్తున్నాము. దానికంటే ఉన్నతమైన మరో స్థాయిని కూడా చేరడము అత్యవసరము. చదువు యొక్క ముఖ్యోద్దేశము అదియే. మనము అన్ని విధాల జగత్తులో జరిగేటటువంటివి ఉచ్చరించినపుడు మన విద్యకు కలిగే విలువ ఏముంటుంది. అన్నిటికీ ఆధారం ఏమిటో? అన్నిటికీ గమ్యమేమిటో, అన్నిటికీ ఒక విధమైన ప్రారంభమేమిటో మనం గుర్తించటానికి ప్రయత్నించాలి. అదే నిజమైనటువంటి దైవత్వము. ఆ దైవ విశ్వాసం లేకుండా మనం దేనిని కూడను సాధించలేము. ఈ విశ్వాసమునకు ఏదో కొన్ని కారణము లని భావిస్తాము. ఇది చాలపొరపాటు. మన Faith అనేదానికి No reason. ఇది Beyond reason. దీనిని చక్కగా మీరు గుర్తించాలి. నీవు తల్లిని ప్రేమిస్తున్నావు. దీనికి ఏమిటి Reason అని ఎవరైనా అడిగితే ఏమి చెపుతావు నీవు? దానికి ఒకే ఒక సమాధానం. "She is my mother" ఆమే నా తల్లి దానివల్ల ఆమెను ప్రేమిస్తున్నాను" అదే విధముగనే ఈ భగవంతునిపై నమ్మకమునకు కారణమేమిటంటే He is my God అదే Reason. ఆయొక్క నమ్మకము చేతనే మనము దైవత్వాన్ని గుర్తించడానికి సాధ్యమవుతుంది. ఆ నమ్మకము ఎంతగానో మనలను బలపరుస్తూ ఉంటుంది. కనుకనే -

Where there is Confidence, there is Love.
Where there is Love, there is Peace.
Where there is Peace, there is Truth.
Where there is Truth, there is Bliss.
Where there is Bliss, there is God

ఇటువంటి Confidence తోనే మనము ఆనందాన్ని పొందడానికి తగినంత కృషి చేయాలి. ఈ Confidence లేకపోతే నీకు ఆనందమే లేదు. కానీ ఈనాటి పిల్లలయందు కేవలం ఉన్నటువంటి Confidence ను ఛిన్నా భిన్నము చేసే దూతలు కూడా ఉన్నారు.

(స.సా.జూ. 89, పు. 174/175)

దైవ విశ్వాసము ఎన్ని విధములైన కష్టములు, నష్టములు, విచారములు, దుఃఖములు కలిగినప్పటికిని, ఆ విశ్వాసము సడలిపోకూడదు. ఆదృఢ విశ్వాసమే అనేక మంది భక్తులను సంరక్షిస్తూ వచ్చింది. ప్రాచీన కాలము నుండి మహర్షులను రక్షించినది ఏ శక్తి? **లక్ష్మీ శక్తి, దుర్గా శక్తి, పార్వతి శక్తి అని అనుకుంటున్నాము. ఏ శక్తికాదు ఆ దృఢవిశ్వాస శక్తియే పెద్ద శక్తి. విశ్వాస శక్తి లేక ఎన్ని శక్తులనుండి ప్రయోజనం ఏమిటి?** కనుక ఆ విశ్వాసమనే శక్తిని మనం బలపర్చుకోవాలి. ఎన్నో అడ్డములు తగులుతాయి, ఎన్నో బాధలు మనలను హింసిస్తూ ఉంటాయి. ఏ మాత్రము లెక్క చేయకూడదు. వీటన్నింటిని తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగినప్పుడే మనము దీనిని సాధించిన వారమవుతాము. అడ్డు తగిలిందని ఏమవుతుందో అని సందేహపడితివా యింక ధ్వంసమైపోయినావు. ఎట్టి పరిస్థితిలో మన విశ్వాసము దూరము చేసుకోకూడదు. విశ్వాసముండిన మానవుడు ఎంతైనా సాధిస్తాడు. అనేక పర్యాయములు త్యాగరాజుకు కూడా విశ్వాసము కొన్ని సమయములలో చంచలమైపోతూ వచ్చింది. రామదాసుకు కూడా **అనేక పర్యాయములు** doubts **వచ్చాయి. "రామా! నాకు నీవు తప్ప ఎవరు లేరని" పరిపూర్ణముగా విశ్వసించినవాడు రామదాసు. తన సర్వస్వము రామునకర్పించిన వాడు రామదాసు.** కానీ కొన్ని సమయములలో మనుష్యత్వము బలహీనతకు గురౌతుంది. ఆ బలహీనత వల్ల బుడగవలె సందేహము బయలుదేరుతుంది. ఆ సిపాయిలు అతన్ని జైల్లో వేసి కొడుతున్నారు. ఆ దేహ బాధలను సహించుకోలేక పోయాడు రామదాసు. రామునిపై కోపం వచ్చేసింది. **కోపము రాకూడదు సాధకునికి.**

కలికి తురాయి నీకు కుదురుగ చేయిస్తి రామచంద్రా!
ఎవరబ్బసొమ్మని కులుకుతు తిరిగేవు రామచంద్రా!

అని తిట్టినాడు. ఎవరబ్బసొమ్ము; నీవు పెట్టుకొని కులుకుతున్నావే అన్నాడు. తక్షణమే బాధ కల్గింది. అయ్యో! నా స్వామిని ఇంతగా నిందించానా.

అబ్బ! తిట్టితినని ఆయాసపడవద్దు
ఈ దెబ్బలకోర్వక అబ్బ తిట్టితినయ్యా రామచంద్రా!

ఈ బాధలు సహించుకోలేక నిన్ను నేను తిట్టినానుగానీ తిట్టాలని తిట్టలేదు. కానీ **అప్పుడు కూడా ఓపిక పట్టుకోవాలి. బిడ్డపైన ప్రేతి ఉంది కదాయని గట్టిగా గొంతుపట్టుకొని ముద్దుపెట్టుకుంటే ప్రాణం పోతుంది. అయ్యో నేను ప్రాణం పోవాలని పిసకలేదు ప్రేమతోపిసికాను అంటే ఏమి ప్రయాజనం చెప్పండి. అక్కడ కూడా సూక్ష్మాన్ని గుర్తించుకుంటూ పోవాలి. పరులకు బాధ కలిగించక ప్రేమను మనం అనుభవించాలి.**

అదే విధముగా త్యాగరాజు. తాను బాధలకోర్వలేక పోయాడు. తనయింటి నుండి రాములు వెళ్లిపోయాడు. ఆ రాములను వెతుకుతూపోయాడు. ఎక్కడా చిక్కలేదు. ఓ చెట్టు క్రింద కూర్చున్నాడు. **రామా! నిన్ను సర్వకాల సర్వావస్థలందు భజించి స్మరించినందుకు ఇదా ఫలితము. నిన్ను ఏమి కోరినాను. ఏ కొండలు గానీ, ధనముగానీ, ధాన్యముగానీ కోరలేదు. నిన్నే కోరాను.** యింత మాత్రము దయ లేదా! **నీకు దయలేదా? లేక నాలో భక్తిలేదా?** ఇందులో సందేహము తీరిపోవాలి అని అనుకొని నిర్ణయము చేసుకున్నాడు. నాలో కాలి మొదలు తల వరకు "రామ, రామ" అనే చింత సర్వత్రా ప్రసరిస్తున్నది. నాలో భక్తి లేదని చెప్పటకు వీలులేదు. చూస్తే నీలోనే శక్తి లేదు. చేతకాని వారికి చేష్టలు జాస్తి. చెప్పుతున్నాడు. రామా! నీలో శక్తి ఉంటే నన్ను ఎందుకు రక్షించుకోలేకపోయావు? నీలో శక్తి లేదన్నాడు. తక్షణమే మనోభ్రాంతి అభివృద్ధి అయింది. నిజంగా అతనికి శక్తి

లేదా? **Self enquiry ప్రతిమానవునికి అత్యవసరము. నాలో ఆ పవిత్రత ఉందాలేదా అనే దృఢమైన విచారణ చేయాలి.**

కపి వారధి దాటునా? కలికి మింట లేచునా?
లక్ష్మిదేవి వలచునా? లక్ష్మణుండు కొలచునా?
సూక్ష బుద్ధి గల భరతుడు చూచి చూచి మ్రొక్కునా?
అబ్బ! రామ శక్తి ఎంతో గొప్పరా!

ఓ రామా! నీ శక్తి ఎంత గొప్పది. ప్రపంచమంతా ప్రార్థిస్తే కూడా లక్ష్మీదేవి ఎవరికీ చిక్కటంలేదు. ఆమె మీ పాదాలు వత్తుతూ కూర్చుందే, ఆమెకు బుద్ధిలేదా! అలాంటి లక్ష్మీదేవే నీ పాదాక్రాంతురాలైనప్పుడు నేనెవరు. నీలో శక్తి లేకపోతే ఆమె నీ పాదములు ఎట్లావత్తుతుంది? కపి వారధి దాటునా? చంచలత్వమునకు పుట్టినిల్లు పెట్టింది పేరు కోతి. సముద్రాన్ని దాటుతాడా! కేవలం నమ్మరాని విషయము. నీ శక్తియే దాటించింది. ఆ శక్తి ఎట్లా వచ్చింది హనుమంతునికి? రోమరోమము రామనామమే. **"సర్వదా సర్వకాలేషు సర్వత్ర రామ చింతనమే".** ఎలాంటి పరిస్థితిలోనైనా అహంకారము, ఆడంబరము ప్రదర్శించినవాడు కాదు హనుమంతుడు. **నిరంతరము రాముని చెంత చాలా దీనుడే! కానీ రావణుని దగ్గర పోయినప్పుడు వీరుడే. రాముల దగ్గర నిరంతరం దానుడుగానే ఉంటున్నాడు.** అశోకవనములో యిష్టానుసారము సంచరిస్తున్నాడు హనుమంతుడు. అనేకమంది రాక్షసులు కోతిని ఏనాడు చూడలేదు. ఈ కోతిని చూడడానికని ఆశ్చర్యముగా వస్తున్నారు గుంపులు గుంపులు. ఒక రాక్షసుడు ప్రశ్నించాడు.ఎవరు నీవు? ఎంత వినయంగా చెబుతున్నాడు. **'దాసోహం కోసలేంద్రస్య' నేను రామచంద్రుని దానుడను. ఆ సమయమునందు మనసుకు ఎంత మృదు మధురమైనదిగా తోచింది.** రామ విషయములో సర్వము లీనమైనవాడు. అలాంటి రామునికి బలము లేకుండా పోలేదు. సర్వశక్తిమయుడు రాముడు. ఇలాంటి శక్తి ఎలా తెలుస్తుంది? తన భక్తిలోనే తెలుస్తుంది. తన విశ్వాసము అంత గాఢముగా ఉండటం చేత రాముని శక్తి గాఢంగా విశ్వసిస్తూ వచ్చాడు. **తనలో ఆత్మ విశ్వాసము లేక పోతే దైవముపై పూర్తి అవిశ్వాసము వస్తుంది. "యద్భావం తద్భవతి".** ఇదంతా నీలోని భావములు గానీ దైవములోనివి కావు. **నీలోని లోపములేగానీ దైవములో లోపమేలేదు.** మనము అన్ని విధాల బుద్ధి చెప్పవలసిన చోట చెప్పాలి. అనుభవించవలసిన దగ్గర అనుభవించాలి. అదే హనుమంతుడు ఎంత శాంతముగా, ఎంత ప్రీతిగా, ఎంత సౌమ్యముగా, ఎంత ఆనందముగా అన్ని విధముల రామసేవ చేశాడు? కట్టకడపటికి రాక్షసులచేత చిక్కాడు. ఆ రాక్షసుల చేత చిక్కినపుడు రావణుని దగ్గరకు పట్టుకొనిపోయారు. రావణుడు హనుమంతుని చూచి ఒరే! క్రింద కూర్చో అన్నాడు. రావణుడు పద్ద సింహాసనముపై కూర్చున్నాడు. ఛీ! ఈ దుర్మార్గుడు పైన కూర్చోటము రామదాసునైన నేను క్రింద కూర్చోటమా! తగినదికాదు.తన తోకను పెంచాడు - పెంచాడు; చుట్టాడు - చుట్టాడు. రావణుని కంటె పైకిపోయి కూర్చున్నాడు. రావణుని ప్రశ్నించాడు:

"కోతి జాతిని వనమెల్ల చెరిచితివి నిన్నెవడు పంపించెరా!
కోతి జాతిని నిన్నెవడు పంపించెరా!"

నవ్వుతూ చెబుతున్నాడు హనుమంతుడు :

"నీ చెల్లి ముక్కు చెవులు కోసిన రాచదొర నన్నంపెరా"

అతనే నన్ను పంపించాడు అన్నాడు. ఎంత చక్కని సూటి అయిన మాటలు. **ఈ హనుమంతునిలో పూర్తిగా రాముడే లీనమైపోయినాడు. "బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి". అదే సాయిజ్య తత్వము. భక్తులలో భగవంతుడు లీనమై ఉంటున్నాడు.** రాక్షసులంతా తిరుగుతున్నారు. అటు యిటూ లంకంతా అగ్గిపెట్టాడు. కేకలు వేస్తు తిరుగుతున్నారు. ఏదన్నా? ఈ కోతి నెవరు పంపిరి?

అది మామీద గోదాడ చేసెనే!

కానీ విభాషణుని భార్య సరమా, బిడ్డలు రెండు చేతులు జోడించి నమస్కరించారు హనుమంతునికి. వారికి యిలాంటి పవిత్రమైన దర్శనం లభ్యమైంది. రాములను మేము చూడలేము. రామదాసుని ద్వారా చూస్తున్నాము.

రామదాసు ఒక పరిశుద్ధమైన అద్దము వంటి వాడు. ఆ అద్దములోనే రామచంద్రుని మేము చూడగలుగు తున్నాము. **దాసుడు ఎట్లా ఉండాలంటే పవిత్రమైన పరిశుద్ధమైన అద్దము వలె తయారు కావాలి. ఏ విధమైన అహంకార ఆడంబర మాలిన్యములు యిందులో ప్రవేశించకూడదు. అలాంటి వాడే నాకు భక్తుడు నా ప్రియుడు అన్నాడు కృష్ణుడు.**

(ద.య.స.97 పు.110/114)

దైవశక్తి/దైవశక్తులు

నేను చేయు పనులు **గారడికాదు, మాయకాదు; మంత్రము కాదు; తంత్రము కాదు; ఇది వాస్తవమైన దైవశక్తి.** ఈ దివ్యతత్వము అల్పజ్ఞులకు అర్థము కాదు. మాయతో వారి కన్నులు మూయబడి వుండుటచేత భగవత్తత్వమును వారు గుర్తించలేరు.అందుచేత ఈ శక్తిని వారు హేళన చేయుదురు; **దూషింతురు. దైవశక్తికి అతీతమైన దేదీలేదు.** ఇది తరుగునవది కాదు. అన్ని శరీరములవలె నేను ధరించిన ఈ శరీరము అశాశ్వతమే అయినప్పటికీ నా సంకల్పమూ నా చర్యలూ శాశ్వతములు''

(స.శి.సు.తృ. పు. 167)

రాముడు శివధనుస్సును అవలీలగా ఎత్తగల్గుటకు కారణమేమిటి? అతడు సాక్షాత్తు నారాయణమూర్తి. అనగా అతనియందు నూటికి నూరుశాతం ఆకర్షణశక్తి ఉన్నది. అందువల్లనే ఆ బరువును ఎత్తనవసరం లేకుండా అదే తన దగ్గరకు వచ్చేసింది. ఇంక, **సీత భూజాత. భూమికి అయస్కాంత శక్తి చాల అధికంగా ఉన్నది.** కనుక, సీత కూడా పూర్తి అయస్కాంత శక్తితో నిండియున్నది. దీనిని సైన్సు కూడా అంగీకరించక తప్పదు. అందువల్లనే సీత కూడా శివధనుస్సును సులభంగా ఎత్తగల్గింది. సీతారాములు ఇరువురూ సాక్షాత్తు దైవశక్తులు, ఎక్కడ అయస్కాంత శక్తి ఉంటుందో అక్కడ ఎలెక్ట్రిక్ పవర్ అనేది ఉంటుంది. కనుకనే సీతారాముల తేజస్సు సర్వత్ర వ్యాపించిపోయింది. ఈ తేజస్సు మన దేహములందు కూడా ఉన్నది. కాని, ఒకరియందు ఎక్కువగా మరొకరి

దైవశక్తి/దైవశక్తులు

యందు తక్కువగా ఉండవచ్చును. సీతారాములందు మాత్రము సర్వశక్తులున్నాయి. కేవలం **లోకోద్ధారణ నిమిత్తమై మానవాకారము ధరించారు.**

(స.సా.జూలై 96 పు.189)

(చూ॥ అన్నం, అయస్కాంతశక్తి)

దైవశాసనము

ఈ ప్రపంచమందు దైవశాసనముచేత వర్షములు కురియుచున్నవి. పంటలు పండుచున్నవి. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు చల్లదనము నందిస్తున్నాడు. నదులు ప్రవహిస్తున్నాయి, ఆనందము నందిస్తున్నాయి. ఇవి ఎవరి సొత్తు? ఇది ప్రాకృత మానవులకందరకు సమానమైన సొత్తే. ప్రాకృత పౌరులందరు దీనిని అనుభవించుటకు అధికారమున్నది, కనుక, అందరూ అనుభవించవచ్చును. **ఇది శ్రేయాశక్తి, ప్రేయోశక్తి రెండింటి సంబంధబాంధవ్యమే.** పంట పండించుకోవటము. భుజించటము, శక్తిసామర్థ్యములు పెంచుకోవటము, కర్మమార్గమునందు ప్రవేశించి దేహకర్మలనాచరించటం, ఈ దేహకర్మలు ఆచరించిన తరువాత ఆత్మధర్మముతో ఆనందించటము - **విచారణ చేసి చూస్తే అంతా దైవశాసనమేకాని అన్యులు నిర్ణయించునది కాదు. అణువు మొదలు ఘనము వరకు గడ్డిపోచ మొదలుకొని బ్రహ్మాండము వరకు భగవత్ శాసనమువల్లనే జరుగుతున్నవి.**

కదలదు నీదు సంకల్పము లేనిదే గడ్డిపోచయును
అదియు, ఇదియు అనగనేల? పిపీలికాది బ్రహ్మపర్యంతము నీవె!
అది ఎఱుంగరు మది గలంగరు భువిని కొందరు
వివేకమున వర్తించెదమని కడు విఱ్ఱవీగెదరుగాని
చివరికే వేళ ఏది సంభవించునో తెలయజాలరు
ఎంతవారలైన.

(ఆ.భా.పు.87/88)

దైవసంకల్పము (Divine will)

మొట్టమొదట మానవత్వంలోనున్న దివ్యత్వమును మీరు అర్థం చేసుకోవాలి. ఏది చేసినా, ఏది చూసినా ఏది చెప్పినా

దైవసంపత్తి

ఏది అనుభవించినా అంతా దైవ సంకల్పం చేతనే జరుగుతున్నది గాని, మానవ సంకల్పంచేత కాదు. మానవుడు నిమిత్త మాత్రుడేగాని, సూత్రధారి కాదు. దైవ సంకల్పంచేతనే సర్వ కార్యములు జరుగు చున్నవి. మీరు దేహంతో కర్మలను ఆచరించి తత్ఫలితమును పొందుతున్నారు. మీ దేహంలో కూడా మీ ప్రయత్నం లేక భగవంతుని సంకల్పంతో పని చేయునట్టి అంగములు అనేక ముంటున్నవి. గుండె ఆడుటకు మీరు ఏ ప్రయత్నం చేస్తున్నారు? మీ దేహంలో రక్త ప్రసరణకు ఏ ప్రయత్నం చేస్తున్నారు? భుజించిన అన్నం జీర్ణం కావడానికి మీరు ఏ ప్రయత్నం చేస్తున్నారు? ఇవన్నీ దైవసంకల్పంతోనే జరుగుతున్నాయి. **మంచిచెడ్డలు రెండింటికీ దైవ సంకల్పమే మూలకారణం. ఏది జరిగినా ఇది నా మంచికోసమే అనుకోవాలి. కష్టంగాని, నష్టంగాని, దుఃఖంగాని, ఆనందంగాని ఏది జరిగినా మీ మంచి కోసమే. భగవత్సంకల్పం లేక ఏదీ జరగడానికి వీలు కాదు.** కనుకనే ఆనాటి మునులు చెప్పారు.

కదలదు నీదు సంకల్పము లేనిదె గడ్డిపోచయును
అదియు నిదియు ననగ నేల?
పిపీలికాది బ్రహ్మపర్యంతము నీవె
అది ఎరుంగరు భువిని కొందరు
వివేకమున వర్తించెదమని కడు విజ్ఞవీగెదరుకాని
చివరికేవేళ ఏమి సంభవించునో తెలియ జాలరెంతవారలైన''

ఒక అడుగు ముందుకు పెట్టిన తరువాత రెండవ అడుగు వేసే లోపల ఏమౌతుందో ఎవరికీ తెలియదు. భవిష్యత్తు మీ హస్తంలో లేదు. ఒక గృహమునకు పునాది వేశారు. అది పూర్తి అయిన తరువాత దానికి ఘనంగా ప్రారంభోత్సవం జరపాలని అనుకుంటారు. కానీ, ఆ గృహం పూర్తి అయ్యేంతవరకు మీరు ఉంటారనే గ్యారంటీ ఏమిటి? **మరుక్షణంలో ఏమౌతుందో కూడా మీరు చెప్పలేరు. కనుక, భగవంతునిపై భారం వేసి మీ కర్తవ్యమును నిర్వర్తించడం అత్యవసరం.** దైవత్వం ఉన్నదా అనే సందేహం ఈనాడు అనేకమందికి ఉన్నది. **ఏది దైవత్వం? సమిష్టి తత్త్వమే దైవత్వం. మన యొక్క అంతరాత్మ** (Conscience) **యే దీనికి సరియైన సాక్ష్యం.**

(స.సా.అ. 99 పు. 272)

ఒక చిన్న ఉదాహరణ: ప్రపంచ యుద్ధములో యూరపులో అనేకమంది పురుషులు మరణించారు. ఆ తర్వాత యూరపు లోపల అందరికి మగబిడ్డలేపుట్టారు. కారణమేమిటి? ఈ మగ బిడ్డలే పుట్టకుండిన ఈ యొక్క ధర్మమనేది చాలావరకు నశించిపోతుంది. వర్ణ సంక్రమము ఏర్పడుతుంది. కనుక భగవంతుడు ఈ యొక్క ఈ విధమౌన సమత్వాన్ని పోషించుకుంటు వస్తుంటాడు. ఈ సమత్వమునకే కొన్ని భిన్నములు కలిగినప్పుడు జగత్తే అశాంతి పొందుతుంది. ఇది అన్నియు కూడ దైవ సంకల్పము పైననే ఆధారపడి ఉంటుంది. అట్టి ఆధారమైన దైవత్వాన్ని ఈనాడు మనము విస్మరించి లౌకికమైన లోకాన్ని, విశ్వాన్ని విశ్వసించి మన మానవత్వాన్ని నిర్మూలము గావించు కుంటున్నాము. మరొక ఉదాహరణము: మనము తిన్నటువంటి అన్న మంతయూ రక్తంగా మారుతుంది. ఈ ఆహారాన్ని రక్తంగా మార్చే దెవరు? ఈనాటి వైజ్ఞానికులంతా అది law of nature, అంటారు. అ nature కు law ఇచ్చినటువంటి వాడెవడు? దానికి no reply. **ఇదే దివ్యత్వము యొక్క నిజ తత్త్వము.**

(స.సా.జూలై 89 పు.174)

(చూ॥ స్వయం నిర్ణయాధికారం)

దైవసంపత్తి

1. అభయము, 2.చిత్తశుద్ధి, 3. జ్ఞానయోగ మందుండుట, 4.దానము, 5. దమము (బాహ్యేంద్రియ నిగ్రహము), 6. యజ్ఞము, 7.అధ్యయనము, 8. తపస్సు, 9. కపటము లేకుండుట, 10. అహింస, 11. సత్యము, 12. ఆక్రోధము, 13. త్యాగము, 14. శాంతి, 15. కొండెములు చెప్పకుండుట, 16. సమస్తప్రాణులయెడ కరుణ, 17. విషయములందు మనస్సు పోకుండుట, 18. తేజస్సు 19. క్షమ,

(ద్వంద్వములను సహించుట) 20. ఆపత్కాలము నందు సహితము ధైర్యమును విడువకుండుట, 21. శౌచము, 22. పరులకుద్రోహము చేయకుండుట 23. మృదు స్వభావము (వాక్ మాధుర్యము), 24.ధర్మ విరుద్ధ కార్యములలో ప్రవేశించకుండుట, 25. చంచల స్వభావము లేకుండుట. ఇట్టి పవిత్రమైన **ఇరువది అయిదు గుణములు కలవారినే దైవ సంసత్తనియును,** డంబము, గర్వము, దురభిమానము, కోపము, పరులను పీడించేలాగున వంచించు స్వభావము, వివేక జ్ఞానహీనత, ఇత్యాది దుర్గుణములు కలవారలను **దానవాంశమనియును,** అందురు. ఆకారమున మానవులవలె కనుపించునంత మాత్రమున మానవులు కానేరరు.''

(గీ.పు.226)

(చూ॥ ప్రమాదము)

దైవ సాన్నిధ్యము

మనసుక్రియయు మనిషికి ఒకటైన
సత్యవంతుడగును సరణి తోడ
సత్యవంతుడే దైవ సాన్నిధ్యమందును
పొందుచుండు ప్రేమ నొందుచుండు ॥

(సా.పు. 72)

దైవస్వరూపులు

''దైవాధీనం జగత్సర్వం, సత్యాధీనంతు దైవతమ్,
తత్సత్యముత్తమాధీనం, ఉత్తమో మమ దేవతా''

ఈ విశ్వమంతయూ దైవాధీనమై ఉంటున్నది. అట్టి దైవము సత్యాధీనమై ఉంటాడు. సత్యము ఉత్తముని యొక్క ఆధీనమై ఉంటుంది. అట్టి ఉత్తములే దైవ స్వరూపులు.

(శ్రీ.సె.2000 పు.7)

విశ్వం విష్ణు స్వరూపము. అంతా విశ్వవిరాటస్వరూపమే. ''సహస్రశీర్షాపురుషః సహస్రాక్షసహస్రపాత్''. ఇదే విశ్వస్వరూపము. ఆనాడు విదురులు ఈ వేదమును అభ్యసించే సమయములో ప్రపంచమంతా చేరి మూడు కోట్లమందే ఉన్నారు. కనుక వారిని ముక్కోటి దేవతలు అన్నారు.

అనగా ఒక్కొక్కవ్యక్తి ఒక్కొక్కదైవస్వరూపమే. ఇప్పుడు 500 కోట్లపైన అయిపోయినారు. కానీ యిప్పుడు కూడా మూడుకోట్ల దేవతలనే అంటున్నాము. కాదు, కాదు ఇప్పుడు 500 కోట్ల దేవతలున్నారు. అందరు దైవస్వరూపులే. ''ఈశ్వరస్సర్వభూతానాం, ఈశావాస్యమిదం జగత్'' అంతా ఈశ్వరుడే. ఈ సత్యాన్ని గట్టిగా మనము విశ్వసించి అందరిని దైవస్వరూపులుగా భావించాలి.

పరుల తిట్టినంత పాపఫలంబబ్బు
విడువదెన్నటికి విశ్వమందు
పరులు పరులు కాదు పరమాత్మ అగునయా!

(ద.య.స. 97 పు.18)

హనుమంతుడు సీతకు రావణుని మరణవార్త చెప్పిన తరువాత, ''తల్లీ! నీవు అనుమతిస్తే ఇంతకాలమూ నిన్ను బాధించిన ఈ రాక్షస స్త్రీలను ముక్కలు ముక్కలు చేస్తానన్నాడు. అప్పుడు సీత ''నాయనా, హనుమంతా! ఇందులో వీరి దోషమేమీ లేదు. తమ ప్రభువాజ్ఞను తాము పాలిస్తూ వచ్చారు. అంతేగాక బాధించడం రాక్షసుల స్వభావమేగాని నా స్వభావం కాదు. ఎవరి స్వభావం వారిది'' అని పలికి ఒక చిన్న కథ చెప్పింది. ఒక వేటగాడిని పులి తరుముకుంటూ వెళ్ళగా అతడొక చెట్టు నెక్కాడు. కాని ఎక్కిన తరువాత చెట్టుపైన ఒక ఎలుగుబంటు కనిపించింది. క్రింద చూస్తే పులి, పైన చూస్తే ఎలుగుబంటు! వేటగానికి ఏమి చేయాలో తోచలేదు. కాని ఆ ఎలుగు బంటు చాల మంచిది. ఎవ్వరికీ హాని తలపెట్టేస్వభావం కాదు దానిది. కొంతసేపటికి చెట్టుక్రిందనున్న పులి, ''ఓ ఎలుగుబంటూ! నేనెంతో శ్రమ పడి వానినింత దూరము తరుముకొని వచ్చాను.కనుక నీవు వానిని క్రిందకు త్రోసివేస్తే భుజించి వెళ్ళిపోతాను'' అన్నది. అప్పుడా ఎలుగుబంటూ, ''ఓ పులీ! ఈ వృక్షము నా నివాసము. ఇతడు నాకు అతిథిగా వచ్చాడు. ఇతనిని రక్షించడం నా

దైవాంశసంభూతుడు

కర్తవ్యం. కాబట్టి ఇతనిని క్రిందికి నెట్టను'' అన్నది. కాని పులి అక్కడి నుండి కదల లేదు. కొంతసేపటికి ఎలుగుబంటుకి నిద్ర వచ్చింది. అప్పుడా పులి ఒక ఉపాయమాలోచించి వేటగానితో, "ఓ వేటగాడా! నాకు కావలసింది ఆహారమే. నీవైతేనేమి, ఇంకొకరైతే నేమి! కనుక నిద్రపోయే ఆ ఎలుగుబంటును క్రిందికి నెట్టు. దానిని భుజించి నిన్ను వదలిపెట్టి వెళ్ళిపోతాను'' అన్నది. ఈ వేటగాడు **స్వార్థపరుడు.** తనను తాను రక్షించుకునే నిమిత్తమై నిద్రపోతున్న ఎలుగుబంటును క్రిందికి నెట్టాడు. అది క్రింద పడుతూంటే అదృష్టవశాత్తు ఒక కొమ్మ చేతికి దొరికింది పాపం! **ఇదే మంచితనమున కున్న రక్షణ. తన మంచితనమే తనను కాపాడింది.** తనచేతి కందిన కొమ్మను పట్టుకొని అది నిదానంగా తిరిగి చెట్టుపైకి ఎగబ్రాకింది. అప్పుడా పులి, "ఓ ఎలుగుబంటూ! నీవింత గొప్ప ఉపకారం చేసినా ఆ వేటగాడు నీకు అపకారమే తలపెట్టాడు. వాడు కృతఘ్నుడు. కనుక తక్షణమే వానిని క్రిందికి నెట్టు'' అన్నది. **"ఓ పులి! ఎవరి స్వభావము వారిది కావచ్చుగాని, ఉపకారము చేయుటే నా స్వభావము. వాని పాపము వానిది, నాపుణ్యము నాది. కనుక నేను మాత్రం వానిని క్రిందకు నెట్టను"** అన్నాదా ఎలుగుబంటు. సీత ఈ కథ చెప్పడం పూర్తి చేసి, "అదేవిధంగా ఓ హనుమంతా! ~~ఈ~~ **రాక్షసులు** నన్ను ఎన్ని విధములుగా బాధించినప్పటికీ నేను తిరిగి వారిని బాధించాలని కోరను. **వారి స్వభావం వారిది, నా స్వభావం నాది"** అన్నది. ఈ మాటలు విని హనుమంతుడు ఎంతో ఆనందించాడు. **లోకంలో ఉపకారికి కూడా అపకారం చేసే వారున్నారు. అటువంటివారు రాక్షసులే. అపకారికి కూడా ఉపకారం చేసేవారే దైవస్వరూపులు.**

(స.సా.ఫి. 97 పు. 52)

దైవాంశసంభూతుడు

(చూ॥ యథార్థ జ్ఞానులు, స్త్రీహత్య)

దైవాజ్ఞ

దైవాజ్ఞ అందరికీ ప్రాణం. **దైవం ఏది చేసినప్పటికీ ఇంక ఎదురు ప్రశ్నలు ఉండకూడదు.** దుముకు అంటే దుమకటమే! **లక్ష్మణుడు అటువంటివాడే.** చిత్రకూట పర్వతమును చేరినప్పుడు సీత అలసినట్లుగా కనిపించింది. రాముడు లక్ష్మణుని పిలిచి. "లక్ష్మణా!ఒక పర్ణశాలను నిర్మించు సీత చాల అలసిపోయింది.'' అన్నాడు. "అన్నా! ఎక్కడ నిర్మించాలి?'' అని అడిగాడు. లక్ష్మణుడు. "నీకు ఎక్కడ ఇష్టమో అక్కడ నిర్మించు'' అన్నాడు రాముడు. ఈ మాట లక్ష్మణుని చాల బాధించింది. "రామా! నేనేం పాపం చేశాను? నీ నోటి నుండి ఇంత కఠినమైన మాట వినవలసి వచ్చింది కదా'' అని బాధపడ్డాడు. అప్పుడు సీత, "లక్ష్మణా! ఎందుకింత బాధపడుతున్నావు? రాముడు నిన్నేమీ అనలేదే'' అన్నది. "అమ్మా! నాకిష్టమైనది ప్రత్యేకంగా ఒకటున్నదా? **రాముని ఇష్టమే నా ఇష్టం కదా! నీ కిష్టమున్నచోట నిర్మించు అంటే, నేను రామునకు దూరమైనట్టే కదా!" అన్నాడు.** అప్పుడు రాముడు లక్ష్మణుని తల నిమురుతూ, "తమ్ముడా! ఈ చిన్న విషయానికి నీవింత బాధపడనక్కరలేదు. ఇదిగో, ఇక్కడ నిర్మించు' ' అని ఒక ప్రదేశాన్ని చూపించాడు.

భరతుడు రామాజ్ఞకు **ఎదురు చెప్పలేక అయోధ్యకు తిరిగి వెళ్ళాడు.** కాని, ఒక షరతు పెట్టాడు. "నీవు ఆయోధ్యలో ప్రవేశించేంత వరకు నందిగ్రామంలో ఒక పర్ణశాల వేసుకొని నేనూ నీ వలె జీవిస్తాను. పధ్నాలుగు సంవత్సరాల తరువాత ఒక్క క్షణం ఆలస్యం చేసినా నేను ప్రాణత్యాగం చేస్తాను. నీవు తిరిగి వచ్చేంతవరకు నీ పాదుకలే అయోధ్యను పాలిస్తాయి'' అన్నాడు. చూశారా! **ప్రతికుటుంబంలోను అన్నదమ్ములు, భార్యాభర్తలు, తండ్రీబిడ్డలు ఏ విధంగా ఉండాలో రామాయణం ప్రబోధిస్తున్నది.**

(శ్రీ.భ.ఉ.పు.65)

దైవత్వానికి చిహ్నములు

విద్యలో రాముడు, రావణుడు ఇరువురూ సమానులే. కాని, వాల్మీకి రావణుణ్ణి మూర్ఖుడని విమర్శించాడు.

రాముణ్ణి దివ్యాత్మస్వరూపుడని వర్ణించాడు. కారణమేమిటి? రావణుడు తాను చదివిన చదువును ఆచరణలో పెట్టి జీర్ణించుకోకుండా దుర్మార్గంలో ప్రవేశపెట్టి దుర్వినియోగపర్చుకున్నాడు. రాముడు తన చదువును ఆచరణలో పెట్టి ఆనందాన్ని అనుభవించడమే కాక ఇతరులకు కూడా ఆనందాన్ని అందించాడు. **"సర్వే సముదితా గుణైః", సమస్త సద్గుణములను పోషించుకున్నాడు. లోకహితాన్ని కోరటం, సంపూర్ణ జ్ఞానమును కల్గియుండటం, సమస్త సద్గుణములను పోషించుకోవటం ఈ మూడింటిద్వారా రాముడు తన దైవత్వాన్ని ప్రకటించాడు.** ఈ మూడు ఎవరి యందుండునో వారందరూ దైవస్వరూపులే. అసలు ప్రతి మానవుడూ దైవ స్వరూపుడే. కాని, ఆత్మాభిమానమును తగ్గించుకొని దేహాభిమానమును అమితంగా పెంచుకోవడంచేత మానవునికి దివ్యత్వం బోధపడటం లేదు. దివ్యత్వాన్ని దర్శించాలనుకుంటే ప్రేమమార్గాన్ని అనుసరించాలి. కానీ, మానవుడు విశాలమైన ప్రేమను పెంచుకోలేక సంకుచితమైన, లౌకికమైన సంబంధ బాంధవ్యాలను పెంచుకుంటున్నాడు. 'నేను, నావారు' అనే సంకుచిత భావాన్ని వీడి, లోకమంతా నావారే అనే విశాలమైన భావాన్ని పెంచుకోవాలి.

(స.సా.మే 99 పు.114)

దైవానుగ్రహము/దైవానుగ్రహమే

మానవునికి సర్వసంపదలు ఉంటున్నాయి. కానీ, రెండు మాత్రం లేవు. ఆ రెండు ఎవరి దగ్గరున్నాయి? భగవంతుని దగ్గర మాత్రమే ఉన్నాయి. ఆ రెండింటికోసమే భగవంతుణ్ణి మీరు ప్రార్థించాలి. ఏమిటా రెండు? **ఒకటి శాంతి, రెండవది ఆనందము.** లౌకిక విషయాలలో ఆనంద మున్నట్లుగా, శాంతి ఉన్నట్లుగా అనిపిస్తుందిగాని అది క్షణభంగురమైనది. **శాశ్వతమైన శాంతి, శాశ్వతమైన ఆనందము దైవానుగ్రహమే. కనుక, ఆ వరమును ప్రసాదించమని మీరు ప్రార్థన చేయాలి.** "భగవంతుడా! నాకు జగత్తులో దొరికేవి ఏమీ అక్కరలేదు. ఈ ప్రపంచంలో లేనివి, నా దగ్గర లేనివి నీ దగ్గర ఉన్నవి. వాటిని నేను అడుగుతున్నాను. నీ శాంతిని నాకందించు, నీ ఆనందమును నాచేత అనుభవింపచేయి. ఈ రెండు తప్ప నాకు ఏమీ అక్కరలేదు." **ఇదే మీరు భగవంతుణ్ణి కోరవలసినవి.** మీరు కోరే సుఖసంతోషాలన్నీ ఈ జగత్తులోనే ఉన్నాయి. అవి క్షణభంగురమైనవి. భగవద్గీత **"అనిత్య మసుఖం లోకం ఇమం ప్రాప్య భజస్వ మామ్" అనింది. అంతా అనిత్యమే,** అసుఖమే. ఆకలైనప్పుడు రెండు చపాతీలు తిని ఆకలి తీర్చుకోవచ్చును. కానీ, ఎంతసేపు? రెండు గంటల తరువాత తిరిగి ఆకలి ప్రారంభమతుంది.అంతా అనిత్యమైనదే కదా. కనుకనే, భగవంతుణ్ణి ప్రేమించాలి. దైవ సన్నిధిని, దైవ సన్నిధిని కోరడం ప్రేమ నిమిత్తమే. ఒక్క ప్రేమ లభించిందా, సకల జగత్తు మీ హస్తగతమైపోతుంది. కనుక, ప్రేమ నిమిత్తమై మీరు ప్రార్థించాలి. ప్రాపంచిక సంబంధమైన చిన్న చిన్న విషయాలు కూడా ఈ ప్రార్థనలో చేరిపోతుంటాయి.

(సా.శు.పు.37/38)

(చూ॥ కర్మదాటవశమా!, భక్తసూరదాసు, త్యాగం)

దైవాన్వేషణ

అనేకమంది **దైవాన్వేషణ** జరుపుతున్నామంటున్నారు. ఈ దైవాన్వేషణ ఈనాటిది కాదు. అనాది కాలము నండి **దైవాన్వేషణ** జరుగుతూనే వస్తున్నది. సత్యాన్ని సరైన మార్గములో అనుసరించినప్పుడు సర్వమూ దైవ స్వరూపంగా రూపొందుతుంది. ఈ సత్యాన్ని అన్వేషణ ఎలా చేయాలి? **సత్యమన్నది ఒక్కటే కదా! ఎక్కడున్నదని మనం వెదకాలి? చిన్న ఉదాహరణ. తల్లిని చూస్తున్నావు. సోదరిని చూస్తున్నావు; బిడ్డను చూస్తున్నావు; భార్యను చూస్తున్నావు. ఇక్కడ విచారణ చేయాలి. తల్లిని ఏ విధంగా చూడాలి? మాతృమూర్తిగా మనం చూడాలి, పూజనీయురాలిగా చూడాలి, గౌరవనీయురాలిగా చూడాలి, దేవతా స్వరూపిణిగా చూడాలి. ఇది ఇందులో చూడవలసిన**

దైవారాధన

సత్యము. బిడ్డను బిడ్డగానే భావించాలి. "ఆ బిడ్డ నా యొక్క అంశమే. నా అంశమే ఈ బిడ్డ రూపంలో వచ్చింది"అని గుర్తించాలి. ఎవరు తల్లి? ఎవరు బిడ్డ? ఎవరు సోదరి? ఈ విధముగా సత్యాన్వేషణ చేయాలి. చూచేది ఒకే కన్నులే. అయితే తల్లిని ఏ దృష్టితో చూడాలి, సోదరిని ఏ దృష్టితో చూడాలి, బిడ్డను ఏ దృష్టితో చూడాలి, భార్యను ఏ దృష్టితో చూడాలి - **ఇదే సత్యాన్వేషణ.**

(ద.య.స.98.పు.7)

దైవారాధన

ప్రేమస్వరూపులారా! ప్రాచీన కాలము నుండి భారతీయులు వైదిక సాంప్రదాయమును అనుసరిస్తూ, యజ్ఞ యాగాది క్రతువుల నాచరిస్తూ ఆనందిస్తూ, ఆ ఆనందాన్ని పదిమందికి అందిస్తూ వచ్చారు. వైదిక సాంప్రదాయమునందు **దైవారాధన** నాల్గు విధములుగా విభజించబడింది. అవి **1. సత్యవతీ ఆరాధన 2. అంగవతీ ఆరాధన 3.అన్యవతీ ఆరాధన 4. నిదావతీ ఆరాధన.**

(స.సా.న. 99 పు.301)

(చూ॥ మాతలు)

దైవోపాసకులు

నాలుగువిధములైన దైవోపాసకులుగా ఉన్నారు. **వారు ద్విజులు, మునులు, అల్పబుద్ధులు, విదితాత్ములు.**

అగ్నిహోత్రములందే దైవబుద్ధి కలిగి పూజించి భుజించువారు ద్విజులు.

మునులు పరమాత్మను హృదయనివాసిగానెంచి ప్రార్థించువారు.

అల్పబుద్ధులు ప్రతివాదులు చిత్రపటములయందే దైవబుద్ధి కలిగి పూజించి భుజించువారు. **విదితాత్ములు సర్వ భూతాత్మకమగు ప్రపంచమంతయూ పరమాత్మయే యని తెలిసి ధ్యానించువారు.** అన్ని విధముల వుపాసనలూ ఆయాస్థానములకు గొప్పవే, కాని **ఉత్తమమయినవారు విదితాత్మ ఉపాసకులే. వారే శ్రేష్ఠులు.**

(ప్ర. వా. పు. 23/24)

ద్వైతము

(చూ॥ దాసోహం, భక్తిప్రపత్తులు)

దౌర్బల్యము

"క్షుద్రం హృదయదౌర్బల్యమ్" అర్జునా! యీ నీచమైన మానసిక దౌర్బల్యమును తరుమగొట్టి ధైర్యముగా యుద్ధభూమియందు నిలుపుమని ఆదేశించాడు కృష్ణుడు. హృదయదౌర్బల్యమునకు మూలకారణము దేహాత్మభావము. దేహాత్మ భావమునకు అజ్ఞాన ప్రభావమే కారణము. ఏతావాతా అజ్ఞానము యొక్క ప్రభావము చేత మానవుడు దేహాత్మభావమును పెంచుకొని మానసికంగా దుర్బలుడౌతున్నాడు. దేహమే దుఃఖమునకు మూలకారణము. **మానసిక దౌర్బల్యముతో ఎట్టి చిన్నకార్యమును కూడ సాధించలేడు.** కనుకనే మధ్యమధ్య గీతాచార్యుడు **"నాయమాత్మా బలహీనేన లభ్యః"** హృదయ దౌర్బల్యం గలవాడు, బలహీనుడైనవాడు యెట్టి కార్యమును సాధించలేడని నిరూపించాడు. మానసిక దౌర్బల్యమున్న వ్యక్తినే దుఃఖమోహములు వెంటాడుతుంటాయి. దుఃఖము ముందా లేక మోహము ముందా అనే విషయమును మనము విచారించాలి. మోహముండినప్పుడే దుఃఖము వెంటాడుతుంది. **మోహమే లేకుండిన దుఃఖముండదు. మోహము బింబము, దుఃఖము ప్రతిబింబము.** ఈ బింబప్రతిబింబములే మానవునికి ప్రధానవిరోధులు. ఈ **మోహదుఃఖములు** మానవుని క్రుంగదీయుచున్నవి.

(శ్రీ.స.గీ. పు.121)

(చూ॥ మోహము, స్థైర్యము)

దోషము/దోషములు

ఇంద్రియముల సహవాసముచేతనే మనస్సు మాలిన్యమగుతున్నది. సర్వ శాస్త్రములు మనస్సుకు

మల, విక్షేప, ఆవరణములనే దోషములున్నవని నిరూపించినవి.

(బృ.త్ర. పు. ౯౦)

(చూ॥ అంతఃకరణ, అసూయ, ఆహారము, జగత్తు, దుర్భావము, దైవం, దైవమును విమర్శించకండి, నామస్మరణ, పాత్ర, భగవదన్వేషణ, భగవత్ప్రేమ, శిష్యుడు)

ద్రష్టం

(చూ॥ జ్ఞాతుం)

ద్రష్టలు

(చూ॥ దర్శనములు)

ద్రౌపది

ద్రౌపది మహాపతివ్రత. ఆమెకు ఒక్కరు కాదు. ఐదుమంది పతులు. ఐదుమంది పతుల ఆజ్ఞలను శిరసావహించి, కాదు లేదు అనకుండా నడుచుకుంటూ వచ్చింది.

పతుల మాటలకెదురు చెప్పంగబోదు
వారిసేవల చేయగా తీరదనదు
తనకు నున్నంతలో తృప్తిగనుచునుండు
ద్రౌపదికి సాటి ఏ పతివ్రతయు లేదు.

ద్రౌపది పతులు ఎవరు? **ధర్మ అర్జున భీమ నకుల సమదేవులే. పంచ ప్రాణములు. ప్రతి మానవునియందు ఐదు పతులుంటున్నాయి.** ప్రాణ అపాన వ్యాన ఉదాన సమాన - ఈ ఐదింటిని ద్రౌపది చక్కగా సమన్వయ పరుచుకొని అనుసరిస్తూ వచ్చింది. మనము వీటిని అనుసరిస్తున్నామా? ఒక్కొక్క సమయములో ఒక్కొక్కటి ఉద్రేకిస్తుంది. కనుకనే చెప్పినాడు. తనకు నున్నంతలో తృప్తి గనుచునుండు. ఆమెకు ఎంత ఉన్నదో అంతటిలో తృప్తి పడుతుంది. మనకున్న దానితోనే మనము తృప్తిపడాలి. ద్రౌపది నిరంతరము తృప్తిగానే వుండేది. ఈనాటి అసంతృప్తికి కారణము ఉన్న దానిని త్యజించి, లేనిదానికై ఆరాటపడటమే. అందువల్లనే అశాంతికి గురై పోతున్నారు. ద్రౌపది లేని దానిని ఆశించటంలేదు. ఉన్న దానిని వదలటం లేదు. ఉన్న దానిని అనుభవిస్తుండాది.

(బృ. త్ర.పు. ౧౧౯)

(చూ॥ క్షమాగుణం, తల్లులు, త్యాగం, పాపం)

ద్వందములు

(చూ॥ తత్త్వజ్ఞానము)

ద్వేషము

మరణించిన రావణునికి అంత్యక్రియలు చేయుటకు విభీషణునికి మనస్కరించలేదు. శ్రీమన్నారాయణుడైన రామునిపైన ఇంత పగబూనిన యీ దుర్మార్గునికి అంత్యక్రియలు చేయటము మహాపాపమని భావించాడు విభీషణుడు. సర్వధర్మములు ఎరిగినవాడు కనుక, రాముడు, విభీషణుని దగ్గరకు పిలచి **"ద్వేషమనేది మరణము వరకు మాత్రమే ఉండాలి; మరణించిన తరువాత ద్వేషము ఉంచటము చాలా అధర్మము"** అని తెలిపి **"అతని మరణముతో నీ ద్వేషము కూడా మరణించాలి"** అన్నాడు. **"నీవు ఈ అంత్యక్రియలు ఆచరింతువా లేదా? నీవాచరింపవేని సోదర భావముచేత ఈ అంత్యక్రియలు నేనే ఆచరింతును"** అని తాను సంసిద్ధుడైనాడు. ఈ మాటవిన్న తక్షణమే విభీషణుడు రావణునియొక్క అంత్యక్రియలు చేయుటకు పూనుకొన్నాడు. ఈ విధముగా సర్వధర్మములు ఎరిగినటువంటివాడు కనుక **"రామోవిగ్రహవాన్ ధర్మః"** అన్నారు. కనుక, అట్టి ధర్మస్వరూపుడైన శ్రీమన్నారాయణ మూర్తియే రామావతారము ధరించి, లోకములోని మానవులకు ఆదర్శమైన జీవితమును గడుపుతూ వచ్చాడు. కుటుంబములో ఏరీతిగా తాను నడచుకోవాలి. మిత్రుల దగ్గర ఏరీతిగా ప్రవర్తించాలి, సమాజములో ఏరీతిగా ఆదర్శవంతమైన జీవితమును నిరూపించాలి, అనే విషయాలను తన జీవితమున ప్రతిక్షణము ప్రకటిస్తూ వచ్చాడు. సర్వుల యందు కూడను సమప్రేమను ధరించి, సమప్రేమ చేతనే అందరినీ ఆదరించి ఆనందింపజేస్తూ వచ్చాడు.

(ఆ.రా.పు.28/29)

(చూ॥ కులం, భగవత్ప్రేమ, మతము, రజోగుణము)

ధనంకోసం

కోర్కెల అదుపు కార్యక్రమంలో నాలుగు ప్రధానాంశాలు ఇమిడిపున్నాయి. 1. ధనాన్ని వ్యర్థం చేయవద్దు, 2. ఆహారాన్ని వ్యర్థం చేయవద్దు. 3. కాలాన్ని వ్యర్థం చేయవద్దు 4. నీ శక్తిని, మేధస్సును వృధా చేయవద్దు, ఈ నాలుగింటిలో పొదుపునుపాటించడం ద్వారా దివ్యత్వాన్ని అభివృద్ధి గావించుకొని పరతత్వాన్ని అర్థం చేసుకోవడానికి అస్కారం కలుగుతుందని ఈ ఆశల అదుపు కార్యక్రమాన్ని సూచించాము. అయితే కొంతమంది ధనాన్ని వ్యర్థం చేయకుండా ప్రోగుచేసి, ఏదో ఒక కార్యక్రమానికి అర్పించుకోవటమే దీని అంతరార్థమని భావించి, వారివారి కార్యములందు వ్యయపరుస్తూ కోర్కెల అదుపు కోసం కొంత మిగిలించామని కొంత ధనాన్ని మాత్రమే బ్యాంకులో కడుతున్నారు. ధనాశతో సాయి ఈ సంస్థను ప్రారంభించ లేదు. మీ ఆశలను అరికట్టుకొని వైరాగ్యమార్గంలో దివ్యానందాన్ని అనుభవించాలనే నా ఆశ. కాని, పవిత్రమైన నా భావాన్ని అర్థం చేసుకోకుండా కోర్కెల అదుపు పేర కొంత ధనాన్ని సంస్థకు అర్పించటమే దీని లక్ష్యంగా మీరు భావించారు. ఇది సరైన మార్గంకాదు.

భారతదేశంలో కోర్కెల అదుపు కార్యక్రమం క్రింద ఆశలను అరికట్టుకొనక కేవలం డబ్బును మాత్రం ప్రోగుచేసి సత్యసాయి ట్రస్టుపేర 60 లక్షలు కట్టారు. **ధనాన్ని ఆశించే తుచ్ఛభావం నాలో లేదు. ఈనాడు కాదు, ఏనాడు కూడా నేను ఎవ్వరినీ ఇంత ధనం కావాలని ఆశించిన క్షణంలేదు. నా పవిత్ర కర్మలే ఆ ధనమును సమకూర్చి ఆయా కార్యాలను జరుపుతూ వస్తున్నాయి. నాకు కావలసింది. పవిత్రమైన ప్రేమ తప్ప ఈ ధనం నాకు అక్కరలేదు.** మీ రందరు ఐకమత్యంగా ఉండి దివ్యత్వాన్ని ప్రకటించి ప్రచార ప్రబోధలు సలిపి భారతదేశ ప్రాచీన సంప్రదాయ సంస్కృతులను నిలబెట్టాలి. **జనసేవే జనార్దనసేవ అనే విశాల భావాన్ని పెంచుకోవాలి.** నేను నాది అనే సంకుచిత భావాన్ని త్రుంచివేయాలి. ప్రేమ భావాన్ని పెంచుకొని సంకుచిత భావాన్ని త్రుంచుకొని విశాల హృదయంతో సమాజసేవలో పాల్గొనాలి. **ఈనాడే**

కాదు, ఏనాడు కూడా సత్యసాయి సంస్థలకు ధనంతో సంబంధముండబోదనే నా ఆశ. ధనం సంస్థ పేరును చెడగొడుతుంది.

సత్యసాయి సంస్థ సభ్యులు దేశానికి వెన్నెముకవంటి వారు. కార్యకర్తలు సక్రమమార్గంలో ప్రవర్తించకపోతే సంస్థ అనే వెన్నెముకే విరిగిపోతుంది. సంస్థను పెడమార్గం పట్టించకండి. అన్ని సంస్థలకు ఆదర్శవంతమైన ఈ సత్యసాయి సంస్థను సవ్యమైన భవ్యమైన మార్గంలో ప్రవేశపెట్టి సత్కీర్తిని తెచ్చుకోండి. **ధనానికి సత్యసాయి సంస్థకు ఎట్టి సంబంధము ఉండదు. అట్టి సంబంధం కలిగి ఉన్న సంస్థ సత్యసాయి సంస్థ కానేరదు.** ప్రేమతో ప్రేమ, హృదయంతో హృదయం చేరినప్పుడే సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. ఈనాడు అన్ని రాష్ట్రాల అధ్యక్షులు ఇక్కడ ఉన్నారు. ఏ యే రాష్ట్రంనుండి ఎంతెంత ధనం ప్రోగుచేశారో ఏయే జిల్లానుండి ఎంతెంత భిక్షమెత్తుకున్నారో. ఆ భిక్షపు ధనం 60 లక్షలు తిరిగి మీకే ఇచ్చేస్తున్నాను. మీరే దీనిని ఉపయోగపెట్టుకోండి. ఏ జిల్లానుండి వసూలు చేశారో ఆ జిల్లాలోనే సరైన సేవలు సలిపి దీనులకు దిక్కు లేనివారికి తగిన సహాయం చేయండి, **మిమ్మల్ని నేను కోరేది నిర్మలమైన ప్రేమ మాత్రమే. నిస్వార్థమైన ప్రేమకు మాత్రమే నా చేయిని మీముందు చాపేది. ఇంక దేనికి కూడా చేయి చాపను. నా చేయి ఇవ్వడానికే తప్ప పుచ్చుకోవడాని కెప్పుడూ ముందుకు రాదు.**

సత్యసాయి పేరుతో కొంత ధనాన్ని వసూలు చేసినా అది సత్యసాయికి సంబంధించినదికాదనే సత్యాన్ని మీరు గుర్తించాలి. నేను ఆశించను. ఆశించలేదు. ఆశించబోను, ఈ పవిత్రభావం కూడా నాకొరకు కాదు, లోకకళ్యాణం కొరకు, సత్యసాయి సంస్థల సభ్యులందరు పవిత్ర హృదయాలను అభివృద్ధి పరచుకొని ప్రపంచంలో ప్రవేశించి చేరిన మాలిన్యాన్ని శుభ్రపరచి, దివ్యమైన వాతావరణాన్ని అభివృద్ధి పరచాలి. **మన పని సేవ, సేవ, సేవ, ఇదే ప్రధాన లక్ష్యం.**

(స.సా.డి.85 పు.321/322)

(చూ॥ దుష్ప్రచారములు)

ధనము

ఈ పదిరూపాయలు కాగితమునుంచి నీవు తెలుసుకోవలసిన విషయమొకటి కలదు. ఈ కాగితము అనేక చేతులు మారినది, ఇంకెన్నో చేతులు మారనున్నది. **ధనము నీ చేతికి వస్తుంది. కాని నిలబడదు. కాని నీతి వస్తే నిలబడుతుంది. ధనము వచ్చిపోతుంది; నీతి వచ్చి ప్రవర్థమానమవుతుంది.** చాలా మంది స్వార్థమునకు, చెడుపనులకు ఎంత ధనమునైనా దుర్వినియోగము చేయుటకు వెనుకాడరు. కాని ధనమును సత్కార్యములకు వెచ్చింపవలసివస్తే కడు జాగరూకులై అనేకములైన వంకలు చెబుతారు.

(ప.పు.52)

ధనమును ఎంతైనా సంపాదించవచ్చు; సంపాదించిన ధనాన్ని సద్వినియోగం చేయాలి. అప్పుడే ధనానికి కూడా గౌరవం లభిస్తుంది.

ఈనాడు **మానవుడు అర్థము, అధికారము రెండింటి నిమిత్తమై ప్రాకులాడుతున్నాడు. ఈ రెండూ ఉండవలసినవే, కాని, వీటికి కొంత పరిమితి ఉండాలి.** జగత్తును సస్యశ్యామలము గావించే సముద్రుడైనా తన పరిమితులను మరిచితే అపకీర్తి పాలౌతాడు. దేహానికి మనస్సుకు పుష్టిని, సంతుష్టిని అందించే ఆహారము అమితంగా భుజస్తే అజీర్ణ వ్యాధిని కలిగిస్తుంది.

సర్వ సౌఖ్యంబులు చేకూర్చు ధనమన్న
ఎంత వరకది నీచెంతనుండు
ఘనమైన పదవిని చేకూర్చు ధనమన్న
ఎంత వరకది నీదగ్గరుండు
ఆనందమది ఏదో అందించు ధనమన్న
ఎంతవరకది నీ స్వంతమగును
కష్టములను పోగొట్టి శాంతినిచ్చు ధనమన్న
ఎన్ని కష్టములను తీర్చినది ధనము
శాశ్వతమైన సుఖమును కోరకుండ
ధనము, ధనమంచు జీవితంబు ధారపోసి
ఏమి సాధించినావు నీవీ జగతి యందు?
ఎంత వరకుందువు నీవు? మరియు జగత్తెంతవరకు?

ధనవంతుడు/ధనవంతులు

నేనెవరు? నా కర్తవ్యమేమి యంచు
ప్రశ్న వేసుకో నరుడా! సత్యంబు గోచరించు.

ధనాన్ని ఒక చేతితో సంపాదించాలి. మరొక చేతితో త్యాగం చేయాలి.

పూర్వం పారిస్ నగరంలో ఒక వృద్ధ స్త్రీ ఉండేది. తాను బీద స్త్రీ అయినా, తాను సంపాదించిన ధనంతో రెండు మూడు దుప్పట్లు కొనేది. రాత్రి పూట చలిలో నిద్రించి ఉన్నవారిమీద కప్పేసి వచ్చేది. ఆమె త్యాగ గుణం వల్ల భగవదనుగ్రహం లభించింది. భగవదనుగ్రహం పెరిగినకొద్దీ, త్యాగం కూడా పెరుగుతూ వచ్చింది. బండినిండా దుప్పట్లు వేసుకొనేది. చలిలో నిద్రిస్తున్నవారిపై కప్పి వచ్చేది. ఈ విషయం ఎవరికీ చెప్పేది కాదు. జనులంతా ఈ త్యాగాన్ని గుర్తించారు. ఆమె ఎప్పుడూ తలక్రిందకు వంచుకొని నడిచేది. మీరు ఇంత త్యాగం చేస్తున్నారు. కదా! తల ఎత్తుకొని ఎందుకు తిరగరు? మీకు ఎందుకు ఇంత సిగ్గు? అని అడిగేవారు. ఆమె జవాబు చెప్పేది! తలెత్తుకొని తిరగడానికి నాకు అవమానకరంగా ఉంది. భగవంతుడు నాకు వేయి చేతులతో యిస్తూ ఉంటే, నేను ఒక్క చేతితో దానం చేస్తున్నాను. ఇది చాలా అవమానకరం అనేది. ఇది **గుప్తదానం.**

ఇట్టి గుప్తదానం చేసేవారు భారతదేశంలో కోట్ల కొలదీ ఉంటున్నారు. **జగతిలో పుణ్యపురుషులు లేకున్న జగములెట్లు వెలుగు?**

కనుక ధనాన్ని సంపాదించండి. పది మందికీ దానం చేయండి. పరులసేవయే పరమాత్ముని సేవగా విశ్వసించండి. ఇదే మీరు చేయవలసిన సాధన. ఈ సాధన చేత మీరు ఎంతటి ఆనందా నెంతైనా అనుభవించవచ్చు. అప్పుడే మానవ జన్మ సార్థకమౌతుంది. ధనమే లేకున్న మానవునికి క్షణమైనను గడుచుటకు వీలుకాదు.కాని దీనిని ఒక హద్దులో ఇముడ్చుకోవాలి. ధనము మన పాదములకు ధరించే Boot వంటిది. ఈ Boot మన కాళ్ళకు సరిగ్గా ఉన్నప్పుడే నడవగలము. కొంచెం తక్కువగా ఉన్నా, లేక అధికంగా ఉన్నా నడుచుటకు సాధ్యం కాదు. కనుక ధనం కూడా తక్కువగా ఉండినా సుఖశాంతులతో జీవితమును గడపలేము. అధికంగా ఉన్నా భరించలేము.

ధనమును చేర్చుకొనుట సులభముకాదు. దీనిని ప్రోగుచుసుకొనుటకు ఎన్నియో శ్రమలను అనుభవించ వలసి వస్తుంది. కూడ బెట్టుట కూడ శ్రమతో కూడినది. వ్యయము చేయుట కూడా చాల కష్టమే.

పశువు పెరుగుకొలదీ కొమ్ములు కూడా పెరుగుతూ ఉంటాయి. అదే విధముగనే **ధనవంతులకు ధనము అధికమగు కొలదీ దుఃఖము కూడా అధికమవుతంది. "ధనవంతుని యొక్క దుఃఖము దైవ మెరుగు".**

ధనము వలన సమస్యలను తీర్చుకొనవచ్చునని మానవులు భ్రమిస్తూ ఉంటారు. ధనము చేతనే మానవుని సమస్యలు పరిష్కారం కావు. దీనికి తగిన విధానములో స్వార్థమును త్యజించాలి. ధనము మనతో తెచ్చుకొనినది కాదు.

(దే.యు.పు.70/72)

ధనమెచ్చిన మదమెచ్చును
మదమెచ్చిన దుర్గుణంబు మానక హెచ్చున్
ధనముడిగిన మదముడుగును
మదముడిగిన దుర్గుణంబు మానుర వేమా॥

(ము.ము.పు. 92)

(చూ॥ అన్యాయార్జితము, అస్థిరం, పురుషార్థము, మానవత్వము, విద్య)

ధనవంతుడు/ధనవంతులు

"ఎవరు అపరిమిత కోరికలతో ఆవరించబడి ఉంటారో, వారికే బాధలు, చికాకులు హెచ్చు. ఎవరి కోరికలు పరిమితములో, విపరీతములుకావో, ఎవరుతమకున్న దానితోతృప్తి చెందెదరో, వారినందరిని కోరికలులేని వారుగానే భావించవచ్చునని, ఆధ్యాత్మికముగా వారెంతో ధనవంతులని స్వామి భావము. **వస్తు అపేక్ష కన్న**

ఆధ్యాత్మికాపేక్ష ఎన్నోరెట్లు విలువైనది. వస్తు తృప్తికన్న ఆత్మతృప్తి చాలా విలువైనది.

(శ్రీ.స.లీ. పు. 36)

(చూ॥ లిమిటెడ్ కంపెనీ)

ధన్యతముడు

మేఘములు మింటిపై కూడి మెదలుచుండ
వాటి దాపున విద్యుత్తు వరలునట్లు
విద్యవెనుక జ్ఞానము వెలయువలయు
దాని నార్జించి చదువడే ధన్యతముడు.

(వే.ప్ర.పు.9)

ధన్యమైనది

"అయ్యా! మీ యిద్దరినీ సుగ్రీవుని దగ్గరకు తీసుకొని పోదును. నా భుజములపైన ఎక్కికూర్చోండి" అని, ఎక్కుటకు వీలుగా శరీరమును కుంచించినాడు. రామలక్ష్మణులు, సుందర మందహాసకటాక్షములతో హనుమంతుని ఒకమారువీక్షించి, అతని భుజములపైకి ఎక్కి కూర్చున్నారు. **అతని జన్మము ధన్యమైనది.**

"ధర్శనం పాపనాశనం;
సంభాషణం సంకట నాశనం;
స్పర్శనం కర్మవిమోచనం" కదా!

రామలక్ష్మణులయొక్క సంభాషణంచేత, **హనుమంతుని సంకటం కొంత వరకు శాంతించినది. భగవంతుడైన శ్రీరామునిదేహము సోకిన తక్షణమే, అతని హృదయమున, అనేకవిధములైన సద్భావములు, సదాలోచనలు, సచ్చింతనలు ఉద్భవించి ఉప్పొంగుతూ వచ్చాయి.**

(ఆ.రా. పు. 201/202)

ధన్వంతరి

సముద్రమంథన సమయమున అమృతభాండమును ధరించి, భగవానుడు **ధన్వంతరిగా అవతరించి రోగ** నివారణోపాయములను ప్రజలకునేర్పి **మానవులను చికిత్సకులుగా చేసెను. వారే వైద్యులనియు, భిషగ్వరులనియు, చికిత్సకులనియు, లోకమున ప్రసిద్ధికాంచునట్లు చేసెను.** రాజా ఇంతేకాదు, వైద్యులకు పూర్వము యజ్ఞభాగములిప్పించెను, చూచితివా దైవలీలలు! **హరి యొక్క చిత్రలీలలు హరికే తెలియును. అన్యులకు అర్థము కావు. వూహించుటకు కూడనూ వీలుకాదు,** మానవులు అజ్ఞానవశులగుటచే, వారి వారి బుద్ధి శక్తి సామర్థ్యములను పురస్కరించుకొని వాక్‌వాదములు జరిపి లేని పాపములకు గురియగుదురు. దైవకార్యములను సంశయించక మానవులు వారివారి వూహలకు తగినట్లుగా వాటిని మార్చుకొనక తమ భావములనే ఆ దైవ కార్యములకు తగినట్లు మార్చుకొన్న అట్లు మానవులు దైవానుగ్రహమునును పొందగలరు. కానీ అట్లు చేయరేని అనుగ్రహ పాత్రులు కానేరరు. ఆనందమును అందుకోలేరు.

(భా.వా. పు. 205)

ధన్యుడు/ధన్యులు

(చూ॥ ఆంగీరసుడు, దయ, నీవే నేను - నేనే నీవు, స్వధర్మాచరణ)

ధర

(చూ॥ గోపికలు)

ధరణి

(చూ॥ దారి)

ధర్మము/ధర్మములు

"రామో విగ్రహవాన్ ధర్మ:" ధర్మమే రామస్వరూపమును ధరించి ఈ జగత్తులో ఆవిర్భవించినది. ధర్మమువేరు, రాముడు వేరు కాదు. "రాముడు - ధర్మం" అవినాభావ సంబంధములు, అన్యోన్యాశ్రయములు కలిగి యున్నవి.

(స.సా.జూ. 1989 పు. 142)

ధర్మము/ధర్మములు

భారతీయులకు ప్రధాన గ్రంథము వేదము. **ఈ వేదము మొట్టమొదట బోధించినది "సత్యం వద, ధర్మం చర" సత్యమును పలుకు, ధర్మమును ఆచరించు** దురదుష్టవశాత్తు సత్యమును పలుకటమే లేదు. ధర్మమును పలుకుతున్నారే గానీ ఆచరించటం లేదు. ధర్మమును ఆచరించాలి. **'ధర్మోరక్షతి రక్షితః' ధర్మమే మనలను రక్షించేది.** ధర్మమంటే ఏమిటి? మన ఆచారాలు మన సాంప్రదాయములు మాత్రమే కాదు. **"మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం" ఇదే మానవుని ధర్మము "The Proper study of mankind is man". ఈ మూడింటిని ఏకత్వము గావించాలి. అప్పుడే త్రికరణశుద్ధి ఏర్పడుతుంది. ఆ త్రికరణ శుద్ధియే మన ధర్మము.** ఈనాడు మాటలయందు వేరు, తలంపుల యందు వేరు, క్రియలు మరొకటిగా మారుతూ రావటంచేతనే ధర్మము క్షీణించిపోయింది. ఉపనిషత్తులు చెప్పాయి **"సత్యాన్న ప్రమదితవ్యం". ఎట్లాంటి పరిస్థితులయందైనా సత్యాన్ని వదలవద్దు. "ధర్మాన్న ప్రమది తవ్యం" ధర్మాన్ని వదలి పెట్టవద్దు.** ఎలాంటి పరిస్థితులయందు ప్రాణాపాయము సంభవించినప్పుడైనా ధర్మమును మాత్రము మానరాదు. అదియే సత్యహరిశ్చంద్రుడు సాధించిన వ్రతము. సత్యమునకే విజయమని పవిత్రమైన ఉపనిషత్తులు మానవులకు పలుమారు బోధిస్తూ వచ్చాయి. ఇలాంటి విజయమును సాధించవలసిన వాడు ధర్మాన్ని అనుసరించాలి.

పురాణములు కూడను ఈ సత్య ధర్మములనే ప్రబోధిస్తూ వచ్చాయి. **"సత్యాన్నాస్తి పరోధర్మః"** ధర్మమనేది సత్యముపైన ఆధారపడి ఉంటున్నది. దీనికంటె మించినదిలేదు. భాగవతముకూడా **"పలికి బొంకుట కన్న పాపమున్నె"** అన్నది. మనము చెప్పిన దానిని తప్పి పోవుటకంటె పాపమున్నదా? సత్యమే ప్రధానమని నిరూపించినది. సత్యమే యీ జగత్తును కాపాడుతున్నది. ధర్మము యీసత్యమును ఆశ్రయించినది. సత్యధర్మములు రెండు అవినాభావ సంబంధము అన్యోన్యాశ్రయములు. భారత పుత్రులైన యువతీ యువకులారా ప్రధానమైనది సత్యమార్గము. దానినే దైవస్వరూపముగా విశ్వసించాలి. గౌరవించాలి.

(బృ.త్ర.పు. ౮/౯)

ధర్మమనేది ఒక దేశమునకు ఒక కాలమునకు పరిమితైనది కాదు.

(బృ.త్ర.పు. ౧౦)

మానవుడు తన అహంకారమును తన స్వార్థమును, తన పాశవిక ప్రకృత్తిని తన దేహ దృష్టిని బలిచేసి, విశ్వాత్మమైన పరమాత్మతో సమైక్యమును పొందడమే ధర్మమందురు. సమస్త లౌకిక విషయాల యందు ఔచిత్య భంగము కాని మాటలు, హృదయ ద్రోహము కాని పనులు, సమయ స్ఫూర్తి మార్పులు, స్వార్థ రహితమైన నడకలు, భగవత్ రతిగల భావములు, సత్యానేషణములు - **ఇవియే నిజ ధర్మము.** బ్రహ్మ దృష్టితో చేసి బ్రహ్మైక్యానందస్థితికి దారితీసే ప్రతి నిస్వార్థకర్మకూడా ఒక ధర్మమే! ఇట్టి ప్రతి ధర్మకర్మనూ బ్రహ్మజ్ఞాన మహాధర్మ సముద్రమున సంగమించే ఒక పుణ్య వాహినియే.

(స.సూ. పు. 106)

ధర్మము ఒక దేశమునకు గాని, ఒక కాలమునకుగాని పరిమితమైనది కాదు. ఏ దేశమునైనను, ఏ కాలమునైనను, ధర్మమొక్కటే. దేశము మారినను, కాలము మారినను, ధర్మము మారదు. అది సమయానుకూలముగా సవరింపబడునది కాదు. ధర్మము మానవ జాతి యుత్తమ జీవితమునకు మార్గదర్శకములైన యనేక ముఖ్య సూత్రముల సముదాయము.

(స. వ. పు.1)

వేదమే ధర్మమునకు మూలము. ధర్మమునకు గోవు, బ్రాహ్మణుడు, వేదములు, శాస్త్రములు, పరిశుద్ధత అనునవి యైదును అయిదు నిధులు. ఆ యైదింటిని కాపాడుటకు మంచి వారెపుడును యత్నించుచుందురు. మీరును వాటి విషయమున శ్రద్ధ వహించుచుండవలెను. అవి నశించిన జీవితమే నశించును. జీవితమునకు విలువను

కలిగించు ప్రతి యంశమును నశించును. ధర్మమెక్కడ నుండునో కృష్ణుడక్కడ నుండును. కాబట్టి మీరాయన యనుగ్రహము పొందుటకు ఏపాటి యర్హత కలిగి యున్నారో - మీలో ప్రతి యొక్కరును పరిశీలించు కొనుడు. మీరాయనను చేరువకు తెచ్చుకొందురో, లేక దూరము చేసికొందురో - అది మీలోనే యున్నది.

(స.వ.పు. 10)

అన్ని ధర్మములకు మేటి అయిన, విలువైన ధర్మము మరొకటున్నది. అదే **"నేను"; అనే ప్రజ్ఞాధర్మము. ప్రజ్ఞాధర్మమనగా మనసునందు, శరీరము నందు, చిత్తమునందు, అంతఃకరణమునందు, బుద్ధియందు, సర్వమానవులయందు సమత్వముగా ప్రవహించునది. దీనినే constant integrated awareness అంటారు.** ఇది నేను అనే స్వశక్తితో ప్రవేశించి, ప్రకటించి, వికసించి ప్రవర్ధమానమై ప్రకాశిస్తున్నది. ఇందులో ప్రతివిషయము 'నేను' 'నేను' అని ప్రకాశవంతంగా దేహమును వికాసపరుస్తుంది.

(నే.నే.పు.82)

"ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" ధర్మ ఆచరణ స్థాపన చేశాడు, కృష్ణుడు. ధర్మంచెడేది, నాశనమయ్యేది కాదు. త్రికాల బాహ్యం. మనం దానిని ఆచరణలో అందుకోవటంలేదు.

కృతయుగంలో నాలుగుపాదములు, త్రేతాయుగంలో 3 పాదములు, ద్వాపరంలో 2 పాదములు, కలిలో ఒక్క పాదమే ధర్మం అని ఉపనిషత్తులు చెప్పినాయి. కృతయుగంలో నాలుగుపాదములున్న ధర్మమునకు రామావతారంలో ఒక పాదం పోవడానికి అర్థంఏమిటి? ద్వాపరయుగంలో రెండు పాదములే వుంటే కృష్ణుడువచ్చి కాపాడినదేమిటి? కృష్ణుని ధర్మస్థాపన కృష్ణునితోనే పోయింది. ఒక్కొక్క అవతారంలో ఒక్కొక్క పాదం పోతూనేవుంది. పోయినపాదమేమిటి? స్థాపనచేసినదేమిటి? అని ప్రశ్న పురాణములు సత్యస్వరూపాన్నే అందించాయి. కాని సందిగ్ధావస్థలో ముంచలేదు.

ఒక చిన్న ఉదాహరణ : చిన్నబిడ్డ నడకరానటువంటి స్థితిలో రెండుచేతులు, రెండుకాళ్ళు వుపయోగించి నడవటానికి ప్రయత్నిస్తుంది. అదే ఒకసంవత్సరం దాటిన బిడ్డయితే తల్లిచేతిని ఆధారంగాతీసుకుని రెండుకాళ్ళతో తేలికగా నడవగలుగుతుంది. అదేవిధంగా కృతయుగంలో ధర్మానికి నాలుగుపాదాలు అనే విషయంలో ఏదో ధర్మానికి ఒక స్వరూపాన్ని కల్పించి దానికి 4 పాదాలు అని తలచటంకాదు. ఈ నాలుగుపాదాలు భగవంతునిచేరే మార్గాలు. కృతయుగంలో యజ్ఞయాగాది క్రతువు లాచరించి దైవాన్ని చేరేవారు. అది నడకరాని పసిపాప వంటిది. ఇక త్రేతాయుగం వచ్చేటప్పటికి ధర్మానికి ఒకపాదం పోలేదు. యజ్ఞ యాగాదులేకాక, జపతపాదుల నాధారంగా చేసుకుని నడకసాగించినాడు మానవుడు. ఇది తల్లిచేతిని పట్టుకుని నడిచే బిడ్డవంటిది.

ద్వాపరయుగంలో రెండుపాదాలేవున్నాయి. ఆధ్యాత్మిక మార్గంలో నడక యింకొంచెం తేలికఅయింది. యజ్ఞయాగాది క్రతువులు, జపతప ధ్యానాధుల ఆవశ్యకతలేకుండా ఏవో కొన్నిరకములైన అర్చనలద్వారా భగవత్సాన్నిధ్యాన్ని పొందగలిగారు. ఇక కలిలో ధర్మానికి ఒక పాదమే మిగిలింది. అదేనామస్మరణ కలిలో ఏకొంచెం ఆచరించినా ఫలితం అతిసులువుగా, అతిత్వరితంగా అందుతుంది. కృత, త్రేత, ద్వాపరములకంటె **ఈ కలియుగంలో నామస్మరణద్వారా సునాయాసంగా దైవాన్ని పొందవచ్చు.** ఇది పరుగెత్తడంవంటిది. నడుస్తూవున్నపుడు రెండుపాదాలు భూమిమీద ఆనుతాయి. కాని పరిగెత్తినపుడు ఒక్కపాదమే భూమి మీద అనుతుంది. నడవటంకన్నా పరుగెత్తటం వల్ల గమ్యాన్ని త్వరగా చేరిపోతున్నాం.

(వే.ప్ర.పు.95/97)

ధర్మము 'ధృ' అను సంస్కృత ధాతువు నుండి వచ్చినది. ధర్మమనగా ధరించునదని అర్థము. దేశమును, దేహమును కాపాడుటకై అందానందముల ననుగ్రహించుటకే ధర్మమను వస్త్రము భారత దేశమునకు భగవంతుడు కప్పిన పవిత్ర పీతాంబరము వంటిదే. వస్త్రము మాన

ధర్మము/ధర్మములు

మర్యాదలను కాపాడుటకే కాక శీతల బాధలనుండి రక్షించుటకేకాక అందమును కూడనూ అందించుచున్నది. మన దేహమునకు మర్యాద, మానమును కాపాడు నట్టిదే ధర్మము. దేశ గౌరవముకూడనూ భగవత్ సంకల్పమయిన ధర్మధారణతో నిలబెట్టుకొనవలెనను సంకల్పమే ఈ ధర్మముయొక్క స్థితి. దేశమునకేకాక ఈ లోకమున సృష్టించిన ఒక్కొక్క వస్తువు ఒ క్కొక్క ధర్మమను వస్త్రముతో కప్పబడినది . ధర్మమనునది సమిష్టి స్వరూపమేకాక వ్యష్టిస్వరూపమును కూడా కలిగియున్నది. సృష్టికి మూలాధారమయిన **పంచభూతములను** విచారించుడు; నీటికి చలనశక్తి, చలువశక్తి సహజ ధర్మము, అగ్నికి దహనశక్తి, వేడి, ఇవి ధర్మములు. అట్లే ఒక్కొక్క దానిని ఒక్కొక్క ధర్మము. మానవులకు మానవత్వమూ, పశువులకు పశుత్వమూ, ఇవి వాటి వాటి శక్తులను కోల్పోకుండా రక్షించునట్టి ధర్మకవచములై యుండును. అగ్నికి దహన శక్తి, వేడిమి లేకుండిన దానిని అగ్ని అని ఎవరైనా చెప్పుదురా! అగ్నికి తగిన స్వరూప స్వభావములు దాని ధర్మమును ప్రదర్శించును. అట్టి స్వరూప స్వభావములు నశించిన అగ్ని చచ్చినదనే అర్థము. అందువలననే. అగ్ని తన దహన శక్తిని కోల్పోవుటచే ప్రాణము శవస్వరూపమయిన బొగ్గుగా తయారయినది.

(గీత పు. 53/54)

భగవద్గీత ప్రథమాధ్యాయమున ప్రథమ శ్లోకమున "ధర్మ క్షేత్రే కురు క్షేత్రే..." అను వాక్యము కానవచ్చును. ఇందులో ధర్మ శబ్దము ప్రథమమున ప్రయోగింప బడినది. గీత యొక్క పదునెనిమిదవ అధ్యాయమున చిట్టచివర "యత్ర యోగేశ్వరః కృష్ణో..." అను శ్లోకమున ఇదే ధర్మ శబ్దము క్లుప్తముగా బోధింప బడినది. కావున **గీతాభి ప్రాయము "ధర్మమును స్మరింపుడు, ధర్మమును ఆచరింపుడు"** అనునదే యని స్పష్టమగుచున్నది. ధర్మ శబ్ద మెంత గంభీరమో చూడుడు.

(గీ. పు. 3)

ధర్మమునకు నాశములేదు. ధర్మమునకు క్షీణత్వము లేదు. అయితే ధర్మస్థాపన అనుటలో అంతరార్థమున్నది. ధర్మాచరణ క్షీణిస్తుంది. ధర్మము ఏనాటికి క్షీణించేది కాదు.

(ని.పు.18)

"రామో విగ్రహవాన్ ధర్మః" ధర్మము, రాముడు వేరువేరు కాదు. రాముడే ధర్మము, రావణుడే అధర్మము. ధర్మాధర్మముల చదరంగమే ఈ జీవితము. అయితే ధర్మము రెండు రకములు.

1. స్వధర్మము 2. పరధర్మము. స్వధర్మమంటే ఏమిటి? క్షత్రియధర్మము, బ్రాహ్మణధర్మము, శూద్రధర్మము మున్నగునవి కాదు. స్వ - అనగా ఆత్మ. కనుక ఆత్మధర్మమే స్వధర్మము. దేహధర్మమే పరధర్మము.

(స.సా.మే.97 పు.133/134)

జగత్తును ధరించునదే ధర్మము. 'యతో ధర్మస్తతో జయః' ఎక్కడ ధర్మమో అక్కడ విజయము. "ధర్మో రక్షతి రక్షితః" ధర్మమును రక్షించినప్పుడే ధర్మము మనలను రక్షిస్తుంది. 'ధర్మం చర' ధర్మమునే ఆచరించు. 'సత్యాన్నాస్తి పరో ధర్మః' ఇట్టి ధర్మమునకు సత్యమే ఆధారము. సూర్యుని రశ్మియందు ఏడు రంగులు లీనమైనట్లుగా **సమాజశ్రేయస్సునకై యేడు విధములైన ధర్మములు నియమించవలసి వచ్చింది. మొదటిది సత్యము, రెండవది శీలము, మూడవది ధర్మము, నాల్గవది దమము, ఐదవది తపస్సు, ఆరవది త్యాగము, ఏడవది అహింస.** ఇవన్నియు సమాజ రక్షణకై సామాజిక శ్రేయస్సునకై నియమించినట్టివి.

(శ్రీ.గీ.పు.224)

మన కాలేజి చిహ్నంలో 'ధర్మోరక్షతి రక్షితః' ఉంది. ధర్మాన్ని రక్షిస్తే అది నిన్ను రక్షిస్తుంది. ధర్మాన్ని హింసిస్తే ఆ ధర్మమే నిన్ను హింసిస్తుంది. అదే విధముగా ఆత్మ విశ్వాసమే పూర్ణముగా ఉన్నపుడు అదే నిన్ను రక్షిస్తుంది. ఆ self-confidence మనం develop చేసుకోవాలి. ఆ self-confidence కనిపించేది కాదు. ఇక్కడ యింత పెద్ద భవనము ఉంటున్నది పెద్ద భవనమునకు పునాది ఎంతో వేసినాము. పునాదిలేక యింత పెద్ద భవనం యిక్కడ

నిలవటానికి వీలుకాదు. కానీ పునాది కనిపించటంలేదు. ఆ పునాదే self-confidence పైన కనిపించే భవనం self-confidence దీనికి పై roof self-sacrifice అప్పుడు self-realisation అనే సుఖాన్ని పొందుతున్నాం. కాబట్టి self-realisation కు self-sacrifice కావాలి. self-sacrifice కు self-satisfaction పొందాలి. self-satisfaction ఉండటానికి self-confidence ఉండాలి. కనుక self-confidence develop చేసుకోవాలి.

ఈనాటి మానవుడు మనస్సును balance లేకుండా చేసుకుంటున్నాడు. **ప్రతిదానికి నాలుగు స్థాయిలుంటున్నాయి. పైన knowledge ఉంటున్నది. క్రింద skill ఉంటున్నది. మూడవది balance నాల్గవది insight. ఇవన్ని సరియైన స్థితిలో ఉండాలి. knowledge కావలసినంత ఉంటున్నది. knowledge ని skill చేసే balance సక్రమంగా ఉంటుంది. ఇక్కడే మానవుని పొరపాటు. knowledge ని skill చేయటం లేదు. kill చేస్తున్నాడు. దానివల్ల balance తప్పిపోతున్నది. Balance తప్పిపోవటం చేత insight పోయి out-sight అవుతున్నది. మన దృష్టి బహిర్ముఖమవుతున్నది.**

మొట్టమొదట తెలివి తేటలను సక్రమమైన మార్గములో పెట్టుకోవాలి. మన తెలివి తేటలను misuse చేస్తున్నాము. తప్పుడు మార్గములో అనుభవిస్తున్నాము. ఇది సరియైనది కాదు. గొప్ప తెలివితేటలున్నాయని అహంకారం చేత, దేహాత్మ భావంచేత చెడగొట్టుకుంటున్నాం. ఆ knowledge లో కూడా ఉంటున్నది. ఆత్మతత్త్వము. ఆ knowledge లో కూడా energy ఉంటున్నది. ఆ energy నే ఆత్మ. ఈ విధంగా విచారణ చేస్తే ఆత్మ ఇట్టిది అట్టిదనికాదు. సైంటిస్టులు matter and energy అన్నారు. నా ఉద్దేశ్యములో matter అనేదే లేదు. అంతా energy యే! matter, energy గా energy matter గా మారుతున్నది. నీ దృష్టిలో రెండుగా కనిపిస్తున్నాయి. గానీ ఆత్మ దృష్టిలో ఒక్కటే. ఇదే 'ఏకం సత్ విప్రాః బహుధాః వదంతి'.

(ద.య.స.స.97 పు.94/96)

నీ శక్తికి మించకుండా బీదవారికి కావలసినవి సమకూర్చటానికి ప్రయత్నించు. **అది నీ ధర్మము.**

(సా॥ పు. 625)

(చూ॥ అంతరార్ధము, అరిషడ్వర్గములు, అవతార లక్షణము, కర్తవ్యధర్మము, దేహము, పతివ్రత ధర్మము, పరమార్థము, ప్రధానమైన అస్త్రము, బుద్ధునిబోధ, భగవంతుడు, మహాభారతము, శ్రద్ధ, సత్యం, సూత్రము)

ధర్మకర్తలు

మీ ఆస్తులకూ, సంపదలకూ యాజమాన్యం ఈశ్వరునిది. ఆయన పక్షాన వ్యవహరించే ధర్మకర్తలు మీరు. అదే విధంగా కుటుంబమునకు కూడా **ధర్మకర్తలుగా** వ్యవహరించి మీ యింటిలోనివారిని ప్రేమతో సాకుతూ మార్గదర్శకులు కావలెను. ఆ విధంగా **సంసార బాధ్యతలు కూడా పవిత్రంగా చేసుకుంటూ కుటుంబ నిర్వహణమును ఆధ్యాత్మిక పురోగతి సాధనంగా మార్చుకోవాలి.**

(వ.1963 పు.230)

ధర్మక్షేత్రము

ధర్మక్షేత్రమునకును - కురుక్షేత్రమునకు నడుమ యుద్ధమెప్పుడును ఉండునదే. (ధర్మక్షేత్రం = ధర్మం. కురుక్షేత్రం = అధర్మము) - అధర్మమెంత బలవత్తరముగా నున్నట్లు కనుపించినను, ఆ పక్షమున యాదవ బలమంతయు చేరియున్నను, కృష్ణుడు రథసారధిగా నున్నంతవరకును విజయము ధర్మయోధులదే.

(స.వ. పు. 10/11)

(చూ॥ చిహ్నము)

ధర్మతత్త్వము

నేడు ఎంతో మంది గొప్ప విద్యావంతులు, శాస్త్ర వాసన వేదవాసన పాండిత్యములు కలవారును, వాటియందలి విశ్వాసములను కోల్పయి, ధర్మములను ఆదరించక,

ధర్మత్రయము

విశ్వాసహీనులై ధర్మమును ఆచరించక, లోకభీతిచేతను, నవీన విద్యల సాంప్రదాయము చేతను, మధ్య మధ్య తమకుతోచిన కుయుక్తులచేతను, సనాతన ధర్మ సాంప్రదాయమైన ఏకాదశ వ్రతమును కూడను (అనగా ఉపవాసమును కూడ) స్నాన, సంధ్య, ఉపవాసములు ఆరోగ్యము కోసమేనని, కర్పూర హారతులు, వాని జ్వాల, ధూమము ఊపిరితిత్తులకు జబ్బు అనియు, ప్రాణాయామములు జీర్ణరోగ హరములనియు, తీర్థయాత్రలు, పుణ్యనదీ స్నానములు ఇత్యాదివన్నియూ, లోకానుభవం, కలుగడం కోసమనియూ, దానధర్మములు పేరు ప్రతిష్టలకనియు, ఇంకను అనేక మంది అనేక విధముల పవిత్రకార్యములను అపవిత్రభావములలోనికి దింపుచున్నారు.

అట్టివారు లోకవంచకులు. ధర్మతత్త్వము పాలిటి దానవులు. ఇట్టివారు మనుధర్మమును విచారించిన కొంత బోధపడగలదు.

"ఆర్షం ధర్మోపదేశం చ వేదశాస్త్రా విరోధినా
యస్తర్కే ణానుసంధత్తే స ధర్మం వేద, నేతరః"

అన్నాడు మనువు. అనగా వేదమూ, ధర్మశాస్త్రమూ ఈ రెండింటినీ వేద శాస్త్రములకు విరోధముకాని తర్కములతో ఎవరు విమర్శిస్తున్నాడో వాడే ధర్మమెరుగగలడు. కానీ యితరు లెరుగజాలరు. దీని అంతర్ధామేమన ఏయూహ, వేదశాస్త్రములకు విరోధముగా నుండదో, ఆ దానినే మనువు గ్రహించినాడు కానీ, వేద శాస్త్రములు తర్కమూలమని తెలుపలేదు. లేనిపోని శుష్కతర్కముల వలన ప్రయోజనమేమియూ లేదు, రాదు. చాలా మంది ఇప్పటి కాలమున హేతువాదము నాశ్రయించి, తాము అధర్మాచరణ గావిస్తూ, ధర్మాచరణ తత్పరులను కూడా హేతువాదములుచేసే ధర్మదూరులను గావించుచున్నారు.

(ధ.వా. పు. 47, 48)

(చూ॥ చదువు)

ధర్మత్రయము

(చూ॥ అయోధ్య, రామకథ)

ధర్మదీపము

(చూ॥ దారి)

ధర్మనాశనము

(చూ॥ కర్తవ్యము)

ధర్మపత్ని

(చూ॥ గృహలక్ష్మి, ప్రకృతి)

ధర్మపథము

ఎట్టి కర్మము తన యందు పట్టుకొనక,
దైవమందున నిప్పి, తాధర్మపథము
తప్పకుండగ చేసిన - ఎప్పుడైన
ప్రాణికంటదు । సుఖదుఃఖ ఫలమనేది ।

(సా. పు. 186)

పరులు **దూషింప నీవునూ వారివలెనే**
తిరిగి దూషింప నీదు అధిక్యతేమి?
ఏది తప్పని నీవు ఎరిగినావో
దాని చేయక యుండుటే **ధర్మపథము.**

(స.సా.డి.85పు.317)

ధర్మబలము

మొసలికి నీటిలో బలముండునట్లు ధర్మమునకు ఆచరణయందే బలము కానీ చెప్పుటయందు వాటికి తగిన బలము వుండదు. సత్యమునకు చెప్పుటయందే బలము కానీ ఆచరించుటలో అంత బలము వుండదు. బలమనగా ఇక్కడ రెండు విధములైన బలములు కలవు: పశుబలము, ధర్మబలము. మానవునకు **ధర్మబలము బలము** కాని పశుబలము బలమనిపించుకొనదు. భీముడున్నాడు, అతని బలము కేవలము దేహబలము మాత్రమే. అందువలన అతని బలము పశుబలమనే భావించవలెను. ప్రక్కన ధర్మజుడుండుటచే అతని బలము

ధర్మబలమైనది. ధర్మజుడు ప్రక్కన ఉన్నంతవరకూ భీముని బలము ధర్మబలమేకాని పశుబలము కాదు. ధర్మ బలమువలననే పాండవులు రక్షింపబడిరి. కాని కేవలము పశుబలమే ఉండియుండిన పాండవులు ప్రారంభములోనే పరాభవమొంది యుండెడివారు. ధర్మజుడులేని పాండవుల గతి యెన్ని బలములుండీ యేమాయెడిదో యోచింపుడు! **కౌరవులకు సర్వబలము లుండిననూ నశించుటకు కారణమేమి? ధర్మబలము లేదు.** కనుకనే వారి సర్వబలములూ పశుబలములై పోయెను. **యేనాడు ధర్మబలమును ధర్మజుడూ భీముడూ అడవులపాలై పోయిరో ఆనాడే కౌరవ రాజ్యములో అధర్మము ప్రవేశించెను.** కనుక ఇప్పుడు అడవులందున్న ధర్మబలాలను గ్రామాదులకు జేర్చవలెను. అప్పుడే లోకము సుభిక్షమై శాంతి సంపదలభివృద్ధి చెందగలవు. అధర్మ పరిపాలన బారి నుండి తప్పించుకొని ధర్మపరిపాలనలో మనము ప్రవేశము కావలెను. పంట పైరును రక్షించుటకే కలుపులను తీసివేయు ప్రయత్నము అవసరము కాని, పనికిరాని గడ్డిపైరులు మొలిపించుటకు ఏ ప్రయత్నమూ అక్కర లేదు. అటులనే ఇప్పుడు పంటపైరైన సహజ ధర్మమును ఆచరణలోనికి తెప్పించుటకే, సర్వ ప్రయత్నములూ కావలెను.

(గీ. పు. 55/56)

ధర్మమే మూలము

సకల పురుషార్థములకూ ధర్మమే మూలము, ధర్మము సత్యము మీదనే నిలిచి యున్నది. సత్యములేక ధర్మము నిలువజాలదు, సత్యధర్మములు రెండునూ అవినాభావ సంబంధము కలవి. పితృవాక్య పరిపాలనచే నాకు ఇప్పుడు సత్యధర్మములు రెండునూ సమకూరుతున్నవి. తల్లికి కానీ తండ్రికి కానీ పెద్దలయిన గురువులకుకానీ మాట యిచ్చిన తరువాత **ధార్మికుడైనవాడు ఎవడునూ తప్పడు, తప్పకూడదు. అందువలన పితృ ఆజ్ఞను నేను అతిక్రమించను. నన్ను ఆజ్ఞాపించినది కైకేయి కాదు, పిత్రాజ్ఞను ఆమె నాకు అందించినది. అట్లు అందించుట అతని సన్నిధి యందే కనుక దానిని శిరసావహించవలెను.**

(రా. ర. వా. మొ. పు. 222/223)

ధర్మయుద్ధము

క్షేత్రమనగా నేమియో యోచించితివా? **దుఃఖమని, దాని నుండి ప్రజాకోటిని రక్షించే వానినే క్షత్రియుడని అందురు.** ఇట్టి ధర్మ యుద్ధము యెట్టి పుణ్యాత్ములకో లభించును. కానీ అది సామాన్యము కాదు! అందులోనా, క్షత్రియునికే ఈ పుణ్యము దొరికినది. ధర్మపరులను కాపాడుటలో, అధర్మపరులను హతమార్చుటలో యెంతటి ఉపకారమైన పుణ్యము కలదో యోచించుకో! **లోకములో శాంతి సౌఖ్యాన్ని నెలకొలుపుటకు చేయు యుద్ధమునే ధర్మ యుద్ధమని అందురు.**

(గీ. పు. 33)

ధర్మరక్షణ

(చూ॥ అవతారము, ధర్మోద్ధరణ, స్త్రీ హత్య)

ధర్మరాజు

ధర్మరాజు స్వర్గానికి పోయేదారిలో ఒక కుక్క అతనిని అనుసరించినది. ద్రౌపది పోయింది, అర్జునుడు పోయినాడు, భీముడూ పోయినాడు, నకుల సహదేవులు కూడా పోయారు. ఎవరెవరి స్థానములలో వారు వారి ప్రాణములు వదలుతూ పోయారు. కట్టకడపటికి ఆ కుక్క మాత్రమే ధర్మజుని చివరివరకు అనుసరించింది. స్వర్గమునకు పోయే ముందు దైవదూతలు అక్కడకు చేరి ధర్మజా! నీవు మాత్రమే స్వర్గానికి పో! అని చెప్పారు. అపుడు ధర్మరాజు ఇంతకాలము నన్ను అనుసరించి, జంటగా ఉంటూవస్తున్నది ఈ కుక్కయే కానీ, కట్టుకున్న భార్యా నావెంట రాలేదు. కడకు సోదరులూ రాలేక పోయారు. ఈ కుక్క మాత్రం నన్ను ఆశ్రయిస్తూ వచ్చింది. ఇది నన్ను ఆశ్రయించింది కాబట్టి మొదలు దానికి స్థానం

ధర్మవిరుద్ధము

ఇవ్వండి. తరువాత నేను వస్తాను. అని చెప్పాడు. ధర్మజుడనగా నీతినిజాయితీలు అనుసరించేవాడు. నమ్మినవారిని మోసము చేయకూడదు. నమ్మి సహాయం చేసినవారికి ద్రోహం చేయకూడదు.

(దీ.పు.8)

(చూ॥ అర్జునుడు, దుర్గుణములు, దేశసంరక్షణ, పాపం, బలహీనుడు, భక్తుని లక్షణం)

ధర్మవిరుద్ధము

(చూ॥ సర్వము భగవంతుడే!)

ధర్మశాస్త్రము

ధర్మశాస్త్రము విద్యార్థి, గృహస్థ ఆర్జకుడు, యజమాని, సేవకుడు, సాధకుడు, సన్యాసి మొదలగు అన్ని తరగతులవారి నడవళ్ళును, వారి వారి యంతస్తులకు తగు విధమున నిర్ణయించు చట్టము. ప్రజలు ఆ చట్టమును పాటింపక తామీలోకమునకు వచ్చిన ప్రధాన ప్రయోజనమును మరచి తమ విధి విహితములైన కృత్యములు చెరిచి తప్పు దారులు పట్టినప్పుడు వారిని మరల మంచి మార్గమునకు మరలించుటకై భగవంతుడవతరించుచుండును. అనగా, మానవ రూపమున వచ్చి చెదరిపోయిన ధర్మమును చక్క బరచునని భావము. భగవద్గీతలో **"ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అన్న భగవద్వాక్యమునకర్థమిదే.**

(సా.వ. పు. 2)

ధర్మశిక్షణ

(చూ॥ సంతోషభిక్ష)

ధర్మసంస్థాపన

(చూ॥ చాతుర్వర్ణ్యవ్యవస్థ, ధర్మోద్ధరణ, రాక్షసత్వం)

ధర్మసాధన

(చూ॥ జ్ఞాన యజ్ఞము)

ధర్మస్థాపన

"ఒకే భగవంతుడు సృష్టి తంత్రమును నడుపుటకు వీలగునట్లు తన శక్తిని, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను మూడు రూపములుగ విభజించెను. **తత్వతః వీనిలో యే భేదమూలేదు. ఆ ప్రభువే సృష్టి చేయునపుడు బ్రహ్మ అనియు, పాలన చేయునపుడు విష్ణువనియు, సంహార సమయమున శివుడనియు, తన కార్యముల కొరకు దేవుడే విశేషావసరము లందు విశిష్టరూపమునందునపుడు అవతారమని పిలువబడును.** నిజముగా యోచించిన, మన్వాది ప్రజాపతులు సృష్టిని వృద్ధి చేయుటకై వచ్చిన బ్రహ్మ అవతారములనే చెప్పవచ్చును. భగవానుని సంకల్పముచేతనే సృష్టిజరిగెను. కనుక సృష్టిలోని మునులు, ఋషులు, మనుజులు, దానవులు, వీరందరూ విష్ణుని అవతారములని చెప్పుటలో తప్పేమియూ లేదు. జీవులెట్లు అనంతములో, అట్లే అవతారములు కూడనూ అనంతములు. అయితే, యుగావతారముల కథలే, పవిత్ర చరిత్రలు, మిగిలనవన్నియునూ జంజాటములే. **సమస్త అవతారములకూ కారణము ధర్మస్థాపనమే.**

(భా.వా. పు.160/161)

ధర్మాచరణ అభివృద్ధి అయిన అధర్మము తనంతటతానే నశించును. దానికి ప్రత్యేకించి ప్రయత్నము అవసరము లేదు. కనుక ఇప్పుడు, **ధర్మాచరణను స్థాపించుటే ధర్మస్థాపన.** సూర్యుడస్తమించినాడన్న యెంత అర్థమో, ధర్మము నశించినదన్ననూ అంతే అర్థము. సూర్యునకు అస్తమించుటనునది లేదు. కనుపించనంత మాత్రాన అస్తమించెనని తలంతురా? ధర్మము కూడనూ అట్టిదే. కనుపించకుండినంతమాత్రమున నశించినదని తలంతురు కానీ అది నశించునది కాదు. నశించునది సత్యమెట్లగును? **ధర్మము సత్యముతో చేరినది కనుక అది నశించునది**

కాదు. అట్టి సత్యమైన ధర్మము మరుగునపడి కనుపించక అదృశ్యమైన, దానిని దృశ్యమునకు తెప్పించుటే ధర్మస్థాపన.

(గీ.పు.56)

ధర్మసూక్ష్మము

సీతాపహరణం ఎన్నో రహస్యాలను వెల్లడి చేస్తుంది. ఇట్టి సూక్ష్మమైన రహస్యాలను కలిగినట్టిదే అవతార తత్వం ఇది పండితులకు పారాయణ చేసేవారికి అంత తేలికగా బోధపడేది కాదు. ధనకనక వస్తు వాహనాదులను, చీనాంబరములను, దివ్యాభరణాలను వదలిపెట్టి సీత రాముణ్ణి అనుసరించింది. అంటే కామము (కోరిక) ను జయించినది కనుకనే రామునికి దగ్గరైంది కానీ బంగారు లేడిని కోరుకున్నప్పుడు సీత కామునికి దగ్గరైంది. కనుకనే రామునికి దూరమైంది. **రాముడున్నచోట కాముడుండడు. కాముడున్నచోట రాముడుండడు.** ఇక్కడ మరొక ధర్మసూక్ష్మమున్నది. రాముడు బంగారు లేడి నిమిత్తమై బయలుదేరినప్పుడు లక్ష్మణుణ్ణి సీతకు కాపలాగా ఉండమని, ఎట్టి పరిస్థితిలోను సీతను వదలిపెట్టి వెళ్ళవద్దనీ ఆజ్ఞాపించాడు. కానీ లక్ష్మణుడు సీత దూషణలను వినలేక రామాజ్ఞను ధిక్కరించాడు. అనగా తన కర్తవ్యాన్ని విస్మరించాడు. కనుకనే సీతాపహరణం జరిగింది. దీని కంతటికీ తానే కారణమనీ, తాను రామాజ్ఞను ఉల్లంఘించడంవల్లనే ఈ అనర్థం జరిగిందనీ లక్ష్మణుడు చివరి వరకు చింతిస్తూనే ఉన్నాడు.

ఇక్కడ భగవంతుని సంకల్పం కూడా కనిపిస్తుంది. అంతా ఆయన మాస్టర్ ప్లాన్ ప్రకారమే జరుగుతుంది. విశ్వామిత్రుని యాగ సంరక్షణ సమయంలో రాముడు సుబాహుణ్ణి వధించి మారీచుణ్ణి వదలిపెట్టాడు. ఆ మారీచుడే బంగారు లేడి రూపంలో వచ్చాడు. అతడి ద్వారా సీతాపహరణం, రామరావణ యుద్ధం జరగవలసి ఉంది. కాబట్టే ఆనాడు ఆతణ్ణి వదలిపెట్టడం జరిగింది. దీనికి పూర్వం సీతారాములు భరద్వాజ మహర్షి ఆశ్రమాన్ని

ధర్మసూక్ష్మము

సందర్శించినప్పుడు ఆయన వారికి ఆర్ఘ్యపాద్యముల నిడి, ఆతిథ్యమునొసగి, ముందు ప్రయాణానికి సిద్ధం చేసి వారిని సాగనంపినాడు. ఎందుకంటే వారు భరద్వాజాశ్రమంలోనే ఉండినట్లయితే సీతాపహరణం జరగదు. రావణ వధ అన్న ప్రశ్నే ఉదయించదు. కనుక శ్రీరాముడు శ్రీమన్నారాయణుడని తెలిసినప్పటికీ రాక్షసవధ నిమిత్తమై భరద్వాజుడు వారిని తదుపరి ప్రయాణమునకు సిద్ధం చేసినాడు. **ఇది భగవంతుని మాస్టర్ ప్లాన్! ఈ ప్రకారం రామాయణంలోని అన్ని ఘట్టాలూ మానవతా విలువలను ధర్మాలను సూచిస్తూ ఆధ్యాత్మిక తత్వాన్ని అవతార రహస్యాన్ని నిరూపిస్తాయి.**

(స.సా.జూ.98 పు.193/194)

ధర్మసూత్రములు

ధర్మసూత్రములు సనాతనములనబడును. కారణమేమనగా అవి యేనాడు పుట్టినవో యెవ్వరు నెరుగరు. మరియు వాటికి కర్తయెవరో గుర్తించినవారు లేరు. పక్షపాత రహితులును, పరిశుద్ధ బుద్ధులును నయిన ఋషులు ఆ సూత్రములను జ్ఞాన దృష్టిచేత దర్శించి లోకకళ్యాణము కొరకు ప్రకాశితములు కావించినారు. అవి ప్రపంచ ప్రవృత్తికి మూలాధారములు. మరియు శాశ్వతములు. అవి తాత్కాలికావేశములకు ప్రాధాన్యమియ్యవు.

(స.వ. పు. 1)

ధర్మాచరణ

"న యక్షంతి, న హోష్యంతి, హేతువాద విమోహితాః
నీచకర్మ కరిష్యంతి, హేతువాద విమోహితాఃll"

అనగా, **హేతువాదము లాశ్రయించిన వారు దేవతా రూపములను పూజించరు. అగ్నులందు హోమము చేయరు. నీచకార్యాచరణలందు ప్రవేశింతురు. అని మహాభారతమున అరణ్య పర్వమునందు, కవి వర్ణనలో చెప్పబడెను.**

వేయేటికి? **ధర్మాచారమువల్లనే సూర్యచంద్రాదులు తమ**

ధర్మాష్టకము

గతులు, తప్పకుండ, సంచరించుచున్నారు. సమస్త దేవతలు తమ విధులు నిర్వహించుచున్నారు. పంచభూతములు ధర్మాధారంగానే వెలయుచున్నవి. ధర్మమునుండి తాను ప్రమాదమును పొందక, ఇతరులను, ప్రమాదములకు గురిచేయక, ఉండవలెను. ధర్మధ్వజ కాంతి యావత్ ప్రపంచమంతట కళను చిమ్మవలెను. తర్కములకు చోటివ్వక, బుట్టలను పాడు చేసుకొనక, యథార్థ ఆత్మతత్త్వమును విశ్వసించి, దాని మూలమున, ఆధారమున, ఆచార ధర్మములను అనుష్టానము నందు, నిత్య కృత్యములతో లీనమొనర్చి, ఆనందమును అనుభవించుట అత్యవసరము.

(ధ. వా. పు. 47)

(చూ॥ ధర్మస్థాపన, సమానులే)

ధర్మాష్టకము

(చూ॥ మమకారము)

ధర్మోద్ధరణ

ధర్మోద్ధరణములో మరొక సూక్ష్మమున్నది. ఏమన తనకు ప్రాణాపాయస్థితి సంభవించిననూ తన కర్తవ్య ధర్మమును వీడకుండుటే సాధుశబ్దమునకు మరొక అర్థము. **అట్టి సాదు సత్ పురుషులను హింసించుచు త్రికరణములా శాస్త్ర విరుద్ధమగు చర్యలను ఆచరించుచుండువారే దుష్టులు.** శాస్త్రవిహితమగు ధర్మములు స్వయముగా తానాచరించుచూ ధర్మముయొక్క విశిష్టతను, ప్రభావమును లోకమునకు తెలుపుచూ, ప్రకటించుటయే కాక వేద శాస్త్రములందూ దైవముయందూ అవతారము లందూ పరలోకమునందూ పరమపురుషులయందూ శ్రద్ధాభక్తులు కలిగించునట్లునూ లోకులు సదాచార నిష్టాసంపన్నులగునట్లు మార్చుటే **ధర్మసంస్థాపన మనబడును. ధర్మరక్షణ మనబడును. ధర్మోద్ధరణమన బడును.** తాను చేయు సర్వ కర్మలూ ధర్మసంస్థాపన కొరకేనని భావించి స్వార్థ ఉపయోగమునకు కాదనియూ ఈ రహస్యమును తెలిసికొనిన వారికి తిరిగి పుట్టుక పుండదనియూ వారు తననే పొందుదురనియూ కృష్ణపరమాత్మ తెలిపెను.

(గీ.పు.64/65)

(చూ॥ అవతారము)

ధారణ

మనసును ఒక వస్తువుపై నిలుపుట. దీనిని యోగ శాస్త్రమునందు ధారణ యందురు. మనస్సు, మనోవృత్తులూ ఒక వస్తువుపై కదలక మెదలక కేంద్రీకరించిన స్థితి ధారణ అనబడును. ధారణ నుండియే ధ్యానము కుదురును. ధారణయొక్క ముఖ్య లక్షణము అచంచలత్వము. దాని శక్తి, చంచలత్వమును నశింప జేయుట. దాని రూపము కదలిక ఉండుట. ఆనందమే దాని కారణము.

(ధ్యా. వా. పు. 89)

ధీమంతుడు

కఠోపనిషత్తు శరీరమనే రథమునకు ఇంద్రియములు అశ్వములవంటివని వర్ణించినది. **ఇంద్రియములకు అశ్వములని పేరు** పెట్టుటలో అంతరార్థము ఏమిటి? **అశ్వమనగా నిరంతరము చలించే స్వభావము గలది.** అందరకు తెలిసినవిషయమే. గుఱ్ఱము నిద్రించు చుండిన మేల్కొని యుండిన పరుగెత్తుచుండిన నిల్చునివుండిన తన దేహమునందు యేదో ఒక అంగము కదిలిస్తూనే వుంటుంది. తోక తప్పితే కాలో కాలు తప్పితే ముక్కో, ముక్కు తప్పితే నోరో యేదో ఒకటి కదిలిస్తూనే వుంటుంది. **చలన స్వభావము కలిగినది కనుకనే దీనికి అశ్వము అని పేరు వచ్చినది.** అదే విధముగా **రావి వృక్షముగాలి లేకపోయినా దాని ఆకులు ఎప్పుడూ ఆడుతూనే వుంటాయి. కనుకనే దానికి అశ్వత్థ వృక్షమని పేరు.** ప్రాచీన రాజులు అశ్వమేధయాగమని ఒక యాగము సలిపేవారు. **అశ్వ- మేధ- యీ రెండు పదముల**

అంతరార్థము గుర్తించినప్పుడు అశ్వమేధమనేది ఏమిటో మనకు సుస్పష్టముగా అర్థమవుతుంది. మేధ అనగా బుద్ధి. అశ్వమనగా చలించేది. అశ్వమేధమనగా చలించే బుద్ధి ఈ చలించే బుద్ధికి ప్రతిబింబమే అశ్వము. అశ్వమేధయాగమునందు అశ్వమును ఎవరు పట్టగలరో వారే ధీమంతులు. "కస్యధీరః" అని ప్రశ్నించింది భగవద్గీత. ఎవరుదీనిని పట్టెవారు? ఎవరు దీనిని అణగద్రొక్కేవారు? ఎవరు దీనిని నిగ్రహించేవారో వారే నిజమైన ధీరులు అన్నారు. **ఇంద్రియములను అరికట్టి స్వాధీనము చేసుకున్న వ్యక్తియే ధీమంతుడు.** బాహ్యార్థముగా భౌతిక జగత్తునందు అశ్వమును ఎవడు పట్టగలడో వాడే ధీమంతుడు. అతనితోనే యుద్ధము చేసే అధికారమున్నది. అని ప్రాచీన మహారాజులు నిరూపించినారు. ఇక్కడ అంతరారర్థము బాహ్యార్థము రెండింటి యొక్క సమన్వయమే నిజమైన యదార్థము. 'ప్రతి మానవుడు ఈ అశ్వాన్ని పట్టి కట్టాలి. అప్పుడే మీరు ధీరులౌతారు. ఎన్ని యాగములు, ఎన్ని యజ్ఞములు, ఎన్ని క్రతువులు, ఎన్ని గ్రంథ పారాయణములు సల్పినప్పటికిని వీనిని నిగ్రహించలేని ఆశక్తులు యివన్నిటిని వ్యర్థము గావించినవారే.

(బృ.త్ర.పు. ౪౪/౪౫)

ధీరుడు

సంసార సముద్రమందు యెడతెరిపి లేకుండా వచ్చిపడే సుఖ దుఃఖములను తరంగములకు కించిత్తైనను చలించక, చిత్త సామ్యాన్ని కోల్పోక, తన పట్టుదలతో నిలిచిన (అనగా నిష్ఠతో నిలచిన) వాడు ధీరుడగును. **విషయ ద్వంద్వాలను తిరస్కరించే శక్తి సామర్థ్యములు కలిగినవాడే బుద్ధిమంతుడు. అట్టి బుద్ధికలవానినే ధీరుడని అందురు."**

"ధీ" అనగా బుద్ధికదా! అట్టి బుద్ధికలవాడే పురుషుడు. కేవలము మీసములు పెంచి చొక్కా వేసుకొన్నవాడు కాదు పురుషుడు. ద్వందతిరస్కారబుద్ధి కలవాడే పురుషుడు. **అట్టి పురుషుడు బైట శత్రువులను గెలుచుటకంటే లోని శత్రువులను గెలుచుట చాలా పుత్తమ మార్గము.** సుఖ దుఃఖములను జయించుటే - ఈ ధీరుడు చేయవలసిన పని, అదే నిజఫలము.

(గీ. పు.30/31)

జీవితంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తొణకక, బెణకక వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి.

తలచినట్టి పనులు తారుమారైనచో
తొణక వలదు ఎవరు బెణక వలదు
చీకు చింత వీడి చిరునవ్వు నవ్విన
అతడె గుండె పండినట్టివాడు

జీవితమొక సవాలు. ధైర్యంగా ఎదుర్కోవాలి. ఎట్టి పరిస్థితులందైనా బలహీనతకు చోటివ్వకూడదు. బలహీనులు ఏ చిన్న కార్యమునైనా సాధించలేరు. కనుక, మీరు మానసిక బలమును సంపాదించుకోవాలి. మీ మనస్సు దైవవిశ్వాసంతో కూడినదిగా ఉండాలి. **మంచిపైన విశ్వాసమును, చెడుపైన అవిశ్వాసమును పెంచుకోవాలి. కష్టాలు కదలిపోయే మేఘాలవలె వస్తుంటాయి, పోతుంటాయి. వాటికి వెఱువకూడదు.** పట్టాభిషేకానికి సంసిద్ధమైన రాముడు అదే క్షణంలో ఆనందంగా అడవికి వెళ్ళాడు. **"సుఖ దుఃఖే సమేకృత్వా లాభా లాభౌ జయా జయౌ",** సుఖ దుఃఖాలయందు సమత్వాన్ని వహించాడు. ఇట్టి సమత్వం మానవునియందు కనిపించటం లేదు. తనకు అర్హత ఉండినప్పటికీ రాముడు అధికారమును ఆశించలేదు. కానీ మానవుడు తనకు అర్హత లేనప్పటికీ అధికారంకోసం ప్రాకులాడుతున్నాడు. **రామునికి అన్నింటియందు ధీరత్వమేగాని,ఏనాడూ దీనత్వం లేదు. రామనామాన్ని స్మరించేవానికి కూడా ధీరత్వమే వస్తుందిగాని, దీనత్వం రాదు. నిరంతరం రామనామాన్ని స్మరించిన హనుమంతుడు రాముని ఎదుట దీనుడై నిలిచాడు. రావణునివద్దకు పోయినప్పుడు ధీరుడై నిలిచాడు. అనగా, దివ్యత్వము ఎదుట దీనుడైనాడు. అహంకారము ఎదుట ధీరుడైనాడు.**

(స.సా.మే 99 పు.116)

(చూ॥ ధీమంతుడు)

ధూమాదిమార్గము

ధూమాదిమార్గము

(చూ॥ ఉత్తరాయనము)

ధృతరాష్ట్రప్రేమ

నేటి ఆధునిక యుగంలో నూటికి 90 పాళ్ళు తల్లిదండ్రులే పిల్లల్ని పాడుచేస్తున్నారు. వారికి ఇష్టమొచ్చినట్లు అధికార మిస్తున్నారు. తప్పులు చేస్తే దండించటం లేదు. పాపాలకు వడిగడితే నిందించటం లేదు. ఫలితంగా వారు మరింత పాతకులుగా మారిపోతున్నారు. అటువంటి **కుమారులను తల్లిదండ్రులు ఏమాత్రం క్షమించరాదు. పుత్రప్రేమ ఉండవచ్చునుగాని ధృతరాష్ట్ర ప్రేమవలె మాత్రం ఉండరాదు.** ధృతరాష్ట్రుని వలె, తల్లిదండ్రులు అక్రమాలు అనాచారాలు చేసే తమ కుమారులను క్షమిస్తూ పోరాదు. **ధృతరాష్ట్రుడు కృష్ణుని బోధనలను విస్మరించాడు. విదురుని మాటలను వినలేదు.** నా పుత్రులంతటి గొప్పవారు మరెవ్వరూ లేరని విర్రవీగాడు. ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడు. **గ్రుడ్డిగా నమ్మాడు** తన కుమారుడైన దుర్యోధనుని. ఎన్ని తప్పులు చేసినా మందలించలేదు. దుర్యోధనుని దుశ్చేష్టలకు అంతులేకుండా పోయింది. చిట్టచివరికి నూర్గురు కుమారులు మరణించారు. **పుత్రుడు పుట్టినప్పుడే సంతోషించరాదు. పెరిగి సత్కీర్తి తెచ్చినప్పుడు సంతోషించాలి. పిల్లల్ని ప్రేమించవచ్చు. పెట్టేటప్పుడు పెట్టాలి. తప్పులు చేస్తే దండించాలి. ఏమాత్రం వెనుకాడరాదు. చిన్నతనంలో చిన్న తప్పులే చేస్తారు. ప్రేమతో వాటిని ఆమోదిస్తే, పెద్ద వాళ్ళయిన తరువాత పెద్ద తప్పులు చేయటానికి వెనుకాడరు. రౌతుకొద్దీ గుఱ్ఱం. తల్లిదండ్రుల పెంపకంమీదనే పిల్లల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.** కనుక తల్లిదండ్రుల ప్రేమ ధృతరాష్ట్ర ప్రేమవలె ఉండకూడదు.

(శ్రీ జూ 97, పుట 40)

ధృతరాష్ట్రుడు

కృష్ణుడు ఎన్ని చెప్పినా ధృతరాష్ట్రుడు సంధికి అంగీకరించలేదు. కృష్ణుడు భరించలేక "ధృతరాష్ట్రా! **తనదికాని రాజ్యమును తనదిగా భావించుకొని ఎవరు భోగభాగ్యములు, సుఖములు అనుభవిస్తారో వారు దొంగలవంటివారు.**" అన్నాడు. **"ధృతం యేన రాష్ట్రం ఇతి ధృతరాష్ట్ర : తనది కానిదానిని తనదిగా భావించుకొనేవాడు ధృతరాష్ట్రుడు."**

(ని.పు.49)

(చూ॥ సత్యం)

ధ్రువతార

(చూ॥ పుట్టపర్తి)

ధ్యానమార్గము

ధ్యాన మార్గములలో మూడు రకములైన ద్వారముల చేర ప్రయత్నించుచున్నారు. అదే సాత్వికమార్గము, రాజసిక మార్గము, తామసికమార్గము.

మొదటిది సాత్వికమార్గము : అది, జీవితముయొక్క కర్తవ్యముగా భావించి ఎన్ని బాధలకైనను, ఎన్ని కష్టములుకైనను సహించి ఇవన్నియూ మిథ్యయని దృఢనిశ్చయుడై, సర్వకాల సర్వావస్థలయందునూ మంచినే చేయుచు, మంచినే కోరుచు సర్వులకు ప్రీతిహితుడై, సర్వేశ్వర స్మరణ, జపధ్యాన చింతనలయందు కాలమును గడుపుట. దాని ఫలము సహితము సర్వేశ్వరుని అనుగ్రహము పైననే వేయును కాని ఆశించడు.

ఇక **రాజసిక సాధన** : అడుగడుగునకూ తత్ఫలితమునే కోరుచుండును. అట్టి తత్ఫలితము లేకున్న విసుగు, విరక్తి పడుచూ తానాచరించు ఆరాధన జపధ్యానములు క్రమేణ సన్నగిల్లుచూ వచ్చును.

తామసికసాధన : అది మరింత మోసము. ఆపదల యందు, బాధలయందు, కష్టనష్టములయందే పరమాత్ముడు స్మరణకు వచ్చును. అట్టి సమయమున నీకు ఈ పూజ చేతు, ఇంత నైవేద్యము పెట్టుదు, నీకు గుడికట్టుదునని ఇటువంటి ప్రార్థనలతో ప్రార్థింతురు. వారు కేవలము చేసిన నైవేద్యము, కట్టిన ముడుపులు, పెట్టిన నమస్కారములు,

తిరిగి ప్రదక్షిణలు లెక్కించుచు, దానికి తగిన ఫలములు కోరుదురు ఇట్టి ఆపేక్షలతో ధ్యానించువారికి మనోబుద్ధులు నిర్మలము కానేరవు. కేవలము లోకమున చాలామంది ఈ రజోతమోమార్గములందే ధ్యానము చేతురు. ఇట్టి నిర్మలమునకు ప్రథమ ధ్యానమైన సాత్విక ధ్యానమే ఉత్తమమైనది. మనసు, బుద్ధి నిర్మలమెప్పుడు ఉండునో, అట్టివారి **ఆత్మ యెరుక అనబడుతేజస్సు ప్రకాశించు చుండును. ఎవనియందు ఈ యెరుక పరిపూర్ణముగా ప్రకాశించునో అతనినే ఋషి అందురు.**

(ధ్యా.వా.పు. 11/12)

ధ్యానము

సాయింకాలము భజన అయిన తరువాత 10 నిమిషాలు ధ్యానానికి కూర్చుంటావు. అంత వరకు బాగానే ఉంది. కాని 10 నిమిషాల తరువాత నీవు లేచి తిరుగుతున్నప్పుడు ప్రతి ఒక్కరిని స్వచ్ఛమైన **కాంతిలో చూసినపుడు వారు దైవత్వంతో ఉన్నట్లు గమనించేవా? అలా కానట్లయితే ఆధ్యానం కాలం వృధా గావించడమే.** నీవు ఎక్కువగా ప్రేమిస్తావా? తక్కువగా మాట్లాడతావా? ఇతరులను శ్రద్ధతో సేవిస్తావా? **ఇవి ధ్యానంలో అభివృద్ధికి చిహ్నాలు.** నీ పురోగతి నీ ప్రవర్తనలో, నడతలో ప్రస్ఫుటించాలి. ధ్యానం నీవు ఇతరుల గురించి, ఇతర వస్తువుల గురించి ప్రవర్తించే తీరులో ప్రతిబింబించాలి. లేకపోతే అది హాస్యాస్పదమే. ఒక బండరాయి అయినా ఎండావానలకు, చలికి వేడికి ముక్కలు, ముక్కలై బురదగా మారి చెట్టుకు ఆహారంగా మారిపోయింది. ఎంతటి కఠిన హృదయమైనా మెత్తబడ వచ్చు, దానిలో దివ్యత్వము మొలకెత్తవచ్చు.

(అ.ష.పు.19)

మీరు ఏ సాధనా చేయనక్కరలేదు. సమయం చిక్కితే జపం, ధ్యానం అన్నీచేయండి. ఆధునిక యుగంలో జపం, ధ్యానం కుదరడం కష్టమే. మెడిటేషన్‌చేయాలని కూర్చుంటే mind మాత్రం Market లో తిరుగుతూ ఉంటుంది. కొందరు చేతిలో జపమాల తిప్పుతూ ఉంటారు. కాని వారి "మైండ్" మంగలింటికి, చాకలింటికి, ప్రయాణ మౌవుతుంది. ఈ విధంగా కాలాన్ని వ్యర్థం చేయకండి. **జపం, ధ్యానం చేయడం మీకు కుదరక పోతే సేవచేయండి. ధాన్యం మీకు అక్కరలేదు.**

నోరు మూయాలి. హృదయాన్ని తెరవాలి. ఇదే నిజమైన ధ్యానం. అనేక మంది హృదయాన్ని మూసిపెడుతున్నారు. నోరు తెరుస్తున్నారు! ఇది ధ్యానం కాదు.

(దే.యు.పు.13)

"శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే,
ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్.

దైవమును పొందే నిమిత్తమై దైవమును చెందే నిమిత్తమై నిత్యజీవితములో సాధకులు చేసే తర్ఫీదు అభ్యాసమని చెప్పబడుతుంది. ఇట్టి అభ్యాసమునకంటె దైవమును హృదయములో నిలుపుకొని తాదాత్మ్యభావమును పొంది ఏకత్వములో దివ్యత్వమును పొందే దివ్యస్థితినే ధ్యానమన్నారు. **"ధ్యై చిన్తాయాం" అనే ధాతువు నుండి పుట్టినదే ధ్యానము అనే పదము. భగవంతుని చింతనే ధ్యానమని చెప్పబడుతున్నది.** అప్పుడప్పుడు చింతించి నంత మాత్రమున అది ధ్యానము కానేరదు. **సతతం చింతన చేయటం, సర్వకాలములయందును, సర్వావస్థల యందును, సర్వప్రదేశముల యందును, దైవచింతన చేసే స్థితిని ధ్యానము అని చెప్పవచ్చును. అభ్యాసమనేది కాలముతో కర్మముతో కారణముతో కూడి వుంటుంది. కాలకర్మకారణములకు అతీతమైన స్థితియే ధ్యానమని చెప్పబడుతుంది. అభ్యాసముకంటె ఉత్తమమైనది ధ్యానము. ఈధ్యానముకంటె జ్ఞానము మరింత ఉత్తమమైనది.** ఇది విచారణ శక్తితో కూడినది. ఇది విషయపరిశీలనలతో కూడినది.

(శ్రీ.గీ.పు.26)

ధ్యానజపమనగా మనోబుద్ధుల నిర్మలమొనర్చుటే.
ధ్యాన సంపద కలుగునంతవరకు, నిర్ణీత ఆసీన క్రమములను అవలంభింపవలెను. అంతవరకు ఆ క్రమశిక్షణ పాటించవలెను. ధ్యానసంపద కల్గిన తరువాత అనగా, మనో బుద్ధులు వశమయిన తరువాత తాను

ధ్యానము

పరుండిన పడకపై సహితము కూర్చున్న కుర్చీమీద, మరే ఇతర బండమీద, బండిమీద ఎచ్చటైనను సరే, ఎట్టి పరిస్థితిలోనైనను సరే, ఎట్టి సమయములోనైనను సరే ధ్యానము సలుప సాధ్యమగును.

భక్తుని మనోవాంఛ సఫలము చేయుటకు విశ్వమునకు ఆధారభూతుడైన, హరి ఏ రీతిగానైనా ఎక్కడైనా వచ్చును. అయితే తనను ఏకాగ్రతచిత్తులై ప్రార్థించవలెను. అట్టి ఏకాగ్రత పుట్టుకస్థానమే సత్త్వగుణము. అట్టి సత్త్వగుణము యొక్క జన్మభూమే ధ్యానము.

ధ్యానము చేస్తూ చేస్తూ ఒక రూపము వచ్చును. ఆ రూపమును చూస్తూ చూస్తూ కడకు ఆ రూపము కూడా మరుగయి, నీకు నీవు మరతువు. దానినే సమాధి అందురు. మానవుడు, అట్టి సమయమున, ఒకే భావము కల్గియున్నప్పుడు సవికల్ప సమాధి అనియూ, ఏ భావము లేకుండా మనసు ఖాళీగా నుండిన, రాజయోగ శాస్త్రమందు పతంజలి తెలిపిన భావనాశనము అనబడును.

(ధ్యా.వా.పు.10,13,60,85/86)

ధ్యాన సాధన సలుప వలసిన వారు నిర్ణీత క్రమముల ననుసరించే తీరవలెను. అందులో ఏ మార్పును చెందకూడదు. అయితే, **రజో తమోగుణ సాధనలు మాత్రము ధ్యాన మనిపించుకోవు. అట్టి వాటిని అణగద్రొక్కి కేవల సాత్విక సాధననే చేసిన అది ధ్యానమనిపించుకొనును. అదే ఉత్తమ సాధన.** ఒక విషయమును మాటలతో వర్ణించుట కష్టమే కాక విసుగుకూడా జనించును. దానిని కార్యముచేసి చూపుట అతి సులభము, ఆనందము. ధ్యానముచేసి తెలిపిన నీమము ననుసరించి ధ్యానమార్గమును తెలిసికొనుట మంచిది. నే వ్రాయుటవల్ల, మీరు పఠించుట వల్ల అంత సులభముగ మీకు తెలియదు. ధ్యానమువల్ల మానవుని అంతరమున ఆత్మను కనుగొనగల దివ్యానుభవమును పొందుచున్నాడు. ధ్యానమువల్ల సాధకుడు భ్రాంతి కలిగించు ఆవరణములనుండి పొరలు పొరలుగా ఉపసంహారము పొందుచున్నాడు. ప్రపంచ విషయానుభవములనుండి ఇంద్రియ వ్యవహారములను వెనుకకు మరల్చుచున్నాడు. ఇట్టి పవిత్ర స్థానమును పొందగోరుటే ధ్యానమనబడును. దీనికి ప్రధానముగా మానవుడు చక్కని నీతినియములు కలిగి యుండవలెను. ప్రపంచ విషయములు, అందుగల తీవ్ర ఆకర్షణలయెడ విరాగము గలిగియుండవలెను. ఎట్టి సమయమునందైనను ఉత్సాహ, ఆనందములతో మెలగవలెను. ఏ కార్యమును చేసినను జీవిత మార్గమునకు కాక ఆత్మానందమునకని భావించవలెను. తన శరీరమును చక్కని ఆసనమున యుంచగలిగి, అంగములు సళ్ళు పరచి, శరీరముయొక్క బరువు, ఒత్తిడియు తన మనోదృష్టిని లాగకుండునట్లు నిలుపుటకు అభ్యాసము చేయవలెను. **ఇదియే సాత్విక ధ్యానసాధన అనబడును. దీనికే క్రమము ముఖ్యావసరము.**

(ధ్యా.వా.పు.14/15)

సాధకులు, సన్యాసులు ధ్యాన యోగులు ఒక నిచ్చెన మూలముననే ఆయా స్థానములు పొందగల్గుదురు. ఆ నిచ్చెన మెట్లు సవితర్క నిర్వితర్క, సవిచార నిర్విచార సమ్మత మొదలగునవి. ప్రపంచ జ్ఞానమనునది నిజమైన జ్ఞానము కాదు. ప్రపంచమే మిథ్యమైన, ఇంక జ్ఞానము మాత్రము సత్యజ్ఞాన మెట్లగును? **నిత్యమైన అంతర్ముఖ ఆత్మజ్ఞానము, సత్యజ్ఞానము. దానిని పొందు, పొందించు మార్గమే ధ్యానమార్గము.**

(ధ్యా.వా.పు.34)

ధ్యానము అంటే ఏమిటి? **బ్రాహ్మభావము చేత స్థిరమైన తత్త్వాన్ని పొందుట. ఇలాంటి వేదాంత వాక్యములు ఎన్ని విధములైన అంతరార్థములనో ప్రబోధిస్తూ ఉంటాయి. దీనినే వేదాంతమునందు మరొక రీతిగా వాసః అన్నారు. వాసః అనగా నీ నివాసమెక్కడ?**

ఈనాడు జగత్సంబంధమైన వాసమని బోధిస్తున్నాము. **సర్వ జీవుల యొక్క వాసము భగవంతుడే నేను భగవంతుని యందు వాసము చేస్తున్నాను. నీవు ఆత్మ స్వరూపుడవు. కనుకనే 'శ్రుణ్వంతు విశ్వే అమృతస్య పుత్రః' అన్నది వేదము.**

(శ్రీ.వ.1991పు.11)

భూమికంటే కొంత ఎత్తైన ప్రదేశము, అనగా, ఒక ఇంచి రెండు ఇంచిలు ఉండవచ్చును. దానిపై దుర్భచాప, దానిపై కృష్ణాజినము, దానిపై తెల్లటి పలచటి గుడ్డను పరచి, ఆ ఆసనముపై ధ్యానము చేయు వారు పద్మాసనముతో కూర్చొనవలెను. కుడికాలు ఎడమకాలుమీద ఉండవలెను. ఎడమకాలు కుడికాలు మీద నుండవలెను. రెండు కాళ్ళనూ ఆసనమును అంటియే యుండవలెను. వ్రేళ్ళను వ్రేళ్ళతో కలిపి, చేతులు ముందుకు వదలవలెను. కన్నులు సగము తెరచి యుంచవలెను. (నిమీలిత నేత్రము) లేక పూర్తిగా మూసుకొనియైననూ ఉండవచ్చును. మానసమున దేహము యొక్క ఒక్కొక్క భాగమునూ మాలీసు చేయవలెను. మెడ, భుజము, చేతులు, రొమ్ము, వళ్ళు, కడుపు, వ్రేళ్ళు, వీపు, మోకాళ్ళు, తొడలు, పాదములు, కండరములూ వదలు విడువవలెను. (సళ్లు చేయవలెను) అది అయిన తరువాత తమ తమ ఇష్టనామమును, రూపమును, ఓంకారముతో జతపరచవలెను. అది చేయు సమయమున మానసికమున ఏ ఆలోచనలూ లేక స్థిమితముగా నుండలెను. గడచిన పాత యోచనలు కాని, కోపతాపములు కాని, దుఃఖచింతలుకాని తలంపునకే రాకూడదు. వచ్చిననూ తలంచకనూ తనకు ఉత్సాహమును కలిగించు భావముల యోచించవలెను. ఇవి ప్రప్రథమున కొంత కష్టముగనే గనుపించును. ఈ రీతి అగు ధ్యానమునకు తెల్లవారుఝామున (3 గంటలు మొదలు 5 గంటలలోపున ఎప్పుడైననూ సరే) 4 గంటలకు లేచిన, నిశ్శబ్దముగా నుండును; సాధనకు ఉత్తమ సమయము. మొదట నిద్రను అరికట్టవలెను. అది అతి అవసరము. కాని కాల, క్రమములు మార్చురానీయ కుండుటకు 4 గంటలకు అలారము పెట్టుకొనవచ్చును. అదియూ సాధ్యముకాక నిద్రవచ్చుచుండిన చల్లనీటితో స్నానము చేసిన దాని బారి తప్పించుకొనవచ్చును. స్నానము అవసరమని ఏమియు లేదు. నిద్ర ఎక్కువగా ఉండిన మాత్రము చేయవచ్చును.

ఈ రీతిగా ధ్యాన మార్గమును అభ్యాస పరచిన అతి త్వరితముగనే అనుగ్రహమునకు పాత్రులు కాగలరు.

(ధ్యా.వా.పు. 7/8)

(చూ॥ అజ్ఞానము, మనసు, దూరంగా ఉంచు)

ధ్యాన యోగము

(చూ॥ శ్రేష్ఠుడు)

ధ్యేయము

(చూ॥ అరటిచెట్టు)

ధ్వని

(చూ॥ రూపనామములు)

నందీశ్వరుడు

ఒక ఉపమానము తెలిసిన, ప్రాచీనధర్మ మెట్టిదో, యిప్పటి అర్థమెట్టిదో, మీకు బోధపడగలదు. శివదేవాలయములు చూడని భారతీయుడుండడని తలంతును. ఆ దేవాలయములో శివుని కెదురుగా ఒక నందిని చూతుము. వాటి భావమేమని? ఇప్పటి అర్థము ఈశ్వరుని వాహనమైన ఒక కోడె యనియు బసవణ్ణ అనియు తలంతురు. కానీ, ప్రాచీనకాలపుయొక్క శాస్త్రమువేరు! **శివలింగం ఈశ్వర ప్రతీకం అనియు, నంది జీవ ప్రతీకం అనియు జీవేశ్వరులమధ్య విభేదం చూడగూడదనియు శివలింగానికి నందికి మధ్య యెవ్వరూ పోకూడదనియు, ఆలయాచారము! నంది శృంగమధ్యములోనుంచి శివలింగదర్శనం చేయడం మహాపుణ్యమని ఇప్పటివారు భావింతురు; ఎందుకనగా యధార్థమయిన అర్థమును తెలియనివారగుటచే!** కానీ, దాని అంతరార్థము అదికాదు. **జీవునిలో శివుని దర్శించమనియే పరమార్థము. పశువు, పశుపతికి వాహనము, అనగా అంకితమైనపుడు, నంది ఈశ్వరుడను రెండు రూపములు రెండుభావములుగా, కాక అపుడు నందీశ్వరుడను ఒకే నామరూపములను స్వీకరించును.** అప్పుడు అది అరాధనీయమవుతుంది. పశువు ఈశ్వరార్పితమై ధన్యత గాంచటమే యధార్థ పరమార్థము.

(స.సా.ఏ. 1974 పు.55)

నగరసంకీర్తనము

నగర సంకీర్తనము గురించి నామాటలివి - జయదేవుడు, గౌరాంగుడు, తుకారాము, కబీరు మొదలైనవారందరు తమ శక్తుల నభివృద్ధి పరుచుకొనుటకు, ప్రజల ఆధ్యాత్మిక శక్తుల నభివృద్ధి పరచుటకు దీనినొక సాధనగా అనాదిగా ఉపయోగించుచుండుట మనకి క్రొత్త విషయమేమియు కాదు. ఉదయాత్పూర్వమే, 4-30, 5 గంటల మధ్య లేచి అందరు ఒకచోట చేరి, భగవంతుని భజించుచు, నెమ్మదిగా వీధుల వెంట వెళ్ళవలెను. ఆ సమయమున నిదురించువారిని మేల్కొలిపి, వీధులలోని మలిన వాతావరణమును భగవన్నామముతో పవిత్రపరచుము.

ప్రేమ స్వరూపుడు, సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వ వ్యాపకుడైన పరమాత్మ భావనతో సూర్యోదయము (జ్ఞానోదయము) నీకు, ఇతరులకు కలుగునట్లు చేయుము. ఇంతకంటె నీకునీవు, ఇతరులకు చేయగల సేవ ఏమున్నది? అది నీకు ఆరోగ్యమును, ఆనందము నందించును. నీ ఇరుగు పొరుగువారి ముందిట్లు సంకీర్తన చేయుటవలన **నీ అహంకారము పూర్తిగా పటాపంచలైపోవును.** ఆ ఉత్సాహములో నీ దర్పమును, అహంకారమును పూర్తిగా మర్చిపోదువు. ఇట్లు చేయు నగర సంకీర్తన - **ఒక మహోన్నత సాధన - మహోత్తర సేవ.**

(శ్రీ.స.సూ.పు.102)

తెల్లవారు ఝామున **నగర సంకీర్తన ఎందుకోసం పెట్టాము?** ఏ పని లేక పెట్టామా? early morning లేచి నీ నిద్ర పాడుచుసుకోమని పెట్టామా? కాదు కాదు. ఇది భౌతికంగా, లౌకికంగా, ఆధ్యాత్మికముగా ఎంతో పవిత్రమైనది. **బ్రహ్మ ముహూర్త కాలము.** చల్లని ప్రదేశము. చల్లని వాతావరణము. ఆ చల్లని వాతావరణములో మన మనస్సు రాత్రంతా నిద్రించి మంచి ప్రశాంతముగా ఉంటుంది. లేచిన తక్షణమే పిచ్చి పిచ్చి పలుకులు వినకుండా అసభ్యమైన శ్రవణం చేయకుండా **రామా, కృష్ణా, గోవిందా అని నామస్మరణ వింటుంటే హృదయమునకెంతో హాయి చేకూరుస్తుంది. వినేవానికి హాయి. తెల్లవారి లేస్తూనే భగవన్నామము విన్నాను అనుకుంటాడు. తెల్లవారి లేచిన తక్షణమే భగవన్నామస్మరణ చేయాలి. మొట్టమొదట లేచిన క్షణమే స్మరణతో ప్రారంభము కావాలి.** అందు నిమిత్తమై సత్యసాయి సంస్థలలో నగర సంకీర్తనలు, భజనలు, సత్సంగములు, స్టడీ సర్కిల్సు యివన్నీ పెట్టటానికి కారణం అయినది. **ఇవంతా కాలము పవిత్రము చేసి హృదయమునకు శాంతి చేకూర్చటానికే.** శాంతి ఎక్కడుంది. భౌతికంగా చూస్తే శాంతి గాఢనిద్రలో ఉంది. లభిస్తుంది. **రెండవది. సంకల్పరహితుడైనప్పుడు శాంతి పొందుతున్నావు. సంకల్పములను అరికట్టుకొనుటకు వీలుకాదు. కనుక మనము సాధ్యమైనంతవరకు ఒక గంట మౌనము వహించాలి.** మాట్లాడి మాట్లాడి తలలోని నరములు బలహీనమై పోతాయి. మాటలలో పవిత్రమైన మాటలైతే బ్యాటరీ ఛార్జి అవుతుంది. అపవిత్రమైన పరనిందలుగానీ, పరదూషణగానీ మనము పలుకుతుంటే మన జీవితము మరింత అధోగతి పాలైపోతుంది. కనుక ఈనాటి యువకులంతా మొట్టమొదట మాటలు తగ్గించుకోవాలి. అందులో నున్న మాధుర్యము మీరు ఎంతో అనుభవించగలరు. సమాజము కూడా చూస్తే ఆ పిల్లవాడు చాలా మంచివాడు, ఎవరితోను మాట్లాడడు, మంచిగా ఉంటాడు అనే సత్కీర్తి పొందుతాడు. కొంత మంది వడవడ వాగుతుంటారు. వీరిని చూస్తే సమాజములో వస్తున్నాడురా వాగ్గాయి అని వెళ్ళిపోతారు. బోర్‌గా ఉండేవాడు వస్తున్నాడని తప్పించుకుపోతారు. నిన్ను తప్పించుకు పోవటమేకాక నీకు చెడ్డ పేరు వస్తుంది. **మిత భాష అతి హాయి; అతిభాష మతి హాని.**

(శ్రీ.స.పు.62/63)

నగ్నసత్యము

మీరు నొసటను ధరించు విభూది, అది ఉంచబడిన నొసలుతో సహా సర్వమును బూడిదగా మారిపోవునను నగ్నసత్యమును అనవరతము జ్ఞాపకము చేయుచుండును.

(శ్రీ.స.సూ.పు.91)

నచికేతుడు

"ధర్మనిరతుడు, సౌజన్యతత్పరుడు, శమ దమాదులు గాంచిన సజ్జనుఁడు,
సమస్త ధర్మములను తెలుసుకొన్నవాడు, గర్వము నెరుగనివాడు...ఎవరు?
అతడే - నచికేతుడు!"

(స.సా.జూ94 పు.157)

నటరాజు

"నేను నటరాజును. నేను నర్తకులలో యువరాజును. మీరంతా నా విద్యార్థులు. ప్రతి అడుగు ముందుకువేసే విధమేదో మీకు నేర్పటంలో నున్న వేదన నాకే తెలుసు."

(స.ప్ర.పు.31)

నదిమూలము

(చూ॥ అనుభవము)

నదీస్నానం

శాంతం మానవుని స్వరూపం. సౌఖ్యం మానవుని స్వభావం. **ఆలయ నిర్మాణం కంటే వ్యక్తుల పునర్నిర్మాణం ముఖ్యం. గుణముల సంఖ్యపెంచండి - గుడుల సంఖ్య కాదు. చెప్పింది చేయండి,** అదే అసలైన తీర్థయాత్ర - మనస్సులనుంచి అసూయ ద్వేషాలు తొలగించండి - **అదే నిజమైన పుణ్య నదీ స్నానం.**

(త.శ.మ.పు.147)

నదులు

భారతదేశంలో ఉన్న జీవనదులు ఏ దేశంలోనూ లేవు. భారతదేశంలో అన్నపూర్ణను అందించేటటువంటి సారవంతమైన సువిశాల మైన భూములు కూడా ఉన్నాయి. కానీ వీటిని ఉపయోగించుకోలేకపోతున్నాం. గంగా, కావేరి, కృష్ణా, గోదావరి మొదలైన జీవనదులెన్నో భారతదేశంలో ఉన్నాయి. **దేశంలోని నదీజలాలన్నింటినీ జాతీయ ఆస్తిగా ప్రకటించితే ఏ ఇబ్బంది ఉండదు.** కానీ ఈనాడు ఒక నది కర్ణాటకదని మరోనది మహారాష్ట్రదని భావిస్తూ నదీ జలాల పంపిణీ విషయంలో పోరాటం చేస్తున్నారు. ఈ భేదం ఎవరు పెట్టారు?

కొందరు స్వార్థపరులో ఆవేశపరులో పెట్టిన భేదం ఇది. ఇది దేశము యొక్క ఆస్తి. ఇది జాతీయ సంపద. నీటిని అందరూ ఉపయోగించుకోవచ్చును. ఐకమత్యం లేక ఇది నానది, అది నీనది అని తేడాలు రావడం చేతనే, చివరికి అంత జలమూ సముద్రములో వృధాగా చేరిపోతున్నది. ఇది మన సంపద, మనందరిసంపద. ఇట్టి విశాలమైన త్యాగ భాగమును అంతా పెంపొందించుకోవాలి.

(శ్రీ.సా.గీ.పు.285/286)

నన్ను చేరగోరువారు

లోకమున మానవుల ప్రతినిధివి కనుక నీ సందేహమే లోకసందేహము. **నీ సందేహ నివృత్తే నా సందేశము!** వినుము. లోకమున **నన్ను చేరగోరువారు, నాలుగు విధములుగా** వున్నారు. నిరంతరము దేహసంబంధ మయిన దుఃఖములతో పీడింప బడువారు ఒకరు; అతనిని **ఆర్తుడని అందురు.** ఇక ధనకనక వస్తువాహనములతో పదవీ పేరు ప్రతిష్టలతో పుత్ర పౌత్రాభివృద్ధిని గోరి పరితపించువారు రెండవతెగవారు. **వీరిని అర్థార్థులు** అని అందురు; తరువాత ఆత్మస్వరూపమైన పరమాత్మను తెలిసికొనగోరి అనేక సత్ గ్రంథములతో సదాలోచనలతో సత్ భావములతో విచారణసలుపుచూ సాన్నిధ్యప్రాప్తిని బడయగోరువారు, వీరిని **జిజ్ఞాసువులని** అందురు. ఇక నాలుగవ వారైనవారే **జ్ఞానులు.** అతను నిరంతరము బ్రహ్మ తత్త్వమున మునిగియుండును.

(గీ.పు.67)

నన్నే పొందుదురు

"అర్జునా! రాగద్వేష భయ క్రోధముల నుండి వేరైన వారునూ, నా చింతన, నామ రూపమునందే లీనమైన వారును, నన్నువినా అన్య ఆశ్రయమును యెరుగని వారునూ ఆత్మజ్ఞానముచే పవిత్రమైనవారును, నా దివ్యజన్మ కర్మలనెరిగి సత్య ధర్మ ప్రేమలతో నన్నే వెదకువారును నన్నే పొందుదురు. **ఇది ముమ్మాటికీ సత్యము. సంశయమును విడువుము.** అజ్ఞానులయిన మానవులు నిరంతరమూ విషయచింతనతో అంతః

కరణములను అపవిత్రము చేసికొనుచున్నారు. అట్టివారు కేవలము శబ్దాది విషయములను చింతించెడివారగుదురు; వారలకు విషయ వాసనలు సోకినంతనే వాటిని పొందవలనెనను అభిలాష కలుగును. అట్లు కోరిన అభిలాషలు నెరవేరకున్న లేక చేతికి చిక్కి జారిపోయిన, వారు అశాంతికి గురియై భయ భ్రాంతులకు గురియగుదురు. **భయము మానవుని సర్వశక్తులను భక్షించును, భయస్థునకు కోపము మెండు, కోపము, భయము ఈ రెండే భగవత్ప్రాప్తికి భయంకర ప్రతిబంధకములు. అంతఃకరణమున ఈ మూడూ అనగా అభిలాష, క్రోధము, భయము పూర్తిగా తొలగినపుడే భగవంతునితో యెప్పటికినీ వియోగమును పొందకుండా వుందురు.**

(గీ.పు.65/66)

నమస్కారము

ప్రేమస్వరూపులారా! అహంకార, ఆడంబరములను వదలి, ప్రేమను పెంచుకున్నప్పుడే ఐకమత్యం సాధ్యమౌతుంది. మీరు రెండు చేతులను జోడించి భగవంతునికి నమస్కరిస్తారు కదా! **నమస్కారమంటే ఏమిటి? ఐదు కర్మేంద్రియములను, ఐదు జ్ఞానేంద్రియములను చేర్చి భగవంతునికి అర్పించడమే నిజమైన నమస్కారం. "నా అహంకారం పోయింది" అని చెప్పడానికి గుర్తు నమస్కారం. 'న మ' అనగా 'నాది కాదు', అని అర్థం.** మానవునిలో ఇట్టి భావం కల్గినప్పుడే ఐకమత్యం సాధ్యమౌతుంది. కాని, అందరూ 'నాది' అనే భావాన్ని పెంచుకుంటున్నారు.

(స.సా.జూ.2000 పు.184)

ఎవరికి నమస్కారం చేసినా ఎవరికి చేయక పోయినా తాము చేసే కర్మలకు మాత్రం నమస్కారం చేయాలి! మానవుని జీవితమంతా కర్మపైనే ఆధారపడి ఉన్నది. 'కర్మమున పుట్టు జీవుడు, కర్మముననె వృద్ధిపొంది కర్మమున చనున్, కర్మమె నరునకు దైవము, కర్మయె సుఖ దుఃఖములకు కారణమిలన్' అని బోధిస్తుంది భాగవతము. కనుక మనము చేసే ప్రతి కర్మకు మొదట నమస్కరించి **ఓ కర్మా! ధర్మ రహితము కాని ఉత్తమ కర్మలు ఉపకారమైన పవిత్ర కర్మలు మాత్రమే నాచేత చేయించు - అని ప్రార్థించాలి. కర్మచేత దైవ సన్నిధిని కూడా పొందుటకు అవకాశమున్నది. ఉత్తమ స్థితిని పొందుటకు గాని అధమస్థితికి దిగజారుటకుగాని కర్మలే కారణము. కర్మనే మానవునకు జన్మనందిస్తున్నది. ఎట్టి కర్మ లాచరిస్తామో అట్టి జన్మలను పొందుతాము. ఎట్టి స్థానమును పొందుతామో అట్టి ఫలాన్ని అనుభవిస్తాము.**

(స.సా.జ.87 చివరిపుట)

ఈనాడు లోకంలో అనిత్యమూ, అశాశ్వతమైనటు వంటి వాటికి కూడా ఎన్నో ఆరాధనలు సలుపుతుంటారు. ఎవరెవరి కర్మకు వారు నమస్కరిస్తుంటారు. అదియే ఉపనిషత్తు యొక్క సారము. **'చిత్తస్యశుద్ధయే కర్మ:'. ఒక డ్రయివరు కారులో ఎక్కి మొట్టమొదట స్టీరింగ్‌కు నమస్కారంచేసి,కారును స్టార్ట్ చేస్తాడు. నర్తకి నాట్యంచేసేముందు కాలి అందెలకు నమస్కారం చేసి, వాటిని కాళ్ళకు కట్టుకొని నాట్యం చేస్తుంది.** గీతను చదవడానికి ముందు, దానిని తెరచి **మొట్టమొదట నమస్కారంచేసి,** దానిని చదవటం మొదలు పెడుతారు. దీని అంతరార్థమేమిటి? ఈ సంప్రదాయములు ఎందుకు పెట్టారు? దేని నిమిత్తమై వీటిని ఆచరిస్తూ వచ్చారు? **ప్రారంభమునకు పూర్వమే భగవంతునికి తన మనసును అర్పితం చేయాలని, భగవంతునికి నమస్కరించి కార్యములో మనం పాల్గొవాలనే పవిత్రభావం వారిలో ఉండడమే,** విజ్ఞానరహితులైనవారే ఈ విధంగా ప్రవర్తిస్తుంటే విజ్ఞానవంతులమని చెప్పుకొనే సైంటిస్టులకు మాత్రం ఈ జ్ఞానం లేకుండా పోతున్నది. ఈనాడు జ్ఞాని... జ్ఞాని... అని భావించుకుంటున్నాడో, వాడే పరమ అజ్ఞానిగా తయారవుతున్నాడు. **మనం నడుస్తుంటే, మన నీడ మన ప్రక్కనే నడుస్తూ వస్తుంటుంది. అదేవిధముగనే మనం జ్ఞానవంతులమని విర్రవీగుతుంటే,**

నమ్మకము

మన ప్రక్కన 'అజ్ఞానము' అనే నీడ నడుస్తునే ఉంటుంది. జ్ఞాన అజ్ఞానముల రెండింటి చేరికే మానవత్వం. కనుక నేను గొప్ప జ్ఞానిని అనుకోవటం చాలా పొరపాటు. **జ్ఞానము ఎంత ఉందో, అంత అజ్ఞానము కూడా నీ వెంట వస్తూనే ఉంటుంది.** మనం ఏది చేస్తున్నా, ప్రక్కన అజ్ఞానం ఉంటూనే ఉంటుంది. దీని నుండి తప్పించుకొని పోవాలంటే, సర్వమునూ జ్ఞానమయంగా భావించుకోవాలి.

(శ్రీ.అ. 2000 పు.10)

(చూ॥ మైలురాళ్ళు)

నమ్మకము

వైరాగ్యము, నమ్మిక, ప్రేమ అనే స్థంభాలపై శక్తి, ఆధారపడి ఉంటుంది. వీటన్నింటిలో నమ్మకం ప్రధానమైనది. అదిలేని సాధన నిష్ప్రయోజనము. కేవలం **వైరాగ్యం సాధనను శక్తి వంతం చేస్తుంది. ప్రేమ త్వరిత గతిని భగవంతుని దగ్గరకు చేరుస్తుంది.** భగవంతుని యందు నమ్మకము ఆయనను, వేరైన విరహాగ్నిని వెలుగొందింప చేస్తుంది. భగవంతుడు నీకు ఏది కావాలో ఏది ప్రాప్తో దానిని అనుగ్రహిస్తాడు. అడుగవలసిన పనిలేదు. గొణుగు కోవడానికి కారణం కనబడదు. తృప్తి అలవరచుకో, **ఎప్పుడేది జరిగినా కృతజ్ఞతా భావంతో ఉండు. ఆయన సంకల్పానికి తిరుగు లేదు.**

(అ.షు.పు.78)

అన్నిటికి మొట్టమొదట నమ్మకము చాలా అవసరము.

నమ్మకమనే రెండు నయనమ్ములే లేని
అంధులైరి మనుజులవనియందు

మొట్టమొదట నమ్మకం కావాలి. అదియే పునాది. అదియే Self confidence. (ఆత్మవిశ్వాసం) ఆ Self confidence అనే పునాది ఉండినప్పుడే Self satisfaction (ఆత్మ తృప్తి) అనే గోడలు నిర్మించవచ్చు. ఈ Self satisfaction అనే గోడలు వేసినప్పుడే Self-sacrifice అనే పైకప్పు కుదురుతుంది. ఈ Self sacrifice అనే roof (పైకప్పు) వేసినప్పుడే Self realisation అనే life అక్కడ నివసిస్తుంది. పైకప్పు లేక ఎవరూ ఇంటిలో నివసించరు కదా! గోడలు లేక పైకప్పు వేయలేరు కదా! పునాది లేకుండా గోడలు కట్టరు కదా! కాబట్టి అన్నింటికీ పునాది చాలా అవసరం. అదే Self-confidence. నమ్మకము ఉండాలి.

(ద.స.98.పు.88)

(చూ॥ అయస్కాంతశక్తి, ఆచరణ, భక్తి, రోగవిముక్తుడు)

నమ్మిచెడినవారు లేరు

భగవంతుడు మనల్ని కష్టాలలో చూసినంత ఆప్యాయంగా సుఖాలలో చూడడు. అయితే సుఖాలలో కూడా చూసే అవకాశాలు లేకపోలేదు. భగవంతుని దృష్టిలో కష్టసుఖాలు రెండూ సమానమే. హృదయపూర్వకంగా భగవంతుని ప్రేమించిన వారికి ఎటువంటి కొరత ఉండదు. నమ్మక చెడినవారలున్నారు కాని నమ్మిచెడినవారు ఈలోకంలో లేరు లేరు లేరు.

(త.పు.204)

నరకచతుర్దశి

ఈనాడు నరక చతుర్దశి, **దుఃఖముతో కూడినటువంటి దానిని నరకమంటారు.** న..ర...క 'క' ఇది దుర్గణములకు లక్షణము. **'నరక' అనగా దుర్గుణములతో కూడిన నరత్వము అని, నరకమునకు గొని పోయే మానవత్వము** అని, అలాంటి దానిని ఏవిధంగా సాధించాడు కృష్ణుడు? అసలు **కృష్ణుడనగా ఎవరు?** దేవకీ దేవుని కుమారుడని, యశోద కుమారుడని భావిస్తున్నాం ఇదికాదు, **"కర్షతీతికృష్ణుః" అనగా ఆకర్షించే టటువంటి దివ్యత్వం! అట్టి ఆకర్షించేటటువంటి దివ్యత్వం ఏమిటి? అదియే Magnet (అయస్కాంతం) మాగ్నెట్ అంటే ఏమిటి?** అది పరిశుద్ధమైనటువంటి శక్తి, తేజస్సు. అదియే శక్తి తరంగములు. అట్టి శక్తి తరంగములు సర్వత్రా వ్యాపించి ఉంటున్నాయి కనుక అట్టి Vibration (కంపనము) యే నిజమైనటువంటి కృష్ణతత్వము. ఆవైబ్రేషన్‌యే ప్రాణ

సమానం. ఆ ప్రాణ సమానమైనటువంటి వైబ్రేషన్ దివ్యత్వమునకు కళంకం కలగకుండా చూస్తుంది. అదియే **'ప్రజ్ఞానం బ్రహ్మ' అదియే 'రేడియేషన్' (ప్రకాశం) ఆ రేడియేషన్, వైబ్రేషన్ రెండూ చేర్చి ఈ దేహమును కదిలింపజేసి, పోషింపజేసి, ఈ దేహమును జగత్తులో నివసింపజేస్తుండాలి. ఇదియే "ఓం భూర్భువః స్సుః" ఇదియే గాయత్రీ మంత్రమునందు ఉండిన అంతరార్థము. కనుక మనయందు ఈ వైబ్రేషన్, ఈ రేడియోషన్ ఈ మెటిరియలైజేషన్ - ఈమూడు ఏకమైనటువంటి జీవితమే మానవ జీవితము. కనుక మనలో నున్నటువంటి దుర్గణములు, దురాలోచనలు, దుశ్చింతనలు అనేటటువంటి ఈ నరకాసురుని చంపాలి.** ఈ దుర్గుణాలను చంపడానికి కృష్ణుడు సత్యభామను సహాయం తీసుకున్నాడు. **'సత్యభామ' అంటే ఏమిటి? 'భామ'అనగా, భరించేటటువంటిది.** సత్యముతో భరించేటటువంటిది. కనుక **సత్యమును ఆధారం చేసుకొని ఈ దుర్గుణములను హతమార్చాడు శ్రీకృష్ణుడు.** సత్యమును ఆధారము చేసుకొని అసత్యము, అనిత్యమై నటువంటి దుర్గుణములను నిర్మూలనం చేశాడు. కనుక మనం ఈనాడు సత్యమును ఆధారం చేసుకోవాలి. **"సత్యంనాస్తిపరో ధర్మః".** ఈ సత్యము కేవలం ఒక రాష్ట్రమునకు, ఒక దేశమునకు, ఒక వ్యక్తికి మాత్రమే సంబంధించినటువంటిది కాదు. సర్వులకూ సంబంధించి నటువంటిది, కాలాతీతమైనటువంటిది సత్యం. సత్యము పైననే ఈ జగత్తు ఆధారపడి ఉన్నది. కనుక సత్యమే దైవము (Truth is God) కనుక సత్యమార్గమునే అనుసరించు సత్యమును పలుకు, అదియే నీ ప్రధానమైన సాధన.

రాక్షసగుణములను ఈనాడు మనం నిర్మూలనం గావించాలి. దైవచింతనచేసి, మనలోనున్న దుర్గుణములను దూరం గావించుకొని నేను మానవుడనే సత్యాన్ని నిలపాలి. అంతేగాని మానవజన్మ ఎత్తి, పశుపక్ష్య మృగాదులవలె జీవించటం కాదు. ఎంత సంపాదించినా, మనం ఏమి తీసుకొనివెళ్లుతున్నాం? **'కీర్తి' అనే ఒక దానినే మనం సంపాదించాలి 'మంచివాడు' అనే పేరును సంపాదించాలి. ఆ ఒక్క పేరు మాత్రమే శాశ్వతంగా నిలిచిపోతుంది. కనుక ధర్మము, కీర్తి - ఈరెండింటిని కాపాడుకునే నిమిత్తం మన జీవితంలో ప్రతిక్షణమునూ వినియోగించుకోవాలి.** కనుక ఈ సత్యమార్గంలో ప్రవేశించి, **దుర్గుణములను దూరం గావించిన దినమే ఈ 'నరకచతుర్దశి'.**

ఈనాడు దీపావళి...దీపావళి.. అని పటాసులు కొట్టి, శబ్దాలు వాయించి, మతాబులు కాల్చి ఆనందాన్ని అనుభవిస్తున్నాం. ఆనాటి దేవతలు ఏవిధంగా అనుభవించారంటే దుర్మార్గుడైన నరకాసురుని హతం చేయటం చేతనే, ఈనాడు చాలా ఆనందమని భావించి, మందు సామానులు కాల్చి ఆనందంతో ఉప్పొంగి పోయారు. ఇంతియేగాక ఈ పటాసులు కొట్టటంలో కూడా మరొక అర్థం ఉన్నది. **ఇప్పుడు వర్షాకాలం అనేక విషక్రిములు అభివృద్ధి అవుతుంటాయి ఈ మతాబుల వాసన చేత విషక్రిములు నశించిపోతాయి, వ్యాపించే రోగములు నివారణ అయిపోతాయి. ఆనందాన్ని కూడా కలుగజేస్తాయి.** కేవలం మతాబులు కాల్చి ఆనందించడంకాదు, మనలోనున్న దుర్గుణాలు పోవాలి. అప్పుడు సహజంగా మనకు ఆనందం ప్రాప్తిస్తుంది. అటులకాకుండా దుర్గుణాలు లోపలపెట్టుకొని, ఎన్ని విధములైన సాధనలు చేసినా ప్రయోజనం లేదు. మొట్ట మొదట ఆ దుర్గుణాలను దూరం చేయాలి. అది చేయటానికి దైవచింతన కావాలి. ఆ దైవచింతన చేయాలి, వినాలి, అనుభవించాలి కనుక శ్రవణం చేయండి! భజనలు చేయండి!మననం చేయండి!

(శ్రీ.న.95 పు.77/78)

నరకము

కాలు జారితే కలుగదు నష్టం నోరుజారితే నరకమేరా!

(భ.స.ప్ర.పం.పు.42)

(చూ॥ నరకచతుర్దశి, ప్రాణము)

నరకమునకుపోయేవారు

నరకమునకుపోయేవారు

(చూ॥ పాపం)

నరకాసురుడు

బాహ్యంగా జరిగినది నరకాసుర వధ. అంతర్భావంలో జరిగినది - **దుర్గుణముల నిర్మూలనము. అన్ని దుర్గుణముల కంటే అహంకారము, అసూయ చాలా చెడ్డవి.** ఎట్టివాడినైనా అహంకారము క్షణంలో క్రిందకు త్రోసివేస్తుంది. అసూయ నెమ్మదిగా ప్రవేశించి జీవితాన్నే నాశనం గావిస్తుంది. కనుక, నరకాసుర వధ అనేది మానవుని యందుండిన అహంకార అసూయల వంటి దుర్గుణాలను దూరము గావించే నిమిత్తమై జరిగిన చరిత్ర.

దీనికి వైజ్ఞానికంగా మరొక చరిత్ర ఉన్నది. ఈ విశ్వంలో ప్రాచీన కాలము నుండి అనేక గ్రహాలు తిరుగుతూ ఉన్నవి. అయితే, ద్వాపరయుగంలో "నరక" అనే గ్రహము భూమికి అతి సమీపంగా వచ్చింది. ఈ గ్రహము భూమిపైన పడితే భూమి అంతా భస్మమైపోగల ప్రమాదం ఏర్పడినది. చల్లనైన చంద్రుడే భూమికి రెండడుగులు దగ్గరగా వస్తే అనేక ప్రమాదాలు సంభవిస్తాయి. కనుక, ద్వాపర యుగంలో- "నరక" అనే గ్రహము భూమిని ఢీకొనడానికి సమీపించగా ఆ విపత్తు నుండి కాపాడమని ప్రజలందరూ కృష్ణుని ప్రార్థించారు. అప్పుడు కృష్ణుడు ఆ గ్రహాన్ని సంహరించి లోకాన్ని సంరక్షించిన ఘట్టమే నరకాసుర సంహారము.

ఆనాటి ప్రజలు భూమిని భస్మం చేయడానికి సమీపించిన **నరకగ్రహాన్ని ఒక రాక్షసునిగా విశ్వసించారు. ఏలనగా, ప్రపంచాన్ని నాశనం చేయడానికి ప్రయత్నించేవాడు రాక్షసుడే కదా!** పూర్వము జర్మనీ దేశస్థుడైన హిట్లర్ అన్ని దేశాలపైన దండెత్తాడు. అతడి రాక్షసత్వాన్ని వ్యతిరేకిస్తూ పూర్వం తల్లులు ఒక జోలపాట కూడా పాడేవారు.

"హంతకుడు హిట్లరు అమర రష్యాపై
దండెత్తి వచ్చెనని జడిసి ఏడ్చితివా"
జో!....జో!...!
హిట్లరుని చంపుటకు ఎట్టసైన్యంబు
వీరుడొ స్టాలిను గలరు, ఏడవకు ....జో!...జో!" కనుక, ఆనాటి వారందరూ **హిట్లర్‌ని కూడా ఒక రాక్షసునిగా భావించారు.** అదేవిధంగా ద్వాపరయుగములో 'నరక' గ్రహాన్ని అందరూ రాక్షసునిగా విశ్వసించారు. అనేక మంది అతడి వలన అనేక బాధలకు గురియైనారు. అందుచేతనే, నరకాసురుడు పదహారు వేలమంది గోపికలను అపహరించాడని అంటున్నాము. అట్టి రాక్షసుని శ్రీకృష్ణుడు సంహరించి, ఆ గోపికలను విడిపించాడు. ఆ పదహారు వేల మంది గోపికలను వారివారి ఇళ్ళకు వెళ్ళి క్షేమంగా జీవించవలసినదిగా కృష్ణుడు అదేశించాడు, కాని, ప్రాకృతికంగా గోపికలు - "స్వామీ! లోకులు కాకులు. ఇంత కాలంపాటు మేము ఆ రాక్షసుని ఆధీనంలో జీవించి ఇప్పుడు మా ఇళ్ళకు వెళ్ళితే లోకులు నిందిస్తారేమో! ఈ లోక నిందను మేము భరించలేము. కనుక, ఈ బంధము నుండి రక్షించిన మీరే మమ్మల్నికాపాడి పోషించమని ప్రార్థిస్తున్నాము" అన్నారు. కనుక. **వారు అతని పత్నులుకాదు. తనద్వారా రక్షింపబడినవారు కనుకనే శ్రీకృష్ణుడు వారిని పోషించుతూ వచ్చాడు.**

(స.సా.న.92 పు.269/270)

(చూ॥దీపావళి)

నరజన్మ

ప్రేమస్వరూపులారా! **"జంతూనాం నరజన్మ దుర్లభం"** మానవ జన్మ మహా దుర్లభమైనది. ఇది భగవంతునియొక్క వరప్రసాదం. భగవంతుడను గ్రహించిన పవిత్రమైన ఈ మానవ దేహాన్ని **పరోపకార సంబంధమైన పనులలో ప్రవేశపెట్టాలి.** కొంతమంది ఎప్పుడు చూసినా పరదూషణలోనే కాలాన్ని వ్యర్థం చేస్తుంటారు. అది అనేక జన్మల పాపఫలం తప్ప అన్యం కాదు. **నోటి నుండి దూషణ అనేదే రాకూడదు. నోటినిచ్చినది ఇతరులను తిట్టడంకోసం కాదు. మంచి మాటలు మాట్లాడాలి. "సత్యం**

కంఠస్య భూషణం". కంఠమునకు అలంకారం ముత్యాల దండ కాదు, డైమండ్ నెక్లెస్ కాదు; సత్యమే కంఠమునకు భూషణం. చేతులకు అందము రత్నాల కంకణాలు కాదు. "హస్తస్య భూషణం దానం", దానమే చేతులకు అందము. భగవంతుడు మీకు చెవుల నిచ్చినది ఎందుకోసం? కన్నుల నిచ్చినది ఎందుకోసం? బజార్లో ఎక్కడైనా ఎవరైనా పోట్లాడుతున్నారని తెలిస్తే ప్రజలందరూ అక్కడికి గుంపులు గుంపులుగా పరుగెత్తి పోతారు. ఆ పోట్లాటలు చూడటానికా మీకు కన్నుల నిచ్చినది? వారి దుర్భాషలను వినటానికా మీకు చెవుల నిచ్చినది? ఛీ, ఛీ, మీ కన్నులను ఎంత అపవిత్రం గావించుకుంటున్నారు! మీ చెవులను ఎంత దుర్వినియోగపర్చుకుంటున్నారు!

"ప్రొద్దుబోక ఊరివారి సుద్దులంటే మీరు సిద్ధమౌదురే కదు శ్రద్ధతోడ; ముద్దుముద్దుగాను భగవత్ ముచ్చటలు చెప్పువేళ ఒద్దికగ నుండరేల ఓ చెవులారా;"

భగవంతుడు మీకు చెవుల నిచ్చింది ఊరివారి సుద్దులు వినడంకోసం కాదు. పవిత్రమైన భగవన్నామాన్ని వినడానికి మీకు చెవుల నందించాడు. ఇంక, కన్నులను దేనికోసం ఇచ్చాడు?

"పనికిమాలిన సినిమాలు పలుమారు మీరు చనిచని కనినను తనివిలేదే! క్షణమైన దైవసన్నిధి నిలుపగ కనులారా కదు కష్టమౌగా?"

కన్నుల నిచ్చినది భగవంతుని సుందర రూపాన్ని దర్శించడానికేగాని, సినిమాలు, టీవీలు చూడటానికి కాదు. టీవీలు, సినిమాలు చూసి పవిత్రమైన కన్నులను దుర్వినియోగపర్చుకోవడంచేత ఈనాడు చిన్నచిన్న పిల్లలకు కూడా కంటిజబ్బులు వస్తున్నాయి. మధ్యవయస్సులోనే కన్నులను క్యాటరాక్టు పొరకప్పిచేస్తున్నది. ఈ దేహానికి 75 సంవత్సరాలు వస్తున్నాయి. కాని, నా కన్నులకు క్యాటరాక్టు అనేదే లేదు. కారణమేమిటి? నేను టీవీలు, సినిమాలు చూడను. మీరు చూడవలసింది ఏమిటి? టీవీలు, సినిమాలలలోని వేషాలను కాదు; దైవస్వరూపాన్ని చూడాలి.

(స.సా.మే2000 పు.133)

ఓ పురజనులారా! ఓ గురుబ్రాహ్మణులారా! నమస్కారము. నామాటలను శాంతముతో శాంతముగా వినుడు. స్వార్థపరుడనై నేను దురభిమానముతో ప్రసంగించుట కాదు. నేను మీరాజునని చెప్పుటయు కాదు. మిమ్ముల చెడుమార్గముల సంచరింపుడని బోధించుటయు కాదు. నా మాటలు మంచివని మీకు తోచినయెడల ఆ ప్రకారము సంచరింపుడు. **నా మాటలను విని వాటి ప్రకారము నడచుకొనువాడే నా స్నేహితుడు. వాడే నాతమ్ముడు. నేనొక తప్పుమాట చెప్పినను, మీరు వెనుదీయక, నా తప్పును నాకు చూపుడు. అన్ని జన్మలకంటే నరజన్మము దుర్లభము** అని వేదపురాణములును, మహానీయులును చెప్పిరి, చెప్పుచున్నారు. ఎంతో పుణ్యము చేసియుండినకాని నరుడై పుట్టడు. అది దేవతలకు సహితము దుర్లభము. **నరజన్మ మోక్షమునకు ద్వారము. సకల సాధనములకు రాజమార్గము.**

(రా.వా.రె.పు.225)

(చూ॥ ఆపద్బంధువు)

నరపశువు

నరుడైనందుకు పరమాత్మాయని
తలచిన నరుడని ఎంచండి
భగవన్నామము వలదనె నరుని
నరపశువని భావించండి

(ము.ము.పు.77)

నరసింహావతారము

నరసింహావతారమును జూచినపుడు ప్రహ్లాదుడు గడ గడ వణకెను. ఎందుకు అట్లు వణకుచున్నావని భగవంతుడు అడుగగా మీరు భయంకర రూపమున నున్నారని భయపడుటలేదు. అన్ని రూపములు మీవే కదా. మీరు త్వరలో అదృశ్యులవుతురేమోయను భయముతో వణకుచున్నానని ప్రహ్లాదుడు బదులు

నరుడు

చెప్పెను. హిరణ్యకశిపుడు రజోగుణము గలవాడగుటచే మోహనావతారమును చూడలేకపోయెను. ప్రహ్లాదుడు భక్తుడైనందువల్ల అదే రూపమును భయంకరముగా తలంచక ప్రేమ భావముతో చూచుటవల్ల భగవంతుడతనికి సాధు రూపముతో దర్శనమిచ్చెను.

(జ.పు.184)

నరుడు

పేలముల పైని పేరాశ విడువ లేక
బోను నందెలుకలు పడిపోయినట్లు
తుచ్ఛ విషయ సుఖాసక్తి దూలి నరుడు
వద్దనే యున్న ఆనంద పదవి వదలు

(స.సా.ఫి.2000 పు.47)

సకల సద్గుణములు చక్కగా లేకున్న
వాడు నరుడు కాడు వాస్తవముగ
సవినయుండుగాక సచ్చరితుండెట్లగును।
ఉన్నమాట తెలుపు చున్నమాట॥

(సా.పు.519)

నరుడనగా అర్థమేమిటి? ఆత్మకే 'నరః' అని పేరు. 'నరః' అనగా ఆత్మస్వరూపుడే. ఒకానొక సమయంలో **గోపికలు "క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా" అన్నారు. 'క్లీం' మొదటిది, 'కృష్ణాయ' రెండవది; 'గోవిందాయ' మూడవది; 'గోపీజన వల్లభాయ' నాల్గవది, 'స్వాహా' ఐదవది. ఇవే పంచభూతములు.** ఈ పంచభూతముల స్వరూపమే మానవత్వములో చేరి ఉన్నది. పంచ భూతములు లేని స్థలముగాని, పంచభూతములు లేని జీవితముగాని జగత్తులో కానరాదు. పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము సర్వత్ర వ్యాపించినవి. కనుకనే భగవంతుడు సర్వత్రా వ్యాపించినవాడని వారు నిర్ణయము చేసుకొన్నారు. ఈ పంచభూతములను సద్వినియోగ పరచుకోటమే మానవుని ప్రధాన కర్తవ్యము. అగ్నిని దుర్వినియోగము చేసుకోవటం భగవంతుని దుర్వినియోగం చేసుకోవటమే; జలమును దుర్వినియోగం చేసుకోవటం భగవంతుని దుర్వినియోగం చేసుకోవటమే; పృథ్విని దుర్వినియోగం చేసుకోవటం కూడా భగవంతుని దుర్వినియోగం చేసుకోవటమే. మానవుడు పాంచ భౌతిక దేహమునే విశ్వసించి దీని సుఖములకోసం, దీని అనుకూలముల కోసం జీవితాన్ని అర్పితము చేస్తున్నాడు.

(ద.స.98. పు.34/35)

విద్య యెసగు వినయము! వినయమునను
బడయు పాత్రత! పాత్రత వలన ధనము!
ధనము వలన ధర్మము! దానివలన
ఐహికాముష్మికా! సుఖముల నందు, నరుడు॥

(సా.పు.289)

నీటియందే పుట్టి, నీటియందే నిలిచి
నీటి యందే అడంగు నీటిబుగ్గ
నరుడు బుద్బుదము నారాయణుడు నీరు
సత్యమైన మాట సాయిమాట॥

(సా.పు.301)

పాపకర్మంబు నరుడు ఓపికతోచేయు
పాప ఫలము నుడువ నోపకుండు!
పుణ్యమును విడుచు బుద్ధిపూర్వకముగాను
పుణ్య ఫలము గుడవబోవ నహహా॥

(సా.పు.576)

చెవులకెవ్వడు వినుశక్తి చేర్చెనోయి
కనుల కెవ్వడు ఇచ్చెను కాంతిరేఖ
అట్టివానిని వెతికెడి వాడె నరుడు

(బృ.త్ర.పు. 54)

(చూ॥ జ్ఞానోదయము, దేవుడు, నాలుక, పండితుడు, పుణ్యకర్మలు, వేదము)

నర్తకి

(చూ॥ ఆపద్బంధువు)

నవద్వారము

(చూ॥ దేహమే దేవాలయము)

నవనీత చోరుడు (శ్రీకృష్ణుడు)

శృంగార రూపుడు ఉపదేశస్తాయుడు।
నవనీత చోరుడు నరసఖుండు
మోహన రూపుండు ముక్తి ప్రదాయుడు।
భక్తార్తి హరుడు భవ హరుండు
గర్వాపహరుడు కమనీయ చెలుడు।
వనమాల ధరుడు అనన్య హితుడు
తేజ స్వరూపుడు ప్రేమ స్వభావుడు ।
వారిజ లోచనుండు కారణుండు
సుజన మానస చోరుడు సుందరుడు।
దేవకీ గర్భ రత్నంబు దేవకుండు
వాసుదేవుండు యదు వంశ వర్ధనుండు॥

(సా.పు.556/557)

నవవిధభక్తిమార్గములు

(చూ॥ కృష్ణునిలీలలు)

నవవిధ భక్తులు

(చూ॥ దైవమును విమర్శించకండి)

నా ఆయుధం

ప్రత్యేకంగా అనుసరించవలసిన విధానంగాని, ప్రత్యేక యంత్రాంగమో, మంత్రాంగమో కాని నావద్ద లేవు. నా పద్ధతి చాలా సులభమైనది. సరళమైనది. ప్రేమతో మనస్సులను మార్చడంపైన ఆధారపడి ఉంటుంది. **ప్రేమే నా సాధనం. ప్రేమే నా ఆయుధం. ప్రేమ స్వరూపునిగా వర్ణించటమే సరైన పద్ధతి.**

(స.శి.సు. నా. పు. 95)

నా ఆశయము

(చూ॥ నా సందేశము)

నా కర్తవ్యము

కల్పవృక్షమువంటివాడను! యెవరు దేనిని కోరిన అది అందించుటే నా కర్తవ్యము, వ్యక్తుల భావనాను కూలము ననుసరించుచూ, దానికి తగిన ఫలమును ప్రసాదించు చుందును. **ద్వేషము కాని, భేదముగాని, పక్షపాతముకాని నాకు యేనాడునూ లేదు; రాదు. నిర్దయ నా నీడను కూడా తాకలేదు; నాలో యెట్టి వైషమ్యమునూ ఆరోపించుటకు వీలులేదు.** ప్రకాశించు సూర్యుని కిరణములు తనకు యెదురైన వాటిపైనంతా వ్యాపించును. తనకు మరుగైన వాటిని తానెట్లు ఆక్రమించును! అటులనే నేనూ, ఏ విధమయిన ఆభీష్టములను కోరుదురో ఆ యభీష్టములను తీర్తును. కనుక ఉత్తమభావముల వృద్ధి చేసుకొన్న ఉత్తమస్థానమును, **అల్ప భావములు వృద్ధిచేసుకున్న అధమస్థానమును అందింతును. దీనికి భక్తుల భావదోషములు తప్ప భగవంతుని అనుగ్రహాలోప మేనాడునూ లేదు.**

(గీ.పు.68)

(చూ॥ జ్ఞానసిద్ధి)

నా జీవితము

ఈ కళాశాలలో సక్రమంగా విద్యాబోధన తదితర కార్యక్రమములు ఆదర్శవంతముగా జరుగుచున్నవంటే - ఇవన్నీ నా ఒక్కని చేతిమీదగానే జరుగుతుంది. ఇప్పుడు యిక్కడ మైకు ఎక్కడ పెట్టాలి అనే విషయము యింతకు పూర్వము కస్తూరితో, గోపీనాథ్‌తో చెప్పాను. ఈ విషయము మీకు తెలియదు. సాయిబాబా చక్కగా మందిరములో సుఖముగా నిద్ర పోతున్నారని అనుకొంటారు. నాకు సుఖము ఏది? మీతో కలసి వుండడము మీతో సంప్రదించడము యిదే నా సుఖము. అందువలననే **My Life is My Message (నాజీవితమే నాసందేశము)** అంటాను. తెల్లవారుఝామున 4 గంటలనుంచి రాత్రి 10 గం॥వరకు నిరంతరము పని చేస్తూనే ఉంటాను. ఇదే నా **ధ్యాస,** దేనిని పట్టించుకోను,

నా జీవితమే నా సందేశము

దేనికీ వెరువను, నేనెప్పుడూ ఆనందముగానే ఉంటాను. నిరంతరము చిరునవ్వుతోనే ఉంటాను. కారణమేమిటి? జరుగవలసినదేదో జరిగి తీరుతుంది. **రెండు బాధల మధ్యనే సుఖము లభిస్తుంది. అందువలననే 'నసుఖాత్ లభ్యతే సుఖమ్"** అన్నారు. సుఖమునుంచి సుఖము దొరకదు. కష్టమునుంచే లభిస్తుంది. ఈ సత్యాన్ని గుర్తించాలి.నిరంతరము ఎయిర్‌కండిషన్డ్ (Air Conditioned) గదిలో కూర్చునేవానికి ఆ గదియొక్క చల్లదనము తెలియదు. ఒక పర్యాయము బయట ఎండలోనికి వెళ్ళివచ్చినప్పుడు ఆ ఎయిర్ కండిషన్డ్ యొక్క విలువ తెలుస్తుంది. అదే విధముగ పగటి పూట దీపముయొక్క ప్రకాశము తెలియదు. చీకటి ఉంటేనే వెలుతురు ప్రకాశించేది.

(శ్రీ.ది.పు.31/32)

నా జీవితమే నా సందేశము

ఈ దేహం పుట్టినప్పటి నుండి సేవలోనే నిమగ్నమై యున్నది. మీరు కూడా సేవకే మీ జీవితాన్ని అంకితం చేయాలి. ఇదియే నా సందేశం. నేను ఏది చెప్పినా ముందు నేను చేసి మీకు చూపిస్తున్నాను. నేను సర్వులను ప్రేమించి మిమ్మల్ని కూడా ప్రేమించమని చెపుతున్నాను. కాని, ఈ ప్రేమతత్వాన్ని మీరు సరిగా అర్థం చేసుకోవడం లేదు.**"నా జీవితమే నా సందేశం"** అన్నాను. అయితే, మీరు స్వామి ఆదేశాలను ఆచరణలో పెట్టి మీ జీవితాన్ని స్వామి సందేశంగా మార్చుకోవాలని ఇంతకు ముందు ప్రసంగించిన అమ్మాయి చెప్పింది. మీరు స్వామి చెప్పినట్లుగా నడుచుకున్నప్పుడే మీ జీవితం నా సందేశంగా ఉంటుంది. అంతేగాని, **మీరు చేయరాని పనులు చేస్తూ "మా జీవితమే స్వామి సందేశం" అనటం చాల తప్పు. అది మీ సందేశమేగాని, నా సందేశం కాదు.** ఏది చేసినా దైవకార్యంగా భావించి చేయండి. మీరు ఏ రంగు అద్దాలు ధరిస్తారో జగత్తంతా అదే రంగుతో కనిపిస్తుంది. అది మీరు వేసుకున్న అద్దాలయొక్క దోషమేగాని, జగత్తు యొక్క దోషము కాదు కదా! అదేవిధంగా, మీకు కనిపించే మంచి, చెడ్డలన్నీ మీలో ఉన్నవేగాని, బయట ఉన్నవి కావు. **ఒకడు చెడ్డవాడని, మరొకడు మంచివాడని నిర్ణయించే అధికారం మీకు లేదు.** మొట్టమొదట మీలో ఉన్న చెడ్డను నిర్మూలించుకోండి. అప్పుడు మీకు ఎక్కడ చూసినా మంచియే కనిపిస్తుంది.

(స.సా.డి.99 పు. 369)

(చూ॥ దివ్యప్రకటనలు)

నాడీకేంద్రము

(చూ॥ రూపనామములు)

నాడీగ్రంథము

(చూ॥ పద్మపురాణం)

నాద బిందు కళలు

ఉపనిషత్తులు సమస్త విషయములను క్రోడీకరించి ఒక త్రికోణముగా రూపొందింప చేస్తూ వచ్చాయి. శరీరము, మనస్సు, ఆత్మ - ఈ మూడూ ఒక త్రికోణము. శరీరము స్థూలము, ఆత్మ సూక్ష్మము. ఈ స్థూల, సూక్ష్మములు రెండింటినీ మనస్సు ఏకము చేస్తున్నది. ఏవిధంగానైతే **నాద బిందు కళలు సర్వత్రా వ్యాపించి యున్నవో అటులనే మనస్సు కూడను సర్వత్రా వ్యాపించి ఉంటున్నది.** ప్రణవము సర్వత్రా ఉంటున్నది - అదే **"ఈశావాస్య మిదం జగత్".** మనస్సు సర్వత్రా వ్యాపించినదగుటచేత - **"మనో మూల మిదం జగత్"** అయింది. నమస్తమునకూ మనస్సే కారణం. సుఖదుఃఖములకు, పాపపుణ్యములకు, ఆనంద ఆహ్లాదములకు మనస్సే కారణము. ఐతే, ఈ మనస్సు స్థూలమైన శరీరమును అదుపులో నుంచుకొని తగిన కర్తవ్య కర్మలను నిర్వర్తించడానికి కృషి సల్పాలి. **శరీరము కేవలం జడమైనది. పదార్థములతో కూడినది. దీనికి చైతన్య శక్తి లేదు. ప్రాణమే దీనికి చైతన్యము కలిపిస్తున్నది.**

ఇదే నిజమైన చైతన్యశక్తి. ఐతే, ఈ చైతన్య శక్తి ఎక్కడనుంచి లభిస్తున్నది? ఇది ప్రజ్ఞానము నుండి లభిస్తున్నది. కనుక "రేడియేషన్" అనే ప్రజ్ఞానము నుండి ప్రాణమనే "వైబ్రేషన్" ప్రవేశించి దేహమనే "మెటీరియల్" లోపల జీవిస్తూ ఉంటున్నది. దీనినే సత్ చిత్ ఆనందమనే త్రికోణంగా జాగ్రత్ స్వప్న సుషుప్తులనే త్రికోణంగా రూపొందింప జేసినది ఉపనిషత్తు. జాగ్రత్ స్వప్న సుషుప్తులు కాల వ్యత్యాసములే కాని, అనుభవించే వ్యక్తి ఒక్కడే. అన్నింటి యందు ఏకత్వాన్ని నిరూపింపజేసేది ఉపనిషత్తు.

(స.సా. ఫి 1994. పు. 40/41)

నాదములు

నాదములు స్థూలదేహమంతే వున్నవి. అవి దశవిధములు; లలాది ఘోషము, భేరీనాదము, చణీనాదము, మృదంగ నాదము, ఘంటానాదము, కళానాదము, కింకిణీనాదము, వేణునాదము, భ్రమరనాదము, ప్రణవనాదములు.

(ప్ర.శో.వా. పు. 7)

నాథుడు

(చూ॥ అనాథుడు)

నామంచికే

ఏది జరిగినా "నామంచికే" అన్న భావం మీలో రావాలి. దీన్ని Positive Thinking అనవచ్చు. ఈనాడు మీరు హృదయాన్ని నెగెటివ్ భావాలతో నింపుకున్నారు. అలాంటప్పుడు భగవంతుడనే పాజిటివ్ ను ఎలా గుర్తించగలరు? మీ దేహము, మనస్సు, చిత్తము, అహంకారము అంతా నెగెటివ్‌కు సంబంధించినవి. **ఆత్మ ఒక్కటే పాజిటివ్. భగవంతుడు ఆత్మస్వరూపుడు. మీరు ఎన్ని సాధనలు చేసినప్పటికీ నెగెటివ్ భావాలను త్యజించనంత వరకు భగవదనుభూతిని పొందడానికి వీలుకాదు. పాజిటివ్ భావాలతో పాజిటివ్ క్రియలలో ప్రవేశించినప్పుడే భగవదనుగ్రహం లభించగలదు.** చిన్న ఉదాహరణ: విద్యార్థియైనవాడు శ్రద్ధగా విద్య నభ్యసించాలి; ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణుడు కావాలి; తరువాత ఉద్యోగంలో ప్రవేశించి సమాజ సేవ చేయాలి. తల్లిదండ్రులను సేవించాలి. ఇదంతా పాజిటివ్. అట్లుగాకుండా, ఏది చదివితే ఏ ఉద్యోగం చిక్కుతుంది? విదేశాలకు ఏవిధంగా పోవచ్చును? అక్కడ ఎంత ఎక్కువగా సంపాదించ వచ్చును? అని ఆలోచించడం నెగెటివ్. తల్లిదండ్రులు తమ బిడ్డలను మంచిగా చదివించి, ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దడం పాజిటివ్. అట్లుగాకుండా, తమ కుమారునికి ఎంత జీతం వస్తే ఎంత వరకట్నం లభిస్తుంది? విదేశాలకు వెళితే ఎంత ఎక్కువగా సంపాదించగలడు? అని ఆలోచించడం నెగెటివ్. అదేవిధంగా, వైద్యుడు నిస్స్వార్థంగా రోగికి సరియైన చికిత్స చేసి స్వస్థత చేకూర్చడం పాజిటివ్. అట్లుగాకుండా, "ఈరోగి నుండి ఎంత డబ్బు లభిస్తుంది?" అని ఆలోచించడం నెగెటివ్. మీ హృదయాన్ని భగవద్భావము, భగవచ్చింతన, సదాలోచనలనే పాజిటివ్‌తో నింపుకోవాలి. అప్పుడే మీరు భగవదనుగ్రహమును, శాంతిని, ఆనందమును అందుకోవడానికి వీలవుతుంది. **భగవంతుడు ఏది చేసినా, ఏదిచెప్పినా, "అంతా నా మంచికే" అని భావించడమే Positive Thinking.** ప్రారంభంలో ఇది కొంత కష్టమనిపించినప్పటికి అనుభవం మీద ఈ సత్యాన్ని గ్రహించగలరు.

దీనికి ఒక చక్కని కథ ఉన్నది. ఒక రాజుగారికి చెఱకు గడను తానే స్వయంగా కత్తితో ముక్కలు చేసుకుని ఆరగించాలని కోరిక కలిగింది. వెంటనే ఒక చెఱకు గడను తెప్పించి దానిని కత్తితో ముక్కలుగా తరుగుతుంటే పొరపాటున వ్రేలు తెగింది. ప్రక్కనే ఉండి దీన్నంతా గమనిస్తున్న మంత్రి "రాజా! మే మంచికే జరిగింది" అన్నాడు. ఇది విని రాజు కోపోద్రిక్తు డయ్యాడు. "ఏమిటి! ఈనాడు నా వ్రేలు తెగడం నా మంచికంటున్నాడు. రేపు నా కంఠం తెగినా నష్టం లేదంటాడేమో!" అని అనుకుంటూ మంత్రిని చెఱసాలలో పెట్టించాడు. మంత్రి చెఱసాలకు

నామమహిమ

వెళుతూ "రాజా! ఇది నా మంచికే" అన్నాడు. కొంతకాలం తరువాత ఒకనాడు రాజు వేటకోసం అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ కొంతమంది ఆటవికులు తమ కులదేవతకు నరబలి ఇవ్వాలని ఒక మనిషికోసం వెతుకుతున్నారు. వారు రాజుగారిని చూసి తమ కులదేవతకు బలిఇవ్వడానికి సరియైన మనిషి దొరికాడని ఆనందించారు. వెంటనే అతనిని తమ కులపెద్దవద్దకు తీసుకు వెళ్లారు. కులపెద్ద బలి ఇవ్వడానికి ముందు రాజుగారిని సునిశితంగా పరిశీలించి, అతనికి ఒక వ్రేలు లేకపోవడాన్ని గమనించి, "అంగహీనుడు బలికి పనికి రాడు" అని పలికాడు. వెంటనే వారు రాజుగారిని వదిలిపెట్టారు. అప్పుడు రాజు తనలో తాను ఇలా అనుకున్నాడు. "ఆరోజు నా వ్రేలు తెగినప్పుడు మంత్రి 'ఇది మీ మంచికే' అన్నాడు. అతను చెప్పిన మాట సత్యమే. నా వ్రేలు తెగకపోయి ఉంటే ఈ అటవికులు నన్ను తప్పకుండా తమ కులదేవతకు బలి ఇచ్చి ఉండేవారు". అతడు రాజ భవనానికి వెళుతునే మంత్రిని చెఱసాల నుండి విడిపించి, జరిగినదంతా అతనికి పూసగ్రుచ్చినట్లు వివరించి "మంత్రీ! మీరన్నది సత్యం. నా వ్రేలు తెగడం నా మంచికే జరిగింది. మరి మిమ్మల్ని నేను చెఱసాలలో పెట్టించినప్పుడు 'ఇది నా మంచికే అన్నారు కదా! మీరు చెఱసాలలో ఉండటం మీ మంచికే జరిగిందని ఎలా చెప్పగలరు?" అని ప్రశ్నించాడు. అప్పుడు మంత్రి "రాజా! ఆనాడు మీరు నన్ను చెఱసాలలో పెట్టకపోయినట్లైతే నేను కూడా మీ వెంట అరణ్యానికి వచ్చి ఉండేవాడను. మీకు వ్రేలు తెగిన కారణంగా అటవికులు మిమ్మల్ని వదలిపెట్టి నన్ను బలి ఇచ్చి ఉండేవారు. కనుక, నేను చెఱసాలలో బందీ కావడం నా మంచికే కదా!" అన్నాడు. ఈరకంగా, మీరు Positive Thinking. Positive Attitude, Positive Actions ను వృద్ధి చేసుకోవాలి. అప్పుడే మీకు ఆనందము, శాంతి లభిస్తాయి. కాని, మీ భావాలు దీనికి విరుద్ధంగా ఉంటున్నాయి. దీనికొక దృష్టాంతం: సుమతి శతకంలో ఒక పద్యం ఉంది.

"అక్కరకు రాని చుట్టము
మొక్కిన వరమీని వేల్పు, మోహరమున తా
నెక్కిన పారని గుఱ్ఱము
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ!"

అవసరానికి ఆదుకోని చుట్టాన్ని, యుద్దరంగంలో పరుగెత్తని గుఱ్ఱాన్ని మొక్కినా వరమీయని దేవుణ్ణి గ్రక్కున విడిచిపెట్టాలని దీని అర్థం చెపుతారు. కాని, ఇందులో **'సుమతీ' అనే పదము చాల ముఖ్యమైనది.** అనగా, ఈ పద్యము బుద్ధిమంతులకు మాత్రమే వర్తిస్తుంది అని ముందుగా గ్రహించాలి. నీకు అక్కరకు రాని చుట్టాన్ని వదలాలి అని ఆలోచిస్తున్నావు. కానీ, నీవు ఎవర్ని ఆదుకున్నావు? ఎవరి అవసరాన్ని తీర్చావు? ఇది ఆలోచించావా? యుద్ధరంగంలో పరుగెత్తని గుఱ్ఱాన్ని విడిచిపెట్టాలని అంటున్నావు. కాని, నీకు గుఱ్ఱపు స్వారీ సరిగా వచ్చునో లేదో ఆలోచించావా? మొక్కిన వర మీయని వేల్పును వదలిపెట్టాలని అంటున్నావు. కాని, నీవు యోగ్యుడవు అవునో కాదో ఆలోచించావా? నీవు ఇతరులకు ఉపయోగపడక అందరూ నీకు ఉపయోగ పడాలని, నీకు గుఱ్ఱపు స్వారీ రాకపోయినా నీవెక్కిన గుఱ్ఱం పరుగెత్తాలని, నీకు యోగ్యత లేకపోయినా నీ కోరికలు తీరాలని ఆలోచించడం మూర్ఖత్వం, అజ్ఞానం కాదా!

(స.సా.డి.99 పు.375/376)

నామమహిమ

జీవితారణ్యంలో మృగాలనుంచి మిమ్మల్ని కాపాడగల తుపాకి భగవన్నామం అనే గుండు వదలినప్పుడు తుపాకి పెద్ద ధ్వని చేస్తుంది. నామమనే ధ్వనితోపాటు, భావమనే గుండును వదలి గురిని కొట్టండి. "నామంలో ఏముంది? అని చాలామంది అడుగుతుంటారు. అది కేవలం కొన్ని శబ్దాల సముదాయమే గదా అని అంటారు. నా పలుకులుకూడా శబ్దసముదాయమే గదా! అవి మీ హృదయాలలో ప్రవేశవించగానే మీకు సంతృప్తి ఉత్తేజమూ

ఎందుకు కలుగుతున్నాయి? మాటలకు మహత్తర శక్తి ఉంది. ఉద్రేకాలను రెచ్చగొట్టగలవు. మనస్సులను శాంతపరచగలవు. **సత్యావిష్కరణ చేయగలవు.** అపారమైన శక్తికీ వివేకమునకూ ఆటపట్టులు కాగల మహాశక్తి మాటలలో ఉన్నది కాబట్టి నామమహిమను విశ్వసించి వీలు చిక్కిన వేళల్లో నామము పదేపదే ఉచ్చరించండి.''

(ఉదయం ప్రత్యేక అనుబంధం పు.4)

భక్తునికి భగవన్నామముకంటెను ప్రియమైనది, విలువ గలది మరియొకటి యుండదు. నామము రూపమును భక్తునికి విధేయము కావించి, విధిగా ననుగ్రహించునట్లు చేయును.

(స.వ.పు.19)

నామము

(చూ॥ జన్మాద్యస్యయతః, నరజన్మ, భ్రాంతి, రూపనామములు)

నామరసము

(చూ॥ నాలుక)

నామస్మరణ

ఈ కలియుగము నందు నామస్మరణ మన ప్రాణము. కృతయుగంలో ధ్యానము, త్రేతాయుగంలో యజ్ఞము, ద్వాపరయుగంలో అర్చనం, కలియుగంలో నామస్మరణ నిర్దేశించబడినవి.

"హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ గతి రన్యథా''

ఈ కలియుగంలో నామస్మరణకంటే సులభమైన మార్గము మరొకటి లేదు. ప్రయాణం చేస్తూ మనస్సులో నామస్మరణ చేసుకోవచ్చు. ఏ పనులు చేస్తున్నా నామ నామస్మరణ చేసుకోవచ్చు **ఈ కలిలో ఇది అతి పవిత్రమైన అతి సులభమైన మార్గము.**

(స.సా.మా.96 పు.68/69)

భగవంతుణ్ణి పొందటము మజ్జిగ చిలికినంత తేలిక. అందు వల్లనే భగవంతుని హృదయాన్ని వెన్నతో పోలుస్తారు. వెన్న ఎంత మృదువో భగవంతుని మనస్సు అంత మృదువు. దాన్ని కరిగించటానికి కొద్దిపాటి వెచ్చదనం చాలు. అంటే బాధపడుతున్న తోటి వానిపై కొద్దిపాటి అభిమానం చూపించటము, భగవంతుని నామం పలికేటప్పుడు కాస్త ఆర్తి కనబరచటము అన్నమాట. **నామస్మరణ చేసేటప్పుడు కలిగే చైతన్యమంతటికీ నామమే మూలస్థానము. అదే ప్రాణప్రదమైన అమృతము. మానవుని శక్తికంతటికీ అదే ఊట. నామం స్మరించండి. నామి మీ యెదుట ఉంటాడు. నామి రూపాన్ని ధ్యానించండి. నామం మీ పెదవులపై ఉంటుంది. నామరూపములు రెండూ ఒకే నాణెమునకు రెండు ప్రక్కల వంటివి.**

(వ.61-62పు.180/181)

నామస్మరణతోపాటు సేవలు అత్యవసరంగా చేయాలి; భగవంతుని ఆజ్ఞను శిరసావహించాలి. **ఆజ్ఞను శిరసావహించటమే సరియైన సాధన. భగవంతునికి ఏది ప్రీతియో దానిని చక్కగా అనుసరించ టానికి ప్రయత్నించాలి. ఈనాటి మానవులంతా "నా కష్టములు తీరలేదు, నా బాధలు పరిహారం కాలేదు" అని విచారిస్తూంటారేగాని, "నేను భగవంతుడు చెప్పినట్లు చేస్తున్నానా? భగవంతుని ఆజ్ఞ శిరసావహిస్తున్నానా? భగవంతునికి ప్రీతికరమైన పనులు చేస్తున్నానా?"** అని ఎవరిని వారు ప్రశ్నించుకోవడం లేదు. ఈ ప్రశ్న వేసుకుంటే తప్పక ధన్యులౌతారు. కానీ, ఈ ప్రశ్న వేసుకోకుండా "భగవంతుడు చెప్పింది కాలేదే'' అని వాదిస్తున్నారు. ఇది one way traffic కాదు! **అజ్ఞను నెరవేర్చాలి, అనుగ్రహాన్ని పొందాలి.** నీవు చేసుకున్నవి నీవు చూచుకొని అహంకారంలో మునిగిపోవడం మంచిది కాదు. దైవాభీష్టమును నెరవేర్చే కృషినీవు చేస్తున్నావా? **దైవమునకు తగిన తృప్తిని నీవు అందిస్తున్నావా? దైవాన్ని తృప్తి పరచనివాడు ఇంక ఎవరిని తృప్తి పరచగలడు? దైవాన్ని తృప్తి పరచితే లోకమంతా తృప్తి చెందుతుంది. లేకపోతే**

లోకమంతా విరుద్ధమవుతుంది. కనుకనే, రామకృష్ణ పరమహంస, **"నీకు కానివాడనైతే లోకమాతా! నేను లోకమందు లోకువౌదు లోకమాతా!"** అన్నాడు. కానీ, నీవు దైవాభీష్టమును నెరవేర్చకుండాపోతే నీ అభీష్టం ఎలా నెరవేరగలదు? "నేను స్వామికి చాల సమీపంగా పోతున్నానుగాని, స్వామి దగ్గరకు రావటం లేదు" అనుకుంటారు కొంతమంది. ఇది చాల పొరపాటు. అనిల్ కుమార్ నాకెంత దూరమో నేను అనిల్ కుమార్‌కి అంతే దూరం. యిక్కడి నుండి అక్కడికి, అక్కడి నుండి యిక్కడికి ఒకే కొలతే. కానీ, అనిల్ కుమార్ అనుకుంటాడు, "నేను స్వామికి దగ్గరే ఉంటున్నానుగాని, స్వామి నాకు దూరంగా ఉంటున్నాడ"ని. **నీవు స్వామికి దగ్గరుంటే స్వామి నీకు దూరం ఎట్లా అవుతాడు? దోషం నీవు వేసుకున్న కొలతలోనే ఉన్నది.** నీ నుండి స్వామికి ఒకవిధంగా, స్వామి నుండి నీకు మరొక విధంగా కొలతలు వేస్తున్నావు. కనుకనే, స్వామి దూరంగా ఉన్నట్లు గోచరమవుతోంది. **భగవంతుడు ఎప్పుడూ ఎవరికీ దూరం కాడు. దూరమయ్యేది భక్తుడే. భక్తులలో శ్రద్ధా భక్తులు నన్నగిల్లే కొలది క్రమక్రమేణ భగవంతుడు దూరమవుతున్నట్లు గోచరిస్తున్నది. ఇది మీ భక్తిలోని దోషమేగాని, భగవంతుని శక్తిలోని దోషం కాదు.**

(సా.శు.పు.58/59)

మానవుడు దివారాత్రము నామస్మరణముతో పవిత్రము చేయవలయును. ఆనందముతో ఆర్తితో స్మరించిన, ఏనామముతో, ఏరూపముతో కోరుకొనినను, ఆరూపముతో తప్పక ప్రత్యక్షమగును. ఏమతస్థుడు, ఏ కులస్థుడు, భజించినను, అన్ని నామములు, అన్ని రూపములు, నిత్య సత్యమైన, నిత్య సుందరమైన, ఆ భగవంతునివే కదా!

(సా.పు.291)

ఒకానొక సమయంలో నీ కుమారుడు ఏమి చదివాడో విచారించమని హిరణ్యకశిపుని నారదుడు కోరాడు. అప్పుడు తన కుమారుని రప్పించి హిరణ్యకశిపుడు "నాయనా! నీవు చదివిన చదువుల సారమేమిటి?" అని అడిగాడు. అప్పుడు ప్రహ్లాదుడు...

"నారాయణ: పరంబ్రహ్మ
నారాయణ:పరంప్రేమ
నారాయణ: పరంతపః
సర్వం నారాయణ: సమ"

"తండ్రీ! నారాయణ నామమే నా తపస్సు. నారయణ స్మరణయే నా పరబ్రహ్మ స్వరూపము. నారాయణ ప్రేమనే నా అనంత స్వరూపుడైన దైవత్వము. దానికి మించినది ఈ జగత్తులో మరొకటిలేదు. ప్రేమనే సర్వస్వరూపము" అన్నాడు. ఈ విధంగా **ప్రహ్లాదునివలె** మీరు నిరంతరం నామస్మరణ జరపాలి. **జయదేవుడు, గౌరాంగుడు, తుకారాం, రామకృష్ణ పరమహంస మొదలైన సాధువులు, సంతులు నిరంతరం భగవంతుని ప్రేమను ఆశిస్తూ వచ్చారు. సక్కుబాయి, మీరాబాయిలు భగవంతుని కోసం వెక్కివెక్కి ఏడ్చారు. అట్టి దుఃఖముచేతనే దైవము సాక్షాత్కరించి, వారికి అనుగ్రహప్రాప్తిని అందించాడు.** కాని ఈనాటి కలిప్రభావంచేత ఎట్టి సాధనలు చేయక, కాలు గడపదాటక, కాసు ఖర్చుచేయక దైవముయొక్క అనుగ్రహం వచ్చి వడిలో పడాలని ఆశిస్తున్నారు. ఈనాడు మానవుని యందు ప్రేమ ప్రభావం క్షీణించిపోవటంచేతనే, ఎక్కడ చూచినా దుర్మార్గం, హింసలు తాండవ మాడుతున్నాయి. నీలో క్రోధం ఆవిర్భవించినచో, దానిని కూడా ప్రేమగా మార్చుకో, అసూయ నీయందు ఆవిర్భవించినచో, దానిని కూడా ప్రేమగా మార్చుకో జగత్తులో ఏది జరిగినా దానిని ప్రేమమయంగా విశ్వసించు. జగత్తుకు సర్వవిధములా కర్త ఒక్కడే. అతనే కర్మాధీనుడైనటువంటి దైవత్వము. కర్మాధ్యక్షుడు దైవము. ఒక బల్ల కావాలి. దీనిని చేసేవాడు ఎవరైనా ఒకరుండాలి గదా! ఒక ఇల్లు కావాలి. దానిని కట్టెటటువంటి వ్యక్తి ఒకరుండాలి గదా! అదే విధముగనే ప్రతి పదార్థమునందు కూడనూ, దానిని ఆవిర్భవింపజేసేటటువంటి భోక్తి ఒకటి ఉన్నది. ఈ చరాచరములను సృష్టి గావించినటువంటి సృష్టికర్త భగవంతుడే. కనుకనే అతనికి "కర్మాధ్యక్షుఁ"

అని పేరు పెట్టారు. అన్ని కర్మలయందును తానే అధ్యక్షుడై ఉంటున్నాడు. ఏది చేయవలెననిన, ఏది చూడవలెననిన, ఏది అనుభవించవలెననిన, ఏది తినవలెననిన, ఏది త్రాగవలెననిన - అంతా ప్రేమమయంగానే ఉండాలి.

(శ్రీ.సె.99 పు.8)

ఈ **కలియుగమునందు** నామస్మరణ చేయుటచేత **నాలుకయొక్క పవిత్రత మరింత అభివృద్ధి అవుతుంది.** జిహ్వను సార్థకము గావించుకోవాలంటే హరినామకీర్తనము చేస్తూ రావాలి. **"హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్, కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా"** నామస్మరణకంటె అధికమైన మార్గముగానీ, అధికమైన సాధనగానీ మరొకటి లేదు. మాటలచేత వ్యర్థము గావించుకొనేకంటె పాటలచేత సార్థకము గావించుకోమని బోధిస్తూ వచ్చింది గీత.

(శ్రీ.గీ.పు.57)

అజ్ఞానము దూరమే చేసుకోవాలంటే జ్ఞానము లభించాలి. చీకటి పోవాలంటే వెలుతురు రావాలి. అజ్ఞానము పోవాలంటే జ్ఞానము కలగాలి. జ్ఞానముకలగాలి అంటే అనుగ్రహము కావాలి. అప్పుడే అజ్ఞానమనే గ్రహము దూరమైపోతుంది. త్యాగరాజు 'రామా! నీ అనుగ్రహమనేది ఒక్కటుంటే నాకే గ్రహము లేమిచేయగలవు' అన్నాడు. మానవుని జీవితము కామ, క్రోధ,లోభ, మోహ, మద, మాత్సర్యములతో ఆరాటపడేది కాదు. అనుగ్రహము పైన ఆధారపడినటువంటిది. కనుక యీ అనుగ్రహానికై పాటుబడి మానవత్వాన్ని సార్థకము గావించుకొనే నిజతత్వములో మనము జగత్తుకు ఆదర్శప్రాయంగా నిలవాలి. **"సతతం దైవచింతనం" "సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరి చింతనం" "నాస్తి నాస్తి మహాభాగ కలికాలసమం యుగం, స్మరణాచ్చింతనాదేవ ప్రాప్నోసి పరమాం గతిం" ఈ కలియుగము లోపల నామ స్మరణమునకు మించినది లేదు.**

(శ్రీ.గీ.పు.120)

నామస్మరణము అన్ని సాధనలకంటెను ఉత్తమమైనది. అది యభ్యుదయకారకమయిన సత్ప్రవర్తనము. అది యొక గొప్ప జపము. ఆమోఘమైన తపము. ఈనామస్మరణము వలననే కుచేలుడు శ్రీకృష్ణుని యనుగ్రహమును చూరగొన్నాడు. నీవు నామము స్మరించునపుడు, ఆనామమును నీ భక్తి తోను - ప్రేమతోను నింపుము. అది యే మీ కందరికిని అత్యంత సులభమైన మార్గము.

(స.వ.పు.21)

తనలో నివసించే పరమాత్మను గురించి నిత్యానందమును పొందవలెనని నామస్మరణము అత్యవసరము. **"శబ్దమే బ్రహ్మస్వరూపము". మంత్రోచ్చారణ వలన నామస్మరణ వలన, నామ సంకీర్తనవలన శ్రేష్ఠ ఫలము లభించును. పరమాత్మను సులభముగా కట్టి వేయగలది ఒక నామము. నామస్మరణతో పరమాత్మను పొందవచ్చును. పరమాత్మలోనే లీనం కావచ్చును.**

(సా.పు.39)

నాలుక పవిత్రంగా వుండాలంటే నామస్మరణే ముఖ్యం. జయదేవుడన్నాడు. **"రసజ్ఞే మధుర ప్రియత్వం.** సత్యం హి వందేత్వాం పరమోదం నమామి ఆవర్ణయేత్ మధురాక్షరాణి గోవిందా దామోదర మాధవేతి'' రసజ్ఞత్వం కలిగి సత్యమెరిగిన ఓ నాలుకా! పవిత్రము త్యాగ రూపమై గౌరవ మర్యాదలను కాపాడుకొనే **ఓ నాలుకా! గోవిందా, దామోదరా అనే నామాన్ని స్మరించు"** అని నాలుకను గూర్చి ప్రబోధించాడు. ప్రధానమైనది సాధన, నామస్మరణతో, నాలుక పవిత్రత మరింత అభివృద్ధి చెందుతుంది. నిరంతరము హరినామ సంకీర్తన చేయాలి. "హరేర్నామ, హరేర్నామ, హరేర్నామైవ కేవలం'' నామస్మరణ కంటే అధికమైన సాధన మరొకటి లేదు.

(సా.పు.45)

నాయకుడు

ముఖ్యంగా లీడర్స్‌కు రెండు లక్షణాలుండాలి. **ఒకటి ఇండివిజువల్ క్యారక్టర్, రెండవది నేషనల్ క్యారక్టర్.** స్వాతంత్ర్య సమర యోధులైన **నేతాజీ సుభాష్ చంద్రబోస్,**

నారద/నారదుడు

లోకమాన్య బాలగంగాధర్ తిలక్, సర్దార్ వల్లభభాయి పటేల్ మున్నగువారిని ఈ లక్షణాలు కల్గిన నాయకులుగా పేర్కొనవచ్చు. ఈనాడు లీడర్స్‌లో ఇవి లోపించడంవలన అక్రమాలు, అరాచకాలు, అవినీతి విజృంభిస్తున్నాయి. ఇండివిజువల్ క్యారెక్టర్‌లోపించినవానిని లీడర్ అనడానికి వీల్లేదు. లీడర్ అనేవాడు ముందుండి నడిపించేవాడుగా ఉండాలిగాని, వెనుక నుండి త్రోసేవానిగా ఉండకూడదు. **సేవకుడే నాయకుడు. జితేంద్రియుడే యతీంద్రుడు. కింకరుడు కానివాడు శంకరుడు కాలేడు.** లీడర్స్ ముఖ్యంగా గుర్తుంచుకోవలసింది మరొకటుంది**. First be then do, and tell.** మంచిగా ఉండి, మంచిని చేస్తూ మంచిని చెప్పేవాడే సరియైన లీడర్. దీనినే నేను అప్పుడప్పుడు పిల్లలకు చెపుతుంటాను: **Be good, do good, See good.**

(స.సా.ఫి.99పు.53/54)

(చూ॥ దేశాభివృద్ధి, వినాయకుడు)

నారద/నారదుడు

పొయ్యిమీది గిన్నెలో పాలు పొంగుతుంటే చల్లని నీళ్ళు జల్లుతారు. అది వెంటనే తగ్గిపోయి గిన్నెలో సర్దుకుంటుంది. **పొంగిపోయే పాలు దుర్వాసుడు. పొంగిపోని పాలు నారదుడు. నాలుకమీద నిరంతరమూ భగవన్నామం నాట్యం చేస్తున్నందువల్ల నారదుడు ఇంద్రియాలకు వశుడై పోలేదు,** మి ఇంద్రియాలనూ కోరికలనూ అదుపు చేసుకుంటే మీరిక్కడికి వచ్చి ఈ ప్రసంగాలు విన్నందుకు సత్ఫలితం కలిగినట్లు. నిజమైన బలమూ. సంతోషమూ అందించగల సవ్య మార్గంలో మీరు నడకసాగిస్తే నేను ఆనందిస్తాను.

(వ. 1963. పు. 28)

(చూ॥ ఆనందము, తుంగభద్ర, పాదం, భక్తుడు, భగవంతుడు, మంచివాడు, వాల్మీకి)

నారాయణుని బోధ

"నారాయణుని బోధ నమ్మియుండినచాలు
సామవేదము మీరు చదివినట్లే-
నారాయణుని వాక్కు నమ్మియుండిన చాలు-
ఇల యజుర్వేదంబు నుడివినట్లే-
నారాయణుని వాక్కు నమ్మి సేవించిన చాలు-
పుడమి ఋగ్వేదము నుడివినట్లే-"
వాదమేల అధర్వణ వేదమిదియె-

(యు.సా.పు.98)

నారాయణ స్వరూపములు

ప్రహ్లాదుడు భగవచ్చింతన తప్ప చింతన ఎరుగడు. **అతని దృష్టిలో ఏనుగు, పాము, విషము, అగ్ని అన్నియు నారాయణ స్వరూపములే.** అవి ఎట్లాతనకి హాని చేయగలవు? నీ హృదయమును ముట్టడించి పీడించు రాజస తామసగుణములనెడు **హిరణ్యకశిపుని పాలిటికి భగవన్నామము నృసింహావతారము వంటిది.** వైద్యులిచ్చు కాల్షియం ఘుటికలు, విటమిన్ ఘుటికలు రక్తహీనతయను వ్యాధిని పోగొట్టునట్లు నామఘుటికలు మానసికాందోళన మను వ్యాధిని పోగొట్టును. భగవన్నామమును నోరార కీర్తింపుము. నాలుకపై నామము ఇంటి గడపపై దీపమువలె లోపల వెలుపల గూడా వెలుగును ప్రసరింపజేయును.

(నా.పు.8)

నారాయణుడు

(చూ॥ అనాథుడు, జ్ఞానోదయం, పండితుడు, వైద్యుడు, శాస్త్రములు)

నారికేళ నివేదన

భగవంతునికి మనం నారికేళమును పగుల గొట్టి సమర్పించుతాము. మనలో అల్లుకుపోయిన వాంఛలే కొబ్బరికాయకు గల పీచు. దీనిని తీసి వేయడము మనం చేసే నిష్కామ ఆరాధనకు చిహ్నం. తెల్లని కొబ్బరి మనలోని సత్వగుణంతో కూడిన జ్ఞానానికి గుర్తు. కొబ్బరికాయకు గల మూడు కన్నులు మన రెండు కళ్ళు

మరియు జ్ఞాననేత్రానికి సంకేతం. తీయని నీరు. మనం సమర్పించే ప్రేమామృతం అదే. **నివేదన అంటే మన ఆరాధన.**

పూజచేసి కొబ్బరి కాయను కొట్టినప్పుడు, ఇవన్నీ గుర్తించుకోవాలి.

(శ్రీ.స.ది.వా. పు.69)

నాలుక

రసమెరిగిన నాలుకా! మధుర పదార్థములనే కోరుకొందువేల? గోవిందా, దామోదరా, మాధవా అనే నామరసమును గ్రోలుము!'

(శ్రీ.స.సూ.పు.28)

జిహ్వే రసజ్ఞే మధుర ప్రియే త్వం సత్యం హితం త్వాం పరమం వదామి,

ఆవర్ణయేధా మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి.

అని బిల్లమంగళుడు చెప్పినాడు. 'ఓ నాలుకా! రసమెరిగిన నాలుకా! సత్యమెరిగిన నాలుకా! పవిత్రమైన నాలుకా! గౌరవమర్యాదలు కాపాడుకొనే నాలుకా నీవు నిరంతరము గోవింద, దామోదర, మాధవ అనే నామాన్ని స్మరించు అన్నాడు. ఇది స్వార్థపరమైన నాలుకా, స్వార్థరహితమైన నాలుకా అని మనమేరీతిగా చెప్పగలము? నిత్య జీవితములో మనకు చక్కగా గోచరమవుతుంటుంది. ఏదైనా మధురమైన పదార్థము నాలుకపైన పెట్టినప్పుడు యీ పదార్థము చాలా మధురముగా వుంటుండాది. అని తాను అనుభవించకుండా జఠరమునకు పంపిస్తుండాది. అది మధురము కాక, మరొక రుచిగా, విరుద్ధమైన రుచిగా నున్నప్పుడు యిది ప్రయోజనము కాదని భూదేవి కందిస్తుంది; నెట్టివేస్తుంది. మంచిగానీ, చెడ్డగానీ నాలుక యేమాత్రము అనుభవించదు. గౌరవమర్యాదలతో బ్రతికేది నాలుక. జీవితపర్యంతము నాలుక అనేక విధములైన పనులు చూస్తుండాది. ఒక్కనాడైనా తన ద్వారము దాటి, తన యిల్లు దాటి బయటకు వస్తుండాదా? ఎన్నిమాటలు మాట్లాడినా నాలుక లోపలే వున్నదిగానీ బయటకు యేమైనా వస్తున్నదా? రావటానికి అంగీకరించదు. ఓపికతో ఉంటుంది. ఎలాంటి కష్టములైనా, ఎలాంటి బాధలైనా, ఎలాంటి దుఃఖములైనా సహించుకొని, భరించుకొని తన జీవితాన్ని కాపాడుకొంటూ వస్తుండాది. ఎంతమంది దుష్టుల మధ్య, దుర్మార్గుల మధ్య ఉండినప్పటికీ వారితో యేమాత్రమును సంబంధము లేకుండా అతి జాగ్రత్తగా మెలుగుతూ వస్తుంది. నాలుక చుట్టూ ఖడ్గములవలెనుండే 36 దంతములుంటున్నాయి. వీరు యే విషయములో యెట్లు ప్రవర్తించినా ఒక్క నిముషములోనే కట్ చేస్తారు. కానీ యిలాంటి దుర్మార్గుల మధ్యనుండినప్పటికి అతి జాగ్రత్తగా తనకెట్టి ప్రమాదము లేకుండా మెలగుతూ వస్తుంది. కనుకనే యీనాలుక అనేకవిధములైన ఉపదేశములు గావిస్తుంది. నాయనా! నీవు ఎంతమంది దుర్మార్గుల మధ్యనున్నప్పటికి, వారితో ఏమాత్రము కలహించక వారి బారి పడక, తప్పించుకొని, మెప్పించుకొని తిరుగుమని బోధిస్తుంది. కానీ యీనాటి మన పరిస్థితి! దుర్మార్గుల మధ్యలో చేరితిమంటే, మనము కూడను దుర్మార్గులమైపోతున్నాము. మన సద్గుణములను, మన సద్భావములను, సత్ప్రవర్తనలను ఒక్క క్షణములో కోల్పోతున్నాము. ఇలాంటి పరిస్థితులకు గురి కాకుండా వుండేటందుకు జిహ్వాను అరికట్టుకోమని గీత బోధించింది.

(శ్రీ.గీ.పు.54/55)

దంతముల మధ్య ఎంతో నేర్పుకలిగి
నాల్క సంచరించు నలగ కుండ
నరుడు కూడ అటులే నడవంగ వలెనయా
సత్యమైన బాట సాయి మాట॥

(సా.పు.228)

తనను తాను తెలుసుకొనే నిమిత్తం తనువును ఏర్పర్చుకొన్నాడనే సత్యాన్ని మానవుడు మొట్ట మొదట గుర్తించాలి. ఈ దేహము సార్థకంకావాలి లేనిచో మానవత్వమే వ్యర్థమౌతుంది. ఒకానొక సమయంలో హనుమంతుడు విభీషణుని కలిసాడు. "నాయనా! నీవు ఈ రాక్షసుల మధ్య ఏ విధంగా జీవిస్తున్నావు" అని

ప్రశ్నించాడు. **"భయంకరమైన దంతముల మధ్య సున్నితమైన నాలుక** ఏవిధంగా ఉన్నదో ఆ విధంగా నేను జీవిస్తున్నాను" అన్నాడు విభీషణుడు. "కాని, ఎంతకాలం నేనీ జీవితం గడపాలి" అని బాధ పడ్డాడు. అప్పుడు హనుమంతుడు - "విభీషణా! నీవు బాధ పడనక్కరలేదు. పళ్ళు ఊడిపోతాయా? నాలుక త్వరగా ఊడి పోతుందా? **మొదట పడిపోయేవి పళ్ళే, నాలుక పడిపోదు. కనుక నీతితో** కూడిన మానవునకు ఎట్టి ప్రమాదమూ ఉండదు. దుర్చర్యలతో పరహింసలతో కాలం గడిపే పళ్ళు త్వరలో రాలిపోతాయి. ఆ పళ్ళ వంటిదే రాక్షసత్వము. కనుక, నీవు భయపడనక్కర లేదు" అన్నాడు. **దీనికి ఓపికను సాధించాలి.** ఓపిక సాధించిన మానవుడు ఎన్ని కార్యములందైనా విజయాన్ని సాధించగలడు.

(స.సా.ఫి 1994 పు. 41)

వాక్కు అగ్నికణమువంటిది. వాక్కును వశముచేసుకుంటే జగత్తునే వశము చేసుకున్న వారమవుతాము. వాక్కుచేత ఎంతటి ఘనకార్యమైనను చేయవచ్చును. ఎంతటి హీనకార్యమైనను చేయవచ్చును. ఈ వాక్కే ఆశీర్వాదమును అందించుతుంది. దూషణను చేకూరుస్తుంది. ఈ జిహ్వాకే బిల్వమంగళుడు

"జిహ్వే రసజ్ఞే మధుర ప్రియేత్వం
సత్యం హితం త్వాం పరమం వదామి
ఆవర యేథా మధురాక్షరాణి
గోవింద దామోదర మాధవేతి" అని వర్ణించాడు.

ఓ రసమెరిగిన నాలుకా! సున్నితమైన మధుర భాషణ లాడే నాలుకా!

నీవు అనవసరమైన మాటలలో ప్రవేశించక మధురమైన ఆనందమునందించే గోవిందనామస్మరణ చేయమని బోధించినాడు. "కాలు జారితే కలుగదు నష్టము, నాలుక జారితే నరకమేరా!" అన్నారు. ఈ నాలుకను దుర్వినియోగము చేసినచో హృదయాన్ని ఎంతైనా గాయపరుస్తుంది. ఈ గాయమును మాన్పె డాక్టర్లు జగత్తు నందు కానరారు.

(బృ.త్ర.పు.55/56)

అతి భాష ఈ నాలుకకు తగదు. **నాలుక నాలుగు విధములైన పాపములు చేస్తుండాది. 1. అసత్యమాడటం, 2. చాడీలు చెప్పటం 3. పరదూషణ చేయటం 4. అతిగా భాషించటం** ఈ నాల్గింటి వల్లనే మానవులకు అశాంతి అభివృద్ధి అవుతున్నది. సత్యము మాత్రము పలకాలి. కొన్ని సమయములందు సత్యము చెప్పుట వలన ప్రమాదమవుతుంది. అట్టి సమయములందు సత్యమూ వద్దూ అసత్యమూ వద్దు. ఈ విధమైన మార్గమును అనుసరించినపుడే సమాజమునందు రాణించగలవు.

(బృ.త్ర.పు.57/58)

(చూ॥ నామస్మరణ, శిష్యుడు)

నాలుగు

(చూ॥ నాలుక, శోభ)

నాలుగు ఆటంకములు

(చూ॥ ఆటంకములు)

నాలుగు ఆలయములు

మధ్యాహ్నము వరంగల్ నుండి వచ్చిన టీచరు Nathaniel మనము బడులను గుళ్ళుగా మారుస్తాము. అని చెప్పాడు. బడిని గుడిగా మార్చటము కాదు. బడులు నిరంతరము గుళ్ళే. **వైద్యాలయము, భోజనాలయము, విద్యాలయము, దేవాలయము, మొదటిది దేహము నకు ఆరోగ్యమును అందించడానికి, రెండవది పుష్టిని, తుష్టిని అందించడానికి, మూడవది జ్ఞానమును అందించి లోకానికి సుజ్ఞాన విజ్ఞాన ప్రజ్ఞానమును చాటడానికి ఏర్పడినవి. విద్యాలయము నుండి దేవాలయమునకు పోవాలి. విద్యకు ఆలయమైన బడిని ఏ విధంగా మనము తయారు చేశాము. ఒక చావిడి సత్రము లాగా తయారు చేశాము. కాని యిది నిజముగా గుడి. బడి కాదు. పాఠశాల కాదు** విద్యాలయము. ఇటువంటి పవిత్రమైన ప్రదేశమున మనము చక్కని విద్యనందిస్తే

వారు విద్యార్థులవుతారు. వారు కూడా సమస్త ప్రపంచమునకు **ఆదర్శమూర్తులుగ తయారవుతారు.**

(శ్రీ.సా.ది.పు.113)

నాలుగు గుణములు

(చూ॥ అలవర్చుకో)

నాలుగు జన్మలు

యువకులైన మీరు ఈనాటి నుండి ఒక పవిత్రమైన దీక్షను పట్టాలి. ఏదో ఒక యజ్ఞోపవీతం వేసుకున్నంత మాత్రాన సరిపోదు. **మానవునికి నాల్గువిధములైన సంస్కారాలుంటున్నాయి.** కోటీశ్వరుడైనా, కూటిపేదైనా తల్లి యొక్క గర్భము నుండే పుట్టాలి. **చక్రవర్తికాని, ఛండాలుడుకాని తల్లిగర్భము నుండే పుడుతున్నాడు. అది సహజజన్మ. గాయత్రీ మంత్రోపదేశము జరిగిన తరువాత 'ద్విజు' డౌతాడు. ఇది రెండవజన్మ. పూర్వపు మాలిన్యమును గాయత్రిమంత్రము చేత పరిశుద్ధం గావిస్తారు. ఈనాడు ఉపనయనం జరిగిన వారు రెండవ జన్మ ఎత్తారు. తరువాత మూడవజన్మ కూడా ఎత్తాలి. ఏమిటిది? వేదాధ్యయనము గావించినప్పుడే 'విప్రుడు' అంటారు. అంతమాత్రమే చాలదు. భగవంతునికి వేదజ్ఞానముకాని, శాస్త్రజ్ఞానముకాని పనికిరాదు. ఐతే, ఇవన్నీ నీ మనశ్శాంతికి ఉపకరిస్తాయి. ఈ వేదమును అభ్యసించిన తరువాత తిరిగి నాల్గవజన్మ ఎత్తాలి. ఏమిటిది? బ్రహ్మతత్త్వమును తెలుసుకున్నవాడు. 'బ్రాహ్మణుడు' అన్నారు. మొట్టమొదట శూద్రుడు, తరువాత ద్విజుడు, తరువాత విప్రుడు, తరువాత బ్రహ్మణుడు. ఐతే, బ్రహ్మతత్త్వమును సరిగా అర్థం చేసుకున్నవాడే నిజమైన బ్రాహ్మణుడు.**

(స.సా.జూ.95 పు. 164/165)

నాలుగు మార్గాలు

మానవులు ఇపుడు నడచుచున్న మార్గములు నాలుగు. మొదటి మార్గము కర్మాతీతమైనది, రెండవది నిష్కామకర్మ మార్గము, మూడవది కామకర్మ మార్గము, నాలుగవది కర్మభ్రష్ట మార్గము.

ఇందులో మొదటి వారైన కర్మాతీతులు జీవన్ముక్తులు! వారు చేసిన సర్వకర్మలూ జ్ఞానాగ్నితో భస్మమయి పోవును; చేయవలసిన పనియూ, చేయరాని పనియూ విధి నిషేధములు లేవు. సాధనలు దాన ధర్మములు, తపములు కూడా వేరే యేమీ వుండవు. వారు చేసిన కర్మలన్నియూ భగవత్ కర్మలగనే మారును. వారుతమ కాలు పెట్టిన స్థానమంతయూ కైవల్యముగానే నుండును. ప్రతిమాట, బ్రహ్మవాక్కుగానే మారును. అట్టివారు దేహమును విడిచిన తక్షణమే వారి ప్రాణము యెక్కడో పోనక్కరలేదు. అక్కడిక్కడే బ్రహ్మమును పొందును. అట్టివారే పైన చెప్పిన కైవల్య ప్రాప్తికి, బ్రహ్మప్రాప్తికి, సద్యోముక్తికి సంబంధించిన వారు.

"తరువాత, రెండవ తెగవారు **నిష్కామకర్మ యోగమును అవలంభించువారు; వీరినే ముముక్షువులని అందురు. అనగా మోక్షాపేక్ష కలవారని,** వీరుచేయు సర్వకర్మలూ భగవత్ప్రాప్తి భావము తోనే చేయుదురు. వేరు ఫలములనాశించరు. వీరు సత్ కర్మలు మాత్రమే చేతురు. లోక సంబంధమైన వాంఛలు కానీ మరే విధమైన స్వర్గాది లోకముల ఆశ కానీ వీరిలో వుండవు. కేవలము మోక్షమును మాత్రము కోరుచుందురు. వారి దీక్షనుబట్టి భగవత్ కటాక్షము కలిసి కరిగి అనుగ్రహించును.

"ఇక, మూడవవారు, **సకామ కర్మయోగులు; వీరు ఫలాపేక్షతో సత్కర్మ లాచరింతురు,** శాస్త్రవిహిత కర్మలను మాత్రమే చేతురు. పాప కర్మలు కానీ, నిషిద్ధకర్మలు కానీ వీరు చేయరు. అటులే వీరి అభీష్టము; సుఖములు భోగములు కావలెనని, ఏ సత్ కర్మ చేసిన యే సుఖము కలుగునో, యే పుణ్యకర్మలు చేసిన యే భోగాది స్వర్గములు లభించునో అని ఫలమును మొదట లక్ష్యమునందుంచు కొని పవిత్ర కర్మల నాచరింతురు. అట్టివారు శరీరమును వదలిన తరువాత స్వర్గాది లోకములకు పోయి, వారు చేసిన పుణ్యము నశించు వరకూ వుండి, తరువాత భూలోకమునకు వత్తురు.

నాలుగు F లు

"ఇక మిగిలిన నాలుగవ తెగవారుఃకర్మభ్రష్టులు. **వీరికి పుణ్యముకానీ పాపముకానీ, మంచికానీ, చెడ్డకానీ, నీతికానీ, నీమము కానీ, శాస్త్రము కానీ, ధర్మముకానీ, దైవముకానీ దయ్యముకానీ, యేవీ లేవు. ఇట్టి వానిని మనిషి రూపముననున్న మృగమని తెలుపవచ్చును.** లోకమున ఈతెగకుచెందినవారే అధిక సంఖ్యాకులు కలరు. తాత్కాలిక సుఖము, ఆనందము, ఆహారము, హాయి వీరి ఆశయము. **వీరుమానవ రూపముతో నున్న వానరులని చెప్పుటకు కూడా వీలు కాదు.** వానరులయినా ఒక స్థానమును వదలి మరొక స్థానమునకో, ఒక కొమ్మను వదలి మరొక కొమ్మకో యేగుదురు, వీరట్లుకాదు; మరొకటి ఆధారము చేసుకొని ఉన్న దానిని విడతురు. అనగా, ఆనపకాయలందును, చెట్ల కొమ్మల యందునూ, ఒక విధమైన పురుగుండును. అది ఒక ఆకునుండి మరొక ఆకును చేరునపుడు ముందు మూతితో ఒక ఆకును కరచుకొని వెనుకవైపున మరొక ఆకును వదలును. అటులనే వీరునూ, **క్రిములవలే దేహమును విడచి, మరొక దేహమును అప్పుడే అందుకొనుటకు సిద్ధముగావుందురు. వీరికి యే లోకమూలేదు, రాదు. జనన మరణములే వీరికి ప్రాప్తము.** వారికి పవిత్ర కాలము వచ్చు వరకూ ఈ విధమైన ప్రయాణమే చేయుచుందురు.

(గీ.పు.152/154)

నాలుగుF లు

(చూ॥నాలుగు S లు)

నాలుగు ముఖ్యమైన అంశములు

(చూ॥ నేను)

నాలుగు S లు

మానవునికి ఆనందం లభించాలంటే సంతోషం ప్రాప్తించాలంటే ఇలాంటి విశ్వాసం, లేకపోతే ఏరీతిగా తానాయానందాన్ని పొందగలడు? కనుకనే మొట్టమొదట 'సెల్ఫ్‌కాన్ఫిడెన్స్; ఆత్మవిశ్వాసము; రెండవది 'సెల్ఫ్ శాటిస్‌ఫాక్షన్'; ఇట్టి ఆత్మవిశ్వాసాన్ని కలిగిఉండిన ఈ ఆనందమనేది మనకు లభిస్తుంది. ఆత్మవిశ్వాసము లేనటువంటి వానికి ఆనందం ఎంతదూరంగా ఉంటున్నది. అట్టి వారు ఆనందం నటించవచ్చునుకానీ నిజమైన ఆనందం అనుభవించలేరు, కనుక ఈ "సెల్ఫ్ శాటిస్‌ఫాక్షన్" ఉండినప్పుడే 'సెల్ఫ్‌శాక్రిఫైన్' చేస్తాము. తాను సంతోషముగా లేనప్పుడు ఏవిధమైన త్యాగమునకు పూనుకుంటాడు? కనుక ఈ త్యాగమునకు "శాటిస్‌ఫాక్షన్" 'తృప్తి' అనేది అత్యవసరం, ఎప్పుడు ఈ "శాక్రిఫైస్" అనేది చేస్తాడో 'సెల్ఫ్‌రియలైరజేషన్' అనేది మనకు లభిస్తుంది.

కనుకనే నాలుగు 'S' లలో ఉన్న జీవితరహస్యాన్ని మనం గుర్తించాలి.

First S-Self Confidence
Second S - Self Satisfaction
Third S - Self Sacrifice
Fourth S - Self Realization

ఈ నాలుగింటియొక్క రహస్యాన్ని మనం ఏనాడు గుర్తింతుమో అప్పుడే 'Four— F లకు మన Life ను అంకితం చేస్తాము. **First f-follow the Master** 'మాష్టర్' అనగా ఎవరు? మన బాల వికాస్ గురువా లేక పాఠశాలలో నున్నటువంటి గురువా? ఈ గురువులు మార్పు చెందువారు. **నీ యొక్క హృదయమే, నీ 'కాన్షష్‌నెస్' నీ మాష్టర్.** నీ కాన్షష్ నెస్‌ను నీవు 'ఫాలో' చేసినప్పుడే నీ జీవితము భద్రమైన స్థానాన్ని అందుకుంటుంది. కనుకనే Follow the Masterనీ కాన్షస్‌నెస్‌ను నీవు ఫాలో చేయుము.

1st F - follow the master
2nd F - face the devil.

నీ దుర్గుణములను, దుర్బుద్ధులను దురాలోచనలను, దుర్భావములను కొంతవరకైనా దూరం చేయాల్సి ఉంటుంది. ఇక మూడవ F-fight to the end. 4th F-finish the game.ఈ నాలుగు F లుకూడ మీరు నిరంతరము హృదయములో పెట్టుకుని ఉండాలి.

(స.సా.మా.80 పు. 60/61)

నాలుగు యుగాలు

యుగాది అంటే కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగములకు సంబంధించినది, ఏదో కొన్నివేల సంవత్సరముల క్రిందట కృతయుగము పోయింది. అటు తరువాత కొన్ని వేల సంవత్సరాల క్రిందట త్రేతాయుగం పోయింది అని అనుకొంటూ - యుగాల క్రింద, కాలము క్రింద మనము గడుపుతున్నాము.

ప్రేమస్వరూపులారా! ఏదో కొన్నివేల సంవత్సరాల క్రిందట కృత, త్రేతా, ద్వాపర, కలియుగములు వచ్చినవి కాదు. ఇవన్నీ కేవలం "కేలండరులో" వారాలు వస్తూన్నట్లుగా ఈ యుగములు కదలుతూనే ఉంటాయి. ఇప్పుడు ఈ కలియుగం పోతూనే తిరిగి కృతయుగము వస్తుంది. ఇది వేల సంవత్సరములకు సంబంధించినది కాదు. జీవితములోపల చక్కగా **విచారిస్తే, నిత్యము ఒక్క దినంలో 24 గంటల లోపల నాలుగు యుగాలు మారిపోతున్నాయి. (1) తెల్లవారుఝామున నాలుగు గంటల నుండి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు కృతయుగము. మానవుడు ధర్మమును నాలుగు పాదములలోపల నడచటానికి తగిన శక్తి సామర్థ్యం కలిగి ఉంటుంది ఆ కాలం, (2) మధ్యాహ్నము పన్నెండు గంటల నుండి సాయంత్రం ఆరుగంటల వరకు ఇది త్రేతాయుగము. ఇక్కడ ధర్మము ఒక పాదము క్షీణించిపోతుంది. అనగా మానవ దేహములో ఉండిన శక్తులు కొంత నశించి పోతాయి. అక్కడ 3 పాదములు మాత్రమే సంచరిస్తూ ఉంటాయి, (3) సాయంకాలము ఆరు గంటల నుండి రాత్రి పన్నెండు గంటల వరకు అది ద్వాపరయుగము. అప్పుడు రెండు పాదములతోనే ఉంటుంది. ధర్మం. అనగా శారీరక,మానసిక సంబంధములైనదంతా చల్లబడి ప్రాణమయ, విజ్ఞానమయ మనేటటువంటివి రెండుమాత్రమే అక్కడ సంచరిస్తూవుంటాయి. (4) ఆ తరువాత రాత్రి పన్నెండు గంటల నుండి తెల్లవారి నాలుగు గంటల వరకు కలియుగం. ఈ కలియుగములో - ఒక్క పాదము మాత్రమే వుంటుంది. ఏమిటి ఆ ఒక్క పాదము యొక్క ధర్మం? మైమరచి గురకలు కొట్టుకుంటూ నిద్రపోవటమే దాని ధర్మం.**

కృతయుగం యొక్క కాలం 18,32,000. త్రేతా యుగము యొక్క కాలం 14,68,000. ద్వాపరయుగము యొక్క కాలం 8,32,000. కలియుగము యొక్క కాలం 4,63,000. ఇవన్నీ కూడితే ఎంత అవుతందో, అది బ్రహ్మకు ఒక్క పగలు అని, ఈలాంటివి అన్నీ చేరినప్పుడు - బ్రహ్మకు నూరు సంవత్సరములు అన్నారు. కనుక ఈ విధముగా చూచుకొంటే, మానవత్వము అర్థము చేసుకోవటానికి ఏమాత్రం వీలుకాదు. ఎవరు బ్రహ్మ? **సోహమే బ్రహ్మ. ఈ బ్రహ్మ యొక్క వయస్సు అనాది.** అనగా బ్రహ్మకు అనేక కోట్ల సంవత్సరములు ఒక పగలు. ఈ విధంగా మనము ఆలోచిస్తే, బ్రహ్మ అనాదికాక మరియేమిటి? కనుకనే **"బ్రహ్మఅనాది"** అని పేరు పట్టారు, ఈనాటి సైంటిస్టులంతా ఏదో పెద్ద విజ్ఞానమును బోధించినవారమని, విజ్ఞానమును గుర్తించు కొన్నవారమని, ఈ అనాదికి ఒక కాలమును నిర్ణయిస్తూ వస్తున్నారు. ఇప్పుడు అన్ని కోట్లు అంటుంటే ఎవరు ఎంచుకొన్న వారమవుతాము? దీనికంటే 'అనాది' అని చెబితే, ఎంత సులభముగా ఉంటుంది? **అనాది అని చెప్పినవాడు "మొరటువాడు", ఇన్ని కోట్ల సంవత్సరములంటే "సైంటిస్టు". ఇది ఈనాటి ప్రచారప్రబోధలు.**

కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగ, కలియుగము లంతా - ఒక్క దినం లోపల మార్పు చెందినటువంటివే. **కనుకనే కాలమునకు - "భగవత్స్వరూపుడు"అని పేరు. యుగములకు 'ఆదివాడు' కనుకనే - "ఉగాది" అని పేరు వచ్చింది. "యుగాదైనమః" అని భగవంతునికి పేరు.** కాలముతో కూడినవాడు భగవంతుడు. కాలమునే ఆత్మగా విశ్వసించినవాడు భగవంతుడు. కనుకనే అతనిని - **"కాలాత్మకాయనమః" అన్నారు. ఆ కాలమునే తన గర్భమునందు ధరించిన వాడు కనుకనే - "కాలగర్భుడు" అని భగవంతునికి పేరు. కనుకనే** - "కాల కాల ప్రపన్నాయనమః" అన్నారు. కాలమనే తత్త్వము కాయమును మ్రింగివేస్తుంది.

నాలుగు స్థాయులు

కానీ, కాలమునే మ్రింగేటటువంటివాడు భగవంతుడు అని - **"కాయమును మ్రింగేది కాలము - కాలమును మ్రింగేవాడు భగవంతుడు".**

(స.సా.ఏ. 91 పు. 92/93)

నాలుగు స్థాయులు

మనస్సు యొక్క నాలుగు స్థాయిలు : జాగ్రతావస్థలోని సహజమనస్సు;
సుషుప్తిలోని సూపర్‌మైండు;
హాయినందించే హైయ్యర్‌మైండు;
కార్యకారణ సంబంధమైనది ఇల్యూమినేటెడ్ మైండు;
పవిత్ర పురుషత్వం అనేది (Over Mind) ఓవర్‌మైండు.

(ప్ర.పా.పు.53)

నాలెడ్జి

(చూ॥ జీవితమంటే)

నావ

(చూ॥ పెట్రోమాక్స్ లైట్)

నావాళ్ళే

"ఈ ప్రపంచములో నా వాళ్ళు కానివారెవరూ లేరు. అందరూ నా వాళ్ళే. కొందరు నా నామమునుగాని, మరే యితర నామమును గాని ఉచ్చరించకపోవచ్చు; అయినప్పటికీ వాళ్ళు నా వాళ్ళే. నేను ఎవరినో పలకరించకపోవచ్చు; అయినప్పటికీ వాళ్ళు నా వాళ్ళే. **నేను ఎవరినో పలకరించినట్లు చిరునవ్వు నవ్వడం, వ్రేళ్ళుకదపడం మీరు గమనించి ఉంటారు. అప్పుడప్పుడు నేను గాలిలో ఏదో వ్రాస్తున్నట్లు మీకు కనిపిస్తుంది. నేను ఇలా ఎందుకు చేస్తున్నానో తెలుసు కోవాలని మీలో కొందరికి కుతూహలం కలుగవచ్చు. అటువంటి సమయాల్లో, మీ కంటికి కనబడని ఎవరికో నేను సందేశము పంపుతున్నానన్న మాట.** నా చేష్టలు మీకు అర్థంకావు. ఎక్కడో చాలా దూరములోనున్న ఎవరైనా ఒక వ్యక్తి నన్ను ఏవైనా ప్రశ్నలు అడిగితే వాటికి నేను జవాబులు వ్రాస్తాను. ప్రతిక్షణం నేను వేలాదిమందికి సహాయము చేస్తుంటాను. కాని వీటన్నింటినీ నేను ప్రచారము చేసుకోను. ఎందువల్లనంటే, ఒక తండ్రి తన కొడుకుకు చేసే సహాయాన్ని ప్రచారము చేసుకోడు కదా!"

(దై.పు.260)

నాశనం

(చూ॥ శిరస్సు)

నా సందేశము

నాకొరకు కాదు. మీ కొరకు నేను మీవలె మాట్లాడు చున్నాను. తిరుగుచున్నాను. భుజించుచున్నాను. మీకు అర్థమగు రీతిగా ప్రవర్తించు చున్నాను. మీలో వుండి, మీలో ఒక్కడినై మీ విశ్వాసమును, ప్రేమను, విధేయతను చూరగొని మిమ్ము దైవత్వము వైపు మరలించు చున్నాను. **మీ యందు ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగించుటయే నా ఆశయము. మీ నిజతత్వమును గ్రహించి తద్వారా ఈ విశ్వ సత్యమును గుర్తించెదరు. ఈ చరాచర సృష్టికంతకూ నేనే అంతర్వాహినిని, అన్నింటిని ప్రేరేపించు శక్తి నేను, నేనే జ్ఞానిని. జ్ఞానము, జ్ఞేయము నేనిచ్చవచ్చినట్లు నా శక్తిని ప్రదర్శించి మిమ్ము తికమక పెట్టును. నేను ఏమి చేసినా నా ప్రబోధనలను ఆచరణ రూపములో మీకు చూపుటకే, మార్గదర్శకుడనై మిమ్ముత్సాహపరచుటకు నా జీవితమే నా సందేశము.**

(స.శి.సు.తృ.పు.132)

(చూ॥ నాజీవితం)

నాస్తి

(చూ॥ తల్లి ఆశీర్వాదము)

నాస్తికుడు/ నాస్తికులు

"నాస్తికులైన వారు కూడా ఏదో ఒక జంతువునో, మొక్కనో, మనిషినో లేక వర్గాన్నో, ఆదర్శాన్నో లేక సిద్ధాంతాన్నో దేనినో ఒక దానిని తప్పక ప్రేమించి తీరుతారు. ఆ ప్రేమే భగవంతుడు."

(స.శి.సు.నా.పు.88)

(చూ॥ ఆస్తికుడు, కమ్‌యు నెక్స్‌ట్, మంచిచెడ్డలు)

నిందాస్తుతులు

ఒక నాస్థికుడు బుద్ధునియెదుట నిలిచి నోటికి వచ్చినట్లు తిట్టినాడు. బుద్ధుడు యేమీ పలుకలేదు. శాంతముగా పద్మాసనము వేసుకొని మందహాస వదనముతో అన్నియును వింటున్నాడు. కొంతసేపటికి వానికి గుండెనొప్పి, నోరునొప్పి వచ్చి తాళలేక వెళ్ళిపోయినాడు. ఇదంతా చూచుచున్న ఒక శిష్యుడు ప్రశ్నించినాడు. ప్రభూ! మీరు మారుమాటాడక మౌనముగా వాని దూషణములు విన్నారుకదా! దీని కర్థమేమి? అప్పుడు బుద్ధుడు వత్సా! నీయింటికి యెవరైనా వస్తే వారిని "యేమి? యెప్పుడు వచ్చినారు! అని పలుకరిస్తే కదా? వారు యింటిలోనికి ప్రవేసిస్తారు. పలుకరించకపోతే వారు వచ్చిన దోవను పట్టుకొని వెళ్లుతారు కదా!" **అలాగే నిందాస్తుతు లనే అతిథులను మనము నిరాకరించాలి, అన్నారు.**

(సు.పు.117)

నిందించుట

(చూ॥ దివ్యప్రకటనలు)

నిగ్రహము

నిగ్రహము ఉంటే అనుగ్రహం తప్పకుండా లభిస్తుంది. ఒక ఉదాహరణ: నీవు కంసాలి చేతికి బంగారం ఇచ్చి నీకు కావలసిన ఆభరణంయొక్క డిజైను చెపుతావు. నీవిచ్చిన బంగారంయొక్క బరువును వ్రాసుకుంటావు. అంతేగాని, "దీనిని కాల్చకూడదు, సుత్తితో కొట్టకూడదు, ముక్కలుగా కట్ చేయకూడదు" అని నిబంధనలు విధిస్తావా? నీకు కావలసింది నీవు కోరుకున్న డిజైనులో అదే బరువుగల బంగారు నగయే కదా! **నేనూ అంతే. మీ Manners (మర్యాద) Behaviour (నడత) Discipline(క్రమశిక్షణ) - ఈ మూడింటినీ సరిచేసి మిమ్మల్ని 'బంగారు నగ'గా మారుస్తాను.** మీరు బాగా గుర్తుపెట్టుకోవాలి. **Boy కి Behaviour బాగుండాలి; Man కి Manners బాగుండాలి Devotee కి (భక్తునికి) Discipline (క్రమశిక్షణ) ఉండాలి. 'మనిషి'ని త్రిప్పి చదివితే 'సినిమ'అవుతుంది.** అలాంటి కృత్రిమమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఈనాటి మానవులు అలాంటివారు నన్నెలా గుర్తించగలరు?

(స.సా.మే99పు.139)

(చూ॥ సంయమము)

నిజతత్త్వము

(చూ॥ దైవసంకల్పము)

నిజమైన బంధువులు

సత్యం మాతా పితా జ్ఞానం ధర్మో భ్రాతా దయా సఖా
శాంతం పత్నీ క్షమా పుత్రః షడేతే నిజ బాంధవాః

సత్యం మాతాః ప్రపంచములో ప్రతి వ్యక్తికీ ఒక తల్లి ఉంటుంది. కానీ జగత్తులో గల **సర్వజీవులకు ఒకే తల్లి.** ఆ తల్లిని మనం గుర్తించాలి. **ప్రతి మానవునకు సత్యమనే ఒక మాతృదేవి ఉంటున్నది. ఆ దేవిని అనుసరించిన వానికి ఎట్టి ఇబ్బందులూ కలుగవు. ఆ తల్లి త్రికాలాబాధ్యమైనది, త్రిలోకములకు అధిపతి అయినది, త్రిగుణములకు అతీతమైనది.** ప్రాకృతమైన తల్లి మరణించవచ్చు, మార్పు చెందవచ్చు, ప్రదేశాన్ని మారవచ్చుగాని. సత్య మనే తల్లి ఏ దేశమునకైనా, ఏ కాలమునకైనా, ఏ వ్యక్తికైనా, ఏనాటికైనా ఒక్కటే. ఇట్టి

నిజ సన్యాసి

దివ్యమైన, భవ్యమైన, సవ్యమైన, సమంజసమైన సత్యాన్ని ప్రతి వ్యక్తి తల్లిగా భావించి, విశ్వసించి అనుసరించటం అత్యవసరం.

పితా జ్ఞానం: ఇంక తండ్రి ఎవరు? జ్ఞానం. జ్ఞానమనగా లౌకిక జ్ఞానము, భౌతిక జ్ఞానము, వైజ్ఞానిక జ్ఞానము కాదు. **"అద్వైత దర్శనం జ్ఞానం".** ఏకాత్మ భావాన్ని విశ్వసించడమే జ్ఞానం. ఆ జ్ఞానమే సత్యస్వరూపం. దీనినే వేదం 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' అన్నది.

ధర్మో భ్రాతా: సర్వ మానవులనూ, సర్వదేశములందు, సర్వకాలములందు ఏకత్వముతో ప్రేమించే సోదరుడు ధర్మము. **ప్రేమస్వరూపుడైనవాడు ఈ సోదరుడు.** దీనిని పురస్కరించుకొనే ప్రాచీన కాలము నుండి వేదము **'సత్యం వద ధర్మం చర'** అని సత్యధర్మములకు అత్యంత ప్రాధాన్యము నందిస్తూ వచ్చింది. **ధర్మమును మించిన సోదరుడు మరొకడు లేడు.** రామలక్ష్మణులు సోదరులై పవిత్రమైన ఆదర్శమును జగత్తున కందించారు. యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు రాముడు చాలా బాధ పడ్డాడు. **'లక్ష్మణా! సీత వంటి భార్యను ఎక్కడైనా వెదకి తెచ్చుకోవచ్చు. కౌసల్యవంటి తల్లిని నేను పొందవచ్చు. కానీ నీ వంటి సోదరుని తిరిగి పొందలేను. నీలాంటి సోదరుడు ఉండటంచేత నా రామతత్వము ప్రకాశిస్తూ వచ్చింది"** అన్నాడు.

దయా సఖా: ఈ లోకంలో ఈనాటి మిత్రులు రేపు శత్రువులుగా మారవచ్చు. కానీ, **మానవునికి, సర్వకాల సర్వావస్థలయందు మిత్రునిగా ఉండేది దయ.** దయకు మించిన మిత్రుడు మనకు కానరాడు. నిజమైన మిత్రుడు దయాస్వరూపుడు.

శాంతం పత్నీ: పత్ని ఎవరు? **శాంతమే పత్ని.** శాంతమే మహర్షుల ఆభరణము; ఋషుల యొక్క కిరీటము; ఆధ్యాత్మికమందు రాజమార్గము.

క్షమా పుత్రః : క్షమయే పుత్రుడు. క్షమను మించిన పుత్రుడు లేడు. ఈ క్షమయే సత్యము. క్షమయే వేదము. క్షమయే ధర్మము. క్షమయే అహింస. క్షమయే శౌర్యము. ఈ జగత్తునందు క్షమను మించిన శక్తి మరొకటి లేదు. **సత్యము, జ్ఞానము, ధర్మము, దయ, శాంతి, క్షమ -** ఈ ఆరూ ప్రతి మానవునకు **నిజమైన బంధువులు.** ఈనాడు మానవుడు ఇట్టి మాతృదేవిని, యిట్టి పితృదేవుని, యిట్టి సఖుని,యిట్టి సోదరుని, యిట్టి పత్నిని, యిట్టి కుమారుని కోల్పోవటంచేత జగత్తు అనేక అల్లకల్లోలములకు గురౌతున్నది.

(ద.స.98.పు.1/2)

నిజ సన్యాసి

(చూ॥ నిష్కామకర్మ)

నిత్యజీవితము

భువిని త్యాగముచేత పుణ్యకర్మలచేత
ప్రేమభావములను పెంపుజేసి
దానవత్వ మడంచి దైవచింతనజేసి
నిత్యజీవితంబు నెరపుమయ్య!

(స.సా.డి 85 పు. 311)

నిత్యము

(చూ॥ అనన్యభక్తి, బంధువు)

నిత్యుడు

ఒక ఉదాహరణ: ఒక గ్రామంలో ఒక వేదవాడున్నాడు. అతనికి ఒక కుమారుడు, భార్య ఉన్నారు. సంపాదనకోసం ప్రక్క గ్రామానికి వెళ్ళాడు.అక్కడ ఒకనాడు అలసి పరుండగా తాను ఆ దేశానికి రాజైనట్లు, తనకు ఐదుగురు కుమారులున్నట్లు కల గన్నాడు. అతను ఇంటికి వచ్చిన తరువాత తండ్రి దూరంగా ఉండటం భరించలేక కుమారుడు మరణించాడని భార్య విలపిస్తూ చెబుతుంది. స్తబ్ధుడై నిలచిన భర్తను చూసి భార్య అంటున్నది, "స్వామి! మీ కుమారుని మరణం మీకు బాధ కలిగించడం లేదా?

ఇలా ఉన్నారేమిటి?'' దానికి అతడు చెబుతున్నాడు, "దేవీ! దేనికోసం విలపించేది? నిన్న నాకు కలలో ఐదుగురు కుమారులున్నారు. వారిప్పుడు లేరు. ఇక్కడ ఈ కుమారుడు లేడు. ఆ ఐదుగురుకోసం ఏడ్చేదా? ఈ ఒక్కడికోసం ఏడ్చేదా?" **ఒకటి రాత్రి కల, మరొకటి పగటి కల. ఒకదానిలో మరొకటి లేదు. కాని, రెండిటిలో నీవున్నావు. అందువల్ల నీవు నిత్యుడవు. అయితే, పగలుకు, రాత్రికి ఉన్న తేడా ఏమి? కాల, కర్మ, కారణ, కర్తవ్యములతో కూడినది పగటి అనుభవం.** ఉదాహరణకు, నీవు గుంటూరు వెళ్ళావు. ఉదయం 10 గంటలకు బయలుదేరి మరునాడుదయం నాల్గు గంటలకు చేరినావు. ఎట్లా వెళ్ళినావు (కర్మ)? బస్సులో వెళ్ళినావు. దేనికోసం (కారణం)? నీ భార్యకు ఇక్కడి వివరాలను, స్వామి విషయాలను చెప్పడానికి. ఇది నీ కర్తవ్యం. కాని, కలలో అలా ఉండదు. కలలో గుంటూరు వెళ్ళినావనుకో. ఎంతకాలం పట్టింది? ఎట్లా ప్రయాణించావు? ఎందుకోసం వెళ్ళావు? నీ కాయము మంచం మీదే ఉందే! ఏది గుంటూరు చేరింది? ఈ ప్రకారం **జాగ్రదవస్థకు, స్వప్నావస్థకు తేడాలున్నప్పటికీ రెండిటిలోను నీవు ఉండటంచేత నిత్యుడవు అని గ్రహించాలి.**

(స.సా.జూ.2000పు.191)

నిదర్శనము

ఒక రోగి నావద్దకు వచ్చును. నేను విభూతిని కాని మరేదైన వస్తువును కాని సృష్టించి అతనికిచ్చెదను. దాని దివ్యశక్తిని గ్రహించగలుగుతాడు. మనశ్శాంతి పొందుతాడు. వ్యాధి తగ్గుతుంది. ఆ విశ్వాసమువలన ఎన్నో సత్ఫలితములను పొందుతాడు. నా యెడల భక్తిగలవారికి మాత్రమే వీటిని యిచ్చెదనని అనుకొనకుడు; ఎవరి బాధలు తీరుటకు దైవచింతన అవసరమో అట్టి వారందరికీ యిచ్చెదను.

వీటిని అద్భుతములు, చమత్కారములు అనుచుందురు. అది తప్పు. ఇవి అద్భుతములూ కాదు, నమస్కారము లందు కొనుటకు చేయు చమత్కారములూ కాదు. ఇది నాకు సహజం; నా వినోదం; నా ఆనందం. **ఇది నిదర్శనే కాని ప్రదర్శన కాదు.** మానవుల మనస్సులను భక్తి, విశ్వాసము, విచారణ, ఆత్మజ్ఞానము వైపు మళ్ళించుటకు సహాయపడు గుర్తులే నేనిచ్చు వస్తువులు, **మనస్సులో సంకల్పము కలుగగానే ఆ వస్తువు తయారగును. కావలెననుకున్న క్షణములో నా చేతిలో యుండును; లేదా నేనెక్కడ ఏది జరుగవలెనని సంకల్పించెదనో అక్కడ అది ఆ క్షణములోనే జరుగును.**

(స.శి.సు.తృ. పు. 65)

నిద్ర

అనేకమంది టీ, కాఫీలను అధికంగా త్రాగుతుంటారు. ఇవి శరీరమునందలి నిద్రాశక్తిని చంపివేస్తాయి. రాత్రిపూట లారీలను, బస్సులను డ్రైవ్ చేసేవారే ఎక్కువగా టీ, కాఫీలను త్రాగుతుంటారు. అంతేకాదు, పరీక్షల కోసం చదివే పిల్లలు కూడా వీటిని ఎక్కువగా త్రాగుతుంటారు. ఇది చాలా తప్పు. నిద్ర రాకుండా ఉండడానికి వీటిని త్రాగుతున్నారు. కాని, మానవునికి నిద్ర ఎంత ఉండాలో, అంత ఉండాలి. ఆహారం లేకపోయినా జీవించవచ్చును గాని, **నిద్రలేకపోతే జీవించటానికి వీలు కాదు. అయితే నిద్ర ఎక్కువగా** రాకుండా ఉండటానికి మనం సరియైన మార్గాన్ని అవలంబించాలి.

విద్యార్థులకు ఇంకొక విషయం. రాత్రి పదిగంటల తరువాత చదవటం ప్రారంభించకూడదు. రాత్రంతా చదవటం, తెల్లవారుఝామున నిద్రపోవటం - ఇది చాలామందికి ఒక దురభ్యాసమయిపోయింది. అసలు రాత్రిపూట పశు పక్షి మృగాదులు కూడా నిద్రిస్తుంటాయి. ప్రకృతి అంతా నిద్రిస్తూ ఉంటుంది. **ప్రకృతి నిద్రించే సమయంలో మేలుకొని ఉండేవాడు ఎవడు? రాక్షసుడే. కనుక, రాత్రిపూట చదివేవాడు రాక్షసుడనే చెప్పవచ్చును.** ఇది కొంతమందికి అలవాటైపోయినది. ఈ అభ్యాసమును కొంతవరకు తగ్గించుకోవాలి. **ఇది రజోగుణ,**

నిదానవతీ ఆరాధన

తమోగుణముల చేరికయే. రాత్రంతా చదివి తెల్లవారున నిద్రిస్తే, చదివినందంతా పోతుంది. నీకు చదువుకోవాలని అంత ఇష్టముంటే ఉదయం 3 గం॥లకు లేచి చదువుకో. అయితే, **చదువుకొన్న తరువాత తిరిగి నిద్రించరాదు. ఇది సరియైన సాత్విక పద్ధతి. ఈ పద్ధతిలో మితమైన ఆహారం ఉంటుండాలి.**

(శ్రీ.భ.ఉ.పు.139/140)

నిద్ర ప్రతి జీవునకు అత్యవసరము. నిద్రలేకున్న, మనిషి కానీ, మరే జీవి కాని జీవించలేడు. ప్రపంచ భోగములన్నింటికంటే నిద్ర ప్రధాన భోగము. దీని ముందు సర్వ భోగములును నిరుపయోగమై నవిగా అల్పమైనవిగా గోచరించును. **నిద్ర పోకున్న ప్రాణిలో పంచ ప్రాణములు అనగా - ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన ప్రాణములు - పంచాగ్నులవలె మేలుకొని యుండును.** ఉచ్ఛ్వాస నిశ్వాసలు సమాన వాయువును సంచరింపజేయును. ప్రాణవాయువు అహవన్నీయాగ్నివలె ప్రసరించుచుండును. వ్యాన వాయువు దక్షిణాగ్నివలె వెలుగుచుండును ఉదాన వాయువు యజమాని యైన మనస్సును, కర్మ ఫలము ననుసరించి బ్రహ్మలోకమునకు తీసికొనిపోయి, అనగా తదాత్మ్య భావములోనికి తీసుకొనిపోయి, బ్రహ్మానంద మన నేమియో రుచి చూపును.

అనగా నిద్రలో హాయిని, విశ్రాంతిని, ఆనందమును, సుఖమును అనుభవించేది జీవుడే. దేహమనే దేవాలయానికి అతనే దేవుడు. బాహ్య జగత్తులో చూచినది, వినినది, అనుభవించినది, దానితోపాటు చూడనివి, వినినివి అనుభవించనివి కూడా జీవుడు అనుభవించును. అంతేకాదు, పూర్వజన్మములో అనుభవించినవికూడా ఈ జన్మలో, కలలో కనుపించవచ్చును. అంతియే కాదు, రాబోవు జన్మల అనుభవములను కూడా అనుభవించ వచ్చును. ఇవి వారి వారి మనోకర్మ ఫలములపై ఆధారపడి యుండును. **ఒకొకతూరి నిద్రలో దేహేంద్రియాదులతో సంబంధమును వదలి, ఆధారస్వరూపుడైన పరమాత్ముని లో లయమగును. అందువలననే జీవుడు హాయి ననుభవించును. ఆహాయియే పరమాత్ముని యొక్క స్వరూపము. కలలుకూడా రాని గాఢ నిద్రలో జీవుడు ఉదానములోని తేజస్సును పురస్కరించుకొని ఆనంద లోకములోనికి ప్రవేశించును. అదే బ్రహ్మలోకము, అదే ఆనందలోకము, పంచభూతములకు, పంచేద్రియములకు అంతఃకరణములకు, మూలకారణమైన పరమాత్మను, సమీపముగా చూచి ఆనందించుటకు, జీవునికి అప్రయత్నముగా లభించే సదవకాశము.**

ఈనిద్రలో తన స్వరూపము తెలియని అజ్ఞానము తమోగుణ రూపమున ఉండును. జ్ఞానులైనవారికి ఈ స్వప్నములో కూడా జాగ్రదావస్థలో నుండినట్లు ఆనందానుభూతి ఉండును. ఎరుక కలిగినవాడు దేహేంద్రియ బుద్ధులతోడి తన సంబంధమును విరమించుకొని స్వస్వరూపానుభవముచే అట్టి ఆనందము సహజముగా జాగ్రతలో అనుభవించును.

(సూ.వా.పు.43/44)

నిద్రకు కూడా ఒక సమయం, ఒక పరిమితి అవసరం. మానవునికి పని ఆహారం ఎంత అవసరమో నిద్రకూడా అంత అవసరము.

(వ.61-62 పు.60)

(చూ॥ ప్రార్థన)

నిదానవతీ ఆరాధన

(చూ॥ దైవారాధన)

నిదిధ్యాసము

(చూ॥ భృగువల్లి)

నిన్ను నీవు తెలుసుకో

నిజముగా దైవమును మరిస్తే సర్వము మరచిన వారమవుతాము. నిన్ను నీవు మరచిన వాడౌతావు. నిన్ను నీవు మరచిన ఏమి ప్రయోజనం? నిన్ను నీవు తెలుసుకో.

రమణ మహర్షి ఎవరైనా వెళ్లినప్పుడు "నిన్ను నీవు తెలుసుకో" అనేవాడు. నిన్ను నీవు తెలుసుకుంటే సర్వము తెలుసుకున్న వాడౌతావు. నిన్ను నీవు తెలుసుకోటమంటే నే దేహాన్ని నీ మనస్సును నీ చర్యలను తెలుసుకోటంకాదు. **నేనెవరు?** చిన్న ఉదాహరణము. ఇది నా దేహము. ఇది నా తల, ఇది నా చేయి, నా కాలు, నేనెవరు? ప్రశ్నించుకో! నా దేహమనుకుంటే నేనెవరు? నా తల అనుకుంటే నేనెవరు? ఈ విధంగా విచారణ చేస్తే. ...? 'నేను' వేరుగా ఉంటున్నది. బుద్ధి, చిత్తము, అంతఃకరణ వేరువేరుగా ఉంటున్నాయి. ఇది నా కర్చీఫ్. నేను వేరు. కర్చీఫ్ వేరు. నా దేహము అంటే దేహము నీ కంటె వేరుగా ఉండాలి కదా. కాబట్టి నీవు ఎవరు. అప్పుడు మనస్సు బుద్ధి చిత్తము ఇంద్రియములు. అంతఃకరణ పనిముట్లు. నీవు Master. Master the mind. Be a master mind. నీవు Master గా జీవించు.

(ద.య.స.97 పు.75/76)

నిన్ను నీవు మరచి పోవద్దు

మనస్సు, బుద్ధి, చిత్తము మరి అహంకారము ఎందు పుట్టి, పెరిగి, ఎందడంగె? **అదియే బ్రహ్మ. అదియే ఆత్మ. కనుక నీ పుట్టుక స్థానమును నీవు గుర్తించే నిమిత్తమై, నీ స్వస్వరూపాన్ని నీవు గుర్తించే నిమిత్తమమై అన్యమార్గముల యందు నీవు అన్వేషణ సల్పిన ఇది ఏరీతిగా పొందగలవు?** ఇది ఎట్లా వున్నదంటే, దొంగవాడు తాను పోలీసువేషము వేసుకొని తన్ను తానే పట్టుకొనటానికి ప్రయత్నించి నట్లుగా ఉన్నది. నిన్ను నీవు గుర్తించుకోవటానికి అన్యసాధనలు ఎందుకు?

దీనికొక చిన్నకథ ఉంది. **పదిమంది మూర్ఖులు చేరి ఒక నదిని దాటడానికిపోయారు. ఆ నదిని దాటిన తరువాత పదిమంది తిరిగి వచ్చినామా? లేదా?** అనేది వారి సందేహము. ఒకడు లెక్క పెట్టటకు ప్రారంభించాడు. 1,2,3,4,5,6,7,8,9 అయ్యో! ఇంకొక్కడు లేడే! నదిలో కొట్టుకుపోయాడు అని ఒకరికొకరు భ్రాంతిచేత విచారం

నిన్ను నీవు మరచి పోవద్దు

పొందుతూ వచ్చారు. నీవు చెప్పింది సరికాదు. నేను చూస్తానని వేరొకడు 1,2,3,4,5,6,7,8,9 అని నీవు చెప్పింది నిజమే! ఇంకకడు లేడు అని వాడు కూడా ఏడుస్తూ కూర్చున్నాడు. అదే మార్గమునందు ప్రయాణము చేస్తున్న ఒక బాటసారి, అతడు వివేకవంతుడు, వీరి యొక్క బాధను చూచి నాయనా! మీరు దుఃఖించటానికి కారణము ఏమిటని ప్రశ్నించాడు. మేము పది మందిమి వచ్చాము, కాని తొమ్మిదిమందే ఉన్నాము, ఇంకొకడు ఈ నదిలో కొట్టుకొనిపోయాడని ఏడ్చారు. వారిఅజ్ఞానమును గుర్తించి ఆ బాటసారి 1,2,3,4..అని పదిమంది ఎంచి నాయనా! పదిమంది ఉంటున్నారు కాని ఎవరు ఎంచుచున్నారో, వారు తనను తాను మరచిపోయి ఎంచుతున్నారు. కనుకనే ఒకరు పోయినట్టుగా విచారిస్తున్నారు అని చెప్పాడు.

కనుక **తనను తాను మరచిన వ్యక్తి సరియైన సత్యాన్ని గుర్తించలేడు. నీవే ఆత్మయై యుండి, నీవు ఆత్మ నిమిత్తమై మరొక దానిని ప్రార్థనగాని, సాధనగాని చేస్తే, నీయొక్క తత్వము ఏరీతిగా గుర్తించగలవు? "ఏ కోహం బహుస్యామ్"** ఒక్కటే అనేకముగా మారిపోవుటచేత, భిన్నత్వములో నీవు అభిరుచిని అభివృద్ధిపరచుకొని ఏకత్వమును విస్మరిస్తూ వస్తున్నావు. ఇవన్నీ అద్దములో కనిపించే ప్రతిబింబములవలె, నీ యొక్క ప్రతిబింబములే. **బింబమును వదలి, ప్రతిబింబమును విశ్వసిస్తున్నావు. కనుక నీవు భ్రమతో కట్టబడి ఉంటున్నావు. బ్రహ్మ భ్రమతో కట్టబడినవానికి చిక్కడు.** కనుక ఆత్మభావమును మనము అనుభవించాలనుకొంటే, మనము చేసే సాధనలన్నీ నిరుపయోగమైనవి.

(స.సా.ఏ.91 పు.105/106)

నిప్పు

(చూ॥ పొత్తు)

నిమిత్తకారణము

(చూ॥ కారణములు, సంపర్కము, హేయత్వావచనాచ్చ)

నియమ నిబంధనలు

(చూ॥ బంగారు బాటలు)

నియమబద్ధ జీవితము

జీవితంలో నియమం లేకపోతే శాంతిభద్రతలు ఉండవు. **ఇతరులను శాసించేవాడు యమ. తనను తాను నిగ్రహించుకొనేవాడు సంయమి.** సంయమిపై ఎవరి ఆదేశాలు పని చేయవు. జీవితం నియమనిబద్ధం కావాలి. ఈ నియమం తపస్సుగా మారాలి. నియమరహితమైన జీవితం పతనానికి దారి తీస్తుంది.

నియమంచేతనే గాలి వీస్తున్నది. సముద్రం నిలచి ఉన్నది. భూమి తిరుగుతున్నది. సర్వబ్రహ్మాండములు నియమానికి లోబడి ఉండటంవల్లనే జగత్తు సంక్షేమంగా ఉన్నది. దీనివల్లనే శాంతి లభిస్తున్నది.

ప్రపంచంలో శాంతికిమించిన లాభం లేదు. శాంతికి మించిన పదార్థంలేదు. శాంతిలోనే సర్వసౌఖ్యములు యిమడి ఉన్నాయి.

ధ్యాన నిష్ఠకు కొన్ని నియమాలను పాటించాలి. దయ, ప్రేమ, ఇత్యాది సద్గుణాలను అభవృద్ధి చేసుకోవాలి. శాంతం కేవలం ధ్యాననిష్ఠా నియమంలోనే కాదు, సర్వకాల సర్వావస్థలయందు ఉండాలి.

ధ్యానం ఒక కాలానికి, దేశానికి, నియమానికి కట్టుబడినది కాదు. ఈ ధ్యానం ద్వారా పవిత్రమైన దివ్యత్వాన్ని చేరుకోవచ్చు. **దివ్యత్వంలో లీనంచేసే మార్గం ఈ ధ్యానం. ధ్యానబద్ధుడైన మానవుడు శాంతియే ప్రధానసూత్రంగా ప్రయాణం చేయాలి.**

దైవగుణాలు కేవలం పూజాసమయానికి పరిమితం కారాదు. ధ్యానసమయంలో పరమశాంతి ప్రదర్శించి వెన్‌వెంటనే రాక్షసంగా ప్రవర్తించడం సమంజసం కాదు.

(ఆ.శా. పు.5/6)

నియమములు

మానవ జీవితము సుఖ దుఃఖ సంఘర్షణాత్మకమైన మహోత్తుంగ తరంగ సాగరము. ఈ సంసార సాగరంలో సంచారం చేసే ప్రతి మానవునికి దిక్కును చూపే చక్కని దీపికలు ఆధ్యాత్మిక జ్యోతులు. ఆధ్యాత్మికం పూజలకు, పునస్కారములకు మాత్రమే పరిమితమైనది కాదు. **అనేకత్వంలోని ఏకత్వాన్ని నిరూపించునదే ఆధ్యాత్మికము.** ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించేవారు కొన్ని నియమ నిబంధనలను పాటించవలసి ఉంటుంది. **"న శ్రేయో నియమం వినా", నియమం లేక శ్రేయస్సు లేదు.**

(స.సా.మే99పు.127)

జగత్తు నందు ప్రతి పదార్థమునకును కొన్ని నియమములు ఉంటున్నవి. **"న శ్రేయోనియమం వినా"** ఈ దేహముకూడను అనేక నియమములతో కూడినట్టిది. మన ప్రవర్తనలయందుగాని, మన చూపుల యందుగాని, మనమాటలయందుగాని, మనభావముల యందుగాని పవిత్రతను అభివృద్ధి పరచుకోవాలి. అనుగ్రహించిన అంగములన్నిటిని అపవిత్రమార్గములో ప్రవేశపెట్టిన మానవత్వము దానవత్వముగా మారిపోతుంది. మనజీవిత మంతయు ఒక వ్యాపారంగాఉంటుండాది. మన దేహములో ఉష్ణము 98.2°C ఉంటాది. కాని యీ ఉష్ణము 99°C కి పోతేయిది రోగమవుతుంది. మన blood pressure 120/80 ఉంటాది. కాని యిది 90 ఐతే రోగముగా మారుతుంది. మని eye ball ఎంతవెలుతురునో అంత వెలుతురునే చూడగలదు. ఎక్కువ వెలుతురు చూచిన రెటినా కాలిపోతుంది. మన ear drum ఎంత శబ్దమో అంతే శబ్దము వినగలదు. అమిత మైన శబ్దము వినినప్పుడు ear drum బ్రద్దలవుతుంది. **మనదేహమంతయు ఒక limited company** ఇలాంటి దేహము కాపాడు కోవటంలో కొంత పరిమితి కావాలి. దీనికి తీసుకునే ఆహారము పరిమితముగా ఉండాలి. త్రాగేనీరుకు పరిమితి ఉండాలి. మాటలయందు పరిమితి, వినటమునందు పరిమితి, మనజీవితమంతయు పరిమితమైనదిగా వుంటుండాలి.

మితిమీరినప్పుడే ప్రమాదమునకు గురి అవుతుంది. అతి తిండి మతి హాని మితతిండి అతిహాయి. అతి భాష మతిహాని, మిత భాష అతిహాయి. మానవుడు ఈ దేహమును ఏవిధమైన మార్గములో అనుభవింప చేసుకోవాలో ఆ ఆనందమునకు సరియైన మార్గమునే మనము అనుసరించాలి.

(బృ.త్ర.పు.30)

(చూ॥ నియమబద్ధ జీవితము, మాయ)

నియర్ (సమీపం)

(చూ॥ ఉపవాసము, బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి)

నిరంతరము

(చూ॥ సాక్షాత్కారము)

నిరర్థకములు

భగవన్నామం ఉచ్చరించని నాలుక, ధర్మంచెయ్యని చెయ్యి, శాంతిని అనుభవించని ఆయుర్దాయం, ప్రతిఫలం పొందని శక్తులు, జ్ఞానం సంపాదించుకోని జీవితం, భక్తి సహితమైన పవిత్రవాతావరణం లేని దేవాలయం, విజ్ఞానమును అందించని ప్రసంగం నిరర్థకములు.

(వ.1963 పు.166)

నిరాకారము

లాయరును చూడగానే కోర్టు కేసులు జ్ఞాపకం వస్తాయి. డాక్టరును చూడగానే రోగాలు గుర్తుకు వస్తాయి. అట్లాగే గుడిగోపురాలను చూడగానే భగవంతుడు జ్ఞాపకం వస్తాడు. ప్రశాంతతను, మనశ్శాంతిని, ఏకాగ్రతను ప్రసాదించడానికే దేవాలయాలు నిర్మింపబడినవి. **ప్రేమకు ఆకారం లేదుగాని, ప్రేమించే తల్లికి ఆకారం ఉంది. పరిమళానికి ఆకారం లేదుగాని, పరిమళాన్ని అందించే పుష్పానికి ఆకారం ఉంది.** గాలికి ఆకారం లేదుగాని, గాలిని నింపే బెలూన్‌కి ఆకారం ఉంది. నీటికి రూపం లేదుగాని, నీరును పోసే టంబ్లర్‌కు రూపం ఉంది. అలాగే, **నిరాకారానికి ఆకారం ప్రధానం. అవ్యక్తమైన నిరాకారం సాకారంద్వారా అభివ్యక్తం అవుతుంది.** మరొక ఉదాహరణ: సినిమా హాలులో స్క్రీను ఉంటుంది. దానిపైన బొమ్మలు వస్తాయి. స్క్రీను లేనిదే బొమ్మలు రావు. బొమ్మలలో కూడా స్క్రీను ఉంటుంది. అయితే, ఏ బొమ్మా స్థిరంగా ఉండదు. అదేవిధంగా, ఆత్మ అనే స్క్రీను ఉంటుంది. అయితే, ఏ బొమ్మా స్థిరంగా ఉండదు. అదేవిధంగా, ఆత్మ అనే స్క్రీనుపైనే జగత్తు గోచరిస్తున్నది. **ఈవిధంగా, నిరాకారంలో సాకారం, సాకారంలో నిరాకారం ఉంటాయి.**

(స.సా.జూ 2000పు.191)

నిరాకారోపాసన

(చూ॥ ప్రసన్నుడు)

నిర్మమత్వము

భోగులు ఎప్పుడూ తక్కువ శ్రమకు ఎక్కువ ఫలితము నాశింతురు. కాబట్టి, వాళ్ళకు నిరాశ, అశాంతి, యోగులు శ్రమ అధికమైనను తక్కువ ఫలితమునే ఎదురు చూచుదురు. కాబట్టి, వాళ్ళకు శాంతి, ఆనందము. **నిర్మమత్వమే ఆనందము; అదే నిజమైన మానవధర్మం. అదే విముక్తి సాధన. మమత్వం పశు లక్షణం. అది రక్తిని పెంచి పెద్ద చేయును.** ఆనంద ప్రాప్తికై భగవద్రతిని అభివృద్ధి పర్చుకునేవారే ధన్యులు.

(స.సా.జులై99పు.191)

నిర్యాణము

(చూ॥ ఇంద్రియ నిగ్రహం, పంచిపెట్టు, పశుబలము)

నిర్వాణము

దేహం శాశ్వతమైనది కాదు. జీవితమనేది ప్రాణతత్త్వమే. కనుక, ఈ ప్రాణతత్త్వాన్ని గౌరవించాలి. కాపాడుకోవాలి. అది ఈ దేహంలో ఉన్నంత వరకే ఇది ప్రకాశిస్తుంది.

నిర్వాణము

లేకపోతే దీనికి ప్రకాశమే లేదు. బల్బులు ప్రకాశించడానికి కారణమేమిటి? కరెంటే! వైరుద్వారా కరెంటు బల్బులో ప్రవేశించి ప్రకాశాన్ని అందిస్తున్నది. సత్యమే కరెంటు, ధర్మము, శాంతి - ఈ మూడింటి ఏకత్వంచేతనే ప్రేమను పొందగల్గుతాము **Bend the Body, Mend the Senses, End the Mind. ఇదే నిజమైన తత్త్వము.** పెద్దలను చూస్తే గౌరవించాలి, **అహంకారంగా పోకూడదు.** Bend the Body - వినయంగా ఉండాలి. ఇదే విద్య నేర్పే వినయము. Mend the Senses, End the Mind.**అదే నిర్వాణము.**

(సా.శ్రు.పు.112)

ఒకానొక సమయంలో బుద్ధుడు ఎక్కడికో ప్రయాణమై వెళుతుండగా మార్గమధ్యలో ఒక పెద్ద యజ్ఞం జరుగుతున్నది. ఆ యజ్ఞంలో అనేక మేకలను, గొట్టెలను బలి యిస్తున్నారు. బుద్ధుడు చూచాడు. **'అహింసా పరమో ధర్మః',** నోరు లేని జీవులను ఎందుకు బలియిస్తున్నారు? ఇది మంచిది కాదని అరికట్టటానికి ప్రయత్నం చేశాడు. అక్కడ చేరిన పెద్దలందరూ "అయ్యా ఈ బలిని ఎందుకు మీరు ఆపుతున్నారు? గొట్టెలను, మేకలను బలి ఇచ్చి, తద్వారా వాటికి మోక్షమునందిస్తున్నాం" అన్నారు. "ఓహో! ఇదియా మీరు చేసే పని. అయితే, మీ తల్లి మెక్షాన్ని కోరుతున్నది, మీ తండ్రి మోక్షాన్ని కోరుతున్నాడు. వారిని కూడా ఎందుకు బలి యివ్వకూడదు? మోక్షం కోరేవారికి మోక్షం ఇవ్వకుండా, ఈ మూగ జీవులకు మోక్షం ఇవ్వడం ఎందుకు? ఏ ప్రాణినీ మనం హింస చేయకూడదు. ఇది మోక్షమునకు సంబంధించిన మార్గమే కాదు**, ఇంద్రియాల నరికట్టుకోవడమే నిజమైన మోక్షము. అదే నిజమైన సాధన"** అన్నాడు. దీనిని పురస్కరించుకొనియే బుద్ధుడు ఐదు సూత్రాలను బోధించాడు. **సమ్యక్ దృష్టి, సమ్యక్ శ్రవణం, సమ్మక్ వాక్కు, సమ్యక్ భావం, సమ్యక్ కర్మ - ఈ ఐదింటిని అలవర్చుకున్నప్పుడే నిర్వాణం ప్రాప్తిస్తుంది.** మొట్టమొదట బుద్ధుడు ఎన్ని దినములు సాధన చేసినప్పటికీ తృప్తిని పొందలేకపోయాడు. ఇది అంతా ప్రయోజనం లేని పని. ఎన్ని గ్రంథములు చదివినా, ఎంతమంది పెద్దల బోధనలు విన్నా, ఎన్ని సాధనలు చేసినా మోక్షం లభించదు. భగవంతు డిచ్చిన పంచేంద్రియాలను సక్రమమైన మార్గంలో వినియోగించు కోవటమే మోక్షమునకు మార్గం అన్నాడు. దానికి తగిన ప్రయత్నం చేస్తూ వచ్చాడు. **సమ్యక్ దృష్టి సమ్యక్ భావం, సమ్యక్ వాక్కు, సమ్యక్ శ్రవణం, సమ్యక్ కర్మ - ఈ ఐదింటిద్వారా నిర్వాణం పొందాడు.** కనుక, మొట్టమొదట మంచి దృష్టిని అలవర్చుకోవాలి. తద్వారా మంచి భావాలు కలుగుతాయి. మంచి భావాలు కలిగినప్పుడు మంచినే పలుకుతాము, మంచినే చేస్తాము, మంచినే పొందుతాము. కనుక, మంచిని పొందాలంటే మొట్టమొదట ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. దీనినే **"యోగః చిత్త వృత్తి నిరోధః" అన్నాడు పతంజలి. ఇంద్రియాలను నిగ్రహించుకోకుండా ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు.**

(సా.శ్రు.పు.112/113)

మీరు ఇతరులకు చేసిన అపకారమును, ఇతరులు మీకు చేసిన ఉపకారమును గుర్తుంచుకోండి, ఇతరులకు మీరు చేసిన ఉపకారమును, ఇతరులు మీకు చేసిన అపకారమును మరచిపోండి. ఉపకారం చేసినవారికి తగిన కృతజ్ఞత చూపండి. **"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం"** ఈ శరీరం ధర్మాచరణకోసం వచ్చింది. కాబట్టి మంచినే చేస్తూ పోదాం, మంచినే చూస్తూ పోదాం, మంచినే వింటూ పోదాం, మంచినే తలుస్తూ పోదాం, మంచినే పలుకుతూ పోదాం.

See no evil, See what is good
Hear no evil, Hear what is good,
Talk no evil, Talk what is good,
Think no evil, Think what is good
Do no evil, Do what is good

This is the way to God.

ఇదే బుద్ధుడు బోధించినటువంటిది. **సమ్యక్ దృష్టి, సమ్యక్ భావం, సమ్యక్ శ్రవణం, సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ - ఈ ఐదింటి ద్వారా మన పంచేంద్రియాలను పవిత్రం**

గావించుకుంటే ఇంతకంటే మోక్షం మరొకటిలేదు. **ఇదియే నిర్వాణం.**

(స.సా.జూన్ 1998 పు.155)

(చూ॥ పంచిపెట్టు)

నిర్వికల్ప సమాధి

మనస్సు విషయాసక్తి, వలననూ, విక్షేపశక్తి వలననూ, బహిర్ విషయములమీదికి పరుగెత్తు చుండును. కాని, మరల మరల దానిని లక్ష్యము పైకి తెచ్చుచుండవలెను. ప్రథమములో అది కష్టముగానున్ననూ, మన శిక్షణద్వారా మనస్సును శుచిపరువ గలిగినపుడు, ఓం అను శబ్దముమీద నిలువగలదు. ఈ శిక్షణ సాము దాన ఉపరతి తితీక్ష శ్రద్ధ సమాధానము లనెడి ఉపాయములచే మనసును కట్టవలెను.

మనస్సును ఉపనిషత్తులు, ప్రార్థనలు, భజనలు సత్వగుణము మొదలైన వాటిచేత నింపి, క్రమేణా బ్రహ్మధ్యానము లోనికి దింపవలెను. చిత్తమందు ధ్యానము సాగింపగా, మనసు నందు క్రొత్తఆసక్తులు బయలు దేరును. **అట్టి శిక్షణచేత మనస్సును, ఇతర చింతలపైకి ఉరకకుండ, హృదయగుహయందు బంధింప వచ్చును.** అట్టి సాధన ఫలమునే **"నిర్వికల్ప సమాధి"** అందురు. **నిర్వికల్ప సమాధి ఫలితము బ్రహ్మజ్ఞాన మనబడును. బ్రహ్మజ్ఞానఫలమునే "మోక్ష" మనిగానీ "జనన మరణముల బారి నుండి విముక్తి" అని గాని పిలుతురు.**

బ్రహ్మ పారాయణమందే మనసు నిలువవలయును. ఇట్లు బ్రహ్మ నిష్ఠయందుండి బ్రహ్మనివాసముకొరకు ప్రయత్నించవలెను. వాసనలను విసర్జించుట, మనస్సును నిర్మూలించుట, తత్త్వజ్ఞానము, ఈ మూడునూ కలిపి **సాధన** చేయవలెను. అప్పుడే **ఆత్మజ్ఞానము పొంద వీలగును.**

(జ్ఞా.వా.పు.10/11)

నిర్వీరాముము

(చూ॥ గుండె)

నిర్గుణోపాసన

నిర్గుణోపాసకునిలో **మొదటి లక్షణము, ఇంద్రియములను తన ఆధీనమునందుంచుకొనవలెను. రెండవది సమస్త పరిస్థితులలోను సమానబుద్ధి కలిగియుండవలెను. ఇక మూడవది కష్టసుఖముల యందును, కష్ట నిష్టూరములయందును, అందరికినీ ఉపకారిగానే యుండవలెను.** ఇట్టి మూడు లక్షణములు కలవాడు అక్షరోపాసకుడని తలంచుము; ఇవి నిర్గుణోపాసకుని లక్షణములు.'' అక్షరోపాసకులన్ననూ, నిర్గుణోపాసకులన్ననూ వక్కటియే అని పాఠకులు భావించవలెను.

(గీ.పు.195)

(చూ॥ మానవజీవితము)

నిలకడ

(చూ॥ శాంతిసుఖములు)

నివాసము

(చూ॥ అనాహతము)

నివాసస్థానము

శ్రీరాముడు, "స్వామి, ఏ స్థలమున మమ్ము నివసింపుమని తాము ఆజ్ఞ చేసిన ఆ స్థలమున మేము నివసించెదము. యెవ్వరికి బాధ కలుగక, ఋషులకు యెట్టి ఇబ్బందినీ చేకూర్చక, నష్టకష్టములు వాటిల్లకుండ, ఈ సంగతులను తాము విచారించి మాకు యోగ్యమైన స్థానమును తెలుపుడు. అక్కడ ఒక పర్ణశాలను యేర్పరచుకొని కొంతకాలము గడుపుదుము'' అని నిర్మలాంతఃకరణముతో పలికిన ప్రియవచనములను ముని విని (వాల్మీకి), రామునితో నిట్లు చెప్పెను: "ఓ రామా! **నేను ధన్యుడను. నీవు రఘు కులమునకు సేతువువంటివాడవు. నీవు యెందులకిట్లు పలుకుచున్నావు? నీవు వేదమార్గములను పాలించువాడవు రక్షించువాడవు.**

నివృత్తి

జానకీ నీ మాయ. నీ యిచ్ఛానుసారము ఆమె జగత్తుల సృష్టి స్థితిసంహారముల జేయుచుండును. చరాచరముల కాధారభూతుడు, సహస్ర శిరస్సులుగల ఆదిశేషుడే లక్ష్మణుడు, ధర్మసంస్థాపనకై దేవతల మనోభీష్టమును సాధించుటకు మీరు నరరూపమును ధరించితిరి. రాక్షసహృదయాలను త్వరలో హతమార్చుదురు. సాధుత్వమును పోషింతురు. ఓరామా! ఈ **లోక వ్యాపారములకు నీవు సాక్షీభూతుడవు. జగత్తు దృశ్యము, నీవు సాక్షివి;** దేవతలు సహితము నీ తత్త్వమును గుర్తించలేదు. ఇక సామాన్యులు నిన్ను తెలిసికొన గలరా? యెవరికి నీ వరప్రసాదమైన జ్ఞానములభించునో వారే నిన్ను తెలిసికొనగలరు. నిన్ను తెలిసికొనినవారే నీ సామీప్యమును బొందుదురు.

నీకు వికారములు లేవు. దేవసజ్జనహితార్థము నీవు మనుజ రూపమున ధరించి సాధారణ రాజువలె మాటలు చెప్పి, చర్యల జేయు చున్నావు. నీ చర్యలు చూచి మూర్ఖులు మోసపోవుచున్నారు. నీవు చెప్పిన ప్రకారము సంచరించెదవు. నీ మాటలకును క్రియలకును భేదము లేదు. నీ వాడించు ప్రకారము మేము ఆడువారమే కాని నిన్ను ఈ రీతిగా చేయమని, ఈ స్థానమందుండుడని శాసించువారెవ్వరు? రామా! మాటలతో మునులను సహితము మాయలో త్రోయచూచుచున్నావా? ఏమి నీ లీల, యేమి నీ నటన? **నీవు కపటనాటకసూత్రధారివి. నివాస యెగ్యమగు స్థలమును చూపుమని, తెలుపుమని నన్ను నీవు కోరుటలో వున్న అర్థమేమో బోధపడుటలేదు. నేను యేస్థలమును చూపించగలను? నీవులేని స్థలము ఒక్కటి కలదా?** దీనికి జవాబు తెలుపుము. అట్టి స్థలముండిన, తప్పక నే చూపుదును'' అని రాముని చూచుచూ,ఆనందముతో స్తంభించిపోయెను. ఇట్లు పలికిన మునీశ్వరుని ప్రియవచనములను రాముడు విని లోలోన నవ్వుకొనెను. పునః మహాముని మందహాసముతో మృదుమధుర వాక్యముల జెప్పనారంభించెను;

ఓ రామా! నీ నిజమైన నివాసస్థానము భక్తుల హృదయము. ఇక నరాకారమునకు ఉత్తమ స్థానము జెప్పదను వినుము. అచ్చట నీవు సీతాలక్ష్మణులతో కూడి నివసింపవచ్చును. నీ దివ్యచరిత్రములనునట్టి మహానదులు ప్రవేశించుటకు యెవని చెవులు సముద్రము వంటివో, ఎవని చెవులు నిరంతరము నీ కథలతో నిండియుండునో, యెవని జిహ్వ నీ నామముతో కదులుచూ కంఠమునుండి నీ మృదుమధుర శబ్దమును చవి చూచుచుండునో, యెవని నేత్రములు చాతకములవలే నీలమేఘము వంటి నీ స్వరూపమును చూచుట కభిలషించి అట్టి రూపమును చూడ నలుదిక్కులా వెతుకుచుండునో, అన్వేషణ జరుపుచుండునో అట్టివానిలో మీరు ముప్పురూ సదా నివసించవచ్చును.

రామా! ఇంకనూ వివరించి చెప్పగోరుదువేని, ఎవడు అవగుణములను విడచి, సుగుణములను గ్రహించునో, ఎవడు నీతి నిజాయితీల మార్గమున సంచరించునో, ఎవడు లోకమర్యాద నొందునో, ఎవడు త్రికరణశుద్ధిగా సర్వము నీ సృష్టిగా భావించి, లోకమే నీ ఆకారముగా విశ్వసించి ఆచరించునో **అట్టివాని హృదయము నీనివాసము.**

(రా.వా.మొ.పు.283/285)

నివృత్తి

ఫలములోని రసము తరులు తామెరుగునా
పువ్వులోని పరిమళము తీగెలనుభవించునా?
కావ్యాలలోని మధుర రసము గ్రంధములనుభవించునా
నివృత్తి సార పాండిత్యము ప్రవృత్తి పండితుడెట్లురుగును?

శ్లో॥ ప్రవృత్తించ నివృత్తించ జనా న విదు రాసురాః
నశౌచం నాసిదాచారో నసత్యం తేషు విద్యతే

నివృత్తి జ్ఞానమార్గము: ప్రవృత్తి కర్మమార్గము, వైదిక కర్మలు మోక్షసాధకములు కానేరవు. కేవలము చిత్తశుద్ధిని మాత్రమే చేకూర్చును. ప్రపంచమును ప్రపంచదృష్టిలో చూడక.ఆత్మదృష్టితో చూచిన ద్వందములకు అతీతుడు కావచ్చును.

(శ్రీ.భ.ఉ.పు.5/6)

(చూ॥ ప్రవృత్తి)

నిశ్శబ్దము

గాఢమైన నిశ్శబ్దమునందే భగవద్వాణి వినిపించును.

(ఆ.శా. పు.2)

చేతితో సత్కర్మల నాచరించాలి, నోటితో దైవ చింతన చేయాలి. ఈ రెండింటి ఏకత్వమే బ్రహ్మతత్వంగా మనకు ప్రాప్తిస్తుంది. కేవలము నోటితో భగవచ్చింతన చేసినంత మాత్రాన చాలదు. గ్రామ ఫోను రికార్డు పాడుతుంది, టేపురికార్డు పాడుతుంది, మీరు కూడా పాడుతున్నారు. కాని, ఈ పాటలు సరియైనవి కావు. **ఆ నాదం హృదయం నుండి రావాలి.**

మీకందరికీ తెలుసు. నేను మాట్లాడినవి, పాడినవి, అన్నీ రికార్డు చేస్తున్నారు. అయితే, టేపు తీసి చూస్తే అవన్నీ కనిపిస్తాయా? టేపును ముక్కలు ముక్కలుగా కత్తిరిస్తే, అవి మనకు వినిపిస్తాయా? అంతమాత్రము చేత ఆ టేపులో మాటలు లేవని భావించడానికి వీలు లేదు. గదా! ఆ టేపులో మాటలు వినాలంటే టేపుకు, కరెంట్‌ను కనెక్షన్ చేయాలి. అప్పుడే టేపులో ఉన్న శబ్దాలన్నీ నీకు వినిపిస్తాయి. అదే విధంగా నీ హృదయమనే టేపుకు, ఆత్మతత్వంతో కనెక్షన్ చెయ్యాలి. అప్పుడే **"ఓం, ఓం" అనే ప్రతి ధ్వనిని నీవు నిరంతరం ఆనందంగా వినవచ్చును. అదే "శబ్ద బ్రహ్మము". అంతేగాని, మనం చేసే శబ్దాలన్నీ బ్రహ్మము కాదు. నిశ్శబ్దములోని శబ్దమే బ్రహ్మము. నీవు ఏకాంతమైన స్థానంలో కూర్చొన్నప్పుడు, అక్కడ ఒక విధమైన శబ్దం ప్రారంభమవుతుంది. అదే నిశ్శబ్దములోని శబ్దము.**

(శ్రీ.భ.ఉ.పు.136)

నిశ్చలసమానచిత్తుడు

సకల విద్యలు నేర్చి సభ జయించగవచ్చు
శూరుడై రణమున పోరవచ్చు
రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు
హేమ గోదానముల్ ఈయవచ్చు
గగనంపు చుక్కలు గణియింపగావచ్చు
జీవరాసుల పేర్లు చెప్పవచ్చు
అష్టాంగ విద్యల నన్ని నేర్వగవచ్చు
చంద్రమండలమైన చేరవచ్చు
కానీ దేహేంద్రియముల నరికట్టి
మనసు నిల్పి, అంతర్ముఖము చేసి
అనవరతము నిశ్చల సమాన చిత్తుడై
నిలువగా లేడు మానవుడు నియతితోడ.

(స.సా.మ.99పు.74)

నిష్ఫలము

గుణములేని సుతులు గురిలేని విద్యలు నీతిలేని జాతి నిష్ఫలంబు
శాంతిలేని జీవి శశిలేని నిశి సుమీ। వినుము భారతీయవీర సుతుడ॥

(సా.పు.350)

నిష్కామకర్మ

అర్జునా! కర్మలను కర్తవ్యముగా నెంచి, నా మాటలయందు సంపూర్ణ విశ్వాసముంచి, ఫలాపేక్షను దృష్టియందుంచు కొనక చెప్పిన కర్మలు చేయుము. అపుడు నీవు నిష్కామ కర్మను ఆచరించిన వాడగుదువు.నీవు ఫలాసక్తిని వదలుటవలన జ్ఞాన నిష్ఠాత్మకమగు మోక్షమును పొందుదువు. అర్జునా ఈశ్వరార్పణ బుద్ధితో కర్తృత్వమును ఫలాపేక్షను వదలి కర్మలు చేయువానిని యే పాపము కూడనూ యేమియూ చేయలేదు. బావా! కంటికాటుక గ్రుడ్డునూ, నీరు తామరాకునూ అంటనట్లు నిష్కామకర్మయోగి యెట్టి కర్మ చేసినా, చూచినా, వినినా, తానేమియూ చేయనివాడే అగుచున్నాడు. బాహ్యమైన విషయ భోగములు సుఖదుఃఖములకు దారితీయును; అవి క్షణికములు. నీవు వీటన్నింటికి అతీతమైన ఆత్మస్వరూపుడవు; నీవు స్వయముగా జ్ఞానస్వరూపుడవు, ఈ కర్మలతో నీకెట్టి సంబంధములేదు. అన్నింటికి నీవు కర్తవు కాదు; సాక్షివి, కాన ఈ అభిమాన మమకారములను భ్రాంతితో నీవీ సంశయములకు గురి అయినావు. నీవు బ్రహ్మజ్ఞానివి కమ్ము. **సర్వ కర్మలూ చేయుచూ ఫలమును**

మాత్రము త్యాగము చేయుము. కర్మత్యాగము కంటే కర్మఫల త్యాగమూ, కర్మ సన్యాసముకంటే కర్మయోగ మెంతో పవిత్రమైనవి. ఈ రెండింటికెంటెనూ ధ్యాన యోగము మరింత శ్రేష్ఠమయినది.

ధ్యానయోగమునకు కర్మయోగముయొక్క తోడ్పాటు అవసరము! కనుకనే కర్మయోగమును ముందుగానే తెలుపవలసివచ్చినది. అర్జునా! **ఫలమును వదలి కర్తవ్యకర్మ చేయువాడు నాకు అత్యంత ప్రియుడు. అట్టివాడే నిజసన్యాసి.** అంతే కానీ, అగ్నులను వదలి పని పాటలను మాని పరమ సోమరులవలె తిని, నిద్రించి, ఇంద్రియ విషయములను ఆశించుచు కుంభకర్ణుని సోదరులైనవారు నాకేనాటికి ప్రియులుకారు. **సోమరులకు నేను చాలా దూరము.** సంకల్పములను సన్యసించని వాడు యెన్నిసాధనలు చేసిననూ యోగి కాలేడు. శబ్దాది విషయము లందునూ కర్మల ఫలములందునూ తగులుకొననివాడు సర్వసంగ పరిత్యాగికాగలడు. ఇట్టి నిష్కామ కర్మల వలననే ధ్యానయోగమును సాధింపవచ్చును. అజ్ఞానవర్తికాని చిత్తమే తనకు పరమ శత్రువుగా మారును. కనుక నీవు జితేంద్రియుడవు కమ్ము. ఏకాంత వాసము చేయుము. చిత్తేంద్రియములను వశపఱచుకొనుము. **కళ్ళెములేని గుఱ్ఱము, కాడి పెట్టనివ్వని యెద్దు, ఇంద్రియములు వశము చేసుకోలేని సాధనా, నీరులేని నది వంటివే, నిష్ప్రయోజన కర్మలు.**

అర్జునా లెమ్ము! ధ్యానయోగమును అభ్యసించుము; క్రమము తప్పక, కాలము మార్చక, స్థానమును వీడక, మనసును అరికట్టుటకు పూనుకో. ఈ యోగమునకు క్రమము ప్రధాన అంగము; దానిని అతి జాగ్రత్తగా పాటించవలెను. ఇష్టమొచ్చినట్లంతయూ పద్ధతులు మార్చకూడదు అది ప్రమాదమునకు గురియగును. అతిగా తిని ఆయాస పడువానికీ, తిండే తినక దేహమును కృశింపజేయువానికీ, అతిగా నిద్రించువానికీ, అసలే నిద్రలేక నిరంతరము మెలకువతో నుండు వానికీ అనుకూలమునుబట్టి ధ్యానమును ఆచరించువానికీ కామ క్రోధాది షడ్గుణములను విచ్చలవిడిగా ఉపయోగించు వానికీ, తల్లిదండ్రుల యొక్క హృదయములను హింసించు వానికీ మాతృదేవి హృదయమును సంతృప్తి చేయనివానికీ వీటన్నింటికంటే అతి ముఖ్యమయినది, భగవంతునియందు గానీ లేక యెవరిని గురువుగా, దైవముగా భావించి హృదయమును అర్పితము చేసెనో, అట్టి వారలపై సంశయములు, అవిశ్వాసములు ప్రదర్శించువానికీ, యెన్ని యుగములు ధ్యానము చేసినా ఫలసిద్ధి కాజాలదు.

యోగభ్యాసము చేయువాని చిత్తము గాలిలేని స్థానమున దీపము ఉండినట్లు నిశ్చలముగా వుండవలెను. ఏయే సమయమున మనసు చలించునో అప్పటికప్పుడే దానిని నిశ్చలముగా పరుగెత్తనీయక అరికట్టుటకు ప్రయత్నించ వలెను. అన్నింటియందూ నేనే యున్నానను భావమును, సర్వభూతములూ నాయందే యున్నవను యేకత్వమునూ, పొందువాడూ అన్ని యోగములనూ సాధించును. అట్టివానికి పరులనియూ, పరమాత్మ అనియూ, భేదము లేకుండును. ఇతరుల సుఖదుఃఖములు తనవిగా భావించును ఇతర హృదయములను బాధింపజేయక సర్వులనూ సర్వేశ్వర భావమున ప్రేమించును. **ఇట్టి భావముగలవాడు యోగులలో శ్రేష్ఠుడు".**

(గీ.పు.96/98)

బుద్ధిపూర్వకముగా ఫలాసక్తి వదలి చేసిన కర్మనే నిష్కామ కర్మ అని అందురు. అదే బుద్ధియోగం. బుద్ధి నిర్మలము కానిదే ఫలాసక్తి వదలేది వీలుపడదుకదా! కాబట్టి దానినే **యోగబుద్ధి అని కూడనూ అందురు.** దీని సహాయముతోనే నీవు కర్మబంధాలను వదలించుకో, నీవు కర్మాతీతుడవు కమ్ము. పోనీ అసలు బంధనలను కలిగించే కర్మలు చేయకుండా వుందామని తలంచిన అది సాధ్యము కాదు. అసలు కర్మచేయక ఉండుటకు వీలులేదు. అది యెట్టివారి చేతనూ కాదు. **అందుకనే గీతలో కృష్ణుడు మూడవ అధ్యాయములో "నహి కశ్చిత్ క్షణమపి" అని అంటున్నాడు.** "అర్జునా! కామ్యకర్మములకు అభిక్రమ నాశమున్నది. నిష్కామకర్మలకు అభిక్రమము లేదు. ఇదియే సకామ

నిష్కామ కర్మలకు భేదము. కామ్యకర్మ శిక్షకుకూడనూ సిద్ధము కావలసివుండును. నిష్కామ కర్మకు అట్టి శిక్షలు వుండవు. **ఫలాపేక్ష సంసార హేతువు., ఫలత్యాగము మోక్షము హేతువు. నిష్కామకర్మ యోగమార్గమును అనుసరించువాడు ఆ జన్మలోనే సిద్ధిని సాధించలేక పోయిననూ చేసిన కర్మ వ్యర్థము కాదు.** దాని ఫలముతరువాత వచ్చు జన్మమునందైననూ ఫలించును. తన లక్ష్యాన్ని అవశ్యం సాధించవచ్చును. కనుక **కర్మయందే అధికారముంచుకో, కాని కర్మఫలమందు అధికారము వుంచుకొనవద్దు.**

"బావా! ఫలాపేక్ష రజోగుణ సంబంధము. అది నీకు సరి గాదు. ఫలం వదలమంటే కర్మనే మానుదువేమో! అది మరింత మోసము, అది తమోగుణ లక్షణము. జాగ్రత్త !" ఇక్కడ భగవంతుడు **నాలుగు ఆజ్ఞలు పెట్టినాడు. మొదటిది విధాయకాజ్ఞ, తక్కిన మూడును, నిషేధాజ్ఞలు; మొదటిది గుణనిరూపణ సంబంధము, రెండవది దోషనిరూపణ సంబంధము. కాన మానవుల కందరికీ కర్మయందధికారము కలదని భావించవలెను. ఒక అర్జునునికే కాదు.**

అర్జునుని మానవప్రతినిధిగా భావించవలెను. అదియే గీతాపాఠకులు మొదట గమనించవలసిన విషయము. ఇందులో మరొకటి తెలిసి కొనవలెను; యేమన, కర్మాధికారము మానవులకే కానీ, పశుపక్ష్యాదులకూ దేవతలకూ కాదని, దీని అర్థము. లోకమున ప్రతి మానవుడూ ఫలాన్ని కోరే కర్మలు చేయును; ఫలమే లేదన్న అసలు మానవుడు కర్మనైననూ వదలును కానీ ఫలము లేక యేకర్మయునూచేయుట లేదు; ప్రతి కర్మకూ మానవునకు లాభము అవసరము కానీ మన గీతాపానము చేయు వారలకు ఇది అన్వయింపదు. సామాన్య మానవుల మనస్సులు అట్టి ఫలాపేక్షకు పాల్పడవచ్చును. **మోక్షాపేక్ష కలవారు కర్మలు చేయుచు ఫలమును భగవదర్పితము చేయవలెను; అది శాంతిని చేకూర్చును.**

ఫలాపేక్ష అశాంతిని అందించును. ఫలమునే వదలిన జీవించుటెట్లు అని తలంతురేమో, అంత దౌర్భల్యమెందుకు! **ఎవరు "యోగ క్షేమం వహామ్యహం" అని అన్నారోవారే చూచుకొందురు. జీవితానందము** ప్రధానమా? మోక్షానందము ప్రధానమా? **జీవితానందము క్షుద్రము; మోక్షానందము నిత్యము, భద్రము!** ఈవిషయములో అనేక మంది వ్యాఖ్యానీకులు వారి వారి బుద్ధి కుశలతనుబట్టి వ్రాతలు వ్రాసిరి. అందులో అధిక సంఖ్య **ఫలాపేక్ష అనగా ఫలమును కోరుటకు మానవునకు అధికారము లేదు అని తెలుపుచుందురు.**

ఇది వ్యాఖ్యానీకులు పడిన పెద్ద పొరపాటు. భగవంతుడు గీతలో "మా ఫలేషు" అన్నాడు. అనగా ఫలము వద్దు అనిదాని అర్థము. మా అనగా "వద్దు"; అంటే ఫలమేమోవున్నది; కానీ నాకు వద్దు అని దానిని వదలుట, దీని భావము. వ్యాఖ్యానీకులు వ్రాసినట్లు అధికారము లేదు అని అనియుండిన కృష్ణపరమాత్మ "నఫలేషు" అని అనివుండవలెను కదా! 'న' అనగా లేదు అని, "మా ఫలేషు' 'కు 'న ఫలేషు' అనుటలో భగవత్ వాక్యమును కూడనూ మార్చినవారగుదురు. అట్టిది మహాపరాధము.

కర్మ చేయుటకు అధికారమున్నప్పుడు కర్మ ఫలమునకు కూడనూ మానవున కధికారమున్నది. లేదని చెప్పుటకు సాధ్యము కాదు; వీలులేదు కానీ; ఇష్టముతో కర్మఫలమునువదలవలెననియే దీని అర్థము_అందుకనే గీత ఒక మార్గము తెలిపినది; **"పనిచేయి ; ఫలము వదలు" ఫలాపేక్ష రజోగుణము. ఫలము లేదని, పనే మానిన తమోగుణము. కాని పని చేసి ఫలమును వదలిన అది సత్వగుణమగునని దివ్యమార్గము చూపుతున్నది!**

(గీ.పు.34/37)

(చూ॥ భగవంతుని అనుగ్రహం)

నిష్కామకర్మయోగము

(చూ॥ నాల్గుమార్గములు)

నిస్సంగత్వం

ఇప్పటినుంచీ క్రమక్రమంగా నిస్సంగత్వం అలవరుచు కోండి. ఎందుకంటే మీరు అత్యంత ప్రియంగా భావించు

నీచుడు

కుంటున్న వాటిని వదిలి పెట్టిపోవలసిన తరుణం ఎప్పుడో ఒకప్పుడు రాక తప్పదు. వ్యామోహాలతో బంధించే వస్తువులను పోగుచేయవద్దు. బంధ విముక్తి ప్రదాత ఆ పరమాత్మునితో అనుబంధం ఏర్పరచుకోవాలి.

(వ.1963 పు.165)

నీచుడు

(చూ॥ దేవుడు)

నీడ

(చూ॥ మాయ)

నీతి

నీతియమము లేక తిరిగిన - ధాతకైన అజ్ఞాన మొదగదు
జ్యోతిలేనిది అంధకారము - భూతలంబున లేదటంచును
కన్ను విప్పి చూడరోరన్నా - ఈ దేవదేవుని
యెన్నగా యెందైన కలడన్నా !

(శ్రీ.స.వి.వా.పు.43)

మనకు ఎంత జ్ఞానం ఉన్నప్పటికీ, సంఘానికి మేలు చేయాలన్న భావం లేకపోతే చదువుల వల్ల ఉపయోగం ఉండదు. సద్గుణాలు, సంస్కృతి, నాగరకత, **నీతి లేకపోతే విద్య ఏ విధమైన ప్రఖ్యాతిని కలిగించదు.**

(లో.పు.75)

దేశ కాల మతముల నియమములననుసరించి ఆచరించే సదాచారమే నీతి. దీనినే ప్రవర్తన, నడత, సదాచారము అని చెప్పవచ్చును.

(వ.1984.పు.84)

జాతి గౌరవంబు నీతిపై నిలుచును
నీతి లేక యున్న జాతి చెడును
నీతి గల్గుజాతి నిజమైన జాతిరా
వినుము భారతీయ వీరసుతుడా.

మానవజాతి యొక్క గౌరవము నీతి నిజాయితీలతో కూడిన మానవత్వముపై ఆధారపడి ఉంటుండాది. ఈనాడు విద్యార్థులు పోషించుకొన వలసినది మానవత్వము. ఈ మానవత్వము ఆధ్యాత్మిక వాతావరణమునందు మాత్రమే అభివృద్ధి కాగలదు. అన్యవాతావరణములందు అభివృద్ధి అగుటకు అవకాశములేదు. విత్తనము మట్టిలో నాటి నీరు పోసినప్పుడే అది మొక్కై, వృక్షమై ఫలము లభిస్తుంది. అట్లు కాక బీజములు ఒక టిన్నులో ఎట్టి నీరుపోస్తే కుళ్ళిపోతుంది. **నీతినిజాయితీలు మానవతా హృదయమునందు మాత్రమే అభివృద్ధి అగుటకు అవకాశమున్నది. మానవత్వానికి సద్గుణములకు ఆధారము నీతి! నడత యొక్క పరిపూర్ణతయే నీతి. భోగభాగ్యములు సిరిసంపదలు నీతి పైననే ఆధారపడి ఉంటున్నవి. నీతి మానవుని ఉన్నతస్థాయికి గొని పోతుంది.** ప్రాచీన కాలమునుండి అన్ని దేశములకు ఆధ్యాత్మిక సంపత్తితో నీతినిజాయితీలను బోధించిన దేశము. **నీతి నిజాయితీలే భగవంతుని నిత్య నిలయాలు. నిత్య నిలయాలు.** నీతియే లేకుండిన మానవజాతియే పోతుంది. ఈనాడు దేశమునకు అవసరమైనది నీతియే. నీతి అన్ని సమయములయందు సర్వత్ర అత్యవసరంగా పాటించాలి. మార్షల్ పోప్ యుద్ధ సమయమునందుగాని, ప్రాణాపాయ సమయమునందుగాని ఎట్టి కఠినమైన స్థితి యందైనను గాని నీతిని విసర్జించకూడదని బోధించాడు. విక్టోరియా రాణి ప్రధానమంత్రి ఐన విలియమ్ గ్లాడ్‌స్టన్ నీతినిజాయితీలను సర్వకాలముల యందు పోషించినాడు. కనుకనే విక్టోరియా రాణి కంటేను ప్రధాన మంత్రిని ప్రజలు గౌరవించేవారు. **ఈ నీతి ఇంద్రియనిగ్రహము చేత అలవడుతుంది. ఎవరిని వారు శాసించుకో తగిన శక్తి కలిగిన వారే ఇతరులను శాసించటానికి అధికారులౌతారు.** తనను తానే శాసించుకోలేని బలహీనుడు ఇతరులను ఏ రీతిగా శాసించగలడు. తన మాట తన ప్రవర్తన రెండింటిని గావించే జీవితమును గడపాలి. ఈ విధముగా మాట క్రియ ఏకమైనప్పుడే తాను మహత్తరమైన విభూతులను అనుభవించగలడు.

(బృ.త్ర.పు.139/170/171)

(చూ॥ అవినీతి, ఇస్లామ్, బెస్ట్‌ఫ్రెండ్స్, మానవజీవితము)

నీరు

(చూ॥ పంచభూతములు, పండితుడు, పాత్ర)

నీలవర్ణము

భగవంతుడు నీలవర్ణుడంటారు. అంటే అతని శరీరము నీలవర్ణమని కాదు. అతను జ్ఞాన భాస్కరుడు. జ్ఞాన స్వరూపుడు. జ్ఞానజ్యోతి. అతను అనంతుడు. ఆకాశము వలె అంతులేని వాడు, సముద్రములా ఆద్యంతరహితుడు. రెండూ కూడా నీలవర్ణమే. భగవంతుడు కూడా నీలవర్ణుడే. అతను నీలపు రంగుతో పుట్టలేదు. అతడు అనంతుడు, అంతము లేనివాడు

(ది.ఉ. 12.4.1993)

(చూ॥ కళ్యాణము)

నీవే

(చూ॥ దైవసంకల్పము, భగవంతుడు)

నీవేనేను - నేనేనీవు

"డార్విన్" విద్యార్థిగా యున్నప్పుడు హెన్ స్లో అనే గురువు వద్ద విద్య అభ్యసించినాడు. ఆయన పరమ పవిత్ర హృదయుడు. నిస్స్వార్థప్రియుడు. నిరహంకార మయుడు. నిశ్చల చిత్తుడు. అట్టి గురువును ఆశ్రయించిన వాడు డార్విను. తన గురువు వలె తాను కూడా ఆస్థితిని అనుభవించాలని సత్ చింతన చేస్తూ వుండే వాడు. **"యద్భావం తద్భవతి" ఫలితాలు భావాలను అనుసరించి యుంటాయి.** చివరకు తన కోర్కె తీర్చుకోగలినాడు. డార్విను తాను కూడా నిశ్చల చిత్తుడు. నిస్వార్థపరుడు. నిరహంకారమయుడై ప్రజల ముందు తేజస్సుతో ప్రకాశించాడు. **కడపటికి దైవము తాను ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించాడు. కనుకనే తనే దైవాన్ని తన ఎదుటిగా యున్నట్లు భావించి "నేను లేక నీవు లేవు" అని అనగలిగాడు.** ఐన్‌స్టీన్ కోట్లు గడించాడు. కడకు తన్ను తాను తెలిసికోవడమే ప్రధానమని గుర్తించాడు. **నీవే దైవం. చూచేది తానే, చేసేది తానే, అనుభవించేది తానే. అన్నీ తానే. ఇట్టి సంకల్పాన్ని అనుభవిస్తే ఎంతో తృప్తిని అనుభవిస్తాము. నేను నేనే, వేదం నేనే, వేదంతయు నేనే, వేదవేత్తను నేనే. సర్వము వేదమయము. వేదమే దైవం, వేదమే మానవత్వం "దైవం మానుష రూపేణ" దైవత్వం మనుష్య రూపంలో వచ్చింది.** కనుక మానవత్వాన్ని పవిత్రమైన వరప్రసాదంగా భావించాలి. **ప్రసాదాన్ని పారవేసే వాడు మూర్ఖుడు. అనుభవించేవాడు ధన్యుడు.** దైవమిచ్చిన మానుష్యత్వాన్ని సార్థకాన్ని కావించుకొన్నవాడు ధన్యుడు.

(సా.పు.423)

(చూ॥ అరిషడ్వర్గాలు)

నూతనజబ్బు

ఇప్పుడు లోకమున శాంతిని మరుగు పరచుటకు మరొక నూతన జబ్బు ప్రారంభమైనది. సర్వనీతులు, సర్వ ధర్మములు, సర్వక్రమములు చిలకపలుకలవలె ఇతరులకు చెప్పనేర్తురేకాని, అందులో ఏ ఒక్కటీ వారు అనుష్ఠింప అలవడుటలేదు. మన పెద్దలకు ఇప్పుడు చెప్పునది మాత్రము తెలియును. కాని, చేయుట తెలియదు; నేర్చుటలేదు. చేయ నేర్చని వానికి చెప్పుటకెట్లు తెలియును? అట్టి అనుభవములేని వాక్కులే ఇప్పటి **నూతన జబ్బు**. ఈ రోగము మొదట రూపుమాయవలెను. దీని మూలముకూడా, మానవుడు యదార్థమైన శాంతిని అనుభవించలేక పోవుచున్నాడు. **చెప్పుట అందరికీ సులభమే. చేసి చెప్పువాడు యదార్థ సాధకుడు, చేయక చెప్పువాడు అనర్థ సాధకుడు.**

(ప్ర.వా.పు.7)

నెగిటివ్

(చూ॥ నామంచికే, నిర్గుణోపాసన, ప్రవృత్తి, సగుణపాసన)

నెమలి

నెమలి చూచుటకు అందముగా వుంటుంది. దాని నాట్యము అతి సొంపుగా వుంటుంది. కానీ అది భుజించేది ఏమిటి? పాములను. **దుర్జనులు** కూడ అట్టివారే. వారు నెమలివలె అందరిని ఆకర్షిస్తారు. కాని వీరెట్టి పాపము చేయుటకు వెనకాడరు.

(భ.ప్ర.పు.39)

నెఱ్ఱు

నెఱ్ఱు

(చూ॥ దివ్యత్వం)

నేటి విద్యలు

నేటివిద్యలు తెలివితేటలనేపెంచు
కొంచెమైన గుణము పెంచబోదు
కోటి విద్యలుండి గుణములేకున్నచో
ఫలమదెమీ? వాని విలువదేమి?

(స.సా.జూలై. 2001 పు. 215)

నేటి విద్యావిధానము

నేటి విద్యా విధానము ఈ వికృతి మార్గము పొందటానికి కారణమేమిటి? ఇంటిలో తల్లిదండ్రులు, విద్యా సంస్థల యందు అధ్యాపకులు, సమాజమునందు నాయకులు సరియైన ఆదర్శమును నిరూపించలేకపోవడం చేతనే విద్యార్థుల మార్గం పెడమార్గంగా మారింది. ఇంటిలో తల్లిదండ్రులు చెప్పుట ఒకటి, చేయుట మరొకటి. విద్యార్థులు అత్యంత తెలివితేటలు గలవారు కనుకనే, అన్నింటినీ గమనిస్తూ వస్తున్నారు. "ఆవు పంటలో చేరి మేస్తుంటే, దూడ గట్టుపై ఉంటుందా?" కనుక, **దీనికి పెద్దలే మూలకారణం. మొట్టమొదట ఇంటియందు తల్లిదండ్రులు సరియైన ఆదర్శాన్ని నిరూపించలేక పోతున్నారు.** తమ కుమారుడు కేవలం విద్య నభ్యసించి ఉద్యోగంలో చేరి చక్కగా ధనము నార్జించాలనే లక్ష్యము తప్ప **వాడు సద్గుణవంతుడు, సదాచార సంపన్నుడు కావాలనేది తల్లిదండ్రులలో లేకపోతున్నది.** అయితే, **తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమించవలసిందే. కాని, అది ధృతరాష్ట్ర ప్రేమగా ఉండకూడదు.** పిల్లలు ఏమి చేసినా దానిని సమర్థించుకుంటూ పోకూడదు. తప్పుకు తగిన శిక్ష ఒప్పుకు తగిన సత్కలితము అందిస్తూ రావాలి.

(శ్రీ.భ.ఉ.పు.143)

నేత్ర లింగము

ఈ బదరీ యాత్రకు వచ్చిన వారు ప్రతిక్షణము భగవంతుని అనుగ్రహం పొందుతూనే ఉన్నారు. వీరిలో ఒక నూటయాభైమంది మరీ వృద్ధాప్యంలో ఉన్నారు. వారి ఆరోగ్యం బాగాలేదు. అటువంటివారు ఈ యాత్రలో ఒకక్షణకాలం కూడా తలనొప్పి కూడా ఎరుగకుండా వచ్చారు. దానికి కారణం స్వామి! **స్వామి కూడా బదరీకి వెళ్ళిన కారణం బదరీలో పవిత్రతకు మూలకారణమైన నేత్రలింగాన్ని తిరిగి శక్తిమంతం చేయవలసి ఉండటమే. శంకరాచార్యులు కైలాసం నుండి ఐదు లింగములను తెచ్చి ద్వారక, శృంగేరి, బదరీ, పూరీ, చిదంబరములలో ప్రతిష్టించారు. వాటిల్లో బదరీలోనిది నారాయణ అంశము. దానిని శక్తిమంతం చేయటం నాకర్తవ్యం.** ఆ సన్నివేశాన్ని వీరంతా దర్శించారు.

నేత్రలింగాన్ని శక్తిమంతం చేయటం నేను ఈ సంవత్సరమే (1961) చేయవలసి ఉంది. కారణం నేను ఈ అవతారము ధరించి ఇది 35 వ సంవత్సరము. మరొకటి శృంగేరీలో శంకరాచార్యపీఠం ఈ సంవత్సరం అధిష్టించిన వారు 35వ వారు. అందువల్ల బదరికాశ్రమంలో ఆధ్యాత్మిక సంపద వెల్లివిరియటానికి, ఆ బ్యాటరీ చార్జి చేయటానికి ఇది ముఖ్యమైన సమయంగా నేను భావించాను. శంకరాచార్యులు నారాయణుని విగ్రహం క్రింద నిక్షిప్తం చేసిన నేత్ర లింగాన్ని నేను హస్తచాలనంతో బయటకు తీసి మరల హస్తచాలనంతో గంగోత్రి జలము తెప్పించి దానికి అభిషేకం చేశాను. తరువాత బంగారు **బిల్వపత్రాలను, తుమ్మిపూలను అప్పటికప్పుడు సృష్టించి ఆ లింగమునకు పూజ చేసి తిరిగి దానిని స్వస్థానమునకు పంపించాను.** ఆ లింగమును ఒక బంగారు పద్మంలో ఉంచాను. ఈ పద్మం రేకులు మూడు వరుసలుగా ఉన్నాయి. ప్రతి వరుసలోను మరల 16 రేకులు చిన్న వరసలు ఉన్నాయి. **ఆ బంగారు కమలము హృదయ కమలమును తెలియజేస్తుంది.**

(వ.61-62 పు.41/42)

నేను

నేను సాయిబాబాను! (23.5.1940 ప్రకటించారు) అపస్తంబ సూత్రుడను! భారద్వాజ గోత్రుడను! నేను మీ కష్టాలన్నీ తొలగించడానికి వచ్చాను. మీరంతా గురువుగా గుర్తించి ఆరాధిస్తున్న మీ పూర్వపురుషుడు, మహాజ్ఞాని అయిన వెంకావధూత నన్ను ప్రార్థించారు. హృదయ పూర్వకమైన ఆయన కోరికను మన్నించి నేను మీ కుటుంబంలో జన్మించాను. **ప్రతి గురువారం నన్ను పూజించండి.** మీ గృహాలు, మనసులు నిర్మలంగా పవిత్రంగా ఉంచుకోండి.''

(లో.పు.7)

నేనింక మీ సత్యాన్నికాను. 'సాయిబాబా'ను మాయ తొలగిపోయింది. నేను వెళుతున్నాను. నా భక్తులు నన్ను పిలుస్తున్నారు. నేను చేయవలసిన పని వేచి ఉంది. నేనింక ఎంతమాత్రం ఉండలేను.

(లో.పు.7)

నాలుగు ముఖ్యమైన అంశములను మీరు తత్వ విచారణతో గ్రహించవలెను. దేహం ఏమిటి? **నేను ఈ దేహమా? నాహం; కాదు. మరి నేనెవరు?కోహం? (తత్వమసి) నేను అదేనా? లేక ఇది వేరు అది వేరునా? వీటన్నిటికీ ఒక్కటే సమాధానము-'సోహం' అదే నేను - అంటే ఆ పరమాత్మ నేనేను.** నశ్వరమైన శరీరముతో అస్థిరమైన మనస్సుతో తదాత్మ్య భావము విడచి ఈ క్షణికమైన నాటకమునకు నేను సాక్షిని మాత్రమే అని గ్రహింపుము.

(స.శి.సు.తృ.పు.132)

అందరి కష్టసుఖములు నాకు తెలుసు. దానికి కారణము నేను అందరిలోను వుండటయే. ఈ సాయి అను కరెంటు ప్రతివ్యక్తి అనే బల్బులోనూ ప్రవహిస్తున్నది. ప్రతి హృదయములోను నేను ప్రకాశిస్తున్నాను. **మీ అందరి హృదయములలోనూ వున్న చైతన్య శక్తిని నేనే.**

(స.శి.సు.పు.166/167)

నేను అను పదములు రెండు కలవు. **1.అహంకారము, దీనినే దేహాత్మ, ఇది బైటగల నేను. 2 అంతరాత్మ, లేక ప్రత్యగాత్మ. ఇదిలోపలగల నేను.** ఈ రెండింటికీ భేదము తెలియనివాడు అహంకారమే. అనగా దేహాత్మనే నేను అని అనుకొనుచున్నారు. కానీ అది సత్యము కాదు. అది ఆత్మకాదు. దేహము పనిముట్టు, అయినందున, పదార్థమెట్లు దృశ్యమో, దేహాత్మ అయిన అహంకారము కూడా దృశ్యము. ఈ అహంకారము స్వప్నమునవుండదు, నిద్రలో వుండదు. త్రికాలభాద్యం సత్యం. రెండుకాలములలో లేనిది సత్యమెట్లగును. ఈ విధముగ విచారము సలిపి, **ఇంద్రియములు, మనస్సు బుద్ధి ప్రాణము** యేది తాను కానియెడల ఇక ఆత్మ ఏది అని, ఆత్మఎవరని, మీలో సందేహము కలుగవచ్చును.

రాకపోకలు లేని, కరచరణ అవయవములు కాని, మాలిన్యము చేరని, అణువున అణువుగను, ఘనమున ఘనముగను, ఆకాశమువలే అంతటానున్నను. నేను, నాది అను భావములేక, అగ్నికి వేడిమివలె సూర్యునకు ప్రకాశమువలె, ఎరుకయే స్వభావముగాగలది ఆత్మ. శోక కోప పంచేంద్రియాది సంబంధములేక పరమానందమైనది ఆత్మ. సర్వజీవుల యందు, హృదయముగా ప్రజ్ఞగావున్నదే ఆత్మ. దృశ్యములందు దృక్కుగా చూడబడేవస్తు జాలమును చూచువాడే ఆత్మ. కరణాదుల సహాయములతో చూచి విని, తిని, చెప్పు వాడెవడైననూసరే వాడు కేవలము దీపమువంటి వాడే కానీ ఆత్మస్వరూపుడు కాడు. **ఆత్మ అల్పద్రష్టకానీ, క్రమద్రష్టకానీ, అద్రష్టకానీ, అన్యథాద్రష్టకానీ** కాదు. బుద్ధి చంద్రుని వంటిదయినప్పటికినీ స్వప్రకాశము కాదు. దానికి సూర్యునివంటి ఆత్మకు అతి సమీపముననున్నందున అది ఆత్మతో కలియవీలున్నది **లక్కా, చెక్కా చక్కగా అంటుకొనును. బుద్ధి, ఆత్మ అట్టివికావు. అభ్యాసముచే మాత్రము కలియును.** సూర్యుడును ఇతరవస్తుసాన్నిధ్యమును బట్టే సూర్యుడు జగచ్చక్షువు అని చెప్పబడుచున్నాడు. సూర్యునకు నేను అని కాని, నాది అనికానీ, ఒక కోరిక కానీ లేదు. అతని సాన్నిధ్య మాత్రమున చీకటి పోయి వెలుతురు, వెలుగువచ్చి సర్వము ప్రకాశించుటవలన

అతడు ప్రకాశకుడయినాడు. కానీ అతనికి కర్తృత్వ రూపమును ప్రకాశత్వము లేదు. **అటులనే ఆత్మకు, మార్పులుకానీ కూర్పులుకానీ లేని, ఆత్మ కర్త యెటులగు నని అడిగినచో, సూదంటురాయికి కర్తృత్వమెటుల తనదాపున చేరిన సూదిని కదుల్చును?**

ఆత్మవున్నదా? ఉన్నయెడల ఏ ప్రమాణముచే సాధింపబడును? **ఆత్మ వున్నదనుటకు ప్రమాణముతో పనిలేదు. ఆత్మయే ప్రమాణాధీనుడై ప్రమాణములచే సాధింపబడవలసిన యెడల. ఆప్రమాణము వుపయోగించి పరీక్షించువాడు మరొకడుండవలెను. కదా అతనెవరు? పోనీ ఆతనే ఆత్మ. ఆత్మకలదని చెప్పుటకు వేదమే ప్రమాణమని** కొందరు చెప్పవచ్చు. కొందరు వేదముచే కూడా ఆత్మ సాధింపబడదని చెప్పవచ్చు. ఆత్మ అన్నను ఒకటే అని తెలుపులో వేదము ప్రమాణముకావచ్చును. కాని స్వయంసాక్షి అయిన **ఆత్మకు వేద ప్రమాణములు లేవు.**

(స.వా.పు.161/163)

"నేను మానవుడినో, భగవంతుడినో, దేవతనో, ఆత్మనో కాను. నేను నాలుగు వర్ణాలలో ఏదో ఒక వర్ణానికి చెందిన వాడినని కాని, జీవితంలోని నాలుగు దశలలో ఏదో ఒక దశకు చెందిన వాడినని కాని ముద్ర వేయటానికి వీలు లేదు. సత్యాన్ని బోధించేగురువుగా, సత్యం శివం సుందరంగా మీరు తెలుసుకోండి".

(శ్రీ.స.ప్రే.ప్ర.పు.242)

నన్ను నేను ప్రేమిస్తున్నప్పుడు నేను మిమ్మల్నే ప్రేమిస్తున్నాను. మిమ్మల్ని మీరు ప్రేమించేటప్పుడు మీరు నన్నే ప్రేమిస్తున్నారు. మనం ఇరువురం ఒక్కటే. నన్ను నేను ప్రేమించుకోగలగటం కోసమే నానుండి నన్ను వేరుచేశాను.

when I love my self I love you, when you love your selves you love Me. We are one, I only seperated My self from My self so that I can love Myself

(శ్రీ.స.ప్రే.ప్ర.పు.392/393)

సూర్యుడు స్థిరంగా ఉన్నాడు. భూమిపరిభ్రమిస్తోంది. నదులు ప్రవహిస్తున్నాయి; గాలివీస్తోంది అంటేకారణం ఆవిధంగా నేను సంకల్పించటమే. మానవులంతా వివిధమైన భిన్నాభిప్రాయాలు కలవారు, వివిధమైన అదృష్టాన్ని కలిగి ఉన్నవారు. వివిధవర్గాలలో ఉన్నవారు అందరూకూడా నేను ఆడించేనాటకంలో భిన్నభిన్నమైన మనస్తత్వాలు కలపాత్రలే.

స్వర్గలోకవాసుల ప్రయాణంకోసం 'ఆటోమేటిక్ ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పరచింది నేనే"

(శ్రీ.స.ప్రే.ప్ర.పు.408)

సకల భూతములయొక్క హృదయ కమలములందుండు ప్రత్యగాత్మను నేనే, దీనినే ఆత్మ అని అందురు. దానిని ధ్యానించిన చాలును. అనగా సర్వ భూతములయొక్క ప్రత్యగాత్మ అని విశ్వసించిన చాలును, అదే ధ్యానము, అట్టి విశ్వాసమునకు ప్రతిబంధకములు కలుగక దృఢవ్రతుడవై ఆచరణలయందు నిరూపణ సలిపినపుడు నీవే నేను, నేనే నీవను అనుభవము పొందుదువు. అదే ఏకత్వము.

లోకమున భూతములుకాక మిగిలిన సృష్టిజాలమున యేయే రూపముననున్నానో అదియును తెలిసికొమ్ము. పంచభూతముల స్వరూపమైన భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశములు నా రూపములే, సూర్య చంద్ర నక్షత్రముల యందలి చైతన్యమును నేనే. ప్రళయకాలమున సమస్తమునూ తనలో లయ పరచెడు మృత్యుదేవతయు, ఉత్పత్తి కాలమున పుట్టుకయూ నేనే.అణువు మొదలు అఖండము వరకూ, త్రికాల, త్రిలోక, త్రిగుణములందు అంతయు నేనే వ్యాపించి యున్నాను.

"నేను వస్తువు కానీ, నాదికాని పేరుగానీ లోకమున లేదు. దేహమునందలి రక్తము, యే భాగమున చూచిననూ వక్కటిగానే యెట్లుండునో, దేశమునందు యే భూతమును చూచిననూ అందులో సర్వ వ్యాపియైన నేనే రక్తమువలె ప్రవహించుచుండును"అని కృష్ణపరమాత్మ బోధించెను.

(గీ.పు.180/181)

ఈ సృష్టికి భగవత్సంకల్పమే మూలాధారం. మానవుడు భగవత్సంకల్పము నుండియే ఆవిర్భవించాడు. కాబట్టి, తాను భగవద్భావములనే కలిగి యుండాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాది దుర్గుణాలు ఆహార విహారముల నుండి ఆవిర్భవించినవేగాని, మానవునికి సహజమైనవి కావు. మీరు 'నేను' అనే పదాన్ని ఉచ్చరిస్తున్నారు కదా! **ఈ 'నేను' అనేదే మూలాధారమైన మంత్రము. 'నేను' అనే మంత్రము పుట్టిన తరువాతనే మిగిలిన మంత్రములన్నీ ఆవిర్భవించాయి. వేదము "అహం బ్రహ్మాస్మి"** అన్నది. **అనగా, 'నేను' అనేదే బ్రహ్మ. బ్రహ్మకు మొట్టమొదటి పేరు 'నేను' అనేదే బ్రహ్మ.** కాని, ఈ పదముయొక్క సరియైన అర్థాన్ని మీరు గుర్తించుకోలేక దీనిని దేహభావంతో ఉచ్చరించి దుర్వినియోగ పర్చుతున్నారు. ప్రేమస్వరూపులారా! నిత్యజీవితంలో మీరు సత్యమైన మార్గాన్ని అనుసరించాలి. అట్లు చేయకుండా జపము, ధ్యానము మున్నగు సాధనల నెన్ని చేసినా ప్రయోజనం లేదు. ఈ సాధనలతో పాటు మీ మనస్సును పరిశుద్ధపర్చుకోవాలి. హృదయంలో నున్నది మాటలో చెప్పాలి; మాటలో చెప్పింది ఆచరణలో చూపించాలి. ఇదియే నిజమైన మానవత్వం. ఇట్టి త్రికరణ శుద్ధి కల్గిన మానవుని కోసమే భగవంతుడు అన్వేషణ సల్పుతున్నాడు?

(స.సా.మే.2000పు.150)

కొలతకు అలవికాని అగాధమైన లోతుగల బ్రహ్మాను న్వల్పమైన మనస్సుతో ఎట్లుకొలువగలడు? **అప్రమేయమనగా వెడల్పు, పొడవు కొలతను, తీసికొనుటకు అలవికానిది. అపరిచ్ఛిన్న మనగా అంతేలేనిది. అవ్యపదేశ్యమనగా వర్ణింప నలవికానిది అని అర్థము.** ఇట్టి పరమాత్మను సామాన్య భౌతిక ఇంద్రియము లచే చూచుటకానీ తెలిసికొనుటకానీ దుర్లభము. **వేదాంతమందు చెప్పబడిన భోగత్యాగ లక్షణమైన బ్రహ్మాను నేతి, నేతి యనబడు వ్యతిరేక భావ సిద్ధాంతము సూచించిన బ్రహ్మము నేనే, హృదయ గుహయందుండెడి బ్రహ్మాను నేనే. సాధకులు, శమము, దమము, తపస్సు సత్యము, బ్రహ్మచర్యము మొదలైనవాని అభ్యాసము వలన కనుగొనగోరెడి బ్రహ్మము నేనే, దేహము, మనసు, ప్రాణము, మేధకాక మిగిలినది పరబ్రహ్మము, ఇదియే నేతి, నేతి అనెడి సిద్ధాంతము.** ఇది వ్యతిరేక సిద్ధాంతము యొక్క తపస్సు. భోగ త్యాగ లక్షణములకే జాగ్రతా జాగ్రత లక్షణమని పేరు. జీవ బ్రహ్మైకత్వమును చూపెడి లక్షణము ఇదియే. **"తత్త్వమసి" మహా వాక్యము యొక్క అర్థమును "సోయం దేవదత్త" (ఇతడే దేవదత్తుడు)**అని చూపించినట్లు పై చెప్పిన సిద్ధాంతము చూపగలుగు చున్నది. జీవునికి కప్పిన ఆవరణము తొలగింపగనే జీవుడే పరమాత్మగా, పరబ్రహ్మముగా చూపబడు చున్నాడు. **బ్రహ్మయొక్క స్థానమే జీవాత్మ, (ధహరాకాశ మనగా హృదయమందుండు ప్రాణవాయువు; తపస్సు అనగా ఇంద్రియనిగ్రహముచే చేయబడు ఆరాధన, దమమనగా మనోనిగ్రహము).**

నేను అను పదము నత్తు చిత్తానందములను అన్వయించునపుడు భౌతిక శరీరము "నేను" ఎట్లు కాగలదు? అజ్ఞానమువల్లనే భౌతిక శరీరము మహత్తరమనే నేననెడి పరమాత్మగా నెంచుచున్నాము **ఈ అజ్ఞానమే అనేక జన్మలకు సుఖదుఃఖములకు హేతువగుచున్నది.** కావున **నేను అనే పదమును వివేకముతో పరబ్రహ్మ కన్వయింపగల్గినచో వెంటనే ఆత్మజ్ఞానము పొందుదురు. ఆత్మసాక్షాత్కారమునకు ఇంద్రియ నిగ్రహము,** దేహవాసనా నిర్మూలనము, నత్యము, చాల అవసరము. **శాశ్వతబ్రహ్మయే బుద్ధికి బృహస్పతి, మనస్సునకు మనస్సు, చెవికి చెవి, కన్నుకు కన్ను, సర్వముపైన స్వయం ప్రకాశకుడు. అతని తేజస్సు వలననే ఇతరములన్నియు ప్రకాశించుచున్నవి. సంపూర్ణుడయిన పరమాత్మయే అన్నింటికి ఆధారము. బ్రహ్మము మనస్సునందు జ్ఞాన స్వరూపుడుగా నున్నాడు. మనస్సు బుద్ధి అనెడి ఇంద్రియముల నావరించియుండును. అతడు లేనిది మనోబుద్ధు లాలోచింపజాలవు. మరల అందులోనే**

లయమగుచున్నవి. గడ్డి, భూమిలో పుట్టి భూమిలోనే నశించునట్లు, బ్రహ్మయందు, బుద్ధి జనించి, అందులోనే నశించుచున్నది. ఎట్లు ఇనుము నిప్పులో పెట్టగానే యెఱ్ఱరంగు పొందునో, నీరు పాల సాంగత్యము వలన ఎట్లు తెల్లబడునో, అట్లే జ్ఞానస్వరూపుడైన పరబ్రహ్మ సాంగత్యమువలన బుద్ధికూడ జ్ఞానము పొందుచున్నది.

(ఉ.వా.పు.84/86)

సర్వవేదాంత గ్రంథాల సారమెల్ల
ఒక్క వాక్యాన చెప్పుడునొక్కసారి
అఖిల భూతంబులందున్న ఆత్మయు
నేనొక్కటేయని మనసున నుండవలయు.

ఆత్మమే 'ఎరుక' అని పిలువబడుతుంది. ఈ ఎరుకయే సర్వులయందూ 'నేను' 'నేను', అనే స్ఫురణను కలిగిస్తుంది. ఆ స్ఫురణ శక్తి దేహముతో తాదాత్మ్యం పొందటంవల్లనే అహంకారంగా రూపొందుతుంది. తత్ఫలితంగా తన శరీరమే తాను అనే భ్రమకు గురి అవుతాడు మానవుడు.ఇదే మిథ్య 'నేను'.

ఈ **'నేను' 'ఆత్మ' పరమాత్మ' 'బ్రహ్మము' 'దేహి' 'క్షేత్రజ్ఞుడు' 'దైవము' మొదలైన పదములన్నీ ఆధ్యాత్మిక పరిభాషలో సందర్భోచితంగా ఉపయోగపెట్టే పర్యాయ పదములే.**

(శ్రీ.స.పు.39)

"నేను ఆధునికుణ్ణి. మరెల్లప్పుడూ కూడ సనాతునుణ్ణి. నే నెప్పుడూ ధర్మాన్ని పునరుద్ధరించడానికి పరిరక్షించడానికీ సజ్జనుల్ని సంరక్షించడానికీ వారి అభ్యుదయానికి కావలసిన నిశ్చయ పరిస్థితుల కల్పనకూ అజ్ఞానంతో దారీ తెన్నూ లేక తిరుగాడుచున్న వారికి ఆత్మవిజ్ఞానం ప్రబోధించడానికి వస్తూంటాను. కొంతమంది సంశయాళువులు "పరమాత్మ మానవశరీరము ధరిస్తారా" అని అడుగవచ్చును. "మంచిది, మనిషికి ఆనందం మానవరూపంద్వారానే లభిస్తుంది. అతడు ఆత్మ ప్రబోధాన్నీ ఉత్తేజాన్నీ ఆత్మసాక్షాత్కారాన్నీ మానవ భాషలోనూ మానవ సంభాషణల్లోనూ మాత్రమే పొందగలడు."

(సా.అ.పు.108)

విశ్వాసమూ, భగవదేచ్ఛకు శరణాగతి చెప్పుకోవడమూను, భారాలన్నీ విసరిపారవేసి తేలిగ్గా ఉండు. ఆపు డొక ఆడుగు ఒక తరంగ మూర్ధంమీదా వేరొక అడుగు మరొక తరంగమూర్ధంమీదా ఉంచి ముందుకు పోగలవు. భగవంతుడు, కూడా ఉండి తీసుకు పోగలడు - **నీ మనస్సు నిన్ను విచారంలోనికో గర్వానికో అసూయకో లాక్కుని పోతుంటే నాదిక్కు తిరుగు. నీ మనస్సు యొక్క లోతులను, అవెంత పరిహాసాస్పదాలుగా ఉన్నా సంశయాలతోగాని ఆశాభంగాలతోగాని ఎంత క్రూరంగా చిందవందరై యున్నా నాకు చూపించు. నాకు తెలుసు వాటి నెట్లా సరిచేయాలో. నేను నిన్ను త్యజించును. నీ అమ్మను నేను.**

(సా.అ. పు. 187)

నేను ప్రతివారికీ సేవకుణ్ణి.
నన్నే పేరున పిలిచినా పలుకుతాను.
ఏమంటే పేర్లన్నీ నావేగనుక.
నాకు ప్రత్యేకమైన పేరంటూ ఏమీ లేదు.
ఒకరు కృష్ణుడంటే యిష్ట పడతారు.
వేరొకరిమనస్సుకు శివుడంటే ప్రీతి;
మరొకరు నిరాకారుడైన అల్లా అంటే అభిమానిస్తారు.
వారంతకుముందునుండీ పూజించేమూర్తులను
విడచివేసి నే నెప్పుడూ ప్రజల్ని నన్నారాధించమని కోరను.
నేను ధర్మాన్ని ప్రతిష్టించడంకొరకు వచ్చాను.
అందుచేత నాకు మీవిధేయతలవసరంలేదు.
కోరనుకూడ. వారెవరైనప్పటికీ వాటిని మీ
ప్రభువుకుగాని గురువుకుగాని సమర్పించండి.
నేను మీదృష్టుల్ని సరిదిద్దుటకు వచ్చిన మహాసాక్షిని.

(సా.అ.పు.243)

నపుణ్యం నపాపం నసౌఖ్యం దుఃఖం
నమంత్రో నతీర్థం నవేదా నయాజ్ఞాః
అహం భోజనం నైవ భోజ్యం న భోక్తా
సచ్చిదానంద రూపం సత్యం శివం సుందరమ్.

నేను పుణ్యముకాదు, పాపముకాదు, నేను సౌఖ్యం కాదు,

దుఃఖముకాదు, నేను మంత్రము కాదు, తీర్థము కాదు. నాకు వేదయజ్ఞములు లేవు. నేను భోక్తను కాదు. భోజనము కాదు. నేను సచ్చిదానంద స్వరూపమైన సత్యం, శివం సుందరం. ఈ మంత్రము ప్రతి వ్యక్తికి సంబంధించినది మానవుడు సుఖాభిలాషి. ఆనందపిపాసి.

(బృ.త్ర.పు.103/104)

నేను పోతే అనగా నేను అనే అహం పోతే పోవచ్చును. అనేదే దీని భావము. అహం, అహం, నేను అనేది ఒక అహం. ఈ అహం ఆకారముతో కూడటంచేత అహంకారముగా మారిపోయినది. **దేహాత్మ భావము పోయినపుడే మోక్షమునకు అర్హుడవుతాడు.** అనే దీని అంతరార్థము. ప్రతిమానవుని యందు ఈ దేహాత్మ భావము దేహతాదాత్మ్యమును పొందినప్పుడే అహంకారంగా రూపొందుతుంది. ఈ అహంకారముండి నంతవరకు, బుద్ధి ప్రకాశించదు. కనుక మొదట బుద్ధిని ఆవరించిన అహంకారాన్ని నిర్మూలించటానికి తగిన కృషి చేయాలి.

(బృ.త్ర.పు.94/95)

(చూ॥ అవతారము, ఆత్మజ్ఞానము, ఎరుక, దివ్యప్రకటనలు, దైవశక్తి, ధర్మము, నటరాజు, పేరు, బ్రహ్మము, విశ్వాసము, సత్యము, సర్వాంతర్యామి)

నేను-మనము

మీ ప్రేమను కేవలం మీ కుటుంబమునకు, బంధు మిత్రలకు మాత్రమే పరిమితం చేయక సర్వుల పట్ల ప్రసరింపజేయండి. ఎల్లప్పుడూ సహాయమే చేయండి. ఎవ్వరికి అపకారం చేయకండి. సకల వేదాంత సారము ఇదే, బైబిల్, ఖురాన్ మున్నగు గ్రంథరాజముల సారము కూడా ఇదే. మతభేదములను విడనాడండి. ఉన్నది ఒకే మతము, అదే ప్రేమమతము. ఉన్నది ఒకే భాష అదే హృదయభాష. ఈ సత్యాన్ని గుర్తించండి. సేవలో ప్రవేవించి 'నేను' అనే స్థాయి నుండి 'మనము' అనే స్థాయికి చేరుకోండి. ...('నేను' 'మనం' వరకు) - ఇదే మానవుడు చేయవలసిన ప్రయాణము. 'నేను' అనే స్థాయి నుండి 'మనం' అనే స్థాయికి చేరటమే మానవుని జీవిత గమ్యము. ఈ ప్రయాణము అతి సూక్ష్మమైనది, గమ్యము కూడా అత్యంత సమీపమైనది కాని, ఇట్టి సమీపమైన గమ్యమును చేరుకోవడానికి మీరు అనేక జన్మల కాలం తీసుకుంటున్నారు, అనేక శ్రమలకు గురి అవుతూన్నారు. యువతీ యువకులారా! మొదట మానవత్వమంటే ఏమిటో అర్థం చేసుకోండి. **మానవత్వ మనగా పవిత్రమైన దివ్యత్వమే. భగవంతుడు వేరు, మానవుడు వేరు కాదు.** ప్రతి మానవుడు దైవస్వరూపుడే! కాని, తన సత్యాన్ని తాను గుర్తించనంత వరకు తాను మానవునిగానే ఉంటాడు. తన సత్యాన్ని తాను గుర్తిస్తే తానే దేవుడై పోతాడు. మానవత్వంలో ఉన్న దైవత్వాన్ని గుర్తించాలంటే మొట్టమొదట సేవాకార్యక్రమాలలో ప్రవేశించాలి. ఏదో పేరుప్రతిష్టల నిమిత్తమై చేయకూడదు. హృదయ తృప్తికోసం సేవలు చేయాలి. అందులో ఆనందమును అనుభవించాలి. ఆ ఆనందమును పదిమందికి పంచాలి. చాలమంది గ్రామసేవ చేస్తున్నామంటున్నారు. సేవ చేయటానికి వేళ్ళేముందు మొట్టమొదట మీ మనస్సులను సరిదిద్దుకోవాలి, విశాలమైన భావములను పెంచుకోవాలి. 'నేను, నాది' అనే సంకుచిత భావంతో జీవితాన్ని గడిపితే ఇంక 'మనము' అనే స్థాయికి ఎప్పుడు చేరుకుంటారు! ప్రేమను పెంచుకున్నప్పుడే 'మనము' అనే స్థాయిని సులభంగా చేరుకోవచ్చును. అప్పుడు జగత్తంతా ఒక కుటుంబంగా ఏర్పడుతుంది. అదే నాకు కావలిసింది.

(స.సా.డి.99 పు. 368/369)

నేనెవరు

మానవుడు తనను తాను గుర్తించుకునే నిమిత్తమై భగవంతుడు అతనికి పవిత్రమైన బుద్ధిని అనుగ్రహించాడు. బుద్ధి పరిశుద్ధమైన అద్దము వంటిది అద్దమునకు ఒకవైపున రసాయనం పూయబడినప్పుడు దానిలో మీరు మీ ప్రతిబింబమును చూసుకోవచ్చు. రసాయనము పూయని అద్దమును ఎదురుగా పెట్టుకుంటే దాని వెనుక భాగమున

నేర్చుకో

ఉన్నదేదో కనిపిస్తుందిగాని, మీకు మీరు కనిపించరు. అదేవిధంగా, మీరు స్వస్వరూపాన్ని గుర్తించాలంటే మీ బుద్ధి అనే అద్దమునకు ఒకవైపున ప్రేమ అనే రసాయనమును పూయాలి. అయితే మీరు బుద్ధి అనే అద్దమును మాత్రం ఎదురుగా పెట్టుకున్నారు గాని, దానికి ప్రేమ అనే రసాయనమును పూయటం లేదు. కనుకనే, మీరు స్వస్వరూపాన్ని దర్శించలేక పోతున్నారు. రసాయనం పూయని అద్దంలో మీకు ఇతరుల ముఖం కనిపిస్తుందిగాని, మీ ముఖం ఎలా కనిపిస్తుంది! కనుకనే, ఈనాడు ప్రతి ఒక్కరూ "ఎవరండీ మీరు? ఎక్కడి నుండి వచ్చారు?" **అని ఎదుటివారిని ప్రశ్నిస్తున్నారేగాని, మొట్టమొదట "నేనెవరు? ఎక్కడి నుండి వచ్చాను?" అని తమను తాము ప్రశ్నించుకోవడం లేదు. మొట్టమొదట 'నీవెవరు?' అనే ప్రశ్నను వదలిపెట్టి 'నేనెవరు'? అనే విచారణను ప్రారంభించాలి. ఇతరుల దోషాలను చూడటం మానివేసి మీలోని దోషాలను గుర్తించుకోవాలి.** భగవంతుడు మీకు బుద్ధిని అనుగ్రహించినది మిమ్మల్ని మీరు చూసుకోవడానికే గాని, పరులయొక్క దోషాలను చూడటానికి కాదు.

(స.సా.మే2000 పు. 150/151)

నే నెవడు అని విచారణ చేసినచో వృత్తులన్నియూ పోవును. ఎట్టి వృత్తులు వచ్చిననూ నేనెవరను ప్రశ్న వేసుకొన్న అన్ని వృత్తులు బుడగలవలె నలిగి పోవును. ఇట్టి **సాధన రమణమహర్షి సాధించెను.** అదే మార్గమును తన శిష్యబృందమునకు బోధించెను. **అదియే సులభమార్గము,** అనగా సర్వమును బ్రహ్మమే, దానికి వ్యతిరేకమైన దేదియు లేదు అని అర్థము. అహం బ్రహ్మాస్మి అనే మహావాక్యమును జపించిననూ అజ్ఞానము పటాపంచలగును.

(జ్ఞా.వా.పు.18/19)

నే నెవరు? ఈ కర్తృత్వ మేమిటి? ఈ భోక్తృత్వ మెందులకు? జనన మరణాదు లెందుకు కలుగుచున్నవి? నాకీ సంసార మెట్లు ప్రాప్తించినది? ఇందుండి ముక్తి కలదా? ఇత్యాది విషయ విచారణయే మహాతపస్సని ఋషులు చెప్పెడివారు.

"నేను యెవరు? అని ప్రశ్న జనించుటకు మృత్యు విషయమే మూలకారణము. కావున మృత్యువిషయమును విస్మరించరాదు. అలక్ష్యము చేయరాదు, భయపడి పారిపోరాదు, అజ్ఞాన ప్రప్రథమ సోపానము. అమాయకపు జీవితానికి అంకురార్పణము. మాయకు మహాబలము. మానవత్వము యొక్క పరమరహస్య మంతయూ మృత్యువిచారముతోనే ముడిపడి యున్నది. దైవచిద్విలాస మంతయూ మృత్యువుయొక్క పరిశీలనలోనే ప్రకాశించు చున్నది.

(ఆ.శా.పు.11/12)

(చూ॥ ప్రవృత్తి)

నేర్చుకో

కుక్క

గడ్డివాముపై కూర్చున్న కుక్క పశువులను గడ్డిదగ్గరకు రానీయదు, తాను తినదు. అదేవిధముగ కొందరు తాము సత్కార్యములు చేయరు, ఒకరిని చేయ నివ్వరు.

ఇదే కుక్కలో మంచిగుణము కూడావుంది. తన యజమాని పట్ల అంతులేని విశ్వాసము. అతడు ఎక్కడవున్నా ఏ వేషమేసుకుని తిరిగినా గుర్తుపట్టగలదు. మనకు దేవుని యందు అట్టి విశ్వాసంవుండాలి.

గబ్బిలము

గబ్బిలముల వంటి పక్షులు వెలుగును చూడలేవు. చీకటిలోనే సంచరిస్తాయి. సూర్యోదయం కాగానే ఎగిరిపోతాయి. అదే విధముగ హృదయమునావరించి యున్న చీకటిలో అసూయ, ద్వేషము, గర్వము క్రోధములనే గబ్బిలములు భగవన్నామస్మరణచే హృదయమును ప్రకాశవంతం చేస్తే తొలిగిపోతాయి.

గొర్రె

గొర్రె చాలా సాధుజంతువు. ఆకులు, గడ్డి మొదలైన సాత్వికాహారమునే భుజిస్తుంది. గొర్రె ఎప్పుడూ మందను

వదలివెళ్లదు. గ్రుడ్డిగా మందను అనుసరించటం గొర్రె స్వభావం. మనము సాధుస్వభావం కలిగి ఉండాలి. మనము మనవారితో కలసిమెలసి ఉండవచ్చు. కానీ గొర్రెవలె ఎవరినీ గ్రుడ్డిగా అనుసరించకూడదు.

చెఱకు

తనలోని మాధుర్యమును అందరూ అనుభవించుటకు చెఱకుగడ ఖండనము, దండనము, జ్వలనములను భరిస్తుంది. మానవుడు కూడా కష్టనష్టములను సహించినప్పుడే సజ్జనుడుగా, జ్ఞానిగా రూపొందగలడు.

నదులు:

నదులు కొండలనుండి రాళ్ళు రప్పలు ముండ్లా దాటుకుంటూ సముద్రము వైపునకు ప్రవహిస్తూంటాయి. తమ నీటిని సృష్టిలో సకల జీవరాసులకు అందిస్తాయి. ఈ విధంగా నదులు తమ కర్తవ్యమును నిస్స్వార్థముగ నిర్వర్తిస్తూ గమ్యమును మరువక అటువైపుననే పరుగులిడుతాయి. మనము ఈ వైఖరిని అలవరచుకోవాలి.

పర్వతములు

పర్వతములు ఎండనూ వాననూ భరించి సహన శీలతను నిరూపిస్తాయి. అదేవిధముగా మనము సుఖదుఃఖములలో, కష్టనష్టములలో శాంతముగా వుండడం అలవరచుకోవాలి.

బత్తాయిపండు

బత్తాయి పండులోని తియ్యని రసమును రుచిచూడాలి అంటే, చేదుగా వుండే పైతొక్కను తొలగించాలి. తొనలో వుండే గింజలను ఏరి పారవెయ్యాలి. అదే విధముగ జీవితములో నిజమైన ఆనందమును అనుభవించాలంటే అహంకారమనే తొక్కను, కామ, క్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యములనే గింజలను దూరము చేయాలి.

సముద్రము

సముద్రము నిరర్థకములైన ఆలిచిప్పలను ఒడ్డుకు నెట్టివేసి విలువైన ముత్యములను తన హృదయమున దాచు కుంటుంది. అదే విధంగా మనము మన హృదయము నుండి దుష్టభావములను తొలగించి, పవిత్రమైన వాటిని దాచుకోవాలి.

సర్పము

సర్పము సూటిగాకాక వంకరగ ప్రాకుతూ వెళ్తుంది. ఇంద్రియాలను అనుసరిస్తున్న వ్యక్తి నడతకూడ అంతే. మనస్సు అనే పుట్టలోనుంచి విషయవాసన లనే సర్పములు బయటకు విజృంభిస్తుంటాయి.వాటిని నామసంకీర్తనముచే వశము చేసుకోండి.

(సా.యా.పు.1,3,5,7,9)

నేర్పునది

అశ్వము

అశ్వము చాలా చంచల స్వభావంకల జంతువు. అది ఎప్పుడూ ఏదో ఒక అవయవమును కదిలిస్తూనే ఉంటుంది. మన మనస్సు కూడ నిరంతరం చలిస్తూనే ఉంటుంది. అశ్వము వలె చంచలమైన మనస్సును నిశ్చలంగా ఉంచుటకు మనో విగ్రహము మనకు అవసరము.

ఈగ

ఈగ ఒక స్థానమున స్థిరముగ వుండదు. ఒక నిముషము మంచి భక్ష్యములమీద వ్రాలుతుంది. మరొక నిముషము మాలిన్యములమీద వ్రాలుతుంది. మనస్సుకూడ అంతే. ఈగవలె వుండరాదు మనస్సు.

కస్తూరి మృగము

కస్తూరి మృగము తనను ఆకర్షించిన పరిమళమును అన్వేషిస్తూ పరుగులిడుతుంది. చివరికి విసిగి వేసారి తన ముఖమును బొడ్డునకానించుకొని పండుకొనినప్పుడు, ఆ పరిమళము తన నుండే వస్తున్నదని తెలుసుకుంటుంది. ఆ విధంగానే మనము ఆనందము కొరకు బాహ్య ప్రపంచంలో వెదకి వేసారి, చివరకు మనలోనే ఆనందం ఉన్నదనే సత్యాన్ని గుర్తిస్తాము.

కాకులు

మనము భుజించి, కొన్ని మెతుకులను విదిలించి నప్పుడు కాకి తానొక్కతే భుజించదు. కావుకావుమంటూ కాకులన్నిటినీ పిలిచి కలిసి తింటుంది. అంత ఐకమత్యముంది కాకులలో. మీరు అటువంటి ఐకమత్యమును అలవరచుకోవాలి.

నైతిక

చీడపురుగు

మొక్కకు చీడపురుగు వలె, వృక్షమునకు వేరుపురుగు వలె క్రమంగా మానవులను నాశనము చేస్తాయి దుర్గుణములు. వాటిని చేరనీయకూడదు.

చేపలు

చేపలు నీటిలో ఉన్నంతకాలము సురక్షితముగా సుఖముగా వుంటాయి. నీటినుండి బైటకు తీస్తే గిలగిల కొట్టుకొని చనిపోతాయి. అలాగే మానుడు ప్రేమ అనే నీటిలో వున్నంతవరకు సౌఖ్యముగా వుంటాడు.

భూమి

భూమి తన చుట్టూ తాను తిరుగుట వలన రాత్రి, పగలు ఏర్పడుతున్నవి. భూమి సూర్యుని చుట్టూ తిరుగుట వలన ఋతువు లేర్పడి ఎండలుకాసి, వానలు కురిసి పంటలు పండి జీవించే మార్గము ఏర్పడుతున్నది. ఈ భ్రమణము వలన భూమికి ఎట్టి లాభము లేదు. నిస్స్వార్థ నిర్విరామ సేవకు చిహ్నము భూమి.

రాబందులు

రాబందుల దృష్టి ఎప్పుడూ క్రిందివైపే వుంటుంది. కళేబరాలు ఎక్కడ దొరుకుతుందా అని చూస్తూంటుంది. దాని నివాసస్థలము శ్మశానవాటిక. రాబందులవలె క్రిందిచూపు అలవరచుకొనవద్దు. ఊర్ధ్వ దృష్టిని అలవరచుకొనండి.

వృక్షములు

వృక్షములు తమ నీడను, ఫలములను అందరికీ అందిస్తాయి. తమ కొమ్మలను నరికిన వారికీ, ఫలములను రాళ్ళతో కొట్టేవారికి కూడా అందిస్తాయి. మనము కూడా మన మిత్రులకే కాక శత్రువులకు కూడా ఉపకారం చేయాలి.

(సా.యా.పు.6,12,14,17,26,28,30,34)

నైతిక

(చూ॥ మానవజీవితము)

నైతికపతనము

"ఈనాటి నైతికపతనానికి బాధ్యత పూర్తిగా సమాజములోని పెద్దలదే. ఆవు కంచెను దాటి పొరుగువాని పొలములో పడి దొంగతనముగా మేస్తుంటే దూడ వెనుకకు ఉండిపోతుందా?"

(దై.మ.పు.309)

నైతికసూత్రములు

పాశ్చాత్య మత విశిష్టతకు భారతీయ మతమునకు భేదము స్పష్టముగ కనబడును. దేహము, మనస్సు, **బుద్ధి అనునవి పాశ్చాత్యమునకు ముఖ్యము. అందు బుద్ధికే ప్రాధాన్యత,** కాని **భారతీయ సంస్కృతిలో** దేహము మనస్సు, బుద్ధి చిత్తము, **ఆత్మ ముఖ్యము. ఆత్మ పున్నతమైనది.** భారతదేశములో అనేక మతములేర్పడి పైవానిలో భేదములు తెలుపుచున్నవి. **మతము యేదైనను సామాన్యనీతులు ఒకటే. తల్లిదండ్రులయెడల భక్తి, గురుభక్తి చెప్పుచున్నవి. సర్వ మతములలో దేవునిగూర్చి భేదాభిప్రాయములున్నవి. కాని నైతిక సూత్రములొక్కటే.** నేడు యేసత్య నిత్యములు చెప్పెనో దానిని వీడి అసత్య అన్యాయములకుపాల్పడుచున్నారు. యే మతములు శాశ్వత సత్యములు చెప్పినవో వానియందు విశ్వాసముంచాలి.

(భ.ప్ర.పు2)

నైపుణ్యము (Skill)

~~ఈనాడు~~ విద్యార్థులు Knowledge ని Skill చేయటం లేదు Kill చేస్తున్నారు. Kill చేయటం వలన Balance తప్పుతున్నది. ~~ఈ~~ Balance తప్పటం వలననే Insight (అంతర్‌దృష్టి) తగ్గిపోయి, Outlook (బహిర్‌దృష్టి) పెరుగుతున్నది. మానవత్వాన్ని కోల్పోయిన విజ్ఞానం మారణహోమానికి దారి తీస్తుంది. విచక్షణా రహితమైన (Skill) నైపుణ్యం వినాశనానికి దోహదం చేస్తుంది. **ఆలోచనారహితమైన మేధాశక్తి (Intellect) సర్వ నాశనానికి**

దారి తీస్తుంది. మేధా శక్తికి, నైపుణ్యానికి మధ్య సమతూకం Balance లోపించటం వలననే ప్రపంచంలో నేడు తరచుగా తుఫాన్లు, ఉప్పెనలు, భూకంపాలు సంభవిస్తున్నాయి. ఖనిజ సంపద కోసం భూమిని లోతుగా త్రవ్వి, తొర్ర చేయటం వలననూ, భూతలము మీద ఆకాశ హార్మ్యాలు నిర్మించడం వలననూ, సముద్ర గర్భమునుండి కోట్లాది టన్నుల చేపలను వెలికి తీయటం వలననూ, భూగర్భములోని వాయువును, చమురు నిక్షేపాలను ఖాళీ చేయడం వలననూ, అడవులను విచక్షణారహితంగా నరకడం వలననూ ఈ సమతూకం (Ecological Balance) లేకుండా పోయి తరచుగా ఊహించని అవాంతరాలు, భయంకర జల ప్రళయాలు, భూకంపాలు సంభవిస్తున్నాయి. Skill నుండి 'S' మైనస్ చేస్తే (Skill-S=Kill) Kill అవుతుంది.

(శ్రీ.వా.జూ.97 పు.65)

నైవేద్యము

వినాయకచవితి పర్వదినమున భారతీయులు కుడుములు ఉండ్రాళ్ళు మొదలగు పిండి వంటలు చేసి గణపతికి నివేదన చేయటం కద్దు. దీనియొక్క అంతరార్థాన్ని మీరు గుర్తించాలి. బియ్యపుపిండి, నువ్వులపిండి, బెల్లము కలిపి, తైలము లేకుండా ఆవిరపై ఉడికించి, వాటిని ఉండలుగా చేసి వినాయకునికి నైవేద్యం పెడుతున్నారు. **నూనె లేకుండా ఆవిరిపై ఉడికిన పదార్థం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది కన్నులకు మంచి శక్తినిస్తుంది; ఆస్త్మా, ఇస్నో ఫీలియా, ఉబ్బస వ్యాధులతో బాధపడేవారికి చాలా మేలు చేస్తుంది.** ఈ విధంగా, **భగవత్సంబంధమైన ప్రతి కార్యములోనూ ఒక అంతరార్థం ఉంటుంది.** కాని, మానవుడు ఈ సత్యాన్ని గుర్తించుకోలేక పోతున్నాడు.

(స.సా.అ.2000. పు.290)

(చూ॥ గణపతి)

నో

(చూ॥ దేవుడెక్కడున్నాడు?)

నోరు

వాక్కు ద్వారా మీశీలం వెల్లడి అవుతుంది. మీ అనుభూతులను ఇతరులకు తెలిపి, సమాచారం చెప్పి వాళ్ళను వివేకవంతులను చేయగలదు. కాబట్టి, మాటల విషయంలో జాగ్రత్త చూపండి. **కాలుజారితే తగిలే దెబ్బ నయమవుతుంది. కాని, నోరుజారితే కలిగే గాయం, మానదు. ఈశ్వరానుగ్రహమే అనలు సంపాదించ దగిన ఐశ్వర్యం.** ఆయనే మిమ్మల్ని కంటికి రెప్పలాగా కాపాడగలరు. ఈ విషయంలో సందేహం వద్దు.

(శ్రీ.స.సూ.పు.68)

(చూ॥ నరజన్మ)

న్యాయ

(చూ॥ వేదము)

న్యాయసూత్రములు

(చూ॥ షడ్దర్శనములు)

న్యూస్

దురదృష్టవశాత్తు ఈనాడు న్యూస్‌ను మాత్రమే తీసుకోకుండా న్యూసెన్సును తీసుకుంటున్నారు. న్యూసెన్సు కాదు మనకు కావలసింది. చక్కని న్యూస్ కావాలి. ఏమిటి ఈ NEWS? N-North, W-West, E-East, S-South. East, West, North, South. అన్నింటి యందు ఏకత్వంగా ఉండిన దివ్యత్వాన్ని మనం తీసుకోవాలి. ఐతే ఈనాటి సైంటిస్టులలో కూడా North, South, East, West అనేది లేదు. ప్రాకృతమైన జీవితము

న్యూస్

మనము గడుపుతున్నాము. కనుక ఈనాడు **North, South, East, Westఅని చెబుతున్నాము. ఇది సత్యము కాదు. సత్యము కానిదాన్ని మీరు అనుసరిస్తున్నారు. సూర్యోదయము తూర్పున అవుతున్నదని అంటున్నారు. Sunset West న అంటున్నారు. It is not right, complete wrong. ఎట్లనగా సూర్యుడు ఉదయించడము లేదు. అస్తమించడం లేదు. సూర్యుడు ఉన్నచోటే ఉన్నాడు.** మనం తిరుగుతూ ఉండటం చేత East, West గా అవుతున్నది. సత్యము విచారించుకుంటే దైవము ఒక్కడే. ఏకత్వము. అదే ఉన్న స్థిరత్వము. దీనినే వేదాంతము అన్నారు.

(భ.మ.పు.10)

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీ సత్యసాయి ప్రబోధామృతము

ఓం

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీ సత్యసాయి ప్రబోధామృతము

2

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీ సత్యసాయి ప్రబోధామృతము

ద్వితీయ భాగము

(ప నుండి హ వరకు అనుబంధంతో)

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము	పు.నం.
పంగనామము	499
పంచక్లేశములు	499
పంచ పాండవులు	500
పంచ ప్రాణములు	500
పంచ ప్రాణాలుగాభావించు	500
పంచ భూతములు	500
పంచమపురుషార్థము	501
పంచమవేదము	501
పంచమాతలు	502
పంచాగ్నులు	502
పంచిపెట్టు	503
పంచేంద్రియములు	503
పంట	503
పండుగలు	503
పండితుడు/పండితులు	504
పట్టు	506
పట్టుదల	506
పతంజలి	506
పతనము	506
పతి	506
పతివ్రత ధర్మము	506
పదిసూత్రములు	507
పద్మపురాణము	508
పద్నాలుగు లోకములు	508
పన్నులు	509
పరబ్రహ్మము	509
పరమభక్తి	510
పరమ రహస్యము	510
పరమలక్ష్యము	510
పరమహంస	510
పరమాత్మ/పరమాత్ముడు	510
పరమాత్మనికథ	511
పరమాత్మప్రేమ	511
పరమానందము	511
పరమార్థము	511
పరము	512
పరమేష్ఠి	512
పరవిద్య	512
పరశురాముడు	512
పరాభక్తి	512
పరికరములు	513
పరిజ్ఞానము	513
పరిణామములు	513
పరిధి	513
పరిపాలనకు అర్హుడుకాదు	514
పరిపూర్ణ ఆరాధన	514
పరిపూర్ణత	514
పరిపూర్ణబ్రహ్మతత్త్వము	515
పరిపూర్ణ మానవుడు	515
పరిపూర్ణుడు	515
పరిమితి	515
పరివర్తనలు	515
పరిశీలన	516
పరిశుద్ధము	516
పరిశోధన	516
పరిశోధనవ్యాసములు	516
పరీక్ష	517
పరీక్షించు	517
పరీక్షిత్	517
పరీక్షిత్ ప్రార్థన	517

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

పరుగు జీవితము 518
పరోక్షము 518
పరోక్షజ్ఞానము 518
పరోపకారము 518
పర్తీశుడు 518
పర్వదినము/పర్వదినములు 518
పర్షియనులు 519
పలుకులు 519
పల్లెసీమల సేవ 519
పవరుహౌసు 521
పవిత్ర ఆదర్శము 521
పవిత్రత 521
పవిత్రము 521
పవిత్రమైన ప్రదేశము - కేరళ 521
పశుబలము 521
పశువు 522
పశ్చాత్తాపము 522
పసుపుకుంకుమలు 522
పాంచభౌతికము 522
పాండవులు 523
పాజిటివ్ 523
పాజిటివ్-నెగిటివ్ 523
పాఠం 523
పాఠశాల 523
పాతస్నేహితుడు 523
పాదము/పాదములు 524
పాదముల నాశ్రయించు 525
పాదసేవనము 525
పాదుకలు 526
పానీయము 526
పాపకృత్యము 526
పాపపుణ్యములు 526
పాపభీతి 526
పాపము/పాపములు 527
పాపులు 528
పామరులు 528
పాము 528
పార్వతి 528
పార్టీ/పార్టీలు 528
పార్థుడు 528
పాలు 529
పాశము 529
పాశ్చాత్య విద్యలు 529
పిండదానము 529
పిండార్పణము 530
పిచ్చికోతి 530
పితృవాక్యపరిపాలన 530
పిల్లలు 530
పిసినిగొట్టు 533
పుట్టపర్తి 533
పుట్టపర్తి నిలయుడు 534
పుట్టుచున్నది 534
పుణ్యకర్మలు 534
పుణ్యపురుషులు 534
పుణ్యము 534
పునర్జన్మ 534
పునాది 534
పురందరదాసు 534
పురాణము/పురాణములు 535
పురాణాల సారాంశము 537
పురాణుడు 538
పురుషప్రయత్నము 538
పురుషసూక్తము 538
పురుషార్థము 538
పురుషుడు 539
పురుషోత్తమ యోగము 539

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము	పు.నం.
పురుషోత్తముడు	540
పుస్తక జ్ఞానము	540
పుష్పములు	540
పుష్యమాసము	540
పూజ/పూజలు	540
పూజించాలి	541
పూతన	541
పూరకము	541
పూర్ణప్రేమ	541
పూర్ణమనస్సు	541
పూర్ణము	542
పూర్ణస్వతంత్రుడు	542
పూర్ణుడు	543
పూర్వమీమాంస	543
పూర్వావతార మహత్త్వము	543
పూవులు	544
పృశ్ని	544
పెండ్యులమ్	544
పెట్రోమాక్స్‌లైట్	544
పెద్దపాపము	545
పెద్ద హాస్పిటల్	545
పెన్నిధి	545
పేడ	545
పేపర్‌వెయిటా?	546
పేరాస	546
పేరు	546
పేషంట్లు	546
పొత్తు	547
పోతరాజు (పోతన)	547
పోస్టుమాన్	547
ప్రకృతి	547
ప్రకృతిలోని బ్యాలన్సు	548
ప్రకాశము	548

పదము	పు.నం.
ప్రఖ్యాతి	549
ప్రచారము	549
ప్రజాపతి	549
ప్రజ్ఞానం బ్రహ్మ	549
ప్రజ్ఞానము	549
ప్రణవతత్త్వము	549
ప్రణవము	553
ప్రణాలిక	553
ప్రతిజ్ఞ/ప్రతిజ్ఞలు	554
ప్రతిబంధములు	554
ప్రతిబింబాలు	554
ప్రతిష్ఠించు	554
ప్రత్యక్షము	555
ప్రత్యక్ష దైవము	555
ప్రత్యక్షప్రమాణము	555
ప్రత్యగాత్మ	555
ప్రత్యేకమైన తంతి తపాలశాఖ	555
ప్రథమజా	555
ప్రథమస్థానము	556
ప్రదక్షిణ	556
ప్రదర్శనము	557
ప్రధానకర్తవ్యము	557
ప్రధాన పురుషార్థము	558
ప్రధానమంత్రి (ప్రైమ్‌మినిస్టర్)	558
ప్రధానము	558
ప్రధానమైన అస్త్రము	558
ప్రధానమైన కారణములు	558
ప్రధాన సుఖము	559
ప్రధాన సూత్రములు	559
ప్రపంచము	559
ప్రపత్తి	559
ప్రబోధము	560
ప్రభువు	560

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

ప్రమాణము/ప్రమాణములు 560
ప్రమాదము 560
ప్రయాగ 561
ప్రళయము 561
ప్రవర్తన 561
ప్రవృత్తి 562
ప్రవృత్తి లక్షణాలు 562
ప్రవేశము 562
ప్రవేష్టం 563
ప్రశాంతి 563
ప్రశాంతినిలయము 563
ప్రశాంతి పతాకము - చిహ్నములు 564
ప్రశాంతి పతాకము - సందేశము 564
ప్రశాంతి విద్వన్మహాసభ 564
ప్రశ్నలు 565
ప్రశ్నోపనిషత్తు 565
ప్రసన్నము 565
ప్రసన్నుడు 566
ప్రసవము 566
ప్రసాదము 566
ప్రస్థానత్రయము 567
ప్రహ్లాదుడు 567
ప్రాచీన భారతీయ సంస్కృతి 567
ప్రాచేతనుడు 568
ప్రాణము 569
ప్రాణప్రమాణము 571
ప్రాణశక్తి 571
ప్రాణస్తధానుగమాత్ 571
ప్రాణాయామము 572
ప్రాణుడు 572
ప్రాపర్టీ 573
ప్రాప్తి 573
ప్రార్థన/ప్రార్థనలు 573
ప్రార్థనగీతము/ప్రార్థనగీతాలు 575
ప్రార్థించు 576
ప్రాయశ్చిత్తము 576
ప్రియం 577
ప్రియమిత్రులు (డియర్‌ఫ్రెండ్స్) 577
ప్రియమైన వాక్యము 578
ప్రియుడు 578
ప్రీతిపాత్రుడు 578
ప్రేమ్‌చంద్ 581
ప్రేమ 581
ప్రేమకు ప్రధాన ప్రాణములు 586
ప్రేమకు మూడుమెట్లు 586
ప్రేమజీవనము 587
ప్రేమతత్త్వము 587
ప్రేమను పెంచుకోవాలి 589
ప్రేమ నేర్పుటకోసం 589
ప్రేమబంధము 589
ప్రేమభక్తియోగము 589
ప్రేమమతము 589
ప్రేమమాధుర్యము 590
ప్రేమే సందేశము 590
ప్రేమస్వరూపుడు 590
ప్రేమసిద్ధాంతము 590
ప్రేమోదయము 590
ప్రేయస్సు 590
ప్రేయోమార్గము 591
ఫలము 592
ఫలమేమి 592
ఫలాపేక్ష 592
ఫాషన్ 592
ఫిలాసఫీ 592
ఫుట్‌బాల్ 593
ఫ్రీవిల్ 593

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం

బంగారు/బంగారము 594
బంగారుబాటలు 595
బంతిఆట 595
బంధనలు/బంధనాలు 595
బంధవిముక్తి 595
బంధువులు 596
బడి 596
బదరీ 596
బదరీయాత్ర 596
బల అతిబల 596
బలము 596
బలరామకృష్ణులు 597
బలరాముడు 598
బలహీనత 598
బలహీనుడు 598
బలి 599
బలిచక్రవర్తి 599
బహుమానము 600
బాగవుతాం 600
బాధ 600
బాబర్‌లేఖ 600
బాబా 600
బాలగంగాధర్‌తిలక్ 600
బాలవికాస్ 600
బాలురు(బాలికలు) 601
బీజాక్షరం 601
బీదవాడు 601
బుద్ధి 601
బుద్ధిదోషము 603
బుద్ధియోగము 604
బుద్ధిశాలురు 604
బుద్ధుడు (గౌతమబుద్ధుడు) 604
బుద్ధునిబోధ 605
బుట్టకథ 606
బృందావనము 607
బృందావన్‌కాలేజి 608
బృహత్ఫలము 608
బృహదారణ్యకోపనిషత్తు 608
బెస్ట్‌ఫ్రెండ్స్ 609
బైబిల్ 609
బోధ 609
బోధము 609
బ్యాడ్జి (Badge) 610
బ్రతుకు 610
బ్రహ్మ/బ్రహ్మము 610
బ్రహ్మఅధిష్ఠానము 612
బ్రహ్మకాండ 612
బ్రహ్మచర్యము 612
బ్రహ్మచారి 612
బ్రహ్మచింతన 612
బ్రహ్మచైతన్యము 613
బ్రహ్మజిజ్ఞాస 613
బ్రహ్మజ్ఞానము 613
బ్రహ్మజ్ఞాని 614
బ్రహ్మతత్త్వము 614
బ్రహ్మత్వము 614
బ్రహ్మదర్శనము 614
బ్రహ్మదృష్టి 614
బ్రహ్మనిష్ఠ 614
బ్రహ్మప్రాప్తి 614
బ్రహ్మమయము 614
బ్రహ్మముహూర్తము 614
బ్రహ్మయజ్ఞము 614
బ్రహ్మరహస్యము 615
బ్రహ్మర్షి 615
బ్రహ్మవల్లి 616

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము	పు.నం.
బ్రహ్మవాక్యములు	616
బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి	616
బ్రహ్మవిద్య	617
బ్రహ్మవిద్య-స్త్రీలు	620
బ్రహ్మ విష్ణు మహేశ్వరులు	621
బ్రహ్మసాక్షాత్కార జ్ఞానము	621
బ్రహ్మసూత్రములు	622
బ్రహ్మస్వరూపము	622
బ్రహ్మస్వరూపుడు	623
బ్రహ్మాండము	623
బ్రహ్మానందము	623
బ్రహ్మానుభవఉపనిషత్తు	624
బ్రహ్మాభ్యాసము	624
బ్రహ్మార్పణము	625
బ్రాహ్మణాలు	625
బ్రాహ్మణుడు	625
బ్లడ్డు, పుడ్డు, దుడ్డు	626
భక్తపరాధీనుడు	628
భక్తమార్కండేయుడు	628
భక్తరక్షణ	629
భక్తవత్సలుడు	629
భక్తసులభుడు	629
భక్తసూరదాసు	629
భక్తి	630
భక్తికిగుర్తు	642
భక్తిపరమావధి	643
భక్తిప్రపత్తులు	644
భక్తిమార్గము	645
భక్తియోగము	645
భక్తి రెండువిధములు	646
భక్తివిశ్వాసములు	646
భక్తుడు/భక్తులు	646
భక్తునిలక్షణము	650
భక్తుని హృదయము	651
భగవంతుడు	651
భగవంతుని అడ్రస్సు	655
భగవంతుని అనుగ్రహము	656
భగవంతుని ఉనికి	656
భగవంతునికి అర్పించాలి	657
భగవంతునికి ఇవ్వవలసినది	657
భగవంతుని కోరవలసినవి	657
భగవంతుని చిత్రవిచిత్రములు	657
భగవంతుని దృష్టి	658
భగవంతుని బిడ్డలు	659
భగవంతుని యొక్క తత్వము	659
భగవంతుని లీలలు	660
భగవంతుని వర్ణింతురు	660
భగవంతుని సృష్టి	660
భగవంతుని హృదయము	660
భగవచ్చింతన/భగవత్ చింతన	660
భగవత్తత్వము	660
భగవత్ప్రసాదము	666
భగవత్ప్రీత్యర్థము	666
భగవత్ప్రేమ	666
భగవత్స్వరూపము	667
భగవదనుగ్రహము	667
భగవదన్వేషణ	667
భగవదాసక్తులు	668
భగవద్గీత	669
భగవద్గీత-అంతరార్థము	669
భగవద్దర్శనము	670
భగవద్దృష్టి	671
భగవద్భక్తులు	671
భగవద్విశ్వాసము	671
భగవన్మయం	672
భగవన్నామము/భగవన్నామములు	672

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము పు.నం.

భగవానుడు 673
భజగోవిందం 674
భజన 674
భజనగీతాలు 675
భద్రము (Watch) 675
భద్రాచలం రామదాసు 676
భయము/భయమెందుకు 676
భరత 677
భరతభూమి 678
భరతమాత 678
భరతుడు 678
భర్త 678
భవసాగరము 678
భవానీశంకర 678
భస్మాసురుడు 679
భాగవతతత్త్వము 679
భాగవతము 679
భాగవతుని లక్షణములు 683
భాగవతులు 683
భాతి 683
భారత 684
భారతదేశము 684
భారతపాలనము 688
భారతము 688
భారతీయఋషులు 688
భారతీయమతము 688
భారతీయవిద్య 689
భారతీయసంస్కృతి 689
భారతీయులు 690
భార్య 692
భార్యా-భర్తలు 692
భావము 692
భావంప్రధానము 692
భావనలు/భావములు/భావాలు 693
భావనాశనము 694
భిక్షకులు 694
భిన్నత్వము 694
భీముడు 694
భీష్ముడు 694
భూకంపములు 695
భూతచిత్త చిదాకాశములు 695
భూతదయ 695
భూతము 695
భూమా 695
భూమి 695
భూర్భువస్సువః 695
భూషణము 696
భృగువల్లి 696
భేద భావములు 696
భేదం 696
భోగభూమి 697
భోగములు 697
భౌతికశాస్త్రము 697
భ్రమ 697
భ్రమరములు 697
భ్రమరాంబ 697
భ్రష్టులు 698
భ్రాంతి 698
మంగళవారము 699
మంగళసూత్రము 700
మంచి 700
మంచిచెడ్డలు 700
మంచితనము 702
మంచినడత 702
మంచిపనులు 702
మంచిబుద్ధులు 703

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము	పు.నం.
మంచిబ్రతుకు	703
మంచిమాట	703
మంచివాడు/మంచివారు	703
మంచివారి హృదయము	703
మంచి సమయము	703
మండోదరి	703
మంత్రపుష్పము	703
మంత్రము	703
మంత్రశక్తి	704
మంత్రులు	704
మంథర	704
మంథర-శూర్పణఖ	706
మందిరము	706
మందులు	706
మగవారు	707
మడి	707
మతకర్తలు	707
మతబాంధవ్యము	708
మతము/మతములు	708
మత్కర్మకృత్	713
మతి	713
మదము/మదములు	713
మదాలస	714
మద్భక్త	715
మధ్యము	715
మనదేశము	715
మననము	715
మనము	715
మనసు/మనస్సు	716
మనిషి/మనుష్యుడు	725
మనిషిగా జీవించాలి	726
మనుజుడు	726
మనుశాస్త్రము	726
మనుష్యత్వము	726
మనోతపము	727
మనోతీతమైనస్థితి	727
మనోదౌర్బల్యము	728
మనోనాశనము	728
మనోబలము	728
మన్సూర్	728
మమకారము	730
మమైమత్వము	731
మరణము	731
మరచిపోవలెను	732
మరువకూడదు	732
మర్మము	733
మర్త్యుడు	733
మలము	733
మల్లికార్జునుడు	733
మసీదు	733
మహత్తత్వము	733
మహనీయులు	734
మహిమలు	734
మహాత్యాగి	735
మహాత్ములు	735
మహానుభావుడు	735
మహాపాతకాలు	735
మహాపాపము/మహాపాపులు	735
మహాపురుషులు	736
మహాప్రస్థానము	736
మహాబలి	736
మహాభాగ్యము	736
మహాభారతము	736
మహాభారతయుద్ధము	737
మహాయోగి	737
మహావాక్యములు	738

పదము	పు.నం.
మురళి	765
ముల్లోకములు	766
ముస్లిం	766
మూడు	766
మూడు అవతారములు	767
మూడుకార్యక్రమాలు	768
మూడుకోతులు	769
మూడుకోరికలు	769
మూడుక్రియలు	769
మూడు జన్మలు	769
మూడు తలలరక్కసి	770
మూడు మృగములు	770
మూడు విధములైన పాపములు	771
మూడు సూత్రాలు	771
మూఢత్వము	772
మూఢమతి	772
మూర్ఖత్వము	773
మూర్ఖుడు	773
మూర్తిపూజ	773
మూర్తీభవించిన మానవరూపము	773
మూలకారణము	773
మూలము	773
మూలసూత్రములు	773
మూలాధారతత్వము	773
మూలాధారము	774
మూషికము	775
మృగములు	775
మృగలక్షణాలు	776
మృత్యువు	776
మెడిటేషన్	776
మెటీరియలైజేషన్	776
మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి	777
మేధాశక్తి	781
మేలు-కీడు	781
మేలుకొల్పు	781
మైత్రి	782
మైలురాళ్ళు	782
మోక్షము	782
మోక్షానందము	784
మోక్షాన్వేషణము	784
మోసపోకండి	784
మోహనిద్ర	784
మోహము	784
మోహసాగరము	785
మౌనము	785
మ్యాక్స్‌ముల్లర్	786
యంత్రము	787
యజుర్వేదము	788
యజ్ఞఫలము	788
యజ్ఞము/యజ్ఞములు	788
యజ్ఞోపవీతము	792
యథార్థజ్ఞానులు	792
యద్భావంతద్భవతి	792
యముడు	793
యాంతేమతిస్సాగతిః	793
యాగము	793
యాచనవద్దు	793
యాజ్ఞవల్క్యుడు	793
యాత్రికుడు	793
యాదవులు	794
యుక్తి	794
యుక్తులు	794
యుగము/యుగములు	796
యుగలక్షణము	796
యుద్ధములు	796
యువకుడు/యువకులు	796

పదము	పు.నం.
యువతి	796
యోగక్షేమము	796
యోగభూమి	797
యోగము	797
యోగి/యోగులు	798
యోగవాశిష్ఠము	798
యోగశాస్త్రము	798
యోగాభ్యాసము	798
యౌవనము	799
రంజాన్	800
రక్కసి	800
రక్ష	800
రక్షణ	801
రజోగుణము/రాజసిక	801
రత్నమాల	801
రత్నావళి	801
రథము	801
రథసారథి	802
రమణమహర్షి	802
రష్యా	802
రస(ము)	802
రసాస్వాదము	802
రసోవైసః	802
రహస్యము	802
రాక్షసుడు/రాక్షసులు	803
రాక్షసగుణములు	803
రాక్షసత్వం	803
రాగద్వేషములు	804
రాగము	804
రాజకీయాలు	804
రాజనీతి	804
రాజబాట	804
రాజ్యాంగము	804
రాజ్యాధికారులు	804
రాణించదు	804
రాధ	805
రాధాతత్త్వం	805
రాధిక	805
రాము/రాముడు	805
రామకథ	806
రామకథారసప్రవాహము	806
రామకథారసవాహిని	806
రామకృష్ణ పరమహంస	806
రామచంద్రుడు	806
రామచరిత్ర/రామచరితము(రాముని చరిత్ర)	806
రామతత్త్వం/రామతత్త్వము	808
రామదాసు	810
రామనామము	810
రామరాజ్యము	811
రామలక్ష్మణభరతశత్రుఘ్నులు	812
రామలక్ష్మణులు	813
రామశక్తి	814
రామాయణతత్త్వము	814
రామాయణ భాగవతభారతాలు	814
రామాయణము	814
రామాయణవిశిష్టత	815
రాముని జన్మస్థానము	816
రావణతత్త్వము	817
రావణుడు	817
రీటైర్ (Retire)	818
రుక్మిణి	818
రుద్రుడు	818
రూప/రూపము	818
రూప నామములు	818
రూప రహితుడు	819
రెండుశక్తులు	819

పదము	పు.నం.
రెలిజియన్	819
రెస్ట్ (Rest)	819
రేచకము	819
రేడియేషన్	820
రైల్వేస్టేషన్	820
రోగము	820
రోగవిముక్తుడు	820
ర్యాగింగ్	821
లక్షణములు	822
లక్ష్మణుడు	823
లక్ష్మి	823
లక్ష్యము	823
లగ్నము	824
లఘున్యాసము	824
లయ/లయము	824
లాక్	824
లాభము/లాభనష్టములు	824
లింకన్	824
లింగము	825
లింగోద్భవము	827
లిమిటెడ్ కంపెనీ	827
లీనము/లీనమైపోవాలి	828
లీనమగుట/లీనమగును	828
లీలలు	829
లీలాజన్మ	829
లేనిదెక్కడ	829
లైట్‌హౌస్	829
లైబ్రరీ	829
లైఫ్‌స్మిత్	830
లోకకళ్యాణము	830
లోకనాటకము	830
లోకపిత	830
లోకమాత	831

పదము	పు.నం.
లోకము/లోకములు	831
లోకాస్సమస్తాస్సుఖినోభవంతు	831
లోభము	831
లోభి	831
లౌకికము	831
వందనము	832
వజ్రసంకల్పము	832
వజ్రోత్సవము	833
వట్టిచేతులు	833
వట్టిమాటలు	834
వదలవలసినది	834
వదులు	834
వరదలు	834
వరప్రసాదము	834
వరలక్ష్మీవ్రతము	834
వర్క్‌షాప్	836
వర్ణాశ్రమధర్మాలు	836
వర్ణింతురు/వర్ణిస్తారు	837
వర్తమానము	837
వలెవుండవద్దు	838
వలెవుండు	838
వశిష్ఠుడు/వశిష్ఠమహర్షి	839
వసంతఋతువు	840
వాంఛ/వాంఛలు	841
వాచ్ (watch)	841
వాతావరణము	841
వాత్సల్యము	842
వానప్రస్థము	842
వామనమూర్తి/వామనుడు	843
వాయువు	843
వాలి	843
వాల్మీకి	844
వాల్మీకి రామాయణము	844

పదము	పు.నం.
వాసనలు	844
వాసుదేవస్సర్వమిదం	845
వాసుదేవుని సంకల్పము	845
విక్షేపము	845
విగ్రహారాధన	846
విఘ్నేశ్వరపూజ	846
విచక్షణ	846
విచారణ	847
విచారణయోగము	847
విచారణ శక్తులు	847
విజయదశమి	848
విజయము	848
విజయుడు	848
విజిటింగు కార్డులు	848
విజ్ఞానజ్యోతి	848
విజ్ఞానము	848
విజ్ఞానశాస్త్రము	849
విటమిన్ 'జి'	850
విత్తాపహారి	850
విదేశాలు	850
విద్య	850
విద్యాచతుష్టయములు	855
విద్యాభ్యాసము	855
విద్యార్థి/విద్యార్థులు	855
విద్యాలయము	857
విద్యావంతుడు	857
విద్యావిధానము	857
విద్యావైద్యకేంద్రములు	857
విద్యుల్లేఖేవభాస్వరా	858
విధినిర్వహణ	858
విధులు	858
వినయము	859
వినయవిధేయత	859
వినాయకచవితి	859
వినాయకపండుగ	859
వినాయకుడు	860
విపత్తులు	861
విప్లవము	861
విప్రలిప్స	861
విభీషణుడు	862
విభుడు	863
విభూతి	863
విమర్శనలు	864
వియోగము	864
విరాజనుడు	864
విరాజాహోమము	864
విరాట్టుడు	864
విరోధప్రేమ(భక్తి)	865
విరోధులు	865
విలియమ్ గ్లాడ్‌స్టన్	865
విలువ	865
వివాహము	865
వివేకము	866
వివేకానందుడు	867
విశిష్టాద్వైతము	868
విశ్వకళ్యాణము	868
విశ్వకుటుంబము	868
విశ్వజిత్‌యాగము	869
విశ్వనాథునిదర్శనముకొరకు	869
విశ్వమతము	870
విశ్వము	870
విశ్వరూపము	871
విశ్వవిద్యాలయము	872
విశ్వవిరాట్టుస్వరూపము	872
విశ్వామిత్రుడు	872
విశ్వాసము	873

పదము	పు.నం.
విశ్వుడు	876
విశ్వేశ్వరుడు	876
విషయజ్ఞానము	876
విషయవాంఛలు	876
విషాదయోగము	876
విష్ణువు	876
విష్ణుస్మరణము	876
విసుగు	876
విస్తరి	877
విహారము	877
వృక్షము	877
వృద్ధాశ్రమము	878
వెంకటేశ్వరస్వామి	878
వెదుకుచున్నాను	878
వెఱువనక్కరలేదు	878
వెట్టితనము	879
వెలుగు	879
వేణుగానము	879
వేణువు	879
వేతనము	880
వేదమంత్రములు	880
వేదము/వేదములు	880
వేదరక్షణము	891
వేదవాజ్ఞయము	891
వేదవ్యాసుడు	891
వేదసూక్తులు	891
వేదస్వరూపుడు/వేదస్వరూపాలు	891
వేదాంగము	892
వేదాంతము/వేదాంతి	892
వేదార్థములు	893
వేరు	893
వేలిముద్ర	893
వైజ్ఞానికుడు	893

పదము	పు.నం.
వైట్‌ఫీల్డ్ శ్రీసత్యసాయిసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్	894
వైదిక-ఇతర ఉపాసనలు	894
వైద్యాలయము	897
వైద్యుడు/వైద్యులు	897
వైబ్రేషన్	897
వైరాగ్యము	897
వైశేషిక	897
వైశేషికదర్శనము	899
వైశ్వానర/వైశ్వానరుడు	902
వైస్‌చాన్స్‌లర్లు	902
వ్యక్తి	902
వ్యక్తిత్వము	902
వ్యత్యాసము	902
వ్యర్థము	903
వ్యసనములు	903
వ్యష్టి	904
వ్యష్టితత్వము	904
వ్యాకరణముకాపాడదురా!	904
వ్యాధులు	906
వ్యామోహము	907
వ్యాసమహర్షి/వ్యాసుడు/వ్యాసులవారు	907
శంకర/శంకరుడు	908
శంకరాచార్య/శంకరాచార్యులు/శంకరులవారు	908
శంఖనాదము	910
శకునములు	910
శక్తి	911
శక్తులు	911
శత్రువు/శత్రువులు	911
శని	913
శబ్దబ్రహ్మము	913
శబ్దము	913
శబ్దస్పర్శరూపరసగంధములు	913
శమదమాదిగుణసంపత్తి	913

పదము	పు.నం.
శరణాగతి	913
శరణు	916
శరన్నవరాత్రులు	916
శరీరము	916
శాంతజీవనము	917
శాంతజ్ఞానము	918
శాంతభక్తి	818
శాంతము	918
శాంతి	919
శాంతి తేజము	922
శాంతి పుష్పము	922
శాంతి మంత్రము	923
శాంతివృద్ధికి సూచనలు	923
శాంతి సుఖము	923
శాంతుడు	923
శాఖలు	924
శాపము	924
శాశ్వతము	924
శాశ్వతుండు	924
శాసనము	924
శాస్త్రము/శాస్త్రములు	924
శాస్త్రప్రమాణము	925
శాస్త్రయోనిత్వాత్	925
శిక్ష	926
శిక్షణ	926
శిక్షావల్లి	926
శిరస్సు	926
శివ	928
శివం	928
శివధనుస్సు	928
శివరాత్రి	928
శివ శక్త్యాత్మకస్వరూపము	929
శివశక్తి	930
శివార్పణం	930
శివుడు	929
శిష్టులు	930
శిష్యుడు/శిష్యులు	930
శీతలవెన్నెల	931
శీతోష్ణములు	931
శీలత్రయము	931
శీలము	932
శుకనాడి	933
శుకుడు	933
శుక్లమార్గము	933
శుక్రుడు-ద్రోణుడు	933
శుచి	934
శుద్ధసత్వము	935
శుద్ధి	935
శుభవార్త	935
శుభాశుభములు	935
శుభేచ్ఛభూమిక	935
శుభ్రత	936
శుభ్రము	937
శూర్పణఖ	937
శృంగారము	937
శోకము	938
శోధనము	938
శౌచము	938
శ్రద్ధ	939
శ్రవణము	940
శ్రాద్ధము	941
శ్రీ	941
శ్రీధరుడు	941
శ్రీమంతులు	941
శ్రీమన్నారాయణుడు	941
శ్రీరామచంద్రుడు/శ్రీరాముడు	941

పదము	పు.నం.
శ్రీరామరక్ష	942
శ్రీలక్ష్మి	942
శ్రీశైలము	943
శ్రీసత్యసాయి	943
శ్రీసత్యసాయి అంతర్జాతీయ కేంద్రము	943
శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్	943
శ్రీసత్యసాయి ఉన్నతవిద్యాసంస్థ	944
శ్రీసత్యసాయి ప్రబోధము	944
శ్రీసత్యసాయిబాబా	947
శ్రీసత్యసాయిసేవాసంస్థలు	947
శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్	948
శ్రీసత్యసాయి సువాక్యములు	948
శ్రీసాయి	950
శ్రుతత్వాచ్చ	950
శ్రుతి	951
శ్రుత్యము	951
శ్రేయస్సు	951
శ్రేయోమార్గము	951
శ్రేష్ఠుడు	951
షడ్‌చక్రములు	952
షడ్ దర్శనములు	953
షడ్ శక్తులు	957
షడ్భావ వికారములు	957
షడ్వికారములు	957
షిరిడీసాయి	957
షిర్డిసాయిబాబా	976
షేక్స్పియర్	976
సంకర్షణ	977
సంకల్పము	977
సంకల్పశక్తి	981
సంకీర్తన	981
సంకేతము	990
సంక్రాంతి	990

పదము	పు.నం.
సంఖ్య	990
సంఖ్యాశాస్త్రము	990
సంగము	990
సంగీతము	991
సంగీతవిశ్వవిద్యాలయము	991
సంగీతశాస్త్రము	991
సంఘనీతి	991
సంఘబుద్ధి	991
సంఘము	991
సంఘర్షణ	992
సంఘసేవ	992
సంచరించు	992
సంతృప్తి	992
సంతోషభిక్ష	993
సంతోషము	993
సందేశము	993
సందేహము	994
సందేహాలు - సమాధానాలు	994
సంధ్య	1012
సంధ్యావందనము	1012
సంపద	1012
సంపర్కము	1013
సంపూర్ణావతారము	1013
సంప్రదాయము	1013
సంబంధము	1014
సంభవించినవి	1014
సంభర్త	1014
సంభాషణ	1014
సంయమము	1014
సంయోగము	1014
సంయోగవియోగములు	1015
సంరక్షణ	1015
సంవత్సరాది	1015

పదము	పు.నం.
సంశయము	1015
సంసారజీవితము	1016
సంసారము	1017
సంస్కారము	1017
సంస్కృతి	1018
సగుణభక్తి	1020
సగుణోపాసన	1020
సగుణోపాసనతత్త్వము	1021
సచ్చిదానంద	1021
సతతం యోగినం	1021
సత్‌కర్మలు	1022
సత్కీర్తి	1022
సత్‌చిత్‌ఆనందము	1023
సత్ ప్రవర్తన	1023
సత్‌సంకల్పము	1023
సత్‌సంగము	1023
సతి	1023
సత్పురుషులు-దుర్మార్గులుతారతమ్యము	1024
సత్యంజ్ఞానం అనంతం బ్రహ్మ	1025
సత్యం శివం సుందరం	1026
సత్యజీవి	1026
సత్యభామ	1026
సత్యము	1026
సత్యవతీ ఆరాధన	1029
సత్యవిద్య	1029
సత్యసాయి	1029
సత్యసాయి కాలేజిలు	1030
సత్యసాయిమహితోక్తులు	1030
సత్యసాయిశకము	1031
సత్యసాయి సెంట్రల్ ట్రస్టు	1031
సత్యసాయిసేవలు	1032
సత్యాన్వేషణ	1032
సత్త్వగుణము	1033
సత్త్వరజస్తమో గుణములు	1033
సత్సంగము	1033
సత్సాంగత్యము	1035
సద్గుణములు	1035
సద్భావములు	1035
సద్వినియోగము	1035
సన్‌ఇన్‌లాలు	1036
సనాతన ధర్మము	1036
సనాతన మతము	1038
సనాతనసారథి	1038
సనాతన సంప్రదాయములు	1040
సన్నిహిత సంబంధబాంధవ్యము	1040
సన్మార్గతత్త్వము	1041
సన్యాసము	1041
సన్యాసి	1042
సమత్వము	1042
సమత్వస్థితి	1043
సమాజము	1043
సమాజసేవ	1044
సమాధానము	1044
సమాధి	1044
సమానత్వము	1044
సమానబుద్ధి	1044
సమానులే	1044
సమిష్టి	1044
సమిష్టిభావము	1045
సముద్రము	1045
సముద్రుడు	1045
సమ్యక్‌కర్మ	1046
సమ్యక్‌జ్ఞానము	1046
సమ్యక్‌దృష్టి	1046
సమ్యక్ భావము	1046
సమ్యక్‌వాక్కు	1046

పదము	పు.నం.
సమ్యక్ శ్రవణం	1046
సమ్యక్‌సాధన	1046
సరస్వతి	1046
సర్వజ్ఞుడను	1047
సర్వచింతలు	1047
సర్వత్యాగము	1047
సర్వత్రాపసిద్ధోపదేశాత్	1048
సర్వదుఃఖములు	1048
సర్వధర్మాన్‌పరిత్యజ్య	1048
సర్వభారములు	1049
సర్వభావములు	1049
సర్వభూతదయ	1049
సర్వమతసమ్మతము	1049
సర్వమతసామరస్యము	1049
సర్వమూ భగవంతుడే!	1049
సర్వవస్తువులు	1050
సర్వవ్యాపకుడవు	1050
సర్వసంగపరిత్యాగి	1051
సర్వసిద్ధి	1051
సర్వస్యధాతార	1051
సర్వాంతర్యామి	1051
సర్వాధారుడు	1051
సర్వారంభపరిత్యాగి	1051
సర్వేశ్వరపూజ	1051
సవతి తల్లి	1051
సస్వరూపము	1052
సహజలక్షణములు	1052
సహనము	1052
సాంఖ్యదర్శనము	1052
సాంఖ్యయోగము	1054
సాకారోపాసన	1054
సాక్షాత్కారము	1054
సాక్షి	1055

పదము	పు.నం.
సాక్షీభూతుడు	1055
సాగరము	1055
సాటిరారు	1055
సాత్త్విక	1055
సాత్త్వికాహారము	1055
సాదృశ్యము	1056
సాధకుడు/సాధకులు	1056
సాధన	1058
సాధనచతుష్టయము	1060
సాధన లక్ష్యము	1060
సాధ్యము	1061
సాధించుట	1061
సాధు/సాధువు	1061
సాధుత్వము	1061
సాఫల్యత	1061
సామాన్యభక్తి	1061
సామీప్యము	1061
సామీప్యముక్తి	1061
సాయి	1061
సాయి అపేక్ష	1062
సాయి అవతారము	1062
సాయి ఆశయము	1062
సాయితత్త్వము	1063
సాయిదేవుడు	1063
సాయినామము	1063
సాయిప్రేమ	1063
సాయిబాబా	1063
సాయిబాబాకే పూజ	1063
సాయిభక్తులు	1064
సాయిమతము	1064
సాయిమయము	1064
సాయియేదిక్కు	1064
సాయిరాం	1064

పదము	పు.నం.
సాయిశరీరము	1064
సాయి సంకల్పము	1065
సాయి సంస్థలు	1065
సాయుజ్యము	1066
సారథి	1066
సార్థకత	1066
సార్థకము	1066
సారూప్యము	1066
సారూప్యముక్తి	1066
సాలోక్యము	1066
సావిత్రి	1066
సాహచర్యము	1066
సిక్కు	1066
సినిమాపిల్లలు	1066
సినిమాలు	1067
సిద్ధ	1067
సిద్ధి	1067
సీత	1067
సీతతత్వము	1068
సీత హితబోధ	1069
సీతాకళ్యాణము	1070
సీతాపహరణము	1072
సీలింగ్ ఆన్ డిజైర్సు	1072
సుందరాకాండము	1073
సుఖము	1073
సుఖదుఃఖములు	1074
సుఖశయన ప్రార్థన	1074
సుఖానందములు	1074
సుగుణములు	1075
సుజ్ఞాన విజ్ఞాన ప్రజ్ఞానములు	1075
సుదర్శనము	1075
సుదర్శనము-సమ్యక్‌దృష్టి	1075
సుద్దులు	1075

పదము	పు.నం.
సున్నా	1075
సుబ్బమ్మ	1076
సుభాష్‌చంద్రబోస్	1076
సుమంతుడు	1076
సుమతి	1076
సుమిత్ర	1077
సుప్రభాతము	1077
సుప్రీంకోర్టు	1077
సుప్రీంస్టేజి	1077
సుషుప్తి	1077
సుషుమ్ననాడి	1077
సూక్ష్మదేహము	1078
సూక్ష్మము	1078
సూక్ష్మరామాయణము	1078
సూక్ష్మరూపము	1079
సూక్ష్మరూపుడు	1079
సూత్రము	1079
సూత్రాత్మకుడు	1080
సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి	1080
సూరదాసు	1080
సూర్యశక్తి	1081
సూర్యుడు	1081
సృష్టి	1085
సృష్టకర్త	1087
స్మృతిభ్రష్టుడు	1087
స్మృతులు	1087
సెయింటు	1088
సైంటిస్టు	1088
సైన్సు	1088
సేవ	1088
సేవదళసభ్యులు	1090
సేవాదళ్	1091
సేవాసాధన	1091

పదము	పు.నం.
సోదరప్రేమ	1095
సోమహారము	1095
సోమశేఖరుడు	1095
సోషలిజమ్	1095
సోహం	1096
సోహం తత్త్వము	1097
సౌఖ్యము	1097
సౌభాగ్యము	1097
స్టడీసర్కిల్	1097
స్త్రీ	1098
స్త్రీజాతి	1100
స్త్రీ తత్వము	1100
స్త్రీ ధర్మము	1101
స్త్రీ పురుష బేధములు	1101
స్త్రీలు - విద్య	1102
స్త్రీహత్య	1105
స్థల ప్రభావము	1106
స్థితప్రజ్ఞుడు	1107
స్థితి	1109
స్థూలరూపము	1109
స్థైర్యము	1109
స్నాతకోత్సవము	1109
స్నానము	1109
స్నేహభావము	1109
స్నేహము	1109
స్నేహితుడు/స్నేహితులు	1110
స్పర్శ	1110
స్పర్శనం	1110
స్పెషలైజేషన్	1110
స్మరణ/స్మరణలు	1111
స్మరించు	1111
స్మరింతురు	1112
స్వంత ఆస్తి	1113

పదము	పు.నం.
స్వధర్మము	1113
స్వధర్మాచరణ	1113
స్వధా	1114
స్వప్నతుల్యము	1114
స్వప్నలోకము	1114
స్వప్రకాశము	1114
స్వభావము	1114
స్వయంకృతము	1114
స్వయం నిర్ణయాధికారము	1115
స్వయం సేవకులు	1115
స్వరూప లక్షణము	1115
స్వర్గము	1116
స్వస్థానము	1116
స్వాతంత్ర్యము	1117
స్వాధ్యాయము	1118
స్వాప్యయాత్	1118
స్వామి	1118
స్వామికోరిక	1118
స్వామిదయ	1118
స్వామిపాడిన పాటలు	1118
స్వామి బాల్యము	1119
స్వామిభోజనము	1127
స్వామి శివానంద	1127
స్వార్థము	1127
స్వాహా	1127
స్వేచ్ఛ	1130
హంసగాయత్రి	1131
హక్కు	1132
హజరత్‌మహమ్మద్	1132
హద్దు	1132
హనుమంతుడు	1133
హరినామము	1136
హరియొక్కచిత్రలీలలు	1136

పదము పు.నం.

హళ్ళికిహళ్ళి 1136
హోని 1136
హోయి 1136
హిందువులు 1137
హిందూమతము 1138
హింస 1138
హిట్లరు 1138
హితభాష 1138
హిపోక్రసీ 1138
హిమాచలము 1138
హిరణ్యము 1139
హిరణ్యకశిపుడు 1139
హిరణ్యగర్భతత్త్వము 1140
హిరణ్యగర్భుడు 1141
హీనుడు 1141
హీరో 1141
హూమన్ 1141
హృదయకమలము 1141
హృదయమందిరము 1141
హృదయము 1141
హృదయవాసి 1143
హృదయసంబంధము 1144
హృదయస్థాయి 1145
హృషీకేశుడు 1145
హెచ్చరించుకొండి 1145
హెచ్చరిక 1145
హెడ్‌క్వార్టర్స్ 1146
హేయత్వావచనాచ్చ 1146
హోమము 1147

అనుబంధము

అటాచ్‌మెంట్ 1148
అనుగ్రహము 1148
అహింస 1148
ఆదర్శపుత్రుడు 1148
ఆదర్శప్రాయులు 1148
ఆదర్శము 1148
ఆదిశేషుడు 1148
ఆనందపిపాసి 1148
ఆనందప్రాప్తి 1148
ఆనందము 1148
ఆవేదన 1148
ఇష్టాయిష్టాలు 1148
ఈశ్వరత్వము 1148
ఈశ్వరాంబ 1149
ఈశ్వరార్పణము 1149
ఈషణత్రయము 1149
ఉపకారము 1150
ఊర్మిళ 1150
కస్తూరి 1154
కృతజ్ఞత 1154
కొండమరాజు (తండ్రి) 1154
కైకేయి 1155
కౌసల్య 1155
గడ్డి 1155
గుణములు 1155
ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి - ఋషి 1155
చైతన్యము 1155
జననమరణాలు 1156
జన్మ 1156
జీవితచరిత్ర 1156
డాక్టర్లు 1156
తల్లితండ్రులు 1156
దశరథుడు 1157
దివ్యప్రకటనలు 1157
దూపాటితిరుమలాచారి 1158

దూషణభూషణలు 1158
దేహాభిమానము 1158
నరకము 1158
నా ప్రతిజ్ఞ 1158
నామస్మరణ 1158
నాయకుడు 1158
నేనెవరు 1158
పిలుపు 1158
పుట్టపర్తి 1158
పునర్జన్మ 1159
ప్రాచీన సంస్కృతి 1159
బల-అతిబల 1159
బింబము-ప్రతిబింబము 1159
బుద్ధుడు 1159
బొమ్మలాట 1160
బ్రాహ్మణులు 1160
భక్తరక్షణ 1160
భగవన్నామస్మరణ 1160
భరతుడు 1160
భారతదేశము 1160
భారతీయ సంస్కృతి 1161
మరణము 1161
మానవతావిలువలు 1161
మానవధర్మము 1161
యుక్తిప్రయుక్తులు 1162
రామనామము 1162
రామబ్రహ్మం 1163
రామరావణయుద్ధము 1163
రామాయణము 1163
రాముడు 1163
రాముని ఆశయము 1163
లక్ష్మణుడు 1164
లీలానాటకము 1164
విరాట్‌పురుషునివిశ్వరూపం 1164
వశిష్ఠుడు 1164
వాల్మీకి 1164
విశ్వామిత్రుడు 1165
విశ్వాసము 1165
వేసవి తరగతులు 1165
వైదేహరాజు (జనకమహారాజు) 1165
శంఖుస్థాపన 1165
శక్తిసామర్థ్యములు 1165
శత్రుఘ్నుడు 1165
షడ్ఐశ్వరసంపన్నుడు 1165
సంకల్పము 1165
సంపూర్ణజీవనము 1165
సంస్కృతము 1166
సనాతన సారథి 1166
సమత్వము 1166
సాంఘికన్యాయము 1166
సాధన 1166
సార్థకము 1166
సునాయసమరణము 1166
సుమిత్ర 1166
సేవ 1168
సేవకుడు 1168
స్వప్నము 1168
స్వామి హృదయము 1168
హనుమంతుడు 1168
హృదయావేదన 1168
హ్యూమానిటి 1168

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

పదము	పు.నం.
మహాశక్తి	740
మహోత్కృష్టశాస్త్రము	740
మహోపకారి	740
మహోపద్రవాలు	740
మాండూక్యోపనిషత్తు	741
మాంత్రవర్ణికమేవచ	741
మాంసభక్షణ	741
మాట/మాటలు	742
మాణిక్యవాచకర్	742
మాత/మాతలు	743
మాతృదేవోభవ	744
మాతృదేశము	744
మాతృప్రేమ	744
మాతృభాష	744
మాతృమూర్తి	744
మాతృమూర్తియొక్క ఆరాధనదినము	744
మాతృస్థానము	745
మాత్ర	745
మాత్సర్యము	745
మాధవ	745
మాధవుడు	745
మానము	746
మానవ/మానవుడు	746
మానవజన్మ	746
మానవజీవితము	747
మానవతావిలువలు	748
మానవత్వము	749
మానవరూపము	750
మానవలక్షణములు	751
మానవశరీరము	751
మానవసేవ	751
మానవసేవయేమాధవసేవ	751
మానవుడు కాడు	752
మానవుని పరిస్థితి	752
మానవుని విశిష్టత	752
మానసభజరేగురుచరణం	753
మానసిక మరణోత్సవము	753
మానుషాకారము	753
మాయ	754
మాయాధికారి	757
మాయాశక్తి	757
మారదు	757
మారరు	757
మార్కండేయుడు	757
మార్గదర్శకుడు	757
మార్గములు	758
మార్పు/మార్పులు	758
మాలిన్యము	758
మాస్టర్	758
మితభాషి	758
మితము	759
మిత్రులు	759
మిథ్య	759
మీమాంస	759
మిరాకిల్	761
మీరా	761
ముండకోపనిషత్	761
ముక్తి/ముక్తులు	761
ముక్తికిబాట	764
ముక్తిఫలము	764
ముఖ్యకారణము	764
ముగ్గురురాజులు	764
ముదిత	765
మునకలు	765
ముప్పు	765
ముముక్షుత్వము	765

పంగనామము

రూపాయి కోసమై లోపాయికారిగా
అడ్డమైన గడ్డి తింటారయా
ధనం కోసము దైవధ్యానాలు బోనాలు
కోటి పన్నాగములు పన్నేరయా
రంగ లింగాయంచు దొంగ మ్రొక్కులు మొక్క
పంగనామము ప్రజకు పెడతారయా

(శ్రీ.ఆ. 2001 పు. 6)

పంచ క్లేశములు

మొదటిది అవిద్యా క్లేశము, రెండవది అభినవ క్లేశము, మూడవది అస్థిత క్లేశము, నాల్గవది రాగక్లేశము, ఐదవది ద్వేష క్లేశము. ఈ పంచ క్లేశముల వల్లనే మానవుడు ఆత్మకు అత్యంత దూరమైపోతున్నాడు. ఆత్మదర్శనం చేసుకోలేకపోతున్నాడు, ఆత్మానందాన్ని అనుభవించలేకపోతున్నాడు. ఈ పంచ క్లేశముల పాంచభౌతిక శరీరమునకు అనేక ఇబ్బందులు కలిగిస్తున్నవి. దేహాన్ని అమితంగా ప్రేమించి, దాని నిమిత్తమై జీవితాన్ని ధారపోయడమే **అవిద్యాక్లేశము.** ఇది మానవునికి అనేక ఆశలను, రోగాలను కల్పించి, జీవితాన్ని దుఃఖమయం గావిస్తుంది. సర్వమునకు మనస్సే కారణమని తెలుసుకోలేక కంటికి కనిపించే దృశ్యమే ప్రధానమని భావించడం **అభినవ క్లేశము.** మనస్సును అరికట్టలేక, దేహభ్రాంతిని వీడలేక మానవుడు దుఃఖాన్ని అనుభవిస్తాడు. విషయ భోగములందు అసక్తియే **అస్థిత క్లేశము.** ధన, కనక, వస్తు, వాహనాదులు కావాలని అభిలషించడమే **రాగక్లేశము.** అది మానవుణ్ణి అనేక విధములైన బాధలకు గురి చేస్తుంది. ఇంక, **ద్వేషక్లేశమనగా** ఏమిటి? మానవుడు కొన్ని కోరికలతో ఇతరులను ఆశ్రయించి, కోరికలు తీరితే సంతోషిస్తాడు: కోరికలు తీరకపోతే వారిని ద్వేషిస్తాడు. కేవలం సామాన్య మానవులు మాత్రమే కాదు, అనేకమంది భక్తులు కూడా భగవంతుణ్ణి ఎన్నో ఆశలతో ఆరాధన సల్పుతుంటారు. అవి సఫలమైతే ఆనందిస్తారు, విఫలమైతే భగవంతుణ్ణి కూడా ద్వేషిస్తారు. ఈ పంచ క్లేశములు మానవుణ్ణి బంధితుని గావిస్తున్నాయి.

పంచ పాండవులు

తురీయావస్థలోనే మానవునికి ఆనందం లభ్యమౌతుంది. ఇట్టి పారమార్థిక తత్వాన్ని గుర్తించాలనుకుంటే, మనస్సును నిర్మూలించుకోవాలి. లేక అదుపులో ఉంచుకోవాలి. క్రమక్రమేణ దేహాభిమానమును తగ్గించుకోవాలి.

(స.సా.ఏ.2000 పు.98)

పంచ పాండవులు

ప్రాచీన కాలము నుండి భారత దేశము అన్ని దేశములకూ దైవత్వాన్ని గురించి ప్రచార ప్రబోధలు సల్పుతూ, సుస్థిరమైన శాంతి, భద్రతలు చేకూర్చుతూ వచ్చింది. ప్రాచీన భారతీయ సంస్కృతి చాల పవిత్రమైనది; ఇది దివ్యమైనది, భవ్యమైనది, నవ్యమైనది. కాని, ఇట్టి సంస్కృతియొక్క తత్వాన్ని ఎవ్వరూ విచారణ చేయటం లేదు. ఈనాటి విద్యార్థులు కూడా ఈ సంస్కృతియొక్క తత్వాన్ని ఎవ్వరూ విచారణ చేయటం లేదు. ఈనాటి విద్యార్థులు కూడా ఈ సంస్కృతిని అర్థం చేసుకోలేక పోతున్నారు. మహాభారత యుద్ధం యొక్క ఫలితాన్ని ఉదాహరణగా తీసుకోండి. **పంచ పాండవులు నిరంతరం కృష్ణుణ్ణి స్మరిస్తూ వచ్చారు. వారు భగవంతునికి మొట్టమొదట స్థానం అందించారు; ప్రపంచానికి రెండవ స్థానమిచ్చారు. స్వార్థాన్ని చివరికి నెట్టారు. First God, Next world, Last I అని వారు భావించారు.** కాని, కౌరవులు అలా కాదు. వారి దృష్టిలో మొదట స్వార్థం, తరువాత ప్రపంచం, చివరికి భగవంతుడు. అనగా, వారు First I, Next world, Last God అని భావించారు. కనుకనే వారు భగవంతుణ్ణి కోల్పోయారు, జీవితాన్నే నాశనం చేసుకున్నారు. కనుక, **మానవుడు ఎల్లప్పుడు దైవాన్ని ముందు ఉంచుకోవాలి.** దైవాన్ని ముందు ఉంచుకున్నవారికి ఏ ప్రమాదమూ సంభవించదు. దైవాన్ని స్మరించుకుంటూ దేశసేవలో జీవితాన్ని గడపాలి.

(స.సా.జ.2000పు.5)

పంచ ప్రాణములు

(చూ॥ ఆత్మభ్రాంతి, ద్రౌపది, మానుషాకారము)

పంచ ప్రాణాలుగా భావించు

సత్య ధర్మ శాంతి, ప్రేమ అహింసలను మానవుడు తన పంచ ప్రాణాలుగా భావించాలి. సత్యం నాలో లేకపోతే ఒక ప్రాణం పోయినట్లే ధర్మం లేకపోతే రెండవ ప్రాణం కూడా పోయినట్లే.

ఈ పంచ ప్రాణాలు నీలో లేక పోతే నీ వొక డెడ్ బాడీ. నీవొక శవంతో సమానం.

అన్నింటికీ ప్రేమ ప్రధానమైనది. **ప్రేమతో ఏది పలికినా అది సత్యమవుతుంది. ప్రేమతో ఏది చేసినా అది ధర్మం** అవుతుంది.

ఏకష్టం నీకు కలగకూడదని ఆశిస్తావో, ఎదుటి వారికి అట్టి కష్టాలు మీ వల్ల కలగకుండా చూసుకోవాలి.

(దే.యు.పు.8)

పంచ భూతములు

పంచ భూతములు లేని స్థానం లేదు. పంచభూతములతో కూడినది కాబట్టే, శరీరాన్ని పాంచభౌతిక స్వరూపమన్నారు. పంచ భూతముల తత్వాన్ని తెలిపేదే పంచాంగము. ఆకాశము శబ్దస్వరూపము. అదే ప్రణవనాదము. ఏరోప్లేను దూరంనుండి వస్తున్నప్పుడు శబ్దం తక్కువగా ఉంటుంది. దగ్గరకు వచ్చేటప్పటికి శబ్దం ఎక్కువవుతుంది. తిరిగి దూరంగా వెళ్ళిపోయేటప్పుడు ఆ శబ్దం క్రమక్రమేణ తగ్గిపోతుంది. అదేరీతిగా, ఓంకారం ఆకార, ఉకార, మకారములతో కూడియున్నది. ఇట్టి **ఓంకారనాదాన్ని మీరు శ్రవణం చేయాలి. ఇదే ఆకాశం చేసే బోధ. ఇంక, గాలి ఏమని బోధిస్తున్నది? మీరు ఆక్సీజన్‌ను పీల్చుకొని, కార్బన్‌డయాక్సైడ్‌ను వదలిపెడుతున్నారు కదా! అదేరీతిగా, మీరు మంచిని స్వీకరించి, చెడ్డను విసర్జించాలి; ఫలమును స్వీకరించి మలమును విసర్జించాలి. ఇదే గాలి అందించే గొప్ప ఉపదేశం. అగ్ని ఆత్మజ్ఞానమును ప్రబోధిస్తున్నది. "తమ సోమా జ్యోతిర్గమయ," అన్నారు. జ్యోతి ఉన్నచోట తమస్సు ఉండటానికి వీల్లేదు.** రామనామంలో కూడా అగ్నిబీజం ఇమిడియున్నది. **'ర, అ, మ' అనే మూడక్షరముల**

చేరికయే రామనామము. 'ర' - అగ్నిబీజము; 'అ' - చంద్రబీజము; 'మ' - సూర్యబీజము. సూర్యుడు చీకటిని దూరం చేసి ప్రకాశాన్ని అందిస్తున్నాడు; ప్రాణాన్ని నిల్పుతున్నాడు. చంద్రుడు తాపాన్ని తొలగించి హృదయాన్ని చల్లబర్చుతున్నాడు. ఇంక, అగ్ని పాపాన్ని భస్మం చేస్తున్నది. కనుక, **రామనామం అజ్ఞానాంధ కారమును పోగొట్టుతుంది; తాపాన్ని చల్లార్చుతుంది; పాపాన్ని భస్మం చేస్తుంది. గర్గ మహర్షి 'రామ' అని పేరు పెట్టడంలో గల అంతరార్థమిదియే.**

(స.సా.జూలై2000 పు.195/196)

శబ్దం, స్పర్శ, రూప, రస, గంధములను గుణముల మిశ్రమములే: మొదటిది భూమి, అందువలన భూమి అతి భారమైనది. రెండవదైన నీరులో శబ్ద, స్పర్శ, రూపు, రసమను నాలుగు మాత్రమే కలవు. అందులో గంధము ఒకటి తగ్గినది. దాని వలన కొంత తేలికయి, అది ప్రవహించుచున్నది. ఇక మూడవదయిన అగ్ని యందు శబ్ద, స్పర్శ రూపములు మాత్రమే వున్నవి. రస, గంధములు లేవు. ఆ కారణముచే ఆగ్ని మరికొంత సూక్ష్మమయి పైకిలేచుచున్నది. వాయువు నాలుగవది. అందులో శబ్ద, స్పర్శ మాత్రమే నిలిచి, రూప, రస, గంధములు లేనందున అది మరింత సూక్ష్మమయి సర్వవ్యాప్తి అయినది. తరువాత ఆకాశము, అందులో శబ్దము మాత్రము మిగిలినది. తక్కిన స్పర్శ, రూప, రస, గంధములు లేనందున ఆకాశము అన్నిటికంటే తేలిక అయినది.

(శ్రీ.స.సూ.పు.221)

(చూ॥ ఆత్మభ్రాంతి, కులం, గుండె, దైవంకోసం, ధర్మము, నరుడు, మానుషాకారము, సృష్టి)

పంచమ పురుషార్థము

"ప్రేమ అమృత స్వరూపాయచ" అన్నాడు నారదుడు. ప్రేమ అమృత స్వరూపము. ఈ బాహ్య ప్రపంచమునందు మానవుడు చతుర్విధ పురుషార్థములను మాత్రమే లక్ష్యము నందుంచుకొని ఇదియే మోక్షానికి తగిన మార్గమని భ్రమిస్తున్నాడు. కాదు... కాదు... **ధర్మ, అర్థ, కామ, మోక్షములు మాత్రమే పురుషార్థములు కావు. పంచమ పురుషార్థం కూడానూ ఒకటున్నది అది మోక్షమునకంటె అతీతమైనది. అదియే పరమప్రేమ.** ఈ ప్రేమతత్వము దైవత్వము. దైవము వేరు. ప్రేమవేరుకాదు. దైవము ప్రేమ, ప్రేమయే దైవము. ఇట్టి ప్రేమ తత్వాన్ని మనం గుర్తించినప్పుడే మానవత్వాన్ని కూడనూ మనం అర్థం చేసుకోగలము.

(శ్రీ.ఫి. 1995 పు. 2)

(చూ॥ సోహం తత్వము)

పంచమ వేదము

భారతము పంచమ వేదం. అది ఐహిక, ఆముష్మిక ధర్మాల నిధి. మాధవుడు భారతదేశ ధర్మక్షేత్ర రంగస్థలంలో, తన నాటక సామాగ్రిని దింపుకొని ఆడిన ఆద్భుతమైన ఆట మహాభారతము. భారత నాటకానికి పాత్రధారులను, మాటలను, పాటలను సమకూర్చిన రచయిత, నటకుడు, దర్శకుడు, నిర్మాత అంతా ఒక్క మాధవుడే! **ఒకవైపున ధర్మవృద్ధియైన పరిమిత ఆత్మబలం, మరొకవైపున అధర్మవృద్ధమైన అపార భౌతిక బలం.** ఈ రెంటి ఘర్షణలో, పర్యవసానరూపమైన ధార్మిక విజయజ్యోతిగా, తనను నిర్దేశించుట, **ఇదే భారతామృత సర్వస్వం. అదే భగవద్గీత.**

(శ్రీ.భ.ఉ.పు.2)

మహాభారతము, భాగవతము వలెను, రామాయణము వలెను, భక్తి బోధకము కాదని పలువురనుట కలదు. కాని, ఒకమారు దాని రుచి తెలిసికొన్న వాడు దానిని వదలడు. దానికి తక్కువ విలువయు కట్టడు. భారతము పంచమవేదముగా పేర్కొన బడినది. ఎందువలననగా వేదములు ప్రతి పాదించు పరమార్థములు సామాన్య బుద్ధులకు సులభగ్రాహ్యములు కావు. అట్టి యర్థములను మహాభారతము మనోరంజకములయిన చిన్న చిన్న కథల రూపమున ప్రజల కందించి, యాచరణ సాధ్యములు కావించినది. అందువలన పంచమ వేదమనబడినది.

పంచ మాతలు

పూర్వమీమాంస ప్రవృత్తి మార్గమును తెలుపును ఉత్తరమీమాంస నివృత్తి మార్గమును తెలుపును. పూర్వ మీమాంస కారణమును, ఉత్తర మీమాంస కార్యమును (అనగా -జ్ఞానమును) తెలుపును. మహాభారతములో ఆరెండు మార్గములును సమగ్రముగా వివరింపబడియున్నవి. కావుననే పంచమ వేదముగా భావింపబడినది. అది వేద సారము, భారతము కమ్మకమ్మని కథలతో, సులభమైన భాషతో -మానవుని యిహలోక యాత్రకును పరలోక ప్రాప్తికిని కావలసిన సకల ధర్మలను బోధించును. అందువలననే "వింటే భారతమే వినవలె తింటే గారెలే తినవలే"నన్న లోకోక్తి పుట్టినది.

(స.వ.పు.6)

పంచ మాతలు

పుట్టిన ప్రతివ్యక్తికి తన జీవితమున కొక అర్థమూ, పరమార్థమూ లభింప జేసినందుకు ఐదుగురు మాతృదేవతలకు ఋణపడి వుండును. **మొదటిది దేహమాత** అనగా కన్నతల్లి; **రెండవది గోమాత,** పాలిచ్చు గోవు మరియు భూమిదున్ను ఎద్దు; **మూడవది భూమాత,** తినుటకు తిండి ఉండుటకు చోటు యిచ్చి రక్షించిన తల్లి; **నాలుగవది దేశమాత,** సంస్కారం, సాంప్రదాయం, జీవితమునకొక లక్ష్యం అందించిన తల్లి; **అయిదవది వేదమాత,** ఆధ్యాత్మిక జ్ఞాననిధి. **జన్మయిచ్చి, మిగిలిన మాతృదేవతలతో సంబంధము కలిగించిన దేహమాత అత్యంత పూజ్యురాలు. అందువలననే ప్రప్రథముగా కళాశాల మహిళల కొరకు స్థాపించి సర్వతోముఖమైన సనాతన ధర్మమునకు నాందివచనము పలుక సంకల్పించితిని.**

(శ్రీ.స.సూ.పు.39)

పంచాగ్నులు

తైత్తిరియోపనిషత్తు 'పంచాగ్నుల' ను గూర్చి కూడా ప్రబోధిస్తున్నది. **ఉదరాగ్ని, మందాగ్ని, కామాగ్ని, శోకాగ్ని, బడబాగ్ని-ఇవే పంచాగ్నులు. 'ఉదరాగ్ని'**-అనగా ఆకలి చేత మానవుని తపింప జేయునది. **'మందాగ్ని'** - అనగా అమితంగా భజించుట వలన కలిగే అజీర్ణము చేత తపింపజేయునది. **'కామాగ్ని'** - అనగా చిత్తమును అనేక విధములైన వాంఛల చేత తపింపజేయునది.

ఇంక **నాల్గవది శోకాగ్ని**. ఇది లౌకికమైన చింతల వలన, వాంఛల వలన కలిగే శోకము కాదు. దైవదర్శనం పొందుటకై, దైవానందం నిమిత్తమై మానవుని తపింపజేయునదే-శోకాగ్ని. **భగవద్గీత యందు మొట్టమొదటి అధ్యాయం - "విషాదయోగం"** ఇక్కడ "విషాద" మనగా ఏమిటి? అర్జునుడికీ విషాదము ఎందుకు కలిగినది? కేవలం లౌకిక సంబంధమైన విషయ వాంఛలతో బంధు మిత్రుల నిమిత్తమై తాను విచారమునకు గురియైనాడా? ఈ విధంగా ఏర్పడే విషాదమునకు 'యోగము' అనే సార్థకనామం కలుగదు. కనుక లౌకిక సుఖదుఃఖముల నిమిత్తమై, ధన కనక వస్తు వాహనాదుల నిమిత్తమై అర్జునుడు శోకించలేదు. యుద్ధం వలన అనేక ప్రాణులు నశిస్తాయి. వర్ణసంకరము ఏర్పడుతుంది. ధర్మగ్లాని కలుగుతుంది - ఈ విధమైన ధర్మమును లక్ష్యమందుంచు కొని, దైవమును దృష్టి యందుంచుకొని అర్జునుడు విషాదమునకు గురియగుట చేత అది ''విషాదయోగము''గా రూపొందినది. ఇట్టి **దైవ సంబంధమైన, ధర్మ సంబంధమైన తపనకే "శోకాగ్ని" అని పేరు.**

ఐదవదైన 'బడబాగ్ని' భయంకరమైన రోగముల చేత, బాధల చేత మరణము చేత మానవుని తపింప జేస్తుంది. ఈ పంచాగ్నులు కేవలం భౌతికమైన శరీరమునకు సంబంధించినవి మాత్రమే, తద్భిన్నమైన ఆత్మకు సంబంధించినవి కావు.ఈ పంచాగ్నులకు ఆత్మ సాక్షీభూతుడై ఉంటున్నాడు. ఇట్టి సాక్షీభూతుని తత్వాన్ని జగత్తునకు చాటే నిమిత్తమై తైత్తరియోపనిషత్తు పంచాగ్నుల యొక్క ప్రమాణములను ఆధారముగా చేసికొని ప్రజలకు బోధిస్తున్నది.

(స.సా.న.91.పు.298)

పంచాగ్నులు : కాలాగ్ని, క్షుదాగ్ని, శీతాగ్ని, కోపాగ్ని, జ్ఞానాగ్ని. కాలాగ్ని పాదములందును, క్షుదాగ్ని నాభియందునూ, శీతాగ్ని హృదయమందును, కోపాగ్ని నేత్రమందును, జ్ఞానాగ్ని ఆత్మయందును వుండును.

(ప్రశ్నో.వా. పు. 7)

(చూ॥ ప్రేయోమార్గం)

పంచిపెట్టు

పూర్వం తమిళ దేశంలో మాణిక్యవాచికర్ అనే సాధకుడుండేవాడు. ఒకనాడు అతడు ఎక్కడికో ప్రయాణమై వెళుతుండగా ఉన్నట్టుండి కుంభవృష్టి ప్రారంభమైంది. సమీపంలో అతనికొక ఇల్లు కనిపించింది. ఆ ఇంటి ముందు వరండాలో ఎవ్వరూ లేరు. అతడు ఆ వరండాలోకి ప్రవేశించాడు. అందులో ఒక్క మనిషి పడుకోవడానికి తగినంత స్థలం మాత్రమే ఉన్నది. కొంతసేపటికి మరొక వ్యక్తి ఆ కుంభవృష్టిలో నడుచుకుంటూ పోతున్నాడు. వెంటనే మాణిక్యవాచికర్ "సోదరా! రండి, లోపలికి వచ్చి తలదాచుకోండి" అని ఆహ్వానించాడు. అతడు "అయ్యా! ఈ వరండాలోకి నీవు పడుకోవడానికి తగినంత స్థలం మాత్రమే ఉన్నది కదా! నేను కూడా రావటంవల్ల నీకు ఇబ్బంది కల్గుతుందేమో!" అన్నాడు. "సోదరా! నీవు కూడా వస్తే మనిద్దరము కూర్చోవచ్చును" అన్నాడు మాణిక్య వాచికర్. మరి కొంతసేపటికి ఇంకొకడు వర్షంలో తడుసుకుంటూ పోతున్నాడు. "సోదరా!సోదరా! మీరు కూడా వచ్చి ఇక్కడ కూర్చోండి" అన్నాడు. ఆ వ్యక్తి "అయ్యా! మీరిద్దరు కూర్చోవడానికి తగినంత స్థలం మాత్రమే ఉన్నది కదా! నేను కూడా వస్తే మీకు ఇబ్బంది కలుగుతుందేమో!" అన్నాడు. "సోదరా! మాకేమీ ఇబ్బంది కలుగదు. నీవు వస్తే మనం ముగ్గురం నిలబడుదాం" అన్నాడు. **మాణిక్యవాచికర్.** ఈవిధమైన త్యాగభావం మీయందు అభివృద్ధి కావాలి. ఒక్కడు పడుకొనే బదులు ఇద్దరు కూర్చున్నారు: తరువాత ఇద్దరు కూర్చునే బదులు ముగ్గురు నిల్చున్నారు. ఈవిధంగా, ఒక్క మనిషి తన ఆనందాన్ని మరో ఇద్దరికి పంచి పెట్టాడు. మీరు కూడా **మీ ఆనందాన్ని పదిమందికి పంచటానికి ప్రయత్నించాలి.** అప్పుడు మీలో ఆనందము పది రెట్లు పెరిగిపోతుంది. మీ చేతిలో ఒక నీటిబిందువు ఉన్నదనుకోండి. అది అట్లానే ఉంటే గాలికి ఆవిరైపోతుంది. ఆ ఒక్క బిందువును సముద్రంతో చేర్చితే అది సముద్ర స్వరూపాన్నే ధరిస్తుంది. అదేవిధంగా **మీ ఆనందాన్ని అందరికీ పంచినప్పుడు మీలో నఖశిఖ పర్యంతం ఉన్న కాన్షియస్స్ సర్వత్ర ఉన్న కాన్షియస్‌నెస్‌లో లీనమై పోతుంది. అదియే నిర్వాణము, అదియే సాయుజ్యము.**

(స.సా.ఫి.99పు.39/40)

పంచేంద్రియములు

"లేత వయస్సులో ఉన్న పిల్లలు లేత అరిటాకులవంటివారు. పంచేంద్రియములు అరిటాకులో వడ్డించిన పంచభక్ష్య పరమాన్నముల వంటివి. వీటిని సద్భావములు, సదాచారములు, సద్గుణములనే దైవానికి అర్పించాలి. కాని, ఈనాటి పిల్లలు వీటిని దుర్గుణములు, దురాచారములు, దుర్భావములు అనే రాక్షసులకు అర్పిస్తున్నారు.'

(స.సా.సె.2000 పు.281)

(చూ॥ ఆత్మశాంతి, నిర్వాణం)

పంట

సాధకుని పంట: ఓర్పును మించిన తపస్సు, సంతృప్తిని మించిన సుఖం, కనికరాన్ని మించిన పుణ్యం, క్షమను మించిన శక్తి వంతమైన ఆయుధము లోకమున వేరు లేదు.

(ప్రే.వా.పు.72)

పండగలు

"పండగలు Holidays కావు Holydays (పండగలు శెలవుదినములు కావు, పర్వదినములు)" అయితే ఈనాడు

పండితుడు/పండితులు

దురదృష్టవశాత్తు ఇటువంటి పవిత్రమైన భావన చాలా మందిలో లేకుండా పోయింది. పర్వదినాలు శెలవు దినాలుగా భావించి పిక్‌నిక్‌లకు వెళ్ళటం పరిపాటైంది. పార్టీలుచేసు కుంటున్నారు. శివరాత్రి జాగరణ పేరుతో చీట్లపేకలు అడుతున్నారు. త్రాగుతున్నారు, తందనాలు త్రొక్కుతున్నారు. ఇది మారాలి. ఈ భావన మారాలి. ఈ ఆలోచనా సరళి మారాలి. **పండుగ దినాలు పర్వదినాలుగా భావించి, నిర్మలచిత్తంతో కొద్దిసేపైనా భగవంతుని స్మరించాలి.** పవిత్ర హృదయంతో భగవన్నామం చేయాలి. అప్పుడే పర్వదినం (Holyday) యొక్క ప్రాముఖ్యతను సద్వినియోగ పరచిన వారమవుతాము.

(అ.పు.3b)

పండితుడు/పండితులు

కర్మా కర్మలయొక్క యదార్థ దర్శనము కలిగినవాడే నిజమైన పండితుడు. పుస్తకమందున్న విషయములను కంఠస్థము చేసి మస్తకమున చేర్చినంతమాత్రమున పండితుడని తలంచరాదు. పండితుడు కాదు. సమ్యగ్దర్శనమునకు యోగ్యమగు బుద్ధికలవాడే పండితుడనబడును. అట్టి జ్ఞానసంపదను ఆర్జించినవాని సర్వ కర్మలూ పటాపంచలము కాగలవు. జ్ఞానాగ్ని యందు అట్టి దహనశక్తి కలదు. అయితే ప్రారబ్ధ కర్మను జ్ఞానులయిననూ అనుభవించితీరవలెనని కొందరి అభిప్రాయము. ఇది పరదృష్టి నాశ్రయించి, జ్ఞానికి ప్రారబ్ధముండినట్లు తోచునేకాని స్వదృష్టికి అది లేదు. ఎవడు లౌకిక వస్తువులపై ఆధారపడివుండడో ఇంద్రియ సుఖమును యెవడాశించడో సర్వవిధము లైన వాసనాకామము లెవ్వని వదలియుండునో అట్టివాని యందు శబ్దాదులు వాటి ప్రభావములు కూడనూ చూపలేవు. ఇట్టి స్థితిని సాధించినవాడే **సన్యాసి అనిపించుకొనును.** అతడే సర్వపరిగ్రహవివర్జితుడు. **ఇతడే జ్ఞాని,** అనగా నిరంతరమూ బాహ్య వస్తువులపై విషయములపై ఆధారపడక తనయందె తాను సంతృప్తిపొందువాడు. ఇతను కర్మయందు అకర్మనూ, అకర్మయందు కర్మనూ దర్శించిన మహానుభావుడు, **పండితుడు.** ఇట్టి వ్యక్తి కర్మలయందు ప్రవర్తించు చుండినప్పటికి అట్టి కర్మల కేమాత్రమూ బాధ్యుడు కానివాడే అగును. జ్ఞానికి ఫలాపేక్ష వుండదు. కారణమేమందువేమో, వినుఁ! అతను నిత్య తృప్తుడు.అతడు నిరాశ్రితుడు. అతనికి కర్తృత్వభావము లేకుండును. అనిచ్ఛా ప్రారబ్ధముననూ పరేచ్ఛా ప్రారబ్ధముననూ ప్రాప్తించిన అనుకూల ప్రతికూల పదార్థములయందు రాగద్వేషములు లేక సదాతృప్తిగా వుండును ఇతని యదృచ్ఛాలాభ సంతుష్టుడని కూడనూ అందురు. ఏది జరిగిననూ భగవ దిచ్ఛానుసారము జరుగునని నిరంతర ప్రశాంతి ప్రసన్నుడై నిశ్చలచిత్తుడై సదానందమున తాండవమాడును. **తృప్తిగలవాడే జ్ఞాని అసంతృప్తుడే అజ్ఞాని"**

(గీ.పు.83/84)

అర్జునా! నీ వెవరో, నీవు చేసే పని యెమో కొంత యోచించుకో, అన్నియూ నాకు తెలుసునని అంటావు. గోడున ఆడువారివలె యేడుస్తావు. మాటలు పండిత మాటలు. ఆటలు పామర ఆటలు. మాటలతో జ్ఞానివని తలంచిన, ఆటలతో అజ్ఞానివని చింతించవలసి వచ్చుచున్నది. నీస్థితిని చూచిన ఆగమ్యగోచరముగా నున్నది. పోనీ పండితుడవేనని అందుమా, **చావు బ్రతుకులకు పండితులు దుఃఖించరు, దుఃఖించకూడదు. అట్లు దుఃఖింతురా వారు పండితులు కారు."**

దేహముయొక్క మర్మమును ఆత్మయొక్క మర్మమును వున్న దున్నట్లు తెలిసికొనువారే పండితులు కాదా! అట్టి పండితులు కాయములతో వున్నవారికి కానీ, వూడినవారికి కానీ దుఃఖించరు. యెట్టి ద్వంద్వ పరిస్థితులలోను చిత్త సమాధానాన్ని కోల్పోరు. యేమియూ రెండూ తెలియని అజ్ఞానులే మరణించిన వారికై విలపించేది. తెలిసి, తెలియని వారు బ్రతికివున్న వారి బాగోగులకొరకు దుఃఖించుదురు. అన్నియూ తెలిసిన పండితులు దేనికి దుఃఖించరు.

(గీ.పు.24/25)

శాస్త్రజ్ఞానము కలవాడు పండితుడు కాడు. వేదశాస్త్ర ఇతిహాస పురాణ ప్రమాణములు గుర్తించినవాడు పండితుడు కాడు. పాండిత్యమును ఆర్జించిన వాడు పండితుడు కాడు. భాషాప్రవీణుడైన పండితుడుకాడు. **"పండితాः సమ దర్శినः" సమాన దృష్టి కలిగిన వాడే నిజమైన పండితుడు.** పండితులైన వారి దృష్టిలో గో, బ్రాహ్మణ, చండాలాదిగా గల వారందరూ సమానులే.

(శ్రీ.భ.ఉ.పు. 19)

ఒక పర్యాయం బుద్ధునివద్దకు ఒక పండితుడు వచ్చి "బుద్ధా! నీవు నన్ను జయించావంటే నేను, నా మూడు వేలమంది శిష్యులు నీకు పాదాక్రాంతులమై నీ సేవ చేస్తాము, బౌద్ధమతమును స్వీకరిస్తాము. ఒక వేళ నీవు ఓడిపోయినట్లయితే నీవు నాకు పాదాక్రాంతుడవు కావాలి" అన్నాడు. అప్పుడు బుద్ధుడు చిరునవ్వు నవ్వుతూ - "పండితాः సమ దర్శినः" - "సమత్వాన్ని పూనినవాడే పండితుడు. పండితునకు సుఖదుఃఖము లనేవి తెలియవు; ఎక్కువ తక్కువలనేవి ఉండవు. కానీ నీయందు అహంకారమున్నది. క్రోధమున్నది. అలాంటప్పుడు నీవు పండితుడ వెట్లవుతావు? ఆత్మజ్ఞానం గ్రంథపరిచయంతో వచ్చేది కాదు, లౌకికమైన పాండిత్యంతో వచ్చేది కాదు, గురువులు అందించేది కాదు. ఈ లోకంలో కట్టలు కట్టలు పుస్తకాలు చదివేవారున్నారు. కానీ వాటిలోని పవిత్రమైన విషయాలను ఆచరణలో పెట్టేవారు ఒక్కరైనా ఉన్నారా? జీవితమంతా చదువుతూనే ఉంటే ఇంక ఆచరణలో పెట్టే దెప్పుడు? ఆచరణలో లేని పాండిత్యము పాండిత్యమే కాదు".

కవిం పురాణ మనుశాసితారం
అణోరణీయాంస మనుస్మరే ద్యः
సర్వస్య ధాతార మచిన్త్యరూపం
ఆదిత్యవర్ణం తమసः పరస్తాత్

కవి అనగా ఎవరు? ఏవో కొన్ని పదములను కూర్చి పద్యములల్లేవాడు కాదు కవి. **భూత భవిష్యత్ వర్తమానములను చక్కగా గుర్తించినవాడే కవి. అతడు భగవంతుడొక్కడే. 'పురాణమ్' అనగా ఏమిటి? ఈ దేహమనే పురంలో నఖశిఖ పర్యంతము సంచరించే దివ్యత్వమునే 'పురాణమ్' అన్నారు. ఇంక అనుశాసితు డనగా ఎవరు? లోకంలో పరుల సొత్తు అపహరించినవారిని, పరులకు అపకారం చేసినవారిని చెఱసాలలో పెట్టి బీగం వేస్తారు. కానీ మనస్సును ఎవరైనా చెఱసాలలో పెట్టగలరా? మనస్సు తన ఇంటికి పోవచ్చు, తనవారిని చూడవచ్చు, ఇంకెక్కడికైనా సంచరించవచ్చు.** ఈ జగత్తులో దేహాన్ని శాసించే జడ్జీలు కావలసినంతమంది ఉన్నారుగాని, మనస్సును **శాసించే జడ్జి ఒక్క భగవంతుడు తప్ప మరొకడు లేడు. అతడే అనుశాసితుడు.**

బుద్ధుడు ఈ విధంగా సుమాధానం చెప్పి ఆ పండితుని నోరు మూయించాడు. "నాయనా! ఇకపైన నీవు ఆడంబరములకు పూనుకోవద్దు, అహంకారమునకు అవకాశ మివ్వవద్దు. అహంకారము అధఃపతనం గావిస్తుంది. నీవు సంపాదించవలసింది లౌకికమైన, భౌతికమైన, ప్రాకృతమైన పాండిత్యము కాదు; భగవంతునికి అర్పితమయ్యే దివ్యమైన, నవ్యమైన, భవ్యమైన జ్ఞానమును సంపాదించుకో. నేను సత్యాన్ని గుర్తించాలని నిద్రాహారములను త్యజించి, ఆకలి దప్పులను మరచి ఎంతో కాలం సాధన చేశాను. నీవు చదివిన గ్రంథములకంటే ఎక్కువ గ్రంథములనే చదివాను. ఎంతోమంది పండితులను దర్శించాను; అనేకమంది గురువులను సేవించాను. కానీ నాకు తృప్తి కలుగ లేదు. చివరికి, **పంచేంద్రియములను సద్వినియోగ పరచకుండా ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదని గుర్తించాను. కనుక ముందు వాటిని పవిత్రం గావించుకో. అప్పుడే నీవు నిజమైన పండితుడవవుతావు.** భగవంతుడు ప్రసాదించిన పంచేంద్రియాలను సద్వినియోగ పరచినప్పుడే ఆనందం ప్రాప్తిస్తుంది. నేను నా పంచేంద్రియాలను సన్మార్గంలో ప్రవేశపెట్టాను, సద్వినియోగ పర్చాను. తద్వారా అవి నా స్వాధీనమైపోయాయి. అందుచేతనే నేనిప్పుడు ఆనంద

పట్టు

స్వరూపునిగా ఉన్నాను'' అన్నాడు. **ఆనందములో లీనం కావడమే నిర్వాణము.**

నీటియందె పుట్టి, నీటియందె పెరిగి
నీటియందడంగు నీటి బుడగ
నరుడు బుద్బుదంబు, నారాయణుడు నీరు
ఉన్న మాట తెలుపుచున్న మాట.

ఈ 'బుడగల'న్నీ 'నీటి' యందె పుడుతున్నాయి. 'నీటి' యందె నిలుస్తున్నాయి, 'నీటి' యందె సంచరిస్తున్నాయి, 'నీటి' యందె అణగిపోతున్నాయి. ఇదియే మానవ జీవితము. మనం ఆనందము నుండియే పుట్టాము. ఆనందమునందే సంచరిస్తున్నాము. ఆనందమునందే లీనం కావాలి. ఇంతకంటే మరొక మార్గం లేదు.

(స.సా. మా.99 పు.69/70)

(చూ॥ స్మరింతురు)

పట్టు

పట్టిన పట్టేదో పట్టనే పట్టితివి
పట్టు నెగ్గెడిదాక అట్లె ఉండు
కోరిన దేదియో కోరనే కోరితివి
కోర్కె చెల్లెడు దాక పోవకుండు
అడిగిన దేదియో అడుగనే అడిగితివి
అడిగిన దిడుదాక విడువకుండు
తలచిన దేదియో తలచనే తలిచితివి
తలపు తీరెడు దాక పోవకుండు
పోరు పడలేక తానైన బ్రోవవలయు
ఒడలు తెలియక నీవైన మడుగవలయు
పదములు వీడక పట్టుడు
వదలకుడే నాటికైన వరదుడే కనడే
ముదమీయడే ఎదమీటడే?
మదమాత్సర్యముల ద్రుంచి మనమున గొనడే!

(బా.జీ.జ. స. పు.85/86)

పట్టుదల (Perseverance)

శత్రువు నీయందలి పట్టుదలను స్థైర్యమును,ఓరిమిని, నిగ్రహమును, ఇంకా ఎన్నిటినో పరీక్షించుచూ ఉంటాడు. నీ వెప్పుడూ సావధానముగా హెచ్చరికతో ఉండునట్లు చేస్తాడు. **రాముని విజయమునకు రావణుడు ప్రధానకారణము. శ్రీకృష్ణుని లీలలను కంసుడు ప్రపంచములో చాటించినాడు.** ప్రహ్లాదుని అనన్యభక్తిని తండ్రి హిరణ్యకశిపుడు ప్రకటింపచేసినాడు. కురుక్షేత్ర యుద్ధము కారణముగా ధర్మక్షేత్రమయినది; చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింపబడినది.

(స్వీ.పు.348)

(చూ॥ దివ్యప్రకటనలు)

పతంజలి

(చూ॥ ఇంద్రియ నిగ్రహం)

పతనము

(చూ॥ పరమాత్ముడు)

పతి

(చూ॥ సతి)

పతివ్రత ధర్మము

స్త్రీలకు పతివ్రత ధర్మము ప్రధాన లక్ష్యము. ఆసచ్ఛీల శక్తిచే వారు దేనినైనను చేయగలరు. అట్టి మహాశక్తి చేతనే సావిత్రి తన గతించిన భర్తయగు సత్యవంతునకు తిరిగి ప్రాణము రప్పించెను. ఆమె వాస్తవికముగ మృత్యుదేవునితో పోరాడెను. అత్రిఋషి భార్యయు, దత్తాత్రేయుని తల్లియును అనసూయ పాతివ్రత్యము అందరికి తెలిసిన విషయమే. తన పాతివ్రత్యశక్తిచే త్రిమూర్తులను గూడను పసిబిడ్డలుగ మార్చగలిగెను. నాలాయని తన కుష్టి భర్త ప్రాణమును కాపాడుటకు సూర్యుని సంచారమునే ఆపివేసెను.

పాతివ్రత్యమే స్త్రీల కొక్క శిరోమణి. లోకము చే ఎక్కువ కొని యాడబడునది స్త్రీకి ఈ లక్షణమే. ఈ శక్తిని

వర్ణింపనెట్టి వారికిని సాధ్యముకాదు. కానేరదు గొప్ప విపత్తులలో పడిపోయినప్పటికినీ స్త్రీ తన పాతివ్రత్య శక్తిచే సులభముగా రక్షింపబడును. స్త్రీకి పాతివ్రత్యమే జీవనము. స్త్రీ తన స్వకీయ యత్నముల ద్వారా తన్ను తాను కాపాడుకొని నిస్సంశయముగ స్వర్గమును పొందును. తన్ను బాధించ యత్నించునపుడు కేవలమొక మాటచే దమయంతి ఒక బోయవానిని బూదిగ దగ్ధపరచెను. రాజగు నలుడు తన సర్వస్వమును కోలుపోయి, తన శరీరము ఒంటి బట్టతో అరణ్యమున ప్రవేశించినపుడు, ఆమె సంతోషముతో పతి యిక్కట్లు పంచుకొనెను.

(ధ.వా.పు.28/29)

పది సూత్రములు

మీ రందరు ఒక్క సాయి కుటుంబమని కాదు. దివ్యమైన భవ్యమైన భగవత్కుటుంబం. భగవంతుడు అన్ని దేశాల వారికి అన్ని తెగలవారికి అన్ని కులాలవారికి అన్ని కాలాల్లోనూ ఒక్కడే. ఒక్క పేరు ఒక్క రూపం సంకుచిత మైనది. అన్ని రూపాలు, అన్ని నామాలు ఒక్కటేనన్న విశాల భావాన్ని మనం పెంచుకోవాలి. ఈనాడు ముఖ్యంగా మీకు పది సూత్రాలు నేను చెప్పదలచుకున్నాను.

మొట్టమొదటిది జననీ జన్మభూమిశ్చ: జన్మభూమి కన్న తల్లివంటిది. ప్రతిమానవుడు దేశాభిమానం కలిగిఉండాలి. ఏయే దేశాలవారు ఆయా దేశాలపట్ల అభిమానం కలిగి వుండడంలో దోషంలేదు. తన దేశాన్ని అభిమానించినంత మాత్రాన పరదేశాన్ని విమర్శించాలని లేదు. ఒక దేశాన్ని విశ్వసించినంతమాత్రంచేత మరొక దేశాన్ని ద్వేషించడం తగదు. కలలో, ఊహల్లో కూడా దేశద్రోహాని కేమాత్రం అవకాశాన్ని అందించరాదు. ప్రతి వ్యక్తికి దేశాభిమానం చాలా ముఖ్యమైనది.

రెండవది: ఏ మతాన్నీ ద్వేషించక సర్వమతాలను గౌరవించాలి. దేశాభిమానంతోపాటు అన్ని మతాలను గౌరవించటం రెండవది.

ఇంక మూడవది: ప్రతి మానవుని సోదరునిగా భావించి ప్రేమించాలి. మనందరి జాతి ఒక్కటే. అది మానవజాతి. మానవజాతిలో పుట్టినవారము గనుక మానవులందరూ ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించి సర్వమానవులను ప్రేమించాలి.

ప్రతిగృహమును, గృహ పరిసరాలను పరిశుద్ధంగా ఉంచుకోవటం **నాలుగవది.** తన గృహాన్నేకాక పరిసర ప్రాంతాలను కూడా పరిశుద్ధపరచుకోవటంచేత ఆరోగ్య ఆనందములు చేకూరుతాయి.

భారతదేశంలో దానం పేర దేశానికి ద్రోహం జరుగుతున్నది. దానమనగా దేశమంతటా భిక్షగాళ్లను తయారుచేయటం కాదు. భిక్షగాళ్ళకు ఒక ఉపాధిని కల్పించవచ్చునే కాని దానం, అలవాటు చేయకూడదు. వీరికి ఉపాధికల్పించి, ఏదైనా ప్రదేశంలో ఏర్పాట్లు గావించి, కాలకాలానికి ఆహారము. వస్త్రము ఇస్తూ అనుకూలమైన వాతావరణం కల్పించవచ్చునే కాని బజారులో అడ్డమొచ్చిన వారికంతా డబ్బులిచ్చి భారతదేశమంతా భిక్షగాళ్ళే అని చెడ్డపేరు తేరాదు. మనం భిక్ష మివ్వడంచేతనే పట్టణాలలో పల్లెలలో సోమరత్వాన్ని పెంచుకొని భిక్షగాళ్ళుగా తయారవు తున్నారు. **ఇది ఐదవది.**

ఇంక ఆరవది: లంచమిచ్చి పని చేయించుకోవటం గాని, లంచం పుచ్చుకొని పనిచేయటంకాని సత్యసాయి సంస్థలలో ఏమాత్రం జరగకూడదు. లంచం పుచ్చుకోవటం వల్లకాని, లంచం ఇచ్చుకోవటంవల్లకాని సత్యసాయి సంస్థలకు తీరని ద్రోహం జరుగుతుంది. కనుక సంస్థలకు సంబంధించిన వ్యక్తులందరూ ఈ లక్ష్యాన్ని దృష్టి యందుంచుకొని జాగ్రత్తగా మెలగాలి.

ఏడవది: మానవు లీనాడు అనేక విధములైన సమస్యల నెదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కారము గావించుకొనే నిమిత్తమై మనం కొన్ని సూత్రాలను ఆదర్శంగా పెట్టుకోవాలి. పరస్పరం ద్వేషాలు అసూయలు పెరుగుతుంటాయి. వీటిని అరికట్టుకోవటానికి విశాల భావాన్ని పెంచుకోవలసివస్తుంది. విశాల భావం కలగాలంటే

పద్మపురాణము

జాతిమత భేదాలకు అవకాశ మివ్వకూడదు. జాతి మతాలను పాటించరాదు. మీ పద్ధతులు మీ గృహాలలో ఆచరించుకోవచ్చుకాని సమాజంలో వీటిని పాటించటంచేత ప్రమాదాలు సంభవిస్తాయి. ఒకరిని వంచించటం మరొకరిని అభివృద్ధిగావించటం జరుగుతూ వుంటుంది. అట్లుకాక సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరినీ సోదరభావంతో ప్రేమించాలి. జాతిమత భేదభావాలు ఏమాత్రం పెంచుకోరాదు.

ఇంక ఎనిమిదవది: ముందు స్వయంసేవ. తమ పనులు తాము చేసుకోలేనివారు సమాజసేవలు ఏరీతిగా చేయగలరు? సత్యసాయి సంస్థలకు చెందిన ప్రతి సభ్యుడు కూడా తనపని తానే చేసుకోవాలిగాని ఇంకొకరితో చేయించు కోరాదు. కొందరు శ్రీమంతులై ఉండవచ్చును. వారు సేవక పరివారాన్ని పెట్టుకోవచ్చును, కొన్ని పనులకు వారిని ఉపయోగించవచ్చును. కాని తమ స్వంత పనులను కూడా ఆ పని వారితోనే చేయించుకోవటం కేవలం సోమరత్వం. ఇట్టి సోమరత్వానికి మరిగిన వ్యక్తి సమాజసేవ చేయలేడు. **సమాజసేవ చేయనివాడు సాయి సంస్థలో ఉండటానికి అర్హుడుకాడు. సమాజసేవ చేసే నిమిత్తమై మొట్టమొదట తమసేవ తాము చేసుకోవాలి.**

ఇక తొమ్మిదవది: పాపభీతి దైవప్రీతి ప్రతి ఒక్కరికీ ఉండాలి. నిరంతరం భగవంతుని ప్రేమించాలి. పాపాన్ని ద్వేషించాలి. **పాపాలు చేస్తున్నంతకాలం దైవం చిక్కడు.**

పదవది: ఇది సర్వసామాన్యమైన విషయం. ప్రభుత్వ చట్ట నిబంధనలను మనము ఏమాత్రం అతిక్రమించరాదు. ప్రభుత్వ శాసనాలను, చట్టాలను తూ.చ తప్పకుండా అనుసరించాలి. సత్యసాయి సంస్థల సభ్యుల నియమ నిబంధనలను చక్కగా పాటించి ప్రభుత్వానికి కూడా ఆదర్శాన్ని నిరూపించాలి. చట్టవిరుద్ధమైన కర్మలు మన సంస్థల సభ్యులు ఎంతమాత్రం చేయరాదు.

ఈ పది సూత్రాలను మీ హృదయంలో ప్రతిష్ఠించుకొని సంస్థకు సరైన ఆదర్శాన్ని నెలకొల్పాలి. మన ఆచరణ, మన పనులు సరైనవని ప్రజలకూ ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం కలిగించాలి. ఇది మన కర్తవ్యం, మానవధర్మం, సమాజనీతి సంస్థ నిబంధనలను చక్కగా పాటించినప్పుడు సంస్థను మనం పెంచుకోనక్కరలేదు. అదే పెరిగిపోతుంది. ఈ క్రమశిక్షణను పాటించుకొంటూ పోతే సంస్థ అభివృద్ధిని మనం కోరనక్కరలేదు. ఎవరియందు ఎట్టి దోషాలున్నా మనమా దోషాలనెంచక వారిని ప్రేమించి వారితో సహకరించి ప్రేమను అభివృద్ధిపరచుకోవాలి.

(స.సా.డి.85 పు.322/323)

పద్మపురాణము

విల్సన్ అనేవాడు పరాశర మహర్షి రచించిన పురాణములను ఇంగ్లీషులోకి తర్జుమా చేసాడు. ఈ కలియుగమునందు **పర్తి అనే గ్రామంలో సత్య అనే పేరుతో ఐదడుగుల మూడు ఇంచ్‌లు పొడవుగల వ్యక్తి ఉద్భవిస్తాడని పద్మపురాణంలో ఉన్నది. అతడు యావత్ప్రపంచమును ఆకర్షించే 'బిగ్గెస్ట్ మేగ్నెట్' అని కూడా అందులో ఉన్నది.** భారతీయుల భవిష్యత్తు గురించి పరాశరమహర్షి నాడీ గ్రంధములో అనేక విధములుగా వ్రాస్తూ వచ్చాడు. భారతీయ సంస్కృతి అన్ని రంగాలలోను దివ్యమైన భావముల చేత యావత్ప్రపంచమును ఆకట్టు కున్నది. **భారతములో లేనిది ఏ దేశములోను లేదు.** ఇట్టి భారతీయసంస్కృతి ఈనాడు భారతీయులే విస్మరిస్తూ వస్తున్నారు.

(స.సా.జులై.96పు.179)

పద్నాలుగు లోకములు

పురాణములు పద్నాలుగు లోకములున్నవని చెప్పుచున్నవి. దీనికి ఏదో అజ్ఞానులు చెప్పే అర్థమును తీసికొని పాతాళలోకము. ఉత్తమలోకము అని విభజించుచున్నారు. అయితే ఈ లోకములన్నీ మనము ధరించే, ప్రేమించే దేహమునందే ఉన్నవి. ఏడు లోకములు పైనా, ఏడు లోకములు క్రిందా, మన దేహమునకు పైభాగమేది? అదే

శిరస్సు, త్రికుట స్థానము, ఉత్తమ లోకము. అక్కడే ఏడు లోకములున్నాయి.

గరుడలోకము, గంధర్వలోకము. యక్షలోకము, కిన్నెరలోకము, కింపురుషలోకము అన్నీ శిరస్సులోనే ఉన్నవి. గరుడలోకము: ముక్కు. ఇది గరుడుని వలె ఉంటుంది. ఉచ్ఛ్వాస. నిశ్వాసములకు ఆధార మైన లోకము. రెండవది గంధర్వలోకము: కనులు యక్షలోకమే నోరు కిన్నెరలోకము: చెవులు, కింపురుషలోకము: స్పర్శ. అనగా, గరుడలోకము 1. గంధర్వలోకములు 2. అందువలన ఇవి 3 అవుతాయి. **యక్షలోకము నోరు నాల్గవది. కిన్నెరలోకములు రెండు చెవులు చేరి ఆరు. కింపురుషలోకము స్పర్శ ఒకటి. అన్నీ చేరి ఏడు. సప్తలోకములు, ఊర్ధ్వలోకములు.**

వీటిని అనుసరించినవారు పవిత్రమైన మానవత్వమును గుర్తించినవారని చెప్పవచ్చు. అనగా మంచిని వినటము, మంచిని చెప్పటము. మంచిని శ్వాసముగా తీసికోవడము, మంచిని చూడటము... కనుక, ఈ ఏడు లోకములు మానవత్వానికి మకుటము పెట్టేటివి. మొగ్గలు తొడిగేవి. కన్నులనిచ్చిన దెందుకు దెలుసునా?

అన్నీ చూచేటందుకా?

కాదు, కాదు:

కైలాస వాసుని కనులార
గాంచే టందుకురా!

అందువలన మనము కన్నులతో దివ్యత్వాన్ని చూడాలి. అందరియందును పవిత్రమైన భావాలను కన్పించాలి. దీనికోసమే భగవంతుడు కన్నులిచ్చాడు గానీ, "ఎవరెట్లున్నారు? ఎవరు బజారుకు వెళ్ళినారు; ఏ సినిమాకు పోతున్నారు" ఇవన్నింటినీ చూడడానికి భగవంతుడు కన్నులివ్వలేదు.

భోజనమును అందించుటకు కాదు భగవంతుడు నోటినిచ్చినది. పవిత్రమైన వాక్కును పలికేటందుకు భగవంతుడు నాలుక నిచ్చాడు.

ఎవరైనా మంచి చెప్పుకుంటే చెవులు ఒక్కటిగా చేరవు; ఎవరైనా రహస్యాలు చెప్పుతుంటే, రెండూ ఏకమైపోతాయి. దీనికోసమా భగవంతుడు చెవుల నిచ్చింది? కనుక ఈ ఏడు లోకములను **ఈ ఏడు అవయవములను సక్రమముగా పవిత్రముగా ఉపయోగించినప్పుడు మరొక దివ్యత్వము. ఇంతకంటె మోక్షము కానరాదు.**

మనము సక్రమ మార్గమున పెట్టవలసినది ఈ ఏడు లోకములనే. మిగిలినవన్నీ దేహసంరక్షణార్థమై వచ్చి నవే. పై ఏడు లోకములను కాపాడే నిమిత్తమై క్రింది ఏడు లోకములేర్పడినవి. ఏమిటి ఈ ఏడులోకములు? **మొదటిది చేతులు, హస్తలోకములు రెండు. కడుపు మూడవలోకము. పెట్రోల్ టాంకువలె ఉంటుంది. దానిలో పదార్థములను వేసినప్పుడే. సర్వాంగములును క్షేమముగా పనులు చేస్తుంటాయి.** మనము సక్రమమైన పనులు చేయుటములేదుగాని పొట్టను మాత్రము నింపుకోవడం జరుగుచున్నది. పొట్టలో వేసిన పదార్థములుతో ప్రాణాన్ని సద్వినియోగము చేస్తున్నామా సత్కర్మలలో వినియోగిస్తున్నామా అనేది విచారించాలి. **తదుపరి మర్మ గ్రంధులు, తదుపరి రెండు కాళ్లు ఇవన్నీ చేర్చి ఏడు, ఇవన్నీ అధోలోకములు, వీటినే పాతాళలోకములు అందురు.**

అయితే ఈరెండూ అవసరమే. **ఊర్ధ్వలోకము యొక్క క్షేమము అధోలోకముపై ఆధారపడియుండినది. పాతాళలోకమే లేకపోతే, ఉత్తమలోకముండడానికి వీలు లేదు.** కానీ, రెండింటికీ సన్నిహితసంబంధమేర్పరచాలి. **సుఖమునుంచి సుఖములభించదు. కష్టమునుండే సుఖము లభిస్తుంది.**

(స.సా.సె.82 పు.195)

పన్నులు (Tax)

(చూ॥ కృతజ్ఞత)

పరబ్రహ్మము

"కుటిలాలక సంయుక్తం పూర్ణచంద్ర
నిభాననం విలసత్కుండల ధరం
సత్యం బ్రహ్మం జగద్గురుం"

పరమ భక్తి

సత్యమే ప్రాణము, సత్యమే తేజము, సత్యమే సర్వత్రా వ్యాపించిన బ్రహ్మము. అట్టి బ్రహ్మతత్త్వమును గుర్తించుటయే మానవత్వమునకు ప్రధాన లక్ష్యము. మానవుడనగా శరీరేంద్రియ మనో బుద్ధులతో కూడిన స్వరూపమని భావించడము అజ్ఞానమే. ఇవి మానవత్వానికి ఉపాధులేకాని, మరొకటి కాదు.

"రక్తము మాంసశల్యముల రాశియైన దేహము మీరు కాదు; సువ్యక్తముగాని కోరికల వ్యర్థ మనస్సులు మీరు కాదు; ముక్తికి భంగకారియగు మోహపు భావన కూడా మీరు కాదు; **మీ శక్తి ద్వారా మిమ్ము తెలుసుకోగలిగిన పరబ్రహ్మమే మీరు!"**

(స.సా.ఆ.93 పు.207)

(చూ॥ జ్యోతిశ్చరణాభిధానాత్)

పరమ భక్తి

పరమాత్మ ప్రేమను ధరణిలో జనులకు
ప్రవహింపజేయుటే పరమ భక్తి
ప్రతి మానవుండును బ్రతికి తా నుండుట
స్వార్థంబునకు కాదు సంఘ సేవ
చేయుటకే యన్న శ్రేష్ఠ భావంబుతో
మెలగుచుండిన మేలు కలుగు
మరచియు తను దాను మానవ సేవకు
అంకిత మొసగుటే ఆత్మ తృప్తి
నిష్కళంకపు ప్రేమను నిలిపి హృదిని
సకల జీవుల కువకృతి సలుపకున్న
పుట్టి ఫల మేమి నరుడుగా పుడమి యందు
ఇంతకన్నను వేరెద్ది యెరుక పరతు।

(ఆ.ప్ర.న.1992 పు.22)

పరమ రహస్యము

నేను **నా గోళ్లను** యెన్నిసార్లైననూ ఎట్లు ఖండించి వేయగలనో అట్లే **నా స్థూల శరీరమును లక్షలాదిసార్లు విడనాడగలను. కానీ నా సూక్ష్మ శరీరము నిలిచియే యుండును. ఇది మన భారతీయ పరమార్థ వాహిని తెలుపు పరమ రహస్యము.** ఇంకనూ విచారించిన **మానవుడనగా ఒక స్థూల శరీరము, ఒక సూక్ష్మ శరీరమును, ఒక జీవుడును కూడియుండు నొక ప్రాణి.** వేదాంత తత్త్వశాస్త్ర ప్రకారము **జీవుడు ఈశ్వరునివలె నిత్యుడు,** ప్రకృతి కూడా నిత్యమే కాని మార్పులొందుచు నిలచియుండును. ప్రకృతి మూలమగు ప్రాణాకాశ పదార్థము నిత్యమైనదే, కానీ అది సర్వదా వివిధ రూపములుగా మారుచుండును, **జీవాత్మ మాత్రము ఆకాశములో కానీ ప్రాణములోకానీ నిర్మింపబడినదికాదు. అది భౌతిక వస్తువే కాదు. కావున అది శాశ్వతము.**

(స.వా.పు.41/42)

పరమలక్ష్యం

కామితార్థంబు లెల్లను కల్పతరువు
వలెను దయచేయు **దేవుడు** కలడొకండు
దుర్లభంబగు నరజన్మ దొరకు కతన
అతని గాంచుటే **పరమలక్ష్యంబు** యిలను.

(షి.పు.1)

పరమహంస

(చూ॥ భగవంతుని చిత్ర విచిత్రములు)

పరమాత్మ/ పరమాత్ముడు

పరమాత్ముని మరచి ఆత్మ విశ్వాసమును కోల్పోయి పశువులవలె జ్ఞానహీనుడయి అనుభవించినంత వరకూ ఆ ఫలితమును స్మరించి తదుపరి దానికి కృతజ్ఞతేలేక క్రూరుడయి తిరుగమని సృష్టించలేదు. ప్రకృతి అంతయూ పరమాత్మ రూపముగా భావించి విశ్వసించి చక్కగా వినియోగించుకొమ్మని కూడా తెలిపెను. కానీ, ఇది నాది, అది నాది, నావారిది అని అహంకారముతో ప్రకృతిని వినియోగించుకొంటూ ప్రకృతియొక్క చట్టమును

ఉల్లంఘించి తన ఇచ్ఛానుసారముగా ప్రవర్తించు వారికి ప్రకృతే తగిన ప్రాయశ్చిత్తము చేయును. **పతనానికి దారితీయును.**

(గీ.పు.107)

రక్తము మాంసశల్యముల రాశియు దేహము మీరు కాదు. సువ్యక్తముకాని కోరికలు వ్యర్థమనస్సును మీరు కాదుగా. ముక్తికి బంధకారమగు మోహపు భ్రాంతియు మీరు కాదు. మీ శక్తిని మీరెరుంగ గల శాశ్వితుడౌ పరమాత్మ మీరె గా!

(ద.స.స.పు.1)

(చూ॥ ఆత్మ, ఆరుగుణములు, నేను, పరికరములు, పాము, బంధువు, సంపర్కము)

పరమాత్మునికథ

విద్యార్థులారా! **రామాయణమును మూడు విదములైన పేర్లతో వాల్మీకి ప్రచార ప్రబోధలు సల్పాడు. మొదటిది రామాయణం, రెండవది సీతాచరితము, మూడవది రావణవధ. "రామస్య ఆయనం రామాయణం". రాముని గురించి తెలిపేది భౌతికమైన రామాయణం. దీనిని అంతర్ముఖంగా విచారణ చేస్తే - ఇదే పరమాత్ముని కథ. రెండవది, "రామాయా:ఆయనం ఇతి రామాయణం", అనగా సీతాచరిత్రమును తెలుపునది రామాయణం. ఇది బాహ్యమైనది. అంతర్ముఖంగా విచారిస్తే - ఇది జీవాత్మ చరితము. ఇంక మూడవది రావణవధ. ఇది బాహ్యమైనది. అంతర్భావములో ఇది అజ్ఞాన నాశనము. ఏతావాతా రామాయణమనగా పరమాత్ముని కథ, సీతాచరితమనగా జీవాత్మకథ, రావణవధ అనగా అజ్ఞాన నాశనము. పరమాత్మ, జీవాత్మల తత్వములను చక్కగా గుర్తించినప్పుడే అజ్ఞానము నాశనమవుతుంది.** ర,అ,మ - ఈ మూడు అక్షరములలో ఉండిన అంతరార్థమేమిటి? ఒకటి సూర్య బీజము రెండవది చంద్ర బీజము, మూడవది అగ్ని బీజము. సూర్యబీజము అజ్ఞానాంధకారమును దూరం గావిస్తుంది. చంద్రబీజములోని తాపమును చల్లార్చు తుంది. హృదయానికి చల్లదనము చేకూర్చుతుంది. ఇంక అగ్ని బీజము పాపమును నాశనం చేస్తుంది.

(శ్రీ.భ.ఉ.పు.46)

పరమాత్మప్రేమ

(చూ॥ పరమ భక్తి)

పరమానందము

(చూ॥ ప్రేమనేర్పటంకోసం)

పరమార్థము

జీవితమునకు పరమార్థము ఆత్మ. ఇది సర్వత్రావున్నదన్న విషయము భారతీయులకు విదితమే. కొందరు వేదములు ఆధారముగాను, మరికొందరు శాస్త్రములను ఆధారముగాను, ఇంకా కొందరు యతీశ్వరుల అనుభవములను ఆధారముగానూ తీసికొని వారి వారి బుద్ధి కుశలతతో ఈ విషయమును ఋజువు పరచిరి. అనేకమంది మహనీయులు నర్వ్యాపకమైన ఆత్మాన్వేషణలో తమ శక్తి సామర్థ్యములను ఉపయోగించి ఆ దివ్యత్వాన్ని కనుగొనిరి. ప్రవక్తలు, శాస్త్రజ్ఞులు ఎవరెవరు యేయే సంకల్పములు చేసి దేనికొరకు ప్రయత్నించిరో వారు వారి సంకల్పమును సిద్ధి చేసికొని నట్లు భారతదేశమున యెన్నియో ప్రమాణములు కలవు. కోట్లమంది మానవులలో ఇట్టి ఆత్మ సందర్శనము యే కొంత మందికో లభించెను. **అట్టి పవిత్రప్రాప్తి మానవునిలోని బుద్ధి వివేకము పరాకాష్ట చెందినట్లు మిగిలిన జీవరాసులలో చెందలేదు. అందువలన సృష్టిలో మానవుడు ఉత్తముడనియూ మానవ జన్మ దుర్లభమైనదనియూ శాస్త్రములు చాటెను.** మానవుడు సృష్టి హేతువును వెదుకుటలో అధికారి. మానవుని శాంతిభద్రత కొరకు ఈ సృష్టిని వినియోగించుకొనుచున్నాడు. ఇది వేద ప్రమాణము.

పరము

వైదిక మతమునకు ఆధార భూతములగు **వేదముల ఈశ్వరవాణి రూపములైనవి. వేదముల ఆద్యంత రహితములని** హిందువుల సిద్ధాంతము. వేదములనగా గ్రంధములుకావు. అవి **వివిధ జిజ్ఞాసువులచే వివిధ కాలములందు కనిపెట్టబడిన పరమార్థ ధర్మ సూత్రములు.** ఇవి మానవులు ఎరుగక పూర్వము యెట్లు ప్రవర్తిల్లు చుండెనో మానవులు వాటిని మరచిన తరువాత కూడాను అట్లే ప్రవర్తించు చుండును.

అట్లే **పరమార్థ లోక ధర్మములు కూడా శాశ్వతములు.** ఈ రహస్యమును కనుగొన్నవారు ఋషులు. ఈ ఋషులు కనుగొన్న ధర్మములకు అంతము లేక పోయిననూ అది ఉండి తీరవలయునుకదా అని కొందరు తలంచవచ్చును. సృష్టి ఆద్యంత రహితమని వేద సిద్ధాంతము. విశ్వశక్తి యొక్క సమిష్టి పరిణామము యెప్పుడును సుస్థిరమై హెచ్చు తగ్గులు లేక నిలిచి యుండును. **సృష్టియూ, సృష్టికర్తయూ రెండు సమానరేఖలు. అవి ఆద్యంత రహితములై సుస్థిరమగు సమదూరమునే సాగుచున్నవి. భగవంతుడు నిత్య కార్యశీలుడు, అతని శక్తి అవ్యక్తము.**

(స.వా.పు.1/2)

తన్ను తాను తెలిసి కొనడమే **పరమార్థము. పురుషార్థము.** దేహభ్రాంతి కలవారు బాలుడా? వృద్ధుడా? పురుషుడా? స్త్రీయా? అని విచారణ చేయుదురు. ఇట్టి దేహభ్రాంతిని వదలి బ్రహ్మ భావము రావాలి. ఇదికాదు **చివరకు బ్రహ్మమే తాను అని తెలిసికోవాలి.** దానికే "నేతి, నేతి ఇది ఆత్మ" అని శ్రుతులు చెప్పుచున్నవి. జీవ స్వరూపము ఆత్మ యొక్క ప్రతి బింబమే. జీవి నిజముగా అమృత స్వరూపుడు. ఈ సత్యము శ్రీ శంకరాచార్యులు ముచ్చటగామూడు పదాలతో లోకానికి ఉపదేశించారు. **"బ్రహ్మసత్యం, జగన్మిథ్య జీవో బ్రహ్మై వ నాపరా"** అవి అదే ముఖ్యమైన ఆధ్యాత్మిక ప్రభోధ. జీవుడు బ్రహ్మ గనే యున్నాడు. రెండింటికిని అవినాభావ సంబంధము. బ్రహ్మతత్వముతో కూడిన మానవత్వము హీనము కాదు. అల్పముకాదు. అపవిత్రము కాదు.

(సా॥పు.313)

పరము

పరలోకమనగా మనకు కనిపించని లోకం.

స్థితికాని స్థితి పరం. **పరం అనగా రాక పోకలు లేనిస్థితి. అంతే కాదు ఏమీలేని స్థితి పరం అని చెప్పారు. అనగా ఎలాంటి స్థితి లేనిదానిని పరం అన్నారు.** ఇట్టి పరతత్వముతో కూడినట్టిదే **పూర్ణత్వము** (పరలోకము) పూర్ణత్వమునకు ఆది అంత్యములు లేవు. అటువంటిదే పరలోకము. ఆది మధ్యాంతములు ఉండవు. పరబ్రహ్మ, పరంజ్యోతి, పరమేశ్వరుడు, పరంధాముడు, పరవిద్య (బ్రహ్మవిద్య) పరాభక్తి, పరమసత్యము, పరమపదార్థము, ప్రేమ మొదలగునవి. ఇది పరమార్థస్థితిని తెలుపుతాయి.

(సా.పు.528)

పరమేష్ఠి

(చూ॥ సమిష్ఠి)

పరవిద్య

(చూ॥ ముండకోపనిషత్)

పరశురాముడు

(చూ॥ శకునములు)

పరాభక్తి

భక్తి అనగా దృశ్యకల్పితమైన జగత్తునందు సృష్టించబడిన పదార్థముల ప్రయోజనము. దీనికి ఉదాహరణము మనము చేసే పూజలు. బాహ్య సంబంధమైన పుష్పములు తెచ్చి భగవంతుణ్ణి పూజిస్తున్నాము. ఈపుష్పములు యెక్కడి నుండి వచ్చినవి? మీరు సృష్టించినవా లేక మరేవిధంగానైనా కల్పితము చేసినవా? కాదు కాదు. ఇవి భగవత్సృష్టికి సంబంధించిన పుష్పములు. భగవంతునిచే సృష్టింపబడిన పుష్పములు, నీవు తెచ్చి భగవంతునికి అర్పితము చేయుటలో విశేషమేమిటున్నది? **భగవంతునిచే**

సృష్టింపబడిన పదార్థముల చేత భగవంతుణ్ణి ఆరాధన చేసే ప్రక్రియలను సాధారణమైన భక్తిగా నిరూపిస్తూ వచ్చింది గీత. నీ ప్రయత్నము ద్వారా నీ హృదయబృందావనము నందు సత్‌శీలసదాచారములైన గుణములను అభివృద్ధి గావించి పోషించి అట్టి పుష్పములచేత భగవంతుని ఆరాధన చేసే ప్రక్రియనే పరాభక్తి అన్నారు.

(శ్రీ.గీ.పు.59)

పరికరములు

పరమాత్మ ఆరాధన కుపయోగకరమైన ప్రధాన పరికరములు మూడున్నవి. ఆ పరికరములను భక్తుడు ముఖ్యముగా సాధించవలెను.

రాగద్వేషములతో దూషితము కానట్టి చిత్తము.
అసత్యాదులతో దూషితము కానట్టి వాక్కు.
హింసాదులతో దూషితము కానట్టి కాయము.

(ఆ.పు.35)

(చూ॥ ఆరాధన)

పరిజ్ఞానము

కేవలం **శాస్త్ర పరిజ్ఞానం మాత్రమే ప్రధానం కాదు. నేటి పుస్తక పరిజ్ఞానం, రేపు విజ్ఞానం, మరునాడు అజ్ఞానం.** పుస్తకాన్ని మస్తకాన్ని ఏకం చేయరాదు. మస్తకంలో పెట్టుకున్న పవిత్ర భావాలను ఆచరణలో పెట్టాలి. అయితే ఈనాడు చాలమంది పుస్తకంలోని విషయాలను మస్తకంలో పెట్టుకొని గడగడా వల్లెవేస్తున్నారు. కంఠస్తం చేయడమే పండిత లక్షణ మనుకుంటున్నారు. **అర్థంలేని చదువు వ్యర్థం. ఆచరణలో పెట్టని విజ్ఞానం ఉన్నా ప్రయోజనం లేదు. భజించిన అన్నం జీర్ణమై సర్వాంగములకు చేరినప్పుడే దేహం పుష్టిగా ఉంటుంది.** ఎవరో వ్రాసిన దానిని కంఠస్తం చేసి, జీర్ణం చేసుకోవటానికి ప్రయత్నించడం **మననం చేసిన** దానిని భుజించడం వంటిది. **అది శునక లక్షణం, మానవ లక్షణం కాదు.** కనుక పుస్తకాలలోని విషయాలను కేవలం **గ్రుడ్డిగా కంఠస్తంమాత్రమే చేయక, మొదట చక్కగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి.** అర్థం చేసుకొనిన దానిని కొంతవరకైనా అనుభవానికి తెచ్చుకోవాలి.అదే సరియైన చదువు. నదులకు ఆనకట్టలు కట్టి, నిలువచేసిన నీటిని కాలువల ద్వారా ప్రవహింపజేసి పంటలు పండిస్తున్నట్లుగా, **గ్రంథాలలోని జ్ఞానాన్ని అవగాహన చేసుకొని చేతులద్వారా సమాజానికి పంచటం నేర్చుకోవాలి.**

(శ్రీ.జూ.97పు.28)

పరిణామములు

ఎన్ని పరిణామములున్నా మానసిక పరిణామము లేనిది ఇవన్నీ నిరుపయోగములే. నైతిక పరిణామానికి సాంఘిక పరిణామ మత్యవసరము. సాంఘిక పరిణామానికి ఆధ్యాత్మిక పరిణామ మత్యవసరము. ఆధ్యాత్మిక పరిణామమే లేకున్న సాంఘిక పరిణామము మానవ ద్రోహముగా పరిణమిస్తుంది. సాంఘిక నైతిక పరిణామములకు ఆధ్యాత్మిక పరిణామమే మూలాధారము. ఈనాడు నైతిక వైజ్ఞానిక పరిణామములను పరస్పర విరుద్ధములుగా భావిస్తున్నారు. కేవలం వైజ్ఞానిక పరిణామంలో మానవ జీవితము కృత్రిమంగా రూపొందుతుంది. ఆందుచేతనే నేడు మానవునిలో అసూయ, దురాశ, స్వార్థము, ఆడంబరము, అహంకారములనే పైశాచిక ప్రవృత్తులు ప్రళయతాండవం చేస్తున్నాయి. మానవుడు కేవలం స్వార్థ ప్రయోజనముల నిమిత్తమే జగత్తు నాశిస్తున్నాడు గాని, జగత్తు నిమిత్తం జగత్తు నాశించడం లేదు. కాని, ఈ స్వార్థ స్వప్రయోజన భావములను భస్మం చేసుకొన్న నాడే జగత్తు మానవత్వములకు అభివృద్ధి.

(ఆ.ప్ర.న/డి.1992 పు.26)

పరిధి

"నాపరిధి లోనికి నా సంకల్పములేక ఎవ్వరూరాలేరు. నా పరిధిలోనికి వచ్చిన వారెంతగా ప్రయత్నించినా, నా సంకల్పములేక అందుండి వెలుపలకు పోలేరు".

(శ్రీ.స.లీ.పు.17)

పరిపాలనకు అర్హుడుకాడు

ఒకనాటిరాత్రి పానీయమున గ్రోలగోరి నిద్రించు రాణులను నిద్రాభంగముచేయ మనసొప్పక కూజాలోని నీరును ఒక చిన్న గిన్నెలో పోసుకొని త్రాగు సమయమున **తన చేతివ్రేళ్ళు పట్టుతప్పుట, హస్తము కొంత అదురుట గమనించి దశరథుడు తనకు వార్ధక్యము వచ్చిన దనియును, నరముల పటుత్వము తప్పినమీదట రాజ్యపాలన చేయకూడదనియు, ఇంద్రియనిగ్రహములేని పరిపాలన ప్రజాక్షేమమునకు విరుద్ధము కాగలదనియు, అట్టి పరిపాలనచే రాజ్యము అస్తవ్యస్తమై కడకు పతనమునకు దారితీయుననియు నిర్ణయము చేసికొనెను.** అంగపటుత్వము తప్పినరాజు పరిపాలనకు అర్హుడు కాడు. **వార్ధక్యము ప్రవేశించిన ప్రభువునకు పరిపాలనా కాంక్ష ఉండుట మహాప్రమాదము. అది దురాశ కాగలదు.** ఇన్ని తెలిసియుండియు నేను తిరిగి అందులో ప్రవేశించుటచే నా కర్తవ్యమును తప్పినవాడ నగుదును. అని దశరథుడు వసిష్టులవారితో అనెను.

(రా.వా.మొ.పు.163/165)

పరిపూర్ణ ఆరాధన

భగవంతుడు పరిపూర్ణమైన ప్రేమస్వరూపుడు. అట్టి పరిపూర్ణమైన ప్రేమస్వరూపుణ్ణి తృప్తి పర్చాలంటే పరిపూర్ణమైన ప్రేమతో ఆరాధించాలి. "కేశవాయ నమః నారాయణాయ నమః మాధవాయనమః..." అని ఊరికే నిమిషానికి పది నామాలు ఉచ్చరించినంత మాత్రాన సరిపోదు. హృదయ పూర్వకంగా పరిపూర్ణమైన ప్రేమచేత ఒక్క నామము చెప్పినా చాలు. **భగవంతుడు మీ భావమునే చూస్తాడుగాని, మీరెన్ని నామాలు చెప్పారనేది చూడడు. మీరు ఏది చేసినా భగవంతునికి పరిపూర్ణమైన అర్పితం చేయాలి. అంతో ఇంతో 'పార్ట్‌టైం' అర్పితం చేయకూడదు.** పరిపూర్ణమైన హృదయంతో చేయాలి, పరిపూర్ణమైన ప్రేమతో చేయాలి. పరిపూర్ణమైన కర్మల నాచరించాలి. ఇటలీ దేశంల ఆంథోనీ అనే వ్యక్తి ఉండేవాడు. అతడు వయోలిన్‌లను తయారు చేసి వాటిని అమ్ముకొని జీవించేవాడు. అయితే, ఒక్క వయోలిన్‌ను తయారు చేయడానికి అతనికి ఒక సంవత్సరం పట్టేది. ఒకనాడు అతని మిత్రులు "ఓ పిచ్చివాడా! ఎందుకీవిధంగా కాలమునంతా వ్యర్థం చేసుకుంటున్నావు? ఒక్క వయోలిన్ తయారు చేయడానికి నీవు ఒక సంవత్సరం తీసుకుంటే నీ జీవితం గడిచేదెలా?" అని మందలించారు. ఆంథోనీ "మిత్రులారా! దైవము పరిపూర్ణ స్వరూపుడు. అట్టి పరిపూర్ణుడైన పరమాత్మునికి పరిపూర్ణమైన తృప్తి కలిగేటట్లు నేను పని చేయాలి. లేకపోతే నా పని పూర్తిగా వ్యర్థమే" అన్నాడు. పరి పూర్ణుడైన దైవానికి చేసే అర్పితం కూడా పరిపూర్ణ మైనదిగానే ఉండాలి. ఈ సత్యాన్ని ఆంథోనీ గుర్తించాడు. కనుకనే, **అతడు కాలమును వ్యర్థం చేస్తున్నానని భావించలేదు. కాలమును సార్థకం చేస్తున్నానని ఆనందించేవాడు.** మీరు ఆంథోనీ వయోలిన్‌లను గురించి వినే ఉంటారు. అవి చాల ప్రసిద్ధి చెందాయి. ఎందుకంటే, అతడు పవిత్ర హృదయంతో, పరిపూర్ణమైన భక్తివిశ్వాసాలతో వాటిని తయారు చేసేవాడు.

(స.సా.న.99పు.301/302)

పరిపూర్ణత

మానవుడు పరిపూర్ణుడు కావాలంటే ఒక చిన్న ఉదాహరణము ఒక విత్తనము మనము భూమిలో నాటుతున్నాము. విత్తనము నుండి చిన్నగా రెండు ఆకులతో మొక్క బయలుదేరుతుంది. ఇది క్రమక్రమేణా కొమ్మలతో రెమ్మలతో పాటు రూపొందుతుంది. తదుపరి ఆవృక్షము మనకు ఫలములు అందిస్తుంది. ఇదే విత్తనము యొక్క పరిపూర్ణత్వము. కాబట్టి మానవత్వమనేది ఒక విత్తనమువంటిది. దానిని అనేక రకములుగా మనము సంస్కరించినప్పుడు, అదే ఒక విశాలమైన ప్రేమతత్వము గా కొమ్మలు రెమ్మలుగా రూపొందుతుంది. తదుపరి శాంతిభద్రతలనే ఫలాన్ని, యీ వృక్షము అందిస్తుంది. **అదియే మానవుని యొక్క పరిపూర్ణత.**

(బృ.త్ర.పు.9)

పరిపూర్ణపరబ్రహ్మతత్త్వము

మన కంటికి కనుపించేది, మనతనువును మరిపించేది, మనసును మురిపించేది, మనమనుగడ వెలియించేది ఈ భౌతిక ప్రపంచము. ఈ పార్థివమైన ప్రపంచములోనే అపార్థివమైన పరమార్థమున్నది. ఈ రెండూ ఒకే అఖండ చైతన్యంలోని అవిచ్ఛిన్నమైన అంశాలు. దేనికదే పరిపూర్ణము. ఒకదానికొకటి పరిపూరకం. పరి పూర్ణమైన పరబ్రహ్మతత్త్వము నుంచే పరిపూరకమైన జీవతత్త్వం ఉదయించింది. జీవతత్త్వమునుండి శరీరము విడిపోయిన తరువాత శేషించినపుడే నిరంతర చైతన్యముకూడా పరిపూర్ణమైన పరబ్రహ్మతత్త్వమే.

"పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతేః"

ఈ ప్రపంచము పరమేశ్వరుని లీలావిలాసముతప్ప మరేమీ కాదనే పరమసత్యాన్ని ప్రబోధిస్తుంది విద్య.

(వి.వా.పు.3/4)

పరిపూర్ణ మానవుడు

విచ్చలవిడిగ పరుగెత్తునటువంటి జ్ఞానేంద్రియము లను అరికట్టుము. వ్యాధి కారణము తొలగుచున్నది. మనసు, దాని చేష్టలను గమనింపుము. ఆలోచనలను పిచ్చి ప్రవాహమును అడ్డగించుము. ఆలోచన అలజడి తగ్గుటకు నామమును ఉచ్చరించుము. దానివలన మనసునందు దుఃఖ బాధలకు చోటుండదు. మనసు పావనము కాగా జ్ఞానోత్పత్తి కలుగును. **అతడే పరిపూర్ణ మానవుడు.**

(ధ.పు.21)

(చూ॥ తలంపులు)

పరిపూర్ణుడు

(చూ॥ అంధోని, బ్రహ్మానుభవ ఉపనిషత్తు)

పరిమితి (limit)

ఈనాటి మానవుడు అర్థము, అధికారము రెండిటినిమిత్తమై ప్రాకులాడుతున్నాడు. అయితే ఈ రెండు ఉండవలసినవే. కాని **వీటికి కొంత పరిమితి ఉండాలి.** జగత్తును సస్యశ్యామలముగావించే సముద్రుడైనా తన పరిమితులను మీరితే అపకీర్తి పాలౌతాడు. దేహానికి, మనస్సుకు పుష్టిని, సంతుష్టిని అందించే ఆహారము కూడా అమితంగా భుజిస్తే అజీర్ణవ్యాధిని కలిగిస్తుంది. అంతేకాదు. మనం వేసుకునే తాంబూలమునకు ప్రధానమైనది సున్నము. కాని దానినైనా అధికంగా ఉపయోగిస్తే నాలుక పొక్కిపోతుంది. కనుక దేనినైనా పరిమితంగా ఉపయోగించుకోవాలి. **దృశ్యకల్పితమైన ఈ జగత్తులో ప్రతిదానికి ఒక పరిమితి ఉన్నది కాని, ప్రేమకు మాత్రం పరిమితిలేదు.**

(స.సా.1996 డి.పు.310)

(చూ॥ లిమిటెడ్ కంపెనీ)

పరివర్తనలు

ఈనాడు ప్రధానంగా **మూడు విధములైన పరివర్తనలు జరగాలి. మొట్టమొదట ఆధ్యాత్మిక పరివర్తన, తరువాత సాంఘిక పరివర్తన, తదుపరి వ్యక్తి యొక్క పరివర్తన.** ఆధ్యాత్మిక పరివర్తన జరిగినప్పుడు సహజంగానే సంఘంలో పవిత్రమైన పరివర్తన జరుగుతుంది. సంఘం సుక్షేమంగా వెలుగుతున్నప్పుడు వ్యక్తి యొక్క స్వభావం కూడా సహజంగా మారుతుంది. ఈ మూడింటి పరివర్తన చేకూర్చడమే సాయి ఆశయం. SAI (సాయి)అనే పదంలో S- అనగా Spiritual change (ఆధ్యాత్మిక పరివర్తన): A అనగా Associational Change (సాంఘిక పరివర్తన); I అనగా Individual Change (వ్యక్తి యొక్క పరివర్తన) ఇదే సాయి ఆశయము. ఇట్టి పరివర్తన జరిగినప్పుడు ప్రపంచమంతా సుక్షేమంగా ఉంటుంది. ఈ మూడింటి యందు ఉన్న ఏకత్వమే ప్రేమతత్వము. దానిని మనము అనుభవించాలి.

(శ్రీ.భ.ఉ.పు.184)

పరిశీలన

ప్రతి విషయంలోను మానవుడు అనుభవించుటకు ముందు చక్కగా విచారణ (Enquiry) సలిపి, పరిశీలన (Investigation) చేయాలి.

పరిశీలన జరిపినపుడే పరిశోధన (Research) కూడా లభ్యమవుతుంది. పరిశోధనల ఫలితాలను వినియోగించుకోవటానికి వివేకము ఉండాలి. అయితే ఈనాడు విజ్ఞానశాస్త్రరంగంలో వివేకాన్ని విస్మరిస్తున్నారు. విషయ పరిశోధనా ఫలితాన్ని వినియోగించుకోవటానికి వివేక మంత అవసరం. పరిశోధన, పరిశీలనల యందు సమత్వముండాలి. ఈనాడు పరిశోధన అధికంగానే సాగుతున్నదిగాని, పరిశీలన మాత్రం సలుపటం లేదు. **ప్రతి విషయాన్ని మొదట చక్కగా విచారణ సలిపి, తరువాత శ్రద్ధగా పరిశీలన చేసి పరిశోధన చేయాలి. పరిశోధన ద్వారా లభ్యమైన విజ్ఞానాన్ని వివేకంతో ప్రపంచాభివృద్ధికి వినియోగించాలి.** అయితే ఈనాడు వివేకం లోపించింది. వివేకం లేని విజ్ఞానం వలన దేశానికి ప్రమాదం.

(శ్రీ.జూ.97 పు.47)

పరిశుద్ధము

భగవంతుడు **దేహమనే పాత్రను కర్మక్షేత్రమైన జగత్తుకు పంపించేడు. లోకకళ్యాణం నిమిత్తమై ఈ పాత్రను తెచ్చుకొని దానిని చెడగొట్టి దేవునికివ్వడము ఎంత అధమస్థితో ఆలోచించండి.**

వచ్చే సమయంలో పాత్ర ఎంతో నిర్మలంగా నిశ్చలంగా నిరపరాధిగా ఉంటుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలతో చిల్లు పడకుండా వచ్చింది. యీ పాత్ర. దానిని తెచ్చుకొని, దీనికి **కామమనే ఒక చిల్లు, క్రోధమనే ఒకచిల్లు, ద్వేషమనే ఒక చిల్లు, ఇన్ని చిల్లులు కొట్టి, తిరిగి ఈ పాత్రను పరమాత్మకు అర్పిస్తే ఇదిసరియైన మర్యాదా?** శ్రీమంతుల ఇంటి నుండి వండుకోడానికి మనము పాత్రలను తెచ్చుకుంటాము. ఈ పాత్రలను తిరిగి ఏ స్థితిలో యజమానికి అందిస్తాము? తెచ్చుకున్న పాత్రలను చెడగొట్టి అందించేవాడు అధముడు. తెచ్చుకున్న పాత్రను వినియోగించి, దానిని పరిశుద్ధము చేసి అందించేవాడు మధ్యముడు. అట్లుకాక వినియోగించిన, పాత్రలను చక్కగా తోమి కళాయి వేయించి **పరిశుద్ధముచేసి** యిచ్చేవాడు ఉత్తముడు.

కనుక ఆధ్యాత్మికమనే కళాయి దీనికి వేసి తద్వారా దీనిని **పరిశుద్ధము చేసి,** అయ్యా! స్వామీ! మీరిచ్చిన పాత్రను ఏ ద్వేషమూ అసూయ అహంకారం అనే చిల్లులు పడకుండా పరిశుద్ధంగా దీనిని మీకు అందిస్తున్నాను'' **అని జీవితము దైవార్పితం గావించేవాడు ఉత్తముడు.''**

హృదయం ఒక పాత్ర, హృదయం **పరిశుద్ధముగా** లేకున్న చేసిన సర్వకర్మలూ వ్యర్థమైపోతాయి. చిత్త శుద్ధిని సాధించే నిమిత్తమై కర్మలు ఆచరించాలి. **''చిత్తస్య శుద్ధయే కర్మ:''** మనం చేసే ప్రతికర్మ చిత్తశుద్ధికి హేతువు కావాలి. చిత్తశుద్ధికై చేసిన కర్మలన్నీ పవిత్రమైనవిగా ఉండాలి. **మన చూపు పవిత్రంగా ఉండాలి. మన శ్రవణం పవిత్రంగా ఉండాలి. మన వాక్కు పవిత్రమైనదిగా ఉండాలి. మన నడత పవిత్రమైనదిగా ఉండాలి. మన తలుపు పవిత్రంగా ఉండాలి. ఈ పంచేంద్రియముల పవిత్రతనే పరమాత్మ స్వరూపం అన్నారు.**

(త.శ.మ.పు.51/52)

పరిశోధన

(చూ॥ పరిశీలన)

పరిశోధనావ్యాసములు

''పదార్థమును గురించిన శాస్త్రములవలెనే ఆత్మను గురించిన శాస్త్రము కూడా ఒకటున్నది. దానిలో కూడా కొన్ని శాఖలు, ఒక విధానము, కొందరు నిపుణులు, కొన్ని అధికారికమైన పరిశోధనా వ్యాసములు ఉన్నవి.''

(ధై.మ.పు.194)

పరీక్ష

(చూ॥ లక్ష్మణుడు)

పరీక్షించు

పరమాత్ముడు అనేక విధముల బాలుని పరీక్షించి కడకు తన ప్రయత్నములు ఫలించక పోవుటచే, "ఈ బాలుడు సామాన్యుడుకాడు నా పరీక్షకు కూడనూ లొంగక నెగ్గినవాడు. కనుక పరీక్షితుడను నామము ఈ బాలునకు సార్థకము కాగలదు" అని కృష్ణపరమాత్మ చెప్పినతోడనే, పండితులు ఆశీర్వాదములు చేసిరి.

వ్యాసులవారు "ధర్మజా! బాలుడు ఉత్తర గర్భమందుండగ అశ్వత్థామ వేసిన అస్త్రము, ఆ బాలుని సమీపించగా, పరమాత్ముడు పిండమందే ప్రవేశించి బాలుని రక్షించెను; ఆనాడు గర్భమున తనతోపాటు వుండి తనను హతమార్చవచ్చిన అస్త్రమును దునుమార్చిన ఆ పురుషుడు యెవరాయని, ఆనాడు గర్భములో చూచిన దివ్య కాంతులుగల రూపుడు లోకమున యెక్కడున్నాడని ఆనాటి నుండియూ ఆ కాంతి గల వ్యక్తులను కన్నువార్చక చూచుచుండెను. నేడు ఆ దివ్య స్వరూపుడు ప్రత్యక్షమగుట తోడనే గుర్తించి చెంత చేరెను. ఇదే బాలుని చేష్టలయందలి **మర్మము"**అని వ్యాసుడు తెలిపిన తోడనే ఆనంద భాష్పములు రాల్చుచూ యుధిష్ఠిరుడు మహా దానందముతో **"పర మాత్ముడు కరుణానిధి"** అని నమస్కరించెను.

(భా.వా.పు.20/21)

పరీక్షిత్

(చూ॥ పరీక్షించు)

పరీక్షిత్ ప్రార్థన

మహారాజు పరీక్షిత్ చేతులు జోడించుకొని "మునిశ్రేష్ఠులారా, నాకొక సందేహము కలదు. దానిని తీర్చి నన్ను ధన్యుని గావింపు" డని కోరెను. అది యేదియో తెలుపమని ముని కోరగ, "మృత్యువాసన్నమైనవాడు యే కర్మ చేయవలనో తెలుపుడు." అని ప్రార్థించెను. అందుకు వక ముని లేచి, కాల వ్యవధియే యుండిన, యజ్ఞ, యాగ, తప, ధ్యాన, వ్రత, తీర్థ, దాన పూజార్చాదులు చేయు చుండుట మంచిదని తెలిపెను. మరొకరు **'జ్ఞానా దేవతుకైవల్య'** మనిరి, మరికొందరు **'కర్మణ్యైవహి సంసిద్ధిః'** అనిరి. యింకా కొందరు **'భక్తి వశః పురుషః'** అనిరి.

(భా.వా. పు. 154/155)

పరీక్షిత్ మహారాజు (దిగంబర యువక ముని కుమారుడు మహాతేజోమయుడు దివ్యకాంతులతో నున్న శుకునకు) మోకరిల్లి, "ప్రభూ! మరణాసన్నమై, చావబోవుచున్నానని తెలిసికొన్నవాడు చేయవలసిన కార్యమేమి? చింతించ వలసిన చింతన యేమి? **మరణమునకు తరువాత జననము కాకుండా వుండుటకు** ఆసమయమున యెట్టి పద్ధతులను అవలభించవలెనో శెలవివ్వవలెను. ఇవి నన్ను ప్రస్తుతము వేధించుచున్న బాధలు. ఇప్పుడు పరమ పురుషార్థమేదియో కృపతో తెలుపమని పదే పదే ప్రార్థించెను." శుక మహర్షి, **"రాజా! నీవు ప్రాపంచక విషయములనుండి చిత్తమును తొలగించి మనస్సును జగన్మోహనుడైన శ్రీహరి యందు నిలుపుము. నేను భాగవతత్వమును చెప్పెదను. హృదయపూర్వకముగ శ్రవణము చేయుము. ఇంతకంటే పవిత్రకర్మ, ఇంతకంటే పవిత్ర చింతన, ఇంతకంటే గొప్ప తపశ్శక్తి వేరొండు లేదు. నర తనువే ధృడమైన నావ, శ్రీహరి కథనే చక్కని చుక్కాని, సంసారమే భవసాగరము, నారాయణుడే సరియైన నావికుడు. ఈనాడు ఈ పవిత్ర సామగ్రి నీకు సంప్రాప్తమయి నీ సమీపమునకే వచ్చినవి. నీ వడిగిన ప్రశ్న లోక హితార్థమైనదే గానీ, వక వ్యక్తితో మాత్రమే చేరినదికాదు. విచారణ చేయవలసిన ప్రశ్నలన్నింటిలోనూ సర్వ శ్రేష్ఠమైనది ఆత్మతత్వము. సమస్త ప్రాణికోటికీ, అంత్యకాలము పరమ సత్యము. అది తప్పునది కాదు. అట్టి ధృడమైన సమయమున యెట్టి పురుషార్థము**

పరుగు జీవితము

చేపట్టవలెనో అది ప్రతి ప్రాణికి కూడనూ ప్రధానమైన చుట్టము. దాని ననునరించియే పునర్జన్మము కలుగుచుండును. కాన నీవడిగిన ప్రశ్న, నీకు కలిగిన సంశయము, లోకకళ్యాణ కార్యమే కానీ నీ నిమిత్తము మాత్రమే కాదు! వినుము".

(భా.వా. పు. 157/158)

పరుగు జీవితము

పరుగు జీవితములే పరిపాటి కలిలోన
పరుగు లిడక యున్న పనులు చెడును
బస్సులకై పరుగు బైస్కోపులకు పరుగు
పరుగు విడక యున్న పనులు చెడును
ఆర్థికమునకు పరుగు ఆఫీసులకు పరుగు
పరుగులిడక యున్న పనులు చెడును
పదవులకై పరుగు పగదీర్చుకొన పరుగు
పరుగు విడకయున్న పనులు చెడును
పరుగు విడరెవ్వ రీనాడు భక్తితో
అఖిల సౌఖ్యమ్ము లిడెడనధ్యాత్మమునకు?
ఇంతకన్న వేరెద్ది యెరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

(స.సా.వా.పు. 102)

పరోక్షము

(చూ॥ ఆలయము)

పరోక్షజ్ఞానము

(చూ॥ జ్ఞానము)

పరోపకారము

పరోపకారాయ ఫలంతి వృక్షాः పరోపకారాయ వహంతి నద్యः
పరోపకారాయ దుహంతి గావः పరోపకారార్థమిదం శరీరం.
వృక్షాలు ఫలాలను, నదులు జలాలను, గోవులు క్షీరాన్ని అందిస్తున్నాయి. పరోపకారమనే ప్రకృతిధర్మానికి తన శరీరమును అంకితం చేసి మానవుడు తన జన్మను సార్థకం చేసుకోవాలి.

(ప్రే.బం.పు.21)

కోటివిద్యలను నేర్చినను, త్యాగబుద్ధి ఒక్కటి లేకున్న, నేర్చిన విద్యలన్నియూ నిష్ప్రయోజనము. **పరోపకారబుద్ధి విద్యలో ప్రధానమాత్రము. పరోపకారబుద్ధి శ్రేష్ఠమైన విద్య. ఇతరులకు ఉపకారముచేయునపుడు,** స్వార్థమును సంకుచిత భావము మనస్సున యేమాత్రమూ వుండరాదు. అంతేకాదు, ఉపకారభావముతో ప్రతిఫలమును ఆశించరాదు. యెట్టి ఫలాపేక్ష లేక పరోపకారమను ప్రధానయజ్ఞమును దృష్టియందుంచుకొన వలెను.

(వి.వా.పు.67)

(చూ॥ అవతారము, నరజన్మ)

పర్తీశుడు

ఏగుణంబు గణించి ఏ తెంచెనోనాడు
ప్రహ్లాదు పాలింప పరమ పురుషు
డేగుణంబు గణజంచి ఏ తెంచెనోనాడు
వేదకు చేలుబ్రోవ వేద చరితు
డే గుణంబు గణించి ఏతెంచెనో నాడు
కరిని గాచెడు తటి కమలనయను
డే గుణంబు గణించి ఏతెంచెనో నాడు
ధ్రువకుమారుని సాక వైకుంఠవాసు
డా గుణంబు గణించి ఈ అమర వంద్యు
డార్తజననాథుడీనాడు అవతరించె
శ్రీనివాసుండు లోకైక చిన్మయుండు
వెల్గె పర్తీశుడు పృథివి యందు

(యు.అ.సా.పు. 115)

పర్వదినము/పర్వదినములు

భగవత్తత్త్వానికి ప్రాధన్యత ఇచ్చినదే పర్వదినం. మీ ఇంటికి పాత తోరణాలు తీసి కొత్తతోరణాలు కట్టినట్లుగా, పాత

వస్త్రాలను త్యజించి నూతన వస్త్రాలను ధరించినట్లుగా, మీరు **పాత, రోత గుణాలను త్యజించి పవిత్రమైన నూతన గుణాలను అలవర్చుకోవాలి.**

(స.సా.న.99.పు.289)

ఈనాటి పర్వదినములను కేవలము పర్వదినములుగా భావించి ఆనందించుచున్నారు. కానీ పర్వదినముల యొక్క అంతరార్థము గానీ, పర్వదినముల యొక్క గంభీరమైన పవిత్రతను గానీ భారతీయులు కూడను ఈనాడు గుర్తించడం లేదు. మనం Holyday(పర్వదినం) కూడా Holiday(సెలవుదినం)గా గడపుతున్నాం. నిజానికి "హాలిడే" (సెలవుదినాలు)లు కూడా మనం "హోలిడే" (పవిత్రదినాలు)గ మార్పు చేసుకోవాలి.

మన పవిత్ర భారతదేశమునందు అన్ని పర్వదినములూ పండగలూ పరమాత్మని పురస్కరించుకొనియే ఏర్పడును. వాటిని ప్రజలు ఆచరించే క్రియలు, కర్మలు, పద్ధతులు అన్ని చాలా అర్థవంతముగనే ఉన్నవి. గృహములను పరిశుభ్రపరచుట ద్వారములకు పచ్చతోరణములుకట్టుట, నూతన దుస్తులతో అలంకరించుకొనుట, మాధుర్యాన్ని ఆరగించుట బంధుమిత్రులను ఆహ్వానించి ఆనందించుట మొదలగు సంప్రదాయములలో అంతరార్థములెన్నో ఉన్నవి.

పాతరోత భావాలను తిరస్కరించి, క్రొత్త దనము ఏర్పడి, ఆనంద జీవితమునకు ఉత్తేజమిచ్చి సుఖసంతోషాలకు స్వాగతము అందించేది వీటి అంతరార్థము. ఉత్తమ భావనలు ఆదర్శచర్యలు, స్నేహపూర్ణసఖ్య స్వభావములు, వీటిని అభివృద్ధి పరచుటయే పర్వదినముల యొక్క ఉద్దేశ్యము, లక్ష్యము. కాని ఈనాడు ప్రజలు పాయస, పరమాన్నములతోనే ఆహార విహారముల తోనే, ఆడంబర ఆరాట ములతోనే. పర్వదినములను అంత్యముగావించు దురభ్యాసమునకు లోనగుటవలన వారు ఎన్నో దురవస్థలకు గురి అగుచున్నారు.

(సా.ముందుమాట)

(చూ॥ వినాయకచవితి, పండుగలు, పల్లెసీమలసేవ)

పర్వియనులు

పర్వియనుల యొక్క ప్రాచీనమతమైన జోరాష్ట్రియను మతమును స్థాపించిన వారు జోరాష్టరు. ఆయన బోధలలో అగ్నిదేవుడు కేంద్రస్థానములో ఉంటాడు. భగవంతుని యొక్క **ఈ చరాచర సృష్టిలో ప్రతివస్తువు కూడా చివరకు అగ్నికి ఆహుతై భస్మమవుతుంది. అలాగే మానవ శరీరము కూడా, దీనికి తిరుగులేదు. ప్రాపంచికమైన కోర్కెలను ఆధ్యాత్మిక జ్ఞానమనే అగ్నిలో దగ్ధము చేసి బూడిద చేయవలెనని దీని యొక్క అంతరార్థము. నిషిద్ధమైన ఆలోచనలను, కోరికలను దగ్ధం చేసి భస్మము చేసే నిమిత్తమై నిరంతరము మన హృదయాలలో ఆ పవిత్రాగ్ని వెలుగుతూ ఉండాలని** ఆయన బోధిస్తూ వచ్చారు. మనలో నిరంతరం వెలుగొందే ఆ పవిత్రాగ్ని యొక్క వెలుగు కిరణాలు మనలోను, మనచుట్టూను ప్రసరించి, ఆ కాంతి అంతటా నిండి పోవాలి.

(దై.మ. పు. 36)

పలుకులు

"పలుకులే మహారుచికరములు...!!
పలుకులే పరిమళ పూతలు..!!
పలుకులే మధుర మకరంద ఇక్షురస ద్రాక్షాపానకాలు..!!
పలుకులే నాల్గు వేదాలు..! పలుకులే శ్రుతి స్మృతి గీతాలు..!!
నీ పలుకులే స్వర్గ నరక మోక్ష ద్వార బంధనాలు..!!"

(స.సా.జ.93పు.9)

పల్లెసీమల సేవ

మన భారతదేశంలో 56400 కుగ్రామాలున్నాయి. ఈ పల్లెల పరిస్థితి చాలా విచారకరంగా దయనీయంగా ఉంది. పల్లెలలో ఉండే సోదర మానవులను ఆదుకొని తమస్థాయికి తీసుక రావటానికి పట్టణవాసులు సమాజ సేవా కార్యక్రమాలలో నిమగ్నులు కావాలె. ఈనాడేది చేసినా ఏది తలచినా స్వార్థంతోనే. వ్యర్థులమై పోతున్నాము.

పల్లెసీమల సేవ

ఇక పరార్థము గుర్తించేది ఎప్పుడు? అనేక ఆశలు పెట్టుకొని మోసపోతున్నాము. వేదిక లెక్కి ఉపన్యాసాలు చేస్తున్నాము. కాని చెప్పినది చేయటంలేదే. "చెప్పవచ్చు కోటి; చేయరు ఒక్కటి"అందుకే **"ఉత్తిష్ట జాగ్రత ప్రాప్య వరాన్ని బోధత"** అన్నది ఉపనిషత్తు. వేదికలెక్కి సోదరీ సోదరులారా అంటున్నాము. అందరం సోదరుల మనుకుంటున్నాము. కాని **నిజమైన సోదరులే ఆస్తులకోసం పోరాడుతూ సుప్రీంకోర్టుల వరకు పోతున్నారు. కనుక వట్టి మాటలుగా సోదరులమనుకోవటం కంటే అంతకంటే మిన్నయైన ఆత్మభావం పెంచుకోవాలి. దైవ పితృత్వమూ మానవ సోదరత్వమూ అప్పుడే సార్థకమౌతవి.**

ఈనాడు పవిత్రమైన ఉగాది దినం. విందుభోజనాలు చేయటం కొత్తబట్టలు కట్టుకోవటంతో సరిపోదు నూతనసంవత్సరం. నూతనోద్యమం ప్రారంభించండి. పల్లెటూరి వారు అనేక బాధలు పడుతున్నారు. వాళ్లకు సరియైన వైద్య విద్యా సౌకర్యాలు లేవు. త్రాగడానికి మంచినీళ్లు లేవు. మరుగుదొడ్లు లేవు. తినడానికి తిండిలేదు. వాళ్ళకు **ఈ సౌకర్యాలు కల్పించే సేవ చేసి దానిద్వారా దైవత్వాన్ని చూడండి.** ఈనాడు శ్రమపడేవాడు కావాలె. వట్టిమాటలు చెప్పేవాడుకాదు. మనది భరతభూమి, కర్మభూమి, శ్రమపడటమేకర్మ. అప్పుడే ఇది కర్మభూమి ఔతుంది. భగవద్రతి కలిగినదే భరతభూమి. కనుక శ్రమించి పల్లెసీమల వారిని ముందుకు తీసుకవచ్చి భగవద్రతిని పొందండి. **ఈనాడుమన బ్రతుకులు దారేషణ ధనేషణ పుత్రేషణ అనే ఈషణ త్రయంతో మలినమై పోయినవి. ధనం మానవుని మత్తుని ఉన్నత్తుని చేస్తుంది. ధనం అవసరమే, కాని దానికి ఒక హద్దు ఉండాలి. మితిమీరిన ధనం మతిహానిచేస్తుంది. ధనం సంపాదించటం కంటే సంపాదించిన దానిని ఖర్చుపెట్టడం కష్టం. మిగిలిన ధనాన్ని దాచటం మరీకష్టం.** ఈ కష్టాలలో కొన్ని సుఖాలు లేకపోలేదు. కనుక **ఈ ధనాన్ని పల్లెసీమల వారికి దీనులకు వెచ్చించి సద్వినియోగం చేయండి. ధన మూలం మిదం జగత్ కాదు. ధర్మమూలం మిదం జగత్.** ధనం పెరిగితే పశువుకు కొమ్ములు పెరిగినట్లు అశాంతి. ధనం వెంట దుఃఖం కూడా పెరుగుతుంది. ధనమున్న వానిని ఒకవైపు ప్రభుత్వము మరొకవైపు బంధువులు ఇంకొకవైపు దొంగలు బాధిస్తారు. ధనమున్నవాడు పడే బాధదైవానికి తెలుసు. **పుత్రులకోసం ధనం ప్రోగుచేసిన వారు పుత్రుల మూలంగానే బాధలు పడుతున్నారు. కనుక దానధర్మాలు చేసి మీ ధనమును సార్థకం చేసి కొనండి.** సత్యసాయి సంస్థలవారు ప్రతి పల్లె తిరిగి ఆ పల్లెటూరివారి జీవితాలను బాగుచేయాలి. **సత్యసాయి సంస్థలవారికి ఇదొక క్రొత్త ఉద్యమము.** నేను ప్రతి పల్లెకు వస్తాను. ప్రభుత్వం ఏమేమో అంటుంది. దానితో ప్రమేయంలేకుండా కుల మత జాతి వర్గ విచక్షణ లేకుండా సత్యసాయిసంస్థలు ఈనాటి నుండి పల్లెసీమల నుద్ధరించే కార్యక్రమాలు చేపట్టి ప్రతి గ్రామం వెళ్ళి వారికి విద్యా వైద్య సౌకర్యాలు కల్పించవలెనని కోరుచున్నాను. ధ్యాన తపములు స్వార్థానికే ఉపయోగపడుతాయి కాని త్యాగముచేత లోక కల్యాణం జరుగుతుంది. **"త్యాగే నైకే అమృతత్వ మానశుః' ' అని త్యాగమును అందుకు ఉపనిషత్తులు మోక్షకారణముగా చెప్పినవి. కాన ఈనాటి నుండి సత్యసాయి సంస్థలవారు త్యాగం ప్రదర్శించి పల్లెలవారికి అనుకూలాలు కల్పించవలెనని కోరుతున్నాను.** అంతో ఇంతో నీతి నిజాయితి ఇప్పటికీ పల్లెలలో మిగిలిఉన్నది. పట్టణాల్లోలేదు. కనుక డబ్బుగల వారంతా ఈ పల్లెటూరి వారిని అభివృద్ధి పరుస్తారని ఆశిస్తున్నాను.

పర్వదిన మంటే పాత తోరణాలు తీసివేసి కొత్త వైన పచ్చతోరణాలు కట్టుకొనటంకాదు. పాత దుస్తులు తీసివేసి కొత్తబట్టలు కట్టుకొనుటంకాదు. ఇంతమాత్రం చాలదు. పాతభావాలు తీసివేసి కొత్తభావాలను ప్రోగు చేయండి. **చేదు తీపి కలిపిన ఉగాది పచ్చడి కష్టసుఖముల సమత్వానికి చిహ్నం. పల్లెసీమల సేవ చేయడానికి చిన్నప్పటి నుండి పిల్లలకు, విద్యార్థులకు తరిఫీదు ఇవ్వాలి. మన దేశంలో ఈనాడు 255000మందిపిల్లలున్నారు. వీళ్ళల్లో 40 శాతం బిచ్చమెత్తుకుంటున్నారు. ఇట్టి కష్ట పరిస్థితుల్లో మనం**

ఊరకుండటం మంచిది కాదు. జప సాధనలు కట్టిపెట్టి మానవసేవే మాధవ సేవ అనే భావంతో త్యాగంతో శ్రమతో వాళ్ళను ఉద్ధరించవలె. మీరంతా రాజకీయ కుల మత భేదాల కతీతంగా పవిత్రమైన భావనతో మీమీ శక్త్యనుసారం వీరికి సేవ చేయటమే ఈ నూతన సంవత్సర దీక్షగా పూనండి. ప్రతి సంవత్సరానికి స్వాగతమే. ప్రతి సంవత్సరానికి వీడ్కోలే. దుఃఖానికి సుఖానికి ఆత్మ విశ్వాసమే రక్ష. అది లేకపోతే మానవత్వం. క్షీణిస్తుంది. ఈ భావంతో సేవ చేస్తే మన దేశం ఇతర దేశాలకు ఆదర్శవంతంగా ఉంటుంది. మేము భారతీయులం అని చెప్పుకుంటాముగాని భారతీయ సంస్కృతిని ఏమి పోషిస్తున్నాము? ఆధ్యాత్మికాభివృద్ధికి ఆత్మవిశ్వాసమే ముఖ్యం. కనుక **పల్లెల సేవే దైవ సేవగా భావిస్తారని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.**

(స.సా.ఆ.79పు.191/192)

పవరు హౌసు

మీయింట్లో కరెంటు వేసి దీపాలు వెలిగించాలంటే, పవరు హౌసు నుండి మీయింటిదాకా అక్కడక్కడా స్తంభాలు పాతి, తీగలను వేసి, మీయింటికి కనెక్షను ఇవ్వాలి. అలాగే భగవంతుని అనుగ్రహము పొందాలంటే ప్రతిరోజూ నియమిత వేళలలో సాధన చేసి నామస్మరణ అనే తీగల ద్వారా భగవంతునితో అనుసంధానము చేసుకో. నామస్మరణ ఉత్తమోత్తమమైన సాధన. నామస్మరణ చేస్తున్నప్పుడు ప్రతి నామము వెనుకగల భగవంతుని వైభవమును గుర్తు చేసుకో.''

(దై.పు.327)

పవిత్ర ఆదర్శము

హనుమంతుడు రామలక్ష్మణులను సుగ్రీవునకి పరిచయం చేశాడు. సీత అపహరింపబడిన సంగతి తెలిపాడు. అప్పుడు సుగ్రీవునకి కొన్ని రోజుల క్రిందట వానరులు తమకు దొరికిందని తెలుపుతూ ఏదో ఒక నగల మూటను తెచ్చి ఇచ్చినట్లుగా గుర్తుకు వచ్చింది. తక్షణమే ఆ మూటను తెప్పించి రామలక్ష్మణుల ముందు ఉంచాడు. రాముడు, ''లక్ష్మణా! ఈ నగలు సీతవేనేమో చూడు'' అన్నాడు. లక్ష్మణుడు చూశాడు. కన్నీటి ధారలు కార్చాడు.

''నాహం జానామి కేయూరే
నాహం జానామి కుండలే
నూపురే త్వభిజానామి
నిత్యం పాదాంభివందనాత్

''అన్నా ఈ కంకణములు, కుండలములు ఎవరివో చెప్పలేను. కాని, ఈ కాలి అందెలు మాత్రం సీతమ్మ వారివే'' అన్నాడు. రాముడు. ''ఇది మాత్రం నీకెలా తెలుసు?'' అని అడిగాడు. ''అన్నా! ప్రతి ఉదయము ఆ తల్లికి పాదాభివందనము చేయటం నాకు అలవాటు. కనుక, కాలి అందెలను మాత్రం నేను ఎరుగుదును'' అన్నాడు. చూశారా! సీతారామలక్ష్మణులు 13 సంవత్సరములు అరణ్యంలో కలసి జీవించినప్పటికీ లక్ష్మణుడు ఒక్కనాడైనా సీత ముఖం చూసి ఎరుగడు. ఆమె పాదములనే చూస్తూ ఉండేవాడు. లక్ష్మణుని ఇట్టి పవిత్ర ఆదర్శాన్ని విద్యార్థులు చక్కగా గమనించాలి.

(శ్రీ.భ.ఉ.పు. 74)

పవిత్రత

(చూ॥ తెల్లని వస్త్రాలు, దివ్యప్రకటనలు, పాపము, రామలక్ష్మణులు)

పవిత్రము

(చూ॥ పరిశుద్ధము, ప్రసన్నుడు)

పవిత్రమైన ప్రదేశము - కేరళ

(చూ॥ విశ్వామిత్రుడు)

పశుబలము

(చూ॥ ధర్మబలము)

పశువు

పశువు

కాలం ప్రచండ మారుతం వలె కదలి పోతున్నది. జీవిత ప్రమాణం మంచుగడ్డ వలె కరిగిపోతున్నది. కర్తవ్యాన్ని గుర్తించకమునుపే కాయమును వదిలి పోతున్నారు. ఇంక మానవుడై పుట్టినందుకు ఫలితమేమి?

ఆహార నిద్రా భయ మైథునాని
సామాన్యమే తత్పశుభి ర్నరాణాం
జ్ఞానం నరాణా మధికం విశేషః
జ్ఞానేన శూన్యః పశుభి స్సమానః

ముఖ్యంగా జ్ఞానమే లేకపోతే పశువుతో సమానము. విద్యార్థులైన మీరు ఆదర్శవంతమైన జీవితాన్ని అనుభవించాలి. మీరే భవిష్యత్తుకు నాయకులు. కనుక మీ భావములను సున్నిత ముగను, పవిత్రముగను, నిర్మలముగను నిస్వార్థముగను తీర్చి దిద్దుకోవాలి. ఈవిధమైన దివ్య సంస్కృతిని ఆచరించి ఆనందించి అందించడానికి ప్రయత్నించాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

(స.సా.జ.87 పు.24)

అనేక దోషములు చేయటము I am human అనటం ఎంత పొరపాటు! ఎంత పాపము! **I am a human being కాబట్టి తప్పులు చేయటము నాస్వభావము అని సమర్థించు కుంటున్నాడు. నీవు మానవుడైనందుకు తప్పులు చేయకూడదు. పశువైతే తప్పులు చేసినా ఫరవాలేదు.** అది దీని ప్రవర్తన. నీవు మనిషివై తప్పులు చేయకూడదు. **పశువుగా ప్రవర్తించటము ఎంత విరుద్ధము! కనుక నీవు మనిషిగా ప్రవర్తించు.**

(బృ.త్ర.పు.51/52)

(చూ॥ విద్య)

పశ్చాత్తాపము

(చూ॥ ప్రేమ, ప్రేమకుమూడు మెట్లు, సంప్రదాయము)

పసుపుకుంకుమలు

పూర్వం అడవారు ఇంటి ద్వారములకు పసుపురాసి, కుంకుమ పెట్టేవారు. వీటిలో ఉన్న 'యాంటిసెప్టిక్' శక్తి క్రిములను ఇంటి లోనికి రానీయకుండా నాశనము చేస్తుంది. కాని, ఈనాడు "ఆ పసుపు ఎందుకు రాయాలి? పసుపుపచ్చనిరంగువేస్తే చాలదా?" అని భావిస్తున్నారు. ఈ రంగులో అలంకారమున్నది గాని, క్రిములను నాశనంచేసే శక్తి లేదు. కనుక **పూర్వీకులు ప్రతి చిన్న విషయము నందు ఒక పవిత్రమైన ఉపయోగాన్ని అనుసరిస్తూ వచ్చారు.**

ఇంతేగాకుండా, పూర్వం మన భారతీయ స్త్రీలు శరీరానికి 'పసుపు' రాసుకునేవారు. కుంకుమ పెట్టుకొనేవారు. ఈ విధముగా చేయుట చేత, వారి ముఖము సువర్ణమయంగా రూపొందేది. ముఖముపై ఏమాత్రము వెంట్రుకలుండేవి కావు. అంతేగాక, పసుపు కుంకుమల యందున్న 'క్రిమిసంహారిక శక్తి' క్రిములను నోట్లోకిగాని, ముక్కులోనికి గాని ప్రవేశించనీయకుండా కాపాడుతుంది. ఈనాడు 'ఫేసుపౌడరు' వాడుకలోనికి రావడం చేత పసుపును ఎవ్వరూ ఉపయోగించుట లేదు. **కనుకనే 'ఇస్నోఫీలియా', 'ఆస్తమా' మొదలగు వ్యాధులకు గురియౌతున్నారు. ఆనాటి ప్రజలు ఆరోగ్యము, ఆనందము- వీటినే తమ జీవిత లక్ష్యంగా భావించారు.** ఆరోగ్యముగా ఉన్నప్పుడే ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. ఈ విధంగా పరిశీలిస్తే, **భారతీయ సంస్కృతి యందు నిత్యజీవితంలో చేసే ప్రతి కార్యంలో ఏదో ఒక పవిత్రమైన అంతరార్థము గోచరిస్తుంది.**

(స.సా.అ.91.పు.262)

పాంచభౌతికము

దేహము పాంచభౌతికము
దేహము కూలుట తప్పదెప్పటికి
దేహి నిరామయుండు
తొణికింపగ దేహికి చావు పుట్టుకలు
మోహనిబంధ బంధనలు ముద్రలు లేవు.
నిజముగ చూడ ఆ దేహియే దేవదేవుడు
మదిని గమనింపగ ఆత్మరూపుడై ఉన్నాడు.

పాంచభౌతికము దుర్భలమైన కాయంబు
ఎప్పుడో విడిచేది ఎరుకలేదు
శత వర్షముల దాక మితము చెప్పిరిగాని
నమ్మరాదామాట నెమ్మనమున
బాల్యమందో, లేక ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
ఊరనో, యడవినో, ఉదక మధ్యముననో
ఎప్పుడో విడిచేది ఏ క్షణంలో
మరణమే నిశ్చయము, బుద్ధిమంతుడైన
దేహమున్నంతలో తెలియవలయు.

(శ్రీ.భ.ఉ.పు. 3/4)

(చూ॥ కాయము, చదువు, విద్య)

పాండవులు

(చూ॥ పంచపాండవులు, సత్యం)

పాజిటివ్

(చూ॥ నామంచికే)

పాజిటివ్/నెగిటివ్

కేవలం విద్య నేర్చినంత మాత్రాన మిమ్మల్ని సమాజం గౌరవించదు. **విద్యతోపాటు సంస్కారం కూడా అత్యవసరం. విద్య - నెగెటివ్, సంస్కారం - పాజిటివ్.** కరెంటు ప్రసరించడానికి పాజిటివ్, నెగెటివ్ రెండూ అవసరం కదా! అదేరీతిగా, **విద్యకు సంస్కారం తోడైనప్పుడే మీరు ఉన్నత స్థితిని చేరుకోగలరు. విద్య కేవలం 'ఇన్ఫర్మేషన్' (విషయపరిజ్ఞానము) ను అందిస్తుంది; సంస్కారం 'ట్రాన్స్‌ఫర్మేషన్'(హృదయపరివర్తన) ను చేకూర్చుతుంది.** సంస్కారంలేని విద్య నీరులేని పైరు వంటిది, కరెంటులేని వైరువంటిది. దీపములేని ఇల్లువంటిది, పంతులులేని బడివంటిది, దేవుడు లేని గుడివంటిది.

(ఆ.భా.పు.2)

పాఠం

(చూ॥ ప్రకృతి, సముద్రుడు)

పాఠశాల

(చూ॥ ప్రకృతి)

పాతస్నేహితుడు

ఒకానొక సమయంలో త్యాగరాజు రామ విగ్రహమును కోల్పోయి చాల బాధలను గురియైనాడు. అన్ని వైపుల వెతికాడు. కానీ, ఎక్కడా రామ విగ్రహం కనిపించలేదు. అప్పుడు తనలో తాను అనుకున్నాడు- **"అయ్యో, ముందు వెనుక యిరుప్రక్కల ఉన్న భగవంతుడు లేడని అనుకోవటం నాతప్పు కదా! భగవంతుడు నా వెంటనే ఉన్నాడు; నా జంటనే ఉన్నాడు; నీ హృదయమందే ఉంటున్నాడు. నా నుండి ఎప్పుడూ దూరంగా లేడు".** అతనిలో ఒక్కతూరి విశ్వాసం వచ్చేసింది. తక్షణమే కావేరీ నదికి పోయి స్నానం చేశాడు. కాలికి ఏదో గ్రుచ్చుక్కున్నట్లయింది. ఏమిటిదని చూస్తే రామ విగ్రహం!

రారా మా ఇంటిదాకా
రఘువీర సుకుమార నే మ్రొక్కద
రా రా మా ఇంటిదాకా
రా రా దశరథ కుమారా నన్నేలుకోరా నే తాళలేరా
రారా మాయింటి దాకా

దిక్కు నీవనుచు తెలిసె నన్ను బ్రోవ గ్రక్కునను రారా

"నిన్నే నమ్ముకున్నాను. రా రా మా యింటిదాకా" అని పాత స్నేహితుణ్ణి పిలిచినట్లు పిల్చాడు. క్రొత్త స్నేహితుడు ఎవరైనా మన ఇంటికి వస్తే "రండి దయచేయండి" అని కుర్చీ వేస్తాం. అవన్నీ పైపై మర్యాదలేగాని, హృదయంలో అతనికి స్థానం లేదు. క్రొత్త స్నేహితుణ్ణి పదములలో మాత్రమే గౌరవిస్తాముగాని, అతనితో సన్నిహిత సంబంధం ఉండదు. కానీ, **పాత స్నేహితునితో హృదయ సంబంధముంటుంది.** కనుకనే రారా, పోరా అంటాం. త్యాగరాజుకు రామునితో అట్టి సన్నిహిత సంబంధం

పాదము/పాదములు

అధికంగా ఉండటంచేత "రారా మా యింటిదాకా.." అని ఎంతో స్నేహంగా ఎంతో స్వేచ్ఛగా, ఎంతో పవిత్రంగా, ఎంతో ఆర్తిగా పిలిచాడు. పాత స్నేహితునితో స్వేచ్ఛగా సంచరించవచ్చును. పాత స్నేహితుడు గౌరవ మర్యాదలను ఏమాత్రము ఆశించడు. కనుక, **భగవంతుణ్ణి మీ పాత స్నేహితునిగా భావించాలి; అనేక జన్మల నుండి మీ వెంట వచ్చేవానిగా విశ్వసించాలి. భగవంతుడు అన్ని జన్మలలోను మీ జంట యింట వెంట ఉండి కంటికి రెప్పవలె చూచుకుంటాడు.** ఆ హక్కును మీరు కోరాలి. అదియే నిజమైన భక్తుని తత్త్వం. భక్తులు భయం, భయంగా ఉంటే ప్రయోజనం లేదు, పరిపూర్ణ స్వేచ్ఛతో ఉండాలి. దివ్యత్వాన్ని పొందాలనుకుంటే, మీయందున్న ప్రకాశ తత్త్వమును మీరు చూడాలనుకుంటే నిజమైన హక్కుతో ఆ దైవత్వాన్ని ప్రార్థించాలి. **ప్రేమచేతనే, స్వేచ్ఛచేతనే దైవాన్ని పట్టాలి. భయభక్తులతో ఉండినంత వరకు దైవం లభ్యంకాడు. పాపభీతి ఉండాలిగాని, దైవభీతి ఉండకూడదు. భగవంతునిపై ప్రేమ ఉండాలి. అప్పుడే మీకు భగవంతుడు ప్రాప్తిస్తాడు.**

(సా.శు.పు.59/61)

(చూ॥ అంగహీనుడు)

పాదము/పాదములు

మానవుడు ప్రపంచంలో జీవించుటకు ప్రధాన ఆధారం పాదములే. మానవ శరీర మంతయు పాదములపై ఆధారపడి ఉంటున్నది. "బ్రాహ్మణోస్యముఖమాసీత్ బాహూరాజన్యకృతః..." అన్నది వేదం. దృష్టి శ్రవణము, వాసన, వాక్కు, స్పర్శ - ఇవన్నీ ముఖమునందు మాత్రమే ఉంటున్నాయి. కనుకనే దీనికి బ్రాహ్మణుడని పేరు పెట్టారు. ఈ దేహమును రక్షించే నిమిత్తమై ఏర్పడిన బాహువులకు క్షత్రియులని పేరు పెట్టారు. ఇంక, ఉదరము తనలో ప్రవేశించిన పదార్థములను జీర్ణింపజేసి సర్వాంగములకు సప్లై చేస్తున్నది. కనుకనే, దీనికి వైశ్యుడని పేరు పెట్టారు. ఈ మూడింటిని ఆధారంగా చేసుకొని జీవితం గడపటానికి పాదములే ప్రధానమని నిర్ణయించి వాటిని శూద్రులని అన్నారు. ఇలాంటి యథార్థమును గుర్తించడానికి ప్రయత్నించక ఈనాటి మానవులందరూ బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులను ప్రత్యేక తెగలుగా భావిస్తున్నారు. ఇది పొరపాటు. ఒక్కొక్క అంగమునందు ఒక్కొక్క దివ్యమైన భావాన్ని నిరూపిస్తూ వచ్చింది వేదము. అన్నీ దేహంలో ఏకంగా ఉంటున్నవే! **ముఖము, భుజములు, ఉదరము-ఈ మూడింటినీ కాపాడే పాదములే శూద్రులు. కాని, శూద్రత్వ మనగా కేవలం పనికి మాలినదని మనం భావిస్తున్నాము. కాదు, కాదు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు (ముఖము, బాహువులు, ఉదరము) శూద్రుల పైననే (పాదముల పైననే) ఆధారపడి ఉంటున్నారు.**

అన్నింటికంటే ప్రధానమైనది, ప్రమాణమైనది పాదము. పల్లెల్లో ఏదైనా పోట్లాట జరిగినప్పుడు న్యాయనిరూపణ చేసే సమయంలో "తప్పు చేశావు. వాని పాదాలపై పడు, క్షమిస్తాడు" అంటారు. అనగా, **దోషాన్ని క్షమింపజేసేది పాదము.** మన కన్ను ముఖముపైన ఉంటున్నది; పాదము క్రింద ఉంటున్నది. అయితే మనం బజార్లో నడుస్తున్నప్పుడు కన్ను ముల్లును చూసిన తక్షణమే కాలు దానిని దాటుకుంటుంది. కన్నేమైనా వచ్చి కాలుకు చెప్పిందా? లేదే! ఇదే అంతర్ సంబంధము. అంతేకాదు **కాలికి ముల్లు గ్రుచ్చుకుంటే కన్ను ఏడుస్తుంది.** చూడండి వీటికి ఎంత అంతర్‌సంబంధ మున్నదో! అసలు దీని అర్థమేమిటి? శూద్రుని కేమైనా కష్టం కలిగితే **బ్రాహ్మణుడు చాలా బాధపడాలి. కాని, ఈనాడు అలా జరగటంలేదు. "వాడి బాధవాడే అనుభవించుకోనీ, అది వాడి కర్మ"** అని ఊరికే ఉంటాం. ఇది సరియైన సంబంధము కాదు. అంతర్‌సంబంధమైన ఆత్మతత్త్వాన్ని ఏకంగా భావించాలి. అప్పుడే జగత్తు నిత్యకల్యాణం పచ్చతోరణంగా ఉంటుంది. ఈనాడు మనం ఎవరినైతే బ్రాహ్మణులని, క్షత్రియులని, వైశ్యులని, శూద్రులని భావిస్తున్నామో వారందరూ మన దేశంలోని వివిధ అంగముల వంటివారే! కాని, వీటిని

మనం వేర్వేరు కులములుగాను, మతములుగాను భావించుకొని పోతున్నాము. ఇవి కులమతములకు సంబంధించినవి కావు; మన మతికి సంబంధించినవి. **"మతులు మంచివైన మతమేది చెడ్డది?"** కనుక, మతములో ఏ దోషమూ లేదు; మతిలోనే దోషమున్నది.

(స.సా.ఆ.95.పు.212/213)

ఒకసారి విష్ణుమూర్తి వామనావతారము ధరించి, బలిచక్రవర్తిని ఉద్ధరించే నిమిత్తమై వచ్చి, బలిచక్రవర్తిని మూడడుగుల నేలను దానము కోరినాడు. **బలిచక్రవర్తి విష్ణుమూర్తికి మూడడుగుల నేలను దానం చేసినాడు. ఒక పాదముచేత భూలోకమును, రెండవపాదము చేత ఆకాశమును విష్ణుమూర్తి ఆక్రమించుకొన్నాడు. ఇటువంటి విష్ణుమూర్తి విశాలత్వం, దివ్యత్వమును, పవిత్రతను, విశ్వవిరాట్ స్వరూపమును గుర్తించుకొన్న బ్రహ్మ, ఆ శ్రీ మహావిష్ణువు పాదపద్మములను కడగాలని ఆశించినాడు,** పాదాలు కడగాలంటే నీరు కావాలి. ఆ నీరును తెచ్చే నిమిత్తమై బ్రహ్మ మనస్సులో సంకల్పించుకొన్నాడు. అప్పుడే ఒక వ్యక్తి క్రిందికి దిగివచ్చినాడు. బ్రహ్మ సంకల్పముచేత ఆవిర్భవించినవాడు కనుకనే, అతనికి 'బ్రహ్మమానసపుత్రుడని' పేరు కల్గినది. అతను వచ్చినది దేనికోసము? **నీరు తెచ్చే నిమిత్తమై ఆవిర్భవించినాడు. నీరును తెచ్చి ఇచ్చినవాడు కనుకనే, అతనికి 'నారద' అని పేరు వచ్చినది. నార-అనగా నీరు. ద-అనగా ఇచ్చినవాడు, 'నారద'అనగా నీరును తెచ్చి ఇచ్చినవాడు అని అర్థం.**

(స.సా. అ.90పు.259/260)

(చూ॥ కృష్ణుడు, భక్తుడు)

పాదములనాశ్రయించు

ద్వాపర యుగమందు వ్రేపల్లెలో ఒకనాడు గోపికలు యశోద దగ్గరకు వెళ్ళి, "అమ్మా! నీ కుమారుడు మా ఇండ్లలో ప్రవేశించి పాలుపెరుగు తినుటమే కాకుండా కుండలను పగులగొడుతున్నాడు" అని ఫిర్యాదు చేసారు. కాని, యశోద నమ్మలేదు. "కృష్ణుడు మా ఇంటియందే ఉంటున్నాడు. మా ఇంట్లో పెరుగుపాల కేమీ తక్కువ లేదు. మీరు కావాలని కృష్ణునిపై ఈవిధమైన ఫిర్యాదు చేస్తున్నారు. నేను నమ్మను" అని అన్నది. ఇంక లాభం లేదని గోపికలంతా ఒక సమావేశం పెట్టుకున్నారు. కృష్ణుడు మళ్ళీ వాళ్ళ ఇండ్లలో ప్రవేశించినప్పుడు ఒక్కతూరి అతనిని పట్టి కట్టివేసి యశోదకు తెచ్చి చూపాలని తీర్మానించు కొన్నారు. **కృష్ణుడు కూడా తాను గోపికల చేతికి చిక్కాలని సంకల్పించుకున్నాడు. దీనికోసం ఒక ఉపాయం పన్నాడు. ఒక గోపిక ఇంటికి వెళ్ళి పాలను క్రిందపోసాడు. ఆ పాలలో తన పాదములను చక్కగా తడుపుకొన్నాడు. గోపికలు తనను పట్టుకోవాలని వచ్చే సమయానికి పరుగెత్తి పోయాడు. గోపికలు చూసారు. కృష్ణుడు ఎక్కడా కనిపించ లేదుకాని, పాలలో తడిసిన కృష్ణుని పాదముల ముద్రలు కనిపించాయి. వాటిని ఆధారంగా చేసుకొని వెళ్ళినప్పుడు వారు కృష్ణుని పట్టగలిగారు. కృష్ణుని పట్టడానికి ఈ పాదముద్రలే కారణమైనాయి. అనగా, భగవంతుని మనం స్వాధీనం చేసుకోవాలనుకుంటే, భగవంతుని అనుగ్రహానికి మనం పాత్రులం కావాలనుకుంటే పాదములను ఆశ్రయించాలి.** ఈ విధమైన అంతరార్థమును గోపికలకు బోధించే నిమిత్తమై కృష్ణుడు ఈ నాటక మాడాడు. పాదములందున్న పవిత్రత, దివ్యశక్తి అనుభవజ్ఞులకు మాత్రమే అర్థమవుతుందిగాని, కేవలం శ్రవణం చేసినవారికి అర్థంకాదు. దివ్యమైన ఆత్మతత్త్వమును గుర్తించవలెనన్న భగవంతుని పాదముల నాశ్రయించాలి. **బ్రహ్మ కడిగిన పాదమని, లక్ష్మి వత్తిన పాదమని** - ఇట్లు అనేకవిధాలుగా మన పురాణములు పాదముల ప్రాధాన్యతను నిరూపిస్తూ వచ్చాయి. **రాముడు తన తమ్మునికి ఇచ్చినవి పాదుకలే.** భరతుడు ఏలలేదు రాజ్యాన్ని, రామపాదుకలే ఏలుతూ వచ్చాయి. కనుక, పాదములలో ఇన్ని శక్తి సామర్థ్యములు ఇమిడి యుంటున్నాయి.

(స.సా.ఆ.95 పు.212)

పాదసేవనము

(చూ॥ ఆనందము)

పాదుకలు

రామప్రభువు కటాక్షించి తన పాదుకలను తీసి భరతున కిచ్చెను. సాదరముగ భరతుడు, పవిత్ర పాదుకలను తన హస్తములతో తీసుకొని శిరస్సుపై ధరించెను. రెండు నేత్రములనుండి గంగాయమునలవలే ఆనందజలము ప్రవాహముగా కారదొడగెను. భరతుని నోటమాట రాలేకపోయెను. **ఇవి కరుణాసముద్రుడు ధరించిన పాదుకలు కావు. సకలజనుల ప్రాణములు రక్షించు రక్షలు,** భరతుని స్నేహరత్నమును కాపాడునట్టి సంపుటము, రఘుకులమును రక్షించు రెండు కవాటములు. ఇవి సుకర్మలు చేయునట్టి రెండు హస్తములు. ఇవే లోకనేత్రములు. ఈ రెండు పాదుకలు మనవెంట వచ్చు సీతారాముల చిహ్నములు, అని వర్ణించుచూ గంతులు వేయుచున్న భరతుని ఆనందమును యెవ్వరున్ను వర్ణింపలేకపోయిరి.

(రా.వా.మొ.పు.358)

పానీయము (Wine)

ఇది మొదట చాల సుఖముగానే కనుపించవచ్చు, కాని పోతూ పోతూ ఎక్కడ దిగుతుంది?

First the man drinks the wine
Second the wine drinks the wine
Third the wine drinks the man.

తాను తీసుకుంటున్నానని భ్రమిస్తున్నాడు. కాదు కాదు. అదే తనను తీసుకుంటున్నది. శాంతిని గోరి ఈ విధమైన పెడమార్గమును బట్టి జీవితమును భ్రష్ట పట్టించుకుంటున్నారు. **నిజమైన శాంతి సుఖములు అనుభవించాలనుకుంటే సమాజములో ప్రవేశించు. సేవచేయి. దీనులను దిక్కులేనివారిని పోషించు.** దానిలోనీ శక్తి కూడను అభివృద్ధి అవుతుంది. మానసిక శాంతి లభిస్తుంది. నీవు చేసిన పని మంచిదని నీ కాన్షన్స్ తృప్తి పడుతుంది.

(బృ.త్ర.పు.116)

పాపకృత్యము

తనలోని తప్పులను, పరులలోని మంచిని వెదుకుట ఉత్తమ చిత్తము. పరుల దోషములను వెదుకుట పాపకృత్యము.

(ఆ.శా. పు. 3)

పాపపుణ్యములు

(చూ॥ ఆధ్యాత్మిక మయము)

పాపభీతి

పాపభీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దాని బట్టి
మానవత్వ మణగె మానవులందున
విశ్వశాంతి కిదియె విప్లవంబు.

ఈనాడు మానవులలో పాపభీతిగాని, దైవప్రీతిగాని లేకపోవడంచేతనే విశ్వశాంతికి ముప్పు ఏర్పడింది. ఈనాటి మానవ జీవితము తినటం, త్రాగటం, నిద్రించటం, సుఖించటం - వీటికి మాత్రమే పరిమిత మవుతున్నది. **ఇదేనా మానవ జీవితం? "జ్ఞానేన శూన్యః పశుభిస్సమానః",** జ్ఞాన హీనుడు పశువుతో సమానం. వశువులు, మృగములు కూడా తింటున్నాయి, త్రాగుతున్నాయి, నిద్రిస్తున్నాయి, సుఖిస్తున్నాయి. అయితే, వాటిలో దాచుకునే స్వార్థంగాని, దోచుకునే దౌర్భాగ్యంగాని లేవు. దాచుకోవటం, దోచుకోవటం మానవునియందే కనిపిస్తున్నాయి. మానవుడని పేరు పెట్టుకొని మృగములలో కూడా లేని అవలక్షణాలను పెంచుకోవటం ఎంత దోషం! ఈనాడు మానవుని ఆశలకు అంతు లేకుండా పోతున్నది. కోరికలు చీమల పుట్టవలె పెరిగిపోతున్నాయి. మానవ జీవితం దీర్ఘ ప్రయాణం ఇందులో కోరికలనే లగేజిని ఎంత తగ్గించుకుంటే ప్రయాణం అంత హాయిగా సాగుతుంది. కోరికలను తగ్గించుకుని **ఈ దీర్ఘ ప్రయాణాన్ని దివ్య జీవితంగా గడపాలిగాని, దీన జీవితంగా గడపకూడదు.**

(స.సా.మే.99పు.115/116)

(చూ॥ మూడుసూత్రాలు)

పాపము/పాపములు

పరులను నిందింప ఒప్పుకుందురు గాని
తమను తాము నిందింప తలచ నేరరు
పరుల రూపంబు చూచి వెక్కిరింతురు గాని
తమ రూపంబు చూడ నేరరు
ఇతరులను హేళన చేయుదురు గాని
తమను తాము హేళన చేయబోరు
ఇతరుల మాటలు వెక్కిరింతురు గాని
తమ మాటల తప్పులు గాంచలేరు
పుట్టినప్పుడే ఈ బుద్ధి పట్టబడిన
ఇంతకన్న పాపమెద్ది కలదు.

(ప్ర.ప.పు.20)

మీకు ధైర్యమును, సంతోషమును కలుగచేసి మీలోనున్న బలహీనతను, భయమును పారద్రోలడమే **నా లక్ష్యము. మిమ్మల్ని మీరు పాపులని నిందించుకోకండి; నిజానికి, పాపమనే మాటేలేదు;** మీరు చేసేవి పొరపాట్లు మాత్రమే. అయితే, చేసిన పొరపాట్లకు మీరు మనస్ఫూర్తిగా పశ్చాతాపము చెంది చెడుపనులను, మీలో ప్రవేశించిన **దురలవాట్లను తొలగించుకునే శక్తి సామర్థ్యాలు మీకు ప్రసాదించుమని భగవంతుని ప్రార్థించండి.**

(దై.పు.299)

నిండుసభలో దుర్యోధన దుశ్శాసనాదులు ద్రౌపదిని పరాభవించడానికి ప్రయత్నించారు. ఆమె శాంతంగా భీష్మునివద్దకు వెళ్ళి "పితామహా! ధర్మజుడు తానోడి నన్నోడెనా, లేక నన్నోడి తానోడెనా? చెప్పండి" అన్నది. మొట్టమొదట ధర్మజుడు తనను తాను ఒడ్డుకున్నాడు. తాను ఓడిన తరువాత ద్రౌపదిని ఒడ్డే అధికారం అతనికి లేదు. కానీ ద్రౌపది ప్రశ్నకు ద్రోణుడుగాని, భీష్ముడుగాని ఎవ్వరూ జవాబు చెప్పలేదు. ధృతరాష్ట్రుడు పెదవి విప్పలేదు. అప్పుడే విదురుడు చెప్పాడు - **"నరకమునకు పోయేవారు కేవలం పాపం చేపినవారు మాత్రమే కాదు; పాపం చేయడానికి పురిగొల్పినవారు, పాపం చేయడం చూసినవారు, పాపం చేయడానికి మార్గం తెలిపేవారు కూడా నరకానికి పోతారు. పాపం చేయడం చూస్తూ దానిని తప్పించడానికి ప్రయత్నించనివారికి కూడా నరక ప్రాప్తి ఉంటుంది".** భీష్ముడు మహా జ్ఞానియే కానీ నిరపరాధియైన స్త్రీని దుర్యోధన దుశ్శాసనాదులు నిండు సభలో పరాభవిస్తుంటే తానెందుకు వారికి అడ్డు చెప్పలేదు? కనుకనే, 56 దినములు శరతల్పముపై పరుండి ఆ పాప ఫలితాన్ని ప్రత్యక్షంగా అనుభవించాడు. ఆనాడు కౌరవులు చేసిన పాపానికి అడ్డు తగిలి ఉంటే తనకీ బాధ తప్పేది కదా!

(స.సా.మా.99 పు.62/63)

ధ్యానికి కేవలము ఆత్మానంద మార్గమేకాక, లోక హితార్థముకూడా ప్రధానము. అట్లు లోకహితమును కోరుటకు శారీర మానసిక వాక్కులందు కొన్నింటిని కట్టుదిట్టము చేసుకొనవలెను. అవియే **దశవిధ పాపములు. కాయకంగా త్రివిధములైన పాపములు, వాక్కున చతుర్విధములైన పాపములు, మానసికంగా త్రివిధములైన పాపములు.** అందులో కాయక పాపములు, 1. ప్రాణాతిపాతము 2. పరదారాసక్తి 3. దొంగతనము. ఇంక వాక్కు నందాచరించు పాపములు: 1. యనత్ప్రలాపములు 2. పారుష్యము 3. పైసున్యము 4.అసత్యము. అటులనే మానసికంగా కూడను: 1. పరధనాసక్తి 2. పరులయెడఅసూయ 3. నాస్తికత్వము; ఈ విధములైన దశవిధపాపములనూ ధ్యానసాధకుడు చెంత చేర్చక చూచుకొనవలెను. వాటిని పూర్తిగా పరిత్యజించవలెను.

(ధ్యా.వా.పు.23)

కాలిలో గుచ్చుకొని బాధించేది ముల్లే. ఆముల్లును తీసి మళ్ళీ బాధను నివారణ చేయునదీముల్లే. ఈ బాధకు కాని, నివారణకుగాని ముల్లు వంటిది ఈ మనస్సు. మనము కట్టుకున్నటువంటి బట్టలు మాలిన్యపరచేదీ మట్టే. అట్టి మాలిన్యము చేరినటువంటి బట్టను పవిత్రముగ శుభ్రపరచేటువంటిదీ మట్టే. కనుకనే మనస్సు కూడాను ఒక మట్టివంటిదే. దీనిని పురస్కరించుకొనయే **"మృత్తికే హరమేపాపం" అన్నారు. ఈ మనస్సువల్లనే మన పాపము**

పాపులు

తీరుతుంది. ఈ మనస్సు వల్లనే మన పాపము పెరుగుతుంది. మనస్సే దేహమును మట్టినుండి పుట్టించినది; తిరిగి యీ యొక్క దేహమును మట్టియందు లీన మొనర్చుచున్నది. కనుక యిట్టి **మనస్సు యొక్క ఏకత్వాన్ని కనుక్కునేటటువంటి పవిత్రతను గుర్తించుకోవటము ప్రతి మానవుని కర్తవ్యము. "మనేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోఃు" అనగా బంధమునకును, మోక్షమునకున్నూ మనమనస్సే కారణమనేటువంటి సత్యాన్ని గుర్తించుకొని మన మనస్సు ఊహలచేత పవిత్రపరచుకొని తద్వారా మనయొక్క భ్రాంతులు కూడను అరికట్టుకోవటానికి ప్రయత్నము చేయటము సాధకునియొక్క ప్రధాన కర్తవ్యము.**

(మ.మ.పు.3/4)

మనస్సు కేవలము ఒక స్టీరింగు (Steering) వంటిది. ఈ స్టీరింగును మనము లోపల త్రిప్పుతూ రావటం చేత బయటనున్న టైర్లు, అంతకూడను రోడ్డులోపల, యెట్ల త్రిప్పితే అట్ల దొర్లుతుంటానికి పూనుకొంటుంటాయి. మనస్సు ద్విపాత్రాభినయము చేసేటువంటిదని మొన్న చెప్పాను. రెండు రకములైన అభినయములు చేస్తుంటాది. మంచిగాను చేస్తుంది; చెడ్డగాను చేస్తుంది. **మనస్సు కేవలము కెమెరా లెన్సు (Camera Lens)** వంటిది. ఎటువైపు త్రిప్పి స్విచ్‌వేస్తే ఆ పిక్చరు (Picture) దాంట్లో వచ్చి చేరిపోతుంటాది. కానీ నేటి మానవులయొక్క అజ్ఞానము ఏ రీతిగా వుందనగా, దైవమును కోరుతున్నారు ప్రపంచమువైపు ఈ లెన్సును త్రిప్పి స్విచ్ ఆన్ చేస్తున్నారు. తదుపరి ఈ పిక్చరులో చూస్తున్నారు; ప్రపంచమే కనబడుతుండాదే అని భ్రమించి, ఆశించినది లభించలేదే అని నిరుత్సాహము నకు గురియై పోతున్నారు.

(మ.మ.పు36)

(చూ॥ మూడువిధములైన పాపములు, ప్రేమ)

పాపులు

(చూ॥ అమృత పుత్రుడు)

పామరులు

(చూ॥ దేహము)

పాము

పాముకు రెండు పిచ్చి గుణములు కలవు. ఒకటి వంకరిటింకరి నడక; రెండవది చూచినదానినంతా, అడ్డమువచ్చిన వాటినన్నింటినీ, కరచుట. ఈ రెండునూ మానవునిలో అక్షరాలా ప్రత్యక్షముగు చున్నవి. చక్కని నడకలేదు, చూచినవన్నింటినీ పట్టుకొనుటకు ప్రయత్నించును. అయితే పాములో ఒక పవిత్రమైన స్వభావమున్నది. అది యేదనిన నాగస్వరము పట్టిన యెట్టి విషసర్పమయినా ఆనందముగా అందులో పడగవిప్పి ఆడుతూ, తన సర్వస్వమునూ ఆ స్వరమున లీనము చేయును. **అటులనే మానవుడు అభ్యాసముద్వారా ప్రణవములో మనసును లీనము చేయవచ్చును.** కనుక శబ్దోపాసన పరమాత్ముని పొందుటకు ప్రధానమార్గమై యున్నది. **శబ్దమే పరమాత్మ. అందుకనే మానవునియందలి పురుషార్థశక్తిని నేనే అని పరమాత్ముడు తెలిపెను.**

(గీ.పు.106)

పార్వతి

(చూ॥ వరలక్ష్మీవ్రతము)

పార్టీ/పార్టీలు

(చూ॥ దేశాభివృద్ధి)

పార్థుడు

పార్థుడు అంటే అర్జునుడే కాదు. పృథ్వీపుత్రుడైనవాడు పార్థుడు. మీరందరూ పృథ్వీపుత్రులే. మీరందరు భగవంతుని సారథిగా స్వీకరించాలి. బుద్ధి భగవంతుని యొక్క ఆత్మ ప్రతి బింబము కనుక బుద్ధిని సహజముగా పెట్టుకొని భగవంతుని సన్నిధిని చేరటానికి కృషి

చేయండి. ఈ అన్నింటికినీ ప్రేమ అత్యవసరము. ప్రేమలేకుండా యేకార్యము చేయటానికి వీలుకాదు. ప్రేమ వుండినపుడే తినటానికి త్రాగటానికి పూనుకుంటాము. ఆ ప్రేమస్వరూపుడే భగవంతుడు. సత్యభాస్కరుడు భగవంతుడు. సద్గుణములకు నిలయమైన వాడు. సర్వ ప్రేమచేత నీ యదార్థ స్వరూపాన్ని గుర్తించటానికి, బుద్ధిని ఆశ్రయించి తద్వారా నీ మానసిక తత్వాన్ని పవిత్రమైనదిగా, పరిశుద్ధమైనదిగా దివ్యమైన భవ్యమైనటువంటి నవ్యమైన రూపకముగా తీర్చి దిద్దుకో.

(బృ.త్ర,పు.103)

పాలు

(చూ॥ కలియుగము)

పాశము

యముడు ప్రాణులను తన లోకమునకు లాగుకొని పోవుటకు ఉచ్చుత్రాడు తీసికొని రాడు, ఆ త్రాడును, వధ్యుడగు ప్రాణి, స్వయంగానే తయారు చేసికొనును. వాడుదానిని మెడకు తగిలించుకొని, యముని రాకకెదురుచూచుచుండును. ప్రతి ప్రాణము, అనుక్షణము - తాను చేయు కర్మమను **పాశమును** మెడకు చుట్టుకొనుచునే యుండును. క్రమక్రమముగా పురి యెక్కి యెక్కి పెనుచుకొని, అంతిమ క్షణమున నదియే వానిని యముని కడకు లాగుకొని పోవును. నీవు నీ వాస్తవ స్థితిని తెలిసి కొంటివేని, దేహమే నేనన్న భావ మంత రించును. దానితో నీకున్న యశాంతి యంతయు పోయి, పరిపూర్ణ శాంతి ప్రాప్తించును. దేహమునేను కానన్న సత్యమును తెలిసికొనుట, చాల సులభము.

(స.వ.పు.96)

పాశ్చాత్య విద్యలు

పాశ్చాత్య విద్యల ప్రభావ మది యేమొ
ఆర్యధర్మము లెల్ల ఆరిపోయె
పాశ్చాత్య విద్యల ప్రాముఖ్య తది యేమొ
పరిణయ ధర్మముల్ వమ్ములయ్యె
పాశ్చాత్య విద్యల ప్రభావ మది యేమొ
వేష భాషల యందు మోజు హెచ్చె
పాశ్చాత్య విద్యల ప్రాముఖ్య తది యేమొ
సంస్కృత మడుగంటి సన్నగిల్లె
తల్లి భాషను మాట్లాడ తప్పుతోచె
సంఘ మర్యాద పాటింప జంకు పుట్టె
ధర్మమన్నది భోధింప తప్పిపోయె
గురువులపై గౌరవము సన్నగిల్లె

(స.సా.డి.96పు.322)

పిండదానము

చాల మంది కొన్ని భ్రాంతులకు లోబడి పోతుంటారు మమ్మల్ని ఉద్ధరించేవారు మా పుత్రులే అనుకుంటారు. ఎందుకంటె తమకు శ్రాద్ధములు పితృపిండములు వదులు తుంటారు. దానివల్ల వీరికి పుద్ధారము కలుగుతుందని వీరి భ్రాంతి. లోకములో ఎంతమంది పుత్రులు కలిగినవారు లేరు. వీరిని పుత్రులు పుద్ధారము చేస్తున్నారా? పుత్రులు లేనివారు ఎంతమంది లేరు? వీరందరు అధోగతి పాలౌతున్నారా? "పుత్రుల్ పుట్టరె కౌరవేంద్రునకనేకుల్ వారిచే ఏగతిన్ బడసెన్ పుత్రులు లేని ఆ శుకునకున్ పెంపొందెనే దుర్గతుల్" వీరుకాదు మనలను ఉద్ధారము చేసేది. చేసే ఆచారముల అర్థము కూడను మనము గుర్తించు కోవటంలేదు. శ్రాద్ధము అంటాము, బ్రాహ్మణుని పిలిపించటము, అతనికి పాదాలు కడగటము, పొట్టనిండా అన్నంపెట్టటము, వానిచే అక్షింతలు వేయించుకోవటం యిది శ్రాద్ధమైపోయినది అనుకుంటాము. **శ్రాద్ధమనగా శ్రద్ధతో కూడినదని అర్థము. పిండదానములు చేస్తారు. పిండమనగా దేహమే! శ్రద్ధతో మనదేహమునే పిండమును భగవంతునికి అర్పితము గావించటమే నిజమైన శ్రాద్ధము, ఇది పిండదానము.**

(బృ.త్ర.పు.139)

పిండార్పణము

పిండార్పణము

మానవ జన్మ ప్రేమమయమైనదేగాని మానవుడు తన ప్రేమను ప్రాకృతమైన విషయాలలో ప్రవేశపెడుతున్నాడు. భగవంతునికి అనేకమంది అనేక పదార్థాలను అర్పితం గావిస్తుంటారు. కానీ నిజమైన భక్తుడు తన దేహాన్నే అర్పితం చేసుకుంటాడు. బలిచక్రవర్తి చేసినది ఇదే! కనుకనే అతనికి మళ్ళీ జన్మయే లేకుండా పోయింది. మీ దేహమును భగవంతునికి అర్పితం గావించవలసిన పుష్పంగా మీరు భావించాలి. గాని మరోవిధంగా భావించకూడదు. మీ జీవితమును సత్కర్మలచేత, సదాచారములచేత, సత్ప్రవర్తనచేత అనుభవించి కట్టకడపటికి దీనిని భగవంతునికి అర్పితం చేయాలి. దీనిని **'పిండార్పణం'** అని అన్నారు. **దేహమునకు 'పిండము' అనేది ఒక పేరు.** చాలమంది బ్రాహ్మణులు పిండార్పణ మంటే శ్రాద్ధకర్మలకు సంబంధించినదని భావిస్తున్నారు. అది పిండార్పణం కాదు. **పిండమనగా దేహమే,** దీనిని భగవదర్పితం గావించడమే పిండార్పణం. **అదే మోక్షము, అదే ముక్తి.** ఎందుకంటే **ఎప్పుడైతే మీరు దేహాన్ని దైవార్పితం చేస్తారో అప్పుడు మీలో మోహం క్షయమై పోతుంది. మోహక్షయమే మోక్షము.** ఈ సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడు మీరెంతైనా ఆనందాన్ని అనుభవించవచ్చు. అయితే అట్టి పవిత్రమైన స్థితి వచ్చేంత వరకు దేహాన్ని కాపాడుకోవాలి. కర్తవ్యాన్ని నిర్వర్తించాలి, సత్యధర్మాలను ఆచరించాలి, త్యాగాన్ని పోషించుకోవాలి.

(స.సా.సె.98పు.234)

పిచ్చి కోతి

దేహము ఒక నీటి బుడగ
మనసు ఒక పిచ్చి కోతి
కనుక దేహేంద్రియములను
మనస్సును అనుసరించకూడదు
వివేకముతో వర్తించాలి.

(ము.ము. పు.18)

పితృవాక్యపరిపాలన

(చూ॥ స్త్రీహత్య)

పిల్లలు

ఈనాటి పిల్లలు చెడిపోవటానికి మూలకారణమైన మరొక విషయాన్ని ఆడవారికి చెప్పాలి. ఈనాడు సైన్సు అభివృద్ధి చెందుట వలన మనుషులు చేయవలసిన పనులన్నీ యంత్రములే చేస్తున్నాయి. ఒక్క "కుక్కర్" లోనే అన్నం, సాంబారు మొదలైన వన్నీ తయారైపోతున్నాయి. ఇంక వారేమీ శ్రమ పడనవసరము లేదు. అయితే, కనీసం తమ పిల్లలనైనా తాము చూసుకోవడం లేదు. పిల్లలు పుట్టిన తరువాత ఆ పిల్లలను ఆయాకు అప్పచెప్పి ఉద్యోగాలకై ఆఫీసులకు తాము వెళ్ళిపోతుంటారు. ఈ ఆయా ప్రేమ సంబంధంలోనే బిడ్డ పెరుగుతాడు. క్రమక్రమేణా **పిల్లవాడు పెరిగి పెద్దవాడైన తరువాత, ఆ బిడ్డకు తల్లి సంబంధమైన బాంధవ్యమే ఉండదు. తల్లి స్పర్శ, సంభాషణ దృష్టి తన పిల్లలపైన ఉంటుండాలి. కనుకనే పూర్వకాలమందు చిన్న బిడ్డలకు 24 గంటల పాటు తల్లియే పాలిచ్చేది, తన దగ్గర పడుకోబెట్టుకునేది. ఈ విధమైన దర్శన, స్పర్శన, సంభాషణలు బిడ్డకు తల్లితోనే జరుగుతండేవి.** అయితే, ఈ ఆధునికి పరిస్థితి ఎట్లున్నదంటే, బిడ్డను కనడం మాత్రమే తల్లి వంతు, పోషించడం మాత్రం ఆయా వంతు. ఈనాటి వారు తమ పిల్లలను ఆయాలతోపాటు బీచ్‌లకు, పబ్లిక్ పార్కులకు పంపిస్తున్నారు. ఈ చిన్న పిల్లలు కార్లలో వెళ్ళుతున్నప్పుడు ఆయా-డ్రైవరు మాట్లాడుకునే విషయాలను వింటారు. ఈ విషయాలే పిల్లలకు అలవడిపోతాయి. **ఈ ఆయా చేసే పనులనే ఈ పిల్లలు నేర్చుకుంటారు. కట్టకడపటికి, ఆయా మరణిస్తే పిల్లవాడు ఏడుస్తాడు గాని తల్లి మరణిస్తే ఏడ్వడు.** కారణం ఏమిటి? ఆ పిల్లవానికి తల్లితో సంబంధం లేదు. కనుక, వానికి దుఃఖము ఎట్లు కలుగుతుంది? **అందుచేత తల్లి తన పిల్లలను వేరు చేసుకొనరాదు.**

(శ్రీ.భ.ఉ. పు.132)

పిల్లలు మొదటి ఐదు సంవత్సరాలు తల్లిదగ్గరే పెరగాలి. చాలామంది పిల్లలకు తల్లిప్రేమ తెలియదు. ఆ వయసులో **తల్లి పిల్లల పెంపకాన్ని మరొకరికి ఇచ్చి తాను కేవలం "మమ్మీ" అని పిలవబడుతూ పిల్లలు ఆడుకొనే బొమ్మవలె ఉండకూడదు.** ఈనాడు ధనవంతుల పిల్లలు, విద్యావంతులైన తల్లిదండ్రుల పిల్లలు అంగవికలుర వలె బాధపడుతున్నారు. వారికి తల్లి దండ్రుల రక్షణ, ప్రేమ తెలియదు. వారిని సేవకులకు, ఆయాలకు అప్పజెప్తే, పిల్లలు వారి మధ్య పెరిగి వారి మాటలు, వారి అలవాట్లు వారి ఆలోచనా విధానాలు నేర్చుకొంటున్నారు.

పిల్లవానికి ఐదు సంవత్సరాల వయస్సు వచ్చిన తరువాత అతని బాధ్యతను తండ్రి చేపట్టాలి. తండ్రి అతనిని గురువుకు అప్పగిస్తాడు. గురువు అతనికి జీవితపు విలువలను నేర్పుతాడు. అధ్యాపకులు తమ అదృష్టమును గ్రహించి దానితోపాటు తమ విధులను గుర్తించాలి. కొందరు అధ్యాపకులు తమ విధులను తాము నిర్వర్తించకుండగా సమాజానికి హాని చేస్తున్నారు. వారు క్లాసులోకి రావటము, బ్లాక్ బోర్డుమీద వ్రాయటము, **"నిశ్శబ్దం" అనటము,** కుర్చీలో కూర్చొని నిద్రపోవటము చేస్తుంటారు. దానివల్ల పిల్లలకు స్కూలు అంటే ఇష్టము పోతుంది.

పిల్లలు నూతన వస్త్రము వంటివారు. వారికి ఏరంగు కావాలంటే ఆ రంగు చేయవచ్చు. వారిని రంగులో ముంచితే చాలు. పెద్దవాళ్ళు పాతవస్త్రము వంటివారు. వారిని రంగులో ముంచినా ఆ రంగును తేలికగా పొందలేరు. మృదుహృయులు చెప్పినది వెంటనే గ్రహించగలుగుతారు.

పెద్దవాళ్ళు ఒక విధమైన సిగ్గుతో, గర్వంతో, కృత్రిమంగా, దర్పంగా ఉంటారు. పొరపాట్లు చేస్తూ క్షమాపణలు కోరుతుంటారు. పిల్లలు ఆవిధంగా ఉండరు. పిల్లలు అందర్నీ నమ్ముతారు. అందరూ పిల్లల్ని నమ్ముతారు. వారు గ్రామఫోన్ రికార్డుల వంటివారు. మీరు ఎటువంటి పాటపాడినా వారు ఇష్టపడతారు. వారు తిరిగి అదే రకంగా పాడి వినిపిస్తారు. దానికున్న సూదియే ప్రేమ. అది వాడిగా ఉండాలి. అప్పుడే సంగీతం వస్తుంది. పెద్దవాళ్ళ విషయంలో ఆ సూది మొద్దుబారి ఉంటుంది. పిల్లలకు ఏకాగ్రత వరం వలె ఉంటుంది. వారు నిర్భయులై ఉంటారు. **పెద్దవాళ్ళే వారికి భయం నేర్పుతారు. పిల్లలు సత్యమే పలుకుతారు.** కాని పెద్దవాళ్ళు వారికి అబద్ధాలాడటం నేర్పుతారు. పిల్లల్ని కొన్ని విషయాలు గమనించి చెప్పమని పెద్దవాళ్ళు అంటారు. **దానివల్ల పిల్లలకు ఇతరులలో చెడును, దోషాలను చూడటంలో ఆసక్తి ఏర్పడుతుంది.**

పెద్దవాళ్ళు మాట్లాడేటప్పుడు వారు మాట్లాడేది **నిజమో అబద్ధమో చెప్పలేము. కాని పిల్లలు ఉన్నది ఉన్నట్టు మాట్లాడతారు. కపటంగా మాట్లాడితే తాత్కాలికంగా ప్రయోజనం కలుగుతుందని వారికి తెలియదు.** నిజానికి కపటం లేకుండా మాట్లాడితేనే ఆలస్యంగానైనా చక్కని ప్రయోజనం కలుగుతుంది. అందుకనే మీరు **భగవంతుని అనుగ్రహం పొందటానికి చిన్నపిల్లలవలె అమాయకులుగానైనా ఉండాలి, లేకపోతే మంచి విద్యావంతులై విచక్షణా జ్ఞానంతోనైనా ఉండాలి.** ఇందుకు చక్కని ఉదాహరణము ప్రహ్లాదుడు. అతనికి ఏమాత్రమూ అహంకారము లేదు. విషము అమృతము రెండూ కలపకూడదు. సత్‌ని సత్‌తోనే కలపాలి. ప్రకృతి బ్రహ్మమయం. బ్రహ్మము ప్రకృతిమయం! వస్త్రము దారముల మయం. దారము వస్త్రమయం. ఒకటిలేకుండా ఒకటి లేదు. **పిల్లవాని దశ స్వచ్ఛమైన సత్ దశ. మీరు ఆవిధంగా అదే అమాయకతతో శుక మహర్షి వలె ఉండగలిగితే మీరు చాలా సహజంగా భగంతునిలో లీనం కావచ్చు. సూర్యకిరణాలు మీ తలుపు బయట నిశ్శబ్దంతో, ఓర్పుతో ఎదురు చూస్తుంటాయి. మీరు తలుపులు కొంచెం తెరిస్తే చాలు. ఆ సందులో నుంచి అవి ఆనందంగా లోపలకు ప్రవేశిస్తాయి. తలుపు బాగా తెరవండి. మీరు కాంతిలో, వెచ్చదనంలో స్నానం చేయవచ్చు. పిల్లల మనస్సులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. వారు తలుపులు వేయరు. అందువల్ల వారిలోపల చీకటి**

పిల్లలు

ఉండదు. అందువల్లనే దుఃఖముతో నిండిన ఇంట్లో వారి చిరునవ్వులు సూర్యకిరణాల వలె ఉంటాయి. ధ్రువుడు, మార్కండేయుడు భగవద్దర్శనంతో ముక్తిపొందారు. అది యెటువంటి కపటంవల్ల కాదు, వారు తమ మనస్సులను సాధనతో ముక్తికి ఉపయోగపడే దివ్యమైన ఉపకరణాలుగా మార్చుకున్నారు.

మీకు జీవితంలో కావలసింది ఏమిటి? ఆనందము, అనుకూలము, అన్యోన్యము, అనురాగము. అధికారి ఉద్యోగస్థుని మధ్య, యజమాని సేవకుల మధ్య, భార్యాభర్తల మధ్య, తండ్రికొడుకుల మధ్య హక్కులు విధులు ఉన్న ప్రతిచోట ఈ నాలుగూ అవసరమే. **మీ పిల్లలు చిన్నవారుగా ఉన్నప్పుడే ఈ గింజలను వారి మనస్సులలో నాటండి.** మీరు వారికి ఇవ్వదగిన గొప్ప వారసత్వ సంసద ఇదే. నిస్పృహ, నిరుత్సాహము, అసంతృప్తి మొదలైన వాటికి తగిన విరుగుడు ఇదే.

(వ. 61-62 పు.186/188)

తరువాత పిల్లలు క్రికెట్‌కాని, ఫుట్‌బాల్‌కాని, టెన్నిస్ కాని ఆడేటప్పుడు వారు ఒకవేళ ఓడిపోయే పరిస్థితి ఏర్పడితే తప్పులు చెయ్యటం ఆరంభిస్తారు. ఆవిధంగా గెలిచినా అది ఓటమి క్రిందే లెక్క. శత్రుభావం లేకుండగా, ఎలాగైనా విజయం పొందాలని కాంక్షించకుండా ఉంటే వారు తప్పక గెలుస్తారు. **ఒకరిని మరొకరితో పాల్చవద్దు. పోటీవద్దు. దానివల్ల పడిపోయే ప్రమాదం ఉంది.** ఈ పాఠం కూడా పిల్లలకు బోధించండి పోటీ ఉంటే అది ఆరోగ్యకరంగా అసూయాద్వేషాలు ఆంటకుండగా కొన్ని నియమాలకు లోబడి ఉండాలి.

అన్నిటిని మించి పిల్లలు విలువైన సంసద అని గ్రహించండి. వారిని భగవంతుని సేవకులుగా, ఉత్తమ సాధకులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత మీకు ఉంది.

(వ. 61-62. పు. 189)

పిల్లలు కొండలోని గుండుబండలవంటివారు, తల్లి తండ్రులు గురువులూ ఆ బండలలో దాచియున్న సుందర దేవ విగ్రహములను ప్రకటింపజేసే శిల్పులు ఆత్మవిశ్వాసము, ఆత్మజ్ఞానము వీటివలన ఆ విగ్రహములకు తేజస్సు ఓజస్సు ప్రతిభ ప్రభావము ప్రతాపము చూకూరును. వేరే ఏ రీతిగానూ రాదు. తానెవరో తెలియక పరులను తెలిసికొనిన, వచ్చిన లాభమేమి? తన తత్వమేమి, తన నిజస్వరూపమేమి, తన గురియేమి అని తెలియని గురువు ఎట్లు ఆ పేరుకు అర్హుడు? తనలోని వ్యక్తిసామర్థ్యములను తెలిసికొనక, ఎన్ని ఆర్జించిన అందుకొనిన, అన్నీ వ్యర్థమే; మస్తకములో పుస్తకములను చేర్చిన, జగత్తును మోసపరచవచ్చునే కానీ తనను తాను వంచించుటకు వీలుకాదు. విద్యార్థులకు గురువులు ఆదర్శములుగా తోడ్పడాలి. ఉపాధ్యాయుని జీవితమే, శిష్యులకాయన అనుగ్రహించే పెద్ద సందేశము. అయితే, **పిల్లలు అనత్యమార్గమును పట్టుటకు అబద్ధమాడుటకు, అపవిత్రతను ఆశించుటకు. ఇంటిలోని వాతావరణమే మూలకారణము. తాము ఆచరించక, పిల్లలకు బోధించుటకు తల్లితండ్రుల కధికార మేమాత్రమూ లేదు.** మీరు కూడ, అందరినీ సమభావముతో చూడవలెను. పరుల బిడ్డలను మీ స్వంత బిడ్డలవలె, ప్రేమించవలెను. **అధ్యాపకులకు సమచిత్తము, సమభావన, సమరసప్రేమ ఇవి అత్యవసరము.**

శిక్షణక్రమమందు ఈనాడు లోపదోషములు నిండియున్నవి. పిల్లలు సంపూర్ణముగా సుశిక్షితులు కానక్కర లేదట. నూరు నంబర్లలో 35 ఆర్జించిన చాలు, పూర్తి విద్యావంతులైనట్టే. వారిని ఆమోదించి ఆదరింతురు. డిగ్రీలనందింతురు. ఈ పద్ధతిననుసరించిన, విద్యార్థులు బాగుపడేదెట్లా? పెద్దలైన తరువాత, వారు నూటికి నూటయాభై తప్పులు చేస్తే ఆశ్చర్యమేమి? నూటికి 65 తప్పులు చేసిన కూడ వారికి డిగ్రీలు దొరకును కదా? కాబట్టి, తప్పులే వారికి అలవాటై పోవును, యువకులు కఠిన హృదయములతో దయారహితులుగా రాక్షసులుగా తయారగుచున్నారు. దీనికి పెద్దల దురభ్యాసములే, వారు నిరూపించే ఆదర్శములే మూలకారణము.

మీ బాలవికాస్ తరగతులకు వచ్చే పిల్లల తల్లితండ్రులకూ ఆధ్యాత్మిక మార్గమందు అభిరుచి కలుగునట్లు

ప్రయత్నించాలి. తమ బిడ్డలపై ఇంత ప్రేమయును త్యాగమునూ ప్రసరింపజేయు గురువుల ఆదేశములకు వారు విలువనిత్తురో అని సందేహించనవసరము లేదు. మంచి మాటలతో ప్రేమభావముతో మీరు సంప్రతించిన వారు మీ సలహాలను స్వాగతింతురు.

(స.సా.జ.76 పు.258/259)

(చూ॥ గురువులు, సంస్కృతి)

పిసినిగొట్టు

"సౌఖ్యమనుభవింప జాలనివానికి
ఎంత కలిగియున్న ఏమిఫలము?
నీరుగతుకు కుక్కకు ఏరెంతపారినా
ప్రీతికలుగబోదు పిసినిగొట్టు"

(ఆ.రా.పు.420

పుట్టపర్తి

రాముడు, కృష్ణుడు, సాయిబాబా వారు ధరించిన దుస్తులను బట్టి మీకు వేరువేరుగా కనిపిస్తారు. కానీ అన్నీ ఒకే తత్వం! నామాట విశ్వసించండి. ఈ పెద్ద భవనం, ఇంకా పెద్ద భవన సముదాయాలు ఇక్కడకు పిలువబడిన జనంతో చిన్నవయిపోయే రోజులు త్వరలోనే వస్తున్నాయి. **భవిష్యత్తులో ఇక్కడ చేరిన జనసందోహానికి ఆకాశమే పైకప్పు అవుతుంది. ఆ జనసందోహం వల్ల నేను ఒకచోటు నుంచి మరొక చోటుకు వెళ్ళటానికి కారు, విమానం కూడా వదులుకొనవలసి వస్తుంది.** ఆకాశంలోనే ఆడ్డంగా వెళుతూ కనిపించవలసివస్తుంది! అవును అది జరుగుతుంది. నామాట నమ్మండి.

పుట్టపర్తి మధురానగరంగా మారటం మీరు చూస్తారు. **ఈ అభివృద్ధిని ఎవ్వరూ ఆపలేరు. నేను మిమ్మల్ని వదలిపెట్టను. మీరెవ్వరూ నన్ను వదలుకోలేరు. ఒకవేళ మీకు నమ్మకం పోతే మీరు పశ్చాత్తాపం పొంది, మరల చేరటానికి ఇక్కడకే వస్తారు.** నేను ఈ శరీరంతో ఇంకా 58 సంవత్సరాలు ఉంటాను. ఈ విషయం ఇది వరకే మీకు హామీ ఇచ్చాను. **మీ జీవితాలు నాజీవితంతో ముడిపడి ఉన్నాయి. మీరు ఆ మహత్తరమైన అవకాశానికి అనుగుణంగా నడుచుకొండి.**

(వ 61-62 పు.80/81)

"గోపాల బాల రారా, శ్రీసాయినాథరారా
శిరిడి యందు నీవుబాగా, సిద్ధొందితీవిసాయీ
పుట్టపర్తి గ్రామమందూ, పుట్టొందితీవి మరల
పుణ్యముల కాకరమ్ము **పుట్టపర్తి** పురవరమ్ము"

(లో.పు.6)

"పుట్టపర్తి" అనే పేరు యెలా వచ్చిందో తెల్సా?ముందు దీనికి గొల్లపల్లె అని పేరు. చాలాకాలం క్రిందట గొల్లలు యెక్కువగా వుండినారు. గోవులను గాచి జీవితం నడుపువారు. ఆ మందలో ఒకపాడి ఆవు పుష్టిగా, అందంగా వున్నా, ఒక్క చుక్క పాలైనా యిచ్చేది కాదు. కారణం తెలియక గొల్లవాడు చింతించాడు. ఒకవేళ దూడ తాగేస్తు వుందేమోనని, దూడను దూరంగా కట్టాడు. లాభంలేదు. ఒకరోజు రాత్రి అక్కడే పడుకొన్నాడు. తెలతెలవారుచుండ ఆవు వెళ్ళటం చూచి, అనుసరించాడు. సరాసరి ఒక పుట్టవద్దకు వెళ్ళి ఆగింది. పుట్టలోనుండి పామువచ్చి ఆవు పొదుగులో నోరుపెట్టి, చక్కగా పాలు త్రాగుతూవుండటం చూచి, విస్మయచకితుడై, కోపంకొద్దీ, ఒక బండతీసి పాముపై విసిరాడు. పాము తల, తోక, వేరై నురగలు క్రక్కుతూ, బుసలు కొట్టుతూ "నీ గొల్లవంశం నాశమగుగాక" అని శపించి ప్రాణములు విడిచిపెట్టింది. నాటినుండి క్రమీణ **గొల్లవంశం** క్షీణించిపోయింది. **బోయలు** విస్తరించారు. నాటినుండి యెక్కడచూచినా పాము పుట్టలు విపరీతంగా పెరిగిపోయింది. **గొల్లపల్లి** అన్న పేరుపోయి, **పుట్టపల్లి** అని పిలుస్తూ వచ్చారు. వల్మీకపురమని కూడా పేరుగాంచింది. క్రమీణ **బోయవంశం** కూడా నాశనమై, **బ్రాహ్మణ** వంశం వృద్ధి చెందింది. బ్రాహ్మణులు పూజాపునస్కారములు సరిగ్గా నెరవేర్చకపోవటం వల్ల, వారి వంశము నశించిపోయింది. తరువాత **క్షత్రియవంశజులైన** రత్నాకర వంశం వెలసిల్లింది. **పుట్టపల్లి అనేపేరు మెల్లగా పుట్టపర్తి** అయ్యింది.

పుట్టపర్తి నిలయుడు

పాతమందిరం ప్రక్కనే, వేణుగోపాలస్వామి గుడి వున్నది. ఈనాటికి **అందులో దేవుడుగానీ విగ్రహంగానీ లేదు. పాముపై విసిరిన రాయినే** యిక్కడ ప్రతిష్ఠించారు. దానికే నిత్యపూజలు సల్పుతున్నారు. **ఆ రాయికి గంధం పూసితే, చక్కగా కాళింగమర్ధనం సల్పుతున్న కృష్ణుడు కన్పిస్తాడు."**

(అ.శ.పు.126/127)

పుడమికి సరిమధ్య **పుట్టపర్తి** యనగ
ఆత్మ విద్య ఇందే అవతరించె
విశ్వ మానవ కోటి విజ్ఞాన మొందంగ
విశ్వవిద్యాలయము లిచట వెలసె
శాంతి సౌఖ్యములను సర్వ దేశములందు
వెదజల్లెడి విజ్ఞుడిచట వెలసె
నియతి తప్పని మహానిష్ఠ గల భక్తులు
వేలు లక్షలు కోట్లువెలసిరిచట
సత్యధర్మ శాంతులు జగతిని
స్థాపించె భూమిలో చక్కగ సాయి ప్రభు
సత్యసాయి భువిని సంపూర్ణ
ప్రేమమూర్తి యగుచు పుట్టె మోదమలర

(భ.ప్ర.పు.21)

(చూ॥ చక్కచేసుకోండి, రైల్వేస్టేషన్, సంగీతవిశ్వ విద్యాలయం, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (పుట్టపర్తి))

పుట్టపర్తి నిలయుడు

శ్రీ పుట్టపర్తి నిలయుడు
కాపాడును మిమ్ము నెపుడు కరుణాకరుడై
చేపట్టి మిమ్ము బ్రోచును
ఏ పట్టున విడువకుండ ఏలును మిమ్మున్.

(స.సా.ఫి.2000 పు.41)

పుట్టుచున్నది

స్థూలదేహమున:

పృథ్వివలన: అస్థి, చర్మము, మాంసము, నరములు, వెండ్రుకలు,పుట్టుచున్నవి.

జలమువలన: రక్తము, మూత్రము, జొల్లు, శ్లేష్మము, మెదడు పుట్టుచున్నవి.

అగ్నివలన: ఆకలి, దాహము, నిద్ర సంగమము, నిధానము కలుగుచున్నవి.

వాయువువలన: చలనము, గమనము, తీవ్రము, లజ్జ, భయము కలుగుచున్నవి.

ఆకాశమువలన: కామ, క్రోధ, లోభ, మద, మత్సర్యములు

(ప్ర.శో.వా.పు.4/5)

పుణ్యకర్మలు

పుణ్యకర్మలు చేత భువిని త్యాగము చేసి
ప్రేమ తత్త్వములను పెంపు చేసి
దానవత్వమడంచి దైవత్వమును పెంచి
నిత్య జీవితంబు నెరపు నరుడా॥

(సా.పు.634)

పుణ్యపురుషులు

(చూ॥ బుద్ధుడు)

పుణ్యము

(చూ॥ అనహంకారము, ఆశలు, త్యజ)

పునర్జన్మ

(చూ॥ ఉత్తరాయనము, పరీక్షిత్ ప్రార్థన, మేలుకొలుపు, స్మరించు, హిందూమతము)

పునాది

(చూ॥ ఆత్మవిశ్వాసము)

పురందరదాసు

(చూ॥ భావములు)

పురాణము/పురాణములు

పురాణం పంచ లక్షణమ్ అందురు. అనగా అందు చారిత్రక సంబంధములైనవి. సృష్టిక్రమ సంబంధములైనవి. తాత్త్విక సిద్ధాంతములను విశదీకరించు సాంకేతికోదాహరణ రూపమైనవి యెన్నెన్నియో విషయము లుండును. వేదవిషయమును సామాన్య మానవులకు అర్థమగు రూపమున ప్రదర్శించుటకై ఇవి రచించబడెను. వేదభాష అత్యంత ప్రాచీన రూపమైనది. మహా మహా విద్వాంసులలో కూడా ఏ కొలదిమందియో మాత్రము వీని రచనా కాలమును కనుగొనగలరు. **పురాణములు ఆ కాలపు జన సమాన్యము వాడుచుండిన భాషలో వ్రాయబడినవి.** మనమిప్పుడు ఆధునికి సంస్కృతమను పేర వ్యవహరించు భాషయే అది. అప్పటి విద్వాంసులకే కాక ఆ భాష సామాన్య ప్రజలకై ఉద్దేశింపబడినది. కనుక ఆ భావమునకు ఆ భాషతోనే రూపకల్పన మొనర్చిరి. **మహాపురుషుల యొక్కయు, రాజన్యులయొక్కయు, సుప్రసిద్ధ పురుషుల యొక్కయు, జీవితరూపమునకు, జాతి జీవితములో కలిగిన చారిత్రాత్మక సంఘటనల రూపమునను ఇట్టి యితర స్థూల రూపమునను అందు ప్రదర్శింపబడెను.** హిందూమత సనాతన ధర్మముల ఉదాహరణ రూపముగా వర్తించుటకై మహాఋషులు ఈ విధముగ పురాణములు నిర్మించిరి.

(స.వా.పు.69)

వేదములోని సంక్షిప్తవచనములకు వ్యాఖ్యానము చేయబడిన వాటిని పురాణము అని అందురు. పురాణములు అసంఖ్యాకములు కానీ, **ఈ సమయమున పదునెనిమిది పురాణములు,** పదునెనిమిది ఉప పురాణములు, పదెనెనిమిది ఉపోప పురాణములు మాత్రము ప్రసిద్ధము లగుచున్నవి. వీటన్నింటినీ **వ్యాసుల వారే సంగ్రహించిరి.**

"ఈ పురాణములకు దశ లక్షణము లుండును. ఉప పురాణములకు పంచ లక్షణము లుండును, ఆ దశ లక్షణము లేవని తిరిగి నీవు ప్రశ్నించ వచ్చును, దీనికి పూర్వమే నేనే తెలుపుదును, వినుము. **సర్గము, విసర్గము, స్థానము, పోషణము, ఊతి, మన్వంతరము, ఈశాను చరితము, నిరోధము, ముక్తి, ఆశ్రయము అని, ఈ పది యందూ ఆశ్రయము ప్రధానము.**

ఈ పది లక్షణములు సంక్షిప్తముగా తెలుపలెనన్న, పాలు పితుకుట మొదలుకొని, వెన్నముద్ద చేయువరకు చేయవలసిన పనులన్నియు అవసరమే. ఆయా పనుల స్థితికి తగిన గతికే ఆనామములు కానీ, అన్నింటిలో ప్రధానము వెన్నముద్దయే! దాని కొరకే ఈ పై విధముల లక్షణములూ చేయవలసివచ్చును. అటులనే ఆశ్రయ తత్త్వసిద్ధి కొరకే సర్వ విసర్గాది వర్ణనము, దీనినే శ్రుతిచే ఒక్కొక్కచోట ఒక్కొక్క వాక్యము చేతను, తాత్పర్యము చేతను, సాక్షాద్రూపము వర్ణింపబడినది. పురాణములో నుండవలసిన దశ లక్షణములనూ తెలిపి నన్నానంద పరుచు, మని ప్రార్థింప, శుకుడు తిరిగి వివరించుటకు ఉద్యుక్తుడై, **సత్వ, రజ స్తమోగుణములు సమానముగ నున్న దానిని ప్రకృతి యందురు,** మూల ప్రకృతి వలన, పృథివి, జలము, తేజస్సు, వాయు, ఆకాశము పంచ భూతములును శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులును పంచ తన్మాత్రలును వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థలను పంచ కర్మేంద్రియములును, చెవులు, చర్మము, కన్నులు, నాలుక, ముక్కులను పంచ జ్ఞానంద్రియములున్నూ మనస్సును మహదహంకారములు రెండును మూడు తత్త్వము ఎప్పుడుద్భవించునో, అపుడు దానిని **సర్గమని అందురు,**

ఒక రెండవ దయిన **విసర్గమనగా** విశేష రూపమగు సర్గము నకే విసర్గమని అందురు. చిత్ర విచిత్ర కర్మలొనర్చు అసంఖ్యాకజీవుల నుత్పత్తి చేయుటే విసర్గమని అందురు. ఇది విరాట్పురుషసంబంధము.

స్థానమనగా, లోకమున యే వస్తువు పుట్టినను వాటికి కొన్ని హద్దులు ఏర్పరచుకున్న, ఆ వస్తువులు వృధా అయిపోవును, అందుకై ఉత్పన్నమయిన వస్తువులకు హద్దులు ఏర్పరచి ఆ వస్తువులు ఆయాహద్దులు

మీరకుండునట్లు చేయుటకే **స్థానమని** అందురు. ఉదాహరణమున కొకటి తీసుకొందుము, ఒక యంత్రము కలదు. దానికి తాళము త్రిప్పిన నడువగలదు. కాని దానిని హద్దులో నడిపిననే అది అదుపులో నడువ గలదు. లేకున్న యిష్టమొచ్చినట్లు పోయి ప్రమాదమునకు గురి యగును. ఇట్టి అదుపునే స్థానమని అందురు.

పోషణ మనగా సులభముగా తెలుపవలెనన్న దైవానుగ్రహమునే పోషణ మనవచ్చును. సృష్టి కార్యము లన్నియు పోషణ చేతనే జరుగు చున్నవి. చెట్టును నాటి దానికి తగిన పోషణ జరుపకున్న అది వృద్ధి కాదుకదా? తదుపరి **మన్వంతర** మునగా, యెనిమిది జాముల గల రాత్రింబగలునకు దినమని పేరు. ముప్పది దినము లోకమాసము, పండ్రెండు నెలలు ఒక సంవత్సరము,ఈ లోక సంవత్సరము దేవతకొక దినము. ఇట్టి దినములు మూడు వందల అరువది దినములైన దేవతల కొక సంవత్సరము. ఇట్టివి వేయి దివ్య సంవత్సరములు కలియుగము. రెండు వేలయిన, ద్వాపర యుగము, మూడువేలయిన త్రేతాయుగము నాలుగు వేలయిన, కృత యుగము. ఈ యుగములకు రెండువందలు సంధి, సంధ్యాంశలుగ నుండును. ఇట్టి పండ్రెండు వేల దివ్య వర్షములు ఒక మహాయుగ మనబడును. అట్టి మహాయుగములు వేయి గడచిన బ్రహ్మ కొక దినము, బ్రహ్మ దినములో పదునలుగురు మనువులు మారుదురు. ఒక్కొక్క మనువు డెబ్బది మహా యుగముల కంటే అధికముగానే యుండును. ఇట్టి దానినే **మన్వంతరమని** అందురు.

ఊతి అనగా, కర్మవాసననే ఊతి అని అందురు. అనగా పూర్వ కర్మ వాసనల ననుసరించి ఆయా జన్మములు ఎత్తవలసి యుండును. అంతేకాని, భగవంతుడు ఈజన్మమెత్తు ఆజన్మమెత్తు అని ఆజ్ఞాపించడు. అతనికి అందరూ సమానులే. భేదము లన్నియు వారి వారి కర్మల ననుసరించి కలుగుచుండును. దీనినే **ఊతి** అని అందురు.

ఈశాను కథ అనగా ఈశ్వరుని గుణలీలలను అతని భక్తులైన వారల యొక్క అనుభవ కథలను ఈశాను కథలని అందురు. విరోధ లక్షణమన, భగవంతుడు తన సమస్త శక్తులను ఉపసంహరించుకొని, తనలో లీనము చేసుకొన్నప్పుడు అతను యోగ నిద్రను గ్రహించును. దానినే **నిరోధమని అందురు.**

ముక్తి అనగా, ఆజ్ఞానముచే బంధింపబడిన జీవుని బంధవిమోచనము గావించుటే ముక్తి అని అందురు. అనగా అనాత్మ భావమును వీడి ఆత్మ భావమునందు నిలుచుటే **ముక్తి.**

ఆశ్రమ మన, ముక్తి కూడా ఒకా నొకని ఆశ్రయించి యుండవలెను కదా? ఆశ్రయము లేక యేదియు నిలువ జాలదు. విశ్వమున కంతటికినీ పరమాత్మయే ఆశ్రయము, చరాచర ప్రపంచ మెవరి వలన పుట్టి పెరిగి నశించు చున్నదో అట్టి పరమాత్మయే ముక్తికి ఆశ్రయము కాన **ఆశ్రయమున పరమాత్మయే.** ఆధి భౌతిక, ఆధి దైవిక ఆధ్యాత్మికముల నెవడు తెలుసుకొనుచున్నాడో అట్టి ఆత్మను సమస్తమునకు **ఆశ్రయమని తెలియవలెను.**

(భా.వా.పు.185/189)

పురాణాలు మానవత్వాన్ని ఆదర్శాన్ని దివ్యత్వాన్ని జీవన విధానాన్ని గమ్యాన్ని భారతీయ సంస్కృతిని నిరూపించునట్టివి. మానవతా విలువల ప్రమాణాన్ని, వాటి లోపం వల్ల కలిగే నష్టాన్ని వివరించునట్టివి; ఆత్మతత్త్వమును నిరూపించునట్టివి. కానీ ఈనాటి పండితులు వాటియొక్క విపరీతార్థాలు తెలిపి అనర్థాలు కలిగిస్తున్నారేగాని యథార్థాన్ని అంతరార్థాన్ని తెలిపేవారు లేరు. అందుచేత వాటిని సరిగా గ్రహించేవారు లేరు. **నాటి పురాణ కథలు. భారతీయ చరిత్రలు ఆధ్యాత్మిక జ్యోతులు. మానవుణ్ణి దైవానికి చేర్చే సనాతన సారథులు, వారధులు, ఈ పురాణాలు. భగవంతుడు జగన్నాటక సూత్రధారి. తానే ఈ జగన్నాటకమును రచించి, దర్శకుడైయుండి, పాత్రధారియై తన పాత్రను ఔచిత్యముగా పోషించిన విధానమును ఈ పురాణాలు చక్కగా వెల్లడిస్తాయి. ఉదాహరణకు, రామాయణంలో**

గావించునో రామాయణ భాగవత భారతాలు ప్రకటించుచున్నవి.

(స.సా.జులై.98.పు.191/192)

పురాణములు కొన్ని మంచి ప్రబోధలు చేస్తూ వచ్చాయి. మరికొన్ని హాస్యాస్పదమైన విషయాలను కూడా ప్రబోధించాయి. ఒకానొక సమయంలో పార్వతీ ఈశ్వరుడు జూదము ఆడుచూ, తీర్పు చెప్పటానికి నందిని మధ్యవర్తిగా పెట్టుకున్నారట. నంది ఈశ్వరుని యొక్క అభిమాని గదా! అందులో ఈశ్వరుని వాహనము గదా నంది. అందువలన పక్షపాత బుద్ధితో ఈశ్వరుడు ఓడినప్పటికినీ, గెలిచినట్లు ప్రకటించింది నంది. పార్వతికి కోపం వచ్చి "నయముకాని వ్యాధితో నీవు నశించు పోవుదువుగాక" అని పార్వతి నందిని శపించిందట. అప్పుడు నంది వచ్చి పార్వతి కాళ్ళపై పడి క్షమించమని వేడుకుంది. నా నాయకుని ఓటమి నాకు కూడా ఓటమే గదా! కనుక అతనిని గౌరవించే నిమిత్తం నేను అసత్యమాడిన మాట నిజమే. దీనికి ఇంత పెద్ద శిక్షా, నన్ను క్షమించు తల్లి' అని నంది ప్రార్థించిందిట. అప్పుడు పార్వతి క్షమించి, పాప పరిహారమును కూడా చెప్పింది. నా కుమారుడైన గణపతి పుట్టిన పండుగ భాద్రపద చతుర్థశి దినము. ఆ దినమున నీవు తినేటటువంటిది, నీకు అత్యంత ప్రీతికరమైనటువంటి గరిక (గడ్డి) ను గణపతికి అర్పితం చేయమని చెప్పందట. అనగా **ఏది ఎవరికి ఏది ప్రీతికరమైనదో, ఆ ప్రీతికరమైనది అర్పితం చేసినప్పుడు అన్ని శాపములు విమోచనమవుతాయి.** కనుక తనకు అత్యంత ప్రీతికరమైనటువంటి గరికను తీసుకొని వచ్చి వినాయకుని పూజించింది నంది. గణపతి అనుగ్రహంతో నంది యొక్క అనారోగ్యము నిర్మూలన మైంది. దేవీ కటాక్షంతో శాపవిమోచనమైంది.

(శ్రీ.అ.95 పు.7)

(చూ॥ ఆశలు, పండితుడు)

పురాణాల సారాంశము

Help Ever - Hurt Never

వ్యాసుడు పద్దెనిమిది పురాణాలు వ్రాసాడు. వీటిని

శ్రీరామునికి తాను అవతారమూర్తి అని తెలుసు. కానీ సామాన్య మానవునివలె నటించి, సీతావియోగమునకు దుఃఖించినట్లు కనబడి సహజ మానవ ప్రకృతిని, పతిపట్ల పతి ధర్మమును నిరూపించాడు. కుమారునిగా, సోదరునిగా, పతిగా, రాజ్యపాలకునిగా, ఒక స్నేహితునిగా వివిధ రీతుల ధర్మాలను ప్రబోధించినదే రామతత్వం. సత్యవాక్పరిపాలన, పితృవాక్యపరిపాలన, ఏకపత్నీవ్రతము మున్నగు ధర్మాలను లోకానికి చాటే నిమిత్తము అవతరించినవాడు రాముడు. ఈ ప్రకారం ప్రాచీన భారతీయ ఇతిహాసములన్నియు మానవతా విలువలను చాటునట్టివే. కామంవల్ల పతనం తప్పదని నిరూపించినది రామాయణం. రామునికంటే అధిక విద్యలందు ఆరితేరి, శివభక్తుడై, మహాబలశాలియై, సువర్ణమయమైన లంకకు అధిపతియైన రావణుడు కామంచేత ఏరీతిగా తన ప్రాణాన్ని రాజ్యాన్ని వంశాన్ని కోల్పోయిందీ చక్కగా వర్ణిస్తుంది రామాయణం. ఇక క్రోధము మానవుణ్ణి ఏ రీతిగా పతనం గావిస్తుందో తెలుపుతుంది భాగవతము. కంస, శిశుపాల, దంతవక్ర, హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు అస్త్రశస్త్ర పారంగతులై, తపోధనులై, మహాశక్తి సంపన్నులైనప్పటికీ భగవంతునిపై ప్రేమకు బదులు క్రోధాన్ని ద్వేషాన్ని పెంచుకోవడంచేత దుర్మరణం పాలయ్యారు. మూడవది మహాభారతం. ధనబలం, జనబలం, భుజబలం. బుద్ధిబలం ఎంతగా ఉన్నప్పటికీ కౌరవులు నూరుమందీ నామరూపాలు లేకుండా హతులైనారు. నూర్గురు పుత్రులు కల్గిన ధృతరాష్ట్రునకు చివరికి పిండం విడిచేవారు కూడా లేకుండాపోయారు. దీనికి కారణం? **లోభం.** రాజ్యం పాండురాజుది. కానీ కౌరవులు లోభంచేత పాండవులకు అర్ధరాజ్యం కూడా ఇవ్వ నిరాకరించారు. ఐదూళ్ళు కాదు సరికదా, కనీసం సూదిమొన మోపుటంత భూమిని కూడా ఇవ్వమన్నారు. అంతేకాదు ధర్మపరులైన, మహాభక్తులైన పాండవులను వధించడానికి కూడా సిద్ధపడ్డారు. **దీనికంతటికీ లోభమే కారణం. ఈ ప్రకారం కామక్రోధ లోభములు మానవుణ్ణి ఎన్ని ఉన్ననూ ఏరీతిగా పతనం**

పురాణుడు

చదవడానికి సమయం ఎక్కడ చిక్కుతోంది? కనుక ఈ పద్దెనిమిది పురాణాల సారాంశాన్ని రెండు వాక్యాల్లో చెప్పాడు.

"అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచన ద్వయం
పరోపకారయ పుణ్యాయ పాపాయ పరపీడనం"

అందరికి సహాయం చేయండి. ఎవ్వరినీ బాధించకండి. అదే స్వామికి ఆనందం అదే బాబాసందేశం.

"అందరికీ సహాయం చేయి - ఎవరినీ బాధించకు''. ఇవే మీ లక్ష్యాలు కావాలి. అపకారం ఎన్నడూ చేయకు. చేతనైనంత ఉపకారం చెయ్యి. ఇది నీ ధర్మం.

"సహస్ర శీర్షాపురుషఃసహస్రాక్షసహస్రపాత్'' అన్ని శిరస్సులు అన్ని నేత్రాలు అన్ని పాదాలు భగవంతునివే. కనుక ఎవరిని బాధించినా భగవంతుని బాధించినట్లే అవుతుంది.

(దే.యు.పు.12)

పురాణుడు

(చూ॥ స్మరింతురు)

పురుష ప్రయత్నము

"బాబా అది చేయి, ఇది చేయి, మా మనసు మార్చు" అని అడుగుతుంటారు. కానీ అది బాబా పనా! మీ కర్తవ్యమది. అన్నీ బాబా చేస్తుంటే యింక మీరు చేసే పని ఏమిటి? ఇది కేవలం పరిపూర్ణంగా సోమరితనమే. మీ ప్రయత్నంతో మీరు సాధించాలి. పురుష ప్రయత్నము చేసినప్పుడే భగవంతుని సహాయం లభిస్తుంది. **'భగవంతుడా! ఇది చేయి, అదిచేయి, నామనసు మార్చు అనటం బలహీనత యొక్క లక్షణము. పరిపూర్ణ విశ్వాసముంటే మీ మనస్సు ఎందుకు మారదు? అది లేదు కాబట్టే నన్ను మార్చమని కోరుతున్నారు. "నాది మనస్సు మార్చేపనికాదు. మీ కర్మ తీర్చుపని నాది."** ప్రతివ్యక్తి ఈ సత్యమును గుర్తించాలి. **మొట్టమొదట మీలోని దోషములను నిర్మూలించుకోండి. మీ భక్తి ప్రపత్తులు స్థిరమైనవిగా చేసుకోండి. ఎట్టి పరిస్థితులందు మార్పులేకుండా చూసుకోండి. అది మీ పురుష ప్రయత్నము.** అప్పుడే భగవదనుగ్రహం కూడా లభిస్తుంది. ఈ సత్యమార్గంలో ప్రవేశించి, ప్రేమ మార్గములో నడచి అనంతమైన దివ్యత్వంలో లీనంకండి.

(ష.పు.77)

పురుషసూక్తము

(చూ॥ లఘున్యాసము)

పురుషార్థము

లోకంలో ధర్మార్థకామమోక్షములు పురుషార్థములని చెప్పారు. పురుషార్థము అనే పదముయొక్క అర్థమును గుర్తించుకోలేని వ్యక్తులు ఇవి కేవలం మగవారికి మాత్రమే సంబంధించినవని భావిస్తున్నారు. అవి ఆశ్రమ ధర్మాలేగాని, ఆధ్యాత్మిక ధర్మాలు కావు. ఆధ్యాత్మిక ధర్మమే నిజమైన ధర్మము. పురుష అనగా ఆత్మ అని, చైతన్యమని, ప్రాణమని, జీవియని అర్థము. ఆత్మకు చైతన్యమునకు, ప్రాణమునకు, జీవతత్వమునకు పురుషుడు, స్త్రీ అనే లింగ భేదము ఏమాత్రము లేదు. కనుక **ఆత్మధర్మమే పురుషార్థము, చైతన్యంయొక్క ధర్మమే పురుషార్థము, ప్రాణంయొక్క ధర్మమే పురుషార్థము. ఆత్మపురుషార్థము, జీవియొక్క, ధర్మమే పురుషార్థము. ఆత్మధర్మమేమిటి? అదే సాయుజ్యము.** అదే నిజమైన పురుషార్థము.

అర్థము అనగా ధనము. కానీ పురుషుడు సాధించవలసినవి లౌకికమైన ధన కనక వస్తు వాహనాదులు కాదు. లౌకికమైన ధనము ఈనాడు ఉంటుంది, రేపు పోతుంది. భగవంతుని ధనము జ్ఞానధనమే **"అద్వైత దర్శనం జ్ఞానం", అట్టి జ్ఞానమును సంపాదించాలి.**

మూడవది కామం. ఇది లౌకికమైన దేహంతో అనుభవించే విషయవాసనలకు సంబంధించినది కాకూడదు. **మోక్ష కామమును అభివృద్ధి పర్చుకోవాలి. తన స్వస్వరూపాన్ని దర్శించాలని, తన ఆత్మతత్వాన్ని గుర్తించాలనే కోరికను**

చున్నవి, అతనియందే లయమగుచున్నవి, మైలురాళ్ళవలె ప్రధానముగా గాన్పించు పృథివి, ఓషధులు, అన్నము, పురుషుడను నాలుగు తత్త్వములు వరుసన నొకదానినుండి మరియొకటి యుత్పన్నమగునట్లు తైత్తరీయ ద్వితీయాను వాకమున బేర్కొనబడినది. ఓషదాది పురుషాన్తమగు సృష్టిప్రక్రియ ఇచట స్పష్టముగా కనుపించక పోయినను పురుషావయములగు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ సృష్టి చెప్పబడుటచే తదంగమగు పురుషుని సృష్టికూడా చెప్పినట్లే అగును. నదులన్నియు సముద్రములోనికి ప్రవహించి తమ తమ రూప నామములను గోల్పోవుచున్నవి. సముద్రమున ప్రవేశించిన నదులన్నియూ సముద్ర మనియే పిలువబడుచున్నవి. పురుషుడొక్కడు మాత్రము సముద్రమువలె మిగులుచున్నాడు. అతడు సర్వ కళావిహితుడు, మృత్యురహితుడు అయి యున్నాడు. వేద్యమగు పరబ్రహ్మమును గూర్చి నాకింతవరకు తెలుసును. ఇంతకంటే వేరేమియు లేదు.''

(ఉ.వా.పు.47/48)

పురుషుడన్నను, క్షేత్రజ్ఞుడన్నను జ్ఞేయమన్ననూ వక్కటియే. పురుషుడనగా జీవుడని, ప్రకృతి అనగా దేహమనియు నెరుంగుము. పురుషుడనగా ఆ దేహమును తెలుసు కొనువాడు. ఈ దేహమునకే అనేక నామములు కలవు. జీర్ణమయి శిధిల మయ్యేది కనుక శరీరమనియు, దహింపబడేది కనుక దేహమనియు అందురు. ఇందులో చైతన్యస్వరూపుడైన దానిస్థితిని సంపూర్ణముగా తెలుసు కొనువానినే జీవుడనికూడనూ అందురు.''

(గీ.పు.200)

(చూ॥ అర్ధనారీశ్వరుడు, గృహలక్ష్మి, ధృవుడు)

పురుషోత్తమ యోగము

భక్తి, జ్ఞానము వేరు వేరని తలచరాదు. మానవునికి బోధపడుటకు వేరువేరు మాటలతో చెప్పుకొందురు. భక్తియే జ్ఞానముగా మారును, సుగుణ నిర్గుణ సంబంధమే, భక్తిజ్ఞాన సంబంధము, కర్మయనునది, భక్తియనునది,

కలిగియుండాలి. ముక్తి అనగా భగవంతుణ్ణి చేరటం కాదు. మన స్వరూపాన్ని మన సర్వస్వాన్ని వదలి భగవంతునిలో లీనం కావాలి. గంగ గోదావరి, సరస్వతీ నదులు ప్రవహిస్తున్నాయి. వాటి జలము తీయగా ఉన్నది. రూపము చూస్తే అనేక వంకర్లు, టింకర్లు తిరిగియున్నది. అయితే ఆ నదులు సముద్రంలో చేరినప్పుడు తమ రూపనామములను రుచిని కోల్పోయి, సముద్రం యొక్క రుచిని, రూపాన్ని పొందుతాయి. సముద్రంలో చేరిన తరువాత గంగ, గోదావరి, సరస్వతి అనే విభాగమేమైనా ఉంటుందా? ఉండదు. అదేవిధంగా, మీరు దైవత్వాన్ని పొందినప్పుడు ఇంకేవిధమైన విభాగమూ ఉండదు. **అదియే అద్వైత దర్శనం. అట్టి దివ్యత్వాన్ని పొందుటమే నిజమైన పురుషార్థము.**

(స.సా.మా.99పు.71)

(చూ॥ పరమార్థము, వైరాగ్యము)

పురుషుడు

పదహారు కళలు మనము ఎక్కడో సంపాదించేవి కావు. **పంచభూతాలు, పంచప్రాణాలు, పంచజ్ఞానేంద్రియాలు, మనస్సు- వీటన్నింటిని కలిపితే మొత్తం పదహారు కళలవుతాయి.** ప్రతిమానవుని యందు ఈ పదహారు కళలు నిండియున్నవి. ఈ షోడశ కళలను పరిపూర్ణంగా అనుభవించి, పరిపూర్ణమార్గములో ప్రవేశపెట్టి, **పరిపూర్ణత్వమును పొందిన వాడే "పురుషోత్తముడ"ని పిలువబడతాడు.** దేహమును ఆధారముగా చేసికొని వ్యక్తిత్వాన్ని అనుభవిస్తూ, **ఈ దేహమనే పురమునందు నఖశిఖ పర్యంతం సంచరించే చైతన్యశక్తికే "పురుషుడ' 'ని పేరు; సమిష్టిస్వరూపములోపల సమత్వంగా ప్రకాశించి, జగత్తునందు ప్రకటింపబడే దివ్యశక్తికే "పురుషోత్తముడ"ని పేరు.** అనగా, **వ్యష్టిస్వరూపుడు పురుషుడు; సమిష్టిస్వరూపుడు పురుషోత్తముడు.**

(స.సా.అ.91.పు.274)

పురుషుడు ఈ శరీరము నందే హృదయాకాశమున నున్నాడు. అతనివలననే షోడశకళలుత్పన్నములగు

పురుషోత్తముడు

జ్ఞానమనునది వేరువేరునుట నేనొప్పుకొనను. వాటిని వేరువేరు చేసినకూడా నా కిష్టములేదు, కర్మ భక్తి జ్ఞానము సముచ్చయవాదమును కూడా నే నంగీకరింపను. **కర్మయే భక్తి, భక్తియే జ్ఞానము మైసూరుపాకు ముక్క మాధుర్యమూ,** దాని ఆకారము, దాని బరువు మూడునూ వేరు వేరెట్లగును? మనము నోటిలో వేసుకొన్న వెంటనే దాని ఆకారమును తినివేసినాము, దాని బరువును జీర్ణించినాము. అందులోని మాధుర్యమును రుచి చూచితిమి, ఆ మూడు పనులూ కలిసి యొక సారే జరిగినవి కదా? ఒక కణమున ఆకారము, ఒక కణమున బరువూ, మరొకకణమున మాధుర్యమూ లేదు. ఆవిధముగనే **జీవుడూ, ఆత్మ పరమాత్మ వేరువేరుకాదు,** కానేరదు, ప్రతికార్యము సేవామయము, ప్రేమమయము, జ్ఞానమయము కావలెను. జీవితముయొక్క విభాగము లన్నింటిలోనూ కర్మ, భక్తి జ్ఞానములు నిండియుండవలెను. **ఇట్టి వానినే పురుషోత్తమయోగ** మందురు.

(ప్రే.వా.పు.28/29)

పురుషోత్తముడు

(చూ॥ పురుషుడు)

పుస్తకజ్ఞానం

ఈనాడు Bookish Knowledge **(పుస్తకజ్ఞానం)** మాత్రం పెరిగిపోతున్నది. అనుభవ జ్ఞానం (Practical Knowledge) అసలే ఉండటం లేదు. **విచక్షణా జ్ఞానం (Discrimination Knowledge) ఏమాత్రం లేకుండా పోతున్నది.** ఈనాటి Bookish Knowledge రేపు knowledge, తరువాత Elergy గా వికటిస్తున్నది. అదికాదు knowledge **దివ్యమైన Energy గా మారాలిగాని Elergy గా మాత్రం కాదు.** అనుభవం లేని విద్య అక్కరకు రాదు. వక్తిని సముపార్జించి పెట్టని విద్యవలన ప్రయోజనం లేదు. భౌతిక, శారీరక, ఆర్థిక బలములతోపాటు; నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక శక్తులు కూడా కలిసినపుడు అది దివ్యశక్తిగా మారుతుంది. అటువంటి దివ్యశక్తిని విద్యార్థులు సముపార్జించాలి.

(శ్రీ.జూన్.97 పు.73)

పుష్పములు

"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" త్రికాలముల యందును మార్పు చెందనటువంటిది సత్యము, అహింస, ఇంద్రియ నిగ్రహము, శాంతి, సర్వభూత దయ, క్షమ, తపస్సు, ధ్యానమనే పుష్పములు నీలో ఆవిర్భవించిన తరువాత ప్రాప్తించేది **సత్యపుష్పం.** ఇది శాశ్వతంగా హృదయ కమలంలో విచ్చి పరిమళముతో ప్రకాశిస్తుంది. ఈ గుణ పుష్పములతో భగవంతుని పూజించాలి. కాని కేవలం వాడిపోయి, దుర్గంధం వెదజల్లె పూలతో పూజ చేస్తే మన భక్తి ప్రపత్తులు, ఉన్నత స్థాయిలో ఉండవు.

(సా॥పు.309)

(చూ॥ అష్టవిధపుష్పములు)

పుష్యమాసము

దినకరుడు శాంతుడై తోచె దినము లింత
కురుచలయ్యెను, చలిగాలి చురుకు హెచ్చె
పాలములన్ రేయి గ్రుడ్డి వెన్నెలలోన
కుప్పలన్ నూర్పు కాపులు గొంతులెత్తి
పదములన్ పాడ దొడగిరి పచ్చపూలు
జనుప చేలకు ముత్యాల సరుల గూర్చె
మిరపపండ్లు కుంకుమ మెరుపు దాల్చె
బంతి పువ్వులు మొగము లల్లంత విప్పి
మన గృహంబుల ధాన్య సంపదల నిలిపి
సరసురాలైన పుష్యమాసంబు వచ్చె.

(స.సా.వా. పు. 31)

పూజ/పూజలు

(చూ॥ పూవులు, విధులు, సేవ)

పూజించాలి

భగవంతుడు నీ సేవలను కాంక్షించడు. భగవంతునికి నీ పూజలు, పునస్కారాలు అక్కర్లేదు. **భగవంతుడు కోరేది ఒక్కటే ఒక్కటి. అదే నీ ప్రేమ.** అది నీ సొత్తు కాదు, నీ తాత సొత్తూ కాదు; ఒకరి నుండి బహుమతిగా పొందేదీ కాదు; కంపెనీలో తయారయ్యేదీ కాదు; గురూపదేశంతో లభించేదీ కాదు. **ప్రేమ దైవానుగ్రహం.** ఆ ప్రేమ దైవానికే అర్పితం కావాలి. వివాహాలకు, విందులకు వంటసామాగ్రిని అద్దెకు తెచ్చుకుంటావు. వాటిని ఉపయోగించుకున్న తరువాత శుభ్రపరచి, మొదట అద్దెకు తెచ్చుకున్నప్పుడు అవి ఏ స్థితిలో ఉన్నవో ఆ స్థితిలోనే తిరిగి యజమానికి వాపసు చేయవలసి ఉంటుంది. అదేవిధంగా, **భగవంతుడు అనుగ్రహించిన హృదయపాత్రను యథాతథంగా భగవంతునికే అర్పించాలి. భగవదనుగ్రహమైన ప్రేమను భగవంతునికే నివేదించాలి. అదే నిజమైన ఆరాధన.** మరి భగవంతుని ఎట్లా ప్రేమించాలి? **"ది బెస్ట్ వే టు లవ్ గాడ్ ఈజ్ టు లవ్ ఆల్ ఎండ్ సర్వ్ ఆల్"**. అందరినీ ప్రేమించాలి, సేవించాలి అప్పుడే భగవంతుణ్ణి ప్రేమించిన వాడవవుతావు. భగవంతుడు ఆశించేది ఏదీ లేదు. సర్వమునూ అనుగ్రహించేవాడు, సర్వమూ తానైనవాడు ఆశించడమేమిటి! **పవిత్ర హృదయమే దైవమందిరం.** పవిత్రత అనగా మనోవాక్కాయకర్మల ఏకత్వమే. అదే నేను అప్పుడప్పుడు చెపుతుంటాను: **The proper Study of mankind is man.** నిస్స్వార్థ భావంతో, నిర్మల మనస్సుతో, ప్రేమతో చేసిన కర్మలన్నీ భగవదారాధనలే అవుతాయి. **Work will be transformed into worship.** మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించండి. "డ్యూటీ ఈజ్ గాడ్". సమాజ సేవయే సర్వేశ్వర పూజ. మానవసేవయే మాధవసేవ. వాడిపోయే, రాలిపోయే పుష్పాలు భగవంతుణ్ణి సంతృప్తి పరచలేవు. **నీ హృదయ బృందావనంలో పూచే సద్గుణాలనే సుగంధ పుష్పాలతో భగవంతుణ్ణి పూజించాలి.**

(స.సా.డి.98 పు.336)

పూతన

(చూ॥ సంకల్పము)

పూరకము

(చూ॥ ప్రాణాయామము)

పూర్ణప్రేమ

పూర్ణప్రేమయందె పుట్టును **సౌఖ్యంబు**
సత్య త్యాగ శాంతి క్షాంతు లబ్బు
ప్రేమ లేకయున్న క్షేమంబు లేదయా
సత్యమైన బాట సాయి మాట.

(శ్రీ.గీ.పు.1)

పూర్ణ మనస్సు

ఒకనొక సమయంలో రాధమ్మ తన చెలికత్తెలను తీసుకొని మధుర నుండి బృందావనికి బయలుదేరింది. పడవలో తెల్లవారకమునుపే లేచారు. గుంపంతా పడవలో కూర్చున్నారు. వంతుల ప్రకారం ఒకరి తరువాత ఒకరు తెడ్లు వేసుకుంటూ నడుపుతున్నారు. ఎంత సేపో చేసారు. ఈ డ్రైవింగ్! చేతులంతా నొప్పి చేసాయి. తెల్లవారింది. కాని, పడవ మధుర రేవులోనే ఉంది! మధుర వాళ్ళంతా వచ్చి నీళ్ళు ముంచుకు పోతున్నారు. ఏమిటా దీనికి కారణం? అని చూసుకుంటే, ఆ పడవ **ఒక కట్టకు కట్టివేయబడి వుంది.** ఆ కట్టకు కట్టిన త్రాడును వాళ్ళు విప్పలేదు. పాపం! అది విప్పకుండా ఎంతసేపు తెడ్డు వేసినా పడవ ముందుకు కదులుతుందా? ఉన్నచోటే ఉంటుంది. అదే విధంగా మనం ఎన్ని సాధనలు చేసినా,ఎన్ని జప తపములు చేసినా, **అభిమానంతో కట్టిన మనస్సును విప్పకపోతే చేరవలసిన స్థానమును చేరలేము. ముందు అహంకార, మమకారములనే త్రాడును విప్పాలి. త్యాగం చేయాలి. అన్ని విధాల బంధ విముక్తి గావించుకున్నప్పుడే పూర్ణ మనస్సు ఆవిర్భవిస్తుంది. పూర్ణ మనస్సు నందు ఎలాంటి దోషాలు కనిపించవు.**

(శ్రీ.భ.ఉ.పు.179)

పూర్ణము

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే॥
అదీ పూర్ణము, ఇదీపూర్ణము, పూర్ణములో నుండి పూర్ణమును తీసివేసినా మిగిలేది పూర్ణమే. ముక్కలు కానక్కరలేదు.

(శ్రీ.భ.ఉ. పు.29)

(చూ॥ పరిపూర్ణుడు)

పూర్ణ స్వతంత్రుడు

అంతులేకుండా ఉత్తరములు నాకు చేరుతూనే ఉంటాయి. **అన్ని ఉత్తరములను చదివి** ఉదయం 10 గంటల సమయములో **వాటిని కాల్చి వేయుదును. ప్రతి ఒక్కటి నేనే స్వయముగా చేయుదును.** దాని వలన అంతా సక్రముగా జరుగుతుంది. **నేను ఎన్నడూ నిద్రించను.** రాత్రి సమయములో దీపములను ఆర్పివేసి ప్రక్కపై విశ్రమించెదను. దీపములు వెలుగుతూనే ఉంటే భక్తులు గుమికూడెదరు. నాకు నిద్రించవలసిన అవసరం లేదు. కాని మానవులకు కనీసము నాలుగు గంటల నిద్ర అవసరము. కొందరనుకోవచ్చును. నేను సాయంకాలము 4 గంటల వరకు నిద్రించెదనని, కాని, **నాకు విశ్రాంతే లేదు. నేను ఎన్నటికీ అలసిపోను.** ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటాను. ముగ్గురు, నలుగురు బంధువులు వస్తేనే గృహస్థులు తలక్రిందులవుతారు. కాని నన్ను దర్శించే వారికి అంతే లేదు. నేను పండితులకు, కళాశాలలకు, లక్షలాది భక్తులకు చెందిన ప్రతి చిన్న విషయాన్ని స్వయముగా చూచుకొనవలసి యున్నది. చాలామంది విషయములో వారు చేయు కార్యము యొక్క బాధ్యత ఇంకొకరిపై ఉంటుంది. కాని **ఇక్కడ కార్యములే కాక వాటి ఫలితముల బాధ్యత కూడా నా భుజస్కంధములపై ఉన్నది.**

సాధువులు, యతులు, ఋషులు యోగులు ఎక్కడ ఉన్నా వారికి సూచనలిస్తూ వారిని సంరక్షించెదను.

అది ఈ విధముగా ఉంటున్నది. నేను స్విచ్ వంటి వాడిని. స్విచ్ వేయగనే అన్నీ వాటంతటవే పనిచేయుట ప్రారంభించును. తాళము చెవి త్రిప్పగనే కారు భాగములన్నీ ఏ విధముగ తిరుగుట మొదలిడునో ఆ విధముగనే ఈ విశ్వమంతా క్రమబద్ధము చేయబడును. లీలలుగా భావింపబడునవి లీలలు కావు. అవి దివ్యత్వమును నిరూపింపలేవు. **విశ్వములోని ఈ అంతు లేని కార్యాభారాన్ని అతి సులభముగా అనాయాసముగా, ఆనందముగా నేను నిర్వహించుటయే లీల.**

ఎటువంటి సంఘటనలోనైనా, ఎల్లవేళలా నేను సంతోషముగానే ఉంటాను.

వరద నీటిపై ప్రయాణించే పడవ, నీటిని పడవలోకి రానీయనపుడు ఆ పడవలోని వ్యక్తి ఎంత ప్రశాంతత ననుభవించునో అట్లే ఎట్టి విచారములు కాని, విషయములు కాని నా బ్రహ్మానంద స్థితిని చెడగొట్టలేవు. కాని సామాన్య మానవులు నావలె ప్రవర్తించరు. వారు నీటిని పడవలోకి అనుమతించెదరు. అంటే అన్ని విచారములకు, విషయములకు స్థానము కల్పించెదరు. దీనివలన ఆనందోత్సాహములకు తావుండదు. మానసిక ప్రశాంతతకు భంగము కలుగును. నా బ్రహ్మానందస్థితి ప్రపంచముతో సంబంధము లేకనే ఎల్లప్పుడూ ఒకే విధముగ నుండును. ప్రతి నెలా నేను కొన్ని వందల వేల రూపాయలను ఖర్చును పెట్టుకోవలసి యున్నది. **నా భుజస్కంధములపై పాఠశాలల కార్యములు, ఆశ్రమ విషయములు, నాకు భౌతికముగా సన్నిహితముగా నున్నవారి విషయములు, భక్తులకు ప్రసాదించు ప్రత్యేక సంభాషణావకాశములు, ఆరోపణలు, ఉత్తర ప్రత్యుత్తరములు, ఇతర సమస్యలు ఉన్నాయి. ఇది అంతా భౌతిక దేహ స్థాయిలోనిది. అదే సమయములో మానసిక స్థాయిలో నా కొరకు పరితపించే యతులు, యోగులు, ఋషులు, సాధకులు ఎక్కడ ఉన్నా వారికి సూచనలిస్తూ, సంరక్షించుతూ, ప్రతిక్షణమూ వారితో హృదయ సంబంధము పెట్టుకొనెదను. కాని ఇవేవి నన్ను**

పూర్ణుడు

ప్రయాణమై గ్రామాంతరము పోవుచున్న వ్యక్తికి మార్గమధ్యమున నది అడ్డు తగిలినది. అది పొంగి పొరలుచున్నది. దాటుటకు బాటసారి ప్రయత్నించెను. ఎవరో ఇరువురు చెట్టుక్రింద కూర్చొని యుండగా అక్కడకి వెళ్ళిచూచెను. అక్కడ ఒకడు కుంటివాడు. రెండవవాడు గ్రుడ్డివాడు. వారికి లోతు పాతులు తెలియవనియు వారు చెప్పుమాటలు నమ్మ రాదనియు ఆగంతకుడు వెనెకకు పోయెను. అనగా **శాస్త్రజ్ఞానము లేనివాడు గ్రుడ్డివాడు, అనుభవజ్ఞానము లేనివాడు కుంటివాడు. ఒట్టి శాస్త్రజ్ఞానము, ఒట్టి అనుభవమును రెండును అసంపూర్ణములు. రెండును చేరినప్పుడు పూర్ణుడు, వాడే శిష్యుని ఉద్ధరించగలడు.**

(సా॥పు.501)

పూర్వమీమాంస

పూర్వమీమాంస 'అథాతో బ్రహ్మజిజ్ఞాసా'' అని ప్రారంభ మగుచున్నది. ఇట్టి ప్రాప్తి ధనము చేత, దానివలన పొందబడు చదువలచేత, అధికారముల చేత లభించదు. డిగ్రీలు డిప్లమాలు, యజ్ఞయాగాది క్రతువులు మొదలైన వేవియు అజ్ఞాన నివృత్తి నొసగజాలవు.

(సూ.వా.పు. 4)

(చూ॥ దర్శనము, వేదము, వేదార్థములు)

పూర్వావతార మహత్త్వము

గోపాల బాల రారా
శ్రీ సాయి నాథ రారా
ఓ జంగమయ్య రారా
నీ హేమలింగ మీరా ॥గోపాల॥
పత్రీలో బ్రాహ్మణులకూ
పుత్రుండవైతి వీవూ
పక్కీరు దంపతులకూ
చిక్కీతి వయ్యా నీవూ ॥గోపాల॥

చలింపచేయలేవు. ఒక్కొక్క పర్యాయము నేను కోపముగా అసహనముగా, ఎవరితోననూ కలవకుండా దూరముగా ఉన్నట్లు కనపడినా, నేను నిరంతరము బ్రహ్మానంద స్థితిలోనే ఉంటాను. కోపము ఒట్టి శబ్దము మాత్రమే. అది కొన్ని పరిస్థితులను చక్కదిద్దుటకై అవసరము. అట్లా ఎవరితోనూ కలువకుండా ఉండడము, దూరముగా ఉండడము నేను ఆ సమయ సందర్భములకు **తగనట్లుగా వేసే వేషములే. వాస్తవమునకు నా ప్రేమ, బ్రహ్మానంద స్థితివలె నిరంతరమైనది, మార్పులేనిది.**

నేను నా అనంత దేహములతో, అన్ని ప్రదేశములలో కార్యములను నిర్వహించుదును. సహస్ర శీర్ష పురుష సహస్రాక్ష సహస్ర పాదుడు భగవంతుడు. ఈ ఒక్క దేహమే మీతో కూర్చొని మాట్లాడుతున్నది. ఇది, నేను సర్వాంతర్యామినని తెలుపుచున్నది. అవతారము పంచభూతములకు అతీతము. అతడే సృష్టికర్త. అర్జునుడు వశమునందుంచుకొనువాడు, కృష్ణుడు **సృష్టికర్త. విజ్ఞాన శాస్త్రము బాహ్యమైనది. ప్రజ్ఞానము అంతర్గతమైనది.** మనిషి బహిర్ముఖుడై యంత్రములను సృష్టించును. అంతటితో అతని ఆధిపత్యము ముగియును. కొన్ని నెలల క్రితము మరణించిన ఆ ముగ్గురు రోదశీ యాత్రికుల విషయము చూడండి. భగవంతుడు ఎటువంటి పరిమితులకు లోను కాడు. పంచ భూతములను సృష్టించేవాడు, మార్పుచేయువాడు, పరిరక్షించేవాడు, నాశనము చేయువాడు భగవంతుడే. అవతార పురుషునకు జన్మలేదు. కాని అవతార పురుషుడు జన్మించినట్లుగా, క్రమేణ సామాన్య రీతిలో పెరిగి పెద్దైనట్లుగా గోచరించుచున్నది. మనకు కనపడే ఈ దేహములు అశాశ్వతములైనవి.

అవతార పురుషుడు పైన వివరించిట్లుగా దేహమును ఆశ్రయించును. ఇక్కడ తేడా ఏమిటంటే మానవులు వారి భావనల, కర్మల ఫలితముగా దేహములను ధరింతురు. **నేను ఈ భావనలేవీ లేకుండా, పూర్ణస్వతంత్రుడనై, వాంఛా రహితుడనై, బంధ రహితుడనై, సదానంత స్వరూపుడనై దేహమును ధరించితిని.**

(ప.పు.118/121)

పూవులు

బాలూడవౌచు నీవూ
గోలీల నాడునపుడూ
లింగంబు మ్రింగి తీవీ
లింగేశుడైతి వౌరా ॥గోపాల॥
అంగాన గొట్టి నిన్ను
లింగంబు జూపు మనగా
రంగైన నీదు లీలా
శృంగారముగను జూపి
లింగంబు జూపితీవి
ఇది ఏమి మాయ యవురా ॥గోపాల॥
తరిమేసి రయ్య నిన్ను
తల్లి దండ్రి దయనులేక
తిరిగీతివయ్య నీవూ
తిరిపెంపు వృత్తి వలన ॥గోపాల॥
నట్టడవి యందు నీవు
నాబాబురాజు నొకని
గుట్టంబు తెరగు జెప్పి
దరిజేర్చి బ్రోచితీవి ॥గోపాల॥
శిరిడి యందు నీవు బాగా
సిద్ధొంది తీవి సాయీ
పుట్టపర్తి గ్రామ మందు
పట్టొందితీవి మరల ॥గోపాల॥
పుణ్యముల కాకరమ్ము
పుట్టపర్తి పురవరమ్ము
నరలోక పూజ్యుడీవు
దొరపంపనరసనేలూ ॥గోపాల॥
సిరులొసగి బ్రోచునట్టి
శ్రీ సత్యసాయి దేవా
భక్తులను మరచిపోకా
దరిజేర్చి బ్రోవరావా ॥గోపాల॥

(లో.పు.53/54)

పూవులు

పూవులెన్నో తెచ్చి పూజలు చేసిన
మెచ్చబోడు, తాను పుచ్చుకొనడు
హృదయకమల మివ్వ సదయుడై గ్రహియించు
సత్యసాయి ప్రేమశాంతిదాయి

(స.సా.సె.2000పు.270)

పృశ్ని

పరమేశ్వరు పృశ్ని గర్భుడు. **పృశ్ని అనగా పరిశుద్ధము, పవిత్రము, నిర్మలం అని అర్థములు.** పరమేశ్వరుని బుద్ధి దోషరహితమని అర్థము.

ఋషులు మంత్రద్రష్టలై పరిశుద్ధాన్త కరుణులై బ్రహ్మ ప్రేరితులై తదనుగ్రహ పాత్రులై తపస్సమాధిలో మంత్రజాతమును దర్శించిరి. అట్టి మంత్రములను దర్శించిన మంత్ర ద్రష్టలు కూడా భగవంతుని పృశ్ని గర్భుడని వర్ణించిరి. అయితే **మంత్ర ద్రష్టలగు ఋషులు కర్మబద్ధులై మరల జన్మించువారు కారు.** కల్పాదియందు మాత్రమే బ్రహ్మచే సృజింపబడుతారు. కాన **వీరిని అజుఁ అని కూడా శ్రుతి చెప్పినది. వారు సహజముగనే పరిశుద్ధాఁ కరుణులు. వారు పృశ్ని అని పిలువబడిరి.** అట్టి పరిశుద్ధ స్వరూపులై తపము నాచరించిరి. ఆ తపస్సమాధిలో స్వాయంభువనమగు బ్రహ్మ వారికి అభివ్యక్త మాయెను. బ్రహ్మసాక్షాత్కారమును బడిసి. బ్రహ్మయజ్ఞమును దర్శించిరి.

(లీ.వా. పు. 13/14)

(చూ॥ బ్రహ్మయజ్ఞము)

పెండ్యులమ్

(చూ॥ సర్వమూ భగవంతుడే!)

పెట్రోమాక్స్‌లైట్

మీకు నిత్యజీవితంలో కొన్ని అనుభవములుండ వచ్చును.

(ప్రే.జో.పు.273)

పెద్దపాపము

పెట్రోమాక్స్‌లైట్‌కి ఎంత పంపుకొట్టినప్పటికినీ, అప్పుడప్పుడు దానికి పిన్ను త్రిప్పాలి. అందులో కొంత కిరసనాయిలు కూడా పోయాలి. కిరసనాయిలు అనేది మన శ్రద్ధ. మన ప్రేమయే పిన్ను. మన విశ్వాసమే పంపు. ఈ మూడింటితో పాటు దివ్యమైన నామమనే వత్తి లైటుకు ఉన్నప్పుడే, దివ్యప్రకాశాన్ని ఇతరులకు అందించడానికి వీలు ఏర్పడుతుంది. ఈ ఉదాహరణ నుండి గురువులు స్ఫూర్తిని గైకొని, దివ్య ప్రకాశమును బాలబాలికలకు అందించి, వారిలో ఉన్న ఆజ్ఞానమును పారద్రోలాలి. ఈ మహత్తర ప్రయత్నం సఫలీకృతం కావాలంటే మొట్టమొదట గురువులకు శ్రద్ధ ఉండాలి. **పిల్లలలో చదువు మీద శ్రద్ధను కలుగజేయాలి. తరువాత గురువులు ప్రేమతో పిలిస్తే పిల్లలు దగ్గరకు వస్తారు. ప్రేమతో బుజ్జగిస్తే మాట వింటారు. కోపంతో దెబ్బకొడితే దూరంగా పోతారు. కనుక బాలబాలికల మీద ప్రేమ జల్లులు కురిపించాలి. వారిలో ప్రేమ బీజములు నాటాలి. పిల్లలలో విశ్వాసాన్ని కలుగ జేయాలి. విశ్వాసం లేనివాడు ఎందుకూ కొరగాకుండా పోతాడు. తన శక్తి మీద తనకు విశ్వాసం ఉండాలి. భగవంతుని మీద విశ్వాసం ఉండాలి. శ్రద్ధ, ప్రేమ, విశ్వాసములతో పాటు భగవన్నామం మీదకు బాలబాలికల దృష్టిని మరల్చాలి. "భగవన్నామమే, భవసాగరమును దాటించే నావ"** ఈ నాలుగు సద్గుణాలను బాలబాలికలలో పెంపొందించటానికి గురువులు కృషి చేయాలి.

(శ్రీ. జూ. 97 పు.58)

పెద్దపాపము

పరులను హింసించుట పెద్దపాపము. పరులను ఆనందపరుచునది పెద్ద పుణ్యము. పాపభీతి. దైవప్రీతి ఇవి రెండూ మానవుని అభ్యున్నతికి అత్యవసరము. ఎవరినీ దూషించక అగౌరవపరచక హాస్యాస్పదము గావించక, అందరితోను మృదుమధురముగా మాటలాడి స్నేహసౌహార్ధములతో మెలగవలెను. జీవితమునకు కృతజ్ఞతయే శోభ. గౌరవమే కీర్తి. **జ్ఞానార్జనే మానవుని యొక్క జన్మకు సార్థకత.**

(సీ.పు.328)

పెద్దహాస్పిటల్

ఈ ప్రపంచమంతా ఒక పెద్ద హాస్పిటల్. మానవులందరూ ఇందులో రోగులుగా ఉన్నారు. కొందరు అసూయతో బాధపడుతున్నారు. కొందరు గర్వంతో అనారోగ్యంగా ఉన్నారు. కొందరు ద్వేషంతో నిద్రలేకుండా ఉన్నారు. కొందరు లోభంతో అంధులై ఉన్నారు. కొందరు స్వార్థంతో దిగజారిపోయి ఉన్నారు. ప్రతి వ్యక్తికీ ఏదో ఒక అనారోగ్యం ఉంది. ఈ గురుపూర్ణిమ రోజున మీ రోగాలను గుర్తించి మీకు నివారణోపాయాలను చెప్పిన డాక్టరు యెడల మీరు కృతజ్ఞులై ఉండాలి. ఆ డాక్టరు మీకు చెప్పిన మందులను ఈరోజు నుంచి వాడాలని మీరు నిర్ణయం తీసుకోండి. అంతేకాని మందుల పట్టీని కంఠస్థం చేస్తే, లేక మందుసీసా మీద ఉన్న విషయాలను రోజుకు మూడు సార్లు వల్లిస్తే, లేక ప్రతిరోజు హాస్పిటల్‌కి వస్తుంటే ప్రయోజనం లేదు. మీరు కేవలం డాక్టరుని పొగుడుతూ ఆయనను పూజిస్తూ ఉంటే మీ స్థితికి జాలి కలుగుతుంది. మీరు ఆ డాక్టరు చెప్పిన మందులు వాడితేనే, ఆయన చెప్పిన ఆహారనియమాలు పాటిస్తేనే మీరు ఆనారోగ్యం నుంచి బయటపడతారు.

(వ61-62 పు.54)

పెన్నిధి

(చూ॥ సనాతనసారథి, సేవ)

పేడ

పూర్వము **ఆవుపేడను నీటిలో కలిపి,** ఇంటిముందర చల్లుకోవటం వాడుకలో ఉండినది. **"ఈ పేడనీళ్ళను ఇంటిముందు చల్లుకునేబదులు, మార్బుల్‌స్టోన్ను**

పేపర్‌వెయిటా?

అమర్చుకొని, శుభ్రముగా పెట్టుకోవచ్చు గదా!''అని నేటి సైంటిస్టులు భావిస్తున్నారు. కాదు, కాదు ఈ పేడలోపల క్రిములను చంపే శక్తిగల పదార్థముంటున్నది. పేడనీళ్లను ఇంటి ముందర చల్లినప్పుడు, ఇంటి ముందున్న విషపురుగులన్నీ నాశనమౌతాయి. తద్వారా మనుష్యుల ఆరోగ్యం అభివృద్ధి అవుతుంది. దురదృష్టవశాత్తు నేటి సైంటిస్టులు ఇటువంటి చిన్న చిన్న విషయాలను పరిశోధించకుండా, ఎక్కడో మైళ్ళదూరంలోనున్న సూర్యచంద్రులను పరిశోధించుటకై ప్రయత్నిస్తున్నారు.

(స.సా. అ.91 పు. 261/262)

(చూ॥ గొబ్బిలు)

పేపర్‌వెయిటా?

తులసీదాస్ చెప్పాడు: "రత్నం యొక్క విలువ తెలిసినవాడే దానికి తగిన బందోబస్తును ఏర్పాటు చేసి పెట్టెలో పెట్టి తాళం వేస్తాడు.'' వజ్రం యొక్క విలువ తెలియని మూర్ఖులు టేబుల్‌పైన పేపర్‌వెయిటుగా పెట్టిదానిని అలక్ష్యం చేస్తుంటారు. అదేవిధముగ మానవత్వం యొక్క విలువను తెలిసినటువంటివాడు, దీనిని బజారులో మసిబొగ్గులకు అమ్ముకోవటానికి ప్రయత్నించడు. కనుక మొట్టమొదట మానవత్వమంటే ఏమిటి? దీని విలువ ఏమిటి? అనేటటువంటిది. తల్లిదండ్రులు పిల్లలకు నేర్పాలి. ఏమి నేర్పగలరు? వారికే లేవు ఆగుణములు! పిల్లలకు ఏమినేర్పగలరు? కనుక మొట్టమొదట తల్లి దండ్రులు కూడా నేర్చుకోవాలి.

(శ్రీ.సా.గీ.పు.42)

పేరాస

పేలాలపైన పేరాస విడువలేక
బోనులో నెలుకలు చిక్కి పోయినట్లు
తుచ్ఛవిషయ సుఖాసక్తి తూలినరుడు
వద్దనున్న బ్రహ్మానంద పదవి వదలు.

(స.సా.వా. పు. 96)

పేరు

"నాకు పేరు లేదు. ఏ పేరు పెట్టి పిలిచినా పలుకుతాను. నాకొక చోటంటూలేదు. నేను అన్ని స్థలాలకూ చెందిన వాడిని. నేను ఎక్కడ అవసరమో - అక్కడ ఉంటాను.''

(లో.పు.5)

(చూ॥ పద్మపురాణం, శాంతి)

పేషంట్లు

నా ఉద్దేశ్యమేమిటంటే - **ధనం కోసం మీరు పాటుపడకండి, బాధపడకండి. మీరు ప్రేమతో పేషంట్లకు సేవ చేయండి. మీరు ప్రేమతో పేషంట్లకు సేవ చేయండి.** ఈ ప్రేమ అనేది కేవలం పుచ్చుకొనేది కాదు. Give and Take. **మీరు Charge చేయండి.** కాని, **Treatment చేసే సమయంలో ప్రేమతో చేయాలి. ఇది సరియైన మార్గంగా ఉంటుంది.** అప్పుడు అన్ని కేసులూ Success అవుతాయి మన ప్రేమను బట్టి పేషంట్స్ కూడా చాలా ఆనందిస్తారు. కనుక-

Start the day with Love
Spend the day with Love
Fill the day with Love
End the day with Love
This is the way to God.

ఈరకమైన ప్రేమతో మనం జీవితాన్ని గడపాలి. కొంతమంది చాలా శ్రమపడి అలసిపోతుంటారు. అది నిజమే. దానికి తగిన విశ్రాంతి కూడా ఉండాలి. మన ఆమెరికన్ డాక్టర్ స్వామి చెప్పినది Quote చేసాడు. "You can't always oblige; but you can speak always obligingly'' అన్నాడు. అదే విధంగా మనము మంచి మాటలను చెప్పాలి, చేసే పనులను ప్రేమతో చేయాలి. డాక్టర్లు నవ్వుతూ ఉంటే పేషంట్లూ కూడా నవ్వుతూ ఉంటారు.

(స.సా.మా.93 పు.66)

పొత్తు

నీటికిని నిప్పుకూ ఎట్లు పొత్తు కుదరదో అటులనే ద్వేషము నకూ భక్తికీ పొత్తు కుదరదు. ఖేదమోదములు, రాగద్వేషములు, మంచిచెడ్డలు లేకుండా, **అన్నింటికినీ సమానముగ చూచువారలే నాకు ప్రియులు అని కూడనూ తెలిపెను. ఏ రూపమునైననూ సరియే ద్వేషవృత్తి అంతఃకరణమునందు వుండిన, వాడు భక్తుడు కాజాలడు "వాసుదేవస్సర్వమిదం"** నమస్తము వాసుదేవుడనే భావము వుండవలెను. తన ఆత్మయే అంతటనూ, అన్నింటనూ వున్నదని తలంచి, చరించి, భావించి, దేనిని ద్వేషించిననూ తనను తాను ద్వేషించుకొన్న వాడగును.

(గీ.పు.196)

పోతరాజు (పోతన)

(చూ॥ ముగ్గురు రాజులు)

పోస్టుమాన్

భగవంతుడు ఒక పోస్టుమాన్ వంటివాడు. ఈ పోస్టుమాన్ ఒక ఇంటిలో ఒక జాబు ఇస్తాడు. మరొక ఇంట్లో వేరొక జాబు ఇస్తాడు. మొదటిజాబు వచ్చిన ఇంటివారు ఘొల్లున ఏడుస్తారు. రెండో ఇంటిలో వారు ఘక్కున నవ్వుతారు. వారు నవ్వటానికి వీరు ఏడవటానికి కేవలం పోస్టుమానా కర్త? కాదు... వారికి వచ్చిన జాబులే కారణం. కనుకనే మంచి చెడ్డలనేవి భగవంతుడు అందిస్తున్నాడు. **ఏడ్చేది, నవ్వేది మీ యొక్క ప్రవర్తనల ఫలితము వల్లనే. ఇతను కేవలం సాక్షీభూతుడు.**

(శ్రీ.సా.గీ. పు. 27)

ప్రకృతి

ప్రకృతి శక్తిని అనుసరించి దానికి వశుడై మానవుడు స్వసామర్థ్యమును ప్రకటించవలసియున్నది. తన బుద్ధిబల, ధనబల, భుజబలముల వలన తాను తన అభీష్టమును నెరవేర్చు కొన్నాడనని వాడు విఱ్ఱవీగవచ్చును; కానీ, స్వప్రయత్నము చేత మాత్రము ప్రకృతిని వశము చేసుకొనుట అసాధ్యమైన పని. దైవము యొక్క అనుమతి లేక ప్రకృతిని స్వాధీనపరచుకొనుట సాధ్యముకాదు. దీనికి చక్కని ఉదాహరణము, రామాయణము. **రాముడు, పరమాత్మ స్వరూపుడు; సీత ప్రకృతి స్వరూపిణి. ప్రకృతి పరమాత్ముని సొత్తు; సీత రాముని సొత్తు.** అయితే, రావణుడు ప్రకృతిని ఆశించి, పరమాత్ముని ప్రక్కకునెట్టి తిరస్కరించినాడు; తత్ఫలితముగా తన్నూ, తన కులమునూ నాశనము చేసుకొన్నాడు. దైవము ప్రకృతి ధాత. ఆ దైవము అక్కరలేదన్న, అది ఎంత వెఱ్ఱి తనము? రాముని ఆగ్రహమునకు పాత్రుడై తీరని అపకీర్తిని సంపాదించుకొన్నాడు. **దేహము ప్రకృతి; ప్రాణము పరమాత్మ; ప్రాణమే దేహమునకాధారము. ప్రకృతిని పరమాత్మ నిమిత్తమై ప్రవేశ పెట్టవలెను. "పరోపకారార్థం మిదం శరీరం"** అనుసూక్తి ఈ మార్గమనే ఉపదేశించుచున్నది.

(స.సా.మా.77.పు.6)

జాతి భేదములేక జనులకాశ్రయమిచ్చి
సర్వసమత్వంబు చాటు తరులు
తనువుపై మనకింత తమకంబు వలదంచు
చలి ఎండ వానలసైచు గిరులు
రేపుమాపటికంచు వాపోవ వలదంచు
విహంగముల్ సంతృప్తి విద్యగఱపు
జగము నిత్యము కాదుసంసారమిది భ్రాంతి
అనుచు సర్వము త్యజించిపోవు వారు
నాదినాదంచు భ్రాంతి అనిత్యమంచు
ఏడ్చు ప్రకృతి జనని! కన్నీటి భాష్పంబు తెలుపు
ప్రాణి సర్వసుఖములననుభవించగోరి
ప్రకృతియే పాఠశాల శ్రీధరుడే గురువుగాక

(శ్రీ.ఆ.99.పు.7)

ప్రపంచమే ఉత్తమ విద్యాలయం ప్రకృతే ఉత్తమ గురువు

(సా.యా.రెండవ మొదటికవరు పుట)

ప్రకృతిలోని బ్యాలన్సు

భూమి తనచుట్టూ తాను తిరగటం చేత రాత్రింబవళ్ళు ఏర్పడుతున్నాయి; సూర్యునిచుట్టూ తిరగటంచేత ఋతువులు ఏర్పడి, పంటలు పండి, ప్రజలకు తిండి తీర్థాదులు చేకూరుతున్నాయి. భూమి ఈ విధంగా తిరగటం లోక్షేమంకోసమే గాని, తన స్వార్థంకోసం కాదు. తనచుట్టూ తాను తిరగటంచేతను, సూర్యునిచుట్టూ తిరగటంచేతను భూమికి వచ్చే ఆదాయమేమీ లేదుగాని, దానివల్ల ప్రజలకు ఎంతోమేలు కలుగుతున్నది. ఈరీతిగా, **భూమి క్షణమైనా విశ్రాంతి లేకుండా నిస్స్వార్థంగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ప్రజలకు చక్కని ఆదర్శాన్ని అందిస్తున్నది. ప్రతి మానవుడు భూమిని ఆదర్శంగా తీసుకొని తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. కర్తవ్యాన్ని నిర్వర్తించడమే నిజమైన మానవత్వం.** కాని, నేటి మానవుడు తన కర్తవ్యాన్ని విస్మరించాడు. జడమైన యంత్రాలు కూడా తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాయిగాని, ప్రాణం కలిగిన మానవుడు మాత్రం తన కర్తవ్యాన్ని విస్మరిస్తున్నాడు. కనుకనే, కష్టాల ననుభవిస్తున్నాడు. కేవలం శ్వాస ఉన్నంతమాత్రాన మానవుడు జీవించియున్నాడని భావించడం పొరపాటు; కర్తవ్యాన్ని నిర్వర్తించని వాడు జీవించియున్నా మరణించినట్లే! భగవద్గీతలో కృష్ణుడు చెప్పాడు.

నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి.

"పార్థా! నాకు ఈ ముల్లోకాలలో కావలసింది ఏమీ లేదు. నేనీ కర్మలను ఆచరించవలసిన అక్కర్లేదు. నేనే సర్వమునైయుండగా నాకు కర్మలతో పనేముంది! కాని, నేనే కర్మలను ఆచరించకపోతే ప్రజలు ఆచరించరు. కనుక, ప్రజలకు ఆదర్శాన్ని అందించే నిమిత్తం, ప్రజా సంక్షేమ నిమిత్తం నేను కూడా కర్మలను ఆచరిస్తున్నాను. ఇది నా కర్తవ్యం, " అన్నాడు. **అయితే, మీ కర్తవ్య మేమిటి? ప్రకృతిలో జన్మించినందుకు మీరు ప్రకృతిని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రకృతి అందరికీ ఉపకారమే చేస్తున్నది. కనుక, మీరు కూడా సమాజానికి ఉపకారం చేయాలి.** అప్పుడే మీరు ప్రకృతిబిడ్డ లనిపించుకోవడానికి అర్హులౌతారు. కృష్ణుడు అర్జునుణ్ణి 'పార్థా!' అని సంభోదించాడు. పార్థుడనగా పృథ్వీ పుత్రుడని అర్థం. ప్రతి మానవుడు పృథ్వీ పుత్రుడని అర్థం. ప్రతి మానవుడు పృథ్వీపుత్రుడే. కాబట్టి, ప్రతి మానవుడు పార్థుడే. తాను పృథ్వీకి పుత్రుడైనందుకు పృథ్వియొక్క ఆదర్శాలను అనుసరించాలి. ఇదియే మానవుని కర్తవ్యం. **"కర్తవ్యం యోగ ముచ్చతే,"** కర్తవ్యాన్ని నిర్వర్తించడమే నిజమైన యోగం. మిగిలినవన్నీ రోగాలే!

(స.సా.జూ.2000 పు.183)

ప్రకృతికి క్షేత్రమని మరొక పేరు కూడనూ కలదు. ప్రకృతి అన్ననూ, క్షేత్రమన్ననూ వక్కటియే. ప్రకృతి అనగా ప్రపంచము. అందులో రెండు వస్తువులున్నవి. వకటి జడము రెండవది చైతన్యము, అనగా ఒకటి ద్రష్ట రెండవది దృశ్యము. తెలుసుకొనునది అహం వస్తువనియు, తెలియబడునది ఇదం వస్తువనియు అందురు. గుణముల యొక్క వికారము ప్రకృతి నంబంధములు. సుఖదుఃఖ మోహ రూపములయిన సత్వరజస్తమోగుణములు **ప్రకృతి గుణములు.** కర్తృత్వ భోక్తృత్వ ధర్మములు **'ప్రకృతికి సంబంధించినవే'**

(గీ.పు.199)

(చూ॥ అగ్ని, కాలము, దైవము, భ్రాంతి, సృష్టి)

ప్రకృతిలోని బ్యాలన్సు

(చూ॥ మానవుని పరిస్థితి)

ప్రకాశము

వస్తువులను తెలియజేయుట ప్రకాశమునకు స్వభావము. అట్టి ప్రకాశస్వభావము ఒక ఆత్మకు కలుదు, సూర్యుడు, అగ్ని, ఇతరవస్తువులను తెలుపుచున్నవే కాని రాత్రులందు ప్రసరించునట్టి అంధకారమును అవి తెలుపలేకున్నవి. వాటి ప్రకాశమున కున్ను అంధకారమున కున్ను వైరుధ్యముండుటయే దానికి కారణము.

అయితే ఆత్మ ప్రకాశమునకు అట్టి విరోధము లేదు. అది సర్వ పదార్థమునకు, సర్వరూపమునకు అనుకూలమైనది. అది అన్నింటినీ **ప్రకాశింపచేయును. కనుకనే ఆత్మస్వరూపము. "తం దేవా జ్యోతిషాం జ్యోతిః;" ఆ పరమాత్మను జ్యోతిస్సులకు జ్యోతిస్సుగువాడని దేవతలు స్తుతి చేయుచుందురు. జ్ఞానత్వమే దీని ఆకారము;** దేహము అటువంటిదికాదు. ప్రతి దేహమును పరస్పరము ఆకారమునందు మారుచుండును. ఆత్మ అట్లుకాక సర్వత్ర సమానమైన ప్రకాశించుటచేతను, ఆనందస్వరూపుడగుటచేతను, చైతన్య స్వరూపుడగుటచేతను, బ్రహ్మమే అగుచున్నది. ఇట్టి నిశ్చయమే జ్ఞానమని చెప్పబడును.

(ప్ర.వా.పు.62)

ప్రఖ్యాతి

(చూ॥ నీతి)

ప్రచారము

(చూ॥ ప్రబోధము)

ప్రజాపతి

(చూ॥ ప్రశ్నోపనిషత్తు)

ప్రజ్ఞానం బ్రహ్మ

'ప్రజ్ఞ' అనగా_constant Integrated awareness_ఏ మాత్రము మార్పుచెందేది కాదు. ఒక కాలములో ఉంటే మరొక కాలములో లేకుండా ఉండేది కాదు. అందువలనConstant Integrated awarenessఎప్పటికి, ఎల్లకాలములందు ఎల్ల ప్రదేశములందు ఇది సమంగానే ఉంటున్నది. దీనిని పురస్కరించుకునే **వేదము 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనింది. ఈ ప్రజ్ఞానమే ఆత్మ. ప్రజ్ఞానము, ఎరుక, ఆనందము, నేను, బ్రహ్మ ఇవన్నీ ఆత్మకు పర్యాయ పదములే.** భౌతికమైన లోకము గుర్తించి దీనికి పేర్లు మారుస్తూ వచ్చారు. ఈ టంబ్లరులో నీరుంటున్నది. ఈ నీరును తెలుగు వారు 'నీరు' అని, తమిళులు 'తన్ని' అని హిందీవారు 'పానీ' అని ఇంగ్లీషు వారు 'వాటర్'అని సంస్కృతము వారు 'వారి' అని అంటారు. ఈ విధంగా ఒక్కొక్కరు వారివారి భాషలు పురస్కరించుకొని పేర్లు పెడుతూ వచ్చారుగానీ నీరును ఎవరూ మార్చలేరు కదా. శక్తి అన్నా, ఎరుకఅన్నా, ఆత్మఅన్నా, బ్రహ్మంఅన్నా యివన్ని వారి వారి పర్యాయ పదములుగా మార్చుకుంటూ వచ్చారు. కానీ మానవుడు ఒక్కొక్క పేరును ఒక్కొక్క రూపముగా భావిస్తున్నాడు. ఇది దేహము. ఇది క్షేత్రము. క్షేత్రములో క్షేత్రజ్ఞుడు అనేవాడు ఒకడున్నాడు. ఆ క్షేత్రజ్ఞుడులేక దీనికి క్షేత్రమనే పేరే లేదు. కనుక పేరుకు తగిన ప్రవర్తన అందులో గుర్తింపచేస్తుంది.

(ద.స.స.పు.86/87)

(చూ॥ అయస్కాంతశక్తి)

ప్రజ్ఞానము

(చూ॥ ఈక్షతేర్నాశబ్దం)

ప్రణవతత్త్వము

ప్రణవమే పరతత్త్వము, ప్రణవమే పరమాత్మ, ప్రణవమే సర్వస్వము. దీనిలో మూడు విధములైన శక్తులున్నవి. 1. నాదము 2. బిందువు 3. కళ, నాదమనగా ఏమిటి? **పంచప్రాణములైన - ప్రాణ అపాన వ్యాన ఉదాన సమానములన్నీ ఒక్కతూరి చేరి నప్పుడు ఏవిధమైన ఘోష ఏర్పడుతుందో అదే "నాదము", "ఇది నాశరీరము, ఇది నా ఇంద్రియము, ఇది నా మనస్సు'అనే భేదము లేక, శరీర మనో ఇంద్రియములందు శుద్ధసత్వమైన బుద్ధి కల్గిన తత్వమే బిందువు. ఈ శుద్ధసత్వమైన బుద్ధియందు ప్రతిబింబించే పరతత్వమే - "కళ". భగవంతుడు కళాస్వరూపుడు. సర్వకళలూ అతని నుండే ఆవిర్భవించినవి. కళ అనగా ఏమిటి? సమస్త సృష్టి కళయే!** సృష్టి కళాస్వరూపము! కనుక కళ అనేది ఆత్మకు మాత్రమే సంబంధించినది!

ప్రణవతత్త్వము

"నచికేతా..! శరీరము నశించునది, ఆత్మ నశించనిది. నశించిన ఆత్మ నశించే ఈ దేహమునందే ఉంటున్నది. కనుక ఈ నశించే దేహాన్ని అలక్ష్యం చేసుకోవద్దు. ఎంత వరకు? **నశించని ఆత్మను గుర్తించే వరకు - నశించే దేహాన్ని సంరక్షించుకోవాలి. మానవత్వంలో పరతత్త్వము ఏకమై ఉన్నదేకాని, భిన్నంగా లేదు"** అన్నాడు యమధర్మరాజు. దీనికొక చక్కని ఉపమానమును చెపుతూ వచ్చాడు. జీవాత్మ పరమాత్మల సంబంధము ఎండ నీడల వంటిది అన్నాడు. ఎండలేక నీడలేదు. నీడలో ఎండ కొంత అరూపకంగా కనిపిస్తుంది. నీడలు వేరు వేరుకాని, ఎండ ఒక్కటే...! కనిపించే నీడలలో భేదములుంటున్నాయి కాని, సూర్యునిలో భేదము లేదు. అనంతమైన సముద్రంలో అలలు ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయికాని, అన్నీ సముద్రం నుండి ఆవిర్భవించినవే...! అదేవిధముగా, జీవులందరూ సచ్చిదానందమనే సముద్రము నుండి ఆవిర్భవించినవారే...! అందరి యందున్న ఆత్మతత్త్వం ఒక్కటే...! ఇది ప్రతీ మానవుని యందు ప్రణవస్వరూపములో ఉన్నది. మానవుడు నిద్రిస్తున్నప్పటికి ఈ ప్రణవము నిద్రించదు. అనగా ఏమిటి? ఇది ఉచ్ఛ్వాస నిశ్వాసల రూపంలో గుర్తింపజేస్తున్నది. ఈ ప్రణవము దేహాన్ని వదలినప్పుడు జీవతత్త్వమే లేదు.

ఈ ప్రణవము మానవుని యందు అనేక విధములైన శబ్దరూపములతో కనిపిస్తుంది. దీనినే శబ్దబ్రహ్మము అన్నారు. ఇది చరాచర ప్రపంచమంతా ఉంటున్నది. ఈ శబ్దమునకు రూపమేమిటి? జ్యోతిర్మయమే దీని రూపం. ఈ జ్యోతిర్మయమనేది వాక్ రూపములో ఉంటున్నది. వాక్కును అదుపులో పెట్టుకొంటే మిగిలిన ఇంద్రియములన్నీ సులభంగా వశమైపోతాయి. మొట్టమొదట వాక్కును మనస్సులో చేర్చాలి. అప్పుడు వాక్కు నిల్చిపోతుంది. కాని, **మనస్సు మాట్లాడుటకు ప్రయత్నించినప్పుడు బుద్ధి దానికి బుద్ధి చెప్పి shut-up (నోర్ముయ్!) అంటుంది. ఎప్పుడైతే బుద్ధి మనస్సు యొక్క శబ్దాన్ని అణగద్రొక్కుతుందో - అప్పుడు అందులో ఆత్మతత్త్వము పరిశుద్ధంగా ప్రకాశిస్తుంది. బుద్ధి శుద్ధమైన అద్దము వంటిది. దీని యందు ఆత్మతత్త్వము చక్కగా ప్రకాశిస్తుంది. వాక్కు కంటే అతీతమైనది మనస్సు, మనస్సుకంటే గొప్పది బుద్ధి, బుద్ధికంటే పైస్థాయిలో ఉన్నది ఆత్మతత్త్వం. "నచికేతా...! నీ యందే ఉండిన పరతత్త్వాన్ని నీవు తెలుసుకోవాలని కోరుకోవటం చాలా వెట్టితనం" అన్నాడు యముడు. నీవే పరతత్త్వంగా ఉంటున్నావు.** నీ పరతత్త్వాన్ని నీవేవిధంగా తెలుసుకోగలవు? మానవునికి ముఖము ఉన్నది, లేదని ఎవ్వరూ చెప్పరు. కాని, తన ముఖమును తానే చూడలేకపోతున్నాడు. ఐతే, ముందు అద్దమును పెట్టుకొంటే తన ముఖమును తాను చూడగలుగుతున్నాడు, అదేవిధంగా, తన యందే ఉన్న పరతత్త్వాన్ని చూడాలనుకొన్నప్పుడు - **బుద్ధిని పరిశుద్ధమైన రీతిలో తన ఎదురుగా పెట్టుకొన్నప్పుడు దాని ద్వారా ప్రతిబింబము గోచరిస్తుంది.** కనుక, ఈనాడు మనం చేయవలసినది ఏమిటంటే - **బుద్ధిని పరిశుద్ధం గావించుకోవడమే...!** ఈ "అద్దము" ను పరిశుద్ధము గావించుకోవడానికి దివ్యమైన ప్రేమతత్త్వము కావాలి. అద్దము (Glass) వెనెక రసాయనము పూసినప్పుడే - మన ప్రతిబింబము అందులో కనిపిస్తుంది. వట్టి అద్దములోకి చూస్తే అవతల వైపునున్న పదార్థం కనిపిస్తుందికాని, మన ప్రతిబింబము మనకు కనిపించదు. అదేవిధంగా నీకు పరిశుద్ధ మైన బుద్ధి ఉన్నప్పటికీ అందులో బయటివారి స్వరూపాలు కనిపిస్తాయికాని, నీ స్వరూపము నీకు కనిపించదు. అందువల్లనే. ఈనాడు **ప్రతీ వ్యక్తి పరుల దోషములనే వెతుకుతున్నాడు. కాని, తన దోషాన్ని తాను వెతకటం లేదు...!** కనుక, ఈ బుద్ధి అనే అద్దానికి రెండవవైపున ప్రేమ అనే "రసాయనాన్ని" పూస్తే అప్పుడు తనవే తనకు కనిపిస్తాయికాని, బయటవి కనిపించవు. **అనగా తనను తాను గుర్తించాలంటే ఒక్క ప్రేమతత్త్వం తప్ప అన్యమార్గంలేదు.**

ప్రణవమే సర్వమునకూ అధారము. ఆ ప్రణవము నీలోనే ఉంటున్నది. జాగ్రత్ స్వప్న సుషుప్తి తురీయావస్థలనే

చేత రాముని అరణ్యానికి పంపించింది. కాని, తరువాత తన దోషమును తాను గుర్తించి, రాముడు లంకనుండి తిరిగి వచ్చిన తరువాత - నాయనా! నేను నిన్ను చాలా బాధలు పెట్టాను! అట్టి పాపపరిహారార్థమై నాకొక మంత్రోపదేశం చేసి తరింపజేయి.'' అని కోరింది. ''అమ్మా! సరయూనదికి వెళ్ళి స్నానం చేసి అక్కడ పరిస్థితిని చూసుకొనిరా! నేను మంత్రోపదేశము చేస్తాను'' అన్నాడు. కైకేయి సరయూనదికి వెళ్ళి స్నానము చేసింది. అక్కడ రెండువైపులా ఉన్న పచ్చిక బయళ్ళలో గొట్టెలు, మేకలు - ''మే...మే...''అని అరుస్తున్నాయి. **కైక రాముని వద్దకు తిరిగి వెళ్ళి - "రామా...! నేను సరయూనదిలో స్నానం చేసి సంపూర్ణమైన విశ్వాసంతో నీ ఉపదేశాన్ని అందుకోవడానికి వచ్చాను"** అన్నది ''అమ్మా...! సరయూనది తీరంలో ఏమైనా జంతువులను చూసావా...?'' అని అడిగాడు. రాముడు. ''ఆఁ...చూసాను! అటువైపున మేకలు, ఇటువైపున గొట్టెలు మేస్తున్నాయి'' అన్నది. ''అవి ఏమంటున్నాయమ్మా..?'' అని రాముడు ప్రశ్నించగా- ''మే..మే...! అంటున్నాయి'' అని సమాధానం చెప్పింది కైక. ''దానిని వదులు! అదే నీకు ఉపదేశము'' అన్నాడు రాముడు. దీని అంతరార్థమేమిటి? **మే-అనగా "నేను" ~~ఈ~~ "నేను" అనే అహం ప్రతీ మానవుని యందుంటున్నది. ~~ఈ~~ "నేను" అనేదానిని ఆత్మగా భావిస్తే అదే ఉపదేశము. కాని, దానిని దేహముగా భావిస్తే అదే - బంధనము.**

''నచికేతా..! నీవు బాలుడవు! బాల్య చాపల్యము వర్ణనాతీతమైనది. కనుక, నీవు బ్రహ్మచర్యవ్రతమును అనుభవించాలి'' అన్నాడు యముడు. దీని అర్థమేమిటి? ఈ కలియుగ ప్రభావము వలన- **"బ్రహ్మచారీ సహస్ర మర్కటః" అన్నారు.** వేయి కోతుల బుద్ధి బ్రహ్మచారిలో ఉంటున్నదట!! కనుక, ఈ వేయి కోతుల బుద్ధిని భగవంతుని వైపు మరల్చాలి. దీనికి వయస్సు ప్రధానం కాదు. **ధ్రువుడు** ఆరు సంవత్సరముల పిల్లవాడైనప్పటికీ దైవానుగ్రహమును పొందాలని బయలు దేరాడు. మధ్యలో నారదుడు ఎదురైనాడు. **నారదుడనగా చాడీలు చెప్పే**

నాల్గు పాదములు కూడను ప్రణవము నందే ఉంటున్నవి. అకార ఉకార మకారములు మూడూ చేరి నప్పుడే - "ఓం" అనే ప్రణవశబ్దము నాల్గవదిగా వస్తుంది. 'అ'కారమే విశ్వస్వరూపము. ~~ఈ~~ 'అ'కారము అక్షర సంఖ్య ప్రధానమైనది. ఇది అతి సులభంగా ఉచ్చరింపబడేది. అనగా, మన మీ విశ్వాన్ని సులభంగా ప్రేమిస్తున్నాము, సులభంగా అనుభవిస్తున్నాము. రెండవది 'ఉ' కారము. దీనిని ఉచ్చరించాలంటే కొంచెం నోరు తెరవాలి, ఇది కొంత శ్రమతో కూడినది. ఇది స్వప్నావస్థకు సంబంధించినది. స్వప్నావస్థలో దేనిని చూడగలుగుతున్నావు? జాగ్రదవస్థ ప్రతిబింబాన్నే! నీవు ఏనాడూ చూడనివి, జాగ్రదవస్థలో లేనివి స్వప్నంలో చూడటానికి వీలుకాదు. జాగ్రదలో ఉండినవే స్వప్నములో వస్తున్నాయి. **అనగా, విశ్వుడే తేజసుడుగా కనిపిస్తున్నాడు. తేజస్సనగా ఏమి? తనను తాను సృష్టించుకొనేది తేజస్సు.** నీవు పరుపుపైన పడుకొంటే రాత్రి నీకొక స్వప్నము వచ్చింది. అందులో నిన్ను, నీ ఇంటిని, నీ స్నేహితులనందరినీ నీవే సృష్టించుకొన్నావు. ఎవ్వరూ వచ్చి అందులో చేరలేదు. తెల్లవారిన తరువాత నీవు నీ స్నేహితుని వద్దకు వెళ్ళి ''ఒరేయ్! నీవు రాత్రి నా స్వప్నంలో వచ్చావు. కదా!'' అంటే - ''అబ్బే! నాకేమి తెలుసురా'' అంటాడు. అనగా, స్వప్నములో అంతటినీ నేవే సృష్టించుకొంటున్నావు. సర్వదుఃఖము లనూ, సర్వానందములనూ నీవే సృష్టించు కొంటున్నావు. **~~ఈ~~ స్వప్నావస్థ యొక్క స్వరూపమే - 'ఉ' కారం. 'ఉ'కారమనగా ఏమిటి? "ఉత్తది" అని అర్థము. అనగా ఏమీ లేనిది.** స్వప్నములో నీవు ఎన్నో బాధలుపడి ఎంతో ఏడ్చినావు. కాని, జాగ్రత్తకు వచ్చేటప్పటికి ఆ ఏడుపులేదు, ఆ చూసినవి కూడా లేవు. ''కలలో చూసిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవు కదా!'' కలలో అన్నీ చూసావుకాని కన్నులు విప్పితే ఏమీ కనిపించటం లేదు. **ఇంక 'మ'కారమనేది - "ప్రజ్ఞ" ~~ఈ~~ 'మ' అనేది మమత్వాన్ని పెంచుతుంది. ఇది పోయినప్పుడే** - బ్రహ్మతత్వము ప్రాప్తమౌతుంది. కైక తన పుత్రునిపైగల వాత్సల్యము

ప్రణవతత్త్వము

వాడని, జగడాలు పెట్టేవాడని మనము అనుకుంటున్నాము. ఇది చాలా పొరపాటు. నారదుడు జ్ఞానస్వరూపుడు. దోషములను నిర్మూలించి జ్ఞానాన్ని బోధించె వాడు నారదుడు. అట్టి నారదుడు ధ్రువునకు సాక్షాత్కరించి అతని మనస్తత్వాన్ని పరీక్షించాలని ప్రయత్నించాడు.

ప్రతీ దానికి పరీక్ష అత్యవసరము. ఎంత త్వరగా పరీక్ష వస్తుందో అంత త్వరగా మనము ఉన్నత స్థాయికి పోవచ్చును. ప్రతీ సంవత్సరమూ పరీక్ష పెట్టడం చేతనే విద్యార్థి ఒక క్లాసు నుండి పైక్లాసుకు పోగల్గుతున్నాడు. కాని, దురదృష్టవశాత్తు ఆధ్యాత్మిక మార్గంలో - "భగవంతుడా...! నన్ను పరీక్షించ వద్దు" అని కోరుతుంటారు. ఇది చాలా పొరపాటు. టెస్టు చేసే తీరాలి. **టెస్టు చేస్తేనే రెస్టు కుదురుతుంది.** వైద్యుడు రోగికి అన్ని టెస్టులూ చేసిన తరువాతనే రోగానికి తగిన మందునిస్తాడు. వైద్యుడెంతబాగా టెస్టు చేస్తే రోగి అంత తృప్తి పడాలి. కనుక, దేవుడు నాకు ఇన్ని కష్టాలు పెడుతున్నాడే...! నన్నింత శోధిస్తున్నాడే...!! అని అనుకోవడం చాలా పొరపాటు. అది తప్పు! "భగవంతుడా...! నన్ను త్వరగా టెస్టుచేసి ఉన్నతస్థాయికి పంపించు" అని కోరుకోవాలి. కనుకనే నారదుడు ధ్రువుని టెస్టు చేసాడు.

"నాయనా....! నీవు చిన్నవాడవు! క్రూరమృగాలు సంచరించే అడవిలో ఏరీతిగా జీవించగలవు? నీ ఆహారం మాటేమిటి? చెట్టు నెక్కి ఫలములను కోసుకోవడం కూడా నీకు చేతకాదే...!!" అంటూ నారదుడు భయపెట్టాడు. అప్పుడా పిల్లవాడు - "నారదా...! **భగవంతుడు సర్వాంతర్యామి కదా! అతడే నన్ను పోషిస్తాడు, అతడే - నన్ను రక్షిస్తాడు. ఒకవేళ రక్షించడానికి ఇష్టం లేకపోతే నన్ను శిక్షిస్తాడు. కనుక ఉన్నవి రెండే-రక్షించుట శిక్షించుట, వీటన్నింటికీ సిద్ధంగా ఉన్నాను"** అన్నాడు. నారదుడు అతని ధైర్యసాహసాలకు మెచ్చి- "నాయనా..! నీవు దిగ్విజయము సాధింతువు గాక!" అని ఆశీర్వదించి, మంత్రమును ఉపదేశం చేసి పింపించాడు.

అదేవిధంగా, యముడు కూడా నచికేతుని ఎంతో పరీక్షించాడు. అనేక సమస్యలను అతని తలలో దూర్చాడు. కాని, నచికేతుడు దేనినీ చేర్చుకోలేదు. అతని సంకల్పము ఒక్కటే!"నాకు భగవంతుడు తప్ప ఏమీ అక్కరలేదు. ఆ పరతత్త్వాన్ని నేను అనుభవించాలి. ఇంక నీవేమైనా చెప్పుకో.." అన్నాడు నచికేతుడు. **చలించని మనస్సు, భ్రమించని దృష్టి-ఈ రెండూ కుదిరాయి నచికేతునకు!** అప్పుడు వాక్కు స్తంభించి మనస్సులో చేరింది, మనస్సు బుద్ధిని అనుసరించింది, బుద్ధి ఆత్మలో ప్రవేశించింది. బుద్ధికి, మనస్సుకు మధ్యలో ఒక అడ్డుగోడ ఉన్నది. ఏమిటీ అడ్డుగోడ? అదే ప్రకృతి అనే తెర. అదే దేహభ్రాంతి. ఆ దేహభ్రాంతిని వదలినప్పుడే పరతత్త్వం మనకు అర్థమవుతుంది. దేహతత్త్వం ఒక వైపున, పరతత్త్వం మరొక వైపున ఉంటుంటే మన కేమాత్రమూ అర్థంకాదు. ఇది చాలాప్రమాదం కూడా..! **రెండు గుఱ్ఱాలపై స్వారీ ఎవరు చేయగలరు? చేయటానికి వీలుకాదు. కనుక, నీవు ప్రకృతినే పరమాత్మగా భావించుకో.. తప్పులేదు! లేకపోతే పరమాత్మనే ప్రకృతిగా భావించుకో.... తప్పులేదు! కాని ప్రకృతివేరు, పరమాత్మవేరు అని భావించుకోవద్దు. "సర్వం విష్ణుమయం జగత్"** ఇట్టి ఏకత్వాన్ని నచికేతునకు చక్కగా బోధిస్తూ వచ్చాడు యముడు.

నచికేతుడు ఇంకా సందేహం తీరలేదు! "పరతత్త్వమనేది చాలా కఠినమైనదే..! ప్రణవోపాసన చాలా కష్టమంటారు కదా..!! కాని, ఈ యమధర్మరాజు ఇంత సులభంగా చెపుతున్నాడే...!" అనుకొన్నాడు. ఐతే **ప్రణవోపాసన కంటే సులభమైన సాధన మరొకటిలేదు! ఎందుకంటే-అన్నింటికీ ఆధారము అదే...! మన నఖశిఖ పర్యంతము సంచరించేది ప్రణవమే...! ఈ ప్రణవమే సర్వమునకూ ఆధారము.** ఒక చిన్న ఉదాహరణ:- జాగ్రదవస్థ యందు మనకు విశ్వస్వరూపము కనిపిస్తుంది. ఇక్కడ మన శ్వాస ఏరీతిగా జరుగుతున్నది? "సో**ఽ**హం... సో**ఽ**హం..." అంటూ మన ఉచ్ఛ్వాస నిశ్వాసలు సంచిరిస్తున్నాయి. కాని, నిద్రావస్థలోకి పోయేటప్పటికి- **"సో.." అనే దాంట్లో 'స'కారము మైనస్ అవుతుందిः "హం..." అనే దాంట్లో-**

'హ'కారము మైనస్ అవుతుంది. "సో.."లో 'స'కారము లేనప్పుడు అది 'ఓ' అవుతుంది. 'హం.."లో - 'హ'కారము లేనప్పుదడు అది 'మ్' అవుతుంది. ఈ రెండూ చేరితే అది - "ఓమ్" అవుతుంది. చాలా మంది నిద్రించే సమయంలో గురక పెడుతుంటారు. నీవు ఈ ఓంకారమును ప్రత్యేకముగా వినాలంటే - అక్కడ కూర్చొని వినుము. ఆ గురకపెట్టేవాడు. "ఓమ్.." అనే శబ్దమును చేస్తుంటాడుకాని, "సో**ఽ**హం"అని పలుకడు. అయితే, నోరు తెరిచి గురకపెట్టే సమయంలో అది కొంత వికారాన్ని పొందుతుంది.

భగవంతుడు మనకు ఇంద్రియములను ఎందుకిచ్చాడో ఎవ్వరూ అర్థము చేసుకోవడం లేదు. "దీన్ని చూడ వద్దు, దాన్ని చూడ వద్దు, ఇది విన కూడదు, అది విన కూడదు- అని స్వామి చెపుతున్నారే! కాని, భగవంతుడు మా కన్నులను, ముక్కును, చెవిని, నోరును-అన్నింటినీ బయటకే పెట్టాడుకాని, లోపలకు పెట్టలేదే..!! అంటూ కొందరు వాదించవచ్చును. నిజమే...!**ఈ ఇంద్రియాలను బయటకు పెట్టాడు కనుక, బయటివి అనుభవించ వచ్చును. కాని కొన్ని నియమాలను విధించాడు. చెడ్డ విషయములను చూడ వద్దని కన్నులకు Shutters (తలుపులు) వేసాడు, ఇంక ఎక్కువగా మాట్లాడవద్దని నోటికి కూడా తలుపులు పెట్టాడు.** నీవు కన్నులతో చూసున్నావు. ఐతే, చూసినవన్నీ లోపలకు చేర్చుకోవద్దు. చెవులతో వింటున్నావు. ఐతే, విన్నవన్నీ హృదయానికి అందించ వద్దు. ఈ విశ్వస్వరూపాన్ని నీవు అర్థం చేసుకోవడం కోసమే నీకు ఈ ఇంద్రియములు అందించబడ్డాయి. కనుక,ఈ ఇంద్రియాలను పవిత్రంగా ఉపయోగించుకో! "నాయనా...! నీ ప్రాణాన్ని కాపాడు కొనుటకై గాలిని పీల్చుకో, చక్కని సువాసనలను అనుభవించు" అని భగవంతుడు ముక్కు నందిస్తే- అతని ఆజ్ఞకు విరుద్ధంగా ముక్కులో నశ్యం వేసుకొంటున్నారు! "నీ దేహమును కాపాడుకొనే నిమిత్తమై భోజనం చేయి, మంచి మాటలనే మాట్లాడు" అని భగవంతుడు నోటిని అందిస్తే- మద్యపానం చేయడానికి, చేపలను తినడానికి దీనిని ఉపయోగించుకొంటున్నారు. ఇది మానవత్వానికే విరుద్ధము.

ఇంద్రియములు చాలా శక్తివంతమైనవి. ఐతే, అలాంటి ఇంద్రియములను కూడా క్షణములో అణగద్రొక్కవచ్చు, క్షణములో వశంచేసుకోవచ్చు. అంతటి శక్తి మనలో ఉన్నప్పటికీ మనం ఉపయోగించుకోలేకపోతున్నాము. ఎందుచేత? వీటి సత్యస్వరూపాన్ని మనము గుర్తించనందు వల్లనే...! చిన్న పిల్లవాడు అగ్ని కాలుస్తుందని తెలిస్తే దానిని పట్టుకోడుఃతెలియనప్పుడే- దానిని పట్టుకొని కాల్చుకొని బాధపడుతున్నాడు. **అత్యంత కఠినమైన ఇంద్రియతత్వాన్ని అతి చిన్నదైన బుద్ధి చేతనే గుర్తించ వచ్చును. కనుక, మొట్టమొదట మనం బుద్ధిని చక్కదిద్దుకోవాలి. అప్పుడే మనకు జీవిత మంటే ఏమిటో సులభముగా అర్థమౌతుంది.**

(స.సా.జూన్.94పు.157/162)

ప్రణవము

(చూ॥ అంత్యకాలము, అనాహత ధ్వని, ప్రణవతత్త్వము, ప్రాణము)

ప్రణాళిక

దేహపోషణ కోసం ఒక ప్రణాళిక వేసుకుంటారు - అదే విధంగా **ఆధ్యాత్మిక పరిపుష్టికి ఒక ప్రణాళిక ఉండాలి.**

ఉదయం జపమూ - ధ్యానమూ ఫలహారం,
మధ్యాహ్నభోజనం. నిత్యమూ భగవన్నామస్మరణం
సాయింకాలపు ఫలహారం.
రాత్రిభోజనం, భజన కీర్తనం పవిత్రగ్రంధ పఠనం

ఈ నియమాలను అనుసరిస్తే సుఖంగా నిద్రపోయి - నవశక్తితో మేలు కొనగలరు.

సమభావనకోసం - చిత్త శాంతికోసం హృదయాలు పరితపించి నపుడు ఆధ్యాత్మిక శక్తిసంపన్నుల సంసర్గం అనే జలంలో మీరు మునకలు వేయాలి.

ప్రతిజ్ఞ/ప్రతిజ్ఞలు

మీరు చేసిన ప్రతిపనీ దైవ ప్రేరితమైనపుడు చేసిన పనుల ఫలితమును భగవంతునికి సమర్పణ చేసినపుడు, ఏనాటిలెక్క ఆనాటితో సరి. మరుసటి రోజుకు పేరుకోవు. అట్టి సంపూర్ణ విశ్వాసం నిలిపితే, భగవంతుడు మీకు అన్నవస్త్రాలే కాక, అమృతత్వం కూడ అనుగ్రహించ గలడని మరువకండి.

ఏపనిచేస్తున్నప్పటికి - రామ,కృష్ణ - శివ,హరి వంటి దైవ నామం మీ నాలుక మీద నర్తించాలి. ఇందుకు ప్రత్యేక సమయంగాని - శక్తిగాని వెచ్చించ నవసరం లేదు.

ఉదయాన దైవనామంతో నిద్రలేవండి. రాత్రివేళ తలక్రింద చెయ్యిపెట్టుకొని, దివ్య నామస్మరణ చేస్తూ నిద్రలోకి జారిపోవాలి.

(త.శ.మ.పు.151)

ప్రతిజ్ఞ/ ప్రతిజ్ఞలు

సత్యనిష్ఠకు - ధర్మదీక్షకు పేరు పొందిన దేశం మనది! శాంతి అహింసలు కవచకుండలాలుగా వర్ధిల్లిన దేశం మనది! **ఆధ్యాత్మిక సంపదను - ఆత్మవిజ్ఞానాన్ని అఖిల ప్రపంచానికి అందించిన దేశం** మనది! సత్యపథాన్ని **చూపించి - ధర్మజ్యోతిని వెలిగించిన దేశం మనది! ఈ భూతలాన్ని శాంతి ధామంగా - ప్రేమసీమగా - పవిత్రక్షేత్రంగా మార్చాలని చూసిన దేశం మనది! సత్య నిరతికి - ధర్మదీక్షకు పేరుపడిన దేశం మనది! అర్షధర్మాన్ని - సనాతన సంస్కృతిని వేద విజ్ఞానాన్ని సర్వ ప్రపంచానికి పంచిపెట్టిన దేశం మనది! భారతీయుడై జన్మించినందుకు భారతమాత ధర్మాన్ని కాపాడువలసిన కర్తవ్యం మన అందరిపైనా ఉంది! ఈ దేశ పవిత్ర వారసత్వసంపదను కాపాడుగలమని ప్రతి పౌరుడు ప్రతిజ్ఞ తీసుకోవాలి.**

ఐకమత్యంబు -జ్ఞానంబు అందజేసి
జ్ఞాన జ్యోతిని వెలిగించు దేశమిదియె
ఈ దివ్య జ్యోతిని అందించు దేశమిదియె
భారతదేశాన పుట్టుటే భాగ్యమౌరా!

(దే.యు.పు.48)

(చూ॥ కృష్ణుడు, దేవుడెక్కడున్నాడు?)

ప్రతిబంధములు

నాలుగు ప్రతిబంధములుగా వున్నది. అవియే విషయాసక్తి, ప్రజ్ఞామాంద్యము, కుతర్కము, విపర్యయ దురాగ్రహము, ఇందులో **విషయసక్తి** అనగా పెద్దలచెంత వాక్యార్థ శ్రవణము చేయుచుండగా వృత్తి శాబ్దాది విషయాయత్త మగుట, **ప్రజ్ఞామాంద్య** మనగా చెప్పిన విషయములు బుద్ధికి తోచకుండుట, **కుతర్క** మనగా పెద్దల వాక్యములకు విపరీతముగా అర్థము చేయుట. **విపర్యయదురాగ్రహ** మనగా సర్వులకంటే నేనే గొప్ప యని తనది తప్పయిననూ సరియని సమర్థించుకొను దుష్టబుద్ధి. భావి ప్రతిబంధకమనగా యే సమయమునకు యేమిచ్చునో యని ముందుగానే చింతించుట (అనగా రాబోవు వాటికి క్రుంగి, పొంగుట)

(ప్ర.శో.వా.పు.22/23)

ప్రతిబింబాలు

"జీవులందరూ దేవుని **ప్రతిబింబాలు**. మనుష్యులంతా ఆయన **ప్రతిరూపాలు**. ఆయన సంకల్ప ఫలితంగా ఆయన ప్రణాళికను అనుసరించి ప్రాణులన్నీ జీవిస్తున్నాయి. కనుక ఆయన అనుగ్రహానికి ఎవ్వరూ బాహ్యులు కాలేరు."

(లో.పు.27)

ప్రతిష్ఠించు

"ప్రతి దివ్య తత్త్వం, ప్రతి దివ్య సిద్ధాంతం అనగా - దేవునికి మానవుడు ఆరోపించిన అన్ని నామాలూ అన్ని రూపాలూ సాయియొక్క ఈ మానవ రూపంలో ప్రత్యక్షంగా ఉన్నాయి. సందేహం నిన్ను కలవర పెట్టేందుకు అవకాశం ఈయవద్దు. నా దివ్యత్వం పట్ల **నీ హృదయపీఠం పైన నిశ్చల విశ్వాసాన్ని ప్రతిష్ఠాపించుకుంటేనే నా సత్యదర్శనాన్ని నీవు పొందగలుగుతావు.**"

(లో.పు.144)

ప్రత్యక్షము
(చూ॥ ఆలయం)

ప్రత్యక్ష దైవము
దైవము ఎక్కడ వున్నాడు? ఎట్లా వుంటాడు? విచారణ చేస్తే ప్రత్యక్ష స్వరూపముగా ప్రకృతియే మనకు ఆన్సర్ యిస్తున్నాది. సుర్యోదయము, సూర్యాస్తమయము జరుగుతున్నాయి. దినముల వల్ల నెలలు, నెలలవల్ల సంవత్సరములు జరుగుతున్నాయి. ఇది జరగటానికి కారణం ఏమిటి? భూమి తనచుట్టూ తాను గంటకు వేయిమైళ్ల వేగముతో తిరుగుతున్నది. అట్లా తిరగటం చేతనే సూర్యోదయము. సూర్యాస్తమయము జరుగుతున్నాయి. ఇవి జరిగినంత మాత్రమున లభించే ఫలితము ఏమిటి? భగవత్సంకల్పము చాల విశాలమైనది ఎవ్వరూ దీనిని అర్థము చేసుకోలేరు. భూమి సూర్యుని చుట్టూ గంటకు 66 వేల మైళ్ళ వేగముతో తిరుగుతుండాది. చూశారా! తన చుట్టూ తాను గంటకు వేయి మైళ్ళ వేగంతో తిరుగుతూవుండి సూర్యుని చుట్టూ గంటకు 66వేల మైళ్ళ వేగముతో తిరుగుతున్నది. సూర్యుని చుట్టూ తిరగటము మూలముగా ఋతువులు ఏర్పడుతున్నాయి. ఈ ఋతువులవల్ల వర్షములు కురుస్తున్నాయి. పంటలు పండుతుండాయి. పంటలకు ఏమీ తక్కువ లేకుండా వుండాది మన ఆహార విహారములకు యీ భూమి తత్వము ఎంత వుపకారముగా వుంటుండాది. ఇదియే ప్రత్యక్ష దైవము. **"పశ్యనపిచన పశ్యతి మూఢః" నీవు భగవంతుని చూస్తూ కూడను చూడలేదు చూడలేదు అనుకుంటున్నావు. చాల పొరపాటు. ప్రకృతియే పరమాత్మస్వరూపము.** ఈ ప్రకృతి వల్ల మనము గుర్తించవలసినది యేమిటి? క్రియాశీలత. మన కర్తవ్యమును మనము నిర్వర్తించాలి. ప్రకృతి తన కర్తవ్యమును తానుపాటిస్తూ వుండటం చేతనే జగత్తుకు వుపకారము చేయ గలుగుతున్నది. సృష్టి యొక్క రహస్యము కర్తవ్యాచరణే. ఏ కర్మలో నీవు ప్రవేశిస్తున్నావో ఆకర్మను నీవు శ్రద్ధాభక్తులతో చేయి.

(బృ.త్ర.పు.117/118)

ప్రత్యక్షప్రమాణము
(చూ॥ గురువు)

ప్రత్యగాత్మ
(చూ॥ నేనే)

ప్రత్యేకమైన తంతి తపాలశాఖ
మీరు నన్ను ఫోనులో పిలవవచ్చు. భగవంతుని కోసం నిజమైన నిశ్చలమైన పరితాపం హృదయాలలో వున్నవారికే నేను పలుకుతాను. **నువ్వు నా ప్రభువువి కాదు అన్న వారితో కాదు అంటాను. నువ్వే నా దైవం అన్నవారితో అవును అంటాను.** నేను మీ హృదయాలలో వుంటే, ఈ టెలిఫోనుద్వారా పలుకుతాను. నాకు ఒక ప్రత్యేకమైన తంతి తపాలా శాఖ వుందని మరచిపోకండి. ఆ పరికరాలు మన హృదయాల మధ్య పనిచేస్తాయి. మీ హృదయాలనూ నా హృదయామునూ కలుపుతున్న తంతితపాలా శాఖ కొన్ని నిబంధనలకు లోబడి పనిచేస్తూ వుంటుంది. ఆ నియమావళినే శాస్త్రాలు ప్రకటిస్తున్నవి. వాటిని మీరు శాస్త్రాలద్వారా తెలుసుకోగలరు.

(వ.1963 పు.64)

ప్రథమజా
త్రయిరూప మగు వేదవాక్కు ప్రథమజా అని కీర్తింప బడినది. 'ఉపస్థాయి ప్రథమ జాం' అని అనుటచే ప్రథమజా అను వాక్కును సేవించుట వలననే విద్య సిద్ధించు చున్నదని చెప్పబడినది. అనగా **వేద వాక్కును సేవింపని యెడల బ్రహ్మ విద్య సిద్ధింపదని దీని తాత్పర్యము. వేదవాక్కు కేవలము అర్థము తెలిసి భావపూరితముగ**

ప్రథమస్థానము

సేవించినపుడే వేద విద్య సిద్ధిని బడయువచ్చునే కాని కేవలము నోటితో ఉచ్చరించినంత మాత్రమున వేద విద్య సిద్ధి లభించిందని కూడా ~~ఈ~~ వాణి స్పష్టపరచినది. ఋగ్వేదము నందు ప్రథమజా, పూర్వజా అను పదములు వేదము యొక్క అనాదిత్వమును చాటుచున్నవి. అందుచేతనే రామాయణమును వ్రాయుచు వాల్మీకి ఈ వాక్కును అగ్రవాక్ అని కీర్తించినాడు. వేద వాక్కునే కాక **హిరణ్య గర్భునకు కూడా, ప్రథమజా అని ప్రథమోత్పన్నమైన దగుటచే బ్రహ్మను బ్రహ్మవిద్యను ప్రథమజా** అని శ్రుతులు కీర్తించినవి.

బ్రాహ్మదేవానాం ప్రథమ:

బ్రహ్మదేవునకు, హిరణ్యగర్భునకు ప్రథమజా అను పేరు వేదమున కప్పట్టుచునే యున్నది.

హిరణ్య గర్భునకంటె పరబ్రహ్మకు ప్రాధాన్యముండుటచే బ్రహ్మ ప్రథమజా అయినది. ప్రథమజా అనగా అనాది సిద్ధమగు వాక్కు ఇది. పరబ్రహ్మముఖమునుండి ఆవిర్భవించినది అని అర్థము. ప్రథమజా అనునామము సార్థకము అయినట్లే అర్షపదము కూడా బ్రహ్మ వాక్యమైన వేదమునకు ప్రసిద్ధము. మీ మాంసాది న్యాయముచే పరిశీలన చేయువాడే ధర్మజుడు.

(లీ.వా.పు.15/16)

(చూ॥ఋగ్వేదము)

ప్రథమస్థానము

ధర్మముకొరకు గీత కానీ ధనముకొరకు కాదు. కృష్ణమందిరాలనియూ, రామ మందిరాలనియూ ఏవో కొన్ని కొన్ని పేర్లు పెట్టుకొని మందిర నిర్మాణమను పేరుతో, ఆశ్రమముల నిర్మాణమను పేరుతో గీతా ప్రచార నిర్వహణ పేరుతో, ధనమును ప్రోగుచేయుట కూడా భగవత్ విశ్వాసము కోల్పోవుటకు ఒక మార్గము. సర్వ వ్యాపియైన పరమాత్మకు కేవలము మందిర నిర్మాణము హాస్యాస్పదము. **భగవత్ ప్రతిష్ఠకు హృదయ మందిరము ప్రథాన స్థానము.**

అట్టి మందిరమును నిర్మించుటకు ప్రయత్నించక, మానవ కల్పిత మందిరములు మాత్రము నిర్మించిన, స్థిరమా! నిత్యసత్యమైన పరమాత్మకు శాశ్వత మందిరమే సార్థకము కానీ శిధిలమగు మందిరములు కావు.

అయితే ఒక స్థితికి వచ్చు నంతవరకూ బాహ్యనిర్మాణ మందిరములు అవసరమే కానీ, అనాదిగా మందిరములు అనేకములున్నవి కదా! వాటిని భద్రపరచుకొని, సద్వినియోగము చేసుకొన్న చాలదా? **సనాతన మందిరములు కొట్టడమూ, నూతనమందిరములు కట్టడమూ గోవును చంపి చెప్పులు దానము చేసినట్లున్నది! ప్రత్యేకించి నూతన మందిరములు కట్టక, శిధిలమైన సనాతన మందిరములను పునరుద్ధరణ చేయుట యెంతయో లోకక్షేమము.** ఆనాటి శాస్త్రోక్తమైన ధర్మ ప్రతిష్ఠలు మహా పవిత్రములు అట్టి ధర్మమందిరముల శక్తియే మన భారతదేశము నేడు ఈ మాత్రమైననూ క్షేమముగా ఉండుటకు మూలకారణము.

(గీ.పు.172/173)

ప్రదక్షిణ

మాఘమాసం ప్రారంభమైంది. నేను పిల్లలతో "మాఘ స్నానం చాల పవిత్రమైనది. అయితే, కేవలం స్నానం చేసినంతమాత్రాన చాలదు, దైవప్రదక్షిణ కూడా మీరు చేయాలి" అని చెప్పాను. తెల్లవారు ఝామున నాల్గు గంటలకే మేము ఆంజనేయ స్వామి గుడికి వెళ్ళేవారము. చిన్నచిన్న పిల్లలు లేపినా లేవలేకపోయేవారు పాపం! ఒక్కొక్క పిల్లవానిని నేనే ఎత్తుకొనిపోయి స్నానం చేయించేవాడిని. అందరం కలసి గుడికి వెళ్ళాము. **"ఆంజనేయ స్వామికి మీరు ప్రదక్షిణలు చేసుకొని రండి, నేను ఇక్కడే కూర్చొని ఉంటాను" అని చెప్పాను. వారు ప్రదక్షిణలు చేయడానికి వెళ్ళారు. కాని, వారిలో వారు "మనం మాత్రమే ప్రదక్షిణలు ఎందుకు చేయాలి? రాజు కూడా మనతో ఎందుకు రాకూడదు? రాజు మనకు ఎన్నో పనులు నేర్పించాడు. అతను లేకుండా మనం ఏ పనీ**

ప్రదర్శనము

(చూ॥ నిదర్శనము)

ప్రధానకర్తవ్యము

విద్య తలకు సంబంధించినది, వైద్యము గుండెకు సంబంధించినది. నీరు ప్రాణసమానమైనది. ఈ మూడు సౌకర్యాలను ప్రజలకు సమకూర్చేవాడే అందరికంటే గొప్పవాడు. అలాంటివాడు దేవుడనే చెప్పవచ్చు. మానవునికి సత్కర్మలు చాల ప్రధాన మైనవి. కనుకనే, నేను మిమ్మల్ని సమాజ సేవలో పాల్గొనమని చెపుతుంటాను. మీరు సమాజంలో పుట్టారు. సమాజంలో పెరిగారు. సమాజం ద్వారా విద్య నభ్యసించారు. సమాజం ద్వారా ధనము నార్జించారు,సమాజం ద్వారానే ఆనందాన్ని అనుభవిస్తున్నారు. కనుక, సమాజానికి తగిన కృతజ్ఞత చూపడం మీ **ప్రథమ కర్తవ్యం.** సత్కర్మల నాచరించినప్పుడే మీరు సమాజానికి కృతజ్ఞత చూపినవారౌతారు.

(స.సా.మే.2000 పు.132)

పరమాత్మయొక్క సత్య బోధనలను ప్రేమతత్వమును అనుభవించి, ఆనందించి, జగత్తునకు చాటడమే మానవుని ప్రధాన కర్తవ్యం. భగవత్తత్త్వాన్ని ప్రచారం చేసిన మానవునికే **'మెస్సెంజర్ ఆఫ్ గాడ్'** అనే పేరు సార్థకమవుతుంది. భౌతికమైన, లౌకికమైన, అనిత్యమైన విషయాలను ప్రచారం చేసేవారు భగవంతుని మెస్సెంజర్లు కానేరరు.

జీసస్ పుట్టినప్పుడు ముగ్గురు అరేబియన్ రాజులు వచ్చారు; ఆ బిడ్డను చూసి చాల ఆనందించారు. తిరిగి వెళ్ళే సమయంలో మొదటి రాజు చెప్పాడు మేరీతో - **"అమ్మా! నీ గర్భమునందు భగవంతుని ప్రేమించేవాడు పుట్టాడు" అని. రెండవ రాజు "అమ్మా, మేరీ! నీ కుమారుణ్ణి భగవంతుడు ప్రేమిస్తాడు" అన్నాడు. మూడవ రాజు "అమ్మా! భగవంతుడు నీ కుమారుడు వేరు కాదు. ఇరువురూ ఒక్కటే" అన్నాడు.** ఈ మూడింటి అంతరార్థమును గుర్తించి వర్తించినప్పుడు సత్యము సుస్పష్టంగా మనకు గోచరమవుతుంది. **భగవంతుని చేయలేము.** కాబట్టి, అతను ముందు నడవాలి, మనం వెనుక నడవాలి''అనుకున్నారు. వెంటనే అందరూ పరెగెత్తికొని నా దగ్గరకు వచ్చారు. **"రాజా! నీవు కూడా మాతో రావాలి" అన్నారు. "నాకు అక్కర్లేదు, మీరే చేయండి" అన్నాను.** "అయితే, మాకూ అక్కర్లేదు నీవు మాతో వచ్చే తీరాలి'' అని బలవంతం చేశారు. వారి బలవంతం మీద నేను కూడా గుడికి వెళ్ళి ప్రదక్షిణ చేయడానికి ఉపక్రమించాను. మీరు నమ్మవచ్చు, నమ్మకపోవచ్చుగాని, హనుమంతుడు అడ్డం వచ్చాడు. ఈ పిల్లలందరూ కోతి వచ్చిందనుకున్నారు. వారికి తెలియదు, హనుమంతుడే వచ్చాడు. **"స్వామీ! నేను మీకు ప్రదక్షిణ చేయవలసినవాడిని. మీరు నాకు ప్రదక్షిణ చేయకూడదు"** అన్నాడు. సరే, నేను పిల్లలకు చెప్పాను - మీరు వింటున్నారు కదా! నేను ప్రదక్షిణలు చేయడం హనుమంతునికి ఇష్టం లేదు. కాబట్టి, నేను మానేస్తాను'' అన్నాను. ఆనాటి నుండి పిల్లలలో చాల పరివర్తన కల్గింది. వారిలో దివ్యమైన భావాలు కలిగాయి. వాళ్ళు ఇళ్ళకు తిరిగి వెళ్ళేటప్పుడు "రాజు మాతో కలిసి హనుమంతుని గుడికి ప్రదక్షిణ చేస్తుంటే ఒక పెద్ద కోతి అతనికి అడ్డుగా వచ్చి 'మీ ప్రదక్షిణ నేను చేయాలిగాని, నా ప్రదక్షిణ మీరు చేయకూడదు' అని రాజును ప్రదక్షిణ చేయనివ్వలేదు'' అని బజారులో అందరికీ చెప్పారు. ఈ వార్త సుబ్బమ్మ దగ్గరకు కూడా ప్రాకిపోయింది.

(స.సా.మా2000 పు.85)

కాళ్ళరిగి పోయేలా భగవంతుని ప్రతిమ చుట్టుగాని లేక, మందిరం చుట్టూగాని తిరగటం ఎందుకు? అర్థం చేసుకుని చేయాలి ప్రతి పనినీ. మన ప్రాచీనులు అర్థం లేని క్రియలు చేయలేదు, చేయమన లేదు. చక్రానికి ఇరుసు మధ్యలో ఉంటుంది. చక్రం ఎంతదూరం ప్రయాణించినా ఇరుసునే ఆధారం చేసుకొని ఉంటుంది. అదేవిధంగా, **భగవంతుణ్ణి ఆధారంగా చేసుకొని మన పనులను నెరవేర్చుకోవాలని మనల్ని మనం గుర్తు చేసుకోవడానికే మందిరం చుట్టూగాని లేక, విగ్రహం చుట్టూగాని ప్రదక్షిణ చేయమంటారు.**

(స.సా.జూన్.96 పు.153)

ప్రధాన పురుషార్థము

ప్రేమించేవాడు "మెస్సెంజర్ ఆఫ్ గాడ్" (భగవంతుని దూత): భగవంతునిచేత ప్రేమింపబడే వాడు "సన్ ఆఫ్ గాడ్" (భగవంతుని కుమారుడు) ఇరువురి ఏకత్వాన్ని గుర్తించినప్పుడు తండ్రి, కుమారుడు ఒక్కటే అవుతారు.

(స.సా.జ.99పు.1/2)

(చూ॥ దివ్యప్రకటనలు, దేశరక్షణ)

ప్రధాన పురుషార్థము

"విశ్వం దర్పణ దృశ్యమాననగరీ" అని దక్షిణామూర్తి అన్నాడు. ఈ విశ్వమంతయు మనస్సనే దర్పణమునందు ఒక పట్టణము వలె కనుపిస్తున్నాది. మానవుడు సాధించవలసినది ధర్మ అర్థకామమోక్షములుకావు. అంతఃకరణ నిర్మూలనము. అంతఃకరణ పరిశుద్ధియే మానవునకు ప్రధానమైన పురుషార్థము.

(బృ.త్ర.పు. 79)

ప్రధానమంత్రి (ప్రైమ్‌మినిష్టర్)

(చూ॥ నీవే)

ప్రధానము

Science కంటే Sense ప్రధానం

(భ.ప్ర.పు.2)

(చూ॥ ఓర్పు, నిరాకారం)

ప్రధానమైన అస్త్రము

మహాభారతములో పంచపాండవులున్నారు. ఇందులో పెద్దవాడు ధర్మజుడు. ధర్మజుని తరువాత భీముడు. భీముని తరువాత అర్జునుడు. అర్జునుని తరువాత నకుల సహదేవులు. ఈ ఐదుమందిలో మిగిలిన నలుగురు **ధర్మజుని అనుసరించేవారు. ఈనాడు ప్రపంచ పోలికలను తీసుకుంటే బాంబులు అవి అభివృద్ధి చేసినవారు అమెరికా వారు రష్యావారు. ఆమెరికన్సు అర్జునుని వంటి వారు. అనేక అస్త్ర శస్త్రములను** ధరించి ఒక్కతూరి భస్మము గావించే శక్తి అర్జునునిలో ఉంది. భీముడు మంచి బలవంతుడు. భుజ బలము, బుద్ధి బలము, గద బలము, వీటిని రష్యన్సుగా మనం భావించుకుందాం. భారతదేశము ఏమీ చేయలేదేఅనుకుంటారు కదా. **భారతదేశము ధర్మజుని వంటివాడు. ఈనాడు మనము చేయవలసినది ఏమిటి?** ధర్మాభివృద్ధి చేయాలి. ధర్మాన్ని మనము అభివృద్ధి చేస్తే భుజబలము బుద్ధి బలము ఉండినవారు దర్మజునికి శరణాగతులైపోతారు. మనము ఎవరిని ఏ విధంగా హింసించకూడదు. ఎవరిని మనం బాధించకూడదు. ఆ విధమైన ధర్మము మనము అనుసరిస్తే మనకు ఏ బాంబులు అక్కరలేదు. **ఏ అస్త్రశస్త్రములు అక్కర లేదు. ధర్మమే భారతీయుల ప్రధానమైన అస్త్రము. సత్యమే భారతీయుల కిరీటము.** ఏ దేశము వారికైనా సత్యము, ధర్మము చాలా ప్రమాణము. అన్ని దేశముల వారికి సత్యము ఒక్కటే. సత్యమే truth, అమెరికన్ truth, రష్యన్ truth, పాకిస్తాన్ truth, ఇండియా truth, అని భేదముందా? లేదు. **Truth is one.** ఏ భేదము లేదు. కాని అన్ని దేశముల వారు సత్యమును ధర్మమును అనుసరించాలి. ఈ రెండింటిని అనుసరిస్తే ఏ విధమైన కలతలు కల్లోలములు ఉండవు. అన్ని దేశములు శాంతిగా ఉంటుండాలి.

(శ్రీ.స.పు.41/42)

ప్రధానమైన కారణములు

ముఖ్యంగా మానవుని గుండె జబ్బులకు కారణమేమిటి? పొగ త్రాగడమే దీనికి కారణమని కొందరు, క్రొవ్వు పదార్థము (Fat)తో కూడిన ఆహారమే దీనికి కారణమని మరికొందరు - ఈ విధంగా అనేక మంది డాక్టర్లు అనేక విధాలుగా చెపుతుంటారు. కనుక, మన ఆహార విహారములు (Food and habits) సరియైన మార్గములో ఉండాలి. మన దేహతత్వము యొక్క పుష్టిని, మన మనోభావములను సమత్వముగా పోషిస్తూ రావాలి.

ఈనాడు మానవుని మనోవృత్తులు అతివేగంగా పరుగెడుతున్నాయి. ఈ విధమైన తొందరపాటు వలన కొని విధములైన రోగములు సంభవిస్తున్నాయి. అంతేగాకుండా, తాను తలపెట్టిన కార్యములు విఫలమైనప్పుడు మానవుడు మితిమీరిన యోచన చేస్తున్నాడు. **ఈ కారణములను చక్కగా విచారణ చేసినప్పుడు, గుండె జబ్బులకు** Hurry, Worry, Curry - ఈ మూడే ప్రధానమైన కారణాలని స్పష్టమౌతున్నది. Curry అనగా Fat (క్రొవ్వు పదార్థము) ఈ Fat కి మూలకారణము ఆహారమే. మహాప్రజ్ఞావంతులైన డాక్టర్లు అనేక విధాలుగా పరిశోధనలు చేశారు. పరిశీలన సలిపారు. కాని, ఆ పరిశోధనల ఫలితాలను ప్రజలకు సరియైన రీతిలో ప్రచారం చేయటం లేదు.

ఈనాడు మాంసాహారులకే గుండె జబ్బులు అధికంగా సంభవిస్తున్నాయి. శాఖాహారులలో ఈ జబ్బులు అంత అధికంగా లేవు. కారణమేమనగా - మాంసాహారంలో క్రొవ్వు పదార్థం అధికంగా ఉంటున్నది. దీని వలన దేహములో 'కొలెస్ట్రాల్' అనేది పెరిగి పోతుంది. దీనికి తోడుగా Hurry, worry చేరినప్పుడు గుండె మరింత బలహీనమై పోతున్నది. Hurry, worry ఈ రెండూ చేరినప్పుడు Blood Pressure దానితోపాటుగా Blood sugar పెరిగిపోతాయి. ఈ Blood Pressure, blood sugar రెండూ twins వలె ఒక దాని నొకటి అనుసరిస్తుంటాయి. ఈ రెండూ గుండెపైననే పనిచేస్తున్నాయి. కనుక, మొటమొదట Diabetis, Blood Pressure ఈ రెండింటికీ దూరంగా ఉండటానికి ప్రయత్నించాలి. వీటికి మరొక కారణమే మనగా - కొంతమంది అధికారులు, శ్రీమంతులు తగినంత exercise చేయుటలేదు. ఇది మంచిది కాదు. అందరికీ తప్పనిసరిగా exercise ఉంటుండాలి. ఈనాడు అందరూ సుఖానికి మరిగి పోవటముచేత exercise లేకుండా పోతున్నది. అందుచే అనారోగ్యము పెరిగి పోతున్నది.

(స.సా. మా. 93 పు. 72)

ప్రధాన సుఖము

యోగ వాశిష్ఠములో, "ఓరామా! కమహాసముద్రమునైనా సులభముగా పానము చేయవచ్చు, సుమారు పర్వతములనైనను. అవలీలగా ఊడపెరకవచ్చు, అగ్నిని అనాయాసముగా భుజించవచ్చు. కాని మనో నిగ్రహము చాల కష్టమని" అన్నాడు వశిష్టుడు, కాన ఒక పరి మనోనిగ్రహమును గావించితిమా అదే అమృతత్వము. అట్టి అమృతత్వమునుపొందుటకు పూర్వము అతి శ్రమ అనక **మనోనిగ్రహమునకై ప్రయత్నించుట ప్రధాన సుఖము.** ఇది ప్రధమ సుఖము.

(వి.వా.పు.51)

ప్రధాన సూత్రములు

Bend the Body, Mend the Senses, End the Mind **(కష్టించి పని చేయండి, ఇంద్రియములను అరికట్టుకోండి, అమనస్కులు కండి). ఇవి భారతీయ సంస్కృతి యొక్క ప్రధాన సూత్రములు.** ప్రతి మానవుడు ఈ సంస్కృతికి వారసుడే. ఈ సంస్కృతిని సక్రమమైన మార్గంలో అనుభవించినపుడే మానవుడు సార్థక జీవితమును గడిపినవాడౌతాడు.

(స.సా.జూలై99 పు.186)

ప్రపంచము

(చూ॥ త్రిగుణములు, ప్రకృతి, ప్రమాదము, భవానీ శంకర)

ప్రపత్తి

ప్రతి ఒక్కరు క్రింది విధముగా నుండవలెను.

1. భక్తియే మానవునకు నిజశక్తి. 2. కష్ట నష్టములు సహించుటకు సన్నద్ధుడుగా నుండవలెను. 3. సేవయే తరించుటకునావ. 4. కోరికలే మానవుని బాధించు తృష్ట. 5. జితేంద్రుడే యతీంద్రుడు. 6. దానశీలము. 7. ఆత్మ

ప్రబోధము

గౌరవమే మానవుని అంతస్తు. 8. సదాచారశీలము. 9. ఆత్మ సంతృప్తి. 10. సద్గుణములను పంపొందించుకొనుట. 11. విజ్ఞాన సంపదను అభివృద్ధి పరచుకొనుట. 12. వివేకజ్ఞానమును అలవరచుకొనుట. 13. ఇంద్రియ నిగ్రహము. 14. కల్మషములేని సాంఘిక కట్టుబాట్లలో నుండుట. 15. సుఖజీవిని చూచి సంతసించుట, దుఃఖజీవిని చూచి జాలిపడుట అను సద్గుణము. 16. భగవంతుని యందు గాఢప్రేమ, విశ్వాసము, నీవే యేకైక గతియను దృఢభావము; అదే ఆత్మ నిక్షేపము, ప్రపత్తి.

(శ్రీ.స.సూ.9/10)

(చూ॥ భక్తిరెండు విధములు, విగ్రహారాధన)

ప్రబోధము

నన్ను గురించి ప్రబోధం చేయుటకు సాహసించవద్దు. ఎట్టి ప్రచారమూ నాకు అక్కరలేదు. **'నా గురించి నీకేమి తెలియును?'** నన్ను గూర్చి ఈ దినమున ఒక విధముగను, రేపటి దినమున మరొక విధముగను మాటలాడెదవు. నా యందు నీకు దృఢ నమ్మకము లేదు. అన్నియు నీకు అనుకూలముగా జరుగుచుండిన నన్ను పొగడెదవు - లేనియెడల నన్ను తెగడెదవు. **నాతో నెంతటి అనుభవ ముండినను - 'మాయతెర' అడ్డుగా నున్నందున నా మహిమను ఏ స్వల్పభాగమో నీవు గుర్తింతువు** - గ్రహింతువు. కావున, నా చరిత్రను నీవు వ్రాయ దలచితివేని, నీకు యథార్థంగా **అనుభవమునకు వచ్చిన విషయాలను మాత్రమే వ్రాయుము.** అతిశయోక్తిగా వ్రాయవద్దు, ప్రచారము చేయవద్దు.

(ప్రే.బం.పు.2)

(చూ॥ పురాణము)

ప్రభువు

అడిగితే ఇచ్చేవాడు "ప్రభువు" అడగకుండా ఇచ్చేవాడు "విభుడు".

(సా. పు. 237)

ప్రమాణము/ప్రమాణములు

సకల శాస్త్రములయొక్క ముఖ్యసూత్రములు ఉపనిషత్తు లలో ఇమిడియున్నవి. అందువలననే అన్నింటికిని ఉపనిషత్తులు ప్రమాణములైనవి. ఆ పవిత్ర ఉపనిషత్తులు మానవులచేత వ్రాయబడినవి కావు. అనగా ఆపౌరుషేయములు.

ఆదికాలమునుండి వచ్చు వేదముల ఉపాంగములే, అనగా వేదస్వరూపమునందలి కొన్ని అంగములే ఉపనిషత్తులు, ఇట్టి అనేక అంగములతో విరాజిల్లునదే వేదము. కాన **ఉపనిషత్తులకు అధారమూ ప్రమాణమూ వేదము.**

(ఉ.వా.పు.4)

(చూ॥ కంప్యూటర్లు, షడ్ దర్శనములు)

ప్రమాదము

గోవుల కొట్టములోనికి పులులు ప్రవేశించిన, యెంత ప్రమాదము! గోవులెట్లు జీవించును? సహజముగానే దైవీ సంసత్తికి సంబంధించిన, సత్య ధర్మ శాంతి ప్రేమలనే గోవులు నివసించే హృదయమనే కొట్టములోనికి, అజ్ఞానముచే మానవులు, ద్వేషము అసూయ, లోభము, హింస, కోపము, మదము, మాత్సర్యము అనే దుష్ట మృగములను ప్రవేశపెట్టిన. పరిస్థితి ఏమగును? శాంతి ఎట్లు సిద్ధించును? ఈ నాడు మానవుని హృదయ స్థానమందు సాత్విక గుణములకు స్థానమే లేకుండా పోయినది; దానిని రజోగుణ సంబంధమైన అశాంతి కారకమైన ద్వేషాసూయలే అక్రమించినవి.

(స.సా.మే.75 పు.62)

ఒక వేదాంతి నాదగ్గరకు వచ్చాడు. స్వామీ బ్రహ్మసత్యం జగన్మిథ్య అని శంకరాచార్యులవారు జెప్పారు కదా! ప్రత్యక్షముగా కనుపిస్తుంది. ప్రత్యక్షముగా అనుభవిస్తున్నాము. జాగ్రత్ స్వప్నసుషుప్తులయందు జీవిస్తున్నాము. ఇది మిథ్య ఎట్లా అవుతుంది? అని ప్రశ్నించాడు. నాయనా **ప్రపంచము మిథ్య అనేది ప్రపంచమునకు వదలిపెట్టు. మొట్టమొదట నీవు సత్యమా**

మిథ్యయా కనుక్కోమన్నాను. మొట్టమొదట ఎవనికివాడు సత్యమా మిథ్యయా అని గుర్తించుకుంటే ప్రపంచగుణము గుర్తించుకున్నవాడౌతాడు. ఈనాటి విద్యార్థులు అంతే. తన తత్వమేమిటో తాను గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. విదేశముల విషయాలన్ని వినాలని కోరుతారు. ఆదేశములో ఏమి జరుగుతుండాది? యీ దేశములో ఏమి జరుగుతుండాది. పరదేశముల విషయాన్ని చూస్తున్నావు గాని నీదేహములో ఏమి జరుగుతున్నాది అని గుర్తించటానికి ప్రయత్నిస్తున్నావా? **బయట నుంచి వచ్చిన న్యూస్ అందుకుంటున్నావు. నీ నుండి వచ్చే న్యూసెన్స్‌ను నీవు గుర్తించటం లేదు. మొట్టమొదట నిన్ను నీవు గుర్తించుకో, నిన్ను నీవు చక్కబరచుకో, ఆ తరువాత యితరులను చక్కబరచటానికి ప్రయత్నించు.** ఇది మొట్ట మొదట విద్యార్థులు గుర్తించవలసిన విషయము. కనుక **భ్రమచేత ప్రమాదము సంభవిస్తుంది.**

(బృ.త్ర.పు.87/88)

(చూ॥ నియమములు, ఇంద్రియములు, ప్రాణయామము)

ప్రయాగ

(చూ॥ క్షేత్రములు)

ప్రళయము

ప్రళయానికి **కారణం మానవుని అన్యాయ, అక్రమ, అనాచారములు, స్వార్థస్వప్రయోజనములే గాని, దైవ సంకల్పం కాదు.** అధిక సంఖ్యలో జననష్టం, ప్రాణనష్టం సంభవించడమే ప్రళయం. ఇటీవల గుజరాత్‌లో సంభవించింది ప్రళయమే.

(స.సా.జూలై 2001 పు. 213)

ప్రవర్తన

ఒక పర్యాయం భోజరాజు దర్బారులో ఒక పగటివేషగాడు శంకరులవారి వేషంలో వచ్చి వేదాంతరసాన్ని వినిపించాడు. రాజు చాల ఆనందించి అతనికి కొన్ని బంగారు కాసులు బహుమతిగా ఇవ్వబోయాడు. అప్పుడతడు "రాజా! సన్యాసికి బంగారు కాసులతో పనే ముంది! నాకక్కర్లేదు," అన్నాడు. మరునాడు అదే వ్యక్తి నర్తకి వేషంలో వచ్చి చక్కగా నాట్యమాడాడు. అప్పుడు కూడా రాజు అతనికి కొన్ని బంగారు కాసులివ్వబోగా "రాజా! ఇవి నాకు చాలవు, ఇంకా కావాలి," అన్నాడు. రాజుకు ఆశ్చర్యం కలిగింది. "నిన్నటి దినము ఇచ్చిన కాసులను వద్దని వదలిపెట్టావు. ఈరోజు ఇచ్చినవి చాలవంటున్నావు. ఏమిటి దీని అంతరార్థం?" అని ప్రశ్నించాడు. అప్పుడతడు "రాజా! వేషానికి తగిన ప్రవర్తన ఉండాలి. నిన్నటి దినమున నేను సన్యాసి వేషంలో వచ్చాను. కాబట్టి, ఆ వేషానికి తగినట్లుగా ప్రవర్తించాను. ఈరోజు నర్తకి వేషంలో వచ్చాను. కాబట్టి, ఇంకా కావాలని అడుగుతున్నాను" అన్నాడు.

(స.సా.జులై.2000 పు.210)

మనకు పాపములు అనేటువంటివి కోపము, అసూయ, ద్వేషము, అహంకారము అనే దుర్గుణములు. అవి మన పాపాలకంతా పుట్టినిల్లుగా నిలిచి ఉన్నవి. అట్టి దుర్గుణములు అనే రావణుని, ధర్మము, సత్యము, ప్రేమ, శాంతి అనే సుగుణములచేత వధించుటకు పూనుకోవాలి. అసూయ, అహంకార సమయములందు మనమే రావణాసురులము. సత్యమార్గమునందు, ధర్మమార్గమునందు, ప్రేమమార్గమునందు ప్రవర్తించినపుడు మనమే శ్రీరామచంద్రులము. మంచికాని, చెడ్డకాని మన ప్రవర్తనములోనే కూడి ఉంటున్నవి. కనుక, రామచంద్రుడు కాని, రావణుడుకాని మనహృదయమునందే నివసించుచున్నారు తప్ప, అన్యముగా ప్రవర్తించి, ప్రకటించేటటువంటివారు కారు. దీనిని పురస్కరించుకొనియే **"మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః"** అన్నారు. చెడ్డకూ మంచికీ మనమనస్సే కారణ మనేటువంటిది ఇక్కడ మనకు స్పష్టముగా తెలియుచున్నది. 'పశువా' అనిపించుకోవటము మనయొక్క ప్రవర్తనచేతనే; 'పశుపతి' అనిపించుకోవటము మనయొక్క ప్రవర్తన చేతనే. కనుక,

ప్రవృత్తి

ప్రవర్తనము చక్కనైనమార్గమునందుంచుకొనుటకు తగిన ప్రయత్నముచేయాలి యువకులు.

(ఆ.రా.పు.237)

(చూ॥ మూలకారణము)

ప్రవృత్తి

నదిలోకి దిగినవాడు గొంతు వరకు మునిగి నప్పుడు కూడా మాట్లాడగలడుగాని, నీటిలో పూర్తిగా మునిగిన తరువాత మాట్లాడటానికి వీలుకాదు. అదేవిధంగా, దివ్యత్వాన్ని చక్కగా అర్థం చేసుకున్నవాడు, దివ్యత్వంలో పూర్తిగా మునిగినవాడు ఏమీ మాట్లాడడు. మీరు దివ్యమైన భావాల్లో మునగాలి, దివ్యమైన ప్రేమలో మునగాలి. **వేదాంతము "నిన్ను నీవు తెలుసుకో" అని బోధించింది.** కానీ మీరు ఎవరెవరినో తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. **"మీరెవరండీ? ఎక్కడి నుండి వచ్చారండీ?" అని ఎంక్వైరీ చేసేవాడు ప్రవృత్తి మార్గంలో జీవించేవాడు. "నేనెవరు? ఎక్కడి నుండి వచ్చాను?" అని విచారణ చేసేవాడు నివృత్తిమార్గంలో జీవించేవాడు.** తాను ఇతరుల గురించి తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడం **నెగెటివ్ లక్షణం;** తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించడం **పాజిటివ్ లక్షణం.** మీలో నెగెటివ్ ఆలోచనలను నింపుకొని పాజిటివ్ ఫలితం రావాలంటే ఎలా వస్తుంది? దోసకాయ తింటే మామిడి పండు త్రేపు వస్తుందా? కనుక మొట్ట మొదట మీలో పాజిటివ్ ఆలోచనలను నింపుకోండి. పాజిటివ్ ఆలోచనలంటే దైవత్వమునకు సంబంధించినవి. నెగెటివ్ ఆలోచన లంటే ప్రాపంచిక విషయాలకు సంబంధించినవి. ప్రేమ, సత్యము, సహనము, శాంతము మున్నగు **పాజిటివ్ గుణములు** హృదయం నుండి వస్తున్నాయి; ప్రాపంచిక సంబంధమైన నెగెటివ్ ఆలోచనలు తల నుండి వస్తున్నాయి. **మానవునికి హెడ్ (తల), హార్ట్ (హృదయం) చాల ప్రధానమైనవి. సైన్సు, టెక్నాలజీ తలకు సంబంధించినవే. కానీ ఈనాడు టెక్నాలజీ అనేది 'ట్రిక్ నాలెడ్జ్' గా మారిపోతున్నది. ఎందుకంటే మానవుడు పాజిటివ్‌వైపుకు ప్రయాణం చేయడం లేదు.**

(స.సా.మా.99 పు.61)

ప్రవృతి లక్షణాలు

మానవునికి ప్రధానమైనవి రెండు. ఒకటి తల, రెండవది హృదయము. **తలనుండి ఆవిర్భవించేవి ప్రవృతి లక్షణాలు. చదవడం, వ్రాయటం, తినటం, తిరగటం, సంపాదించడం, కూడబెట్టడం, ఇవన్నీ ప్రవృతి లక్షణాలు. హృదయము నుండి ఆవిర్భవించేవి నివృతి లక్షణాలు. దయ, ప్రేమ, సహనం, సానుభూతి - ఇవన్నీ నివృత్తి లక్షణాలు.** ఈ నివృత్తిని ఆధారంగా చేసుకోవాలి. ఈ ప్రవృత్తీ నివృత్తుల తత్వాన్ని సరిగ్గా గుర్తించడమే సత్యాన్వేషణ. మన కన్నులు తల్లిని చూస్తున్నాయి. భార్యను చూస్తున్నాయి. కూతుర్ని చూస్తున్నాయి. కోడల్ని చూస్తున్నాయి. అయితే **ఎవరిని ఏ దృష్టితో చూడాలి? అన్న విచారణే సత్యాన్వేషణ.** ఒక వృక్షమున్నది. కొందరు శాఖలే ప్రధానమని వాటి నుండి లభించే ఫలపుష్పములే ప్రధానమని విశ్వసిస్తారు. కాని **వాటన్నిటికీ ఆధారమైన వేర్లను చూసేవాడు వేదాంతి. సైంటిస్టుకు తెలియనిది వేదాంతము బోధిస్తుంది. వేదాంతికి తెలియనిది సైన్సు బోధిస్తుంది. అయితే, సైన్సు వేదాంతముల సమ్మిళత స్వరూపమే సత్యాన్వేషణ అన్నారు. వేర్లు లేక శాఖలు లేవు. శాఖలు లేక వేర్ల వల్ల ప్రయోజనం లేదు. ఈ రెండూ అన్యోన్యాశ్రయమైనవి.** అవినాభావ సంబంధం కలవి. కనుకనే, ప్రతి వ్యక్తీ అంతర్ బహిర్ తత్వములు రెండింటిని గుర్తించడానికి ప్రయత్నించాలి.

(శ్రీ.భ.ఉ. పు.182/183)

ప్రవేశము

కొన్ని సంవత్సరాల క్రిందట ఒకనాడు స్వామి చుట్టూ భక్తులు కూర్చొని సంభాషిస్తూ ఉండగా, "స్వామి! మీ **అవతరణ ప్రసవమా లేక ప్రవేశమా?"** అని ఒకరు ప్రశ్నించారు. హఠాత్తుగా అక్కడి వాతావరణం

మారిపోయింది. ఏదో తమాషాగా మాట్లాడుతూ ఉన్నవారు ఒక్క కుదుపుకు లోనైనట్లు భావించారు. స్వామి తమకు ఎదురుగా కూర్చున్న ఈశ్వరమ్మను చూసి **"నీవు చెప్పు రామశర్మకు.** ఆ రోజున మీ అత్తగారు హెచ్చరించిన తరువాత ఏమి జరిగిందో'' అన్నారు. రామశర్మ పురాణాలను క్షుణ్ణంగా చదివిన పండితులు. ఈశ్వరమ్మ ఇలా వివరించింది.

"మా అత్తగారికి కలలో సత్యనారాయణ స్వామి కనిపించారు. అందువల్ల ఏ అద్భుతమైనా జరగవచ్చు. నీవు గాభరాపడవాకు" అని నాతో చెప్పింది. తరువాత నేను బావివద్ద నీళ్ళు తోడుతున్నప్పుడు నీలంగానున్న తేజో రాశి గుండ్రంగా బింబంవలె అయి నావద్దకు దొర్లుకుంటూ వచ్చింది. నేను మూర్ఛ పోయాను. అది నాలో ప్రవేశించినట్లు తెలుసు కున్నాను."

స్వామి రామశర్మ వంక తిరిగి "అదీ సమాధానం. **నన్ను ప్రసవించలేదు. అది ప్రవేశమే" అన్నారు.**

(స.సా.మే2000పు.136)

ప్రవేష్టుం

(చూ॥ జ్ఞాతుం)

ప్రశాంతి

అసలు ప్రశాంతి అన్న పద అర్థము సహితము యేమో ఎరగని వారుకూడా వున్నారు. అది ప్రతి మానవునకు వెన్నెముకవంటిది. సాధకునకు శ్వాసమువంటిది. ప్రశాంతి అన్న ఒక్కొక్కరు ఒక్కొక్క అర్థము తీసుకొని లౌకిక సంబంధమైన కార్యములు, అభీష్టములు నెరవేరిన అదియే శాంతి అని తలంచుదురు. అది నిజశాంతికాదు; క్షణశాంతి. ప్రశాంతిఅన్న, **ప్ర అనగా వికశింపజేయుట; శాంతి అనగా కామక్రోధ రాహిత్యము. కామక్రోధరాహిత్యమును వికశింపచేయుటే ప్రశాంతి అని అర్థము.** శమము మానవునకు ముఖ్యాంగముగా భావించవలెను. అట్టి శమమును అభివృద్ధిచేయుటే సాధకుని కర్మ. సాధకునకు సార్థకము ప్రధానముకదా? శాంతే సార్థకము. అది మానవునకు స్వభావసిద్ధముగా నుండునది. **వివేక, వైరాగ్య విచక్షణలు మానవునకే ప్రత్యేక అంగము లనియూ, వాటిని పెంపొందించు బలమే శాంతి అనియూ, అది ఆత్మ యొక్క కళయనియు, సర్వకార్యములందు సర్వశక్తులందు, సర్వానుభవములందు, శాంతి ఆత్మను పోలినదనియు అందురు. శాంతికికూడ అది అంత్యములు లేవు. ఏ కళంకము రాదు. దానికి అదియేసాటి.** మరొక **దానితో పోల్చుటకు వీలులేదు.** అది మనోవాక్కాయ కర్మలయందు సమానముగానే యుండవలెను. అదే నిజశాంతి, ప్రశాంతి, ఆ ప్రశాంతిలేక లౌకిక, ఆముష్మిక, కైవల్యములందుకూడ సౌఖ్యము చేకూరదు. **సర్వ సౌఖ్యములకు శాంతియే పుట్టినిల్లు, కైవల్యములందుకూడ సౌఖ్యము చేకూరదు.** త్యాగరాజు చెప్పినట్లు శాంతములేక సౌఖ్యములేదు. ఇది ఎట్టివారికైన కావలెను. దాంతుని మొదలు వేదాంతుని వరకు శాంతి అవసరము. అది లేక లోకము నిమిషము సహితము నిలువలేదు. క్రోధము లేనంతసేపు శాంతి అనకూడదు. మనోభీష్టము నెరవేరినంత మాత్రమున శాంతి వచ్చినదనకుడు. వచ్చినశాంతి ఇంకే కారణముల వల్లనైనా తిరిగి మారకూడదు. **అది ప్రశాంతి. శాంతికి మార్పులు లేవు.** నేడు ఒక విధము, రేపు మరొక విధము, సంతోషమున ఒక విధము, దుఃఖమున ఇంకొక విధము. ఈ రీతిగా మార్పు చెందుచుండదు. అట్టి మార్పును రానీక సుఖ దుఃఖములను, మంచి చెడ్డలను సమముగా ఆనందింప జేయునదే శాంతి. **దానిని ఎట్లు పొందవలెనో, దాని ఉపయోగము లేవో, దాని గుణగణము లేవో తెలుపునట్టిదే ప్రశాంతి వాహిని. దీనిని ప్రతి సాధకుడు అనుభవించ హక్కు కలదు;** పొందుటకు మార్గము కూడాకలదు.

(ప్ర.వా.పు.1/2)

ప్రశాంతినిలయము

ప్రేమస్వరూపులారా! **మీలోని దుర్గుణములను, దురభ్యాసములను ప్రశాంతినిలయంలో వదలి పెట్టండి;**

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

ప్రశాంతి పతాకము - చిహ్నములు

సద్భావములను, సచ్చింతనలను మీతో తీసుకొని పొండి. అప్పుడే మీరిక్కడకు వచ్చినందుకు సరియైన ఫలిత ముంటుంది. లేకపోతే ఇంత ఖర్చు పెట్టి ఇన్ని శ్రమలలకోర్చి ఇక్కడకు వచ్చి ప్రయోజన మేమిటి? నేను మీ మంచిని అడగటం లేదు, మీ చెడ్డను నాకిచ్చేయండి. నేను మీకు మంచి నిస్తాను. పాడైపోయిన నూరురూపాయల నోటును ఎవ్వరి కిచ్చినా తీసుకోరుకాని అదే రిజర్వ్ బ్యాంకులో ఇస్తే దానికి బదులు మీకు మంచి నోటునిస్తారు. అట్లే మీవద్ద నున్న పనికిమాలిన దుర్గుణాలను మీ కన్నతల్లిదండ్రులైనా అంగీకరించరు కాని, నేను అంగీకరిస్తాను. నాకివ్వండి. నా నుండి పవిత్రమైన గుణాలను తీసుకొని పొండి. మీరు బాగుపడండి, సమాజమును బాగుపర్చండి. మీరు ఆనందించండి. మీ ఆనందాన్ని పదిమందికి పంచండి. అదే నేను కోరేది. ఇంక దేనినీ నేను కోరటం లేదు. **మీ దురభ్యాసములను ఇక్కడ వదలిపెట్టి సదభ్యాసములను తీసుకుపోతే మీ ప్రాంతంలో ఉన్నవారు మీలో వచ్చిన మార్పును గమనించి మీపై గౌరవం పెంచుకుంటారు. లేకపోతే పుట్టపర్తికి పోయి పది నెలలున్నా ఇతనిలో ఏమీ మార్పు లేదేఁ అనుకుంటారు. ఇక్కడికి వచ్చినందుకు మీలో తగిన మార్పును సమాజానికి చూపించాలి. వర్క్‌షాపుకు పోయినకారు క్రొత్తనట్లు, క్రొత్తబోల్టులతో మంచిగా తయారై బయటకి వస్తే వర్క్‌షాపుకు పోయినందుకు సార్థకత ఉంటుంది కాని** ఎలా వెళ్ళిందో అలాగే తిరిగి వస్తే ప్రయోజన మేమి? సాధకులందరికీ ప్రశాంతినిలయం ఒక పెద్ద వండర్‌ఫుల్ వర్క్‌షాప్. **ఈ వర్క్‌షాప్‌లో చేసినపనికి ఏమాత్రము బిల్లు వేసేది లేదు. ఎడ్యుకేషన్ ఫ్రీ, మెడికల్ ట్రీట్‌మెంట్ ఫ్రీ, అంతా ఫ్రీ! వీటిని అందుకోవడానికి మీ అందరికీ అధికార మున్నది. "ఐ యామ్ రెడీ" నేనెప్పుడూ సంసిద్ధంగానే ఉన్నాను. అనుభవించండి, ఆనందించండి.**

(స.సా.మా.97పు.69)

ఈ ప్రదేశం త్వరలోనే ఒక షిరిడీగా, ఒక తిరుపతిగా ఒక వారణాసిగా రూపొందుతుంది. వేలకొలది యోగులు, సాధువులు, జిజ్ఞాసువులు ఈ క్షేత్రానికి వచ్చి ఆత్మశాంతిని మోక్షాన్ని పొందుతారు. ఇచ్చట నుండే సనాతన ధర్మోద్ధరణ కార్యక్రమము ఆరంభమవుతుంది. ప్రపంచం నలు మూలలనుంచి లక్షలాది మంది నన్ను వెదుక్కొంటూ ఇక్కడకు వస్తారు. ఆ అనంతమైన జన సందోహం చివర నిలబడి ఉన్నవారు సుదూరం నుంచి చిన్న చుక్కలా కనిపించే ఈ కాషాయరంగును చూసి తాము ధన్యుల మయ్యామని భావిస్తారు.

(త.పు. 26/27)

(చూ॥ క్రిస్మస్, సూర్యుడు)

ప్రశాంతి పతాకము - చిహ్నములు

"క్రైస్తవమతచిహ్నమైన సిలువ 'అహం' ను ఖండించి వేస్తున్నది; పార్సీమత చిహ్నమైన 'అగ్ని' అన్ని నీచ వాంఛలను దహించివేస్తున్నది; బౌద్ధమతచిహ్నము, చక్రము మన బంధమోక్షములకు కారణచక్రము; ఇస్లాం మతచిహ్నము 'చంద్రరేఖనక్షత్రము భగవంతు నియందచంచల విశ్వాసమును సూచించుతుంది. ప్రణవమైన 'ఓం'సృష్టిస్థితుల విధానము లన్నింటిని క్రోడీకరించబడిన ఆధ్యాత్మిక విజయము యొక్క చరమ స్థితికి చిహ్నము.

(స.సా.జూలై.75 పు.105)

ప్రశాంతి పతాకము - సందేశము

ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసములోను భగవన్నామము నుచ్చరింపుము. నీవు భగవంతునిలో, భగవంతుని కొరకు, భగవంతునిలో అధవసింపుము. అదియే నేనిప్పుడా విష్కరించు ప్రశాంతి పతాకము యొక్క సందేశము.

(శ్రీ.స.సూ.పు.89)

ప్రశాంతి విద్వన్మహాసభ

మన పూర్వసంప్రదాయాలను యీనాటి మానవుల హృదయాలలో మరల నాటవలసి ఉన్నది! ఇంతవరకు

మానవుడు యీ ప్రపంచ నాటక రంగముపై హాస్య నటునిగా, సేవకునిగా, భిక్షకునిగా ఎన్నెన్నో వేషాలను ఎంతో కాలంనుండీ అభినయిస్తున్నాడు. ఇప్పుడు 'నాయకపాత్ర' ధరింప వలసిన సమయం ఆసన్న మయింది. ఆ పాత్రధారణకు తగిన యోగ్యతను అతడు సంతరించు కొనవలసివున్నది. ఆ అర్హతలను తెలియజేసే వారందరినీ (వేద పండితులను) ఒక వేదిక మీదికి చేర్చేటందుకే యీ **ప్రశాంతి విద్వన్మహాసభ** స్థాపించడ మైనది.

(యు.సా.పు.53)

ప్రశ్నలు

ప్రశ్నలు అడుగుటకు నాలుగుకారణము లుండును. 1.తుచ్ఛము, 2.కనిష్టము, 3. మధ్యమము, 4. ఉత్తమము, అని నాలుగు కారణములు. ఇందులో:

వివాదార్థము, ఒకరిని ఓడించుటకు ప్రశ్నవేయుట; ఇది తుచ్ఛము 2. వాక్చాతుర్యము జూపించుటకు ప్రశ్నవేయుట; ఇది కనిష్టము 3. బుద్ధిచాతుర్యము చూపించుటకు ప్రశ్నించటము; ఇది మధ్యమము 3. సందేహములను నివృత్తిచేసుకొనుటకు ప్రశ్నించుట; ఇది ఉత్తమము.

(రా.వా.రె.పు.16)

ప్రశ్నోపనిషత్తు

ప్రశ్నోపనిషత్తు అథర్వణ వేదాంగము. **ప్రశ్న ప్రతి వచన పూర్వకముగా విషయ వివరణము చేయబడుటచే ప్రశ్నోపనిషత్తని పేరు వచ్చినది.** ముండకోపనిషత్తునందు సంక్షిప్తముగా ఉదహరింపబడిన కొన్ని విషయములను విస్తరించుటచేత, ప్రశ్నోపనిషత్తు అర్థానికి వ్యాఖ్యాన మగుచున్నది. **విద్య పరమనియు, అపరమనియు రెండు తెఱంగెలని ముండకము తెలిపెను.** అపరవిద్యకర్మ, ఉపాసనమని రెండు భాగములు. ఈ రెండింటిలో ఉపాసము రెండవ మూడవ ప్రశ్నలయందు విచారింప బడినది. కర్మ విధాన మంతయూ కర్మకాండ యందు

ప్రశ్నలు

విస్తరింపబడి యుండుటవలన ఇచట ప్రస్తావింపబడలేదు. కర్మోపాసనలు రెండును నిష్కామముగా ఆచరించిన వైరాగ్యహేతువు అగుచున్నవి. ఈ విషయము ఈ మొదటి ప్రశ్నయందు వివరింపబడినది. ముండకమును చదివిన పిదప ప్రశ్నోపనిషత్తును చదివిన విషయము విశదము కానేరదని తెలిసికొని నిత్యఫలదమగు పరబ్రహ్మను వెదక గోరి వీరు, పిప్పలాదుడను యోగ్యుడగు గురువును ఆశ్రయించిరి. అపర బ్రహ్మవరులగు వీరు స్వస్వరూపమే ఆత్మయని గుర్తెరుంగలేక పోయినవి "అన్వేషమాణా" యను పదముచే సూచింపబడుచున్నది. నిత్యము అద్వితీయమగు పరబ్రహ్మము గురుశాస్త్రైకవేద్యము. "సమిత్పాణి" యన గురువునకు ప్రియమైనట్టియు, అతని ఆశ్రమమునకు యోగ్యమైనట్టియు, అగు కానుక చేతపట్టుకొనిన వాడని అర్థము. వీరులకు పిప్పలాదుడు చెప్పిన ప్రతివచన మేమన పరమరహస్యము, గోప్యము అగు బ్రహ్మవిద్య; యోగ్యతలేనివానికి ఉపదేశ్యము కాదు. కనుక క్రొత్తగా వచ్చినవారి యోగ్యతను తెలిసికొనుటకై పిప్పలాదుడొక సంవత్సరము గడువు పెట్టెను. సంవత్సరము గడువు పూర్తి అయిన తర్వాత కాత్యాయనుడు పిప్పలాదుని, దేనివలన ప్రజలు పుట్టుచున్నారు? అని అడిగెను. **ప్రజలందు కోరికగలవాడు ప్రజాకాముడు. తననే ప్రజారూపమున సృష్టించుకొను కోరికయే ప్రజా కాముము. పరమాత్మకంటే భిన్నుడు కానట్టి హిరణ్యగర్భుడే ప్రజాపతి.** ఈ కల్పము నందు హిరణ్యగర్భుడు ప్రజాపతియై, తరువాత ప్రజాకాముడయ్యెను. ఇతడు జన్మాంతరమున అనుషించిన అపరవిద్యాకర్మ సముచ్చయ సంపన్నుడు. తత్కృతమగు జ్ఞానము నుద్భుద్ధము చేసికొని యాత్మాదనము చేసెను. ఇదియే అతడొనర్చిన తపము.

(ఉ.వా.పు.43/44)

ప్రసన్నము

(చూ॥ శరణాగతి)

ప్రసన్నుడు

ప్రసన్నుడు

ఈ రెండిటియందునూ, సాకారోపాసన నిరాకారోపాసన, నాకే మాత్రము బేధములేదు. రెండునూ ఒక్కటియే. కావలసినది చిత్తము భగవదాత్మై యుండుట. పవిత్రమైన శ్రద్ధతో ఎట్లు ఆరాధించిననూ నేను ప్రసన్నుడనౌదును.

(గీ.పు.184/185)

ప్రసవము

(చూ॥ ప్రవేశము)

ప్రసాదము

మనము భుజించే దానిలో నాలుగురకములైన ఆహారములు ఉంటున్నాయి. ఒకటి పళ్ళతో నమిలేటటువంటి పదార్థము, రెండవది నాలుకతో రుచిచూచి చప్పరించే టటువంటి పదార్థము. మూడవది జుర్రుకోవటం, నాలుగవది కేవలం మ్రింగటము. మనలో చేరే పదార్థములంతా ఈ నాలుగు రకములుగా ఉంటున్నాయి. కనుక వాటిని పరమాత్మునికి అర్పణం గావించుకునే నిమిత్తం...

శ్లో॥బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా.॥గీ. 4-24 ॥
శ్లో॥ అహంవైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్. ॥గీ. 15-14॥

... అనే శ్లోకములను భుజించే సమయము నందు పఠించాలి. ఎందుకంటే? మొదట మనము భుజించే ఆహారమును బ్రహ్మార్పితము గావిస్తే అందుకు భగవంతుడు **"నేనే వైశ్వానరరూపంలో నీకడుపులో ఉండి, నీవు తినేటటువంటి నాలుగు రకములైన ఆహారములను నేనే ఆరగించి, పుష్టినీ, శక్తినీ, నీ సర్వాంగములకు అందిస్తున్నాను."** అంటున్నాడు. కనుక మనము భుజించే ఆహారములో ఎటువంటి దోషములున్నప్పటికీ, అది భగవదర్పితము చేయుట వలన ప్రసాదముగా మారి పవిత్ర మవుతున్నది.

(శ్రీ.భ.ఉ.పు21)

ఎంత మంచితీపూ మీరంతా సేవింపుడీ
పోవునుదుర్భావము రాబోవును సద్భావముల్
ద్రావంగ ద్రావంగ పాపమెల్ల బాపగన్ "ఎంత"!
(అనిపాడి అందరినీ ఆనందంలో ముంచెత్తేవారు)

నూరిపోసేమందుకాదు నూరువరహాలిస్తే రాదు
దారిచూపి సాయినాథుని దయచే తరియించే మందు
॥నూరి॥
కనలేరు కొనలేరు నిజమైన యీమందు
కనుగొనుచు తిన్నవారు గడియలో కడతేరేమందు
॥నూరి॥
అవి తియ్యని కంఠంలో కమ్మగా పాడుతూ
కమ్మటి ప్రసాదములను అందరికీ పంచువారు.
సాయి నామమను ప్రసాదమిదిగో. రండి భక్తులారా
॥నూరి॥
వేదసారమనుగోధుమపిండిలో వేదవాక్యమను క్షీరముపోసి
ఆధారమైన పెద్ద పాత్రను తీసి, అది సాయి దీని పాకము
బెట్టెను ॥నూరి॥
రకరకమైనది సాయిప్రసాదం. సకల రోగనివారణమోయీ
ఒక కాసైనను ఖర్చులేదోయి. తఖరారు సేయక
తారకమైనది ॥సాయి॥
సారమైనదీ సారధిపాత్ర. సారధి దాసులకేమో యెరుక
దూరముపోయి కొనపనిలేదు. పర్తీపురమున కొల్లగ
దొరుకును ॥సాయి॥

(అ.శ.పు.12/13)

మానవుడు భుజించే ఆహారమువల్ల రాగద్వేషములు అభివృద్ధి ఔతున్నాయనే సత్యాన్ని గుర్తించి మన ప్రాచీనులు భుజించుటకు పూర్వము ఆహారమును పరిశుద్ధి గావించుకునే వారు. **"అన్నం బ్రహ్మ రసో విష్ణుః భోక్తాదేహోమహేశ్వరః"** అని ప్రోక్షించుకునేవారు. ఈ భుజించే అన్నము బ్రహ్మతో సమానము. రసము అనగా త్రాగే నీరు భుజించే పదార్థముల సారము విష్ణురూపము తినేవాడు మహేశ్వరుడు. భుజించే అన్నము శాశ్వతమైన

ఆనందాన్ని అందించాలి. అని ఋతం సత్యంతో ప్రోక్షింపబడుతున్నది. బ్రహ్మవిష్ణు మహేశ్వర స్వరూపులైన మీరు ఋతం సత్యం యొక్క స్వభావాన్ని మాకు అందించండి అని ఆహారమును ఋతముగా సత్యంగా మార్చుకొనే నిమిత్తమై ప్రోక్షించి పవిత్రము గావించి **ప్రసాదముగా స్వీకరించేవారు.**

(బృ.త్ర.పు. 105)

(చూ॥ ప్రార్థన)

ప్రస్థానత్రయము

బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, గీత, జ్ఞానప్రాప్తికి ప్రస్థాన త్రయములు, త్రిమూర్తి స్వరూపములు. బ్రహ్మ సూత్రములను అర్థము చేసుకొనుట కఠినమైన విషయము. ఇది అధికార పురుషులకు తప్ప అన్యుల కందునది కాది. **అధికార పురుషులనగా సాధన చతుష్టయ సంపన్నులు. అట్టి వారికిది కరతలామలకము.** మానవుడు తనను తాను ఉద్ధరించుకొనవలెనన్న మొదట సాధన చతుష్టయమును సాధించి తీరవలెను.

(సూ.వా.పు.2/3)

ప్రహ్లాదుడు

(చూ॥ చర్చిల్, భక్తి రెండు విధములు, భావములు, శీలము)

ప్రాచీన భారతీయ సంస్కృతి

భక్తునికి, భగవంతునికి అవినాభావ సంబంధమున్నది. భగవంతుడు తన సర్వవ్యాపక, సర్వజ్ఞాత్వాది లక్షణాలను భక్తునికి ప్రత్యక్షానుభూతిగా అందించే నిమిత్తమై అనేక లీలలను చూపిస్తాడు. **భగవంతుడు లేనిదే భక్తుడనే పదానికి అర్థమే లేదు. భాగవతము భగవత్తత్త్వంతోపాటు భక్తుని శక్తిని, భగవదనురక్తిని, జగత్తుపై విరక్తిని, సాధనా సంపత్తిని, సంపూర్ణ శరణాగతిని గురించి వివరించింది.** భక్తితో కూడిన కర్మను, అనుభవైకవేద్యమైన జ్ఞానమును భాగవతము ప్రతిపాదించింది. భగవంతునికి, భక్తునికి మధ్య ఎవరూ లేరనీ, అనుగ్రహానికి మార్గం భక్తియే తప్ప అన్యము లేదనీ ప్రకటించింది. భక్తునికి భగవంతుడే సర్వస్వము అని వర్ణించింది. **భక్తుడు భగవంతుడు. భాగవతము - ఈ మూడింటి సమ్మిళిత స్వరూపమే ప్రాచీన భారతీయ సంస్కృతి.**

ధ్రువుడు తన తండ్రి తొడపై కూర్చొనవలెనని ఆశించాడు. కానీ సవతి తల్లి అతడిని నిరసించి, పరిహసించి, తూలనాడి వలదని వారించింది. ధ్రువుడు దుఃఖంతో తల్లివద్దకు వెళ్ళి తన కోరికను విన్నవించి, ఆమె అనుమతితో ఘోరారణ్యంలో ప్రవేశించి, నిద్రాహారాలను త్యజించి, చలి, ఎండ, వానలను లెక్కచేయక అకుంఠిత దీక్షాపరుడై కఠోర తపస్సు నాచరించాడు. భగవంతుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. "స్వామీ! **నాకు నీవే కావాలి" అన్నాడు ధ్రువుడు. దానికి భగవంతుడు సమాధానం చెపుతూ "నాయనా!** నీవు నీ తండ్రి తొడపై కూర్చోవాలనే కోరికతో తపస్సు సలిపావు. కానీ ఈనాడు మరొకటి కోరుతున్నావు. **'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం' అన్నారు.** కనుక ముందు నీ అభీష్టమును నెరవేర్చుకో. భవిష్యత్తులో నీకు గల రాజ్యపాలనాది బాధ్యతలను నిర్వర్తించు. ఆచంద్ర తారార్కము ఆకసమున ధ్రువతారగా ప్రకాశిస్తూ ఆదర్శప్రాయుడవై నిలచెదవు గాక!"అని ఆశీర్వదించాడు. ఈఘట్టంలో మనం గమనించవలసిన దేమిటంటే - **తలచింది, చెప్పేది, చేసేది మూడూ ఒక్కటిగా ఉండాలి. అనగా త్రికరణ శుద్ధి అత్యవసరం.**

ప్రహ్లాదుణ్ణి తండ్రి సర్పాలచేత కరిపించినా, ఏనుగులచేత త్రొక్కించినా, అగ్నిలో పడవేసినా, పర్వత సానువుల నుండి పడద్రోయించినా, సముద్రంలో ముంచినా అతడేమాత్రము వెరువక, కన్నీరు పెట్టక "ఓ పన్నగశాయీ! ఓ దనుజభంజన!" అంటూ భగవంతుణ్ణి కీర్తిస్తూనే ఉన్నాడు. నారాయణ మంత్రాన్ని స్మరిస్తూనే ఉన్నాడు.

ప్రాచేతనుడు

లోకములన్నింటినీ జయించి, సూర్య చంద్ర నక్షత్ర మండలములను, అష్టదిక్పాలకులను, పంచభూతములను హస్తగతం గావించుకున్నావేగాని నీ ఇంద్రియాలను మాత్రం జయించలేకపోతున్నావంటూ తండ్రికి కూడా బుద్ధి చెప్పాడు. చిట్టచివరకు హిరణ్యకశిపుడు "ఎక్కడున్నాడు నీ హరి?" అని అడిగాడు. **"ఇందు గలడందు లేడని సందేహంబు వలదు. చక్రి సర్వోపగతుండు"** అని సమాధాన మిచ్చాడు ప్రహ్లాదుడు. "అయితే ఈ స్తంభంలో ఉన్నాడా?" అని హిరణ్యకశిపుడు గద్దించాడు. ఉన్నాడన్నాడు ప్రహ్లాదుడు. హిరణ్యకశిపుడు ఆ స్తంభాన్ని బ్రద్దలు చేసేసరికి నరసింహావతారం ఆవిర్భవించి అతణ్ణి అంతం గావించింది. ఇందులో అంతరార్థాన్ని గమనించాలి. **ఇక్కడ స్తంభం అనగా దేహం. స్తంభాన్ని బ్రద్దలు చేసినప్పుడే నరసింహావతారం ప్రత్యక్షమైంది. అంటే దేహభావాన్ని త్యజించినప్పుడే దైవాన్ని దర్శించడానికి వీలవుతుంది. దేహభావమును, అభిమాన మమకారములను వీడనంతవరకు దైవాన్ని దర్శించడానికి వీలుకాదు.**

గజేంద్రుడు శక్తివంచన లేకుండా తన భుజబలాన్ని. బుద్ధిబలాన్ని ఉపయోగించి ఎంత ప్రయత్నించినప్పటికీ మొసలి బారి నుండి తప్పించుకోలేక పోయాడు. చిట్టచివరికి **"అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ"** అనే స్థితికి వచ్చి **"నీవే తప్ప నితఃపరం బెరుగ మన్నింప దగున్ దీనునిన్, రావే ఈశ్వర కావవే వరద రక్షింపు భద్రాత్మకా"** అని ఎలుగెత్తి పిలిచే సరికి తక్షణమే శ్రీ మహావిష్ణువు తన సుదర్శనంతో మొసలిని సంహరించి గజేంద్రుణ్ణి కాపాడాడు. ఈ గజేంద్ర మోక్ష ఘట్టం ఒక చక్కని అంతరార్థంతో కూడినది. **సంసారమనే సరస్సులో జీవుడనే గజేంద్రుణ్ణి విషయ వాసనలనే మొసళ్ళు పట్టి పీడిస్తున్నవి.** భగవన్నామం వలన, భగవంతుని **'సు-దర్శనం' వలననే** జీవుడీ విషయ వాసనల నుండి విముక్తి పొందగలడు. గజేంద్రుడు తన తొండంతో ప్రక్కనున్న చెట్టును చుట్టి మొసలితో పోరాడినంత కాలము ప్రయోజనం లేకపోయింది. చెట్టును వదలి, తొండాన్ని సడలించి, ఎలుగెత్తి ఆర్తితో ప్రార్థించినంతనే భగవంతుని సహాయం అందింది. అనగా గజేంద్రుడు సంపూర్ణ శరణాగతి పొందేదాకా భగవంతుడు స్పందించలేదు. **కౌరవ సభలో కృష్ణుడు ద్రౌపది మానం కాపాడిన ఘట్టం కూడా ఇదే విషయాన్ని ప్రకటిస్తుంది.** ఆమె తన చేతులతో చీరచెంగును పట్టుకొని ప్రార్థించినంతసేపు కృష్ణుడు ప్రత్యక్షం కాలేదు. ఎప్పుడైతే ఆమె **తన రెండు హస్తములను చేర్చి, అనగా దశేంద్రియములను కలిపి ప్రార్థించిందో తక్షణమే కృష్ణుడు అక్షయంగా వలువల నిచ్చి ఆమెను రక్షించాడు.**

(స.సా.అ.98పు.275/276)

(చూ॥ భారతీయ సంస్కృతి)

ప్రాచేతనుడు

ప్రాచేతనుడనగా ఎవరు? వాల్మీకి. ఇతనికి ప్రాచేతనుడనే పేరు ఎట్లా వచ్చింది? **వరుణునకు 'ప్రాచేతన' అనేది మరొక పేరు.** నిరంతరము దైవచింతనచేత తనను, తన దేహాన్ని మరచాడు రత్నాకరుడు. శరీరంపైన పుట్టలు పెరిగాయి; అతని రూపము మరుగైపోయింది. అప్పుడు వరుణుడు కుంభవృష్టిని కురిపించాడు. దాంతో అతని శరీరంపైన పుట్టలుగా ఉన్న మట్టి కరిగిపోయింది. తద్ద్వారా వాల్మీకి బయటపడ్డాడు. ఈవిధంగా వరుణుని అనుగ్రహం చేత బయటకు వచ్చినవాడు కనుకనే, ఇతనికి ప్రాచేతనుడు అని పేరు వచ్చింది. **ఈ ప్రాచేతనుడే శ్లోకదాతగా మారి లోకదాతయైన రాముని చరిత్రను జగత్తుకు అందించాడు.** ఈనాటి మానవుడు కూడా తనకు అంటుకున్న అహంకార మమకారములనే మట్టిని **దైవచింతనచేత ఏనాడు వదల్చుకొనునో ఆనాడే తాను పవిత్రుడు కాగలడు.**

(స.సా.ఏ.96 పు.94)

ప్రాణము (వైబ్రేషన్)

భక్తునియొక్క హృదయం భగవంతునికోసం ఎంతగా పరితపిస్తుందో,భగవంతుని హృదయం కూడా భక్తునికోసం అంతగా పరితపిస్తుంది. భగవత్తత్వాన్ని ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. కొన్ని సందర్భాల్లో "భగవంతుడు ఇంత చిన్న పని చేశాడే!" అని మీరు అనుకుంటారు. కాని, చిన్న పని, పెద్ద పని అనేది లేదిక్కడ. భక్తులను రక్షించే నిమిత్తం తాను ఎలాంటి పనైనా చేస్తాడు. భక్తులే లేకపోతే భగవంతుడెక్కడ? భగవంతుని గొప్పతనమును వర్ణించేది, నిరూపించేది భక్తులే కదా! ఇప్పుడు ఇక్కడ యింతమంది చేరారు. ఎందుకోసం? ఒకే జవాబు. మీదగ్గర లేనిది, మీ యింటిలో చిక్కనిది, మీ ఊరిలో దొరకనిది ఏదోఒకటి యిక్కడున్నది. దాన్ని పొందేకోసం మీరు ఇక్కడికి వచ్చారు. అంతేగాని, ఊరికే రమ్మని చెబితే వస్తారా? **మీలో లేనిది సాయిప్రేమ,** మీ ఊరిలో లేనిది సాయిప్రేమ. కాబట్టి, ఈ **ప్రేమను పొందటానికి మీరిక్కడికి వచ్చారు. దానిని పొంది తీసుకొనిపొండి. సాయిప్రేమను మీ హృదయాల్లో నింపుకోండి. కాబట్టి, భక్తులే లేకపోతే బాబాఎక్కడ? బాబా లేకపోతే భక్తులెక్కడ? బాబాకు భక్తులకు మధ్యనున్న సన్నిహిత సంబంధ బాంధవ్యం విడదీయరానిది. బాబా ప్రాణమే భక్తులు, భక్తుల ప్రాణమే బాబా. యిరువురిదీ ఒకే ప్రాణమే.** కనుక, ఈ సత్యాన్ని మీరు అర్థం చేసుకొని ఎక్కడైనా ఉండండి, **బాబా మిమ్మల్ని రక్షిస్తూనే ఉంటాడు. భక్తులైనవారు ఎలాంటి పరిస్థితియందూ ఎలాంటి బాధలూ పొందరు.** చరిత్రలో మీరు చదివియే ఉంటారు. భగవద్భక్తులకు ఏ చేటూ, ఏ లోటూ రాదు. మీ హృదయాలలో పవిత్రమైన భక్తి స్థిరంగా ఉన్నప్పుడే అనుగ్రహం సిద్ధిస్తుంది. అంతేగాని మధ్యమధ్య పెండ్యులం మాదిరి భక్తి యిటూ, అటూ చలిస్తుంటే అనుగ్రహం చిక్కదు. మీ హృదయం నిశ్చలమైనదిగా నిస్వార్థమైనదిగా ఉండాలి. సముద్రంలో గండశిలలుంటాయి. వాటిని నిరంతరము అలలు వచ్చి కొడుతూనే ఉంటాయి. అలలు వదలవు, శిలలు కదలవు. **మీ హృదయం కూడా ఆ గండశిలల మాదిరి నిశ్చలంగా ఉండాలి. ప్రపంచంలో అనేక అవస్థలు వచ్చి మిమ్మల్ని కొడుతుంటాయి. కాని, మీరు కదలకుండా స్థిరంగా ఉండాలి. అదియే నిజమైన భక్తి.**

ప్రేమస్వరూపులారా! **దేన్నైనా మీరు సుఖంగా వదలవచ్చునుగాని, దైవాన్ని మాత్రం వదలకండి, మరువకండి. ఈ సత్యాన్ని మీ హృదయంలో భద్రం చేసుకోండి. అదియే మిమ్ము సర్వ విధముల రక్షిస్తుంది.**

(ఆ.భా.పు.61/62)

ప్రాణము ప్రకాశించుచున్న అన్ని జీవులయందు, ప్రణవ స్వరూపముగా పరమాత్మ నివసించుచున్నాడు. దీనిని గుర్తించినవాడే, మానవుడు. మానవుడుగా జన్మించి, మానవుడుగా జీవించి, దైవత్వము గుర్తించి మరణించ వలెను. సర్వ భూతాంతరాత్మ అనెది దేవుని అందరి లోనూ గుర్తించి వర్తించవలెను. అందరియందూ తనలోని దైవమునే దర్శించి ఆచరించవలెను. అట్టి విశాల భావమే స్వర్గము; దానికి విరుద్ధముగా సంకుచితమైన భావమే, నరకము.

(స.సా.ఆ.75 పు.133)

ఒకానొక సమయంలో జనకమహారాజు గొప్ప యజ్ఞమును ప్రారంభించాడు ఈ యజ్ఞమునకు మహామహా పండితోత్తములందరూ వచ్చారు. ఇందులో మహా పండితులైన మైత్రేయ, శాండిలిని, గార్గి మొదలైన స్త్రీలుకూడా వచ్చారు. ఇలాంటి పండితుల సభలో **'అశ్వరుడు' అనే మహర్షి యజ్ఞవల్క్యుణ్ణి ప్రశ్నిస్తూ వచ్చాడు.** "దేవతలు ఎంతమంది ఇక్కడ?"అని ప్రశించాడు. యాజ్ఞవల్క్యుడు **'ఇక్కడ'** అనే పదమును ఆధారముగా తీసుకొని **3306** అని చెప్పాడు. ఇంతమంది దేవతలు ఇక్కడ ఉన్నారా? అని సభ అంతా ఆశ్చర్యపోయింది. యాజ్ఞవల్క్యుని ఉద్దేశ్యమేమిటి. ఆ సభలో పాల్గొనిన ప్రతి వ్యక్తి దైవ స్వరూపుడేనని అతని అభిప్రాయం. **'దైవం మానుష రూపేణ'. ఆనాడు వారు ప్రతి వ్యక్తినీ భగవత్ స్వరూపుడుగానే భావించేవారు.** తిరిగి మరొక ప్రశ్న వేశాడు

ప్రాణము

'అశ్వరుడు'. **ఈ 3306 దేవతల లోపల కొంతవరకు తగ్గించడానికి వీలుంటుందా యాజ్ఞవల్క్యా?** అని ప్రశ్నించాడు. తప్పకుండా తగ్గించవచ్చునన్నాడు యాజ్ఞవల్క్యుడు అయితే ఎంతమంది దేవతలు? **అక్కడ 'ఇక్కడ' అనే పదములేదు 33 మంది దేవతలున్నారని సమాధానం** చెప్పాడు యాజ్ఞవల్క్యుడు. వారిని గురించి వివరించ మన్నారు అశ్వరుడు. **వసువులు-8, రుద్రులు-11, ఆదిత్యులు-12, ఇంద్రుడు,ప్రజాపతి - వీరందరూ చేరితే మొత్తం 33 మంది అని చెప్పాడు.** అయితే సరియని సభలోని వారందరూ తలలూపారు. ఇంతలో **"గార్గి" లేచి పండితోత్తమా!** వీరిని కొంతవరకు తగ్గించడానికి సాధ్యమా" అని అడిగింది. తప్పక సాధ్యమవుతుందని చెప్పి **'ఆరు మంది' అన్నాడు యాజ్ఞవల్క్యుడు.** ఎవరు? అని అడిగారు. అప్పుడు **1. అగ్ని 2 పృథ్వి 3 వాయువు 4 ఆదిత్య 5 అమరత్వము 6. అధ్వరము - ఈ ఆరుమంది నిజమయిన దేవతలని చెప్పాడు.** తిరిగి అశ్వరుడు లేచి ఈ ఆరుమందిలో కొంతవరకు తగ్గించవచ్చునా? అని అడిగాడు. తప్పక తగ్గించవచ్చునని యాజ్ఞవల్క్యుడు చెప్పి వారు **ముగ్గురు మాత్రమేనని, వారే భూతభవిష్యత్తు వర్తమాన కాలములని పేర్కొనినాడు.** వీరినికూడా ఏమైనా తగ్గించ వచ్చునా? అని అడిగారు. అప్పుడు యాజ్ఞ వల్క్యుడు **రెండు అని చెప్పి అన్నము, ప్రాణము అన్నాడు.** అయితే ఈ రెండులో ఏమైనా తగ్గించవచ్చునా? అని అడిగారు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు **1 1/2 దేవుడన్నాడు.** దీని అర్థమేమిటని అడిగారు. **గాలి సర్వ పదార్థముల యందునూ యిమిడి ఉంటున్నది సర్వత్రా నిండినటు వంటి ఈ గాలికి 'అద్వర్తము' అన్నాడు. 'అద్వర్తము' అనగా 1 1/2 అని దీని అర్థము. అయితే ఈ 1 1/2 నుంచి కూడా ఏమైనా తగ్గించవచ్చునా? అని అడిగారు.** తగ్గించవచ్చునని చెప్పి **'ప్రాణము' ఒక్కటే అని యాజ్ఞవల్క్యుడు చెప్పాడు.** అన్ని రకములుగా ఆలోచించిన తరువాత **కట్టకడపటికి 'ప్రాణము' అనేటటువంటిది ఒక్కటే అంత్యదేవుడుగా నిలిచాడు.**

ఈ ప్రాణతత్వము ఎక్కడ ఉంటున్నది? **ప్రాణమునకు ఒక స్థానము, ఒక కాలము, ఒక దేశములేదు. సర్వత్రా ఉంటున్నది. ఇట్టి సర్వత్రా ఉండినటువంటి ప్రాణ ప్రతిష్ఠనే ప్రధానమైన 'యజ్ఞము' అన్నాడు.** యజ్ఞమనగా ఏమిటి? **కేవలం ఒక హోమంలో సమిధలను అర్పించడమేకాదు. యము వియమాదులతో ఆచరించడమే "యజ్ఞము" అన్నారు.** ఈ జ్ఞానమంతా కేవలం భౌతికమైన జ్ఞానమేనన్నారు. యమనియమాదులు ఆచరించేది దేహముతోనే. దేహము అనిత్యమైనటువంటిది నీటిబుడగ వంటిది కనుక ఇది సత్యమెట్లా అవుతుంది?

ఇంక 'జ్ఞానము' అంటున్నారు. ఈ జ్ఞానము కూడనూ నిజమైన జ్ఞానము కాదు. అజ్ఞానముతోకూడిన జ్ఞానము అన్నారు. జ్ఞా=జ్ఞానము, న=కాదు. జ్ఞానము కానిది. ఇది జ్ఞానము కాదని అర్థము. ఏది జ్ఞానం? **ఆత్మజ్ఞానమే జ్ఞానము.** కేవలం ఇంద్రియములచేత, తెలివితేటలచేత అనుభవించేటటువంటి జ్ఞానములన్నీ మిథ్యాజ్ఞానములే. జీవదేవుడేనని టటువంటిది ఎండానీడలవలె వుంటున్నాది ఎండవుంటేనే నీడ. నీడలోకూడా ఎండ ఉన్నది. కనుక ఈ రెండింటియొక్క తత్వమే ఈ జగత్తు. దీనినే **ద్వైతము అన్నారు. ఈ జగత్తంతా ద్వైతస్వరూపమే.** ఈ ద్వైతస్వరూపమైనటువంటి జగత్తునందు, ఎట్టి జ్ఞానము మనం సంపాదించినప్పటికినీ - ఇవి అజ్ఞానము క్రిందనే రూపొందుతాయి. ఈ జ్ఞానము అనేక వాదోపవాదములకు పనికి వస్తుంది. తర్కములకు ఉపయోగిస్తూ వుంటారు. **"వాదేవాదే వజతే వైరం" ఈ వాదన వలన వైరం పెరుగుతూ వుంటుంది. వాదన కానిది బేధము లేనిది, రెండోది కానిది, తేజస్సు వెలుగునది, సర్వత్రా వ్యాపించునది - అదియే నిజమైన ఆత్మజ్ఞానము.** అట్టి ఆత్మజ్ఞాన నిమిత్తమై ప్రాచీన కాలమునందు మహర్షులు యజ్ఞయాగాదులు సలుపుతూ వచ్చారు. మానవునియొక్క ఉనికిని గుర్తించే నిమిత్తమై యజ్ఞములు ఆచరిస్తూ వచ్చారు. జీవిత పరమావధిని తెలుసుకొనే నిమిత్తమై యజ్ఞములు ప్రారంభించారు. అయితే ఈనాడు ఏదో ఒక లలితా

ఒకానొక సమయమున ప్రతరథనుడు మనుష్యునకు అత్యంత హితము కలిగించునదేదో తెలుపమని ఇంద్రుని ప్రార్థించగా, అపుడు ఇంద్రుడు **ప్రాణము నేను. నన్ను నీవు ఆయువనియు తలంపుమని, ఉపాసింపుమని అంటాడు.** ఇంకనూ అనేక విధుల ప్రాణమును వర్ణించుచును ఏష ప్రాణ ఏవ **"ప్రజ్ఞాత్మానందో ఽజరో ఽమృతః" అన్నారు. అనగా ఆ ప్రాణము ఆనందస్వరూపము, అజరము, అమీతము అని ప్రబోధిస్తాడు.** ఈ వాక్యమునందు కూడా ప్రత్యక్షముగా బ్రహ్మలక్షణములే చెప్పబడినవి. ఏతావాతా చక్కగా పరిశీలించి చూచిన ప్రాణ వాక్యమునకు ప్రాణశబ్దమును, బ్రహ్మమనే (పరబ్రహ్మమనే) అర్థము వివరమగుచున్నది. కానీ, అన్య అర్థములు కనిపించవు, అన్య అర్థములు కావు.

మరొక విధముగా విమర్శించి చూచిన **మనుష్యునికి హితమైనది ప్రధానమైనది యేది అంటే ప్రాణము** అని స్థూలార్థము కాగలదు. కాని ఆ ప్రాణము బ్రహ్మ వాచయమగుటచేత పరబ్రహ్మ ప్రాప్తి మనుష్యునికి హితము, ప్రధానము అని తేలుచున్నది. లోకములోని సామాన్యమానవులు, వ్యావహారిక రీతిని ధన, కనకవస్తు వాహనాదులు ప్రధానములని భావింతురు. అవియే జీవిత లక్ష్యములని వాటివెంటబడి వాటిని సంపాదించుకొనుటకు ప్రయత్నింతురు.

ఈప్రయత్నములో మానవుడు తన అమూల్యమైన మానవత్వమును వ్యర్థము గావించుకొనుచున్నాడు. జీవితమును వ్యర్థము గావించుకొనుటయే కాక పూర్ణ అజ్ఞానమును పెంచుకొనుచున్నాడు. తన స్వరూపాన్ని విస్మరించుచున్నాడు.

మరొక సమయమున ఇంద్రుడు **'మామేవ విజానీహి' అన్నాడు.** అనగా నన్నే బాగాతెలుసుకొమ్మని అర్థము. **ఇక్కడ కూడా ఇంద్రుడనగా అవయవములు కల ఒకానొకదేవత అని, ఆ దేవతయే ప్రాణ శబ్దము చేత చెప్పినవాడు కావలయును.** ఇక్కడ బ్రహ్మమనుటకు వీలు లేదు అనుతలంపుతో ప్రాణమనగా ఇంద్రుడు అని సహస్ర నామమో, విష్ణుసహస్రనామమో, ఏదో ఓక పారాయణమో చేసుకుంటూ- ఇదే యజ్ఞములోపల కాలమును సార్థకం చేసుకున్నట్లుగా భావిస్తున్నాం. ఇవన్నీ చేయదగినవే అయితే మనం దీనివలన అందుకొనేది ఏమాత్రంలేదు అప్పటికప్పుడు తాత్కాలిక ఆనందమును అందుకోవచ్చును. **శాశ్వతానందమును పొందటానికి ఇవి ఏమాత్రం కారణం కావు తనలో తాను ఆత్మతత్త్వమును చక్కగా విచారణ సలిపి, విమర్శించి, పరిశోధన సలిపి, పరిశీలించి దానిని పరతత్త్వంగా అనుభవించాలి. ఇదియే నిజమైన ఆత్మ జ్ఞానం.** కనుక ఇట్టి ఆత్మజ్ఞానముకోసం ఏ గ్రంథములూ మనం చదువనవసరంలేదు. కాని అనుభవజ్ఞుల ద్వారా కొంతవరకు సత్యమును గుర్తించి, దానిని సాధనలో నిమిడ్చి, మన స్వప్రయత్నంచేతనే దీనిని సాధించాలి.

(శ్రీ.న.93.పు.51/52)

(చూ॥ అంతరార్థము, ఉత్తరాయణము, జన్మద్యస్యయతః, జ్యోతిశ్చరణాభిధానాత్, చదువు, ప్రాణస్తథానుగమాత్, యాంతేమతిస్సాగతిః, విద్యుల్లేఖేవభాస్వరా, సంకల్పము, హిరణ్యగర్భతత్త్వం)

ప్రాణప్రయాణము

(చూ॥ అంత్యకాలము)

ప్రాణశక్తి

వేదము **"నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవభాస్వరా." నీలమేఘముమధ్య ఏవిధంగా మించు, మించుతూ ఉంటున్నదో, ఆవిధముగా మూలాధారమైన చక్రముమధ్య, వెన్నెముకమధ్య, పూసలమధ్య తాను ఒక మించువలె మించుతూ ఉంటుండాది. ప్రాణశక్తి.**

(ఆ.రా.పు.404)

ప్రాణస్తథానుగమాత్

ఇక్కడ ప్రాణ శబ్దమున చెప్పబడినది. ప్రాణవాక్యము బ్రహ్మమే అగునుగానీ అన్య అర్థములు అనగా ఇంద్రుడు, రుద్రుడు, వాయువు ఇత్యాది అర్థములు కావు.

ప్రాణాయామము

చెప్పిరే కాని ఇది సరికాదు. **ప్రాణ శబ్దముపరబ్రహ్మమే అని తలంచవలెను.** ఇంకా కొందరు దేవేంద్రుడు తన యందున్న పరబ్రహ్మ స్వరూపమును తెలుసుకొమ్మని చెప్పియుండవచ్చును అన్నారు. ఈ కారణము వలన ఇచ్చట **ప్రాణ శబ్దము పరబ్రహ్మకే సంకేత మని గ్రహించిరి.** లౌకికదృష్టితో ప్రాణశబ్దమును ఇంద్రునకు సంబంధము కలిగించుచున్నారు. **ఆధ్యాత్మికంగా భూమా అనగా పరబ్రహ్మముతో మిక్కిలి సంబంధము కలిగియున్నది.** దీనిని పురస్కరించుకొనే భాష్యకారులు అనేక విమర్శలు చేసి వ్యావహారిక పారమార్థికంగా పరిశీలన జరిపి రెండింటిని సమన్వయ పరచి రెండింటి యందూ వున్న తత్వము ప్రాణమేయనియు, ~~ఈ~~ **ప్రాణము బ్రహ్మకే సంకేతమనియు నిర్ణయించిరి. ప్రాణము బ్రహ్మమునకు అవినాభావ సంబంధమనియు** రెండు ముఖములతో కూడిన నాణెము వంటిదనియు ఒక దానిని విడచి మరొకటి వుండలేదనియు, వీలు కాని దనియు నిర్ణయించిరి.

మొత్తముపై ప్రాణ శబ్దము పరబ్రహ్మమే అన్నది పరమ సత్యము. ఉపాస్య దేవత పరబ్రహ్మమే కాని వేరొకటి మరొకరు కాదు - అని తాత్పర్యము.

"శాస్త్ర దృష్ట్యాతు ఉపదేశ వామదేవవత్" వాసు దేవుడను మహాముని ఉపదేశించిన ప్రకారముగా శాస్త్రదృష్ట్యా అహం బ్రహ్మాస్మి. తత్త్వమ్ అసి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మవాక్యములను వినుట వలన కలిగిన అపరోక్ష బ్రహ్మజ్ఞానముచేత, పై అహం బ్రహ్మాస్మి అను వాక్యమును ధ్యానము చేయుటచేత, ప్రాణ శబ్దమునకు ఇంద్రుడు అని ఉపదేశము చేయుటలో తప్పులేదని భావింతురు. ఇది అనుభూతికి రాక మునుపు తోచిన భావము. అనగా బ్రహ్మజ్ఞానము కలుగక పూర్వము వాసుదేవ మహాముని, ప్రాణమనగా ఇంద్రుడు అని తలంచి యుండవచ్చును. బ్రహ్మజ్ఞానము కలిగిన తరువాత **'అహం మనురభవం' నేనే సర్వాత్మకుడనని యెట్లు చెప్పెనో అటులనే ఇంద్రుడు పరిపూర్ణ జ్ఞానము కలవాడగుటచే ఇంద్రుడు ప్రాణపదము బ్రహ్మము అని చెప్పుటలో విరోధము లేదని మరికొందరు భావింతురు.**

బ్రహ్మమునకు యేమైనా చెప్పవచ్చును. **'సర్వం బ్రహ్మ, సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ,సత్వం బ్రహ్మ, ప్రాణం బ్రహ్మ, అనంతం బ్రహ్మ, జ్ఞానం బ్రహ్మ,సర్వం బ్రహ్మ'** ఈ వాక్యములను ఆధారము చేసుకొని అన్నింటిని బ్రహ్మవాక్యమునకే సమన్వయపరచవచ్చును. **సర్వం బ్రహ్మము నుండి వెలువడినవే.**

(సూ.వా.పు.51/54)

ప్రాణాయామము

ప్రాణాయామం క్రమపద్ధతిలో జరుపవలసిన సాధనా ప్రక్రియ. నియమిత విధానంలో జరుపనిచో ప్రమాదం కూడా సంభవించవచ్చు. ప్రాణాయామంలో **మూడు అంశములున్నవి. మొదటిది,. పూరకము** అనగా, నాసిక ద్వారా గాలిని పీల్చుకొనడం. **రెండవది, కుంభకము.** ఇది గాలిని స్తంభింపజేయటం. పూరకమునకు ఎంత కాలం తీసుకుంటావో అంత కాలం కుంభకంలో గాలిని బిగపట్టాలి. **మూడవది, రేచకము** లేక గాలిని వదిలివేయటం. రేచకమునకు కూడా పూరక, కుంభకములకు తీసుకున్నంత కాలాన్ని తీసుకోవాలి. **అంటే, మూడు దశలలో సమంగా గాలిని తీసుకోవటం, బిగపట్టటం, వదలటం జరగాలి. ప్రాణాయామం మన శ్వాసను నియమబద్ధం చేస్తుంది.** శ్వాస వేగం ఎక్కువగా ఉన్న జీవులు దీర్ఘకాలం జీవించవు. **ఉదాహరణకు, కుక్క శ్వాస వేగం ఎక్కువ.** కనుక, అది దీర్ఘకాలం జీవించలేదు. పాము, ముంగిసల శ్వాస వేగం తక్కువ కావడంచేత అవి దీర్ఘకాలం జీవిస్తాయి.

(స.సా.ఏ. 2000 పు. 127)

ప్రాణుడు

(చూ॥ బ్రహ్మవిద్య)

ప్రాపర్టీ

విద్యార్థులారా! మీ ఇన్‌స్టిట్యూషన్స్ ఒక్కొక్కదానికి ఒక్కొక్క సిల్వర్ కప్పును ప్రైజుగా ఇస్తున్నాను. ఇవి కేవలం సంస్థలకు ఇచ్చినానని అనుకోకండి, ఎవరికి వారు స్వామి నాకే ఇచ్చారని భావించి ఆనందించండి. **'ఫండమెంటల్ లవ్'** ను పెంచుకోండి, **'ఇండివిజువల్ లవ్'** కాదు. నీవు, నేను, వారు అందరూ చేరి ఒక్కటే అనే ఏకత్వాన్ని మీరు అభివృద్ధి పర్చుకోవాలి. ఈనాడు ప్రపంచమంతా ఏకత్వాన్ని అనేకత్వంగా విభజించుకొని అశాంతికి గురియవుతున్నది. మీరీ ప్రపంచంలో ప్రవేవించి అనేకత్వాన్ని ఏకత్వంగా మార్చుటకు ప్రయత్నించాలి. అదే మీరు నాకివ్వవలసిన ప్రైజు, **మీరందరూ నా ప్రాపర్టీ, నేను మీ ప్రాపర్టీ.** కాబట్టి నన్ను మీరు పంచుకోండి, నేను మిమ్మల్ని పంచుకుంటాను. భక్తి పేరుతో పూజలు, వ్రతాలు, భజనలు చేస్తే చాలదు. **"దైవం నావాడు" అనే హక్కును మీరు సంపాదించాలి. దైవం నావాడని నీవనుకొన్నప్పుడు దాని రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్ ఫలితంగా దైవం 'నీవు నావాడవు" అంటాడు.** కనుక నన్ను మీవాడుగా భావించుకోండి. సహజంగానే మీరు నావారుగా వచ్చేస్తారు. మీకు తెలియదుగాని మొన్న క్రికెట్ మ్యాచ్ ఆడడానికని ఇక్కడకు వచ్చిన ఒక ఆటగాడు నాతో ఒక మాట చెప్పాడు. అతడు ఇక్కడకు వచ్చిన తరువాత అతని పని విజయవంతమైనదని ఒక టెలిగ్రామ్ వచ్చింది. అప్పుడతడు **"స్వామీ! నా పని నేనేమీ చేసుకోలేదు. ఇది నా స్వామిపని అనుకొని ఇక్కడకు వచ్చేశాను. నేను స్వామి పని చేశాను, స్వామి నా పని చేశారు"** అన్నాడు. కనుక మీరు స్వామి పనులన్నీ చేయండి, మీ పనులన్నీ నేను చేస్తుంటాను. ప్రతి కర్మను దైవకర్మగా విశ్వసించండి.

(స.సా.ఫి.98పు.45)

ప్రాప్తి

ప్రాప్తిపై భారమువేసి వూరకుండుటలో యత్నలోపమున్నది. ప్రయత్నించి, ప్రార్థించి ప్రాప్తిని పొందవలెను. ప్రయత్న ప్రార్థనలులేక ప్రాప్తి దయా రెండునూ లభించునవి కావు. నేటినుంచీ ప్రయత్నించేపని ప్రారంభించు.

(స.ని.పు.38)

ప్రాపర్టీ

ప్రార్థన/ప్రార్థనలు

విద్యార్థులారా! చక్కగ మీరు గుర్తించవలసిన విషయము, హాస్టలులోకానీ మరెక్కడైనా సరే బ్రహ్మార్పణము గావించి భుజించమని బోధించాము. ఎందుకనగా ఆహారములో అనేక రకములైన అశుద్ధములు చేరుతుంటాయి. **పాక శుద్ధి - పాత్ర శుద్ధి - పదార్థ శుద్ధి,** పదార్థములను శుభ్రంచేసి పెట్టుకున్నంత మాత్రాన అవి శుద్ధి కావు. మనం తెచ్చుకున్న కూర కాయలు, వండించి తెచ్చినాడో. దొంగలించి తెచ్చినాడో మనకు తెలియదు. కనుక ఈ కూరగాయలలో అనేక దోషాలుంటాయి. ఇలాగ పదార్థము యొక్క దోషాలు విచారించడం సాధ్యము కాదు. **వంటవాని thoughts** ఎలాంటివో మనము విచారించలేము. కనుక ఎన్ని దోషములున్నను - **బ్రహ్మార్పణం గావిస్తే - భగవదర్పితము గావిస్తే - అది ప్రసాదము అవుతుంది. కానీ, పదార్థములు కావు. ప్రసాదముగా మారినప్పుడు దాంట్లో ఎట్టి దోషములుండవు. నాలుగు రకములుగా మనము భుజించే ఆహారమును భగవంతుడు పరిశుద్ధం చేస్తున్నాడు. ఇవి ఏమనగా - భక్ష్య, భోజ్య లేహ్య చోష్యములు.**

(స.సా.ఆ.89పు.220)

"రోజుకు రెండుసార్లు క్రమం తప్పకుండా ప్రార్థనలు చేయడం వల్ల వ్యాధులకు తట్టుకోగల శక్తి, ధైర్యం లభిస్తాయి. భగవంతుని అనుగ్రహం మనశ్శాంతిని కలిగిస్తుంది. కనుక నీవు నూటికి నూరు పాళ్ళూ భగవంతుని మీద ఆధారపడి ఉన్నానని భావించు. ఆయన నిన్ను జాగ్రత్తగా చూసుకొని అపాయంనుండి, కష్టం నుండి కాపాడుతాడు,''

(లో.పు.124)

'బ్రహ్మాండమంతట ప్రబలుచుండెడి నీకు
ఆలయంబునమర్చ నలవియగునె?

ప్రార్థన/ప్రార్థనలు

కోటిసూర్యులకాంతి మేటివయిన నీకు
ప్రమిద దీపం బెట్లు పెట్టగలను?
అజహరాదులకైన అందనివాడవు
నీరూపు కనుగొన నెవరి తరము?
సర్వజీవులయందు సంచరించెడు నీకు
సరియైన పేరిడ **సాధ్యమగునె?**
వసుధ తెలుసుకున్నది సాయిబాబయనుచు
ఇతరమైనది నేనేమి **ఎరుగనయ్య**
సర్వమును నీవెయని నిన్ను సన్నుతింతు
మరువనెపుడు బాబ నా మనసుతీర
ముంచు నీళ్ళను పాలనో **విడువనెపుడు".**

(లో.పు.1)

నిద్రనుంచి మేల్కొనటం జన్మించటమని, నిద్రలోకి వెళ్ళటం మరణించటమని తెలిసికొనండి. ప్రతిరోజు నిద్రనుంచి మేల్కొనగానే "పరమాత్మా! నేను నిద్ర గర్భము నుంచి జన్మించాను. సకల చరాచర ప్రపంచమునకు ప్రభువై, నాహృదయ వాసివై ఉన్న నిన్నే తలచి నీ కొరకే అన్ని కార్యకలాపములను చేయపూనుతున్నాను. నీకే అర్పణముగా నేను పలికే మాటలు, తలచే తలపులు, చేసే కర్మలు పవిత్రమొనర్చి, నా నుంచి మంచి మాటలు, మంచి తలపులు, మంచి పనులు వచ్చునట్లు చేసి, **నేను ఎవరినీ బాధింపక, నేను బాధపడకుండునట్లు నన్ను నడిపించు"**అని ప్రార్థించండి.

అదేవిధంగా **నిద్రలోకి వెళ్ళేటప్పుడు "పరమాత్మా! నేనింతవరకు నీవు చేయించిన పనులను చేశాను. నీవు ప్రేరేపించిన తలపులనే తలచాను. నీవు పలికించిన మాటలనే పలికాను. నేను నడచిన నడకలు, కలిగిన పలుకులు తలచిన తలపులు అన్నీ నీవే నడిపించి, పలికించి, తలపించినవి. ఈ దినమున నిత్యవ్రతము సమాప్తమైనది.** నన్ను ఇంక నిద్రలోనికి తీసుకో. పరమాత్మా! నాకు ఎల్లవేళలా శాంతి సుఖములను ప్రసాదించేది - నీ ఒడి ఒక్కటే' అని ప్రార్థించండి.

వెలుగును ప్రసాదించే మీ ఆత్మను మీరు గురువుగా స్వీకరించటమే అన్నిటికన్నా మంచిపని. ఆ అంతరాత్మయే, అంతర్గతంగా ఉన్న ఆ గురువే మీకు సత్యమును ప్రకటిస్తాడు. ప్రార్థనా పూర్వకమైన ఈ మనస్తత్వము మీ గుణములను, మీ జ్ఞానమును అభివృద్ధి చేస్తుంది.

(వ.61-62 పు.56)

దుర్భావములు, దుస్సంకల్పములు విసర్జించి నిత్యమూ 4 గం॥లకు లేచి ధ్యానమూ, సంకీర్తనా చేయండి. **పడకమీద లేచి కూర్చుని చిన్న ప్రార్థనచేయండి.**

సుషుప్తిమాతా సుషువే శిశుంతత్ అహం నిశ్చయంతత్ర సద్యఃకరోమి
యద్యత్కృతం తద్భవతు త్వదర్థం హృదిస్థితే రాజ్ఞి చరాచరాణాం
ఉక్తం మతం దేవ తథా కృతంచ హవ్యం తతః పావన పూతమస్తు
కుర్యాం నకించిత్ పరపీడనాయ పరోపి మహ్యాం నతథాదునోతు.

నీపై భారమువేసి నా కార్యక్రమములను నేను పూనుకున్నాను. అని అంతా తనకై అర్పించి కార్యక్రమమునకు పూనుకో.రాత్రికి పుట్టిన పడకమీదనే తిరిగి చేరుతున్నావు. కనుక అది మరణముగా భావించు "స్వామీ! నీవు యిచ్చిన కార్యాన్నే అచరించాను. అది నీకే అర్పిస్తున్నాను. ఏవైనా తప్పులు ఉంటే మరల అవి చేయకుండా కాపాడు." అవి అతనికి అర్పించి అతనిలోచేరిపో. ఇట్లు నిరంతరమూ చేసుకుంటే తప్పులురావు కర్మఫలం మిమ్మల్ని అంటదు. అవసరమైన భావములతో స్నానముచేయక **భగవత్ నామంతో స్నానంచేయి. భుజించే టప్పుడు కూడ అనేకమాటలతో కుక్కలుగా తినటంకాదు. తింటున్నప్పుడు ప్రసాదం నా ఆత్మస్వరూపానికి అందిస్తున్నానని భావించు.** ప్రసాదం దోషరహితమైన అమృతస్వరూపం అన్నారు. ఈనాడు పాత్ర శుద్ధి. పాకశుద్ధి, పదార్థశుద్ధి అన్నీ చూసుకోవటం కుదరదు కనుక నీ ముందు పెట్టగానే భగవంతుని కర్పించు. సర్వదోషములు పరిహారమై పోతాయి.

(వే.ప్ర.పు.194/195)

ప్రార్థన చేయటానికి కావలసింది అనవసరపు హంగులూ ఆర్భాటాలు కావనీ, ప్రార్థన కేవలం భగవంతునితో మనం ప్రత్యక్షంగా సంభాషిస్తున్నట్లుగా ఉండాలి.

(శ్రీ.స.ప్రే.స.పు.79)

(చూ॥ అసతోమా సద్గమయ, ఇస్లామ్, ఏకాత్మ, నిష్కామకర్మ, పరీక్షిత్ ప్రార్థన, శాంతి, శాంతిమంత్రము, స్వామి బాల్యం, సూర్యనారాయణుడు)

ప్రార్థనగీతము/ ప్రార్థనగీతాలు

"దేవా! ఓదేవా! పట్టు వదిలిపెట్టకు
వదిలిపెట్టకు నీ పట్టు ఎంత చెడ్డవాడినినేనైనా
ఓదేవా! వ్యర్థం కానిస్తావా **నా కాలాన్ని**
వ్యర్థం కానీయకు స్వామి! నేనెంత సోమరినైనా!
ఓ దేవా, పెడదారిపట్టనీకు నన్ను స్వామీ
పెడదారిని పోనివ్వకు నన్ను ఎంత చంచల స్వభావిని నేనైనా !
ఓ దేవా! కన్నుమరుగుకానివ్వకు నేనెంత తుంటరినై పారిపోదలచినా!
ఎంత భాద్యతారహితుడనై ప్రవర్తించినా నన్ను నీ దృష్టి దాటి పోనివ్వకు స్వామీ!
నీ వాడినైన నన్ను కాపాడటానికి పరుగెత్తుకు వస్తావు నీవు
నా తప్పోప్పులు తులాభారం వేస్తూ ఆలస్యం చెయ్యవు!
నీ వారమైన మేము దుఃఖిస్తుంటే చూసి పట్టనట్లుగా ఊరకుండలేవు నీవు.
వేదల ప్రార్థనలకు ప్రతిస్పందించకుండా ఉండలేవు నీవు"

(శ్రీ.స.ప్రే.స. పు. 77)

"అనుగ్రహపుజల్లును నా పై వర్షించటానికి నీ కంటె దయామయుడు మరెవ్వరూ లేరని గట్టిగా నమ్ముతున్నాను ప్రభూ! ఈ నమ్మకమే కదా నన్ను నీ పాదపద్మాల చెంతకు చేర్చింది! తెలియచెప్పు ప్రభూ!
నా ప్రార్థనకు , అభ్యర్థనకు వెంటనే బదులు యిస్తావని గట్టిగా నమ్ముతున్నాను ప్రభూ! ఈ కారణం వలననే కాదా నీపాదాల చెంత వేడుకుంటూ రోదిస్తున్నాను. తెలియచెప్పు ప్రభూ!"
నా ప్రక్కనే నువ్వుంటావని, సరియైన బాటలో నన్ను నడిపిస్తావని నమ్ముతున్నాను. చెప్పు ప్రభూ, ఇందుకే కదా పగలు రాత్రి నీ చెంతనే నేనుండేది! నిన్ను **నేను ఏది కావాలని కోరినా నువ్వు 'కాదు' అని అనవని నమ్ముతున్నాను! చెప్పు ప్రభూ! ఇందుకే కదా నీకటాక్షవీక్షణం కోసమై నీ చెంత వేచి యున్నది.!** ఈసారి నా కోసం ఏమి సిద్ధం చేసి ఉంచావు! నీ వరాల వర్షం కురిపించటంలో ఈ జాప్యం ఎందుకు? ఎంతకాలమైనా కానీ ఎన్నేళ్ళయినా కానీ ప్రేమను వర్షించే నీ కన్నులు నా వైపు తిరిగేదాకా నీకోసం నీ కటాక్ష వీక్షణం కోసం ఎదురుచూస్తూనే వేచి ఉంటాను నేను నీ చెంతనే."

(శ్రీ.స.ప్రే.స.పు.77/78)

నేడే రేపో కరుణించి నాకు మార్గదర్శివవుతావని
ఆశిస్తూ వేచి ఉంటాను ప్రతిరోజూ!
దర్శన మిస్తావేమేననే ఆశతో, ఇవ్వవేమోననే
బెదురుతో అప్రమత్తుడనై ఉంటాను ప్రతి గంటా!
ఈ క్షణమే నీవు నావైపే తిన్నగా వస్తావనే
ఆశతో ఎదురుచూస్తుంటాను ప్రతి క్షణమూ!

(శ్రీ.స.ప్రే.స.పు.78)

"కాపాడు ఓ సాయి దేవా! నీకంటె దయ గల దేవుడు లేడింక!
తప్పుత్రోవలో మునిగి పోయాను. దుష్టత్వంతో కొట్టుకుపోతున్నాను.
ఏ సహాయము కనబడటంలేదు నాకు, ఓ సాయి! నీ అనుగ్రహం కావాలి నాకింక
పాలలోనే ముంచుతావో, మరి నీటిలోనే ముంచుతావో ఏమైనా సరే నిన్ను నిందించను. దూషించను.
వచ్చావు నీవు మనిషి రూపంలో ఈ కలియుగంలో
తమకు తామే వేసుకున్న బంధాల సంకెళ్ళనుండి
మానవులకు విముక్తి కలిగించడానికై
బలహీనులు భగవంతుని ఘనకీర్తిని వర్ణించగలరా?
అటువంటి వారిని బలహీన మనస్కులుగా క్షమించి
వదలివేస్తావు నీవు

ప్రార్థించు

ఎప్పుడైతే నేను దృఢమైన విశ్వాసంతో పుడమిపై అవతరించిన భగవంతుని నిజావతారంగా నిన్ను పూజిస్తానో
అప్పుడు **ఎల్లప్పుడూ నువ్వు నావెంటే వుంటావు.**
నన్ను ఓదార్చటానికి, రక్షించటానికి''.

(శ్రీ.స.ప్రే.స.పు.86)

"అహరహ తన ఆహ్వాన ప్రచారిత సునితవ ఉదరవాణి హిందూ బౌద్ధ శిఖ క్రైన పారశిక ముసల్మాన కిరస్తానీ"

(ధై.ది.పు.201)

(చూ॥ స్వామి బాల్యము)

ప్రార్థించు

భగవంతుని ఎందుకోసం ప్రార్థించాలి మనం? ఏది నీ దగ్గర లేదో దానికోసం ప్రార్థించాలి.
నీ దగ్గర ప్రేమ లేదు, శాంతి లేదు, ఆనందంలేదు. అవన్నీ భగవంతుని దగ్గరే ఉన్నాయి. కనుక వాటి నిమిత్తమై భగవంతుని ప్రార్థించు. నీ దగ్గర సంతోషం ఉందిగాని ఆనందం లేదు. సంతోషం తనకు సంబంధించినది. ఆనందం హృదయానికి సంబంధించినది. ఇట్టి ఆనందమును భగవంతుని నుండి ఆశించు.
నీవు భగవంతుని అడుగవలసినవి లౌకికమైనవికావు. "భగవంతుడా! నాకు శాంతిని ప్రసాదించు ఆనందాన్ని ప్రసాదించు, ప్రేమను ప్రసాదించు" అని **ప్రార్థించు.**

(దే.యు.పు.7)

ప్రాయశ్చిత్తము

శ్రీరాముడు సీతామహాసాధ్విని అరణ్యాలకు పంపిన తరువాత యెంతో వేదనకు గురియై ఎల్లప్పుడూ ఆమెను గురించిన ఆలోచనల్లోనే నిమగ్నమై ఉండేవాడు. ఆమె ఆ నిస్సహాయ స్థితిలో యేమి చేస్తున్నదో, ఎన్ని యిక్కట్లకు గురి కావలసి వచ్చినదో అని ఆమెను గురించే చింతిస్తూ ఉండేవాడు. అందుచేత రాచకార్యాలన్నీ భరతుడే ఎక్కువగా చక్కబెడుతూ ఉండేవాడు. ఒకనాటి రాత్రి భోజనానంతరం శ్రీరాముడు సీతావియోగదుఃఖంలో పరధ్యానంగా తన శయ్యాగృహంలోకి ప్రవేశిస్తున్నాననుకొని ఆ ప్రక్కనే ఉన్న భరతుడి పడకగదిలోకి ప్రవేశించాడు. వారి సోదరుల శయన మందిరాలన్నీ ఒకే వరుసలో ఉండేవి. అయితే, శ్రీరాముని గదిలో శయ్యకు ఎదురుగా దశరథుని నిలువెత్తు తైలవర్ణ చిత్రం ఉండేది. ఆయన పితృభక్తుడు కావడం మూలాన నిద్ర నుండి లేస్తూనే తండ్రి చిత్రపటానికి ప్రణమిల్లిగాని వేరే ఇంకేపనీ చేసేవాడు కాదు. కాగా భరతుడు తన అగ్రజుడైన శ్రీరామచంద్రునికి భక్తుడు కావడం వల్ల తన శయ్యకు ఎదురుగా అన్నగారి నిలువెత్తు తైలవర్ణచిత్రాన్ని పెట్టుకున్నాడు. ఆయన నిద్రలేస్తూనే అన్నగారి చిత్రపటానికి నమస్కరించిగాని రాచకార్యాలలోకి వెళ్ళేవాడు కాదు. (మరొక విషయంకూడా చెప్పారు స్వామి. రామరాజ్యంలో ఏ యిళ్ళకూ, గదులకూ తలుపులుగాని, గొళ్ళేలుగాని, వాటికి తాళాలు గాని ఉండేవి కావట. ఎందుకంటే, రామరాజ్యంలో వాటి అవసరం లేకపోయింది. కాబట్టి, కేవలం గది గుమ్మాలకు తెరలు మాత్రమే వేళ్ళాడుతూండేవి.)

శ్రీరాముడలా భరతుని శయనమందిరంలో ప్రవేశించి అతని శయ్యమీద అటుప్రక్కగా తిరిగి పడుకున్నాడు. అలసిపోయి ఉన్నాడేమో బాగా గాఢమైన నిద్ర పట్టేసింది. కొంతసేపటికి భరతుని భార్య మాండవి లోనికి వచ్చి చూసింది. తన పతిదేవుడైన భరతుడే నిద్ర పోతున్నాడను కుంది. భరతుడు కూడా నీలమేఘశ్యాముడే కావడం మూలాన ఆమెకేమీ అనుమానం రాలేదు. ఆయన కేమాత్రమూ నిద్రాభంగం కల్గకుండా ఆమె కూడా అదే శయ్యమీద ఇటుప్రక్కగా ఒదిగిపడుకుంది. ఆనాటి రాచకార్యాలను ముగించుకున్న భరతుడు అర్ధరాత్రి సమయంలో తెర తొలగించుకుని తన గదిలోకి ప్రవేశించాడు. ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు. ఆలోచించాడు. తన పడకపై అటు ఒత్తిగిలి పడుకున్నది మూర్తీభవించిన ధర్మస్వరూపుడైన తన అగ్రజుడు శ్రీరామచంద్రమూర్తి.

ఇటువైపుగా ఒదిగి పడుకున్న వ్యక్తి తన భార్య, మహాసాధ్వి మాండవి. ఈ సంఘటన ఎలా జరిగి ఉంటుందో సులభంగానే ఊహించుకున్నాడు కుశాగ్రబుద్ధి గల భరతుడు. అతడు సూక్ష్మగ్రాహి. తనలో ఇలా తలపోశాడు - **"ఇప్పటికే నా తల్లి సీతమ్మ విషయంలో వచ్చిన ఒక్క అపవాదుతో ఇంత రభస జరిగి అన్నగారు ఎంతో మనోవేదనకు గురి కావలసివచ్చింది. ఈ దృశ్యం మరెవరి కంటనైనా పడితే ఇంకేమి అనర్థం సంభవిస్తుందో! ఆ విధంగా జరగకూడదు. ఇటువైపు ఎవరూ రాకూడదు"** అని ఆలోచించి, ద్వారం ముందు కట్టి ఉన్న తెర వెనుక తెల్లవారే వరకూ కాపలాగా నిలబడి ఉన్నాడు. ("ఇక్కడ చూడండి, **ఎంతటి ఉదాత్తమైన మనస్తత్వమో భరతుడిది"** అన్నారు స్వామి.) అలా తెల్లవారే వరకూ భరతుడు అక్కడే ఉండి మాండవి మేల్కొన్న అలికిడి విని ఆమె కంట పడకుండా శీఘ్రంగా అక్కడి నుండి తప్పుకున్నాడు. ఆమె నిద్ర లేచి రాముడి చిత్రపటానికి నమస్కరించి తన గృహకృత్యాలలోకి వెళ్ళిపోయింది. ఆ తరువాత కొద్దిసేపటికి శ్రీరాముడు కూడా నిద్ర నుండి లేచాడు. అలవాటు ప్రకారం దశరథుని చిత్రపటానికి నమస్కరించ బోయాడు. అయితే, అక్కడ ఉన్నది తన తండ్రి చిత్రానికి బదులు తన చిత్రపటం ఉన్నది. ఒక్కసారిగా గుండె ఝల్లుమన్నది. ఇదేమిటి? ఇది భరతుడి గది కాదు కదా! ఇక్కడ తానెందుకున్నాడు? ఇలా ఎందుకు జరిగింది? ఎలా జరిగింది? ఒక్క క్షణం ఆలోచించిన తరువాత ఈ పొరపాటు ఎలా జరిగి ఉండవచ్చో గ్రహించాడు. అయ్యో, ఎంత పని జరిగిపోయింది! ప్రక్క మీద చూశాడు. మాండవి తలగడ మీద నలిగిన పువ్వులు, పాదాలవైపు పారాణిముద్రలూ కనిపించినై. జరిగిన పొరపాటు గ్రహించాడు. ఇప్పుడేం చెయ్యాలి! ఏమైనా సరే, జరిగిన పొరపాటుకు వెంటనే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. పోనీ, **ఈ విషయం యెవరూ చూడలేదు కదా అని మౌనం వహించడం భావ్యమా? "అసంభవం. అది ధర్మరక్షణ యేవిధంగా అవుతుంది? ఏమైనా సరే, ధర్మాన్ని ఆచరించి తీరవలసిందే. అది యెంతటి కఠినమైనదైనా ఫరవాలేదు." అని దృఢంగా నిశ్చయించుకున్నాడు.**

వెంటనే కులగురువులైన వశిష్ఠులవారిని రావించి, జరిగిన సంగతి వివరించి తనచేత ప్రాయశ్చిత్త కర్మ చేయించి రక్షించమన్నాడు రాముడు. "ఇందులో యే తప్పిదమూ లేదు. మీరిద్దరూ అమాయకులే, నిరపరాధులే. ఇక్కడ జరిగిన దోషమేదీ లేదు. నీవంటి నిర్మల చిత్తునకు ప్రాయశ్చిత్తం చేసుకోవలసిన పని లేదు." అని వశిష్ఠులవారు నచ్చ జెప్పారు. కాని, **ధర్మమూర్తి అయిన శ్రీరాముడు అందుకు ససేమిరా ఒప్పుకోలేదు. ప్రాయశ్చిత్తం జరిగి తీరవలసిందేనని పట్టుబట్టాడు. చేసేది లేక అప్పుడు వశిష్ఠులవారు ధర్మశాస్త్రములను తిరగేసి పది రోజులపాటు కటిక ఉపవాసం చెయ్యాలని రాముణ్ణి ఆదేశించారు. అలాగే శ్రీరాముడు పది రోజులపాటు పూర్తి ఉపవాసం చేసి ప్రాయశ్చిత్తం చేసుకున్నాడు.**

(ఈ సంఘటనంతా వివరంగా చెప్పి చివరగా స్వామి ఇలా అన్నారు.) "ఈ సన్నివేశం గురించి వాల్మీకి రామాయణంలోగాని, మరియే ఇతర రామాయణంలోగాని ఎందులోనూ లేదు. **కేవలం అనుభవించినవాణ్ణి కాబట్టి నాకు మాత్రమే తెలుసు."**

(స.సా.న.2001 పు. 331/332)

(చూ॥ ప్రేమకు మూడు మెట్లు, సంప్రదాయము)

ప్రియం

(చూ॥ జన్మాద్యస్యయతః)

ప్రియమిత్రులు (డియర్‌ఫ్రెండ్స్)

యువతీ యువకులారా! నేను అధికంగా మాట్లాడి మిమ్మల్ని శ్రమ పెడుతున్నానో ఏమో! నేను ఈవిధంగా మంచి విషయాలు ఎంత సేపైనా మాట్లాడగలను. ఎవరికైనా ఉపయోగపడే మాటలు ఎన్నైనా మాట్లాడతాను. నిరుపయోగమైన మాటలు నేను మాట్లాడను. మీరు చాల పవిత్రమైన జీవితాన్ని గడపవలసినవారు. సత్యసాయి సంస్థల బాధ్యత ముమ్ముందు మీరే నిర్వహించవలసి ఉంటుంది. మీలో ఒక్కొక్కరు ఒక్కొక్క రాష్ట్రానికి లీడర్‌గా

ప్రియమైన వాక్యము

ఉండాలి. అయితే, ఒక్క విషయాన్ని గుర్తుంచుకోండి - **రాజకీయాలతో మీకు సంబంధం లేకుండా చూసుకోండి.** సమాజాభివృద్ధిని కోరండి. దానికోసం మీరు ఎంతైనా పాటుపడండి. అదే గొప్ప తపస్సు. **ప్రశాంతి నిలయంలో ఉన్నంత వరకు మంచిగా ఉండి, బయటికి పోతూనే తోకలు తిప్పకూడదు. అది 'మంకీ మైండ్' లక్షణం.** మీరు **'డివైన్ మైండ్' తో ఉండండి; 'డీప్ వైన్'లో మునగకండి! అలాంటి** పవిత్ర హృదయులైన యువతీ యువకులు నాకు అత్యవసరం. **వారందరూ నాకు సమీపులే. అలాంటివారే నాడియర్ ఫ్రెండ్స్ (ప్రియ మిత్రులు). మీరు స్వామికి డియర్ ఫ్రెండ్స్ కావాలను కుంటే, స్వామి చెప్పినట్లు నడుచుకోండి. అప్పుడు మీరిక్కడకు రానక్కర్లేదు, నేనే మీవద్దకు వస్తాను. నేను మీతోనే ఉన్నాను: మీ లోపలున్నాను, వెలుపలున్నాను, మీ ముందు ఉన్నాను, వెనుక ఉన్నాను. ఇట్టి విశ్వాసాన్ని అభివృద్ధి పర్చుకోండి. నేను మీకంటే ప్రత్యేకంగా లేను. నేను, మీరు ఒక్కటే.** ఇట్టి ఏకత్వాన్ని గుర్తించి, దివ్యత్వాన్ని పొందటానికి మీరు ప్రయత్నం చేయండి. పవిత్రతను పెంచుకోండి. నిరంతరము దైవచింతన చేయండి. అప్పుడు మీరు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారు.

(స.సా.ఫి.2000 పు.58/59)

ప్రియమైన వాక్యము

"ప్రియవాక్య ప్రదానేన
సర్వే దుష్యంతి జన్తవః
తస్మాత్ తదేవ కర్తవ్యం
వచనేకా దరిద్రతా?"

ప్రియమైన వాక్యమే మానవునకు అత్యంత ఆనందమును చేకూరుస్తుంది. ఇట్టి ప్రియమైన వాక్యమునకు కొదువలేదు. కనుక ప్రతి మానవుడు కూడనూ ప్రియ మైనటువంటి వాక్యములను ప్రపంచమునకు అందించాలి.

(శ్రీ.ఏ. 1995 పు.5)

ప్రియుడు

(చూ॥ అనపేక్ష)

ప్రీతిపాత్రుడు

శ్లో॥ అనపేక్షః శుచిర్దక్షః ఉదాసీనో గత వ్యధః
సర్వారంభ పరిత్యాగీ యోమద్భక్త స్సమే ప్రియః

ఈ గుణములు ఏ మానవుని యందు ఉండునో, అట్టి మానవుడే భగవంతునికి అత్యంత ప్రియుడు. ఇందు మొదటిది. 'అనపేక్ష' అనగా ఎట్టి అపేక్షలు లేకుండా ఉండటం. శరీర మనోబుద్ధులు ధరించిన మానవుడు ఏ అపేక్ష లేకుండా ఉండగలడా? ఇది అసాధ్యము కాని, ఇట్టి స్థితిని ప్రయత్నపూర్వకముగా మానవుడు సాధించ వచ్చును. ప్రపంచములో అనేకమంది అప్పటికప్పుడు ఆనందము నందించే ఇంద్రియ సుఖములను ఆశిస్తూ ఉంటారు. **ఇది ప్రేయోమార్గము.** దీనికి భిన్నముగా శాశ్వత ఆనందమును అందింపజేసి, ఇంద్రియాతీతమైన సుఖమును అందించి, దివ్యత్వమైన మార్గమును ప్రవేశింప జేయునది ఆత్మానుభూతి. **దీనికి శ్రేయోమార్గముని పేరు. ఈ శ్రేయా మార్గము అందరికీ అర్థమయ్యేది కాదు.** ఇది అందరికీ అందుబాటులో ఉండదు. కనుకనే శ్రేయో మార్గమును ప్రజలు అమితంగా విశ్వసించలేకపోతున్నారు. ఒకవైపున ప్రేయోమార్గము, రెండవవైపున శ్రేయోమార్గము, ప్రపంచమునందున్న ప్రజలను తమతమ వైపునకు మరల్చుకునే నిమిత్తము ప్రయత్నిస్తూఉంటాయి. కాని, ఇంద్రియానందమును కోరే ప్రజలు ఈ ప్రేయో మార్గమునే ఆశిస్తూ ఉంటారు.

ఈ భౌతికమైన సుఖమును లెక్కచేయక అనిత్యము, అశాశ్వతము, లోకసంబంధము అయినటువంటి సుఖాలను ఏమాత్రము ఆశించక, నిష్కలై, ద్రష్టలై, పవిత్రమైన హృదయమును పొందిన ఒక్క జ్ఞానులు మాత్రమే ఈ శ్రేయోమార్గమును ఆశిస్తారు. శ్రేయస్సునకు ప్రేయస్సునకు అతీతమైనటువంటిది మరొక మార్గముకూడా ఉంటున్నది. సమస్త అభీష్టములు ఈ

శ్రేయస్సునందు, ప్రేయస్సు నందు, అంతర్భూతములై ఉంటాయి. ప్రపంచమునందు గల అభీష్టములన్నింటికినీ **ఈ శ్రేయస్సు, ప్రేయస్సు ప్రధానమైన అంతర్వాహినులుగా ప్రవహిస్తుంటాయి.**

ఈ రెండింటికీ అతీతమైనదే 'అనపేక్ష' అనే మార్గము. 'అనపేక్ష' అనగా ఎట్టి అపేక్షలు లేకపోవటము. ఇది సరియైన అర్థముకాదు. మానవుడు చేయు సర్వకర్మల యందు నేను చేస్తున్నాను' అనే అహంకారమును, నేను అనుభవిస్తున్నాను' అనే అభీష్టమును త్యజించినప్పుడది 'అనపేక్ష'గా మారిపోతుంది. ఆచరణందు అహంకారము, అనుభూతి యందాసక్తి ఈ రెండింటినీ త్యజించినప్పుడు అనపేక్ష అనునటువంటిది రూపొందుతుంది. ఇట్టి అనపేక్ష హృదయమునందు ఆవిర్భవించిన వ్యక్తిని భగవంతుడు ఐక్యం కావించుకొంటాడు. అట్టి అనపేక్ష కలిగిన వ్యక్తినే భగవంతుడు ప్రేమిస్తాడు. భగవంతుని ప్రేమకు పాత్రుడు కావలెనన్న సర్వకర్మలు, భగవత్ ప్రీత్యర్థం కావించే సేవలలో మనం పాల్గొనాలి. ఎవరికి ఎప్పుడు ఎక్కడ సేవలు చేసినా ఇవన్నీ భగవదర్పితమనే భావముతో మనము చేయాలి.

రెండవది 'శుచి': అనగా శుభ్రత అని. ఇది అంతర్, బహిర్ శుభ్రతగా ఉంటుండాలి. శారీరకమైన పరిశుభ్రత లోకసంబంధమైనటువంటిది. స్నానాదులతో దేహమును పరిశుద్ధము గావించుకోవటము, శుభ్రమైన వస్త్రములు, ధరించటము, భుజించే ఆహారమును పరిశుద్ధముగా ఉండేటట్లు చూసుకోవటం, వండే వంటల యందు పరిశుభ్రతను అభివృద్ధిగావించుకోవటము, పదార్థశుద్ధి, పాత్రశుద్ధి, పాకశుద్ధి మొదలగునవి మనం కొంతవరకు గమనించాలి.

నిజానికి నిత్యజీవితంలో మానవుడు అనుభవించే ప్రతి పదార్థము పరిశుద్ధముగా ఉంచుకోవాలి. ఇది భౌతికమైన పరిశుభ్రత, ఈ పరిశుద్ధములు ఎన్ని ఉండినప్పటికీ **'అంతర్‌శుద్ధియే' లేకపోయిన ఇవి నిరుపయోగము అవుతాయి.** పండితుని మొదలుకొని పామరుని వరకూ బాహ్యమైన పరిశుద్ధత కొరకే పాటు పడుచున్నారు గాని, అంతఃశుద్ధికి ఏమాత్రము పాటుబడటం లేదు.

వంటపాత్రను ఎంత పరిశుద్ధంగా తోమి పెట్టినప్పటికినీ, ఆ పాత్రకు కళాయి లేకపోయిన, అందులో వండేటటు వంటి పదార్థమంతయు నిరుపయోగ మవుతుంది. కనుక, **హృదయమనే పాత్రను పరిశుద్ధము కావించుకోవటమే ప్రధానమైన సాధన. దీనిని పరిశుద్ధము చేసుకొనుటకు స్వార్థరహితమైన సేవలో మనము ప్రవేశించాలి.** రాగద్వేషములచేత మనోబుద్ధులు మాలిన్యమవుతాయి. ఇట్టి అశుద్ధమైన మనో బుద్ధులను స్వార్థరహితమైన సేవల ద్వారా మనము పరిశుద్ధము గావించాలి. **మనోబుద్ధులు పరిశుద్ధముగా ఉండినపుడే నిష్కామసేవలో పాల్గొనగలము.** మనోబుద్ధులు అశుద్ధంగా ఉండినప్పుడు, మనం చేసే కర్మలు కూడా అశుద్ధంగానే రూపొందుతాయి. **శారీరక, మానసిక పరిశుద్ధతలు మానవుడికి ప్రధాన కర్తవ్యాలు.**

మూడవది 'నిష్ఠ'. అనగా ప్రతిమానవుడు తన జీవితములో ఒకనిష్ఠను పూనాలి. ఉన్నంత వరకూ పవిత్రమైన కార్యములలో ప్రవేశించి, ప్రజాసేవలో మనము పాల్గొని తద్వారా పుణ్యకార్యములను మనము చేయాలనే భావము ప్రతిమానవుని యందును ఆవిర్భవించాలి. ప్రజాసేవ చేత మానవుని యొక్క ఏకత్వ భావాన్ని పొందవచ్చును అనే విశ్వాసాన్ని అభివృద్ధి పరచుకోవాలి. సంఘసేవద్వారా ఏకత్వము ప్రాప్తిస్తుంది. ఏకత్వము ద్వారా దివ్యత్వము పొందవచ్చు. ఈ దివ్యత్వమును పొందటమే పవిత్రమని భావించాలి. ప్రతిమానవుడు తాను జీవించినంత కాలము **"పరోపకారార్థమిదం శరీరం" ఈ శరీరము పరోపకార సంబంధమైనదనే భావమును తప్పక గుర్తించి విశ్వసించాలి.** ఎల్లప్పుడూ స్వార్థము, స్వప్రయోజనము ఈ రెండింటి యందే మానవుడు లీనమైపప్పుడు, ఇంక పరార్థమనే యదార్థతత్వాన్ని ఏరీతిగా గుర్తించగలడు? స్వార్థాన్ని త్యాగం చేయాలి. ఈ త్యాగం చేయాలనుకుంటే సమాజ సేవలో పాల్గొనాలి. ఈ సమాజసేవలో అహంకారము

నిర్మూలనమవుతుంది. ఏకాత్మ భావము ప్రాప్తిస్తుంది. కనుక, **ఇటువంటి దీక్షను పూనినవాడు భగవంతునికి పరమ ప్రీతి పాత్రుడు కాగలడు.**

నాలుగవది 'ఉదాసీన': అనగా సుఖదుఃఖములను గాని, మంచిచెడులనుగాని, కీర్తి ప్రతిష్ఠలను గాని, లెక్కచేయనక్కరలేదు. నీవు చేసే కర్మలు పవిత్రమైనవా? కావా? అని మనస్సాక్షిగా గుర్తించాలి. ఇది మంచి కార్యము, ఇది పవిత్రమైన కార్యము, సమాజసేవలో ఇది సరియైన సేవ అని విశ్వసించినవారు ఏ విషయమునందు లెక్కచేయనక్కరలేదు.

మంచి కార్యములలో మానవుడు ప్రవేశించినప్పుడు అనేక విధములైన ఆటంకములు వస్తూ ఉంటాయి. ఇతరులు ద్వేషించవచ్చును. ఇతరులు హాస్యాస్పదము చేయవచ్చును. వాటి నన్నింటినీ మనము లెక్కచేయనక్కరలేదు. **నీ హృదయానికి నీవు సాక్షిగా నిలవాలి.** నేను చేయునటువంటి కర్మ మంచిదా? లేక చెడ్డదా? అనే విచారణ చేసి ఆ పరిశీలనలో నీవు దానిని పరీక్షించుకోవాలి. **అది మంచిదని నీ అంతర్వాణి భోదించినప్పుడు, ఎవ్వరు ఏమి చెప్పినా నీవు లెక్కచేయనక్కరలేదు.** బంధువులు కానీ, మిత్రులు కానీ తల్లిదండ్రులు కానీ, ఎవ్వరైనా దీనికి అడ్డుతగిలినప్పటికీ నీవు మాత్రము లెక్కచేయకు. ఈ విధమైన దీక్షను పూనినపుడే ఈ ఉదాసీన భావము కలిగినప్పుడే నీవు సంకల్పించిన దానిని పూర్తిగా సాధించగలవు. ప్రతికార్యమందు నీవు అదరి, చెదరి, బెదరి ఉంటుంటే ఏమాత్రము విజయాన్ని సాధించలేవు. కనుక, ఉదాసీన భావముతో లౌకికమైన జగత్తునకు అతి దూరంగా ఉండి, మానసికమైన ప్రేమచేత సమస్త మానవులకు సేవ చేయడానికి తగిన కృషి చేయాలి. ఈ ఉదాసీనమనే విషయం లోపల అనేక విధమైన భావాలు మనలో ఆవిర్భవించవచ్చు. కాని, ఉదాసీనత అనగా ఏమీ లెక్కచేయకుండా, అహంకారము చేత, లేక ఆడంబరము చేత, గర్వముచేత, పాగరుబోతు తనము చేత చెడిపోవటము కాదు. **మంచిని అనుసరించి చెడ్డను లెక్కచేయక పోవటమే ఉదాసీనత.**

ఐదవది 'గతవ్యధః' అనగా గడచిపోయిన దానికి మనము చింతింపనక్కరలేదు. మనో కలత చెందినవాడు ఎట్టి కార్యములలోనూ పాల్గొనలేడు. ఈ మానసిక కలత మానవునకు ఏవ మాత్రము ఉపకారము చేయదు. ఎప్పుడో గడచిపోయిన విషయాన్ని మనము చింతించి ప్రయోజనము లేదు. ఎప్పుడో రాబోయే విషయాన్ని గురించి మనము చింతించకూడదు. కనుక **గతమును, భవిష్యత్తును విస్మరించి వర్తమానము నందే లక్ష్యమును అభివృద్ధి పరచుకోవాలి. ఈనాడు ప్రపంచములో సమస్త దుఃఖములకు మూలకారణమిదియే. నేటి మానవుడు ఉన్నదానిని వదిలి, లేనిదానిని ఆశించి, గడచిన దానికి చింతించి, లేని దుఃఖమును తెచ్చుకుంటున్నాడు.** గడచినది గడచినది. ఎంత ప్రయత్నము చేసిననూ ముందుకు రాదు. భవిష్యత్తు మనకు కనిపించదు. కనిపించని దాని నిమిత్తమై నీవు ప్రయత్నము చేయటము కేవలము వెర్రితనము. వర్తమానమును లక్ష్యములో పెట్టుకొని మనఃశుద్ధిగా నీవు కార్యములో పాల్గొనాలి. **వర్తమానకాలము నందే గతము, భవిష్యత్తు ఇమిడి ఉంటాయి.** నీవు వర్తమానమును సరియైన దృష్టి యందుంచుకొని, పవిత్రమైన భావములతో పవిత్రమైన కార్యములలో పాల్గొనాలి. అట్టివాడు భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రుడు, అత్యంత ప్రియుడు కాగలడు.

ఆరవది 'సర్వారంభపరిత్యాగి' అనగా ఆడంబరములతో మనము ఎట్టి కార్యములను ఆచరించరాదు. **అహంకారము ఉండినంత వరకూ ఆడంబరము చావదు. ఆడంబరము చావకుండా చిత్తశుద్ధి కలుగదు.** చిత్తశుద్ధి లేనివాడు పవిత్రకార్యములు ఆచరించలేడు. పవిత్రకార్యముల వలననే చిత్తశుద్ధి లభిస్తుంది. **"చిత్తస్య శుద్ధయే కర్మ:'** కనుక చిత్తశుద్ధిని గావించే కర్మలే మానవులు ఆచరించాలి. ఆడంబరమనేది మానవునికి ఒక రాక్షసగుణము వంటిది. **ఈ రాక్షస గుణము నందు, రాగద్వేషములు, మోహము అమితంగా అభివృద్ధి అవుతాయి.** ఏదిచేసినా వినయ విధేయతలతో కార్యములలో పాల్గొనాలి. **ఇది నా కర్తవ్యం,**

సేవ నిమిత్తమై అందించినదీ దేహం. అనే పరిపూర్ణ విశ్వాసంతో సేవలో పాల్గొనాలి. అట్టివాడు భగవంతునకు అత్యంత ప్రీతిపాత్రుడు, అత్యంత ప్రియుడు కాగలడు.

(శ్రీ.భ.ఉ.పు.16/19)

ప్రేమ్‌చంద్

(చూ॥ ఇచ్చిపుచ్చుకో)

ప్రేమ

జీవరాసులు అన్నింటికినీ తమతమ బిడ్డలపై, తలిదండ్రుల పై, మిత్రులపై, వస్తువాహనాదులపై, తిండి తీర్థాదులపై, పరిపరివిధముల ప్రేమ ప్రవహించుచుండును. దీనిని పట్టి, తగిన నామములు నియమములగు చున్నవి. అన్నింటికినీ భక్తి అని చెప్ప వీలు లేదు. అది సరయైనది కాదు. **తమ ప్రేమ, తమ తమ బిడ్డలపై మరలినపుడు, అట్టి ప్రేమ వాత్సల్యమని పిలువబడును. అదే ప్రేమ దాయాదులపై తిరిగినపుడు, మోహమని పిలువబడును. అటులనే దీనులపై పడినపుడు కరుణ అనియు, సమానులపై చూపునపుడు మైత్రి అనియు, వస్తు వాహనములపై పడినపుడు ఇచ్ఛఅనియు, వాంఛ అనియు అందురు.** అయితే పూజనీయులయిన తల్లిదండ్రులపై, విద్యాగురువులైన ఆచార్యులపై ఈ ప్రేమ ప్రవహించిన, దానిని గౌరవమనియూ, **వినయమనియూ, విధేయత** అనియూ అందురు.

కానీ ఒక భగవంతునిపై మాత్రము ప్రవహించిన ప్రేమయే భక్తి అని పిలువబడును. చాలా చీలికలుగ యేర్పడి, **క్షీణించి యెందుకూ కొరకాక, అశాంతి, దుఃఖములకు చిక్కుకొని విలపించుటకంటే, యేక ముఖమున తన ప్రేమ ప్రవాహమును భగవత్ అనుగ్రహమను సాగరమున చేరునట్లు చేయు సాధననే భక్తి అందురు.** సంసార సాగరమున చేరి, నిస్సారమగుటకన్న, సర్వేశ్వరానుగ్రహ సాగరమును చేరి సార్థక మగుట, సచ్చిదానందమును పొందుట యెంత పవిత్రము! జన్మ ధన్యము; అదే ఆనందము; **ఈ విధమైన ప్రయత్నములతో సాధించి సంతపించినవారే గోపికలు; తరించినవారే గోపికలు.** గోపికలయొక్క మనోవాక్కాయ కర్మలన్నియు సర్వకాల సర్వావస్థలయందునూ కృష్ణ చరణారవిందములందు, అర్పితము లగుచుండెడివి. కనుకనే **గోపికలు యోగులని పిలువబడెను.** కృష్ణపరమాత్మయే గోపికలను యోగులని పిలువవలెనన్న వారలది యెంతటి పవిత్ర హృదయమో యోచించుడు!

(గీ.పు.193/194)

ప్రేమ రూపము బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమప్రేమతో సంధింపనీయమగును
కాన ప్రేమను గట్టిగ కల్గియున్న
అద్వితీయము చెందగ నర్హుడగును

(స.సా. ఏ. 2001 పు. 111)

ప్రేమయే దివ్యత్వానికి మార్గం. ఏ పని చేసినా ప్రేమతో చేయాలి. ప్రేమ ఏమాత్రము తరిగేది కాదు, క్షణక్షణమునకూ పెరిగేదే. మీ ప్రేమను పదిమందికి పంచాలి. పంచే కొద్దీ ప్రేమ పెరుగుతూనే ఉంటుంది. ఇది తరగనిది, అమృతంకంటే మధురమైనది. ప్రేమను వర్ణించడానికి భాషలేదు. **"అనిర్వచనీయం ప్రేమ" అన్నాడు నారదుడు.** నారదుడనగా కలహ ప్రియుడని అనుకుంటారు చాలమంది. చాల పొరపాటు. నారదుడు కలహ ప్రియుడు కాదు. అయితే, పూర్వం ఆవిధంగా ఉండేవాడు. కానీ తరువాత తన దోషాలను పరిహారం గావించుకొని గొప్ప బోధకుడుగా తయారయ్యాడు. జ్ఞాన బోధకుడు నారదుడు, అజ్ఞాన నాశకుడు నారదుడు. **"యల్లబ్ధో పుమాన్ ఇచ్చారామో భవతి తృప్తో భవతి మత్తో భవతి ఆత్మారామో భవతి", అంతా ఆ మధురమైన ప్రేమలోనే ఉన్నది.** ఒకానొక సమయంలో నారదుడు నారాయణునివద్దకు వెళ్ళి "అమృతంకంటే మధురమైనది ఉన్నదా స్వామీ?" అని అడిగాడు. "ఓ పిచ్చివాడా! **ప్రేమ అమృతంకంటే చాల మధురమైనది. అమృతమునైనా అధికంగా త్రాగితే కొంత వెగటు పుట్టవచ్చుగాని, ప్రేమను**

ప్రేమ

అనుభవించే కొలది ఆనందం అభివృద్ధి అవుతుంది" అన్నాడు నారాయణుడు. ఇలాంటి ప్రేమతత్వాన్ని మీయందుంచు కొని ఎందుకింత ఆశాంతిని పొందటం? ఎందుకిన్ని కష్టములను అనుభవించటం? నిజంగా కష్టములే లేవు మనకు. అంతా ఆనందమే, ఆనందమే. ఎప్పుడీ ఆనందం లభ్యమవుతుంది? ప్రేమను అనుసరించి నప్పుడే ఆనందము లభిస్తుంది.

(స.సా.ఏ.99పు.100/101)

ప్రేమ అనేది స్వార్థ రహితముగా యుండడము చేత దానికి ఏనాడు కూడా భయముండదు. అది నిరంతరము సత్యము కొరకు ఫైటు(fight) చేసేదిగా యుండాలి. ఇది నిరంతరము హృదయాన్ని ఆధారము చేసుకొనేటటు వంటిది దీనినే నేను అప్పుడు అప్పుడు చెప్పుతూ ఉంటాను.

Follow the master
Face the devil
Fight to the end
Finish the game.

ఈ విధముగా మనము జీవితాన్ని **అర్పణ** చేసినప్పుడే ప్రేమ తత్వాన్ని మనము చక్కగా అనుభవించిన వాళ్ళమౌతాము.**ప్రేమ యిచ్చుకునేదే కాని, పుచ్చుకునేది కాదు.**

(సా॥పు.314/315)

ప్రేమమయుండు శ్రీధరుడు ప్రేమయె అతని దివ్య రూపమౌ ప్రేమయె సర్వ మానవుల ప్రీతికి తారక మంత్ర మట్టి స త్ప్రేమ రవంతయైన వివరింపగ లేక జగంబు నందు త త్కామిత సత్పదార్థమెటు గాంచగ నేర్తురటయ్య మానవా!

(స.సా.న.99పు.301)

ఏ ప్రేమశక్తిచే ఈ ధారుణీ చక్ర
మిరుసు లేకుండగా తిరుగుచుండు
ఏ ప్రేమశక్తిచేనెల్ల నక్షత్రాలు
నేలరాలక మింట నిలిచియుండు
ఏ ప్రేమశక్తిచే ఈ పుడమి బడక
కడలిరాయడు కాళ్ళుముడుచుకొనియె
ఏ ప్రేమశక్తిచే ఈరేడు లోకాలు
గాలిదేవుడు సురిటీలు విసరె
ఆ మహాప్రేమశక్తియే ఆత్మశక్తి
అద్భుతమనంతమద్వితీయమగుశక్తి
నిండియున్నది బ్రహ్మాండ భాండమెల్ల
ఈ మహాసృష్టియంతయు ప్రేమమయమె

(స.సా.ఆ.2000 పు.225)

ప్రేమను, భగవత్తత్వాన్ని పరిపూర్ణంగా విశ్వసించాలి. **ప్రేమే దైవం, దైవమే ప్రేమ. ఈ ప్రేమ లోనే మనం జీవించాలి.** పరమాత్మ ప్రేమ పరిశుద్ధమైనది, స్వార్థరహితమైనది. దీనినే **ప్రాచీన మహర్షులు "నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణమ్" అని వర్ణించారు.**

ప్రేమ దూరస్థాన్ని కూడా సమీపానికి చేరుస్తుంది. వియోగమును సంయోగముగా మారుస్తుంది. నరుని నారాయణునిగా మారుస్తుంది.

(దే.యే.పు.6)

ప్రేమస్వరూపులారా! మీరు ముఖ్యంగా పెంచుకోవలసింది ప్రేమ ఒక్కటి ఉంటే ద్వేషానికి అవకాశమే ఉండదు. **ఆనాడు గోపికలు కూడా చెప్పారు.**

ప్రేమరహిత మరుభూములలో
ప్రేమాంకురములు పెంపొంద
ప్రేమావేశముతో
ప్రేమసుధా వర్షము వర్షింపగ
ప్రేమనదులు ప్రవహింపగ
మురళీ గానము సేయగదే!
కృష్ణా! గానము సేయగదే!

ప్రేమరహితమైన హృదయం క్షేత్రాలలో మీరు ప్రేమ బీజమును నాటాలి, దానికి ప్రేమజలమును పోయాలి. ప్రేమవర్షమును కురిపించాలి, ప్రేమ ప్రవాహమును ప్రవహింపజేయాలి. మీ ప్రేమను అందరికీ పంచాలి. ఈ నూతన సంవత్సరంలో మీరు చేయవలసిందేమిటంటే - నిర్మలమైన నిశ్చలమైన, నిస్వార్థమైన ప్రేమను

మానవుని హృదయము సింగిల్ చైర్ not double sofa, not musical chair. కనుక హృదయములో ప్రేమ ఒక్కటి ఉంటే ఏ పిచ్చి భావాలూ అందులో ప్రవేశించవు. ప్రేమలో సర్వమూ లీనమై ఉన్నది. అన్నింటికీ ప్రాణసమానమైనది ప్రేమతత్వము. ఇలాంటి ప్రేమను మర్చిపోయి లౌకికమైన ప్రేమను పెంచుకొని జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు. ఇదంతా కేవలం ప్రాకృతమైన ప్రేమ. **తల్లి ప్రేమను వాత్సల్యమంటున్నారు. భార్య ప్రేమను మోహమంటున్నారు. బంధు ప్రేమను అనురాగమంటున్నారు. పదార్థ ప్రేమను ఇచ్ఛ అంటున్నారు. కేవలం భగవంతుని ప్రేమను మాత్రమే ప్రేమ అన్నారు. మరి దేనికీ ప్రేమ అనే పదం ఉపయోగించటం లేదు. ప్రేమ అనే పదమును ఒక్క దైవస్వరూపానికి తప్ప మరొక దానికి ఉపయోగించు కోటానికి అధికారమే లేదు.**

ప్రేమ రెండక్షరముల పదము. ఈ రెండక్షరములే సర్వత్రా వ్యాపించి ఉన్నాయి. వాల్మీకి నూరుకోట్ల రామాయణ శ్లోకాలు వ్రాసాడు. ఈ రామాయణము వలన మానవత్వము సార్థక మవుతుందని, దీనిని ఎవరు చదువుతారో, ఎవరు స్మరిస్తారో, ఎవరు జపిస్తారో, ఎవరు ధ్యానము చేస్తారో అట్టివారికి జన్మ రాహిత్యమవుతుందని అన్నాడు. ఈ వార్త విన్నంతనే దేవతలు, రాక్షసులు, మానవులు ముగ్గురూ బ్రహ్మ చెంతకు వెళ్ళి, 'స్వామి! మాకు రామాయణములో భాగము ఇవ్వమ''న్నారు. బ్రహ్మ చెప్పాడు. 'నాకు ఎవరిపైనా పక్షపాతం లేదు. నాకు అందరూ సమానులే. కనుక నూరుకోట్ల శ్లోకములను మూడు లోకములకూ సమానంగా పంచిపెడతాన''న్నాడు. అందరూ చాలా సంతోషించారు. **భేద రహితుడైనవాడు బ్రహ్మ. వాంఛారహితుడైనవాడు బ్రహ్మ.** అతడు రామాయణాన్ని మూడు భాగములు చేసి ఒక్కొక్క లోకానికి 33, 33,33, 333 శ్లోకాలను పంచాడు. ఒక్క శ్లోకం మిగిలింది. ఈ శ్లోకాన్ని ఎట్లా పంచేది? ఈ శ్లోకములో ఎన్ని అక్షరాలున్నాయి? అని విచారించాడు. శ్లోకములో 32 అక్షరాలున్నాయి. దేవతలకు పది అక్షరములు, మానవులకు పది అక్షరములు, రాక్షసులకు

పెంచుకోవాలి. మీరు మీ ప్రేమను లౌకికమైన విషయాలలో ప్రవేశపెట్టడంచేతనే అనేక చిక్కులకు గురి అవుతున్నారు. **ప్రేమ ఇస్తుంది, క్షమిస్తుంది; స్వార్థం స్వీకరిస్తుంది, మరచిపోతుంది. కనుక, స్వార్థపూరితమైన ప్రేమ (Self-ish love) మనకు వద్దు. Selfish love (స్వార్థపూరితమైన ప్రేమ fish (చేప) యొక్క దుర్గంధమువలె భరించడానికి వీలుకానిది. కనుక, Selfless love (నిస్వార్థ ప్రేమ) ను పెంచుకోవాలి. అందరినీ ప్రేమించాలి. ఎవరేమనుకున్నా మీరు వెరువనక్కర్లేదు. మీ ప్రేమను పవిత్రంగా పెట్టుకోండి, చాలు. అప్పుడు జగత్తంతా పవిత్ర మవుతుంది.**

(స.సా.జ.2000 పు.6/7)

స్వార్థ ప్రేమ, అన్యోన్య ప్రేమ, పరార్థ ప్రేమ అని మూడు విధములుగా ప్రేమ మనకు గోచరిస్తున్నది. ఎవరేమై పోయినా, ఫరవాలేదు, నేను మాత్రం క్షేమంగా ఉండాలని ఆశించడం స్వార్ధ ప్రేమ. తనతోపాటు తన బంధు మిత్రులు కూడా క్షేమంగా ఉండాలని ఆశించడం అన్యోన్య ప్రేమ, ఇంక "లోకాస్సమస్తాస్సుఖినో భవంతు" అందరూ సుక్షేమంగా ఉండాలని ఆశించడం పరార్థ ప్రేమ. **స్వార్థప్రేమ అనేది ఒక గదిలో వేసిన బల్బు వంటిది.** ఆ బల్బునుండి వచ్చే వెలుతురు ఆ గదికి మాత్రమే పరిమితమై ఉంటుంది. **అన్యోన్య ప్రేమ చంద్రకాంతి (Moon Light) వంటిది.** ఇది అన్నివైపులా కూడా ప్రసరిస్తుంటుంది కాని అంత స్పష్టంగా ఉండదు. ఇందులో కొంత సందేహానికి కూడా అవకాశ ముంటుంది. వెన్నెలలో త్రాడును పాముగాను, మొద్దు చెట్టును మనిషిగాను భ్రమించడం జరుగుతుంది కదా! అదే విధంగా అన్యోన్య ప్రేమలో మంచిని చెడ్డగా, చెడ్డను మంచిగా భావించడం జరుగుతుంది. చెడ్డవారి మాటలు అతి తీయగా ఉంటాయి. మంచి వారి మాటలు కొంత కఠినంగా అనిపిస్తాయి. నిర్మల, నిశ్చల, నిస్వార్థమైన దైవత్వం పైన కూడా సందేహాన్ని కలిగిస్తుంది. ఈ అన్యోన్య ప్రేమ. **ఇంక పరార్థ ప్రేమ అనేది సూర్యకాంతి వంటిది.** ఇందులో ప్రతి ఒక్కటి మనకు సుస్పష్టంగా గోచరిస్తుంది. **ఇది అందరికీ సుక్షేమాన్ని చేకూర్చుతుంది.**

(శ్రీ.భ.ఉ.పు.213)

ప్రేమ

పది అక్షరములు ఇచ్చాడు. ఇంక రెండక్షరాలు మిగిలాయి. అప్పుడు చెప్పాడు. నాయనా! ఈ రెండక్షరములే **రామ, కృష్ణ, సాయి, శివ, హరి, బాబా అనే దివ్య నామములు. వీటిని నిరంతరము స్మరించుకోండి."** అన్నాడు అన్నింటికి మూలాధారమైన తత్వము ప్రేమయే. ఇది ఒక్కటే ప్రతి హృదయమందు పర్మనెంటుగా ఉండేది. మిగిలిన వన్నీ మార్పు చెందేవే. **భగవంతుడు "మమైవాంశో జీవలోకే" అన్నాడు. "మీరందరు నా అంశమే"** అన్నాడు. దీనిని మనస్ఫూర్తిగా విశ్వసించాలి, అనుసరించాలి. ప్రేమచేతనే మనం జగత్తును శాంత పరచాలి; విశ్వాన్ని ధర్మమయంగా మార్చాలి; అహింసను పాటించాలి.

(ద.య.స.98 పు.92/93)

ప్రేమను యుండు శ్రీధరుండు ప్రేమయే అతని దివ్యరూపము
ప్రేమయే సర్వభూతముల ప్రీతిగ తారకమంత్రము, మట్టి
సత్ప్రేమ రవంతయైన, వివరింపగలేక జగంబునందున
త్కామిత సత్పదార్థము ఎటు కాంచక పోవుదురయ్య
(నేర్తురటయ్య) మానవా॥

(సా.పు.17)

పరిపూర్ణప్రేమ
పూర్ణప్రేమయందె పుట్టెను సౌఖ్యంబు
సత్య త్యాగ శాంతులబ్బు।
ప్రేమలేక యున్న లేదయా।
సత్యమైన బాట సాయి మాట॥

(సా.పు.422)

ప్రేమను ఎట్లా పెంచుకోవటం? దీనికి రెండు పద్ధతులు. 1.ఇతరులలో యున్న తప్పులు - ఎంత పెద్దవి అయినా వాటిని విస్మరించరు. 2. నీతప్పులు ఎంత చిన్నవైనను అతి పెద్దవిగా ఎంచి, పశ్చాత్తాపపడుము. నీవు ఏపనిచేసినా అదంతా భగవంతుడు చూస్తాడు. వింటాడు. తెలుసుకుంటాడు.

(సా.పు.430)

నీ హృదయాన్ని ప్రేమతోనింపుకో. అది అందరికి పంచు. పంచినకొద్ది ప్రేమపెరుగుతుంది. నీ హృదయం అప్పుడు ప్రేమతో నిండుగానే యుంటుంది. భగవంతుడు అక్కడనే యున్నాడు. ప్రేమ స్వరూపుడు ఇప్పుడు నీవు భగవంతుని ఇతరులతో అనుభవిస్తున్నాడు అంతే.

(సా.పు.579)

పలువిధ సంపదలు ఆస్తులు, అధికారాలు, పేరు, ప్రఖ్యాతులు అంత విలువైనవికావు. ప్రేమ అనే అమూల్యమైన ఐశ్వర్యం మానవుని జీవితంలో సర్వస్వం. ప్రేమ శూన్యమైన హృదయం నిడాంధకారమైన శిధిల మందిరం. అందులో దుశ్చింతలనే గబ్బిలములు నివసించును. అశాంతి అను దుర్వాసనకు అది ఆలవాలము. ప్రేమ యను జ్యోతి హృదయము నిండెనా దుశ్చింతలు మాయమై శాంతి నెలకొనును.

(సా.పు.651/652)

ప్రేమ+కోరిక = సత్యము
ప్రేమ+కర్మ = ధర్మము
ప్రేమ+భావన = శాంతి
ప్రేమ+అర్థముచేసికొనుట = అహింస

(సా.పు.604)

ప్రేమ అంటే ఏమిటి? "త్రికాల బాధ్యం ప్రేమ" Past Present Future లో కూడా మార్పు చెందనటువంటిది ప్రేమ. కనుక, అట్టి ప్రేమ ఒక్క భగవంతునికి, భక్తునికి మధ్యనున్నటువంటి సంబంధమే కాని వీరందరికీ ఉన్న సంబంధమును ప్రేమ అని చెప్పకూడదు. **కనుక క్షణములో పెరిగి క్షణములో తరిగేటటువంటిది ప్రేమకాదు. ఎప్పటికీ స్థిరమైనటువంటిదిగా ఉండేటటువంటిదే ప్రేమ. అదియే భగవంతుడు, అదియే Love is God Live in Love.** ఇలాంటి ప్రేమ తత్వమును మనం సరియైనటువంటి మార్గములో ప్రవేవపెట్టుకోవాలి.

(శ్రీ.ఫి.1955.పు.26)

ప్రేమ ఉన్నచోటు అసూయద్వేషాలకు అవకాశం లేదు. మానవ హృదయం "సింగిల్ చైర్' వంటిది. ఇందులో ఇద్దరు కుర్చోవడానికి వీల్లేదు. ఈ హృదయంలో ప్రేమ కూర్చున్నప్పుడు ఇంక ఇతర గుణములు. ఇందులో

కలరు భారత భువిని పెక్కండ్రు
ఉండి ఫలమేమి వారిలో నొక్కరైన
అనుదినంబును వినిపించు ఆర్తరవము
ఆలకింప దలంపరో యార్యులార!
ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము
ప్రేమను ప్రేమతో సంధింప నీమమగును
కాన ప్రేమను గట్టిగా కలిగియున్న
అద్వితీయము నొందంగ అర్హుడగును.

జగత్తంతయు ప్రేమచేతనే నిండి యున్నది. ప్రేమపైననే ఆధారపడి యున్నది. ప్రేమయేధనము, ప్రేమయే ధర్మము ప్రేమయే సత్యము. ఇట్టి ప్రేమ తత్వాన్ని మానవుడు గుర్తించుకోలేక క్షణికమైన విషయాల కోసం ప్రాకులాడు తున్నాడు. కారణమేమిటి? స్వార్థము పెరిగినది పరార్థము తరిగినది. విశాల భావములు తరిగినవి. ఆశలు పెరిగినవి. ఆశయాలు తరిగినవి. సంకుచిత భావములు పెరిగినవి, ప్రాచీన మహర్షులు త్యాగమునకు పట్టము కట్టారు, ధర్మమును అందల మెక్కించారు. సత్యమునకు స్వాగతం పలికారు. ఈనాడు ఇట్టి దివ్యమైన భావములను మానవుడు విస్మరించాడు. కనుకనే ఈజగత్తు అనుదినము అనేక అవస్థలతో క్రుంగి కృళ్ళి కృశించి పోతున్నది. **ప్రేమలేని హృదయం ప్రేత భూమితో సమానం.** పవిత్రమైన దివ్యత్వాన్ని నిరూపించేది ప్రేమ ఒక్కటే. కనుక ప్రతిమానవుడు హృదయంలో ప్రేమను నింపుకోవాలి. **"అనిర్వచనీయం ప్రేమ" అని నారదుడు వర్ణించాడు.** ఈ ప్రేమ జపతపధ్యానములవల్ల గాని వేదశాస్త్ర ఇతిహాసపురాణముల వల్లగాని లభించేది కాదు. కాని అనేకమంది ప్రేమను పొందే నిమిత్తమై జపధ్యానములు చేస్తున్నారు. యోగము నభ్యసిస్తున్నారు గ్రంధములను పఠిస్తున్నారు. పారాయణములు చేస్తున్నారు.ఇవన్నీ శరీరంపై ధరించే నగలవంటివే కాని ఆత్మ స్వరూపాన్ని నిరూపించే మార్గములుకావు. పాండిత్యము ఒక నగ వంటిది, పారాయణము ఒక నగ వంటిది. ఇవన్నీ బాహ్యమైన అందమును మాత్రమే అందిస్తున్నాయికాని ప్రవేశించుటకు వీలుకాదు. ఇట్టి హృదయాన్ని మానవుడు "మ్యూజికల్ చైర్'గా మార్చుకుంటున్నాడు. అనగా హృదయంలో ఈనాడు ఒక స్వామి రూపు మరొక స్వామి కొన్నాళ్ళ తరువాత ఇంకొక స్వామి, ఈనాడు ఒక జపము, రేపు ఇంకొక జపము ఈ విధంగా మార్చుకుంటున్నాడు. హృదయం నిండుకు ప్రేమ ఉన్నది. కాని దానిని వదలుకుంటున్నాడు, దాహము తీర్చే గంగా ప్రవాహము ప్రక్కనే ఉండగా దానిని వదిలిపెట్టి మంచు బిందువులను ఆశించినట్లుగా, తన యందే ఉన్న ప్రేమను విస్మరించి లౌకిక విషయాలకై ఆరాటపడు తున్నాడు. దైవానికి అర్పితమైన హృదయానికి అశాంతిగాని, అననుకూలముగాని, దుఃఖముగాని ఎన్నటికి ప్రాప్తించవు.
(స.సా.డి.96పు.31)

సకల శాస్త్రపురాణ సంగ్రహవేత్తయై వేదాంత వేద్యుడే
విబుద్ధుడైన
రక్తి ఏపారగ రమ్యహర్మ్యంబుల రమియించు రాజ
చంద్రముడైన
రణరగమందు పరాభూతరిపుడౌచు వెల్గొందు
జగదేకవీరుడైన
దారిద్ర్యదేవతా దాక్షిణ్యమున కుందు దౌర్భాగ్య విభుడగు
దాసుడైన
ప్రేమలేనిచో ఎందుకు పనికి రాడు
ప్రేమరహితుడగు జగద్భర్తకన్న
ప్రేమ పరుడగు దాసుడే వంద్యుడగును
ఇంత కన్నను వేఱెద్ది ఎఱుకపరతు?
ప్రాచీన ఋషులకు పారముల్ నేర్పించ జాలిన
వేదాంతసారమతులు
నిర్జీవ శిలలచే నృత్యమాడించంగ నేర్పు గల్గిన
కళానిపుణమతులు
పరవీర శిరములు బంతులాడించుచు క్రీడింప గల్గినవాడి
మగలు
సర్వసర్వం సహా చక్రపాలన చేసినడిపించ గల్గిన
నాయకులును

ప్రేమకు ప్రధాన ప్రాణములు

అంతర్ ఆనందమును చేకూర్చవు. **అంతర్ ఆనందమును పొందడానికి ప్రేమయే ప్రధాన సూత్రము.**

(స.సా.డి.96పు.309/310)

జీవితాన్ని ప్రేమమయంగా మార్చుకోండి. **ప్రేమమయ జీవితంలో పొందలేని సుఖం లేదు. సర్వసంపదలూ, సర్వాధికారములూ ప్రేమచేతనే ప్రాప్తిస్తాయి. సర్వవిజయములూ ప్రేమనే వరిస్తాయి.** అయితే, ఈ ప్రేమ ఏ విధంగా ఉండాలి? సర్వార్పిత భావంతో కూడినదిగా ఉండాలి. సర్వార్పిత భావంతో భగవంతున్ని ప్రార్థించాలి.

(స.సా.డి.96 పు.310)

మీరు నిజంగా దైవాన్ని ఆశిస్తున్నట్లయితే ప్రేమను ఆశ్రయించండి. మీ తాపమును, మీ పాపమును రెండింటినీ చల్లార్చేది ప్రేమనే. ఈ లోకసంబంధమైన బాధలచేత కష్టముల చేత మీరు నిరాశా నిస్పృహలకు గురియై ఉంటున్నారు. నిర్విరామకృషిచే, నిరంతర తాపత్రయములచే అంతులేని ఆశలచే, **అర్థంకాని ఆవేదనలచే, కృశించిపోతున్న మానవుని దాహం తీర్చేది. ప్రేమ ఒక్కటే. భగవంతుని ప్రేమ ఒక లైటు హౌసు వంటిది. మీకు మార్గం చూపించేది అదే.** సంసార సాగరం లో ఎన్ని బాధలు కల్గినప్పటికీ మీ జీవితమనే పడవను ప్రేమవైపే ప్రయాణం చేయించండి. తప్పక మీరు గమ్యాన్ని చేరుతారు. విజయాన్ని పొందుతారు. ధన్యులవుతారు.

(స.సా.డి.96పు.314)

(చూ॥ అవినాభావసంబంధము, ఆదిశంకరులు, ఆపద్భాందవుడు, ఎటాచ్‌మెంట్, ఒక్కడే, క్రిస్మస్, కైలాసం, గృహం అమ్మాయి, చతుర్విధపురుషార్థాలు, జాలిహృదయము, త్రికోణాత్మకం, దున్నపోతా!, పురుషార్థము, భక్తి, ర్యాగింగ్, విచారణ, హిందువు, హిరణ్యగర్భుడు)

ప్రేమకు ప్రధాన ప్రాణములు

నిజంగా హృదయంలో ప్రేమనే ఉంటే ఎక్కడికి వెళ్ళినా అది మార్పు చెందడానికి వీలులేదు. దీనికి చక్కని దృష్టాంతము. ఒక కాగితంపై ఒక పూల తీగ బొమ్మ గీసాము. బయట గాలి ఎంత వీచినా కాగితము అల్లాడుతుంది గాని, దానిపై గీసిన పూల తీగ ఏ మాత్రము అల్లాడదు. అదేవిధముగా సంగదోషముచేత మనస్సు అటూ, ఇటూ కొంత కదిలినప్పటికీ హృదయంలో ఉన్న ప్రేమ మారుటకు వీలుకాదు. **ప్రేమ త్రికోణ స్వరూపము. ఒకటి ప్రేమకు భయమే లేదు. రెండు ప్రేమ పరులను 'Beg' చేయదు. మూడవది ప్రేమ ప్రేమనిమిత్తమై ప్రేమిస్తుంది. ఈ మూడు ప్రేమకు ప్రధాన ప్రాణములు.**

(శ్రీ.బ.ఉ.పు.200/201)

ప్రేమకు మూడుమెట్లు

భగవంతుని ప్రేమను సంపాదించుకొనుటకు మొట్ట **మొదట 'దేవా! నేను నీవాడను"** అనుట నీవు యులవాటు చేసికొనవలెను. ఈ మొదటిమెట్టు పైకి కనబడునంత తేలికైనదికాదు. ఆ మెట్టుకెక్కుటకు ముందు, నీవొక మహాసముద్రములోని చిన్న అలవన్న సంగతి చక్కగా తెలసికొనవలెను. అది తెలిసికొనుటకు చాలాకాలము పట్టును. ఎట్లో తెలిసికొన్నను. దేవుని మ్రొలనమ్రతతో తలవంచి నిలబడి, **"నేను నీవాడను, నీవునాకు ప్రభువు నేను నీకు దాసుడను" అనుభావమును స్థిరపరచు కొందువేని** అది నీ అహమునణచివేయును. అప్పుడు నీవు చేయుప్రతి పనియు అమోఘమును అర్థవంతమును అగును. ఇది శాస్త్రసమ్మతమైన ప్రపత్తిమార్గము. ఈవిధమైన **ప్రపత్తికి మార్జాలకిశోరన్యాయ మని పేరు.** పిల్లికూనకును దాని తల్లికిని గల సంబంధము వంటి సంబంధమని యర్థము. పిల్లిపిల్ల అహము లవలేశమైనను పెట్టుకొనక సహాయము కొరకును, జీవనము కొరకును - దీనముగా తల్లినే యర్దించుచుండును.

రెండవమెట్టు: "నీవు నావాడవు" అని విశ్వసించి, వర్తించు. ప్రతివ్యక్తి యొక్క యోగక్షేమములను విచారింపవలసిన బాధ్యత భగవంతునిదే. అయినను తన కృపకు పాత్రుడును, తనకు ముఖ్యుడునూ అయిన భక్తుని

యక్కరను తీర్చుట భగవంతుని ప్రథమకర్తవ్యము ఆయన అందుకు బద్ధుడైయున్నాడు. **సూరదాసు "నీవు నావాడవు, నేను నిన్ను విడవను, నిన్ను నాహృదయమున బంధీ చేసితిని, ఇకతప్పించుకొని పోజాల" వన్నాడు.**

మూడవమెట్టు: "నీవే నేను". "నీవు ప్రథానబింబమువు. నేను ప్రతిబింబమును. నాకు ప్రత్యేకవ్యక్తిత్వము లేదు." అని తెలుపుకొనుట. బింబ ప్రతిబింబములలో ద్వంద్వత్వము లేదు. ఆరెండును ఒక్కటే, **రెండు అనుకొనుట భ్రాంతి.**

నీవు నీయిష్ట దేవతకు నివేదన చేయవలసినది - అల్పవ్యయముతో అంగడిలో కొని తెచ్చు వస్తువులతో తయారుచేసిన పనికిమాలిన పదార్థములు కాదు. **అహింసయను** గోధుమరవ్వ - **సమర్పణ** మను మినపపిండి - **ప్రాయశ్చిత్త** మను పప్పు - **పశ్చాత్తాపమను** బెల్లముచేర్చి - **సౌశీల్యమను** నేతితో పాకము చేసిన కజ్జాయము - **అదే దేవునికి ప్రియమైన నివేదనము.**

(త.శ.మ.పు.249)

ప్రేమజీవనము

భక్తి అనునది యెక్కడినుండియో వచ్చి పడునది కాదు. ఎవరూ అందించునదికాదు. భూమినుండి రాలేదు. ఆకాశము నుండి పడలేదు. తనలోనుండియే వచ్చు భగవదనురాగము, భక్తునిలోని ప్రేమవృత్తి ప్రవాహము చెల్లాచెదరై ప్రవహించక భగవంతునివైపు యేకోన్ముఖము గా ప్రవహించిన ప్రేమ ప్రవాహమే భక్తి అని పిలువబడును. ప్రేమ సర్వప్రాణుల యందును కలదు. ప్రేమలేని జీవిలేదు. పశుపక్షి మృగాదులకు క్రిమికీటకాదులకు కూడా, వాటికి తగిన 'ప్రేమ వాటికున్నది, వేయేల! **ప్రేమే జీవనము, జీవనమే ప్రేమ.**

(గీ.పు.193)

ప్రేమతత్వము

భగవంతుడు భక్తికే తూగుతాడు కాని, ధనమునకు తూగడు. నీ హృదయాన్ని పవిత్రమైన ప్రేమతో నింపుకో. దానిని పదిమందికీ పంచుకో. నీవు మాత్రం ఇతరులనుండి కోరి, వారికి తిరిగి ఇవ్వకపోతే అది one way traffic అవుతుంది. కాని ప్రేమ one way traffic కాదు. దీనిని ఇచ్చుకోవాలి. పుచ్చుకోవాలి. నీ డబ్బును నీవు Bank లో పెట్టుకొంటే నీవు తిరిగి "చెక్" వ్రాసి ఇస్తేనే నీ డబ్బు నీకు ఇస్తారు లేకపోతే నీ డబ్బయినా నీకివ్వరు. భగవంతుడు కూడా అంతే! నీవు ఆనంద బాష్పాలనైనా అర్పించినప్పుడు, అనంతమైన ఆనందాన్ని అందిస్తుంటాడు. కుచేలుడు ఏమిచ్చాడు? పిడికెడు అటుకులను అర్పించాడు. కాని కృష్ణుడు అతనికి బహుళ భోగభాగ్యములను అందించాడు. రుక్మిణి దేవి ఏమిచ్చింది? తులసి దళాన్ని ఇచ్చింది. దానికే కృష్ణుడు ఆమెకు వశమైపోయాడు. కనుక, **భగవంతునికి ప్రేమతత్వాన్ని ఇవ్వాలి.** ప్రేమతత్వాన్ని పుచ్చుకోవాలి. భగవంతునికి ఏమీ అక్కరలేదు. అతడు ఏమి ఆశించడు కాని ప్రేమను మాత్రం అర్పించాలి. అదికూడా నీ Property కాదుLove is God, Live in Love.

(శ్రీ.భ.ఉ.పు.151/152)

ఒక్క ప్రేమను అభివృద్ధి పర్చుకుంటే ప్రపంచమంతా దగ్గర చేరుతుంది. ఈనాడు ఇన్ని దేశముల నుండి, ఇన్ని ప్రాంతముల నుండి ఇంతమంది ఇక్కడకు ఎందుకోసం వచ్చారు? చక్కగా విచారణ చేసినప్పుడు దీని అంతరార్థము అర్థమవుతుంది. మీ ఇంటిలో లేనిది, మీ సంసారములో లేనిది, మీ రాష్ట్రములో లేనిది, మీ గ్రామములో లేనిది, మీ దేశములో లేనిది, ఏదో ఒకటి ఇక్కడ ఉంటున్నది. అదే సర్వసమానత్వమైన ప్రేమ. ఆ ప్రేమ నిమిత్తమై మీరు ఇక్కడకు వచ్చారు. **ప్రేమచేతనే సన్నిహిత సంబంధ బాంధవ్యము ఏర్పరచుకోవచ్చు.** హృదయభూమియందు ప్రేమతత్వము ఉండాలి.

ప్రేమ రహిత మరు భూములలో
ప్రేమాంకురములు పెంపొంద
ప్రేమావేశముతో, ప్రేమ సుధావర్షము వర్షింపగ
ప్రేమ నదులు ప్రవహింపగ

ప్రేమతత్త్వము

మురళీగానము సేయగదే, కృష్ణా! గానము సేయగాదె! అని గోపికలు ప్రార్థించారు. **"కృష్ణా! నీ మురళీ నాదమునందే ప్రేమతత్వము ఉంటున్నది. నీ వాక్కునందే ఈ ప్రేమతత్వము ఉంటున్నది. నీ ప్రవర్తనయందే ప్రేమతత్వము ఉంటున్నది"** అన్నారు. **దేనినీ ఆశించదు ఈ ప్రేమ. ఇది అందించేదేగాని అందుకొనేదికాదు. ఒక్క దైవమునందు మాత్రమే అట్టి నిస్స్వార్థ ప్రేమ లభ్యమవుతుంది.** అట్టి నిస్స్వార్థ ప్రేమ నిమిత్తమై మీరు ఇక్కడకు వస్తున్నారు. లేకపోతే ఎవరు మీకు జాబులు వ్రాసారు? ఎవరు మీకు invitations పంపారు? ఎందుకోసం ఇక్కడకు వచ్చారు? నేను ఏమిస్తున్నాను మీకు? ఏమీ లేదు. 'నాయనా! ఎప్పుడొస్తివి?" అని ప్రేమతో మాట్లాడితే మీరు ఉబ్బిపోతున్నారు, చాలా ఆనందము అనుభవిస్తున్నారు. ఒక్క మాటలోనే యింత మాధుర్యము ఉన్నది. కనుక **మీరు మధురమైన మాటలు నేర్చుకోండి. పవిత్రమైన మార్గంలో నడుచుకోండి. అప్పుడే మీకు గౌరవము లభిస్తుంది. మీరు మాట్లాడే మాట సత్యమైనదిగా ఉంటుండాలి. You cannot always oblige, but you can speak always obligingly.** ఎవరైనా మన యింటికి వచ్చారంటే 'ఏమండీ, ఎప్పుడు వచ్చారు? దయచేసి లోపలకు రండి' అని మంచి మాట మాట్లాడితే వారికి భోజనము చేసినంత ఆనందమవుతుంది. అట్లుకాక "ఎందుకు వచ్చారండి?" అంటే, వారికి మరింత అకలైపోయి వెళ్ళిపోతారు. కఠినమైన మాటలు బాంబుల వలె వారిని భస్మం చేస్తాయి. వారికి ఏమీ పెట్టకపోయినా కనీసం మాటలనైనా మృదు మధురంగా మాట్లాడాలి.

(ద.స.98 పు.40/41)

"సర్వ మతముల మూలము, సమస్త శాస్త్రముల సారము, సర్వమార్గముల గమ్యము, సమస్త జీవుల కీలకము, ప్రేమతత్వమే, అదే జీవిత సౌధమునకు భద్రమైన పునాది. విశ్వకళ్యాణమునకు విజ్ఞానజ్యోతి.

ప్రతి మాట, ప్రతిఆట, ప్రేమమయము కావలెను. మాటలు కత్తిపోటులుగాను, సూటిబాణములుగానూ, సుత్తి ఏటులుగానూ, మారరాదు. అమృతపూటలుగనూ వేదాంత మాటలుగానూ, పూలబాటలుగనూ, శాంతి సుఖ ముల నందించునట్టివై యుండవలెను.

(ఆ.దీ.పు.1179)

ఈనాడు మీరు ఉద్యోగముల చేతను వ్యాపారముల చేతను ధనమును ప్రోగు చేసుకుని బ్యాంకుల్లోను, ఇన్సూరెన్స్ కంపెనీల్లోను పెట్టు కుంటున్నారు. కాని ఇవన్నీ అస్థిరమైనవి, అశాశ్వతమైనవి. నిజంగా మీరు ఆనందాన్ని పొందాలంటే **ప్రేమ ధనాన్ని పెంచుకోండి. దానిని హృదయమనే బ్యాంకులో డిపోజిట్ చేసుకోండి. మీ డిపాజిట్ ఎక్కడికీ పోదు. పైగా డబుల్‌గా పెరిగిపోతుంటుంది. ఎక్కడైనా దొంగతనం జరగవచ్చు కాని ఈ హృదయమనే బ్యాంకులో దొంగతనం జరుగడానికి వీల్లేదు. దీనికి తలుపులు లేవు. బీగములు లేవు. ఏమి లేకపోయినా సత్యనిత్యమై ఉంటుంది. కనుక అశాశ్వతమైన ధనాన్ని ప్రాకృతమైన కంపెనీలలో ఇన్సూర్‌చేసే బదులు ప్రేమధనాన్ని మీ హృదయంలో ఇన్-షూర్ (in-sure) చేయండి. ఇది లోపలనే ప్యూర్‌గా శాశ్వతంగా ఉంటుంది. అమృతము కంటే అధికమైనది ప్రేమ. అమృతము ప్రాకృతమైన జిహ్వకు రుచిగా ఉంటుందేమో గాని ప్రేమామృతం హృదయానికే రుచి కలిగిస్తుంది. ఇట్టి ప్రేమామృతాన్ని గ్రోలటానికి తగిన ప్రయత్నం చేయాలి. త్యాగానికి పట్టం కట్టినప్పుడే ప్రేమకు స్వాగతం పలుకడానికి వీలవుతుంది. అప్పుడు దేనిని తలంచినా తక్షణమే ఫలసిద్ధి కలుగుతుంది.**

(స.సా.డి.96పు.312)

ప్రేమతత్వము ప్రబోధించి, మమత సమతను పొందుపరచి, మానవత్వపు విలువ దెలిపిన ప్రేమమూర్తి ఆత్మదేవుడు. కనుక ప్రేమనే ఆత్మ, ఆత్మనే ప్రేమ.

(శ్రీ.ఫి. 1995 పు. 2)

(చూ॥ గోపికలు, భక్తి పరమావధి, సాయిదేవుడు, సోహం తత్వము)

ప్రేమను పెంచుకోవాలి

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా! జీవితమును దేశమునకు అంకితము గావించుకునే భావముతో మీ హృదయమును నింపుకోవాలి. కేవలము స్వార్థము సరియైనది కాదు. **ఫిష్ ఈజ్ బెటర్ దాన్ సెల్ఫిష్.** మానవుడు కేవలము స్వార్థములోనే మునిగి జగత్తులో వుండిన దుర్గుణములను, దురాచారములను, దురహంకారములను రూపుమాపలేక పోతున్నాడు. ప్రేమను పెంచుకోవాలి. విశాలమైన మనస్సు అభివృద్ధి గావించుకోవాలి.

Love lives by giving and forgiving
Self lives by getting and forgetting

(ఉ.బృ.పు.4)

ప్రేమనేర్పుటకోసం

మీ కష్టాలను తీర్చటానికి భగవంతుడు స్వయంగా రానవసరంలేదు. మీ ప్రార్థనలే మీ కష్టాలను తీరుస్తాయి. కాని **ఆయన అవతరించేది ప్రధానంగా మానవాళికి ప్రేమ నేర్పటం కోసం!** నేను భగవంతుణ్ణి దర్శించాను, నేను భగవంతునితో సంభాషించాను, నేను భగవంతుణ్ణి స్పృశించాను, నేను భగవంతునితో కలసి ఆడాను, పాడాను, నవ్వాను - అని మానవులు అనేక పర్యాయములు **తలచి తలచి పరమానందం పొందటం కోసం భగవంతుడు అవతరిస్తాడు"**

(వ.61-62 పు.(i)

ప్రేమబంధము

(చూ॥ దివ్యప్రకటనలు)

ప్రేమభక్తి యోగము

"యోగమను పదమునకు ప్రేమభక్తి యోగమునదే సరయైన నిర్వచనము. దైవమును చేరుకొనుటకిది చక్కటి రాజమార్గము. **మిగిలిన యోగములు 'క్రియాయోగము' హఠయోగము' 'రాజయోగము' కొందరు వర్ణించుచున్న**

ప్రేమను పెంచుకోవాలి

'సాయియోగము' ఇవియన్నియూ 'యోగము'ను పేరిట పిలువబడుచున్ననూ, దీనిలో శరీరమునకు, లౌకిక వ్యవహారములతోనూ సంబంధముకల ఒక విధమైన 'డ్రిల్లు'Drill కవాతు ప్రధానమైన అంగముగా ఉంటున్నది. 'లెఫ్ట్ రైట్'ఆప్ డౌన్ అంటూ! దీనివలన లాభమేమిటి? ఇవియన్నియూ నిరుపయోగమైనవి! వీనిపై కాలమును వ్యర్థము చేయుట తప్ప ప్రయోజనమేమియూ లేదు, హృదయమును లగ్నము చేసి చేయుప్రేమ యోగమే నేరుగా దైవము వద్దకు చేర్చును."

(లీ.నా.పు.228/229)

ప్రేమమతము

అన్ని మతములూ బోధించే దైవత్వం ఒక్కటే. అందరూ దైవస్వరూపులే. ఈ సత్యాన్ని మొట్టమొదట గుర్తించాలి. క్రిస్మిన్ అనేది క్రిష్టియన్లు జరుపుకునే పండుగ అని మీరు భావిస్తున్నారు. కేవలం క్రిష్టియన్లే కాదు, ఇది అందరూ జరుపుకోవలసిన పండుగ. మానవత్వాన్ని ధరించిన ప్రతి వ్యక్తికి ఇది పండుగే. హిందువలని, క్రిష్టియన్లని, ముస్లింలని మత భేదములకు అవకాశమివ్వకూడదు. మీ మతిని విశాలం చేసుకొని హృదయంలో దైవాన్ని ప్రతిష్టించుకోవాలి. ఉన్నది ఒకే కులం, అదే మానవ కులం. ఉన్నది ఒకే మతం, అదే ప్రేమమతం. **ప్రేమలేనివాడు హిందువు కాదు, క్రిష్టియన్ కాదు, ముస్లింకాదు, సిక్కు కాదు; అలాంటివాడు రాక్షసుడనే చెప్పవచ్చు.** కనుక, హృదయంలో ప్రేమను పెంచుకోవాలి. ఈ దేవుడు, ఆ దేవుడు అని భేదాలు పెట్టుకోకూడదు. అందరి హృదయమందున్న దేవుడు ఒక్కడే అని భావించాలి. అట్టి భక్తిప్రపత్తులు ఒక్క ప్రశాంతి నిలయమునందు మాత్రమే గోచరిస్తున్నాయి. 64 దేశాలకు చెందిన క్రిష్టియన్లు ఈ ప్రశాంతి నిలయంలో ఏకమై క్రిస్మస్ పండుగ జరుపుకోవడం ఎంత అద్భుతం! ఇలాంటి ఏకత్వమే నిజమైన భక్తి.

(స.సా.జ.2000 పు.13)

ప్రేమమాధుర్యము

ప్రేమమాధుర్యము

(చూ॥ గోపికలు)

ప్రేమ సందేశము

ప్రతిదేశము ఏకత్వాన్ని సాధించటానికి ప్రయత్నించాలి. అదే నా ప్రేమ సందేశము. ప్రతివారు హృదయ పూర్వకంగా స్వీకరించాలి. దేవుడిని గుడిలోనో చర్చిలోనో దర్శించి, ఇంటికి తీసుకురావాలి. దేవుని సర్వత్రా దర్శించాలి. ఆయనను మీ హృదయంలో ప్రవేశపెట్టండి. మీ పని తేలిక అవుతుంది. **అన్ని మతాలు "ఓం" లోను యున్నాయి.**

(సా.పు. 81)

ప్రేమస్వరూపుడు

నిర్గుణో నిష్క్రియో నిత్యో నిర్వికల్పో నిరంజనః
నిర్వికారో నిరాకారో నిత్యముక్తో హి నిర్మలః

గుణములు లేనిది, ఎట్టి కర్మలూ ఎరుగనిది, నిర్వికారమైనది, ఆకారము లేనిది ఒకటున్నది. **అదియే ప్రేమ. ఈ ప్రేమకే ఆత్మ అని పేరు పెట్టారు.** ఇట్టి ప్రేమతత్వాన్ని మానవుడు ఏ రీతిగా గుర్తించగలడు? ఈ ప్రేమ బుద్ధియొక్క వ్యాయామము కాదు, మానసిక మార్గము కాదు, స్వప్నమునందలి ప్రతిబింబము కాదు. అన్నింటి యందు ప్రాణసమానమైన సత్యము ప్రేమయే. అయితే ప్రేమస్వరూపము ఎట్లా ఉంటుంది? ఆచరణ స్వరూపములో ఇది మనకు సాక్షాత్కరిస్తుంది. **ప్రేమను వర్ణించుటకు కవిత్వము చాలదు, భాషలేదు. మనస్సునకు, వాక్కునకు అతీతమైనది. ప్రేమస్వరూపమే భగవత్స్వరూపము. భగవంతుడు ప్రేమస్వరూపుడు.**

(ద.స.98 పు.84)

ప్రేమసిద్ధాంతము

సర్వజ్ఞమైన, సర్వశక్తివంతమైన ఆత్మ తత్వమును పరమార్థ స్థితిని ప్రేమించుటే అతనిని ఆరాధించుట ఆత్మనే మానవునకు ఏకైక ప్రియుడు. ఇహ పరములందు గల సర్వము కన్ననూ ప్రియతర వస్తువుగా భావించుట అతనిని ఆరాధించుట ఇదియే వేదప్రబోధ. వేదములు ప్రతిపాదించినది నిష్ఠుర నియమములయొక్క ఘోరసందోహముకాదు. కార్యకారణ రూపమైన కారాగారముగాదు. ఈ నియమముల కన్నింటికీ ప్రభువైన భౌతిక పదార్థములలోని, భౌతిక శక్తులలోని ప్రతి అణువు నందును నిలిచి దీపించుచుండు వాడు వకడు కలడని, అతని ఆజ్ఞ వలననే పంచభూతములు తమ తమ పనులు చేయుచున్నవనియు ప్రతిపాదించును. ఇదియే వేదములందు ప్రతిపాదించిన ప్రేమ సిద్ధాంతము.

నీటియందుద్భవించియు నీటిచేత తడియక యుండు తామరాకువలె మానవుడు ఈ లోకమున జీవింపవలెను. అని పరమార్థము; **ఇహమునను పరమునను ప్రతిఫలమపేక్షించి భగవంతుని ప్రేమించుట మంచిదేకానీ, ఇంతకంటే ప్రియమైన వస్తువు మరొకటి లేకపోవుటచే దీనిని నిష్కామ ప్రేమగా ప్రేమించుట శ్రేష్ఠమని కూడా దీని అంతరార్థము.** అనగా **భగవంతుని ప్రేమించుటకే ప్రేమను కలిగి యున్నానని భావించుట భారతీయ పరమార్థము.**

(స.వా.పు.3/4)

ప్రేమోదయము

సరస్సులోని పద్మం సూర్యునికి చాలా చాలా దూరంలో ఉంటుంది. అయితే ప్రేమోదయానికి **దూరమేమి అవరోధం కాదు.** ఆకాశం అంచులపైకి ఆదిత్యుడు తొంగి చూచీ చూడగానే కమలం వికసిస్తుంది.

(సా.అ. పు. 227)

ప్రేయస్సు

(చూ॥ ఆత్మజ్ఞానము)

ప్రేయోమార్గము

తైత్తిరి యోపనిషత్తు పంచాగ్నుల యొక్క ప్రమాణాలను గురించి, నాలుగు తరగతులకు చెందిన మానవులను గూర్చి చక్కగా వివరించడమే గాకుండా, గురుకులంలో తమ విద్యాభ్యాసమును పూర్తిజేసుకొని గృహస్థాశ్రమములో ప్రవేశించబోయే విద్యార్థులు తమ జీవితంలో ఎట్టి మార్గాన్ని అనుసరించవలెనో ఉపదేశించుచున్నది. "ప్రేయోమార్గం, శ్రేయోమార్గం" అని రెండు విధములైన మార్గము లుంటున్నవి. ప్రేయోమార్గములో మానవుడు తాత్కాలికమైన ఆనందాన్ని అందించే ఇంద్రియ సుఖములనాశించి, తత్ఫలితాన్ని అనుభవిస్తాడు. చాలామంది ఇట్టి అనిత్యమైన, అసత్యమైన ప్రేయోమార్గమునే ఆశిస్తున్నారు, అనుసరిస్తున్నారు. మంచి ప్రవర్తన, మంచిగుణములు, మంచిజ్ఞానం ఆశించి, అనుభవించుటయే- శ్రేయోమార్గం. కాని, మానవుడిట్టి నిత్య సత్యమైన మార్గము నాశించుట లేదు. కారణమేమిటంటే - **శ్రేయోమార్గం నందు సత్ఫలితాలకు కొంతకాలము పడుతుంది.** కాని, తానాశించిన ఫలితాలను ఆలస్యముగా అనుభవించుటకు మానవుడు ఇష్టపడడు. తాను ప్రతివిషయానికి పరుగులిడతాడు. తనకు అనుకూలమైన ఆశలను మాత్రమే దృష్టియందుంచు కుంటాడు. అప్పటికప్పుడు గొప్పపదవులు, కీర్తి ప్రతిష్టలు కావాలని కోరుతుంటాడు. ఇట్టి తాత్కాలికమైన విషయాలను ఆశించుటయే, ప్రేయోమార్గము.

(స.సా.న.91 పు.299/300)

ఫలము

మనసులో నున్న భావంబు మంచిదైన
కలిగి తీరును ఫలసిద్ధి కార్యమందు
మనసులోనున్న భావంబు మలినమైన
ఫలము కూడ ఆరీతిమలినమౌను

(స.సా.ఏ.99పు.85)

ఫలమేమి

పరమాత్మ ప్రేమను ధరణిలో జనులకు
ప్రవహింప జేయుటే పరమ భక్తి
ప్రతిమానవుండును బ్రతికి తానుండుట
స్వార్థంబునకు కాదు సంఘసేవ
చేయుటకే నన్న శ్రేష్టభావంబుతో
మెలగుచు నుండిన మేలుకలుగు
మరచియు తను దాసు మానవసేవకు
అంకిత మొసగుటే ఆత్మతృప్తి
నిష్కళంకపు ప్రేమను నిలిపి హృదిని
సకల జీవులకుపకృతి సలుపకున్న
పుట్టి ఫలమేమి నరుడుగా పుడమియందు
ఇంతకన్నను వేరెద్ది యెఱుక పఱుతు?

(యు.సా.పు.63)

ఫలాపేక్ష

(చూ॥ నిష్కామకర్మ)

ఫాషన్

(చూ॥ సర్వమూ భగవంతుడే!)

ఫిలాసఫీ (Philosophy)

ఫిలాసఫీ చాల మంది చదువుతున్నారు. ఏం ప్రయోజనం? వారి ఫిలాసఫీ చదువు 'ఫుల్-లాస్' (Full Loss) లో ఉంది. అట్లాకాకూడదు. ఫిలాసఫీ అంటే 'ఫిల్ - లాస్' (Fill Loss)గా ఉండాలి. అప్పుడే ప్రయోజనం ఉంటుంది. హృదయ గ్రంథాన్ని చదువు. **శ్లోకాలు వల్లిస్తే శోకం**

తీరదు. అనుభవ జ్ఞానం రావాలి. చాల మంది భగవద్గీత చదువుతుంటారు. అందులో "ధర్మక్షేత్రే కురుక్షేత్రే" అనే మొదటి శ్లోకంలో ధృతరాష్ట్రుడు సంజయుణ్ణి ప్రశ్నిస్తాడు. - "ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో ఆనాడు పాండవులు ఏం చేస్తున్నారు?" అని, ఏంచేస్తారు? రాజైయుండి యుద్ధభూమిలో ఏం చేస్తారో అతనికి తెలియదా? యుద్ధభూమిలో విలాసాలున్నాయా? మరి ఎందుకడిగినట్లు? యుద్ధానికి ముందు కౌరవుల మనస్సు మారిందే మోనని తెలుసుకోవాలని ప్రశ్నించాడు. ఈ ప్రకారం రహస్యాలను సూక్ష్మాలను గమనించాలి. అర్థం చేసుకోవాలి. ఇది "ఫెల్ - లాస్" నిజమైన ఫిలాసఫీ.

(స.సా.మా.99.పు.83)

ఫుట్‌బాల్ (Foot Ball)

ఒక దినము ఒక విద్యార్థి తన టీచరు దగ్గరకు వెళ్ళాడు. ఆ సమయములో ఆటస్థలమున కొందరు Foot Ball అడుతున్నారు. ఈ అబ్బాయి టీచరుని "సార్! అదేమిటి, ఆ బాల్‌ను ఇరుప్రక్కలవారు అటూ, ఇటూ, మార్చి మార్చి కొడుతున్నారు కాలితో," అని అడిగాడు. టీచరు "అబ్బాయీ! దానిని యెంతవరకు ఇట్లా కొడతారో చెప్పు అని అన్నాడు. ఆ అబ్బాయి యోచించి **"దానిలో గాలి వున్నంతవరకు"** అన్నాడు. "గాలి పోయిన వెంటనే దానిని చేతులోకి తీసుకుంటారు " అని అన్నాడు. మన జీవితమే ఒక ఫుట్‌బాల్ గ్రౌండ్ (Foot Ball Ground), దానిలో ప్రతి వ్యక్తి ఫుట్‌బాల్ (Foot Ball) వంటి వాడు. **ఈ బాల్‌ను అటూ ఇటూ కొట్టేవి మనలోనున్న సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు ఒక ప్రక్క, కామ, క్రోధ. లోభ, మోహ, మద మాత్సర్యము లింకొక ప్రక్క. అయితే యెంతవరకు ఇవి కొడతాయి? మనలో అహంకార మున్నంతవరకు. యెప్పుడు మనలో అహంకార ముండదో, అప్పుడు దెబ్బలు కూడా తగలవు.**

(శ్రీ.సా.ది.పు.29)

ఫ్రీవిల్ (Free will)

ప్రతిమానవునకు ఒక Free will ఉన్నదని విశ్వసిస్తున్నారు. ఇది చాల పొరపాటు. వ్యక్తి సంకల్పము చేతనే, వ్యక్తి ప్రయత్నముల చేతనే, వ్యక్తి సాధనల చేతనే ఫలితమును పొందుతున్నామని భావిస్తున్నారు. ఇది కర్తృత్వము యొక్క ప్రతిబింబము, **అహంకారము యొక్క వికారము.**

(బృ.త్ర.పు.136)

మానవులలో **'ఫ్రీవిల్' అనేది ఉండటానికి వీలే లేదు.** నేనిప్పుడు నాకారులో ఇంటికి పోతానంటావు. కాని, దారిలో నీ కారుకు ఏమైనా కావచ్చు. ఇంక 'ఫ్రీవిల్' ఎక్కడ ఉంది నీకు? ఏ కార్యం చేయాలనుకున్నా 'ఫ్రీవిల్' లేకపోతే, అది ఫలిస్తుందో లేదో అని సందేహాలు వస్తాయి. నీవు ఏది చేయాలనుకున్నా అనేక అడ్డంకులు ఎదురవుతుంటాయి. **ఒక్క భగవంతునికి మాత్రమే ఈ 'ఫ్రీవిల్' అనేది ఉన్నది. ఇంకెవ్వరికీ లేదు.** "నాకు ఫ్రీ-విల్" ఉంది నా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాను" అని నీవు భ్రమించవచ్చు. అది నీ కోరిక యొక్క లక్షణమే కాని 'ఫ్రీ-విల్' కానే కాదు. ఒక్క దైవానుగ్రహం చేతనే దానిని మనం పొందడానికి వీలవుతుంది.

(శ్రీ.భ.ఉ.పు.188)

బంగారు/ బంగారం

ఈనాడు మానవునియందుండవలసిన మానవతా గుణములు శూన్యమైపోతున్నాయి. ప్రేమ అనేది ఎక్కడా కనిపించడం లేదు. సత్యమనేది ఎక్కడా వినిపించడం లేదు. ధర్మమును ఎవరూ ఆచరించడం లేదు. ఇంక, శాంతి ఏరీతిగా లభిస్తుంది? బంగారము లేక నగలు తయారు కావడానికి వీలుకాదు. అదేవిధంగా, భగవంతుడు లేక మీకు సత్యంగాని, ధర్మంగాని శాంతిగాని ప్రాప్తించవు. ఇవన్నీ భగవంతుని ద్వారా లభించేవే! **భగవంతుడు హిరణ్యగర్భుడు, బంగారంవంటివాడు. కనుక, భగవంతుడనే బంగారాన్ని మీ హృదయంలో పెట్టుకుంటే, ఆ బంగారంచేత సత్యము, ధర్మము, శాంతి అనే నగలను చేయించుకోవచ్చును. అందరియందు హిరణ్యగర్భుడున్నాడు. దీనిని దృష్టియందుంచు కొనే నేను అందరినీ 'బంగారు! బంగారు!' అని పిలుస్తుంటాను.** అందరి యందు భగవంతుడున్నాడనే సత్యాన్ని గుర్తించాలి. మీయందు భగవంతుడున్నాడని విశ్వసించి నప్పుడే మీకు సర్వ సుఖములు చేకూరుతాయి. హృదయమందున్న దైవత్వాన్ని విస్మరించి, బాహ్యమైన ఫలితాలకోసం ప్రాకులాడితే ప్రయోజనం లేదు.

(స.సా.జ.2000పు.4)

కంచునందు మ్రోత ఘనముగా నుండును
కనకమందు మ్రోత కానరాదు
అల్పులయందుండు ఆడంబరము మెండు
మేలి పూత లేల భక్తులకును?

కంచు, కనకము కంటికి ఒకే మాదిరి కనిపిస్తాయి.కాని, కంచు మ్రోగినట్లు కనకము మ్రోగదు. అట్లే, అల్పునియందు ఆడంబరము మెండుగా ఉంటుంది. నిజమైన భక్తుడు బంగారంవలె ఉంటాడు. బంగారం మట్టిలో పడినా చెడిపోదు. అగ్నిలో పడినా ఆపరంజిగా ప్రకాశిస్తుందేకాని విలువను కోల్పోదు. భక్తుడు కూడా బంగారమువలె కష్టనష్టాలవల్ల సంస్కరింపబడి ఉన్నతస్థాయికి చేరుకుంటాడు. మీరు బంగారం వంటివారుగా తయారు కావాలనే నేను మిమ్మల్ని **'బంగారూ! బంగారూ!' అని పిలుస్తుంటాను. మీరందరూ గోల్డ్ మాదిరి తయారు కావాలి. ఎలాంటి గోల్డ్? రోల్డ్ గోల్డ్ కాదు, ప్యూర్‌గోల్డ్‌గా తయారు కావాలి.**

(స.సా.అ.96పు.262)

ఒక బంగారు ముద్దను మనము చేతిలో పెట్టుకొంటే మనకు అందం లేదు, ఆనందంలేదు, కాని, దానికి వెల

ఉంటున్నది. ఆ వెల ఉండినప్పటికి ప్రయోజనమేమిటి? మనకు ఆనందం రావాలంటే - ఆ బంగారు ముద్దను ముక్కలుగా కొట్టి, నిప్పులోవేసి కరిగించి, సుత్తితో కొట్టి కోసినప్పుడే అది ఒక అందమైన 'హారం'గా తయారౌతుంది. అట్టి చక్కని హారాన్ని మనము మెడలో వేసికొని ఆనందించవచ్చును. ఈ విధంగా బంగారానికి ఈ కష్టాలను అందించకుండిన, అది అందముగా తయారు కాదు, మనం ఆనందాన్ని అనుభవించలేము. ప్రతి మానవుడు బంగారం వంటివాడే అందుచేతనే, అందరినీ నేను - "బంగారు! బంగారు!" అని సంబోధిస్తుంటాను. అనగా, నీవు చాలా విలువైనవాడవే. కాని, కొన్ని కష్టాలను, దుఃఖాలను కొంతవరకు శాంతముగా భరించుకోవాలి. అంతేగాని, మనకు కష్టాలు సంభవించినాయని మన మనస్సును మార్చుకోరాదు. ఒక ఉక్కుగుండును, ఎండుటాకును రెండింటిని ఒక చోట పెట్టినప్పుడు, గాలి ఎక్కువగా వీచనంత వరకు రెండూ నిశ్చలంగానే ఉంటాయి. కాని మలయమారుతం వస్తే, ఎండుటాకు ఏడుమైళ్ళు ఎగిరిపోతుంది. కాని ఉక్కుగుండు మాత్రం అక్కడే ఉంటుంది. మనం ప్రకృతమైన కష్టాలను దుఃఖములను భరించుకూంటూ భగవంతునిపై విశ్వాసం పెంచుకొన్నప్పుడు ఉక్కుగుండువలె ఉండవచ్చును. అట్టి విశ్వాసము లేనివాడు ఎండుటాకువలె ఎగిరిపోతాడు. కనుక, మొట్టమొదట విశ్వాసాన్ని పెంచుకోవాలి. ప్రజా క్షేమాన్ని ఆశించి మనము జగత్తులో సరియైన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. ఈ అహంకారమమకారములను పూర్తిగా త్యజించాలి.

(స.సా.ఫి.మా.92పు.37/38)

బంగారు బాటలు

నియమాలు, నిబంధనలు, స్వయం కట్టుబాట్లు అనేవి ఆత్మ సాక్షాత్కారానికి బంగారు బాటలు, అవి నిన్ను కేవలము కట్టివేయటానికి కాదు. హద్దులో వుంచటానికి కాదు. అందరికి ఆత్మ వున్నది. అయితే మనస్సు చలిస్తుంది: అశాంతి పాలవుతుంది. ఆ విధంగా మనస్సును కట్టి వేయటానికే యీ నియమ నిబంధనలు. చిన్న మొక్కచుట్టూ కంచెకడతాము ఎందుకని? పశువులు నాశనం చేయకుండా. కానీ ఆ మొక్క పెరిగి చెట్టుగా మారినపుడు నాశనము చేయటానికి వచ్చిన పశువులే ఆ చెట్ల నీడలో విశ్రాంతి తీసుకొంటాయి. నియమ నిబంధనలు అనేవి మనసుచుట్టూ వేసే కంచెలాంటివి.

(శ్రీ.స.ప్ర.పు.116)

బంతి ఆట

ఈ దేహం ఒక బంతి. దీనిలో దివ్యత్వం అనే గాలిని నింపారు. ఆరుగురు శత్రువులు (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు) ఒక వైపు నుండి దీనిని తంతూ, ఆడు తున్నారు. మరోవైపు ఆరుగురు మిత్రులు (సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, కరుణ, ధృతి) ఆడుతున్నారు. రెండువైపులా గోలుపోస్టులున్నాయి. ఆగోలు పోస్టుల మధ్యగా వెళ్ళేలా బంతిని తన్న గలిగితే 'గోల్' అవుతుంది. అంటే 'ధర్మవిద్య' సాధించి గెలుపొందుతారు. లేకపోతే ఆతోపుకు వీళ్లపుటవుతారు. ఇదే భగవంతుని లీల!

(శ్రీ.సా.గీ.పు. 29)

బంధనలు/బంధనాలు

(చూ॥గుణములు, పలుకులు)

బంధవిముక్తి

విలాస వస్తువుల వైపు పరుగిడితే లాభం లేదు. సంసార బంధంలో తగులుకొని అస్వతంత్రుడ వైపోతావు. నీకు కావలసింది **బంధవిముక్తి. బంధవిమోచన. నీవు దేహసంఘాతము** కావు. ఆత్మయే నీవు. అది చేరే వరకు స్వేచ్ఛ లేదు, శాంతిలేదు.

బంధువులు

రాజభవనంలో రామచిలుక సువర్ణపంజరంలో ఉన్నా, ఎప్పుడూ చింతాక్రాంతమై ఉంటుంది. దాని మనసు రుచికరమైన పాలపానీయాల మీద ఉండదు. బంగారు పంజరం మీద ఉండదు. రారాజే తనకు సేవ చేస్తున్నా పట్టించుకోదు. ఏ వనప్రాంతంలో చెట్టుకొమ్మపై ఎపుడు పోయి వాల్తానని ఎదురు చూస్తూ వుంటుంది. అంతవరకు విచార సాగరంలోనే ఉంటుంది. సర్వసౌకర్యాలతో ఉన్నా రాజభవనంలో శరీరం ఉన్నా, చిలుక మనసు అరణ్యాన్నే కోరుతూ ఉంటుంది. **తన జన్మస్థానం అరణ్యం, తన నివాసం చెట్టుకొమ్మ,అవే తనకు కావలసినవి.** మానవుడు ఆవిధంగా ఎందుకు తలంచడు? ఈ పాటి బుద్ధి మానవుడికి ఎందుకు ఉండదు? **పరమాత్మ వారి జన్మస్థానం.** అక్కడికి చేరుకోవాలనే చింత ఎందుకు కలుగదు? తన ఆత్మ స్థానాన్ని చేరుకోవాలి. తాను ఆత్మ స్వరూపుడునని తెలుసుకోవాలి.

(త.శ.మ.పు.46)

బంధువులు

జ్ఞానమును తండ్రిలాగా గౌరవించండి. ప్రేమను తల్లిలాగా ఆరాధించండి. ధర్మమును సోదరునిలాగా భావించి కలసి, మెలసి తిరగండి. దయను ఆప్తమిత్రునిలాగా విశ్వసించండి. శాంతమును మీ అర్ధాంగిని చేసుకోండి. సహనమునుమీ ప్రియ పుత్రునిగా తలంచండి. **ఇవే మీకు నిజమైన బంధువులు.** వాళ్లతో కలసి, మెలసి కాలం గడపండి. ఈ బంధువులను వదలకండి. నిర్లక్ష్యం చేయకండి.

(శ్రీ.స.సూ.పు.59)

"ఆత్మైవ చాత్మనో బంధుః"తనకు తానే బంధువు. తనకు తానే శత్రువు.

(ని.పు.134)

ఈ లోకముతో రెండునాళ్ల సంబంధమున్నదని, నిత్య సంబంధమున్న పరమాత్మని మరచుట న్యాయముకాదు. ముందు వ్రాసినట్లు "బంధువులందరు వాకిటిదాకను, వల్ల కాటకే వత్తురు బంధమణచి నిన్ బాయని అపద్బంధువు భగన్నామమేరా" అన్నట్లు, **ఎన్నటికీ ఎడబాయని బంధువు అతనొక్కడే.** నీ జన్మములందు ఎంతమంది తల్లులూ, ఎంతమంది తండ్రులూ, ఎంతమంది భార్యలూ, భర్తలూ, పుత్రులూ, మిత్రులూ, శత్రువులూ జన్మ జన్మకూ లెక్క లేనన్ని మార్లు ఉండినారు. అట్టి సంబంధము నేటికి చిరస్థాయిగా ఉన్నదా? పూర్వబంధువులందరికీ జ్ఞాపక మున్నదా? నీకు వారు లేరు, వారికి నీవు లేవు. ఇద్దరికి మాత్రము **పరమాత్మ ఒక్కడే. అతను మాత్రము ఎన్ని జన్మములైనా మారడు; నిత్యము.**

(ధ్యా.వా. పు. 55)

బడి

(చూ॥ నాలుగు ఆలయములు)

బదరీ

(చూ॥యుక్తులు)

బదరీయాత్ర

(చూ॥నేత్రలింగము)

బల అతిబల

(చూ॥మాయ)

బలము

ప్రాప్తించిన వస్తువు స్థిరమయినది కాకుండా నశించిపోయేదయి నప్పటికినీ అది స్థిరముగా తనకే ఉండవలెనను పట్టుదలనే రాగము అని అందురు. రంజననే రాగమందురు. ఇట్టి కామ రాగములకు రెండింటితోను దూషితమైన బలము భగవత్ బలము కాదు. అయితే కొన్ని కొన్ని స్థానబలమును బట్టి విశేషబలమును బట్టి

యోగ్యతా అయోగ్యతలను పొందును. ఉదాహరణమునకు ఒక్కటి చూతము. ధనమున్నది, అది దుష్టునిచేరి మదకారణ మౌతుంది. సజ్జనులను చేరి దాన ధర్మములగు సత్కర్మలకు ఉపయోగ మవుతుంది. అటులనే బలము దుర్మార్గుల చెంతచేరి పర పీడనకు ప్రాకుతుంది. సజ్జనుల చెంతచేరి పర రక్షణకు ప్రయోగింపబడుతుంది.

(గీ.పు.108)

విద్యాబలము, బుద్ధిబలము, ధనబలము, జనబలము, ఎన్ని ఉన్నా గొప్ప అధికార స్థానమును ఆక్రమించినా, మానసిక కోమలత్వము, దయ, ప్రేమ శూన్యమైతే లక్ష్యం సిద్ధించదు. దైవత్వము పొందాలన్న ఆశగల వ్యక్తులు మానవత్వాన్ని దైవత్వంగా మార్చుకోవాలి.

మానవుని మాధవునిగా మార్చే నిమిత్తమై దైవము మానవాకారము దరించి వచ్చేడు. దైవం మానుషరూపేణ, జనార్థనుడు జనం రూపంలో ఉంటున్నాడు. మానవుల కంటే ఉన్నతమైన స్థాయి నందుండు వాడు గనుక పురుషోత్తముడని పేరుపెట్టేరు. "సహస్రశీర్షాపురుషః సహస్రాక్షస్సహస్రపాత్" మానవునికి ఒక శిరస్సు, భగవంతునికి అనేక శిరస్సులున్నాయని, భగవంతుని శక్తి అనేక రెట్లు అధికంగా ఉన్నదని ప్రస్తుతిస్తూ వస్తున్నారు. **"దైవం మానుషరూపేణ" అన్నది - ఇక్కడ, ప్రత్యక్షంగా గోచరిస్తున్నది.** అయితే పురుషత్వము గుర్తెరిగే మార్గం ఏమిటి? **అహంతత్వము, మమత్వము, వాసనతత్వము ఈమూడింటిని క్షయం చేసుకున్నపుడే పురుషోత్తమ తత్వము అర్థం అవుతుంది.**

ఆగమ శాస్త్రాన్ని పురస్కరించుకొని దేవాలయములందు ప్రవేశించే ముందు బలిపీఠము అని పెడతారు. మమత్వమును, అహంతత్వమును, వాసనలను యీ బలిపీఠమున బలి ఇచ్చి తర్వాత లోనికి వెళ్ళమని దీని అంతరార్థము. **లక్ష్యాన్ని మాత్రం దృష్టి యందుంచు కుంటున్నారు. గాని సాధనను అలక్ష్యం చేస్తున్నారు.**

(త.వ.మ.పు.60)

లోకమున అనేక విధములైన బలము లున్నవి; ధనబలము, బుద్ధిబలము, విద్యాబలము, జనబలము, మనోబలము, దేహబలము అని కలవు ఇవన్నియూ పరమేశ్వరుడనైన నా బలమనే భావించవలెను. కానీ అవి కామ రాగ రహితమై ఉండవలెను. అట్టివి మాత్రమే భగవత్ స్వరూపము లనబడును. అట్లుకాక కామరాగ సహితమైన బలములు పశుబలము లనవచ్చును. కాని పశుపతి బలము కానేరదు.

(గీ.పు.107/108)

(చూ॥ ఆత్మబలం, ధర్మబలము, భక్తి, యోగము)

బలరామకృష్ణులు

ప్రాచీన కాలమునుండి కృష్ణుని గోపాల అనిపిలుచుట పవిత్రముగా భావిస్తున్నాము. **గోవు అనగా ఏమి?** పశువు అనుకొంటున్నారు. కాదు, కాదు. ఆహారమును అందించి, వ్యవసాయమునకు తోడ్పడి, **పాడిపంటల నిచ్చేజీవులను గోవులని పిలుస్తున్నారు. గోపాలురనగా గొల్లవారని భావిస్తున్నారు. కాదు గోవులను పోషించే వారంతా గోపాలురే.** ప్రపంచమునకు సరియైన సంపద గోవులని విశ్వసించినవాడు కృష్ణుడు. నిజమైన సంపదలంటే ఏమిటో గుర్తించలేని స్థితిలో మానవుడు ఈనాడు జీవితమును నిరర్థకము కావించుకుంటున్నాడు. ప్రింటు కొట్టిన నోట్లను చూచి ఆనందపడే దౌర్భాగ్యస్థితిలో మానవుడు ఈనాడు ఉన్నాడు. **గోవులే సరియైన సంపద అని, గోవులవలన ఆహారమును ఉత్పత్తి చేయవచ్చునని, ఈ ఆహారముపైనే దేశసౌభాగ్యము ఆధారపడి ఉంటుందని ఆనాడే గుర్తించి సోషలిజమ్‌ను తాను ఆచరణ పూర్వకముగా అనుభవించి లోకమున వెల్లడి చేసినవాడు కృష్ణుడు. గోవు ద్వారా పాలు, పెరుగు, నెయ్యి, వెన్న ఇత్యాది ఆహార పదార్థములు పొందుటయే** కాక గోవుల సంతతియైన పశువులను వ్యవసాయమునకు ఉపయోగించుకొని పంటలను అభివృద్ధి కావించి లోకమునకు కల్యాణము అందించిన వాడు కృష్ణుడు.

సోదరులైన **బలరామకృష్ణులు పాడిపంటలను రెండు విభాగములుగా భావించుకున్నారు; పాడి గోపాలుడు.**

బలరాముడు

పంట బలరాముడు. పంట పండించే వానికి నాగలి ప్రధానము. దీనినే హలం అంటారు. హాలాహలము లేని వాడు, హలమును ధరించినవాడు బలరాముడు. వారు పాడిపంటలద్వారా లోకమునకు కల్యాణము కలిగించినారు. పాడి పంటలద్వారా లోకమునకు ఆనాడు సౌభాగ్యము కలిగించినారు. పాడి పంటలద్వారా లోకమునకు ఆనాడు సౌభాగ్యము కలిగింది. లోకమునకు సౌభాగ్యము ఆకాశమునుండి ఊడిపడేది కాదు. భూమినుండి పుట్టేది కాదు; లేదా మధ్యలో అందుకునేది కాదు. సోమరి తనమును దూరము చేసి నడుము వంచి పనిచేసే తత్వమును నిరూపించినాడు బలరాముడు. సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమయుడు. సర్వాంతర్యామి అయిన పరమాత్ముడు తన దివ్యత్వమును **ఒక ప్రక్కకు పెట్టి ఒక సేవకునివలె అర్జునుని రథమును తోలినాడు. సమాజసేవ ప్రధానమని విశ్వసించి ఆదర్శమును నిరూపించి నాడు కృష్ణమూర్తి.** భారతయుద్ధములో యుద్ధము ముగియగానే గుట్టములను నదికి తీసుకొని వెళ్ళి ఆ గుట్టముల గాయములకు తగిన మందులు వేసి జీవకోటిని ప్రాణసమానముగా భావించి సేవ చేసినవారు బలరామకృష్ణులు.

(ని.పు.15/16)

బలరాముడు

ఈ బలరాముని కి పేరు పెట్టినవాడు - గర్గుడు. "ఇతను చాలా బలవంతుడుగా ఉంటున్నాడు; ఇతని తేజస్సు చాలా రమించేదిగా ఉంటున్నది. రమించే బలవంతుడనగా ఇతనికి బలరాముడని పేరు పెట్టండి" అన్నాడు.

(స.సా.అ.94పు.272)

బలహీనత

(చూ॥ పురుషప్రయత్నము)

బలహీనుడు

మీ కందరికిని తెలుసు మహాభారతంలో బలహీనుడు ఎట్టివాడు అని పరీక్షచేసే నిమిత్తమై ఒకానొక సమయంలో కృష్ణుడు కౌరవులయందు ఒకరిని ఎన్నుకొన్నాడు. ఒకనాడు ఒకరికి ఒకరు తెలియకుండా తాను పరీక్షించటానికి పూనుకున్నాడు. కౌరవులయందు దుర్యోధనుని పిలిచి ఒకనాడు **"దుర్యోధనా!** నాకు ఏదో ఒక ఘనకార్యము కావలసిన అవసరముండి వచ్చాను. నీవు నాకది చేసి పెట్టెదవా?" అని అడిగాడు. తప్పక భగవంతుడే వచ్చి చేయడానికి నన్ను అడిగినప్పుడు నేను దీనిని కాదని చెప్పుదునా? "తప్పక చేస్తాను" అని అహంకారము చేత వాగ్దాన మిచ్చాడు. నాకు ఒక ఉత్తమ చిత్తుడైన వ్యక్తితో అవసరమున్నది. పవిత్రహృదయుడు, శాంత స్వరూపుడు నాకు అవసరంగా ఉంటున్నాడు. అలాంటి వ్యక్తిని ఈ రాజ్యంలోపల ఎక్కడైనా వెతికి తేగలవా? అన్నాడు."తప్పక తేగలను" అని ఆనాడు రథంలో రాజ్యమంతా తిరిగాడు. ఎక్కడా విచారించలేదు. అహంకారికి విచారించే అవకాశము ఉండదు. తిరిగి వెనుకకు వచ్చాడు. "స్వామీ! **అట్టి ఉత్తముడైనటువంటి వ్యక్తి నాకీ రాజ్యములో ఎక్కడా కనిపించలేదు. ఒక వేళ ఒకరో యిద్దరో ఉండినారంటే అందులో నేను మాత్రమే ప్రధానమైనటువంటి వాడను"** అని అహంకారంగా తెలుపుకున్నాడు. "సరే అట్లయితే తరువాత నీతో కొంత అవసరముంది. తప్పక నిన్ను వినియోగించుకుంటాను" అని చెప్పి వెనుకకు వచ్చేశాడు **కృష్ణుడు. తిరిగి పాండవుల దగ్గరకు వెళ్లాడు. "ధర్మజా! నీతో ఒక అత్యవసరమైనటువంటి పని ఉండటంచేత వచ్చాను.** ఎవరైనా నీ రాజ్యములో అతినీచుడు, దుర్మార్గుడు. అసత్యవాది, ఆధర్మప్రియుడు ఉండిన తేగలవా?" అన్నాడు. ఈధర్మజుడు వినయవిధేయతలతో తాను శిరస్సువంచి అన్ని ప్రదేశములలో వెదకి వచ్చాడు. అతని దృష్టిలో అందరూమంచి వారుగానే కనిపించారు. **"స్వామీ! నారాజ్యములో చెడ్డవారైన వారు ఎంతవెదకినా నాకు కనిపించలేదు. అంతో యింతో చెడ్డ తనము నాలో**

ఉండవచ్చును. కానీ నా ప్రజలలో లేదు. ఆ చెడ్డవానిగా నన్నే నీవు స్వీకరించి నీయిష్టం వచ్చిన రీతిగా కావించుకో" మన్నాడు. కనుక ఈ దుర్యోధనునకు ధర్మజునకు ఉన్న వ్యత్యాసం ప్రత్యేకంగా మనం విచారించినపుడు దుర్యోధనునిలో ఉన్నటువంటి అహంకారమే అతనికి మంచివారు కనబడకుండా పోవటం. ధర్మజుని యందున్న వినయవిధేయతలే అతనికి చెడ్డవారు కనబడకుండా పోవటం. కనుక ఈ మంచిచెడ్డలకు మనయొక్క దృష్టిదోషము మనోదోషములే, మూలకారణం కానీ ప్రకృతి యొక్క దోషము కాదు. కనుకనే మొట్టమొదట మన యొక్క దృష్టిని, మనస్తత్వమును మనము వినయవిధేయతలుగా మార్చుకున్నపుడు అహంకారమునకు కాని, అసూయలకు కాని అవకాశం లేకుండా ఉంటుంది. ఇంతేకాకుండా ఇంకొక సులభమైన మార్గాన్ని మనం అవలంభించాలను **కుంటే సర్వజీవులయందు సర్వేశ్వరుడొక్కడే " నా ఆరాధ్యదైవము అందరియందూ ఒకడుగానే ఉంటున్నాడు" అనేటటువంటి తత్వాన్ని మనం అభివృద్ధి పరచుకుంటూ రావాలి.** కనుక అందరియందు ఉన్నటువంటి భగవంతునిపై మనం అహంకారం పూనటానికి ఏమాత్రం అవకాశం ఉండదు. అందరియందు ఉన్నటువంటి భగవంతుని అసూయతో చూడటానికి అవకాశం ఉండదు.

(స.సా.ఆ.79పు.174/175)

బలి

"తనలో గల **జంతులక్షణాలను బలియివ్వకుండా మూగజీవియైన ఒక జంతువును బలి యివ్వడం మానవతాలక్షణ మనిపించుకోదు.** రాగద్వేషములు, అహంకారమమకారములు ఈ జంతులక్షణాలకు ఉదాహరణలు. అటువంటి దుష్టలక్షణాలను హోమగుండములో భగవంతునికి అర్పించినప్పుడు, ఆయన వాటిని స్వీకరించి వాటికి బదులు మంచి ఆలోచనలను, మంచి లక్షణాలను మీలో నింపుతాడు. సృష్టికర్తయైన **భగవంతుడొక్కడే దుష్టగుణాలను స్వీకరించి వాటికి బదులు మంచి గుణాలను ప్రసాదించగల శక్తిగలవాడు.** ఇది, భారతదేశములో ప్రభుత్వ కోశాగారములు ఒక్కటే మాసిపోయి, చిరిగిపోయిన కరెన్సీ నోట్లను తీసికొని క్రొత్తనోట్లను ఇవ్వడానికి అధికారము కలిగియుండడాన్ని మనకు గుర్తుచేస్తుంది.

(ధై.ది.పు.45)

(చూ॥ యజ్ఞము)

బలిచక్రవర్తి

బలి చక్రవర్తి దానపరుడు, సత్యమును కాపాడుకొనే నిమిత్తం, తన సర్వస్వాన్ని సమర్పించాడు. వామనుడు మూడడుగులు దానం కోరినప్పుడు, ఏమాత్రం వెనుకాడక ఇచ్చివేశాడు. శుక్రాచార్యుడు వద్దని చెప్పినా వినక యిచ్చిన వాగ్దానమును నిలబెట్టుకున్నాడు. బలి సత్యం కోసం నిలబడ్డాడు. కనుకనే వామనుడు బలిని పాతాళము నకు అణగద్రొక్కాడు. అంటే ఏమిటి? మరో జన్మలేకుండా ప్రసాదించాడన్నమాట. జన్మ రాహిత్యమే మోక్షమన్నమాట. ఆనాడు 'బలి' వామనుడ్ని ఒక చిన్న కోరిక కోరాడు. ఈనాడు ఏవిధంగా తమరు మా కేరళ దేశం వచ్చారో! అదే విధంగా ప్రతి సంవత్సరం కేరళ దర్శించి, కేరళ ప్రజలను కాపాడుతూండాలని కోరుకున్నాడు. కనుకనే వామనమూర్తి కేరళ వచ్చిన శుభదినమునకు చిహ్నంగా **'ఓణం'** అని పేరుపెట్టుకొని కేరళకు ప్రజలు ఆనాడు ఆనందాన్ని అనుభవిస్తూ వస్తున్నారు. కనుక బలిచక్రవర్తి చాలాపుణ్యాత్ముడు. అతని పూర్వజన్మ పుణ్యంవలన, అతను చేసిన త్యాగమువలననే, ఈ కేరళ ప్రజలకు ఈ 'ఓణం' అనేటటువంటి గొప్ప పండుగ ఏర్పడింది.

(శ్రీ.అ.2001 పు.87)

(చూ॥ విశ్వామిత్రుడు, సంకల్పములు)

బహుమానము

"భక్తుని సంతోషం భగవంతునికి సంతోషాన్ని కలిగిస్తుంది. భగవంతుని సంతోషం భక్తునికి **బహుమానం**"

(లో.పు.153)

బాగవుతాం

(చూ॥ భాగవతము)

బాధ

"భగవదనుగ్రహాన్ని అధికంగా పొందే అధికారాన్ని నీకు కలిగిస్తుంది **'బాధ'**. కష్టాలు ఒకదానివెంట ఒకటి తరంగాలుగా వచ్చినప్పుడు ఒడ్డుసమీపంలోనే ఉందని సంతోషించు. ధైర్యంగా వాటిని సహించు. పిరికి పందలాగ ఏదో ఒక బాహ్యమైన శక్తిమీద నిందవేయడంకాని, దేవునిమీద అయిష్టం కలిగించు కోడంకాని చేయవద్దు."

(లో.పు.20)

(చూ॥ లింగోద్భవము)

బాబర్ లేఖ

మన భారతదేశము ఎంత గొప్పదో ఒక్కతూరి మీరు విచారణ చేయండి. ఇది త్యాగభూమి, యోగ భూమి, కర్మభూమి, మహత్తరమైన భూమి. బాబర్ కుమారుడైన హుమాయూన్ ఈ దేశాన్ని పరిపాలిస్తున్న రోజులలో ఒకనాడు బాబర్ అతనికి ఒక ఉత్తరం వ్రాశాడు. "నాయనా! నీవు చాల అదృష్టవంతుడవు కనుకనే, **పవిత్రమైన భారత దేశానికి నాయకుడివైనావు. భారత దేశమును సామాన్యమైనదిగా భావించవద్దు. భారతీయ సంస్కృతిని చక్కగా పోషించు.** భారతీయులకు ఆనందాన్ని అందించు" అని వ్రాశాడు. మహమ్మదీయులు కూడా భారత దేశాన్ని ఎంతో ప్రీతిగా చూసుకునేవారు. పూర్వం భారత దేశంలో మహమ్మదీయులు, సిక్కులు, హిందువులు అందరూ చక్కని ఐకమత్యంతో ఒక్క కుటుంబంగా జీవించేవారు. కానీ, ఈనాడు ఒకరి నుండి ఒకరు విడిపోతున్నారు. ఉన్నది ఒకే కులము, అదే మానవ కులము; ఉన్నది ఒకే మతము, అదే ప్రేమమతము; ఉన్నది ఒకే భాష, అదే హృదయ భాష ఈ మూడింటినీ దృష్టిలో పెట్టుకుంటే ఎవ్వరినీ మీరు ద్వేషించరు.

(స.సా.మే99.పు.125/126)

బాబా (BABA)

బాబా (BABA) అంటే సత్(Being), చిత్ (Awareness), ఆనంద్ (Bliss) ఆత్మ (Atma) అనే వాస్తవిక స్థితి.

(ప.ప్ర.122)

బాలగంగాధర్ తిలక్

(చూ॥ ఆదర్శమార్గం)

బాలవికాస్

"సత్యసాయి బాలవికాస్‌నందలి పిల్లలు వారి హృదయములందు సత్యసాయినివసించుచున్నాడని వారు తెలుసుకొనవలెను. ఇందలి ఉపాధ్యాయినులు కూడా ఈ పవిత్రమైన బాధ్యతను సాయి రాముని పూజగా భావించవలెను. ఆ పసిపిల్లల హృదయములందు సాయి వున్నాడన్న భావ చైతన్యమును ఏవిధముగా అభివృద్ధి చెయ్యవలెనో, **ఎట్టి కార్యక్రమములు వారి మనస్సులను వికసింపజేయునో యన్న విషయములను ఉపాధ్యాయినులు పరిశీలించు చుండవలెను.** ఈ పిల్లలను దైవోన్ముఖులుగా తీర్చి దిద్దు ఈ ఉపాధ్యాయినులు సమాజమునకు సాటిలేని సేవ చేస్తున్నారు. ఈ మనోభావములతో పెరిగే పిల్లలు ఈ పవిత్రమైన వాతావరణమును వారి గృహములందూ పరిసరములందూ ప్రవేశ పెట్టి సంస్కరించగలరు"

(స.శి.సు.తృ.పు.157/158)

బాలురు (బాలికలు)

ఈనాటి బాలురు రేపటి తండ్రులు, బాలికలు రేపటి తల్లులు.చిన్నప్పుడు మీ తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకుంటే, రేపు మీ బిడ్డలనుండి మీరు గౌరవాన్ని పొందడానికి అర్హత సంపాదించుకుంటారు. మొక్క చిన్నదిగా ఉన్నప్పుడు వంపులతో పెరిగితే పెద్దయాక ఆ వంపులు పోతాయా? అందుకే చిన్నతనంలో ప్రవర్తన మంచిగా ఉండవలెను''.

(శ్రీ.వా.జూన్.97.పు.83)

బీజాక్షరం

భగవంతునికి సంబంధించిన ప్రతి అక్షరము బీజాక్షరమే. అందువల్ల నేను మీ చెవిలో ఎటువంటి మంత్రమును చెప్పటం లేదు. నేను మాట్లాడే ప్రతి మాటలో ఆ విషయం చెప్తూనే ఉన్నాను. మీరు జాగ్రత్తగా వినండి. మీరు నిద్రలేవగానే మీకు భగవంతుడిచ్చిన పాత్రనే పోషించడానికి రంగస్థలంపై ప్రవేశిస్తున్నామని భావించండి. మీరు బాగా నటించాలని, ఆయన అభిమానం పొందాలని ఆయనను ప్రార్థించండి. రాత్రిపూట నిద్రపోయే ముందు నటించిన దృశ్యం పూర్తి ఆయిన కారణంగా గ్రీన్‌రూమ్‌లోకి ప్రవేశిస్తున్నామని భావించండి. మీ పాత్ర పోషించటం పూర్తి అయితేనే తప్ప డ్రెస్ మార్చుకొనటానికి భగవంతుడు అనుమతించడు. మీరు మరునాటి ఉదయం తరువాత దృశ్యంలో ప్రవేశిస్తాడు.దానిని గురించి ఇప్పుడు దిగులు పడవద్దు. మీరు పూర్తిగా ఆయన అధీనంలో ఉండండి. ఆయనకు తెలుసు. ~~ఈ~~ **నాటకం రచించింది ఆయనే. ఇది ఎలా ఉంటుందో, ఎలా సమాప్తమవుతుందో ఆయనకు తెలుసు. నటించటము, విశ్రాంతి తీసికొనటము, అదే మీరు చేయవలసినది.**

(వ61-62పు.165/166)

బీదవాడు

(చూ॥ లిమిటెడ్‌కంపెనీ)

బుద్ధి

మనకు బాగా ఉక్కపోతగా ఉన్నప్పుడు విసిన కట్టతో విసురుకుంటే చల్లదనం చిక్కుతుంది. అదే విసిన కట్టను ఇతరులవైపు త్రిప్పితే ఆచల్లదనం వారికే పోతుంది. మన బుద్ధియే ఒక విసిన కట్ట. దానిని ఆత్మవైపు త్రిప్పి విసిరితే ఆత్మానందం కలుగుతుంది. దేహంవైపు త్రిప్పి విసిరితే దేహానికి ఆనందం కలుగుతుంది. ~~ఈ~~ దేహానందం క్షణికమైనది. ~~ఈ~~ దేహం ఒక మలినపు కొంప. దీనివల్ల సుఖం లేదు. ఆత్మవైపులో చేరితే ఆనందం లభిస్తుంది. **Head-Heart-Hand ~~ఈ~~ మూడింటినీ ఆధారంగా తీసుకోవాలి. హృదయంలో భగవంతుని నిలుపుకో. తలతో దైవాన్ని చింతించు. చేతులతో పనిచెయ్యి.**

See no Evil - See what is good
Hear no evil - Hear what is good
Talk no evil - Talk what is good
Think no evil - Think what is good
Do no evil - Do what is good
This is the way to God

(దే.యు.పు.29)

బుద్ధి అనే సూర్యునిచేత దుర్భావాలనే సముద్ర జలాన్ని సద్భావాలనే ఆవిరిగా మార్చుకొని, సత్యమనే మేఘంనుండి ప్రేమజలం కురుస్తుంది. చివరకి అది అనుగ్రహ సాగరంలో లీనమైపోతుంది.

(సా.సా.జూలై 2000 పు.196)

బుద్ధి అంటే ఏమిటని ప్రత్యేకంగా విచారణ చేసినప్పుడు చదువుకున్నవాడుగాని, చదువులేనివాడుగాని, మూర్ఖుడుగాని, మేధాశక్తి గలిగినవాడుగాని బుద్ధి అనగా విచారణా శక్తి అంటున్నారు. నిత్యానిత్య విషయ పరిశీలన బుద్ధి యొక్క స్వభావము అన్నారు. ఇది సరియైన అర్థము కాదు. ~~ఈ~~ **బుద్ధికి ఐదు అంశములుంటున్నాయి.** ఏమిటీ ఐదు అంశములు? **శ్రద్ధ, ఋతము, సత్యము, యోగము, మహత్తత్వము.** ఈ ఐదు అంశములతో కూడిన బుద్ధిని కేవలం నిత్యానిత్య పరిశీలనా శక్తి యని చెప్పటం ఎంత పొరపాటు! శ్రద్ధకు రెండు విధములైన శక్తులుంటున్నాయి. ఇది గాఢ విశ్వాసముతో కూడినది. ~~ఈ~~ విశ్వాసము

బుద్ధి

స్థిరత్వముతో ఉండినది. ఋతము నుండి ఆవిర్భవించిన వాక్ స్వరూపమేసత్యము. ఈ సత్యము తరువాత యోగము. ఏమిటీ యోగము? సర్వేంద్రియములను అరికట్టే తత్వము, సర్వేంద్రియములను స్వాధీనము చేసుకునే తత్వము యోగము. ఇంక, మహత్తత్వ మనగా ఏమిటి? ఇది చాలా పవిత్రమైన స్థితి. దివ్యమైన, నవ్యమైన స్థితి. ఇది ఇట్టిది, అట్టిది అని ఎవరూ వర్ణించలేరు. కనుక శ్రద్ధతో, ఋతముతో, సత్యముతో, యోగముతో, మహత్ తత్వంలో కూడినది బుద్ధి యొక్క స్వరూప ము. ఇలాంటి సర్వశక్తులతో కూడిన బుద్ధిని కేవలం నిత్యానిత్య విషయ పరిశీలనతో పోల్చితే బుద్ధిని ఎంత చులకన చేసిన వారమౌతాము! ప్రతి పదమునకు సరైన అర్థమును గుర్తించుటకు ప్రయత్నించాలి.

(ద.స.98 పు. 50/51)

బుద్ధి అనగా ఏమిటి? ఇది విచక్షణా జ్ఞానముతో కూడినది. ఇది మనస్సుకు అతీతమైనది. మొట్టమొదటిది దేహము. దానికి పైభాగమున ఉన్నవి యిం(దియములు. దానికంటే పైభాగమున ఉన్నది మనస్సు. దాని కంటే పైభాగమున ఉన్నది బుద్ధి. బుద్ధి పైభాగమే ఆత్మ. కనుక ఆత్మకు అతి సమీపములో నుండుటం చేత ఆత్మ ప్రభావము, ప్రకాశము బుద్ధిపైన పడుతూ ఉంటుంది. మనస్సుకు అతీతమైన తత్వము బుద్ధి. ఈ బుద్ధితో కొంతవరకు విచారణ చేసి మానవుడు బుద్ధిగా బ్రతకాలి. అప్పుడే నిజమైన ఆత్మతత్వము అర్థమవుతుంది.

(స.ది.పు.87)

"బుద్ధి గ్రాహ్య మతీంద్రియం" అన్నట్టుగా, బుద్ధిని ఒక ప్రత్యేకమైనటువంటి స్థానమునందు అనుభవిస్తూ వస్తున్నారు ప్రజలు. ఇది ఒక స్ఫటికము వంటిది. దీనికి స్వప్రకాశమన్నటువంటిది శూన్యము. ఆత్మకు సమీపంగా ఉండటంచేత, ఆత్మయొక్క ప్రకాశముచేత ఇది ప్రకాశిస్తూ ఉంటుంది. ఆత్మయొక్క ప్రకాశము బుద్ధిపైన పడటంచేతనే, బుద్ధి ప్రకాశమైనటువంటిదిగా మనకు గోచరిస్తూ వస్తున్నది. చంద్రుడు స్వప్రకాశకుడుకాడు. సూర్యుని యొక్క కిరణములు చంద్రునిపైన పడటంచేత, చంద్రుడు కూడను ప్రకాశవంతుడుగా మనకు గోచరిస్తున్నాడు. అదేవిధముగనే, బుద్ధికి స్వప్రకాశమన్నటువంటిది లేదు. కత్తిని పదునువలె, మనస్సును బుద్ధి అంటి వుండును.

(ఆ.రా.పు.156)

చిత్త శుద్ధిలేని। రిక్త సాధకునకు।
ఆత్మ తత్వమెట్లు । అబ్బునొక్క।
ఆత్మ తత్వమబ్బు। అతి శుద్ధ బుద్ధికే।
సత్యమైన బాట।సాయిమాట॥

(సా.పు.381)

మీహృదయమే మిమ్ములను గమ్యస్థానం చేరుస్తుంది. మీ హృదయాన్ని నమ్మండి. నిర్మల హృదయం బుద్ధికి అవతల వుంటుంది. అదే మిమ్ములను ప్రేరేపిస్తుంది.

(సా.పు.522)

మేధస్సుకంటె బుద్ధి చాలా శక్తివంతమైనదనే సత్యాన్ని విద్యార్థులు గుర్తించాలి. ఇది సామాన్యమైన బుద్ధికాదు. అస్థస్థాస్థ అనే ఆసక్తి స్థిరత్వములతో కూడిన శాంతియే యీ బుద్ధి. ఋతము సత్యము రెండింటితో ఏకీభవించినదే యీ బుద్ధి. యోగము మహత్తత్వము రెండింటితో కూడినదే ఈ బుద్ధి. **బుద్ధి అనగా ఆలోచనా శక్తి విచారణశక్తి వివేక శక్తి విజ్ఞాన శక్తి మాత్రమే కాదు, విచక్షణా శక్తితో కూడిన విచారణశక్తి.**

(బృ.త్ర.పు.116)

బుద్ధి ఆత్మకు సమీపముగా వుంటుంది. కనుక ఆత్మయొక్క ప్రకాశము ఆత్మయొక్క ప్రభావము ఈ బుద్ధిని సరిగా చేయటానికి అవకాశముంటుంది. ఆత్మశక్తి ఇంచుమించు 90 శాతము బుద్ధిమీదకురావటానికి అవకాశముంటుండాది. ఈ బుద్ధి ప్రభావము మనస్సు పైన, మనస్సు ప్రభావము ఇంద్రియములపైన, ఇంద్రియముల ప్రభావము దేహముపైన ప్రసరిస్తుంది. దశోపనిషత్తులందు ప్రధానమైనది. తైత్తిరీయోపనిషత్తు. అది బుద్ధిని ఒక పక్షిగా వర్ణించింది. దాని శిరస్సు శ్రద్ధ

కుడి రెక్క ఋతము, ఎడమరెక్క సత్యము, మధ్యనున్న దేహము మహత్తత్వము. తోక యోగము అని నామకరణ చేసింది. కనుక బుద్ధి ఒక భాగము కాదు. ఋతము సత్యము. మహతత్వము యోగములతోకూడినట్టిది. బుద్ధి సామాన్యమైనది కాదు. ఇన్ని అంగములతోకూడినపుడే ఇది పరిపూర్ణస్వరూపాన్ని పొందుతుంది.

(బృ.త్ర.పు.95/96)

(చూ॥ అంతరాత్మ, ఆత్మధర్మము, అభేదజ్ఞానము, గణపతి, జీవించు, నేనెవరు, వినాయకుడు)

బుద్ధిదోషము

కౌరపాండవుల మధ్య సంధి కుదర్చడానికి **కృష్ణుడు** హస్తినాపురం వెళ్ళినపుడు **దుర్యోధనునకు** అనేక విధములుగా హితబోధ చేశాడు. కాని, సర్వ ధర్మములు తెలిసిన దుర్యోధనుడు కృష్ణుని హితబోధను లెక్కచేయలేదు. కారణం ఏమిటి? సత్యమేమిటో, ధర్మమేమిటో తనకు తెలిసి కూడా **బుద్ధిదోషముచేత** వాటిని ఆచరణలో పెట్టలేకపోయాడు. కట్టకడపటికి అతనికి ఏ గతిపట్టిందో మీకు తెలుసు.

నారదుడు రావణుని వద్దకు వెళ్ళి పర స్త్రీని అపహరించడం మహా పాపమని, సీతను రామునికి అప్పజెప్పమని బోధించాడు. ఇల్లాలు **మండోదరి** కూడా ఎంతగానో నచ్చజెప్పింది. కానీ, రావణుడు వారి హితబోధను పెడచెవిని పెట్టి సర్వ నాశనమయ్యాడు.

రావణునికి పట్టిన గతే **హిరణ్యకశుపునికి** కూడా పట్టింది. అతనిని మించిన సైంటిస్టు మరొకడు లేడు. ఈనాటి సైంటిస్టులు చంద్రమండలం వరకే వెళ్లగల్గారు గాని హిరణ్యకశుపుడు సూర్య, నక్షత్ర మండలములను కూడా దాటాడు. అంతటి **గొప్ప సైంటిస్టు దైవాన్ని ద్వేషించి,** ధర్మాన్ని పాటించక తన కన్న కుమారుని కూడా హింసించాడు. కట్టకడపటికి పతనమై పోయాడు. **సుగ్రీవుణ్ణి** ఎందుకు అడవులకు పంపించావని **వాలిని** ప్రశ్నించినప్పుడు అతడు తన దోషాన్ని కప్పిపుచ్చుకుని, సుగ్రీవుడు తనకు మోసం చేశాడని చెప్పుకున్నాడు. **బుద్ధిదోషముచేతనే వాలి ఈవిధమైన అసత్యానికి పాల్పడ్డాడు. అంబ** కూడా తన దోషాన్ని కప్పిపుచ్చుకుని **భీష్ముడు** తనకు మోసం చేశాడని నిందించింది. వీరందరూ సామాన్యులు కావచ్చును. కాని, గొప్ప తపశ్శక్తి సంపన్నుడైన **విశ్వామిత్రుడు** కూడా **బుద్ధిదోషముచేత** ధర్మాన్ని విస్మరించి **వశిష్ఠులవారిపై** ద్వేషం పూనాడు. ఈనాడు గొప్ప గొప్ప సైంటిస్టులు కూడా బుద్ధిదోషముచేత అసత్యాన్ని సత్యంగా, సత్యాన్ని అసత్యంగా ధర్మాన్ని అధర్మంగా, ఆధర్మాన్ని ధర్మంగా భావిస్తున్నారు.

బుద్ధిస్వరూపుడే గణపతి: మేధాశక్తి స్వరూపుడే గణపతి. జ్ఞానస్వరూపుడే గణపతి: సత్యస్వరూపుడే గణపతి. అతనికి వినాయకుడని కూడా పేరు కలదు. ఎందుకంటే, అతనికి మరొక నాయకుడు లేడు. అతనికి ఇంకొకరు సలహాలు ఇచ్చేవారు లేరు. అతను చెప్పినదే సత్యము, అతను చేసినదే ధర్మము. కనుక, అతని వాక్యమును శిరసావహించడమే మానవుని కర్తవ్యము. ఈనాటి మానవుడు తన మేధాశక్తి చాల గొప్పదని విఱ్ఱవీగుతున్నాడు. అది ఎప్పుడు గొప్పదవుతుంది? ఆ మేధాశక్తిని Skill చేసినప్పుడే అది గొప్పదవుతుంది. **అప్పుడే జీవితంలో చక్కని Balance ఏర్పడుతుంది. కానీ, ఈ కలిప్రభావంచేత మానవుడు తన మేధాశక్తిని Kill చేస్తున్నాడు. అందుచేత తన జీవితంలో Balance తప్పిపోయి మానవునిలో బుద్ధి దోషము ఏర్పడింది.** తనకు తోచినదే సత్యమని, తాను చేసినదే ధర్మమని భావిస్తున్నాడు. దీనికి తగిన ఫలితమును అనుభవించక తప్పదు.

(స.సా.న.99.పు.285/286)

ఈ ప్రపంచమెచట నుండి ఎటుల వచ్చినదని యుగములు విచారించినను తేలదు. ఏ విద్య వలననో ఎచ్చటి నుండియో వచ్చియుండినదో విచారణ ఫలితము ఉండును. కానీ, జగత్తు అట్టి విషయముకాదు. జగత్తు ఎట్లు కలిగెనను ప్రశ్న రజ్జు సర్పభ్రాంతి యందలి సర్ప మెట్లు

బుద్ధియోగము

ఉద్భవించినదను ప్రశ్న తుల్యము. అచ్చట ఉన్నది త్రాడు. కాని దాని నుండి సర్పము ఉద్భవించెను. ఈ సర్పోద్భవ కారణము, **చూచునట్టి వాని బుద్ధియందు గల దోషము.** అనగా భ్రమ లేక అజ్ఞానము. కావున సర్ప ఆవిర్భవ కారణము అజ్ఞానము వలన పుట్టెనను జవాబు యుక్తిసిద్ధము. అటులనే త్రాడు స్థానమున నున్నది బ్రహ్మము. పాము స్థానమున నున్నది జగత్తు. అనగా **బ్రహ్మమునే మనము భ్రాంతి వలన జగత్తుగా తలచి వ్యవహరించు చున్నాము. ఇచ్చట కూడా చూచునట్టి వాని బుద్ధి దోషమునకు తీరదు.** ఒక వస్తువును మరొక వస్తువుగా చూచుట బుద్ధిదోషమని తేలుచున్నది. **బుద్ధి దోషమువలన భ్రాంతివలన జనించిన విషయ మెన్నటికీ సత్యము కాదు.** భ్రాంతి నశించిన తజ్జనిత విషయము కూడా నశించును. యదార్థము గోచరమగును.

(జ.పు.93)

బుద్ధియోగము

"నాయందే దత్తచిత్తులై జీవిత సర్వస్వము నాయందే లగ్నము చేసి, ప్రతిక్షణము మన్మహిమాతి వైభవము నభివర్ణింప ప్రీతిపూర్వక మనస్కులై, అద్భుతమగు నా లీలాచరిత్రకథనమున కుతూహలము కలవారు అఖండానందాబ్ధి నోలలాడుదురు. నన్ను నిరంతరము సేవిస్తూ, స్మరిస్తూ నిశ్చల ప్రేమతో చెంతచేరి, ఆరాధించు నా భక్తులకు నా యందే లయమగు **బుద్ధియోగము** ననుగ్రహింతును."

(భా.వా.ప్రియమైన పాఠకులకు పేజీ)

బుద్ధిశాలురు

"ధనము వలన దానమును, వాక్కువలన సత్యమును ఆయువువలన కీర్తియును, దేహమువలన పరోపకారమును, ఈ విధముగా పాలనుండి వెన్నవలె నిస్సారమైన సంసారమునుండి సారభూతమైన ఆత్మసంపదను గ్రహింపవలెను. తత్త్వజ్ఞానాభిలాష గల బుద్ధిశాలురు. ధనికులయ్యును చాంచల్యము లేకయు, ప్రభువులయ్యునూ ప్రమాదము లేకయు సంచరించు చుందురు".

(జ్ఞా.వా.పు.78)

బుద్ధుడు (గౌతమబుద్ధుడు)

ఒకానొక సమయంలో బుద్ధుడు దేశంలోని వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ, ప్రజలకు సత్యబోధలు సల్పుతూ వచ్చాడు. ఒక రోజున ఒక గ్రామం చేరుకునేసరికి అతడు బాగా అలసిపోయాడు. అప్పుడు తన శిష్యుల్లో ప్రధానుడైన నిత్యానందుణ్ణి పిలిచి "నాయనా ! ఈ రోజు నేను కొంత విశ్రాంతి తీసుకుంటాను. ఇక్కడ చేరిన భక్తులకు నీవేదైనా సద్బోధలు సల్పు" అని చెప్పి, విశ్రాంతి తీసుకోవడానికి లోపలికి వెళ్ళాడు. కాని, నిద్ర రాక పోవడంచేత నిత్యానందుని ప్రసంగాన్ని వినసాగాడు. నిత్యానందుడు ఏమని బోధిస్తున్నాడు? "ప్రజలారా! బుద్ధునివంటి మహనీయుడు ఇంతకు పూర్వం పుట్టలేదు, ఇకముందు పుట్టబోడు. బుద్ధునికి సమకాలీనులుగా పుట్టడం మీ అదృష్టం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తగిన కృషి చేయండి" అన్నాడు. ఈ మాటలు విని అక్కడ గుమికూడిన భక్తులు పెద్ద ఎత్తున కరతాళ ధ్వనులు చేశారు. వెంటనే బుద్ధుడు లేచి వచ్చి నిత్యానందుని భుజంపై చేయి వేసి "నాయనా! నిత్యానందా! నీ వయస్సెంత?" అని ప్రశ్నించాడు. నిత్యానందుడు "నలభై సంవత్సరములు స్వామీ"! అన్నాడు. "ఇంతవరకు ఎన్ని పట్టణాలు చూశావు"? అని ప్రశ్నించగా "రెండు పట్టణాలను మాత్రమే చూశాను స్వామీ!" అన్నాడు. "ఎంతమంది మహానీయులను దర్శించావు?" అని మళ్ళీ ప్రశ్నించగా, ఎవ్వరినీ దర్శించలేదనిసమాధానం చెప్పాడు. అప్పుడు బుద్ధుడు చెప్పాడు, "పిచ్చివాడా! నీ వయస్సు నలభై సంవత్సరాలు. నీవు రెండు పట్టణాలను మాత్రమే చూశావు. ఏ

మహనీయులనూ నీవు దర్శించలేదు. అలాంటప్పుడు బుద్ధునివంటి మహనీయుడు ఇంత వరకు పుట్టలేదు. ఇకముందు పుట్టబోడు అని చెప్పడానికి నీకేమి అధికారం ఉంది? నలభై సంవత్సరములకు పూర్వం ఎవరు పుట్టారో నీకేమి తెలుసు? ఎందరో మహానుభావులు పుట్టారు. మున్ముందు ఇంకెందరో మహానుభావులు పుట్ట బోతున్నారు. మహనీయులే పుట్టకపోతే ఈ జగత్తే నిలువలేదు. **"జగతియందు పుణ్య పురుషులు లేకున్న జగము లెట్లు వెలుగు పగలుగాను?"** మహానీయులు ప్రభావముచేతనే ఈ జగత్తు ప్రకాశిస్తున్నది."

(స.సా.మే2000పు.142/143)

బుద్ధుడు ఆత్మజ్ఞానం నిమిత్తమై అనేక సాధనలు సల్పి కట్టకడపటికి ఇది పండితులు బోధించేది కాదనీ, గ్రంథపఠనంచేత లభించేది కాదనీ గుర్తించాడు. మొట్ట మొదట భగవంతుడు ప్రసాదించిన పంచేంద్రియాలను పవిత్రం గావించుకొన్నప్పుడే ఆత్మజ్ఞానానికి తగిన అర్హత ప్రాప్తిస్తుందనీ, పంచేంద్రియాలను సద్వినియోగ పర్చుకోవడంద్వారానే మానవుడు తనయందున్న దివ్యత్వాన్ని గుర్తించుకోగలడనీ బోధించాడు. నిత్యజీవితంలో అనుభవించే ఇంద్రియాలనే పవిత్రం గావించుకోలేనివాడు ఇంక ఇంద్రియాతీతమైన దివ్యత్వాన్ని ఏరీతిగా గుర్తించగలడు? కనుకనే **మొట్టమొదట సమ్యక్ దృష్టిని అలవర్చుకొమ్మని బోధించాడు బుద్ధుడు. సమ్యక్‌దృష్టివల్ల హృదయంలో సమ్యక్‌భావములు ఆవిర్భవిస్తాయి.సమ్యక్‌భావములవల్ల సమ్యక్‌వాక్కు వెలవడుతుంది. సమ్యక్‌వాక్కును ఆచరణలో పెడితే అది సమ్యక్ కర్మగా రూపొందుతుంది. సమ్యక్‌కర్మలను చేస్తూ ఉండడమే సమ్యక్‌సాధన అవుతుంది.**

సమ్యక్‌దృష్టి అనగా ఏమిటి? పవిత్రమైన దృశ్యములను మాత్రమే చూడాలి. ఎందుకంటే చూసిన దృశ్యములన్నీ హృదయంపై ముద్రించు కొని పోతాయి. కనుక కన్నులున్నాయి కదా అని దేనిని పడితే దానిని, ఎవరిని పడితే వారిని చూడకూడదు. **మన శాస్త్రజ్ఞాన మంతయు నేత్రములపై ఆధారపడియున్నది. నేత్రమే శాస్త్రము, దృష్టియే సృష్టి. కనుక పవిత్రమైన జ్ఞానం ప్రాప్తించాలంటే దృష్టిని పవిత్రంగా ఉంచుకోవాలి. దృష్టియే మన హృదయంలో సంకల్పములను సృష్టిస్తుంది. దృష్టి మన హృదయక్షేత్రంలో నాటుకొనే విత్తనంవంటిది. కనుక దృష్టి మంచిదిగా ఉన్నప్పుడే హృదయంలో మంచి సంకల్పములు సృష్టింప బడతాయి. కానీ మానవుడీనాడు అసహ్యకరమైన, అసభ్యకరమైన ఘోరమైన దృశ్యములను చూడడం చేత దుర్భావములకు లోనై మానవత్వాన్ని కోల్పోయి మృగంగా మారి పోతున్నాడు. చిట్ట చివరికి దుఃఖాన్ని అనుభవిస్తున్నాడు. ఎట్టి దృష్టియో అట్టి హృదయం; ఎట్టి హృదయమో అట్టి సంకల్పం; ఎట్టి సంకల్పమో అట్టి వాక్కు. కనుక సమ్యక్ దృష్టివల్ల సమ్యక్‌భావం, సమ్యక్ భావంవల్ల సమ్యక్ వాక్కు ఆవిర్భవిస్తాయి. చూపినదానిని తలచి, తలచినదానిని చెప్పి, చెప్పినదానిని చేయాలి. దీనినే 'సమ్యక్‌కర్మ' అన్నాడు బుద్ధుడు.** సమ్యక్‌కర్మల నాచరించడమే **సమ్యక్‌సాధన.** దుర్భావములను వీడి సద్భావములను పోషించుకొని సత్కర్మల నాచరించడమే సమ్యక్‌సాధన. **సత్కర్మలలో ప్రవేశించడమే సరియైన సాధన. పూజలు, జపములు, ధ్యానములు ఇవన్నీ సత్కర్మలు మాత్రమేకాని సాధనలు కావు. సమ్యక్‌దృష్టి, సమ్యక్‌భావము, సమ్యక్‌వాక్కు, సమ్యక్‌కర్మ, సమ్యక్‌సాధన - వీటన్నింటితో కూడినదే సమ్యక్‌జీవనం.**

(స.సా.ఫి.98 పు.29/30)

(చూ॥ ఇంద్రియనిగ్రహము, దూషించుట, నిర్మాణము, భావముప్రధానము, వర్తమానము, శీలము, సత్యసాయి)

బుద్ధునిబోధ

బుద్ధుడు కూడ వేదభావములను. వేదముయొక్క ఆశయములను ఆచరించి నిరూపించాడు. మొట్టమొదట **"బుద్ధం శరణం గచ్ఛామి"** అన్నాడు. ఇది వ్యక్తి గతమైనది. క్రమక్రమేణ **"సంఘం శరణం గచ్ఛామి"** అన్నాడు.

బుట్టకథ

వ్యక్తిగతమైన భావములు సంకుచితములుగా వుంటాయి. దీనినే సర్వస్వముగా నీవు భావించవద్దు. సముద్రములో బిందువు వంటిది యిది. కనుక "సంఘం శరణం గచ్ఛామి" నీ సంఘములోపల సంఘస్వరూపుడుగా విశాలహృదయాన్ని యేర్పరచుకోమన్నాడు. సంఘమునకు రూపము లేదు. వ్యక్తుల సమూహమే సంఘము. వ్యక్తిత్వము అనేకవిధములుగా చేరినపుడే సంఘస్వరూపము ధరిస్తుంది. Life into infinity is Divinity. విశాలమైన ఆత్మతత్వాన్ని చేరుకున్నప్పుడే యెంతో విశాలమైన తత్వముగా రూపొందుతుంది. Life into infinity. ఇదే దైవత్వము. విశాలమైన హృదయములుగా కమ్మన్నాడు. ఈ సంఘముయేదో కొంత గుంపుతో మాత్రమే కూడి వుంటాది. ఒక దేశపు సంఘమునకు మరో దేశపు సంఘమునకు సంబంధముండదు. ఒక పేరుతో వుండిన సంఘము మరొక పేరుతో వుండిన సంఘమునకు సంబంధముండదు. కనుక సంఘమునకు కూడ హద్దులుంటాయి. హద్దులతో కూడిన సంఘములు గొప్పవి కావు. కనుకనే సర్వాత్మక భావమును ధరించి **"ధర్మం శరణం గచ్ఛామి"** అన్నాడు. **"ధారయతాతి ధర్మః"** జగత్తును ధరించినది ధర్మము. ధర్మమంటే యేమిటి అని విచారిస్తే ఆపదార్థము యొక్క గుణమే పదార్థము యొక్క ధర్మము. గుణమే దాని యదార్థము. పదార్థమే వస్తువు. అదే పరబ్రహ్మతత్వము. పరబ్రహ్మతత్వమును ఆధారము చేసుకున్నదే ధర్మము.

(శ్రీ.గీ.పు.302)

బుట్టకథ

ఈ క్రింద వ్రాసిన "బుట్టకథ" అర్థము చేసుకో. చాలవరకు నీవు అనునది ఎవరో బోధపడగలదు. దాని మూలమున కూడా చాలావరకు వైరాగ్యము రాగలదు. ఆపై నేను చెప్పెడి విషయము నీవు అనునది సులభముగా తెలియును. "బుట్టకథ" కేవలము చదువుటయేకాక పదపదమునకూ అర్థము తెలసికొని ఆలోచించు; గిర్రున నీ బుట్ట తిరుగును.

1. వినుచక్కగ.
   తై తై తై తై తై బొమ్మా
   దీని తమాషజూడర మాయబొమ్మ
   ఖ్యాతి దీనికి ముందు వెనుకగల
   కథ వివరింతును వినుజీవా ॥తై॥
2. మాతృగర్భమున మలమూత్రమ్ముల రోతల నీవు రోదింప
   ప్రీతిగ వీరలు పేరంటమ్ములు చేతు రిదెంతటి
   చిత్రమురా ॥తై॥
3. పుట్టితి, మది గోల్పోయితి, దుర్గతి పట్టితివని నీ వేడువగా
   అట్టెనవ్వుచు నానందించెద రిట్టివీరు నీ కెవరయ్యా
   ॥తై॥
4. మసిలో మట్టిన మలమూత్రములన్
   మసలుచు సిగ్గనుమాటయె లేక
   పసిపాపడవై పడుచు లేచుచు
   దిన మొక నాటక మాడవకో ॥తై॥
5. తోడివారలతొ కూడియాడుచు వేడుకతో పలువిద్దెలు నేర్చుచు
   చూడచూడగ చోద్యపుకళతో ఏడేడునకు ఎదిగే బొమ్మ ॥తై॥
   సతిపతియని సరసభావమున జతజేరుచు సంసారరంగమున
   అతికొతుకమున నంతకన్న నిక అన్యము లేదని
   ఆడితిరే ॥తై॥
6. బొమ్మను బొమ్మను పొందుపఱచి పలు
   బొమ్మలు సేయుర బ్రహ్మయ్య
   నమ్ముట వన్నియు నావేయని దిం
   దిమ్మని వానితో నాడుదుగా ॥తై॥
7. ధనము గూర్చునెడ దాచిపెట్టునెడ దానిబెంచ నది చనినపుడున్
   తనువుతోడ నీ మనసుతోడ నీ తాండవ మెన్నగ తరమౌనా
   ॥తై॥
8. కామము క్రోధము గట్టికోలగా తామసంబు ముక దాడును గాగన్
   కామినియున్ కనకంబుచేతిలో గంగిరెద్దులై గంతులు వేసే ॥తై॥
9. సాగుచున్నదని లోగినవారిని సంకటపెట్టుటె సంతసమా
   ఈగకాలియంతే వికటించిన నీగతి తైతకలేగాదా ॥తై॥
10. ఉరిమిచూచును కరములూచుచు ఒడలెరుగని శివ
    మొందుచును

అరుచు చెగురుచు నందురు నవ్వగ ఆగ్ర
మనుదయ్యము పట్టిన ॥తై॥

11. చదువెందులకను సంగతెమఱుచి
ఉదరపూర్తికే ఉఱుకులెత్తుచు
ఎదటి గొప్ప సహియింపకేడ్చుచు
సతమతమయ్యె చదువలబొమ్మ ॥తై॥

12. గుట్టుగ నీ చెడుకోర్కె చెల్లనని లొట్టలు గొట్టకు రోరన్నా
చిట్టావాసే చిత్రగుప్త కండ్లెట్టుల గంతలు గట్టుదురా ॥తై॥

13. అందము ప్రాయము ఇంద్రియశక్తియు
ఉందని నిక్కకు రోరన్నా
ముందున్నవిరా తొందరలోనే
ముసలితనమ్మను ముసళ్ళపండువు ॥తై॥

14. మెసలలేవు కనుమసకలు మోమున
మడతలుబడె తల నెరిసెనుగా
ముసలికోతియని పనివారలు నిన్
ముసిముసినవ్వగ గసరుకొనే ఓ ॥తై॥

15. చచ్చుదాక సంసారచింతలో పుచ్చిన లాభము ఒచ్చేనా
అచ్చట నీ మయమాతన కడ్డము వచ్చే దేదిరా పిచ్చయ్యా ॥తై॥
బుర్రుమనుచు జీవుం డను పిట్ట బొట్టబొమ్మను విడిపోగా
బిర్రుగనీల్గిన కట్టబొమ్మ యిది బర్రున బైటికి పట్టి లాగే ॥తై॥

16. పంచభూతసంభవమై మేనిక
పంచత్వము ప్రాప్తించుగదా
వంచితుడై నాదంచు దీనకై
వాంఛగొంచు దుఃఖించే జీవా ॥తై॥

17. బంధువులందరు వాకిటదాకను వత్తురుగా
బంధమణచి నిన్ బాయని ఆపద్బంధువు భగవన్నామ మెరా॥తై॥

18. నమ్మకొనకు నిత్యమ్మని దేహము
పుట్టిముంచు నిది నట్టేటన్
తుమ్మునంతలో తూలిపోవు నీ
తొమ్మిదితొట్ల తోలుబొమ్మ ॥తై॥

19. ఆపదలన్ సౌఖ్యంబులందురు
ఏపుమీరగా ఏడ్చుచు నవ్వుచు
ఆ పరమేశ్వరు నానతి మేఱకు
ఆడే భోగము తాపాబొమ్మ ॥తై॥

20. ధర్మకర్మసూత్రంబుల గొనినన్ దా నాడింపక దైవంబు
మర్మమెరుంగక మాయేటందువు మాధవుచేతి కీలుబొమ్మ॥తై॥

21. తరతరమును సుస్థిర మనిపించుచు
పరమావస్థలపాలు సేయుచు
మరునిముసం బిది మరుగుపడురా
పరమాత్ముడు సల్పిన మాయబొమ్మ ॥తై॥

22. చెట్టెపుట్టి చేమై దోమై చిలుకై కొండచిలువయు నౌచు
పుట్టుచు గిట్టుచు కొట్టుకొనుచును గట్టే వెదుకని కర్మ జీవా॥తై॥

23. అరుదుగ దొరికెను నరజన్మం బిది
అరనిముసము వృధపరుపకురా
తెరవు నెరిగి చని పరమాత్ముని గని
చిరసుఖమొందర చింతా జీవా ॥తై॥

24. నీ యదృష్టమున సాయికృష్ణుడై ఆ యఖిలేశుం డగుపడురా
హాయిగ సత్యసాయి నాత్మలో అరయుచు నిను నివె ఎరుగుమురా
॥తై॥

25. నీటుగ మాటలు కోటి పల్కిన నీ కడు పింతయు నిండదురా
సూటిగ నాత్మజ్యోతిని గన్ననె ఆటవిడుపు నీ కగునయ్యా ॥తై॥

26. వ్యర్థంబగు నీ వెర్రి బుట్టకథ విని యజ్ఞానము వీడు జీవా
సార్థక సత్యసాయి బుట్టకథ కని ప్రజ్ఞానము కొనరన్నా ॥తై॥

(స.ని.పు.45/49)

బృందావనము

విద్యార్థులారా! మీరు తలుస్తున్నారో లేదో! కాని ఈ భరతమాత మీ నిమిత్తమై ఎంత పరితపిస్తున్నదో మీకు తెలియదు. కాని మీరు భారతదేశంలో పుట్టామనే విషయాన్ని గుర్తించడానికి తగిన ప్రయత్నం చేయడం లేదు. మీ నిమిత్తమై భరతమాత కావల్సినంత సంపదను దాచి పెట్టింది. ఈ సంపదకు అంతేలేదు. ఏమిటి ఆ సంపద? విజ్ఞాన సంపద. ఆధ్యాత్మిక సంపద. **అదియే మీ జీవిత రస సంపద.** ఈ సంపదలను మీకు కావల్సినంత పెట్టుకొని ఉంది భరతమాత. విదేశీయులు వచ్చి దానిని అనుభవిస్తున్నారు గాని, స్వదేశీయులు దానిని అనుభవించ ప్రయత్నించడం లేదు. అందరూ

బృందావన్‌కాలేజి

అనుభవించండి. ఇది **"బృందావనమది అందరిది గోవిందుడందరి వాడేలే!" ఆధ్యాత్మికము నందు సర్వులకూ అధికారముంది.** విదేశీయులైనను దీనిని అనుభవించ వచ్చు. కనుక మీరు అనుభవించి, ఆనందించి, మీతోటి మానవులకు. దీనిని పంచి పెడతారని నేను ఆశిస్తున్నాను.

(శ్రీ.జ.95 పు.11)

బృందావన్‌కాలేజి

ఈ కళాశాలలో(9.6.1969) చదువు విద్యార్థులకు సంపూర్ణ విద్య, అనగా కర్మ మార్గమూ ధర్మ మార్గమూ, బ్రహ్మ మార్గమూ, నేర్పుదురు. ఈ కాలేజి విద్యార్థులైన మీరు ఈ కాలేజిలోనే పై తరగతిలో చేరవచ్చు, లేదా మరో కాలేజీలో చేరవచ్చు, లేకపోయిన చదువు పూర్తి చేసుకుని యింటికి తిరిగి వెళ్ళ వచ్చును. మీరెక్కడ వుండిననూ ఈ కాలేజి విద్యార్థులుగా మీ రందుకొనిన ప్రత్యేకమైన తర్ఫీదు వలన మీ జీవితములలో మీరు రాణించవలెనని నా కోరిక. అభిప్రాయ భేదములతో, ద్వేషములతో అధికారోన్మాదములతో, ఉద్రేకములతో, పరస్పర విరోధములతో నిండియున్న రాజకీయ నరకములో మాత్రం ప్రవేశించ వద్దు. యుగయుగాలుగా భారతావని పొందుపరచిన జ్ఞానదీపికను చేతబూని ఉజ్వల భవిష్యత్తువైపు పురోగమించే నాయకులుగా మీరందరూ తయారు కావాలి.

ఇది పుణ్యభూమి యోగభూమి, అనాదిగా ఆధ్యాత్మిక జ్ఞాన సంపదకు ప్రసిద్ధి కెక్కినది. ఈనాడు తొంబది తొమ్మిది అజ్ఞానులు, లేదా ఆధ్యాత్మిక జ్ఞానమును నిరసించువారు, ప్రజలు వారి సంస్కృతిని వారే న్యూనత పరచుచున్నారు. ఇకనైనను మీ తప్పులు మీరు తెలుసుకుని మీ జీవితములను సంస్కరించుకుని పావన భారతావని ప్రతిష్టను పునరుద్ధరించుడు. ఇతరులలో దోషములు వెదకుటమానుడు. మీ బంధుమిత్రుల యడల తోటి మానవుల యడల గౌరవముతో ప్రవర్తింపుడు. దేశసేవ చేయుడు. సర్వజన శ్రేయస్సు కొరకు ప్రార్థించుడు.

(స.శి.పు.తృ.పు.13)

బృహత్వము

మనము చేసిన కర్మలన్నియు కూడనూ మన భ్రాంతిచే నేను చేసానని భావించటంచేత దానిని అనుభవించటాన్ని తగిన అర్హతను కోల్పోతున్నాము. ఈ అనుభవించేదంతా సూక్ష్మదేహమే. **ఇదే ప్రాణమయ, విజ్ఞానమయ, మనోమయ కోశములయొక్క స్వరూపము. వీటినే వేదముయందు "ఋతం, సత్యం, బృహత్వం"** అన్నారు. **బృహత్వమనగా విశాలత్వం. దీనినే ఉపనిషత్తులంతా కూడనూ మహాతత్వమన్నారు. దీనినే భూమము అన్నారు. భూమమనగా బ్రహ్మతత్వమే. వ్యాపించజేసే గుణముకల్గినదే బ్రహ్మ.** ఈ వ్యాపించే గుణము గాలితోకూడినది. గాలి సర్వత్రా వ్యాపించివుంది. ఇది పంచభూతములలో ఒకటి. ఈ ఐదు మానవునియొక్క హస్త గతమయినవే. నిజముగా మానవుడు ఈ పంచభూతములను స్వాధీన మునందుంచుకొని ఎంతో అధికుడుగా ఉండవలసిన స్థితిని తాను కోల్పోతున్నాడు. **వీటికి తాను దాసుడుకావడంచేతనే తాను సర్వమునకు బద్దుడైపోతున్నాడు. మనము బద్దులముకాము. బుద్దులమే. ఈ మానవత్వము చాలా విశిష్టమైనది, ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది,** సౌశీల్యమైనది. ఇలాంటి మానవత్వాన్ని మొట్టమొదట మనము అర్థంచేసుకోవాలి. మానవునికంటె అధికమైనది ఈ జగత్తునందు మనకు కానరాదు. అట్టి దివ్యమైన మానవత్వాన్ని మనము ధరించి అల్పత్వమైన దేహభ్రాంతిని మనము వరించి మనము ఆత్మతత్వాన్ని విస్మరిస్తున్నాము.

(స.ది.పు.20/21)

బృహ దారణ్యకోపనిషత్తు

బృహదారణ్యకోపనిషత్తు శుక్ల యజుశ్శాఖాంతర్గము; దీనియందు ఆరు ఆధ్యాయములు కలవు. అందులో మూడు నాలుగు అధ్యాయములు తప్ప, తక్కిన నాలుగు అధ్యాయములు కర్మసముచ్చయమగు ఉపాసనమును వివరించినవి. మూడు నాలుగు అధ్యాయములందు

బెస్ట్‌ఫ్రెండ్స్

మంచితనమునందు, మానవత్వమునందు;
నీతియందు నిండు నిజమునందు;
ఆచరించి చెప్పు, ఆచరించి చూపు ఆదర్శములనెల్ల
అతడె యువకుడు; ఆమె యువతి కాదె!
ఇట్టివారె 'బెస్ట్ ఫ్రెండ్స్' మీకు,
ఇట్టివారె 'బెస్ట్ ఫ్రెండ్స్' నాకు.

(స.సా.డి.99 పు.366)

బైబిల్

(చూ॥ ఆనందమయుడవు)

బోధ

(చూ॥ లింగోద్భవము)

బోధము

బోధము రెండు విధములుగా ఉన్నది. ఒకటి **పరోక్ష బోధము. రెండవది అపరోక్షబోధము.** వేదవేదాంగములచే, యుక్తిప్రయుక్తులచే ఊహలచే యిదమిత్థమని తెలిసికొను తెలివియంతయు **పరోక్షబోధము**. అట్లు తెలిసి కొనినదంతయు అనుభవసిద్ధమైనప్పుడు అదియే అపరోక్ష బోధమని అందురు. సత్యజ్ఞానానంద పరబ్రహ్మము స్వతసిద్ధము గాన పరోక్షజ్ఞానమే; ఒక విధముగా తలంచిన నీ పావనమైన బ్రహ్మమునకు పరోక్షతాపరోక్షతలులేవు. ఇది రెండింటికిని అతీతమైన విలక్షణ వస్తువు. ఇట్టి బ్రహ్మవిద్యయగు నపరోక్షజ్ఞానసిద్ధిని బడయుటకు మొదటి సాధన సద్గురు శ్రీ॥ సద్గురువు నాశ్రయించి అతనిపై సంపూర్ణ విశ్వాస ముంచి అతనిని నిరంతరము సేవించుచుండవలెను. గురు ప్రభుడుకూడను. నిరంతరము బ్రహ్మనుగూర్చి సులలితభావముతో బోధించుచుండవలెను. అట్టి బోధనను నిరంతరము శిష్యుడు వినుచుండినయెడల అది పరోక్షజ్ఞానమగును. ఇట్టి శ్రవణాంగము సిద్ధించిన

యాజ్ఞవల్క్యుడు జనకునకు ఆధ్యాత్మికతత్త్వమును ఉపదేశించెను. యాజ్ఞవల్క్యుని ఆధ్యాత్మిక జ్ఞానవైభవము ఇందులో పూర్తిగా ప్రదర్శింపబడినది. ఇది ముముక్షువులకు ఉత్తమమగు తారకమగుచున్నందున ~~ఈ~~ **రెండు అధ్యాయములూ యాజ్ఞవల్క్యకాండమని ప్రఖ్యాతి గాంచినవి. ~~ఈ~~ ఉపనిషత్తు దశోపనిషత్తులలో కడపటిది. ఇది అర్థమునందును, పరిమాణమునందును మహత్తర మగుటచే బృహత్తనియు, అరణ్యమునందు పఠించుటవలన అరణ్యకమనియు, బ్రహ్మజ్ఞానోపదేశమగుటచే ఉపనిషత్తనియూ అలరారు చున్నది.** మొదటి రెండధ్యాయములు మధుర కాండమనియు తరువాత రెండధ్యాయములు మునికాండమనియు, చివరి రెండధ్యాయములు ఖిలకాండ మనియు పండితలోకమున చెప్పబడుచున్నవి. ఖిలశబ్దమునకు అనుబంధమని అర్థము. మొదటి కాండమందు తత్త్వము యథారూపముగ ఉపదేశింపబడినది. అయ్యదియే రెండవ కాండమందు అనుభవముచే సమర్థింపబడినది. మూడవదానియందు దాని ఉపాసనా విధానము ప్రదర్శించబడినది. మొదటి కాండము జ్ఞానోపదేశము, అది కర్మోపాసనా సముచ్చయ రూపమున ఉపదేశింపబడినది. జిజ్ఞాసువులకు బ్రహ్మ జ్ఞాపకములగు సాధనములు **పదము, బీజము, సంఖ్య, రేఖ అని నాలుగు విధముల పిలువబడుతున్నవి.** వానిలో పదమనగా వేదము. దాని అర్థ బోధకమగు శ్రుతియు, బీజమనగా గురుముఖైక వేద్యమగు మంత్ర సముదాయము. సంఖ్య వైదికము, లౌకికము అని రెండు విధములు. వైదికమగు సంఖ్య మంత్ర సంకేతముగ అలరారుచు, తత్త్వమునకు సన్నిహిత సాధన మగుచున్నది. లౌకిక సంఖ్య, సర్వ ప్రపంచ వ్యవహార సర్వజనానుభవ సిద్ధమగుచున్నది. రేఖ కూడ సంఖ్య వలెనే రెండు విధములు. వైదికమగు రేఖ ఉపాసనాంగము. లౌకికమగు రేఖ గణితశాస్త్ర ప్రసిద్ధము. మధురకాండము **బ్రహ్మ తత్త్వము శాస్త్ర ప్రమాణమును ముఖ్యమైన ఆధారముగా చేసికొని విషయ వివరణము అచట చేయబడినది.**

(ఉ.వా.పు. 33/34)

బ్యాడ్జి

యెడల ఈ పరోక్షజ్ఞానమే ఎల్లప్పుడూ మననము చేసిన, అపరోక్షజ్ఞానముగా మారును. పరోక్షజ్ఞానమున నీటిపై వ్రాయు అక్షరములభంగి క్షణభంగురైనది. కాని, అపరోక్ష జ్ఞానమో రాతిపై చెక్కబడిన అక్షరములరీతి శాశ్వతముగా నిలుచును ఇట్లు గురువ్రభువును సంపూర్ణముగా విశ్వసించి ఎల్లప్పుడూ బ్రహ్మజ్ఞానశ్రవణము చేయుచుండిన అది మననము జేయబడినదై అటుమీదట అపరోక్షజ్ఞానవధిని యగును.

(ప్ర.వా.పు.76)

బ్యాడ్జి (Badge)

(చూ॥ బ్రహ్మర్షి)

బ్రతుకు

(చూ॥ బ్రహ్మ)

బ్రహ్మ/బ్రహ్మము

బ్రహ్మమను పదము బృహ్ అనెడి పదమునుండి వచ్చినది బృహ్ అనగా పెరుగుట, విస్తరించుట, వ్యాపించుట. బృహత్ అనగా పెద్దది, గొప్పది, ఎత్తైనదని, స్థూలమైనదనికూడా చెప్పవచ్చును. పురుష అన్నపదము ప్రియ అను మాటనుండి వచ్చినది. **ప్రి అనగా నింపుట. పూర్తిచేయుట అనికూడను అనవచ్చును. పుర్ అనగా నగరము. ఆస్థానమున దేహమును పోల్చుకొనవచ్చును. దేహమనే అనవచ్చును. వీటిని నింపువాడు కావున పురుషుడనబడును. ఆత్మ అను పదము ఆప్ అనెడి మూలమునుండి వచ్చినది, ఆప్ అనగా పొందుట ఆక్రమించుట అని.** కాన, ఆత్మను తెలుసుకున్న వానికి సర్వమును లభించును.

(జ్ఞా.వా.పు.27)

ఎంతకాలము రోత బ్రతుకు. మానవత్వమనేది ఈనాడు నూతనంగా ఏర్పడినది కాదు. ఎన్నోజన్మల నుండి వచ్చుచున్నది. పాతదే అయితే ఎల్లకాలమూ యీ మానవత్వాన్ని పాతగా, రోతగా, భావించి అనుభవిస్తూ వుంటే, తన స్వస్వరూపాన్ని అనుభవించేదెప్పుడు? కనుకనే సర్వం బ్రహ్మమయం అనే స్వరూపాన్ని మనం నిరూపించాలి. మన సమాజములోనే సర్వ స్వరూపమైన ఈశ్వరత్వాన్ని ఆవిర్భవింప చేసుకోవాలి. "ఈశా వాస్యమిదం సర్వం" ఈ సర్వమును ఈశ్వరుడే.

సర్వము బ్రహ్మమయమే - బ్రహ్మమునకు వేరైన పదార్థమొక్కటియు లేదు సర్వము బ్రహ్మరూపముగా యున్నప్పుడు మనము వెదుకుట ఎక్కడ? తాను చిక్కుట ఎక్కడ? విశ్వమంతయు, ప్రాణవిభుని మందిరమైన వీధి స్థానము ఎక్కడ యున్నది? వీధి లేనప్పుడు వీధి వాకిలి చింత ఎందుకు? విశ్వ విభుడే హృదయేశ్వరుడు.

(సా.పు.474/475)

బ్రహ్మము స్వప్రకాశము, స్వప్రతిష్టము. మరి కొందరు పరాశక్తియే ఆనందమయాత్మ అనియు దానినే పరాకాశమనియు పేర్కొనిరి. ఇవన్నియూ వారివారి భావనూచనలే. **బ్రహ్మకు బ్రహ్మనే ఆధారము బ్రహ్మమున కు మూలభేదము లేనందున, ఆనందమయాత్మగా బ్రహ్మనే నిర్దేశించవచ్చు.** ధర్మము కంటే ధర్మ స్వభావము వేరు కాదు కదా! ఆత్మకంటే బ్రహ్మ వేరు కాదు. ఆనందాత్మ పరమాత్మయేకాని జీవాత్మ కాదు. ఇందులో జీవ పరమాత్మల అభేద ప్రసక్తే లేదనియు ఆనందము అప్రేయము, **ఆనంద మయమనగా ఆనందమే అనియు అర్థము.**

(సూ.వా.పు.47)

అన్నము రస స్వరూపాన్ని ధరించి దేహమంతా వ్యాపించి పుష్టిని, సంతుష్టిని చేకూర్చుతుంది. కనుకనే **"అన్నం బ్రహ్మ" అన్నారు.** పుష్టివంతమైన దేహాన్ని సద్వినియోగపరుచుకునే మనస్సును ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థించేవారు ప్రాచీన మహర్షులు. ఈనాడు అనేకమంది బ్రహ్మను చూడాలని ఆశిస్తున్నారు. కానీ, భ్రమలో మునిగిపోతున్నారు. **అనేకత్వంలోని ఏకత్వమే**

బ్రహ్మ: ఏకత్వాన్ని అనేకత్వంగా భావించడమే భ్రమ. ఈనాటి మానవుడు అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించే దృష్టిని కోల్పోయినాడు: ఏకత్వాన్ని అనేకత్వంగా విభజించటంలో గొప్ప 'మేధావి' గా తయారవుతున్నాడు. అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించటమే మానవుడు చేయవలసిన సాధన. వేద శాస్త్రములను, ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రములను పఠించినంత మాత్రమున బ్రహ్మతత్త్వాన్ని గుర్తించడానికి వీలుకాదు. వాటిని ఆచరణలో పెట్టాలి.

(స.సా.మే99పు.128)

బ్రహ్మమే సర్వ శరీరములందూ సర్వ భూతములందూ, 'నేను' 'నేను' అను రూపమున నివసించుచున్నది. ప్రతి శరీరము, నేను వస్తువునే ఆశ్రయించుకొని యున్నది. ఆ శరీరములందు కూడా ఒక్కొక్క అంకము ఒక్కొక్క కార్యమునందు ప్రాధాన్యత వహించియుండును; ఉపయోగపడుచుండును ఒక్కొక్క ఇంద్రియము ఒక్కొక్క విషయమును గుర్తిడుచుండియూ, ఈ సర్వ ఇంద్రియములకు సంబంధించియూ వాటన్నిటికి అతీతమయి, 'నేను' అనునది ప్రకాశించుచుండును. ఈ నేనను వ్యక్తి ఈ సర్వాంగములలో సర్వేంద్రియములలో చేరకున్న అవి అన్నియునూ జడములైపోవును!

"నేను అనుశక్తి సర్వేంద్రియములలో చేరినపుడే ఆయా ఇంద్రియములు వాటి వాటి పనులను చేయగలవు. ఇట్టి శక్తినే ఆధ్యాత్మం అని అందురు. బావా! ఇది అందరికి అంత సులభముగా తెలియనట్టిదికాదు తెలిసికొన వీలులేదు. వివేకదృష్టితో విచారణ సలుపు వారలకే కొంతవరకు అర్థమగును, విషయము తెలియును.

(గీ.పు.126)

శాస్త్రములందు, సచ్చిదానంద స్వరూపుడు బ్రహ్మ అని వున్నదికదా! ఇది కేవలము వేదాంత పరిభాషయొక్క అర్థము. ఇక సంస్కృత భాషలోని అర్థము. **అస్తి భాతిప్రియం అని అందురు.** ఈ రెండూ ఒకటియేనా? అని విచారించిన **రెండూ ఒక పదార్థమే. ఒక స్థితియొక్క నామములే, స్వభావముకానీ, పదార్థముకానీ వేరుకాదు.** సత్ అనగా యెల్లప్పుడు వుండునది. దానినే సంస్కృతమున, అస్తి అని అందురు. చిత్ అనగా అన్నింటిని తెలిసికొను శక్తి; దీనిని సంస్కృతమున,భాతి అని అందురు. ఇక ఆనందమనగా నిరంతర సుఖాపేక్ష. దీనిని సంస్కృతమున ప్రియం అని అందురు. ఈ మూడునూ ప్రతి మానవుని యందుండును, పశుపక్షులయందు సహితము గోచరమగుచున్నది. ఎటులన, సత్ అను మొదటి దానిని విచారించిన తెలియును.

(గీ.పు.126/127)

ఆత్మతత్త్వమెరుగ ఆనందమబ్బు
తత్త్వ మెరుగకున్న తామసుడగు
బ్రహ్మమెరిగినంత బ్రహ్మమేయగునయా
సత్యమైన బాట సాయిమాట॥

(సా.పు.452/453)

సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు
మేటి వస్తువునందు మేటి యగుచు
అంతటను సర్వసాక్షియై అలరునట్టి
ఆత్మయే బ్రహ్మ! బ్రహ్మయే ఆత్మ॥

(సా॥పు.399)

బ్రహ్మత్వం పొందటానికి అహంతత్వం పోవాలి.

(సా॥పు.522)

ఏకార్యము చేయటానికి పూనుకున్నా అక్కడ ఒక ప్రశ్నను వేసుకోవాలి. ఆత్మస్వరూపుడైన బ్రహ్మనునేను. ఈ కాయములో నివసిస్తున్నాను. కనుక ఆత్మ స్వరూపుడైన నేను బ్రహ్మ స్వరూపుడైన నేను ఈ కాయముతో ఈ కర్మలు ఆచరించవచ్చునా ఆచరించకూడదా? అని విచారణ చేసుకోవాలి. ఈ కర్మచేయతగినదా చేయ తగనిదా? అనే విషయమును విచారించు కోవాలి. అప్పుడే యీ దేహము సద్వినియోగము గావించుకున్నవాడ వవుతావు.

(బృ.త్ర.పు.14)

(చూ॥ అక్షరము, అన్నము ఆచరణ, గాయత్రి, జగదీశుడు, జన్మాద్యస్యయతః, జీవన్ముక్తి, తత్తుసమన్వయాత్, నాల్గుయుగాలు, నేను, పాదము, బ్రహ్మస్వరూపము, శాస్త్రయోనిత్వాత్)

బ్రహ్మఅధిష్ఠానము

బ్రహ్మఅధిష్ఠానము

(చూ॥ వేదాంతి)

బ్రహ్మకాండ

బ్రహ్మకాండ అనగా యజ్ఞ యాగాదులను ధర్మాచరణకు సంబంధించినది. ఇందులో ఎన్నియో విశేషములతో కూడిన ధర్మములు, యజ్ఞములు కలవు.

(లీ.వా.పు.7)

(చూ॥వేదము)

బ్రహ్మచర్యము

గృహస్తుడు కాకుండినంత మాత్రమున బ్రహ్మచర్యమని తలంతురు. అది చాలా పొరపాటు. యదార్థము అదికాదు. **తన చిత్తమును ప్రపంచ వ్యామోహములకు చేరనీయక దైవచింతనా తత్పరుడగుచు వింతలు విశేషములు వినక, చూడక, యే రుచులనూ కోరక ఆనంద దుఃఖములకు లోనుగాక, మనోబుద్ధి అహంకారములకు సాధ్యపడక, నిష్కామ, నిర్మోహ, నిర్ద్వంద్వ, నిర్విషయ, నిశ్చలుడై, అన్నింటియందు, అన్ని వేళలందు బ్రహ్మతత్వములోనే నిలిచుయుండు మనోస్వరూపమును, బ్రహ్మ చర్యమని పిలువబడును.**

(ప్ర.శో.వా.పు.9)

(చూ॥ గృహలక్ష్మి, మానవజీవితము)

బ్రహ్మచారి

బ్రహ్మచర్యం అంటే పెళ్ళి చేసుకోకుండా వుండటం కాదు. బ్రహ్మయందు చరించటం. అందుకు ఆలోచనలు పవిత్రంగా వుండాలి. మనస్సు నిర్మలంగా వుండాలి. ఆచరణ స్వార్థరహితంగా వుండాలి. చిత్త శుద్ధి కనిపించాలి. హనుమంతుడు ఎప్పటికి బ్రహ్మచారే. సువర్చల ఆయన భార్య అంటారు. అయినా ఆయన బ్రహ్మచారి ఎలా అయ్యాడు? ఎందుకంటే ఆయనకు రాముడు తప్ప మరో విషయం తోచదు. సర్వస్వం రాముడే. **ఆయన సదాబ్రహ్మంలోనే వుంటున్నాడు బ్రహ్మంలోనే చరిస్తున్నాడు. కనుక బ్రహ్మచారి** అయ్యాడు.
నీ ఆలోచనలనూ, వాక్కులనూ చేతలనూ బ్రహ్మ పరం చేయి. అసలైన బ్రహ్మచారివికా!

(శ్రీ.సా.గీ.పు.32)

బ్రహ్మచింతన

బ్రహ్మాభ్యాసమనగా ఎల్లప్పుడూ బ్రహ్మమునే తలంచుట, ప్రార్థించుట, ఉపన్యసించుట, అతనితో కలసిపోగలుగుట. అందుకనే పంచదశిలోకూడా ఇట్లే చెప్పబడినది. "తత్ చింతనమ్, తత్ కథనమ్, అన్యోన్యం తత్ ప్రభోధనమ్: ఏతత్ ఏకపరత్వంచ జ్ఞానాభ్యాసం విదుర్బుధాః॥" బ్రహ్మనే తలచుట, మాటాడుట, చింతించుట మొదలయినవి జ్ఞానులచే జ్ఞానాభ్యాసమని తెలియబడును. దీనినే కృష్ణుడు **గీతలో కూడ బోధించెను. మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతఃపరస్పరమ్; కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ.**" నా యందే మనస్సుంచి నాయందే దాగి, నన్ను గురించి ముచ్చటించుచూ తెలుసుకొన్న వారు తృప్తిపొంది ఆనందించెదరు.
కాన **బ్రహ్మచింతన అనెడి పదమునే ఆత్మాభ్యాసమనియు, జ్ఞానాభ్యాసమనియుకూడా వాడెదురు.** మనసు విషయాసక్తి వలననూ, విక్షేపశక్తివలననూ, బహిర్ విషయములమీదికి పరువెత్తుచుండును. కానీ మరల మరల దానిని లక్ష్యముపైకి తెచ్చు చుండవలెను. ప్రధమములో అది కష్టముగా నున్ననూ, మన శిక్షణద్వారా మనసును పలుచపరుప గలిగినప్పుడు ఓం అను జపముమీద నిలువగలదు, శిక్షణ, సామ, దాన,ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానము అనెడి ఉపాయములతో మనస్సును కట్ట వలెను. **మనసును భజనలు, ప్రార్థనలు, సత్యగుణములు, సత్ప్రవర్తన మొదలగువాటితో నింపి క్రమేణా బ్రహ్మాభ్యాసము లోనికి దింపవలెను.** ఆత్మయందు ధ్యానము సాగింపగా సాగింపగా మనసునందు క్రొత్త

పూర్వోక్త ప్రకారమున తెలిసికొనినచో వాని జన్మము సఫలమగును. అట్లు కానిచో వృథా యగును. సుప్రసిద్ధమైన పరబ్రహ్మము మెరుపుతీగవలె ప్రకాశించును. కనురెప్పపాటువలె అత్యంత శీఘ్రముగా ప్రకాశతిరోధానములు గలది. ఇది బ్రహ్మయొక్క ద్వైనికస్వరూపము. బ్రహ్మయొక్క స్వరూపము దుర్విజ్ఞేయము. మనస్సు బ్రహ్మమునకు ఉపాధియగుటంజేసి అది అత్యంత సమీపమున నున్నటుల కాన్పించుచున్నది. అందువలన మనస్సు బ్రహ్మమును పొందుచున్నట్టున్నది. నిజముగా అది అద్దానిని పొందుటలేదు. అత్యంత సామీప్యముచే నేను బ్రహ్మమయితినని ప్రతిక్షణము సాధకుడు స్మరించుచున్నాడు. అందువలన బ్రహ్మ సాక్షాత్కారాభిలాషయతనికి పలుమారు కలుగుచున్నది. అట్టి స్మరణ సంకల్పాది చిహ్నములచేత బ్రహ్మ ముపాస్యమగుచున్నదని భావము. బ్రహ్మజ్ఞానికి ధర్మాధర్మములు పుణ్య పాపములు నశించును. ధర్మాచరణచే ఉత్తమలోకమును, అధర్మాచరణచే అధోలోకమును సంప్రాప్తమగును. రెండునూ బంధ కారణములే. సమస్త హృదయ గ్రంథులను శిథిలముచేసి, అవిద్య నంతమొందించి, సాధకుని అత్యంతము బ్రహ్మసామీప్యమును పొందించు నది కనుక ఉపనిషత్తను పేరు వచ్చినది. బ్రహ్మజ్ఞానమునకు తపస్సు, దమము, అగ్నిహోత్రాది కర్మలు ప్రతిష్టాభూతములు. వేదములు దాని అంగములుగా ఉన్నవి. సత్యమే అద్దానికి నివాసము. బ్రహ్మ జ్ఞానోపదేశమంతయు ఈ ఉపనిషత్తున చెప్పబడినది. ఈ ఉపనిషత్తున ఉపదేశింపబడిన దంతయును సత్యజ్ఞానానంతలక్షితమగు బ్రహ్మ విషయమై ఉన్నది.

(ఉ.వా.పు.54/56)

(చూ॥ తత్తుసమన్వయాత్, దక్షుడు, సచ్చిదానంద)

ఆసక్తులు బయలుదేరును. **ఇట్టి శిక్షణ చేత మనసును ఇతర విషయములపై పురకకుండా హృదయ గుహయందు బంధింపవచ్చును. అట్టిసాధనయొక్క ఫలితమునే నిర్వికల్ప సమాధి అందురు. అట్టి సమాధిఫలితము బ్రహ్మజ్ఞానమనబడును. బ్రహ్మజ్ఞానఫలమే మోక్షము,** లేదా జననమరణముల బారినుండి విముక్తి అనిగాని అనుచుందురు. వాంఛలను విసర్జించుట, మనస్సును నిర్మూలించుట, తత్త్వజ్ఞానము, ఈ మూడున్నూ కలిపి సాధన చేయవలెను. **అప్పుడే ఆత్మజ్ఞానము లభించును.**

(జ్ఞా.వా.పు.49/50)

(చూ॥ బ్రహ్మాభ్యాసము)

బ్రహ్మచైతన్యము

(చూ॥ ఈక్షతే ర్నా శబ్దం)

బ్రహ్మజిజ్ఞాస

(చూ॥ అథాతోబ్రహ్మజిజ్ఞాస)

బ్రహ్మజ్ఞానము

బ్రహ్మజ్ఞానమునకు జిజ్ఞాసా నివృత్తియే పర్యవసానము; సాక్షాత్కారమే దాని ఫలము. ఈ సర్వోత్కృష్ట స్థానము సమాధి లభ్యము. సాక్షాత్కారమున కనివార్యముగా పూర్వాంగములగు శ్రవణ మనన నిధి ధ్యాసములు బుద్ధివిషయములే అగుచున్నవి. ఈ జన్మమునందే ఆత్మస్వరూపమును తెలిసికొనినయెడల దాని ఫలముగ సత్యస్వరూపము సిద్ధించును. అట్లు తెలిసికొనలేక పోయినయెడల జన్మ నిష్ఫలమగును. జ్ఞానులగువారు ప్రతి భూతమునందును నద్వితీయమగు ఆత్మ తత్త్వమును గ్రహించి ఈ లోకమునుండి పోయిన తరువాత జనన మరణములు లేని వారగుచున్నారు.

బ్రహ్మజ్ఞానమునకు అధికారి మనుజుడు. అతడు సమర్థుడై పూర్వోక్త లక్షణలక్షితమగు పరమాత్మస్వరూపమును

బ్రహ్మజ్ఞాని

ప్రేమస్వరూపులారా! శివుడు, జీవుడు ఒక్కటే అన్న పరమ జ్ఞానమును గుర్తించినవాడే నిజమైన **బ్రహ్మజ్ఞాని**. శివుడు వేరు, జీవుడు వేరు కాదు ఇరువురిలో ఉన్న ఆత్మతత్వం ఒక్కటే అనే సత్యాన్ని మానవుడు గుర్తించాలి.

(స.సా.న.పు.285)

బ్రహ్మతత్వము

(చూ॥ అన్నం)

బ్రహ్మత్వము

కాయముగానీ కర్మనుగానీ అపవిత్రము చేయక, పరులను బాధించక, తానూ బాధ పడక, మంచిగా వుండి, మంచిని తలంచుచూ మంచిగా జీవించినపుడు బ్రహ్మత్వమనునది సులభముగా అర్థమగును, లబ్ధమగును.

(స.సా.ఏ.75పు.35)

(చూ॥ ఏకత్వము)

బ్రహ్మదర్శనము

బ్రహ్మదర్శన భాగ్యంబు, బడయగోరి।
వెతుక బోవుదు, ఎచటికి వెఱ్రిమనస।
అదియ నీలోన నున్నది, గాంచుమచట
సత్యమును, తెలుపుమాట, యీ సాయిమాట॥

(సా.పు.251)

బ్రహ్మదృష్టి

(చే॥ హేయత్వావచనాచ్చ)

బ్రహ్మనిష్ఠ

(చూ॥ హేయత్వావచనాచ్చ)

బ్రహ్మప్రాప్తి

నదులకు సముద్రములాగ, జీవులకు గమ్యస్థానము **బ్రహ్మప్రాప్తి!** చైతన్య స్వరూపులైన జీవులకు జడస్వరూపులైన, వస్తువులతో శాశ్వత సుఖము యేనాడును వుండదు; లేదు. బ్రహ్మ ప్రాప్తి అనినను, నిత్యసుఖమనినను, మోక్షమనినను వక్కటే. ఇవి అన్నియు పర్యాయ పదములు.

(గీ.పు.219)

(చూ॥ అభేద జ్ఞానము, ఉత్తరాయణము)

బ్రహ్మమయము

శంకరులవారు "దృష్టి జ్ఞానమయం చేసుకొంటే, సృష్టి బ్రహ్మమయం అవుతుంది" అని అన్నారు.

(వి.వా.పు.12)

బ్రహ్మముహుర్తము

(చూ॥ నగరసంకీర్తన, మెడిటేషన్)

బ్రహ్మయజ్ఞము

బ్రహ్మయజ్ఞమనగా స్వాధ్యాయ. లోక కళ్యాణార్థమై బ్రహ్మను గ్రహమును పొంది అజులగు అధికారులగు ఋషులు యజ్ఞములను సృజించిరి. మంత్రములను దర్శించిన వారు వేద చోదితమైన పరమార్థమును, ధర్మ బ్రహ్మస్వరూపమును దర్శించువారిని మాత్రమే ఋషులని వేదము తెలిపినది. అట్టివేదము అంగీకరించిన ఋషులు సృజించిన క్రతువులే యజ్ఞములు.

తపస్సుచే లభించిన దగుటచే బ్రహ్మతత్వము 'తపోజా' అని కూడా దేవుని లక్షణాలను వర్ణించిరి దీనినే దైవీవాక్, దేవ వాణి అనిరి. తపోజా అనుటచే, అంతకు పూర్వములేక కొత్తగా పుట్టినది కాదు. అనాది సిద్ధమైన వేదవాణి యే తపస్సు వలన అభివ్యక్తమైనది. స్వాయంభువమగు బ్రహ్మ. ఇది అనాది సిద్ధమైన వాక్కు అని స్పష్టము చేయుచున్నది. స్వయంభూ, తపోజా-ఇత్యాది పదములను

పురస్కరించుకొని దైవీవాక్ వేదమునందు అచటచట మంత్రకృత్, ఋషికృత్, ఇత్యాది పదములను అనుసరించుచు ఈ వాక్-మంత్ర-మంత్ర కర్తృ-రచితమై చెప్పబడినది.

అన్నము, జలము, అమృతము, వేదము- ఇవి పృశ్ని అని చెప్పబడుచున్నవి. ఇవి ఎల్లప్పుడు భగవంతుని గర్భమునందుండునవి కాన భగవంతుడు పృశ్ని గర్భుడని కూడా బ్రహ్మనే తనకు తాను వేద రూపమున తెలుపుకొన్నాడు.

(లీ.వా.పు.14/15)

బ్రహ్మరహస్యము

(చూ॥ఆత్మజ్ఞానము)

బ్రహ్మర్షి

ఒక పౌర్ణమినాడు వశిష్టుడు చల్లని, చక్కని వెన్నెలలో అరుంధతితో ఒక గుట్టపై కూర్చుని ఉండగా అతనిని ఏవిధంగానైనా హతమార్చాలని విశ్వామిత్రులవారు చక్కని ఖడ్గమును తీసుకొని వెళ్లి ఆ కొండ దగ్గరలో ఒక పొదలోదాగి ఉన్నాడు. అతని శిరస్సును ఖండించడానికి అన్ని విధాల విశ్వామిత్రుడు సంసిద్ధంగా ఉంటున్నాడు. ఆ సమయములో వశిష్ట అరుంధతులు సంభాషించు కుంటున్నారు. అరుంధతి **"ఈనాడు పూర్ణపౌర్ణమి. చంద్రుడు ఎంత తెల్లగా, ఎంతచల్లగా ప్రకాశిస్తున్నాడో ఇంత పరిశుద్ధమైన పూర్ణిమను నేనెన్నడూ చూడలేదు. కదా!" అన్నది. వశిష్టుడు, "అవును అరుంధతీ! ఈ పవిత్రత, చల్లదనము, ఈ పరిశుద్ధత, విశ్వామిత్రుని తపశ్శక్తివల్లనే" అన్నాడు. ఈ మాట వినేటప్పటికి విశ్వామిత్రుని హృదయము చాలా మార్పుచెందినది. "ఈ వశిష్టులవారిది ఎంత గొప్ప హృదయము!** భార్యలవద్ద నిజమైన సత్యాన్ని నిరూపించటం పురుషుల లక్షణం. అలాంటిది నాతపశ్శక్తిని భార్యవద్ద ఎంతగొప్పగా వర్ణిస్తున్నాడు నాదే దుర్మార్గము" అని ఆకత్తిని పారవేసి, పరుగెత్తుకొని వచ్చి వశిష్టుని పాదములపై పడినాడు. ఈ దృశ్యమును చూచివశిష్టులవారు **"బ్రహ్మర్షివెమ్ము" అన్నాడు.** విశ్వామిత్రునికి ఎంతో ఆశ్చర్యం కలిగింది. "ఇంత కాలము ఇంత తపశ్శక్తిని సంపాదించినప్పటికినీ నన్ను రాజర్షి అని పిలిచిన వశిష్టుడు ఈనాడు నేను దుర్మార్గమునకు పూనుకున్నపుడు 'బ్రహ్మర్షి' అని పిలుచుటలోగల అంతరార్థమును అడిగి తెలుసు కోవా" అనుకున్నాడు. అప్పుడు వశిష్టుడు "విశ్వామిత్రా!' ఇంతకాలము నీ నఖశిఖ పర్యంతము అహంకారంనిండి ఉండినది. నీవు ఎవరికీ తల వంచేవాడవు కాదు. లొంగే టటువంటి వాడవు కాదు. ఈ విధమైన అహంకారము చేత నీవు స్వేచ్ఛావిహారము సలుపుతూ వచ్చావు. ఈనాడు నీ శిరస్సును వంచి. లొంగినట్లుగా పాదాక్రాంతుడవైనావు. ఇప్పటినుంచి నీవు బ్రహ్మర్షివి" అన్నాడు. దీని అంతరార్థమేమిటి? అహంకారముతో ఉండినంతవరకు, అసూయ అనేది అన్ని విధాల హింసిస్తూ ఉంటుంది. ఏనాడు అహంకారము పోయి వినయవిధేయతలతో ఉంటామో ఆనాడు మనపేరు ప్రతిష్టలు వ్యాప్తికావటానికి అవకాశం ఉంటుంది. అహంకారంతో ఉండటంచేత అతనిని రాజర్షి అన్నారు. రజోగుణ సంపత్తి గలవాడు రాజర్షి. **మహారాజుఅనగా ఏమిటి? రాజులు రజోగుణము కలవారు కనుక 'రాజులు' అన్నారు. కనుక ఏనాడు ఈ రజోగుణము పోయి, సాత్వికలక్షణములయిన వినయవిధేయతలతో ప్రవర్తిస్తామో, ఆనాడు పవిత్రత మనకు ఏర్పడుతుంది.** క్రమక్రమేణా మనము వినయ విధేయతలతో ప్రవర్తించడానికి ప్రయత్నిస్తే మన హృదయానికి యీ అహంకార, అసూయలు సాధ్యమయినంతవరకు దూరము చేయడానికి అవకాశం ఉంటుంది. ఒక చిన్న ఉదాహరణ. మన సేవాదళం వారు అనేక బహిరంగ సమావేశములలో కానీ, గుంపుగా జనం చేరినచోట్ల గానీ అనేక సేవలు చేస్తుంటారు. తాను **సేవాదళ సభ్యుడు కదా అని ఒక badge వేసుకుని**

బ్రహ్మవల్లి

ఉండుట చేత ఒక అహంకారముతో-ఇక్కడ కూర్చో, అక్కడ కూర్చోవద్దు అని వారిపైన జబర్దస్తీచేయడానికి కొంత అవకాశం ఉంటుంది. నీవు వేసిన badge అహంకారాన్ని దూరం చేసేదేకాని, ఇనుమడింప చేసేది కాదు. వచ్చిన ప్రేక్షకులకు **ప్రజలకు నీవు సాధకుడవు, సేవకుడవుకానీ నీవు అధికారివి కాదు. ఒక ఇంటిలో సేవకుడు యజమానిపై అధికారం చెలాయించినపుడు యజమానికి ఎట్లుంటుందో నీవు యోచించు.** మనము వచ్చేవారికి సేవచేయడానికి ఉంటున్నాము. మనము సేవకులుగా ఉంటుండి, వచ్చినవారిపై అధికారం చెలాయించడానికి ప్రయత్నిస్తే మన అధికారాన్ని మనం కోల్పోతాము. ఎదుటివారు ఒక వేళ మన సమావేశములో అభ్యంతరములు కలిగిస్తూ అడ్డుతగులుతుంటే వారికి మొట్టమొదట నమస్కరించాలి. వారకి మంచి మాటలతో ఇక్కడ కూర్చో, కొంచం జరిగితే అందరికీ వీలుగా ఉంటుందని చెప్పడానికి ప్రయత్నించాలి. అయితే కొంతమంది **మూర్ఖంగా ప్రవర్తిస్తుంటారు.** అలాంటి సమయంలో మనం కూడా కొంచెం మూర్ఖంగా ఉండవలసి వస్తుంది.

(స.సా.ఆ.79పు.176/177)

బ్రహ్మవల్లి

బ్రహ్మజ్ఞానబోధకములగు వేదార్థములను విశ్వాస భావముచే శ్రవణము చేయవలెను. అప్పుడే అజ్ఞానము నశించును. సర్వ సంసారబీజకారణమగు ఆజ్ఞానము పోగొట్టుకొని బ్రహ్మజ్ఞానోపదేశమును సేయుటయే బ్రహ్మవల్లి లక్ష్యము.

(ఉ.వా.పు.73)

బ్రహ్మవాక్యములు

(చూ॥ప్రాణస్తధానుగమాత్)

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి

ఉపనిషత్ అంటే ఏమిటి అర్థం? 'ఉప' అంటే సమీపంగా, 'ని' అంటే క్రింద, 'షత్' అంటే కూర్చో. అదియే ఉపనిషత్సారము. అనేకమంది ఉపవాసం చేస్తున్నామంటారు. ఉపవాసమంటే తిండి మాని ఫలములు తినడమా? కాదు, కాదు. భగవంతునికి దగ్గరగా ఉండడమే ఉపవాసము. భగవంతునికి దగ్గరగా ఉన్నప్పుడే దైవత్వం మీలో ప్రవేశిస్తుంది. ఎయిర్ కండిషన్డ్ గదిలో కూర్చుంటే ఏమౌతుంది? వేడి దూరమై చల్లదనం వస్తుంది. అదేరీతిగా, దైవానికి సమీపంగా పోవటంవలన మీ ప్రాకృతమైన ధుఃఖములు మాయమై పోతాయి? భగవత్ప్రేమచేత చల్లగా హాయిగా శాంతిని పొందగల్గుతారు. కనుక, భగవంతునికి సమీపంగా వెళ్ళాలి. అదియే ఉపవాసము. **ఐతే, 'నియర్‌నెస్' తోపాటు 'డియర్‌నెస్' కూడా ఉండాలి.** బొగ్గు ఒక చోట, అగ్ని మరొక చోట ఉంటే అగ్ని బొగ్గులో చేరుతుందా? చేరదు. అగ్ని బొగ్గులో ప్రవేశించాలంటే రెండింటినీ ఒకదానికొకటి సమీపంగా చేర్చాలి. ఇదే 'నియర్‌నెస్' సమీపంగా చేరటంవల్ల బొగ్గు అగ్నికి ఎంత తగిలిందో అంత మాత్రమే అది అగ్నిగా మారుతుంది. కానీ, పైన ఫ్యాను విసిరితే బొగ్గు పూర్తి అగ్నిగా మారిపోతుంది. అదేవిధంగా, భగవంతునికి మీరు **'నియర్' గాను, 'డియర్' గాను ఉన్నప్పుడు మీరు కూడా దైవంగా మారిపోతారు. దీనిని పురస్కరించుకొనియే "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" అన్నారు. మీకు, దేవునికి భేదం లేదు. మీరు అంశము కాదు, ప్రత్యేకమైనవారు కాదు. మీరే దైవం. YOU ARE GOD.** ఇట్టి ఆనందమును మనం పొందే నిమిత్తమై మీరు ఏ సాధనలు చేయనక్కర్లేదు గాని అందరినీ ప్రేమించాలి. ప్రేమకు ఎట్టి నష్టమూ లేదు, ఎట్టి కష్టమూ లేదు. ప్రేమ పెరిగే కొద్దీ మీ ఆనందం కూడా పెరిగిపోతుంది. మీరు భగవంతుణ్ణి ఎంత అధికంగా ప్రేమిస్తారో మీరు అంత అధికంగా ఆనందాన్ని పొందుతారు. భగవంతుణ్ణి ఎంత తక్కువగా ప్రేమిస్తారో మీ ఆనందం కూడా అంత తగ్గిపోతుంది.. కనుక, ఎక్కువ ఆనందము

పొందాలనుకుంటే ప్రేమించాలి. **అధికంగా ప్రేమించాలి. ప్రేమచేతనే మీ జీవితం ధన్యమవుతుంది.**

(సా.శు.పు.85/86)

బ్రహ్మవిద్య

బ్రహ్మవిద్య మానవాతీతమైనది కాదు. ఇది నిత్యజీవితంలో మానవుని సత్యమార్గమున నడిపించి, వ్యక్తిత్వాన్ని పోషించే సహజమైన సాధనయే. ఇట్టి సాధనాసంపత్తిని మానవుడు దినదినాభివృద్ధి చేసుకోవాలి. అనంతమైన బ్రహ్మతత్త్వము నకు ఉపనిషత్తు మూడు విధములైన రూపములను నిరూపిస్తూవచ్చింది. 1. విరాట్టుడు. 2. హిరణ్యగర్భుడు. 3. అవ్యాకృతుడు. ఈమూడు రూపముల స్థూల, సూక్ష్మ, కారణములకు సంబంధించినటువంటివి; జాగ్రత్, స్వప్న, సుషుప్తులతో చేరినటువంటివి.

విరాట్టుడు అనగా స్థూలమైన స్వరూపాన్ని ధరించి, భౌతిక శరీరంతో తాను దీర్ఘాయుష్మంతుడుగా ఉంటుండి, జాగ్రతావస్థాస్వరూపుడైన ఆత్మ తత్త్వమునకు - "విరాట్ స్వరూపుడ'ని పేరు. ఇతను వివిధ రూపములను ధరించి, వివిధ నామములతో ప్రకటితమౌతుంటాడు. అనగా, పిపీలికాది బ్రహ్మ పర్యంతమును, ఆకాశాది పంచ భూతములను, చరాచర ప్రపంచమంతటిని తన రూపములుగా నిరూపిస్తూ - **"సర్వం విష్ణుస్వరూపము"** అనే సత్యాన్ని తాను ప్రకటించుట చేతనే ఇతనిని - "విరాట్ స్వరూపుడు" అన్నారు. అంటే కొండలు, గుట్టలు, నదులు, పర్వతాలు మొదలైన దృశ్య కల్పిత జగత్తంతా "విరాట్ స్వరూపమే". ఇది, అది అనేభేదము లేకుండా ఏదైతే కనిపించునో, అదంతయు విరాట్ స్వరూపుని అంశమే. కనుక, విరాట్టుడు అనగా, బాహ్యజగత్తునకు సంబంధించి స్థూలమైన జగత్ స్వరూపాన్ని ధరించి, తాను ఈ జగత్తునకు ఆదర్శాన్ని అందిస్తుంటాడు.

ఈ విరాట్టునికి మరిరెండు పేర్లు కలవు. 1. వైశ్వానరుడు 2. విరాజనుడు. వైశ్వానరుడు అనగా ప్రతి వ్యక్తియందు "నేను, నేను" అనే పదము చేత నిరూపించబడేవాడు. రాజు మొదలుకొని రైతులవరకు, నిరుపేద మొదలుకొని శ్రీమంతునివరకు, బాలుని మొదలుకొని వృద్ధుని వరకు ప్రతి ఒక్కరూ తనను తాను పరిచయం గావించుకొనే సమయంలో "నేను" అనే పదమును ఉపయోగపడతారు. కాబట్టి, ఈ "నేను" అనే పదము సర్వజీవుల యందు ఉంటున్నది. **ఈ విధంగా సర్వజీవుల యందు 'నేను' అనే పదమును ఉచ్ఛరించే వాడే వైశ్వానరుడు.**

విరాట్టునికి మరొక పేరు విరాజనుడు. ఇతడు విచిత్రమైన స్వరూపమును ధరించినవాడు. ఇతడు అందరి యందుండి కూడను తాను లేనట్లుగా, అన్ని పనులు చేస్తూ తాను చేయనట్లుగా, అన్నింటిని అనుభవిస్తూ తాను అనుభవించ నట్లుగా ఉంటాడు. ఈవిధమైన రూపాన్ని ధరించినవాడు కనుకనే ఇతనికి విరాజనుడని పేరు. కనుక విరాట్టుడు, వైశ్యానరుడు, విరాజనుడు అనే వివిధ నామములన్నీ ఒక్కరికి సంబంధించినవే.

ఇంక **రెండవది హిరణ్యగర్భుడు.** ఇతడు సమస్త జ్ఞానానికి ఆది. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక జ్ఞానములన్నీ హిరణ్యగర్భుని నుండే ఆవిర్భవించినవి. అందుచేత ఇతనిని జ్ఞానభాస్కరుడని కూడా పిలువవచ్చును. ఉదయించేటప్పుడు భాస్కరుడు హిరణ్మయస్వరూపాన్ని ధరిస్తూ ఉంటాడు. ప్రకృతిని కూడా హిరణ్మయంగా మారుస్తాడు. కనుక హిరణ్య గర్భునకు జ్ఞానభాస్కరుడనే పేరు సరియైన అర్థాన్ని అందిస్తుంది. సమస్త సృష్టిప్రప్రథమములో హిరణ్యగర్భుని నుండియే వచ్చినది. హిరణ్యగర్భుడనేది ఒక "బంగారు గుడ్డు" ఆకృతిని కలిగియుంటుంది. ఈ విధమైన ఆకారము నుండి మొట్టమొదట నోరు పుట్టింది. దాని నుండి శబ్దము ప్రారంభమైనది. తదుపరి నాసిక పుట్టింది. దాని నుండి గాలి ప్రారంభమైనది తదుపరి కన్నులు పుట్టాయి. కన్నుల నుండి అగ్ని ప్రారంభమైనది. తరువాత చెవులు పుట్టాయి. అప్పుడు దిక్కులన్నీ ప్రారంభమైనాయి. ఈ విధంగా మానవజీవితానికి హిరణ్యగర్భుడు మూలాధారుడు. ఇతని నుండియే సమస్తజీవులు

ఉద్భవిస్తూ వచ్చాయి. ఈ సమస్త జీవులకు నిత్యానిత్య విషయ పరిశీలన చేసే విజ్ఞాన, ప్రజ్ఞాన సుజ్ఞానములను హిరణ్యగర్భుడే ప్రసాదించాడు. మానవుడు దేనిని చేయవచ్చును? దేనిని చేయకూడదు? దేనిని పొందవచ్చును? దేనిని పొందకూడదు? అనే విషయాలలో మానవుని సరియైన మార్గంలో ప్రవేశింపజేయటానికి తగిన జ్ఞానాన్ని మానవునికి అందిస్తున్నాడు. ఇది హిరణ్యగర్భుని ప్రధానమైన క్రియ.

హిరణ్యగర్భునికి మరి రెండు పేర్లు కలవు. 1. సూత్రాత్మకుడు. 2. ప్రాణుడు. సూత్రాత్మకుడు అనగా - మణులలో సూత్రము ఏరీతిగా ప్రసరిస్తూ ఉంటుందో, అదే విధముగా ప్రతి మానవుని యందు హిరణ్యగర్భుడు ఒక సూత్రరూపమును ధరించి అందరి యందు **సమత్వంగా ప్రసరించేవాడు. దీనినే "బ్రహ్మసూత్రము" అని చెప్పవచ్చును. "వీరు వారు" అనే భేదము లేక సర్వులు యందు సమముగా చేరియుండి, సమత్వాన్ని చాటే తత్వం హిరణ్యగర్భతత్వం. ఈ విధంగా హిరణ్యగర్భుడు భేదరహితమైన సృష్టిని జగత్తునకు నిరూపిస్తూవచ్చాడు.**

హరిణ్యగర్భునికి మరొక పేరు ప్రాణుడు. హిరణ్యగర్భుడు సూక్ష్మాకారముతో స్వప్నావస్థయందు ఆత్మస్వరూపాన్ని ధరించినవాడు. కనుకనే, నిద్రావస్థయందు, స్వప్నావస్థ యందు హిరణ్యగర్భుడు మేల్కొని ఉంటాడు. జాగ్రదావస్థ యందు విరాట్టుడు సర్వమూ సృష్టించితే, హిరణ్యగర్భుడు సర్వమును సంకల్పము చేత సృష్టించుకొంటాడు. స్వప్నములో దేనిని చూసినప్పటికీ అది హిరణ్యగర్భుని సృష్టియే కనుక, సూక్ష్మమైన హిరణ్యగర్భుడు స్వప్నావస్థ యందు సమస్త జగత్తునూ సృష్టిస్తున్నాడు.

ఇంక మూడవది అవ్యాకృతుడు. అవ్యాకృతుడనగా ఎట్టి ఆకారంలేనివాడు. ఎట్టి విశ్లేషణకు లొంగని వాడు. ఈతడు కారణశరీరము నందు పరిపూర్ణమైన రూపరహితుడై సుషుప్తిస్థితిని అనుభవిస్తుంటాడు. ఇతనికి ఎట్టి ఆకారము లేదుగాని, అన్నింటిని తన స్వాధీనము చేసుకొంటున్నాడు, ఇతనికి కారచరణాది అవయవములు లేవుగాని, అన్ని పనుల తాను చేస్తున్నాడు. అనేక దూరములు ప్రయాణము సల్పుతున్నాడు. ఇతనికి నేత్రములు లేవుగాని అన్నింటిని చూస్తున్నాడు. శోత్రములు లేవుగాని సర్వమును వింటున్నాడు. **ఈవిధంగా, అకారరహితుడై సృష్టికి సంబంధించిన సమస్తము ఆచరిస్తున్నాడు. కనుక, ఇతనిని "అవ్యాకృతుడు" అని పిలుస్తూ వచ్చారు.**

అవ్యాకృతునకు మరి రెండు పేర్లు ఉంటున్నాయి. 1.అంతరాత్మ. 2. ఈశ్వరత్వం. అంతరాత్మ అనగా తన నుండి అన్నింటిని ప్రేరణ చేసేవాడు. ప్రతి ఒక్క ప్రేరణ అంతరాత్మ నుండియే ప్రారంభమౌతున్నది. అదే అంతర్వాణి. ఈ అంతర్వాణికి ఆధారభూతుడు అంతరాత్మనే. మానవుని యందు ఆవిర్భవించే సమస్త శబ్దములు అంతరాత్మ నుండియే ఆవిర్భవిస్తున్నాయి.

అవ్యాకృతునకు రెండవ పేరు ఈశ్వరుడు. ఈశ్వరుడనగా సకలైశ్వర్యస్వరూపుడనే పేరుండి నప్పటికీ, ఈ పరిస్థితి యందు తానొక శిక్షా ప్రదాతగా ఉంటాడు. మంచి చెడ్డలను విచారణ సల్పి ఇతడు శిక్షను అందిస్తాడు. ఇతనినే లోకులు **"లయకారకుడ"ని** పిలుస్తూ వచ్చారు. సకలైశ్వర్యస్వరూపుడైన ఇతడు తన యందున్న క్రియాశక్తి చేత మానవుని మంచి చెడ్డలను నిర్ణయం చేసి తగిన ఫలాన్ని అందిస్తుంటాడు. ఐశ్వర్యము నందించేవాడనగా ఏమిటి? మంచి - చెడ్డ రెండూ ఐశ్వర్యములే. కనుకనే, మానవుని మంచి - చెడ్డలను తాను గుర్తించి, తగిన ఫలితాన్ని ఇస్తాడు.

ఈ విరాట్టుడు, హిరణ్యగర్భుడు, అవ్యాకృతుడు వేరే ఎక్కడో ప్రత్యేకంగా లేరు. వీటిని సూక్ష్మ రూపంలో విచారణ సల్పినప్పుడు ప్రతి మానవుడు విరాటస్వరూపుడే, ప్రతి మానవుడు హిరణ్యగర్భుడే, ప్రతి మానవుడు అవ్యాకృతుడే. ఐతే, మనం అల్ప మైన మార్గములో ప్రవేశించుట చేత అనంతమైన తత్వాన్ని అర్థం చేసికొనలేకపోతున్నాము. శరీరాన్ని అనంతంతో గుణించినప్పుడు విరాటస్వరూపుడౌతాడు.

చున్నవి. ఉపనిషత్తు మంత్రములన్నియు బ్రహ్మవిద్యా ప్రతిపాదములగుట జేసి పవిత్ర సూచకము లగుచున్నవి.

(ఉ.వా.పు.22/23)

"విత్" అను ధాతువునకు "య" అను ప్రత్యయము చేర్చి నపుడు "విద్య" అను పదము యేర్పడుచున్నది. "య" అనగా ఏది, "విత్" అనగా వెలుగు. యేది వెలుగును ఇచ్చునో అది విద్య అని ఉత్పత్తి అర్థము. కనుక **విద్యపదము బ్రహ్మవిద్యకు మాత్రమే తగినది. జ్ఞానమును వెలుగుగా అజ్ఞానమును చీకటిగా పూర్వీకులు పేర్కొనిరి.** ప్రకాశ అంధకారములు యెట్లు ఒకే కాలములో ఒకే స్థానమున నిలువజాలవో అట్లే విద్య అవిద్యలు రెండూ ఒకే కాలమున, ఒకే స్థలమున నిలువజాలవు. కాన ప్రగతి పథమున పయనించు ప్రతి మానవుడు బ్రహ్మవిద్య నభ్యసించి పరిశుద్ధాత్ముడు కావలెను.

(వి.వా.పు.53)

వరుణ పుత్రుడగు భృగువనువాడు "పూజ్యుడవగు ఓ తండ్రీ! నాకు బ్రహ్మము నుపదేశింపుడు" అని తండ్రిని సమీపించిప్రార్థించెను. అపుడు అన్నము, ప్రాణము, చక్షువు, శ్రోత్రము, మనస్సు, వాక్కు అని వరుణుడు పుత్రున కుపదేశించెను. మరి దేనివలన ఈ భూతములుత్పన్నమగుచున్నవో, అది బ్రహ్మమని తెలిసికొనుమని అతడు తెలియజెప్పెను. భృగువు ఈ రెండు వాక్యములు తండ్రివలన విని తప మొనరించి అన్నమే బ్రహ్మమని తెలిసికొనెను.

ఏలయన ఈ భూతము అన్నమువలననే పుట్టుచున్నవి. పుట్టిన భూతము లన్నముచేతనే జీవించుచున్నవి. ఇట్లు తెలిసికొనిన భృగువు మరల తండ్రి దగ్గరకు వెళ్ళి, తనకు బ్రహ్మమును ఉపదేశింపుడని కోరెను. తపస్సుచేతనే బ్రహ్మమును తెలిసికొనుమని, తపస్సే బ్రహ్మమని తండ్రి కుమారునకు **తెలియజెప్పెను.** అతడు తపస్సు చేసి, విజ్ఞానము బ్రహ్మమని తెలిసికొనెను. విజ్ఞానము వలననే భూతము లుత్పన్నమగుచున్నవి. విజ్ఞానముచే జీవించుచున్నవి. **విద్యలలోకెల్లా ఉత్కృష్టము, పవిత్రము,**

శరీరము × అనంతము = విరాట్టుడు;
మనస్సు × అనంతము = హిరణ్యగర్భుడు
జీవితము × అనంతము = అవ్యాకృతుడు.

ఈ మూడు స్థూల, సూక్ష్మకారణములతో చేరి నటువంటివి. 1. దేహమునకు సంబంధించినది విరాట స్వరూపము, 2. మనస్సునకు సంబంధించినది హిరణ్యగర్భస్వరూపము. 3 జీవితమున కు సంబంధించినది అవ్యాకృతస్వరూపము. అయితే, ఈ మూడు కూడా ఒక్క మానవునితో కూడినటువంటివే.

(స.సా.జ. 92. పు. 10/12)

జీవేశ్వరులను రెండు పక్షులునూ, శరీరమను ఒక వృక్షమునే ఆశ్రయించి ఉన్నవి. జీవుడు కర్మఫలమును అనుభవించును. ఈశ్వరుడు దూరమునుండి చూచుచూ సాక్షిభూతుడగును. జీవుడు శరీరధర్మములలో ఐక్యమై దుఃఖమును అనుభవించుచున్నాడు. ఏనాడు తానే ఈశ్వరుడని తెలిసికొనునో అప్పుడు శోకవిముక్తిని పొందుచున్నాడు. ఈశ్వర జ్ఞానేచ్ఛచే వశీకృతచిత్తుడైనవానికి విషయేచ్ఛ నశించి ఆత్మజ్ఞానము కుదురును. అట్టి పవిత్ర బ్రహ్మవిద్యోపదేశమే ఈ ముండకోపనిషత్తుయొక్క ఉద్దేశమని చివర మంత్రమునందు తెలుపబడినది. **ముండమన శిరస్సు;** ఉపనిషచ్ఛిరోభూషణ మగుటంజేసి ఇద్దానికీ నామము కలిగినట్లు తెలిసికొన వచ్చును. అగ్నిని శిరస్సునందు ధరించు యే ముఖ్య లక్షణముగా యథావిధిగా నాచరించినవారికే బ్రహ్మవిద్య బోధ కాగలదనికూడ దీని భావము. ఈ ఉపనిషత్తులో మంత్రవిచారము కొరకు బ్రహ్మసూత్రముల యందలి రెండధికరణములు వినియోగింపబడినవి. ఈ ఉపనిషత్తులో రెండేసి ఖండములుగా మూడు ముండకములు గలవు. ప్రథమ ముండకము ప్రథమ ఖండమున పరాపర విద్యలును, రెండవ ఖండమున పరబ్రహ్మప్రాప్తి హేతువగు కర్మమును కర్మ ప్రతిపాదక మగు శబ్దము సామాన్యముగ మంత్రములలో చెప్ప బడినవి. ఇవియే కర్మ కాండమునం దెక్కువ వినబడు

బ్రహ్మవిద్య - స్త్రీలు

పరమరహస్యమగు బ్రహ్మవిద్యను సంప్రదాయ సిద్ధముగా తెలిసికొనెను.

అన్నమును నిందింపకూడదు. అది బ్రహ్మవిదునకు వ్రతము. ప్రాణమే అన్నము. శరీరమన్నాదము. ప్రాణమునందు శరీరము ప్రతిష్టితమయి యున్నది. అందువలన అన్నమును పరిహసింపకూడదు. అది వ్రతము. ఉదకములు జఠరాగ్నిచే జీర్ణములయి అన్నమగుచున్నవి. ఉదకములయందు విద్యుదగ్ని ప్రతిష్టితమగుచున్నది. జ్యోతిస్సునందు ఉదకములు ప్రతిష్టితములు. అందువలన ఈ యభయమునగు నన్న మన్న మునందు ప్రతిష్ఠితమగుచున్నది. ఎవడు ఆపోజ్యోతి రూపమగు నన్నమును అన్నమునందు ప్రతిష్ఠితమైన దానినిగా ఉపాసించుచున్నాడో వాడు ప్రతిష్ఠితుడగు చున్నాడు. బ్రహ్మవిజ్ఞానమునకు అన్నము ద్వారమగుటచే నది గురుతుల్యము. దానిని నిందింపరాదు. ఉపాసకుని కిది ఒక వ్రతము. శరీరము అన్న వికారమగుటచే అన్నమయకోశమనియూ, ప్రాణాత్మకమగునది. ప్రాణమయ కోశమనియూ, మంచి చెడుగులను విచారించునపుడు మనోమయ కోశమనియు, విచారించిన దాని పర్యవసానమును నిశ్చయించినపుడు విజ్ఞాన మయకోశమనియు, నిశ్చయించిన దాని **ఫలమగు ఆనందము ననుభవించునపుడు ఆనందమయ కోశమనియు వ్యవహరింపబడుచున్నది.**

బ్రహ్మభావముచే ఉపాసించుటకై ప్రాణమయ కోశముయొక్క పురుషాకృతిత్వము ప్రదర్శింపబడు చున్నది. ప్రాణమయకోశము శరీర పిండముకంటె నన్యము, సూక్ష్మతరము. అన్నమయకోశము తనలో ఇముడ్చుకొనియున్నది. అది వాయుమయము. దానిచే అన్నమయకోశమాపాద మస్తకము నిండియున్నది. అన్నమయకోశమున కది ఆత్మ అగుచున్నది. ప్రాణవాయువులేక అది నిలువనేరదు. ప్రాణము క్రియాశక్తి కార్యభూతము. ఈ ప్రాణము ప్రాణాపాన వ్యానోదాన సమానములను అయిదు రూపముల మారి ప్రాణమయ కోశమగుచున్నది. అన్నమయ కోశమునకు ప్రాణమయ కోశము ఆత్మయను స్థిరమగు భావనచే అన్న మయకోశమునందనాత్మబుద్ధి తొలగును. మూసలో కరిగించి పోసిన లోహమువలె అన్నమయ కోశము నాశ్రయించి ఆత్మభావముచే వర్ధిల్లు చున్న ప్రాణమయ కోశముకూడా పురుషాకారమున కనిపించుచున్నది.

స్వాహారూపమగు ప్రాణవృత్తి **ప్రాణమయ కోశమునకు శిరస్సు, వ్యానవృత్తి దక్షణపక్షము, అపానవృత్తి ఉత్తరపక్షము. శరీర మధ్యమున నున్న సమాన వృత్తి ఆత్మ. పృథివి దేవతాస్థితి హేతవగుటచే పుచ్ఛమగు చున్నది. పృథిని ప్రతిష్ఠానహేతువు కానిచో పుదానవృత్తిచే నూర్ధ్వ గమనమొంది బరువుచే క్రిందపడుట సంభవించును.** హృద్దేశము నుండి ముఖ నాసికా మూలమున పైకి సంచరించుటచే ప్రాణ వృత్తి శిరస్సనియు ఆచట నుండి సర్వ నాడులయందును ప్రసరించుటచే వ్యానవృత్తి, అధః ప్రసారముచే ఆపానవృత్తి, పక్షములనియు, ఉదర మధ్యమున నాభి సమీపమున నుండుటచే సమాన మాత్మ మనియు కల్పింపబడినది.

(ఉ.వా.పు.76/79)

(చూ॥ ఉపనిషత్తులు. గౌణశ్చేన్నాత్మ శబ్దాత్, మాండూక్యోపనిషత్తు, ముండకోపనిషత్, శాస్త్రయోనిత్వాత్)

బ్రహ్మవిద్య - స్త్రీలు

స్త్రీలకు బ్రహ్మవిద్యయందు అధికారములేదనుట శుద్ధ అబద్ధము. కాని లౌకికవ్యవహారములందు వారలకు కొన్ని నిబంధనలు అత్యవసరము. ఇదియును ధర్మరక్షణ నిమిత్తమే, లోకళ్యాణార్థమే, స్త్రీలు ఇటువంటి నిబంధనలు తు చ పాటించియే తీరవలెను. ఇందులో ఆచార విచారములు గూఢముగా నుండుటచే స్త్రీలు వాటిని సక్రమముగా పాటించలేని బలహీనులగుటయు, ప్రకృతికి సంబంధమైన కొన్ని ఆటంకములుండుటయు, అట్టి నిర్బంధనలకు కొన్ని కారణములుగా నున్నవి. అసలు పండితులు సహితము, శాస్త్రజ్ఞులు సహితము బ్రహ్మాది

దేవతలయందు నారీస్వరూపిణియగు సరస్వతీదేవిని ఉపాసించియే జ్ఞానమును పొందుదురు. విద్యాధిదేవత అయిన సరస్వతియు, ధనాధిదేవత అయిన లక్ష్మియు, జ్ఞానస్వరూపిణి అయిన పార్వతియు, స్త్రీలే కదా! వేయేల ! లోకమునందుకూడనూ యెవరికయిననూ స్త్రీలకు జాబులు వ్రాయునపుడు కూడనూ లక్ష్మీసమానురాలయిన అని సంబోధించుట పరిపాటేకదా! మాతాపిత, గౌరీశంకర, లక్ష్మీనారాయణ, సీతారామ, రాధాకృష్ణ, ఇత్యాది స్త్రీవాచక పదములే ప్రయుక్తములయి ఉన్నవి. కాన స్త్రీలకు ఇందులో యెంత గౌరవ స్థానము కలదో గుర్తించవలెను.

(ప్ర.శో.వా.పు.37)

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు

ప్రతి దేహమునందు **ఒక హృదయమున్నది. దీనికే వేదము 'ఆత్మ' అని పేరు పెట్టింది. ఆత్మకే 'ఈశ్వర' అని పేరు.** "ఈశ్వర స్సర్వభూతానాం" ఈశ్వరతత్వం ప్రతి వ్యక్తి యందు, సర్వ భూతముల యందు ఉన్నది. ఇట్టి హృదయమనే ఈశ్వరత్వం నుండియే మనస్సనే విష్ణుత్వం ఆవిర్భవించింది. **"విశ్వం విష్ణుమయం జగత్", అన్నారు. విష్ణువనగా సర్వవ్యాపకుడు. మనస్సు కూడా అట్టిదే. విష్ణువుకున్న** సర్వవ్యాపకత్వం మనస్సుకు కూడా ఉంది. మనస్సు ఏ క్షణమునందైనా ఏ ప్రదేశము నందైనా, **ఏ దేశమునందైనా సంచరించగలదు. కనుకనే, "మనో మూలంమిదం జగత్"** అన్నారు. మనస్సే విష్ణు స్వరూపం. విష్ణువుయొక్క నాభికమలము నుండి ఉద్భవించినవాడు బ్రహ్మ. అట్లే, మనస్సు **నుండి ఆవిర్భవించినది వాక్కు. కనుక, బ్రహ్మ వాక్స్వరూపుడు.** దీనిని పురస్కరించుకొనియే మహర్షులు దివ్యత్వాన్ని "శబ్దబ్రహ్మమయి" అని వర్ణించారు.

ఆత్మ, మనస్సు, వాక్కు - ఈ మూడూ అవినాభావ సంబంధం కల్గినవి. **వాక్స్వరూపుడే బ్రహ్మ; మనోస్వరూపుడే విష్ణువు; ఆత్మస్వరూపుడే శివుడు. కనుక, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు గుణస్వరూపులై ప్రతి మానవుని**

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు

యందున్నారు. వారికి ప్రత్యేకమైన ఆకారములు లేవు. ఆత్మ చైతన్యస్వరూపం (Consciousness) అదే ఈశ్వరత్వం. విశ్వమంతా వ్యాపించినవాడు విష్ణువు; బృహత్స్వరూపుడైనవాడు బ్రహ్మ. ఇట్టి సర్వవ్యాపకులైన బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు అణుమాత్రమైన మానవదేహమునందే ఆవిర్భవించి యున్నారు. **"అణోరణీయాన్ మహతో మహీయాన్".** భగవంతుడు అణువులో అణువుగా, ఘనములో ఘనముగా ఉన్నాడు. బ్రహ్మాండమునందున్న మహత్తరమైన శక్తులన్నీ అణుమాత్రమైన దేహమందే ఇమిడియున్నాయి. బ్రహ్మాండమును మీరెవ్వరూ చూడలేరు? చూచుటకు వీలుకాదు. మీయందున్న బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల తత్వాన్ని మీరు అర్థం చేసుకుంటే విశ్వమునంతటినీ అర్థం చేసుకున్నవారవుతారు. ఎట్టి సంకల్పములూ లేనివాడు ఈశ్వరుడు. హృదయం ఈశ్వరస్వరూపమని గుర్తించినటువంటి వ్యక్తులు ఎట్టి దుర్గుణాలకూ, దురాలోచనలకూ అవకాశ మివ్వరు. **వేదము హృదయాన్ని "నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మలస్వరూపిణిం," అని వర్ణించింది.** ఇట్టి హృదయాన్ని ఈనాటి మానవులు దుర్భావాలతో నింపుకొని దుర్వినియోగ పర్చుతున్నారు. హృదయమే ఈశ్వరుడని గుర్తించి ఈశ్వరభావంతో జీవించాలి. వాక్కే బ్రహ్మ స్వరూపమని గుర్తించి, మృదుమధురమైన వాక్కును పోషించుకోవాలి. మనస్సే విష్ణుస్వరూపమని గుర్తించి మనస్సును పవిత్రంగా ప్రశాంతంగా ఉంచుకోవాలి.

(స.సా.జూలై.2000పు.200/201)

(చూ॥ త్రిమూర్తి స్వరూపులు, ధర్మస్థాపన)

బ్రహ్మసాక్షాత్కారజ్ఞానము

సంయోగమునకు వియోగమే అంత్యము; పుట్టినవాడు గిట్టుటయు, గిట్టినవాడు పుట్టుటయు, ఇవి ప్రకృతియొక్క నియమములు, పుట్టి గిట్టని అనగా, రాకడ పోకడలేని

బ్రహ్మసూత్రములు

స్థితియే బ్రహ్మసాక్షాత్కార జ్ఞానమనబడును. బ్రహ్మము సర్వవ్యాపక తత్త్వము కలవాడు కనుక, రాక పోకలకు వేరు స్థలమెక్కడిది?బ్రహ్మసాక్షాత్కారజ్ఞానము అందరికీ సాధ్యమా, ఇట్టి ప్రాప్తి అందరికీ జేకూరునా? అని, సంశయించ నక్కరలేదు. దీనికి యేశ్రమయు, యేప్రాప్తియు, యే యోగ్యకర్మయూ చేయనక్కరలేదు. నిరంతరము, నీ మనసును పరమాత్మయందు లగ్నముచేసిన చాలు. అనగా, నిరంతరము భగవంతుని ధ్యానించుచుండిన చాలును. అట్టి నిరంతర ధ్యానమే మాలిన్యమైన మనసును నిర్మలము చేయును. మనస్సు యెప్పుడు నిర్మలాకారమును పొందునో, అపుడు మోహము నాశమగును. మోహనాశమే **మోక్షము**. మోహక్షయ మైనవాడు యెట్టి మృత్యువుచేత దేహమును వీడిననూ బ్రహ్మైక్యమును పొందును. అట్టివానినే **'జ్ఞాని'** అని అందురు.

(గీ.పు.160)

బ్రహ్మసూత్రములు

స్వల్ప అక్షరపదాలతో సారభూతమైన అనంత అర్థాన్ని చాలా తక్కువగా సూచించేవి సూత్రాలు. సర్వోపనిషద్వాక్య సుమములను కూర్చిన చేర్చిన వేదాంత శాస్త్రముల ఈ బ్రహ్మసూత్రము.

(సూ.వా.పు.4)

బ్రహ్మసూత్రములు మొత్తము 555 ఉన్నవి. కొంత మంది 449 అని కూడా అందురు. సూత్రమంటె కొలది శబ్దములలో గొప్ప దైన అర్థమును స్ఫురింపజేయునది అని. మీమాంస అనుపదమునకు భారతీయ తత్వశాస్త్రమునందు నిర్ణీతార్థమున్నది. జిజ్ఞాస విషయక సంశయాసంభావనా విపరీత విభావనాది నివర్తక విచారమని దానినిశ్చితార్థము.

(సూ.వా.పు.3/4)

(చూ॥ అథాతో బ్రహ్మజిజ్ఞాసా, ఆనందము)

బ్రహ్మస్వరూపము

త్వమేవ మాతాచ పితాత్వమేవ త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ త్వమేవ విద్యాద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమదేవ దేవ. జగత్తంతయు భగవంతుని స్వరూపమే. ప్రతి అణువునందు, ప్రతి కణము నందు ఉన్నది బ్రహ్మమే. కనిపించు పర్వతములు, గాలిని వీచు వృక్షములు, పారాడే పురుగులు, తినే తిండి, పీల్చేగాలి, ఎగిరే పక్షులు సర్వము బ్రహ్మస్వరూపమే.

చుక్కలన్నియు బ్రహ్మ సూర్యుండు అది బ్రహ్మ
చంద్రుడన్నను బ్రహ్మ జలము బ్రహ్మ
స్వర్గమన్నను బ్రహ్మ వైకుంఠమది బ్రహ్మ
తల్లియన్నను బ్రహ్మ మరి తండ్రి బ్రహ్మ
భాగ్యమన్నను బ్రహ్మ వాల్లభ్యమది బ్రహ్మ
జీవరాసులు బ్రహ్మ జీవిబ్రహ్మ
పుట్టించునది బ్రహ్మ పోషించునది బ్రహ్మ
గిట్టించునది బ్రహ్మ గృహిణి బ్రహ్మ
కర్మలన్నియు బ్రహ్మ కాలంబు బ్రహ్మ
ప్రకృతంతయు బ్రహ్మ మన ప్రేమ బ్రహ్మ
సర్వమును బ్రహ్మ ఈ మహాసభయు బ్రహ్మ
సత్యమును దెల్పునట్టి ఈ సాయి బ్రహ్మ
ఇంతకంటెను వేరెద్ది ఎరుకపరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

భగవంతుడు శక్తిమయుడు. ఆ శక్తియే ప్రకృతి యొక్క ప్రతిబింబము ప్రకృతి యందున్న సమస్త శక్తులు ప్రకృతిలో జీవించే ప్రతి మానవుని యందు ఉంటున్నది. కనుక భగవంతుడు, ప్రకృతి, జీవుడు ఈ మూడు బ్రహ్మతత్వములే. జీవుడు వేరు దేవుడు వేరు కాదు. జగత్తు వేరు జగదీశ్వరుడు వేరు కాదు. సర్వం **విష్ణుమయం జగత్. విష్ణు పురాణము. ప్రకృతి కార్యము. కార్యకారణ స్వరూపుడే భగవంతుడు. భగవంతుని అన్వేషించుటకు ఎట్టి సాధనలు చేయనక్కరలేదు. మనిషి యందు సమస్త శక్తులు యిమిడి ఉన్నవి. అజ్ఞాతమైన స్థాయిలో యిమిడి ఉంటున్నవి. అజ్ఞాతమనగా ఏమిటి? తెలియని స్థితియే.** పాండవులు పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము

బ్రహ్మానందము

మీరు మొట్టమొదట, **'మేము ఆనంద స్వరూపులం' అనే విశ్వాసాన్ని పెట్టుకోండి.** అప్పుడు ఎన్ని కష్టనష్టములు ఎదురైనప్పటికీ మీరు చలించరు, ఆనందాన్నే అనుభవిస్తారు. "బ్రహ్మానందం పరమసుఖదం..'' ఏది మనకు సుఖము? డన్‌లప్‌బెడ్స్ పై నిద్రించడమా సుఖము? ఎయిర్ కండిషన్డ్ గదిలో నివసించడమా సుఖము? మంచి భోజనమా సుఖము? కాదు,కాదు. బ్రహ్మానందమే మనకు సుఖము.

"బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగన సదృశం తత్వమస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం
భావాతీతం త్రిగుణ రహితం...''

ఈ శ్లోకము ఒక్క బ్రహ్మతత్వాన్నే ప్రబోధిస్తున్నది. బ్రహ్మానందమంటే ఏమిటి? **మానవుడు సర్వ సుఖములతో, సకల సౌభాగ్యములతో తులతూగు తున్నప్పుడు అనుభవించే ఆనందాన్ని 'మానవానందము' అన్నారు. దీనికంటే వేయిరెట్లు అధికమైనది గంధర్వానందము. గంధర్వానందము కంటే వేయిరెట్లు అధికమైనది బృహస్పతి ఆనందము. ఈ ఆనందము కంటే వేయిరెట్లు అధికమైనది ప్రజాపతి ఆనందము. దీనికంటే వేయిరెట్లు అధికమైనది హిరణ్య గర్భానందము. దీనినే బ్రహ్మానందము అన్నారు. హిరణ్యమనగా బంగారము. ఇది ఎప్పటికీ చెడిపోదు. అనగా మార్పుచెందే ఆనందము మిథ్యానందము. బ్రహ్మానందమే సత్యమైన ఆనందము. అయితే ఈ ఆనందము ఎక్కడున్నది? ఎక్కడెక్కడోలేదు,** హృదయము నందే ఉంటున్నది. ఆ హిరణ్యగర్భానందము, ఆ ప్రజాపతి ఆనందము, ఆ బృహస్పతి ఆనందము, ఆ గంధర్వానందము, ఆ మానవానందము అంతా మానవ హృదయమునందే ఉంటున్నవి.

(స.సా.మే96పు.115)

ఆనందము 7 విధములు 1. లౌకికమైన భోగ భాగ్యములతో తులతూగుతూ, ఆరోగ్యమైన దేహముకలిగి అన్ని చేసి ఒక సంవత్సరము అజ్ఞాత వాసము చేశారని. **అజ్ఞాత వాసమనగా ఎవరికి తెలియకుండా జీవించటమే.** అట్టులనే సమస్త శక్తులు మానవుని యందు అజ్ఞాత వాసము చేస్తున్నాయి.

(శ్రీ.స.పు.72/73)

బ్రహ్మస్వరూపుడు

"బ్రహ్మ ప్రాప్తి, కొత్తగా సాధించుకునే విషయంకాదు. **జీవుడే బ్రహ్మస్వరూపుడు. "జీవో దేవ సనాతనః"** లౌకిక జగత్తు నందు కూడా జీవుడై యుంటున్నాడు. దేహధారియై మనో ఇంద్రియ సంసర్గముచేత తానుకేవలము మానవుడనని భ్రమిస్తున్నాడు. మేఘముల జలము పరిశుద్ధమై యున్నప్పటికిని భూసంసర్గముచేత మాలిన్యమగుచున్నది. ఇంత మాత్రముచేత జలము యొక్క పరిశుభ్రత సమసిపోదు. అనేక ప్రదేశములందు అనంతకాలము అనేక రూపనామములు ధరించినప్పటికిని సముద్రము తన స్వభావము కోల్పోదు. అటులనే దేహమును మనస్సును, ఇంద్రియములను చేర్చుకొన్న జీవత్వము ఎంత కాలమైనప్పటికిని ఎన్ని విధములైన నామరూపములు మారినప్పటికిని బ్రహ్మతత్వము లక్ష్యమునందు ఉంచుకొనవలసి వస్తుంది. **"మమైవాంశో జీవలోకే జీవభూత సనాతనః"** అని గీత బోధించింది. సనాతనమైన నా అంశమే సర్వశరీరములయందు సర్వత్రా ప్రకాశించుచున్నది. దీని భావము **"శృణ్వంతువిశ్వే అమృతశ్యపుత్రాః"** ప్రతి మానవుడు అజ్ఞానమువలన తాను మానవుడనని భ్రమించుచున్నాడు. కాని నిజముగా అమృత పుత్రుడని వేదము ఎలుగెత్తి చాటు చున్నది.

(సా.పు.234)

బ్రహ్మండము

"యథాండాండే తథా బ్రహ్మాండే'' అన్నారు. అండాండమ వ్యష్టిగతము బ్రహ్మాండము సమిష్టి స్వరూపము తనను తాను గుర్తించుకున్న వ్యక్తి సర్వమును గుర్తించగలడు.

(బృ.త్ర.పు.142)

బ్రహ్మానుభవ ఉపనిషత్తు

విధములైన అనుకూలములు కలిగి యున్న ఆనందం. **మనుష్యానందము** 2. దానికంటె నూరురెట్లు అధికమైన ఆనందము **పితృదేవతానందము** 3. దానికంటె నూరు రెట్లు ఆనందము **గంధర్వానందము.** 4. దాని కంటె నూరురెట్లు అధికమైన ఆనందము **దేవానందము.** 5. దాని కంటె నూరురెట్లు అధిక ఆనందము **విరాట్ పురుష ఆనందము.** 6. దానికంటే నూరురెట్లు ఆనందము **ప్రజాపతి** ఆనందము. 7. దానికంటె నూరురెట్లు అధిక ఆనందము **హిరణ్య గర్భానందము.** దానికంటె నూరురెట్లు ఆనందము బ్రహ్మానందము. బ్రహ్మానందము ఎంతటితో కూడినదో మీరూహించు కొనవచ్చును. ఈనాడు కొడుకు పుట్టినా బ్రహ్మానందంగా వుందంటారు. క్లాసులో ఫష్టక్లాసు మార్కులు వచ్చినా బ్రహ్మానందంగా వున్నదంటారు. ఈ ఆనందముకున్నూ బ్రహ్మానందముకున్నూ ఎన్ని కోట్ల మైళ్ల దూరము. **బ్రహ్మ భావముతో ఆనందిచడమే బ్రహ్మానందం. ఆ బ్రహ్మానంద తత్వమే మోక్షప్రాప్తి.**

(సా.పు.533/534)

(చూ॥ పేరాస)

బ్రహ్మానుభవ ఉపనిషత్తు

"ఏకమేవాద్వితీయంబ్రహ్మ" అని శ్రుతులు ఘోషించు చున్నవి. అనగా పరబ్రహ్మము తప్ప మరియొకటేదియు లేదనియు, సర్వకాల సర్వావస్థలయందును ఉండు వాడనియు అర్థము. ఛాందోగ్యోపనిషత్తు ప్రకారము ప్రథమమున నొక సత్తు మాత్రముండెను. అట్లే, శాంతం, శివం, అద్వైతము అని మాండూకోపనిషత్తు చెప్పెను. ఈ లోకములో వివర్తము పైకి కనబడునది మాత్రమే. ద్వివిధ రూపము కాజాలదు. మనకు కనబడు భిన్న భిన్న రూపములన్నియు మన కల్పనామయమగుట వలననూ, వాసనామయ మగుటవలననూ కలుగుచున్నవి. దీపము తెచ్చి చూచిన తక్షణమే పాము అని భ్రమింపబడుచున్న త్రాడు ఎట్లు బయటబడుచున్నదో అట్లే **ద్వంద్వరహితుడై పరబ్రహ్మజ్ఞానముతో చూచిన వానికి ప్రపంచము మీద భ్రమ మయమగుచున్నది. ద్వివిధములుండు చోటునే భయము.** చూచువాడు, వినువాడు, చేయువాడు, ఆనందించువాడుతానే అయియుండినపుడు భయమెట్లు కలుగును? నిద్రలో నున్న స్థితిని తెలిసి కొందుము. నిద్రపోవుచున్నపుడు ప్రపంచమంతయూ మాయమగుచున్నది గదా? రెండవదనునది లేకయే సర్వత్ర ఏకత్వమునే అనుభవించుచున్నాము. అట్టి ఏక స్వరూపుడైన పరమేశ్వరునిలో విశ్రమించుచుంటిమి. పరమభక్తుడైన జ్ఞానికి అట్టి అనుభవము కలుగుచున్నది. పరబ్రహ్మము సర్వవ్యాప్తమైన ప్రాణ వాయువు వలె చిదాకారుడై యున్నాడు. **సత్తు, చిత్తు, ఆనందము, పరిపూర్ణము, నిత్యము అనెడి ఐదు గుణములచే పరబ్రహ్మము బాగుగా కొనియాడబడుచున్నాడు.** ఈ గుణములను తలచుకొనుచు పరమాత్మను కనుగొనవలెను. త్రికాలములలో నుండునది సత్; తన్ను తాను తెలిసికొని ప్రకాశింప జేసికొని ఇతరులను ప్రకాశింపజేయునదియే చిత్తు. ప్రతివానికిని పరమ ప్రీతికర మైనది ఆనందము. ప్రాకభావ, ప్రధ్వంసాభావ, అన్యోన్యాభావముల నుండి విముక్తి పొందినవాడే నిత్యుడు. **ఇచ్ఛారహితుడైవాడే పరిపూర్ణుడు.**

(ఉ.వా.పు.80/81)

బ్రహ్మాభ్యాసము

జీవబ్రహ్మములయొక్క ఏకత్వమును దృఢముగా గుర్తెరిగి అసంభావన - **విపరీతభావములనుండి సంశయ నివృత్తి గాంచుటయే దృఢ అపరోక్ష బ్రహ్మజ్ఞాన మనబడును.** అట్టి దివ్యమయిన జ్ఞానోదయము వలన అభాస అపర్ణము తొలగిపోవును.

బ్రహ్మజ్యోతి నాయందు వెలుగుటలేదు అనెడి తప్పు అభిప్రాయమునే అభాస ఆవర్ణమని అందురు. ప్రతి జీవి హృదయ మందు పరమాత్మ సూక్షమున అతి సూక్ష్మముగాను, గొప్పలో అతి గొప్పగాను వున్నాడు.

కావున అంతరంగ మందున్న ఆత్మ సందర్శనము చేయగలిగిన జ్ఞాని ఎన్నడును దుఃఖింపడు. ఆత్మ సర్వభూతములందూ చీమ మొదలు ఏనుగు వరకూ సర్వత్రా ఉన్నది. ప్రపంచము అతిసూక్ష్మమగు ఆత్మచేత వ్యాపింపబడినది. సాధకుడు ప్రపంచ ధోరణిని త్యజించి, అంతర్ముఖుడై ఆత్మ యందు దృష్టి మరలింపవలెను. మనోవృత్తులన్నియు ఎచ్చట నుండి ఉత్పన్న మగుచున్నవో గ్రహింపనగును. అట్లు గ్రహించి నచో సంకల్పములన్నియు నాశనమగును. అటు తరువాత, బ్రహ్మాకారవృత్తి నిరంతరాయముగ గల్గును. దాని వలన సాధకుడు సచ్చిదానంద స్వరూపస్థితియందు స్థిరపడును.

అట్టి జ్ఞానిని ఎట్టి సుఖదుఃఖములును అంటజాలవు. తాను ఆత్మానంద సాగరమున పూర్తిగా మునిగి ప్రపంచమున కతీతుడై యుండును **ఆత్మచింతన అనెడి పదమునే బ్రహ్మాభ్యాసమనియు, జ్ఞానాభ్యాసమనియు కూడా వాడుదురు.**

(జ్ఞా.వా.పు.9/10)

(చూ॥ బ్రహ్మచింతన)

బ్రహ్మార్పణము

పిల్లలు భోజనం చేసే ముందుగా భగవంతుని ప్రార్థించి భోజనం ప్రారంభిస్తారు. ఏవిధంగా ప్రార్థిస్తున్నారు?

బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం
బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మ కర్మ సమాధినా.

బ్రహ్మార్పణం చేస్తున్నామంటున్నారు. ఈ బ్రహ్మ మీలోపలనే ఉన్నాడు. కదా. అందువల్ల తక్షణమే జవాబు వస్తున్నది. ఏమని?

అహం వైశ్వా నరోభూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః
ప్రాణా పాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్.

"నేను వైశ్వానర రూపంలో నీలోనే ఉండి, నీవు భుజించిన ఆహారాన్ని జీర్ణం చేస్తున్నాను" అని. లేకపోతే నీ కడుపులోకి పోయిన ఆహారాన్ని ఎవరు జీర్ణము చేస్తున్నారు? దేహములో సంచరించే రక్తమునకు ఆక్సీజను ఎవరిస్తున్నారు? 24 గంటలు నీ గుండె కొట్టుకోటానికి ఎవరు మిషను పెట్టారు? అంతా భగవంతుని సృష్టియే. ఇది అగమ్యగోచరమైనది; ఎవరూ అర్థము చేసుకోవటానికి వీలుకానిది. భగవంతుడు ఈ సృష్టియందు మానవత్వానికి తగిన తెలివితేటలను, ప్రత్యేక జ్ఞానాన్ని కూడా అందించాడు. **దీనినే వేదం "ప్రజ్ఞానం బ్రహ్మ" అన్నది. దీనినే Constant Integrated Awareness అన్నారు.** ఇది మార్పు చెందనిది: ఏ సమయమునందైనా నిశ్చలంగా ఉండేది.

(ద.స.98 పు.90)

(చూ॥ ప్రార్థన)

బ్రాహ్మణాలు

బ్రాహ్మణాలు మంత్ర భాగవ్యాపక రూపాలు. ఆయా యాగములను వాటి స్వరూపాలను చక్కగా వివరిస్తాయి. ఇవి ఐతరేవ బ్రహ్మణమని, తైత్తిరీయ బ్రహ్మణమని, శతపథ బ్రాహ్మణమని గోపద బ్రాహ్మణమని అనేక విధముల కలవు.

(లీ.వా.పు.6)

బ్రాహ్మణుడు

బ్రహ్మనిష్ఠగలవాడే బ్రాహ్మణుడు. అసత్య పక్షమును ధిక్కరించువాడే క్షత్రియుడు: సదా సద్విచారము చేయజాలెడి వ్యవసాయాత్మిక బుద్ధిగలవాడే వైశ్యుడు: కర్మనిష్ఠా సత్యాచరణను సల్పువాడే శూద్రుడు; మానవత్వము పొందుటకు ఈ నాలుగు వృత్తులు ఆత్యావశ్యకము.

(గీ.పు.79)

బ్రాహ్మణులు ద్వేష బుద్ధితో మిగిలిన **కులములవారిని వేదములు చదవనీయకుండా చేశారని కొందరు భావిస్తున్నారు.** అది సరికాదు. మీరు ఒక చేపను పట్టుకొనటానికి వెళ్ళేటప్పుడుఒక పొడుగాటి ఇనుపచువ్వ, దానికొక కొక్కెము, ఆ చేపను ఆకర్షించే ఆహారము

బ్లడ్డు, ఫుడ్డు, దుడ్డు

ఇవన్నీ కూడా తీసికొని వెళ్ళాలి. **మీరు వేదములను వశం చేసుకోవాలంటే మీకు ధార్మిక జీవనం అనే ఇనుపచువ్వ ఉండాలి, వైదిక సంస్కృతం అనే కొక్కెము ఉండాలి. వేదములచేత గౌరవింపబడే బ్రాహ్మణుడు తిరిగి ఆ వేదములను గౌరవిస్తాడు.** అటువంటి ఆకర్షణీయమైన ఆహారం కూడా ఉండాలి. బ్రాహ్మణుడు తనను తాను పరిశుద్ధమొనర్చుకొనే అనేక ఆచారాలు, సంస్కారాలు పాటించటానికి సిద్ధంగా ఉంటాడు. ఇది అతడు మంత్రాలను ఉచ్చరించటానికి, ఎదుటివారికి చెప్పటానికి అర్హత కలిగిస్తుంది.

ప్రతివారికి ఉదాత్తమైన భావాలు ఉండవు. మీరందరూ నామాటలు వింటున్నారు కదా! మీకందరికి నేను చెప్పినవి చెప్పినట్లు అర్థమవుతున్నాయా? లేక నేను చెప్పినవి చెప్పినట్లు మీరేమైనా ఆచరిస్తున్నారా? లేదు. ప్రతివారు వారి వారి స్వభావములను బట్టి, వారి మానసిక ప్రవృత్తిని బట్టి అర్థం చేసికొనటం కాని, ఆచరించటం కాని ఉంటుంది. మానవులందరూ ఒకే విధంగా ఉండరు. **ఒకవ్యక్తి మరొక వ్యక్తి వలె ఉండడు. మానవులంతా యాత్రికుల బృందమే.**

బ్రాహ్మణుడు పుట్టుకతో శూద్రుడే. బ్రాహ్మణకులములో పుట్టినంత మాత్రముచేత అతడు వేదపండితుని కుమారుడైనప్పటికీ వేదపఠనకు అర్హుడు కాడు. అతనికి సంప్రదాయానుసారంగా శాస్త్రోక్తంగా ఉపనయనం జరిగిన తరువాతనే అతడు బ్రాహ్మణుడు అవుతాడు. అతడు అప్పుడు అధ్యయన ప్రపంచంలో తిరిగి జన్మించినట్లు. చాలామంది బ్రాహ్మణులు ఆస్తికతతో కూడిన నిరాడంబరత్వాన్ని, పాండిత్యస్థాయిని కోల్పోతున్నారు. స్వచ్ఛమైన లోహము కలుషితమైనప్పుడు దానిని మరల మూసలో పోయాలి. ఇటువంటి స్వచ్ఛమైన పాత్రల వంటి వేదపండితులు కనిపించినప్పుడు మనం వారిని రక్షించాలి. కొందరు ద్వేషపూరితమైన తెలివిమాలినవారు రాళ్ళు విసిరితే ఈ పాత్రలు పగిలిపోతాయి. వేదములు కూడా దూరమైపోతాయి.

బ్రాహ్మణులు వేద సంరక్షకులు కాబట్టి బ్రాహ్మణుల్ని అడవిలోకి తరిమివేస్తే, వేదాలు కూడా అడవిలోకి వెళ్ళి పోతాయి. వేదములను స్పష్టంగా ఉచ్చరిస్తూ, అద్భుతమైన జ్ఞాపకశక్తితో వాటిని ఎన్నో యుగాలనుంచి కాపాడుతూ, భారతదేశం ఎన్ని ఉత్పాతాలు ఎదుర్కొన్నప్పటికి వాటిని నిలిపి ఉంచినవారు బ్రాహ్మణులు. ఒక బాలుడు ఇంటి దగ్గర ఇంగ్లీషు పాఠం చదువుతున్నాడు. అతడు చదివే విధానం తల్లిదండ్రులకు ఎంతో ఆందోళను కలిగించింది. "మిల్క్" అనే పదాన్ని ఎమ్,ఐ,ఎల్,కె మిల్క్; ఎమ్,ఐ,ఎల్,కె మిల్క్ అని వేగంగా చదువసాగాడు. తల్లిదండ్రులు అది విని అమ్మా ఎలుక, అమ్మా ఎలుక అని భయపడిపోతూ పిలుస్తున్నాడని భావించారు. ఉచ్చారణ స్పష్టంగా ఉండాలి. బ్రాహ్మణులు వేదం చక్కగా చదవటానికి వారిని ప్రోత్సహించండి. వారి వేదపఠనం వల్ల మీకు ఇన్ని రోజులూ ప్రయోజనం కలిగినట్లుగానే ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

(వ. 61-62పు.220/221)

(చూ॥ అద్వైతదర్శనము, వేదములు)

బ్లడ్డు, ఫుడ్డు, దుడ్డు

ఈనాటి విద్యార్థులు అమితంగా డబ్బులు ఖర్చుపెడుతున్నారు. తల్లిదండ్రులు ఎంత కష్టపడి డబ్బులు పంపిస్తున్నారో మీరు గుర్తించాలి. వారు చెమటోడ్చి ఎంతో కష్టపడి సంపాదించి, వారు కడుపునిండా తినక, మిగిల్చి మీకు పంపిస్తుంటారు. వారు కష్టపడుతూ కూడా, మీకు సుఖాన్ని అందించాలని మీకు డబ్బు పంపుతూ ఉంటారు. కనుక ప్రతిపైసా మన రక్తం బొట్టుతో సమానంగా చూచుకోవాలి. మన బ్లడ్డు మన దుడ్డు, వేస్టు (వ్యర్థం)చేయకూడదు. నీ దుడ్డు అంతా కూడా నీ తల్లిదండ్రుల రక్తపు బొట్లే (బ్లడ్‌డ్రాప్స్). అవసరమైన దానికే ఖర్చుచేయి! అమితంగా మాత్రం వ్యర్థం చేయకు! ఈనాడు విద్యార్థులు కాలేజీ ఎన్నికలలో అసెంబ్లీ ఎన్నికల కన్నా ఎక్కువ ఖర్చు పెడుతున్నారు. ఎన్నకలలో గెలిచిన

తరువాత 'పిక్‌నిక్' ల పేరుతో చాలా డబ్బు ఖర్చు చేస్తుంటారు. ఇది చాలా దుర్వినియోగం. ఇది ఏమాత్రం మంచిది కాదు. మీ భవిష్యత్తును గురించి కూడా కొంత యోచించాలి. తల్లిదండ్రుల పరిస్థితిని కూడా చింతించాలి. పంపుతున్నారు గదాయని ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేయకూడదు.

Don't waste time.
Time waste is life waste.
Don't waste food.
Food is God.
Don't waste money.
Misuse of Money is Evil
Don't waste Energy.
Energy is God.

మన చూపు God మన వినికిడి. God, మన మాటలు.. మన వాసన God మన పనులు God. మనం అంతా దైవాన్ని Waste (వ్యర్థం) చేస్తున్నాం. కనుక ఈ Energy (శక్తి) ని ఎంత పవిత్రంగా మనం ఉపయోగ పెట్టుకుంటే, అంత పవిత్రమైనటువంటి దివ్యత్వాన్ని నీవు చేరవచ్చును. **ఈ Energy (శక్తి)ని Waste (వృథా) చేసుకోవటంచేతనే Elergy (చెడు)గా మారి పోతున్నారు. పవిత్రమే (Purity) సర్వమునకూ మూలకారణము.**

(శ్రీ.న.96.పు.51)

భక్తపరాధీనుడు

భక్తపరాధీనుడు

నేను భక్తపరాధీనుడను. సామాన్య మానవరూపంలో నేను మితో కలసిమెలసి సంచరిస్తూ ఆడుతూ పాడుతూ ఉన్నప్పటికీ నా శక్తిని, నా స్వభావమును ఎంతటి మేధావులైనా అర్థం చేసుకోలేరు. మానవత్వాన్ని ఏకత్వపరచి, ఆత్మతత్త్వాన్ని నిరూపించి దైవత్వస్థానంలో చేర్చటమే నా లక్ష్యం. నాలో ఉన్నటువంటిది ఎటువంటి కొలతలకూ అందనిది, పరిమాణమునకు అతీతమైనది, పరిశోధనలకు అంతుపట్టనిది. అదియే ప్రేమ. నా ప్రేమతత్త్వమును గుర్తించి అనుభవించినవారు మాత్రమే నన్ను కొంతవరకు తెలిసికొనగలరు. నా అనుగ్రహాన్ని పొందినప్పుడు మీకు అనంతమైన జగత్తే లభిస్తుంది. అమూల్యమైన వజ్రమును నేనుండగా తుచ్ఛమైన, అశాశ్వతమైనవాటికొరకు ఎందుకు ప్రాకులాడెదరు? నన్నే కోరండి. ప్రేమతో, భక్తితో కోరినట్లయిన నేను తప్పక లభిస్తాను.

(స.సా.న.2000 వెనుకపుట)

(చూ॥ భగవంతుడు)

భక్త మార్కండేయుడు

భక్తుల అభీష్టములు మంచివైతే భగవంతుడు వాటిని తప్పక నెరవేరుస్తుంటాడు. ఈశ్వరత్వాన్ని నమ్ముకున్న వ్యక్తులకు ఎంతటి మేలైనా చేస్తాడు. ఈశ్వరుడు మార్కండేయునికి 16 సంవత్సరాల ఆయుర్దాయమును ప్రసాదించాడు. కాని, ఈ విషయం మార్కండేయునికి తెలియదు. ఒకనాడు ఇంట్లో అతని తల్లి ఒకప్రక్క, తండ్రి ఒకప్రక్క ఏడుస్తూకూర్చున్నారు. మార్కండేయుడు కారణమడుగగా, "నాయనా! మా దురదృష్ట మేమని చెప్పాలి? ఈనాటితో నీ ఆయువు తీరిపోతున్నది," అన్నారు. వారిద్వారా తన జన్మరహస్యాన్ని తెలుసుకుని మార్కండేయుడు "నేనీ పదహారు సంవత్సరాలను వ్యర్థం చేశాను. ఇంక ఒక్క క్షణంకూడా వ్యర్థం చేయను," అని తక్షణమే శివాలయమునకు వెళ్ళాడు.

ఈశ గిరీశ నరేశ పరేశ పన్నగభూష విభో!
సాంబసదాశివ శంభో శంకర
శరణం మే తవ చరణయుగళం

అని ప్రార్థిస్తూ శివలింగాన్ని గట్టిగా కౌగిలించుకున్నాడు. అతనికి కాలం తీరిపోయింది. యముడు వచ్చాడు. ఇతనికి పాశం ఎట్లా వేసేది? అని ఆలోచించాడు. ఆలోచించకూండా యముడు ఏ పనీ చేయడు. మార్కండేయుని శిరస్సు ఈశ్వరుని శిరస్సుతో చేరియుండటంచేత మార్కండేయునికి మాత్రమే పాశం వేయటానికి వీల్లేదు. కాని, గడువు తీరిపోయేలోపల ప్రాణం తీసుకొని పోవలసిందే! గత్యంతరం లేక యముడు పాశం విసిరాడు. అది ఈశ్వరునికి కూడా తగిలింది. తక్షణమే ఈశ్వరుడు ప్రత్యక్షమై "ఒరేయ్ యమా!నాకు కూడా పాశం వేసే స్థితికి వచ్చావా నీవు!" అని అతనిని భస్మం చేసి, మార్కండేయునికి చిరంజీవత్వాన్ని ప్రసాదించాడు. మార్కండేయుడు అచంచలమైన విశ్వాసంతో, దృఢదీక్షతో ఈశ్వర ప్రార్థనలో లీనమైపోవడం చేతనే ఈశ్వారానుగ్రహపాత్రుడైనాడు. **"యద్భావం తద్భవతి"**. ఎలాంటి తిండియో అలాంటి త్రేపు; ఎలాంటి పూజనో అలాంటి ఫలితం. ఈ సత్యాన్ని మీరు గుర్తించి హృదయాన్ని పరిశుద్ధపర్చుకోండి. **"నా హృదయమే ఈశ్వరుడు, నా మనస్సే విష్ణువు, నా వాక్కే బ్రహ్మ" అని పూర్తిగా విశ్వసించి వాటిని సద్వినియోగపర్చుకుంటే మీకు తప్పక సద్గతి కల్గుతుంది; మీరు తప్పక దైవంలో లీనమౌతారు.**

ఈనాడు దీపక్ ఆనంద్ మీకు చక్కని అవకాశము నందించాడు. అతడు ప్రార్తించడం చేతనే నేను బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను గురించి చెప్పవలసివచ్చింది. లేకపోతే చెప్పేది లేదు. మీకు తెలియని రహస్యాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. దైవతత్వంలోని రహస్యాలను తెలుసు కొనక మీరు కాలాన్ని వ్యర్థం చుస్తున్నారు.

ప్రేమస్వరూపులారా! **కాలం భగవత్స్వరూపం. కనుకనే, భగవంతుణ్ణి "కాలాయనమః కాల కాలాయనమః కాలదర్పదమనాయనమః కాల స్వరూపాయనమః కాలనియమితాయనమః.." అని వర్ణిస్తున్నారు. కనుక, మంచి మాటలతో, మంచి మనస్సుతో, మంచి హృదయంతో కాలాన్ని సద్వినియోగపర్చుకోండి.** అన్నింటికీ ప్రేమను ఆధారంగా తీసుకోండి.

(స.సా.జులై 2000 పు.204/205)

(చూ॥ కర్మదాటవశమా)

భక్తరక్షణ

(చూ॥ అవతార లక్షణము, దివ్యప్రకటనలు)

భక్త వత్సలుడు

(చూ॥ విశ్వరూపము)

భక్త సులభుడు

పంచ భూతాత్మకమగు ఈ చక్షువులు, పంచభూత సంబంధమైన వస్తువులను మాత్రమే చూడ గలవు. అప్రకాశ వస్తువులు యెంత ప్రకాశవంతమైన యెంత విలువైన సువర్ణ రత్నములనైననూ ప్రకాశింప జేయజాలవు. దీపము స్వప్రకాశమై తన్నుతాను, ఇతర వస్తువులను యెట్లు ప్రకాశింప జేయునో అటులనే **భగవంతుడు స్వయం ప్రకాశకుడును, జ్ఞాన స్వరూపుడును, అప్రాకృతుడును అగుటచే అతనిని జ్ఞాన దృష్టిచే మాత్రమే చూడనగును.** అట్టి జ్ఞాన దృష్టికూడనూ స్వయముగా కలుగుట దుస్సాధ్యము, ఈశ్వరానుగ్రహము వలననే గలుగవలెను. అందువలన ఈశ్వరోపాసన అవసరము. అది లేనివారికి అన్నియూ లేనట్లే. **తనను తాను చూడలేనివాడు ఇతరములను మాత్రమేమి చూగడలడు! ఈశ్వరాను గ్రహమును పొందగల్గినట్టి సాధన చేసిన, జ్ఞాన నేత్రము తానే అందించగలడు! అతను భక్తసులభుడు.**

(గీ.పు.182)

భక్తసూరదాసు

ఒక పర్యాయము సూరదాసు ఎవరో పరస్త్రిని చూసినందుకు ప్రాయశ్చిత్తంగా తన కళ్ళను తానే పొడుచుకున్నాడు.

భక్తి

అప్పటి నుండి కృష్ణచింతనలో కాలం గడుపుతూ వచ్చాడు. ఒకనాడతడు ద్వారకకు ప్రయాణమై వెళుతూ ప్రమాదవశాత్తు దారిలో ఒక పాడుపడిన బావిలో పడబోయాడు. అతడు నిరంతరము కృష్ణనామాన్ని స్మరిస్తూ ఉండడంచేత కృష్ణుడే ఒక గొల్లపిల్లవాని వేషంలో వచ్చి అతణ్ణి పడిపోకుండా పట్టుకొని "దాసుగారూ! ఎక్కడికి వెళ్ళాలి" అని అడిగాడు. "నాయనా! నేను ద్వారకకు వెళ్లాలి" అని చెప్పాడు. "అయితే నేను దారి చూసిస్తాను. కానీ ఇప్పుడు చీకటి పడుతోండి. ఇక్కడ సమీపంలోనే ఒక సత్రం ఉంది. ఈ రాత్రికి అక్కడ ఉండండి. రేపు ఉదయమే వచ్చి మిమ్మల్ని తీసుకు వెళతాను" అన్నాడు. "నాయనా! నీవు వెళ్ళిపోతే మళ్ళీ వస్తావో రావో! కనుక నీవు వెళ్ళకూడదు" అని గట్టిగా ప్రార్థించాడు. అంతేకాదు. "నీవు నా ప్రక్కనే పడుకో. నీ చేయి నాపైన వేసుకో, నా చేయి నీపైన వేసుకుంటాను. అప్పుడు నీవు నా ప్రక్కనే ఉన్నావన్న ధైర్యం నాకుంటుంది" అన్నాడు. ఆ రాత్రి సూరదాసు కృష్ణునిపై చేయి వేసుకొని నిద్రించాడు. **స్పర్శనం కర్మవిమోచనం, సంభాషణం సంకట నాశనం!** కృష్ణుని స్పర్శచేత అతనిలో దివ్యమైన జ్ఞానం ఆవిర్భవించింది. తెల్లవారి లేచిన తరువాత కృష్ణుడు "సూరదాసూ! **నేనే కృష్ణుణ్ణి. నీ అజ్ఞానాన్ని దూరం గావించే నిమిత్తమై నేనీవిధంగా నాటకమాడాను" అని పలికి అతని కన్నులను ఒక్కతూరి స్పృశించాడు. తక్షణమే అతనికి చూపు వచ్చింది. కృష్ణుని దివ్య మంగళ స్వరూపాన్ని తనివితీర దర్శించాడు. "కృష్ణా! నిన్ను చూసిన కన్నులతో ఇతరులను చూడడానికి నేనిష్టపడను. ఇంక నాకీ కన్నులు అక్కరలేదు.** ఈ ప్రపంచంలో ఎంతో మందికి కన్నులున్నాయి. కానీ ఏమి ప్రయోజనం? కన్నులుండి గ్రుడ్డులై కల్యాణకరమైన నీ మూర్తి దర్శింపనేరరైరి. నేను నీ రూపాన్ని చూశాను. నాకింతే చాలు. కనుక నాకీ చర్మచక్షువులు అవసరం లేదు. జ్ఞానచక్షువును ప్రసాదించు" అని ప్రార్థించాడు. అప్పుడు కృష్ణుడు అతని తలపై చేయి పెట్టాడు. **అతని ప్రాణం కృష్ణునిలో లీనమై పోయింది.** ఈవిధంగా **ఎప్పుడు ఎక్కడ ఏ పరిస్థితిలో దైవానుగ్రహం లభిస్తుందో ఎవ్వరూ చెప్పలేరు. కనుక మీరు నామస్మరణ చేస్తూ ఎల్లప్పుడు సిద్ధంగా ఉండండి.**

(స.సా.ఆ.98పు.217/218)

భక్తి

"భక్తిరేవ పరమార్థదాయిని
భక్తిరేవ భవరోగనాశిని
భక్తిరేవ పరమార్థదాయిని
భక్తిరేవ పరమోక్షకారిణి"

ప్రేమస్వరూపులైన విద్యార్థినీ, విద్యార్థులారా!

ప్రాచీన కాలము నుండి భారతదేశము ఆధ్యాత్మిక తత్త్వ ప్రభావముతో, యావత్ ప్రపంచమునకూ భక్తిని చాటుతూ వచ్చింది. **'భక్తి' అనగా కేవలము జపము, ధ్యానము, పూజలు, పురస్కారములు - ఇత్యాది అంతములుకావు. భగవంతునిపైగల ప్రేమయే 'భక్తి'. కర్మఫల సంసర్గముచేత కలుషితముకానటువంటి యొక్క నిశ్చల, నిర్మల నిస్వార్థమైనటువంటి ప్రేమనే భక్తి. ఇట్టి ప్రేమకు ఎట్టి నిబంధనలూలేవు. ఎట్టి హద్దులూలేవు. మానవుని నుండి ఆవిర్భవించినటువంటి నిజమైనటువంటి ప్రేమతత్త్వమే ఈ భక్తి. వాంఛలతో కూడినటువంటి ప్రేమ భక్తికానేరదు.** అయితే భగవత్ వాంఛలు తప్ప, ప్రాకృతమైన వాంఛలు ఉండరాదు. అప్పుడు భక్తుల హృదయము నుండి ఆవిర్భవించేటటువంటి ప్రేమతత్త్వము సరాసరి దైవమునకే చెందుతుంది. కష్టసుఖములయందుగాని, ఆనంద దుఃఖముల యందుగాని, ఇది ఏ మాత్రమూ మార్పు చెందకూడదు. ఈ విధముగా ఏకాత్మభావంతో సాధించినవాడు పాండవ అగ్రజుడైన ధర్మజుడు. **'భక్తి' అనేది నవవిధమార్గముల ద్వారాను, ఆరాధనల చేతనూ, ఆనంద భజనచేతనూ నిరూపించేటటువంటిది కాదు. హృదయమానస సరోవరము నుండి ఆవిర్భవించే టటువంటి ప్రేమజలమే భక్తి.** కనుకనే వేదమునందు 'పత్రం' అనగా ఆకులలములుకావు. దేహమే **ఒక పత్రం.**

ఈ దేహమనే పత్రముఎప్పుడు రాలుతుందో? ఎప్పుడు కూలుతుందో? ఎప్పుడు కాలుతుందో? వేసవి వచ్చేటప్పటికీ ఏ విధంగా ఆకులు రాలిపోతుంటాయో, అదే విధంగా కాలం గడిచేటప్పటికీ దేహం కూడా రాలిపోతుంది. కనుక హే భగవాన్! ఈ దేహమనే పత్రమును నీకు అర్పితం చేస్తున్నాను. నీవు యిచ్చిన దేహమునే నీకు పత్రముగా సమర్పించుకుంటున్నాను. ఇక 'పుష్పం'. ఏమిటి ఈ పుష్పం. హృదయ పుష్పం. జాజి, మల్లె పుష్పములుకావు. అవన్నీ సాయంత్రానికి వాడిపోయేవే. వాడనటువంటిది నా హృదయపుష్పము మాత్రమే. అది పరిశుద్ధమైనటువంటిది, పరిపూర్ణమై నటువంటిది, ప్రేమతో కూడినటువంటిది, కనుక నా హృదయ పుష్పమును నీకు సమర్పించుకుంటున్నాను. ఇక **'ఫలం'**. నీకు ఏ ఫలం కావాలి? జామ యాపిల్, ఫలములా? ఆ ఫలములన్నీ ప్రాకృతమైనవే. నా మనసే నిజమైన ఫలము. ఆ ఫలమును నీకు అర్పిస్తున్నాను. అనగా నా మనసును నీకు అర్పిస్తున్నాను. ఇక **'తోయం'**. తోయం అంటే పంపు నీరు, బావినీరు, నదినీరుకాదు. నిన్ను చింతిస్తూ నీ యొక్క లీలలు ఆనందిస్తూ, ప్రేమతత్వాన్ని అనుభవిస్తూ కార్చే కంటిధారలే ఆనందభాష్పాలు. ఇట్టి ఆనందభాష్పములే నిజమైన తోయం. ఇటువంటివే భక్తులు, భగవంతునికి సమర్పించాలి. భగవంతుడు కూడా ఆశించేది అదే. అంతేగాని క్షణభంగురమైన పత్రపుష్పఫలములుకాదు. ఒక పర్యాయం సత్యభామ భౌతికమైన ధనకనక వస్తువాహనాదులతో కృష్ణుని తూచడానికి ప్రయత్నించింది. భగవంతుడు వీటికి తూగుతాడా? తూగలేదు.ప్రేమకు మాత్రమే తూగుతాడు. రుక్మిణి వచ్చింది. కృష్ణా! అంటూ ఒక తులసిదళం వేసింది. కృష్ణనామముతో కృష్ణుని తూచింది. తులసీదళం ఎక్కువ బరువైంది. కనుక భక్తికి చిక్కుతాడు కాని భగవంతుడు, ధనమునకు కాదు. భక్తికంటే మించిన వస్తువు ఈ జగత్తులో మరొకటిలేదు. కనుకనే భారతదేశంలో ప్రాచీనకాలము నుండి భక్తికి ప్రధానమైన స్థానం యివ్వబడింది. భక్తికి మించిన ధనం మరొకటిలేదు. భక్తికి సమానమైన తూకం మరొకటిలేదు.

(శ్రీ.సె.2000పు.20/21)

భక్తి ! భక్తి! భక్తి! మొట్టమొదట ఈ భక్తి అనేది యేమిటో భక్తి స్వరూప స్వభావాలు యేమిటో గుర్తించటానికి ప్రయత్నించాలి. **భగవంతునిపై గల అనురక్తియే భక్తి.** భగవంతునిపై గల అనురక్తి భక్తియని చెప్పుకోవటం ఒక పెద్ద వాక్యములాగా పుంటుంటాది. **భగవంతుని యందుండే భకారమనే జీవనశక్తిని, అనురక్తియందున్న 'క్తి' అనే జీవశక్తిని జేర్చి భక్తియని సులభముగా చెప్పినారు. ఈ భక్తిని మాత్రమే పోషించుకుంటూ పాయినప్పుడు, శక్తి రక్తి, ముక్తి అనురక్తి అన్నీ మనకు ప్రాప్తిస్తూ పుంటాయి. మానవునికి అనురక్తి అనేది ప్రాణము వంటిది. యాజ్ఞవల్క్యుడు చెప్పినట్టుగా ఎవరు యెవరిని ప్రేమించినప్పటికినీ తన నిమిత్తము ప్రేమిస్తున్నాడే గాని పరుల నిమిత్తము కాదు అనే సత్యము అర్థమవుతుంది.**

(శ్రీ.గీ.పు.37)

ఒకానొక సమయంలో రాముని తల్లియైన కౌసల్యవద్దకు హనుమంతుని తల్లి వచ్చింది. కొంత సేపటికి అగస్త్యుని తల్లి కూడా వచ్చింది. "అమ్మా! ఎవరు మీరు? ఎందుకోసం వచ్చారు?" అని ప్రశ్నించింది కౌసల్య. మొదటి వ్యక్తి 'అమ్మా! నేను హనుమంతుని తల్లిని నా కుమారుడు పెద్ద సముద్రాన్ని దాటి భయంకరమైన లంకలో ప్రవేశించి అనేక మంది రాక్షసులను సంహరించాడు" అన్నది. రెండవ వ్యక్తి "అమ్మా! నేను అగస్త్యుని తల్లిని. నా కుమారుడు సముద్రాన్నంతా ఒక్క గుటకలో మ్రింగి గొప్ప కీర్తి గడించాడు" అన్నది. అప్పుడు కౌసల్య నవ్వి "నా కుమారుడైన శ్రీరాముని మహిమవల్లనే కదా. మీ కుమారులు ఈ మహత్కార్యములు చేయగల్గారు" అన్నది. సరిగ్గా ఆసమాయానికి రాముడు ప్రవేశించి "అమ్మా! ఏమి చెపుతున్నావు? **హనుమంతుడు మహాభక్తుడు, శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు. అగస్త్యుడుకూడా మహాభక్తుడే. వారు తమ భక్తి**

ప్రపత్తులచేతనే ఈ మహత్కార్యములను సాధించగల్గారు. ఇందులో నా గొప్పతనమేమీ లేదు" అన్నాడు.

(స.సా.న.99పు.322)

భక్తి యనగా తన ధ్యేయవస్తువుతో చిత్త వృత్తి తదాకారము చెందుటే సరియైన భక్తికాగలదు.

ఇంద్రియద్వారము లన్నింటిని సంయమము చేసి మనసును హృదయ స్థానమున నిరోధించి ప్రాణమును శీర్షస్థానమున స్థాపించి ఆత్మ సంబంధమగు యోగధారణను అవలంబించినవాడై ప్రాణప్రయాణ సమయమున 'ఓం' అను బ్రహ్మమును ఉచ్చరిస్తూ శరీరమును వదలిన అట్టివాడు నన్ను చేరును. చిత్తవృత్తి తదాకారము పొందును" అని కృష్ణుడు అన్నాడు.

(గీ.పు.144)

కోటిపూసల కొక్క కొల్కిపల్కే గానీ
నీటుమాటల కోటి నేరడి తడు
చచ్చిపుట్టుట మాన్పు చదువు వచ్చునేగానీ
చచ్చువిద్యలు రావు సాయికెపుడు
మనసిచ్చికొను ప్రేమమాటలాడునే గానీ
సాయి వుపన్యాసమీయలేడు
తన యదార్థత తాను తప్పక చనుగాని
యెదటి తప్పుల బాబయెన్నలేడు.
కల్లకపటాలు తెలియని పిల్లవాడు
ఎల్లజీవుల తనవలె యెంచువాడు
ఇట్టిమురీశు జన్మించినాడు
పట్టుపడినాడు భక్తికి బాబగాను॥

(అ.శ.నా.పు.131/132)

భక్తియనగా త్రిమూర్తి స్వరూపాన్ని, త్రిగుణముల యొక్క పరిపూర్ణమును పవిత్రమైన మార్గమున ప్రవేశ పెట్టి దివ్యత్వముతో సన్నిహిత సంబంధ బాంధవ్యమును కలిగించు కొనుటయే. త్రికరణ శుద్ధితో భగవంతుని స్నేహమును అభివృద్ధి పరచుకొనుటయే భక్తి. **భక్తి మూడు విధములు 1. సామాన్య బేధ భక్తి 2. అనన్య భక్తి, 3. ఏకాంత భక్తి.**

సామన్య భక్తి అనగా శ్రవణం, కీర్తనం విష్ణు స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం, స్నేహం, ఆత్మనివేదనం.

1. **శ్రవణం:** తన శరీరము, ఇల్లు మరచి, మృత్యువును ముందుంచుకొని ఏడు దినములు ఏకాగ్రతతో భగవత్ చింతన సలిపినటువంటివాడు పరీక్షిత్ మహారాజు. తాను రాజై ఉండినప్పటికీ, దివ్యమైన తత్వాన్ని పొందే నిమిత్తమై దైవత్వాన్ని ఆనందించే నిమిత్తమై, ఏకాగ్రచిత్తుడై ఏడు రోజులు శ్రవణము గావించినవాడు. శ్రవణము చేసినదానిని, మననము చేసి, ఆచరణలో పెట్టి చూపించిన వ్యక్తి **పరీక్షిత్ మహారాజు**. ఈ మూడింటి ఏకత్వమే దివ్యత్వం పొందుటకు రాజమార్గము.

2. **కీర్తనం:** సర్వకాల సర్వావస్థల యందు భగవన్నామ సంకీర్తన సలిపి యావత్‌ప్రపంచమునకే దివ్యమైన వాతావరణమును కల్పించిన వ్యక్తి బ్రహ్మ మానస పుత్రుడు **నారదుడు.**

3. **విష్ణు స్మరణం:** నిరంతరము భగవంతుని చింతన గావించినటువంటి పరమభక్తుడు ప్రహ్లాదుడు. ఎన్ని విధాల హింసలు పెట్టినప్పటికినీ, పరమ భక్తుడైన ప్రహ్లాదుడు. కన్నీరు కార్చక, దైవనామ స్మరణ చేసినవాడు ప్రహ్లాదుడు. జగత్తునకు నామచింతన మాత్రమే సార్థకత చేకూర్చు మార్గమని బోధించినవాడు.

4. **పాదసేవనం:** సమస్త ఐశ్వర్యములు కలిగి, సమస్త భోగభాగ్యములకు నిలయమైనటువంటి, సకలైశ్వర్య స్వరూపిణియైన లక్ష్మి, **"సిరి ప్రధానముకాదు, హరి పాదసేవనమే ప్రధాన"మని లోకమునకు చాటి, నిరంతరము హరి పాదసేవయందే తన జీవితమును అంకితము గావించుకొన్నది.** ఈనాటి భక్తులు సిరి భక్తులుగా రూపొందుతున్నారే కానీ, హరి భక్తులుగా అభివృద్ధి కావటము లేదు. హరి పాదసేవనం చేత సిరికూడా లభ్యమవుతుందనే సత్యాన్ని గుర్తించుకోలేరు. సిరిని ఆశ్రయించి, హరిని విస్మరించి దివ్యత్వమునకు దూరము కావడము మానవుని యొక్క సహజము కాదని నిరూపించినది **లక్ష్మి.**

5. **వందనం:** నమస్కారమే సర్వస్వమునకు ఆస్కారమనే

భావముతో అనగా అహంకారమును వదలి, దివ్యత్వముతో లీనమై, సర్వస్వము అర్పితము గావించటము. దశేంద్రియములను భగవంతునికి హృదయ పూర్వకముగా అంకితము గావించటము, శరణాగతి స్థితి పొందటము అనే భావములను చాటించుతూ వచ్చాడు **అక్రూరుడు.**

6. **అర్చనం:** పృథు చక్రవర్తి షోడశోపచారముల చేత దైవత్వాన్ని ప్రసన్నము గావించుకొని, తన మనోభీష్టములను నెరవేర్చుకొన్నటువంటి వ్యక్తి. ఈ అర్చనములో అంగార్చన ప్రధానమని చాటుతూ వచ్చాడు. "నేత్రకమలం సమర్పయామి, శ్రోత్రకమలం సమర్పయామి, హస్తకమలం సమర్పయామి, హృదయం కమలం సమర్పయామి", అనగా హృదయము, హస్తములు మొదలగు ఇంద్రియములను కమలములతో పోల్చి భగవంతునికి అర్పితము గావించుకుంటూ వచ్చాడు. కానీ కలి ప్రభావము వల్ల **"నేత్ర కమలం సమర్పయామి" అని చెప్పటం, పుష్పము వేయటం జరుగుతుంది. దృష్టిని అభివృద్ధి పరచుకోవటము లేదు.** మన దృష్టిని దైవ దృష్టిగా పెట్టవలెనే కానీ అన్యకార్యములకుపయోగింప రాదు. ఈ రీతిగానే దైవ నామస్మరణ పరోపకార విషయములందు, పవిత్ర కార్యములందు తప్ప, మరో విషయములలో చెవులు దుర్వినియోగము చేయరాదు. ఇట్టి పవిత్రమైన అంగపూజయందు అర్పితము గావించుకొని, జగత్తునకు అర్చనం ప్రధాన మార్గమని ప్రబోధించినవాడు **పృథు చక్రవర్తి.**

7. **దాస్యం: హనుమంతుడు** మహాబలవంతుడు, గొప్ప గుణవంతుడు అహంకార రహితుడు, నిరంతరము తాను రామ దాసుడనని వినయ విధేయతలను ప్రకటించిన వ్యక్తి. రామ సేవ తప్ప అన్య సేవలు ఆశ్రయించేటటువంటి వాడు కాడు. సేవా భావములో హనుమంతుని మించినవారు జగత్తులో కానరారు.

8. **స్నేహం:** నిరంతరము కృష్ణ స్నేహము తప్ప అన్య స్నేహము కోరినటువంటివాడుకాడు అర్జునుడు. స్నేహమనగా ప్రేమ అని మరొక అర్థము. కృష్ణుణ్ణే ప్రేమించినటువంటివాడు కనుక సమస్త శక్తులను సాధించినటువంటి వ్యక్తి, పరమ భక్తుడు, మహావీరుడు, శూరుడు, చిత్తశుద్ధి కలిగినవాడు, నిర్మల హృదయుడు. భగవంతుని సన్నిధే నెన్నిధిగా మార్చుకొన్న హృదయము పవిత్రంగా ఉంటుంది. రుద్రభూమి, భద్రభూమి యందు కృష్ణుని బలము, ఆశ్రయము, ప్రేమ తప్ప అన్యము లాశించలేదు. **"నీ ఆజ్ఞలను శిరసావహించి నా కర్మల్లో నేను పాల్గొంటాను" అని అన్న భక్తుడు మిత్రుడు, అర్జునుడు.**

9. **ఆత్మనివేదనం:** "ఓణం" నాటి కథానాయకుడు, ప్రధాన పురుషుడు, **బలిచక్రవర్తి,** దీనికి చక్కని ఉదాహరణము, "భగవంతుడా! నాదన్నది ఏమున్నది?" సర్వము నీదే" అనే ఆత్మార్పిత భావముతో తనను తాను అర్పితము గావించుకొన్న వ్యక్తి బలిచక్రవర్తి. వామన మూర్తిని రమ్మని ఆహ్వానించి, అతని చరణములను కడిగేదానికి తన చేతికిమ్మని, వాటిని కడిగి ఆ పాద చరణామృతమును తన శిరస్సుపై జల్లు కొనుటకు ప్రార్థించినాడు. శుక్రాచార్యుడు, సమస్తమును ఎరిగిన బ్రాహ్మణుడు,చక్రవర్తికి పురోహితుడు, మహా పండితుడు. విష్ణుమూర్తి వామనమూర్తి స్వరూపములో వచ్చినాడనే సత్యాన్ని గుర్తెరిగినవాడు. బలిచక్రవర్తి కెంతయో బోధించినవాడు, కడపటికి రహస్యాన్ని బలిచక్రవర్తికి బోధించి వామనుడు అడిగినదానికి నీవిచ్చుటకు సంసిద్ధుడుగా ఉండకూడదన్నాడు. దానికి బలి అన్నాడు. **"సాక్షాత్ భగవంతుడే, నా ఎదుట చెయ్యి చాచి 'నాకిది ఇమ్ము' అని అడిగినప్పుడు, అల్పుడైన నా హస్తము** పరాత్ముడైన అతని హస్తముపైన ఉండేదాని కంటే వేరే భాగ్యమేముంటుంది? ఏమైనా కానీ నా సర్వస్వమును అర్పితము చేస్తాన"ని గురువాజ్ఞను తిరస్కరించేదానికి సిద్ధమవుతాడు బలి.

2. **అనన్య భక్తి:** భగవంతునికంటే జగత్తులో అన్యమైనది లేదు అనే విశ్వాసముచేత సర్వమునూ భగవత్ స్వరూపముగా విశ్వసించటము **"విశ్వం విష్ణు స్వరూపం", "ఏకం**

సత్ విప్రాః బహుధా వదంతి" - ఉన్నది ఒక్కటే. ఇట్టి భావముచేత దివ్యత్వాన్ని స్మరించుచూ జీవితమును సార్థకము చేసుకోవటమే ఈ అనన్య భక్తి. ఏది చూసినా దైవస్వరూపమే, ఏది విన్నా దైవ నామమే, ఏది చేసినా దైవ సేవనే, ఎక్కడికి నడిచినా దైవ ప్రదక్షిణతో సమానము. సర్వ కర్మలను భగవదంకితము గావించుకొని తన జన్మను సార్థకము గావించుకొను ఏకాత్మ భక్తినే అనన్య భక్తిగా భావిస్తూ వచ్చినారు. ఇది అందరికీ సులభ సాధ్యముకాదు. భగవంతుడు సర్వ వ్యాపకుడు అని చెప్పటము సులభమే కానీ సర్వ వ్యాపకత్వమును అనుభవించటము చాలాకష్టము. రామ భక్తులు జగత్తులో ఉండినవారు, కాని రామ ప్రీతికి అర్హుడైనవాడు ఒక్కడైనా కనిపించడము లేదు. **"రా" అనగా ఆత్మ, "మ" అనగా జీవుడు. ఈ రెండింటి ఏకత్వమే నిజమైన రామ తత్వము.** ఇట్టి అంతరార్థము గుర్తించి వర్తించే వ్యక్తులు చాలా అరుదు.

అదే విధముగనే, భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడని, సర్వవ్యాపకుడని, సర్వజ్ఞుడని భావించవచ్చును తప్ప అనుభవించటము చాలా కష్టము. చెప్పేది చేసేటటు వంటివాడే నిజమైన భక్తుడు. దీనినే త్రికరణ శుద్ధి అని చెప్పుతూ వచ్చారు. **"మనస్యేకం వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనాం", "మనస్ అన్యత్, వచస్ అన్యత్, కర్మణ్ అన్యత్ దురాత్మనాం" ఈ త్రికరణశుద్ధితో దైవము సర్వత్రా ఉంటున్నాడు,** సర్వ విషయములందు భగవత్ భావమునుతాను గుర్తించినటువంటి వ్యక్తి అనన్య భక్తుడు.

3. **ఏకాంత భక్తి: "అంతర్ బహిశ్చతత్ సర్వ వ్యాప్యనారాయణ స్థితః"** ఏ నారాయణుడు సర్వత్రా వ్యాపించి ఉన్నాడో. బహిర్ముఖములో ఉన్నాడో, నా అంతర్ముఖములో ఉన్నాడని గాఢమైన విశ్వాసము గలవాడు ఏకాంత భక్తుడు. లోపల, వెలుపల, సర్వత్రా ఉండినటువంటివాడే నాయందూ ఉన్నాడు. సర్వత్రా ఉన్న స్వరూపుడు సమిష్టి స్వరూపుడు. నాయందు ఉన్నవాడు వ్యక్తి స్వరూపుడు. వ్యక్తి లేక సమిష్టి లేదనే విశ్వాసంతో ఏకాంత భక్తి అనుసరించేవాడు. **ఎక్కడ చూచినా దైవ భావమే, దైవ నామమే, దైవ రూపమే.**

(స.సా.అ.89 పు. 253/258)

నామమును మానవతత్వంగా భావించడం కాకుండా, మాధవత్వంగా నిరూపించి నతనే శబ్దస్వరూపుడు - అని వర్ణిస్తూ వచ్చారు. **"శబ్దబ్రహ్మమయీ, చరాచరమయీ, జ్యోతిర్మయీ, వాఙ్మయీ, నిత్యానందమయీ, పరాత్పరమయీ, మాయామయీ, శ్రీమయీ"**. ఈ అష్టవిధములైన స్వరాలకును శబ్దమే ప్రధానమైనది. ఈ శబ్దమును భావరూపములో ఇముడ్చుకొని, **దైవత్వాన్ని పొందుటకు శాంతభక్తి, సఖ్యభక్తి, వాత్సల్యభక్తి, అనురాగ భక్తి, మధురభక్తి అని అనేకవిధములైన మార్గములను ఏర్పరచుకున్నారు.**

శాంతభక్తి: ఈ భక్తిలో భగవంతుని పొందినవారెవరు? మహాకఠిన దీక్షను పట్టి సాధించిన **భీష్ముడు.** ఇతను గంగాపుత్రుడు. జగన్నిమిత్తమై తన సర్వకర్మలు, సర్వసుఖములు, త్యాగము చేసినవాడు, భీష్మప్రతిజ్ఞ గావించినవాడు, శారీరక, మానసిక, జీవితతత్వాన్ని అంతము గావించి దివ్యత్వాన్ని పొందిన మహాత్యాగి. కట్టకడపటికి దేశోద్ధారం నిమిత్తమై తాను నాయకత్వాన్ని వహించి మహాభారతయుద్ధములో పాండవులతోకూడను యుద్ధము చేసినవాడు. తొమ్మిదవ దినమున అర్జునుడు వేసిన అమ్ములచేత కూలిపోయాడు. శరీరమంతా ఈ అమ్ములే చేరి ఉంటున్నాయి. తాను క్రింద పడేటప్పటికి దేహము భూమిపైన పడలేదు. అమ్ములపైనే అధారపడి ఉంటుండాది. దానినే **శరతల్పము అన్నారు.** తిరిగి అర్జునునే కోరినాడు. అంత శాంతమూర్తి, ఎవరు తనను నేలకూల్చినారో ఆ అర్జునునే అడిగినాడు. అర్జునా నాకు బెడ్‌ను మాత్రం తయారు చేసినావు, కాని పిల్లో ఇవ్వలేదే అని. తల క్రిందికి పడిపోతుండాది. అర్జునుడు రెండు అమ్ములను తిరిగి ఇట్ల వేస్తే ఈ మధ్యభాగములో తలపెట్టాడు. సకాలములో మరణము ప్రాప్తించినప్పుడే జన్మ సార్థకమౌతుందని అతని విశ్వాసము. ఉత్తరాయణ

కాలం వచ్చేంత వరకు ఆనాడు మొదలుకొని 56 దినముల వరకును భగవచ్చింతన చేస్తూ ఉన్నాడు. దేహమున కెన్ని బాధలు సంభవించినా ఎన్ని నొప్పులు బాధించినా లెక్క చెయ్యలేదు. పవిత్రమైన కాలం నాకు ప్రాప్తించాలి. అంతవరకు నేనీ ప్రాణమును వదలకూడదు. **ప్రాణము చాలా విలువైనది.** ఇలాంటి విలువైన కాలములోనే వదలాలి అని అమ్ములపైనే 56 దినములు పవళించినాడు.ఈ కాలమునుకూడను వృధా చేయకూడదని **రాజనీతి గృహనీతి శాంతి బోధలంతా** ఇతడు బోధిస్తూ వచ్చాడు. దీనినే మహాభారతంలో **శాంతిపర్వము** అంటారు. పాండవులకందరికిని విశేషములంతా చక్కగా వర్ణిస్తూ వచ్చాడు. ఇంతటి నిగ్రహశక్తి కలిగిన మహాపురుషుడు భీష్ముడు. దీనికంతా శాంతభక్తియే మూలాధారము.ఎన్ని కష్టములైనా. ఎన్ని నష్టములైనా ఎట్టి నిందలైనా, నిష్కారములైనా సహించి, భరించి భగవంతుని స్మరించే వాడు. యుద్ధసమయమునందు కృష్ణుడే భీష్ముణ్ణి కొట్టడానికి వచ్చాడు. నిజంగా కృష్ణునికి భీష్ముణ్ణి కొట్టడం ఇష్టంలేదు. అర్జునుడు బలహీనుడైపోవటంచేత అర్జునునకు బలమునందించే నిమిత్తమై, అర్జునుని రౌద్రాన్ని బలపర్చే నిమిత్తమై అర్జునా! పిరికిపందవలె నీవుంటున్నావు. నేనే యుద్ధం చేస్తానని అమ్ములు తీసుకున్నాడు. భీష్మునిపైకి కృష్ణుడు వస్తుంటే భీష్ముడు ఆ సమయమునందు కూడను కృష్ణుణ్ణి ప్రార్థిస్తూ వచ్చాడు.

"కుప్పించి యెగసిన కుండలంబులకాంతి గగనభాగంబెల్ల కప్పిగొనగ
నటికిన నోర్వక యుదరంబులోనున్న జగముల వ్రేగున జగతి గదల
చక్రంబు చేపట్టి చనుదెంచురయమున పైనున్న పచ్చనిపటము జాఱ
నమ్మితి నాలావు నగుబాటు సేయక మన్నింపుమని క్రీడి మరల దిగువ
కరికి లంఘించు సింహంబు కరణి మెఱసి
నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
విడువు మర్జున యనుచు మద్విశిఖవృష్టి
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు"

ఓ అర్జునా! నేనిప్పుడు ~~ఈ~~ **భీష్ముని చంపుతాను.** నన్ను విడిచిపెట్టు అని నన్ను చంపడానికి ఏ భగవంతుడైన కృష్ణుడు వస్తున్నాడో ఆ కృష్ణుడే నన్ను రక్షించాలి అన్నాడు. చూచారా! ఎంత భక్తో : ఏ భగవంతుడు నన్ను చంపడానికి వస్తున్నాడో ఆ భగవంతుడే నన్ను రక్షించాలి, అని ప్రార్థిస్తూ వచ్చాడు. శిక్షించడానికి వస్తున్నాడు. ఓ రామా నన్ను రక్షించు. ఓ ఈశ్వరా నన్ను రక్షించు అని ఎవర్నీ ప్రార్థించలేదు. అంతటి నిశ్చల భక్తి నిర్మలభావము. **అతనే శాంతభక్తి.**

ఇక సఖ్యభక్తి: అర్జునుడు ఎంతకాలమునుంచి మిత్రత్వముతో ఉన్నప్పటికిని కృష్ణుడంతటి స్నేహితుడు ఈ జగత్తులో నాకు లేడని విశ్వసించాడు. **కృష్ణభావమునందు తన జీవితమును స్నేహభావముతో అనుభవిస్తూవచ్చాడు.** లోకము మరొకరీతిగా భావిస్తుందనీ **కృష్ణుణ్ణి బావా బావా అంటూ పిలుస్తూ వచ్చాడు.** కృష్ణునికి ఆవిధంగా రిలేషన్‌షిప్ పెట్టుకోవడం ఇష్టం లేదు. నన్ను బావా అని పిలుస్తున్నావేకాని బావకు తగిన అర్థం లేదే, అక్కడ: ప్రతి పదమునకు ఒక అర్థాన్ని నిరూపించాలి, అనే ఉద్దేశ్యంతో ఈ బావా అనే పదమునకు విలువనిచ్చే నిమిత్తమై తన సోదరియైన సుభద్ర నిచ్చి పెండ్లిచేసి అప్పుడు బావా అనిపించుకున్నాడు. ఇప్పుడు నీవు బావా అని పిలు అన్నాడు. అర్థము లేని పదమును ఉపయోగ పెట్టకూడదు. ఇది భగవంతుని చరిత్రలో ఉన్న యధార్థమైన పవిత్రత. కష్టములయందు, సుఖముల యందు, అపజయములందు, జయములందు, అరణ్యవాసము నందు నిరంతరముకూడను కృష్ణుడే మా స్నేహితుడు, కృష్ణుడే నా మిత్రుడు. **ఇదే సఖ్యత.** కష్టములందు దూషించడము, సుఖములయందు వర్ణించడము యిదికాదు నిజమైన సఖ్యత. ఎన్ని కష్టములైనా సరే, ఎన్ని బాధలైనా సరే ఎన్ని విధముల హింసలైనా సరే నీవుతప్ప నాకన్యము లేదు, అనే విశ్వాసముతో ఆ కృష్ణుణ్ణి ఆధారం

చేసుకున్నాడు అర్జునుడు. రెండుదేహములు ఒక్క ప్రాణము. ఇది నిజమైన స్నేహము. ఈవిధంగా అర్జునుడు మైత్రిగా చూచుకుంటూ వచ్చాడు.

ఇక దాస్యమునకు హనుమంతుడు. ఎప్పుడు చూచినా నీవు ప్రభువు నేను దాసుడు నీవు ప్రభువు నేను దాసుడు అనేవాడు. లంకను దాటక పూర్వము మంచి పండు వెన్నెలలోపల అందరు పవళించారు. శ్రీరాముడు కూడను పవళించాలి. ఎక్కడ పవళించగలడు? అక్కడ పరుపులు లేవు. ఇసుక జటాజూటమును ధరించి యతివేషముతో బయలుదేరినవాడు రాముడు. లక్ష్మణుడు కూర్చున్నాడు. అతని తొడపైన తలపెట్టి రాముడు పవళించినాడు: ఒక్కొక్కర్నీ ప్రశ్నిస్తూవచ్చాడు రాముడు. సుగ్రీవా: ఆ చంద్రునిలోపల ఏదో నల్లని మచ్చ కనిపిస్తుండాదే: దాన్నేమంటావు నీవు? అన్నాడు. నాకు తెలియదు రామా: అన్నాడు. ఇంకా జాంబవంతుణ్ణి ప్రశ్నించాడు. జాంబవంతుడు చెప్పాడు. ఆ చంద్రుని లోపల అనేకపర్వతములు గుంతలు ఉంటుంటాయి. ఆ గుంతలు పర్వతముల యొక్క నీడనే ఆ నల్లటి రూపముగా కన్పిస్తుండాది అన్నాడు. జాంబవంతుడు జ్యోతిశ్శాస్త్రములోనూ, ప్రకృతిశాస్త్రము లోనూ ప్రవీణుడు. భూగోళశాస్త్రమును చక్కగా గుర్తించినవాడు. రాముడు ఇంకా కొంతమందిని అట్లనే అడుగుతూ వచ్చాడు. లక్ష్మణుని అడిగాడు. లక్ష్మణుడు, అన్నా!అందులో ఏదో జింకవలె కన్పిస్తుండాది, మృగాలవలె కన్పిస్తుండాది అన్నాడు. ప్రక్కనున్న కాళ్ళు వత్తుతున్న హనుమంతుణ్ణి **ఆ చంద్రునిలోపల నీవేమి చూస్తున్నావు హనుమా అన్నాడు. రామా! అన్యము నాకేమీ కన్పించుటలేదు. నీవు వెల్లకిల పండుకొని చూస్తుంటే నీ ముఖము యొక్క చిత్రమే చంద్రుడనే అద్దములో కన్పిస్తుండాది** అన్నాడు. చంద్రుడనేవాడు శుద్ధమైన అద్దమువలె కన్పిస్తున్నాడు. ఆ అద్దములో నీ ముఖ ప్రతిబింబమే కన్పిస్తుండాది అన్నాడు. **అనగా ప్రతి పదార్థమునందు కూడను శ్రీరామచంద్రుని స్వరూపము, నామమే అతనికి కన్పిస్తూ వచ్చింది.** ఎలాంటి సమయమునందును రామసేవ తప్ప అన్యము చేసే వాడుకాడు. అతను మహాబలవంతుడు, మహాగుణ వంతుడు, మహాశాంతుడు. ఇట్టి హనుమంతుడు అశోకవనంలో ప్రవేశించాడు. లంకనంతా ధ్వంసము చేస్తూవచ్చాడు. రావణాసురుడు వచ్చి ఎవడురా నీవు? అని ప్రశ్నించాడు. బలవంతుడైన హనుమంతుడు అహంకారముతో విర్రవీగలేదు. **దాసోహం కోసలేంద్రస్య. నేను శ్రీరామచంద్రుని దాసుడను అన్నాడు.** దానికే ఇంత బలముంటుంటే ఇక ప్రభువున కెంతబలమో యోచించుకో రావణా అన్నాడు. నిరంతరము దాసత్వాన్ని భావించి ఇట్టి హనుమంతునికంటె ఆదర్శవంతమైనవాడు మరొకడు లేడు. అందుకోసమనే **రాముడు భారతదేశము కృతజ్ఞతకు పుట్టినిల్లు పెట్టినపేరు** అన్నాడు. **కృతజ్ఞతనే లేకపోతే మానవత్వమే లేదు.** ఒంటరిగా తీసుకొనిపోతున్న సీతను రక్షించే నిమిత్తమై జటాయువు తన ప్రాణాన్ని అర్పించింది. కనుకనే తన సీతకు సహాయం చేసిన జటాయువుకు కృతజ్ఞత రీతిగా రాముడే దాని కర్మలన్నీ ఆచరిస్తూవచ్చాడు. హనుమంతునికి కూడా అంతే. హనుమా! నీకు ఏవిధంగా కృతజ్ఞత చెప్పాలో నాకర్థం కావటంలేదు. కిష్కింధలో ఉన్న నాయొక్క క్షేమవార్త అశోకవనములో ఉన్న సీతకు అందించినది నీవే. అశోకవనములో బాధచెందుతున్న సీతవార్త రామున కందించినవాడవు నీవే. అడవులన్నియు శోధించి, సాధించి సముద్రములు దాటి సీతను చూచివచ్చినవాడవు నీవే. సీత జీవముతో ఉన్నదనే పవిత్రమైన వార్తను తెలిపినవాడవు నీవే. నా ఉంగరము సీతకిచ్చి, సీత శిరోమణిని నాకందించినవాడవు నీవే. రఘుపతి కార్యము ఈడేర్చిన ఓ కపిశిఖామణి! నీకు ఏరీతిగా కృతజ్ఞతలు తెలపాలి? నాదగ్గర ఏమీ లేదు. **నన్ను నేనే ఇచ్చుకుంటున్నాను హనుమా! తీసుకో అన్నాడు.** తాను సముద్రము దాటడానికి రామనామమే ఆధారమైనది. **నామముయొక్క మహత్తరశక్తి ఎట్టిదో చక్కగా గుర్తించవచ్చు. ఇదీ దాస్యమునకు సరైన అర్థము. ఒక్కతూరి సరెండర్ అయిపోతే, అర్పితమైపోతే**

ఇంక ప్రాణము పోయినాసరే నా జీవిత మంతా నీకే అర్పితము అనే రీతిగా అర్పితము గావించినవాడు హనుమంతుడు. ఇది దాస్యత్వము.

ఇంక వాత్సల్యము: ఈ వాత్సల్యములో ఉండిన మాయతత్త్వము ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. కృష్ణుని నోటియందు 14 లోకములు చూచిన యశోద మాయచేత ఇతను నాకుమారుడే, ఇంత గొప్పలోకాలు, నాకుమారుని చిన్ననోటిలో ఎట్లు కనిపిస్తాయి? అని తను చూచినదాన్ని మరచింది. వాత్సల్యము కేవలము దేహసంబంధముగా ఉంటుంది. నేను తల్లిని, తాను కుమారుడు అనే వాత్సల్యమే మాయ ఇంతగట్టిగా అందిస్తూ వచ్చింది. గోవర్ధనగిరి ఎత్తి కృష్ణుడు గోవులను గోపాలురను కాపాడుతున్న సమయములోపల అయ్యో! ఇంత పర్వతమును ఎత్తినాడే; దీనిని క్రింద ఏరీతిగా పెట్టగలడు? ఏవిధంగా క్రింద పెట్టాలనుకున్నప్పటికి ఈ పర్వతం మధ్యలో ఉన్న తాను క్రిందికి పడిపోతాడో **ఏమో! ఎత్తటం సులభం కావచ్చును. కాని కింద పెట్టటం చాలాకష్టం అనుకొని అందరూ వెళ్ళిపోయినప్పటికిని యశోద అక్కడనే కాచుకొని ఉంటుంది. ఇక్కడ కూడను ఒక మాయనే.** కృష్ణుడు ఒక పెద్దశబ్దము వచ్చేటట్టు సృష్టించాడు. ఆ శబ్దమును భరించుకోలేక కన్నులు చెవులు మూసుకొన్నది యశోద. **ఆమె కన్నులు, చెవులు మూసుకొన్న తత్క్షణము భూమిపై నుంచుండాది పర్వతము.** తాను ప్రక్కనున్నాడు. ఏరీతిగా ఎత్తినాడో ఆ రీతిగా దింపినాడు. ఇంత యోచనకు ఆమె ఏమాత్రము లోతుగా పోలేదు. **ఎత్తిన పరమాత్ముడు దింపలేడా అనే విచారము లేకపోయింది. ఈ నిత్యానిత్యవిషయపరిశీలన ఎప్పుడు పోతుంది? వాత్సల్యంలోపల నిర్మూలన మౌతుంది ఈ విచారచర్చ.** ఉద్ధవుడు వచ్చి కృష్ణుని వార్తలు చెపుతున్నప్పుడు యశోద వెళ్ళి ఉద్ధవా: నా గోపాలుడు బాగున్నాడా? అని ప్రశ్నించింది. లీలామానుషవిగ్రహుడు, బృందావనవిహారి, మునిమానససంచారి ఏవిధంగా పోయినా నాకక్కరలేదు. బృందావనవిహారి ఎక్కడ ఉండినా నాకక్కర లేదు! నా గోపాలుడు బాగున్నాడా లేదా? అని అడిగింది. కనుక వాత్సల్యమనేది సంకుచితస్థానానికి తీసుకొని వస్తుంది. **ఆమెకు ఏ విధమైన వర్ణనలు అక్కరలేదు. గోపాలా, గోపాలా, గోపాలా భక్తులు ఎన్ని వర్ణనలు చేసుకున్నను తనకక్కరలేదు. తనకు కావలసినది గోపాలుడే.** నిరంతరము గోపాలా, గోపాలా, గోపాలా అనే నామము చేతనే యశోద వాత్సల్యముచేత తరించినది.

ఇంక అనురాగభక్తికి గోపికలు. వాళ్ళకు రెండు గుర్రాల సవారి. ఇంటిలోపల భర్త, అత్త; బయట గోపాలుడు. ఈ రెండు తప్ప ఏమాత్రము మరొక చింత లేదు. తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ దివ్యత్వాన్ని అనుభవిస్తూ వచ్చారు వాళ్ళు. ఒక్కొక్క సమయంలోపల జగత్సంబంధమైన ఈ కర్తవ్యములో వాళ్ళు కొంతవరకు తప్పిపోతూ వచ్చారు. నిరంతరమూ కృష్ణా, కృష్ణా, కృష్ణా అంటూ ఈవిధంగా **అనురాగభక్తి, తమ స్నేహితుడుగాను, మిత్రుడుగాను. సర్వశక్తిగాను భావించినవారు గోపికలు.**

మధురభక్తి ఒక్క రాధకుతప్ప అన్యులకు లేదు. కృష్ణా! అనుకునేటప్పటికి తన దేహాన్ని తాను మరచిపోయేది. కృష్ణుడు పతి, తాను సతి అను భావములో మునిగిపోయేది. కృష్ణుడు మాస్టర్ తాను సర్వెంట్ అనే భావముతో ఉండేది. ఇరువురు కూడను ఒక్కటే. ఆయన పరమాత్మ నేను ప్రకృతి అనేరీతిగా ఉండేది. మరొక చింత లేదు. ఎక్కడ నీలంగా కన్పించిన వృక్షమైనప్పటికిని కృష్ణా అని పోయి వృక్షాన్ని పట్టుకునేది. నిరంతరము సమస్తపదార్థముల యందు కృష్ణుడు తప్ప అన్యము కనిపించలేదు. నిరంతరము కృష్ణనామము, కృష్ణమురళీగానమే. ఆమె ప్రాణం విడిచేపూర్వం ఆ మురళీనాదమునే వినాలని కోరింది. నాదం కూడ ఎటువంటి పవిత్రమైన సారమో తెలుసునా? **పరిపూర్ణమైన వేదసారమే ఈ మురళీనాదం. ఈ వేదముల సారమంతయు గోక్షీరమే.** ఆమెను రక్షించే నిమిత్తమై కట్టకడపటి స్థితిలో కృష్ణుడక్కడికి వెళ్ళాడు. రాధా నీ కేంకావాలి. అని అంతిమకోరికను నీవు ఉచ్చరించుమన్నాడు. రాధ చెప్పింది. కృష్ణా! ఇంతకాలము

భక్తి

నా హృదయకమలములోపల నిన్ను పోషించుకున్నాను. నా హృదయమనే కొలనులోపల ప్రేమజలమంతా యిగిరి పోయింది. కట్టకడపట నిన్ను నా కంటి ధారలనే జలము లోపల పెట్టి పోషించుకున్నాను. కంటిధారలు కూడను యిగిరిపోయినవి. ఇంక నిన్నెక్కడ పెట్టుకొని నేను పోషించాలి? నీ శబ్దమునందే నీ నామము నేను పోషించు కోవాలి అని **"పాటపాడుమా కృష్ణా: పలుకుతేనె లొలుకునటుల మాటలాడుమా ముకుందా: మనసుతీరగా; వేదసారమంత దీసి, నాదబ్రహ్మముగను మార్చి, వేణువందు తిరుగబోసి, కాలరూపముగను మార్చి పాడపాడుమా"** అన్నది. కన్నులు మూసుకున్నది. ఆమెలోనుండి ఆజ్యోతి కృష్ణునిలో ప్రవేశించింది. **మధురభక్తి అనగా రెండు ప్రాణాలు ఒక్కటే అనే అంతరార్థాన్ని రాధ నిరూపించింది.** ఈ రకమైన స్థితిని పొందడానికి కారణమేమిటి? **నిశ్చలమైన భక్తి, నిర్మలమైన ప్రేమ, నిస్వార్థమైన హృదయము-ఈమూడే దీనికి కారణము. తన, మన, ధనములను అర్పితము గావించింది ఈ రాధ, ఈ తనువెవ్వరిది? ఈ మనస్సెవరిది? ఈ ప్రాణమెవ్వరిది? ఈ మూడును నీవు అందించినవే:**

(శ్రీ.స.వి.వా.పు.71/78)

భక్తి అంటే ఏమిటి? భక్తులంటే ఎవరు? **భక్తి అంటే నిశ్చల విశ్వాసం, నిర్భయం, నిరహంకారం, సద్గుణం, సమర్పణం.**

(వ.1963 పు.10)

భగవంతునికి మిమ్ములను సంపూర్ణంగా సమగ్రంగా సమర్పించుకుని, లేశమైనా అహంభావం లేకుండా ఆయన హస్తాలకు ఆధీనులై పోవాలి. అప్పుడే భక్తుడు అనిపించుకోగల అర్హత పొందగలుగుతాడు.

(వ.1963 పు.12)

నేను భక్తుని ప్రేమించను. భక్తిని ప్రేమిస్తాను.

(సా.పు.62)

తామసంబు విడక, తత్త్వంబు ఎటుకుదురు,
రాజసంబు విడక, రామభక్తి
సాత్వికంటె, భక్తి సాదన మగునయా
ఉన్నమాట తెలుపు చున్న మాట!

(సా.పు.95)

"దైవము సర్వత్రావుండినప్పటికిని,ఎవరికి గోచరింపడు. ఇది కేవలం అనుభవానికి మాత్రమే గొచరమవుతుంది. నీటిలో చెక్కెర పాకము కలిపాము. కాని అది కన్నులకు కనపడదు. ఆనీటిని నాలుకపై వేసుకొన్నప్పుడే చక్కర వున్నదని తెలుస్తుంది. అదేవిధముగనే ఈ ప్రకృతి అనే భాండము లోపల, దివ్యత్వమనే ఆత్మ వ్యాపించియున్నది. ఇదినీకు కనిపించదు. ఇది నీకు అనుభవంలో అర్థమవుతుంది. ఈ అనుభవంకోసం సాధన చెయ్యాలి. దైవభావాన్ని పెంచుకోవాలి. ఎవ్వరిని ద్వేషించకూడదు. ఏమతాన్ని కూడా విమర్శించకూడదు. అందరిని ప్రేమించాలి. ఈ ప్రేమయే భగవత్ప్రేమ. ఈ ప్రేమను పెంచుకోడం నిజమైన భక్తి.

(సా.పు.265/266)

భక్తి అంటే ఏడవటంకాదు. భక్తి అంటే సృష్టి అన్నిటిలోను మీరు మిమ్ములను చూడాలి.

(సా.పు.522)

చెప్పుకునేది భక్తి చేసేది భుక్తి. అదికాదు. నిజమైన భక్తి. అన్నింటికిని మనసు సిద్ధముగా వుంటుండాలి. "పిలిచి అడుగు చెఱుకు పెట్టినా బెల్లంబు, పిప్పెగొట్టి రసము పీల్చుకున్న"? "జాతి వజ్రమైన సానబెట్టువలయు" కట్టింగ్సు లేకపోతే దానివిలువ తగ్గిపోతుంది. బాధలే లేకపోతే చెఱుకు పాలైనా ఇవ్వదు. మానవుని యందు కష్టములు నష్టములు దుఃఖములు మథించినప్పుడే అందులో నిజమైన సారము ఆవిర్భవిస్తుంది. కనుకనే భక్తి, భక్తి, భక్తి, అనేకవేదాంతోపనిషత్తుల సారమును మథించి అందించిన సుధానిధియే యీభక్తి. భక్తిలో యేమాత్రము చలనము ఏర్పడకూడదు. దానిని స్థిర మైనదిగా నిల్చుకున్నప్పుడే ధృడమైన విశ్వాసము కలిగినప్పుడే ఫలమును అందుకోవటానికి మనము అర్హులమవుతాము.

(బృ.త్ర.పు.41)

ధనమున్నదని పెద్దలను జెన్కనగుగాని
పుడమినద్దానిచే ముక్తిరాదు
బలమున్నదని మిట్టిపడవచ్చునేకానీ
పుడమి నద్దానిచే ముక్తిరాదు

విద్యాంసుడని పెద్ద బిరుదొందనగుగాని
పుడమినద్దానిచే ముక్తిరాదు
పదవి కద్దని పల్కుబడి జూపనగుకానీ
పుడమినద్దానిచే ముక్తిరాదు
భక్తి సంపాదనముననే ముక్తి కలుగు
రామభక్తులు కానిచో రాదు ముక్తి
శాశ్వతములు గావు మిగతవి సత్యముగను.
భక్తియే యన్న సాయి సత్యంబునొసగు

(ము.ము.పు.41)

ఇసుకపై వర్షధార నింకిపోవు
మధురమై నిల్చురేగడి మసకలోన
చిప్పపైబడి ముత్యమై చెన్నుమీరు
అటుల ప్రాప్తానుసారమై అలరు భక్తి

పూవులేక కాయ పుట్టదు చెట్టున
కాయలేక ఫలము కాంచబోము
కర్మ, నిష్ట లేక కలుగదు భక్తియు
భక్తియులేక జ్ఞాన భరితుడగునా?

చెట్టున పువ్వులేక కాయ పుట్టదు. కర్మలేకుండా భక్తిమార్గము మనలో ప్రవేశించదు. కాయలేక ఫలము కలుగబోదు. అనగా భక్తియే లేకపోతే జ్ఞానమనే పరిపక్వత ఏర్పడదు. జ్ఞానము అనే శిఖరమునకు చేరాలంటే, భక్తిని మనము అనుభవించాలి. భక్తి స్థాయిలో జీవితము పరిపక్వతస్థితికి తెచ్చుకోవాలంటే కాయలనే కర్మలయందు ప్రవేశించాలి. కనుక, కర్మ వలన భక్తి, భక్తి వలన జ్ఞానము లభిస్తుంది. కర్మలేక భక్తిలేక జ్ఞానమును అనుభవించుటకు వీలుగాదు. సాధకులైనవారు, సాధకులు కాబోయే వారు, చిత్తమును పరిశ్రుభము చేసుకునే కర్మలను ఆచరిస్తూ పోవాలి.

ప్రతిజీవిత వృక్షమందు 'ప్రేమ' అనే ఫలము మధుర రసముతో కూడి ఉంటుంది. అయితే ఈ ఫలము 'తృష్ణ' అనే చర్మముతో కప్పబడి ఉన్నది. 'తృష్ణ' అనే చర్మమును వలచి, లోపల ఉండే ఈర్ష్య, అసూయ, అహంకార, స్వార్థములనే బీజములను దూరముచేసి ప్రేమరసమును అనుభవించినప్పుడే **'పరమప్రేమ'** అనే ప్రథమ స్థానమును అందుకొనుటకు వీలగును. ఈ **'పరమప్రేమనే ఉపనిషత్తులు 'రసస్వరూపము' అని చెబుతూ వచ్చాయి.** "అపోజ్యోతిరసః అమృతం బ్రహ్మ' ఇదే అమృతం, ఇదే జ్యోతి, ఇదే ఆత్మ, ఇదే బ్రహ్మ దీనిని బడయగోరి మానవులు మూడు విధములైన భక్తిని అనుసరిస్తున్నారు. **మొదటిది (భౌతిక భక్తి) సామాన్యబేధభక్తి రెండవది ఏకాంతభక్తి మూడవది అనన్యభక్తి.** శ్రవణ. మనన, నిధి, ధ్యాసలతో కూడినటు వంటిది. యజ్ఞయాగాదిక్రతువులతో చేరినటువంటిది. క్షేత్రయాత్ర పుణ్యనదీ, తీర్థయాత్ర, కీర్తన, షోడశోపచారములతో కూడినటువంటిదీ, ధానధర్మాది కృత్యములతో చేరినదీ, ఇవి అన్నియూ భౌతిక భక్తి మాత్రమే! జపతపాది పూజలు, వ్రతములు, సంధ్యావందనములు కూడా ఈభౌతిక భక్తితో కూడినట్టివే! ఇవయన్నియూ జపము లనియే చెప్పవచ్చును.

ధ్యానము నందు నిమగ్నుడై, అనేక విధములైన దర్శనములను అనుభవించినప్పటికీ అనేక విధములైన దైవశక్తులను తాను చూచినట్లుగా భావించినప్పటికీ, అవియన్నియూ కేవలము భౌతిక భక్తికి మాత్రమే చెంది ఉంటాయి. కారణమేమనగా, అనిత్యమూ, అశాశ్వతమూ. అసత్యమూ అయినటువంటి కాయముతో ఆచరించు చున్నవన్నీ అనుభవించుచున్నవన్నీ మనస్సుతో విస్మరించి, మనస్సుతో విశ్వసించేటటువంటివీ ఇవన్నీ జడముతో కూడినవి.

"శర్యతే ఇతి శరీరః" జీర్ణించే శరీరముతో గావించేవి కనుక, దీని ఫలితములు కూడా జీర్ణించుకు పోతాయి. "దహ్యతే ఇతి దేహః" దహించుకుపోయే దేహముతో ఆచరించేవి కనుక ఇవి కూడా భస్మమైపోతాయి. అట్లని ఈ ప్రథమ స్థానమునందే మాత్రము విరక్తిని కలిగియుండ కూడదు. ఇవి ప్రాధమిక స్థానమునకు అవసరమే.

క్రమక్రమేణా ఏకాంత భక్తిని పొందాలి. ఏకాంత భక్తి అనగా, అనేకమంది, ఏదో ఒక విగ్రహము లేక స్వరూపము

భక్తి

చెంత ఏకాంతముగా నుండి అనుభవించటము అని భావిస్తుంటారు. కాదు, కాదు. మనస్సును అరికట్టి, దివ్యమైన అనుభూతి యందు చేరి యుండటము ఏకాంతభక్తి. మనస్సును అరికట్టుట యగునా, కేవలము మనస్సును అటూ, ఇటూ తిరగకుండా ఒక ప్రదేశమందు నిలబెట్టటము అని భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటు; మనస్సునందు చేరిన కల్మషాన్ని మాలిన్యాన్ని పరిశుద్ధము గావించడమే! ఒక ప్రదేశములో నిలబెట్టుటకు, అది నిలబడే స్వభావము కాదు. మనస్సుకు లయము ఉన్నదిగాని స్థిరమనేది లేదు. **సంకల్ప వికల్పములను అణగద్రొక్కడమే ఏకాంత భక్తి.** సంకల్ప వికల్పములచేతనే మానవత్వమనేది దెబ్బతింటూ వస్తున్నది. ఇది ఏవిధంగా ఉండాలంటే - దానికి ఒక ఉదాహరణము. భూమి యందు ఎన్ని వృక్షములు పుట్టుచూ, పెరుగుచూ, నశించుచూ ఉండినప్పటికీ భూమికి ఎటువంటి బాధలు లేవు. ఏకాంత భక్తి స్థితి యందు మనస్సు అట్టి స్థిరమైన పరిస్థితి యందు లయమై ఉంటుంది. సర్పుల యందూ భగవంతుడు ఉండినప్పటికినీ, ఇట్టి లయమైన హృదయము కలిగిన వారి యందు భగవంతుడు ప్రత్యక్షరూపములో తన దివ్యత్వాన్ని అందిస్తుంటాడు. తలుపులు బిగించుకొని, ఒక విగ్రహాన్ని గట్టిగా పట్టుకొని, ఆరాధన చేసుకొని అనుభవించినంత మాత్రాన అది ఏకాంత భక్తికాదు; **ఏకాకి భక్తి.**

స్వస్వరూపమునందున్న ఆత్మ స్వరూపుణ్ణి దర్శించాలి గాని, కల్పితమైన స్వరూపాన్ని అనుభవించేది భ్రాంతి మాత్రమే! అయితే కల్పితములైన ఆరాధనలు కూడా ప్రాథమిక స్థాయిలో అవసరమే! ఎంతకాలమైననూ ఆదశలోనే జీవితాన్ని ధారపోస్తూ ఉండకూడదు. విషసర్పములకు కోఱలు పెరికిపారవైచినపుడు ఏ విధముగా భయము లేకుండా ఉండునో, ఆ విధముగనే మనస్సునందు దుర్భావములను దుర్గుణములను దూరము చేసినప్పుడు, మనస్సు ఏమాత్రమే ప్రమాదకరముకాదు.

భావంబునందు దుష్టభావము వీడుటే
త్యాగమగును, అదియె యోగమగును.

పవిత్రమైనటువంటి భావాలచేత, పరమార్థ భావము చేత మనస్సును మార్చుకోవడానికి పూనుకోవాలి. ఈ విధమైనటువంటి తర్ఫీదు చేస్తూ రాగా, అంతర్భూతమైన ఆత్మదర్శనాన్ని అనుభవించవచ్చు. మనయందు ఆత్మ అంతర్భూతమై యున్నది. కాని కనిపించుటలేదు. కారణం ఏమిటి? మాలిన్యమైన పాచి దానిపై కప్పబడి యున్నది. రాగద్వేషాలనే అలలు లేకుండా చేసినప్పుడు, దుర్భావములనే కల్మషాన్ని దూరమే చేసినప్పుడు పరిశుద్ధమైన జలముగా చిత్తము రూపొందుతుంది. అప్పుడు కన్నులు మూసుకొని, **మనస్సును అంతర్ముఖము చేసుకొంటినా, క్షణములో సాక్షాత్కారాన్ని అనుభవిస్తావు. ఈ సాక్షాత్కారమే ఏకాంత భక్తి.**

ఇక **'అనన్య భక్తి'** "నీవే తప్ప నితః పరం బెరుగ''అని పలకటం అనన్య భక్తి అని భావిస్తున్నాము. 'శరణాగతి' అనన్య భక్తి అని భావిస్తున్నాము. కాని, ఒక ప్రక్కన "నీవే తప్ప నితఃపరం బెరుగ'' అంటూ, ఇంకొక ప్రక్క నా వారూ నా బంధువులూ ఉన్నారని విస్మరించటం లేదు; విశ్వసిస్తున్నాము. **తాను తప్ప అన్యము లేదనే భావనే అనన్య భక్తి.**

త్వమేవ మాతాచ పితాత్వమేవ
త్వమేవ బంధుః సఖాత్వమేవ
త్వమేవ విద్యా, ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవదేవ

ఇది వాచా భక్తి: హృదయ భక్తి కాదు. అనన్య భక్తి అంటే హృదయ పూర్వకంగా ఈ నిర్ణయం చేసుకోవాలి.

భక్తి అంటే నిజముగా భగవంతునితో అనురక్తిగా జీవించటమే! **భగవంతునితో విభక్తముకాని వాడే భక్తుడు.** భక్తుని మొదటి లక్షణము ఎవ్వరినీ ద్వేషించకుండా ఉండటము. భగవంతుడు సర్వత్రా సర్వజీవుల యందున్న ఆత్మ స్వరూపము. ఎవరిని ద్వేషించినా, భగవంతుని ద్వేషించినట్లే! ఎవరిని అలక్ష్యము చేసినా భగవంతుని

అలక్ష్యము చేసినవారము అవుతాము. **"సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి"** ఎవరికి నమస్కారం చేసినా అది ఆ ఆరాధనా దైవానికే చెందుతుంది. అలాగే **"సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతి గచ్ఛతి"**. ఎవరిని తిరస్కరించినా, అదీ భగవంతునికే చెందుతుందని తెలుసుకోవాలి. కనుక మన సంకల్పములు పవిత్రమైనవిగా ఉండాలి. మానవత్వములో దివ్యత్వము ఉన్నది. మానవత్వము ప్రకృతి తత్వము. ఇది ప్రవృత్తి మార్గము. హృదయమునకు సంబంధించినది నివృత్తి మార్గము. ప్రవృత్తి నివృత్తులు రెండూ మనయందే ఉంటున్నవి.

(శ్రీ.భ.ఉ.పు.25/27)

ప్రేమనే 'భక్తి' అని మన భారతీయులు అనాది కాలమునుంచి చెప్పుతూ వచ్చినారు. భగవంతుని ప్రేమను పొందుటకు అనేక మార్గములు కలవు. భగవంతుని చేరుటకు, తెలసికొనుటకు, భగవంతునితో తాదాత్మ్యమును పొందుటకు, తద్వారా భగవంతుని విభూతులను అర్థము చేసుకొనుటకు ప్రేమయే తోడ్పడుతుంది. **ఏదో విధముగా భగవంతుని సన్నిహిత సంబంధులు కావటానికి పూనుకోవటమే 'భక్తి' అని ప్రబోధించినారు. బంధువుగానో, మిత్రుడుగానో, తండ్రిగానో, తల్లిగానో, సతిగానో, పతిగానో, ఏదో విధముగముగ భగవంతునితో సన్నిహిత సంబంధమును కల్పించుకోవటమే భక్తి యొక్క అంతరార్థము.**

జ్ఞాన, కర్మయోగ మార్గములు భక్తి కంటే కష్టమైనవిగా ఉంటాయి. ప్రేమ చాల సులభమార్గము. చాల దగ్గర మార్గము. చంద్రుని వెలుతురు ద్వారానే చంద్రుని చూడటానికి సాధ్యమౌతుంది. అదే విధముగా ప్రేమ స్వరూపుడైన పరమాత్ముని తెలిసికోవటానికి, పొందటానికి, ప్రేమ ద్వారానే అది సాధ్యమౌతుంది. అదే సులభమార్గము. భగవంతుడు సముద్రము వంటి ప్రేమను కలిగి ఉంటాడు. మనము ఎంత పాత్రను తీసికొని పోతామో ఆ పాత్రకు తగినంత మాత్రమే సముద్ర జలము అందుకోగలము గాని తక్కిన జలము అంతా తెచ్చుటకు వీలు కాదు. కనుక మొట్టమొదట మన పాత్రను పెద్దదిగా చేసుకొనుటకు ప్రయత్నించటమే **సాధన** అన్నారు.

సాధన యందు మొదట మెట్టు మాతృభక్తి. కుమారునికి, తల్లిపైన, తల్లికి కుమారునిపైన ఉన్నవాత్సల్యము, మాతృభక్తి. ఈ రెండింటి సన్నిహిత సంబంధమే భగవద్భక్తిగా మారిపోతుంది. దీనిని వాత్సల్యభక్తి అని భాగవతమునందు ప్రకటించారు.

సఖ్యభక్తి దీనికి ఉదాహరణ గోపబాలురు.

మూడవది **విరోధ ప్రేమ.** ఏదోవిధముగా భగవంతునికి వారు సన్నిహిత సంబంధులైనారు. కంసుడు, జరాసంధుడు దంతవక్రుడు, పౌండరీక వాసుదేవుడు. ఇలాంటి వారంతా క్షణక్షణము కృష్ణుని ద్వేషించి, ఏ నిమిషములో ఎక్కడ కనిపిస్తాడా? ఏ నిమిషంలో కృష్ణుని నామము మనము వింటామా? అని రాత్రులయందు నిద్రలో కూడా కలవరించే వారు. విశ్వాసమున్న వారికే స్వరూపమును చూచినప్పుడే ప్రేమ వస్తుంది. ఏదో పటమును చూచినప్పుడే ప్రేమ వస్తుంది. కాని విరోధమున్న వారికి ఎల్లవేళల రాత్రులందు నిద్రయందు కలయందు కూడ ఆరూపాన్ని చింతించటమే ఆ నామాన్ని స్మరించటము ఎల్లప్పుడు ఉంటుంది.

విరోధ భక్తితో సర్వదా సర్వకాలేషు సర్వత్ర కృష్ణ చింతనే చేస్తుంటారు విరోధులు. ఈ విధముగా భగవంతుని నామమును, రూపమును, వారి హృదయాలలో చిత్రించబడి పోయింది. **ఆ విధమైన సంబంధముతో కృష్ణునిలో వారు ఐక్యమై పోయినారు.**

నాల్గవది గోపికాభక్తి. దీనికి మధుర భక్తి అని మరొక పేరు. ఉదాహరణ గోపికలు. వీరికి నిరంతరము కృష్ణ చింతన తప్ప అన్య చింతన లేదు.

"బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అని మన భావములు ఎట్లా ఉంటే భగవంతుని భావము తత్వము కూడ ఆ రీతిగానే తెలియజేస్తుంటాడు. ఈ రీతిగా నిరంతరము కృష్ణచింతన చేయటములో **వారి దేహాలు కూడ కృష్ణమయముగా మారి పోయినాయి. "యద్భావంతద్భవతి"**

(ని.వె.పు. 159/169)

భక్తికిగుర్తు

ఈనాడు ఆధ్యాత్మికమునకు అనేక అంతరాయములు కల్గుతున్నాయి. అయితే, ఇవన్నీ తాత్కాలికమైనవే గాని, శాశ్వతమైనవి కావు. **మానవుని మనస్సు అనలే చంచలమైనది.** దానికి మరింత చంచలత్వమును పెంచే వాతావరణం ప్రపంచంలో అధికమౌతున్నది. కారణమేమిటి? ఈనాడు లోకంలో ఎక్కడ చూసినా అనేకమంది మాతాజీలు, స్వాములు, బాబాలు పుట్టుకొస్తున్నారు. **ఎవరినైనా సరే, ఒక్కసారి నమ్మిన తరువాత జీవితాన్ని చాలించేవరకు ఆ నమ్మకాన్ని నిల్పుకోవాలి. దైవం ఒక్కడే. "ఏకంసత్...." అదే నిజమైన దైవత్వం. ఆ ఒక్కదానినే మీరు ఆశించండి, విశ్వసించండి.** అనవసరంగా వారివద్దకు, వీరివద్దకు పోయి మీలో ఉన్న నమ్మకాన్ని పాడు చేసుకోవద్దు. ఒక చోట మొక్కను నాటిన తరువాత దానికి ఎరువు వేసి నీరు పోసి పెంచాలి. అట్లుగాకుండా, ఆ మొక్కను ఇక్కడ కొన్ని రోజులు, అక్కడ కొన్ని రోజులు.... ఈ రీతిగా పెరుకుతూ పోతూ ఉంటే అది ఎంతకాలం బ్రతుకుతుంది? అట్లే, **ఆధ్యాత్మిక మార్గంలో ఇష్టమొచ్చినట్లు గురువులను మార్చుకోవడం వ్యభిచార భక్తి అవుతుందేగాని, నిజమైన భక్తి కాజాలదు. అలాంటి చంచలత్వానికి మీరు తావీయకూడదు. అందరియందు భగవంతుడున్నాడని విశ్వసించండి. ఎందుకంటె మమైవాంశోజీవలోకే జీవభూతస్సనాతనః' అని భగవద్గీత చెప్పింది. కనుక, అందరినీ భగవత్స్వరూపులుగా భావించండి, తప్పులేదు. కాని, ఇది వదలి అది, అది వదలి మరొకటి.... ఇలా మార్చుకునే వారు దొంగ భక్తులే గాని, సరియైన భక్తులు కారు. మీ భక్తి నిర్మలమైనదిగా, నిశ్చలమైనదిగా, నిస్వార్థమైనదిగా ఉండాలి.** ఎన్ని కష్టనష్టములు సంభవించినా వాటిని తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగాలి. **ఎంతో మంది భక్తులు, సాధువులు, మహనీయులు, పతివ్రతలు ఎన్నోకష్టములను ఎదుర్కోవలసి వచ్చింది. కాని, వారు పట్టిన పట్టు విడువకుండా దైవానుగ్రహాన్ని సాధించగల్గారు.** మహాభక్తురాండ్రైన మీరా, సక్కుబాయిలు ఎన్ని కష్టములకు గురి అయినారో మీకు తెలుసు. మీరాను భర్తయైన మహారాణాయే తప్పు పట్టి బయటికి నెట్టాడు. ఆ సంఘటన ఆమెకు 'షాక్' మాదిరి తగిలింది. అయితే, అది ఒక్క సెకండు మాత్రమే. తక్షణమే ధైర్యాన్ని కూడదీసుకొంది. "చలోరే మన్... గంగా యమునాతీర్, గంగా యమునా నిర్మల్ పానీ, శీతల్ హోత్ శరీర్.... చలోరే మన్..." అని పాటుకుంటూ ద్వారకకు బయల్దేరింది. ఇద, పింగళ - ఈ రెండింటికీ మధ్యనున్న సుషుమ్నయే గంగాయమునా తీరము. అక్కడి వెళ్ళవలసిందిగా ఆమె తన మనస్సుకు బోధించింది. **అలాంటి స్థిరమైన భక్తిని మీరు పోషించుకోవాలి.**

(స.సా.అ. 2001 పు. 295)

(చూ॥ ఆడంబరభక్తి, ఆదిశంకరులు, కర్మ, కుంతీదేవి, కోరికలు, గోల్డ్‌స్టీన్, త్రిగుణములు, నామస్మరణ, పరము, పరాభక్తి, పొత్తు, ప్రేమ, ప్రేమజీవనము, ప్రేమమతము, భక్తుడు, భక్తుని లక్షణము, శాంతిపుష్పము)

భక్తికిగుర్తు

పరమాత్మునికి భావమే ముఖ్యం. అణుమాత్రమైన పదార్థములో బ్రహ్మాండమంత భావాన్ని భక్తులు నింపగలరు. ద్రౌపది ఇచ్చిన ఆ చిన్న బలుసాకులో అంత భావం ఉండటంవల్లనే సృష్టి అంతయు తృప్తి పడింది; క్షుద్బాధ ఒకే క్షణంలో తీరిపోయింది. రుక్మిణి త్రాసులో వేసిన ఒకే ఒక తులసీ దళములో ఆ భావం ఇమిడి యుండుటవల్లనే పధ్నాలుగు లోకములను తన బొజ్జలో ధరించిన భగవంతునికి అది సమముగా తూకమైనది. ఎటువంటిదానికి తాను తూగగలడు, అనేది చూపించడానికే కృష్ణుడు ఈ ప్రకరణాన్ని జరిపించినాడు. ఇంక, కుచేలుడు తెచ్చిన ఆ పిడికెడు అటుకులకు ఆనాడు ఒక నయాపైస కూడా విలువ ఉండదు. అయినా వాని భార్య భక్తి శ్రద్ధలతో, వినయ విశ్వాసములతో ఇచ్చినది కాబట్టి, అది అంత ఫలిత మిచ్చినది. కొండంత పరమాత్మునికి కొండంత పూలు అక్కరలేదు. అణువంత పదార్థములోనే బ్రహ్మాండమంత భావాన్ని ఇమడ్చాలి. అదియే భక్తికి గుర్తు.

(స.సా.అ.99పు.వెనుకకవరుపుట)

భక్తికి పరమావధి

వచ్చిన దూత ఉద్ధవుడు. కృష్ణునికి పరమ మిత్రుడు. గోపికలు పడుతున్న పాట్లు తెలుసుకున్న మాధవుడు వారి హృదయ పరితాపమును చల్లార్చి వారికి ఆనందము నందించుటకై ఉద్ధవుని పంపించాడు. ఈ ఉద్ధవుడు దిగిన తక్షణమే ఓ పెద్ద లెక్చర్ మొదలు పెట్టాడు. గోపికలారా! మీరు శాస్త్ర హీనులు: ఏవిధమైన ప్రజ్ఞానమూ మీకు లేదు. మూఢులు. మూగ వారి వలె కృష్ణుని కోసం పరితపిస్తున్నారు. శాస్త్రాన్ని తెలుసుకొంటే కృష్ణుడు మీ వెంటనే ఉంటాడు. మీ హృదయంలోనే ఉంటాడు. అలాంటి కృష్ణుని చూచి ఆనందించండి. స్థూల దేహంతో ఉన్న కృష్ణుని కోసం మీరు పరితపించడం అజ్ఞానం, నేనిప్పుడు మీకు యోగశాస్త్రం బోధిస్తాను. అందుకే కృష్ణుడు నన్నిక్కడికి పంపాడు. అన్నాడు.

కన్నెత్తి పరమపురుషునితో ముఖాముఖిగా మాట్లాడటం వాళ్ళ స్వభావం కాదు గనుక. ఒక భ్రమరమును సాక్షిగా పెట్టుకొని, సంభాషణ సాగేట్టుగా వారు యుక్తి పన్నారు. కృష్ణునికి అర్పితమైన వారు, పరపురుషులతో మాట్లాడటం దోషం కదా! కనుక ఓ తుమ్మెదా! అని సంబోధించి తుమ్మెదతోనే మాట్లాడుతున్నారు వాళ్ళు ఓ తుమ్మదా! కృష్ణ వియోగాగ్నితో మండిపోతున్న మా హృదయాలకు ఈ మాటలు మరిన్ని కట్టెలు కాల్చినట్లున్నవి. మరింత తైలము పోసినట్లున్నది. ఇక మాట చాలించు తుమ్మదా అన్నారు గోపికలు. అంతటితో అతను ఆగలేదు. ఇదిగో! కృష్ణుడు పంపిన సందేశం. దీనినైనా చదువుకోండి! అన్నాడు.

ఒక గోపిక అన్నది. తుమ్మెదా! మేము పల్లె పడుచులం. మాకు చదువు సంధ్యలు లేవు. కృష్ణుని వియోగముతో మేము కుమిలి పోతున్నాం. మాటలు చాలించి కృష్ణుని చూపించు మరొక గోపిక అందుకున్నది: తుమ్మెదా ఈ దేహము విరహాగ్నిలో మండుతున్నది. చేతులతో తాకగానే ఆ కాగితం భస్మమై పోవచ్చు. కనుక దానిని మేము తాకము అని చెప్పింది. ఇంకొక గోపిక అన్నది:ముత్యముల వంటి **ఆ కృష్ణుని అక్షరములు మా కంటి ధారలకు చెదరి పోతాయి.** కనుక ఆజాబును మేము చూడము. అప్పుడు ఉద్ధవుడు, అయితే యోగ విద్య బోధిస్తాను వినండి అన్నాడు. మరొక గోపిక అందుకున్నది. ఆమె భరించలేక పోయింది, తుమ్మెదా! నీ అధిక ప్రసంగాన్ని కట్టిపెట్టు. **మాకున్నది ఒకేమనసు. అది కృష్ణునితోనే మధురకు వెళ్ళి పోయింది. నీవలె మాకు నాలుగు మనసులుంటే నీ యోగ శాస్త్రానికొకటి.** దానికొకటి, దీనికొకటి వినియోగించే వాళ్ళం. ఉండేది ఒకే మనసు, అదీ ఇక్కడ లేదు. శ్రీకృష్ణునితోనే ఉంది. నీ యోగశాస్త్రం ముగించుకొని వచ్చిన దారిని వెళ్ళిపో! అన్నది.

ఈ ఒక్క మనసు అనే మాట వినగానే ఉద్ధవుని మనసు గిజ్జును తిరిగింది. సర్వ వేదముల సారము ఏక మనస్తత్వము. ఏకాత్మ భావమే కావలసింది. ఏకాత్మ భావమునకు ఏక మనస్సు కావాలి. అదే ఏకాగ్రత. ఈ గోపికలకున్న ఏకాగ్రత నాకు లేకపోయింది. కదా! అని తనలోతాను విచారించుకున్నాడు. అమ్మలారా! నేనిక కృష్ణుని దగ్గరకు వెళ్ళిపోతున్నానుఅని చెప్పాడు. గోపికలలో కొంత ఉన్నత స్థాయి భక్తి గలవారు రాధిక, నీరజ. రాధిక చెప్తున్నది: తుమ్మెదా ఒకసారి కన్నెత్తి చూడమని చెప్పవే నామాట రాచిలుక తోడ.

ఉద్ధవుని తుమ్మెదగా పోల్చుకున్న గోపికలు కృష్ణుని రాము చిలుకగా పోల్చుకున్నారు. మాహృదయం పరితపించి పోతున్నది. ఒక్కతూరి కన్నెత్తి తమవైపు చూడమని చెప్పు అన్నది.

ఇంక నీరజ చెప్పింది:

చెదరి పోయిన నాదు జీవిత సుమమాల
చెలువార చూచి ధరియించమనవే

ఇంకొక గోపిక అందుకున్నది:

మబ్బు గ్రమ్మిన నాదు మానస వీధిలో
కృష్ణ భానుని తేజము నిలువ మనవే

మరో గోపిక అన్నది:

ఎండు బారిన నాదు జీవిత సుమములు
చిగురు బెట్టగ వేగ చేయమనవే

భక్తి ప్రపత్తులు

వీరి సందేశాలను తీసుకున్న ఉద్ధవుడు వెళ్ళుతున్నాడు. ఇసుక తిన్నెలపైన చర్మము బండబారి పడివున్న రాధను చూశాడు. **రాధమ్మా! నేను ఉద్ధవుణ్ణి, కృష్ణుడు పంపిన రాయభారాన్ని గోపికలకు అప్పజెప్పాను. వారు కొన్ని సందేశాలు పంపారు. నీవేమైనా సందేశం పంపుతావా? అని అడిగాడు. ఆమెకు పోయిన ప్రాణం లేచివచ్చింది. ఉద్ధవా!**

వృక్షంబువలె తాను వర్ధిల్లు చుండిన
వల్లికనై నేను అల్లుకొందు
పుష్పంబువలె తాను పాలు పొందుచుండిన
తుమ్మెదనై నేను తిరుగుచుందు
మేరు పర్వతమే తానైన
పరచుకొని పారెద నేను సెలయేరునై
అనంత ఆకాశమే తానైన
చిన్ని చుక్కను నేనై తనలోనే చేరుకొందు
వరసముద్రుడు తానైన వాహిని యగుదు
నేను తనలోనె ఐక్యమొందుదు
కృష్ణా...కృష్ణా...కృష్ణా....కృష్ణా..
ఎందున్నావో..ఇందురావో...
దయలేద నీ దాసిపై...

ఈ విధంగా పరితపిస్తున్న రాధను చూచి ఉద్ధవుని హృదయం కరిగి పోయింది. భక్తి ప్రపత్తులు తనకు సులభముగా అర్థమయ్యేట్టు చేయడానికి ఈ రాయభారాన్ని నిమిత్తంగా చేసి కృష్ణుడు తననిక్కడికి పంపించాడని గ్రహించాడు ఉద్ధవుడు. గోపికల ద్వారా తనకు నేర్పించడానికి ఇంత నాటకం ఆడాడని అనుకున్నాడు. ఆనాటి గోపికలు తమ భక్తి ప్రపత్తుల ద్వారా పరమ భక్తులు, శాస్త్రవేత్తలైన వారికి కూడా అంతరార్థాన్ని సూక్ష్మమైన మాటలలో ప్రబోధించారు. **భక్తికి పరమావధి, గమ్యము ప్రేమ అని గోపికలు నిరూపించారు.**

ప్రేమ రహితమగు భూములలో
ప్రేమాంకురములు పెంపొంద
ప్రేమావేశముతో
ప్రేమసుధా వర్షము వర్షింపగ
ప్రేమ నదులు ప్రవహింపగ మురళీ
గానము చేయగదే, కృష్ణా....

క్షేత్రము ప్రేమే, బీజము ప్రేమే వర్షము ప్రేమే, ప్రవాహము ప్రేమ, మురళీ ప్రేమే, సర్వమూ ప్రేమే...గోపికలు ప్రేమమయులై తపించారు. కృష్ణుడు దగ్గరకు వచ్చినా వారి కోరిక ఆ మురళిని వాయించమనే!

పాట పాడుమా కృష్ణా.. పలుకుతేనె లొలుకునటుల
మాటలాడుమా ముకుంద మనసు తీరగా
వేదసారమంత తీసి నాదబ్రహ్మముగ మార్చి
వేణునందు తిరుగబోసి
గాన రూపముగ మార్చి ॥పా॥

పుంసా మోహన రూపాయ, పురుషులను సైతము మోహింప జేసేది దైవత్వము. ఇది చైతన్య శక్తి అందరిలోను ఉంటుంది. దానిని అనుభవించుకోవడానికి సాధన చేయాలి. అందుకు ఏకైక మార్గము ప్రేమ తత్వము. ప్రేమను అభివృద్ధి పరచుకొని దైవత్వాన్ని అనుభవించాడానికి ప్రయత్నించిన రోజే కృష్ణ జన్మోత్సవం కాని, ప్రతి అష్టమికి కృష్ణుడు పుడతున్నాడని కాదు. అష్టమి అయినంత మాత్రాన కృష్ణుడు పుట్టడు. ఏరోజు కష్టములను తీర్చుకోవడానికి ప్రేమ తత్వాన్ని అలవరచుకుంటావో ఆరోజే కృష్ణుడు ఉద్భవిస్తాడు. కృష్ణుని బోధనలను ఆచరణలో పెట్టడమే నిజమైన పండుగ.

(స.సా.అ.83 పు.238/241)

(చూ॥ చిత్తాపహారి)

భక్తి ప్రపత్తులు

"తత్త్వేవాహం" నేను భగవంతుని భక్తుడను అని ప్రారంభములో చెప్పుకుంటాడు. ఇందులో భగవంతుడు వేరు తాను వేరుగా నిరూపించుకుంటాడు. తత్త్వేవాహంలో నేను ప్రత్యేకంగా వుంటున్నాను.దేవుడు యెక్కడో వుంటున్నాడు, అతనిని చూడటం కోసమని అతని

భక్తుడుగా నేను తయారవుతున్నాను అని భావిస్తాడు. క్రమక్రమేణ యీ భక్తిని అభివృద్ధి గావించుకొని **'తవైవాహం' అంటూ ముఖాముఖిగా వచ్చి భగవంతుడా నేను నీ భక్తుడను, నేను నీ భక్తుడను అని ప్రారంభిస్తాడు.** తవైవాహం అన్నప్పుడు యెదురుగా నిల్చి భక్తుడు భగవంతునితో నేను నీ భక్తుడనని దీనంగా చెబుతున్నాడు. **మూడవది త్వమేవాహం నేను నీవేను అని అంటున్నాడు. నేను దైవభక్తుడను అనుకోవటం ద్వైతము. నేను నీభక్తుడను అనుకోవటం విశిష్టాద్వైతం. నేవే నేను అనుకోవటం అద్వైతము.** మనము ద్వైతములో ప్రారంభము సలిపినప్పుడే అద్వైతములో ప్రవేశించటానికి అర్హులమౌతాము. మొట్ట మొదట సామాన్యభక్తితో ఆరాధనను ప్రారంభించాలి. సాకార సగుణములు లేకుండా నిరాకార నిర్గుణములు ప్రాప్తించవు. ఇది ఆసాధ్యము కూడను. కనుక మొట్టమొదట దాసులుగా తయారుకావాలి.

దీనికి మరొక ఉదాహరణము. ఒకవైపున పెద్దసున్న వుంటుండాది. దానికి ప్రక్కనే ఒక చిన్న సున్న వుంటున్నది. ఈ పెద్దసర్కిల్ దైవము. చిన్నదే జీవుడు. **ఈ జీవుడనేవాడు దేవునకు ప్రత్యేకంగా వుంటున్నాడు. ఇది ద్వైతము. విశిష్టాద్వైతమనగా పెద్ద సున్నాలోపల చిన్న సున్న వుంటుండాలి. అనగా దైవములో జీవుడున్నాడు. అయితే యీజీవుడు దైవములో జేరే విధానము యేమిటి?** ఈ చిన్నసున్న క్రమక్రమేణ విశాలమైన భావములు పెంచుకొని పోతూపోతూ యీ పెద్దసున్నలో లీనమైపోతుంది. ఇదే అద్వైతము అన్నారు. జీవతత్వమును దైవత్వముతో చేర్చటానికి తగిన కృషిచేయటమే భక్తిప్రపత్తుల మార్గము.

(శ్రీ.గీ.పు.61)

కొంతమంది చెపుతుంటారు - " చిన్న వయస్సు నందు ఎందుకీ భక్తిప్రపత్తులు? రిటైరైన తరువాత భగవంతుని స్మరించవచ్చు" అని. రిటైరైన తరువాత ఏమవుతుందో!

పదపదమంచు కింకరులు పాశము లాగెడువేళ,
బంధువుల్ దబదబ బయట పెట్టుడిక లాభము
లేదని చెప్పువేళ, ఆలుబిడ్డలున్ లబలబ
ఏడ్చువేళ, తరమా హరినామము నోట పల్కగన్
ఉద్యోగంలో చేయలేనిది రిటైరైన తరువాత ఏమి చేయగలరు?

(స.సా.ఏ.99 పు.105/106)

(చూ॥ అయోధ్య, దూపాటితిరుమలాచార్యులు, భావములు, శరణాగతి, హనుమంతుడు)

భక్తిమార్గము

ప్రజలారా! ఇహపరలోక సుఖముల ననుభవింపగోరు వారు నా మాటలను లక్ష్యములో నిడుకొని వానిని మరువక సంచరించుతారు. **అన్ని మార్గములకంటే సంసారమును దాటుటకు భక్తిమార్గమే సులభము, మనోహరమైనది.** సంసారమును దాటుటకు జ్ఞానమార్గమే కష్టము. ఆ మార్గమున అనేక విఘ్నములు కలుగును. మనో నిగ్రహము దుర్లభము. జ్ఞానమార్గమున నడచినవానికి భక్తిలేని యెడల నాకు ప్రియుడు కాడు. భక్తివంటిది మరొకటి లేదు. దానికి స్వతంత్రము కలదు. దాని వలన సకల సుఖములు కలుగును. సత్సాంగత్యము లేనియెడల భక్తి కలుగదు. ఓ జనులారా! మీకు మరొక **రహస్యమును చెప్పుచున్నాను, వినుడు. శివకేశవుల కేవిధమగు భేదములు లేవు. భగవంతుడు ఒక్కడే అని విశ్వసింపుడు.** రూప నామములు వేరువేరు గానీ దివ్యాత్మ ఒక్కటే. అది అందరియందునూ సమముగనే యున్నది అనిన రాముని అమృతోపానమగు వచనములను విని పురజనులు శ్రీరామచంద్రునకు శిరస్సులు వంచుకొని నమస్కరించిరి.

(రా.వా.రె.పు.226)

(చూ॥ జన్మము, మాయ)

భక్తియోగము

(చూ॥ సంతృప్తి, స్వేచ్ఛ)

భక్తి రెండువిధములు

నవమార్గముల నాచరించువారు రెండుతెగలకు చెందియున్నారు. **మొదటివారిది, కఠిన సాధన: రెండవవారి సాధన నిరపాయమును, సౌలభ్యమునై యున్నది. ఈ రెండింటినే భక్తి, ప్రపత్తి అని అందురు. మర్కటకిశోర న్యాయముగా నాచరించు దానిని భక్తి అనియు, మార్జాలకిశోర న్యాయమైనదానిని ప్రపత్తి యనియు చెప్పుదురు.**

భక్తి ఎప్పుడును తైలధారవలె అవిచ్ఛిన్నముగ నుండవలెను. భక్తి ప్రపత్తు లొక్కటే అయియుండియు, భిన్నరూపముగ ప్రవర్థమాన మగుచున్నవి. ప్రేమలేక ప్రపంచమున ఏ వస్తువును లభించదు. ప్రేమ ఉండిననే అనురాగ మేర్పడును. అనురాగ ముండిననే లభించిన వస్తువును రక్షించుకొనును. ఈ రెండింటి యందును సమమైనది ఒక్క ప్రేమే అయినను, ప్రవర్తనలు మాత్రము భిన్నముగ నుండును. మర్కటకిశోర మార్గమున తల్లి ఎట్లు తిరుగు చుండినను, బిడ్డ తనరక్షణ భారము లేక ఉండును. అట్లే భక్తుడును, తనను భగవంతుడు చేయు పరీక్షలందును, లోకమునందలి నిందాక్షేపణలు, సిగ్గు ఎగ్గులందును సహనము ప్రదర్శించి, విసుగుచెందక, విరక్తిబొందక, సోమరిగాక సర్వకాల సర్వావస్థలయందును భగవన్నా మమును విడువకుండ ఉండవలెను. **ఇందు లకు ఉపమానము భక్తాగ్రగణ్యుడైన ప్రహ్లాదుడే.**

ఇక ప్రపత్తి మార్గమట్లుగాక **మార్జాలకిశోర న్యాయము వలె ఉండును. "సర్వభార సమర్పితః"** అని తన **భారమునంతయు భగవంతునిపై నుంచవలెను.** పిల్లి పిల్ల తన తల్లిపిల్లిపై వేసి తానరచుచుమాత్ర మూర కున్నప్పుడు. తల్లి పిల్లే, పిల్లిపిల్లను తననోట కరచుకొని, ఉన్నత ప్రదేశములకు మార్చుచు. ఇరుకైన స్థలములందు సహితము అపాయము లేక తీసుకొనిపోవును. అట్లే భక్తుడగువాడు. ప్రకృతి తన్నెట్లు ఎదుర్కొనినను, తన సర్వభారమును పరమాత్ముని పైనుంచి సంపూర్ణ శరణాగతుడైనయెడల, తనను సర్వవిధముల భగవానుడే సంరక్షించుకొనును. **ఇందులకు లక్ష్మణసేవయే సాక్షి.** భక్తి నిష్టకంటెను ప్రపత్తినిష్ట సర్వదా శ్రేష్టము. అన్ని విధముల భగవంతునికి **శరణాగతిచేయుటే ప్రపత్తి లక్షణము. లక్షణుడు** రామచంద్రుని సేవకై, తనకడ్డమగు ధన, దార, మాతృ, గేయాదుల నన్నింటిని త్యాగమొనర్చి, చివరకు ఆహారాదులు సైతముత్యజించెను. ఒకరోజుకాదు. ఒకనెలకాదు ఒక్క సంవత్సరమూ కాదూ. పదునాలుగేండ్లు సర్వసుఖ సంతోషములు శ్రీరామ చంద్రుడే యనియు, తన సర్వస్వమును తానే చూచుకొననియు, తనను విడనాడక వెంటాడుటే తన జీవిత లక్ష్యమని శరణాగతుడై ప్రవర్తించెను. కాన, సర్వభారమును పరమాత్మపైనుంచి తనను మాత్రము విడువక, మరువక వెంటాడుచుండిన సర్వమూ తానేచూచు కొనును. **ఇది ప్రపత్తి లక్షణము.**

(ప్రే.వా.పు.58/59)

భక్తి విశ్వాసములు

(చూ॥ కులమతద్వేషములు)

భక్తుడు/భక్తులు

ఒకానొకప్పుడు కృష్ణపరమాత్మ అర్జునునితో సరదాగా మాట్లాడుతూ "బావా **నీవు నాకు పరమభక్తుడవు; అంతియే కాదు, ప్రాణమిత్రుడవు. నీబోటి మిత్రుడు నాకు మరొకడులేడు; అందువలననే ఈ పవిత్రమైన ఉత్తమ రహస్యమును నీకు బోధించితిని"** అని అన్నాడు. దీని అంతరార్థమెంత గాఢమయినదో యోచించుడు. లోకమున యెందరో భక్తులమని వారికి వారు బిరుదులు కల్పించుకొనుచున్నారు. కానీ, **నీవు భక్తుడవు అని భగవంతుడు ఎవ్వరికీ బిరుదు ఇవ్వలేదు. భగవంతుని హృదయమునుండి నీవు నా భక్తుడవు అను బిరుదును పొందినవాడు భక్తుడు కాని; భగవంతుని హృదయమును కరగింపలేని వారు యెంత భక్తుల మనుకొన్ననూ అది వారి అల్ప తృప్తేకానీ ఆత్మ తృప్తికాదు.** నీవు నా భక్తుడవని బిరుదును సాధించినది ఒక్క అర్జునుడు మాత్రమే.

అర్జునుడు యెంతటి పవిత్ర హృదయముతో భగవత్ అనుగ్రహమునకు యెంతటి అర్హుడో దీనితో తెలుసుకొనవచ్చును. భక్తులము భక్తులమని వూరికే చెప్పుకొను జొల్లుమాటలు, జొల్లుమాటలూ కేవలం గాలిమూటలే. వారికి తిరుగు అంగీకారముండిన గదా భక్తులనుటకు గుర్తు! **భక్తివలన అవిధేయత దూరమగును. అంత మాత్రమున చాలదు. అందుకనే మిత్రుడవనికూడా కృష్ణపరమాత్మ సంబోధించినవాడు. మిత్రత్వమువలన భయము వుండదు.** ఇవి ఒకదాని కొకటి లేకపోయిన ఉత్తమవిద్యకు అధికారికాలేడు. కనుకనే. **భక్తి, మైత్రి రెండూ అన్యోన్యముగా నుండిన అనుగ్రహమునకు అధికారి కాగలడు.**

(గీ.పు.57/58)

అనపేక్షః శుచి ర్దక్ష ఉదాసీనో గతవ్యథ!
సర్వారమ్భపరిత్యాగీ యో మద్భక్తః స మే ప్రియః

ప్రేమస్వరూపులారా! కృష్ణుడు **భక్తునికి ఉండవలసిన లక్షణములను వివరిస్తూ** భగవద్గీతలో చెప్పిన శ్లోకం ఇది. **మొదటి లక్షణం అనపేక్ష.** భక్తునికి ఎట్టి ఆశలూ, అపేక్షలూ ఉండకూడదు. శరీర, ఇంద్రియ, మనోబుద్ధులతో కూడిన మానవుడు ఆశలు, అపేక్షలు లేకుండా ఎలా ఉండగలడు? దీనికి కృష్ణుడు ఒక చక్కని ఉపాయమును బోధించాడు. ''నాయనా! నీవు అభీష్టములను, వాంఛలను కల్గియండుటంలో తప్పులేదు. కాని, **నీ అభీష్టములను, వాంఛలను భగత్ప్రీత్యర్థంగా అనుభవించు" అన్నాడు. "సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం" అనే ఉత్తమమైన భావమును అభివృద్ధి పర్చుకోవాలి.** 'నాది, నీది' అనే భేదభావమును త్యజించి సర్వమూ భగవత్ప్రీత్యర్థమై నేను అనుభవిస్తున్నాననే ఉన్నతమైన భావంతో జీవించినప్పుడు మానవుడు ఎట్టి ఆశలూ, ఎట్టి అభీష్టములూ లేనివాడుగా రూపొందగలడు.

భక్తునికి ఉండవలసిన **రెండవ లక్షణం శుచి. ఏ శుచి? బాహ్య శుచియా? లేక, అంతఃశుచియా? రెండింటినీ అభివృద్ధి పర్చుకోవాలి.** కేవలం బాహ్యమైన శరీరమును పరిశుద్ధం గావించుకున్నంత మాత్రాన సరిపోదు. అంతర్ శుచి అత్యవసరం. కళాయి లేని పాత్రయందు సాంబారు వండితే, ఆ సాంబారంతా చిలుము పడుతుంది. హృదయం ఒక పాత్రవంటిది. దానికి ప్రేమ అనే కళాయి లేకుండా ఏ కర్మలు ఆచరించినా అవి అపవిత్రంగానే ఉంటాయి. కనుక, దుష్టభావములను దరిచేరనీయకుండా హృదయంలో భగవత్ప్రేమను నింపుకోవాలి.

మూడవది 'దక్ష' ఎలాంటి కష్ట పరిస్థితియందైనా ఎలాంటి ఇక్కట్లు సంభవించినా భగవంతుణ్ణి వదలను అని ప్రతిజ్ఞ పట్టాలి. ఆ విధమైన దీక్షను పూనినవాడే దక్షుడు.

నాల్గవ లక్షణం ఉదాసీనత. అనగా దేనితోను సంబంధం లేకుండా ఉండటం. ఇష్టమైనదిగాని, అయిష్టమైనదిగాని ఏది జరిగినప్పటికీ రజోగుణానికి అవకాశము నందించకూడదు. ఎలాంటి పరిస్థితి యందైనా ఉదాసీనతను వహించాలి.

ఐదవది 'గతవ్యథ:' గడచిపోయింది తిరిగి రాదు, రాబోయేది నీది కాదు. కాబట్టి ప్రెజెంట్ (వర్తమానం) లో జీవించాలి. ఇది అర్థినరీ ప్రెజెంట్ కాదు. ఆమ్నీ ప్రెజంట్! ఎందుకంటే, గడచినదాని ఫలితం వర్తమానంలో ఉంది, వర్తమానంలో చేసేది భవిష్యత్తులో అనుభవించవలసి ఉంటుంది. గడచిపోయినది ఒక వృక్షమువంటిది. ఆ వృక్షము నుండియే వర్తమానమనే విత్తనం వచ్చింది.ఈ విత్తనము నుండియే భవిష్యత్తు అనే వృక్షం వస్తుంది. కనుక, మీరు గడచిపోయినదాని గురించిగాని, రాబోయేదాని గురించిగాని విచారించకుండా వర్తమానమును దృష్టియందుంచుకుని సరియైన దీక్షతో కార్యములో ప్రవేశించాలి. అప్పుడే సర్వ విధముల విజయాన్ని సాధించవచ్చును.

ఇంక, ఆరవ లక్షణం 'సర్వారమ్భపరిత్యాగీ' అహంకారం చాల చెడ్డది. అహంకారంచేతనే మానవుడు అధఃపతనమైపోతున్నాడు. అహంకారం గలవానిని కట్టుకున్న భార్య, కన్న కొడుకు కూడా గౌరవించరు, ప్రేమించరు. కనుక, అహంకారమును పూర్తిగా త్యజించాలి.

భక్తుడు/భక్తులు

"యోమద్భక్త స్సమేప్రియః" ఈ లక్షణాలు గల భక్తుడే నాకు ప్రియమైనవాడు అన్నాడు కృష్ణుడు. కనుక, భగవంతునితో సన్నిహిత సంబంధాన్ని పెంచుకోవాలంటే, భగవత్ప్రేమను అందుకోవాలంటే, నిత్య సత్యమైన స్థానాన్ని పొందాలనుకుంటే పైన చెప్పిన పవిత్ర గుణములను అభివృద్ధి పర్చుకోవాలి. హృదయంలో అహం 'కారం' నింపుకుని పైకి ఎన్ని నమస్కారాలు పెట్టినా ప్రయోజనం లేదు. అహంకారమును వీడనంత వరకు మానవుణ్ణి అభిమానం, క్రోధం,అసూయ డంబము మున్నగు దుర్గుణములు వెంటాడుతూనే ఉంటాయి.

(స.సా.న.99పు.318/319)

భక్తునకు మొదటి లక్షణము, ద్వేషము లేకుండుట; రెండవ లక్షణము, మైత్రి కలిగియుండుట; ఇంతమాత్రముచేతనే విడువక దీనుల యందును దుఃఖితులయందును కరుణకూడనూ వుండవలెను.

(గీ.పు.197/198)

భక్తుడు మమకారము అహంకారము ఈ రెండునూ తనయందు లేకుండా చేసుకొనవలెను. ఈ రెండునూ వేరు వేరు కావు; మమకారమునకు మూలము అహంకారము. అజ్ఞానము లేనివారికి అహంకారము చేరుటకు వీలుకాదు, చోటులేదు, అందుకనే భగవత్ భక్తుడు కాగోరు వారు **'సతతం సంతుష్టిః' అనగా భోగమందు కానీ, రోగమందుకానీ, నష్టమందుకానీ ఆదాయమందుకానీ, దుఃఖమందుకానీ, సుఖమునందుకానీ, యేది ప్రాపించిననూ సంతుష్టుడై వుండవలెను.** తన వాంఛా ఫలసిద్ధియందును, వాంఛా అఫలమందును మనసును చలించకుండా చూచుకొనవలెను.

అట్లుకాక తన వాంఛకు యే మాత్రము కొంచము అడ్డు తగిలినను చెప్పినను, మనసు ఉద్రేకమునకు దారితీయుచుండును. ఇంత యెందులకు! సకాలమునకు సరిగా కాఫీ లేకపోయిన, వారమునకు రెండు సినిమాలు చూడకపోయిన, ఉదయము సాయంత్రము రేడియోల ముందు కూర్చొనక పోయిన, ఇంకనూ అనేక విధములైన అల్ప విషయములందుకూడనూ తనమనోభీష్టము సిద్ధించకున్న ఆనాడు యెంతయో అసంతృప్తిగాను ఆశాంతిగాను వుందురు. ఇట్టి స్థితులు సంతుష్టి అని అనిపించుకొన జాలవు. ఏది జరిగిననూ జరుగక పోయిననూ, సిద్ధించిననూ సిద్ధించకపోయిననూ రెండింటి యందూ సమానతృప్తిని కనబరచుట, అనుభవించుటే, సంతుష్టి అని చెప్పవచ్చును.

(గీ.పు.198/199)

ఈనాటి భక్తులు Deep devotion వుంది అంటారు, కానీ Deep Ocean లో వుంటారు.

(భ.ప్ర.పు.1)

సత్యమైన పరమాత్మయందును సత్యమునయందును సద్ధర్ములు యందును గల ప్రేమయే శాంతము, ఇట్టి శాంతియే సత్యాత్మను సాక్షాత్కరింపజేయును. అట్టి దైవ సాక్షాత్కారము నొంద తలంచువారికి ముఖ్యముగా శాంతియునునది యుండవలెను. అనగా సత్యపరమాత్మయందె దృష్టిగలవారైనా జీవితమేమైననూ సత్యాత్మ దర్శనమొందియే తీరవలెనను గట్టి పట్టుదలగలవారై కామక్రోధాది ప్రకృతి వికారములకు సుఖదుఃఖ స్తుతి నిందానింద్యములను తలంచక యుండవలెను. ఇట్టి ఓర్పు ఒక్కటే దైవసాక్షాత్కార జ్ఞానము నొందించును.

మానవజన్మమెత్తుట దేవుని భజించి తద్వారా పరమాత్మను తెలిసి కొనుటకు అని నిశ్చయించుకొనివలెను. "నేనే ఆట, ఏ మాట, ఏ పాట, ఏమి చేసిననూ భగవంతుని తెలిసికొనుటకే, ఏమి చూసినా, ఏమి తినినా, ఏమనినా, ఏమి చేసినా, అంతా దేవుని తెలుసుకొను నిమిత్తమే" అను దృఢమును మొదట పెంపొందించుకొనవలెను. భగవన్నామరూపములు పెద్ద బెల్లపు పర్వతములవంటివి. ఆ కొండను సమీపించి సర్వదా నమ్మి ఏ వైపున నీవు భుజించిననూ ఆనందమను తీపినే అనుభవింతువు. ఈ రీతిగా ఎల్లప్పుడూ ఆ మధురమును అనుభవించువారే

ఒకానొక సమయంలో శ్రీమన్నారాయణుడు నారదుణ్ణి ప్రశ్నించాడు. - నారదా! పంచభూతములలో ఏది గొప్పది?'' ''స్వామీ! భూమి చాల గొప్పది'' అన్నాడు. ''భూమి గొప్పదే. కాని, భూమిలో మూడు భాగములు సముద్రం మింగివేసిందే! కనుక, సముద్రం గొప్పదా? భూమి గొప్పదా?'' అని అడిగాడు. ''అవును సముద్రమే గొప్పది'' అన్నాడు నారదుడు. ''అంత గొప్ప సముద్రాన్ని అగస్త్యుడు ఒక్క గుటకలో మ్రింగినాడు. కాబట్టి, సముద్రం గొప్పదా? అగస్త్యుడు గొప్పవాడా?'' అని అడిగాడు. ''అగస్త్యుడే గొప్పవాడు'' అన్నాడు నారదుడు. ''అగస్త్యుడు ఆకాశంలో ఒక చిన్న చుక్కగా ఉన్నాడే! కనుక, ఆగస్త్యుడు గొప్పవాడా? ఆకాశం గొప్పదా?'' అని అడిగాడు. నారదుడు ఆకాశమే గొప్పదని అన్నాడు ''అంత పెద్ద ఆకాశాన్ని భగవంతుడు వామనావతారంలో ఒక్క అడుగుతో ఆక్రమించాడు. కనుక, భగవంతుడు గొప్పవాడా? ఆకాశం గొప్పదా?'' అని అడిగాడు. భగవంతుడే గొప్పవాడన్నాడు నారదుడు. ''అంతటి గొప్పవాడైన భగవంతుడు భక్తుని హృదయంలో బందీయై ఉన్నాడు. కాబట్టి భగవంతుడు గొప్పవాడా? భక్తుడు గొప్పవాడా?'' అని అడిగాడు. అప్పుడు నారదుడు ''స్వామీ! భక్తుని మించినవాడు మరొకడు లేడు'' అన్నాడు. భక్త పరాధీనుడు భగవంతుడు. భక్తునికి భగవంతుడు సేవకుడౌతాడు. కాబట్టి, భగవంతుని కంటే భక్తుడే గొప్పవాడు. ప్రేమచేతనే భగవంతుని హృదయాన్ని కరిగించవచ్చు. కనుక, ప్రేమను పెంచుకోవాలి. భగవంతుణ్ణి హృదయ పూర్వకంగా ప్రేమించాలి. భగవత్ప్రేమను పొందటానికి కృషి చేయాలి. అప్పుడే మీ జన్మ సార్థకమవుతుంది.

''త్వరపడుమా, త్వరపడుమా
ప్రభు సాయీశుని ప్రేమ పిలుపులని
వినబడుచున్నవి రమ్మనుచు
పరమార్థము చేకొనుమనుచు
యోగ సాధనల పనియే లేదట
ఉపదేశంబుల పనియే లేదట

ఉత్తమ భక్తులు. దైవనామస్మరణ యను కొండలో కొంతకాలము అనుభవించి, సమీపముననుండి కొంతకాలము విషయసుఖము లనుభవింతురు. వీరిని **మధ్యమ భక్తులని అందురు**.

దైవస్మరణను కొండలో నాల్గవభాగమునే అనుభవించి ముప్పాతిక భాగమంతా విషయసుఖముల ననుభవింతురు. **వీరిని అధములని అందురు**. కష్టములు వచ్చినపుడు నామస్మరణ యను బెల్లపుకొండను ఆశ్రయించి, ఆ కష్టము తీరగనే కొండకు దూరమగుదురు. ఇట్టివారిని అధమాధము లందురు.

పరమ భక్తులైన మీరు, పై నాలుగింటిలో ప్రథమమైన ఉత్తమ మార్గమును విడువక పట్టిన, జీవితమున పూర్తి ఆనందమును తీపిని ఆరగించుచుందురు. అట్టి పట్టు పట్టుటకు శాంతే మీ నిజమిత్రము. ఆ మిత్రుని మీరు సాయముకోరిన అతని మూలమున పవిత్ర జీవులు కాగలరు. సార్థకమొందగలరు.

(ప్ర.వా.పు.33/34)

ప్రేమ స్వరూపులారా! మీరు ఏపని చేసినా పరిశుద్ధమైన భావంతో చేయాలి. చంచలమైన మనస్సుతో, దుర్భావములతో చేయకూడదు. కాలం అధికంగా తీసుకున్నా ఫరవాలేదుగాని, చేసే పని పరిపూర్ణంగా ఉండాలి. ''అయ్యో, కాలం మించిపోతున్నదే'' అని తొందరపాటుతో పనిని పాడు చేయకూడదు. కాలమును సార్థకం చేసుకున్నప్పుడే మీరు పవిత్రులౌతారు. కాలమే భగవత్స్వరూపం. చావు పుట్టుకలకు కాలమే కారణం. ప్రతి ఒక్కరూ కాలమునకు లోబడవలసిందే. కాలము ఎవ్వరికీ లోబడదు. అయితే, ఎవరైతే భగవత్ప్రేమను సాధిస్తారో వారు మాత్రమే కాలాన్ని సాధించగలరు. మార్కండేయుని వృత్తాంతమే దీనికి చక్కని ఉదాహరణ. అతనికి మొట్టమొదట ఈశ్వరుడే 16 ఏళ్ళ ఆయుర్దాయమును ప్రసాదించాడు. కాని, తరువాత అతని భక్తి ప్రపత్తులకు మెచ్చి తన సంకల్పాన్ని కూడా మార్చుకుని అతనిని చిరంజీవిగా చేశాడు. ఈ లోకంలో భక్తుణ్ణి మించినవాడు మరొకడు లేడు.

భక్తుని లక్షణము

త్వరపడుమా త్వరపడుమా
ప్రభు సాయీశుని ప్రేమ పిలుపులని
వినబడుచున్నవి రమ్మనుచు''

యోగసాధనల పనే లేదు, ఉపదేశముల పనే లేదు. ''రమ్ము, రమ్ము'' అని భగవంతుడు పిలుస్తూనే ఉన్నాడు. **తిరుపతిలో వేంకటేశ్వరస్వామి ఒక చేయిని క్రిందికి చూపిస్తూ, మరొక చేత్తో అభయమిస్తూ కనిపిస్తాడు. ఏమిటి దీని అర్థం? ''ఒరే పిచ్చివాడా! నాపాదాలపై పడు, నన్ను శరణుజొచ్చు. నేను నీకు అభయమిస్తాను'' అంటున్నాడు. భగవంతుణ్ణి శరణు జొచ్చినవారికి అభయం ఎప్పుడూ ఉంటుంది.**

(స.సా. న.99పు.304/305)

(చూ॥ దైవవిశ్వాసము, నామస్మరణ, శ్రీమంతుడు)

భక్తుని లక్షణము

మహాభారత యుద్ధం తరువాత 42 సంవత్సరాలు గడచిపోయాయి. ఒకనాడు అర్జునుడు ద్వారక నుండి తిరిగి వస్తున్నాడు. ఎట్టి పరిస్థితిలో వస్తున్నాడు? అక్కడ యాదవకులంలో ముసలం పుట్టింది. యాదవులందరూ మరణించారు. కృష్ణుడు కూడా శరీరాన్ని వదలి పెట్టాడు. ఈ వార్తను తీసుకొని అర్జునుడు వస్తున్నాడు. అర్జునుని రాకను గమనించి కుంతీదేవి లేచి కూర్చుంది. ధర్మజుడు అర్జునునికి ఎదురేగి ''అర్జునా! మన కృష్ణుడు ఎలా ఉన్నాడు? మన సఖుడు, మన బంధువు, మన బావ, మన దైవం కుశలమే కదా!'' అన్నాడు. అర్జునుడు, ''ఇంకెక్కడ కృష్ణుడన్నా!'' అని పట్టలేని దుఃఖంతో కూలబడ్డాడు. ధర్మజునిద్వారా ~~ఈ~~ **ఈ వార్త విని కుంతీదేవి 'కృష్ణుడు పోయాడా!' అని మూడు పర్యాయములు పలికి ధర్మజుని తొడపై పడి ప్రాణం వదలింది.** ధర్మజుడు తన తొడపై పడిన తల్లి దేహాన్ని చూసి ''అమ్మా! కృష్ణుణ్ణి వెతుక్కోవడానికి నీవు వెళ్ళావా? నీవు కృష్ణుణ్ణి వెతకడానికి వెళ్ళినట్లనిపిస్తోంది'' నాకు అని చాల విచారించాడు. **''ఇంతకాలము మేము కృష్ణుని వల్లనే జీవించాము, కృష్ణుని సహాయంవల్లనే యుద్ధంలో విజయం సాధించాము, పేరు ప్రతిష్ఠలను పొందాము.** ఇంక, కృష్ణుడు లేని జీవితం మా కెందుకు? అనుకొని వెంటనే భీమార్జున నకుల సహదేవులను పిలిచాడు. భీమునితో తల్లి అంత్యక్రియలకు తగిన ఏర్పాట్లు చేయమన్నాడు. అర్జునునితో పరీక్షిత్తు పట్టాభిషేకానికి కావలసిన ఏర్పాట్లు చేయమన్నాడు. నకుల సహదేవులతో **''మహాప్రస్థానమునకు అంతా సిద్ధం గావించండి'** అని చెప్పాడు. ఏమి విచిత్రము! కుంతీదేవి దేహానికి అంత్యక్రియలు, పరీక్షిత్తుకు పట్టాభిషేకం, పాండవుల మహాప్రస్థానం మూడూ ఒక దినమే జరిగాయి. ఇలా ఎవరు చేయగలరు? భగవదనుగ్రహము కల్గిన ధర్మజునివంటి పరమ భక్తులకు మాత్రమే ఇది సాధ్యము. కష్టాలు కదలిపోయే మేఘాలవలె వస్తుంటాయి, పోతుంటాయి. కష్టానికి కంటనీరు పెట్ట కూడదు, సుఖానికి పొంగిపోకూడదు. క్రుంగని, పొంగని మనస్తత్వాన్ని అభివృద్ధి పర్చుకోవాలి. ఇదియే నిజమైన భక్తుని దీక్ష. భక్తి అంటే ఏమనుకున్నారు? పూజలు, వ్రతములు చేయటం కాదు. భగవంతునిపై ప్రసరించిన ప్రేమను తిరిగి వెనుకకు తీసుకోకూడదు. అదియే నిజమైన భక్తి.

(స.సా.ఫి.2000పు.43)

భక్తికి అర్పణ భావమే ముఖ్యం. ఆడంబరము, ఆర్భాటములతో పటములను పూజించి, గట్టిగా భజన పాటలు పాడటం కాదు. స్వామి అజ్ఞానుసారం నడుచుకొనేవారికే స్వామి చిక్కుతారు.స్వామి ఆజ్ఞలను అనుసరించకూండా స్వామి మాత్రం కావాలి అనుకుంటే, అది జరుగదు. ''సర్వమును స్వామికి అర్పితం చేసుకొన్నాను. అయినా స్వామి నన్ను శిక్షిస్తున్నారే'' అని కొంతమంది నాకు జాబులు వ్రాసి పంపుతుంటారు. సర్వమును స్వామికి అర్పితం చేసుకొన్నట్లయిన స్వామి చేసినది శిక్షగా తోచదే! శిక్ష అనే భావము అహంకారము నందు పుట్టునేగాని, శరణాగతులకు రానేరదు. అది శిక్ష కాదు, రక్షణ అని సంతోషంగా భరించుకొనుటే నిజమైన భక్తుని లక్షణం. అడిగే స్థితిలో భక్తుడున్నాడంటే అతడింకా

శరణాగతుడు కాలేదనే అర్థం. మీరు అడుగనక్కర్లేదు, మీ అభివృద్ధికి కావలసినవన్నీ నేనే అందిస్తాను. దీనిని విశ్వసించి సంతృప్తితో, శాంతితో ఉండండి.

(స.సా.మే.2000 వెనుక కవరుపుట)

భక్తుని హృదయము

(చూ॥ ప్రాణము)

భగవంతుడు

భగవంతునికి భర్త, సంభర్త అని రెండు పేర్లున్నాయి. **'సంభర్త' అనగా ప్రకృతిని ఆధారం చేసుకొని సృష్టిని గావించేవాడు. 'భర్త' అనగా సృష్టించిన పదార్థములను రక్షించేవాడు. భర్త అంటే తెలుగువారు Husband అని అనుకుంటారు. కాని, భర్త అనగా యజమాని, సంరక్షకుడు అనేదే సరియైన అర్థం.** ఒక పర్యాయం నారాయణుడు నారదుణ్ణి ఉద్దేశించి "నారదా! నేను సృష్టించిన పంచభూతములలోఏది గొప్పది?" అని అడిగాడు. "స్వామీ! భూమి చాలా గొప్పది" అన్నాడు నారదుడు. "భూమి గొప్పదే. కాని, భూమిలో మూడు భాగములు **సముద్రము మ్రింగివేసిందే! కనుక, సముద్రము గొప్పదా? భూమి గొప్పదా?"** అని అడిగాడు. "అవును, సముద్రమే గొప్పది" అన్నాడు నారదుడు. "అంత గొప్ప సముద్రాన్ని అగస్త్యుడు ఒక్క గుటకలో మ్రింగినాడు. కాబట్టి, సముద్రం గొప్పదా? అగస్త్యుడు గొప్పవాడా? అని అడిగాడు. అగస్త్యుడే గొప్పవాడన్నడు నారదుడు. "అంతటి గొప్పవాడైన అగస్త్యుడు ఆకాశంలో ఒక చిన్న చుక్కగా ఉన్నాడే! కనుక, అగస్త్యుడు గొప్పవాడా? ఆకాశము గొప్పదా?" అని అడిగాడు. నారదుడు ఆకాశమే గొప్పదని అన్నాడు. "అంత పెద్ద ఆకాశాన్ని భగవంతుడు వామనావతారంలో ఒక అడుగుతో ఆక్రమించాడు. కనుక, భగవంతుడు గొప్పవాడా? ఆకాశము గొప్పదా?" అని అడిగాడు. భగవంతుడే గొప్పవాడన్నాడు నారదుడు. "అంతటి గొప్పవాడైన భగవంతుణ్ణి భక్తుడు తన హృదయంలో బంధించాడు. కాబట్టి, భగవంతుడు గొప్పవాడా? భక్తుని హృదయం గొప్పదా?" అని అడిగాడు. భక్తుని హృదయమే చాల గొప్పదని అంగీకరించాడు నారదుడు. అప్పుడు విష్ణువు **"నారదా! నేను భక్తుల హృదయమునందు బంధింపబడి యున్నాను. నాకు స్వతంత్రమే లేదు. భక్తుల ఇష్టానుసారమే వర్తిస్తాను"** అని చెప్పాడు.

(స.సా.డి.99పు.349/350)

"నీవే భగవంతుడవు" అని నేను అనేక పర్యాయములు చెపుతుంటాను. ప్రతి మానవుడు భగవత్స్వరూపుడే. ఆ రోజులలో జనాభా తక్కువగా ఉండటంచేత ముక్కోటి దేవతలనే పదము వాడుకలోకి వచ్చింది. దేహమొక దేవాలయం. అయితే, ఇది అనుభవంలోకి రావాలి. కాని, దేహపరమైన భౌతిక జ్ఞానంవలనగాని, మనోగతమైన సుజ్ఞానంవలనగాని ఇది అనుభవంలోకి రాదు. **ఆత్మసంబంధమైన, హృదయగతమైన ఆత్మజ్ఞానము లేక, ప్రజ్ఞానముతోనే అనుభవంలోకి వస్తుంది. "దేవుడు" "దేవతలు" ఈ రెండింటి గురించి యోచించు. దేవుడు ప్రధానమంత్రిలాంటివాడైతే, దేవతలు కేబినెట్ మంత్రులవంటివారు.** ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క మంత్రి నియమితుడైనట్లు పంచభూతాలను కూడా దేవతలుగా భావించారు. అందుచేతనే భూమిని భూమాత అని, వాయువును వాయుదేవుడని, జలమును వరుణదేవుడని, అగ్నిని అగ్నిదేవుడని పిలుస్తూ ఆరాధిస్తూ వచ్చారు. నీవు ప్రైమ్ మినిష్టర్‌కు ఉత్తరం వ్రాస్తే అది నేరుగా ఆయనకి చేరిపోతుంది. అలాకాకుండా ఫైనాన్స్ మినిష్టర్‌కో లేక, హోమ్ మినిష్టర్‌కో వ్రాస్తే అది వారికే చేరుతుంది. ఆ డిపార్ట్‌మెంట్‌వారు నీకు సేవలందిస్తారు. యజ్ఞయాగాదు లిట్టివే. మరొక ఉదాహరణ: టెలిఫోన్‌లో రెండు రకాలైన Calls ఉంటాయి. ఒకటి Number Call, రెండవది Particular Person Call. Number Call చేస్తే ఎవరైనా సమాధానం చెప్పవచ్చు. "అనిల్ కుమార్ ఉన్నాడా?" అని అడిగితే. నీ భార్యగాని, బిడ్డగాని ఫోన్ అందుకొని సమాధానం చెప్పవచ్చు. ఇట్టి Number Calls

భగవంతుడు

లాంటివే దేవతల నుద్దేశించి చేసే పూజలు, వ్రతాలు. కాని, Particular Person Callచేస్తే ఫోన్ నువ్వే అందుకొని మాట్లాడాలి. దేవుని ఉద్దేశించి చేసే ప్రార్థన, ధ్యానము ఇలాంటివే. అవి నేరుగా భగవంతునికి చేరిపోతాయి. సంకీర్తనలో అన్ని నామాలు పలుకవచ్చు. ఇవన్నీ Number Calls వంటివి. ధ్యానంలో ఇష్టదైవాన్ని స్మరించు. అది Particular Person Call.

(స.సా.మే2000పు.160)

ఐశ్వర్యం, ధర్మం, పూర్ణత్వం, యశస్సు, జ్ఞానం, వైరాగ్యం - ఈ ఆరుగుణములకు 'భగము' అని పేరు. ఈ భగమును కల్గినవాడు కనుకనే పరమాత్మునికి "భగవాన్" అని పేరు భగవంతుని నామములన్నీ ప్రత్యక్ష ప్రమాణములతో కూడినవేగాని కేవలం భక్తుల ప్రేమోన్మాదము చేత ఉచ్చరించినవి కాదు. భగవంతుడు నాల్గు విధములైన విభూతులతో ఆత్మస్వరూపుడుగా భావిస్తున్నాడు. **ఇతనికే - "చతురాత్మ" అని పేరు 1.వాసుదేవ. 2. సంకర్షణ. 3. అనిరుద్ధ. 4. ప్రద్యుమ్న. వీటి యందు మొదటి మూడు తత్వాలను చక్కగా గుర్తించుకుంటే, నాలుగవదైన ప్రద్యుమ్న తత్వం మనకు సులభంగా అర్థమౌతుంది.**

మొదటిది: వాసుదేవ. "ఈశావాస్యమిదం జగత్" జగత్తులో అంతటా నివసించినవాడు వాసుదేవుడు. ఈ జగత్తునంతయు తన వశం చేసుకొన్నవాడు వాసుదేవుడు. కనుక, **వాసుదేవుడనగా - సర్వభూతము లందు ఆత్మస్వరూపుడుగా ఉంటున్నవాడు.** కేవలము అందరి యందు మాత్రమేగాక సర్వత్రా వ్యాపించిన వాడు వాసుదేవుడు. అందుచేతనే - **"అంతర్బహిశ్చ తత్సర్వ వ్యాప్య నారాయణ స్థితః"** అన్నారు. మన లోపల, వెలుపల, సర్వత్రా ఉండినవాడు ఈ వాసుదేవుడే. సర్వత్రా వసించినవాడు కనుకనే ఇతనికి "వాసుదేవుడు" అని పేరు.

రెండవది: సంకర్షణ. సర్వజీవులను తనవైపు ఆకర్షింపజేసుకొనేవాడే - సంకర్షణుడు. అంతేగాక, ఇతడు సర్వజీవులను తన నుండియే ఆవిర్భవింపజేసి నటువంటివాడు. **'సంకర్షణ' అనే పదంలో సం అనగా పవిత్రత కనుక, సంకర్షణుడనగా - పవిత్ర తను ఆకర్షించేవాడు** అని అర్థము. అంతేగాక, ఈ సంకర్షణతత్వం సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్య తత్వములకు సంబంధించినది.

మూడవది: అనిరుద్ధ. సర్వశక్తిమయుడు. సర్వవ్యాపకుడైన తత్వానికే - **"అనిరుద్ధత్వము" అని పేరు. ఇతని అనుగ్రహం చేతనే ఇతనిని సాధించవచ్చునుగాని, వేరొక మార్గంలో** ఇతనిని సాధించుటకు ఎవ్వరికీ వీలుకాదు.

ఇంక, **నాల్గవది: ప్రద్యుమ్న.** అనంతమైన ఐశ్వర్యం కలిగినవాడు - **ప్రద్యుమ్నుడు భగవంతుని ఆశ్రయించినవారికి, ఆరాధించినవారికి, ప్రేమించినవారికి సర్వ సుఖములను, ఆనందములను అనుగ్రహిస్తూ, వారి అభీష్టములను నెరవేర్చుతుంటాడు.** ఈ ఐశ్వర్యము అనగా, ధన కనక వస్తు వాహనాదులు మాత్రమే కాదు. ఆరోగ్యం, విద్య బుద్ధి, గుణం ఇవన్నీ ఐశ్వర్యములే, కనుక, ఇతడు సకలైశ్వర్యస్వరూపుడగుట చేత ఇతనికి "ఈశ్వరుడు" అని మరొక పేరు కలదు.

(స.సా.ఫి.మా.92పు.42/43)

భగవంతుడు భక్తవత్సలుడు భక్తపరాధీనుడు. భక్తులయొక్క క్షేమనిమిత్తమై తాను ఎన్ని విధములైనటువంటి కష్టములకైనా గురియవటానికి సిద్ధంగావుంటాడు. తనను దూషించినప్పటికినీ తాను ఏమాత్రమూ లెక్కపెట్టడు; బాధపడడు. కాని, తన భక్తులను దూషించినపుడు, తాను చాలా బాధపడు తుంటాడు. కాని, తాను గుణములకు అతీతమైనటువంటి వాడు కనుక, ఆ బాధను లెక్కచేయడు. అతడు సర్వవ్యాపకుడు. అయినను, ఉపాధిని ధరించటంచేత, కొన్ని కొన్ని కాలములయందు, కొన్ని కొన్ని స్థానముల యందు మాత్రమే అతడు పరమాత్ముడు అని గుర్తించి కొంతవరకు మనము విశ్వసిస్తూ వస్తున్నాము.

(ఆ.రా.పు.138/139)

సాధు సత్పురుషులూ మహర్షులూ ఆర్తితో నిరీక్షించినప్పుడు భగవంతుడు అవతారం ధరిస్తాడు. సాధుపులు ప్రార్థించారు. నేను అవతరించాను. **నా కర్తవ్యాలు మూడు. వేద రక్షణా ధర్మ రక్షణా పర్యాయ పదాలు కనక రెండు అనవచ్చు. వేదరక్షణా, భక్తరక్షణా నా ఆశయాలు.**

(వ.1963 పు.10)

భగవంతుడు కలడని విశ్వసించినప్పుడు **ఇది మూఢ విశ్వాసమని ఎవరెన్ని విధాలుగా విమర్శించినా ఆ విమర్శను ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను మనం సంపాదించుకోవాలి. దేవుడు లేడని వాదించే వానికి మనమేమి జవాబు చెప్పాలి? లేడని నీవంటున్నావు, ఉన్నాడని నేనంటున్నాను. నీకు లేకపోవచ్చు, నాకు ఉన్నాడు.** నా దేవుడు లేడని చెప్పడానికి నీవెవరు? నా దేవుడు లేడనడానికి నీకు అధికారము లేదు. ఈ విధమైన వాదాన్ని ఎదుర్కొనడానికి ధైర్యాన్ని, విశ్వాసాన్ని పెంచుకోవాలి. ఈనాడు లోకంలో మూర్ఖవాదం అధికమైపోతున్నది. వారికి విషయం తెలియదు, విశ్వాసము లేదు, వాదనకు మాత్రం సిద్ధం.

నిజంగా దేవుని చూడాలని ఉంటే అనుసరించు, విశ్వసించు, ప్రయత్నించు. సాధన ద్వారా దేవుని తప్పక చూడగలవు.

(ప.పు.214)

భగవంతుని ద్వేషింపవద్దు ఎవ్వరిని అవమానించ వద్దు. చిన్నచూపు చూడవద్దు. సాయి అందరి హృదయములలో నున్నాడు. అందుచే ఎవ్వనికైనా హానిచేస్తే సాయికి హానిచేసినట్లే. ఎవరినైనను అవమానపరుస్తే సాయిని అవమానపరిచినట్లే. వారు అహంకారులైతే వారే అనుభవిస్తారు. నేను కరుణా స్వరూపుడను. నేను ప్రేమస్వరూపుడను. అందరిని ప్రేమతోనే చూడు.

(సా.పు.435)

అంతటను వున్న దేవుని వెదికే దెక్కడ? కొందరు "ఎన్నో సాధనలు చేస్తున్నాము. భగవంతుడు మాత్రము కనిపించటంలేదు అని అంటారు. భగవంతుని వెదికేవారు అన్వేషణ సలిపేవారు కోట్లకొలదిగా కనిపిస్తూ యుంటారు. కాని ఇది కేవలం వెర్రితనము. **ఎక్కడ చూస్తే అక్కడ యున్న భగవంతుని వెదికేదెక్కడ.** చాలపొరపాటు పడుచున్నారు. ప్రజలు, సాధకులు భగవంతుని వెదుకుచున్నారా? లేక భగవంతుడే సాధకుని వెదుకుచున్నాడా? యోచించాలి. సంపూర్ణ శరణాగతుడైనవాడు లోకంలో ఎక్కడా కనిపించడం లేదు. భక్తుని నిమిత్తమే భగవంతుడు వెదుకుచున్నాడు. కాని భతవంతుని మీరు వెదకనక్కరలేదు.

(సా.పు.649/650)

ధర్మం ప్రపంచ జీవకోటి యొక్క మనుగడకు ఆధార భూతం, సార్వకాలిక సత్యం.

భగవంతుడు ధర్మదేవత ధర్మప్రియుడు, ధర్మ పాలకుడు, ధర్మ స్థాపకుడు, ధర్మ స్వరూపుడు.

(ధ.వా.పు.1)

అన్నింటికీ దైవమొకడు ఆధారంగా ఉన్నాడు. అతని ఆధారం లేకుండా ఏదీ జరగటానికి వీలులేదు. అతడు ఎట్టి వాంఛలు లేనటువంటి వాడు. అతనినే గుణాతీతుడు అన్నారు. అయితే, ఈ గుణాతీతుడు సర్వత్రా వ్యాపించి యున్నాడనుటలో అర్థమేమిటి? దీనికి సాక్ష్యమేమిటి? దీనికొక చిన్న ఉదాహరణ. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాదులనే పంచగుణములతో చేరినదే ఈ ప్రకృతి. ఈ ఐదుగుణములు పృథ్వియందున్నాయి. ఐతే జలములో శబ్ద, స్పర్శ, రూప, రసములనే నాలుగు గుణములే ఉన్నాయి. గంధము లేదు. కనుకనే, ఇది విశాలంగా రూపొందింది. కాని, అగ్నిలో శబ్ద, స్పర్శ, రూపములనే మూడు గుణములు మాత్రమే ఉండుట చేత, ఇది మరింత విశాలంగా రూపొందుతూ వచ్చింది. ఇంక గాలిలో, శబ్ద, స్పర్శ అనే రెండు గుణములే ఉంటున్నాయి. మిగిలిన మూడు గుణములూ లేవు. ఈ విధముగా గుణములు తగ్గడం వలన గాలి, స్పర్శ, రూప, రస, గంధాదులు లేవు. కనుకనే, ఆకాశం మరింత విశాలంగా రూపొంది యున్నది. అనగా గుణములు తగ్గే కొలది రూపము విశాలమై పోతుంది. **భగవంతునికి**

భగవంతుడు

గుణములు లేవు. అతడు గుణములన్నింటికీ అతీతుడుగా ఉన్నాడు. కాబట్టి సర్వత్రా వ్యాపించి యున్నాడు. ఇట్టి విశాల తత్వాన్ని గుర్తించడానికి ఏ సైంటిస్టు అక్కరలేదు. భగవంతుడు ఎక్కడ ఉన్నాడు? ఏ విధంగా ఉన్నాడు? అనే విషయాన్ని నాటి నుండి నేటి వరకు ఆస్తికులు అనేక విధాలుగా పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. అయితే, ఆస్తికులు కాని, నాస్తికులు కాని ఎవ్వరూ ఈ విషయాన్ని విపులంగా వివరించలేకపోయారు. ఈ నిజమైన స్వస్వరూపాన్ని గుర్తించే విధానం మానవుని యందే ఉన్నది. కాని, గ్రంధములలో గాని, గురువుల యందు గాని లేక ఇతర సాధనల యందుగాని ఏమాత్రము కనిపించదు. కన్నులోని దృష్టివలె, కర్ణములోని వినికిడివలె, నాలుకలోని రుచివలె చైతన్యము మనస్సునందు సర్వత్రా వ్యాపించి యున్నది. కంటిలోని చూపును ఎవరైనా గుర్తించగలుగుతున్నారా? చూపును వినియోగించు కుంటున్నారే కాని, ఈ చూపు యొక్క నిజమైన తత్వాన్ని ఎవరూ విచారంచటం లేదు. ఇది చైతన్యం యొక్క ప్రభావమే. భగవంతుడు సర్వత్రా వ్యాపించి ఉన్నప్పటికీ అలాంటి సమీపత్వాన్ని గుర్తించుకోలేక మానవుడు అనేక విధములైన సాధనలు సలిపి వ్యర్థుడవుతున్నాడు.

"కనిపించెడి జగత్తులో కానరాక
అందు వెలుగొందు చైతన్య మాత్మరూపు.
మణుల యందలి సూత్రము మాదిరిగను
విశ్వమంతా నిండెను విశ్వవిభుడు."

భగవంతునికి పుట్టుకా లేదు, చావూ లేదు. ఈ జగత్ సృష్టికి భగవంతుడు సూత్రధారి. అయితే, తాను కూడా పాంచభౌతికమైన దేహాన్ని ధరించినప్పుడు ఈ విశ్వనాటక మందు తాను కూడా నటన చేయాలి. అప్పుడు తాను కూడ ఒక పాత్రధారిగా ఉంటాడు. అంత మాత్రము చేత భగవత్ తత్వాన్ని అనుమానించ కూడదు. కారణమేమనగా ఆయాకాలములకు ఆయా పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని తాను నటన చేయవలసి వస్తుంది. ఒక వ్యక్తి డ్రామాలో నటిస్తున్నప్పుడు అందులో తన పాత్రకు తగినట్లుగానే నటించాలి. తరువాత దాని వెనుక తన వ్యక్తిగతమైన చర్యలు తాను వ్యక్తిగతంగా చేయాలి. కనుక వ్యక్తిగతమైన శక్తి ఒకటి, ప్రాకృతమైన ఆకారశక్తి మరొకటి ఈరెండింటి సత్యాన్ని గుర్తించిన వాడే దైవాన్ని చక్కగా అర్థం చేసుకోగలడు. భగవంతుడు మానవాకారాన్ని ధరించి ఈ విశ్వనాటకరంగమందు తన వేషాన్ని ప్రకటిస్తున్నాడు. కనుక, ఏ సమయంలో దేనిని ప్రకటించాలో దానినే ప్రకటించాలి.

(శ్రీ.భ.ఉ.పు.144/146)

నీవు భగవంతుడవు మనుష్యులంతా భగవంతులే. జీవమున పదార్థము, జీవములేని పదార్థము భగవంతుడే. నేను భగవంతుడను. నేను భగవంతుడని నాకు తెలుసు. తెలుసుకోనక్కరలేదు. ఎందుకంటే నేను సర్వకాల సర్వావస్థలయందు భగవంతుడినే కనుక. నేను అవతారమూర్తిని. నేను ఎప్పుడూ అవతార మూర్తినే.

(సా.పు.334)

భగవంతునకు ఎట్టి విధమైన భావములు లేవు. కాని వ్యక్తి యొక్క చర్యలను, పూజలను భావములు ప్రార్థనలు పురస్కరించుకొని తాను దీనికి తగినట్లుగా నటిస్తుంటాడు. **భగవంతునికి అగ్రహము లేదు, అనుగ్రహములేదు. ఇష్టములేదు. అయిష్టములేదు. ప్రతి ఒక్కటే నీ ప్రతి** బింబమయొక్క స్వరూపములే. దేహమును ధరించటంచేత అవతారములందు కూడను ఇలాంటి కొన్ని Reactions, Reflections, Resounds వుంటాయి. జగత్తు నందు ఆదర్శవంత జీవితమును అందించే నిమిత్తమై యీ రకమైన చర్యలు చెయ్యాలి. భగవంతునికి ఇతడు బ్రాహ్మణుడు, యితడు క్షత్రియుడు, యితడు వైశ్యుడు ఇతడు శూద్రుడు యీమె స్త్రీ, యితను పురుషుడు, యితడు బాలుడు, యితను వృద్ధుడు అనే భేదములు లేవు. ఇవి లౌకిక జగత్తునకు సంబంధించినవి గాని భగవంతునికి ఎట్టి సంబంధము లేదు. రాముడు మా క్షత్రియవంశములో పుట్టినాడు, కృష్ణుడు మాయాదవ కులములో పుట్టినాడు. సాయిబాబా మాక్షత్రియ

వంశములో పుట్టాడు. ఈవిధముగా అనుకోవటం కించిత్ భావములే. భగవంతునికి అట్టి భేదములు ఏనాడు లేవు, ఎప్పుడు రావు. దివ్యత్వమైన ఆత్మ తత్వము చక్కగా అర్థముచేసుకుంటె యీ సంకుచితమైన మార్గమునకు ఏమాత్రము అవకాశము ఇవ్వరు. ఇవన్నీ సంకుచితమైన తత్వములు, సంకుచితమైన భావములు.

(బృ.త్ర. పు.152)

భగవంతుడు నీవే. నీతత్వమే భగవత్ శక్తి. దీనినే ఎనర్జీ అన్నారు.

(బృ.త్ర.పు.119)

ఆజ్ఞ ఇచ్చిన భగవంతుడు శక్తినికూడా తానే ఇవ్వగలడు.

(బృ.త్ర.పు.120)

భాగవతుల యొక్క చరిత్రలు మనం చక్కగా లోతునకు దిగి విచారిస్తే ఇంత మధురమైనవి,ఇంత జ్ఞానమయమైనవి, ఇంత ఆనందమయమైనవి, ఇంత ధర్మమయమైనవి ఎక్కడా కనుపించవు. **భక్తిశక్తి దగ్గర దైవశక్తి చాలా అల్పంగా ఉంటుంది. 'భక్తులకు నేను అధీనుడనుగానీ భక్తుడు నా అధీనుడు కాదు. నేను నా భక్తులకు దాసుడను. భక్తుల పూజాగృహములందు సింహద్వారము దగ్గర కాచుకొని ఉంటున్నాను. ఎందుకోసం కాచుకొన్నాను? ఆ దేవాలయములో నా భక్తుడు ఏమి కోరతాడో, కోరిన దానిని వెంటనే తీర్చే నిమిత్తము నేను దాసుని వలె ఉంటున్నాను. నేను అధికారిని కాదు. సర్వాధికారి భక్తుడే.** భక్తికి మించినది మరొకటి లేదని నిరూపిస్తూ వచ్చాడు భగవంతుడు. భక్తి అనేది అల్పంగా భావించుకొని, సామాన్యంగా లోకములో జరిపే సాధనలుగా మనము భావించరాదు. **భగవదనురక్తే భక్తి.** ఈ భక్తి లోపల అన్నీ చేరి ఉంటాయి. భుక్తి, రక్తి, యుక్తి, అనురక్తి, ముక్తి - అన్నీ అందులో చేరి ఉంటున్నాయి. భక్తి అనే పదము ఎక్కడ నుండి వచ్చింది.? అనేక మంది పండితులు భుక్ అనే పదము నుండి వచ్చిందంటారు. కానీ అది కాదు. మానవునికి మొట్టమొదట కావలసింది. భుక్తి, ఆహారము కావాలి. కర్మ నాచరించుటకు ఆహారము ఉండాలి. భుక్తిలో 'క్తి' రక్తి - కోరిక కావాలి. 'క్తి' రక్తిలో ప్రధానమైనది. ఈ ప్రపంచములో ఏ విధముగా బ్రతకాలి అనే యుక్తిని పొందాలి. యుక్తిలోని 'క్తి' తరువాత అనురక్తి. అందరిని ప్రేమించాలి. అనురక్తిలోని 'క్తి' తరువాత విరక్తి, విరక్తిలోని 'క్తి' ముక్తి. ముక్తిలోని 'క్తి' భగవంతునిలోని 'భ' వీటి అన్నింటిలో చేరిన 'క్తి' రెండు చేరితే 'భక్తి' అయింది. **భగవంతుడనగా ఎవరు? నీకు భుక్తి, రక్తి, యుక్తి, అనురక్తి విరక్తి, ముక్తి, అన్నింటిని ఇచ్చేవాడు.**

(భ.స.మ.పు.86/87)

(చూ॥ అనాధుడు, అమోఘుడు, అవతారము, ఆంగీరసుడు, కలియుగము, కానుకలు, గానప్రియుడు, జ్ఞానము, తత్వజ్ఞానము, తీర్థయాత్ర, దేవుడెక్కడున్నాడు, నీలవర్ణము, పాతస్నేహితుడు, బంగారు, బ్రహ్మస్వరూపము, భక్తుడు, భారతదేశము, మానుషాకారము, లైఫ్‌స్మిత్, విశ్వాసము, శోభ, శ్రీమంతులు, సూర్యుడు, స్మరింతురు)

భగవంతుని అడ్రస్సు

నారదుడు ఒకానొక సమయములో విష్ణువుని సందర్శించి "స్వామి!నేను త్రికాలము లందు సంచరిస్తాను. ఈలోక వార్తలు నీకారీతిగా అందించాలి. నీ Permanent Address ఏమిటి? ఇక్కడా, అక్కడా అని Branch Address లు ఇస్తావు. ఈBranch Address లు నాకక్కరలేదు. అక్కడ ఉండవచ్చు లేకపోవచ్చును" అన్నాడు నారదుడు. అప్పుడు వెంటనే విష్ణువు చెప్పాడు నారదా! వ్రాసుకో నా అడ్రసు "మద్భక్తాః యత్రగాయన్తి, తత్రతిష్టామి" నారదా: ఎక్కడ నాభక్తులు మధురమైన కంఠములతో నిర్మలమైన భావములతో నన్ను స్మరిస్తారో అదే నా పర్మనెంటు అడ్రస్. భగవంతుడు "కైలాసవాసి, వైకుంఠవాసి, బదరీవాసి, కేదారవాసి" అని ఏమేమో చెప్పుతారు. ఇవన్నియు కేరాఫ్ అడ్రస్సులే. **కాని డైరక్టు అడ్రస్సు హృదయమే. "ఈశ్వర సర్వభూతానాం" "ఈశావాస్య మిదం సర్వం" "వాసుదేవ సర్వ మిదం" ఎక్కడ చూచినా ఉన్నాడు కనుక, మన హృదయంలో కూడా, ఉన్నాడు, కనుకనే హృదయానికి**

భగవంతుని అనుగ్రహము

ఆత్మారాముడు అని పేరు వచ్చినది. ఆత్మ స్వరూపమును రమింప జేసినది కనుకనే "రామ" అనే పేరు.

(స.సా.జూ.1989పు.146)

భగవంతుని అనుగ్రహము

"ప్రతి దేశమునకు ఒక మంత్రి మండలి ఉంటుంది. దానికి ప్రధాన మంత్రి అధిపతి. అతనొక్కడే అన్ని శాఖలను చూడటం కష్టం కనుక, ఆర్థిక, రవాణా, పోలీసు, పరిపాలన మొదలగు అనేక శాఖలుగా విభజించి, మంత్రులకు ఆయా శాఖలను కేటాయించబడుతాయి. ప్రధానమంత్రి అతి ముఖ్యమైన శాఖలను కొన్నింటిని తన ఆధీనంలో ఉంచుకుంటాడు. ఈ విధంగా విభజించటం వలన ఏ శాఖకు చెందిన Files ఆ శాఖకు చెందిన మంత్రివద్దకే వెళ్ళుతాయి. ప్రధానమంత్రి పెద్దవాడు కదా! అని అతని దగ్గరకు అన్ని Files వెళ్ళవు అదేవిధముగా భగవంతుని సృష్టియందు కూడా పరిపాలనలో అనేక శాఖలుగా విభజించబడి ఇంద్రుడు, వరుణుడు, వాయువు, అగ్ని, రుద్రుడు వంటి మంత్రులకు కేటాయించబడినాయి. వారు వారి శాఖలను పరిపాలన చేస్తుంటారు. అయితే భగవంతుడు, ప్రధానమంత్రి (Prime Minister) వలె అన్నింటిని పర్యవేక్షిస్తూ తన ఆధీనంలో వుంచుకొనిన శాఖలపైన ప్రత్యేకమైన దృష్టిని పెట్టి పరిపాలన కొనసాగిస్తుంటాడు. **భగవంతుని అధీనంలో మూడు ప్రధాన శాఖలున్నాయి. 1. నిష్కామ కర్మ 2. అనంత ప్రేమ 3. నిర్మల చిత్తము.** ఈ మూడు మార్గముల ద్వారా వచ్చే ప్రార్థనలన్నీ భగవంతునికి Direct గాచేరతాయి. మిగిలిన ప్రార్థనలన్నీ భగవంతునికి Direct గా చేరడానికి వీలుకాదు. కనుక మనం ఈనాడు Direct గా భగవంతుని అనుగ్రహాన్ని, ఆశీస్సులను, అనుమతినీ పొందాలంటే, ఈ మూడు మార్గముల ద్వారానే పొందటానికి వీలవుతుంది. **ఈ మూడింటి యందు 'నిష్కామకర్మ' ప్రధానమైనది".**

(శ్రీ.న.2000పు.32)

భగవంతుని ఉనికి

దైవత్వము పరిశోధనలచే లభ్యమయ్యేది కాదు. చెఱుకు లోని తీపి, మిరపలోని కారము, నిమ్మలోని పులుపు ఇవన్నీ భగవంతుని ఉనికిని ప్రబోధిస్తున్నాయి. తారలు వెలుగుతున్నాయి, గ్రహములు తిరుగుతున్నాయి, గాలి వీచుచున్నది. వర్షము కురియుచున్నది, సూర్యుడు మండుచున్నాడు- వీటికన్నిటికీ కారణం భగవత్తత్వమే. పర్వతములను, ప్రవాహములను, అడవులను చూస్తే ఆనందం ఉప్పొంగుతుంది. ఇవన్నీ భగవంతుని చిత్ర విచిత్రములే, ఈ ప్రకృతి సౌందర్యము భగవంతుని ఉనికిని నిరూపిస్తూ వస్తున్నది.

భగవంతుని ఉనికిని కనుగొనుటకు ఆధ్యాత్మిక మార్గము ఎంతైనా తోడ్పడుతున్నది. నవవిధ మార్గముల గమ్యం ఒక్కటే. ఏ మార్గమునందైనా భగవంతుని చేరవచ్చు అయితే దివ్యమైన నామస్మరణయే దీనికి రాజమార్గం. ధ్యానము చేసినా. జపము చేసినా తపము చేసినా ఇంకేవిధమైన క్రతువు లాచరించినా అన్నింటికీ నామమే మూలాధారము. ఋగ్వేదమంతయు నామముతో కూడినది. యజుర్వేదమంతయు మంత్రముతో చేరినది. సామవేదమంతయు గానముతో కూడినది. **నామము, మంత్రము, గానము-ఈ మూడింటితో కూడినదే మానవ హృదయం. మానవదేహమే ఒక యంత్రము శ్వాసయే ఒక మంత్రము(సోహం..) హృదయమే ఒక తంత్రము.** ఈ దేహమనే యంత్రములో ఏ చిన్నభాగమైనా సరిగా లేకపోతే ఇది పనికి రాదు. చంద్రమండలానికి ఈనాడు రాకెట్స్ పంపుతున్నారు.అయితే అందులో ఏ చిన్న స్క్రూగాని, పిన్నుగాని సరిగా లేకపోతే అది క్రింద పడి భస్మమై పోతుంది. అదేవిధంగా దేహమనే యంత్రంలో సర్వేంద్రియాలు సక్రమమైన రీతిలో పరిశుద్ధంగా ఉండాలి. అప్పుడే మానవత్వము దివ్యత్వంగా మారడానికి అవకాశము ఉంటుంది. దీనికి తగిన మార్గమేమిటి? **ఏ కర్మల నాచరించినా భగవత్ప్రీత్యర్థం చేస్తున్నామనే ఉత్తమ భావం ఉంచుకోవాలి. అప్పుడే జీవితం సార్థకమవుతుంది.**

మీ పనులను, మీ ఉద్యోగాలను మీరు వదలనక్కర లేదు. కాని, మీరు చేసే సర్వకర్మలూ భగవత్ప్రీత్యర్థమనే భావాన్ని హృదయంలో చిత్రించుకోవాలి.

(స.సా.మా 96 పు.67/68)

భగవంతునికి అర్పించాలి

భగవంతునికి ఏమి అర్పితం చేయాలి?
"పత్రం పుష్పం, ఫలం, తోయం...." అన్నారు. దేహమే పత్రం, హృదయమే పుష్పం, మనస్సే ఫలం, ఆనంద భాష్పములే తోయం. ఈ నాల్గింటినీ భగవంతునికి అర్పించాలి.

(స.సా. అ.2001 పు. 294)

భగవంతునికి ఇవ్వవలసినది

నీవు భగవంతునికి ఇవ్వవలసింది ఏమిటి? పత్రమో, పుష్పమో, ఫలమో...అనుకుంటావు. ఇవి భగవంతుని వద్ద లేకపోలేదు. **భగవంతుడు కోరేది ఏమీ లేదు. "మీరు కూడా భగవంతుడు కండి" అని కోరుతుంటాడు. కాని, ఇట్టి విశాలమైన భావాన్ని విస్మరించి, భగవంతునికి తుచ్ఛమైన బొచ్చు నిచ్చి ఉచ్ఛమైన కోరికలు కోరుతుంటావు. తిరుపతి వేంకటేశ్వరస్వామి ఏమి తక్కువ? విశ్వాన్ని ఏలే భగవంతునికి ఏమి తక్కువ? అతనికి నీ పాత బొచ్చు, పేడబొచ్చు ఎందుకు? కనుక, భగవంతునికి ఇవ్వవలసింది తుచ్ఛమైన బొచ్చుకాదు. దీనికి మరొక అర్థమున్నది. తలపైన వెంట్రుకలు తమో గుణానికి చిహ్నము. కనుక, తిరుపతికి పోయే వారు తమెగుణమును భగవంతునికిచ్చి సాత్వికమనే గుణమును తీసుకొని రావాలి. అంతేగాని తిరుపతికి పోయి, జుత్తునిచ్చి వచ్చాననడం గొప్పతనం కాదు. ఇది అల్ప బుద్ధుల లక్షణం.** ఈ అల్ప విషయాలలో విశ్వాసం పెట్టుకొని నిజమైన విశ్వాసము కోల్పోవుచున్నావు. భగవంతునికి నీవిచ్చేది ఏమీ లేదు.

(శ్రీ.భ.ఉ.పు.178)

భగవంతుని కోరవలసినవి

కోరిన ఫలమిచ్చు కల్పవృక్షము యుండ
పెరటి పుష్పమునకై ప్రీతి ఏల?
అడిగిన పాలిచ్చు కామధేనువె యుండ
ధనమిచ్చి ఆవును కొనగ నేల?
మెండగు కాంతితో మేరు పర్వతముండ
వెండి బంగారుకై వెదకనేల?
భక్తి ముక్తులనిచ్చు పరమాత్ముడేయుండ
పాడు సంసారము కోరనేల?

(స.సా.మే. 1993 పు. 99)

(చూ॥ తిరువళ్ళవరు, దైవానుగ్రహము)

భగవంతుని చిత్రవిచిత్రములు

జగత్తులో ఎన్ని కోట్లమంది మానవ రూపాలను ధరిస్తున్నారు. యావత్ ప్రపంచములో అయిదు వందల ఎనిమిది లక్షల కోట్లు ఉంటున్నారు. ఇంతమంది లోపల ఒకడుండినట్లు ఇంకొకడెవడైనా ఉండటానికి వీలవు తుందా? **ఒక తల్లి గర్భములో ట్విన్స్ పుడ్తున్నారు. వారిలో కూడా కొంత వ్యత్యాసము ఉంటుంది.** కాని సమానంగా ఎక్కడనూ కన్పించటంలేదు. ఇన్ని రూపములు, ఇన్ని రకములుగా ఎవరు చేయగలరు?

మానవుడు విసర్జించిన బొగ్గుపులుసు వాయువును వృక్షములు తీసుకొంటున్నాయి. వృక్షములు వదిలిన ప్రాణవాయువును మానవుడు స్వీకరిస్తున్నాడు. ఈ విధమైన నియమమును ఎవరు ఏర్పరిచినారు? ఆక్సిజన్ తెచ్చి ముక్కులో పెట్టి ఎంతగా పంపుచేసినా యీ పనుల జరగటంలేదు. సృష్టిలోపల మానవుడు ఎక్కడ ఉండినప్పటికి అతని బొగ్గుపులుసు వాయువును వృక్షములు తీసుకుంటున్నాయి. ఆ వృక్షములు ప్రాణవాయువును మానవుడు స్వీకరిస్తున్నాడు. ఈ సంబంధమును ఏర్పరచినవారెవ్వరు?

నెమలి ఎన్నిరకములైన రంగులతో కూడియున్నది? ఎంత సుందరమైన రంగులు ఒకదానికొకటి మనము

భగవంతుని దృష్టి

కల్పినప్పటికిని అది చేయటానికి వీలుకాదు. అంత సుందరమైన సృష్టిని ఎవరు చేస్తున్నారు?

చిలుక ఉంటున్నది. దాని రంగుచూస్తే పచ్చగ, ముక్కు చూస్తే ఎర్రగ ఈ కాంబినేషన్ ఎవరు చేసేరు? ఈ సృష్టిరహస్యాన్ని ఎందరు గ్రహిస్తున్నారు. ప్రకృతి నియమం అంటారు. నేచర్ నేచర్ అని వదలిపెట్టి పోతున్నారే గాని వీరు కనిపెట్టినవన్నియు నేచర్ ఫలితములు కాదా? వీరు నేచర్ కతీతమైపోతున్నారా? పోవటం లేదే!

హంస పాలు - నీరును వేరుచేస్తూ వచ్చింది. హంసవలె విభాగము చేయు గుణము కల్గిన మానవునకు పరమహంస అని పేరు వచ్చింది. హంస పాలలో ముక్కు పెట్టేటప్పటికి నీరు వేరు - పాలువేరు అవుతున్నది. అయ్యా! యీ శక్తి హంసకు ఎవరిచ్చారు? అని అడిగితే హంసకు ముక్కు దగ్గర ఒక ఆసిడ్ ఉంటుంది. అది పాలను తాకితే రెండూ విడి అవుతున్నాయి. అని సైంటిస్టులు చెప్పారు. నిజమే, హంస ముక్కు దగ్గర యీ ఆసిడ్ ఎవరు పెట్టారు? సైంటిస్ట్ తెచ్చి పెట్టాడా? కాదే! ఇది సృష్టి రహస్యం. కనుక **భగవంతుని చర్యలు, సృష్టి ఎంతయో చిత్రవిచిత్రములుగా ఉంటుంటాయి.**

నాలుకలో 40 వేల టేస్టుబడ్సు ఉన్నాయి. అంతేగాక ఉష్ణం జనింపజేసే బడ్సు 25 వేలు ఉన్నాయి, కన్ను చూచుటకు ఒక ఇంచి మాత్రమే ప్రమాణంలో ఉంటున్నది. దీనియందు 13 కోట్ల కాంతికిరణాలు ఉంటున్నాయి. ఇది ఎంత విచిత్రమో చూడండి.

మనదేహంలో కొన్ని కోట్ల సెల్సు ఉన్నాయి. ప్రతిసెల్ యందు మనరూపం సంపూర్ణంగా ఉన్నది.

దీనిని ఎవరైనా నమ్మగలరా! ఇది అంతయూ ఎవరి సృష్టి? అతీతమైన దైవ సృష్టియే.

ఎంచి చూసినట్లయితే ప్రతి ఇంచీ భగవంతుని తత్వమే- ప్రతి అణువణువూ భగవంతుని తత్వమే.

దేహంలో ఎన్ని నాడాలున్నాయి? 72 కోట్లు నరాలు ఉన్నాయి. దైవత్వము పరిశోధనలచే లభ్యమయ్యేది కాదు. చెఱుకులోని తీపి,మిరపలోను కారము, నిమ్మలోని పులుపు ఇవన్నీ భగవంతుని ఉనికిని ప్రబోధిస్తున్నాయి. తారలు వెలుగుతున్నాయి. గ్రహములు తిరుగుతున్నాయి. గాలి వీచుచున్నది. వర్షము కురియుచున్నది. సూర్యుడు మండుచున్నాడు. వీటికన్నింటికీ కారణం భగవతత్త్వమే. పర్వతములను, ప్రవాహములను, అడవులను చూస్తే ఆనందం ఉప్పొంగుతుంది. ఇవన్నీ **భగవంతుని చిత్ర విచిత్రములే. ఈ ప్రకృతి సౌందర్యము భగవంతుని ఉనికిని నిరూపిస్తూ వస్తున్నది.**

(దే.యు.పు.103/104)

భగవంతుని దృష్టి

ప్రేమ స్వరూపులారా! మీకు వేదములోని అక్షరములు తెలియక పోయినా పరవా లేదు. **ఆ శబ్దమును శ్రవణము చేస్తే చాలు!** అందులోనే ఉంటున్నది **ఆనందము.** పుట్టిన బిడ్డను ఊయలలో వేసి తల్లి కమ్మని కంఠంతో జోలపాట పాడుతుంది. ఆ చంటి బిడ్డకు అమ్మ పాడే పదములు అర్థము తెలియునా? తెలియదు. కాని, ఆ రాగమువల్ల చంటి బిడ్డ చక్కగా నిద్రపోతుంది. అదే విధముగా మీకు అర్థము తెలియక పోయినా ఫరవాలేదు. ఎవరైనా వేదోచ్చారణ చక్కగా చేస్తుంటే మీరు ఆనందంగా శ్రవణం చేయండి. ఆ నాదములోనే ఎంతో **ఘనమైన శక్తి** ఇమిడి ఉంటున్నది. **దేవాలయమునకు** వెళ్ళిన వారంతా ఒక తూరి గంట కొడతారు. అక్కడ **గంటలు ఎందుకోసం పెట్టారు?** భగవంతుడు నిద్రపోతుంటాడని, అతనిని మేల్కొల్పడానికి పెట్టారా? కాదు, కాదు. **వేదము రాని వారు నాదమే వేదమని భగవంతునికి వినిపించుకుంటారు.** అంతేకాదు ఈ ఆధునిక యుగంలో మనం ఎవరింటికైనా పోతే - **అక్కడ ఒక విజిటింగ్ కార్డు** ఇచ్చి లోపలికి పంపిస్తాము. దానిని చూసి "ఓ....! ఫలానా వారు వచ్చారా!" అని గుర్తించి అతడు లోపల నుండి బయటకు వస్తాడు. అదే విధంగా దేవాలయంలోనికి వెళ్ళినప్పుడు బెల్ కొట్టడమే మన విజిటింగ్ కార్డు అప్పుడు ఆ భగవంతుడు "ఎవర్రా... బెల్లు కొట్టాడు?" అనిచూస్తాడు. **అనగా**

భగవంతుని దృష్టిని ఈ శబ్దం ద్వారా మనపై మరల్పు కుంటున్నాము. అది కూడా ఇష్టమొచ్చిన శబ్దము చేయకూడదు. **చక్కగా అకార, ఉకార, మకారములతో కూడిన ఓం కారనాదం రావాలి.**

(స.సా. జ.94 పు. 21)

భగవంతుని బిడ్డలు

ఈ దేశం ఆదేశం అన్న భేదాలు పెట్టుకోకూడదు. ప్రపంచములోని 575 కోట్ల మంది ప్రజలూ భగవంతుని బిడ్డలే. యీ ప్రపంచమంతా ఒక పెద్ద భవనం. యిందులో ఆమెరికా ఒక రూము, రష్యా ఒక రూము, జపాన్ ఒక రూము, ఇటలీ ఒక రూము, ఇండియా ఒక రూము. యీ విధంగా అన్ని దేశాలు ప్రపంచమనే భవనము లోని గదుల వంటివే: మధ్యలో గోడలు కట్టుకోవడం వల్ల గదులన్నీ విడివిడిగా కనబడుతున్నాయి. గోడలను కొట్టి వేస్తే అంతా ఒక్కటి అయిపోతుంది.

అందరూభగవంతుని బిడ్డలే. ఏకత్వాన్ని పెంచుకోవాలి. భారతదేశమన్నను, భారతీయ సంస్కృతియన్నను, ప్రజలలో గౌరవము, భక్తి ఇనుమడింపచేయాలి.

భారత దేశాన్ని రక్షించేది రాజకీయం కాదు, తుపాకులు కాపాడలేవు. బాంబులు రక్షించలేవు. ప్రజల గుండెల్లో నాటుకున్న దేశభక్తి, త్యాగశీలం, ఆధ్యాత్మిక దృక్పథం - యివే దేశాన్ని కాపాడాలి.!

(దే.యు.పు.38/39)

పుష్పాలలోని మకరందాన్ని గ్రోలే తుమ్మెదలవలె ఉండండి. అంతేకాని ఇతరుల రక్తం పీల్చేవి, వ్యాధుల్ని వ్యాపించేసే దోమల వలె ఉండకండి. మొదట మీరంతా భగవంతుని బిడ్డలేనని, అందరూ సోదరీసోదరులని భావించండి. ప్రేమగుణాన్ని పెంపొందించండి. నిరంతరం మానవు లందరికి క్షేమాన్నీ ఆకాక్షించండి. అందరిని ప్రేమించండి. ఫలితంగా మీరు ప్రేమింపబడతారు. ప్రేమను వృద్ధిచేసుకొని అందర్నీ ప్రేమతో చూడటం ఆరంభిస్తే ఎవ్వరూ మిమ్మల్ని ద్వేషించరు.

(త.శ.మ.పు.133)

ఇది వారిపనే కాని మాపని కాదు అని అనుకో కూడదు. ఇది అందరి పని, అందరూ మనవారే, అందరూ ఒకే భగవంతుని బిడ్డలు. "Brotherhood of Man - Fatherhood of God" అనే భావాన్ని మన మనస్సులో చేర్చాలి. సర్వదుఃఖములకు కారణమైన నీవు, నీవు అన్న భేదభావమును విడనాడి మనము, మనము అనే భావాన్ని చేపట్టాలి. మానవుడు "నేను" అన్న ప్రదేశమునుండి ప్రయాణముచేసి మనము అనే గమ్యమును చేరాలి. చివరకు **I and you are one అన్న భావాన్నిమనం అందుకోవాలి**

(శ్రీ.ది.పు.36)

(చూ॥ ఐకమత్యం)

భగవంతుని యొక్కతత్త్వము

ఈనాడు సాయి సంస్థలు గురించి అనేక విధములుగా మన అనిల్‌కుమార్ చెప్పాడు. సంస్థలు జరుగుతున్నాయి. భక్తి శ్రద్ధలతో చేస్తున్నారు. కాని లక్ష్యమేమిటో అనేటటువంటి తత్వాన్ని గుర్తించడానికి వారు తగిన కృషి చేయడంలేదు. **నీ తృప్తి నిమిత్తమై ఆచరిస్తున్నావా? లేక దైవ తృప్తి నిమిత్తమై ఆచరిస్తున్నావా?** ఇదియే ఒకానొక సమయంలో ఒక భక్తుడు జీసస్ వద్దకు వెళ్ళి 'స్వామి! తనను తాను రక్షించు కొనగలుగు శక్తి ఏమిటి? అన్నాడు'. 'నాయనా! నేను భగవంతుణ్ణి ప్రేమించినప్పుడు ఆశక్తే తనను తాను రక్షింపచేస్తుంది.' అన్నాడు. ఇదియే భగవద్గీత యందు కూడనూ. స్వామి! భగవత్ ప్రేమకు పాత్రులు కావడానికి ఏమిచేయాలి? అన్నాడు. 'పిచ్చివాడా! నీవు భగవంతుడని ప్రేమిస్తున్నావని భ్రమిస్తున్నావు. **భగవంతుడు నిన్ను ప్రేమించేటటువంటి మార్గాన్ని వెతుకు' అన్నాడు. నీవే భగవంతుడవై ఉన్నావు. అలాంటి భగవంతునియొక్క తత్వాన్ని మొట్టమొదట నీవు గుర్తించటానికి తగిన ప్రయత్నము చేయి!** ఏ విధంగా చేయాలి? ఒకటే మార్గము. ప్రతి మానవుడు కూడనూ దివ్యాత్మతో ప్రేమించు! అందరినీ సేవించు. దీనినే The best way to Love God,

భగవంతుని లీలలు

is to Love all, Serve all. మనం అందరినీ ప్రేమించాలి. ఎందుకనగా ఆరూపంలో ఉన్నాడు భగవంతుడు, ప్రతిమానవుని యొక్క స్వరూపము కూడనూ భగవంతుని యొక్క వేషమే.

(శ్రీ.ఫి.1955పు.22)

భగవంతుని లీలలు

ప్రేమస్వరూపులారా! **భగవంతుని లీలలను విమర్శించడం సులభమేకాని, భగవత్తత్వాన్ని తెలుసుకోవడం అతి కష్టం. భగవంతుడు సత్యాసత్యము లందున్నాడు, ధర్మాధర్మము లందున్నాడు, మంచిచెడ్డలయం దున్నాడు. ఇట్టి సర్వవ్యాపకమైన దివ్యత్వాన్ని ఎవరు తెలుసుకోగలరు?** ఆ చెట్టుకొమ్మపై 'ధ్రువనక్షత్రం' ఉంది, చూడు అని చెప్పినప్పుడు నిజంగా చెట్టుకొమ్మపై ధ్రువ నక్షత్రం ఉన్నదా? లేదు. కాని, ఎన్నో కోట్ల మైళ్ళ దూరంలో ఉన్న ధ్రువనక్షత్రాన్ని ఆ చెట్టు కొమ్మ నాధారంగా తీసుకొని చూడగల్గుతున్నాము. అదేవిధంగా, **వేదశాస్త్రేతిహాస పురాణములు భగవత్తత్వాన్ని ప్రత్యక్షంగా నిరూపించ లేకపోయినప్పటికీ భగవంతుని గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి.** ఎత్తైన కొండలను చూస్తే ఉల్లాసం కల్గుతుంది. దట్టమైన అడవులను, ప్రవహించే నదులను చూస్తే ఆనంద ముప్పొంగుతుంది. ఇవన్నీ భగవంతుని శక్తి సామర్థ్యాలను నిరూపిస్తున్నాయి. తారలు వెలుగు తున్నాయి. గ్రహములు తిరుగుతున్నాయి. సూర్యుడు మండుతున్నాడు. గాలి వీస్తున్నది. ఇవన్నీ భగవత్తత్వానికి చిహ్నములే. అగ్ని కణాన్ని అర్థం చేసుకున్నప్పుడు అగ్ని స్వభావాన్ని అర్థం చేసుకోగల్గినట్లుగా, అణువైన ప్రకృతి స్వభావాన్ని గుర్తించినప్పుడు అనంతమైన భగవత్తత్వాన్ని గుర్తించ వచ్చును. దీనిని పురస్కరించుకొనియే ఉపనిషత్తులు, **"అణోరణీయాన్ మహతో మహీయాన్"** అన్నాయి. **సమస్త మానవులందు ప్రకాశించేది ఈ దివ్యత్వమే. కాని, మానవుడు దేహభిమానమును అభివృద్ధి పర్చుకోవడంవల్ల దీనిని గుర్తించలేక పోతున్నాడు.**

(స.సా.అ.96 పు.253)

భగవంతుని వర్ణింతురు

(చూ॥ స్మరింతురు)

భగవంతుని సృష్టి

భగవంతుని తోటలోని పువ్వులు మీరు
భగవంతుని ఆకాశంలోని తారకలు మీరు
పువ్వులను నక్షత్రాలను ప్రేమించండి
భగవంతుని సృష్టిలో అత్యద్భుత సృష్టి మీరు

(సా.య. మొదటిపుట)

భగవంతుని హృదయము

(చూ॥ ప్రాణము)

భగవచ్చింతన/భగవత్ చింతన

"దేహములోని సర్వాంగములు అతి సుందరంగా అతి పుష్టిగా వుండినప్పటికినీ, వీటన్నింటికీ ఆధారమైన గుండె గనుక ఆరోగ్యముగాలేని యెడల అవన్నియూ ఎంత నిష్ప్రయోజనమో, అదే విధముగ మీకు భౌతికంగా, లౌకికంగా రాజకీయముగా, వ్యాపారికముగా అన్నీయునూ పుష్టిగా తుష్టిగా వుండినప్పటికినీ 'భగవత్ చింతన' లనెడి గుండె లేని యెడల మీరు నిర్జీవులే. కనుక మీమీ విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ 'భగవత్ చింతన' ను మాత్రం నిర్లక్ష్యం చేయకండి. **'భగవత్ చింతన'వలన మీకు సర్వక్షేమములు, సర్వానందములు, సర్వ సుఖములు చేకూరుతాయి".**

(సా.లీ.త.పు.70)

(చూ॥ స్వస్థానము)

భగవత్తత్వము

"బ్రహ్మానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వందాతీతం గగన సదృశం తత్వమస్యాది లక్ష్యం

ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం
భావాతీతం త్రిగుణ రహితం సద్గురుం.....''

భగవత్తత్త్వాన్ని గుర్తించడం అంత సులభం కాదు. 'నేను' అనే అహంకారం, 'నాది' అనే మమకారం - ఇవే సమస్త అనర్థాలకు మూలకారణాలు. ఈ అహంకారం మమకారములను త్యజించినవాడే మానవునికి దివ్యత్వం అత్యంత సులభంగా లభిస్తుంది. అనంతమైన, సర్వాంతర్యామియైన ఆత్మ ఒక్కటే. కాని, ఉపాధి భేదముల వలన అది వివిధ రూపములలో మనకు కనిపించుచున్నది. ఈ అనేకత్వంలోని ఏకత్వమే - ''ఆత్మతత్త్వం'' అనే సత్యాన్ని గుర్తింపజేయునదే ఆధ్యాత్మికం కాని, దురదృష్టవశాత్తు **ఈనాడు ఏకత్వాన్ని అనేకత్వంగా విభజించుకొనె 'మేధావులు' అభివృద్ధి యౌతున్నారేగాని, అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించే వ్యక్తులు చాలా తక్కువగా ఉంటున్నారు.**

మనం ఒక భవనాన్ని నిర్మించుకొంటే అందులో స్నానాలగది, వంటగది, భోజనాల గది - ఈవిధంగా ఆ భవనమును అనేక భాగములుగా విభజించుకొంటాము. ఆ భవనములో ఇన్ని విధములైన విభాగములు ఏర్పడ టానికి కారణం - గోడలే. కాని, ఈ గోడలను తీసివేసినప్పుడు అంతా ఒకే గది వలె కనిపిస్తుంది. అదే విధంగా, **ఆత్మ అనే 'భవనం' ఒక్కటే. దీనియందు శరీరము, ఇంద్రియములు, మనోబుద్ధి చిత్త అహం కారములనే గదులను ఏర్పరుచుకొని ఉపాధులను నిర్మించుకోవడం చేత మనకు భిన్నముగా కనిపించు చున్నవి.** ఈనాడు ఇట్టి భిన్నత్వముతో కూడిన మానవత్వం అభివృద్ధియగుటచేత మానవత్వానికి గురుత్వమనేది అత్యవసరమై ఉన్నది.

భౌతికమైన విద్యలను నేర్పించేవారు, జగత్‌సంబంధమైన పదార్థ విజ్ఞానాన్ని విపులంగా విశదీకరించి బోధించేవారు గురువులు కారు. వీరందరూ అధ్యాపకులు మాత్రమే. గురుత్వమనగా ఏమిటి? **నిజమైన గురువు ఏవరు?** ఈ గురుత్వములోని నిజతత్త్వం ఏమిటి? దీని సత్యస్వరూపమేమిటి?

మొట్టమొదటిది - "బ్రహ్మానందం" ఈ బ్రహ్మానందమంటే ఏమిటి? ఇతని రూపమేమిటి? ఇతనెక్కడ ఉంటాడు? బ్రహ్మానందమునకు సాటియైన ఆనందం మరొకటి కానరాదు. ఈ జగత్తులోని సమస్త ఆనందములు ఈ బ్రహ్మానందము నందే విలీనమై అంతర్గతమై ఉంటున్నవి. ఐతే, ఈ బ్రహ్మానందముఎక్కడ ఉన్నది? తాను శాంతిని అనుభవిస్తున్నప్పుడు, పుష్టిని సంతుష్టిని కలిగి ఉన్నప్పుడు మానవుడు పొందే ఆనందము ఎట్టిది? **ధన కనక వస్తు వాహనాదులతో, భోగ భాగ్యాదులతో మానవుడు అనుభవించే ఆనందమును - "మానవానందం" లేక "మనుష్యానందం" అన్నారు. ఈ మనుష్యానందము కంటే వందరెట్లు అధికమైనది దేవానందం. దీనికంటే వందరెట్లు అధికమైనది దేవేంద్రానందం. ఈ దేవేంద్రా నందము కంటే వంద రెట్లు అధికమైనది బృహస్పతి ఆనందం. దీనికంటే వందరెట్లు అధికమైనది ప్రజాపతి ఆనందం. ఈ ప్రజాపతి ఆనందము కంటే వంద రెట్లు అధికమైన ఆనందమే - "బ్రహ్మానందం". ఈ బ్రహ్మానంద వల్లియే దీనికి సరియైన కొలతబద్ద.** ఊహాతీతమైన ఇట్టి ఆనందమునకు సరియైన అర్థాన్ని గుర్తించకుండా మానవుడు తన నిత్య జీవితంలో ''బ్రహ్మానందం'' అనే పదాన్ని అనేక సందర్భాలలో ఉపయోగపెడుతున్నాడు. "నా కుమార్తె వివాహం బ్రహ్మానందంగా జరిగింది. నా కుమారుడు విదేశాలలో బ్రహ్మానందంగా ఉంటున్నాడు' ' అని కొంతమంది చెప్పుకొంటారు. ఈ బ్రహ్మానందం అంత పరిమిత మైనదా? అంతసులభమైనదా? లోకసంబంధమైనదా? కాదు, కాదు. **నైతిక, భౌతిక ధార్మిక, లౌకిక, ఆధ్యాత్మికములకు అతీతమైనదే - ఈ బ్రహ్మానందం. అట్టి ఆనందమును అనుభవించేవాడే నిజమైన గురువు. అతడే భగవంతుడు. ఒక్క భగవంతునికి తప్ప అన్యులకిట్టి ఆనందం అనుభవించే అధికారం లేదు.**

ఇంక రెండవది - "పరమసుఖదం" ఈ పరమసుఖమనగా ఏమిటి? ఈ జగత్తులో గల సుఖములన్నింటి కంటే ఈ

పరమసుఖము అత్యున్నతమైనది. ఇది భౌతికమైన సుఖము కాదు. భౌతిక సుఖములు మార్పుచెందునవి; రాక పోకలు కలిగినవి. కాని, రాక పోకలు లేనటువంటిదే - పరమసుఖము. ఈ భౌతిక సుఖములన్నీ నీటి బుడగల వంటివి. అవి ఏ క్షణంలోనైనా శిథలమౌతాయి. కాని, పరమ సుఖము మార్పుచెందదు. **అట్టి పరమసుఖమును అనుభవించేవాడే నిజమైన గురువు.**

మూడవది - "కేవలం" కేవలమనగా దేశకాలములకు అతీతమైన తత్వం. ప్రపంచములోని సమస్త పదార్థములు దేశ కాలములతో కట్టుబడియున్నవి. **ఈ జగత్తులో ఇతని కంటే అధికమైనది మరొకటి లేకపోవడం చేతనే ఇతడు - "కేవలుడు" అని పిలువబడుతున్నాడు.** కనుక, ఇట్టి దేశ కాల పరిస్థితుల ప్రభావమునకు అతీతమైన వ్యక్తియే **గురువు. అతడే భగవంతుడు.**

"జ్ఞానమూర్తిం" - ఇందులో జ్ఞానము అనగా ఏమిటి? భౌతిక జ్ఞానమా? రసాయనిక జ్ఞానమా? కాదు, కాదు జగత్తునందు సమస్త జ్ఞానములకు ఆధారమైనది, అనంతమైనది, అవ్యక్తమైనది, గుప్తమైనది, ఏకత్వమైనదే - జ్ఞానం. **"అద్వైత దర్శనం జ్ఞానం" అనగా సమస్తమూ ఒక్కటే, ఒక్కటే, ఒక్కటే!** ఈ జగత్తు నందు రెండవ పదార్థమే లేదు. ఒకవేళ రెండవ పదార్థమనేది ఉంటే, అది ఈ పదార్థము యొక్క Reaction, Resound Reflection (ప్రతిచర్య, ప్రతిధ్వని, ప్రతిబింబం) మాత్రమేగాని, ప్రత్యేకమైన రెండవ పదార్థము కాదు. **స్వస్వరూప సందర్శనమే నిజమైన జ్ఞానం. అనగా తనను తాను తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం.** ఈ విధంగా తన తత్వాన్ని తాను గుర్తించుకొన్నవాడు ఒక్క భగవంతుడు తప్ప మరొకడు లేడు. కనుక, **భగవంతుడే - జ్ఞానస్వరూపుడు, సత్యస్వరూపుడు, అనంతస్వరూపుడు. అందుచేతనే "సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ" అన్నారు.**

"ద్వంద్వాతీతం" - ఇందులో ద్వంద్వ మనగా ఏమిటి? శీతోష్ణములకు, సుఖదుఃఖాలకు, లాభనష్టాలకు, నిందాస్తుతులకు అతీతమైన తత్వము ఏమిటి? అదే భగవతత్వం. అన్యులకు ఈ అధికారం లేదు. కనుక, **ద్వంద్వాతీతుడైన భగవంతుడే నిజమైన గురువు.**

"గగన సదృశం" - ఈ గగనము ఎక్కడ ఉన్నది? ఇది సర్వత్రా వ్యాపించి యున్నది. ఎక్కడ చూసినా గగనము ఉంటున్నది. గగనమనగా అకాశమనేది సరియైన అర్థంకాదు. ఆకాశమనగా ఏమిటి? **'ఆకాశ గగనం శూన్యం'** ఇది కనిపించునది కాదు. ఆకాశమనేది పైన ఉన్నదని మనం అనుకొంటున్నాము. అది ఆకాశము కాదు. **ఈ ఆకాశమునకు గుణము ఏమిటి? శబ్దమే.** (స్వామి చిటిక వేస్తూ) ఇక్కడ ఆకాశము ఉన్నది; నేను మాట్లాడే మాటలలో శబ్దం ఉన్నది. కాబట్టి **శబ్దం ఎక్కడ ఉన్నదో అక్కడున్నదంతా ఆకాశమే.** మన ఉచ్ఛ్వాస నిశ్వాసములలో కూడా శబ్దముంటున్నది. కనుక, ఆకాశములేని స్థానమెక్కడ? **'అంతర్భహిశ్చ తత్సర్వ వ్యాప్య నారాయణ స్థితః' ఆ ఆకాశము కంటే అమితంగా వ్యాపించి యున్నవాడే భగవంతుడు.** కనుక, **అతడే నిజమైన గురువు.**

"తత్త్వమస్యాది లక్ష్యం" - ఇక్కడ తత్వము అనగా ఏమిటి? **మన వేదములలో నాలుగు మహా వాక్యములుంటున్నాయి. మొదటిది "ప్రజ్ఞానం బ్రహ్మ". ఇది ఋగ్వేదసారం. రెండవది "అహం బ్రహ్మాస్మి" ఇది యజుర్వేదసారం. మూడవది "తత్వమసి". ఇది సామవేదసారం నాల్గవది "అయమాత్మా బ్రహ్మ" ఇది అథర్వణవేదసారం.** ఈ విధంగా నాల్గువేదముల సారము ఈ నాలుగు మహావాక్యములలో విభజింపబడినది. ఈ నాలుగు మహావాక్యములు ఒక్క దివ్యత్వమును మాత్రమే నిరూపిస్తున్నవి.

మొట్టమొదటిది "ప్రజ్ఞానం బ్రహ్మ" ప్రజ్ఞ అనగా ఏమిటి? ప్రజ్ఞ అనగా తెలివితేటలని అనుకొంటున్నాము. కాదు, కాదు. ఈ ప్రజ్ఞ శరీరేంద్రియములందు, అంతఃకరణ యందు సర్వత్రా ఉంటున్నది. ఈ **ప్రజ్ఞ అనేది సర్వప్రాణులందు, చరాచరములందు ఉంటున్నది. దీనినే Constant Integrated Awareness అన్నారు.** పరిపూర్ణముగా తెలుసుకోవడమే - Awareness

అనబడుతుంది. ఈ 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనే వాక్యములో ప్రజ్ఞ, బ్రహ్మ రెండూ సమమైన పదములే. ప్రజ్ఞానమే బ్రహ్మ అని కొంతమంది పండితులు వ్యాఖ్యానం చేస్తారు. **ఈ ప్రజ్ఞానం, బ్రహ్మ వేరు వేరు కాదు. సర్వత్రా వ్యాపించిన వానికే 'బ్రహ్మ' అని పేరు. సులభంగా మనం అర్థం చేసికొనవలెనన్న 'బ్రహ్మ' అనగా వ్యాపకత్వమే.** ఎక్కడ చూసినా వ్యాప్తి జరుగుతున్నది. **ఇట్టి సర్వవ్యాపకుడే భగవంతుడని ఋగ్వేదం చక్కగా నిరూపించినది. ఇట్టి సర్వవ్యాపకుడే నిజమైన గురువు.**

రెండవ మహావాక్యము "అహం బ్రహ్మాస్మి" అహం అనగా ఏమిటి? అహం అనగా 'నేను' అని అనుకొంటున్నారు. దీనికి 'సాక్షి' అని మరొక అర్థము కూడా ఉంటున్నది. అతడు సమస్తమునకు సాక్షీభూతుడు. 'అహం' అనేది ఆత్మ స్వరూపకంగా నిలిచియుంటున్నది. ఆత్మ చైతన్యము, బ్రహ్మ వేరు వేరు కాదు. ప్రత్తి, దారము, వస్త్రము - ఈ మూడు ఒక్కటైనట్లుగా, **వివిధ సమయములందు వివిధ పరిస్థితులందు ఆత్మ, బ్రహ్మ, అహం అనే పేర్లు ధరిస్తుంటుంది.** ఐతే, ఈ మూడింటి యొక్క ఏకత్వమే 'అహం బ్రహ్మాస్మి'. అస్మి అనగా కలపడం. 'నేను' అనే సాక్షీభూతుడు, సర్వవ్యాపకుడైన సాక్షీభూతుడు - రెండూ ఒక్కటే అని నిరూపించుటయే "అహం బ్రహ్మాస్మి" యొక్క అంతరార్థము.

మూడవది "తత్వమసి". తత్ - అనగా అది; త్వం - అనగా ఇది; అసి-అనగా ఒక్కటే. నీవు, నేను వేరువేరుగా ఉండినప్పుడు నీవు నీవే, నేను నేనే, **'నీవు, నేను' ఈ రెండూ కలసినప్పుడు 'మనం'అంటున్నాము.** కాని, రెండూ ఒకటే, ఉపాధి ధరించినప్పుడు 'త్వం' అనుకొంటున్నాము. ఉపాధి రహితమైనప్పుడది 'తత్' గా మారిపోతున్నది. ఉపాధి రహితమే - 'తత్'; ఉపాధి సహితమే - 'త్వం' కనుక ఉపాధి సహితుడే - జీవుడు, ఉపాధి రహితుడే - దేవుడు కనుక **దేవుడు, జీవుడు ఒక్కటే అని సామవేదము చక్కగా విశదీకరించి బోధించుచున్నది.**

నాల్గవది "అయమాత్మాబ్రహ్మ" ఇక్కడ మీరు చక్కగా విచారణ చేయాలి. I am Atma and Brahma ఇక్కడ ఉన్నవి రెండు కాదు, ఒక్కటే. నీకు దేహమున్నది, మనస్సు ఉన్నది. ఆత్మ ఉన్నది. మూడింటి చేరిక ఒక్కటే శరీరంతో పనులు చేస్తున్నావు, మనస్సుతో విచారణలు సలుపుతున్నావు. ఈ రెండింటికి సాక్షీభూతునిగా చూస్తున్నది. **'నీవే' జాగ్రత్తలో విశ్వుడు - 'నీవే'; స్వప్నములో తేజుడు - 'నీవే'; సుషుప్తిలో ప్రాజ్ఞుడు-'నీవే'.** ప్రాజ్ఞుడనగా ఎవరు? అదే "ప్రజ్ఞానం బ్రహ్మ" ఆత్మతత్వమే ప్రజ్ఞ.

ఈ నాలుగు వాక్యముల అంతరార్థాన్ని ఏకత్వముతో కూడిన శక్తి ఏదైతే ఉన్నదో, అదే నిజమైన గురువు. ఈ నాలుగు మహావాక్యముల సారమును చక్కగా అనుభవించి, ఆనందించి, ఆకారాన్ని ధరించినవాడే గురువు.

"ఏకం ఏవ అద్వితీయం బ్రహ్మ" ఉన్నది ఒక్కటే. నీవు పుట్టక పూర్వం, పుట్టిన తరువాత, మరణించిన తరువాత ఎల్లప్పుడు ఉండినది ఒక్కటే అది మార్పుచెందదు. "ఏకం" అనగా, భగవంతుడు ఒక్కడే. ఇంకెవ్వరూ 'ఏకం' కాదు. మిగిలిన వన్నీ అనేకత్వముతో కూడినవే. ఈ అనేకత్వము ఏకత్వములోనే ఉన్నదని గుర్తించిన వాడే గురువు. ఐతే, ఏకత్వములో అనేకత్వం ఏ విధంగా ఉంటున్నది? దీనికి ఒక ఉదాహరణ: మట్టి విత్తనమనేది ఏకంగానే ఉంటున్నది. కాని, ఆ విత్తనమునందే పెద్ద వృక్షము ఉంటున్నది. ఆ వృక్షములోనే అనేక శాఖోపశాఖలు ఉంటున్నాయి. దీనియందే పువ్వులు, కాయలు ఉంటున్నాయి. చూసారా! ఎంతో పెద్ద వృక్షము ఒక చిన్న విత్తనములోనే ఇమిడి ఉన్నది. **"ఏకం సత్ విప్రాబహుదావదంతి"** ఉన్నది. ఒక్కటే అయినప్పటికీ కొందరు దానిని కొమ్మలని, కొందరు దానిని ఆకులని, మరికొందరు దానిని పువ్వులని, కాయలని అంటున్నారు. కాని, అది ఒక్కటే కనుక, **ఒక్కటైనటు వంటివాడే నిజమైన గురువు. అతడే భగవంతుడు.**

"నిత్యం" - అతడు ఎట్టి పరిస్థితులందూ మార్పు చెందడు సూర్యచంద్రాదులు కదిలినప్పటికి తాను కదిలెడివాడు

కాడు. కనుక, ఇతడు నిత్యుడైనవాడు,మార్పు చెందనివాడు. ఈనాడు మానవుడు పుట్టినది మొదలుకొని అంత్యము వరకు మార్పు చెందుతున్నాడు. భగవంతునికి పుట్టుక లేదు, అంత్యము లేదు. పుట్టుకే లేనటువంటివానికి అంత్యమెక్కడ ఉన్నది? **ఇట్టి ఆద్యంత రహితుడైనవాడే నిజమైన గురువు. అతడే భగవంతుడు.**

"విమలం" అనగా మాలిన్యము లేనివాడు ఇతడు పరిశుద్ధుడు, పవిత్రుడు. ఎట్టి మాలిన్యమును తనలో చేర్చుకోడు. ఏది ఇతనిని చేరినప్పటికీ అది భస్మంగా మారుతుంది. అగ్నిలో మంచి పదార్థముగాని చెడ్డ పదార్థముగాని దేనిని వేసినప్పటికీ మిగిలేది భస్మమే. శవాన్ని కాల్చినా, కట్టెలను కాల్చినా లేక బంగారమును కాల్చినా అగ్ని ఎప్పుడూ పవిత్రముగానే ఉంటుంది. **అట్టి నిర్మలమైనవాడు, పవిత్రమైనవాడు ఎవరు? భగవంతుడే! అతడే నిజమైన గురువు.**

"అచలం" అనగా, భగవంతుడు నిశ్చలమైనవాడు. భూమి, సూర్యచంద్రాదులు తిరుగుతున్నవిగాని, ఇతడు తిరిగేవాడు కాదు. అంతా తనయందే ఉన్నది, అంతట తానే, ఇంక తిరిగేదెక్కడ? ఇక్కడ అక్కడ, ఎక్కడ చూసినా ఉన్నది ఒక్కటే. అదే నిశ్చలమైన నిర్మలమైన భగవత్తత్త్వం.

"సర్వధీ సాక్షిభూతం" అనగా, అన్నింటికీ తానే సాక్షి. మంచికిగాని, చెడుకుగాని తానే సాక్షీభూతుడు.ఒక స్టేజిపైనా ఏదైనా నాటకం ప్రదర్శింపబడుతుంటే దానిలోని నటులు మారుతుంటారు, వారి మాటలు మార్పు చెందుతుంటాయి. కాని, ఆస్టేజిపైన లైటుకు నటులతో గాని వారి మాటలతోగాని ఎట్టి సంబంధములేదు, అది కేవలం ఒక సాక్షిభూతుని వలె ఉంటుంది. అది మార్పు చెందదు. **ఇట్లు సమస్తమునకు సాక్షీభూతుడైన వాడే నిజమైన గురువు.**

"భావాతీతం" అనగా ఇతడు ఇట్టి వాడు, అట్టివాడు అని చెప్పడానికి ఎవ్వరికీ వీలుకాదు **"యతోవాచో నివర్తంతే అప్రాప్యమనసాసహ"**ఇతడు భావానికి అతీతమైన వాడు. భావమునకు అతీతమైనవాని యొక్క మంచి చెడ్డలను గురించి ఎవ్వరూ చెప్పలేరు. **ఇట్టివాడే నిజమైనగురువు. అతడే భగవంతుడు.**

"త్రిగుణ రహితం" - త్రిగుణములనగా సత్వరజస్తమో గుణములు. ఇవి ప్రకృతి లక్షణములు, ఈ మూడు గుణములున్నప్పుడే సుఖ దుఃఖములు ఉంటాయి. ఇవి లేనిచో సుఖము లేదు, దుఃఖము లేదు. ఈ మూడు గుణములే అవలక్షణములు. ఈ అవలక్షణముల చేతనే మనం అనేక దుఃఖాలను పొందుతున్నాము. **ఈ మూడు గుణములకు అతీత మైనవాడు. ఎవడు? అతడే భగవంతుడు. అతడే నిజమైన గురువు.**

గురువు అంటే ఎవరు? "గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుర్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః" బ్రహ్మమే గురువు. ఎవరు ఈ బ్రహ్మ? సృష్టి, సృష్టికర్త, సమస్తమును పాలించేవాడే - బ్రహ్మ. సృష్టి తానే, సృష్టికర్తకూడా తానే. ఈ బృహత్తరమైన జగత్తునందున్నది కూడా తానే. కనుక, ఇట్టి **సమస్త స్వరూపాన్ని ధరించినవాడే నిజమైన గురువు** అని స్పష్టమౌతున్నది.

ఇంక **"గురుర్విష్ణుః" ఇక్కడ విష్ణువనగా ఎవరు?** విష్ణువనగా వ్యాపక గుణము కలిగినవాడు. కర్తతానే, కర్మతానే. జగత్తంతయు క్రియా రూపము దీనికి భగవంతుడే కర్త. **కార్య కర్మ కారణ చైతన్యమే భగవత్ స్వరూపం. కర్త, కారణము, కర్తవ్యం అంతా తానే. అంతా తానే అయినవాడే - విష్ణువు. "విశ్వం విష్ణుస్వరూపం" విష్ణువనగా విశ్వస్వరూపమే. అతడే గురువు.**

"గురుర్దేవో మహేశ్వరః" మహేశ్వరుడనగా - ఈ జగత్తుతనందు సమస్త జీవులను శాసించేవాడు. ఈ ఈశ్వరుడు శాస్త్రనియమితుడైనవాడు. ఇతడు ఎవరెవరు ఏఏ కాలములో ఎక్కడెక్కడ ఏఏ విధంగా ప్రవర్తించాలో శాసించేటటువంటివాడు ఎన్నటికీ దీనిని మార్పు చేయడు. సూర్యోదయ సూర్యాస్తమయములు, రాత్రింబవళ్ళు, ఋతువులు మున్నగునవన్నీ ఇతని శాసనము వలననే

జరుగుతున్నది. **ఇట్టి క్రమశిక్షణలను తు.చ తప్పకుండా పాటింప చేయునట్టి శాసనాన్ని జగత్తుకు అందించినటు వంటివాడు ఈశ్వరుడు. కనుక, ఈ బ్రహ్మ విష్ణు మహేశ్వరులను గురువులన్నారు. గురువనగా కేవలం బోధించే వాడు కాదు. సర్వవ్యాపకుడైనవాడు, సర్వశక్తి సంపన్నుడైనవాడు, సర్వజ్ఞుడైనవాడు- గురువు. సమస్తమును తన హస్తగతము గావించుకొన్న వాడే-గురువు.**

గు కారము అజ్ఞానమును, అంధకారమును సూచిస్తుంది. ఆ అజ్ఞానమనే అంధకారాన్ని నిర్మూలము చేయునది ప్రకాశమే. కనుక, అజ్ఞానమనే అంధకారమును నిర్మూలము గావించేవాడే గురువు. కేవలం మంత్రోపదేశం చేసే వాడు, వేదాంతమును బోధించేవాడు గురువు కాడు. లౌకికమైన బోధలు సలిపేవాడు గురువు కాదు. అధ్యాపకుడు కావచ్చును. **ఈ అధ్యాపకులలో ఆచరించి ఇతరులకు బోధించేవాడు ఆచార్యుడు కావచ్చును. ఆచరణలో నిరూపణ చేసేవాడే ఆచార్యుడు. ఈనాడు ఆచార్యులు లేరు.** గురువులు లేరు. "చెవిలో మంత్రం, చేతిలో డబ్బు". ఇది నిజమైన గురువు యొక్క లక్షణము కాదు.

విష్ణువు యొక్క నాలుగు చేతులలో శంఖ చక్ర గదా పద్మములున్నవని అంటున్నారు. దీనిఅంతరార్థమేమిటి? **శంఖము శబ్దానికి సంకేతము.** కనుక , శబ్దము భగంతుని హస్తగతమై ఉన్నది. **చక్రం కాలమును, గద బలమును సూచిస్తాయి.** అనగా, సమస్త శక్తులు, కాలము భగవంతుని చేతిలో ఉంటున్నవి. **పద్మము హృదయమును గుర్తింప జేస్తుంది.** అనగా, అందరి హృదయములు భగవంతుని స్వాధీనములో ఉన్నవని అర్థము. ఈ విధముగా, ప్రాచీనులు శంఖ చక్ర గదా పద్మాలను గుర్తుగా తీసికొని విష్ణువనగా సర్వశక్తి మంతుడైన భగవంతుడేనని బోధిస్తూ వచ్చారు. ఐతే "ఈశ్వరుని కూడా భగవంతుడన్నారు కదా! మరి ఈశ్వరునికి విష్ణువుకు ఏ మాత్రం పొత్తుకుదరదే!" అని భావించరాదు. పొత్తు కుదరకుండా ఉండటానికి వారిద్దరూ వేరువేరు కాదు. ఇద్దరూ ఒక్కటే. ఈనాడు ఆరాధన చేసేవారి సంకుచిత బుద్ధుల మధ్యనే పొత్తు కుదరడంలేదు. "నేను వైష్ణవుడను", "నేను శైవుడను" అని అనుకోవడం కేవలం సంకుచిత భావాలే. వీళ్ళు తమలో తాము పోట్లాడుకుంటారనే గాని, భగంతుడు ఒక్కడే! శబ్ద, కాలం, బలం, హృదయం - ఈ నాలుగు విష్ణువు హస్తగతమై ఉన్నాయని అతని చేతులలోని శంఖ చక్ర గదా పద్మాలు సూచిస్తున్నాయి. ఇంక, ఈశ్వరునికి ఒక చేతిలో డమరుకం, మరొక చేతిలో త్రిశూలం ఉంటున్నాయి, ఈ డమరుకము శబ్దమునకు గుర్తు. అనగా, శబ్దము ఈశ్వరుని హస్తగతమై ఉన్నది. త్రిశూలము త్రికాల స్వరూపము. కాబట్టి కాలముకూడా ఈశ్వరుని చేతిలోనే ఉంటున్నది. ఈ విధంగా విచారిస్తే , రూప నామాలు వేరు వేరైనప్పటికీ భగవంతుడు ఒక్కడేనని అర్థమౌతుంది.

వైష్ణవులు, శైవులు తిరుపతికి వెళుతుంటారు. ఐతే, శైవులు "వేంకటేశ్వరా! వేంకటేశ్వరా! " అని ప్రార్థిస్తుంటారు, వైష్ణవులు 'వెంకటరమణా! వెంకటరమణా!' అంటారు. ఈ విధంగా వీరి భావాలలో మార్పు ఉన్నదిగాని, భగవంతుడు ఒక్కడే.

ఈశ్వరునికి "పశుపతి" అని మరొక పేరు. పశుపతి అనగా, పశువులకు నాథుడు. మనోబుద్ధులతో చేరిన జీవతత్వమునకే పశుత్వమని పేరు. అదే విధముగా, విష్ణువును - "గోపాలా!" అంటారు. కనుక పశుపతి, గోపాలుడు - వీరిరువురూ ఒక్కటే! ఇట్టి ఏకత్వాన్ని వారి నామములే నిరూపణ చేస్తున్నాయి.

(స.సా.ఆ.92పు.171/178)

భగవతత్త్వమనేది, పరమాణు స్వరూపాన్ని ధరించి అంతటా నిండి యున్నది. సర్వత్ర ఉన్నది శక్తి స్వరూపమే. అయితే, ఈ దివ్యశక్తిని గుర్తించే నిమిత్తమై మానవుడు సద్గుణములు అలవర్చుకోవాలి. సత్యమే ఈ ప్రపంచ స్వరూపాన్ని ధరించింది. సత్యమే లేకుండిన జగత్తేలేదు. సర్వమూ సత్యము నుండియే ఆవిర్భవించినది.

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె

భగవత్ప్రసాదము

సత్యంబునందణగె సర్వ సృష్టి
సత్యమహిమలేని స్థలమేది కనుకొన్న
శుద్ధ సత్యమిదియె చూడరయ్య!

నాయనా! **జీవుడవైన నీవు నా అంశమే. అనాదివి. ప్రకృతి పంచభూతముల అంశాలివి కావు.** నా అంశమైన నీవు నన్ను చేరునంత వరకూ శాంతి సుఖములనందుకొనలేవు. బిడ్డ తల్లికి అంశము; తల్లిని విడిచి బ్రతుకలేదు. నది సముద్రమునకు అంశము; సముద్రమునకు దూరమై నిలువలేదు. కొమ్మ చెట్టునకు అంశము; చెట్టును విడచి బ్రతుకలేదు. చేప జలమునకు అంశము; జలము లేక క్షణమైనా జీవించజాలదు. అదేవిధముగా **నీవు నా అంశము; నన్ను విడిచి బ్రతుకలేవు. కనుక నన్ను చేరుటకు ప్రయత్నించు.**

శ్లో॥ మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః
మనఃషష్ఠానీ ఇ్ధియాణి ప్రకృతి స్థాని కర్షతి. (భ.గీ.15-7)

ఓ మానవుడా! నీవు నా అంశమే. కనుక నా భావములే నీలో ఆవిర్భవించాలి' అన్నాడు గీతాచార్యుడు. తాను దైవాంశయేనని విశ్వసించే మానవుడు నిత్యానందమునే పొందుతాడు. పరమ సుఖమునే అనుభవిస్తాడు.

(శ్రీ.భ.ఉ.పు.28/29)

భగవత్ప్రసాదము

(చూ॥ విశ్వాసము)

భగవత్ప్రీత్యర్థము

భక్తి Part time devotion గా ఉండకూడదు. Full time devotion గా ఉండాలి. కష్టాలు, నష్టాలు వచ్చినప్పుడు "దేవుడా! దేవుడా!" అని దేవులాడుతాము. కాని, సుఖ సౌభాగ్యములు సంభవించినప్పుడు దేవుని నామమే మనకు జ్ఞాపకం రాదు. నిజమైన భక్తి కాదు. **"సతతం యోగినః".** కాని, తెల్లవారి లేస్తే మనం యోగములో కూర్చొంటాము, మధ్యాహ్నము చూస్తే భోగములో కూర్చొంటాము; రాత్రి చూస్తే రోగములో మునిగి పోతాము. ఇది సరియైనది కాదు. తెల్లవారున, మధ్యాహ్నం,రాత్రి నిరంతరం చిత్తవృత్తులను అరికట్టుకొన్న వారిగా ఉండాలి. **అదియే దివ్యమైన భావము. "సర్వం భగవత్ప్రీత్యర్థం" అనే భావనలో మనం మునగాలి.** ఏ పనైనా చేయి. నీ ఉద్యోగం చూసుకో, విద్యావంతుడిగా చదువు, అధ్యాపకుడిగా బోధించు. ఏ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తిస్తున్నప్పటికి ఇవన్నీ **భగవత్ప్రీత్యర్థం చేస్తున్నావనే సులభమైన దివ్యమైన భావముతో చేస్తే - అదియే భగవదర్పితమౌతుంది.** మనస్సును సులభంగా అరికట్టడానికి ఇదే మార్గము.

(స.సా.ఆ.93 పు.222)

భగవత్ప్రేమ

హనుమంతుడు రామాజ్ఞను శిరసావహించి, లంకలో ప్రవేశించి, సీతయొక్క క్షేమవార్తను తెచ్చి రామునికి అందించాడు. రాముడు వానరసైన్యంతో కూడి లంకలో ప్రవేశించి, రావణుని వధించాడు.అప్పుడు హనుమంతుడు సీతవద్దకు వెళ్లి, "అమ్మా! రామునికి విజయం చేకూరింది. రావణ సంహారం జరిగింది. నీకు బంధవిమోచన జరిగింది'' అని చెప్పాడు. సీతాదేవి ఆనందంతో ఉప్పొంగిపోయి హనుమంతుణ్ణి అనేక విధాలుగా వర్ణించింది. "రఘుపతి కార్యం బీడేర్చిన కపిరాజ శిఖామణి నీవయ్యా! రాముద్రిక గొని సముద్రము దాటిన భద్రపరాక్రముడవీవయ్యా! '' అని హనుమంతునికి ఎన్నో టైటిల్స్ (బిరుదులు) ఇచ్చింది. "హనుమంతా! నీవంటి గుణవంతుడు, బలవంతుడు ఈ జగత్తులో కానరాడు'' అని ఎంతో గొప్పగా వర్ణించింది. కానీ ఈ వర్ణనలు విని హనుమంతుడు కృంగిపోయాడు. తలవంచుకున్నాడు. ఈ సత్యాన్ని గుర్తించిన సీత "అయ్యో! ఈ వర్ణనలు హనుమంతునికి ఏమాత్రము ఆనందము నందించలేదే! ఇతనికి ఆనందము కల్గించే విషయ మేమిటి?'' అని బాగా లోతుగా యోచన చేసి "హనుమంతా! **సర్వ కాల సర్వావస్థలయందు నీవు రామప్రేమను పొందుదువు**

గాక!" అన్నది. ఈ మాటలు వినేటప్పటికి హనుమంతుడు ఆనందంతో ఎగిరి గంతేసాడు. **"తల్లీ! రామప్రేమను మించినది ఈ జగత్తులో లేదు కదా! అది లేకుండా ఈ జగత్తునంతా నా హస్తమునందుంచినా నాకు ఆనందం కలుగదు. రాముని ప్రేమకిరణములు నాపై ప్రసరించితే నా జన్మ ధన్యమైపోతుంది"** అన్నాడు. చూశారా! బలవంతుడు, గుణవంతుడు, పరమ భక్తుడైన హనుమంతుడు రామప్రేమను తప్ప మరి దేనినీ ఆశించలేదు. ప్రేమయే ఈ లోకము, ప్రేమయే సర్వస్వము. కానీ మానవుడు ప్రేమమయమైన ఈ జగత్తునందు ఉద్భవించి, ప్రేమను కోల్పోయి, ద్వేషము, అసూయ, క్రోధము మున్నగు దుర్భావములను హృదయంలో నింపుకుంటున్నాడు.

(స.సా.మా.99పు.68/69)

భగవత్స్వరూపము

(చూ॥ తత్త్వజ్ఞానము)

భగవదనుగ్రహము

పూర్వజన్మల కర్మను ఈ జన్మలో పూర్తిగా అనుభవించాలనీ భగవదనుగ్రహం ఎంత వున్నటికీ దానిని తప్పించలేదనీ మీరు అనుకోవచ్చు. ఈ విధమైన బోధ మీకు ఎవరో చేసివుంటారు. అందు వల్ల మీరు ఆ విధంగా తలుస్తున్నారు. ఆ విధంగా మీకు కర్మను అనుభవించినవసరం లేదని నేను అభయమిస్తున్నాను. **తీవ్రమైన బాధ కలిగి నప్పుడు వైద్యుడు మత్తు ఇంజక్షనిస్తాడు. శరీరానికి ఆ బాధ తెలియదు.** బాధ వున్నప్పటికి తెలియకుండానే మత్తుమందు వంటిది **దైవానుగ్రహంమీరు అనుభవించవలసినకర్మయొక్క తీవ్రబాధను అనుగ్రహం హరిస్తుంది.** కొంతకాలము తరువాత పనిచెయ్యని మందులు కొన్ని వున్నవి. ఆ విధంగానే కర్మ ఫలం అనుభవానికి రాకుండా పోతుంది. కర్మఫలం అనుభవించవలసి వున్నప్పటికీ దాని బాధలేకుండా తెలియకుండా చేస్తుంది. అనుగ్రహం. భగవంతుడు కర్మ ఫలంనుంచి పూర్తిగా రక్షించగలడు. గురుపూర్ణిమకు వారం దినాలముందు ఒక భక్తుని పక్షవాతమునూ హృద్రోగమునూ నేను అనుభవించి అతడిని రక్షించాను. **ఎలాటలిఖితం చెరిపివేయలేము అనటం పొరపాటు. కిందటి జన్మలోకూడ చేసుకున్న కర్మను ఈ జన్మలో అనుభవించక తప్పదనటం కూడా సరికాదు. అనుగ్రహం అన్నింటినీ రద్దుచేయగలదు. దానికి ఆటంకాలూలేవు. అది సర్వశక్తిమంతమైన అనుగ్రహమని మరువకండి.**

(వ.1963పు.180/181)

భగవదన్వేషణ

భగవదన్వేషణలో తొలివిజయం సాధించినట్టిది భారత దేశము. ఇట్టినైతిక ధార్మిక, ఆధ్యాత్మికముల యందు పవిత్రమైన ముందంజవేసి, దిగ్విజయము సాధించి, ఆదర్శమునందించి నట్టిది భారతదేశము. కనుకనే **త్రిమూర్తి స్వరూపమైన దివ్యత్వమును గుర్తింపచేసే నిమిత్తమై త్రిరాత్రులు, నవరాత్రి, శివరాత్రి, సంక్రాంతి. అనే ఈ మూడు రాత్రులను పవిత్రమైన సర్వదినములుగా చాలాకాలమునుండి ఆచరిస్తూ వచ్చారు భారతీయులు.** కనుక పర్వదినములుగా ఏదో ఒక విధమైన ఆహార ఆనందములలో అనుభవించేవి కావనే సత్యాన్ని గుర్తించి, ఆరాధన నిమిత్తమై, అత్మాన్వేషణ నిమిత్తమై ఏర్పడినటు వంటివిగా సత్యస్వరూపములుగ గుర్తించుట అత్యవసరము. **ప్రేమతత్వమును విశాలపరుచుకొని సర్వత్రావ్యాపింప చేసేటువంటి సమత్వమును అనుభవింపచేయు మహాపర్వదినములుగా ఈ పర్వదినములను భావించి, మనలోని దుర్గుణములకు, దురహంకారములను, దుర్భావములను దుష్టచేష్టలను, దూరము కావించుకొని, సద్భావములను సచ్చింతలను, సత్కర్మలు ఆచరించుటకు ఈదేహమును సమాజమునకు అంకితము కావించవలెనని ఈనాడు దృఢసంకల్పమునకు మనము పూనుకోవాలి.**

(సా.ముందుమాట)

భగవదాసక్తులు

సుకృతులు నిరంతరము సద్గుణ, సదాలోచన, సర్వేశ్వర చింతనలలో భగవదాసక్తులై ఆరాటపడుచుందురు. అట్టివారు ఆర్తులు కావచ్చు. అర్థార్థులుకావచ్చు, జిజ్ఞాసువులు కావచ్చు. వీరి జన్మజన్మాల పుణ్యకర్మలే వీరికిట్టి స్వభావములు కలిగించును. సంస్కారముతో ఈ జన్మయందు కూడనూ పుణ్యకర్మలే ఆచరింతురు. సుకృతులు. కాని గీత సకామ కర్మలను అంగీకరించదు. నిష్కామ కర్మనే నిర్మోహమాటంగా అందించుచున్నది. ఆర్త, అర్థార్థి, జిజ్ఞాసు, జ్ఞాని అనే ఈనాలుగు విధములైన భక్తులలో మొదటి ముగ్గురు అయిన ఆర్త, ఆర్థార్థి, జిజ్ఞానులు, భగవంతుని పరోక్షముగా భావించి ప్రార్థింతురు. అయితే జ్ఞాని అట్లుకాక స్వాత్మరూపముగా అపరోక్షముగానెరిగి సేవిస్తాడు. అట్టివాడు సదా భగవన్నిష్ఠుడై యుండును. పై మొదటి మూడు మార్గములవారు తమ తమ అభీష్టప్రాప్తికోసం భగవంతుని సాధనంగా ఉపయోగించుకొందురు.

జ్ఞానిది ఏకభక్తి; మిగిలిన ఆర్త, అర్థార్థి జిజ్ఞాసు లను మూడు అవస్థలవారిది అనేక భక్తి (అనగా కోరే వస్తువులయందూ, విషయములందూ, భూతముల యందూ, భగవంతునియందూ, అన్నింటియందూ ప్రేమను ప్రవహింపజేయుదురు). అట్టివారు భగవంతునికే కాక వస్తు వాహనములకూ విషయ విహారములకూ భక్తులగుదురు. **జ్ఞాని భగవంతునకు తప్ప మరే ఇతరమైనవాటిని కన్నెత్తి కూడనూ చూడడు. చూచిననూ అతనికి సర్వమూ భగవంతుడుగానే గోచరించును అందువలననే పరమాత్ముడు జ్ఞాని నాకు అతిప్రియమైన వాడని తెలిపెను.** భగవంతునకు అందరూ సమానమే అయిననూ, చెంతచేరి సన్నిహితులుగా వున్నవారిపై ప్రేమ ప్రత్యక్ష గోచరము. అనుభవము. కనుక జ్ఞాని భగవంతునికి అతి సమీపమున ఉన్నవాడనే తలంచవలెను.

శీతలబాధ తీర్చుట అగ్నికి సహజ గుణము; అయిన్పటికినీ దగ్గర కూర్చొనక అతి దూరమున నుండిన వానికి శీతలమెట్లు తీర్చును అతని శీతల బాధను తీర్చనంత మాత్రమున అగ్నికి వక్తి లేదని అర్థము కాదు. శీతల బాధను తీర్చుకొనవలెనని అభీష్టమున్న వాడు యెట్లు అగ్ని సమీపమున నివసించవలెనో అటులనే అనుగ్రహమను జ్ఞానాగ్నిని అనుభవించి తమ తమ ఈతి బాధలను, శీతలమును దూరము చేసుకొనవలెనన్న అభీష్టము కలవారు, జ్ఞానులై పరమాత్మునికి సన్నిహితులగుటకు ప్రయత్నించవలెను.

సాధకులలో కలిగిన ప్రయత్న లోపమునకు సర్వేశ్వరుని అడ్డుపెట్టుకొని, దేవునకు పావులనీ, పుణ్యులనీ, జ్ఞానులనీ, అజ్ఞానులనీ భేదమున్నదన్న అవి అర్థములేని వ్యర్థవూహలు భగవంతునికెప్పుడూ అట్టి భేదములు లేవు. నిజముగా భగవంతునికే అట్టి భేదములే వుండి యుండిన పాపులు లోకమున ఒక నిమిషము కూడనూ బ్రతుకలేరు. భగవంతున కట్టి భేదములేదు. కనుకనే అందరూ లోకమున బ్రతుకు చున్నారు. ఇట్టి సత్యము జ్ఞానికి మాత్రమే తెలియును. కాని తక్కిన వారలకు తెలియదు. కనుకనే దేవుడు మాకు దూరముగా యెక్కడో ఉన్నాడని పిచ్చి భ్రాంతిలో పడి పరితపించుచున్నారు.

జ్ఞాని మాయాతీతుడు, గుణరహితుడు, జిజ్ఞాసువు అట్లుకాక అన్య అపేక్షలకు చోటివ్వక నిరంతరము భగవత్ చింతనలతో సత్ ప్రవర్తనలతో, సదాలోచనలతో కాలమును గడుపును. ఇక అర్థార్థుడు, ఆర్తుడు క్రమక్రమేణ విషయ విచారణచేసి సాధనలతో విశ్వాసములతో జిజ్ఞాసువుగా మారి దానిద్వారా జ్ఞానమును చేరగలుగు చున్నారు. దానిని ఆశ్రయించి తరించుచున్నారు.

పై విధముగ సాధన స్థానములు ఒకదానిద్వారా ఒకటిని దాటేగమ్యమును చేరును. అట్లు లేక ఒక పర్యాయము గమ్యమునకు చేరవలెనన్న అది సాధ్యముకాదు. దీనికి ఒక ఉదాహరణము; **జ్ఞానమను నది 'త్రూ రైలు'** అనగా అందులో సాధకుడు ప్రయాణము చేసిన యెక్కడా మధ్యలో దిగనక్కరలేక తాను చేరవలసిన స్థానమును చేరును.

జిజ్ఞాసు అనునది త్రూక్యారేజి (రైలుపెట్టె), అందులో ప్రయాణము చేయు సాధకుడు దిగనక్కరలేదు. కానీ ఈ పెట్టెను మరొక బండికి తగిలింతురు. అట్టి మార్పులుండును. దానిద్వారా గమ్యమును చేరును. ఇక **ఆర్తుడు, అర్థార్థుడు అనునది సామాన్యమయిన రైలు బండి.** అనగా త్రూ రైలు కాదు, త్రూక్యారేజి కాదు, ఆ బండి పూర్తి గమ్యము వరకూ పోదు. కనుక ఆ బండిలో యెక్కిన సాధకుడను ప్రయాణీకుడు మధ్య మధ్య బండినుండి దిగి తరువాత మరొక బండికి కాచుకొని వుండి ఆ తరువాత మరొకబండి యెక్కి దానిద్వారా గమ్యమును చేరును. ఇందులో ప్రయాణము చేయువారు కొన్ని కష్టములకు శ్రమలకు గురికావలసి వచ్చును. **అయితే కడకు గమ్యము మాత్రము నలుగురూ చేరుదురు, కాని కాల కర్మములు వ్యత్యాసము. అందువలననే భగవంతుడు "ఈ నాలుగు విధముల వారూ నావారే"** అని పలుమారులు తెలుపుచుండును. కారణమేమి? గమ్యము ఒక్కటే గనుక. కాన అల్ప వస్తువులను కొరిక **అది దైవమును కోరుటలో ఆనందము మెండు. 'అల్ప వస్తువును కోరేవారు కృపణులు, భగవంతుని కోరే వారు ఉదారులు'** అని కూడనూ కృష్ణపరమాత్మ అన్నాడు.

(గీ.పు.114/118)

భగవద్గీత

ఉపనిషత్తులనుండి భగవద్గీత ఆవిర్భవించింది. ఇది షట్కర్మలనే మార్గములు మరొక విధముగా లోకానికి బోధించింది. గీత షడంగముల రూపాన్ని ధరించింది. గీతయందు ఆరారు ఆధ్యాయములకు ఒక షట్కము చొప్పున మాడార్లపద్దెనిమిది అధ్యాయముల ఉన్నవి. మొదటి షట్కము కర్మ మార్గము. రెండవషట్కము ఉపాసనమార్గము. మూడవది జ్ఞానమార్గము. ఏతావాతా వేదములనుండి ఉపనిషత్తులు, ఉపనిషత్తులనుండి భగవద్గీత, భగవద్గీత నుండి భవ్యమైన ఆచరణ రూపమైన మానవత్వము ఆవిర్భవించింది. **గీత యొక్కసారమే మానవజాతి. ఈ జాతికి అభిమతము గీతనే. భగవద్గీత** భారతీయులకు మాత్రమే సంబంధించిన ప్రాపర్టీకాదు. యావద్విశ్వమునకు సంబంధించినది. **ఇది భగవద్గీత భగవంతుని యొక్క వాక్యం.**

(బ్ర.త్ర.పు.181/182)

'శాంతిని ముక్తిని కోరేవారికి భగవద్గీత ఒక చిత్రపటం (Map) వంటిది. **భగవంతుడు అందరి హృదయాలలోను సారథిగాప్రతిష్టింపబడి ఉన్నాడు.** సరైన మార్గంకోసం వేడుకుంటే ఆయన తప్పక జవాబు ఇచ్చి ముందుకు నడిపిస్తాడు. మీలోని భగవంతుని చిత్తశుద్ధితో వేడుకుంటే మీకోసమే ప్రత్యేకించబడిన 'గీత' ను మీలో ప్రతి ఒక్కరికీ ఆయన వినిపిస్తాడు''.

(శ్రీ.స.స.పు.219)

(చూ॥ అందము, ఆనందమయుడవు, అర్జునుడు, పంచమ వేదము, భూతచిత్తచిదాకాశములు)

భగవద్గీత - అంతరార్థము

భగవద్గీతయందు కౌరవులు, పాండవులు హస్తినాపురం నిమిత్తం యుద్ధము చేసినది బాహ్యార్థము. కాని అంతరార్థము మధురమైనది. హస్తిమంజరమునకు హస్తినాపురమని పేరు. **హస్తినాపురమునకు. నవ ద్వారములు కలవు. నిర్గుణనిరాకార పరబ్రహ్మతత్వము.** ఒకడు సాక్షిభూతుడుగా వున్నాడు. అట్టినిర్గుణ పరబ్రహ్మ మాయాఅనే దానిని వరించాడు. అందువలననే పరబ్రహ్మాను మాయోపాధి అందురు. మాయకు **పరబ్రహ్మమునకు, మనస్సుకుమారుడు, మనస్సు అనేకరకములుగా తల్లినే అనుసరించును.** తండ్రి జాడలు కనపడలేదు. మనస్సుకు మాయతత్వము యిష్టము. నిర్మలత్వమైన తండ్రి గుణములు యిష్టములేదు. మనస్సునే కుమారుని పెంచి పెద్దచేసి పెండ్లిచేసారు. మనస్సుకు రెండు పెండ్లిండ్లు అయినవి, **ప్రవృత్తి నివృత్తి,** అనే యిద్దరు మనస్సును పెండ్లి చేసుకున్నారు. మనస్సుకు ప్రవృత్తిపైనే మక్కువ, నివృత్తిని చూచి చూడనట్లుగా

భగవద్దర్శనము

వెళుతుంటాడు, ప్రవృత్తికి అనేక మంది పిల్లలు పుట్టారు. **నివృత్తికి అయిదుమంది మాత్రమే పిల్లలు పుట్టారు. అనేకమంది అయిన ప్రవృత్తి పిల్లలు అసురులు నివృత్తి పిల్లలు అయిదుమంది దైవస్వరూపులు. ప్రవృత్తి నివృత్తి పిల్లలయినవారే. కౌరవులు, పాండవులు, నివృత్తి బిడ్డలు అయిదుమంది. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింస ఈ అయిదుదైవలక్షణములుగా వుండుటచేత దేవతలు, ప్రవృత్తి సంతతి అయిన అసురులు దుర్గుణములన్నీ చేర్చుకొన్నారు. అందుచే కౌరవుల పేర్లన్నీ దుకారముతోనే ప్రారంభమైనవి.** దుర్యోధనుడు, దుశ్శాసనుడు అని దుతోనే ప్రారంభమయినవి. **దుకారము దుఃఖహేతువు, దుర్గుణములతో దుఃఖములపాలైరి.** వీరుయిరువురు హృదయ సామ్రాజ్యముకొరకు యుద్ధము చేసినారు, హృదయ క్షేత్రమే ధర్మక్షేత్రము, దుర్గుణములకు, సద్గుణములకు ధర్మక్షేత్రమునందు నిత్యము యుద్ధము జరుగుచుండును. **మనస్సు గ్రుడ్డివాడు అతనే ధృతరాష్ట్రుడు. ధృతం, రాష్ట్ర ఇతీహిధృతు. తనది కానిదానిని తనదిగా విశ్వశించుట ధృతరాష్ట్రతత్వము.** అట్టిదే మనస్సు తనదికాని దానిని అంతయు కావాలి అని ఆశించును. మనస్సునకు కోతికి హెచ్చుతగ్గు వుండదు. మనస్సు కుచ్ఛితము, అసహ్యము ఆశించును, మంచిని ఆశించుట అలవాటులేదు. ధృతరాష్ట్రుడు తనదికాని రాజ్యమును తనకు కావాలని ఆశించి తనకుమారులు దుర్మార్గులైన వారి వెనుకనే వెళ్ళెను. ధృతరాష్ట్రుడు అనే మనస్సు పరిపరి విధములుగా పోయినపుడు, కుమారుల దుస్తితికి, హీనస్తితికి తండ్రియే కారణము అని గీతబోధించును. మనస్సును అరికట్టి, వుద్రేకములకు వుప్పొంగే రౌద్రములకు దానిని పోనివ్వకూడదు. మనస్సు విషసర్పములాంటిది, పాము తిన్నగా నడువదు సొట్టమార్గములో పోతుంది. అదేవిధముగా **మనస్సు యిటు అటుపోతుంది. దానినే "యవ్వనసన్ని పాతకము" అంటారు. యిది అహంకార తత్వము. అజ్ఞానము యొక్క చిహ్నము** అనే చెప్పవచ్చు. **పాముకు రెండవ దుర్గుణము యేది మూతికి తగిలిన కరుచుకొంటూ పోవును.** అటువంటిదే మనస్సు, చూచినవన్నీ కావాలని కోరుకోవటము. ఈ రెంటికి తగిన రెండు దంతములున్నాయి. ఆరెండు దంతములు తీసిన ఆడించి పొట్ట పోసుకొనే వారికి వుపయోగపడును. యట్టి విషదంతములు రెండు మనకూ వున్నవి. **అవి అభిమానము, మమకారము. యీ రెండు తీసివేసిన జగత్తునకే వుపకారము, లోక కళ్యాణమేకాక స్వార్థమును దూరము చేసి పరార్థమును పొందుటకు అవకాశము కలుగును.** యువకులైన మీరు ఆదర్శప్రాయులై లోకమున తల్లీ తండ్రులను సంతోషపెట్టి యెవ్వరికి బాధకలుగ నీయక యెవ్వరిని నొప్పించక భారతదేశ కీర్తిని నిలుపుటకు తయారగుదురని ఆశిస్తున్నాను. **భుజబలము బుద్ధిబలము ధనబలము జనబలము శాశ్వతముకాదు. దైవబలము నిజబలము.** దానిని అభివృద్ధి పరచే ప్రయత్నమునందే మానవత్వము నకు సార్థకత లభించును.

(భ.స.వే.ప్ర. పు. 136/138)

భగవద్దర్శనము

నేను నీ ప్రక్కనే యున్నాను. నీలోపల యున్నాను. నీ హృదయాంతరాళములో యున్నాను. నేను నీకు సహాయము చేయుటకు, దారి చూపించుటానికి వచ్చాను. **భగవంతుని పై దృష్టి మరల్చు. నీకొరకు ఆపనిచెయ్యలేను. అది నీకు నువ్వే చెయ్యాలి.** నీలో యున్న భగవంతుని నావైపుకు త్రిప్పగలను కాని నీవు నా దగ్గరకు రావు. **నీవు నాలో ఒక్కటి అయిపోవాలి. ప్రతి అణువు నందును భగవంతుని చూడగలగాలి.** ప్రతి వారిలోను భగవంతుని ప్రేమచూడు. భగవంతుని ప్రేమ నీలో యున్నదని గుర్తించుకో. అదే ఇతర ప్రేమలకంటే అతీతమైనది. నేను ఏ పని చేసినా భగవంతుని గురించే చెబుతాను. నా ప్రేమ భగవంతుని ప్రేమ, **నీకళ్ళని తెరిపించడమే నా కర్తవ్యము.** ఆధ్యాత్మిక జీవితం దొరకడం చాలా కష్టము. **భగవద్దర్శనము నీ చేతిలోనే యున్నది నీ ప్రేమను**

విస్తరింపచెయ్యి. ఈ ప్రపంచములో మహత్తరమైన దానిని పొందుటకు నువ్వు నువ్వే కావాలి. అదే భగవంతుడు **నువ్వు నువ్వు కావడమే భగవద్దర్శనం.**

(సా. పు.332/333)

భగవద్దృష్టి

(చూ॥ తత్త్వజ్ఞానము, సంసారజీవితము)

భగవద్భక్తులు

ఈనాడు ఏవరైనాసరే, భగవద్భక్తులుగా ఉండేవారు. భగవద్భక్తులమని విశ్వసించేవారు **మాంసభక్షణమును వదలాలి. కారణమేమిటి? పశుమాంసము పశుగుణములనే పెంచుతుంది. హిందీలో చెబుతారు "జైసే అన్నే, ఐసే మన్" ఎలాంటి తిండో అలాంటి త్రేపు.** క్రూర మృగముల యొక్క మాంసమును భుజించడం చేత మనలో కూడా క్రూరత్వము అభివృద్ధి అవుతున్నది. ఇది ఒక్కటేకాదు, పరప్రాణులను చంపడం ఎంత పాపం! కనుక, నిజమైన దైవభక్తులు కావాలని ఆశించేవారు మాంస భక్షణమును పూర్తిగా వదలాలి. "మేము సాయి భక్తులం, రామ భక్తులం, కృష్ణభక్తులం..." అని చెప్పుకుంటూ, కోళ్ళు కోసుకుని తింటూ కూర్చునేవారు భక్తులు ఎలా అవుతారు? వారు కేవలం రాక్షసులే! **అలాంటి వారిని భగవంతుడేమాత్రం అనుగ్రహించడు.** కనుక, ఎవరైనా సరే, స్వదేశీయులు కాని, విదేశీయులు కాని -స్వామి ఆజ్ఞను పాటించేవారు మాంస భక్షణమును తక్షణమే వర్జించాలి.

మనము నీరు తీసుకుంటున్నాము. నీటిలో ప్రాణశక్తి జీవశక్తి ఉంటున్నది. నీరు పవిత్రమైన భగవదంశము భగవంతుని (శంకరుని జటాజూటము) నుండియే నీరు ఆవిర్భవిస్తున్నది. అలాంటి నీటిని వదలి "బాటిలు"ని తీసుకోవడం తప్పు! **మద్యపానము మహాప్రమాదకరమైనది. తనను తాను మరపిస్తుంది. గౌరవమును తీసివేస్తుంది, మానవత్వాన్ని దూరం చేస్తుంది.** దివ్యత్వాన్ని మరపిస్తుంది. త్రాగినవాడు తాను ఏమి చేస్తున్నాడో, ఏమి చూస్తున్నాడో తనకే తెలియదు "ఊ..." అని ఊగుతూంటాడు. అట్టి వానిని చూస్తే ఎంతో అవమానమనిపిస్తుంది. నవ్వు వస్తుంది. వీడు మానవుడై ఈ విధముగా ప్రవర్తిస్తున్నాడే అని బాధనిపిస్తుంది. ఈ మద్యపానము వల్ల కొన్ని కుటుంబములు నాశనమైపోతున్నాయి. కొందరు తాము సంపాదించిన ధనమంతా మద్యపానమున కు వినియోగిస్తూ కట్టుకున్న భార్యను, కన్నబిడ్డలను ఏమాత్రం సాకటం లేదు. తల్లిదండ్రులను, భార్యాబిడ్డలను పోషించలేనివాడు ఇంట ఉండి ఏమి ప్రయోజనం? ఈ దురవస్థకు మూల కారణం మద్యపానమే. అంతేకాదు. కొంతమంది మద్యపానముతోపాటు సిగరెట్లను కూడా కాలుస్తుంటారు. ఈ సిగరెట్లమూలంగా ఆస్త్మా, ఇస్నోఫీలియా, గుండెజబ్బులు మున్నగునవి ఏర్పడుతున్నవి. సిగరెట్లను కాల్చి కన్నబిడ్డను ముద్దుపెట్టుకుంటే వానికి 'కాన్సరు' వస్తుంది. ఈ ధూమపానం వల్ల కలిగే అపాయమునకు ప్రత్యక్ష ప్రమాణమును కూడా నిరూపించవచ్చు. ధూమ పానము చేసినప్పుడు తెల్లని బట్ట తీసుకుని దాని మీద ఊదండి. ఆ తెల్లని బట్టపైన ఎట్టని మచ్చ ఏర్పడుతుంది. ఆ పొగవల్ల బట్టనే ఇంత పాడైనప్పుడు, ఇంక పొగత్రాగితే మన రక్తనాళములు ఎంతగా, చెడిపోతాయో! ఇది ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్మూలిస్తుంది. జీవిత ప్రమాణాన్ని నశింపజేస్తుంది.

కనుక, నిజమైన దైవభక్తులు కాగోరువారు మాంస భక్షణ, మద్యపానము, ధూమపానము ఈ మూడింటినీ పూర్తిగా మానివేయాలి. ఏ ప్రభుత్వమూ దీనిని ఆపలేదు. ఎవరి భావములలో వారికి మార్పు రావాలి. ఇది మానసిక పరివర్తన వలన వస్తుంది. కాని, పరుల వలన వచ్చేది కాదు ఎరికి వారు సత్యాన్ని గుర్తించి వర్తించాలి.

(శ్రీ.భ.ఉ.పు.160)

భగవద్విశ్వాసము

ఘృష్టం ఘృష్టం పునరపి పునః చందనం చారురమ్యం।
ఛిన్నం ఛిన్నం పునరపి పునః స్వాదు ఇక్షుకాండం।

భగవన్మయం

దగ్ధం దగ్ధం పునరపి పునః కాంచనం కాంతివర్ణం।
సప్రాణాంతే ప్రకృతిర్వికృతిర్జాయతే ఉత్తమానాం॥

"గంధపు చెక్కను అరగదీసిన కొలది సుగంధపరిమళాన్ని అనుభవించగలుగుచున్నాము. చెఱుకును నమిలిన కొలది అతి మధురమైన రసమును గ్రోలగలుగుచున్నాము. బంగారాన్ని అగ్నిలో వేసి కాల్చినకొలది, దాని మాలిన్య మంతయు తొలగింపబడి, పరిశుద్ధమైన అపరంజిని పొందగలుగుచున్నాము. అట్లే, మానవుడీ లోకంలో కష్ట-నష్టాలు, విచారాలనెడు వికృతులను ఎన్ని అనుభవించి నప్పటికి, తాను స్థిరచిత్తుడై **'భగవద్విశ్వాసము' ను కల్గియుండినచో- అతడే ఉత్తమమైన మానవుడుగా రాణింపగలడు".**

(స.సా.సె.91 పు.225)

భగవన్మయం

ప్రేమస్వరూపులారా! మీరు భజనలు చేస్తున్నారు. కాని, దేని నిమిత్తమై చేస్తున్నామనేది మీరు గుర్తించటంలేదు. కొంతమందికి భజన చేసే సమయంలో శ్రుతిలయ రాగములపై మనస్సు పోతుంటాది. శ్రుతిలయరాగములు కూడా ఉండవలసిందే కాని, వాటిపైనే దృష్టి పెడితే భావము పాడైపోతుంది. నిజంగా భగవత్ప్రేమను మీ హృదయంలో నింపుకున్నప్పుడు శ్రుతిలయరాగములు ఆటోమెటిక్‌గా సరిపోతాయి. అగ్నిలో పారవేసిన ఇనుప ముక్క పూర్తి అగ్నిగానే మారినట్టు, మీ **మనస్సు పూర్తి భగవన్మయం కావాలి. పాలను, నీటిని విడదీయటానికి వీలుకాదు.** అదే రీతిగా, మీరు భగవంతునితో ఏకం కావాలి. అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తించాలి, అట్టివాడే నిజమైన మానవుడు. ఏదో పండుగ రోజుల్లో భగవంతుని పూజిస్తే సరిపోదు. ప్రతిక్షణమూ దైవప్రార్థన చేయాలి. అలా చేస్తే మా పనులెలా జరుగుతాయని మీరు సందేహిస్తారేమో! **మీ పని వేరు, దైవం పని వేరా? కాదు, కాదు. ఈ విధంగా విభజించు కోకూడదు. మీరు వేరు, దైవము వేరు కాదు. కాబట్టి, మీ పని, దైవం పని ఒక్కటే.** పూజ గదిలో చేసే ప్రార్థన భగవంతుని పనియని, బయట చేసే పనులు మీ పనులని భావించటం చాలా పొరపాటు. కొంతమంది పూజగదిలోకి ప్రవేశించేంత వరకు ప్రాకృతమైన భావాలతో ఉంటారు; పూజగదిలోకి పోతూనే తలుపులు వేసుకొని భగవత్ప్రార్థన చేస్తారు. ఇట్టి భేద భావాన్ని దూరం చేసుకోవాలి. **"నా హృదయమే భగవంతుని మందిరం"** అన్న సత్యాన్ని గుర్తించి వర్తించువాడే నిజమైన వ్యక్తి. **హృదయంలో దైవాన్ని ప్రతిష్టించుకొని ఏ కార్యం చేసినా అది దైవ కార్యంగానే రూపొందుతుంది.**

(స.సా.అ.2000పు.292/293)

భగవన్నామము/భగవన్నామములు

జీవితారణ్యములో పయనించుచున్న మానవులకు, భగవన్నామము చిన్న జ్యోతి. వివేకమను గురువు సలహా ననుసరించు, ఈ జ్యోతిని చేతనుంచుకొని కర్మానుష్ఠాన మనెడి ప్రయాణము సాగించినచో, ఈ చిన్న వెలుగే వేళ్ళమైళ్లు దాటించి సురక్షితముగా గమ్యము జేర్చును.

(స.సా.జ.76పు.263)

బంధువులందరు వాకిటి దాకను
వల్ల కాటికి వత్తురుగా
బంధమణచినిన్ బాయని ఆప
ద్బంధువు భగవన్నామమేరా!

(ము.ము. పు. 39)

రమణీయమైన మనఃకమలమునకు భ్రమరములు. మనస్సనే కమలము జలమును ఆధారము చేసుకొని సూర్య కిరణములు అధేయముగా భావించి తన జీవితమును గావించుకుంటుంది. భ్రమరములకు మధుకరములు అని పేరు. దీనిని మరొక మార్గమున మధుకరము అని రెండుపదములుగా ఏర్పరచు కొనవచ్చును. మధువనగా జలము, కరమనగా సూర్యకిరణము. కమలమునకు క్రింద జలము, పైన సూర్య కిరణము. ఈ రెండు లేకపోతే ఈ కమలము జీవించలేదు. అదేవిధముగనే భగవంతునియొక్క

నామము మానవుని హృదయమునందు జలము అనే ఆధారము, జ్ఞానము అనే కిరణము రెండు అత్యవసరము. ఈ జలమే భక్తి. ఈ కిరణమే జ్ఞానము. భక్తిజ్ఞానములకు మధ్య మాత్రమే మానవుని హృదయమనే కమలము పోషింపబడుతుంది. ఈ భక్తిజ్ఞానములనేవే భగవన్నామములు. భగవన్నామము మానవుని హృదయ కమలమునకు మధుకిరణములు ఏవిధంగా ఏర్పడినవో, యశోదకు కృష్ణబలరాములుకూడను ఆ విధముగా ఏర్పడుతూ వచ్చారు. ఈ యశోద యెవరు? ఏ అభిమానంచేత వారిని లాలించి పాలించి పోషిస్తున్నది యశోద? వీరి విషయములలో లోతుగా దిగి విచారించినప్పుడే అంతరార్థము బోధపడుతుంది. నిజముగా యోచించిన బలరామకృష్ణులు యశోద బిడ్డలు కారు. వీరెక్కడనుంచి వచ్చారనికూడా ఆమెకు తెలియదు. ఐనప్పటికిని వారిని తన కన్నబిడ్డలవలె ప్రేమించి లాలించి పోషిస్తూ వచ్చింది. బలరామకృష్ణులు మధురయందు జీవించేవారు. వారు ఈ గోకులము రావడానికి కారణమేమిటి? ఆధ్యాత్మిక మార్గములందు వీనిని చక్కగా విచారణ చేసినప్పుడు **గోకులము ఏమిటి? యశోద ఎవరు? మధుర ఏది? ఈ బలరామకృష్ణులకు తల్లి ఎవరు?** వీరు ఎక్కడ ఆవిర్భవించారు? అని విచారణ చేస్తే **భగవన్నామమనే రామనామము నాభిస్థానమునుంచి ప్రారంభమౌతుండాది. ఈ నాభిస్థానమే మధుర. శక్తి స్థానమైన శబ్దమే దేవకీదేవి. ఆమె గర్భమునందు జన్మించినవారే ఈ బలరామకృష్ణులు. గోకులము అనే నోటిలో చేరి యశోద అనే నాలుకపైన ఈ భగవన్నామమనే బలరామకృష్ణులు పోషింపబడుతూ వచ్చారు.** కనుక బలరామకృష్ణులనే భగవన్నామము నాలుకపై నాట్య మాడుతూ వచ్చింది. భగవన్నామమనేది ఏవిధంగానైనను భగవంతుని బంధించవచ్చును. **కామధేనువు** మెడకైనను త్రాడు కట్టి ఒక గూటమునకు కట్టివేసిన ఆ కామధేనువు కదలక మెదలక నిలిచిపోతుంది. ఈ కామధేనువే భగవంతుడు. సమస్త అభీష్టములను అందించేవాడు. కామధేనువువంటి భగవంతుడు, అతని మెడకు ప్రేమఅనే పాశము కట్టి, నాలుకఅనే గూటమునకు తగిలించినపుడు భగవంతుడు అక్కడనే నిలిచిపోతాడు. **కనుకనే భగవంతుని నామము అనేది రూపమును బంధించే ప్రేమపాశము.** ఇట్టి పవిత్రమైన నామతత్త్వాన్ని మనం గుర్తించుకొనలేక నామిని చూడలేక (నామి అనగా రూపము) భౌతికమైన జగత్తునే భ్రమించి, దానినే వరించి, తరించలేకపోతున్నాము. వరించాల్సింది భగవంతుణ్ణి. తరించవల్సింది జీవతత్త్వాన్ని భ్రమించవలసినది ప్రేమతత్త్వాన్ని. ఈ సత్యాన్ని మానవుడు ఈనాడు గుర్తించలేకపోతున్నాడు. దీనినే రామనామ తత్త్వమునందు పవిత్రమైన ఓంకారమునకు పోల్చుకోవచ్చు.

(శ్రీ.స.వి.వా.పు.69/70)

ప్రతిరాత్రి చీకటిగానే ఉంటుంది. చీకటిగా ఉన్నదానినే రాత్రి అని పిలుస్తారు. కాని, రాత్రికి శివరాత్రికి ఉన్న భేదమేమిటి? దివ్యత్వాన్ని గుర్తించుకొన్న వానికి ప్రతీ దినం శివరాత్రే! లోకాన్ని విశ్వసించినవానికి ప్రతీ దినము రాత్రే. ఈ రాత్రి చీకటి, ఆ రాత్రి వెలుగు. ఈ చీకటి వెలుగులందే మానవుడు తికమకమై పోతున్నాడు. అంతులేని ఆశలతో, అర్థం కాని ఆవేదనలతో అప్రాప్య ప్రాప్తికై ప్రాకులాడి **నిరాశా నిస్పృహలకు గురియౌతున్న మానవునికి దిక్కును చూపే చక్కని** దీపికలే - ఆధ్యాత్మిక జ్యోతులు. **అటువంటి దివ్యమైన 'లైట్‌హౌస్' (Light house) ను మనం పెట్టాలి. అదే భగవన్నామము.** నామము చేతనే నామిని పొందవచ్చు; ఎక్కడ ఉన్నా దైవాన్ని పట్టవచ్చు. కనుక, నామము చాలా ప్రధానమైనది.

(స.సా. ఏ.93 పు. 97/98)

(చూ॥ ఆపద్బాంధవు, నగరసంకీర్తన)

భగవానుడు

(చూ॥ సూర్యుడు)

భజగోవిందం

(చూ॥ చింత)

భజన

"రాముడు, కృష్ణుడు దేవి, షిరడీబాబా, అంటూ ఎన్నెన్నో దేవతామూర్తుల నామములను గానం చేసినప్పుడు నేను వారికి భిన్నమని ఎన్నడూ భావించలేదు. **భజన యొక్క లక్ష్యమే నే నైనప్పుడు నేనే సంకీర్తనము చేయుటలో నా కొచ్చే లాభమే మున్నది? పట్టభద్రుడైన ఒక అధ్యాపకుడు కూడా ఒక చిన్న పసిబిడ్డకు విద్యారంభం చేయవలసి వచ్చినప్పుడు అ..ఆ..ఇ..ఈ.. అంటూ అచ్చులతో ప్రారంభించినట్లుగానే మీకు భగవన్నామ సంకీర్తన నేర్పే నిమిత్తమే నేను కూడా సంకీర్తనము చేయ వలసి వస్తున్నది.** ఒక గొప్ప పరుగుపందెపు ఆటగాడు కూడా, తప్పటడుగులు వేసే తన బిడ్డకు నడక నేర్పేందుకు ఒక తోపుడు బండిని తాను పట్టుకుని నడిచి చూపించవలసిన అగత్యం ఏర్పడినట్లు నేను కూడా నామావళిని పాడటం, వాటిని మీరు నేర్చుకుని గానం చేసేందుకే. యింతకన్నా కూడా ఒక మెట్టు మీకోసం, నేను దిగవలసి వచ్చినా అది కూడా మీ శ్రేయస్సుకై చేయటానికి సిద్ధంగా వున్నాను. బురదలో పడ్డ బిడ్డను రక్షించటానికి తల్లి తాను కూడా ఆ బురదలో ఏ విధంగా దిగుతుందో ఆదే విధంగా మీ కొచ్చే ఉపద్రవాలనుండి మిమ్ము రక్షించేందుకు ఒక తల్లిగా నేను కూడా వాటిలో పాలుపంచుకున్నట్లుగా నటిస్తాను. అంతెందుకు దొంగను పట్టేందుకు యుక్తిగా ఒక పోలీసు అధికారి కూడా దొంగవేషమే వేయవలసి వచ్చినట్లు నేను కూడా అప్పుడప్పుడు, మీరు చేసే తప్పు పనులనే నేనూ చేస్తున్నట్లుగా మిమ్మల్ని భ్రమింప చేస్తుంటాను."

(స్వా.పు.306/307)

"తియ్యని తేనెవంటి భగవన్నామామృతమును, సులభంగా, ఆస్వాదించేందుకే, మీకీ నామభజన అందిస్తున్నాను. మంత్రము, జపము, పూజ, యోగము వంటి సాధనలు, మీకు కఠినము, కష్ట సాధ్యము. అందువల్ల సులభ మైన నామ సంకీర్తనమే మీకు తగిన సాధన. భగవంతుని దివ్యనామాన్ని, మీ నాలికపై నిలిపి, మీ ప్రాణశక్తియైన శ్వాసంతో లయమొందించి, ఆనందముగా భజన చేయండి! తాళము వేస్తూ పాడండి. రెండు చేతులు కలిపి చప్పట్లు కొట్టగానే, చెట్టుమీద చేరిన కాకిగుంపు ఒక్కమాటుగా, ఏ విధంగా ఎగిరిపోతుందో, అదేవిధంగా మీరు భజన చేసేటప్పుడు ఆ కరతాళధ్వనికి, మీ మనస్సులలో జనించే పాపపంకిలపుటాలోచనలన్నీ ఒక్క మాటుగా, ఎగిరిపోయి అచ్చట ఆ పరమాత్ముని నామము మాత్రమే నిలిచి, పవిత్రమవుతుంది"

(సా.పు.311/312)

మరుపురాని మధురానుభూతియే భజన. నామి యొక్క సన్నిధికి చేర్చునావ నామము. మీ హృదయములు దయతో కరిగి భక్తి భావముతో పరిశుద్ధమై ప్రేమతో పొంగినపుడు, స్వామికి చాలా ఆనందము కలుగును; ఆనందో ద్రేకముతో పాడండి, అంతే చాలు. అర్థమయ్యే రీతిగా, ఆనందము తొణుకు లాడేటట్టుగా భజన చెయ్యాలి. యాంత్రికముగా **గ్రామ్‌ఫోన్ ప్లేట్లవలె టేప్‌రికార్డుల వలె, భజనలు పాడితే స్వామికే మాత్రము తృప్తి యుండదు.**

భజనలో పాల్గొన్న తరువాత మన స్థితిలో ఏకించిత్తైనా మార్పు కలిగినదా, అని పరీక్షించవలెనని చాలామార్లు శ్రీవారు హెచ్చరించియున్నారు కదా? పూర్వపు మాదిరే ఈర్ష్య అసూయ, కలహ ప్రీతి, పరనిందాసక్తి, ఆత్మస్తుతి మొదలగు దుర్గుణములే మిగిలియున్నవా? నిర్మలమైన ఉదాత్త దృష్టికలుగలేదా? సాటి మానవులలో వెలుగుచున్న దైవత్వమును వీక్షించి ఆనందించుచున్నారా? మాటలు తగ్గి, సేవాసక్తి పెరిగి మునుపటి కన్న మిన్నగా పరులను శత్రుమిత్రులనే భేదభావము లేక ప్రేమించగలిగిన, భజన సాధన ఫలించినటులే.

భజన ఒక దివ్యానుభూతి, దాని ఫలితముగా శాంతి ప్రేమలను పొంది సుఖింతుము. భజనలో కొంతసేపైనమా దైవసాన్నిహిత్యమును అనుభవించ కలిగెదము.

అన్నింటి కన్న భజన కార్యక్రమమే స్వామికి ఆనందము నందించును. అయితే ఉత్సాహముగా ఉల్లాసముగా ప్రతి పదము యొక్క అర్థమునూ, సారమునూ గ్రహించి ఆనందించే భజనయే, ఇతరులకు కూడా ఆనంద మందించును. రాగము, తాళము శ్రుతి, పదభావములు అన్నీ మధురముగా ఉండాలి.

(త.శ.మ.పు.300/301)

మన భజన పాటలు, నామావళుల గానము హృదయ కుహరమునుండి వెలువడినవా? లేదా? అని మన మెట్లు గ్రహించగలము? శ్రద్ధగా విని పాడ ప్రయత్నించు భక్తుని కన్నమనకు వేరు పరీక్షించు మార్గము లేదు. ప్రగాఢమైన భక్తితో మధురకంఠముతో రాగతాళలయబద్ధముగా అందరి హృదయ వాసి అయిన సాయిభగవానుని ఆనందపరచగల భజనలే పాడవలెను. అందరి ఆనందమే సాయికి హాయి.

(త.శ.మ.పు.302)

అంతా భజనలలో పాల్గొనాలి. నోరు దేవుడు యిచ్చిన దెందుకు? పరమాత్మ నామమును నాలుక మీద నాట్యం చేయించేటందులకే! జీవిత మనే ఏడారిలో, మానవుని దాహము తీర్చగలదా ఒక్కనామము మాత్రమే. "సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనమ్" దానిలో ఆసక్తి కలిగిన వారు అందరు చేరే అవకాశము కలిగించాలి. అనుకూలము కలిగిన స్థలమందు, కాలమందు, భజనలను ఆనందముగా చేయండి. మీకు ఆత్మానందము అందిచ్చే ఏ భగవన్నామమైనా సరే, శ్రావ్యముగా, హృదయములోని ఆవేదనతో, ఉత్సాహముతో పాడండి. ప్రణవోచ్చారణముతో (మూడుసార్లు) భజనను మొదలుపెట్టి దానితోనే ముక్తాయ పరచండి. మీరు ఏనామముతో భజన చేసినా నాకే చెందుతుంది. అన్ని నామములు, రూపములు నావేగా.

(సా.పు.4)

ఒక వృక్షం క్రిందచేరి గట్టిగా శబ్దంచేస్తూ చప్పట్లు కొడితే కొమ్మల మీద పక్షులన్నీ దూరంగా పోతాయి. మన జీవితం కూడా ఇటువంటిదే. **జీవిత వృక్షంపై కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే పక్షులు మహా గందరగోళం చేస్తూంటాయి. కనుక మీరు "రామ కృష్ణగోవింద నారాయణ" అని శబ్దం చేస్తూ, లయగా చప్పట్లు కొడితే అవన్నీ ఎగిరిపోయి మీ హృదయక్షేత్రాలు శుభ్రమవుతాయి!"**

(త.పు.36/37)

(చూ॥ ధ్యానము)

భజన గీతాలు

"రండి, పోదాము పండిరికి

గఱుకు ఇటుక ఱాతిపై నిలుచున్న విఠలుని దర్శించటానికి,

మార్గం బహుదూరం, **అయినా లక్ష్యం చివరికి దైవం**

ఎంత త్వరగా నడిస్తే చేరుకుంటాం అంత త్వరగా సన్నిధికి,

పాడుకుంటూ పోతే భజనగీతాలు మార్గం బహుసుగమం, సులభం''

(శ్రీ.స.ప్రే.ప్ర.పు.85)

భద్రము (Watch)

భగవంతుని ప్రేరణతో కలిగిన మానసిక బలము నిన్ను పై అంతస్థులకు తీసికొనిపోవును. దీనినే సంకల్ప బలమందురు. దీనిని జప, ధ్యానములతో అభివృద్ధి చేసికో, బుద్ధి యొక్క అధికారమునకు మనస్సు లోబడునట్లు చూడు. లేని యెడల మనస్సు ఇష్టము వచ్చినట్టు పరుగిడును. మనస్సు చాల చంచలమైనది. అందువలననే నేను **'Watch' (భద్రము) అని చెప్పుచుందును. ఆ శబ్దములోని మొదటి అక్షరము 'W' నీ మాటలు (Words) 'A' ఆచరణలు (Actions), 'T' భావనలు (Thoughts), ('C') నడత లేక శీలము (Character) 'H' హృదయము (Heart) విషయములలో జాగరూకుడవుగా నుండవలెనని అర్థము. ఈ ఐదు విషయములలోను తీసుకోవలసిన జాగ్రత్త గురించి**

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీ సత్యసాయి ప్రబోధామృతము తప్పు ఒప్పుల పట్టీ

పుట	లైను	కాలం	తప్పు	ఒప్పు
2	8	1	మానవుణ్ణి	(మానవుణ్ణి తరువాత చేర్చు) “కాపాడుతూ, పోషిస్తూ వస్తున్నాడు, కనుకనే భగవంతుణ్ణి”
51	8	1	దేవధారియైన	దేహదారియైన
149	19	1	అర్చితము	అర్పితము
487	7	1	ఆధ్యంత	ఆద్యంత
576	13	1	ప్రార్ధించాలి	ప్రార్థించాలి
581	2	2	నంతనించినవారే	సంతసించినవారే
582	10	2	స్వార్ధరహితమైనది	స్వార్థరహితమైనది
583	1	12	స్వార్ధ	స్వార్థ
		12,18,31	పరార్ధ	పరార్థ
	6	2	వర్ధం	వ్యర్థం
	9	2	పదార్ధ	పదార్థ
586	11	2	ప్రేమకుమూడుమెట్లు	ప్రేమకు మూడుమెట్లు
	26		యర్ధము	యర్థము
			పిల్లపిల్ల	పిల్లిపిల్ల
	31		భాద్యత	బాధ్యత
587	1	1	ప్రధమకర్తవ్యము	ప్రథమకర్తవ్యము
	5	1	ప్రదాన	ప్రధాన
588	19	1	సర్ప్శించాను	స్పృశించాను
590	5	2	ఘోర సందేహాకాదు	ఘెరసందోహముకాదు
629	17	2	దృష్టికే	దృష్టిచే
	20	1	ఆవిర్భవించింది	ఆవిర్భవించింది
630	6	2	పరమార్థగాయిని	పరమార్థదాయిని
	17	2	నిస్వార్ధ	నిస్వార్థ
632	12	2	కీర్తినం	కీర్తనం
635	15	1	నిష్మరములైనా	నిష్మారములైనా
	19	1	నిమిత్తమే	నిమిత్తమై
637	9	1	సంబందము	సంబంధము
	28	1	మౌతుంది.	మౌతుంది
	29	1	ఉద్దవుడు	ఉద్ధవుడు

638	3	2	వీటిలో	నీటిలో
	20	2	కంటిగ్సు	కట్టింగ్సు
	23	2	మధించి	మథించి
	25	2	మధించి	మథించి
	26	2	సుథానిధియే	సుధానిధియే
639	11	2	షోడశుపచారము	షోడశోపచారము
640	3	2	పరమార్ద	పరమార్థ
641	2	2	ప్రయత్నించడమే	ప్రయత్నించటమే
	19	2	చింతించము	చింతించటమే
	34	2	(ని.పు.159/160)	ని.వె.పు.159/169)
646	4	2	లక్షణుడు	లక్ష్మణుడు
	10	2	లక్షణమని	లక్ష్యమని
651	11	2	పరము	పదము
	17	2	“దేవుడు”.	“దేవుడు”
	29	2	ఒకట	ఒకటి
652	17	1	ప్రద్యమ్న	ప్రద్యుమ్న
	27		అంతర్భయిశ్చ	అంతర్బహిశ్చ
	16	2	వామనాదులు	వాహనాదులు
653	11	2	స్వార్థకాలిక సత్యం	సార్వకాలిక సత్యం
654	11	2	పదార్ధము	పదార్థము
655	9	2	(భ.మ.పు.86/87)	(భ.స.మ.పు 86/87)
	24	2	తతతిష్టామి	తత్రతిష్టామి
656	25, 26	1	ప్రార్థనలన్నీ	ప్రార్థనలన్నీ
	31	1	నిష్కామకర్మ	‘నిష్కామకర్మ’
657	19	2	కల్పించటం లేదు	కన్పించటం లేదు
658	22	1	ఇక	ఒక
	1	2	ప్రభోదిస్తున్నాయి	ప్రబోధిస్తున్నాయి
660	29	1	అణోరిణియాన్	అణోరణీయాన్
662	26	1	తెనుకోవడమే	తెలుసుకోవడమే
	14	2	అంతర్భహిశ్చ	అంతర్బహిశ్చ
	19	2	బ్రహ్మా	బ్రహ్మ
663	33	2	సూర్యుచంద్రాదులు	సూర్యచంద్రాదులు
664	32	1	నవిర్తంతే	నివర్తంతే
	12	2	గురుర్భహ్మ	గురుర్బహ్మ
	32	2	సూర్యోదయ	సూర్యోదయ

665	31	1	పొత్తుకుదరదే!	పొత్తుకురదరే!"
666	3	1	శుద్ద	శుద్ధ
679	1	2	అని	అసి
	3	2	భగవంతుడు	భగవంతుడు.
754	4	1	దృష్టి	సృష్టి
	29	1	అవరించునల	ఆవరించునటుల
	1	2	పశులగుదురు	వశులగుదురు
755	18	2	తోజోవంత	తేజోవంత
871	10	1	దరించినవాడు	ధరించినవాడు
	2	2	మొహమున	మోమున
	3	2	పంటలు	మంటలు
	20	2	చెదురుచున్న	బెదురుచున్న
1025	20	2	జ్ఞానమునంతం	జ్ఞానమనంతం
	26	2	ఔషధులనుండి	ఓషధులనుండి
1059	6	1	నివారణమవుతుంది	నివారణవుతుంది
1110	5	2	జగద్భంధులైన	జగద్బంధువైన

భద్రాచలం రామదాసు

('Watch') అడుగడుగునా జ్ఞాపకము చేసిన, నీవు చాల ఆనందముగా నుండగలవు.

ఇంద్రియములు నీ మానసిక శక్తులకు, భ్రాంతులకు మూలములు.

(శ్రీ.స.సూ.పు.99/100)

భద్రాచలం రామదాసు

భద్రాచలం రామదాసు చాల పాటలను రచించి వాటిలో ఏవి శ్రీరామునికి నచ్చినవో నిర్ణయించుకొనుటకు, వాటినన్నిటినీ గోదావరిలో పారవేసి, "రామ చంద్రా నీకు సంతృప్తి కలిగించిన పాటలను ఎన్నుకొనుము" అని వేడినాడు. అంతట వాటిలో 108 కీర్తనలు మట్టుకు నీటిపైకి తేలి, మిగిలిన వన్నియూ మునిగిపోయినవి! ఆ 108 మాత్రమే తాను హృదయపూర్వకముగా వ్రాసినవని, మిగిలినవన్నియూ పాండిత్య ప్రకటన, శబ్ద జాలము, మాటల చమత్కృతి, బుద్ధి కుశలత వలన వెలువడినవి అని నిర్ణయించెను. అట్టి కీర్తనలు భగవంతునికి నచ్చవని గ్రహించెను.

(త.శ.మ.పు.302)

భయము/భయమెందుకు

"ఇంద్రియములు తమ తమ స్థానములలోనే వుండిన **యే భయము రాదు; లేదు.** కాని, విషయములతో చేరుటవలన **భయము;** అనగా, ఇంద్రియ విషయ సంయోగమే సుఖ దుఃఖములకు కారణమగుచున్నది. నిన్నెవరైననూ దూషించిన, అది నీవు విన్న, నిన్ను వికారముగా మార్చును. అట్లుకాక, ఈ విషయమునే నీ ఇంద్రియమునకు చేర్చకుండిన అనగా వారి దూషణము మాటలు నీ చెవిన పడకుండినంతకాలము యే వికారము నీలో లేదు. ఇట్టి వికారమునకు విషయేంద్రియ సమ్మేళనమే కారణము కదా!"

"ఇవి కేవలము శీతోష్ణాలవలే నుండును. శీతలము వేడి కాలమున సుఖమును హాయినీ యిచ్చును. అటులనే ఉష్ణము కూడనూ శీతకాలమున సుఖమును హాయినీ అందించును. అటులనే విషయ స్పర్శలు కూడనూ, ప్రపంచమున్నంతవరకూ బైట విషయాలు తప్పవు. **ప్రారబ్ధమున్నంత వరకు సుఖదుఃఖాలు తప్పవు.** అయితే వాటిని భరించుకొను విద్యను, వుపాయమును, నేర్చుకొనవలెను.".

(గీ.పు.28)

"భయమను దయ్యమును పారగద్రోలి నిర్భయముగ నుండరయ్యా
పాపంబన భయముండవలెనయ్యా లోకముతోటి భయము మీ కేలనయ్యా అందరికి భయపడి దేవుని భజన
చేయగలేక భ్రమ చెంది మరణించు సమయమునందున బలిమిమీరగ యముడు రమ్మిక రమ్మనుచు లాగంగ నప్పుడు
అయ్యయ్యో అని యేడ్వంగ నెవ్వరు అడ్డితింపగ వత్తురయ్యా"

(శ్రీ.స.వి.వా.పు.59)

ఎవ్వరికీ మీరు భయపడకూడదు. Be fearless. కొందరు ఇంట్లో ఉన్నప్పుడు విభూతి పెట్టుకుంటారు, బయటికి వెళ్ళినప్పుడు ఎవరైనా చూస్తే ఏమనుకుంటారో అని తుడిచేసుకుంటారు. మరి కొందరు తాము పుట్టపర్తికి వెళుతున్నామంటే ఇతరులు హేళన చేస్తారేమోనని అనంతపురం వెళుతున్నామని చెప్పుకుంటారు. పుట్టపర్తికి వెళుతున్నామని చెప్పుకుంటే వచ్చే నష్టమేమిటి! ఎవరేమైనా అనుకోనీయడి. **మీకెందుకింత భయం?** మీరేమీ తప్పు చేయటం లేదు కదా! లోకంలో అనేకులు ఏమాత్రము భయం లేకుండా కావలసినన్ని తప్పపనులు చేస్తున్నారు. దైవ దర్శనం కోసం వెళుతున్నామని చెప్పుకోవడానికి మీకు భయం ఎందుకు? ఈనాటి మానవునికి సాధనలో భయం, సత్కర్మలలో భయం, అన్నింటికీ భయం, భయం! భయం, భయం, బ్రతుకు భయం!

అన్నా! మనకీలోకం పన్నిన పద్మవ్యూహం
గతి లేని మానవులకు చితికిన సంసారాలకు
కష్టాలే బంధువులా! కన్నీళ్ళే కానుకలా!
భయం, భయం, బ్రతుకు భయం!
భయంతో జీవించేవాడు జీవితంలో దేన్నీ సాధించలేడు.
దైవత్వముతో కూడినప్పుడు ఎందుకు భయపడాలి?
భయంచేత చాలమంది జీవితాలు పాడు చేసుకుంటున్నారు.
మర్చిపోయారు. మీరు ఏనాడూ అనుభవించిన ఆనందాన్ని ఆధ్యాత్మికంలో అనుభవించ గలరు. దైవత్వంతో గడిపే జీవితమే శాశ్వతమైన, ఆనంద మయమైన జీవితము. మీరు కూడా పశువులవలె జ్ఞానాశూన్యులై తింటూ, తిరుగుతూ ఇంద్రియ సుఖాలను అనుభవిస్తుంటే ఇంక, "జంతూనాం నరజన్మ దుర్లభం" అని చెప్పడంలో అర్థమేమిటి? మీరు పశువులు కాదు, మానవులు, మొదటిది రాక్షసత్వం, తరువాత పశుత్వం, తరువాత మానవత్వం, తరువాత దివ్యత్వం. కనుక, మానవుల వలె జీవించండి. తరువాతనే దివ్యత్వాన్ని పొందగలరు. **దేహాన్ని నమ్మవద్దు. లోకాన్ని విశ్వసించవద్దు. దైవాన్ని వదలవద్దు. ఆధ్యాత్మికంలో ఈ మూడింటిని ప్రధానంగా పాటించాలి.**

(స.సా.డి.99.పు.353/354)

ఈనాడు లోకంలో ఎక్కడ చూసినా భయమే. భయం లేని మానవుడు ఎక్కడా కనిపించడం లేదు. అయితే, **భగవంతుని అభయం పొందితే భయానికి చోటేలేదు.** ఈనాడు కారెక్కాలన్నా, ట్రైన్ ఎక్కాలన్నా భయమే! పోనీ ఏదీ వద్దు. నడచుకొని పోదామన్నా అది కూడా భయమే! ఎక్కడికీ వద్దు. ఇంట్లో కూర్చుందామన్నా అదీ భయమే. **దైవానుగ్రహమే అభయత్వాన్ని అందించగలదు. అట్టి అనుగ్రహానికై మనం పాటుపడాలి. దైవానుగ్రహాన్ని పొందాలంటే దైవ విశ్వాసాన్ని పెంచుకోవాలి.**

(స.సా.డి.95పు.287)

(చూ॥ నన్నేపొందుదురు, బ్రహ్మానుభవ ఉపనిషత్తు, భక్తుడు)

భరత

జడ భరతుడు భారతదేశమును పరిపాలించుటచేత ఈ దేశమునకు భారతదేశము అనిపేరు వచ్చినది. శకుంతలా దుష్యంతుల కుమారుడు భరతుడు ఈ దేశమును పరిపాలించుట చేత, ఈ దేశమునకు భరతదేశము అని పేరు వచ్చినది చెప్పవచ్చు. శ్రీరామచంద్రుని సోదరుడైన భరతుడు "రామ పాదుకల" కే పట్టాభిషేకము గావించి, పవిత్రమైన హృదయముతో పాలించుట చేత, 'భరత' అనే నామము ఈ దేశమునకు వచ్చినదని పురాణములు చెప్పవచ్చును. ఐతే ఈ 'భరత' అనే శబ్దము ఏనాడు పుట్టినది? జడభరతునికి పూర్వమే ఈ భరత అనేపేరు ఉండుట చేతనే కదా! ఈ జడ భరతునికి భరత అని పేరును ఉచ్చరించినారు. శకుంతలా దుష్యంతుల కుమారునికి పూర్వము ఈ 'భరత' అనే పేరు ఉండుటచేతనే కదా! వారి కుమారునికే పేరు పెట్టినారు. అదేవిధముగనే భరత అనే పేరు అనాదిగా ఉండునటువంటిది. **సరస్వతి, భగవతి, భారతి అని సరస్వతి కి ఈపేర్లు సార్థకమైనటువంటివి. సరస్వతి అనగా వాగ్దేవతా స్వరూపిణి కనుక వాక్కుచే ఉద్భవించిన ప్రతిమానవుడు భరతుడే. కేవలం ఈ దేశమునకు మాత్రమే, ఈ కాలమునకు మాత్రమే, వ్యక్తికి మాత్రమే సంబంధించిన పేరు సమస్త జాతికి, ఈ 'భరత' అనే పదం అన్వయిస్తుంది.**

'భ' అనగా దివ్య జ్ఞాన స్వరూపమైన తత్వమునకు 'భ' కారము అని అర్థము, స్వస్వరూప జ్ఞానమే 'భ' ఈ 'భ' అనేదానిని రమించినవాడు భరతుడు. స్వప్రకాశమైన జ్ఞానమును ప్రకటించేవాడు భరతుడు. **"సంగ్రమం తనోతీతి భరతః" అని దీనికి ఉత్పత్తి స్థానము. అనగా సంగ్రామము నందు కుశలుడైనవాడు భారతీయుడని అర్థము, సంగ్రామమనగా ఏమిటి? అసుర ప్రకృతి యొక్క శక్తిని ఆత్మశక్తి తో ఎదుర్కొనుట,** కనుక ప్రతిమానవుడు తన యందున్న అసుర ప్రకృతి శక్తిని దివ్యమైన, భవ్యమైన ఆత్మశక్తితో ఎదుర్కొనేవాడు భారతీయుడు. బలం, భరం, భవతి, బిభర్తేః అని నిరుక్త పదములు. **బలం అనగా**

భరతభూమి

బ్రహ్మబలం, తేజోబలం, క్షేత్రబలం, ఈ మమ్మూర్తులతో కూడినవాడు భరతుడు, బలం అనగా శ్రుతి యందుదీనిని యజ్ఞమని ఒక అర్థము. "యజ్ఞం ఆత్మబలం వా తనూతీతి భారతీ" అనగా యజ్ఞముచేత ఆత్మబలమును పొందేవాడు భారతీయుడు. ఆత్మబలం అనగా దైవ బలమును పొందే వాడు భారతీయుడు. కనుక ఏదేశము వాడైనా ఏ కాలమువాడైనా ఏ వ్యక్తియైనా వీటిని పొందుటకు అధికారికాగలడు.

(స.సా.డి.1990 పు.309/310)

భరతభూమి

ఖండ ఖండాంత ఖ్యాతి నార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించుయు
స్వాతంత్ర్యమును గన్న సమరభూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరతభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి చూపిన దివ్యభూమి
చిత్రకళల తోడ విచిత్రమైయున్నట్టి
భరత భూమి యందు జననమొంది
భరతమాత దివ్య భాగ్యంబు కాపాడ
బాధ్యతంతము మీదె బాలబాలికలార!

(స.సా.డి.96పు.321)

భరతమాత

విద్యార్థులారా! మీరు పుట్టినది భారతదేశంలో మీరు పీల్చుకునే గాలి భరతమాతగాలి. మీరు త్రాగే నీరు భరతమాత నీరు. మీరు అనుభవించే సంపత్తి అంతా భరతమాత సంపత్తి. కనుక భరతమాత పవిత్ర సంస్కృతి మీరు గుర్తించి వర్తించడానికి ప్రయత్నించండి. అప్పుడే మీ జీవితం సార్థక మవుతుంది. లేకుంటే
ఎన్ని చదువులు చదివి ఏమీ ఫలము?
తన్నొసట వ్రాత తప్పించ నెవరి తరము?
చెడ్డ బుద్ధులు తన తలచేరెనేని
ఎండ బారును బుద్ధులు బెండుబారు

(స.సా.డి.96పు.322)

భరతుడు

(చూ॥ ప్రాయశ్చితం)

భర్త

భర్త దుర్మార్గుడై కీడు బడయువేళ
మంత్రి యట్టుల మేల్ కీడు మనవి జేసి
పతికి హితము గఱుపగా పడతులెపుడు
నడువవలెను మండోదరి యట్లు భువిని

(స.సా.జూలై 2001 పు. 204)

(చూ॥ తల్లులు, భగవంతుడు, భార్య, స్త్రీతత్వము)

భవసాగరము

(చూ॥పెట్రోమాక్స్‌లైట్)

భవానీశంకర

ఈ ప్రపంచమునకు "భవానీ శంకర" అనే గొప్ప పేరున్నది. 'భవాని' అనగా శ్రద్ధ అని, 'శంకర' అనగా విశ్వాసమని అర్థము. భవానీ శంకరుల సమ్మిళిత స్వరూపమే ఈ జగత్తు. కనుక, ఈ జగత్తే అర్ధనారీశ్వర స్వరూపము. దీనిని పురస్కరించుకొనియే శ్రీమతి, అనగా భవాని, శ్రీ అనగా శంకరుడు. ఈ రెండింటి ఏకత్వమే మానవత్వం. ఎవరు ఏ నామమును, ఏ రూపమున స్మరించినా భవానీ శంకరుల తత్త్వమునే అనుసరించాలి. శ్రద్ధ, విశ్వాసములు లేక మానవుడు దేనినీ సాధించలేడు. **"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం"**, శ్రద్ధ

వల్లనే జ్ఞానం లభిస్తుంది. మానవుడు ఎన్ని సాధనలు చేసినప్పటికీ భవానీ శంకరుల అనుగ్రహం లేక ఏదీ ఫలించదు. భవానీ శంకరుల స్వరూపమే ఈ ప్రపంచము. మీరు **"లోకాస్సమస్తా స్సుఖినో భవంతు"** అని ప్రార్థిస్తున్నారు. లోకమంతా సుఖంగా ఉండాలంటే శ్రద్ధ, విశ్వాసములు భద్రంగా ఉండాలి. శ్రద్ధ, విశ్వాసములుంటే మీరు సాధించలేనిది ఈ లోకంలో ఏదీ లేదు; క్షణంలో మోక్షాన్ని పొందవచ్చును. ఆనందాన్ని అనుభవించ వచ్చును. దీనికి ఏమాత్రము శ్రమ పడనక్కర్లేదు. ఇట్టి శ్రమ లేని మార్గాన్ని వదలి మీరు అనేక శ్రమలకు ఓర్చుకొని ఎన్నో సాధనలు చేస్తున్నారు. **దైవాన్ని ప్రేమించండి. నిత్యసత్యమైన దైవప్రేమను సాధించండి. అదియే మీరు చేయవలసిన సాధన.**

(స.సా.డి.99పు.360)

భస్మాసురుడు

(చూ॥ దుర్గుణములు)

భాగవతతత్త్వము

(చూ॥ పరీక్షిత్ ప్రార్థన)

భాగవతము

పరమ భక్తుడైన పోతన భాగవతమును ప్రారంభిస్తూ

"పలికెడిది భాగవతమట
పలికించెడు వాడు రామభద్రుండటనే
పలికిన భవహర మగునట
పలికెడ వేరొండు గాథ పలుకగనేలా॥ అన్నాడు.

పలికించేవాడు భగవంతుడే పలికేవాడు భగవంతుడే. వ్రాసేవాడు భగవంతుడే, వ్రాయించేవాడు భగవంతుడే. నన్ను నిమిత్తమాత్రముగా తీసుకొని ఈవిధంగా వ్రాయిస్తున్నాడని పోతనామాత్యుడు ప్రారంభములోనే భగవంతునికి అర్పితము చేసి, తనకావ్యాన్ని ప్రారంభించాడు. ఇక్కడ తత్ త్వమ్ అసి అనే దివ్యత్వము ఇమడి ఉంటూండాది. "పలికెడిది భాగవతమట, పలికించెడి వాడు భగవంతుడు. నే పలికిన ఇతనే జీవాత్మ, వాడు పరమాత్ముడు. నేను జీవాత్ముడు, కనుకనే తత్వమ్ అసి ఈ రెండింటి ఏకత్వమే భాగవతము. భాగవతము నందే మానవత్వానికి సరియైన మార్గములను ఇముడ్చుకుంటూ వచ్చాడు. మొట్టమొదట భక్తి ఆధారము. భక్తి క్రమక్రమేణ పెరుగుతూ జ్ఞాన స్వరూపాన్ని పొందుతుంది. జ్ఞానము ముదిరి వైరాగ్యము ప్రాప్తిస్తుంది. ఈవైరాగ్యమునందే తత్వం అర్థం చేసుకోగలుగుతాము. ఈ తత్వజ్ఞానాన్ని గుర్తించిన వ్యక్తియే ముక్తిని పొందగలడు. **భాగవతమనే పదమునందే ఈ ఐదింటి రహస్యము ఇమిడి ఉంటున్నది. భా-గ-వ-త-ము. ఇవి ఐదక్షరాలు. ఇవే పంచభూతములు పంచేంద్రియములు పంచ కోశములు, పంచప్రాణములు. భా, ఇదేభక్తి - గ - ఇదే జ్ఞానము. వ-ఇదే వైరాగ్యము, త-ఇదే తత్వము ము-ఇదే ముక్తి. ఇదే భాగవతము. భక్తి జ్ఞాన వైరాగ్య తత్వముల సమ్మిళిత సంబంధమే ముక్తి. కనుక ప్రతిమానవునకు భక్తి ఆత్యవసరము. ఇదే పునాది.**

(బృ.త్ర.పు.123/124)

భాగవతము గోపికల అనన్య భక్తిని గురించి చాల గొప్పగా వర్ణించింది. భాగవతము చాల పవిత్రమైనది. అందులో సకల వేదాంత సారము ఇమిడియున్నది. **"భాగవతం చదివితే బాగవుతాం అని చెప్పవచ్చు. భాగవతము అనే పదములో భా - భక్తిని, గ - జ్ఞానమును, వ - వైరాగ్యమును, త -తత్వమును, ము - ముక్తిని సూచిస్తున్నాయి. కనుక, భాగవతమనగా భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్వములను అందజేసి ముక్తిని ప్రసాదించేది అని అర్థం.** భాగవతములో గోపికల ప్రేమతత్వమును మొట్టమొదట గుర్తించాలి. గోపాలుడు గోకులం వదలి మధురకు వెళ్ళిపోయిన తరువాత గోకుల వాసులైన గోపికలు, గోపాలురు కృష్ణ వియోగంతో పరితపిస్తున్నారు. గోకులమంతా ఎండబారినట్లు కళావిహీనంగా కనిపిస్తున్నది. వారికి తిండికి ఏమాత్రము

లోటు లేదు. కాని, భుజించడం లేదు. అన్ని సుఖములూ ఉన్నాయి. కాని, అనుభవించడం లేదు. కారణమేమిటి? **ప్రాణసమానమైన కృష్ణుడు తమ వెంట లేనప్పుడు తాము జీవించడం వ్యర్థమని భావించారు.** నిద్రాహారములను త్యజించడంచేత వారి దేహములు కృశిస్తున్నాయి. కృష్ణ వియోగంచేత వారి మనస్సులు ఆందోళన చెందు తున్నాయి. ఈ సత్యాన్ని గుర్తించిన మధురలో ఉన్న గోపాలుడు తన మిత్రుడైన ఉద్ధవుణ్ణి పిలిచి "ఉద్ధవా! గోపికలు నా నిమిత్తమై చాల పరితపిస్తున్నారు. నీవు వెళ్ళి వారికి తగిన ప్రబోధలు సల్పి, వారి మనస్సులను శాంత పరచి రా" అన్నాడు. ఉద్ధవుడు సహజంగా గొప్ప వేదాంతి, గొప్ప జ్ఞాని. కృష్ణుడు సర్వజ్ఞుడు, సర్వ వ్యాపకుడు అని అతనికి తెలుసు. అతడు గోకులం వెళ్ళి **"గోపికలారా! గోపాలులారా! కృష్ణుడు సర్వాంతర్యామి;** ఇందుగలడందు లేడని సందేహము వలదు. అతడు సర్వ వ్యాపకుడు; కేవలం మధురలో మాత్రమే కాదు, సర్వత్ర ఉన్నాడు. కాబట్టి, అతడు మీకు దూరంగా ఉన్నాడని చింతించకండి, మీ వెంటనే ఉన్నాడని విశ్వసించండి" అని బోధించాడు.

(స.సా.జ.2000పు.10)

భాగవతము ఈ భారత రామాయణములవలె గుణ రూపములతో ఉండదు. ఈ గుణ, ఇంద్రియ, మనసు, చిత్తము లన్నింటికీ అతీతమైన ఆత్మయొక్క రూపములు, శక్తి సామర్థ్యములు. వాటి యొక్క లీలల భాగవతము. అన్నింటికి సాక్షిగా ఉన్నవారని అవతార కథలనే భాగవతమంటారు. అతను సర్వ స్వరూపి. అతని రూపములకు హద్దు లేదు. కాని, ప్రకృతికి గోచరమగునట్లు చెప్పవలెనన్న బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, మత్స్య, కూర్మవరాహ, వామన, నరసింహ, రామకృష్ణ అవతారములు. లోక సృష్టి, స్థితి, లయముల కొరకు, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కొరకు ఆయా కాలములందు తాను ఏఏ రూపమున పోయిన, తన సంకల్పిత కార్యములు జయప్రదమగునో తలంచుకొని, ఆయా రూపమున తనను తాను సృష్టించుకొనును. ఆ కార్యము పూర్తికాగానే తిరిగి ఆత్మ స్వరూపుడుగనే యుండును.

గుణములకు ఆది, అంతము ఉన్నది. ఆత్మకు ఆది, అంతము లేదు. రామకృష్ణాదులు కూడా గుణ స్వరూపములుగా లేరే? గుణములకు అతీతులుగా ఉండి గుణ స్వరూపములను ఎట్లు వశపరచుకొనవలెనని చూపించినారు. రామాయణ, భారతములకు ముగింపు ఉన్నది. కాని ఆ విధముగా భాగవతమునకు ముగింపేలేదు. అది భగవంతుడు ఆద్యంత రహితుడు కదా! ఏ యుగమున ఏ కార్యము నిమిత్తమై ఏఏ కాలములో వచ్చుచుండునో అట్టి అవతార రహస్యమును మాత్రము తెలుపునది భాగవతము. అనిత్యమై, ఆసత్యమై అది అంత్యమును కలిగిన లోకనీతులను బోధించి, సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను చూపించి, చేయుంచుటకై వచ్చినవి రామాయణ భాగవతములు.

భాగవతమే సాధకులకు అవసరము. అందులోనే భగవంతుని నిజమర్మములూ, నిజ మహత్మ్యములూ, నిజ మార్గములూ ఉన్నవి. రామాయణ, భారతములు కొంతవరకూ లౌకికమైన సహజ మానవులను ఉద్ధారము చేయుటకు నీతుల బోధించినవి. పరమాత్ముని అనుగ్రహమునకు ఎట్లు పాత్రులగుట చూపినది. **ఆత్మార్థమును తెలిసికొన కోరువారు, పరమాత్ముని తెలుసుకొన కోరువారు భాగవతమునే ప్రధానముగా పాటింతురు.**

భాగవతము ఆది అంత్యములు లేని ఆత్మ కథ. అది సూక్ష్మమునను, స్థూలమునను రెండింటియందూ ఒక్కటే. అది సూక్ష్మమున అతి సూక్ష్మము, స్థూలమున అతి స్థూలము. దానికి ప్రమాణమేలేదు. అది అంత్యమే లేదు. భాగవతము సూక్ష్మ రూపమున వేరు, స్థూల రూపమున వేరులేదు. రామాయణ, భారతములు, ఇతిహాసములు. భాగవతము అట్లుకాదు. కేవలము భక్తిమార్గమును తెలుపుతూ ఆత్మస్వరూపమై యుండును. ఏనాటికైనా భాగవతమునకు అంత్యము లేదు, రాదు. ఈ యదార్థమే భాగవతము యొక్క అర్థము.

(శ్రీ.స.సూ.పు.258/260)

పరీక్షిత్తు రాజు మోకరిల్లి, "ప్రభూ! **మరణాసన్నమై,**

చావబోవుచున్నానని తెలిసికొన్నవాడు చేయవలసిన కార్యమేమి? చింతించవలసిన చింతన యేమి? మరణమునకు తరువాత జననము రాకుండా వుండుటకు ఆ సమయమున యెట్టి పద్ధతులను అవలంబించివలెనో శెలవివ్వవలెను. ఇవి నన్ను ప్రస్తుతము వేధించుచున్న బాధలు. ఇప్పుడు పరమ పురుషార్థమేదియో కృపతో తెలుపమని పదేపదే ప్రార్థించుచుండ, శుక మహర్షి, **"రాజా! నీవు ప్రాపంచిక విషయములనుండి చిత్తమును** తొలగించి మనస్సును జగన్మోహనుడైన శ్రీహరి యందు నిలుపుము. **నేను భాగవతత్త్వమును** చెప్పెదను; హృదయ పూర్వకముగ శ్రవణము చేయుము. ఇంతకంటే పవిత్రకర్మ, ఇంతకంటే పవిత్ర చింతన, ఇంతకంటే గొప్ప తపశ్శక్తి వేరొండులేదు. నర తనువే దృఢమైన నావ, **శ్రీహరి కథనే చక్కని చుక్కాని, సంసారమే భగసాగరము, నారాయణుడే సరియైన నావకుడు. ఈనాడు ఈ పవిత్ర సామగ్రి నీకు సంప్రాప్తమయి నీ సమీపమునకే వచ్చినవి.** నీవడిగిన ప్రశ్న లోకహితార్థమైనదే గానీ, వక వ్యక్తితో మాత్రమే చేరినది కాదు. విచారణ చేయవలసిన ప్రశ్నలన్నిటిలోనూ సర్వ శ్రేష్ఠమైనది ఆత్మతత్త్వము. సమస్త ప్రాణికోటికి, అంత్యకాలము పరమ సత్యము. అది తప్పునది కాదు. అట్టి దృఢమైన సమయమున యెట్టి పురుషార్థము చేపట్టవలెనో అది ప్రతి ప్రాణికి కూడనూ ప్రధానమైన చుట్టము. దాని ననుసరించియే పునర్జన్మము కలుగుచుండును. **కాన నీవడిగిన ప్రశ్న, నీకు కలిగిన సంశయము, లోకల్యాణ కార్యమే కానీ, నీ నిమిత్తము మాత్రమే కాదు! వినుము"**

"మహారాజా! **భాగవతము మహాపృక్షము. అది భవ్యమైనది. సమస్త శుభములు, సుఖములూ దానిలో ఇమిడియున్నవి. ఈ పవిత్ర వృక్షమునకు శ్రీమన్నారాయణుడే బీజము; బ్రహ్మనే అంకురము. నారదుడు బోదె, వ్యాసుడు శాఖ; అందులోని మధురఫలమే కృష్ణ కథామృతము. ఈ అమృతమునకై అఱ్ఱులుచాచి, కాయ బాధలను లక్ష్యము చేయక కాలమును లెక్కచేయక కాచుకొని భుజించువారే పవిత్ర ముసులు, యోగులు,** ఓ ముసులారా! ఈనాడు నేనా కమనీయ కృష్ణకథను, భాతవతశాస్త్రమును మీ అందరి ముందూ వినుపింతును, వచింతును. స్మరించి తరింతును. మీరు సమస్త శాస్త్రములూ శ్రవణము చేసియుందురు. మీరు సర్వ సాధన సంపన్నులు అన్నింటి కంటెనూ శ్రేష్ఠమయినదేదియో మీకు తెలియనిది కాదు. యే వస్తువు అధిక రుచికరముగ తోచుచున్నదో, దేనిని వినినంతనే హృదయము హర్షము చెందుచున్నదో, దేనిని స్మరించి నంతనే మనసులోని ప్రేమతరంగములు పైకి లేచుచున్నవో, **అట్టి పవిత్ర కృష్ణనామమును, దాని మాధుర్యమును మీకందింతును; ఆ పవిత్ర కృష్ణభక్తికి సహాయమైనది భాగవతము.**

"అజుడు, అవ్యక్తుడు, అనంతుడునైన, పరమాత్మ, సగుణ సాకారమును ధరించి అనేక అవతారములెత్తి, అంతులేని లీలలను విస్తరింప జేసెను. అతని నామ రూప, గుణ ధామములు జగత్తు లోని జీవితములను తరింపజేసెను. ఇట్టి దానిని యెవడు గానము చేయుచున్నాడో, శ్రవణము చేయుచున్నాడో, సేవించుచున్నాడో అట్టి వానినే భక్తుడని పిలువబడును, వాడే భాగవతుడు.

అనగా భక్తునకు భగవంతునితో సంబంధము కలదే భాగవతము. అవతార కథలలో కేవలము భక్త భగవంతుల సంబంధమే యుండును, భగవదవతారములు దుష్ట సంహారము కొరకే కాదు. అది వక నిమిత్త మాత్రమే. నిజమునకు భగవతవతారము భక్తులకొరకే. గోవు తన పాలను తన దూడకొరకే ఇచ్చును. వాటిని ప్రజలు యెట్లు ఉపయోగించుకొందురో, అట్లే భగవంతుడు భక్తునకొరకవతరించిన, ఆ భక్తులు కూడనూ దానిని వేరు మార్గమున అందుకొని ఉపయోగించుకొందురు. భక్తునకునూ, భగవంతునకూ మధ్య యెందరివో దుష్ట వ్యక్తుల చరిత్రలూ చేరుచుండును. అంతమాత్రము చేతనే భాగవతము పవిత్రము కాకపోదు. తీయని రసముతో చేరిన చెరకు, రసమును తీసిన తదుపరి పిప్పిని పారవేసినటుల భక్త భగవంతుని సంబంధమైన

మధుర సారమును తీసిన తదుపరి, దుష్ట వ్యక్తులను పిప్పిని దూరము చేయవచ్చును. పిప్పిలేక రసము చిక్కదు కదా, అటులనే అభక్తులు లేక భక్తులగుటకు వీలుండదు. **"భగవంతుడు దేశకాల బంధములనుండి విముక్తి జెందిన వాడు.** అతనికి జీవులందరూ సమానమే. అతను చరాచరములకు స్వామి. బ్రహ్మరూపమును ధరించి ప్రళయములందు లీనమైన ప్రజలను సృజించును. **అతనే విష్ణురూపమును ధరించి సర్వులయందూ తన శక్తిని ప్రసాదించి నానావతారములు ధరించి, ఈ చరాచర ప్రపంచమును పాలించును.** చివర కాతడే సాక్షాత్ శివరూపమును దరించి, సమస్తమునూ సంహారము చేయును. అతని శక్తికి అంత్యము లేదు, హద్దులు రావు. **అతని పురుషార్థమునకు పరిధి వుండదు. అవతారములా లెక్క లేదు. సర్వ కళావతారుడు అతడే, అంశావతారుడూ అతడే, అవేశావతారుడూ అతడే, యుగావతారుడూ అతడే; అట్టి అవతారముల కథాశ్రవణములే భాగవతము.**

(భా.వా.పు.157/160)

భాగవతము, శ్రవణ, మనన, నిధి, ధ్యాసలద్వారా అనుభవించినవారు బాగవుట తధ్యము-పవిత్ర భక్తిని పెంపొందించునదే ఈ భాగవతము.

(భా.వా.ఫోటోక్రిందవ్రాసినది)

భాగవతమంటే ఏమిటని మనం విచారించాలి. భాగవతమును చక్కగా మనం విచారించినప్పుడు మనం బాగవుతాం. భాగవతమునందే ఉంటున్నాయి. అన్ని సాధనా ఫలితములు. భా-గ-వ-త-ము. ఐదు అక్షరములతో కూడి ఉంటున్నది. భ-భక్తి. గ-జ్ఞానము, వ-వైరాగ్యము, త-తత్వము, ము-ముక్తి. ఈ ఐదు దీనిలోనే ఉంటున్నాయి. భాగవతము సర్వశాస్త్రసారము. సర్వమార్గముల గమ్యము. సర్వఫలముల సారము. ఇది భాగవతము.

(భ.మ.పు.33)

'భగవతరి ఇదం భాగవతం' అని కొందరు పండితులు బోధించారు. అనగా భగవంతుని గురించి చెప్పు కథలకే భాగవతమని పేరు. మరికొందరు **భాగవతానాం ఇదం భాగవతమ్'** అన్నారు. అనగా భక్తులను గురించి ప్రబోధించినదే భాగవతము అన్నారు. వారి వారి భావశుద్ధులను పురస్కరించుకొని వారి వారి సందేశాలను ఆ విధముగా అందిస్తూ వచ్చారు. భక్తునకుభగవంతునకు మధ్యనున్న సన్నిహిత సంబంధ బాంధవ్యములను గురించి బోధించునదే భాగవతము. **భక్తునకు భగవంతునకు మధ్యనున్న సేతువే ఈ భాగవతము.**

(భ.మ.పు.35)

మీకు ఎంత అవసరమో అంత ఆశించవచ్చు. ఆ అధికారము, స్వాతంత్ర్యము మీకు ఉంటున్నది. కానీ మితిమీరిన రీతిలో పోకూడదు. అహంకారము త్రుంచుకొని, అభిమానము త్రుంచుకొని దివ్యభావములను మీరు అభివృద్ధి గావించుకోండి. ఇదే నిజమైన వేదాంతబోధ. **భాగవతము యొక్క బోధ.** ఈ భాగవతములో కథలు వస్తుంటాయి. ఆ కథలు కొంతవరకు మీకు విసుగుగా ఉండవచ్చును. కాదు. కాదు. **అది History అన్నీ భగవంతుని చరిత్రలు.** ప్రతి విషయము భగవంతుని చరిత్రయే. భాగవతము అర్థముకాకుండా పోవటముచేత దానిని ఉల్లఘింస్తున్నాముగానీ ప్రతి పదము ముత్యము వంటిది. రత్నము వంటిది. ఆ విధమైన ప్రబోధలు సలిపే నిమిత్తము భాగవతము వచ్చింది. **లేకపోతే పద్దెనిమిది పురాణములు వ్రాసి నిరాశ నిస్పృహలతో సరస్వతీ తీరమునందున్న వ్యాసులవారిని చూచి నారదుడు ఈ భాగవతమును** వ్రాయమని ఎందుకు చెప్పాలి? కావలసినన్ని వ్రాశావు. **శ్లోకదాత అని పేరుపొందావు. శ్లోకదాతయేగాని శోకాన్ని నివారణ చేసుకోలేదు.** కౌరవులలోని దుర్గుణములు ప్రవేశించి వారి చరిత్ర వ్రాస్తూవచ్చావు. తరువాత నీ మనస్సు మాలిన్యమై పోయింది. ఆ మాలిన్యము నీవు పరిశుద్ధము గావించుకోవాలంటే **భగవంతుని లీలాగుణగణ విశేషములను వ్రాయమని చెప్పాడు. భాగవతమే సరైన ప్రమాణము. భాగవతమునకు మించిన మరొక చరిత్ర**

లేదున్నారు. కారణం ఏమిటి? తెలిసి చదవాలి. అలాంటి చరిత్ర. భగవత్ తత్వము సంపూర్ణముగా విచారించి వెల్లడి చేసినది భాగవతము.

(భ.మ.పు.118/119)

భాగవతమందు భ్రమర సందేశాన్ని ప్రధానమైన ప్రాణంగా తీసుకున్నారు పండితులు. అసలు భాగవతమంటే ఏమిటి? **భాగవతమంటే భక్తునికి భగవంతునికి మధ్య జరిగిన చరిత్రనే అని భావిస్తారు. భక్తుడు. భక్తి, భగవంతుడు ఈ మూడింటి సమ్మిళిత స్వరూపమే భాగవత మని కూడా కొందరు వ్యాఖ్యానిస్తారు.** వాస్తవానికి ముక్తి అనేది భాగవతము అనే ఐదక్షరములలోనే లభిస్తుంది. **భ భక్తి, గ జ్ఞానము, వ వైరాగ్యము, త తత్వము ఈ నాల్గింటి సమ్మేళనమే ముక్తి. భక్తి, జ్ఞానము.** వైరాగ్యము. తత్వవిచారణ ముక్తికి మార్గములని నిరూపించింది. భాగవతము. ఇవి ప్రతిమానవునిలో నిండి నిబిడీకృతమై యున్నవి. కాని వాటిని సరియైన మార్గంలో అనుభవించడం లేదు. అనుభవించిన వాడే భాగవత ప్రియుడు. భగవంతునిపై ప్రేమే భక్తి. నిత్యా నిత్య పరిశీలనా తత్వమే జ్ఞానము. మనలో ఉన్న దుర్గుణాలను పరిత్యజించడమే వైరాగ్యము. తానెవరు? నేనెవరు? ఈ రెండింటిని తెలుసు కోవడమే తత్వ విచారణ.

(స.సా.అ.83పు.235)

(చూ॥ కృష్ణతత్త్వము, కృష్ణునిలీలలు, గోపికలు, మూలాధారము)

భాగవతుని లక్షణములు

బాల్యకాలమున చంటిపిల్లలకు పాలరుచి తెలియ కుండిననూ, **నిరంతర అభ్యాసముచే** యెప్పుడైననూ పాలను వదలి అన్నము నందించిన, దానిని ఆరగించరు; పాలను విడువరు. అయితే తల్లి వారికి మెల్ల మెల్లగ అన్నమును కలిపి కొంతకొంత సేవనము చేయు చుండును. నిత్య సేవనముచే అన్నమునందలి రుచిమరిగి పాలను వదలుదురు. పాలే యెంత సహజమని భావించి ఆరగించిరో వారికి నేడు **అభ్యాసముల ద్వారా** అన్నము అంత సహజముగా మారెను; **అన్నమునే సహజముగా ఆరగించుటకు మరిగిన మానవుడు ఒక దినము అన్నములేక నిలువజాలడు.**

అటులనే, ప్రప్రథమమున, విషయభోగము సహజ మయిననూ అభ్యాసముద్వారా, శిక్షణచే జిజ్ఞాసువులు కథాకీర్తనమునే అనురక్తిగా భావించి మెల్ల మెల్లగ దానియందు రుచిని బలపరుచుకొనిన, కొంత కాలమునకు భగవత్కథా శ్రవణమె కీర్తనమె తనకు ఆహారముగా కలిగి, ఒక నిమిషమైననూ దానిని వదలని వాడై అందులోనే రసమును ఆస్వాదనచేయుచూ ఆనందములో కాలమును గడుపును. అట్టివారలు, సామాన్యులు నలుగురు చేరిన స్థానమున చేరక, విషయ సంబంధమైన సంభాషణలలో నిలువక, భగవత్ కీర్తనలు కథలు జరుగు స్థలములకు పోయి ఆనందముగా కాలమును గడుపుదురు.

సజ్జనులనుటకు ఇట్టి ప్రవర్తనలే సరియైన గుర్తులు. అట్లుకాక, మేము సాధకులమని చెప్పుకొనుచు, భగవత్ భక్తులమని బాహ్యాండంబరములు చేయుచు యెక్కడ వెళ్ళిననూ విషయసంబంధమైన, ఆటలు మాటలు ఆడిన అది సాధకత్వమునకు స్థానము కాదు. **భగవత్ సంబంధమైన విషయములు జరుగు స్థానమునందే కాలమును గడుపవలెను. కానీ, వాటికి విరుద్ధమయిన ప్రదేశములందు యెట్టి విచిత్రములు జరిగిననూ తాను చేరరాదు; చూడరాదు; వినరాదు; అట్టివే భాగవతుని లక్షణములు.**

(భా.వా.పు.4/5)

భాగవతులు

(చూ॥ జిజ్ఞాస, ముగ్గురు రాజులు)

భాతి

(చూ॥ జన్మాద్యస్యయతః)

భారత

"భారత" అంటే భగవానుని యెడల రతిగల దేశము అని అర్థము. భగవంతుడు మీ మధ్యకు వచ్చుటకు అదే కారణము. దీనిని యింకొక విధముగా చెప్పవచ్చు. భారతదేశములో ఒక్క కోలారు గనులయందు మాత్రమే బంగారము ఎందుకు వుండాలి? అది ఆ ప్రదేశము యొక్క అదృష్టము. గనులున్న చోటనే ఇంజనీర్లు, కెమిస్టులు ఉంటారు. వారు బంగారమును వెలికిదీసి శుభ్రపరచి అవసరమైన చోటికి బంగారమును అందిస్తారు. అదేవిధంగా ఆధ్యాత్మిక ధనము - వేదములు, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు, గీత అనే గనులలో నిక్షిప్తమైవుంది. 'అది మాకు కావాలి' అని కోరేవారికి, వాటిని స్వచ్ఛమైన రూపములో అమూల్యమైన వానిగా అందించుటకు ఋషులను, మునులను భగవంతుడు పంపుతాడు. అవసరమైనపుడు తానే అవతరించి ఆధ్యాత్మిక ధనమును స్వచ్ఛమైన రూపములో అందిస్తాడు.

(యు.సా.)

భారతదేశము

ఖండ ఖండాంతర ఖ్యాతినార్జించిన
మహానీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమర భూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరతభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి చూపిన దివ్య భూమి
చిత్రకళల తోడచిత్రమైయున్నట్టి
భరత భూమి యందు జనన మొంది
భరతమాత ధర్మ భాగ్యంబు కాపాడ
బాధ్యతంతయు మీదె భక్తులారా!

భారతదేశము యొక్క పవిత్రమైన ఖ్యాతిని కాపాడ వలసిన భారతీయులే ఈనాడు సత్య ధర్మములను చేతులారా కోల్పోతున్నారు. ప్రాచీన ఋషులు, మునులు కూడబెట్టిన ఆధ్యాత్మిక సంపత్తికి వారసులైన భారతీయులే అసత్యమును, అధర్మమును పోషిస్తున్నారు. నేడు మానవతా విలువలను పోషించుకోవలసిన బాధ్యత భారతీయులపై ఏంతేని ఉన్నది. యుగ యుగముల నుండి భారతీయుల సాధించి నటువంటి సిరిసంపదలు మానవతా విలువలే. ఇట్టి పవిత్రమైన భారతదేశములో జన్మించి కూడను భారతదేశము యొక్క విశిష్టతను, భారతీయ సంస్కృతిని మీరు అర్థం చేసుకోలేకపోతున్నారు. మానవతా విలువలు గ్రంథపఠనంవల్ల అలవడేవి కావు. గురువులు అందించేవి కావు. ఇవి మీ హృదయము నుండి ఆవిర్భవించేవే. హృదయమునందు పవిత్రమైన ప్రేమను నింపుకున్నప్పుడు మీ నోటి నుండి వచ్చే ప్రతి పలుకు సత్యంగానే ఉంటుంది; మీరు చేసే ప్రతి కర్మ ధర్మమయంగానే ఉంటుంది. మీ జీవితమే ప్రేమమయమైనదిగా ప్రకాశిస్తుంది. కనుక, మీ హృదయాన్ని ప్రేమచేత నింపుకొని జీవితాన్నే ప్రేమమయంగా మార్చుకోవాలి. దీనికంటే మించిన సాధన మరొకటి లేదు.

(స.సా.అ.99పు.261/262)

మీతల్లి కురూపియని ఆమెను త్యజించి అందంగా ఉన్న పరాయి స్త్రీని తల్లియని పిలవడం ఎలాంటిదో ధన వ్యామోహంతో మాతృదేశాన్ని విస్మరించి విదేశాలకు వెళ్ళడం అలాంటిదే. ఈనాడు అనేక మంది విద్యార్థులు భారత దేశం బీదదేశమని భావిస్తున్నారు. ఇదే మన పిల్లల్లో ఉన్న పెద్ద బలహీనత. భారత దేశం బీదది కానే కాదు. భారతదేశంలో లేనిది ఏ దేశంలోను లేదు. సమస్త శక్తులూ భారత దేశమునందే ఉంటున్నాయి. **ఇది త్యాగభూమి, ఇది యోగ భూమి, ఇది కర్మభూమి. ఇలాంటి భూమిని కొందరు భోగభూమిగా మార్చడానికి ప్రయత్నం చేస్తున్నారు. మనకు భోగమే వద్దు. భోగం రోగానికి దారి తీస్తుంది. త్యాగమే యోగాన్ని చేకూర్చుతుంది. కాబట్టి, త్యాగభావంతో మీ సర్వస్వాన్ని సమాజానికి అర్పితం చేయండి. నడుం వంచి పనిచేయండి. చేతి నిండుకు పని చేయాలి. మనస్సు నిండుకు మంచి**

భావము లుండాలి. అలాంటివాడే నిజమైన మానవుడు. అట్టి మానవునికోసమే భగవంతుడు వెదకుతున్నాడు. భగవంతునికోసం మానవుడు వెదకనక్కర్లేదు. ఎందుకంటే, భగవంతుడు ఎక్కడ చూసినా ఉన్నాడు. కాబట్టి, మీరు దైవాన్వేషణకోసం ప్రయత్నించకండి, మంచి మనస్సుకోసం ప్రయత్నించండి. మీరు మంచివారు కావాలిగాని, గొప్పవారు కానక్కర్లేదు. గొప్పవారివల్ల లోకానికి జరుగుతున్న ఉపకార మేమిటి? ఏమీ లేదు. ఉపకారానికి బదులు ఎక్కువగా అపకారమే జరుగుతున్నది.

(స.సా.మే2000పు.153/154)

ఒక నాణ్యానికి రెండుపక్క లున్నాయి. పరమాత్ముడు ధర్మస్వరూపుడు. సత్యస్వరూపుడు కూడ. **అధర్మమును సత్యమును అలక్ష్యంచేస్తే భారతదేశము భారదేశమై పోయింది. భగవంతునిపై భగవద్విషయముపై రతికలవాడే భారతీయుడు.** యెవరెవరి కర్తవ్యమును వారు నిర్వహించాలి. అనుష్టానానికి తగిన నిష్టవుండాలి. యిదే ధర్మముయొక్క గురుతు. మానసిక శాంతి ధర్మాచరణములోనే దొరికేది. దీనిని మానవుడు మరచి విషయవాసనల లోబడి అసత్యము. అక్రమము అనాచారము పెరిగినపుడు పరమాత్ముడే మానవరూపముతో అవతరిస్తాడు.

(సు.పు.154/155)

"భారతదేశము వేదాల పట్టుకొమ్మ
యజ్ఞయాగాది క్రతువుల కాటపట్టు
పెక్కు అవతారముల గన్న పెద్దతల్లి
నీతి నియమాల యోగి యీ త్యాగభూమి"

(యు.సా.పు.9)

భారతదేశమునకు హిమాలయము శిరోభూషణము; కన్యాకుమారి పాదములు. బొంబాయి నగరము ఉదరభాగము. ఉదర మెప్పుడు సరిగా పనిచేయదో, శరీరము శిరమునుండి పాదమువరకు బాధపడుతుంది. ఉదరమును నిర్మలమైన ఆరోగ్యకరమైన ఆహారముతో నింపి, సవ్యముగా పనిచేయునట్లుగావించినచో, శరీరము ఎటువంటి రోగబాధలు లేకుండా, చక్కగా పనిచేయగలదు.

(స.సా.జూ.75 పు.108)

ఒకానొక సమయంలో **20 సం॥లకు పూర్వం మున్నీ ఒక పెద్ద సభను ఏర్పాటు చేసాడు. అతడు చాలా తెలివితేటలు గలవారినందరినీ చేర్చాడు. ఈనాడు తెలివితేటలు గలవారికే అనేక అనుమానాలు కూడా! అసలు తెలివిగలవార మనుకునే వారికి తెలివే ఉండదు!** అది కేవలం అహంకారము యొక్క ప్రభావము. ఆ సమావేశంలో అందరూ చేరారు. తెలివితేటలు గలవారి సమావేశం ఎట్లా విఙ్ఞప్తీగుతున్నారు.

"దీన్ని చదివాం, దాన్ని చదివాం, ఇన్ని రకములైన ప్లాన్లు వేసాం.." అంటూ వర్ణిస్తూ కూర్చున్నారు. **నేను ఆ సభకు ప్రధాన అధిపతిని. నా ప్రక్కన మున్నీ కూర్చున్నాడు.** "స్వామీ! ఈ ఆధునిక యుగంలో తెలివి గలవారికి ఆధ్యాత్మికముపైన, ధార్మికముపైన అనేక అనుమానా లుంటున్నాయి. వాటిని మీరు తప్పక తీర్చాలి' అని కోరాడు. ఇంక వారు స్వామిని అనేక ప్రశ్నలు అడిగారు. వాటికి చక్కగా సూటిగా హృదయానికి హత్తుకునేటట్లుగా జవాబులు చెప్పాను. **తదుపరి గొప్ప తెలివితేటలు గలవాడు లేచాడు. "రష్యా గొప్ప ట్యాంకులను, బాంబులను తయారు చేస్తున్నది. ఇంక ఆమెరికాకు చూస్తే దాని శక్తిసామర్థ్యాలకు సాటి లేదు. కాని, భారతీయులు ఎట్టి ఆస్త్రశస్త్రములనూ తయారు చేయటం లేదు.** మరి మన భారతదేశం గతి ఏమౌతుంది?! ఈ సందేహమును మీరు తీర్చాలి. మన భారతీయులు కూడా ఆస్త్రాలను, ట్యాంకులను తయారు చేయాలి" అన్నాడు "పిచ్చివాడా! తినడానికి తిండి, ఉండడానికి కొంప, కట్టడానికి బట్ట - వీటిని ప్రజలకు అందించాలి. ఇదే గొప్పశక్తి. ఈనాడు రష్యాలో కావలసినంత ఆయుధ సామాగ్రి ఉంటున్నది. కాని, తినడానికి తిండి లేదు. ప్రజలకు తగిన అనుకూలములను సమకూర్చకుండా బాంబులు పెట్టుకొంటే ఏమి ప్రయోజనం? ఆయుధాల కొరకు కోట్లకొలది ధనమును వ్యర్థం చేస్తున్నారు. దీనికి నేనేమాత్రమూ అంగీకరించను" అన్నాను. "మరి మనపై పరాయివారు దండెత్తి వచ్చినప్పుడు వారిని ఏవిధంగా ఎదుర్కోవాలి?" అని ఇంకొకరు ప్రశ్నించారు. **అప్పుడు నేను చెప్పాను, "మన దేశము**

భారతదేశము

పేరేమిటి? భారతదేశము. కనుక, భారతదేశమునకు భారతమే ప్రధానము. ఈ భారతములో ముఖ్యులెవరు? ధర్మజ భీమార్జున నకులసహదేవులు. భారతమునకు ప్రధాన కర్తలు ఈ ఐదు మంది. ఇందులో అర్జునుడు గొప్ప శక్తి వంతుడు; గాండీవమును సాధించినవాడు. ఇతని బిరుదులు పద్మశ్రీ పద్మవిభూషణ్ వంటివి కావు. "అర్జున ఫల్గుణ పార్థివ కిరీటి శ్వేతవాహన భీభత్స సవ్యసాచి ధనుంజయ" - ఇలాంటి టైటిల్స్ కల్గినవాడు. ఇన్ని శక్తిసామర్థ్యాలు కల్గిన అర్జునుడు అన్న మాటను ధిక్కరించక శిరస్సు వంచుతున్నాడు. ఇంక భీముని చూస్తామా...ఇతనికి గొప్ప భుజబలము, బుద్ధిబలము ఉంటున్నవి. ఒక పెద్ద వృక్షమునైనా ఎడమ చేతితో కదిలించి పెకిలించి శక్తి గలవాడు. ఐతే, ఇతడు కూడా అన్న ఆజ్ఞను శిరసావహిస్తున్నాడు. ఎందుకోసం? మీరు చక్కగా గుర్తించండి. అస్త్రశస్త్రములను సాధించి గొప్ప శక్తి సామర్థ్యములు గల అర్జునుడు అమెరికాతో సమానము; భుజబలము, బుద్ధిబలము గల భీముడు రష్యా వంటివాడు. ఐతే, ఈ ఇరువురూ ఎవరి శరణాగతి పొందుతున్నారు? ధర్మజుడనే వానికి శరణాగతులౌతున్నారు. కనుక, ఈనాడు మనం ధర్మాన్ని పోషించినప్పుడు ఈ రెండూ స్వాధీనమైపోతాయి. ఎంతటి శక్తి సామర్థ్యములు కల్గినవాడైనా ధర్మము ముందు అణుమాత్రంగానే ఉంటాడు. కనుక, భారతీయుల ప్రధాన ప్రాణము ధర్మము" అని నేను చెప్పాను. ఈ జవాబు చెప్పేటప్పటికి ఒక నిమిషము కాదు, రెండు నిమిషములు కాదు, 15 నిమిషములు అందరూ Claps (చప్పట్లు) కొడుతూ వచ్చారు. నేను చెప్పాను - "Claps కొట్టినంత మాత్రమున ప్రయోజనం లేదు. మీ మనస్సు Taps త్రిప్పి దుర్భావాలను విసర్జించండి. అందరూ ధర్మమార్గంలో ప్రవేశించండి" అన్నాను.

(స.సా.డి.94.పు.313/314)

విద్యార్థులారా! మొట్టమొదట నేషనాలిటీని తీసుకోండి. భారతదేశమునకు ఏమని పేరు? HINDU అని పెట్టారు. H-humility, I-individuality, N-nationality, D-divinity, U-unity ఉండాలి. Divinity ఉండాలి nationality. ఉండాలి individuality ఉండాలి. అన్నీ చేరినప్పుడే భారతదేశము. వీటన్నింటికి humility ఉండాలి. ఇది లేకపోతే రెండవది ఏ మాత్రము లేదు.Humility లేక individuality ఎక్కడ నుండి వస్తుంది? మొట్టమొదట వినయము. అప్పుడే కట్టకడపటికి Unity వస్తుంది.

(భ.మ.పు.15)

భారతదేశము చెత్త భూమిగా విశ్వసిస్తూ విదేశములకు ప్రయాణమై వెళ్ళుతున్నారు. "యన్న భారతే తన్న భారత" భారతదేశములో లేనిది ఏ దేశము లోను లేదు.

"భవ్య భావాలు కల్గిన భారతీయ
దివ్య సంస్కృతి తత్వంబు తెలుసుకొనగ
భారతీయులు యత్నింపనేరరైరి
ఇంతకంటెను దౌర్భాగ్యమెమికలదు?"

కర్మభూమి, యోగభూమి, అయిన భారతదేశమునందు పుట్టిన యువకులైన మీరు భారతీయ సంస్కృతినే గుర్తించటానికి ప్రయత్నించలేక పోవటం చేత ఈ విధమైన అవస్థలకు గురియై పోతున్నారు. ఇట్టి విశిష్టమైన సంస్కృతిని గుర్తించాలి. విచారించాలి దీనిని ప్రబోధించే పెద్దలుగాని పండితులు గాని తల్లితండ్రులుగాని లేకపోవటమే దీనికి మూలకారణము.

(బృ.త్ర.పు. ౧౦)

ప్రతికర్మకూ ఒక ఫలితం ఉంటుంది. కాబట్టి ఈ కర్మ ఫలితాన్ని అనుభవించక తప్పదు. త్వరలోనే **పవిత్రమైన ఫలితం కూడా వస్తుంది.** ముఖ్యంగా **భారతదేశానికి చాలా శుభం కలుగుతుంది.** ఈనాడు అనేకమంది భయభ్రాంతులతో కుమిలిపోతున్నారు. ఏ నిముషంలో యుద్ధం వస్తుందో! అని భయపడుతున్నారు. ఏ నిముషంలో పాకిస్థాన్‌కు, ఇండియా కు యుద్ధం జరుగుతుందో! అని భయపడుతున్నారు. ఏమీ జరుగదు. **భారతదేశము పవిత్రమైనది. ఇది సుక్షేమంగానే** ఉంటుంది. ఏవో చిన్న చిన్నవన్నీ జరుగుతునే ఉంటాయి. నలుగురున్న కుటుంబంలోనే కలహాలు వస్తుంటాయి. కోట్ల కొలదీ

జనాభా వున్న దేశంలో చిన్న చిన్న లడాయిలు రాకుండా ఉండవు. కాని యుద్ధం అనేది రాదు. **ఈ రెండు దేశాలవారు ఏకమైపోయి సోదరులలాగే జీవిస్తారు. "లోకాస్సమస్తా సుఖినోభవంతు"** అని మీరు కూడా ప్రార్థనలు చేయండి. లోకమంతా సుఖంగా ఉండాలని మనం ఆశించాలి. ఈ **లోకాన్ని బట్టి మనం జీవిస్తున్నాం. లోకమే లేకపోతే నీవు ఎవరవు? నీవే లేకపోతే లోకమెక్కడ? కనుక నీకు, లోకానికి సన్నిహిత సంబంధ బాంధవ్యం ఉండాలి.** కాబట్టి భగవన్నామ స్మరణ చేస్తూ, లోకక్షేమాన్ని ఆశిస్తూ, సంఘ క్షేమాన్ని కోరుకుంటూ, సేవలలో పాల్గొంటూ మీ జీవితాలను సార్థకం చేసుకోండి!

(శ్రీ. ఫి. 2002 పు.32)

జీవ, బ్రహ్మలయందు ఐక్యసాధనా సంపత్తి భారతదేశము. జీవ, బ్రహ్మఐక్యాను సంధానమునకు భారత దేశమే ఒక ఆట పట్టు. 'భారత' అనగా కేవలం ఒక దేశమునకు గాని, ఒక వ్యక్తికి గాని ఒక కాలమునకుగాని సంబంధించినది కాదు. అనేక పురాణముల యందు వివిధ రీతులలో భారతదేశాన్ని ప్రకటించినప్పటికిని, కేవలము వారివారి భ్రాంతులనే చెప్పవచ్చును.

భారతదేశం సంపన్నదేశము నైతిక, ధార్మిక ఆధ్యాత్మిక, సంపత్తి కి మూలస్థానం. ఈ దేశము లౌకిక జీవితమునకు అన్నపూర్ణ వంటిది. ఇట్టి పవిత్రమైన దేశమునకు ఈనాడు పేదదేశముగా భావించుకోవటం ఇది కేవలం ఒక భ్రాంతియే. మనది పేద దేశముకాదు. ఇది సంపన్నదేశము. ఇది సంపన్నదేశము కాకుండిన - మొగలు చక్రవర్తులు, తురుష్కులు, ఐరోపావారు ఈ దేశముపైన ఎందుకు దండెత్తి వస్తారు. సంపద ఉండినప్పటికిని దానిని మనము సంరక్షించుకోలేక పోతున్నాము. కారణము ఏమిటి? **సర్వసంపదలు ఉంటున్నవి గాని భారతీయులయందు ఐక మత్యము క్షీణించినది. స్వాతంత్ర్యమును సాధించారు కాని ఐక్యతను సాధించలేదు.** ఐకమత్యము లేకపోవుట చేతనే భారతదేశం ఇన్ని అనర్థములకు మూలకారణమైనది. ఇటువంటి సంపన్నదేశమునందు మనము జన్మించినప్పటికి, ఇందుగల గుణములను, భావములను మనము ఆవిర్భవింప చేసికొనలేకపోవుట ఇది కేవలం ఒక దురదృష్టకరమైన విషయం. ఏకార్యము చూచినప్పటికి, స్వార్థము, స్వప్రయోజనము, విలయతాండవ మాడుచున్నవి. స్వార్థమును త్యజించి ఐక్యమత్యమును చేపట్టాలి. అప్పుడే మనము దేశము యొక్క ఐక్యతలోని ఆనందమును అనుభవించగలము. అట్టి ఆనందమునే అనుభవించాలి. వాస్తవముగా భారత దేశము ఎంత పవిత్రమైన దేశమన్నది మీరు గుర్తించవలసిన అవసరం ఏంతేని యున్నది. ఇట్టి పవిత్ర దేశమునందు లేనిది ఏ ఒక్కటి కూడను లేదు. ఈ దేశము నందు లేనటువంటి వస్తువులుగాని, సాంప్రదాయములుగాని సంశక్తులుగాని మరి ఏ ఇతర దేశములందు చూడలేము. ఇటువంటి భారతదేశము నందు సర్వశక్తులు ఉండినప్పటికి నిశ్శక్తులుగా మనము భావిస్తున్నాము. ఇది కేవలము మన భ్రాంతి మాత్రమే. ఈ భ్రాంతిని దూరము చేసినప్పుడే మనకు నిజమైన ఆత్మానందము లభ్యమవుతుంది. భ్రమను దూరము చేసినప్పుడే బ్రహ్మ మనకు సాక్షాత్కారవుతుంది.

సర్వము భారతదేశమునందు ఆవిర్భవించి యున్నది. మీరంతా భారతీయులై పుట్టినందులకు భారతమాత యొక్క ధర్మమును కాపాడవలసిన బాధ్యత మీపైననే నిలిచియున్నది. భక్తులారా! ఈ **భారతదేశము యొక్క భాగ్యమును కాపాడుతానని ప్రతిభక్తుడు కంకణము కట్టుకోవాలి.**

(స.సా.డి.1990 పు.310/311)

భారతదేశమ్ము నారింజపండు।
కనగ జాతులు మతములు తొనలుగానె
భిన్నతెగలు వృత్తులు ఎన్నియున్న
భారతదేశాన్ని పుట్టుట భాగ్యమగును।
ఐకమత్యంబు జ్ఞానంబు నందజేయు
దివ్యజ్యోతిని వెలిగించి దేశమిదియె॥

(సా.పు.428)

(చూ॥ అధర్వణవేదము, ప్రతిజ్ఞ, పవిత్రత, ప్రధానమైన ఆస్రము, సరస్వతి)

భారతపాలనము

పరమపావనమైన భారతావనియందు
సహసమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నిటిలోన వన్నెగాంచినయట్టి
ఘనసత్యశీలమే కఠిన తపము
మధురభావంబేది మనదేశమందన్న
మాతృభావముకన్న మాన్యమెద్ది
ప్రాణంబుకంటెను మానంబు ఘనమను
మనదేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశనీతులరసి
వెసవిచిత్ర స్వేచ్ఛయన్ విచ్చుకత్తి
ఔర ఏమందు భారతపాలనంబు
ఎనుగెట్టుల తన బలమెరుగదొ
అట్టులైనారు మనవారలపని నేడు!

(శ్రీ.స.పు.156)

భారతము

భారత కథ కౌరవ పాండవ గాథ మాత్రమేనా! కాదు. అది పంచప్రాణాల కథ! పంచ ప్రాణాలూ నూరు అడ్డంకులను ఎలాదాట గలిగాయో వివరిస్తుంది భారతం.
ధర్మరాజు నీతి ప్రతీక; భీముడు దేహబలం; అర్జునుడు దైవభక్తికి గుర్తు; నకులు స్థైర్యం; సహదేవుడు సమచిత్తం; ఈ అయిదు గుణాలూ క్షీణిస్తే, హస్తిన - అంటే, దేహం అధర్మంలో మునిగిపోతుంది.

(శ్రీ.సా.గీ.పు.177)

(చూ॥ పంచమ వేదము)

భారతీయఋషులు

సుగుణసాకారభావముకన్నా ఉన్నతమగు ఈశ్వర భావమే లేదని ఉగ్గు పాలతో నేర్పిన వారు ప్రాచీన తత్త్వ విచార పరులు: భారతీయ ఋషులు.

(స.వా.పు.14)

భారతీయమతము

భారతీయ పరమార్థము మహావిశాల భావాలతో, ఉన్నత ఆశయములతో పవిత్ర తలంపులతో ప్రవహించిన వాహిని. మలుపులేక, కలతకాక అనుగ్రహ సాగరమునకు చక్కని బాటగా యేర్పడిన రాజబాట. ఇంకొకటి: **భారతీయుల యొక్క మత నిర్మాణ మంతటికినీ, భగవంతుడే, ఈశ్వరుడే మూలస్తంభమైయుండగా మరొక దానిని విశ్వసించనక్కరలేదు. అన్ని మతములకు అధిష్టానమైన స్థాయిలో ఉన్నత శిఖరమున నిలచిన మతము భారతీయ మతము.** ఈ మతమునకు విరుద్ధమయిన ఆశయములు గల ఇతర మతములను భారతీయ మతము అనేక స్థాయిల యందు, అనేక రీతుల ఖండించినది. **భారతీయుల మరొక మతముల ననుసరింప పని లేదు. ఇందులో లేనివి మరే మతమునందు కానరావు.** భారతీయ మతము నందలి భావములనే ఇతర మతములు ఆదర్శముగా వేరు వేరు రూప నామములతో అనుభవించుచున్నారు. ఇతర మతముల వారు భారతీయ వైదిక మతమును అనుసరించిన అనుసరించ వచ్చును. కానీ భారతీయులు ఇతర మతముల ననుసరించు నవసరము లేదు. మనము ముఖ్యముగా గమనింప వలసినది **ఆత్మను గూర్చియు, ఈశ్వరుని గూర్చియూ, ఆస్తిక ధర్మమును గూర్చియూ జరిగిన విచారము.** ప్రపంచవాఙ్మయమున గూడా ప్రాచీన **తమమైనది ఆర్యవాఙ్మయము.** ఇంతకన్నా ప్రాచీనరచనలు యేదేశమందునూ యెచ్చటనూ లేవు. ఒక వేళ వున్ననూ వాటికి వాఙ్మయ నామము చెల్లదు. ఇంత పురాతనమైన గ్రంథము వాఙ్మయము ప్రపంచముననే ఎందునూ లేదు. ఆర్యుల చిత్త వృత్తులు, వారి వాంఛలు వారి వ్యవహార విషయములు, వారల నెదుర్కొన్న సమస్యలు మున్నగు సంగతులు ఇందు చిత్రింపబడినవి.

(స.వా.పు.11/12)

భారతీయవిద్య

ఆస్తి పాస్తులనుకూడా తగలబెట్టి డిగ్రీ అనేటువంటి భిక్షా పాత్రను చేతబట్టి గడప గడపకు వెళ్ళి ఉద్యోగము, ఉద్యోగము అనే భిక్షను ఆశించే టటువంటి విద్యకాదు మన భారతీయ విద్య. తన స్వశక్తిపై స్వతంత్రముగా నిలచేటట్లు చేసేటటువంటిదే భారతీయ విద్య. అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములను యెదుర్కొనేటువంటి మనోధైర్యంమును, అత్మస్థైర్యమును **అందించేది భారతీయ విద్య**. నిజముగా భారతీయ విద్యయొక్క తత్వమును భారతీయులే గుర్తించలేనటువంటి పరిస్థితి ఏర్పడుచున్నది. మానవత్వములో నున్నటువంటి ధైర్యమును బలమును, క్రమశిక్షణను అందించేటటు వంటిదే భారతీయ విద్య.

(శ్రీ.ది.పు.2)

భారతీయసంస్కృతి

భూతదయకు భారతదేశము పుట్టినిల్లు, పెట్టింది పేరు. భారతీయులు విషసర్పములకు కూడా పాలు పోసి పూజిస్తున్నారు, చీమలకు కూడా బియ్యపు పిండి వేసి పోషిస్తున్నారు. **"చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో ప్రేమ మీర వెలసియుండే బిరుదు వహించిన సీతారామ నన్ను బ్రోవరా!" అన్నాడు త్యాగరాజు.** చీమ మొదలు సింహము వరకు, రాయి మొదలు రత్నము వరకు గులకరాయి మొదలు పర్వతము వరకు సమస్త పదార్థములూ దైవస్వరూపములేనని ప్రబోధించినది భారతీయ సంస్కృతి. కనుకనే చెట్టును, గుట్టను, మట్టిని. పుట్టను కూడా పూజిస్తూ వచ్చారు భారతీయులు. భగవంతుడను గ్రహించిన ప్రేమతత్వాన్ని కేవలం మానవులకే పరిమితం చేయకుండా సర్వప్రాణులకు, సమస్తపదార్థములకు ప్రసరింపజేయాలనే గొప్ప అంతరార్థముతో కూడినది భారతీయుల విశ్వాసము. పాశ్చాత్యులు విశ్వమానవ సోదర భావంకంటే మించినది లేదన్నారు కాని, అందరి యందున్న ఆత్మతత్వం ఒక్కటేనని భారతీయ సంస్కృతిని మూఢ విశ్వాస మంటూ కొట్టి వేయడం కంటే మూర్ఖత్వం మరొకటి లేదు.

(స.సా.అ.96 పు.275)

"సర్వే భవంతు సుఖీనః
సర్వే సంతు నిరామయాఃసర్వే భద్రాణి పశ్యంతు
మా కశ్చిత్ దుఃఖ భాగ్భవేత్"

దేశమంతా సుఖముగను, సౌభాగ్యముగను ఆనందముగను ఉండాలనేదే భారతీయ సంస్కృతి యొక్క ప్రధాన సూత్రము. భారతదేశము ఆధ్యాత్మికమునకు, దాన ధర్మమునకు పుట్టినిల్లు. శాంతి అహింసలకు మెట్టినిల్లు భారతదేశమునందున్న సత్యవ్రతము మరే దేశము నందునూ కానరాదు. ఈ గడ్డ సప్తఋుషులకు జన్మస్థానము. వ్యాస వాల్మీకులు జన్మించిన స్థానం. **రాముడు ఏలిన రామరాజ్యం. ఈ భారతదేశం కృష్ణుడు బోధించిన గీత ధర్మక్షేత్రం. ఈ భారతభూమి** బుద్ధుడు సంచరించిన పుణ్యభూమి. ఇదే అనేక అవతారములకు అలవాలము ఈ భారతభూమి. **అయితే ఇట్టి పవిత్ర మైనటువంటి ఈ పుణ్యభూమి తత్వమును భారతీయులే ఈనాడు గుర్తించుకోలేకపోతున్నారు.**

దాన ధర్మములే భారతీయుల ప్రధాన ధర్మము, ప్రధాన సంపద భారతీయులు భగవత్ ప్రార్థనను ప్రధానముగా భావించి ఆచరించేవారు. ఇట్టి సంపదకు బాలబాలికలే వారసులు. కనుక ఇట్టి పవిత్రమైన సంపదను నిలబెట్టుకొనుటకు బాలబాలికలు తగిన కృషి చేయాలి. అనాది కాలము నుండి ఈ భారతదేశం ఆధ్యాత్మిక సంపత్తితో అన్ని దేశములకును సుస్థిర శాంతి భద్రతలను చేకూరుస్తూ వస్తున్నది. నాటికి నేటికి "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" అన్నదే భారతీయుల లక్ష్యము.

(శ్రీ.ఏ.96 పు.9)

సంస్కృతం, సంస్కృతి, సంస్కరణ, సంస్కారం, సాంఘిక ప్రవర్తన - ఇటువంటి పదములు వేరువేరుగా గోచరించినప్పటికి ఒక 'సం'పూర్వక 'కృత్' ధాతువునుండి

భారతీయులు

పుట్టినటువంటివి. భారతీయసంస్కృతి అనేక విధములైన శ్రేయస్సు, పవిత్రత, భిన్నత్వముల యొక్క ఆనంద మయమైన సారముతో కూడి ఉంటున్నది.

(శ్రీ.న.1990పు.1)

రామాయణ మహాభారతములు మన భారతీయులను వేలాది సంవత్సరాల కాలము, తీర్చి దిద్దినవి. భారతీయ సంస్కృతికి అవే పునాదులు. అలెగ్జాండర్ చక్రవర్తి సిందునదీ ప్రాంతమునకు దండెత్తి వచ్చినపుడు, మన సంస్కృతి యెట్టిది అని తెలుసుకొనుటకై మారు వేషమును ధరించి, గ్రామములకు చీకటి సమయమందు వెళ్లేవాడట. ఒకనాడు, ఒక సత్రము సమీపమును చేరుకొనినాడు. అచ్చట చాలా మంది గుమిగూడి యేదో పెద్ద తర్క వితర్కములు చేయుచుండుట విని ఆయన ఒక చెట్టుచాటున నిలిచి, అన్నీ శ్రద్ధగా గమనించినాడట. వింటూ వింటూ, **భారతీయ సంస్కృతి** యొక్క ఆదర్శాలను చూచి ఆనందించి, ఇట్టి దేశమునకు అన్యాయముగా అహంకారము వలన ఇంత కష్టనష్టములను కలిగించితినే అని కంటిధారలు కార్చి నాడట. ఈ గ్రామములో కొంత భూమిని దున్నినప్పుడు, బంగారు నాణ్యములతో నిండిన ఒక బంగారు పాత్ర దొరికినది. "నేను నీ దగ్గరనుండి భూమిని మాత్రమే కొనినాను, ఈ బంగారము నీదే కాని నా కేమాత్రము దానిని తీసుకొను అధికారము లేదు." అని దానిని తెచ్చి, అమ్మిన రైతు ముందు పెట్టగా, ఆయన, "పో పో, నాకు దీనికి సంబంధమేలేదు, భూమిని అమ్మిన తరువాత, దానిలో దొరికే నిధి నిక్షేపములు అన్ని నీవే" అని పాత్రను త్రోసివేసినాడు! నాది కాదు, నీదే, అని ఇద్దరూ ఆ సొమ్మును వద్దు అనినప్పుడు, గ్రామములోని పెద్దలు కొంతమంది కూర్చొని, ఆలోచించి, "అయ్యా! బంగారపు పాత్ర దొరికిన రైతూ! నీకొడుకు. ఈ అమ్మిన ఆయన కుమార్తెను పెండ్లాడితే ఈ బంగారమును నీవు స్త్రీ ధనముగా నీ కోడలికిచ్చిన ఈతర్కవితర్కములు, నాదానీదా అనే సమస్య, శుభ్రముగా, అందరికి సంతృప్తిగా, పరిహారమగును" అని తీర్పు చెప్పినారు. అందరూ సంతోషముతో ఆ అభిప్రాయమునామెదించిరి, ఈ నీతిని విని అలెగ్జాండర్ చక్రవర్తి సిగ్గుచే తలవంచుకొని వెళ్లినాడు.

(స.సా. జూ.75.పు.90)

భారతీయ సంస్కృతి వేష భాషల యందే కాక ఆచారవిచారములందే కాక తెల్లవారి మొదలు రాత్రి వరకు మనకు అడుగడుగున కనిపించే దంతయు భారతీయ సంస్కృతియే.

(బృ.త్ర.పు.4)

(చూ॥ ఎవరుగొప్ప, ఏకత్వము, పద్మపురాణం, ప్రధానసూత్రములు, విద్యాభ్యాసం, హిమాచలం)

భారతీయులు

రాళ్ళయందూ దేవుని చూడవలెనుగానీ దేవుళ్ళను రాళ్ళగా చేయరాదు, చూడరాదు. అదే మన భారతీయులకు భగవంతుడందించిన మహాభాగ్యము. సముద్రమున పైపై అలలలో వెతికిన ముత్యములు చిక్కవు. సముద్ర మధ్యభాగములో స్వాతివాన పడిన సమయములో సముద్ర గర్భమునచేరి వెతికిన చిక్కును. ఇట్టి భగవదన్వేషణ సలుపువారే మన భారతీయులు.

ధర్మాచరణే దేహముగాను, దైవదర్శనమే హృదయము గాను తలంచి, చరించి తరించువారు మన భారతీయులు, పైపై పూతలకు బాహ్యాడంబరములకు భౌతిక అభివృద్ధులకూ బానిసలుకారు. అంతర్ దృష్టితో ఆత్మాన్వేషణ సలుపునట్టి విస్వార్థ హృదయులు. ఇట్టి పవిత్ర స్థితిగతులు కలిగిన భారతీయులు.

(గీ.పు.171/172)

భారతీయులలో సమత్వము మెండు. హిందూ మతమో, బౌద్ధ మతమో, మహమ్మదీయమతమో, జోరాష్ట్ర మతమో, క్రీస్తుమతమో, ఏదిగానున్ననూ, **దైవరాధనను ఎవరునూ పరహసించ కూడదనియునూ, యే రూపనామమును పరహసించిననూ వకే దైవమును పరిహసించినట్లగు ననియూ భారతీయ పరమార్థము ప్రచారము చేసెను.** ఈ సత్యాన్ని నేర్చిన వారే నిజమైన భారతీయులు.

(స.వా.పు.17)

చారిత్రక యుగమునుంచి పరిశీలించిన, హిందువులలో ఎట్టి మహాపురుషులు ఏఏ తెగలందు జన్మ మొందినది విశదముగా తెలియును. అవతారములు, దైవాంశ సంభూతులు, జీవన్ముక్తులు అయిన రామ, కృష్ణ, బలరామ, జనక, పరీక్షిత్తుడు, విశ్వామిత్రాది రాజయోగులు కూడా క్షత్రియతెగయం దుద్భవించిరి, బ్రహ్మఋషులు, పండితోత్తములు, శాస్త్రవేత్తలు, వేదఋషులు బ్రహ్మణ తెగయం దుద్భవించిరి. భారత భాగవతాది గ్రంధము లందు శూద్రు లధికులు కలరు. భక్తి శేఖరులు నిమ్నజాతియందే అధికులుకలరు. ఈ సారమును పట్టిచూడ పవిత్రతను పొందుటకు, పరమాత్మను చేరుటకు వారివారి సాధనా ప్రాప్తి ప్రధానము కాని వేరే తెగలు అడ్డురావు. అయితే అందుకు తగిన అనుగ్రహమునకు అర్హుడుకావలెను. అనుష్ఠానమున క్రమబద్ధుడు కావలెను. ఇంతటి పవిత్రులైన భారతీయులు పై మహాపురుషుల జీవిత తత్త్వములను గమనించక, తలంచక, వారి ఆజ్ఞశిరసావహించక, కాలకర్మముచే పట్టుపడి, **"వినాశకాలే విపరీత బుద్ధి"** అన్నట్లు స్వార్థముకొఱకు తమ పుత్రకళత్రాదులను అభివృద్ధి పరచుటకొరకు వీలుకలుగుదేమో అను సందియమున పేరు ప్రఖ్యాతులకు దాసులై, అధికారత్వమునకు ఆశపడి, హిందూమతమునకు తీరని లోట్లు కలిగించుచున్నారు. అయితే సర్వజన సమాన ప్రియులై, స్వార్థరహితులై, ప్రజాక్షేమపరాయణులై, లోక సేవార్పితులై, సర్వమును ధారపోయువారు లేకపోలేదు. అట్టి మహానీయులను లోకాధికారులుగా వదలిన ఈ దుర్మార్గపు వ్యక్తులకు, అనాచారవ్యక్తులకు, అధర్మ ప్రియులకు స్థానముండదని వారిని చేర్చనీయక అణగద్రొక్కుచున్నారు. ఎట్టి అగాధమైన సముద్రమైనను. ఒడ్డున భూకంపముරాగానే జలము తమంతటతామే దూరముపోవును. ఆ అశాంతి తగ్గినతోడనే తిరిగి యధాస్థానము నాక్రమించును. అట్లే ఇట్టి అన్యాయ, అక్రమ, అహంకారపు ఆడంబర భూకంపమునకు చిక్కుకొనక, సత్పురుషులు, లోకోద్ధారకులు దూరముగా నుండి వీరి ప్రతాప ప్రదర్శనము చల్లబడగనే వారు తిరిగి లోకమున ప్రవేశింతురు. ఇట్టి క్షణభంగురమైన అధికారత్వములు. అహంకారములు స్థిరముకావు. "పెరుగుట విరుగుటకొరకే" అన్నట్లు ఇప్పటి ఆశాంతి వాతావరణము విరుగుటకే కాని పెరుగుటకు కాదు. లేకున్న ఆదినుంచి ఎంతో పవిత్రమైన పద్ధతులతో, భావములతో, సహనముతో, పేరుప్రఖ్యాతితో, వేద, శాస్త్ర, ఉపనిషత్ ఉగ్గుపాలతో పెరిగి, దేశభ్రష్టులైన మానవులను ఆదరించి, అట్టివారికి అండనొసగి సమంజస ప్రేమను పంచిపెట్టిన భారతీయులు నేడు చూడుడు, భారత సోదరులైన హిందువులే ఒకరిపైఒకరు అధికారులు కాగోరి తమ తమ సోదరులనే తాము తూలనాడుకొంటూ, ఒకరి క్షేమమును ఒకరు ఓర్వలేక అసూయాపరులై, పదవి ప్రతిష్టలకు పాల్పడి, అహంకార ఆవేశులై తమతమ భారత సోదరులనే వంచించుచు అభివృద్ధి కోరువారిని అణగద్రొక్కుచు, వారికి వారు స్వార్థమును పొందగోరి, హిందువులలో ఎన్నడు కనివిని ఎరుగని దుర్గణములను అభివృద్ధిపరచుకొని, అనాచార మాచరించుచు **పాపభీతి, దైవభీతి, వినయ, భయ, విశ్వాసములు లేక ఇంతటి అశాంతికి గురియగుట, శాంతికి దూరమగుట భారతీయులకు తలవని తలంపులుకదా!**

హిందూ సోదరులారా, **భారత పుత్రులారా, సనాతన సాంప్రదాయులారా,** పురాణకాలపు పురుషలక్షణము లెందునోయెను? సత్య, సహన, నీతి, నీమములు ఎందుదాచితిరి? లెండి. తిరిగి సత్య, ధర్మ, శాంతి భవనములైన రామరాజ్యమును స్థాపించండి. భారత సోదరులను ప్రేమించండి. సనాతన ధర్మములను అనుష్ఠించండి. ఇప్పుడు దహించుచున్న అజ్ఞాన, అశాంతి, అక్రమ అసూయాదులగు అగ్నిజ్వాలలను ప్రేమ, సహన, సత్యమను నీటితో ఆర్పుడు. అన్యోన్యతను అభివృద్ధి చేయుడు. ఈర్ష్య క్రోధములు ఈడ్చి వేయుడు. పవిత్రపురుషుల పాలనను, ఉత్తమ పురుషుల లక్షణములను, దైవ రాజ్యములను జ్ఞాపకమునకు తెచ్చుకొనుడు.

భార్య

తమతమ తప్పులను తాము గ్రహింపుడు, పరుల తప్పులను వెతుకుటలో వచ్చే సుఖమేమియు లేదని దృఢము చేసుకొనుడు. అట్టివి వృథా కాలహరణము, కలహకారణములగును. అట్టి గుణములు వదలుడు. ఈ తరుణము తప్పిన చేయునది మరేమి? ఆలసింపకుడు. **నిరుత్సాహమున చోటివ్వక, గడచిన అవనీతులకు స్వస్తిచెప్పి. నిజపశ్చాత్తాపరులై దేవ ప్రార్థనలు, సత్కార్యములు, సోదరప్రేమలు ప్రవేశపెట్టుడు.** సనాతనపు రామరాజ్యమును స్థాపింపుడు. ఇట్టి రాజ్యమును జయింపగోరే ఈ సనాతనసారధి బయలుదేరి తన సైన్యసహాయమున చేదోడు వాదోడుగా నిలువగలదు. ఈ రథమును లాగుటకు. నడుము కట్టి నారాయణ స్మరణకు బయలుదేరుడు. **భారతీయులందరును ఒకతల్లి బిడ్డలే. ఆ తల్లియే సనాతన ధర్మము. ఆ మాతృ ఋణమును భారత పుత్రులు తీర్చవలెను. తల్లిని మరచిన పుత్రుడు పుత్రుడు కాడు. తల్లిని చెడ్డ అన్న తాను మంచికాడు.** ఆ తల్లి పాలపోషణే నేటి ప్రాణము. ఈ ప్రాణదాతయైన సర్వుల తండ్రి ఒక్క పరమాత్ముడే. అందరు ఒక్క తల్లిదండ్రుల బిడ్డలు, అట్టి సోదరులలో తమను తాము నిందించు కొనక, తమవారలకు తాము చెడ్డకోరక, మీప్రీతి వస్తువుపైన మీకెంత ఇష్టమో, అట్లె ఇతర సోదరులకు వారి ప్రీతి వస్తువుపై వారికంత ఇష్టమని భావింపుడు. ఒకరి ఇష్టమును ఒకరు దూషించక, పరిహసించక ప్రేమించవలెను. ఇవి భారతీయుల ప్రేమ సత్య లక్షణములు.

(ప్రే.వా.పు.38/40)

విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తిఔరా
ఏమందు భారత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెరుంగ లేదో,
అట్టులయినారు మన భారతీయులు నేడు॥

(సా.పు.507)

(చూ॥ ఆదర్శము, భారతదేశము, వరలక్ష్మీవ్రతము, సూర్యుడు)

భార్య

భార్య పతివ్రత ఐతే భర్తకు గండాలు తప్పుతాయి

(త్రి.సా.పు.223)

తల్లి తండ్రి తోబుట్టు కొడుకు కోడలు మొదలయిన వారందరూ వారు వారు చేసుకొన్న పుణ్యపాపములనుబట్టి శుభాశుభముల ననుభవింతురు. **భార్య ఒక్కతే భర్త అనుభవించే శుభాశుభములలో భాగమును వహించును.**

(రా.వా.మొ.పు.235)

(చూ॥ తల్లులు)

భార్యా-భర్తలు

భార్యా భర్తా పక్కపక్కన నదిలో కొట్టుకొని పోతున్న రెండు కర్ర ముక్కల లాంటివారు. కాసేపు రెండు ముక్కలూ పరస్పరం కలసి పోతుంటాయి. ఇంతలో నదీ ప్రవాహం వాటిని విడదీస్తుంది. మళ్ళీ కాసేపటికి కలుస్తుంటాయి. రెండూ సముద్రంలోకి నదితోపాటు కొట్టుకొనిపోయేవే. కాస్తముందో, వెనుకో, అంతే! అందుకే అవి విడిపోతే విచారించాల్సిన పనిలేదు. అది సహజంగా జరిగే సంగతే!

(శ్రీ.సా.గీ.పు.40)

భావము

మనసులోనున్న భావంబు మందైన,
కలిగి తీరును ఫలసిద్ధి కార్యమందు,
మనసులో నున్న భావంబు మలినమైన
ఫలము కూడ నారీతి మలినమగును

(సా.పు.465)

భావంప్రధానము

బుద్ధునికోసం అనేకమంది రాజులు పెద్దపెద్ద ఆశ్రమాలు కట్టిస్తూవచ్చారు. కాని, బుద్ధుడు వాటిని ఆశించలేదు. ఒక ముదుసలి తల్లి పవిత్ర మైన హృదయంతో ఒక

దమ్మిడి నివ్వగా దానిని రెండు చేతులతో స్వీకరించి ఒక బట్టలో మూట కట్టుకొని తన దగ్గర పెట్టుకున్నాడు. కట్టకడపటికి ప్రాణం విడిచే సమయంలో అతనిదగ్గర ఆ దమ్మిడీ మాత్రమే ఉంది. **ఆడంబరంతో ఇచ్చినది కాదు గొప్పది; ప్రేమతో, వినయంతో, పవిత్రమైన హృదయంతో ఒక్క నయాపైస ఇచ్చినా అదే గొప్పది. Why barrels of donkey's milk? One teaspoonful of cow milk is useful.**

(స.పా.అ.2000పు.309)

భావనలు/భావములు/భావాలు

మన భావములను పురస్కరించు కొనియే, మన ప్రవర్తన కొసాగుతూ వస్తుంది. "యద్భావం - తద్భవతి", మన హృదయము పవిత్రమైనది. ఇందులో ఏ విధమైన అభ్యాసములను, తలంపులను మనము ప్రవేశపెడుదుమో వాని ప్రభావమే ఈ హృదయం పొందుతుంది.

Sow an action - reap a tendency
Sow a tendency - reap a habit
Sow a habit - reap a character
Sow a character - reap a destiny
You are the master of your destiny
You can do or undo.

కొన్ని సమయములలో -Emotional excitement ఉంటున్నది. అది కొంచెం చల్లార్చు కోవాలి. దీనిని మీరు Control చేసుకుంటే ఎంతో ఆదర్శ జీవులుగా ఉంటారు. మాటలు తగ్గించుకొండి - కొంత వరకు సత్యాన్ని గుర్తించండి - పవిత్రత పెంచుకోండి-జీవితమును ఆనందంగా జీవించండి.

జీవితములో ఏదీ Happy గా లేదు. అప్పటి కప్పుడు వస్తుంది. అప్పటి కప్పుడు పోతుంది. అంతా Passing clouds. Permanent Happiness ఒక్క దైవత్వములో మాత్రమే ఉంటున్నది. ఇది Heart to Heart - Love to Love ఇదే మీరు పెంచుకోవాలి. ఇదియే నిజమైన భక్తి ప్రపత్తులకు నిదర్శనము.

(దే.యు.పు.110)

భగవంతునికి ఒకరి పట్ల ఇష్టము, మరొకరి పట్ల ద్వేషము అనేది లేదు. అయితే, ఎవరి భావములకు తగిన ఫలితం వారికి లభిస్తుంది. ఒక పర్యాయం పురందరదాసు చెప్పాడు - "కృష్ణా! నీవు కంసునికి యముడిగా కనిపించావు. అతని తండ్రికి దేవునిగా గోచరించావు. హిరణ్యకశిపునికి యముడుగా కనిపంచావు. అతని కుమారుడైన ప్రహ్లాదునికి దేవునిగా గోచరించావు. రావణునికి యమునిగా కనిపించావు. అతని తమ్ముడైన విభీషణునికి రామునిగా కనిపించావు". రాముడు యముడు ప్రత్యేకంగా లేరు. అయితే, వారివారి భావములను పురస్కరించుకొని ఒకరికి రామునిగాను, మరొకరికి యమునిగాను గోచరించాడు.

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతాల విత్రంబులు స
న్మిత్రంబులు ముని జన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్

భగవంతుని చిత్రములు వర్ణించుటకు వీలుకానివి. కవులు తమకు తోచినట్లుగా వర్ణించవచ్చునుగాని, ఆ వర్ణన సరియైనది కాదు. ఈ కలియుగంలో మానవుడు ప్లాస్టిక్‌తో కమలాలను, ద్రాక్షగుత్తులను సృష్టిస్తున్నాడు. కాని, ఆ కమలాలపై తుమ్మెదలు వ్రాలుతున్నాయా? లేదే. భగవంతుడు సృష్టించిన కమలాల పైనే తుమ్మెదలు వ్రాలుతాయి. ఎందుకంటే, భగవంతుని సృష్టి మధుర మైనది. పురందరదాసు మరొక పర్యాయం చెప్పాడు- "భగవంతుడా! కొండ మధ్యలో చెట్టును ఎవరు సృష్టించారు? దానికి ఎవరు నీరు పోశారు? ఎవరు ఎరువు వేశారు? నెమలికి ఇన్ని రకములైన రంగులు ఎవరు వేశారు? పచ్చని చిలుకకు ఎఱ్ఱని ముక్కు ఎవరు పెట్టారు? ఈ ప్రపంచంలో కనిపించే రకరకాల పుష్పాలకు ఇన్ని రంగులు ఎవరు వేశారు? ఈ చిత్రమంతా నీదేగాని, మరొకరిది కాదు. ఈ సృష్టి అంతయు నీ సంకల్పములోనే ఇమిడి యున్నది."

(స.సా.న.99పు.304)

మీ భావాలు మధురంగా వుండాలి. వాటికి తగిన మాధుర్యం మీ భాషణలో వుండాలి. ఇరులకు ప్రియంగా

భావనాశనము

వుండటంకోసం అసత్యమూ అతిశయోక్తులూ పలకవద్దు. ప్రతిదాన్నీ పరుషంగా విమర్శించే అప్రతిష్ఠ ఫాలుచేసే మనస్తత్వం చాలా చెడ్డది. అల్లాగే సత్యపు సరిహద్దులుదాటి పోయి గోరంతలు కొండంతలుచేసి స్తోత్రాలు చెయ్యటంకూడా చెడ్డపద్ధతే.

(వ1963 పు.63)

'ముండే ముండే మతిర్భిన్నాఃʼ అన్నట్లు ఎవరి భావాలు వారివి. భిన్నత్వము సహజము. ప్రతివానికి తన భావమే సరియైనదని, ప్రత్యేకమైనదని, ప్రధానమైనదని తోస్తుంది. ఇది సాధారణం. సమరస భావంతోను, సమన్వయ ధోరణితోను సమైక్యతను సాధించాలి. ఒక చిన్న ఉదాహరణ: ఒక పర్యాయం చేతివ్రేళ్ళు తమలో ఎవరు గొప్ప? అని వాదించుకున్నాయి. ముందుగా చిటికెన వ్రేలు అంటున్నది - ''చూడండి, ఎవరికైనా నమస్కరించేటప్పుడు నేను ముందుంటాను. కాబట్టి, నేనే గొప్ప''.దాని ప్రక్క వ్రేలు చెప్పింది - "నేను ఉంగరపు వ్రేలును, అత్యంత విలువైన ఉంగరాలను నాకే ధరింపజేస్తారు. కనుక, నేనే ప్రధానం''. మధ్య వ్రేలు అంటున్నది - "నా చేతికి కూడా ఉంగరాన్ని తగిలించవచ్చు. ఇందులో ప్రత్యేకత ఏముంది? మీ అందరికంటే నేనే పొడువు. కాబట్టి, నేనే ముఖ్యం'' అన్నది. ఇంక చూపుడు వ్రేలు చెపుతున్నది - "చూడండి, ఎవరికైనా బుద్ధి చెప్పాలన్నా, ఎవరినైనా హెచ్చరించాలన్నా, ఏ వైపునకైనా సూచించాలన్నా నేనే కావలసి వస్తుంది. కాబట్టి, నేనే ముఖ్యం'', చివరికి బొటన వ్రేలు "మీరు నల్గురూ మూర్ఖంగా వాదిస్తున్నారు. ఒక విషయం ఆలోచించండి. నేను మీతో కలవనిదే మీరు ఏ పనీ చేయలేరు. కనుక, మీ అందరికంటే నేనే ముఖ్యం'' అన్నది. నేటి మీ ధోరణులు, ఆలోచనలు కూడా ఈ రీతిగానే ఉంటున్నాయి. కలసి పని చేయాలి. ఎవ్వరూ ఆధిక్యతను ప్రకటించుకోరాదు. దీనివల్ల సమాజంలో ప్రేమ మరుగై ద్వేషాలు, తగాదాలు పెరిగి అలజడి ప్రారంభమవుతుంది. చేతి వ్రేళ్ళు కలసికట్టుగా పని చేయకపోతే మనం ఏ కార్యమూ సాధించలేము కదా! అదేవిధంగా, వ్యక్తుల మధ్య సమన్వయం, సహకారం లోపిస్తే సమాజం అభివృద్ధి చెందదు.

(స.సా.జ.2000పు.28/29)

(చూ॥ దుర్గుణములు, భద్రము)

భావనాశనము

(చూ॥ధ్యానము)

భిక్షకులు

భగవంతుని ద్వారసన్నిధానమున అంతా భిక్షకులే. లొంగి, వొంగి, పొగడ్తలు చేసి యాచించిన వాడే నిజమైన ధీరుడు. భగవంతునికి అన్నీ బాగా తెలుసునని అతను గ్రహిస్తాడు. అది ఆయన సంకల్పమైతే అన్న వస్త్రాలు లభిస్తాయి. లేకపోతే ఆయన సంకల్పానుసారమే అన్నీ జరుగుతాయి. **ఇదే శరణాగతి లేక ప్రపత్తి.**

(శ్రీ.స.సూ.పు.58)

భిన్నత్వము

(చూ॥ ఏకత్వము, భావాలు)

భీముడు

(చూ॥ అర్జునుడు)

భీష్ముడు

నీవు భీష్ముని వలె చావవలె. భీష్ముడు శరతల్పమున పరుండి, లోకము కొరకు సమస్త ధర్మములును (శాంతిపర్వము) తెలిపి, యనంతరము తన హృదయమున కృష్ణ భగవానుని సాక్షాత్కారించుకొని దేహము వదలెను. మృతి భయంకరమైనదిగాను, సుఖ సందర్భములలో నుచ్చరింప రానిదిగాను భావింప బడుచున్నది. కాని, మృతి మంచిదియు కాదు. చెడ్డదియు కాదు. మృతి విషయమున నీ ఇష్టానిష్టముల కవకాశములు

లేవు. నీవు మృతిని గౌరవించి త్వరలో రప్పించుకొనజాలవు, నిందించి దానిని తొలగించుకొనను జాలవు. అది నీజీవితమున కనివార్యమైన సమాప్తి. దేహి పుట్టిన నిముషము నుండియే శ్మశాన ప్రయాణము ప్రారంభమగును. ఆ ప్రయాణములో కొందరాప్రదేశమును త్వరలో చేరుకొందురు. కొందరు కొంచెమాలస్యముగా చేరుకొందురు. ముందు వెనుకల భేదమేకాని తుద కందరును అక్కడ చేరవలసిన వారే.

(శ్రీ.స.సూ.పు.14)

(చూ॥ గోపికలు, పాపం, విభీషణుడు, సాధకులు)

భూకంపములు

(చూ॥ అవతారము, ప్రకృతిలోని బ్యాలన్సు)

భూత చిత్త చిదాకాశములు

లక్షలమైళ్ళ దూరములో నున్న చంద్రమండలము, కోట్లమైళ్ళ దూరములో నున్న సూర్యమండలము, కోటానుకోట్ల దూరములో నున్న నక్షత్రమండలము, యీ సమస్తమండలములు చేరిన మండలమునే **నభోమండల మన్నారు. దీనినే భూతాకాశము అన్నారు.** ఇది స్థూలస్వరూపమునకు సంబంధించినది. ఇంత పెద్ద భూతాకాశము అగమ్యగోచరము, అప్రమేయమైనట్టిది. అపూరూపమైన యీ భూమండలము **చిత్తాకాశములో ఎక్కడో ఒక చిన్నభాగములుగా కనిపిస్తూవుండాది. చిత్తాకాశమే సూక్ష్మమైన మనోఆకాశము.** ఈ ఆకాశములో భూతాకాశము ఎక్కడో అణుమాత్రంగా ఉండినట్లు కనిపిస్తున్నది. మహాస్వరూపాన్ని ధరించిన యీ చిత్తాకాశము చిదాకాశమునందు అణుమాత్రముగా రూపొందుతుంది. ఈ చిదాకాశమే కారణస్వరూపము అయినట్టిది. భూతాకాశము, చిత్తాకాశము, చిదాకాశము మూడింటియొక్క స్వరూపస్వభావాలు వర్ణనాతీతమైనవి. కనుకనే వేదము **'యతో వాచో నివర్తన్తే అ ప్రాప్య మనసా సహ' వాక్కుతో గానీ మనస్సుతో గానీ అందుకోవటానికి సాధ్యము కాదు అన్నది. ఇలాంటి భగవత్తత్వాన్ని నీవు ఏవిధంగా గుర్తించగలవు? అని ప్రశ్నిస్తుంది. భూతాకాశం స్థూలం, చిత్తాకాశం సూక్ష్మం, చిదాకాశం కారణం. ఈ మూడింటికి అవలనున్న భగవత్తత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇదే మహాకారణస్వరూపము.** ఇట్టి అగమ్యమైన ఆగాధమైనదాని స్వరూపస్వభావాన్ని సామాన్యమైన మానవుడు గుర్తించుట అసాధ్యము. త్రిలోకములకు అధిపతియైన భగవంతుని, త్రిగుణములకు అధిపతియైన భగవంతుని, త్రికాలాధిపతియైన భగవంతుని అల్పజ్ఞులైన మానవులు గుర్తించుట అసాధ్యము. దీనికి సులభమైన ఉపాయము భక్తియోగములో ప్రబోధించింది భగవద్గీత.

(శ్రీ.గీ.పు.9/10)

భూతదయ

(చూ॥ భారతీయసంస్కృతి, రామతత్వము)

భూతము

(చూ॥ దుర్గుణములు)

భూమా

(చూ॥ ఆనందము)

భూమి

(చూ॥ ప్రకృతి, భగవంతుడు)

భూర్భువస్సువః

గాయత్రీ మంత్రమందు "భూర్భువస్సువః" అని ఉన్నది. 'భూర్' అనగా, భూలోకమని అనుకుంటున్నారు. భూలోకమంతయు కేవలం పదార్థములయొక్క (మెటీరియల్స్) చేరికయే. అన్నీ మార్పు చెందునవే, ఏదీ శాశ్వతం కాదు. **ఈ దేహము కూడా నీరు, సున్నము,**

భూషణము

ఇనుము, సబ్బు మున్నగు పదార్థములతో కూడినది. కనుక, 'భూర్' అనగా దేహమే. ఇదే 'మెటీరియలైజేషన్' (materialisation). రెండవది 'భువః' ఇదియే ప్రాణమయము. దీనినే 'వైబ్రేషన్' (vibration) అన్నారు. దేహమనే 'మెటీరియలైజేషన్' ఉన్నప్పటికీ ప్రాణమయమనే 'వైబ్రేషన్' లేకపోతే దేహానికి ఏమాత్రము చలనం ఉండదు. ఈ 'వైబ్రేషన్' కి 'సోర్సు' ఏది? దీనియొక్క 'సోర్సు' 'ఫోర్సు' ప్రజ్ఞానం నుండి ప్రారంభమవుతున్నది. దానినే 'రేడియేషన్' (radiation) అన్నారు. ఇదే వేదమునందు "ప్రజ్ఞానం బ్రహ్మ", "ఆయమాత్మా బ్రహ్మ", "తత్త్వమసి", "అహం బ్రహ్మాస్మి" అనే మహా వాక్యాలలో చెప్పబడింది. ఆ 'రేడియేషన్' ద్వారానే ప్రాణమనే 'వైబ్రేషన్' పని చేస్తున్నది. 'రేడియేషన్' లేకపోతే 'వైబ్రేషన్' కే ఏమాత్రం చలనం లేదు. 'వైబ్రేషన్' లేకపోతే 'మెటీరియలైజేషన్' (దేహము) జడమైనదిగా రూపొందుతుంది. ఈ మూడింటి చేరికయే మానవత్వం.

(సా.శ్రు.పు.30/31)

(చూ॥ హిరణ్య గర్భ తత్త్వం)

భూషణము

మనచేతికి ఏమిటి అందము? పెద్ద పెద్ద కంకణాలు వేసుకోవడం కాదు. **"హస్తస్య భూషణం దానం"**, దానం చేయడమే చేతికి అందము. **"సత్యం కంఠస్య భూషణం"**, సత్యమే కంఠమునకు భూషణం. **"శ్రోత్రంచ భూషణం శాస్త్రం"**, దైవమును గురించి వినటమే శ్రోత్రమునకు అందము. ఇలాంటి అందములను వదలిపెట్టి పిచ్చిపిచ్చి అందములకై ప్రాకులాడట మెందుకు? మీ పంచేంద్రియాలను పరమాత్మునికై వినియోగించాలి. అదే జీవితమునకు ధన్యము. జీవితము నిచ్చినది దేనికోసం? లౌకికమైన సుఖములను అనుభవించుటకు కాదు. అందుకోసమనే త్యాగరాజు కూడా, "నిధి చాల సుఖమా, ఈశ్వర సన్నిధి చాల సుఖమా, నిజముగ తెలుపుము మనసా!" అన్నాడు. ఇవన్నీ కదలిపోయే మేఘాలవలె వస్తాయి, పోతాయి. కానీ, దైవప్రేమ మాత్రం వస్తుంది. పెరుగుతుంది. ఈ ప్రేమను మీరెంత అభివృద్ధి పరచుకుంటారో ఆనందం అంత అభివృద్ధి అవుతుంది. ఈ ప్రేమ ఎంత తగ్గిపోతుందో ఆనందం కూడా అంత తగ్గిపోతుంది. మీరు అమితమైన ఆనందాన్ని పొందాలని ఆశిస్తే దైవాన్ని అమితంగా ప్రేమించాలి. అందరినీ ప్రేమించాలి. అయితే, ఆత్మభావంతో ప్రేమించాలి, దేహభావంతో కాదు.

(సా.శు.పు.96/97)

(చూ॥ నరజన్మ, విద్య)

భృగువల్లి

(చూ॥ తైత్తిరీయోపనిషత్తు)

భేదభావములు

"భగవంతునికి ఎటువంటి ఆలోచనలుగాని, భావములు గాని ఉండవు. ఆయనకు దేనియందు ఇష్టాయిష్టము లుండవు. అలాగే ఆయనకు కొందరి యందుకోపము, కొందరియందు ఇష్టము అంటూ ఉండదు.

ఒకేవ్యక్తియందుగాని, లేక వేరువేరు వ్యక్తులయందు గాని ఆయనకు కాలమును బట్టి మారిపోయే అభిప్రాయములుండవు. ఉన్నత కుటుంబమునకు చెందినవారనీ లేక నీచజాతివారనీ, యువకులనీ వృద్ధులనీ, స్త్రీయనీ పురుషుడనీ, ఈ దేశమునకు చెందినవారనీ పైదేశమునకు చెందినవారనీ భగవంతుడు విచక్షణ చూపడు. ఇవన్నీ నిరంతరం మార్పుచెందే లౌకిక ప్రపంచమునకుచెందిన భేదభావములు, దివ్యత్వమునకు వీటితో సంబంధము లేదు. భగవంతునికి అటువంటి భేదభావము ఎప్పుడూ ఉండదు."

(దై.మ.పు.352/353)

భేదం

శాస్త్ర ప్రమాణము ననుసరించి - ఉత్సాహం, సాహసం, ధైర్యం, సద్బుద్ధి, శక్తి, పరాక్రమము - అను ఈ ఆరు

సుగుణములు ఉండు చోట సాక్షాత్తు భగవానుడు నివసిస్తాడు. పిరకిపందలకు - ఆధ్యాత్మిక క్షేత్రమున చోటేలేదు. దుర్జనులు, దృఢవిశ్వాసము లేనివారు, సందేహస్తులు, ఏడుపుముఖము గలవారు - వైద్యులకు శిష్యులుగా ఉండవలసినవారేకానీ, అట్టివారు **యోగ్యులెన్నటికి కాలేరు. కానేరరు. జ్ఞానికి, - అజ్ఞానికి ఇదే భేదం. "ప్రహసన్నివ" - కృష్ణుడు ఆనందాతిరేకములతో నవ్వుతూ పలుకుట - అర్జునుడు దుఃఖాకులుడై వినుట - జ్ఞాని ఎల్లప్పుడు నవ్వుతాడు. అజ్ఞాని ఎల్లప్పుడు ఏడుస్తాడు.**

(జ.పు.139/140)

(చూ॥పుణ్యఫలం)

భోగభూమి

(చూ॥ భారతదేశము)

భోగములు

ఈ ఓణం పర్వదినం **నాడు వామనమూర్తి పవిత్రత, బలి చక్రవర్తి త్యాగం మనలో ఆవిర్భవించాలి.** మనం త్యాగం చేసే కొద్ది భోగము అధిక మవుతాయి! ఏ భోగములు? **దివ్యమైన భోగములు. "శృణ్వంతు విశ్వేఅమృతస్య పుత్రాః" - అమృత పుత్రులగా మారాలి.** హృదయాన్ని క్షీరసాగరంగా మార్చుకోవాలి. విశాల మెనర్చుకోవాలి. అప్పుడే నారాయణుడు మన హృదయంలో నివాసం చేస్తాడు. మహావిష్ణువు క్షీరసాగరం శయనుడు. అంటే పవిత్రమైన హృదయంలో పవళించి ఉండేవాడని అర్థం.

భగవంతునికి నివాసమైన మనసును అపవిత్రమైన దుర్గుణాలకు నివాసంగా చేసుకోవడం ఎంత పాపం? దుష్టభావాలను, దుష్ట సంకల్పములను త్రుంచి పారవేయాలి. నిర్మలమైన నిస్వార్థమైన ప్రేమను నింపుకోవాలి. జీవితాన్ని భగవంతునికి సమర్పించాలి. అదే తన రాజ్యంలో బలిచక్రవర్తి చేసిన పవిత్ర కర్మ. నాటి నుండి నేటి వరకు ఈ పవిత్ర భావముల సంస్మరణగా ఉత్తేజకరమైన భక్తి శ్రద్ధలతో ప్రజలు ఓణం పండుగ జరుపుకొంటున్నారు.

(జ.పు.165)

చూ॥ పుణ్యఫలం)

భౌతికశాస్త్రము

(చూ॥ జన్మాద్యస్యయతః)

భ్రమ

నిత్య సత్య, నిర్గుణ, నిరూప తత్వాన్ని గుర్తించడానికి భ్రమను దూరం గావించుకోవాలి. ఈ భ్రమ అనే మోహము, మోహగుణములచే సంభవించేది. గుణములు కల్పితములైనవి. స్వప్న దృశ్యమువంటి జగత్తులో భయ భ్రాంతులు ఏర్పడుతూ వుంటాయి. **"విశ్వం దర్పణ దృశ్య మాన నగరీ"** విశ్వం అంతా నగరంలో ప్రతి బింబంగా కనిపిస్తూ ఉన్నా, దానికి అద్దాలకూ ఏమీ సంబంధము లేదు. నేత్రాలకు గోచరిస్తుంది. కాని నేత్రాలతో సంబంధములేదు. నేత్రాలు ఎల్లప్పుడూ సాక్షి భూతములై యుంటాయి, నేత్రాలు సర్వదృశ్యాలను చూడగల్గుతున్నాయి. కాని తమ్ముతాము చూడలేక పోతున్నాయి. ఇట్టి అంధత్వాన్ని నిర్మూలము గావించి, దివ్యత్వాన్ని ప్రాప్తింప చేసేది భగవద్గీత.

(సా.పు.557)

(చూ॥ ఆచరణ, ఆత్మధర్మం, ఆనందము, ఏకత్వము, కలియుగము, దుర్మార్గమైనామార్గం, భజన, శాంతి జీవనము)

భ్రమరములు

(చూ॥ భగవన్నామము)

భ్రమరాంబ

(చూ॥ అర్జునుడు)

భ్రష్టులు

(చూ॥ మాయ)

భ్రాంతి

ప్రకృతిని పరమాత్మభావంతో దర్శించాలి. అప్పుడే "సర్వం విష్ణుమయం జగత్" అనే సత్యం గోచరిస్తుంది. యోగి, భోగి, విరాగి, బైరాగి వీరందరియందున్న ఆత్మతత్త్వం ఒక్కటే. ఆస్తిక, నాస్తిక, యాస్తిక-నాస్తికులందు ఉన్నది కూడా దైవత్వమే. అన్ని జీవులయందు, అన్ని రూపములందు ఉన్న ఆత్మతత్త్వమే దైవత్వము. **అట్టి దైవత్వాన్ని ఒక రూపానికి, ఒక నామానికి పరిమితం చేయడం భ్రాంతియే.** మీరు చూసేది, వినేది, అనుభవించే దంతా దైవత్వంగానే విశ్వసించాలి. అయితే కష్టములు, దుఃఖములు, విచారములు కూడా దైవస్వరూపములేనా అని మీరు ప్రశ్నించవచ్చు అవును, అవి కూడా దైవ స్వరూపములే. ఒక చిన్న ఉదాహరణ: శ్రీమన్నారాయణుడు హిరణ్యకశిపుని పాలిట యముడయ్యాడు, అతని కుమారుడైన ప్రహ్లాదుని పాలిట దేవుడయ్యాడు. యముడూ తానే, దేవుడూ తానే. ఈ రెండూ దైవ స్వరూపములే కదా!

(స.సా.డి.99పు.347/348)

ఒకే చైతన్యము భిన్నభిన్నముగా వివిధరీతుల వ్యక్తమగుటచే వ్యష్టిగాను, వ్యష్టులసమూహమే సమిష్టిగాను ఎన్నబడును. బ్రహ్మచైతన్యమునందే వ్యష్టికల్పనమగుటచే ఆ బ్రహ్మ చైతన్యమే, త్రాటియందు పాముతోచురీతి, ఎండమావుల యందు నీరు తోచురీతి, దేహత్రయయుతముగా తోచునుగాని, ఆ దేహత్రయభావము బ్రహ్మవిదునకు మిథ్యయే. అజ్ఞాని, ఈ భ్రాంతిదశలో కన్పట్టు సంసారమే శాశ్వతమైనట్టును, సుఖప్రదమైనట్లును మోహము చెందును. దీని కాధారభూతమైన బ్రహ్మమునే మిథ్య అనును.

(ప్ర.వా.పు.78)

ఇది భ్రమ. త్రాడును చూచి పామును కోవటము. పామును చూచి త్రాడునుకోవటము. నిత్యమునుచూచి అనిత్యముగా భావించటము, అనిత్యమును చూచి నిత్యముగా విశ్వసించటము. ఈ విధమైన భ్రమతో రెండవదోషము ప్రమాదము సంభవిస్తుండాది. త్రాడును కొని పామును పట్టుకొంటె ప్రమాదముకాక మరి ఏమవుతుంది? ఈనాటి మానవుడు దేహము సత్యమని విశ్వసిస్తున్నాడు. ఇది ఒకనీటి బుడగ వంటిది. ఎప్పుడో ఎక్కడో ఏరకముగానో పగిలిపోతుంది. దేహము సత్యమనుకొని ఆదేహమును సరైనరీతిలో వినియోగించే ఆసక్తి విస్మరిస్తున్నాము.

ఆదివ్యమైన శరీరములో ఉండినంతవరకును అనేక రకములైన పనులు ఆచరిస్తుంటాయి. ఈ శరీరము సత్యమని మనము భ్రమించి ప్రమాదమునకు గురియై పోతున్నాము. నమ్మదగినవారిని నమ్మకుండా నమ్మరాని వారిని నమ్ముతున్నాము. నాది, నావారు అనుకున్న వారంతా ఎంతకాలముండగలరు? ఎవరికి ఎవరు? మిథ్యను సత్యమనుకుంటున్నాము.

(బ్ర.త్ర.పు.87)

(చూ॥ అష్టాగయోగములు, దేహభ్రాంతి)

మంగళవారము

ఈ రోజు మంగళవారము - మంగళదినము. సీతాదేవి ఈ శుభదినమున, తన్ను రక్షించుటకు శ్రీరాముడు వచ్చుచున్న సంతోష వార్తను హనుమంతుని ద్వారా వినెను. అప్పుడు సీత 'ఇప్పటినుండియు ఈ దినము 'మంగళవారము' గా పరిగణింపబడుగాక' అనెను. ఇదే దినమున అతి భయంకరమైన రాక్షసరాజు, రావణాసురుడు రాముల వారిచే ఓడింపబడి, చంపబడెను. అదే విధముగా ఈ దినమున మీరందరును మీలోని రాక్షస ప్రవృత్తులను, లక్షణములను నాశనమొనర్చి, సాధన మార్గమున ముందంజవేయవలెనని ఆశీర్వదించు చున్నాను.

(శ్రీ.స.సూ.పు.93)

జానకి రామవిజయమును రావణ పరాజయమును విని సంతసించి ఆమె ప్రసన్నురాలై దేహము పులకరించి ఆనందబాష్పములు రాల్చుచూ, ఓ కపీశ్వరా! ఈ శుభవార్త నందించినందులకు నేను నీకేమియ్యగలను? నీ వాక్కునకు సమాధానమైన వస్తువులు లేవు. అందులకు హనుమంతుడు, తల్లీ! మీ ఆనందమునకు మీ ప్రసన్నతకు నాకీ దినమున మూడు లోకముల **రాజ్యము లభించినంత ఆనందమాయెను. నేడు శత్రువును జయించి తమ్మునితో కూడిన నిరామయుడగు రామప్రభువును చూచుటకంటే భాగ్యమేమి కలదు, అని నమస్కరించెను.** అంత జానకి వానరోత్తమా, నేను ఈ పదినెలలు రామచంద్రుని వియోగదుఃఖమున మునిగినందున బైటప్రపంచము ఏమియూ కనిపించలేదు. **నేడు ఏమి వారమో ఏమి తిథియో తెలియదు. యేమైన నేడు మంగళకరమైన వార్తను తెలిపితివి కనుక ఈనాడు మంగళవారమనే పిలుతును. నీవీవార్త నందించినందుకు ఈ దినము నిన్ను పూజించు దినముగా ఆశీర్వదింతును. అని సీత పలికెను.** హనుమంతుడు ఇది మహాప్రసాదమని చేతులు జోడించి సీతకు నమస్కరించెను.

(రా.వా.రె.పు.202)

(చూ॥ హిరణ్యగర్భతత్త్వం)

మంగళసూత్రము

(చూ॥ రామలక్ష్మణులు, స్త్రీలు)

మంచి

మంచి తలుపుయు - మాటయు- మంచిచేత
మంచి వినికిడి - చూపును - మంచితనము
మంచి ఆరోగ్యమిచ్చును మానవులకు
సత్యమును తెలుపుమాట సాయిమాట.

(త.పు.179)

మనసునందున మంచి। మాటలందున మంచి।
నడతలందున మంచి। వాడును కాకున్న
సాయి మిముమెచ్చి । సంతోష మెట్లిచ్చు।
శాంతి ప్రేమదాయి సత్యసాయి॥

(సా.పు.125)

(చూ॥ స్వామి కోరిక)

మంచిచెడ్డలు

లోకంలో మంచి చెడ్డలకు మధ్య సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఎప్పుడు? ఎవరి మధ్య జరుగుతుంది? మూర్ఖుల మధ్య జరుగు తుంటుంది. ఎవరైనా మంచి పేరు తెచ్చుకుంటుంటే, అభివృద్ధిలోనికి వస్తుంటే, వారిపైన లేని పోని అపోహలు కలిపిస్తుంటారు. కొందరు స్వార్థపరులు. వాటిని మనం ఏ మాత్రం లెక్కచేయ కూడదు. నిందలు, స్తుతులు ఇవన్నీ మానవత్వంలో వచ్చే సహజములే. కీర్తికి, అపకీర్తికి మధ్య ఇలాంటివన్నీ జరుగుతూ ఉంటాయి. మన భారతదేశంలో కూడా గొప్ప పేరుపొందిన మహనీయులు కూడా వీటన్నింటిని ఎదుర్కొనిన వారే. కాని వారు ఆత్మ విశ్వాసంతో విజయాన్ని సాధిస్తూ వచ్చారు. సత్యంతో జీవించే వారికి, ప్రేమతో బ్రతికే వారికి, ఏనాటికి ముప్పురాదు.

(శ్రీ.డి.2000 పు.4)

త్రేతా యుగంలో రాక్షసులు ఒక చోట, దేవతలు మరొక చోట ఉన్నారు. కనుకనే, రాక్షసులను చంపడానికి రాముడే స్వయంగా సంసిద్ధుడయ్యాడు. ద్వాపర యుగంలో రాక్షసులు, దేవతలంతా ఒకేగృహంలో ఉన్నారు. అందుచేత కృష్ణుడేమి చేశాడు? దేవతలకు సారధిగా మాత్రమే నిలిచాడు. తాను యుద్ధం చేయలేదు. **ఇంక ఈ కలియుగం వచ్చే సరికి ఏమయింది? దేవతలు, రాక్షసులంతా ఒకే దేహంలో ఉంటున్నారు.** ఒక నిమిషంలో దుర్గుణాలు, మరొక నిమిషంలో సద్గుణాలు! మానవుడు ఎప్పుడు మంచిగా ప్రవర్తిస్తాడో, ఎప్పుడు చెడ్డగా ప్రవర్తిస్తాడో చెప్పడానికీ వీలులేదు. అందువల్ల ఈ **కలియుగంలో దేవుడేం చేసాడు? మంచిచెడ్డల భాధ్యత మానవునికే ఇచ్చేశాడు. "నిన్ను నీవు రక్షించుకొన్ననూ, శిక్షించుకున్ననూ నీదే బాధ్యత. నేను సాక్షీభూతునిగా, నీలో ఆత్మగా ఉంటున్నాను"** అన్నాడు. కనుక, మానవుడు తన దోషాలను తాను గుర్తించి వాటిని తీసివేసుకొనుటకు తానే ప్రయత్నించాలి.

(శ్రీ.భ.ఉ.పు.188)

దివ్యత్వమునకు మంచి వారు చెడ్డవారు ఇద్దరు బాధించేవారే. ఆస్తికులు నాస్తికులు ఇద్దరు కూడను దూషించేవారే. దివ్యత్వమును మంచివారు చెడ్డవారు హింసించేవారే. ఏమిటి ఈ హింసయొక్క అంతరార్థము? దీనిని హింస అని ఏ రీతిగా మనం భావించవచ్చును? అని విచారం చేయగా మంచివారి వియోగమే దుఃఖమునకు మూలకారణము, చెడ్డవారి సంయోగమే దుఃఖమునకు మూలకారణము. ఏతావాతా సంయోగవియోగములు రెండును దుఃఖమునకు మూలకారణములే. కనుకనే దివ్యత్వము ఇద్దరినీ ఆశీర్వదిస్తూ వచ్చింది. ఈ ఆశీర్వాదమునకు అంతరార్థమేమిటి? చెడ్డవారియొక్క సంయోగము, మంచివారియొక్క వియోగము ఉండకుండా ఉండాలి, అని ఆశీర్వదించాడు. మంచివారియొక్క సంయోగమును పెంచుకోవటము, చెడ్డవారి సంయోగమును తుంచుకోవటము మానవుని ప్రధానమైన సాధనము. ఈ సంయోగవియోగములు రెండును ఒకే హృదయమునుండి ఆవిర్భవిస్తాయి. ఒకే సముద్రమునందు అమృతము విషము రెండూ ఉద్భవించాయి. అమృతము ఆనందాన్ని అందించింది,

నిరత సత్యప్రౌఢి ధరణి నేలిన హరి
శ్చంద్రుడీ ధర బాసి చనగ లేదె
ఎల్ల లోకము లేలి యెసగు శ్రీ నలరాజు
తనవెంట భూమిని కొనుచు చనెన
కృతయుగంబున కలంకృతి చేయు మాంధాత
సిరి మూట గట్టుక నరుగ జనెన
జలధి సేతువు కట్టె అలనాటి శ్రీరాము
డుర్విపై నిప్పుడు నున్న వాడ
ఎందరెందరు రాజులు ఏగినారొ
ఒక్కరును వెంట కొనిపోరు ఉర్వితలము
మీరు మాత్రము మీ విద్య సిరులుగాని
తలను గట్టుక పోరు విద్యార్థులార:
ఏదీ మనవెంట రాదు. వచ్చేవి రెండే. అదే మంచి, చెడ్డ.
మనము ఏది చేస్తామో అది మాత్రం మనవెంట వస్తుంది. మంచిని చేసి మంచిని తీసుకోండి. ఏవిత్తును నాటుతామో అదేఫలము మనకు లభిస్తుంది.

(బృత్ర.పు.165)

సృష్టియందు మంచి, చెడ్డ అనే తారతమ్యములుండ వచ్చును. భగవంతుని దృష్టిలో మంచి చెడ్డలు అనేవి లేవు.

ఒకటి చెడ్డయనుచు ఒకటి మంచి యనుచు
సృష్టియందు నిర్ణయింపనగునే
అదియు నిదియు ఒక్క ఈశ్వరుండు చేసే
భేధమెందుకలదు భక్తులారా.

నీవు ప్రకృతి వాతావరణమునకు బానిసవుగనుక కొన్ని పరిమితులు పెట్టుకొని ఉండటంచేత ఇది మంచి, ఇది చెడ్డ అని నీ వూహ మాత్రమే. విభజన జరుపుచున్నది పరిమితులు మాత్రమే. ఈ మంచిచెడ్డలుకు మూలకారణము మీ భావములు, లీలలు, గుణములు అన్నియును సంకల్ప, వికల్పముల స్వభావములు.

(సా.పు.69)

(చూ॥ అగ్ని, కర్మలు, తత్త్వజ్ఞానము, దైవసంకల్పము, పాత్ర, విరోధులు, వివేకానందుడు, సర్వమూభగవంతుడే!, సర్వవ్యాపకుడు)

విషము బాధను కలిగించింది. అమృతము కీర్తిని పొందింది, విషము అపకీర్తినందుకుంది. కనుకనే మానవత్వము ఏ మంచి కీర్తిని సంపాదించగలదో ఆ కీర్తి నిమిత్తమై మంచిని మనం పోషించుకోవాలి. **ఈనాటి మానవుడు పుణ్యపదమును అమితంగా ఆశిస్తున్నాడుకాని, పుణ్యకార్యములకు ముందంజ వేయటం లేదు. పాపఫలమును అంగీకరించటం లేదు కాని పాపకార్యములు చేయటానికి ముందంజ వేస్తున్నాడు. ఇదే మూలకారణం. "పుణ్యస్య ఫల మిచ్ఛంతి పుణ్యం నేచ్ఛంతి మానవాः, న పాపఫల మిచ్ఛంతి పాపం కుర్వంతి యత్నతः" అన్నారు. పాపఫలము వద్దని నీవు విసర్జించినపుడు పాపకార్యములో ప్రవేశించకు. పుణ్యఫలము నీవు ఆశించినపుడు పుణ్యకార్యములు చెయ్యటానికి పూనుకో.** మానవత్వములోపల రెండువిధములైన తత్త్వములు ఉంటున్నాయి. కొందరు వ్యక్తులయందు మంచిచెడ్డలు సమ్మిళితమై ఉంటుంటాయి. కాకులు చేదునిమ్మను ఆరగిస్తాయి. ఆనందిస్తాయి. కోకిల తియ్యని మామిడి చిగుళ్ళను తిని సంతోషిస్తుంది. అదేవిధముగనే కొంతమంది మానవులు లోక విషయ వాసనలు ఆశించి అందులోనే ఆనందముందని విశ్వసించి దాని నిమిత్తమై ప్రాకులాడుతుంటారు. మంచివారు దివ్యత్వముయొక్క ప్రేమ తత్త్వము అనుభవించాలని అట్టులు చాస్తూ దాని నిమిత్తమై ప్రాకులాడుతుంటారు. ఈ రెండింటి తత్త్వమునందు మంచిచెడ్డలు ఇమిడి ఉంటున్నాయి. మంచిని ఎప్పుడు బాధలే వెంటాడుతుంటాయి. ప్రాకృతమైన దృష్టిలో అది ఒక హీనమైన స్థితిగా భావిస్తుంటారు. కోరిన ఫలములు అందించేది కల్పము వృక్షముగా ఉంటుండాది. విలువైన రత్నమును అందించే సముద్రము ఉప్పునీరుగా తయారైంది. కనుక ఈ మంచిచెడ్డలయందు మానవత్వాన్ని విచారించినపుడు వాళ్ళ అభీష్టముపైన ఈ **మంచిచెడ్డలు** ఆధారపడినవే కాని నిజమైన పదార్థముపైన కాదు.

(శ్రీ.స.వి.వా.పు.2/3)

మంచితనము

విద్యార్థులారా! "హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్", ఎల్లప్పుడు సహాయమే చేయండి. ఎవ్వరిని బాధించకండి. ఇదే భారతీయ సంస్కృతి యొక్క ప్రధాన సూత్రము. మీరు గొప్ప డిగ్రీలు తీసుకోవచ్చు. విదేశాలకు పోవచ్చు, తప్పులేదు. కాని, భారతీయ సంస్కృతిని మాత్రం మర్చిపోకండి. ఎక్కడికి వెళ్ళినా మీ జీవితాన్ని ఆదర్శంగా నిరూపించండి. అందరితో స్నేహంగా ఉండండి, మంచి మాటలు మాట్లాడండి, మంచి పనులు చేయండి, మంచి పేరు తెచ్చుకోండి. అదే నిజమైన మానవత్వం. **మీరు గొప్పవారు కావడానికి ప్రాకులాడకండి, మంచివారు కావడానికి ప్రయత్నించండి. గొప్పవారు తప్పు పనులు చేయవచ్చు. కాని, మంచివారు ఏది చేసినా అది ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉంటుంది.** రావణుడు, రాముడు ఇరువురూ విద్యలో సమానులే! కాని, **రావణుడు గొప్పవాడు, రాముడు మంచివాడు. చూశారా! మంచితనానికి, గొప్పతనానికి ఇంత వ్యత్యాసం ఉంటుంది. రావణుడు కామాన్ని** బలపర్చు కున్నాడు. ఈ ఒక్క దుర్గుణంచేత తనతో పాటు తన వంశాన్ని కూడా నాశనం చేసుకున్నాడు. హిరణ్యకశిపుడు పంచ భూతములను హస్తగతం చేసుకొని వాటితో ఆడుకున్నవాడు. అంతటి గొప్పవాడు క్రోధం వలన నాశనమైపోయాడు. ఇంక, దుర్యోధనునిలో ఉన్న దుర్గుణం లోభత్వం. **పాండవులు కనీసం** ఐదు గ్రామాలైనా ఇవ్వమని అడిగితే, సూదిమొన మోపినంత స్థలం కూడా ఇవ్వనన్నాడు. కట్టకడపటికి **అతనికి ఏ గతి పట్టిందో మీకు తెలుసు. రావణుడు కామమువలన, హిరణ్యకశిపుడు క్రోధంవలన, దుర్యోధనుడు లోభం వలన పూర్తిగా నాశనమై పోయారు.** ఏదో ఒక్క దుర్గుణం ఉన్నవారే ఆవిధంగా నాశనమైపోతే, కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యములనే ఆరు దుర్గుణాలున్న మానవునికి ఏ గతి పడుతుందో ఒక్కతూరి యోచన చేసుకోండి.

(స.సా.జ.2000పు.20)

మంచివారు ఎక్కడున్నప్పటికీ, ఆ మంచితనాన్ని ఎంత మంది ఎన్ని విధాలుగా దాచుటకు ప్రయత్నించినప్పటికీ అది దాగేది కాదు.

"పెద్ద వజ్రమొకటి పెంటలో దొరికిన
విలువ మారదు దాని వెలుగు పోదు
మంచి గుమ్మడి పండు కంచెలో కాచిన
రుచియు మారదు దాని చవియు పోదు.
గొప్ప నెమలి గ్రుడ్డు కోడి తా పొదిగిన
వన్నె మారదు దాని చిన్నె పోదు"
అదే విధంగానే గొప్పవారి దివ్య తేజస్సులు,
దివ్య ప్రభావములు, దివ్య తత్త్వములు ఏ విధమైన స్థానములో ఉన్నప్పటికీ, ఎలాంటి పరిస్థితులందున్నప్పటికి వాటి విలువ ఏనాటికి మారదు.

(స.సా. జ.94.పు.3)

(చూ॥ బెస్ట్‌ఫ్రెండ్స్)

మంచినడత

మంచికాలము, పదవులు, మంచిబ్రతుకు
కోరుచుందురు మనుజులు; కోరబోరు
మంచిబుద్ధులు జ్ఞానంబు, మంచినడత
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపరతు?
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా!

(స.సా.వా. పు. 106)

మంచిపనులు

"మంచి పనులన్నీ కష్టపడి చేయవలసి ఉంటుంది. సుఖం ఔన్నత్యం కలిసి జతగా ఉండలేవు. కష్టాలు మనిషిని ఎల్లప్పుడూ జాగ్రత్తగాను, పొందికగాను ఉండేటట్లు చేస్తాయి. మనిషిలో నిగూఢంగా ఉన్న కౌశల్యాలు, అపరిమితమైన తెలివి తేటలు క్రమమయ్యే లాగ చేస్తాయి. ధైర్యాన్ని పెంపొందిస్తాయి. విశ్వాసం వేళ్ళు నాటుకొని బలపడేటట్లుగా చేస్తాయి.

(లో.పు.13)

మంచిబుద్ధులు

(చూ॥ మంచినడత)

మంచిబ్రతుకు

(చూ॥ మంచినడత)

మంచి మాట

చిత్త శుద్ధిలేని రిత్త మానవులందు
క్రోధ మత్సరములు కూడియుండు
చీకటింటిలోన చేరవె గబ్బిలాల్
మరవబోకు డిట్టి మంచిమాట

(బృ.త్ర.పు.54)

మంచివాడు/మంచివారు

'జంతూనాం నరజన్మదుర్లభం' అన్నారు. ముఖ్యంగా 'నర' శబ్దమునకు అంతరార్థం తెలుసుకోవాలి. 'న' అనగా కాదు. 'ర' అనగా మృత్యువు. నాశనము కానటువంటి తత్త్వమునకే 'నర' అని పేరు. 'నరుడు' అనగా నాశనం కానటువంటివాడు. నర, నారద, నారాయణ - ఈ మూడు పదముల అంతరార్థమును తెలుసుకుంటే, ఈ మూడు ఒక్కటే అని తెలుస్తుంది. నరునకు, నారాయణుని చూపించినటువంటివాడే నారదుడు. 'నర' తత్త్వమునకు ఎంతటి ఉత్తమమైన అర్థములో ఉంటున్నాయి. ఇలాంటి 'నర' మానవత్వాన్ని దుర్వినియోగపరుచుకుంటున్నందుకు విచారించాలి. నరునికంటే దైవం వేరొకడుకాదు. దైవం తనకంటే భిన్నంగా లేడు. తనకన్నా భిన్నంగా లేనటువంటివాడు కనుకనే, భగవంతుని పూజించనవసరం లేదన్నాడు నారదుడు. నరుడే నారాయణుడు. నరుని యందు నారాయణుని చూడటమే నిజమైనటువంటి మంచితనం. నారాయణుని యందు నరత్వమును వహించటమే గొప్పతనం. **కాని మనం 'గొప్పవాడు' కావాలని ఆశిస్తున్నాం. గొప్పవాని కంటే మంచివాడు చాలా ఉత్తముడు. ప్రతి నరుని యందు నారాయణుని చూస్తుంటాడు మంచివాడు. కాని నారాయణుని యందు కూడనూ నరుని చూస్తూ వస్తుంటాడు చెడ్డవాడు. అతనే రావణుడు.** కాని నారదుడు నరునియందు నారాయణుని చూస్తూ వచ్చాడు.

(శ్రీ. సె. 2000 పు. 8)

(చూ॥ మంచితనము)

మంచివారిహృదయము

చక్కని పరిమళముగల పుష్పము కుడిచేతి యందుంచు కొన్ననూ, యెడమ చేతియందుంచు కొన్ననూ, దాని సువాసన యెట్లు మారక యేకస్థితిగా నుండునో, అటులనే **మంచివారి హృదయములు** అడవులయందున్న, ఆకసమునందున్న, పల్లెనున్న, పట్టణమునందున్న, గుట్టమీదనున్న, నట్టేటయున్నా, పట్టువిడువని పవిత్రత చిట్టచివరి వరకూ మారదు. దానికి మీ తాతలే ప్రత్యక్ష సాక్షులు. సన్మార్గులు యొక్క సంతోష శాంతులు, దుర్మార్గులకు ఆనంద ఆదాయములు.

(భా.వా.పు.116)

మంచి సమయము

ఆధ్యాత్మిక జీవితం చిన్నప్పటినుంచే ప్రారంభం కావాలి. చిన్నతనమే మంచి సమయము.

(సా.పు.74)

మండోదరి

(చూ॥ భర్త, రావణుడు)

మంత్రపుష్పము

(చూ॥ దైవలక్షణాలు)

మంత్రము

తైత్తిరీ యోపనిషత్తు కృష్ణయజుర్వేదము నందలి తైత్తిరీయశాఖ లోనిది. ఈ ఉపనిషత్తు అతి

మంత్రశక్తి

పూరాతనమైనది. దీని యందున్న ప్రతి ఒక్కటి మంత్రస్వరూపమే. మంత్రము అనగా కేవలం "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరి గాని, "ఓం నమఃశివాయ" అనే పంచాక్షరి గాని కాదు. **"మనన త్రాణ సమ్మిళితం ఇతి మంత్రః" మననం చేసి, మనస్సునందు స్థిరపరచుకొన్నదే మంత్రం.** ఈ ఉపనిషత్తు నందు ప్రతి చిన్న పదము కూడా మంత్రస్వరూపకంగా ఆవిర్భవించి, వ్యాప్తి నొందినవి. **"సత్యం వద - ధర్మం చర", "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ"** మున్నగు చిన్న చిన్న పదములే మంత్రస్వరూపాన్ని ధరించి, మానవునకు బోధల నందించి ఆనందాన్ని చేకూర్చుతున్నాయి.

ఈ ఉపనిషత్తు నందు గల మరొక విచిత్రమైన రహస్యమేమిటంటే - సాధారణంగా ఒక్కొక్క ఉపనిషత్తు ఒక్కొక్క స్థాయి వారికే సమన్వయమై ఉన్నవి. కాని, ఈ తైత్తిరీ యోపనిషత్తు నందలి దివ్యబోధలు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమాలకు చెందిన వారందరికీ సమత్వంగా సమన్వయమై ఉన్నవి.

(స.సా.న.91 పు.297/298)

మీరేదో ఒక మంత్రమును ఉచ్చరించాలి. తరువాత దానిని మననంచేయాలి.మననం చేసినదానిని ప్రాణశక్తిగా మార్చుకోవాలి.

"మనన స్మరణ సమ్మిళితం మంత్రమ్".

ప్రతిమాటకూడను ఒక మంత్రమే. ప్రతి శబ్దముకూడను ఓంకారమే. సర్వత్రా పరమాత్మయే.

(ఆ.రా.పు.297)

విధింప బడిన అర్థాన్ని వివరించి చెప్పేది మంత్రము. మననము చేయడానికి హేతవయ్యేది మంత్రం అని కూడా అనవచ్చును. 'మం' మననము 'త్రా' త్రాణశక్తి ఏతావాతా - **మననత్రాణ సమ్మిళితము మంత్రము.** యజ్ఞయాగాదికర్మలు చేస్తూ వాటి స్వరూపాన్ని స్మరించటం యాజ్ఞికులు ప్రత్యేకంగా ఉచ్చరించే శబ్దాలు మంత్రాలు. అయితే ఈనాడు మంత్రాలను వల్లెవేస్తున్నారు, పారాయణం చేస్తున్నారు అర్థాలు తెలియకుండా అలాచేస్తే పారాయణముల ప్రయోజనముండదు. అర్థజ్ఞానంతో పఠించిన సంపూర్ణ ప్రయోజనము కలదు.

(లీ.వా.పు.9)

(చూ॥ అధర్వణవేదము, ఋగ్వేదము, నేను, పృథ్వి, యజుర్వేదము, వేదము, శాఖలు)

మంత్రశక్తి

ఆనాడు అశ్వత్థామ, అర్జునుడు ఇరువురు యుద్ధము చేసినపుడు వారు విడిచిన బ్రహ్మాస్త్రము, పాశుపతాస్త్రముల ప్రభావమే గర్భములో ఉన్న శిశువు మరణించుటకు కారణము. ఈనాడు ఆటంబాంబులో హైడ్రోజిన్ బాంబులో వేసేటప్పటికి ఎక్కడో ఉన్న గర్భములు నశించిపోతున్నాయని అనుకుంటున్నారు. ఇది ఈనాడు క్రొత్తగ కనిపెట్టినది కాదు. పాతవాటిని ఈనాడు ప్రదర్శిస్తున్నారు. **~~ఈనాడు యంత్రశక్తి;~~ ఆనాడు మంత్రశక్తి. ఆనాడు ఒక అస్త్రమును ప్రయోగించినారంటే తిరిగి దానిని ఉపసంహరించుకొనే శక్తి వారికి ఉండేది. నేడు ప్రయోగమేకాని ఉపసంహారము లేదు.**

(ని.పు.112)

మంత్రులు

(చూ॥ సుమంతుడు)

మంథర

కైకకు రాముడంటే అత్యంత ప్రీతి. తన స్వంత కుమారుడైన భరతునికంటే రాముడినే అత్యంత ప్రేమతో చూసేది కాని, మధ్యలో మంథర చేరి ఆమెకు దుర్బోధలు చేసింది. **~~ఈ మంథర ఎవరు?~~** ఒక పర్యాయం కైకేయి తండ్రియైన కేకయరాజు వేట నిమిత్తం అడవికి వెళ్ళినపుడు ఒకచోట అతనికి ఆడ, మగ జింకలు రెండు ఆడుకుంటూ కనిపించాయి. వెంటనే కేకయరాజు మగజింకను బాణంతో కొట్టాడు. ఆడజింక ఏడ్చుకుంటూ తన తల్లిదగ్గరకు వెళ్ళి

"అమ్మా! ఈ కేకయరాజు నా భర్తను హతమార్చాడు. ఇప్పుడు నా గతి ఏమిటి?" అన్నది. అప్పుడా తల్లిజింక కేకయరాజు దగ్గరకు వచ్చి "రాజా! భార్యాభర్తలను విడదీయటం మంచిది కాదు. నీవు మహారాజువైయుండి ఇలాంటి పనికి పూనుకోవడం న్యాయం కాదు. ఇప్పుడు నీవు చేసిన పనిచే నీ జీవితంలో అశాంతికి కారణ మౌతుంది. నేనేవిధంగా నా అల్లుని మరణంతో బాధపడుతున్నానో అదేవిధంగా, నీవుకూడా నీ అల్లుని మరణంతో బాధపడతావు. దానికి నేనే కారణమౌతాను," అన్నది. ఆ జింకయే మంథరగా పుట్టి, దశరథుని మరణానికి కారకురాలై, కేకయ రాజుకు దుఃఖాన్ని కల్గించింది. ఈవిధంగా విచారణ చేస్తే వేదశాస్త్ర పురాణములందు ఇట్టిప్రమాణాలు అనేకంగా కనిపిస్తాయి. వేదశాస్త్రపురాణములు అవినాభావసంబంధం కల్గినవి. అవి అన్యోన్యాశ్రయములు. అది వేరు, ఇది వేరు అని వాటిని విభజించడానికి వీల్లేదు.

మంథరకు పాతసంకల్పం మనస్సులో ఉంది. దశరథునిపై లేనిపోని చాడీలు చెప్పి, అతనిపట్ల కైకకు గల ప్రేమను చెడగొట్టాలని ఆమెకు బుద్ధి పుట్టింది. ఇంతలో దశరథుడు శ్రీరామ పట్టాభిషేక శుభవార్తను కైకకు తెలియజేయడానికి మేళతాళాలతో ఊరేగింపుగా వస్తున్నాడు. గుట్టములు సకిలిస్తున్నాయి, ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. మంగళ వాద్యాలు వినిపిస్తున్నాయి. ఈ శబ్దములు ఎక్కడినుండి వస్తున్నాయో చూద్దామని గూని మంథర భవనంపైకి ఎక్కి చూసింది. దశరథుడు ఊరేగింపుగా రావడం కనిపించింది. **రాజు ఇంత వైభవంగా ఉండటం ఆమెకిష్టం లేదు.** క్రిందికి దిగి వస్తుంటే కౌసల్య చెలికత్తె ఒకామె ఎదురు వచ్చింది. ఆమె కౌసల్య తనకిచ్చిన పట్టువస్త్రాలను ఆభరణాలను ధరించి వాటిని కైకకు చూపించాలని వస్తోంది. మంథర "ఏమిటి నీవింత అలంకారం చేసుకొని వస్తున్నావు? ఎవరిచ్చారు నీకివన్నీ?" అని అడిగింది. తన కుమారుడైన రాముడు రాజుగా పట్టాభిషిక్తుడు అవుతున్నాడన్న ఆనందంతో కౌసల్య తన దాసీలందరికీ పట్టువస్త్రాలను, నగలను బహూకరించిందని ఆమె చెప్పింది. **ఈ మాటలు వినగానే మంథరకు అసూయ కల్గింది. తనకు కూడా ఇవ్వనందుకు ఆమెకు కోపం వచ్చింది.** వెంటనే లోపలకు ప్రవేశించింది. ఆ సమయంలో కైక చాలా ఆనందంగా అలంకారం చేసుకుంటోంది. మంథర "కైకా! ఏమి నీవైభవం? ఏమిటీ అలంకారం? ఎందుకోసం చేసుకుంటున్నావు?" అని అడిగింది. కైక ఆమె మాటలను లెక్క చేయలేదు. దగ్గరకు వెళ్ళి "కైకమ్మ! రాజుకు నీవంటే చాలా ప్రేమ అని భావిస్తున్నావు. అది కపటప్రేమ. ఆ ప్రేమను నమ్మి నీవు మోసపోతున్నావు. ముమ్ముందు నీ పరిస్థితి చాలా దిగజారిపోనున్నది. చూడు, నా మాట విను," **అంటూ ఆమెభుజంపై సున్నితంగా కొట్టింది. ఆ స్పర్శచేత ఆమెలో ఉన్న దుర్భావాలు కైకలో ప్రవేశించాయి. కనుక, దుర్గుణములు గలవారితో మనం ఎప్పుడూ చేరకూడదు. వారి స్పర్శకూడా మనకు చాలా ప్రమాదం తెప్పిస్తుంది.** అంత వరకు రామున్ణి ఎంతగానో ప్రేమించిన కైక ఆ క్షణంలో అతనికి విరోధిగా మారిపోయింది. **అసూయకు మారుపేరైన మంథర తన దుర్బోధలతో ఆమె మనస్సును పాడుచేసింది. అసూయ అనే పెనుభూతం పట్టినవారెవ్వరూ బాగుపడరు. కనుకనే, నేను అప్పుడప్పుడు చెబుతుంటాను - "త్యజ దుర్జన సంసర్గం." దుర్గుణములు గలవారితో సహవాసం చేయ కూడదు. మీ ప్రాణం పోయినా సరే, అసూయా పరులతో స్నేహం చేయకూడదు.**

(స.సా.మే.2001పు.133/134)

దుర్గుణములన్నింటిలోనూ అసూయ చాలా చెడ్డది. అసూయచేతనే లోకం మూడు భాగములు చెడిపోతున్నది. అందంగా ఉన్నవారిని వికారంగా చేయడం...ఫస్ట్ క్లాసులో పాసయ్యేవారిని పాడు చేయడం....ఈ రీతిగా, బాగున్నవారిని చెడగొట్టడమే అసూయయొక్క పని. **రామాయణంలో రావణుడు మరణించాడుగాని, మంథర ఈనాటికీ మరణించ లేదు. అసూయ అనే మంథర ఇప్పటికీ సజీవంగానే ఉన్నది. ఈ 'మంథర'ను మరణింప**

మంథర - శూర్పణఖ

జేసేవారు ఎవ్వరూ లేరు. దీనిని లెక్కచేయకుండా ఉండడమే మనం చేయవలసిన పని.

చెడ్డ మాటలు చెప్పకూడదు, చెడ్డ మాటలు వినకూడదు, చెడ్డ పనులు చేయకూడదు. ఇదే రామాయణం అందించే ప్రధానమైన ఆదర్శం. చెడ్డ మాటలు చెప్పింది మంథర; చెడ్డ మాటలు విన్నది కైక. వారి గతి ఏమైపోయింది? **ఈనాడు లోకంలో స్త్రీ లెవరైనా మంథర, లేక, కైక అని పేరు పెట్టుకుంటున్నారా? కౌసల్య పేరు పెట్టుకుంటారు గాని, కైక పేరుగాని, మంథర పేరుగాని ఎవ్వరూ పెట్టుకోరు. చెడ్డ చూపులు చూశాడు కీచకుడు. తత్ఫలితంగా భీముడు అతని తల పగలగొట్టాడు. ఈనాడు మగవారిలో ఎవరైనా కీచుకుని పేరు పెట్టుకుంటున్నారా? ఎవ్వరూ పెట్టుకోరు, చెడ్డ మాటలు చెప్పినవారిని, చెడ్డ మాటలు విన్నవారిని, చెడ్డ చూపులు చూసినవారిని నిరసిస్తుంది లోకం.**

(స.సా.మే.2001పు.135)

(చూ॥ కామము - క్రోధము)

మంథర - శూర్పణఖ

రామాయణ గాథమొత్తం యిద్దరు స్త్రీలపై ఆధారపడివుంది. ఒకతె **మంథర - అది మత్సరానికి ప్రతీక. రెండవది శూర్పణఖ - అది కామానికి ప్రతీక.** మంథరకుట్ర వల్ల రాముడు వనవాసం పోయాడు. శూర్పణఖ కారణంగా సీత అపహరించబడినది. నిజానికి ఈ పాత్రలు రెండూ చెప్పుకోదగ్గవికావు. కాని అవి నిర్వహించిన పాత్ర మాత్రం విశేషమైందే! **మత్సరం, క్రోధం అణుబాంబులకన్నా శక్తి వంతమైనవి, కాని హృదయంలో రాముణ్ణి ప్రతిష్టించుకో అవి నిర్వీర్యమవుతాయి.**

(శ్రీ.సా.గీ.పు.147)

మందిరము

దేహమనే మందిరమును ఐదు ద్వారములుంటున్నవి. ఈద్వారములు ఎందుకోసము నిర్మించారు? దైవదర్శనం నిమిత్తమై ప్రవేశించే భక్తులకోసం ఏర్పరిచినది. ఒక్కొక్క దేవాలయమునకు అనేక ద్వారములుంటాయి. ఈద్వారములలో భక్తులే ప్రవేశిస్తుంటారు. గాని అన్యులు ప్రవేశించరు. ఒక చిన్న ఉదాహరణ. మనము ఒక యిల్లు కట్టుకున్నాము. చక్కగా సుందరముగా ఉంటున్నాది. అనేక ద్వారములు పెట్టుకున్నాము. మనము మన బంధువులు మనవారు అందులో ప్రవేశించటము వెలుపలకు పోవటము ఈ అనుకూలం నిమిత్తము ద్వారములు పెట్టుకున్నాము. ద్వారమున్నది కదా అని పందులు, కుక్కలు, గాడిదలు, అన్నింటిని ప్రవేశింప చేస్తామా? కాదు కాదు. అలాంటి ప్రవేశింపరానివి ఏమైనా వచ్చినప్పుడు ద్వారమును బంధిస్తాము. ప్రవేశింప తగినవారు వచ్చినప్పుడే ద్వారము తెరుస్తాము. ఇదే విధముగనే యీదేహమనే దేవాలయద్వారములు **పవిత్రమైనవాటికి మాత్రమే ప్రవేశించటానికి తగిన అవకాశము ఇవ్వాలి. అప్పుడే దీనికి దేవాలయమనే సార్థకనామము, క్షేత్రమనే సార్థకనామము,** చెల్లుతుంది. అట్లు కాకుండా యిది విరుద్ధమైన మార్గమును అనుసరించినప్పుడు క్షేత్రము కానేరదు. కనుక యీదేహము యొక్క సద్వినియోగమునకు ఆహారము అత్యవసరము.

(బృ.త్ర.పు.48)

(చూ॥ ప్రథమస్థానము)

మందులు

ఈనాడు కొన్ని కొన్ని నూతనమైన ఔషధాలు అభివృద్ధియౌతున్నాయి; **ఈ నూతనమైన ఔషధములు Antibiotics తో చేరుతున్నాయి.** ఈ రకమైన మందులు ఒక దానిని మరొకటిగా మార్పు చేస్తున్నాయి. ఎవరికైనా Tuberculosis వస్తే ఆ రోగమునకు సంబంధించిన క్రిములను చంపటానికై Antibiotic ఔషధాన్ని ఇస్తారు. **కాని, ఇది మంచి ఆరోగ్యమునిచ్చే Cellsను కూడా పాడు చేస్తున్నది. ఒక్క ఔషధమే మంచిని - చెడ్డను కూడా చేస్తుంది.** ఈ విధంగా ఆరోగ్యవిషయములో ఒక మంచి

కోసమని మరొక చెడును కూడా చేస్తున్నాము. అంతేగాదు. నేడు పళ్ళ వృక్షాలకు కూరగాయల పంటలకు **ఏమైనా పురుగు పట్టినప్పుడు వాటిపైన DDT ని ఉపయోగిస్తున్నాము. దీనివలన ఆ క్రిములు నశించడం మాత్రమే కాకుండా ఆ ఫలములలో DDT Power ప్రవేశించడం కూడా జరుగుతున్నది.** ఈ విధంగా, మనం తినే కూర గాయలలో, పదార్థలలో DDT చేరుతున్నది. ఈ విషయము తెలిసిన వ్యక్తులు ఆ ఫలములను, కూరగాయలను కడిగి వండుకొంటారు. కాని, ఏమీ తెలియని బీదవారు వాటిని కొని అట్లే తింటారు. తద్వారా ఆ ఫలములపై కొట్టిన మందులు వారిలో చేరుతాయి. దానితో మరికొన్ని రోగాలు ప్రారంభమైతాయి. కనుక, ఈరోగాలకు మూలకారణం మన ఆశ్రద్దనే. **Laziness is rust and dust; Realization is best and rest.** "ఈ విషయాలు నాకెందుకులే" అని ఎవరికి వారు తప్పించుకొనిపోతున్నారు. ఇది మంచిది కాదు. "ఈనాడు వానికైనది రేపు నాకు కావచ్చును". అని మానవుడు గుర్తించి వర్తించాలి. అనగా మానవుడు తనయందు ప్రకృతిని, పరమాత్మను చూసే జ్ఞానమును మొట్టమొదట గుర్తించాలి; ప్రకృతి యందు కూడా తనను పరమాత్మను చూడగలగాలి. ఈ విధమైన సమత్వమును అభివృద్ధి చేసుకోవాలి.

(స.సా.మా.పు.61)

మగవారు

(చూ॥ ఆడవారు)

మడి

(చూ॥ శౌచము)

మతకర్తలు

ఈ చిత్ర విచిత్రమైన చరాచర ప్రపంచమునకు సృష్టికర్త ఒకడున్నాడు. అతడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు. సర్వవ్యాపకుడు. అట్టి భగవంతుని అనేకమంది అనేకమైన పేర్లతో స్మరిస్తూ, భజిస్తూ తరిస్తూవచ్చారు. మానవునికి ఐకమత్యం, సంఘీభావం భక్తి ప్రపత్తులు అత్యవసరం. ఇట్టి పవిత్రమైన మూడు సూత్రములను మానవలోకంలో అభివృద్ధి చేయతలంచి అనేకమంది మహనీయులు కొన్ని మతములను స్థాపిస్తూ వచ్చారు. **మతము అనగా కేవలం ఒక పరిమితమైనది కాదు. మానవాభ్యుదయమునకు జీవిత పరమావధికి మార్గమును చూపించేటటువంటిదే మతము. మానవుని యందలి మానవత్వమును ప్రేరేపించి, పదిమందితో కలిసి ఆనందంగా జీవితము గడిపించేచేసేది మతము జీవునకు దేవునకు మధ్యనున్న సంబంధ బాంధవ్యాన్ని చేకూర్చుటటువంటిదే మతము. అనేకత్వమునందలి ఏకత్వమును నిరూపించేటటువంటిదే మతము. ప్రేమ, త్యాగము, సేవ, ధర్మము మున్నగునవి మతమునకు ప్రధానమైన అంగములు. మానవుని యందలి దివ్యభావములను, నవ్యభావములను వ్యాపింపచేసి సమాజమునకు అందింప చేసేది మతము. మానవ జీవితంలో ఔన్నత్యమును, ఆనందమును, సభ్యతను నిరూపింప జేసి, జగత్తునకు ఏకత్వాన్ని బోధించునదే మతము.**

ఈనాడు ఇటువంటి దివ్యమైన మతమును సంకుచితమైన భావములతో అనుభవిస్తూ, ఆచరిస్తూ, ప్రచార ప్రబోధలు సల్పుతూ ఉండటం చాలా దురదృష్టకరమైన విషయం. ఈ మతమే సమస్త మానవజాతికి అంతర్భాగమైన ప్రవాహము. **ఇట్టి పవిత్రమైన మతరహస్యమును సమాజమునందు వ్యాపింపచేసే నిమిత్తమై మత కర్తలు కొన్ని విధాలైన నిబంధనలుగావించి జగత్తులో ప్రచార ప్రబోధములు సలుపుతూవచ్చారు.** బౌద్ధమతం- అమోహత్వాన్ని, పవిత్రతను, దివ్యత్వమును ప్రచారం చేయుటకు **"సత్యం, అహింసలే"** ప్రధానమైన సూత్రములని ప్రచారముచేస్తూ వచ్చింది. **క్రిస్టియన్‌మతం "మనపులందరు భగవంతుని బిడ్డలే"** ప్రతి ఒక్కరు సోదరసోదరీ భావము పెంచుకొని, దివ్యమైన దైవత్వమును

మతబాంధవ్యము

ప్రార్థించి, ఆనందమును అనుభవించాలని ప్రచారముచేస్తూ వచ్చింది. **"All are one be alike to everyone"** అని ప్రభోధలు సల్పినవాడు జీసస్. ఇంక మహమ్మదీయ మతమునందు ఆత్మరీతిగా "అందరూ సోదరులే". ఈ సోదర భావమును అభివృద్ధి పరచుకొని జగత్తునకు శాంతి భద్రతలు చేకూర్చటానికి ప్రార్థనే ప్రధానమైనటువంటి మార్గమని వారు ప్రభోధించిరి.

(స.సా.జ.91పు.19/20)

మతబాంధవ్యము

అన్ని మతాల్లోనూ సూక్తులూ సూత్రాలు దాదాపు ఒకేరకంగా వుంటాయి. మతాలపరస్పర సంబంధాన్ని యిది సూచిస్తుంది.

మొదట వేదమతం ఉద్భవించింది. 2500 ఏళ్ళ కిందట వచ్చిన బౌద్ధం వేదమతానికి కొడుకు వంటిది. పాశ్చదేశాల ప్రభావంగా కనిపించే క్రైస్తవమతం మనమడు కాగా క్రైస్తవప్రవక్తల బోధల ఆధారంగా వచ్చిన ఇస్లాం మునిమనవడు అనుకోవచ్చు.

అన్నింటిలోను ప్రధానంగా కనిపించేది ప్రేమ. మనిషిని మనిషిగా చేసి దివ్యత్వంవైపు నడిపించేది ఆప్రేమే!

(శ్రీ.సా.గీపు.260)

మతము మతముకు మధ్య ద్వేషము-జాతి జాతికి మధ్య జగడము
దేశదేశములందు రగడలు-దేనికయ్యా! మత ప్రబోధలు
కన్నువిప్పి చూడరోరన్నా-ఈసాయి దేవుని
ఎన్నగా ఎందైన గలడన్నా:
మొన్న షిరిడీ నేడు పర్తీ-ఉన్నవాడని పేరెగాని
తన్ను భావనచేయు భక్తుల-కన్నులందే మెలగునన్నా!

(శ్రీ.స.వి.వా.పు.191)

మతములన్నీ పరస్పర సుహృద్భాంధవ్యములు కలిగి ఉన్నాయి. అగుటచే వాటినన్నింటినీ కూడా ఆహ్వానించు మతాలన్నీ మానవుల్ని భగవన్మార్గంలో నడుచునట్లు అభ్యసింపచేసే ప్రయత్నాలు మాత్రమే. మతాలన్నీ మంచి పనులను చేయడంద్వారా మనస్సును పవిత్రీభూతం చేసుకొని తద్వారా పరమాత్మ సాక్షాత్కారం పొందాలని ఆశిస్తాయి. **సర్వమతముల ఆంతర్యమూ వేదాంత తత్వముయొక్క సనాతన ధర్మమే.** ఆసనాతనధర్మము సాధకుడు తన ఆధ్యాత్మికస్థాయినీ అర్హతలనూ పురస్కరించుకొని భగవత్తత్వాన్ని సాక్షాత్కరింప చేసుకొనుటకు వీలుగా సాధ్యమైనన్ని మార్గాలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేస్తుంది. **వైదిక ధర్మాన్ని ప్రపితామహునిగానూ, బౌద్ధమతాన్ని పుత్రునిగానూ, క్రైస్తవాన్ని పౌత్రునిగానూ, ఇస్లామును ప్రపౌత్రునిగానూ అభివర్ణించవచ్చు. వీటిమధ్య అభిప్రాయబేధమేమైనా వస్తే అది కుటుంబ సమస్య మాత్రమే. మనమందరమూ భాగస్వాముల మైన ఆ పితార్జితపుటాస్తి అంతా ఒకటే.**

(సా.అ.పు.267/268)

(చూ॥ ప్రార్థనగీతము, సర్వమత సామరస్యం, స్వామి బాల్యము)

మతము/మతములు

ఒకానొక సమయమున Munshi (Bhavan's అధిపతి) Bombay లో ఒక పెద్ద సమావేశాన్ని ఏర్పాటు చేసాడు. ఈ సభలో స్వామి మాట్లాడవలసి వచ్చింది. వారికి నిజంగా తెలివితేటలు ఏమాత్రము వున్నట్లు నాకు కనబడలేదు. ఈ సమావేశానికి పెద్ద పెద్ద Doctors, Vice Chancellors, Principals, Professors అందరూ వచ్చారు. ఎవరికి వారు చాల తెలివికలవారని భావించుకున్నారు. అది కాదు **తెలివికి లక్షణం మనయొక్క ప్రవర్తనలో వుంది అంతా. చెఱకుకు విలువ దాని రసము వలననే, చెఱకు మాదిరే వుంటుంది.** వెదురు బొంగు. దానికి దాని ఒడ్డు పొడుగుకు ఇస్తాము, విలువ. అట్లే **మానవుని విలువ అతని గుణముబట్టే.** సరే ఒకరు ఒక ప్రశ్న వేసారు. 'స్వామీ ఈనాడు హిందువులు, బౌద్ధ మతస్తులు, Christians, Jains ఒకరికొకరు భేదాభిప్రాయములతో కలహించుకుని ద్వేషిస్తున్నారే. దీనికి

చెవులు పట్టుకొని పరీశీలనగా "ఏనుగు అంటే ఒక చేటవలె వున్నట్లుంది" అని అన్నాడు ఇంకొకడు, తోకను తడిమి "ఏనుగు ఒక పాములా వుంది" అని అన్నాడు మరొకడు తొండము పట్టుకొని ఏనుగు ఒక తీగలా వుంది అన్నాడు. వారి వారి అనుభవమును బట్టి వారికి తోచిందివారు చెప్పారు. ఇందులో ఎవరిదీ తప్పు? అందరిది Correct, అయితే ఏనుగు స్వరూపము ఎట్లు ఏర్పడుతుంది? - ఈనలుగురు గ్రుడ్డివాండ్లు చెప్పిన అంతములన్నీ కలిసి నపుడే. ఇదే విధంగ ప్రతి మతమువారు ఏనుగు సమగ్ర రూపంలోని ఒక్కొక్క అంగము యొక్క తత్వాన్ని చెప్పుతున్నారే గాని వారు స్పృశించని ఇతర అంగముల తత్వమును చెప్పుటలేదు. అన్ని అంగములను చేర్చిన **ఏనుగు సమగ్రరూపమును మనము చూడవచ్చును. అదే విధముగ ఈ వివిధ మతముల ప్రభోదములన్నియు చేర్చితే అదే విశ్వమత మవుతుంది. ఇదే నిజ మతము, ఈ సత్యాన్ని గుర్తించి మతకలహములు లేకుండ సమత్వమును పెంపొందించు కోవాలి. ఎవరి మతమును వారు స్వేచ్ఛగా అనుసరించ వచ్చును. కాని అన్ని మతములవారి గమ్యము ఒక్కటే. దివ్యత్వము, పవిత్రత ఒక్కటే.** ఒక గ్రామంలో నున్న చెఱువుకు నలువైపుల మెట్లు వుండును. నలువైపుల నుండి ఆ ప్రాంతమువారు వచ్చి దానిలో నీరు తీసికొనిపోతారు. వారు వివిధములైన దిక్కులనుండి వస్తారు. అయితే వారు వచ్చేది ఆ చెఱువుకే - ఆ చెరువులో నీరు కొరకే ఈ సత్యాన్ని గుర్తించాలి.

(శ్రీ.ది.పు.132/135)

కొంతమంది వ్యక్తులను ప్రత్యేకంగా
గుర్తించడానికి లేక కొన్ని సందర్భాలలో
కొన్ని అవసరాల నిమిత్తమై
ధరించే దుస్తులవలె, ప్రపంచములో
అనేక మతములను ఉపయోగించు
కోవడం జరుగుతోంది.

(ధై.మ.పు.110)

కారణమేమిటి" అని అడిగారు. నిజంగా ఈ కలహాలకు కారణము వారి వారి దుర్గుణములే కాని మతములు కావు. అన్ని మతములు మంచినే చెప్తూవచ్చాయి. కానీ మతమందున్న **దురభిమానమే అన్నింటికి మూలము.** ఈ దురభిమానము చేతనే ఒక మతస్థులు మరొక మతస్థులను ద్వేషిస్తున్నారు. ఇలాంటి తత్వము కలవారిని మతస్థాపకులు అనరాదు. వారు కిరాతకులు. వారి చిన్ని బుద్ధిని వారు బహిర్గతము చేసారు. అంతే. నేను చివరకు వారికి సమత్వమును గురించి చెప్పాను. మీరందరు చక్కగా నేను చెప్పేదాంట్లోని అర్థము చక్కగా గుర్తించాలి. హైందవమతము ఎప్పుడు పుట్టిందో ఎవ్వరికి తెలియదు. ఎవరికి తోచిన రీతిలో వారు చెప్తున్నారే కాని అసలు సంగతి ఎవరికి తెలియదు. అయితే తరువాత వచ్చిన బౌద్ధమతమునకు, క్రైస్తవమతమునకు చక్కగా కాలనిర్ణయము చేసినారు. **1918 సం॥పూర్వము వచ్చింది క్రైస్తవ మతము. ఇట్లే ఇస్లాము, బౌద్ధమతము, సుమారు 900 సంవత్సరముల క్రిందటనే వచ్చినవి. ఇట్లా ఏర్పడినపుడు ఏమి జరిగింది - అనాదిగా వుండినది హైందవ మతము, 2000 సంవత్సరములకు ముందు పుట్టినది క్రైస్తవమతము, 900 సంవత్సరములకు పూర్వ ముద్భవించినవి తదితర మతములు, ఇస్లాము. వీటికి పరస్పర సంబంధమును మనము ఈ విధముగ చెప్పవచ్చును. హైందవమతము Grand Father; బౌద్ధమతము, క్రైస్తవమతము Father, ఇస్లాము తదితర మతములు Grand sons - అని చెప్పవచ్చును. కాబట్టి ఇది ఒక Family వంటిదే. (ప్రత్యేకమైన Fighting కాదు)కనుక మన మందరము ఒక కుటుంబమునకు చెందినవారము. అన్న విషయంమనం చక్కగ గుర్తించాలి. ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క మతము**నకు ప్రాముఖ్యత వస్తూవుంటుంది. దీనికి సంబంధించిన ఇంకొక ఉదాహరణ చెప్తాను.

ఒక ఏనుగు దగ్గరకు కొంతమంది గ్రుడ్డివారు వెళ్ళారు. ఈ కథ మీకందరికి తెలిసివుంటుంది. ఒక గ్రుడ్డివాడు ఏనుగు కాలును తడిమి చూచి "అయ్యా ఏనుగు ఒక స్తంభము వలె ఉంది" అని అన్నాడు. మరొకడు ఏనుగు

మతము/మతములు

మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటె
వస్త్రభేదము వేరు వస్తువొకటె
శృంగారములు వేరు బంగారమొక్కటె
పశులవన్నెలు వేరు పాలు ఒకటె
జీవ జంతువులు వేరుజీవుండు ఒక్కడే
జాతిరీతులు వేరు జన్మమొక్కటె
దర్శనంబులు వేరు దైవంబు ఒక్కడె
పూలజాతులు వేరు పూజ ఒక్కటె
తెలియ లేకను మానవుల్ తెలివి దప్పి
బ్రతుకు కోసము బహుబంధబద్ధులైరి
ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు
సాధు సద్గుణగణ్యులొ సభ్యులార!

~~ఈ~~ దైవ సృష్టిలో కనబడే భిన్నత్వంలో వుండే ఏకత్వం గుర్తించి వర్తించుటే మానవ విజ్ఞతకి, జీవితానికీ సార్థకత. ప్రతి మతము దైవానుగ్రహప్రాప్తి అనే లక్ష్యమునకు ఒక మార్గం. మతానికొకదైవం లేదు. దైవానికొక మతంలేదు. అన్ని మతముల ప్రబోధసారము ఒక్కటే దైవ పితృత్వం, మానవ సోదరత్వం Fatherhood of God and Brotherhood of Man. భగవంతుడు ప్రేమ స్వరూపుడు. మానవాళి సర్వదా పెంచుకోవల్సిందీ, పంచుకోవల్సిందీ పరస్పర ప్రేమయే. అదే మానవ శాంతియుత సహజీవనానికి ఆధారం గమ్యం కూడాను.

(శ్రీ.స.పు.114)

మతము క్రమశిక్షణను నేర్పి హితముగూర్పు
ఆత్మశక్తియు తేజంబు అధిక పరచు
దాని మర్మంబు నెరుగక దాటుకొన్న
జాతి సంస్కృతి నశియించి జబ్బుపడును''

(శ్రీ.జ.పు.5)

"మతములన్ని చేరి మంచినే బోధించె
తెలిసి మెలగవలెను తెలివి తోడ
మతులు మంచివైన మతమేమి చెడ్డది
వినుము భారతీయ వీరసుతుడ.''

(సా. పు. 375)

ఒక మతము ఉత్తమమైనదనియు, మరొక మతము హీనమైనదనియు భావించుకోవటం, బేధములు పెంచుకోవటం - ఇది అజ్ఞానము యొక్క ప్రభావం. అన్ని మతములయొక్క ప్రభావం పవిత్రమైనదే. అన్ని మత సిద్ధాంతములు సత్యమైనవే. సర్వ మతముల సారము, సమస్త ధర్మములయొక్క మూలము, సర్వ శాస్త్రముల యొక్క కీలకము సత్యస్వరూపమైన ఆత్మ తత్త్వమే. మార్గములు వేరువేరైనప్పటికీ గమ్యమొక్కటేననే సత్యాన్ని గుర్తించి వర్తించటమే మానవత్వముయొక్క ప్రధాన కర్తవ్యం, త్యాగం, ప్రేమ, దయ, నీతి, నిజాయితి-ఇలాంటి పవిత్రమైన విషయములు సర్వ మతములయందు సామాన్యమైనవిగా ఉన్నాయి. అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తింప చేసుకొనే నిమిత్తమై ప్రతి మతమునందుకూడనూ భిన్నభిన్న మార్గములు ప్రబోధిస్తూ వస్తున్నాయి, భారతీయుల సిద్ధాంతము, భారతీయుల సంస్కృతి. భారతీయుల పవిత్రమైనటువంటి మార్గములు అన్ని మతములయందు అంతర్భూతమై, అంతార్వహినియై రాణిస్తూ వస్తున్నవి.

"ఏకోవసి సర్వభూతాంతరాత్మ" అనేటటువంటి సత్యాన్ని పురస్కరించుకొని, సర్వ జీవుల యందు ఉన్నది "ఏకాత్మయే' అనే సత్యాన్ని కూడనూ హెచ్చరిస్తూ వచ్చింది భారతీయ సంస్కృతి. బౌద్ధ మతమునందు, ఇస్లాం మతమునందు, క్రిష్టియన్ మతమునందు ఇట్టి ఏకత్వాన్ని అనేక స్థానములందు హెచ్చరిస్తూ వచ్చింది. శారీరకంగా, కర్మరీతిలో భిన్నంగా గోచరించినప్పటికినీ, ఆత్మతత్త్వము నందు అందరూ ఒక్కటేననే సత్యాన్ని క్రిష్టియన్ మతము వెల్లడిస్తూ వచ్చింది. ఒక్క ప్రభువు యొక్క బిడ్డలే సర్వులూ అనియూ, అందరూ సోదర భావమునే పెంచు కోవలెననియూ, దైవంయొక్క పితృత్వాన్ని, మానవుని యొక్క సోదరత్వాన్ని అభివృద్ధి పరచుకోవలెనని బోధించాయి. "ఏకం సత్ విప్రా బహుధా వదన్తి'' ఉన్నది ఒక్కటే. కాని భిన్నత్వం నీ మానసిక చర్యలే. భగవంతునికి అర్పితం కావలసినది ఏకాత్మభావమే. **భారతీయులు**

రెండు హస్తములు చేర్చి 'నమస్కారము' అని ఉచ్ఛరిస్తూ వుంటారు. ఈ నమస్కారంయొక్క అంతరార్థం ఏమిటి? అనేకత్వాన్ని ఏకత్వంగా చేర్చటమే ఈ నమస్కారము యొక్క అంతరార్థం. అదేవిధముగనే ఇస్లాంమతంలో "సలామ్" అన్నారు. "స" అనగా సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యములు. సత్స్వరూపుడు, సత్యరూపుడు అని అర్థము. సత్, చిత్ ఆనంద మయుడు. "ల" అనగా లయము. ఈ సకారస్వరూపుడైన పరమాత్మయందు లయమై ఉండటమే "సలాం" అని అర్థము. క్రిస్టియన్ మతము నందుకూడనూ "ఏసు" అని పిలుస్తూ వచ్చారు. "ఏ" అనగా ఏకత్వము. "స" అనగా దివ్యత్వము. దైవము ఒక్కడే. అనేకము లేదు. కనుక ఏకత్వమైన దివ్యత్వంలో మానసిక తత్వములు అంకితం గావించుకోవటమే ఈ "ఏసు" యొక్క అంతరార్థము.

జైనమతము నందుకూడనూ ఇదే విధమైన అంతరార్థమును ప్రబోధిస్తూ వచ్చాడు, మహావీరుడు. ఇంద్రియములను పలు పలు విధములుగా ప్రవహింప జేసినప్పుడు అనేక విధములైన మార్పులు, కూర్పులు జరుగుతూ వుంటాయి. ఈ ఇంద్రియములయొక్క ఏకత్వాన్ని మనం సాధించినప్పుడే ఇట్టి దివ్యమైనటువంటి ఆత్మతత్వము మనకు అర్థమవుతుంది. కనులకు చూచూటటువంటి శక్తి వుంటుంది. చెవులకు వినే శక్తి ఉంటున్నది. చూచునది, వినునది, పలుకునది తలంచునది సర్వమునకూ ఒక్క దివ్యత్వమే ఆధారము. కనుకనే ఈ అన్నింటిని ఏకత్వాన్ని చేసినప్పుడే జయత్వాన్ని పొందుతాం. కనుకనే మహావీర **త్యాగికి "జయ" అనే బిరుదునుకూడా అందించారు. "జయ" అనగా ఏకత్వమును గావించటమే జయత్వము యొక్క అంతరార్థం. అందరూ ఒక్కటే. దేహములు వేరు,** ఆభరణములు వేరైనప్పటికినీ సువర్ణము ఒక్కటే. అదేవిధముగనే ఏకత్వాన్ని భావించేటటువంటి దివ్యాత్మ తత్వమునే సర్వ మతములూ ప్రబోధిస్తూ వచ్చాయి. బౌద్ధమతము నందుకూడనూ ఇలాంటి ఏకత్వమునే సూచిస్తూ వచ్చింది. ప్రతి మానవుని యందును నిజముగా ఆవిర్భవింపవలసినది ప్రేమ తత్వము. **ఏది లేకపోయినా జీవితం సాగిపోవచ్చును గాని, ప్రేమ లేకపోతే జీవితం స్తంభించిపోతుంది. ప్రతి జీవికి ప్రేమయే ప్రాణం. ఇలాంటి ప్రేమతత్వము కలిగినప్పుడే అహింస, హింసకు పూనుకోదు.** దివ్యత్వమైన మానవత్వం రాణించవలెననిన ప్రేమ తత్వమును అభివృద్ధి గావించుకొనవలెను. కనుక ప్రతి మతమునందలి ప్రబోధలు సరియైన రీతిలో అర్థం చేసుకుంటే ఏకత్వాన్ని మాత్రమే గుర్తింపజేస్తుంది. మతభేదములనేటటువంటివి మానవుని మతిని చెడగొడుతున్నాయి. కనుక మతబేధములను ఎవ్వరూ పాటించరాదు. కేవలం ఒక్కొక్క మానవత్వం భిన్నత్వంగా గోచరించినప్పటికినీ, అందున్నటువంటి ధాతృతత్వము ఒక్కటిగానే మనం విశ్వసించాలి. ఇలాంటి పరిస్థితుల యందు మానవత్వాన్ని వికసింపజేసి, ప్రకటింపజేసి, వికాశింపజేసే నిమిత్తమై అప్పుడప్పుడు అవతారములు, మహాపురుషులు, దైవాంశ సంభూతులు ఆవిర్భవిస్తుంటారు. ఈ జగత్తునందు రెండువేల సంవత్సరములకు పూర్వం రోమన్ దేశంలో యూదులు అనే మతంవారు వుండేవారు. ఈ **యూదులకు 'యెహోవా'కు మించిన దైవం మరొకడు లేడని వారి విశ్వాసం.** అతి శీఘ్రకాలంలోనే ఇజ్రాయిల్ ప్రజలను రక్షించే నిమిత్తమై "మెస్సయ్య" అనేటువంటివాడు వస్తాడని వారి నమ్మకం. ఈ **యూదులకు పవిత్రమైన స్థానం 'జెరూసలెమ్'.** ఇక్కడ వారివారి మత సిద్ధాంతములను, ఆచారములను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమములను జరుపుకొనుచుండెడివారు.క్రమక్రమేణా కాలము మారిన కొలది మానవ స్వభావములుకూడా మారుతూ వచ్చాయి. కాలక్రమంలో 'టాంపే' అనే వాడు "జెరూసలెమ్' పశపరచుకొన్నాడు. అప్పటి నుంచి ఈ 'జెరూసలెమ్ రోమన్ వారికి ప్రధాన స్థలమైంది. యూదులు నిరుత్సాహపడక, తమ మతమును పెంచుకోవలెననే తలంపుతో తీవ్రమైన ప్రయత్నం సలుపుతూ వచ్చారు ఆనాటి పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని రాజులనే దైవంగా

విశ్వసించి కొలిచేటటువంటివారు. ఇట్టి పరిస్థితులలో **"జీసస్" అవతరించాడు. ఈ జీసస్ బాల్యమునుండే కరుణ, ప్రేమ, దయ, త్యాగము అనేటటువంటి భావములను ప్రకటిస్తూ వచ్చాడు.** లేతవయస్సునందే కర్తవ్య కర్మలను నిర్వర్తించటం మానవుని ప్రధాన ధర్మమని విశ్వసించి, తండ్రి చేసే పనులయందు ప్రవేశించి వడ్రంగి పనిని నేర్చుకుంటూ వచ్చాడు. కాని దురదృష్టవశాత్తు 12వ సంవత్సరమునునే తండ్రి మరణించాడు. కొంతకాలం తన తండ్రి పనినే చేసుకుంటూ, క్రమక్రమేణా తన మనస్సు అభివృద్ధి కావడంచేత, తల్లి వద్ద శలవు తీసుకొని దేశసేవ నిమిత్తమై దేశములో ప్రవేశించాడు. పూవుపుట్టగనే పరిమళం అభివృద్ధి గావించినట్లుగా, ఈ పిల్లవానియందు పవిత్రమైన భావములు ప్రకాశిస్తూ వచ్చాయి. **ఈ పిల్లవాడు జన్మించినప్పుడు అరేబియన్ రాజులుకూడా అతనిని చూడటానికి వెళ్ళారు. ఇందులో ముగ్గురు మూడు విధములైన భావములను ప్రకటించారు. మొదటి వ్యక్తి పిల్లవానిని చూచి "ఈ పిల్లవాడు భగవంతుని ప్రేమించేవాడుగా రూపొందుతాడు" అని తనలో తాను చింతించాడు. రెండవ వ్యక్తి "పరమాత్ముని యొక్క ప్రేమకు ఈ పిల్లవాడు గురికావచ్చును." అని తలిచాడు. మూడవ వ్యక్తి "తానే పరమాత్మునిగా ఈ పిల్లవాడు ప్రకటించుకోవచ్చు" అని తలిచాడు. "ఈ పిల్లవాడు భగవంతుని ప్రేమించవచ్చును" అని తలచు కోవటమే "Messenger of God" అని అర్థం. భగవంతుడే ఈపిల్లవాడిని ప్రేమించవచ్చు" అని తలచుకోవటమే "I am the Son of God" అని అర్థం.ఈ పిల్లవాడే భగవంతుడు కావచ్చును" అని అనుకోవటమే "I and My father are One" అని అర్థము.**

కనుక ఈ Messenger అనేటటువంటివాడు ఎలాంటివాడు? తన తత్వాన్ని మాత్రమే తాను గుర్తించుకోవటం. The one you think you are (నీవనుకుంటున్న నీవు). రెండవది " I am the Son of God" అనేదిthe one others think you are (ఇతరులు భావించేనీవు). ఇతనే దైవస్వరూపుడుగా వుండవచ్చును. మూడవది "I and My father are One " అనేది The one you really are (నిజంగా నీవైపు నీవు) అనే సత్యాన్ని ప్రబోధిస్తూ వచ్చారు. ఈ విధమైన ప్రబోధనలను ఏసుక్రీస్తు ప్రచారం సలుపుతూ వచ్చాడు. కారణ కర్మ కర్తవ్యాలను పురస్కరించుకొని కొంతమంది వ్యక్తులవల్ల అనేక మార్పులు సంభవిస్తూ వుంటాయి. అన్ని మతముల యందునూ కూర్పులూ, మార్పులూ జరుగుతూ వుంటాయి. ఈ క్రిష్టియన్ మతమునందుకూడనూ ఇలాంటి కూర్పులు మార్పులు సంభవిస్తూ వచ్చాయి. రోమన్ కాథలిక్కులు చర్చికిపోయే విషయాల లోపల అనేక మార్పులు జరుగుతూ వచ్చాయి. రోమన్‌లకు కాథలిక్ చర్చి అనేది చాలా ప్రధానమైనది. దీని అధిపతికి "బిషప్" అని పేరు పెట్టారు. జర్మన్ దేశస్థుడైన ఒక సన్యాసి "మార్టిన్ లూథర్" 1517 సం.లో క్రిష్టియన్ మతములో కొన్ని సంస్కరణలు చేసి నూతనమైన మార్గమును అవలంభించాడు. "ఈఫ్టన్ ఆథరెడ్స్" అని పేరుపెట్టి వారి లోపలకొన్ని విధములైనటువంటి యజమానులను నియమించి అతన్నే **"పోప్"** అనే రూపుతో ఓక అధికారత్వాన్ని చలాయిస్తూ వచ్చారు. ఒక్క ప్రక్క జీసస్ ప్రభావం దినదినానికి అభివృద్ధి కావిస్తూ వచ్చింది. దయ, కరుణ, ప్రేమ,త్యాగం అనేనాలుగు ప్రబోధనలచేత ప్రజల ప్రేమను చూరగొంటూ వస్తున్నాడు. ఈ రోమన్ దేశంలో క్రిష్టియన్ మతం క్రమక్రమేణ పెరుగుతూ వచ్చింది. పూర్వం జీసస్ అనేటటువంటి పేరునకు, ఈ క్రీస్తు పేరు లోపల క్రైస్తు అనే పదమునకు ఉండి నటువంటి సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని గుర్తింప జేస్తూ వచ్చారు. **క్రైస్తు అనగా అభిషక్తుడైనటువాడని అర్థము. అనగా ఎన్నుకోబడినటువంటివాడని. ఈ దివ్యమైనటువంటి వ్యక్తిని ఎన్నకోడం చేతనే ఇతనికి "క్రైస్తు" అని పేరు పెట్టారు. ఇతనిని అనుసరించే వారందరిని క్రైస్తవులన్నారు. అప్పటి రాజైన 'కాన్ స్టెంటైల్' కూడను ఈ మతమును అధికార మతముగా గుర్తిస్తూ వచ్చాడు.** ఈ విధంగా మతం అభివృద్ధి గావటం చేత అనేకమందిలో అసూయ

భావములుకూడా అభివృద్ధి అవుతూ వచ్చాయి. ప్రతి మతమునందు ఇలాంటివి జరుగుతునే వుంటాయి. వ్యక్తిత్వమనే తత్వం అర్థం చేసుకోవటం చాలా కష్టం. ఈ విధమైన కలతలు ప్రారంభం కావటం చేతనే మానవత్వంలో వుండినటువంటి దివ్యత్వం క్రమక్రమేణ మాలిన్యం చెందుతూ వచ్చింది. మానవునియొక్క వాంఛలన్నియు కూడను విషయాలపై ప్రసరింపజేస్తూ వచ్చారు. ఎడారిలో ప్రయాణంచేసే వ్యక్తి దాహంవల్ల ఎండ మావులనే నీరని భ్రమించి దాని వెంట పరుగెడుతూ వుంటాడు. క్రమక్రమేణా దారి తప్పి, సమీపించే కొలదీ, అది జలము కాదనే సత్యాన్ని గుర్తించి నిరుత్సాహంతో కృంగిపోతాడు. అదే విధముగనే మానవుడు విషయాసక్తుడై విషయములయందు ఆనందము కలదని విశ్వసించి, దానిని వెంటాడుతూ వెళ్ళి, కట్టకడపటికి తన సత్యాన్ని తాను గుర్తించుకొని, నిరాశకు, నిస్పృహకు గురి అవుతూ వస్తుంటాడు.

(శ్రీ.జ.92పు.5/8)

"నిజంగా మతాన్ని అర్థం చేసుకున్న వారెవ్వరూ ఒక ప్రత్యేకమైన మతాన్ని కాని, ఇతర మతాలను కాని వ్యతిరేకించరు; మోక్షాన్ని కేవలం ఒక్క మార్గం ద్వారా మాత్రమే పొందవచ్చునని కాని, మరే ఇతర మార్గాలు పనికిరావని కాని అనరు. ఏ మతంలో పుట్టినవారూ అయినా, ఏ మార్గాన్ని ఎన్నుకున్నా అన్ని ఆధ్యాత్మిక మార్గాలు నడిపించేది ఒక్క గమ్యం వైపుకే".

(స.శి.సు. నా. పు.71)

(చూ॥ ఒక్కటే, కులం, పాదములు, ప్రేమమతము, భారతదేశము, మతకర్తలు, మనుశాస్త్రం, విశ్వకళ్యాణము)

మతి

(చూ॥ పాదములు)

మత్కర్మకృత్

'మత్కర్మకృత్ మత్పరమో మద్భక్తః' మత్కర్మకృత్ అనగా నేమి? అన్ని కర్మలు నాకు సంబంధించినవిగా నీవు ఆచరించు. నీవు ఏకర్మలు చేసినప్పటికినీ, ఈ భూతాకాశాములో అన్నీ నీకు సంబంధించినవే. **నాకంటె అన్యమైన కర్మలు ఈ జగత్తులో కానరావు. నీవు ఏ కర్మలు చేసినప్పటికినీ నాకు సంబంధించిన కర్మలుగా ఆచరించు అని మొట్ట మొదట భక్తి యోగము మనకు బోధిస్తుంది. 'మత్పరమో' నాకోసం నీవు చేయి నీవు చేస్తుండేది నీకోసం కాదు.** నీవు, నీవు, నీవు అనుకొంటున్నావు. నీవు ఎవరు? నీయందు అణుస్వరూపుడై, ఆత్మస్వరూపుడై ప్రకాశించేది నేనే. ఆత్మస్థానమునుండియే, నేను నేను అనే పదము ఆవిర్భవిస్తూ వచ్చింది. కనుక నేను అనే పదము ఈ దేహమునకు సంబంధించినట్టిది కాదు. ఇది ఆత్మకు సంబంధించినట్టిది. ఆత్మ యొక్క .., ఆత్మ యొక్క .., ఆత్మ యొక్క ...ఈ నేను అనేపదము దేహమునకు గానీ, మనస్సునకు గానీ, బుద్ధికి గానీ, యింద్రియములకు గాని, సంబంధించినది గాదు. దేహమనస్తత్వములకు అతీతమైన నేను అనే పదము ఆత్మకు సంబంధించినట్టిది. నీవు ఏమి చేసినప్పటికీ ఆత్మతృప్తి నిమిత్తమై ఆచరిస్తున్నావు. ఈ రహస్యమును గుర్తించక యేదో బాహ్యదేహమే నేనని భావించి. మాయలో మునిగి, నాది నేను నావారు అనే భ్రాంతిలో కొట్టుకొనిపోతున్నారు. ఏమి చేసినప్పటికినీ నా తృప్తి నిమిత్తమై నీవు చేస్తున్నావు. నాపరమై నీవు ఆచరిస్తున్నావు. నీవు నా ఏజంటుగా ప్రవర్తిస్తున్నావు. 'మర్పరమో' నా కోసమే నీవు ఆచరిస్తున్నావు. ఈ సత్యాన్ని నీవు గుర్తుంచుకో.

(శ్రీ.గీ.పు.10/11)

మదము/మదములు

ఇవి నాలుగు విధములయినటువంటివి. మదము వలన మానవుడు కన్ను మిన్ను యెరుగక ప్రవర్తించుచుండును. కుల మదము, ధన మదము, యౌవన మదము, విద్యామదము ఇంకను అనేక విధముల మదములు

మదాలస

కలవు. కాని అవి అన్నియునూ ఈ నాల్గింటిపైననే ఆధారపడి వున్నవి.

(ప్ర.శో.వా.పు6)

(చూ॥ కళలు, మంచితనము)

మదాలస

ప్రేమస్వరూపులారా! మానవునియందున్న దైవం కంటే వేరు దైవం లేడనే సత్యాన్ని మీరు మొట్టమొదట గుర్తించాలి. మానవుడే దైవం. మానవునకు, దైవమునకు ఎట్టి భేదమూ లేదు. కేవలం భావదోషంవల్లనే బేధం కనిపిస్తున్నది. కంటికి కనిపించే విశ్వాన్ని మానవుడు ప్రాకృత భావంతో చూస్తున్నాడేగాని, విశ్వేశ్వర స్వరూపంగా చూడటం లేదు. **ప్రాకృత దృష్టిని పరమాత్మ దృష్టిగా మార్చుకోవాలి. ప్రాకృత దృష్టితో చూసినప్పుడు ఇది ఒక గులాబీ పుష్పం. దైవభావంతో చూసినప్పుడు ఇదే హృదయ పుష్పం.** దైవత్వంతో కూడిన ఈ జగత్తును మీరు జగత్తుగానే చూస్తున్నారుగాని, దైవత్వంగా చూడటం లేదు. కనుకనే, ఈ జగత్సంబంధమైన కష్టనష్టములను అనుభవిస్తున్నారు. **మదాలస తనకు పుట్టిన ప్రతి బిడ్డకు సత్యాన్ని ఈవిధంగా బోధిస్తూ వచ్చింది.** "నాయనా! నీవు కేవలం ఈ భౌతికమైన శరీరానివి కాదు. నీవు అజ్ఞానమునకు, మాయకు అతీతుడవు. కాని, మోహమనే నిద్రలో సంసారమనే స్వప్నమునుగాంచి నీ స్వస్వరూపాన్ని మరచిపోతున్నావు. మోహమనే నిద్ర నుండి మేలుకొని జ్ఞానమనే జాగ్రత్తలో ప్రవేశించు. **కలలు రావటానికి కారణం ఏమిటి? కొంతమంది ఆహార దోషంవల్ల కలలు వస్తాయని భావిస్తున్నారు. మరికొంతమంది తలంపులే కలలకు మూలకారణమని అనుకొంటున్నారు. కాని, కలలకు ఇవేవి కారణం కావు. నిద్రయే లేక స్వప్నమే రాదు. కనుక, స్వప్నమునకు నిద్రయే మూలకారణం. అదేవిధంగా సంసారమనే స్వప్నమునకు మోహమనే నిద్రయే కారణం. ఈవిధమైన బోధలు సల్పి మదాలస తన కుమారులను గొప్ప యోగులుగా మార్చివేసింది.** మానవుడు జన్మించింది జగత్తుకు సంబంధించిన విషయములను అనుభవించడానికి కాదు. ఎంత అనుభవించినా మానవునికి తృప్తి కల్గటం లేదు. అనుభవించే కొలది ఆశలు పెరిగిపోతున్నాయేగాని, తరిగిపోవడంలేదు. మానవుడు మొట్టమొదట తన తత్వాన్ని తాను గుర్తించుకోవాలి. **మానవుడనగా ఎవరు? మా - అనగా, అజ్ఞానము; న - అనగా, లేకుండా; వ - వర్తించడం. కనుక, అజ్ఞానము లేకుండా వర్తించే వాడే మానవుడు. ఈ పదానికి మరొక అర్థం కూడా ఉన్నది మా - అనగా, కాదు; నవ - అనగా, క్రొత్త. కనుక, మానవుడు క్రొత్తవాడు కాదు,** పాతవాడే. ఇతడు నవీన మానవుడు కాదు, సనాతన మానవుడు, పురాతన మానవుడు, ఎన్నో వేల సంవత్సరముల నుండి వస్తున్నాడు.

(స.సా.జ.2000 పు.2/3)

మదాలస అనే రాణి తన పిల్లలను తొట్లెలో వేసి వారికి జ్ఞానాన్ని బోధించే పాటలు పాడుతూ జోకొట్టేది. **"నాయనా! నీవు శుద్ధుడవు, బుద్ధుడవు, నిరంజనుడవు. సంసారమనెడి స్వప్నమును, మోహనిద్రను త్యజించు" అని వారికి బోధించి అరణ్యానికి పంపింది.** పుట్టిన పిల్లలందరికీ జ్ఞాన బోధలు సల్పి వారిని అరణ్యానికి పంపితే, ఇంక రాజ్యమేలేది ఎవరు? అని ఒకనాడు భర్త కోప్పడ్డాడు. అప్పుడామె "మహారాజా! రాజ్యభోగము అనిత్యమైనది. కనుకనే, నా కుమారులను నిత్య, సత్యమైన హృదయ సామ్రాజ్యానికి రాజులుగా పట్టాభిషేకం చేస్తున్నాను" అని జవాబు చెప్పింది. స్వప్నం రావడానికి కారణం. ఏమిటి? మీరు భుజించిన అహారం కాదు, మీరు విన్న విషయములు కాదు. స్వప్నానికి మూలకారణం నిద్రయే. నిద్రయే లేకపోతే స్వప్నమే లేదు. అదేవిధంగా, మోహమనే నిద్రవల్లనే సంసారమనే స్వప్నం వస్తున్నది. **కనుకనే మదాలస తన పుత్రులకు "సంసార స్వప్నా త్యజ మోహనిద్రాం" అని బోధించింది.**

(స.సా.ఫి.2000పు.46/47)

మద్భక్త

'మద్భక్తः' భక్తుడు అనే మాటలో నున్న రహస్యాన్ని ప్రధానముగా గుర్తించాలి. **భక్తి అనేది ప్రేమతత్వమునకు ప్రతిబింబము. ఈ ప్రేమతత్వము ఆత్మస్థాయినుండియే ఆవిర్భవించేది. ఆత్మకు ప్రతిఫలమే యీప్రేమ.** అంతేగానీ ప్రేమ అనేది లౌకికమైనట్టి దానికి ఏమాత్రం సంబంధించి నది కాదు. ఈ ప్రేమతత్వము భక్తి పూర్వకముగా భావిస్తుంటాము. ఏది చేసినప్పటికినీ హృదయమునుండి రావాలి. ఇలాంటి పరిస్థితియందు యేమి చేసినా, ఏమి తలచినా, ఏమి చెప్పినా భగవత్‌పరమైనట్టివిగా భావించు కొంటూ రావాలి. దీనినే **'సర్వకర్మ భగవత్‌ప్రీత్యర్థం' అన్నారు.**

(శ్రీ.గీ.పు.11)

మధ్యము

(చూ॥ ఆత్మవిద్య)

మనదేశము

ఇది నాదు మాతృదేశము
ఇది నా ప్రియమాతృభాష ఇది నా మతం
చెదగొట్టి నుడవనేరక
బ్రతికిన నరపీనుగొకడు వసుధను కలడా.

స్వదేశాభిమానమే లేకపోతే పరదేశవిచారణ ఎందుకు చెయ్యాలి? కన్న తల్లినే మరచిన వ్యక్తి పినతల్లిని మరువకుండా వుంటాడా? ధనం నిమిత్తమై యీ విధముగా beggarsగా తయారు కాకూడదు. నీవు beg చేయాలనుకుంటే నీ దేశములో చేయి. విదేశాలు పోయి భిక్షాపాత్ర నెత్తుకొని ధనమును సంపాయించుకొని బ్రతికేదానికంటె చావు మేలు. స్వదేశ సేవలో స్వదేశ విశ్వాసమును అభివృద్ధి పరచుకోవాలి. **'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'** అన్నారు. జన్మభూమిపైననే విశ్వాసము లేకపోతే ఎందుకోసం జన్మనెత్తాలి? **మన దేశము నందే వుండి మన దేశసేవ చేసి దేశ ప్రజలను తీర్చిదిద్దటానికి కంకణము కట్టుకోవాలి. నీ తల్లితండ్రుల సేవ చేయి. నీ కన్నభూమి సేవచేయి, నీదేశ ప్రజలను ఆదుకో.** స్వార్థము స్వప్రయోజనం నిమిత్తమై నీశక్తి సామర్థ్యము లుపయోగ పెట్టుకోవద్దు. ఇట్టి భావములను అభివృద్ధిపరచుకున్నప్పుడే చిత్తము స్థిరత్వానికి వస్తుంది. లేకపోతే ఎప్పుడూ గడియారము పెండ్యులం మాదిరి అటుయిటు ఆడుతూ వుంటుంది. స్థిరత్వము కావాలనుకుంటే మొదటనే master plan వేసుకోవాలి. నాభవిష్యత్తు ఏమి? ఏమి చెయ్యాలి? ఎలాంటి మార్గములో నడుచుకోవాలి? అనే విషయాన్ని విచారణ చెయ్యాలి. విద్యార్థులారా? ఒక్కటి మాత్రం మీరు మరవకూడదు. "మీ food మీ blood మీ head అంతా మీ parents యొక్క gift" మీరు మొట్టమొదట Parentsకు gratitude చూపించాలి. వారిని **ప్రపన్నులు చేయలేని మీ చదువులు ఎందుకోసం? వృద్ధులైన తల్లి తండ్రులను విసర్జించి పరదేశములకు పోయి నీవు ఫాషన్‌గా తిరుగుతుంటుంటే నీపాపము పెరగక ఏట్ల తగ్గుతుంది?** తల్లితండ్రుల దగ్గర వుండి వారిని చూచుకోవాలి. అది నీకర్తవ్యము. ఈవిధమైన పవిత్రభావాలను అభివృద్ధి పరచుకున్నప్పుడే మీచిత్తము స్థిరము ఔతుంది. దీనికి ప్రత్యేకమైన కసరత్తులు చేయనక్కరలేదు. పవిత్ర భావములచేత పవిత్ర సాధనలచేత పవిత్రచింతనలచేత మనస్సును స్థిరము చేసుకోవచ్చు.

(బ్ర.త్ర.పు.84)

మననము

(చూ॥ నరక చతుర్దశి, భృగువల్లి)

మనము

మొదట "నేను" తరువాత "నీవు" "నేను" అనునది జీవితము. "నీవు" అనునది ప్రపంచము. "నేను", "నీవు" కలిసిన "మనము" అవుతుంది. "మనము", "అతడు" అంటే భగవంతుడు కలిసి చివరకు భగవంతుడు మాత్రమే

మనసు/మనస్సు

మిగులుతాడు. ప్రేమ ఉన్నది. ప్రేమించే వ్యక్తి ఉంటాడు. ప్రేమింపబడే వ్యక్తి ఉంటాడు. వీటికలయికే బ్రహ్మానందము. ఈ ఫాన్‌లో మూడు రేకులు ఉన్నాయి. త్రిగుణాలు ఈ రేకులను సూచిస్తాయి. ఈ మూడు రేకులు సమన్వయముతో తిరిగినప్పుడే చల్లటి గాలి లభిస్తుంది. **మనలో ఈ త్రిగుణాలు మూడు దిక్కులలో పోతున్నాయి. వాటిని ఒకే దిక్కుకు త్రిప్పినపుడు నీవు ఏకోన్ముఖుడవగుదువు,** సరియైన అవగాహనకు వచ్చెదవు.

(ప.ప్ర.పు.8)

మనసు/మనస్సు

ఈనాడు మానవుడు మనసు **(Mind)** పదార్థము **(Matter)** యొక్క తేడాను గుర్తించలేకపోతున్నాడు. మనసును గుర్తించినవాడే మహనీయుడు. ఈ మనసు యొక్క స్వరూపమేమిటి? ఇది ఎక్కడనుంచి ఆవిర్భవించింది? దీని యొక్క **Nature** ఏమిటి? అని విచారణ చేస్తే, ఆత్మకు మూడు శక్తులు ఉన్నాయి. 1. మనసు 2. బుద్ధి, 3. సంకల్పం. మనోబుద్ధుల సంకల్పముల స్వరూపమే 'ఆత్మ'. కనుక ఆత్మ నుండి ఆవిర్భవించినదే ఈ 'మనసు' ఈ మనసు యొక్క విశాలతను వర్ణించుటకు సాధ్యము కాదు. దీనినే సంస్కృతము నందు

"సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి"

దీనిని సంకల్పించిన మనసు ఎంత దూరమైనా క్షణంలో ప్రయాణం చేస్తుంది. సర్వత్రా క్షణములో వ్యాపించి పోతుంది. ఈ మనసు యొక్క శక్తిని ఎవ్వరూ గుర్తించలేదు, విచారించలేరు. దీనిని వర్ణించుటకు భాషయే చాలదు. కనుక మనసు యొక్క శక్తి ఇట్టిదీ, అట్టిదీ అని చెప్పుట సాధ్యం కాదు. మనసు అనే శక్తి లేకుండా, ఏ చిన్న కార్యాన్నయినా సాధించలేము. ఈ మనసుకు రూపం లేదు. మనసు చేసేదంతయూ, ఆత్మ శక్తి ద్వారానే చేస్తుంటుంది. లోపలనున్న ఆత్మ. ఈ మనసు ద్వారా, ప్రపంచంలో సర్వకర్మలనూ ఆచరిస్తూ వస్తున్నది. ఈ మనోవికారములు, మనో వికాసములు గుర్తించవలెననిన ఎన్ని సంవత్సరములు అయినా చాలదు. కొన్ని యుగములకైనా వీలుకాదు.

రెండవది బుద్ధి. ఇది ప్రకాశవంతమైనటువంటిది. వికాసవంతమైనటువంటిది. విచారణ చేయటమే ఈ బుద్ధి యొక్క సత్యం. **ఆ Discrimination లోపల కూడనూ, స్వార్థస్వప్రయోజనములకు ఏమాత్రం స్థానం లేకుండా చేయగలదు ఈ బుద్ధి.**

మూడవది సంకల్పము. ఈ సంకల్పములు ఈ జన్మలో చేసినవేగాక, వచ్చేజన్మలో కూడా ఇంకా ఎన్నియో దీని ఫలితములను అందిస్తూ వస్తుంటుంది. **ఇది సంస్కారవంతమైనది. సంస్కారమనగా ఏమిటి? చెడును దూరం చేసి మంచిని పోషించటమే. నిత్యజీవితంలో మనం ఏ కర్మల నాచరిస్తుంటామో, ఆ కర్మల యొక్క దోషములను నిర్మూలనం గావించి, దోషరహితమైన కర్మలుగా తీర్చిదిద్దుకోవటమే సంస్కారం.**

(శ్రీ. ఫి. 2002 పు. 28)

మనస్సు నిన్ను పీడించడం లేదు. సమస్తము దాని వినియోగంపై ఆధారపడియున్నది. మనస్సు సర్వత్ర వ్యాపించింది. దేనిలో చేరితే ఆ రూపాన్ని పొందుతుంది. మనస్సుకు మరణం లేదు. **అందువల్లనే "మనో మూల మిదం జగత్" అన్నారు. అట్టి మనస్సు నాశనం కాదు. కనుక, మనోనాశనమన్న పదం సరియైనది కాదు. నీవు కోరవలసింది మనోనాశనం కాదు, మనోలయాన్ని కోరాలి. నది సముద్రంలో కలుస్తుంది. అదేరీతిగా మనస్సు ఆత్మలో లయం కావాలి. పరమాత్మలో లీనం కావాలి. ఇదీ మనోలయమంటే!** మాధవునికి అర్పితమైన మనస్సు రామదాసుగా మారి పూజార్హమౌతుంది. వానరమూర్తియైన ఆంజనేయస్వామి రామదాసుగా వాసికెక్కి పూజలందు కుంటున్నాడు. కాని, మానవుడు మనస్సుని కామదాసునిగా చేసి పతనమౌతున్నాడు. మనస్సు కలిమి, బలిమి, చెలిమిలపై ప్రసరించకూడదు, భగవంతునిపై నిలిచి తన్మయం కావాలి.

(స.సా.జూ.2000పు.190)

మనస్సు ఒక కొతి, దీనికి విషయవాసన అనే మద్యము త్రాపిన తరువాత, ఇంక గుణములలో ఉన్నటువంటి రౌద్రములనే తేళ్ళు కుట్టిన తరువాత దీనికి ప్రపంచ వ్యామోహమనే పిచ్చికూడను పడుతుంది. కనుక ఈ పరిస్థితియందు మానవుడు ఏరీతిగా మనస్సును అరికట్టడం? ఈ దేహమునకుగానీ, ఈ మానవత్వమునకు గానీ విమోచన లేదా?

ఈనాటి యువకులకు ఒక ఘోరమైన వ్యాధి పట్టింది. అది ఏదనగా యవ్వనసన్నిపాతము. ఇది మానవత్వములో ఉన్నటువంటి దివ్యత్వమును మరిపింపచేస్తుండాది.

(ఆ.రా.పు.102)

మనసును కోతి కుక్క అని తిట్టరాదు, అది చెప్పినట్లు వింటుంది. సాధనలక్షణాల్ని పట్టి గురువుపదేశాన్ని బట్టి, మంచి రోడ్డులో తీసుకొనివచ్చి దివ్యత్వమనే సింహ ద్వారానికి చేరుస్తుంది, లేకపోతే సందుగొందులకుతిప్పి ముళ్లలో పడవేస్తుంది. మనస్సును చక్కచేస్తే అదే మంచిమార్గమును చూపిస్తుంది. **"మనయేవ మనుష్యాణాం, కారణం బంధమోక్షయోః'**... బంధనానికి మోక్షానికి రెండింటికి మనసే కారణం. దీనికి కృతజ్ఞతను చూపించ వలయును.

(సు.పు.50)

మనసును ఆయుధంబునిదె మానవ జాతికి యిచ్చెతొల్లి ఆ మనసుని శిక్షలో నిల్పు మానవుడే విజయుండు భూమిపై మనసుకు దాసుడైన మహి మానవుడెన్నడు శాంతి సౌఖ్యముల్ కనుగొనజూచినట్లు వినిపింపగ గల్గదు స్వప్నమందునన్. ప్రేమస్వరూపులారా! మానవజాతికి మనస్సనే ఒక పదునైన కత్తి అందించబడినది. ప్రప్రథములో **మానవుడు ఈ మనస్సు యొక్క తత్వాన్ని గుర్తించి వర్తించినప్పుడే మానవత్వము సార్థకమవుతుంది**. మనస్సు బలవత్తర మైనది. మనస్సు చాలా వేగముగా పరిగెట్టేటటువంటిది. మనస్సు ఆకాశము కంటే తేలికైనది. విద్యుచ్ఛక్తి కంటే సూక్ష్మమయినది. ఇట్టి మనస్తత్వాన్ని మానవుడు గుర్తించుకొనలేక మనస్సును పెడమార్గములలో ఉపయోగ పెట్టి అనేక విధములైన దుఃఖములకు విచారములకు గురియగుచున్నాడు. మనస్సు ప్రకాశము కంటే అతివేగముగా పరిగెట్టుతుంది.

(స.ది.పు.59)

ఈ మానవత్వంలోపలనే నాలుగు విధములైన మార్పులు ఉంటూన్నయి.1. Super Mind. 2. Higher Mind 3. Illumination Mind 4.Over Mind. ఈ నాల్గవ స్థితిని పొందుతుంది. దీనికి పూర్వం Illumination Mind ఇది కరెంటుతో సంబంధమైనటువంటిది. మానవదేహమంతా కరెంటుతోనే ఉంటంది. ఈ దేహమే ఒక పెద్ద జనరేటర్. కనుక ఇది చాలా శక్తివంతమైనది. దీనికి పూర్వం Higher Mind. ఇది పంచభూతములకు అతీతమైనది. అట్టి స్థితికి రావాలంటే మొట్టమొదట Super Mindలో ప్రవేశించాలి. అసలు ఈ Super Mind అంటే ఏమిటి? Body Consicousness ఈ దేహమునందు వుండినటువంటి ఆత్మతత్వమే Consicousness. ఆ 'కాన్‌షన్‌నెస్' అనేటటువంటిది దేహంలో సర్వత్రా వ్యాపించి ఉంటున్నది. కనుకనే దీనిని Body Consciouness అన్నారు. క్రమక్రమేణ అది Higher Mindకు పోయేటప్పటికి, ఈ Body Consciouness ను కేవలం Thought Consciousness అంటారు. దగ్గరగావున్నప్పుడు దేహమును ఎవరైనా రెండు కొట్టవచ్చును. అది Personal Connection గా ఉంటుంది. కాని Thought Consciousness అనేది ఎంత దూరమైన ప్రయాణం చేస్తుంది. కనుక ఇది Higher Mind కు సంబంధించినటువంటిది. తరువాత Illumination Mind. దీనిలో కాలిగోళ్ళ లోపల, తలవెంట్రుకలలో కూడా కరెంటు ఉంటుంది. ఒక్కొక్క పర్యాయం కాలి వేళ్ళగోళ్ళు తీస్తుంటే, షాక్ కొట్టినట్లుగా ఉంటుంది. అయితే ప్రాకృతమైన భావములలో ఇమిడినటువంటివానికి ఇది ఏమీ తెలియదు. కనుకనే ప్రాచీన ఋషులు గోళ్ళు పెంచుకునేవారు. అందులో కరెంటు ఇమిడి ఉన్నది. వారి హృదయములన్నీ పవిత్రమైన ఆలోచనలలో అభివృద్ధి అవుతూ వచ్చాయి. వారి చింతన

భగవత్ చింతన. వారి భావన భగవత్ భావనే. వారు చేసే సర్వకార్యములు భగవత్ కర్మలే. అందువలనే వారిలో శక్తివంతమైన కరెంటు వుండేది. అలాంటివారి వెంట్రుకలయందు కూడనూ కరెంటు వుంటుంది. ఆ వెంట్రుకలు ముట్టినా 'షాక్' కొడుతుంది. సామాన్యమైన మానవునియందు కూడనూ ఈ కరెంటు ఉంటుంది. ఈ విద్యుచ్ఛక్తి లోపల ఉన్నది. Heart అనేది పంపుసెట్టు వంటిది. అది పంపుకొడుతుంటే శరీరమంతా కరెంటు ప్రాకుతుంటుంది. ఊపిరితిత్తులు (Lungs)ఉన్నాయి. ఇవే Thoughts (ఆలోచనలు) కు ప్రధానమైనటువంటి పంపు. దీనిని డాక్టర్సు మరొక రీతిగా భావిస్తుంటారు. దేహములోని రక్తము ఊపిరితిత్తులలోనికి వెళ్ళి, అక్కడ ఆక్సిజన్‌తో పరిశుభ్రంగావించబడి, తరువాత దేహమంతా పంపుజేయు బడుతుందని డాక్టర్లు అంటారు. అదికాదు. ఊపిరితిత్తుల యందున్న ప్రాణశక్తి, వైబ్రేషన్ ద్వారా ఆ సంకల్పశక్తి చేత కరెంటుగా మారిపోతుంది. ఆ కరెంటు అనేది ఎంత దూరమైన ప్రయాణం చేస్తుంది. ఇక్కడ జనరేటర్ పెట్టి ఆడిస్తే, దూరంగావున్న బల్బులు కూడా వెలుగుతాయి. అదేవిధముగానే, హృదయము నందు అనగా గుండెయందు,లేక ఊపిరితిత్తులయందు ఆ పవిత్రమైన భావములు, జనరేటర్‌వలె, ఊపిరితిత్తులు పంపుకొట్టినటువంటివి గుండెకు చేరుతాయి. **హార్ట్‌పంపు కొట్టినప్పుడల్లా, రక్తము 12వేల మైళ్ళ దూరం ప్రయాణం చేస్తుంది. అనగా ఒక్క తూరి పంపుకొడితేచాలు, 12వేల మైళ్ళు రక్తం ప్రయాణం చేస్తుంది. మన దేహములోవున్న చిన్న నరాలు, పెద్ద నరాలు అన్నీ ఒకదానికొకటి కలుపుకుంటూపోతే 12వేల మైళ్ళు పొడవు ఉంటాయి.** పంపు కొట్టినప్పుడల్లా, రక్తం 12 వేల మైళ్ళు ప్రయాణం చేస్తుంది. కరెంటు జనరేటర్‌తో సమానమైనటువంటిది మన గుండె (Heart), దీనినే Illumination Mind అన్నారు. దీనిలోవున్న ఆత్మశక్తి, దివ్యశక్తిగా మారుతుంది.

దేహము అన్నమయప్రాణము. మనసు, ప్రాణము, బుద్ధి - ఇవన్నీ సూక్ష్మమైన ప్రాణము. సర్వదుఃఖములను, బాధలను, కష్టములను, సుఖములను అన్నింటిని అనుభవించేది అదే. ఈ దేహము కేవలం జడమైనటువంటిది. **ఈ Illumination Mind వద్దకు వచ్చేటప్పటికీ Mind అంతా మారిపోతుంది. దీనిని సూక్ష్మమైన ప్రాణము అన్నారు. దీనిలో మూడు ఉంటున్నాయి. 1. ప్రాణశక్తి 2. మనోశక్తి 3. ఆత్మశక్తి. ఈ మూడింటి యొక్క ఏకత్వంచేతనే, విజ్ఞానమనేది మనస్సును ప్రాణంగా మార్చివేస్తుంది.** ఇది ఏ డాక్టర్‌కుగాని, ఇంజనీర్‌కుగాని అర్థంకాదు. ఈ దేహములో ఏ భాగమునకైనా మనం విశ్రాంతి (Rest) నివ్వవచ్చును. కాని Heart కు మాత్రం యిచ్చేవారు ఎవరూలేరు. దీనికి విశ్రాంతిలేదు. నిద్రపోతున్నా, నడుస్తున్నా ఆ గుండె ఆడుతునే ఉంటుంది. దీనిని ఏ డాక్టర్ కనిపెట్టాడు? ఏ సైంటిస్ట్ కనిపెట్టాడు? ఏ ఇంజనీరు కనిపెట్టాడు? ఇంతేకాదు, మన కన్నులయందు 13 లక్షల నరములుంటున్నాయి. ఇన్ని నరములు ఈ కంటిలో వుండటానికి కారణమేమి? వీటిని యిక్కడ ఎవరు చేర్చారు. ఇదంతా భగవంతుని సృష్టియే. భగవంతుని సృష్టిలోపల చిత్రవిచిత్రము లెన్నియో ఉన్నాయి.

"చిత్రంబులు త్రైలోక్య పవిత్రంబులు
భవలతాల విచిత్రంబులు సన్మిత్రంబులు
మునిజనవన చైత్రంబులు
విష్ణుదేవు చారిత్రంబుల్"

సర్వమూ మానవునియందే ఇమిడి ఉంటున్నాయి. కన్నులు తెరచినప్పుడు ఎన్నోవేలమంది కనిపిస్తారు. కన్నులు మూసుకున్నప్పుడు, అంతర్ దృష్టిగా మార్చుకున్నప్పుడు అంతా శూన్యమైపోతుంది. కనుక కన్నులయందుండి నంతా కూడనూ అంతర్ దృష్టికోసం పెట్టారేగాని, బహిర్ దృష్టికోసం కాదు. దేవాలయానికి వెళ్ళి దేవుని దర్శనం చేసుకోవాలని ఆశిస్తుంటారు. కాని దేవాలయం వరకు వెళ్ళుతారు. దేవుని దగ్గరకు వెళ్ళటంతోనే కండ్లు మూసు కుంటారు. కండ్లు మూసుకోవటానికి దేవాలయానికి ఎందుకుపోవాలి? బయటనుంచి దేవాలయానికి పోవాలి!

పోవాలి! అని వస్తారు. దేవుని విగ్రహం ముందునుంచొని కండ్లు మూసుకుంటారు. కారణమేమిటి? దీని అంతరార్థ మేమిటి? భగవంతుని చర్మచక్షువులతోకాదు చూడవలసింది. జ్ఞానచక్షువులతో చూడాలి. కర్మచక్షువులను మూసుకో? అప్పుడు జ్ఞానచక్షువులు అభివృద్ధి అవుతాయి. అందు వలననే ధ్యానసమయమందు కన్నులు మూసుకొని ధ్యానం చేస్తారు. ఆ పవిత్రరూపమును నీవు లోపల భద్రపరచు కోవాలి. బయట చిత్రములంతా Reflection, Reaction, Resound. అయితే ఈనాడు తనతో కూడినదానిని ఆశిస్తున్నాం. Real (యదార్థమును) దానిని మనం చూడటంలేదు. కనుక Illumination Mind అనేటటువంటిది కరెంటుతో సమానమైనటువంటిది. అదియే జ్ఞానశక్తి.

దేహము అన్నమయప్రాణము. మనసు, బుద్ధి, చిత్తము ఈ మూడూ చేరినప్పుడు అది సూక్ష్మమయప్రాణంగా మారుతుంది. కారణం దేహము నిజమైనటువంటి Illumination. దీని యందు ఏరూపనామములుగాని, ఏ అవస్థలుగానీ, ఒక్కటీ మనకు తెలియవు. ఇది ఎట్లాగనగా "రాత్రి మనం పడుకునేముందు అన్నీ చూస్తాము. అన్నీ పనులు చేస్తాము. కాని నిద్రవచ్చేటప్పటికీ దేనినీ చూడలేము, ఏపనులు చేయలేము. అప్పుడు ఈ మనసు ఎక్కడ ఉన్నది? ఆ స్థితినే Illumination Mind అంటారు. అది అన్నింటిని సృష్టిస్తుంది. అన్ని స్థానములకు ప్రయాణిస్తుంది. అన్ని పనులూ చేస్తుంది. ఎట్లా చేస్తుంది? మనకు నిద్రలో స్వప్నాలు వస్తుంటాయి. నీవు ప్రశాంతి నిలయంలో ఉన్నావు. కాని కలలో నీవు అమెరికాలో వుండినట్లుగా కనిపిస్తుంది. ఆమెరికాకు పోయింది ఎవరు? నీ దేహము యిక్కడనే ఉన్నది గదా! ఈ భావమును Illumination Mind అంటారు ఇది ప్రపంచమంతా చుట్టి వస్తుంది. దీనికి ఒక రూపము. నామములేదు. అన్నిపనులూ చేస్తుంది. కాని దానికి ప్రాకృతమైన బుద్ధులు లేవు. అరిషడ్వర్గములు ఏమాత్రం దానిలో కనిపించవు. కనుక ఈ Illumination Mind కు కేవలం Thoughts Mind నుంచి మనం ప్రయాణం చేయాలి. ఈ ప్రాకృతమైన ఆలోచనలను మనం అరికట్టుకున్నప్పుడే Illumination Mind కండ్లు తెరుస్తుంది. ఈ Thoughts (ఆలోచనలు)ను మనం అరికట్టుకోవాలంటే Super Mind లో మనం ప్రవేశించాలి.

Super Mind అంటే ఏమిటి? ఈ Super Mind మనసుకు అతీతమైనటువంటిది. మనం ఒక పుస్తకమును చదువుతున్నాం. చదువుతున్నప్పుడు, దానిలోని విషయాలన్నీ లోపల చేరుతాయి. కాని కాగితములలో చదివినదంతా, నీమనసులో చేరిపోతాయి. కనుక ఇది ఒక ఆకారము లేనటువంటిది Super Mind దీనికొక ఆచారములేదు. దీనికి మొట్టమొదట ఆధారమేమిటి? Fundamental ఏమిటి? Super Love ఒక్కటే. అనగా ఎట్టి వాంఛలూ లేనటువంటి ప్రేమయే దీనికి ప్రధానం. కనుకనే Love is God, Live in Love అన్నారు. మానవుడు లేచిన దగ్గర నుంచీ పడుకునేంతవరకు ప్రేమతోనే జీవిస్తున్నాడు. కనుకనే నేను ఎప్పుడూ చెబుతుంటాను.

Start the Day with Love
Fill the Day with Love
End the Day with Love
This is the way to God.

మనం మొట్టమొదట ఈ ప్రేమను కొంతవరకు దేహరీతితో అనుభవించాలి. లేస్తూనే ఏ చింతనలూ చేయకుండా, నిర్మలమైన ప్రేమతో లేవండి. దీనికి కారణమేమిటి? తల్లియొక్క భావములే దీనికి మూల కారణం. తల్లిదండ్రులు లేస్తూనే తిట్టుకుంటూలేస్తుంటే, ఈ పిల్లలు కూడనూ కొట్టుకుంటూ బయలుదేరుతారు. కనుక ఇట్టి దృశ్యములు కూడనూ పిల్లల మీద ప్రభావం చూపుతుంటాయి. పుట్టిన బిడ్డకు ఎట్టి తలంపులూ, ఎట్టి వాంఛలూ ఉండువు. ఎట్టి ఆశలూ ఉండవు. కాని పెరుగుతున్న కొద్దీ ఈ కోరికలు అభివృద్ధి అవుతుంటాయి. మానవుడు బంధనలలో పడిపోతున్నాడు. కనుక మన Mind అనేటటువంటిది భగవత్ ప్రేమతో ప్రారంభం కావాలి. అన్ని చింతనలనూ మరిచిపోయి క్రమక్రమేణా దీనిని ప్రాక్టీస్ చేయాలి."

"శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్, జ్ఞానాధ్యానం విశిష్యతే, ధ్యానాత్ కర్మఫలత్యాగః త్యాగేనైకే అమృతత్వ మానశుః" ప్రతి దానికి ప్రాక్టీస్ ఉండాలి. Walking Practice, Talking Practice, Eating Practice ఉండాలి. అన్నింటిలో Practice ఉండాలి. కనుకనే ఈ ఆధ్యాత్మికమును ప్రేమతో మనం ప్రారంభించాలి. ఆ ప్రేమను పెంచుకుంటూ పోవాలి. ఈ విధంగా ప్రాక్టీస్ చేసుకుంటూపోతే ఏకాత్మభావం ఏర్పడుతుంది. వసుధైక కుటుంబంగా మారిపోతుంది.

ఈ విధంగా ప్రాక్టీస్ చేసుకుంటూపోతూ, తరువాత Thoughts Mind కు పోవాలి. బహిర్ముఖంగా చేసేటటువంటివి నిలబెట్టుకొని, Thoughts తో వాటిని అభివృద్ధి పరచుకోండి. ఈ Thoughts Mind నుండి క్రమక్రమేణా Illumination Mindకుపోవాలి. అందులోనికి పోయేటప్పటికీ Thoughtsకూడా ఉండవు. ఏదీ ఉండదు. కరెంటు ఇనుమును కూడా ముద్ద చేస్తుంది. అదే విధంగా మంచి చెడ్డలనన్నింటిని భస్మం చేస్తుంది. దానినే ఆధ్యాత్మికంలో సమాధి స్థితిః అన్నారు. సమాధి అనగా సము+అధి=సమాధి. మంచి చెడ్డలను రెండింటిని ఏకం చేస్తుంది. ఏకాత్మభావమును అభివృద్ధి పరుస్తుంది. కనుక మనం ఇప్పుడు చేయవలసింది ఏమిటి? ప్రేమతో అందరికీ సేవ చేయండి. ఎవరికి చేసినా అది భగవంతునికి చేసినట్లుగా భావించండి. భేదభావములకు చోటివ్వకండి. నేను ధనవంతుడను, వాడు పేదవాడని భావించకండి. ఎవరు ధనవంతుడు? ఎవరు పేదవాడు? He, who has much Desires is a Poor Man. He who has much more satisfaction is the Richest Man. తృప్తిగలవాడు ధనవంతుడు. వాంఛలు పెంచుకుంటూ పోయేవాడు బీదవాడు. కనుక వాంఛలు క్రమక్రమేణా తగ్గించుకుంటూ పోండి. **Less luggage more comfort make travel a Pleasure.** మన ఈజీవన ప్రయాణం లోపల కోరికలు అనే సామానును తగ్గించుకోవాలి. కనుకనే దీనికి 'సమాధి' అని పేరు వచ్చింది. కోరికలు ఎంత తగ్గుతాయో, అంత 'మనోశక్తి' అభివృద్ధి అవుతుంది. అన్నింటికీ చావు ఉన్నదిగాని Mind కు చావులేదు. అన్నింటికీ మనసే మూలకారణం. ఆ మనసే ఆత్మగా మారిపోతుంది. ఆయితే లౌకిక వాంఛలతో చేరిన మనసు, అది మనసే కాదు. దానిని సరియైన దారిలోనికి తెచ్చుకోవటంలేదు. కనుక దీనిని క్రమక్రమేణా అభివృద్ధి పరచుకొని, ఉత్తమమైన భావములతో పెంచుకోవాలి. పవిత్రమైన భావములతో నింపుకోవాలి. నిర్మలమైన, నిశ్చలమైన భావములను పెంచుకోవాలి. అప్పుడే మనం Illumination Mind ను అభివృద్ధి పరచుకోగలుగుతాం. దీనిని చేరుకున్నప్పుడు అవి Over Mind అయిపోతుంది. ఇది మనసుకు అతీతమైనది. **దీనినే 'అమనస్కము' అన్నారు వేదాంతములో.**

అమనస్కమనగా మనసు లేనటువంటిది. కనుక ఇలాంటి మనసులేనటువంటి స్థితికి మనం చేరాలి. ఇట్టి స్థితిలో ఒక్క ఆత్మ మాత్రమే మనకు కనిపిస్తుంది. దీనినే 'కాన్షస్‌నెస్'అన్నారు. ఎలాంటి 'కాన్షస్‌నెస్'. ఇది Super Consciousness. Divine Consciousness కాదు. ఇది ఎప్పుడు వస్తుంది? కాని Over Mind అనేది Super Consciousness. కనుక మనం ఎంతటి స్థాయి వరకైనా చేరవచ్చును. ఆ శక్తి మానవుని యందుంటున్నది. సాధనలతో దేనినైనా సాధించవచ్చును. 'సాధనల వలన పనులు సమకూరు ధరలోన' ఒక చిన్న చీమ నడుస్తూ, నడుస్తూ ఎంత దూరమైనా ప్రయాణం చేస్తుంది. పెద్ద రెక్కలు గల గ్రద్ద, ప్రయత్నం చేయకపోతే అక్కడనే పడి ఉంటుంది. అసలురెక్కలే లేకపోతే అసలేఎగురలేదు. కనుక ప్రేమ, సేవలు రెండు రెక్కలు మనకు. ఈ రెండు రెక్కలను మనం భద్రంగా పోషించుకుంటూ, ఎంత దూరమైనా ప్రయాణం చేయవచ్చును. ఈ రెండు భద్రం చేసుకొని, నిస్వార్థమైన సేవలుచేసి, నిరహంకారమైన ప్రేమను పెంచుకొనినప్పుడు, మనం ఎంతటి ఉన్నత స్థితికైనా చేరుకోవచ్చును. ఎందరో మహానుభావులు ఇలాంటి పవిత్రమైన సేవలు చేసి సద్గతిని పొందారు. కాని

మనం ఈనాడు కొన్ని నిమిషాలు కూడా కూర్చోలేక పోతున్నాము. ప్రాచీనులు కూర్చుంటే, ఎన్ని వత్సరాలైనా కదలకుండ కూర్చొనేవారు. ఈనాడు మనం నరముల వలన, రక్తం వలన ఈ దేహం కదులుతున్నదని భావిస్తున్నాం. ఆ Illumination Mind దగ్గరకు వచ్చేటప్పటికి రక్తప్రసరణ కూడా ఆగిపోతుంది. రక్తప్రసరణ ఆగినప్పుడు, దేహం పాడైపోతుందని భావిస్తుంటారు. కాదు.... కాదు..... (Super Blood) వచ్చేస్తుంది. అదే దీనిని అంతా కదలించి వేస్తుంటుంది. ~~ఈ 'సూపర్ బ్లడ్'~~ **అంతా 'సుపీరియర్' గానే ఉంటుంది. దీనిని పురస్కరించుకొనియే వేదమునందు 'రసోవైసః' అన్నారు. రసము నుంచి రసమే వస్తుందిగాని, నీరసం రాదు.** ఏది చూచినా, ఏది చేసినా ఏది అనుభవించినా అంతా రసస్వరూపమే. పానకంలో అంతా పంచదారవేసే మూర్ఖుడు ఎవడైనా ఉంటాడా? ఆ పానకం అంతా పంచదారతోనే నిండి ఉంటుంది. పంచదార లేకపోతే పానకమే (Syrup) కాదు. కాబట్టి ఈ పానకంలో పంచదార ఉంటుంది. అదియే దివ్యశక్తి. ఆ శక్తి వుండటంచేతనే సర్వత్రా దివ్యశక్తిగా మారిపోతున్నది. అయితే మానవుని ఏ శక్తిలేని బలహీనునిగా భావిస్తున్నాం. తెలియనటువంటివాడే ఈ విధంగా బలహీనుడుగా భావిస్తాడు. సర్వమూ తనయందే ఉన్నదనే సత్యాన్ని గుర్తించిన వ్యక్తిఎంతైనా ఆనందాన్ని అనుభవిస్తాడు.

ప్రేమకు ఒక రూపంలేదు. ప్రేమకు ఒక్క నామం మాత్రమే ఉన్నది. ఈ నామమే సర్వమునూ అభివృద్ధి పరుస్తుంది. మనకు మనమే రూపములను కల్పించుకుంటున్నాం. అలాంటి రూపరహితమైనటువంటి తత్వానికి మనమే రూపములను కలిపించుకొని ఊహిస్తున్నాం. దైవమునకు ఎట్టి భావమూలేదు, ఎట్టి రూపమూలేదు. కాని నీ తృప్తి నిమిత్తమే ఒక ఆకారము కావాలి. అదియే అవతారం. వచ్చి, ఆ విధంగా బోధిస్తూ వస్తుంది. సృష్టించేదితానే, రక్షించేదితానే, శిక్షించేదితానే. కాని మనం పుట్టుకకు ఒక మంత్రిని పోషణకు ఒక మంత్రిని, చావుకు ఒక మంత్రిని, పెట్టుకుంటున్నాం. కాని ఇవన్నీ భగవంతునికి అధీనంలోనే ఉంటుంటాయి. కనుక మనం ఒక్క భతవంతునికి అర్పితం చేస్తే చాలు, సర్వదేవతలకూ వర్తిస్తుంది. అదేవిధంగా నీవు చేసే సేవలన్నీ భతవంతునికి చేస్తున్నా మనుకుంటే, అదే భగవత్ స్వరూపంగా మారిపోతుంది. ఎవరికి సేవ చేస్తున్నా, భగవంతునికి చేసే సేవయని భావించండి. ఎందుకంటే 'ఈశ్వరస్సర్వభూతానాం'. అన్ని భూతములయందూ దేవుడు ఉంటున్నాడు. నీకు కనిపించనటువంటి దేవుడుగా ఒకటి ప్రత్యక్షం, మరొకటి పరోక్షము. ఇది బింబము, అది ప్రతిబింబము. ఇది Action. అది Reaction. అన్నింటి యందునూ ఆ విధంగా వస్తుంటుంది. రెండులేనే లేవు. కాని కలిపించేది మాత్రం అట్లా కనిపిస్తుంటుంది. ఒక సినిమాలో తెర వుంటుంది. ఆ తెరలో పెద్దపర్వతాలు మండిపోతున్నట్లుగా కనిపిస్తుంది. అదే విధముగ బాహ్యదృష్టికి అన్నీ కనిపిస్తున్నాయిగాని, Illumination Mind కు మాత్రం అది కనిపించదు. దానినే 'దివ్యశక్తి' అన్నారు. ఆ దివ్యశక్తి సర్వులయందూనూ ఉంటున్నది. ఇది లేనటువంటి వ్యక్తేమనకు కనిపించడు. కాని ఆ సత్యమును గుర్తించుకోలేక పోవటం వలన, ఎక్కడెక్కడో వెదుకుతున్నాం. కొంత కాలం దీనిని ప్రేమతోనే 'ప్రాక్టీస్' చేయాలి. అందరినీ మనం ప్రేమించాలి. అప్పుడు అందరూ నీవే. అందరుగా మారిపోతావు. ఏకత్వంలో అనేకత్వం, అనేకత్వంలో ఎకత్వం కనిపిస్తుంది.

ప్రేమస్వరూపులారా!

మీరందరూ ప్రేమస్వరూపులే. మీయందున్నదంతా ప్రేమయే. అందరియందునూ వున్నటువంటి ప్రేమనే భగవంతుని ప్రేమ. మానవుడు భగవంతుని అంశ మాత్రమే. కారణమేమిటి? దేహములు వేరుగా ఉండటంచేత. కనుక అంతా చేరి ఒకటిగానే ఉంటుంది. కనుక నేటి నుండి ఎవరికి సేవచేసినా భగవంతుని సేవగానే భావించుకోండి. ఎలాంటి పనినైనా చేయటానికి సిద్దంకండి. దేహాన్ని అనుసరించకండి. పరిస్థితులను

గురించి విచారించకండి. అందరినీ ఏకంగా చూచుకోండి, సమానంగా చూచుకోండి. అందరియందు వున్నటువంటిది ఒకే దివ్యశక్తి అని భావించుకోండి. అప్పుడే నిజమైనటువంటి Illumination కు చేరుకోగలరు. కనుక మొట్టమొదట Super Mind లో ప్రయాణించండి. నేను వేరు, అతనువేరుగా ఉన్నాడని భావించటం, ఇదే Dualism. దీనితో ప్రారంభం చేయండి. ఆ Dualism కూడా సత్యము కాదు. A man with Dual Mind is Half Blind. ఆ Half Blind లో నీవు పోతున్నావు. అక్కడ ప్రారంభించి క్రమక్రమేణా అదే Higher Mind కు పోతుంది. ఈ Higher Mindకు పోయిన తరువాత నీ తత్వము నీకు రుచింపజేస్తుంది. ఈ రుచిని మరిగిన తరువాత నీవు క్రమక్రమేణా Illuminationకు చేరుకోగలవు. ఇక్కడ ఏకత్వాన్ని పూర్తిగా గుర్తించిన తరువాత Over Mindలో చేరిపోతావు. అదియే నీ గమ్యము. అదియే నీ సర్వము. దానిని చేరటానికే నీవు చేసే సాధనలు. దేహముతో చేసిన సాధనలు ప్రధానము కాదు. ఇది కేవలం కసరత్ వంటివి. ఈ కసరత్తులు దేహమును అభివృద్ధి పరచుకోవటానికి గాని, మనసును కాదు. కాని ఇప్పుడు మనసు అభివృద్ధి కావాలి. మనసు నిర్మలత్వం కావాలి. Mind లోపల Mind Illumination రావాలి.

(శ్రీ.జ.01పు.24/30)

ప్రేమస్వరూపులారా! మనస్సు యొక్క తత్వమును వర్ణించడం కష్టం. ఒక నిమిషంలో పిచ్చికోతివలె ప్రవర్తిస్తుంది, మరొక సమయంలో దివ్యమైన భావాలతో ప్రకాశిస్తుంది. ఒకానొక సమయంలో మనిషిని చూచి కోతి నవ్విందట. "మనిషీ! నీవు సర్వశక్తిమయుడవని భావిస్తున్నావు. విజ్ఞాన ప్రజ్ఞాన సుజ్ఞానములకు నీవే మూలాధారమని గర్విస్తున్నావు. ఈ విధంగా నీవు గర్వించవద్దు. ఎందుకంటే, నేను నీయందు మనస్సునై ఉన్నాను. నీ జీవితం నాపై ఆధారపడి ఉన్నది. నేను కొంత పెడ మార్గం పడితే నీ జీవితమే పెడమార్గం పడుతుంది. నేనుసక్రమమైన మార్గంలో నడచినప్పుడే నీ జీవితం సవ్యంగా సాగుతుంది. నేను కోతినైనప్పటికి రామనామ స్మరణ చేస్తూ, రామసేవలో పాల్గొని, రామకార్యమును విజయవంతం గావించాను" అన్నదట. ఈ విధంగా, మనస్సు సక్రమమైన మార్గంలో ప్రవేశించినప్పుడే దైవసన్నిధిని, దైవపెన్నిధిని అనుభవిస్తుంది. మనస్సు పెడ మార్గమున ప్రవేశిస్తే జీవితమును అధఃపతనం గావిస్తుంది. అప్పుడు మనస్సును Monkey Mind అంటారు. అందుచేత Mankind కావాలిగాని, Monkey mind కాకూడదు. దివ్యత్వమును స్మరించవలెనన్న, పవిత్రతను అనుభవించవలెనన్న మనస్సే ఆధారం. మనసే లేక మనిషే లేడు. మనస్సును సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. Start Early, Drive Slowly, Reach Safely. చిన్నతనము నుండియే మనస్సును సక్రమమైన మార్గంలో ప్రవేశపెడితే మీరు చాల దివ్యమైన స్థానమును పొందుతారు.

(సా.శు.పు.52)

మాను దిద్ద గలరు. మరి వంపు లేకుండ
దిద్దగలరు రాయి తిన్న గాను
మనసు దిద్దగలర? మరి వంపు లేకుండ
చక్కనైన మాట సాయి మాట॥

(సా॥పు.484)

మనస్సు ఒక గూఢా కాపలాదారు వంటిది. గూఢా తన యజమాని స్నేహితులనే భవనంలోనికి ప్రవేశపెడతాడు. అటులనే మనస్సు తన అధిపతికి భద్రత కలిగించే తలంపులను, భావాలను చేర్చుకోవాలి. అంతేకాదు ఎవరు లోపలికి వస్తున్నారు? ఎవరు బయటకు పోతున్నారన్న విషయాన్ని కాపలాదారు ఏ విధంగా జాగ్రత్తగా పరిశీలిస్తుంటాడో, అదే విధముగ మనస్సులోనికి చెడు తలంపులు, దుర్భావములు ప్రవేశించకుండ జాగ్రత్త వహించాలి.

(భ.ప్ర.పు.40)

గాలి యందున జ్యోతి కదలుచుండు
గాలిలేని జ్యోతి కదలకుండు

మనసు ఎట్లు పారిపోతే అట్లు పారిపోనీ; నీవు మాత్రము దాని వెంట ఎక్కడ పోతుందా అని చూచుకుంటూ పోవద్దు. నీవు ఉన్నచోటే ఉండు. మనసు ఇష్టమొచ్చినట్లు తిరిగి తిరిగి కడకు అలసి నీ చెంతకే వచ్చును. మనసు ఏమియు తెలియని పసిబిడ్డవంటిది. తల్లిపిల్లే కొలదీతాను కూడను దూరముగా పోవుచునే యుండును. అట్లు కాక, ఆ బిడ్డవైపు చూడక, తల్లిపాటికి తల్లి వెనుకకు తిరిగిన బిడ్డతన పాటికి తానే పరుగెత్తుకొని తల్లిచెంతకు వచ్చి చేరును. నీ నియమము ప్రకారం నీ ఇష్టనామ ధ్యానములను ఆచరించు మనస్సును లక్ష్యపెట్టకు. తప్పక నీ ధ్యానమున ఏకాగ్రత ఫలించును. **నీవు శుచి, అశుచి అనే మాటనే మనసులోనికి చేరనివ్వవద్దు. ప్రపంచమున అశుచి పదార్థమంటూ లేనేలేదు.** సర్వాంతర్యామిగా పరమాత్ముడు ఉన్నప్పుడు ఆశుచి ఎక్కడిది? బాహ్య దృశ్యమునకూ అనుభవమునకూ అశుచి అనుకున్ననూ దానికి పరమాత్మనామము సోకగనే శుచిగా మారును.

(స.సా.జూ.1989 చివరిపుట)

సకల విద్యలుచేర్చి సభ జయించగవచ్చు
శూరుడై రణమందు పోరవచ్చు
రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు
హేమగోదానముల్ ఈయవచ్చు
గగనమందున్న చుక్కలు లెక్క గొనవచ్చు
జీవరాసులపేర్లు చెప్పవచ్చు
అష్టాంగవిద్యలు అభ్యసించగవచ్చు
చంద్రమండల యాత్ర సలుపవచ్చు
కానిదేహేంద్రియాదుల కట్టిపెట్టి
మనసునంతర్ముఖముచేసి యనవరతము
నిశ్చలసమాన చిత్తుడై నిలువలేడు

(బృ.త్ర.పు.47)

మనసు కారణంబు మరియెందు నుండిన
ఇండ్లు అడవి ముక్తి నీయలేవు
మనసు లేనివాడు మందిరమున నున్న
కాననమున నున్న కార్యమొకటి.

గాలి వంటి ఆశ కట్టివేసిన యంత
నిశ్చలంబైన మనసు నిలిచియుండు॥

(సా.పు.12)

మనస్సునకు రెండు విధములైన స్థితులు ఉంటాయన్నది. మొదటిది శుద్ధము. రెండవది అశుద్ధము. కోరికల తోకూడిన మనస్సు అశుద్ధము. అవి లేని మనస్సు శుద్ధము. బంధమోక్షములకు మనస్సే కారణం. మనస్సు ఒక క్షణమైనా ఒక స్థితియందుండదు. తటాకము నందు ఎడతెరిపి లేకుండా రాళ్ళురువ్వుతూ వుంటే ఏ విధముగా అది ప్రశాంతిగా యుండగలదు? ఏనాడు యీ రాళ్ళు రువ్వడం మానెదుమో ఆనాడే ప్రశాంతి పరిస్థితిని పొందుతుంది. అదేవిధముగా మానవ సరోవరమునందు, ఎడతెరిపి లేకుండా కోరికలనే రాళ్ళు రువ్వుతున్నప్పుడు ఈ మనస్సు ఏవిధంగా ప్రశాంతి పొందగలదు. మానసిక శాంతి కావాలంటే, భక్తులు, వ్యక్తులు కోరకలనే రాళ్ళను మానసికమునందు ప్రవేశింపకుండా చూచుకొన వలయును.

(సా.పు.240)

వేద శాస్త్రములు వివరించి బుధులచే
చదివించవచ్చు తాచదువ వచ్చు।
యజ్ఞయాగ తపంబులు అధికార జనులచే
చేయించవచ్చు తా చేయవచ్చు।
ఇల లోనగల తీర్థములకేగ అన్యులకు
బోధించవచ్చు తాబోవవచ్చు।
అష్టాంగు విద్యలు తానన్యులకు
ఉపదేశించవచ్చు తాసాధించవచ్చు।
కాని దేహేంద్రియములను అరికట్టి
మనసు నిల్ప అంతర్ముఖము చేసి।
అనన్యతరము నిశ్చల, సమాన చిత్తుతై నిలువలేరు.

(సా.పు.590)

ఇనుప పాత్రయైన హేమ పాత్రంబైన, నీటి తేటవలన మేటికెక్కు
మనస్సు మంచిదైన తనువులు మాటేమి!ఉన్నమాట చెప్పుచున్నమాట!

(సా.పు.175)

మనసు/మనస్సు

"మనో మూల మిదం జగత్" జగత్తంతయు మనసుపైననే ఆధారపడి ఉంటున్నది. సుఖదుఃఖములు, పాపపుణ్యములు సత్యాసత్యములు అన్యాయ అక్రమములు అన్నీ మనసునందే జరుగుతున్నవి. **అన్నింటికిని మనస్సే కారణము. మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః** బంధమోక్షములకు మనసే కారణము. ఈ మనస్సు శుద్ధమైన అద్దమువంటిది. మనస్సుకు స్వతస్సిద్ధమైన శక్తిలేదు. మనస్సు ఇంద్రియములను ఆశ్రయించి వుంటున్నది. ఇది నేత్రముల ద్వారా చూస్తున్నది. స్వతఃగా తాను చూడలేదు. కర్ణముల ద్వారా వింటున్నది. స్వతఃగా తాను వినలేదు. ఇదేవిధముగనే అన్ని యింద్రియముల ద్వారాను యీ మనస్సు కార్యములు సలుపుతున్నది. ఇంద్రియములు చేసి దోషములన్నియు మనస్సునే అద్దముపైన చిత్రింపబడు తున్నవి. ఇంద్రియములు సంకల్ప వికల్పకాత్మకమైన తత్వముతో కూడి ఉంటున్నవి. ఇందులో దోషము ఎవరిది? ఇంద్రియములదా? లేక మనస్సుదా? మనస్సు నందు స్వతస్సిద్ధమైన దోషములు లేవు.

(బృ.త్ర.పు.79/80)

మనసే హేతువు మనుజుని
మనుగడకును బంధమునకు మాన్యతకును(తా)
మనసే ముక్తికి ముఖ్యము
మనసే నరకంబు దెచ్చు మైమరపించున్.

(బృ.త్ర.పు.68)

మనస్సుకు కూడను కొన్ని రంగులు ఉన్నవి. భేదభావములతో కూడిన మనస్సు ఎర్రని రంగుగా, స్వార్థభావముతో కూడిన మనస్సు గోధుమరంగుగా, అహంకారముతో కూడిన మనస్సు కమలాపండు రంగుగా, భగవదర్పితమైన మనస్సు తెల్లగా ఈ వస్త్రం వలె శుద్ధమైనదిగా ఉంటుంటాది. మనస్సుకు అనేక విధములైన రంగులను మనమే వేసుకుంటున్నాము. ఇది కూడను ఇతరుల ప్రభావము కాదు. మన సంకల్పములే మనకు ఈ దుర్గతిని సద్గతిని చేర్చుతున్నాయి. సంకల్పములను సరియైనవిగా ఎన్నుకున్నప్పుడే, అభివృద్ధి పరచుకున్నప్పుడే మన జీవితము శాంతి భద్రతలతో ఉండగలదు.

(బృ.త్ర.పు.71)

మనస్సును మాయలమారి అని, మాయ అనికూడనూ పిలుస్తూ వచ్చారు ఇది ఒక మార్జాలము వంటిది.

(బృ.త్ర.పు.75)

జగత్తునందు "ఏకం సత్" ఉన్నది ఒక్కటే. రెండవది ఉంటేకదా ఫ్రీడమో బంధమో అనేది కనుపిస్తున్నది. ఈ బంధము స్వాతంత్ర్యము అనేవి మనఃకల్పితాలు. సూర్యుడు లేనప్పుడే చంద్రునకు మనము విలువ నిస్తున్నాము. సూర్యుడుండినప్పుడు చంద్రుని ఎవరు చూడరు. సూర్యుడు లేనప్పుడు చంద్రునికి దేనివల్ల విలువ ఇస్తున్నాము? చంద్రుడు స్వతఃప్రకాశకుడు కాదు. సూర్యునియొక్క కిరణములు చంద్రునిమీద పడినప్పుడే చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. అదేవిధముగనే ఆత్మాన్వేషణ లేని సమయమునందే చంద్రుడనే మనస్సుకు మనము విలువ యిస్తున్నాము. **"చంద్రమా మనసో జాతః చక్షుస్సూర్యో అజాయత"** ఈ మనస్సునకు చంద్రునకు ఉండిన బింబ ప్రతిబింబముల సంబంధమును వేదము ఈ రీతిగా నిర్ణయించింది. కనుక మనము ఆత్మ విచారము లేనంతవరకు మనస్సునకు చంద్రునకు ఉండిన బింబప్రతిబింబముల సంబంధమును వేదము ఈ రీతిగా ఎక్కువ బలమును, ఎక్కువ సమయమును, ఎక్కువ ప్రాధాన్యమును ఇస్తున్నాము. **ఈ మనస్సనేది స్వతస్సిద్ధమైన ప్రకాశము కాదు.** మనస్సుండినవానికే స్వాతంత్ర్యము, బంధన. మనస్సుండిన వానికే ఆధ్యాత్మికము పారమార్థికము, లౌకికము మనస్సుండిన వానికే ప్రకృతి పరతత్వము. మనస్సుండినవానికే స్త్రీ పురుషుడు అనే భేదము. సర్వ ద్వంద్వములు ఈమనసు వల్లనే ఏర్పడినవి.

(బృ.త్ర.పు.144)

మనస్సు దేహాన్ని ఆశ్రయించివుంటున్నది. ఈ దేహమున కుండిన కన్ను ముక్కు చెవులు నోరు వీటి ద్వారానే

మనస్సు యీ పంచభూతములన్నింటిని అనుభవిస్తుండాది. మనస్సు దేహముయొక్క నేత్రముల ద్వారా చూస్తుండాది. దేహముయొక్క కర్ణముల ద్వారా వింటున్నది. **మనస్సుకు రూపము లేదు. మనస్సే మాయ. మనసే కోరిక, మనసే ప్రకృతి, మనసే ఆవిద్య. మనసే ప్రాకృతమైన భ్రాంతి.** ఇట్టి భ్రాంతితో కూడిన మనస్సుద్వారా సత్యనిత్యమైన బ్రహ్మతత్వమును మనము అర్థము చేసుకోవటము చాలా కష్టము. ఏది నిజమైన జ్ఞానము? మనస్సుచేత ఇంద్రియములను స్వాధీనపరచుకొని ఇంద్రియనాశనము గావించిన తరువాత మనస్సుకూడను అంతర్ధానమవుతుంది. ప్రశాంతమైన మౌనతత్వము ఏర్పడుతుంది. **~~ఈ~~ మనోనాశనము వలన కలిగిన మౌనమనేదే నిజమైన జ్ఞానము.**

(బృ.త్ర.పు.132/133)

మనస్సుండినంతవరకు కోరికలు తప్పవు. కోరకలుండినంతవరకు అభమానమమకారములు వదలవు. అభిమానమమకారము లుండినంతవరకును అహంకారము పోదు. అహంకారము పోయేంతవరకు ఆత్మజ్ఞానము కలుగదు. ఆత్మజ్ఞానముగాని ఆత్మానందముగాని ఆత్మదర్శనముగాని మనోనాశనము చేతనే సంభవిస్తుంది. అన్యమార్గములో లభ్యముకాదు.

(బృ.త్ర.పు.124/125)

మనసు నిర్మలంబు మంచికి మార్గంబు
మనసు నిర్మలంబు మహితశక్తి
నిర్మలంపు మనసె నీరధిముత్యమౌ
మరచిపోకు డిట్టి మంచిమాట.

(బృ.త్ర.పు.92)

మనసును ఆయుధంబునిదె మానవ జాతికి యిచ్చెతొల్లి ఆ
మనసుని శిక్షలో నిల్పు మానవుడే విజయుండు భూమిపై
మనసుకు దాసుడైన మహి మానవుడెన్నడు శాంతి సౌఖ్యముల్
కనుగొనజూచినట్లు వినిపింపగ గల్గదు స్వప్నమందునన్.
ప్రేమస్వరూపులారా! మానవజాతికి మనస్సనే ఒక పదునైన కత్తి అందించబడినది. ప్రప్రథములో మానవుడు ఈ మనస్సు యొక్క తత్వాన్ని గుర్తించి వర్తించినప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. మనస్సు బలవత్తరమైనది. మనస్సు చాలా వేగముగా పరిగెట్టేటటువంటిది. మనస్సు ఆకాశము కంటే తేలికైనది. విద్యుచ్ఛక్తి కంటే సూక్ష్మమయినది. ఇట్టి మనస్తత్వాన్ని మానవుడు గుర్తించుకొనలేక మనస్సును పెడమార్గములో ఉపయోగ పెట్టి అనేక విధములైన దుఃఖములకు విచారములకు గురియగుచున్నాడు. మనస్సు ప్రకాశము కంటే అతి వేగముగా పరిగెట్టుతుంది.

(స.ది.పు.59)

"యత్ర యత్ర మనస్ఫూర్తి
తత్ర తత్ర జగత్రయాం
యత్ర యత్ర మనోనాస్తి
తత్ర తత్ర నకించనా"
ప్రేమస్వరూపులారా !
ఎక్కడెక్కడ మనస్సు స్ఫురించుచున్నదో, అక్కడంతా ముల్లోకములు నిండి ఉంటాయి. ఎక్కడ మనస్సులేదో అక్కడ ఏమియునూ లేదు. ఈనాటి సమస్యలకు, కష్టములకు దుఃఖములకు, విచారములకు మూలకారణం మనస్సే. మనస్సు నిర్మూలనం గావించుకొనవలెననిన వాంఛలను అదుపులో పెట్టుకోవాలి.

(శ్రీ.అ.1999పు.7)

(చూ॥ అంతరాత్మ, అడవి జంతువు, అమనస్కుడు, అమోఘుడు, అహందేహోస్మి, క్రమశిక్షణ, గురుపూర్ణిమ, నాలుగుస్థాయులు, పిచ్చికోతి, ఫలము, మహాపాపం, మాటలు, మూలాధారము, యజ్ఞము, విద్య, వినాయకుడు, సచ్చిదానంద, స్వస్థానము)

మనిషి/మనుష్యుడు

మనిషిని ఇంగ్లీషులో MAN అంటారు. "M" అనగా మనస్సు-మాయ. దీనిని వశపరుచుకోవాలి. "A" అనగా ఆత్మత్వం. దీనిని అర్థముచేసుకోవాలి. అప్పుడే "N" అనగా నిర్వాణం చేకూరుతుంది. ~~ఈ~~ నిర్వాణం కోసమే

మనిషిగా జీవించాలి

బుద్ధుడు అనేక సాధనలు జరిపాడు. సర్వం మానవుని యందే ఉన్నాయి. మానవుడు యీ విషయాన్ని మరచిపోయాడు. మానవతా విలువలు పోగొట్టుకున్నాడు.

(దే.యు.పు. 7)

"మనో మూలం ఇదం జగత్" మనసు లేనిది ఎక్కడ కూడను కానరాదు. ఇట్టి మనసును కలిగినవాడు కనుకనే ఇతనికి మనుష్యుడు అని పేరు వచ్చింది. **'యద్భావం తద్భవతి'** అని. ఈ మనుష్యుని భావములు ఎట్టివో దాని ఫలితములు అట్టివిగానే ఉంటాయి. దీనినే ఆంగ్ల భాష యందు So thinketh the man, so the man అన్నారు.

(బ్ర.త్ర.పు.69)

(చూ॥ శీలము)

మనిషిగా జీవించాలి

మీరు భగవంతుని నుండి వచ్చారు. (from God)
మీరు భగవంతునితోనే ఉన్నారు (with God)
మీరు భగవంతుని కోసమే జీవిస్తున్నారు (for God)
మీరు భగవంతుడి నే చేరుకుంటారు (to God)
భగవంతుడు మీలో నే మీ వెంటనే ఉన్నాడు
నీవు మంచిమనిషి గా జీవించాలి. (Goodman) గా తయారైనపుడే God Man గా రూపొందగలవు
తల్లి అయినా మనకు దూరంగా ఉంటుంది. గాని భగవంతుడు అందరికంటే నీకు సమీపుడు. దైవమంత సమీపుడు మరొకడు లేనేలేడు.

దైవం చాల Nearest and Dearest అట్టి వానిని మనం దూరం చేసుకుంటున్నాం. ఇది అజ్ఞానం. The best way to love God is to love all.

(దే.యు.పు.102/103)

మనుజుడు

(చూ॥ వదులు)

మనుశాస్త్రము

మనుశాస్త్రం - నీవు మానవుడై ఈ జగత్తులో జన్మించినందుకు కులమునకై నీ జీవితాన్ని పోషించుకో, త్యాగముచేయుము, సమాజమునకై కులమును త్యాగము చేయుము. **సమాజమే ప్రధానమైన సూత్రమని ప్రబోధించినది. ఉపనిషత్తులు - "సహస్రశీర్ షాపురుషః సహస్రాక్ష స్సహస్రపాత్" అన్ని శిరస్సులు దైవంయొక్క శిరస్సులే, అన్ని హస్తములు దైవముయొక్క హస్తములే అన్ని పాదములు దైవము యొక్క పాదములే - అని ఐకమత్యమును, సమాజతత్వాన్ని ప్రబోధిస్తూ వచ్చాయి.** మానవునిది సమిష్టి సాంప్రదాయమేకాని, వ్యష్టి సాంప్రదాయము కాదు. ఈ జగత్తులో మానవుడు వ్యష్టిగా జీవించలేడు. మానవుడు ఈ జగత్తునందు సుఖ శాంతులతో జీవించవలెనన్న సమిష్టిభావాన్ని పోషించు కోవాలి. అన్ని మతములు సమాజ క్షేమాన్ని, శ్రేయస్సును దృష్టి యందుపెట్టుకొని ప్రబోధలు సలుపుతూ వచ్చాయి. ఈ సమాజము యొక్క క్షేమమే జగత్ క్షేమము.

(స.సా.జ.1991పు.20)

మనుష్యత్వము

మనుష్యత్వమనేది దైవత్వముతో సమానమైనది. కనుకనే **"దైవం మానుషరూపేణ"** Men are more valuable than all the wealth of the world. మనకుండిన ధనకనకవస్తు వాహనాదు లన్నియు మానవునికంటె మించినవి కాదు. అటువంటి నిత్యసత్యమైన ఆత్మతత్వమును ఒక్క క్షణము చింతించి దర్శిస్తే సర్వము మనము సాధించనవార మవుతాము.

కాని మానవుడు దాని నిమిత్తమై తగిన కృషి చేయటం లేదు. భౌతికమైన సుఖసంతోషభోగభాగ్యముల నిమిత్తమై అనేక విధములుగా శ్రమలు పడుతున్నాడు. ఆశ్రమలలో వెయ్యింట ఒక భాగమో, కోటింట ఒకభాగమో భగవంతుని చింతిస్తే ఆ దివ్యత్వమును ఎంత ఆనందముగా అనుభవించవచ్చు!

యా చింతా భువి పుత్రమిత్రభరణవ్యాపారసంభాషణే
యా చింతా ధనధాన్యభోగయశసే లాభే సదా జాయతే
సా చింతా భువి నందనందనపదద్వంద్వారవిందేక్షణే
కా చింతా యమరాజభీమనదనద్వార ప్రయాణే ప్రభో.

ధనధాన్యభోగయశస్సుల నిమిత్తమై మనము ఎంత కాలమును వినియోగిస్తున్నామో పుత్రమిత్రభరణ వ్యాపారములకై ఎంతకాలమును దుర్వినియెగపరచు కుంటున్నామో ఆ కాలములో క్షణకాలము భగవంతుని పాదారవిందములపై పెట్టటానికి మనము కృషి చేస్తే భీమసదనద్వార ప్రయాణేప్రభో - భీమసదనం. భయంకరమైన యమరాజు భవనం ద్వారాలు దాటి పోతాము. మనము ఈ ఆత్మజ్ఞానమును ఆత్మానందమును పొందవలెనంటే దీనికి ఒక్కటే ఆధారము అదే భక్తి. **స్వస్వరూపానుసంధానమే నిజమైన భక్తి. ఇదే నిజమైన ఆత్మ నిష్ఠ జ్ఞానమన్నా భక్తి అన్నా వేరుకాదు. భక్తేజ్ఞానము జ్ఞానమే భక్తి.** ఈ రెండు అన్యన్యాశ్రయములు. ఈ రెండిటిని కట్టివేసే ప్రధానమైన సూత్రము ప్రేమ. ఈ ప్రేమసూత్రము చేతనే భగవంతుని బంధించవచ్చును. ప్రేమ ప్రత్యేకము కాదు. ప్రేమనే దైవము, దైవమే ప్రేమ దేహముతో ఏర్పడే ప్రేమ, వాంఛలతో ఏర్పడిన ప్రేమ, క్షణభంగురమైనది. దైవప్రేమ శాశ్వతమైనది. ఎన్నియో బాధలు చిక్కులు సంభవించ వచ్చును. ఇవన్నీ కదలిపోయే మేఘములే. వీని నిమిత్తమై మనము ఆరాటపడనక్కరలేదు. **సత్యనిత్యమైన ఆత్మతత్వాన్ని పొందే నిమిత్తమై మనము తగిన విచారణ చెయ్యాలి. తమను తాము పుద్ధరించుకోవాలి. 'ఉద్ధరేదాత్మనాత్మానామ్' అన్నారు.**

(బ్ర.త్ర.పు.138/139)

మనోతపము

మనసున యెట్టివిచారమును పెట్టుకొనక సకల ప్రాణులకు యెల్లప్పుడు మేలుకోరుచుండవలెను. పరమాత్మను మననము చేయుచుండ వలెను. ఇతర విషయములపై పరుగెత్తు చిత్తమును స్వాధీనమందుంచుకొని, పవిత్ర భావములనుమాత్రమే మనసున కలిగియుండ వలెను. ఇట్టి దానిని మనోతపమని అందురు.

(గీ.పు.232)

(చూ॥ తపస్సు)

మనోతీతమైన స్థితి

"ఈ దేహము భగవంతునిదే" అని అనుకొన్నప్పుడు దీనితో పాప కార్యములను ఏమాత్రం చేయము. "నాధనము, నాశక్తి భగవంతునివే" అనుకొన్నప్పుడు వాటిని దుర్వినియోగం చేయవు. సదుద్దేశముతో, సత్ప్రవర్తనలో వాటిని ప్రవేశపెడతావు. కనుకనే, సత్యసాయి సంస్థలలో Ceiling on Desires అనేది ప్రవేశపెట్టాము.

1) Don't waste, food is God. నీ శరీరము ఆహారము (food) తో ఆవిర్భవించినదే. తల్లిదండ్రుల food యొక్క స్వరూపమే నీ దేహము. అన్నం బ్రహ్మ. food is God. దానిని నీవు Waste (వ్యర్థం) చేయవద్దు. నీకు ఎంత అవసరమో అంత తిను. కాని, వృధా చేస్తే భగవంతుని శక్తినే వృధా చేసిన వాడవౌతావు.

2) Don't waste Money. God is Wealth. నీవు ధనమును Waste చేయవద్దు. Misuse of Money is Evil అన్నారు. సత్కార్యములు చేయి, అన్నదానము చేయి, గృహదానము చేయి, వస్త్ర దానము చేయి, శక్తి హీనులకుదానము చేయి. అంతేగాని, ధనాన్ని దుర్వినియెగం చేయడం పాపమే.

3) Don't waste time, time waste is life waste. భగవంతుని "కాలాయనమః కాలా కాలాయనమః కాలా తీతాయనమః కాల స్వరూపాయనమః" అని కీర్తిస్తాము. అంతా కాలమే. కనుక, అనవసరమైన మాటలతో కాలాన్ని వ్యర్థం చేయవద్దు. కాలాన్ని వ్యర్థం చేయడం భగవంతుని వ్యర్థం చేయడమౌతుంది.

4) Don't waste Energy చెడ్డ ఆలోచనలు, చెడ్డ తలంపులు, చెడ్డ చర్యలు - వీటన్నింటి ద్వారా నీ

మనోదౌర్బల్యము

శరీరంలోఉండే శక్తిని అంతా వృధా చేస్తున్నావు. కనుక, మంచినే చూడాలి, మంచినే వినాలి. మంచినే చేయాలి, మంచినే తలంచాలి. అప్పుడే నీ శక్తిని సద్వినియోగం చేసిన వాడవౌతావు. అదే సాధన. అదే భగవంతుని సేవ ఈ విధంగా చేస్తుంటే మనస్సు యొక్క ప్రభావము చచ్చిపోతుంది; మనోలయ మౌతుంది. **కనుక, మనోతీతమైన స్థితికి పోవాలంటే ఈ విధమైన మార్గాలలో ప్రవేశించాలి. మనస్సును దుర్లక్షణముల ఆధీనం చేసే మార్గాలలో ప్రవేశించరాదు. మనస్సును క్రమక్రమేణా మర్చిపోయే స్థితిలో మనం సాధన చేయాలి.**

(స.సా.ఆ.93 పు.223)

మనోదౌర్బల్యము

ఒక గ్రామంలో కలరాపడి చాలామంది చనిపోయినారు. ఒక సన్యాసి ఆ గ్రామమునకు వచ్చి తిరిగి పోవుచు, దారిలో కనపడిన కలరా దేవతను, 'ఎందరిని కాజేసితివి?' అని అడిగెను. 'పదిమందిని మాత్రమే' అని ఆమె బదులు చెప్పెను. సన్యాసి 'వందకు పైగా చనిపోయినట్లు విన్నానే! నిజం చెప్పు' అనెను. అప్పుడా దేవత, నిజంగా నేను చంపింది పదిమందిని మాత్రమే. తక్కినవారు భయపడి చచ్చినవారు అని చెప్పెను. **కాబట్టి మనోదౌర్బల్యమే మానవునకు మహాపకారి.**

(శ్రీ.న.2000పు.58)

మనోనాశనము

(చూ॥ డైమండ్, ముక్తి)

మనోబలము

ఎంతటి శరీరబలిమి ఉండినప్పటికినీ, మనో బలమే లేకపోతే వీడు మనిషేకాదు. దుఃఖమొచ్చినప్పుడు అరికట్టుకోవాలి.

LIfe is a challenge Meet it
LIfe is a Game Play it
LIfe is Love Enjoy it
LIfe is Awareness

ఈ Awareness అనేటటువంటి ప్రేమ తత్వము ఎక్కడ చూచినా ఉండేటటు వంటిది. ప్రేమ లేకపోతే మానవుని ప్రాణమే లేదు. love...love...love is Everything. Live in Love. ఆ ప్రేమ ఎలాంటిదిగా ఉండాలి? స్వార్థరహితమైనదిగా ఉండాలి. స్వార్థమైనది కారాదు. Love lives by giving and forgiving, Self Lives by getting and forgetting. కనుకనే ఈ ప్రేమతత్వాన్ని మనం అభివృద్ధి పరచుకోవాలి.

(శ్రీ.అ. 1999 పు. 10)

మన్సూర్

ఉత్తర దేశంలో 'మన్సూర్' అనే మహమ్మదీయ విద్యార్థి ఉండేవాడు. అతడు నిరంతరము దైవచింతనలో మునిగి ఉండేవాడు. వారిది చాల బీద కుంటుంబము. ఎంత బీదకుటుంబమైనప్పటికీ పిల్లవానిని చదివించాలనే ఆశ తల్లిదండ్రులకు సహజము కదా! కనుక, మున్సూర్‌ను స్కూల్‌లో చేర్పించాలని తల్లిదండ్రులు ఎంతో ప్రయత్నించారు. కాని, చదువు దేనికోసమని మన్సూర్ ప్రశ్నించాడు. "నాయనా! చదువుకుంటేనే కదా తిండికి, గుడ్డకు కొదువ లేకుండా జీవిస్తావు" అన్నది తల్లి "అమ్మా! నన్ను క్షమించు. కుక్కలు, కోతులు, పక్షులు కూడా పొట్ట నింపుకుంటున్నాయి. అవి ఏ చదువులు చదివాయి? పొట్ట నింపుకోవడం కోసం చదువు చదవాలా? అట్టి చదువు నాకక్కరలేదు. దాని కోసమని నాశక్తిని, **నా దివ్యత్వాన్ని వృధా చేసుకోలేను" అన్నాడు.** ఆ పిల్లవాని హృదయం పరిశుద్ధమైన అద్దము వంటిది. పరిశుద్ధమైన అద్దములోనే మన ప్రతిబింబము చక్కగా కనిపిస్తుంది. వట్టి అద్దములో అవతల ఉన్న రూపము మాత్రమే కనిపిస్తుందికాని, ప్రతిబింబము కనిపించదు. అద్దమునకు అటువైపున మెర్క్యూరీ రసాయనమును పూసినప్పుడే ప్రతిబింబమును చూసుకోవచ్చు. అదేవిధంగా మన్సూర్ తన హృదయమనే అద్దమునకు ప్రేమ అనే

రసాయనమును చేర్చాడు. **"ఇంక ఈ లోకంతో నాకు అవసరం లేదు.** నన్ను నేను చూసుకుంటున్నాను. నా తత్వాన్ని నేను గుర్తించడమే నా జీవిత లక్ష్యము'' అని మనస్సులో దృఢం చేసుకున్నాడు.

అతడు ఇంటి నుండి బయలుదేరాడు. ఎక్కడికో వెళ్ళుతున్నాడు. అతని హృదయం పరిశుద్ధంగా, పరిపూర్ణంగా ఉండటంచేత అతని ముఖం బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతున్నది. అతడు ఎవ్వరినీ ఏమీ అడగటం లేదు. అతని తేజస్సే అన్నింటినీ అతనికి అందించింది. ఎవరో ఒక తల్లి, "నాయనా! భోజనం పెడతాను రా'' అని పిలిచేది. ఎవరు పెట్టిస్తున్నారు ఈ భోజనం? అతని పరిశుద్ధమైన హృదయమే పెట్టిస్తున్నది; పవిత్రమైన ప్రేమయే పెట్టిస్తున్నది. అతడు ఎక్కడికి పోయినా, 'అనల్‌హక్, అనల్ హక్' (నేనే దైవము, నేనే దైవము) అంటున్నాడు. ఈ మాటలు హాస్యాస్పదంగా కనిపించాయి. పెద్దలందరూ అతనిని నిందించారు. **"పిల్లవాడా! నేనే దైవమంటున్నావు.** నీవెట్లా దేవుడవౌతావు? అని ప్రశ్నిస్తూ వచ్చారు. మూర్ఖులు ఈ కలియుగంలో అధికమైపోతున్నారు. **"నేనే దైవమనే విశ్వాసం నాకు ఉంది.** మీకు లేకపోతే పోండి. నా విశ్వాసాన్ని మీరెందుకు పాడు చేస్తారు?'' అన్నాడు మన్సూర్.

"అనేక వేదశాస్త్రాలను చదివాము. అయినా మేమే దైవమని చెప్పలేక పోతున్నామే!'' అని పండితులకు కోపం వచ్చింది. మన్సూర్‌కు నేనే దైవమని చెప్పే ధైర్యం ఎక్కడి నుండి వచ్చింది? దీనికి హృదయ విశ్వాసమే ప్రధానంకాని, పాండిత్యం కాదు. ఎవరెన్ని చెప్పినా అతని విశ్వాసం చలించలేదు. పండితులందరూ రాజు వద్దకు వెళ్ళారు. "రాజా ఈ పిల్లవాడు మా పాండిత్యమునకు చాల అవమానం చేస్తున్నాడు. మేము ఎన్ని విద్యలు నేర్చినా మేమే దైవమని చెప్పుకోలేక పోతున్నాము. కాని, ఏ అక్షర జ్ఞానమూ లేని ఈ మూర్ఖుడు నేనే దైవమంటున్నాడు. ఇది ఎట్లా చెప్పగలడు? అతడు పిచ్చివాడైనా కావాలి. లేక అహంకారియైనా కావాలి'' అన్నారు. అతనిని ఎట్లాగైనా అణగద్రొక్కాలని పండితులు ప్రయత్నం చేశారు.

"ఊరక సజ్జనుండు ఒదిగి ఉండిననైన దురాత్ముకుండుని
షాకారణ మోర్వలేక అపకారము చేయుట వాని విద్యగా
చీరల నూరు టంకములు చేసెడివైనను పెట్టె నుండగా
చేరి చినింగిపో గొఱుకు చిమ్మటకేమి ఫలంబు.....?

పెట్టెలో నీవు నూరు రూపాయల బెనారస్ చీర పెట్టుకో, లేక బాత్‌రూమ్ తుడిచే గుడ్డ పెట్టుకో, దానిని కొరికి వేయడం చిమ్మట స్వభావం. దాని విలువ ఎంత, అంత అని విచారణ చేయదు. అదే విధంగా, ఎట్టివారినైనా విమర్శించడానికి పూనుకునేవారందరూ చిమ్మట జాతికి సంబంధించినవారు.

రాజు మన్సూర్‌ను దగ్గరకు పిల్చి మంచి మాటలతో చెప్పడానికి ప్రయత్నించాడు. "నాయనా! నీవు సామాన్య బాలుడవు, అక్షర జ్ఞానం లేని అవివేకివి. కనుక, ఇంత అహంకారంగా నేనే దైవమని నీవు చెప్పకూడదు'' అన్నాడు. "నేనే సత్యమే పలుకుతున్నాను. నేను దైవమే, నీవు దైవమే అందరూ దైవమే. జపమాలతో దారమువలె భగవంతుడు అందరియందు వ్యాపించియున్నాడు'' అని వాదిస్తూ వచ్చాడు మన్సూర్. ఈ మంచి మాటలు రాజు తలలో ఏ మాత్రము చేరలేదు. పైగా తన మాటలను ధిక్కరిస్తున్నాడని మన్సూర్‌పై అతనికి కోపం వచ్చింది. వెంటనే ఒక డాక్టర్‌ను పిలిచి, "ఏయ్ డాక్టర్! ఇతని కన్నులు పీకివేయ్! ఎక్కడికీ పోకుండా ఒక చోట పడి ఉంటాడు'' అని ఆదేశించాడు. డాక్టర్ వచ్చి మన్సూర్ కన్నులు పీకివేసాడు. అప్పుడు కూడా మన్సూర్ నవ్వుతూ, నవ్వుతూ, **'అనల్‌హక్ అనల్‌హక్'** అంటూ వచ్చాడు. ఎందుకంటే అతనికి దేహాభిమానం పోయింది తరువాత రాజు కిరాతకులను పిలిపించి అతని రెండు చేతులూ నరికివేయించాడు. అప్పుడు కూడా మన్సూర్ ముఖంలో ఏ మాత్రము విచారము లేదు. నవ్వుతూ, నవ్వుతూ, **'అనల్‌హక్ అనల్‌హక్'** అంటున్నాడు. అంత దృఢమైన విశ్వాసం ఆ పిల్లవానికి కట్టకడపటికి అతని కాళ్ళు కూడా కొట్టించాడు. దాంతో దేహధర్మాన్ని అనుసరించి అతని ప్రాణం

మమకారము

పోయింది, రక్తము కాలువలై ప్రవహించసాగింది. అది కూడా 'నేనే దైవం, నేనే దైవం' అని గాలికి ఎగురుతూ ఉండినది. ఇది మూడువందల సంవత్సరములకు పూర్వం ఉత్తర దేశంలో జరిగినది. అక్కడి ప్రజలందరూ చాల ఆశ్చర్యపడ్డారు. కాని, అన్నీ జరిగిపోయినతరువాత పశ్చాత్తాపం ప్రాయశ్చిత్తం వలన ప్రయోజన మేమిటి? సత్యాన్ని గుర్తించి వర్తించాలి. ఎవ్వరు ఏ మాట చెప్పినప్పటికి సత్యాన్ని విచారించకుండా ఊరికే వినకూడదు.

(స.సా.మే.96 పు. 124/125)

మమకారము

భీష్మ ద్రోణాదులు మరణింతురనియా? నీ యేడ్పు కేవలము భీష్మద్రోణాదులు మరణింతురని కాదు. వారలు నావారే అను మమకారమే నిన్ను యేడ్పించుచున్నది. లోకములో యేడ్చువారందరూ ఇదే విధముగా మరణములకు యేడ్చుట లేదు. మరణించువారు నావారలను మమకారముతో యేడ్చుచుందురు. బావా! నీవారు కానివారల నెందరిని నీవు దీనికి పూర్వము చంపలేదు. ఆనాడు ఈ యేడుపు యెక్కడకు పోయినది? ఈ కనుపించువారలు నా వారలను **మమకారమే నిన్నింత దుఃఖమునకు కూలద్రోసినది. ఆ మమకారమునకు అహంకారము కారణము. నిద్రలో అహంకారము లేదు.** అందుకే పరుండిన తన దేహము తనవారల దేహములు, కూడబెట్టిన ధన, కనక, వస్తువాహనములు యేమై పోవుచున్నవో యేమియూ తెలియకుండును. "అహం" ప్రథమా విభక్తి, మొదట వుండే "మమ" షష్టీ విభక్తి తరువాత వస్తుంది. ఇది సహజమే కదా? **పిచ్చివాడా తాను కాని దేహాన్ని తానుగా అనుకొనుటే అజ్ఞానము. అనాత్మనాత్మగా తలంచటము విపరీత జ్ఞానము. అది జ్ఞానము కానేరదు. దేహాత్మబుద్ధే జ్ఞానము.** కాని అర్జునా, నీ అజ్ఞానము మరేమి చేసినా తీరదు. దీనికి జ్ఞానమే దివ్యౌషధము" అని ప్రథమములోనే ఆత్మజ్ఞానబోధ కుపక్రమించెను. అదియే రెండవ అధ్యాయమున పదకొండవ శ్లోకము. ఈ శ్లోకము గీతాపారాయణములో బీజశ్లోకముగా భావించవలెను.

శ్లో॥ అశోచ్యాన న్యశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే
గతాసూన గతాసూంశ్చ నానుశోచంతి పండితాః॥

ఇందులో అర్జునునిలో నున్న రెండు అక్షేపణలను ఖండించు చున్నాడు కృష్ణుడు. మొదటిది దేహములకు సంభవించు నాశము ఆత్మకేననియు, శోకింపదగనివారికి శోకించుట, ఇది "ప్రజ్ఞావాదాంశ్చభాషసే" స్వధర్మాన్ని అధర్మమని పండిత వాదాన్ని చెండి వేస్తున్నానని అన్నాడు. ఇక్కడ పాఠకులు గమనించవలసిన విషయమున్నది. యేమన అర్జునునకు రెండు విధములైన మోహములు ఆవేశించినవి. ఒకటి సామాన్య మోహము. రెండవది అసాధారణ మోహము. దేహమే ఆత్మ అనుకొని దేహధర్మాన్ని ఆత్మయందు ఆరోపించుట **సాధారణ మోహము.** స్వధర్మమైన యుద్ధము ఆధర్మమని తలంచుట. ఇది ఆసాధారణమైన మోహము. ఇదే అర్జునుని యందు ప్రత్యేకించిన మోహము. అందువలననే కృష్ణపరమాత్మ మొదటిదైన సాధారణ మోహమును నిరసిస్తూ రెండవదైన అసాధారణ మోహమును నివారిస్తున్నాడు. సాధారణ మెహమును రెండవ అధ్యాయములో పండ్రెండవ శ్లోకము **నుండి ముప్పదవ శ్లోకము వరకూ ఆత్మబోధన చేసి, రెండవదయిన** అసాధారణ మోహమునకు ప్రత్యుత్తరంగా విశేషమోహాన్ని నివారిస్తు స్వధర్మ ప్రతిపాదికమైన యెనిమిది "శ్లోకాలు చెప్పెను. **వాటినే ధర్మాష్టకమని అందురు.** ఆ స్వధర్మము యేరీతిగ చేస్తే అది జన్మహేతువుకాక మోక్షహేతువు కాగలదో అట్టి నిష్కామకర్మ యోగాన్ని అనంతరం బోధించెను. ఈ రెండవ అధ్యాయములో చివరలో సాకారమూర్తి అయిన స్థిత ప్రజ్ఞుని వర్ణన జరిగింది గమనించుడు.

(గీ.పు.22/24)

దుఃఖము భగవంతుడు అందించేది కాదు. అది మీ అభిమాన మమకారములచేత కలిగేది. పోస్ట్‌మేన్ ఒక యింట్లో ఒక ఉత్తరం యిస్తాడు. మరొక యింట్లో మరొక

ఉత్తరం ఇస్తాడు. మొదటి ఇంట్లోనివారు ఘొల్లున ఏడుస్తారు, రెండవ యింటిలోనివారు ఆనందాన్ని పొందుతారు. వారి దుఃఖానికిగాని, వీరి ఆనందానికిగాని పోస్ట్‌మేన్ కారణమా? కాదు, కాదు; వారికి వచ్చిన ఉత్తరాలే కారణం. మొదటి ఇంటివారికి కుమారుడు మరణించాడని ఉత్తరం వచ్చింది. రెండవ ఇంటివారికి కుమారుడు పుట్టాడని జాబు వచ్చింది. ఈ లోకంలో పుట్టేవారు, చచ్చేవారు ఎంతో మంది ఉన్నారు. కానీ, పుట్టిన వారందరి కోసం మీరు నవ్వుతున్నారా? పోనీ, చచ్చినవారందరికోసం ఏడుస్తున్నారా? లేదే! కనుక, చావు కాదు దుఃఖమును అందించేది, చచ్చిన దేహంపై గల మమకారమే దుఃఖమును అందిస్తున్నది. మమకారంచేతనే మానవుడు ఏడుస్తున్నాడు. అదే విధంగా పుట్టుక ఆనందమును అందించడం లేదు. పుట్టిన దేహంతో గల దేహసంబంధం చేతనే మానవునికి సంతోషం కల్గుతున్నది. కనుక, సమస్త సుఖదుఃఖములకు అభిమాన మమకారములే మూలకారణం. ఈ అభిమాన మమకారములు రెండూ నీవు పెంచుకున్నవే. పెళ్ళికి పూర్వం నీకు రెండు కాళ్ళున్నాయి. అప్పుడు నీవు చాల స్వేచ్ఛగా, ఆనందంగా ఉన్నావు; బాధ్యతలు లేవు. ఎక్కడికి కావాలంటే అక్కడికి పోతావు, వస్తావు. కానీ, పెళ్ళి అయిన తరువాత నీకు ఇంకో రెండు కాళ్ళు చేరినాయి. నాలుగు కాళ్ళు అయ్యేటప్పటికి కొంచెం బంధన ఏర్పడిపోయింది. ఎక్కడికి పోవాలన్నా యింటి దగ్గర భార్యకు తగిన బందోబస్తు ఏర్పాటు చేసిపోవాలి. క్రమక్రమేణ చింతలు పెరుగుతూ వస్తాయి. తరువాత కుమారుడు పుట్టాడు. అప్పుడు ఆరుకాళ్ళు అయినాయి, నడవడం మిరంత నిదానమైపోయింది. నాలుగు కాళ్ళున్నప్పుడు జంతువుగా మారిపోయావు? నీకు అనేక బాధ్యతలు ఏర్పడుతూ వచ్చాయి. **ఆరు కాళ్ళు ఏర్పడేటప్పటికి Scorpian (తేలు) గా తయారైనావు. ఎనిమిది కాళ్ళు వచ్చేటప్పటికి Crockroach(బొద్దింక)గా మారి పోయావు.** ఈవిధంగా కాళ్ళు పెంచుకుంటూ అల్ప జీవితానికి పోతున్నావే గాని, అధిక జీవితానికి పోవటంలేదు. కోరికలను ఎంత తగ్గించుకుంటే జీవిత ప్రయాణంఅంత సులువుగా సాగుతుంది. కనుక, కోరికలను ఒక పరిమితిలో పెట్టుకోవాలి. పరిమితి లేకుండా పెంచుకుంటే ప్రమాదమైపోతుంది.

(స.సా.అ.99పు.273/274)

మమైమత్వము

(చూ॥ శరాణాగతి)

మరణము

చిన్నపిల్లలు మరణిస్తే వారికి పునర్జన్మ ఉండదు. ఎటువంటి పిల్లలో తెలుసా తల్లితండ్రులకు ఎటువంటి జబ్బు ఉండకూడదు. ఆరోగ్యంగా ఉండాలి. శిశువు కూడ ఏరోగము లేక ధృడశరీరము కలిగి ఉండాలి. అటువంటి బిడ్డ మరణిస్తే పునర్జన్మ లేదు. పదహైదు సంవత్సరాల లోపల మరణిస్తే ముక్తజీవులౌతారు. ఎందుకంటే ఆ వయస్సు లోపు వారిలో కామక్రోధాలు చోటు చేసుకోవు. యోగులకు గర్భవాసం బాల్యం అనే కర్మలు గానే ఉంటేవారు పుట్టి అవి అనుభవించి తక్షణం మరణిస్తారు. అదివారికి చివరి జన్మ అవుతుంది.

ఆయుర్దాయం పూర్తి కాకుండా ఆత్మహత్య చేసుకోకూడదు. అది మహాపాపం. కొత్తగా సమస్యను తెచ్చుకోవటం. అద్దె ఇల్లు సంపాదించకుండా, ఉన్న ఇల్లును ఖాళీ చేయడం వంటిది. ఆత్మహత్య చేసుకుంటే నడి రోడ్డు మీద పడాలి. ప్రేతాత్మగా దిక్కు మొక్కులేక బాధపడాలి.

((త్రి.సా.పు.222)

పాంచభౌతికము, దుర్బలమైన కాయంబు।
ఎప్పుడో విడచేది ఎరుక లేదు।
శతవర్షములదాక మితము చెప్పిరి కాని।
నమ్మరాదామాట నెమ్మనమున।
బాల్యమందో, లేక ముదిమియందో లేక ముసిలి యందో,
ఈడనో, ప్రాయమందో। ఉదకమధ్యమున!

మరచిపోవలెను

ఎప్పుడో విడిచేది ఏక్షణములో।
మరణమేనిశ్చయము బుద్ధిమంతుడైన।
దేహమున్నంతలో తెలియవలయు।

(సా.పు.198)

(చూ॥ అంత్యకాలము, ఆత్మ, ఆత్మధర్మం, ఉత్తరాయనము, చదువు, జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనము, దుఃఖము, పరీక్షిత్ ప్రార్థన, మాయ)

మరచిపోవలెను

అత్యంతాశ్చర్యకరమైన విషయమేమిటంటే మానవులు ఎవరికి వారు, తమకు మరణము సంభవించుననే విషయములో అనేక అపోహలకు లోనగుదురు. పుష్పములు, వడలి నేలరాలక ముందు వికసించి పరిమళమును వెదజల్లును. మానవుడు తన అంత్యకాలమాసన్నమైనపుడు విచారవదనుడగును. పుష్పమువలె అంత్యకాలము సమీపించినపుడు తేజోమయుడై సత్కార్యములను చేపట్టవలెను. మానవుడు రెండు విషయములను ఎప్పటికీ గుర్తుంచుకొనవలెను. అవి, మరణము, భగవంతుడు. ఇక రెండు విషయములను మరచి పోవలెను. అవి మనకు ఇతరులు చేసిన హాని, మనము. ఇతరులకు చేసిన మంచి వీటిని విడచి పెట్టకుండా జ్ఞప్తియందుంచుకోవడమంటే కొన్ని ఫలితములనాశించి ప్రాకులాడుట. అప్పుడు వాటి పరిణామములను కూడా అనుభవించవలసి వచ్చును. మనము ఏమి యోచించినా, మన మనస్సులో ఏ భావమునకైనా స్థానము కల్పించినా మనము ప్రతిఫలమును అనుభవించెదము. అయితే మరణము సంభవించునను సత్యమును ఎప్పుడూ మనస్సునందుంచుకొనవలసినదే. దీని వలన సత్కార్యాములను చేపట్టి హానికరములైన పనులకు దూరముగా నుండుటకు అవకాశమున్నది.

(ప.పు.95)

మరువకూడదు

ఎలాంటి కష్టసమయములయందుగాని, ఎలాంటి బాధల యందుగాని దైవాన్ని మాత్రం వదలరాదు. దైవం ఒక్కడే.

హెచ్చుగ సంపదలొచ్చినగాని
ఏనుగు గుఱ్ఱములెక్కినగాని
పిచ్చోడని పేరొచ్చినగాని
ప్రియముతో పెద్దలు పొగిడినగాని
దేవుని మరువకురా!
ఉన్నది దైవము ఒక్కడురా!
దుష్ట జనులు దూషించినగాని
దోషరహితుడై వుండినగాని
కష్టములెన్నో వచ్చినగాని
కాయము వ్యాధుల చిక్కినగాని
దైవము వదలకురా!
ఉన్నది దైవము ఒక్కడురా!
యోగాభ్యాసము చేసినగాని
భాగవతాదుల చూచినగాని
పండితుడని బిరుదిచ్చినగాని
పాపిష్టోడని అన్ననుగాని
దైవము వదలకురా!
ఉన్నది దైవము ఒక్కడురా!
నిందకు లోబడి నిలిచినగాని
నిండుచదువులే చదివినగాని
నిండు కుండవై వుండుమురా
నీవు ఎండని కుండగనుండకురా
దైవము ఒక్కడురా!
ఉన్నది దైవము ఒక్కడురా!

ఇలాంటి దైవతత్వమును ఏనాటికి మరువకూడదు. ఉన్నది ఒకే దైవమనే సత్యాన్ని మనం గుర్తించాలి. నా లోపల, నా వెలుపల నా సర్వత్రా వున్నటువంటి ది దైవమే. దైవమే అనే సత్యాన్ని గుర్తించాలి. దైవము సమిష్టి స్వరూపం. దైవము ప్రేమస్వరూపుడు. ప్రపంచమంతా ప్రేమమయమే. ప్రేమ దృష్టిని మనం పెంచుకోవాలి. మన జీవితం ప్రేమమయంగా మారుతున్నప్పుడు జగత్తంతా బ్రహ్మమయంగా మారుతుంది.

(శ్రీ. ఆ. 98పు. 8)

మర్మము

(చూ॥ గురుపూర్ణిమ)

మర్త్యుడు

హృదయమనే క్షేత్రమందు కలదు ఒక్క కల్పతరువు
దాని చుట్టు కలుపు ముండ్ల కలప పెరిగియుండు
కలుపు తీసి శుభ్రపరచ కల్పతరువు కానపడును
అదియే నీ అభీష్టములనొసగు **కామధేనువు.**
కల్పవృక్షము, కామధేనువూ కూడనూ ఒక్క మానవుని యందే వుంటున్నవి. ఈ మానవత్వమనేది గోచరమయ్యే వస్తువునకు, అగోచరమయ్యే వస్తువునకు మధ్య ఒక వారధివలె ఉంటున్నది. ఇట్టి మానవత్యం మధ్యలో ఉన్నది. కాబట్టే మానవునికి మర్త్యుడు అని మరొక పేరు.

(స.ది.పు.129)

మలము

మలమనగా ఏమిటి? మన జీవితములో తెలిసియో తెలియకనో అనేక విధములైన దోషములు చేస్తున్నాము. ఈ జన్మమునందే కాదు. ప్రతిజన్మము నుండి, అనేక తరములనుండి మనము దోషములు ఆచరిస్తూ వస్తున్నాము. ఈ దోషముల మాలిన్యము తరతరముల నుండి మార్పు చెందక చిత్రముపైన చిత్రంపబడుతూ వచ్చింది. అద్దముపైన మాలిన్యముండినప్పుడు మన స్వరూపము స్పష్టంగా గోచరము కాదు. ఈ కారణముచే మానవుడు తన స్వస్వరూపమును దర్శించలేకపోతున్నాడు; గుర్తించలేకపోతున్నాడు. మనస్సనే అద్దము నందు తన నిజస్వరూపాన్ని చూడలేక పోతున్నాడు. కనుక యీ అద్దమునకు చేరిన మాలిన్యాన్ని శుద్ధపరచటానికి తగిన కృషిచెయ్యాలి. **ఏవిధముగా చెయ్యాలి? చేసే ఉపాయము ఏమిటి? దీనిని మానవుని ఆహారవిహారముల చేత పరిశుద్ధము గావించుకోవచ్చుPast is past గడచి పోయినది గడచిపోయినది; వర్తమానమందైనా పవిత్రమైన మార్గమును అనుసరించి దీనిని పరిశుద్ధపరచే ప్రయత్నమునకు పూనుకోవాలి.**

(బ్ర.త్ర.పు.80)

(చూ॥ ఆవరణము, ఆహారము)

మల్లికార్జునుడు

(చూ॥ అర్జునుడు)

మసీదు

(చూ॥ ఇస్లామ్)

మహత్తత్వము

మేధాశక్తి, తెలివితేటలున్న వానిని వీడు బుద్ధిమంతుడప్పా అంటారు. వాడు బుద్ధిమంతుడు కాదు, తెలివిమంతుడు కావచ్చును. **శ్రద్ధ సత్యము ఋతము, యోగము, మహత్తత్వము ఈ ఐదింటి చేరిక సమయమునందే బుద్ధి అనాలి. ఈ యోగ ముండినప్పటికీ మధ్యలో దేహముంటుండాది. అదే మహత్తత్వము. అనగా గొప్ప తత్వము. మహత్ అనగా గొప్ప అని అర్థము. తత్వము అనగా రెండిటినీ గుర్తించినది అని. అందుకనే మహా మంత్రమునందు "తత్ త్వం అసి" అన్నారు.** అదే నేను అని ఈ సర్వశక్తితో కూడిన దివ్యత్వమే నేను అనే తత్వమే ఈ మహత్తత్వము. **నేనే సత్ చిత్ ఆనందమును అనేదే మహత్తత్వము. స్వస్వరూప సందర్శనభాగ్యమే తత్వము, స్వస్వరూపసంధానమే తత్వము. తానెవరో గుర్తించుకోవటమే సరియైన తత్వము.** తానెవరో గుర్తించుకోగలిగితే అదే నిజమైన బుద్ధి. తానెవరో తెలియకుండా తెలివి తేటలతో ప్రపంచమునంతా తెలిసికొనినవాడు బుద్ధిమంతుడు కాడు. తనను తాను తెలుసుకున్నవాడే బుద్ధిమంతుడు. బుద్ధి అనేదానిని సామాన్య స్థితితో, సామాన్యమైన పేరుతో అనుభవించ రాదు. ఇది ఆత్మకు ప్రతిబింబమనే చెప్పవచ్చు.

మహనీయులు

ఆత్మయొక్క Resound, Reflection, Reaction తత్వమే బుద్ధి యొక్క ప్రమాణము. విద్యార్థి ఈ బుద్ధిరహస్యాన్ని తెలుసుకున్నపుడే తాను బుద్ధిమంతుడా లేక భ్రమతో కూడినవాడా అని తనకు తానే నిర్ణయము చేసుకోవచ్చు. First rank వచ్చిన లేక 'O' grade వచ్చిన తెలివితేటలు గలవాడు అని భావించవచ్చు. అది మేధాశక్తికి సంబంధించినది. మే-మే-మే- అదే మేధా శక్తి మేధా దానిలో పుట్టిన శక్తి. **ఈ మేధాశక్తియే మాయాశక్తి.**

(బృ.త్ర.పు.100/101)

(చూ॥ బుద్ధి, బ్రహ్మత్వము, సృష్టి)

మహనీయులు

(చూ॥ జ్ఞానము, దుష్ప్రచారములు)

మహిమలు

"నామహిమలను నా దివ్యతత్వమును ఓర్వలేని వారెందరో వున్నారు. వారు నాచర్యలకు గారడి, కనికట్లు, హస్త లాఘవము అని పేర్లు పెట్టుదురు. వారి మాటలవలెనే వారి భావములూ, అనుభవమూ పరిమితమైనవి. ఇట్టి ప్రచారములతో నాకు కళంకము ఆపాదించగలరని వారి భ్రమ. నా దివ్యశక్తి యొక్క మహావైభవమును గ్రహించుట అట్టి అల్పజ్ఞులకు, సంకుచిత హృదయులకు అనుభవహీనులకు సాధ్యము కాదు. ఇది సర్వశక్తి సమన్వితమైన దైవ శక్తి. సమస్త శక్తులూ నా అరచేతిలో వున్నవి. నా శరీరము తదితర శరీరములవలెనే తాత్కాలికమైనది; **నా శక్తి ప్రభావములు శాశ్వతము, సర్వవ్యాప్తము, నిర్వికల్పము,"**

(స.శి.సు.తృ.పు.64)

మహిమలు గారడీలతో, సిద్ధులతో వీటికి సంబంధంలేదు. యోగసిద్ధులు సాధన ద్వారా ప్రతివారికి అలవడగలవు. కాని ప్రజలను రక్షించటానికీ, వ్యాధులను నివారించటానికి, జనులకు అభయ మివ్వటానికీ నేను సృష్టించే వస్తువులు నా దివ్యత్వం నుంచి అవిర్భవిస్తున్నది. ఈ అవతార పురుషునికే సాధ్యమయినవి. వీటికి శిక్షణలూ, నిబంధనలూ,అభివృద్ధి ప్రణాళికలూ లేవు. అవి విశ్వవ్యాప్త మయిన సృజన శక్తి నుంచి ఆవిర్భవిస్తున్నది.

మీరు కొన్ని అదృశ్య శక్తులను ప్రయోగించి వస్తువులను ఒకచోటనుంచి మరొకచోటికి తెప్పిస్తున్నారని కొంద రంటున్నారు. నిజమేనా?అదృశ్య శక్తులను ప్రయోగించ వలసిన అవసరం నాకు లేదు. నా దివ్య సంకల్పం ద్వారా వస్తువులను సృష్టించగలను. అన్నీ నేనే. అంతటా నేనే. నేను సర్వజ్ఞుడను, సర్వవ్యాప్తిని సర్వశక్తి సమన్వితుడను. కాబట్టి నేను ఏది సంకల్పిస్తే అది అ క్షణమే జరుగుతుంది. మనదేశంలోనూ, విదేశములలోనూ భక్తులెందరో బాబా తమ హృదయాందరంలో మసలుతున్నట్లు అంతరంగంలో మెరిసే దైవం మీరేనని ప్రశంసించారు. ఈ స్థితి వారికి ఎలా లభించింది?

నా అనుగ్రహం వల్లనూ, వారి భక్తివల్లనూ ఇటువంటి అనుభూతి కలుగుతుంది. మనందరిలో ఒకే దివ్యత్వం వున్నదని నేను పదే పదే చెబుతున్నాను. అందరిలో చిన్న వెలుగు రేఖగా మెరిసే దివ్యత్వమే నాలో సంపూర్ణ జ్యోతిగ భాసిస్తున్నది. అందరిలో వున్న దివ్యత్వ స్ఫూర్తిని దివ్య మహాజ్వాలగా ప్రకాశింప జేయటమేనా ఉద్యమ లక్ష్యము. అనుగ్రహమును అందుకొనే భ క్తులు, తమలో తదనుగుణమైన భక్తి శ్రద్ధలను పెంపు చేసుకోవాలి. తమ హృదయాంతరాళాలలో నిత్యమూ బాబా మసలుతున్నట్లు భావించుకొనే వారు ఇటువంటి స్థాయికి ఎదిగిన వారు. వారు నా సన్నిధికి వచ్చి నన్ను సందర్శించి నా సంభాషణ ఆలకించి నా ప్రేమను భక్తితో స్వీకరించి నా దివ్యత్వములో విలీనమవుతున్నారు.

సంశయగ్రస్తులకు నేను ఒక ఉదాహరణ ఇస్తున్నాను. ముత్యాలు ఏరదలచినవారు సముద్రంలో దిగి లోతునకు పోవాలి. ఒడ్డున నిలబడి సముద్రంలో ముత్యాలు ఉన్నవనే కబుర్లు కల్లలు అనకూడదు. అవతార మూర్తి ప్రేమానుగ్రహములను పొందగోరిన వారు సాయిబాబా దివ్యత్వమును అవగాహన చేసికొని ఆతత్వంలో

మునిగిపోవాలి. అప్పుడే నాలో వారు కలసి పోగలరు. అప్పుడే వారు తమ హృదయాంతరాళములో నా శక్తిని అనుభవించగలరు.

(స.ప్ర.పు.19/21)

(చూ॥ అవతారములు, దివ్యప్రకటనలు)

మహాత్యాగి

(చూ॥ సూర్యుడు)

మహాత్ములు

ప్రతి మానవుడు తన మనస్సునందు, మాటలందు, కర్మలందు పవిత్రతను కల్గియుండాలి. దీనినే ...అన్నారు. మానవత్వ మంటే ఏమిటి? హృదయము, వాక్కు, పని ఈ మూడింటి ఏకత్వము కావాలి. హృదయములో ఏది ఉద్భవిస్తున్నదో దాన్ని వాక్కులో చెప్పాలి. ఏది వాక్కులో చెప్పావో అది చేత్తో చేయాలి. ఈనాడు హృదయములో ఉద్భవించేది ఒకటి, నోటితో చెప్పేది ఒకటి, చేత్తో చేసేది మరొకటి.

మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్
మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనామ్

మీరందరు మహాత్ములు కావాలి. మీకు మహత్తరమైన మానవ జన్మ లభించింది. ఈ జన్మ చాలా పవిత్రమైనది. **'జంతూనాం నరజన్మ దుర్లభం'** అన్నారు. ఈ జన్మకున్న విలువ మరి దేనికీ లేదు. మానవ జన్మకున్న కీర్తి మరొక దానికి లేదు. మానవ జన్మకున్న స్థాయి మరొక దానికి లేదు.

(ద.స.1998 పు.60)

మహానుభావుడు

(చూ॥ పండితుడు)

మహాపాతకాలు

దురదృష్టవశాత్తు ఈనాడు ఏడు విధములైన మహాపాతకాలు దేశాన్ని పట్టి పీడిస్తున్నవి. అవి 1) నీతిలేని వాణిజ్యము 2) నిజాయితీలేని రాజకీయము 3)శీలం లేని విద్యావంతుడు 4) త్యాగం లేని ఆచారము 5)కృషిలేని సేద్యము. 6)గుణములేని మానవత్వం. 7)స్థిరంలేని భక్తి. ఏనాడు ఈ మహాపాపములు సమసి పోతాయో - ఆనాడే దేశము నిత్యకళ్యాణము పచ్చతోరణములతో కళకళ లాడుతుంది. అయితే, మానవుని యందు ఈనాడు శీలసంపద, నీతినిజాయితీలు, కృషి, త్యాగము మొదలైన సద్గుణాలు సన్నగిల్లిపోతున్నాయి. అందుచేతనే దేశము మరింత అల్లకల్లోలములకు, ఆశాంతికి గురియౌతున్నది. ఈనాడు విద్యార్థుల ప్రవర్తనను అరికట్టుటకుగాని, ప్రజల నోరు మూయుటకు గాని ఎవ్వరికీ సాధ్యము కావటము లేదు.

(స.సా.ఏ92పు.80/81)

మహాపాపము/మహాపాపులు

శంకరులవారు కాశీ క్షేత్రంలో విశ్వనాథుని దర్శించి, "స్వామి! నేను మూడు విధములైన పాపములను చేశాను. వాటి పరిహారార్థమై నీ దర్శనానికి వచ్చాను" అన్నారు. శంకరులవారు ఏ పాపం చేశారు? ఎవరిని చంపారు? ఎవరి సొత్తును అపహరించారు? ఏమీ లేదే! మరి అలాంటప్పుడు తాను పాపినని ఎట్లా చెప్పారు? **"స్వామీ! 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' అని నేనే చెప్పాను.** నిన్ను వాక్కుచేత గాని, మనస్సుచేతగాని వర్ణించుటకు సాధ్యం కాదని నేనే అన్నాను. అలాంటి నేనే ఇక్కడకు వచ్చి **'ఈశ గిరీశ నరేశ పరేశ...' అని నిన్ను వర్ణిస్తున్నాను. నేను చెప్పినది ఒకటి, చేసినది ఒకటి. ఇది పాపం కాదా? ఈ పాపమును క్షమించు" అని ప్రార్థించారు. "భగవంతుడు హృదయవాసి** అని, ఎక్కడ చూసినా ఉన్నాడని ఇతరులకు బోధించాను. కానీ నిన్ను దర్శించడానికి ఇప్పుడు కాశీ క్షేత్రానికి వచ్చాను. అన్ని చోట్ల ఉన్న నిన్ను చూడటానికి ఇంతదూరం

మహాపురుషులు

రావడమెందుకు? నేను బోధించిందొకటి, ఆచరించిందొకటి. ఇది కూడా పాపమే కదా!'' అన్నారు. **ఇంక మూడవ పాపం ఏమిటి?** "మానవునకు పాపం లేదన్నాను. **"నపుణ్యం నపాపం నసౌఖ్యం నదుఃఖం.."** అన్నాను. అలాంటి నేను తిరిగి పాప పరిహారార్థం నిన్ను ప్రార్థిస్తున్నాను. ఇదే పెద్ద పాపం'' అన్నారు. దీని అంతరార్థ మేమిటి?

మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనః
మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణన్యత్ దురాత్మనః

మానవుడు చెడిపోవడానికి కారణ మేమిటి? **మనో వాక్కాయకర్మలు ఏకం కావటం లేదు. మనస్సులో ఒకటి, మాటలో మరొకటి, క్రియలో ఇంకొకటి - ఇదే పెద్ద పాపమని బోధించారు శంకరులవారు.**

(స.సా.మా.99పు.75/76)

పరుల బాధను చూచి, ఆనందించువారు మహా పాపులు. రాక్షసులు. పరుల సంతోషమును కోరువారు పరుల ఆనందము నపేక్షించువారు పవిత్రులు.

(రా.వా.మొ.పు.195)

మహాపురుషులు

(చూ॥ భారతీయులు)

మహాప్రస్థానము

మహాప్రస్థానమును నిమించిరి. అనగా, యేమియూ తినక, త్రాగక, విశ్రాంతి గొనక ఉత్తరదిక్కునకు వెడలుట; దీనినే మహాప్రస్థానమని అందురు.

(భా.వా.పు.85)

మహాబలి

(చూ॥ విశ్వామిత్రుడు)

మహాభాగ్యము

'ధర్మార్థ కామమోక్షానాం ఆరోగ్యం మూలముత్తమం'. చతుర్విధ పురుషార్థ సాధనకు ఆరోగ్యం అత్యవసరం. ఆరోగ్యమే లేకుండిన మానవుడు ఎట్టి చిన్న కార్యము నందైనా పాల్గొనలేడు. ఆరోగ్యమును మించిన భాగ్యం మరొకటి లేదు. ఆరోగ్యమే మహాభాగ్యం.

(స.సా. జూలై 2001 పు. 193)

మహాభారతము

కృష్ణుడు, తన యెడ గాఢమైన భక్తియు, విశ్వాసమును కలిగి ప్రార్థించు ఆర్తులు మొరలాలించి, తప్పక పాలించునని పెక్కు తార్కాణాలతో భారతము నిరూపించుచున్నది. అట్టి తార్కాణాలలో, కౌరవ సభలో అవమానితమై, దుర్భర దుఃఖముతో మొరపెట్టిన ఘట్టమొకటి.

భగవంతుడెప్పుడును భక్తుని ప్రార్థనమునకు వెనుకనుండు వేదననే ముఖ్యముగా చూచును. ఆవేదన యనుభైకవేద్యము. అదే భగవంతునకర్పింపదగినది. **భగవదర్పితము చేయుట ద్వారా కర్మయే ఉపాసనమగును.** రతి (అనురాగము) విత్తనము, భావము (చిత్తవృత్తి) మొలక; ప్రేమ వృక్షము; సచ్చిదానందము దాని ఫలము. **వేదములలో కర్మకాండ, ఉపాసనకాండ, జ్ఞానకాండ. అని మూడు భాగములున్నవి.** ఆమూడింటిని మహాభారతము బోధించును. కాబట్టి భారతము వేదరక్ష ఫలముగా చెప్పనగును.

(స.వ.పు.9)

విషవాంఛలు - భావోద్వేగములు అనెడు కొండవాగులు జీవిత కాలములను కూలద్రోయకుండా తిన్నగా సాగిపోవుటను ధర్మము పొర్లుకట్టలు నిర్మించునది. ఆకట్టలెట్టివో మహాభారతము విస్పష్టముగా వివరించును. బ్రహ్మ చర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము. అను నాల్గుగాశ్రమములను, ఆ వాగులు దాటుటకు కట్టిన వంతెనలు, అవి జీవిత యాత్ర లోని మజిలీలు. ఏ

యాశ్రమములో ఎట్లు వర్తించవలెనో తెలుపు నిబంధనలతో ఆనాలుగాశ్రమములును, వ్యక్తి క్షేమము కొరకును, సంఘక్షేమము కొరకును, ప్రతివానికిని విధింపబడినవి. అవి మానవుని లోని పశుత్వోద్రేకము నణగించి, మానవత్వమును కాపాడును. మహాభారతము ఎల్ల ప్రజలకును ఉపాధేయమైన దివ్యోపదేశము.

(స.వ.పు.10)

(చూ॥ త్యాగం, ప్రధానమైన అస్త్రము, పంచమవేదము, బలహీనుడు)

మహాభారతయుద్ధము

పాండవులు, కౌరవులూ నేడుగూడునూ యుద్ధము చేయుచునే ఉన్నారు, సూక్ష్మరూపులై. ఇందులో దుర్గుణములే కౌరవులు, సద్గుణములయిన సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను ఐదు గుణములే పంచ పాండవులు. దుర్గుణములను కౌరవులు లెక్క లేనంతమంది వున్నారు. వారికి, వారికి ప్రతి ఒక్కరి హృదయాకాశము క్రిందే చిత్త భూమియందే యుద్ధము జరుగుచున్నది. హృదయరాజ్యాధిపతులే వారు. అజ్ఞాని, సుజ్ఞాని అనే పేర్లతో అందరి యందూ ఉన్నారు. అజ్ఞాని అయిన గ్రుడ్డివాడే ధృతరాష్ట్రుడు. సుజ్ఞాని అయిన పాండురాజు సద్గుణముల తండ్రి.

అనేకములైన రథములూ, సైన్యమూ, ప్రజలూ, వారంతా మానవుని యందే వున్నవి. వివిధమైన అనేక భావములే ప్రజలు. దశేంద్రియములే సైన్యము, పంచేంద్రియములే రథాలు. అట్టి సైన్యముతో, ప్రజలతో, ప్రతి ఒక్కరి హృదయమందు నిత్యమూ పాండవులు కౌరవులను సద్గుణ దుర్గుణములు యుద్ధము చేయుచునే యున్నారు. కృష్ణపరమాత్మ ఆత్మ అను పేరుతో సాక్షీభూతుడై యున్నాడు. జీవిత రథసారధే అతడు.

సూక్ష్మ రూపమున సంచరించు సర్వసైన్య, కథ, కౌరవ, పాండవులకు నిలయమైనది అస్థి పంజరమే.కాన, అస్థిపంజరమే హస్తినాపురము, ఎట్లన ఆస్థాల హస్తినాపురమునకూ నవ ద్వారములు. దీనికీ నవ ద్వారములు. కౌరవ పాండవులు పుట్టినది, పెరిగినది, విద్యలు నేర్చినది, కడకు యుద్ధము చేసినది, ఒకే స్థలమందు. ఇక్కడ గూడ దుర్గుణ సద్గుణములు పుట్టినది, ఆడినది, పాడినది, సర్వమూ చేర్చినది, కడకు రెండింటికి వైరము వచ్చినది, ఒకే అస్థిపంజరమైన దేహమందే కాన దేహమే హస్తినాపురము. ఇందులోని రాజులు, అజ్ఞాని, సుజ్ఞాని.

ఎప్పుడు దుర్గుణ సద్గుణములు ఒక్కటయి, గుణ రహితులు కాగలరో అప్పుడే శాంతి ఏర్పడును.

వ్యామోహములను ప్రజలున్నకదా యుద్ధమును జరిపింతురు? అట్టి ప్రజలే లేకున్న యుద్ధమూలేదు. కాన, మొదట వ్యామోహములు, మమకార అహంకారములూ లేకుండా చేసికొన్న శాంతిగా ఉండవచ్చును. అట్టి శాంతికి ప్రయత్నించు. ఊరికే సందేహములు పెట్టుకొనుట కూడా ఒక వ్యామోహమే. దీనిని గూడా లేకుండా చేసికొనుటకు ప్రయత్నించు.

(శ్రీ.స.సూ.పు.255/256)

మహాయోగి

ఇంద్రియములను మనసు నిలిపిన అంధుడైనను పొందు మోక్షము.

ఇంద్రియములను మనసు నిల్పిని చంద్రుడైనను సంతునొందడు.

కుక్క తిన్నవాడు గురుజంగ లింగము
పంది తిన్నవాడు పరమగురువు
ఏనుగు తిన్నవాడెంత సుజ్ఞానియో
విశ్వదాభిరామ వినురవేమ.

ఇందులోని అంతరార్థాన్ని మనం విచారించాలి. **కుక్క-క్రోధము. పంది-అహంకారము, ఏనుగు-మదము. ఈ మూడింటిని అరికట్టుకున్న వాడు మహాయోగి అన్నాడు** వేమన. యావత్ దేశమునందు అనేక రకములైన యోగాలు మనం వింటూ ఆచరించటానికి పూనుకుంటున్నాం.

మహావాక్యములు

యోగాలు అనేకం ఉన్నా అన్నింటిలోనూ ప్రధానమైనది పతంజలి యోగం. "యోగః చిత్తవృత్తి నిరోధకః". ఇంద్రియములు అరికట్టక మనము ఎట్టి కార్యము లందైనను సుఖసంతోషాలు పొందలేము. విచ్చలవిడిగా విడచిన యింద్రియములద్వారాదుఃఖమే సంప్రాప్తమవు తుంది. భారతీయులు ఈ తత్వాన్ని విచారణ చేయటంలేదు. ఇంద్రియ నిగ్రహమును విరుద్ధంగా భావిస్తున్నారు. ఇంద్రియ నిగ్రహమనగా ఇంద్రియములను సక్రమ మార్గంలో ప్రవేశింపజేసి తద్వారా హృదయా నందాన్ని అందుకోవటానికి పూనుకోవటమే.

క్రోధము, అహంకారము, మదము, మానవుని ఉన్మత్తుచేసి అహంకారిగా తయారు చేస్తాయి. మానవత్వంలో వున్న ప్రజ్ఞాన, విజ్ఞాన, సుజ్ఞానములను తెలిసికొని వానివల్ల ఆత్మానందాన్ని అనుభవించాలి. ఈనాడు లోకంలో మనం చూస్తున్న అలజడులకు. అల్లకల్లోలాలకు యింద్రియము లను విచ్చలవిడిగా విడిచి పెట్టటమే ముఖ్యకారణం. ఇంద్రియములను విచ్చలవిడిగా సంచరింపజేయటంచేత విచారణ శక్తి శూన్యమైపోతుంది.

(వే.ప్ర.పు.148/149)

(చూ॥ శ్రేష్టుడు)

మహావాక్యములు

నిజముగా శరీర మనో బుద్ధి అంతఃకరణం తత్వాన్ని ఛేదించి గమ్యం చేరవలెనన్న మానసిక తత్వాన్ని, బుద్ధి యొక్క విచారణను, అంతఃకరణ తత్వాన్ని, జాగ్రత్ స్వప్న సుషుప్తులను చాటాలి. అప్పుడే "నేను" అనే ప్రజ్ఞాతత్వాన్ని అర్థము చేసుకోవచ్చును. దేహం, మనస్సు బుద్ధి, అంతఃకరణ ఇవన్నీ ప్రాకృతమైన భావములతో కూడినవే. ఇవి మనస్సు యొక్క వికార స్వరూపములే. ఈ మనస్సు ఉండినంత వరకు దివ్యత్వాన్ని ఆర్థము చేసుకోలేము. కనుక, మానసికతత్వాన్ని నిగ్రహించు కోవడానికి తగిన కృషి చేయాలి. దీని అంతరార్థమును పురస్కరించుకొనియే వేదము నాలుగు విధములైన మహా వాక్యములను ప్రబోధిస్తూ వచ్చింది.

మొదటిది "ప్రజ్ఞానం బ్రహ్మ". ప్రజ్ఞానము అనగా చైతన్యము. ఈ ప్రజ్ఞానము సర్వేంద్రియములందు, మానవ దానవ దివ్యత్వములందు, పశుపక్షి మృగాదుల యందు కూడా వ్యాపించియున్నది. కనుక సర్వజీవుల యందు, సర్వత్రా వ్యాపించినట్టి ఈ చైతన్యము బ్రహ్మతత్వముగా రూపొందుతూ వచ్చింది. బ్రహ్మ అనగా ఏమిటి? ఇది వ్యాపకత్వముతో కూడినది. శరీర మనో బుద్ధి అంతఃకరణ తత్వములకు, జాగ్రత్ స్వప్న సుషుప్తులకు కూడా అతీతమైనది. ఇదే **"ప్రజ్ఞానం బ్రహ్మ"** ప్రజ్ఞానము చైతన్యంతో కూడినది. కనుక, చైతన్యం బ్రహ్మ రెండూ సమాన పదాలే. అనగా దైవత్వము చైతన్యము వ్యాపకత్వము మొదలైనవన్నీ ప్రత్యేక మైన రూప నామములుకావు. ఇవన్నీ బ్రహ్మతత్వము యొక్క వివిధ అంగములే. మన దేహానికి "మానవ దేహము" అని ఒక పేరున్నది. కాని, ఇది కాళ్ళు, చేతులు, నోరు, ముక్కు మొదలైన అంగములతో కూడినది. అదేవిధముగా, ఈ బ్రహ్మతత్వమనేది ప్రజ్ఞతో, వ్యాపకత్వముతో, చైతన్యముతో, పరిపూర్ణత్వముతో కూడినది. ఇవన్నీ దాని అంగములే. ఈ అంగములన్నింటి యొక్క సమ్మిళిత స్వరూపమే దివ్యత్వము. **"ప్రజ్ఞానం బ్రహ్మ" అనగా, చైతన్యమే బ్రహ్మ.** ఈ చైతన్యము సర్వత్రా ఉంటున్నది. ఈ చైతన్యము లేని స్థానమే లేదు. కనుక, ఈ **"ప్రజ్ఞానం బ్రహ్మ" అనే మహా వాక్యాన్ని పురస్కరించుకొనియే దైవం సర్వవ్యాపకుడనియు, సర్వశక్తి మయుడనియు వేదం ప్రబోధిస్తూ వచ్చింది.**

ఇంక రెండవది "అహం బ్రహ్మాస్మి" ఇక్కడ అహం, బ్రహ్మ, అస్మి అనే మూడు పదములున్నవి. అహం అనగా ఏమిటి? ఇది పరిపూర్ణత్వం. దేశ కాల పరిస్థితులతో ఏమాత్రము మార్పుచెందనిది. దీనికి 'సాక్షి' అని మరొక అర్థము కూడా ఉన్నది. అనగా, అన్నింటికీ తానే సాక్షీభూతుడు. జరిగినదానికి జరుగుతున్నదానికి, జరుగబోయేదానికి తాను సాక్షిగా ఉంటాడేగాని దేనితోను అతనికి సంబంధం లేదు. ఇంక బ్రహ్మ అనగా, ఆకాశాది

పంచభూతములకు ఆధారమైన తత్త్వము. **అహంనకు, బ్రహ్మకు మధ్యలో ఎట్టి భేదమూ లేదు.** ఇవి రెండూ అవినాభావ సంబంధములు, అన్యోన్యాశ్రయములు. **అహంతత్వమునకు కూడా వ్యాపించే శక్తి ఉన్నది. వ్యాపించే పంచభూతములందు అహం తత్త్వమున్నది. ఈ రెండింటిని ఏకం చేయునదే - ఆస్మి. ఇవి రెండూ భిన్నంకాదు, ఒక్కటే అదే "అహం బ్రహ్మాస్మి"**

మూడవది "తత్వమసి" తత్ - అనగా ఏమిటి? ఇది సృష్టి పుట్టుకకు పూర్వము, పుట్టిన తరువాత సృష్టి యందు నిరంతరము మార్పు చెందకుండా ఉండేది. దీనికి రూపనామములే లేవు. అందుచేతనే దీనిని **'తత్' అని పిలిచారు. ఇది నిరంతరం మార్పు చెందినది కనుకనే దీనిని 'being' (ఉన్నది) అని చెపుతూ వచ్చారు.** ఇది త్రికాలములకు అతీత మైనది. ఇంక 'త్వం' అనేది రూప నామములతో కూడినది. ఇది శరీర మనో బుద్ధి అంతఃకరణేంద్రియాలతో కూడినది, ప్రాకృతమైన స్వరూపాన్ని ధరించినటువంటిది. ప్రాకృతమునకు అప్రాకృతమునకు ఉన్న సంబంధము ఒక్కటే. అన్నింటియందు "నేను" అనే ప్రజ్ఞాశక్తి ఏకంగానే ఉంటున్నది. దీనికొక ఉదాహరణ, ఒక శిల్పి పెద్ద రాతి గుండు నొక దానిని తీసుకొని చక్కని కృష్ణవిగ్రహంగా మలిచాడు. ఆవిధంగా మలిచేటప్పుడు తన లక్ష్యాన్ని కృష్ణునిపైననే ఉంచుకొని మిగిలిన పనికిరాని రాతి ముక్కలను పారవేస్తూ వచ్చాడు. ఆ విగ్రహాన్ని పూర్తిచేసిన తరువాత దానిని మందిరంలో ప్రతిష్టించాడు. అప్పటి నుండి దానికి షోడశోపచారాలతో పూజలు జరుగుతూ వచ్చాయి. కాని, ఆ కృష్ణ విగ్రహాన్ని మలిచిన తరువాత మిగిలిన రాతి ముక్కలన్నీ కొండలోనే నిలిచి పోయాయి. ఐతే, పూర్వ ఇవన్నీ ఒక్క రాతి గుండులో ఉండినవే. కాని అక్కడ మందిరంలో రూపనామములు చేరాయి, ఇక్కడ రూపనామములు చేరలేదు. రూప నామములు లేని ఈరాతి ముక్కలు ఏమి చెపుతున్నాయి? "తత్ త్వం ఆసి' అంటున్నాయి. **"అది మేమే. పూర్వము మేమంతా ఒక్కటిగానే ఉన్నాము. కాని, దానికొక రూపము ఏర్పడటం చేత మేము వేరైపోయాము. కాని, అన్నింటియందున్న దివ్యత్వము ఒక్కటే" అని తెలుపుతున్నాయి.**

అదేవిధంగా, 'తత్' అనే శుద్ధసాత్వికమైన తత్త్వము నుండి ఆవిర్భవించినదే ఈ శరీర అంతఃకరణములు, ఐతే అశుద్ధసత్వమును మాత్రము ప్రత్యేకంగా ఉంచి మిగిలినవాటిని పనికిమాలినవిగా ప్రవేశ పెట్టారు. ఇవి ప్రాకృతమైన జీవితానికి చాలా అవసరమైనవే. ఏ సాధనలనైనా ఈ శరీరమునాధారముగా చేసుకొనియే చెయ్యాలి. దేనినైనా మనస్సును ఆధారముగా చేసుకొనియే చింతించాలి, బుద్ధినాధారముగా చేసుకొనియే విచారించాలి. కనుక, ప్రాకృతమైన ఈ జగత్తునందు శరీరము మనస్సు బుద్ధి ప్రభావమైన పనిముట్లుగా తయారైనవి. అయితే, ఇవి పనిముట్లు మాత్రమే. వీటి ద్వారా పని చేయించేది వేరే ఒకటి ఉన్నది. **అదే 'తత్'. ఈ 'తత్' అనేది మనశరీరమునందు, అంతఃకరణ యందు ప్రవేశించి అన్నింటి ద్వారా వాటి వాటి కర్తవ్య కర్మలను ఆచరింప జేస్తున్నది.** ఈ రెండింటికి ఏ మాత్రం భేధము లేదు.

ఇంకొక చిన్న ఉదాహరణ: అగాధమైన సముద్రములో అసంఖ్యాకములైన అలలు ఆవిర్భవిస్తుంటాయి. అనేక తరంగాలు ఒకదానికొకటి భిన్నంగా కనిపిస్తుంటాయి. ఒక తరంగము ఉన్నట్లుగా వేరొక తరంగము ఉండదు. ఐతే, ఈ తరంగములు వేరు కాదు. వాటియందున్నది కూడా సముద్రము యొక్క జలమే కాని, ఆకారములు వేరు వేరుగా వస్తున్నాయి. ఈ తరంగముల యందే నురుగు, సముద్రాన్ని విడిచి తరంగాలు ఉండలేవు. తరంగాల యందు, నురుగు నందు సముద్రమే ఉంటున్నది. **మూడింటి యొక్క ఏకత్వాన్నే 'కూటస్థుడు' అని వేదాంతములో చెపుతారు. కూటస్థుడనగా నురుగు నందు, అలల యందు, సముద్రము నందు ఉన్న Quality అదే 'తత్'.**

ఇంక నాలుగవది "అయమాత్మ బ్రహ్మ". ఆయమనగా స్వప్రకాశమైనది, స్వస్వరూపమైనది. అనగా, పరోక్షమైన

మహాశక్తి

తత్వము. సర్వజీవుల యందు చైతన్యరూపముతో కూడినదే ఆత్మ. అన్ని దేహములందు, అన్ని రూపముల యందు అంతర్భావమై ఉన్న ఆత్మ "సత్యం" అని చెప్పబడుతోంది. దీని అంతరార్థమేమిటి? ఆత్మ నిత్యమైనది కనుకనే దానికి 'సత్యం' అని పేరు వచ్చింది. అంతేకాకుండా, సద్భావమునకు ఆదర్శమైనది కనుకనే తైత్తిరియోపనిషత్తు నందు దీనికి 'సత్' అని పేరు పెట్టారు. కనుక "ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, అయమాత్మ బ్రహ్మ" ఈ నాలుగు మహా వాక్యములందూ ఉన్నది ఒక్కటే. అదే "నేను" అనే ప్రజ్ఞ.

(స.సా.ఫి.93 పు.37/39)

(చూ॥ భగవచ్చింతన)

మహాశక్తి

ఈ మహాశక్తి పూర్వ శరీరంలో ఉన్నపుడు 1918లో శరీరం వదలిపెట్టదలచిన సమయంలో కాకాసాహెబ్ దీక్షిత్‌ని పిలిచి 8 సంవత్సరాలలో మరల అవతరిస్తానని చెప్పాను. తరువాత కొన్నాళ్ళకు అబ్దుల్‌బాబాకు కూడా 7 సంవత్సరాలలో ఇది మరల మద్రాసు రాష్ట్రంలో కనిపిస్తుందని సమాచారం అందించాను. సమాధి చెందిన మూడు నెలలతరువాత కిర్కీ ఇంటి దగ్గర కనిపించి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా "ఈ శరీరం వెళ్ళిపోయింది. అయినా నేను మరల వస్తాను" అని ప్రకటించాను. సమాధి చెందిన 6 నెలల తరువాత ద్వారకామాయి దగ్గర ఆనాడు నా దగ్గర ఉండే సత్తుగిన్నెతో సహా కనిపించాను. అప్పుడు దాస్‌గణ్‌కి, మహల్సాపతికి కబురు చేయటం కూడా జరిగింది. "8 సంవత్సరాల బాలునిగా వస్తానని కాదు." ఆవిధంగా పొరపాటు పడటానికి కారణం కాకాసాహెబ్ తన జ్ఞాపకం మీద ఆధారపడి ఆ విషయాన్ని చాలాకాలం తరువాత పుస్తకంలో వ్రాసుకున్నాడు. ఏడు సంవత్సరాలకు అనేది కూడా సత్యమే. **ఎలాగంటే పదినెలలూ గర్భంలో గడిపి 1926లో ఈ శరీరం అవతరించింది. ఈ విధంగా కాకాసాహెబ్‌కి చెప్పిన ఎనిమిది సంవత్సరాలు కూడా నిజమయింది.**

(వ.61-62 పు.90)

నేను పూర్వ శరీరంలో ఉన్నప్పుడు "ఎనిమిది సంవత్సరాల తరువాత నేను మరల వస్తాను" అని చెప్పాను. కాని దీక్షిత్ నేను ఎనిమిది సంవత్సరాల బాలునిగా వస్తానని వ్రాసుకున్నాడు. అది పొరపాటు. 1918లో విజయ దశమి, రోజు ఆ శరీరం విడిచిపెట్టిన తరువాత ఆరు సంవత్సరాల దాకా చాలా మంది భక్తులకు స్పష్టమైన దర్శనము ఇస్తూనే వచ్చాను. ఒకసారి నేను అబ్దుల్‌బాబాకు కనిపించి "ఈ శరీరాన్ని పంపివేయటం జరిగింది. కాని నన్ను ఎవరు పంపివేయగలరు?" అని అన్నాను. నేను మరల అవతరించే విషయాన్ని అబ్దుల్ బాబాకి తెలియజేశాను. మీరిప్పుడు ఆయన ఈయనేనా? ఈయన ఆయనేనా? అని సందేహపడుతూ సమయాన్ని వృథా చేసుకొనకండి. మీకు తెలిసినంతవరకు నమ్మండి. మీరు పొందుతున్న ఆనందాన్ని మాత్రం ఎన్నడూ కాదనకండి. ఆ ఆనందాన్ని నిలువచేసుకోండి.

(వ 61-62 పు.103/104)

మహోత్కృష్టశాస్త్రము

ఎవడు మార్పుల కతీతుడో, ఎవడు నిరతిశయానంద స్వరూపుడో ఎవనియందు మాత్రమే జీవము అనంతమో ఆ పరాత్పరుని తత్త్వమును తెలుపు శాస్త్రము సర్వాతివయమగు **మహోత్కృష్ట శాస్త్రమని భారతీయ పూర్వుల బోధ.**

(స.వా.పు.26)

మహోపకారి

(చూ॥ మనోధైర్యబల్యము)

మహోపద్రవాలు

శీల సంపద లేని - విద్యావిధానం
నీతిలేని - రాజకీయం

ధర్మచింతన లేని - వాణిజ్యం
దానశీలత లేని - ధనం
మానవత్వం లేని - విజ్ఞాన శాస్త్రం
వర్తమాన కాలానికి మహోపద్రవాలు.

(దే.యు.పు.12)

మాండూక్యోపనిషత్తు

ఈ ఉపనిషత్తు సర్వ వేదాంతసారము, అన్నింటికంటెను గంభీరమైనది. **మోక్షప్రాప్తికి ఈ మాండూక్యోపనిషత్తు ఒక్కటి చాలును. బ్రహ్మవిద్యను బోధించునట్టివానిలో ఇది ముఖ్యమైనదై యున్నది. కానీ ఉపనిషత్తులలో ఇంత చిన్నది మరే ఉపనిషత్తులేదు.** ఇది చాలా స్వల్పమైనది. దీనిలో పదురెండు మంత్రములు మాత్రమే యున్నవి. ఇందులో **ఆగమ; వైతథ్య, అద్వైత, అలాతశాంతులను నాలుగు ప్రకరణము లున్నవి.** మొదటిదైన ఆగమ ప్రకరణమందు, ఆత్మతత్త్వమునకు ఉపాయమగు ఓంకారత్త్వము నిర్ణయింపబడినది. రెండవదైన వైతథ్యప్రకరణమున ద్వైతోపశమనము, మూడవదైన అద్వైతమున ఏకత్వము అనగా అద్వైత తత్త్వము విచారింపబడినది. నాలుగవదయిన అలా శాంతి ప్రకరణమున పరస్పరవిరుద్ధములు, అవైదికములు మతాంతములు వివరింపబడినవి. **శబ్దములన్నియు ఓంకారముకంటె వేరుకావు కనుక అవి అన్నియూ ఓంకారములగుచున్నవి. అయితే బ్రహ్మ ఓంకారశబ్దవాక్య మగుటవలన ఓంకారము బ్రహ్మముకంటే వేరుకాదు. పరోక్షముగ కనిపించు బ్రహ్మమే అపరోక్షమగు ఆత్మ.** అత్మకు విశ్వతైజస ప్రాజ్ఞాది బేధము ఉపాధికల్పితము. నేనూ, నేనూ అని సర్వ సామాన్యముగ తెలియవచ్చు ఆత్మ, రెండూ ఒక్కటియే. అవస్థాత్రయము నొకదాని తరువాత నొకదానిలో తనను అనుసంధానము చేసికొనగా ఆయా అవస్థలు అనుభవించుచున్నది. నదీ ప్రవాహ మధ్యగతమగుచు, రెండు కూలములను ఆటంక సంచరించు మత్స్యమువలె ఉండును. సుషుప్తియందు విషయవాసనలన్నియు ఘనీ భూతములగుటవలన ఉన్ననూ ఉండినట్లు కనుపించవు. స్వప్నము నందు వాసనరూపమున దానిని అనుభవించుచున్నారు. విషయ వాసన లన్నియూ మానసిక స్పందనముచే జాగ్రత్ స్వప్నములందు మొలక వేయుచున్నవి. దీనినే అనగా **మానసిక స్పందనమునే సృష్టి అని అందురు.** జాగ్రదాద్యవస్థాత్రయముకంటే, (అనగా **జాగ్రత, స్వప్నము, సుషుప్తి, అను మూడు అవస్థలకంటే) భిన్నమయినది ఒకటి కలదు. దానినే తురీయము అని అందురు.**

(ఉ.వా.పు.26/27)

మాంత్ర వర్ణిక మేవచ

సత్యంజ్ఞాన మనంతం బ్రహ్మ అను మంత్రములో చెప్పబడిన బ్రహ్మ ఈ ఆనంద స్వరూపుడు. ఆనందం బ్రహ్మ. బ్రహ్మ సత్య స్వరూపుడు. బ్రహ్మజ్ఞాన స్వరూపుడు. బ్రహ్మ అనంత స్వరూపుడు. కనుక సర్వమును ఆనందమునకు నిర్వచనములే కాని అన్యము కాదు. పరిచ్ఛేద మనబడు అల్పత్వము లేనిది ఆనందము. దేశ, కాల, ప్రాంతములకు లొంగునది కాదు ఆనందము. ఆనందమునందు దేశము, కాలము, పాత్రము పరిపూర్ణమై యుండును. **ఆనందమునకు లోబడినవే దేశ కాల పాత్రములు కానీ, ఆనందము దేశ కాల పాత్రములకు లొంగినది కాదు,** కట్టుబడినది కాదు. కనుక మంత్రముల చేత వర్ణింపబడిన **భగవంతుడు, మంత్రములకు కట్టుబడునే కాని, తాము మంత్రములను కట్టివేయడు. రెండింటిని కట్టివేయునదే ఆనందము.**

(సూ.వా.పు.48/49)

మాంసభక్షణ

ఈ మాంస భక్షణ ఆరోగ్యమునకు మంచిదని డాక్టర్లు చెపుతారు. కానీ యిది అనేక రకములైన అనారోగ్యములకు మూలకారణము.

మాట/మాటలు

'జైసే ఆన్ ఐసే మన్' ఎటువంటి ఆహారమో అటువంటి మనస్సు అని అంటారు. ఎలాంటి విత్తనమో అలాంటి మొక్క! ఎటువంటి తిండో, అటువంటి త్రేపు. ఎటువంటి పిండో అటువంటి రొట్టె. అయితేమనము తినేది ఎట్లా ఉండాలి? మాంసాహార మనగా మృగముల యొక్క మాంసము. ఒక గొర్రె మాంసము తిన్నాడనుకోండి. వానికి గొర్రె బుద్ధులే వస్తాయి. అందువలననే మనలో నేడు కొన్ని గొర్రెలు అరుస్తున్నాయి. కొన్ని కోళ్ళు కూస్తున్నాయి. కొన్ని మేకలరుస్తున్నాయి. అందువలననే వేమన చెప్పాడు **"కుక్క తిన్నవాడు గురుజంగ లింగము. పంది తిన్నవాడు పరమ యోగి" అని పంది తామసమునకు ప్రతీక. దానిని తిని జీర్ణించుకున్నవాడు నిజముగా యోగి.** ఈ పద్యములో ఎంతో అర్థము నందించాడు. మనము యే మృగము యొక్క మాంసమును తింటామో, దాని బుద్ధులే మనకు వస్తాయి. కనుక ఈ మాంసాహారమును కొంతవరకు మానుకొనుట మంచిది.

(శ్రీ.ది.పు.96)

మాట/మాటలు

ఈనాడు చూచేది మాటలలో Cooperation చేతలలో Operation.

(భ.ప. పు.2)

ఇనుమునైన కూడ యిమ్మారు ముమ్మారు
కాల్చి అతుకవచ్చు కమ్మరీడు
మనసు విరిగెనేని మరి పెట్టగలరయా?

మనసును విరిగించటానికి గానీ, మనసును అరిగించటానికి గానీ, అతికించటానికిగానీ మాటనే కారణము. మాటాడే మాటలు పరులను బాధపెట్టకుండ పరులకు యే విధమైన కష్టము కలుగకుండ వుపయోగ పెట్టాలి. 'కాలు జారితే కలుగదు నష్టము నాలుక జారితె నరకమేరా!' కాలు జారి పడినామంటే గాయము కనిపిస్తుంది. డాక్టరుకు చూపించి దానికి కట్టుకట్టి మాన్పించుకోవచ్చును. కానీ మాటచేత మనస్సుకు కలిగిన గాయము కంటికి కన్పించదు. ఈ గాయమును మాన్పే డాక్టరు యీ జగత్తులో యెవ్వరూ లేరు. కనుక యితరుల మనస్సును నొప్పించే మాటలు యే మాత్రము వుపయోగించరాదు. **ఏనాటికైనా మనమాటే మనకు బ్రహ్మాస్త్రముగా వెనుకకు తిరుగుతుంది.** కనుక మంచి మాటలను వుపయోగించుకో!

(శ్రీ.గీ.54)

మాటలకున్న విలువ యిట్టిది. అట్టిది అని వర్ణించుటకు వీలుకాదు. మాటల చేతనే మానవుడు సంపద సాధించ గలుగుతున్నాడు. మాటలచేతనే రాజ్యమును కూడా కోల్పోవుచున్నాడు. మాటలచేతనే బంధుమిత్రులను సంపాదించుకొంటున్నాడు. మాటల చేతనే శత్రుత్వమును పెంచుకుంటున్నాడు. కనుక, **మాటలు మధురమైనవిగా హితకరమైనవిగా, ప్రీతికరమైనవిగా ఉండాలి. సత్యమైనప్పటికీ కటువుగా మాట్లాడకూడదు. మాటలు మృదువుగా, శాంతంగా సామ్యంగా ఉండాలి. అతి భాష లేకుండుట, అసత్యమాటకుండుట. చాడీలు చెప్పకుండుట, పరులను దూషించకుండుట, కఠినోక్తుల వాడకుండుటయే గాక, మధురమైన పలుకులు,** మాధవస్మరణతో వాక్కులను పవిత్రము చేయుచుండుట ఇట్టి మనోవాక్కాయములను ఉత్తమమైన మార్గమున వినియోగించిన అది నిజమైన తపస్సనబడును.

(శ్రీ.భ.ఉ.పు.14)

(చూ॥ ఆచరించాలి, భద్రము, స్వేచ్ఛ)

మాణిక్య వాచకర్

ఈ తమిళ దేశమందు చాల ప్రసిద్ధి చెందినది పాండ్యరాజ్యం. పాండ్యరాజు యువకులనే తన మంత్రులుగా నియమించుకొని ధర్మ మార్గంలో పరిపాలన చేస్తూండేవాడు. ఆ రాజుకు అశ్వపోషణంటే చాల అభిరుచి. ఒకనాడు యువకుడైన ఒక మంత్రిని "మంత్రీ! నీవు దేశ సంచారం సల్పి ఎక్కడైనా మంచి గుఱ్ఱములు కనిపిస్తే కొని తీసుకు రావాలి" అని అతనికి తగిన మొత్తము నిచ్చి, కొంతమంది

సిపాయిలను కూడా ఇచ్చి పంపాడు. ఇతను ప్రయాణమై వెడుతూ మార్గమధ్యంలో పెద్దదొరై అనే గ్రామంలో ఆగాడు. ఆ గ్రామానికి సమీపంలో యోగానంద సరస్వతి అనే మహనీయుడు ఉండేవాడు. అతను ఆనాటి సాయంకాలం భక్తులకు చక్కని ఆధ్యాత్మిక ప్రబోధ సల్పుతున్నాడు. ఈ మంత్రి కూడా పరమభక్తుడు. ఆనాటి యువకులకు దైవంవట్ల పరిపూర్ణమైన విశ్వాసముండేది. **"యథారాజా తథా ప్రజా"** అన్నట్లుగా, రాజు పరమ భక్తుడు కనుక మంత్రులు కూడా పరమ భక్తులుగా మారిపోయారు. ఆ మంత్రి ప్రతి సాయంకాలం అక్కడ కూర్చొని ఆ మహనీయుని ప్రబోధలు చక్కగా శ్రవణం చేస్తూ వచ్చాడు. అక్కడికి సమీపంలో ఒక ఈశ్వరాలయం ఉండేది. అది చాల పాడుపడి శిథిలావస్థలో ఉండేది. తాను గుట్టములకోసం తీసుకొని పోయిన డబ్బును ఖర్చుపెట్టి ఆ ఈశ్వరాలయమును సుందరమైన మందిరంగా తీర్చిదిద్దాడు. చారులద్వారా ఈ విషయం పాండ్యరాజుకు తెలిసింది. తక్షణమే ఆ మంత్రిని వెనుకకు రమ్మన్నాడు. రాజుచెంతకు వచ్చి నమస్కరించి నిల్చున్నాడు మంత్రి. "నిన్ను దేనికోసం పంపాను? అశ్వములను కొని తీసుకురమ్మని పంపిస్తే ఆ డబ్బు ఏమి చేసావు?" అని ప్రశ్నించాడు. ఇతను ఏమాత్రు భయం లేకుండా **"దైవానికి అర్పితం చేశాను"** అన్నాడు. **"నిన్ను దైవానికి అర్పితం చేయమని పంపలేదు,** అత్యంత విలువైన గుట్టములను తీసుకొని రమ్మని పంపాను. నేను చెప్పిన దొకటి, నీవు చేసిన దొకటి. రాజాజ్ఞను ధిక్కరించావు" అని పలికి, సిపాయిలను పిల్చి అతనిని జైల్లో పెట్టించాడు. అతను ఆ జైల్లో కూర్చొని నిరంతరం దైవచింతన చేస్తూ వచ్చాడు. అనేక శ్లోకములు వ్రాస్తూవచ్చాడు. అతడు జైలునందు కూడా దైవచింతన మానలేదని తెలుసుకుని ఒక దినము రాజు అతనిని పిలిపించాడు. "మంత్రీ! నీవు యువకుడవు. యువకులు భోగభాగ్యములను ఆశించాలి. కానీ, నీవు మాత్రం సర్వసంగ పరిత్యాగివైనీ కాలమును, కాయమును వ్యర్థం గావించుకుంటున్నావు" అన్నాడు. అప్పుడు చెప్పాడు ఆ మంత్రి.

అస్థిరం జీవనం లోకే అస్థిరం యౌవనం ధనం
అస్థిరం దారా పుత్రాది సత్యం ప్రేమ ద్వయం స్థిరం.

"రాజా! లౌకికమైనవన్నీ అనిత్యమైనవి. అసత్యమైనవి. సత్యము, ప్రేమ ఈ రెండు మాత్రమే నిత్యమైనవి. సత్యమే దైవం, ప్రేమయే దైవం. కనుక, సత్యమును అనుసరించాలి. ప్రేమలో జీవించాలి. 'యదృశ్యం తన్నశ్యం', ఈ జగత్తునందు మనం అనుభవించేదంతా అస్థిరమైనది" అన్నాడు. మంత్రీ! ప్రతిదినము జైల్లో ఏమి చేస్తున్నావు?" అని అడిగాడు. మంత్రి జైల్లో తాను వ్రాసిన శ్లోకములు రెండు, మూడు చదివాడు. రాజుకు చాల ఆనందం వేసింది. అలాంటి ఉత్తముడైన మంత్రిని జైల్లో పెట్టించినందుకు పశ్చాత్తాపపడ్డాడు. అతనిని తిరిగి మంత్రిగా పదనీ బాధ్యతలను స్వీకరించిమని కోరాడు. "రాజా! నాపవిత్రమైన మార్గమునకు అడ్డు తగలవద్దు. నన్ను వదిలి పెట్టు" అన్నాడు. **అతనే మాణిక్య వాచకర్.** అతడు సర్వసంగ పరిత్యాగియై ఆధ్యాత్మిక ప్రబోదలు సల్పి, అనేక మంది యువకులను నివృత్తి మార్గంలో ప్రవేశ పెట్టాడు. నివృత్తి మార్గమే నిత్యసత్యమైన మార్గమని ప్రభోదిస్తూ వచ్చాడు.

(సా.శు.పు.67/69)

(చూ॥ పంచిపెట్టు)

మాత/మాతలు

భూమాత, గోమాత, వేదమాత, మనల్ని కన్నమాత - ఈ నలుగురు మాతలను ఆరాధించండి. అట్టి మాతలను రక్షించుకోవడానికి సరియైన సాధనలు సలపండి. అన్నిటికన్నా మిన్న దైవారాధన. ఈనాడు దైవారాధన సన్నగిల్లిపోవటం చేతనే, ప్రపంచంలో అనేక దుఃఖములు సంభవిస్తున్నాయి. అరాచకత్వం ప్రబలుతున్నది. దైవారాధన ఒక్కటే దేశాన్ని రక్షించగలదు, శాంతిని చేకూర్చగలదు.

(శ్రీ.ఏ.2002 పు. 24)

(చూ॥ వరలక్ష్మీవ్రతము)

మాతృదేవోభవ

తల్లి చాలా ప్రధానము. తల్లికి మొట్టమొదట gratitude చెప్పాలి. తల్లికి ఆనందము నందించాలి. దేని కోసం? నీ బ్లడ్, నీ దుడ్డు, నీ ఫుడ్ అంతా తల్లితండ్రులు గిఫ్టే. ఆ తల్లితండ్రుల giftఅందుకొని వారికి gratitudeఅందించక యింక ఎవరికి gratitude అందిస్తావు? **Mother ని select చేసుకున్నది నీవు కాదు.** నీకంటే ముందుగానే పుట్టింది. ఆమెకు నీవు గౌరవము నందించాలి. నీవు select చేసుకున్నది భార్యను మాత్రమే. ఆమె నీ తరువాత పుట్టినామె. నీకంటె ముందు పుట్టింది తల్లి. నీ కంటె ముందు పుట్టిన తల్లికి gratitude యివ్వాలి. ఆమె నుండియే నీవు ఆవిర్భవించావు. ఆమెనే దైవత్వంగా భావించాలి. కనుక select చేసుకున్న భార్యను, నిన్ను ముందు రక్షించిన తల్లిని equal గా చూసుకోకూడదు. అయితే personal విషయంలో నీ సంబంధము నీవు చూచుకోవచ్చు. కాని కుటుంబ విషయములో తల్లికి మొట్టమొదట గౌరవము. ఆ తల్లి శ్రమలకోర్చి నిన్ను యింత పెద్దవానినిగా చేసింది. కనుక వేదాంత మందు **"మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ" అన్నారు.** అందరికంటే మొట్టమొదట తల్లిని పెట్టారు. ఆ తల్లి లేక నీవు లేవు. కనుక **నీవు తల్లితో మృదుమధురంగా మాట్లాడటానికి ప్రయత్నించాలి.** నీవు యిక్కడ నుంచి వెళ్ళిన తరువాత యిక్కడి సమాచారము మధురమైన మాటలతో వినయ విధేయతలతో తల్లికి చెబుతే ఆమె ఎంతో ఆనందిస్తుంది. మీరు మీ తల్లి తండ్రులలో మాత్రమే కాక మిత్రులతోను, బంధువులలోను సరైన మార్పు తెప్పించాలి. ఇదే నీవు చేయవలసిన సేవ. సేవ అంటే ఏమిటి? **'మంచిని పది మందికి బోధించటమే సేవ' మంచిని పది మందికి చేయటమే సేవ. ఇది స్వామి యొక్క ఆశయము. నాకింకేమీ అక్కరలేదు.**

(శ్రీ.స.పు.47)

మాతృదేశము

(చూ॥ జనని, ధర్మరాజు, వివేకానందుడు, సుభాష్ చంద్రబోస్)

మాతృప్రేమ

దానముకాని యజ్ఞ సముదాయముగాని
వైదిక సనాతన ధర్మముగాని సత్యసంధానముగాని
నియమిత విధానముగాని మరి ఏదియైనను గాని
మాతృప్రేమకు సాటిరాదు విచారణ చేసి చూచినన్॥

(స.సా.డి.96పు.329)

మాతృభాష

(చూ॥ ధర్మరాజు)

మాతృమూర్తి

(చూ॥ తల్లుల, సత్యసాయి కాలేజిలు)

మాతృమూర్తియొక్క ఆరాధన దినము (Mother's Day)
నిజమైన ప్రేమస్వరూపమే తల్లి. తల్లినుండియే ప్రేమ మొట్టమొదట ఆవిర్భవిస్తుంది. ప్రతి మానవుడు పుట్టిన తక్షణమే తల్లి ప్రేమకు నోచుకుంటాడు. **బిడ్డలకోసం తల్లి తన జీవితాన్నైనా త్యాగం చేయడానికి వెనుకాడదు.** ఇట్టి త్యాగము ఒక్క తల్లి యందు మాత్రమే గోచరిస్తుంది. కనుక తల్లిని గౌరవించి ఆమె అభీష్టాలను నెరవేర్చి ఆమెను సంతృప్తి పర్చడానికి ప్రయత్నించాలి. **ఇదే నిజమైన పూజ. ఇదే నిజమైన తపస్సు. ఈ నవంబరు 19వ తేదిని మాతృమూర్తి యొక్క ఆరాధనా దినము** (Mother's Day) **గా పెట్టుకున్నాము.** కారణం ఏమిటి? **జన్మకు మూలకారణం తల్లి. ఎక్కడైనా చూడండి. మదర్‌ల్యాండ్ అంటున్నారు గాని ఫాదర్‌ల్యాండ్ అంటూన్నారా? మాతృభాష అంటూన్నరుగాని పితృభాష అంటున్నారా?**

మనం నివసించే ప్రపంచమంతా మాతృస్వరూపమే. **మన జీవితమంతా తల్లి వరప్రసాదమే.**

(స.సా.డి.96పు.329)

మాతృస్థానము

భారతదేశంలో మాతృస్థానాన్ని కలిగినవి కొన్ని ఉన్నవి. జన్మనిచ్చిన **దేహమాత,** క్షీరాన్నందించి పుష్టిని సంతుష్టిని చేకూర్చే **గోమాత,** నిధినిక్షేపాదులను ధనధాన్యాదుల నందించే **భూమాత,** సంస్కృతిని సంప్రదాయమును ఆచారములను కట్టుబట్ట నందించిన **దేశమాత,** జీవిత ధ్యేయాన్ని హెచ్చరించి మార్గాన్ని ఉచ్చరించి మోక్షమును ప్రబోధించి ఆనందాన్ని, జన్మరాహిత్యాన్ని ప్రసాదించే **వేదమాత మాతృస్థానమున నిలచి పూజార్హులైనారు.** ఆకారణంగా ఈ దేశంలో మాంసం ప్రజామోదాన్ని పొందలేదు.

(శ్రీ.న.2000పు.36)

మాత్ర

ఇంద్రియములకు 'మాత్ర' అని పేరు. 'మీయేతే ఇది మాత్రః' అని. ఇంద్రియములు, మాత్రలు కొలతలు వేయబడేటువంటివి. కొలతలువేయునవి ఇంద్రియములే. ఇట్లా? పప్పుకు తగిన ఉప్పు లేదు అని దీనికి తగిన కొలతలు వేసి చెప్పునది నాలుక. మనిషి చాలా అందముగా ఉంటున్నాడు కానీ ముక్కు చాలా చిన్నది అని కొలతవేసి చెబుతుంది కన్ను. ఈ విధంగా మంచి చెడ్డలనుగుర్తించి ఉచ్చరించునవి యీఇంద్రియములు. **మాత్రకు మరొక విశిష్టత ఉంటున్నది. ఒక పరిమితములో దీనిని ఉపయోగించు కోవాలి.** భగవంతుడుప్రసాదించిన ఈ ఇంద్రియములను పరిమితముగా ఉపయోగించికోవాలి. పరిమితమునకు మించినప్పుడు భగవదాజ్ఞ ఉల్లంఘించిన వాడుగుటయే కాక దీని వల్ల అనే కష్టములకు నష్టములకు రోగములకు గురికావలసి వస్తుంది. భగవంతుడు ఏ నిమిత్తమై ఏ ఇంద్రియములను ప్రసాదించాడో ఆ ఇంద్రియములను ఆ నిమిత్తమై సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టి అనుభవించటానికి ప్రయత్నించాలి.

(ద.స.స.పు.27)

'మాత్ర' అనే దానికి 'పరిమితమైన పద్ధతి' అని అర్థము. ఏది వినవలెనో దానిని మాత్రమే వినాలి మనము. వినవలసిన దానిని విస్మరించి విననిదానిని విశ్వసించి ఈ శ్రవణమును నాశనము చేసుకుంటున్నావు. **సూరదాసు చెప్పాడు.**

చెవులుండి చెవుటులై అతి మనోహరమైన
నీగాన మాలింప నేరరైరి
కన్నులుండి గ్రడ్డులై కళ్యాణకరమైన
నీరూపు దర్శింపనేరరైరి.

కన్నులెందుకిచ్చాడు భగవంతుడు? అడ్డము వచ్చిన వానిని చూడటం కోసమనా. కాదు కాదు. మంచిని చూసే కోసమని. **పురందరదాసు కూడా చెప్పాడు.**

(ద.స.స.పు.29)

మాత్సర్యము

(చూ॥ మంచితనము)

మాధవ

(చూ॥ కృష్ణతత్త్వము)

మాధవుడు

మన భారతీయ సంస్కృతియందు పవిత్ర చరిత్రలలో భగవంతుని అతి ప్రేమతో మాధవుడని పిలుస్తూవచ్చారు. 'మా' అనగా మాయ ప్రకృతి. లక్ష్మీధవుడు అనగా పతి, అట్టివాడే పరమానంద మాధవుడు. అట్టి పరమాత్ముడే ఆనందమయుడు, ప్రకృతి పరతంత్రమైన జీవుడు పరమానందుడు కాలేడు. పరమాత్ముడు స్వతంత్రుడు. జీవుడు పరతంత్రుడు కనుకనే పరమానందము మానవునికి లభించాలంటే, లక్ష్మికి పతియైన వానిని పొందాలంటే పవిత్రమైన సాధన సలపాలి.పరమాత్ముని

మానము

ఎట్టి స్థానమందు బంధించవచ్చునో భారత భాగవతాలు చక్కగా చెప్తూవచ్చాయి.

(వే.ప్ర.పు.24)

(చూ॥ మాయ)

మానము

మధుర భావంబేది మనదేశమున కన్న।
మాతృభావముకన్న మాన్యమేది।
ప్రాణంబు కంటెను మానంబు ఘనమగును।
మనదేశ నీతి నియమముల మరచి।
చేతికిచ్చిరి పరదేశ నీతులరసి॥

(సా.పు.50)

మానవ/ మానవుడు

మానవుడు సుఖాభిలాషి, ఆనందపిపాసి, అహోరాత్రములు అనేక శ్రమలు పడి యీ సుఖానందములను సంపాదించు కొనుటకై కృషి చేస్తున్నాడు. అన్ని రంగముల యందు **మానవుడు ఆశించునవి రెండు; ఒకటి సుఖప్రాప్తి, రెండవది దుఃఖ నివృత్తి.** ఆధ్యాత్మికమునందే కాక వైజ్ఞానికమునందు దీనికి ఆధారములుంటున్నవి మానవుడు సుఖాన్ని కోరటంలో ఆనందము ఆశించుటలో అంతరార్థము ఏమిటి? **మానవుని స్వభావము స్వరూపము ఆనందమే.**

(బృ.త్ర.పు.115)

ఆత్మజ్ఞాన విచారమే సనాతన ధర్మము. ఆత్మజ్ఞాన విచారమే జీవుని కర్తవ్యము. 'అంతవంత ఇమే దుఃఖ దేహాः' దేహత్వము అంతమయ్యేది పంచభూతములు పాంచభౌతిక దేహమును బాధింప వచ్చునే కాని, ఆత్మ తత్వాన్ని అవి చలింపలేవు. **శరీర, ఆత్మల కూడిక మానవుడు.**

(సా.పు.453/454)

శరీరము, మనస్సు, ఆత్మల కూడిక మనుష్యుడు. ఇక ఆత్మ ఇదినిత్యము శుద్ధము, సత్యము, నిర్మలము, నిస్వార్థము. ప్రకాశవంతమైన స్వరూపము. మార్పు చెందునది కాదు. ఇది మానవుని **అంతరాత్మయందు (గుహయందు) పరంజ్యోతిగా వెలుగుచున్నది. దీనినే దైవత్వమని చెప్పుచున్నది. శాస్త్రము.**

(సా.పు.460)

శరీరము మనస్సు ఆత్మల కలయికనే మానవుడు. ఇవి మానవుని భావములను నిర్ణయించి అతణ్ణి ఉన్నతస్థితికి గొని పోయే సోపానములు. **కర్మలు ఆచరించునది దేహము, తెలుసుకొనునది మనస్సు, నిత్యమై సత్యమై నిరంతరము ఉండునది ఆత్మ.** ఇదియే మానవుని యందలి దేవత. చేయుట, తెలిసికొనుట, ఉండుట ఈత్రిశక్తులు అభివ్యక్తియే మానవత్వము. మనసు దేహము, ఆత్మ వేరు వేరు రూపముల చేత వేరు వేరు ఫలితములును అందించుచు వేరు వేరు నామములు కలిగి ఉండినప్పటికిని ఈమూడింటి ఏకత్వముచేతనే మానవత్వము దివ్యత్వము నొందుచున్నది. ఈ మూడింటి భిన్నత్వమే మానవుని పశుత్వమునకు గొనిపోతుంది.

(బృ.త్ర.పు.68)

హృదయమందు ప్రేమ పండించుకొనుచున్న
వాడే క్రైస్తవుడు వాడే సిక్కు
వాడేహైందవుడు వాడే ముస్లిము కూడ
వాడే మానవుండు వసుధలోన

(శ్రీ.ఆ.2001పు.3)

(చూ॥ అద్వైత దర్శనము, దుఃఖదోషానుదర్శనము, చతుష్టాదమహాసభ, చింత, జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనము, జన్మహక్కు, దైవము, నాల్గుమార్గములు, మదాలస, మర్త్యుడు, మానవత్వం, మానుషాకారము, యజ్ఞము, హిరణ్యగర్భుడు)

మానవజన్మ

మరల మరల రాదు మానవజన్మము
నరుడు నారాయణుడగునట్టి యిలను
చెవికిసోక, యింకేల ఈజాగు నీకు
మేలుకొని సాయి పదసన్నిధిని చేరు॥

(సా.పు.512)

మానవజన్మచాలా పవిత్రమైనటువంటిది. విశిష్టమైనటు వంటిది. విలువైనటువంటిది, జీవించ తగినటువంటిది. దేహ నిర్మాణం నందేకాక, మేధా శక్తి యందుకూడా మానవుడు మహావిశిష్టమైనటువంటి వాడు. కాని, **ఇట్టి విశిష్టమైనటువంటి మానవత్వమునకు ఆయుఃప్రమాణము అతి స్వల్పముగా ఉన్నది.** దీనిని ఎవ్వరూ మరువరానిది. ఈ మానవత్వమునకు అందించినటువంటి దివ్య మేధస్సును ఈ ఆయుఃప్రమాణము ఉన్నంతలోనే దీనిని సద్వినియెగపరచి సరియైన సార్థకత పొందాలి. **మానవ శరీరము నీటి బుడగ వంటిది. ఏ నిముషములో ఈ నీటిబుడగ** శిధిలమవుతుందో తెలియదు. కనుక, ఈ జీవితము ఉన్నంత లోపలనే మానవత్వమును సార్థకము గావించుకొనుటకై ప్రతివ్యక్తి ప్రయత్నించాలి.

(స.సా.జూ.1989 పు.142,143)

(చూ॥ జన్మ, దేవుడు)

మానవజీవితము

ప్రేమస్వరూపులారా! మీరు ఎన్ని విద్యలు నేర్చినప్పటికీ ఆత్మతత్త్వమును అర్థం చేసుకొనకపోతే అన్నీ వ్యర్థమే. సంపాదన ప్రధానం కాదు. ఉద్యోగం స్థిరం కాదు. అయితే, ఉన్నంత వరకు ఇవన్నీ చేయవలసినవే. కానీ, ఇవే ప్రధానమని భావించకూడదు. విద్య యొక్క పవిత్రతను, విద్య యొక్క పరమావధిని అర్థం చేసుకోవాలి. మీరు నేర్చిన విద్యలను సమాజమునకు అర్పితం గావించి, సమాజ సంక్షేమమునకు కృషి చేసి జీవితాన్ని సార్థకం గావించుకోవాలి. ఈనాడు సమాజ సంక్షేమాన్ని ఆశించేవారు లేకపోలేదు. "జగతియందు పుణ్యపురుషులు లేకున్న జగములెట్లు వెలుగు పగలుగాను" కానీ, అలాంటి మహనీయులు చాల అరుదుగా ఉన్నారు. భగవంతుడు ప్రేమ స్వరూపుడు. ప్రేమమయుడు. కనుక, భగవంతుణ్ణి పొందాలనుకుంటే ప్రేమనే మీ జీవితానికి పునాదిగా తీసుకోవాలి. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలకు తగిన భద్రత నిచ్చేది ప్రేమయే. **"సత్యం బ్రూయాత్" (సత్యము చెప్పవలయును) "ప్రియంబ్రూయాత్" (ప్రియము పలుకవలయును) న బ్రూయాత్", సత్య మప్రియం"(సత్యమయినను అప్రియమగుచో చెప్పరాదు). ప్రియమని అసత్యమును చెప్పరాదు. ఇవే నైతిక ధార్మిక ఆధ్యాత్మిక విలువలు. ఈ మూడింటి ఏకత్వమే మానవ జీవితము. మొట్టమొదట మానవ జీవితాన్ని చక్కగా అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్నవాడు కాలాన్ని వ్యర్థం చేయడు.**

(స.సా.అ.99పు.270)

మానవ జీవితమనే బండిలో ప్రయాణం చేసే ప్రయాణికుడే ఆత్మ. ఆ బండిని నడిపే డ్రైవరు బుద్ధి. ఆ బండిని లాగేవి ఇంద్రియములు. వాటికి పగ్గములు వివేక వైరాగ్యములు. ఆ బండికున్న చక్రములు ఒకటి కాలచక్రము, మరొకటి కర్మచక్రము. ఆ చక్రముల కున్న ఆకులే ధర్మనియమములు. వాటి చుట్టూ ఉన్న వర్తులాకారమే ప్రేమ, ఇరుసు సత్యము. ఇక చేరవలసిన లక్ష్యము శాంతి!

(వ.61-62 పు.26)

ఈనాడు మీరు రక్షించవలసినది దేశాన్ని కాదు. సత్యధర్మాలను రక్షించాలి. అనుసరించాలి. అవే దేశాన్ని రక్షిస్తాయి. ప్రేమను పెంచుకోవాలి. సర్వులను ప్రేమించాలి. సర్వులను సేవించాలి. కుల మత జాతి బేధములను త్యజించి, దైవ పితృత్వమును, మానవ సౌభ్రాతృత్వమును ప్రగాఢంగా విశ్వసించాలి. సోమరితనమును విసర్జించాలి. సమాజ సేవ చేయాలి. మీకు క్షేమాన్ని, సౌఖ్యాన్ని సదుపాయాల్ని సౌకర్యాల్ని సమకూర్చిన సమాజంపట్ల కృతజ్ఞతను ప్రకటించాలి. మానవతా విలువలను పోషించుకుని మాధవత్వమును అందుకునే ప్రయత్నం చేయాలి. దైవం నుండి ఆవిర్భవించిన మానవుడు దైవం యొక్క గుణములనే కలిగియుండాలి. **"నేను మానవుడను" అని మీరు చెప్పుకుంటున్నారు. కానీ, ఇది పూర్తి సత్యంలో అర్ధ భాగం మాత్రమే. "నేను పశువును కాదు" అనేదే మిగిలిన అర్ధసత్యం.** మనిషి లక్షణాలు పశు లక్షణాలు

రెండింటితో కూడిన మనస్సు చంచలంగా ఉంటుంది. చంచలమైన మనస్సు గలవాడు సగం గ్రుడ్డివానితో సమానం.

మానవత్వంలోని దివ్యత్వమును, భిన్నత్వంలోని ఏకత్వమును గుర్తించి అనుభవించాలి. అందు నిమిత్తమే భగవంతుడు మీకు ఈ దివ్యమైన భవ్యమైన, నవ్యమైన మానవ జీవితాన్ని అనుగ్రహించాడు. నీతిలేని వాణిజ్యము.సిద్ధాంతము లేని రాజకీయము, మానవత్వము లేని శాస్త్ర పరిజ్ఞానము, శీలము లేని విద్య నిరర్థకము, అనర్థదాయకము. మానవ జాతికి నీతి, నిజాయితీలు ప్రధానమైనవి. జాతి గౌరవం నీతిపైనిలుచును; నీతి లేకయున్న జాతి చెడును. నీతి కలిగిన జాతియే నిజమైన జాతి. నీతి లేనివాడు కోతికంటే హీనుడు.

ముఖ్యంగా మీరు గుర్తుంచుకోవలసిన విషయాలు మూడు - లోకాన్ని నమ్మవద్దు. దైవాన్ని మరువవద్దు. మృత్యువుకు వెఱువవద్దు. త్రికరణ శుద్ధిని, పవిత్రతను పెంచుకోండి. కోరికలను తగ్గించుకోండి. తృప్తిగలవాడే అందరికంటే ధనవంతుడు. మితిమీరిన కోరికలు గలవాడే అందరికంటే బీదవాడు. అణాలు ముఖ్యం కాదు, గుణాలు ముఖ్యం. జీవిత గమ్యాన్ని గుర్తుంచుకుని ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలి. ఆహార, నిద్ర. భయ, మైథునాదులు పశుపక్ష్యాదులకు కూడా ఉన్నవి. మానవులైన మీరు కూడా వీటికే పరిమితమైతే ఇంక మీకు, పశుపక్ష్యాదులకు తేడా ఏముంటుంది.

ఈనాడు ముఖ్యంగా మీరు చేయవలసింది మరొకటి ఉన్నది - **నోరు మూసుకోండి: హృదయాన్ని తెరుచుకోండి:** సమాజ సేవకు మీ శరీరాన్ని అంకితం చేయండి: మీ లక్ష్యాన్ని దైవంపై ఉంచండి. తలలో ఆధ్యాత్మిక చింతన ఉండాలి. చేతులతో సేవ చేయాలి. **గ్రామసేవయే రామసేవ. మానవ సేవయే మాధవ సేవ.** పల్లె ప్రజలకు పారిశుద్ధ్యమును గురించి. ఆరోగ్యమును గురించి వివరించండి. వారికి వైద్యసేవల నందించండి. నీటి సౌకర్యాన్ని కల్పించండి. **దరిద్ర నారాయణ సేవ సల్పండి.** వారు దురభ్యాసములను విడనాడేటట్లు చేయండి. యజ్ఞ యాగ జప ధ్యాన అర్చనాదులకన్న సేవయే ప్రధానమైనది. అధికమైనది. కనుక, స్వార్థమును విసర్జించి పరార్థములో ప్రవేశించండి. అహంకారము, అసూయ, అభిమానము, మమకారము మున్నగు దుర్గుణాలకు చోటివ్వక వినయము, నిరాడంబరత, విధేయత, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనవంటి సద్గుణాలను పోషించుకోండి. **దుర్గుణాలు పులులు, తోడేళ్ళవంటివి, సద్గుణాలు గోపులవంటివి. క్రూర మృగాలు గోపులను బ్రతకనివ్వవు కదా. కనుక మీ హృదయంలో దుర్గుణాలకు చోటివ్వక, మానవతా విలువలను నిర్భయంగా పోషించుకోండి.**

(స.సా.సె.99పు.249/250)

మానవతావిలువలు

మానవతా విలువలలో ప్రధానమైనది, ప్రాణ సమానమైనది ప్రేమ. ప్రేమ లేక సత్య, ధర్మ,శాంతి, అహింసలు ఉండలేవు. ఇట్టి ప్రేమతత్వాన్ని మరచిపోవడం చేతనే మానవుడు స్వార్థమునకు లోనై దుఃఖానికి గురి అవుతున్నాడు. **సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను మానవుని పంచ ప్రాణములైన ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములతో పోల్చ వచ్చును.** మానవుడు తన కష్ట నష్టములను నివారించుకొనవలెనన్న ఈ పంచ ప్రాణములను పోషించుకోవాలి. కానీ ఈనాడు మానవుడు పలికే పలుకునందు సత్యము సడలిపోతున్నది. మానవుడు వేసే ప్రతి అడుగు అధర్మంలో పడుతున్నది, మానవుని ప్రేమ కేవలం లౌకిక మైనదిగా, కృత్రిమమైనదిగా కనిపిస్తున్నది. అందుచేత ఎక్కడ చూసినా శాంతి కనిపించడం లేదు. **బుద్ధుడు "అహింస పరమో ధర్మ:" అన్నాడు. కానీ ఈనాడు అహింస అనేది కనిపించడం లేదు.** ఎక్కడ చూసినా హింసనే, హింసనే! ఈవిధంగా ఈనాటి మానవుడు పంచప్రాణములను కోల్పోయిన శవం మాదిరి తయారైనాడు. ఇలాంటి పరిస్థితులందు మానవునికి శాంతి, సుఖములు ఏరీతిగా లభ్య మౌతాయి.

(స.సా.అ.99పు.261)

(చూ॥ ఆరోగ్యమేమహాభాగ్యము, మానవజీవితము, శాంతి)

మానవత్వము

సత్యము ధర్మముతో చేరాలి. ధర్మము ప్రేమతో ఉండాలి. ప్రేమ శాంతంతో అనుభవించాలి. ఈ శాంతము అహింసలో ప్రవేశించాలి. అప్పుడే ఇది ఏకత్వమనే దివ్యత్వంగా రూపొందుతుంది. **అనేక త్వాన్ని ఏకత్వంగా చేసినప్పుడే ఈ ఏకత్వంలోనే మానవత్వం వస్తుంది.** ఇట్టి మానవత్వంలోనే ఏకత్వం సులభంగా ఏర్పడుతుంది. **ఈ ఏకత్వంలో స్వచ్ఛత సహజంగా వస్తుంది. ఈ స్వచ్ఛత దివ్యత్వంలో ప్రవేశిస్తుంది. ఏకత్వం, దివ్యత్వం, స్వచ్ఛత మూడింటి సమ్మిళిత స్వరూపం ఈ మానవత్వం.** దీనిని పిల్లలకు ఏరీతిగా మనం బోధించాలి? బోధించడానికి ముందు ఆధ్యాపకులు-బోధకులు-తాము అనుభవించి తమ ఆచరణలో పెట్టినప్పుడు చూచి నేర్చుకోవటం మరింత సులభమవుతుంది. **అధ్యాపకులు ఒక పుస్తకంగా తయారు కాకూడదు. ఆచరణతో మన్నకాన్ని తయారుచేసుకోవాలి.** మానవత్వ గుణమనేదానిని కేవలం ఒక విషయ మాత్రంగా మనం తీసుకోకూడదు. **Information కాదు, Transformation కావాలి.** ఈ విధంగా పరివర్తితులై పిల్లలకు చెప్పడానికి ప్రయత్నించాలి. ఈ మానవత్వ గుణములను ఒక బోధనా విషయంగా భావిస్తున్నాము. ఇది ప్రత్యేక బోధనాంశం కాదు. మన జీవిత కర్తవ్యమనే మాట మరచి ఇదేదో బోధన పరమావధి ఏమిటి అని మొదట మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. మానవత్వం - ఇదే మన జీవిత పరమార్థం. శరీరము, మనస్సు ఆత్మల చేరిక ఏర్పడితే ఈ మానవత్వం అలవడుతుంది. ప్రత్యక్ష పరోక్షములందు కూడా మనం ఏకత్వంగా ప్రవర్తించాలి. ఎక్కడికి వెళ్ళినా మానవత్వ గుణమనేది శరీరాన్ని వెంబడించే నీడ మాదిరిగా ఉండాలి.

(స.సా.ఫి.85 పు.42)

పునర్విత్తం పునర్మిత్రం పునర్భార్యా పునర్మహి:,
ఏ తత్సర్వం పునర్లభ్యం నశరీరం పునఃపునః
ప్రేమస్వరూపులైన యువతీయువకులారా,
భావి ప్రపంచపౌరులారా!

మానవత్వము

ధనము కోల్పోయిన మరల సంపాదించుకోవచ్చు. మిత్రుడు పోయినప్పటికి మరొక మిత్రుని సంపాదించుకోవచ్చు. భార్య పోయినప్పటికి మరొక వివాహమాడ వచ్చును. భూమిని కోల్పోయిన తిరిగి మనము దానిని సంపాదించుకోవచ్చు. **శరీరము పోతే తిరిగి మనము సంపాదించుకోలేము.** అనంత జగత్తులో అఖిల ప్రాణికోటిలో మానవుడు అత్యంత ఉన్నతుడు. మానవుడు ఉత్కృష్టమైనవాడు, సౌజన్య సౌశీల్యముతో కూడినవాడు. ఇట్టి మానవత్వమును కోల్పోయిన యింక తిరిగి మనకు లభ్యము కాదు.

(శ్రీ.స.పు.1)

నైతికము, ధార్మికము, అధ్యాత్మికము - ఈ మూడింటి యొక్క సమ్మిళిత స్వరూపమే మానవత్వము. కాని, మానవుడీ నాడు ఈ మూడింటినీ విస్మరించాడు. మానవత్వమనగా ఎంత పవిత్రమైనదో విచారిస్తే ఈనాటి మానవుడు సిగ్గుపడవలసి వస్తుంది. **సత్యము. ప్రేమ, సహనము, దయ, సానుభూతి ఇత్యాది గుణముల చేత వర్ధిల్లిన ఈ భారత దేశంలో ఈనాడు ఎక్కడ చూసినా నిర్దయ, స్వార్థము, కఠినత్వము ఇత్యాది దుర్గుణములు తాండవ మాడుచున్నవి.** ప్రేమ అనేది ఎక్కడా కనిపించడం లేద. ఈనాడు మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. కాని, ఆయా మహానీయులు ప్రబోధించిన మంచి విషయాలను భూమిలో పూడ్చి పెడుతున్నారు. ఎందుకీ ఆడంబరాలు? ఎందుకీ నాటకాలు? **విగ్రహములను పూజించడం, ప్రబోధములను విస్మరించడం మానవత్వం కాదు.** మానవునికి మానవునికి మధ్య గల సంబంధ భాంధవ్యాన్ని గుర్తించి వర్తించడమే నిజమైన మానవత్వము.

(శ్రీ.భ.ఉ.పు.208)

సత్యాన్వేషణ సలిపి న్యాయమును విచారించి పవిత్రమైన ధర్మమార్గమును ప్రవేశింప చేసేదే మానవత్వము. మానవుడు సత్యవ్రతుడు, ధర్మపరాయణుడు న్యాయమే ఇతనికి ఆటపట్టు.

(బృ.త్ర.పు.58)

మానవరూపము

ఆకారము మానవకారముండవచ్చును; దానవ గుణములచేత ఈ మానవత్వాన్ని మరుగుచేయవచ్చును. ఆకారమును చూచి మానవత్వముగా భ్రమించరాదు. నిజమైన మానవత్వ మనగా: మా-నవ -మా అనగా కాదు నవ అనగా కొత్తది. కొత్తది కానిదే మానవత్వము. దీనికి మరొక అర్థమున్నది. మూడక్షరములతో కూడిన **మా.న.వ.మా అనగా అజ్ఞానము న అనగా లేకుండా. వ అనగా వర్తించటము. అజ్ఞానము లేకుండా వర్తించేవాడు అనేది సరైన అర్థము.** అజ్ఞానమునకు గురియై అశాంతికి లోనై దివ్యమైన ఆత్మజ్ఞానము లభించాలంటే ఏరీతిగా సాధ్యమవుతుంది? ఈమానవత్వమనే దివ్యత్వమును మొట్టమొదట అర్థము చేసుకోవాలి. అర్థము చేసుకొనక నానార్థములతో అనర్థములు మాత్రమే ఉంచుకొని యధార్థమును విసర్జించటంచేత సత్యస్వరూపమును గుర్తించటానికి వీలుకాదు.

ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా?
పువ్వులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా?
పులిచర్మము కప్పినట్టి గాడిద తా పులియగునా?
ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా?

మానవత్వమనగ మనసు మాట క్రియయు, అన్ని ఒక్కటిగానె అతికి యుంట, "మాటయందు వేరు పనులయందు వేరు, వచనమందు వేరు" ఈవిధమైన మార్గము అనుసరించినప్పుడు మానవత్వము ఎట్లా అవుతుంది? **దహింపబడేది కనుకనే యిది దేహము, జీర్ణించేది కనుకనే యిది శరీరము.** ఇలాంటి తత్వముచేత దీనికి అనేకనామములు ఏర్పడుతూ వచ్చినవి. దేహము ఒక నీటిబుడగవంటిది. ఏక్షణములో యీబుడగ నీటిలో లీనమవుతుందో, ఈనీటి బుడగ ఎక్కడనుండి వచ్చింది?

'నీటియందె పుట్టి నీటియందె పెరిగి
నీటియందడంగ నీటిబుడగ
నరుడు బద్బుదంబు నారాయణుడు నీరు'

ఈబుడగ నీటినుండే పుట్టినప్పుడు నరుడుకూడను నారాయణునినుండియే ఆవిర్భవించినవాడు. ఈసత్యాన్ని గుర్తించినప్పుడే **శరీరమును** అలక్ష్యము చేయక అశ్రద్ధ చేయక తగినరీతిగా దీనిని పోషించుకోవటానికి కృషి చేస్తాము. ఇది **ఒక పనిముట్టు అయినప్పటికిని దీనికి తగిన హద్దులు, హంగులు ఉండాలి.**

(బృ.త్ర.పు.29/30)

అసలు, మానవత్వమంటే ఏమిటి? మనసు, మాట, క్రియ అన్ని ఒకటిగా అతికి యుండుట. మనసువేరు, మాట వేరు క్రియవేరు. అయిన ప్రయెజనమేమి? తలచిన తలపులు, మాటలతో ఉచ్ఛరించి ఉచ్ఛరించిన మాటలు క్రియలలో ఆచరించాలి. దీనినే **'మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనాం' అట్టి మహాత్ముడే రాముడు 'మనస్యన్యత్, వచస్యన్యత్, కర్మణ్యన్యత్ దురాత్మనం' అట్టి దురాత్ముడే** రావణుడు. మానవుడు ఆచరించ వలసినటువంటి సత్కర్మలను మనస్సు నందుతలంచి, వాక్కులతో ఉచ్ఛరించి, క్రియలలో ఆచరించాలి. ఇట్టి మానవత్వాన్ని మనము పోషించాలి.

(స.సా.జూ.1989పు.143)

(చూ॥ Ceiling on desires, అర్థనారీశ్వరుడు, ఏడుప్రాకారాలకోట, ధృడనిశ్చయము, భూర్భువస్సువః, బెస్ట్‌ఫ్రెండ్స్, మనస్సు, మ్యాక్స్‌ముల్లర్, హిందువులు)

మానవరూపము

మానవరూపములో దివ్య శక్తి 80 శాతము వరకు యుండుటయే దాని విశిష్టత, అద్వితీయత. జంతువు నందు ఆ శక్తి 15 శాతమే ఉండును. మానవుడు దివ్య పరివర్తనను సాధించి భగవంతునిలో ఐక్యము కాగలడు;జంతువు తన సహజ స్వభావము నుండి ఎన్నటికీ బయటపడలేదు. ఉదాహరణకు - ఒక పిల్లికి ఎంత మంచి ఆహార పదార్థములను పెట్టినా, ఎలుకను చూచిన వెంటనే, ఆ ఆహారమును వదలి పెట్టి అది ఎలుక కొరకు పరుగెత్తును. ఒక పులికి ఎంత శిక్షణ నిచ్చినా గింజలతో తయారుచేసిన ఆహారము దానికి రుచింపదు, సంతృప్తిని కలిగింపదు. పులికి సహజమైన ప్రేరణ మృగములను చంపి మృత శరీరములను భక్షించుట.

(ప.పు.281)

మానవలక్షణములు

(చూ॥ హెచ్చరించుకోండి)

మానవ శరీరము

మానవశరీరము ధరించు నటువంటి ప్రతివ్యక్తి సత్యాన్ని పాటించాలి, పాలించాలి, అనుసరించాలి. ఇదే మానవతావిలువ యొక్క ప్రధాన విషయము.

(స.సా.జూ.1989పు.143)

మానవసేవ

(చూ॥ పల్లెసీమలసేవ)

మానవసేవయే మాధవసేవ

లోకమున మానవసేవే మాధవసేవ అనుచుందురు. అది నిజమే. ప్రజాసేవ పవిత్రమైన కార్యమైనను, సత్ వస్తువగు దైవములో కలియువరకు, గొప్ప సేవచే జనులకు శక్తి కలుగజాలదు. ఏ కార్యము చేసినను దైవచింతనను తోడుగైకొని, మానవునియందు మాధవ దివ్యత్వమున్నదని గ్రహించి, మానవసేవే మాధవసేవ అన్న, సత్యమగునుకాని, కేవలము అట్టి భావము. విశ్వాసమేలేక, వారివారి పేరు ప్రతిష్టలకు, సంఘ గౌరవములకు తత్పలితమునుకోరి, మానవసేవ చేస్తూ, మానవసేవే మాధవసేవ అన్న, ఎట్లు అగును? మాధవచింతనే లేక మాధవసేవ ఎక్కడ ఉట్టిపడును. అవి బూటక మాటలు. అది నేనొప్పను. దైవచింతనతో, సత్యమార్గముతో, ధర్మగుణముతో ఏ కార్యము చేసినను భగవత్ సేవగా భావించవలెను. పేరు, గౌరవము తత్పలిత ఆశకొరకు చేయు సేవ మాధవసేవ అనబడదు. అట్టి నిరంతర ధ్యానపరులైన వారు ఇతరమైన కార్యము ఏమియున్ను చేయనక్కరలేదు. వారి ప్రార్థనాఫలమే లోకమును పావనము చేయును. అయితే నిరంతరము ధ్యేయాకారమగు ధ్యానములో నిలుచుటకు అందరికి సాధ్యమైన పనికాదు. కనుక, అట్టి స్థితిని పొందుటకు **విశుద్ధాంతఃకరణము** కలిగి, సర్వసంకల్పములను నశింపజేసుకొనవలెను. అట్టి మనధర్మము కలిగిన సాధువులు స్వయముగా కనుగొనగలరు. అంతియే కాని, అందరికి సాధ్యముకాదు. కాదని ఊరక ఉండకూడదు. అది మీ మీ ప్రాప్తానుసారము, సాధనానుసారము లభించును. అంతవరకు ఆత్మవంచనలేక, ఎంతవరకు మనస్సు వృత్తి నిమితమై దైవాకార్యమగు స్థితిలో నిలుచునో అంతవరకు ధ్యాన జపములు చేయుచు, పరోపకారము చేస్తూ, తత్పలితమును ఆశించక లోకసేవలో కాలమును వినియోగించిన, ధన్యాత్ములు కాగలరు. అట్లు కానిచో, దేహముతో ప్రపంచ కర్మలు చేయకపోయినను, మనస్సు లోకమునపోయి అనేక కర్మలు చేయుచుండును. ఇట్టి వారు కర్మలు చేయకనే, కర్మమునకు కట్టుపడుదురు. దైవధ్యానము, సత్యమార్గములో నుండి మనస్సు బహిర్గత మగునపుడు, ప్రాణికోట్లకు ఉపకారమగు పనులు దేహేంద్రియములు చేసినను, మనస్సు దానిపై ఏకాగ్రతలో పడియుండుటచేత కర్మము చేసినను, కర్మము చేయని వాడగును. భగవద్గీత భావమంతయు దీనిపై ఆధారపడినది. మనస్సున పవిత్ర విషయమై పరిశ్రమ చేయని హృదయమే, దుర్గణములకు విశ్రాంతి పొందుటకు తగిన ఆనంద భవనముగా నుండును. ఈ విషయమును మోక్షమును కోరువారు, ఏకాగ్రతను పొందగోరువారు. పెద్దలు కాగోరువారు ముఖ్యముగా గ్రహించవలసిన ధర్మము. ఇట్టి ఆత్మజ్ఞానముకు పొందుటకు బ్రాహ్మణాది వర్ణములుగాని, సన్యాసాది ఆశ్రమములుగాని, యజ్ఞాదికర్మలున్ను, శాస్త్రాది కారణములున్ను కారణములు కావు. బ్రహ్మనిష్ట ఒక్కటే దీనికి కారణము. అందుకనే ఉపనిషత్ వచనముకూడా ఇట్లే నుడివినది:

నాశ్రమం కారణం ముక్తేః దర్శనాని సకారణం
తథైవ సర్వకర్మాణి జ్ఞానమేవహి కారణమ్ ॥

అట్టి పరబ్రహ్మమగు పరమాత్మ చింతనకు కాలనియమము లేదు; పుణ్యదేశమనియు, ప్రత్యేక

మానవుడు కాడు

స్థలమనియు లేదు, ఏ కాలమైనను, ఏ స్థలమున, ఏ సమయమున చిత్తము పరమాత్మయందు రమించునో అదే పుణ్యస్థలము, పుణ్యకాలము అగుచుండును. ఎచ్చటనున్న అచ్చటనే చింతనచేయుచుండ వచ్చును. అందుకనే మునుపీరీతిగా తెలియపర్చటము:

శ్లో॥ సకాల నియమోయత్ర నదేశస్య స్థలస్యచ
యత్రాస్య రమతే చిత్తం తత్ర ధ్యానే నకేవలమ్॥

ఇట్టి సర్వనిష్ఠా గరిష్ఠులై, సర్వసార సహితులై, అంతఃకరణ శుద్ధి కల్గిన వారలవల్ల లోకము క్షమమునకు రాగలదు. అట్టివారి అనుగ్రహమునకు పాత్రలై, వారి ప్రార్థనలవలన దేశక్షమమునుకోరి, ఉన్న బాధలను మరువగోట్ట ప్రయత్నించుటకు సర్వులూ ఈనిమిషము నుండియే పరమాత్ముని ప్రార్థనలు సల్పుదురుగాక! లోకక్షేమమును పొందుదురు గాక!

(ప్రే.వా.పు.86/88)

మానవుడు కాడు

"ఏకం సత్ విప్రాః బహుధా వదంతి". దేవుడు ఒక్కడే. కనుక, నీ దేవుడు, నా దేవుడు అనే భేద భావములకు చోటివ్వకండి. కొందరు తమకు రాముడంటేనే ఇష్టమంటారు, కొందరు కృష్ణుడంటేనే ఇష్టమంటారు, కొందరు శివుడంటేనే ఇష్టమంటారు. కొందరు సాయిబాబా అంటేనే ఇష్టమంటారు. ఇవన్నీ కేవలం అల్పబుద్ధుల యొక్క లక్షణాలు. **దైవం ఒక్కడే, అతడు సర్వాంతర్యామి. ఈ సత్యాన్ని చక్కగా గుర్తించండి. మీరు క్రిష్టియన్లు అయితే నిజమైన క్రిష్టియన్లుగా తయారు కండి; హిందువులైతే నిజమైన హిందువులుగా తయారు కండి;** ముస్లింలైతే నిజమైన ముస్లింలుగా తయారు కండి. మీ ప్రవర్తన మానవుడనే పేరుకు తగినట్లుగా ఉండాలి.

కాడు మానవుండు ప్రేమయే లేకున్న
కాడు క్రైస్తవుడు, కాడు సిక్కు
కాడు హైందవుండు, కాడు ముస్లిమ్
వాడె రాక్షసుండు వసుధపైన!

ప్రేమస్వరూపులారా! **రాముడు "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అన్నాడు. దేశము తల్లి, సంస్కృతి తండ్రి. కనుకనే, జన్మభూమిని Mother land అంటారుగాని, Father land అనరు.** భారతీయ సంస్కృతి తల్లికి ఇంత ప్రాధాన్యత ఇచ్చింది. తల్లి ప్రేమతత్వానికి అనుక్షణమూ జ్ఞప్తియందుంచుకొని ఎలాంటి పరిస్థితి యందైనా తల్లిని సంతోషపెట్టడానికి ప్రయత్నించండి. **తల్లి సంతోషపడక నేను సంతోషపడను. తల్లిని సంతృప్తిపరచితే నాకు కూడా సంతృప్తే!**

(స.సా.డి.99పు.364/365)

మానవుని పరిస్థితి

మానవాళి కంటె సృష్టిచాల విశాలమైనది. ఈ సృష్టికి మానవత్వమునకు సన్నిహిత సంబంధమున్నది. తల్లిపాలు బిడ్డ త్రాగినట్లుగా, పూవులోని మకరందమును తుమ్మెద గ్రోలినట్లుగా ప్రకృతిలోని వనరులను మానవుడు అనుభవించటంలో ఎట్టి అభ్యంతరమూ లేదు. కాని **ఈనాటి మానవుడు మితిమీరిన ఆశలచేత ప్రకృతి వనరులను దుర్వినియోగం చేస్తున్నాడు. అందుచేతనే ప్రకృతిలోని బ్యాలన్సు తప్పిపోయి భూకంపములు, ఉప్పెనలు, కరవు కాటకముల వంటి ప్రకృతి వైపరిత్యాలు సంభవిస్తున్నాయి.** తాను కూర్చున్నటువంటి కొమ్మను తానే నరుక్కుంటున్నట్లుగా ఉన్నది. ఈనాటి మానవుని పరిస్థితి.

(స.సా.మా.97పు.64)

మానవుని విశిష్టత

చర్మచక్షువులు మానవులకు మాత్రమేకాదు. పశుపక్షి మృగాదులకు, క్రిమికీటకాదులకు ఉంటున్నది. మానవుని విశిష్టత ఏమిటి? జ్ఞానచక్షువులను తాను అభివృద్ధి పరచుకొనకుండిన ఈ చర్మచక్షువులు ఉండి పశు పక్షిమృగాదులతో సమానమనే అనిపిస్తుంది. మానవ జీవితము అమూల్యమైనది. అర్థవంతమైనది.

మానుషాకారము

పంచభూతములు మానవునికి ప్రధానమైన పంచప్రాణములు, ఈ ప్రాణములే లేకుండిన జీవితమే లేదు. **ఇందులో 'వాయువు' అనే ప్రాణము సర్వత్రా వ్యాపించి యుంటున్నది.** కాని మనకు కనిపించదు. చేతికి చిక్కదు. కనిపించనంత మాత్రమున లేదని భావించరాదు. గాలిలేక పోతే నీవు ఎలా ఉన్నావు? అదియే నీ శ్వాస. **ఈ శ్వాస ఉండినంత వరకే ఇది శివం ఈ శ్వాసనే పోతే శవం కాబట్టి శ్వాసనే ఈశ్వరస్వరూపం.** ఈ శ్వాసనే నిజమైనటువంటి గాలి స్వరూపము. ఈ స్వరూపాలతో భగవంతుడు మానవుని యందు సంచిరస్తూ, శతవిధాలామానవుని సంరక్షిస్తున్నాడు. కనుక భగవంతుడు అంటే ఏదో ఒక పెద్ద ఆకారంతో ఉన్నాడని భావించరాదు. ఆ ఆకారములన్నీ మనం కలిపించుకున్నవే. భగవంతునకు నాల్గు చేతులు పెట్టారు, శంఖం, చక్రము, గద, పద్మములు పెట్టారు. భగవంతునకు నాలుగు చేతులున్నాయా? లేదు. **భగవంతుడు సర్వశక్తి మయుడుఅని గుర్తింపచేయటానికి నాలుగు చేతులుగా పెట్టారు. ఒక చేతిలో శంఖం. ఆ శంఖమే శబ్దబ్రహ్మము. ఇంకొక చేతిలో చక్రము. ఆ చక్రమే కాలచక్రము. కాబట్టి ఈ శబ్దము, కాలము భగవంతుని చేతిలోనే ఉంటున్నాయన్నమాట. మరొక చేతిలో గద. గద అనగా బలము. బలము కూడా భగవంతుని చేతిలోనే ఉంటున్నది. మరొక చేతిలో పద్మము. అనగా హృదయము. ఇది కూడానూ భగవంతుని చేతిలో ఉంటున్నది** ఇవన్నీ అర్థం గావించుకొనే నిమిత్తమై ఈవిధమైన ఆకారములు నిర్మస్తూ వచ్చారు. ఆకారము కాదు, **మానుషాకారమే శాశ్వతమైన ఆకారము. అటువంటి దైవం మానుషరూపేణ.** కనుక ఆ మనుష్య నిజస్వరూపం లోపల ఏది ఉత్తమమైనదో ఏది పవిత్రమైనటువంటిదో, ఏది సర్వకర్మకూ ఆధారమైనటువంటిదో, ఏది సర్వాధారమైనటువంటిదో, అలాంటి మానవత్వాన్ని మనం విశ్వసించాలి. మనకు ప్రసాదించిన ఇంద్రియాలను సద్వినియోగపరచాలి. అప్పుడే నీవు నిజమైన మానవుడవు అయిపోతావు.

(శ్రీ.న.2001.పు.8)

అనుభవించదగినది. ఇట్టి పవిత్ర మానవజీవితమును సార్థకము గావించుకొనవలెనన్న ఆత్మ జ్ఞానము అవసరము. 'జంతూనాం నరజన్మ దుర్లభం' కాని 'జ్ఞానేన **శూన్యః పశుభిస్సమానః' జ్ఞానమే లేకుండిన పశువుతో సమానమే.** ఈ చర్మచక్షువులు బాహ్యమైన స్థూలమైన జగుత్తును చూడగలుగు తున్నవేకాని సూక్ష్మమైన దివ్యత్వాన్ని గుర్తించుటకు సాధ్యం కాదు. ఎవరి నేత్రములు వారే చూడలేరు. ఎవరి నేత్రములు వారినే చూడలేదు...కనుక చర్మచక్షువులు సహజమైన జీవితానికి దృశ్య కల్పిత జగత్తును చూపించునవి మాత్రమే. **జ్ఞాననేత్రము ప్రతిమానవునకు అత్యవసరము. జ్ఞాననేత్రమన్నా, దివ్యనేత్రమన్నా ఆత్మనేత్రమన్నా, బ్రహ్మనేత్రమన్నా ఒకదానికొకటి** పర్యాయపదములు. సర్వం బ్రహ్మమ్ అనే భావాన్ని మనము విశ్వసించినప్పుడే జగత్తంతయు బ్రహ్మభావంతో రూపొందుతుంది. ఎట్టి భావమో అట్టి దృశ్యము ఎట్టిరంగో అట్టి ప్రకృతి. **దృష్టిని జ్ఞానమయముగా మార్చుకున్నప్పుడే సృష్టిబ్రహ్మమయంగా రూపొందుతుంది.**

(బృ.త్ర.పు.158/159)

మానసభజరేగురుచరణం

అవ్యాజకృపతో నవరతించిన సద్గురుచరణులఁ సంపూర్ణ శరాణాగతులు కండు.

మానస భజరే గురుచరణం: దుస్తర భవసారగ తరణం. సత్యాన్వేషకులారా: అనన్య మనస్కులై సద్గురుచరణముల భజింపుడు. జనన మరణ రూప సంసారార్ణవమున తరించి, బంధవిముక్తి, నిత్యానంద ప్రాప్తిని గాంచగలరు.

(స.శి.సు.ద్వి.పు.6/7)

మానసికమరణోత్సవము

ప్రతి మానవుడు జరుపుకొనవలసినది 'వజ్రోత్సవము' (Diamond Jubilee) కాదు. అది 'మానసిక మరణోత్సవము' (Diemind Jubilee) సాధనద్వారా, మనస్సును గెలిచిన సందర్భములో అది సాధ్యమగును.

(శ్రీ.స.సూ.పు.86)

మాయ

పరమాత్ముడు అర్జునా వినుమా! ఈ లోకమునకూ **నాకూ మధ్యలో మాయ అను భ్రాంతి తిరుగుచుండును,** దానిని మానవులు జయించుట కష్టము. అదియును నాదే. మాయయన్న నాకు భిన్నమయినది కాదు. నా సృష్టి లోనిదే, నా వశమైనదే. అది యెట్టివారినైనను ఒక్క నిమిషములో తలక్రిందులుచేయును. దానిని జయించుట ఎంతకష్టమా అని నీవు కూడనూ తలంచవచ్చును. కష్టమే. నీవు కూడనూ వాయువును సులభముగా జయించితివి కానీ, మాయను జయించలేవు. అది అంతతేలికయైన పనికాదు; జయించలేవు. **యెవరు నన్ను సంపూర్ణముగా ఆశ్రయించి యుందురో అట్టివారు మాత్రమే ఆ మాయను జయించగలరు.**

"మాయయనగా వేరేమీ నూతనముగా వచ్చి చేరునట్టి వికారస్వరూపము కాదు, బావా! నిత్యసత్యమైన పరమాత్మను మరచి గుణకార్యములైన నామరూప పదార్థములే నిజమని యెంచుటే మాయ యొక్క గుణము, **దేహి యయిన ఆత్మ తాననుకోకుండా దేహమే. తాననుకొనుట మాయయొక్క స్వభావము, మాయ అనునది ముందుండి తరువాత పోవునది కానీ, లేనిది తరువాత వచ్చి చేరునదికానీ కాదు. ఇది ఎప్పుడూ లేదు; లేని వస్తువే మాయ.** అయితే కనుపించును. ఇది యెండమావుల జలము వలె కనుపించును. అవి నీరుకాదు పుట్టనూ లేదు వాటి సత్యమును తెలిసికొనినవారిని అవి ఆకర్షించలేవు. తెలియని వారిని జలభ్రాంతి కలిగించి, అనేక విధముల శ్రమింపజేయును. ఆశాంతిని కలిగించును; నిరుత్సాహమును పుట్టించును, చీకటి ఇంటిలోనే పుట్టి ఇంటినే ఆవరించునటుల, పాచి నీటియందే పుట్టి నీటినే అవరించునటల, కంటిపోర కంటియందేపుట్టి కంటిని కప్పినటుల మాయకూడనూ సామాన్యమయినది కాదు. అది యెవరియందు పుట్టునో వారినే ఆశ్రయించును. త్రిమూర్తిని. త్రిగుణాలనూ ఆవరించును.

"కానీ, జీవభ్రాంతి కలవారు దీనికి వశులగుదురు. తత్త్వదృష్టి కలవారు దీనికి అతీతులగుదురు. అట్టి వారిని అది ఆవరించలేదు. తత్త్వ వస్తువులను గోచరించనట్లు చేయును. కానీ తత్త్వజ్ఞానులను చేరలేదు. బావా! యెక్కడ పుట్టినదో యెవరిలో పుట్టినదో వారినే ఆవరించునని మాయను గురించి చెప్పిన విషయమును పురస్కరించు కొని నీలోనే పుట్టిన మాయ నిన్ను మాత్రము ఆవరించలేదా అని నీవనవచ్చును, సంశయము కలుగవచ్చు, అది పొసగదు. మాయ సర్వజగత్తుకూ ఉపాదానకారణము. సర్వేశ్వరునికి కారణముకాదు. నేను మాయాధికారిని, మాయావరణము జగత్తు, మాయ నన్ను ఆశ్రయించి నా ఆజ్ఞలో నిలచి యుండును. నన్ను ఆశ్రయించి నా ఆజ్ఞలో యెవరుందురో, వారికి కూడనూ మాయ దాసురాలై దోసిలొగ్గును.

"పరమాత్మజ్ఞానమువలననే దానిని దాటవచ్చును. కానీ అన్యమార్గముల దాటలేరు. ప్రాణధర్మమును పరమాత్మపై ఆరోపించుటే మాయ! సుఖ దుఃఖములు, మనో ధర్మములు, జనన మరణములు, దేహ ధర్మములు, ఆకలి దప్పులు, ప్రాణ ధర్మములు, ఇవి అనాత్మ ధర్మములు కానీ ఆత్మధర్మములు కావు. అనాత్మధర్మమును ఆత్మ యందు ఆరోపించుటే మాయ. ఇది నన్ను శరణుజొచ్చిన వారిచెంతకు కూడనూ పోలేదు. మాయ వైపున చూపు పెట్టి చూచువానికి మాయ అపారమైన సాగరమువలె అడ్డువచ్చును. **పరమాత్మవైపున చూపుపెట్టి చూచువారలకు మాయఅనే మాధవుడే సాక్షాత్కరించును. భగవదైక్యభావముతో కానీ శరణాగతితో కానీ మాయ ప్రతిబంధాన్ని అతిక్రమించవచ్చు; ఒక దానిని జ్ఞానమార్గమనియూ మరొకదానిని భక్తి మార్గమనియూ పిలుతురు.**

లోకమున సామాన్య మానవులకు భగవంతుని శరణుజొచ్చి మాయను జయించవలెనను బుద్ధిపుట్టదు. అది వారివారి జన్మాంతర సుకృత దుష్కృతములనుపట్టి ఉండును. దుష్కృతులు కేవలము భోగలాలసులైక్షణానందమునకు

ప్రాకులాడుదురు. పశుపక్షి మృగముల వలే తిని తిరుగుచూ తాత్కాలిక ఆనందములతో తందనా లాడుచుందురు. ఇట్టిదే జీవిత లక్ష్యమని భావించి దైవచింతయే లేక,సత్ సంగ మన్న అనహ్యించు కొనుచూ, సదాచారమన్న గిట్టనివారై వట్టి భ్రష్టులగుచుందురు.

(గీ.పు.112/114)

మాయకు నత్వరజ స్తమోగుణములు మూడు మూలాధారములు. మోహమునకు ధనేషణ, దారేషణ, పుత్రేషణ మూడు మూలాధారములు. తమోగుణమును, రజోగుణమును, సత్వగుణమును నిర్మూలం గావించుకున్న తరువాత, వాడు మానవుడు కాదు. మాయ తన దగ్గర ఉండదు. మానవుడు మాయనుండి వేరు కావాలని తలంచినప్పుడు ఈ త్రిగుణములను దూరం చేసుకోవాలి. ఈ త్రిగుణములు ఉండినంతవరకు మాయ అతనిని వీడదు. ఇంక, మోహమును ఏరీతిగా త్యజించాలి? ధనేషణ, దారేషణ, పుత్రేషణ - యీ మూడూ లేని మనస్సుకే మోహము నిర్మూలమవుతుంది.

(ఆ.భా.పు.64)

సంజయుడే ధృతరాష్ట్రునకు తెలిపెను **'ఎచట యోగీశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారియైన అర్జునుడుందురో అచ్చట విజయము, సంపత్తు లభించును"** మనకు ఇంతకంటే వేరు ఆదర్శము యెందుకు? విజయమునకు తాపత్రయపడనక్కరలేదు. తహతహలాడ పనిలేదు. ఐశ్వర్యమునకు, పరితపించనక్కరలేదు. పరమాత్ముని హృదయమున చేర్చుకొనుము. ధైర్యమును ధనుస్సును ధరించుము. అనగా నిర్మల హృదయుడవు కమ్ము. విజయము, ఐశ్వర్యము నీదే. నీడను వెంటాడితివా? కోట్లకొలది సంవత్సరములకైనను అది నీకు లభించదు. అది నీకంటే ముందు గనే పరెగెత్తును. అయితే నీ దృష్టి సూర్యునివైపు మరల్చితివా, నీ నీడ నిన్ను ఆశ్రయించును. అనగా నీ నీడ నీ వెనుక నిన్ను ఆశ్రయించుచూ రాగలదు. నీకు బానిసయై వర్తించును. ఇక్కడ నీడ ఒక మాయ, మాయను ఆశ్రయించు నంతకాలము నీకు మాధవుడు దక్కడు, చిక్కడు, మాయను బానిసగా చేసుకొంటివా, మాధవుడు గమనశీలుడు కాగలడు.

(వి.వా.పు.40/41)

సూర్యాస్తసమయము కానున్నందున, విశ్వామిత్రుడు రామలక్ష్మణులను పిలిచి మృదు మధురమైన పలుకులతో "నాయనలారా! ఆలస్యము చేయక నదిలో ఆచమింపుడు. **సమస్త మంత్రములకు మూలాధారములైన "బల అతిబల" అను రెండు మంత్రములను ఉపదేశింతును.** ఈ మంత్రములు మహాప్రభావము కలవై యుండును. ఇవి యెట్టి అలసటనైననూ క్షణములో తీర్చి హాయిని కలిగించును. ఎన్ని పనులు చేసిననూ అలసట కలిగించక, వ్యాధులను రానివ్వక, రాక్షసుల బాధలు కలుగకుండ రక్షించును. ఇంతే కాదు దారిలో నడుచుచున్న సమయాలలో ఈ మంత్రములను స్మరించుచూ వెళ్లిన ఆకలి దప్పులు లేక ఆనందోల్లాసముల నొసంగి అతి బలమును కలిగించుచూ వచ్చును.

"రామా! **"బల అతిబల" అను ఈ రెండు మంత్రములు సర్వమంత్రములకే కాక సమస్త శక్తులకు తోబోవంత మైనవి."** అని ఇంకనూ ఆ మంత్రముల మహత్తరమైన శక్తి సామర్థ్యములను విశ్వామిత్రులవారు వర్ణించుచుండ, సర్వజ్ఞుడైన రామచంద్రుడు దాని విషయము యేమీ తెలియని వానివలె, తల ఊపుచూ ఆశ్చర్యముగా వినునట్లు నటించుచుండ, లక్ష్మణుడు ఇరువురినీ చూచుచూ, తనలో తాను నవ్వుకొనుచుండెను.

ఇచట లోకోపదేశ నిమిత్తమై రాముడు ఒక విచిత్రమైన ప్రబోధ చేసిరి. **అది యేమన మాయ యెట్టి వారినైనను క్షణములో తలక్రిందుచేయుననియునూ, దేహాభిమాన మున్నంతవరకు మాయ మనుజుని వీడ దనియూ ఇది తపస్సులతో, జ్ఞానముతో, పేరు ప్రతిష్ఠలతో, శక్తి సామర్థ్యములతో తొలగునది కాదనియునూ, తాను ఆత్మ స్వరూపుడనని తెలిసికొని, సమత్వ బుద్ధితో జగత్తును చూచుటతో ఈ మాయ మరుగు పడుననియూ ఒక నీతిని నిరూపించిరి.** కాకున్న, "బల, అతిబల" అతి

శక్తివంతమైన మంత్రములు తనచెంత నుండియూ, తాను తపోసంపన్నుడైనప్పటికినీ, యజ్ఞసంరక్షణార్థమై దానికి తగిన శక్తి సామర్థ్యము కలవాడు శ్రీరాముడే యని గమినించియూ, రాముడు సామాన్యుడు కాడులోక రక్షకుడు, అతడు చేయలేని కార్యమంటూ యొకటి జగత్తున లేదని దశరథుని చెంత వర్ణించి, పుత్రవాత్సల్యమే నిన్నింత అమాయకుని చేసినదని బోధించి ఇక్కడ, మాయాబంధితుడై గుణమోహితుడై రామ లక్ష్మణులను **సామాన్య పిల్లలవలె భావించి, వారలకు మంత్రోపదేశము చేయుటకు పూనుకొనుటలో మాయయొక్క ప్రభావమును నిరూపించుటయే దీని అంతరార్థమని చెప్పక చెప్పుచున్నది. అట్టి మాయను విశ్వామిత్రుని యందు ఆ నిమిషమున ప్రవేశింప చేయకున్న రామసంకల్పకార్యము జరుగనేరదు. మహర్షులలో ప్రవేశించిన మాయ కూడను మహత్తర కారణములను చేయించును.**

విశ్వామిత్రమహర్షి ఆజ్ఞానుసారము, రామలక్ష్మణులు సరయూనదిలో ఆచమించిరి. విశ్వామిత్రుడు రామలచెంతకు వచ్చి ఆ రెండు మంత్రములను ఉపదేశించెను. మాయామానుషరూపుడైన రాముడు విశ్వామిత్రుడు చెప్పి నటులనే పలికి, తలనూపుచూ, శిష్యత్వము అందుకొన్నటుల ప్రదర్శించెను.

(రా.వా.మొ.పు.70/71)

దేహమును ఆధారము చేసుకొని, అంతర్ దృష్టిని మనం అభివృద్ధి గావించుకొని బహిర్ ముఖమైనమనస్సును అంతర్ముఖముగా మార్చుకోవాలి. ఈ విధముగా ప్రాక్టీసు చేస్తూ వస్తే తప్పక ఈ సత్యమును మనము అనుభవించవచ్చును, గుర్తించవచ్చును. దీనినే ఆత్మ సాక్షాత్కారమన్నారు. అనగా నేను అనే తత్త్వము ఏ మూలము నుండి వచ్చిందో ఆ మూలములో చేర్చాలి.

ఒక చిన్న ఉదాహరణ నీవు తెల్లవారి నడుస్తున్నావు. సూర్యుడు తూర్పున ఉదయిస్తున్నాడు. నీవు పడమటి వైపు ప్రయాణము చేస్తున్నావు. పడమటి వైపు ప్రయాణము చేసేంత వరకు నీ నీడ నీ కంటె ముందుగా వెడుతున్నది. కానీ నీ నీడను దాటి పోవాలని ఎంతో ప్రయత్నం చేస్తున్నావు. ఇది అసాధ్యము. ఎందుకనగా సూర్యునికి విరుద్ధముగా నడుస్తున్నావు. కనుక నీ నీడ నీ కంటె ముందుగా పోతున్నది. ఎంత తీవ్రముగా వెళ్ల ప్రయత్నించినా అంత తీవ్రముగా ముందు వెడుతుంది. దీనితో పోరాడి ప్రయోజనము లేదు. నీ ముఖము సూర్యుని వైపు తిప్పు. అప్పుడు నీనీడ నీవెనుక పడిపోతుంది. ఇదియే ఈనాడు జరుగుచున్న ప్రపంచ పరిస్థితి. **భగవంతునికి విరుద్ధముగా ప్రకృతి దిశవైపు ప్రయాణము చేస్తున్నావు. నీకంటె ముందుగానే మాయ అనే ప్రతిబింబము నడుస్తున్నది.** ఈ విధముగా విరుద్ధమైన ముఖము పెట్టుకొని మాయను వెనుక వేయాలంటే సాధ్యము కాదు. **నీ దృష్టి భగవంతుని వైపు తిప్పు. ఈ మాయ ఏ సాధనలు చేయకపోయినా వెనుకపడిపోతుంది. కనుక ఈనాడు మనం మార్చవలసింది ఏమంటే మనస్సు యొక్క దృష్టిని మార్చాలి. ప్రకృతిభావములో నుండిన దృష్టిని పరమాత్మ భావములోకి మార్చుకోవాలి. ఇదియే ఈనాడు చేయవలసిన సాధన.**

దృష్టిదోషమే కానీ, సృష్టిదోషము లేదు:

ఈ ప్రకృతి భావము కేవలము 'మాయ'. మాయను తప్పించుకోవాలంటే భగవంతుని వైపు మరల్చాలి. మాయ, మనస్సు ప్రకృతి ఒక్కటే. కనుక ప్రకృతి వైపునున్న మనస్సు పరమాత్మ వైపు మరల్చాలి. అనగా అంతర్భావమును మార్చుకోవాలి. అప్పుడే ప్రకృతి దూరమై పరమాత్మ సమీపుడౌతాడు. **దీనినే 'పశ్యన్నపి చ న పశ్యతి మూఢో' అయ్యా! నీవు భగవంతుని చూస్తున్నావు. ఎక్కడ చూస్తున్నావు? ఇదంతా భగవత్స్వరూపమే.** నాకు భగవంతుడు కనిపించాలని ఆశిస్తున్నావు. చూచేది భగవంతుడినే. దీని కంటే ప్రత్యేకంగా ఏమి కనిపించగలడు? అయితే నీవు ఏ భావముతో చూస్తున్నావు. దీనిని ప్రకృతి భావముతో చూస్తున్నావు. నీకు భగవంతుడు కనిపించటంలేదు. దీనిని భగవద్భావముతో చూడు ప్రకృతి నీకు కనిపించదు. **నీ దృష్టి దోషమేగానీ సృష్టి దోషము లేదు.**

(ద.స.స.పు.87-89)

మాయ అనగా ఏమిటి? సత్త్వరజస్తమో గుణముల స్వరూపమే మాయ. కనుక, మానవుడు ఈ త్రిగుణములను అరికట్టిన నాడు మాయకు అతీతుడై జీవిస్తాడని వేదము యొక్క ప్రమాణము. **ఇంక మోహమంటే ఏమిటి?** ధనేషణ, దారేషణ, పుత్రేషణ - ఈ ఈషణత్రయము చేతనే మోహము పెరిగి పోతున్నది. వీటిని జయిస్తే **మోహమే ఉండదు.** జీవితంలో అనేక కష్టనష్టములు ఎదురౌతుంటాయి. వీటిని తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగిన వాడే నిజమైన మానవుడు. మానవుని దుఃఖమునకు, విచారమునకు మూలకారణం మితిమీరిన కోరికలే! **"న శ్రేయో నయమం వినా" - వీటి యందు మనం సరియైన నియమాన్ని పాటించాలి.**

(స.సా.న.94పు.281/282)

అంతను తానాయె అంతయు లోనాయె
మాయకు లోనాయె మాయ తానాయె
మాయ యిరువదియైదు మంత్రములాయె
మాయ యిరువదియైదు మంత్రములు తెలసితే
మాయ మాయ మాయ మరిబయలాయె.
అంతా మాయ తత్వంగా కనిపిస్తుంది.

(శ్రీ.స.పు.80)

మాయలో పుట్టి మాయలో పెరిగి
మయనెరుంగరుమందమతులు
బ్రతుకులన్నియు మాయ భవబంధములు మాయ
సంసారమది మాయ చావుమాయ
మాయ బ్రతుకు కింత మాయలో పడనేల?

(ము.ము.పు. 32)

(చూ॥ అక్షరం, తొమ్మిది, శ్రీమంతుడు)

మాయాధికారి

(చూ॥ మాయ)

మాయాశక్తి

(చూ॥ గోపికలు)

మారదు

పెద్ద వజ్రమెకటి పెరటిలో పూడ్చివుంచిన
విలువ మారదు, దాని వెలుగు పోదు
మంచి గుమ్మడి పండు కంచెలో దాచినా
రుచియు మారదు దాని చవియు పోదు.
మంచినెమలి గుడ్డు కోడిగా పొదిగిన
వన్నె మారదు, దాని చిన్నెపోదు.

(సా. పు.245)

మారరు

ప్రతివారు సంఘాన్ని మార్చాలని కోరుతారు. కాని వారు మాత్రముమారరు. చివరకు యత్నమునైనా చెయ్యరు.

(సా.పు. 68)

మార్కండేయుడు

(చూ॥ స్మరించు)

మార్గదర్శకుడు

అధ్యాపకులు మార్గదర్శకులు. భవిష్యత్తుకు రాచబాట వేయువారు విద్యార్థులు. మానవజాతియొక్క గౌరవముకానీ, శక్తిసామర్థ్యములుకానీ ఉపాధ్యాయుల గుణముపైననే ఆధారపడియుంటివి. మానవత్వమునకు గుణమే గీటురాయి. గుణమును పోషించే నిమిత్తము తమ విద్యను జ్ఞానమును వినియోగించి విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసికొనిపోవుటకు ఆధ్యాపకులు తగిన ప్రయత్నము చేయాలి. సాంఘిక జీవితానికి సర్వోన్నతిని కలిగించేది గుణము. మానవత్వమునకు మొగ్గను తొడిగేది గుణము. అన్నము నిమిత్తముకాక ఆదర్శము నిమిత్తమై జీవించుటమేగుణము. గుణములేనిజీవితము దీపములేని గుడివంటిది, చెల్లని రూపాయి వంటిది, దారము తెగిన గాలిపటము వంటిది.

ధన నిమిత్తమే ఆధ్యాపకుడు బోధన సలపడము ఉద్యోగ

మార్గములు

నిమిత్తమే **విద్యార్థులు విద్యనభ్యసించడము** సరియైన పద్ధతికాదు. విద్యార్థియొక్క ఔన్నత్యమును, అభివృద్ధిని ఆశించి తన కర్తవ్యమును గుర్తించి వర్తించడమే అధ్యాపకుని పని. మానవత్వాన్ని వికసింపచేసుకొని సామాజిక సేవయందు గానీ, దివ్వత్వమునందుగానీ **మార్గదర్శకుడైనవాడు విద్యార్థి.**

(వి.వా.పు.82)

(చూ॥ నాసందేశము)

మార్గములు

కృతయుగంలో - ధ్యానము
త్రేతాయుగంలో - యజ్ఞం
ద్వాపరయుగంలో - అర్చనము
కలియుగంలో - నామస్మరణ
ఇవే మానవునకు ముఖ్యమార్గాలు.

(భ.స.మ. పు. 224)

మానవులు సంచరించు మార్గములు రెండు. అవి ధర్మమార్గము. బ్రహ్మమార్గము. ధర్మమార్గమనగా ఇహలోకమునకు సంబంధించిన ధర్మములను సంఘమునకు సంబంధించిన ధర్మములను చక్కగా నాచరించుట. బ్రహ్మమార్గమనగా ఆత్మధర్మములను తెలిసికొని, తత్సంబంధసాధనలను చక్కగా జేయుట. మానవుడు కుడిచేతితో భగవంతుని పట్టుకొని యెడమచేతితో లోకమును పట్టుకొనవలెను. క్రమముగా ఎడమచేయి పట్టువీడును; ఎడమగును. అనగా దూరమగును లేదా విడిచిపోవును. ఇందును గూర్చి చింతింప పనిలేదు. అది సహజమే. అందు వలననే ఆ చేతికి 'లెఫ్ట్' అని ఇంగ్లీషుభాషలోను (అర్థము - విడిచిపెట్టెను) 'ఎడమ'అని తెలుగులోను (అర్థము - ఎడమ, దూరమగును' పేరు వచ్చినది. కుడి చేయిమాత్రం పట్టువిడువ కూడదు. అది 'రైట్‌హాన్డ్' రైట్ అనగా సరి, తప్పుకాదు.

(స.శా.సు.ప్ర.పు.228)

మార్పు/మార్పులు

మార్పుచెందునంతయు మిథ్యయే. సత్యమే మార్పు చెందనిది. అట్టి సత్యమైనది, నిత్యమైనది, ఆత్మ ఒక్కటే. అదే భగవద్రూపము. అదే సర్వశక్తి. అట్టి శక్తి పొందునట్టి శక్తికాని, అర్హతకాని ఒక్క మానవునికే ఉన్నది.

(ప్ర.వా.పు.46)

మాలిన్యము

మోహమనే మాలిన్యమును తలపైన వేసుకొని, తనలో యున్న మనోశక్తిని కోల్పోతూ వుంటాడు.

(సా.పు.24)

మాస్టర్

సర్కస్‌లో సింహాలు వాటి మాస్టర్ చెప్పినట్లుగా వింటాయి. అలాగే అరిషడ్వర్గాలు కూడా వాటి అధిపతికి అప్పజెప్పినప్పుడు అవి వాటి వాటి త్రీవతలను వదలిపెట్టి సాత్వికంగా మారిపోతాయి. **అదే ఆయుధపూజ అంటే.**

(త.పు.88)

Master of Business Admintration (M.B.A)

(చూ॥ మనస్సు, వినాయకుడు)

మితభాషి

రాముడు బాల్యము నుండి మితభాషి. ఈ మితభాషణము యొక్క ఆదర్శమును లోకమునకు చాటేనిమిత్తమై, తాను ఆరీతిగా నడుచుతూ వచ్చాడు. ఈ **మితభాష దివ్యశక్తిని అభివృద్ధి గావించుతుంది. మితభాష జ్ఞాపకశక్తిని కూడా పెంపొందింప చేస్తుంది.** సమాజములో గౌరవమును కలిగింప చేస్తుంది. అట్లుగాక అతిభాషణగా ఉండుటచేత. **'అతిభాష మతిహాని, మితభాష అతిహాయి"** అని అతిభాష జ్ఞాపకశక్తిని చాలావరకూ క్షీణింపచేస్తుంది. ఇంతియేగాక; మన దేహములో ఉన్న నరములయొక్క పటుత్వమును బలహీనపరుస్తుంది. సమాజములో మన గౌరవమును

పోగొడుతుంది. మౌనము, దివ్యమైనశక్తిని పెంపొందింప చేస్తుంది. దీనిని పురస్కరించుకొనియే, మహనీయులు మౌనము అను వ్రతమును పాటించుట. ఆ మౌనమును పాటించుటలో ఉన్న మహత్తరశక్తి, యిదియే. ఈనాటి యువకులు అతిభాషులు అయిపోవటంచేత, వారు చదివినది పరీక్షాహాలులో మరచి పోవుటకు అవకాశముంటున్నది. కనుక రాముడు యువకులకు అందించిన ముఖ్యమైన ఆదర్శములలో **మితభాష మొదటిది. రెండవది పెద్దలను చూచి గౌరవించటము. మూడవది తల్లితండ్రుల ఆజ్ఞను శిరసావహించటము.**

(ఆ.రా.పు.29/30)

మితము

మితము అంటే ఏమిటి? అమితము అంటే ఏమిటి? **భోజనమునకు మనమెట్లైతే తేలికగా వచ్చి కూర్చున్నామో, తిని లేచేటప్పుడు కూడా అదే విధంగా తేలికగా లేవాలి.** తేలికగా వచ్చికూర్చొని భారంగా లేస్తే, అది తమోగుణమై పోతుంది. కడుపును మనము నాలుగు భాగాలుగా విభజించాలి. ఇది అందరికీ తెలియదు. ఇంకా నేను కొంచం భోజనం చేయవచ్చును. అనే భావమున్నంత వరకు మాత్రమే భుజించాలి. అంతేగాని, ఇంకా పొట్టలో కొంత స్థలం ఉందికదా! అని ఊరికే దానిని నింపకూడదు. **ఇది పొట్టే కాని, బుట్ట కాదని గ్రహించాలి. దీనికి తగిన మితాహారమే ఉంటుండాలి. అయితే, చిన్న వయస్సులో ఉన్నవారు, పొట్టలో మూడు భాగాలు నిండేటట్లుగా భుజించవచ్చును. ఒక భాగాన్ని మాత్రం నీటితో నింపుకోవచ్చును.కాని, మిగిలిన వారు మాత్రము రెండు భాగములు ఆహారము, ఒక భాగము నీరు, ఒక భాగము గాలి ఉండేటట్లుగా భుజించాలి.** కాని, ఈనాటి కలియుగ ప్రభావమేమిటంటే కడుపులోని నాలుగు భాగములను ఆహారంతోనే నింపుతున్నారు. ఇక అందులో జలమునకు ఏమాత్రం అవకాశం లేదు.

(శ్రీ.భ.ఉ.పు.140)

(చూ॥ హితభాష)

మిత్రులు

మానవుని సంకల్పవికల్పములే మూలకారణమని తెలుస్తుంది. మనలను గౌరవించి, మన క్షేమమును, ఆశయములను అభివృద్ధిచేసి ఆనందమును అందించేవారే మన బంధువులని విశ్వసిస్తున్నాము. మనలను ద్వేషించి మన ఆశయాలకు విరుద్ధముగా నడిచి, కష్టనష్టములను కలిగించేవారిని విరోధులుగా భావిస్తున్నాము. నిజముగా ఇందులో మిత్రులెవ్వరు? శత్రులెవ్వరు? **కబీరు చెప్పినట్లు మనను దూషించేవారే మనకు మిత్రులు.** కారణము ఏమిటి? మనము అనేక పాపములను చేసినప్పటికీ, మనలను దూషించేవారు అపాపములను హరిస్తారు. **అందువలననే "పరిహాసమ్ పాపనాశనమ్"** అన్నారు. నిజముగా **మన పాపములను హరించేవారే మనకు మిత్రులు. పాపములను అభివృద్ధి పరచేవారే మనకు శత్రువులు. ప్రహ్లాదుడు తన తండ్రితో "వైరెవ్వరు చిత్తంబె వైరి కాదె" అన్నాడు. "దేశము లన్నియున్ గడియలోన జయించినవాడ నింద్రియానీకము(జిత్తమున్ గెలువనేరవు"** అన్నాడు. కనుక ఇంద్రియనిగ్రహము కావాలె. ఇంద్రియముల నరికట్టు ప్రయత్నమున కు ఆత్మవిశ్వాసము, దైవవిశ్వాసము అత్యవసరము. ఇవి లేకపోతే ఇంద్రియనిగ్రహము కష్టము. ఈ రెండూ లేక ఎట్టిప్రయత్నము చేసినా అది నిష్ఫలమే.

(ని.పు.135)

(చూ॥ కలియుగం, భక్తుడు, భగవంతుడు, శ్రీరాముడు)

మిథ్య

(చూ॥ మార్పు)

మీమాంస

షడంగ దర్శనములు, వానియొక్క విశిష్టతను షడ్దర్శనములయొక్క ప్రభావమును జగత్తునకు వ్యాపింపజేయుదలచి అనేకమంది మహర్షులు

అనేకవిధములయిన సాధనలు జరుపుతూ వచ్చారు. **జైమినీ మహర్షి** తనయొక్క జీవితమంతయూ ధారబోసి **మీమాంసయొక్క తత్వాన్ని పూర్వమీమాంసమనే తత్వాన్ని భారతదేశములో వ్యాపింపజేసాడు.** మీమాంసమనగా భక్తి జ్ఞాన సిద్ధాంతములను నియమములనుసరించి చర్చించటమే మీమాంస. భేదములను పూర్వమయినది కనుకనే దీనికి పూర్వమీమాంసమని పేరు. ఉత్తర మీమాంసకు పూర్వమే ఉదయించినది కనుక దీనికి పూర్వమీమాంసమని పేరు. ఇది కర్మకాండకు సంబంధించినది. సమస్తధర్మములూ కర్మనే అనుసరిస్తూ వచ్చాయి. కానీ ధర్మము కర్మమయమైనట్టిదే అనే సత్యమును జగత్తుకు చాటుటకు అనేకమంది మహనీయులు అనేకవిధములుగా పాటుపడ్డారు. **'అథాతో ధర్మజిజ్ఞాసా' అనుటకు పూర్వము 'అథాతోకర్మ జిజ్ఞాసా' అనాలి. కర్మజిజ్ఞాసులు కాక ధర్మ జిజ్ఞాసులు కాలేరు. ధర్మ జిజ్ఞాసులు కాక బ్రహ్మ జిజ్ఞాసులు కాలేరు.**

పూవులేక పిందె పుట్టునా చెట్టున?
కాయలేక ఫలము కలుగునా జగతిలో?
కర్మలేక భక్తి కలుగునా జగతిలో?
భక్తిలేక జ్ఞాన పథము కలుగునా?

కనుకనే కర్మ జిజ్ఞాసద్వారా ధర్మ జిజ్ఞాస, ధర్మ జిజ్ఞాసవలన బ్రహ్మ జిజ్ఞాస ప్రతీ మానవునకూ ప్రాప్తిస్తుంది. జైమినీ మహర్షి తనయొక్క స్వానుభవముతో పరిశోధనలు సల్పి పరిశీలనద్వారా తనయొక్క మనసును సంతృప్తి పరచుకొన్నాడు. కర్మ జిజ్ఞాస: మానవుడు తెల్లవారినది మొదలు రాత్రి పరుండునంతవరకూ కర్మలు ఆచరిస్తూనేయుంటున్నాడు. కర్మలేని మానవుడు ఈ జగత్తునందు కానరాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడనూ కర్మలే. మన దేహములో ప్రవహించే రక్తము కర్మమయమైనదే. కనుక కర్మను విస్మరించి ధర్మమును విశ్వసించడానికి అవకాశములేదు. జైమినీ మహర్షి **కర్మ జిజ్ఞాస** యందు చక్కని ఉదాహరణమును అందిస్తూ వచ్చాడు. మనము నిత్యజీవితములో గృహమునందు కొన్ని పంటలను చేసుకొంటూ యుంటాము. ఒక పచ్చడి మనము చేయాలనుకుంటే కొన్ని పదార్థములు ప్రోగుచేసుకోవాలి. కొబ్బరికాయ పచ్చడి చేయాలి. దీనికి మిరపకాయలు కావాలి. చింతపండు కావాలి. ఉప్పుకావాలి. కొబ్బరి కావాలి. ఈ పదార్థములన్నియునూ ప్రోగుచేసి కలిపి, నూరినప్పుడే చట్నీ రూపొందుతుంది. ఇది కర్మజిజ్ఞాస. నాకు ఈనాడు చట్నీ కావాలి అనుకున్నంతమాత్రమునే ఇది సాధించడానికి వీలుకాదు. ఈ పదార్థములను మనము ప్రోగుచేసుకోవాలి. ఈ పదార్థములను ప్రోగుచేసుకోవడమే గాక పదార్థముయొక్క స్వరూపాన్ని ఏకత్వముగా నిర్మించుకోవాలి. ఒట్టి మిరపకాయ తినటానికి వీలు కాదు. ఒట్టి ఉప్పు తినటానికి వీలుకాదు. ఒట్టి చింతపండు తినటానికి వీలుకాదు. ఈ మూడింటిని సమభాగములో ఏకత్వముగా చేసినప్పుడే చట్నీగా తినడానికి వీలవుతుంది. **కర్మజిజ్ఞాస అనే చట్నీ చేసినంతమాత్రమున చాలదు. ధర్మ జిజ్ఞాస. దానిని తిని చూడాలి.** అది తిని చూసారు. ఇందులో ఉప్పు తక్కువ అని గుర్తించారు. తక్కువైన ఉప్పును తిరిగి చేర్చుకోవాలి. ఈ చేర్చుకోవటమే బ్రహ్మజిజ్ఞాస. చట్నీ చేయడం, రుచి చూడడం ఆ రుచిలోపల ఏది దోషమో అనేదాన్ని గుర్తించటం, అటు తరువాత దోషాన్ని నిర్మూలన గావించడమే బ్రహ్మ జిజ్ఞాస.

అటులనే **మానవ జన్మమందు విదితమైన కర్మలు ఆచరించి, ఆచరించిన కర్మలను అనుష్ఠానములో పుంచుకొని, ఈ అనుష్ఠానములో ఏవి లోపమున్నదని గుర్తించి ఆ లోపములు తీర్చుకోవడమే బ్రహ్మ జిజ్ఞాస. మనము పుట్టినాము. పంచభూతములచే కూడినాము. పంచకోశములచేత చేరినాము. పంచభూతములను అనుభవిస్తున్నాము. ఈ అనుభవించటమే ధర్మ జిజ్ఞాస. అనుభవించిన తర్వాత ఇందులో శాశ్వతానందము లేదని గుర్తించుకొన్నాము. ఈ శాశ్వతానందము ఏమిటి? అదియే బ్రహ్మతత్వము. శాశ్వతానందమయిన బ్రహ్మతత్వమును చేర్చుకోవటమే బ్రహ్మజిజ్ఞాస. కనుక ప్రతి మానవునికి కర్మ జిజ్ఞాస ప్రారంభము. రెండవది ధర్మ జిజ్ఞాస మూడవది**

బ్రహ్మ జిజ్ఞాస. ఇలాంటి కర్మయొక్క కాండమును సక్రమముగా సామాన్య మానవునకు నిత్య జీవితములో ఆచరణ రూపమయిన ఆనందాన్ని అందించే నిమిత్తమై **జైమినీ మహర్షి ఈ పూర్వ మీమాంసను దర్శించాడు.**

(స.ది.పు.153/155)

(చూ॥ వేదము)

మిరాకిల్

(చూ॥ నామ సంకీర్తన)

మీరా

(చూ॥ ఎమ్ఎస్.సుబ్బలక్ష్మి)

ముండకోపనిషత్

నేత్రశోత్రములచే నెల్లపుడు మంగళప్రదమగు కార్యములు చూచునట్లునూ, మంగళనాదము వినునట్లును, సర్వేశుని అనవరతము చింతన చేయుచు ఆయుష్కాలమును గడుపునట్లును, శాంతిపతనముతో ఈ ఉపనిషత్తు బోధించుచున్నది. **ఇందులో ఉపదేశించిన విద్య, కార్యబ్రహ్మయగు హిరణ్యగర్భునిచే మొదట చెప్పబడుటచేగాని, బ్రహ్మమును గురించి చెప్పడుటచేగాని, బ్రహ్మవిద్య అని పిలువబడుచున్నది. పూర్తి క్షురకర్మ చేయబడిన శిరస్సునందు అగ్నిని బంధించుటయే ముఖ్య లక్షణముగా గల శిరోవ్రతము నాశ్రయించినవారు మాత్రము ఇచట బ్రహ్మవిద్య కర్హులగుటచే ఈ ఉపనిషత్తుకు ముండకమని పేరు కలిగినది.** గుణ సంపత్తిచే ఈ ఉపనిషత్తు సర్వోప నిషత్తులకూ భూషణముగా నుండుటచే కూడను దీనికి ముండకమని పేరు సమన్వయింపబడినది. ఇది అధర్వణ వేదములోనిది.

సంప్రదాయసిద్ధమై పరంపరగా వచ్చిన ఈ బ్రహ్మవిద్య, **నిర్గుణ బ్రహ్మమును బోధించు పరవిద్యయనియు, ధర్మాధర్మ ఫల సాధనమగు సగుణబ్రహ్మమును బోధించు అపరవిద్య అనియు, ఇందులో రెండు భాగములున్నవి.** ఇవి రెండును శాసకుడు ఆంగిరమునకుపదేశించెను. **వేదములతోనూ వేదాంగములతోనూ కలసిన దానిని అపరవిద్య అందురు. ఉపనిషత్తు మొదలగు శబ్దరాశియంతయూ అపరవిద్యయందురు.** కానీ, అవి అపరవిద్య లయినప్పటికినీ, **దాని బోధచే బ్రహ్మమును బోధింపచేయు విజ్ఞానము, పరవిద్య యగుచున్నది.**

(ఉ.వా.పు.21)

(చూ॥ బ్రహ్మవిద్య)

ముక్తి/ముక్తులు

ఉపనిషత్తులలో ముక్తి రెండు విధములుగా తెలుపబడినది. ఒకటి, సద్యోముక్తి, రెండవది క్రమముక్తి, సద్యోముక్తిని కైవల్యముక్తి అని కూడ అందురు. ఇట్టివారు యే లోకమునకూ పోనక్కరలేదు. వారు అక్కడికక్కడే భగవత్ ప్రాప్తిని పొందుదురు. అది నిత్యమైన స్థితి. మిగిలిన యెట్టి ప్రాప్తులైననూ అనిత్యమైనవే. తాను చేసిన పుణ్యకర్మల ఫలము ఎంతవరకు వుండునో, అంతవరకు స్వర్గాది లోకములందుండి తిరిగీ రావలసియుండును. కైవల్యమును పొందినవారికి మాత్రమే లయము.

లయమంటే నాశముకాదు. కంటికి కానరాని స్థితి నొందుట లయమని అందురు.

కంటికి కానరానంత మాత్రమున నాశమని తెలుపుట చెల్లదు. ఎటులన లవణము కానీ, పంచదార కానీ జలములో వేసిన అది నీటిలోచేరి కంటికి కనుపించక పోవును. దానిని నాశమందువా? లయమందువా? నాశమయిన దానిరుచి తెలియుచున్నదే! నీటిద్వారా, లేదని యెటులందువు? **ఉండియూ తన గుణమును మాత్రము తెలుపు, నిరాకారమైన తత్త్వమును లయమని అందురు.** నీటిలో చేరిన లవణమువలే, బ్రహ్మముతో చేరిన జీవమునూ లయమని అందురు. అది యేనాటికీ నశించదు. అట్లు కైవల్యమును పొందక కర్మలద్వారా

పుణ్యములు సలిపిన వారు స్వర్గాది లోకములకు వెళ్ళి తిరిగి వచ్చి కొన్ని సాధనలను సలిపి తత్ఫలములను అనుసరించు చుందురు.

(గీ.పు.151/152)

ముక్తి కోసం ప్రార్థించటం కూడా ఒక కోరికే. అదీ ఉండకూడదు. అందుచేత దేనినీ కోరకుండా సదా నన్నే జ్ఞాపకం ఉంచుకొంటే ముక్తి తానంతట తానే లభిస్తుంది.

(త్రి.సా.పు.273)

వ్యాసమహర్షి జాలరి కులమున పుట్టెను, వసిష్ఠమహాఋషి వేశ్యయగు ఊర్వశికి జన్మించెను. శౌనక మహాముని శునక వంశమున పుట్టెను. అగస్త్యుడు ఘటమున జన్మించెను. విశ్వామిత్రుడు క్షత్రియ కులమున పుట్టెను. ఖగోళమహాముని వైశ్యవంశమున జన్మించెను. సూతమహాముని చతుర్థ వంశమున (శూద్ర) జన్మించెను. ఇక సహజులుగా జన్మించి, సద్గుణములతో జాతి ధర్మమును దేహ ధర్మములను కొంతకాలము పాటించి సత్యమును యెరింగి తదుపరి సర్వమునూ దూరీకరించి సర్వదాముక్తిని స్వవశము చేసుకొన్న విదురుడు, సంజయుడు, సత్యకాముడు మొదలగు వారలు కూడా అనేక మంది వున్నారు. నాయనా! పురుష ప్రయత్నము, వివేకము, తపస్సు వీనివలన కలుగు గుణములే మహోన్నత స్థితికి కారణములు. మానవ జాతికి ఆత్మశుద్ధిలేక యే జాతియందు జన్మించిననూ ముక్తిని పొందలేరు. మలినమైన రాగిలో కూడిన బంగారము వెల తగ్గినదగుచున్నది. అలాగుననే తాను శుద్ధ విరాడ్రూపుడయినను, సంసార సంసర్గములచే అహంకారముతో కూడిన జీవుడగును. జీవుడును తపోవ్రత సంస్కృతుడై శుద్ధబుద్ధియుతుడై నిజస్థానమగు పరమాత్మ స్వరూపమును పొందును. కాలనికుండ జలస్పర్శముచే కరిగి మట్టియగునటుల తపస్సుచే పరిపక్వముకాని వారి మనసు విషయదోషముల సంబంధముచే విషయములో ప్రవేశించుచున్నది. తపోగ్నిచే దహించ బడిన కుండను సముద్రమున పడవేసిననూ కరుగక వుండును. తీవ్రతపోవహ్నిచే నిశ్శేషముగా దహింపబడిన కర్మ బీజములు కలవారు గనుకనే జ్ఞానసంపత్తి గలవారై, నిర్మల తత్త్వముచే ముక్తులై జనన మరణముల జెందనివారగుచున్నారు.

(ప్రశ్నో.వా.పు.59)

మనసును దాని ఇష్టమొచ్చినట్లు పోనీయకూడదు. నిర్దాక్షిణ్యముగా దానిని అడ్డగించవలెను. సాధ్యమైతే మనసును నాశనము చేయుటకే సిద్ధపడవలెను. (అనగా ప్రపంచవాసనలపై ఇచ్ఛలేకుండ జేయుట) అట్లు చేసినప్పుడే మానవుడు తన నిజస్వరూపమును తెలిసికొనగలడు; **అదియేముక్తి.** అప్పుడు అన్నివిధములైన బాధలు, విచారములు, భ్రమలు అంతరించును. మానవుడు దుఃఖము, భయము, ఆతురతలు వదలి పవిత్ర శాంతిసాధన అనుసరింపుడు.

మలిన వాసనలు వదలి మంచి వాసనలు మొదట అలవరచు కొనుడు. తదుపరి క్రమేణా మంచి వాసనలనుకూడా వదలి, నిర్విషయమను నిశ్చయమును పొందవచ్చును. ప్రకాశవంతమైన, **ఆనందమైన, జ్ఞానముతో కూడిన శాంతమే మూర్తీభవించిన పరమాత్మ.**

(ప్ర.వా.పు.30)

నిశ్చలచిత్తముతో, నిర్మలభావముతో, అన్యచింతలకు చోటివ్వక భజించిన అదియే భావసమాధి అగును. అట్టి సమాధి ఫలితముగా భగవంతుడు ఏ రూపంబున అతనిని ఆరాధింతురో ఆ రూపంబున, భక్తుల అంతర్దృష్టికి గోచరించును. భగవద్దర్శనము కేవల భావమాత్రమే కాదు. ముఖాముఖి నుండును. **భగవంతుడు స్థానవ్యత్యాసములు లేక ఏక ప్రపంచ మందే నివసించుటగును. దీనినే సాలోక్యముక్తి అందురు. ఈ సాలోక్యముక్తి యందు** భక్తుడు భగవంతునితో నిరంతరము ఉండుటయే కాక, తాను చూచుచున్నవన్నియు భగవత్ విలాసములే అని అతడు గ్రహించును. ఈ భావంబును **సామీప్యముక్తి అందురు.** భగవంతునితో నిరంతరముండుట, **భగవత్ విభూతి విలాసంబులను చూచుట, తన్మయుడై**

యుండుట, ఇవి మూడును భక్తుని చివరకు భగవద్ప్రత్తికి కొని వచ్చును. ఈ స్థితిని సారూప్యముక్తి యందురు. భక్తి శాస్త్రముయొక్క చివరిఫలము ఇదియే. ఈ స్థితియందు భేదభావము కొంత ఉండును. అందువలన ఇది ఉత్తమగతిగా అద్వైత సిద్ధాంతము ఒప్పదు. **భగవత్సారూప్యమన్నంతనే భగవంతునివలె భక్తునకుకూడా సృష్టిస్థితి లయశక్తులు ఉండునని భావించరాదు. భేదభావంబులు సమూలంబుగా నశించి ఐక్యమొందుట ఒక్కటె ఉత్తమగతి. దీనినే సాయుజ్యమందురు.** దీనిని వారివారి సాధనా సారమునుబట్టి భగవంతుడు అనుగ్రహించునే కాని ప్రయత్నఫలంబుగా పొందలేనిది. భగవంతుని తన యిష్టప్రకారము సేవించును, ఆ రూపానందంబును అనుభవించుచుండుటే భక్తునికోరిక కాని, ఐక్యంబు అట్టి భక్తుడు కోరడు. భక్తుడు కోరకున్నను భగవంతుడే వానికి సాలోక్యాదిత్రయమే కాక సాయుజ్యంబు కూడను అనుగ్రహించును. భక్తి మార్గఫలంబున బ్రహ్మజ్ఞానసిద్ధికూడ కలుగును. అట్టిదానిని సయితము భక్తుడు కోరకున్ననూ భగవంతుడే అనుగ్రహించును. ఇట్టి **సాయుజ్యముక్తినే ఏకాంతముక్తి అని యందురు.**

(ప్రే.వా.పు.64/65)

కైవల్యోపనిషత్తు నందు "నకర్మణాన ప్రజయా ధనేనత్యాగే నైకేన అమృతత్వమానుశుః" అని తెలిపినట్లుగా, **నకర్మణా అనగా** యజ్ఞయాగాదులు, వ్రతములు, ధానధర్మాదులు, తీర్థయాత్రలు, నదీ సాగరస్నానములు మున్నగు కర్మలవల్ల మోక్షము కలుగదు. **అనగా అజ్ఞానం నివృత్తికాదు.** అనగా అధికార సంపదలు, బుద్ధిచాతుర్యము, కీర్తిప్రతిష్టలు, సౌందర్యము, పుష్టి, పుత్రులు మున్నగువాటి వల్లముక్తి పొందజాలరు. **నధనేన** - పైన తెలిపిన కర్మలన్నియు ధనసహాయముతో జరుపబడునవి. ధనములేని యెడల అట్టి కర్మలు జరుప బడజాలవు. అయితే జ్ఞానమును ధనముతో కొనలేరు. ధనమునకూ జ్ఞానమునకూ సంబంధమే లేదు. కాబట్టి ధనము వలన ముక్తిని సంపాదించుకొనజాలరు. ఇది ధన సాధనము కాదు. అట్లయిన ముక్తికి సాధనమేమి? **త్యాగనైకే అమృతత్వ మానుశుః.** జగత్తు లేనే లేదను జ్ఞానము వల్లను, ఉన్నట్లు కనబడినను అది మిథ్యామాత్రమేనని తెలుసుకొనుట వల్లను, ఇహపరములలోగల భాగముల ఆశలు వదలుకొనుట వల్లను - అనగా సర్వంత్యాగము - సర్వత్యాగమువల్లను ముక్తికలుగును. అని దీని అర్థము. అనగా ఆత్మ తత్వజ్ఞానముచేత మాత్రమే దాని ఫలమైన సంసారము దుఃఖము నశించును. కేవలము కర్మలవల్ల అవి నాశనము కావు. ఉపనిషత్తు చెప్పుచున్నది.

(సూ.వా.పు.1/2)

శంకరులు సాధనకు మొదటి మెట్టుగా **సత్సంగమును** చెప్పినారు. సత్సంగత్వము. నిస్సంగత్వము నలవరచి మౌనమునందును ఏకాంతవాసమునందును. ఆసక్తి కలిగించును. అది మోహమును రూపుమాపును భగవద్గీత వినుటవలన పార్థునకు సిద్ధించిన ఫలమిదే. అది లభించినప్పుడు నిశ్చల తత్వము స్థిరపడును. **తత్ - అది పరమాత్మ, త్వమ్-నీవు (జీవాత్మ) అనుదేని పరమార్థము - అనగా ఆరెంటికిని గల యేకత్వమును గుర్తించుటయే ముక్తి ప్రాప్తి.**

(స.వ.పు.15)

ముక్తి గోరినరుడు ముక్కోటి దేవతల
ఆశ్రయించు గాని అన్య మెరుగ
తనదు లోని అహము తా చంపుకొన్నను
ముక్తియేల తానే ముక్తి కాడె?

ముక్తి కోరి మానవుడు ముక్కోటి దేవతలను ఆరాధన చేస్తున్నాడు. ఉన్నది ఒక్కటే, అని వేదము, శాస్త్రము, బైబిలు, ఖురాన్ ఏగ్రంథము గాని నిర్ణయించి సత్యాన్ని బోధించు చుండగా ముక్కోటి సంఖ్యకు విలువ ఎక్కడ ఉంటున్నాది? ఇవన్ని మనో భ్రాంతుల వికారములే.

(బృ.త్ర.పు.124)

(చూ॥ కృష్ణనిలీలలు, భక్తి, మూలాధారము, శీలము)

ముక్తికిబాట

"జగతిని జీవించువాడు మనుజుడుకావలె మొదట;
దనుజవృత్తులనెల్ల పొగడుచుండెడివాడె చవట.
బ్రహ్మవిద్యను నేర్చి తన్నుతాను తెలిసికొనుట
రాజయోగమునకు బాట; బుద్ధిమంతుడైన దేహ
మున్నంతలో, తనను తాను తెలియవలయు,
అదియేముక్తికి బాట॥

(భ.ప్ర.పు.69)

ముక్తిఫలము

స్వార్థ అహంకారములను తొలగించుకొని, దివ్యత్వాన్ని చేరుకోండి! **సామాన్యభక్తి నుంచి అనన్య భక్తికి చేరుకోవటానికి ప్రయత్నించండి!** మొగ్గవిచ్చి, పరిమళాన్ని వెదజల్లినట్లుగ, మనసు వికసించి, విశాలమై సత్యసహన శాంతి ప్రేమ పరిమళాలను వెదజల్లాలి. దుర్గుణ నాశనం, పవిత్ర పోషణల ద్వారా హృదయ కమలము వికసించి **'ముక్తిఫలం' లభిస్తుంది.**

(సా.లీ.త.పు.9)

ముఖ్యకారణము

ప్రపంచమంతా ఈనాడు దుఃఖముతో నిండియున్నది. శాంతి ఎచ్చట నూ కనిపించుటలేదు. అన్యాయ, అక్రమ, అనిత్యములు అన్ని దేశములందు తాండవించుచున్నవి. లోకమంతా వ్యాపించి ప్రపంచమంతా పీడించుచున్న మనోవ్యధలకు ముఖ్యకారణము మానవులు కోరేదొకటి సాధించేది మరొకటిగా ఉండుటమే.

(సా.ముందుమాట)

ముగ్గురు రాజులు

ఆంధ్రదేశములో ముగ్గురు రాజులుండేవారు. ఒకడు త్యాగరాజు, రెండవవాడు పోతరాజు, మూడోవాడు గోపరాజు, గోపరాజు, త్యాగరాజు, పోతరాజు వీరు ఆధ్యాత్మిక రాజులు. పోతరాజే పోతన. మహాభాగవతాన్ని రచించిన మహాగుణవంతుడు, త్యాగి. బావ ఐన శ్రీనాథుడు పోతరాజుయొక్క కష్టములను గుర్తించి అతనిని ఏదో ఒక విధముగా సుఖ పెట్టాలనే ఉద్దేశముతో వచ్చి "బావా! నీయింటి పరిస్థితి నాకు తెలియనిదికాదు. తినడానికి తిండిగాని కట్టడానికి బట్టకాని ఉండటానికి కొంపగాని లేకుండా అవస్థల పాలౌతున్నావు. నీ కవిత్వమునంతా కేవలము శ్రీరామచంద్రునికి అర్పితము గావిస్తున్నావు. దీనివల్ల లభించే ఫలితం ప్రత్యక్షంగా మనకు ఏమాత్రము గోచరించటంలేదు. ప్రాకృతమైన జీవితానికి ప్రత్యక్షమే అవసరము. నీ కవిత్వమును రాజులకు అర్పితము గావించుకుంటే నీకు రత్నాల అభిషేకము జరుగుతుంది" అన్నాడు. పోతనకు మనస్సు చాలా కష్టమైపోయింది. "ఇక్కూలకిచ్చి పడుపుకూడు భుజించుటకంటె హాలికుడైన నేమి?" అహంకార స్వరూపులైన రాజులకు నా కావ్యాన్ని అంకితమిచ్చి వారు పడవేసిన అన్నమును భుజించి నేను జీవించేదానికంటే భూమిని ఆశ్రయించి దానిని దున్ని నేను బ్రతకటం చాలా పవిత్రమైనది" అన్నాడు. పోతన తన సర్వస్వమును భగవంతునకు అర్పించటంచేతనే భాగవతము జగద్వ్యాప్తి గాంచినది. అసలు భాగవతము వ్రాయుటకు పూర్వమే

"పలికెడిది భాగవతమట
పలికించెడివాడు రామభద్రుండట నే
పలికిన భవహరమగునట
పలికెద వేరొండుగాధ పలుకగనేలా"

అన్నాడు వ్రాసేవాడు తానే, పలికించేవాడు తానే, పొందేవాడు తానే, ఆనందించేవాడు తానే అని తనపైన ఏ బాధ్యతను పెట్టుకోకుండా అంతా భగవంతునికే అర్పితం గావించాడు. ఈ జగత్తునకు సృష్టి స్థితి లయకారుడు భగవంతుడే. సర్వశక్తిమయుడు సర్వజ్ఞుడు ఐన భగవంతునికి అర్పితం గావించకుండా పామరులైన వారు, అహంకార ఆడంబరములతో తులతూగే వారికి ఇది అర్పితం గావించటం నాకిష్టంలేదన్నాడు. ఇంక

త్యాగరాజు ఇతడు అవస్థల పాలౌతున్నది చూచి తంజావూరు రాజా అనేకవస్తువాహనాలు, కనకరాసులతో పల్లకీ పంపించాడు. చూచాడు త్యాగరాజు. నవ్వినాడు "నిధి చాలా సుఖమా? ఈశ్వర నన్నిధి చాలా సుఖమా? నిజముగ దెల్పుము మనసా" అన్నాడు.నాకు కావలసింది రామసన్నిధే. అదే నా పన్నిధి. నాకే సామాను అక్కరలేదని వెనుకకు పంపించాడు. తన పేరుకు తగినట్టి త్యాగం గావించినవాడు త్యాగరాజు. సర్వము భగవంతుడే, అన్యపదార్థములు కాని అన్యులయొక్క సహాయముకాని నాకక్కరలేదని వెనుకకు నెట్టినవాడు త్యాగరాజు. ఇక **గోపరాజు భద్రాచల రాముని ఆశ్రయించినవాడు.** తన జీతమును, తాను సంపాదించే సమస్త ద్రవ్యమును భగవంతునికి అర్పితము గావిస్తూ వచ్చాడు. తాను తాసిల్దారుగా పనిచేస్తూ చెల్లించిన కప్పమును కూడను భగవంతుని మందిరము నిర్మించడానికి, భగవన్మందిరం కాంపౌండు (Compound) నిర్మించడానికీ, భగవంతునికి అలంకారము చేయటానికీ వినియోగ పెడుతూ వచ్చాడు. తానీషా ఇతణ్ణి బాధించినప్పుడు నేను రామార్పితమైన వాడినేకానీ కామార్పితుణ్ణి కాదు.

నేను సంపూర్ణంగా రామార్పితమైనటువంటి వాడిని అన్నాడు. ఈ ముప్పురు కూడను సర్వవ్యాపకమైన దివ్యత్వాన్ని గుర్తించినవారు. ఇంతేకాదు సర్వ రక్షకుడు కూడను భగవంతుడే అని విశ్వసించినవారు. వీరే నిజమైన భాగవతులు.

(శ్రీ.స.వి.వా.పు.18/20)

ముదిత

(చూ॥ అలవర్చుకోవాలి)

మునకలు

ఏ పుణ్యతీర్థంలో స్నానంచేసినప్పుడైనా మూడు మునకలు వెయ్యాలి అంటారు. దాని అర్థం యిది. మొదటి మునక స్థూల శరీరాన్ని శుభ్రపరుస్తుంది. రెండవ మునక ప్రాణమయ మనోమయ విజ్ఞానమయ కోశములకు చెందిన సూక్ష్మశరీరమునూ, మూడవమునక విజ్ఞానమయ కోశమునకు సంబంధించిన కారణ శరీరమునూ, పరిశుభ్రము చేయగా యింకా కొంతమాయ మిగిలి ఉంటుంది. ఆ మూడు మునకలూ కర్మసాధన ఉపాసనలను పవిత్రంచేసి జ్ఞానము ప్రసాదించును. ఆధ్యాత్మిక చైతన్యమందు ద్వైత విశిష్టాద్వైత అద్వైతములు మూడు సోపానములు. ప్రతి రంగమందును ద్వైత అద్వైత వైఖరులు ప్రజల భావములను ఏ విధముగా ప్రభావితము చేయుచున్నవో సోమశేఖరశాస్త్రి వివరించారు.

అవి భిన్నములుకావు. మానసిక పరివర్తనమందు వేరు వేరు దశలు.

(వ.1963 పు.140)

ముప్పు

(చూ॥ మంచిచెడ్డలు)

ముముక్షుత్వము

(చూ॥ అథాతోబ్రహ్మజిజ్ఞాస)

మురళి

కృష్ణుని చేతిలోని మురళిగానుండ ఇచ్చగించు. మురళివలె తిన్నగా, లోన ఖాళీగా (విషయవాసన భరితముకాక) నుండిన, భగవంతుడు అనుగ్రహించి, ఆదరించి నీద్వారా కమ్మని సంగీతమును వినిపించును.

(శ్రీ.స.సూ.పు.73)

కృష్ణుని మాధుర్యం ప్రకృతిలో నిండారివున్నది. ఆ మధురిమను రాధ ఆస్వాదించి పరవశురాలవుతున్నది. రాధ ఎవరు? ఆమె ప్రకృతి. మాయాశక్తి. శ్రీకృష్ణ సంభూతమైన హ్లాదినీ శక్తి. ఆమె కృష్ణుని మహాభావము. ప్రకృతి రూపంలో ప్రకటితమైన కృష్ణుని ఆనందమును రాధ దొంగిలించి తన హృదయంలో భద్రపరుచుకున్నది.

ముల్లోకములు

తను పోగొట్టుకున్న ధనం మళ్ళీ తన చేతికి చిక్కేదాకా యజమాని దొంగ ఇంటిచుట్టూ తిరుగుతూ వుంటాడు. అల్లాగే కృష్ణుడు తన ఆనందంకోసం రాధ యింటి చుట్టూ తిరుగుతూ వుంటాడు.

ఒక నాడు కృష్ణుడు మురళిని వదిలేసి గాఢనిద్ర పోతున్నట్లు నటించాడు. రాధ అదృష్టవంతురాలైన మురళి చెంతకు వెళ్ళి ఇంతటి భాగ్యం నువ్వు ఏ విధంగా సంపాదించుకున్నావో నాకు చెప్పవా? ఏమి నోములు నోచావు? ఎన్ని జాగరణలు చేశావు? ఏ పుణ్యతీర్థాలకు సేవించావు? ఏ మంత్రం జపించావు? ఏ మూర్తిని పూజించావు.అని దీనంగా వేడు కున్నది. భగవదనుగ్రహంవల్ల వేణువుకు మాటలు వచ్చాయి. "నేను అన్ని ఇంద్రియ వాంఛలూ, అసూయా దురాశా అహంభావమూ విసర్జించాను. నాదీ అనేది ఏదీ అడ్డురాకుండా చేసుకున్నాను. అదే ప్రభువు ప్రేమవాహిని నా ద్వారా సకల సృష్టిమీదా ప్రసరించాలని కోరుకున్నాను. అంతే" అంది మురళి.

(వ.1963పు.122/123)

భగవంతుడు అనే శ్వాసను మాత్రమే పీల్చండి, అదే నిజమైన దివ్యజీవనం. "అహం" భావాన్ని మరచి వేణువులా "శూన్యంగా" హృదయాన్ని ఉంచుకోండి. (ఎటువంటి సంకల్పవికల్పాలు లేని మనసుతో)అప్పుడు ఖాళీగా ఉన్న మీ హృదయమనే మురళిపై అద్భుతమైన, మధురమైన రాగాలు పలికిస్తాడు.

(శ్రీ.స.స.పు.220)

ఆనాడు కృష్ణుని మురళీగానం వినుట వలన ప్రజలకు మానసిక రుగ్మతలుపోయి, ఆరోగ్యం, ఆనందం కలుగుతూ వచ్చాయి. కృష్ణుని మురళికి నవ రంధ్రములుండినవి. దీని అంతరార్థమేమిటంటే - మానవ దేహానికి నవ రంధ్రములు ఉంటున్నాయి. నవ రంధ్రములు కలిగిన ఈ దేహమునకు భగవన్నామమునే శ్వాసగా తీసుకోవాలి. దీనిని పురస్కరించుకొనియే ఆనాటి గోపికలు "కృష్ణా! మా దేహమునే ఒక మురళిగా తీసుకొని, నీ ఉచ్ఛ్వాస నిశ్వాసాలను దాని లోపల స్వేచ్ఛగా సంచరింపజేయుము. నీ ఉచ్ఛ్వాస నిశ్వాసములే వేదసారము. ఇట్టి వేదసారమును నాదబ్రహ్మముగా మార్చి, మా దేహమనే వేణువు నందు దానిని తిరుగబోసి, మధురమైన గానమును వినిపించుము" అని ప్రార్థించారు. కనుక, మన దేహం నవరంధ్రములు గల మురళివంటిది. అన్నింటి యందు దైవస్పర్శ ఉండాలి. అనగా, సర్వాంగములు దేవుని సేవ యందే అర్పితము కావాలి. ఇదే సంపూర్ణ శారణాగతితత్త్వం; ఏకత్వాన్ని విశ్వసించడమే సంపూర్ణశరణాగతి. అంటే "దైవం వేరు - నేను వేరు " అనే భావము కలిగియుండ కూడదు. అందచేతనే, గోపికలు "కృష్ణా! నీవు నా కనుపాపలోనే దాగియుండి జగత్తునంతా చూస్తున్నావు. నీవు లేకపోతే నేను లేను" అనే భావన కలిగియుండినారు. దీనిని బట్టి గోపికలు ఎంతటి పవిత్ర హృదయాలను కలిగియుండిరో గుర్తించాలి. వారి భావము లన్నీ అంతర్ముఖముగా ఉండేవి. కనుక, ఈనాడు బాహ్యమైన భావాలను దూరం చేసి, అంతర్భావాలను అభివృద్ధి పరచుకొని దివ్య త్వమును అనుభవించాలి.

(స.సా.అ.91 పు.263)

ముల్లోకములు

(చూ॥ ఆత్మరామాయణం)

ముస్లిం

(చూ॥ ప్రేమమతం)

మూడు

అవతార స్వరూపుని అనుగ్రహం లభించాలంటే ముఖ్యంగా మూడు గుణాలను అలవరుచు కోవాలి. ఒకటి; ఏపనీ స్వార్థబుద్ధితో చేయకు, నలుగురికీ ఉపయోగపడాలనే తత్వాన్ని పెంచుకో. రెండు; సాధన అంతా ఆత్మదర్శనాపేక్షతోచేయి. మూడు; చిత్తశుద్ధి అన్నింటికన్న ముఖ్యం.

(శ్రీ.సా.గీ. పు.144)

మూడుఅవతారములు

ఈ మూడు అవతారములు షిర్డి, సత్య,ప్రేమ సాయిబాబాలు భిన్నమైనవికావు. అవి ఏకమేనని ఇదివరకే విశదం చేసాను. ఒకే లక్ష్యసాధన కోసం ఇవి ఏర్పడినవి. ఒక ఉదాహరణ చెబుతాను. ఒక కిలో బెల్లం తీసుకోండి. ఆముద్ద అంతా మధురమే. తరవాత దానిని ముక్కలు చేయండి. గణంలోనే ఉన్నది. ఈ సత్యం అవతారాలకూ వర్తిస్తుంది. **దేశకాల పరిస్థితులను బట్టి అవతారాల ప్రయోజనాలూ శక్తులూ వేరుగా వుంటాయి.** కాని అవతారాలన్నీ ఒకే ధర్మానికి భిన్న స్వరూపాలు మాత్రమే. ఒక ఫలమును ఉదాహరణగా తీసుకొందాం. విత్తనంతో ప్రారంభమై వృక్షం అవుతుంది. వృక్షం ఫలాలను అందిస్తుంది. కర్మ బీజం వంటిది. అరాధన వృక్షం. వివేకం దాని ఫలం. **పూర్వావతారమైన షిర్డీబాబా మతసామరస్యానికి పునాది వేశారు. మానవులకు కర్తవ్య కర్మను బోధించారు. ప్రస్తుత అవతార లక్ష్యం ఇది.** అందరిలోనూ ఒకే దివ్యత్వం భాసిస్తున్నది కాబట్టి మానవులు పరస్పర గౌరవ ప్రేమలతో ఒకరికొకరు సాయం చేసుకోవాలి. జాతి, వర్ణ, మత విభేదాలు పాటించరాదు. అటువంటి విశాల మానవభావనతో చేసే ప్రతిపనీ ఆరాధనగా అలరార గలదు. **మూడవదైన ప్రేమసాయి అవతారంఅందరిలోనూ భగవంతుడన్నాడని చాటించటమే కాక అందరూ దివ్యమూర్తులనే తత్వం ప్రచారం చేస్తుంది.** ఆ పరమ వివేకం వికసించి నప్పుడు నరనారులందరు నారాయణులు కాగలరు.

ఈ విధంగా కర్మ, ఆరాధన, వివేకం అనే మూడు అవతారాలు సందేశాత్మకంగా అందించగలవు.

(స.ప్ర.పు.8/9)

ఆత్మ పరమైన దివ్యతత్వం స్థాపనచేసి మనవులందరినీ ఒక కులంగా ఒక కుటుంబంగా సమైక్యం చేయటం. ప్రతి స్త్రీలో ప్రతి పురుషునిలో వున్న ఈ దివ్యత్వమే సమస్త సృష్టికీ ఆధారభూతం. ఒకసారి ఈతత్వం గుర్తిస్తే మనిషికీ, మనిషికీ మధ్య మానవునికి, దైవానికీ నడుమ అనుసంధానం ఏర్పడుతుంది. వారసత్వమైన ఈ దివ్యసంపదను గుర్తిస్తే ప్రేమభావం విస్తరించి విశ్వానికి మార్గదర్శకమైన మహాజ్యోతిగా వెలుగొంద గలదు.

మొదటి వ్యక్తిగా వున్న మనిషి మానవజాతిలో విలీనమై నవీ కృతమైన సంపూర్ణ శక్తిని గ్రహించుకోవాలి. ప్రస్తుత ప్రపంచంలో మానవజాతి కనిపించటంలేదు. అలోచనకూ, మాటకూ, రచనకూ సమన్వయం లేదు. ఈనాటి మానవుడు అలోచించేది ఒకటీ. చెప్పేది ఇంకొకటీ చేసేది మరొకటీ. కాబట్టి ఈనాడు పరస్పర విరుద్ధ భావాలు - సంఘర్షణలో తికమక పడుతున్న వ్యక్తులే కనిపిస్తున్నారు. మంచి తలపులూ, మంచి మాటలూ, మంచి పనులూ ప్రేరణ చేసే మానవజాతి మనకి నేడు కనబడటంలేదు. కాబట్టి వ్యక్తిని తనలోపలి దివ్యత్వమును గుర్తించుకునేట్లు చేయాలి. ఆలోచనకూ, మాటకూ, చేతకూ సమన్వయం కుదుర్చుకొని అభివృద్ధి పరచుకునేట్లు చేయాలి.

ఒకసారి ఈ ప్రతిపదిక సత్యమును కుటుంబంలో, పాఠశాలల్లో, కళాశాలల్లో, సమాజంలో, నగరాలలో రాష్ట్రాలలో, ప్రపంచంలో జాతులలో ప్రబోధించాలి. అప్పుడు మానవులంతా ఒకే కుటుంబానికి చెందిన సభ్యులనే ఎరుక మనుషులకు కలుగుతుంది. **అందరూ ఒకటే, అందరినీ ఒకే రకంగా మన్నించాలనీ క్రీస్తు వచించాడు. ఈ ఏకత్వ స్థాపనే ముఖ్య సమస్య. ఉన్నదొకటే కులం, ఉన్నదొకటే వర్గం, ఉన్నదొకటే మతం. అదే మానవత్వం.** వ్యక్తి తన అహంకార బుద్ధిని నిర్మల నిస్వార్థ నిరవధిక విశ్వప్రేమకు లొంగిపోయేట్లు చేసు కోవలెను. ప్రేమయే ప్రాతిపదిక. అందరిలో వుండే సమాన లక్షణం అదే. **భక్తి ఒక దివ్య తోజోరేఖ, మనిషికీ మనిషికీ మధ్య, మనిషికీ దైవానికీ నడుమ బలీయమైన సమైక్య సూత్రం అదే.**

ఒక ఉదాహరణ చూడండి ఇది ఒక వస్త్రంకదా, దీనిని దారాలతో తయారుచేశారు. ఒక్కొక్కదారపు పోగూ లాగివేస్తే వస్త్రం తరిగి పోతుంది. వాటిని చిక్కగా దగ్గరగా చేర్చితే వస్త్రం గట్టిగావుంటుంది. మానవజాతి కూడ

మూడు కార్యక్రమాలు

ఇంతే. వస్త్రంలోఉన్న వేల లక్ష్యం దారాలను ఒక చోట చేర్చేదిప్రేమ. మానవునికి దేవునుకి పునర్మిలనం సమకూర్చేది భక్తి. కాబట్టి **నేను ప్రేమకు మూర్తీభావమునై దానిని నా పరికరంగా వినియోగిస్తున్నాను.** ప్రేమ ద్వారా మానవులలో జాగృతీ పునరుద్ధరణసాధించి, భక్తి ప్రబోధం వల్ల మానవులలో సోదరభావం వర్ధిల్లజేయగలను. అందుకే నేను ఎప్పుడూఅంటూ వుంటాను. **ప్రేమతో మీ దినచర్య ప్రారంభించండి.**

ప్రేమను మీ దైనందిన ప్రణాలికలో నింపుకోండి.

ప్రేమతో మీ నిత్య కార్యక్రమం ముగించండి

ప్రేమ స్వరూపుడైన భగవంతుని చేరుకోటానికి శీఘ్రమైన నిశ్చయమైన మార్గం ఇదే.

(స.ప్ర.పు.9/11)

షిర్డీబాబా 1918లో కీర్తి శేషు లైనారు కదా: ఎనిమిది సంవత్సరాల తరవాత మళ్ళీ జన్మిస్తానని ప్రకటించారు. సాయిబాబాకు సన్నిహితంగా వున్న కాకాదీక్షిత్ తదితర భక్తులూ ఈ విషయం వ్రాతపూర్వకంగా తెలిపివున్నారు. నా అనుభవ పూర్వకమైన అభిజ్ఞానం ముఖ్యకారణం. షిర్డీ బాబాతో పరిచయం వున్నవారు ఇప్పుడెవరూ జీవించిలేరు. కాబట్టి **నా అనుభవమే నా అభిజ్ఞానమే ముఖ్యమైన సాక్ష్యం.**

నేను పదహారు సంవత్సరాల ప్రాయంలో వున్నప్పుడు, అంటే నలభైయేళ్ల క్రిందట, షిర్డీబాబాను అని ప్రకటన చేశాను. అప్పటికి దక్షిణ భారతదేశంలో ఈ ప్రాంతములో షిర్డీ బాబాను గురించి తెలియదు. వినికూడా వుండరు **ఈ ప్రకటనమే గట్టి నిదర్శనం.**

ప్రస్తుత పరిస్థితిలో మానవజాతిని దుష్టశక్తులు వినాశనం వైపు నడిపిస్తున్నట్లు మీరు వివరించారు. దీనిని బట్టి తప్పనిసరి అవుతందా? వినాశకరమైన యుద్ధం ద్వారానే మీరు కృషిచేస్తున్న విముక్తి సాధ్యమవుతుందా?

మహాభారతయుద్ధం మాదిరి మరొక యుద్ధం వంటి విపత్తు రాకపూర్వమే దుష్ట శక్తులను తొలగించాలి. చిన్నయుద్ధాలు, సంఘర్షణలు అనివార్యం కావచ్చు, ప్రస్తుత పరిస్థితికి మహాభారతయుద్ధానికి తేడాయున్నది. కృష్ణ పరమాత్ముని నిర్దేశము ప్రకారము అది జరిగింది. అర్జునుకి దివ్య సారధియై కృష్ణుడే యుద్ధరంగానికి నడిపించి దుర్మార్గులనుండి అసుర శక్తులనుంచి ప్రపంచాన్ని రక్షించాడు. ఈనాడు దుర్మార్గం విస్తారంగా వ్యాపించి యుంది.

ఇంకొక ప్రపంచయుద్ధం వస్తే పరమాణు శక్తులవల్ల మానవజాతి అంతా నిర్మూలనమై పోతుంది. అటువంటి విపత్తులను నివారించడానికి ప్రస్తుత అవతారం వచ్చింది. ఆగ్రహము, ద్వేషము, హింస, యుద్ధము నివారించి మానవ చైతన్యాన్ని ఉన్నత స్థాయికి ఉద్ధరించి ప్రపంచమును వినాశము నుండికాపాడుటమే నాలక్ష్యం. దీనిని సాధించాలంటే వేదశాస్త్రముల ద్వారా భిన్న మతములు ప్రతిపాదించే ధర్మము ద్వారా మానవ జాతిని కర్మ బంధములనుంచి విముక్తి చేసి మానవులలో సోదరభావము అభివృద్ధి చేయాలి.

అందుకే నేను ఎప్పుడే చెబుతూ ఉంటాను. **విభిన్న మతము లను విలసిల్లనివ్వండి. భిన్న రాగములతో వివిధ భాషలలో భగవంతుని వైభవమును గానముచేయండి. అదేఆదర్శంగా వుండాలి.** మత విశ్వాసముల మధ్య ఉన్న భేదాలను మన్నించాలి. దివ్యత్వమనేజ్యోతికి భంగము కలిగించనంతవరకు భిన్న మతములను సత్యములుగా గుర్తించాలి.

(స.ప్ర.పు.12/13)

(చూ॥ దివ్యప్రకటనలు)

మూడు కార్యక్రమాలు

మీరు కోరే పరిమితులకు లోబడి నేనిప్పుడు అవతరించాను. **భగవంతుని కార్యక్రమాలు మూడు. సృష్టి, స్థితి, లయము.** విశ్వకల్యాణం కోసం ఆయన ఆశయాలు అన్నీ సాత్వికంగానే ఉంటాయి. నా ఆనందము నాది. నేను చెప్పదలచుకొన్నది చెప్తాను. ఇతరుల ఇష్టానిష్టములతో నాకు సంబంధంలేదు. ప్రతివ్యక్తికీ, ప్రతిదానికి నేను

సాక్షీభూతుణ్ణి. అందరూ నా ఆధీనంలోనే ఉన్నారు. అటువంటప్పుడు నేను ఏమి చేయాలో ఎవరు చెప్పగలరు? నేను సర్వశక్తులూ కలిగిన వాడనని కొద్ది సంవత్సరాలలో మీరందరూ గ్రహిస్తారు. బుద్ధిమంతులు, పరిశోధకులు, బాధితులు ప్రపంచం నలుమూలల నుంచి ఇక్కడకు వస్తారు. కష్టాలు కలుగగానే భగవంతుణ్ణి నిందించి ఆయనకు దూరము కాకండి. దానివల్ల మీకు నష్టము. తరువాత మీరే పశ్చాత్తాపపడతారు.

(వ.61-62 పు.100

మూడుకోతులు

చెడ్డ చూడరాదు చెప్పరా దెప్పుడు
వినగరా దెప్పుడు విశ్వమందు
మూడుకోతుల గల మూర్తిని మది నిల్పు
ఉన్నమాట తెలుపుచున్నమాట.

(బ్ర.త్ర.పు.92)

మూడుకోరికలు

(చూ॥ ఈశ్వర చంద్ర విద్యాసాగర్)

మూడుక్రియలు

బ్రహ్మ సృష్టి చేయు బ్రహ్మాండములనెల్ల
విష్ణువెంతో పెంచి వృద్ధిచేయు
పరమశివుడు ద్రుంచు పాపిష్టిజీవుల గురుడు మూడ
క్రియల కూర్చునొకడె!

(త.పు.107)

మూడుజన్మలు

ప్రేమస్వరూపులారా! **"దిక్కులేనివానికి దేవుడేదిక్కు" అను సామెతనువినియుందురుగదా? ఒకదిక్కు లేని భక్తుడీ ఘోరవ్యాధితో బాధ నొందుచు. నార్తుడైనన్ను పిలచినందున వానికి రక్షణనిచ్చి వాని వ్యాధిని నేనుగైకొంటిని. భక్త సంరక్షణమే నా ధర్మము. నా పూర్వ శరీరమునందును నిట్టి భక్త రక్షణలు జరిపి యుంటిని. ఇది నాలీల.** షిర్డి యవతారమందు సముద్రము, నదులను త్రిప్పికొట్టవచ్చునుగాక! **నేనుమాత్రము నాభక్తులనెన్నడు నుపేక్షింపను.** అని బాబా చెప్పియుండలేదా? "చాల కాలము నుండి **మీకొక రహస్యమును చెప్పక దాచియుంటిని. ఈ పవిత్రదినమున మీ కారహస్యమును దెలుపుచున్నాను. శ్రద్ధతో నాలకింపుడు. నేను శివశక్తిని (అర్ధనారీశ్వరుడను) భారద్వాజుడను ఋషి కొసంగిన వర ప్రకారము నేను నాశక్త్యంశమున షిర్డి బాబాగ భరద్వాజ గోత్రమున నవతరించితిని. ఇప్పుడును నా శివశక్త్యంశలతో ఆ భరద్వాజ గోత్రమునందే, పుట్టపర్తియందు నవతరించితిని. రాబోవు మూడవ జన్మయందును నాభారద్వాజ గోత్రమందే యొక శివాంశముతో మాత్రమే మైసూరులో నవతరింపగలను. ఈ దేహముందు కుడి భాగము శివునిది. ఎడమభాగము శక్తిదని జ్ఞప్తి యందుంచుకొనుడు.** ప్రస్తుత వ్యాధికి కారణము చెప్పుచున్నాను వినుడు. పూర్వము కైలాసములో అర్ధనారీశ్వరులమగు (శవ-శక్తి)మమ్ము దర్శించుటకు భరద్వాజ మహర్షి వచ్చెను. ఏకారణముననో ఆ మహర్షిని పార్వతిగమనించకుండ నుండెను. అట్లే నిల్చి యుండుటచేత భరద్వాజునికి పక్షవాతము సంభవించెను. అంతట శివుడు మంత్రజలప్రోక్షణచేసి భరద్వాజుని వ్యాధిని పోగొట్టెను. ఆనాటి దోషమే (పాపఫలమే) ఈ దేహ ఎడమ భాగము. (శక్తి). యీనాడు 8 రోజులును ఘోర పక్షపాత బాధ ననుబవించినపిమ్మట, కుడి భాగము (శివుడు) మంత్రజల ప్రోక్షణము చేతనే నివారించుటను మీరు ప్రత్యక్షముగ చూచితిరిగదా? ఇట్టి రహస్యములు మానవులు తెలియజాలరు. ఇది యసలు విషయము. కాని ప్రస్తుతమీ దీనభక్తుని రక్షణ నెపమున ఆనాటి పాపఫలమును నీ దేహమందలి శక్తిభాగముచేత ననుబవింపజేసి, శివుని భాగముచేత శక్తిభాగపు బాధను మీ యెదుట జలప్రోక్షణముచేత బాపితిని. ఇట్లు

మూడుతలలరక్కసి

భక్తరక్షణమును, శక్తి పాప ఫలమును రెంటిని యేకకాలమున ఈ దేహము ద్వారా యనుభవింపజేసి చూపితిని. ఈ 8రోజులును మీరు భయాందోళనములతో గడిపితిరి. ఇదే మీకందఱకును యానందమును గూర్చుచున్నాను. (హర హర శివ శివ సుబ్రహ్మణ్యం! శివ శివ హర హర సుబ్రహ్మణ్యం! గురు శరవణ భవ సుబ్రహ్మణ్యం! అని భజన చేయించెను.

అంతట మామూలుగ మెట్లనెక్కి మిద్దెపైకిపోయి వరండా నుండి దిగువనుండు భక్తుల నుద్దేశించి, మరుసటి దినముదయము 6-30 గంటలకు పాద నమస్కారము నిచ్చెదనని సెలవిచ్చెను. ఆ రాత్రి సుమాఱుగ బాబా భుజించెను. ఆరాత్రియంతయు భక్తులు బాబా మహిమలను తలచుకొనుచు పరమానందముతో పరస్పరము చెప్పుకొనుచు గడిపిరి. మరుసటి రోజు సాయంకాలమును బాబా యుపన్యసించెను. దుష్ట ప్రచారములను నమ్మవలదనెను.) ఈ యవతార కార్యక్రమమున కెన్ని యాటంకములు కలిగినను, కార్యక్రమము నిలువక సాగిపోవుచునే యుండును. కృష్ణావతారమునందు నొక్క గోవర్ధనగిరినే యెత్తవలసి వచ్చెను. ఈయవతారమునందో: యట్టి గిరుల నెన్నింటినో యెత్తవలసియున్నది. గంగానది లోకమునకు మేలు చేయుటకై నిరాఘాటముగా ప్రవహించుచున్నది గదా! **ఒక్కనికాపాడుటకైపెక్కు మంది భక్తులను దుఃఖసాగరములో ముంచుట ధర్మమా యని నన్నొకరు ప్రశ్నించిరి. కాని భక్తరక్షణమే నా ధర్మమైనందున నట్టి నాకార్యముల వలన నితరులకు కించిత్ బాధ కలిగినను నేను లెక్కచేయను. శ్రీరామచంద్రమూర్తి తండ్రి యాజ్ఞను పరిపాలించెనే గాని. ఆయోధ్యా ప్రజల దుఃఖమును శమింపజేయుటకు ప్రయత్నించెనా? దుఃఖ తప్తుడైన భరతుని ప్రార్థన నంగీకరించి అయోధ్యా పట్టణమునకు తిరిగి వచ్చెనా?** నేనిట్లు భక్తరక్షణను, కష్టములకు సహించియైన చేసినప్పుడే భక్తులు నా యాదర్శమును గ్రహించి, తాము నట్లే నడుచుకొందురు. ఇంద్రుడు బృందావనముపై కుంభవృష్టిని గురిపింప వరుణు నాజ్ఞాపించి నప్పుడు కృష్ణుడు వరుణుని ఇంద్రు నాజ్ఞ నుల్లంఘింపమని కోరెనా? కుంభవృష్టికురియగా, ఆ వర్షమును నివారింపజేసి గోవర్ధనగిరినెత్తిగోపికా గోపకులకు తన మహిమను జూపెనుగదా? అట్లే నాడును భక్తరక్షణమును జేసి, భగవన్మహిమ జూపెనుగదా? అట్లే నేడును భక్తరక్షణమును జేసి, భగవన్మహిమ వెల్లడింపబడినది. ఈ 8 రోజులు మీరు పడిన యాందోళన, కష్టము నాయందు మీకుగల యచంచల భక్తి నిరూపణమగు చున్నది కదా? అతి శీఘ్రముగా నా వ్యాధి నివారణము కావలెనని మీరు ప్రార్థనముల, వ్రతముల, నుపవాసముల నెన్నింటినో జేసితిరిగదా? ఇట్లు మీరు చేసినదంతయు నావలన మీరు పొందగల యుద్ధరణము కొఱకే గదా?

(స.శి.పు.ద్వి.పు.75/78)

మూడుతలలరక్కసి

కామం మూడుతలల రక్కసి. కామితార్థం సిద్ధించగానే లోభం బయలుదేరుతుంది. దొరికిన దానిని దాచిపెట్టి వృద్ధిచేయాలనే పిసినారి కోరిక. కోరినది దొరకకపోతే క్రోధం తలయెత్తుతుంది. తపస్సువల్ల కూడ స్వభావం మారకపోవచ్చు. భస్మాసురుని విషయం చూడండి. కోరి వరం ఇచ్చిన భగవంతుని నెత్తిమీదనే చెయ్యిపెట్టాలని తయారైనాడు. కామక్రోధ లోభములు మూడూ రజోగుణమునకు రూపములే. లక్ష్యమే ప్రధానమని అవలంబించే విధానములు ముఖ్యముకావనీ భావించి నిరంతరంగా రజోగుణ వ్యాపారం కొనసాగుతుంది. గమ్యం చేరుకోవటమే ముఖ్యం.అనుసరించే మార్గం ఏదైనా ఫరవాలేదు. అనుకోవటం రజోగుణ లక్షణం. లక్ష్యం ఉన్నంతంగానూ సాధనలు ఉత్తమంగానూ వుండాలి.

(వ.1963 పు.77)

మూడు మృగములు

ప్రేమలేని జీవితం జీవితముకానేరదు. ప్రేమలేనటు వంటి హృదయము హృదయము కానేరదు. ప్రేమగలవాడే

మానవుడు. అయితే ఇట్టి ప్రేమను ప్రవేశింప జేయకుండా మూడు మృగములు సింహద్వారమునందు అడ్డుగా నిలిచియున్నవి. **1. క్రోధము అనే కుక్క దీనిని అడ్డగిస్తున్నది. 2. అభిమానముఅనే పంది అటకాయిస్తున్నది. 3. అహంకారము అనే దున్నపోతు అడ్డముగా పరుండి యున్నది.** వీటిని సంహరించి విశాలమైన ప్రేమతత్త్వంలో మనం ప్రవేశించాలి. **అహంకారము మృగలక్షణం.** అహంకారమునుండినంతవరకు వాడు మానవుడు కానేరడు. **క్రోధము మహా ప్రమాదకరమైనది.** మానవత్వాన్ని కూడా సంహరించడానికి ప్రయత్నిస్తుంది. మనిషికి మనిషికి మధ్యనున్న సంబంధబాంధవ్యాన్ని దూరంగావిస్తుంది. ఈ క్రోధమే పాపమునకు ధూపముగా ఏర్పడుతున్నది. **క్రోధం వల్లనే మానవుడు గౌరవ మర్యాదలను కూడా కోల్పోతున్నాడు. అభిమానం చాలా సంకుచితమైనది. ఐతే ఆత్మాభిమానం వుండాలిగాని, దేహాభిమానం మాత్రం వుండకూడదు. దేహాభిమానాన్ని త్యజించడమే త్యాగం. ఆత్మాభిమానాన్ని అభివృద్ధి పరచుకోవడమే యోగం.**

(శ్రీ.న.2000పు.35)

మూడువిధములైన పాపములు

దేహాభిమానం ఉండినంతవరకు భిన్న అభిమానములు ఆవిర్భవిస్తుంటాయి. శంకరులవారు కాశీక్షేత్రాన్ని చేరారు, విశ్వనాథుని దర్శించారు. 'స్వామీ! నేను ఎందుకోసం ఇక్కడకు చేరాను? నేను మూడు విధములైన పాపములు చేశాను. ఆ మూడు పాపముల పరిహార నిమిత్తమై నిన్ను దర్శించవలసి వచ్చింది'' అన్నాడు. ఏ పాపం చేశాడు? ఎవరిని చంపాడు? ఎవరిని నొప్పించాడు? ఏమి దొంగిలించాడు? ఎవరి సొత్తు అపహరించాడు? ఏమీ చేయలేదే! మరి పాపినని అని ఎట్లా అన్నాడు? **మొదటి పాపము** చెబుతున్నాను వినండి. **"యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ"** - అని నేనే వ్రాశాను. భగవంతుని వాక్కుచేతగాని, మనస్సు చేతగాని వర్ణించుటకు సాధ్యం కాదు అని నేనే తెల్పాను. అట్టి నేను ఇక్కడకు వచ్చి నిన్ను వర్ణిస్తున్నాను. నేను చెప్పినది ఒకటి, చేసినది మరొకటి. ఇది పాపం కాదా! ఈ పాపాన్నిక్షమించమ''ని ప్రార్థించాడు. భగవంతుడు ఎక్కడ ఉన్నాడు?

సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరో ముఖమ్
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమా వృత్యతిష్ఠతి.

"ఈశ్వరా! సర్వభూతములందు నీవే ఉంటున్నావని వర్ణించాను. భగవంతుడు ఎక్కడ చూచినా ఉన్నాడని వర్ణించాను. భగవంతుడు హృదయవాసి అని చెప్పాను. కానీ నిన్ను దర్శించటానికి కాశీక్షేత్రము వచ్చాను. నేను **బోధించుట ఒకటి, ఆచరించుట మరొకటి. ఇది పాపం కాదా!"** అన్నాడు ఇంక **మూడవ** పాపమేమిటి? "పాపమే లేదు మానవునికి అని నేను వర్ణించాను. **"న పుణ్యం, న పాపం, న సౌఖ్యం న దుఃఖం..."** అన్నాను. అలాంటి నేనే **ఈ శరీరంతో** పాప పరిహారము చేయమని కోరటం పాపం కాదా! నేనే భగవంతుడనైతే యింక పాపము ఎక్కడ చేశాను? ఇన్ని చెప్పిన నేనే తిరిగి పాప పరిహారంకోసం ప్రార్థించటానికి వచ్చానంటే, యిదే ఒక పెద్ద పాపం'' అన్నాడు.

(ద.స.98పు.21/22)

మూడుసూత్రాలు

మూడుసూత్రాల ప్రకారం నడుచుకుంటే అన్ని రంగాల్లోను ప్రగతి సాధించవచ్చు. **మొదటిది దైవప్రీతి, రెండవది పాపభీతి, మూడవది సంఘనీతి. దైవప్రీతి ఉన్నప్పుడే పాపభీతి ఉంటుంది. పాపభీతివల్లనే సంఘనీతి ఏర్పడుతుంది. అన్నింటికీ మూలం దైవప్రీతి.** నేను మా పిల్లలకు చెబుతుంటాను: **నువ్వేదన్నా చేయదల్చుకున్నప్పుడు, ఈ పని స్వామి అంగీకారాన్ని పొందుతుందా? ఈ పనిని స్వామి హర్షిస్తారా?"**

అని నిన్ను నీవు ప్రశ్నించుకోవాలి. నీకు స్వామిపైనుండే ప్రేమ నీచేత ఏ చెడునూ చేయించదు. అంటే, దైవప్రీతి పాపభీతికి దారితీస్తుంది. సముద్రంలో ఎన్ని అలలు చెలరేగినప్పటికీ సముద్రంలోని గండశిలలు మాత్రం

మూఢత్వము

కదలక చెదరక నిర్భీతితో నిలుస్తాయి. అట్లే జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనప్పటికీ నీ విశ్వాసం దృఢంగా నిలచియుండాలి. ఎవడైనా వచ్చి దేవుడు లేడన్నాడనుకో. అప్పుడు నీవేం చేయాలి? "నీ దేవుడు నీకు లేకుండా పోవచ్చుగాని, నాదేవుడు లేడనడానికి నీకు అధికార మేముంది?"అని ప్రశ్నించాలి. **"దేవుడున్నాడు" అనే పంచాక్షరీ మంత్రాన్ని జపించాలని లోగడ చెప్పాను.** ఆ సమయంలో సందేహం కలుగకుండా, **"సంశయాత్మా వినశ్యతి" అనే అష్టాక్షరీ మంత్రాన్ని కూడా జపించు. God is no-where అన్న మాటలో మొదట God is అంటున్నావు. అంటే దేవుడున్నాడు. కానీ no-where అన్నప్పుడు నీకు లేకుండా పోయాడు. ఇప్పుడు 'w' అక్షరాన్ని 'no'కి జతజేర్చి చదువు. ఏమౌతుంది? God is now-here అవుతుంది.** కనుక దేవుడు లేడని అంటున్నావంటే - నీకు నీవు లేకుండా పోయా వన్న మాట. అది ఇంపాసిబుల్! ఈనాడు మనిషి పాపకార్యాలు చేస్తున్నాడు. కానీ పాపఫలితాన్ని అనుభవించడానికి సిద్ధంగా లేడు. పుణ్యకార్యాలు చేయడం లేదు. కానీ పుణ్యఫలితాన్ని మాత్రం ఆశిస్తున్నాడు. పాపకార్యాలను చేస్తూ ఉంటే పుణ్యఫలాలెలా వస్తాయి? **నీవు చేసే పాపకార్యాల రియాక్షన్, రిసౌండ్, రిఫ్లెక్షన్‌లు రేపు నీకే ఎదురౌతాయి.** ఈ విషయాన్ని గుర్తిస్తే పాపకార్యాలు చేయడానికి ముందంజ వేయవు. కనుక దైవమంటే ప్రీతి, పాపమంటే భీతి ఉండాలి. ఈ రెండూ ఉన్నప్పుడే సంఘంలో నీతి నిలుస్తుంది.

(స.సా.ఫి.98పు.54)

మూఢత్వము

(చూ॥ శిష్యుడు)

మూఢమతి

శంకరులవారు కాశీ క్షేత్రము నుండి తిరిగి వచ్చేటప్పుడు ఎవరో ఒక పండితుడు ఒక చెట్టు క్రింద కూర్చొని "డుకృఞ్ కరణే, డుకృఞ్ కరణే" అని పాణినీ వ్యాకరణాన్ని వల్లిస్తున్నాడు. శంకరులవారు అతని వద్దకు వెళ్ళి "నాయనా! దీనివల్ల నీకు కలిగే ఫలితమేమిటి?" అని ప్రశ్నించారు. "నేను గొప్ప పండితుడనై రాజుగారి కొలువులో ప్రవేశించి కావలసినంత ధనం సంపాదిస్తానను" అన్నాడు. "ధనంవల్ల నీకు కలిగే ఫలిత మేమిటి?" అని అడిగారు. "నేను ఉన్నంత వరకు నాకుటుంబంతో సుఖంగా జీవిస్తాను" అన్నాడు. "తదుపరి?", "నాకు తెలియదు" అన్నాడు. అప్పుడు శంకరులవారు "పిచ్చివాడా! ధనం, వ్యాకరణం భౌతిక మైనవి. అంత్యసమయములో ఇవేవీ నిన్ను రక్షించలేవు. నీవు మరణించిన తరువాత కూడా అనుభవించగలిగే నిత్యసత్యమైన ఆనందాన్ని మొట్టమొదట సంపాదించుకో.

భజగోవిందం భజ గోవిందం
గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి డుకృఞ్ కరణే

ఈ లౌకికమైన విద్యలతో కాలాన్ని వ్యర్థం చేసి, నీ జీవితాన్ని నిరర్థకం చేసుకోవద్దు" అని బోధించారు. శంకరులవారు ఎట్టి స్వార్థమూ లేక సర్వ కర్మలను లోకోద్ధరణ నిమిత్తమై లోకకల్యాణ నిమిత్తమై ఆచరిస్తూ వచ్చారు. శంకరులవారు మాత్రమే కాదు.కృష్ణుడు కూడా అట్లే చేశాడు.

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిశులోకేషు కించన
నా నవాప్త మవాప్తవ్యం వర్తయేవచ కర్మణి

"అర్జునా! ఈ ముల్లోకములలో నేను చేయవలసిన పని ఏమీ లేదు, నాకు వచ్చే ఆదాయము కూడా ఏమీ లేదు. అయినప్పటికీ నేను నిరంతరము కర్మాచరణలో నిమగ్నుడనై ఉన్నాను. ఎవరికోసం? ఎందుకోసం? లోకోద్ధరణకోసమే. పెద్దలను చూసి పిల్లలు నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇతరులు నన్ను అనుసరించి తద్వారా తరించుటకు ప్రయత్నం చేస్తారు. నేనే కర్మలను ఆచరిస్తున్నాను. నీవు కూడా ఆచరించు. కర్మచేతనే నీ జన్మ సార్థకమవుతుంది" అన్నాడు.

(స.సా.మా.99పు.76/77)

మూర్ఖత్వము

(చూ॥ భారతీయసంస్కృతి)

మూర్ఖుడు

తమ్ములారా! ఈ శరీరము విషయభోగముల **ననుసరించుటకు కాదు. సర్వభోగముల ననుభవించుటకు కాదు.** ఇవి అన్నియు **క్షణభంగురములు.** వీని మూలమున జీవుడు మరల సంసారములోనికి వచ్చును. **అందుచేత యీ భోగములన్నియును దుఃఖములకు కారణములు. ఈ విషయభోగములందాసక్తికలవాడు మూర్ఖుడు.** విషయములు విషమువంటివి. అమృతమును విడిచి విషమును గోరుట తగునా? అటుల విషమును గోరువాడు మంచివాడు కాడు. చింతామణిని విడిచి గాజుపెంకును అభిలషించినట్లుండును. నరశరీరమును ధరించి మానవుడు సంసారసాగరమును దాటలేక పోయిన యెడల వానివంటి దౌర్భాగ్యుడును, మందమతియు లేడు. వానివంటి ఆత్మఘాతకుడు ఉండడు. అందుచే మనుజులై పుట్టినవారు సర్వులయందు దైవము ఆత్మస్వరూపుడై ఉన్నాడన్న సత్యమును గ్రహించి జన సేవ చేయుచూ అదియే దైవసేవగా భావించి దైవాజ్ఞలను శిరసావహించి, దైవార్పితభావముతో సర్వకర్మలు గావింతురు, ఆచరింతురు.

(రా.వా.రె.పు.225/226)

(చూ॥ దుష్ప్రచారములు)

మూర్తిపూజ

ఎక్కువమంది మూర్తిపూజలపై దాడివెడలుదురు. మూర్తిపూజ అనగా ఒక చిన్న **వస్తువులో బ్రహ్మాండమును** దర్శించు శక్తియే. ఇది ఊహాభావముకాదు. అనుభవసిద్ధమే. **విరాట్స్వరూపములో** యేమున్నదో అది అంతయూ **ఒక చిన్న స్వరూపమందు** కూడా వున్నది. కావ్యములో ఉపమానములు దృష్టాంతములూ మొదలైన వానికున్న ఆధారములే మూర్తిపూజకున్నవి.

(ప్రే.వా.పు.13)

మూర్తీభవించిన మానవరూపము

దివ్యమైన ప్రతి స్వరూపం, దివ్యమైన మూలసూత్రం యొక్క ప్రతి లక్షణం... అనగా భగవంతునికి మానవుడారోపించిన అన్ని రూపాలూ **అన్ని నామాలూ మూర్తీభవించిన మానవ రూపమిది.**

(లో.పు.57)

మూలకారణము

ఈనాడు ఈ జగత్తులో ఇన్ని కల్లోలములకు మూలకారణం **మానసిక ప్రమాణములే. వ్యక్తి యొక్క ప్రవర్తనలే దీనికి మూల కారణం.** జాతి, మత, కుల భేదములు ఏమాత్రం కారణాలు కావు. ఈ మూలాధార తత్త్వమును గుర్తించుకోలేని వ్యక్తులు మాత్రమే, జాతిమత కుల భేదములే ఈ కలహాలకు మూలకారణమని భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. కనుక మన సంస్కృతిని మనం పవిత్రంగా చేసుకోవాలి.

(శ్రీ.ఆ. 2000 పు.33)

(చూ॥ అజ్ఞానం, దేశశ్రేయస్సు, దైవసంకల్పము, ప్రథమస్థానము, మదాలస, శరీరము)

మూలము

(చూ॥ అనుభవము, విశ్వకళ్యాణము)

మూలసూత్రములు

(చూ॥ అలవర్చుకోవాలి)

మూలాధారతత్వము

ఈ ప్రపంచానికి మూలాధారమైన తత్వం- దివ్యత్వమొక్కటే ఇలాంటి పవిత్రమైన తత్వం ఒక రూపాన్ని ధరించవలెనంటే దానికి కొంత పురుష ప్రయత్నం కావాలి. పుష్పములు, దారము, సూది - ఈమూడు ఉన్నప్పటికీ పుష్పమాల దానంతట అది తయారవుతుందా? వాటిని

మూలాధారము

చేర్చి కట్టేవాడు ఒకడు ఉండాలికదా! దానిని వెలిగించేవాడు ఒకడు ఉండాలి కదా! అదే విధముగనే, భగవంతుడనే వాడు ఒకడు లేకపోతే ఈ సృష్టి ఏ రీతిగా వచ్చింది? ఈ ప్రకృతిలో జడచైతన్యములు రెండూ ఉన్నాయి. అయితే, ఈ రెండింటినీ కలిపి మరొక రూపాన్ని తయారుచేసే వాడొకడు ఉండాలి కదా? నీవు బట్టల షాపు నుండి కొన్ని గుడ్డలు తెచ్చావు. అక్కడ నీకు Readymadeగా లభించినప్పటికీ వాటిని తయారు చేసినవాడు ఒకడు ఉండాలికదా! కనుక, నీవు చూసినా, చూడకపోయినా, భగవంతుడనేవాడు ఒకడు ఉన్నాడు.

(శ్రీ.భ.ఉ.పు.144)

మూలాధారము

దేహము-దేహి, లేక క్షేత్రము - క్షేత్రజ్ఞుడు, లేక శరీరము - శరీరి అనే రెండు తత్వములతో కూడినవాడు మానవుడు. శరీరమనగా ఏమిటి? **"శీర్యతీతి శరీరః" అనగా జీర్ణించిపోవునది శరీరము.** ఇది పెరుగుతూ ఉన్నప్పటికీ జడమైనదే.

దేహము క్షేత్రము, దేహి-క్షేత్రజ్ఞుడు క్షేత్రమని దేనికి పేరు? **దైవత్వమున్న ప్రదేశానికే క్షేత్రమని పేరు.** కనుకనే తిరుపతి, అమర్‌నాథ్, బదరీనాథ్ మున్నగువాటిని క్షేత్రములని పిలుస్తాము. ఈ దేహము కూడా ఒక క్షేత్రమే. ఎందుకోసం? ఇందులో భగవంతుడనే క్షేత్రజ్ఞుడున్నాడు. **క్షేత్రజ్ఞుని వల్లనే క్షేత్రమునకు విలువ ఉంటుంది. ప్రతి దేహము దేవాలయమేకాని, జీవాలయము కాదు.** ఇట్టి దివ్యమైన శక్తితో కూడిన దేహాన్ని అందించినందులకు తల్లికి మనం కృతజ్ఞులమై ఉండాలి.

అన్నింటికి భగవంతుడే మూలకారకుడైనప్పటికీ ఈ దేహానికి మూలాధారం తల్లియే. విత్తనము మంచిదే అయినప్పటికీ దానిని మట్టిలో పెట్టి నీరు పోసినప్పుడే మొలకెత్తుతుంది. కాని, టిన్నులో పెడితే మొలకెత్తదు కదా! కాబట్టి **ప్రకృతియే తల్లి, పరమాత్ముడే తండ్రి. ప్రకృతిపరమాత్మల సంయోగమువల్లనే జీవతత్వము ఏర్పడుచున్నది. ప్రతిదానికి భగవంతుడే మూలాధారం.**

(స.సా.జూన్.97పు.142)

ప్రతి వస్తువుకు ఒక మూలాధార పదార్థమున్నది. ఈ జగత్తంతా ఒక మూలాధారము నుండియే ఏర్పడినది. ఆ మూలాధారమును వదలితే మీరు సర్వమును కోల్పోయినవారౌతారు. ఇది ఒక వెండి ప్లేటు, ఇది ఒక వెండి గ్లాసు, ఇది ఒకవెండి చెంబు. ఈ రూపనామములన్నీ మూలాధారమైన వెండి నుండి ప్రారంభమైనవే కదా! మూలాధారమైన వెండిని విసర్జిస్తే ఈ రూపనామములకు ఏమాత్రం విలువ లేదు. ప్లేటును చెడగొట్టి స్పూనుగా మార్చుకోవచ్చు. స్పూనును చెడగొట్టి చిన్న కప్పును తయారు చేసుకోవచ్చు. కాబట్టి, రూపనామములన్నీ మార్పుచెందునవే, మరణించునవే. కాని, రూపనామములకు మూలాధారమైన వస్తువు ఏనాటికి మార్పుచెందదు. మరణించదు.

చావు, పుట్టుక లేనట్టి శాశ్వతుండు
ఆదిమధ్యాంతరహితు డనాదివాడు
తాను పుట్టక చావక చంపబడక
ఆత్మరూపుడై అంతట వెలసియుండు

దేహమునకు, ప్రాణమునకు, మనస్సుకు మూలాధారమేమిటి? అన్నింటికీ ఒక్క దివ్యత్వమే మూలాధారం. సూర్యరశ్మిచేత సముద్రజలం ఆవిరిగా మారుతున్నది. ఆవిరి మేఘములుగా రూపొంది, ఆ మేఘములపై చల్లని గాలి వీచినప్పుడు అవి వర్ష బిందువులే ప్రవాహాలుగా రూపొంది తిరిగి సముద్రంలో కలసిపోతున్నాయి. అనగా, సముద్ర జలం ఇన్ని రూపనామములను ధరించి కట్టకడపటికి తిరిగి సముద్రం లోనే కలిసిపోతున్న దన్నమాట. అదేవిధంగా ఈ జగత్తులోని ప్రతి ప్రాణి, ప్రతి వస్తువు ఒకే మూలాధార తత్వం నుండి ఏర్పడినవి. కట్టకడపటికి అవన్నీ ఆ **మూలాధార తత్వంలోనే చేరిపోవాలి.** దీనిని పురస్కరించుకొనియే భాగవతం **"ఎచ్చట పుట్టె నచ్చటి కేగుట నైజము ప్రాణికోటికిన్"** అన్నది. దీనికే వేదాంతం **'ముక్తి' అని పేరు పెట్టింది.**

(స.సా.ఏ.2000పు.98/99)

మృత్పించమేకం బహు భాండరూపం సువర్ణమేకం బహు భూషణాని
గోక్షీరమేకం బహుధేనురూపం ఏకం పరాత్మా బహు దేహవర్తిః
మట్టి ఒక్కటే కాని కుండలు రూపములు భిన్నములు. సువర్ణము ఒక్కటే కాని అభరణములుగా వివిధ రూపములు ధరిస్తుంది. గోవుల రంగులు భిన్నములు కాని క్షీరము పవిత్రము అనగా తెలుపు. ఆత్మ ఒక్కటే అయితే భిన్నమైన రూపము లందు ఏకత్వమును ప్రకటిస్తూవుంటుంది. 'ఏకోదేవో సర్వభూతేషుగూఢః''. ప్రతి భూతమునందును అందర్భూతముగా ప్రకటించే దేవుడు ఒక్కడే. అతడే సత్యస్వరూపుడు. శాశ్వత సత్యము ఒక్కటైనప్పటికి అనుభవజ్ఞులు దానిని అనేకముగా అనుభవిస్తూ వచ్చారు. ఉన్న సత్యము ఒక్కటైనప్పటికి వారి వారి అనుభవములను పురస్కరించుకొని భగవంతునికి అనేక రూపనామములు కల్పిస్తూవచ్చారు. **ఐతే మూలాధారమును మాత్రము ఎవ్వరును మార్చలేరు.**

(స.సా.న. 1986 పు.262)

మూషికము

ఎలుకను 'మూషికము' అంటారు. రాత్రికి అనగా చీకటికి చిహ్నమే మూషికము. **చీకటిని వినాయకుడు అణగ ద్రొక్కినవాడు కనుకనే ఇతనికి "మూషిక వాహనుడు" అని పేరు వచ్చింది. చీకటిని పారద్రోలి వెలుగును జగత్తుకు అందించేటటువంటి నాయకుడు వినాయకుడు.** ఇంతేగాక మూషికమునకు వాసన యొక్క చిహ్నమని కూడా చెప్పవచ్చును. ఈ మూషికము వాసన పురస్కరించు కొనియే తన ప్రయాణమును సాగిస్తుంది. అనగా కోరికలు, వాంఛలు అజ్ఞానమనేటటువంటి మూషికమును అణగద్రొక్కినటువంటివాడు వినాయకుడు. అందువలన వినాయకుని యొక్క వాహనము 'మూషికము' అన్నారు. **వాహన మనగా ఏమిటి? తన క్రింద వేసుకున్నదే వాహనము.** దానిని ఎక్కినటువంటి వాడు నాయకుడు సమస్త దుఃఖములను, బాధలను, కష్టములను దూరము గావించు కొనేటటువంటివాడు వినాయకుడు. విఘ్నములకు శత్రువు వినాయకుడు. విఘ్నమును సంహరించేటటువంటివాడు వినాయకుడు. అసలు విఘ్నములకు ఏ మాత్రం అవకాశమిచ్చేవాడే కాడు. సుఖశాంతులను అందించేటటు వంటివాడు.

(శ్రీ. అ. 95, పు. 6)

మృగములు

గరికపోచలు రాలె గణనాథు పూజకు
ఇంతకన్నను హీనులైరి నరులు
కావుకావు మటంచు కాకి వేడుటలేదె
ఇంతకన్నను నికృష్టులైరి జనులు
అంబ అంబా అంచు అరచదే లే లేగ
ఇంతకన్నను పలుచనైరి జనులు
రామా రామా యంచు కామించదే చిలుక
ఇంతకన్నను తక్కువైరి జనులు
మానవుల కంటె మృగములే మంచివేమొ
ఇంత విజ్ఞానముండియు ఏమి ఫలము?
మానవత్వము కోల్పోయి మనిషి నిలిచె
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు?''

(సే.యో.పు.10)

వివిధ జాతుల వన్య మృగములు స్వేచ్ఛగా తిరుగుచుండు ప్రదేశములను సందర్శించితిమి. ఒకనాటిరాత్రి చెట్లపై నమర్చబడిన మంచ నధిష్టించి క్రూర సత్వ స్వేచ్ఛా విహారములను ఆనందముగ గమనించు చుంటిమి. సింహములను, చిరుతపులులను, జీబ్రాలను, జిరాఫీలను మొదలగు జంతు జాతుల నెన్నింటినో పరికించితిమి. అరణ్యమునందలి మృగజాతు లన్నియు కొంతవరకు అన్యోన్యముగ జీవితములు గడుపుచుండుటను చూచినప్పుడు పరస్పరము ద్వేషాసూయలతో గూడి కలహించుకొను మానవుల జీవితము లెంత శోచనీయములని గోచరించుచుండును. **మానవుని కంటే మృగములే తమ తమ ధర్మములను సకాలమున నెరవేర్చు చుండు ననుట అతిశయోక్తి కాదు.** మానవుడు తన దైవ

మృగలక్షణాలు

స్వభావమును మరచి పైశాచిక భావమునకు దిగజారిపోవుట అత్యంత శోచనీయము. జంతువులును, పక్షులునూ స్వధర్మముల ననుష్ఠించుచుండ **మానవులు స్వధర్మముల వీడి పరధర్మావలంబులై భ్రష్టులగుచుండుట గమనార్హము.**

(స.శి.సు.ది.పు.290/291)

మృగలక్షణాలు

ఈ వయసులో ఉడుకు రక్తం ప్రవహిస్తూ ఉంటుంది. ఎవరేమన్నా చాలా కోపం వస్తుంది. ఇది చాలా తప్పు. కామ, క్రోధ, లోభ, మోహ మద మాత్సర్యాలు **మృగలక్షణాలు. మానవ లక్షణాలు కాదు. భయపెట్టేది మృగం. భయపడేది పశువు. మీరు మృగంకాదు, పశువు కాదు.**

కనుక మీరు భయపడకూడదు. భయపెట్టకూడదు. ఈ రెండింటికీ అతీతమైన మానవునిగా మీరు జీవించాలి. పాపమునకు భయపడాలి. దైవమును ప్రేమించాలి. దుష్కర్మలకు దురాలోచనలకు, విషయభోగాలకు దాసులు కాకూడదు.

(దే.యు. పు. 13)

మృత్యువు

మృత్యువును 'కాలుడు' అందురు. కాలునకు (కాలమునకు) దయా దాక్షిణ్యములు లేవు. నీ జీవితములోని క్షణక్షణము కాలుని కత్తెరతో కత్తిరింపబడు చుండును. అందుచే సమయ మాసన్నమైనపుడు ఈ ప్రపంచమును వీడవలసి యుండును. ప్రతి దినము నీ జీవిత కాలములో (ఆయుర్దాయములో) 24 గంటలు తరిగిపోవు చుండును. మృత్యువు కూడ సర్వ శక్తిమంతుడు. సర్వాంతర్యామియే. అనుక్షణము మరణించు అనేక లక్షల మానవులను కొనిపోవుటకు అతడు త్రాళ్ళను తయారుచేయు కర్మాగారమును నడుపుటలేదు. మృత్యువువాతబడనున్న మానవుడే ఆ త్రాటిని మెలిపెట్టి, మెడచుట్టూ సిద్ధపెట్టుకొని యుండును. కాలుడు వచ్చి దానిని లాగటమే చేయుపని. మానవుడు అజన్మాంతము, గత జన్మలోను చేయు ప్రతిపనివల్లనే ఈ త్రాటిని తయారు చేసికొనుచున్నాడు. అహంకారబద్ధమైన అన్ని కార్యములు, స్వలాభాపేక్ష, ప్రతిఫలాపేక్ష మొదలగునవి ఈ త్రాటికి మరికొంత మెలిని, పాడవును ఇచ్చుచుండును.

(శ్రీ.స.సూ.పు.76/77)

మృత్యువు యెల్లప్పుడూ జీవిని అంటియేయున్నది. మృత్యువు అను శబ్దమును వినగానే మానవుడు సహించడు. ఎంత వెట్టి: ఎట్టివైనా శుభకార్యములు జరుగుచున్నప్పుడు మృత్యువు అన్న శబ్దము విన్న అశుభమని అనుచున్నారు. కానీ యెంత అశుభమనుకొన్ననూ జీవివేయు ప్రతి అడుగునూ మృత్యువువైపునకే పడుచున్నదికదా! మానవుడు ఏ వూరైనా ప్రయాణమై టిక్కెట్టుకొని ఆ రైలులో ఊరక కూర్చున్ననూ పండుకొన్ననూ, **ఆరైలు యెట్లు** తాను చేరవలసిన ప్రదేశమునకు చేర్చునో, **అట్లే జీవుడు పుట్టుకతోనే మృత్యువను వూరికి టిక్కెట్టుతీసుకొన్నాడు. మీరెన్ని ప్రయత్నములు చేసిననూ. యెంత జాగరూకతతో నుండినను అది ఏనాటికయినా రాక తప్పదు కదా!** ఏది నిశ్చయము కాక పోయినా మృత్యువు మాత్రము నిశ్చయము దానిని మరచుటకు ప్రయత్నింప వీలేలేదు.

(ప్రే.వా.పు.4)

మృత్యువు యెదుట అన్ని గర్వములు, అన్ని హోదాలును, అణిగిపోవును. కాన అహార్నిశము దేహమును గూర్చి యోచించక పారమార్థమును పొందగోరి త్రికరణశుద్ధిగా సర్వజీవుల కొరకు పాటుపడుటకు ఈ కాయమును కాపాడుకొనవలెనే కాని, నీవు ఈ దేహము కావు, ఆత్మవు.

(ప్రే.వా. పు. 26)

(చూ॥ నేనుయెవరు?, వర్తమానము, హితభాష)

మెడిటేషన్

మన జీవితమంతా మెడిటేషన్‌తో కూడినదే. 'మెడిటేషన్ ఈజ్ ఏవే ఆఫ్ లైఫ్'. ఇది మన జీవిత విధానానికి

సంబంధించినది. నడిచే సమయంలో త్రోవ చూసుకోకుండా నడిస్తే ప్రమాదాలకు గురి అవుతాము. కావున నడకకు కూడా ఏకాగ్రత అవసరం. నడవటం, మాట్లాడటం, చదవటం, వ్రాయటం మున్నగునవన్నీ ఏకాగ్రతతో కూడినవే. అయితే మీరు వస్తువులపై, భౌతిక విషయాలపై పెట్టే ఏకాగ్రతను భగవంతునిపై పెట్టండి. అప్పుడు మీలో దివ్యమైన మార్పు కలుగుతుంది. మీరు చేసే ప్రతిపనీ దైవారాధనగా మారుతుంది. అదే మెడిటేషన్.

మీ దృష్టిని మీ భావాన్ని ప్రకృతి నుండి పరమాత్మకు మరల్చాలి.

పనివేరు పూజవేరుకాదు. ప్రకృతి వేరు - పరమాత్మ వేరుకాదు. జీవుడు వేరు - దేవుడు వేరు కాదు. దివ్యత్వము మీలోనే ఉన్నది. ఆ విశ్వాసం మీరు అభివృద్ధి పరుచుకున్నప్పుడు మీరు తప్పులు చేయటానికి ఎన్నడూ పూనుకోరు.

(దే.యు. పు.7)

(చూ॥ ధ్యానం)

మెటీరియలైజేషన్

(చూ॥ అయస్కాంత శక్తి, విశ్వామిత్రుడు)

మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి

ఈనాడు "మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి", అనంతపురం కళాశాల పూర్వ విద్యార్థినులు, తమ సంస్థ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఆ పేరుకు తగినట్లుగా వారు స్వామిసందేశాన్ని ఆచరణ పూర్వకంగా ప్రచారం సల్పుతున్నారు. వారు చేపట్టిన సేవాకార్యక్రమాలకు సంబంధించిన రిపోర్టు (నివేదిక) మీరింతకుముందు విన్నారు. అయితే, మీరు విన్నది తక్కువగాని, వారు చేసినది ఎక్కువగా ఉన్నది. "మీ రిపోర్టు అడ్వర్‌టైజ్‌మెంట్ మాదిరి ఉండకూడదు. కాబట్టి, చిన్న రిపోర్టును తయారు చేసి తీసుకురండి" అని వారికి నేనే చెప్పాను. అందువల్ల, వారు ఎంతో చేసినప్పటికీ రిపోర్టును మాత్రం చాల చిన్నదిగా తగ్గించుకొని తీసుకు వచ్చారు. నిజం చెప్పాలంటే, వారు చాల సేవలు చేస్తున్నారు. ఇక్కడే కాదు, కెనడా, అమెరికా, జపాన్ మున్నగు అనేక దేశాలలో కూడా ఇక్కడి నుండి వెళ్ళిన బిడ్డలున్నారు. వారు కూడా అక్కడ అనేక సేవలు సల్పుతున్నారు; **సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ పేరు నిలబెడుతున్నారు.** సేవాకార్యక్రమాలకోసం వారికి వచ్చే జీతాన్ని ఖర్చు పెడుతున్నారు. ఎందుకు మీరిలా చేస్తున్నారని తల్లి దండ్రులూ అడిగితే "అమ్మా! నాన్నా! మమ్ముల్ని చదివించింది స్వామియే కదా! స్వామి మాకు ఉచిత విద్యను, ఉచిత వైద్యాన్ని అందించాడు. మాహెల్త్, వెల్త్ (ఆరోగ్యం, ఐశ్వర్యం) రెండూ స్వామి అనుగ్రహించినవే. కనుక, మేము సంపాదించినది కూడా సేవకే ఖర్చు పెట్టాలి. ఒక్క నయాపైసా మేము దుర్వినియోగం చేయటం లేదు" అని సరియైన జవాబు చెపుతున్నారు. తల్లిదండ్రులలో కూడా మంచి మార్పు తెప్పిస్తున్నారు. ఇక్కడ మన జనరల్ హాస్పిటల్‌లో వన్స అనే కంటి డాక్టరున్నది. ఆమె తన బిడ్డను మన కాలేజిలో చదివించింది. ఆ అమ్మాయి ఇప్పుడు తన భర్తతో ఆస్ట్రేలియాలో ఉన్నది. అతనిలో మంచి మార్పు తెప్పించింది. అతడు కూడా సేవలో చురుగ్గా పాల్గొంటున్నాడు. భార్యాభర్త లిరువురు తమ సంపాదనను ఖర్చుపెట్టి అనేక సేవలు సల్పుతున్నారు. వారికి బిడ్డలు లేరు. వన్స నావద్దకు వచ్చి "స్వామీ! నా బిడ్డకు బిడ్డను ప్రసాదించండి" అని ప్రార్థించింది. అప్పుడా అమ్మాయి చెప్పింది - "స్వామీ! నాకు ఆ బాధ్యతలు, బంధనలు వద్దు. స్వామియే నా సర్వస్వము. అందరూ నా అక్కచెల్లెండ్రే. వారి బిడ్డలందరూ నా బిడ్డలే. కాబట్టి, నాకు బిడ్డలు అక్కర్లేదు. నాకు స్వేచ్ఛగా సేవ చేసుకునే అవకాశాన్ని ప్రసాదించండి" ఇట్టి భక్తిప్రపత్తులు కల్గినవారు స్త్రీలలోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇంతేకాదు. మన పురాణాలలో కూడా సీత, సావిత్రి, చంద్రమతి, దమయంతి మున్నగు ఆదర్శమూర్తులైన స్త్రీలు అనేకమంది ఉన్నారు. ఇలాంటి స్త్రీలవల్లనే భారత దేశమే కాదు, ప్రపంచమంతా

సుక్షేమంగా ఉన్నది. కనుక, స్త్రీలను చులకనగా చూడకూడదు, వారు బలహీనులని భావించకూడదు. స్త్రీలలో ఉన్న శక్తిసామర్థ్యములు చాల గొప్పవి. ఇంకా కొన్ని విషయములు మీకు తెల్పాలి. వచ్చే నవంబరులో ఈ దేహముయొక్క **75 వ పుట్టిన రోజు వస్తున్నది. ఆ సందర్భంగా వచ్చిన భక్తులకు పది దినముల ఉచిత భోజనం అందించాలని "సత్యసాయి మెస్సెంజర్స్" చాల పెద్ద ప్లాను వేశారు. ఇప్పటి నుండియే దానికి తగిన ప్రయత్నాలు ప్రారంభించారు. వెయ్య సంచుల బియ్యం కొని సిద్ధంగా ఉంచారు. స్త్రీలకు 75000 చీరలు పంచి పెట్టాలని సంకల్పించుకున్నారు. ఆ చీరలన్నీ ఒకే డిజైనులో ఉండాలని వాటిని తయారు చేయడానికి అప్పుడే ఆర్డరు కూడా ఇచ్చారు. ఈ సంస్థలో 3000 మంది పిల్లలు సభ్యులుగా ఉన్నారు.** దినదినమునకు వారి భక్తిప్రపత్తులు పెరుగుతూనే ఉన్నాయి. అసలు స్త్రీల యందే భక్తిప్రపత్తులు అధికంగా ఉంటాయి. కనుకనే, **స్త్రీలను భక్తితోను, పురుషులను జ్ఞానంతోను పోల్చారు. భక్తి అనే స్త్రీకి భగవంతుని అంతఃపురంలో కూడా ప్రవేశించడానికి అధికారం ఉంటుంది. జ్ఞానమనే పురుషునికి కేవలం భగవంతుని దర్బారు హాలులో మాత్రమే ప్రవేశం ఉంటుంది. అంతఃపురమనగా ఏమిటి? అంతరాత్మయే అంతఃపురము. అందులో ప్రవేశించేది భక్తి తప్ప జ్ఞానము కాదు.** పుట్టపర్తికి వచ్చే పురుషులలో చాలమంది స్త్రీలయొక్క ప్రోద్బలంవల్లనే రాగల్గుతున్నారు. **పురుషులను భక్తిమార్గంలో ప్రవేశపుట్టేవారు స్త్రీలే. ఆనాటి గోపికల భక్తి ప్రపత్తులను విచారణ చేస్తే హృదయం కరిగిపోతుంది.** గోపికలు తమకు ఒకే మనస్సు ఉన్నదని, అది కృష్ణునితో వెళ్ళిపోయినదని ఉద్ధవునితో అన్నారు. అదే గొప్ప వేదాంతం. ఆనాడు ఉద్ధవుణ్ణి గొప్ప జ్ఞానిగా భావించే వారు. అలాంటి ఉద్ధవుడు కూడా కృష్ణుని వద్దకు వెళ్ళి "కృష్ణా! ఆ గోపికల భక్తిప్రపత్తులలో కొంత భాగమైనా నాకు ప్రసాదించు" అని ప్రార్థించాడు.

నా ఉద్దేశ్య మేమంటే "మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి" సంస్థ సభ్యులు ఆధ్యాత్మిక తత్త్వాన్ని ఇంకా అధికంగా దేశమంతా ప్రచారం చేయాలి. వీరివల్లనే దేశమంతా బాగుపడుతుంది. ఒక్క భారతదేశమే కాదు, యావత్ప్రపంచమే బాగుపడాలి. ప్రాచీన భారతీయ సంస్కృతి పునరుద్ధరింపబడాలి. **"ఏకం సత్ విప్రాः బహుధా వదంతి" దైవత్వం తప్ప మరేదీ లేదు.** మీకు కనిపించే మనుష్యులు మనుష్యులు కాదు, కొండలు కొండలు కాదు, గుట్టలు గుట్టలు కాదు, చెట్లు చెట్లు కాదు. అన్నీ దైవస్వరూపములే. **"యద్భావం తద్భవతి"**, మీరు ప్రాకృత దృష్టితో చూస్తున్నారు. కాబట్టి మీకు మనుష్యుల మాదిరి కనిపిస్తున్నారు. దైవదృష్టితో చూడండి, అందరూ దైవంగానే గోచరిస్తారు.

(స.సా.జ.2000పు.12 /13)

ముమ్ముందు "మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి" చేయవలసిన పనులు ఇంకా ఎన్నో ఉన్నాయి. అన్నదానం చేయడం, మెడికల్ క్యాంపులు నిర్వహించడం, పిల్లలకు చదువు చెప్పడం - ఇవి చాల అవసరమే. కాని వీటితో పాటు ప్రజల దృష్టిని ఆధ్యాత్మికం వైపు మరల్చాలి. ఆధ్యాత్మికమే నశిస్తే జీవితమే నశిస్తుంది. కేవలం **'మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి' మాత్రమే కాకుండా మగపిల్లలు కూడా ఆధ్యాత్మిక తత్త్వాన్ని ప్రచారం చేయడానికి పూనుకోవాలి.** నిజంగా మగ పిల్లలకు ఉన్నంత స్వేచ్ఛ ఆడపిల్లలకు లేదు. ఆడపిల్లలకే స్వేచ్ఛఉండి యుంటే ఈపాటికి అర్థ ప్రపంచాన్ని మార్పు చేసి యుందురు. కాని, వారు ఏ పని చేయాలన్నా తల్లిదండ్రులు ఒకవైపున, భర్త ఒకవైపున, పిల్లలు ఒకవైపున అడ్డు పెడుతుంటారు. అయినప్పటికి వారు అన్నింటిని తట్టుకొని, నెట్టుకొని ముందంజ వేస్తున్నారు. మగవారికి ఎవ్వరూ అడ్డు చెప్పేవారు లేరు. అలాంటప్పుడు వారు ఎందుకు ఆధ్యాత్మిక జీవితాన్ని గడపకుడదు?! **ఆధ్యాత్మిక తత్త్వాన్ని ఎందుకు ప్రచారం చేయకూడదు?! సమాజ సేవలో ఎందుకు పాల్గొనకూడదు?! సమాజ సేవ చేయకపోతే మీరు చదివిన చదువులవల్ల ప్రయోజనం మేమిటి?!** ధన సంపాదన కాదు, గుణసంపాదన చాల అవసరం. ఎంతమంది సంపాదించలేదు! కాని, వారు తమ వెంట ఏమి

తీసుకుపోయారు? ఏమీ లేదు. అయితే, సంపాదన కూడా ఉండవలసిందే. కాని,దానికొక పరిమితి ఉండాలి. మీ శక్తిని, కాయమును సమాజ సేవకు అంకితం చేయాలి. ప్రపంచంలోని అశాంతిని, అలజడిని దూరం చేయడానికి యువకులు కంకణం కట్టుకోవాలి. అయితే, ఈనాడు కొంతమంది ఇంట్లో తల్లిదండ్రులను కూడా సరిగా చూసుకోవడం లేదు. తల్లిదండ్రులనే చూసుకోలేని వారు దేశాన్ని ఏరీతిగా ఉద్ధరించగలరు?! మొట్టమొదట తల్లిదండ్రులను సేవించండి; మీ కుటుంబాన్ని పోషించుకోండి; మీ గ్రామసేవ చేయండి. తరువాతనే దేశసేవ ప్రారంభించవచ్చు. ముఖ్యంగా మీరు దేశాభివృద్ధికి సమాజ సంక్షేమానికి పాటుపడండి. దేశసేవగా మారిపోతుంది. మీరు చేసే సేవకు ఫలితాన్ని ఆశించకండి. అది దైవమే ఇస్తాడు.

'మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి' విద్యార్థినులారా! మీరు చేసే సేవలు చాల సంతోషాన్ని కల్గిస్తున్నాయి. కాని, ఇంకా అధికంగా మీరు సేవలు చేయాలని నేను ఆశిస్తున్నాను. **మీ తల్లిదండ్రుల ఆజ్ఞను శిరసావహించి, వారి ఆశీర్వాదములను కూడా పొందండి.** మీ తల్లిదండ్రులకు మీరు సేవ చేస్తే భవిష్యత్తులో మీ పిల్లలు మీకు సేవ చేస్తారు. మీరు ఎలాంటి పనులు చేస్తారో అలాంటి ఫలితాన్నే పొందుతారు. ఇదే వేదాంతం బోధించే ప్రధానమైన సత్యం. **దైవప్రేమకు పాత్రులు కండి.** ఈ ప్రపంచంలో మీరు సంపాదించవలసిన అత్యంత ఉత్తమమైన, అత్యంత శ్రేష్ఠమైన సంపద దైవప్రేమ ఒక్కటే. దైవప్రేమకు మీరు పాత్రులైతే దేనినైనా సాధించగలరు. అట్టి దైవప్రేమను సంపాదించుకొనే నిమిత్తమై సమాజ సేవలో పాల్గొనండి. పెద్ద డిగ్రీలు పొంది గొప్పగా సంపాదించాలనే ఆశలను తగ్గించుకోండి. సంపాదించుకోండి, సంతోషమే. **కాని, సంపాదించినది సమాజ సేవకు వినియోగించండి. చిత్తమునందు భగవచ్చింతన చేయండి. అప్పుడే మీ జీవితం సార్థకమవుతుంది.**

(స.సా.జ.2000పు.14)

సత్యంలో జీవించండి. ధర్మంతో జీవించండి. ప్రేమతో అందరూ ఏకం కండి. ప్రతి మానవుని యందున్న ప్రేమ ఒక్కటే. మీయందున్న ప్రేమయే పరులయందూకూడా ఉన్నది. అందరియందున్న ప్రేమ ఏకమైనప్పుడు విశ్వకుటుంబం ఏర్పడుతుంది. ప్రేమను ముక్కలు చేసి, ద్వేషాన్ని పెంచేవారికి ఏమీ సుఖముండదు. నేను అహర్నిశలు ప్రేమతోనే కాలం గడుపుతున్నాను. ఎంతోమంది విద్యార్థులకు విద్యను ఉచితంగా నేర్పిస్తున్నాను. ఉచిత విద్య మాత్రమే కాదు, ఆదర్శవంతమైన జీవితాన్ని అందిస్తున్నాను. కాని, కొంతమంది తమ దుర్భావములను ఈ పిల్లలపైన రుద్ది వారినికూడా పాడుచేయడానికి ప్రయత్నిస్తున్నారు. కాని, మా పిల్లలు బంగారంవంటివారు. మా పిల్లలపాదధూళి తీసుకున్నా వారికి ఆ దుర్బుద్ధులు పుట్టవు. మా విద్యాసంస్థల్లో చదువుకున్న పిల్లలు ఎంతో పవిత్రమైన, ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఆడపిల్లలు **"మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి"** అనే పేరు పెట్టుకొని ఎన్నో దేశాల్లో ఎన్నో సేవలు చేస్తున్నారు. తాము చేయడమేగాక తమ భర్తలతోకూడా చేయిస్తున్నారు. స్విట్జర్లాండ్, ఆమెరికా, జపాన్, రష్యా చైనా మున్నగు అనేక దేశాల్లో మా పిల్లలు పని చేస్తున్నారు. ఆ పిల్లలకు కొంతమంది విదేశీయులు డబ్బు ఆశ చూపించి, సత్యసాయిబాబాకు విరుద్ధంగా కొన్ని స్టోరీలను వ్రాయమంటున్నారు. మతప్రచారం సల్పేవారు ఇట్టి దుష్ప్రచారానికి పూనుకొని, స్విట్జర్లాండులో ఒక అమ్మాయిని ఈవిధంగా అడిగినప్పుడు ఆ అమ్మాయి కోపంతో తాను కాలికి తోడుక్కున్న బూటును తీసింది. **"ఇదేనా మీ మతం నేర్పే సత్యము? ఇదేనా మీ మతం బోధించే ఆదర్శము? ఛీ, పొమ్మ"ని గట్టిగా అరిచింది. కాని, కొంతమంది 'జూడాస్'లు డబ్బుకోసం ఆశపడి ఈ దుర్మార్గంలో ప్రవేశిస్తున్నారు.** ఆనాడు జూడాస్ గతి ఏమైంది? **"ఛీ, నా గురువుకు నేనింత ద్రోహం చేసితినా! నేను దైవద్రోహిని" అని ఏడుస్తూ తలకొట్టుకున్నాడు.**

అన్ని ద్రోహములకంటే దైవద్రోహం చాలా చెడ్డది. ఎన్ని జన్మలెత్తినా ఆ పాపం తీరదు. కనుక, దైవద్రోహానికి ఎవ్వరూ పూనుకోకూడదు.

(స.సా.జ.2001పు.4/5)

ప్రేమస్వరూపులారా! **దేనికీ మీరు వెఱువనక్కర్లేదు. తలపైన పిడుగు పడినా ఫరవాలేదు. మీరేమీ భయపడకండి. ప్రాణం పోతే ఒక్కతూరి పోతుందిగాని, రెండు తూర్లు పోదు కదా! ఈనాడు కాకపోయినా రేపైనా పోతుంది. కాబట్టి, ప్రాణం పోతుందని మీరు భయపడనక్కర్లేదు.** దేనికైనా సిద్ధంగా ఉండండి. సత్యాన్ని అనుసరించడానికి మీరు భయపడకూడదు. సత్యాన్ని వదలుకొని, ప్రేమను వదలుకొని ఏదో ప్రాణం రక్షించుకోవాలని జపములు, తపములుచేస్తే లాభం లేదు. ఎవరేమనుకుంటారో అని భయపడకండి. ఎవరేమనుకున్నా మీకు వచ్చిన నష్టమేమిటి? మీ ఇష్టం మీది, వారి ఇష్టం వారిది. మీరేమీ తప్పుచేయటం లేదు కదా! భగవంతుణ్ణి ప్రేమించడంలో తప్పే ముంది? ఆ ప్రేమచేతనే ప్రాణం వదలాలి. అంతే గాని, పిచ్చిపిచ్చి కలహాలకు, లోనిపోని సందేహాలకు అవకాశమందించకండి. ఎవరి కర్మను వారు అనుభవిస్తారు.

"ఎవరు చేసిన కర్మ వానుభవించక
ఎవరికైనను తప్పదన్నా!
ఏనాడు ఏతీరు ఎవరు చెప్పాగలరు?
అనుభవించుట సిద్ధమన్నా!"

అయితే **మీరు నిరంతరము భగవచ్చింతన చేస్తూ ఉంటే మీకు ఎలాంటి బాధలూ సంభవించవు. అడవులందున్న, ఆకసమునన్న, పట్టణమునన్న పల్లెనున్న, గుట్టమీదనున్న నట్టేట పడియున్న ఎక్కడున్నప్పటికీ భగవంతుడు మీ వెంటనే, జంటనే ఉండి మిమ్మల్ని కాపాడుతుంటాడు. ఎక్కడున్నా దైవత్వం మీవెంటనే ఉంది. జీసస్ అనండి, రామా అనండి కృష్ణా అనండి; ఏ పేరుతోనైనా పిలవండి. కాని, భగవంతుడు ఒక్కడే. ఆ ప్రేమయే దైవం. కనుక, దైవత్వాన్ని విమర్శించడానికి ఎవ్వరికి అధికారం లేదు; హక్కులేదు. విమర్శలన్నీ బూటకపు మాటలే. అవి దైవత్వాన్ని చలింపజేయలేవు.** ఈ కలిప్రభావంచేత ప్రజలు ధనం కోసం ఎన్నో పాట్లు పడుతున్నారు. ధనంకోసం ప్రాణాలనుకూడా తీస్తున్నారు. ఎందుకిలాంటి తుచ్ఛమైన ధనము? ప్రేమధనమును సంపాదించుకోండి. ప్రేమయే అన్ని బాధలను నివారణ గావించగలదు.

ప్రేమస్వరూపులారా! ఎక్కువసేపు మాట్లాడి మిమ్మల్ని బాధపెడుతున్నానేమో! అయితే, ఇది బాధకానే కాదు. ఇది గొప్పబోధ. అధైర్యంతో కృంగిపోయేవారికి ధైర్యమనే టానిక్‌ను అందించాలి. **"మెస్సెంజర్స్ ఆఫ్ సత్యసాయి"** సంస్థకు చెందిన పిల్లలు చాలా గొప్ప సేవలు చేస్తున్నారు. ఒక్కొక్క పర్యాయం తిండికూడా మాని సేవలలో పాల్గొంటున్నారు. కాని, ఆవిధంగా ఆరోగ్యాన్ని పాడుచేసుకోకూడదు. "బెంగుళూరులో స్వామి ఇంత పెద్ద హాస్పిటల్‌ను కట్టిస్తున్నారు. కాని అక్కడ సేవ చేయడానికి మాకు శక్తి చాలదే! పురుషుల మాదిరి రాళ్ళు, ఇటుకలు మోసి సహాయం చేయడానికి మాకు చేతకాదే!" అని వారు బాధపడుతున్నారు. **వారికి వచ్చే జీతాలలో చాలా మిగిలించుకొని వాకు చెప్పకుండా సత్యసాయి ట్రస్టు పేరుతో మొన్నటి దినము 75 లక్షలు పంపించారు. ఇంక, మన కాలేజిలో చదువుకున్న మగపిల్లలు బయట అనేకచోట్ల పనిచేస్తున్నారు. బయట ఉండినా వారు వారే! వారు ఎంతో శ్రమ పడి, తిండి కూడా సరిగా తినకుండా ఇక్కడ నెలలకొద్దీ కాచుకొని ఉంటారు పాపం! అవిధంగా మిగిలించుకొని సత్యసాయి ఓల్డ్ స్టూడెంట్స్ 45 లక్షలు సెంట్రల్ ట్రస్టుకు పంపించారు.**

విద్యార్థినీ విద్యార్థులారా! మేము మీ డబ్బును కోరటం లేదు; మీ ప్రేమను మీక్షేమాన్ని, మీ అభివృద్ధిని, మీ ఆనందాన్ని మాత్రమే కోరుతున్నాము. మీరు ఎక్కడున్నప్పటికీ ఆదర్శవంతమైన జీవితాన్ని గడపండి. ఏదో గొప్పగొప్ప వారందరూ ఈ ఆసుపత్రికి కోట్ల రూపాయలిస్తున్నారని కొందరు భావిస్తున్నారు. గొప్పగొప్ప వారిని మేము అడగటమూ లేదు, వారు మాకు ఇవ్వటమూ

లేదు. ప్రేమతో ఇచ్చేది చిన్నదైనా గొప్పదే. జీసస్‌కు గొప్పగొప్పవారు గొప్పగొప్ప బహుమతులను అందించడానికి ప్రయత్నించారు. కాని, అతను వాటిని స్వీకరించలేదు. ఒక నిరుపేద వృద్ధురాలు ప్రేమతో ఇచ్చిన చిన్న కానును ఆనందంగా స్వీకరించాడు. తాను మరణించేంత వరకు ఆ కానును తనదగ్గరే పెట్టుకున్నాడు. అదేవిధంగా, నాకు కావలసింది ప్రేమయేగాని ధనంకాదు. ముమ్ముందు ఇలాంటి హాస్పిటల్ ఇంకా ఎన్నో నెలకొల్పబడతాయి. కాని, నేను ఎవ్వరినీ ఆడగటం లేదు. నాది సత్యసంకల్పం. కనుక, అది తప్పక నెరవేరుతుంది. మనం చేసేది మంచి పని. మంచి పనులకు మంచియే జరుగుతుంది. నా మంచితనమే నాకు సహాయం. **విద్యార్థినీ విద్యార్థులారా! మీరిచ్చిన డబ్బును వాపస్ తీసుకోండి. మీ ప్రేమను, మీ క్షేమమును మీ అభివృద్ధిని మాత్రమే మేము** కోరుతున్నాము మీరు మీ ప్రవర్తనలో ఆదర్శాన్ని చూపినప్పుడే నాకు ఆనందము. సత్యసాయి స్టూడెంట్స్ చాలా మంచి ప్రవర్తన కలిగినవారనే పేరు తెచ్చుకోండి నేనీనాడు కాదు, ఏనాడూ ధనమును ఆశించను. ధనం వస్తుంది, పోతుంది. నైతికశక్తివస్తుంది. అభివృద్ధి చెందుతుంది. కనుక, నైతికశక్తిని పెంచుకోండి. శీలమును అభివృద్ధిపరచుకోండి. ధైర్యాన్ని పెంచుకోండి. ప్రేమను అందరికీ పంచండి.

స్వామిపట్ల భక్తులకు పిల్లలకుగల ప్రేమ ఎలాంటిదో బయటివారికి తెలియదు. మీ ఆరోగ్యాన్నికూడా లెక్కచేయక మీరు స్వామిసేవ చేస్తున్నారు. కాని, అలాంటి సేవ నాకక్కర్లేదు. జీవుడే దేవుడు. జీవుణ్ణి హింసించకూడదు. కాబట్టి మీరు బాగా భుజించి, ఆరోగ్యంగా ఉండి తరువాత సేవలో ప్రవేశించండి. మీరు పల్లెపల్లెకు పోయిసేవ చేస్తున్నారు. ఇట్టి సేవాధనము ఎన్నో కోట్ల రూపాయలతో సమానం. కాబట్టి, మీరు సేవాధనమును పెంచుకోండి. పల్లెపల్లెకూ వెళ్ళి సేవలు చేయండి; బీదవారిని ఆదరించండి; ఆకలితో అలమటించేవారికి పట్టెడన్నం పెట్టండి.

(స.సా.జ.2001పు.7/8)

మేధాశక్తి

(చూ॥ నైపుణ్యం)

మేలు-కీడు

నీట మునిగిపోవువానికి ఏ చిన్నపుల్ల అయిన కూడా ఆధారమగును. అట్లే సంసార సాగరమున మునిగిన వారికి ఏ కొంచెము మంచిగా మాట్లాడిననూ అదే జీవితమునకాధారము కావచ్చును. చేసిన మేలు వ్యర్థము కాదు. చేసిన కీడుకూడా వృథాపోదు. కనుక లేశ మాత్రము కూడా చెడ్డ సంస్కారము కలుగనీయక, కనులు పవిత్రములై యుండునట్లు చెవులు నిందావాక్యములను వినక సాధ్యమైనంతవరకు భగవద్వాక్యములు, సద్విషయములు వినుచుండునట్లు, నోరు మంచి మాటలనే, భగవత్ స్మరణనే, సత్య వాక్కునే, పలుకు చుండునట్లు సదా ప్రయత్నించవలెను. ఇట్టి జాగరూకతతో నుండిన చివరకు విజయము కలిగి తీరును.

(జ.పు.75)

మేలుకొల్పు

అంత్యసమయమున స్మరణకు వచ్చినదే జీవితమునకంతకునూ ఫలము, కనుక చనిపోవువేళ ఏసంస్కారము దృఢముగా నుండవలెనను కోరిక యుండునో దాని కనుగుణముగా జీవిత ప్రవాహమును త్రిప్పుకొనవలెను. అహోరాత్రులూ దానివైపే దృష్టి యుండవలెను. మరణ సమయమున బలిష్టముగ మనస్సునందుండు భావనయే తన జన్మసార్థక మార్గమునకు దారిబత్తెముగ భావించి భావి జీవిత యాత్రకు బయలుదేరవలెను. కనుక రేపటినుండియే నిరంతరము మరణమును జ్ఞప్తియందుంచుకొని జీవితయాత్ర సద్భావములతో సత్యవాక్కులతో, సర్వేశ్వర స్మరణలతో, సాధుసంఘ సంబంధములతో పాపపు పనులనుకాని, ద్రోహచింతనకు కాని, ప్రాపంచిక

మైత్రి

వ్యామోహములకు కాని చోటివ్వక, అంత్యక్షణము **పుణ్యమయము, పవిత్రము మధురము కావలెను.** ఇట్టి క్రమముతో బ్రతికినన్నాళ్ళు సాధనచేయుచునే యుండవలెను. మంచి సంస్కారముపైపు మనసు మరల్చవలెను. వారి వారి దోషములను వారు గుర్తించినంతనే దిద్దుకొనుటకు ప్రయత్నించవలెను. **తన తప్పుతనకు తెలియగనే పునర్జన్మము కలిగినట్లే.** అది మానవుని జీవితమునకు నూతన బాల్యావస్థ. ఇదియే మానవునకు నిజ **మేలుకొల్పు**.

(ప్రే.వా.పు.3/4)

మైత్రి

మైత్రి అనగా నేమి? My Three అంటే Thought, Word, Deed.

(భ.వ్ర.పు.5)

(చూ॥ అలవర్చుకోవాలి, ప్రేమ, విశ్వము)

మైలురాళ్ళు

నీ ముఖారవిందము నందెప్పుడును చిరునవ్వు చిందులాడు నట్లుండును. నాకును, నా దర్శనము కొరకు తహతహలాడు వారికిని మధ్య అడ్డురావద్దు. వారి ఆరాటములో నిన్ను ప్రక్కకు త్రోసివేయవచ్చును. అప్పుడు వారిని తిరిగి త్రోసివేయు అధికారము నీకులేదు. నీవు నవ్వుచూ క్షమార్పణ కోరుకుని, రెండు చేతులు జోడించి నమస్కరించుట మాత్రము చేయవలెను.

బాహ్యావిషయముల ద్వారా నా సామీప్యమును పొందలేవు. నీవు నా ప్రక్కనే ఉన్నప్పటికిని చాలా దూరముగానే ఉందువేమో. నాకు ఎంతో దూరముననున్ననూ అతి సామీప్యముగా, సన్నిహితముగా నుండగలవు. సత్యము, ధర్మము, శాంతి ప్రేమల నంటిపెట్టుకొనియున్న నీవెంత దూరములోనున్ననూ. నాకు అతి సమీపమున నుందువు. నేనును నీకు అట్లే యుందును. అవియే మిమ్ములను నా దగ్గరకు చేర్చు మార్గములోని మైలు రాళ్ళు.

(శ్రీ.స.సూ.పు.95)

మోక్షము

క్రోధము మానవునకున్న జ్ఞానమును నాశనముచేయును. కామము కర్మనాశనము, లోభము భక్తి వినాశమును గావించును. కామ, క్రోధ, లోభములు వరుసగా కర్మ, జ్ఞాన, భక్తిహీనుని గావించును. అనగా మూర్ఖుని గావించును. క్రోధమునకు కామమే కారణము, కామము అజ్ఞానము వలన కలుగును, కాన త్యాగమనగా అజ్ఞానమును త్యాగముచేయుట (వదలుట) మోక్షము.

(వి.వా.పు.18/19)

శరీరాకారమువలన సుఖదుఃఖములు కలుగును. సుఖదుఃఖముల నుండి విముక్తి కలుగ వలెనన్నచో శరీర జ్ఞానమును పోగొట్టుకొనవలెను. శరీర జ్ఞానమును పోగొట్టుకొనవలెనన్నచో **స్వార్థపూరితములైన కార్యములను చేయరాదు.** అట్లు స్వార్థమును విడనాడుటకు **రాగద్వేషములు విడనాడవలెను. ఇట్టి కోర్కె మోక్షమునకు పరమశత్రువు. ఈ కోర్కెలో జనన మరణములను చక్రమునకు మానవుని బంధించు చున్నవి.** మానవుల బాధలకు ఇవియే మూలకారణము ఇట్టి విచారణ వలన జ్ఞానమును ప్రకాశింపజేసినప్పుడు మోక్షము సిద్ధించును. మోక్షమనునది స్వతంత్రము. అట్టి బాటలనుండి దూరమై ఏ సుఖదుఃఖ సంతోషములకూ చేరక స్వతంత్రమైన ఆనందమును అనుభవించునదే **మోక్షమని అందురు.**

(జ్ఞా.వా.పు.6)

"కర్మ ద్వారానే మోక్షసిద్ధి. భక్తితో కర్మచేస్తే సంసారభక్తి. జ్ఞానం కూడా కొంచెం వికసిస్తే వానప్రస్థ భక్తి. జ్ఞానరూపాన భక్తి పర్యవసించినప్పుడు చేసే కర్మ సన్యాస భక్తి. అది మోక్షమే. కర్మ చేయకపోతే పురోగతే కష్టం.

జ్ఞానులు కూడా కర్మ చేయక తప్పదు. కాని ఈ కర్మ వారిని అంటదు. హంసలు పాడి రెక్కల తో నీళ్ళలో దిగి విహరించి ఒడ్డుకు చేరుకున్నాక రెక్కలు విదిలించి కొంచెమైనా తడిలేకుండా చేసుకోగలవు. అటువంటిదే జ్ఞానుల కర్మాచరణ. అహంభావం లేకుండా, ప్రతిఫలాపేక్ష లేకుండా పనులు చేస్తారు. లోకక్షేమం కోరుతూ

జగత్కళ్యాణ సంధాయక కార్యకలాపాలు సాగించటం వారి స్వభావం.''

(ఉదయం ప్రత్యేక అనుబంధం పు.4)

శ్లో॥ సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః

అన్ని ధర్మాలు నీవు అనే తత్వాన్ని విసర్జించమన్నాయి. అన్ని ధర్మాలు అంటే ఏమిటి? అసలు ధర్మమంటే తెలిస్తే గదా! అన్ని ధర్మాలు వదలిపెట్టేది. ఇక్కడ ధర్మమనగా ఒక్కొక్క వస్తువునకు ఒక్కొక్క ప్రాణసమానమైన ధర్మగుణం ఉంటున్నది. అదే ఆ వస్తువు యొక్క సహజ ధర్మం. అగ్నికి వేడి ధర్మం. వేడిలేకపోతే అది బొగ్గుగా మారిపోతుంది. అది అగ్ని అనిపించుకోదు. చక్కెరకు తీపి ధర్మం. తీపిలేకపోతే అది కేవలం ఇసుక అవుతుంది. కాని చక్కెర మాత్రం కాదు. అదే విధంగా మానవుని ధర్మం ఏమిటనగా, వాంఛలు కలిగియుండుటయే! నిరంతరం వాంఛలు పెంచుకోవటమే మానవుని ధర్మం. **కనుక వాంఛలు త్యజించుటయే 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అని చెప్పబడుతుంది. ఈ విధానమే వైరాగ్యమని పిలువబడుతుంది.**

మోక్షమంటే విడుదల. ఉపాధిని ధరించిన జీవులంతా ఏదో ఒక అవస్థనుండి విడుదల కోరుదురు. కనుక ప్రతిజీవుడూ ముముక్షుడే! ప్రతి మానవుడు త్యాగి అయే తీరాలి. 'నకర్మణా, నప్రజయా, ధనేన, త్యాగేనైక అమృతత్వ మానశుః' ఇది చివరి సత్యం. దేహమును విడిచి పోయే వాడెవడూ పిడికెడు మట్టిని కూడా తీసుకెళ్ళడు.

నిగముల్ హరించి నిండు దూషణచేసి
సోమకాసురుడేమి సుఖమునొందె?
పరసతి నాశించి పదితలల వాడేమి
పట్టుకుపోయెను గట్టిగాను?
ఇల సూదిమొన మోప ఇయ్యజాలనటన్న
దుర్యోధనుడేమి దోచుకొనిపోయె?
పసిపాపలను కూడ కసిపట్టి చంపిన
కంసుడేపాటి కాచుకొనియె?
నేటి దుర్మార్గులకు కూడ నిదియె గతియు
సత్యమును దెల్పుమాట ఈసాయి మాట.

త్యాగము చేయని వానికి ప్రకృతి నిర్బంధముగా త్యాగము నేర్పుతుంది. అట్లుకాక మునుపే త్యాగమును నేర్చుకొనుట మంచిది. ముఖ్యముగా వాంఛలను త్యాగము చేయుట, తదుపరి సంపూర్ణ శరణాగతి తత్వముతో, అనన్యభక్తితో చిత్తమును భగవంతుడి కర్పించితివా ఆయనే నీయోగక్షేమాలను చూసుకొంటాడు. యోగము వద్దు. తపస్సు వద్దు. శక్తిలేక ఏ ఇతర సాధనలు చెయ్యలేక పోయిననూ సరే! అన్ని ప్రాపంచిక ధర్మములను విడిచిపెట్టు; చిత్తమును నాకర్పించి శరణుజొచ్చితివా, నిన్ను సమస్త పాపములనుండి విముక్తిని చేస్తానంటున్నాడు భగవంతుడు. అట్టివానికి వర్ణాశ్రమ అవస్థలతో గాని, అర్హతలతోగాని సంబంధం లేదు. వంశమనే దానిని విచారించినప్పుడు

వాల్మీకి ఎవ్వరి వంశమువాడు?
కులమా ప్రధానమనుకుంటే
నందనుడు ఏకులమున పుట్టె?
వయస్సు అనుకుంటే
వసుధ ధృవుడెంత వయస్సు కలిగి యుండె
మతిని చద్దామా అంటే
విదురున కెంత వితరణ మతియుండె
తెలివి చూద్దామా అంటే
తిమ్మన కెంత తెలివియుండె

ఇవేవి ప్రధానం కాదు. శరణు జొచ్చిన చాలు. మనస్సును స్థిరముగా ఒక్క భగవంతునిపై మాత్రమే నిలిపి ప్రపంచ ధర్మానికి వస్తు ప్రపంచానికి దూరముగా నుండిన చాలు. అలాగని ప్రపంచము నుండి పారిపోయి అడవుల చేరుట భక్తికానేరదు. సంపూర్ణ శరణాగతి నొందినవానికి ఇతరమైన సంబంధము లేవియు ఉండవు. బాధ, సుఖము, అను ద్వైత భావముండదు. నిరంతరము దైవ భావలో ఉన్నవాడికి ద్వైతభావము ఎలా ఉంటుంది? చిత్తము భగవంతుడి కర్పితము చేయకుండా ఎన్ని ప్రాపంచిక ధర్మాలను

మోక్షానందము

పాటించినా ప్రయోజనం ఉండదని భక్తులు తెలుసుకోవడం ఎంతైనా అవసరము.

(శ్రీ.భ.ఉ.పు.35/36)

మంచిగావుండు, మంచి చెయ్యి మంచి చూడు, మంచిది వినుము. ఇదే మోక్షానికి దారి.

(సా.పు.91)

మోహము పోతే మోక్షమే

(సా.పు.104)

(చూ॥ ఆత్మజ్ఞానము, ఇంద్రియనిగ్రహం, గుణలక్షణము, జీవన్ముక్తి, బ్రహ్మసాక్షాత్కారజ్ఞానము, శ్రీమంతుడు, సగుణభక్తి)

మోక్షానందము

(చూ॥ నిష్కామకర్మ)

మోక్షాన్వేషణము

ఆనందమును, ప్రశాంతతను అర్థించు వారందరూ మోక్షమును అర్థించినట్లే. ఆనందమును, ప్రశాంతతను ఆర్థించని వారెవరు? నీకు శాశ్వతానందము, శాశ్వత ప్రశాంతత లభించినపుడు మోక్షము ప్రాప్తించును. తాత్కాలికానందముతో, **అస్థిరమైన శాంతితో అలసట చెందిన మానవుడు తుట్టతుదకు శాశ్వతానందమునకై, శాశ్వత ప్రశాంతతకై కృషిచేయును. అదే మోక్షాన్వేషణము.** శాశ్వతానందమును, శాశ్వత ప్రశాంతతను పొందు మార్గము తెలిసినవారు ఇంద్రియ భోగలాలసత్వమనే డొంక దారుల వెంట పరువెత్తరు.

(ప.ప్ర.పు6)

మోసపోకండి

(చూ॥ నమ్మకండి)

మోహనిద్ర

(చూ॥ మదాలస)

మోహము

"అర్జునుడనగా స్వచ్ఛమయిన స్వభావము కలవాడని కదా! సమయ సందర్భములను యోచించక ఈ ఏడుపు ఏమిటి? యుద్ధమూ కుత్తుకపై కూర్చొన్నది, యుద్ధమేఘములు దట్టమైన స్వరూపమును ధరించి ప్రతిధ్వనించుచు చుట్టుముట్టుచున్నవి. యెదుట నిలచిన శత్రువులా! యెప్పుడా అని పురోహిత లూగుచున్నారు. వారు యింతవరకూ మీపై చూపిన అన్యాయ, అక్రమ, అనాచారములా లెక్కలేనన్ని, అంతమాత్రముతో పోక ధర్మరీతిగా మీకు రావలసిన రాజ్యమును కూడా మ్రింగివేయుటకు సిద్ధముగా నున్నారు.

యింతవరకూ మీరు సత్యనిష్టకు వైదొలగక అనేక కష్టాల పాలై తిరి. వారిచ్చిన నియమములు, సమయములు కూడనూ గడిపితిరి. కడకు రాజీ ప్రయత్నములా వేరుగా చెప్పనక్కరలేదు. ఎంతవరకూ చూడవలెనో అంతవరకూ చిచితిమి, అన్నియూ నిష్ఫలమాయెను. **అధర్మమార్గ, దురహంకార, దురాచార శీలుడైన దుర్యోధనుని కన్నులు తెరిపించవలెనన్న ఒక్క యుద్ధము తప్ప వేరు మార్గము లేదు,** యిది నేటి సంకల్పము కాదు! దీనికి పూర్వము పెద్దలందరూ చేరి అన్ని విషయములూ యోచించి యుద్ధమనివార్యమని నిర్ణయించిరి. మీ సోదరులను, నీవును అందులకు సమ్మతించి, మంచిదని వప్పుకొంటిరి. ఆనాటినుండి యుద్ధమునకు తగిన ప్రయత్నము లన్నియూ జరుపుచునే యున్నారు. నీవునూ అందులోనే మునిగి యుంటివి, యుద్ధమునకు సిద్ధమని ఈనాడు వెనుకంజ వేయుటకు యేమిటి ఈ పిరికితనము? ఈ యుద్ధము హఠాత్తుగా వచ్చిపడినదికాదే! కావలసిన సామాగ్రి ఎంతో కాలమునుండి సేకరించితివే! ఆనాడు కాయలు, కసురులు తిని కైలాస నాథుని మెప్పించి పాశుపతాస్త్రాన్ని సంపాదించితివి, దేవేంద్రలోకము నకు పోయి వారి మెప్పుల కుప్పవై దివ్యాస్త్రములను ఆర్జించితివి, అరణ్యవాసం గడిచింది, అజ్ఞాతవాసం నడిచింది, కౌరవుల పాపం పండినదని తలంచితివి, మీ దుర్దశనిశకు

ప్రభాతభేరి మ్రోగింది. ఇప్పుడేమిటి నీకీ దుర్దశ పట్టినది? ఈ దౌర్భాగ్యము ఏ శాస్త్రనీతి? **నీదియా ధర్మప్రాణమైన క్షత్రియజాతి, శౌర్య ధైర్య, పరాక్రమ బలములు కలిగియూ ఈ దిక్కుమాలిన వైరాగ్యము ఏ వైపునుండి వచ్చినది? బావా! ఈ పిరికి ప్రవర్తన నీకేకాక నీ పూర్వీకులైన ఆర్యపురుషు లందరికి తీరని తలవంపులు! ఛీ 'చాలు, చాలు' సిగ్గులేని ఈ పరికితనము. క్షత్రియు లందరికీ కళంకము. క్షత్రియునకు యుద్ధము రాచబాట! అసలు క్షత్రియ జాతికిది స్వర్గమార్గము,** ఈ సమయమున యుద్ధమే వద్దనిన అపకీర్తుల పాలగుదువు. స్వార్జితమైన ఆస్తి నీకు విజయుడను బిరుదు. యావజ్జీవిత మంతయూ ధారపోసి సంపాదించిన యాకీర్తిని మట్టిపాలుచేతువా? క్షుద్రమైన ఆ మోహములను పరిత్యజించుకో బావా! నా మాటవిను. గడచిన అమరావతి సంఘటనను జ్ఞాపకము చేసుకో.

ఊర్వశి తనకుతానై వలచిరాగా వలదని తిరస్కరించితివి. నీ వలన నాకు పుత్ర ప్రాప్తిని చేకూర్చమని అడుగగా, నన్నే పుత్రునిగా భావించమని కోరితివి. అట్టి అనన్య మహామునివి, జితేంద్రియుడివి. ఆ సమయమున ఊర్వశి తన పాచిక చెల్లక విఫల మనోరథురాలై, నపుంసకునివి కమ్మనమని ఇచ్చిన శాపమే కదా, విరాట నగరమున తీరినది, అట్టి ధీరత్వ మెక్కడకు పోయెను? ఈ దీనత్వ మెక్కడనుండి వచ్చెను? ఛా! యిట్టి పిరికిపందవు, అర్ధరాత్రిలో పరుగెత్తి వచ్చి నిద్ర పోవుచున్న నన్ను యుద్ధమున సహాయమునకు రమ్మనమని లేపుకొని వచ్చినది. ఈ పిరికి ప్రతాపమును చూపుటకా? చాలు చాలు, యీ దౌర్భాగ్యపు మోహమును నిర్మూలనము చేయుము, దౌర్బల్యమును మంటకలుపుము. బలమును వహించుము'' అనెను.

ఈ సమయమున కృష్ణపరమాత్మ నాల్గు పదములను ఉపయోగించెను. **1. కశ్మలమని, 2. అనార్యజుష్టమని, 3. అస్వర్గ్యమని, 4. అకీర్తికరమని. అందులో కశ్మలమనగా అజ్ఞాతమనియు, అనార్యజుష్టమనగా ఈశ్వర స్వభావ సుఖహాని అనియు, అస్వర్గ్యమనగా ఆధి దైవిక సుఖహాని అనియు, అకీర్తికరమనగా ఆధి భౌతిక సుఖహాని అనియు సూచించినది, పౌరుషాన్ని పురికొల్పే క్షాత్రరక్తాన్ని కదిలించే శ్రీకృష్ణుని మాటలు అర్జునునిపై కొంత పని చేసినవి.** ఈ మాటల కిరణములతో అర్జునునిలోని కరుడు కట్టిన తమోగుణము కొంత కొంత కరుగుట మొదలిడినది, రజోగుణము కొంత పులకరించినది. ఆ రాజసిక తీక్షణతతో అర్జునునికి తిరిగి నోట తడి యేర్పడి ప్రసంగమునకు ప్రయత్నిస్తాడు. అక్కడ అర్జునుడు **"కథం?"** అని కృష్ణుని ప్రశ్నిస్తాడు. దీనిని సూక్ష్మంగా యోచించిన ఈ పదము యొక్క లక్ష్యము చక్కని గుట్టును తెలుపుచున్నది. అదియేమన భగవత్ గీత ఏమి చేయవలెనో అను విషయమును కాక, యెట్లు చేయవలెనో అనునది తెలుపుచున్నది. **"కథం" అనగా యేవిధంగా అని తలంచవలెను.** దీనిని బాగుగా గ్రహించవలెను. ముఖ్యముగా గమనించవలెను.

(గీ.పు.13/15)

మోహమున మునిగియుండు మూఢబుద్ధి
ముక్తి యననేమి తెలియదు ముగ్ధబుద్ధి
దుష్టయననేమొ తెలియదు దొడ్డబుద్ధి
చెడ్డనే నిత్యంబు స్మరించు గొడ్డుబుద్ధి

(ము.ము. పు. 88)

(చూ॥ దౌర్బల్యము, ప్రేమ, బ్రహ్మసాక్షాత్కారజ్ఞానము, మాయ)

మోహసాగరము

(చూ॥ వేతనము)

మౌనము

భౌతికంగా చూస్తే గాఢనిద్రలో శాంతి లభిస్తుంది. సంకల్ప రాహిత్యమైనప్పుడు శాంతి కలుగుతుంది. కాని సంకల్పాన్ని అరికట్టడానికి వీలుకాదు. కనుక సాధ్యమైనంతవరకు దినంలో ఒక గంట మౌనం పాటించాలి.

మ్యాక్స్‌ముల్లర్

అతిగా మాట్లాడితే తలలో నరాలన్నీ బలహీనమైపోతాయి. పవిత్రమైన మాటలు మాట్లాడితే బ్యాటరీ ఛార్జ్ అవుతుంది. అపవిత్రమైన మాటలు మాట్లాడితే మీ జీవితం ఆధోగతి పాలవుతుంది.

మితంగా మాట్లాడే వాడు సమాజంలో సత్కీర్తి పొందుతాడు. ఊరికే వాగుడు వాగకండి. అతిభాష మతి హాని. మిత భాష అతి హాయి.

మీరు శ్రీమంతులే కావచ్చు, లక్షాధికారులే కావచ్చు Simple Living, High Thinking అలవర్చుకోవాలి. ఆడంబరానికి పోకూడదు. ఆడంబరానికి వెళ్తే ఆహంకారం బయలుదేరుతుంది.

(దే.యు. పు. 14)

(చూ॥ నగర సంకీర్తన)

మ్యాక్స్‌ముల్లర్

ప్రేమస్వరూపులారా! నిజంగా భారతదేశం ఎంతటి పుణ్యభూమో, జ్ఞానభూమో, కర్మభూమో, త్యాగభూమో, యెగభూమో చెప్పలేము. ఇట్టి పవిత్రమైన భారతదేశంలోనే పుట్టి ఇక్కడే మరణించాలని విదేశీయులు కూడా ఎంతో ఆశించారు. మాక్స్‌ముల్లర్ తనకు ఏ జన్మ వచ్చినా భారతభూమిలోనే జన్మించాలని కోరుకున్నాడు. **వేదమును సరియైన రీతిలో విచారణ సల్పినాడు మ్యాక్స్‌ముల్లర్. భారతదేశములోని ప్రతి మట్టికణము పవిత్రమైనది అన్నాడు. ఇంతటి సత్యాన్ని గుర్తించినవాడు కనుకనే, మ్యాక్స్‌ముల్లర్‌ను 'మోక్షముల్లర్' అన్నారు.** విదేశీయులే ఇట్టి పవిత్రతను అందుకొని ఆనందాన్ని అనుభవిస్తుంటే భారతీయులు మాత్రం దీనిని మరచి పోతున్నారు. విత్తనం చెట్టుగా మారిపోతున్నది. గ్రుడ్డు పిట్టగా మారిపోతున్నది. బిడ్డ తల్లిగా మారిపోతున్నది. కాని, మానవుడు దేవుడుగా పరివర్తన చెందటంలేదు. మానవత్వం నుండి దానవత్వానికి మారిపోతున్నాడు. ఇది మంచిదికాదు. ముందుకుపోవాలి. ప్రమోషన్ రావాలి. కాని, రివర్స్‌లో పరుగెత్తకూడదు. పశుత్వం నుండి వచ్చారు, **మానవత్వంలో జీవిస్తున్నారు. దివ్యత్వముతో అంత్యము కావాలి. ఇదే మానవత్వము.**

(స.సా.మా.96పు.69/70)

యంత్రము

అనేక మంది సైంటిస్టులు జగద్వ్యాపకమైన నూతన యంత్రములను కనిపెడుతూ వస్తున్నారు. కాని, ఇన్ని యంత్రములను కనిపెట్టిన యంత్రమును ఈనాడు సైంటిస్టులు గుర్తించడం లేదు. భూమి చుట్టూ ప్రదక్షిణ చేసే గ్రహాలను సృష్టిస్తున్నారు. చంద్రునికి పైకి పోయే వాటిని కూడా సృష్టిస్తున్నారు. సోలార్ పవర్‌తో ఎంతో చేస్తున్నారు. కాని, **ఈ అన్ని యంత్రములను సృష్టించిన గొప్ప యంత్రము ఒకటి ఉంటున్నది. ఏమిటా యంత్రము? మానవదేహమే!** ఇట్టి యంత్రము యొక్క రహస్యాన్ని గుర్తించడానికి ఎవ్వరూ ప్రయత్నించడంలేదు. బయటి యంత్రాలను చక్కగా పరిశీలన చేస్తున్నారు. లేబొరేటరీకి పోతున్నారు. పరిశోధనలు జరుపుతున్నారు. కాని, **What about your self? నిన్ను నీవు పరీక్షించుకోవాలి, పరిశోధన చేసుకోవాలి. నీలోని శక్తియే జగత్తంతా వ్యాపించి యున్నది. జగత్తునందున్న శక్తియే నీయందు ఉన్నది. ప్రపంచమంతా Reflection of the inner being. నీ కంటే గొప్పవాడు ఈ లోకంలో లేడు.** అన్ని శక్తులూ నీలోనే ఉంటున్నాయి. ఆకర్షణ శక్తి, విద్యుత్ శక్తి, కాంతిశక్తి, అగ్నిశక్తి అన్నీ నీలోనే ఉంటున్నాయి. X-Ray Power కూడా నీలోనే ఉంటున్నది. **ప్రతి వ్యక్తీ ఒక చిన్న కంప్యూటరు. ప్రతి వ్యక్తీ ఒక చిన్న జనరేటరు. ప్రతి వ్యక్తీ ఒక కాంతి జ్యోతి.**

వైజ్ఞానికులు ఉన్నదానినే వినియోగిస్తున్నారు. కాని, లేని దానిని సృష్టించి వినియోగించటం లేదు. భూమికి ఆకర్షణ శక్తి ఉంటున్నది. ఇది దీని సహజశక్తియే. కాని, న్యూటన్ పరిశోధన చేసి దీనిని కనిపెట్టాడు. ఇక్కడ వైజ్ఞానికులు యొక్క అజ్ఞానం ఎంతవరకు పనిచేస్తున్నదనేది మీరు గమనించాలి. సహజంగానే ఉన్నదానిని కేవలం పరిశోధనలు చేసి ఉన్నది ఉన్నట్లుగా చెప్పిన వైజ్ఞానికుని పేరు ప్రపంచ వ్యాప్తి అయిపోయింది. కాని, అందరూ ఉన్నదాని సంగతి మరచిపోతున్నారు. **ఉన్నది అనగా ...అదే 'సత్'. ఆ 'సత్'ను పరిశోధన చేసి "అది-ఉన్నది"** అని చెప్పిన వాని పేరు సార్థకమైపోయింది. కాని, అసలు ఉన్నదాని వ్యాప్తి ఏమాత్రం కాలేదు. **అదియే దివ్యమైన శక్తి.** అలాంటి శక్తియే సూర్య చంద్రాదులయందు,

యజుర్వేదము

నక్షత్రముల యందు, భూమి యందు, ప్రతివ్యక్తి యందు - సర్వత్రా వ్యాపించి యున్నది.

(శ్రీభ.ఉ.పు.143/144)

యజుర్వేదము

యజ్ అనే ధాతువు నుండి పుట్టినది. దీనికి అనేక అర్థములున్నవి. ప్రధానముగా దేవపూజ అనియు దాన ధర్మాదులనియు అర్థము. **యజ్ఞయాగాది క్రియాకలాపాన్ని వివరించే వేదం యజుర్వేదము**. దీనినే అధర్వవేదమని కూడా చెప్పుదురు.

దీనికి రెండు సంప్రదాయములు కలవు. ఆదిత్య సంప్రదాయమనియు, రెండవి బ్రహ్మసంప్రదాయ మనియు. బ్రహ్మసంప్రదాయమే కృష్ణయజుర్వేదమనియు, ఆదిత్య సంప్రదాయమే శుక్ల యజుర్వేదమనియు అందురు. శుక్ల యజుర్వేదము ఉత్తర భారతములోను, కృష్ణ యజుర్వేదము దక్షిణ భారతము లోను ప్రసిద్ధము. ఇది బుక్ సంహితము దగ్గరగా ఉంటుంది. దేవ పూజకు హవిస్సులు సమర్పించుటే ఈ మంత్రముల యొక్క ఉపయోగము. ఈ కృష్ణయజుర్వేదము నకు 86 ప్రధాన శాఖలు మాత్రమే. ఉన్న కొన్ని శాఖలే ఇంత మహత్తరమైనవై ఉండగా అన్ని శాఖలు ఉండి ఉండిన దీని విశిష్టత వర్ణనాతీతము. వేదము ఘనతను వర్ణింపనెవరి తరముకాదు. ఇది అవాఙ్మానసగోచరం. **'యతోవాచ నివర్తంతే అప్రాప్యమనసా సహ'** ఈ సత్యాన్ని గుర్తించినవాడు ధన్యుడు. వాడే పూజ్యుడు. పురుషార్థమును సార్థకము గావించుకొన్నాడు.

(లీ.వా.పు.12/13)

(చూ॥ ఈశావాశ్యము, సోషలిజము)

యజ్ఞఫలము

"మన శరీరమే యజ్ఞ వాటిక. మనము నివసించే ఈ ప్రపంచమే భగవంతునికి నివేదన. భక్తి, జ్ఞానము అనబడే అగ్నిజ్వాలలు నివేదనను స్వీకరించి పవిత్రంగావిస్తాయి. **ఆత్మపరమాత్మలో, పురుషుడు పురుషోత్తమునిలో విలీనం కావటమే యజ్ఞఫలం"**

(స.శి.సు.నా.పు.23)

యజ్ఞము/యజ్ఞములు

యజ్ఞ మనగా ఏమిటి? "యజ్ఞో వై విష్ణుః. కనుక, యజ్ఞ మనగా విష్ణు స్వరూపమును భజించటమే. విష్ణుస్వరూపానికి అర్పితం గావించటమే. అయితే, దేనిని అర్పితం చేయాలి? లౌకికమైన ధన కనక వస్తు వాహనాదులను కాదు. మీ **హృదయాన్ని అర్పితం చేయాలి. దుర్గుణములను, దురాలోచనలను త్యజించి సద్భావములను, సత్ప్రవర్తనను సచ్చింతనను భగవంతునికి అర్పితం గావించాలి. "యద్భావం తద్భవతి" మీ భావం ఎలాంటిదో మీకు అలాంటి ఫలితమే లభిస్తుంది.**

సత్య స్వరూపుడైన భగవంతుణ్ణి పొందే నిమిత్తమై ప్రాచీన ఋషులు ఈ వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞాన్ని ప్రారంభించారు. భగవంతుడే వేద పురుషుడు. ఈ సప్తాహంలో సప్త ఋషులు, సప్త సముద్రములు సప్త వర్ణములు, సప్త స్వరముల తత్త్వము చేరియుంటున్నది. ఒకొనొక సమయంలో ఒక వ్యక్తి ఒకచోట యజ్ఞం జరుగుతుంటే అక్కడికి వెళ్ళి యజ్ఞ యాగాది క్రతువుల పేరుతో విలువైన ఆవునేతిని అగ్నిపాలు చేయడం మూర్ఖత్వమని విమర్శించాడు. అతని మాటలు విని అమ్నాయవాచస్పతి అనే పండితుడు లేచి అతనికి బుద్ధి చెప్పాడు - " అయ్యా! యజ్ఞముయొక్క అంతరార్థాన్ని గుర్తించకుండా విమర్శించడానికి పూనుకున్న నీవే పరమ మూర్ఖుడవు. రైతు నాలుగుమూటల వడ్లు తీసుకు పోయి మడిలో చల్లుతాడు. ఏమిటి, ఈ పిచ్చి మనిషి తినడానికి తిండి లేకపోతే నాలుగు మూటల వడ్లను బురదలో పడవేస్తున్నాడే. అని ఎవరైనా అనుకుంటారా? ఈనాడు నాలుగు, మూటల వడ్లను బురదలో చల్లితే నాలుగు నెలల తరువాత నలభై మూటలను ఇంటికి తెచ్చుకోగలడు. యజ్ఞము కూడా అటువంటిదే". అది 'వేస్ట్' కాదు,

భగవంతునికి 'టేస్ట్'! ఢిల్లీ రేడియో స్టేషన్‌లో మాట్లాడే మాటలు అదే సమయంలో ఇక్కడ కూడా రేడియోలో వినగల్గుతున్నారు కదా. అది ఎట్లా వస్తున్నది? ఆ శబ్ద తరంగములు గాలిలోని విద్యుత్ తరంగములతో చేరి సర్వత్ర వ్యాపించిపోతున్నవి. అదే విధంగా, యజ్ఞ శాలలో పండితులు దివ్యమైన మంత్రాలను ఉచ్చరిస్తూ యజ్ఞకుండంలో అర్పితం చేయడంవల్ల ఆ మంత్ర మహిమ గాలిలో సర్వత్ర వ్యాపించిపోయి వాతావరణాన్ని పరిశుద్ధిగావిస్తుంది.

యజ్ఞయాగాది క్రతువులు ముహూర్తములు, వేదమంత్రములు మహత్తరమైన అంతరార్థముతో కూడినవి. కవరుపై అడ్రసు సరిగా వ్రాసి పోస్టు బాక్సులో వేస్తే, అది ప్రక్క వీధికైనా వెళ్ళగలదు. ఎన్నో మైళ్ళ దూరంలో ఉన్న ఊరికైనా వెళ్ళగలదు. అడ్రసు సరిగా వ్రాయకపోతే అది ఎక్కడికీ పోయి చేరదు. అడ్రసు ముఖ్యం. పండితులు ఒక్కొక్క మంత్రమును ఉచ్చరిస్తూ యజ్ఞకుండంలో అర్పితం చేస్తూ వచ్చారు. మంత్రమే అడ్రసు. మంత్రమును స్వరబద్ధంగా చెప్పినప్పుడు వారు అర్పితం చేసింది సరియైన స్థానానికి చేరిపోతుంది. **పవిత్రమైన మంత్రములను దివ్యమైన భావాలతో స్వరబద్ధంగా, సుస్పష్టంగా చెప్పాలి.**

(స.సా.న.99పు.302/303)

వేదమునకు ఛందస్సు ప్రాణ సమానమైనది. 'చత్' అనే ధాతువు నుండి పుట్టినది ఛందస్సు. 'ఛత్' అనగా ఆనందము, ఆహ్లాదము, ఉత్సాహము, యజ్ఞములన్ని కూడా ఆనందమయములైనవి. ఉత్సాహకరమైనవి. ఆత్మప్రాప్తిని చేకూర్చేవి. వేద మంత్రములకు అర్థము గుర్తించి అనుభవించేప్పుడే ఆత్మ మనకు గోచరమవుతుంది. **"విష్ణోవై విష్ణుః" యజ్ఞ పురుషుడు విష్ణువని** దీని అంతరార్థము. **విష్ణువుకు యజ్ఞభృత్ అని పేరు.** యజ్ఞభృత్ అనగా యజ్ఞమునకు యజమాని. అధిపతి. యజ్ఞమునకు "తానే" నాథుడైనప్పుడు, దాని విశిష్టత ఎంత గొప్పదై ఉంటుందో మనము విచారించుకొనవచ్చును. అంతే కాదు **'యజ్ఞ కృత్' అని కూడా అతనికి పేరు, యజ్ఞము** చేసే వాడని, యజ్ఞమును పోషించే వాడని కట్టకడపటికి యజ్ఞమును ధ్వంసము చేసేవాడని కూడా దీని అర్థము. అనగా సృష్టి స్థితి లయములకు ఇతనే మూలకారణము.

'యజ్ఞభుక్' అని మరొక పేరు, అనగా మనము అర్పితముచేసిన సమస్త పదార్థములను, హోమము చేసిన సుగంధ ద్రవ్యములను, మంత్రములను, యంత్రములను ఆరగించే వాడని దీని అర్థము. పవిత్ర మంత్రముల చేత స్వాహా కారములతో భగవంతునికి అర్పితము చేసిన ప్రతి పదార్థమును భగవంతుడు ఆరగిస్తాడు. అయితే భగవంతునికి ఆరగింపు చేసే పదార్థములు చాలా మధురమై, రమ్యమై, అతి ఆకర్షణీయమై, పరిశుద్ధమై, పవిత్రమైనవిగా ఉండాలి.

(స.సా.మా.84 పు.73)

ఇంద్రుడు చేతికి అధిష్ఠానదైవం. ఇంద్రయజ్ఞం అంటే సర్వహస్తములను చేర్చి క్రియాసక్తిని సమాజశ్రేయస్సు కోసం ఏకముఖంగా అభివృద్ధి చేసేది. బృహస్పతి బుద్ధికి అధిష్ఠానదైవం. బృహస్పతి యజ్ఞం అంటే మానవుల అందరి బుద్ధిని ఏకోన్ముఖంగా వికసింపచేసేది. చంద్రుడు హృదయమునకు అధిష్ఠాన దైవము. చంద్రయజ్ఞమంటే మానవ హృదయములన్నీ కలిసి ఒకే కార్యములో నిరతులయ్యేటట్లు చేసేది. సూర్యుడు కంటికి అధిష్ఠానదైవం. సూర్యయజ్ఞమంటే సర్వుల దృష్టిని ఏకదృష్టిగా చేసేది. ఈ విధంగా ప్రతి యజ్ఞము మానవుల తత్త్వములపై కనిపించకుండగా గొప్ప ప్రభావము చూపుతుంది. కారణం ఈ మంత్రములు, ఈ శబ్దములు ఎంతో శక్తివంతములైనవి.

(వ 61-62.పు.210)

యజ్ఞమనగా ఏమిటి? పేరు చాలా పెద్దదే గానీ మన నిత్యజీవితములో మనము చేసే సర్వకర్మలు యజ్ఞ స్వరూపమే. యజ్ఞము చేయాలనుకుంటే గొప్ప తపస్సు చేయనక్కరలేదు.

న తపాంసి న తీర్థాని నశాస్త్రాణి జపానహి
సంసార సాగరోత్తారే, సజ్జనం సేవనం వినా

తపస్సు చేయనక్కరలేదు. తీర్థయాత్రలు సలప నక్కరలేదు. జపములు ఆచరించనక్కరలేదు. ఎదుటి మనిషి సేవలు మనం చేస్తుంటే, ఎదుటివాని బాధలు మనం నివారణ గావిస్తుంటే దాని ఫలితము మనకు లభ్యమవుతుంది. సజ్జనుల సేవలు మనం చేయాలి. అట్టి సేవయే సమాజసేవ. సమాజసేవ వల్ల మనకు లభించేది ఏమిటి? సర్వేశ్వరానుగ్రహము మనం పొందగలము.

(ద.స.స.పు.6)

యజ్ఞములు రెండు విధములు: ఒకటి అంతర్ యజ్ఞము రెండవది బహిర్ యజ్ఞము. అంతర్ యజ్ఞమనగా జ్ఞానము చేత మానవుని యందున్న దైవత్వాన్ని దర్శించ యత్నించడం. ప్రతి మానవునియందు దివ్యత్వమైన దైవత్వమున్నది. అది ధ్యానము ద్వారా లభ్యమవుతుంది. ఈ దైవత్వాన్ని సందర్శించడానికి కొన్ని అర్పితము గావించాలి. మనస్సు బలి పీఠము, **ఈ మనస్సనే బలి పీఠంపైన మానవుని యందున్న దుర్గుణములను బలి చెయ్యాలి.** దైవమే నివాసముగా ఉన్న ఈ దేహములో ఈ దుర్గుణములు ఎట్లు వచ్చాయి?మానవ జన్మము ఒక్క జన్మముతో లభించినటువంటిది కాదు. అనేక జన్మముల తదుపరి మానవ జన్మ ప్రాప్తించింది. కనుక నరజన్మను కడ జన్మగా విశ్వసిస్తారు. **'మానవ' అనే పదమే మానవుడు అనేక జన్మల నుండి వస్తున్నాడని నిరూపిస్తున్నది. 'మ' అనగా కాదు 'నవ' అనగా క్రొత్తది. మానవ అనగా క్రొత్తది కాదు పాతదే అని దీని అర్థము.** 84 లక్షల జీవరాసుల తరువాత మానవ జన్మము వస్తున్నది. కడ జన్మమైన నరజన్మము లోపల గడచిన జన్మల గుణములన్నీ కూడా చేరుతుంటాయి. ఎన్నియో మృగజన్మలు, క్రిమి కీటకాదులు జన్మల నెత్తియుండ వచ్చును. వాటి తదుపరే ఈ నరజన్మ ప్రాప్తిస్తుంది.

జంతులక్షణాలకు కారణం: కనుకనే మానవునియందు, దివ్యత్వం ముండినప్పటికి మదము మానవుని బాధిస్తున్నది. **మదము మానవుని లక్షణము కాదు. దున్నపోతు లక్షణము.** మదముతో మనము సంచరించామంటే ముందు జన్మలో దున్నపోతుగా పుట్టినామని నిర్ధారణ చేసికొన వచ్చును. కొంతమంది చాలా **మూర్ఖంగా ప్రవర్తిస్తుంటారు. అది కూడా మానవ లక్షణము కాదు. ఇది గొర్రె గుణము.** మన మెప్పుడో గొర్రెగా పుట్టినామని నిర్ణయము చేసికొన వచ్చును. ఒక్కొక్కప్పుడు మానవునియందు **దొంగ బుద్ధులు బయలుదేరు తుంటాయి. ఈ దొంగబుద్ధి కూడా మానవుని గుణము కాదు. ఇది పిల్లి లక్షణం.** ఈ లక్షణము మనలో ఉంటే మన మెప్పుడో పిల్లిగా పుట్టి ఉంటామని నిర్ణయించుకోవచ్చు. ఒక్కొక్క సమయములో మానవుని **బుద్ధి అతి చంచలముగా ఉంటుంది. ఈ చంచలత్వము** కూడా మానవుని లక్షణముకాదు. **చంచలత్వమునకు పుట్టిన ఇల్లు, పెట్టిన పేరు కోతి.** ఈ లక్షణము మనలో ఉంటే, మనము కోతిగా ఒకప్పుడు పుట్టినామని నిర్ధారణ చేసికొన వచ్చును. నరజన్మకు పూర్వము కోతి జన్మ నెత్తినవారు, మానవులలో అధిక భాగముండటంవల్ల, చాలామంది చంచలత్వముతో కూడి యుంటున్నారు. ఇతరులచేత అనేక ఉపకారములు సహాయములు పొంది. వారికే అపకారం చెయ్యడం, కీడును సంకల్పించడం ఇలాంటి చర్యలకు పాల్పడు తుంటారు. తమను ఉన్నత స్థాయికి తెచ్చినవారికే చెడును కోరుతుంటారు. ఇది మానవుని గుణము కాదు! **పాలు తాగిన సర్పము విషమును చిందుతుంటుంది. పాలు, గ్రుడ్లు మధురమైన ఆహారమునందించిన యజమానినే ఈ పాము చంపుతుంది. సర్పమునకు కృతజ్ఞత లేదు.** ఈగుణము మనలో ఉండినప్పుడు మన మెప్పుడో విష సర్పముగా పుట్టినామని నిర్ణయము చేసికొనవచ్చును.

మనస్సుకే ఆహ్వానం: కనుక మనస్సనే బలి పీఠముపైన దున్నపోతు అనే మదమును, మూర్ఖత్వమనే గొర్రెను, దొంగబుద్ధి అనే పిల్లిని, చంచలత్వమనే కోతిని, కృతఘ్నుడనే సర్పమును బలి చెయ్యాలి. ఈ విధమైన

దుర్గుణములను దుష్టస్వభావములను బలి చేయడమే అంతర్ యజ్ఞము. దురదృష్టవశాత్తు ఈ అంతరార్థమును గమనించక మనము బాహ్యమైన జంతువుల బలి ఇస్తున్నాము. కనుకనే ఉన్న దుర్గుణములు మరింత అభివృద్ధి అవుతున్నవి.

ఈ యజ్ఞము వలన మానవునందున్న పవిత్ర గుణములను బలపరచుకొన వచ్చును. ఈ యజ్ఞములో ముఖ్యముగా ఇంద్రుని ఆహ్వానము అధికముగా జరుగుతుంది. ఇంద్రుడనగా ఎవరు? **ఇంద్రియముల కధిపతియైన మనస్సే ఇంద్రుడు.** ఈ మనస్సునే దానిని ఇంద్రియములు అనేక విధములుగా లోబరచుకొనడము చేత మనస్సునే ఇంద్రుని ఈ యజ్ఞములో ఆహ్వానించడము జరుగుతుంది. **ఈ ఇంద్రునకు మరొక పేరు పురుహూతుడు. అనగా అనేక పర్యాయములు ఆహ్వానింప బడునటువంటి వాడు. కనుకనే ఈ మనస్సునే దానిని మనము మరి మరీ ఆహ్వానిస్తుంటాము. ఈ మనస్సును వేదము రుద్రుడని కూడా పేర్కొంటుంది. ఒకే మనస్సు ఇంద్రుడని కూడా పేర్కొంటుంది. ఒకే మనస్సు ఇంద్రుడని, రుద్రుడని, పురుహూతుడని ఇన్ని పేర్లతో చెలామణి అవుతున్నది.** అయితే రుద్రుడనే పేరెట్లు వచ్చింది? **ఇంద్రియములను స్వాధీనము చేసుకున్న సమయములో ఇంద్రుడు. ఇంద్రియములను మధించి తాను సర్వాంతర్యామిగా సర్వేంద్రియములను ప్రకటించినపుడు రుద్రుడుగా రూపొందుతాడు. ఇతనే ఈశ్వరుడు. ఇంద్రియములను నిగ్రహించిన ప్రతి మానవుడు ఈశ్వరుడే.** మానవత్వము నుండి ఈశ్వరత్వమునకు బయలు దేరిపోవాలను కున్నప్పుడు ఇంద్రియములకు స్వాధీనమై ఉన్న మనస్సు కంటే ఇంద్రియములను వశం చేసుకున్న రుద్రునిగా మనము రూపొందడము సాధన లక్షణము. **ఏతావాతా మానవత్వము ఈశ్వరత్వముగా మారిపోవడమే అంతరిక యజ్ఞము యొక్క లక్ష్యము.** అనగా మనము ఇంద్రియములను వశము చేసికోవాలి. ఇష్టానుసారము ఈ మనస్సు పరుగెత్తకూడదు. మనస్సు ఇంద్రియములకు యజమాని. యజమానియైన మనస్సు తన పరిచారకుల వెంట పరిగెత్త కూడదు. **పరిచారకుల వెంట పరుగెత్తే ప్రభువు చులకనై పోతాడు. కేవలం అనుకరించే వాడుగా రూపొందుతాడు. అనుకరణ నీడవంటిది. నీడకు ఒక రూపము, ఒక నామములేదు.** ఈ రూపనామములు లేవు కనుక దీనికి కీర్తి లేదు. దీనికి ప్రాణము కూడా లేదు. ఈ ఇంద్రియములను అనుసరించడం చేత మనస్సు తన శక్తిని కోల్పోతుంది. **కనుకనే మానవుడు బానిసగా తయారవుతున్నాడు.**

ఇంద్రియాల నిగ్రహానికే యజ్ఞం: ఆశలున్న వాడే పరులతో సంబంధము పెట్టుకుంటాడు, పరులను ఆశ్రయించవలసి వస్తుంది. పరులతో కూడి, ఆడి తిరుగవలసి వస్తుంది. ఆశలేలేని వానికి ఎవ్వరితోనూ సంబంధము ఉండదు. కనుక మనము ఇంద్రియములతో సంబంధము పెట్టుకొనడం వలన ఆశలు పెరిగి పోతుంటాయి. ఇంద్రియాలను వశము చేసికొనడానికి ప్రయత్నము చేస్తే జగత్తంతా మన చెంతకు పరిగెత్తుకొని వస్తుంది. **నిజముగా ఈ యజ్ఞయాగాదులు ఇంద్రియనిగ్రహము కోసము చేసే ప్రధాన క్రతువులు,** యజ్ఞయాగాదులు చేస్తూ, ఇంద్రియాలను ఉద్రేక పరచుకున్నామంటే ఇది క్రతువుల యందు సంపాదించుకొనే పాప మవుతుంది. బాహ్యముగా జరిగే ఈ యజ్ఞముల అంతరార్థమును గమనించినప్పుడే వాటి విశిష్టతను తెలిసికొన్న వారమవుతాము. కనుక నిత్యజీవితములో మనము యజ్ఞముల ద్వారా తెలిసికొనవలసిన వెన్నో ఉన్నాయి. ఈ యజ్ఞముల స్వార్థం కోసము చేసేవి కావు. లోకకళ్యాణం కోసమై చేస్తున్నాము. ఇది నిజ తత్వాన్ని గుర్తింప చేసేటటువంటిది. దురదృష్టవశాత్తూ అంతరార్థములను గుర్తించలేక బాహ్యార్థములను మాత్రమే గ్రహిస్తూ బాహ్యమైన మార్గములను మాత్రమే అనుసరిస్తున్నాము. **ఇంద్రియాలను నిగ్రహించుకోలేక పోతే ఎన్ని సాధనలు చేసినా అవి వృధా అవుతాయి.**

పాతవాసనల బలి: మనలో అభివృద్ధి అవుతున్న

యజ్ఞోపవీతము

దర్భణాలను అదుపులో పెట్టుకొనుటకు తగిన కృషి చెయ్యాలి. పాత జన్మల వాసనలను మనస్సనే యజ్ఞ వేదికలపైన బలి ఇవ్వాలి. మానవునకు ప్రధానగా క్రోధము, ద్వేషము, అసూయ అధికంగా పెరుగుతున్నాయి. వీటికన్నింటికీ కారణము స్వార్థమే. స్వార్థముండడము చేతనే క్రోధము, ద్వేషము, అసూయాదులు పెరుగుతున్నవి. **క్రోధము అసూయ, ద్వేషము, చిరుత గుణములు, ~~ఈ~~ గుణములు మనలో ఉండరాదు. దేనినైనా నమ్మవచ్చును గాని, చిరుతపులిని నమ్మరాదు.** ~~ఈ~~కోప, తాప దంభ అసూయాదులను జయించినట్లుగా నటిస్తూ కొన్ని యుక్తులను కూడా మనము ప్రవేశ పెడుతున్నాము. ఈ యుక్తిని యోగముగా చెప్పుకొంటున్నాము. **ఇది యోగము కాదు. నక్క లక్షణము.**

~~ఈ~~ గుణములు మనలో అప్పుడప్పుడూ వస్తున్నాయి గనుక, వచ్చిన తక్షణమే ~~ఈ~~ మనస్సు అనే బలి పీఠముపై వానిని బలి ఇవ్వడానికి ప్రయత్నము చెయ్యాలి. ~~ఈ~~ బాహ్యయజ్ఞములు సంవత్సరమునకు ఒక పర్యాయము ఏదో ఒక ప్రదేశమునందు జరుపుతుంటాము. కానీ అంతర్ యజ్ఞవేదిక మన మెక్కడకు పోయినా వెంటనే ఉంటుంది. ఇది దేశకాల పాత్రలకు అతీతమైన వేదిక. ~~ఈ~~ పీఠము నిరంతరము నీడ వలె మన వెంటనే ఉంటుంది. దుర్గుణములు బయలు దేరిన తక్షణమే వాటిని సంహరించడానికి ప్రయత్నము చెయ్యాలి. ~~ఈ~~ విధమైన చర్యలకు సంసిద్ధులమైనప్పుడే దైవ ప్రీతికి అర్హుల మవుతాము. దైవానుగ్రహమునకు, దైవ ప్రీతికి పాత్రులు కావాలని కోరే ప్రతి వ్యక్తి ~~ఈ~~ దుర్గుణాలను మొదలు దూరం చెయ్యాలి. ~~ఈ~~ దుర్గుణాలను ఏనాడు దూరము చేస్తామో ఆనాడే మనలో దైవత్వం ఆవిర్భవిస్తుంది. దైవత్వము మనలో ఏనాడు ఆవిర్భవిస్తుందో ఆనాడే మనము **"మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః"** మనస్సే బంధనకు మోక్షానికి మూలకారణమని గుర్తిస్తాము.

కనుక మనము పవిత్రమైన హృదయాన్ని అభివృద్ధి గావించుకొని దివ్యత్వమైన ఆత్మతత్వాన్ని పెంచు కోవడానికి కృషి చేయ్యాలి.

(స.సా.న. 1983 పు.263/265)

(చూ॥ ~~ఈ~~క్షతేర్నాశబ్దం, జ్ఞానయజ్ఞము, శ్రద్ధ)

యజ్ఞోపవీతము

(చూ॥ అద్వైతదర్శనము)

యథార్థ జ్ఞానులు

యథార్థ జ్ఞానులు, 'క్షీరం క్షీరే యథాక్షిప్తం, తైలం తైలే జలం జలే సంయుక్త మేకతాం యాతి తథాత్మన్యాత్మవిన్మునిః' అనట్లు కేవల జ్ఞాన సిద్ధిని పొందినవాడు పాలలో పాలవలే, నూనెలో నూనెవలె, నీటిలో నీటి వలె లీనమైనట్లు స్థూల శరీర పతనానంతరము ఆత్మలో లీనమయి పోవును. కొంతమందికి మాత్రము కొన్ని కొన్ని సంస్కారములు మిగిలి ఉండును. ఆ సంస్కారములే సంకల్ప రూపముగా నిల్చి యుండును. ఆ సంస్కారములు తీరేటంతవరకు ఇష్టమొచ్చిన దేహముతో లోకములో సంచరిస్తూ వుండును. అదియును భగవత్ సంకల్పమువల్లనే. **వారినే దైవాంశ సంభూతులని అందురు.**

(సం. పు. 75)

యద్భావంతద్భవతి

మన భావములను పురస్కరించుకొనియే, మన ప్రవర్తన కొనసాగుతూ వస్తుంది. "యద్భావం - తద్భవతి". మన హృదయము పవిత్రమైనది. ఇందులో ఏ విధమైన అభ్యాసములను, తలంపులను మనము ప్రవేశ పెడుదుమో వాని ప్రభావమే ~~ఈ~~ హృదయం పొందుతుంది.

Sow an action - reap a tendency
Sow a tendency - reap a habit
Sow a habit -reap a character
Sow a character - reap a destiny
your are the maker of your destiny
You can do or undo it

కొన్ని సమయములలో - Emotional excitement ఉంటున్నది. అది కొంచెం చల్లార్చుకోవాలి. దీనిని మీరు Control చేసుకుంటే ఎంతో ఆదర్శ జీవులుగా ఉంటారు. మాటలు తగ్గించుకొండి - కొంత వరకు సత్యాన్ని గుర్తించండి - పవిత్రత పెంచుకొండి - జీవితమును ఆనందంగా జీవించండి.

జీవితములో ఏదీ Happy గాలేదు. అప్పటి కప్పుడు వస్తుంది. అప్పటికప్పుడు పోతుంది. అంతా Passing clouds. **Permanent Happiness ఒక్క దైవత్వములో మాత్రమే ఉంటున్నది. ఇది Heart to Heart -Love to Love.** ఇదే మీరు పెంచుకోవాలి. ఇదియే నిజమైన భక్తి ప్రపత్తులకు నిదర్శనము.

(దే.యు. పు. 110)

(చూ॥ కృష్ణుడు, యజ్ఞము, సంకల్పము)

యముడు

(చూ॥ ఆత్మజ్ఞానముయొక్కపరాకాష్ఠ, పాశము, భయము)

యాంతేమతిస్సాగతిః

ఒకానొక వృద్ధునకు అంత్యకాలం వచ్చినది. అతడు కన్నడ దేశమువాడు. అతడా తుది క్షణములలో, ఏదో మాట అస్పష్టముగా మాటి మాటికిని అనసాగినాడు. తాను ధనము దాచిన చోటును చెప్పుచున్నాడు. కాబోలు ననుకొని, కొడుకులు ఆ మాటను తెలిసికొనుటకు బహు ప్రయత్నము చేయగా, తుదకా మాటలోని మొదటి అక్షరము 'క' అని తెలిసినది. అప్పుడు వారు - కనకమా(బంగారమా?); కరా (ఆవుదూడా?); కనజా (ధాన్యపు కొట్టా?); అని అడుగగా, వృద్ధుడు అదియేదియు కాదన్నట్లు తల ఊపి, తన యెదుట చీపురు కట్ట నమిలివేయుచున్న బట్టెదూడ వైపు చేయి చూపి, ప్రాణం వదిలినాడు. **'కసబరిక' అనేది ఆ వృద్ధుడన్న మాట. కన్నడంలో కసబరిక అనగా చీపురు.** దూడ చీపురు పాడు చేయుచున్నదనియు, దానిని భద్రపరుచుడనియు నాతడు చెప్పదలచుకొన్న మాట. **తుది క్షణమున అతని మనస్సు చీపురు మీద నిల్చినది గావున, అతడు మరు జన్మలో, వీథులూడ్చి బ్రతుకువాడుగా పుట్టవలసి వచ్చింది. "యాంతే మతి స్సా గతిః"**

(స.సా.మే.99 వెనుక కవరు పుట)

యాగము

(చూ॥ థీమంతుడు, యజ్ఞము)

యాచన వద్దు

'అది కావాలి ఇది కావాలి' అని దేవుడిని ఏదీ కోరకూడదు. ఆయన యిచ్ఛ ప్రకారం అన్నీ జరగనీయాలి. తన అంత్యక్రియలను రాముడే చేయాలని జటాయువు కోరాడా? తన కుటీరాన్ని పావనం చేయమని శబరి రాముణ్ణి ఆహ్వానించిందా? ప్రేమ విశ్వాసం, పవిత్రత వీటిని సంపాదించి పెట్టుకోండి! రాముడే మీ దగ్గరకు నడుచి వస్తాడు. మిమ్మల్ని రక్షిస్తాడు.

శమదమాదులంటే స్వామి కృప అయాచితంగా లభిస్తుంది.

(శ్రీ.సా.గీ.పు.330)

యాజ్ఞవల్క్యుడు

(చూ॥ ఈశావాశ్యము)

యాత్రికుడు

నీవు భగవంతుని సమీపించడానికి వేసే ప్రతి ఒక్క అడుగుకు, భగవంతుడు కూడా నీవైపు పది అడుగులు వేసి ముందుకు వస్తాడు. ఈ తీర్థయాత్రలో ఆగడమనేది లేదు. ఇది నిరంతర ప్రయాణము. రాత్రింబవళ్ళు, లోయల గుండా, ఎడారుల గుండా, కన్నీళ్ళతో, చిరునవ్వుతో, జనన మరణాలతో సమాధుల నుంచి గర్భకోశం వరకు సాగే ప్రయాణం. రోడ్డు చివరకు వచ్చి, గమ్యం చేరుకొన్నప్పుడు, యాత్రికుడు తన నుంచి తనలోనికే

యాదవులు

పయనించినట్లు తెలుసుకొంటాడు. ఆ దారి సుదీర్ఘం, ఒంటరి ప్రయాణం, కాని ఆదారిలో నడిపించిన భగవంతుడు అంత సేపు తనలోనే ఉన్నాడు, చుట్టూ ఉన్నాడు, తనతోనే ఉన్నాడు, తన ప్రక్కనే ఉన్నాడు!

(అ.ష.పు.4)

యాదవులు

(చూ॥ గోపికలు)

యుక్తి

మొన్న కొయంబత్తూర్ ప్రసిడెంట్ చెప్పాడు యుక్తి చాలా అవసరమన్నాడు. దీనికొక ఉదాహరణము: ఒక ధనవంతుడుండేవాడు. అతన్ని పరీక్ష చేసే నిమిత్తమై శ్రీలక్ష్మి, దరిద్రలక్ష్మి ఇద్దరూ వచ్చారు. "మా ఇద్దరి లోపల ఎవరు అందంగా ఉన్నారు?" అని నిర్ణయించమన్నారు. అతను ఆలోచించారు. శ్రీలక్ష్మి అందంగా ఉన్నదంటే దరిద్రదేవత తనను వచ్చి పీడుస్తుందో ఏమిటో? దరిద్రలక్ష్మి బాగుందంటే శ్రీలక్ష్మి వెళ్లిపోతుందో ఏమో? ఏమి చేసేది అని ఆలోచిస్తే అప్పుడతనికి ఒక యుక్తి వచ్చింది. "మీరు అటూ, ఇటూ నడవండమ్మా, మీలో ఎవరు అందంగా ఉంటారో చెప్పుతా"నన్నాడు. వారట్లే చేశారు. "ఒకరు రండి మరొకరు పొండి" అన్నాడు. అప్పుడు చెప్పాడు **"అమ్మా! లక్ష్మీదేవి నీవు వస్తున్నప్పుడు చాలా అందంగా ఉంటావు అమ్మా! దరిద్ర లక్ష్మీ నీవు పోతున్నప్పుడు చాలా అందంగా ఉంటా"** వన్నాడు. ఆ విధముగా యుక్తితో ఇద్దరినీ తృప్తి పరచాడు ఈ విధముగా **యుక్తితో శక్తిని సంపాదించాలి.** అందువలననే **"నొప్పించక, తానొవ్వక తప్పించుకు తిరుగువాడు ధన్యుడు" అన్నారు. ఆ యుక్తే యోగంగా మారి పోతుంది ఆ యుక్తివలన నీకుగానీ, ఇతరులకు గానీ బాధలు కలుగకూడదు.**

(స.సా.జూ.1988 పు.147/148)

ప్రేమను పెంచుకోండి. ఆ ప్రేమనే విస్మరిస్తే మీరు మరణించిన వారితో సమానమే అవుతారు. సత్యం నాలుకకు ప్రాణం. ధర్మం చేతికి ప్రాణం, అహింస హృదయానికే ప్రాణం. కనుక వీటిని రక్షించుకోవాలి. 'శివ' అంటే అణుకువ, వినయము. అహంకార మనేటటువంటి 'శవం'ను ఆశ్రయిస్తున్నామే గాని, వినయ, విధేయతయైన 'శివం'ను మనం ఆశ్రయించడం లేదు. 'సత్యంజన విరోధాయ' అని భావించి సత్యమును చెప్పటం లేదు. **'అసత్యం జనరంజనం' అని భావించి అసత్యమును చెబుతున్నారు. జనాన్ని రంజింప జేస్తున్నారు** గాని, హృదయాన్ని రంజింపజేస్తున్నారా? హృదయాన్ని రంజింపజేయకుండా, ప్రజలను రంజింపచేసి ప్రయోజనం ఏమిటి? ప్రజలను సంతృప్తిపరచడాని కోసం ప్రయత్నిస్తున్నారు గాని, ఆత్మను సంతృప్తిపరచడానికి కోసం ప్రయత్నం చేయటం లేదు. **సత్యం చెప్పకపోయినా ఫరవాలేదు గాని, అసత్యం మాత్రం చెప్పరాదు.** సత్యం చెప్పలేకపోతే మెదలకుండా ఉండండి. అసత్యం మాత్రం చెప్పకండి.

ఒకానొక సమయంలో ఒక సాధకుడు 'సత్యాన్నే చెప్పాలి. అసత్యాన్ని చెప్పరాదు' అని భావించి అరణ్యానికి వెళ్ళి 'నమః శివాయ' అనే నామాన్ని ఉచ్చరిస్తూ జపం చేస్తూ కూర్చున్నాడు. అతనిచేత ఎట్లాగైనాసరే అసత్యం చెప్పించాలని ఈశ్వరుడు పట్టుపట్టాడు. ఒక జింకను తరుముకుంటూ వచ్చాడు మారువేషంలో ఆ ఈశ్వరుడు. ఆ జింక పరుగెత్తుకొని వచ్చి, ఆ తపస్వికి ఎదురుగానున్న పొదలో దాక్కున్నది. దీనిని ఆ తపస్వి చూచాడు. ఇంతలో మారువేషంలో జింకను ఈశ్వరుడు తరుముకుని వచ్చాడు. జింక విషయం ఆ తపస్విని అడిగాడు. ఆ తపస్వికి ఏమి చెప్పాలో అర్థం కాలేదు. అయితే జింకను చూచాడు. చూడలేదని చెబితే అసత్యమాడినవాడవుతాడు. 'చూచాను' అంటే ఆ జింక ప్రాణాలు పోతాయి. అసత్యం ఆడినవాడవుతాడు. అపకారం చేసినవాడవుతాడు. అతనికి మనస్కరించలేదు. ఆ సందిగ్ధము నుండి బయటపడేయ

మని భగవంతుని ప్రార్థిస్తాడు. **చక్కని 'యుక్తి'ని ప్రాసదించమని వేడుకుంటాడు. తక్షణమే భగవంతుడు ఆ తపస్వికి చక్కటి ఉపాయాన్ని కలుగజేస్తాడు.** అప్పుడు ఆ తపస్వి చెబుతాడు. "నాయనా! **ఏది చూచెనో అది పలుకదు. ఏది పలుకునో అది చూడలేదు" అని అంటాడు. (కన్నులు చూచినాయిగాని, వాటికి చెప్పడానికి నోరు లేదు. నోరు చెప్పగలుగుతుంది గాని అది చూడలేదు గదా!)** అని చెప్పి తప్పించుకున్నాడు. అప్పుడు ఈశ్వరుడు ప్రత్యక్షమై, **'ఈ యుక్తియే యోగము'** అన్నాడు. **పరులకు అపకారం గావించకుండా, ఉపకారం గావించి, ఉత్తమ మార్గంలో దానిని సంరక్షించేటటువంటి భావమే సరియైనటువంటి 'మానవత్వం'.** అసత్యమాడలేదు. అపకారం చేయలేదు. దానిని (జింక) రక్షించాడు ఆ తపస్వి. **ఇట్టి యుక్తిచేత సత్యాన్ని సాధించాలి. దైవ ప్రార్థనలచేత మనం కష్టములను దాటాలి. సర్వులకూ ఉపకారం చేసేటటువంటి సద్భావములు, ఉన్నత, ఉత్తమ భావములను పెంచుకుంటూ రావాలి. ఎవ్వరికీ మనం అపకారం చేయకూడదు.** మనం పరులకు అపకారం చేస్తే, ఏదో ఒక రోజున ఆ అపకారం వచ్చి మనకే తగులుతుంది. కనుక అపకారం చేయకండి. ఎవరికీ, ఏ విధమైన ద్రోహం తలపెట్టకండి. ఎవరినీ దూషించకండి. **ఇవన్నీ ప్రవృత్తి లక్షణాలేగాని, నివృత్తి లక్షణాలు కావు. "పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం". Help Ever, Hurt Never. దీనిని నేర్చుకోవాలి.** సాధ్యమైనంత వరకూ ఇతరులను బాధించకుండా చూచుకోండి. ఒకవేళ నీకు బాధ కలిగినా ఫరవాలేదు. **నీ బాధను భగవంతుడు వైదొలగించుతాడు. మనకై మనం మాత్రం ఇతరులకు బాధ కలిగించకూడదు. పరుల మంచిని చూచి ఆనందించండి. పరుల సుఖాన్ని చూచి సంతోషించండి. అప్పుడే మీరు ఆనందాన్ని పొందుతారు. సుఖాన్ని అనుభవిస్తారు.**

ప్రేమస్వరూపులారా! ఈనాడు శివరాత్రి శంకర రాత్రి. **చిదానందమును, ఆత్మానందమును అందించేవాడు శంకరుడు.** అలాంటి శంకరుని మన హృదయము నందుంచుకొని, ఆత్మానందాన్ని, బ్రహ్మానందాన్ని, నిత్యానందాన్ని, పరమానందాన్ని మనం అభివృద్ధి పరచుకొనిన వారమవుతాము.

(శ్రీ. ఏ. 2002 పు. 23/24)

యుక్తులు

గురునానక్ ఒకానొక సమయంలోపల హృషీకేశ్‌కి పొయాడు. అక్కడ నుంచి అందరు దివ్యమైన క్షేత్రమును దర్శిస్తున్నారు.తానుకూడా బదరీ పోవాలని వెళ్ళాడు. **మనభారతీయులలో ఉండిన బలహీనత ఒకటే. బదరీలో తల్లిదండ్రులకు కాని పెద్దలకుకాని పిండం పెడితే ఇంక వాళ్ళకు జన్మ ఉండదని విశ్వాసం. అక్కడ పండాలందరు పెరుక్కతింటారు.** పోయినవారందరిని డబ్బుడబ్బని పీడిస్తూ ఉంటారు. ఒక బండపైన కూర్చోబెట్టి అందరికి పిండాలు పెట్టిస్తున్నారు పండాలు. ఇక్కడ పెట్టిన పిండము స్వర్గములోనో నరకములోనో ఉండినవారికందరికి చేరుతుందని వాళ్ళ బోధలు. నదిప్రక్కనే పిండాలు పెడుతుంటే ఈ గురునానక్ అక్కడ నీళ్ళలో పోయి దిగాడు. తూర్పు వైపున తిరిగాడు. నీళ్ళు ఊరికే చల్లుతున్నాడు.ఈ పండాలంతా చూచారు. ఏమిటి ఈ పిచ్చివాడు: నదిలో ఉన్న నీరంతా గట్టుకు చల్లేస్తున్నాడే: అని అందరు నవ్వుతున్నారు. హాస్యాస్పదంగా చూస్తున్నారు. వీరు హాస్యం చేసే కొలదీ అతను మరింత వేగంగా నీళ్ళు చల్లుతూ వచ్చాడు. వీళ్ళపైకూడా చల్లాడు. ఆ పండాలంతా వచ్చి కోపంతో పిచ్చివాడా! ఎక్కడికి నీళ్లు చల్లుతున్నావన్నారు. **మా పంజాబులోపల మోగ అనే గ్రామములో మరొక మామిడితోట ఉంటుందాది.** ఆ మామిడితోటకు నీళ్ళు చల్లుతున్నా నన్నాడు. పిచ్చివాడా! ఉండేది బదరీలోపల. అలకనది నీళ్ళు ఇక్కడుంటున్నాయి, అక్కడ మోగ పంజాబులో ఉండే తోటకు నీళ్ళెట్లా చేరతాయి? అన్నారు. ఎక్కడో ఏలోకములోనో ఉన్న

యుగము/యుగములు

తల్లిదండ్రులకు ఇక్కడ పెట్టిన పిండాలు చేరుతుంటే నేనిక్కడ చల్లిన నీరు మోగాకు ఎందుకుచేరకూడదు? అన్నాడు ఇవి వాళ్ళ బుద్ధిని కదలించే యుక్తులు.

(శ్రీ.స.వి.వా.పు.102)

యుగము/యుగములు

(చూ॥ అవతారము, నాల్గుయుగాలు)

యుగలక్షణము

ఈనాడు జీవితమే ఒక సమస్యల తోరణముగా కనుపట్టు చున్నది. ఆధునిక యుగమనగా ఏమిటో అర్థం చేసికోలేకపోతున్నాము. ఆధునిక లక్షణ మేమనగా పురుషులయందు సత్యము, స్త్రీలయందు శీలమును అభివృద్ధి పరచుకొనుటయే, ఒక విధముగా ఇదే ఆధునిక యుగమునకు ప్రమాణము. కోరికలను మితిమీరినట్లుగా పెంచుకొనుట ఆధునిక యుగ ప్రమాణముకాదు. కోరికలను తగ్గించుకొనుటయే ఆధునిక **యుగ లక్షణము**. కోరికలను తగ్గించుకొంటూ, సేవాభావమును పెంచుకొంటూ దివ్యత్వమైన ప్రేమతత్వాన్ని వికసింపజేసు కోవడం, ప్రధాన లక్ష్యంగా ఉంచుకోవాలి.

(జ.పు.81)

యుద్ధములు

జరిగిన యుద్ధములు మానవునకేమి నీతిని బోధించినవి? కామ, క్రోధ, ద్వేష, అసూయలు అనునట్టి దుష్ట శక్తులు మానవుని బాధించునను నీతిని యుద్ధములు బోధించుచున్నవి. ఈ దుష్ట శక్తులే అరాజకమునకును, చట్ట విరుద్ధ ప్రవర్తనమునకును, విప్లవములకును, హత్యలకును ప్రస్తుత ప్రపంచములో కూడా కారణములై విజృంభించుచున్నవి.

(జ.పు.165)

(చూ॥ మహాభారతయుద్ధము)

యువకుడు/యువకులు

(చూ॥ బెస్ట్‌ఫ్రెండ్స్)

యువతి

(చూ॥ బెస్ట్‌ఫ్రెండ్స్)

యోగక్షేమము

"ఏ పరమభక్తులు ఇతర చింతనలను చేరనివ్వక సర్వకర్మలు ఈశ్వరార్పణ బుద్ధితో సలుపుదురో, నిరంతరము నన్నే ధ్యానించి, సేవించి, పూజించి, స్మరింతురో, అట్టి సర్వకాలములందూ సమాహిత చిత్తులైనవారి **యోగక్షేమమును** నేనే స్వయముగా చూచుకొను చుందును.

(గీ.పు.163)

గీతలో "యోగక్షేమం వహామ్యహం" అన్నాడు. యోగ క్షేమమనగా నీవు బాగున్నావా?మా ఇంట్లో అందరు బాగున్నారా? అని విచారించడం కాదు. **యోగమనగా లేనిది సంపాదించడము. క్షేమమనగా సంపాదించు కున్నదానిని కాపాడుకోవటం. యోగ క్షేమమనగా అశాశ్వతమైన, అనిత్యమైన, అసత్యమైన యీ దేహమునకు సంబంధించినది కాదు. ఏనాటికైనా, ఎవరిదైనా శ్మశానానికి వెళుతుందీ శరీరము. మనము సాధించిన దానిని కాపాడు కోవడం అంటే దేనిని సాధించడము? విజ్ఞాన,ప్రజ్ఞాన, సుజ్ఞాన తత్వమును సాధించాము. దీనిని కాపాడుకోవటమే క్షేమం, అంటే -**

సౌఖ్య మనుభవింప జాలని వానికి
ఎంత కలిమి యున్న నేమి ఫలము?
నీరు గతుకు కుక్కకు ఏరెంత పారినా
ప్రీతి కలుగబోదు పిసినిగొట్టుకు.

కుక్కకు నీరెంత పోసినా, అది జుర్రుకొని త్రాగలేదు. నాలిక తోనే త్రాగాలి. మనలో దివ్యత్వమనే శక్తి అపారంగా ఉన్నప్పటికీ అనుభవింపలేక పోతున్నాము. ఎందువలన? పాతవాసనలచే, దురభ్యాసములచే, దుశ్చింతలచే మనము

దానిని నాలుకతోనే అనుభవిస్తున్నాము. జుర్రుకొని ఎక్కువగా అనుభవించలేక పోతున్నాము. అలాంటి వారికి తృప్తి వుండదు.

(శ్రీ.ది.పు.102/103)

శ్లో॥ పత్రం పుష్పం ఫలం తోయం యోమేభక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః ॥

భక్తితో సమర్పించు పత్రమో, పుష్పమో, ఫలమో, తోయమో ఏదైననూ భగవంతుడు ప్రీతితో స్వీకరిస్తాడు. కాని పత్రమనగా ఏమిటి; ఏ బిల్వపత్రమో, ఏ తులసీపత్రమో కాదు. ఈ పత్రములన్నియూ అయాకాలములో రాలిపోతుంటాయి. కనుకనే **దేహము కూడా ఒక పత్రము వంటిదని అన్నారు.** ఎప్పుడో కాలము వచ్చినప్పుడు దేహము కూడా రాలిపోతుంది. **ఆ దేహమునే పత్రము** త్రిగుణములతో కూడినటువంటిది. దీనిని **భగవంతునికి అర్పితము చేయాలి.** మరి పుష్పమనగా ఏమిటి? ఏ మల్లెపుష్పమో బంతి పుష్పమో, చామంతి పుష్పమో కాదు. ఎప్పటికీ **వాడిపోనటువంటి హృదయపుష్పము.** దానిని **భగవంతునికి సమర్పించాలి.** ఇక ఫలము; ఏమిటీ ఫలము? అరటిపండు, అనాసపండు కాదు; **కర్మఫలము, నిష్కామబుద్ధితో చేసిన కర్మఫలమును భగవంతునికి కైంకర్యము చేయాలి.** తదుపరి తోయము. అనగా బావి నుండి తెచ్చిన జలము, గంగాజలమూ కాదు; **పవిత్రమైన ఆనందభాష్పములు.** కన్నులను సంస్కృతములో నయనములని అన్నారు. నీరుని నారము అని అన్నారు. కనుక **నయనముల నుండి వచ్చే నారములను ఒక్క నారాయణునికి మాత్రమే అర్పించాలి.** అనగా ఒక్క దైవము కొరకు మాత్రమే మనకంటి ధారలను విడవాలి గాని, అన్యచింతలకు మనం కంటి ధారలు కార్చకూడదు. **అదే నిజమైన తోయము! ఇట్టి ఫల పుష్పాదులను పరిశుద్ధముగా సమర్పించు భక్తులు, అన్య చింతనలు లేక, అనవరతము, ఆఖండ సచ్చిదానంద పరబ్రహ్మ ధ్యానమందే నిమగ్నులైన అట్టి వారి యోగక్షేమములు భగవంతుడే చూచుకుంటాడు.**

(శ్రీ.భ.ఉ.పు.32)

యోగభూమి

(చూ॥ భారతదేశము)

యోగము

ప్రజ్ఞాతత్త్వమును గుర్తించవలెనన్న ఒక యోగము ఉంటున్నది. ఏమిటీ యోగము? క్రియా యోగమా? హఠయోగమా? భక్తి యోగమా? కర్మయోగమా? జ్ఞానయోగమా? లేక పతంజలి యోగమా? కాదు, కాదు. **యోగమనగా కేవలము శరీరముతోగాని, మనస్సుతోగాని ఆచరించే కసరత్తు కాదు. యోగమనగా - ఆనందము.** ఇదే సరియైన అర్థము ఆనందమనేది మనకు ఎప్పుడు లభిస్తుంది? "నేను" అనే ప్రజ్ఞాతత్త్వాన్ని విశ్వసించినప్పుడే లభిస్తుంది. మనము ప్రజ్ఞాశక్తితో జీవించినప్పుడే ఆనందము కలుగుతుంది. జీవతత్త్వాన్ని బ్రహ్మతత్త్వముతో ఏకం చేయడమే యోగముకాని, మరొకటి కాదు. **జీవ బ్రహ్మ తత్త్వములు రెండూ ఏకమే కాని, అనేకము కాదని ప్రబోధించునదే - యోగము. దీనినే శ్రుతులు - "ఏకం సత్ విప్రా బహుదా వదంతి"అని తెలిపాయి.** ఉన్నది ఒక్కటే అయినప్పటికీ దానికి విప్రులు అనేక పేర్లు పెడుతూవచ్చారు. ఇది త్రికాలములందూ మార్పు చెందని సత్యము.

(స.సా.జ.93 పు.18)

యోగము రెండువిధములు: ఒకటి రాజయోగము, రెండవది జ్ఞానయోగము. రాజయోగమున అష్టాంగ యోగము అభ్యసింపబడును. ఇదియే ఆర్యము. యోగము నందు అంగములు బాహిరములు, అంతరములు అని రెండువిధములు, జ్ఞానయోగాంగములయందు, బాహిరములే లేవు. ఈ రెంటికి గమ్యము వృత్తివిలయ మొక్కటియే.

(ప్ర.వా.పు.77)

దేహమును పుష్టివంతముగను, మనస్సును ఆరోగ్యవంతముగను ఉంచేటందులకు అనుకూలమైన

యోగమును కొంత వరకు నేర్పించాలి. కొంత మంది యోగమును కసరత్తుగా మాత్రమే ప్రాక్టీసు చేసి విదేశాలకు వెళ్ళి యోగా సెంటరు అని పెద్ద బోర్డు పెట్టుకొని ఈ కసరత్తు లన్నీ చేస్తుంటారు. ఇది యోగమని చెప్పుటకు వీలుకాదు. ఇది పెద్ద రోగము. మత్స్యాసనము కూర్మాసనము, సూర్యాసనము అని ఏవేవో ఆసనములు నేర్చుకొని వాటిని యోగమనే పేరుతో వ్యవహరిస్తున్నారు. పతంజలి చెప్పిన యోగమునకును, ఈ యోగమునకును ఎక్కడా పొలిక లేదు. చిత్త వృత్తులను అరికట్టడంగాని, ఆత్మసాక్షాత్కరమునకు లేక ఆత్మానుభవమునకు గాని ఏమాత్రము పనికి రాదు. చిత్త శుద్ధికి మాత్రమే పనికి వస్తుంది. **షడ్ దర్శనాలు కాదు సత్ దర్శనం కావాలి.**

(సా.పు.24)

పక్షికి తోక వేరే ఉంటుండాది. ఈ తోక ఎందుకోసం? రెక్కలను సమన్వయపరిచే కోసము Balance సరిగా పెట్టె నిమిత్తము ఈతోక అత్యవసరము. ఋత, సత్యములను జగత్తులో క్రియారూపములో ప్రసరింప చేయటానికి యోగము అనే తోక అవసరము. మనము వాయు విమానము చూస్తుంటాము. దీనికి రెండు రెక్కలుంటాయి. రెండు రెక్కలతో ఈ విమానము పరుగెత్తదు. ఈ రెండు రెక్కలకు సమన్వయపరచే తోకకూడా ఉండాలి. ఈ మూడింటి ద్వారానే మధ్య నున్నదేహము బాలెన్స్‌లో వుంటాది. విమానం లోపల కూర్చునపుడు మీరు చూశారోలేదో? ఎక్కేసమయములో ఒక రెక్క క్రిందికి వస్తుంది. ఒక రెక్క పైకి పోతుంది. దిగే సమయములో మరోకరెక్క క్రిందకు వస్తుంది వేరొక రెక్క పైకి పోతుంది. ఇహసంబంధమైన జగత్తులో సత్యము ముందుగా వస్తుంది. ఋతం వెనుక వస్తుంది. ఆధ్యాత్మికమార్గములో ఋతం ముందు వస్తుంది. సత్యం దాని వెంట బడుతుంది. ఇదంతా ఒక బ్యాలెన్స్ పైన ఆధారపడి వుంటాది. అన్ని రకములైన బాలెన్సులు సరిగా నున్నపుడే ఈ బుద్ధి బుద్ధిగా రూపొందుతుంది. ఋతము, సత్యము, యోగము లేకుండా పోతే ఇది బుద్ధియే కాదు యోగమంటే ఏమిటి? హఠయోగమా? రాజయోగమా? ఏయోగముకాదిది. ఆసనాలు వేయటమే యోగముకాదు. అదొక Physical trainingఒక విధమైన కసరత్తు. **"యోగః చిత్తవృత్తి నిరోధకః"** ఇంద్రియములను అరికట్టేదే నిజమైన యోగము. ఈ యోగమే తోక, యోగముతో కూడినపుడే బుద్ధి సరియైన మార్గములో నడుస్తుంది.

(బృ.త్ర.పు.99/100)

భావమందు దుష్టవాంఛలు వీడుటే త్యాగమగును అదియె యోగమగును, ఆస్తి అలివీడి అడవికేగుట కాదు.

(బృ.త్ర.పు.123)

కర్తృత్వభోక్తృత్వములను మనము దూరముగావించి కర్తవ్యమును ఆచరించాలి. **"కర్తవ్యం యోగచ్ఛతే"** ఇదే యోగము. ఈ యోగమును నీవు సాధించావంటె దివ్యమై ఆత్మభోగమును అనుభవించవచ్చు. ఈ యోగము లేక పోవటంచేతనే రోగులుగా మారుతున్నారు.

(బృ.త్ర.పు.170)

(చూ॥ ఎరుక, కర్మ, త్రికాండ స్వరూపము, బుద్ధి, యుక్తి, వేదము)

యోగి/యోగులు

(చూ॥ ఆహారము, శ్రేష్ఠుడు)

యోగవాశిష్ఠము

(చూ॥ ప్రధమసుఖము)

యోగశాస్త్రము

(చూ॥ ఉపనిషత్తులు)

యెగాభ్యాసము

(చూ॥ వేదము, శ్రేష్ఠుడు)

యౌవనము

విద్యార్థినీ విద్యార్థులారా! మన పవిత్ర సంస్కృతిని ఆధునిక జీవితాన్ని రెండింటిని సమన్వయపరచి, సత్యమార్గమును విడువక, ధర్మమార్గమును విసర్జించక, న్యాయమార్గములో జీవితాన్ని గడపటానికి తగిన కృషి చేయాలి. మనకు అధికారము ప్రధానము కాదు. అధికారములు కేవలము కదిలిపోయే మేఘములు దాని నిమిత్తమై గర్వించ నక్కరలేదు.

"మా కురు ధనజన యౌవనగర్వం
హరతి నిమేషాత్కాల స్సర్వం"

మనిషిలో క్షణములో వచ్చి క్షణములో పోయేదే యీ యౌవనము; మధ్యలో వచ్చి మధ్యలో పోయేదే యీ యౌవనము. ఇలాంటి క్షణ భంగురమైన మధ్యకాలములో వచ్చిపోయే యౌవనమును ఆధారము చేసుకొని భ్రష్టుపట్టి పోరాదు. ఇది చాలా ఉత్తమమైన జీవితము. ఇది పవిత్రమైన కాలము. ఈ కాలము మనము వ్యర్థముచేసుకోరాదు.

(బృ.త్ర.పు.11)

రంజాన్

హజరత్ మహమ్మద్ అల్లాను ప్రార్థన చేస్తున్న సమయములో ఆయనకు కొన్ని శబ్దములు వినిపిస్తూ వచ్చాయి. తాను విన్న సుశబ్దములను హజరత్ మహమ్మద్ మక్కాలో శబ్ద సంభాషణలక్రింద చాటుతూవచ్చాడు, కాని అక్కడ చాలామంది నానా కష్టములు పెట్టి చివరకు అతనిని మక్కానుండి తరుమగొట్టారు. ఎన్ని హింసలు పెట్టినప్పటికీ సత్యమే జయిస్తుందని, దైవమే రక్షిస్తాడని, ఆత్మ నిరంతరము సుఖస్వరూపమైనదని చివరి ఘడియ వరకూ బోధించినాడు మహమ్మద్. అట్టి మహమ్మద్ సుసూక్తులను ఆచరణలో వెట్టి, దివ్య స్థానమును పొందే నిమిత్తమై ఈ రంజాన్ ఉపవాసదీక్షను మహమ్మదీయులు స్వీకరించారు.

(స.సా.ఆ.83 పు.186)

(చూ॥ ఉపవాసం)

రక్కసి

కామం మూడుతలల రక్కసి. కామితార్థం సిద్ధించగానే లోభం బయలు దేరుతుంది. దొరికిన దానిని దాచిపెట్టి వృద్ధి చేయాలనే పిసినారి కోరిక. కోరినది దొరకకపోతే క్రోధం తలయెత్తుతుంది. తపస్సువల్ల కూడా స్వభావం మారకపోవచ్చు. భస్మాసురుని విషయం చూడండి. కోరిన వరం ఇచ్చిన భగవంతుని నెత్తిమీదనే చెయ్యి పెట్టాలని తయారైనాడు. కామ, క్రోధ, లోభములు మూడూ రజోగుణమునకు రూపములే. లక్ష్యమే ప్రధాన మనీ, అవలంబించే విధానములు ముఖ్యము కావనీ భావించి నిరంతరంగా రజో గుణ వ్యాపారం కొనసాగుతుంది. గమ్యం చేరుకోవటమే ముఖ్యం. అనుసరించే మార్గం ఏదైనా ఫరవాలేదు అనుకోవటం రజో గుణ లక్షణం లక్ష్యం ఉన్నంతగానూ సాధనలు కూడా ఉత్తమంగా వుండాలి.

(శ్రీ.స.సూ.పు.55)

రక్ష

తారకాసురుని దోర్దర్ప మణచు వేళ
గౌరి తనయు కిడ్డ వీర రక్ష
శంబరాసురుని జంపగా చను వేళ
భార్గవి సుతు కిడ్డ భవ్య రక్ష

మాతృదాసీత్వము మాన్ప నురుకు వేళ
వినత పుత్రు కిడ్డ విమల రక్ష
జనకు మాటగావ పనికి నేగెడు వేళ
తల్లి రఘువు కిడ్డ ధర్మ రక్ష
అట్టి శ్రీ రక్ష ఘన రక్ష యజ్ఞ రక్ష
రక్షలందున దివ్యమౌ శ్రీరామ రక్ష
తోడునీడై నిన్ను కాపాడుగాక

(భ.ప్ర.పు.18/19)

రక్షణ

(చూ॥అదృశ్యంగా సందేశం)

రజోగుణము/రాజసిక

రజోగుణము కలిగినవాడు అన్నిటియందు తొందరపాటు పడుతుంటాడు. ఇతనికి కోపము కూడను జాస్తి. ఇంతియే కాకుండా వాంఛలను అధికముగా పెంచుకుంటుంటాడు. ఒక్కక్షణమైనా స్థిరముగా వుండడు. ఇవి రజోగుణములు. మీరు యెక్కడైనా జూకు పోయి చూసినారంటే అక్కడ చిరుతపులి, నక్క యిలాంటివాటిని చూస్తే మీకు చక్కగా తెలుస్తుంది. ఎప్పుడు చూసినా అటోయిటో, అటోయిటో తిరుగుతూ వుంటాయి. కాని, నిలకడగా వుండే స్వభావము కాదు వాటిది. ఇది రజోగుణ స్వభావము. మానవుని హృదయమందు రజోగుణము ప్రవేశించెనా అది నిరంతరము చలింప చేస్తుంటాది. చలింపచేయటమే కాదు, భ్రమింప చేస్తుంటాది. భ్రమింపచేయటమే కాదు, జగత్తును వరింపచేస్తూ వుంటాది. జగత్తును వరించటము, ఆశలను రగల్చటము, దేహమును జయించటము యీ మూడు గుణములు రజోగుణమునకు ప్రధానమైన లక్షణములు. మనము ఒకచోట కూర్చుంటే నిలకడగా కూర్చోలేము. ఎప్పుడు చూసినా యేదో ఒకటి కదలుతూనే వుంటుంటాది.

(శ్రీ.గీ.పు.264/265)

విచారణ శక్తి హీనుడై, రాగద్వేషములకు గురియై తన యొక్క ఇచ్ఛానుసారముగా సంచరించడము రజోగుణము. తొందరపాటు లక్షణము. ఈ తొందరపాటు లోపల మన మనేకవిధములైనటువంటి నష్టకష్టములకు గురికాగలము.

(స.సా.జూ. 1989 పు. 144)

(చూ॥ అవతారము, గుణములు, జగదీశుడు, తత్త్వజ్ఞానము,పృథ్వితత్త్వము, శబ్దస్పర్శరూపరసగంధములు, స్త్రీతత్వము)

రత్నమాల

(చూ॥ సంకల్పము)

రత్నావళి

(చూ॥ సంకల్పము)

రథము

"దేహో దేవాలయః ప్రోక్తో జీవోదేవః సనాతనః" - దేహము ఆత్మకు ఒక దేవాలయము వంటిది. భగవంతుని ఊరేగించుటకు దేహము ఒక చక్కని రథము. రథము లేనిదే రథికుడుండుటకు వీలుకాదు.
చక్రములు లేని రథము
నీరెరువులు లేని పంట
చంద్రకళలు లేని రాత్రి
సింధూరము లేని గృహిణి
వెన్న తీసినట్టి పాలు
రుచి ప్రకాశము లెట్లు కలిగియుండు?
భక్తి లేని జీవితంబు
పుణ్యమా? పురుషార్థమా? అన్నట్లు
రథికుడు లేని రథముండుటకు వీలు లేదు. ఇటువంటి పవిత్ర మైన దేహమును మనము అలక్ష్యము చేసి దివ్యత్వమనే ఆత్మ తత్త్వము ఆధారముగా నున్న

రథసారథి

సత్యమును తెలుసుకొనుటకు ప్రయత్నము చేయక కాలమును వ్యర్థము గావిస్తున్నాము.

(శ్రీ.ది.పు.155/156)

రథసారథి

"నన్ను మీ జీవిత రథసారథిగా చేసుకొనుడు. ఈ ఉత్తమావకాశమును జారవిడువకుడు. ముక్తిమార్గముకై నన్నర్థింపుడు. ముందు ముందు నా దరిచేరుట దుర్లభము. నలుదిశల నుండి ప్రజావాహినులు నన్ను చుట్టుముట్టు చున్నవి. ఈ దివ్యశక్తి మానవాళికి ఆశ్రయ మిచ్చి రక్షించు విశ్వవృక్షముగా పెరుగుట తథ్యము. ఆ లక్ష్యముతోనే ఈ ఆకారమును ధరించి అవతరించితిని. నా సంకల్పము నిర్వికల్పము. **నా పేరే సత్యము సత్యమే నా ప్రచారము సత్యమే నామార్గము. నేనే సత్యము"**

(స.శి.సు.తృ.పు.11)

రమణ మహర్షి

(చూ॥ నిన్ను నీవు తెలుసుకో, నేనెవరు?)

రష్యా

(చూ॥ ప్రధానమైన అస్త్రము, భగవంతుని బిడ్డలు)

రస(ము)

(చూ॥ పంచ భూతము)

రసాస్వాదము

(చూ॥ ఆటంకములు)

రసోవైసః

పవిత్రమైన భారతీయ సంస్కృతికి వేద శాస్త్రములే పురాణములు. సంగీత సాహిత్యములు వేదమునుండియే ఆవిర్భవించినవి. సంగీతమునకు సామవేదము మాతృక, సాహిత్యమునకు ఋగ్వేదము మాతృక. భక్తి పూరితమైన సంగీతము భగవంతుని స్వరూపము గనుకనే **'నాహం విశామి వైకుంఠేన యోగి హృదయే రసవో మద్భక్తా, యత్రగాయంతి తత్ర తిష్ఠామి నారద' అన్నాడు నారాయణుడు : వైకుంఠవాసిని కాను, యోగుల హృదయవాసిని కాను. ఎక్కడ నా భక్తులు నన్ను గురించి ప్రేమతో గానము చేస్తూ వుంటారో, అస్థానమే నా ప్రతిష్ఠస్థానమని నారదునితో చెప్పాడు. ముక్త పురుషులైన** భక్త శిఖామణులు, కళాకారులు, భక్తి చేత తన్మయులై పదార్థ భావంతో తదాత్మ్య భావన పొందినటువంటి వారు. ప్రహ్లాదుడు హరినామమును ఆనందముతో గానము చేశాడు. **త్యాగరాజు "ఏ తావునరా నిలకడ నీకు" అని పాడాడు. అనగా సర్వత్రా వ్యాపించి నీ ప్రేమ స్వభావమును సర్వులకు అందిస్తున్నాడని భావముతో శ్రీరాముని కీర్తించాడు.** సంగీతము గాని, కావ్యముగాని, రసములు అని చెప్పవచ్చు. **"అలంకారో విష్ణుప్రియః" అన్నారు. నవరసములున్నాయి.** భోజరాజు శృంగార రసమును, భవభూతి కరుణా రసమును, అల్లసాని పెద్దన **"రసోవైసః" - బ్రహ్మమే నిజమైన రసమని చెప్పాడు.** రామకృష్ణుడు హాస్య, వీరసము. వాల్మీకి శోకరసము ప్రారంభించి, కరుణారసముతో ముగించాడు రామాయణము. ఈ బ్రతుకు సారమేమిటి? రసమేమిటి? **ఆనందమే బ్రహ్మము. బ్రహ్మతత్వమే మన జీవితం.**

(సా॥పు.540)

(చూ॥ లింగము, లింగోద్భవము)

రహస్యము

అనాదికాలము నుండి అవతారముల యొక్క రహస్యమే ఇది. ఏదీ డైరక్టగా చెప్పటం లేదు. కొన్ని మాత్రమే డైరెక్ట్‌గా చెప్పవచ్చును. కొన్ని ఇన్‌డైరెక్టుగా చెప్పుతారు. మానవత్వమునందే దివ్యత్వమున్నది. కనుక ఆదివ్యత్వములను మేలుకొలిపి ఆదివ్యత్వము ద్వారానే

గుర్తించ ప్రయత్నించాలి. అన్నీ డైరెక్ట్‌గా చెప్పు పోతుంటే, మానవుడు తనదివ్యత్వాని ఏమాత్రము అర్థము చేసుకోలేడు. తన దివ్యత్వాన్ని అర్థము చేసుకొనే స్వాతంత్ర్యాన్ని అతని అందించటానికి దైవము ఇన్‌డైరెక్టుగా చెప్తుంటాడు.

(బృ.త్ర.పు.101)

(చూ॥ కర్మఫలత్యాగం, భక్తిమార్గము, మూడుజన్మలు, సర్వసంగపరిత్యాగి)

రాక్షసుడు/రాక్షసులు

తనకు ఉపకారము చేసిన వారికి అపకారము చేసేటటువంటివాడు. రాక్షసుడు. ప్రేమించిన వారిని కూడను ద్వేషించేవాడు రాక్షసుడు. ప్రేమించినటువంటి వారిని ప్రేమించువాడు మానవుడు. దూషించి నటువంటి, హింసించినటువంటి వారిని కూడను ప్రేమించేటటువంటి వాడే దేవుడు. తనకు కీడు చేసినటువంటి వారిని కూడను ప్రేమిస్తుంటాడు పరమాత్ముడు. **పరమాత్ముని యొక్క తత్వము ప్రేమయే. ప్రేమయే అతని స్వరూపము. రాముడు ప్రేమగలిగినవాడు గనుక, ప్రేమ క్షమకు జన్మస్థానము.**

(ఆ.రా.పు.86)

రాక్షసులనగా ఒక ప్రత్యేకమైన స్వరూపము గలవారు కాదు. **మన దుర్గుణాలు, దుర్భావాలే "రాక్షసులు".** ఈ రాక్షస నాయకుడైన రావణాసురుడు పదితలలు కలిగినవాడని మనం భావిస్తున్నాము. **రావణుడు పదితలలతో పుట్టలేదు. ఏమిటీ పది తలలు? కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు, మనస్సు - బుద్ధి - చిత్తము - అహంకారము - ఈ పది గుణములతో కూడినవాడే రావణాసురుడు.** అతనికి ఆ ఒక్కొక్క గుణము ఒక్కొక్క శిరస్సుగా రూపొందుతూ వచ్చింది. కనుక, ఎవరికి వారు ''నేను రాముడనా? రావణాసురుడనా?'' అని విచారణ చేసుకోవాలి. **రామచంద్రుడు ఈ రావణుని ఒక్కొక్క శిరస్సును (అనగా ఒక్కొక్క దుర్గుణాన్ని) ఖండిస్తూ వచ్చాడు.** ఈ దుర్గుణములను సంహరించేవాడు కూడా భగవంతుడే. అయితే దుర్గుణాలను నాశనం చేసే సమయంలో రజోగుణ స్వరూపాన్ని ధరిస్తాడు. ఈ రజోగుణము కూడనూ సాత్వికముతో కూడినటువంటిదే. రామునికి రావణునిపై ప్రేమ, దయ ఉండుట చేతనే అతని దుర్గుణాలను నిర్మూలం గావించాడు. (ప్రేమయే లేకుండా దుర్గుణాలను దూరం చేయుటకు వీలుకాదు. కనుక ఈ రజోగుణము లోపల కూడా సాత్వికము చేరి యుంటున్నది.

(స.సా.న.91 పు.306)

(చూ॥ అద్వైతదర్శనము, దైవస్వరూపులు, నరకాసురుడు, పంచేంద్రియములు, ర్యాగింగ్)

రాక్షసగుణములు

(చూ॥ నరకచతుర్థశి)

రాక్షసత్వం

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం;
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే॥"

అని శ్రీకృష్ణుడు భగవద్గీత యందు తెలిపియున్నాడు. అనగా సద్గుణములు కలిగిన వారిని రక్షించి, దుర్గుణములు కలిగిన వారిని శిక్షించి ధర్మ స్థాపన చేయుట. అని భావిస్తున్నాము. ఇది సరియైనది కాదు. "రాక్షసత్వాన్ని రూపుమాపి, దైవత్వాన్ని అభివృద్ధి పరచి, దివ్యత్వమైన ధర్మాన్ని జగత్తు యందు స్థాపించుట'' యే దీనికి సరియైన అర్థము. ఇక్కడ రాక్షసత్వం అనగా ఏమిటి? దైవత్వం అనగా ఏమిటి? అని మనం విచారించాలి. "పరిత్రాణాయ సాధూనాం'' అనే పదములో "సాధుత్వం'' అనగా నిర్మలంగా, నిస్వార్థంగా, నిరహంకారంగా ఉండిన మానవ స్వభావము అని అర్థం. **"వినాశాయచదుష్కృతాం" ఇక్కడ దుష్కృతములనగా దుర్మార్గులైన, దుష్టులైన మానవులు కాదు. రాగ ద్వేషాలు, అసూయ, అహంకారము**

రాగద్వేషములు

- ఇవే "దుష్టులు" ఈ "దుష్టుల" హతమార్చి నిర్మల నిస్వార్థ, నిరహంకారములను రక్షించుటయే - ధర్మ సంస్థాపన. ధర్మమనగా ఏమిటి? "రామో విగ్రహవాన్ ధర్మః" భగవంతుడే ధర్మస్వరూపుడు.

(స.సా.న.91 పు.290)

రాగద్వేషములు

(చూ॥ ఆహారము, నన్నే పొందుదురు, పొత్తు, వ్యాధులు, సుఖానందములు)

రాగము

(చూ॥ బలము, రజోగుణము)

రాజకీయాలు

''నాది ఏకత్వం మీరాజకీయాలు భిన్నత్వం. నా కార్యక్రమాలకు, రాజకీయాలకు సంబంధం లేదు. **నాలుకకు నరంలేదు, ఏరకంగానైనా మాట్లాడవచ్చు. కాని, నాది ఒకే మాట; ఒకే బాట".**

(స.సా.జూ.2001పు.191)

(చూ॥ రామచరిత్ర)

రాజనీతి

రామచంద్రుడు ప్రతి మాటయందును, పనులయందును తన కారుణ్యమును కనుపరిచెడివాడు. ఒకొకపరి లక్ష్మణుడు కొంత ఉల్లాసముతో, సరదాగా మృగములపై గురిపెట్టిననూ తత్క్షణము రాముడు అడ్డుతగిలి "లక్ష్మణా! వాటివలన నీకుకానీ, లేక లోకమునకు కానీ గలిగిన అపకారమేమని వాటిని కొట్టపూనుకొంటివి? **నిర్దోషుల శిక్షించుట రాజనీతికి పరమవిరుద్ధముకాదా అని నీతులు చెప్పెడివాడు.**

(రా.వా.మొ.పు.45/46)

రాజబాట

తానెవరో తెలుసుకొనక బయట ప్రపంచమును తెలుసుకొనటానికి ప్రయత్నిస్తున్నాడు. తనను తాను తెలుసుకొనటానికి తగిన ప్రయత్నం చేయాలి. తన దేహమును తన మనస్సును తన యింద్రియములను ఆత్మతత్వమును మొట్ట మొదట గుర్తించటానికి తగిన కృషి చేయాలి.

"జగమున జీవించు వాడు మనుజుడు కావలె మొదట
దనుజుల దుష్కృతులనెల్ల పొగడువాడు చవట
బ్రహ్మవిద్య నేర్చి యిచట ఆత్మజ్ఞానము కనుగొనుట
ఇదియే మానవ జీవితమునకు రాజబాట''

(బృ.త్ర.పు.11)

రాజ్యాంగము

(చూ॥ సనాతన ధర్మము)

రాజ్యాధికారులు

కుటిలచిత్తుడు రాజ్యమునేలిన భూమి పాతాళమునకు క్రుంగును. స్వార్థపరులు, సంకుచితచిత్తులు, దురాశా పరులు, ఆడంబరజీవులు, అహంకార వ్యక్తులు, అసూయాస్వభావులు రాజ్యాధికారులు కారు. అట్టి వారల పరిపాలన ప్రజలకు హాని కలిగించును, ధర్మమును నాశనము చేయును. దేశమునకే కీడు వాటిల్లును. సదాచార, సచ్ఛీల, త్యాగ, సత్యవాక్య పరిపాలకులే రాజ్యాధికారులు.

(రా.వా.మొ.పు.315)

(చూ॥ సనాతన ధర్మము)

రాణించదు

విజ్ఞానము లేని విద్య, వివేకము లేని విజ్ఞానం. లౌకికము లేని మనిషి, విచక్షణ లేని పని, విజ్ఞత లేని పాండిత్యము. అర్హత లేని అధికారము, సత్యము లేని వాక్కు,

మాధుర్యము లేని సంగీతం, భక్తి లేని పూజ, శీలం లేని మనిషి, వినయము లేని విద్యార్థి, సభ్యులను మెప్పించని ఉపన్యాసం రాణించదు.

(స.వా.పు.137/138)

రాధ

రాధ తన బంధువులపైగాని, అక్కచెల్లెండ్రపైగాని, అన్నదమ్ములపైగాని ఎవ్వరిపై ఆధారపడలేదు. నిరంతరం కృష్ణచింతనలో కాలం గడిపింది.

"నిలువ నీడలేని బ్రతుకు నీ కొరకని మోయుదాన
నిలువదురా నా మనసు నీ నగవులు దూరమైన
కలలోనైనా కనులకు కానగరారా కృష్ణా!
నిన్ను విడచి నిలువలేనురా, కానగరారా!"

భక్తునికోసం భగవంతుడు ఏమైనా చేస్తాడు. తన ప్రాణమునైనా అర్పిస్తాడు. ఇంతటి త్యాగం జగత్తులో మరే వ్యక్తియందు కనిపించదు. రాధ దేహం వదిలే ముందు కృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు. "రాధా!నీ తుదికోరిక ఏదైనా ఉంటే చెప్పు" అన్నాడు. "కృష్ణా! నాకేమీ వద్దు, ఒక్కసారి నీ వేణుగానాన్ని వినాలని ఉంది" అన్నది.

"వేదసారమంత తీసి నాద బ్రహ్మముగను మార్చి
వేణువందు తిరుగ బోసి గానరూపముగను మార్చి
పాటపాడుమా కృష్ణా! పలుకు తేనె లొలుకునటుల
మాటలాడుమా ముకుంద మనసు తీరగా"

రాధ కోరిక మేరకు కృష్ణుడే వేణుగానాన్ని వినిపించాడు. తరువాత ఈ వేణువును అక్కడే పారవేశాడు. ఆనాటి నుండి ఈనాటి వరకు తిరిగి ఆ వేణువును ముట్టలేదు. కృష్ణుని తత్వము, కృష్ణుని లీలలు ఇట్టివి, అట్టివి అని వర్ణించడానికి వీలుకాదు. స్త్రీలలో స్త్రీవలె ఉన్నాడు; పురుషులలో పురుషునివలె ఉన్నాడు; చిన్న పిల్లలలో పిల్లవానివలె ఉన్నాడు. ఈనాడు గోకులాష్టమి, కృష్ణుడు పుట్టినదినము. అనగా, ఇది బాహ్యస్వరూపానికి పుట్టిన దినమే కాని, కృష్ణుడు పుట్టడమేమిటి! కృష్ణుని అదేశాలను శిరసావహించండి. కృష్ణుడు వేరు, కృష్ణునివాణి వేరు కాదు. అట్లే స్వామి వేరు, స్వామివాణి వేరు కాదు. కనుక మీరు భేదమునకు అవకాశం ఇవ్వకండి.

(స.సా.ఆ.96 పు.256)

(చూ॥ మురళి, సగుణోపాసన, హృదయవాసి)

రాధాతత్త్వం

(చూ॥ గోపికలు)

రాధిక

(చూ॥ సగుణోపాసన)

రాము/రాముడు

'రాము' అనే పదమునందు 'ర' - 'అ' - 'మ' అను మూడు బీజాక్షరములు ఉన్నవి. వాటిలో 'ర' సూర్య బీజము; 'అ' చంద్రబీజము; 'మ' అగ్ని బీజము. ఈ మూడింటియందును ఉన్న అంతరార్థమేమిటి? 'ర' అనే సూర్యబీజము, మనయొక్క అజ్ఞానమనే చీకటినంతా దూరము చేస్తుంది. ఇంక చంద్రబీజమైన **'అ', మనకున్న తాపమును చల్లార్చుతుంది.** 'మ' అనే అగ్ని బీజము, మన పాపమునంతా భస్మముచేస్తుంది. కనుక ఒక్క రామనామమే పాపమును, తాపమును, ఆజ్ఞానమును, మూడింటిని కూడను నాశనము చేస్తుంది. కనుకనే, రామనామముకంటెను మించినది లేదని వాల్మీకిమహర్షి లోకానికి చాటుతూవచ్చాడు. ఆమహాకవి రాము నామ మహిమను, ఇంకా సులభమార్గంగా సామాన్యప్రజలకును అర్థమయ్యేరీతిగా ఇట్లు తెలిపినాడు. **'ర' అను అక్షరము ఉచ్చరించునపుడు నోటిని తెరిపించి, ఆ ద్వారమున మనలోనున్న ఎల్లపాపములనూ బయటకు పింపిస్తుందట!**

'మ' అను అక్షరము, బయటికిపోయిన పాపములు, మరల లోనికి రాకుండా, ఆద్వారమును మూసివేస్తుందట!
(ఆ.రా.పు.14/16)

(చూ॥ ఆదర్శప్రేమ, ఏకత్వం, కళలు, త్యాగం, పంచ భూతములు, భగవత్ప్రేమ, భావములు, మంచి తనము, రామాయణము, విశిష్టత, సీత, స్త్రీలు, హిరణ్య)

రామకథ

(చూ॥ రామాయణ విశిష్టత)

రామకథారసప్రవాహము

(చూ॥ కరుణారసము)

రామకథారసవాహిని

(చూ॥ కరుణారసము)

రామకృష్ణ పరమ హంస

(చూ॥ దాసోహం, దైవం కోసం, నామస్మరణ)

రామచంద్రుడు

రామచంద్రుడు సత్యవాక్పరిపాలకుడు; గుణశీలుడు. అంతేకాదు; అతను మహాసౌందర్యవంతుడు. రామచంద్రుని సౌందర్యాన్ని వర్ణించే సమయములో వాల్మీకి తన్మయుడైపోయాడు. అతని ఒక్కొక్క అంగమును కూడను వర్ణిస్తూ, ఇటువంటి ఆదర్శమైన అందగాడు లోకములో నున్నాడా? అని తాను భ్రమించాడు. చివరకు వర్ణించలేక **"పుంసాం మోహన రూపాయ" (పురుషులు కూడను మోహించేటువంటి మోహనరూపుడు)** అని అన్నాడు. అలాంటి రామచంద్రుడు కేవలము మానవాకారమును ధరించి, లోకములో ఉన్న మానవులకు ఆదర్శమైన జీవితాన్ని నిరూపించే నిమిత్తమై, తాను ఈ విధమైనటువంటి క్రియల యందు అనేకరకములైన పవిత్ర మార్గాలను నిరూపిస్తూవచ్చాడు.
(ఆ.రా.పు.101)

(చూ॥ రామచరిత్ర)

రామచరిత్ర/రామచరితము (రాముని చరిత్ర)

వాల్మీకి రామాయణాన్ని రచించిన తరువాత ఋషులందరినీ సమావేశపరచి రామకథను ఎలా ప్రచారం చేయాలి, ప్రచారం చేయగల సమర్థులెవరు అని విచారణ చేశాడు. ఆ ఋషు లందరూ నమస్కరించి "మహర్షీ! మేము వృద్ధులమైపోయాము. వీధివీధిలో తిరిగి రామకథను ప్రచారం చేసే శక్తి మాకు లేదు" అని తమ అశక్తతను వెలిబుచ్చారు. దూరంగా కూర్చుని ఇదంతా గమనిస్తున్న లవకుశులు ముందుకు వచ్చి "గురూజీ! దివ్యమైన రామకథను వీధివీధిలోను, ఇంటింటా చాటడానికి మేము సిద్ధంగా ఉన్నాము" అని పలికారు. ఒక చేత్తో తంబుర, మరొక చేత్తో చిఱుతలు పట్టుకొని, మెడలో రుద్రాక్ష మాలలు ధరించి, నుదుట విభూతి పెట్టుకొని బయలుదేరారు.**"వినుడు వినుడు శ్రీరాముని గాథ వినుడీ ప్రజలారా!" "శ్రీరాముని చరితమును తెలిపెదమమ్మా! శీలవతి సీత కథ వినుడో యమ్మా!" అని వీధివీధిలోను రామకథను గానం చేస్తూ వచ్చారు.** "ఓ ప్రజలారా! దివ్యమైన రామ చరిత్రను వినండి. మీ చరిత్రను కూడా రామ చరిత్రగా మార్చుకోండి" అని బోధించారు. ఈనాటి పిల్లలకు ఈ విధంగా భగవంతుని గురించి ప్రచారం చేయాలంటే చాల అవమానంగా ఉంటుంది. **భజన చేయాలంటే అవమానం! విభూతి పెట్టుకోవాలంటే అవమానం!** కొంతమంది ఇంట్లో ఉన్నప్పుడు విభూతి పెట్టుకుంటారు, బయటికి వెళ్ళే ముందు తుడుచు కుంటారు. పరులను దూషించడం, పరిహసించడం వంటి చేయరాని పనులు చేయడానికి వారికి అవమానం లేదుగాని, **భగవన్నామం చెప్పాలంటే అవమానంగా భావిస్తారు.** పరదూషణను మించిన పాపం లేదు.

పరదూషణ చేయడానికి అసలు నోరు ఎలా వస్తుందో అర్థం కాదు. నాలుక నిచ్చినది భగవన్నామం స్మరించడానికి, పవిత్రమైన పలుకులు పలకడానికేగాని, పరులను దూషించడానికి కాదు. **"పరులు పరులుకాదు, పరమాత్ము డగునయా!"** మీకు తెలుసు - **నేటి రాజకీయాల్లో ఒకరి నొకరు ఇష్టం వచ్చినట్లు తిట్టుకుంటున్నారు,** పరదూషణలో జీవితాన్ని వ్యర్థం చేస్తున్నారు. ప్రేమస్వరూపులారా! మంచి చేయడానికే మీరు పుట్టారు. పరోపకార నిమిత్తమే మానవ జన్మ ఏర్పడింది. కనుక, పరోపకారంలో ప్రవేశించి జన్మను సార్థకం చేసుకోండి.

ఒకానొక సమయంలో రాముని తల్లియైన కౌసల్య వద్దకు హనుమంతుని తల్లి వచ్చింది. కొంత సేపటికి అగస్త్యుని తల్లి కూడా వచ్చింది. "అమ్మా! ఎవరు మీరు? ఎందుకోసం వచ్చారు?" అని ప్రశ్నించింది కౌసల్య. మొదటి వ్యక్తి "అమ్మా! నేను హనుమంతుని తల్లిని. నా కుమారుడు పెద్ద సముద్రాన్ని దాటి భయంకరమైన లంకలో ప్రవేశించి అనేకమంది రాక్షసులను సంహరించాడు" అన్నది. రెండవ వ్యక్తి "అమ్మా! నేను అగస్త్యుని తల్లిని. నా కుమారుడు సముద్రాన్నంతా ఒక్క గుటకలో మ్రింగీ గొప్ప కీర్తి గడించాడు" అన్నది. అప్పుడు కౌసల్య నవ్వి "నా కుమారుడైన శ్రీరాముని మహిమవల్లనే కదా. మీ కుమారులు ఈ మహత్కార్యములు చేయగల్గారు." అన్నది. సరిగ్గా ఆ సమయానికి రాముడు ప్రవేశించి "అమ్మా! ఏమి చెపుతున్నావు? **హనుమంతుడు మహా భక్తుడు, శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు. అగస్త్యుడు కూడా మహాభక్తుడే. వారు తమ భక్తి ప్రపత్తులచేతనే ఈ మహత్కార్యములను సాధించగల్గారు. ఇందులో నా గొప్పతనమేమీ లేదు" అన్నాడు.**

రామ చరిత్ర చాల పవిత్రమైనది. **రావణుడు ప్రాణం విడిచే ముందు ప్రజలకు ఒక మాట చెప్పాడు. "ఓ ప్రజలారా! నేను కామాన్ని అదుపులో పెట్టుకోలేక నా కొడుకులను చంపుకున్నాను; వాంఛలను అరికట్టుకోలేక నా వంశమునే నాశనం చేసుకున్నాను. మీరు నావలె ప్రవర్తించి మీ జీవితాన్ని వ్యర్థం చేసుకోకండి. రామునివలె సత్యాన్ని పలికి, ధర్మాన్ని ఆచరించి మీ జన్మను సార్థకం చేసుకోండి."** రామాయణము యొక్క అంతరార్థమును, పవిత్రమైన సూక్తులను అందరూ తెలుసుకొని ఆచరణలో పెట్టాలి. అప్పుడే జీవితం సార్థకమవుతుంది. **"రమయతీతి రామః", రమించడమే రామతత్వం.** ఆ రమించే గుణము మీలోను ఉన్నది. కాబట్టి, మీరందరూ రామస్వరూపులే. ఆత్మకే 'రామ' అని పేరు. **'నా ఆత్మారామునికే తెలుసు' అంటాం** కదా! ప్రతి ఒక్కరియందున్న ఆత్మరామ స్వరూపమే. రాముడు అందరి హృదయంలో ప్రతిష్ఠింపబడి ఉన్నాడు, **"సర్వతః పాణిపాదం...."** సర్వత్రా ఉన్నాడు. అట్టి దైవాన్ని విస్మరించి ఏవో ప్రాకృతమైన ఫలితాలకోసం ప్రాకులాడటం చాల పొరపాటు. వచ్చిన జన్మను సార్థకం చేసుకోవాలి. సార్థకం చేసుకోవాలంటే దైవాన్ని స్మరించాలి, దైవానికి అర్పితమైపోవాలి. అదే మీ జీవితం యొక్క ప్రధాన లక్ష్యము.

(స.సా. నం.99 పు. 321/322)

ధర్మ సంరక్షణార్థమై అవతరించు దైవము, సమస్త ప్రాకృత లీలలను సాధారణ మానవునివలె చేయుచుండును. చేయవలెను, కారణము లోకులకు ఆదర్శము నందించుటకు, అనుభూతులు కలిగించుటకు లీలలు చూచుటకు సామాన్యమైనటువంటివిగా కంటికి కనిపించినను అందులోని రసము సరసము సౌందర్యము పుష్టి విశ్వమును మోహింపజేయును, హృదయముల పరిశుద్ధపరచును. మనసుల మరపించును, మాయను వదిలించును, మధురత్వమును అందించును. ప్రాకృతములుగా కనుపించు తన లీలలన్నియును ఆప్రాకృతములే, మాననీయములే, దివ్యములే. **రామచరిత్ర వ్యక్తిచరిత్ర కాదు, విశ్వచరిత్రమనియే చెప్పవచ్చును. రాముడు సమిష్టి స్వరూపుడు సర్వవ్యాపకుడు. రామచరిత్ర** కొంతకాలము మాత్రమే జరిగెనని తలంచరాదు. ఇది అద్యంతరహితమయిన

రామతత్త్వం/రామతత్త్వము

చరిత్ర. రామేచ్ఛ లేక చీమైనను కుట్టదు, ఆకైనను రాలదు. ప్రకృతియందలి పంచభూతములు రామేచ్ఛవలననే తమ తమ కర్తవ్యములను నిర్వర్తించుచున్నవి. దృక్‌గోచరమగు సమస్త వస్తుజాలములందు గల **ఆకర్షణ శక్తియే ఆ రామచంద్రుడు.** ప్రకృతి ఆకర్షణ చేతనే లోకము జరుగుచున్నది. ఆకర్షణ లేకున్న ప్రకృతియే లేదు. అనగా రాముడు లేకున్న లోకమే లేదు.

(రా.వా.మొ.పు.6)

(చూ॥ అయోధ్య)

రామతత్త్వం/రామతత్త్వము

శ్రీరాముని చరిత్రయందు, **రాముడు కేవలం మానవ ఆదర్శపురుషుడుగా రూపొంది, తద్వారా దైవత్వము వరకును** తీసుకొని పోయేటటువంటి ఘట్టములు, మనము రామాయణములో అనేకంగా చూస్తూ వచ్చాము. కాని ఈ యొక్క మనస్తత్వాన్ని కొంతవరకూ లోకమునకు చాటి, అతడు తనలో ఉన్నటువంటి **దివ్యమైన దైవత్వాన్ని మరుగుపరచి రహస్యంగా ఉంచాడు.** అనేకమంది ఋషులు దీనిని దాచిపెట్టారు. కారణమేమనగా మొదటే రామచంద్రుడు భగవత్స్వరూపుడనే సత్యమే ప్రకటితమైతే, రావణవధ జరుగదు. అందువలననే విశ్వామిత్రుడు. రామలక్ష్మణులను తన యజ్ఞసంరక్షణకై తీసికొని వెళ్లుటకు వచ్చిన సమయమునందు "ఈ రామలక్ష్మణుల తత్వము నాకూ, వశిష్ఠులవారికీ మాత్రమే తెలియును. నీకు తెలియదు'' అనికూడను దశరథునికి స్పష్టముగా తెలిపాడు. అనంత కళ్యాణగుణములు కలిగినటువంటి రామచంద్రుని యొక్క తత్వము మహనీయులకు మాత్రమే అర్థమవుతుంది. సామాన్యులకు అది అర్థము కానేరదు. **రాముడు సర్వేశ్వరుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు.** అట్టి సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడైన రాముని తత్వము గ్రహించడము సర్వజ్ఞునకే గాని, అల్పజ్ఞుడైన మానవునికి ఆసాధ్యంకాదా? **బ్రహ్మమును తెలుసుకొనటానికి బ్రహ్మతత్వాన్ని మనము అనుభవించాలి. "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" బ్రహ్మమును తెలుసుకొనే స్థాయిని మనము చెందినపుడే ఆ దివ్యత్వమును అర్థముచేసుకోటానికి వీలవుతుంది. కనుక రామ తత్వమును మనము అర్థము చేసుకోవాలనుకుంటే ఈ రామాయణముయొక్క పవిత్ర తను మనము కొంతవరకును అనుభవములోనికి తెచ్చుకోవాలి.**

(ఆ.రా.పు.9/10)

రామునియందు ఉన్న ప్రత్యేకలక్షణము భూతదయ ఎట్టిజీవినైనను కూడా ప్రేమించి, ఆదరించి, దయచూపేటు వంటిది రామతత్వము. తనకు అపకారము చేసినటువంటి వారిని, తనకు కీడు చేసినటువంటి వారిని కూడను ప్రేమించి, ఆదరించి వారికి **మంచిని కోరేటటువంటిది రామతత్వము,** ఇట్టి పవిత్రమైన తత్వము ప్రతిమనిషికి అత్యవసరము అని భావించవచ్చు. దీనినే **'క్షము'** అని చెప్పవచ్చును. ఒకానొక సమయములో భరతుడు, తన తల్లియైన కైకను దూషించగా అప్పుడు రాముడు, **మాతృదూషణ మహాపాపమని** భరతుని చర్యను ఖండించాడు. ఇంతియేకాదు; **రావణవధానంతరము,** ఒకానొక సమయము నందు **తన తండ్రియైన దశరథుని దర్శించాడు.** ఆ సమయమునందు దశరథుడు ఆనందమును పట్టలేక "నీకు ఏమి కావలయునో కోరుకో" అని ఆజ్ఞాపించాడు. అప్పుడు రాముడు "తండ్రీ! మీరు ఈవిధమున నాకు దర్శనమివ్వటము చాలా ఆనందకర మైనది. కాని. **మా మాతృమూర్తి అయిన కైకను క్షమించి, భరతుని క్షమించి, ఆదరించి, వారికి మీరిచ్చియున్న శాపములను ఉపసంహరింతురేని నేనింకనూ ఆనందింతును. ఇదియే నాకు కావలసినది"** అని అన్నాడు. రాముని అరణ్యమునకు పంపే సమయమున దశరథుడు పట్టలేని దుఃఖముతో, క్రోధముతో "కైకా! నీకు నరకప్రాప్తి చేకూరుగాక! నీ కుమారుడు అయిన భరతుని చేతి పిండమును కూడా నేను అందుకోను'' అని అన్నాడు. ఆ విధమైనటువంటి మాటలను ఉపసంహరించుకోవాలని,

రాముడు తండ్రిని ప్రార్థించాడు. ఇలాంటి పవిత్రమైన హృదయము మానవాదర్శములకు ఎంత ఉపకరిస్తుందో యోచించాలి. రాముడు జీవితమున మూర్తిగా ఆదర్శమానవుడుగానే నటించి, లోకమునకు ఆదర్శ మూర్తిగా కూడను కీర్తిని పొందినాడు. ఇంతేకాదు; యుద్ధసమయమునందు రావణుని సైనికులు **కొంత రహస్యమునను తెలుసుకోవాలని వానరులలోచేరి, మారు వేషములతో సంచరించు** సమయమునందు **విభీషణుడు వారిని పట్టినాడు.** ఆ సమయములో సుగ్రీవాదులు వారిని హింసించుచుండగా, వారు **రాముని శరణాగతిపొంది, "రామా!** మమ్ము రక్షించుమని" కోరినపుడు రాముడు క్షమించి వదలినాడు. రాజదూతలను హింసించటము సరియైన రాజనీతికాదని, విభీషణాదులకు బోధించినాడు. నిజముగా రాముడు లోకమునకు చేసిన సేవ, లోకమునకు అందించిన ఆదర్శము, మానవత్వములో ఉన్న దివ్యత్వమును గుర్తింపచేసిన పరమతత్వమును మనము క్షణక్షణమునందు గుర్తించుకొనుట అత్యవసరము. ఈనాడు రామాయణములో తెలుసుకోవలసినదికానీ, చూడవలసినదికానీ రామచరిత్రలు కావు. **రాము లీలలుగా రామునియొక్క ఆదర్శమును తెలుసుకోవాలి.**

(ఆ.రా.పు.44/46)

"రామ" అనగా సర్వవ్యాపకమైన స్థితి. ఎక్క డ చూచినా రామ నామమే. ఏ ప్రదేశము చూచినా రామనామమే. **'సర్వదా సర్వకాలేషు సర్వత్ర రామచింతనమ్.**

రామతత్త్వమనేటటువంటిది సర్వైశ్వర్య సంపన్నమైన ఈశ్వరత్వమే. ఈశ్వరతత్వానికి రామ తత్వానికీ భేద మేమాత్రమూలేదు.

నిరంతరమూ నిత్యమై, నిర్మలమై, నిస్స్వార్థమై యున్నది రామతత్త్వము ఒక్కటియే.

ధర్మమే ప్రధాన మనీ, ధర్మమే ఆచరణ యుక్తమైనదనీ ప్రబోధలు సల్పుయుఋగ్వేదమే రామచంద్రుడు. రామాజ్ఞనే యజ్ఞముగా భావించి, రామమంత్రమును వల్లెవేయుచూ ఆనందమును అనుభవించుచున్నటువంటి లక్ష్మణుడే ఋగ్వేదము. రామనామమే పరమతారక మని భావించి నిరంతరమూ రామనామమునే గానము చేయుచున్నటు వంటి భరతుడే సామవేదము. ముగ్గురు అన్నల ఆజ్ఞను శిరసావహించి, అంతః శత్రువులను, బహిశ్శత్రువులను హత మార్చేశక్తి గలిగినటువంటి శత్రుఘ్నుడే అధర్వణ వేదము.

(రా.సా.పు.3/5)

దైవత్వము పొందేటప్పటకి ఎంత ఆధిక్యముతో జీవితము ప్రకాశిస్తుందో మనము యోచించుకోవాలి. దైవత్వము లోపల అల్పత్వము చేరటానికి వీలుండదు. **అల్పత్వములో దైవత్వాన్ని ప్రకటించటానికి సాధ్యము కాదు. సీతను పదినెలలు అశోకవనములో పుంచుకొని రావణుడు చాలా బాధపడుతున్నాడు. పది నెలలైనప్పటికిని యీమె యేమాత్రము అతని ముఖము చూడటం లేదు. ఒక్క పలుకైనా పలకటం లేదు. ఎన్నిరకములైన మాటలు ఆడినప్పటికి ఆమె యేమాత్రము లక్ష్యము చేయలేదు. ఈబాధను గుర్తించిన మండోదరి భర్త చెంతను చేరి బోధిస్తూండాది. రావణా! నీవు అనంతశక్తిని కల్గినవాడవు. ఈశ్వరుని పరమభక్తుడవు. మహాతపస్సు నాచరించిన వాడవు. నీలో యేవిధమైన శక్తినైనను మార్చుకునే సామర్థ్య ముంటుండాది. సీతను తీసుకొని రావాలనుకుంటే సన్యాసివేషమును ధరించి ఆమెను అపహరించటానికి ప్రయత్నించినట్టి వాడవు. ఏరూపాన్నయినా మార్చుకునే శక్తి కలిగినవాడవు. సీతకోసమై ఈ విధముగా బాధపడేదాని కంటె ఒక్కతూరి రామస్వరూపాన్ని ధరిస్తే సీత నీకు సులభముగా వశమవుతుందిగదా! ఎందుకు ధరించటము లేదని ప్రశ్నించింది.** అప్పుడు **రావణుడు 'మండోదరీ! పవిత్రమైన రామస్వరూపమును నేను ధరిస్తే యీ కామబుద్ధులు నాకెందుకుంటాయి'** అన్నాడు. **కనుక అట్టి రామతత్వములోకి, అట్టి దివ్యతత్వములోకి మనము పోయేటప్పటికీ యీ అల్పత్వము ఏమాత్రము మన దగ్గరకు చేరదు.**

(శ్రీ.గీ.పు.188/189)

రామదాసు

ఒక ఆదర్శమూర్తియైన మానవుని తత్వము రామాయణ మని పిలవబడుతూ వచ్చింది. ప్రతి మానవుడూ ఆదర్శమూర్తి అయిన రాముడే. అయితే, ఆ రాముని యొక్క ఆదర్శములు తనయందున్నావా లేవా అనే విచారణ ప్రతి వ్యక్తి సలుపవలసినటువంటిది. వ్యక్తి ధర్మములు, కుటుంబధర్మములు, సామాజికధర్మములు - ఈ సర్వధర్మముల ఏకత్వమే రామతత్వమనే సత్యాన్ని నిరూపించినది రామాయణము. ఇది జరిగి వేల సంవత్సరము లైనప్పటికీ ఇప్పటికీ కూడా క్షణక్షణమూ ఈ రామాయణము జరుగుతూనే ఉంటున్నది. **రము అనగా సీత, కనుక, సీతా చరిత్రమునకు రామాయణమని పేరు. రము అనగా స్త్రీ. ఈ స్త్రీ సీతయే. ఈ సీత భూజాత. ప్రకృతియందు ఆవిర్భవించిన ప్రతి మానవుడు తన తత్వమును సీతాతత్వముగానే మార్చుకోవాలి. ప్రకృతి పుత్రుడైన ప్రతి మానవుడు ఆదర్శమూర్తిగా తయారు కావాలి. వాల్మీకి రాముని ఆదర్శమానవునిగా విశ్వసించి రామాయణము వ్రాస్తూ వ్రాస్తూ కడపటికి రామచంద్రుడు సాక్షాత్ పరమాత్ముడే అని నిర్ణయం చేసుకున్నాడు. కాని, తులసీదాసు రాముడు సాక్షాత్ నారాయణమూర్తి అని ప్రారంభించి కట్టకడపటికి రాముడు ఆదర్శమూర్తి అని నిర్ణయించుకున్నాడు. ఇక కంబరామాయణంలో నరుడే నారాయణుడు. నారాయణుడే నరుడు, మానవుడే రాముడు, రాముడే మానవుడు అని తెలుపబడింది.** ఇట్లు ఒక్కొక్కరు ఒక్కొక్కరీతిగా పవిత్రమైన రామచరిత్రమును వ్రాస్తూ వచ్చారు. ఇప్పటి కాలానుగుణ్యముగా ప్రతి వ్యక్తికీ రామతత్వము అత్యవసరం.

(శ్రీ.భ.ఉ.పు.39)

(చూ॥ రామకథ, రామచరిత్ర, రామాయణ విశిష్టత, రావణత్వం, స్త్రీతత్వము)

రామదాసు

(చూ॥ దైవవిశ్వాసము)

రామనామము

"చక్కరకంటెతీపి; ఘనసారముకంటెను రుచ్యమౌను; పెం పెక్కిన తేనెకన్న అతిరుచ్యము; నోటను పల్కపల్కగా మిక్కిలికమ్మనౌ అమృతమే యనిపించును; కాన నిత్యమున్ చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్"

(ఆ.రా.పు.1)

అకార ఉకార మకారముల చేరికయే ఓంకారము. అకారము లక్ష్మణుడు, ఉకారము భరతుడు, మకారము శత్రుఘ్నుడు. ఈ మూడిటి ఏకత్వమైన ఓంకారమే రాముడు. ఈ రామనామము యొక్క విశిష్టత ఏమిటి? సంఖ్యాశాస్త్ర పరంగా రా+మ=2+5=7 అవుతుంది. అనగా సప్త సముద్రములు, సప్త వర్ణములు, సప్తస్వరములు, సప్త ఋషుల తత్వాన్ని ప్రబోధించునదే రామనామము. ప్రజ లీనాడు రామనామ సప్తాహములను జరుపుకోవడంలో గల అంతరార్థమిదే.

(స.సా.ఫి.97 పు.55)

" రామ నామము ఎటువంటి దంటే - చక్కెర కంటె తీపి॥ దధి సారము కంటెను రుచ్యమౌను; పెంపెక్కిన తేనె కన్న అతి రుచ్యము; నోటను పలుకగా అమృతమే యనిపించును. కావున, నిత్యమూ ఈ రామనామాన్ని చక్కగా స్మరింపుడు."

(స.సా.జూ.94 పు.150)

జపతపములు లేక పోయినను, నీవు రాముని వలె పితృభక్తియు, మాతృభక్తియు కలిగి యుందువేని రామ నామము నిన్ను కాపాడును. లేనిచో రామనామజపము వట్టి పెదవుల కదలిక మాత్రమే యగును. రామధ్యాన శ్లోకములు పఠించునపుడును, రామకోటి వ్రాయు నపుడును, మనసును రాముని స్వరూపమునందును రాముని స్వభావమునందును నిల్పుము. అది నీ మనసునకు స్థైర్యమును, తుష్టిని, పుష్టిని కలిగించును. ఆత్మ - విచారజ్ఞానము నలవరుచును. ఈ శ్రీరామనవమి దినమున ఈ ధర్మస్వరూపమును మీ యాత్మారాముని గా చేసుకొనుడు.

(స.వ.పు.5)

రామరాజ్యము

కోసల దేశమునకు ప్రధాన కేంద్రము అయోధ్య. ఇది మనుచక్రవర్తి స్వయంగా నిర్మించిన పట్టణము. ఇంత సుందరమైన పట్టణము మరి ఏ దేశమునందూ ఎక్కడా కనిపించదు. ఆనాడే ఈ అయోధ్యలో ఏడంతస్తులు, ఎనిమిదంతస్తుల మేడలు ఉండేవి. విశాలమైన బజారు లందు అనేకవిధములైన సౌందర్యములు కల్పించి మరింత ఆకర్షణీయంగా రూపొందింప జేస్తూ వచ్చారు. అయోధ్య పురవాసులు.

శ్రీలు మించిన దిక్కుటాలు
వింతల బంగళాలు, ముత్యపుతోరణాలు
మూలల కిటికిటీలు, వజ్రాల తలుపులు, తాపిన నీలాలు
నీలాలు వెయ్యార్లు నూరార్లు బజార్లు.

ఈ భవనములు రత్నములచేత, ముత్యములచేత కూర్పబడిన అలంకారములచేత కప్పబడినవి. ఈ రాజ్యమునకు **మహారాజైన దశరథుడు శాంతమూర్తి, తేజస్వరూపుడు. నిర్మలనిశ్చల స్వభావుడు. ప్రజలను తన కన్నబిడ్డలవలె పరిపాలిస్తూ వచ్చాడు. "యథారాజా తథా ప్రజా" అన్నట్లు, ప్రజలు కూడా దశరథుని తమ తండ్రిగా విశ్వసించి అతని ఆదర్శమును అనుభవిస్తూ వచ్చారు. ఇంత పెద్ద రాజ్యమునకు ఎనిమిదిమంది మంత్రులను మాత్రమే నియమించుకున్నాడు దశరథుడు! వీరు సామాన్యమైన మంత్రులు కారు. సకల శాస్త్రములు తెలిసినవారు. గొప్ప విద్వాంసులు, గుణవంతులు, ఇంద్రియ నిగ్రహము గలవారు. స్వార్థప్రయోజనములు లేనివారు. రాజాజ్ఞను శిరసావహించి తమ ప్రాణములనైనా అర్పించుటకు సంసిద్ధులయ్యేవారు. ఇంక వశిష్ఠుడు, వామనుడు ఇరువురు పురోహితులు, వీరు ధార్మికమైన, వైదికమైన మార్గములను ప్రబోధిస్తూ ప్రజలలో దివ్యమైన ఆత్మతత్వాన్ని ప్రకటింప జేస్తూ వచ్చారు. దశరథుడు నిరంతరము దైవ చింతనలో కాలము గడిపేవాడు. సత్యధర్మములే అతని నేత్రములు; శాంతిప్రేమలే అతని సూత్రములు, ప్రజలు కూడా అట్టివారే. మంత్రులు కూడా మహాపవిత్రులే. దశరథుని వంటి మహారాజు, అతని అష్టమంత్రులవంటి మంత్రులు, వశిష్ఠ వామనులవంటి పురోహితులు ఉండినట్లైతే ఏనాడైనా ఏ రాజ్యమునైనా రామరాజ్యంగా మార్చవచ్చు.** కాని రావణుని యొక్క గుణములు హృదయమునందు నాటుకొని రామ రాజ్యమును స్థాపించాలంటే ఎలా సాధ్యమవుతుంది? కనుక, ఈనాడు సత్యధర్మములను సరియైన మార్గములో అనుభవించాలి.

(శ్రీ.భ.ఉ.పు.39/40)

ఆనాడు **దశరథుని మంత్రులు ఎనిమిది మంది. వారెలాంటివారు? నీతినిజాయితీలతో కూడిన వారు, ఇంద్రియ నిగ్రహం కలవారు, సత్యవాక్పరిపాలకులు. అలాంటి మంత్రులు, వశిష్ఠవామదేవుల వంటి గురువులు, దశరథునివంటి రాజు ఉంటే ఇప్పుడు కూడా దేశం రామరాజ్యంగా మారిపోతుంది. దశరథుడనగా ఎవరు? దశేంద్రియములతో కూడిన ఈ దేహమే ఒక రథము. ఇందులో ఆత్మాభిమానియైన రాజు ఉంటున్నాడు. అతడే దశరథుడు. సత్వరజస్తమో గుణములే అతని ముగ్గురు భార్యలు. ఈ ముగ్గురు భార్యలకు ధర్మార్థ కామ మోక్షములనే నల్గురు కొడుకులు పుట్టారు. ధర్మము రాముడు, మోక్షము భరతుడు, అర్థకామములు లక్ష్మణ శత్రుఘ్నులు.** ఈనాడు మానవుడు ధర్మమోక్షములను విస్మరించి అర్థకామముల నిమిత్తమై ప్రాకులాడుతున్నాడు. ఇది రామభక్తికి సరియైన లక్షణం కాదు. జానెడు పొట్టకు పట్టెడన్నం పెట్టలేడా భగవంతుడు? పైరు నాటిన వాడు నీరు పోయక మానడు. ఇట్టి నమ్మకాన్ని అభివృద్ధి పర్చుకోవాలి. ఇది లేకుండా ఎన్ని చోట్లకు తిరిగినా శాంతి చిక్కదు. కారణమేమిటి? ఈ లోకంలో ఎక్కడా శాంతి లేదు. దృష్టిని హృదయం వైపు మరల్చాలి. హృదయంలో మాలిన్యం నింపుకొని శాంతి కావాలంటే ఎలా చిక్కుతుంది? ముందు ఆ మాలిన్యాన్ని ఊడ్చిపారవేయాలి. గలీజుగా ఉన్న చీపురుతో ఊడ్చితే ఇల్లు కూడా గలీజైపోతుంది. మన మనస్సే ఒక చీపురు. ముందు దానిని పరిశుద్ధం గావించుకోవాలి. అది భగవదర్పిత

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు

మైనప్పుడే పరిశుద్ధ మవుతుంది. కనుక **ప్రేమచేత రామచింతన చేయండి, విశ్వాసంచేత రాముణ్ణి స్మరించండి. ప్రేమ, విశ్వాసంచేత రాముణ్ణి స్మరించండి. ప్రేమ, విశ్వాసములే మానవుని ప్రధానమైన ప్రాణములు.**

(స.సా.మే.97 పు.134)

అయోధ్యానగరములో నిత్యోత్సవములును, నూతన వినోదములును జరుగుచుండెను. అనుదినము శ్రీరాముడు దానములకింద ధనమును వినియోగించెను. ఒకరినొకరు నిందించుకొనకూడదు. దుర్భాష లాడరాదు. ప్రతిగృహమునందు దినమూ వేదపారాయణము, పురాణశ్రవణం జరుగుచుండెను. ఎవరి కులధర్మముల ననుసరించి వారు సంచరించిరి. కానీ, పరకులములను తిరస్కరించువారు కానీ, చిన్నబరచుట కాని రామ పరిపాలనలో ఎక్కడనూ కానరాదు. రామునకు ప్రజలయందు దయానురాగములు పెరిగెను. **రాముని కాలములో భక్తి శ్రద్ధలతో భర్తలకు స్త్రీలు శుశ్రూష చేయుటచూచి దేవతాస్త్రీలు సహితము సిగ్గుపడెడివారు ఆనాటి భర్తలు కూడను వారికి తగినవారై యుండిరి. భార్యలకు కంటినీరు తెప్పించెడివారు కారు. పతీపతులు ఇరువురు అర్ధదేహములుగా భావించి ఒకరినొకరు అనుసరించి, అన్యోన్యానుకూలముగా మెలగెడివారు. అసత్యములు రామ కాలమున యెట్టి సమయము నందైననూ ఆడుటకు పూనుకొనెడివారు కారు. తల్లిదండ్రుల ఆజ్ఞలు, గురువుల ఆజ్ఞలు, బాలబాలికలు మన్నించుచుండిరి. అందరూ దేవేంద్ర భోగముల ననుభవించిరి. కుబేరునితో సమానముగా ధనధాన్యములు సమృద్ధిగా నుండెను.** శరత్కాల చంద్రబింబమును చూచి, చకోరములు సంతసించు నటుల అంతఃపురస్త్రీలు రాముని చూచి ఆనందించెడివారు. శ్రీరాముని దివ్యమంగళ విగ్రహమున కన్నులారా చూచి భరత లక్ష్మణ శత్రుఘ్నుల మనసున కాప్యాయము కలిగెడిది.

రాముని ప్రభుత్వములో లోకమంతయు సంపూర్ణ కళలతో నిండియుండెను. పాపమను మాటలేదు. మునీశ్వరులు నిర్భయముగ వనములలో సంచరించుచుండిరి. **రాజునకు ప్రజలకు అన్యోన్యానురాగము పెరిగెను. భూమి అంతయు శోభాకరముగా నుండెను. వనములు కళ కళలాడెను. పక్షులు, మృగములు స్వాభావికవిరోధమును విడిచి పరస్పరమైత్రితో మెలంగెను. రామరాజ్యములో వైరమను మాట లేదు. అందరూ పరమసఖ్యముగా నుండిరి.** ప్రతి వ్యక్తి శ్రీహరి ప్రభావమును వర్ణించుటలో యోంతయో ఉల్లాసపడు చుండెడివారు.

(రా.వా.రె.పు.230/231)

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు

కౌసల్య కుమారుడు వసిష్టుల వారివైపు చూచుచు యేదో పాతపరిచయమున్నట్లు చూపరులకు ఆశ్చర్యము కల్గించునటుల వశిష్టులవారిని చెంతకురమ్మని పిలచినట్లు ఆ బాలుడు గంతులు వేయుచొడగెను. అంత గురువు ఆబాలుని చర్యలను చూచి ఆనందమును పట్టలేక, ఆనంద బాష్పములు తుడుచుకొంటూ, అక్షతలు చేతపట్టి "రాజా! కౌసల్యానందవర్ధనుడు అందరికి ఆహ్లాదము కలిగించును, అతని గుణరూపములు అందరినీ క్రీడింపజేయును. యోగులే ఇతనిని రమింతురు. కనుక నేటి నుండి ఈ బాలుడు "రాముడ"ను పేర బరగుచున్నాడు". అని కౌసల్యా నందనునకు రాముడని నామకరణము గావించెను.

అంత ఋషులు భళీ భళీ సరియైన నామమని ఆనందించిరి. తదుపరి సుమిత్రా నందవర్ధనులైన ఇరువురు బాలురను తిలకించి, పెద్ద బాలుని చూచి శౌర్య వీర్యములను ప్రదర్శించు లక్ష్మీసంపన్నుడు కాగలడనియు, లక్ష్మీనారాయణుల సేవనే తన శ్వాసగా భావించి, ఆచరించును కనుక ఈతనికి లక్ష్మణుడనియు, అతని తమ్ముడు శత్రువులను నాశనముచేసి అన్నల జాడల ననుసరించి, శాంత చిత్తుడై ప్రవర్తించును కనుక ఆ బాలుడు శత్రుఘ్నుడనియు పిలువబడును అని ఆశీర్వదించెను.

తదుపరికైకేయీ నందవర్ధనుడగు బాలుని చూచి, **ఈతడు అందరి అంతఃకరణములను ప్రేమానందములతో**

నింపుటే కాక, ఆశ్చర్యకరమైన ధర్మప్రవృత్తి గలవాడగు ననియు, ప్రజలకు భరణ పోషణములను గావించును కనుక, అతనికి భరతుడనియు నామకరణము గావించితినని వసిష్ఠులవారు తెలుపగనే ప్రజలు పిల్లల భవిష్యత్తు కూడా ఇట్టివి కాగలవని విశ్వసించి, ఆనాటినుండి కౌసల్యానందనుని రాముడనియు, సుమిత్రానందనులను లక్ష్మణ శత్రుఘ్నులనియు, కైకేయినందనుని భరతుడనియు పిలువదొడగిరి.

(రా.వా.మొ.పు.32/33)

(చూ॥ రామాయణము)

రామలక్ష్మణులు

మన చరిత్ర పవిత్రమైన రీతిగా విచారణ చేసి చూసినప్పుడు ఒక్కొక్క వ్యక్తి తన చూపులు, తన శ్రవణము, తన పలుకులు ఎంత కంట్రోలులో పెట్టుకొని ఉండేవారో చూచుకోవచ్చు. ఒక చిన్న ఉదాహరణము. **శివధనుస్సు విరచిన తరువాత శ్రీరామచంద్రునికి సీతనిచ్చి వివాహము చేసేదానికి సిద్ధమయ్యాడు జనక మహారాజు. కానీ దీనికి పూర్వము ఒక్క క్షణమైనా సీతను రాముడు చూచి ఎరుగడు. వివాహము కాక పూర్వము ఆమె పరస్త్రీ. పరస్త్రీని కన్నెత్తి చూడకూడదు. శ్రీరామచంద్రుని శీలము యొక్క పవిత్రత. దీని బాధ్యత తల్లితండ్రులు చూచుకుంటారు.** చూడకూడదని ఉన్నాడు. పెండ్లి పీటలపై కూర్చున్నారు. తిరిగి మంగళసూత్రము కట్టే ముందు లేచి నిల్చున్నారు. సీత ఎడమభాగములో నున్నప్పుడు రాముడు కుడి వైపు చూస్తున్నాడు. ప్రక్కనే ఉన్న జనకమహారాజు చెబుతున్నాడు! ఇయం సీతా, రామా! సీత యిక్కడున్నది. నీవు ఎక్కడో చూస్తున్నావు' అన్నాడు. అనేక పర్యాయములు చెప్పాడు. ఏమాత్రము తాను లెక్క చేయలేదు. కారణం ఏమిటి? **ఇంకా మంగళసూత్రం కట్టలేదు.** ఆ స్త్రీని మనం చూడకూడదు. ఇలాంటి **ఆదర్శమును జగత్తునకందించిన వాడు చరిత్ర పురుషుడు రామచంద్రుడు.**

ఆ సోదరులందరు ఆ విధంగానే ప్రవర్తించారు. శ్రీరామునితో లక్ష్మణుడు అరణ్యమునకు బయలుదేరి వెళ్లాడు. ఒక దినము రెండు దినములు కాదు. పదునాలుగు సంవత్సరములు. వీరి వెంట సీత కూడా ఉంటున్నది. సీత చాలా యువ్వనవతి. 18 సంవత్సరముల వయస్సు 20 సంవత్సరముల వయస్సు గలిగిన రామ లక్ష్మణులు వెంటనే ఉంటున్నప్పుడు ఈ పదునాలుగు సంవత్సరములు సీత ముఖము చూచి ఎరుగడు లక్ష్మణుడు. సీతను రావణుడు తీసుకుపోయిన తరువాత లక్ష్మణుడు, రాముడు సీతను వెతక్కుంటూ వెడుతున్నారు. ఒక పర్వతముపై సుగ్రీవుడు హనుమంతుడు ఉండేవారు. ఆ జన సమూహమును జూచి సీత తన నగలను మూటగట్టి ఆ పర్వతముపై వదలిపెట్టింది. సీతాన్వేషణ నిమిత్తమై పోతున్న సమయంలో సుగ్రీవుడు వారికి స్నేహమయ్యాడు. వీరి చరిత్ర సుగ్రీవునికి చెప్పారు. సీతను తీసుకుపోయారు ఎవరో. వారిని వెతకటానికి మీ సహాయము అత్యవసర మన్నాడు. ఆ మాట విన్న తక్షణమే సుగ్రీవుడు ఒక మూట తెచ్చి యిచ్చాడు. ఈ నగలు సీతమ్మవేనా చూడండి అన్నాడు. రామునికి కూడా భార్య నగలు ఏవో తెలియదు. అప్పుడు లక్ష్మణుని ముందు పెట్టాడు. 'లక్ష్మణా! ఈ నగలు మీ వదినవేమో చూడ' మన్నాడు. అప్పుడు లక్ష్మణుడు చెప్పాడు. ' ఈ కంఠ హారము ఎవరిదో తెలియదు. ఈ కంకణములు ఎవరివో నాకు తెలియదు. కానీ కాలి **అందెలు మాత్రము సీతవే. అవి నాకు చక్కగా తెలుసు' అన్నాడు. ' ఆ అందెలు మాత్రం నీకు ఎట్లా తెలుసు' అని రాముడు అడిగాడు. 'ఆమెకు దినము పాదాభివందనము చేసేవాడిని. ఆమె యొక్క పాదములపై యీ నగలున్నవి. చూచాను'** అన్నాడు లక్ష్మణుడు. పదునాలుగు సంవత్సరములు అడవిలో నుండినప్పటికిని ఒక్కక్షణమైనా సీత ముఖము చూచి ఎరుగడు లక్ష్మణుడు. **ఈ విధమైన శీలము పోషించుకుంటూ రావటం చేత వారు ఆనాడు ఆదర్శపురుషులుగా రూపొందుతూ వచ్చారు.**

(శ్రీ.స.పు.52/53)

రామశక్తి

(చూ॥ దైవవిశ్వాసము)

రామాయణతత్త్వము

(చూ॥ స్త్రీపురుష భేదములు)

రామయణ భాగవతభారతాలు

(చూ॥ పురాణములు)

రామాయణము

ఆత్మే రాముడు. తాను జీవుని వేషము ధరించి దేహ, వస్త్రధారియై వచ్చినాడు. లీలావినోదమే కాని తనకు కష్టమెక్కడిదీ, సుఖమెక్కడిదీ? ఈ రెండూ లేని ఆనంద స్వరూపుడు. తనమాయా సంకల్పముచే సర్వమునూ సృష్టించును, సర్వమునూ లయమొనర్చును. ఈ లోక నాటకరంగమందు ఒక్కొక్క గుణమును ఒకొక్క స్వరూపముగా చూపించి, తానూ ఒక స్వరూపమును ధరించి జీవితమను రామాయణమును జరిపించినాడు. అట్టి రామాయణము నేటికి కూడా ప్రతి హృదయమున జరుగుచునే యున్నది. అన్నింటికి ఆత్మారాముడు సాక్షీభూతుడై చూచుచునే యున్నాడు.

~~ఈ జడము బ్రహ్మజ్ఞానమను చైతన్యమును వరించును.~~ **ఆ బ్రహ్మజ్ఞాన చైతన్యమే సీత అను పేరున పుట్టినది.** అప్పుడు ఈ జడ చైతన్యములు ఒకటిగా ఏకమగును వాటినే సీతారాములను పేర్లతో సంబోధించుచున్నారు. అ రెండూ ఏకముగా ఉన్నంత కాలమూ ఏ బాధలూ ఉండవు. ఈ రెండింటి యొక్క యెడబాటే కష్ట ప్రారంభము.

బ్రహ్మ జ్ఞానమను సీత, జీవిరూపమందున్న ఆత్మను వదలిన అంధకారమను జీవిత అడవిలో పడక తప్పదు. జీవి బ్రహ్మజ్ఞానమను సీతను పోగొట్టుకొనుట వల్ల అంధకారమను అడవిలో సంచరించక తప్పదను అర్థమును చూపుటకొరకే రాముడు అట్లు నటించినాడు. అట్టి **అంధకారమైన జీవిత అడవిలో వంటరిగా వద్దు, మనస్సు అనే లక్ష్మణుని ఎడబాయక ఉండమని తెలిపినాడు. అట్టి అంధకార జీవితములో సంచరించు సమయమున దీనత్వము, వివేకము అనేవి రెండూ వైరముతో ఉండుననియూ, అట్టి సమయమున దీనత్వమను వాలిని తెగటార్చవలెననియూ చూపినాడు.** ఈ దీనత్వ వివేకములే వాలి సుగ్రీవులు, **దీనత్వమే వాలి, వివేకమే సుగ్రీవుడు.** దీనత్వమును తెగటార్చుటకు తగిన సహాయకారి, అతనే ధైర్యమను రూపమున ఉన్నాడు. **ఆ ధైర్యమను హనుమంతుని విశ్వాసము** చేసికొనుట వల్లనే మోహ సారమను సప్త సముద్రములనూ జీవి సులభముగా దాటగలడనుట నిశ్చయముగా చూపుతూ లంకకు హనుమంతునితో సేతువు కట్టించినట్లు చూపినాడు. రాముడు సేతువుదాటి మోహమును దాటిన తక్షణము **రజోగుణ తమోగుణములను రావణుని, కుంభకర్ణుని చంపివేసెను. మిగిలిన చిన్నతమ్ముడైన సత్వగుణము అనగా విభీషణునకు పట్టముగట్టెను. కాన మూడు గుణములనూ ముగ్గురు అన్నదమ్ములు వారే రావణ, కుంభకర్ణ, విభీషణులు.**

తరువాత అనుభవజ్ఞానమైన సీత అను చైతన్యమును చేరుట. ఎప్పుడు తిరిగి జడ చైతన్యములు చేరునో అదే పట్టాభిషేకము. అనగా ''జీవన్ముక్తి''. కాన, రామాయణములో సారమేమన, మానవుని యందున్న జీవి, మనసూ, జ్ఞానమూ, దీనత్వము, వివేకము, మోహము, ధైర్యము, రజస్సు, తమస్సు, సత్వము వీటిని ఒక్కొక్క దానిని ఒక్కొక్క రూపనామములుగా సృష్టించి, ఏవీ రీతిగా జయించవలెను, సాధించవలెను, అను విధానమును ఆత్మ స్వరూపుడు రామస్వరూపమున వచ్చి నటించి నడిపించి, చూపించి, చేయించినాడు. కాన, ఆనాటితో రామాయణము ముగియలేదు. ఎవరెవరి జీవితము ఇన్ని మార్గములు సాధించి, కడకు అనుభవ జ్ఞానమును పొంది. సత్వగుణమునకు పట్టము కట్టుదురో అంత వరకు వారి వారి హృదయ భూమియందు రామాయణము జరుగుచునే యుండును.

ఎట్టి గుణములైనా ఇంద్రియ సంబంధము లేక చలించవు! గుణములకు పుట్టుక స్థానమే అది. కర్మేంద్రియములు ఐదు, జ్ఞానేంద్రియములు ఐదు. ఈ రెండూ చేరేకదా మనోసహాయమున ఆత్మను చేరుచున్నవి. లేకున్న లయమే లేదు. **'మాయలోనే పుట్టి, మాయలోనే పెరిగి, మాయను దాటుట మనిషి నీతి అన్నట్లు వాటిలోనే పుట్టి వాటిలోనే పెరిగి, వాటిని దాటుట జడ లక్షణములు కదా!'**

దశేంద్రియములందు నాలుగే కాదు, ఎన్ని గుణ రూపములైననూ పుట్టవచ్చును. అయితే ముఖ్యముగా పుట్టవలసిన గుణ రూపములు నాలుగు ముఖము లనియూ, పరమాత్ముడు, చతుర్ముఖుడు కనుక, తనను తాను సంకల్పించుకొని నాలుగు భాగములుగా విభజించి, నాలుగు ముఖములూ నాలుగు రూపములుగా జన్మించిరి, వారే రాము, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు. వారు సూక్ష్మరూపమున సత్య, ధర్మ, శాంతి, ప్రేమ స్వరూపులై యున్నారు. పరమాత్ముని యొక్క చతుర్ముఖములు ఇవియే.

రాముడే సత్య స్వరూపుడు. ఎవరి స్థానము వారిదే కాని, నాకు అర్హత లేదని నిరూపించిన **భరతుడే ధర్మ స్వరూపుడనియూ,** ఆత్మపై (అనగా రామ స్వరూపునిపై) సంపూర్ణ భారము వేసి, దానికంటే మించిన ఆనందము వేరులేదని సర్వకాల సర్వావస్థల యందును ఎడబాయక నిరూపించిన **లక్ష్మణుడే ప్రేమ స్వరూపుడనియూ** ఈ మూడింటిని అనుసరించి అవి ఏవీ మార్గమున నడుచునో అంతవరకూ తాను ఏ ఉద్దేశ్యములు పడక శాంతముగా ఈ మూడింటి జాడలలో నడిచి నిరూపించిన **శత్రుఘ్నుడే శాంత స్వరూపుడు.**

మాయలోనే పుట్టి, అందులోనే పెరిగి తిరిగి దానినే జయించవలె నన్నట్లు వీరు గుణములందే పుట్టి గుణములను జయించి, **గుణాతీతులు అయ్యే అర్థమును నిరూపించుటకే ఈ ముగ్గురు తల్లులూ మూడు గుణములుగా ఉండిరి. అందులో కౌసల్య సత్వ గుణము, కైక రజోగుణము, సుమిత్ర తమోగుణముగా నటించినవి. దశరథుడు దశేంద్రియ రూపుడై ఈ గుణములను కూడియుండుటవల్ల వారు ఇంద్రియ గుణ స్వరూపులను పేరున నిల్చి యుందురు. ఈ ఇంద్రియ గుణముల మూలమున మానవులు సులభముగా గ్రాహ్యము చేసుకొనలేని మానవ బోధనా మార్గము పరమాత్ముడు ఇన్నిన్ని స్వరూపములతో ఇంత రామాయణమును ఈనాటి మానవ హృదయరంగమున గుణరూపములతో సూక్ష్మ రామాయణముగ జరుపుచున్నాడు.**

(శ్రీ.స.సూ. పు.256/258)

విద్యార్థులారా! **రామాయణమును మూడు విధములైన పేర్లతో వాల్మీకి ప్రచార ప్రబోధలు సల్పాడు. మొదటిది రామాయణం, రెండవది సీతాచరితము, మూడవది రావణవధ. "రామస్య ఆయనం రామాయణం". రాముని గురించి తెలిపేది భౌతికమైన రామాయణం. దీనిని అంతర్ముఖంగా విచారణ చేస్తే - ఇదే పరమాత్ముని కథ. రెండవది, "రమాయాః ఆయనం ఇతి రామాయణం", అనగా సీతాచరిత్రమును తెలుపునది రామాయణం. ఇది బాహ్యమైనది. అంతర్ముఖంగా విచారిస్తే - ఇది జీవాత్మ చరితము. ఇంక మూడవది రావణవధ. ఇది బాహ్యమైనది. అంతర్భావములో ఇది అజ్ఞాన నాశనము. ఏతావాతా రామాయణమనగా పరమాత్ముని కథ, సీతాచరితమనగా జీవాత్మకథ, రావణవధ అనగా అజ్ఞాన నాశనము. పరమాత్మ జీవాత్మల తత్వములను చక్కగా గుర్తించినప్పుడే అజ్ఞానము నాశనమవుతుంది. ర,అ,మ** ఈ మూడు అక్షరములలో ఉండిన అంతరార్థ మేమిటి? **ఒకటి సూర్య బీజము, రెండవది చంద్ర బీజము, మూడవది అగ్ని బీజము. సూర్యబీజము అజ్ఞానాంధకారమును దూరం గావిస్తుంది. చంద్రబీజము లోని తాపమును చల్లార్చు తుంది. హృదయానికి చల్లదనము చేకూర్చుతుంది. ఇంక అగ్ని బీజము పాపమును నాశనం చేస్తుంది.**

(శ్రీ.భ.ఉ.పు.46)

(చూ॥ ఆదర్శం, ఇంద్రియపటుత్వం, కామ క్రోధ లోభములు, పరమాత్ముని కథ, ప్రాయశ్చిత్తం, సోదర ప్రేమ, హనుమంతుడు)

రామాయణ విశిష్టత

వ్యక్తి యొక్క ధర్మము, కుటుంబముయొక్క ధర్మము, సాంఘిక ధర్మము అనే ధర్మ త్రయమును తెలిపే నిమిత్తమై రామకథ ప్రారంభమైనది. రాముడు దయాసాగరుడు, ప్రేమస్వరూపుడు. కనుక, రామ తత్త్వాన్ని ప్రేమచేతనే గుర్తించటానికి సాధ్యమవుతుంది. మానవత్వంలో అంతర్భూతమై ఉన్న ప్రేమ తత్త్వాన్ని మానవుడు అభివృద్ధి పర్చుకున్నప్పుడే దివ్యమైన ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకోగలడు. నేటి సమాజానికి రామాయణం అత్యవసరం. కారణమేమిటి? ఈనాడు పుత్రుడు తండ్రి మాట వినటం లేదు; తల్లి దండ్రులు పుత్రునియొక్క శ్రేయస్సును గురించి ఆలోచించటం లేదు. శిష్యునికి గురువుయందు విశ్వాసం లేదు; గురువు శిష్యునికి హితమును బోధించుట లేదు. **ఇట్టి పరిస్థితులందు సమాజానికి రామాయణంలో అంతర్భాగమై ఉన్న ధర్మాలు అత్యవసరం.** వ్యక్తి యొక్క నిజత్వమును వెల్లడించునదే రామాయణం. మానవత్వాన్ని వివరించి ప్రబోధించునదే రామాయణం. సోదరుల మధ్య ఉండవలసిన ఐక్యతను, తండ్రీ బిడ్డలమధ్య, గురుశిష్యులమధ్య ఉండవలసిన సంబంధ బాంధవ్యమును విపులీకరించి బోధించునదే రామాయణం. భారతీయ సంస్కృతి **"సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, న బ్రూయాత్ సత్యమప్రియం" అని ప్రబోధించింది. మొదటిది నైతిక విలువ. రెండవది ధార్మిక విలువ, మూడవది ఆధ్యాత్మిక విలువ. ఈ నైతిక ధార్మిక ఆధ్యాత్మిక తత్త్వములు మూడూ రామాయణమునందు ఇమిడియున్నవి.**

(స.సా. మే. 99 పు.113/114)

రాముని జన్మ స్థానము

ఒక పర్యాయం విశ్వహిందూ పరిషత్ జనరల్ సెక్రెటరీ అశోక్ సింఘాల్ నా దగ్గరకు వచ్చి "స్వామీ! రాముడు జన్మించిన చోట మేమొక మందిరమును కట్టాలని ఆశిస్తున్నాము. రాముడు ఎక్కడ పుట్టాడు? మేము నిర్ణయించిన స్థానం లోనే పుట్టాడా? లేక, ఇంకో స్థానంలో పుట్టాడా? ఎక్కడ పుట్టాడో మాకు తెలియజేస్తే మేము అక్కడొక మందిరం కట్టిస్తాము" అన్నాడు. అప్పుడు నేను **"పిచ్చివాడా! కౌసల్య గర్భమే రాముని జన్మస్థానము"** అని చెప్పాను. వ్యక్తులు గాని, అవతారములుగాని అందరూ తల్లి గర్భము నుండియే జన్మిస్తున్నారు. గనుక, ప్రతి ఒక్కరూ తల్లియొక్క కీర్తిగౌరవాలను కాపాడే వ్యక్తులుగా తయారు కావాలి. ఈ నవంబరు 19వ తేదిని 'లేడీస్ డే' గా జరుపుకోవడంలో గల అంతరార్థం ఇదే. ప్రతి ఒక్కరూ తల్లి యొక్క ఇష్టమును అనుసరించాలి. ఒకవేళ తల్లికి తెలియకపోతే ఆమెను నొప్పించకుండా తగిన రీతిగా నచ్చజెప్పాలి.

(స.సా.డి.99 పు.362/363)

ఈనాడు మీరు రాముని జన్మదినమును జరుపుకుంటున్నారు. అయితే, రాముడు బోధించిన విషయాలను ఆచరించకుండా కేవలం రాముని జన్మదినమును జరుపుకున్నంత మాత్రమున ప్రయోజనం లేదు. **"రామో విగ్రహవాన్ ధర్మః"** రాముడు ధర్మస్వరూపుడు. రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు నల్గురూ దశరథుని కుమారులని మీరు భావిస్తున్నారు. దశరథుడనగా ఎవరు? భౌతికంగా చూస్తే అతడు అయోధ్య నగరానికి రాజు. అయోధ్య అనగా ఏదో కాశీకి సమీపంలో ఉన్న పట్టణమని, అక్కడే శ్రీరామచంద్రుడు పుట్టాడని భావించడం చాల పొరపాటు. ఒక రోజు అశోక్ సింఘాల్ నన్ను అడిగాడు. "స్వామీ, రాముని జన్మస్థానం గురించి అనేకమంది అనేక అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. రాముని నిజమైన జన్మస్థానమేమిటో దయచేసి మాకు తెలియజేయండి." అప్పుడు నేను చెప్పాను, "సింఘాల్! రాముని యొక్క జన్మస్థానము కౌసల్య గర్భమే. రాముడు ఇక్కడ పుట్టాడు. అక్కడ పుట్టాడు అని మీరు కేవలం ఆకారాన్ని మాత్రమే ఆధారం చేసుకుంటున్నారు. కాని, రాముడు సర్వ వ్యాపకుడు."

(స.సా. మే. 2000 పు.143)

రావణతత్త్వము

ఈనాడు మానవత్వంలో రెండు తత్త్వములు ప్రధానంగా గోచరిస్తున్నాయి. **ఒకటి రావణతత్త్వం, రెండవది రామతత్త్వం. రావణతత్త్వం రాగ ద్వేషాహంకారములతో కూడినది. రామతత్త్వం నిర్మల, నిస్వార్థ, నిరహంకారములతో కూడినది. రాముడు లోకకల్యాణం నిమిత్తమై తనకున్న సర్వభోగభాగ్యములను త్యజించి కారడవులలో ప్రవేశించి, రాగ ద్వేషాహంకారములతో కూడిన రాక్షసులను సంహరించాడు.** కాని ఈనాటి రామభక్తులు రాముడు త్యజించిన భోగ భాగ్యములనే ఆశిస్తూ తద్వారా ఈ రాగ ద్వేషాహంకారములను మరింత అభివృద్ధి పరచు కుంటున్నారు. ఇది రామభక్తి యొక్క తత్త్వం కాదు.

(స.సా.న.1999పు.290/291)

రావణుడు

రావణుడు ఎన్ని విద్యలు చదివినా, ఎంత కఠోర తపస్సు చేసినా అతనిలో హృదయ పరివర్తన కలుగలేదు. అతడు వాంఛలచేత కుమిలిపోయాడు, ఆశలచేత కృంగిపోయాడు. కోరికలచేత కల్మషుడయ్యాడు. కానీ,_**చిట్టచివరికి తన ప్రాణం పోయే ముందు ప్రజలకు ఒక చక్కని సందేశాన్ని అందించినాడు. "ఓ ప్రజలారా! నేను కామమునకు లొంగిపోయి నా కుమారులను పోగొట్టుకున్నాను : వాంఛలకు లోబడి నా వంశమును నాశనం గావించు కున్నాను; రాగమునకు లోబడి నా రాజ్యమును భస్మం గావించుకున్నాను. మీరు నావలె చెడిపోకండి, రామునివలె ధర్మమార్గమును అవలంబించి జీవితంలో ఉత్తీర్ణులు కండి" అన్నాడు.**

(స.సా. మే 99 పు.114)

రావణుడు మహావిద్యావంతుడు, మహా తపస్వి మహా శక్తివంతుడు. కాని, తన తెలివి తేటలను స్వార్థ స్వప్రయోజనాలలో ప్రవేశ పెడుతూ వచ్చాడు. **మానవునికి సరియైన మార్గమును నిరూపింప జేయటానికి సుజ్ఞాన విజ్ఞాన ప్రజ్ఞానములు మూడూ ఆధారముగా ఉంటాయి. మొదట రావణునికి సుజ్ఞానమనే మండోదరి** ఎంతగానో బోధించింది. "రావణా! **నీ పత్నిని పరపురుషుడు అపహరించినప్పుడు నీ మనస్సు ఏ రీతిగా ఉంటుందో యోచించు.** పరపురుషుని పత్నిని నీవపహరించి నప్పుడు ఆ పతి ఎంతగా బాధపడతాడో యోచించు. అనంతమైన శక్తి సామర్థ్యాలు కలిగిన నీవు విచారణా శక్తి, విచక్షణా జ్ఞానము లేక అజ్ఞానములో ప్రవేశిస్తున్నావు. ఇది మంచిది కాదు" అని బోధించింది.

తరువాత **విజ్ఞానమనే విభీషణుడు కూడా రావణునకు బోధించాడు. "సోదరా! నీవు చక్రవర్తివి, మహాతపస్వివి. ఇది చక్రవర్తి చేయవలసిన పనికాదు.** మహా తపస్వివైన నీ విట్టి పెడమార్గం పట్టడం మంచిది కాదు. నీ విజ్ఞాన శక్తితో చక్కగా విచారణ చేసి పవిత్రమైన మార్గంలో ప్రవేశించు" అని విభీషణుడెంతగా బోధించినప్పటికీ స్వార్థపరుడైన రావణుని తలకెక్క లేదు.

ఈ విధంగా సుజ్ఞానమనే మండోదరి, విజ్ఞానమనే విభీషణుడు ఎంతగా బోధించి నప్పటికీ రావణునిలో ఏమాత్రం మార్పు లేక పోవడం చేత **ప్రజ్ఞానమనే హనుమంతుడు ప్రవేశించి చెప్పాడు.**

బుద్ధిచెప్పెద రావణా...! ఈ లంక
నీకింక లేదుర దుర్గుణా!!
బుద్ధి చెప్పద వినుము నీవిక
సద్దుచేయక నాదు పల్కులు
బుద్ధికి యోచించక చావుకు
బద్ధుడవైతివి పాపమతివై ॥బుద్ధి చెప్పెద॥
లోకమునకు తల్లిరా సీతమ్మ
నీకును చూడగ తల్లిరా..!
లోకమాతను తెచ్చి ఇప్పుడు
పాతకమున కొడిగట్టుకొంటివి
ఏక శరమున నీదు శిరముల
నేక మారుగ ద్రుంచు రాములు ॥బుద్ధి చెప్పెద॥
పది తలలుండే తీరు
నీ విప్పుడు చేసే దర్బారు

రీటైర్

ఇవి కదా నే చూడవలెనని
ఇంద్రజిత్తు చేత చిక్కితి
పదె పదె నీ కేల చెప్పుదు
ప్రాణములు నీసొమ్ము కావురా!'' ॥బుద్ధి చెప్పెద॥

అని హనుమంతుడు ఎంతగానో బోధించాడు. కాని, స్వార్థపరునకు తన ప్రాణము తన హస్తములో లేదు. పవిత్రమైన హృదయము పరోపకారమైన భావములు కలిగి నిస్వార్థమైన హృదయంతో లోక కల్యాణమును ఆశించిన రామునకు మాత్రమే తన ప్రాణము తన హస్తములో ఉన్నది. ఇట్టి సత్యాన్ని గుర్తించిన వ్యక్తుల యందు దివ్యత్వమనేది సాక్షాత్కరిస్తుంది.

(స.సా.ఆ.93పు.209/210)

రావణుడు గొప్పవాడు, రాముడు మంచివాడు **మంచితనమునకు గొప్పతనమునకు గల వ్యత్యాసమును మీరు గుర్తించాలి.** అందరియందు దైవత్వమును గుర్తించి వర్తించడమే మంచితనము. రావణుని యందుకూడా దైవత్వాన్ని గుర్తించాడు రాముడు. యుద్ధానికి వస్తున్న రావణుణ్ణి చూసి "లక్ష్మణా! రావణుని తేజస్సు ఎంత గొప్పగా ఉందో చూడు సాక్షాత్తు ఇంద్రునిలా కనిపిస్తునాడు" అన్నాడు. ఇంత తేజస్సుండి ఇన్ని విద్యలుండి కట్టకడపటికి ఒక్క దుర్గుణంచేత రావణుడు నాశనమైపోయాడు.

(స.సా.జూలై2001పు.204)

(చూ॥ దైవవిశ్వాసము, మంగళవారము, మంచితనము, మంచివాడు, రామచరిత్ర, సందేశము)

రీటైర్ (Retire)

దీపం ఉన్నప్పుడే మనం మన పనులను చక్కపెట్టుకోవాలి. పడవ చిల్లులు పడి శిధిలం కాక పూర్వమే నదిని దాటాలి. అన్ని విధాలా పటుత్వంగానున్న సమయంలోనే చేయవలసిన సత్కార్యాలు చేయాలి, దైవకార్యాలను ఆచరించాలి, సాధనలు సలిపి దైవానుగ్రహమునకు పాత్రులం కావాలి. వర్షాకాలంలో Tank ను పూర్తిగా నింపితే ఎండాకాలంలో కూడా చక్కటి పంటలు పండించుకోవచ్చును. అయితే కొంత మంది అబ్బే! ఇప్పటినుంచే భగవచ్చింతన ఎందుకు? Retire అయిన తరువాత ప్రశాంతంగా జపం చేసుకుంటూ కూర్చోవచ్చునంటారు. కాని "Retire అయిన తరువాత మన అంగములు Tire అయిపోతాయి. అప్పుడు మనం ఏమి చేయగలుగుతాం?'' జవసత్వాలు ఉడిగిన తరువాత చేయగలిగినదేమి లేదు. ఓపిక ఉన్నప్పుడే ఏ పనినైనా చేయగలుగుతాం, దేనినైనా సాధించగలుగుతాం. వయసు మళ్ళిన వారికి ఏకాగ్రత కుదరదు. కనుక వంటిలో శక్తి ఉన్నప్పుడే దైవచింతనకు కొంత సమయాన్ని కేటాయించాలి. అలా చేయకుండా అవసాన దశలో చింతించితే ప్రయోజనం ఉండదు. **"దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి"** అనే లోకోక్తిని విస్మరించరాదు.

(అ.కు.చివరిపుట)

రుక్మిణి

(చూ॥ భక్తి)

రుద్రుడు

(చూ॥ ఇంద్రుడు)

రూప/రూపము

(చూ॥ జన్మాద్యస్సయతః, పంచభూతములు, భ్రాంతి)

రూప నామములు

ప్రపంచమందలి సర్వ పదార్థములూ రెండు భాగములుగా నున్నవి. అవియే రూప నామములు ఈ రూపనామములను తీసివేసిన ప్రపంచమే లేదు. **రూపమును స్వాధీనము చేసుకొన్నది నామము; నామమును ఆశ్రయించి యున్నది రూపము.** ఇందులో ఏది నిత్యము, యేది అనిత్యము అని యోచించిన, **నామము నిత్యము, రూపము అనిత్యము** లోకమున యెన్నియో సత్కార్యములను చేసి కొన్ని ఘన కార్యములను సాధించి యుండవచ్చును. కొన్ని

వైద్యశాలలో, కొన్ని విద్యాసౌకర్యములో, భగవన్మందిరాలో అనేక ప్రజా ప్రధాన సదుపాయములో చేసియుండ వచ్చును: కానీ వారు నేడు స్వరూపకముగా లోకములో లేనప్పటికినీ వారు చేసి సాధించిన కార్యములు కర్మలు లోకమున నేటికినీ నిలచియున్నవి కదా! **రూపము కొంత కాలముండి పోయిననూ, నామము మరికొంత యెక్కువ కాలము నిలచియుండును.** నామములు అసంఖ్యాకము లయినప్పుడు స్వరూపములు అసంఖ్యాకము లయి యుండును. అయితే యిచ్చట మనకు నిత్యానుభవము నందు పండితుని మొదలు పామరుని వరకూ సులభముగా అర్థమయ్యే అక్షరములను విచారింతము. తెలుగునందు చూచినయెడల యేబదిరెండు అక్షరములు, ఆంగ్లము నందు చూచిన ఇరువదియారు అక్షరములు. లోకంలో గొప్ప గొప్ప సాహిత్యములన్నింటినీ కొండలు కొండలుగా కుప్పలు వేసిననూ, ఈ తెలుగునందు గల యేబదిరెండు అక్షరములే తప్ప మరేమీ యెక్కువ ఉండవు. ఆంగ్లమును చూచిన ఇరువదిఆరు అక్షరములు తప్ప క్రొత్తవేవీ అందులో లేవు, రావు.

(గీ.పు.104/105)

రూప రహితుడు

(చూ॥ లీనమగుట)

రెండుశక్తులు

పదార్థమునకు రెండు శక్తులు ఆధారంగా ఉంటాయి. **ఒకటి నిమిత్త మాత్రం రెండవది మూలాధారం. మూలాధారతత్వము లేనిదే- కల్పితమున కాధారంలేదు.** ఉ॥ బంగారం అధిష్టాన (మూలాధార) పదార్థం. బంగారం తనంత తాను నగ కాలేదు. - నగ చేసేనిమిత్తమాత్రుడు (కంసాలి) ద్వారా తయారైంది. కంసాలిని వదలి నగ ఉండవచ్చును గాని ఆధారభూతమైన బంగారాన్ని వదలి నగ ఉండటానికి వీల్లేదు. అట్లాగే అధిష్టానమైన దైవత్వం నుండి నిమిత్తమాత్రమైన జగత్తు తయారైంది. నిమిత్తాన్ని వదలి అధిష్టానం ఉండవచ్చును. అధిష్టాన్ని వదలి నిమిత్తం ఉండలేదు. - **చేపలు లేక జలం ఉండవచ్చును. జలం లేక చేపలు ఉండలేవు. జగత్తు లేక బ్రహ్మ ఉండవచ్చును. బ్రహ్మలేక జగత్తు ఉండలేదు. ప్రపంచంవేరు బ్రహ్మవేరు అని భావించవద్దు. ప్రకృతి స్త్రీ. పరమాత్మ పురుషుడు. ప్రకృతి పురుష సంయోగమే సృష్టికి మూలం.**
తల్లి, తండ్రి రెండూ కూడినదే జగత్తు. ప్రకృతి ద్వైతం, బ్రహ్మ అద్వైతం. ప్రకృతి సంగ్రహం. బ్రహ్మ అనుగ్రహం. సంగ్రహానుగ్రహాలు రెండూ కూడినదే జగత్తు. జడ చైతన్యములు చేరినదే జగత్తు. వీటిని వేరు పరచ వీలులేదు. జగత్తంతా బ్రహ్మయే. మృణ్మయ జగత్తులో చిన్మయ బ్రహ్మ ఉన్నది.

(త.శ.మ.పు.44/45)

రెలిజియన్

బ్రహ్మసత్యాన్ని గుర్తించాలి. దీనిని గుర్తించాలను కున్నప్పుడు బ్రహ్మ తత్వాన్ని చింతించాలి. తెలుసు కొనుటకు ప్రయత్నించాలి. దీనితో సంభాషించటానికి ప్రయత్నించాలి. అదే నిజమైన రెలిజియన్ మ్యాన్ మస్ట్ రియలైజ్ గాడ్, ఫీల్‌గాడ్, సీగాడ్, టాక్‌గాడ్, దిస్-ఈజ్ రియలైజేషన్. మానవుడు మొట్టమొదట గుర్తించవలసినది దైవత్వాన్ని. దానిని తెలుసు కొనకుండా ఎన్నింటిని తెలుసుకున్నప్పటికిని ప్రయోజనము లేదు.

(బ్ర.త్ర.పు.160)

Religion అంటే Realisation అని అర్థము. Realise చేసిన తరువాత ఒకే Religion సరియైన సమన్వయాన్ని మనము అభివృద్ధి పరచుకోవాలి.

(బ్ర.త్ర.పు.99)

రెస్ట్ (Rest)

(చూ॥ గుండె)

రేచకము

(చూ॥ ప్రాణాయామము)

రేడియేషన్

(చూ॥ అయస్కాంత శక్తి, విశ్వామిత్రుడు)

రైల్వేస్టేషన్

సేవాదళంవారు, భక్తులు ప్రశాంతి నిలయానికి సుఖంగా వచ్చి చేరడానికి ఇక్కడ. ఒక రైల్వే స్టేషన్ నిర్మించాలని సెంట్రల్ గవర్నమెంట్ 50 కోట్లు మంజూరు చేసింది. ప్రశాంతి నిలయం మెయిన్ రోడ్డు దాటిన తరువాత వచ్చే పెట్రోల్ బంక్‌కు దగ్గర రైల్వే స్టేషన్ నిర్మించాలని నిర్ణయించారు. పెనుకొండ, ప్రశాంతి నిలయం, ధర్మవరంలకు కనెక్షన్ ఇచ్చే రీతిగా రైళ్ళను ప్రారంభిస్తున్నారు. రైల్వే డిపార్ట్‌మెంట్‌వారు మొన్న మీటింగ్ జరుపుకొని ఒక నిర్ణయానికి వచ్చారు. స్వామి 75వ బర్త్‌డేకే అందరూ వచ్చి ప్రశాంతి నిలయంలో దిగాలి. బొంబాయిలో ఎక్కవచ్చును. హైదరాబాద్‌లో ఎక్కవచ్చును. ఎక్కడ ఎక్కినా ప్రశాంతి నిలయం చేరుకోవడానికి వీలవుతుంది. ఇవన్నీ మీకు ఎందుకోసం చెపుతున్నానంటే - అవతార సమయంలో ఎప్పుడు ఎక్కడ ఏది జరగాలో అన్నీ జరిగిపోతుంటాయి.

(స.సా.ఫి.99 పు.36)

రోగము

నా ఉద్దేశ్యంలో - రోగము వచ్చిన తరువాత మనం ట్రీట్‌మెంటును ప్రారంభించే కంటే, రోగములే రాకుండా ఉండే స్థితిని కనిపెట్టాలి. తల్లి గర్భములో ఉన్నప్పుడే శిశువుకు ఎలాంటి జబ్బులూ రాకుండా ఉండేందుకై డాక్టర్లు, ప్రభుత్వమువారు దానికి తగిన ప్రచారము చేయాలి. చిన్న చిన్న బిడ్డలకే ఈ గుండె జబ్బు వచ్చిందంటే ఎంత ప్రమాదము! ఎంత బాధ! కొంతమంది చిన్న పిల్లలను చూస్తే ఎంతో ఆనందంగా ముద్దుగా కనిపిస్తారు. కాని, వారి జబ్బుచూస్తే భయంకరంగా ఉంటుంది. దీని వలన ఎవరికి సుఖము? తల్లిదండ్రులకు సుఖము లేదు; బిడ్డలకు సుఖము లేదు; సమాజానికి కూడా సుఖము లేదు. కనుక గర్భములో ఉన్నప్పుడే పిల్లలకు ఎలాంటి జబ్బులూ రాకుండా ఉండటానికి తగిన ఉపాయము కనిపెట్టాలి. దీనికై ఔషధములు లేకపోలేదు, ఉన్నాయి. కాని, మనం బద్ధకంతో వాటిని సక్రమమైన మార్గంలో వినియోగించటం లేదు.

గర్భవంతులైన స్త్రీలకు విటమిన్ A,B,C మొదలైనవాటి గురించి సక్రమమైన రీతిలో తెలిపి, వాటిని వాడకపోతే కలిగే దోషాలను గురించి హెచ్చరించాలి. "అమ్మా! నీవు Vit A సక్రమంగా తీసికొనకపోతే బిడ్డ కళ్లకు కొంత ప్రమాదం కలుగుతుంది." అని చెపితే ఏ తల్లియైనా తప్పకుండా వాటిని తీసుకొంటుంది. "మధ్య మధ్య నెలకొకసారైనా హాస్పిటల్‌కు వెళ్ళి Check-up చేయించుకోవాలి పుట్టిన తరువాత ఏమైనా దోషాలుంటే ఆ బిడ్డతో జీవితమంతా అనుభవించే బదులు నెలకొకసారి హాస్పిటల్‌కు వెళ్ళి ట్రీట్‌మెంటు తీసుకోవడంలో తప్పేముంది?" - ఇలాంటి ప్రచారప్రబోధలను చక్కగా చేయాలి. కాని, పాపం! డాక్టర్లు - తమ వద్దకు వచ్చినవారికి మాత్రం ఈ విషయాలను బోధించవచ్చుగాని, అందరికీ ప్రచారం చేయడానికి వారికే మాత్రం అవకాశముండదు. అయితే డాక్టర్లు ఈనాడు చేయవలసిన ప్రయత్నమేమిటి - వారు ప్రభుత్వంపై ఈ విషయంలో వత్తిడి తీసికొని రావాలి ఎందుకనగా, ప్రపంచంలో ఈ విధమైన జబ్బులు అధికమైపోతున్నాయి కనుక ప్రభుత్వము యొక్క ప్రచారములను, విధానములను కొంత మార్చుకోమని చెప్పాలి. అట్లుకాకుండా, కేవలం కోట్లకొలది రూపాయలను ఖర్చుపెట్టి ప్రయోజనమేమిటి? దీని వలన ధనము నష్టమైమాత్రమౌతున్నది కాని, ఆరోగ్యం కుదరటం లేదు.

(స.సా.మా.93 పు.60)

ఈనాటి అన్ని రోగాలకు, కారణం hurry, worry, curry.

(భ.ప్ర.పు.1)

(చూ॥ శాంతము)

రోగవిముక్తుడు

"ఆయన అనుగ్రహాన్ని నమ్ముకుంటే ఈక్షణం నుండే నీవు రోగవిముక్తుడ వవుతావని నిశ్చయింకో, ఔషధాల

మీద నీకున్న విశ్వాసాన్ని దైవం మీదకు మరలించు. **ఔషధాల పైన నమ్మకం పెట్టుకోవద్దు. మాధవుని మీద పెట్టుకో.** ప్రార్థన, జపం, ధ్యానాలను అనుసరించు. అవి నీకు అవసరమైన విటమినులు. ఆరోగ్యాన్ని చేకూరుస్తాయి. **రామనామమంత ప్రయోజనకరమైన మందుగుళిక ఏదీ లేదు. నేను నీకు విభూతి ఇస్తాను. అది నిన్ను స్వస్థపరుస్తుంది.** ఔషధాల మీద, వైద్యుల మీద నమ్మకం ఉండే వాళ్ళకోసం ఆస్పత్రులు. కాని, దైవానుగ్రహం లేకపోతే ఔషధాలు ఏం చేయగలుగుతాయి? వైద్యులేం చేయ గలుగుతారు? శాంతి సంతోషాలకు సాధనమార్గాన్ని, ఆనందమార్గాన్ని అంగీకరించడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఏరోగం లేకుండా ఉండడం చేత **అసలు ఆస్పత్రులే అవసరంలేని రోజు తప్పకుండా వస్తుంది."**

(లో.పు.107)

ర్యాగింగ్

ప్రేమస్వరూపులారా! మీలో ప్రేమ లేకపోయినా నేను మిమ్మల్ని ప్రేమస్వరూపులనే సంబోధిస్తాను. దేనినీ మీరు పెంచుకోనక్కరలేదు. ఒక్క ప్రేమను పెంచుకోండి. **ఎవరైనా క్రొత్త భక్తులు వచ్చినప్పుడు ఆశ్రమంలోనివారు ఎంతో మర్యాదగా స్వాగతం చేయాలి. ఇన్‌స్టిట్యూట్‌లోను అంతే, క్రొత్త పిల్లలు వచ్చి చేరినప్పుడు మిగిలిన విద్యార్థులు వారికి ప్రేమతో స్వాగతం పలకాలి.** వారు తమ తల్లిదండ్రులను వదలి వచ్చిన బాధను మరపించాలి. కాని, బయటి కాలేజీలలో ర్యాగింగ్ పేరుతో క్రొత్తగా చేరిన పిల్లల ప్రాణాలు తీస్తున్నారు. **ర్యాగింగ్ చేసేవారు రాక్షసులే!వారి సోదరులనైతే ర్యాగింగ్ చేస్తారా? క్రొత్తగా ప్రవేశించిన పిల్లలకు ధైర్యమును, ఆనందమును అందించవలసిన విద్యార్థులు వారికి భయమును, ఆందోళనను కలిగిస్తున్నారు.** ఇది మంచిది కాదు. ఒకరితో ఒకరు కలసిమెలసి ఉండండి. అప్పుడే మీరు స్వామి యొక్క ప్రేమతత్వాన్ని అర్థం చేసుకున్నవారవుతారు. ఏ మాట మాట్లాడినా ప్రేమతో మాట్లాడండి. **జీవులను చూస్తే బాధించడం, దేవుని చూస్తే పూజించడం భక్తి అనిపించుకోదు.** రాత్రింబవళ్ళు శ్రమించి పని చేసే ఎద్దులను కట్టతో కొడతారు. రాతినందిని చూస్తే భక్తితో ప్రదక్షిణ చేసి నమస్కరిస్తారు. ఇది భక్తి కానే కాదు.

(స.సా.సె.96 పు.241/242)

లక్షణములు

"గోవింద భజగోవిందం"దీనికి పెద్దలు అనేక అర్థాలు చెప్పారు. "గాధం యితిగోవిందం" అని అర్థము అనగా గోవులను పాలించేవాడు భరించేవాడు అని అర్థము. అనగాపశుత్వాన్ని కూడా పరిపాలన జరిపేవాడే గోవిందుడు, మానవునియందు పశుత్వము శేషమై యున్నది. ఈ పశుత్వాన్ని పోగొట్టి మానవుని పరిశుద్ధునిగా చేయునదే గోవిందనామము. మానవత్వానికి దివ్యత్వము లభ్యమగును. కాని పశుత్వానికి మానవత్వము లభ్యముకాదు. **పశుత్వ లక్షణము పచ్చగడ్డి చూపినప్పుడు దగ్గరకొచ్చి పరుగిడును. యీనాడు మానవుడు పది కాసులు చూపిన దగ్గరకువచ్చును. కనరిన దూరము పోతున్నాడు, యిది పశుత్వ లక్షణము,** అట్లుకాక మానవుడు భయపడకూడదు, భయపెట్టకూడదు, **భయపడుట మృగలక్షణము భయపెట్టుటకు భయపడుటకు మానవుడు మృగముకాదు. మానవుని తప్పొప్పులను తీర్చి దిద్ది పరమాత్ముని సన్నిధి అందించునది గోవిందుని లక్షణము.** కనుకనే గోవిందుని భజింపకతప్పదు. **గోవింద నామమునకు మరొక అర్థము, వాక్యము (శబ్దము). మానవుని పలుకులకు, పశువుల అరపులకు, వేదములకు శబ్దమే ప్రధానము.** శబ్దములలో భేదముండవచ్చును. కాని శబ్దము యేకశబ్దమే, శబ్ద స్వరూపుడు **గోవిందుడు గాం: భూమికి స్వర్గం: వేదంవా గోవింద. జగన్నాటక భూమియందు సూత్రధారి గానుండి సర్వ సుఖములకు నిలయమై, సర్వమునకు అధికారిగా నున్నవాడే గోవిందుడు. "వేదో నారాయణోహరి"** వేదము నారాయణతత్వము నిరూపణచేస్తూ వచ్చింది. స్థూలసూక్ష్మ కారణ స్వరూపమై నీజగత్తును ప్రకాశింపచేయునదే గోవిందనామము. అందువలననే ప్రహల్లాదుడు **"దీన సుఖములేదు. దివ్యజీవనములేదు. జగతి పుట్టి పుట్టి, చచ్చి చచ్చి, పుట్టనేల మనము పుట్టియు చచ్చియు చావులేనిపుట్టు పుట్టవలయు"** యిట్టి సత్యమైన త్రోవ వెతకువారే దొడ్డబుద్ధి, లేనిచో గొడ్డుబుద్ధి అని చెప్పవలెను. దొడ్డబుద్ధి అనగ అమృతస్థానమైన దివ్యత్వమును విశ్వశించినవాడు, అయితే దీనిని యేరీతిగా పొందడమనే సందేహము, దేహమేవిల్లు, మనస్సే త్రాడు, ప్రాణమే అంబు,

దేహమునేవిల్లు మనస్సు అనేదారముతో సరిపోయింది. మనస్సు అనే దారములో ప్రాణమనే అంబు పెట్టి నపుడు విల్లు వంగును. మైండ్ యెంత లాగి విడిచిన ప్రాణమంత సూటిగా పోవును. దేహమునకు కట్టిన మనస్సనే దారము గట్టిగా లాగాలి విడిచిపెట్టకూడదు. దీనిని పురస్కరించు కొని మనస్సును అరికట్టుటకు మాధవుని స్మరించవలెను.

(భ.ప్ర.పు.10/11)

(చూ॥, అలవర్చుకోవాలి, గృహలక్ష్మి, జన్యాద్యస్యయతః, పుణ్యఫలం, భక్తుడు, భక్తుని లక్షణము, యుగలక్షణము, విద్యావంతుడు, శరణాగతి, స్వరూపలక్షణము, హిందువులు, హిందూమతము)

లక్ష్మణుడు

రామలక్ష్మణులు సీతాన్వేషణ సల్పుతూ సుగ్రీవుణ్ణి కలుసుకున్నారు. అప్పుడు సుగ్రీవుడు ఒక నగల మూటను తెచ్చి, "రామా ! కొద్ది రోజుల క్రిందట ఎవరో ఈ మూటను ఇక్కడ పడవేశారు. ఇందులో సీతమ్మవారి నగలేమైనా ఉన్నాయేమో చూడు" అన్నాడు. రామునికి తెలియదు పాపం ! అందుచేత "లక్ష్మణా ఇందులో మీ వదినగారి నగలేమైనా ఉన్నాయేమో, చూడు" అన్నాడు. లక్ష్మణుడు వాటిని చూసి, "అన్నా! ఈ కుండలాలు, కంకణాలు ఎవరివో నాకు తెలియదుగాని, ఈ కాలి అందెలు మాత్రం సీతమ్మవే" అన్నాడు. "ఇవి మాత్రం నీకెట్లా తెలుసు?" అని రాముడు అడుగగా, "అన్నా ప్రతి రోజు నిద్ర లేచిన తక్షణమే సీతమ్మ పాదాలకు నమస్కారం చేసుకోవటం నా వాడుక. ఆ తల్లికి నమస్కారం చేసుకునే సమయంలో ఈ అందెలను చూశాను" అన్నాడు. అందుచేతనే, **ఒకానొక సమయంలో రాముడు "ఈ ప్రపంచంలో వెతికితే నాకు సీతవంటి భార్య, కౌసల్యవంటి తల్లి అయినా లభించవచ్చుగాని, లక్ష్మణునివంటి సోదరుడు లభించడు. అలాంటి సోదరుడు ఉండటంచేతనే నేను రావణుని హతమార్చి సీతను అయోధ్యకు తేగలిగాను. ఇది నా శక్తి కాదు. లక్ష్మణుని యొక్క భక్తి ప్రపత్తుల శక్తియే"** అన్నాడు.

పవిత్రమైన రామాయణమును ఎన్ని పర్యాయములు విన్నా తనివి తీరదు. ఇంకా వినాలనే ఆశ పుడుతుంది. భారతీయులు అనాది కాలము నుండి రామచరితమును స్మరిస్తూనే ఉన్నారు. అయితే, అందులో ఉన్న అమూల్యమైన విషయాలను గుర్తించి ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాలి. పితృవాక్యపరిపాలన చేయాలి. తల్లిదండ్రులను గౌరవించాలి. సోదరులలో ఐకమత్యం ఉండాలి. స్త్రీలను గౌరవించాలి. గుణసంపత్తిని అభివృద్ధి పర్చుకోవాలి. వీటిని మీరు ఆచరణలో పెట్టినప్పుడు ఇంక రామాయణమును చదువనక్కరలేదు. మీ జీవితమే రామాయణంగా రూపొందుతుంది.

(స.సా.మే.99పు.117/118)

(చూ॥ ఏకత్వము, భక్తి రెండువిధములు, విభీషణుడు, శరణాగతి, సుమిత్ర)

లక్ష్మి

(చూ॥ ఆరాధన, శరన్నవరాత్రులు)

లక్ష్యము

పిప్పిని త్రిప్పికొట్టి చెరకునందలి రసమనే మానవులు జుఱ్ఱుకొను నటుల పుష్పముయొక్క అందచందములు చూడక, తుమ్మెద అందలి మధువునే గ్రోలినటుల, అగ్ని ప్రమాదమును యోచించక ప్రకాశమునే ఆకర్షించి మిడత దీపమును చేరునటుల, సాధకులు కావ్యమునందలి **కరుణారసమునే లక్ష్యమందుంచుకొని మిగిలిన విషయములను విసర్జించవలెను.**

(రా.వా.మొ.పు.3)

మనం లక్ష్యాన్ని గుర్తించాలి, సత్యాన్ని అర్థం చేసుకోవాలి, నిత్యములో చేరాలి. ఇది మానవుని ప్రధానమైన కర్తవ్యము. చలించని మనసును భ్రమించని దృష్టిని సాధించుటయే సరియైన లక్ష్యము.

(శ్రీ.స.వి.వా.పు.16)

లగ్నము

మన విద్య ఆత్మ విద్య. దీనిద్వారా మనము పవిత్రమైన ఆదర్శవంతమైన జీవితాన్ని లోకాని కందించాలి. జానెడు పొట్ట నింపుకునే కోసమని రెండు చేతులు నిచ్చాడు. రెండు చేతులనిండుకు పని దొరికితే పని చేస్తే, కష్టపడి శ్రమిస్తే, పొట్టనిండదా? మనము రెండు చేతులతో శ్రమించి పనిచేయటం లేదు. కనుకనే మనము ఈ అవస్థలకు గురియైపోతున్నాము. **"కర్మణ్యేవాధికారస్తే" కర్మనే మనకు ప్రధానమైన లక్ష్యము. పవిత్ర కర్మలు ఆచరించాలి.** ఆదర్శవంతమైన కర్మలు ఆచరించాలి. అన్యులకు సహాయకరమైన కర్మలు ఆచరించాలి. లోకోద్ధారమునకు మనము జీవితము అంకితము చెయ్యాలి.

మన సంస్థకుకాని, మనం ఎవరినుండి ఇంత స్థాయికి వచ్చామనే విషయం కాని **ఆ కృతజ్ఞతను విద్యార్థులు మరువరాదు. అదేనిజమైన దీక్ష; నిజమైన త్యాగము, స్వార్థాన్ని త్యాగము చేసి, పరార్థాన్ని విశ్వసించి, పరమార్థాన్ని పొందాలి.**

(బృ.త్ర.పు.166/167)

(చూ॥ ఆధ్యాత్మికము, దూషించుట, యుగలక్ష్యం, సందేశము, సమాజము, హిరణ్యగర్భతత్త్వం)

లగ్నము

(చూ॥ స్త్రీతత్వము)

లఘున్యాసము

లఘున్యాసం (పురుషసూక్తముల) లో "పాపోఽహం పాపకర్మాహం పాపాత్మా" అని పలుకుతూ వుంటారు పూజలో. పాపోహం, నేను పాపిని, నాఆత్మ పాపము, నేను పాపకర్మలు చేస్తున్నాను అని అనుకోవటంలో యెంత బలహీనత వుంటుందాది? ఈపదములు, యీభావములు సాధకునకు ఉత్సాహప్రోత్సాహము అందించుటకు సరియైనవి కాదని తెలుసుకొనే **భగవంతుడు 'అచ్యుతోహం, అనంతోహం, గోవిందోహం, సదాశివోహం' అని బోధిస్తూ వచ్చాడు.**

(శ్రీ.గీ.పు.69)

లయ/లయము

లయ మనగా నిద్ర; బాహ్యావిషయములనుండి లోనికి త్రిప్పిన మనసు గాఢనిద్ర (సుషుప్తి) అనే సంసార ప్రభావము వలన గాఢనిద్రలో ప్రవేశించుచున్నది.

(జ్ఞా.వా.పు.3)

(చూ॥ ఆత్మజ్ఞానము, ఆటంకములు, ముక్తి)

లాక్

మనహృదయమేలాక్. మనసు కీ. భగవంతునివైపు తిప్పితేమోక్షం. ప్రపంచం వైపు తిప్పితే బంధం. అదేలాక్. అదే 'కీ' త్రిప్పటంలో తేడా. త్రిప్పటంలోఉంటుంది. రహస్యం! మనసును దైవం వైపు మరల్చటమే సాధనలప్రధానసారము. !

(త.శ.మ.పు.110)

లాభము/లాభనష్టములు

(చూ॥ తృప్తి, దైవమును విమర్శించకండి)

లింకన్

అమెరికాలో పూర్వం అబ్రహం లింకన్ అనే వ్యక్తి ఉండేవాడు. అతను చిన్నతనంలో స్కూలుకి వెళ్ళుతుంటే అతని తోటి పిల్లలు "మేము విలువైన దుస్తులను ధరించాము నీవు బీదవాడవు ధరించడానికి నీకు సరియైన దుస్తులు కూడా లేవు' అని హేళన చేసేవారు. పసివాడైన లింకన్ ఈ అవమానాన్ని భరించలేక ఒక నాడు తల్లి ఒడిలో చేరి "అమ్మా! నాతోటి విద్యార్థులు నన్ను చాలా అవమానానికి గురిచేస్తున్నారు" అని ఏడ్చాడు. అప్పుడా తల్ల కుమారుణ్ణి బుజ్జగిస్తూ 'నాయనా! ఈ అవమానము లన్నీ మన మంచికోసమే ఇతరులు చూపించే గౌరవ మర్యాదలకోసం నీవే మాత్రం ఆశించవద్దు. **నీవు ఆత్మగౌరవాన్ని నిల్పుకో అదియే నీ ఆస్తి. అదియే నీ సంపద. అదియే నీ దైవం. ఆత్మగౌరవాన్ని నీవెప్పుడూ**

కోల్పోవద్దు." అని చెప్పింది. ఆ మాటలు ఆ లేత హృదయంలో నాటుకొని పోవడం చేతనే లింకన్ ప్రతి కష్టాన్ని ధైర్యంగా ఎదుర్కొంటూ వచ్చాడు. **ఆత్మ గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో** అన్ని క్లాసులూ చక్కగా పాస్ అవుతూ వచ్చాడు. అతనిలోని సద్గుణాలను గమనించి అతని స్నేహితులు అతనిని ఎలక్షన్లలో నిలబడ వలసిందిగా ప్రొద్బలం చేశారు. ఒక్క క్షణం పాటు లింకన్ "నేనేక్కడ? ఆ పార్లమెంటు ఎక్కడ? అక్కడ నాకు సీటు లభిస్తుందా? కనీసం ఆ హాలు లోనైనా నేను ప్రవేశించ గలనా?" అని సందేహించాడు. మరుక్షణమే ఆలోచనను దూరంగా నెట్టాడు. నా తల్లి ఆత్మవిశ్వాసమును పెంచుకొమ్మని బోధించింది. అట్టి ఆత్మ విశ్వాసంతో నేను ఎలక్షన్లలోపోరాడతాను. అని తీర్మానించుకున్నాడు. అప్పటినుండి ధృఢమైన ఆత్మవిశ్వాసంతో పోరాడి కట్టకడపటికి పేదవాడైన లింకన్ అమెరికా దేశానికి ప్రెసిడెంటు కావడానికి కారణమేమిటి? **ఆత్మవిశ్వాసమే, ఆత్మ విశ్వాసం లేనివాడు ఎటువంటి స్థానంలో ఉండినా తుదకు క్రిందికి దిగజారిపోతాడు.**

(దివ్యసందేశము 23.11.2000పు.4/5)

లింగము

"లింగోద్భవాన్ని నేను సంకల్పించినప్పుడు, అది మెత్తని, ఎటుపడితే అటు సులభంగా వంగే పదార్థముతో పుడుతుంది. అది నాకడుపులో పుట్టి నోటిచివరకు వచ్చేవరకు మెత్తగా ఉంటుంది. నోటినుండి బయటకు వెలువడేటప్పుడు మాత్రమే గట్టి పడుతుంది."

ఈ రోజున (1971 వ సంవత్సరములో జరిగిన శివరాత్రి) స్వామి తనశరీరమునుండి ఆత్మలింగాన్ని ఎందుకు వెలికితీస్తారు? భగవత్తత్త్వాన్ని అర్థం చేసుకోవటం చాలా కష్టమని నేను మీకు చెపుతున్నాను. దానియొక్క శక్తిని మీరు కొలిచి చెప్పలేరు; అలాగే దాని మహిమను కూడా మీరు గ్రహింపలేరు; అది అగమ్యము, అగోచరమూ ఐన తత్త్వము, అందువలన ఆ దివ్య తత్త్వమును మీరు తెలుసుకోవాలంటే దానికి కొన్ని నిదర్శనాలు మీకు కావాలి, మీమధ్యనున్న ఆ దివ్యతత్త్వాన్ని మీరు గుర్తించేందుకు, దానివలన మీరు లాభము పొందేందుకు, అనుగ్రహము సంపాదించేందుకు ఈ విధముగా లింగము వెలువడుచున్నది."

(ధై.పు.147)

"సృష్టి అంతా ఎందులో నుంచి ఆవిర్భవిస్తున్నదో, మరలా ఈ సృష్టిఅంతా ఎందులో లయిస్తుందోఅటువంటిదీ అంతము లేనిదే లింగము"

(స.శి.సు.నా.పు.45)

అన్ని నామాలకు అన్ని రూపాలకు సంకేతమే లింగము. రూపము లేని రూపము, పేరు లేని పేరు, దైవం నుండి ప్రాథమికంగా ఆవిష్కరింపబడినదే ఈ లింగము"

((స.శి.సు.నా.58/59)

సృష్టి స్థితి లయములకు కారణమైన ఈ విశ్వమంతటినీ తన గర్భంలో దాచుకున్న బ్రహ్మాండమే ఈ లింగము. ఈ లింగము సృష్టిని లయాన్ని కూడా సూచిస్తుంది.

ఈ లింగోద్భవ దృశ్య పారవశ్యాన్ని మీ మనస్సులలో పదిలపరచుకోండి. మీ హృదయాలలో ఉప్పొంగుతున్న ఆనందాన్ని పెంచుకోండి. మీరందరూ శాశ్వతమైన అమరత్వం పొందుతారన్న హామీని మీకు నేను ఇస్తున్నాను. మీరిక జననమరణ బాధల నుండి విముక్తి పొందుతారు.

(స.శి.సు.నా.పు.46)

"బ్రహ్మము నుండి ఉద్భవించే లింగం మొదట ఒక కోరికగా కలిగి, తరువాత ఆలోచనగామారి చివరకు సంకల్పంగా రూపొందింది. బ్రహ్మాండము పరమ శివుని సంకల్ప పరిణామమే. అదే విధంగా మీరు కూడా శివుని చేత సంకల్పించబడి, శివుని చేత, శివుని నుండి సృష్టించబడిన వారే"

(స.శి.సు.నా.పు.51/52)

వేదాలలో ఉపనిషత్తులలో కపిలదేవుడు వర్ణించిన దశాంగుళ స్వరూపమైన **ఆత్మలింగం** ఇదే. ఈ పవిత్ర దర్శనంచేత మీజన్మ సార్థకత చెందింది. మీకు తిరిగి

జగత్తత్వసంబంధమైన జనన మరణాలు లేవు. ఈ లింగం చుట్టుకొలత పది అంగుళాలు. దీనిలోపల జ్యోతి రూపంలో కనిపించే త్రిశూలం ప్రతి పదినిముషముల కొక సారి క్రొత్త క్రొత్త రంగులతో ప్రకాశిస్తూ ఉంటుంది.

(త.పు.94)

లింగమునకు ఎటు ముఖము, ఎటు కాలు అనేది తెలియదు. **ఆద్యంతములులేని స్వరూపానికి 'లింగము' అన్నారు. ఆద్యంతములు లేనివాడు భగవంతుడు మాత్రమే. కరుణాస్వరూపతత్త్వమే ఈశ్వరత్వము.**

ఈనాడు 'శివరాత్రి' మంగళకరమైన రాత్రి 'శివరాత్రి' ఈ 'శివ' అనేటటువంటి మంగళకరమైన తత్త్వము ఎక్కడ నుంచి వచ్చింది? తన శ్వాస నుండి వచ్చినది. అదియే 'సోఽహం'. అదియే ఆత్మ నుండి వచ్చిన శబ్దము. దీనిని 'హంసగాయిత్రి' అని కూడా పిలుస్తూ వచ్చారు. 'హం' అనగా తాను. 'సో' అనగా దైవము. కాబట్టి దైవాన్ని నేనే అనే అంతరార్థమును బోధిస్తున్నది. 'సో ్హం' అంటూ దినమునకు 21,600 సార్లు ప్రబోధిస్తున్నది. ఇలాంటి ప్రబోధలు అనాది కాలము నుంచి భారతదేశంలో ఆచరిస్తూ వస్తున్నారు.

(శ్రీ. ఏ.2002 పు. 22)

చూడండి! ఇది ఒక పెద్ద సైజు లింగము. **ఇది ఐదు తులములు బరువు వుంటుంది. ప్రతి వ్యక్తిలో 5 తులముల సువర్ణరసము ఉంటుంది. దీనినే 'హిరణ్యగర్భుడు' అన్నారు.** (ది. 13-3-2002న ఉదయం గం॥ 6.00లకు ప్రశాంతి నిలయంలోని సాయి కుళ్వంత్ హాల్‌లో ఈ హిరణ్యగర్భ లింగమును సృష్టించి భక్తులకు స్వామి చూపించారు). సువర్ణశక్తి చాలా ప్రధానమైనటువంటిది. ఆ సువర్ణ శక్తి ఉన్నప్పుడే తేజస్సు ప్రకాశిస్తుంది. **మన దేహములో 5 తులముల బంగారం ఉంటుంది. దీనిని కరిగించినప్పుడు శరీరమంతా ప్రవహిస్తుంది.** కన్నులలో క్రాంతిని కలిగించేది ఇదే. చెవులు వినిపించేట్లు చేసేది ఇదే. నాలుక పైన మూడు వేల Tastebuds ఉన్నాయి. కన్నులలో 2 కోట్ల కాంతికిరణాలు ఉంటున్నాయి. అయస్కాంతంలో క్రాంతి ఉంటుంది. శక్తి, రుచి, వినికిడి, చూపు దీని ప్రభావమే. మన శరీరములో చర్మము క్రింద ఒక పల్చని తెల్లని పొర ఉంటుంది. దానిని కోసినప్పుడే రక్తము వస్తుంది. రక్తము కాపాడటానికి ఇది ఏర్పాటు చేయబడింది. దీనిని భగవంతుడు ఎందుకు పెట్టాడు? రక్షణ కోసమే. భగవంతుడు ఏది చేసినా మన రక్షణ కోసమే, మన క్షేమం కోసమే. 'లోకాస్సమస్తా స్సుఖినోభవంతు' అందరూ సుఖంగా ఉండాలని భగవంతుని ఉద్దేశ్యము. దైవ సృష్టిలో ఎన్నో విచిత్రములున్నాయి. భగవంతుని గోపికలు పూర్ణ విశ్వాసంతో నమ్మారు. ఆ నమ్మకం చేతనే వారు తరించారు.

'రసోవైసః' అన్నారు గోపికలు. రసస్వరూపుడే భగవంతుడు. ఇంక వేరే రసము లేనేలేదు. సర్వరసముల సారము కరుణా రసమే, ప్రేమ రసమే. ప్రేమరసము కంటే మించిన రసము మరొకటి లేదు. ప్రేమరసములో అనేక రుచులు ఉన్నాయి. మనకు తెలియని రుచులు ఎన్నో ఉన్నాయి. **మత్తు, ఉన్మత్తు, ప్రమత్తు - ఈ మూడు రసములు కూడా ఉన్నాయి.** నారదుడు భగవంతుని యొక్క ప్రేమ తత్త్వాన్ని ఈ విధంగా వర్ణించాడు. **ఇచ్ఛారామోభవతి, తత్తోభవతి, మత్తోభవతి, ఉన్మత్తోభవతి, తన్మయత్తోభవతి, ఆత్మారామోభవతి అని భగవంతుని యొక్క ప్రేమతత్త్వాన్ని వర్ణించాడు నారదుడు.** ఈ ప్రేమను పొందిన మానవుని యొక్క జన్మయే ధన్యము. కనుక అట్టి ప్రేమను పొందే నిమిత్తమై, నీయందున్న ప్రేమ అనే అయస్కాంతమును పెంచుకుంటూ రాండి! అప్పుడు మీరు చదివిన చదువులు తక్షణమే హృదయానికి హత్తుకొని పోతాయి. అట్టి అయస్కాంతశక్తియే మనలో లేకపోతే రాత్రింబవళ్ళు చదివినా ప్రయోజనం ఉండదు. నిద్రాదేవి ఆవహిస్తుంది. కుంభకర్ణుడు వచ్చి ప్రవేశిస్తాడు. నిద్రలో ముంచుతాడు. అయస్కాంతశక్తి మనలో వుంటే ఆ నిద్రాశక్తి మన దరిదాపులలోనికే రాదు.

(శ్రీ.ఏ. 2002 పు. 10/11)

(చూ॥ ఆదిశంకరుడు, లీనమగుట, హిరణ్యము, హిరణ్యగర్భతత్త్వం)

లింగోద్భవము

ప్రతి మానవుని యందునూ 'స్వర్ణం' (Gold) ఉంటున్నది. లోహములన్నీ ఉంటున్నాయి. ఇవి బయట నుంచిరావు. అన్ని లోహములు దేహమునందే ఇమిడి వుంటున్నాయి. 'రసోవైసః' రసముతో కూడినటువంటిదే ఈ దేహము. ఈ 'లింగోద్భవం' అనేటటువంటిది ప్రత్యేకంగా వచ్చినటువంటిది కాదు. భగవంతుడు హిరణ్యగర్భుడు. తన ఉదరమంతయూ హిరణ్యమయం. కాబట్టి ఈ రసమయమైనటువంటి హిరణ్యం తిరిగి... తిరిగి... రసమంతనూ ఒక చోట చేరిపోతుంది. దానినే 'లింగము' అన్నారు. 'లింగము' అనగా 'చిహ్నం' అని పేరు. ఒక 'గుర్తు' అని పేరు. దీనికి కన్ను, ముఖము, నోరు లేదు. ఏది తల? ఏవి కాళ్ళు? అని చెప్పడానికి కూడా వీలుకాదు. దీనికి ప్రత్యేకంగా ఆకారము లేదు. అదే 'లింగము' అన్నారు. 'లింగం' అనగా "లీయతే, గమ్యతే ఇతి లింగ" అన్నారు. ఇదియే గమ్యం, ఇదియే లీనం. కనుకనే సర్వత్వమునకు లింగమే మూలకారణమన్నారు. ఈ లింగాకారం లోపల తయారై పోయి బహిర్ముఖంగా బయలుదేరుతుంది. ఇది బయటకు వచ్చేటప్పుడు కలిగే బాధలే, స్వామికి బాధ అని మీరు భావిస్తుంటారు. **ఇది బాధ కాదు, మీకొక బోధ. తల్లి గర్భమున వున్న శిశువు బయటకు వచ్చేటప్పుడు తల్లి బాధపడుతుంది గదా! బాధపడుతూ, ఈ పాడుబిడ్డ, నన్నింత బాధపెడుతుందా? అని ఏ తల్లి అయినా తిట్టుకుంటుందా? నా బిడ్డ సుక్షేమంగా వుండాలని కోరుకుంటుంది. అదే విధముగనే నా నుండి లింగం బయటకు వచ్చేటప్పుడు, ఎంత బాధ వుండినప్పటికీ, ఇది నాకు బాధ అని నేను భావించుకోను. ఇంతమందికి నేను బోధ గావిస్తున్నాననే ఆనందమే నాకు.** Reflection, Reaction, Resound మాత్రమే. **కనుక దైవత్వమునకు ఎట్టి బాధలూ వుండవు, ఎట్టి విచారములూ వుండవు.** ఎట్టి కష్టములూ కలుగవు. అయితే స్వామికి 'ఇంత కష్టమా? ఇన్ని బాధలా? ఇన్ని నొప్పులా?' అని అనుకుంటారు మానవులు. గత రెండు దినములుగా ఈ లింగం తయారుకావటానికి **నా శరీరమంతా మాగ్నెట్‌గా తయారైపోయింది.** అందువలన నా కాళ్ళు భూమికి కరచుకొని (అంటుకొని) పోతున్నాయి. ఆ కరచుకున్న కాళ్ళు ఎత్తడానికి కొంచెం కష్టమైపోతున్నది. ఎక్కడ నడిస్తే, అక్కడ కరచుకొని పోతున్నాయి. అది ఈ మాగ్నెట్ ప్రభావం. ఈ మాగ్నెట్ అందరియందూ వుంటుంది గాని ఈ విధంగా ఉండదు. కేవలం ఒక దివ్యత్వమునందు మాత్రమే ఈ మాగ్నెట్ ఇంత శక్తివంతంగా వుంటుంది. కనుక గత మూడు దినముల నుంచి కాళ్ళు నడవటానికి వీలులేకుండా పోయింది. అయితే అది నాకేమీ కష్టము కాదు. అది దాని సహజలక్షణం. ఎందుకంటే నా దేహమంతా మాగ్నెట్‌గా మారిపోయింది. నేను టంబ్లర్‌ను ముట్టుకుంటే టంబ్లర్ కూడా కరుచుకొనేది. ఇవన్నీ ఇతరులకు చెప్పేటటువంటివి కావు. **ఇటువంటి దివ్యత్వమైన అయస్కాంతం ప్రతి మానవుని యందూ ఉంటుంది. అయితే అది సామాన్య మానవునిలో పరిమితంగా వుంటుంది. దివ్యత్వమునకు పరిమితమే లేదు. మానవుని శక్తి పరిమితం,** దైవశక్తి అపరిమితం. విస్మరించకండి.

(శ్రీ. ఏ. 2002 పు. 8/9)

(చూ॥ లింగము)

లిమిటెడ్ కంపెనీ

దాహంగా ఉన్నప్పుడు ఒక కప్పు నీరు తీసుకొంటే చాలు. కానీ, మానవుడు గంగాజలమంతా కావాలని ఆశిస్తున్నాడు. ఇట్టి అమితమైన ఆశలచేతనే నిరాశకు గురౌతున్నాడు. **ప్రతి ఒక్కటీ ఒక limit (పరిమితి)లో ఉండాలి. మన బ్లడ్ ప్రెషర్ 120/80 మాత్రమే ఉండాలి. అది ఏమాత్రము పెరిగినా రోగం ప్రారంభమవుతుంది. మన దేహంయొక్క టెంపరేచర్ 98.4°c ఉండాలి. అది perfect normal** అది 99కి వస్తే జ్వరం ప్రారంభమవుతుంది. అదే విధంగా, మన కండ్లు పరిమితమైన కాంతిని మాత్రమే చూడగలవు. మితిమీరిన కాంతిని చూస్తే రెటీనా కాలిపోతుంది. అట్లే,

లీనము/లీనమైపోవాలి

మన చెవులు కూడా పరిమితమైన శబ్దమును మాత్రమే వినగలవు. మితిమీరిన శబ్దం వింటే Ear drum (కర్ణభేరి) పగిలిపోతుంది. కనుక, ప్రతి ఒక్కటి ఒక లిమిట్‌లో ఉండాలి. **మానవ జీవితమే ఒక లిమిటెడ్ కంపెనీ!** దీనికి తగినట్లుగా మన జీవితాన్ని కూడా నడుపుకోవాలి. కానీ, ఈనాడు మానవుని కోరికలు ఆకాశాన్నంటుతున్నాయి. మానవునికి తృప్తియే లేదు, ఎంత సంపాదించినా ఇంకా కావాలి, ఇంకా కావాలని ఆశిస్తున్నాడు. తృప్తి లేనివాడే నిరంతరము దుఃఖానికి గురి అవుతున్నాడు. **Who is the richest man in this world? He who has much satisfaction is the richest man. Who is the poorest man in this world? He who has more desires is the poorest man. (తృప్తి గలవాడే ఈ ప్రపంచంలో అందరికంటే ధనవంతుడు. మితిమీరిన కోరికలు గలవాడే అందరికంటే బీదవాడు)**

(సా.శు.పు.109)

M.B.A. 'Master of Business Administration' అంటారు. కాని ఏ విధమైన వ్యాపారం? ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంటు, ఇంకా అనేక మేనేజ్‌మెంట్లు చేస్తున్నారు. ఈనాటి మానవుడు లౌకికముగా, భౌతికముగా, వైజ్ఞానికముగా ఎంతో అభివృద్ధిగాంచాడు. కాని మానసిక పరిణామము లేకుండా ఎంత అభివృద్ధి చెందినప్పటికీ ప్రయెజనము లేదు. కనుక **అన్ని మేనేజ్‌మెంట్ల కంటె Man Management అత్యవసరము. తనకు తాను సంపూర్ణముగా గుర్తించినప్పుడే అన్ని రంగములందు దానినిచక్కగా అర్థము చేసుకోగలడు.** అందునా నీవు భారతీయుడవు. మన యొక్క తత్త్వము హిందూత్వము. అమెరికన్, రష్యన్, జర్మన్, జపాన్ ఇత్యాది వ్యాపారములందు అనేక విధములైన సమస్యలుంటున్నవి. **ఇవన్నీ కేవలము ఇమిటేషన్, కాంపిటీషన్‌తో కూడుకొన్నవి.** కానీ ఒకానొక కంపెనీ చాలా అద్భుతమైన కంపెనీ, అపూర్వమైన కంపెనీ ఒక్కటి ఉన్నది. దానిని మనము గుర్తించినప్పుడు సర్వము గుర్తించిన వారమవుతాము. **అదియే మానవుని లిమిటెడ్ కంపెనీ.**

(శ్రీ.వ.1990 పు16)

లీనము/లీనమైపోవాలి

మనస్సు అనే వెండిని కరిగించి మాధవుడనే రూపముగా పోతపొయ్యాలి. ఈ దేహము వేరు - దైవము వేరు, కానేరదు. ఇదే ధ్యానము యొక్క సాఫల్యత. మానవత్వములో లీనమై పోవాలి.

(స.సా.జ.76పు.260)

"ముత్యాలు సంపాదించడానికి నీవు సముద్రంలోపలికి పోవాలి. ఒడ్డున **కెరటాలమధ్య ఆడుకొంటూ కూర్చొని సముద్రంలో ముత్యాలు లేవు,** వాటిని గూర్చి చెప్పిన కథలన్నీ అబద్ధం - అని ప్రమాణం చేసి చెప్పడం మంచిదా? అట్లే ఈ **అవతారం** యొక్క పూర్తి ప్రయోజనాన్ని మీరు **పొందాలంటే లోతుకు పోయి సాయిబాబాలో లీనమైపోవాలి."**

(లో.పు.12)

(చూ॥ గానము)

లీనమగుట/లీనమగును

భగవంతుడు రూప రహితుడు అతనిని మనం చేరాలనుకుంటే మనం కూడా రూపరహితులంకావాలి. రూపరహితమైన ఈశ్వర తత్వానికి లింగము గుర్తు. లింగము అనే పదానికి గురుతు అనేదే అర్థం. లింగము లయానికి గుర్తు. ప్రపంచమంతా లింగంలో లీనమవుతుంది. ఇంద్రియములు, యింద్రియ విషయములు, మనస్సు కూడా లయముకావలెను. ఊహలు, భావాలు, మనోవికారములు, చిత్తవృత్తులు ఆ ఈశ్వరతత్వ చిహ్నమున ధ్యానములో లీనము కావలెను. కనుక మనము జీవనజ్యోతిగా భావించి - జ్యోతిని ఏకాగ్రతగా నుంచుకొని, తద్వారా ధ్యానము సల్పి దైవత్వములో లీనము కావాలి.

(సు. పు. 95)

"విశ్వవ్యాప్తమైన **బ్రహ్మాండము, వ్యక్తిగతమైన పిండాండము - ఈ రెండు ఒకే పరబ్రహ్మ తత్త్వమునుండి**

ఉద్భవించుచున్నవి. అణువులో అణువుగా బ్రహ్మాండములో బ్రహ్మాండముగా, సృష్టిలోని ప్రతిజీవిలోను సాక్షీభూతముగా ఉండే ఆత్మతత్త్వము బ్రహ్మ తత్త్వములో **లీనమగుచున్నది** అటులనే **బ్రహ్మతత్త్వము కూడా ఆత్మతత్త్వములో లీనమగు చున్నది."**

(ధ్రై.మ.పు.170)

నల్లటి పెద్ద తుమ్మెదను మీరు చూచియుందురు. కదా? అది కఠినమైన కర్రలో కూడా రంధ్రములువేయును. కర్రుని తొడను ప్రవేశించే శక్తి గలిగినది. అయితే వికసించిన కమలమునందు ప్రవేశించి మకరందమును త్రాగిన తరువాత ముకుళించిన ఆ కమలము లేత రేకులను చీల్చుకొని తుమ్మెద బయటకు రాలేకపోవుచున్నది.

అట్లాగే భగవంతుని పాదపద్మములందున్న మకరందమును గ్రోలి, ఆభక్తి వలన ఉన్మత్తులై ఆ **ఆనందములోనే లీనమై పోదురు.**

దుర్భావము దుశ్చింత దుర్బోధలు లేని జీవితమే పరిపూర్ణజీవితము. నెరవేరవలనది, నీ అభిష్టమా? పరమాత్ముని అభీష్టమా? అని విచారణ సలుపవలెను. **నెరవేరునవన్నీ పరమాత్ముని సంకల్పములే. అని తెలియవలెను. తాను దైవస్థానమునకు పయనించి చేరవలెను.** కానీ తనస్థానమునకు దైవమునులాగకూడదుఃః

(త.శ.మ.పు.92/93)

(చూ॥ ఆనందము)

లీలలు

'ఏనుగుపై వాలిన దోమలు' గా అభివర్ణించేవారు; అంత సూక్ష్మాతి సూక్ష్మమైనవి ఆ లీలలు అనేవారు "లీలలను అతిశయోక్తులుగా వర్ణించి చెపుతారీకపులు. ప్రవాహం పట్ల మాత్రమే కాని ప్రవాహం యొక్క మూలంపై శ్రద్ధ లేదు వీరికి.

(శ్రీ.స.స.పు.405)

శ్రీకృష్ణుడు తానవతార పురుషుడనన్న సంగతిని తన లీలల ద్వారా క్రమక్రమంగా వెల్లడి చేశాడు. అన్ని అవతారాల్లోనూ, యిలానే జరిగింది.

జనం వాస్తవాన్నెంత గ్రహిస్తున్నారూ, అమోదిస్తున్నారూ అనేది కూడా ఆయన ఎప్పటికప్పుడు చూచుకొంటూ వుండేవాడు.

తన అవతార తత్వాన్ని ప్రజలకు తెలియజేయటానికి ఆయన అనేక లీలలు చేశాడు. ఆయన లీలలన్నీ మానవ మాత్రులకు అసాధ్యమైన అద్భుతాలే!

నాడే కాదు, నేడు అంతే!

(శ్రీ.సా.గీ.పు.19/20)

లీలాజన్మ

(చూ॥ జన్మ)

లేనిదెక్కడ

భగవంతుడెక్కడ వున్నాడు? పిల్లలు చేసే అల్లరిలో ఆయనే వున్నాడు. పక్షులు చేసే **సందడిలో ఆయనే వున్నాడు.** ఆకులు రెపరెపల్లో ఆయనే వున్నాడు. కొండలు చేసే ప్రతి ధ్వనిలో ఆయనే వున్నాడు. **అంతటా నిండి వున్న ఓంకారాల లోనూ ఆయనే వున్నాడు. ఆయన లేనిది ఎక్కడ? ఆయన అంతటావున్నాడు.** ఆయన అంతటా వున్నా ఒకంతట చిక్కడు. ఆయనను గుర్తించటానికి ఋషులు అనేక మార్గాలు చెప్పారు. అయినా ఆయనను కనుగొనటం ఏ కొద్ది మందికోమాత్రమే సాధ్యం. **అన్నీ అనుగ్రహించేది ఆయనే.**

(శ్రీ.సా.గీ.పు.3)

లైట్ హౌస్

(చూ॥ భగవన్నామము)

లైబ్రరీ

ఒక "లైబ్రరీ రూమ్" లో లక్షలాది పుస్తకములు ఉండవచ్చును. అయినప్పటికీ ఆ లక్షలాది పుస్తకములలోని

లైఫ్‌స్మిత్

ఏ ఒక్క పదమైనా ఆలైబ్రరీకేమాత్రమైనా తెలుసునా? నేటి మానవుడి పరిస్థితి కూడా ఆలైబ్రరీ రూమ్ మాదిరిగా ఉంటున్నది. ప్రపంచంలో అన్ని విషయాలను అతడు తెలుసుకొంటున్నాడు. **అన్ని బోధలు వింటున్నాడు. కాని, ఏ ఒక్కటైనా ఆచరణలో పెట్టుటలేదు. ఆచరణలో పెట్టని విషయాలను ఎన్ని పర్యాయములు విన్నప్పటికీ ప్రయోజనం లేదు. కనుక, ఆధ్యాత్మిక మార్గమును అనుసరించేవారు, ఒకటి, రెండు విషయాలనైనా ఆచరణలో పెట్టాలి. అప్పుడే ఆనందాన్ని అనుభవించ గలరు.** అప్పుడే, అనుభవించిన ఆనందాన్ని పదిమందికి పంచగలరు. ఇదే ఈనాడు మనము తెలుసుకొన వలసిన ప్రధాన తత్వం.

(శ్రీ.భ.ఉ. పు.126/127)

లైఫ్‌స్మిత్

మీరు ఏ పనిచేసినా పరిపూర్ణంగా భగవంతునికి తృప్తికరంగా చేయాలి. అప్పుడే ఆపని సార్థకమౌతుంది. భగవంతుడు ఏపని చేసినా పరిపూర్ణంగా చేస్తాడు. నేను భక్తులకు ఉంగరాలను సృష్టించి ఇస్తుంటాను. నేను ఎవరికి ఇచ్చినా అది వారి వ్రేలికి సరిగ్గా సరిపోతుంది. కొలత తీసుకుని తయారు చేసే 'గోల్డ్‌స్మిత్' కూడా పొరపాటు చేయడానికి అవకాశముందిగాని, **భగవంతుడనే 'లైఫ్‌స్మిత్' ఏది చేసినా 'ఫర్ఫెక్ట్' (పరిపూర్ణం) గా ఉంటుంది.** అట్లే మీరు కూడా ఏది చేసినా పరిపూర్ణంగా చేయాలి. **చేయించుకున్నవారూ తృప్తిపడాలి, చేసే వారికి తృప్తి కల్గాలి. అదియే నిజమైన సేవ. అలాంటి సేవల్లో ఉన్న ఆనందం మరి దేని యందూ లేదు.**

(స.సా. న. 2001 పు. 344)

లోకకల్యాణము

(చూ॥ సీతతత్వము)

లోకనాటకము

వాల్మీకి రామాయణమున, **రాముడు** కేవలము లోకనాటక నిమిత్తమై, తాను ఒక అవతారముగా నరరూపము ధరించి, **లోకమునకు ఆదర్శమైనటువంటి జీవితాన్ని నిరూపిస్తూ, అందిస్తూ, ప్రకటిస్తూ వచ్చాడు.** అక్కడక్కడ, తనయొక్క దైవత్వాన్ని కూడను తాను ఏమాత్రము మరుగుపర్చలేదు. ఒకచిన్న ఉదాహరణము: రాముడు పట్టాభిషేకమునకు రథమును ఎక్కి, పురవీధులయందు ఉత్సవముతో తరలివెళ్తుండే శుభ సమయములో ఏవిధమైన ఆనందాన్ని జనులకు ప్రకటించాడో, అదే ఆనందమును, వనవాస విషయము తెలిసినపుడునూ ప్రకటించినాడు. మరియు, వనవాసమునకు వెళ్లే సమయములో తన తల్లిని దర్శించే నిమిత్తమై తాను తల్లి భవనమునకు వెళ్లినపుడుకూడను, అదే ఆనందాన్ని ప్రకటించి, సమత్వాన్ని బోధిస్తూ వచ్చాడు. ఈ సమత్వాన్ని వాల్మీకి చక్కగా వర్ణిస్తూ వచ్చాడు. **అక్కడ దైవత్వాన్ని కూడను నిరూపిస్తూ వచ్చాడు.** మరియు, తల్లి భవనమునుండి, సీత భవనమునకు వచ్చే సమయము లోపల, సీతను చూచిన తక్షణమే తాను మానవత్వములో ఉన్నటువంటి దౌర్బల్యాన్ని తిరిగి ప్రకటించాడు. తమకు సన్నిహితు లైనటువంటివారిని చూచినపుడు, తమకు ఆప్యాయులైన వారి దగ్గరికి వెళ్లినపుడు తమలో ఉన్నటువంటి దుఃఖముకాని, విచారముకాని వెలిపర్చడము మానవులయొక్క సహజలక్షణము, కనుక ఇక్కడ మానవత్వాన్ని తిరిగి ప్రకటించాడు. తనకు సన్నిహితులు, ఆప్తులు అయినటువంటి వారి దగ్గర ఇలాంటి ప్రకటన చేయకుండుట, అది నిజముగా మానవత్వమునకు సరియైనటువంటి లక్షణము కాదని కూడను నిరూపిస్తూ వచ్చాడు.

(ఆ.రా.పు.3/4)

లోకపిత

ఏ తండ్రి అయినా తన ఆస్తిని తన మాట ప్రకారం నడచుకొని, తనను గౌరవించే కుమారునికి అప్పగిస్తాడు. మాటను గౌరవించక ఎదురు తిరిగిన కుమారునికి యిప్పడు

కదా! అదే విధంగా లోకపిత అయిన భగవంతుడు భగవద్విశ్వాసమును అభివృద్ధి పరచుకొని, అతని ఆజ్ఞలను పాటించే వానికే తన దయను, అనుగ్రహమును అందిస్తాడు.

(భ.ప్ర.స.పు.28)

లోకమాత

(చూ॥ వరలక్ష్మీవ్రతము)

లోకము/లోకములు

భూలోకము: (అది మానవుని పాదముల యందును) భువర్లోకము; (ఇది గుహ్యమందును) సువర్లోకము; (ఇది నాభియందును) మహర్లోకము; (ఇది హృదయమందును) జనలోకము; (ఇది కంఠమునందును) తపోలోకము; (ఇది భ్రూమధ్యమందును) సత్యలోకము; (ఇది లలాట మందును) కలవు. ఈ సప్తలోకములు మానవుని అంగములందే వున్నవి. వీటిని ఊర్ధ్వలోకములని అందురు. ఇంకను అధోలోకములు కూడా కలవు.

అతలము (ఇది అరికాళ్ళయందును) వితలము (గ్రోళ్ళయందును) సుతలము (మడిమలయందును) తలా తలము (పిక్కలయందును) రసాతలము (మ్రోకాళ్ళయందును) మహతలము (తొడలయందును) పాతాళము ప్రాయువునందును వుండును.

లోకములన్నింటికి దేహమే నిలయమయినప్పుడు సముద్రములు లోకములతోనే కాక ప్రత్యేకించి యెటులుండును? అన్నియును ఈ దేహముతోటి మిళితమై వున్నవి. 1. లవణ సముద్రము 2. ఇక్షు సముద్రము 3. సురా సముద్రము 4. సర్పిసముద్రము 5. దధిసముద్రము 6. క్షీరసముద్రము 7. శుద్ధోదక సముద్రము అని యేడు సముద్రములు కలవు. అవి లవణ సముద్రము మూత్రముగాను ఇక్షు చెమటగాను, సుర ఇంద్రియముగాను సర్పి దోషితముగాను, దధి శ్లేషముగాను, క్షీరము జొల్లుగాను, శుద్ధోదకము కన్నీరుగాను వున్నవి.

(ప్ర.శో.వా.పు.6/7)

(చూ॥ శిరస్సు)

"లోకా స్సమస్తా స్సుఖినోభవంతు"

అనాది కాలము నుండియు భారతీయులు **'లోకా స్సమస్తా స్సుఖినోభవంతు'**. ప్రపంచములోని ప్రతి ఒక్కరూ సుఖముగా నుండవలెను. అని ప్రార్థించుచుండిరి. అందువలననే భారతదేశము సమస్త మానవ కోటికి తలమానికముగా, గురుతుల్యముగా నుండెడిది. అందువలననే అనేక విదేశ సంస్కృతీ ప్రభావముల ఒత్తిడికి నిలబడగలిగి తనపూర్వ ప్రాదుర్భావమును తిరిగి పొందగల స్థితిలో నున్నది. ప్రపంచమందలి అన్ని కోణములకు 'శాంతి' సందేశము నందించి, ఒక పెద్ద ప్రశాంతి నిలయముగా విరాజిల్లగల అన్ని హంగులూ, భారతదేశము కలిగియున్నది తప్పక ఆ విధముగా నుండగలదు.

(శ్రీ.స.సూ.పు.82)

(చూ॥ లింగము)

లోభము

నాస్తి లోభసమో వ్యాధిః నాస్తి క్రోధరసమో రిపుః
నాస్తి దారిద్ర్య వ ద్దుఃఖం నాస్తి జ్ఞానసమో సుఖం.
ఈ ప్రపంచంలో లోభముకంటే రోగము మరొకటి లేదు. ఈ జగత్తునందు క్రోధముకంటే మరొక శత్రువు లేదు. దారిద్ర్యముకంటే మరొక దుఃఖములేదు. జ్ఞానముకంటె మరొక సుఖము లేదు.

(భ.మ.పు.105)

(చూ॥ జీవితమంటే, మంచితనము, రక్కసి)

లోభి

సౌఖ్యమనుభవించజాలని లోభికి! ఎంత కలిమి యున్న ఏమిఫలము. నీరుగతుకుక్క ఏరెంత పారిన! ప్రీతి చెందబోడు పిసిని గొట్టు॥

(సా.పు.169)

లౌకికము

(చూ॥ ఆధ్యాత్మికమయం)

వందనము

వందనము

(చూ॥ ఆనందము)

వజ్రసంకల్పం

నేను ఈ మధ్య ఒక విషాదకరమైన వార్తను పత్రికలలో చూచాను. ఒక అమాయకురాలైన తల్లి, తన ముగ్గురు పిల్లలను సాకలేక, ఆకలి అమ్మా! అంటుంటే అన్నం పెట్టలేక, ఆ పిల్లలకు విషం యిచ్చింది. తాను త్రాగింది అందరూ మరణించారు. ఆ వార్తను చూచి నేను చాలా బాధపడ్డాను. నా హృదయం ద్రవించింది. ఇది నిజంగా దురదృష్టకర సంఘటన. నేను ఇప్పటివరకు ఎన్నో పనులు చేసాను. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి, విద్యా సంస్థలను నెలకొలిపి, ఉచితంగా చదువు చెప్పిస్తున్నాను. వందల కోట్లరూపాయిలు వెచ్చించి రెండు సూపర్ స్పెషాలిటి ఆసుపత్రులు నిర్మించాను. (పుట్టపర్తి, బెంగుళూరు). లక్షలు వెచ్చించినా నయంకాని వ్యాధులకు ఉచితంగా చికిత్సలు చేయిస్తున్నాను. వేలాదిమందికి ఉచితంగా గుండె ఆపరేషన్లు కూడా చేయిస్తున్నాను. మరియు వందలకోట్ల రూపాయిలు ఖర్చుచేసి ఉచితంగా వందలాది గ్రామాలకు మంచినీటిని అందిస్తున్నాను. విద్య, వైద్యం, నీరు ముఖ్యమైన ఈ మూడు ఉచితంగా అందిస్తున్నాను. పేద పిల్లలను పోషించే నిమిత్తమై ఇప్పుడు ఒక క్రొత్త ప్లాన్ వేస్తున్నాను. అనంతపూర్ జిల్లాలో నా విద్యార్థులను, అధ్యాపకులను సర్వే చేయించడానికి నవంబర్ 1వ తేదీ గ్రామాలకు పంపుతున్నాను. పేద పిల్లలకు అన్నం పెట్టి, ఉచితంగా వస్త్రములనిచ్చి, చదువు చెప్పించి, వారికి సమాజంలో గౌరవప్రదమైన స్థానం కలిపించాలని సంకల్పించుకున్నాను. మొదటి దశలో వెయ్యి పేద కుటుంబాలను గుర్తించి ఒక్కొక్క కుటుంబానికి లక్షరూపాయల చొప్పున Fixed Deposit చేసి, వచ్చే వడ్డీ ద్వారా ఆ పేద పిల్లలకు అన్నం, వస్త్ర సౌకర్యములు ఏర్పాటుచేసి, మా విద్యార్థులచేత వారికి ఉచితంగా విద్యను నేర్పించాలని సంకల్పించుకున్నాను. క్రమ క్రమేణా ఈ పథకమును అభివృద్ధిపరచదలిచాను. ఈ నవంబర్ 1వ తేదీ నుంచి దీనిని ప్రారంభిస్తున్నాను. కొన్ని లారీలలో

చీరెలు, పంచెలు, పిల్లలకు చొక్కాలు, నిక్కర్లు మరియు అన్నం ప్యాకెట్లు యిచ్చి పల్లెలలో పంచడానికి మా విద్యార్థులను పంపుతున్నాను. ఇంతేకాదు, **నా సంకల్పం వజ్ర సంకల్పం. నా ఆలోచనలు ఎప్పుడూ పరోపకార సంబంధమైనవిగానే ఉంటాయి. స్వార్థమనేది నాలో ఎక్కడా కనిపించదు.** ఆ బీదకుటుంబాలకు తలా ఒక చిన్న ఇల్లుకూడా నిర్మించాలని నా సంకల్పం. అందులో తల్లిదండ్రులకు ఒక గది, పిల్లలుండటానికి మరోగది. మరియు చిన్న వంటగది, స్నానాలగది కూడా ఉంటాయి. **ఈ విధంగా ప్రథమ దశలోనే వేయి పేద కుటుంబాలకు సహాయం చేయదలిచాను.**

విద్యార్థులారా! ఈ పవిత్రమైన కార్యక్రమంలో మీరందరూ పాల్గొనాలి. ధనసంపాదన కోసం మీరు బయటకు పోకూడదు. నిజంగా మీరు బయటకుపోతే భిక్షమెత్తిన వారవుతారు. ఇక్కడ ఏ విధమైన ఖర్చులేకుండా మీరు చదివినారు. బయటకుపోయి ఇష్టం వచ్చినట్లుగా సంపాదించుకుంటూ కూర్చుంటే దీనివలన వచ్చిన ఫలితమేమిటి? మీరు కూడా ఉన్నటువంటివారు కాబట్టి మీరు కూడా ఈ సేవలలో ప్రవేశించాలి. మీ పరిస్థితి నేను చూచుకుంటాను. మా తండ్రి ఎట్లా? అని మీరు సందేహించనవసరంలేదు. **ఉపకారం చేసినవారికి, దైవం ఎప్పుడూ అపకారం చేయడు. విశాలమై భావాలను పెంచుకోండి.** సంకుచిత భావాలను విడనాడండి. దుర్మార్గములలో ప్రవేశించకండి. **అయితే ఈనాడు చాలామంది అపవిత్రమైన మార్గములలో ప్రవేశించి, పశువులకంటే హీనంగా ప్రవర్తిస్తున్నారు. కాని, ఇన్ని విన్నటువంటి మీరు పశువులు కాకండి. 'నేను మానవుడ్ని'** అని చింతించండి. మానవతా హృదయాన్ని అభివృద్ధి పరచుకోండి. **పశుగుణములను దూరం చేసుకోండి, పశువులు ఏ చదువులూ చదువలేదు, ఏ డిగ్రీలు తీసుకోలేదు.** భుజిస్తున్నాయి, వంటిని వంచి పని చేస్తున్నాయి. మనం కూడా పని చేయాలి. కర్తవ్యకర్మల నాచరించాలి. పల్లెలలో నున్న పిల్లలను ఉద్ధరించాలి. **వారికి చదువులు నేర్పించాలి. సద్గుణములను నేర్పాలి.** సరియైనవారిగా తీర్చిదిద్దాలి. ఈ విధంగా పనులుచేస్తూ పోతే పవిత్రమైన భారతదేశము తిరిగి దేదీప్యమానంగా ఆదర్శవంతమైన భారతదేశంగా రూపొందుతుంది. ఈ విధమైన కార్యములలో మీరు ప్రవేశించి, సరియైనటువంటి మానవత్వాన్ని మీరు నిలుపుకుంటారని నేను ఆశిస్తున్నాను. **మీరు చదువుకున్నవారు. చదువుకున్నవారికి ఒక Season ఒక Reason ఉంటుంది. కాని Season, Reason లేని మృగాలవలె మీరు కూడనూ ప్రవర్తించ కూడదు. మీరు అసత్యమాడకూడదు, అన్యాయం చేయకూడదు, అక్రమాలలో ప్రవేశించకూడదు. అప్పుడే మీరు ఆదర్శప్రాయులైన విద్యార్థులుగా రూపొందుతారు.** సత్యసాయి ఇనిస్టిట్యూట్‌కు పేరు ప్రతిష్టలు తెచ్చిన వారవుతారు. మీ నుండి నేను ఏమీ కోరటంలేదు. ఎక్కడికి పోయినా మీరు మంచిపేరు తెచ్చుకోండి. స్వామి **ఆశయాలను ఆచరణలో పెట్టండి. ఆశయాలకు తగినట్లుగా నడుచుకోండి.**

(శ్రీ.డి.2000 పు.14/15)

వజ్రోత్సవము

(చూ॥మానసికమరణోత్సవము)

వట్టిచేతులు

అలెగ్జాండర్ అనేక దేశములను జయించి, చక్రవర్తి అని పేరు గాంచాడు. కానీ, అతనికి అంత్యసమయం ఆసన్నమైనప్పుడు ఏ వైద్యుడూ అతనిని కాపాడలేక పోయాడు. అలెగ్జాండర్ తానింక బ్రతకనని గుర్తించు కున్నాడు. అప్పుడు తన మంత్రులను పిలిపించి **"నేను మరణించిన తరువాత నా దేహాన్ని స్మశానానికి తీసుకు వెళ్ళేటప్పుడు నా రెండు చేతులూ పైకి కనిపించేలా పెట్టి వీథివీథిలోను త్రిప్పండి. అనేక దేశాలను జయించి గొప్ప చక్రవర్తిగా పేరు గాంచిన అలెగ్జాండర్ కూడా పోయే సమయంలో వట్టి చేతులతోనే పోయాడని ప్రజలకు**

వట్టిమాటలు

చాటండి" అన్నాడు. అనేక రాజ్యాలను జయించిన అలెగ్జాండర్ చివరికి తన వెంట ఏమి తీసుకు వెళ్ళగల్గాడు? ఏమీ లేదు. ఈనాడు కూడా రాజ్యాలను జయించాలనే ఆకాంక్ష పాలకులలో మితిమారిపోతున్నది. అధికార వాంఛ దినదినానికి పెరిగిపోతున్నది. అధికారంకోసం ప్రాకులాడే వారు దేశనాశకులౌతారేగాని, దేశపాలకులు కాజాలరు.

(స.సా.జూ.పు.154)

వట్టిమాటలు

"వట్టిమాటలచేత నెప్పుడు సత్తు
చిత్తానంద మొందడు విత్తనంబులు
లేని భూమిలొ మొత్తముగ పంటేమి పండదు॥

(భ.ప్ర.పు.93)

వదలవలసినది

వదల వలసిన దానిని వదలినంత
తెలియ వలసిన దానిని తెలిసినంత
చేర వలసిన దానిని చేరినంత
కలుగు ఆనందమిదియని తెలుపవశమా!
వదల వలసింది యీ జగ ద్భావములనే
తెలియ వలసింది యీ జీవ తత్త్వములనే
చేర వలసింది యీ బ్రహ్మ చరణములనే
ఇంత కన్నను ఆనంద మేమి కలదు!

(స.సా.ఫి. 95 పు. 48)

వదులు

మనుజుడైనవాడు తన దుర్గుణమ్ముల
వరుసనొకటి యొకటి వదలవలయు
పశుగుణంబు వీడి పశుపతి కావలె
సత్యమైన బాట సాయిమాట

(75 వి. పు.105)

వరదలు

(చూ॥ అవతారములు)

వరప్రసాదము

(చూ॥ వరలక్ష్మీవ్రతము)

వరలక్ష్మీవ్రతము

స్త్రీలకు సుక్షేమాన్ని, సౌభాగ్యాన్ని ప్రసాదించే వ్రతం ఏమైనా ఉన్నదా, అని ఒకానొక సమయంలో పార్వతీదేవి ఈశ్వరుణ్ణి ప్రశ్నించిందట. ప్రతి స్త్రీ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో, పుత్రపౌత్రాభివృద్ధితో సుమంగళిగా జీవించాలని పార్వతి కోరిక. స్త్రీలు తమ కుటుంబము గురించి, తమ వంశము గురించి, తమ సౌభాగ్యము గురించి అనేక విధాలుగా పాటుపడుతుంటారు. సమత, సమగ్రత, సమైక్యత, సౌభ్రాతృత్వములను కోరేది స్త్రీలే. ఇట్టి సుగుణ సంపన్నులైన స్త్రీలకు ఏదైనా వరప్రసాదమును అనుగ్రహించాలని పార్వతి ఈశ్వరుణ్ణి ప్రార్థించినట్లు పురాణములలో ఉన్నది. **దీనికి ఈశ్వరుడు కూడా సంతోషించి స్త్రీలకు అష్టైశ్వర్యములను అనుగ్రహించే వరలక్ష్మీ వ్రతము గురించి పార్వతికి తెలియజేశాడు. ఇది స్త్రీలకు ప్రత్యేకమైన వరప్రసాదము.**

(స.సా.సె.2000పు.257)

ప్రాచీన కాలము నుండి ఎందరో సాధ్వీమతల్లులు భారతదేశమునందు ఉద్భవించి, **వరలక్ష్మీ వ్రతమును ఆచరించి, వరలక్ష్మీ అనుగ్రహమునకు పాత్రులైనారు.** రావణసంహారం తరువాత రాముడు సీతకు అగ్నిపరీక్ష పెట్టాడు. సీత మహాసాధ్వి అన్న విషయం సర్వజ్ఞుడు, సర్వ వ్యాపకుడు, సర్వశక్తిమయుడైన రామునికి తెలియనిది కాదు. కాని, లోకులు కాకులు, వారిలో ఎలాంటి అనుమానాలకూ అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశ్యంతోనే రాముడు ఈ పని చేశాడు. సీత ఏమాత్రమూ సందేహించకుండా అగ్నిపరీక్షను ఎదుర్కొని తన పాతివ్రత్యాన్ని నిరూపించింది. సత్యశీలురు, పవిత్ర

హృదయులైన స్త్రీలు ఎలాంటి అనుమానాలకూ అవకాశమివ్వరు.

(స.సా.సె.2000పు.257/258)

స్త్రీలకు సుమంగళత్వాన్ని, సౌభాగ్యాన్ని, సిరి సంపదలను, అష్టైశ్వర్యాలను అనుగ్రహించేది వరలక్ష్మి కోరిన వరములను ప్రసాదించేది కనుకనే వరలక్ష్మికి ఈ పేరు వచ్చింది. సావిత్రి, చంద్రమతి, దమయంతి మున్నగు సాధ్వీమణులు వరలక్ష్మీ అనుగ్రహప్రసాదంచేతనే అంతటి శక్తి సామర్థ్యాలను పొందగలిగారు. స్త్రీలు వరలక్ష్మీ నోమును నోచటంచేత సిరి సంపదలు అభివృద్ధి అవుతాయి, ఆనందము చేకూరుతుంది. కాని, ఈ ఆధునిక యుగంలో ఇలాంటి పవిత్రమైన వ్రతము లను ఆచరించటం తగ్గిపోయింది. కనుకనే గృహములలో పవిత్రత లోపించింది. **ఇల్లును చూసి ఇల్లాలిని చూడమన్నారు. ఇల్లు పరిశుద్ధంగా ఉందంటే ఇల్లాలి హృదయం కూడా పరిశుద్ధంగా ఉంటుందని అర్థం.** ప్రాచీనకాలంలో ఇళ్ళు ఎంతో పరిశుద్ధంగా ఉండేవి. ఎందుకంటే, ఆనాటి స్త్రీల హృదయాలు అంత పరిశుద్ధమైనవి. కాని, ఈనాడు ఎక్కడ చూసినా మాలిన్యం, మాలిన్యం! త్రాగే నీరు. తినే తిండి, పీల్చే గాలి కలుషితమైపోయాయి. మానవుని మనస్సుకూడా మలినం కావటంచేతనే సర్వమూ మలినమైపోయింది.

(స.సా.సె.2000 పు.259)

ఈశ్వరుడు పార్వతికి వరలక్ష్మీ వ్రత ప్రాశస్త్యమును వివరించి "పార్వతీ! నీవు స్త్రీజాతిచే దీనిని ఆచరింపజేసి వారి కష్టనష్టములను రూపుమాపి, శాంతిసౌఖ్యాలను అందించు,' అన్నాడు. ఈ వ్రతమును చేసుకోవటం చాలా సులభమే. **అయితే ఈనాడు మీకు స్థానబలము, దైవబలము తోడుకావటం చాలా అదృష్టం. ఏ వ్రతమునైనా పవిత్రభావంతో, ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో ఆచరించాలి.** అప్పుడే మీకు ఎంతటి ఫలితమైనా లభిస్తుంది. భగవదనుగ్రహంచేత మీరు చేయలేని పని ఈ జగత్తులో లేదు; ఎంతటి ఘనకార్యమునైనా మీరు సాధించవచ్చును. సావిత్రి మరణించిన పతినే బ్రతికించుకోగల్గినప్పుడు ఇంక ఈ లోకసంబంధమైన విషయాలు ఎంతమాత్రము! భూమిని ఆకాశంగా మార్చవచ్చు, ఆకాశాన్ని భూమిగా మార్చవచ్చు. అయితే పవిత్రమైన హృదయంతో ప్రార్థించాలి. వారు ఇలాంటివారు, వీరు అలాంటివారు అంటూ ఊరివారి సుద్దులు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తే మీరు తలచిన కార్యములు ఎలా సిద్ధిస్తాయి? **లోకసంబంధమైన సుద్దులను వదలిపెట్టి, లోకేశుణ్ణి ఆశ్రయించినప్పుడే మీయొక్క సర్వకార్యములూ సిద్ధిస్తాయి.**

(స.సా.సె.2000పు.261)

వరలక్ష్మీ వ్రతము నాచరించినప్పుడు స్త్రీలు "దీర్ఘసుమంగళీ భవ, పుత్రపౌత్రాభివృద్ధిరస్తు, ఆయురారోగ్యఐశ్వర్యాభివృద్ధిరస్తు" అని దీవెనలు పొందుతున్నారు. ఈ వ్రతము ఇటువైపు ఏడు తరములను, అటువైపు ఏడు తరములను మొత్తం పధ్నాలుగు తరములవారిని రక్షిస్తుంది. కనుకనే, ఈశ్వరుడు పార్వతికి ఈవ్రతమహత్మ్యమును తెలియజేసి, స్త్రీలచేత ఈ వ్రతమును ఆచరింపజేసి వారికి సుభిక్షమును, సౌభాగ్యమును ప్రసాదించవలసిందని కోరాడు. ఈ వరలక్ష్మీ నోమును నోచిన తరువాతనే సావిత్రి, అనసూయ, సుమతి సుఖసంతోషాలను పొందారు. దోషాలను పరిహారం చేసి, పవిత్రతను అభివృద్ధి గావించి, దివ్యత్వాన్ని అందిస్తుంది వరలక్ష్మీ, **వరలక్ష్మీని భారతీయులు 'లోకమాత' అని పిలుస్తున్నారు. మన భారత దేశంలో 'మాత' అనే పదమునకు ఎంతో గొప్ప విలువ ఉన్నది ఎవరికైనా బాధ కలిగినప్పుడు 'అమ్మా' అంటారుగాని, "అయ్యా, అప్పా," అనరు.** అమ్మ అనే పదము ఎంతో విలువైనది, పవిత్రమైనది. పిల్లలకు మొట్టమొదట నోటికి వచ్చే పదము ఇదే. తల్లిప్రేమ వర్ణనాతీతమైనది. కనుకనే భారతీయ సంస్కృతి "మాత పిత, గురువు, దైవము" అని తల్లికి ప్రథమస్థానం అందించింది. తల్లిని ప్రేమించాలి, ఆమె ఆజ్ఞను శిరసావహించాలి. తల్లిని సంతృప్తిపరచకపోతే లోకం

మిమ్మల్ని ఛీకొడుతుంది. తల్లిని సంతృప్తిపరచితే లోకాన్నంతటినీ సంతృప్తిపరచినట్లే!

ప్రేమస్వరూపులారా! పవిత్రమైన వరలక్ష్మీవ్రత మహాత్మ్యమును గురించి ఎంతైనా చెప్పవచ్చును. **ఆడవారు లోకమాతమైన వరలక్ష్మిని పూజించి ఆశ్రయించి, ఆనందించి, ఆ ఆనందాన్ని పదిమందికి పంచాలి.** వారికి తగిన ఉత్సాహప్రోత్సాహములను మగవారు అందించాలి; ఖర్చు ఎక్కువవుతుందని అడ్డు చెప్పకూడదు. **భార్య వ్రతం చేయటం భర్తయొక్క ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధికే కదా! కాబట్టి, భార్య చేసే పూజకు భర్త ఏమాత్రమూ అడ్డు తగలకూడదు.** ఒకవేళ తనకేమైనా ఇబ్బందిగా ఉంటే మంచి మాటలతో నచ్చజెప్పవచ్చును. అంతేగాని, 'నేను మగవాడిని కదా,' అని తన ఇష్టప్రకారం ప్రవర్తించకూడదు. నిజం చెప్పాలంటే, మగవారికంటే ఆడవారికే శక్తి అధికంగా ఉంటుంది. ఆడవారు పతికోసం ప్రాణాలను సహితం త్యాగం చేస్తారు. మరణించిన పతిని బ్రతికించుకుంది సావిత్రి. కాని, మరణించిన సతిని బ్రతికించుకున్న పతి ఎవరైనా ఉన్నారా? గౌరవం, మర్యాద, త్యాగం, సంతృప్తి, సౌశీల్యమువంటి సద్గుణాలు స్త్రీలలోనే ఉన్నాయి. పురుషులలో మాత్రం క్రోధం, మొండితనం, హటమువంటి దుర్గుణాలు అధికంగా ఉంటాయి. కనుకనే, పురుషులకంటే **స్త్రీలకే అధిక గౌరవం ఇవ్వబడుతోంది. లగ్న పత్రికలపైకూడా 'శ్రీమతి & శ్రీ' అని ముందు** స్త్రీ తరువాత పురుషుని పేరు వ్రాస్తారు. **రాధాకృష్ణులు, లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరులు అనే పేర్లలోకూడా స్త్రీ పేరే ముందున్నది.** స్త్రీలు లక్ష్మీస్వరూపులు. వారిని గౌరవించినప్పుడే లోకం సుక్షేమంగా, సుభిక్షంగా ఉంటుంది. గుణవంతులైన స్త్రీలున్న రాజ్యం నిరంతరము సుక్షేమంగా ఉంటుంది. ప్రపంచ యుద్ధాలలో ఎన్నో రాజ్యాలు నాశనమైపోయాయి. కాని, **గుణవంతులైన స్త్రీలు** ఉండటంచేత భారతదేశమునకు మాత్రం ఎట్టి ప్రమాదమూ సంభవించలేదు. భారతదేశమునకు పవిత్రత స్త్రీలవల్ల ఏర్పడినదే. కనుక స్త్రీలను గౌరవించి, వారిని ఆనందపరచాలి. అప్పుడే దేశం నిత్య కల్యాణం, పచ్చతోరణంగా వర్ధిల్లుతుంది.

(స.సా.సె.2000పు.263/264)

గత జీవుడగు పతిన్ బ్రతికించి యముగెలిచె
సావిత్రి భారత సాధ్వికాదె
తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె
ధృతి చంద్రమతి భారతీయ కాదె
కుల సతీత్వము అగ్నిగుండాన ప్రకటించె
సీత భారత ధరాజాత కాదె
కినిసి దుర్మద కిరాతుని బూదిగావించె
దమయంతి భారత రమణి గాదె
సత్యసాగర వేష్టి తక్ష్వా తలమున
భారత జాతి పతివ్రత ప్రభావభావ
సంపన్న కిది కాదె పంటభూమి
అఖిలవ్రతములకెల్ల వరలక్ష్మీ వ్రతమె మిన్న.

(శ్రీ.సె.2000 పు.27)

వర్క్‌షాప్

(చూ॥ ప్రశాంతినిలయం)

వర్ణాశ్రమధర్మాలు

వర్ణాశ్రమ ధర్మాలు కూడా మానవుని మనస్సును భగవంతునిపై లగ్నం చేయటానికే ఏర్పడ్డాయి. అందులో జీవితంలో ప్రతిస్థాయిలోను ప్రతివారికి జీవన విధానము, సాంఘికమైన హక్కులు, కట్టుబాట్లు, వారికి ప్రవర్తనా నియమావళి ఏర్పరచారు. అవన్నీ చిత్తవృత్తులను నిరోధించి మనోవికాసం ఏర్పడటం కోసం ఉద్దేశింప బడినవే. వర్ణాశ్రమమనేది బాగా వేళ్ళూని ఉన్న వృక్షం వంటిది. దాని క్రింద అన్ని తరగతులవారు విశ్రాంతి పొందవచ్చు.

(వ.61-62 పు.168)

వర్ణింతురు/వర్ణిస్తారు

(చూ॥ స్మరింతురు, హిరణ్యగర్భతత్త్వము)

వర్తమానము

ఇంద్రియాలు "ఎందుకీ పెనగులాట? వీలున్నంత వరకూ హాయిగా తినండి త్రాగండి" అంటాయి. గురువు అంటాడు. **"చెప్పకుండా ఎప్పుడో మృత్యువు మీద విరుచుకు పడుతుంది. అ క్షణం రాకముందే మృత్యుభీతి తొలగించు కోండి" వర్తమానమే నమ్మదగిన మిత్రుడు. నిన్నటిదినం నిన్ను దగా చేసి వెళ్లిపోయింది. భవిష్యత్తు అనేది వస్తాడో రాడో తెలియని అతిథి.** ఈనాడే గట్టిస్నేహితుడు. కనక గట్టిగా పట్టుకోండి.

(వ.1963 పు.83)

బుద్ధుడు ధర్మ ప్రచార నిమిత్తం దేశసంచారం సల్పుతున్న సమయంలో ఒకనాడు బాగా అలసిపోయినాడు. ఒక గ్రామం చేరిన తరువాత తన శిష్యులలో ప్రధానుడైనవానిని పిలిచి "నాయనా! నేను బాగా అలసిపోయినాను. కాబట్టి, ఈనాడు నీవే ప్రజలకు చక్కని ఆధ్యాత్మిక బోధ సల్పి వారిని ఆనందపరచు. నేను కొంత విశ్రాంతి తీసుకుంటాను" అని పలికి లోపలికి వెళ్ళాడు. ఆ శిష్యుడు ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తూ, "బుద్ధుడు ప్రేమమయుడు, జ్ఞానయోగి. ఇలాంటి మహనీయుడు ఇంతకుముందు పుట్టలేదు, ఇకముందు పుట్టబోడు" అని చెప్పేటప్పటికి అక్కడ చేరిన భక్తులందరూ హర్షామోదాలను వ్యక్తం చేస్తూ గట్టిగా చప్పట్లు కొట్టారు. లోపల విశ్రాంతి తీసుకుంటున్న బుద్ధుడు తక్షణమే బయటికి వచ్చాడు. మాట్లాడుతున్న శిష్యుణ్ణి ఆపాడు. "నాయనా! నీ వయస్సెంత?" అని అడిగాడు. ఆ శిష్యుడు "స్వామీ! నాకు 25 సంవత్సరములు" అన్నాడు. "నీవు ఏఏ దేశాలను సందర్శించావు?" "స్వామీ! కురు, పాంచాల దేశాలను సందర్శించాను" అన్నాడు. అప్పుడు బుద్ధుడు "నాయనా! నీ వయస్సు 25 సంవత్సరాలు మాత్రమే. కేవలం రెండు దేశాలను మాత్రమే చూశావు. అలాంటప్పుడు నీవు బుద్ధని వంటి మహనీయుడు ఇంతవరకు ఎక్కడా పుట్టలేదు. ఇకముందు పుట్టబోడు అని ఎలా చెప్పగల్గుతున్నావు? **వర్తమానం గురించికూడా పూర్తిగా తెలియని వాడవు గతమునుగూర్చి, భవిష్యత్తునుగూర్చి ఏరీతిగా చెప్పగలవు? ఇది కేవలం అజ్ఞానమే.** ఇంతకు పూర్వం ఎందరో మహానీయులు పుట్టినారు. ఇక ముందు కూడా ఎందరో పుట్టబోతున్నారు. కాబట్టి, పుట్టలేదు, పుట్టబోరు అని చెప్పటానికి నీకు అధికారం లేదు. ఇకపై ఈ విధంగా ప్రసంగించవద్దు" అని మందలించాడు.

(స.సా. అ. 200 పు 307/308)

దేహము ఆరోగ్యముగా పుష్టిగా సంతుష్టిగా నుండినప్పుడే మన బాలెన్స్ సరైన స్థితిలో అనుభవించవచ్చు. గడచిన దానికి మీరు ఏమాత్రము చింతించనక్కరలేదు. Past is Past, forget the past. నడచుకొని వచ్చిన రోడ్డు చూచుకొని వచ్చాము కదా. ఇంక వెనుకకు ఎందుకు చూడాలి. ఎన్నిలక్షలు ఖర్చుపెట్టినా ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా తిరిగి ఒక సెకండైనా ఒక యించైనా ముందుకు రాదు. అలాంటి దానినిమిత్తమై మనము ఎందుకు యోచన చేయాలి? ఇంక భవిష్యత్తు, భవిష్యత్తు మనకు తెలియనిది, అగాధమైనది. రేపు రేపు అనే భావన చేసినప్పుడు రేపటి వరకు మనము వుండేది ఏమినమ్మకము? నమ్మకము లేనిదాని నిమిత్తమై మనము ఎందుకు యోచన చెయ్యాలి? future is not sure. Sure కానటువంటి దానికి insure చేయటం ఎందుకు? ఈ రెండు రకములైన చింతలచేతనే మనజీవితము వ్యర్థమైపోతుండాది. ఈనాటి మానవుడు యువకుడు దుఃఖమునకు గురికావటము, విచారమునకు గురికావటము, అనారోగ్యమునకు గురికావటము, కారణమేమిటి? ఉన్నదానితో తృప్తిపడక లేని దానికి అవస్థలు పడుతున్నాడు. అందువల్లనే అశాంతికి గురి ఔతున్నాడు. విద్యార్థులారా! గతము గతము. భవిష్యత్తు భవిష్యత్తు. ఈ రెండింటిని మనము విచారణ చేయనక్కరలేదు. వర్తమానము Present చాలా ప్రధానమైనది. this is not ordinary present. This is

వలె వుండవద్దు

omnipresent అనగా భవిష్యత్తు ఫలితము ఈ Present లోవుంటున్నదిpast యొక్క ఫలితము ఈ Present లో వుంటున్నాది. ముందు ఏవిత్తనము నాటామో ఆమొక్క ఇప్పుడు వచ్చింది. ఇప్పుడు యేమొక్కను నాటుతామో ఆఫలమే ముందుకు అనుభవిస్తాము. Future and past రెండు కూడను Present లో వుంటున్నాయి. వర్తమానమును సక్రమమైన మార్గములో అనుభవించండి. ఎట్టి విచారములకును అవకాశమునందించకండి. ఈ సక్రమమైన మార్గము అనుసరించినప్పుడే మన జీవితము ఆదర్శవంతమైన జీవితముగా రూపొందుతుంది. అమృతమయమైన జీవితముగా రూపొందుతుంది. అమరత్వము పొందుతుంది. మానవత్వము సార్ధకము గావిస్తుంది.

(బ్ర.త్ర.పు.34/35)

వలె వుండవద్దు

దోమ:

నీవు తేనెటీగవలెవుండు. దోమవలె వుండవద్దు. తేనెటీగ అన్ని పుష్పముల లోని మధురమైన పదార్ధమును గ్రోలు తుంది. దోమ రక్తాన్ని పీల్చి వ్యాధిని అంటించి వెళ్తుంది. నీవు **ఇతరులలో వుండే మంచినే గ్రహించు.**

ఎలుక

ఎలుక గాదెలోవున్న మంచి ధాన్యమును వదలి తాత్కాలికముగ కమ్మని వాసనచే ఆకర్షింపబడి బోనులో చిక్కుకుంటుంది. అదేవిధముగ మానవుడు తన నిజమైన ఆధారమును ఆహారమును నిర్లక్ష్యము చేసి ప్రాపంచిక **భోగములను వెదుకుచూ చిక్కులు తెచ్చుకుంటాడు.**

కప్ప

బావిలోని కప్పలవలె సంకుచిత దృష్టిని అలవరచు కోకూడదు విద్యార్థులు. విశాలమైన దృష్టిని అభివృద్ధి చేసుకోవాలి. కప్ప కమలమువద్దనే వుండవచ్చును. కానీ కమలములోని మకరందమును గ్రోలనేరదు. ఎక్కడ నుంచో వచ్చి తుమ్మెద కమలంలోని మకరందమును గ్రోలి వెళ్ళుతుంది. అదేవిధముగ **దైవత్వ మును అనుభవించడానికి దూరము దగ్గర ప్రధానం కాదు. ప్రేమ ఒక్కటే కావాలి.**

గాడిద

గాడిద ఓర్మికి పెట్టిన పేరు. అయితే అది చందనపు కట్టెలను మోసుకుపోయిననూ, దానికి వాటి బరువు తెలుసునేకాని వాటి సుగంధమును గురించి తెలియదు. అదే విధముగ (ప్రాపంచిక చింతల భారంతో క్రుంగిపోతున్న) **మానవుడు తనలోని దివ్యత్వమును గురించి తెలుసుకోలేకపోతున్నాడు.**

నిప్పుకోడి

నిప్పుకోడి వేటగాడి నుండి తప్పించుకోవటానికి తన మూతిని ఇసుకలో దూర్చుకొని, తనను ఎవరూ చూడటంలేదని భావిస్తుంది. కానీ పెద్దదైన దాని దేహాన్ని చూసి వేటగాడు చంపుతాడు. అదే విధంగా మనయందున్న దోషములను మరుగు చేసికొని ఎవరికీ తెలియదని నిప్పుకోడి వలె మూర్ఖత్వంతో ప్రవర్తించకూడదు.

గ్రద్ద

గ్రద్ద పైనుంచి అతివేగముగ క్రిందికి వచ్చి ఒక మృగమును విసురుగా ఎత్తుకొనిపోతుంది. కానీ ఆ విసురులో ఆ మృగము జారిపడిపోతుంది. కనుక అత్యాశ, ఉద్వేగము పనికిరావు.

(సా.యా. పు. 11, 18, 23, 33, 35)

వలె వుండు

కమలము

బురదలో పుట్టి బురదలో పెరిగిననూ కమలము ఎట్టి మాలిన్యమును చేర్చుకొనక పరిశుద్ధముగ అందముగ వుంటుంది. సూర్యరశ్మి సోకగానే విచ్చుకుంటుంది. అదే విధముగ **మానవుడు ప్రపంచములోవుంటూ విషయవాసనలను తనలోకి చేర్చుకొనక జీవించవలెను జ్ఞానమునే కోరవలెను.**

చీమ

బెల్లం ముక్కను చూచిన చీమ తానొక్కతే కూర్చుని తినదు. అన్ని చీమలను పిలుచుకొని వస్తుంది. బారులు బారులుగా చీమలు వచ్చి బెల్లంముక్కను తింటాయి. **ఇతరులతో పంచుకుని అనుభవించే గుణమును అలవరచు కొనవలెను.**

తేనిటీగ:

నీవు తేనిటీగవలెవుండు. దోమవలె వుండవద్దు. తేనెటీగ అన్ని పుష్పముల లోని మధురమైన పదార్థమును గ్రోలు తుంది. దోమ రక్తాన్ని పీల్చి వ్యాధిని అంటింది వెళ్తుంది. **నీవు ఇతరులలో వుండే మంచినే గ్రహించు.**

సాలీడు

సాలీడులో ఒక మంచి గుణం వుంది. దానికి పట్టుదల ఎక్కువ. గూడునల్లుటలో ఎన్నిసార్లు పరాజయమొందిననూ పట్టుదలతో చివరకు తన పనిని సాధిస్తుంది. **సాలీడువలె పట్టుదల వహించండి.**

ముత్యపుచిప్ప

ముత్యపుచిప్ప స్వాతి వర్షపు బిందువు కొరకు వేచి వుంటుంది. బిందువు పడగానే ముత్యపు చిప్ప మూసుకుంటుంది. అదే ముత్యముగామారు తుంది. ఆ విధంగానే **మానవుడు దైవానుగ్రహము కొరకు నిరీక్షించవలెను.**

గోవు

పనికిరాని గడ్డితిని, మనము పారబోసే కుడితిని త్రాగి తియ్యని పాలను తయారుచేసి, తన దూడకే కాకుండా సర్వులకు ఆ పాలను అందిస్తుంది గోవు. అదే విధముగ **మీరు కూడా ఇతరులకు మంచినే చెయ్యాలి.** మన ఇంద్రియముల ద్వారా గ్రహించిన దానిని సర్వులకు ఆనందము చేకూర్చు విధముగ ఉపయోగపెట్టాలి.

తాబేలు

తాబేలు తన ఇంద్రియములను స్వాధీనములో వుంచుకొన గలదు. ఆ విధంగా అవయవములను లోనికి చేర్చుకొని ఒక రాయి పెంకువలె నిశ్చలంగ వుండగలదు. **మానవుడు కూడా బాహ్యేంద్రియములను అంతర్ముఖము గావించి నిశ్చలముగ ధ్యానము చేయవలెను.**

కోతిపిల్ల

కోతిపిల్ల వలె వుండండి. అది తల్లిని అంటిపెట్టుకొని వుంటుంది. నిర్భయముగ వుంటుంది. అదేవిధముగ **మీరు మీ పెద్దలను దైవమును అంటిపెట్టుకొని ఆశ్రయించి వుండండి. ఎట్టి ప్రమాదము కలుగదు.**

ఏనుగు

ఏనుగు చాలా తెలివిగల జంతువు. బాగా పరిశీలించి, ఆలోచించిగానీ ముందుకు ఒక అడుగైనా వేయదు. ఒక్క సారివేసెనా వెనుకకు మరల్చదు, ఎట్టి ఆటంకములనైనా ఎదుర్కొనగలదు, **మీరుకూడా ఏనుగువలె వ్యవహరించాలి.**

సింహము

సింహము నిద్రలేచి గర్జిస్తే అప్పటివరకు ఆటలాడుచున్న చిన్న జంతువులు పరుగులిడ ప్రారంభిస్తుంటాయి. అదేవిధముగ **నిద్రనుండి లేచిన వెంటనే ప్రణవ మంత్రమును పఠిస్తే జంతుసంబంధమగు సహజ భావములు పరుగులిడతాయి.**

కోకిల

కోకిల చేసిన పుణ్యమేమి? కాకి చేసిన పాపమేమి? కాకిని తరుముతాం. కోకిలదరి చేరుతాం. ఎందుచేత? **నోరుమంచిదైన ఊరుమంచిదౌనుకదా!**

హంస

హంసవలె వివేకముతో వ్యవహరించండి, నీటిని పాలనుండి వేరు చేయగల శక్తి దానికి వుంది. అదే విధముగ **మీరు మంచిన చెడును గుర్తించే నేర్పును కలిగి వుండాలి.**

(సా.యా.పు.8,10,11,13,16,19,21,25,27,29,31)

వశిష్ఠుడు/వశిష్ఠ మహర్షి

విద్యార్థులారా! మానవత్వమంటే ఏమిటో అర్థము చేసుకోటానికి ప్రయత్నం చేయండి. మానవత్వములోనున్న

దివ్యశక్తిని ఎవరికీ గుర్తించుటకు వీలుకాదు. ఈ జగత్తులో ఎన్ని శక్తులుంటున్నాయో ఆ శక్తులన్నీ మానవునియందే ఇమిడి ఉంటున్నాయి. నీవు ఒక్క మానవాకారము కాదు, విశ్వవిరాట స్వరూపుడవు. ఉపనిషత్తులలో మానవుడనగా విలువైన వాడని ఒక అర్థం. డైమండుకు విలువ ఎవరిస్తున్నారు? మానవుడే. భూమికి విలువ ఎవరిస్తున్నారు? మానవుడే. బంగారుకి విలువ ఎవరిస్తున్నారు? మానవుడే. కాబట్టి Men are more valuable than all the wealth of the world. మనిషికంటె విలువైనది మరొకటి లేదు. అలాంటి మానవత్వాన్ని దుర్వినియోగం చేసుకోకూడదు. ఆనాటి పవిత్రమైన **ఋషులందరు** భగవత్‌చింతనతో మానవత్వాన్ని సార్థకము గావించుకున్నారు. ఒకానొక సమయంలో **"దశరథా! నేను నీ ధనము చూచి రాలేదు.** నీ శక్తి సామర్థ్యములు గొప్పవని భావించి రాలేదు. నేను ఎందుకోసం వచ్చానో తెలుసునా? **నీ ఇంటిలో శ్రీమన్నారాయణుడు పుట్టబోతున్నాడు. అతనితో కొంతకాలం గడపాలని వచ్చాను". అంత ప్రేమతో ఉండేవాడు వశిష్ఠుడు.**

(ద.స.98పు.41/42)

వశిష్ఠ మహర్షి మహనీయుడు. సర్వ విద్యలు అతడి హస్తగతము. దైవ ఋషి. అంత దైవ ఋషియైన వశిష్ఠుడు కూడా ఒక్కొక్క సమయంలో దైవత్వాన్ని గుర్తించుకోలేకపోయాడు. అతడికి శ్రీమన్నారాయణుడని తెలుసు. ఒకానొక సమయంలో దశరథునకు చెబుతున్నాడు వశిష్ఠుడుః 'దశరథా! ధనధాన్యాదులు నేనేమీ నీనుండి కోరటం లేదు. నీ దగ్గర పురోహితునిగా వచ్చిఉండటానికి నాకేమీ అవసరము లేదు. కానీ నీ గృహములో సాక్షాత్ నారాయణమూర్తి ఉద్భవిస్తున్నాడు. కనుక అతని చర్యలు చూడాలి, అతని సేవలు చెయ్యాలి అనే సదుద్దేశ్యముతోనే నేను నీ దగ్గర పురోహితునిగా పనిచేస్తున్నాను. నీ ధన కనక వస్తు వాహనాదులు నాకు అక్కరలేదు. నేను సంకల్పించుకుంటే సర్వము ఏర్పడుతుంది. దైవము కోసం నేను నీ ఇల్లు చేరాను' అన్నాడు. ఇంత తెలుసుకున్న వశిష్ఠుల వారు కూడ రామునకు ప్రబోధలు చేస్తూ వచ్చాడు. **అదియే వశిష్ఠ గీత. యోగవాశిష్ఠము అన్నారు. ఇంత తెలుసుకున్న వశిష్ఠునికి ఎందుకీ మాయ రావటం? సామాన్యమైన మానవత్వముగా భావించుకుంటూ తరువాత దివ్యత్వమును కూడా నిరూపించాడు. దీనికి కారణము ఉపాధియే.** చిన్న ఉదాహరణము-లోకములో అనేక ముహూర్తములు పెడుతూ ఉంటారు పండితులు. శ్రీమన్నారాయణుడైన రాముని పట్టాభిషేకమునకు వశిష్ఠులవారే ముహూర్తము పెట్టారు. తెల్లవారి ఏడుగంటలకు పట్టాభిషేకము అని. ఆ ముహూర్తము అరణ్యవాసమునకు ముహూర్తముగా మారిపోయింది. ఏమిటి ఈ ముహూర్తము యొక్క పవిత్రత? ఎవరు పెట్టినది? ఎవరి కోసం? ఎవరో పంచాంగము బ్రహ్మాణుడు పెట్టినది కాదు. సాక్షాత్ వశిష్ఠులవారు పెట్టినది. బ్రహ్మర్షి కానీ ఈ విధంగా మార్పు వచ్చింది. **అనగా దైవసంకల్పమునకు ఏ ముహూర్తము అడ్డురాదు. వారు పెట్టే ముహూర్తము ఒకటి, జరిగేది మరొకటి.** ఇవన్నీ ఏమాత్రము పనికిరావనే సత్యాన్ని ప్రపంచమునకు ప్రబోధించే నిమిత్తమై ఈరకంగా చేస్తూ వచ్చాడు.

(భ.మ.పు.41/42)

(చూ॥ బ్రహ్మర్షి)

వసంత ఋతువు

"మధు - మాధవ" అనేటటువంటి ఈ రెండు నెలల మార్పులే వసంత ఋతువు. వసంత ఋతువు అనగా సూర్యుడు మేష, వృషభరాసులందు ప్రవేశించడము. ఈరాశులే శుక్రరాశి అని కూడచెప్పుతారు. ఈ శుక్రరాశియందు కేవలము నీల వర్ణములో కూడినటువంటి తెలుపుగా నుండిన జీవితమును ప్రబోధిస్తుంది. ఈ నీల వర్ణంతో కూడినటువంటి ఒక భగవతత్వం లోకము యొక్క విశాలతత్వం, ఆరోగ్యం, ఆనందము సూచించు మూలచిహ్నముగా ప్రబోధిస్తూ వచ్చినది. శుక్రుడు మీనములో ప్రవేశించినప్పుడు శ్రీ రామచంద్రుడు జనన మొందుట సంభవించినది. లోకమున శాంతి భద్రతలు

అందించే నిమిత్తమై మానవత్వమున నున్న దివ్యతత్త్వము ఆవిర్భవించే నిమిత్తమై రామతత్త్వము ఆవిర్భవించినది. ఈ రామ తత్త్వము నందు ఈ వసంత ఋతువు చాల ప్రధానమైనది. పండిన ఆకులు రాలి లేత చిగురు మహాకళకళలాడే చిగురు ప్రపంచానికి ఆనందాన్ని అందించే చిగురు ఈ వృక్షములలో అభివృద్ధి అవుతాయి. సూర్య బింబము ఈ దళములపై పడినప్పుడు ఇది కేవలము సువర్ణమైన జగత్తుగా రూపొందుతుంది. అంతేకాక, ప్రపంచమునే ఒక సౌందర్యముగా నిరూపిస్తుంది ఈ వసంత ఋతువు.

(స.సా.జూన్.1989 పు.142)

వాంఛ/వాంఛలు

(చూ॥ ఆనందము, ఏకత్వము, ప్రేమ, మనస్సు, యోగము)

వాచ్ (Watch)

మీరు వాచ్ (Watch) వేసుకున్నారు. ఇది అయిదు అక్షరములతో ఉంటున్నది. దీనిని మీరు గంటలు మాత్రమే చూచి, అలంకారంగా పెట్టుకోటంకాదు.

"ఎడమచేతికడాన రెండు తుంటలవిల్లు
తోలుపెట్టగ గట్టి యాలాడ గడతారు
ఏటి యేషాలప్ప ఇవి
ఇవి కంటితో చూచేటి కానియవతారాలు"

ఇది కేవలము అలంకారము కోసం కట్టుకోటం కాదు. అలంకారంతోపాటు మన గుణములను కూడా పోషించుకోటానికి ప్రయత్నం చేయాలి. గడియారము కూడను, ఒక ఆదర్శవంతమైన జీవితాన్ని సూచిస్తూ వస్తుండాది. మనము దీనిని మొట్టమొదట పంచ ప్రాణములుగా భావించాలి. ఇది పంచాక్షరములతో ప్రబోధ చేసేటటువంటి పవిత్రమైన మంత్రంగా ఉంటుండాది.

దీని మొదటి లెటరు (letter) W

'W' = Word - "Watch your word".

నీ యిష్టమొచ్చినట్లు నీవు వాగొద్దు నీవు చెప్పేటటువంటి ప్రతిపదమును కూడను వాచ్ (Watch) చెయ్యి. ఇంక రెండవది A.

'A' = Action "Watch your action"

నీ ప్రవర్తనను సరియైన హద్దులోపల పెట్టుకొని సక్రమమైన మార్గంలో దింపడానికి చూచుకోవాలి. ఇంక మూడవది T

'T' = Thought "Watch-your thought."

నీయొక్క ఆలోచనను మంచిమార్గంలో వుంచుకోవాలి. ఇంక నాల్గవది C

'C' = Character- "Watch your character."

నీ యొక్క శీలమును కాపాడుకో, ఇంక ఐదవది. H

"H" = Heart- "Watch your heart"

నీ యొక్క హృదయమును పరిశుద్ధముగా ఉంచుకో. పంచ ప్రాణములైన ఈ పంచాక్షరములను మీరు సక్రమముగా పాటించితే, పరమాత్మ మీకు అక్కడే ప్రత్యక్షమవుతాడు. ఈ అయిదింటిని విచ్చలవిడిగా బజారు వెంట విడిచిపెట్టి, ఏదో మృగలక్షణంగా, లేక మృగప్రవర్తనతో సంచరిస్తే నిజంగా వారిని మానవులని చెప్పడానికి వీలుకాదు. కనుకనే, మానవ ధర్మమునెరిగినటువంటి వాలిని మానవునిగ విశ్వసించి, రాముడు అతనిని శిక్షించడానికి ప్రయత్నించాడు. కనుక, మనము ఆకారమును ప్రధానముగా భావించకూడదు. అందులో ఉన్నటువంటి ఆత్మతత్వమును ప్రధానంగా తీసుకోవాలి.

(ఆ.రా.పు.93/94)

వాతావరణము

రామలక్ష్మణులు సీతాన్వేషణ సలుపుతూ దండకారణ్యంలో ప్రయాణమై పోతున్నారు. కొంతసేపటికి అలసిపోయి, ఒక చెట్టుకింద కూర్చున్నారు. వెంటనే లక్ష్మణుడు లేచి, "అన్నా! నేనీ బాధలు సహించలేను. సకాలమునకు భోజన పానీయాదులు లేక నా శరీరమును కృంగదీసు కుంటున్నాను. ఇక ఒక క్షణమైనా ఇక్కడ ఉండను.

అయోధ్యకు వెళ్ళెదను.'' అన్నాడు రాముడు నవ్వాడు. "సోదరా! మనం మరికొంత దూరం వెళ్ళిన తరువాత మాట్లాడతాను'' అని చెప్పాడు.పూర్వము రామ సన్నిధే తన పెన్నిధి అని భావించి తల్లిదండ్రులనైనా త్యజించి వచ్చిన లక్ష్మణునిలో ఈ దుర్బుద్ధి పుట్టడానికి కారణం ఏమిటి? అతనిలో దేహభ్రాంతి, దేహాభిమానం కలుగుటకు కారణమేమిటి? రామలక్ష్మణులు అక్కడ నుండి మరొకొంతదూరం వెళ్ళి ఒక చెట్టుకింద కూర్చున్నారు. తక్షణమే లక్ష్మణునికి పశ్చాతాపం కలిగింది. రాముని కాళ్ళు గట్టిగా పట్టుకొన్నాడు. "అన్నా! నన్ను క్షమించు. నాలో ఈ దుర్బుద్ధి ఎందుకు ప్రవేశించిందో తెలియటం లేదు.'' అని ప్రార్థించేటప్పటికి రాముడు చెప్పాడు. "లక్ష్మణా! ఆ ప్రదేశమంతయూ **శూర్పణఖ సంచారము చేసిన ప్రదేశము. కనుక, ఆమె దుర్గుణములు అక్కడి వాతావరణములో కలిసి ఉన్నాయి. ఆ ప్రభావము నీలో ప్రవేశించడం వలన ఇలాంటి దుర్బుద్ధి పుట్టింది. ఆస్థానం వదలగానే నీలో తిరిగి సద్భావం వచ్చింది." అన్నాడు.**

కనుక, కొన్ని కొన్ని స్థానములందు కొన్ని కొన్ని సమయములలో మనం జాగ్రత్తగా ఉంటుండాలి. దుస్సంగానికి, దుర్బుద్ధులు సంచరించే ప్రదేశానికి మనం దూరంగా ఉండాలి. ఎందుకంటే మంచికిగాని, చెడుకుగాని, ఒక విధమైన 'వైబ్రేషన్' ఉంటుంది. మనది 'డివైన్ వైబ్రేషన్' అది 'డెమన్ వైబ్రేషన్'. **సత్సంగము చాలా అవసరము. మంచివారితో మనం స్నేహం చేయాలి.** మంచివారితోనే మన జీవితాన్ని అంకితము గావించుకోవాలి. దైవము ఎంత అనుగ్రహస్వరూపుడైనా, మన ప్రవర్తనలందు కొన్ని దోషములుంటున్నాయి. మన ప్రవర్తనను సక్రమముగా తీర్చి దిద్దుకొన్నప్పుడు, దైవానుగ్రహం మనకు డైరెక్టుగా వచ్చి చేరిపోతుంది.

(శ్రీ.భ.ఉ.పు.165)

వాత్సల్యము

(చూ॥ ప్రేమ)

వానప్రస్థము

సమస్త ద్వంద్వములు అనిత్యములని తలంచి సకలాపేక్షలు విరమించుకొని ఈ ప్రపంచమునకు విరాగియై యే జన ప్రదేశముల నుండ నొల్లక, అడవికి పోయు స్థాననిష్టా గరిష్ఠుడై, మంత్ర జపసిద్ధి యను యజ్ఞమును చేయుచు, తనకు ఆకలి సమయమున వండిన ఆహారము తినక, ఫలపత్ర తోయవాయు కందమూలములను తినుచు, మితాహార భక్షణుడై, మహర్షిగణముల సమూహములలో చేరి, ఉత్తమ ఋషీశ్వరుల బోధలను వింటూ, జన్మము ముగియు వరకు తిరిగి వెనుక మార్గము పట్టక వెనుకటి చింతలను తలపక, క్రమేణా సర్వమును మరచి సర్వేశ్వరుని యందు లీనము కావలెను. ఇక్కడ ఒక్క విషయమును జాగ్రత్తగా యోచించవలెను. ఏమన, అట్టి వానప్రస్థమును కోరు వారికి, భార్యాబిడ్డలుండిన, బిడ్డలకు తగినమార్గములు చేసి వారి జీవనోపాధికి యే విధమయిన ఆటంకములు కలుగకుండునట్లు చేసి, భార్యను ఒప్పించి, వానప్రస్తుడు కావలయును. అట్లుకాక భార్య తనవెంట వుండుటకు అంగీకరించిన ఆమెను కూడను వెంటతీసుకొని పోవలయును. వెంట వుండినను వారు సోదరీ సోదర భావములతో మెలగవలయును తప్ప, సతీపతుల సంబంధము వుండకూడదు. ఈ సంబంధముతో గృహము నందుండినను వాడు వానప్రస్తుడే యగును. అట్లుకాక సతి, భావముండి మిగిలిన వానప్రస్త క్రమములన్నియూ నడచుకొనుచు, అడవుల యందుండిననూ వాడు వానప్రస్తుడు కాజాలడు. ఇట్టివాడు గృహస్తుల ఇండ్లయందు మకాములు వేయరాదు. పక్వాహారములు భుజించకూడదు. ఆయా ఋతువుల యందు, ఆయా వ్రతములు సల్పుచుండ వలయును. అనగా వర్షాకాలమున వర్షములలో, యెండాకాలమున యెండలయందును, శీతాకాలమున చలియందును సంచరించవలెను. మానసిక సంబంధమైన వృత్తుల యందు కానీ, అభిరుచిని అణచి నిరంతర భగవత్ చింతనలో తాను సంతసించు చుండవలయును.

(ప్రశ్నో.వా. పు.10,11)

మనుజుడు **గృహస్థుడుగా ఉండి సంకట,** సంతోష సౌఖ్యములను పొంది అందులోని నిజార్థములు గ్రహించి 45 సంవత్సరములు లేక 50 సంవత్సరములు పూర్తి నిండగనే, సర్వ సంకట, సంతోష సౌఖ్యములను త్యజించి తాను నిర్మించిన **గృహమును వీడి, ఊరినే విడిచి, అరణ్యవాసి కావలెను.** అట్టి తరుణమున తన ధర్మపత్ని యుండిన ఆమెను సమ్మతి పరచి తన కొడుకులచెంతనో తల్లిదండ్రుల చెంతనో విడువవచ్చును. **లేకున్న వెంట తీసికొనివెళ్ళి సతిపతుల భావనలు విసర్జించి, బ్రహచర్యమును ఆచరించి, కేవలము అన్న చెల్లెలు భావముల ప్రవర్తించుచు,** ఆహారాదులయందు సైతము మార్పులు కలిగి, కందమూలాదులతో పండ్లు, పాలతో, అట్లు కాకున్న సాత్విక ఆహారుడై, అగ్నిచే పూర్తి పక్వము పొందించక మూడవవంతు పక్వపరచి భుజించవలెను. బియ్యమును ఎక్కువ ఉపయోగించరాదు. అట్లు తనకు తాను ఏర్పాటు కలిగించుకొనలేని స్థితిలో, ఊరియందుపోయి భిక్షమెత్తి ఊరియందే భుజించక తన నివాసమైన అడవికి తెచ్చి ఆరగించవలెను. తానేరకమైన ఆహారమును భుజించునో అట్టిదే ఆశ్రయించిన వారికి అందించవలెను కాని, వారికి రుచికి తగినవాటిని తయారు చేయించుట కాని, తెచ్చి యిచ్చుటకాని జరుపరాదు. అది వారు భుజించిన సరే, లేకున్న పండ్లు, పాలతోనే వారిని తృప్తిపరుపవలెను కాని, ఇతరుల కని తన నీమమును మార్చరాదు. ఎట్టి అనానుకూల పరిస్థితులు సంభవించినను, క్రమశిక్షణ మాత్రము విడువరాదు, మార్చరాదు. వీనిని చాలా ముఖ్యముగా గమనించవలెను. వీరు అర్చన, దాన ధర్మాదులు ఆచరించరాదు. వారి చెంతనుండిన భోజనముకాని, వేరే ఇతరవస్తువులు కాని ఇతరులకు ఇచ్చినను దానముగా తలంచరాదు. దేనినైనను ఇతరుల చెంతనుంచి దానముగా సహితము పుచ్చుకొనరాదు. సర్వులయందు సమాన పవిత్రప్రేమ కలిగియుండవలెను. **ప్రతి ఆశ్వీజమాసమందు జీర్ణవస్త్రములు వదలి క్రొత్తవాటిని గ్రహించవలెను. వానప్రస్థుడాచరించవలసిన వ్రతములలో చాంద్రాయణ వ్రతము ముఖ్యము.** ఆ మాసమునందు 15 దినములు తాను తిను ఆహారమందు దినమున కొకముద్ద చొప్పున తగ్గించవలెను. రెండవ పక్షమున క్రమక్రమేణ దినమున కొక ముద్దచొప్పున హెచ్చుచేయుచుండవలెను. **పౌర్ణమి అమావాస్యలందు వట్టి గంజి మాత్రము త్రాగవలెను.** వర్షఋతువులో వానలయందు నిలిచి తపస్సు చేయవలెను. హేమంత ఋతువులో తడిగుడ్డలతో తపస్సులు చేయవలెను. క్రమాభ్యాసముగా ఈ తపస్సులు చేయుచు, ఉదయము, మధ్యాహ్నము సాయం సమయములందు స్నానము లాచరించవలెను. వివిధ ఉపనిషద్వాక్యములను అర్థ, అనుభవసహితముగా పఠించుచుండ వలెను. అట్టి వానప్రస్థునికి, ఏదైన శరీర సంబంధమయిన వ్యాధులు వెంటబడిన, తాను భుజించుచున్న ఆహారములుమాని కేవలము జలము, వాయువులే ఆహారముగా స్వీకరించి, ఈశాన్యదిక్కుగా ప్రయాణము సాగించి మరణ పర్యంతము పోవలెను. అట్లు కాక శరీరసంబంధమైన వ్యాధులు లేక సౌఖ్యముగా ఉండిన, పై నిబంధనలను జయించిన తరువాత, అప్రయత్నముగా తనంతట తానే జ్ఞానోదయము ఏర్పడును. ఆ జ్ఞానమువల్ల మోక్షప్రాప్తి లభించును.

(ప్రే. వా. పు. 60,61)

వామనమూర్తి/వామనుడు

(చూ॥ బలిచక్రవర్తి, విశ్వామిత్రుడు)

వాయువు

(చూ॥ పంచభూతములు)

వాలి

(చూ॥ కాయము)

వాల్మీకి

ఒకానొక సమయంలో వాల్మీకి నారదుణ్ణి 'స్వామీ! ఈ ప్రపంచంలో సత్యవాక్పరిపాలకుడున్నాడా? నిరంతరము ఆనందమును అనుభవించేవాడున్నాడా? నిరంతరము చిరునవ్వులు చిందించే మోము గలవాడున్నాడా? తప్పు చేయని వాడున్నాడా? తప్పు చేసినవారిని క్షమించే వాడున్నాడా? పొందిన ఏ చిన్న ఉపకారమునకైనా కృతజ్ఞత చూపే వాడున్నాడా?....'' అని ఈ రీతిగా పదకొండు ప్రశ్నలు అడిగాడు. అప్పుడు నారదుడు ''వాల్మీకీ! పదకొండు కాదు, పదకొండు వేల సద్గుణములకు అధిపతియైన **శ్రీరాముడు** నరరూపధారియై ఈ జగత్తులోనే ఉన్నాడు. **సద్గుణములు, సత్ప్రవర్తన గలవాడే భగవత్స్వరూపుడు.** అట్టి శ్రీరామచంద్రుడు మానవాకారంలో పుట్టాడు. తానెన్నో అవస్థలకు గురి అయినాడు. కాని, ఎట్టి పరిస్థితిలోనూ సత్యమార్గమును వీడలేదు. అతడు చెప్పిందంతా సత్యమే, చేసిందంతా ధర్మమే. కనుక, అతనిని నీవు అనుసరించు నాయనా!'' అని బోధించాడు. నారదుడు కలహప్రియుడని అనేకమంది అపోహ పడుతుంటారు. **నారదుడు** కలహప్రియుడుకాదు. కఠిన హృదయుడు కాదు. అతడు **జ్ఞానజ్యోతి ప్రకాశకుడు, విశ్వామిత్రుడు సంపాదించిన గాయత్రీమంత్రమును లోకానికి అందించినవాడు.**

(స.సా.సె. 2001 పు. 260/261)

(చూ॥ జనసంఘమున ప్రీతి లేకుండుట, జ్ఞానగుణము, ప్రాచేతనుడు)

వాల్మీకిరామాయణము

వాల్మీకి రామాయణము సుధాసముద్రము. కనుకనే ఈరామాయణమునందున్న భాగము లన్నింటికిని కాండములని పేరుపెడ్తూ వచ్చారు. కాండమనగా జలము. ఇక్కడ ఒక్కొక్క బిందువు ప్రాణప్రదమైనట్టుగా ఒక్కొక్క పదము కూడను ధర్మార్థకామమోక్షములనేటటువంటి పురుషార్థప్రదంగా గోచరిస్తూ వచ్చింది. హృదయమనే సముద్రమునందు బుద్ధి అనే ముత్యపుచిప్ప, సరస్వతిఅనే వర్షబిందువునకై వేచివుండడమనే దానిని కూడను నిరూపిస్తూవచ్చారు. పవిత్రమైనటువంటి ఈభారతీయ సంస్కృతిని గుర్తించడానికి మనము తగిన ప్రయత్నము చేయుట అవసరము. ముత్యపు చిప్ప స్వాతివర్షపు బిందువు నిమిత్తమై ఏరీతిగా కాచుకొని ఉండునో, అదేరీతిగా మానవుని హృదయము ఈ సరస్వతి అనుగ్రహము నిమిత్తమై కాచుకొనియున్నది. దానికి తగిన సమయము ఇప్పుడు ఆసన్నమైనది. రామచరిత్ర అనే సరోవరమునందు స్నానముచేసి పునీతుడైనటువంటి వాడు మాత్రమే బ్రహ్మలోకమునందున్న శారదాంబయొక్క అనుగ్రహము పొందుటకు అర్హుడౌతాడు. ఇందులో వాల్మీకీ, రామచరిత్ర సరోవరమునందు స్నానముచేసి పునీతుడుకానివ్యక్తి, సరస్వతియొక్క అనుగ్రహమునకు పాత్రుడు కాడని కూడను నిరూపిస్తూ వచ్చాడు.

(ఆ.రా.పు.1/2)

వాసనలు

వాసనలు రెండు విధములు : శుభమనియు, అశుభ మనియు, శుద్ధ వాసనలైనచో అతనికి త్వరలో మోక్షప్రాప్తి చేకూరును. జపము, ధ్యానము, సత్కర్మ, దానము, ధర్మము, నిస్స్వార్థసేవ, క్షమ, దయ మొదలగునవి మంచి వాసనలు; అవే శుభ్రమైనవి. క్రోధము, హింస, కామము, దురాశ, స్వార్థము మొదలగునవి అపవిత్ర వాసనలు, లేదా అశుద్ధ వాసనలు. ఒక ముల్లును మరొక ముల్లుతో తీసి రెండును పారవేయు విధముగా, అపవిత్రమైన వాసనలను పవిత్ర వాసనలతో తీసి తదుపరి మంచి వాసనలను కూడా నిర్మూలము చేయవలెను. మోక్ష సాధనకు పవిత్ర వాసనలు తోడ్పడునే కానీ, పవిత్ర వాసనలు బహుజన్మలను బంధించుచున్నవి. జీవన్ముక్తులకున్న పవిత్ర వాసనలనుకూడా నిర్మూలము చేయవలెను. కాల్చిన గింజ వంటివి జీవన్ముక్తుని యందు ఇంద్రియానందము, తృష్ణ, మోహము అని ఆత్మ

సందర్శనముచే మాయమగుచున్నవి. తనకు ప్రియమైన దేదియూ ఉండదు, ఎచ్చట సూర్యుడస్తమించునో అచట నిద్రించును. తనను గురించి ఇతరులకు తెలియకుండు నట్లు సంచరించును.

(ఉ.వా. పు. 83, 84)

వాసుదేవస్సర్వమిదం

(చూ॥ పొత్తు)

వాసుదేవుని సంకల్పము

వాసుదేవుని సంకల్పములేక ఈ వసుధలో యే చిన్న కార్యము కూడనూ జరుగదను విషయము నాకు నేటికి సంపూర్ణముగా తెలిసినది. తానే సూత్రధారుడై ప్రేక్షకులతో కూర్చొని తాను యెవ్వరికినీ తెలియనివానివలే, దాగియుండును. యే పాత్రను యే విధముగా నటింప వలయునని నిర్దేశించెనో ఆ విధముగ ఆ నటుడుచేయక తప్పదు కదా?

ఈ నాటకమునందలి చిత్ర విచిత్రములు ప్రేక్షకుల హృదయములకు మాత్రము మార్పు కలిగించునే కానీ, సూత్రధారునకట్టి భేదము లేమాత్రమునూ కలుగవు కదా? యెప్పుడు, ఎవరిచేత, యేమి చేయించ, తలంచునో అప్పుడు వారికట్టి బుద్ధి పుట్టించును.

(భా.వా.పు.58)

అతని అజ్ఞలేక యే వక్కటియునూ జరుగదు. లేక అతని ఆజ్ఞను ఉల్లంఘించి పోవలెనన్ననూ అది సాధ్యము కాదు. తాను నేర్పిన నటనను నీమించిన కాలమును, ఈ ప్రకృతి రంగమున అతడు చెప్పినట్లాడక తప్పదు; చేయక తప్పదు, జరుగక తప్పదు కదా? ఇవి మన ఊహాభావములు కానీ, అన్నింటికీ అతని సంకల్పము మూల కారణములై కార్యమును జరిపించును.

(భా.వా.పు.60)

విక్షేపము

రెండవది విక్షేపము. అద్దముంవంటిదే మనసు. కాని అద్దమును కదిలిస్తూ ఉండినంతవరకు మన ప్రతిబింబము కూడా అందులో కదులుతూనే ఉంటుంది. ఈ మనస్సే నిరంతరము చంచలముగా అటూయిటూ కదలటంచేత ఇందులో ప్రతిబింబము కూడను చంచలము గానే రూపొందుతున్నది. చంచలం హిమనఃకృష్ణ ప్రమాధి బలద్దృడమ్'' అర్జునుడు చంచలమైన మనస్సుతోచాలా కలత చెంతున్నాననీ అదిచాలా బలవత్తరమైనదిగా వుంటున్నదనీ ప్రార్థించాడు. ఈ చంచలత్వమును స్థిరత్వముగావించటానికి ఏది ఉపాయము? ధ్యానమని ప్రార్థన అని చింతన అని నవవిధ మార్గములదీనిని క్రమక్రమేణా స్థిరపరచుకోవచ్చును. **"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం, అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనం"** ఈ నవవిధ మార్గములయందు మానవుడు పవిత్రమైన హృదయముతో ప్రార్థన సలిపినప్పుడె చంచలత్వము క్రమ క్రమేణ ఒక స్థితికి రాగలదు. ఈనాటి యువకులు మాలిన్యమైన మనస్సును మరింత మాలిన్యమైన వానితోనే అభివృద్ధి పరుస్తున్నారు. బురదతో కూడిన వస్తువును తిరిగి బురదతోనే కడిగితే బురద పోతుందా? పరిశుద్ధమైన జలముతో కడగాలి ఈనాటి యువకులందు అట్టి పరిజ్ఞానము శూన్యమైనది. ఈనాటి విద్యావిధానమునందు. వివేక విజ్ఞానములు లేకుండా పోతున్నాయి. స్వార్థ స్వప్రయోజనతత్వాలు అభివృద్ధియై పోతున్నాయి. లౌకిక భోగభాగ్యములనిమిత్తమై యీనాటి విద్యార్థి ప్రాకులాడుతున్నాడు. భావిభారతోద్ధారకులైన విద్యార్థులు హృదయములు మలినమైతే భారతదేశ పరిపాలన మలినముగానే రూపొందుతుంది.

(బృ.త.పు.82)

(చూ॥ ఆటంకములు)

విగ్రహారాధన

చెట్లను, రాళ్ళను పూజించే అనాగరికులు ఇచ్చటివారు అనే విచక్షణ లేని మాటలను మీరు ఎంత మాత్రమూ విశ్వసించవద్దు. విగ్రహారాధన అనాగరికతకు గుర్తుకానే కాదు. **పెళ్ళికూతురికి నుదుట కుంకుమ బొట్టు ఎంత ముఖ్యమో ఆధ్యాత్మికతలో ఈ విగ్రహారాధన కూడ అంత ముఖ్యము, అంత అర్థవంతము. విగ్రహమంటే భగవంతుని స్వరూపము. అంతటా అన్నిటా వ్యాపించి యున్న** భగవంతుడు విగ్రహంలో దర్శన మిస్తుంటే **స్వచ్ఛమైన మనస్సుగలవారు ఆయనను ఆరాధిస్తూ అది విగ్రహమనే భావనను మరచిపోయి నిత్య సత్య తత్త్వంలో లీనమవుతారు. దీనినే ప్రపత్తి లేక శరణాగతి అంటారు.** ఈ తత్త్వం లేకపోతే మీరు చేసే ఆరాధన వృథా అవుతుంది. మీరు విశ్వాసము, ధైర్యములను అలవరచుకోండి. అలా అలవరచుకుందామని, దానిని వెంటనే ఆచరణలో పెడదామని ఇప్పుడే నిర్ణయించుకోండి. భక్తిని కన్నీళ్ళను బట్టి, ఉత్సాహాన్ని బట్టి అంచనా వేయకూడదు. అది అన్ని విషయములలోను ఒక అంతర్గతమైన పరివర్తనము!

(వ.61-62 పు.174)

విఘ్నేశ్వరపూజ

ప్రాచీన ఋషులు చాలా గొప్పవారు వారిని మనం అనుసరించాలి. నేటి మానవులు బలహీనులైనటువంటి వారు. తప్పులు చేసి గుర్తించిన తరువాత కూడా సరిదిద్దుకోవటానికి ప్రయత్నించరు. ఆనాటివారు మాత్రం తప్పులను సరిదిద్దుకొని, కృతజ్ఞతాపూర్వకంగా దైవాన్ని క్షమించమని ప్రార్థించేవారు. ఆ ప్రార్థనే పశ్చాత్తాపమునకు మూలకారణము. దీనిని గుర్తింపజేసే నిమిత్తమై వత్సరాని కొకపర్యాయం **'విఘ్నేశ్వరపూజ' అనేది పెట్టారు. 'విఘ్నేశ్వరుడు' అనగా ఏమిటి? 'గణపతి' అనగా ఏమిటి? 'గణ' అనేది బుద్ధికి సంబంధించినటువంటిది. 'ణ' అనేది విజ్ఞానమునకు సంబంధించినది. విజ్ఞాన ప్రజ్ఞానములకు అధిపతి 'గణపతి'. 'వినాయకుడు'.** అనగా తనకంటే నాయకుడు మరొకడు లేడు. తనకు తానే నాయకుడు. అలాంటి వినాయక తత్త్వము ఎవ్వరికీ కీడు తలబెట్టదు. సర్వకర్మలకును 'అవిఘ్నమస్తు' అని ఆశీర్వదించి పోషించేవాడు వినాయకుడు. చెడ్డను ఏమాత్రం దరికి చేరనిచ్చేవాడుకాదు. అతనిది ఎలుక వాహనము. 'మూషికము' అనగా చీకటి. రాత్రులయందు చీకటి వుంటుంది. కనుకనే ఎలుకలు కూడానూ రాత్రి యందు సంచరస్తాయి. దైవత్వమనేది కేవలం మానవత్వమునకే పరిమితం కాకుండా, యావత్ క్రిమికీటకాలకు, జంతుజాలాలకు కూడా ఆదర్శవంతమైనదనే సత్యాన్ని నిరూపించే నిమిత్తమై, విఘ్నేశ్వరునికి ఏనుగుతల, ఎలుక వాహనం రెండింటిని సృష్టించారు.

ఏనుగు చాలా తెలివి గలది అందువలననే 'గజతెలివి' అని వాడుకలో వచ్చింది. **ఏనుగు చాలా విశ్వాసం కలది.** ప్రాణంపోయినా సరే యజమానిని మరువదు. **కృతజ్ఞతకు ఆదర్శం గజం. కృతజ్ఞత అనేది చాలా పవిత్రమైనది. క్షమాస్వరూపమే గజము.** ఏ దారిలేని అరణ్యంలో ఏనుగు ఒక తూరి ప్రవేశించిందంటే, మనుషులు నడవడానికి దారి ఏర్పడుతుంది. **కనుకనే జీవితారణ్యమునందు మార్గము కనిపించని మానవులకు మార్గము చూపించేది ఈ గజము. అట్టి తెలివి తేటలు గల శిరస్సును ధరించి నటువంటివాడు వినాయకుడు.** తన తెలివితేటలచేత మానవునికి ఆదర్శమైన మార్గమును నిర్దేశించేవాడు వినాయకుడు.

(శ్రీ.సె.2001పు.12)

విచక్షణ

విచక్షణను ఉపయోగించి ఏ రకమైన తికమకలూ, అనుమానాలూ లేకుండా చేసుకుంటే సమ్యక్ పృద్ధి చెందుతుంది. ఈనాడు ఎవ్వరూ విచక్షణను ఉపయోగించడం లేదు. ప్రతి విషయంలోను అనుమానాలే! ఈ కారణంగా

ముఖ్యంగా యువకులు దేనినీ సాధించలేకున్నారు. అన్ని రంగములలోను అన్ని రకములైన మానవ ప్రయత్నాలకు నమ్మకం అత్యవసరం.

(స.సా.ఫి.2000పు.61)

(చూ॥ జ్ఞానోదయం, దేహము, సంస్కృతి)

విచారణ

దానముగాని యజ్ఞసముదాయముగాని
తపంబుగాని విజ్ఞానముగాని
తేజిత సనాతన ధర్ముముగాని
సత్యసంధానముగాని
పావన నిదానముగాని
మరి ఏదియైనన్ గాని
ప్రేమతో పురుడురాదు కాదు
విచారణ జేసి చూచినన్

(శ్రీ.సె.99 పు.7)

(చూ॥ విజ్ఞానము)

విచారణయోగము

(చూ॥ విషాదయోగము)

విచారణ శక్తులు

మానవునకు ఐదు విధములైన విచారణ శక్తులుంటున్నవి. దీనినే ఒక విజ్ఞానము అన్నారు. ఈనాడు ప్రపంచమంతా వ్యాపించిన జ్ఞానము ఒకటి. అది తెలివితేటలతో కూడినది దీనినే **పుస్తక జ్ఞానం బుకిష్ నాలెడ్జి అన్నారు. ఈ పుస్తక జ్ఞానం సూపర్ ఫిషియల్ నాలెడ్జిగా మారిపోయింది.** ఈ సూపర్ ఫిషియల్ నాలెడ్జిలోపలే మన జీవిత మంతా వ్యర్థము చేసుకుంటున్నాము. ఈవయస్సు నందు మానవునకు ఉండవలసిన జనరల్ నాలెడ్జి, కామన్‌సెన్స్ జీరోగా ఉంటున్నది. **జనరల్ నాలెడ్జి, కామన్‌సెన్స్ విద్యవల్ల లభించేదికాదు.** నిత్య జీవితములో కర్తవ్యధర్మమువల్లనే యీజనరల్ నాలెడ్జిని పోషించుకొనవచ్చును. సమాజ సేవ వల్ల, సమాజ సంపర్కమువల్ల యీ జనరల్ నాలెడ్జిని పోషించు కోవటానికి అవకాశముంటున్నది. **ఇంక నాల్గవది విచక్షణజ్ఞానం discrimination knowledge** ఇది స్వార్థపరమైన డిస్క్రిమినేషన్‌గా ఉంటుండాది. వ్యక్తి సంబంధమైన discrimiation గా వుంటుండాది. కనుకనే యీ డిస్క్రిమినేషన్ పెడమార్గము పడుతుండాది. ఇది సరియైన డిస్క్రిమినేషన్ కాదు. సమిష్టి సంబంధమైన discrimination కావాలి. ఎవరినివాడు సమర్థించుకునే discrimination చూస్తున్నాడు. నాదిరైటు - నాది రైటు అనేది స్వార్థపరమైన discrimination అందువలననే యువకులు పెడమార్గము పట్టటానికి చాలా అవకాశము ఏర్పడుతున్నది. Fundamental discrimination కావాలి. ఎవరికి సంబంధించినప్పటికి అందరికి సమన్వయమయ్యే discrimination గా వుండాలి 2+2=4 ఇది రష్యన్సుగాని, చైనీసుగానీ ఆమెరికన్సుగానీ, పాకిస్తానువారుగానీ, ఇండియన్సుగానీ అందరు ఒప్పుకోవలసినదే. తప్పదు. కానీ **ఆధ్యాత్మిక మార్గము 3-1=1 అంటుంది. ఇది ఎవ్వరు అంగీకరించరు.** ఇది fundamental కాకుండా Individual discrimination గా రూపొందుతుంది. ఆధ్యాత్మికము అలాంటి సంకుచితమైన discrimination ఏనాడు చేయదు. వారు అర్థము తెలుసుకోలేక లేదా విచారణ చేసుకోలేక యిది వ్యక్తిగతమైన విచారణ శక్తి అనుకోవచ్చు. ఏ వ్యక్తిని ప్రశ్నించినప్పటికిన 3-1=1 అంటే తప్పు అంటాడు. **కాని యిదిరైటు అనినేను వాదిస్తాను.** కారణం ఏమిటి? ఇదివ్యక్తిగతమైనది కాదు. సృష్టి సంబంధమైనది. ఆత్మసంబంధమైనది. అమృత సంబంధమైనది ఏ విచారణ శక్తిద్వారా యిది మార్పు చెందటానికి వీలుకాదు. ఈవిధమైన discrimination లోపల అన్ని విధములైన మార్పులు కలగటం చేతనే మానవత్వాన్ని సక్రమమైన మార్గములో గుర్తించలేక పోతున్నారు కారణం ఏమిటి? **ఐదవవిచారణ శక్తి అత్యవసరము. అదే ప్రాక్టికల్ నాలెడ్జి. ఈ ప్రాక్టికల్**

విజయదశమి

నాలెడ్జి లేకపోవటంచేతనే యిన్ని అపోహలకు గురైపోతున్నాడు. మానవుడు. ప్రతి విషయమునకు ప్రాక్టికల్ నాలెడ్జి కావాలి. ఈనాడు Practical knowledge అంటే యేమిటో అర్థము కావటం లేదు. ప్రతివ్యక్తి తనకు సంబంధించినది తన అనుభూతిగా భావిస్తున్నాడు. నేను సమాజములో ఒక్కడిని సమాజపు సమిష్టి తృప్తిని నేను అనుభవించాలి అని విచారణ చెయ్యాలి. సముద్రమునుండి ఏరీతిగా అలలుద్భవిస్తున్నవో, సూర్యుని నుండి ఏవిధముగా కిరణములావిర్భవిస్తున్నవో, ఒకే దైవమునుండి ఆవిర్భవించిన ప్రేమ ఈ ప్రేమ భగవంతునికి ఎట్టిభేదము లేదు సూర్యునికి కిరణములకు ఏవిధమైన భేదముండదు సముద్రమునకు అలలకు ఏవిధమైన భేదములేదు. ఇది అన్యోన్యాశ్రయులు. వీనిది అవినాభావ సంబంధము. అదే విధముగనే యీ దేహము కూడను దివ్యమైన ఆత్మతత్వమునకు సంబంధించినదనే సత్యమును గుర్తించాలి.

(బ్ర.త్ర.పు.31/32)

విజయదశమి

ఈనాడు విజయదశమి. ఇది పవిత్రమైన పర్వదినముల యొక్క సమాప్తి దినము, పవిత్రమైన ప్రాప్తిని చేకూర్చుదినం. మరొక రీతిగా విచారించి చూచినప్పుడు **- షిరిడీ బాబా శరీరము వదలిన దినము ఈ దినము.** విజయ దశమి దినమే షిరడీ బాబా తన దేహాన్ని వదలి, తన ఆత్మస్వరూపంతో అనేక విధములైన సంచారములు సల్పి, తదుపరి ఎనిమిది సంవత్సరములకు ఇక్కడ ప్రవేశించడం జరిగింది. మానవత్వములోని దివ్యత్వమును గుర్తించుకొనవలెనన్న ఈ ఒక్కటి మాత్రమే చాలు.

(ద.స.98 పు.103)

విజయము

నీ హృదయాన్ని మార్దవం చేసుకో. అప్పుడు సాధనలో విజయం త్వరితగతిని లభిస్తుంది. మృదువుగా, మధురంగా భగవంతుని గురించే పలుకు. ఈ విధంగా ఉపరితలాన్ని మెత్తబరచ గలవు. జాలి, దయ అభివృద్ధి పరచుకో. సేవలో పాలు పంచుకో బీదల ఇక్కట్లు, రోగుల ఆర్తనాదాలు, కష్టాలలో ఉన్న వారి నైరాశ్యం అర్థం చేసుకో. ఇతరుల కష్టసుఖాలు పంచుకో. ఇదే హృదయాన్ని మార్దవం గావించు కోవడానికి, సాధనలో విజయం సాధించడానికి మార్గం.

(అ.ష.పు.75)

"యత్రయెగేశ్వరః కృష్ణ యత్రపార్థో దనుర్ధర
తత్ర శ్రీర్విజయో భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ"
ఎక్కడ సర్వశక్తి మయుడైన భగవంతుడుంటాడో, ఎక్కడ సర్వధర్మపరాయణుడైన నిర్మలుడు అర్జునుడు ఉండునో అక్కడనే విజయము. ఈవిజయానికి సత్యధర్మ స్వరూపుడైన భగవంతుని అనుగ్రహమే ప్రధానము. పురాణములు కూడను ఈసత్యధర్మములనే ప్రబోధిస్తూ వచ్చాయి.

(బ్ర.త్ర.పు.8)

(చూ॥ సత్యం, హిరణ్యగర్భతత్వం)

విజయుడు

(చూ॥ మోహము)

విజిటింగు కార్డులు

(చూ॥ దివ్యప్రకటనలు, భగవంతుని దృష్టి)

విజ్ఞాన జ్యోతి

(చూ॥ ప్రేమతత్వం)

విజ్ఞానము

బుద్ధికి విజ్ఞానము అని మరొకపేరు ఈ విజ్ఞానము బాహ్యసంబంధమైన విషయములను మాత్రమే విమర్శించి విచారణ సల్పి నిర్ణయాలు చేస్తుంది. బుద్ధి అంతర

విజ్ఞాన శాస్త్రము

ఈనాడు దేశమున పవిత్రమైన రీతిగా తీర్చిదిద్దాలంటే దీని సమర్థత మీకే ఉంటున్నది. ఈనాడు ప్రపంచములో వ్యాపించిన అశాంతినంతా నిర్మూలము గావించే శక్తి సామర్థ్యములు మీయందే గల్గి ఉంటున్నారు. ఈనాడు దేశమును కాదు **మనము కాపాడవలసింది. సత్యధర్మములను కాపాడితే ఆ సత్యధర్మములే దేశమును కాపాడతాయి. సత్యధర్మములను కాపాడే శక్తి సామర్థ్యములు యువతీయువకులందే ఉంటున్నాయి.** ఈ సత్యమును మీరు చక్కగా ఆచరణలో పెట్టి ఆచరణ ద్వారా ఏర్పడిన ఆనందము అందరికి పంచి తద్వారా ఆధ్యాత్మిక తత్వమును అభివృద్ధి చేయించాలి. ఈనాడు దేశములో ఆధ్యాత్మిక తత్వమును అభివృద్ధి చేయించాలి. ఈనాడు దేశములో ఆధ్యాత్మిక తత్వమంటే హాస్యాస్పదముగా కనిపిస్తున్నది. కారణం ఏమిటి? **ఈనాడు సాంకేతిక విజ్ఞాన శాస్త్రము అభివృద్ధి చెందింది. అంతా technology అని మీరు భావిస్తున్నారుగానీ trick knowledge.** దీని వలననే మన జీవితమంతా పోతున్నది. అప్పటికప్పుడు ఆనందము నందించే రీతిగా మనము భావిస్తున్నామే గాని దీని ద్వారా ఎంతో ప్రమాదములు సంభవిస్తున్నాయి. మన పూర్వీకులు ఏ విధంగా బ్రతికారు? మన పూర్వీకులు ఏ విధమైన శాంతి సంతోషములు అనుభవించారు? ఆనాడు వారు అశాంతి అంటే ఏమిటో ఎరుగరు. భయమంటే ఏమిటో తెలియదు. కారణము ఏమిటి? సత్యధర్మములను ఆశ్రయిస్తూ వచ్చారు. ఈ రెండింటిని మనము ఆశ్రయించినప్పుడు భయమనేది మనలో ప్రవేశించుటకు వీలు లేదు. ఈనాడు ఎంత మేధావి అయినా ఎంత తెలివితేటలు కలవాడైనా, ఎంత విద్యావంతుడైనా క్షణక్షణమునకు భయము భయము. **ఈ సైన్సు విజ్ఞానము చాలా పెరిగిపోయింది. సైన్సు పెరిగి ఎంతపైకి పోయిందో sense అంత క్రిందికి దిగజారిపోయింది. సైన్సు పెరిగింది మీరు చూస్తున్నారు గాని Sense ఎంత low class కి దిగిపోయిందో మీరు** సమస్యలను కూడ తీర్చి, ఒకనిర్ణయానికి వస్తుంది. కనుక **దీనికి విజ్ఞానము అనేది సరియైన పేరుకాదు. విజ్ఞానము లౌకిక భౌతిక జగత్తునకు సంబంధించినది బుద్ధి అంత స్సంబంధమైన సూక్ష్మస్వరూపమైన తత్వానికి సంబంధించినది** కనుక ఈ బుద్ధియొక్క తత్వాన్ని చక్కగా గుర్తించుటకు ప్రయత్నించటము అత్యవసరము.

(బృ.త్ర.పు.94)

ఆధ్యాత్మికానికి, విజ్ఞానానికి వ్యత్యాసమును చెప్పాలంటే ఒకే పదము **spirit of love = spirituality ఇదే ఆధ్యాత్మికము . split of love= science ఇదే విజ్ఞానము.** ఉన్నది. చిన్న పదమేకాని ఎంత వ్యత్యాసమో చూడండి విజ్ఞానము భోగ భాగ్యములను అనుకూలసదుపాయము లను అందిస్తున్నది. కాని మానవునికి కావలసినది అంతర్స్సంబంధమైన ఆనందము కోరేది ఆనందము, ప్రయత్నించేది ఆనందము నిమిత్తము. కాని ఆనందము వస్త్వాదులందున్నదా? విషయములందున్నదా? ఆనందమునిచ్చే వస్తువులే అశాశ్వత మయినప్పుడు నీ నిత్యానందమునకెట్లు లభ్యమవుతుంది? ఇచ్చే పదార్థములు అశాశ్వతమే, అనుభవించేదేహములు అశాశ్వతమే, నివసించే దేశము అశాశ్వతమే. మనము శాశ్వతమైన ఆనందాన్ని అనుభవించాలను కుంటే మానసిక తత్వాన్ని సరియైన స్థితిలో ఉంచుకోవాలి. ఈనాటివైజ్ఞానిక పరిజ్ఞానముతో భౌతిక అభివృద్ధి రాజకీయ పరిణామము ఆర్థిక పరిణామము, వైజ్ఞానిక పరిణామము, లౌకికి పరిణామము అన్ని అభివృద్ధిగాంచినాయి. **కాని మానసిక పరిణామము మాత్రము కలుగలేదు. ఈ మానసిక పరిణామము తరువాత ఆధ్యాత్మిక పరిణామము కూడా అవసరము.**

(బృ.త్ర.పు.97)

(చూ॥ అజ్ఞానము, ఆత్మవిశ్వాసము, ఆధ్యాత్మికము, పరిజ్ఞానము, పరిశీలన విక్షేపము, విద్య)

విటమిన్ - జి

యోచన చేయటం లేదు. ఈ సైన్సుకు ఆధ్యాత్మికమునకు ఉన్న వ్యత్యాసము మీరు గుర్తించాలి. **ఆధ్యాత్మికము full circle ఎక్కడ బయలుదేరిందో తిరిగి అక్కడకే పోయి నిల్చిపోతుంది. అది పూర్ణముగా ఉంటుంది. half ని తుడిచివేసినప్పుడు semi circle అవుతుంది. ఈ semi circle 'C' ఆకారములో ఉంటుంది. ఈ semi circle 'C'ను సైన్సు అన్నారు.** ఒక దగ్గర బయలు దేరి మరొక దగ్గర నిల్చిపోతున్నది. తిరిగి చేరటం లేదు. మధ్యలో అగాధమైన అశాంతి యిమిడి ఉంటున్నది. ఈ అశాంతికి మూలకారణము యీ సైన్సే. సైన్సు అంటే అనేక మంది పొగడుతూ కొనియాడుతుంటారు. దేనికైనా పరిమిత ముంటున్నది. సైన్సు పెరగటం మంచిదే. ప్రజలకు అనుకూలపరిచే విద్యా విధానము పెట్టటం మంచిదే. ఈ టెక్నాలజీ అంటే చాలా అవసరమే. కాని మితిమీరి పోతున్నది. ఈ సైన్సు వల్ల ఏమి ఏర్పడిపోయింది? **ఆటంబాంబులు, హైడ్రోజను బాంబులు స్టార్‌వార్సు యిలాంటివన్నీ అభివృద్ధి గావిస్తున్నారు ఇవంతా చంపటానికి చేసే ప్రయత్నములే.** భయమును అభివృద్ధి పరచే ప్రయత్నములే. కీడు కీటకమైనా చేస్తుంది. చంపటానికి యింత పెద్ద ప్రయత్నములు చేయవలెనా! **ఇన్ని కోట్లు ఖర్చు పెట్టవలెనా! దీనికి ఖర్చు పెట్టే ధనము ప్రజలకు ఖర్చు చేస్తే ఎంత బాగుంటుంది! ఆ కంట్రీవారు చేశారని యింకో దేశము వారు యింకో బాంబు చేసేది.** ఈ విధముగా సర్వము బాంబులతో నిల్చిపోతే ప్రపంచమే భస్మమై పోతుంది.

(శ్రీ.స.పు.40/41)

విటమిన్ - జి

జీవితంలో సుఖం కలిగితే పొంగిపోతారు. దుఃఖం కలిగలితే కుంగిపోతారు. అలా కాకుండా అన్నిటినీ సమదృష్టితో చూడటమే నిస్సంగత్వం. దాని వల్ల శాంతి చేకూరుతుంది. ఆరోగ్యం కూడా బాగుంటుంది.

ఆకాశంలో పక్షులూ, విమానాలు, మేఘాలూ తిరుగుతుంటాయి. అయినా వాటిసంచారం వల్ల ఆకాశానికి ఏమి కాదు. **మన మనస్సును కూడా ఆకాశంలా దేనికీ చలించకుండా సమదృష్టితో మెలగేటట్లు చేయాలి.** శరీరాని కన్నా మనసుకు పోషణ అవసరం. లేకుంటే సుస్తీ చేస్తుంది. డాక్టర్లు విటమిన్ల లోపం వల్ల జబ్బు లొస్తాయంటారు. **నేను 'విటమిన్' జి (జి అంటే God) లోపం అంటాను.** నేను సూచించే చికిత్స నామ జపం దేవుని పేరు తలుచుకోండి. 1 ఆయన ప్రశస్తిని మననం చేయండి! ఆయన కరుణను కొని యాడండి!

ఇదే విటమిన్ జి! అదే ఔషధం!

ఒక పద్ధతి ప్రకారం నడుచుకోవటం మంచి అలవాట్లు - ఇవిచికిత్సలో మూడింట రెండువంతులు. మిగతా మూడోవంతు మెడిసిన్.

(శ్రీ.సా.గీ.పు.112)

విత్తాపహారి

(చూ॥ చిత్తాపహారి)

విదేశాలు

(చూ॥ త్రికరణశుద్ధి)

విద్య

మన చేతికి ఏమిటి అందము? పెద్ద పెద్ద కంకణాలు వేసుకోవడం కాదు. **"హస్తస్య భూషణం దానం", దానంచేయడమే చేతికి అందము. "సత్యం కంఠస్య భూషణం", సత్యమే కంఠమునకు భూషణం "శ్రోత్రస్య భూషణం శాస్త్రం",** దైవమును గురించి వినడమే చెవులకు అందము. ఇలాంటి భూషణములను వదలిపెట్టి పిచ్చిపిచ్చి భూషణములకై ప్రాకులాడట మెందుకు? మీ పంచేంద్రియాలను పరమాత్మునికై వినియోగించాలి. జీవితము నిచ్చినది దేనికోసం? లౌకికమైన సుఖములను

అనుభవించుటకు కాదు. అందుకోసమనే త్యాగరాజు కూడా, **"నిధి చాల సుఖమా, ఈశ్వర సన్నిధి చాల సుఖమా, నిజముగ తెలుపుము మనసా!" అన్నాడు.** లౌకికమైన సుఖాలన్నీ కదలిపోయే మేఘములవలె వస్తాయి, పోతాయి. కానీ, దైవప్రేమ మాత్రం వస్తుంది. పెరుగుతుంది. దైవప్రేమను మీరెంత అభివృద్ధి పరచుకుంటారో ఆనందం అంత అభివృద్ధి అవుతుంది. ఈ ప్రేమ ఎంత తగ్గిపోతుందో ఆనందం కూడా అంత తగ్గిపోతుంది. మీరు అమితమైన ఆనందాన్ని పొందాలని ఆశిస్తే దైవాన్ని అమితంగా ప్రేమించాలి. అందరినీ ప్రేమించాలి. అయితే, ఆత్మభావంతో ప్రేమించాలి. దేహభావంతో కాదు.

దేహము పాంచభౌతికము, దేహము కూలక తప్ప దెప్పుడున్
దేహి నిరామయుండు, గణుతింపగ దేహికి చావు పుట్టుకల్
మోహ నిబంధ బంధనల ముద్రలు లేవు, నిజంబు జూడ నా
దేహియె దేవదేవుడు, మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ

కనుక, దేహిని మీరు ప్రేమించాలి. ఈ పాంచ భౌతికమైన దేహమును అందించినది దేనికోసమని? దేహియైన భగవంతునియొక్క రహస్యమును గుర్తించే నిమిత్తమే. భగవంతునియొక్క రహస్యాన్ని గుర్తించ లేకపోతే, స్వస్వరూపాన్ని సందర్శించలేకపోతే ఇంక ఈ జీవితం ఎందుకోసం?

నిద్దుర నుండి లేచి మరి నిద్దుర పోయెడు దాక పొట్టకై
హద్దును పద్దు లేక **వ్యయమందగ జేయుచు జీవితంబు నీ**
విద్దెల ధారవోసి అరవింద దళాక్షుని విస్మరించి ఏ
పెద్ద సుఖంబు నొందితివొ ప్రీతిగ యోచన జేయు మానవా!
పుస్తకముల్ పఠించితి, పూర్తిగ జూచితి సర్వ శాస్త్రముల్
నిస్తులమైన విద్యలు నేర్చితినంచును గర్వమేల నీ
హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితొ కొల్వలేని యీ
ప్రస్తుత విద్యలన్నియును ధాత్రి నిరర్థకంబు కాదె మానవా!

ఈ లౌకిక విద్యలన్నీ అంత్యంలో మీకు సహాయపడవు. అందువల్లనే శంకరులవారు చెప్పారు.

భజ గోవిందం భజ గోవిందం
గోవిందం భజ మూఢమతే
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి డుకృఞ్ కరణే

విద్య విజ్ఞానంకోసం, కృషి కూటికోసం. విద్య కూటి కోసం కాదు. మీరు నేర్చుకున్న విద్యను సమాజానికి ఉపకరించే రీతిగా వినియోగించాలి. సమాజ సేవయే సర్వేశ్వర సేవ. కనుక, మీ సమస్త శక్తులనూ సమాజానికి అర్పితం గావించాలి. అంతేగాని, ఏదో ఒక పెద్ద పట్టము కట్టుకుని పరదేశానికి ప్రయాణమై పోవడం గొప్పతనం కాదు. ఎంత మంది పోలేదు! ఎంతమంది సంపాదించలేదు! కానీ, కట్టకడపటికి ఏమైనా వెంట తీసుకు పోయారా? పోయే సమయంలో ఇంత మట్టైనా తీసుకు పోవడానికి వీలుకాదు. లేకపోతే భారతదేశంలో మట్టికి కూడా రేషన్ వచ్చేది! అయితే, లౌకికమైన విద్యలను నేర్వవలసిందే. దానికోసమే మేము విద్యాసంస్థలను ప్రారంభించాము. కానీ, మీరు నేర్చిన విద్యను సమాజంలో సద్వినియోగ పర్చుకోవాలి. **విద్యా గర్వంచేత భగవంతుని సన్నిధికి దూరం కాకూడదు. భగవంతునికి సన్నిహితం చేసేదే విద్య. "సా విద్యా యా విముక్తయే" ముక్తి కోసమే విద్య నేర్వాలి. అదియే జీవిత గమ్యము.** అదియే నిర్వాణము అట్టి నిర్వాణ సంబంధమైన విద్యను ఈనాడు మీరు నిర్మూలం గావించుకొంటున్నారు.

(స.సా.అ.99పు.269/270)

"విద్య నేడింతయు విశాలత్వమొంది విస్తృతి పొందుచున్నది
కాని దానికి మూలకందమగు ఆత్మోన్నతిని విస్మరించుచున్నది
మానవులకెల్లెడల జీవనము భారమగుచున్నది
కారణము విద్యార్థి, తళుకుల మెరిసే డంబ దర్పాలకు
వశుడగుచున్నాడు"

(శ్రీ.వా.జూ.97 పు.72)

"నేటి విద్య తెలివి తేటలనె పెంచు
కొంచమైన గుణము పెంచబోదు
కోటివిద్యలుండి గుణము లేకున్నచో
అట్టి విద్య కన్న మట్టి మిన్న."

(శ్రీ.జూ. పు.103)

విద్య

బాధలలో, కష్టాలలో ఉన్నవారిని చూసినప్పుడు మీ మనస్సు కరిగి వారికి సహాయం చేయాలని, వారి దుఃఖమును నివారణ గావించాలని మీకు బుద్ధి పుట్టాలి. అట్టి దయతో నిండిన హృదయం మీయందుండాలి. అప్పుడే మీరు నిజమైన మానవులనిపించుకుంటారు. **మానవుణ్ణి దయామయునిగా మార్చునదే నిజమైన విద్య. కాని,** ఆధునిక విద్య మానవుణ్ణి శిలాహృదయునిగా మార్చివేస్తున్నది. ఒకానొక సమయంలో గాంధీ చాల విచారంగా ఉండటం చూసి ఒక బ్రిటిష్ వ్యక్తి కారణ మడిగాడు. **గాంధీ "The hard heartedness of the educated makes me feel sad." (విద్యావంతుల కఠినత్వమే నన్ను విచారానికి గురి చేస్తున్నది) అన్నాడు.** ఈనాటి విద్యార్థి హృదయం చదివేకొలది కఠినంగా మారిపోతున్నది. ఇలాంటిది సరియైన విద్యయే కాదు. విద్య హృదయాన్ని కరిగించాలి, ప్రేమను పెంచాలి, **దివ్యత్వాన్ని పోషించాలి.** డిగ్రీలను పుచ్చుకోవటం కాదు ముఖ్యం. "చదివి వ్రాయనేర్చినవారంతా విద్యావంతులేనా? కాలేజీ డిగ్రీలు పొంద విద్యావంతులగునా? సుజ్ఞానము, సుకృతము లేని విద్యలు సద్విద్యలగునా? బ్రతుకుటకే విద్యయన్న బ్రతుక లేవె పశు పక్షులు!" మీరు విద్య కేవలం జీవనోపాధికని భావిస్తున్నారు. ఇది చాల పొరపాటు. **Education is for life, not for a living (విద్య జీవిత పరమావధికేగాని, జీవనోపాధికి కాదు)**

(స.సా.జూ.2000పు.171)

జాతి భేదము లేక జనులకాశ్రయమిచ్చి
సర్వసమత్వంబు చాటు తరులు -
తనువుపై మనకింత తమకంబు వలదంచు
చలి ఎండల వానల సైచు గిరులు
రేపుమాపటికంచు వాపోవ వలదంచు
విహగముల్ సంతృప్తి **విద్య గరపు** -
జగతి నిత్యముకాదు సంసారమది భ్రాంతి
అనుచు బోధించు ఆకసంబు
ప్రాణముల్ వీడి చనునాడు మృగములైన
నేను నాదని అనవు రవంతయైన
ప్రకృతి బోధించు సత్యమీమర్మమెల్ల
తెలియజేయు నదె **విద్య తెలిసికొనుడు.**

(యు.సా.పు.95/96)

ఆదిలేనిది అనాది, అదే అన్నిటికీ ఆది; దానికి ఆదికాగలిగి నది మరొకటి లేదు. కాబట్టి దానికి అంతముకూడాలేదు. పెరిగినంత వరకూ పెరిగి వికసించినంతవరకూ వికసించి, పరిపూర్ణమైన తన ప్రభావముతో ప్రపంచానికి కూడా సంపూర్ణతను అందించే ఈ పరమ తత్వాన్నే "విద్య" అందురు.

ఎందరో మహానుభావులు, విశ్వసౌందర్యములోని పరమ రహస్యాలను హృదయాకాశములో అవగాహన చేసుకొని, లోక కల్యాణార్థమై తమ అనుభూతిని వాగ్విభూతిగా లోకానికి చాటింపజేసినది విద్య. వేదములో ప్రధానమైనది నాదము. ఈ నాదము విని ఆనందించవలసినదే కానీ దానిని విమర్శించవలసినది కాదు. అందువలననే దానికి **శ్రుతి అనే పేరువచ్చినది. శ్రవణ మాత్రము చేత లోపలి ఆత్మానుభూతిని బయటికి ఆవిర్భవించి ఆపార రమణీయంగా ఆనందాన్ని అందించేది విద్య.**

(వి.వా.పు.1)

ఆధ్యాత్మిక గుణమును, స్వభావమును లేక పరమాత్మ యొక్క తత్వమును నిర్ణయించునది **విద్యాతత్వము. నీతి సూత్రాలశాస్త్రము: ఇది ప్రత్యక్ష ప్రమాణముగల విద్య, మతము యొక్క సమ్మతమే విద్యాతత్వము, జనప్రియముగా జేసి ఆ ప్రకారముగా జీవించుటే తత్వము. దీనినే ఫిలాసఫీ అన్నాము, ఫిలాసఫీ అంటే జ్ఞానముపై వలపు అని, జ్ఞానము మితిలేని విలువ గల నిధి. జ్ఞానముపై ప్రేమకలిగి జ్ఞానసంపాదనకై కష్టపడి పాటుపడుటే విద్య.**

(వి.వా.పు.20)

విద్యానామ నరస్యరూప మధికం ప్రచ్ఛన్న గుప్తం ధనం
విద్యాభోగకరీ యశశ్శుభకరీ విద్యాగురూనాం గురుః
విద్యా బన్ధుజనో విదేశగమనే విద్యాపరాలోచనం
విద్యా రాజ్యసుపూజ్యతే నహిధనం విద్యావిహీనః పశుః

ఈ ప్రాకృత ప్రపంచములో ప్రతి మానవునకు విద్యయే అలంకారము. ఈ విద్యయే యోగ్యమైన ధనము. ఈ విద్యయే కీర్తి, సుఖము; భోగమునకు ఆధారము. విద్యయే గురువులకు గురువు. విదేశములకు వెళ్లినప్పుడు విద్య బంధువుగా తోడ్పడుతుంది. విద్య మూడవ నేత్రము వంటిది. ఇట్టి పవిత్రమైన విద్య రాజాస్థానమునందు గౌరవము నందుకునేందుకు మహాపాత్ర ధరించినది. విద్యకు యిచ్చిన ఘనత ధనమునకు లేదు. ఇట్టి పవిత్రమైన విద్యలేని మానవుడు కేవలము పశు సమానుడు.

(భ.మ.పు.1)

సుఖార్థీ త్యజతే విద్యా విదార్థీ త్యజతే సుఖం
సుఖార్థినః కుతో విద్యా కుతో విద్యార్థినః సుఖం.
సుఖము కోరువాడు విద్యను పొందలేడు. నిజముగా విద్యార్థి సుఖమును ఆశించడు. విద్యను పొందినవానికి సుఖము అక్కరలేదు. సుఖము నాశించువారు విద్యను పొందలేరు.

(భ.మ.పు.89)

సద్గుణంబులు సద్బుద్ధి సత్యనిరతి
భక్తి క్రమశిక్షణ కర్తవ్య పాలనములు
నేర్పునదే విద్య విద్యార్థి నేర్వవలయు.

(బృ. త్ర. పు.179)

శిక్ష అనగా విద్య. విద్య కేవలం పుస్తకాలు చదవటం కాదు. విద్య గురువు ఆజ్ఞను శిరసావహించి, గురువు ఆజ్ఞాపించిన శిక్షలన్నిటిని మనసారా స్వీకరించటమే నిజమైన విద్య.

(బృ.త్ర.పు.174)

ఎన్ని విద్యలైన ఏ పార చదివినా పొట్టకూటికేగాని, గిట్టబోవు, మట్టి బొమ్మలోని మర్మంబు నెరుగని చదువెలెల్ల పరము చేర్చగలవా?

(సా. పు.47)

ఆధునిక విద్య పెరిగెను అంతులేక
ఆత్మవిద్య క్షీణించె అంతులేక
సత్య ధర్మములన్నియు సమసిపోయె
ప్రేమ శాంతి అహింసలు పేద పడియె

ఆధునిక విద్య (Materialism) అణువు (Atom) తో ఆగిపోయింది. అంతులేకుండా పెరిగింది. దానితోబాటు కోరికలు పెరిగిపోయినాయి. Where materialism ends, Spritualism begins. దృశ్య ప్రపంచము అంతంనుంచే ఆధ్యాత్మికతత్వం మొదలుపెట్టును. **ఆత్మ విద్య అనగా బ్రహ్మవిద్య. ఇది సత్యము, ధర్మము, ప్రేమ, శాంతి అహింసలు మీద ఆధారపడి యుంటుందవి.** ఇవి కంటికి అగపడేవికావు. ఆచరణకే అందుతాయి. (1) బ్రాహ్మణః పరమాత్మనః విద్యా బ్రహ్మవిద్యా = బ్రహ్మము అనగా పరమాత్మ యొక్క సంబంధమైన విద్య బ్రహ్మవిద్య. (2) "ఏకాక్షరం పురుషం వేదసత్యం" ఇది శ్రుతేః పరమాత్మను బోధించుటయే విషయముగా గల విద్య. 3. బ్రహ్మణానా అగ్రజేన ఉక్తా (విద్యా) ఇది బ్రహ్మవిద్యా = అది యందు స్వయంభువగు బ్రహ్మచేత చెప్పబడిన విద్య కనుక బ్రహ్మవిద్య.

(సా.పు.66)

మానవుడు సృష్టికి బంధితుగాక, సృష్టికి అధికారి అయిన ఈశ్వరత్వాన్ని తనలో ఆవిర్భవింపచేసేది విద్య. **నైతిక పరివర్తన కంటే ఆధ్యాత్మిక పరివర్తనమే అత్యంత ఉత్తమమైనదన్న సూత్రాన్ని నిరూపించేది విద్య.** యావత్తు సృష్టిలో మానవులను కట్టి వుంచే సమత్వమే విద్య లక్ష్యం. **సామాజిక తత్వంలో ఈశ్వరతత్వాన్ని ఆవిర్భవింపచేసే సమత్వాన్ని గుర్తింప చేసేది విద్య. ఇట్టి పవిత్ర విద్యలను గరపి విద్యార్థులను గృహస్థ ఆశ్రమమునకు, పంపించే ముందు మున్ముందు నడుచుకోవలసిన పవిత్ర మార్గములను సూచించేది స్నాతకోత్సవము. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ" దేశమంటే మానవులన్న సత్యాన్ని గుర్తించాలి.** మాతృభూమి దుఃఖాన్ని నివారింపచేసేవారెవరు? విద్యార్థులేకదా! **క్రమశిక్షణ లేకపోతే, మానవుడు పశువుగా మారిపోతాడు. పశుపతిగా వుండాలికాని పశువుగా వుండకూడదు. విద్యతో వినయ విధేయతలు, మానవత్వము. వివేక విచక్షణలు వుండాలి.** అటువంటి విద్యార్థులు కావాలని మావుద్దేశము. **అర్థం**

చేసుకున్న దానిని ఆచరణలో పెట్టాలి. ఆచరణలో పెట్టిన దానిని హృదయానికి హత్తుకునేటట్లు అనుభవించాలి, మితిమీరిన కోర్కెలు వుండకూడదు. తల్లితండ్రులకు దుఃఖం కలిగించరాదు. మీ తల్లితండ్రులకు మీరు ఎంత ఆనందము కలిగిస్తే మీ బిడ్డలు మీకు అంత ఆనందము అందిస్తారు. "మాతృదేవోభవ, పితృదేవోభవ,ఆచార్య దేవోభవ, అథితిదేవోభవ!" ఈ నాలుగింటిని మీరు శ్రద్ధగా ఆచరించి, దేశానికి ఆదర్శాన్ని అందించగలరని ఆశిస్తున్నాను.

(సా.పు.120)

దుర్బుద్ధులు తలనున్న
దూరులు విను చెవులున్న
పొంచి చూచు కనులున్న
వంచించె మనసున్న
ఈ వికృతులను చూడగానె
విద్య ఇక బ్రతుక దన్నా,

(స.సా.డి.96 పు.321)

విద్యార్థులారా! మీ విద్య పొట్టకూటికోసం నేర్చే విద్యకాదు. **జీవిత పరమావధి నిమిత్తము ఏర్పడినదే విద్య.** జీవనోపాధి నిమిత్తమై ఏర్పడినది కాదనే సత్యాన్ని మీరు గుర్తించాలి. జీవించటానికి మనిషిగా పుట్టనక్కరలేదు. పశుపక్షి మృగాదులు జీవిస్తునే వుంటూన్నాయి. జీవించటానికి ఉపయోగపడే విద్య లభ్యసించటంచేత మనము పశువుతో సమానమవుతాము. విద్యార్థులది ఆదర్శవంతమైన జీవితముగా రూపొందాలి....

మనము artificial విద్య అందుకుంటున్నాము. అది Heart వరకు పోవటం లేదు. Heart is inside, art is outside. బాహ్యదృష్టియందే జీవితమును ప్రసరింప చేస్తున్నాము. అంతర్దృష్టియందే జీవితమును ప్రసరింప చేస్తున్నాము. అంతర్దృష్టిని అభివృద్ధి పరుచుకోవటం లేదు.

(బృ.త్ర.పు.87)

నేటి విద్య తెలివి తేటలనే పెంచు
కొంచమైన గుణము పెంచబోదు
కోటి విద్యలుండి గుణము లేకున్నచో
ఫలమదేమి వాని విలువ దేమి?

(బృ.త్ర.పు.52)

విద్యయే మానవునకు సౌందర్యము. విద్యయే మానవునకు గుప్త ధనము. విద్యమానవునకు కీర్తి, సుఖభోగములను అందించునది. విద్య గురువునకు గురువు. విదేశములకు వెళ్ళినప్పుడు మానవునకు ఒక బంధువు వంటిది విద్య. విద్యమరోకనేత్రము. రాజులతో పూజింపబడునది విద్య - ధనము కాదు. **ఇట్టి పవిత్రమైన విద్యయే లేకుండిన మానవుడు 'ఏంత పశువ'నే చెప్పవచ్చును.** విద్య మానవునకు వినయమును మాత్రమే అందించునది కాదు. విద్యయొక్క లక్ష్యము భౌతిక జ్ఞానమును అందించుటయే. **భౌతిక జ్ఞానముతో బాటు వినయవిధేయతలను, శీలమును అందిస్తుంది.** ఇటువంటి పవిత్రమైన విద్యయొక్క తత్వాన్ని ప్రతివ్యక్తీ గుర్తించుకొనుట అత్యవసరము.

ఈనాటి విద్యార్థి కలిమిని, బలిమిని, చెలిమిని ఆశిస్తున్నాడే కాని ఏ మాత్రము గుణమునకు ప్రయత్నించుటలేదు. గుణార్జన నిమిత్తమేర్పడినది విద్యగాని, ధనార్జన నిమిత్త మేర్పడినది విద్యకాదు" ఈ సత్యాన్ని ప్రతివిద్యార్థి చక్కగా గుర్తించి వర్తించాలి. మెదడునకు విషయమును అందించుట మాత్రమే విద్య యొక్క లక్ష్యము కాదు. **హృదయాన్ని పవిత్రముగావిస్తుంది.**

(స.సా.డి.1990పు.316)

పవిత్రమైన శీల సంపద లేకుండిన, మానవత్వములోని విద్యలన్నియు నిరుపయోగములే, వ్యక్తిత్వాన్ని పోషించి దివ్యత్వాన్ని వికసింప జేసి, మానవత్వాన్ని రాణింపజేసేదే విద్య.

విద్యయందు రెండు ప్రధానమైన గుణములు కలవు. ఒకటి విషయాన్ని వివరించి చెప్పుతుంది. రెండవది జీవిత వ్యక్తిత్వాన్ని వికసింపజేస్తుంది. ఒకటి Matter రెండవది Energy. ఈ పదార్థశక్తుల సమ్మిళితమైన స్వరూపమే విద్య. ఆధ్యాత్మిక, భౌతిక సమ్మిళితమైన స్వరూపమే విద్య. కేవలము మెదడునకు మాత్రమే అందించునది విద్య కాదు.

విద్య అనగా ప్రకాశమే.

(స.సా.డి.1990 పు.317)

విశ్వశాంతిని చేకూర్చు విధమునేర్చి
సంకుచిత భావములం దెల్ల సమయ చేసి
ఐకమత్యము సహజీవనాదికములు।
సమత నేర్పుటయే కాదె సరస విద్య॥

విద్య డిగ్రీల కొరకుకాదు వెట్టివీడి
సేవాకా వృత్తికై మీరు చేరబోక।
స్వీయ దేశ సౌభాగ్య శ్రేయ మరసి
జగతి శ్రామిక విద్యలు చదువ వలయు॥

(సా॥ 551, 570)

ఈనాడు నైతిక, ధార్మిక ఆధ్యాత్మిక విద్యలు లోపించుట చేతనే ఈ ఆత్మవిద్యగాక లౌకిక విద్యగా రూపొందుతోంది. అని గవర్నరు గోవిందనారాయణ చెప్పేరు. **"సావిద్యయా విముక్తయే" అనగా బంధములను, బాధలను, అంధకారమును నిర్మూలింపచేసేదే విద్య.** అని అర్థము. **మానవత్వమనే దివ్యత్వముతో కూడిన పవిత్రత అనే సత్యమును గుర్తించుకోవటానికి "ఉత్తిష్టత, జాగ్రత ప్రాప్యవరాన్ నిభోధత" అని ఉపనిషత్తులు మేలు కొలుపుతూ వచ్చాయి.**

(సా॥పు.571)

నీతిలేని జీవితం చెల్లని కాసువంటిది. బిక్షగాడు కూడాదానిని అంగీకరించడు. సచ్ఛీలనము, లేని బ్రతకు చీకటి కొంప వంటిది. ఎన్ని చదువులు చదివినా, సచ్ఛీలనమే భూషణం, సత్యనిరతి, క్షమశిక్షణ. కర్తవ్యపాలన నేర్పేదే నిజమైన విద్య.

(సా. పు. 227)

(చూ॥ అకారపంచకము, ఆదర్శము, త్యాగము, దమము, నరుడు, నిశ్చలసమాన చిత్తుడు, పాశ్చాత్యవిద్యలు, ప్రధానకర్తవ్యం, బుద్ధి, బ్రహ్మవిద్య, మంచిచెడ్డలు, మనస్సు, మార్గదర్శకులు, మెస్సంజర్స్ ఆఫ్ సత్యసాయి, రాజబాట, లక్ష్యము, విక్షేపము, వివేకానందుడు, వెదుకుచున్నాను, శుభ్రత, శృంగారము, సంస్కృతి, సమాజము, హితభాష)

విద్యా చతుష్టయములు

అన్వీక్షకి త్రయీ, వార్తా దండనీతి
అన్వీక్షని అనగా ఆత్మ అనాత్మలవలన మోక్ష సాధనమగు విద్య.
త్రయీ అనగా కర్మద్వారమున స్వర్గ సాధనమగు విద్య.
వార్తాఅనగా కృష్యాది ఫలరూపమైన విద్య.
దండనీతి అనగా పాలకులచే (ప్రభుత్వముచే)ధన ధాన్యసంపాదన సాధనమగు విద్య
ఈ నాలుగింటిలో మొదటిదైన అన్వీక్షకి తప్ప మిగిలిన మూడునూ జన్మప్రదములు.

(ప్ర.శో.వా.పు.19/20)

విద్యాభ్యాసము

భారతీయ సంస్కృతి చాల విశాలమైనది, పవిత్ర మైనది. పూర్వం 5 సంవత్సరముల పిల్లలచేత విద్యాభ్యాసం చేయించేటప్పుడు మొట్టమొదట "ఓం నమశ్శివాయ, ఓం నమో నారాయణాయ" అనే పవిత్రమైన మంత్రములను నేర్పించేవారు. కానీ, ఈ ఆధునిక యుగంలో చిన్న పిల్లలకు "బా..బా..బ్లాక్ షీప్.." అని అర్థరహితమైన విషయాలను నేర్పిస్తున్నారు. ఐతే, ఈ ప్రాకృతమైన విద్యను కూడా బోధించవచ్చును. కానీ, దీనితోపాటు పవిత్రమైన భారతీయ సంస్కృతిని కూడా గుర్తింప జేయాలి. ఈనాడు కేవలం ప్రాకృతమైన విద్యకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడంచేత మానవునిలో దైవంపట్ల సందేహాలు మితిమీరిపోతున్నాయి. జీసస్ కాలంలో **'డౌటింగ్ థామస్'** ఒక్కడు మాత్రమే ఉండేవాడు. కానీ, ఈ కలియుగంలో అందరూ 'డౌటింగ్ థామస్'లే!

(స.సా.జూ.99పు.156)

విద్యార్థి/విద్యార్థులు

ఈనాడు Education అంటూ Agitation ను ప్రేరేపిస్తున్నారు కొందరు గురువులు. **Agitation కాదు. Elevation ను ప్రదర్శించాలి.** ఈనాడు కొన్ని

విద్యార్థి/విద్యార్థులు

విద్యాలయాలలో ఆశాంతి ప్రబలటానికి కారకులు కొందరు అధ్యాపకులే అవటం మిక్కిలి దురదృష్టకరం, కొన్ని కొన్ని సందర్భాలలో విద్యార్థులలో క్రమశిక్షణా రాహిత్యం పెచ్చు. పెరిగిపోవటానికి కారణభూతులవు తున్నారు కొందరు అధ్యాపకులు. ముఖ్యంగా అధ్యాపకులలో పరివర్తన రావాలి. **ఒక విద్యార్థి చెడిపోతే పెద్ద ప్రమాదం లేదు గాని, ఒక ఉపాధ్యాయుడు కనుక తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించకపోతే వేలాది మంది విద్యార్థులు చెడిపోయే ప్రమాదం ఉన్నది. కనుక విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలి అధ్యాపకులు.**

(శ్రీ.జూ.97 పు.14)

పుట్టిన తక్షణమే ఏ వ్యక్తి 'విద్యార్థి' కాడు. పుట్టిన తక్షణమే ఏ వ్యక్తీ పండితుడు కాడు. క్రమక్రమేణా సాధనలు సలిపి, ఆ సాధనల ద్వారా ఆవిర్భవింప జేసుకున్నవే ఆ విద్యలు. ఇట్టి ఆవిర్భవింపజేసుకున్న వాటినే Educare అన్నారు. ఈనాడు మనం చదువుకుంటున్న చదువులు అన్నీ Education మాత్రమే. ఇవన్నీ Artificial. Art బయట ఉన్నది Heart లోపల ఉన్నది. Art is outside, Heart is inside. కనుక,'Art' అంతాEducation. Heart మాత్రం Educare దానినే మనం ఆవిర్భవింప జేసుకొని, తిరిగి బయటకు తెప్పించుకోవాలి. అసలు చదువు చదివినటువంటివాడు ఈ జగత్తులో కానరాడు. కనుక దీనికి ఒక ప్రమాణం కూడా ఏర్పర్చారు.

(శ్రీ.ఆ. 2000 పు.9)

నిజమైన విద్యార్థి తనకు ఉపకారము చేసిన వానికే కాక తనకు అపకారము చేసిన వానికే అధిక ఉపకారము చేయవలెను. **ఇది మరింత పవిత్రము.** ఉపకారము చేసినవానికి ఉపకారము చేయుట సామాన్యము. అపకారము చేసినవానికి ఉపకారము చేయుటే గొప్పగుణము. **ఈ విషయమున కొంత ఇంగిత జ్ఞానము, విచక్షణా బుద్ధి అత్యవసరము. అట్టి ఇంగితజ్ఞానమును, విచక్షణా తత్వమును ఉపదేశించునదే విద్య,** కొన్ని సమయములందు మూర్ఖుల విషయములో తప్పని సరిగా విచక్షణ చూపించాలి. చేసిన మేలు మరచిన కృతఘ్నుల విషయములో విజ్ఞతను ప్రదర్శించాలి. అపకారము చేసిన వారిని దండించడం ప్రభుత్వము యొక్క ధర్మము. అయితే విద్యార్థి ఆ స్థాయిని అందుకొనరాదు. తన సహజత్యాగమును, స్వభావమునూ అయిన పరోపకార భావమునే అధికంగా అలవరచుకోవాలి.

(వి.వా.పు.69)

అధిక భాషణ శూరత్వ మధికమయ్యె,
కార్య శూరత్వ క్షీణమై కరిగి పోయె
బ్రతుకు లాడంబరములతో భారమాయె
నేటి విద్యార్థి బ్రతుకు ఈపాటిదాయె।

(సా.పు.59)

విద్యార్థులు విద్యకంటే గుణము అధికంగా పోషించుకోవాలి.

అధిక విద్యావంతుల ప్రయోజకులైరి
పూర్ణశుంఠలు మహా పూజ్యులైరి

ఈనాటి విద్యార్థులు గుణములు అమితముగా పోషించుకోవాలి. గుణవంతుల వల్లనే సమాజమునకు ఎంతో శ్రేయస్సు కలుగగలదు. కనుక ప్రతి విద్యార్థి సామాజిక దృష్టిని తన మనస్సు నందుంచుకొని సమాజసేవ, సమాజమును సంరక్షించడమే సరైన లక్ష్యమని భావించాలి.

(భ.స.మ.పు.2/3)

ఈనాడు విద్యార్థులు రక్షించవలసినది దేశముకాదు. సత్యధర్మములను మాత్రమే రక్షించాలి. సత్యధర్మములే దేశమును రక్షిస్తాయి. సత్యధర్మములు విస్మరించి దేవ రక్షణ దేశరక్షణ అని దేశమును భక్షిస్తున్నారు ఈనాటి విద్యావంతులు. విద్యలునేర్చినంత మాత్రమున వివేకులు కారు.

(బృ.త్ర.పు.2)

(చూ॥ మార్గదర్శకులు, మెస్సంజర్స్ ఆఫ్ సత్యసాయి, వివేకానందుడు, శుభ్రత, హితభాష)

విద్యాలయము

(చూ॥ ప్రకృతి, విశ్వము, శ్రీసత్యసాయి అంతర్జాతీయ కేంద్రము)

విద్యావంతుడు

విద్యావంతునికి ఉండవలసిన ప్రధానమైన **లక్షణములు మూడు. 1. "సర్వే లోక హితే రతః" (లోక శ్రేయస్సును ఆశించాలి) 2. "సర్వే జ్ఞానోప సంపన్నః" (సమస్త జ్ఞానసంపన్నుడై యుండాలి) 3. "సర్వే సముదితా గుణైః" (సమస్త సద్గుణములను కల్గియుండాలి).** కనుక, విద్యావంతులు మొట్టమొదట సమాజాభివృద్ధి కోసం పాటుపడాలి. విద్యార్థులారా! మీరు సమాజంలో సభ్యులు. మీ క్షేమము సమాజ క్షేమమునందు ఇమిడియున్నది. కనుక, మీరు నేర్చిన విద్యలను సమాజాభివృద్ధి కోసం వినియోగించాలే గాని, డబ్బుకోసం అమ్ముకో కూడదు. సమాజము నుండి మీరందుకున్న విద్యలను తిరిగి సమాజానికే అమ్ముకోవడం మానవత్వానికే విరుద్ధం. త్యాగమే ప్రధానమైన మానవతా గుణం. కనుక, త్యాగాన్ని పోషించుకోండి. కనుకనే, వేదము **"నకర్మణా నప్రజయాధనేన త్యాగేనైకే నమృతత్వ మానశుః",** అని తెలిపింది. విద్య ధనసంపాదన కోసమనే అపోహను విడనాడండి. ఏమిటి సంపాదన? 'బెగ్గర్లు' (భిక్షగాళ్ళు) కూడా సంపాదిస్తున్నారు. స్వార్థాన్ని త్యజించండి. ఐకమత్యాన్ని పోషించుకోండి. ప్రేమ తత్వంతో, త్యాగభావంతో జీవించండి. అప్పుడే మీకు అన్నివిధములైన అనుకూలములు చేకూరుతాయి.

(స.సా.జూ.2000పు.170/171)

"విద్యా వినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని శునచైవశ్వ పాకేచ పండితాః సమదర్శినః" అనగా విద్యా వినయములు కలిగిన విద్యావంతుడు గోవునందును, బ్రాహ్మణుల యందును, ఏనుగునందును, కుక్క యందును, నీచాతినీచ స్థితియందున్న వ్యక్తియందును సమదృష్టికలిగి యుండాలని పై శ్లోకమునకు అర్థముగా యెరిగి సమస్త ప్రాణికోటియందును దయా ప్రేమలు చూపవలెను. **సమదృష్టే శుభదృష్టి. అట్టి శుభదృష్టి కలవాడే నిజమైన విద్యావంతుడు. సమదృష్టి కలవాడు విద్యావంతుడు,** సంఘదృష్టిని దూరము చేయాలి. ఇటువంటి అత్యున్నత తత్వమునే భారతీయ సంస్కృతి ప్రబోధించినది. ఇంతటి వున్నత బోధ మరేవిద్య యందునూ యేదేశమునందునూ కనుపించదు. భారతీయవిద్య విశాలమైన, ఉత్కృష్టమైన ఆదర్శమును ప్రబోధించుచున్నది.

(వి.వా.పు.72/73)

విద్యావిధానము

"ఈనాటి విద్యావిధానము కృత్రిమంగా రూపొందుతూ వస్తున్నది. ధనార్జనకని ప్రాకులాడుతున్నారు. ధన సంపాదన నిమిత్తమై ఏర్పడినది కాదు విద్య. గుణ సంపాదన, క్రియాశీలత కొరకు యేర్పడినదే. నదులకు పెద్ద పెద్ద అనకట్టలు కట్టి నీటినంతా నిలువచేస్తున్నది ప్రభుత్వం. ఆనకట్ట కట్టడములో నున్న ఆశయమేమిటి? నిలువ చేసినట్టి నీరును కాలువల ద్వారా ప్రవహింపజేసి, పంటలకు నీరు పెట్టి తద్వారా అధికోత్పత్తిని కలిగించి దేశ సంక్షేమాన్ని అందిస్తున్నది. అదేవిధంగా లైబ్రరీలో కూర్చుండి బీరువాలోని పుస్తకాలను తీసి, వాటిలోని విషయమంతా మస్తకములో చేర్చుకుంటున్నాం. **ఇక్కడ కేవలం ఆనకట్ట కట్టి నీరు నిలువచేసినంత మాత్రాన ఫలప్రదం కాదు. దానిని క్రియారూపంలో సమాజంలో ప్రవహింపజేసి తద్వారా అధికోత్పత్తిని కలిగింపజేసి దేశానికి కళ్యాణాన్ని చేకూర్చాలి."**

(శ్రీ.జూ.97 పు.83)

విద్యావైద్యకేంద్రములు

"ఈనాడు విద్యా, వైద్య కేంద్రాలన్నీ వ్యాపార సంస్థలైనాయి. వాటిలో బీదలకు సేవ చేసే వాటిని వ్రేళ్ళపై లెక్క పెట్టవచ్చు. అందు కొరకు **పంద కోట్లు రూపాయలు**

విద్యుల్లేఖేవ భాస్వరా

వెచ్చించి ఈ వైద్యాలయాన్ని నిర్మిస్తున్నాము. ఇక్కడ ఉన్నత విద్యే కాదు, ఉన్నత వైద్యం కూడా ఉచితమే. ఉన్నవాళ్ళు లక్షలు ఖర్చు చేసి అమెరికాలాంటి దేశాల్లో చికిత్స చేసికొంటే **పేదవాళ్ల** గతేమిటి? **వాళ్ళకు ఎవరు మందులిస్తారు?** దీనిని దృష్టిలో పెట్టుకునే ఈ బృహత్పథకాన్ని చేపట్టినాము. **గుండె ఆపరేషన్‌గాని, మూత్ర పిండముల మార్పిడి గాని, ఏదైనా అంతా ఉచితంగానే చేయబడవలెనని నిర్ణయించాము.** తదనుగుణంగా 1991 నవంబరు 22వ తేదీన ఈ వైద్యాలయం ప్రారంభింపబడుతుంది.

(స.సా.న.99 పు.340)

విద్యుల్లేఖేవ భాస్వరా

ప్రాణరక్షణ నిమిత్తమై దైవాన్ని ప్రార్థించమని మహర్షులు ప్రబోధిస్తూ వచ్చారు. ఈ ప్రాణము "నీలతోయద మధ్యస్థాత్ విద్యుల్లేఖేవ భాస్వరా" వెనుక వైపునకు 33 రింగులతో కూడిన Spinal Chord ఉంటుంది. దానియందు 9 మరియు 12వ రింగుల మధ్య సుషుమ్న నాడి కలదు. అదే విద్యుల్లేఖ వలె కదలుతుంది. ఆ Lightning వలననే దేహమంతా పనిచేస్తుంది. కొంతమంది మన ప్రాణము Heart లో ఉందంటారు, Heart అనేది కేవలము Main Switch వంటిది. కాని ప్రాణము అక్కడ లేదు. డాక్టర్లు Heart ని తీసి వేరొక Heart మారుస్తున్నారే! ఆ సమయమున ఈ ప్రాణము ఏమైపోతుంది? ఇది కేవలం Main Switch ని మార్పిడి చేయడం మాత్రమే జరుగుతోంది. కాని అక్కడ Spinal Columnలో దాని ప్రభావము చేతనే Heartపనిచేస్తుంది. కనుకనే ఆనాటి వేదపురుషులంతా ఏమీ తెలియని మూర్ఖులని, ఏ మాత్రము జ్ఞానము లేని, సైన్సు తెలియని అమాయకులుగా భావించరాదు. ఈనాటి సైంటిస్ట్‌లకు తెలిసిన దానికంటే వారికి మరింత అధికముగానే తెలిసియుండినది. దీనికంతటికి వారి తపశ్శక్తియే కారణము. ఎన్ని వేలమైళ్ళ దూరములో ఉండి తపస్సు చేస్తున్నప్పటికిని, దూరదర్శనము వారికి ప్రాప్తించినది. ప్రకృతితో ముఖాముఖిగా సంభాషణలు సల్పేవారు. ఈనాడు దూరదర్శనమని, దూరశ్రవణమని కోట్ల కొలది ఖర్చుపెట్టి అనుభవిస్తున్నాము. ఒక్క నయాపైసా ఖర్చులేదు ఆనాడు. **మనస్సు పవిత్రమైన దివ్యత్వముగా మార్చుకోవటం చేతనే ఇన్ని శక్తులు వారికి కలుగుతూ వచ్చాయి.**

(స.సా.జూలై.91 పు.173)

విధి నిర్వహణ

పసి పిల్లవానికి తన **నాలుక తనకు ఉంది.** అలాగే తల్లికి. తల్లి తొడమీద కూర్చోపెట్టుకొని బిడ్డకు మాటలు ఉచ్చరిస్తూ, మాటలు నేర్పుతుంది. తల్లి నాలుక ఎంత తీరిక లేనిదైనా, **బిడ్డ తన నాలుకతోనే మాట్లాడ్డం నేర్చుకోవాలి.** బిడ్డ బదులు తల్లి మాట్లాడ లేదు. తన భాద్యత నుండి తప్పించుకోలేదు! గురువు కూడా అటు వంటివాడే! తను పునరుచ్చారణ చేస్తూ, జ్ఞాపకం చేస్తూ ఉత్తేజాన్ని కలిగిస్తూ, నచ్చ జెపుతూ, బోదిస్తుంటాడు; **కాని శిష్యుడే ఆ కార్యక్రమాన్ని నిర్వర్తించాలి.** అతడే ఆ ఘంటాన్ని చేపట్టాలి. **ఆ విధి నిర్వహణలో ఇతరులెవరు తనని పైకెత్తలేరు.**

(అ.ష.పు.122)

విధులు

ప్రతి గృహస్థు, ప్రతి దినము ఆరు రకముల విధులను నిర్వర్తించవలెను అవి. 1. స్నానము, 2. సంధ్య, 3. జపము, 4. హోమము, 5. పూజ, 6. అతిధి సత్కారము. అనగా ఉదయము స్నానము చేసి భగవంతుని నామస్మరణ చేయుట. పవిత్ర అగ్నిలో పవిత్ర పూజాద్రవ్యములు వేసి హోమము చేయుట. భగవంతుని పూజించుట, అతిధి దేవుళ్లను ఆదరముతో సత్కరించవలెను. సేవాతురుడవైన సేవకుడవునీవు. ప్రజలు నిన్ను దూషించినను, భూషించినను. నీవిధిని నీవు సంతోషముగా నిర్వర్తించ

వలెను. **దేహమునకు దూషణ, భూషణలు కాని, దేహికి కాదు** అను సత్యము గ్రహించిన నీవు ఇనుమడించిన శక్తి సామర్థ్యములతో నీ విధిని నిర్వర్తించగలవు.

(శ్రీ.స.సూ.పు.74/75)

వినయము

ఈనాడు 'వినయము' అనేది ఎక్కడా కనిపించటం లేదు. కర్రలు వేసి కట్టినట్లుగా ఉంటుంది నడుము. పెద్దల ముందర నడుమువంచరు, తలవంచరు. వినయములేని అహంకారికి సుఖం ఎట్లాలభిస్తుంది? **అహంకారం ఉన్నంత వరకు కట్టుకున్న భార్య అయినా, కన్న కుమారుడైనా గౌరవించడు, ప్రేమించడు. కనుక మొట్టమొదట అహంకారమును దూరం చేయి.** అప్పుడే నీ జీవితానికి శాంతి కలుగుతుంది. ప్రాచీన భారతీయులు వినయానికి ప్రముఖ స్థానం యిచ్చారు. భవనాలు కట్టేటప్పుడు కూడా వినయాన్ని బోధించే విధంగా శ్రద్ధ తీసుకున్నారు. పట్టణాల వారికి ఎక్కువగా తెలియదు. పల్లెలకు వెళ్ళితే ఈ విషయం తెలుస్తుంది. **చూద్దామంటే పెద్దపెద్ద భవనాలు, వాటికి దర్వాజాలు, తలుపులు మాత్రం చాలా చిన్నవి. అంత చిన్నవి ఎందుకు పెట్టారని అడిగితే వారి సమాధానం. "ఎవరైనా వారింట్లకు వస్తే వారు అతిథులు, బంధువులు అవుతారు. అతిథి అభ్యాగతులకు గుణపాఠం నేర్పే నిమిత్తమై మా ప్రాచీనులు చిన్న చిన్న దర్వాజాలు, తలుపులతో భవనాలు కట్టారు. వారు లోపల ప్రవేశించే టప్పుడు తలవంచుకుని రావాలి. ఈ విధమైన అభ్యాసం నేర్పే నిమిత్తమై మా ప్రాచీనులు ఈ విధంగా భవనాలు కట్టారు అన్నారు.** సహజంగా మన ఇండ్ల అన్నింటికి గడపలు (గుమ్మాలు) ఉంటాయి. ఆ గడప ఎందుకు? అని ఈనాటి ఆధునికులు ఆ గడపను తీసి వేస్తున్నారు. **వర్షం వస్తే కప్పలు లోపలికి ప్రవేశిస్తాయి. ఆ కప్పల కోసం పాములు వస్తాయి. పాముల వల్ల ప్రాణాలు పోతాయి. కనుక ఎత్తైన గడపపెట్టాలి.** ఇది ఎందుకు పెట్టారని ఆ పల్లెవారిని అడిగితే **"ఎవరైనా దొంగలు వచ్చి సామాను ఎత్తుకొని పోతుంటే ఈ గడప తగిలి పడతారు"** అని చెప్పారు. ఈ విధంగా ఆలోచిస్తే ప్రతి పని, ప్రతి ఆచారం, ప్రతి సంప్రదాయం **వెనుక ఎన్నో అంతరార్థాలున్నాయి.** నిశితంగా ప్రతి చిన్న విషయాన్ని పరిశీలిస్తే మన ప్రాచీనులు నియమించిన ప్రతి నియమం కూడనూ మనక్షేమం కోసమనే, సంఘసంక్షేమం కోసమనే, మానవ అభివృద్ధి కోసమనే విషయం మనకు స్పష్టమవుతుంది.

(శ్రీ.ఆ.99.పు.11)

(చూ॥ నరుడు, యుక్తి, శిక్షావల్లి, శివ, సంస్కృతి)

వినయవిధేయత

(చూ॥ ప్రేమ, యుక్తి, శివ)

వినాయక చవితి

ప్రేమస్వరూపులారా! **వినాయక చవితి అనగా వినాయకుని పుట్టిన దినమని అనుకుంటున్నారు. కాని, అతనికి చావులేదు. పుట్టుక లేదు. ఆది, అంత్యములు లేవు.** అలాంటి విఘ్నేశ్వరునకు ఇది పుట్టిన దినమని భావించడం చాల పొరపాటు. భారతీయుల పర్వదినము లన్నీ పవిత్రమైన అంతరార్థంతో కూడినవి. పాయసమును వండుకొని భుజించినంత మాత్రాన అది పర్వదిన మవుతుందా? **భగవత్తత్వానికి ప్రాధాన్యత ఇచ్చినదే పర్వదినము.**

(స.సా.న.99 పు. 290)

వినాయక పండుగ

సిద్ధిబుద్ధులను అధిపతిగా చేసుకొనినటువంటివాడు వినాయకుడు మనస్సు సుద్ధిగా ఉన్నప్పుడే జ్ఞానసిద్ధి లభిస్తుంది. కనుక బుద్ధి సిద్ధినాయకుడు వినాయకుడు. ప్రతి మానవుడు బుద్ధిని అదుపులో ఉంచుకోవాలి. పండుగ దినాలలో మనం అనేక విధములైన వంటలు

వినాయకుడు

చేసుకుంటుంటాం. కాని వినాయక పండుగకు ఒక ప్రత్యేకమైన విశిష్టత ఉన్నది. **నూనెలో ఉడకని వస్తువులను మాత్రమే వినాయకునికి నైవేద్యంగా యిస్తుంటారు. కేవలం ఆవిరితో ఉడికినటువంటి వాటినే వినాయకునకు నైవేద్యం పెడుతాం. ఆయుర్వేదంలో కూడా ఆవిరితో వుడికిన పిండివంటలు త్వరగా జీర్ణమవుతాయని పేర్కొనబడింది భాద్రపదమాసంలో నువ్వులు, బెల్లం వంటలు అధికంగా మన ఇండ్లకు వస్తుంటాయి.** నువ్వులపిండి బెల్లం కలిపి దానిని, బియ్యం పిండిని ఆవిరిలో ఉడకపెట్టినదానిలో పెట్టి దీనినే కుడుములు ఉండ్రాళ్లు అని వినాయకునికి నైవేద్యం పెడుతుంటారు. **బెల్లం కపపిత్తాదులను నివారించుతుంది, నువ్వులపిండి శ్వాస కోశములను పరిశుద్ధ పరుస్తుంది మరియు దృష్టిని కూడా అభివృద్ధి చేస్తుంది. బాహ్యదృష్టితో పాటు, జ్ఞాన దృష్టిని కూడా పోషించేటటువంటివి ఈ కుడుములు, ఉండ్రాళ్లు.**

(శ్రీ. అ.95 పు.6)

వినాయకుడు

వినాయకుని భార్యలపేర్లు బుద్ధి సిద్ధి అన్నారు. అనగా ఈ బుద్ధికి, జ్ఞానమునకు అధిపతి అయినటువంటి వాడు కనుక వినాయకుడు. ఈ రెండింటికినీ 'పతి'గా భావిస్తూ వచ్చారు. బుద్ధికి నాధుడైన వానివలనే మనకు సుఖము, జ్ఞానము, ఆనందము ప్రాప్తిస్తుంది కనుక మనం సుఖజీవితం గడపాలనుకుంటే, ఇంద్రియములను భగవదర్పితం గావించాలి మన మనస్సును భగవంతుని వైపు మరల్చాలి బుద్ధికే మనం స్వాధీనం అయిపోవాలి. **దీనినే "బుద్ధి గ్రాహ్యమతింద్రియమ్" అన్నారు శరీరము కేవలము పదార్థములచేరిక. దీనికి పైన ఉన్నటువంటివి ఇంద్రియములు. ఇంద్రియములకు పైన మనస్సు మనస్సుకు పైన బుద్ధి బుద్ధికి పైన ఉన్నది ఆత్మ. ఆత్మకు బుద్ధికి డైరెక్టు కనెక్షన్ ఉన్నది.** ఆత్మయొక్క తేజస్సు, ప్రశాంతి మొదట బుద్ధికి సోకుతుంది. కనుక బుద్ధిని సరియైన బుద్ధిగా మనం పోషించుకోవాలి మంచి బుద్ధిగలవాడే సరియైన జ్ఞాని అవుతాడు. కనుక **బుద్ధియొక్క సుద్ధియే 'జ్ఞానసిద్ధి' అన్నారు.**

(శ్రీ.అ.95 పు. 9)

వినాయక పూజ ప్రాచీన కాలము నుండి వచ్చింది. నారాయణోపనిషత్తు నందు మొట్టమొదట వినాయకుని ప్రార్థించడం జరిగింది. సూర్యుడ్ని చాలా ప్రధానంగా భావిస్తూవచ్చారు. చతుర్వేదములయందు కూడా వినాయక మంత్రాలు ఎన్నో ఉన్నాయి. వినాయకుడు పరిశుద్ధమైన హృదయముగలవాడు. **సిద్ధి, బుద్ధి అతని నేత్రములు.** ఈ నేత్రములనే తాను పత్నులుగా భావించాడు. కనుకనే సిద్ధి బుద్ధి నాయకుడు వినాయకుడు అన్నారు. సిద్ధి వుండాలంటే బుద్ధి ఉండాలి. **బుద్ధి ఉండాలంటే మనలో కృతజ్ఞతా భావమును పెంచుకోవాలి. కృతఘ్నుడి బుద్ధికూడా నాశనమవుతుంది.** ఈ బుద్ధియే నాశనం అయిన తరువాత, యిక సిద్ధి, మనకు ఏ రీతిగా కలుగుతుంది? **వినాయకుడు విజయానికి, సంకేతం.** ఇలాంటి వినాయక తత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించాలి. ప్రతి శుభకార్యానికి ముందు వినాయకుని ప్రార్థించాలి. ఎవరికైనా ఒక నాయకుడుంటాడుగాని, వినాయకునికి మాత్రం నాయకుడు లేడు. సర్వమునకూ నాయకుడు వినాయకుడు, అట్టి నాయకుడులేని వినాయకుడ్ని ప్రార్థించకుండా, అహంకారంతో ప్రవర్తిస్తే చాలా విఘ్నములు కలుగుతాయి. **అన్ని పర్వదినములు కన్నా మొట్టమొదటిది వినాయక చవితి పండుగ.** పర్వదినములు వినాయక చవితితో ప్రారంభమవుతాయి. **శారీర, మానసిక, ఆధ్యాత్మిక బలములకు మూడింటికీ వినాయకుడే మూలం.** మనం ఈ మూడింటినీ కాపాడాలి.

మన కాలేజీలో MBA ని ప్రారంభించాం. MBA అంటే ఏమిటి అంటే పిల్లలు Master of Business Administration అంటారు. కాదు 'M' కాదు. 'M' అంటే మనసు (Mind) 'B' అంటే బుద్ధి మరియు Body (శరీరం) A అంటే ఆత్మ. ఈ మూడింటి యొక్క సమ్మిళిత స్వరూపమే MBA **విచారణ చేయటానికి మనకు 'మనసు'**

నందించాడు. దేహమును దానిని అమలు పరచడానికి యిచ్చాడు. ఈరెండు తమ కర్తవ్యాన్ని చేస్తున్నాయా? లేదా? అని Watch చేయడానికి 'ఆత్మ' ఉంటున్నది. ఆత్మ శాశ్వతమైనది. 'మనసు' మొట్ట మొదట చంచలమైనది. దానిని సక్రమమైన మార్గంలో పెట్టి, సరియైన స్థితిలో అనుభవించి, నేను మానవుడను! మానవునకు తగినటువంటి మనసా! నాది. లేక మృగమునకు తగినటువంటి మనసా! నాది అని విచారణ చేసి, మానవునకు సంబంధించి నటువంటి మనసును అక్కడ ప్రవేశపెట్టాలి. ఇక "B" అనగా Body మనసు నిర్ణయించిన దానిని Body పనిలో ప్రవేశపెట్టాలి. అయితే ఇక్కడ 'బుద్ధి'కి విచారణశక్తి ఉంటుండాలి. ఈ మనసు నిర్ణయం చేసినటువంటిది సరియైనదా! కాదా! తప్పా! ఒప్పా! అనేటటువంటిది విచారణ చేస్తుంది. ఇది మంచిది అయితే అప్పుడు బుద్ధి దానిని ఆత్మకు అందిస్తుంది. అది సక్రమమైనది కాకపోతే అది ఆత్మ వరకు చేరదు. కనుక ప్రతిమానవుడూ మనో దేహబుద్ధుల ఆత్మ తత్త్వమును గుర్తించాలి. మొట్టమొదట మనసును పరిశుద్ధ పరచాలి. మనసును పరిశుద్ధ పరచక పోతే బుద్ధి ఏమాత్రం అంగీకరించదు. అదియే **"బుద్ధి గ్రాహ్యమతీంద్రియం".** ఇంద్రియములపై పోతున్నాం. మనసును అనుసరిస్తున్నాం. Mind is the Master of Senses. ఏమి ప్రయోజనం? ఆ Senses ను కంట్రోల్ చేయటం లేదు. నాది చాలా Sensitive Mind అంటారు. ఏమిటి ఈ Sensitive? Animal Sensitive కనుక Master the Mind, be A Master Mind. Senses ను నిజంగా కంట్రోల్ చేసే మైండే Master Mind. **ఇట్టి మనస్తత్వం లోపల వినాయకునిది ప్రప్రథమస్థానం.** తాను కేవలం సాక్షీభూతుడుగా వుంటాడు. దేనికీ జవాబు చెప్పడు. ఆచరణ చేసి చూపిస్తుంటాడు. కనుకనే **వినాయక తత్త్వము అత్యంత ఆదర్శవంతమైనది. ఆత్మతత్త్వము అన్నింటిని చూపిస్తుంది. విచారణ చేస్తుంది. కాని దానిలో ప్రవేశించదు.** ఈ మనో దేహముల అధికారి అయిన ఆత్మ దేనిలోనూ ప్రవేశించదు. ఈ మనోబుద్ధలు హృదయపూర్వకంగా పశ్చాత్తాపము పొందినప్పుడు, ఇది నాది తప్పు అని గుర్తించినప్పుడు, ఆత్మ సాక్షీభూతమై ఉంటుంది.

(శ్రీ.సె.2001 పు. 13/14)

విపత్తులు

(చూ॥ అవతారపురుషుడు)

విప్లవము

పాపభీతిలేని పామరత్వముబట్టి
దైవప్రీతిలేని దానిబట్టి
మానవత్వమణగె మానవులందున
విశ్వశాంతి కిదియె విప్లవంబు.

ఈనాడు విశ్వశాంతికి విప్లవము సంభవిస్తున్నాదంటే కారణము ఏమిటి? **పాపభీతి, దైవప్రీతి, సంఘనీతిని కోల్పోయినాము.** ఆకారమానవత్వముతోనే మనము జీవిస్తున్నాము. **ఆకారమానవత్వమువల్ల లోకమునకు ఏమాత్రము మంచి చేయలేరు. ఆచారవిచారమానవునిగా రూపొందాలి. ఆచారవిచారము లేక ఆకారమానవునివల్ల వచ్చే ప్రమాదమే యీనాటి పరిస్థితి.**

(బృ.త్ర.పు.7)

విప్రలిప్స

విప్రలిప్స అనగా ఓర్వలేని తనము, అసూయ, ఈ అసూయ మానవునకు చాలా చెడ్డ గుణము. ఎవరైనా వున్న వారిని చూస్తే ఓర్వలేడు. ఎవరైనా మంచివారిని చూస్తే ఏమాత్రము సహించుకోలేడు. **లోకములో ఏరోగమునకైనా ఔషధముండవచ్చునేమో గానీ యీ అసూయ అనే రోగమునకు నివారణ చేసే ఔషధము ఎక్కడా లేదు. ఇతరుల మంచిని చూచి ఓర్చుకోలేకుండా పోవటము చెడ్డ గుణము.** మంచిని చూచి ఆనందించు. ఆనందించేవారిని చూచి నీవుకూడా ఆనందించు.

విభీషణుడు

అంతేకాని వారిపైన వీరిపైన అసూయ అభివృద్ధిపరచు కోకూడదు.

~~ఈ~~ అసూయ భావము రావడానికి కారణము స్వార్థము.

(బృ.త్ర.89)

విభీషణుడు

భీష్ముడు, విభీషణుడు-వీరిరువురిలో ఎవరు గొప్పవాడు? భీష్మునికంటే విభీషణుడే గొప్పవాడు. ఎందుచేత? **కౌరవులు చేస్తున్నది పాపమని తెలిసినా వారికి ఎదురు చెప్పలేకపోయాడు భీష్ముడు. పైగా యుద్ధంలో వారి సైన్యాధిపతిగా నిల్చాడు. కాని, విభీషణుడు అట్లాకాదు. తన అన్న చేసిన పని చాల తప్పు అని ఖండించాడు. సీతను తిరిగి రామునికి అప్పజెప్పమని హితవు చెప్పాడు. తుదకు అన్ననైనా వదలిపెట్టి రాముని పాదము పట్టాడు.** లంకలో ఒక్క విభీషణుడే కాదు, అలాంటి మహానీయులు ఎంతమందో ఉండినారు. కాని దుర్మార్గానికి దౌర్జన్యానికి వెఱచి వారు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండిపోయారు. మొదట హనుమంతుడు లంకలో ప్రవేశించినప్పుడు విభీషణుని కలుసుకున్నాడు. **"వాయుపుత్రా! దంతముల మధ్య నాలుకవలె నేనీ లంకలో మహారాక్షసుల మధ్య జీవిస్తున్నాను. ఎంతకాలము నేనీవిధంగా జీవించాలి?** శ్రీరాముని అనుగ్రహం నా కేవిధంగా లభిస్తుంది? ఆ మహానీయుని దివ్య సన్నిధి నాకెప్పుడు లభ్యమవుతుంది? ఆ క్షణముకోసం నేను చాలాకాలంగా వేచియున్నాను" అని విభీషణుడు మొరపెట్టుకున్నాడు. అప్పుడు హనుమంతుడు విభీషణునికి చక్కని సందేశము నిచ్చాడు. "విభీషణా! నీకే కాదు, **~~ఈ~~ లోకంలో మంచి వారందరికీ కష్టాలు తప్పవు.** మహనీయులను, తాపసులను, అవతారములను దుష్టులు, దుర్మార్గులు, రాక్షసులు వెంటాడుతూనే ఉంటారు. అయితే ఒక్కటి మాత్రం గుర్తుంచుకో. **ముందు పుట్టినది నాలుక, మధ్యలో పుట్టినవి దంతములు. మధ్యలో పుట్టిన దంతములు మధ్యలోనే ఊడిపోతాయి కదా! అదేవిధంగా ~~ఈ~~ రాక్షసులందరూ త్వరలోనే రాలిపోతారు. ఇందులో సందేహం లేదు"** అని ఓదార్చాడు. **"విభీషణా! పట్టితివి రాముని పాదము. దానిని గట్టిగా పట్టుకో.** పోరుపడలేక తానైనా బ్రోవవలము, ఒడలు తెలియక నీవైనా అడుగవలయు. అని, మధ్యలో వదిలివేయుట భక్తుని లక్షణం కాదు" అన్నాడు. భక్తి అంటే ఏమిటి? కేవలం రాం, రాం, రాం...అంటూ జపం చేయడమా? కాదు, కాదు. **రాముచింతనతోపాటు రామకార్యంలోను పాల్గొనాలి.**

విభీషణుడు లంకక్షేమమును, రాక్షసులందరి క్షేమమును ఆశించాడుకాని సింహాసనము కోరలేదు. ఇంతటి ఉన్నత భావములు కల్గిన విభీషణుని రావణుడు, ఇంద్రజిత్తు అనేక విధములుగా తూలనాడారు. ఒకానొక సమయంలో రావణుడు, విభీషణుడు, కుంభకర్ణుడు బ్రహ్మను గూర్చి కఠోరమైన తపస్సు చేశారు. బ్రహ్మ ప్రత్యక్షమై ఏమి వరంకావాలో కోరుకొమ్మన్నాడు. కుంభకర్ణుడు తనకు నిద్రయ కావాలని కోరుకోవాలనుకున్నాడు. కాని, అతని నాలుక మందంగా ఉండటంచేత నిద్రయ కావాలనడానికి బదులు నిద్ర కావాలన్నాడు. బ్రహ్మ 'తథాస్తు' అన్నాడు. రావణుడే ఏమి కోరాడు? దేవతలు గంధర్వులు, యక్షులు, కిన్నెరులు, కింపురుషుల చేతిలో తన ప్రాణం పోకూడదని కోరు కున్నాడు. కాని, మానవునిచేతిలో పోకూడదని కోరుకోలేదు. ఎందుకనగా, అతని దృష్టిలో మానవుడు చాల బలహీనుడు, అల్పుడు. విష్ణువు దీనిని ఆసరాగా తీసుకుని మానవాకారంలో అవతరించి రావణుని హతమార్చుతానన్నాడు. ఇంక **విభీషణుడు** ఏమి కోరాడు? **"స్వామీ! నా హృదయాన్ని దయతో నింపు. నిరంతరము దయామయుడనై నా జీవితాన్ని దానధర్మాలతో గడిపేటట్లు అనుగ్రహించు"** అని ప్రార్థించాడు. కనుకనే రావణుడు, అతని కుమారులు తనను ఎన్ని విధాలుగా దూషించినను విభీషణుడు దేనికీ చలించలేదు. **క్రోధానికి లోను కాలేదు.** నిరంతరము దయామయునిగానే జీవించాడు. దయతో తన హృదయాన్ని నింపు కోవడంచేతనే అతనికి దైవానుగ్రహం, దైవసన్నిధి ప్రాప్తించాయి. **దయలేనివాడు దానవుడేకాని, మానవుడుకాదు.**

(స.సా.డి.96పు.334/335)

రామలక్ష్మణులు రావణుని కుమారులను, కుంభకర్ణాది మహావీరుల నందరినీ సంహరించారు. ఇంక రావణుడు మాత్రమే మిగిలాడు. ఆ సమయంలో ఒక మహాబలశాలి యుద్ధంలో ప్రవేశించాడు. విభీషణుడు రామునితో, **"ఇతను రావణునికంటే మహాశక్తి సంపన్నుడు.** ఇతనిని అణగద్రొక్కితే లంకనే నీవే హస్తగతం గావించుకున్న వాడవవుతావు'' అన్నాడు. రాముడు అతనితో మహాభయంకరంగా పోరాడినాడు. కాని, ఎంతసేపు పోరాడినా అతనిని జయించ లేకపోయాడు. కడపటికి అలసిపోయి విరమించుకుందా మనుకుంటున్న సమయంలో విభీషణుడు **"రామా! ఇది నీవు విశ్రాంతి తీసుకోవల్సిన సమయంకాదు. కొన్ని నిముషములు ఆలస్యం చేస్తే అతనిని జయించడం చాల కష్టం. కనుక, ఎలాగైనా పోరాడి అతనిని సంహరించు"** అన్నాడు. విభీషణుని ప్రోద్బలంతో రాముడు మరింత విజృంభించి ఆ మహాబలశాలిని సంహరించాడు. **అతడు నేలకూలిన తక్షణమే విభీషణుడు మూర్ఛపోయాడు. కాని వెంటనే తేరుకుని రామచింతన చేయసాగాడు. రామునికి ఆశ్చర్యం వేసింది.** "విభీషణా! ఈ రాక్షసవీరుడు మరణిస్తే నీవు మూర్ఛ పోవడానికి కారణ మేమిటి?'' అని ప్రశ్నించాడు. "స్వామీ! ఆ మహాబలశాలి నా కుమారుడే. దేహ సంబంధమైన మమకారముచేత వాని మరణానికి తట్టుకో లేకపోయాను. ఇది నాబలహీనత. నీ ప్రేమను హృదయంలో నింపుకున్న నేను ఇట్టి బలహీనతకు అవకాశం ఇచ్చినందుకు విచారిస్తున్నాను'' అన్నాడు. అప్పుడు రాముడు, "అయ్యో విభీషణా! అతడు నీ కుమారుడని ముందే ఎందుకు చెప్పలేదు?'' అని అడిగాడు. "రామా! యుద్ధంలో ఎవరైనా బంధుత్వాన్ని పాటిస్తారా? శత్రుపక్షంలోని వాడెవరైనా మనకు విరోధేకాని బంధువుకాదు. అందులోను భగవంతుడవైన నీతోటి పోరాడటానికి వచ్చిన వానితో నాకు సంబంధమేమిటి! నేను నీకు శరణాగతుడను, నీదాసుడను. నీ విజయమే నాకు కావలసింది'' అన్నాడు. చూశారా! రాముని విజయంకోసం **విభీషణుడు కన్న కొడుకునైనా చంపుకోవడానికి వెనుకాడలేదు. రామునికి లక్ష్మణుడు సాత్విక సోదరుడైతే విభీషణుడు సాత్విక మిత్రుడు.**

(స.సా.డి.96పు.335/336)

(చూ॥ రావణుడు)

విభుడు

విశ్వమందు విభుడు వెలుగొందుచుండును
విభుని యందు వెలుగు విశ్వమెపుడు
విభుడు లేకయున్న విశ్వంబు లేదయా
విశ్వవిభుల మైత్రి శాశ్వతంబు.

(శ్రీ.స.వా. పు. 7)

(చూ॥ శివుడు)

విభూతి

విభూతి యను పదమును మీరు చక్కగ అర్థము చేసి కొనలేదు. **విభూతి యనగా మహిమ, ఐశ్వర్యము, అష్టసిద్ధులు, అట్టి విభూతిచే అలంకృతుడు ఈశ్వరుడు.** ఇదియే వేద సమ్మతమైన యర్థము. కేవలము బూదినే ధరించినవాడు కాదని తెలిసికొనుడు. **సర్వమును తుదకు బూడిదయే యగునని జ్ఞాపకము చేయుటకే నేను మీకు విభూతి నొసంగు చుండుట యని గ్రహింపుడు.** వస్తువు లన్నియు విభూతి యగును. కాని **విభూతి మఱొక వస్తువుగ మారదు. అదియే తుదియవస్థ, మార్పులేని స్థితి.**

(స.శి.సు.ద్వి.పు.349)

నేను సృష్టించే విభూతి దివ్య శక్తికి నిదర్శనం. **భగవంతుని అనంతమైన, అమృతమైన, విశ్వవ్యాప్తమైన తత్వమునకు విభూతి ఒక సంకేతము.** ప్రాపంచికమైన, క్షణికమయిన, పరిణామ శీలమయిన పదార్థములన్నీ అగ్నికి ఆహుతి అయినప్పుడు, చివరికి విభూతి రూపంగా పర్యవసానము పొందుతుంది.

విమర్శనలు

వాంఛారహితమైన జీవితం అవసరమని నేను చెప్పాను. శివుడు కామదహనం చేసి ఆ భస్మమును తన దేహము నిండా ధరించి కామవిజయమును ప్రకటించాడు. **కామము నశించినప్పుడు ప్రేమయే దేవతగా పరిపాలించింది. ఇదే విభూతిలో వున్న అంతరార్థము.**

జనన మరణాల చక్రభ్రమణంలో చివరికి అంతా భస్మరూపమే పొందుతుంది. "ధూళిలో పుట్టిన నువ్వు, ధూళిలోనికి తిరిగి వెళ్తావు." భస్మము, ధూళి వస్తువుల చరమదశను సూచిస్తున్నవి. అటు పైన మార్పు వుండదు. **పారమార్థిక దృష్టితో చూచినపుడు విభూతి జనులకు కోరికలను వదలివేయుమని, రాగ ద్వేషములను, వ్యామోహములను భక్తిజ్వాలలో భస్మము చేయవలసిందని హెచ్చరిస్తున్నది.** ఈ విధంగా ఆలోచనలు, మాటలు చేష్టలు పవిత్రం కాగలవు.

భక్తి ప్రేమలతో నా దరికి చేరినవారికి ఈ సందేశమును అందించటం కోసమే నేను విభూతి సృష్టించి ప్రసాదిస్తున్నాను. **ఇతర రక్షల మాదిరిగానే విభూతికూడా రోగులకు వ్యాధి నివారణము, ఆర్తులకు రక్షణము అందిస్తున్నది. మాంత్రికుల గారడీ వల్ల వచ్చే విభూతికీ దివ్యత్వ సంకేతమయిన ఈ విభూతికి పోలిక లేనేలేదు.**

(స.ప్ర. పు.17, 18)

విమర్శనలు

ప్రభువు కొన్నాళ్లు తమకు దూరమైనప్పుడు పల్లె ప్రజలు పొందిన విరహవేదనను గురించి బొన్నలగడ్డ సత్యనారాయణ మూర్తి తన ప్రసంగంలో చక్కగా వర్ణించినాడు. ఆకాశంలో నీలమేఘం కనబడగానే తాము ఆరాధించే మేఘశ్యాముని తలచుకొని ఆనందభాష్పములు రాల్చి నారట. సమకాలీనులు కృష్ణుని గురించి కూడా ఎన్నో అపవాదులు వేసి వ్యాపింపజేశారు. ఇది ఎప్పుడూ జరుగుతునే ఉంటుంది. **నీళ్లు సరఫరా చేసేటప్పుడు మంచినీళ్ళ గొట్టం ప్రక్కనే మురికినీళ్ళ గొట్టం ఉంటుంది. అల్లాగే నిందాస్తుతులు ప్రక్క ప్రక్కనే ఉంటాయి. మాన్యులైన సత్పురుషులు అన్ని కాలాలలోనూ బాధ్యతారహితులైన విమర్శకులకు గురి అవుతూనే ఉంటారు.**

సాధు పురుషులు ఏమంటారంటే లోకులు తమనుచూసి సుఖంగా వున్నారు మీరు అన్నప్పుడు వాళ్లకు విచారంకలుగుతుందట. లోకులు తనను నిందించి, తాళంగ మృదంగాలు బద్దలుకొట్టె సంకీర్తనంతో సమయం వ్యర్థంచేస్తున్నానని తిట్టినప్పుడు చైతన్యుడికిచాలా ఆనందం కలిగేది. ఈ లోకులు మూర్ఖులు. చెట్టు ఆకులకు నీళ్లుపోస్తే వృక్షం పెరుగుతుందనుకుంటారు. ఆనందానికి మూలకారణమైన వేళ్లకు నీళ్లు పొయ్యాలి. అప్పుడు ఆనందం వృద్ధిపొందుతుంది. మీలోపల కృష్ణుడే ఆనందాలన్నిటికీ మూలం. **ఆకృష్ణుడు మీ హృదయాల్లో వున్నాడు అనేవాడు చైతన్యుడు,** కృష్ణనామ సంకీర్తనచేసే భాగ్యం కలిగిందన్న సంతోషంతో ఆనందభాష్పలతో ఆ వేరును తడపాలి. **ఆ ప్రభువు మహిమలు కీర్తించటమే మహాభాగ్యంగా భావించాలి. విషాదాశ్రువులతోకాదు. ప్రభుని పాద పద్మాలు దుఃఖాశ్రువులతో మలినం చేయరాదు.**

(వ.1963 పు.153/154)

(చూ॥ వెఱువనక్కరలేదు)

వియోగము

(చూ॥ సంయోగం)

విరాజనుడు

(చూ॥ బ్రహ్మవిద్య)

విరాజాహోమము

(చూ॥ సన్యాసము)

విరాట్టుడు

(చూ॥ బ్రహ్మవిద్య)

విరోధప్రేమ (భక్తి)

(చూ॥ భక్తి)

విరోధులు

నిజముగా మనకు విరోధులు అని భావించేవారి యందుకూడను మంచి విషయాలు, మంచి భావాలు ఉంటే, వారు మంచి పనులేవైన చేసి ఉంటే వానిని మనము గుర్తించుట అత్యవసరము. మంచి చెడ్డలకు మూలము మన దృష్టిలోపమే తప్ప, వ్యక్తి దోషము కానేరదు. ~~ఈ~~ దృష్టి ఎక్కడ నుండి వచ్చినది? కేవలము మన హృదయము నుంచి సంభవించినది. 'అతడు నా విరోధి' అనేటటువంటి భావము హృదయమునందు ఏర్పడటంచేత మనదృష్టికూడను అతనియందు విరోధంగానే ఏర్పడుతుండాది.

(ఆ.రా.పు.111)

విలియమ్ గ్లాడ్‌స్టన్

మార్షల్ యుద్ధ సమయమందుకాని, ప్రాణాపాయ సమయమునందుకాని, ఎట్టి కఠినమైన స్థితియందై **ననుకాని నీతిని విసర్జించకూడదని బోధించాడు.** విక్టోరియారాణి ప్రధానమంత్రియైన విలియమ్ గ్లాడ్‌స్టన్ నీతి నిజాయితీలను సర్వకాలములయందు పోషించినాడు. కనుకనే విక్టోరియారాణి కంటెను ప్రధానమంత్రిని ప్రజలు గౌరవించేవారు. **~~ఈ~~నీతి ఇంద్రియ నిగ్రహంచేత అలవడుతుంది. ఎవరినివారు శాసించుకోగలిగిన శక్తిని కలిగినవారే, ఇతరులను శాసించడానికి అధికారి అవుతాడు. తనను తానే శాసించుకోలేని బలహీనుడు ఇతరులను ఏరీతిగా శాసించగలడు?** కనుక **మొట్టమొదట మానవుడు తనను తాను శాసించుకొనుటకు తగిన కృషిచేయాలి. తనమాట, తన ప్రవర్తన రెండింటినీ ఏకంగావించే జీవితం గడపాలి. ~~ఈ~~ విధంగా మాట, క్రియ ఏకమై నప్పుడే తాను మహత్తరమైన విభూతులను అనుభవించగలడు.** "ఏమానవుడు తాను చెప్పిన మాట ప్రకారముగా నడచుకొనునో **అట్టివాడు మనిషేకాదు, మహిమాన్వితుడగును.** ఏమానవుడు తాను చెప్పిన మాట ప్రకారంగా నడచుకొనడో, **అట్టివాడు మనిషి కాదు కేవలం మృగమే". ~~ఈ~~నాటి మానవ సమాజములో మాటకు, క్రియకు సంబంధము లేదు. మాట, క్రియతో కూడి నదే సత్యము. మనస్సు, మాట, క్రియతో కూడినదే ఋతము.**

(స.సా.జూన్.91 పు.158)

విలువ

(చూ॥ మంచివారు)

వివాహము

Marriage (వివాహం) అనేది Mirage (ఎండమావి) వంటిది. ఎండమావిలో నీరున్నట్లుగానే కనిపిస్తుంది. కాని, దానివెంట పరుగులు తీస్తే నీదాహం తీరే దెప్పుడు? వివాహం వల్ల కలగే ఫలితం కూడా ఇంతే! పెళ్లి చేసుకున్న తరువాతనే "~~ఈ~~మె నా భార్య" అంటున్నావు. అంతకు పూర్వం ఆమె ఎవరు? నీవెవరు? పుట్టిన తరువాతనే 'ఈమె నా తల్లి' అంటున్నావు. అంతకు పూర్వం తల్లి ఎవరు? బిడ్డ ఎవరు? **~~ఈ~~ సంబంధాలన్నీ కదిలిపోయే మేఘాలవలె వస్తాయి. పోతాయి, కాని నైతిక శక్తి వచ్చి పోయేదికాదు. అది వస్తే అభివృద్ధి చెందుతుంది. దానికి ఇంద్రియనిగ్రం చాలా ప్రధానం.** కాని, ~~ఈ~~నాటి మానవుడు ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోడం చేత బలహీనుడైపోయాడు; **దైవత్వాన్ని చేరవలసినది పోయి దీనత్వానికి దిగజారి పోయాడు.** చిన్న చిన్న విషయాలకు కోపం వస్తుంది. ఇంక, అలాంటివానికి భగవత్తత్వం ఏరీతిగా బోధపడుతుంది? **కష్టసుఖాలపట్ల నీవు సమత్వం వహించాలి.** కొడుకు పుట్టాడు, సంతోషించావు. కొడుకు పోయాడు, దుఃఖిస్తున్నావు. వచ్చింది ఎవరు? పోయింది ఎవరు? మధ్యలో వచ్చి పోయేవాటిగురించి చింతించవద్దు. **నీ కర్తవ్యాన్ని నీవు**

వివేకము

నిర్వర్తించు. కర్తవ్యనిర్వహణయే దైవపూజగా భావించు. "ఇది నా ఇంటిపని, అది ఆఫీసుపని, అది భగవంతుని పని," అని విభజించుకోవద్దు. ఏ పని చేసినా అది దైవకార్యంగా భావించు. అదే సరియైన మార్గం.

(స.సా.జూ2001పు.172/173)

"వివాహమంటే మనం తొడుక్కున్న బుష్‌షర్టును మార్చడం వంటిది కాదు. వివాహము ఒక శాశ్వతమైన బంధము. ఒక బిడ్డ ఏడుస్తున్నప్పుడు ఆ బిడ్డను సముదాయించడానికి ఒక చాక్లెట్‌ను ఇస్తాము. అదే విధముగా **ఇంద్రియలోలురైన మానవులను తృప్తిపరచడానికి భగవంతుడు వివాహమనే ఒక బంధమును సృష్టించి స్త్రీ పురుషుల కలయికకు ఏర్పాటు చేశాడు. నిజానికి ఆత్మనిగ్రహము కొరకే ఇరువురు వ్యక్తులు వివాహమాడతారు. నిస్వార్థపరత్వమే భగవంతుడు. నీది, నాది అని భావించడం అహంకారమునకు చిహ్నము. అహంకారము చాలా ప్రమాదకరమైనది.** అహంకారమును చంపుకుని ఒకరితో ఒకరు సర్దుకుపోవడం ఎలాగో నేర్చుకోవడానికి ఇద్దరు వ్యక్తులు వివాహబంధము ద్వారా చేరువవుతారు. **వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన చాలా అవసరం.** ఈనాడు ఈ **పరస్పర అవగాహనను** మరచిపోయి భార్యాభర్తలు ఒకరితో ఒకరు సర్దుకుపోవడానికి ప్రయత్నిస్తూ సమస్యల వలయంలో చిక్కుకుంటున్నారు. ఇక్కడ కావలసినది **నిజమైన అవగాహన. ఇది లేకుండా ఒకరితో ఒకరు సర్దుకు పోవడానికి ప్రయత్నం చేయడం మంచిది కాదు.** అసలు మొట్టమొదట భార్యా భర్త లిరువురూ ఒకరినొకరు అర్థము చేసుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడు క్రమంగా ఒకరితో ఒకరు సర్దుకుపోవడం సులభతరమవుతుంది. గతాన్ని మరచిపొండి జరిగినదేదో జరిగిపోయింది. గతంలో మీ మధ్య కొన్ని అపార్థములు, విభేదములు సంభవించి యుండవచ్చు. వాటిని తలుచుకుని విచారించకండి. భవిష్యత్తులో ఏమి జరుగబోతోందో అనే విషయాన్ని ఊహించడానికి కూడా ప్రయత్నించకండి. భవిష్యత్తు ఎలా ఉంటుందో మీకుతెలియదు. వర్తమానంలో జీవిస్తూ మీకు చేతనయినంత చేయడానికి ప్రయత్నించండి. **వివాహబంధము చాలా పవిత్రమైనది. మీరిద్దరూ పరస్పర అవగాహనతో సహజీవనం చేస్తామని ఒకరికొకరు ప్రమాణం చేసుకున్నారు.** వివాహమునకు పూర్వము మీరు ఒక ప్రత్యేక వ్యక్తిత్వముగల "నేను". అలాగే ఆమె కూడా ఒక ప్రత్యేక వ్యక్తిత్వము గల "నేను." ఇప్పుడు మీరిద్దరూ కలసి **"నేను" + "నేను" = "మనం" అయ్యారు. ఇకనుండి మీరు "నేను" కాదు "మనం".** ఆమెకు ఏదైనా కష్టము వచ్చినపుడు మీరు "ఆమె" అనుకోకుండా "మనం" అనుకోవాలి. అలాగే భర్తకు ఏదైనా ఆపద సంభవిస్తే భార్య "ఆయన" అనుకోకుండా "మనం" అనుకోవాలి. **జీవితం పూర్తిగా కష్టములు, సమస్యలతో నిండియుంటుంది. అటువంటి సమయాలలో మీరు విడిపోకుండా ఇద్దరు కలసి వాటిని ఎదుర్కొనాలి. వివాహబంధము నుండి విడిపోవాలనే ఆలోచనే రాకూడదు. త్యాగభావంతో ఒకరితో ఒకరు సర్దుకుపోవాలి. అదేవైవాహిక జీవితంలో ఒకరి హృదయమును ఒకరికి అర్పించడం అంటే.**

ఇతరులకు ఇవ్వడం క్షమాగుణం ద్వారా ప్రేమ వృద్ధి పొందుతుంది. స్వార్థము ఇతరులనుండి తీసుకోవడం, వారిని మరచిపోవడం ద్వారా అభివృద్ధి చెందుతుంది. స్వార్థరాహిత్యమే ప్రేమ, ప్రేమ రాహిత్యమే స్వార్థము. వివాహమునకు పూర్వము మీ ఇద్దరి ప్రేమలు వేరువేరుగా ఉంటాయి. **వివాహమయిన తరువాత మీ ఇద్దరి ప్రేమలు ఒక్కటై చిగురిస్తాయి.**

(దై.ది.పు.359/361)

వివేకము

బ్రహ్మజిజ్ఞాసకు పూర్వాంగములలో మొదటిది 'వివేకము' అనగా నిత్య అనిత్య వస్తువిచారణ. అంటే ఆత్మ మాత్రమే నిత్యమనియూ, దృశ్య కల్పితమైన వన్నియూ అనిత్యమనియు అన్నియూ, మార్పు చెందునవేకాని ఏదియూ శాశ్వతమైనది లేదనియూ, వీటిన్నింటికి

ఆధారమైన ఆత్మ నిత్యసత్యమనియూ, దీర్ఘవిచారణ వలన నిర్ణయము గావించుకొని **సత్యాసత్యములను విడదీయునదే వివేకము.**

(సూ.వా.పు.5)

(చూ॥ అథాతో బ్రహ్మ జిజ్ఞాస, సంస్కృతి)

వివేకానందుడు (నరేంద్రుడు)

ఈనాటి విద్యార్థులు మాతృదేశాన్ని విసర్జిస్తున్నారు, విదేశాలను ఆశిస్తున్నారు. అన్ని దేశాలను ప్రేమించండి, తప్పులేదు. కానీ, మాతృదేశాన్ని త్యజించి, విదేశాలను వరించటం చాల పొరపాటు. ఒకానొక సమయంలో **నరేంద్రుడు ఆమెరికా పర్యటన పూర్తి గావించుకొని భారత దేశానికి తిరిగి వచ్చే ముందు పత్రికలవాళ్ళు అతనిని ఇంటర్వ్యూ చేశారు. అప్పుడు నరేంద్రుడు, "నేను భారత దేశాన్ని మాత్రమే కాదు, భారత దేశంలో ఉన్న మట్టిని, గాలిని, ధూళిని కూడా ప్రేమిస్తున్నాను, గౌరవిస్తున్నాను. నా మాతృభూమి సేవకే నా జీవితాన్ని అంకితం గావిస్తున్నాను" అన్నాడు.** కానీ, ఈనాటి విద్యావంతులు కేవలం ధనార్జనకే తమ జీవితాన్ని అంకితం గావిస్తున్నారు.

నిరత సత్య ప్రౌఢి ధరణి నేలిన హరి
శ్చంద్రుడీ ధర బాసి చనగ లేదె
ఎల్ల లోకములేలి ఎసగు శ్రీనలరాజు
తన వెంట భూమిని గొనుచు చనెనె
కృతయుగంబు నలకృతిని చేయు మాంధాత
సిరి మూట గట్టుక అరిగినాడె
జలధి సేతువు గట్టె అలనాటి శ్రీరాము
డుర్వియై ఇప్పుడు ఉన్నవాడె
ఎందరెందరు రాజులు ఏగినారొ
ఒక్కరును వెంట గొనిపోరు ఉర్వితలము
నీవు మాత్రము రాజ్యంబు భోగములను
తలను కట్టుక పోదువా ధర్మహృదయ!

మరణించినప్పుడు ధనమేమైనా వెంట వస్తుందా? సంపాదించిన లక్షలాది రూపాయలను వదలిపెట్టక తప్పదు. మరణించేటప్పుడు పిడికెడు మట్టినైనా వెంట తీసికొని వెళ్ళటానికి వీలుకాదు. లేకపోతే ప్రపంచంలో మట్టికి కూడా రేషన్ వచ్చి యుండేది! **మరణించే సమయంలో మంచి, చెడ్డ - ఈ రెండు మాత్రమే మీ వెంట వస్తాయి.** కనుక, **తుచ్ఛమైన ఆస్తిపాస్తులకోసం ప్రాకులాడకుండా, దైవమే మీ నిజమైన ఆస్తిగా భావించి సమాజ సేవలో ప్రవేశించండి. మీ హృదయంలో దైవభావాలకు చోటివ్వండి.**

(స.సా.జూ.99పు.152/153)

స్వామి ప్రతి సంవత్సరము ఢిల్లీకి రావాలని వాజ్‌పేయి, కుల్వంతరాయ్ కోరారు. తప్పక నేను సంవత్సరానికి ఒకతూరి వస్తాను. అయితే, మీరు ఈ విశాలమైన భావాలను ఆచరణలో పెట్టాలి: వ్యక్తిగతమైన ద్వేషాలను దూరం చేసుకోవాలి. అందరూ సోదర సోదరీమణులుగా జీవించాలి. వంద సంవత్సరాలకు పూర్వం **వివేకానందుడు చికాగో మహాసభలో తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ సభికులను "బ్రదర్స్ అండ్ సిస్టర్స్!" అని సంబోధించగా, వారు పదిహేను నిమిషాలపాటు కరతాళ ధ్వనులు చేశారు. కానీ, ఈనాడు భారతదేశంలోనే అలాంటి విశాలమైన భావం కరువైంది. ప్రజలు సోదర సోదరీమణులుగా జీవిస్తూ 'సుప్రీం స్టేజి' (ఉన్నత స్థాయి)కి పోయే బదులు ఒకరితో ఒకరు పోట్లాడుకుని 'సుప్రీం కోర్టు'కు పోతున్నారు!** ఒక్క ఢిల్లీ బాగుపడిందంటే దేశమంతా బాగుపడుతుంది. ఢిల్లీ భారత దేశంయొక్క కడుపు వంటిది. కడుపు బాగున్నప్పుడే మిగిలిన అంగములు బాగుంటాయి. కనుక, మీరు ఢిల్లీని బాగుపర్చుకోవాలి, భద్రపర్చుకోవాలి. ఐకమత్యం ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది.

(స.సా.మే.99పు.126)

సింహళములో వివేకానందుడు పునర్జన్మ మెత్తి వృద్ధిపొందుచున్నాడు. అతడు వచ్చి నా కార్యక్రమములో పాల్గొనును. వివేకానందుని జీవిత చరిత్రను ఆంగ్లములో

విశిష్టాద్వైతము

మొదట వ్రాసిన గ్రంథకర్త పడమటి సముద్రతీరమందలి కుట్టి పురములో నొక పూరిగుడిసెలో నిన్న రాత్రి జన్మించెను. ఆ బిడ్డ విశాల నేత్రములతో నల్లారుముద్దుగా నున్నాడు.

(స.శి.సు.రె.పు. 121)

(చూ॥ దైవం కోసం)

విశిష్టాద్వైతము

(చూ॥ అద్వైత, ద్వైత, విశిష్టాద్వైతములు)

విశ్వకళ్యాణము

(చూ॥ ప్రేమతత్త్వం)

విశ్వకుటుంబము

ఐకమత్యము, సహనము, సానుభూతి, సమగ్రత, సౌభ్రాతృత్వము అనేవి విశ్వకుటుంబములోనే సాక్షాత్కరిస్తాయి. వీరి కుటుంబములో ఈశ్వరుడు, పార్వతి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యం అని నలుగురు ఉన్నారు. ఈ నలుగురూ చేరి ఏకత్వంగా ఉంటున్నారు. ప్రాకృత రీతిగా మనం విచారణ చేసినప్పుడు - **ఈశ్వరుని వాహనము ఎద్దు, పార్వతి వాహనము సింహం.** సాధారణంగా సింహమునకు ఎద్దుకు పరమవిరోధం ఉంటుంది. కాని, **విశ్వకుటుంబంలో ఈ రెండూ విరోధం లేక ఐకమత్యంగానే ఉంటున్నాయి.**

"శిఖములో మున్నీటి కన్య
ముఖములో మూడవ కన్ను
సొగసుగ రుద్రాక్ష మాలలు నిగ నిగ
మెరయగ శివుడు తాండవ కేళి సల్పెనే;
పరమేశ్వరుడు శ్రీ సాంబశివుడు
తాండవ కేళి సల్పెనే!"

శిరస్సు పైన గంగ, ముఖములో అగ్ని ఉంటున్నవి. సాధారణముగా అగ్ని గంగకు విరుద్ధము. కాని, ఈశ్వరుని వద్ద వీరు ఎట్టి విరోధాలనూ నిరూపించక ఉంటున్నారు. అంతేకాదు.

"నారదుడు తుంబుర మీటగ - జటా
ఝూటము శిరమున మెరయగ-
త్రిశూలంబును త్రిప్పుచు హరుడు
"తథిం తథిం తోం తకిట" యనుచు తాండవ కేళి సల్పెనే...!
సరస్వతి వీణ మీటగ - పురందరుడు వేణువు ఊదగ - హరి మృదంగము వాయించగ - ధిమి ధిమి ధిమితక యనుచు తాండవ కేళి సల్పెనె..! గౌరీదేవి జగముల నేలగ - గంగాదేవి నదులై పారగ - విఘ్నేశ్వరుడు అటు ఇటు తిరుగగ - అవిఘ్నముగ ఆడెను హరుడు తాండవ కేళి సల్పెనే..!"

ఒక దాని కొకటి విరుద్ధమైన వాటి నన్నింటినీ ఏకత్వం గావిస్తూ వస్తున్నాడు ఈశ్వరుడు. విఘ్నేశ్వరునిది గజ శిరస్సు. అతని తల్లి వాహనము సింహము. సహజంగా సింహము స్వప్నంలో వచ్చినా ఏనుగు బ్రతక లేదు. అంత విరుద్ధమైనవి కూడా ఈ కుటుంబములో సన్నిహితంగా మెలగుతూ వస్తున్నాయి. ఇంక **సుబ్రహ్మణ్యుని వాహనం నెమలి; ఈశ్వరుని ఆభరణములు సర్పములు.** ఇవి కూడా ఒక దానికొకటి పరమ విరుద్ధమైనవి. కాని, ఈ కుటుంబములో ఇవన్నీ కలసి మెలసి పెరుగుతున్నాయి. ఇవన్నీ లోకానికి ఆదర్శము నందించే చిహ్నాలే! **విఘ్నేశ్వరుని మొలకు సర్పము ఉంటున్నది. సుబ్రహ్మణ్యము యొక్క వాహనము నెమలి.** సాధారణంగా నెమలిని చూస్తే సర్పాలు పరుగెత్తి పోతాయి. ఇంత విరోధం కల్గినవి కూడా ఈశ్వర కుటుంబములో అన్యోన్యమైన సంబంధాన్ని అనుభవిస్తున్నాయి. ఈవిధంగా ఈశ్వర కుటుంబం ఐకమత్యానికి చిహ్నంగా నిలబడి జగత్తునకు ఆదర్శాన్ని చాటుతూ వచ్చింది.

(స.సా.న.93 పు.293)

విశ్వకుటుంబమైన ఈశ్వర కుటుంబము సర్వులకూ ఆదర్శము నందిస్తున్నది. గణపతి యొక్క చిత్తము కాని, సుబ్రహ్మణ్యం యొక్క భావము కాని, పార్వతి యొక్క

హృదయము కాని, ఈశ్వరుని యొక్క తత్త్వము కాని, వీటన్నింటిలో ఏకత్వాన్ని ఈ కుటుంబము నిరూపిస్తుంది. సుబ్రహ్మణ్యుడు - **బుద్ధి, గణపతి - సిద్ధి, పార్వతి - ప్రకృతి (Matter) ఈశ్వరుడు - శక్తి (energy) ఈ Matter, energy రెండింటి ఏకత్వం** చేతనే బుద్ధి, సిద్ధి రెండూ లభ్యమౌతున్నాయి. ఈ ఏకత్వాన్ని మనం చక్కగా గుర్తిస్తే - నాలుగూ చేరి ఒక్కటే కాని వేరు వేరు కాదు. మన చేతిలోని వ్రేళ్ళు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. కాని, పనిచేసే సమయంలో ఈ ఐదూ ఏకమై పోతాయి. ఇవి ఏకం కాకపోతే ఏ పనీ చేయలేము. **సృష్టి రహస్యం ఈవిధంగా ఉంటున్నది. ఐతే, భగవంతుడు ఈ ఐదు వ్రేళ్ళనూ సమానంగా ఎందుకివ్వకూడదు? అంటే - వ్రేళ్ళన్నీ సమానంగా ఉంటే అసలు మనం పనే చేయలేము.** ఆయా పనులకు సంబంధించినట్లుగా వ్రేళ్ళకు ఆ పొడవు, మందము రెండూ వేరువేరుగా ఉంటుండాలి. ఇది దైవ సృష్టి యొక్క రహస్యం. దీనిని విద్యా బుద్ధులతో విచారిస్తే ప్రయోజనం లేదు.

(స.సా.న.93 పు.295)

విశ్వజిత్ యాగము

(చూ॥ సంకల్పములు)

విశ్వనాథుని దర్శనము కొరకు

పరీక్షిత్ మహారాజు శుకునకు నమస్కరించి "స్వామీ! చాలాకాలమునుండియు నన్నొక సంశయము పీడించు చున్నది. దానిని తమరు తప్ప అన్యులు తీర్చలేరనియును నాకు తెలియును. తమరు వేరుగా తలంచక, ఈ దాసుని సంశయమును నిర్మూలము గావించుడు. అది యేమన, నేను మా వంశీయులలో ప్రప్రథమ నాయకుడైన, మనువు మొదలు, నేటి మా తాత తండ్రుల చరిత్రల వరకునూ వింటిని, పఠించితిని, ఎవరి చరిత్రల యందు చూచినను యేదో ఒక మహర్షి రాజుల నాశ్రయించి యుండుటయును మహా జ్ఞానవృద్ధులైన పండితులు రాజాజ్ఞలలో వారల దర్బారులలో కూడి యుండుటయును చేరియుండిరి. సర్వసంగపరిత్యాగులైన ఋషులును, లోకము మిథ్యము, బ్రహ్మసత్యమని గుర్తించిన పండితులును, రాజుల నాశ్రయించి యుండుటలోగల అంతరార్థమేమియో! కారణము లేని కార్యము పెద్దలు తలంచరు, చరించరు, కాన, ఈ సంశయమును తీర్చి నన్ను ధన్యుని గావింపుమనగా, **శుకులు (నవ్వి),** రాజా! (సరియైన ప్రశ్న గావించితివి, వినుము.) **మహనీయులైన ఋషులు పవిత్రులైన పండితులు నిజమైన లోకపాలకులు. తాము గ్రహించిన సత్యములను, ఆచరించిన పవిత్ర కర్మలను, అందుకొన్న దివ్య దైవానుగ్రహమును, తోటి మానవుల కందించి లోక సుఖశాంతులు చేకూర్చవలెనను వాంఛతో పరిపాలనా దక్షులగు రాజులచెంత చేరి రాజుల కిట్టి ఉత్తమ మార్గముల చిత్తములందు చేర్చి శాసన రీతిగా జనరంజకమగు ధర్మ కర్మలను నియమించు చుండిరి. ఆనాటి రాజులే మహాఋషులను ఆహ్వానించి, పండితులను పిలిపించి, రాజనీతిని తెలుసుకొని దానికి తగినట్లు శాసనములు నీమించెడివారు. ప్రజలకు ప్రభువే ప్రధాన రక్షకుడగుటచేత, ప్రభువు సర్వసుగుణ సంపన్నుడై, సర్వధర్మ పరాయణుడై, సమస్త విద్యాపారంగతుడై యుండిన ప్రజలయొక్క యోగక్షేమమును, పరిపాలనా విధానమును సక్రమమైన మార్గమున నడుపగలరనియును లోక సుఖశాంతులనాశించి, "సమస్త లోకా స్సుఖినోభవంతు" అను లక్ష్యముతో రాజులను చేరెడివారు, ఇంతియే కాదు, జన సుఖదాయకుడు రవికుల నాయకుడు, కౌసల్యా కిశోరుడు, వసుదేవనందనుడు, గోపీజన వల్లభుడు, గోలోక వాసుడు అగు శ్రీమన్నారాయణుడు రాజవంశములందు జన్మించునను వార్త వేద శాస్త్రములందు సూచించుటచే, భగవద్దర్శనార్థమై అప్పటి కప్పుడు రాజులను చేరుటకు వీలుగా నుండదనియును, చేరిననూ దైవానందమును మనసారా అనుభవింప సాధ్యము కాదనియును, ఆలోచించి, కొందరు దివ్యదృష్టిగల మహనీయులు ముందుగానే ఆయా రాజుల కొలువు కూటములచేరి**

విశ్వమతము

దైవరాకకై తపించుచుండురు. అట్టివారే వశిష్ఠ, వాసుదేవ, విశ్వామిత్ర, గౌతమ, గర్గ, అగస్త్య ఇత్యాది మహర్షులు. వీరలకేమి కొదువ? త్యాగులు, విరాగులు అయిన ఈ ఋషులు రాజుల చెంత చేరి వ్యర్థ ప్రసంగములు గావించుటకై రాజుల కొలువు కూటముల చేరలేదు. లేదా, వారి కానుకలందుకొనుటకు కానీ, వారందించు తల భారపు బిరుదులను తగిలించు కొనుటకు కానీ, ప్రభువులను చేరలేదు. **విశ్వనాథుని దర్శనమునకును, ధర్మరక్షణ దీక్షకును లోకపాలురను చేరిరి. వేరు కారణము లేవియును లేవు.** ఆనాటి రాజులు కూడను దైవచింతనా తత్పరులై, ప్రజాపరిపాలనకు తగిన మార్గములను పండితుల వలనను, ఋషులవలనను తెలిసికొని తమకు తామే ఆశ్రమములకు వెళ్ళుటయో, లేదా వారలను రాజభవనములకు రప్పించుటయో జరిపించి, ఆలోచించెడివారు. **ఆనాడు స్వార్థరహితులగు ఋషులు, అధికార వాంఛారహితులగు పండితులు, రాజులకు సలహాదారులుగా నుండుటచే ఆనాడు, తిండి గుడ్డలకు కానీ, తీర్థ గృహములకు గానీ, యెట్టి కొరతయూ లేక, నిత్య కల్యాణము పచ్చ తోరణములతో ప్రజాక్షేమమే ప్రభువు దేహముగను, ప్రభువే ప్రజల గుండెలుగను తలంచి, స్మరించి, వరించి, తరించిరి.**

(రా.వా. మొ. పు. 4/6)

విశ్వమతము

ఒకే అనంతమైన ఆకాశము నుండి వర్షము కురుస్తుంది. అది భూమి మీద పడేవరకు చినుకులుగా వుంటుంది. కానీ, భూమి మీద పడిన వెంటనే ప్రవహిస్తుంది. ఏ నేలలో ఎటెటు దిగవలెనో అట్లు దిగుతుంది. అదే విధంగా **- ఒకే పవిత్రమయిన భావముతో మానవులు జన్మిస్తారు. కాని భూమిమీద పడిన వెంటనే రకరకాలుగా మారి పోతారు. కాని ఈ జన్మకు ఆధారభూతమైన, మానవుని అంతర్గతమైన దివ్యత్వము ఒక్కటే అని గుర్తించాలి.** ఇది చాలా ముఖ్యమైన విషయము ఎందుకనగా మన భారతీయులలోనే చాలా మందికి మన దేశములోనున్న అనేక మతస్థుల, కులస్థుల సంస్కృతులను గురించి కొంత నిరసన భావం ఏర్పడివుంది. **భారత దేశంలో చాలా రకములైన మతములుండుటవలన కలహములు భేదాభిప్రాయములు ఏర్పడినవి - అని భావిస్తున్నారు. భారతీయులు అనేకమంది దేవుళ్లను పూజిస్తారు అని హేళన చేస్తారు. కానీ బాగా ఆలోచించినట్లయితే ఈనాటి కలహములకు, భేదాభిప్రాయములకు, కారణము మతములు కావు. ఏకేశ్వరోపాసన - ఏకత్వమును ప్రబోధిస్తున్న క్రైస్తవులు, అడవిలో వున్న మృగముల కంటె హీనంగా మనుష్యులను అణ్వాయుధములచే చంపేస్తున్నారే! దీనికి ఎవరు కారణము? మతమా? కాదు కాదు. వ్యక్తిగతమైన చెడు బుద్దులు. తమతోటి వారిని హింసిస్తున్నారు. మతము మీద ప్రతిదీ వేయడం ఒక పరిపాటైపోయింది.**

మతములన్నియు చేరి మంచినే బోధించె
తెలిసి మెలగవలయు తెలివితోడ
మతులు మంచివైన మతమేది చెడ్డది!
వినుడు భారతీయ వీరసుతుడా.

కనుక మతమునకు సంబంధించిన విషయములలో మనము ప్రవేశించకూడదు. **సర్వమతముల వారిని గౌరవింపవలయును. అన్ని మతముల ఆకారమే ఈ దివ్య మతమైన విశ్వమతము యొక్క రూపము, అని గుర్తించాలి. గ్రహించాలి, ప్రచార ప్రబోధలు సలుపాలి.**

(శ్రీ.సా.ది.పు.135/136)

విశ్వము

జగత్తంతయు భగవత్ స్వరూపమే, దీనికి మరొక పేరు విశ్వము. వి+శ్వ+మ్. **విశ్వమనగా సమస్తస్వరూపముల చేతను సమస్త అంగముల చేతను ప్రవేశింపబడినది. "సహస్రశీర్షా పురుషఃసహస్రాక్షఃసహస్రపాత్" అని పురుషసూక్తము. విశ్వము కార్యము; విష్ణువు కారణము.**

కార్యకారణసంబంధమే ఈ విశ్వము కారణము వదలి కార్యము, కార్యమును వదలి కారణము ఉండుటకు వీలులేదు. రెండును అన్యోన్యాశ్రయములు; అవినాభావ సంబంధములు. విష్ణువు అనగా వ్యాపింపచేయు గుణం కలవాడు. వ్యాపకత్వము చేత సమస్తమును ఆవరించు వాడు విష్ణువు. ఈ విష్ణువుకు మరి కొన్ని పేర్లు కలవు. ఈ విష్ణువు పుట్టినవాటిని, పుట్టబోవు వాటిని, ఉన్నవాటిని సృష్టింపగలిగిన వాడు, ప్రభువైన వాడు. ఈతనికి భూతభవ్యభవత్ ప్రభువని పేరు. ఇతనికి భవుడని మరొక పేరు. ప్రపంచస్వరూపమును ధరించినవాడు భవుడు.

(నేనే.పు.25)

విశ్వమే ఒక విద్యాలయము. ఇందులోని ప్రతి ప్రాణి విద్యార్థియే. ఒక్కొక్క విద్యార్థి ఒక్కొక్క విషయంలో కృషి చేసి పట్టమునందుకొంటున్నాడు. ఎవరికి అభిరుచి గల విషయమును వారు ఎన్నుకుంటారు. ఎవరే మార్గమును అనుసరించినప్పటికీ **అందరికీ ఏకోన్ముఖమైన గమ్య మొకటి ఉన్నది. అదే భగవత్ప్రేమ పట్టానందుకోవడం.** సైన్యంలో చేరిన వారిలో ఒకరు మంగలిగా పని చేయవచ్చును. ఒకరు "వాచ్‌మన్" కాపలాదారుగా ఉండవచ్చును. ఇంకొకరు సిపాయిగా ఉండవచ్చును. ఒకరు కర్నల్ కావచ్చును. మరొకరు మేజర్ కావచ్చును. వారి వారి పదవులలో ప్రత్యేకత ఉన్నప్పటికి 'పెరేడ్' చేయడం. తుపాకి కొట్టడం ఈ రెండూ అందరికీ అత్యవసరం. అదే విధముగ **విశ్వమనే విద్యాలయంలో నైతిక, భౌతిక, ధార్మిక, లౌకిక, వైజ్ఞానిక మార్గములెన్ని ఉన్నప్పటికీ అన్నింటికీ కీలకమైనది ఆధ్యాత్మికము.**

(స.సా.ఫి. 1988 పు. 5)

(చూ॥ త్రిగుణములు, విభుడు, సగుణభక్తి)

విశ్వరూపము

విశ్వరూపము చూచుచు అర్జునుడు ఆనంద బాష్పములు రాల్చుచు ఇట్లనెను. "పరమాత్మా! సకలదేవతలను, సృష్టికర్తయైన చతుర్ముఖ బ్రహ్మను, సమస్త ఋషులను, నానా స్థావర జంగమాది భూతసమూహములను, చూచుచున్నాను, అబ్బా! భయంకరమైన నీ మోమున వెలువడు మంటలు, ఈ తేజస్సులు, సమస్త జగత్తును వ్యాపించి తపింపజేయు చున్నవి. ఈ భయంకరమైన ఉగ్రరూపమును తెలిసికొన గోరుచున్నాను.

"అర్జునా చూచితివా! సమస్త కర్మలకును, **సమస్త భూతములకును సృష్టి స్థితి లయకారుడను నేనే అని తెలిసినదా! దీనినిపట్టి ఈ యుద్ధభూమియందు చేరిన జనులను కాపాడువాడవుకానీ, సంహరించు వాడవుకానీ, నీవు కాదని తెలిసికొమ్ము నీవు నిమిత్తమాత్రుడవే. చంపు అధికారము నీకుగాని, చచ్చు అధికారము వారికిగాని యెప్పటికీ లేదు. సర్వమూ నాయందే, నాసంకల్పమందే యున్నది. భూభార మణుచుటయు భూభారమును పోషించుటయు, భూభారమును వహించుటయు నా ప్రవృత్తి అని తెలిసికొమ్ము"** అని కృష్ణుడు వీపు నిమురుచూ వాత్సల్యత చూపుచూ వణుకుచున్న అర్జునుని ఓదార్చినాడు.

భక్తవత్సలుడు, భక్తపరాధీనుడనుటలో ఈ ఘట్టము ప్రత్యక్షనిదర్శనము, ప్రత్యక్ష ప్రమాణము. కాకున్న, సామాన్య మానవునివలె అదరి బెదురుచున్న అర్జునుడెక్కడ! మహావీరులు సర్వశక్తిమయులు, సర్వవిద్యా ప్రవీణులయిన భీష్మ, ద్రోణ కర్ణాదు లెక్కడ! అట్టివార లను ఒక్క భగవంతుడు తప్ప మరెవ్వరునూ ఓడించలేరు సాధ్యము కాదు. అట్టి మహావీరులను ఓడించినట్టి ఘనత, వధించినట్టి ఘనత, తనకు శరణాగతుడైన అర్జునుని పొందమని తెలిపెను. భక్తులయొక్క యశస్సును కోరి భగవంతుడు మానవాతీతమైన కార్యములనుకూడా చేయించును. **తాను సాక్షీభూతుడై సర్వకర్తయై నాటకమాడించి యేమియూ యెరుగనివానివలే నటించును.** ఇది తనకు భక్తుల యందుగల వాత్సల్యము. అర్జునుడు కన్నులు తుడుచుకొనుచు, చేతులు జోడించి "పరమాత్మా! నేనెన్నడూ కనీ వినీ యెరుగని విశ్వస్వరూపమును చూచితిని. అందలి సత్యమును తెలిసికొంటిని. భయంకర

విశ్వవిద్యాలయము

తేజఃపుంజములు నన్ను కాల్చి వేయుచున్నవి. నా దేహము మండుచున్నది. ఒకపరి నీ మొదటి రూపమైన ప్రసన్న స్వరూపమును చూపుము, శాంతింపచేయుము. తాళలేను తండ్రీ చూడలేను'' అని మొరపెట్టుకున్నాడు.

అంత కృష్ణుడు అనుగ్రహ హృదయుడై, **"అర్జునా! వేదాధ్యయనము చేత గానీ, ఘోర తపస్సులచేత గానీ, దాన ధర్మాది సత్కర్మలచేత గానీ, యజ్ఞయాగాది క్రతువులచేత గానీ చూడ సాధ్యము కాని నా విశ్వరూపమును నీవు చూడగలిగితివి. ఇట్టి దర్శనము మదేక నిష్ఠుడైన ఒక్క భక్తునకు మాత్రమే ప్రాప్తించును, సాధ్యమగును, అనన్య చింతనతో నన్ను ఉపాసించువారికి ఇది సాధ్యము కాగలదు.** అట్టివారి హృదయము మాలిన్య రహితమై నిర్మలముగా నుండును. ఆ సమయమున దేనిని చూచిననూ, చేసిననూ భగవత్ స్వరూపముగను, భగవత్ రూపమైన కర్మలుగను తలంతురు. వారలకు వేరు రూపములుగానీ వేరు భావములుగానీ వుండవు; సర్వకాల సర్వావస్థల యందూ నా రూపమే, నా నామమే, నాభావమే, నాకర్మలే కాంచు చుందురు, చేయుచుందురు. అట్టివారలకే ఈ పవిత్ర ప్రాప్తి లభ్యమగును. **నేను అనన్యభక్తినే కోరుచుందును బావా"** అని విశ్వరూప సందర్శన ప్రాప్తిగురించి వివరించెను.

(గీ.పు.182/184)

విశ్వవిద్యాలయము

(చూ॥ పుట్టపర్తి)

విశ్వవిరాట్టుస్వరూపుడు

(చూ॥ దైవస్వరూపులు)

విశ్వామిత్రుడు

విశ్వామిత్రుడు గొప్ప తపఃసంపన్నుడు. అనేక అస్త్ర శస్త్రములను సాధించినవాడు. కానీ కోపముచేత సర్వము నాశనము చేసుకున్నాడు. వశిష్ఠులవారు బ్రహ్మర్షి. నిరంతరము బ్రహ్మతత్వాన్ని చింతించే వాడు. విశ్వామిత్రుడు రజోగుణముతో ఉండేవాడు, రాజర్షి. అతను బ్రహ్మర్షి. ఇతను రాజర్షి. తాను కూడా బ్రహ్మర్షి కావాలని పట్టుబట్టాడు విశ్వామిత్రుడు. తపస్సు చేశాడు. అలాంటి విశ్వామిత్రుడు వశిష్ఠులవారిపై క్రోధము పూనటం చేత సర్వశక్తులు కోల్పోయాడు. మీకు తెలుసు. దూర్వాసుడు కూడా గొప్ప తపస్సంపన్నుడే. కానీ అతనికి కోపము ముక్కుపైనే ఉంటుంది. అతని దగ్గర శాంతము, ప్రేమ కనిపించవు. ప్రయోజనం ఏమిటి? మహర్షి అయినందుకు మధురమైన వాక్కులు, పవిత్రమైన నడత ఉండాలి. అప్పుడే మహత్తరమైన శక్తి కీర్తి వస్తుంది.

(ద.స.98పు.42)

విశ్వామిత్రుడు గాయత్రీమంత్రమును కనిపెట్టెను. ఇది సూర్యశక్తికి సంబంధించినది. ఇది మహాశక్తివంతమైనది. మహామంత్రము. దీనిలో అత్యద్భుతమైనశక్తి యున్నది. ఆదిత్యహృదయం అన్న విద్యద్వారా విశ్వామిత్రుడు రామాయణములో రాములకు సూర్యశక్తి రహస్యాలను వివరించినట్లు రామాయణ పాఠకులకు విదితమే! ఆ మంత్రాన్ని ఉచ్చరించి భక్తిశ్రద్ధలతో విశ్వసించి అపూర్వమైన అస్త్రాలను సంపాదించి మహా సంపన్నుడైనాడు విశ్వామిత్రుడు. విశ్వామిత్రుడు ఈ శక్తిద్వారా **సృష్టికి ప్రతిసృష్టి చేసిన గొప్ప వైజ్ఞానికుడు. వైజ్ఞానికుడన్న కేవలము భౌతిక యంత్రాంగములతో అద్భుత శక్తిని కనిపెట్టువాడు కాడు. ఆధ్యాత్మికశక్తిని ఆధారము చేసికొని మంత్రద్రష్టుడై సాధనలు సలిపి శ్రద్ధాభక్తితో నిత్యాచరణలో ఈశక్తిని నిత్యానుభూతికి తెప్పించుకోగలిగిన వానినే పూర్వము వైజ్ఞానికుడని పిలచెడివారు. అయితే ఈనాటి వైజ్ఞానికులు అంతో యింతో చదివి తెలిసికొని దానిని కొండంతచేసి ఆడంబరములతో అత్యద్భుతశక్తిని** సంపాదించితిమని అహంకారముతో ఆకాశానికి ఎగురుచున్నారు.

(స.వా. పు. 157/158)

బలిచక్రవర్తి గుణములందు కూడా మహాబలుడే. కనుకనే అతనికి 'మహాబలి' అని పేరు వచ్చింది. అలాంటి చక్రవర్తి

ఏలిన 'కేరళ' సామాన్యమైన ప్రదేశం కాదు. ప్రపంచ పటంలో అది చాలా చిన్నదిగా కనిపించవచ్చు. కాని, అది భగవంతుడు వామన మూర్తిగా అవతరించిన పవిత్రమైన ప్రదేశం. విశ్వామిత్రుడు యాగము చేసినది అక్కడే. "ఓం భూర్భువస్సువః...." అంటూ మహాపవిత్రమైన గాయత్రీ మంత్రమును బోధించినది అక్కడే. ప్రపంచమంతటా ఈ మూడే ఉన్నాయి. **"భూః" - అనగా 'మెటీరియలైజేషన్', 'మెటీరియలైజేషన్ - దేహతత్త్వం. 'వైబ్రేషన్' - జీవతత్త్వం. ఇంక, 'రేడియేషన్' - దైవత్వం.** ఈ మూడూ మానవునియందే ఉన్నాయి. కనుకనే, నేను అప్పుడప్పుడు చెబుతుంటాను. "నీవు ఒక వ్యక్తి కాదు, నీలో ముగ్గురున్నారు. 1. నీవనుకునే నీవు (దేహం). 2. ఇతరులనుకునే నీవు (మనస్సు). 3. నిజమైన నీవు (ఆత్మ). ఈ సత్యాన్ని గుర్తించినప్పుడే నీవు నిజమైన మానవునిగా రూపొందుతావు." దేహముపై మమకారమును పెంచుకోకూడదు. అయితే, ఉన్నంతవరకు దీనిని కాపాడుకోవాలి. **కర్మమార్గమునకు దేహం ఆధారం. ఉపాసనకు మనస్సు ఆధారం. జ్ఞానమునకు హృదయం ఆధారం. ఈ మూడింటి ఏకత్వాన్ని గుర్తించాలి.**

(స.సా.అ. 2001 పు. 294)

(చూ॥ కామక్రోధలోభములు, బ్రహ్మర్షి, మాయ, వాల్మీకి, సీతతత్వము, సీతాకళ్యాణము, స్త్రీహత్య)

విశ్వాసము

భగవంతుడు ఏ సమయంలో, ఏ రూపంలో వచ్చి సహాయం చేస్తాడో గుర్తించడానికి వీలుకాదు. ఐతే, మీ హృదయంలో దృఢమైన విశ్వాసం ఉండాలి. మీలో దృఢమైన విశ్వాసం లేకపోతే భగవంతుడు ఏ సహాయమూ చేయలేడు.

(స.సా.అ.99పు.254)

"ఉదాత్తమైన బుద్ధితో, మహోన్నతమైన ఉత్సాహంతో ప్రేమ భరితమైన విశాల హృదయంతో, ఆత్మవిశ్వాసంతో, అంతర్యామియైన భగవంతుని పట్ల విశ్వాసంతో నీవీ లోకంలో సంచరించు. అప్పుడంతా మంచే జరుగుతుంది. **నీవెక్కడ నడచినా నేనక్కడున్నాను. నీవెవరిని కలుసుకున్నా ఆ వ్యక్తిలో నేనున్నాను. నేను ప్రతి ఒక్కరిలోను ఉన్నాను.** ప్రతి ఒక్కరిలో నుండి నేను పలుకుతాను. **నేను అంతటా నిండి ఉన్నాను** కనుక **నీవు నన్నొక స్థలంలో చూడలేవు. నీవు నన్ను తప్పించుకోలేవు. అంటే నాకు తెలియకుండా ఏదీ చేయలేవు."**

(లో.పు.135)

విశ్వాసమే మనకు మిత్రుడు అనేటటు వంటి తత్వమును ప్రబోధించినవాడు **విశ్వామిత్రుడు. అనగా, విశ్వమనే ప్రకృతియే మన ఫ్రెండ్** (friend). **విశ్వాసమనేటటు వంటిదే మన ఫ్రెండ్** (friend). **విశ్వాసముగా వుంటున్నప్పుడు, ఎంత పెద్ద కార్యమైనను సాధించగలము.**

(ఆ.రా.పు.266)

"మీలో కొందరు మీకేదైనా ఆశాభంగమైనప్పుడో లేక ఏమైనా యిబ్బంది వచ్చినప్పుడో నాచేత విస్మరింప బడినామని అనుకొంటారు. అయితే అటువంటి అడ్డంకులుమాత్రమే మీశీలాన్ని గట్టిపరచి **మీ విశ్వాసాన్ని సుస్థిరంగా ఉంచుతాయి.** గోడకు పటం వ్రేలాడ తీయాలంటే **పటం బరువును భరించే టంతగట్టిగా ఉందో లేదో అని మేకును గుంజిచూస్తావు.** అట్లాగే భగవంతుని రూపము నీమనోహృదయాలనుండి చెరగి శిధిలాలు కాకుండా ఉండడానికి **నీ హృదయాంతరాలలో బిగించిన మేకును (భగవన్నామమును) ఆచంచలంగా ఉందని నిశ్చయపరచుకోవడానికి గుంజి చూడబడాలి.**

(సా.అ.పు.86)

"ఆధ్యాత్మిక సాధనలో విశ్వాసము ఊపిరివంటిది. సందేహము సాధన యొక్క పునాదులను సైతం కదలించి వేస్తుంది. అందువలన దానిని తొలగించాలి. మనపూర్వులయొక్క విజ్ఞాన సంపదయందు విశ్వాసము కలిగియుండుము. మన మహర్షుల యొక్క స్వయం ప్రేరితమైన మనస్సును (Intuition) గాని, తద్వారా వారు కనిపెట్టిన గొప్పగొప్ప **విషయాలనుగాని నీ అల్పబుద్ధితో**

విశ్వాసము

శంకించకు. నీయందు నీవు విశ్వాసము ఏర్పరచుకో. ఇటువంటి విశ్వాసము ఏర్పరచుకోవటానికి అనేక సంవత్సరాలు పట్టవచ్చు. ఈ విశ్వాసము జీవితంలో ఉపయోగపడాలంటే, **నీ మనసులోగల విశ్వాసము నిరంతరాయముగాను, అచంచలమైనది గాను ఉండాలి. సాధనలో ఎదురయ్యే నిరాశా నిస్పృహలవంటి ఆటంకములను, భగవంతుని యందు మనకు గల విశ్వాసమును గట్టిపరచి మనలను ఉన్నత స్థితికి తీసికొని వెళ్ళడానికి ఆయనే కల్పించిన పరిస్థితులుగా ఆత్మసంయమనముతో స్వీకరించాలి.**

(దై.పు.328)

జీవాత్మ, పరమాత్మల భావపూరిత అనురాగసమ్మేళనము **గోపికల** గాథ యొక్క సారము. వారి **హృదయమే బృందావనముగా మారినది.** వారిలో కించిత్తైనా దేహ భ్రాంతి శేషముగా నిలచలేదు. **వారు కృత యుగములో ఋషులు, త్రేతా యుగమందు వానరులు, ద్వాపర యుగమందు గోప గోపికలు. నిజముగా వారు దేవతలే! "దర్శనం పాప నాశనం" "స్పర్శనం సంకట నాశనం", "సంభాషణం సంకట విమోచనం" అనే సూత్రములపై వారికి అమిత విశ్వాసము.** నిప్పు స్పర్శనమువలన బొగ్గులోని నల్లదనము నాశనమై అది కూడ ప్రజ్వలించు నిప్పుగా మారును కదా?

(స.సా.జూలై78 పు.101)

సచ్చిదానందం కోయంబత్తూరు సాయి సమితి కో-ఆర్డినేటర్. విశ్వాసమువల్లనే ఇంత విజయాన్ని సాధించాడు. దీనికంతా కారణం విశ్వాసమే. ఈ విశ్వాసమునకు ఏమి కారణమని మనము చూడనక్కరలేదు. విశ్వాసము beyond reason. ఎట్లనగా నీవు తల్లిని ప్రేమిస్తున్నావు. నీవు దేనివల్ల ప్రేమిస్తున్నావు? ఆమె తల్లి అన్న విశ్వాసము వల్లనే ప్రేమిస్తున్నావు. ఆమే నాతల్లి అన్న నమ్మకమే లేకపోతే నీవు ప్రేమించ లేవు. "He is my God" అనే నమ్మకమున్నప్పుడే ప్రేమ కలుగుతుంది. ఈ ప్రేమ ఎట్లు పెరుగుతుంది. అని కొందరు ప్రశ్నిస్తారు. ఈ ప్రేమ పెంచడానికి ప్రయత్నము చెయ్యనవసరం లేదు. **ప్రేమిస్తూ - ప్రేమిస్తూ పోతుంటే ప్రేమ పెరిగిపోతుంది. plus+plus= plus అయిపోతుంది.** మనము మొక్కను నాటాము ఎట్లా పెరుగుతుందని మనము దీనిని దినమూ సాగదీస్తుంటే అది చచ్చిపోతుంది. కానీ దానికి పొయ్య వలసినటువంటి నీరు, వెయ్యవలసినటువంటి ఎరువు వేస్తుంటే అదే పెరిగిపోతుంది. **నీ నమ్మకము, నీ శ్రద్ధ, నీ భక్తి వీటిని వేస్తుంటే అదే పెరిగిపోతుంది. శ్రద్ధే జ్ఞానంగా మారిపోతుంది. అందువల్లనే "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం"** అన్నారు. ఈనాడు మీరు ఎం.బి.ఎ.స్థితికి వచ్చారంటే మీ శ్రద్ధే దానికి మూలకారణం. ఈ శ్రద్ధే లేకపోతే మీరు ఇంత అభివృద్ధికి రాలేరు. అందుకే ప్రతిదానికి కూడా శ్రద్ధఃశ్రద్ధఃశ్రద్ధః!

ఒక్కొక్కరు ఒకో పదార్థాన్ని చూచి తృప్తి పడుతుంటారు. మరి కొందరు అసంతృప్తి పడుతుంటారు. ఈ టంబ్లర్‌లో half water ఉన్నది తృప్తికలిగినవాడు ఈ tumbler half full గా ఉన్నది అంటాడు. తృప్తి లేనివాడు ఇది half empty అని నిరాశపడతాడు. ఒకడు గులాబీ పుష్పాన్ని చూచి చాలా ఆనందిస్తాడు. మరొకడు దాని క్రిందనున్న thornచూచి భయపడతాడు. కనుకనే **సుఖము దుఃఖము అనేవి ప్రత్యేకముగా లేవు. మన భావములందే ఉంటాయి.** చూడండి Love is a flower. Lust is thorn. There is no rose without a thorn. So cut the flower but do not touch the thorn! నీవు చెయ్య వలసినదంతే. మనము కావలసిన దానిని తీసుకుందాము అక్కరలేనిదానిని వదలిపెడదాం. అవసరము లేనిదానితో నీవు వాదోపవాదము లెందుకు పెట్టుకోవడం? అవసరమైనది తీసుకో: అవసరం కానిది వదలిపెట్టు ఇటువంటి భావాలతో యువకులు దేశంలో ప్రవేశించారంటే ఎంతైనా దేశం బాగుపడుతుంది. పవిత్రమైన భారత దేశంలో దివ్యమైన సారమున్నది.

(స.సా.జూ.88పు.147)

జరిగిపోయింది పోయింది. మీరు ఎంత ప్రయత్నంచేసినా రాదు. Future గురించి యోచన చేయకండి. Future is

not sure. Present చాలా important. This, not ordinary present: omni-present. ఈనాడు మానవుడు అనేక దుఃఖములకు, అశాంతికి గురికావటానికి కారణం ఏమిటి? Present మరచి Future ను వెతుక్కుంటున్నాడు. Present ప్రధానంగానీ, ఆకలైనప్పుడు తట్టలోని అన్నం భుజించు. పదినెలల క్రిందట మా యింట్లో పండగ జరిగింది. ఆ పండగలో పంచభక్ష్య పరమాన్నములు చేశామని తలచుకొని ప్రయోజనం ఏమిటి? పది నెలల ముందు జరిగింది ఎందుకు యోచించాలి? Present ని యోచించు. Past-tree; future-tree, present-seed. past tree నుంచి Present seed వచ్చింది. Present seed నుండి future tree వస్తుంది. అందుకనే seed is very very very important. Present లో తగిన జాగ్రత్తగా ఉండాలి. Future గురించి ఏమాత్రం తలచకండి. Present మంచిగాఉంటే Future లో ఆటోమేటిక్‌గా మంచిగా ఉంటుంది. కనుక, Future ని గురించి worry అయితే సైకలాజికల్‌గా నిజంగా దుఃఖమే ఏర్పడుతుంది. చింతనే చేయకు. ఎందుకు worry చేయాలి? **What is the shape of Worry? It is mentally created fear only. ఈ** worry **కి ఏరూపు లేదు. నీ creation.** అలాంటి దీనికి అవకాశము యివ్వకండి. ఈ విధంగా ఉంటుంది. ఎప్పుడూ ఆనందముగా ఉంటుండండి. మా కెట్లా స్వామీ, ఇంటిలో అనేక చిక్కులుంటాయి. మాకు అనేక బాధలుంటున్నాయి. సంసారములో వ్యధలుంటున్నాయి. మేము ఎట్లా సుఖముగా ఉండటానికి వీలవుతుంది అంటారు. Worry చేస్తే Problems పోతున్నాయా? పోవటం లేదే. కనుక worry చేసి ఏమి ప్రయోజనం? కనుక happy గా ఉండు. Happiness నీ worry ని దూరం చేస్తుంది. అంతేగానీ worry గా ఉంటే యింకా ప్లస్ ప్లస్ అవుతుంది. నీవు worry చేయకూడదు. ఏది వచ్చినా **ఇది భగవత్ప్రసాదమే. Pleasure is an internal between two pains. రెండు కష్టముల మధ్యనే సుఖము ఉంటున్నది. కష్టములులేక సుఖము విలువ మనకు తెలియదు. చీకటి లేక వెలుగు యొక్క ప్రకాశము తెలియదు.** కాబట్టి కష్టములు కూడా ప్రసాదమే. మలేరియా జ్వరము వచ్చిన వానికి క్వినైన్ యిస్తారు. Bitter గా ఉంటుంది. కానీ దానిని నీవు కష్టపడి త్రాగినప్పుడే మలేరియా జ్వరము నివారణమైపోతుంది. మందుకూడా తీయగా కావాలని కోరితే వ్యాధి నివారణ కాదు. కష్టము కూడా సుఖము నందిస్తుంది. ఎప్పుడూ నీవు joyful గా ఉండాలి. అప్పుడే నీ జీవితము ఆనందము, ఆదర్శము నందిస్తుంది.

యువకులారా! శరీర సంబంధమైన విషయములుగానీ, future విషయములకుగానీ, కుటుంబ విషయములకు గానీ, మీరు హృదయములో ఏ మాత్రము చోటివ్వకండి. హృదయములో చోటు యివ్వవలసింది ఒక్కనికే. భగవంతునికే యివ్వాలి. Art అంతా outside ఉంది, heart inside ఉంది. Art అంతా heart నుండి వచ్చిందే. కనుక మొట్టమొదట heart ని చూసుకో, art ని చూడవద్దు: Reflection of the inner being. లోపల నీవు ఆనందంగా ఉంటే బయట ఆనందమే వస్తుంది. ఎందుకోసం? భగవంతుడు నావెంటనే ఉన్నాడు, హృదయమునందే ఉంటున్నాడు. అనే విశ్వాసము మనము పెంచుకోవాలి. అప్పుడే తగిన ఉత్సాహ ప్రోత్సాహములు అభివృద్ధి అవుతుంటాయి.

(శ్రీ.స.పు.64/66)

విశ్వాసము లేకపోవుటవలన మానవుడు నిరాస్పృహలకు గురియై పోతున్నాడు. కనుకనే మనము నమ్మకమనే టటువంటి దానిపై శ్రద్ధ అలవరచుకోవలయును. శ్రద్ధలేని మానవుడు ముందంజ వేయలేడు. శ్రద్ధ వలననే జ్ఞానము కలుగును. **"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం"** శ్రద్ధ వలన మానవుడు ఎంతటి వున్నత స్థానమునకు నైనా పోగలడు. కేవలము క్షణ భంగురములైన వాటిపై శ్రద్ధను అధికముగా పెంచుకొనరాదు. నిత్య సత్యమైన దైవ పదార్థముపైన శ్రద్ధ అభివృద్ధి చేసుకొనవలయును. **నమ్మకమే మనశక్తి.** ఆ నమ్మకమే లేకుండిన మానవుడు ఈజగత్తునందు కాని మరే జగత్తునందుకాని ఒక్కక్షణమైనను జీవించలేడు.

విశ్వము

రేపు అనే నమ్మకము ఉండబట్టే కొన్ని కార్యములు చేపట్టుతాము. నమ్మకం లేని వారు దౌర్భాగ్యులుగా రూపొందుతారు. కనుక **నమ్మకం చాలా అవసరం.**

(సా. పు 608)

పుట్టలో దేవుడున్నాడు. చెట్టులో దేవుడున్నాడు- అంటూ మనం అన్నింటిని పూజిస్తున్నాము. ఇట్టి సమత్వము ఒక్క భారతదేశమునందు తప్ప ఏ ఇతర దేశమునందూ లేదు. దీనిని ఎవరైనా హాస్యాస్పదం చేస్తుంటే మనమెందుకు ఊరుకోవాలి? వారిని ఎదుర్కొని సరియైన జవాబు చెప్పాలి. **"నాదేవుడు చెట్టులోనూ ఉన్నాడు, పుట్టలోనూ ఉన్నాడు. నా విశ్వాసం నాది. దీనిని కాదనటానికి నీ వెవరు? నీకు విశ్వాసం లేకపోతే నీవు వెళ్ళు"** అని చెప్పాలి. ఇంత చదువుకున్నవాడు ఇలా చెబుతున్నాడే; ఇంత గొప్ప సైంటిస్టు ఇలా చెబుతున్నాడే అనివారి మాటలు నమ్మి నీ విశ్వాసాన్ని కోల్పోరాదు. నీకు ఏ సైంటిస్టూ అక్కరలేదు. ఏ మేధావీ అక్కరలేదు. నీవు ఎవరికీ దాసుడవు కావు. ఎవరినీ ఆశ్రయించనక్కరలేదు. **నీ 'కాన్షియస్సే' నీకు ప్రధానం.** దానిని నీవు అనుసరించు. ఎవరనుకునేది వాళ్ళు అనుకుంటారు. వాళ్ళ మాటలు. వీళ్ళ మాటలు వింటే కట్ట కడపటికి నీవేమైపోతావో! కనుక, నీ అంతరాత్మను అనుసరించు. అదే నిజమైన విశ్వాసం. ఎవ్వరికీ నీవు భయపడనక్కరలేదు. ఆత్మ విశ్వాసాన్ని కలిగి భగవంతుని హృదయ పూర్వకంగా ప్రార్థించు.

(శ్రీ.భ.ఉ.పు.155)

(చూ॥ అయస్కాంతశక్తి, త్యాగము, పరమాత్ముడు, ప్రతిష్ఠించు, భవాని శంకర, యోగ్యము, సనాతన ధర్మము, సాయిశరీరము)

విశ్వము

(చూ॥ ఆత్మ)

విశ్వేశ్వరుడు

(సూ॥ సగుణభక్తి)

విషయజ్ఞానము

(చూ॥ అభేదజ్ఞానము)

విషయ వాంఛలు

విషయ వాసనలకు లోనయి 'దేహమే నేను' అనుభ్రాంతిలో పడి దైవానికి దూరము అవుతున్నాడు నరుడు. ప్రబల ప్రయత్నంతో విషయవాసలు దూరం చేయి.

(అ.త. పు.102)

(చూ॥ వైరాగ్యము)

విషాదయోగము

అర్జునుని విషాదంతో మొదలవుతుంది కాబట్టి భగవద్గీతలో ప్రథమాధ్యాయాన్ని విషాదయోగం అన్నారు. కాని **నిజానికది విషాదం కాదు, విచారణ.** ఈ యుద్ధం అసలు ఎందుకు చేయాలి? ఎవరికోసం? ఎవరిసుఖం కోసం ఈ యుద్ధం చేయవలసి వస్తోందో, వారంతా యుద్ధం చేసి చావడానికి కూడా సిద్ధంగా ఉన్నారు. అటువంటి పరిస్థితులలో ఈ యుద్ధం చేయడం వల్ల ప్రయోజనం ఏమిటి అని **విచారణ** సలిపాడు అర్జునుడు. అందువలన ఈ గీతలోని ప్రథమాధ్యాయమును **"విషాదయోగం" అనే బదులు "విచారణయోగం" అంటే సమంజసంగా ఉంటుంది.**

(శ్రీ.భ.ఉ.పు.2)

విష్ణువు

(చూ॥ చదువు, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు)

విష్ణుస్మరణము

(చూ॥ ఆనందము)

విసుగు

ధ్యాన, జప, సాధనలందు మనసు కుదరక, తలంచిన వాంఛ నెరవేరకున్న **విసుగును భగవంతునిపై చూపకుము.**

అది మరింత విసుగుపుట్టించి, కొద్దో గొప్పో పొందిన శాంతిని కూడా జారవిడచుకొందువు. ధ్యాన జప సమయమున అట్టి విసుగు, విరక్తి, నిరుత్సాహమే పడకూడదు. నీ సాధన లోపమని భావించి, సరిగా సాధించుటకు ప్రయత్నించు.

లోకమున సర్వసాధారణ విషయములందు ఇట్టి సహజ ప్రవర్తనలూ పరిశీలనలూ జరిపిననే పరమాత్మతత్వము అవలీలగా సాధించవచ్చును. కాన, ఈ సుబోధలను జాగ్రత్తపరచుకో. ఇవి నీ స్వామిపుట్టిన పండుగకు పంచిన పలుకు మిఠాయి అని ఆరగించు, ఆనందించు. బోధపడినదా?

(స.ని. పు. 19)

విస్తరి

అన్నీ వడ్డించిన విస్తరి అణిగి మణగి వుంటుంది. ఏమీ లేని విస్తరి ఎగిరెగిరిపడుతుంది.

(భ.ప్ర.పు.41)

విహారము

ఇంక విహారము మనము ఏవిధమైన ప్రదేశమునకు వెళ్ళాలి? ఏవిధమైన వాతావరణములో జీవించాలి? అనేవిషయమును చక్కగా విచారించాలి. ఎట్టి వారితో సంబంధబాంధవ్యమును పెంచుకోవాలి? దుస్సంగముతో మనము దూరముగావుండాలి. దుష్టులు చెలిమి దూరముగా ఉంచాలి. కారణమేమనగా ఎట్టి సంగమును మనము అనుభవిస్తామో అట్టి భావములు మనలో ఆవిర్భవిస్తాయి.Tall me your company, I shall tell you what you are అన్నారు. నీవు ఎలాంటి సంగముతో కూడి వుంటావో అలాంటి వాడుగా తయారవుతావు. కనుక దుస్సంగమును దూరముగా ఉంచాలి. కానీ యీనాటి యువకులకు దుస్సంగము చాలా అభిరుచిగా ఉంటుంది. దుష్కర్మలలో చాలా సులభముగా ప్రవేశిస్తున్నారు. దురాచారములు చాల సులభముగా జరుపుతున్నారు. **ఇది మానవ దేహమునకు సరియైన విలువ కాదు. "జంతూనాం నరజన్మ దుర్లభం" ఇంత దుర్లభమైన మానవజన్మ ఎత్తి మనము ఈవిధమైన పెడమార్గమును పట్టటము మానవత్వానికి తీరని లోటు** కనుకనే ఋషులందరు ఈదేహముచేత సత్కర్మలు ఆచరించే నిమిత్తమై భగవచ్చింతన చేసే నిమిత్తమై, ఏకాంత ప్రదేశమునకు వెళ్ళి తపస్సులు ఆచరిస్తూవచ్చారు. నీవుద్దేశ్యము అది కూడా ఒక బలహీనత. ఒక చిన్న ఉదాహరణ నీవు కోపాన్ని జయించాలని సంకల్పించుకున్నావు. అరణ్యములోకూర్చుని ఎన్ని సంవత్సరముల తపస్సు చేసినా నీవు ఈకోపమును జయించలేవు. **ఈ కోపమునకు కారణము యేమిటి? అని విచారించాలి.** ఏ స్థానములో నీకు కోపము ఆవిర్భవిస్తుండాది? జన సమూహములోనే కోపము ఆవిర్భవిస్తూండాది. కనుక నీవు జన సమూహమునందే వుంటుండి. ఆ కోపమును అరికట్టటానికి ప్రయత్నించాలి గాని ఏ జన సమూహములేని అరణ్యములోకి పోయి కోపాన్ని అరికట్టాననుకుంటే అది నీభ్రమగానే వుంటుంది. అరణ్యములో వుండినంతవరకు శాంతముగా ఉండవచ్చును. కాని తిరిగి నీవు గ్రామములో ప్రవేశించే టప్పటికి అది సిద్ధము సుమతీ అని ప్రవేశిస్తుంది.

(బృ. త్ర.పు.19)

(చూ॥ దేహము)

వృక్షము

"బ్రతికినన్నివాళ్లు ఫలము లిచ్చుటేగాక, చచ్చిచూడ తనువు కోసిఇచ్చు". ఈ వృక్షము కంటే త్యాగి మరొకటి ఉన్నదా; **"త్యాగమందు వృక్షంబె గురువు"** కనుక మానవత్వంలో త్యాగం అత్యవసరం. ఏనాటికైనా త్యాగం లేకుండా మనకు భోగంగాని, అనందంగాని లభ్యంకాదు. కనుక త్యాగానికి మనం ఇప్పటి నుంచే కృషి చేయాలి. "అల్ప బుద్దుల నెంత నాదరించినగాని, కీడు చేయు ఎట్టివానినైనా" కనుక మనం అల్పులం కారాదు. అధికులం కావాలి.

(శ్రీ. సె. 2001 పు. 12)

వృద్ధాశ్రమము

ఈనాడు అనేకమంది వృద్ధులు దిక్కులేని వారుగా జీవితాన్ని గడుపుతున్నారు: కుమారులు ఉండినప్పటికీ వారి ఇంట ఇంత తిండికైనా నోచుకోని దీన స్థితిలో ఉన్నారు. వృద్ధులు జీవించియున్నంతవరకు ఆనందంగా జీవించాలి. శోకభాష్పాలతో జీవితాన్ని అంత్యం గావించకూడదు. కడపటి శ్వాసను కూడా ప్రశాంతంగా వదలాలి. కనుకనే, ఈనాడు **కాడుగోడిలో** ఒక వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్నాము. ఇందులో ఎవరైనా వచ్చి చేరవచ్చు. లోకంలో ఎంతమంది శ్రీమంతులు లేరు! కానీ ఇతరులకు ఒక టంబ్లరు నీరైనా ఇచ్చే పుణ్యానికి పోరు. అది కాదు మానవ జీవితం. **వేదము "న కర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః"** అన్నది. త్యాగముద్వారా అమృతతత్వాన్ని పొందాలి. సత్యసాయి సంస్థలలో ప్రవేశించిన ప్రతి వ్యక్తి పరోపకారంలో ప్రవేశించాలి. గొప్పగొప్ప ప్రచారములు మనం చేయనక్కర లేదు: నిశ్శబ్దంగా మన పని మనం చేయాలి.

(స.సా.ఏ.99పు.88)

వెంకటేశ్వర స్వామి

(చూ॥ అయస్కాంతశక్తి, భక్తుడు)

వెతుకుచున్నాను

వెదకుచున్నాను। వెదకుచునే యున్నాను
వెదకుచుంటిని ఆనాడునేడు। నిజమానవ విద్యార్థిని॥
నరులు గలరు 5నూరుకోట్ల జగతిలోన
నర రూపములనే, చూచితిని। నిజరూపమును గాంచనైతిని॥
వెదకుచున్నాను నేను। వెదకుచునే యున్నాను।
వెదకుచున్నాను నాడు నేడు।నిజమానవ ధర్మపరుని।
బూరగకాయను చూచి।మామిడి యని భ్రమిసినట్లు।
వెర్రిచెఱకు కర్రను చూచి।చెఱుకనని తానమ్మినట్లు।
కణికిరాయి రూపుచూచి। కలకండని నమ్మినట్లు।
రూపమును చూచి మోసపోకు।గుణేశ్వరుని నిజరూపము॥

(సా. పు. 119/120)

వెఱువనక్కరలేదు

ప్రేమస్వరూపులారా! **దేనికి మీరు వెఱువనక్కరలేదు. తలపైన పిడుగు పడినా ఫరవాలేదు. మీరేమీ భయపడకండి. ప్రాణం పోతే ఒక్కతూరి పోతుందిగాని, రెండు తూర్లు పోదు కదా! ఈనాడు కాకపోయినా రేపైనా పోతుంది. కాబట్టి ప్రాణం పోతుందని మీరు భయపడనక్కర్లేదు.** దేనికైనా సిద్ధంగా ఉండండి. సత్యాన్ని అనుసరించడానికి మీరు భయపడకూడదు. సత్యాన్ని వదలుకొని, ప్రేమను వదలుకొని ఏదో ప్రాణం రక్షించుకోవాలని జపములు, తపములు చేస్తే లాభం లేదు. ఎవరేమనుకుంటారో అని భయపడకండి. ఎవరే మనుకున్నా మీకు వచ్చిన నష్టమేమిటి? మీ ఇష్టం మీది, వారి ఇష్టం వారిది. మీరేమీ తప్పు చేయటం లేదు కదా! **భగవంతుణ్ణి ప్రేమించడంలో తప్పేముంది?** ఆ ప్రేమచేతనే ప్రాణం వదలాలి. అంతే గాని, పిచ్చిపిచ్చి కలహాలకు, లేనిపోని సందేహాలకు అవకాశమందించకండి. ఎవరి కర్మను వారు అనుభవిస్తారు.

"ఎవరు చేసిన కర్మ వారనుభవించక
ఎవరికైనను తప్పదన్నా!
ఏనాడు ఏతీరు ఎవరు చెప్పాగలరు?
అనుభవించుట సిద్ధమన్నా!"

అయితే, మీరు నిరంతరము భగవచ్చింతన చేస్తూ ఉంటే మీకు ఎలాంటి బాధలూ సంభవించవు. అడవులలందున్న, ఆకసమునందున్న, పట్టణమునందున్న పల్లెనున్న, గుట్ట మీదనున్న, నట్టేట పడియున్న ఎక్కడున్నప్పటికీ భగవంతుడు మీ వెంటనే, జంటనే ఉండి మిమ్మల్ని కాపాడుతుంటాడు. ఎక్కడున్నా దైవత్వం మీవెంటనే ఉంది. జీసస్ అనండి, రామా అనండి, కృష్ణా అనండి; **ఏ పేరుతోనైనా పిలవండి. కాని, భగవంతుడు ఒక్కడే. గమ్యం ఒక్కటే. సత్యం ఒక్కటే. ప్రేమ ఒక్కటే. ఆ**

ప్రేమయే దైవం. కనుక, దైవత్వాన్ని విమర్శించడానికి ఎవ్వరికీ అధికారం లేదు: హక్కులేదు. విమర్శలన్నీ బూటకపు మాటలే.అవి దైవత్వాన్ని చలింపజేయలేవు. ఈ కలిప్రభావంచేత ప్రజలు ధనం కోసం ఎన్నో పాట్లు పడుతున్నారు. ధనంకోసం ప్రాణాలనుకూడా తీస్తున్నారు. ఎందుకిలాంటి తుచ్ఛమైన ధనము? ప్రేమధనమును సంపాదించుకోండి. ప్రేమయే అన్ని బాధలనూ నివారణ గావించగలదు.

(స.సా.జ.2001పు.7)

వెఱ్ఱితనము

చూచితే దైవాన్ని చూడవలెనేగాని
వేరు చూపులు చూడ వెఱ్ఱితనము
నడచితే వైనముతో నడవవలెను గాని
వేరు మార్గము నడవ వెఱ్ఱితనము
పలికితే సత్యాన్ని పలుకవలెనేగాని
వేరు పలుకులు పలుక వెఱ్ఱితనము
పాడితే తత్వాలు పాడవలెనే గాని
వేరు పాటలు పాడ వెఱ్ఱితనము
విన గోరిన హరిభజనలు వినగవలయు
చూడ కోరిన దైవాన్ని చూడవలయు
చేరవలసిన దైవాన్ని చేరవలయు
ఇంత కంటెను పరతత్వమేమి కలదు?
సాధు సద్గుణ గణ్యులే సభ్యులారా!

(శ్రీ.వ.1991 పు.81)

వెలుగు

నేను వెలుగులో నున్నాను నేనె వెలుగు
వెలుగు నాలోన నున్నది వెలుగు నేనె
అన్న భావము హృదయాన హత్తుకొన్న
అట్టి జ్ఞానియె బ్రహ్మలో ఐక్యమగును.

(బృ.త్ర.పు.179)

వేణుగానము

ఒకానొక సమయంలో బృందావనంలో గోపికలు, గోపాలురు కృష్ణుని చుట్టూ చేరినారు. అందులోను ఈ గోపికలు పిచ్చివారు. ఏ పిచ్చి? **భగవంతుని పిచ్చి,** కాని, నేటి పండితులు దీనిని అర్థం చేసుకోలేక అసభ్యకరమైన, అమర్యాదరకమైన విషయాలను ప్రబోధిస్తూ వస్తున్నారు. **గోపికల ఆటపాటలయందు ఆధ్యాత్మిక తత్వమే ఇమిడియుంటున్నది. కించిత్తైనా లౌకికము వారిలో కనిపించదు.** ఒక గోపిక అన్నది, **"కృష్ణా! నీ వేణుగానమును మేము వినాలి. నీ వేణుగానములోని నాదమే మాకు ప్రాణము. అదే మా జీవితము."**

"పాట పాడుమా కృష్ణా!
పలుకు తేనెలొలుకు నటుల
మాటలాడుమా ముకుంద
మనసు తీరగా...
వేదసారమంత తీసి
నాదబ్రహ్మముగను మార్చి
వేణువందు తిరుగబోసి
గానరూపముగను మార్చి
పాటపాడుమా కృష్ణా!"

ఇందులో ఏవిధమైన లౌకిక భావమూ లేదు. **"ఎన్నో వేదము లున్నవి. స్త్రీలమైన మేము ఎన్ని చదువగలం? ఈ వేదములు మాకేమీ తెలియవు. వాటి సారమునంతా సూక్ష్మంగా మా కందించు. బ్రహ్మ నాదస్వరూపుడు. కనుక, వేదసారమునంతా తీసి నాదబ్రహ్మముగా మార్చి వేణువునందు తిరుగబోసి మాకు అందించు"** అన్నారు. ఎంతటి దివ్యమైన భావములు చేరాయి ఆ గోపికలలో!

(స.సా.అ.95 పు.265)

వేణువు

పరమాత్ముని నీ చెంతకు రప్పించుకునే సామర్థ్యం నీకు వుంటే తనంతట తానేవచ్చి నీ సరసన నిలబడుతాడు. **వేణువులాగా సరళంగా, తేలికగా ఉండాలి.** ఆయన వూదే

వేతనము

నాలుక లోపల అడ్డం ఏదీ ఉండరాదు.అప్పుడు కిందికి వచ్చి కరాలతో అందుకుంటాడు. తన సుకుమార కరాంగుళులతో స్వరాలు చేస్తూ మీ మేనులను వేణువులుగా దివ్య మధుర సంగీతంతో నింపివేస్తాడు. ఈ వేణువును పట్టుదట్టీలో దాచుకుంటాడు. కోమలాధర స్పర్శ అనుగ్రహిస్తాడు. తన చేతులలో ధరించి గౌరవం చేకూర్చి నలుగురికి ప్రదర్శిస్తాడు. ఆయన హస్త స్పర్శతో అణువు ఘనమై అల్పవస్తువు మహత్తరమై అలరారుతుంది.

(శ్రీ.స.సూ.పు.59)

వేతనము

రామచంద్రుడు ఆ నావికునకు వేతనము నిచ్చుటకు తనచెంత చిల్లిగవ్వయైననూ లేనందున చాల సిగ్గు పడినటుల నటించెను. రామహృదయమును యెరిగిన జానకి తన వ్రేలియందలి ఉంగరమును తీసి రామహస్తముల యందుంచెను. రాముడు, ఓయీ! నావికా, ఇదిగో **నీ వేతనము, పుచ్చుకొనుమని పలికెను. అంత నావికుడు రామచంద్రుని పాదములపై బడి "రామా! రామా! ఈనాడు నా జన్మ సాఫల్యమయినది. నా సర్వపాపములూ పటాపంచలయినవి. నా భవరోగము తీరినది. అనేక జన్మలుగా శ్రమపడుచుండిన నా శ్రమకు నేడు నా విధాత నాకు ప్రాప్తించి, నా వంశమునే తరింపజేసితిరి. నాథా, మీ అనుగ్రహ మొక్కటుండిన చాలును.** తిరిగి తమరు వచ్చునపుడు నన్ను మరువక ఇట్టి సేవ నాకు కటాక్షించిన ధన్యుడనయ్యెదను'' అని పాదములపై బడి ఆనందబాష్పములతో ప్రార్థించెను. అంత రామలక్ష్మణులు పలువిధముల ఆ నావికుని ఓదార్చి బోధించి వేతనమును పుచ్చుకొమ్మని నచ్చజెప్పిరి. అయితే ఆ నావికుడు స్వామీ! రామచంద్రా, **నేను మిమ్ముల నొక్కరినీ ఈ చిన్న గంగానది దాటించినందుకే నేను వేతనము పుచ్చుకొన్న తమరు కోట్లకు కోట్లు నా తరమువారలను నాతోటి మానవులను సంసార ప్రవాహమును దాటించి మోహసాగరమును దాటించుచున్నారే, ఇందుకు తమరేమి వేతనమును పుచ్చుకొనుచున్నారు?** ఈ స్వల్ప కార్యమునకు నేనెంతో అదృష్టవంతుడనని ఆనందించుచుండ, నా ప్రాప్తిని దూరము చేయుట తమకు భావ్యము కాదు, రామా, అని దీనుడై ప్రార్థించెను. రాముని హృదయము కరిగి అతనిని తొందరపెట్టుట మంచిదికాదని తలంచి హృదయ పూర్వకంగా ఆశీర్వదించి అతనిని దీవించి పంపెను.

(రా.వా.మొ. పు. 274/275)

వేదమంత్రములు

(చూ॥ యజ్ఞము)

వేదము/వేదములు

వేదములన్నీ ద్వైతములే. వేదాంతము ఒక్కటే అద్వైతము. వేదములందు 'అది కావాలి, ఇదికావాలి' అనే ఆశలు మెండుగా వుంటున్నాయి. చిన్నఉదాహరణ: నాకు గాలి కావాలి. గాలికూడా ఎట్లావుండాలి నాకు అనుకూలమైన గాలిగా ఉండాలి. వత్తిడి పెట్టే గాలిగా వుండకూడదు. హింసింప చేసే గాలిగా ఉండకూడదు. నాకు అవసరమైన గాలి మాత్రమే కావాలి. అదీ ఒక కోరికే. వేదములన్నీ వాంఛలతో కూడినవే. ద్వైతముతో కూడినవే. కనుక **మనం యజ్ఞము చేసే సమయంలో మొదటి ఆరు దినములు వేదము పఠిస్తారు. ఏడవ దినము ఉపనిషత్తులు ప్రారంభిస్తారు. ఉపనిషత్తులే అద్వైతము. ఏమిటి అద్వైతము. ఒక్కటే దర్శనము. "అద్వైతదర్శనం జ్ఞానం" అన్నారు కట్టకడపటికి. జ్ఞానమే అద్వైతము. "జ్ఞానాదేవతు కైవల్యం".** తద్వారా ఎంతైనా పొందవచ్చు.

(ద.స.స.పు.68)

ప్రాచీన వేదములను తూలనాడకండి. అవి నాగురించిన సత్యాన్ని స్థిరపరచుకొనటానికి మీకు అధికారికమైన ఆధారాలు. వాటిని చదవటం ద్వారా మీరు భగవంతుని దివ్య వైభవం గ్రహించవచ్చు **మీ భక్తి మరొక రూపనామముల**

మీద ఉన్నప్పటికీ విష్ణువును లేక శివుణ్ణి నిందించకండి. అంతెందుకు? మీరు ఒక వ్యక్తిని ఆగౌరవించినాసరే మీరు నన్ను అగౌరవించినట్లే. కారణం అతనిలోను నేను ఉన్నాను కాబట్టి! అతనిలో ఉన్న ఆత్మను గౌరవించండి. మీ తత్వం కూడా ఆత్మతత్వమే. అందువల్ల మిమ్మల్ని మీరు గౌరవించుకోండి. **ఈ ప్రాథమికమైన సత్యాన్ని అవమానపరచే పని యేదీ చేయకండి.**

(వ.61-62 పు.169)

వేదములు అనంతములు **"అనంతో వైవేదః"** కానీ వీటి అన్నింటిలోని సారమును గైకొని నాలుగుగా విభజించి, లోకకళ్యాణ నిమిత్తము ప్రచారము జరిగెను. అవే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదములని ఇవి నాలుగు భాగములుగా మానవులను తరింపజేసి ధర్మమును నిలబెట్టి సత్యమును చాటి ఆరాధనలతో, అర్చనలతో, గానముతో అస్త్ర శస్త్రములతో జగత్కల్యాణమును గావించినవి, సమస్త మానవులకు నిత్య జీవితములో ఆదర్శవంతమును నిరూపించినవి. ఏ కార్యము జరిగిననూ భారతీయులకు అది తెలిసిననూ, తెలియకపోయిననూ, యేదో ఒక విధముగా అది వేద ప్రమాణము ననుసరించే యుండును. పెండ్లి **మొదలు శ్రాద్ధమువరకూ భారతీయులు వేదప్రమాణమునే అనుసరించుచున్నారు. అట్టి ఆధార ప్రమాణరూపమైన వేదమును విస్మరించుట భారతీయుల లక్షణముకాదు.** ద్వైతముననో, అద్వైతముననో, లేక విశిష్టాద్వైతముననో భారతీయులు తమ జీవితమును ప్రమాణబద్ధముగానే అనుభవించుచున్నారు. అయితే తెలిసి అనుసరించిన, ఆచరించిన, దాని ఫలము మరింత అధికమగును. ఆనందము లభించును.

"వేత్తిఇతి వేదః" అనగా మానవుడు తన కర్మకాండను, జ్ఞానకాండను వేదబలమునుండే గ్రహించగలడు. వేదములు మానవుని పుట్టుక నుండీ మరణమువరకు అతని కర్తవ్యమును బోధించుచున్నవి. అనగా మానవుని అన్ని ఆశ్రమములను గురించి వివరించుచున్నవి. ఈ వేదసార గ్రహణార్థము కాలానుక్రమముగా వేదాంగములు, పురాణ, ఇతిహాసములు ఏర్పడెను. కనుక మానవులు యదార్థమగు మానవత్వమును గ్రహించ వలెనన్న వేదవేదాంగముల ప్రాబల్యమును ముందుగా తెలుసు కొనవలెను. కనుకనే ప్రాచీన కాలమున భారతీయులైన పూర్వీకులు, వేదాధ్యయనమునకు ముందుగా వేదాంగము లను గురుకులములలో నిర్బంధముగా బోధించెడివారు. అనగా ఆ కాలములో భారతీయులు చతుర్దశ విద్యలను అభ్యసించెడివారు.

ఆనాటి వేదాధ్యయనములో కంఠస్థీకరణ, విద్యకు అధిక ప్రాముఖ్యత నిచ్చిరి. **వేదాధ్యయన మొనర్చినవానిని "జడము" అని పిలుచుట అలవాటు ఆనాడు.** అనగా అతనికి ఏమీ రాదని కానీ, తెలియదని కానీ అర్థము కాదు. అనుకోరాదు. **వేదాధ్యయనము చేసినవానికి సర్వము అవగత మగునని దీని అర్థము. వేదాధ్యయనముచే మానవుడు సర్వజ్ఞుడు అని చెప్పబడెను.** కాగలడని నుడువబడెను. కావున నరుడు తన జీవిత సాఫల్యమునకై వేదాధ్యయన మొనర్చుట యెంతైననూ అవసరమరనియూ వేదప్రమాణములే భారతీయుని నిత్యజీవిత ప్రధానములని భారతీయ పరమార్థ వాహిని తెలుపుచూ వచ్చెను.

ఇందులో **మొదటిది ఋగ్వేదము. ఇది పది మండలములుగా విభజించబడినది.** మొదటి నవమండలములో అగ్ని, ఇంద్రుడు, మరుత్తు, ఉషస్సు మున్నగు దేవతలను గురించిన సూక్తులున్నవి. చరిత్రకారులు ఈ ఋక్కులు యెట్లు ఏర్పడినవి అను విషయమును కొన్ని ప్రమాణములతో చెప్పిరి. ఆనాటి ఋగ్వేద మానవులు తమకంటే అగ్ని, వాయువువంటి దేవతలను ప్రత్యేకంగా భావించిరి. మానవులకన్నా ఈ విశిష్ట దేవతలు, విశిష్టశక్తి కలవారని గుర్తించిరి. అందువలననే దేవతల గుణములను గురించి విశేషముగా వర్ణించిరి. **ఇక రెండవది యజుర్వేదము. ఇందులో కృష్ణ యజుర్వేదమునియూ, శుక్ల యజుర్వేదమునియూ రెండు శాఖలున్నవి.** ఈ వేదములో గంగానదీ తీరముకూడా

వర్ణింపబడినది. ఈ వేదములోనే ఉత్తర మీమాంస విషయములుకూడా విశదముగా చెప్పిరి.

ఆనాటికే మానవులు అరణ్యము, గ్రామము అని విభజించి గ్రామములలో నివసించిరి. ఇట్లు **యజుర్వేదమును విభజించుటకు మరొక ప్రమాణము కూడా వున్నది. యజుర్వేదమును సప్తకాండగా విభజించి దానిలో అరణ్యమని అనగా అరణ్యములోనే అభ్యసింపవలసినదని చెప్పుటచే, పైచెప్పిన గ్రామము,** అరణ్య విభజనము వ్యక్తము అగుచున్నది. **మూడవదైన సామవేదము. ఈ వేదములో ఋగ్వేదములో చెప్పబడిన అనేక ఋక్కులు, సస్వరముగా చెప్పబడినవి.** అందువలననే సామవేదము స్వరప్రధానమైనది. ఈ వేదము ఋగ్వేద, యజుర్వేదములకన్నా అర్వాచీనము. ఋగ్వేదకాలములో సింధూతీరమున నివసించిన ఆర్యులు, యజుర్వేద కాలమునకు గంగాతీరమునకు తరలివచ్చిరి.

సామవేద కాలములో భారతదేశముయొక్క మధ్య భాగమునకు వ్యాపించిరని అభిప్రాయపడిరి. ఈ సామ వేదమునకు గానవేదమని కూడా పేరు. లోకములోని అన్ని విధములైన సంగీతము ఈ సామగానమును ఆధారము చేసుకునే అభివృద్ధి గాంచెను. గానమునకు మూలము సామవేదము. సమస్త స్వరములూ దీనిలో యిమిడి యుండును.

నాలుగవది అథర్వణ వేదము. అనేకమంది అనేక విధముల దీనిని వర్ణించిరి, తెలిపిరి. కొందరు దీని వేదత్వము నంగీకరించలేదు. మరి కొందరు మిగిలిన వేదములలోని శేషమే ఈ అథర్వణ వేదమని నుడివిరి. మిగిలిన **వేదములలో దేవతలయొక్క శక్తి సామర్థ్యములే చెప్పబడినవి.** కానీ యోగాభ్యాసముచేత మానవుడు కొన్ని అద్భుత కార్యములను తన **శక్తి సామర్థ్యములచేత** చేయవచ్చునని చెప్పుట ఈ అథర్వణ వేదము యొక్క వైలక్షణ్యము, అష్టయోగము, హఠయోగము, తిరస్కరణి విద్య ఇత్యాదులు ఈ వేదమువల్లనే సిద్ధించినవి. దేవతా ప్రసాదముచే అసాధ్యమైన కార్యములను కూడా సాధింపగలడు. కాన వేదాలు చాలా ముఖ్యమైనవనియూ, వానిలో అన్ని విషయములూ చెప్పబడినవనియూ భావించ వలెను. వేదములే భారతీయ సంస్కృతికి మూలములు. ఈ వేదములు అపౌరుషేయములు, స్వయంభువములు.

(స.వా. పు. 62/65)

ఈ జగత్తును ఎవడు సృష్టించెనో, ఎవడు కాపాడెనో ఎవని లోనికిది నియమితకాల పరిణామానుసారముగా లయించునో, మరల కొంత కాలమునకు ఈ అద్భుత జగద్రూపమున గోచరించుచుండునో ఆ ఈశ్వరుని తెల్పునది వేదము.

(స.వా. పు. 30)

వేదములనగా మంత్ర ద్రష్టలైన మహర్షుల యొక్క సత్యవాక్యముల సముదాయము. **పరమేశ్వరుని యొక్క ఉచ్ఛ్వాస నిశ్వాసములే వేదము. త్రిలోకములందు, తిరుగులేని సత్యమును ప్రబోధించినదే వేదము. త్రిలోకవాసుల యోగ క్షేమములను పురస్కరించుకొని శాంతి సౌఖ్యములనందింప చేయునదే వేదము.**

వేదము -విత్. అనే ధాతువు నుండి పుట్టి నటువంటిది. ఇదియే జ్ఞాన స్వరూపము. ఇష్టసిద్ధిని గావించుటకుగానీ, అయిష్టములను దూరము గావించుటకుగానీ, తగిన ఉపాయములను ప్రబోధించునదే వేదము. **"అనంతో వై వేదః"** అని అఖండమైన, అనంతమైన ఈ వేదమును మానవులభ్యసించడము చాలా కష్టతరముగా ఉండేటటు వంటిది. పూర్వము వేదము ఒక్కటిగా మాత్రమే ఉండేది. దీనిని అధ్యయనము చేయుటకే కాలమంతా వ్యర్థము గావించి ఆచరణయందు విచారణయందు అనుభవించుటకు ఆసాధ్యమని తలంచి, వ్యాసులవారు దీనిని విభజిస్తూ వచ్చారు.

అమోఘమైన వేదమునుండి ఋక్కులను వేరు చేసి దీనిని ఋగ్వేదమనియు, యజుస్ లను వేరుచేసి యజుర్వేదమనియు, సామములను వేరు చేసి సామ వేదమనియు, మూడు విధములుగా విభజిస్తూ వచ్చారు. మంత్రములకు సంహితమని ఒక పేరు. కనుకనే వీటికి

ఋగ్వేద సంహితము, యజుర్వేద సంహితము, సామవేద సంహితము అని పేర్లు పెట్టారు. ఇందులో ఋగ్వేదము దేవతాస్తుతి స్వరూపము. ఈ స్తుతి స్వరూపమైన ఋగ్వేద మంత్రములను అనంతమైన దివ్య భావము చేత స్మరిస్తూ వచ్చారు **ఆనాటి ఋషులు, యజుర్వేదము మంత్ర స్వరూపమైనటువంటిది, దేవతా స్వరూపమును పూజిస్తూ రావటము. ఈ యజుర్వేదమంత్రము లను యజ్ఞ, యాగాది, క్రతువుల యందు, దాన ధర్మాది సత్ కర్మలందు ప్రవేశ పెట్టుతూ వచ్చారు.**

ఒక్కొక్క వేదమును మూడు భాగములుగా విభజిస్తూ వచ్చారు. దీనినే బ్రాహ్మణములని (మంత్రములు), అరణ్యకములని, ఉపనిషత్తులని అన్నారు. అయితే, ఈ మంత్ర సంహితము నందు పరిపూర్ణ మంత్రములే ఇమిడి ఉండేవి. ఈ బ్రాహ్మణములలో ఎక్కువగా కర్మకాండ మాత్రమే కాకుండా దీనికి అనుచరణకు మంత్ర, ఉపదేశ, జ్ఞాన యజ్ఞములను అనుసరించుటకు మార్గములను అవలంభిస్తూ వచ్చింది. బ్రాహ్మణములలో మరి మూడు విధములుగా అభివృద్ధి గావించుకొంటూ వచ్చింది. తైత్తిరీయ, ఐత్తిరీయ, శతపథ బ్రాహ్మణమని, ఇవన్నీ మంత్ర స్వరూపమైనవి. ఈ విధమైన మార్పులు చేత, దేశ కళ్యాణము, మానవోద్ధారణ, యోగ క్షేమ ములకే విభజిస్తూ రావడము జరిగింది.

యజ్ఞ, యాగాది, క్రతువులవల్ల లోక క్షేమము ఏర్పడుతుంది, దీని ప్రభావము వలన సకాల వర్షములు సంభవిస్తాయని, సుభిక్షముతో జీవిస్తారని నమ్మకం. ఇవన్నీ కర్మకాండలతో కూడిన వగుటవల్ల యజ్ఞ, యాగాది, క్రతువులవల్ల వర్షము సంభవించటము, సస్యశ్యామలము అభివృద్ధిగావటం, పంటలు అభివృద్ధి గావటము, తద్వారా మానవ జీవితమునకు, తిండి తీర్థాదులకు లోటులేకుండా సుఖ జీవనము గడపటము, ఇత్యాది ఫలితములను అనుభవిస్తూ వచ్చారు.

అరణ్యకములు: గృహస్థాశ్రమము అనుభవించిన తర్వాత ఏకాంతముగ అడవులకో, సమీప వనములకో వెళ్లి భగవత్ చింతనము గావించుకుంటూ వారు స్మరించినటువంటి భావములను మంత్రములచేత అభివృద్ధి చేసుకుంటూ వచ్చినారు. భావోద్రేకముతో ఆవిర్భవించిన ఈ భావములను మంత్రములుగా చేకూర్చుచూ, వానినే నిరంతరము స్మరించుకుంటూ, చింతించు కుంటూ రావటముచేత వీనికి అరణ్యకములని పేరువచ్చినది. అరణ్యకములన్నియు ఎక్కువ భాగము కర్మకాండతో కూడి ఉంటున్నవి, చివర మాత్రము బ్రహ్మకాండగా రూపొందుతుంది. ఈ బ్రహ్మకాండనే యజ్ఞ యాగాదులకు ఉపయోగపడుతూ వచ్చినది.

యజ్ అనే ధాతువునుండి ఆవిర్భవించినది యజుర్వేదము. ఇది పరిపూర్ణముగా దేవతా స్వరూపాన్ని చింతించటమే, స్మరించటమే, పూజించటమే. **ఈ యజుర్వేదమును రెండు విధములుగా విభజించినారు. ఇవే కృష్ణ యజుర్వేదము, శుక్ల యజుర్వేదము. వీటికి రెండు సిద్ధాంతాలున్నాయి. బ్రహ్మ సాంప్రదాయమొకటి, ఆదిత్య సాంప్రదాయము రెండవది. బ్రహ్మ సాంప్రదాయమే శుక్ల యజుర్వేదము. ఆదిత్య సాంప్రదాయమే కృష్ణ యజుర్వేదము.** కృష్ణయజుర్వేదము దక్షిణ భారతదేశమునందు, శుక్ల యజుర్వేదము ఉత్తర భారతదేశమునందు అభివృద్ధి అవుతూ వచ్చినవి.

వేదముల పేర్లు : ఈ వేదము తొమ్మిది పేర్లతో పిలువబడుతూ వచ్చినది. **శ్రుతి, అనుస్వర, త్రయీ, ఆమ్నాయము, సమామ్నాయము, ఛందస్, స్వాధ్యాయ, గము, ఆగము అనునవి.** కారణము లేకుండా ఈ పేర్లు అభివృద్ధికి రాలేదు.

శ్రుతి: గురువు చెప్పినట్లుగా శ్రద్ధతో విని, ఆశబ్దమును అదేరీతిగా ఉచ్చరించి, అధ్యయనము చేసి వేదమును అభివృద్ధి గావించటము. అనగా వినికిడిచేతనే దీనిని అధ్యయనము చేయటము.

అధ్యయనము చేసిన దానిని మననము చేసి స్మరిస్తూ పోషించుకుంటూ పోవడము **అనుస్వర అన్నారు.**

త్రయీ: పూర్వము ఋగ్వేదము, యజుర్వేదము,

వేదము/వేదములు

సామవేదము ఈ మూడు వేదములు మాత్రము అపౌరుషేయములని అనే వారు. **యజుర్వేదము నుంచి తీసి వేరు చేసిన మంత్రములు అధర్వణ వేదము. కనుకనే ఈ మూడు వేదములకు త్రయీ** అని పేరు వచ్చినది. **అమ్నాయము: "మ్నా" అనే ధాతువుకు నిరంతరము చింతించటము, అభ్యాసము చేయుటము అని అర్థము. అభ్యాసము వల్ల ఇది అభివృద్ధి అవుతుంది కనుక దీనికి అమ్నాయము, సమామ్నాయము అని పేర్లు వచ్చినవి.**

ఛందస్సు : కప్పిపుచ్చి, వ్యాప్తి గావించటమనేది ఒక అర్థము. వేద మంత్రముల కన్నిటికి ఛందస్సు అని పేరు. సామవేదము అంతయూ ఛందస్సులో నిండి ఉంది.

స్వాధ్యాయము: ముత్తాతలు, తాతలు తండ్రుల ద్వారా **సాంప్రదాయంగా వేదము అభివృద్ధి గావించటముచేతనే దీనికి స్వాధ్యాయమని పేరు.** కేవలము గ్రంథములతో పరిచయ మయేటటువంటిది కాదు. గురు శిష్య పరంపర చేతనే, శ్రవణము చేతనే అభివృద్ధి గావించబడినది. పరంపరంగా స్వాధ్యాయం గావించడము వల్ల వచ్చింది కనుకనే స్వాధ్యాయమని పేరు వచ్చినది.

గమ, ఆగమ: భగవంతుని ఉచ్ఛ్వాస నిశ్వాసముల నుంచి ఏర్పడినది కనుకనే గమ, ఆగమ అని పేర్లు వచ్చింది. ఏతావాతా వేదము లన్నియూ భగవంతుని ఉచ్ఛ్వాస నిశ్వాస స్వరూపములే. మంత్రద్రష్టలైన మహర్షులు దీనిని అష్టఅక్షరములతో శ్రవణము చేసినారు- అకచటతపయశ అనే ఎనిమిది అక్షరముల చేతనే వేదము లన్నింటిని అనేక విధములైన స్వరములు వేసి అనేక కోట్ల అక్షరములుగా అభివృద్ధి గావించుతూ వచ్చినారు. మహర్షులు వీటిని అనేక విధములుగా పోషించుకుంటూ వచ్చినారు.

ఈ వేదములకు అనేక శాఖలు, ఉప శాఖలు ఉండేటటువంటివి. ఋగ్వేదమునకు 20 ప్రధాన శాఖలు, 21 ఉపశాఖలు కానీ దురదృష్టవశాత్తు, కాలగర్భములో కలిసిపోయి ఇప్పుడు 3 శాఖలు మాత్రమే నిలిచి పోయినాయి. యజుర్వేదములో 96 శాఖలు ఉండేవి, కానీ 2 శాఖలు మాత్రమే ఇప్పుడు నిలిచిపోయినాయి. సామవేదము **1000 శాఖలలో ఉండేటటువంటిది. అది కూడా ఇప్పుడు 3 శాఖలతో నిలచి పోయినది. ఈనాడు మిగిలిన ఇంత తక్కువ శాఖలలోనే ఇంత అనంత జ్ఞానము ఇమిడి ఉండగా గతించిన శాఖలన్నీ ఉండిపుంటే భారతీయులు ఎంత ప్రజ్ఞావంతులై ఉండేవారో? వేదములను అలక్ష్యము చేస్తూ రావటముచేతనే భారతీయుల ప్రజ్ఞాన విజ్ఞానములు కూడా క్షీణిస్తూ వచ్చినాయి.** సంకుచిత భావములు పెరుగుతూ వచ్చినాయి. విశాలమైన విశిష్టతలు క్షీణిస్తూ పోయినాయి. ఈనాడు వేదములంటే అయిష్టపడేవాళ్లు, అసహ్య పడేవాళ్ళు విరివిగా పెరుగుతూ పోతున్నారు. అసలు ప్రధానమైన బ్రాహ్మణులయందు ఈ విధమైన భక్తి శ్రద్ధలు తగ్గిపోతూ వచ్చినాయి.

బ్రాహ్మణులనగా ఎవరు? బ్రహ్మ అనగా మంత్ర స్వరూపము. మంత్ర స్వరూపములైన అర్థములను నిరంతరము స్మరిస్తూ రావడము చేత వారు బ్రాహ్మణులనబడినారు. ఈనాడు అట్టి బ్రాహ్మణులే అట్టి మంత్ర స్వరూపమైన దైవమును విస్మరిస్తూ వచ్చినారు. ఆధునిక విద్యలు అభివృద్ధి గావటము చేతనూ, ఆశలు పెరిగి పోవటము చేతనూ, ఉత్తమ భావములు క్షీణించుట వల్లనూ, సంకుచిత భావము పెరగటము వల్లనూ, తమ దివ్యత్వాన్ని తామే కోల్పోతూ వచ్చినారు. కనుకనే యోగక్షేమములు క్షీణిస్తూ వచ్చినాయి, శాంతి భద్రతలు కోల్పోతూ వచ్చినారు.

వేదములంటే ఏమిటి? ఎరుక అని ఒక అర్థము, తెలివి అని మరొక అర్థము, వివేకమని మరొక అర్థము. తెలివి కావాలనేవారు, వివేకవంతులు కావాలని కోరుకొనేవారు, వేదాన్ని అభ్యసించేవారు. ఈనాడు మేధాశక్తి పెరిగి పోతున్నా కృత్రిమముగా పెరుగుతూపోతున్నది ఏ విధముగా పదవులు పొందాలి? ఏ విధముగా ధనమును అభివృద్ధి గావించుకోవాలి? ఏ విధముగా భోగభాగ్యము అనుభవించాలి? ఏ మార్గమున శాంతి భద్రతలు పొందాలి? అనేటటువంటి ఆశలు మాత్రమే. కానీ సద్గుణవంతులు

కావాలి, సదాచార సంపన్నులుగా మారాలి, దివ్యమైన మార్గములో ప్రవేశించాలి, బ్రహ్మ పాదాన్ని పొందాలి అనేటటువంటి ఉన్నత భావాలు ఈనాడు సన్నగిల్లిపోతూ వచ్చాయి. వీరి తెలివితేటలన్నియూ, అల్పమైన మార్గములో స్వార్థ స్వప్రయోజనములైన మార్గములలో ఉపయోగ పరుస్తూ వస్తున్నారు. మానవత్వమును మరచిపోతూ వున్నారు. మానవాకారము మాత్రమే నిలిచింది కానీ మానవత్వము లేని మానవుని వల్ల లోకానికి కలిగే ఉపయోగమేమిటి? కనుకనే వేదములన్నియూ, ఆకార మానవునివల్ల లోకానికి ఉపయోగము లేదు, **ఆచార మానవులు కావాలి, ప్రచార, విచార మానవులు కావాలని ప్రబోధిస్తూ వచ్చింది.**

ఈనాడు అనేకులు వేదమంత్రము అధ్యయనము చేస్తున్నారు, వల్లె వేస్తున్నారు, కానీ అర్థము తెలిసి వల్లె వేయటము చాలా తక్కువగా ఉంటున్నది. అర్థములు తెలిసి మంత్రములు ఉచ్ఛరించుటచేత మరింత పరిపూర్ణమైన ఆనందమును అనుభవించవచ్చు. తినుబండారముల పేర్లు విన్న, పుస్తకములో చదివిన దాని యొక్క రుచిగాని, పుష్టిగాని, ఆనందముకాని ఏర్పడదు. దానిని భుజించిన తర్వాత కలిగే మధురానందము, చదివినా, విన్నా, లభ్యముకాదు. అటులనే మంత్రములను పఠించిన, వల్లించిన మాత్రమున దాని పరిపూర్ణ దివ్యత్వము అర్థము కాదు. దాని అంతరార్థము గుర్తించి, వర్తించినపుడే దానియొక్క పరిపూర్ణ స్వరూపము సాక్షాత్కరిస్తుంది. వేదము విశాలమైన భావముతో, వివేకమైన తలంపుతో, విజ్ఞానమైన భావముతో, విశ్వవ్యాప్తి అయినదే కానీ సంకుచితంగా నిలిచిపోలేదు. **ప్రతి విషయము నందు సమత్వాన్ని ప్రభోధిస్తూ వచ్చింది. ఏకత్వాన్ని అభివృద్ధి గావించుకుంటూ వచ్చింది. కష్ట సుఖములందు సమత్వాన్ని నేర్పుతూ వచ్చింది.**

కానీ ఈనాటి మానవుడు మంత్రములను ఉచ్ఛరిస్తూ ఉన్నా, అందులోని పవిత్రతను గుర్తించుకోలేక పోతున్నాడు. ఒక్క మంత్రమును అర్థం చేసుకున్నా చాలు. శాంతి మంత్రములో - "సహనావవతు" అని నిత్యము పఠిస్తూ వస్తున్నారు. ఎంత విశాలమైన మంత్రమును సంకుచితంగా భావించి తద్వారా బేధము లను అభివృద్ధి గావించుకుంటూ వచ్చారు. ఆనాటి సమత్వము, ఏకత్వములో వెయ్యింటిలో ఒక భాగము కూడా కన్పించడములేదీనాడు. వేదము యొక్క అర్థము పరిపూర్ణమైనది. ఈనాటి మానవుని భావములు మరింత దిగజారి పోవటముచేత భిన్నత్వము అభివృద్ధి అయి పోతూ వచ్చింది. వారికి అర్థము తెలియక పోతే ఊరకుండుటే ఎంతో మేలు కానీ నానార్థాలు పెంచి అనర్థాలు తెచ్చుకుంటున్నారు. అనర్థాలు పెరుగుతూ యధార్థాలు మునిగిపోతూ వచ్చాయి.

యజ్ఞ యాగాది, క్రతువుల యందు, మంత్రముల యందు ఋగ్వేదములో అనేక దేవతలను వర్ణిస్తూ వచ్చారు. **ఇందులో 33 ప్రధాన దేవతలుగా నిరూపిస్తూ వచ్చారు. ఇందులో సూర్యుడు ప్రధానము.** మానవులవలె దేవతలు అనేక అంగములతో ఉండేవారు. **సూర్య తత్త్వము జగత్ వ్యాప్తిగావించినటువంటిది. సూర్యునికి ఋత్విక్ అని ఒక పేరు, హోతా అని, బ్రహ్మ అని పేర్లు.** అర్పితము అయినవన్నీ దేవతలకందించేది అతని పని.

అగ్ని దేవతా స్వరూపము, సూర్య ప్రతిబింబమే. అగ్నికి రూపమున్నదని నిరూపిస్తూ వచ్చినారు. అగ్నికి తల్లి తండ్రులు- అరణి. అగ్ని పుట్టిన వెంటనే తల్లితండ్రులను భస్మము చేస్తాడట. పైకర్ర తండ్రి, క్రింద కర్ర తల్లి. అగ్నికి రూపముంటున్నది. జ్వాలలన్నియూ నాలుకలవలె, కిరణములన్నియూ శిరస్సుల వంటివి. "సహస్ర శీర్షా పురుష, సహస్రాక్ష సహస్రపాత్" అనే మంత్రముతో వర్ణిస్తూ వచ్చారు. ప్రతి ఒక్కరియందు అగ్ని తత్త్వము ఇమిడి ఉంటున్నది. "ప్రతి జీవికూడా భగవత్ స్వరూపమే" దీనియొక్క అంతరార్థము. ఈ విధములైన మంత్రములను ఉచ్ఛరించి భగవదర్పితము గావించటము చేత ఇవన్నీ భగవంతునికి చేరి, తద్వారా శాంతి ప్రసన్నము గావించటము చేతనే లోక కళ్యాణం ఏర్పడుతూ వచ్చింది.

(స.సా.న.89పు.285/289)

వేదము/వేదములు

వేదములన్నియు ప్రవృత్తి మార్గమునే బోధిస్తూ వచ్చాయి. రసాయన, వృక్ష, పదార్థ, గణిత సంగీత శాస్త్రములన్నియూ వేదముల నుండి వచ్చినవే. కానీ, ఇవన్నీయూ ప్రవృత్తి మార్గమునే బోధిస్తూ వచ్చినవి. కనుకనే వేదములను ద్వైతములని చెప్పుతూ వచ్చారు. **ఉపనిషత్తులు మాత్రమే నివృత్తి మార్గమును బోధిస్తూవచ్చినవి.** మానవుని చతుర్విధ పురుషార్థములలో ధర్మ, అర్థ, కామములను బోధిస్తూ వచ్చాయి వేదములు. ఉపనిషత్తులు కేవలము విద్యవల్లనే గుర్తించడానికి వీలవుతుందని బోధించినాయి.

(స.సా.న.89 పు.291)

వేదములు అనంతములైనను, ఇప్పటికి మిగిలినవి ఆచరణలో నున్నవి నాలుగే. **అవియే ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదములు. ఒక్కొక్క వేదమును అనేక ఉపనిషత్తులుగా విభజించిరి. అట్లు విభజించినవి మొత్తము (1180) వేయినూట యెనుబది ఉపనిషత్తులు కలవు.** కానీ కాలపు మార్పు చేత ఉపనిషత్తులు **క్రమేణా తరుగుతూవచ్చి (108) నూటయెనిమిదికి దిగినవి.** మిగిలినవి కనుపించకున్నవి. వానిలోనైనా **నేడు ఆచరణలో నున్నవి, విచారించగా పది మాత్రమే తేలినవి.**

ఇందులో ఏ యే వేదమునకు ఎన్నెన్ని ఉపనిషత్తులో వ్యాసమహర్షియే విభజించెను. ఋగ్వేదమునకు ఇరువది ఒక్క శాఖలు, ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క ఉపనిషత్తును; యజుర్వేదమునకు 109 శాఖలను అందుకూడా ఒక్కొక్క శాఖకు ఒక్కొక్క ఉపనిషత్తు అనగా నూట తొమ్మిది ఉపనిషత్తులును; అథర్వణ వేదమునకు ఏబది శాఖలు, కనుక దానియందునూ ఏబది ఉపనిషత్తులును; సామవేదమునకు వేయి శాఖలు కనుక ఒక్కొక్క శాఖకూ ఒక్కొక్క ఉపనిషత్తును; ఈ రీతిగా నాలుగు వేదములకూ ఎన్ని శాఖలో అన్ని ఉపనిషత్తులుగా విభజించబడినవి. అన్నియు కలిసి వేయునూట యెనుబది ఉపనిషత్తులు (1180) కలవు.

అవి అన్నియూ మరుగునపడగా సర్వోపనిష త్పారమునూ చేర్చి శంకరులవారు పదిగా ఆచరణలో నిలిపిరి. అపుడు అవి దశోపనిషత్తుల ఆధారముతోనే ఈ ధర నిలిచి యున్నది. అవి కూడా ఏనాడు మరుగున పడి ప్రళయము సంభవించునో అను భయము ఆస్తికులకూ వేదపండితులకూ లేకపోలేదు. కానీ పరమాత్మ అట్లు ఏనాడు చేయడు: **అందునిమిత్తమే భగవంతుడు అనేక రూపములతో అవతరించి వేదములనూ, ధర్మములనూ ఉద్ధరించుచున్నాడు.** కాన ఆస్తికులకు అట్టి భయము అవసరములేదు. వేదమునకు హాని రాదు. కనుక, ఈ దశోపనిషత్తులనైనా లోకమునకు అందించుటకు పండితులు, ఆస్తికులు కంకణము కట్టవలెను. అవియే **ఈశ, కేన, కఠ, ప్రశ్న, మండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ ఛాందోగ్య, బృహదారణ్యకము లనబడునవి.**

(ఉ.వా.పు.4/5)

మనసునకు అతీతమైన స్థాయినుండి ఆవిర్భవించినప్పుడు సత్యవాక్కుగా రూపొందుతుంది. ఆసత్యవాక్కునే వైబ్రేషన్ అన్నారు. **భూర్-అనగా ఈ శరీరమునందు, సర్వత్రా వ్యాపించే భువః. ఆవైబ్రేషన్ ప్రాణశక్తి. ఈ ప్రాణశక్తి అనే వైబ్రేషన్ ఎక్కడనుండి ఆవిర్భవిస్తున్నది? సువః - ప్రజ్ఞనుండి ఆవిర్భవిస్తుంది. కనుక radiation నుండి vibration, vibration నుండి materialisation. ఈ విధంగా సంబంధము ఏర్పడుతున్నది. దీనినే 'భూర్భువస్సువః'** అన్నారు. ఈ వేదమును ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము అని మంత్రాలతో మనము ఉచ్చరిస్తున్నాము. **ఋగ్వేదము అనగా ఏమిటి? వాక్కే ఋగ్వేదము. ఋగ్వేదము వాక్కునుండి ప్రారంభమవుతుంది.** ఈ వాక్కు ఏవిధంగా వస్తున్నది. అంతర్భావమైన మూలాధార మైన నాభినుండి వస్తున్నది. దీనినే ఋగ్వేదమన్నారు. **మనసునే యజుర్వేదమన్నారు. ప్రాణమునే సామవేద మన్నారు.** ప్రాణములు ప్రణవోపాసనచేత ఒక విధమైన శ్వాసము ప్రారంభమవుతుంది. ఈ శ్వాసము సుస్వరము తో కూడినదై వుంటుంది. **ఇది నిజమైన సామవేదము. సామగానమనగా ఏమిటి? ప్రాణోపాసనచేత ఆవిర్భవించిన శ్రవణానందమే సామము. గానానందమే సాధన.** ఈ

సామముయొక్క గుణము సుస్వరమైనదిగా ఉండాలి. సుస్వరముగానిది ఏమాత్రము సామగానము కాదు. **యజుర్వేదము - యజ్ఞయాగాది క్రతువులందు మంత్రస్వరూపమైనది. తేజోమయమైనది.** ఈ ప్రపంచము నందు మనకు కానవచ్చే సమస్త తేజస్సును ఒక స్వరూపముగా నిరూపణజేసి భగవంతుడు తేజోమయుడని ఈ ఋగ్వేదము ప్రపంచానికి చాటుతూ వచ్చింది. సామాన్యంగా మన భారతీయులంతా **భగవంతుడు కోటి సూర్యులకాంతితో వెలుగుచున్నాడని ఉచ్ఛరిస్తున్నారు. అనగా తేజస్వరూపమే ఋగ్వేదము. మంత్ర స్వరూపమే యజుర్వేదము. గానస్వరూపమే సామవేదము. మానవునికి ఈ మూడూ అవసరమే.** భగవంతుని తేజోమయముగా నిర్మించుకొని, భగవంతుని మంత్రముతో ఉచ్ఛరించి గానముతో ఆనందించమని కోరింది. కాబట్టి ఈ ఋగ్వేద, యజుర్వేద సామవేదములన్నీ దివ్యత్వమును అనుభవించటానికి వచ్చినవే. కాని కంకణాలు, రుద్రాక్షలు ధరించటానికి కాదు. **ఋగ్వేదము - తేజోమయమైన భగవంతుని, యజుర్వేదము - మంత్రపూర్వకమైన ఆరాధనచేత, సామవేదము - గానముచేత లీనముకావాలి. గానముచేత తప్ప మరొకదానిలో లీనము కావడానికిలేదు.** చాలామంది పద్యాలు చెప్తూవుంటారు. మాటలు చెప్తూ వుంటారు. మాటలచేతను, పద్యాలచేతనూ హృదయం ఆకర్షింపబడదు. ఒకడు రాముని ముందుకు పోయి- రామా నన్ను కాపాడు అని అంటే యీ మాటలతో హృదయము ఏమాత్రము కరగదు. రామా నన్ను కాపాడు- పద్యముతో చెప్పితే ఇదికూడా ఏమాత్రమూ కరిగించదు. **"రామా నన్ను కాపాడు" అని గానంచేస్తే** అదే - హృదయాన్ని ఆకర్షిస్తుంది. గానములో యీ విధమైన లీనముంటుంది. ఈ లీనతత్వమును అర్థము చేసుకోలేని వ్యర్థజీవులంతా గానాన్ని కొంతవరకూ వినలేకపోతున్నారు. అది ఏమైనా కొంత అపస్వరమైపోతే భ్రష్టుపట్టిస్తుంది. ఏకాగ్రతను చెడగొట్టుతుంది. **మనము పాడే సమయములోపల సుస్వరంగా పాడేటట్టువుంటే మైకు ముందు కూర్చోవాలి. లేకపోతే మైకుకు దూరంగా వుండి శ్రవణంచేస్తే మంచిది.** అపస్వరముతో పాడే భజనలు అపస్వరముతో చేసే గానము మన హృదయాన్ని కొంతవరకూ చలింపజేస్తు వున్నాయి. నీకు ఇష్టముగావుంటే ఒంటరిగా ప్రాక్టీసు చేయి. తరువాత మైకుముందు వచ్చి కూర్చో. **భగవంతుని ఆకర్షింపజేసేది, హృదయాన్ని రంజింపజేసేది గానము. ఇదే శబ్ద ప్రమాణము.** ఈ న్యాయ దర్శనములో ఇంకా ఎన్నో విధములైనవి మానవత్వానికి అవసరమైనవి ఉంటున్నాయి. మానవుని సంశయము లను తీర్చి మానవ హృదయాన్ని ఉప్పొంగింప జేసి, వికసింపజేసి ప్రకటిజేసి, ఆనందింపజేసేవి. ఈ న్యాయములో చాలా ఉంటున్నాయి. **ఈ న్యాయ, వైవేషిక, సాంఖ్య, యోగ, పూర్వమీమాంస, ఉత్తర మీమాంస ఈ ఆరు దశలను ఒక్కతూరి మనము విని చక్కగా అర్థము చేసుకుంటే ఇంక మానవత్వములో మనము చేయవలసిన సాధన ఏమీలేదు.** ఈ దర్శనములే సృష్టియొక్క రహస్యాన్ని నిరూపించి, ప్రబోధించి ప్రచారము సల్పి ఆనందము నందించునని.

(స.ది.పు.114/115)

వేద వేదాంగములు వల్లెవేసియున్న
గద్య పద్యములను కూర్ప గలిగి యున్న
చిత్త శుద్ధియు లేకున్న చెడును నరుడు
ఇంత కన్నను వేరెద్ది ఎరుకపరతు.

(సా.పు.410)

'అనంతో వై వేదః' అని అందురు. అయితే వేదము మొదట ఒక్కటే. తదుపరి మూడుగా, అతరువాత నాలుగుగా విభజింపబడెను.

ఇది అనంతమైనది కనుక అధ్యయనము చేయుట సామాన్యమానవులకు కష్టమయ్యేడిది. అంతేకాదు ఈ వేదమును నేర్చుకొనుటకు ఎంతోకాలము పట్టెడిది.కనుక నేర్చుకొనువారు దిగులొంది వేదాధ్యయనము చేయుటకు అంత అభిరుచితో ముందుకు వచ్చెడివారు కాదు. ఈ కారణమును పురస్కరించుకొని, అందరికీ అనుకూలముగా ఉండునట్లు ఈ వేదములో ఉన్న ఋక్కులన్నింటినీ

వేరుచేసి బుగ్ సంహితములని, యజుస్సులను కూర్చియజుస్సంహితములని, సామములన్నింటిని కూర్చి సామసంహితములని, అధర్వ మంత్రాలను వేరుగ చేర్చి అధర్వ సంహితములని విభజించిరి.

ఈ విధముగ విభజించిన వారు నారాయణాంశ సంభూతుడగు **వ్యాసుడు పరాశర మహర్షి కొమారుడు. సమస్త విద్యలమూట. ఆమూటకు మరుపేరు వ్యాసుడు.** ఇతను మహర్షి, సమస్త వేదశాస్త్రపారంగతుడు, సమన్వితుడు, సమర్థుడు. లోకకళ్యాణార్థమై అతను వేదములను విభజించి ధర్మమును ఆచరించుటకు అనుకూల పరచెను. వేదములను నాలుగుగా విభజించి ఐదు సంహితులుగా ఏర్పరచెను, కృష్ణ యజుర్వేద సంహిత, శుక్ల యజుర్వేద సంహిత అని రెండు. యజుర్వేదమును రెండుగాను, మిగిలిన మూడు వేదములను ఒక్కొక్కటిగనే విభజించుటచేత ఐదు అయినవి. అంతేకాదు, ఒక్కొక్క సంహితను తిరిగి మూడు భాగములుగ విభజించెను. ఇవన్నియు వారివారి స్థితి గతులకు తగిన రీతిగా అందరినీ తరింప చేయగోరి చేసినవే. వారి వారి యోగ్యతలను పురస్కరించుకొని, సంఘశ్రేయస్సు కోసం చేసినవే. అంతేగాని వీటిలో ఏ మాత్రము భేదములు లేవు.

సంహిత భాగములు - బ్రహ్మణాలు, అరణ్యాకాలు, ఉపనిషత్తులు - అని మూడు.

(లీ.వా.పు.5/6)

ఒక్కొక్క వేదము అనేక శాఖలు కలిగి యున్నది. ఆ శాఖల యొక్క పరిపూర్ణతను కూడా అనుభవింపవలసి వచ్చును.

(లీ.వా.పు.9)

వేదమునకు ఎన్నియో పేర్లున్నవి. **పృశ్నిఅనియు, ప్రథమజా** అనియు, ఇంకా ఆయా సందర్భమును పురస్కరించుకొని అనేక పేర్లు ఉన్నవి.

(లీ.వా.పు.13)

భావ శుద్ధితో అర్థభావముతో వేదమన ఉచ్చరించువారికి సకలైశ్వర్య జ్ఞానమగు బ్రహ్మవిద్య లభ్యమగును. ఏనామమైనా, యేమంత్రమైన భావశుద్ధితో, ఆత్మ శుద్ధితో ఉచ్చరించిన అట్టివారికి సకలైశ్వర్య స్వరూపుడగు బ్రహ్మ, అనుగ్రహముతో బ్రహ్మ విద్య, ప్రాప్తి నందించును.

"వేదం పరమేశ్వరం. వేదయతీత వేదసః వేదస్యమ్"

శుభప్రాప్తి సాధనమై అర్థింపబడునది అగుటచే ధనాధికము అర్థః అని చెప్పబడుచున్నది. సుఖరూపుడై అందరిచే అర్థింపబడువాడగుటచే **పరమేశ్వరునకు అర్థః అని పేరు.** అట్టి పరమేశ్వరుని కొరకు వినియోగింపబడే తత్ప్రాప్తి సాధనమగు ధనము లేక ఆరాధకునకు, ఆరాధ్యుడగు దైవమునకు తృప్తిని కలిగించునని శ్రుతియే తెలిసినది. వేద వాక్కుచే వేద విహితధర్మాధ్యాచరణముచే సిద్ధించెడి ధనమే వేదః అగుననెడి అర్థము వేదతాత్పర్యము, కావుననే ఇట్టి ధనమును **శ్రుత్యమ్'** అని ఋగ్వేదము కీర్తించుచున్నది

(లీ.వా.పు.17/18)

ఈ ప్రపంచములో మిక్కిలి ప్రాచీనమైనది వేద సాహిత్యము. ఇది విజ్ఞానరాశి. మానవుని సర్వతోముఖుని గావించినది. ఈ వేదము. **మానవుని చరిత్రకు మొట్టమొదటి పాఠ్యగ్రంథము వేదమే. మానవ సంస్కృతికి, సర్వశక్తికి మూలాధారము పుట్టినిల్లు ఈ వేదము "సర్వం వేదాత్ ప్రసిధ్యతే" అన్నాడు మనువు. సమస్త విద్యలు** వేదమునుండి ఆవిర్భవించినవే. సర్వగుణముల సర్వ ధర్మములు వేదమునుండి యే ఆవిర్భవించినవి. **"అనంతోవై వేదాః" వేదము అనంతము, అగాధము, అప్రమేయము, ఆనందమయము. విద్ జ్ఞానే అనే ధాతువు నుండి పుట్టినది వేదము. ఈశ్వర జ్ఞానమే వేదము. ఆత్మజ్ఞానమే వేదము. బ్రహ్మజ్ఞానమే వేదము అద్వైతజ్ఞానమే వేదము విజ్ఞానమే వేదము. ఇవన్ని ఆత్మజ్ఞానమునకు పర్యాయపదములు.** ఇట్టి పవిత్ర వేదమును సామాన్యులు అర్థముచేసుకొనలేరు. అర్థము చేసుకొన్నను చేసుకొనక పోయినను వేదము యొక్క దివ్యత్వమే సర్వత్ర వ్యాపించి ఉంటున్నది. ఇది శబ్ద బ్రహ్మము. **"శబ్దబ్రహ్మమయీ, చరాచరమయీ, జ్యోతిర్మయీ, వాఙ్మయీ, నిత్యానందమయీ, పరాత్పర**

మయీ, మాయామయీ, శ్రీమయీ" ఇదియే ప్రజ్ఞాన మయమైన బ్రహ్మము; కాన్‌స్టెంట్ ఇంటిగ్రెటెడ్ అవేర్‌నెస్. ఇది ఒకకాలమునకు కాని, ఒకస్థానమునకు కాని, ఒక వ్యక్తికి గాని సంబంధించినది కాదు; యావద్విశ్వమునకు సంబంధించినది. ఇట్టి వేదమును సామాన్య ప్రజలు గుర్తించటం కాని, వర్తించటంకాని సాధ్యముకాదని తెలుసుకొని వ్యాసులు వారు దీనిని నాలుగు విధములుగా విభజించినారు. వేదము త్రికాండలలో కూడి జగత్తునకు ఆచార రూపమైన ప్రచారము గావిస్తూ వచ్చింది.

(బృ.త్ర.పు.180)

వేదము సనాతన శాస్త్రము : శాస్త్రమనగా అజ్ఞాత జ్ఞాపకము: అనగా. లోకసిద్ధము కాని అతీంద్రియములైన అర్థముల దర్శింప జేయుటకు ప్రవృత్తమైనది. **పురుష బుద్ధికి గోచరము కానిదగుటచే, "పరమంవ్యోమ, పరమం పదమ్, అక్షరమ్, తత్, సత్"** యీరీతిగా ఋగాది శ్రుతులన్నియు తెలిపెను.

ఒక వేదమును తెలియజేయుటకై అనేక వేదము లావిర్భవించెను. వేదశబ్దము మొదట సర్వజ్ఞుడగు పరమేశ్వరునకు వాచకమగుచు, **(వేత్తతీతి వేదః)** తరువాత తత్స్వరూప నిరూపణపరమై **(వేదయతీతి వేదః)** సర్వజ్ఞ కల్పమగు ఋగాది శబ్దరాశికినీ వాచకమైనది. తరువాత తదనుగుణముగ ప్రవృత్తములయ్యెడి, ధర్మ, అర్థ, కామములకు సుపలక్షకమగుచున్నది, మొదట (సర్వద్రష్ట) యగు పరమేశ్వరుని బోధించుచు, తరువాత ఆ పరమేశ్వరుని దర్శింపజేసెడి (దర్శనాత్) ఈ వేదము, ఋషి శబ్దరాశికికూడా వాచకమై వరలినది. తరువాత ఋషులు దైవ వేదములను ఆరాధించి తననుగ్రహముచే ద్రష్టలయి వెలసి, ప్రసిద్ధములైరి.

దీనిని పురస్కరించుకొని పరమేశ్వరునకు "మహర్షి" అని కూడా నామము ప్రసిద్ధమైనది. బ్రహ్మసూత్రమున "మహర్షిః ముఖ్యర్షిః శివః" అని కూడా సహస్రనామముల కలవు. పరమేశ్వరుని దర్శింపజేయునదగుట చేత, వేదమునకు ఋషి అనియు నామము సార్థకము. బ్రహ్మ అని వేదమునకు నామము. అందుచే బ్రహ్మను పొందుటకై చేయు ఫలత్యాగ కర్మలకు, బ్రహ్మయజ్ఞమని, ఋషియజ్ఞమని కూడా చెప్పుతూ వచ్చిరి. శుద్ధ, శుభ, సాత్విక, నిస్స్వార్థ కర్మలన్నియూ యజ్ఞములే.

ఈవిధములైన ఫలత్యాగ కర్మలలో, పదే పదే **స్వాహా** అనుచు అర్పితము గావించుచుందురు. ఈ స్వాహా శబ్దసాంప్రదాయములకు గతములైన శబ్దముల అర్థములను చూతము. కేశవాయ స్వాహా, ప్రాణాయ స్వాహా, ఇంద్రాయస్వాహా, ఇత్యాది స్వరములయందు **'స్వాహా' పదమునకు సామాన్యముగ "హవిస్సు సుహుతమగు గాక" అని అర్థము చెప్పుదురు.**

"సుహుత" మన నేమి? అగ్నియందు విడువబడిన యజ్ఞాది ద్రవ్యములు దగ్ధమగు గాక, జీర్ణమగుగాక, అని. ఇక్కడ ఒక సందేహము కలుగవచ్చు. అగ్నిలో వేసిన సమస్త పదార్థములు, సహజంగానే దగ్ధమగును. జీర్ణమగును కదా. ఇక స్వాహాకారము చేయుటచేత కలుగు ప్రత్యేకత ఏమి? **స్వాహుతి అనగా వస్తువులను దగ్ధము చేయుట, జీర్ణము చేయుట మాత్రమే శ్రుతితాత్పర్యము కాదు.** దగ్ధ మగుట ప్రత్యక్షగోచరము మాత్రమే; **వైదిక దృష్టివేరు.**

కుమార సంభవ కావ్యమందు, కాళిదాసు, హిమాలయమును వర్ణించుచూ "దేవతాత్మ" అని అన్నాడు. అనగా, దేవతా శరీరము, భౌతిక శరీరము అని ప్రతిదానికి రెండు శరీరములు కలవు. ఇది శ్రుతి సమ్మతము. **దేవతా శరీరము అతీంద్రియం. భౌతిక శరీరం ఇంద్రియములతో కూడినది.** దేవతా శరీరమున అగ్ని ప్రాణాగ్ని అగుచున్నది. అందులో ఆహుతి హవిస్సు అగుచున్నది. అహుతియొక్క స్వరూపమును శ్రుతియిట్లు వివరించుచున్నది. **అత్తా, అద్యము అనగా భోక్త, భోగ్యరూపమగు ఈ జగత్తు ఏకీభూతమయినపుడు, రెంటినీ కలిపి అత్తా అనియే అనగా భోక్త అనియే వ్యవహారము.** ఆ భోక్త యెవరు? **అదే అగ్ని. అది దైవికముగ అదిత్యుడు; ఆధ్యాత్మికముగ ప్రాణము.** అట్టి ప్రాణాగ్ని యందు సమంత్రముగ నుంచబడెడి అన్నాది హవిస్సులకు

వేదరక్షణము

"అహితయుఃʼʼ అని పేరు. స్వాహా శబ్దము కేవలము హోమ సూచకమైన సాంకేతిక పదము మాత్రమే కాదు, స్వార్థకమగు వాఙ్మయము.

ఛందయతిః ఆహ్లాద, చాదనమనగా బలవంతుడగుట, ప్రాణశక్తి వంతుడగుట, అచ్ఛాందించుట. ఇట్టి ధర్మబలముండుటచేతనే వేదములకు చందస్సులని పేరు. ఇట్టి వేదము నాచ్ఛాదించు వారలను సుశక్తి వంతులను తైత్తరీయ శృతి యెంతయో విపులపరచినది. ఇట్టి క్రతువు ఒక వ్యక్తికే కాక లోకోత్తరాహ్లాదమునే కలిగించునదై యున్నది. **"యజ్ఞాంగః యజ్ఞ వాహనః వృషరథఃʼʼ** ఇత్యాది నామములు శృతి, స్మృతులయందు పరమేశ్వరునకు చెప్పబడినవి. హిరణ్యగర్భుడు సువర్ణ ఛందోమయుడు, సువర్ణమనగా గరుత్మంతుడు. ఛందోమయమను గరుడని వాహనముగా స్వీకరించినవాడు.

వృష అనగా ధర్మస్వరూపము. ధర్మమునే వాహనముగా చేసుకొనుట. విష్ణు ఆలయములందు గరుడ, శివాలయములందు వృషభం స్తంభములను ద్వారముల ముందు యుంచి యుండుటలో ఇదే అంతరార్థము.

ఛాదనమనగ సంసారవృక్ష రక్షణము. ఫలకాములై కర్మల యందు చరించు వారికి తత్ఫలము నాచ్ఛాదించి, ధర్మనిష్ఠ గావించి, సంసార వృక్షమును రక్షించుచుండును. కర్మిష్టులన ధర్మరూపమృత్యువునుండియు జ్ఞానులను సంసారరూపమృత్యువునుండియు నాచ్ఛాదించి రక్షించును. అట్లు రక్షించునట్టి వానినే ఛందస్సులనియు, అవే వేదములనియు చెప్పబడెను. **"ఛాదనాత్ ఛందాసి" మృత్యువునుండి రక్షించగలుగునదని ఛందస్సులు శర్మ హేతువులు.** యజ్ఞము దేవతలనుండి తొలగిపోయి కృష్ణమృగరూపమై సంచరించుచుండ దేవతలు వెన్నంటి, కడకు దాని చర్మమును గ్రహించగల్గిరి. **యజ్ఞశరీరమే కృష్ణాజినము, దానియందలి శుక్ల, కృష్ణ, బభ్రువర్ణములు ఋగ్వేద, యజుఃసామములయొక్క, రూపములు. కనుక కృష్ణాజినము ఋగ్, యజుర్, సామవేదస్వరూపమనే నిర్ణయము గావించిరి. దీనిని త్రయీ విద్యారూపమనిరి. త్రయీ విహిత కర్మ సాధ్యమగుటచే యజ్ఞముకూడా త్రయీస్వరూపము.** ఇట్టి కృష్ణాజినమును గ్రహించుట చేతనే, యజ్ఞదీక్షితుడగు యజమానుడు, ఛందస్సుల ప్రేరేపించును.

శుక్ల, కృష్ణ బభ్రు వర్ణములకల కృష్ణాజినము లోక త్రయీరూపము. కాన కృష్ణాజినము ధరించి యజమానుడు లోకత్రయ దీక్షితుడగు చున్నాడు. **దీక్షితుడైన యజమాని గర్భస్థశిశుతుల్యుడు,** గర్భస్థ శిశువు యేరీతిగ వ్రేళ్ళుముడిచి గుప్పిలిపట్టి మాత్రు శరీరచ్ఛాదితుడై యుండునో యజమానుడును అట్లే గుప్పిలిపట్టి త్రయీ విద్యారూప ఛందోమాతృ శరీరచ్ఛాదితుడై కృష్ణాజినధారుడై యుండవలెను.

కృష్ణాజినము మానుషదృష్టిలో చర్మము. అది దేవతా ప్రీతికర మైనదగుటచేత, యజ్ఞకర్మల యందు శర్మమగుచున్నది. అందువలన యేయజమానుడు, యజ్ఞసమయమున "నీవు శర్వస్వరూపివి, నాకు శర్మ నిమ్ముʼʼ అని సంబోధించును.

శర్మమనగా సుఖము, ఆనందము. ఆనంద స్వరూపుడు విష్ణువు. విష్ణువు యజ్ఞస్వరూపుడు. "యజ్ఞోవై విష్ణుఃʼʼ ఆ విష్ణు త్రయీ విద్యాస్వరూపుడు.

(స.సా.వా.ఉ.167/171)

(చూ॥ అన్నం, అయోధ్య, అసూయ, ఆనందము, ఉత్తరాయనము, ఉపనిషత్తులు, కలియుగం, కారణము, క్షమ, గాయత్రి, త్రికాండ స్వరూపము, దేవుడు, దైవముకోసం, నేను, ప్రమాణము, బ్రహ్మస్వరూపుడు, మనస్సు, మహావాక్యములు, వేణుగానము, షడ్దర్శనములు)

వేదరక్షణము

"వేదము ధర్మమూలము. దానిని నశింపజేయకూడదు. గట్టి పునాదులపై సుప్రతిష్ఠితము గావింపబడవలెను. అట్టి ధర్మస్థాపనకే నా యవతారము. వేదపండితులసంఖ్య యభివృద్ధి నొందవలెను. ఎచ్చటెచ్చట వేదోద్ధరణము జరుగుచుండునో, **యెచ్చటెచ్చట వేదవిదులును,**

వేదపండితులును పూజింపబడుచుందురో అచ్చటచ్చట సుఖశాంతులు ప్రవర్ధమానము లగుచుండునని నమ్ముడు. విశ్వమునందు నాకెంత ప్రేమయో వేదమునందును నాకంతియే ప్రేమ, రెండును నాస్వరూపములే కదా? **నా కార్యము కేవల భక్త రక్షణమే గాక విద్వత్ పోషణమును, వేద రక్షణమును కూడయని నమ్ముడు."**

(స.శి.సు.ది.పు.39)

వేదవాఙ్మయము

(చూ॥ వేదాంతము)

వేదవ్యాసుడు

(చూ॥ ఈశావాశ్యము, వేదము)

వేదసూక్తులు

(చూ॥ కలియుగం)

వేదస్వరూపుడు/వేదస్వరూపాలు

మనము వేదమును - ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం అని మంత్రాలలో ఉచ్చరిస్తున్నాము. ఋగ్వేదమనగా ఏమిటి? **వాక్కే ఋగ్వేదం. వాక్కు నుండి ఋగ్వేదము ప్రారంభమౌతుంది.** ఈ వాక్కు ఏవిధంగా వస్తున్నది? **అంతర్భావమైన, మూలాధారమైన నాభి నుండి వస్తున్నది. దీనినే ఋగ్వేదమన్నారు. ప్రాణమునే సామవేదమన్నారు. ప్రాణోపాసన చేత ఒక విధమైన శ్వాసము ప్రారంభమౌతుంది.** ఈ శ్వాసము సుస్వరముతో కూడినదై ఉంటుంది. **ఇదే నిజమైన సామవేదము. సామగానమనగా ఏమిటి? ప్రాణోపాసన చేత ఆవిర్భవించిన శ్రవణానందమే సామము. గానానందమే సాధన.** ఈ సామము సుస్వరమైనదిగా ఉండాలి. సుస్వరం కానిది ఏమాత్రం సామగానము కాదు. **ఇంక యజుర్వేదము - యజ్ఞయాగాది క్రతువులందు మంత్రస్వరూపమైనది, తేజోమయమైనది.** ఈ ప్రపంచము నందు మనకు కనిపించే సమస్త తేజస్సునూ స్వరూపంగా నిరూపణ చేసి, అది **భగవంతుని తేజోమయ స్వరూపమేనని ఋగ్వేదము ప్రపంచానికి చాటుతూ వచ్చింది.** సామాన్యంగా మన భారతీయులందరూ - **"భగవంతుడు కోటి సూర్యుల కాంతితో వెలుగొందుచున్నాడు"** అని విశ్వసిస్తారు. **కనుక తేజస్వరూపమే, ఋగ్వేదము, మంత్రస్వరూపమే యజుర్వేదము, గానస్వరూపమే సామవేదము.** మానవునికి ఈ మూడూ అవసరమే. భగవంతుని తేజోమయంగా నిర్మించుకొని మంత్రంతో ఉచ్చరించి గానంతో ఆనందించాలి. కాబట్టి, ఈ ఋగ్వేద యజుర్వేద సామవేదాలన్నీ అనుభవించటానికి వచ్చినవేకాని, కంకణాలు రుద్రాక్షలు ధరింపజేయటానికి కాదు.

(స.సా.అ.93పు.273/274)

వేదము, వేదాంతము, వేదజ్ఞుడు సర్వమూ భగవంతుడే. వాక్కుతో కూడుకున్నదంతా ఋగ్వేదము, మనస్సుతో కూడుకున్నదంతా యజుర్వేదము. ప్రాణముతో కూడి ఉన్నదంతా సామవేదము. ఋగ్యుజుస్సామ వేదముల తత్వము వాక్కు, మనస్సు, ప్రాణతత్వమే కనుక **సర్వమూ వేదమయమే. వేదస్వరూపుడు పరమాత్ముడు 'అనంతోవై వేదః" ప్రతి వ్యక్తి వేదస్వరూపుడే. కనుక వాక్కులో తేజస్సును అభివృద్ధి పరచుకోవాలి. ఆదర్శమును అందించే నిమిత్తము వ్రతకాలి కాని ఆశల కోసము కాదు. నిజంగా ఏ మానవుడు కూడా సర్వసంగ పరిత్యాగిగా కానరావటంలేదు.** దైవార్పిత భావమే సర్వసంగ పరిత్యాగము. కాని ఎక్కడున్నది దైవార్పిత భావము? దైవార్పిత భావమే ఉంటే జగత్తు దుఃఖములతో అశాంతితో నిండిపోయేదే కాదు.

"సత్యం భ్రూయాత్ ప్రియం భూయాతనభ్రూయాత్ సత్యమ ప్రియం" సత్య పాలనకు నియమములున్నాయి. ఉద్రేకము ఉండకూడదు. ఆప్రియమైన సత్యాన్ని చెప్పకూడదు. ప్రియమని అసత్య మాడకూడదు; ఇట్టి నియమములను పాటిస్తూ సత్యమే దైవంగా భావించి కర్తవ్యములను నిర్వర్తించాలి.

(జ.పు.159)

వేదాంగము

(చూ॥ ప్రశ్నోపనిషత్తు)

వేదాంతము/వేదాంతి

నానా రూప ప్రపంచముపై వైరాగ్యము కల్గినవారికే అనన్య భక్తి కుదురును. అదే ఆత్మ జ్ఞానము నందించును. సంసారాసక్తమైన చిత్తమునకు వైరాగ్యము నేర్పు నిమిత్తమై ప్రపంచమును ఒక అశ్వత్థముగా చెప్పడమైనది. దీనిని తెలుసుకొన్నవాడే నిజమైన **వేదాంతి** అని కూడనూ చెప్పవచ్చును. లోకమున సామాన్యముగ ఊర్ధ్వమన్న పై భాగమని తలంతురు. కానీ ఈ భగవత్ వాక్యమైన బ్రహ్మాండ వృక్షమునకు బ్రహ్మమే ఊర్ధ్వము. మాయోపాధిక బ్రహ్మము ఈ జగత్తుకు సువిశాలమైనది; సమస్తమునకు బ్రహ్మయే అధిష్ఠానము.

(గీ.పు.219/220)

వేదాంతమునందు **"బ్రహ్మ సత్యం జగన్మిథ్య"** అంటున్నాము. మరొక వైపున **"సర్వం విష్ణుమయం జగత్"** అని కూడా అంటున్నాము. ఈ రెండింటి లో ఒకదాని కొకటి పొందిక కుదరదే? ఒక దానిని విశ్వసించినప్పుడు మరొక దానిని విశ్వసించడానికి వీలు లేదు కదా అని మీరు అనుకోవచ్చును. కాని వేదాంతమునందు రెండింటినీ విశ్వసించవలసిందే! రెండూ సత్యమే. ఎట్లా? "బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అన్నప్పుడు, స్క్రీన్ (బ్రహ్మ) - సత్యము; బొమ్మలు (జగత్తు) - మిథ్యము. అయితే, ఈ బొమ్మలు వచ్చినప్పుడు స్క్రీన్ ఎక్కడ ఉంటున్నది. ఈ మిథ్యమైన బొమ్మలులోనే సత్యమైన స్క్రీన్ ఉంటున్నది. కాబట్టి, **సత్యమైన విష్ణువు మిథ్యమైన బొమ్మలలో కూడా ఉంటున్నాడు. కనుక, "సర్వం విష్ణుమయం జగత్" అన్నది కూడా సత్యమే.**

(శ్రీ.భ.ఉ.పు.171)

మామూలు వేదాంతమనే పదాన్ని తత్వచింతనకు పర్యాయపదంగా వాడుతుంటారు. కానీ వేదాంతమనేది వేద వాఙ్మయములో ఒక ప్రత్యేకమైనశాఖ. ఉపనిషత్ వాఙ్మయ మంతా వేదాంతమునకు సంబంధించినదే. బాహ్యసృష్టిలోని అందచందాలను **అంతర్దృష్టితో అవగాహన చేసుకొనివాటి అదేశాన్ని అనురాగముతో కీర్తించిన ఆనందగీతికలు ఋగ్వేదములోని ఋక్కులు. పాడుకొని కొనియాడ తగిన పరమరమణీయ పదసంపద సామగానము. ఐహిక ఆముష్మిక రహస్య సంపుటి అధర్వణ** రూపాన్ని ధరించినది. సత్కర్మలయిన, పుణ్యకర్మలయిన యజ్ఞ యాగాలు కర్మకాండకు సంబంధించిన మంత్రాలు యజుర్వేదములో చేరినాయి. ఇలా నాలుగు నాలుగు భాగాల్లో విస్తరిల్లిన వేద వాఙ్మయములలో తిరిగి నాలుగు శాఖలు, ఇవన్నియూ విద్యలనబడును. **మంత్ర భాగము, బ్రాహ్మణ భాగము, అరణ్యకం, ఉపనిషత్ భాగము. మంత్రభాగాన్ని సంహితాభాగమని కూడా అంటారు.** ఇందులో మంత్రాలన్నీ సంగ్రహంగా కూడి వుంటాయి. **ఈ మంత్రాలకు వినియోగం, ప్రయోజనం ప్రక్రియ నిరూపించేది బ్రాహ్మణ భాగము. బ్రహ్మశబ్దానికి** అనేక అర్థము లున్ననూ **ఇచట మంత్రమనే అర్థము.** ఈ భాగములో యెక్కువగా ప్రవృత్తి మార్గానికి చెందినవి, **వైరాగ్య సూత్రాలు వేద రహస్యాలు అరణ్యకములో వుంటాయి. ఈ రెండింటి సమన్వయం చివరిభాగమైన ఉపనిషత్తులలో వుంటుంది. ఇది వేద వాఙ్మయానికి తుది విభాగములగుటవల్ల దీనికి వేదాంతమని పేరు వచ్చింది. ఒక విధంగా దీనిని వేదసారమని చెప్పవచ్చు.** సమస్త వేదసారస్వతానికి నవనీతము లాంటిది. అనగా పాలను మధించగా పైకితేలు వెన్నవంటిది ఈ వాఙ్మయము. ఉపనిషత్ సత్ అనే ధాతువునుండి వచ్చినది. ఈ **ధాతువుకు "ఉప" "ని" అనే రెండు ఉపసర్గలుచేరాయి. సత్ అనే ధాతువునకు కూర్చుండుట అని యర్థము దీనికే నశింపజేయుట అని కూడా మరొక అర్థమున్నది. "ని" అనగా నిష్ఠను తెలియజేస్తుంది. అనగా ఆచార్య సమీపమున (గురు సమీపమున) నిష్ఠతోకూర్చొని నేర్చుకొన్న వివేక విజ్ఞానాలు అలవడును. భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రములు భారతీయ తత్వ**

చింతనకు మూలకందములు. వీటినే ప్రస్థానత్రయములని అందురు.

(వి.వా.పు.2/3)

వేదాంతము అంటే బహుళ గ్రంథపఠనమువలన కలుగు పాండిత్యము కాదు; వాది సింహము, ప్రతివాది భయంకరుడు అనే పేరుప్రతిష్ఠలు కాదు; సంసారమందు, ప్రకృతి ధర్మసంబంధమై సహజముగా కలుగు కష్ట నష్టములను తప్పించు కవచమే వేదాంతము. **మంచి, చెడ్డ, ఏది జరిగినా, అన్నీ పరమాత్మయొక్క సంకల్పమే అనే వివేకము వేదాంతము. అన్నిటిలో చేరిననూ. అన్ని కర్మలనూ నిర్వహించిననూ దేనిలోనూ కర్తృత్వ భోక్తృత్వ భావము లేని వాడు తాను, అనే జ్ఞానమే వేదాంతము.**

(ఆ.శా.పు.40/41)

ఉపనిషత్తులకే వేదాంతము అని పేరు. వేదాంతములు తెలుసుకో కుండా కేవలము వేదములు వల్లెవేసినంత మాత్రమున ప్రయోజనముండదు. అంతియేకాదు. సంపూర్ణ ఫలము కలుగదు.

(లీ.వా.పు.8)

ఈ వేదాంతమనే దానిని విచారణ చేస్తూ పోతే దీనికి అంత్యమేలేదు. వేదాంతముయొక్క సారము ఈ మూడింటి యొక్క ఏకత్వమే. (మనస్సు, వాక్కు, ప్రవర్తన)ఈ మూడింటి యొక్క ఏకత్వమును మనం అనుభవించినప్పుడే నిజమైన ఆనందము. అప్పుడే దైవత్వమనే ఏకత్వముమనకు ఆత్మతత్త్వముగ నిరూపిస్తుంది.

(శ్రీ.ఫి1995.పు.2)

(చూ॥ చైతన్యము, తుంగభద్ర, దమము, వేదము, శ్రద్ధ)

వేదార్థములు

వేదార్థములు రెండు: ఒకటి ధర్మము, రెండవది బ్రహ్మము. ధర్మము పూర్వమీమాంస, దీనికి కర్మప్రధానమైనది. పూర్వమీమాంస విషయము ధర్మము. ఉత్తరమీమాంస విషయము బ్రహ్మము.

(సూ.వా.పు.4)

వేరు

మతములన్నియు వేరు। మార్గము ఒక్కటే।
వస్తుభేదములు లేవు। వస్తువొక్కటే।
శృంగారములువేరు। బంగారమొక్కటే।
పశువువన్నెలు వేరు। పాలు ఒక్కటే।
జీవ జంతువులు వేరు। జీవమొక్కటే।
జాతినీతులువేరు। జన్మమొక్కటే।
దర్శనంబులు వేరు। దైవ మొక్కటే।
పూలజాతులు వేరు। పూజ ఒక్కటే।
తెలివిలేక మానవులు।తెలివి తప్పి।
బ్రతుకు కోసము బహుబాధబద్ధులైరి।

(సా.పు.136)

(చూ॥ లీనమైపోవాలి)

వేలిముద్ర

భగవంతుని సృష్టియే మహావిచిత్రం. ఒక మానవుని వలె మరొక మానవుడు లేడు. ఒక వ్రేలిముద్రవలె ఇంకొక వ్రేలి ముద్ర లేదు. అంతా చిత్రంగా ఉంటున్నది. భగవంతుని సృష్టి ఒక మూస (Mould) తో చేసేది కాదు, లేక ఒక రబ్బరు స్టాంపుతో చేసేది కాదు. ఇది క్షణ క్షణమునకు మారేటటువంటిది. విభిన్నమైన రూపనామములను ధరించేటటువంటిది. కవల పిల్లల యందు కూడా ఏదో వ్యత్యాసం ఉండే తీరుతుంది. ఇంత విచిత్రమైనది భగవత్ సృష్టి...! ఇలాంటి సృష్టిని మనం సద్వినియోగం చేసుకోవాలి. **"మానవ సేవే మాధవ సేవ"**. ప్రతి మానవుని యందు మాధవుడు ఉంటున్నాడు. **"~~ఈశ్వరః~~ సర్వభూతానాం" కనుక, ఎవరికి సేవ చేసినా ~~ఈశ్వరునికి~~ చేసినట్లే..!**

(శ్రీ.భ.ఉ. పు.155)

వైజ్ఞానికుడు

(చూ॥ విశ్వామిత్రుడు)

వైట్‌ఫీల్డ్ శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

(చూ॥ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ - పుట్టపర్తి)

వైదిక ఇతర ఉపాసనలు

వైదికోపాసన:

ఇది నాలుగు విధములుగ వున్నది. 1. సత్యవతి 2. అంగవతి 3. అన్యవతి 4. నిదానవతి అని.

"సర్వవ్యాప్తిన మాత్మానం క్షీరేసర్పిరివార్పితమ్" పాలలో నెయ్యి కలిసివున్నట్లే ఆత్మ సర్వవ్యాప్తమై ఉన్నదనే భావముతో చేసే సాధనే **సత్యవతీ ఉపాసన** అంటారు.

"మాయాతీతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా" నేనీ సమస్థంలో అవ్యక్తంగా వ్యాపించివున్నాను. నన్ను అంతటా నాలో అంతటినీ చూస్తూ ఉండే **సత్యవతి ఉపాసనకు** నేను కనిపించకుండా ఉండను. నాకు ఆ ఉపాసకుడు కనుపించకుండా ఉండడు అంటూ ఉన్నాడు మాధవుడు. ఆ సర్వాత్మనే నిప్పు, గాలి, సూర్యుడు, చంద్రుడు (మొదలైన వన్నీ) అనే భావముతో చేయబడేదే **అంగవతీ ఉపాసన.** ప్రాణరూపమై అందరికీ ఆత్మీయమైన ఆగాలి అన్నింటినీ వెలిగించు అగ్ని ప్రాణములకు వివిధ జీవనాధారములైన అన్నము ఉత్పాదనచేయటానికి కావలసినవరుణ (వర్షము) అని పరమాత్మను పొగడుట **అంగవతీ ఉపాసన.**

"శంఖచక్రదాపాణి" అని విష్ణువును, "ఏకదంతగజాననా" అని విఘ్నేశ్వరుని, "శూలపాణి" అని ఈశ్వరుని, "కోదండపాణి" అని రాముణ్ణి, "శఖిపించమౌళి మురళీధర" అని కృష్ణుని. "వీణావాణి" అని సరస్వతిని ఇలా ఆయా దేవతల చిహ్నములను ధ్యానపూర్వకంగా మనస్సును తన్మయము చేసుకొని హృదయంలో ఆరాధిస్తూ ఉండటం **అన్యవతీ ఉపాసన** అని అందురు.

"శ్రవణం, కీర్తనం, విష్ణోఃస్మరణం పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, ఆత్మనివేదనం తన్మయాసక్తి, పరమ విరహాసక్తి" అని పదకొండు **భక్తిసాధనలు కూడా నిదానవతీ ఉపాసనలో చేరును.**

సత్యవతీ, అంగవతీ, అన్యవతీ, నిదానవతీ ఉపాసనలు అనుక్రమేణా ఒకదానికంటే ఒకటి అత్యుత్తమ స్థితికి కారణాలై విశ్వనియంతతో తాదాత్మ్యాన్ని ప్రసాదిస్తాయి. **ప్రతీకోపాసన అని మరొకటి ఉన్నది.** అది అంగవతీ ఉపాసన లాగానే. **ప్రతిరూపోపాసన: - "సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖమ్"** సర్వాత్మయైన మాధవునికి అంతటా చేతులూ, కళ్ళూ; చూస్తాడు, ఆలోచిస్తాడు, తింటాడు, వింటాడు. సర్వోన్నత ఆదర్శభావముతో ప్రతిరూపోపాసన జరుగుతూ వుంటుంది.

భానోపాసన: - మంచి గుణములన్నింటినీ మాధవునిలో అమితంగా వుండినట్లు చూడటమే.

గీతోపాసన: భారతం పంచమ వేదం. అది ఐహిక ఆముష్మిక ధర్మాలనిధి. మాధవుడు భారతదేశ ధర్మక్షేత్రరంగస్థలంలో తన నాటక సామాగ్రిని దింపుకొని ఆడిన అద్భుతమైన ఆట. **మహాభారతము. భారత నాటకానికి పాత్రధారులును, మాటలను, పాటలను సమకూర్చిన రచయిత, నటకుడు, దర్శకుడు, నిర్మాత అంతా ఒక్క మాధవుడే. ఒక వైపున అధర్మవృద్ధమైన ఆపార భౌతిక బలం, మరొకవైపున ధర్మవృద్ధమైన పరిమిత ఆత్మబలం. ఈ రెంటి ఘర్షణలో పర్యవసాన రూపమైన ధార్మిక విజయజ్యోతిగా తనను నిర్దేశించుట. ఇదే భారతామృత సర్వస్వం, అదే భగవద్గీత మహాభారత సారాంశమంతయూ భగవద్గీతలో ఉన్నది. "కరిష్యే వచనం తవ" నీవు చెప్పినట్లే చేస్తాను. "స్వధర్మే నిధనం శ్రేయః " ఇదే ఐహిక తత్వానికి గీటురాయి.** సర్వశ్రేయస్సులను ప్రవహించే భక్తిని నిర్లక్ష్యము చేసి కళ్ళుమూసుకొని **"అహం బ్రహ్మాస్మి"** అనే అహంకారముతో బాధపడే నకిలీ బ్రహ్మలకు క్లేశమే ఫలితము. పొట్టుదంచితే బియ్యము రాదుకదా!; అసలు బ్రహ్మమే కృష్ణుడు.

అద్వైతోపాసన ఆదిశంకరులు - ఆవు శరీరములో పాలు ఉన్నాయి. ఆపాలలో నెయ్యి ఉన్నది. అయినా ఆ నెయ్యితో ఆవుకు బలము రాదు. ఆ పాలను పితికి, కాచి, తోడుపెట్టి, చిలికి, వెన్నతీసి, కాచి, ఆ నెయ్యిని మళ్ళీ ఆవుకు

త్రాపించిన బలము కలుగుతుంది. అలాగే సర్వేశ్వరుడు సర్వాంతర్యామి అయినా, సాధనోపచారములు లేకుండా, మానవులలో హితం చేయజాలడు. నువ్వులలో నూనె, పెరుగులో వెన్న, భూమిలో నీరు. కట్టెలో నిప్పుకలిసి వుండునటుల సర్వాంతర్యామి మానవుల శరీరములోను, మనసులలోను కలిసివున్నాడు. వాటిని వేరుచేయాలంటే **ప్రయత్నం, సాధన చేయాలి. అపుడు ఆ రెంటి అభేదత్వం అద్వైత్వం తెలుస్తుంది. అదే మోక్షం.**

విశిష్టాద్వైతం : రామానుజుడు : ఉపాసించదగిన పరమాత్మను తనకు వేరుగా వున్నట్లు భావించాలా? లేక తనలో కలిసివుండినట్లు భావించాలా? సాధకునిది ప్రశ్న. ఇక జవాబు: **జీవుడు శరీరానికి ఆత్మ. అలాగే దేవుడు జీవునకు ఆత్మ.** అలా భావించి ఉపాసించుటే రామానుజాచార్యుల విశిష్టాద్వైతోపాసన. ఈ సమస్తభూతజాలము ఎవనిలో ఉన్నాయో యెవరు ఈ సమస్తానికి అంతర్యామిగా వ్యాపించి యున్నారో ఆ పరమపురుషపరమాత్మ **అనన్యభక్తి (ప్రపత్తి)**తోనే లభ్యమవుతారు అని పరిజ్ఞాన ప్రపత్తి పూర్వకంగా పరమ పురుషోపాసన చేయటమే విశిష్టాద్వైతం. **"త్వమేవ సర్వం మమ దేవ దేవ" నీవే నాగతి. పతి అనే అనన్యభావంతో ఉపాసించుటే.**

ద్వైతోపాసన: - మధ్వాచార్యులు - పతిపత్ని సంబంధమే జీవాత్మ పరమాత్మ సంబంధంకూడా. అవ్యయుడైన విష్ణుభగవానుని భర్తగా ద్వైత భావముతో ఉపాసించుట. **చైతన్యోపాసన:** శ్రీకృష్ణ చరణాసక్తి, భక్తిలేనిదే జీవన్ముక్తి మాట అటుంచి కనీసం బుద్ధి శుద్ధంకావటంకూడా అసంభవము అని అంటాడు **చైతన్యుడు.** మునులూ ఆత్మారాములు అయినవారికి లౌకిక గ్రంథాలు లేకపోయినా సూదంటురాయిలాంటి శ్రీహరి కల్యాణ గుణగణ విశేషంవల్ల నిష్కారణంవల్లా భక్తిపారవశ్యం వారికి కలుగుతూ వుంటుందట. ఆ పారవశ్యముతో సిగ్గూ, బిడియాలు వదలి బిగ్గరగా శ్రీహరి నామసంకీర్తనం, చేస్తూ గగుర్పాటుతో, కంటిధారలతో నృత్యంచేస్తూ అసలైన ఆనందాన్ని అనుభవిస్తూ వుంటారు. శ్రీచరణులు ఈ విశ్వాన్ని పావనం చేస్తూవుంటారు. ఈ విధంగా పరానురక్తితో నామసంకీర్తన ప్రధానంగా కలిగింది. **చైతన్యుల ఉపాసన,** నామసంకీర్తనలలో, తన్మయత్వంతో నృత్యంచేస్తూ తదాత్మ్యభావముతోనిలిచి వుండుట ప్రధానలక్ష్యము.

గౌడియోపాసన: అవ్యక్త పురుషోత్తమ రూపములో కృష్ణపరమాత్మను, వ్యక్తపరాశక్తిప్రకృతిరూపములో రాధను అనుదర్శనము చేస్తూ ఈ కలిలో **రాధామాధవ నామసంకీర్తన** చేస్తూవుంటే పొందేఆనందమే కేవలము మోక్షము అంటారు **గౌడపాదాచార్యులు. ఆయన సనాతన గోస్వామి.** ఆ పరమాత్మ ఆనందరస స్వరూపుడు. ఆ రసాన్ని పొందితేనే ప్రాణికి నిజమైన ఆనందం కలుగుతుంది. అనే శ్రుతి వచనానుసారం- ఆరసోనందనిధిని అనుభవించాలంటే శ్రీరాధామాధవ నామమే శరణ్యం అంటారు.

నింభార్కాచార్యులు - ద్వైతోపాసనలో పురుషప్రకృతి సంబంధం వలెనే, జీవాత్మ పరమాత్మ సంబంధంగా భావించి ఉపాసించాలంటారు **వల్లభాచార్యులు.** శుద్ధాద్వైతోపాసనలో **"కృష్ణస్తు భగవాన్ స్వయం"** కృష్ణభగవానుడు స్వయంగా పరమాత్మ. ఆ పర్వాత్మను పొందుటమే శుద్ధాద్వైతమోక్షము.

శైవోపాసన - "అంగం సర్వకాలం" పృథివ్యాధి తత్వాల స్థితి గతులకు మూలకారణమైన లింగము. అదే పరమశివరూపం. ఆ యిష్టలింగ ప్రాప్తినే మోక్షము అని అంటారు.

శివాద్వైతోపాసన - జీవాత్మ తనను కర్తగాను, భోక్తగాను భావించుకొని ప్రకృతి బద్ధుడు అవుతున్నాడు.శివప్రాప్తి కలిగితేనే జీవునకు మోక్షము కలుగుతుంది. అంటే, శివైక్యత కలుగుతుంది అంటారు. **వీరశైవోపాసన - (జంగములు)** ఒక ఈశ్వరుడుతప్ప వేరు యేమీ లేదంటారు. ఈశ్వర విభూతిని(శక్తి) పొందటమే ముక్తి అంటారు.

పాశుపతోపాసన - జీవుడు ప్రకృతి గుణాలనే పాశాలతో కట్టివేయ బడిన పశువు. ఆ పశువుకూ, ఆ పాశాలకూ, ఆ

ప్రకృతికీ నియంత పరమేశ్వరుడు. అందుకే పశుపతిని పొందటమే ముక్తి అంటారు.

శాక్తోపాసన - "సర్వదేవమయీదేవీ" ఆదిపరాశక్తి సర్వదేవమయి. ఈ వివిధ విచిత్ర రూపములకు నామములకు కారణమైన ప్రకృతియే మాయాశక్తి. ఈ శక్తి కలిగినవాడే మహేశ్వరుడు. ఈ జంట అవయవాలతో ఈ నింగి, నేల నిండిఉన్నై. అవ్యక్తంగా పురుషరూపంలో వున్న పరమేశ్వరతత్వమే వ్యక్తంగా స్త్రీ రూపములో మాయగావున్న పరాశక్తి. ఆమే జగన్మాత. అమ్మలగన్న యమ్మ. ఆ పరాశక్తి మనలో స్వభావికమై తెలిసినా బలముగా, క్రియగా అనుభవమౌతుంది.

జైనోపాసన: - జైనులు (మూర్వాడీలు) వైష్ణవ ప్రాధాన్యంగా వుంటుంది. శంఖచక్రధారుడైన విష్ణుభగవానుని ప్రతిమలు దేవాలయములలో పూజిస్తారు.

ణమో అరి హరితాణమ్ ణమో సిద్ధాణమ్:
ణమో అయిరియాణమ్ ణమో ఉవర్ఝాయాణమ్
ణమో లోప సబ్యసాహూణమ్
ఇవే జైనుల మంత్రాలు.

కామాది వైరులను జయించే మహావీరులకు, సిద్ధులకు, ఆచార్యులకు, ఉపాధ్యాయులకు లోకములో వున్న సర్వసాధువులకూ నమస్కారములు. ఈ పంచ నమస్కారములూ పాపపరిహారం చేస్తాయి. ఈ మంత్రధారణీ సర్వశుభం. ఈ మంత్ర భావంలోనే ముక్తి పొందాలంటారు జైనులు.

సిక్కులు - సాంప్రదాయోపాసన ఆత్మతత్వోపదేశాన్ని చేసే గురువునూ, ఆయన ఉపదేశాల సమ్మేళనమయిన "గ్రంథసాహెబు"నూ పూజిస్తూ, కీర్తిస్తూ ఉండటమే పరమధర్మం. భారతీయ సంప్రదాయంలో సిక్కు సంప్రదాయము అంతర్భావం.

క్రైస్తవోపాసన- ఏసుప్రభువువే రక్షకుడు. తెలిసియో, తెలియకనో పాపాలు చేయటం మనిషికి పరిపాటి. మానవుల పాపాలను తొలగించి పరిశుద్ధులను చేయడానికే ఏసుప్రభువు శిలువపై రక్తాన్ని చిందించాడు. ఆ ప్రభువునూ, ఆయన ఉపదేశాలనూ, **"బైబులు"** అనే మతగ్రంథములోని సూత్రాలను ఆచరిస్తూ, ఉపాసిస్తూ ఉండటమే మనిషికి మంచి దారి. క్రైస్తవోపాసనలో స్తోత్రము చేయటమే ముఖ్యంగా ఉపాసనా నియమం.

మహమ్మదీయోపాసనా - ఈమాన్‌దారీ ఖైదామే తో-పైగంబర్ మే భరోసా. ఆత్మవిశ్వాసం కలిగి ఉండటం దైవముపై సర్వభారము పెట్టి యుండటం, దైవశక్తి అడుగడుగునా గుర్తించుచూ ఉండటం - ఇవి లోకములో ప్రధాన నియమాలు. దేహత్యాగం చేసిన తరువాత పరలోకంలో దేవుని దర్బారులో తన వాస్తవికతను నిరూపించుకొనటం అంటే- అందుకు తగిన రుజువర్తన జీవితాంతంవరకూ కలిగియుండటం. దైవవాణియైన ఖురాను గ్రంథబోధనలను అక్షరాలా ఆచరించటం. ఇవి మహమ్మదీయోపాసనలో పారలౌకికి నియమావళి.

"అల్లా హో అక్బర్" "లా యిలాహ్" "ఇల్లల్లాహ్" - ఇవి మహమ్మదీయుల ప్రధాన మంత్రాలు. (భగవంతుడు సర్వోత్తముడు. అంతకంటే మించిన విశ్వనియంత లేడు. అతడే ఆరాధించ తగినవాడు అని ఈ మంత్రముయొక్క అర్థము). నాకంటే మించినది లేదు. **"నా పరమస్తికంచిత్ " అనే భగవద్గీతార్థము. మహమ్మదీయ మంత్రార్థానికి సామ్యాలే.** అందువలన మహమ్మదీయ సాంప్రదాయముకూడా భారతీయ హైందవ సాంప్రదాయములో అవాంతర భాగమే.

ఈ విధంగా మానవుడు ఆత్మపరిశోధనకు ప్రారంభించి నప్పటినుండీ తరతరాల నరజాతికి తారకమైన అనంత విజ్ఞాననిధిగా ఎరంగిన భారతీయుల సంస్కృతి అనంత గంభీరం కావటం వల్ల, భిన్నభిన్న సాంప్రదాయాల రూపాలలో నదులెన్ని వచ్చిననూ, చేరిననూ పొంగక, క్రుంగక ధర్మసీమలో నిలచియున్నది.

అంతేకాక విశ్వాత్మకమై సార్వభౌతికమై సర్వకారుకమై, పెంజీ కటికవ్వల నేకాకృతియై వెలిగే విజ్ఞాన విజయ జ్యోతియై వెలుగుచున్నది. **ఇట్టి పవిత్రమహా సంస్కృతిక క్షేత్రమైన భారత ధాత్రిమీద మనిషిగా పుట్టుటకంటే**

సుకృతములేదని తెలిసుకోగలిగిన, మనిషికి కలిగే ఆనందం అపారం.

(స.సా.వా.పు.171/179)

వైద్యాలయము

(చూ॥ శ్రీసత్యసాయి అంతర్జాతీయ కేంద్రము)

వైద్యుడు/వైద్యులు

సేవ చేసేవాడే నిజమైన వైద్యుడు. **"వైద్యోనారాయణో హరిః"** వైద్యుడు నారాయణ సమానుడు. నారాయణుడేమి చేస్తున్నాడు? అందరికి సహాయం చేస్తున్నాడు. అదే రీతిగా, వైద్య నారాయణులు కూడా అందరికీ సహాయం చేయాలి.

(స.సా. జూలై 2001 పు. 198)

ప్రేమస్వరూపులైన వైద్యులారా! మీ అదృష్టవశాత్తు మీరు గొప్ప చదువులు చదివి డాక్టర్లు అయినారు. **డాక్టరుకు ఉండవలసిన ప్రధాన గుణం త్యాగమే.** త్యాగగుణం లేని డాక్టరు ఉండి ప్రయోజనం లేదు. త్యాగమే జీవితానికి క్షేమమని గుర్తించాలి. బీదలను అప్యాయంగా చేరదీసి, వారికి సేవలందించాలి. అప్పుడే మీరు ధన్యులౌతారు. అనేకమంది బీదలు రోగనివారణ గావించుకోవడానికి తగిన ధనం తమవద్ద లేకపోవడంచేత ప్రాణాలు కోల్పోతున్నారు. **మీరు ప్రేమతో అలాంటివారి ప్రాణాలను కాపాడండి. Help Ever, Hurt Never, బీదలను డబ్బుకోసం పీడించి వారి ప్రాణాలను తీయకండి. వారిని పీడిపించి మీరు ధనం సంపాదిస్తే అది మీకు మంచిదికాదు.** ప్రేమస్వరూపులు కండి, దయాస్వరూపులు కండి త్యాగస్వరూపులు కండి. **త్యాగమే యోగాన్ని అందిస్తుంది.** మీరు త్యాగభావాన్ని ఎంత పెంచుకుంటే లోకం అంత అభివృద్ధి అవుతుంది. కాబట్టి, మీరు సంపాదించిన దబ్బును బీదలకోసం వినియోగించండి. పరోపకారదీక్షను పూనండి. ఈనాడు ఇక్కడి ఆసుపత్రిని నిర్మించడంచేత ఎందరో ప్రజలు వచ్చి చుట్టూ భవనాలు కట్టుకుంటున్నారు. ఇంతకుపూర్వం ఇక్కడ భూమికి అంతగా విలువ లేదు. ఈ ఆసుపత్రి ఏర్పడిన తరువాత ఇక్కడ భూమి యొక్క వెల చాలా పెరిగిపోయింది. ఇంత లాభం పొందినవారు బీదలకోసం ఏమి చేస్తున్నారు? ఒక్క బీదవానిని సంతోషపెడితే మీకుకూడా ఎంతో ఆనందం లభిస్తుంది.

(స.సా.ఫి.2001 పు.35)

వైబ్రేషన్

(చూ॥ అయస్కాంత శక్తి, విశ్వామిత్రుడు)

వైరాగ్యము

వైరాగ్యమంటే అలుబిడ్డలను వదలిపెట్టి అడవికి పోవడం కాదు. **"భావమందు దుష్టభావంబు వీడుటే త్యాగమగును. అదియే యోగమగును".** కోరికలను ఎంత తగ్గించుకొంటావో నీవు అంత ఆనందమును అనుభవిస్తావు.

(స.సా.అ.99 పు.273)

వైరాగ్యం అంటే కర్మలు విసర్జించటంకాదు. ఇల్లు వాకిలీ విడిచి అడవి గుహలో నివసించటం కాదు. కేవలం కర్మ త్యాగం ఎన్నటికీ వైరాగ్యం అనిపించుకోదు. **విషయ వాంఛలు** తగ్గించుకోటమే వైరాగ్యం అనిపించుకొంటుంది. వైరాగ్యలబ్ధికి రామాయణాది గ్రంథాలు తోడ్పడతాయి. రాముడు త్యాగ పురుషుడు. ''త్యాగేనైకే అమృతత్వమానశుః'' అధికారం పొందటానికి సర్వశక్తి సామార్థ్యాలు ఉండినననూ దానిని త్యాగం చేశాడు. ఆనాడు రాముడు.''

(అ.త.పు. 126)

వైరాగ్యము అనగా శబ్దాది విషయాలలో అనురక్తి వుండరాదు. ఇంద్రియములు వాటికి తగినవే కోరును కానీ సాధకునకు తగినవి అవి కోరవు. కాన ఇంద్రియార్థములు పురుషార్థములుకావు. **ఆత్మకు కావలసినవే పురుషార్థములు.**

(గీ.పు.209)

వైశేషిక

మీ రందరూ యీ శిక్షణా కేంద్రమునకు బయలు దేరేముందు తక్కువ luggageతో వచ్చారు. ఎందుకు? మీకు దారిలో పడవలసిన శ్రమ తెలుసును కనుక. కానీ మీరు రెండు బుట్టలు, రెండు ట్రంకులు, ఒక బెడ్డింగు ఇలా సామానులు ఎక్కువగాతెస్తే మీ ప్రయాణము సుఖముగా ఉండదు. దిగవలసిన stationలో రైలు చాలా కొంచెము సేపు మాత్రమే నిలిచినప్పుడు ఇవన్నీ దింపుకొనే లోపల బండి కదిలి పోతుంది. నా సామానులు పోయినవి అని బాధపడుతుంటారు. అందుకే Railway Department వారు 'Less luggage, more comfort, make travel a pleasure' అని వ్రాసి పెట్టారు. మన జీవితము కూడ ఒక దీర్ఘ ప్రయాణము. ఈ వాంఛలే Luggage. దీనిని తగ్గించుకోవాలి. ~~ఈ కోరికలను తగ్గించుకోవడాన్నే~~ **వేదాంత పరిభాషలో 'వైరాగ్య'మన్నారు.** వైరాగ్యమంటే ఇల్లు, వాకిలి, ఆలుబిడ్డలను వదలి అరణ్యమునకు పోవడం కాదు. ఇది సరైన అర్థము కాదు. **వైరాగ్యమనగా ఆశలను అదుపులో పెట్టు కోవడమే, నీవు సంసారములో ఉండు. సంసారమును నీలోనికి చేర్చకు' - 'Hands in the Society, Head in the forest'** అనే తత్వమును మనము పెంపొందించు కోవాలి. పిల్లల తల్లిదండ్రులకు కూడ బోధించాలి. మీరు ఆచరణ రూపేణ అందిస్తే వారు కూడ మారడానికి అవకాశం ఉంటుంది.

(శ్రీ.ది.పు.117/118)

అభిమానమే దుఃఖమునకు మూలకారణము. కనుక మొట్టమొదట ఈ అభిమానమును క్రమక్రమేణ మనం తగ్గించుకుంటూ రావాలి. దీనినే వేదాంత పరిభాషల యందు వైరాగ్యము అని చెబుతారు. ఈ బాధ్యులను క్రమక్రమేణ తగ్గించుకుంటూరావాలి. దీనినే less luggage more comfort make travel a pleasure మన ప్రయాణము లోపల ఈలగేజ్‌ను తగ్గించుకుంటూ రావాలి. అయితే ఏ విధంగా తగ్గించుకోవాలి? ఈ వాంఛలు లేకుండా మానవుడు జీవించడానికి వీలుకాదే! ఈ వాంఛలు ఏవిధముగా మనము తగ్గించుకోవడానికి వీలవుతుంది? **వాంఛలు తగ్గించుకోవడమంటే వాంఛలపై నున్న మమత్వాన్ని తగ్గించుకోవడము.** నీ వ్యాపారము. నీవు చేసుకో, నీ ఉద్యోగానికి నీవు వెళ్ళు. నీ కర్తవ్యాలు నీవు నిర్వర్తించు, నీ బాధ్యతలు నీవు అనుసరించు, ఆచరించు, అనుష్ఠించు **కాని ఇవన్నీ కూడనూ భగవత్ కార్యములే అనే భావనతో నీవు అనుభవించాలి.** **"సర్వ కర్మ భగవత్ ప్రీత్యార్థం" అనే భావనతో నీవు అనుభవించాలి.** ఇది సులభమైనమార్గము. అన్నీ భగవంతుడే చేస్తున్నాడు.

(శ్రీ.ఫి. 1955 పు.21)

ఇంద్రియములు వినిన విషయములపైగానీ, చూసిన వస్తువులపై గానీ, మనస్సు ఒక విధమైన కాంక్షను దూరము గావించుకోవటమే వైరాగ్యమని నిరూపించింది పతంజలి యోగసూత్రము. విషయస్వరూపమునుండి ఆసక్తిని దూరము చేయుటయే వైరాగ్యమని స్థిరము చేసింది. ఈలోకమునందు గల వస్తువులుగానీ పరలోకము నందున్న వస్తువులుగానీ అనిత్యములని వాటిపైన ఆసక్తిభావమును దూరము గావించుకొని, అట్టి వస్తువుల యెడ వైరాగ్యమును పొందటము అత్యవసరమని ప్రబోధించింది శంకరభాష్యము.

ఇక శ్రుతిప్రమాణము. దృశ్యకల్పితమైన దేహము మొదలు బ్రహ్మదేవుని వరకుండిన వస్తువిసర్జనయే - అనగా వస్తువులపైన రోతయే వైరాగ్యమని బోధించింది.

(శ్రీ.గీ.పు. 91)

(చూ॥అంతర్జ్యోతి, భాగవతము)

వైశేషిక

మన భావములను ఉత్తమమైన భావములుగా, ఉత్తమమైనట్టి భావములుగా పెంపొందింప జేసుకోవాలి అని వైశేషికము బోధించింది.

(స.ది.పు.135)

(చూ॥ వేదము)

వైశేషిక దర్శనము

చరిత్రకు పూర్వము దివ్యజ్ఞానసంపన్నులైన మహర్షులు దైవము నుండి ఆవిర్భవించిన దేవవాణిని శ్రద్ధగా పరిశీలించి సలిపి అందలి సత్యసూక్తులను జగత్తుకు ప్రచార(ప్రబోధములు సలుపుతూ వచ్చారు. **ప్రపంచమున వున్నవి రెండే వస్తువులు. ఒకటి పరార్థము, రెండు పదార్థము.** కానీ పదమునకు అర్థములను ప్రబోధించి, జగత్తులో వ్యాప్తి గావించి **ఏకత్వములోని అనేకత్వాన్ని నిరూపణ జరిపి చాటినవాడు ప్రాణిని. పదార్థముయొక్క స్వరూపమునే అంతరార్థముగా విశ్వసించి ఆ పదార్థ స్వరూప జ్ఞానమును లోకములో ప్రచారము చేసిన మహనీయుడు 'కాణాదుడు'. ఈ కాణాద దర్శనమే వైశేషికము.** దీనికి కాణాదుడే మూలకారకుడు. అనగా పదార్థ విజ్ఞానమును ప్రపంచమున చాటి **పదార్థము అశాశ్వతమనియు. పరార్థము శాశ్వతమనియు జగత్తుకు నిరూపించటానికి ఈ వైశేషిక దర్శనము ప్రయత్నిస్తూ వచ్చింది. ఈ ప్రపంచమునందలి సమస్త విద్యలూ వేదము నుండి ఆవిర్భవించినట్టివే.** ఈ సర్వ విద్యలూ భౌతికమైన జగత్తులో అనుభవింపజేసేటటువంటివే. కానీ ఆనాటి మహర్షులు ఈ భౌతికమైన, లౌకికమైన క్షణికమైన విద్యలను త్యజించి అలౌకికమైన అభౌతికమైన దివ్యత్వము నిమిత్తమై తమ జీవితాన్ని అంకితము చేస్తూ వచ్చారు. తపశ్శక్తిచేత అభౌతికములైన సత్యమును హస్తగతము గావించు కున్నవారు ఆనాటి మహనీయులు. పదార్థజ్ఞానములో పరిశీలన జరిపినప్పుడు భిన్నరూపాలు మాత్రమే మనకు గోచరిస్తాయి. అంతరార్థ భావమునందు ఆచరణ సల్పినప్పుడు పరిశీలన సల్పినప్పుడు అన్నింటి యందును ఉన్నది ఒకే దివ్యత్వమని స్పష్టమగుచున్నది. కొండలన్నీ బండలే. భూమియంతయూ మృణ్మయమే వృక్షము లన్నియూ కాష్టమయములే. మానవులందరూ మాంసమయమే. ఆకారములో, రూపనామములలో వస్తువు యొక్క విశిష్టతలు వివిధమైనట్టి స్వరూప స్వభావములను నిరూపించవచ్చును. అంతరార్థమును పరిశీలించినప్పుడు **అన్నింటియందు ఉండినటువంటిది ఈ పంచభూతములే.**

ఈ పంచభూతముల యొక్క వికాసస్వరూపములే ఈ వృక్షములు, ఈ కొండలు ఈ భూమి, ఈ మానవ స్వరూపాలు. **సమస్త ప్రాణికోటి కూడా పంచభూతముల యొక్క అంతరార్థములే. ఈ భేదములు భౌతికమైనటు వంటి దృష్టిభేదములే కాని అలౌకికమైనట్టి ఆత్మభేదములు కావని ఈ వైశేషిక సూత్రములు ప్రబోధిస్తూ వచ్చాయి. ఒక అణువునకు మరొక అణువునకు భేదమును నిరూపణ చేసినటువంటి దానికే విశేషము అన్నారు. విశేషమును నిరూపింపజేసినట్టిదానికే వైశేషికము అని పేరు వచ్చింది. విశేషమనగా ఒక విధమైన అంతర్భావము. సమస్త పదార్థములయందు విశిష్టత అయినట్టి ఆధారభూతమును ఆధారము చేసుకొని ఇటువంటి విశేషమును నిరూపణ చేసినదే వైశేషికము.** ప్రపంచమంతా అణుమయమే. ఒకఅణువునకు మరొక అణువునకు ఎంతో భేదము కనిపిస్తుంది. ఈ ప్రపంచము సత్యస్వరూపమనికూడనూ నిరూపిస్తూ వచ్చింది వైశేషికము. ప్రకృతి పదార్థము సత్యమే అని నిరూపిస్తూ వచ్చింది. స్వరూపములు మారినప్పటికీ పదార్థములు మారునని కావు అని నిరూపిస్తూ వచ్చింది. మట్టితో కుమ్మరి కుండలు చేసాడు. కుండలు పగిలిపోయినవి. ముక్కలైనవి. మట్టిగా మారినవి. కుండలు ముక్కలుగా మారినవేకానీ మట్టి మారలేదు. **ఈ పదార్థము సత్యమేనని నిరూపించింది వైశేషికము.** ఇది వెండి టంబ్లరు. ఈ వెండి టంబ్లరును కరిగించి వెండి ప్లేటుగా చేసుకోవచ్చును. వెండి ప్లేటును కరిగించి వెండి గిన్నెగా మార్చుకోవచ్చును. ఈ విధముగా ఆకారములు ఎన్ని మారినప్పటికీ వెండి మారలేదు. కదా. కనుక పదార్థము కూడనూ ఈ జగత్తులో సత్యమేనని ప్రబోధించి ప్రచారము సల్పినదే వైశేషికము.

ఇంక పంచభూతముల యొక్క తత్వము ఏనాడు కూడనూ మారునది కాదు. పంచభూతములు భగవత్ అంశములు. శబ్దముల యందు వివిధములైన శబ్దములుండవచ్చును.

ఆధారశబ్దము ఏనాటికీ మారునది కాదు. ఒక హార్మోనియమ్‌కు గాలి వేస్తుంది. గాలి వొక్కటే, కానీ రీడ్స్ వత్తినప్పుడు స,రి,గ,మ,ప,ద,ని,అనే వేరు సప్తస్వరములు వస్తాయి. **ఈ సప్తస్వరములకూ ఒక్క గాలియే ఆధారము. ఆ గాలియే ఓంకారము. ఈ స్వరములే వికారములు. ఇన్ని వికారములు కూడనూ ఒక్క ఓంకారము నుండియే ఆవిర్భవించినవని పదార్థము మారినా పరార్థము మారదని, శాశ్వతమని నిరూపిస్తూ వచ్చింది యీ వైశేషికము.** దీనికి కొన్ని ఆధారములు కూడా తీసుకొన్నది. ఈ ఆధారములుకూడనూ ప్రకృతమైన ఆధారములనే తీసుకొన్నది. లోకములో స్త్రీలు ఉన్నారు, పురుషులు ఉన్నారు. ఈ యిరువురికి లింగభేదములుండవచ్చును కానీ వీరిలో ఏ మాత్రముకూడనూ హెచ్చుతగ్గులుగానీ లేవని ఖండిస్తూ వచ్చింది. వైశేషికము. పురుషులు అధికమని, స్త్రీలు తక్కువని ఈనాడు ప్రాకృతమైన దృష్టిలో చూచుకుంటూ అనుభవిస్తున్నారు. కానీ **వైశేషికము ఇరువురూ సమానమే అని చెప్పింది.** పురుష సహకారమే లేకుండిన స్త్రీ ఎట్టి కార్యముకూడనూ సాధించలేదని అదే విధముగా స్త్రీ సహకారము లేకుండిన పురుషుడు ఏకార్యము నందు విజయము సాధించలేదని అనేక ప్రామాణములచేత నిరూపిస్తూ వచ్చింది. సమాజము ఇట్టి దురవస్థలకు ఈనాడు గురికావడానికి కారణమేమిటి? ఈ అల్పభేదములను పెంచుకొని ఆత్మతత్వాన్ని విస్మరించి ఏకత్వమును అనేకత్వముగా మార్చుకొనుట చేతనే సమాజము యింతటి దురవస్థలకు గురవుతూ వచ్చింది.

మానవునికి శాంతి లేకపోవటానికి కారణమేమిటి? **శాంతి కావాలని ఆశిస్తున్నాడు మానవుడు.** సమాజము నుండి సుఖమును అందుకోవాలని ఆశిస్తున్నాడు మానవుడు. **కానీ ప్రతీ మానవుడు తాను ఈ సమాజమునకు చేసిన ఉపకారము ఏమిటని మంచి ఏమిటని తనకు తాను ప్రశ్నవేసుకొంటే ఏమాత్రమూ జవాబు చిక్కటం లేదు.** ప్రపంచానికి నీవు ఏమైనా మంచి చేస్తేకదా, ప్రపంచము నీకు మంచి చేసేది. ప్రపంచముయొక్క శాంతిని నీవు ఆశించి ప్రపంచశాంతికి పాటుపడినప్పుడే ప్రపంచము కూడనూ శాంతినందిస్తుంది. కనుకనే **ప్రపంచమునుండి నీవు అనుభవించే సుఖదుఃఖములన్నీ నీ భావముల యొక్క ప్రతిబింబములే అని ఈ వైశేషికము చక్కగా బోధిస్తుంది. ఇవియే అంతర్ విశేషములు. ఈ విశేషములను పురస్కరించుకొనియే దీనికి వైశేషికమని కూడా పేరు వచ్చింది.** "ప్రపంచము నాకు ఏ సుఖమునందిస్తున్నది?" అని ప్రశ్నించుకుంటున్నావే కానీ "ప్రపంచానికి నేను ఏ సుఖాన్ని అందించాను?" ప్రపంచము నాకు ఏమి మేలు చేస్తున్నదని అని ఆశించుతున్నామే గానీ ప్రపంచానికి నేను ఏమి మేలుచేసాను. అని ప్రశ్నించుకోవటంలేదు. కనుకనే వైవేషికము ఇలాంటి ప్రశ్నలంతా వేసి జగత్తునందు ఆ సమాధానమును పొంది ఆ సమాధానమును ప్రచార ప్రబోధలు సల్పుతూ వచ్చింది. కనుక మనము చేసే కర్మలు ఉత్తమమైనవిగాను, మానవత్వమున కు సంబంధించినవిగాను విచారించి చేయాలి.

పరమాణువునందు మహత్తరమైన శక్తి వుంటున్నది. భేదములను పురస్కరించుకొని మనము అంతరార్థమును గుర్తించాలి. ఇంతేకాదు. భూత భవిష్యత్ వర్తమాన కాలములకు సత్యస్వరూపాన్ని నిరూపించే దివ్యజ్యోతులను కూడనూ ఈ వైవేషికము అందిస్తూ వచ్చింది. త్రికాల భాధ్యమైనదే సత్యమని నిరూపిస్తూ, వచ్చింది. ఈ సత్యమునందు భేదములెందుకు? శుక్ల యజుర్వేదము నందు కూడనూ చక్కని ఆదర్శములిచ్చే అనుభూతులను అందిస్తూ వచ్చింది. **ఈ వేదములయొక్క సూత్రములను వైవేషికము చక్కగా పరిశీలన సల్పి "ఓ మానవుడా!**

ఒక్క గూటి పిట్టలం
ఒక్క తల్లి పిల్లలం
ఒక్క తీగ పువ్వులం
ఒక్క జాతి పౌరులం

అందరం మానవులమే ఎందుకు ఈ భేదములు? ఎందుకు ఈ రాగద్వేషములు? నిన్ను నీవు ద్వేషించుకుంటున్నావు.

కానీ పరులను కాదు నాయనా!" అని ప్రబోధించింది. ఒక్క గూటి పిట్టలమే. ఏమిటి ఆ గూడు? దేహమనే గూడు అందరికీ ఉంటున్నది. ఆ గూటిలోనున్నవి ఈ జీవులు. అందుకోసమే పూర్వకాలములో పాడేవారు. "పలుకవే బంగారు చిలుకా" అని. ఆ చిలుకను ఈ దేహమనే పంజరములో పెట్టి పెంచుతున్నారని. అనేక పర్యాయములు చెప్పాను. **ఈ దేహము పాంచభౌతికము. ఇందులో క్షణక్షణమూ "నీచులూరునేగాని పుణుగు జవ్వాదీలు పుట్టబోవు",** ఇలాంటి గూడునందు ఎంతవరకూ వుంటుంది ఈ పిట్ట? రెక్కలు వచ్చేవరకు మాత్రమే గూడులో వుండి గూడును క్షేమముగా కాపాడుకుంటుంది. రెక్కలు రాగానే గూడును కూడనూ శిథిలము చేసి వెళ్ళిపోతుంది. కనుకనే **మనకు ఆత్మ జ్ఞానము వచ్చువరకు మాత్రమే ఈ గూడును ఛిన్నాభిన్నము చేసి దీనిపైన వైరాగ్యము పూని దీనిని మనము విసర్జించి పోతున్నాము.** ఈ దేహమనే గూడు అందరికీ ఉంటున్నది. ఈ గూడులు వివిధరూపములుగా వుండినప్పటికీ అన్నీ కూడ గూడులే కనుక అనేకత్వములో ఉండిన ఏకత్వాన్ని మనము తీసుకోవాలి. **ఒక్కతల్లి పిల్లలమే. ఎవరు ఆ తల్లి? భూమాత.** ప్రతీ మానవుడు భూమి నుండి ఆవిర్భవించినవాడే. ప్రతీ దేహము మట్టిమయమే. పుట్టిన బిడ్డను చక్కగా స్నానము చేయించి, శుభ్రపరచి ఊయలలో పెట్టినప్పుడు సాయంకాలమునకు ఆ బిడ్డచేతిలో మట్టి వుంటుంది. ఆ బిడ్డ ఎక్కడికి పోయి ఆడింది? ఏ మట్టిని ముట్టింది? కాదు. దేహమే మట్టిమయము. మట్టి నుండి వచ్చిన ఈ దేహము మట్టిలోనే లీనమయిపోతున్నది. కనుక ప్రతీ మానవుడూ కూటిపేద మొదలుకొని కోటీశ్వరునివరకూ, రాజు నుండి రత్నమువరకూ మట్టినుండి వచ్చినవారే. లోకములో లోహములు ఎన్నియో వుంటున్నది. అన్ని లోహములూ మట్టినుండి వచ్చినవే కానీ వీటి విలువలు మాత్రము వివిధరూపములలో అందిస్తున్నాము. మాణిక్యముకూడనూ మట్టినుండి పుట్టినదే కానీ చెట్టునుండి కాయలేదు. ఈ సత్యాన్ని చక్కగా గుర్తించుకుంటే అందరమూ ఒక్కతల్లి పిల్లలమే. **ఒక్క తీగ పుష్పులమే. తీగ ఒక్కటే పూలు వేర్వేరుగా వుంటున్నాయి. ఆ తీగనే హృదయము.** ఈ హృదయము అందరిదగ్గరా వుంటున్నది. హృదయమునుండి మరొక హృదయానికి సంబంధముంటున్నది. **ఒక్క జాతి పారులమే-మనదంతా ఒకే జాతి. అదే మానవ జాతి.** ఎట్టివారైనా నాది పశుజాతి అని అనుకుంటాడా? లేక రాక్షస జాతి అనుకుంటాడా? లేక పక్షిజాతి అనుకుంటాడా? కనుక నీవు మానవజాతి యందు పుట్టినవాడవే. సముద్రములో పుట్టిన వివిధమైన అలలవలె ఈ సచ్చిదానందమైనట్టి దివ్యత్వము నుండి వివిధరూపముల వంటి అలలు పుడుతున్నాయి. కనుక మనకెందుకు ఈ ద్వేషము? **ద్వేషము నిర్మూలనము గావించినది, భేదములు నిర్మూలనము గావించినది ఏకత్వాన్ని ప్రకటించి దివ్యత్వాన్ని ఆనందాన్ని అందించినది ఈ వైశేషికమే. ఇదియే యిందులోన్ను పెద్ద విశేషము.**

అనేక మంది వైశేషిక దర్శనాన్ని గురించి అనేక విధములుగా ప్రకటించుతు వుంటారు. ప్రబోధిస్తూ వుంటారు. గ్రంథ పరిచయముతో నేర్చుకొని విచారణ చేసి అందిస్తున్నారేకానీ నిత్యసత్యమైన అనుభూతిలోనుండిన విషయాలను అందించి ప్రజలయొక్క హృదయాలకు హత్తుకొనేటట్లుగా, ఆనందపరిచేటట్లుగా బోధించే వ్యక్తులు ఈనాడు కరువై పోయారు. ఆనాటి దివ్యజ్ఞాన సంపన్నులైన మహర్షులందరూ ఈ భౌతిక లౌకికములకు అతీతమైన స్థితిని పొందారు. **వారంతా కేవలం సూపర్ మైండులో ప్రవేశించారు.** ఆ సూపర్‌మైండ్‌లో నుండి చూసినప్పుడు ఇవన్నీ కూడనూ అల్పవక్తులుగానే వుంటుంటాయి. ఈనాడు మనము నేర్చిన సర్వవిద్యలు కూడా అల్ప విద్యలే, అనిత్య విద్యలే, అప్రమాణ విద్యలే. ప్రమాణములు లేవిక్కడ. ఏమిటి దీనికి ప్రమాణము? ఇష్టము వచ్చినట్లు పలుక్కోవటమే దీనికి ప్రమాణము. కనుక ప్రమాణమనేదానిని నిరూపించే విశిష్టత లేనటువంటి ఈ ప్రకృతియంతయు కూడా అప్రమాణ స్వరూపములయిపోయినాయి. ఏ భాషలో

వైశ్వానర/వైశ్వానరుడు

చూచినప్పటికీ శబ్దముయొక్క అర్థములు అనేకంగా రూపొందుతున్నాయి. పదముల యొక్క స్వరూపములు అనేకంగా ప్రకటిస్తూ వచ్చాయి. ఈనాటి విద్యార్థులకు చక్కగా అర్థమయ్యే రీతిలో విచారణ చేయాలను కున్నప్పుడు put పుట్ అంటారు ఈ పదమును. కానీ But బట్ అంటారు దానిని ఎందుకు బుట్ అనకూడదు? దీనికేమిటి ప్రమాణము? ప్రమాణము లేదు. Walk వాక్. వాల్క్ అని ఎందుకు అనకూడదు? కనుకనే ఈ పదముయొక్క అర్థమును ప్రమాణములేని స్థితిలో ప్రబోధించటంచేత మానవుని పరతత్వము కూడనూ పరమాత్మ మార్గమునకు పోలేక పోతున్నాది. **పదార్థములగురించినట్టిది పాణిని వ్యాకరణము. శబ్దమును అనుసరించి బోధించి నది వైశేషికము.**

(స.ది.పు.117/122)

వైశేషిక దర్శనము ప్రకృతి సృష్టి గురించి చక్కగా విపులంగా చెప్తూ, వచ్చింది. అణుమయమే ఈ ప్రపంచము. అఖండమంతా అణువులోనే వుంటున్నది. చిన్న విత్తనములోనే వుంటున్నది. పెద్ద వృక్షము. కానీ విత్తనములో ఈ వృక్షము మనకు కనిపించదు. వృక్షములో ఏఏ భాగములున్నాయో అన్నీ విత్తనములోనే వుంటున్నాయి. ఈ విత్తనములోనే లేకుండిన వృక్షములో ఎట్లా వస్తాయి? కనుకనే "బీజం మాం సర్వ భూతానాం". ఈ బీజము నుండే ఈ విశ్వమనే వృక్షము ఆవిర్భవించింది. అణువునందే వుంటున్నది ఘనమైన దివ్యశక్తి. ఈ ఘనమునందే వుంటున్నది అణుశక్తి. ఇంత పెద్ద వృక్షమునందే చిన్న విత్తనము వుంటున్నది.

ఇలాంటి పవిత్రమైన నిత్యసత్యమైన సూక్తులు బోధిస్తూ వచ్చాయి ఈషడ్దర్శనములు. **న్యాయము మానవునకు ప్రాణము.** ప్రాణమున్న మానవుడు ప్రకృతిని గుర్తించమని చెప్తూ వచ్చింది. వైశేషికము. మొదట ప్రాణాన్ని తరువాత ప్రపంచాన్ని బోధిస్తూ వచ్చాయి **ఈన్యాయ వైశేషికములు.**

(స.ది.పు.126)

వైశ్వానర/వైశ్వానరుడు

(చూ॥ బ్రహ్మార్పణం, బ్రహ్మవిద్య)

వైస్ చాన్స్‌లర్లు

మొట్టమొదటి వైస్ చాన్స్‌లర్ గోకాక్ గొప్ప పండితుడు, జ్ఞాని, మహా సాధకుడు, గొప్ప యోగివంటివాడు. అతడిక్కడ ఒక్క నయాపైసా ముట్టకుండా ఫ్రీగా సేవ చేశాడు. రాత్రింబవళ్ళు కష్టపడి మన సంస్థను తన స్వంత ఇల్లువలె చూసుకున్నాడు. గవర్నమెంటు నిబంధనల ప్రకారం రిటైర్మెంటు తరువాత ఎవరైనా మూడు సంవత్సరములకు మించి వైస్ చాన్స్‌లర్‌గా ఉండటానికి వీల్లేదు. కనుక గోకాక్ తరువాత సరాఫ్ వచ్చాడు. అతను కూడా చాల గొప్పవాడే. అతడు యు.జి.సి.లో మెంబర్‌గా పనిచేశాడు. అతను ఇక్కడకు వచ్చి మూడు సంవత్సరములు పని చేసిన తరువాత సంపత్ వచ్చాడు. అతను కూడా చాల గొప్పవాడు, కాన్పూర్ ఐ.ఐ.టి యొక్క డైరెక్టర్‌గా పనిచేశాడు, కంప్యూటర్ సైన్సులో చాల ప్రసిద్ధి పొందినవాడు. అతను కూడా ఇక్కడ చాల శ్రద్ధగా పని చేశాడు. తరువాత హనుమంతప్ప వచ్చాడు. వీరెవ్వరూ ఒక్క నయాపైస కూడా ఆశించలేదు. నేనిచ్చినా పుచ్చుకోలేదు. 'మీ దయ తప్ప మాకు ఏమీ అక్కర లేదు అన్నారు.

(స.సా.సె. 98 పు. 240)

వ్యక్తి

(చూ॥ త్రిగుణములు)

వ్యక్తిత్వము (Individuality)

(చూ॥ హిందువులు)

వ్యత్యాసము

Saint కు Scientist కు వ్యత్యాసమేమిటి?

Saint మంత్రోపాసకుడు Scientist యంత్రోపాసకుడు.

Saint సృష్టికర్తను గురించి విచారణ సలుపుతాడు.
Scientist సృష్టిని గురించి విచారణ సలుపుతాడు.

(భ.ప్ర.పు.2)

జీవుడు, దేవుడు రెండూ ఒక్కటే. వడ్లు, బియ్యము రెండూ ఒక్కటే. అయినప్పటికీ వడ్లకు బియ్యమునకు ఉన్న తేడా ఏమిటి? ఈ వడ్లు పొట్టు (హస్క్)చే కప్పబడి ఉంటుంది. ఈ పొట్టు ఉండినంత వరకు అవి వడ్లు. ఈ వడ్లుగా ఉండినంతవరకు ఎక్కడైనా భూమిలో పెట్టి నీరు పోయండి - తిరిగి మొక్కలు, తిరిగి వడ్లు - ఈ విధంగా జీవితం గడుస్తుంది. తన పైపొట్టు తీసిన తరువాత బియ్యముగా తయారౌతుంది. **ఈ బియ్యమును భూమిలో పెట్టి ఎన్ని విధముల మంచి ఎరువులు వేసి పోషించినప్పటికి, 'పునర్జన్మ నవిద్యతే',** దీనికి యింక జన్మ ఉండదు, పుట్టుక లేదు. వడ్లకు, బియ్యమునకు ఏవిధమైన వ్యత్యాసమున్నదో, **జీవునకు దేవునకు ఇదే వ్యత్యాసము.** బంగారులో వెండి, రాగి, ఇత్తడి మొదలైన లోహములు చేరటంచేత అది కేవలం తెల్లబంగారమని చెప్ప బడుతుంది. దీని విలువ కూడా తగ్గుతుంది. అయితే దీనిని అగ్నిలో వేసి, పుటము పెట్టి పరిశుద్ధము గావించిన తరువాత దీనిలో చేరిన వెండి, రాగి, ఇత్తడి దూరమై స్వతస్సిద్ధమైన అపరంజిగా తయారై దానికి గొప్ప విలువ వస్తుంది. అదేవిధముగా **దివ్యత్వములో సత్త్వ, రజో, తమోగుణములు చేరిపోవటం చేత ఇది జీవుడుగా తయారౌతుంది. ధ్యాన తపస్సులనే సాధనల ద్వారా గుణములు వేరై పోయి శుద్ధ సాత్త్వికమైన దివ్యత్వము తేలుతుంది. ఏతావాతా ప్రాకృత గుణముల సంపర్కమే జీవుడని, ఈ ప్రాకృత గుణములకు వేరైన వాడే దేవుడని మనకు స్పష్టమవుతూ వచ్చింది.** ఇది ఇంకా అర్థము కావాలనుకొంటే

life + Desires = Man

Life - Desires = God

పొట్టుతో కూడినవి వడ్లు. పొట్టులేనివి బియ్యము. అదే విధముగా నిత్యజీవితములో నుండిన దైవత్వమును ప్రతి మానవుడు సంస్కారము చేత సందర్శించటానికి అవకాశము ఉంది. **కనుక మానవత్వానికి దివ్యత్వముతో ఒక సంబంధము ఏర్పరచాలి.** నిత్యజీవితంలో మనము అనేకం చూస్తుంటాము. తియ్యని మామిడి చెట్టునకు పుల్లని మామిడి కొమ్మను తెచ్చి అంటుకట్టినప్పుడు ఈ పుల్లని మామిడి కొమ్మ తియ్యని మామిడి పండ్లు యిచ్చే స్వభావము కలిగినదిగా రూపొందుతుంది. **ప్రాకృత సంబంధ గుణములు గల్గిన మానవత్వాన్ని దివ్యత్వంతో, పవిత్ర దైవస్వభావముతో చేర్చినప్పుడు ఈ మానవత్వము దైవత్వముగా రూపొందుతుంది. దీనినే వేదాంత పరిభాషలో బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నారు.**

(షి.పు.2/3)

వ్యర్థము

అనుకూల వతియైన అర్థాంగియున్న
తనను పూజించెడి తనయుడున్న
తగు సేవలొనరించు దాన దాసీలున్న
గుణవంతురాలైన కోడలున్న
అమిత ప్రేమగజూచు అక్కచెల్లెండ్రున్న
తన ఆజ్ఞపాలించు తమ్ములున్న
మైత్రి నిత్యము గోరు మిత్రబృందమున్న
తగిన అధికార ఉద్యోగమున్న
విశ్వవ్యాప్తిని గావించు కవితయున్న
చక్రవర్తుల మించిన ధనముయున్న
దైవ ప్రేమయె లేకున్న ధరణియందు
సర్వమును వ్యర్థ మగును తా చనెడువేళ.

(భ.ప్ర.పు.15)

వ్యసనములు

తను వ్యసనము, మనో వ్యసనము, ధనవ్యసనము, స్త్రీవ్యసనము, మిగిలినవి యెన్ని వ్యసనములైననూ ఈ నాల్గింటి పైననే కలుగుచున్నవి.

(ప్రశ్నో. వా. పు. 5)

వ్యష్టి

(చూ॥ అనన్యభక్తి, సమిష్టి)

వ్యష్టి తత్వము

పంచ భూతముల యొక్క సమిష్టి స్వరూపమే అంతఃకరణకు శబ్ద స్పర్శరూపరసగంధములు అన్నీ అనుభవించే అధికారముంటున్నాది. అంతఃకరణము శబ్దస్పర్శరస గంధాదులు జ్ఞానేంద్రియములకు మాత్రమే సంబంధించినది. జ్ఞానేంద్రియములు దేహమునకు వెలుపలివా లోపలివా అని విచారిస్తే ఇవి అంతర్భహి స్వరూపాలు. కర్మేంద్రియమైన చెవి మాత్రమే వుంటుంది. జ్ఞానేంద్రియమనే వినుశక్తి లేక పోయినప్పుడు చెవినుండి ప్రయోజనము లేదు. జ్ఞానేంద్రియమనే వినుశక్తి వుండి కర్మేంద్రియమనే చెవి లేకపోతే వినలేదు.

జ్ఞానేంద్రియ కర్మేంద్రియ సమ్మిళితమైన స్వరూపమే యీ వ్యష్టి తత్వము.

సత్వగుణముయొక్క పంచభూత స్వరూపమైనది అంతఃకరణ అయితే రజోగుణము యొక్క పంచ భూతముల యొక్క సమిష్టి స్వరూపము ప్రాణముగా నిల్చింది.

రజోగుణము సృష్టియందు పంచభూతములందు వ్యష్టిస్వరూపమైన ఆకాశము యొక్క బిందువు కన్ను. రెండవ భూతమైన వాయువు యొక్క వ్యష్టిస్వరూపమైన బిందువు చేయి. రజోగుణసృష్టియందు మూడవదైన వ్యష్టిస్వరూపము అగ్ని. వ్యష్టి స్వరూపమైన అగ్నియొక్క సృష్టి కాలు. నాలుగు ఐదు అయిన గాలి, ప్రకృతుల వ్యష్టి సృష్టి మలమూత్రములు విసర్జించు ప్రదేశములు.

సత్వగుణ సృష్టియందు వ్యష్టిసృష్టిగా వచ్చిన ఆకారము యొక్క మొదటి సృష్టి చెవి. రజోగుణమునందు వ్యష్టి సృష్టి ఆకాశము యొక్క సృష్టికన్ను. ఏతావాతా ఆకాశమునకు యిద్దరు బిడ్డలు. రజోగుణము ... వాక్కు. సత్వగుణము బిడ్డ చెవి. రెండవ బిడ్డ వాక్కు. మొదటి బిడ్డయైన చెవి బయట విషయాన్ని లోపలి స్వీకరిస్తుంది. రెండవ బిడ్డయైన వాక్కు స్వీకరించిన దానిని బయటకు విడిచిపెడుతుంది. సత్వగుణము యొక్క వాయువు యొక్క బిడ్డ చర్మము. రజోగుణము యొక్క వాయువు బిడ్డచేయి. ఎక్కడైనా దేహముపైన చీమ పారాడుతూవుంటే చర్మము స్పర్శ తెలుసుకుంటుంది. తెలుసుకున్న తత్‌క్షణమ్ చేయి తీసి పారవేస్తుంది. ఏతావాతా సత్వగుణము యొక్క అంశములు స్వీకరించటము; రజోగుణముయొక్క సంతతి దానిని విసర్జించటము. ఈనాడు లోకము ఏరీతిగా వున్నదంటే రజోగుణము స్వీకరిస్తూవుంది. దీనిని వుల్టా సీదా అంటారు. విరుద్ధముగా నడుస్తూ వస్తుంది. సృష్టి రహస్యము.

నిజస్వరూపము సత్వగుణము మాత్రమే స్వీకరించాలి. రజోగుణము తత్వము విసర్జించాలి. ప్రకృతికి సత్వగుణమే మొట్టమొదటి పదము. ఈ ప్రకృతికి స్త్రీ అని ఒక పేరు. స్త్రీ అనగా సకార తకార రకారములతో కూడినది. మొదట సాత్వికము స్వీకరించాలి. రెండవది తమోగుణము అనగా మర్యాద వినయముగా అణుకువగా వుండే గుణములు అభివృద్ధి పరుచుకోవాలి. రకారము రాజసము. అనేది కట్టకడపటిది.

(బృ.త్ర.పు.112/113)

వ్యాకరణము కాపాడదురా!

హరిగోవిందా హరిగోవిందా
హరిగోవిందా అనరామందా
మృత్యువు దాపున మసలేటప్పుడు
వ్యాకరణము కాపాడదురా॥

తామరాకుపై తళతళలాడే
నీటిబొట్టువలె నిలకడ లేనిది
బ్రతుకభిమానపు తెగులు పుట్టురా
దిగులు దుఃఖముల తెరరా లోకము

ఆటల పాటల బాల్యంబాయెను
ప్రాయములో ప్రేమాయణమాయెను
ముదిమిని చింతలు ముదిరేపోయెను
పరబ్రహ్మ కాబట్టక పోయెను

ఎవతెభార్య; ఇంకెవరో బిడ్డడు?
ఎంత విచిత్రమో యీ సంసారము
ఎవరివాడ? వెవ్వర? వెటు వచ్చి ఆ
తత్త్వమిక్కడే తమ్ముడ తెలియర

సత్సంగముచే సహజ విరక్తీ
ఆవిరక్తి చే విగతభ్రాంతీ
భ్రాంతి తీరితే శాంతీ స్థిమితము
స్తిమిత శాంతిచే జీవన్ముక్తి

రేయి పవళ్ళు సాయం ప్రొద్దులు
చలి వేసవులూ సారెకు మారును
కాలక్రీడల గడచే నాయువు
ఐనావదలదు ఆశావాయువు

యోగియైన మరిభోగియైన
సంసారియైన సన్యాసియైననూ
స్వాంతము సత్యము ననుభవించితే
ఆనందమే ఆనందము నందము

కించిద్భగవద్గీతా పఠనము
కొంచెము గంగా తీర్థము పానము
హరిపూజన మొకపరి కావించిన
అతనిని యముడేమని తర్కించును

మళ్ళీ పుట్టుట మళ్ళీ గిట్టుట
అమ్మ కడుపులో అణగి యుండుట
అంతులేని సంసారముదయతో
దాటింపుము నన్ను దబ్బున దేవా

నీలో నాలో నిజమొక విష్ణువె
ఓపిక లేని నీ కోపము వ్యర్థము
ఎల్లెడ సమమై ఉల్లంబుంటే
అపుడే అనుభవమగు విష్ణుత్వము

శత్రుడు మిత్రుడు పుత్రుడు బంధువు
అనుచు ఉపేక్షాపేక్షలు మానుము
అన్నటిలోను ఆత్మని చూడుము
భేదమనే అజ్ఞానము వీడుము

పాడుము గీతలు నామ సహస్రము
భగవంతుని రూపముభావింపుము
సలుపుమెపుడు సజ్జన సాంగత్యము
దీన జనులకై దానము చేయుము

ధనమే కీడునుకొనురా నిత్యము
దానలేదు సుఖ లేశము సత్యము
కొడుకుకైనా భయపడురా ధనికుడు
నడచేదిదే యెల్లెడల నెప్పుడు

ప్రాణాయామము ప్రత్యాహారం
నిత్యానిత్య వివేక విచారము
మంత్రముతోడ సమాధివిధానము
జాగ్రత్తగా నిశ్చలముగా చేయుము

కామము,క్రోధము లోభము మోహము
విడుపుము, నేనెవ్వడనని యనుకో!
తము తామెఱుగని దద్దమ్మల కగు
నరకము లోపల నానా బాధలు

సద్గురు చరణాబ్జముపై భక్తీ
త్వరగా ముక్తికి తరలే మార్గము
ఇంద్రియ మానవ సాంద్ర నియమమే
హృదయస్థుని చూపించును దేవుని

(ము.ము.పు.107/110)

వ్యాధులు

నీతినియమములేక తిరిగిన।
దాతకైన అజ్ఞానముడుగదు।
జ్యోతిలేనిదే అంధకారము।
భూతలంబున బాయకుండును।।భ।।

(భ.వే.ప్ర.పు. 77)

"గోవింద భజగోవిందం" దీనికి పెద్దలు అనేక అర్థాలు చెప్పారు. "గాధం యితిగోవిందం" అని అర్థము అనగా గోవులను పాలించేవాడు భరించేవాడు అని అర్థము. అనగాపశుత్వాన్ని కూడా పరిపాలన జరిపేవాడే గోవిందుడు, మానవునియందు పశుత్వము శేషమై యున్నది. ఈ పశుత్వాన్ని పోగొట్టి మానవుని పరిశుద్ధునిగా చేయునదే గోవిందనామము. మానవత్వానికి దివ్యత్వము లభ్యమగును. కాని పశుత్వానికి మానవత్వము లభ్యము కాదు. పశుత్వ లక్షణము పచ్చగడ్డి చూపినప్పుడు దగ్గరకొచ్చి పరుగిడును. యీనాడు మానవుడు పది కాసులు చూపిన దగ్గరకు వచ్చును. కసరిన దూరము పోతున్నాడు. యిది పశుత్వ లక్షణము, అట్లుకాక మానవుడు భయపడకూడదు, భయపెట్టకూడదు, భయపడుట **మృగలక్షణము భయపెట్టుటకు భయపడుటకు మానవుడు మృగముకాదు.** మానవుని తప్పొప్పులను తీర్చిదిద్ది పరమాత్ముని సన్నిధి అందించునది గోవిందుని లక్షణము. కనుకనే గోవిందుని భజింపకతప్పదు. **గోవింద నామమునకు మరొక అర్థము, వాక్యము (శబ్దము). మానవుని పలుకులకు, పశువుల అరపులకు, వేదములకు శబ్దమే ప్రధానము.** శబ్దములలో భేదముండవచ్చును. కాని శబ్దము యేకశబ్దమే, శబ్ద స్వరూపుడు **గోవిందుడు గాం: భూమికి స్వర్గం: వేదంవా గోవింద. జగన్నాటక భూమియందు సూత్రధారిగా నుండి సర్వ సుఖములకు నిలయమై, సర్వమునకు అధికారిగా నున్నవాడే గోవిందుడు. "వేదో నారాయణోహరి"** వేదము నారాయణతత్వము నిరూపణచేస్తూ వచ్చింది. స్థూల సూక్ష్మకారణ స్వరూపమై నీజగత్తును ప్రకాశింపచేయునదే గోవిందనామము. అందువలననే ప్రహ్లాదుడు **"దీని సుఖములేదు. దివ్యజీవనము లేదు. జగతి పుట్టి పుట్టి, చచ్చి చచ్చి, పుట్టనేల మనము పుట్టియు చచ్చియు చావులేని పుట్టు పుట్టవలయు" యిట్టి సత్యమైన త్రోవ వెతకువారే దొడ్డబుద్ధి అనగ అమృతస్థానమైన దివ్యత్వమును విశ్వశించినవాడు,** అయితే దీనిని యేరీతిగా పొందడమనే సందేహము, దేహమేవిల్లు, మనస్సే త్రాడు, ప్రాణమే అంబు, దేహమనేవిల్లు మనస్సు అనే దారముతో సరిపోయింది. మనస్సు అదే దారములో ప్రాణమనే అంబు పెట్టినపుడు విల్లు వంగును. మైండ్ యెంత లాగి విడిచిన ప్రాణమంత సూటిగా పోవును. దేహమునకు కట్టిన మనస్సనే దారము గట్టిగా లాగాలి విడిచి పెట్టకూడదు. దీనిని పురస్కరించుకొని మనస్సును అరికట్టుటకు మాధవుని స్మరించవలెను.

(భ.వే.ప్ర. 1974 పు. 10/11)

వ్యాధులు

ఈ మనస్సునందు ఒక విధమైన రస స్వరూపము ఉన్నది. ఇది శోకరసము కావచ్చును. లేక ఆనందరసము కావచ్చును, ప్రేమరసము కావచ్చును, ద్వేషరసము కావచ్చును. అయితే మానవుని సమస్త సంకల్పములకు, సమస్త **వ్యాధులకు మూలకారణము రాగద్వేషములే.** మనస్సంతా ప్రతిక్షణము రాగద్వేషములతో నిండి ఉంటుంది. ఈ రాగద్వేషములచే మానవత్వమును మరచి పోతున్నది మనస్సు.

(ద.స.స.పు.45)

ఈ మనస్సునందు ఒక విధమైన రస స్వరూపము ఉన్నది. ఇది శోకరసము కావచ్చును. లేక ఆనందరసము కావచ్చును. ప్రేమరసము కావచ్చును, ప్రేమరసము కావచ్చును, ద్వేషరసము కావచ్చును. అయితే మానవుని సమస్త సంకల్పములకు, **సమస్త వ్యాధులకు మూలకారణము రాగద్వేషములే.** మనస్సంతా ప్రతిక్షణము రాగద్వేషములతో నిండి ఉంటుంది. ఈ రాగద్వేషములచే మానవత్వమును మరచి పోతున్నది మనస్సు.

(ద.స.స.పు.45)

వ్యామోహము

ఎప్పుడు దుర్గుణసద్గుణములు ఒక్కటయి గుణరహితులు కాగలరో అప్పుడే శాంతి ఏర్పడును. అప్పుడు ఈ యుద్ధరంగమైన అస్థిపంజరము ఉండదన్న మాట. యుద్ధమున్నకదా యుద్ధరంగము? యుద్ధమే లేకున్న యింక రంగ మెక్కడిది? ఈ యుద్ధము లేకుండ చేసికొన వీలులేదా?

ఎందుకు లేదు? వ్యామోహము లను ప్రజ లున్నకదా యుద్ధమును జరిపింతురు? అట్టి ప్రజలే లేకున్న యుద్ధమూ లేదు. కాన మొదట వ్యామోహములు, మమకార అహంకారములూ లేకుండా చేసికొన్న శాంతిగా ఉండవచ్చును. అట్టి శాంతికి ప్రయత్నించు.

(స.ని.పు.88)

వ్యాసమహర్షి/ వ్యాసుడు/ వ్యాసుల వారు

ఆధ్యాత్మిక వైద్యులలో ఘనుడైన వ్యాసమహర్షికి మానవాళి నివాళులర్పించే రోజు ఇది. ఆయన వేదములను క్రోడీకరించి, పురాణములను మహాభారతమును రచించి, మానవాళికి భాగవతమును ప్రసాదించిన కారణంగా వ్యాసుడు అందరికన్నా గొప్ప వైద్యుడు. ఆయన అందరి కోసం దివ్య మార్గంలో నడచిన మొదటి గురువు. ఆస్తికత అనే విత్తనాన్ని నాటి, శ్రుతి, స్మృతి శాస్త్ర మహాభారతముల ద్వారా ఆ మొక్కను పెంచి పోషించినవాడు. ఆయన ఈ ప్రపంచానికి గీతను, బ్రహ్మసూత్రాలను, ఆత్మతత్వాన్ని దివ్యలీలల గాథలను, పరిణామశీలమైన ఈ సృష్టియొక్క రహస్యాన్ని అందించాడు. **ఆయన క్రీస్తుపూర్వం 3800 సంవత్సరాల నాటి వాడు. ఆయన వసిష్ఠుని మునిమనవడు, పరాశరుని కుమారుడు, ఋషులలో రత్నము వంటి వాడైన శుకమహర్షికి తండ్రి.** ఆయన జీవిత చరిత్ర అద్భుతమైనది. దివ్యమైనది. ఆయన వాసుదేవుని నుంచి వచ్చి, వాసుదేవుని దివ్యలీలలు లోకానికి ప్రకటించి వాసుదేవునిలో లీనమయ్యాడు. వ్యాసుడు నామపారాయణ శకమును ఆరంభించి, భగవంతుని నామ మాధుర్యమును అందరూ గ్రహించేలా చేశాడు.

పూర్ణిమనాటి చంద్రబింబంవలె మనస్సును స్వచ్ఛంగా చల్లగా ఎలా ఉంచుకోవాలో ఆ రహస్యాన్ని మానవులకు మొదట తెలియజేసింది వ్యాసుడు. అందువల్ల ఈ పూర్ణిమ ఆయనకు, గురువులందరికి అనుబంధం కలిగి ఉంది. ఈనాడు ఆస్తికుడు కేవలం ఉపన్యాసంతో తృప్తిపడి ఉండకూడదు. తన పరిశుభ్రమైన మనసులో ఈనాడు నామబీజం నాటాలి. అక్కడ అహంకారపు ముళ్ళను తొలగించాలి.ప్రేమ అనే నీటిని పట్టాలి. శ్రద్ధ అనే కంచెను చుట్టూ వేయాలి. స్మరణ అనే ఎరువును ఉపయోగించాలి. అప్పుడు మంత్రం అనే ఈ వృక్షం నుంచి ఆనందపు ఫలాలను కోసి వాటి నుంచి మాధుర్యమును గ్రోలాలి.

(వ.61-62 పు 55/56)

(చూ॥ ఆచరణ, ఆశలు, గురుకులము)

శంకర/శంకరుడు

శంకరుడు-'శం' అనగా చిదానందమును అనగా సచ్చిదానందమును 'కరుడు' అనగా అందించువాడు. సాధువుల హృదయ స్థానమందు శయనించువాడు కనుక శివుడని పేరు.

(శ్రీ.సా.సూ.పు.31)

శం....కర 'శం' అనగా ఏమిటి? గిలివలే సర్వత్రా వ్యాపించే టటువంటిదే. 'శం' గాలి ఏవిధంగా వ్యాపించుతుందో ఆవిధంగా వ్యాపించడమే ఈ 'శం' యొక్క శక్తి. ఆనందముతో కూడినటువంటిది ఈ గాలి. 'కర' దీనిని అందించేటటువంటి వాడు శంకరుడు. నిత్యానందమును సచ్చిదానందమును, బ్రహ్మానందమును అద్వైతానందమును మహదానందమును సర్వమునూ అందించేదే 'శం'....కర. ఆనందమును చేకూర్చే టటువంటిదే ఈ 'శంకర' అన్న పదమునకు అర్థము.

(శ్రీ.ఏ.1995 పు.8)

(చూ॥ దేవుడు, యుక్తి)

శంకరాచార్య/శంకరాచార్యులు /శంకరులవారు

శంకరుల వారి ఖ్యాతి కాశీలో నలుదిశల ప్రాకి పోయింది. ఒకనాడు శంకరుని ప్రసంగాన్ని వినడానికి వేలాది ప్రజలు, పండితులు గుమికూడారు. ఒక్కతూరి కన్నులు మూసుకున్నారు శంకరులు. కాలడిలో కొన ఊపిరితో ఉన్న తన తల్లి కనిపించింది. ఇల్లు వదిలే సమయంలో, "నాయనా! నీవు ఇల్లు వదలి పోతున్నావు. నాకిష్టం లేకపోయినా సన్యాసం స్వీకరించావు. కనీసం నా అంత్యసమయంలోనైనా నీవు నా దగ్గర ఉండాలి" అని ఆమె కోరింది కదా! శంకరుడు చిత్తశుద్ధి కల్గినవాడు కనుక తన వాగ్దానమును నిలబెట్టుకోవాలని సంకల్పించుకున్నాడు. **చిత్తశుద్ధి కల్గినవారు ఏది చెప్పినా సత్యమే అవుతుంది.** శంకరుడు అప్పటి కప్పుడు సభను నిలిపివేసి కాలడికి వెళ్ళాడు. తల్లి కన్ను మూయడానికి పూర్వమే అక్కడ ప్రత్యక్షమై ఆమె నోటిలో తులసీతీర్థము పోసి **ఆమె కిచ్చిన వాగ్దానమును నిలబెట్టుకొన్నాడు.** ఆర్యాంబకు దహనసంస్కారము చేయడానికి ఆ గ్రామంలో శంకరులవారికి సహాయం చేసేవారే లేక

పోయారు. సన్యాసియైనవాడు కర్మకాండలో ప్రవేశించడం ధర్మవిరుద్ధమనీ, శంకరాచార్యులు ధర్మవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడనీ భావించి అతని తల్లిదేహాన్ని స్మశానమునకు తీసుకుపోవడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. నంబూద్రి బ్రాహ్మణులు ముట్టడానికి కూడా వీలుకాదన్నారు. విధి లేక తల్లిదేహమును తానే భుజముపై వేసుకొని **తన ఇంటి పెరటిలోనే గుంతత్రవ్వి అక్కడే పూడ్చి వేశాడు. ఈనాటికి కేరళలో ఎవరింట్లోనైనా పెద్దలు మరిణిస్తే వారిని ఇంటి పెరటిలోనే పూడ్చి పెట్టటం జరుగుతోంది.** మీరు కేరళకు పోయి చూచినారంటే రోడ్డు పొడవునా ఇళ్ళు ఉంటాయి. వాటి వెనుకభాగం ఖాళీగా ఉంటుంది. శంకరులవారు తన తల్లి కిచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చుకొని తిరిగి కాశీకి వెళ్ళిపోయారు. కాలడిప్రజలు తనపై చూపిన ద్వేషభావానికి ఆయన మనస్సులో జుగుప్స కలిగింది.

(స.సా.జూలై.97పు.184/185)

1200 సంవత్సరములకు పూర్వం ఆది శంకరులు దివ్య దృష్టితో యీ ప్రదేశం (బద్రి) పవిత్రం చేయగా లింగాన్ని స్థాపించటం జరిగింది. ఆయన ఆ కాలంలో శారీరకంగా రావడానికి వీలే లేదు. మానసికంగానే వచ్చారు. కైలాసం నుండి వస్తూ, ఐదు లింగాలు తెచ్చి, ఐదవ దాన్ని యిక్కడ స్థాపించారు. ఇట్టి పవిత్రమైన చోటులో మీరంతా జన్మించటం, మీ పుణ్య విశేషం. **భక్తి అనేది ప్రాథమిక పాఠశాల, జ్ఞానమనేది మాధ్యమిక పాఠశాల, వైరాగ్యమనేది కళాశాల, కళాశాలకు పోవాలంటే ప్రాథమిక పాఠశాల నుంచే రావాలి. అలాగే వైరాగ్యం చేరాలంటే భక్తి నుంచే రావాలి. భక్తి అనగా ప్రేమ. ప్రేమ లేని వ్యక్తి లోకంలో లేడు. దేహమే దేవాలయం. ఆ దేవాలయంలో ప్రేమ స్వరూపుడనే దేవుడున్నాడు. చంద్రుణ్ణి చంద్రుని యొక్క వెలుతురు లోనే చూచి నట్టుగా ప్రేమ స్వరూపుని ప్రేమతోనే చూడాలి.** ప్రేమ తోనే పొందాలి. భగవంతుడు సహస్ర నాముడు. సహస్ర రూపుడు. తనది కానిది లేనిది లేదు. ఎవ్వరిని ద్వేషించినా అతణ్ణి ద్వేషించినట్టే. సర్వులలోనూ వున్నది ఒకే పరమాత్మ అనే సత్యాన్ని గట్టిగా అర్థం చేసుకోవాలి. రోజూ వందలు వేలు యాత్రికులు వస్తూనే వున్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా విసుక్కోకుండా అందరినీ యిక్కడి వారు ప్రేమతో ఆహ్వానించి ఆదరించాలి. (సెభాష్ అని చప్పట్లు కొట్టుతున్నారు) డబ్బుకోసం పీడించరాదు. మీరందరూ యీ పవిత్ర భూమిలో జన్మించారు కనుక మీరందరూ ధన్యత పొందే తీరుతారు. తెలియక పొందే కన్నా తెల్సి పొందటం శ్రేష్ఠం. ఇన్ని కష్టాలకు, భాదలకు మూల కారణం హృదయంలో ప్రేమ లేకపోవటమే. ప్రేమ అనే జ్యోతిచే కామ క్రోధ లోభ మోహములనే గబ్బిలాలను తరిమి వేయాలి. మీకు యిష్టమైన నామాన్నే మనసా స్మరించండి. ఈ జప ధ్యానముల కొరకు యే కొండ గుహలకో వెళ్ళాలి అనే పిచ్చిని వదలుకోండి. ఉన్న చోటు నుండే తరించాలి. **కర్మ సన్యాసం ప్రధానం గానీ దేహ సన్యాసం కాదు.** సర్వదా పరమాత్మ నామం నాలుక పైన నాట్యమాడుతూనే ఉండాలి. ఇక్కడికి వచ్చేవారు విన్నవారు కన్నవారు అందరూ జాతిమత బేధంలేక, అందరూ ఒక్క సర్వేశ్వరుని బిడ్డలే అనేదాన్ని గాఢంగా విశ్వసించి ఆ సర్వేశ్వర నామాన్ని సదా వుచ్చరించి ఆనందించాలనేదే నా కోరిక (ఆనంద కరతాళ ధ్వనులు తుఫానువలె చెలరేగింది.) కొంత సేపు నామస్మరణ చేసుకొందాం.

(బ.పు.96/97)

అద్వైత ప్రతిపాదకులు శంకరాచార్యులు లేత వయస్సులోనే శరీరాన్ని పరిత్యజించిన మాట వాస్తవమే. ప్రస్థాన త్రయమునకు భాష్యము రచించి, జ్ఞాన మార్గమును బోధించి, భక్తి మార్గమును ప్రతిపాదించు అనేక స్తోత్రములను జగత్తుకు అందించి, ఆసేతుహిమాచలము పర్యటించి, పీఠములను ప్రతిష్ఠించి ఆదర్శమూర్తియై నిలిచినవారు ఆదిశంకరులు. ఆయన జీవితంలో జరిగిన ఒక ముఖ్యమైన ఘట్టము మీకు తెలిసే ఉంటుంది. బ్రహ్మచర్య దీక్షకు అంగీకరించమని తల్లిని వేడుకున్నాడు. ఆమె అంగీకరించ లేదు. ఒకనాడు స్నానానికి చెఱువులో

శంఖనాదము

దిగినప్పుడు హఠాత్తుగా, "అమ్మా! ఒక మొసలి నన్ను పట్టి ఈడుస్తున్నది. నేను సన్యసించడానికి నీవు అంగీకరిస్తేనే అది నన్ను వదులుతుంది" అని బిగ్గరగా అరవడం ప్రారంభించాడు. ఆమె ఒప్పుకున్న మీదటే మొసలి వదలిపెట్టిందంటారు. **ఇక్కడ ఒక గూఢార్థమున్నది. సంసారమనే చెఱువులో భౌతిక వాంఛ అనే మొసలి జీవుడైనవానిని పట్టిపీడిస్తున్నది. దీనికి వైరాగ్యమే పరిష్కారము.** శంకరులవారు తన కార్యమును ముగించుకుని కాయాన్ని వదిలారు. తన సందేశాన్ని తన అద్వైత సిద్ధాంతాన్ని తన శిష్యులు తప్పక వ్యాపింప చేయగలరను నమ్మికయే చిన్నతనంలో శరీరాన్ని పరిత్యజించేటట్లు చేసింది. శంకరుల శిష్యులు కూడా అట్టిసమర్థులే.

(స.సా.జూన్ 99 పు.166)

(చూ॥ మహాపాపం, మూఢమతి, మూడు విధములైన పాపములు)

శంఖనాదము

ఈశ్వరునకు శంఖనాదము ప్రీతికరమైనటువంటిది కనుక దానితో ప్రసన్నుడైపోతాడు త్వరగా. ఆ విధమైనటువంటి ఉద్దేశముతో మన పూర్వీకులు శంఖనాదముచేస్తూ వచ్చారు. భగవంతుడు ప్రసన్నుడౌతున్నాడో లేదో అర్థం లేదు కాని, ఈ శంఖనాదము భగవంతునికి ప్రీతికరమైనటువంటి నాదమని కాశీలో విశ్వేశ్వరుని యొక్క సన్నిధిలో "భుం భుం భుం" అని శంఖము ఊదుతుంటారు, ఏ పూజ చేస్తున్నా, చాలా మంది చేసే ఉంటారు. షిర్టీకేసాయిబాబాలో వస్తుంటాది. భం భం భం భం భజనకరేంగే, ఢం ఢం ఢం ఢం ఢమరుభజే' అని. ఈ ఢం ఢం అనేటువంటిది ఈశ్వరునియొక్క ఉత్సాహము. అంతే కాకుండా దీనిని మరొక అంతరార్థము కూడా ఉంటుండాది. మనయొక్క గుండె యొక్క శబ్దమునకు ప్రతి ధ్వనియైనటువంటిది ఈ శంఖనాదమని కూడను రెండవ అర్థము. శివత్వమనేటువంటిది మన గుండెలలో ఉండినంతవరకును ఆడమరుకమనేది వాయిస్తుంటాడని శివత్వమనే డమరుకము ఎప్పుడు వాయించడో అప్పుడే శవత్వంగా మారిపోతుంది అని అర్థము. కనుకనే ఈ **శంఖమనేటువంటిది శివత్వమునకు చిహ్నము. మంగళకరమైనటువంటి చిహ్నము.**

(గు.శి.పు.49)

శకునములు

రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు తమ పత్నులతో కూడి ప్రయాణానికి సిద్ధమయ్యారు. మాండవీ శ్రుతకీర్తిలు కొంతకాలం తరువాత వస్తామన్నారు. కాని, దశరథుడు నల్గురూ ఒకే పర్యాయము వెళ్ళాలని ఆదేశించాడు. శ్రుతకీర్తికి శకునముల గురించి తెలుసు. ఆమె మెల్లగా మాండవితో, "ఈనాడు వెళ్ళడం మంచిది కాదు" అని చెప్పింది. మాండవి వచ్చి ఊర్మిళతో చెప్పింది. ఊర్మిళ సీతతో చెప్పింది. **అప్పుడు సీత, "పిచ్చిదానా! కాల స్వరూపుడైన పరమాత్ముడే మన వెంటనుండగా ఇంక ముహూర్తాల గొడవ మన కెందుకు! ఒక వేళేదైనా ఆటంకం కల్గినా రాముడు చూసుకుంటాడులే" అని ధైర్యం చెప్పింది.** అందరూ అయోధ్యకు ప్రయాణమయ్యారు. మిథిలాపుర ప్రజలంతా కన్నీటితో వీడ్కోలు చెప్పారు. **ప్రకృతీ పరమాత్మల కల్యాణం తన ద్వారా జరిగింది కదా అని జనకుడు ఆనందబాష్పాలు రాల్చాడు.** అనేక రథములు, గజములు, తురగములు మిథిలాపురం నుండి కదిలినాయి. మార్గమధ్యంలో హఠాత్తుగా, "నిలు, నిలు..." అనే గర్జన దిక్కుల్లో పిక్కిటిల్లింది. ఎవరబ్బా అని రాముడు రథము దిగి చూస్తే ఎదురుగా నిలిచాడు పరుశురాముడు. అతడిని చూడగానే ఏ ఉపద్రవమును ఎదుర్కోవలసి వస్తుందోనని దశరథుడు, వశిష్టుడు మున్నగువారు చాల భయపడ్డారు. కాని, రాముని మోముపై మాత్రం చిరునవ్వులు చిందులు వేశాయి. **ఎలాంటి ఉపద్రవం వచ్చినా భగవంతుని తేజస్సు మారదు. ఎల్లప్పుడు ఆనందంగానే ఉంటాడు.** పరశురాముడు, "రామా! నీవు

పుచ్చిపోయిన ధనస్సును విరిచావు. నిజంగా నీకు శక్తి ఉంటే ఈ పరశుని విరుచు చూద్దాం'' అని సవాలు చేశాడు. రాముడు దానిని కూడా విరగగొట్టాడు. తక్షణమే పరుశురాముడు శ్రీరాముని పాదాలపై పడ్డాడు. **దీని అంతరార్థమేమిటి? భగవంతునికి 16 కళలు ఉన్నాయి. అందులో 12 కళలు శ్రీరామచంద్రునిలో ఉన్నాయి. మూడు కళలు లక్ష్మణ భరత శత్రుఘ్నులవి. మిగిలిన ఒక్క కళ పరుశురాముని దగ్గర ఉండినది. దానిని శ్రీరామచంద్రునికి అందించే నిమిత్తమై ఇంత ఆర్భాటం చేసుకుంటూ వచ్చాడు.** రామాయణం వ్రాసేవారుకాని, వినేవారు కాని **పరుశురాముడు** రామునిపై ద్వేషంతో వచ్చాడని భావిస్తుంటారు. కాని, **ద్వేషంతో కాదు, తన వద్దనున్న కళను అప్పజెప్పడానికి వచ్చాడు.**

(శ్రీ.భ.ఉ.పు.60/61)

శక్తి

సీతాన్వేషణలో హనుమంతుడు లంకకు పోవలసి వచ్చింది. అప్పుడు హనుమంతుని దగ్గరకు జాంబవంతుడు, సుగ్రీవుడు వచ్చి, "ఇంత పెద్ద సముద్రాన్ని నీవు ఏరీతిగా దాటగలవు?'' అన్నారు. నవ్వుతూ చెప్పాడు హనుమంతుడు, 'పిచ్చివాడా! **భగవంతుడు చెప్పాడంటే ఆ శక్తి కూడా తానే ఇస్తాడు. ఆ శక్తియే తానివ్వకున్న నేను ఏవిధంగా పోగలను? ఆజ్ఞ యిచ్చాడు కనుక తగిన శక్తి తానే ఇస్తాడు. తప్పక నేను వెళుతున్నాను' అన్నాడు. ఒక్కసారి 'రామా' అని ఎగిరాడు. ఆ రామనామ మహిమతో లంకకు చేరిపోయాడు. కనుక భగవంతుడు ఏమైనా ఆజ్ఞ ఇచ్చాడంటే "ఏమో, నేను చేయగలనా?" అనే సందేహమునకు ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదు. ఆజ్ఞ ఇచ్చినవాడు దానికి తగిన శక్తి కూడా ఇస్తాడు. ఆ నమ్మకం నీలో లేకపోవటం చేత వెనుకంజ వేస్తున్నావు. నిజముగా చెప్పినట్లు చేసి చూడు. తప్పక విజయాన్ని సాధించగలవు. ఏ మాత్రము అనుమానమునకు అవకాశము ఇవ్వవద్దు.**

(ద.స.98 పు.96)

నెహ్రూ ఒక ఉపన్యాసంలో, వ్యక్తి చేసే పనులతో నిమిత్తం లేకుండా సంఘటనలను జరిపించే అదృష్టశక్తి ఒకటి వుందని అంగీకరించారు. కాస్త ముందుగానో, వెనకగానో ప్రతి వ్యక్తీ అంగీకరించక తప్పదు. సంఘటనలను అదుపు చేయటంలో పురుష శక్తికి కొన్ని పరిమితులున్నాయి. దానిని నీవు అదృష్టం అనవచ్చు. మరొకరు దానినే దైవం అనవచ్చు పేరేదైతేనేం! **మనిషిని మించిన శక్తి ఒకటి యీ సంఘటనల క్రమాన్ని కంట్రోల్‌చేస్తున్నదన్నది యదార్థం.** ఆసంగతి తలుచుకుంటే మనిషిలో అహం తగ్గి వినయం పెరగాలి. ఆశ్చర్యంతో, అద్భుతంతో మనసు చకితం కావాలి.

(శ్రీ.సా.గీ.పు.7/8)

(చూ॥ దివ్యత్వం)

శక్తులు

(చూ॥ అమనస్కుడు,ఆరాధన, వశిష్టుడు)

శత్రువు/శత్రువులు

రావణుడు ఎంత గొప్పవాడు! ధన కనక వస్తు వాహనాదులకు తక్కువ లేదు, 64 విద్యలు నేర్చినవాడు; కఠోర తపస్సు ఆచరించి దైవానుగ్రహము పొందినవాడు. **ఇంత గొప్ప వ్యక్తి ఒక్క కామమునకు లోను కావటం చేత పతనమైనాడు.** పవిత్రమైన దివ్యమైన,భవ్యమైన **రామాయణమందు రావణుడు ఒక పెద్ద మూర్ఖుడుగా రూపొందాడు. కారణము వాంఛలే. వాంఛల చేతనే తన తపః ఫలమును నాశనము చేసుకున్నాడు.** ఇంక భాగవతములో **హిరణ్యకశిపుడు క్రోధం వలన పతనమైనాడు.** అతడు పంచభూతములను అదుపులో పెట్టుకున్నవాడు, **గొప్ప సైంటిస్టు. భూమిని తిరగకుండా చేయాలని ప్రయత్నం చేశాడు. ఈనాటి సైంటిస్టులు చంద్ర మండలానికి పోయారు. హిరణ్య కశిపుడు సూర్య మండలానికే ప్రయాణం చేశాడు. ఇంత పెద్ద సైంటిస్టు అయికూడను క్రోధమును జయించలేకపోయాడు.**

శత్రువు/శత్రువులు

కోపము కలిగిన వానికి
ఏ పనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్
పాపపు పనులను చేయుచు
ఛీ, పొమ్మనిపించుకొనుట చేకూరు సుమీ!

తన కలిమి భంగపుచ్చును
తనకుంగల గౌరవంబు దగ్ధము చేయున్
తన వారల కెడ సేయును
జనులకు కోపము వలన సర్వంబు చెడున్.

ఇంక భారతమందు దుర్యోధనుడు లోభి.

లోభివాని చంప లోకంబు లోపల
కొట్ట వద్దు వాని తిట్టవద్దు
డబ్బు అడిగినంత దబ్బున తాచచ్చు
ఉన్న మాట తెలుపుచున్న మాట

ఇలాంటి **లోభి అయిన దుర్యోధనుడు ఏమి సాధించాడు? క్రోధమున్న హిరణ్యకశిపుడు ఏమి సాధించాడు? రావణుడు గొప్ప భక్తుడే. గొప్పతపః సంపన్నుడే. కానీ కామముచేత ఏమి సాధించాడు? కామ, క్రోధ, లోభములు సాధనకు పరమ శత్రువులు. ఈ మూడింటిని మనం అదుపులో పెట్టుకోవాలి.**

(ద.స.98 పు.37/38)

నీ శత్రువే నీకు ఉత్తమమిత్రుడని గుర్తించుకొనుము. శత్రువు నిన్ను దూషించి అనుమానించి నీపాపమును పంచుకొనుచున్నాడు. **అనగా నీవనుభవించవలసిన శిక్షను నిన్ను బాధించినవాడు తనపరము చేసుకొనుచున్నాడు. స్నేహితుడు నిన్ను పొగిడి, మెచ్చుకొని నీవు సంపాదించిన పుణ్యము తరిగిపోతుంది.** నిన్ను దూషించినవారు నీపాపమును, నీవనుభవించవలసిన శిక్షను అనుభవించగా, నీపుణ్యమును నిన్ను పొగడినవారు హరించుచున్నారు. చివరకు నీకు మిగిలినది శూన్యము.

(స్వీ.పు.348)

అహంకారమే మానవుని అధఃపతనము గావిస్తుంది. అహంకారమే మానవుని ప్రధాన శత్రువు. పుట్‌బాల్ లోపల గాలి ఉన్నంత వరకు అటువైపు వారు ఇటువైపు వారు కాళ్ళతో తన్నుతుంటారు. ఎప్పుడైతే గాలి పోతుందో అప్పుడే దానిని చేతికందుకుంటారు. **ఈ పుట్‌బాలు లోని గాలి వంటిదే మానవుని లోని అహంకారము. ఈ అహంకారము ఉన్నంత వరకు ఇతరుల నుండి దెబ్బలు భరించక తప్పదు.**

అట్లే **క్రోధము ఉన్నంత వరకు మానవునికి దుఃఖము తప్పదు. ఇది భయంకరమైన అగ్ని జ్వాల వంటిది. కనుకనే దీనికి క్రోధాగ్ని అని పేరు.**

"క్రోధము కల్గిన వానికి ఏ పనియు ఫలింపకుండు
ఎగ్గులు కలుగును, తనకు గల గౌరవము దగ్ధము సేయున్
తన వారల కెడ సేయును, జనులకు కోపంబు వలన సర్వము చెడున్"

మూడవ శత్రువు కోరిక. ఇది మానవుని యందు నఖశిఖపర్యంతము వ్యాపించి ఉన్నది. ఒక్క కోరిక తీరిన క్షణమే పది కోరికలు అభివృద్ధి ఆపుతుంటాయి. ఏనాడు **మానవుడు తన కోరికలను అదుపులో పెట్టుకొనునో, ఆనాడే అతని సర్వ సంకల్పములూ సిద్ధిస్తాయి. సర్వసంపదలూ అతనికి చేకూరుతాయి.**

ఇక నాలుగవది లోభము. ఇది ఏనాడూ మానవుని నుండి వేరగునో ఆనాడే అతనికి సుఖము లభిస్తుంది. లోభత్వము కలిగిన వానికి శారీరక, మానసిక ఆధ్యాత్మిక సుఖములన్నీ దూరమైపోతాయి. **లోభిని కుక్కతో పోల్చారు.** గడ్డివాముపై కూర్చున్న కుక్క పశువులను దగ్గరకు రానివ్వదు. తాను ఆ గడ్డి తినదు, అదే విధంగా **లోభి తాను భుజించడు, పరులకు అందించడు. కలలో కూడా లోభికి సుఖము ఉండదు.** నిజంగా ఈ నాలుగూ మానవుని యందు ఉండవలసినవి కావు.

(శ్రీ.భ.ఉ.పు.177)

ఆత్మనుండి మొట్టమొదట వినిపించే శబ్దము నేను. ఈ నేను అనే శబ్దము పుట్టిన తరువాతనే సృష్టి అంతయు ప్రారంభమైనది. **నేను లేకుండిన సృష్టియేలేదు. నేను బ్రహ్మ, ఆత్మ పర్యాయపదములు.** మనోరహితమైన నేను స్వస్వరూపమైన ఆత్మ. మనోసహితమైన నేనే మిథ్యాత్మ. **ఉన్నది ఒకే ఆత్మ. అదే ఒక్కనేను.**

(బృ.త్ర.పు.124)

(చూ॥ అనహంకారము, శాంతి, శ్రీరాముడు)

శని

అంగడిలో అన్నీ వున్నాయి. మన యింటిలో మాత్రం **శని** ఉంది.

(భ.ప్ర.పు.41)

శబ్ద బ్రహ్మము

(చూ॥ ప్రణవ తత్త్వము)

శబ్దము

(చూ॥ శత్రువు)

శబ్ద స్పర్శరూపరసగంధములు

శుద్ధసత్త్వమైన సత్త్వగుణ సంపత్తియే శబ్ద స్పర్శరూప గంధాలు. ఇవి సత్త్వగుణమునకు సంబంధించినవి. రజోగుణముయొక్క సమిష్టి పంచ భూతముల స్వరూపమే ప్రాణము.

(బ్ర.త్ర.పు.113)

శమదమాది గుణసంపత్తి

(చూ॥ అథాతో బ్రహ్మజిజ్ఞాస)

శరణాగతి

లక్ష్మణుడు సీతా రాముల వెంట అరణ్యానికి బయలుదేరాడు. ముగ్గురూ చిత్రకూట పర్వతం చేరుకున్నారు. ఆ ప్రదేశాన్ని చూసి రాముడు, "లక్ష్మణా! చాల ప్రశాంతమైన ప్రదేశానికి వచ్చాము. ఎండకన్నెరుగని సీత బాగా అలసిపోయింది. కాబట్టి, ఇక్కడ మనం నివసించటానికి ఒక పర్ణశాల నిర్మించు" అన్నాడు. "ఎక్కడ నిర్మించాలి అన్నా!" అని అడిగాడు లక్ష్మణుడు. రాముడు **"నీకు ఎక్కడ ఇష్టమో అక్కడ నిర్మించు" అన్నాడు. రాముని మాటలు లక్ష్మణునికి చాల బాధ కలిగించాయి. "అబ్బా, నేనెంతటి పాపం చేశానో కదా ఇలాంటి కఠినమైన మాటలు వినవలసి వచ్చింది"** అని దుఃఖించాడు. అప్పుడు సీతమ్మవారు "లక్ష్మణా! మీ అన్నగారు నిన్ను తిట్టలేదు, కొట్టలేదు కదా! ఎందుకు నీవింత దుఃఖిస్తున్నావు?" అని ప్రశ్నించింది. లక్ష్మణుడు "తల్లీ! రాముడు నన్ను తిట్టినా, కొట్టినా నాకు సంతోషమే. కాని, నా ఇష్టమనేది ఒకటి ప్రత్యేకంగా ఉందన్నాడు. ఆ మాట నా హృదయాన్ని కత్తులతో పొడిచినంతగా బాధించింది. **రాముని ఇష్టమే నా ఇష్టము కదా!** నేనేమి పాపం చేశానని నా ఇష్టం వచ్చినచోట నిర్మించమంటున్నాడు" అన్నాడు. అప్పుడు రాముడు లక్ష్మణునికి ఒక ప్రదేశాన్ని చూపించి, "నాయనా! అక్కడ నిర్మించు" అన్నాడు. **శరణాగతి అనగా ఏమిటి? మీ సంకల్పము, దైవ సంకల్పము ఒక్కటిగానే ఉండాలి. ఏదిజరిగినా అది భగవత్సంకల్పమే అని భావించాలి.** ఇది మంచి, ఇది చెడ్డ, ఇది కష్టము, ఇది సుఖము అనే చర్చకు ఏ మాత్రము అవకాశమివ్వకూడదు. **దేవుడు ఏది చేయమంటే అది మీరు చేయవలసిందే!** ఎందుకు, ఏమిటి అని ప్రశ్నించకూడదు. అదియే నిజమైన భక్తుని లక్షణం. **దేవుడు ఏది చేసినా మీ మంచి కోసమే!** పాండవులకు అనేక కష్టాలు పెట్టాడు. అయితే, కష్టాలవల్లనే వారి కీర్తి జగద్వ్యాప్తి అయింది. వారు అచంచలమైన భక్తితో దైవాజ్ఞను శిరసావహించి కట్టకడపటికి విజయాన్ని సాధించారు. భక్తి ప్రపత్తులతో జగత్తులో ఎలాంటి కార్యమునైనా సాధించడానికి వీలౌతుంది.

(స.సా.ఫి.2000పు.44)

సర్వాధారుడైన సర్వేశ్వరుణ్ణి ఆశ్రయించుటే నిజమైన **శరణాగతి**. కానీ ఆధేయములైన అనిత్య పదార్థముల శరణు జొచ్చుట అజ్ఞానము. అర్జునుడు పరమ జ్ఞాని కనుకనే, పరమాత్ముని శరణు జొచ్చెను. ఈ శరణాగతులందును, మూడు విధములైన శరణాగతులు కలవు. **"తవైవాహం, మమైమత్వం, త్వమేవాహ మితి త్రిధా" అనగా మొదటిది నేను నీవాడ ననునది, రెండవది నీవు నావాడవనునది. మూడవది నీవే నే ననునదియును.**

కాని ఉత్తరోత్తరంగా యోచించిన ఒకదాని కంటే ఒకటి ఉత్తమమైనదిగా నున్నది. మొదటి **"తవైవాహం" లో పరమాత్ముని సర్వస్వతంత్రునిగాను, భక్తుని పరతంత్రుని గాను భావించును. అనగా భగవంతుడు పిల్లిగానూ, భక్తుడు పిల్లిపిల్లగానూ,** ఇది అతి మృదువైనది. సర్వులకూ సాధ్యమైనదిగా నుండును. ఇక రెండవదైన **"మమైమత్వం" ఇందులో భక్తుడు స్వతంత్రుడుగాను, పరమాత్ముడు పరతంత్రుడుగాను సూచించినది. దీనికి సూరదాసు భక్తే ఆధారము. "కృష్ణా! నీవు నా చేతుల నుండి తప్పించుకొని పోగలిగావు గానీ యేదీ నా హృదయమునుండి వీడిపో చూతము?"** అని గర్జించినాడు. ఆ మాటలకు పరమాత్మ **"బిడ్డా! నేను భక్తపరతంత్రుణ్ణి"** అని ఆత్మ గౌరవంగా అంగీకరించెను. చూడు! భతవంతుని నిలువుగా కట్టిపెట్టగలడు భక్తుడు. అయితే అంతటి భక్తి పరవశుడు కావలెను కదా!

ఆనాడు పరమాత్ముడు భక్తుని మంచి చెడ్డలు పూర్తిగా తనవి గానే భావించును, అనుగ్రహించును. ఇక్కడ గీతలో చెప్పిన **"యోగక్షేమం వహామ్యహం" అని ప్రతిజ్ఞ చేసిన ప్రభువాక్యము నిరూపించినాడు. ఇక మూడవదైన, "త్వమేవాహ మితి త్రిధా"** అనునది **నీవే నేను అను అవిభక్తమైన భక్తి.** ఇందులో సర్వమూ అర్పించి తననను మాత్రము మిగిలించుకొన్న లాభమేమిటి? అట్లు చేసిన ద్వైత శరణాగతిగా నుండును. కాని **ఇది అద్వైత శరణాగతి. ఇట్టిది. "వాసుదేవ స్సర్వం" అను భావమును పొంది యుండును.** దేహాభిమాన మున్నంత వరకూ భక్తుడు అంశము భగవంతుడు పూర్ణుడు. ఉపాధుల అభిమానము వదలి స్వరూపస్థితిలో ఉన్నప్పుడు **భక్తుడూ భగవంతుడూ ఇద్దరూ ఒకటే అగును.** ఈ మూడవస్థలనూ స్థితులనూ రామాయణమున హనుమంతుడు రాముని వలన పొందెను ఇదే విషయమును ఈ గీతయందు రెండవ ఆధ్యాయమున ఏడవ శ్లోకమున **అనుబంధ చతుష్టయము లను చెప్పెను. "ప్రసన్నం" అనునది అధికార లక్షణము. ఏరీతిగానన తన తప్పును తాను తెలిసికొని అర్జునుడు శరణు పొందెను.** ఎప్పుడు మానవుడు తన తప్పును తాను తెలిసికొనునో అప్పుడు వాడు అధికారస్థానమును పొంద నర్హుడగును. అంతియేకాక అతను తమోగుణము నుండి మేల్కొనినవాడగును. తిని నిద్రించుటే తమోగుణ లక్షణము. కానీ అట్టిదానికి అతీతుడై అంతఃకరణములయందు జాగ్రత్త వహించిన స్థితిని పొందినవాడు కనుకనే అర్జునుడు తన తప్పును తాను చక్కగ తెలిసికొనగలిగెను. ఈ స్థితిని కృష్ణపరమాత్మ గ్రహించి చిరునవ్వు నవ్వుతూ "బావా! తమోగుణమునకు ఉప లక్షణమేకదా నిద్ర, కనుక నిద్రనే జయించినవానికి ఈ మోహనిద్ర ఏమిచేయగలదు? దాని ప్రభావము తాత్కాలికము. అందువలననే ఇంత త్వరలో స్వస్థితికి రాగలిగితివి. నీ తప్పును నీవు తెలిసికొనగలిగితివి. నన్ను శరణాగతిని పొందితివి.

(గీ.పు.19/21)

ఏ హృదయంబు నొసగితివో ఈశ నాకు
మగిడి దానినే అర్పింతు మహితమూర్తి
పరగ వేరేమి తెత్తు నీ పాదార్చనకు
అంజలి ఘటింతు అందుకోవయ్య!

ఈవిధంగా **శరణాగతి కావాలి.** నీ హృదయమందున్న ప్రేమను భగవత్ప్రేమలో లీనం చేయి. రెండూ ఏకమై పోతాయి. ఏకత్వమే నిజమైన ఆనంద తత్వము. **ఏకత్వములోనే నిజమైన ఆనందమున్నది.**

(ద.స.98 పు.62)

శరణాగతి కంగములైదు. **(1)** భగవత్సంకల్పము. **(2)** అభిమాన మమకారములను సకల భోగభాగ్యములను వీడుట, **(3)** తన్ను కాపాడునని ధృఢనమ్మకము. **(4)** తన్ను రక్షింపుమని భగవంతుని ప్రార్థించుట, **(5)** తనకు యేశక్తియు లేదు, నీవే యేకైక గతి అనే ధృఢభావము, ఇదియే ఆత్మనివేదనము, యిదియే ప్రపత్తి.

(సు. పు.16)

శరణు జొచ్చిన వారిని రక్షించుటయే నా కర్తవ్యము.

నీవాడని ఒకపరియన
ఏవాడైనను ఏలుదువానిని''

అని వారికందరికీ తెలుపుతూ వచ్చాడు. అప్పుడు సుగ్రీవుడంటున్నాడు. "స్వామీ! ఇదే విధముగనే రేపటిదినము రావణుడేవచ్చి **"నేను నీకు శరణాగతిని" అని ప్రార్థించితే "నేను నీవాడనే" అని మొరపెడితే అతడిని ఏరీతిగా మీరు క్షమించుగలరు?** ఏరీతిగా రక్షించగలరు?" అన్నాడు. **"రావణునికి అంత ఉత్తమమైన భావమే కలిగితే, నేను అతనిని అయోధ్యకే రాజునిచేస్తాను" అన్నాడు రామచంద్రుడు.**

విద్యార్థులారా:

మీరీ శరణాగతి తత్త్వమును చక్కగా అర్థము చేసుకోవాలి. పగవాడైనను "శరణు" అంటే భగవంతుడు తప్పక రక్షిస్తాడన్న పరమార్థమును గ్రహించాలి.

(ఆ.రా.పు.309)

భక్తులు భగవంతుని ప్రేమిస్తున్నారు; భగవంతుని నిమిత్తము కాదు, భక్తుల నిమిత్తమై భక్తులు భగవంతుని ప్రేమిస్తున్నారు. అయితే యిక్కడ ఒక చిన్న రహస్యాన్ని గుర్తించాలి. భగవంతుడు భక్తుణ్ణి ప్రేమిస్తున్నాడు. ఈ విషయంలో విరుద్ధంగా వుంటుండాది. **భగవంతుడు భగవంతుని నిమిత్తమై భక్తుని ప్రేమించటం లేదు. భక్తుని నిమిత్తమై భగవంతుడు భక్తుని ప్రేమిస్తునాడు.** కారణమేమనగా **తాను అవ్యక్తుడు. అతనికి తన పర అనే భేదము లేదు.** ఎక్కడ వ్యక్తిత్వము, స్వార్థము అనేవి వ్రేలాడుతూ ఉంటాయో ఆస్థాయియందు మాత్రమే స్వార్థము, నీవు, నేను అనే భేదభావములు గోచరిస్తాయి. భగవంతునియందు తన, పర భేదములు ఏమాత్రములేవు. **"మత్కర్మకృత్" 'మత్పరమో' "మద్భక్తః" అనే పదములు తత్వములు.** ఇవి భక్తునకు సంబంధించినవి. ఉపాసనా మార్గమునకు ఎంతో తోడ్పడేవి. మానవుని శక్తిసామర్థ్యములు అల్పమైనప్పుడు దీనియొక్క తత్వమును ఏరీతిగా గుర్తించాలి? ఒక వ్యక్తి గాలి కావాలనుకొని ఒక విసనకర్రను చేతిలో పట్టుకొని అన్ని విధాలా శ్రమపడుతుంటే కించిత్తైనా గాలిసోకటం లేదు. ఝంఝామారుతము వీచినప్పుడు సముద్రమున అలలు బయలుదేరి ఉప్పన వస్తుంది. చెట్లు వేళ్ళవరకు కూలిపోతాయి. పెద్దగాలి వస్తుంది. ఇది యెవరి శక్తి? మానవుడు వీచుకొనే ఫ్యానుగాలి అల్పమైనది దీని శక్తి తుచ్ఛమైనది. కానీ భగవత్‌శక్తి అఖండమైన ఝంఝామారుతమై వీచుతుంది. మానవుడు ఒక బావినుండి నీరు తోడినప్పుడు లేదా పంపుసెట్టు పెట్టి కొట్టినప్పుడు దానిమూలంగా కొంత నీరు ప్రాప్తిస్తుంది. కాని కుంభవర్షమే కురిసినప్పుడు నదులు, ఊర్లూ ఏకమైపోతాయి. ఇది తైలదీపమో లేదా కరెంటు దీపమో వేసుకుంటాము. ఆ వెలుతురుతో గృహమును మాత్రమే సరిదిద్దుకుంటాము. కానీ సూర్యోదయము అయిందంటే సర్వత్రా ప్రకాశమే. అడవియందు, గుట్టయందు, చెట్టుయందు, ఇంటియందు సర్వత్రా ప్రకాశము ప్రసరిస్తూ వుంటుంది. ఇది దైవశక్తి. దీపము మానవుని వ్యక్తిత్వము యొక్క శక్తి. **ఇంత అఖండశక్తి కలిగిన దైవత్వాన్ని యీ అల్పశక్తి కలిగిన మానవుడు ఏరీతిగా చేరటానికి వీలవుతుందో దీనినే శరణాగతి అన్నారు.**

(శ్రీ.గీ.పు. 11/12)

రైలు స్టేషనుకు పోయేంతవరకు లగేజిని కూలినెత్తినో, జట్కాలోనో, రిక్షాలోనో టాక్సీలోనో పెట్టుకొని చూచుకొని పోవాలి. ఎవరు చిక్కనప్పుడు మనమే మన లగేజీని మోసుకొని పోవాలి. తలపైన, చేతిలోను పెట్టుకొని రైలులో పోయి కూర్చున్న తరువాత ఎక్కడివక్కడ పారవేసి హాయిగా నిశ్చంతగా వుంటుండాలి. నిన్ను, నీ లగేజిని, రైలే మోసుకొని పోతుంది. కానీ యీ పిచ్చివాడు అట్లు చేయటం లేదు. రైలులో కూర్చునికూడను తన పెట్టను బుట్టను తన నెత్తిపైన పెట్టుకుంటాడు. **శరణాగతి అయిన తరువాత సర్వమూ అతనికే అర్పితము చేయి. ఏది యెప్పుడు ఎక్కడ ఎట్లా చేయవలెనో తానే చూచుకుంటాడు. ఇంక నాది అనే అహం ఏమాత్రం వుండకూడదు.** దీనికే రామాయణంలోపల ఒక సన్నటి విషయములోపల ఒక ప్రధానమైన లక్ష్యమును నిరూపించాడు లక్ష్మణుడు. రాముడు చిత్రకూటపర్వతము సీతాలక్ష్మణసమేతుడై చేరాడు. **భగవంతుడు యెప్పుడు**

కూడను లీలామానుషవిగ్రహుడు, నటనసూత్రధారి. ఏబాధలు, ఏదుఃఖము, ఏవిచారము లేకపోయినప్పటికినీ, దుఃఖముగానూ, విచారముగానూ, కష్టంగానూ వుండి నట్టుగా నటిస్తూవుంటాడు. **"దైవం మానుషరూపేణ" మనుష్యాకారము పొందినప్పుడు మానవాకార తత్వమంతయు ప్రకటితమయినప్పుడు మానవులకు సన్నిహితసంబంధుడౌతాడు. భక్తుల అందుబాటులో అనుకూలముగా వుండేనిమిత్తమై యీ మానవాకారము ధరిస్తూ వుంటాడు.** రాముడు అలసిపోయినట్టుగా ఒక రాతిపై కూర్చున్నాడు. చాలా అలసినట్టుగా "లక్ష్మణా నేనిక నడవలేను" అని చెమట తుడుచుకొని క్రింద వేస్తున్నాడు. **"ఇక్కడ యేదైనా ఒక చిన్న పర్ణశాల, కుటీరము నిర్మించు. అందులో విశ్రాంతి తీసుకొందా" మన్నాడు. ఎక్కడ వేయాలి అన్నగారూ అని ప్రార్థించాడు లక్ష్మణుడు. నీ యిష్టము వచ్చిన చోటులో నీవే నిర్ణయము చేసుకొని వేయమన్నాడు. "రామరామ! ఎంతటి మాట నేను వింటిని నాలో యేదోష ముంటుండాది? నేను ఏపాపము చేశాను? ఏవిధమైన దీనిలో నీకు విరుద్ధంగా ప్రవర్తించాను? ఇంతటి కష్టమైన మాటలను నేను వినవలసి వచ్చింది." అన్నాడు లక్ష్మణుడు. లక్ష్మణుడు పడేబాధ రామునకు తెలిసినను సీత గుర్తించే నిమిత్తమై లక్ష్మణా!** నేనేమీ అనరాని మాట అనేలేదే? కఠినమైన వాక్కును ప్రవేశపెట్టలేదే? అన్నాడు. లక్ష్మణుడు చెప్పాడు **"అన్నా! తల్లిని, తండ్రిని, భార్యను, రాజ్యమును అన్నీ వదలి సర్వసంగపరిత్యాగివై, తమ ఆజ్ఞనే నాకు ప్రాణంగా భావించి, శిరోధార్యముగా భావించి, తమరే నా తండ్రిగా భావించి, సీతనే నా తల్లిగా భావించి అరణ్యమునే ఆయోధ్యగా భావించి నేను తమ వెంట వచ్చినప్పుడు నాయిష్టము అనేది ఒకటుందా? లేదు. నీ యిష్టము వచ్చినచోట వేయుము అనటము లోపల నాకొక యిష్టము వుండినట్లు అప్పుడు నేను పూర్తి శరణాగతుణ్ణి కానట్లు ఔతుంది. నేను ఎంత క్రూరుణ్ణి" అని బాధపడ్డాడట. "నాకు రెండవ వాంఛ అనేది లేదు. నీయొక్క ఆజ్ఞయే నాయొక్క యిష్టము. నీ యిష్టమేదో అదే నాకు యిష్టము. నీవు ఏది చెప్పినా అది శిరసావహించుటమే నీ కర్తవ్యము. నా లక్ష్యము నాగమ్యము. నీవు తప్ప అన్యము లేదు." అన్నాడు. ఈ మాట అనేటప్పటికి సీత ప్రవేశించి 'రామా! మరొక పర్యాయము మీరు లక్ష్మణునికి యీ విధముగా చెప్పకండి అని ప్రార్థించిందట.**

(శ్రీ.స.గీ.పు.32/33)

(చూ॥ త్యాగరాజు, ప్రాచీన భారతీయ సంస్కృతి, బిక్షకులు, శ్రీమంతుడు, స్థలప్రభావము)

శరణు

(చూ॥ దేవుడెక్కడున్నాడు?, మాయ, సర్వధర్మాన్ పరిత్యజ్య)

శరన్నవరాత్రులు

దుర్గ అనగా శక్తి స్వరూపిణి, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక - ఈ మూడు శక్తులను ప్రసాదించేటటువంటి శక్తి స్వరూపిణినే - దుర్గ అన్నారు. ఇంక లక్ష్మి. ఈమె జ్ఞానైశ్వర్యమును, గుణైశ్వర్యమును ఇంకా అనేక రకములైన అనుభవించదగిన ఐశ్వర్యములనంతా అనుగ్రహించే టటువంటిది. **ఐశ్వర్యమనగా కేవలం కరెన్సీ నోట్స్ మాత్రమే కాదు. మన ఆరోగ్యము కూడా ఐశ్వర్యమే,** సర్వైశ్వర్య స్వరూపిణి అయినటువంటిదే లక్ష్మి. **ఈ లక్ష్మి సంపద స్వరూపిణి, ఐశ్వర్య స్వరూపిణి. ఇంక సరస్వతి. ఈమె మనకు తెలివి తేటలను, విచారణా శక్తిని ప్రసాదించునటు వంటిది. దుర్గా లక్ష్మి సరస్వతుల యొక్క ప్రభావాన్ని ప్రపంచమునకు చాటే నిమిత్తమై ఈ శరన్నవరాత్రులు ఉత్సవములుగా వచ్చాయి.**

(స.సా.అ 93 వెనుక పుట)

శరీరము

మానవుడు ధనమును కోల్పోతే దానిని ఎన్నో మార్గాల ద్వారా తిరిగి సంపాదించుకోవచ్చు. స్నేహితుని కోల్పోతే

ఎంతమంది స్నేహితులనో సంపాదించుకోవచ్చు. భార్యను కోల్పోతే రెండవ వివాహమాడవచ్చు. భూమిని కోల్పోతే దానినికూడా తిరిగి సంపాదించుకోవచ్చు. కాని, **శరీరమునే కోల్పోతే అది లభ్యం కాదు.**

(స.సా.జూలై 2000 పు.206)

మన శరీరంలో 500 కండరాలున్నాయి. 365 సైన్యూస్, 248 ఎముకలు, 7 మైళ్లు పొడవు గల, 72 కోట్ల నరాలున్నాయి. (కండరాలను ఎముకలకు అంటిపెట్టుకొని ఉండినట్టు చేసే వాటిని 'సైన్యూస్' అంటారు).

మన దేహంలో కొన్ని కోట్ల సెల్సు ఉన్నాయి. ప్రతి సెల్ యందు మనరూపం సంపూర్ణంగా ఉంటుంది. మన నాలెకలో 40వేల టేస్టుబడ్సు ఉన్నాయి. అది కాక ఉష్ణం జనింపచేసే బడ్సు 25వేలున్నాయి. కన్ను చూచుటకు కేవలం ఒక అంగుళం ప్రమాణంలో వుంటున్నది. దీని యందు 13 కోట్ల కాంతి కిరణాలు ఉంటున్నాయి. ఇది ఎంత విచిత్రం చూడండి! దీనిని ఎవరైనా నమ్మగలరా? **ఇది అంతా ఎవరి సృష్టి? ఏసైంటిస్టు నిర్మాణం ఇది?** ఇది అంతా దైవసృష్టియే. **ఎంచి చూసినట్లయితే ప్రతి అంగుళం భగవంతుని తత్వమే. ప్రతి అణువణువు భగవంతుని తత్వమే.**

(త.శ.మ.పు.9/10)

"మీ శరీరమునే పత్రముగా భావింపుడు. ఆభావనయే మీరు నాకర్పితము జేసే నివేదన. **మీ హృదయములను ప్రేమతో పుష్పింపజేయుడు. ఇదే నేను కోరునటువంటి పుష్పము. మీ కర్మ ఫలములన్నియూ నా సంకల్పములే యని భావించి యర్పించుడు. నాకు ప్రీతికరమైన ఫలమే అది. భక్తిపారవశ్యమున రాలు మీ ఆనందభాష్పములే నేను కోరు తీర్థము.** "బీదవారికి వృధా ప్రయాస ఎందులకు? ఈ నా దేహము పరోపకారమునకే యుద్భవించినది. ఒకరికి యిచ్చుటకే గాని తీసుకొనుటకు గాదు".

(స్వా.పు.113)

కరోతి దుఃఖే నహికర్మ తంత్రం శరీరమాద్యం భోగః అహర్నిశం సః
శరీర భిన్నః పురుషః సమిచ్ఛతే తావత్ర భోగః పురుషేణ ముచ్యతే.

మానవుడు రాత్రింబవలు శరీర సుఖముల నిమిత్తమై అనేక శ్రమలు పడుతున్నాడు. **ఆత్మ శరీరము కంటే భిన్నమనే సత్యాన్ని గుర్తించిన వ్యక్తి ఈ బాధలకు గురికాడు.** నిజముగా ప్రపంచములోని ప్రతిమానవుడూ తనయొక్క మానవత్వమును, మానవతకు అర్థమును చక్కగా గుర్తించిన ఈ విధమైన శ్రమలే జగత్తులో ఉండేటటు వంటివి కాదు. మానవజీవితమునందే పుట్టి, మానవ జీవితమునందే పెరిగి, మానవ సమాజమునందే జీవితము అనుభవిస్తూ మానవుడు అనే పదమునకు అర్థము తెలుసుకొనకుండిన అట్టిమానవుడు పశుపక్షి మృగాదుల కంటే హీనమని ఉపనిషత్తులు బోధిస్తూ వచ్చాయి.

(స.ది.పు.1)

పంచీకృతమహాభూతం సంభవం కర్మసంచితం
శరీరం సుఖదుఃఖానాం భోగాయతనముచ్యతే.

ప్రేమస్వరూపులారా!

మహాభూతముల పంచీకృతమువలననే కర్మ జరగడం చేత స్థూలశరీరము ఏర్పడుతుంది. సుఖదుఃఖములకు ఈ శరీరమే మూలకారణము.

యేదియెరిగిన సర్వంబు ఎరుకపడునో
యేదితెలియక సర్వంబు తెలియబడదో
అట్టి పరతత్వమెరిగినవాడె నరుడు.

(స.ది.పు.33)

(చూ॥ ఆత్మభ్రాంతి, తుంగభద్ర, దేహము, నాద బిందు కళలు, ప్రణవతత్త్వము,వినాయకుడు,శంకరాచార్యులు, హిరణ్యం)

శాంత జీవనము

శాంతజీవనమునకు వాగ్దత్తము మరువకూడదు. మర్యాద కలిగి నిష్పక్షపాతబుద్ధితో నుండి భక్తి అను సముద్రమున మునిగియుండవలెను హిమవంతునివలె స్థిరముగ నుండవలెను. నీ హృదయ తోటనుండి లోభము, క్రోధము, అసూయ, స్వార్థము, దురాశ, అహంకారము, మమకారమను ముండ్ల చెట్లను తీసివేయవలెను. అట్టి మొలకలను పెరికి వేయవలెను. ఈ సాధనలు అన్నియు

శాంత జ్ఞానము

శాంతి భద్రత సాధనలే. నీవు సర్వ వ్యాప్తియైన, అమరత్వమైన ఆత్మనని మొదట నిర్ధారణ చేసికో. తదుపరి ఈ సాధనలన్నియు సులభముగా సాధించవచ్చును. అట్లుకాక దేహమే నేను, జీవినే నేను, ఇంద్రియములే నేనను భ్రమలో వుండి ఎన్ని సాధనలు చేసిననూ అవి ఫలించని పిందెలే, పండ్లు ఏనాటికీ కానేరవు. శాంతిని ఎన్ని జన్మములైనా నీవు అనుభవించలేవు. శాంతిని నీవు స్వరూపముగా నిరూపించదలచితివా నీవే శాంత స్వరూపుడని తెలిసికో దేహేంద్రియములు నేను కాదని త్యజించుము; వాసనలు దూరమగును. ఎప్పుడు వాసనలు దూరమగునో శాంతము యొక్క ప్రకాశము నీ కగుపడును.

(ప్ర.వా.పు.32/33)

శాంత జ్ఞానము

శాంత జ్ఞానమే ఉత్తమోత్తమ సంపద. మరణము లేనిదానిని, నాశనము లేనిదానిని మార్పు లేనిదానిని ఎవడైతే తెలుసుకొంటాడో వాడు శాంతుడు. వాడు ఎన్నటికి చావడు. శాంతి ఒక తీరము ఉపరిభాగములేని సముద్రము ఇది. శుద్ధజీవితము శాంతియే ఈ ప్రపంచము యొక్క వెలుతురు. శాంతి వున్ననే సమస్తము వుండును. శాంతి ప్రకాశించుచున్నది. కనుకనే సమస్తము ప్రకాశించుచున్నది. శాంతము రెండింటిని తెలియజేయదు. అది ఒక్క బ్రహ్మను విధిగా తెలిసికొనవలెను. **సాక్షాత్కారము పొందవలెను. అదియే మానవ జన్మముయొక్క నిజసారము.**

(ప్ర.వా.పు.4/5)

శాంతభక్తి

(చూ॥ సాధకులు)

శాంతము

శాంతితుల్యం తపోనాస్తి న సంతోషాత్పరం సుఖమ్
నతృష్ణయా పరోవ్యాధి నచధర్మో దయాసమమ్

శాంతమునకు మించిన **తపస్సు** మరొకటిలేదు. **తపస్సనగా ఏమిటి?** నిర్జనారణ్యములో వెళ్లి నిర్మానుష్యమైన ప్రదేశములో ఏకాంతముగా దైవాన్ని ధ్యానించటము **'తపస్సు'ని భావిస్తున్నారు.** ఇదికాదు తపస్సు ఇది కేవలము లౌకికమైన, భౌతికమైన, ప్రాపంచికమైన వృత్తిగా దీన్ని భావిస్తున్నారు. **మనోవాక్కాయములను ఏకపరచి, త్రికరణశుద్ధితో భగవంతుని స్మరించి, ఏకత్వమును పొందటమే నిజమైన తపస్సు.** మనోవాక్కాయములను ఏకపరచటమే దివ్యమైన భావముతో భగవంతుని తపించటమే నిజమైన తపస్సు. ఈ తపస్సు శాంతి నిమిత్తమై చేస్తున్నారు. **కానీ శాంతి మన హృదయ స్థాయినుండి ఆవిర్భవించినప్పుడు** ఇంక తపస్సు ఎందులకు? **శాంతి మనయందే ఉన్నది గానీ బయటి ప్రపంచమందు లేదు. ప్రపంచములో శాంతి, శాంతి, శాంతి యని అరుస్తున్నారు. కానీ అట్టి శాంతి తన యందే ఉండి బయట ప్రపంచములో వెతకటము ఎంత అజ్ఞానము. బహిర్ దృష్టిని అంతర్ దృష్టిగా మార్చుకున్నప్పుడే ఈ శాంతి మనకు లభ్యమవుతుంది.** ఇట్టి అంతర్ శాంతిని మనం అనుభవించిన తరువాత యింక తపస్సు ఎందుకు? ఈ శాంతికి మించిన తపస్సు మరొకటి లేదు.

న సంతోషాత్ పరంసుఖం - సంతోషము కంటె మించిన సుఖము మరొకటి లేదు. సర్వ సుఖములుండి సంతోషములేని వ్యక్తులు ఎంతమంది మనకు ఈ జగత్తులో కనిపించటం లేదు. ధృతరాష్ట్రుడు హంస తూలికాపాన్పు పైన పవళించి నూరుమంది పుత్రులుకలిగి, సకల సౌభాగ్యములతో తులతూగుచు ఎన్ని సుఖములుండినప్పటికిని శాంతి ఏ మాత్రము కలుగలేదు. మనము సుఖమనేదే అనుకూల భావమని అనుకుంటున్నాము. సంతోషము భౌతిక జగత్తులో మనకు కానరాదు. **ఒకవేళ సంతోషము తాత్కాలికముగా మనకు ప్రాప్తించినా యిది శాశ్వత సంతోషము కాదు. నిజమైన సంతోషము మన హృదయమునందే ఉంటున్నది.** అట్టి సంతోషము

పొందటము కంటె మరొక సుఖము మనకెందుకు. ఈ విధమైన సంతోషమును ప్రతి మానవుడు ఆశించాలి. ఈ సంతోషము ప్రతిమానవుని యందు శాశ్వతముగా ఉన్నది.

నతృష్ణయా పరోవ్యాధిః వాంఛలు, కోరికలు అభీష్టములు ఇవియే మానవునికి తీరని వ్యాధులు. తన అభీష్టములు నెరవేరెనా కొంత సుఖము పొందుతాడు. నెరవేరకపోయెనా మానసిక వ్యాధి పొందుతాడు. **ఈ తృష్ణ కంటె మించిన రోగము ఈ జగత్తులో మరొకటి కనిపించటం లేదు. అన్ని రోగములకు ఔషదములు కనిపెడుతున్నారుగానీ ఈ వాంఛలకు ఔషధము కనిపెట్టేవారు లేరు.** మొట్ట మొదట ఔషధము ఎక్కడ ఉంటున్నది? **తృష్ణను తగ్గించుకున్నప్పుడే మనకు రోగము నివారణ కాగలదు.** మొన్న చెప్పినట్టుగా దేహ సంబంధమైన వ్యాధులకంటె మనస్సుతో వచ్చే వ్యాధులే అధికంగా ఉంటున్నాయి.

నచ ధర్మోదయాసమం: దయకంటె మించిన ధర్మము ఎక్కడుంది? కారణమేమనగా "దయగల హృదయమే దైవ మందిరము". అట్టి హృదయము మనయందు పరిపూర్ణమైన దయగా ఉండినప్పుడు ఇంక దానధర్మములు ఏమిటి? అన్ని ధర్మములు దయను పెంపొందించుకునే నిమిత్తమై చేసే సత్కర్మలే. వీటిని దయా స్వరూపముగా భావించినప్పుడు ఇంక ధర్మము చేయవలసిన అవసరము ఏమిటి? కనుక మానవుడు ఆశించే సమస్త వాంఛలు, సమస్త సుఖములు, సమస్త తపస్సులు, సమస్త శాంతములు తనయందే ఉంటున్నవి. బయట ప్రపంచమందు లేవు.

(ద.స.స. పు.80/82)

శాంతి

ఒక పర్యాయం ఎవరో ఒక భక్తుడు వచ్చి "స్వామీ! **I want peace** (నాకు శాంతి కావాలి)" అన్నాడు. నేను చెప్పాను, **I, want రెండింటినీ త్యజిస్తే peace అక్కడే వుంటుంది.**" అనగా, అహంకారాన్ని, కోరికలను త్యజించినప్పుడే శాంతి లభిస్తుంది. అహంకారాన్ని త్యజించడం చాల కష్టమని మీరు భావిస్తున్నారు. ఇది చాల పొరపాటు. **అహంకారాన్ని త్యజించడం చాల సులభం.** మొట్టమొదట I ('నేను') అంటే ఏమిటో గుర్తించాలి. మీరు తల్లిదండ్రులు పెట్టిన పేరునే శాశ్వతంగా తీసుకొని పుట్టిన పేరును విస్మరిస్తున్నారు. **I ('నేను') అనేదే పుట్టిన పేరు. దానినే మీరు శాశ్వతంగా తీసుకోవాలి. పెట్టిన పేరు ఏనాటికైనా మార్పు చెందుతుంది. దేహంతోపాటు ఆ పేరు కూడా పోతుంది.**

(ఆ.భా.పు.33)

శాంతిమనయందే ఉంటున్నది. శాంతి నీ స్వరూపమే. అట్టి శాంతిని పొందడానికి బయట ప్రపంచంలో వెదకనక్కరలేదు. బయట వెదికేవన్నీ కూడనూ ఆశాంతికి లక్షణాలే. ఈ ప్రాకృత జగత్తులో కనిపించేటటువంటి సమస్తములూ అనిత్యములే.

(శ్రీ. అ2000 పు.9)

సైంటిస్టులు భౌతికమైన అనుకూలాలను ఏర్పరుస్తున్నారు. కానీ తాత్కాలికమైన ఆనందాన్ని అందిస్తున్నాయి. మనము తాత్కాలిక సుఖములను అనుభవిస్తున్నాం గాని శాంతికి దూరమై పోతున్నాము. **తాత్కాలిక మైన అనుకూలాలు ఎంత సుఖాన్ని అందిస్తున్నాయో అంత కష్టాన్ని కూడా అందిస్తున్నాయి.**

మనము ఏమి చేస్తున్నాం? ఎక్కడికి వెళ్ళుతున్నాం? Nuclear bombs, hydrogen bombs, atom bombs చేస్తున్నాం.

"హస్తమున అణుబాంబు ఉంచుకొని " శాంతి శాంతి" అని పలుకుచుందురు.

చంద్రు చేరగలిగి కూడను, చెందజాలము శాంతి సుఖములు".

చంద్రుడు దేహానికి చల్లదనాన్ని అందిస్తున్నాడు గానీ, మెదడుకు చల్లదనాన్ని అందించడం లేదు. రోజంతా మెదడువేడెక్కివుంది. ఎప్పుడు ఆక్సిజన్ fail అవుతుందో, ఎప్పుడు హైడ్రోజిన్ fail అవుతుందో ఏమోనని భయముగా ఉంటుంది. Air Conditioned room లోకూర్చున్నాం.

శాంతి

Body చల్ల బడుతుంది. శాంతిలేనివాని మెదడు వేడెక్కుతుంది, మనస్సు శాంతిగా ఉండినప్పుడు అడవిలో ఉన్నా picnic అని ఆనందిస్తాడు. కనుక, ఈనాడుScience మనను మానసిక శాంతి నుండి దూరముగా తీసికొని పోవుచున్నది. కృత్రిమమైన జీవితాన్ని ఈనాటి Scientist గడుపుతున్నాడు. **నిరంతరమూ చింతనే చింతనే!**ఈ **mind** కు **rest** లేదు.

ఈనాడు మానవుల రోగాలకు మానసిక విశ్రాంతి లేకపోవటమే మూలకారణము. దీని వల్ల రోగాలు అధిక మై పోతున్నాయి. ఎప్పుడు చూచినా thinking thinking! దానివలన mind శ్రమిస్తున్నది. జడమైన machineకు కూడా rest ఇస్తున్నాం. కానీ మెదడుకు restఇవ్వనక్కరలేదా? ఎక్కువ తెలివి తేటలున్నవాని mind, devil's workshop అన్నారు. ఈ devil's workshopకు ఏమిశాంతి ఉంటుంది? **వ్యక్తిగతశాంతి, సామాజిక శాంతి, దేశ శాంతి మనకు ఒక్క ఆధ్యాత్మిక మార్గములో తప్ప అన్యమార్గములోరాదు.** ఈ తత్వాన్ని మనము చక్కగా గుర్తించుకొని, భౌతికసుఖాల కోసం పోరాడకుండా, మానసిక శాంతికై మనము పాడుపడాలి. భౌతిక సుఖాలు కొంతవరకు ఉండవలసినదే, కాని అవి naturalసుఖాలుగా ఉండాలి. ఈ naturalసుఖములోనే సరియైన ఆనందం మనకు లభిస్తుంది.

(స.సాజూలై 1988పు 144/145)

చిత్తము యొక్క నిశ్చలత్వమునకే మరొక పేరు శాంతి. ఈ శాంతి ఆత్మ స్వరూపమే. శాంతి పవిత్రమైన సుగుణము. ఇది దివ్యమానవునకు ఆభరణము.

దుస్సంగమనేది దుష్టసంబంధమైనట్టి వ్యక్తులతో సంబంధించినది మాత్రమే కాదు, దుష్టభావములను చేర్చుకోవటం కూడా దుష్టసంగమే. అహంకారము, ఆడంబరము, అసూయ, అసత్యము యిత్యాది దుష్టభావములను హృదయములో చేర్చుకొనుటకు విద్యార్థులు ఏమాత్రమూ ప్రయత్నించ కూడదు. దుష్టభావములే మానవునికి ప్రధానమైన శత్రువులు. ఈ **శత్రుత్వమును పూర్తిగా నిర్మూలం గావించుకొన్నపుడే మానవత్వం రాణిస్తుంది. కనుకనే శత్రుశేషము, అగ్ని శేషము, ఋణశేషము, రోగశేషము లేకుండా చూసుకోమని చెప్పింది వేదాంతము.** ఋణమంతా తీరినప్పటికీ యింకా ఏకొద్ది మాత్రమే వుండినప్పుడు క్రమక్రమేణా యిది వడ్డీ రూపమున పెరిగి తిరిగి స్వస్థానమును చేరుతుంది. కనుక, అప్పు తీర్చుకోనే సమయములో దానిని పూర్తిగా తీర్చుకోవాలి. ఏమాత్రమూ శేషముంచుకొనకూడదు. రోగ నివారణ కోసమై హాస్పిటలులో ఉండి ఔషధములు సేవించి గృహమునకు వచ్చిన తరువాత అపత్యము చేసి అలక్ష్యము చేస్తే తిరిగి రోగము ప్రారంభం కావచ్చు. పరిపూర్ణ ఆరోగ్యము పొందిన తరువాతనే గృహమును చేరాలి మానవుడు. అగ్ని అంతా చల్లారిన తరువాత ఏ కించిత్ మిగిలి ఉన్నప్పటికీ గాలివీచి అది మరల ప్రజ్వలింపవచ్చును. కనుక అగ్నిశేషము కూడను ఉండకూడదు. నాల్గవది శత్రుశేషము. **ఈ శత్రుత్వమనేది పూర్తిగా నిర్మూలనము గావించబడినప్పుడే మానవునికి శాంతి చేకూరుతుంది.**

శాంతి అనగా ఏమిటి? మూలాధారమైన సత్త్వరజ స్తమో గుణములు అణిగినప్పుడే మనలో శాంతి ఆవిర్భవిస్తుంది. ఈ మూడుగుణముల పైన విరక్తి ఉపేక్ష, అనాసక్తి ఈ మూడింటిని మనము పెంచుకోవటానికి ప్రయత్నించాలి.

(స.ది.పు 93/95)

మనలో మానవతా విలువలను పెంచుకోవాలి.

Values for Education
Education for Life
Life for Love
Love for Man
Man for Service
Service for Society
Society for Science
Science for Nation
Nation for World
World for Peace

కనుక, మొట్టమొదట మానవతా విలువలనేవి పెట్టుకున్నప్పుడే మనకు శాంతి అనేది లభిస్తుంది.

విలువలు లేకపోతే Peace (శాంతి) ఉండదు; అంతా Pieces (ముక్కలు)! ఈ మానవతా విలువలను విద్యార్థులు పెంచుకుని దేశాన్ని నిత్య కల్యాణం, పచ్చతోరణంగా తీర్చి దిద్దాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

(స.సా.డి.95 పు.333)

ప్రేమ అను కట్టెలనుండి పుట్టే దివ్యజ్యోతే శాంతి. మానవ ఐకమత్యము, ఆధ్యాత్మిక తెలివి ఈ రెండు లోకశాంతికి ముఖ్యముగా ఉండవలెను. జీవితమునకు ఆత్మసాధన పునాది అయి వుండవలెను. అపుడే మానవుడు శాశ్వతమైన శాంతిని పొందగలడు. **శాంతములేక సౌఖ్యము అనుభవించలేడు. శాంతి, ఇది ఆత్మయొక్క స్వభావము. పేరాశగల మానవునియందు శాంతి ఉండనే ఉండదు.** శాంతి పవిత్ర హృదయములోనే వుండును. శాంతి యోగీశ్వరులకు, ఋషులకు, సత్పురుషులకు అలంకారము. వాస్తవమైన అంతర్శాంతి బాహ్యస్థితిమీద ఆధారపడదు. ఇది స్వార్థపరుల దగ్గరనుండి, కామతృష్ణగలవారినుండి విడిచి పారిపోవును. వారిచెంత వుండ ఇష్టపడదు. అంతరాత్మయొక్క అద్భుత కరమైన అచంచలమే వాస్తవమైన శాశ్వతప్రశాంతి. అసమ్మతము లేని దానిని శాంతి అనుకొందురు. ఆధ్యాత్మిక ఔన్నత్యము, ఆ ఆనందము సహజమైన తెలివి కూడా శాంతిలో యిమిడి యున్నది. **నిజశాంతి చిత్త వృత్తులను అరికట్టుటవల్ల లభించును. అదే ప్రశాంతి. ఆ ప్రశాంతియొక్క అనుభవమే ప్రశాంతి వాహినిగా పారుచుండును.** పెద్ద అలలవలె పైకి క్రిందికి కదలించే మనోవికారమును వశపరచుకొంటే, ఎగిరి ఎగిరిపడే యిష్ట-అయిష్టము ప్రేమ-ద్వేషము, సుఖము-బాధ, ఉల్లాసము అధైర్యములను జయిస్తే శాంతి స్థిరముగా మీసొత్తుగానే నిల్చును. **శాంతి ఆత్మ స్వరూపము.** ఆత్మ ప్రతివస్తువునందు ఉన్నది. శరీర మనసులు రెండును చచ్చేవే. ఈ రెండును మిశ్రమ పదార్థములు. ఆత్మ చిరంజీవి; సర్వత్రా వ్యాపించినది. అతి సూక్ష్మమైనది కాబట్టి ఆత్మ, తెలివిద్వారా తెలిసికొనే వస్తువుకాదు. ఆత్మ తెలివికి ఉత్పత్తి స్థానము. పరిపక్వము, స్వేచ్ఛ, చిరంజీవత్వము, శాశ్వత పరమానందము, **శాశ్వత శాంతి వీటిని పొందుటకు ఏదైతే దారి చూపుచున్నదో, అదియే జ్ఞానము. ఇంద్రియలోలత్వము కలవాడు ఆత్మను పొందలేడు. మార్పుగల వస్తువులలో శాశ్వతమైన దేదో అదే బ్రహ్మము.** బయట సంభవించే మార్పులవల్ల ఆత్మయొక్క తేజస్సు మలినముకాదు. శరీరము ఆత్మకాదు. ఆత్మ ఏదియూకాదు. ఆత్మ-ఆత్మనే. బ్రహ్మనే-సత్య ప్రేమ, వెలుతురు; మూర్తీభవించిన శాంతి జ్ఞానము, పరమానందము అయివున్నది. పైమార్గాలలో ఏ ఒకటియందు మీరు సాధించిననూ బ్రహ్మను పొందవచ్చును, సత్యము.

(ప్ర.వా.పు.3/4)

శాంతితో ధర్మముతో **ద్రౌపది** ఎట్లు భగవద్రక్షణకు అర్హురాలాయ్యెనో సాధకులకు తెలిసిన విషయమే. తన భర్తలు శూరులు, వీరులు, ధర్మపరాయణులు. రాజాధి రాజులుగా వుండియు. అట్టి ఆపత్సమయమున యెవ్వరూ రక్షించలేరనియు, ఎందరుండి ఏమి ఉపయోగమనియు, **కృష్ణా సర్వస్వము నీవే అని కృష్ణుని శరణువేడినది. కాని ప్రహ్లాదుడు అట్లు అపత్సమయమున శరణు వేడలేదు.** పుట్టుకతో సర్వము పరమాత్మార్పితమనియు పరమాత్మ ఎల్లప్పుడు తనవెంటనే తాను పరమాత్మ వెంటనే ఉన్నానని తలంచుటవల్ల ఏ ఆపద సమయమందుకాని హరీ, రక్షింపు అని ప్రార్థించలేదు. **శిక్షణే అతనికి తెలియనపుడు రక్షణ తానెట్లు కోరును?** ఇట్లు సంపూర్ణ ప్రేమోన్మత్తులైన వారలకు, సంపూర్ణ శరణుజొచ్చినవారలకు ప్రార్థన అవసరముండదు. కాని ఆ స్థానమునకు వచ్చునంతవరకు సాధకులకు శాంతిపూర్వకమైన ప్రార్థన అవసరము. **అట్టి శాంతి ప్రార్థనే సమరసమును సాధించును. ఇట్లు శాంతి అనేక విషయములందు అండగా నుండును.** పరమాత్ముని కీర్తనలతో, జపములతో, ధ్యానములతో, భజనలతో ప్రార్థించవచ్చును. అన్నిటియందు పరమాత్మనామమే ప్రధానముగా నుండును. అందుకనే **కృష్ణుడుకూడ గీతలో**

శాంతి తేజము

జపయజ్ఞము అనిరి. ఈ జపములు కేవలము మానసికమేకాక పైకికూడ ఉచ్చరించుట మరింత మంచిది. అట్టి రెండూ చేరిన జపమునే భజన అందురు. అట్టి భజనలవల్ల జనసమూహమునకు, ఆవేశము కలుగును. సంకీర్తనకూడా శ్రావ్యమైన ధ్వనులతో భక్తులు భజనలు సల్పిన, భగవంతునియందు ఒక విధమైన ప్రేమ ఉత్పత్తి అగుచున్నది. అపుడు తన అనుగ్రహముకూడా భక్తులపై ప్రసరించును. అంత వరకు వేచియుండవలెను. తొందరపడిన అనుగ్రహము సహితము చిక్కదు, రాదు. దానికి కూడ శాంతిని పూనవలెను. **ఓపికే అట్టి ఫలసిద్ధికి కూడ ప్రధానగుణము.** సాధకుడు ఈ బోధను దినవారీ క్రమశిక్షణలో, స్వస్తి శాంతిమంత్రములతో చేర్చుకొనవలెను.

(ప్ర.వా.పు.18/19)

మానవుడు అశాంతి స్వరూపుడు. అసత్యస్వరూపుడని మీరంతా అనుకుంటున్నారు. అటువంటి భ్రాంతిని పూర్తిగావదలండి. మానవుడు శాంతి స్వరూపడని గ్రహించండి. ప్రేమయే వారి రక్తనాళాలలో ప్రవహించుచున్నది. మానవుని నిజస్వరూపం ఆనందము, దీనిని మీరంతా సాధన వలన, అనుభవమువలన తెలుసుకోవాలి. మానవుడు విచారముగా యుంటే, ఎందుకు అట్లావున్నావని ప్రశ్నిస్తాము. అతడు సంతోషముగా యుంటే, నీవు ఎందుకు బాధపడవు అని అడగము. ఎందుచేత? **విచారము మానవునకు అన్య భావితము. నిజస్వరూపానికి వ్యతిరేకము కనుక మానవుడు దైవ స్వరూపుడని నే చెప్పుతున్నాను.** వినండి మానవుడు ఈలోకానికి వచ్చింది ఒక పవిత్ర కార్యము చేసేటందులకే తన దైవత్వాన్ని తెలుసుకునేటందులకే. ఆజన్మ హక్కును అనుభవించాలి. **అదియే శాంతి.** అశాంతి అతని స్వాభావిక విరుద్ధము. అతని స్వభావము కాదు. **మానవుని నిజస్వరూపము శాంతి.**

(సా.పు.327)

"స్వామీ! నాకు శాంతి కావా''లంటారు. I want peace అంటారు I = అహంకారము want - కోరిక. ఈ రెండు వదలి పెట్టితే మిగిలేది శాంతియే.

(సా.పు.78)

మనకు నమ్మక మున్నచోటనే ప్రేమ।
మనకు ప్రేమ వున్నచోటనే శాంతి।
ఎక్కడ శాంతి యుండునో అక్కడ సత్యం।
ఎక్కడ సత్య ముండునో అక్కడ ఆనందము॥

(సా.పు.83)

(చూ॥ అద్వైతదర్శనము, అలవర్చుకోవాలి, అష్టవిధ పుష్పములు, ఓటమి, తిరువళ్ళువారు, దర్శనము, దైవానుగ్రహము, ద్రౌపది, నరుడు, నియమబద్ధజీవితం, నోరు, పానీయం, ప్రశాంతి, ప్రేమ, భక్తుని లక్షణము, లోకాస్సమాస్తాసుఖినోభవంతు, శాంతి పుష్పము)

శాంతి తేజము

ఒక సమయములో తులసీదాసు గోస్వామివారు ఈ క్రింది రీతిగా అనిరి. "ఇంటిలోపలా, వెలుపలా, వెలుతురు కావాలంటే గడప పైన దీపము పెట్టవలసి వచ్చును. అట్లే నీలోనూ, నీ వెలుపలనూ శాంతి ప్రకాశము ప్రసరించవలెనంటే, నీ అంతర్బాహ్యారంగాలలో **"శాంతి తేజము" కావాలంటే నీ జిహ్వాగ్రమునే గడపయందు నామమను దీపమును నిలుపుకో! అయితే ఈ దీపము ఏ గాలికీ, వానకూ ఆరునది కాదు. అంతేకాక ఆ "నామదీపము" తనకేకాక, ప్రపంచమునకూ, శాంతి తేజమును ప్రసాదించును"** ఆత్మ కల్యాణమునకూ, అఖిల ప్రపంచ కళ్యాణమునకు హరి మందిరము, హరినామములు పరమోపాయము, **నామస్మరణ చేయుటయే ఒక స్వరూప దర్శనము.**

(జ.పు.129)

శాంతి పుష్పము

శాంతి అంటే ఎవ్వరెన్ని తిట్టినా, ఏమనినా, బెల్లంకొట్టినరాయిలాగా కూర్చోడం కాదు. దీనికి కూడా హృదయం చలింపక, **పూర్ణ ఇంద్రియ నిగ్రహమే శాంతి. దీనికి త్యాగము ముఖ్యము.** శాంతి పాఠములందు శారీరకంగా, మానసికంగా ఆధ్యాత్మికంగా, శాంతి

చేకూరాలని ఓం శాంతి, శాంతి, శాంతి: అని మూడు పర్యాయములు చెబుతాము. **జనక మహారాజునకు వైదేహుడను పేరు. అనగా దేహము వున్నను దేహము మరచిన వాడని యర్థము.** ఏది చూచినా ఏది చెప్పినా ఏది వినినా, అంతా దైవ భావముతో చేసినప్పుడు ఆభావము ఏర్పడుతుంది. "భక్తితోడ భగవంతుని తలచి నిత్య ధర్మములు నిర్వర్తించిన యట్టి జనకునకు రాజ యోగమున మోక్షము పొందెను." అని చెప్పినట్లు; శాంతికి ఉదాహరణము జనకుడే.

(సా.పు.346)

శాంతి లేక పోతే సత్యమును చూచుటకు వీలుకాదు. పూవులు విడచుటకును, పండ్లు పండుటకును, సూర్యరస్మి అవసరము. అట్లా మానవత్వము పరిపూర్ణత చెందడానికి శాంతి అవసరము. అప్పుడే సనాతనుడైన పరమేశ్వరుడు ప్రత్యక్షమవుతాడు.

(సా.పు.383)

శాంతి మంత్రము

"అసతోమానద్గమయ: తమసోమాజ్యోతిర్గమయ; మృత్యోర్మా అమృతంగమయ;" ఇదే శాంతిమంత్రము. దీనిభావము అనేకులు అనేక విధములుగా పెద్దగానూ సూక్ష్మముగనూ చెప్పుదురు. కాని " ఓ భగవంతుడా! నేను ప్రపంచమందలి వస్తువులవిషయమై సౌఖ్య మనుభవించు కాలమందు, నన్ను అసత్తగు వస్తువునందు మరపు పుట్టించి శాశ్వత మైన ఆనందమునకు దారిచూపుము." **ఇది మొదటి ప్రార్థన; ఇక రెండవదానికి "పరమాత్మా!** ప్రపంచమందలి వస్తువు నన్ను ఆకర్షణ చేసినపుడు ఆత్మ వస్తువని ఎంచబడు దానియందుగల ఆత్మస్వరూపమును గుర్తించు శక్తి లేకుండుటచే నన్ను ఆవరించిన చీకటిని తొలగింపుము." **ఇంక మూడవది.** "ఆ వస్తువునందుగల ప్రకాశమానమైన ఆత్మస్వరూపము యొక్క ప్రకాశము చూడనిమ్ము; నేను కోరుచున్న అశాశ్వతమైన సుఖము నీ యొక్క కటాక్షమువల్ల అమృతము, లేక పరమానందము అగుగాక;" **అని ప్రార్థనలయొక్క నిజ అర్థము.**

(ప్ర.వా.పు.19)

(చూ॥ అసతోమాసద్గమయ)

శాంతివృద్ధికి సూచనలు

ఇబ్బందులు కలిగినపుడు వాటిని తప్పించుకొనుటకు, అందులో ఉత్తీర్ణులగుటకు స్థిరమైన పట్టుదల, శాంతము ఉండవలెను.ధృతి, ధైర్యము, సమ్మతి ఇవి ఇచ్ఛాశక్తిని బాగా వృద్ధిచేయును. ముఖ వర్చస్సునందు ప్రకాశము, ప్రకాశించు కనులు, నిశితమైన చూపు **గంభీరమైనవాక్కు, ఉదారత, స్థిరమైన స్వభావము, నిర్భీకత ఇవి వ్యక్తి యొక్క ఇచ్ఛాశక్తి వృద్ధిఅగుచున్నదని తెలియపరచుటకు కొన్ని సూచనలుగా ఉండును. మనో ఆందోళన లేకుండుట, నిర్మలముగా, సంతోషముగా ఉండుట ఇవి శాంతివృద్ధికి సూచనలు.**

ఇట్టి శాంతిని సద్గుణవృద్ధినికూడా ఇవ్వమని భక్తులు ప్రార్థనా మూలమున అడుగుకొనవచ్చును. అసలు సాధకుడు దేనిని సాధించవలె నన్నను **ప్రార్థనే మూలధనము.**

(ప్ర.వా.పు.16/17)

శాంతి సుఖము

బుద్ధి నిలకడలేని మనుజుడు - పొందజాలడు శాంతిసుఖములు

విషయసుఖముల వెంట పరుగిడు-వెఱ్ఱిజీవికి ఎచట శాంతి?

కన్ను విప్పి చూడరోరన్నా!

(శ్రీ.స.వి.వా.పు.54)

శాంతుడు

(చూ॥ శాంతజ్ఞానము)

శాఖలు

శాఖలనగా ఉపాంగాలు చెట్లుకు కొమ్మలుండినట్లు కొమ్మలకు రెమ్మలుండినట్లు ఈ కొమ్మ రెమ్మలతో కూడినదే వృక్షమై నట్లు, **శాఖోపశాఖలతో కూడినది వేదము.** ఇట్లు ఒక్కొక్క వేదమునకు అనేక శాఖోపశాఖలు ఉన్నవి. ఏవో కొన్నింటిని మాత్రమే కొందరు గుర్తించిరి. గుర్తించక ఆచరించక వదలిన శాఖలు కొన్నివేలు, కొందరు గుర్తించిరి. గుర్తించక ఆచరించక వదిలిన శాఖలు కొన్నివేలు లక్షలున్నవి. అసలు వాటిపేర్లు కూడా ఎవరికీ తెలియవు. **కనుకనే అనంతోవై వేదః** అన్నారు. ఒక్కొక్క మహనీయుడు ఒక్కొక్క వేదములో కొన్ని కొన్ని వేదములోకొన్ని కొన్ని శాఖలను మాత్రమే గుర్తించి వల్లెవేస్తూ వచ్చారు.

(లీ.వా.పు.10)

శాపము

(చూ॥ పురాణములు)

శాశ్వతము

రమణీ శిరోమణులు రావచ్చు, పోవచ్చు;
శాశ్వతమైనది సత్యమొకటె.
రాజ్య భోగములన్ని రావచ్చు, పోవచ్చు;
శాశ్వతమైనది సత్యమొకటె.
భ్రాతలు, బందువుల్ రావచ్చు, పోవచ్చు;
శాశ్వతమైనది సత్యమొకటె.
అధికార భోగముల్ రావచ్చు, పోవచ్చు;
శాశ్వతమైనది సత్యమొకటె.
సత్యమే సరస సన్మార్గ తత్త్వము.
సత్యమే సకల సౌభాగ్యదాయకము.
సత్యమే అమృతత్వమునకు మార్గము.
సత్యమొక్కటే జగతిలో శాశ్వతము.

(స.సా.ఫి.2001 పు.41)

(చూ॥ విశ్వము, సత్సంగం)

శాశ్వతుండు

(చూ॥ మూలాధారము)

శాసనము

దైవనిర్ణియమునకు ఎవరు విరుద్ధము చేయటానికి వీలుకాదు. అది తప్పని శాసనము ఆశాసనమును మార్చుకోవటానికి ఎవరికి వీలుకాదు.

(బ్ర.త్ర.పు.20)

శాస్త్రము/శాస్త్రములు

నారాయణ బోధ నమ్మియుండిన చాలు
సామ వేదము చదివి నట్లె
నారాయణునివాక్కు నమ్మి యుండిన చాలు
ఇల యజుర్వేదము నుడివినట్లె
నారాయణుని వాక్కు నమ్మి సేవించిన చాలు
పుడమి ఋగ్వేదము నుడివినట్లె
నారాయణుని బోధ నమ్మి యుండిన చాలు
సకల శాస్త్రంబులు చదివినట్లె
వాదమేల యధర్వణ వేదమిదియె
తుచ్ఛ భావాలు మదిలోన తొలిగించి
నిశ్చలముగ బుద్ధి నిలుపుకున్న
ఇంతకన్న **శివరాత్రి** వేరొకటి కలదె

(భ.ప్ర.పు.19)

వేదము సనాతన శాస్త్రము; శాస్త్రమనగా అజ్ఞాత జ్ఞాపకము; అనగా, లోకసిద్ధము కాని అతీంద్రియములైన అర్థముల దర్శింప జేయుటకు ప్రవృత్తమైనది, పురుష బుద్ధికి గోచరముకానిదగుటచే, **"పరమంవ్యోమ, పరమం పదమ్, అక్షరమ్, తత్, సత్"** అని యీరీతిగా ఋగాది శ్రుతులన్నియు తెలిపెను.

ఒక వేదమును తెలియజేయుటకై అనేక వదములావిర్భవించెను. వేదశబ్దము మొదట సర్వజ్ఞుడగు పరమేశ్వరునకు వాచకమగుచు, (వేత్తతీతి వేదః) తరువాత తత్స్వరూప

నిరూపణాపరమై (వేదయతీతి వేదః) సర్వజ్ఞ కల్పమగు ఋగాది శబ్దరాశికినీ వాచకమైనది. తరువాత తదనుగుణముగ ప్రవృత్తములయ్యెడి, ధర్మ, అర్థ, కామములకు నుపలక్షకమగుచున్నది, మొదట (సర్వద్రష్ట) యగు పరమేశ్వరుని బోధించుచు, తరువాత ఆ పరమేశ్వరుని దర్శింపజేసెడి (దర్శనాత్) ఈ వేదము, ఋషి శబ్దరాశికికూడా వాచకమై వరలినది. తరువాత **ఋషులు దైవ వేదములను ఆరాధించి తదనుగ్రహముచే ద్రష్టలయి వెలసి, ప్రసిద్ధములైరి.**

దీనిని పురస్కరించుకొని పరమేశ్వరునకు "మహర్షి" అని కూడా నామము ప్రసిద్ధమైనది. బ్రహ్మసూత్రమున "మహర్షిః ముఖ్యర్షిః శివః" అని కూడా సహస్రనామములు కలవు. పరమేశ్వరుని దర్శింపజేయునదగుట చేత, **వేదమునకు ఋషి అనియు నామము సార్థకము. బ్రహ్మ అని వేదమునకు నామము. అందుచే బ్రహ్మను పొందుటకై చేయు ఫలత్యాగ కర్మలకు, బ్రహ్మయజ్ఞమని, ఋషియజ్ఞమని కూడా చెప్పుతూ వచ్చిరి. శుద్ధ, శుభ, సాత్విక, నిస్స్వార్థ కర్మలన్నియూ యజ్ఞములే.**

(స.వా.పు.167/168)

(చూ॥ అద్వైతదర్శనము,బ్రహ్మ,భూషణం, వేదములు, విద్య)

శాస్త్ర ప్రమాణము

శాస్త్రప్రమాణము ననుసరించి, ఉత్సాహము, సాహసము, ధైర్యము, సద్బుద్ధి, శక్తి, పరాక్రమము అను ఆరు సుగుణములు ఉండుచోట సాక్షాత్ భగవానుడయి వసించును. ఇట్టి గుణములను ప్రభోదించుటే, గణపతి పూజ అనగా ప్రారంభము. పిరికిపందలకు ఆధ్యాత్మ క్షేత్రమున చోటే లేదు. దుర్జనులు దృఢవిశ్వాసము లేనివారు, సందేహస్తులు యేడుపుముఖము వారు, వైద్యులకు శిష్యులుగా వుండవలసిన వారే కానీ యోగులెన్నటికీ కానేరరు. **జ్ఞానికి అజ్ఞానికి ఇదే భేదము.** "ప్రహసన్నివ" కృష్ణుడు ఆనందాతిరేకములతో నవ్వుచూ పలుకుట అర్జునుడు దుఃఖాకులుడై వినుట, జ్ఞానియెల్లపుడును నవ్వుతాడు, అజ్ఞాని యేడుస్తూ వుండును.

(స.వా.పు.163)

శాస్త్ర యోనిత్వాత్

'శాస్త్రయోనిత్వాత్' అను సూత్రము **బ్రహ్మను తెలుసుకొనుటకు వేదము కారణమనియు, వేదము ద్వారానే బ్రహ్మను తెలుసుకొనగలమనియు,** సర్వవేదముల చేత బ్రహ్మ వేద్యమవుతాడనియు అర్థమును వివరించుచున్నది. ఇంతే కాక దేనికి శాస్త్రము ప్రమాణమో అదే బ్రహ్మ అనియు బ్రహ్మమే వేదమునకు ప్రమాణమునకు కారణమనియు అర్థములున్నవి. సర్వజ్ఞుడు తప్ప ఇతరులెవ్వరూ వేదమునకు కారణము కాజాలరనియు తెలుపుచున్నది. బ్రహ్మజ్ఞానమునకు శాస్త్రమే కారణమని కూడా అర్థమును తెలుపుచున్నది. మానవుని జీవితాన్ని నియమబద్ధమొనరించి, కాపాడునది లేక పాలించునదిగా తెలుపుచున్నది.

బ్రహ్మ ప్రతి మానవుని స్వరూపమై యున్నాడు. ప్రతి మానవుని శాస్త్రము శాసించుచున్నది. అయితే మానవుడు మాయకు లొంగి మమత్వములో పడి తమస్సున తన్మయత్వమును పొంది యున్నాడు. అయినా శాస్త్రము తల్లివంటిది కనుక అతనిని విడువక, వెంటపడి, అతనిని ఉద్ధరించవలెనని తలంచి లక్ష్యమును స్మరింపజేయు చున్నది. అగమ్యగోచరమైన, అప్రమాణమైన, అనిర్వచ నీయమైన పరబ్రహ్మను తెలుపుటకు శాస్త్రము కారణమైనదగుటచే శాస్త్రయోనిత్వాత్ అని నిరూపించు చున్నది ఈ సూత్రము. ఈ శాస్త్రము అనంతము. తెలుసుకొనుటకు ఆయువు తక్కువ. విజ్ఞానము అనంతము. సందేహములు సంఖ్యాతీతం, శ్రద్ధ అల్పం, కనుక అన్నింటినీ తెలుసుకొననెవరి తరమూ కాదు. సముద్రమును పూర్తిగా గ్రోలి రుచి చెప్పలేము. అందులోని ఒక బిందువు రుచిచూచి సముద్రము యొక్క రుచిని

శిక్ష

నిరూపించినట్లు శాస్త్రమును పూర్తిగా తెలుసుకొనుట అసాధ్యము కనుక, అందులోని ప్రధాన సారమును అర్థము చేసుకొని గ్రహించి ఆచరించుటకు ప్రయత్నించిన చాలును. **అదే దైవచింతన.**

పురుషుడు అన్న సారమే. ఏతావాతా మానవ శరీరము అన్నమయం కాదు. అన్నము స్థూలమయిన స్థానము. దానికంటే సూక్ష్మమైనది ఒకటున్నది. అదే ప్రాణము. దానికంటే సూక్ష్మమైనది మనస్సు. మనసుకంటే సూక్ష్మమైనది ఆనందం. మానవుని శరీరమునందే పై అయిదు కోశములు ఇమిడియున్నవి. కాని చివరిదైన ఆనందస్థాయికి మానవస్థాయి చేరినపుడే బ్రహ్మ తత్వమును బ్రహ్మ స్వరూపమును చేరగలడు. చెందగలడు.

"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ" అను వాక్యము ననుసరించి **ఓంకారమే బ్రహ్మ**. ఈ చరాచర ప్రపంచమంతయూ ప్రణవముతో నిండియుండుట చేత, ప్రపంచమంతయూ బ్రహ్మమయము. ప్రణవమయమయిన జగత్తు బ్రహ్మ మయమని చెప్పవచ్చు. తరువాత అయమాత్మా బ్రహ్మ అని. ఆత్మతత్వము బ్రహ్మ పదార్థమే అయివున్నది. ఆత్మకూ బ్రహ్మకు ప్రణవానికీ అభేదం. ఇవి అవినాభావ సంబంధమైనవి. **ఆత్మతత్వమే బ్రహ్మపదార్థము అని అనుభవముతో తెలుసుకోవటమే బ్రహ్మవిద్య.** బాహ్య ప్రపంచానికి, అంతర్జగత్తుకు అవినాభావ సంబంధం ఉందనే విషయాన్ని సూత్రము తెలుపుతుంది.

(సూ.వా.పు.23/27)

శిక్ష

(చూ॥ తల, భక్తుని లక్షణము, విద్య)

శిక్షణ

(చూ॥ గురువులు, సాయి శరీరము)

శిక్షావల్లి

విద్య యొక్క పరమావధి వినయమే. విద్యకు నమ్రతయే ప్రధానమైన దృష్టి. శీలమే ప్రాణము. "మాతృదేవోభవ, పితృదేవోభవ," "సత్యంవద, ధర్మంచర" అని శిక్షావల్లి తెలుపుచున్నది. మొట్టమొదట తల్లిదండ్రులను గౌరవించాలి. మీరు జీవితములో ఎట్టి పరిస్థితులందైననూ సత్యాన్ని వీడరాదు, ధర్మాన్ని తప్పరాదు. ఈ విషయమైన పవిత్ర బోధనలను **"శిక్షావల్లి"** అనే పేరుతో తైత్తిరియోపనిషత్తు ఆనాటి విద్యార్థులకందించి, వారిని సన్మార్గములో ప్రవేశపెట్టి, వారి మానవత్వాన్ని దివ్యత్వంగా మార్చగలిగినది.

నీవు ఏపని చేసినా దాని ఫలితం అనుభవిస్తావు. ఈనాడు నీ స్నేహితుని నీవు మోసగిస్తే, భవిష్యత్తులో నీ స్నేహితుడే నిన్ను మోసగిస్తాడు. ఈనాడు నీ తల్లిదండ్రులను నీవు గౌరవిస్తే, రేపు నీ బిడ్డలు కూడా నిన్ను గౌరవిస్తారు. భవిష్యత్తు యొక్క ఈ మంచి-చెడ్డలన్నింటిని వర్తమానము నందే విడమర్చి, ముక్తమైన స్వరూపాన్ని అందించినది తైత్తిరియోపనిషత్తు.

(స.సా.న91 పు.300)

శిక్షావల్లియందు కర్మకు విరుద్ధములగు సంహితాది విషయములు కర్మ సముచ్చయములగు ఉపాసనలు వివరింపబడినవి. స్వారాజ్యము దీని ఫలము. ఇంత మాత్రమున సంసారబీజ మశేషముగా నాశన మొందనేరదు. ఉపాసన కామనావిరుద్ధము కాదు. దానిచే కర్మవలెనే ఉపాసనముకూడా మోక్షహేతువు కాదు. అజ్ఞానము సంసార కారణము. ఇది నశించుటచే మోక్షమబ్బును. అజ్ఞానము సహజ సిద్ధము. మనము కూర్చున్న రైలు బండి నిలిచియుండి ప్రక్కన మరియొక బండి పోవుచుండగా మనము కూర్చున్న బండియే పోవుచున్నట్లు ప్రత్యక్షముగా కనబడును.

(ఉ.వా. పు. 72)

శిరస్సు

శిరస్సునే దైవలోకము అన్నారు. ఎందుకనగా శిరస్సునందే **శబ్దస్పర్శరూపరసగంధాలుంటున్నాయి.** నరలోకము మన కంఠములో చేరి ఉంటున్నది. నాగలోకం మన హృదయంలో ఉంటున్నది. దేవలోకము, నరలోకము,

నాగలోకము మన దేహములోనే ఉంటున్నాయి. ఇంతటి పవిత్రమైన శరీర తత్వాన్ని తెలుసుకోకుండా జీర్ణించి పోయేది శరీరము అనుకుంటున్నాం. దహించి పోయేది దేహము అనుకుంటున్నాం. దేహము జీర్ణము కావచ్చు కానీదేహానికి నాశనం లేదు.

(ద.స.98 పు.53)

ఒకానొక సమయంలో **అశోక చక్రవర్తి** తన మంత్రితో కూడి విహారార్థం బయలు దేరాడు. మార్గమధ్యంలో ఒక బౌద్ధగురువు వారికి ఎదురయ్యాడు. **తక్షణమే అశోకుడు తన శిరస్సును ఆ బౌద్ధగురువు యొక్క పాదములపై పెట్టి నమస్కరించాడు.** ఈ దృశ్యాన్ని చూసి మంత్రి చాల నొచ్చుకున్నాడు. అశోకచక్రవర్తి అత్యంత విలువైన తన శిరస్సును ఒక సాధారణ సన్యాసి పాదములపై పెట్టినాడే అని బాధపడ్డాడు. అతడు పేరుకు మంత్రియేకాని చాల సంకుచిత బుద్ధి గలవాడు. అశోకుని కున్న విశాల హృదయం అతనికి లేదు. ఇంటికి వెళ్ళిన తరువాత సమయం చూసుకొని అశోకునితో ఈ విషయాన్ని ప్రస్తావించాడు. కాని అశోకుడేమీ మాట్లాడలేదు, నవ్వి ఊరుకున్నాడు. సరియైన సమయం చూసుకొని మంత్రికి సత్యాన్ని బోధించాలని సంకల్పించుకున్నాడు.

కొన్ని దినముల తరువాత **అశోకుడు ఆ మంత్రిని పిలిపించి, "మంత్రీ! నాకు మూడు శిరస్సులు కావాలి. ఒకటి మేక శిరస్సు, రెండవది పులి శిరస్సు, మూడవది మనిషి శిరస్సు. ఈ మూడింటినీ తీసుకొని రా" అన్నాడు.** మంత్రి మేకమాంసం అమ్మేవాని వద్దకు వెళ్ళి మేక శిరస్సును తీసుకువచ్చాడు. అడవికి వెళ్ళి వేటాడి పులి శిరస్సును తీసుకు వచ్చాడు. ఇంక స్మశానమునకు వెళ్ళి అప్పుడే పూడ్చబోతున్న శవము యొక్క శిరస్సును ఖండించి తీసుకువచ్చాడు. "రాజా! మీ ఆజ్ఞ ప్రకారం వీటిని తీసుకువచ్చాను" అన్నాడు. "మంచిది, ఈ మూడింటినీ రేపు మార్కెట్‌కు తీసుకువెళ్ళి అమ్ముకొని రా " అన్నాడు. మరునాడు మార్కెట్‌కు పోతూనే ఎవరో ఒక తిండిపోతు వచ్చి మేకశిరస్సును కొనుక్కున్నాడు. ఇంటిద్వారంపై అలంకారంగా పెట్టుకోవచ్చునని పులిశిరస్సును మరొకడు కొనుక్కున్నాడు. కాని మనిషిశిరస్సును మాత్రం ఎవ్వరూ కొనలేదు. మంత్రి తిరిగి వచ్చి అశోకునితో, "చక్రవర్తీ! ఈ మనిషిశిరస్సును ఎవ్వరూ కొనటం లేదు" అన్నాడు. "సరే, కొనకపోతే పోనీ, ఎవరికైనా ఊరికే ఇచ్చివేసిరా " అన్నాడు. మార్కెట్‌లో మనిషిశిరస్సును ఫ్రీగా తీసుకోవడానికి కూడా ఎవ్వరూ అంగీకరించ లేదు. మంత్రి తిరిగి వచ్చి, "మహారాజా! ఊరికే ఇస్తామన్నా దీనిని ఎవ్వరూ తీసుకోవడం లేదు" అన్నాడు. అప్పుడు అశోకుడు, **"మంత్రీ! జీవ మున్నంత వరకే ఈ శిరస్సుకు విలువ ఉంటుంది. జీవం పోతూనే శిరస్సుకు కూడా విలువ పోతుంది. కనుక జీవ మున్నప్పుడే మహనీయుల పాదములపై శిరస్సు పెట్టి ఆ పవిత్రతను అందుకోవాలి. జీవమున్నంతలోనే శిరస్సును సద్వినియోగం చేసుకోవాలి" అన్నాడు. పెద్దల పాదస్పర్శమే శరీరమునకు సరియైన విలువను చేకూర్చుతుంది.** కాని అనేకమంది నాస్తికులు దీనిని విమర్శిస్తుంటారు. ఇది తెలివి తక్కువతనం!

కౌరవపాండవ యుద్ధం జరిగినప్పుడు భీముడు దుర్యోధనుని క్రింద పడగొట్టాడు. **దుర్యోధనునిలో ప్రాణం ఇంకా కొంతవరకు మిగిలి ఉండగా భీముడు తన కాలుతో అతని శిరస్సును తన్నాడు.** అప్పుడు దుర్యోధనుడు, "భీమా! నేను క్రింద కూలకముందు నా శిరస్సును తన్నియుంటే నా ప్రతాపం చూపించేవాడిని. ఇప్పుడు నా ప్రాణం పోతున్న సమయంలో నా శిరస్సును నీవు కాలుతో తన్నడం గొప్పతనం కాదు. ఇంక కొన్ని నిమిషముల తరువాత కాకులు, గ్రద్దలు కూడా నన్ను కాళ్ళతో తంతాయి" అన్నాడు. కనుక **ప్రాణం ఉన్నప్పుడే శిరస్సుకు విలువ నందించుకోవాలి. మహనీయుల పాదములపై శిరస్సును పెట్టి తద్వారా దానిని పవిత్రం గావించుకోవాలి. జీవితం శాశ్వతం కాదు. మనం చేసే కర్మలే శాశ్వతమైనవి, సత్యమైనవి.**

(స.సా.మే.97 పు.117/118)

శివ

(చూ॥ వినయము)

శివం

ప్రేమనే 'శివం' అన్నారు. అదే మంగళం. ప్రేమ ఎప్పుడూ, ఎవరినీ బాధించదు. కనుక బాధించనటువంటిది మంగళకరమైనటువంటిది. అదియే 'శివత్వం' ఆ ప్రేమ లేకపోతే వీడు 'శవస్వరూపుడే'! ప్రేమ ఉండినప్పుడే వీడు 'శివస్వరూపుడు' కనుక ఈ రోజును 'శివరాత్రి' అన్నారు. చీకటితో కూడినటువంటి దానిని 'రాత్రి' అంటారు. **'చంద్రమామనసోజాతః' చక్షోసూర్యో అజాయత'** అని వేదం బోధించింది. చంద్రుడనగా మనస్స్వరూపుడు కాబట్టి 'మనస్సు' అనేది పవిత్రమైన ప్రేమ మయంగా ఉండాలి. **"గుండె యందు ప్రేమ పండించు కొనుచున్న వాడే హిందువు"** ఈ విధమైన ప్రేమతత్వాన్ని మానవుడు ఈనాడు పూర్తిగా విశ్వసించాడు.

(శ్రీ.మా.99 పు.5)

(చూ॥ నేను, యుక్తి, హిందువులు)

శివధనుస్సు

మిథిలాపురములో వేలాది మంది ఆ శివధనుస్సు ఉన్న బండిని ఈడ్చుకుంటూ వచ్చారు. విశాలమైన ప్రదేశంలో పెట్టారు. అనేకమంది రాజులు వచ్చారు. అయితే, దానిని విరచాలని రాలేదు. సీతను పెండ్లాడాలని వచ్చారు. పాపం! **వారి ఆశలన్నీ అడియాసలైనాయి. కారణ మేమిటి? వారు ప్రతిఫలం ఆశించి వచ్చినటువంటి వారేకాని, పవిత్రమైన దివ్యత్వాన్ని ప్రకటించే నిమిత్తం రాలేదు. రామలక్ష్మణులకు ఏ అభిష్టమూ లేదు, ఏ ప్రతిజ్ఞలూ లేవు. మేము దానిని విరుస్తామనే అహంకారం కూడా లేదు. అసలు ఇష్టమే లేదు. అందరితోపాటు సమానంగా కూర్చున్నారు. "రామా! దీనిని నీవు విరచగలవా? అని ప్రశ్నించాడు. విశ్వామిత్రుడు రాముడు నవ్వాడు. "ఈ చిన్న ధనస్సును ఎడమ చేతితో త్రుంచవచ్చును. ఇది నీవు త్రుంచగలవా? అని నన్ను ప్రశ్నిస్తున్నాడేమిటి! ఇదే మాయ" అనుకున్నాడు.** ఈ సభకు అనేకమంది బలశాలురు వచ్చారు. రావణాసురుడు కూడా వచ్చాడు. తన బలపరాక్రమమునంతా ప్రదర్శించి ధనస్సును ఎత్తబోయాడు. కాని, చేతకాక దాని క్రింద పడిపోయి కదలలేక పోయాడు పాపం! అందరూ ఫక్కున నవ్వారు. ఈ అవమానాన్ని భరించుకోలేకపోయాడు. రావణుడు. పదితలలనూ ఒక్కతూరి తీసివేసినట్లయింది. **అహంకారము, అభిమానము, అసూయ ఉన్నటువంటి వారికి ఎక్కడపోయినా అవమానం తప్పదు.** ఈ సమయంలో పదునాల్గు సంవత్సరములు కల్గిన రాముడు ధనస్సువద్దకు నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చాడు. అక్కడున్న వారందరూ, "ఈ పిల్లవాడేమిటి, ఈ ధనస్సును విరచట మేమిటి? ఇతనిని అనుమతించిన వారెవరు?" అని ఈవిధంగా ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతూ ఉన్నారు. రాముడు ధనస్సు వద్ద నిల్చాడు. సభనంతటినీ ఒక్కతూరి పరికించాడు. ఎడమచేతితో దాని నెత్తాడు. అంతే! అక్కడ చేరిన ప్రజల హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. ఇంక నారి కట్టాలని ఎడమచేతితోనే దానిని వంచాడు. వెంటనే అది మహాప్రళయ భయంకరంగా శబ్దం చేస్తూ విరిగిపోయింది. ఏ ఆటంబాంబో ఏ హైడ్రోజన్ బాంబో వేస్తే వచ్చే శబ్దం ఏవిధంగా ఉంటుందో ఆవిధంగా ఉంది అది. ఈ దృశ్యాన్ని అందరూ ఆశ్చర్యచకితులై చూశారు. అయితే, **రాముడు** శివధనుస్సును అవలీలగా ఎత్తగల్గుటకు కారణ మేమిటి? అతడు **సాక్షాత్తు నారాయణమూర్తి. అనగా అతనియందు నూటికి నూరుశాతం ఆకర్షణ శక్తి పున్నది. అందువల్లనే ఆ బరువును ఎత్తనవసరం లేకుండా అదే తన దగ్గరకు వచ్చేసింది. ఇంక, సీత భూజాత, భూమికి అయస్కాంత శక్తి చాల అధికంగా ఉన్నది. కనుక, సీత కూడా పూర్తి అయస్కాంత శక్తితో నిండియున్నది. దీనిని సైన్సు కూడా అంగీకరించక తప్పదు. అందువల్లనే సీత కూడా శివధనుస్సును సులభంగా ఎత్తగల్గింది. సీతారాములు ఇరువురూ సాక్షాత్తూ దైవశక్తులు.**

ఎక్కడ అయస్కాంత శక్తి ఉంటుందో అక్కడ ఎలక్ట్రిక్ పవర్ అనేది ఉంటుంది. కనుకనే, సీతారాముల తేజస్సు సర్వత్ర వ్యాపించి పోయింది. ఈ తేజస్సు మన దేహములందు కూడా ఉన్నది. కాని, ఒకరియందు ఎక్కువగా, మరొకరి యందు తక్కువగా ఉండవచ్చును. సీతారాములందు మాత్రము సర్వశక్తులున్నాయి. కేవలం లోకోద్ధారణ నిమిత్తమై మానవాకారము ధరించారు.

(శ్రీ.భ.ఉ.పు.54/55)

(చూ॥ దైవశక్తులు)

శివరాత్రి

చాలమంది శివరాత్రివేళ జాగరణ చేయాలని,పేకాట ఆడుతూ రాత్రంతా మేలుకుంటారు.

"పేకాటనాడుచు ప్రీతితో నారాత్రి గడిపినందులకె
అది జాగరణ యగునా? చేపల కొరకునై
చెఱువులో జాలర్లు పొంచి చూచెడి దృష్టి
ధ్యానమగునా? భార్యపై అలిగి భర్త తా
పస్తుండిన అది గొప్ప ఉపవాసమగునా?"

శివరాత్రి అనగా ఏమిటి? **పవిత్రమైన భావాలను పోషించునదే శివరాత్రి; దివ్యమైన ప్రేమను అభివృద్ధి పర్చునదే శివరాత్రి; దుర్గుణములను, దురాలోచనలను, దుర్బుద్ధులను దూరం చేయునదే శివరాత్రి.** కనుక సత్యాన్ని గుర్తించుకొని సత్యమైన మార్గంలో ప్రవేశించండి. **మనస్సు చంద్రునితో పోల్చబడింది. చంద్రునికి 16 కళలున్నాయి.** వీటిలో ఈ రాత్రి పదిహేను కళలు దైవంలో లీనమైపోయి, ఇంక ఒక్క కళ మాత్రమే మిగిలి ఉంటుంది. దైవాన్ని స్మరించడంచేత ఆ ఒక్క కళ కూడా దైవంలో లీనమై పోతుంది. కనుక సంవత్సరమునకు ఈ ఒక్క రాత్రంతా భజన చేసినారంటే ఎంతో అదృష్టవంతు లవుతారు మీరు. సంవత్సరంలో ఒక్క రాత్రియైనా మేలుకొని దైవచింతన చేయగలరా? భజనలోని ఆనందం, భగవన్నామంలోని మాధుర్యం ఇంకెక్కడా చిక్కదు, ఎంత ఖర్చు పెట్టినా లభించదు. ఇది కేవలం ప్రేమచేతనే లభ్యమవుతుంది. కనుక ప్రేమను పెంచుకోండి. పవిత్రతను పెంచుకోండి. జీవితాన్ని సార్థకం గావించుకోండి.

(స.సా.మా.99. పు.66)

(చూ॥ యుక్తి, శాస్త్రములు)

శివ శక్త్యాత్మక స్వరూపము

ప్రకృతి, పురుషుడు అని రెండు పదములున్నవి. **ప్రకృతి అనగా జడము. అదే దేహము. దీనినే స్త్రీ అన్నారు. పురుషుడు అనగా చేతనాశక్తి. ఈ చేతనా శక్తియే పురుషత్వము. ఇదే ఆత్మ. ప్రతి దేహమునందు ఇవి రెండూ అన్యోన్యాశ్రయమై ఉంటున్నవి. దేహము జడమని, చైతన్యము పురుషుడని, దేహము స్త్రీ పురుషత్వ సమ్మిళిత రూపమని చెప్పవచ్చు.** దీనినే జడచైతన్యముల అంతరిక స్వరూపమని కూడా చెప్పవచ్చును. **శివశక్త్యాత్మక స్వరూపమని** కూడా భావించవచ్చు. కనుక ప్రతి జీవికీ ఈ పురుషార్థములను సాధించుటకు అధికారమున్నది.

(స.సా.ఫి.85 పు.33)

శివశక్తి

ఎండుమట్టి తోడ, కుండలు, కుమ్మరి చేయలేడు,
నీరుచేర్చకుండా సృష్టి హేతువగును, శివశక్తులిరువురు!
వినుముభరతా వీర సుతుడ।

(సా.పు.180)

శివార్పణం

త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం
త్రిజన్మ పాపసంహారం ఏకబల్వం శివార్పణం.

(స.సా.అ. 2001 పు. 294)

శివుడు

శివయేవ సదా జీవం జీవ యేవ సదా శివం
వేద్యైక్య మునయో ర్యస్త స్యాత్మజ్ఞాన చేతసః.

శిష్యులు

ప్రేమస్వరూపులారా!

శివుడే జీవుడు. జీవుడే శివుడు అన్న ఏకాత్మ తత్వాన్ని ఎవరు గుర్తింతురో వారే పరిపూర్ణ జ్ఞాని. కారణం విశ్వమంతకు ఒకే విభుడు. ఇట్టి సత్యమును గుర్తించిన వ్యక్తి దానిని అద్వైత దర్శనం జ్ఞానం అన్నాడు. అయితే జీవగుణముతో బాటు శివ గుణము కూడా లీనమై ఉంటున్నది. జీవగుణము మనస్సు. **"మనోమూలమిదం జగత్"**. జగత్తంతయు మనస్సు యొక్క కారణమే. మనస్సంటే ఏమిటి? **"సంకల్ప వికల్పాత్మకం మనః" నిరంతరము మననం చేయుటమే మనస్సు యొక్క స్వరూపము.** సంకల్పవికల్పయులచే తన స్వరూపము నిరూపిస్తూ వచ్చింది. ఇట్టి సంకల్ప వికల్పములకువిరామ మనేదే లేదు. విరామము లేక నిర్విరామముగా సంకల్ప వికల్పము జరుగుతుంటాయి. అయితే ఇట్టిసంకల్పములు ఒకొక్కసారి పరిధి తప్పి వేగ స్థితిని పొంది మానవత్వమును **అవ్యక్తము చేస్తుంది.** ఈ మనోవేగమును భరించుకొన లేక మానవుడు అస్తవ్యస్తమై పోతున్నాడు.

(ద.స.స.97పు. 43/44)

అతర్భహిర్ తత్వములందు, స్వరూప స్వభావములందు, ప్రత్యక్ష అప్రత్యక్ష తత్వములందు దైవత్వమనే శక్తి వ్యాపించి యున్నదనే సత్యాన్ని వారు (ఋషులు) విశ్వసించేవారు. తదుపరి దీని అంతరార్థాన్ని విపులంగా జగత్తులో వ్యాపింప చేసే నిమిత్తమై మహర్షులు తపస్సులు ఆచరించారు. **వేదాహమేతం। పురుషం మహాన్తం। ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్॥** అంధకారమనే చీకటి ఆవలనున్న తేజోమయుడైన పరమాత్మను మేము చూచాము. జనులారా! మీరు కూడా చూచి తరించండి. అని ప్రబోధించారు. **మంగళస్వరూపుడు, గుణరహితుడు కనుక అతనికి "శివః" అని క్రొత్త పేరు పెట్టారు. శివః అనగా త్రైగుణ్యరహితుడు. అనగా త్రిగుణములు లేనివాడు.** కనుక సదా పరిశుద్ధుడు ఆ శుద్ధమును కల్పించేవి గుణములే. భగవంతునికి గుణములు లేవు కనుక అతడు పరిశుద్ధుడు. నిర్గుణుడు. ఇలాంటి తత్వానికి "శివః" అని క్రొత్త పేరు పెట్టారు.

(సా.పు.631)

మానవుడు 'శివం' గాని 'శవం' కాదు. (శివం = శివుడు) - మానవునికి మూడు నేత్రములున్నవి. అవి సూర్య చంద్రాగ్నులనుండి వచ్చినవి. అగ్నినేత్రము = అంతర్నేత్రము. అది యోగశక్తి చేత మాత్రమే తెరువబడును. **త్రినేత్రుడైన శివుడు భూత భవిష్యద్వర్తమానములు మూడును చూడగలడు.**

(స.వ.1995 పు. 16/17)

(చూ॥ ఒకరే, శంకరుడు, హిరణ్యగర్భతత్వం)

శిష్యులు

మానవులకు కొన్ని బాధ్యతలు కూడా ఉన్నాయి - ధర్మమును అనుసరించి ఆశ్రయించి జీవించుట ఆయన బాధ్యత. **ఏది పవిత్రత, ఏది ధీరత్వము, ఏది సమ్మతము అదే ధర్మము. "ధారయతీతి ధర్మః"** మానవ సముదాయమును నిలబెట్టుట మానవధర్మము.

ఈ బాధ్యతను సంతృప్తిగా నెరవేర్చుటకు సాధన అనే సామగ్రి అత్యవసరము. అదే అన్నిటికీ మూలాధారము. స్వార్థభావము దూరముచేసుకొని, పరులకు ఉపకార మందించే బుద్ధిని పెంచుకొనేది కూడ ఒక పెద్ద సాధన. **పరులను ఆనందపరచి, ఆహ్లాదపరచే కర్మల నాచరించాలి. అట్టి వ్యక్తిత్వమునకే శిష్యులు అని పేరు సార్థకనామ మగును.**

(ఆ.పు.20/21)

శిష్యుడు/శిష్యులు

పసిపిల్లవానికి తన నాలుక తనకు పుంది. అలాగే తల్లికి, తల్లి తొడమీద కూర్చోపెట్టుకొని బిడ్డకు మాటలు ఉచ్చరిస్తూ, మాటలు నేర్పుతుంది. తల్లి నాలుక ఎంత తీరిక లేనిదైనా, బిడ్డ తన నాలుకతోనే మాట్లాడ్డం నేర్చుకోవాలి. బిడ్డ బదులు తల్లి మాట్లాడ లేదు. తన భాధ్యత నుండి తప్పించుకోలేదు! **గురువు కూడా అటు వంటివాడే! తను పునరుచ్చారణ చేస్తూ, జ్ఞాపకం చేస్తూ, ఉత్తేజాన్ని కలిగిస్తూ, నచ్చజెపుతూ, బోధిస్తుంటాడు; కాని**

శిష్యుడే ఆ కార్యక్రమాన్ని నిర్వర్తించాలి. అతడే ఆ ఘంటాన్ని చేపట్టాలి. ఆ విధి నిర్వహణలో ఇతరులెవరు తనని పై కెత్తలేరు.

(ప.స.పు.149)

గురువు చెంత చేరినతోడనే అతని అవసరములను పట్టిజ్ఞానచింత సహితము మాని గురువు చిత్తమును రంజింపజేయు శుశ్రూష సలుపుతూ ఆజ్ఞలయందు మమకారమును వీడి శిరసావహించును. గురుకార్యము తప్ప మరే ఇతర చింతనలూ లేక సర్వమూ గురు కటాక్షమునకు వదలినవానికి జ్ఞానము త్వరగా లభించును. కానీ, అట్లుగాక గురువుపై అవిధేయుడై మమకార, అభిమాన, అహంకారములతో అలక్ష్యముతో, అవిశ్వాసముతో గురువునే పరీక్షింప చూచిన తత్త్వజ్ఞాన దేవత అనుగ్రహమునకు బదులు ఆగ్రహ ప్రసాదమును అందుకొనవలసి వచ్చును.

"దూడను చూచినతోడనే ఆవు చేపుచున్నట్లు శిష్యుణ్ణి చూచిన తక్షణమే గురువుయొక్క అనుగ్రహ మను క్షీరమును అందించునట్లు చేసుకొనవలెను. శిష్యుడు నువినీతుడై ఉండవలెను. అట్లుండిన శుభ్రమయిన ఇనుమును అయస్కాంతము ఆకర్షించినట్లు శిష్యుణ్ణి గురువు అనుగ్రహించును.

(గీ.పు.87/88)

తన తప్పును తాను తెలిసికొనుటే, శిష్యునికి ప్రథమ సుగుణము. మానవుని మూఢత్వము అన్నియూ తనకు తెలుసునను అహంకారమును పెంచును.

శిష్యుడు తనలోని మంచి గుణములను వెతుకుటకంటే తనలోని దోషాలను వెతికి తీసివేయుట చాలా మంచిది. అట్టివాడు త్వరలో ముందుకు రాగలడు. అట్టి స్థితి కలవాడే సర్వమూ భగవత్ శక్తిపై భారము వేసి నిర్భయముగా నుండగలడు. నిశ్చింతగా నిలువగలడు. అదే వాని ధన్యతకు తగిన గుర్తు.

(గీ.పు.17/18)

(చూ॥ గురువులు, శంకరాచార్యులు)

శీతలవెన్నెల

"రామా! నీవు రామచంద్రుడవు! నేను సీతాజాతను. అనగా చంద్రునినుండి వెలువడిన చల్లని శీతల వెన్నెలను, చంద్రుడు అరణ్యమందును వెన్నెల ఆయోధ్యయందును వుండ వీలుండదు కదా! చంద్రినిలో వెన్నెల కూడియే యుండును. కానీ వియోగము సంభవించదు. ఈ రెండింటికీ నిరంతర సంయోగమే కానీ, వియోగము సంభవించదు. సంభవించెనా అది యేదో ప్రళయ సమయము అయివుండవచ్చును. లేదా దుష్ట సంహారమునకై శిష్ట పరిపాలనకై అట్లు జరుగవచ్చును. ఈనాడు అట్టి వేవియు లేవు కనుక, మన యెడబాటు వీలుకానిది, జరుగలేనిది" అని దృఢముగా పలికెను.

(రా.వా.మొ.పు.241)

శీతోష్ణములు

(చూ॥ భయం)

శీలత్రయము

ఆధ్యాత్మికక్షేత్రమందు విజయమును సాధించగోరిన ప్రతి మానవుడు శీలత్రయము అతి ప్రధానము. **మొదటిది పావిత్రత. రెండవది సహనము, మూడవది పట్టుదల. ఇవియే శీలత్రయము.** ఎట్టి విద్యావంతుడైనా ఎంతటి ధనవంతుడైనా, ఎంతటి అధికారియైనా ఎంతటి శాస్త్రజ్ఞుడైనా, ఎంతటి పండితుడైనా, ఎట్టి పామరుడైనా యీ శీలత్రయము లేకుండిన, వాడు బ్రతికి కూడను చచ్చినవానితో సమానము అన్నారు.

(శ్రీ.గీ.పు.224)

ఏ రంగంలోనయినా విజయం సాధించవలెనన్న మానవుడు "శీలత్రయము"తప్పని సరిగా కలిగి యుండవలయును.

1. పవిత్రత (Purity)

2.సహనం (Patience)

3. పట్టుదల (Perseverance) ఈ మూడు గల వ్యక్తులచే

శీలము

మన ప్రాచీన సమాజం గౌరవించింది. దీనినే "శీలత్రయము" అన్నారు. **ఇంగ్లీషులో P3 అన్నారు.** ఎవరియందు ఈ శీలత్రయము నెలకొని యుండునో వారిని విజయం వరిస్తుంది. వారు లక్ష్యమును నిరాటంకంగా చేరుకొనగలరు.

(దే.యు.పు.10)

శీలము(Character)

Character (శీలం) అనేది రెండు రకాలు.

1. Individual Character (వ్యక్తి గత శీలము)

2. National Character (జాతీయశీలము)

ఆ నేషనల్ క్యారక్టరే చారిత్రము. అదియే చరిత్ర- రామచరిత్ర కృష్ణచరిత్ర - ఇలాంటివన్నీ చరిత్రలుగా రూపొందినాయి కేవలం మన చరిత్ర మనం రాసుకుంటే అది చరిత్ర అని చెప్పటానికి వీలుకాదు. అది మహా అవమానం. **His story is History దైవము యొక్క కథ అతని గుణగణములను వివరించేదే Story (కథ) అతని ఆదర్శవంతమైన గుణములే మనకు కథలు.** ఇట్టి చరిత్రను మనం అభివృద్ధి పరచుకోవాలి. చారిత్రాత్మకుడు కావాలి కాని, జీవాత్మకుడు కాకూడదు. కదిలిపోయే మేఘముల వంటి ఈ అనిత్యము, ఆశాశ్వతమైనటువంటి కీర్తి నిమిత్తమై నీవు ప్రాకులాడాలి ఈ లోకంలో ఏకత్వాన్ని అనేకత్వంగా విభజించేటటువంటి మేధావులున్నారుగాని, అనేకత్వంలో వున్నటువంటి ఏకత్వాన్ని చేర్చేటటువంటి మేధావులు కనిపించటంలేదు. కనుకనే **ఏకత్వంలో అనేకత్వాన్ని విభపించేటటువంటివాడు మేధావి. అనేకత్వంలోని ఏకత్వాన్ని విశ్వసించేటటువంటివాడే చారిత్రకుడు. కనుకనే Unity in diversity (అనేకత్వంలో ఏకత్వం) ఇలాంటి ఏకత్వాన్ని మనం గుర్తించాలి.**

(శ్రీ.అ.96 పు.31)

ఒక పర్యాయం ప్రహ్లాదుడు విశ్వజిత్ యాగం చేసినప్పుడు, ఇంద్రుడు దేవగురువు యొక్క సలహాపై ఒక చిన్న బ్రాహ్మణ పిల్లవానివేషంలో అతనివద్దకు వెళ్ళాడు. బ్రాహ్మణు లంటే చాలా అభిమానము ప్రహ్లాదునికి. "నాయనా! నీకు ఏమి కావాలి?" అని అడిగినాడు. ప్రహ్లాదుడు. "నాకు నీ శీలమును దానం చేయి," అన్నాడు ఇంద్రుడు. "పిచ్చివాడా! ఇంత చిన్న కోరిక కోరుతున్నావేమిటి? ఇంకా ఏదైనా అడుగు, ఇస్తాను," అన్నాడు ప్రహ్లాదుడు. "నాకిదే చాలు," అన్నాడు బ్రాహ్మణ పిల్లవాని వేషంలో ఉన్న ఇంద్రుడు. ప్రహ్లాదుడు "సరే ఇచ్చినాను, వెళ్ళు," అన్నాడు. తక్షణమే ప్రహ్లాదునినుండి శీలము తళతళలాడుతూ, మిలమిలా మెరుస్తూ ఇంద్రునిలో చేరిపోయింది. దానిని లెక్క చేయలేదు ప్రహ్లాదుడు. తరువాత కొంతసేపటికి దివ్యకాంతితో వెలుగొందుతున్న ఒక స్త్రీ తననుండి వెళ్ళిపోవడం గమనించాడు. **"అమ్మా! నీవెవరు?"** అని అడిగాడు. ఆమె **"నేను నీ రాజ్యలక్ష్మిని.** శీలము లేనిచోట నేను ఉండటానికి వీలుకాదు," అని పలికింది. కొంతసేపటికి మరొక దివ్యాంగన వెళ్లిపోవడం గమనించి "అమ్మా నీవెవరు?" అని ప్రశ్నించాడు. **"నీ యశస్సును. శీలము, రాజ్యలక్ష్మి లేనిచోట నేనుండలేను,'** ' అని సమాధానమిచ్చింది. ఈ విధంగా, శీలమును కోల్పోయిన తక్షణమే ప్రహ్లాదుడు తన సర్వస్వమునూ కోల్పోయాడు. అప్పుడు శీలము యొక్క ప్రాముఖ్యతను గుర్తించి **ప్రహ్లాదుడు, "నారాయణా! నాకు ఈ రాజ్యం అక్కరలేదు; సైన్యం అక్కరలేదు, ఒక్క శీలమును మాత్రం నాకు అనుగ్రహించు,"** అని ప్రార్థించాడు. ప్రహ్లాదుని త్యాగానికి మెచ్చుకొని నారాయణుడు అతనికి **శీలమును తిరిగి అనుగ్రహించాడు.** కనుక, శీలమును మించిన శక్తి మరొకటి లేదు.

(స.సా. సె.2000 పు. 277/278)

గౌతమ బుద్ధుడు, "బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి" అన్నాడు. అనగా బుద్ధిలో ధర్మమును ప్రవేశపెట్టి, బుద్ధిని సంఘంలో ప్రవేశపెట్టాలి. ధర్మమనగా ఏమిటి? **హృదయము, వాక్కు, క్రియ - ఈ మూడింటి ఏకత్వమే నిజమైన ధర్మం. దీనినే భారతీయులు త్రికరణశుద్ధి అన్నారు.** మన ప్రాచీనులు

మనిషికి శీలమే చాల ప్రధానమైనదని విశ్వసించారు.**If wealth is lost, nothing is lost; If health is lost, something is lost; If character is lost, everything is lost (సంపద పోయిందంటే ఏమీ పోనట్లే; ఆరోగ్యం పోయందంటే ఏదో కొంత పోయినట్లు; కానీ శీలమే గనుక పోయిందంటే అంతా పోయినట్లే)** అని వారు భావించారు. కానీ ఈనాటి పరిస్థితి దానికి పూర్తి విరుద్ధంగా ఉన్నది. సంపద పోతే అంతా పోయినట్లే అని విచారిస్తున్నారు; శీలం పోతే ఏమీ పోనట్లుగా భావిస్తున్నారు. శీలమే లేక ఎంత బలమున్నా, ఎంత ధనమున్నా ప్రయోజనం లేదు.

(స.సా.ఫి.98 పు.41/42)

సమస్త శాస్త్రముల సారము సర్వ ధర్మమయమైన శీలము ప్రధానసాధనము. శీలము ఒక్కజాతికి మతమునకు, సంప్రదాయమునకు సంబంధించినది కాదు. దీనిని సర్వసమన్వయ పద్ధతితో బోధించబడినది. దీనిని ఆశ్రయించినవారు ఎనాటికైనను చెడరు. పుణ్యాత్ములు కాగలరు. జీవుల అంతఃకరణశుద్ధికి గుణములు ప్రధానమార్గము. ఈ గుణము ఏదిచేయవలెను. ఎట్లు చేయవలెను. అని చక్కగా విచారించును. నొసటి వ్రాత మంచిదయిన వారికే ఈ గుణము ప్రాప్తించును. ఈ గుణమే భవసాగరమును దాటించు భద్రమైన నావ. గుణమును ఆశ్రయించినవారికి మోక్షమున స్థలము కలదు. ఎంతటి ప్రారబ్ధ కర్మలనుభవించు వాడైననూ శీల పోషణ కలవానిని కర్మ ఫలమంటదు. ఇతను పరమానంద రూపమైన బ్రహ్మముచేరును.

(సూ.వా.పు.11)

(చూ॥ భద్రము, మహోపద్రవాలు, రామలక్ష్మణులు, సాధకుడు, స్త్రీ ధర్మము, నోరు)

శుకనాడి

(చూ॥ అణు స్వరూపము)

శుకుడు

వేదమను వృక్షమునుండి భాగవతమను ఫలమును త్రుంచి ప్రజల కందించిన చిలుకయే ఆ శుకుడు. అందించిన ఈ ఫలమును ఆరగించి జీర్ణించుకొని, ఆత్మానందము నందుదురుగాక, ఆ నందనందనుని పొందుదురు గాక.

(భా.వా.పు.255/256)

(చూ॥ పరీక్షిత్ ప్రార్థన, భాగవతము)

శుక్ల మార్గము

(చూ॥ ఉత్తరాయనము)

శుక్రుడు-ద్రోణుడు

కృతయుగములో శ్రీమన్నారాయణుడు వామనావతారము తీసుకొని బలిచక్రవర్తిని సరియైన మార్గములో పెట్టే నిమిత్తమై దానము అడగటానికి వెళ్లాడు. బలిచక్రవర్తి గురువు శుక్రాచార్యుడు. ఆచార్య ఆచరించినవాడు. అనేక వేల మందికి గురువు ఆచార్యుడు. బలిచక్రవర్తి వామనుడు నారాయణుడని తెలుసుకొని అతనికి సర్వము అర్పించుటకు సిద్ధమయ్యాడు. ఇస్తాను అని మాట ఇచ్చాడు. శుక్రాచార్యుడు వద్దు వద్దు, నీవు చాలా మోసపోతావు. రాజ్యమంతా భ్రష్టయిపోతుంది. నీవు అతనికి ఏ మాత్రము మూడడుగులు దానము ఈయవద్దన్నాడు. **ఆ సమయంలో దైవము కంటే గురువు ఏమిటని ధిక్కరించి 'పలికి బొంకుట కన్న పాపమున్నె'** ఏమైనా సరే, గురువు శపించినా ఫరవాలేదు. నేను భగవంతునికి అర్పితము చేస్తానన్నాడు. దైవమునకు అర్పితము చేస్తుంటే వద్దని చెప్పేవాడు గురువా?!

ద్వాపర యుగంలో పాండవులకు అన్ని రకములైన విద్యలు బోధించుటకు ఏకైక గురువుగా వచ్చాడు. ద్రోణాచార్యుడు. ద్రోణాచార్యుడు ప్రామిస్‌చేశాడు. నీకు తప్ప మరొకరికి గురువుగా ఉండను. నా శక్తి అంతా నీకే అర్పితము చేస్తాను. కానీ మరొకరికి చేయను. ఆ ధైర్యము చేత

శుచి

అర్జునుడు విష్ణువీగిపోయాడు. అన్ని విద్యలు నేర్పాడు. ద్రోణుడు చెప్పినట్టుగా ఎవరికి గురువుగా పోలేదు. ఒకొనొక సమయంలో ఏకలవ్యుడు వచ్చి స్వామీ, నాకు విద్య నేర్పమని ప్రార్థించాడు. నేను అర్జునునికి ప్రామిస్ చేశాను. అర్జునునికి తప్ప మరొకరికి గురువుకాను. అన్నాడు. మంచిదే అంతవరకు సంతోషమే. పాండవులు, కౌరవులు అరణ్యమునకు వెళ్ళారు. విహారార్థమై వారి వెంట కుక్కలను తీసుకువెళ్లారు. ఒక మృగమును చూచి కుక్క అరిచింది. ఆ అరుపును విని ఎక్కడనుందో నాలుగైదు అంబులు వచ్చాయి. ఐదు ఒక్కతూరి పడ్డాయి. అర్జునుడు చాలా ఆశ్చర్యపోయాడు. శబ్దమును పురస్కరించుకొని అన్ని అంబులు వేసిన గొప్ప విద్యావంతుడు ఎవరాయని అరణ్యములో వెతుకుతూ పోయారు. గొప్ప శక్తివంతుడగా ఉంటున్నాడు. ఈ శక్తి నాకు కూడా లేదే. **తనకు లేక పరులకు శక్తి ఉండినప్పుడు అసూయ వస్తుంది.** వెతికేటప్పటికి ఒక పూరి గుడిసె లోపల ఒక బోయవాడు ఒక అంబుని పట్టుకు నిల్చున్నాడు. అతనిని చూచారు. నీవేనా వానిని వదలినదని అడిగాడు. అవును అన్నాడు. 'నీకు ఎవరు గురువు'ని అడిగాడు. ద్రోణాచార్యుని ప్రార్థించాడు. ద్రోణుడు ఒప్పుకోపోవటంచేత ద్రోణాచార్యుని పాదములనే గురువుగా భావించి యీ విద్యలు నేర్చుకున్నాడు. అతనికి తెలియకుండా ద్రోణాచార్యుడే నా గురువు అన్నాడు. అర్జునుడు మండిపోయాడు. నాకొక వైపున ప్రామిస్ చేసి తిరిగి యీ వ్యక్తికి యిన్ని విద్యలు నేర్పినాడని చాలా కోపంగా యింటికి వెళ్ళాడు. ద్రోణాచార్యుని అడిగాడు. ద్రోణాచార్యుడు సత్యమే చెప్పాడు. నేను ఎవరికి గురువుకాదు. నేను ఏకలవ్యునికి గురువుకాదు. నా దగ్గరకు వచ్చి ప్రార్థించాడు గానీ నేను అంగీకరించలేదన్నాడు. ఇది సత్యమే. కానీ అర్జునుడు చాలా మండిపడ్డాడు. నాకంటె గొప్పవాడు ఉన్నాడు ఈలోకంలో, పెద్ద అసూయ. అతని శక్తిని ఎట్లాగైనా నిర్మూలం గావించాలని సంకల్పం గావించుకున్నాడు. నాకంటె అధికుడు యీ లోకంలో ఉండకూడదు. కాబట్టి దీనికి తగిన ప్రయత్నం చేయమన్నాడు ద్రోణాచార్యుని. ద్రోణాచార్యుడు విధిలేక, ఈ గొప్ప దనము చూచి లోంగిపోయాడు ద్రోణాచార్యుడు. రాజుకు విరుద్ధంగా పోతే నాగతి ఏమవుతుందోనని భయపడ్డాడు. స్వార్థమైన బుద్ధితో కుయుక్తి పన్ని అడవియందు నివసించే ఏకలవ్యుని దగ్గరకు పోయి 'ఏకలవ్యా! నీకు ఎవరు గురువు' అడిగాడు. 'నీవే గురువు' అని చెప్పాడు. ఎంతో గౌరవముగా చెప్పాడు. ఇతను గురువుకాకపోయినప్పటికి, మానసికంగా 'నీవే నా గురువు' అన్నాడు. అయితే గురుదక్షిణ ఏమిస్తావు అన్నాడు. ఏది అడిగితే అది యిస్తానన్నాడు. **అన్నింటికి సిద్ధమే వాడు. ఎందుకంటే, గురువుపై విశ్వాసము అట్టిది.** అంత విశ్వాసముగా ఉండినవానికి గురువు చాలా ద్రోహము చేశాడు.

దక్షిణాంగుష్ఠ మిచ్చిన దానచేసి
బాణసంధాన లాఘవ భంగమయ్యె
విలువిద్య కలిమికి హీనుడయ్యె
పార్థుని మనోరథము ఈడేరనంత!

అర్జునుని మనస్సు తృప్తిపరచే నిమిత్తమై ఏకలవ్యుని దక్షిణ అంగుష్ఠమును దక్షిణగా కోరాడు. **ఇది గురువు చేసే పనియా! కాదుకాదు. ఇలాంటి ప్రాపంచిక గురువులు స్వార్థమునకు, స్వప్రయోజనమునకు వినియోగించుకుని నిజమైన ఆత్మజ్ఞానమునకు దూరము గావిస్తున్నారు.** వీరందరు వ్యావహారిక గురువులే గానీ ఆత్మ సంబంధమైన గురువులు కాదు. ఎవరితోనైనా విద్యను నేర్చుకో తప్పులేదు. కానీ అర్పితము మాత్రము భగవంతునికి మాత్రమే కావాలి. అదే నిజమైన భక్తి. అదే నిజమైన ఆధ్యాత్మికము.

(శ్రీ.స.పు.82/84)

శుచి

మనసు ఎట్లు పారిపోతే అట్లు పారిపోనీ; నీవు మాత్రము దాని వెంట ఎక్కడకు పోతుందా అని చూచుకుంటూ పోవద్దు. నీవు ఉన్నచోటే ఉండు. మనసు ఇష్టమొచ్చినట్లు

తిరిగి తిరిగి కడకు అలసి నీ చెంతకే వచ్చును. మనసు ఏమియు తెలియని పసిబిడ్డ వంటిది. తల్లి పిల్చే కొలదీ తానుకూడను దూరముగా పోవుచునే యుండును, అట్లుగాక, ఆ బిడ్డవైపు చూడక, తల్లిపాటికి తల్లివెనుకకు తిరిగిన, బిడ్డ తనపాటికి తానే పరుగెత్తుకొని తల్లిచెంతకు వచ్చి చేరును. నీ నియమము ప్రకారం నీ ఇష్ట నామ ధ్యానములను ఏకాగ్రత ఫలించును. నీవునూ సఫల మనోరథుడవౌదువు. నీవు నీ మనసులోనికి చేరనివ్వవద్దు. **ప్రపంచమున అశుచి పదార్థమంటూ లేనేలేదు. సర్వాంతర్యామిగా పరమాత్ముడు ఉన్నప్పుడు అశుచి ఎక్కడిది? బాహ్య దృశ్యమునకూ, అనుభవమునకూ అశుచి అనుకున్ననూ దానికి పరమాత్మ నామము సోకగానే శుచిగా మారును.**

(జ.పు.123/124)

(చూ॥ అనపేక్ష, మనస్సు)

శుద్ధ సత్వము

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యంబునం దణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థల మేది కనుగొన్న?
శుద్ధసత్వ మిదియె చూడరయ్య!

(స.సా.జూలై 2000 పు.204)

శుద్ధి

(చూ॥ శౌచము)

శుభవార్త

రావణుడు మరణించిన శుభవార్తను సీతకు తెలియజేయుమని రాముడు హనుమంతుని ఆజ్ఞాపించాడు. ఇట్టి ఆనందకరమైన వార్తను సీత చెవిలో ఎప్పుడు వేయగలనా అని ఎదురు చూస్తున్న హనుమంతుడు తక్షణమే ఒక ఎగురు ఎగిరి అశోకవనమునకు చేరుకున్నాడు. అక్కడ సీత ఒంటరిగా కూర్చుని,

"ఈ చెఱలోనుంచి వెళ్ళేనా?
ఇక నే రాముని కన్నుల చూచేనా?
ఆ శ్రీరాముని కన్నుల చూచేనా?
నాడు పెండ్లాడిన రాముడు
ఏల నా జాడలో రాకయున్నాడు
ఎన్నడతని కౌగిలి ఎడబాయకుంటినే
పన్నుగ పదినెలలాయెనే
ఓ నా ముద్దు మరిదీ! ఓ లక్ష్మణా!
నిన్ను తూలనాడితిని సద్గుణా!
నోటి మాటల కెంతో నొచ్చుకొని
ఏమని దూరితో నన్ను విడిచిపోతివ తండ్రీ!"

అని బాధపడుతున్నది. ఆ సమయంలో ఆమెకు ఈ చల్లని వార్తను అందించాడు హనుమంతుడు. సీతకు ఆనందంతో నోట మాట రాలేదు. **ఈ శుభవార్త కోసమే ఆమె పది నెలలుగా కాచుకొని ఉన్నది.**

(స.సా.ఫి.97పు.57)

శుభాశుభములు

(చూ॥ భార్య)

శుభేచ్ఛభూమిక

జీవికి మొదట పునాది ఒకటి కలదు. దానినే శుభేచ్ఛ భూమిక అందురు. అట్టివారెట్లుందురనిన బ్రహ్మతత్వ వేత్తలయొక్క సన్నివేశము, వారిద్వారా తెలిసికొన వలెననియెడి అభిలాష. మోక్షము పొందవలెననియెడి అభిలాష. ఆధ్యాత్మిక గ్రంథపఠనము. ఇంద్రియ భోగవిరక్తి మొదలగు గుణములతో నుందురు. పైచెప్పిన చతుర్విధాభిలాషలు గల సాధకుడు శ్రుతులను విని సద్గురువుల పాదపద్మములందు తత్వమసి మొదలగు మహావాక్యములను మననమొనర్చుకొనుచు ఏకాగ్రతచే చింతించును.

శుభ్రత

ఇదియే విచారణభూమికయను మెట్టు. పైచెప్పిన రెండు విధములైన సాధనలచే మనసు క్షణములో బ్రహ్మ చింతనయందు లగ్నము కాగలదు.

మనస్సు వాటిని త్రాడువలె ఉపయోగించి పై మెట్టునెక్క ప్రయత్నించును. అందువలన బ్రహ్మాకారవృత్తి జనించు చున్నది. ఇదే తనుమనుతే అనియెడి మూడవమెట్టు.

పైన చెప్పిన మూడుమార్గములు సాధనలచే సకల కోరికలు క్రమముగా నశించుచున్నవి. తత్త్వజ్ఞానము వృద్ధి పొందుచున్నది. ఇందు మనసు పూర్తిగా పవిత్రతచెంది సత్యముతో నింపబడుచున్నది. కావున నెమ్మదిగా మనస్సు బ్రహ్మాకారవృత్తి యందు లీనమగును. అసంసక్తియందు బాహ్య విషయములతో కానీ వాటి సంస్కారములతో కానీ సాధన కెట్టి సంబంధమూ ఉండదు.

(జ్ఞా.వా.పు.19/20)

శుభ్రత

విద్యార్థులు ముఖ్యముగా నేర్చుకొనవలసినది మరొకటి, అదే శుభ్రత. ఇది రెండురకములు, ఒకటి బాహ్యశుభ్రత, రెండవది అంతః శుభ్రత. వీటిలో యే ఒకటిలోపించినా ఆ వ్యక్తి యెందుకూ పనికిరాడు. శరీరము పై ధరించు వస్త్రములు, చదువుకొను పుస్తకములు, మరి పరిసర ప్రాంతములు, ఇవన్నియూ బాహ్యశుభ్రత అనబడును. అనగా లోకరీతిగా మననిత్యజీవితమునకు సంబంధించిన ప్రతివస్తువును శుభ్రముగా పెట్టుకోవాలి. పండ్లు, కండ్లు మొదలుకొని తిండ్లు బండ్లు వరకూ శుభ్రతను పాటించాలి. దీనివలన ఆరోగ్యము యేర్పడును. శరీరమును నిత్యమూతోమి స్నానమాచరించుకున్న దేహములో మురికి యేర్పడి దురదలు ప్రారంభము కావచ్చును, కొన్నిపుండ్లు బయలుదేరవచ్చును. ఇవి అంటువ్యాధులుగా మారవచ్చును. మన స్థితి హీనముగా వుండవచ్చును. ఒకటి, రెండు డ్రస్సులు మాత్రమే మనకు ప్రాప్తించియుండవచ్చును. వాటినైనా శుభ్రంగా పెట్టుకొనవలెను. మురికి చేరకుండా చూచుకోవలెను. అటులనే మనము నిత్యమూ చదివే పుస్తకాలుకూడా యెక్కడంటే అక్కడ పారవేయరాదు. దానిలో అనవసరమైన గీతలు గీయరాదు. వ్రాతలు వ్రాయరాదు. కాగితమునుకూడా పరిశుభ్రపరచు కొనవలెను. వాటిశుభ్రత పదిమందీ మెచ్చుకొను రీతిగా వుండాలి. దుర్గంధమును చేర్చుకోరాదు. సర్వుల ప్రేమకు పాత్రులుకావలెను. తాను నివసించు పరిసరములను వూడ్చి తనగదిని తాను శుభ్రంగా పెట్టుకొనవలెను. గదియందు అసభ్యమైన చిత్రములను వ్రేలాడదీయరాదు. ఆదర్శము, ఉత్తమభావములను అందించే చిత్రములనే తనగదిలో వేసుకొనవలెను.

ఎంత సంపదవున్నప్పటికినీ, ఆరోగ్యము గనుక సరిగా లేకోపోయినచో జీవితమున సుఖముండదు, సంపదను తనివితీరా అనుభవించలేడు. తింటే ఆయాసం, తినకపోతే నీరసం. అంతకన్నా సుఖమే మాత్రమూవుండదు. కనుక బాహ్యశుభ్రత జీవితమును ఆనందముగా అనుభవింప జేయును.

ఇక అంతఃశుభ్రత అనగా లోపలనున్న మనస్సును, బుద్ధిని కూడా ప్రశాంతంగా, పవిత్రంగా వుంచుకోవలెను. భావములు అపవిత్రము, ఆశాంతి సంబంధమైనవే అయిన తాను శాంతిని అనుభవించలేడు. సౌఖ్యమును అందుకోలేడు. మనసు మలినమైతే భావాలు మలినమే అగును. మనసు కలుషితము కాకుండా చేసుకొనుటకు యెదుటివారి పరిస్థితులను, ప్రవర్తనలను చక్కగా వివేకంగా విచారించి సక్రమమైన మార్గాన్ని నిర్ణయించు కొనవలసియుండును. తొందరపాటుకానీ, అనుకరణకానీ మంచిదికాదు. విజ్ఞతతో, విచారణతో మనహృదయ నిర్ణయాన్ని మనము చూడాలికానీ, యేదో యెదుటివాడు అందంగా తలచుచున్నాడుకదా అని మనముకూడా దానిని అనుసరించరాదు. **అనుకరణ నీచమైనది. బలహీనమైనది. అజ్ఞానముతో కూడినది. అవిద్యా ప్రభావమైనది. అదిగొట్టె లక్షణము.**

(వి.వా.పు.73/75)

దేహముతో మంచి కర్మలను చేసినప్పుడే మంచి ఫలితం మన మనస్సులో ప్రవేశిస్తుంది. కనుక, మనం కర్మలను

శుభ్రము

దేహమును ఒక పనిముట్టుగా విశ్వసించి మనము ధరించిన వస్త్రముగా స్వీకరించి యీ వస్త్రములో చేరిన మాలిన్యమును అప్పుడప్పుడు పరిశుద్ధము గావించుకోవటానికి తగిన కృషి చేయాలి.

వస్త్రము శుభ్రము చేయాలంటే చాకలికే వేయాలి. నీ హృదయము పరిశుద్ధము కావాలంటే భగవంతునికే అప్పచెప్పాలి. మరొకరు శుభ్రము చేయలేరు. ఈ దేహము సత్కర్మల చేత సార్థకమవుతుంది. ఇది ధరించిన వస్త్రము వంటిదే. దేహము ఒక ఉపాధి. దేహమే నీవు కాదు. నేను కాని దేహమును నేనుగా భావించుటమే అజ్ఞానము. ఈ అజ్ఞానమును నిర్మూలము గావించు కున్నప్పుడే నీవు జ్ఞాన బాస్కరుడుగా ప్రకాశిస్తావు.

(బృ.త్ర.పు.24/25)

శూర్పణఖ

(చూ॥ కామము-క్రోధము)

శృంగారము

గ్రామమునకు ఇండ్లే శృంగారము. సముద్రమునకు అలలే శృంగారము. ఆకాశమునకు చంద్రుడే శృంగారము, స్త్రీకి గుణమే శృంగారము, భక్తులకు నొసట విభూతే శృంగారము. కనుక మానవునకు గుణమే శృంగారము. ఆ గుణ శృంగారమును ఈనాడు విసర్జించి బాహ్య శృంగారము కోసం భ్రమించిపోతున్నాం.

(శ్రీ.వా.ఆ.2000 పు.10)

మానవులకు మానవత్వమే శృంగారము. మానవ సమాజములో ప్రధానముగా ఉండవలసినది మానవత్వము. ఎన్ని విద్యలు నేర్చిన, ఎంతటివైజ్ఞానికుడైన, ఎంతటి పదువులనేవి నా మానవత్వాన్ని అభివృద్ధి గావించుకోవాలి. మానవత్వమును ఎంతెంత అభివృద్ధి గావించుకుందెమో సమాజము, రాజ్యము, దేశము అంతంత అభివృద్ధి

ఆచరించడం అంతగొప్ప తనముకాదు. మనము **శరీర శుభ్రత కోసం స్నానము చేయాలి. అయితే కేవలం శరీరాన్ని మాత్రమే కాదు. మనస్సును కూడా శుభ్రం చేయాలి.** కాని శరీరాన్నే శుభ్రం చేసుకోలేని వారు, ఇంక మనస్సును ఏరీతిగా శుభ్రం చేసుకోగలరు?

ఒక సోమరిపోతు సన్యాసికి ఆకలయింది. అతడు ఒక ఇంటికి వెళ్ళి ఆ ఇల్లాలును "అమ్మా! నాకు ఆకలిగా ఉంది అన్నం పెట్టండి'' అని అడిగాడు. ఆ ఇల్లాలు మహా వేదాంతి. భారతీయ సంస్కృతిని చక్కగా గుర్తించిన స్త్రీ "నాయనా! అతిథులను, అభ్యాగతులను ఆదరించడం మగృహస్థుల ధర్మం. అయితే మీరు వేళకాని వేళలో మా ఇంటికి వచ్చారు. అయినా తక్షణమే వంట ప్రయత్నము చేస్తాను. ఇక్కడ ప్రక్కనే ఒక నది ఉన్నది. మీరు పోయి స్నానం చేసి రండి. అంత లోపన నేను అన్నము తయారు చేసి ఉంచుతాను'', అన్నది. వీడు దొంగ వేదాంతి స్నానము చేయడానికి ఇష్టము లేక "అమ్మా! మా బోటి సన్నాసులకు **'గోవిందేతి సదా స్నానం, గోవిందనామమే సదాస్నానము"** అని చెప్పాడు. ఆ ఇల్లాలు మంచి తెలివితేటలు కలిగినది. వీడెవడో దొంగ సన్యాసిలా, సోమరిపోతులా ఉన్నాడు. ఇతడు కర్మ సిద్ధాంతమును సరిగా గుర్తించినవాడు కాదని గ్రహించి, అతనికి బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో - "నాయనా! **గోవిందేతి సదా భోజనం, కనుక, వెళ్ళిరా!"** అని చెప్పింది. **'గోవిందేతి సదాస్నానం' అయినప్పుడు గోవిందేతి సదా భోజనం'** ఎందుకు కాకూడదు? చూసారా! ఇలాంటి వారు నేడు అధికమైపోతున్నారు. కర్మల నాచరించాలంటే వారిలో తమోగుణము అధికమై పోతున్నది. వారికి అవసరమైన వాటినే సత్యంగా భావిస్తారు కాని, ఏవి నిత్యమైనవో వాటిని అవసరంగా మార్చుకోరు. నేటి కర్మకాండము ఈవిధంగా చాలా అపవిత్రమవుతూ వచ్చింది. కనుక, **కర్మలు ఆచరించినా ఆచరించక పోయినా, ముందు మనస్సును శుద్ధిగావించుకో. దీని నిమిత్తమై దైవచింతన అత్యవసరము.**

(శ్రీ.భ.ఉ.పు.149/150)

శోకము

ఔతుంది. మానవత్వమే కోల్పోయిన సమాజము యొక్క గౌరవము పోతుంది. సమాజముపై ఆధారపడినదేశము తన గౌరవాన్ని కోల్పోతుంది.

(బృ.త్ర.పు. 169/170)

శోకము

శోకమనగా అశాంతి.

(సా.పు.377)

(చూ॥ ఆత్మజ్ఞానము, ఆత్మవిద్య, సాంఖ్యయోగము)

శోధనము

గాయత్రీ జపమును త్యజించువారు అర్థమును తెలియని వారగుదురు. దీనినే మనువుకూడా నొక్కి చెప్పెను. ముఖ్యముగా బ్రాహ్మణునికి గాయత్రి యే జీవనమని కూడా తెలిపెనుకదా? సత్యమే. మానవ పురుషుని బుద్ధులను ప్రేరేపింపజేయు దివ్యతేజస్సును ధ్యానము చేయుట కంటెను పవిత్రమైన దేది యున్నది. మనలను పాపకృత్యముల జోలికి పోకుండా కాపాడునట్టి ప్రార్థనకంటే గొప్ప సుగుణము వేరేమున్నది.? పురుషునకు సద్గుణ పోషణకంటె గొప్పరక్షణ లేదు. బ్రాహ్మణుడు గాయత్రీ మంత్రసారమైన బ్రాహ్మణత్వమును కోలుపోడని వేదాధ్యయనమునకు శక్తిచాలని వాడైనను చివరకు గాయత్రినైనను విడువ రాదని, మనువు పదే పదే నొక్కి చెప్పెను. కదా? అందుకనే **గాయత్రికంటె గొప్ప శోధనము లేదని "గాయత్ర్యాస్తు పరం నాస్తి శోధనం" అని స్మృతి కూడనూ చెప్పెను.**

(ధ.పు.55/56)

శౌచము

శౌచము అనగా శుద్ధిచేయుట. బాహ్య శౌచమే కాక అంతర్ శౌచము ప్రధానమయినది. అదియే అంతఃకరణ శౌచము. రాగద్వేషములు కానీ కామక్రోధాలు కానీ లేక సాత్త్వికమైన దైవీ గుణములు విరాజిల్లినపుడు అట్టిదానిని అంతశ్శౌచం అని చెప్పవచ్చును. **దేహమును జలము వలననూ, మనస్సును సత్యము వలననూ జీవాత్మను విద్యాతపస్సుల వలననూ, బుద్ధిని జ్ఞానమువలననూ శుద్ధి చేసుకొనవలయును.**

(గీ.పు. 208/209)

ప్రాచీన కాలమందు ఋషులు శౌచము నాచరించి నిత్యము స్నానమును చక్కగా చేసేవారు! దీనిని ఈనాటి విద్యావంతులు ఆనాగరికమని హేళన గావించుచున్నారు. ప్రాచీనులు తమనెవ్వరైనా ముట్టినప్పుడు యేదైనా తాకినప్పుడు, స్నానమాచరించి దేహ నైర్మల్యమును మనశ్శాంతిని సంపాదించేవారు! **"మడి" అనే కర్మ** కాని వేరు కాదు. వీరిని ఆధునికులు హేళన చేయు సమయమున, శౌచవాదులు ఎదిరించి, సమర్థించుటకు దుదదృష్ట వశమున అసమర్థులై పోవుచున్నారు. **వారు కూడ కేవలము బాహ్యమునందు మాత్రమే 'మడి' ని ఆచరించుచున్నారే కాని, దాని ఉద్దేశమేమిటి, ఫలిత మేమిటి, సక్రమముగా దానిని పాలించు విధానమేమిటి అని నిర్ణయించుటకు వారు అసమర్థులు!** అయితే, పూర్వీకుల ఆచారములందు అంతరార్థము లేకపోలేదు' పురుషాయుస్సు ఎంత కాలమో అంత కాలము జీవించి, తమ ఆశలు ఆశయములు అన్నింటినీ పూర్తి గావించుకొనుటకు వీలుండవలెననునదే వారి వాంఛ! ఆహార విహారములలో చక్కని మార్గము ననుసరించితే, **ఆయుస్సు వృద్ధియగును,** శాంతి సంతోషములు చేకూరును, అని వారు నిశ్చయించుకొనిరి. పరాధీనములో పడక, ఆయుష్కాలమంతా సుఖ సంతోష సంతృప్తులతో గడిపి, అనాయాసముగా మరణమును పొందుటకు ఋషులు యుక్తాహార విహారములను, విధించిరి. ఆహార పదార్థములందున్న స్థూలభాగము మలముగా విసర్జింప బడును; వాటి యొక్క సూక్ష్మభాగము మాంసము కండరములు రక్తము మొదలగు పదార్థములుగా మారును. సూక్ష్మాతి సూక్ష్మమైన కారణ భాగము మనస్సును

తీర్చిదిద్ది, భావములలోని మంచి చెడ్డలను నిర్ణయించును. దీనివలననే, **ఆహారము వలన ఆరోగ్యము, ఆరోగ్యము వలన ఆధ్యాత్మికాభిరుచి, అభిరుచివలన సాధన, సాధనవలన సంకల్పము, సంకల్పము వలన ఫలసిద్ధి లభించునని ఘోషించిరి.**

(స.సా.డి.74పు 299/300)

శ్రద్ధ

అసూయరహితుడేకాక శ్రద్ధావంతుడు కూడనూ కావలెను. శ్రద్ధ లేక యే చిన్న కార్యమును కూడనూ మానవులు సాధించలేరు. మానవులే కాదు; క్రిమికీటకాదులు, పశుపక్షి మృగాదులు కూడనూ కార్యములు సాధించలేవు. **శ్రద్ధలేక, కర్మ చేసిన దాని ఫలము నైనను అందుకొన లేరు.** ఒకవేళ ఫలముకూడనూ లభించిన అది శుద్ధముగా నైనను వుండియుండదు. శ్రద్ధ ఇంతటి మహత్తరమైనది. అదిలేనిది శుద్ధ ఫలమును యెట్టివాడునూ పొందలేడు.

(గీ.పు.161)

శ్రద్ధ అనగా, శాస్త్రములయందూ, గురువులయందూ, జ్ఞానార్జనయందూ, ఇంతియేకాదు వీటన్నింటికినీ మించినది **నీకై నీకు శ్రద్ధ ప్రధానంగా వుండవలెను.** శ్రద్ధలేక యెట్టి చిన్న కార్యమును కూడనూ సాధింపలేడు మానవుడు. ఇక ఇట్టి పవిత్రమైన జీవనాధారమైన జ్ఞానమునకు శ్రద్ధయెంత ప్రధానమో యోచించు. ఈ శ్రద్ధఅనునది సామాన్యమైనది కాదు; శమ, దమ, ఉపరతి, తితీక్ష, సమాధానమను పవిత్ర పదార్థములను భద్రపరచునట్టి ఇనుప పెట్టె వంటిది శ్రద్ధ.

(గీ.పు.95)

ఆస్థా అనగా ఆసక్తి స్వాస్థా అనగా స్థిరత్వము, ఆసక్తి స్థిరత్వము లేని మేధ నిరుపయోగము కదా. చాలమంది మేధావంతులు ఉండవచ్చును. శ్రద్ధలేక పోతేవారు మేధాశక్తితో యేమి సాధించగలరు? శ్రద్ధ స్థిరత్వము రెండూ ఉండినప్పుడే ఆసక్తి బలపడుతుంది. ఆసక్తి స్థిరత్వము రెండూ కూడినట్టిదే బుద్ధి. కనుక మానవుడు తెలివి తేటలపైననే ఆధారపడి, తెలివితేటలనే నమ్ముకొని జీవించటము వెట్టితనము. దీనికి పైన ఆసక్తిని పెంచుకోవాలి. ఆసక్తి స్థిరత్వంగా రూపొందించుకోవాలి. అప్పుడే మానవుడు ఎట్టిఘనకార్యమునైననూ సులభముగా సాధించగలడు. కనుకనే వేదాంతము **"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అన్నది**

(బ్ర.త్ర.పు.96)

శ్రద్ధవాన్ లభతే జ్ఞానం
తత్పర స్సంయతేంద్రియః!
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిం
అచిరేణాధిగచ్ఛతి
అజ్ఞశ్చా శ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి!
నాయం లోకోనస్తి నపరో న సుఖం సంశయాత్మః

శ్రద్ధ గలవానికే జ్ఞానము లభించును. ఇంద్రియములను స్వాధీనము చేసుకొని, ఆసక్తితో జ్ఞానమును పొందినవాడు మోక్షమును, శాంతిని పొందును. అట్లుగాక, ఆత్మ జ్ఞానము లేక గురువాక్యములు నమ్మక, సంశయించు చిత్తము గలవాడు నశించును. సంశయాత్మునకు ఈ లోకమున గాని, పరలోకమున గాని సుఖశాంతులుండవు.

శ్రద్ధ యనగా శాస్త్రములయందు, శాస్త్రవాక్యములయందు, ఆత్మయందు, గురువుల యందు అచంచలమైన విశ్వాసము, నమ్మకము ఉండవలెను. **నమ్మకమే శ్రద్ధలక్షణము.** గురువులు పూజనీయులు; శ్రేయోమార్గమును జూపువారు. శాస్త్రములు లోకక్షేమమును, ప్రజాశ్రేయస్సును గోరునవి, చూపించునవి. కనుక అట్టి పవిత్రమైన వాటిపై నమ్మకము, శ్రద్ధ ఉండవలెను. అట్టి వానికే జ్ఞానము లభించును.

(శ్రీ.భ.ఉ.పు.20)

ప్రాచీనార్యుల యొక్క ప్రధానమగు అనుష్ఠానము, ధర్మము. అదియే యజ్ఞము. వారియొక్క యజ్ఞాద్యనుష్ఠానములు, అర్చనలు, వందనములు, నమస్కారములు మొదలగు భక్త్యంగములతో కూడియున్నవి. వేదసంహితలలో 'భక్తి' శబ్ద ప్రయోగము సుస్పష్టముగా కనబడక పోయిననూ ఆ అర్థములో "శ్రద్ధ"

శ్రవణము

అను శబ్ద ప్రయోగము తరుచుగా కనబడుచుండును కదా!

శ్రద్ధయాగ్నిః సమిధ్యతే శ్రద్ధ యా హూ యతేహవిః।
శ్రద్ధా భగస్యమూర్ధిని వచసా వేదయామసి॥
శ్రద్ధ ద్వారా మాత్రమే యజ్ఞాగ్ని ప్రజ్వలితమగుచున్నది. శ్రద్ధ వలననే హవిర్భాగముల ఆహుతులందబడుచున్నవి. సమస్తమగు ఆరాధనలకూ ప్రధానాంగమైన శ్రద్ధను మేము స్తుతించుచున్నాము అని పై శ్లోకార్థము. చూడుడు! శ్రద్ధ యెంత పవిత్రశక్తి కలిగినదో యోచించుడు

(ధ.వా. పు. 84)

(చూ॥ అథాతో బ్రహ్మ జిజ్ఞాస, బుద్ధి, భవానీశంకర, లీలలు, శ్రేష్ఠుడు)

శ్రవణము

పవిత్ర ప్రదేశమున, దేవాలయములందో, లేక మందిరములందో, పూజా గృహములందో లేక మహనీయుల ఆశ్రమములందో, సాధుసజ్జనుల సంఘములందో, యేదియును లేక, విశాలమైన ప్రదేశములందో, యేకాంత స్థానములందో, కృష్ణకథా లోలురై కీర్తనలు చేసిన, ఆనందమున మునిగి అన్నియూ మరతురు. అటులకానిదేని భగవత్ కథాలోలురగు మహాపురుషుల సమీపమున నుండి వారిని శ్రద్ధాభక్తి పూర్వముగ సేవా సత్కారములచే ప్రసన్నుల గావించి అట్టివారితోగూడి భగవత్ కథాశ్రవణము చేయవలెను.

ఇట్టి అభిరుచి కలుగుట జన్మాంతర పుణ్యఫలము, అట్టిఫలము లేనివారికి పవిత్ర పరమాత్మ కథల శ్రవణప్రాప్తి లభించదు, ప్రారంభమున జిజ్ఞాసునకు పవిత్ర కథల యందు మనసు లగ్నము కాకపోయినప్పటికినీ సాధు సంఘముల మధ్యకూర్చొని శ్రవణమయిననూ చేసిన చాలును. మెల్లమెల్లగా కథమీద రుచిపెరిగివిషయమును తెలిసికొనుటకు మొదలిడును; విషయ విచారణపై మనసు తిరుగును.

పఠన కంటెను కథాశ్రవణము అధిక రుచిని కలిగించును. లేక శ్రవణ పఠనలు కూడనూ చేయవచ్చును. శ్రవణముపై రుచి గలవారు వంటరిగా నినుటకంటె కొంతమంది జిజ్ఞాసువులతో చేరి వినుట మంచిది. సామాన్య జిజ్ఞాసువులతో చేరి వినుటకంటె మహనీయుల జతచేరి వినుట మరింత మంచిది. మహనీయుల జతయందుండి వినుట కంటెను, మహనీయుల నోటినుండియే వినుట మరింత ఫలము. ఎందుకన **మహనీయులు అనుభవ స్వరూపులై ఆనంద భాష్పములతో వికసిత ముఖమున వివరించుచుండగ శ్రోతలు కూడను మరింత రసహితమై పరవశమంద గలరు,** ఎట్లన దుఃఖముతో కొందరు కుమిలి కుమిలి యేడ్చుచుండ, అట్టివారలను చూచువారల కన్నులు యందునూ నీరుకారును. నవ్వుచున్న పిల్లలను చూచిన చూచు వారలకు కూడనూ నవ్వు వచ్చును. అటులనే, **రసపూరితమైన హృదయముగల మహనీయుల వచనములు శ్రోతల హృదయములను కూడనూ రస భరితము చేయును.** మహనీయుల చెంతచేరి స్వయముగా వారు చెప్పు భగవత్ కథలను శ్రవణము చేయుటచే కలుగు లాభము ఇంతా అంతాయని తెలుప సాధ్యము కాదు.

అట్టి పవిత్రమైన శ్రవణముచే కలుషపూరితమైన హృదయములు కాంతి రూపమై స్వచ్ఛ ప్రకాశమును పొందును. విషయవాసన లనబడు దుర్వాసనలకు విశ్వేశ్వర కథాశ్రవణము దివ్యసువాసన. ఎట్లన, కథాశ్రవణము కర్ణముల ద్వారా మనసున చేరి హృదయమును శుద్ధము చేయును.

అట్టి **శుద్ధమయిన హృదయమే భగవంతునకు యోగ్యమయిన స్థానము; పీఠము. అట్టి హృదయ కుహరమున భగవంతుడెపుడు నివాసము చేయునో, నివాసమేర్పరచుకొనునో, అపుడు అంతకు పూర్వము ఆ హృదయమున స్థానమేర్పరచుకొని వుండిన అరిషడ్వర్గములనబడు కామక్రోధ మోహాదులు నెత్తిన బట్టవేసుకొని కాలికి బుద్ధిచెప్పి కదలిపోదురు.**

(భా.వా. పు.5/7)

(చూ॥ ఆనందము, నరక చతుర్థశి, భగవంతుని దృష్టి, భృగువల్లి)

శ్రాద్ధము

(చూ॥ పిండదానము)

శ్రీ

(చూ॥ ఆరుగుణములు)

శ్రీధరుడు

(చూ॥ ప్రకృతి)

శ్రీమంతులు

శ్రీమంతుల భవనముల ముందు ఒక పెద్ద కుక్కను ఉంచుతారు. ఆ కుక్క సామాన్యమైన కుక్కకాదు. ఎవరైనా భవనములోకి ప్రవేశించుటకు సమీపించిన పెద్దగ గర్జిస్తుంది. కొంతమంది ఆ కుక్క గర్జనలకు భయపడి వెనుకకు వెళ్లిపోతారు. కొందరు ఎట్టైనా ఆ యింటి యజమానిని కలవాలి అన్న తపనతో, విశ్వాసముతో వచ్చి దూరముగ నిలబడి యజమానిని గట్టిగా పిలుస్తారు. అప్పుడు యజమాని ఆ కంఠము తన మిత్రునిదని గుర్తించి క్రిందకు దిగి గేటువద్దకు వచ్చి అతనిని లోపలికి తీసుకుపోతాడు. **ఆ కుక్క తన యజమానితో వెళ్తున్న వ్యక్తిని ఏమి చేయదు. అటులనే మోక్ష సాధమునకు ముందు మాయ అనే కుక్క వుంటుంది. మాయకు భయపడక భతవంతుని ఎలుగెత్తి పిలుస్తాడు భక్తుడు "నీవు రా నేనిక్కడే వున్నాను. నన్ను లోపలికి తీసుకువెళ్లు. నీవు తప్ప నాకింకెవ్వరు వద్దు" అని శరణాగత భావముతో ఆర్తితో పిలవాలి. అట్టి వానిని భగవంతుడే స్వయంగా చేయిపట్టి తీసుకుపోతాడు.**

(భ.ప్ర.పు.39)

శ్రీమన్నారాయణుడు

(చూ॥ భక్తుడు)

శ్రీరామచంద్రుడు/శ్రీరాముడు

శ్రీరాముడు మానవులకు అత్యంత సన్నిహితుడు,ఏ దేశంవారైనా, ఏ జాతివారైనా, ఏ వయస్సువారైనా రామతత్త్వమనే సత్యత్వాన్ని నిత్యత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించాలి. శ్రీరాముడు ఆదర్శపుత్రుడు, ప్రతీ కుటుంబంలోను ఆదర్శ పుత్రుడు అత్యవసరం, పట్టాభిషేకము జరుగబోతున్న సమయంలో - తండ్రి ఆజ్ఞను శిరసావహించి రాజ్య భోగములను త్యాగం చేసి అడవులలో ప్రవేశించాడు. **పితృవాక్య పరిపాలనలో రాముడు అత్యంత ఆదర్శప్రాయుడు.** ఇంక రాముడు **ఆదర్శసోదరుడు.** తన సోదరులను ప్రాణ సమానంగా ప్రేమించి తన ప్రేమను వారందరికీ సమంగా పంచి పెట్టాడు. ప్రతీ కుటుంబము నందు సోదరుల మధ్య ఉండవలసిన అన్యోన్యతకు ఆదర్శాన్ని నిరూపించాడు. **శ్రీరాముడు ఆదర్శ పతి, వాల్మీకి, శ్రీరాముని గుణ గణము లందు ఏక పత్ని, ఏక బాణము, ఏక వాక్కు ప్రధాన మైనవిగా వర్ణించాడు.** దేహములోనున్న అన్ని అంగములనూ పోషించేది, రక్షించేది గుండె ఒక్కటే! అదేవిధంగా, **పతికి పతి ఒక్కతే! పతికి పతి ఒక్కడే!** ఇట్టి ఏకత్వాన్ని లోకానికి గుర్పింప జేసే నిమిత్తమై లోకరీతిగా తన ఆదర్శాన్ని అందిస్తూ వచ్చాడు.

ఇంక శ్రీరాముని మించిన ఆదర్శ మిత్రుడు మరొకడు లేడు. ఈనాడు నీ జేబులో డబ్బు అధికంగా ఉన్నప్పుడు, నీవు మంచి అధికార హోదా కల్గియున్నప్పుడు అందరూ "హలో..హలో.." అంటూ నీకు మిత్రులౌతుంటారు. కాని అధికారమును, ధనమును కోల్పోయిన తరువాత ఒక్క మిత్రుడు కూడా నీ సమీపానికి రాడు, కానీ, రాముడు అటువంటి మిత్రుడు కాడు. కష్టములందైనా, సుఖములందైనా తన మిత్రుని సమంగా ఆదరించి ఆప్యాయంగా ప్రేమించిన వాడు, **గుహుడు చాలా బీదవాడు. అతడు పడవ నడిపేవాడు. అట్టివాని మిత్రత్వాన్ని రాముడు చక్కగా వర్ణిస్తూ - "నీవు నా నాల్గవ తమ్ముడవు" అని అన్నాడు.** ఈ విధంగానే, ఎవరు తనను ఆశ్రయించారో,

శ్రీరామరక్ష

ఎవరు తనను ప్రేమించారో, ఎవరు తనకు శరణా గతులైనారో వారందరినీ తన మిత్రులుగా అదరించి వారికి తగిన శక్తి సామర్థ్యములను చేకూర్చుతూ వచ్చాడు శ్రీరాముడు.

శ్రీరాముడు ఆదర్శ మిత్రుడే కాదు, ఆదర్శ శత్రువు కూడా! సాధారణంగా లోకంలో శత్రువులను వంచించి మోసగించి హింసించడానికి ప్రయత్నింస్తుంటారు. కాని, రాముడు అవిధమైన కుత్సత మార్గముల యందు ప్రవేశించక తన శత్రువు పట్ల కూడను ధర్మ మార్గమును అనుసరిస్తూ వచ్చాడు. రామ రావణ యుద్ధం జరుగు తుండగా - రాముని బాణముల తాకిడికి రావణుడు తాళ లేక పోయాడు. అతని అస్త్ర శస్త్రములన్నీ క్రింద పడిపోయాయి. **రావణుడు చాలా అలసి పోయాడని రాముడు గుర్తించాడు. ఇలాంటి సమయంలో శత్రువు నైనా చంపకూడదు. బలహీనుని, అలసిపోయిన వానిని చంపడం గొప్పతనం కాదు.** శత్రువు సరి సమానమైన శక్తి సామర్థ్యములతో ఉన్నప్పుడే అతనితో యుద్ధం చేయాలి. కనుకనే, రాముడు తన అస్త్ర శస్త్రములను కూడా క్రింద పెట్టి - "ఓ రావణా! నీవు చాలా అలసి పోయావు. కనుక, నీవు యుద్ధం చేయడానికి ఇది సరియైన సమయం కాదు. నీవు ఇంటికి **వెళ్ళి విశ్రాంతి తీసుకొని రేపటి దినమున తిరిగి యుద్ధానికి సంసిద్ధుడవై రా!" అన్నాడు.** సకల దేశీయులకూ, సర్వ మానవులకూ ఇది **ఆదర్శవంత మైన చరిత్ర.**

(స.సా.జూ.94 పు.150/151)

"రామ" అనేటటువంటి తత్వమునకు కొన్ని అర్థములు గుర్తించాలి. అసలు, **మానవజన్మమునకు మూలకారణ మేమిటి? చేసిన పాపము. అనుభవించిన తాపము, అజ్ఞానము. ఈమూడే కారణములు.** అదే **"ర,అ,మ"** ఈ మూడు చేరినప్పుడే **"రాము అయిపోతుంది. "ర అనగా అగ్ని బీజము, "అ" చంద్రబీజము "మ" సూర్యబీజము.** అగ్ని బీజము ఏమి చేస్తుంది? సమస్తము భస్మము చేస్తుంది. కనుక మానవుడు చేసిన పాపములను భస్మము చేసేటటువంటిది "ర" కారము. మానవుడు అనుభవించిన తాపమును చల్లార్చి శాంతినిచేకూర్చేటు వంటిది చంద్రబింబము. అదే "అ"కారము. సూర్యుడు అజ్ఞానమనే అంధకారాన్ని నిర్మూలనము గావించి ప్రకాశవంతమైనటు వంటి వెలుగును అందించేటటువంటి వాడు. **"రాము" అనే నామము మన పాపమును తాపమును అజ్ఞానమునుకూడ ఒక్కటూరి పరిహారము చేస్తుంది.** "రామ్"అనేటటువంటి పదము లోపల 'రా' అనగా మనోద్వారము తెరుస్తూ ఉంటుంది. ఈ "రా" అనే ద్వారము నుండి మనము చేసేటటువంటి పాపములు అన్ని బయట పడిపోతున్నాయి. అంతేకాదు బయట పోయినటువంటి ఈ పాపము తిరిగి లోపలికి ప్రవేశించకుండా "మ్" పాపమును పరిహారమును గావించి బయటకు తరిమే నిమిత్తమూ ప్రయత్నిస్తుంది. పోయిన పాపములు తిరిగి ప్రవేశించకుండా యుండే నిమిత్తమై ద్వారమును మూసివేస్తుంది. రామ నామమునకుండిన మాధుర్యము, రామనామమునకు ఉండిన పవిత్రత, రామనామమునకు ఉండిన దివ్యత్వము అర్థము చేసికొని గుర్తించాలి. కనుకనే **తెలిసి రామ చింతన చేయవేమనసా!"** అని త్యాగరాజు పల్కినాడు. **తెలిస్తే చాలసుఖము, తెలియక పోయినను రామనామము పాపములను పరిహారము చేస్తుంది.** కాబట్టి, రామ మాధుర్యాన్ని మనము ఆనందమైన హృదయంతో నిశ్చలమైన నిర్మలమైన నిస్వార్థమైన భావంతో దీని నారగించటానికి ప్రయత్నించాలి.

(స.సా.జూ.1989 పు.144/145)

(చూ॥ ధర్మరాజు, మంగళవారము, ప్రాయశ్చిత్తం, వాల్మీకి)

శ్రీరామరక్ష

(చూ॥ రక్ష)

శ్రీలక్ష్మి

(చూ॥ ముక్తి)

శ్రీశైలము

(చూ॥ అర్జునుడు)

శ్రీసత్యసాయి

(చూ॥ దివ్యప్రకటనలు)

శ్రీసత్యసాయి అంతర్జాతీయ కేంద్రము

ఆధ్యాత్మిక మనగా పూజలు చేయటం కాదు. ప్రేమను అభివృద్ధి పర్చుకోవాలి. మీకు ఇష్టముంటే పూజలు చేసుకోవచ్చు. తప్పులేదు. కానీ, లోపల పవిత్రమైన భావం లేకపోతే ప్రయోజనం లేదు. మీరు కావలసినంత సంపాదిస్తున్నారు. కానీ, సంపాదించిన దానిని సద్వినియోగం చేస్తున్నారా? పోనీ, జీతానికి తగినంత పనైనా చేస్తున్నారా? ప్రేమ స్వరూపులారా! ఈనాడు అవకాశం వచ్చింది కనుక, చెప్పక తప్పదు. ఈ దేశంలో ఎంతోమంది శ్రీమంతులు, మేధావులు, సైంటిస్టులు, న్యాయవేత్తలు ఉంటున్నారు. కానీ, అందరూ వారివారి కర్తవ్యాలను చక్కగా నిర్వర్తిస్తున్నారా? లేదు. అందుచేతనే, దేశం ఇన్ని దురవస్థలకు గురియైపోతున్నది. సంపాదించిన ధనాన్ని సద్వినియోగపరచాలి. ఎక్కడి నుండి సంపాదించారు? సమాజం నుండియే కదా. కనుక, దానిని సమాజంకోసమే వినియోగం చేయాలి. కుల్వంత్ రాయ్ కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఈ పవిత్రమైన భవనము **(శ్రీ సత్యసాయి అంతర్జాతీయ కేంద్రము)** ను కట్టాడు. ఈ దేశంలో అనేకమంది శ్రీమంతులుంటున్నారు. కానీ, ఎంతమంది ఈ విధమైన త్యాగానికి పూనుకుంటున్నారు? కొంతమంది కోట్ల కొలది ఖర్చుపెట్టి హాస్పిటల్స్ కట్టిస్తున్నారు, విద్యాలయాలను నిర్మిస్తున్నారు. కానీ, ఎందుకోసం? యాభై కోట్లు పెట్టి హాస్పిటల్ కట్టిస్తే నూరు కోట్ల ఆదాయం తీసుకుంటున్నారు. వచ్చే సమయంలో కాసైనా తీసికొని రాలేదు. పోయే సమయంలో నయా పైసైనా తీసికొనిపోరు. సమాజం కోసం ఖర్చు పెట్టకపోతే ఎన్ని మేడలు కట్టించినా, ఎంత బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నా ఏమి ప్రయోజనం? **సమాజ సేవలోనే ఉంది భగవదనుగ్రహం. బీదలకు సహాయం చేయండి.** ఢిల్లీలో ఎంతోమంది బీదలు అనారోగ్యంతో బాధ పడుతున్నారు. **వారికోసం ఉచిత వైద్య శాలలను కట్టించండి. బీద పిల్లలకోసం పాఠశాలలను నిర్మించండి. ఈ విధమైన త్యాగానికి మీ అంతట మీరే పూనుకోవాలి. ఇంకొకరితో చెప్పించుకోకూడదు. నా విషయం నేను చెపుతున్నాను. ఈ భవనమును కట్టమని నేను కుల్వంతరాయ్‌కి చెప్పలేదు.** అతని హృదయంలోనే ఈ సద్భావం ఆవిర్భవించింది. తనంతట తానే కట్టాడు. ఈ విధమైన సత్సంకల్పములు జన్మాంతర సుకృతం వలన కల్గుతుంటాయి. ఇలాంటివారిని చూసి అసూయ పడేవారు కూడా ఉంటారు. వారి కర్మ వారిది, వీరి అదృష్టం వీరిది. **ప్రతిమంచి పని భగవంతుని పనియే.** మా కుల్వంత్ రాయ్ ఈ భవనమును నిర్మించి సాయి సంస్థలకు ఎంతో ఉపకారం చేశాడు. **ప్రతి శ్రీమంతునికి ఈ విధమైన త్యాగభావం రావాలి. భారత దేశం బీద దేశం కాదు.** ఇది సిరిసంపదలతో తులతూగుతున్న లక్ష్మీస్వరూపం. ఇది బీదదేశమే అయితే పూర్వం ఇతర దేశములవారు ఎందుకు వచ్చి పడ్డారు దీనిపైన? **మనం బీదవారమని చెప్పుకోవడం దురదృష్టం. మితిమీరిన కోరికలు కలవాడే ఈ లోకంలో అందరికంటే బీదవాడు. తృప్తి గలవాడే అందరికంటే ధనవంతుడు. దేశాభిమానమును పెంచుకోండి. దేశంకోసం దేహాన్ని కూడా త్యాగం చేయండి.**

(స.సా. జూన్ 99 పు. 158)

శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్

"ఈ శుభ దినాన ఈ విద్యాసంస్థ పవిత్రమైన త్రివేణీ సంగమముగా మారిపోయింది. అందులో అనంతపురం కాలేజి గంగానది, బృందావనం కాలేజి యమునా నది, ప్రశాంతి నిలయములోని కాలేజి సరస్వతీ నదివంటివి. మొట్టమొదటిదిగా పుష్పమైన అనంతపురం కళాశాల అవతరించింది. తరువాత, ఫలమైన బృందావనం కళాశాల రూపుదిద్దుకుంది. ఆ ఫలము నేడు పక్వమై, మధురమై

శ్రీసత్యసాయి ఉన్నత విద్యా సంస్థ

ప్రశాంతి నిలయంలో అవతరించింది. తత్ఫలితంగా ఆ మధురరసమును నింపుకున్న డిగ్రీలు ఈనాడు ప్రసాదింపబడుతాయి".

"ఈ విశ్వవిద్యాలయములో కేవలము పుస్తకశాస్త్రమును బోధించడమే కాదు, దీనికి జీవిత పుస్తకాన్ని కూడా అతికిస్తున్నాము; దీనిలో ఆర్థిక శాస్త్రమును బోధించడమే కాదు, ఆస్తిక శాస్త్రమును కూడా బోధిస్తాము; దీనిలో రసాయనిక శాస్త్రమును మాత్రమే కాదు, 'రసో వై సః' అనే ఆత్మ రసమును కూడా అందిస్తాము; పదార్థ శాస్త్రమును కూడా దీనిలో ప్రవేశపెడుతున్నాము. భౌతికమునకు - ఆధ్యాత్మికమునకు, పదార్థమునకు - పదార్థమునకు ఏవిధమైన ఎడబాటూ లేకుండా ఏకీభావమును, అవినాభావ సంబంధమును ఈ విశ్వ విద్యాలయంలో బోధించుటకు పూనుకుంటున్నాము. ఇదే ఈ విశ్వ విద్యాలయం యొక్క ప్రత్యేకత. ఏవో కొన్ని కోర్సులను ప్రవేశపెట్టి, వాటిలో విద్యార్థులకు డిగ్రీలు ఇచ్చి వారినిబయటి ప్రపంచంలోనికి ఉద్యోగాలు వెతుక్కోడానికి పంపించే ఇతర విశ్వ విద్యాలయముల వంటిది కాదిది. **విద్యార్థులు తమ కాళ్ళపై తాము నిలబడి, తమ శక్తియుక్తులపై తాము ఆధారపడి, తమ జీవన విధానమును తామే తీర్చిదిద్దుకొనడానికి అవసరమైన ధైర్యమును, విశ్వాసమును, విజ్ఞానమును ఈ విశ్వ విద్యాలయం అందిస్తుంది.** అందువలన, **ఈ విశ్వ విద్యాలయములో నైతిక, భౌతిక, ఆధి భౌతిక విద్యా బోధనలో ఆధ్యాత్మిక విద్యను మేళవించి బోధించాలని నిర్ణయించాము. ఈ విశ్వ విద్యాలయంలోని బోధనా భాష క్రమశిక్షణ; తరువాత బోధింపబడే మూడు భాషలు వరుసగా ప్రేమ, సేవ మరియు సాధన".**

(స.సా.న99 పు. 335)

చిన్నతనంలోనే ఆధ్యాత్మిక సాధనలో ప్రవేశించినందుకు తమ బిడ్డలను దండించే హిరణ్యకశిపులవంటి తల్లిదండ్రులు నేడు ఉన్నారు. అంతేకాదు. వారిలో కొందరు తమ పిల్లల దుష్ప్రవర్తనను గమనించనట్లు, వారు సత్ప్రవర్తనే కలిగియున్నారని ఇతరులను భ్రమింప జేయడానికి కూడా ప్రయత్నిస్తారు. తమ పిల్లలను మంచి మార్గంలో పెట్టడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయరు. తల్లిదండ్రుల యొక్క ఇటువంటి స్వభావమువలన విద్యార్థులు దుర్మార్గంలో ప్రవేశించి **భ్రష్ట కుమారుల వలె చెడిపోతారు. ఇందుకు విద్యార్థులను నిందించవలసిన పని లేదు. వారి దుష్ప్రవర్తనకు తల్లిదండ్రులే బాధ్యులు.** ఆ దుష్ప్రవర్తనే విద్యాసంస్థలలో క్రమశిక్షణా రాహిత్యమునకు కారణభూతమవుతుంది.

(స.సా.న.99పు.338)

శ్రీసత్యసాయి ఉన్నత విద్యా సంస్థ(Sri Sathya Sai Institute of Higher Learning)

"మానవ జాతి యొక్క మనుగడకు ప్రధానలక్ష్యము ఆత్మానందమును పొందుట, మానవులందరూ కలసిమెలసి ప్రేమతో జీవించుట. ఈ విద్యా సంస్థలో బోధించే ఉన్నత విద్య ఇదియే. ఈ విశ్వ విద్యాలయములో చదువుకునే విద్యార్థులకు ఆత్మస్థైర్యమును, ఆత్మ విశ్వాసమును పెంపొందించి తమ కాళ్ళపై తాము నిలబడి స్వశక్తితో తమ జీవితాలను చక్కదిద్దుకో గలిగే జ్ఞానము, నైపుణ్యములను అందించడం జరుగుతుంది. **ఇక్కడ ఆధ్యాత్మిక విద్యను నైతిక, భౌతిక, ఆధిభౌతిక విద్యలతో మేళవించి సమగ్రమైన ఒక విద్యావిధానమును విద్యార్థులకు అందించడానికి ఏర్పాటు చేశాము."**

(ధై.ది.పు. 373)

శ్రీ సత్యసాయి ప్రబోధము

సత్య ధర్మము శాంతి ప్రేమలతో
నీ నిత్యజీవనయాత్ర సాగించు - జీవా॥
యత్నప్రయత్నముల్ మానవధర్మము
జయాపజయముల్ దైవాధీనము ॥సత్య॥

భక్తితోడ భగవంతుని దలచుచు
నిత్యధర్మములు నిర్వర్తించిన

అట్టి జనకునకు రాజయోగమున
అందరాని మోక్షంబుపొందెనే ॥సత్య॥

అష్టసిద్ధుల సాధ నెందులకు? (భక్తులకు)
అది వట్టి భ్రమలతో కట్టివేయునుగా
దట్టమైన యీ జీవితాటవిలో
వట్టి నామమే పట్టపగలౌ ॥సత్య॥

హృదయభూమిని సాగు చేయండి
మీ మనసు మడుకగ, గుణములే ఎద్దుల్
వివేక మను చలకోలను దీసి
విశాలమగు మీహృదయము దున్నుడు ॥సత్య॥

మానవధైర్యము మంచి ఎరువుగా
ప్రేమధారలే పంటవిత్తులుగ
భక్తే వర్షము భావమె కలుపులు
బ్రహ్మానందె పండెడుపంట ॥సత్య॥

ప్రకృతిధర్మము పట్టు విడకండి
కర్మయోగమే జన్మధర్మంబు
స్మరణే మానవ జన్మరహస్యము
సాధనే భక్తుల సారలక్షణము ॥సత్య॥

కష్టసుఖములు కర్మ లనకండి
మన యిష్టలోపమే కష్టమౌనండి
పట్టువిడక ఆ పాదము గొలచిన
గట్టుజేర్చుట తన పట్టేను ॥సత్య॥

మొదటి పట్టును విడువబోకండీ
ఆది పట్టులోనే భక్తి పట్టండీ
ఎన్ని బాధలను పొందిన భగవ
చ్చింతన మాత్రము విడకండీ ॥సత్య॥

ఎదను విడడు యెడబాయలేడు
మిమ్మేలుచుండు యేవేళ భక్తుల
కరుణయె అతడు - అతడె కరుణని
కరుణకై కాచి పొందండీ ॥సత్య॥

సాయి సాయి సాయి రామా యని
మీరు రయమున పాడగ రారండీ
ప్రేమమీర ఓ సాయిరామ యని
పిలిచి తరింతురు లేవండీ

కుక్కతోకయగు మానవ మనసును
చక్కగ బరచును రారండీ
ఒక్క మనసుతో నమ్మి సాయిని
చక్కగ స్మరణము చేయండీ

పుట్టుట గిట్టుట రెండే జన్మకు
గట్టివనుచు మది తలచండీ
వట్టి భ్రమలతో మునిగి కర్మలు
యెట్టివిచేయక మెలగండీ

కలియుట బాయుట కాలవాహిని
కాంక్షలు విడిచి చూడండీ
కర్మయోగమే జన్మకు ముఖ్యము
ధర్మము నడిచి మెలగండీ

నామస్మరణమే ముఖ్యవిద్యయని
నియమముతో సేవించండీ
తక్కినవన్ని పుళక్కివిద్యలని
పక్కకు నెట్టుట చూడండీ

తన తలపెల్ల ఫలింపకున్న యిక
దైవము వలదని యనకండీ
దయకు ప్రాప్తుడై మెలగిన
తలపుల-ఫలమున కొరతేముందండీ

కూటికి పేదయు కోటీశ్వరుడును
కాటికి యేగుట సమమండీ
కోతిగుణంబులు మాని యీ పరం
జ్యోతిరూపమును చూడండీ

పామఱత్వమే ప్రకృతి అంద మను
పాటను మీరక మానండీ
పరులబాధలు తమయట్టివి యని
సమముగ మదిలో తలచండీ

మానవధర్మము మాధవయాజ్ఞని
మర్మమెఱిగి భజయించండీ
సర్వజనప్రియ సాయీశుండని
సారెకు మదిలో వేడండీ

లోకముకై దిగులొందక మీరు
లోకేశుని సేవించండీ
వర్ణాశ్రమధర్మంబులు వదలక
ఓపికతో సాధించండీ

మనసుకు లోనై మరుమాటాడక
మాధవస్మరణము చేయండీ
మర్మమెఱింగిన మరునిమిసంబులో
మనసే వారికి గురుడండీ

భక్తి-జ్ఞాన-వైరాగ్యము లన
"మాకు శక్తి చాలద"ని యనకండీ
నామస్మరణలో కూడినవి
నయ-భయ-విశ్వాసము లేనండీ

చీకటి వెలుగులు కష్టసుఖంబులు
చేసినకర్మకు ఫలమండీ
బాగుగ నమ్మక వోగువ యేర్చే
పామఱత్వమును వదలండీ

జాతి-నీతి-మత శాస్త్రములాదిగ
దైవలీల లని తలచండీ
యెట్టిబాధలను పెట్టిన మరువక
సాయిరామయని తలచండీ

నరుడవైనందకు 'పరమాత్మా' యని
తలచిన, నరుడని యెంచండీ
భగవన్నామము వలదనె నరుని
నరపశువని భావించండీ

రామకృష్ణ గోవిందా హరి
నారాయణ శివ యని తలచండీ
అన్ని నామములు పరమాత్మవె యని
భేదమడచి భజియించండీ

సృష్టియంతయు భగవత్సంతతి
భక్తుల మని భావించండీ
భక్తులందరూ సోదరీ సోదర
ప్రేమభావములు పెంచండీ

ప్రేమే దైవము-దైవమె ప్రేమని
ప్రేమభావములు పెంచండీ
ప్రేమలలో నిష్కామప్రేమను
పట్టువిడువక సాధించండీ

సాయిరామ యని నామము తలచిన
సర్వబాధలూ తొలుగండీ
నియమముతో సేవించువారికి
నిశ్చలతత్త్వము కుదురండీ

పుణ్యకార్యములు చేయకున్ననూ
పాపములను తలపెట్టకండీ
పాపము లన్నింటికంటె మించినది
పరులను నిందించేదండీ

ఇట్టిగుణంబులు నేర్చినవారికి
ఇహపరసుఖములు కలుగండీ
సాయిరామ యని భజనలు చేసిన
ఇహపరసుఖములు కలుగండీ

సత్యము-ధర్మము-శాంతము-ప్రేమ
ఉత్తమ స్థితికి త్రోవండీ
కామ-క్రోధ-ద్వేషంబులను
చుట్టి చూరను పెట్టుట మేలండీ

బీదసాద లను భేదభావములు
సాయికి మదిలో లేవండీ
పర్తివాసుని పాదము వీడక
పదములతో మీరు పాడండీ

శివ శివ శివ శివ యనరాదా జీవా!
చింతలెల్ల బాపుకొని మనరాదా! (నీ)
శివసాయీశుని గనరాదా జీవా!
సువివేకంబును గొనరాదా జీవా!

శివమెత్తి జగమంత తిరిగేవు
ఓ చిత్తమా! నీకెంత సిగ్గులేదే
అవనిసుఖంబుల కల్లాలెడి
నీ కాలికి మిగిలే దది యేది? ॥శివ॥

ప్రొద్దుబోక యూరివారి సుద్దులన్న
మీరు సిద్ధమౌదురే కడుశ్రద్ధతోడ
ముద్దుముద్దుగాను సాయి ముచ్చటలు చెప్పునపు
డొద్దికగనుండరే చెవులారా। ॥శివ॥

పనిమాలి సినిమాలు పలుమాఱు
మీరు చనిచని కనినను తనివి లేదే
క్షణమును దైవసన్నిధిలో నిల్వగ
కనులారా! కడుకష్టమౌగా? ॥శి॥

అవినీతిరోతమాట లందరితో
నీ వనుటకు గౌరవమయ్యెనుగా
నవనీత చోరునినామము బల్కుట
నాల్కా! అవమానం బగునా? ॥శి॥

పనిలేని శునకంబువలె నీవు
పరుగిడి వగరించి తిరిగేవు
క్షణమును సత్సంగతిలో నిల్వగ
సాధ్యముగాదా చరణములా! ॥శివ॥

ఇచ్చవచ్చు చెడ్డపను లెల్ల సేయ
ఆ యీశ్వరుండు మిమ్ము సృజియించినాడా?
తెచ్చుకొని - చేతులారా! - తెల్వి యింకనైన మీరు
జెచ్చెరను హరిపూజ సేయరారే! ॥శివ॥

పాటలు పాడిన ఫలమేమి?
మంచిమాటలు నేర్చిన మహిమేమి?
సూటిగ పెద్దల బాటనె పోయిన
సుఖములమూటను దొరకునుగా ॥శివ॥

సులువుగ దొరికిన సుందరసాయిని
చులనకనజేయగ జూతువుగా!
పలుబొమ్మలకే పడిపడి మ్రొక్కిన
భయభక్తులతో బ్రతుకుదువా! ॥శివ॥

(భ.శ్రీ.స.సా.పూ.వి.పు.82/89)

శ్రీసత్యసాయి బాబా

(చూ॥ సనాతన సారథి)

శ్రీసత్యసాయి సేవా సంస్థలు

మన సంస్థలలో వున్న వారు మరి ఏ ఇతర ఆధ్యాత్మిక మత సంస్థలతో సంబంధం వుంచుకొనకూడదు, అయితే సేవ విషయంలో అందరినీ సేవించాల్సిందే, సహాయం

శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

చేయాల్సిందే. అక్కడ బేధాలు లేవు. కష్టాలతో వున్న, ప్రతి వ్యక్తి సేవకు అర్హుడే. అయితే మన సభ్యుడెవరూ కూడా ఇతర మత, ఆధ్యాత్మిక సంస్థలలో సభ్యులుగా వుండకూడదు.

(శ్రీ.స.పు.116)

(చూ॥ ధనం కోసం కాదు)

శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

"ఆధునాతనమైన, అత్యున్నతమైన ఈ వైద్యాలయం పట్టణంలో కాక పల్లెప్రాంతంలో ఎందుకు కట్టిస్తున్నారని మీరు అడుగవచ్చు. దానికి కారణం ఒక్కటే. ధనికులైన వారు ఎక్కడికైనా పోయి ఎంత డబ్బైనా ఖర్చు పెట్టి చికిత్స పొందగలరు. కాని, పేదవారెక్కడికి పోగలరు? వారి కొఱకే ఈ సంస్థ. ఇది కలకాలం ప్రజాసేవకంకితం కావాలి. పల్లె ప్రాంతాల్లో పలు వ్యాధులతో బాధ పడే వారికి సేవలందించాలి. అట్లని పట్టణ ప్రాంతీయులను ప్రక్కన పెట్టడం లేదు. పల్లె, పట్టణ అనే భేదం లేకుండా రోగులందరికీ తరతమభేదాలు లేకుండా ఉచితంగా వ్యాధి నివారణ చేయడమే మా ముఖ్యోద్దేశ్యము".

(స.సా.నం 99 పు.340)

"ఈనాడు విద్యా,వైద్య కేంద్రాలన్నీ వ్యాపార సంస్థలైనాయి. వాటిలో బీదలకు సేవ చేసే వాటిని వ్రేళ్ళపై లెక్క పెట్టవచ్చు. అందుకొరకు వంద కోట్లు రూపాయలు వెచ్చించి ఈ వైద్యాలయాన్ని నిర్మిస్తున్నాము. ఇక్కడ ఉన్నత విద్యేకాదు, ఉన్నత వైద్యం కూడా ఉచితమే. ఉన్నవాళ్ళు లక్షలు ఖర్చుచేసి అమెరికాలాంటి దేశాల్లో చికిత్స చేసికొంటే పేదవాళ్ళ గతేమిటి? వాళ్ళకు ఎవరు మందులిస్తారు? దీనిని దృష్టిలో పెట్టుకునే ఈ బృహత్ప్రథకాన్ని చేపట్టినాము. గుండె ఆపరేషన్‌గాని, మూత్ర పిండముల మార్పిడి గాని, ఏదైనా అంతా ఉచితంగానే చేయబడవలెనని నిర్ణయించాము. తదనుగుణంగా 1991 నవంబరు 22వ తేదీన ఈ వైద్యాలయం ప్రారంభింపబడుతుంది.".

(స.సా.న.99పు.340)

(చూ॥ సంగీత విశ్వవిద్యాలయము)

శ్రీసత్యసాయి సువాక్యములు

దైవ భావముతో శయ్యనుండి మేల్కొనుము.
సాత్వికాహారమును భుజింపుము; తామసికమగు మత్తు పదార్థములను మనస్సునందైనను తలంచుకుము.
జీవించుటకై భుజింపుము, భుజించుటకై జీవించకుము.
శాంతి ప్రేమలతో మిాలోని రక్తనాళముల నింపుము.
పరులయందు తప్పులు వెతకు పాడుబుద్ధికి చోటివ్వకు.
స్వశక్తిని మరచిన, అదియే మరణము.
ఆత్మ జ్ఞప్తియందుండుట, అదియే జీవనం.
ఎన్ని బాధలు కలిగినా, యెట్టినిందలు వచ్చినా, నీ విశ్వాసమును వీడవద్దు. అదే తపస్సు అదే దీక్ష, అదే రక్ష.
నీతియే నీజాతి, అదివదలితివో, నీవు కోతికంటే హీనము.
ఇంద్రియ నిగ్రహమునకు మించిన ఆనందము మరొకటి వుండదు.
మితభాష అతిహాయి; అతిభాష మతిహాని.
పరోపకారార్థమిదం శరీరం; వాటిని శక్తివంచన లేక నివారించుటకు పూనుకో.
నీవు దైవమును యెట్లు వెతకుదువో, దైవమూ నిన్ను అట్లు వెతుకుచుండును.
ఎల్లెడా దైవము కలడని విశ్వసించి,ఎందెందుచూచినా అందందే కనవచ్చును. "యద్‌భావం తద్‌భవతి"
సంయమముతో కూడిన అంతఃకరణముతో, యేమి ఇచ్చిననూ భగవంతు డంగీకరించును. (పత్రం, పుష్పం, ఫలం, జలం) విత్తనము భూమిలో పెట్టిన మొక్క వచ్చునుగాని, టిన్నులో పెట్టిన రాదు.
శాస్త్రజ్ఞానము వృద్ధికాకుండుటకు కారణం, ఆచరణలేని ప్రచారమే. కాన ఆచరణ అత్యవసరము; అనుభవము అంత్యం. పూజాపీఠమువద్ద వెలగవలసిన దీపము నిశ్చలబుద్ధి. ఇంద్రియములనే గవాక్షులద్వారా విషయ వాసనలను గాలిని రానీయక చూచుకొనవలెను.
సువాసనతో కూడిన మనోబుద్ధులనెడి పుష్పములే భగవంతున కత్యంత ప్రీతికరం.
నే నెవడని విచారించుటే "త్వం" పదార్థ శోధన.

అన్నింటికీ కర్తయెవరని విచారించుటే "తత్" పదార్థశోధన. జీవబ్రహ్మల యేకత్వమును ప్రతిపాదించునదే "అసి" పదార్థనిర్ణయము.

"భావ" అనగా దీప్తి (ప్రకాశము), రతుడనగా రమించువాడు. బ్రహ్మవిద్యా ప్రకాశములో రమించేవాడే భారతీయుడు. పరులు నీకు చేసిన అపకారమును మరిచిపొమ్ము. నీవు పరులకు చేసిన ఉపకారమునకు తత్ఫలం ఆశించకుము. అదే నిష్కామ కర్మ.

ఏది జరిగినా జరుగకున్నా, చావు జరగకతప్పదు. చచ్చువాడు పిడికెడు మట్టి అయినా వెంట తీసికొనిపోడు. పాముకు పాలు త్రాగించుకొలదీ, విషము పెరిగినటుల విషయములకు వాసన చేర్చుకొలది, దేహమే నేనను అభిమానము పెరుగును.

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అన్నట్లు శ్రద్ధ గల వారికి జ్ఞానము, శ్రద్ధలేనివారు దైవమువద్ద నుండిననూ లోకసుద్దులకే కాకులయ్యెదరు.

సంశయాత్మా వినశ్యతి" సంశయము గలవాడు యెన్ని జన్మ లెత్తిననూ సత్యమును గాంచలేడు. సంశయము మహా దయ్యము, నిస్సంశయము సత్యస్థానమునకు మార్గము.

హిరణ్యకశిపు, రావణ, కంస, దుర్యోధనాదులు గర్వముచే యేమి సాధించిరో అదే ఫలమే గర్వదేవతకు లభ్యము. సముద్ర మున్నంతవరకూ అలలు తప్పునవి కావు. అటులనే ప్రపంచమను భ్రాంతి యుండినంతవరకూ, సుఖదుఃఖములు తప్పవు.

ఈగ అన్నింటిపైనా వ్రాలును. అగ్నిపై మాత్రము వ్రాలదు. వ్రాలిన జీవించదు. అటులనే మనసు అన్నింటినీ చింతించును. ఆత్మను మాత్రము చింతించదు. ఆత్మను చింతించెనా లోకచింత వుండదు.

"పనికి పరార్, తిండికి తయార్" అయిన శిష్యుడు, విత్తాపహరి గురువూ వుండిన రాతి తెప్పనెక్కి నదిని దాటుటకు ప్రయత్నించి నట్లుండును.

మానవుడు ధన, కనక, వస్తు వాహనాది, డంభ, అహంకార అభిమానములకు దాసుడగుటకన్నా, భగవంతునికి దాసుడగుట మహాభాగ్యము.

నవ్వేవాడు నారాయణుడు; యేడ్చేవాడే నరుడు.

నేడు బోధగురువు లరుదు. కనుక గురువులకై వెతుకక, తండ్రీ తల్లీ, గురువూ, దైవము, ఒక్క పరమాత్ముడేనని విశ్వసించి దైవారాధనలోనే ఆనందమును అనుభవించు.

"సాలోక్యము" రాజ్యములోని ప్రజలవంటిది.

"సామీప్యము" రాజు చెంతనుండు నౌకరువంటిది.

"సారూప్యము" రాజుగారి తమ్మునివంటిది.

"సాయుజ్యము" రాజుగారి జేష్ఠపుత్రునివంటిది.

"సోహం" జ్ఞానం; "దాసోహం" భక్తి.

ముముక్షులు మూడువిధములు. 1. మానవృత్తి 2. మృగవృత్తి 3. కూర్మవృత్తి.

జలములో తప్ప తీరమున జీవించలేదు మీనము. అనగా జనసమూహమును బంధు బలగమునూవిడిచి వారు దూరము వెళ్ళి సాధనలు సలుప ఇష్టముండదు.

భూమిపై తప్ప జలమున వాసము చేయులేనిది మృగము. అనగా జనసమూహమునందు యేమాత్రము సాధనలు సలుపలేరు. వారే యేకాంతము తప్ప అన్యమార్గముల సాధనను సలుప అంగీకరింపరు.

జలమందును, భూమియందును. సమానముగ జీవించునది కూర్మము. అనగా సంసారసంబంధమైన జనస్తోమమునందును యేకాంతమునందును సమాన మనస్సు కలిగి అచంచలమైన ధ్యానమును ఆచరించును. తెల్లవారగనే భోజనమునకు టిక్కెట్టు కొన్నవానికి ఆ సమయానికి వెళ్ళి హోటలులో భోజనమునకు ప్రయత్నించువానికీ యెంతభేదమో, చిన్న వయస్సునుండీ సాధనలు జరుపువానికీ అప్పటికప్పుడు జన్మరాహిత్యము నకు సాధన జరుపువానికినీ అంతేభేదము; అనగా ముందే టిక్కెట్టు కొన్న వానికి భోజనం నిశ్చయం. అప్పటికి అప్పటికి వెళ్ళినవానికి సంశయం.

కర్మ చెడ్డదయిననూ మంచిదయిననూ అనుభవించియే తీర వలెననుట మూర్ఖత్వము. సక్రమమైన సాధనలు

శ్రీసాయి

సలిపిన చెడ్డ పరిహారము, మంచి అభివృద్ధి చేసుకొనుటకు అవకాశముండును.
సోమరితనము చీడపురుగు వంటిది. అది మానవత్వమునే హతమార్చును. కడకు కొరగానిదై పోవును.
నీ క్షేమ సౌఖ్యసంతోషములను నీవు ఎట్లు అభివృద్ధి కోరుదువో అట్లే అందరి క్షేమ, సౌఖ్య, సంతోషములను కోరు.

(భ.శ్రీ.స.సా.పూ.వి.పు.92/107)

శ్రీసాయి

పది దినంబుల నుండి పస్తుండు వానికి
మంచి భోజనము లభించినట్లు
చెరువు బావుల నీళ్ళు కరవైన యపుడు
వరుసగా వర్షంబు కురిసినట్లు
సంతతి లేకను చింతిల్లు వానికి
పుణ్య సుపుత్రుండు పుట్టినట్లు;
కూటికి లేకను అల్లాడుచున్నట్టి
నిరుపేదకు భక్ష్యంబు దొరికినట్లు;
ధర్మనాశనమగుచున్న ధరణియందు
ప్రభవమొందెను శ్రీసాయి పర్తియందు;
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార!

(ఆ.రా.పు.428)

శ్రుతత్వాచ్చ

సర్వజ్ఞుడగు బ్రహ్మమే జగత్కారణమని శ్రుతియందు చెప్పబడి యుండుట వలనకూడా ఈ దివ్యరూప వర్ణన చేయబడినది. బ్రహ్మము సంకల్పాది గుణములను వాచ్చార్థముననే కలిగియున్నది. బ్రహ్మము నిర్విశేషమని వర్ణించు శ్రుతి వాక్యములను సమస్త కళ్యాణ గుణాత్మకముగా వర్ణించుచున్నవి. శ్రుతి వాక్యము విశ్వమునుండి చూచినచో బ్రహ్మము నిర్విశేషము. బ్రహ్మము ఆనందరూపమని కూడా శ్రుతి నిరూపించు చున్నది. ఆత్మస్వరూపమును గురించి, మొదటిది అన్నమయుడనియు, ప్రాణమయుడనియు, మనోమయు డనియు, విజ్ఞానమయుడనియు నిర్వచనము చేసి, అనంతరం ఆనందమయుడని, ఇవన్నియు బ్రహ్మము నందే ప్రయుక్తమగుట వలన ఆనందమయాత్మ బ్రహ్మమే యని తలంచవలసి వచ్చును. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయములన్నియు ఒక దానికంటే ఒకటి సూక్ష్మరూపమును ధరించి ఆనందమయరూపుడైన బ్రహ్మకు ఉపాధులుగా యేర్పడినవనియును తలంచ వచ్చును.
అన్నమయం - కోటు - అది స్థూలమైనది. దానికంటే సూక్షమై దానిని కాపాడుచున్నది ప్రాణమయం. దానిని విచారణాత్మకముగా భావించి ప్రాణము కంటే సూక్ష్మమయ మయినది మనోమయము. దేహేంద్రియా లను, వాటిని ఆచరణ యోగ్యంగా నడిపించు ప్రాణ శక్తిని స్తంభింపచేయుచున్నది మనోమయము. కనుక, అది ప్రాణము కంటే బలవత్తరమైనది. దానికంటే సూక్ష్మమైనది విజ్ఞానమయం. నిత్యానిత్యా విషయ పరిశీలనలో నిమగ్నమై ఆనందమయమునకు అతి సమీపమున నుండుటచేత ఆనందమే బ్రహ్మానుభూతిని నిరూపించుచుండును.
మనము దేహ రక్షణకై అనేక విధములైన దుస్తులు ధరింతుము. ముందు బనియన్, తరువాత షర్టు, ఆ తరువాత కోటు, దానిపై శాలువా, అయితే మనము మన హృదయాన్ని చూడవలెనన్న, మొదలు స్థూలమైన శాలువ తీసివేయవలెను. ఆ తరువాత కోటు విడిచి వేయవలెను. ఆ తరువాత షర్టు విప్పి వేయవలెను. ఆపై బనియన్ తీసివేసినపుడే మన హృదయాన్ని మనము చూడగలము. అటులనే అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయములను ఉపాధులను విసర్జించినపుడే ఆనందమయమైన ఆత్మ బ్రహ్మ స్వరూపముగా కనిపించును. అన్నమయము నుండి అనందమయుని

వరకు చేయు ప్రయాణమే జీవిత ప్రయాణము. **ఇదే మన గమ్యము. ఇదే జీవిత లక్ష్యము. అని ఈ సూత్రము నిరూపించుచున్నది.**

భగవంతుడైన బ్రహ్మ ఆనందమయుడుగా వుండుటచేతనే ఇతరులకు ఆనందము నిచ్చుచున్నాడు. తాను సకల జ్ఞాన సంపన్నుడు కావటం చేతనే సర్వులకు జ్ఞానోదయము కలిగించుచున్నాడు. భగవంతుడు ఆనంద ప్రచురుడు అని మరొక శాఖ ఆనందమయాధికరణమ్. 'ఆనంద మయోభ్యాసాత్' అను సూత్రము హెచ్చరించినది.

(సూ.వా.పు.44/48)

శ్రుతి

(చూ॥ అధర్వవేదము, పృశ్ని, వేదము, సంపర్కము)

శ్రుత్యము

పుత్రపౌత్రాది రూపమున నిరతిశయముగా వర్ధిల్లెడి ఐశ్వర్యమునను గ్రహింపుడు అని అర్థము. ధర్మము వేద స్వరూపమగుట చేతనే పరమేశ్వరునకు ధర్మః అని పేరు ప్రసిద్ధము. **"రామోవిగ్రహవాన్ ధర్మః" అని రామాయణము కీర్తించినది. "సర్వభూతానాం ధారణాత్ ధర్మః"** సర్వ భూతములను ధరించుటచేతను, ధర్మముచే ఆరాధింప బడుట చేతను పరమేశ్వరునకు **"ధర్మః" అని సార్థక నామము.**

"ధర్మోవిశ్వస్య జగతః ప్రతిష్టా" ఇలాంటి పవిత్రమైన ధర్మమును ఎవరికి తోచినట్లు వారు వాఖ్యానము చేసి వారి స్వార్థమునకు తగినట్లు అర్థములు తెలుపుచూ. ధర్మస్వరూపమును విరూపము చేయుచున్నారు. వేద, దేవ అనుపదములు, శబ్దములు రెండును పర్యాయపదములై వర్ధిల్లుటయు శ్రుతుల యందు స్పష్టముగా కనిపించు చున్నది. **"స్వయం సర్వం వేత్తీతి వేదః"** అని వేదశబ్దము నిర్వచింపబడినది. అనగా సర్వజ్ఞుడువేదస్వరూపుడైన బ్రహ్మ అని అర్థము.

(లీ.వా.పు.19)

శ్రేయస్సు

(చూ॥ ఆత్మజ్ఞానముయొక్క పరాకాష్ట, అక్షరం, నియమం)

శ్రేయోమార్గము

(చూ॥ ప్రేయో మార్గము)

శ్రేష్ఠుడు

"యోగాభ్యాసము చేయువాని చిత్తము గాలిలేని స్థానమున దీపము ఉండినట్లు నిశ్చలముగా ఉండవలెను. ఏయే సమయమున మనసు చలించునో అప్పటికప్పుడే దానిని నిశ్చలముగా పరుగెత్తనీయక అరికట్టుటకు ప్రయత్నించ వలెను. అన్నింటియందూ నేనే యున్నానను భావమును, సర్వభూతములూ నాయందే యున్నవను ఏకత్వమునూ, పొందువాడు అన్ని యోగములనూ సాధించును. అట్టివానికి పరులనియూ, పరమాత్మ అనియూ, భేదము లేకుండును. ఇతరుల సుఖదుఃఖములు తనవిగా భావించును ఇతర హృదయములను బాధింపజేయక సర్వులనూ సర్వేశ్వర భావమున ప్రేమించును. ఇట్టి భావము గలవాడు యోగులలో శ్రేష్ఠుడు".

(గీ.పు.98)

ఎవడు నాయందే **చిత్తముంచి శ్రద్ధతో నన్నే ధ్యానించుచుండునో వాడు అందరికంటే శ్రేష్ఠుడు, మహాయోగి. ఈ ధ్యానయోగము,** జ్ఞానయోగమునకు అంతరంగ సాధనము. ఇది శ్రద్ధాభక్తి పూర్వకమైనపుడే ఈ యోగమునకు విలువ కాని, లేకున్న కొయ్యబొమ్మ వంటిదగును. వీటికన్నింటికీ భగవంతునిపై ప్రేమ గాఢంగా వుండవలెను. అదే భక్తి. ఇటువంటి భక్తి స్థిరముగాగల్గుటకు భగవంతుని గుణగణములు స్వభావ స్వరూపములు, పరిచయమూ మొదలగు వాటిని తెలుసుకొనవలెను.

(గీ.పు.99)

షడ్‌చక్రములు

ప్రతి మానవుని యందు 'షడ్ చక్రములు' ఉంటున్నాయి. వీటిలో రెండు చక్రములు చాలా ప్రధానమైనటువంటివి. **1. హృదయ చక్రము 2. సహస్రార చక్రము.** ఈ హృదయ చక్రమునే **'హృదయ కమలము'** అన్నారు. సహస్రారచక్రమును **'సహస్ర కమలము'** అన్నారు. ఈ రెండు చక్రముల యొక్క తత్త్వమును చక్కగా గుర్తించుకున్నప్పుడు, భగవంతుడు వారికి వశుడవుతాడు. ఎనిమిది రేఖలతో కూడినటువంటిది ఈ 'షడ్‌చక్రము' ఒక్కొక్క రేఖకు ఒక ప్రత్యేకత ఉంటుంటుంది. సహస్రార చక్రముపైన ఒక్కొక్క దళముపైన ఒక్కొక్క దళమువాలి వుంటుంది. ఒక్కొక్క దళమునకు కూడనూ షోడశకళలతో నిండివుంటాడు భగవంతుడు. ఈ షోడశకళాపరి పూర్ణుడైనటువంటి భగవంతుడు ఒక్కొక్క రేఖపైన కూడా ఉంటుంటాడు. కనుక వేయి దళములను ఒక్కొక్క దానిని పదహారు దళములతో వెచ్చించినప్పుడు పదహారువేల గోపికలుగా మారిపోయినారు. వీరు భగవంతునికి అర్పితమై పోయినారు. అయితే వీరికి నాయకుడెవరు? భగవంతుడే. ఆ భగవంతుని ఆజ్ఞచేత ఈ దళములను తీసుకోవడానికి ఎవరికైనా అధికారం ఉంటుంది. అయితే భగవంతుని హక్కు అయినటువంటి ఈ దళములను, భగవంతుని ఆజ్ఞలేకుండా పుచ్చుకోవటం ఎవరికీ సాధ్యంకాదు.

ఒక చిన్న ఉదాహరణ. సీత భూజాత, ఈమె రాముని పత్ని. ఆమెపై రామునికి సర్వహక్కులూ వున్నాయి. కనకనే అతను సీతకు పతి అయినాడు. కనుక సీతాపతి రాముడు. పతి ఆజ్ఞను తీసుకోకుండా, ఆమెను రావణుడు దొంగిలించుకొని పోయినాడు. పతి ఆజ్ఞను తీసుకోకుండ, తీసుకొనిపోవటంచేత రావణుడు ఏమి అనుభవించాడు? అన్ని కష్టములకూ గురియైపోయినాడు. కడకు భార్య మండోదరి కూడా రావణునికి హితవు పల్కింది. 'రావణా! రామచంద్రుడు సాక్షాత్ నారాయణమూర్తి. ఈమె సీతామాత. ఈ పతివ్రతురాలు ఈమెను తీసుకొనిరావటం చాలా పొరపాటు. పొరపాటేకాదు తప్పు కూడాను. రాముని ఆజ్ఞలేకుండా ఈమెను ఎందుకు తీసుకొనివచ్చావు? కనుక ఇప్పుడైనా ఈమెను తీసుకొని

వెళ్ళి రామునికి వప్పజెప్పిరా!' అంటుంది. "వినాశకాలే విపరీత బుద్ధిః". అతను ఏ మాత్రం అంగీకరించలేదు. అదే విధముగా ఈ పదహారు వేలమంది గోపికలు కూడనూ, షోడశ కళలతో నిండినటువంటి పరమాత్ముని సొత్తులే. సహస్రార పద్మములన్ని కూడనూ, అష్టదళములతో కూడినటువంటి ఆకారములే. యోగులంతా ఈ అష్టదళములను ఆశ్రయించుకొని, సహస్రార పద్మములో ప్రవేశించి పరమానందమును అనుభవించారు. ఈ ఆనందము సహస్రార పద్మము నుండే వచ్చింది. కనుక ఈ విధమైనటువంటి దైవత్వాన్ని మనం పొందాలనుకున్నప్పుడు, దైవాజ్ఞను మనం పాటించినప్పుడే, సమానమైనటువంటి, పరిపూర్ణమైనటువంటి ఆనందం మనకు లభిస్తుంది.

అష్టదళములయందు అష్టరాణులను పెట్టాడు. సహస్రార దళములయందు పదహారువేల గోపికలు ఉన్నారు. అంతా చేరినప్పుడు, అది అంతా కృష్ణుని యొక్క హృదయ కమలమే. కమలములలో అనేక రేఖలుగా వుంటున్నాయి. రేఖలు వేరు కమలము వేరుకాదు. కనుక దైవత్వాన్ని మనం పొందాలనుకున్నప్పుడు, దైవహృదయంలో మనం రేఖలుగా తయారుకావాలి. ఆ రేఖలు ఏ రీతిగా ఉండాలి? కర్మఫల రహితమైనటువంటి యొక్క పరమశాంతమైనటువంటి రూపకంగా ఉండాలి. మీ ప్రేమను అంతనూ ఆ రేఖలలో ఇమడ్చాలి. ప్రేమను నింపుకోవాలి. ఆనందమును అనుభవించాలి.

(శ్రీ. సె. 2000 పు. 21, 22)

(చూ॥ అద్వైతదర్శనము, గమ్యస్థానము)

షడ్ దర్శనములు

భారతీయ వాఙ్మయము కేవలము అంధవిశ్వాసమని వాదించినవారలకు సహేతుకమైన సమాధానమిచ్చి సంతృప్తిపరచిన దివ్యదర్శనములే "షడ్ దర్శనములు". వేదములకు ఒకవిధమైన అర్థమును మాత్రమే కాక వివిధ విధములుగా అర్థములను బోధించి విశ్వాసానికి అందించిన దివ్యసూత్రములే షడ్దర్శనములు. వేదజ్ఞానమును విపులముగా వివరించి జగత్తునకు విజ్ఞానతత్వమును విజృంభింప చేసినవే యీ షడ్దర్శనములు. 'విశ్వాసము', 'అంతర్దర్శనము' 'వేదము' ఈ మూడు సూత్రములే యీ దర్శనకర్తలకు ప్రధానమైన సూత్రములుగా ఏర్పడినవి. భూతభవిష్యత్ వర్తమాన కాలములలో మారని సత్యాన్ని, విషయ తత్వాన్ని ప్రపంచమునకందించి మానవత్వంలో నున్న బలహీనతను, భయమును, సంశయమును, దుఃఖమును దూరము గావించినవి ఈ షడ్దర్శనములే. విశ్వమునకు యోగ క్షేమములను బోధించి, అందించి మానవత్వములో మాలిన్యము లేకుండా నిర్మలత్వమునందించిన దివ్య మాత్రములే ఈ షడ్దర్శనములు. వేదము, వేదాంతము, వేదజ్ఞులు సర్వులూ ఒక్కటేనని ఏకత్వమును ప్రబోధించి దివ్యతత్వమును ప్రకటింపజేసినవి ఈ షడ్దర్శనములే. అన్ని విధములైన ప్రబోధలకు ప్రచారములకు పవిత్రతకు వివేక విజ్ఞానములకు మూల కారణము మనస్సే. ఈ మానసిక తత్వాన్ని అర్థము చేసుకొనే నిమిత్తమై ఏకత్వములోని అనేకత్వమును విభజించి అనేకత్వము నుండి ఏకత్వానికి మనసుని గొనిపోయే రాజమార్గమే ఈ షడ్దర్శనములుగా రూపొందింది. ఈ దర్శనములే న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, పూర్వమీమాంస, ఉత్తర మీమాంసలు. వీటిలో మొదటిది న్యాయము. యీ మిగిలిన ఐదు దర్శనములకు యీ న్యాయమే ప్రాణము. మానవుని యొక్క సానుభూతిని సామరస్యాన్ని ఏకత్వాన్ని గుర్తించిన మానవునియందు మాత్రమే ఈ న్యాయము స్వేచ్ఛ, ఆనందములుగా లభ్యమవుతుంది. న్యాయతత్వమనేది కొన్ని ప్రమాణముల పైన ఆధారపడివుంది. విషయములను వివరించవలెనన్న, వస్తువులను ప్రకటించవలెనన్న కొన్ని ప్రమాణములు అత్యవసరములు. మానమనగా కొలత. ప్ర అనగా ముందు. దీనిని మనం విచారించవలెనన్న దీనికి ముందు ఒక విధమైన ప్రమాణం మనకు అవసరము. కొలత బద్దచేత - బట్టలు ఇత్యాది కొన్ని నియమితమైన

వస్తువులను కొలతవేయవచ్చును. పదార్థమునకు ఒక కొలత, విషయమునకు ఒక కొలత, విజ్ఞానమునకు ఒక కొలత, సుజ్ఞానమునకు ఒక కొలత, ప్రజ్ఞానమునకు ఒకకొలత, అజ్ఞానమునకు కూడా ఒక కొలత. ఇట్లా అన్నింటికీ ప్రమాణములు అత్యవసరము. ప్రమాణము లేక వస్తువుగాని విషయముగాని వ్యక్తిగాని మంచి చెడ్డలుగాని మనము నిర్ణయించలేము. ఈ అన్ని ప్రమాణములు మనసుపైనే ఆధారపడియుంటున్నాయి. ఈ ప్రమాణములు నాల్గు విధములుగా వుంటున్నాయి. ఒకటి ప్రత్యక్ష ప్రమాణము రెండవది అనుమాన ప్రమాణము, మూడవది ఉపమాన ప్రమాణము, నాల్గవది శబ్ద ప్రమాణము. ఈ నాల్గు ప్రమాణములచేత మానవునియందున్న సర్వ సంశయములను నివారణ గావించి మానవత్వపు విశిష్టతను గుర్తింపచేసి సత్యస్వరూపమును నిరూపణ గావించి మానవత్వపు విశిష్టతను గుర్తింపచేసి సత్యస్వరూపమును నిరూపణ గావించి మానవత్వమును సార్థకము గావిస్తూ వచ్చినదే ఈ న్యాయదర్శనము.

మొదటి ప్రమాణము ప్రత్యక్షము. ప్రత్యక్షమనగా ఏమిటి? కేవలము యింద్రియ గోచరమయినది ప్రత్యక్షమని భావిస్తున్నాము. కంటితో చూచినది ప్రత్యక్షము. చెవులతో విన్నది ప్రత్యక్షము. చేతితో చేసినది ప్రత్యక్షము. కానీ ఈ యింద్రియములు కొన్ని విధములైన వ్యాధులతో కూడటంచేత ఈ ప్రత్యక్షము సరియైన ప్రమాణముకాదు. కన్ను - కన్ను చూచినది. యిది నలుపు, తెలుపు, ఎరుపు అని నిర్ణయిస్తూ వచ్చింది. ఈ ప్రమాణము సత్యమని ఏరీతిగా చెప్పవచ్చును? ఈ యింద్రియములోపల మనసు ఆవరించి తన ఇష్టాయిష్టముల వలన నిర్ణయించటాన్కి పూనుకుంటుంది. అంతేగాక యీ ఇంద్రియము కొన్ని రోగములతో పీడింపబడుతూ ఉంటుంది. యీ కన్ను ఆరోగ్యముగా ఉన్నప్పుడు నలుపు నలుపుగా, తెలుపు తెలుపుగా ఎరుపు ఎరుపుగా పసుపు పసుపుగా కనిపిస్తుంది. మనలో జాండిస్ వ్యాధి బయలుదేరినప్పుడు కన్ను పసుపుపచ్చగా మారుతుంది. చూచినవన్నీ పచ్చగానే వుంటాయి. ఇది ఎట్లా ప్రత్యక్ష ప్రమాణమవుతుంది? రోగముతో కూడిన నేత్రముతో చూచినవన్నీ ప్రత్యక్ష మవుతాయా? కావు. కనుక బాహ్యేంద్రియములన్నీ మనఃప్రభావముతో కూడినవే. ఇంక నోటితో రుచి చూచినది ప్రత్యక్షం అంటారు. "నేను తిన్నాను రుచి చూచాను. ఇది సత్యం" అని వాదించవచ్చు. ఇది కూడా ప్రత్యక్షప్రమాణం కాదు. ఎట్లా? ప్రత్యక్ష ప్రమాణ మవుతుంది? నీకు ఆరోగ్యంగా ఉండినప్పుడు తీపి తీపిగా, కారము కారంగా చేదు చేదుగా ఉంటుంది. నీలో మలేరియా జ్వరము - ప్రవేశించిందంటే ఈ నాలుక తీపిని కూడా చేదుగా రూపొందింపజేస్తుంది. కాబట్టి యిది ప్రత్యక్షమని ఏవిధముగా వివరించగలవు? లడ్డు తీయగానే వున్నది. కాని నువ్వు చేదు అంటున్నావు. యీ సమయమునందు పదార్థమును కూడా ఒక ప్రమాణముగా తీసుకోవాలి. ఇంద్రియ ప్రమాణమే కాకుండా పదార్థ ప్రమాణంకూడా మనం విచారించాలి. ఇంద్రియము చేదు అని చెప్పినది పదార్థమును విచారిస్తే అది తీయగా వుంటున్నది కనుక ఈ ప్రమాణమునకు సరయిన ఆధారము లేదు. ఇక పాలను ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఈ పాలలో కొంచెం మజ్జిగ తోడంటు వేసినప్పుడు పెరుగుగా మారిపోతుంది. యిది ప్రత్యక్షమే. పాలు పెరుగుగా మారిపోయింది. పెరుగును మనం చిలికినప్పుడు వెన్నతేలుతుంది. వెన్నను మనం కాచినప్పుడు నెయ్యిగా మారుతుంది. ఈ నెయ్యి వెన్న మజ్జిగ పెరుగు-పాలలోనే వుంటున్నాయి. కాని వివిధ మార్పులచేత వివిధ కర్మలచేత వివిధ కాలములలో వేర్వేరుగా రూపొందుతూ వచ్చాయి. కాని యిది ప్రత్యక్షముకాదని చెప్పడాన్కి వీలులేదు. ఇది ప్రత్యక్షమే. పాలు పెరుగుగా మారింది. పెరుగు వెన్నగా మారింది. వెన్న నెయ్యిగా మారింది. యిది దేనిలోను తిరిగి చేరదు. మజ్జిగనుండి వచ్చిన వెన్నను ముద్ద చేసి తిరిగి మజ్జిగలోనే వేస్తే మజ్జిగలో కలువదు. పాలలో వేసినా కరగదు. ఇది

ప్రత్యేకంగా వుంటుంది. ఎక్కడనుంచి వచ్చింది యిది? మజ్జిగనుంచే వచ్చింది. తిరిగి దానిలో కలవటం లేదు. దీనినే న్యాయమీమాంసమని కూడ చెప్పవచ్చును. ఈ మీమాంసమనగా ఏ మాంసమూ కాదు. వస్తువు యొక్క చివరి నిష్కర్షయే మీమాంసము. నేయి కట్టకడపటి అంశము. నేయిని ఏమి చేయగలము? భుజించుటమే. దానికి మరొక అంత్యములేదు. పాల యొక్క అంత్యము నేయి. నేయి యొక్క అంత్యము భుజింటము. ఈ చివరి నిష్కర్షయే మీమాంసము. ఈ న్యాయములలో ప్రత్యక్ష ప్రమాణమును తీసుకోవటం కొంతవరకూ సాధ్యమవుతుంది. ఈ న్యాయ సూత్రములను గౌతముడు ప్రబోధిస్తూ వచ్చాడు. న్యాయశాస్త్రమునకు కర్త గౌతముడు. ఈ సూత్రములకు గౌతమ సూత్రములని కూడా మరొక పేరు. మహనీయులు అనేక తపస్సులు చేసి అనేక విధములైన విచారణలు సల్పి ప్రచారప్రబోధలు సల్పటానికి పరిశోధనలు సల్పి ప్రమాణములు కూడా విశ్వసించి ఈవిధమైన నిర్ణయమునకు వచ్చారు. ఆనాటి ప్రమాణ కర్తలకు పరిశోధకులకు, ఈనాటి ప్రమాణకర్తలకు ఏ పోలికా లేదు. ఆనాటి పరిశోధన ఎట్లుండినదంటే - మహర్షులందరూ మనసుని దాటి దాని తర్వాత ఉన్నతమైన మనసును - సూపర్‌మైండును దాటి హయ్యర్ మైండును, హయ్యర్ మైండునుండి ఇల్యూమినేటెడ్ మైండ్ దాటి ఓవర్‌మైండ్‌ను దాటి విశిష్టమైన దైవత్వాన్ని దర్శించగల్గారు. కాని ఈనాటి వైజ్ఞానికులు కేవలము లోయర్ మైండ్ నందు మాత్రమే ఉంటుండి, ఈ విశిష్టమైన దివ్యత్వాన్ని అర్థము చేసుకొనలేక "ఆనాటి ఋషులు కనిపెట్టలేని విషయాలను మేము కనిపెట్టాము" అని విర్రవీగుతున్నారు. ఆనాడు ఋషులు కనిపెట్టలేనివి ఈనాడు కనిపెట్టినవి లేవు. ఆనాటి ఋషులు - "ఇవన్ని వ్యర్థమైనవి-లోక్లాసుకు చెందినవి" అని వదలినవి ఈనాడు వైజ్ఞానికులు కనిపెట్టారు.

(శ్రీ.స.ది.పు.105/108)

మన ప్రమాణాలు ప్రత్యక్ష ప్రమాణాలని అనుకోవడం చాలా మూర్ఖత్వం. కనుక ప్రత్యక్ష ప్రమాణమనగా ఏమిటి? హృదయ ప్రమాణమే ప్రత్యక్ష ప్రమాణము. ఇదే సరయిన న్యాయము. కానీ ఈనాటి న్యాయము విరుద్ధమయిన రీతిగా జరుగుచున్నది. న్యాయమును అన్యాయంగా, అన్యాయమును న్యాయముగా మారుస్తున్నారు. ఒక వెయ్యి రూపాయలు ఎక్కువిస్తే అన్యాయం న్యాయమైపోతుంది, న్యాయం అన్యాయమైపోతుంది. ఇలాంటి న్యాయము న్యాయమైపోతుందా? ఇలాంటి న్యాయస్థానాలు న్యాయ స్థానాలవుతాయా? కానేకావు. నిత్యజీవనోపాధి నిమిత్తమై పొట్టకూటికై పాటుపడే న్యాయములు ఇవన్నీ. ఇట్టి న్యాయము కాదు ఆనాటి కాలములో. అది హృదయ న్యాయము.

తన పర అనే బేధము లేకుండా న్యాయము విచారించి సరైన మార్గములో అమలు పరిచేవారు.

అన్ని మతములూ ఇలాంటి మార్గమును అనుసరించాయి. "హజరత్ మహమ్మద్" ముస్లిం మతములోకూడా న్యాయముంటున్నది. మతములు వేరు కావచ్చు. న్యాయము అందరికీ ఒక్కటే. మానవత్వానికి విరుద్ధముగా ప్రవర్తించిన వారిని కఠినముగా శిక్షించేది ఆనాటి ముస్లిం మతం. అందరికీ సమమయిన పనిష్మెంట్ ఉండేది. దుష్ట దృష్టిచేత, మనసు, క్రియలచేత మానవుడు అనేక దోషాలు చేస్తుంటాడు. అలాంటివారికి నూరు కొరడా దెబ్బలు అని నిర్ణయించారు. ముస్లిం మతంలో. కానీ అలాంటి దోషాలు ఈ హజరత్ మహమ్మద్ కుమారుడే చేసాడు. అప్పుడు తన కుమారుడే అనే భేదము లేకుండా మహమ్మద్ తన కుమారుని నూరు కొరడా దెబ్బలు కొట్టండి అని అన్నాడు. ఇదే నిజమైన న్యాయం. తన పర భేదము లేకుండా అందరికీ సమమయిన శిక్ష. కానీ యాభై దెబ్బలు కొట్టేటప్పుటికే కుమారుడు ప్రాణం విడిచాడు. అతనిని సమాధి చేసారు. సిపాయిలు వచ్చి మహమ్మద్‌ని ప్రార్థించారు. "స్వామీ! యింక యాభై దెబ్బలు మిగిలి వుంటున్నాయి. ఏమి చెయ్యమంటారు?" ఆ సమాధిపైన కొట్టండి అన్నాడు హజరత్ మహ్మద్. చూసారా! ఎంత న్యాయమో, ఎంత ధర్మమో, ఎంత పవిత్రతో. ఈనాడు తన పర అనే భేదము ఉంచుకొని పరాయి

వాడయితే పది సంవత్సరములకు శిక్ష. తనవాడయితే కోర్టును పూర్తిగా ధిక్కరిస్తారు. ఇదే మనం పేపర్లలో చూస్తున్నది. యిట్టి కుయుక్తితో యిట్టి అల్పమయిన బుద్ధితో కూడినది న్యాయము కాదు. న్యాయము న్యాయమే. అలాంటిదానినే గౌతముడు ఆవిర్భవింప జేసాడు. ఇదే న్యాయదర్శనము. ఈ న్యాయదర్శనము లోపల మొట్టమొదటిది ప్రత్యక్ష ప్రమాణము.

రెండవది అనుమాన ప్రమాణము. కొంగలంతా ఎక్కడ బాగా తిరుగుతున్నాయో అక్కడ నీరువుంది అనే విశ్వాసము అనుమాన ప్రమాణము. కొంగలు సంచరించే ప్రదేశములో నీరు ఉంది. కొంగలను సాక్ష్యముగా తీసుకొని నీరున్నదని ప్రమాణము నిరూపిస్తున్నది. ఎక్కడెక్కడ పొగ వస్తుందో అక్కడక్కడ అగ్ని ఉంటుంది. అగ్ని కనిపించటంలేదు. కాని పొగను ఆధారంగా తీసుకొని అగ్ని ఉన్నదని విశ్వసిస్తున్నాడు. ఇక్కడెక్కడో సుగంధం వస్తున్నది. ఈ గంధాన్ని ఆధారం చేసుకొని యిక్కడేవో మల్లెపూలు ఉంటున్నాయని స్వరూపాన్ని నిరూపణ చేసుకుంటున్నాడు. స్వరూపం కనిపించకపోయినా స్వభావం విశ్వసించి ఈ విధమైన స్వరూపముండవచ్చును. అని తేల్చింది. అనుమాన ప్రమాణము. ఈ అనుమాన ప్రమాణము కూడనూ అవసరమే. ఈ దివ్యమైన ప్రకృతి యందు కేవలము ఇంద్రియములతో కూడిన దేహములతో, హృదయము కూడిన మనస్సుతో ఈ అన్ని ప్రమాణములు సరియైన ప్రమాణములుగానే తోస్తూ వుంటాయి. అనుమాన ప్రమాణమనగా విషయాన్ని ఆధారము చేసుకొని నిజస్వరూపాన్ని నిరూపణ చేయటమే. ఇక ఉపమాన ప్రమాణము. ఉపమాన ప్రమాణమనగా ఏమిటి? సముద్రము ఉంటున్నది. ఈ సముద్రములో అలలు బయలుదేరుతున్నాయి. అలలనుంచి నురుగు వచ్చింది. అలలయందు చూచినా నురుగునందు చూచినా సముద్రజలమే వుంటున్నది. ఈ మూడింటిని విచారణ చేసి ఉపమానములుగా తీసుకోవచ్చును. పారమార్థకము, ప్రాతిభాసికము వ్యావహారికము. వీటికి ప్రమాణము చెప్పమంటే అందు ప్రాతిభాసికమనగా కేవలము అల. వ్యావహారికమనగా నురుగు. పారమార్థికమనగా జలము. ఈ అన్నింటిలోనూ ఉండినది. ఒక్క జలమే అనే ఉపమానము తీసుకొని దీనిని ఏకత్వంగా భావించటము. పారమార్థికమైన సముద్ర జలమునుండి ప్రాతి భాసికమైన అలలు ఆవిర్భవిస్తున్నాయి. ఆవిర్భవించిన ప్రాతిభాసికమనే అలల యందే వ్యావహారికమనే నురుగు ఉంటున్నది. అర్థముకాని విషయమును అర్థమయ్యేరీతిగా నిరూపించటము ఉపమాన ప్రమాణము. కేసులు ఏవిధముగా నిర్ణయాలవుతున్నాయి? కేసులకు సాక్ష్యములే ఆధారము. కేసుకు సాక్షులు ఎంత ఆధారమో సత్యాన్ని గుర్తించటాన్కి ఉపమానాలు అంత అవసరము. కనుకనే నేను అమితంగా ఉపమానములు చెపుతూవుంటాను. ఈ ఉపమానాల చేతనే సత్యాన్ని మనం గుర్తించటానికి వీలవుతుంది. అక్కడ చూడు చందమామ ఉంటున్నది. ఈ కంటికి కనిపించని చందమామను అందని చందమామను ఏవిధముగా చూపటానికి వీలవుతుంది? అదిగో అక్కడ ఉందంటే ఎక్కడో చూస్తారు. అక్కడ చెట్టుపై ఉంటుందని చూడు. ఆ గుట్టపై ఉంటుందని చూడు. ఆ మెట్టపై ఉంటుందని చూడు. అని చెప్పినప్పుడు చక్కగా దృష్టి చందమామ పైకి ప్రవర్తిస్తుంది. అట్లే మనసుకు అందనిదానిని ఉపమానాముల చేత అర్థమయ్యేరీతిగా గుర్తించవచ్చును. దీనినే ఉపమాన ప్రమాణము అన్నారు.

ఇంక శబ్దప్రమాణము : ఈ శబ్దప్రమాణమును సత్యప్రమాణమని భావిస్తూ వచ్చారు. ఈ సత్య ప్రమాణమును ఆధారముగా చేసుకొనియే వేదములు, వేదాంగములు ఉపనిషత్తులు, భగవద్గీత ఇత్యాది మహా గ్రంథములు ఉపదేశిస్తున్నాయి. ఈ శబ్దప్రమాణముచేత ఏమవుతుంది? శబ్ద ప్రమాణము ఏరీతిగా సంభవిస్తుంది? ఇంద్రియముల తత్త్వాన్ని పూర్తిగా అణగద్రొక్కాలి. చూచిన కన్నులకు, విన్న చెవులకు, తెలిసిన మనసుకు విచారించే బుద్ధికి అతీతమైన స్థితికి పోవాలి. అందువల్లనే 'బుద్ధిగ్రాహ్య

మతీంద్రియం'అన్నారు. మనము ఈ ప్రత్యక్ష ప్రమాణమును వదలి అనుమాన ప్రమాణమును వదిలి ఉపమాన ప్రమాణమును వదలి శబ్దప్రమాణమునకు పోవటంలో చాలా జాగ్రత్తగా ఉంటుండాలి.

శబ్దబ్రహ్మమయి, చరాచరమయి జ్యోతిర్మయి వాఙ్మయి నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి అష్టైశ్వర్య స్వరూపముతో కూడినది యీ శబ్దము. ఎక్కడో దూరముగా వుండినవాడిని 'ఓ బాబూ' అని పిలిస్తే ఆ శబ్దము చేతనే వాడు తిరిగి వచ్చుచున్నాడు. అంతవరకూ మనము పోనక్కరలేదు. నిత్యమూ శబ్దము చేతనే హృదయానికి ఆనందము చేకూర్చటమో లేక హృదయానికి దుఃఖాన్ని చేకూర్చటమో జరుగుతూ ఉంటున్నది.

ఈ శబ్దములన్నింటిపైన ప్రమాణ శబ్దము భగవత్ సంకీర్తన. ఒకానొక సమయములో నారదుడు మహావిష్ణువును సందర్శించి 'స్వామీ! తన దర్శనార్థమై నేను తరచూ వస్తుంటాను'. సహజము. ఎందుకు ఇతనికి సహజ మయినది? యిల్లూ బిడ్డలూ లేరు. ఇష్టమొచ్చినప్పుడు వైకుంఠము. ఇష్టమొచ్చినప్పుడు కైలాసము సర్వత్రా సంచరిస్తూ ఉంటాడు. 'స్వామీ! నాకు అవసర మొచ్చినప్పుడు తమను దర్శించుకోవాలంటే ఎక్కడకు రావాలి? హెడ్ ఆఫీసు ఎక్కడ?' అప్పుడు చెప్పాడు. 'పిచ్చివాడా! 'మద్భక్తాః యత్రగాయన్తి తత్ర తిష్ఠామి, నారద' వ్రాసుకో నా అడ్రస్ - నా భక్తులు ఎక్కడ గానము చేస్తుంటారో నేనక్కడ ప్రతిష్ఠమయి ఉంటాను. వసావి అని చెప్పలేదు. తిష్ఠామి అన్నాడు.) భగవత్ నామమే శబ్దము. శబ్దమంటే బాంబుల శబ్దము, పటాకుల శబ్దము, ఆ శబ్దము, ఈ శబ్దమూ కాదు. భగవత్ నామమే ప్రధానమైన శబ్దము. ఈ లౌకిక శబ్దములకు మన యియర్ డ్రమ్స్ పగిలిపోతాయి. గానమనే శబ్దము మన హృదయాన్ని వికసింపజేస్తుంది. హృదయగ్రంథిని భేదింపజేస్తుంది. ఈ శబ్దప్రమాణమే వేద ప్రమాణము. ఈ వేదము శబ్దప్రమాణంతో కూడినది. మానవత్వములో న్యాయవిచారణకు నాల్గువిధములైన ప్రమాణములను బోధిస్తూ కడపటిదిగా శబ్దప్రమాణమును చెప్పింది. అన్ని ప్రమాణములందు న్యాయము సమానమైన అంతర్వాహినిగా ప్రవహిస్తూ వచ్చింది.

(శ్రీ.స.ది.పు.110/113)

షడ్ శక్తులు

దేహమునందు, అణుశక్తి నందుకొన్ని విధము లైన శక్తులు ఉంటున్నాయి. ఇది యే షడ్‌శక్తులు. 1. ఐశ్వర్యము 2. ధర్మము, 3. కీర్తి, 4.సంపద 5. జ్ఞానము. 6.వైరాగ్యము. షడైశ్వర్య స్వరూపుడు భగవంతుడు. కాబట్టి ప్రతిశక్తి యందునూ ప్రతి వ్యక్తి యందూ షడైశ్వర్యములు ఉంటున్నాయి. కనుక మనం దైవం కాదని ఎట్లా చెప్పగలము? మనముకూడా దైవమే. దేహ భ్రాంతి వస్తే దేహాన్ని మర్చిపోతావు. దేహమనే అభిమానము మనము పెంచుకున్నంతవరకూ దైవాభిమానము రాదు.

(శ్రీ.వా.ఏ.1995 పు.37)

షడ్భావ వికారములు

పుట్టుట, పుండుట, పెరుగుట. పరిణామము చెందుట, క్షీణించుట, నశించుట, ఈ ఆరింటిని షడ్భావవికారాలని అందురు.

(గీ.పు.32)

షడ్వికారములు

(చూ॥ ఆత్మజ్ఞానము, షడ్భావవికారములు)

షిరిడీ సాయి

ఆనాడు భారతదేశములో హిందువులు, మహమ్మదీయులు మత భేదాలతో సంకుచిత భావాలతో పరస్పరం ప్రాణాలు తీసుకుంటూ వచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో **సర్వమానవ ఏకత్వాన్ని సర్వమత సమన్వయాన్ని బోధించాలనే సంకల్పంతో దైవము ఒక ఆకారాన్ని ధరించవలసి వచ్చింది. నైజాము రాష్ట్రములోని ఔరంగాబాద్ జిల్లా యందు**

పవిత్రమైన గోదావరీ తీరమందు ఒక చిన్న కుగ్రామము. దానిపేరు పత్రి. ఈ గ్రామమందు ఉత్తమ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన దంపతులు నివసించేవారు. వీరు పెద్ద శ్రీమంతులుగానీ, దరిద్రులుగానీ కారు. మధ్య తరగతి కుటుంబీకులు. వీరికి ఏవిధమైన ప్రాపంచిక వాంఛలూ లేవు. కానీ ఒక్క కొఱత వారిని బాధిస్తూ ఉంది. వారికి తినుటకు, ఉండుటకు, గౌరవ మర్యాదలకు ఏమాత్రం తక్కువలేదు. తమకు బిడ్డలు లేరనే కొఱత వారిని ఎక్కువ బాధిస్తూ వచ్చింది. **భార్యపేరు దేవగిరమ్మ. భర్తపేరు గంగాభవారియా. వీరిద్దరు కూడా గౌరిశంకరుల పూజ సల్పుతూ, వచ్చిన అతిథి అభ్యాగతుల నాదరిస్తూ, వారి కాలమును కాయమును పవిత్రమైన సేవలో గడుపుతూ వచ్చారు. గంగాభవారియా వృత్తి ఏమంటే గోదావరిలో పడవలను నడిపించటం.** (టాక్సీలని పెడతారు చూడండి) పడవలను సంపాదించి, కొంతమంది మనుష్యులను పెట్టుకొని ఇటువైపు వారిని అటువైపునకు అటువైపు వారిని ఇటువైపునకు దాటించే వృత్తిలో తన కాలము గడుపుతూ వచ్చాడు. ఒకనాడు గొప్ప కుంభవృష్టి కురిసింది. ఆరోజు ఆషాఢశుద్ధ పౌర్ణమి. సాయం కాలమయ్యేటప్పటికి గోదావరి నీటి మట్టం పెరుగుతూ వచ్చింది. అప్పుడు భర్త భార్యతో 'నేను రాత్రి యింటికి రావటానికి వీలుకాదు. ఎందుకంటే గోదావరి పెరుగుతూ ఉన్నది. పడవలను రక్షించుకోవాలి' అని చెప్పి వెళ్లిపోయాడు.

ఈ మాటలు విని ఈమె తలపులు బిగించుకొని లోపల కూర్చొని పార్వతిని ప్రార్థిస్తున్నది. చీకటి కమ్ముతూ ఉండగా వర్షము పెరుగుతూ వచ్చింది. దీపము వెలిగించింది. పూజ చేసుకుంటూ, పాడుకుంటూ ఉంటున్నది. ఈ కుంభవృష్టిలో ఎవరో ప్రధాన ద్వారము తట్టారు. భర్త వచ్చాడేమోనని త్వరగా వెళ్లి తలుపు తీసింది. అక్కడొక వయోవృద్ధుడు. ఎనభై సంవత్సరములుండవచ్చు. ముఖమునందు దివ్యతేజస్సు 'అమ్మా! ఆకలి, ఆకలి' అని లోపలకు ప్రవేశించాడు. **ఈ దేవగిరమ్మకు మొదటినుండి అతిథి అభ్యాగతులను ఆదరించే స్వభావమే.** ఏవేళప్పుడు వచ్చినప్పటికీ తక్షణమే వండిపెట్టి వారిని తృప్తిపరచేది. ఇంకా అప్పటికి తాను భోజనము చేయలేదు. కనుక కావలసినంత ఆహార పదార్థాలు ఉన్నాయి. 'స్వామీ! దయచేయండ'ని పీటవేసి, విస్తరి వేసి భోజన పదార్థాలు వడ్డించింది. ఈ వృద్ధుడు బాగా భోజనం చేశాడు. 'అమ్మా బయట వర్షము కురుస్తున్నది. నేను ఎక్కడికీ పోలేను. నేను మహావృద్ధుడను. మీ ఇంటియందే ఈరోజు నిద్రిస్తాను' అన్నాడు. **'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ'** అన్నారు. వచ్చిన వారెవరైనా కానీ దైవంతో సమానముగా గౌరవించి, ఆదరించటం ప్రాచీన సాంప్రదాయం. కనుక అతనికి వరండాలో పడకవేసి అతనిని శయనించమని చెప్పి తాను లోపలికి వెళ్ళి తలుపు వేసుకుంది.

భర్త ఆ రాత్రి రాడని తనకు తెలుసు. కనుక తాను కొంచెము ఆహారము తీసుకుంది. దీపము ఆర్పి లోపల తలుపు వేసుకుంది. పడుకొంది. ఇంచుమించు రాత్రి పదిగంటలైంది. అప్పుడు తిరిగి ఈ వృద్ధుడు తలుపు తట్టాడు. అప్పుడు ఈమె తలచింది. 'వయోవృద్ధుడు. కాలకృత్యములు తీర్చుకొనేందుకేమో'నని తలుపు తెరిచింది. తలుపు తెరచేటప్పటికి 'అమ్మా! నీవు నాకు కడుపు నిండా అన్నం పెట్టావు. కాని కంటినిండ నిద్ర రావటంలేదు' అన్నాడు. స్వామీ దానికి నేనేమి చేయగలను? అంది. నాకు ఎవరైనా కాళ్లు పట్టేవారు కావాలి అని కోరాడు. పనివాడు కూడా వెళ్లిపోయాడు. ఎవరూ లేరు. నేనేమి చేసేది? అని తనలో తాను అనుకున్నది. ఇంతలో వృద్ధుడు నాకు స్త్రీయే కాళ్లు పట్టటానికి కావాలి అన్నాడు. ఆ మాట విని ఆమె యింక నిలువునా కూలిపోయింది. నేను ఒంటరిగా ఉంటున్నాను. ఈ వృద్ధుడు ఈ కోరిక కోరుతున్నాడు. నేను ఎక్కడికి పోయేది? ఏమి చేసేది? అతిథిని బాధపెట్టటం ఆమెకు ఇష్టంలేదు. అట్లని తానాసేవలో పాల్గొనటం ఇష్టంలేదు. తలపై కొంగు

కప్పుకొంది. దొడ్డిదోవలో బయలు దేరింది. ఆ గ్రామంలో యిలాంటి సేవ చేసే స్త్రీలు ఉండరా అని అంతాపోయి 'అమ్మా నీకు కావలసినంత ధనము యిస్తాను. మా యింటికి ఒక వృద్ధుడు వచ్చాడు. అతనికి కాళ్లు పట్టే సేవ చేయాలి. వస్తావా, వస్తావా' అని అడిగింది ఎవ్వరూ అంగీకరించలేదు. మేము ఈ వర్షములో అసలే రాము. 'మేము ఈనాడు వ్రతము పూనినాము. వీలుకాదు' అన్నారు. తాను చేసేదిలేక ఇంటికి వచ్చి పూజ గదిలో కూర్చొని 'తల్లి! నీవు నన్ను పరీక్ష చేస్తున్నావా? ఏనాడూ నేను పరపురుషుని అంటిన దానను కాను. అలాంటిది నన్ను ఈనాడు అతనికి పాదములు పట్టమంటావా? అని ప్రార్థిస్తూ వచ్చింది. అతనిని కష్టపెట్టటం యిష్టము లేదు. పోనీ అతని సేవ చేద్దామా అంటే మనస్సు అంగీకరించటం లేదు. ఏమి చేసేది? ఇది పరీక్షా సమయమని భావించి 'ఆ వృద్ధునికి నిరాశ కలుగకుండా, నీ వ్రతము భంగము కాకుండా కాపాడు తల్లీ!' అని కంటిధారలు కార్చుకుంటూ పార్వతీదేవిని ప్రార్థిస్తున్నది. ఇంతలో ఇంటి వెనుక తలుపు ఎవరో తట్టారు. ఈమె వెళ్లితలుపు తెరచేటప్పటికి ఒక స్త్రీ 'అమ్మా! మీరు కోరారు. నేను వచ్చాను' అంది. అప్పుడు దేవగిరమ్మకు పట్టలేని ఆనందము కల్గి 'తల్లీ! ఈనాడు నా గౌరవము రక్షింప వచ్చావా? ఇది నీవు చేసిన సహాయమే! నీవే పంపించావని ఆనందముతో ఆ స్త్రీని పిలుచుకొని వరండాలో ఉంచి, తలుపు వేసుకుంది. ఈ వచ్చిన స్త్రీని తిరిగి పంపించాలి కదా! తాను పడుకోటానికి వీలులేదు. పూజ గదిలో ప్రార్థన చేసుకుంటున్నది.

ఇంతలో తలుపు తట్టారు. మళ్ళీ ఏమి ప్రమాదము కలుగుతుందో యేమోనని ఈమె చాలా భయపడుతూ, వణుకుతూ తలుపు తెరిచింది. తలుపు తెరిచేటప్పటికి **దివ్యమైన సుందర స్వరూపాలతో పార్వతీ పరమేశ్వరులు సాక్షాత్కరించారు. ఆ వచ్చినవాడు వృద్ధుడు కాదు. పరమేశ్వరుడే. ఆ వచ్చిన స్త్రీ సామాన్య స్త్రీకాదు, సాక్షాత్తు పార్వతీదేవియే.** తక్షణమే కాళ్లపై పడింది దేవగిరమ్మ. ఈమె కాళ్లపైబడి ఏడుస్తున్న సమయంలో పార్వతి పరమేశ్వరుణ్ణి వరము ప్రసాదించమని హెచ్చరించింది. వీరి భాషలు వీరికే తెలుసు కానీ అన్యులకు తెలియదు. **'హరి చిత్తలీల హరికే తెలుసున్'** ఎవ్వరు దానిని అర్థము చేసుకోలేరు. అప్పుడు ఈశ్వరుడు పార్వతికి అర్థమయ్యే రీతిగా, **"ప్రార్థన విని వచ్చిన దానవు నీవు. పరీక్షించుటకు వచ్చిన వాడను నేను. ప్రార్థన విని వచ్చినావు కనుక నీవే కోరికలన్నీ తీర్చుము"న్నాడు.** అప్పుడు పార్వతి 'అమ్మా! నీకు అన్ని సుగుణములూ ఉంటున్నాయి; అన్ని సౌభాగ్యములూ ఉంటున్నాయి. కానీ సంతానము లేక బాధపడుతున్నావు. కన్యా దానమునకు ఒక కన్యను. వంశోద్ధరణకు ఒక పుత్రుణ్ణి అనుగ్రహించాన'ని చెప్పింది. తక్షణమే ఈశ్వరునికి నమస్కారము చేసుకుంది దేవగిరమ్మ. **'దేవగిరీ! నీభక్తి నన్ను కరిగించి, కదలించింది. నీ మూడవ గర్భములో నేనే పుడతాను' అన్నాడు. "నేను ఆపస్తంబ సూత్రుడును, భారద్వాజ గోత్రుడను, శివుడను"** దేవగిరమ్మ మరల నమస్కారము చేసుకొంది. లేచేటప్పటికి ఇద్దరూ లేరు. ఆనందము పట్టలేక పోయింది. నిద్రరాదు. చెప్పటానికి భర్తలేడు. ఎవరితో చెప్పుకొని ఈ ఆనందాన్ని పంచుకోగలదు? రాత్రంతా ఇల్లంతా ఆనందముతో తిరుగుతున్నది. తెల్లవారుఝాము ఐదు గంటలైంది. భర్తవచ్చి తలుపు తట్టాడు. ఆయన ప్రవేశించేటప్పటికి పరుగెత్తిపోయి కాళ్లపై పడి ఆమె ఆనందముతో జరిగిన విషయాన్ని చెప్పింది. ఆయన అనుకున్నాడు ఈ దేవగిరమ్మ మొదటినుండి భక్తి ప్రవత్తులవల్ల ఉన్మత్తురాలు. ఈమెకు ఏదో భ్రమ కలిగింది. నేను ఇంటిలో లేక పోవటం చేత నిద్రరాలేదు కాబోలు. దానితో కలలు కంటున్నదేమో! ఇది అందరి ఆడవారి బలహీనతయే అనుకొని చాల సంతోషము అన్నాడు. దానిని సత్యముగా భావించలేదు. ఈ విధముగా కాలము గడుస్తున్నది.

రెండు నెలలయ్యేటప్పటికి ఈమెకు గర్భమని తేలింది. ఆ సంవత్సరము కుమారుడు పుట్టాడు. మరలా ఇంకొక సంవత్సరము తరువాత కుమార్తె కలిగింది. మూడవ

సంవత్సరములో తిరిగి గర్భము ప్రారంభమైంది. **దీనినే వైష్ణవమాయ అంటారు, దైవలీలలు అగమ్యగోచరాలు.** ఈమెకు నవమాసములు నిండేటప్పటికి భర్తకు ఎక్కడ లేని తీవ్రవైరాగ్యము బయలుదేరింది. ఇంటిలో క్షణమైనా నేను ఉండను. అరణ్యమునకు వెళ్లి తపస్సుచేసి ఈశ్వరుని సందర్శించాలి అన్నాడు. 'నీవు ఈశ్వరుని సందర్శించావు నేను సందర్శించలేదు. ఈనాడు నాకు తెలుస్తున్నది అన్నాడు నీవు చెప్పినది సత్యమని. నీవు ఎంత అదృష్టవంతురాలవు. నీవు ఇక్కడే ఉండు. నేను అరణ్యమునకు పోతాను' అన్నాడు. భార్య కాళ్లపైబడి చెప్పింది. "నాథా! సాక్షాత్తు ఈశ్వరుడే మూడవ గర్భమున జన్మిస్తానని చెప్పాడు. మన కుమారునిగా పుట్టే ఈశ్వరుని దర్శించుకోకుండా ఎక్కడో అరణ్యమునకు ఎందుకు వెళ్ళాలి? కొంత కాలము మీరు వేచిఉంటే త్వరలో సాక్షాత్తు ఈశ్వరుడినే మీరు దర్శిస్తారు. ఈ రెండూ సత్యమైనప్పుడు మూడవది మాత్రము అసత్యమవుతుందా? ఇది సత్యమే" అన్నాడు గంగాభవారియా చెప్పాడు. "నాకు పుట్టే కుమారుడు మానవాకారముతో కన్పిస్తాడుగానీ సాక్షాత్తు ఈశ్వరుడుగా నాకు కనిపించడు. ఈ ప్రాకృత జగత్తునందు అప్రాకృతమైన దివ్యత్వము సందర్శించటమే సరైనది. కానీ ప్రాకృతమునకు ప్రాకృతము సరియైనది కాదు. **నేను ప్రవృత్తి యందుండినంత వరకు నాకు నివృత్తి లభ్యముకాదు. బ్రాహ్మజ్ఞానమే హృదయ నేత్రము. త్యాగమే జీవితమునకు సుఖము. నివృత్తియే జీవిత లక్ష్యము.** ఈ మూడింటినీ నేను అనుసరిస్తాను తప్ప ప్రకృతంగా ఉండుటకు వీలులేదని" తాను బయలు దేరిపోయాడు.

పతిని వదలి క్షణమైనా ఉండలేని ఈ దేవగిరమ్మకు నవమాసాలు నిండాయి. అతను చాలా వేగంగా బయలుదేరి పోతున్నాడు. అతని వెంట ఈమె కూడా బయలుదేరింది. అతను చాలా ముందుగా పోతున్నాడు. ఈమె వెనుక పోతున్నది. నడవలేకపోతున్నది. అడవిలోకి పోయేటప్పటికి ఈమెకు పురిటి నొప్పులు బయలు దేరాయి. 'నాథా! కొన్ని క్షణాలు నిలవండి. ఇప్పుడే మీరు ఈశ్వరుని దర్శించగలరు. నాకు చాలా తీవ్రమైన బాధగా ఉంటున్నది. నిలవండి. నిలవండి' అని చెప్పింది. కానీ అతను ఏమాత్రం వినలేదు. వెనుతిరిగలేదు. ఆమె ఒక చెట్టుక్రిందకు పోయింది. ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయింది. అలాంటి పరిస్థితిలో కూర్చుంది. క్షణములో ప్రసవమైంది. బిడ్డను చూస్తే దివ్య కాంతితో తేజరిల్లుతున్నాడు. ఇక్కడ బిడ్డకోసం నిలవటమా? అక్కడ భర్తకోసం వెళ్లటమా? ఏమి చేయాలో తోచక తనకు పతియే దైవమని బిడ్డను ఒక ఆకులో చుట్టింది. అక్కడే పెట్టి ఆమె వెళ్ళింది. ఆమె తనలో తాను 'ఆనాడు పార్వతీపరమేశ్వరులను దర్శించాను. **ఏ ఒక్క అనసూయకో యీవిధమైన ప్రాప్తి లభించింది' వాళ్ళ కథ అట్లా ఉండనీ. అని యోచించుకొని తన భర్తవద్దకు చేరింది.**

ఆ బిడ్డ పుట్టిన దినము 1838వ సంవత్సరము సెప్టెంబరు 28వ తేదీ. ఆనాడు రంజాన్. ఒక ఫకీరు. ఆయన భార్య సూఫీ మతస్థులు. అత్తవారింటికి వెళ్ళి, టాంగాలో వస్తున్నారు. **ఎక్కడెక్కడ ఎవరెవరికి ఏవిధమైన కాల కర్మ, కారణ కర్తవ్యాలు కలసిరావాలో అది దైవనిర్ణయమే తప్ప మీరు భ్రమిస్తేగానీ, తలచుకుంటేగానీ, ప్రయత్నిస్తేగానీ జరిగేవి కావు.** ఆ చెట్టు దగ్గరకు వచ్చేటప్పటికి ఫకీరు భార్య 'కొంచెం బండి నిలపండి. నేను బయటకు పోయి రావాలి అంది. టాంగా తోలేవాడు, భర్త ఉన్నారు. వీరు తప్ప యింకెవరూ లేరు. ఆ ప్రదేశములో ఎక్కడో చిన్న పిల్లవాని ఏడ్పు వినిపించింది. ఎక్కడనుండి ఈ శబ్దం వినవస్తున్నదని చూస్తే ఆ దగ్గర చెట్టుకిందనే ఆకులోపల పురిటి బిడ్డ ఏడుస్తున్నది. తక్షణమే బిడ్డను ఎత్తుకుంది. ఆ బిడ్డ తల్లి ఎక్కడుందో యేమోనని భర్తను పిలిచింది. అటువైపు ఇటువైపు భర్త, టాంగా డ్రైవరు యిద్దరు చాలా బిగ్గరగా పిల్చారు. ఎక్కడా ఎవరి జాడ కనిపించలేదు. అప్పుడామె **"ఈనాడు ఈద్. నాకే కష్టమూ లేకుండా, నవమాసములు మోయకుండా అల్లా నాకీవిధంగా బిడ్డను**

ప్రసాదించాడు" అనుకొని బిడ్డను తీసుకొని టాంగా ఎక్కింది.

వారి క్యాలెండరు లోపల అది తొమ్మిదవ నెల. తెల్లవారుతూనే లేచి స్నానాలు చేసి కొత్తగుడ్డలు ధరించి అల్లాకు కృతజ్ఞత చూపే దినము రంజాన్. ఇంతేకాక మహమ్మద్‌కు కృతజ్ఞతలు అర్పించే దినము. మహమ్మద్ తన జీవితాన్నంతా త్యాగము చేసి అనేక ప్రార్థనలు చేస్తూ ఉండేవాడు. ఈ మహమ్మదీయులకు మూడు ప్రధాన విశ్వాసాలున్నాయి. 'అల్లాహో అక్బర్' భగవంతుని కంటే శ్రేష్ఠమైనవాడు లేడు. 'లాయిలాహో యిల్లల్లా' ఇతనికంటె సర్వవిధముల కాపాడేవాడు లేడు. ఇతడు అన్ని విధముల పూజించుటకు అర్హుడు. ఇంక ఎవరిని పూజించుటకు వీలులేదు. "ఈ మూడు ప్రమాణములు చాలా గాఢంగా విశ్వసించి పాటించునందువల్ల, ఎల్లప్పుడు తలచు కొన్నందువల్ల మాకీ బిడ్డ దొరికింది" అని ఆ ఫకీరు, అతని భార్య ఆ టాంగాలో కూర్చొని ఆనందముతో పొంగి పోతూ ఇల్లు చేరారు.

మన ఇండ్లలో చంటిపిల్లలను చంటి, చిన్ని, బుజ్జి, కన్న ఇలాంటి ముద్దుపేర్లతో పిల్చుకుంటాము కదా! అలాగే వారు **ఆపిల్లవానిని 'బాబా' అని పిలుస్తూ వచ్చారు. ఇలా ఆనందముగా ఫకీరు దంపతులు బాబాతో నాలుగు సంవత్సరములు 1838 నుండి 1842 వరకు గడిపారు.** వీరి ఇంటి పక్కనే ఒక షాహుకారు కుటుంబము ఉండేది. వారికి ఒక పిల్లవాడు. ఒకనాడు ఇద్దరూ గోళీలు ఆడుకుంటున్నారు. ఆటలో అతనిని ఓడించి, గోళీలు గెల్చుకున్నాడు బాబా. అప్పుడు షాహుకారు పిల్లవాడు గోళీలు లేనందువల్ల **యింటిలోనుండి సాలగ్రామము తీసుకువచ్చాడు.** అది కూడా గెల్చుకున్నాడు బాబా. సాలగ్రామము కూడా పోయేటప్పటికి షాహుకారు పిల్లవానికి కోపము వచ్చింది. ఇద్దరూ పోట్లాట ప్రారంభించారు. ఆ పిల్లవాని తల్లి మేడమీదనుండి చూసింది. తన కుమారుని చూచి క్రిందకు దిగి వచ్చింది. మీరిద్దరు కొట్లాడుకుంటున్నారెందుకు? బాబూ, బాబూ రమ్మని పిలిచింది. నాగోళీలన్నీ గెల్చుకున్నాడు. **అందులో క్రొత్తది ఒకటున్నది. అది నాకు ఇమ్మంటే ఇవ్వడం లేదు. నోట్లోవేసుకున్నాడు అని చెప్పాడు.** అప్పుడు తల్లి అడిగింది. 'నాయనా నేను డబ్బు యివ్వలేదు. ఎక్కడనుండి తెచ్చుకున్నావు' అని. 'నా గోళీలన్నీ పోగొట్టుకోవటం చేత నేను పూజ రూములో నున్న దానిని తీసుకు వచ్చాను' అని సత్యము చెప్పాడు. అక్కడకు వెళ్ళి చూచివచ్చి ఈమె చాలా బాధపడింది. 'అయ్యో! నేను నిత్యం పూజలో పెట్టుకొనే ఈ సాలగ్రామము తీసుకొని పోయావా?' అని. వెంటనే బాబాను చెవి పట్టి లోపలకు ఈడ్చుకు వచ్చింది. 'నీకు పది గోళీలు కాకపోతే నూరు గోళీలు యిస్తాను. నా సాలగ్రామము నాకివ్వు' అంది. బాబా తన చేతిలో లేదని చేతులు చూపాడు. కుమారుడు చెప్పాడు 'అమ్మా! నోట్లో పెట్టుకున్నాడు.' అని. అప్పుడు ఇటువైపున, అటువైపున చెంపలమీద కొట్టింది బాబాను. కొట్టి నోరు చూపమంది. నోరు తెరిచేటప్పటికి యశోదకు ఏవిధముగా తన నోటిలో కృష్ణుడు అన్ని లోకాలు చూపించాడో, ఆవిధంగా ఈమెకు సినీమా రీలు తిరుగుతున్నట్లుగా బాబా నోట్లో అన్ని లోకాలూ కనిపించాయి. పరమభక్తురాలు కనుక, ఈ విషయాన్ని కృష్ణలీలలలో చదివినది కనుక, ఇదంతా తనలో తాను తలచుకొని, అటువైపు ఇటువైపు చూచి, ఎవరూ లేరు కదాయని ఆ చిన్న పిల్లవాని పాదములు పట్టుకొని నమస్కారము చేసింది. అప్పటినుండి ఆమెకు బాబాపై భక్తి. ఎవరికీ చెప్పేది కాదు. తన ఇంటిలో ఏమైనా చేస్తే బాబాను పిలిచి తాను తినిపించేది, భర్తకు తెలియకుండా. ఎందుకంటే ఏమనుకుంటాడో యేమో! **అప్పుడు మహమ్మదీయులకు హిందువులకు ద్వేషము.** అప్పటి నుండి బాబా చేసే పని ఏమిటి? **మతముల ఏకత్వము చాటే నిమిత్తము ఈ తీసుకున్న సాలగ్రామమును మసీదుకు పోయి పూజ చేసేవాడు.** తాను మహమ్మదీయుడు. పోయేది హిందూ దేవాలయమునకు. చదివేది ఖురాన్. ఈరెండు పరస్పర విరుద్ధాలు ప్రతి దినము హిందువులు, మహమ్మదీయులు

వచ్చి ఫకీరుకు కంప్లైంట్లు చేయటం జరిగేది.
ఒకనాడు ఫకీరుకు స్వప్నము వచ్చింది. 'ఫకీర్, నీవు ఇంక ఎంతకాలమో ఉండవు. నీవు పెంచిన ఈ పిల్లవానిని యింక ఎవరూ పెంచలేరు. ఫలానా చోట **'వెంకూసా'** అని ఉంటాడు. ఈ పిల్లవానిని అతని దగ్గర వదలిపెట్టు' అని. ఫకీరు ఆ పిల్లవానిని తీసుకొని వెంకూసా దగ్గరకు వెళ్ళాడు. **వెంకూసా మంచి గురువు.** పిల్లలకు ఆధ్యాత్మిక తత్త్వము ప్రబోధించేవాడు. ఈ పిల్లవాడు వస్తుండగనే అతని కోసమే అంతకాలము కాచుకొని ఉన్నట్లు 'ఆవోజీ ఆవోజీ' అని పిలిచి దగ్గర కూర్చోపెట్టుకున్నాడు. భుజాలు నిమిరాడు. 'ఇంతకాలం నీకోసం కాచుకున్నాను' అని అనేక విధములుగా ముచ్చటలాడి లోపల భోజనం చేసిరా అన్నాడు. ఆ ఆశ్రమం హిందువులకు మాత్రమే సంబంధించినది. బాబా హిందువుల బిడ్డయా? మహమ్మదీయ పిల్లలను చేర్చుకొంటే అతని ఆశ్రమముపై మహమ్మదీయులంతా వచ్చి పడతారు. హిందువులకు మరొకవైపున వారిని ఎందుకు చేర్చుకున్నారని ద్వేషము ఏర్పడుతుంది. ఈ విధంగా కొంచెము యోచిస్తూ ఉండేటప్పటికి వెంకూసాకు రాత్రి స్వప్నము వచ్చింది. 'వచ్చిన పిల్లవాడు సామాన్యుడు కాడు. అతనికి మతములతో ఎట్టిసంబంధములేదు. సర్వసమన్వయ మతమే అతని అభిమతము. కనుక నీవు ఏమాత్రము వెనుకంజవేయవద్దు. ఇది నీ అదృష్టము' అని చెప్పేటప్పటికి అప్పటినుండి వెంకూసాకు బాబాపై ప్రేమ అధికమవుతూ వచ్చింది. అతనిని చాలా ఆదరించి తనతోనే ఉండమని 'నాయనా! ఇదంతా నీదే' అని ఆశ్రమములో అన్ని అధికారాలు యిస్తూ వచ్చాడు. ఆ పిల్లవానిని చాలా ప్రేమించేవాడు. ఏవిషయములోనైనా అతనికే ప్రథమ స్థానము ఇచ్చేవాడు.

దైవం కొందరిపై అనుగ్రహము అధికంగా చూపుతుంటాడు. కొందరిపై చూపీ చూపనట్టుంటాడు. కొందరిపై అసలు చూపనట్టే ఉంటాడు. అది నీభ్రాంతియే గానీ మరొకటి కాదు. దైవమునకు అందరూ సమానులే. అద్దమునకు ఒకవైపున రసాయనము పూసి ఉండటం చేత నీ ప్రతిబింబము అందులో కనిపిస్తుంది. కాబట్టి ఎవరి హృదయమునకు ప్రేమ అనే రసాయనము పూసి ఉంటారో వారి దగ్గర మాత్రమే యిది కనిపిస్తుంది. కనిపించక పోవటం దైవము యొక్క దోషముకాదు. నీ హృదయానికి ఆ రసాయనం పూయలేదు. అందుచేత మరొక రోగము ప్రారంభమవుతుంది. ఏమిటా రోగము? **అసూయ.**

ఈ ప్రేమను చూచి అక్కడున్న విద్యార్థులలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. "ఇదేమి మేము ఇన్ని సంవత్సరముల నుండి ఇక్కడ ఉంటున్నాము. మా వైపున చూడటం లేదే. ఇప్పుడే వచ్చిన ఈ పిల్లవానితో ఏమిటీవిధంగా మాట్లాడుతున్నాడు?" అని వీరిలో వీరికి కలతలు బయలుదేరినాయి. కొంతమంది మంచిగా అభిప్రాయ పడ్డారు. మరి కొంతమంది 'ఆ ఫకీరు ధనవంతుడు. అతని దగ్గర ఎక్కువ ధనము వస్తుందని ఆశిస్తున్నాడేమోన' ని అనుకున్నారు. ఈ విధముగా ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా అన్నారు. **తలలు వేరైనప్పుడు తలంపులు వేరుగా వస్తుంటాయి. భావములకొద్దీ ఊహలు బయలు దేరుతాయి.**

దినదినమునకు వెంకూసాకు, బాబాకు సన్నిహిత సంబంధము ఎక్కువ అవుతూ వచ్చింది. ఒకనాడు 'వికారా' అనే అడవికి ఈ ఇద్దరు వెడుతున్నారు. వెంకూసా ఆశ్రమములోని హిందువులందరు మహమ్మదీయ పిల్లవాడు ఆశ్రమములో ఉండకూడదు. ఈ ఆశ్రమము క్రమక్రమేణా మహమ్మదీయులతో నిండిపోతుంది. ఈ తరువాత వారే ఆక్రమించుకుంటారనే ఉద్దేశ్యముతో కుట్రపన్ని బాబాను ఆశ్రమము నుండి తరిమి కొట్టాలని ప్రయత్నించారు. ఐదారుమంది పిల్లలు ఒక ప్లాను వేశారు. ఇప్పుడు సరైన సమయము. ఆ పిల్లవానిని చంపితే వెంకూసా అప్పుడు మనపై ప్రేమ చూపగలడు అనుకున్నారు. అక్కడకు నడిచిపోయారు. ఒక గుడిసె దగ్గర కూర్చున్నారు. ఒక బలమైన విద్యార్థి ఒక యిటుక

తీసుకొని సూటిగా బాబా తలకు తగిలేటట్టు విసిరాడు. బాబా అంటే వెంకూసాకు ప్రేమ. తక్షణమే వచ్చి బాబా ముందు నిల్చున్నాడు. బాబాకు తగలవలసింది వెంకూసాకు తగిలింది. తక్షణమే రక్తం కారింది. అప్పుడు బాబా కట్టుకున్న బట్ట చించి తలకు కట్టాడు. 'స్వామీ! మీకిట్లా తగిలిందే' అని బాబా మాట్లాడుతుండగనే ఆ పిల్లలు పరుగెత్తి వచ్చారు ఒక పిల్లవాని శవము తీసుకొని. ఎవరిది ఈ శవము? బాబాను కొట్టటానికి ఎవరైతే 'యిటుక వేశారో వాడు చనిపోయాడు తక్షణమే. 'గురూజీ! మా పాపము క్షమించండి' అని పాదములపై పడ్డారు. అప్పుడు వెంకూసా చెప్పాడు. 'నాయనా! నేను వృద్ధుడనయ్యాను. నా సర్వస్వము ఈ పిల్లవాడే. నిర్మల ప్రేమగలవాడే మనలను రక్షించగలడుగానీ ఇతరులు రక్షించలేరు' ఈ మాటలు విని బాబా పాదములపై పడవేశారు పోయిన పిల్లవానిని. బాబా ఫక్కున నవ్వాడు. ఎందుకు నవ్వాడు? తనను చంపటానికి ప్లానువేసినవాడు చచ్చాడనే ఆనందముతో కాదు. ఇదంతా దేహలక్షణమని నవ్వాడు. చిన్నవయస్సునందే యిట్టి పరమసత్యమును గుర్తించాడు. బాబాకు వయస్సు అక్కరలేదు. తనకు మొదటి నుండి తెలుసు. ఎందుకంటే సమస్తసృష్టి తన హస్తమునందుంచుకున్నాడు. తక్షణమే 'ఏమి కావాలని వచ్చారు? ఇది శవము. ఈ దినము ఇతను, రేపటిదినము మీరు. ఎవరూ శాశ్వతము కాదు' అన్నాడు. అప్పుడా పిల్లలు అడిగారు. 'మేము తల్లిదండ్రులకేమని చెప్పాలి?' అప్పుడు బాబా చెప్పాడు 'జరిగింది చెప్పండి' అని. జరిగింది చెబితే అవమానము. జరగనిది చెబితే అసత్యము. మీకు కావలసింది ఏమిటి? ఈ పిల్లవానిని బ్రతికించటమే కదా! అంటూ తక్షణమే కూర్చొని ఆ పిల్లవాని తలను తొడపై పెట్టుకున్నాడు. తల నిమురుతున్నాడు. 'సాయినాథునికి శరణుకండి.' మీ అభీష్టము నెరవేరుస్తాను అన్నాడు. అప్పుడందరు బాబా పాదములు పట్టుకున్నారు. తక్షణమే పిల్లవాడు లేచాడు. అప్పటినుండి బాబా ప్రభావము లోకములో ప్రచారమవుతూ వచ్చింది.

వెంకూసా మరణానంతరము అనగా 1854లో ఒకనాటి రాత్రి ఆశ్రమము వదలి ప్రయాణమై షిరిడీ చేరాడు. షిరిడి చాల చిన్న గ్రామం. షిరిడీలో ఖండోబా దేవాలయంలో ప్రవేశించబోయిన బాబాను మహల్సాపతి అనే పూజారి చూసి ఎవరో మహమ్మదీయ ఫకీరని భావించి లోపలకు రానివ్వలేదు. బాబా అక్కడ నుండి ఊరి బయటనున్న ఒక వేపచెట్టు క్రిందకు పోయి కూర్చున్నాడు. అప్పటికి **బాబా వయస్సు పదహారు సంవత్సరాలు.** అతని పేరేమిటో ఊరేమిటో ఎవరికీ తెలియదు. ఒకవేళ ఎవరైనా వచ్చి "మీ పేరేమిటి? మీరే ఊరు నుండి వచ్చారు?" అని ప్రశ్నిస్తే నా ఊరుతో నీకేమి పని? నా పేరు నీకెందుకు? అని ఎదురు ప్రశ్నలు వేసేవాడు బాబా. అందుచేత బాబా పేరుగాని, ఊరుగాని ఎవరూ తెలుసుకోలేక పోయారు.

బాబా అక్కడే కొద్ది కాలంపాటు ఉన్నాడు. ఆ రోజులలో గ్రామప్రజలందరు ఆ వేపచెట్టుక్రింద బాబా వద్దకు వచ్చి తమ బాధలను నివేదించుకొని నివారించుకునేవారు. ఎవరైనా శారీరక బాధలతో వస్తే బాబా ఏదో ఒక ఆకు తీసుకొని నలిపి వారికిస్తూ దీనిని తిను నీ నొప్పి తగ్గిపోతుంది అనేవాడు. ఈ విధంగా అనేకమంది రోగాలను నివారణ గావించేవాడు. ఈ విషయం చుట్టుప్రక్కల పల్లెలంతా ప్రాకి పోయింది. అందరు బాబా వద్దకు రాసాగారు. ఈవిధంగా కొంతకాలం గడిచిన తరువాత ఒకనాడు ఉన్నట్లుండి బాబా ఎవరికీ కనిపించకుండా ఎటో వెళ్ళిపోయాడు. ఎంత వెతికినప్పటికి బాబా కనిపించక పోవటంతో ఆ గ్రామ ప్రజలు నిరాశ చెందారు.

(షి.పు.6/16)

బాబా తిరిగి మూడు సంవత్సరముల తరువాత 1857వ సంవత్సరములో షిరిడీ వచ్చారు. ఎవరితో వచ్చారు? 'ఔరంగాబాద్' దగ్గర 'ధూప్' గ్రామం ఉంది. ఆ గ్రామములో 'చాంద్‌భాయిపాటిల్' అనే ఓ మధ్యతరగతి వ్యక్తి ఉండేవాడు. ఒకనాడు ఏదో ఒక అత్యవసరమైన పని

తటస్థించటంతో చాంద్ భాయిపటేల్ తన గుఱ్ఱమునెక్కి ఔరంగాబాద్ చేరుకున్నాడు. అక్కడ రెండు మూడు రోజులు తన పనులను చక్కబెట్టుకొంటున్న సమయంలో అతని గుఱ్ఱము తప్పించుకొని పోయింది. దానిని వెతకటానికి ఎంతో ధనము ఖర్చుపెట్టి సకల ప్రయత్నాలు చేశాడు. కానీ ఫలితం లేకపోయింది. చాంద్‌భాయిపాటిల్‌కి ఆ గుఱ్ఱమంటే చాలా ఇష్టం. గుఱ్ఱము పోయేటప్పటికి ఆహారము కూడా తీసుకోలేదు. **దేనిపైన అయినా అభిమానము కలిగితే ఈవిధంగా బాధలు కూడా వెంటాడుతూ ఉంటాయి.** చివరకు నిరాశ చెంది దాని జీను మోసుకొని వస్తున్నాడు ధూప్ గ్రామానికి.

ఔరంగాబాద్ నుండి ధూప్ గ్రామానికి వచ్చేదారిలో దట్టమైన అరణ్యం ఉండేది. ఆదట్టమైన అడివిలో ప్రవేశించాడు. ఒక మామిడి చెట్టుక్రింద కూర్చొని ఉన్న ఒక ఫకీరును చూచాడు. గుఱ్ఱము పోగొట్టుకున్న విచారముతో నడుస్తూ వస్తున్న చాంద్‌భాయిపాటిల్‌ను ఆ ఫకీరు చూచి 'ఏయ్! పాటిల్ ఆవోజీ అన్నాడు. అప్పటికే అలసిపోయిన పాటిల్ ఆ చెట్టుక్రిందకు వచ్చి విశ్రమించాడు. బాబా దగ్గర చిలుమున్నది. ఈలోపల బాబా హుక్కా తయారు చేయటం ప్రారంభించాడు. హుక్కాపీల్చాలంటే నీరు, అగ్ని రెండూ కావాలి. 'పాటిల్ నీ దగ్గర అగ్గి పెట్టె ఉందా?' అని ప్రశ్నించాడు. పాటిల్ లేదన్నాడు. అప్పుడు బాబా తన చేతిలోని కట్టను భూమిపై కొట్టాడు. వెంటనే అక్కడ అగ్ని ఆవిర్భవించింది. తిరిగి అదే కట్టను మరల కొట్టాడు. అక్కడే నీరు వచ్చింది. ఈ విధంగా సృష్టించిన అగ్నిని నీటిని ఉపయోగించి బాబా హుక్కా వెలిగించాడు. తాను పీల్చి దానిని పాటిల్‌కు అందిస్తూ పాటిల్! ఎందుకు విచారంగా ఉన్నావు? ఎక్కడకు వచ్చావు? ఎందుకు పోతున్నావు? జీను మాత్రమే వేసుకున్నావు. గుఱ్ఱము ఏది? అని అడిగాడు. 'నాపేరు పాటిల్ అని మీకెట్లా తెలుసు?' అని పాటిల్ తన ఆశ్చర్యాన్ని ప్రకటించాడు? ఇతడు మహనీయుడని గుర్తించి, ఈ జీను నాయొక్క తప్పిపోయిన గుఱ్ఱం జ్ఞాపకార్థముగా తీసుకుపోతున్నాను. అని చెప్పాడు. అప్పుడు బాబా నాకన్నీ తెలుసు. నీ గుఱ్ఱం కోసం నీవు చాలా విచారిస్తున్నావు. తలమీద కళ్ళు పెట్టుకొని వెతకటం వలన అది ఇంతకాలం నీకు కనిపించలేదు. నీ గుఱ్ఱము ఆ చెట్టుక్రిందనే మేస్తున్నది పోయి చూసుకో అన్నాడు. వెంటనే చాంద్‌భాయిపాటిల్ వెళ్ళి చూడగా గుఱ్ఱము అక్కడే ఉంది.

ఇతనిని చూచి అది అరచుకుంటూ వస్తున్నది. ఇంతకు పూర్వం అదే ప్రదేశంలో ఎంతో మంది కూలీలచేత వెతికించినప్పటికి దొరకని గుఱ్ఱము అదే ప్రదేశంలో కనిపించటం చేత ఆశ్చర్యం కలిగింది. ఆ గుఱ్ఱము తీసుకొని దానిపై జీను వేసుకున్నాడు. బాబా అగ్నిని, నీటిని సృష్టించటాన్ని కొద్ది నిముషముల ముందుగా చూచిన పాటిల్‌కు తన గుఱ్ఱముకూడా దొరకటంతో బాబా శక్తిసామర్థ్యాలు అర్థమైనవి. స్వామీజీ మీరు నాకెంతో ఉపకారం చేశారు. కనుక మీరు నావెంబడి మా ఇంటికి వచ్చి నా ఆతిథ్యం స్వీకరించాలి. అని పాటిల్ ప్రార్థించాడు. బాబా అంగీకరించి అతనివెంట బయలుదేరాడు. బాబాను వెనుక కూర్చోబెట్టుకొని ధూప్‌గ్రామం చేరాడు. ఈ ధూప్‌గ్రామంలోనే బాబా మూడు సంవత్సరాలున్నాడు. ఈ విషయము ఎవరికీ తెలియదు.

చాంద్‌భాయి పాటిల్‌మేనల్లుని వివాహము నిశ్చయమైంది. పెండ్లి కుమార్తె షిరిడీకి చెందింది. కావున వారందరూ షిరిడీ బయలు దేరవలసివచ్చింది. బాబాను కూడా తన వెంట రావలసిందిగా చాంద్‌బాయిపాటిల్ కోరాడు. వారందరు బయలుదేరి షిరిడీ చేరుకున్నారు. అక్కడ బాబా బండి దిగుచుండగా మహల్సాపతి చూచాడు. వెంటనే అతడు 'అయియే బాబా సాయీ' అంటూ బాబాను సాదరంగా ఆహ్వానించాడు. **'సాయి అనే పేరు మహల్సాపతి పెట్టినదే.'** అంతవరకు ఎవరూ పేరు పెట్టలేదు.

షిరడీ చేరిన తర్వాత యిక కావలసినవన్ని జరగుతూ వచ్చాయి. షిరడీ వచ్చి చేరేంతవరకు ఎవరికీ బాబా యొక్క చరిత్ర యిట్టిది అట్టిది అని స్పష్టముగా

తెలిసినట్లులేదు. అక్కడ ఒక విష్ణుదేవాలయం ఉంటున్నది. ఆ దేవాలయములో మహల్సాపతి పూజ చేసేవాడు. మహల్సాపతి గొప్ప భక్తుడు. ఈ పెండ్లివారితో వచ్చి దేవాలయము వద్ద కూర్చున్నాడు. బాబా. మహల్సాపతి పోతూ పోతూ దేవుని ప్రసాదము కొంతయిచ్చాడు. నాకు ఈ ప్రసాదం వద్దు అన్నాడు బాబా. 'ఎందుకు నాయనా! ఎందుకు తీసుకోవు దేవుని ప్రసాదం?' అని అడిగాడు. 'నేను యిప్పుడే తిన్నాను. అన్నాడు. ఎక్కడకు వెళ్లావు? ఎక్కడికీ వెళ్లలేదే. ఎలా తిన్నావు? అడిగాడు. ఇప్పుడు నాకు అక్కడ నైవేద్యముగా పెట్టావే. అదే తిన్నాను.' అన్నాడు బాబా. అదేమిటి? చిన్న దేవాలయము. నేను అక్కడే ఉన్నాను. నీవు ఆవైపునే రాలేదు. ఎట్లా తిన్నావు? అని అడిగాడు మహల్సాపతి నీవు చూడలేదు నన్ను అన్నాడు. బాబా. ఈ విధముగా మాట్లాడేటప్పటికి మహల్సాపతి మొదట ఇతనెవరో చిన్న పిల్లవాడనుకొన్నాడు. మరికొంతదూరము పోయిన తర్వాత, భక్తుడు మహల్సాపతి, మరల వెనుకకు వచ్చాడు కనుక్కునే టందుకు. ఈ పిల్లవాడు ఈ విధముగా చెప్పటములో ఏదో అంతరార్థముందని ఊహించి, ఆ పిల్లవానియొక్క తేజస్సు చూచి దైవముగా విశ్వసించాడు. ఆ దేవాలయము ప్రక్కనే సామానులు, ఉత్సవవిగ్రహాలు పెట్టుకోవటానికి చిన్నగది ఉండేది. ఆ గదిలో ఉండమని చెప్పి నిత్యము నైవేద్యం పెట్టేదంతా బాబాకు పెట్టడం ఈ రకంగా చేస్తూ రావటం చేత క్రమక్రమేణా కొన్ని ఆధ్యాత్మిక ప్రబోధాలు అర్థము కానివన్నీ సులభంగా చెప్పటానికి ప్రారంభించాడు బాబా. అప్పుడు కొంతమంది ఈ దేవాలయానికి వచ్చిపోతూ 'ఈ అబ్బాయి ఏమి చదివాడు? ఏవిధముగా పనిచేస్తున్నాడ'ని ప్రశ్నించేవారు. ఈ పిల్లవాడు **'నేను చదువుకోలేదు కానీ అన్ని చదువులు నాకు తెలుసు. నేను దేహరీతిగా దేనినీ చూడలేదు. అన్నీ నాలోనే ఉన్నాయి. నేను ఎట్టి గురువునూ సేవించలేదు. నేనే అందరికీ గురువును. నాకు గురువు లేడు'** అని ఈ విధంగా చెబుతూ రావటం చేత మహల్సాపతి మరింత శ్రద్ధను అభివృద్ధి పరచుకొని అంతరిక రూపాన్ని కొంతవరకు తెలుసుకోవాలని ప్రయత్నిస్తూ వచ్చాడు.

ఈవిధంగా రోజులు గడుస్తున్నాయి. ఈ గ్రామములో జానకీదాసు అనే ఓ పహిల్వాన్ ఉండేవాడు. ముష్టియుద్ధము చేస్తాడు. ఈ పిల్లవానితో అతడు నాకు అన్నీ తెలుసునంటున్నావే. నాతో యుద్ధము చేయగలవా? అన్నాడు. తప్పక చేస్తానన్నాడు బాబా. రెండు దినములు ఒక గుంట త్రవ్వి దానిలో యిసుకేసి జానకీదాసు, బాబా యిద్దరు కుస్తీ చేశారు. ప్రతి పర్యాయము జానకీదాసు క్రిందపడిపోయేవాడు పాపం. ఓడి పోవటంచేత కోపం ఎక్కువై పోయింది. గొప్ప పహిల్వాన్ కనుక, ఆ గ్రామంలో ఉండే పెద్దలందరికి ఆయనంటే గౌరవం. జానకీదాసు చిన్నపిల్లవానిచేత ఓడి పోతున్నాడట అని అపహాస్యం చేస్తూ వచ్చారు. అప్పుడు మహల్సాపతి బాబాకు చెప్పాడు. **'నాయనా! నీవు గొప్పవాడివని తెలుసు నాకు. కానీ జనులు అర్థం చేసుకోలేరు. లోకులు పలువిధములుగా ఉంటారు. నీపై ద్వేషంగా కూడా ఉంటారు. నిన్ను ఏమిచేస్తారో ఏమో, నాకు దేహాభిమానం ఉంది కనుక నీపైన ప్రేమతో చెబుతున్నాను. ఏదో ఒకసారి అతనితో నీవు ఓడిపోయినట్లు నటన చేస్తే మంచిది కదా!' అన్నాడు. అప్పుడు బాబా మహల్సాపతీ! నీకోసం తప్పక ఓడిపోతాను అన్నాడు.' పందెం ఏమంటే జానకీదాసు ఓడిపోతే అతడు సన్యాసము స్వీకరించాలి. నేను ఓడిపోతే ఈనాటినుండి ఈ కుస్తీ జీవితములో చేయను. ఓడిపోయినందుకు గుర్తుగా నేను ఒక కాషాయ వస్త్రాన్ని నాతలకు బిగించుకుంటాను.'** అన్నాడు మహల్సాపతి ప్రార్థన ననుసరించి జానకీదాసు వచ్చి పట్టుకొన్న తక్షణమే బాబా క్రిందపడిపోయినట్లుగా నటించాడు. జానకీదాసు తృప్తి కలిగించాలి. విరోధము పెంచుకో కూడదు. ద్వేషాన్ని రెచ్చగొట్టకూడదు. శాంతిని చేకూర్చాలనే ఉద్దేశ్యముతో తాను పడ్డాడు. అప్పటికప్పుడే జానకీదాసు ఇచ్చిన కాషాయ వస్త్రము తలకు కట్టుకొన్నాడు. బాబా. ఈ చరిత్రనే అనేక విధాలుగా తెలుపుతూ వచ్చారు గ్రంథాలలో. బాబా

గురువు తన ఆశ్రమములో ఉంటున్నప్పుడు ఈ గురువును కొట్టటానికి ఎవరో దొంగలు వచ్చారని, ఆ గురువువెంట తానుకూడా అడవికి పోతే ఒక ఇటుక రాయితో అతనిని కొట్టారని దానివల్ల ఆయనకు దెబ్బ తగిలిందని, ఆనాడు వెంకూసా తనకు వస్త్రము కట్టాడని ఇవన్నీ కేవలము కల్పితమైన కథలు. బాబాకు ఎప్పుడూ, ఎక్కడా ఏ దెబ్బా తగలలేదు. ఎవ్వరూ తలకు కట్టుకట్టలేదు. ఒకవేళ దెబ్బతగిలి కట్టుకడితే దెబ్బ మానిన తర్వాత కట్టుతీయ వచ్చు కదా! జీవితమంతా ఎందుకు కట్టుకట్టాలి? ఈవిధంగా కొన్ని కథలు కల్పించారు.

మహల్సాపతి ద్వారా క్రమక్రమేణా నానా, తాత్యా, అబ్దుల్ బాబా. దాస్‌గణు వీరందరు బాబా దగ్గర చేరుతూ వచ్చారు. అప్పటినుండి బాబాకీర్తి దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతూ వచ్చింది.

ఒకనాడు పైల్‌గావ్‌లో కొంతమంది దొంగలు ఒక శ్రీమంతుని యింటిలో దొంగతనము చేసి పారిపోతుండగా వారిని పోలీసులు పట్టుకున్నారు. వారు భయంతో వణికి పోయి అక్కడే ఉన్న బాబాను చూపిస్తూ అదిగో ఆ ఫకీరే ఈ వస్తువులను మాకిచ్చాడు. అని అబద్ధం చెప్పారు. అప్పుడా పోలీసులు బాబావద్దకు వచ్చి బాబా! ఈ వస్తువులను వారికి యిచ్చినది మీరేనా? అని అడిగారు. అవును అన్నాడు బాబా. అయితే మీకీ వస్తువులు ఎక్కడినుండి వచ్చాయి? అని ప్రశ్నించారు. అన్నీ ఎక్కడ నుండి వచ్చాయో ఇవి కూడా అక్కడినుండే వచ్చాయి. అని బాబా జవాబిచ్చాడు. ఈవిధమైన సమాధానములు పోలీసులు అర్థము చేసుకోలేక పోయారు. పోలీసులది ప్రాకృత దృష్టి. అందుచేత బాబా నుండి ఎట్టి సమాచారమూ సేకరించ వీలుకాదని గుర్తించి పోలీసులు మేజిస్ట్రేటుకు ఒక రిపోర్టు వ్రాసుకున్నారు. అప్పుడు మేజిస్ట్రేటునుండి బాబాకు సాక్ష్యం చెప్పటానికి రావలసిందిగా పిలుపు వచ్చింది. కానీ ఎవరికీ బాబాను మెజిస్ట్రేటు వద్దకు పంపటం ఏమాత్రం యిష్టం లేదు. వారు మేజిస్ట్రేటుతోను, ఉన్నతాధికారులతోను మాట్లాడి దర్యాప్తు బృందం షిరిడీకి వచ్చి బాబాను కలుసుకొనేలా ఏర్పాట్లు చేశారు. ఒకనాడు ఆ బృందంవారు బాబా వద్దకు వచ్చారు. మొట్టమొదట 'మీ తండ్రి పేరేమిటి?' అని బాబాను ప్రశ్నించారు. 'బాబా' అని జవాబిచ్చాడు. బాబా అనగా తండ్రి అని అర్థము. ఇంక బాబాపై వారు ప్రశ్నల వర్షం కురిపించారు.

ప్రశ్న: మీదేమతము?

బాబా: దైవ మతము

ప్రశ్న: మీ కులమేమిటి?

బాబా: దివ్యమైన కులం

మీరెక్కడినుండి వచ్చారు?

బాబా: ఆత్మనుండియే వచ్చాను.

ఈవిధంగా వారి ప్రశ్నలన్నింటికి సమాధానము చెబుతూ వచ్చాడు.

అనేకమంది బాబా దైవత్వమును సందేహిస్తూ వచ్చారు. ఒక మార్గశిర శుద్ధ పంచమినాడు దత్తాత్రేయ జయంతి నాడు అనేకమంది బాబా దగ్గరకు చేరుకున్నారు. వారిలో **మంచి పండితుడు, ధనవంతుడు అయిన ఖైజాక్ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. అతని పూర్తిపేరు బల్వంత్ ఖైజాక్.** అతను వచ్చేసరికి బాబా ఒక కట్ట తీసుకొని తన చుట్టూ చేరిన వారినందరిని **'జావో జావో సైతాన్'** అంటూ కొట్టనారంభించాడు. బాబా ఈవిధంగా ఎందుకు చేస్తున్నారో అర్థంకాలేదు. నాకు ప్రసవ వేదనగా ఉంది. మీరందరు వెళ్లిపోండి అని బాబా గట్టిగా అంటున్నాడు. అప్పుడు బాబా కేకలు వేయటమే కాదు, వీలు పడితే కట్టతో కొట్టేవాడు. బాబా కేకలు విని అందరూ భయంతో పరుగెత్తి పోయారు. కొంత సేపయ్యాక 'అందరూ రండి' అని బాబా పిలిచాడు. అంతేకాదు ఆ బల్వంత్ ఖైజాక్‌ను చూచి 'బల్వంత్‌ఖైజాక్! ఆవోజీ ఆవోజీ' అని పిలుస్తూ బాబా లోపలికి వెళ్లాడు. **లోపలకు బల్వంత్ ఖైజాక్ కూడా వెళ్లాడుగానీ అక్కడ బాబా కనిపించలేదు. ఆ స్థానములో మూడు తలలు గల్గిన శిశువు కనిపించింది. ఆ శిశువు దత్తాత్రేయుని మాదిరిగా కనిపించాడు. ఆ చిన్న శిశువుకు అనేక హస్తములున్నాయి. ఆ దత్తాత్రేయస్వరూపాన్ని**

చూచిన బల్వంత్‌ఖైజాక్ మిగిలిన వారి నందరిని పిలిచాడు. అందరు లోపలకు వెళ్లి చూచి భక్తి పూర్వకముగా కళ్ళు మూసుకున్నారు. తక్షణమే బాబా ప్రత్యక్షమయ్యాడు. ఆనాటి నుండి బాబా దత్తాత్రేయ అవతారమని భగవంతుడని చాల మంది విశ్వసించారు.

బాబా ఒకనాడు కేల్కరును పిలిచి 'ఈనాడు గురుపూర్ణిమ. గురుపూజ చేయమ'న్నాడు. సాఠే మేనమామతో గురుపూజ మొట్టమొదట ప్రారంభింపచేశారు. కేల్కరు గురుపూజ అంటే ఏమిటని ప్రశ్నించాడు. బాబా చెప్పాడు: **గురువంటే ఎవరనుకున్నావు. కేవలం మఠాధిపతులు, సన్యాసులు కాదు గురువులు. భగవంతుడే గురువు. 'బ్రహ్మానందం పరమసుఖదం' లోకములోనున్న అన్ని ఆనందములలో ఉన్నతస్థాయిలో నున్నది బ్రహ్మానందం. అది ఒక్క బ్రహ్మకు తప్ప వేరొకరికి ఉండదు.** లోకములో వస్తు సంబంధమైన ధన, కనక, వస్తు, వాహనాది సుఖములు తాత్కాలిక సుఖములే. పరమ సుఖదం అనగా పరమాత్ముడే. కేవలం జ్ఞానమూర్తిం ఏది జ్ఞానం? వస్తు జ్ఞానమా? కాదు, కాదు. అద్వైత జ్ఞానం. రెండుకాని వస్తువే ఈ జగత్తంతా వ్యాపించి ఉన్నదనే విషయమే జ్ఞానము. అట్టి జ్ఞాన స్వరూపుడు భగవంతుడు. అహం బ్రాహ్మస్మి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ, త్వమేవాహం ఈ నాలుగు వాక్యములకు అతీతమైన తత్వమే ఈ బ్రహ్మజ్ఞానం. గురువు కేవలం భగవంతుడే. **బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులే నిజమైన గురువులు సృష్టిస్థితిలయకారకుడైన వాడే గురువు.** నేను విష్ణుపూజ చేయాలా? లేక బ్రహ్మపూజ చేయాలా? లేక రుద్రపూజ చేయాలా? సెలవివ్వమని కోరాడు కేల్కరు. ఈవిధంగా అడిగేటప్పటికి అరె సైతాన్! నేను ఇక్కడున్నాను కదా! నాకే పూజ చేయి అన్నాడు బాబా. అనగా తానే బ్రహ్మ విష్ణు, మహేశ్వర స్వరూపుడనని, ఇలాంటి **నేను గానున్న తత్వాన్ని పూజించుమని అన్నాడు.** దీనితో షిరడీలో చేరిన వ్యక్తులందరు సాక్షాత్ పరమేశ్వరుడు షిరిడీసాయిబాబా అని విశ్వసిస్తూ వచ్చారు.

బాబావద్ద ఉపదేశం పొందాలని ఆరాటపడుతూ రాధాబాయి అనే భక్తురాలు వచ్చింది. అది వ్యాసపూర్ణిమా కాలం. మంత్రోపదేశం చేసేదాకా ఆహారం తీసుకోనని పట్టుపట్టింది. మూడు దినాలు నిరాహార దీక్ష సాగించింది. కానీ బాబా అంగీకరించలేదు. అప్పుడు శ్యామ్ రాధాబాయి పక్షాన ప్రార్థించాడు. ఉపవాసములతో ఆమె ప్రాణంకూడా పోయేటట్లున్నదని చెప్పాడు. ఆమె చనిపోతే దయా హృదయుడైన బాబా ప్రతిష్ఠకు దెబ్బతగులుతుందని చెప్పాడు. నీరస పడిపోయిన రాధాబాయిని బాబాదగ్గరకు తీసుకువెళ్లాడు. ఎవరైనా గురువు దగ్గరకు పోయి ఉపదేశం పుచ్చుకొమ్మన్నాడు. 'బాబా! నేను ఇంకే గురువునూ ఎరుగను' అందామె.

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురాస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః

అనే శ్లోకానికి అర్థమేమిటని అడిగాడు బాబా. అయితే గురునామం ఎందుకు స్వీకరించరాదు? గురుముఖాన యింకొక నామం కోరటం ఎందుకు? గురువే దైవమైతే ఆయన చెప్పిన మాట తప్పకుండా, చూపించిన బాటలో నడిస్తే నామజపం చేసినంత ఫలితం సంపాదించవచ్చు. గురువును సంపాదించుకున్న తరువాత సర్వమూ ఆయనకే వదలాలి. మోక్షప్రాప్తికోసం కూడా ఆయనపైనే ఆధారపడాలి. మీకంటె మిమ్మల్ని గురించి గురువుకే ఎక్కువ తెలుసు. **మీకు ఏది అత్యంత శ్రేయోదాయకమో ఆమార్గం వెంట మిమ్మల్ని నడిపించగలడు. ఆయనకు దూరంగా తీసుకుపోయే వైఖరులు నిర్మూలించి ఆయనను అనుసరించటయే మీ కర్తవ్యము. ఈవిధంగా గురువును అనుసరిస్తే మీకు భోజనం ఎట్లా వస్తుందని మీరనుకోవచ్చు. భగవంతుడు మిమ్మల్ని తిండి లేకుండా చేయడని గట్టిగా మీరు విశ్వసించండి. ప్రభువు మీకు అన్నమే కాక అమృతం కూడా అందించగలడు.**

ఒక్కొక్కసారి బాబా 'అల్లామాలిక్! అల్లామాలిక్!' అని కేకలు వేసేవాడు. కానీ మరుక్షణంలో 'కృష్ణమాలిక్! రామమాలిక్! దత్తాత్రేయ మాలిక్!' అని అరిచేవాడు. అందుచేత బాబా హిందూమతస్థుడా లేక ఇస్లాం మతస్థుడా

అనే సందేహం బయలుదేరింది. బాబా అల్లామాలిక్ అని అరిచినప్పుడు అనేకమంది ముస్లింలు వచ్చి బాబా చుట్టూ చేరేవారు. అదేవిధంగా హిందువులు కూడా వచ్చి బాబాను ధూపదీపనైవేద్యములతో అర్చించేవారు. కనుక హిందువులు చేస్తున్న పని ముస్లింలకు, ముస్లింలు చేస్తున్న పని హిందువులకు నచ్చలేదు.

మహల్సాపతి ఖండోబా దేవాలయంలో పూజారి. అయితే ఇతనెప్పుడూ బాబావెంటనే ఉండేవాడు. ఇది మహమ్మదీయులకు నచ్చలేదు. ఒక హిందూ పూజారివచ్చి బాబాదగ్గర కూర్చున్నాడనే ద్వేషంతో ఒకనాడు మహమ్మదీయులు మహల్సాపతిని పట్టుకొని కొట్టారు. ఆ మహల్సాపతి తనను కొట్టిన ప్రతి దెబ్బకు 'బాబా! బాబా!' అని అరుస్తూ వచ్చాడు. ఈ విధంగా అతను అరుస్తున్నప్పుడు ఆ దెబ్బలన్నీ బాబాకే తగిలాయి. బాబా బయటకు వచ్చారు. మహమ్మదీయులకు కూడా బాబాపై అమితమైన విశ్వాసముండేది. బాబా బయటకువచ్చి ఒక్కసారిగా గర్జించాడు. 'సైతాన్! ఒకవైపున ప్రార్థించడం. మరొకవైపున దెబ్బలు కొట్టటం. ఇదేనా భక్తి? అన్నాడు. బాబా శరీరమునుండి రక్తము కారుతున్నది. ఈ దృశ్యము చూచిన మహమ్మదీయులు బాబావద్దకు పరుగెత్తికొని వచ్చి బాబా మిమ్మల్ని ఎవరు కొట్టారు? అని అడిగారు. ఇంతసేపు మీరేకదా నన్ను కొట్టింది అన్నాడు బాబా. బాబా మేము మీ దగ్గరకు కూడా రాలేదే. మహల్సాపతిని మాత్రమే కొట్టాము అన్నారు మహమ్మదీయులు. మహల్సాపతిలో ఎవరున్నారు? నేనే. అతని బాధలన్నీ నావే', అని బాబా పలుకగా మహమ్మదీయులందరూ బాబా. కాళ్ళు పట్టుకొని క్షమించమని ప్రార్థించారు. అప్పుడు బాబా మహమ్మదీయులను హిందువులను చేర్చి, **'నాయనలారా! మీరందరు ఒక తల్లి బిడ్డలే. ఇటువంటి కులమత భేదములను పెట్టుకోకూడదు. మతములో వెతికేవానికి మాధవుడు కనిపించడు. కులమతములన్నీ దేహమునకు సంబంధించినవే. మీ హృదయములో భగవంతుని వెతకాలి' అని బోధించాడు.**

ఒకానొక సమయంలో షిరిడీ బాబా ద్వారకామాయి యందు కూర్చున్నప్పుడు దామా, నానా అనే ఇరువురు భక్తులు పాదసేవ చేస్తున్న సమయంలో బాబా కొన్ని రాగినాణెములను ఆచేతినుండి ఈ చేతికి, ఈ చేతినుండి ఆ చేతికి మార్చుకుంటూ పరీక్షగా చూస్తున్నాడు. ఏదో కనిపించీ కనిపించకుండా ఉన్నదానికోసం వెతుకుతున్నట్లుగా ఆ నాణెములను త్రిప్పి చూస్తున్నాడే గాని ఆ యిరువురితో ఎట్టి సంభాషణా జరపటం లేదు. ఒక గంటసేపు బాబా ఈ పని చేస్తూ వచ్చాడు. ఈవిధంగా జరుగుతూ ఉంటే దామా 'బాబా! మీకోసం ఎంతోమంది కాచుకొని ఉంటే మీరు మాత్రం రాగినాణెములతో ఆడుకుంటున్నారేమిటి? చూచిన నాణెములనే తిరిగి చూస్తున్నారు. పరీక్షించిన నాణెములనే తిరిగి పరీక్షిస్తున్నారు. ఎందుకోసం వీటినంత పరీక్షగా చూస్తున్నారు?' అని ప్రశ్నించాడు.

అప్పుడు బాబా "అరె బేటా! నేను చేసిందే చేస్తున్నాను. చూసిందే చూస్తున్నాను. చెప్పినదే చెప్తున్నాను. ఆ ఎదురుగా నున్న మామిడి చెట్టును చూడు. చెట్టంతా పూసింది పూత. ఆకులే కనిపించటం లేదు. నిజంగా ఆ పూతంతా కాయలైతే చెట్టు ఉండగలదా?అట్లైతే దాని కొమ్మలన్నీ వంగి విరిగిపోగలవు. కానీ అట్లు కావటం లేదు. ఏమవుతున్నది? ఆ పూతలో కొంత గాలికి, మంచుకి మరికొంత, పక్షులు వ్రాలటంచేత మరికొంత రాలిపోతుంది. ఇంక మిగిలినవి కాయలుగా తయారయ్యే సరికి పక్షులు, ఉడుతలు, కోతులు మొదలైనవి వాటిని కొరికి వేస్తున్నాయి. ఈ విధంగా సుమారు తొంభై శాతము వృథా అయిన తరువాత ఏ పది శాతమో చెట్టుకు కాయలు కాస్తున్నాయి అదే విధంగా, నా దగ్గరకు ఇన్ని వేల మంది వస్తున్నారు. కానీ వీరందరు ఫలములుగా తయారౌతున్నారా! ఎంతమంది మధ్యలో రాలిపోతున్నారో. కొంతమంది ధనంకోసం, కొంతమంది విద్యకోసం, కొంతమంది వివాహములకోసం, కొంతమంది పిల్లల కోసం, మరి కొంతమంది ఉద్యోగాలకోసం. ఈవిధంగా అనేకరకములైన కోరికలతో వస్తున్నారు. వీరందరిలో

దోషాలే ఉన్నాయి. **వీరిలో నన్ను కోరేవారెవరూ లేరు. ఒక్కొక్కరు ఒక్కొక్క లౌకికమైన కోరికతో వస్తున్నారుగానీ, ఆత్మజ్ఞానము కోరివచ్చేవారు ఒక్కరైనా నాకు కనిపించటంలేదు. ఎంతో విలువైన నా ఖజానాకు నేను తాళం వేయకుండా పెట్టాను. కానీ దీనిని తీసుకునే వారెవ్వరు ఇంకా రాలేదు.** నేను చూస్తున్న నాణెములలో చాలా అరిగిపోయినవి ఉన్నాయి. వీటిలో గుంటపడినవి, సొట్టపోయినవి, రంధ్రము పడినవి కూడా ఉన్నాయి. ఈ నాణెములలో ఏవిధముగా దోషములున్నవో అదేవిధముగా వ్యక్తులందు కూడా దోషాలున్నాయి. ఆ వ్యక్తుల దోషాలనే నేను చూస్తున్నాను. ఈ నాణెములలో ఎన్నో గుంటలు, రంధ్రములు ఉన్నట్లుగా వ్యక్తులలో ఎన్నో దుర్గుణాలు, దురాలోచనలు ఉన్నాయి. ఇట్టి వారందరు నా ఫలములు భుజించగలరా? **నేను కావాలని కోరుతున్నారేగానీ తమ మనస్సంతా ప్రకృతిపైననే పెడుతున్నారు. నాకోసం తగిన ప్రయత్నం చేయటం లేదు. ఇంక నేనెట్లు లభ్యమవుతాను? ఇక్కడకు వచ్చే ప్రజలలో కోటికి ఏ ఒక్కరో నేను కావాలని ఆశిస్తున్నారు. ఇక్కడకు వచ్చేవారంతా భక్తులు కాదు. అందరిలోను అన్ని దోషాలు ఉంటున్నాయి. వారి బుద్ధులన్నీ బెండుబారి పోతూన్నాయి. అంతేకాదు. పరమభక్తులమని భావించేవారు ఇంకా కొంతమంది కాళ్ళనుండి తలవరకు అనుమానాలతో దైవత్వమును తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వీరందరు పాపులే గానీ పుణ్యులుకారు, భక్తులు కారు. ఇట్టి వారందరు నన్ను చేరగలరా!"** అన్నాడు.

అదే సమయానికి అక్కడకు ఒక ఠాకూరు వచ్చాడు. అతడు వస్తూనే బాబాను ఉద్దేశించి 'బాబా! నాకు కావలసినంత ధనము, సిరిసంపదలున్నాయి. కుమారులు కూడా ఉన్నారు. నాకు ఏవిధమైన అసంతృప్తిలేదు. కానీ బ్రహ్మజ్ఞానం కావాలనే కోరికతో ఇక్కడకు వచ్చాను. అన్నాడు. 'ఆ! మంచిదే. అయితే నీవు ఇక్కడ ఎంతవరకు ఉంటావు? అని బాబా ప్రశ్నించాడు. అప్పుడు ఠాకూరు నా తిరుగు ప్రయాణమునకు అయ్యే ఖర్చు కూడా బండివానికిచ్చి బండి పట్టుకొని వచ్చాను. మీరు ఇప్పుడు బ్రహ్మ జ్ఞానము నిస్తే తక్షణమే వెళ్ళిపోవాలను కుంటున్నాను. అన్నాడు. బాబా అతనిని కొంతసేపు ఉండమన్నాడు. ఇంతలో దామాను పిలిచి 'దామా! నాకు ఐదురూపాయలు కావాలి. వెంటనే ఊరిలోకి పోయి పటేలును అడిగి తీసుకురా! అన్నాడు. కొద్ది సేపటికి దామా తిరిగి వచ్చి పటేలు ఇంటి దగ్గర లేడు అన్నాడు. సరే అయితే షాపుయజమానిని అడిగి తీసుకోనిరా అని తిరిగి పంపించాడు. కొంతసేపటికి దామా వట్టి చేతులతో తిరిగి వచ్చాడు. బాబా అతనిని కిళ్ళీకొట్టువాని దగ్గరకు పోయి అడగమన్నాడు. ఈవిధంగా ఐదురూపాయల కోసం దామాను ఐదు పర్యాయములు పంపించాడు. అక్కడే నిలబడిన ఠాకూరు తనకు ఆత్మజ్ఞానం బోధించమని పలుమార్లు అడగుతున్నాడేగాని తన జేబునుండి ఒక ఐదురూపాయలనోటు కూడా తీసి యివ్వటానికి అతనికి మనసొప్పలేదు. చిట్టచివరకు బాబా ఈ ఠాకూర్‌ను చూసి, అరే ఠాకూర్ నీ ఎదురుగానే నేను ఐదురూపాయల కోసం దామాను ఐదుసార్లు పంపించాను. నీ జేబులో నున్న ఐదురూపాయల నోట్లు బాగా కనిపిస్తున్నాయి. ఒక్కటైనా తీసి యివ్వలేక పోయావు. ఓరి పిచ్చివాడా! **ధనంపైన ఇంత ఆశ ఉన్నవానికి దైవం పైన ఇష్టం కలుగుతుందా? ధనంపైన ఆశ ఉంటే ధనం వెంబడే వెళ్లు. వెంటనే టాంగా ఎక్కివెళ్ళిపో!** అన్నాడు. కానీ ఠాకూరు అక్కడనుండి కదలలేదు. వెంటనే బాబా కట్టె తీసుకున్నాడు. జావో సైతాన్! ఇటువంటివాడవు ఇక్కడకెందుకు రావాలి? ఆశించేది బ్రహ్మజ్ఞానం, కానీ నీ మనస్సునిండా ధనధాన్యం. తక్షణమే ఇక్కడనుండి నీవు వెళ్ళిపో. **'త్యాగేనైకే అమృతత్వమానశుః' త్యాగము చేయని వానికి ఆత్మజ్ఞానము ఎన్నోవేల మైళ్లదూరంలో ఉంటుంది.** ఈనాడు నీవు కేవలం ఐదు రూపాయలివ్వటానికి బాధపడుతున్నావు. కానీ, ఇవన్నీ ఏదో ఒకప్పుడు నీవు వదిలిపెట్టి పోవలసిందే. ఆనాడు ఏమి చేయగలవు? ఈ సత్యాన్ని గుర్తించు. ఇదే నిజమైన

ఆత్మజ్ఞానము అన్నాడు. ఈవిధమైన ప్రబోధములచేత భక్తుల మనస్సులలో మార్పులు కలుగుతూ వచ్చాయి.

(షి.పు.17/29)

షిరిడీకి బాబా వెళ్ళినప్పుడు ఏమీ లేదు. పాడుబడిన మసీదు మాత్రమే ఉండేది. అక్కడ చిన్న వేప చెట్టు పెరుగుతూ వచ్చింది. దానికి ఒకవైపు మాత్రమే నీడ ఉండేది. కొమ్మ అలా పెరిగింది. ఈ వేపచెట్టు నీడలో కూర్చొని సేద తీర్చుకొనేవాడు బాబా. ఎంతో శ్రమపడి భిక్షకు వెళ్ళివచ్చి అదే నీడలో కూర్చొనేవాడు. తరువాత లక్ష్మీబాయి అల్లుడు చిన్న మండపం కట్టించాడు. **'ఇన్ని సంవత్సరములు నాకు చల్లని నీడ నందించి ఎంతో ఉపకారం చేసిన ఓ వృక్షమా! నాకు హాయిని ఆనందమును అందించిన ఆ కొమ్మ ఎప్పుడూ మధురముగానే ఉండుగాక!' అన్నాడు. అందువల్లనే ఆ ఒక్క కొమ్మ ఆకులు తీయగా ఉంటాయిగానీ మిగతా కొమ్మల ఆకులు తీయగా ఉండవు. అనగా ఉపకారము చేసే వారికి ఫలితం ఎప్పుడూ ఉపకారముగానే ఉంటుంది. మనము చేసిన ఉపకారము ఎప్పటికీ వృథా కాదు.** తక్షణమే ఫలితం రాదని విచారమునకు గురికాకూడదు. కొంతకాలమైతే తప్పక ఫలితము వస్తుంది.

షిరిడీలో మహల్సాపతి ప్రతి దినము బాబాతో అదే రూములో నిద్రించేవాడు. ఒక చావడి ఉండేది. ఆ చావడిలో ఒక చిన్న పలక కట్టుకొని ఆ పలకపై పవళించేవాడు బాబా. ఆ పలక వెడల్పు ఐదు ఇంచిలు మాత్రమే. ఆజానుబాహుడైన, మంచి ఎత్తైన మనిషి బాబా. దానిపై పవళించేవాడు. వేరే స్థలము లేదు. దానిక్రింద మహల్సాపతి పడుకునేవాడు. ప్రథమంలో మహల్సాపతికి భయం. ఆ పలకను బాబా పాతపంచలతో వ్రేలాడ కట్టేవాడు. ఎప్పుడు తెగుతాయో ఏమిటో! మహల్సాపతి సన్నంగా ఉండేవాడు. క్రింద పడుకుంటే 'అంత పెద్ద మనిషి నాపై పడితే నేను బ్రతగ గలనా? అని భయపడిపోయేవాడు. రాత్రంతా నిద్రపోయేవాడు కాదు. ఎక్కడ కొంచెము శబ్దమైనా పరుగెత్తిపోయేవాడు. తన దైవత్వమును మహల్సాపతికి మాత్రమే నిరూపిస్తూ వచ్చాడు బాబా. ఒకనాటి రాత్రి బాబా 'ఛోటాభాయ్! లే' అన్నాడు. మహల్సాపతిని 'చోటాభాయ్' అని పిల్చేవాడు. మహల్సాపతి లేచి చూడగా పాతపంచలా మోసేది? కాదు, కాదు. నాశక్తియే అన్నాడు. అప్పుడు మరల చెప్పాడు. మహల్సాపతీ! ఎవరికి నీవు చెప్పవద్దు. అందరు నేను బ్రాహ్మణుడనని, మహమ్మదీయుడనని మరికొంతమంది పటేలునని ఈవిధముగా భావిస్తున్నారు. పత్రి గ్రామములో దేవగిరమ్మ, గంగాభవారియా అనే బ్రాహ్మణ దంపతులకు పుట్టిన వాడను నేను. ఈ మర్మము ఎవ్వరికీ చెప్పవద్దు. ఎందుకనగా ఆనాడు మహారాష్ట్రంలో హిందూ మహమ్మదీయులకు ద్వేషము ఏర్పడి ఒకరినొకరు చంపుకోటం జరిగేది. ఇది మంచిది కాదు. **మహమ్మదీయులలో మహమ్మదీయుడను. హిందువులలో హిందువుడను.** నన్ను హిందువని చెప్పవద్దు. మహమ్మదీయుడని చెప్పవద్దు అని మహల్సాపతితో మాట తీసుకున్నాడు. ఈ విధమైన కొన్ని రహస్యాలు ఎవరో ఒకరిద్దరికి మాత్రమే చెబుతూ వచ్చాడు. **ఏ అవతారమందూ అందరికీ తెలిసేది కాదు. రామావతారమందు లక్ష్మణునికి తప్ప మరెవరికీ చెప్పలేదు తనతత్త్వము. కృష్ణావతారమందు బలరాముడు ఎప్పుడూ ఉండేవాడే. కానీ కృష్ణునకు పరమమిత్రుడు ఉద్ధవుడు నీడవలె ఉండేవాడు. తానెప్పుడు దేహాన్ని వదిలేది ఉద్ధవునికే చెప్పాడు. అందరికీ చెప్పటానికి వీలుకాదు. దైవతత్త్వము అందరికి అర్థము కాదు.**

(షి.పు.30/31)

శ్యామ్ తల్లిదండ్రులు రిటైరైన తరువాత శ్యామ్‌ను షిరిడీ తీసుకు వచ్చారు. తల్లిదండ్రులు రిటైరైనందువల్ల షిరిడీలోనే నివసించేవారు. శ్యామ్ అక్కడే ఒక స్కూలులో టీచరుగా నియమింప బడ్డాడు. సాఠే పోయిన తరువాత క్రమక్రమేణా శ్యామ్‌ను దగ్గరకు తీశాడు బాబా. శ్యామ్ పగలంతా పాఠములు చెప్పటం క్లాసులైన తరువాత క్లాసురూంలోనే పడుకోవటం. ప్రక్కరూంలోనికి చూస్తూ ఉండేవాడు శ్యామ్. బాబా తనలో తాను మాట్లాడుకోటం, తనలో తాను

నవ్వుకోవటం. తనలో తాను అనేక చర్యలు చేయటం చేస్తూ ఉండేవాడు. బాబా తాను పండుకునే పలకను పైన రెండు తాళ్ళతో కట్టాడు. అది సన్నటి చెక్క. ఆ చెక్కపైన పడుకొని ఊగుతూ ఉండేవాడు. అందుకే శ్యామ్‌కు భయము. నిద్రలో క్రింద పడిపోతారో యేమో! చిన్న పలక కదా! అని దినమూ చింతిస్తూ ఉండేవాడు. ఒకనాడు బాబా పాదములు వత్తుతూ ఉండగా స్వామీ! రాత్రంతా మీరు నిద్రపోవటం లేదే. ఏదో నవ్వుకుంటున్నారు. మాట్లాడుకుంటున్నారు. దీని అంతరార్థము చెప్పాలని ప్రార్థించాడు. **'పిచ్చివాడా! నీవు ఒక్కడివేనా ఉండేది లోకములో? ఎంతమందో నాకోసం ప్రార్థిస్తున్నారు. వారందరితో మాట్లాడుతున్నాను అన్నాడు. నా వ్రేలు త్రిప్పటమంటే మనస్సు త్రిప్పటమే. వారితో మాట్లాడటమే నా పెదవులు చేసేపని. వారి యొక్క పిచ్చితనాన్ని చూచి నవ్వటమే నా సరదా. ఇవన్నీ భక్తులకోసం చేసే చర్యలే నాయనా!'** అని సమాధానం చెప్పాడు.

బాబాకు కోపం లేదుకానీ ప్రదర్శించేవాడు. కోపంవస్తే పదడుగుల దూరంలో ఉండినా కట్టి తీసుకొని వారిపై విసిరేవాడు. ఒకరోజు తిరిగి శ్యామ్ ప్రశ్నించాడు. **'స్వామీ ఇంతకోపంగా వారిని కొడుతున్నారే. వారికి ఏమైనా ప్రమాదం కలిగి ప్రాణం పోతే మీకు అపకీర్తి వస్తుంది కదా!'** అని. అరె సైతాన్! భైతో. ప్రాణం నాచేతిలో ఉంటున్నది. నేను పంపిస్తే కదా వాడు పోయేది. కాబట్టి నేను పోకుండా చూచుకుంటాను. నీవు నీపని చేయి. అన్నాడు. 'నీకెందుకీ విషయంలో విచారము? ఈ రకమైన నటన నేను చేసినప్పుడే వాడు సరైన స్థితికి వస్తాడు. మంచిగా పోతే నాతలపై కూర్చుంటాడు. కనుకనే కఠిన పదములచేతను, కఠిన వాక్యముల చేతను, కొంతవరకు వారిని బెదిరించి అదలించి పనిచేయించాలి. కార్య నిమిత్తమై నేను కోపము నటిస్తానుగానీ నాకు కోపం లేదు' అని ఒక శ్యామ్‌కే లోపలున్న రహస్యం చెప్పాడు. అతనితో సేవలు చేయించుకుంటూ కాలము గడుపుతూ వచ్చాడు.

(షి.పు.33/34)

బాబా ఎవరు వచ్చినా ముందు దక్షిణ తీసుకొనేవాడు. మరీ అధికంగా కాదు. సాధారణంగా రెండు రూపాయలు దక్షిణ అడిగేవాడు. ఎందుకోసమంటే, ఒకటి భక్తి రెండవది శ్రద్ధ. ఈ రెండూ నాకు ఇవ్వండి అనేవాడు. ఈ రెండూ విత్తనములలో రెండు బద్దల వంటివి. రెండు బద్దలూ చేరినప్పుడే మొక్క వస్తుంది. బద్దలు వేరువేరైనప్పుడు మొక్కరాదు. భక్తి, శ్రద్ధ రెండు బద్దలవలె చేరిపోవాలి. అప్పుడే ఆనందమనే మొక్క ఆవిర్భవిస్తుంది.

అక్కడ తీసుకున్న దక్షిణ అక్కడే వారి ఎదురుగానే యిచ్చేవాడు బాబా. ఒక్కటీ తన దగ్గర ఉంచుకునే వాడు కాదు. ఒకనాడు ప్రధాన్ అనే వ్యక్తి వచ్చాడు. అతను బాబాకు ఇరవై రూపాయలివ్వాలనుకున్నాడు. ఆనాడు అన్నీ నాణెములే. వెండి రూపాయలుండేవి. ఇంత చిల్లర ఎలా యిచ్చేదని ఒక బంగారు నాణెము (సవర) తీసుకొని యిచ్చాడు. దానిని బాబా అటు యిటు తిప్పిచూచాడు. ప్రక్కనున్నవాడు 'ఇది బంగారు నాణెం' అన్నాడు. దీనికి ఎన్ని రూపాయలు? అడిగాడు బాబా. సవరకు పదిహేను రూపాయలని చెప్పాడు.అప్పుడు బాబా ప్రధాన్! ఇంకా ఐదు రూపాయలు రావాలి అన్నాడు. అతను జడ్జి ఏమిటి? సవరకు పదిహేను రూపాయలు. సరిగానే యిచ్చానే. ఎందుకిలా అడగుతున్నారు? అని అనుమానం బయలు దేరింది. మొదట ఐదురూపాయలిచ్చి తరువాత యోచన చేయి అన్నాడు బాబా. నీవు ఇంటిదగ్గర ఏమనుకొని వచ్చావు? ఇరవైరూపాయలు యివ్వాలనుకున్నావు. ఇప్పుడు పదిహేను రూపాయలే యిచ్చావు. ఇంకా ఐదురూపాయలు రావాలి కదా! ఇవ్వు అన్నాడు. దానితో ఆ జడ్జి నిర్ఘాంతపోయాడు. సరైన జడ్జి బాబాయే అనుకున్నాడు. ఈవిధంగా వచ్చినవారి దగ్గర డబ్బు తీసుకోవటం అప్పటికప్పుడే బీదవారికి ఇచ్చివేయటం బాబాకు అలవాటు.

షిరిడీలో బాబా కేవలం ఉపన్యాసాలతో జ్ఞానబోధ చేయలేదు. ఎందుచేతనంటే ఆనాటి వాతావరణము ఆవిధంగా ఉండేది. సాయి ప్రేమమయుడు. ఆయనలో కోపముగానీ ద్వేషముకానీ లేవు. దీని కెన్నియో ఉదాహరణ

లున్నాయి. ఒకానొక సమయంలో దాదాసాహెబ్ భార్య తన బిడ్డను తీసుకొని షిరిడీలో కొన్నిరోజులుండాలని వచ్చింది. ఆ సమయంలో అక్కడ ప్లేగు వ్యాధి అధికంగా ఉండేది. షిరిడీలో ఆ బిడ్డకు జ్వరం వచ్చింది. ఒళ్ళంతా పెద్దపెద్ద బొబ్బలు వచ్చాయి. ఆ బిడ్డను అక్కడవదలి ఆమె మసీదుకు వెళ్ళి బాబా!బాబా! అని దీనంగా ప్రార్థించింది. ఏమి వచ్చావు? నీ బిడ్డకు జ్వరం వచ్చి బొబ్బలు పుట్టాయా? నీబిడ్డకే కాదు, నాకు కూడా ఉన్నాయి. అని తన చొక్కా తీసి చూపించగా అక్కడ పెద్ద పెద్ద బొబ్బలు కనిపించాయి. అప్పుడు మహాల్సాపతి కూడా అక్కడే ఉన్నాడు. అప్పుడు బాబాకు 105/106 డిగ్రీల ఫారెన్ హీట్ వరకు జ్వరం వచ్చింది. అయ్యో పాపం! నా కుమారునికే కాక మీకుకూడా వచ్చిందా! తమను రక్షించే వారెవరు? అని చింతించి, వెంటనే **'సర్వజీవరక్షకుడవైన నిన్ను రక్షించేవారు ఇంకొకరున్నారా స్వామీ! నా అపరాధము క్షమించు'** అని లెంపలు వేసుకొంది. మరి కొంతసేపటికి జ్వరం తగ్గిపోయింది. ఆమె ఆనందముతో ఇంటికి వచ్చి చేసేసరికి తన బిడ్డకు జ్వరం లేదు. బొబ్బలు లేవు. బాబా! నాబిడ్డ బాధను నీవు స్వీకరించి రక్షించావా అంటూ ఆమె కృతజ్ఞతలు తెలుపుకొంది.

పిళ్ళేయని ఒక డాక్టరు. అతడు బాబాయెడ సద్భావము కలవాడు కాదు. వారి మహిమలను గూర్చి ఛలోక్తులతో విపరీత ప్రసంగములను అప్పుడప్పుడు చేస్తుండేవాడు. కొంతకాలానికి అతనికి పరిణామ శూల ఏర్పడి చాల బాధింపజొచ్చింది. తనకు తెలిసిన మందులన్నీ వాడి చూశాడు. పెద్ద పెద్ద డాక్టర్లవద్ద చికిత్స చేయించుకున్నాడు. బాధ తగ్గలేదు. అది అంతకంతకు అధికమైంది. ఆ బాధ భరింపలేక ఆత్మహత్య తప్ప దీనికి మందేలేదనే నిశ్చయానికి వచ్చాడు. అట్టి స్థితిలో అతని ఆప్తమిత్రుడు, బాబా భక్తుడు అయిన కాకాసాహెబ్ అయ్యా! నీ అహంకారం తగ్గించుకొని బాబా పాదములపై పడు. నీ బాధ తొలగిస్తారిని బోధించాడు. బాధ కోర్వలేక బ్రతుకు మీద ఆశచేత అతడు బాబాను దర్శించి పాదాలపై బడి మ్రొక్కి లేచి వినమ్రుడై నిల్చున్నాడు. బాబా ఒక్క నిముష మాతని జూచి చిరునవ్వుతో ఏమోయీ! పరిణామశూలతో బాధపడుతున్నావా? భయపడకు భగవంతుని నమ్మి ధ్యానించుకో. ఆ బాధ నీజోలికి రాదు అని ఉపదేశించి ప్రసాదమిచ్చి పంపివేశాడు. ఆనాటితో ఆ బాధ అతణ్ణి వదలిపోయింది. ఎక్కడికి పోయింది? దానిని బాబా తీసుకున్నాడు. అది వారి అజ్ఞమేరకు కొన్ని దినములుండిన తరువాత తన దారిని తాను పోయినది. ఈ విధంగా బాబా ప్రతివిషయానికి ఎప్పటికప్పుడే ఫలితాలను చూపించాడు. దీనికి కారణం ఆనాటి పరిపూర్ణ విశ్వాసమే. వారు బాబా మాటలను తు.చ. తప్పకుండా పాలించేవారు. కానీ ఈనాడు అదిలేదు. ఏదైనా చెబితే దానికి పది ప్రశ్నలు వేస్తారు. ఇది ఈనాటి విద్యయొక్క ప్రభావమే. ఈనాటి మానవుడు ఏ ఉపకారము పొందినప్పటికి మహాక్రూరుడుగా, కృతఘ్నుడుగా మారిపోతున్నాడు. మంచిని మరచిపోయి చెడును మాత్రం హృదయంలో పెంచుకుంటున్నాడు. కనుక మానవుని యందు అసురత్వం పెరిగిపోయింది. **ఏది కోరినా స్వార్థమే. తన కోరిక తీరిన బాబా!బాబా!! యని నవ్వుతూ వస్తారు. లేనిచో పూర్తిగా మారిపోతున్నారు. ఇంతటి క్రూర మృగాలుగా మారితే మానవత్వంలో బాబా భక్తి ఏవిధంగా అభివృద్ధి కాగలదు? ఈనాడు ఆకారము మానవునిగా ఉన్నదిగానీ ప్రవర్తన మాత్రం మృగమువలె ఉన్నది.**

షిరిడీలో ఒకానొక సమయంలో (1916) పెద్ద తుపాను వచ్చింది. భరించుకోలేక పోయారు షిరిడీ ప్రజలు. వడగళ్ళు రాళ్లవలె కొట్టేస్తున్నాయి. పనిచేసేవారు, పల్లెప్రజలు అందరు ద్వారకామాయికి పరుగెత్తి వచ్చారు. ద్వారకామాయి చిన్నదిగా ఉంటున్నది. ఎక్కడ స్థలం చిక్కితే అక్కడంతా ప్రవేశించారు. అందరూ బాబా! రక్షించండి. రక్షించండి అన్నారు. ద్వాపరయుగంలో ఇంద్రుడు రాళ్ళవర్షం కురిపించినప్పుడు ఆ గోపికలు గోపాలురు వెళ్ళి ఓ కృష్ణా! కాపాడు, కాపాడు అని ప్రార్థించినట్లుగా షిరిడీ ప్రజలందరు బాబాను ప్రార్థించారు. అప్పుడు బాబా అచ్చా దేఖేగా

దేఖేగా అని ముందుకు పోయాడు. స్తంభాన్ని పట్టుకు కొట్టాడు. అయ్యా! చాలు ఇంక రౌద్రము శాంతించు, ఎక్కువ క్రోధము ఉపయోగపెట్టావు. అందరూ నీకు భయపడి పోయారు. నీ ప్రతాపాన్ని తెలుసుకున్నారు. నీవు అధికప్రతాపాన్ని ప్రదర్శించకు. చల్లబడు అన్నాడు. క్షణంలో తుపాను ఆగిపోయింది.

ద్వారకామాయిలో అగ్నిగుండము (ధుని) ఉంటున్నది. ధునిలో కట్టెలు వెయటం సాంప్రదాయం. భక్తులు ధునిలో కట్టెలు వేస్తే మంచిదని, అందులోను ఆడవారికి పిచ్చిభక్తి, కాబట్టి కట్టెలు కొని మరీ వేసేవారు. ధునిలో కట్టెలు వేశామని తృప్తి పడేవారేకానీ దానివల్ల ఆ మసీదు ఆ మంటలను భరించగలదా! అని ఆలోచించేవారు కాదు. అందులో కట్టెలు వేయటం వారికి తృప్తినిచ్చేది. ఒకరోజు కొంతసేపయ్యేటప్పటికి పెద్దమంట ప్రారంభమైంది. శ్యామ్ వచ్చాడు. దాదా, దాదా అని పిల్చాడు. క్యా హోగయా? అన్నాడు బాబా, దేఖో! అగ్ని హోత్రుడు ప్రత్యక్ష మయ్యాడు. చూచేవారెవరున్నారు! ఇక్కడ ఎవరూ లేరు. ఎవరూ లేనప్పుడు నీ ప్రతాపము ఎందుకు చూపుతావు? నీకు బుద్ధి చెప్పేవారు లేక పోతున్నారు. అనవసరమైన దగ్గర నీ ప్రతాపమెందుకు? అని స్తంభాన్ని పట్టుకొని కొట్టాడు బాబా. క్షణములో అగ్ని చల్లారిపోయింది.

(షి.పు.35/38)

షిరిడీ బాబాను కొంతమంది పిచ్చివాడని భావించేవారు. మరికొంత మంది ఇతడొక ఫకీరని విశ్వసించేవారు. భగవంతుడు పిచ్చివాడను కొన్నవారికి పిచ్చివాడుగనే కనిపిస్తాడు. ఫకీరనుకొన్నవారికి ఫకీరుగానే కనిపిస్తాడు. ఒకొనొక సమయంలో బాబా అప్పా కులకర్ణి అనే వానిని పిలిచి తన జేబులో నుండి రెండు కాసులు తీసి యిచ్చి నీవు వెళ్ళి నానాను తీసుకొని రా! అన్నాడు. అప్పుడు నానా తహసీల్దారు పనిచేసేవాడు. ఆకాలములో తహసీల్దారు అంటే అందరికీ అమితగౌరవం. అంతేకాక నానా గొప్ప విద్యావంతుడు. మంచి పర్సనాలిటీ గలవాడు. అందుచేత అతనికి అహంకారం కూడా అధికంగా ఉండేది. ఈ కులకర్ణి నానాను కలుసుకొని 'బాబా మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు. 'అన్నాడు.

ఛీ! ఎక్కడో ఎవరో ఒక ఫకీరు నన్ను రమ్మంటే నేను రావాలా! నీకు బుద్ధి లేదా? వెళ్ళిపో అన్నాడు. కులకర్ణి తిరిగి వచ్చి ఈ మాటలు బాబాకు చెప్పాడు. కానీ బాబా నేను నానాను చూడాలి. నేను నానాను చూడాలి అని అనేక పర్యాయములు పిచ్చివానివలె పలవరిస్తున్నాడు. అప్పుడు కులకర్ణి ఏమిటిది? ఈ నానా నన్ను కూడా అవమానపరుస్తున్నాడే ఇంత అహంకారియైన నానాను చూడవలసిన అవసరం ఏమిటి? అతనిపై బాబాకు ఎందుకింత ఆప్యాయత? అని యోచించాడు. కానీ అర్థం చేసుకోలేక పోయాడు. కడపటికి నానా కాళ్ళు పట్టుకొని బాబా నిన్ను చూడాలని ఆశిస్తున్నారు. మీరు తప్పక రావలసిందే అని ఏడ్చాడు. అప్పుడు నానా నీవు బాధపడుతున్నావని వస్తున్నానుగానీ బాబాను చూడటానికి కాదు. అతణ్ణి చూడవలసిన అవసరం నాకు లేదు అని పలికి షిరిడీ వచ్చాడు. కానీ బాబాకు నమస్కారం చేయలేదు. కనీసం చేతులైనా కట్టుకోలేదు. నేను అధికారిని. నీవు బికారివి. నాతో నీకేమి పని. ఎందుకు నన్ను రమ్మన్నావు? అని ప్రశ్నించాడు.

నానా ఎన్నిసార్లు కబురు చేసినా ఎందుకు రాలేదు? నాకు నీకు యిప్పుడు కాదు సంబంధము. నీవు మరచి పోయావు. నాకు ఎరుక ఉంది. దగ్గరకు రా అన్నాడు బాబా. నన్ను క్రింద కూర్చోమంటున్నాడే అని చాలా యిబ్బందిగా ఉన్నాడు లోపల. ఇంతమందిలో బాబా మాట వినకపోతే అవమానమవుతుందని దగ్గరకు వచ్చాడు. ఆయన చేసే తప్పులన్నీ చెప్పాడు బాబా. 'తహసీల్దారుగా ఉన్నావు. గవర్నమెంటు భూములు స్వంతం కోసం ఉపయోగ పెడుతున్నావు. ఇది మంచిది కాదు. ప్రజలను సరైన స్థితిలో పెట్టేందుకు ఈ ఉద్యోగం వచ్చింది. నీవు చేస్తున్నది చాలా తప్పు అన్నాడు బాబా. ఇలా చెప్పటంతో నానా అనుకున్నాడు. ఈయన బికారి కాదు. చాలా గొప్పవాడు!' అని 'పైవారం రా' అన్నాడు బాబా.

తరువాత వారం వచ్చాడు నానా. బాబా వేదాంత విషయాలు

మాట్లాడుతున్నాడు అక్కడున్న వారితో. నానా మంచి వయస్సులో ఉన్నాడు. ఈ లోపల ఒక ముస్లిం దంపతులు వచ్చారు. వారు చిన్న వయస్సు వారే. ఆమె ముసుగు వేసుకు వచ్చింది. ముస్లింలకు అది సహజం. ముఖం కప్పుకుంటారు కానీ నమస్కారం చేసినప్పుడు గాలికి ముసుగు లేచిపోయింది. ఆమెను చూచాడు నానా, కళ్లార్పకుండా. ఊరకే చేస్తున్నాడు ఆమెవైపు బాబా కనిపెట్టాడు. **"కన్నులను చూడటానికి యిచ్చినది నిజమేగాని కన్నులు చూచినాయని బుద్ధిని పెడమార్గం పట్టించటం తప్పు. చూచేది కన్నులు. బుద్ధిని ఎందుకు మారుస్తావు? భగవంతుడు కన్నులు చూచేందుకిచ్చాడు. తప్పులేదు. కాని బుద్ధిని పెడమార్గం పట్టించటం తప్పు!"** అన్నాడు. ఇంతమందిలో ఈరకంగా అవమానం చేశారని నానా చాలా బాధపడ్డాడు. బాబా! ఇంతమందిలో నన్ను అవమానం చేయవచ్చునా? అని అడిగాడు. యువకులకు గుంపులో అవమానము చేస్తేనే బుద్ధి వస్తుంది. ఒంటరిగా ఏమి చెప్పినా వినరు. చిన్న ఉదాహరణ: నీరూములో నీవు కూర్చుని పాత పంచ, బనీను వేసుకొని ఇల్లు శుభ్రం చేసుకుంటుంటే సిగ్గుపడవు. కానీ ఎవరైనా వచ్చిచూస్తే మంచి బట్టలు వేసుకొని వస్తావు. ఒంటరిగా ఉన్నప్పుడు ఏ డ్రస్సుతో నైనా ఉంటావు. అక్కడ అభిమానం లేదు. పదిమందిని చూచేటప్పటికి అభిమానపడుతున్నావు. అభిమానపడినప్పుడు చెడ్డను దూరం చేసుకుంటావు. మంచిని దగ్గర చేర్చుకుంటావు. పదిమందిలో చెబితే మంచి భావములు అలవర్చుకుంటావు. లేకపోతే యింకొకసారి బయటపెడతానేమో ననే భయం ఉంటుంది. **అదే పాపభీతి. పాపభీతి ఉన్నప్పుడే దైవప్రీతి అభివృద్ధి చేసుకుంటావు. దైవప్రీతి ఉంటే సంఘనీతి పెరుగుతుంది అన్నాడు బాబా.**

మరల తరువాత వారం కూడా వచ్చాడు నానా. 'బేటా బైఠో' అన్నాడు బాబా. 'నానా కూర్చున్న తరువాత బాబా అతనితో నానా! ప్రస్తుత జన్మలో నీకు, నాకు సంబంధము లేదు. కానీ పోయిన జన్మలో మనిద్దరికి చాలా సన్నిహిత సంబంధముంది. అందుచేత నిన్ను చూడాలని ఆశించాను' అని బాబా లేచి తన హస్తమును నానా కన్నులపై పెట్టాడు. అప్పుడు నానాకు పూర్వం తానెవరో, బాబా ఎవరో స్పష్టంగా కనిపించింది. తక్షణమే బాబాకు సాష్టాంగనమస్కారము చేశాడు. 'బాబా! నన్నుక్షమించండి. **మీకు తెలిసినా తెలియని వారిలా ఉంటారు. మాకు తెలియకపోయినా తెలిసినట్లు నటిస్తాము'** అన్నాడు.

అప్పటినుండి నానా బాబాకు అత్యంత సన్నిహితుడుగా మారి పోయాడు. బాబాకు హుక్కా నానాయే అందించేవాడు. 'ఛీ! ఈ పిచ్చివాని దగ్గరకు రావలసిన అవసరమేమిటి నాకు' అని బాబాను నిందించిన నానా, చివరకు బాబాయే తన ఆరవప్రాణంగా విశ్వసించాడు. బాబా లేక నానాగానీ, నానా లేక బాబాగానీ భోజనం చేసేవారు కారు. ఆయన లేకుండా 'ఈయన భోజనం ఎందుకు చేయకూడదు.' అని కొందరు విమర్శించేవారు. 'అది నా ఇష్టం మీరెవరు చెప్పేందుకు నానా ఉంటేనే భోజనం చేస్తాను' అనేవాడు బాబా. ఎవరే జన్మలో ఏవిధంగా ఉండేవారో, ఈనాడు ఈ జన్మ ఏరీతిగా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. కొందరికి ఎట్టి కారణములూ లేకుండానే కార్యములు జరుగుతుంటాయి. వారు ఆశించకపోయినా భగవంతుడే వారిని తన దగ్గరకు లాక్కుంటాడు. **దీనికి కారణం పూర్వజన్మ కర్మ ఫలితమే. నిన్న విత్తనము లేక ఈనాడు మొక్క రావటానికి వీలులేదు కదా! అనేక జన్మల సంస్కారము ఒక్క జన్మలో ఫలించవచ్చు.** మీరు ఏ జన్మలో ఏవిధమైన రూప నామములు ధరించారో చెప్పలేరు. కారణం ఏమిటి? ఈ జన్మలోని రూపనామములపై మీకు గల అభిమాన మమకారముల చేత పూర్వజన్మలోని రూప నామములను మీరు పూర్తిగా మరచిపోతుంటారు.

ఒకానొక సమయంలో భక్తుడైనా నానా కుమార్తె మీనా ప్రసవవేదనతో బాధపడుతోంది జామ్నేరులో. మూడు నాలుగు దినములైపోయింది. చాలా నీరసించింది. ఆమె ప్రాణము ఉంటుందో లేదో అనే సందేహస్థితి వచ్చింది.

నూరు సంవత్సరముల క్రితము ఎట్టి వైద్యమూ ఎట్టి ఆసుపత్రులూ, నర్సులూ ఉండేవారు కాదు. నానా నిరంతరము బాబా పటము దగ్గర 'బాబా, బాబా, బాబా నా కుమార్తెను రక్షించు', అని ప్రార్థించాడు. **భక్తుడు ఎక్కడ ఏవిధముగా ప్రార్థించినా భగవంతునికి ఒక కనెక్షను ఉంటున్నది. వైర్‌లెస్ కంటె ఎక్కువ వేగముతో చేరుతుంది. భక్తునికి, భగవంతునికి హృదయంనుండి హృదయానికి సంబంధము.** తక్షణమే బాబాకు తెలిసింది. అక్కడ రాంగిర్ బాపూ అని ఉండేవాడు. అతనిని బాబా 'బాపూ' అనిపిలిచే వాడు. 'బాపూ! రా. ఈ విభూతి తీసుకొని జామ్నేరు గ్రామములో నున్న నానాకు అందించు' అన్నాడు. 'ఆజ్ఞ' అన్నాడు బాపూ. జేబులో చూచుకున్నాడు. రెండు రూపాయలున్నాయి. జలగాం వరకు రైలులో పోవచ్చు. జామ్నేరు పోవటానికి అతని దగ్గర డబ్బులు లేవు. 'బాబా! నాదగ్గర కాసులు లేవు. నన్ను ఎలా వెళ్ళమంటారు? అని అడిగాడు. 'ఓరే! పిచ్చివాడా! నేను చూచుకుంటాను పొమ్మన్నాడు. **నీకు పని ఎప్పుడు చెప్పానో దానికి తగిన సదుపాయములు నేను చూసుకుంటాను. సందేహములకు చోటివ్వకు అన్నాడు. అట్లే రామావతారమందు రాముడు హనుమంతుని ఆజ్ఞాపించాడు. 'హనుమా! నీవు సీతాన్వేషణ చేయాలి' అని.** సీతాన్వేషణాసమయంలో తాను అంత పెద్ద సముద్రమును దాటగలనా? అని హనుమంతుడు మొదట కొంత సందేహించాడు. కానీ ఆజ్ఞాపించిన భగవంతుడే ఈ కార్యములో అన్నీ చూచుకుంటాడనే ధైర్యముతో వెళ్లాడు. **అతనిది పరిశుద్ధమైన విశ్వాసము. అచంచలమైన విశ్వాసము.** బాపూ కూడా మొదట సందేహముతో ప్రశ్నించాడు. బాబాను, నాదగ్గర రెండు రూపాయలున్నాయి. నేను అంత దూరము ఎట్లా పోవాలి? జలగాం నుండి ముప్పైమైళ్ళు పోవాలి. ఆరోజులలో టాంగాలు మాత్రమే ఉండేవి. ముప్పై మైళ్ళు టాంగాలో వెళ్ళాలి లేక నడిచి వెళ్ళాలి. ముప్పైమైళ్ళు నడవగలనా? అని సందేహిస్తుండగా బాబా ధైర్యము నిచ్చాడు. **'నామాటలు విశ్వసించు. నా ఆజ్ఞ శిరసావహించు. నీవు వెళ్లు' అన్నాడు.** జవాబు చెప్పకుండా జలగాం వరకు రైల్లో వెళ్ళాడు. రాత్రి ఒకటిన్నర గంటలకు జలగాం చేరాడు. నేను ఎక్కడికి పోయేది ఈ చీకటిలో? ఏవిధముగా కాలము గడపాలి? అని అక్కడ కూడా కన్నులు మూసుకొని బాబాను ప్రార్థించాడు. ఒక బిళ్ల జవాను వచ్చాడు. పాతకాలములో తహసీల్దారు వెంట బిళ్లవేసుకొని జవాను ఉండేవాడు. ఆ జవాను ఆజానుబాహుడు. 'ఎవరండీ బాపూ, ట్రైనులో దిగారు షిరిడీ నుండి' అని కేకలు వేసుకుంటూ వచ్చాడు. బాబా పంపితే వచ్చాను. నా పేరు బాపూ అన్నాడు రండి రండి. మీకోసం టాంగా కాచుకొని ఉంటున్నది అన్నాడు. 'ఎక్కడ నుండి వచ్చినది?' అడిగాడు. 'నానా సాహెబు పంపించారు' అన్నాడు. టాంగాలో కూర్చున్నాడు. తాను కూర్చుంటే టాంగా నడచినట్లేలేదు. అంత స్పీడుగా పోతున్నది.తనలో అనుకుంటున్నాడు ఎంత స్పీడుగా పోతున్నదని. ఈ విధంగా తలచు కుంటుంటే గ్రామము వచ్చింది. 'అదే నానా ఇల్లు' అని చూపించాడు. ఆయన దిగాడు. ముందుకు నడచి తిరిగి టాంగావానితో చెబుదామని వెనుకకు తిరిగాడు. టాంగా లేదు. టాంగా నడిపేవాడూ లేడు! సరే ఇంటికి వచ్చి చేరాడు. నానా సాహెబ్ గారూ! ఇదిగో బాబా విభూతి పంపించారు! 'ఎప్పుడు పంపారు?' 'నిన్న సాయంకాలమే పంపారు. రాత్రి ఒకటిన్నర గంటలకు స్టేషను చేరాను. మీకు ఎట్టా తెలిసిందో ఏమిటో! మీరు టాంగా పంపటం చేత శీఘ్రంగా మీయిల్లు చేరగలిగాను' అన్నాడు. నానాకు ఆశ్చర్యం వేసింది. 'నా దగ్గర టాంగా లేదే? నేను ఎవరినీ పంపలేదే!! మీరు వచ్చే విషయం నాకు అసలు తెలియదే!! ఎందుకు ఈ విధంగా చెబుతున్నారు? ఆ టాంగా ఎక్కడుంది చెప్పమ'న్నాడు. 'అయ్యా! దిగిన వెంటనే టాంగా కనిపించలేదు. అతను మీరు పంపినట్లు చెప్పాడు. అన్నాడు.' మాటలకు సమయము కాదు మొట్టమొదట పేషెంటు ఊది ఇవ్వాలని లోపలకు వెళ్లి ప్రసాదము ఇచ్చాడు. బాబా పటము దగ్గరకు వెళ్లి ప్రార్థన చేశాడు. బాబా! బాబా!! బాబా!!! అని అరిచాడు. ఆ అరుపులోపలనే

షిర్డి సాయిబాబా

బిడ్డ అరుపులు వినిపించాయి. కుమారుడు పుట్టాడు. ఆనందముతో 'బాపూ దగ్గరకు వచ్చి బాపూ! ఏమి జరిగిందో చెప్పు. బాబా ఏమి చెప్పారు? ఏవిధంగా వచ్చావు?' అని అడిగేటప్పటికి రెండు రూపాయలతో నేను బయలుదేరాను. **అన్ని సదుపాయములు బాబాయే చేశారు. నమ్మిన వారిని బాబా వదలరు. నమ్మకమే ప్రధానమైనది. నమ్మకమునే నయనములను మనము కోల్పోయినాము.** ఈనాడు నమ్మిపని చేస్తే దేనిలోనైనా విజయము చేకూర్చుకోవచ్చు. ఈ నమ్మకము చేతనే నేను ఇంత ఆనందము పొందగలిగాను. మూడవ దినము బాపూ, నానా షిరడీ వెళ్లారు. 'బాబా! ఏమి నీయొక్క నాటకము! ఏమి నీ సందేశము! ఏమి నీ లీలలు! ఇవి వర్ణనాతీతమైనవి' అని కొనియాడారు.

(షి.పు.41/46)

ఒకసారి షిరిడీలో శ్రీరామనవమి, ముస్లింల బక్రీద్ పండుగ రెండూ జరిగాయి ఒకేరోజు.

(షి.పు.47)

మీ చరిత్ర హరికథగా వ్రాయాలి. ఎక్కడ పుట్టారు? తల్లిదండ్రులెవరు? ఎక్కడ పెరిగారు? అని అడుగుతూ వచ్చాడు దాస్‌గణునాకు పుట్టుక లేదురా దాస్‌గణు. నాపేరు బాబాయే. నేను దేవుని నుండి వచ్చానేగానీ పుట్టలేదన్నాడు బాబా. ఈ విధంగా జవాబు చెబితే ఎవరికీ అర్థం కాదు. ఒకసారి మాత్రం దాస్‌గణున పిల్చి చెవిలో చెప్పాడు **పత్రిగ్రామ సముద్భూతం - ద్వారకామాయి వాసినం.** అప్పుడు అతనికి, అందరికి బాబా పత్రిలో పుట్టారని తెలిసింది.

(షి. పు. 50)

షిర్డి సాయిబాబా

నిజమే మీకు నేనే షిర్డీసాయిబాబా అని తెలియుట కష్టమే. ఇటీవల బెంగుళూరురోడ్డులో బాగేపల్లి అనుచోట వెంకటరామన్ అను ఆయన బిడ్డకు (సుధా అని పేరుగల బాలికకు) జబ్బు చేసినపుడు, నేను ముసలివాని వేషమున జోడిఅదిపల్లె సోమప్ప అను పేరున కనబడి ఆ బిడ్డ ప్రాణము రక్షించితిని. వెంకట్రామన్ నా విషయము పూర్తిగా తెలిసినవాడయ్యాను, మారువేషముతో నున్న నన్ను గుర్తింపలేకపోయె గదా! ఇప్పటి మారురూపమున నున్న నన్ను షిర్డిబాబాయే అని యెట్లు సామాన్యులు తెలియగలరు? ఒకే పరమాత్మ యొక్క అవతారములే కదా రాముడును, కృష్ణుడును. వారియొక్క రూప నామములు, గుణకర్మలు కొంత భేదముగ నుండె. **అందువలన సామాన్య ప్రజలు భేదము నెంచిరి కదా ఇక ఈ సాయిరాం శరీరమునకును, షిర్డిసాయిరాం శరీరమునకు భేదము నెట్లు ఎంచక యుందురు?** షిర్డిబాబా భక్తులు ఆయనను పరిపూర్ణముగా గ్రహింపలేదు. అట్లే మీరు నన్ను పూర్ణముగా తెలిసికొనియుండలేదు. మమ్ముల నిరువురిని బాగుగా నెరిగిననే ఇరువురు ఒక్కటేనని దృఢముగా చెప్పగలరు.

(స.శి.సు.ప్ర.పు.243)

(చూ॥ విజయదశమి)

షేక్స్పియర్

(చూ॥ సద్వినియోగం)

సంకర్షణ

(చూ॥ భగవంతుడు)

సంకల్పము

సంకల్పాలన్నింటికి చిత్తమే స్థానము. అవి అన్నియు చిత్త స్వరూపములు, చిత్తమునుండి పుట్టినవి చిత్తమునందు ప్రతిష్ఠితములయినవి. చిత్తము సంకల్పాలకు మూల మగుటచే అనేకశాస్త్రముల నభ్యసించిన విద్వాంసునికి చేతనత్వము పోయినపుడు అతడు లేనివానితో సమానమని లోకులు చెప్పుదురు. బ్రహ్మ బుద్ధితో చిత్తము నుపాసించువాడు సౌష్ఠవము గలవాడగును. చిత్తము సంకల్పముకంటే గొప్పదగుచున్నది. మనస్సు మొదలగునవి సంకల్పమునందున్నవి. **సంకల్పమే వాని స్వరూపము. సంకల్పము మానసిక వృత్తి; చిత్తము సంకల్ప కారణము, సంకల్పమిచ్ఛాకారణము.** కర్తవ్యాకర్తవ్యము లను విషయవిభాగముచే సమర్థించుట సంకల్పమన బడును. తరువాత దానిని వాక్కుతో చెప్పును. ఇచ్ఛయించిన దానిని నామముతో చెప్పగోరును. శబ్దవిశేషములగు మంత్రములు నామమంత్రములై వాని యంతర్భాగము లగుచున్నవి. మంత్రములందు కర్మ లేకములగుచున్నవి. ఆమంత్రమగు కర్మ యుండనేరదు. ధ్యానము చిత్తమునకంటె అధికమయినది. **ధ్యాన విషయమగు దేవతాబుద్ధిచే శాస్త్రవిహితమగు సాలగ్రామాది కనిష్ఠవస్తువులం దితరచిత్తవృత్తులచే చెదరని బుద్ధివృత్తిని నిలుపుట ధ్యానమందురు. దీనినే చిత్తైకాగ్ర్య మనియు వాడుదురు.** ధ్యాననిష్ఠుడగువాడు నిశ్చలుడగు చున్నాడు. అదే విధముగా పృథ్వి నిశ్చలముగా నున్నది. ఆ తీరుననే అంతరిక్షము, ద్యులోకము, జలములు, పర్వతములు, దేవతలు, మనుష్యులు నిశ్చలురు శమాది గుణసంపత్తిచే దేవతాసమానులగు మనుష్యులుకూడా ధ్యానము చేయుచున్నటుల నచంచలముగ నున్నారు. విజ్ఞానము ధ్యానముకంటె ఉత్తమమైనది. **శాస్త్రార్థము తెలిసికొను జ్ఞానము విజ్ఞానమందురు. అది ధ్యానముచే లభ్యమగుట వలన ధ్యానముకంటె ఉత్తమమని తెలుపబడినది. బలము విజ్ఞానముకంటె నతిశయమగును.** అన్నము భుజించుటచే

సంకల్పము

కలిగిన జ్ఞేయములగు **విషయములందు మనస్సు ప్రతిభను పొందు సామర్థ్యము బలము. జ్ఞేయవిషయములందు ప్రసరించువానిని సులభముగా గ్రహించు బుద్ధిసామర్థ్యము ప్రతిభ.** ఇది అన్నముచే పోషింపబడుచున్నది. **అన్నము బలముకంటె అధికము.** పది దినములు అన్నము తినకుండినచో అట్టివాడు మరణించును. జీవించక మరణించినచో, గురువు వలన విషయములు గ్రహించి శ్రవణము చేయలేడు. మననము చేయలేడు. **దీనికంటె తేజస్సు అధికమయినది. తేజస్సు నుండి జలము, జలమునుండి అన్నము పుట్టును. కాన తేజస్సు రెండింటికీ అధికమైనది. తేజస్సు వాయువును బంధించి వెచ్చగాచేయును.** అపు డాకాశమంతయూ వేడిగా నుండును. తేజస్సు ముందుగా వాయుతత్త్వమై తరువాత జలము నుత్పత్తి చేయుచున్నది. తేజస్సే ఉరుము రూపమున వర్షహేతువగును. ఆకాశము తేజస్సు కంటె గొప్పది. శబ్దమాకాశ మూలమున వినబడుచున్నది. ఆకాశమునందే ప్రియవస్తు సంయోగమువలన అన్యోన్య క్రీడ జరుగుచున్నది. ఆకాశమునందే బీజ మంకురించు చున్నది. **స్మరణమాకాశమున కంటె గొప్పది.** పూర్వమను భూతమయిన దానిని జ్ఞాపకమునకు తెచ్చుకొను అంతఃకరణ ధర్మము స్మృతి అనబడును. స్మరణ ఉన్నప్పుడే సర్వము అనుభూయమానమగుచున్నది. ఆదిలేనపుడు ఆకాశాదివస్తువులను గూడా స్మరించుట శక్యముకాదు. అందువలన స్మరణ ఆకాశమునకు కారణమగుచున్నది.

(ఉ.వా.పు.62/63)

కదలదు నీదు సంకల్పము లేనిది గడ్డి పోచయైన
అదియు యిదియు అనగనేల? పిపీలికాది బ్రహ్మ
పర్యంతము నీవే! అది యెరుంగరు భువిని కొందరు
వివేకమున వర్తించెదమని కడు విర్రవీగెదరు కాని,
ఎవరి కే వేళ యేది సంభవించునో
తెలియ జాల రెంతవారలైన ;

(బ.పు.104)

నాయనా! నీ జాబందినది. సంశయముల తోడను, ఆవేదనతోడను గర్భితమైన నీ ప్రేమభక్తి ప్రవాహములను గమనించితిని. జ్ఞానులు, యోగులు, సన్యాసులు, భక్తులు, ఋషులు మొదలగువారి స్వభావమును, నడవడుల మర్మమును గ్రహించుటకు సామాన్య జనులకు సాధ్యం కాదు. సామాన్య మనుష్యులు చిత్ర విచిత్ర స్వభావములు కల్గియుండి, తమ ముక్కు సూటిగ, నితరుల మనోభావమును గ్రహింపలేక విమర్శించు చుందురు. అది వారి నైజము. లోకుల నిందాస్తుతులకు చలింపక, తమ ధర్మమునకే తమ నిర్ణయమునకే హత్తుకొను జ్ఞానులుందురు. ఫలముల నొసంగు వృక్షమే రాతి దెబ్బలకు గురి అగుచుండుట లోకవిదితమే కదా! అధర్మము ధర్మమునకు అడ్డు తగులును. ధర్మము ఆధర్మమును నశింపజేయును. ఈయదియే లోకములో పోకడ. ఇట్టి వైపరీత్యములు కలుగనిచో, అదియు నొక విచిత్రమే. సత్య విషయమును గ్రహింపజాలని సామాన్య మానవులను నిరసించుటకంటె వారి అజ్ఞానమునకు జాలి పడవలెను. యథార్థమును గుర్తించునంతటి ఓర్పు వారి కుండదు. ఎక్కువ కామక్రోధముల చేతను, దురభిమానములచేతను వారి మనస్సు పూర్తిమైయుండును. అందువలన పూర్తిగ తెలిసి కొనుటకు గూడ ప్రయత్నింపరు. తమ బుద్ధికి తోచినట్లు మాటలాడుదురు; వ్రాయుదురు. అట్టి మాటలనుగాని, వ్రాతలనుగాని లెక్కచేయకూడదు. ప్రస్తుతం నీవాందోళన చెందనవసరం లేదు. సత్య మెన్నటికైనను జయించును. ఆదియం దసత్యము జయించినట్లు కనిపించినను, అంతిమ విజయం సత్యమునకే లభించును.

మహాపురుషులు పూజలకుప్పొంగరు; అవమానములకు ఆందోళన చెందరు. పరిశీలించినచో, ఏ ధర్మశాస్త్రము నందును జ్ఞానుల లక్షణము లిట్టి వనియు, వారి నడవడి ఇట్లుండవలెననియు శాసించియుండలేదు. తామను సరించదగు విధానములను వారే తెలిసికొందురు. వారి స్థితప్రజ్ఞయే పవిత్ర లోకసంగ్రహకర్మలను వారిచేత

చేయించును. ఆత్మవిశ్వాసము, లోకకల్యాణము అను ఈ రెండే మహాపురుషుల నైజధర్మములు. శిష్టులను ధర్మాచరణ నిష్ఠులుగ నొనర్చుచు, నైహికాముష్మిక ఫలముల నందునట్లనుగ్రహించుచుందురు. ఆత్మ విశ్వాసము. లోకసంగ్రహకర్మము అను ఈ రెండు నియమములకు బద్ధుడనైయుండు నన్ను గూర్చి నీవాందోళన చెందనక్కర్లేదు. **నిందాస్తుతులు శరీరమునకే గాని, అంతరాత్మను అంటనేరవు.**

అఖిల మానవులకు నానందమొనగూర్చి
రక్షించుచుండుటే దీక్ష నాకు
సన్మార్గమును వీడి చరియించువారల
బట్టి గాపాడుటే వ్రతము నాకు
బీదసాదలకైన పెనుబాధ తొలగించి
లేమిని బాపుటే ప్రేమ నాకు
నీమనిష్ఠలతోడ ననుగొల్చువారిని
కాపాడుచుండుటే ఘనత నాకు
మంచిచెడ్డలుకూడ మనసులో సమముగా
భావించుచుండుటే భక్తి నాకు
అనగ బేరొంది నాయండ నలరువారి
నెన్నడును మరువనివాడ నన్నమాట
నెట్టి కుచితము మదికి నే నేర్పకుందు
అట్టి నాపేరు చెడుట యెట్టగును భువిని?

అనుచిత భాషణముల నెన్నడును లెక్కచేయకుము. పరులు తమ్ము పొగిడినంతనే యౌన్నత్యము మహాత్ములకు లభింపదు; అల్పు లనినంత మాత్రమున అల్పత్వము సిద్ధింపదు. నల్లమందు, గంజాయి సేవించుచు యోగులమని చెప్పుకొను నట్టివారును, తమ యాడంబరమును సమర్థించు కొనుటకై శాస్త్రప్రమాణములను వల్లెవేయు వారును, తమ కుతర్క నైపుణ్యమునకును, అపార్థ శాస్త్ర పాండిత్యమున కు నుబ్బితబ్బిబ్బులగుచుండు పండితమ్మన్యులును నిందాస్తుతులకు చలింతురు. అవతార పురుషులను గూర్చియు, జ్ఞానులను గూర్చియు రచింపబడిన జీవిత చరిత్రలను నీవు చదివియే యుందువు కదా! **రామ, కృష్ణావతార చరిత్రలలో ఎందఱెందరో దుష్టులు వారిపై ఎన్ని నిందలు మోపియున్నారో నీవు చదివియే యుందువు.** ఆనాడీనడననేల? సర్వ కాలము లందును సజ్జనులను దుయ్యబట్టుచుండుటే దుర్జనుల లక్షణమని గ్రహింపుము. **కావున, అట్టి విషయములకు విచారము పడవద్దు. ఏనుగులను నక్షత్రములను జూచి కుక్కలు మొరుగునను సామెత వినలేదా? ఎంత కాలమీ దుష్ప్రచారము నిలుచును?** నిజము నిలకడ మీద తెలియును సత్యము జయించును.

నా సంకల్పమును, నా సందేశమును విడువను. నేను నా కార్యమును జయప్రదముగ నిర్వర్తించగలను. ఇందు గురించి కలుగు మానావమానములను, నిందాస్తుతులను సమభావముతో నెదుర్కొందును. నేను నిజముగా అంతరంగములో నిర్వికారుడనై యున్నాను. బాహ్య ప్రపంచము కొఱకే నా నటనమంతయు. లోకసంరక్షణార్థం అవతరించితినని ప్రజలకు తెలుపుటకొఱకే నేను ప్రజలతో కలసిమెలసి వ్యవహరించుచుండుట. నే నే దేశమునకూ కట్టుబడలేదు. ఏ నామమునకూ కట్టుబడను. నాది, నీది అను భేదమే నాకు లేదు. ఏ పేరుతో పిలిచినను పలుకుదును. ఎచ్చటికి పిలుచుకొనిపోవలయునన్నను పోయెదను. ఇదియే **నా ప్రథమ శపథం.** ఇంతవరకు ఈ విషయమెవ్వరికీ దెలుపకుంటిని. ఈ మాయా జగత్తుకు దూరముగానున్నాను. మానవోద్ధరణకు మాత్రమే కృషి సల్పుచున్నాను. నా మహిమను ఎంతటి వారైనను కనుగొనలేరు. మున్ముందు నీవు నా యద్భుత మహిమలను గాంచగలవు. భక్తులకు దృఢవిశ్వాసము, నమ్మకము, తితీక్ష యుండవలెను. ఈ విషయములను ప్రచురింపవలెనను కుతూహలము నాకు లేదు. కాని, జవాబు వ్రాయకున్న బాధపడుదువని ఈ విషయములను జవాబులో చేర్చితిని. ఇంతియే.

(స.సా.జ2001 పు.11/12)

మొట్టమొదట పూతన. ఈమె పాలివ్వడానికి పోయి ప్రాణము కోల్పోయింది. "యద్భావం తద్భవతి", మనం

సంకల్పము

ఎట్టి చింతన చేస్తామో అట్టి ఫలములే లభ్యమౌతుంటాయి. ఈ పూతన ఎవరు? ఈమె పూర్వ జన్మలో బలిచక్రవర్తి కుమార్తె. ఈమె పేరు రత్నావళి. బలిచక్రవర్తి వద్దకు వామనుడు వచ్చినప్పుడు రత్నావళి కిటికీ నుండి చూసింది. "ఈ బాలుడు ఎంత అందంగా ఉన్నాడు. ఇతడే నాకు పుట్టి ఉంటే అనేకవిధములుగా పాలిచ్చి పాలించి పోషించి ఆనందించి ఉండేదానను" అని తనలో తాను అనుకొన్నది. అంతలోనే వామనుడు బలిచక్రవర్తి ఇచ్చిన మాట ప్రకారం రెండడుగులు - ఒకటి భూలోకము, రెండవది ఆకాశము - తీసికొని, మూడవ అడగు బలిచక్రవర్తి తలపైన పెట్టాడు. వెంటనే రత్నావళికి కోపం వచ్చేసింది. "ఎవడీ దుర్మార్గుడు? వీనిని చంపివేయాలి" అన్నది. మొదట వామనుని చూచినంతనే ప్రేమతో తల్లిగా పాలివ్వాలని ఆశించింది; కాని కడపటికి చంపాలని సంకల్పించుకొన్నది. ఈ రెండు సంకల్పముల చేతనే ఆమె పూతనగా తిరిగి పుట్టింది. ఆ పూతనే కృష్ణునికి పాలివ్వాలని వచ్చింది; చంపాలని చూసింది; కడకు తానే చచ్చింది.

(స.సా.అ.94పు.271)

దుష్ట సంకల్పముల చేత దుఃఖితుడగు
సత్య సంకల్పములచేత సాధువగును
సకల సంకల్పరహితుడే శాంతి పొందు
ఇంతకన్నను వేరెద్ది ఎఱుక పరతు?

(స.సా.డి.96 పు.325)

సత్యమును ఆధారము చేసుకొనియే బలి చక్రవర్తి ప్రజలను ప్రాణముగా చూచుకుంటూ బిడ్డలుగా పోషించుకుంటూ కాలమును గడుపుతూవచ్చాడు. బలిచక్రవర్తి చాలా దానపరుడు, ప్రేమస్వరూపుడు. సత్యభాస్కరుడు. అతని పాలనలో కేరళ ప్రజలు సుఖశాంతులను అనుభవిస్తూ వచ్చారు. ఆకలిబాధలు లేకుండా వచ్చారు. దేవతలను జయించిన తరువాత నర్మదానది ఒడ్డున ఒక గొప్పయాగం తలపెట్టాడు. దానినే **'విశ్వజిత్ యాగము' అంటారు.** ఆ సమయంలో వామనమూర్తి ఈ బలిచక్రవర్తి తలపెట్టిన యాగమునకు సిద్ధాశ్రమమునుండి వస్తుండగా, అందరూ ఆశ్చర్యంతో చూస్తూవచ్చారు. అతను బాలుడు. అతనిలో తేజస్సు ప్రకాశిస్తున్నది. ఈ ప్రకాశమే అందరినీ ఆకర్షించింది. **వామనుడు అనగా మాగ్నెట్ స్వరూపమే, ఈ దృశ్యమును బలిచక్రవర్తి కుమార్తె 'రత్నమాల' కూడా చూచింది. ఆ బాలుని తేజస్సును చూచి ఆశ్చర్యపోయింది. అలాంటి బిడ్డ నాకు కలిగితే నేను ఎంతో అదృష్ట వంతురాలిని గదా! అని భావించింది. కాని ఇంతలో ఆ బాలుడు (వామనుడు) బలిచక్రవర్తిని మూడడుగులు దానం అడగడం, బలిని పాతాళమునకు త్రొక్కడం జరిగింది. ఆ దృశ్యమును కూడా చూచిన రత్నమాల 'ఛీ! ఇలాంటి దుర్మార్గుడ్ని, నాకు కుమారుడు కావాలని ఆశించానా! నేను విషపుపాలిచ్చి చంపి ఉండేదానను అని భావించింది. వామనుడు దీనిని గమనించి 'తథాస్తు' అన్నాడు. భగవంతుడు ఎవరి సంకల్పములు, భావములు ఏవిధంగా పుంటుంటాయో ఆవిధంగా జరగాలని ఆశీర్వదిస్తూ వస్తుంటారు. కనుక మనం ఎప్పుడూ మంచినే తలుస్తూ వస్తుండాలి.** భగవంతుడు లేని స్థానమే లేదు. సర్వత్రా ఉన్నాడు. అమ్మా! రత్నమాలా! నన్ను నీ పాలనిచ్చి పెంచాలని ఆశించావు. దేహాభిమానం చేత, నీ తండ్రిని పాతాళమునకు త్రొక్కటంచేత, **నీలో క్రోధం ఆవిర్భవించింది.** ఇప్పుడు నాకు విషపుపాలిచ్చి చంపాలని చింతిస్తున్నావు. కనుక **నీవు ద్వాపరయుగంలో 'పూతన'గా పుట్టి నాకు విషపుపాలను యిచ్చి, నీవు మరణించుదువు గాక! అని శపిస్తాడు.** కనుక ప్రతిమానవుడూ సత్సంకల్పములను అభివృద్ధి పరచుకోవాలి. ఏ సంకల్పములు చేసినా భగవంతుడు 'తథాస్తు' అంటుంటాడు. కనుక మంచి సంకల్పములనే సదా చేస్తుండాలి. ఈ పవిత్రతను మానవుడు గమనించక అనేక రకములైన చింతనలు చేస్తుంటాడు. కనుక మనం నిరంతరం మంచి చింతనలు చేస్తుండాలి. పవిత్రమైన చింతనలు చేస్తుంటే పవిత్రమైన ఆశ్వీర్వాదములు కలుగుతూ ఉంటాయి. **చెడ్డ సంకల్పములు చేస్తే చెడ్డే ప్రాప్తిస్తుంది. కాని ఫలితములు అందుకున్నపుడు బాధపడుతాం. చింతించేటప్పుడు**

సంకల్ప శక్తి

మనస్సుకు ఎటువంటి జ్ఞానమూ లేదు. విద్యగా మనము భావించేది పుస్తక పరిజ్ఞానము. ఈ జ్ఞానముతో పాటు తాత్త్విక జ్ఞాన సముపార్జన జరుగవలెను. తాత్త్విక భావన మత సంబంధమైనది కాదు; అది భగవత్ప్రేమ. ఇది నామ స్మరణ వలన, కీర్తనల వలన, ఆధ్యాత్మిక ఆలోచనల వలన, భగవదైక్యము చెందవలెననే వాంఛ వలన సంస్కరింప బడుతున్నది. దీనిని సముద్రపు నీటిలోని బుడగలతో పోల్చవచ్చును. బుడగలు పగిలిపోయినపుడు అవి తమ ఆస్తిత్వమును కోల్పోయి తానే భగవంతుడగును. తాత్త్విక భావన అలవరచుకుంటే దానినుండి సంకల్ప శక్తి ఆవిర్భవించును. సంకల్ప శక్తిలేని జ్ఞానము నిరుపయోగము. సంకల్ప శక్తి తాత్త్విక చింతన వలననే లభించును. సంకల్ప శక్తిచే ఆత్మ శక్తి నేరుగా తెలిసికొనబడుచున్నది.

(ప. పు.97/98)

సంకీర్తన

ఎప్పటికప్పుడే! నశ్వర శరీరములకు, ప్రతిక్షణము అంత్యమే! అట్టి అంత్య సమయమున ఏమి స్మరింతురో, అదియే తదుపరి పరిస్థితులకు అనుకూలమగును. అనగా పునర్జన్మకు పునాది. అట్టి సమయమున నన్ను స్మరించినవాడు నా భావాన్ని పొందును. అనగా నన్నే చేరును.

నాస్తి నాస్తి మహాభాగ
కలికాల సమయుగం
స్మరణాత్ ఉచ్చరణాత్తేవ
ప్రాప్నోతి పరమాం గతిః

అన్నట్లు ఇప్పుడు నామ సంకీర్తన చెయ్యకపోతే ఇంకెప్పుడు మనము చేసేది? నీ యొక్క హృదయాన్ని అనుసరించు.

(శ్రీ.భ.ఉ.పు.33)

"సమ్యక్ కీర్తనం ఇతి సంకీర్తనం". కీర్తనమునకు, సంకీర్తనమునకు ఎంతయో వ్యత్యాసం ఉన్నది. **కీర్తన ఆలోచించం, సంకల్పములను బట్టే ఫలితాలు ఉంటాయి. భగవంతుడు ఇలాంటి ఫలితాలు అందించాడేమని నిందిస్తాముగాని, అది భగవంతుని తప్పుకాదు, నీ దోషమే, కనుక మనం సత్సంకల్పములు చేయాలి, సత్సంగమంలో చేరాలి.** నీవు మంచి సాంగత్యం చేస్తే నీలో మంచి భావములే ప్రవేశిస్తాయి.

(శ్రీ.అ.2001పు.7/8)

నా సంకల్పముద్వారా, అవతారమూర్తిగా, కలిగిన నాశక్తి స్వతస్సిద్ధమైనది, సహజమైనది, అనంతమైనది, నా నిర్ణయానుసారము చరించునట్టిది. ఈ శక్తి నాయందు సహజముగానే ఉన్నందున దాని కొరకు సాధనలుకాని, మంత్ర తంత్రములుకాని, అవసరములేదు. అనగా **సాధనతో, తపస్సుతో పొందిన సిద్ధులు కావు. మంత్రములు కావు. నా నుండి వాటికవే ఆవిర్భవించు చుంటవి. ఇట్టి శక్తి ఒక్క అవతార పురుషునికి మాత్రమే ఉంటుంది.** అందుచేత ఈ లీలలన్నీ భగవంతుని అనంత శక్తిలో ఒక అత్యల్పాంశము మాత్రమే. **"ఏకాంశేన స్థితో జగత్' అని గీతావాణి.**

నా సర్వకార్యములు ఒకానొక విధానము ననుసరించి జరుగుతుంటవి. ఆ విధానము మానవునకు ఆగ్రాహ్యము. **'నేను రోగ నివారణ చేయుగలను. ప్రజలను ఆపదల నుండి రక్షించగలను. పునరుజ్జీవులను చేయుగలను. అయితే నా యీ అనుగ్రహమునకు పాత్రులు కావలెనన్న, వారు ఎటువంటి సంశయములు లేని మనస్సు కలిగి ఉండాలి.'** నా అనుగ్రహమును వారు దానిని పొందుటను, విద్యుచ్ఛక్తిలోని పాజిటివ్, నెగటివ్ కరెంటుతో పోల్చ వచ్చును. నా అనుగ్రహ శక్తి పాజిటివ్ కరెంట్ అయితే, దానిని వారు స్వీకరించు శక్తి నెగిటివ్ కరెంట్ అవుతుంది. ఈ రెండు ప్రవాహముల సంయోగము వలన వెలుగు వచ్చునట్లు ఈ అద్భుతములులేక లీలలు సంభవించు చున్నవి.

(శ్రీ.స.ది.లీ.పు.23/24)

(చూ॥ ఈక్షతేర్నాశబ్దం, ఓంకారము, నగరసంకీర్తన)

కేవలం వ్యక్తిగతమైనది. వ్యక్తి గతమైన కళ్యాణము నందించునదే కీర్తన. అయితే సంకీర్తన అనేది యావద్విశ్వానికే కళ్యాణము చేకూర్చునది. దీనికి - "సామూహికభజన" అని మరొక పేరు. అందరూ కలసి ఏకత్వముగా ఏక కంఠముతో ఉచ్ఛరించే భజనకు - "సంకీర్తన" అని పేరు. దీనిని గురునానక్ మొట్టమొదట ప్రారంభించాడు. ఇది అనేకత్వములోని ఏకత్వమును గుర్తింపజేస్తుంది. ఈ సంకీర్తన అనేది నాలుగు విధములుగా ఉంటున్నది. **1. గుణసంకీర్తన. 2. లీలాసంకీర్తన. 3. భావ సంకీర్తన. 4. నామసంకీర్తన.**

మొదటిది గుణసంకీర్తన. భగవంతుని కళ్యాణగుణము లను వర్ణిస్తూ తాదాత్మ్యం పొంది, అట్టి సద్గుణములను అభివృద్ధి పరచుకొనుటకు కృషి చేయడమే గుణ సంకీర్తనము. ఈ గుణసంకీర్తనము గావించిన వారిలో **త్యాగరాజు** ఒకడు.

"వాచామగోచరుడవగు రామా! నీ చరితమున్ పొగడ బ్రహ్మాదులకు తరమా! కాచుకొన్నాను నీదు కృపకై. నా మొరాలకించి, నన్ను బ్రోవుమయ్యా" అన్నాడు త్యాగరాజు. **"యతో వాచో వివర్తంతే అప్రాప్య మనసాసహ"** అన్నట్లుగా, వాక్కునకు అలవికాని గుణములు శ్రీరామచంద్రునిలో ఉన్నవని త్యాగరాజు కీర్తించాడు.

రెండవది లీలాసంకీర్తనము. భగవంతుని లీలాతరంగము లను నృత్యరూపకముగా ఆడుకొంటూ, ఆ పవిత్రమైన లీలలను అనుభవిస్తూ వాటియందే లీనమై సంకీర్తన మొనర్చుటను - లీలాసంకీర్తనం అంటారు. భక్తజయ దేవుడు ఈ లీలా సంకీర్తనను సల్పినాడు.

జయదేవుడు కేవలం భగవల్లీలలను మాత్రమే చింతిస్తూ, భగవంతుడు తన యందే ఉన్నట్లుగా విశ్వసించి తన నిత్యజీవితంలో ఆటలు, పాటలు, మాటలు అన్నింటిని భగవంతునితో అనుభవిస్తూ, భగవత్ప్రేమను తప్ప అన్యప్రేమలను కోరక తాను ప్రేమ స్వరూపుడుగా మారాడు. కాని, జయదేవుని కీర్తనలను కొందరు సరిగా అర్థము చేసుకొనలేక అనర్థములతో వీనిని వ్యర్థము గావిస్తూ వచ్చారు.

మూడవది భావసంకీర్తన. రాధ, మీరాలు భావసంకీర్తన గావించిన వారిలో ముఖ్యులు. రాధ భగవంతుని యొక్క భావము నందు తాను లీనమై భగవత్తత్త్వము నందు తన తత్త్వమును లీనము చేసుకొన్నది. **శాంతభావము, సఖ్యభావము, వాత్సల్యభావము, అనురాగభావము, మధురభావము - ఈ ఐదు భావములందు రాధ తనయొక్క జీవితాన్ని అనుభవిస్తూ వచ్చింది.**

ఇంక నాల్గవది నామసంకీర్తన. చైతన్యుడు నామసంకీర్తన సల్పుతూ వచ్చాడు. "భగవంతుడా! సర్వనామములు నీవే. నీ నామంగాని నీ రూపం గాని లేని ప్రదేశము ఈ విశ్వమందు కానరాదు. ఈ జగత్తు లోని సౌందర్య మంతయు నీ రూప నామములే" అని ప్రతి అణువును, ప్రతికణమును భగవత్ స్వరూపంగా భావించి, నామముచే తరించినవాడు చైతన్యుడు.

ఈవిధముగా ఒక్కొక్కరు ఒక్కొక్క మార్గాన్ని అనుసరించగా ఈనాడు అదృష్టవశాత్తు ప్రశాంతినిలయ వాసులకు ఈ నాల్గింటిని అనుభవించే అవకాశం దొరికింది. **ఈ నాలుగు సంకీర్తనల సమ్మిళిత స్వరూపమే - మన భజన.** ఇవేగాక మరొక విశిష్టమైన విలక్షణమైన మార్గమొకటున్నది అదే - **"నామలిఖితము" అనగా భగవన్నామమును మనస్సునందు తలంచుతూ, మాటలతో స్మరించుతూ, చేతితో వ్రాయడము. ఇది త్రికరణ శుద్ధికి మార్గం. "మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం మహాత్మనాం"** కనుక, ఇది మహత్తర మైనది. హనుమంతుడు శ్రీరామచంద్రుని వార్తను సీతకు తెలిపి, లంకలో తన కార్యమును పూర్తిగావించుకొని తిరిగి శ్రీరామచంద్రుని వద్దకేగే సందర్భములో - "తల్లీ! నన్ను ఆశీర్వదించు " అని సీతను ప్రార్థించాడు. అప్పుడు సీతాదేవి, "హనుమంతా! శాంతుడవు, గుణవంతుడవు, బలవంతుడవైన నీవు అజరుడవై వర్థిల్లెదవు!' అని ఆశీర్వదించింది. కాని, హనుమంతునికి ఆనందం కలుగలేదు. అతని యొక్క **అసంతృప్తిని గుర్తించిన సీత. "నాయనా! నీవు అమృతుడవై జీవింతువు!" అన్నది.**

అయినప్పటికీ హనుమంతుని ముఖమునందు ఆనందము కనిపించలేదు. తదుపరి, **"హనుమంతా! నీ గుణగణములను ముల్లోకవాసులు కీర్తించెదరు గాక!"** అని పల్కినది. ఆ **మాటలు విని మరింత సిగ్గుపడుతున్నట్లుగా హనుమంతుడు** తలవంచుకొన్నాడు. హనుమంతుని మనస్సును గుర్తించిన సీత **చివరకు, "రాముడు నిన్ను నిరంతరం ప్రేమించుగాక!" అని అన్నది.** ఆ మాటలు విన్న వెంటనే హనుమంతుడు గంతులు వేశాడు. తాను కోరినది కూడా అదే. దైవ ప్రేమకు నోచుకోని జీవితము సజీవసమాధితో సమానమని హనుమంతుడు విశ్వసించాడు. కనుకనే, శ్రీరాముని ప్రేమ తనకు కావాలని ప్రార్థించాడు. **హనుమంతుడు గొప్ప సంగీత విద్వాంసుడు.** నిరంతరం రామనామమును విచ్చలవిడిగా గానము చేసేవాడు. **సంగీతము ద్వారా భగవత్ప్రేమకు పాత్రులు కావాలి. అదే సంగీతము యొక్క సారం. తన భక్తిని, భావమును, నాదమును శ్రుతి లయ తాళములతో చేర్చి భగవంతుని యందు లీనము కావాలి.** భావము నెరిగి, భక్తిని కూర్చి ప్రేమను చేర్చి పవిత్రమైన పలుకులచే పరమాత్ముని ప్రేమిస్తూ వర్ణించడమే గానము. పదములకు అర్థం తెలియకుండా, భావాన్ని చేర్చకుండా, ప్రేమను అందులో ప్రవేశపెట్టకుండా గానము చేస్తే - అది కేవలము టేపురికార్డు నుండి వచ్చే గానము వంటిది. ప్రతి విషయము నందు భావరాగ తాళ సమ్మిళితమును మీరు అనుభవించాలి. **భావము, రాగము, తాళము అనే మూడు పదాలలోని మొదటి మూడు అక్షరముల చేరిక చేతనే "భారత" అనే పేరు వచ్చినది.**

నిత్యజీవితంలో నీవు ఆచరించే ప్రతికార్యము నందు ఈ మూడింటి సమ్మేళనం అత్యవసరం. దీనికి ఒక ఉదాహరణ; ఒక అధ్యాపకుడు చేసే పనిలో ఈ భావరాగతాళముల చేరిక ఉంటున్నది. తాను బోధించే సబ్జెక్టును ప్రేమించడమే - రాగము, ఆ సబ్జెక్టును తాను సరిగా అర్థము చేసుకోవడమే - భావము, ఆ సబ్జెక్టును విద్యార్థులకు తగిన రీతిలో బోధించడమే తాళము. ఈ మూడు తగిన రీతిలో చేరితేనే ఆ అధ్యాపకుడు బోధించగలడు. మనం చేసే వంటలో కూడా ఉప్పుకు తగిన పప్పు - పప్పుకు తగిన ఉప్పు, వంటకు తగిన మంట. మంటకు తగిన వంట అవసరము. పప్పు చారెడు, ఉప్పు దోసెడు వేస్తే వంటకం పాడై పోతుంది. అదేవిధంగా, దేనికి తగినట్లు దానిని హద్దులో ఉంచుకొని, తగిన రీతిలో అనుభవించడమే భావ రాగ తాళ సమ్మిళితము యొక్క అంతరార్థం.

మనము ప్రతి విషయమును మొట్టమొదట సరిగా అర్థం చేసుకోవాలి. త్యాగరాజు కీర్తనలను సరిగా అర్థం చేసికొనలేక వ్యర్థం చేసినవారు లేకపోలేదు. త్యాగరాజు తెలుగులో కీర్తనలను పాడాడు. అందుచేత, ఆ కీర్తనల భావమును తెలుగువారు బాగా తెలుసుకొన్నారు. అయితే, రాగతాళములలో తమిళ్ వాళ్ళకు బాగా ప్రవేశం ఉంది. కేవలం కీర్తనల అర్థం తెలుసుకొన్నవారు - తెలుగువారు, ఆ కీర్తనలను రాగతాళములతో పాడేవారు తమిళ్‌వారు. రాగ తాళములను గూర్చి తెలుగువారికి బాగా తెలియదు, కీర్తనలలోని పదముల అర్థం తమిళ్ వాళ్ళకు సరిగా తెలియదు. కనుక, ఈ ఇద్దరి చేరికలో త్యాగరాజు కీర్తనలు పూర్తిగా నిస్సారముగా మారిపోతున్నాయి.

ఒకానొక సమయములో త్యాగరాజు

"నే పొగడకుంటే.... నీ కేమి... కొదువ రామా...!"

అని పాడినాడు.

ఈ తమిళ్ వాళ్ళకు గ-కారము, త-కారము, డ-కారము మొదలగు అక్షరముల మధ్యగల వ్యత్యాసము సరిగా తెలియదు. ఒక గొప్పతమిళ్ సంగీత విద్వాంసుడు ఇదే పాటను పాడుతూ -

"నే పకోడతింటే....నీ కేమి ...కొదువ రామా..!"

అని అన్నాడు. **"పొగడ,పకోడ "** ఈ రెండింటి మధ్య ఎంత వ్యత్యాసమున్నదో - చూడండి! కనుకనే పదములు పలికేటప్పుడు భావము అనేది అత్యవసరం. భగవన్నామ సంకీర్తన చేసే సమయంలో భావరాగ తాళాలను చక్కగా గుర్తించాలి. నీకు తెలియనప్పుడు తెలిసినవారినడిగి తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.

సంకీర్తన

గానం చేసినప్పుడు భగవన్నామములో ఉండిన మాధుర్యం మన హృదయాన్ని మరింత ఆకర్షిస్తుంది అనేక మంది పండితులు శ్లోకాలు వల్లిస్తుంటారు. కాని, వారికే ఆ శ్లోకాల భావము తెలియనందున శ్లోకాన్ని నివారించు కోలేరు. మరి కొంతమంది గంభీరమైన పదములను ఉపయోగపెడుతూ మాట్లాడుతుంటారు. అవి కూడా హృదయాన్ని ఏమాత్రం ఆకర్షించలేవు. కాని, హృదయం గానము యొక్క రసాన్ని చక్కగా అనుభవిస్తుంది. ఆస్తికులు, నాస్తికులు కూడా గానాన్ని ఆనందంగా ఆలకిస్తూ తమకు తెలియకుండానే తలలూపుతుంటారు. గానములో ఇంత మాధుర్యము నిండి ఉంటున్నది. కనుక, మీయంతట మీరు పాడలేక పోయినప్పటికీ, పాడేవారిని అనుసరిస్తూ పాడుటమంచిది.

కాని, సంకీర్తన జరిగే సమయంలో కొంతమంది నోర్లు ఏమాత్రము కదలవు. కొందరు "మా లోపల మేము పాడుకుంటున్నాము అని అంటారు. అది సరియైన తృప్తిని ఇవ్వదు. "వంటగదిలో అనేక రుచిరకరమైన పదార్థములున్నాయి" అని మనస్సులో అనుకొన్నంత మాత్రమున నోటికి పని పెట్టనిచో నీ పొట్టలోనికి అవి చేరవుకదా! సంకీర్తన జరిగేటప్పుడు చక్కగా గొంతువిప్పి ఎంతవరకు వీలైతే అంత గట్టిగా భగవన్నామమును ఉచ్చరించాలి. అట్టి సంకీర్తనయే భగవంతుని హృదయాన్ని కరిగిస్తుంది. అప్పుడే అతడు వచ్చి నిన్ను రక్షించగలడు. భావిలోపడిన వాడు, "నేను భావిలోపడ్డాను" అని మెల్లగా అంటే అతనిని ఎవ్వరూ రక్షించరు. కాని, అతడు గొంతువిప్పి "అయ్యో! నేను భావిలో పడ్డాను" అని గట్టిగా అరచినప్పుడే ఎవరైనా వచ్చి రక్షిస్తారు. అనగా తన యొక్క అభిమాన అహంకారములను పూర్తిగా త్యజించి కీర్తనను హృదయ పూర్వకంగా విచ్చలవిడిగా పాడాలి.

"నోరును ఇచ్చినదెందుకో తెలుసా? ముద్దలు నోటికి అందించుటకా? కాదు, కాదు. భగవన్నామస్మరణ చేయుటకు. చేతుల నిచ్చిన దెందుకో తెలుసా? పిచ్చిపనులు చేయుటకా? కాదు, కాదు. భగవదర్చన చేయుటకు. పాదముల నిచ్చిన దెందుకొ తెలుసా? సందులు గొందులు తిరుగుటకా? కాదు, కాదు. దేవాలయములను చుట్టుటకు. చెవులనిచ్చిన దెందుకొ తెలుసా? ఊరివారి సుద్దుల నందించుటకా? కాదు, కాదు. భగవన్నామము నాలకించుటకు, కన్నుల నిచ్చిన దెందుకో తెలుసా? రోజుకు మూడు సినిమాలు చూచుటకా? కాదు, కాదు. భగవంతుని రూపాన్ని దర్శించుటకు."కనుక, ఇంద్రియాలను మనస్సును పవిత్రం గావించుకొని, చిత్తశుద్ధితో భగవంతుని చింతించాలి.

నీవు ఎంత భక్తి శ్రద్ధలతో స్మరింతువో దానికి తగిన ఆనందాన్ని పొందుతావు. భగవంతుని నీవు ఎంత భావముతో చింతిస్తావో, అంత భావసిద్ధి నీకు కలుగు తుంది. ఎట్టి పొగనో - అట్టి మేఘము తయారౌతుంది, ఎట్టి మేఘమో - అట్టి వర్షము కురుస్తుంది. ఎట్టి వర్షమో - అట్టి పంట పండుతుంది, ఎట్టి పంటనో - అట్టి పంటను మనం భుజిస్తాము.

ఎట్టి ఆహారం భజిస్తామో అట్టి జీవితమును అనుభవించ వలసి వస్తుందని బుజువు చేయడానికి రష్యాలో, ఆమెరికాలో అనేక పరిశోధనలు చేస్తూ వచ్చారు. ఒక డాక్టరు ఒకస్త్రీ గర్భములోని శిశువునకు ఇంజక్షను ద్వారా నిత్యము ఒక ఔన్సు యాపిల్ జ్యూస్ ఇస్తూ వచ్చాడు. ఆ పిల్లవాడు పుట్టిన తరువాత యాపిల్ పండు లంటే చాలా ఇష్టపడేవాడు. అనగా, **గర్భములో ఉండినప్పుడు ఎలాంటి భావములను, ఎలాంటి పదార్థములను శిశువు అనుభవిస్తుందో, తాను పుట్టిన తరువాత కూడ వాటినే అనుభవిస్తుంది.** ఈనాటి మానవులు తమ నిత్యజీవితములో వీడియోలు, సినిమాలు అధికంగా చూడటంచేత వారికి పుట్టే బిడ్డలు కూడా **"సినిమా బిడ్డలు"** గానే తయారౌతున్నారు. ఇది తల్లి దండ్రుల దోషమే.

ఈనాడు ప్రపంచంలో పంచభూతములను పవిత్రం గావించాలంటే, ఒక్క భగవన్నామ సంకీర్తనయే ఆధారము. మనము చేసే శబ్దములన్నీ గాలిలోని విద్యుత్

తరంగములలో కలసిపోయి, ఒక స్థాయికి చేరుకొన్న తరువాత అవి శాశ్వతంగా నిలచి పోతాయి. ఈనాడు ఢిల్లీ రేడియో స్టేషన్‌లో ఏదైనా కార్యక్రమము జరిగితే, సరిగ్గా అదే సమయానికి మనం ప్రశాంతినిలయంలో వాటిని వినగలుగుతున్నాము. అనగా, శబ్దములు గాలి లోని విద్యుత్ తరంగములలో చేరిపోయి, **క్రమక్రమేణా సర్వత్రా వ్యాపించిపోతున్నాయి. శబ్దములో ఇంతటి మహత్తర మైన శక్తి ఉన్నది.** కనుక, మనం చేసే శబ్దమంతయు విద్యుత్ తరంగములలో లీనమైపోగలదు. ఈనాడు అనేక దుశ్శబ్దముల చేత గాలి కలుషితమై పోయింది. కనుక, ఇట్టి బాహ్య సంబంధమైన గాలిని పరిశుద్ధ పరచాలనుకొంటే భగవన్నామ సంకీర్తన గావించాలి.

ఈ భగవన్నామ సంకీర్తనలో పంచభూతాలను పవిత్రం గావించే శక్తి సామర్థ్యాలు ఇమిడి ఉంటున్నవి. ఈనాడు గంగను పరిశుద్ధం చేయడానికి **ఎన్నో కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నారు. కాని, పరిశుద్ధం చేసే విధానాన్ని మొదట గుర్తించాలి. తలపైన నీరు పోస్తూ కాళ్ళను టర్కీటవలుతో** తుడుస్తుంటే ప్రయోజనమేమిటి? ఒక వైపు గంగాజలమును పరిశుద్ధం చేసే ప్రయత్నం చేస్తూ, పట్టణాల నుండి వస్తున్న డ్రైనేజి నీరంతటిని గంగలో కలుపుతుంటే, ఇంక గంగ ఏవిధంగా పరిశుద్ధం కాగలదు! మొట్టమొదట దాని పవిత్రతను నిలబెట్టాలి.

ప్రేమస్వరూపులారా! **సంకీర్తన చాలా పవిత్రమైన మార్గము.** మనకు రాగం తెలియకపోయినప్పటికీ ఇష్టముతో, ప్రేమతో ఆ నామాన్ని స్మరించాలి. **రాగము అనగా ఇష్టము అని మరొక అర్థము. భగవన్నామ స్మరణ అత్యవసరం. ఈ కలియుగంలో నామసంకీర్తనకు మించిన మరొక మార్గము లేదు. కృతయుగమున ధ్యానం, త్రేతాయుగమున యజ్ఞం ద్వాపరయుగమున అర్చనం, కలియుగమున నామస్మరణం - అని ఈ విధముగా ఆయా యుగ పరిస్థితులకు అనుగుణ్యంగా వివిధ మార్గాలు నిర్దేశింప బడినాయి.**

భజన చేసే సమయములో ప్రతి వ్యక్తి కూడా గొంతెత్తి పాడాలి. అట్లు పాడనివాని నాలుక కేవలం కప్ప నాలుక వంటిది మాత్రమే. కప్ప తన నోరు తెరచి అరుస్తుంటుంది గాని, ఏమి ప్రయోజనం? నాలుక ఇచ్చినది నామస్మరణ చేయుట కోసమే. కనుక, ప్రతి ఒక్కరు నామమును తగిన శ్రద్ధాభక్తులతో గానము చేసి తద్వారా ఆనందాన్ని అనుభవించి, గాలిని పవిత్ర పరచి దేశానికి ఉపకారము చేయుటకు ప్రయత్నించాలి.

(స.సా.ఏ.92పు.67/71)

సంకీర్తన మనగా భగవంతుని లెస్సగా కీర్తించడం, భగవంతుని కీర్తిని ప్రకటించడం. కీర్తనం సాధకుని పవిత్రం గావిస్తుంది. విష్ణు కీర్తన విశ్వాన్నే తరింపజేస్తుంది. కీర్తన వ్యక్తిగతమైన భగవత్ప్రార్థన. సంకీర్తన విశ్వశ్రేయస్సును కోరి చేసే సమిష్టి ప్రార్థన, సంకీర్తన నాలుగు విధములు **మొదటిది గుణ సంకీర్తన. రెండవది లీలాసంకీర్తన, మూడవది భావ సంకీర్తన. నాలుగవది నామ సంకీర్తన. గుణ సంకీర్తనం భగవంతుని కళ్యాణ గుణములను హృదయంలో చింతించి, స్మరించి, తమను తరింప జేసుకోవడానికి తగిన మార్గము. ఈ గుణ సంకీర్తనంలో భక్తుడు నిర్గుణ, నిరంజనమైన దైవత్వానికి, తన ప్రేమ చేత కొన్ని గుణములు కల్పించి, ఆ గుణములను స్మరిస్తూ సంతృప్తి పొందుతాడు.** భగవంతుడు దయ, ప్రేమ, కరుణా స్వరూపుడైనప్పటికీ 'తనకు నిర్దయ, నిర్దాక్షిణ్యము, ఆగ్రహము ఉన్నట్లు భావించి ఆ భావాలను ఆధారం చేసుకొని చింతిస్తాడు. ఈ భావములు తన దోషముల ప్రతిబింబములని భావించక దైవ స్వభావము లనే అనుకొంటాడు. దైవము అవాఙ్మాన సగోచరుడని గుర్తించక వాక్కునకు, మనసునకు ఆధీనమైనటువంటి వాడని భావిస్తాడు. అనేక మంది భక్తులు ఈ మాయకు లోబడే కీర్తనలు సలుపుతుంటారు.

ఒకానొక సమయంలో తాను దైవానుగ్రహానికి దూరమైనట్లు భావించి పరితపిస్తాడు త్యాగరాజు:

వాచా మగోచరుండని ॥వా॥

నీ చరితము బొగడగ బ్రహ్మాదులకైన తరమా

కాచుకున్నాను నీదు కృపకై నా మొరాలకించి బ్రోవుమయ్య ॥వా॥
కాలుడు గొనిపోయిన గురు పుత్రుని దెచ్చి యిచ్చినావు
కంసుని మదమణచినావు
వసుదేవ దేవకీ దేవుల చెరను విడిపించినావు
వాలుగంటి యైన ఆ ద్రౌపది హా కృష్ణా యని మొరలిడ బ్రోచినావు
మేలు మేలు పాండవులను గాచినావు
కుచేలుని ఆర్తి తీర్చినావు
కురూపి వక్రమును బోగొట్టినావు
పదహారు వేల రమామణులను బ్రోచినావు

ఇవన్నియు గుణ సంకీర్తనములు. ఈ గుణ సంకీర్తనలు సాధకుని భ్రమలపై ఆధారపడి ఉంటాయి. **ఇక లీలా సంకీర్తనము:** సృష్టియంతయు లీలా మయము. ఇలాంటి సృష్టి కర్త లీలాతత్వానికి కొన్ని అదుపులు విధించి, కొన్ని హద్దులు నియమించి గానం చేయడం లీలాసంకీర్తనం. అంతా భగవంతుని లీల అని గుర్తుంచుకోలేక, తన అనుభూతులను మాత్రమే దృష్టియందుంచుకొని, ఇవి భగవంతుని లీలలు అని భ్రమిస్తాడు భక్తుడు. **త్యాగరాజు కూడా:**

ఏలా నీ దయ రాదూ
పరాకూ జేసేవేలా సమయమూ కాదూ
బాల కనకమయ చేల సుజన పరిపాల
జలధి గంభీర దనుజ సంహార దశరథ కుమార
సకల శ్రుతి సార నాదుపై ॥ఏలా॥

మానవుడు తన భక్తి ప్రపత్తులను కొంత నియమములో నుంచుకొని తద్వారా భగవంతుని కూడా తన హద్దులలో ఇముడ్చు కొంటాడు. లీలలు కూడా, కేవలము భ్రాంతులు కాదు. ఊహలు, భగవంతుని శక్తి సామర్థ్యములు కన్నియును లీలా మయములే, ఏమి చేసినా, ఏమి చూచినా, ఏది విన్నా, ఏది భావించినా అన్నీ భగవంతుని లీలాగుణగణ విశేషములే. సృష్టియందు మంచి చెడ్డ అనే తారతమ్యము లుండవచ్చును. భగవంతుని దృష్టిలో మంచీ చెడ్డ అనేవి లేవు.

ఒకటి చెడ్డ యనుచు
ఒకటి మంచి యనుచు
సృష్టియందు నిర్ణయింప నగునే
అదియు నిదియు ఒక్క ఈశ్వరుండె జేసె
భేద మెందు కలదు భక్తులారా!

నీవు ప్రకృతి వాతావరణమునకు బానిసవు కనుక, కొన్ని పరిమితులు పెట్టుకొని ఉండడం చేత, ఇది మంచి ఇది చెడ్డ అని నీ ఊహ మాత్రమే విభాజనము జరుపుతున్నది. పరిమితులు మాత్రమే ఈ మంచీ చెడ్డలకు మూల కారణము. ఈ భావములు. లీలలు, గుణములు అన్నియును సంకల్ప వికల్పముల స్వభావములు.

ఇక మూడవది భావసంకీర్తనం: భావములు కొన్ని విధములైన తరంగములతో కూడినవి. వీటిని అధికంగా జయ దేవుడు అనుభవించాడు. కనుకనే **జయ దేవుడు గానం చేసిన కీర్తనలకు భావ తరంగములని పేరు పెట్టారు.** ఇవి ఎట్లా ఉంటాయంటే:

కృష్ణా హరే చిన్ని కృష్ణా హరే
ముద్దు కృష్ణా హరే యని పిలిచెదరా!
విష్ణు స్వరూపా సృష్టినిరూపా
దుష్టసంహార నిన్ రమ్మందురా ॥కృ॥
కృష్ణా! శత కోటి మార్తాండ తేజుడా నీ ముద్దు
చేతులకు గొలుసులు కట్టెదరా
ముంగురులు దువ్వి మురళి చేతికి ఇచ్చి
అందమైన మోము చూచెదరా ॥కృ॥

జగత్తునకు ఒక అర్థము, వ్యక్తియైన భక్తునకు మరొక అర్థము స్ఫురించే గీతములను జయదేవుడు గానం చేశాడు. ఈ భావసంకీర్తనంలో ఆరు విధములైన స్థాయిలుంటాయి. **శాంత భావము, సత్యభావము, దాస్యభావము. వాత్సల్యభావము, అనురాగభావము, మధురభావము,** ఈ ఆరూ ఆరు తరంగములవంటివి. ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్క విధమైన మార్గమును అనుసరించి తరించినాడు.

భీష్ముడు మహాజ్ఞాని. కేవల జ్ఞానిమాత్రమే కాదు. అన్ని విధముల వేదాంత తత్వసారమును గ్రోలి ఆచరణ యందుంచిన మహా వీరుడు. రాజనీతి, దైవనీతి, జగన్నీతి, శాంతినీతుల యందు పరిపూర్ణుడు. కనుకనే ఎన్ని కష్టములు వచ్చినప్పటికీ దేహము నేను కాదు. దాని కష్ట, నష్ట, దుఃఖములకు నేనేమాత్రము బాధ్యుడను కాను అన్న దృఢభావంతో ఉన్నాడు. జీవతత్వమును దైవత్వములో ఇముడ్చాలనుకున్నప్పుడు పవిత్రకాలము అవసరమని, 56 దినములు శరతల్పము పైన పరుండి, ఉత్తరాయణ పుణ్యకాలము వచ్చేంత వరకు కృష్ణనామాన్ని స్మరిస్తూ వచ్చాడు. దీనినే **శాంత భక్తి అన్నారు**. ఎలాంటి పరిస్థితులలోను కష్టములకు క్రుంగక, సుఖములకు పొంగక సమత్వమును అనుభవించి శాంతంగా దైవత్వాన్ని చింతించడం శాంతభక్తి.

ఇంక సఖ్యభక్తి: దీనికి దృష్టాంతము అర్జునుడు, కుచేలుడు, అర్జునుడు శ్రీకృష్ణుడు సాక్షాత్ పరమాత్ముడని గుర్తించి కూడా స్నేహమునే అధిక స్థాయి యందు భావించి నిరంతరము బావా బావా అని సంబోధించేవాడు. అర్జునుడు. గోపబాలురు కూడనూ ఈ స్నేహభావముచేత నిజమైన ఆనందము ననుభవించారు.

తాను భక్తుడనని, భగవంతుడు తన కతీతమైన శక్తి వంతుడని భావించడం చేత భక్తునికి భగవంతునికి సన్నిహిత సంబంధ మేర్పడదు. ఎప్పుడు స్నేహితమధిక మవుతుందో అప్పుడు సర్వ భేదములు కూడనూ దూరమవుతాయి. శ్రవణం, కీర్తనం, విష్ణోఃస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం స్నేహం, ఆత్మనివేదనం- ఈ నవవిధ భక్తి మార్గములలో స్నేహితము నందు ఒక గౌరవము, మర్యాద, పాటించడం ఉండదు. క్రొత్తగా మన ఇంటి కెవరైనా వస్తే దయ చేయండి కూర్చోండి అని చాప, ఛైరు వేసి గౌరవ మర్యాదలతో ఆహ్వానిస్తాము. అదే పాత స్నేహితుడెవరైనా వస్తే ఒరే-రా రా, కూర్చోరా అంటాం. సన్నిహిత సంబంధానికి ఈ గౌరవ వాచకాలు ఉండవు.

అట్లే దైవాన్ని కూడా ప్రియమైన స్నేహితునిగా భావించుకున్నప్పుడు మన భావాలన్నీ స్పష్టంగా చెప్పుకోవడానికి ఒక ధైర్యం వస్తుంది. త్యాగరాజు దైవాన్ని తన పాత స్నేహితునిగా భావించుకొని గౌరవ మర్యాదలే మాత్రం పాటించక ఏకత్వంగా పోయాడు. గౌరవ మర్యాద లివ్వడానికి అనేకత్వంగా భిన్నత్వంగా భావించలేదు- భగవంతుని తన ఇంటికి రారా అని పిలుస్తాడు.

రా రా మా ఇంటి దాకా
రా ర! మా ఇంటి దాకా
రఘువీర, సుకుమార, నే మ్రొక్కెద ॥రా॥
రారా దశరథ కుమారా నన్నేలుకోరా
నేతాళ లేరా ॥రా॥

చూడండి! రారా, అంటూ ఏ భావాన్నే అనుభవించాడు త్యాగరాజు.

ఎంత వేడుకొందు ఓ రాఘువా
పంత మేలర ఓ రాఘువా
ఎంత వేడుకొందు ఓ రాఘువా
పిలచి, పిలచి విసుగెత్తింది:
మారు బల్కకున్నా వేమిరా?
రామ! మారుబలక్కకున్నా వేమిరా?
మా మనోరమణ మారు బల్కకున్నా వేమిరా?
జార, చోరా భజన చేసితిరా
సాకేతసదనా మారు బల్కకున్నా వేమిరా?
మామనోరమణా ॥మా॥
మరికొంత సేపు చూశాడు రామ చంద్రుడు.
నిను నే నెందు వెదకుదురా ॥ని॥
ఓ రామా ॥ని॥

ఈ విధంగా అనేక మంది భక్తులు భగవంతుని స్నేహ భావం చేత ఏక వచనంగా సంబోధించి ఆరాధనలు సలిపారు.

దాస్య భక్తికి గోపికలను, హనుమంతుని చెప్పుకో వాలి. వీరు నిరంతరం భగవంతుని దాసులుగా ఉండి దైవానుగ్రహాన్ని పొందాలని పరితపించిన వారు.

హనుమంతునికి ఏ సమయంలో నైనా పాద సేవ కావాలి. రామునికి తాను దాసుడుగా ఉండాలి. రామాజ్ఞను శిరసావహించాలి. ఎప్పుడూ ఇదే భావన.

గోపికలు మధురకు పోయిన కృష్ణుని రాకకు ఎదురు చూసి, ఎదురు చూసి కట్ట కడపటకు విసుగెత్తి పోయారు.

ఎంత కాలమీ బాధల్
కృష్ణా! ఎందుకోసమీ గాథల్
న్యాయము లేదా మాతో వాదా
మా పై కరుణయె రాదా
మీ గోపికలు మేమవునా కాదా?
కించ బరచ మరియాదా? ॥ఎంత॥

నిరంతరము భగవంతునితో ఉండాలని అశించేది ఈ దాస్యభక్తి. రాముడు ఆవలిస్తే చిటిక వేసే సేవ కోరుకొని ఇరవై నాలుగు గంటలూ రాముని కనిపెట్టుకొని ఉండే అవకాశాన్ని సంపాదించుకున్నాడు హనుమంతుడు. చిన్న చిన్న సమయాలలో సైతం భగవంతునితో కలిసి ఉండటానికి అవకాశం కోసం కాచుకొని ఉండే వాడు.

వాత్సల్యభక్తి: ఇది యశోద భావం. గోపికలు కృష్ణుని ఎన్ని విధములుగ వర్ణించినా ఈమె కా వర్ణన గిట్టేది కాదు. గోపాలా! గోపాలా! ఈ గోపాలా అనే పదము తప్ప అన్యపదము లామెకు నచ్చవు. మధురకు పోయిన కృష్ణుని వార్తలు తెలియక యశోద కూడా ఎంతో పరితపించింది. సందేశం తెచ్చిన ఉద్ధవుని 'నా గోపాలుడు బాగున్నాడా ఉద్ధవా?' అని అడిగింది, అమ్మా! మునిమానస సంచారి, గోపీలోలుడు, మధురాపురి విహారి-ఆయన కేమి తక్కువ? అని అనేక రకాలుగా వర్ణించాడు ఉద్ధవుడు. అప్పు డామె అన్నది: గోపీలోలు డెట్లా ఉన్నాడో నాకవసరం లేదు. నా గోపాలుడే నాకు కావలసింది. యశోద ఇట్లా తన ఒక్క గోపాలుని భావాన్నే తలుస్తూ ఉండిపోయింది.

మీరా గిరిధర గోపాలా అంటుంది. గిరిధర గోపాలా అంటేనే ఆమెకు తృప్తి. ఊరక కృష్ణా అన్నా, గోపాలా అన్నా ఆమెకు తృప్తి లేదు. రంగా, రంగా! పాండు రంగా!! అంటేనే సక్కుబాయికి తృప్తిగాని కృష్ణా అన్నా గోపాలా అన్నా ఆమెకు తృప్తి లేదు.

నీ పదములనే పాడుకోగలనా
పాండురంగా! రంగా! నేరమా అపచారమా
పరాకా! కరుణా సాగరా పల్కులే వినరావా

ఒక్కొక్కరు ఒక్కొక్క పేరునందు అభిరుచి పెంపొందించుకొని భగవంతుని పొందటానికి ప్రయత్నిస్తారు ఈ వాత్సల్య భక్తిలో. అనురాగభక్తిలో కూడా అదేవిధముగ భగవంతుని ఒక్కొక్క పేరుతో ఉచ్చరిస్తూ ధ్యానిస్తూ తపిస్తూ ఉంటారు. తర్వాత మధుర భక్తి.

ఈ మధుర భక్తి మాత్రమే ఉత్తమమైన భక్తి. సర్వమూ దైవంగా భావించి దైవం తప్ప అన్యం లేదు అనే స్థితి ఇది. భర్తను కృష్ణుని వలె, తల్లిని కృష్ణునివలె, అత్తను కృష్ణునివలె, సర్వమూ కృష్ణమయంగానే బావిస్తారు ఈ మధుర భక్తిలో. ఇందులో ఉన్నతస్థాయికి చెందినది ఒక్క రాధ మాత్రమే. మిగితా గోపికలందరూ మధుర భక్తి కలవారే అయినప్పటికీ వారికి కొన్ని హద్దులు అడ్డుగా ఉండేవి. కృష్ణునితో బృందావనానికి పోతే అత్త చూస్తుందేమోనని, భర్త చూస్తాడేమోనని లోకానికి వెరచి, అభిమానానికి కట్టుబడి ఉండే వారు. అభిమానమును పూర్తిగా త్రెంచుకొని ఎవరేమనుకుంటే నాకేమి? నా దైవముతో నాకవసరము. అనే భావముతో సంచరించునది ఒక్క రాధ మాత్రమే. **అభిమాన మమకారములు త్యజించి నప్పుడు మాత్రమే అహంకారం దూరమవుతుంది. అహంకారం దూర మైనప్పుడే ఆత్మతత్వం ప్రకాశిస్తుంది. ఒకనాడు ఒక గోపిక పడకగదిలో పండుకొని ఉంటుంది.** కొంత సేపటికి భర్త వచ్చాడు. వచ్చి పడకపై పండుకున్నాడు. 'చాలా అలసిపోయాను. నేను పరుండాలి అన్నాడు', పడకపైన భర్త పరుండినాడు. భార్య పాద సేవ చేస్తున్నది. కృష్ణుడు వచ్చి తలుపు తట్టాడు. గోపిక పాపం భయపడిపోయింది! భర్త లోపల ఉన్నాడు: కృష్ణుడు తలుపు తడుతున్నాడు: తీయకపోతే అతనికేమి కోపమో! ఏం చేసేదని చాలా బాధ పడిపోతున్నది. ఈ పరిస్థితిని చక్కగా గుర్తించిన భర్త కన్నులు మూసుకొని గురకలు పెట్టి నిద్రపోతున్నట్లుగా నటించసాగాడు. మధ్యమధ్య అటూ ఇటూ పొరలుతున్నాడు.

గోపిక తలుపు దగ్గరకి వెళ్ళి సందులో నుంచి మెల్లిగా చెపుతున్నది కృష్ణునికి.

తలుపు తీయునంతలోనె
తత్తర మది ఏల నోయి ॥కృష్ణా॥
తలుపు తీతు కొంత సేపు
తాళుము కృష్ణా
కొంత సేపు ఆగుము కృష్ణా...
పతి నిద్దుర పోవ లేదు
మది సందియ మొందు నేమొ
తాళుము కృష్ణా....

కాని కృష్ణుడు మాట వినేవాడు కాడు. తలపు కొడుతూనే ఉన్నాడు. గోపిక తియ్యక పోయినా తెరచుకున్నది తలుపు! భర్త ఉన్నాడే, కృష్ణుడు వచ్చాడే, ఏమవుతుందో ఏమో అని తబ్బిబ్బై ఇటు కృష్ణుని వైపు అటు భర్త వైపు చూసింది. అక్కడ భర్త లేడు; అసలు భర్త వేషంలో వచ్చింది కూడా కృష్ణుడే. పరీక్షించాలని ఈ విధంగా వచ్చాడు. అభిమాన మమకారములను త్రుంచే నిమిత్తమై పరీక్షలు పెట్టడం, గోపికలు ప్రార్థించడం, కృష్ణుడు వారిని దూరం చేయడం, ఈ విధంగా సంభవిస్తూ వచ్చింది. అనురాగ భక్తిలో మోహ భక్తిలో లేక మధుర భక్తిలో ఉన్న గోపికలకు, గుణ సంకీర్తనలన్నీ భావ సంకీర్తనలే. గుణ సంకీర్తన, లీలా సంకీర్తన, భావ సంకీర్తన భక్తుల భావోద్రేకాల ప్రతిబింబాలు. **నామ సంకీర్తన అట్లా కాదు.**

సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాద్, భగవంతుని నామములు అనేకంగా ఉండటం చేత ఏ నామమైనా భగవంతుని హృదయానికి సూటిగా నాటుకొని పోతుంది. నామమును గానముగా మార్చుకొని పాడినప్పుడు హృదయాన్ని లాగుతుంది. రూపము అనిత్యము, అశాశ్వతము. కాని నామము సత్యము, నిత్యము, 'తెల్లచొక్కా, తెల్ల ప్యాంటు వేసుకొంటాడు. కళ్ళకు అద్దాలుంటాయి. ఆ అబ్బాయిని చూడాలి.' అంటే ఏ అబ్బాయిని చూడగలము. గుర్తులు అనవాళ్ళతో మనం ఎవరిని గుర్తుపట్టగలము? పేరు చెప్పితే లక్షమందిలో ఉన్నా లేచి వస్తాడు. పేరు సులభంగా చెంతకు లాగుతుంది. భావములు, లీలలు, ఎంత మందికైనా అదే స్థాయిలో ఉండవచ్చును నామము హృదయాన్ని ద్రవింప జేస్తుంది. శోకముతో పిలువవచ్చును, మాటలతో పిలువవచ్చును. రాగం, తాళం, భావంతో పిలిచినప్పుడు హృదయం కరుగుతుంది. భావ రాగ తాళ యుక్తమైన గానము హృదయాన్ని రమింపజేస్తుంది. ఇంకా నీకు దయ రాలేదా అంటే అది హృదయానికి సూటిగా నాటదు. రామా నన్ను బ్రోవరా! అని పద్యంగా చెప్తే అది అసలే ఇంపుగా ఉండదు. రామా! నన్ను కాపాడు... అని ఆర్తితో దీనంగా రాగ తాళ యుక్తంగా ప్రార్థిస్తే హృదయాన్ని అయస్కాంతం మాదిరిగా ఆకర్షిస్తుంది. శ్రుతి రాగతాళ లయ భావములతో పాడినప్పుడు ప్రార్థన దైవాన్ని సన్నిహితం చేస్తుంది.

భగవద్రతి గలిగిన దేశం భారతదేశం. భా-రతి భగవంతుని రమింప జేసేది. అంతేకాదు. భా-భావ, ర-రాగ, త-తాళ సమ్మిళితమైన దేశం భారత దేశం, కనుక మనం భజన చేసే సమయంలో భావం ప్రధానమైనదని గుర్తుంచుకోవాలి. తాళం తగినట్లుగా ఉండాలి. తాళం సరిగా లేకపోతే తల నొప్పి వస్తుంది. తాళం సరిగా ఉండి శ్రుతి అపస్వరంగా వస్తే అది కూడా వినడానికి వీలుకాదు. భజన చెప్పేవారు భావ రాగ శ్రుతి లయబద్ధంగా పాడాలి. ప్రతివ్యక్తి విధిగా నామస్మరణ చేయాలి. పాట తెలియక పోయినా పాడే సమయంలో ఆ నామాన్ని స్మరించుకుంటే నిజంగా మనకు చిత్తశుద్ధి చేకూరుతుంది. విద్యార్థులలో **కొందరు ఏమీ పాడకుండా మూతి ముడుచుకొని కూర్చుంటారు. ఇలాంటి ముఖాలు చూస్తే దైవం దూరం వెళ్ళిపోతాడు. భజనలో తన్మయులై పోవాలి. పదములతో తాను కూడా లీనం కావాలి. రాకపోయినా నెమ్మదిగా నైనా పాడాలి. పాడని నాలుక కప్పనాలుక.**

కనుకనే నారాయణుడు నారదునికి చెప్తాడు. **మద్భక్తా యత్ర గాయంతి, తత్ర తిష్ఠామి నారద! అని. ఎక్కడ నా భక్తుడు గానం చేస్తుంటాడో అక్కడే నేను ప్రతిష్ఠ అయి ఉంటాను అన్నాడు.** నామ సంకీర్తనం చేత దైవాన్ని వశం

చేసుకోవాలి. కోరిన కోరికలు తీర్చే కామధేనువైనా మెడకు తలుగు తగిలించి గూటానికి కట్టివేస్తే అక్కడే నిలిచి పోతుంది. భక్తుల అభీష్టములను నెరవేర్చే కామధేనువు దైవం. భక్తి పాశముతో కట్టి నాలుక అనే గూటానికి బిగించి వేస్తే అక్కడే నిలచి పోతాడు. సమ్యక్ కీర్తనం సంకీర్తనం. నాలుగు వందలమంది ఒక్క తూరి పాడితే వాతావరణం మెంత పరిశుభ్రమైపోతుంది.

ఈనాడు వాతావరణమంతా చెడ్డ శబ్దాలతో, చెడ్డ మాటలతో నిండిపోయింది. దాన్నే మనం పీల్చు కొంటున్నాం. అందుకే చెడ్డ ఆలోచనలన్నీ మనకు వస్తున్నాయి. పవిత్రమైన నామాన్ని పాడితే అది వాతావరణాన్ని పరిశుద్ధం చేస్తుంది. పవిత్రమైన గాలిని పీల్చుకోవడం వల్ల పవిత్రమైన భావాలే మనకు వస్తాయి.

(స.సా.న.83.పు.273/278)

సంకీర్తనలయందు నాలుగు విధములుంటున్నవి. **గుణసంకీర్తన, లీలాసంకీర్తన భావసంకీర్తన, నామసంకీర్తన అని ఇవి నాలుగు విధములు.** గుణసంకీర్తనమనగా భగవంతుని మంగళకరమైన గుణగణములను మాత్రమే వర్ణించేది. ఆనాటి మహర్షులు, ఆనాటి కవులు అనేక విధములుగా భగవంతుని గుణములను వర్ణిస్తూ వచ్చారు. "వాసుకిశయన శ్రీనివాస చిద్విలాస భవపాశముల ద్రుంచి మనోల్లాస మివ్వరా - భాసుర కళ్యాణ పురువాసుడౌచు శౌష గోపదాసుని జగదీశ హృషీకేశ వేగ - శ్రీరమారమణీ మనోహరా" ఈ విధంగా ఆ గుణాలను వర్ణిస్తూ వచ్చారు. ఇంక లీలాగుణగణ విశేషములు. 'సందుగొందులందు మరి అందరందు నీవే ఆనందమొందుచుందవని విందు శ్రీధరా: ఇందువదనా సురేంద్రవందిత పాదారవింద నిత్యవందనంబు నీకు చెసెద - శ్రీరమారమణీమనోహరా'. ఇంక భావసంకీర్తన "మేటియౌ త్రికూట పీట సాటియగు.. రాజు పేట నేలుచున్న కపటనాటకాధార ఆటల పాటల మృదుమాటలచే భోజరాజు మాటికి పిలిచిన పలుకవేటికి శ్రీవేంకటేశ శ్రీరమా రమణీమనోహరా" ఈ గుణ సంకీర్తనకు, లీలాసంకీర్తనకు, భావసంకీర్తనమునకు అనేక విధములైన మార్పులు కలుగుతూ వస్తుంటాయి. కాని నామ సంకీర్తనం మాత్రం అన్నిటికంటె ఉత్తమమైనదని నిర్ణయం చేస్తూ వచ్చారు.

(శ్రీ.స.వి.వా.పు.71)

(చూ॥ భజన, సంతృప్తి)

సంకేతము

(చూ॥ తొమ్మిది)

సంక్రాంతి

(చూ॥ గుమ్మడికాయ, భగవదన్వేషణ)

సంఖ్య

(చూ॥ అష్టోత్తర శతనామాలు, వేదము)

సంఖ్యాశాస్త్రము

(చూ॥ ఓంకారము)

సంగము

నీవు ఎలాంటివాడివో చెప్పాలంటే నీ సంగమెలాంటిదో తెలుసుకుంటే చెప్పవచ్చు. కనుకనే **ఐన్‌స్టీన్ చెప్పాడు.** Tell me your company I shall tell you what you are అని. కనుక మన యొక్క మంచిచెడ్డలు కేవలము సంగముతోనే ఏర్పడుతూ ఉంటాయి.

భజబలంబు, మంచి బుద్ధిబలంబుండి
దైవ బలము లేక దాసుడగును
కర్ణుడంతటివాడు కడపటి కేమయ్యె
మరచిపోకు డిట్టి మంచిమాట.

కర్ణుడు మహాబలశాలి, మహాబుద్ధిమంతుడు, మహా శక్తిమంతుడు. కాని దుర్మార్గులైన దుర్యోధన దుశ్శాసనుల సహవాసముచే దైవాన్ని విస్మరించి దుస్సంగాన్ని విశ్వసించి, దుష్టచతుష్టయములో ఒకడైపోయాడు, దైవమును

దూరము గావించుకున్నాడు. దైవ బలమున్నప్పుడే సర్వ బలములూ చేకూరుతాయి. ధర్మ బలమునుండినప్పుడే సర్వ బలములూ చేకూరుతాయి.

(స.ది.పు.97)

సంగీతము

సంగీతము శాంతిదాయకం అందరికీ సంగీతం యిష్టమే. "శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసం ఫణిః" అన్నారు. గానమాధుర్యానికి పిన్నలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు, పశువులు, పాములు, అన్నీ పరవశిస్తాయి. సంగీతాన్ని ఆశ్రయించి, భక్తి మాధుర్యం మరింతగా పెరుగుతుంది. శాంతి రసంలో పర్యవసిస్తుంది.

(శ్రీ.సా.గీ.పు.446)

(చూ॥ మురళి)

సంగీత విశ్వవిద్యాలయము

ప్రేమస్వరూపులారా! **ఈనాడు సంగీత యూనివర్సిటీకి శంకుస్థాపన చేశాము.** కేవలం సంగీత సాహిత్య నృత్య కళలు మాత్రమే కాదు. **ప్రాచీన సంస్కృతికి సంబంధించిన డ్రామాలు, హరికథలు కూడా ఈ యూనివర్సిటీలో బోధింపబడతాయి.** కొన్ని కోట్ల రూపాయల వ్యయంతో రూపొందుతున్న ఈ యూనివర్సిటీలో ప్రాచీన, ఆధునిక సంగీత సాహిత్యాలు రెండూ చోటుచేసుకుంటాయి. గొప్ప గొప్ప కళాకారులు వస్తారు. ప్రపంచంలోని అనేక సంగీత కళాశాలల్లో పని చేసిన ప్రఖ్యాత సంగీత విద్వాంసురాలు ఇందిరా చక్రవర్తి ఈ యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా వస్తున్నది. రవిశంకర్ (సితార విద్వాంసుడు) అన్న ఉదయశంకర్ పేరు మీరు వినియుండవచ్చు. నృత్యకళలో అతనిని మించినవారు లేరు. అతని దగ్గర ఉండిన పరికరములను ఒక పది లారీలలో వేసుకుని ఇక్కడకు తెస్తున్నారు. అతని భార్య వచ్చి స్వామి వాటిని స్వీకరించాలని ప్రార్థించింది. ఒకవైపు మృదంగం, మరొకవైపు తంబుర, మధ్యలో శంఖము, సితార మున్నగు వాయిద్యాల ఆకృతిలో ఈ భవనం నిర్మింపబడుతుంది. ఈ భవనాన్ని బయటి నుండి చూస్తూనే ఇది సంగీత యూనివర్సిటీ అని అర్థం కావాలి. ఇలాంటి అద్భుతాలు మన ప్రశాంతి నిలయంలో ఎన్నో జరగబోతున్నాయి. **ఒకనాడు కేవలం 106 మంది జనాభా కల్గిన పుట్టపర్తిలో ఈనాడు లక్షలు లక్షలు ప్రోగవుతున్నారు.** ఇంతేకాదు. **కొన్ని సంవత్సరములలో పుట్టపర్తి యావత్ప్రపంచానికే ధ్రువతారగా** వెలుగొందుతుంది. ప్రపంచ మ్యాపులో పుట్టపర్తి స్థానాన్ని పొందుతుంది. ఈనాడు శ్రీనివాస్ (సెంట్రల్ ట్రస్టు సభ్యుడు) చెప్పాడు కదా, **అమెరికాలో వెలువడిన ఒక పుస్తకంలో మన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి గురించి గొప్పగా వర్ణించబడింది.** ఆమెరికాగాని, జపాన్‌గాని, జర్మనీగాని, ఇటలీగాని ఏ దేశానికైనా సరే మన పుట్టపర్తి ప్రధానమైనదిగా రూపొందుతుంది. ముమ్ముందు ఇది ఎంతో అభివృద్ధికి రాబోతున్నది. విద్యార్థులారా! నిజంగా మీ అదృష్టం ఎంత గొప్పదో! **మీ అదృష్టవశాత్తు చిక్కిన ఈ అవకాశాన్ని మీరు సద్వినియోగం చేసుకోండి.** అప్పుడే మీరు ఇక్కడ ఉన్నందుకు తగిన సార్థకతను పొందుతారు.

(స.సా.న.99పు.305/306)

సంగీతశాస్త్రము

(చూ॥ ఓంకారము)

సంఘనీతి

(చూ॥ మూడుసూత్రాలు, విప్లవము)

సంఘబుద్ధి

(చూ॥కర్మయోగి)

సంఘము

మానవుడు సర్వశ్రేష్ఠమైన దైవత్వాన్ని పొందుటయే ఉత్తమ మార్గం. అట్టి దైవత్వాన్ని పొందుటకు సాధ్యం కానప్పుడు,

సంఘర్షణ

కనీసం మానవత్వాన్నైనా అభివృద్ధి పరచుకొని, జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. అంతేగాని, **మానవుడు దానవుడుగా లేక పశువుగా మారుట ధర్మ విరుద్ధం.** ఈనాడు ఇట్టి ధర్మ విరుద్ధమైన చర్యలు జగుత్తనందు వ్యాపించి ఉండుట చేత మానవత్వమే మరుగున పడిపోతున్నది. నీతి నిజాయితీలు, సంఘమర్యాదలు శూన్యమైపోయినవి. మానవుడు 'సంఘము' అనే పదాన్ని సరిగా అర్థము చేసికొనలేక, జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నాడు. కేవలం మనుష్యుల యొక్క చేరికయే 'సంఘము' అని భావిస్తున్నాడు. కాదు, కాదు. **అనేకత్వములో ఉన్న ఏకత్వాన్ని గుర్తింపజేయునదే సంఘము. అందరూ కలసి ఏకకాలంలో ఏక కర్మను ఆచరించి ఆకర్మఫలితాన్ని ఏకాత్మభావంతో అనుభవించాలి. ఇదే సంఘము యొక్క ప్రధానమైన ధర్మం.** నిజమైన సుఖాన్ని సంఘము ద్వారానే అనుభవించడానికి సాధ్యమౌతుందనే సత్యాన్ని మానవుడు గుర్తించాలి. ఇదే 'సంఘం' యొక్క అంతరార్థం. అనగా మానవుని సుఖ - సంతోషాలన్నీ సమాజముపైననే ఆధారపడి ఉంటాయి. సంఘమే లేకుండిన మానవుడే లేడు.

(స.సా.న.1991 పు.299)

సంఘర్షణ

(చూ॥ మంచిచెడ్డలు)

సంఘసేవ

సంఘసేవయే సర్వేశ్వరుని సేవగా విశ్వసింపుడు, సమాజమును భగవంతుని విశ్వరూపముగా తలంచుడు. పేరు ప్రతిష్ఠలకు ప్రాకులాడక, ద్వేష భావములకు చోటివ్వక, వ్యక్తిత్వమును వెనకకు నెట్టి, శక్తి సామర్థ్యముల కొలది సంఘసేవకు కంకణం కట్టుడు.

(ప్రే.బో. పు.36)

(చూ॥ పరమభక్తి)

సంచరించు

ధనము వలన దానమును - వాక్కు వలన సత్యమును ఆయువు వలన కీర్తియును, దేహము వలన పరోపకారమును, ఈవిధముగా పాలునుండి వెన్నవలె నిస్సారమైన సంసారమునుండి సారభూతమైన ఆత్మ సంపత్తును గ్రహింపవలెను. తత్త్వజ్ఞానాభిలాషగల బుద్ధిశాలులు, ధనికులయ్యునూ మదము లేకయు, యవ్వన వంతులయ్యునూ చాంచల్యము లేకయు, ప్రభువులయ్యునూ ప్రమాదము లేకయు **సంచరించు చుందురు.**

(జ. పు.23)

సంతృప్తి

"అసంతృప్తో ద్విజో నష్టః...." అందువలననే మా కాలేజీలో పిల్లలకు చెపుతాను -

"Who is the richest man in the world?
He who has the satisfaction".

ఎవరికి సంతృప్తి వుంటుందో అతడే ధనికుడు.

"Who is the poorest man in the world?
He who has many desires."

ఎక్కువ కోరిక లేవని కున్నవో వాడే బీదవాడు.

(శ్రీ.ది.పు.53/54)

'సంతుష్టః సతతం' అని చెప్పింది భక్తి యోగము. 'దృఢనిశ్చయః' అని కూడను బోధించింది. 'సంతుష్టః సతతం నిరంతరము తృప్తుడై వుంటుండాలి. సంతృప్తుడై వుంటుండాలి. **తృప్తివేరు, సంతృప్తివేరు. గీతము సంగీతములో, కీర్తనం సంకీర్తనం అనే రెండింటిలో కొంత వ్యత్యాసము గోచరిస్తుంది. 'సమ్యక్ కీర్తనం సంకీర్తనం'. కీర్తనం పాడటంలో కేవలము పెదవులనుండి గొంతునుండి వాక్యములు వెలువడవచ్చును. సంకీర్తన అనేది హృదయము నుండి కరగి, కదలి, స్వేచ్ఛతో, ఆనందముతో, భయభ్రాంతులు లేకుండా కావించుదానినే సంకీర్తనం అన్నారు. అదేవిధముగనే తృప్తి, సంతృప్తి. తృప్తి అనేది తాత్కాలికమైనది. ఇది వ్యవహారిక సంబంధమైన**

జగత్తునకు సంబంధించినది. ఇది ప్రాపంచికసంబంధమైన ప్రవృత్తి. సంకీర్తనమన్నట్టుగా సంతృప్తి కూడను. ఇది హృదయస్థాయినుండి శాశ్వతమైనదిగను, సత్యమైనదిగను, పరమైనదిగను, నివృత్తికి సంబంధించినదిగను గోచరిస్తుంది. **సంతృప్తికి మార్పులేదు. కూర్పులేదు. మార్పు కూర్పులేని నిత్యత్వముతో కూడినది సంతృప్తి.** కనుక భక్తుడైనవాడు లౌకికసంబంధమైన ఫలమునకుగానీ లేక ఫలవిరుద్ధమునకుగానీ యేమాత్రము చింతించక స్థిరమైన మనస్తత్వమును అభివృద్ధిపరచుకోవాలని దీని అంతరార్థము. జయాపజయములకు క్రుంగక పొంగక సమత్వముతో భావించుకొనే తత్వమే సంతృప్తి అనే పదమునకు అర్థము. కనుకనే భక్తి యనగా ఎట్టి మార్పును చెందనిది. ఎట్టి కూర్పును కలగనట్టిది. **నిశ్చలమై నిర్మలమై యుండు ప్రేమతత్వమునే సంతృప్తి అని భావించవచ్చును.** భగవంతుడు ఏది అనుగ్రహించినా, ఏది ప్రసాదించినా ప్రేమ ప్రసాదముగనే భావించుకొని తృప్తి పొందాలి. ఇట్టి సమభావమును కలిగి యిట్టి సమత్వముచేత ప్రవర్తించే చిత్తమునే **సంతృప్తి** యని చెప్పవచ్చును.

(శ్రీ.గీ.పు.18/19)

(చూ॥ అంతర్వాణి, అలవర్చుకోవాలి, కోరికలు)

సంతోషభిక్ష

వర్ణములను బట్టి వృత్తులని భావింతురు, కానీ అట్లుకాదు వృత్తులను బట్టి వర్ణములు పిలువబడినవి. **నేడు చూతమా; వృత్తులూ లేవు వర్ణములూ లేవు.** నేడొక వృత్తి, రేపొక వృత్తి; నేడొక వర్ణము రేపొక వర్ణము! అందుకనే, అనేక విధముల అశాంతి, అసౌకర్యములు చెలరేగినవి. అమోఘమైన అంతర్ ధర్మమును, సత్యవ్రతమును, సహనదీక్షను బాహ్య వృత్తులయందు లగ్న పరచి, ఆయావృత్తుల వర్ణములను, **వాని నిబంధనలనూ పాటించిన అదే సంతోష భిక్ష శ్రీరామరక్ష, లేకున్న ఒకరితో ఒకరికి కక్ష, దుర్భిక్ష లోకమునకొక శిక్ష, అట్టి శిక్షనుండి రక్షించునదే, ధర్మ శిక్షణ.**

(జ.పు.132)

సంతోషము

(చూ॥ సర్వదినం, బహుమానం)

సందేశము

నేడు దేశమునకు కావలసినది భోగభాగ్యములు కాదు. మానవజీవితము పవిత్రమైనది విలువైనది. జీవించతగినది మానవతా విలువలు లేకుండిన ఆధ్యాత్మికము అడుగంటి పోతుంది. నైతిక సమగ్రత శాంతము నశించిపోతుంది. మధురాత్మకమైన ధర్మానుభూతి మంట గలసిపోతుంది. ఆదర్శవాదమే అడుగంటి పోతోంది. సమాజసంక్షేమాన్ని లక్ష్యమందుంచుకుని మావనతావిలువలను సాధించే నిమిత్తము జన్మించినామను విశ్వాసముతో కాలాన్ని సార్థకముగావించుకొనవలెను.

(స.సా.న.2000 ముందుపేజీ)

రావణుడు ఎన్ని విద్యలు చదివినా ఎంత కఠోర తపస్సు చేసినా అతనిలో హృదయ పరివర్తన కలుగలేదు. అతడు వాంఛలచేత కుమిలిపోయాడు. ఆశలచేత కృంగిపోయాడు. కోరికలచేత కల్మషుడయ్యాడు. కానీ, చిట్టచివరికి తన ప్రాణం పోయేముందు ప్రజలకు ఒక చక్కని సందేశాన్ని అందించాడు. "ఓ ప్రజలారా! నేను కామమునకు లొంగి పోయి నా కుమారులను పోగొట్టుకున్నాను: వాంఛలకు లోబడి నా వంశమును నాశనం గావించుకున్నాను: రాగమునకు లోబడి నా రాజ్యమును భస్మం గావించుకొన్నాను. మీరు నావలె చెడిపోకండి. రామునివలె ధర్మమార్గమును అవలంబించి జీవితంలో ఉత్తీర్ణులు కండి" అన్నాడు.

(స.సా.మే.99పు.114)

మానవుడు మానవమూసలో పోయబడిన దైవీతత్వము. సజీవ మైనవైనా, స్తబ్దమైనవైనా మిగిలిన ప్రతీదికూడ అంతే. ఈఅమూల్యసత్యాన్నిగూర్చిన ఎరుక కలిగి ఉండడం ఒక్క మానవునికి మాత్రమే లభించిన ప్రత్యేక ధర్మము. **ఇదే ఉపనిషత్తులు మానవుని కిచ్చే సందేశం.**

సందేహము

దీన్నే మతాలు మారు మ్రోగిస్తాయి. మహారుషులు మరీమరీ ప్రకటిస్తారు.

(సా.అ.పు.295)

నా సందేశమును ప్రతినిత్యము ఆచరించుటవలన సమకూరు శక్తి సామర్థములు, మనోస్థైర్యములకు ప్రతీకలుగా కాలేజీ విద్యార్థులు నిలవాలని నా ఆశయము. నా సందేశములను గురించే ఎల్లప్పుడూ చర్చించుకుంటూ, మననం చేసుకుంటూ, గానం చేస్తూ, ఆచరిస్తూ తమ హృదయాలలో అవి స్థిరంగా నిలిచిపోయేటట్లు చేసుకోమని వారిని నేను ప్రోత్సహిస్తాను. నేను ఏమిచేసినా చేస్తున్నా, ఏమి చెప్పినా, ఇతరులచే చెప్పించినా, నిత్యసత్యమైన ఈ ఆత్మతత్త్వమును గురించి నొక్కిచెప్పి, వివరించి, దాని యొక్క విశిష్టతను గురించి చాటి చెప్పడానికే. **నేను నా ఆశలన్నీ విద్యార్థులపైనే పెట్టుకున్నాను. వారే నా ఆనందమునకు మూలకారణం. వారే నా జీవనాధారము.**

(ధై.పు.316)

(ఆగమనము)

సాధకుడు, స్వల్ప విషయములందుకూడా త్వరగా కోపించకూడదు. అట్లుండిన ధ్యానమందు ఎంతమాత్రము వృద్ధికలుగదు. అతడు సౌమ్యముతో కూడిన ప్రేమభావము అలవరచుకొనవలెను. అప్పుడు చెడు అలవాట్లు తప్పిపోవును. చెడు అలవాట్లు అభ్యసించుటకు కోపమే ప్రథమ పీఠము. అది ఉండిన ఏ నిమిషమందైనా, ఎట్టిదానియందైనా, ఏవిధమైన చెడ్డలనయినా చేయ వచ్చును. కాన, మొదట దానిని, రూపు మానవలెను. క్రమేణా ప్రయత్నించవలెను. **సాధకులకు తన తప్పులు ఎవరైనా బయట పెట్టిన, అప్పుడు ఓపికతో దానిని సర్దుకొనుటకు ప్రయత్నించి, తన తప్పును తెలిపినవారికి కృతజ్ఞతగా ఉండవలెను. కానీ తెలిపిరికదా అని వారిపై కోపించరాదు. అప్పుడు మంచికి ద్వేషి అయి నట్లగును. మంచిని ద్వేషము చేసిన అలవడునవే చెడుగా ఉండును. కాన మంచిని ప్రేమించి, చెడ్డను వదలవలెను.** వాటిపైననూ ద్వేషించరాదు. అట్టివాడు ఆధ్యాత్మిక జ్ఞానము నందునూ, ధ్యానమునందునూ వృద్ధి పొందగలడు.

(ధ్యా.వా.పు.90)

సాధకులు లో చూపు నిలిపి, వారి మనస్సులను పరీక్షించు కొనవలెను. సరియైన పద్ధతులు ఉపయోగించ అందుండు మలినములను క్రమ క్రమేణ నొకదాని వెనుక నొకటి తీసి వేయవలెను. గర్వము చిరకాలస్థాయియై విడువనిదిగా నుండును. రజోమనస్సునందు అది అనేకవిధములైన ఉపశాఖలు గలిగి అన్ని వైపులా వ్యాపించును. అట్టి ఉద్రేకము ఎప్పుడో ఒకప్పుడు తాత్కాలికముగా తగ్గిననూ, తిరిగి కనుపించుచునేయుండును అవసరము వచ్చినప్పు డంతయు గర్వము బయటపడి దాని అధిక్యత చూపుచునేయుండును.

(ధ్యా.వా.పు.91)

(చూ॥ నన్ను చేరగోరువారు, సంకల్పము)

సందేహము

(చూ॥ నన్ను చేరగోరువారు)

సందేహాలు - సమాధానాలు

ఈ కాన్ఫెరెన్స్‌లో పాల్గొంటున్న డెలిగేట్ల నుండి నాకొక లెటర్ వచ్చింది. అందులో కొన్ని సందేహాలు వ్యక్తం చేయబడినాయి. నిజంగా **ఈ సందేహాలకు మూలకారణం పరిపూర్ణ విశ్వాసం. లేకపోవడమే దైవంపై పరిపూర్ణ విశ్వాసం ఉన్నవానికి సందేహాలు రావడానికి అవకాశమే లేదు.** జీసస్ శిష్యులతో ఒకడైన థామస్ అన్నింటినీ అనుమానించేవాడు. కనుకనే అతనికి 'డౌటింగ్ థామస్' అని పేరు వచ్చింది అయితే సాధనామార్గంలో సందేహాలు సహజంగానే వస్తుంటాయి. దైవంపైన విశ్వాసం ఉన్నప్పటికీ కొన్ని కొన్ని సందేహాలు కలుగుతుంటాయి. ఈ లెటర్‌లో అడిగిన మొట్టమొదటి ప్రశ్న.

జీసస్ "నేనే సత్యాన్ని, నేనే సరియైన మార్గం చూపేవాడిని, నన్ను మించినవారు ఈ జగత్తులో లేరు" అని చెప్పాడట. ఇది తప్పా, ఒప్పా?

మీరు చక్కగా విచారణ చేస్తే ఇది సత్యమో, అసత్యమో మీకే తెలుస్తుంది. జీసస్ 'నేను సత్యాన్ని నేనే కాపాడేవాడను.

నేనే మిమ్మల్ని సమస్త బాధల నుండి రక్షించేవాడను'' అని ఎప్పుడూ చెప్పలేదు. అతనికి ఎట్టి సమయమునందూ అహంకారము లేదు. ఒక ట్యాక్స్ కలెక్టర్ బెస్తవారి దగ్గర కూర్చొని జీసస్ మాట్లాడేవన్నీ వ్రాసుకొనేవాడు. బెస్తవారితో మాట్లాడే సమయంలో, వారికి ఉత్సాహము, ధైర్యము అందించే నిమిత్తమై జీసస్ ''నేను చూసుకొంటాను'' అన్నాడు. అంతేగాని ''నేను చూసుకొంటాను నేను మిమ్మల్ని రక్షించడానికి వచ్చినవాడను'' అని అహంకారంతో చెప్పలేదు. ఆ చిన్న వాక్యమును ఆధారం చేసుకొని అనేకమంది పండితులు, అన్నీ తానే చూసుకొంటాననీ ఎవరికీ ఏ అపదా లేకుండా తానే కాపాడుతాననీ జీసస్ చెప్పినట్లుగా చెపుతున్నారు. జీసస్ పుట్టిన సమయంలో ముగ్గురు అరేబియన్ రాజులు వచ్చారు. వారిలో ఒకడు ఈ బాలుణ్ణి చూసి ''ఇతను దేవుని దూతవలె కనిసిపిస్తున్నాడు నాకు'' అన్నాడు. ''దేవుని దూత కాదు, దేవుని కుమారునిగా కనిపిస్తున్నాడు'' అన్నాడు రెండవవాడు. ''కాదు,కాదు; తండ్రి, కొడుకు ఇరువురూ ఒక్కటే'' అని చెప్పాడు మూడవవాడు.

జీసస్ కరుణామయుడు అతనికి ఏనాడూ అహంకారమే లేదు. బాధ పడేవారిని చూస్తే అతని హృదయం ద్రవించేది. ఈ ప్రపంచంలో మంచిని చెడ్డగాను, చెడ్డను మంచిగాను భావించే వ్యక్తులు అనేకంగా ఉంటారు. జీసస్‌లో ఏ దోషమూ లేదు. అతడు అందరినీ దైవమార్గంలో ప్రవేశపెట్టాలని ఆశించాడు. కానీ పాల్ అనే వ్యక్తి మొట్టమొదటి నుండి జీసస్‌ను విమర్శించేవాడు. కొంతకాలం జరిగిన తరువాత జీసస్ అతనికి స్వప్నంలో కనపడి ''పాల్! నీకు నేనేమి ద్రోహం చేశాను? ఎందుకు నన్నింతగా విమర్శిస్తున్నావు?'' అని ప్రశ్నించాడు. దానితో పాల్ తన దోషాన్ని గుర్తించి తన ఆజ్ఞానానికి పశ్చాత్తాపపడి జీసస్ యొక్క భక్తునిగా మారి పోయాడు. తరువాత అతనికి 'సెయింట్ పాల్' అని పేరు వచ్చింది.

జీసస్‌ను కట్టకడపటికి శిలువ వేసే సమయంలో ''ఓ ఫాదర్! నేనేమి తప్పు చేశాను? నన్నెందు కీవిధంగా శిక్షిస్తున్నావు?'' అని గట్టిగా ప్రార్థించాడు. అతని తల్లియైన మేరీ వచ్చి ఏడుస్తున్నది. అప్పుడు అశరీరవాణి వినిపించింది. All are one my dear son, be alike to everyone అని. అనగా, అందరూ ఒక్కటే. అందరిపట్ల సమరస భావంతో వర్తించాలి. భగవద్గీతయందు కృష్ణుడు **''చాతుర్వర్ణ్యం మయా సృష్టం'' అన్నాడు. వర్ణము అనగా వేర్వేరు కులములని మీరు భావిస్తున్నారు కానీ కృష్ణుడు అలా చెప్పలేదు. నాలుగు వర్ణములనగా నాలుగు రంగులని అర్థం. జపాన్‌వారు, బ్రిటీష్‌వారు తెల్లగా ఉంటారు; చైనీయులు పచ్చగా ఉంటారు. రష్యన్లు ఎఱ్ఱగా ఉంటారు; భారతీయులు నీగ్రోలు నల్లగా ఉంటారు.** ఈ నాల్గు వర్ణములవారిని తానే సృష్టించానని అన్నాడు కృష్ణుడు. భగవంతుడు చెప్పే ప్రతి మాట విశాలమైన భావంతో కూడియుంటుంది. కనుక మీరు సంకుచిత భావాలకు, సందేహాలకు అవకాశం ఇవ్వకండి. మీరు క్రిష్టియన్లు కావచ్చు హిందువులు కావచ్చు. ముస్లింలు కావచ్చు జోరాష్ట్రియన్లు కావచ్చు. ఏమతంవారైనా సరే. దైవం ఒక్కడే అని విశ్వసించండి.

జీసస్ మొట్టమొదట తనను తాను 'పర్సోనా'గా వర్ణించుకొన్నాడు. రోమన్ భాషలో 'పర్సోనా' అనగా పవిత్రమైనవాడని, దైవత్వంతో కూడినవాడని అర్థం. 'పర్సోనా' అనే పదము నుండియే ఆంగ్లభాషలో 'పర్సన్' అనే పదం ఏర్పడింది. దీనినే భారతీయులు 'పురుష'ః అన్నారు. మానవునియందు దైవత్వం ఉంది కాబట్టే మానవునికి 'పర్సన్' అని పేరు వచ్చింది. దైవత్వం సర్వులయందూ ఉన్నది. ఈనాడు మీరు చేయవలసినది ఏమిటి? అనేకత్వంలోని ఏకత్వాన్ని దర్శించాలి. అదియే సత్యసాయి సంస్థలయొక్క ప్రధాన లక్ష్యం. భేదములకు, ద్వేషమునకు అవకాశం ఇవ్వకూడదు. అందరియందున్నది ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. ప్రచారం కాదు, ఆచరణ ప్రధానం. మీ మాటలు హృదయం నుండి రావాలి. దానినే Expansion Talk అన్నారు. కొంతమంది కేవలం తాత్కాలిక తృప్తికోసం హృదయంతో

సంబంధం లేకుండా మాట్లాడుతుంటారు. దానిని Contraction talk అన్నారు. హృదయం నుండి మాట్లాడేవారు సత్యాన్ని అనుసరిస్తుంటారు. కేవలం పెదవుల నుండి మాట్లాడేవారు అసత్యానికి పాల్పడుతుంటారు. ఎవరేది చెప్పినా సత్యంగానే అనిపించవచ్చు. కానీ అది మీకు అన్వయిస్తుందా, లేదా అని విచారణ చేసుకోవాలి.

ప్రతి మానవునియందు సత్యము, అసత్యము, ధర్మము, అధర్మము, హింస, అహింస అనేవి చేరి అనేక మార్పులు కలుగుతున్నాయి. దీనికొక ఉదాహరణ: నీ దగ్గర పరిశుద్ధమైన బంగారమున్నది. కానీ కొంత కాలమునకు దానికి వెండి చేర్చావు; తరువాత రాగి చేర్చావు: మరి కొంతకాలమునకు ఇత్తడి చేర్చావు. ఈవిధంగా అనేక లోహములు చేర్చుటప్పటికి ఏమైంది బంగారానికి? దాని స్వస్వరూపం మరుగున పడి పోయింది. మానవుడు కూడా అంతే! **పుట్టినప్పుడు పవిత్రంగా ఉంటున్నాడు. కానీ క్రమక్రమేణ అందరితో చేరడంచేత తనిలో సత్యము, అసత్యము, న్యాయము, అన్యాయము, హింస, అహింస ఇత్యాది గుణములు ప్రవేశిస్తున్నాయి. తద్ద్వారా సుఖ దుఃఖములు ఏర్పడుతున్నాయి. జననమరణములకు మూలకారణం ఇదే.** పవిత్రమైన ఆత్మగా ఉన్నప్పుడు జనన మరణములకు అవకాశమే లేదు. కానీ శరీరంపై ఆభిమానం, మనస్సుపై అభిమానం, బుద్ధిపై అభిమానం - ఇవన్నీ చేరడంచేత మానవుడు తన స్వస్వరూపాన్ని మరచి పోయి లోహములు కలిసిన బంగారంగా తయారవుతున్నాడు. కల్తీ బంగారాన్ని అగ్నిలో వేసినప్పుడు లోహములన్నీ వేరైపోయి స్వచ్ఛమైన బంగారం తయారౌతుంది. అదేవిధంగా, మానవుడు పవిత్రుడు కావాలంటే దుర్గుణాలను దూరం చేసుకోవాలి. ఈనాడు మానవునిలో అసూయాద్వేషాలు అధికమై పోతున్నాయి. భక్తులలో, సాధకులలో అసూయ మరింత పెరిగిపోతున్నది. అసూయతోపాటు అహంకారం కూడా పెరిగిపోతున్నది. బంగారంవంటి మానవత్వంలో ఈ 'లోహములను' చేర్చుకోవడంచేత మానవత్వం మరుగునపడిపోతున్నది. బంగారంలో బంగారాన్నే చేర్చుకోవాలి. అనగా సత్సంగమును చేర్చుకోవాలి. దుస్సంగమునకు దూరంగా ఉండాలి.

త్యజ దుర్జన సంసర్గం
భజ సాధు సమాగమమ్
కురు పుణ్య మహోరాత్రం
స్మర నిత్యమనిత్యతాం

కొంతమంది మాటలు చాల మధురంగా ఉంటాయి. గాని వారి చర్యలు రాక్షసత్వాన్ని ప్రతిబింబిస్తుంటాయి. ఇలాంటివారిని విశ్వసించి మీరు చెడిపోకండి. మీరు పరిశుద్ధమైన బంగారంగా ఉండాలి. పరిశుద్ధమైన బంగారం కొంత ఉన్నా దానికి ఎంతో విలువ ఉంటుంది. అనేక లోహములు చేరిన బంగారం ఎంత ఉన్నా దానికి సరియైన విలువ రాదు. "పంట పండని భూమి పది ఎకరము లేల? కొంచెమైన చాలు మంచి భూమి", **కనుక మనకు క్వాలిటీ ప్రధానం. క్వాన్టిటీ కాదు. మీరు ఎవరి మాటా వినవక్కర లేదు. మీ కాన్షియన్స్‌ను మీరు అనుసరించండి. చాలు. కాన్షియన్సే మీ మాస్టర్.**

"ఫాలోది మాస్టర్; ఫేస్ ది డెవిల్
ఫైట్ టు ది ఎన్డ్; ఫినిష్ ది గేమ్"

ఇదే జీవిత తత్వము. మీరు ఎవరు పడితే వారిని అనుసరించి, మీలో 'కల్తీ లోహాల' ను చేర్చుకోవడం చేత మీ స్వామిని మీరు మరచిపోతున్నారు. మీ స్వస్వరూపాన్ని మీరు మరచిపోతున్నారు; చేతులారా దుఃఖాన్ని తెచ్చుకొంటున్నారు. మీ **కాన్షియన్స్‌ను** మీరు ఫాలో చేయండి. నేను ఎవ్వరినీ ఏ విషయంలోను ఫోర్స్ (బలవంతం) చేయడం లేదు. **ఎందుకంటే మీలోనే 'స్టోర్స్ ఉన్నది. అదే ఆత్మ. అదే కాన్షియన్స్ అది ప్రేమతో కూడినది. దానిని మీరు అనుసరించండి.**

మొదటి ప్రశ్నకు దీనిని జవాబుగా తీసుకోండి: జీసస్ "అందరినీ నేనే కాపాడుతాను. నేనే సత్యమును, మరొకటి సత్యం కాదు" అని ఎప్పుడూ చెప్పలేదు. అందరూ సత్యస్వరూపులే, అందరూ పవిత్ర స్వరూపులే, అందరూ

భగవంతుని బిడ్డలే అనే విశాలమైన భావాలను ప్రచారం చేస్తూ వచ్చాడు. ఒకరినొకరు తిట్టుకోకూడదు, ఒకరినొకరు కొట్టుకోకూడదు, ఒకరినొకరు హింసించుకోకూడదు అని బోధించాడు.

రెండవ ప్రశ్న: స్వామి అనేకమందికి స్వప్నాలలో దర్శన మిస్తుంటారు కదా! ఆ స్వప్నాలు మా కెందుకు రాకూడదు?

ఇది కూడా ఒకవిధమైన అమాయకత్వమే. స్వామి కనిపించే స్వప్నాలు తల్చుకుంటే వచ్చేవి కావు. మీరెందరినో తలుచుకొంటారు కదా! వారందరూ మీ స్వప్నంలో వస్తున్నారా? రావటం లేదు. అయితే, స్వప్నంలో రాక పోయినంత మాత్రాన స్వామికి మీ మీద దయ లేదను కోవడం చాల పొరపాటు.

ఇప్పుడు **స్వప్నముల** గురించి కొంత చెపుతాను. **స్వప్నమనేది ప్రతిబింబము.** స్వప్నం రావడం చాల మంచిది. కొన్ని చెడ్డవి వస్తుంటాయి: కొన్ని భయంకరమైనవి వస్తుంటాయి. కొన్ని బాధాకరమైనవి వస్తుంటాయి: కొన్ని దుఃఖకరమైనవి వస్తుంటాయి. ఎందువలనంటే, అవన్నీ అప్పుడప్పుడు మీ సంకల్పములో చేరి, లోపల 'స్టాక్' మాదిరి ప్రోగవుతున్నాయి. కనుక అవి స్వప్నరూపంలో బయట పడిపోవటం చాల మంచిది. స్వప్నములన్నీ మీ సంకల్పముల రిఫ్లెక్షన్, రియాక్షన్, రీసౌండ్‌లని భావించాలి. అయితే స్వామి కనిపించే స్వప్నం రిఫ్లెక్షన్ కాదు. రియాక్షన్ కాదు, రీసౌండ్ కాదు. అది నేను తలుచుకొన్నప్పుడే మీకు వస్తుందిగాని మీరు తలుచుకొంటే వచ్చేది కాదు. నిన్న సంగీత కార్యక్రమంలో పాల్గొన్న మహమ్మదీయుణ్ణి మీరు చూశారు. అతడు ఇంతకుముందు నన్ను చూసి యుండలేదు. నిన్న అతను వచ్చినప్పుడు నేను "నీవు అమెరికాకు వెళ్ళినప్పుడు అక్కడ నీకు కారు యాక్సిడెంట్ జరిగింది. అక్కడ నేను కనిపించాను. నీకు జ్ఞాపకముందా?" అని అడిగాను. అతడు " ఓ మై గాడ్!" అని ఏడ్చినాడు పాపం! అతనెప్పుడూ నన్ను చూడలేదు. కానీ అమెరికాలో కనిపించాను. అదే రాత్రి అతనికి కలలో కనపడి "నీవు వచ్చే బర్త్‌డేకి పుట్టపర్తికి వస్తున్నావు" అని చెప్పాను. చెప్పినట్లుగానే నిన్నటిదినం వచ్చాడు.

అయితే కొన్నిసార్లు కన్ఫ్యూషన్‌తో కూడిన స్వప్నాలు కూడా వస్తుంటాయి. స్వామి కనబడుతుంటారు. మీ భావములు కనిపిస్తుంటాయి. అది ఇది రెండూ మిక్స్ అయిపోతాయి. ఒక క్షణంలో మీరు పుట్టపర్తి వెళ్ళినట్లుగా కనిపిస్తుంది: మరుక్షణంలో అమెరికా వెళ్ళినట్లుగా కనిపిస్తుంది. ఈవిధంగా ఒకేసారి రెండు మూడు కలసిపోతుంటాయి. **ఇవి ఆహార దోషంవలన, అజీర్ణంవలన వచ్చే స్వప్నములేగాని స్వామియొక్క సంకల్పంతో వచ్చేవి కాదు. నేను సంకల్పించే స్వప్నంలో కన్ఫ్యూషన్‌కు అవకాశ ముండదు: క్లియర్‌గా వచ్చి, క్లియర్‌గా మాట్లాడిపోతాను.** అయితే నేను మీకు స్వప్నంలో కనిపించకపోయినంత మాత్రమున మీపై స్వామికి దయ లేదని భావించడం చాల పొరపాటు. దయ ఉంది.

మూడవ ప్రశ్న: అనేకమంది సాధనలు చేస్తున్నారు. నేను కూడా సాధన చేయాలని ఆశిస్తున్నాను. కానీ నేను ప్రాపంచిక సంబంధమైన పనులయందు నిమగ్నుడనై ఉండటంచేత స్వామిని చింతించడానికి, స్వామిసేవ చేయడానికి నాకు సమయం చిక్కడం లేదు.

ఇవి భావించడం చాల తప్పు. స్వామిచింతన చేయడానికి మీకు ప్రత్యేకంగా కొంత కాలం అవసరం లేదు. **మీరు ఏ పని చేసినా అది దైవకార్యంగా భావించండి. మీరు ఆఫీసు మానసక్కరలేదు. ఆఫీసు పనులను కూడా దైవంయొక్క పనులుగా భావించి సక్రమంగా చేయండి. అదీ దైవసేవయే. అదీ దైవకార్యమే, అదీ స్వామికార్యమే. దీనిని పురస్కరించు కొనియే "వర్క్ ఈజ్ వర్షిప్; డ్యూటీ ఈజ్ గాడ్" అన్నారు.** కనుక మీరు ప్రత్యేకంగా ఒకచోట కూర్చొని "సాయిరాం, సాయిరాం.."అని జపించనక్కర లేదు. మీరేదో సాధన చేయాలని ధ్యానంలో కూర్చుంటారు. కానీ ఒక్క క్షణమైనా మనస్సును నిలుపగల్గుతున్నారా? లేదు. అలాంటప్పుడు ధ్యానం చేయడ మెందుకు? మీ ఇంటి పనులను మీరు చేసుకోండి, **"సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం"**, అన్ని పనులూ భగవత్ప్రీత్యర్థం చేస్తున్నామనుకోండి. అదే గొప్ప సాధన. "ఖర్మానుబంధీని

మనుష్య లోకే'' ప్రతి మానవుడు కర్మకు కట్టుబడి ఉంటున్నాడు. **కర్మ అనగా ఏమిటి? చలన శక్తితో కూడినదే కర్మ. మీ ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడా కర్మలే: మీ కనురెప్పలు ఆడటం కూడా కర్మయే: మీరు భుజించడమూ కర్మయే, నిద్రించడమూ కర్మయే. సర్వమూ కర్మమయమే. కర్మ లేక మానవుడు క్షణమైనా జీవించుటకు వీలు కాదు. అయితే భగవత్ప్రీత్యర్థంగా చేసే కర్మయే సార్థకమవుతుంది.** ఇది నా పని, అది భగవంతుని పని అనే భేదం పెట్టుకోకూడదు. మీరు వేరు, భగవంతుడు వేరు అని భావించరాదు. మీరు, భగవంతుడు ఒక్కటే. ఇట్టి నమ్మకంతో ఏ చిన్న పని చేసినా అది గొప్పదిగా మారుతుంది. అందరికీ సహాయం చేయండి. హాస్పిటల్స్‌కు పోయి పేషంట్లకు సేవ చేయండి. అయితే ఇంతమాత్రమే సేవ కాదు. మీ ఆఫీసులోను, మీ బిజినెస్‌లోను మీ డ్యూటీని మీరు సక్రమంగా నిర్వర్తించండి. **ప్రభుత్వం నుండి మీరు తీసుకొంటున్న జీతానికి తగిన పని చేయండి. అదియే సేవ, అదియే సాధన. ఏ పనైనా చేసుకోండి అన్నీ దైవకార్యాలుగా భావించండి.**

దైవచింతన చేయడానికి నాకు సమయం చాలడం లేదని సాకు చెప్పకూడదు. కావలసినంత సమయమున్నది. 24 గంటలలో 7,8 గంటలు ఆఫీసులో పని చేస్తున్నారు. 6గంటలు నిద్ర పోతున్నారు. మరి మిగిలిన టైమ్‌లో ఏమి చేస్తున్నారు? ఒక చిన్న కథ చెపుతాను మీకు. ఒక వ్యక్తి తన జీవితంలో దైవచింతనకు కొంత కాలం కేటాయించాలనుకొన్నాడు. అందుచేత తన ఆయుష్షు ఎంతనో తెలియజేయవలసిందని భగవంతుణ్ణి ప్రార్థించాడు. భగవంతుడు "నయనా! నీకు 80 సంవత్సరముల ఆయుష్షు నిచ్చాను'' అన్నాడు. అప్పుడా వ్యక్తి "స్వామీ! మొదటి 25 సంవత్సరాలు ఆటపాటలతో చదువు సంధ్యలతో జరిగిపోతాయి. తరువాత 25 సంవత్సరాలు నా భార్యాబిడ్డలను, ఇతర వ్యవహారములను చూసుకోవాలి. తరువాత 30 సంవత్సరాలు నా పిల్లల భవిష్యత్తుకు తగిన భద్రతను చేకూర్చడంలో గడచిపోతాయి. ఈ విధంగా మీరిచ్చిన 80 సంవత్సరాలు నా పనులకు సరిపోతుంది. ఇంక నేను మీ చింతన చేసేదెప్పుడు? కనుక నాకింకా 20 సంవత్సరాలు ఇవ్వవలసింది'' అని అడిగాడు. అప్పుడు భగవంతుడు "పిచ్చివాడా! నీకింకా 20 సంవత్సరముల నిచ్చినా వాటిని దేనికి ఉపయోగ పెడతావో ఏమిటో! ఇది పక్కా సోయరితనం! నన్ను తలుచుకోవడానికి నీకు 20 సంవత్సరములు అక్కరలేదు, 2 సెకండ్లు చాలు'' అన్నాడు ఎట్లా? కరెంటు ఉన్నది. మీకు లైటుకావాలి. స్విచ్ నొక్కడానికి మీకు ఎంత టైమ్ పడుతుంది? 20 సంవత్సరములు కావలెనా? కాదు, కాదు. ఒక్క సెకండు చాలు. అదేవిధంగా భగవంతుణ్ణి హృదయ పూర్వకంగా స్మరించుకోవడానికి ఒక్క క్షణం చాలు. కాలం భగవత్స్వరూపం. కాలాన్ని వ్యర్థం చేస్తే జీవితాన్ని వ్యర్థం చేసినట్లే. కాబట్టి కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. అదే నిజమైన సాధన కాబట్టి స్వామిచింతన చేయడానికి స్వామిసేవ చేయడానికి నాకు టైమ్ లేదని వగచ నవసరం లేదు. ఈ ప్రశ్న వ్రాసిందెవరోగాని వారు పక్కా సోమరిపోతులే! మొట్టమొదట సోమరితన్నాన్ని దూరం చేసుకోండి. **Laziness is rust and dust; realisation is best and rest.** ఈ సత్యాన్ని చక్కగా గుర్తుంచుకోండి.

నాల్గవ ప్రశ్న : మేము విదేశాలలో ఉండటంచేత స్వామిసేవ చేయడానికి అవకాశం చిక్కడం లేదు. కాబట్టి మేము ఇండియాకు వచ్చి స్వామిసేవ సంపూర్ణంగా, హృదయ పూర్వకంగా చేయాలని ఆశిస్తున్నాము.

ఇది కూడా సోమరితనమే. **సేవ చేయడానికి స్వదేశ మేమిటి, విదేశమేమిటి! అక్కడ చేసినా సేవయే, ఇక్కడ చేసినా సేవయే. ఎక్కడున్నా సేవ చేయవచ్చు.** అంతేగాని ప్రశాంతి నిలయానికే వచ్చి, స్వామి దగ్గరే ఉండి సేవ చేయాలని ఆశించడం స్వార్థమే. కావాలంటే రిటైర్ అయిన తరువాత ఇక్కడకు వచ్చి చేయండి. సంతోషమే. మీ పిల్లల చదువు తదితర బాధ్యతలు మీపై దండిగా ఉంటాయి. కాబట్టి అక్కడే మీ డ్యూటీని మీరు సక్రంగా

చేయండి. అవన్నీ వదలిపెట్టి ప్రశాంతి నిలయానికి వస్తే, కొన్ని దినములు బాగానే చేయవచ్చుగాని తరువాత మీ మనస్సు భ్రమించి పోవచ్చు. కాబట్టి 'డోన్ట్‌కమ్' మీరు అక్కడే ఉండి సేవ చేయండి. ఎక్కడ చేసినా సేవ సేవయే. నేను ఏ సేవనూ ఆశించడం లేదు. నా పని నేనే చేసుకొంటున్నాను. మా పిల్లలు ఇంతమంది ఇక్కడుంటున్నారు. ఎవరు చేస్తున్నారు. స్వామిసేవ? అయితే వారు కూడా మీలాగే **స్వామిసేవ చేయాలని ఆశిస్తున్నారు. కానీ ఏపవిత్రమైన వ్యక్తులకో ఈ పవిత్రమైన సేవ చిక్కుతుంది. ఎవ్వరూ నాకు సేవ చేయనక్కరలేదు.** సేవ చేయకుండా పోయినంత మాత్రమున నాకు దూరమైనవారని నేను భావించను. నేను ఏనాడూ ఏ సేవనూ ఆశించడం లేదు. మీ సేవలు మీరు చేసుకోండి. మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించుకోండి. నాకు ఏ సేవలూ అక్కర లేదు. నా కాళ్ళు, చేతులు, కన్నులు అన్నీ భద్రంగా ఉన్నాయి. నా పనులను నేను చేసుకోగలను. ఇంకొకరి సేవలు నేను ఆశించడం లేదు. కనుక శక్తి లేనివారికి మీరు సేవ చేయండి. అదియే స్వామిసేవగా భావించండి. స్వామి ఎప్పుడూ భక్తుల మధ్యలో తిరుగుతుంటారు. కాబట్టి స్వామికి కాళ్ళు నొప్పిగా ఉండవచ్చునని మీరనుకొంటారు. కానీ నాకు కాళ్ళనొప్పి ఎప్పుడూ లేదు. నేను ఏ నొప్పీ అనుభవించ లేదు. ఎవరిదైనా తీసుకొన్నప్పుడు నేను అనుభవిస్తానేగాని లేకపోతే నాకు ఏ నొప్పీ లేదు. ఈ దేహానికి ఏ బాధలూ లేవు. ఎప్పుడు చూసినా బ్లడ్ ప్రెషర్, పల్స్ రేటు పర్‌ఫెక్ట్ నార్మల్‌గా ఉంటాయి. ఎంతసేపు మాట్లాడినా, ఏ పనిచేసినా నా బ్లడ్‌ప్రెషర్‌లో మార్పు ఉండదు. **ఈ దేహం చాల పవిత్రమైనది. దీనికి కారణం నాలో Purity (పవిత్రత) Patience (సహనం), Perseverance (పట్టుదల) ఈ మూడు ఉన్నాయి.** కనుక మీరెవ్వరూ నాకు సేవలు చేయనక్కరలేదు. మీ సేవలు మీరు చేసుకోండి. మీ బాధ్యతలను మీరు నిర్వర్తించండి.

ఐదవ ప్రశ్న: మేము చేసుకొన్న కర్మ ఫలితముల బాకీలు ఎట్లా తీరుతాయి?

ఎలాంటి కర్మఫలితమునైనా ప్రేమ అనే మందుతో నివారణ చేసుకోవచ్చు. ప్రేమను మించినది మరొకటి లేదు. హృదయ పూర్వకంగా భగవంతుణ్ణి ప్రేమిస్తే మీ సర్వ బాధలూ, సర్వ రోగములూ నివారణ అవుతాయి. కొంతమంది పూజా రూమ్‌లో కూర్చొని "సాయిరాం, సాయిరాం.." అని జపం చేస్తుంటారు గాని వారి మనస్సు చాకలివానిపై పోతుంది. జపం చేస్తూ మధ్యలో "ఏమిటే, చాకలివాడు గుడ్డలు తెచ్చాడా?" అని అడుగుతారు భార్యను. లేకపోతే వంటగది నుండి పొగ వస్తుంటే "వంట మాడిపోతున్నది చూడు" అంటారు. ఇది భగవత్ప్రార్థన ఎట్లా అవుతుంది? మీరు చేసే సాధనలన్నీ చంచలమైన మనస్సుతో చేస్తున్నారు. స్థిరమైన మనస్సుతో చేయండి మీకు తప్పక ఫలితం లభిస్తుంది. **ఏ సాధనలైనా చేసుకోండిగాని భగవంతుణ్ణి హృదయ పూర్వకంగా ప్రేమించండి. ప్రేమతోనే సర్వ చింతలూ నివారణ అవుతాయి. మొట్టమొదట ప్రేమను పెంచుకోండి.** ఏరీతిగా పెంచుకోవాలి? మొక్కను భూమిలో నాటి నీరు పోయాలిగాని, టిన్నులో పెట్టి నీరు పోస్తే ఫలితం ఉండదు. భగవంతుడు ప్రేమస్వరూపుడు కనుక భగవంతుని రూపమును, నామమును హృదయ భూమిలో నాటుకొని ప్రేమజలమును పోయండి. తప్పక మీలో ప్రేమ అభివృద్ధి అవుతుంది. ఇంతకంటే ప్రత్యేకంగా మొరక సాధన చేయనక్కరలేదు.

ఆరవప్రశ్న చాలా విచిత్రమైనది: మా పూజా రూమ్‌లో రాముడు, కృష్ణుడు ఈశ్వరుడు, జీసస్ మొదలైన ఫోటోలన్నీ పెట్టుకొన్నాము. వీటి మధ్యలో స్వామి ఫోటో కూడా పెట్టుకున్నాము. ఇది తప్పా?

భగవంతుడు సర్వ స్వరూపుడు అనే విశ్వాసం మీలో దృఢంగా ఉంటే ఏ ఫోటో పెట్టుకుంటే ఏమి! రాముణ్ణిగాని, ఈశ్వరుణ్ణిగాని, అల్లానుగాని, జీసస్‌ను, జోరాష్ట్రనుగాని, సాయినిగాని ఎవ్వరినైనా పూజించండి. **కానీ అందరూ ఒక్కటే అనే భావమును పెట్టుకోండి.** దీనికొక చిన్న ఉదాహరణ : గోధుమ హల్వా, బాదంఖీరు, గులాబ్

జామ్, జిలేబి, లడ్డు, మైసూర్‌పాక్ మొదలైన స్వీట్లయొక్క రూపనామములు వేరువేరుగాని అన్నింటియందూ ఉన్న చక్కెర ఒక్కటే కదా! అదేవిధంగా మీరు ఏ దేవుణ్ణి పూజించినా అందరి యందున్న దివ్యత్వం ఒక్కటే అని విశ్వసించండి. "ఆల్ ఆర్ వన్" (అందరూ ఒక్కటే) అని విశ్వసించినప్పుడు ఇంక భేదములు ఏమాత్రము మిమ్మల్ని బాధించవు. ఒకవేళ మీకు సాయిబాబా అంటే ఇష్టం లేకపోతే సాయిబాబా ఫొటో తీసివేయండి. రాముడంటే ఇష్టం లేకపోతే రాముని ఫొటో తీసివేయండి. మీకు ఇష్టం వచ్చిన ఫొటో పెట్టుకోండి. అయితే ఈ ఫొటోలను మార్చటంవలన వచ్చే ఫలితమేమీ లేదు. దీనికి సంబంధించిన ఒక చిన్న కథను అప్పుడప్పుడు మా పిల్లలకు చెపుతుంటాను. ఒక పిల్లవాడు మేథమెటిక్స్ పరీక్షకు వెళ్ళే ముందు సాయిబాబా ఫొటో పెట్టి పూజ చేశాడు. కానీ ఆ రోజు పరీక్ష సరిగా వ్రాయలేదు. ఇంటికి వస్తూనే సాయిబాబా ఫొటో తీసి కప్‌బోర్డ్‌లో పడేశాడు. రెండవ దినం పరీక్షకు వెళ్ళే ముందు రాముని ఫొటో పెట్టి పూజ చేశాడు. కానీ ఆ రోజు పరీక్ష మరింత కఠినంగా అనిపించింది. రాముని ఫొటో కూడా తీసి కప్‌బోర్డ్‌లో పడేశాడు. మూడవ దినము పరీక్షకు వెళ్ళే ముందు ఏ దేవుణ్ణి పూజించాలి? అని యోచించాడు. 'ఈ మగ దేవుళ్ళకు అసలు ప్రేమలేదు. అమ్మకు మాత్రం చాల ప్రేమ' అనుకొన్నాడు. వెంటనే దేవి ఫొటో పెట్టి పూజ చేసి, పరీక్షకు వెళ్ళాడు. కానీ ఆ రోజు పరీక్షలో కనీసం ప్రశ్నలు కూడా వానికి అర్థం కాలేదు. దాంతో ఇంటికి వస్తూనే దేవి ఫోటో కూడా తీసి కప్‌బోర్డ్‌లో పడేశాడు. మరునాడు వినాయకుని ఫొటో పెట్టి పూజించాడు. కానీ తాను వెలిగించిన ఊదిబత్తీల పొగ కప్‌బోర్డ్‌లో పడేసిన ఫొటోల వైపు వెళ్ళడం గమనించాడు. తనకు ద్రోహం చేసిన దేవుళ్ళకు ఆ సువాసన పీల్చే అధికారం లేదని భావించి, ఒక గుడ్డ తెచ్చి ఆ ఫొటోల చుట్టూ కట్టేశాడు. తక్షణమే సాయిబాబా, రాముడు, దేవి ప్రత్యక్షమయ్యారు. ఆ పిల్లవాడు ఆశ్చర్యచకితుడయ్యాడు. తాను పూజించినంత కాలం ప్రత్యక్షం కాకుండా తిరస్కరించినప్పుడు ప్రత్యక్షం కావడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించాడు. అప్పుడు సాయిబాబా చెప్పాడు : "నాయనా! ఇంతకాలం మమ్మల్ని నీవు ఫొటోలుగా భావించి పూజించావు. అందుచేత ఫలితం లేకపోయింది. కానీ ఈనాడు మమ్మల్ని సజీవ స్వరూపాలుగా విశ్వసించి, ఆ సువాసన మాకు చేరకూడదనే ఉద్దేశ్యంతో మా ముక్కు చుట్టూ గుడ్డ కట్టేశావు. అందుచేతనే ప్రత్యక్షమైనాము." **You may worship picture as God, but not God as picture.** భగవంతుణ్ణి ఫొటోగా పూజిస్తే ప్రయోజనం లేదు. ఫొటోను సాక్షాత్తు భగవంతునిగా భావించి పూజించాలి. అప్పుడే మీ అభీష్టములన్నీ నెరవేరుతాయి. ఏ ఫోటో పెట్టుకొన్నా ఏ నామం తల్చుకొన్నా ఫరవాలేదు. కానీ అన్ని రూపములూ, అన్ని నామములూ ఒక్క దైవానివే అని గుర్తించుకోండి. **అందరూ దైవస్వరూపులే. మీ తల్లిదండ్రులు కూడా దైవస్వరూపులే. కాబట్టి వారినే పూజించండి. వేదము "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ..." అన్నది.** అలాంటప్పుడు ఈ దైవాన్ని పూజించాలా, లేక ఆ దైవాన్ని పూజించాలా? అనే సందేహాలు మీకెందుకు రావాలి? దైవంపైన అనుమానము నకు ఏమాత్రము అవకాశమివ్వవద్దు. దైవం ఒక్కడే. **"ఏకం సత్ విప్రాः బహుధా వదంతి".** కనుక భేదాలను పెట్టుకొని ఫొటోలు మార్చకండి. మీకిష్టమైన రూపనామము లను పూజించండి. అదే సరియైన మార్గము.

ఏడవ ప్రశ్న : మేము చేసే సాధన స్వామిని సంతృప్తి పర్చాలి. కనుక మేము ఏ సాధన చేస్తే స్వామికి సంతృప్తి కల్గుతుందో తెలియజేస్తే ఆ సాధన చేస్తాము.

దీనికి జవాబు ఒక్కటే. **నాకు ఏ సాధనా అవసరం లేదు. సర్వ మానవులనూ దైవస్వరూపులుగా విశ్వసించండి. అది నాకు చాల ఇష్టం. ఇతరులు ఏది చేస్తే మీకు ఆనందమనిపిస్తుందో దానిని మీరు ఇతరులకు చేయండి. అనేక పర్యాయములు చెపుతూనే ఉన్నాను. "హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్". ఇది నాకు చాల ఇష్టం. నిరంతరము**

సహాయం చేయండి. ఎవ్వరినీ బాధించవద్దు. హింసించవద్దు. ఇతరులపట్ల దుర్భావములను పెంచుకోకండి. ఎదుటివారు మిమ్మల్ని దూషించినా, ద్వేషించినా మీరు వారిని ప్రేమించండి. అదియే స్వామితత్వము. ఈ లోకంలో ఎంతమందో ఉన్నారు. అందరూ స్వామిని పూజించేవారు కాదు. కొంతమంది పూజిస్తున్నారు. కొంతమంది దూషిస్తున్నారు. కానీ నేను ఈ రెండింటినీ చూడను. అందరినీ ప్రేమిస్తూనే ఉంటాను. నాకు అందరూ ఒక్కటే. అందరూ ఆనందంగా ఉండాలన్నదే నా ఆశ. అయితే మీ కెపాసిటీని బట్టి మీరు అర్థం చేసుకొంటున్నారు. **మంచి చెడ్డలు మీకేగాని నాకు లేవు. రావు. ఎవరు చేసినది వారే అనుభవిస్తారుగాని అది నా వరకు రాదు. ఎవరి కర్మ వారిది. ఈనాడు కాకపోయినా ఏనాటికైనా కర్మఫలితం తప్పదు.**

"ఎవరు చేసిన కర్మ వారనుభవించక
ఎవరికైనా తప్పదన్నా!
ఏనాడు ఏ తీరు ఎవరు చెప్పాగలరు
అనుభవించుట సిద్ధమన్నా!
అలనాటి పాండవులు ఆకులలములు మేసి
అడవి పాలైపోయిరన్నా!
రాముడంతటివాడు రమణి సీతను బాసి
పామరునివలె ఏడ్చెనన్నా!"

మీరు మంచి చేస్తే మంచి వస్తుంది. చెడు చేస్తే చెడు వస్తుంది. దీనిని మొట్టమొదట గుర్తించుకోండి. నేను **ఎల్లప్పుడు "లోకాస్సమస్తాస్సుఖినోభవంతు" అని ఆశిస్తాను. నన్ను మీరు ద్వేషించినా నేను మిమ్మల్ని ప్రేమిస్తాను. అది నాకు సహజం. అదే డివైన్ క్వాలిటీ.** మీరు ఒక రోజు పూజిస్తారు. మరొక రోజు దూషిస్తారు. త్రాగినవాడు ఒక రకంగా మాట్లాడుతాడు. త్రాగనప్పుడు మరో రకంగా మాట్లాడుతాడు. అదేవిధంగా ప్రాపంచిక వాంఛలలో మునిగినవారి విశ్వాసం అటూ ఇటూ చలిస్తూ ఉంటుంది. కానీ **పరిపూర్ణ ప్రేమ కల్గిన వారు ఎప్పుడూ ఒకే మాదిరి ఉంటారు. నేనెప్పుడూ అలాంటివారి ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉంటాను.** అలాంటివారు ఎంతో అదృష్టము చేసుకొన్నవారు. ఎంతో పవిత్ర హృదయులు. అది ఈ ఒక్క జన్మలో వచ్చినది కాదు. ఎన్ని జన్మల పుణ్యఫలమో! స్వామికి ఏది ఇష్టము, ఏది అయిష్టము. అని మీరు విచారణ చేయనక్కర లేదు. **మీ హృదయ పవిత్రతే నాకు కావాలి.** ప్రేమతో మీరు ఏ సేవైనా చేయండి. **స్వామిపై మీకు పరిపూర్ణ విశ్వాసమే ఉంటే స్వామి ఆజ్ఞను శిరసావహించండి. నేనెప్పుడూ ఎవ్వరికీ చెడు చెప్పను. నేనేది చెప్పినా మీ మంచికోసమే. "వాటెవర్ ఐ సే, వాటెవర్ ఐ డూ ఈజ్ గుడ్ ఫర్ యూ నాట్ ఫర్ మీ". నేనేమి చెప్పినా, ఏమి చేసినా మీ మంచి కోసమేగాని నాకోసం కాదు. నా పని అనేది నాకు ఏ ఒక్కటీ లేదు, అన్నీ మీ పనులే. నిరంతరము మీ పనులే చేస్తుంటాను.** కనుక మీపై నాకు ప్రేమ లేదని భావించకండి. **అయితే అదృష్టవంతులకు పవిత్రమైన సేవ, పవిత్రమైన సన్నిధి లభిస్తుంటాయి. వారికి చిక్కిందే, నాకు చిక్కలేదే అని అసూయకు అవకాశమివ్వకండి. అన్ని జబ్బులను మించిన జబ్బు అసూయ. క్యాన్సర్‌నైనా క్యాన్సిల్ చేయవచ్చుగాని అసూయకు మాత్రం మందు లేదు. అది మనిషిని కృంగదీసి, కృంగదీసి కట్టకడపటికి నాశనం చేస్తుంది.** ప్రేమస్వరూపులారా! అసూయాహంకారములకు అవకాశమివ్వకుండా, అందరినీ సోదర సోదరీమణులుగా భావించుకొని మీరు ఆనందంగా సేవలు చేయాలి. ఈనాటి విద్యావిధానంలో అనేక మార్పులు తెప్పించాలి. **విద్య ధనముకోసం కాదు, గుణంకోసమని పిల్లలకు బోధించాలి. కలిమి, బలిమి, చెలిమి శాశ్వతమైనవి కావు. ధనము వస్తుంది, పోతుంది. ఈనాటి మిత్రుడు రేపు శత్రువుగా మారవచ్చు. కనుక శాశ్వతమైన, పవిత్రమైన గుణాన్ని మీరు అభివృద్ధి పర్చుకోండి. సర్వులకూ సహాయం చేయండి. చేతులనిచ్చినది పరోపకారం చేయడానికేగాని నోటికి ముద్దందించడానికి కాదు. కంఠము నిచ్చినది దైవనామాన్ని గానం చేయడానికేగాని సినిమా పాటలు పాడటానికి కాదు. పరులను దూషించడానికి కాదు.**

తెలివిని ఇచ్చినది దైవాన్ని ఏరీతిగా పొందాలని విచారణ చేయడానికేగాని అహంకారపడటానికి కాదు. మీ దేహంలోని ప్రతి అంగమును పవిత్రమైన కర్మలలో ప్రవేశపెట్టి సార్థకం చేసుకోండి.

ప్రేమస్వరూపులారా! మీరు సక్రమమైన మార్గంలో నడుచుకొన్నప్పుడు ఎన్ని వేలమందినైనా మీరు చక్కగా తీర్చిదిద్దవచ్చు. **మీరు ఆచరణ మాని పదిమందికి బోధిస్తూ కూర్చుంటే లాభం లేదు. ఒకటి రెండైనా ఆచరించి చూపించండి. అన్నీ చేసి చూపించమని నేను కోరటం లేదు. మీరు ఆదర్శప్రాయులై దేశాన్ని బాగుపర్చండి. నా పేరుకోసం నేను ఆశించడం లేదు. నాకు పేరు ప్రతిష్ఠలు అవసరం లేదు. నేనింకా ఆశించడం లేదుగాని ఆశిస్తే ప్రపంచమంతా ఇక్కడ వ్రాలిపోతుంది. కానీ నాకది అవసరం లేదు. నాకు కావలసింది మీరు బాగుపడటమే. ఇంక ఏదీ అక్కర లేదు. స్వామిది ఇచ్చే స్వభావమేగాని పుచ్చుకొనే స్వభావం కాదని గోల్డ్‌స్టీన్ తన ప్రసంగంలో చెప్పాడు. అయితే ఒక్కటి ఆశిస్తున్నాను, అడుగుతున్నాను. అదే ప్రేమ.** మరేదీ వద్దు. **ప్రేమను ఇస్తే మీరు ఏది కోరినా ఇస్తాను. ప్రేమను ఇచ్చుకొని సర్వమునూ పుచ్చుకోండి. కలసి మెలసి పని చేయండి. మీలో మీకు అసూయ లేకుండా, భేదాలు లేకుండా,** ఒకరితో ఒకరు పోట్లాడుకోకుండా ఐకమత్యంతో మెలగినప్పుడు నాకు అంతకంటే కావలసింది ఏముంది! మీరు స్వామి సంకల్పానుసారం పని చేస్తే అంతకంటే ఆనందం ఏముంది! **"హేపీనెస్ ఈజ్ యూనియన్ విత్ గాడ్". భగవద్భావంతో పని చేసినప్పుడే నిజమైన హేపీనెస్ పొందుతారు.** మీలో మీకు ఎలాంటి భిన్నాభిప్రాయములున్నా కలసి మెలసి పని చేయండి. మీరెవ్వరిని బాధ పెట్టినా ఆ బాధ నాకు వస్తుంది. అందరూ ఒక్కటిగా ఉంటే నేను ఆనందిస్తాను. మీకెవరైనా ద్వేషులుంటే, ఇక్కడి నుండి వెళ్ళిన తరువాత వారిని ప్రేమతో పలకరించండి. మీ ప్రేమను అందరికీ పంచండి. ఇదే నిజమైన తపస్సు, ధ్యానము, జపము, సాధన కూడా. ప్రేమ లేకుండా ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు. **ప్రేమను ఇచ్చి, ప్రేమను పుచ్చుకోండి. ఏ యుగంలోను లేని ఆనందాన్ని ఈ యుగంలో మీరు అందుకోవచ్చును. ఐకమత్యంలో ఎంతో బలమున్నది. ప్రేమ ఉంటే ఐకమత్యం ఎంతైనా అభివృద్ధి అవుతుంది.** ప్రేమస్వరూపులారా! ఈనాడు మీలో ఉన్న దోషాలన్నింటినీ దూరం చేసుకోండి. హృదయాన్ని పవిత్రం గావించుకొని ఆనందంగా తిరిగి వెళ్ళండి. **ఈ ప్రశాంతి నిలయం ఒక పెద్ద వర్క్‌షాప్. ఇందులో మిమ్మల్ని మీరు సరిదిద్దుకొని వెళ్ళండి. మీరు మీమీ దేశాలకు తిరిగి వెళ్ళిన తరువాత ఇతరులు మిమ్మల్ని చూసి "అబ్బ! పుట్టపర్తికి వెళ్ళి వచ్చిన తరువాత ఇతనిలో ఎంత మంచి మార్పు వచ్చిందిరా" అని ఆశ్చర్యపోవాలి. ఆనందించాలి, మిమ్మల్ని మెచ్చుకోవాలి.**

(స.సా.డి. 98 పు. 325/334)

(అంతర్జాతీయ విద్యాసంస్థల సదస్సు ప్రశాంతినిలయంలో జరిగింది. ఆ సదస్సులో ప్రతినిధులు వెలిబుచ్చిన సందేహాలను క్రోడీకరించి శ్రీఅనిల్ కుమార్ 13 ప్రశ్నలు భగవాన్ సత్యసాయిబాబావారిని అడుగగా ది.21.11.2001 న స్వామివారు తమ ప్రసంగంలో సమాధానం యిచ్చినారు.)

1 ప్రశ్న: What is the relationship between religion, spirituality and educare?

సమాధానం:

"తలచినట్టి పనులు తారుమారైనను
తొణక వలదు ఎవరు తొణకవలదు
చీకు చింత వీడి చిరునవ్వు నవ్విన
అతని గుండె పండినట్టిగుండె"

ప్రేమస్వరూపులారా!

మతమునకు, ఆధ్యాత్మికమునకు, Educare కును వున్నటువంటి సంబంధబాంధవ్యములు మీరు గుర్తించ లేదంటే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంటున్నది. మొట్టమొదట **Religion (మతం) అంటే ఏమిటి?** అర్థం చేసుకోండి. **Realize is religion.** దేనిని 'రీలైజేషన్'

చేయాలి? **నీవెవరో మొదట గుర్తించినప్పుడే ఈ 'రెలిజియన్'** అనేది నీకు బాగా అర్థమవుతుంది. **ఆధ్యాత్మికము (Spirituality) అంటే ఏమిటి? కేవలం భజనలు చేయటం, పూజలుచేయటం, ఆరాధనలు సల్పటం, దేవాలయములను దర్శించటం, యాత్రలు సల్పటం లాంటివన్ని ఇత్యాది సత్కర్మలన్ని కూడనూ కేవలం ఆధ్యాత్మికమార్గమునకు సంబంధించినవి భావిస్తున్నారు. ఇది కాదు ఆధ్యాత్మికము. నాయందు ఏ 'ఆత్మ' కలదో, ఆ ఆత్మనే సర్వులయందునూ వున్నదని అనేటటువంటి 'ఏకాత్మభావనను' గుర్తించటమే నిజమైనటువంటి 'ఆధ్యాత్మికము'. అనేకత్వంలో ఏకత్వాన్ని గుర్తించటమే ఆధ్యాత్మికము.** దీనికొక చిన్న ఉదాహరణ. నీవు కన్నులు మూసుకుంటే ఒక వ్యక్తి కూడా నీకు కనిపించడు. ఆ కన్నులే తెరచిన అనేక వేల శిరస్సులు కనిపిస్తాయి. ఈ శిరస్సులు ఎక్కడ నుంచి వచ్చాయి? నీ కన్నులు మూసుకున్నప్పుడు ఈ శిరస్సులు ఎక్కడ ఉన్నాయి? కన్నులు తెరచేటప్పటికి ఈ శిరస్సులన్నీ ఎక్కడనుంచి ఆవిర్భవించాయి? వీరందరూ ఎవరు? ఈ శిరస్సులు ఎవరివి? అని విచారణ చేస్తే. ఇన్ని శిరస్సులు నీ నేత్రములయందే ఉన్నాయిగాని బయటనుంచి రాలేదు. కనుకనే **అన్ని భూతములు కూడనూ నీయందే ఉన్నాయి. నీవు అన్ని భూతములయందూ ఉంటున్నావు. కనుక ఇట్టి ఏకత్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించేదే ఆధ్యాత్మికము. నేను ఒక్కడిని కాదు, అనేకత్వంలో నేను ఒక్కడను అనేటటువంటి సత్యాన్ని మొట్టమొదట గుర్తింపజేస్తుంది 'ఆధ్యాత్మికము'.** కనుక ఆధ్యాత్మికమనగా ఏదో కొన్ని లౌకికమైన, భౌతికమైన, ప్రాకృతికమైన, ఇలాంటి కర్మలు ఆచరించటం ఆధ్యాత్మికము కాదు. **ఆది+ఆత్మ= ఆధ్యాత్మ.** అందరి యందునూ ఒకటే ఆత్మ ఉన్నది. ప్రత్యేకంగాలేదు. కాని ఇది ప్రత్యేకంగా, ప్రపంచమునందు వేరుగా ఉన్నదని భావించి, అనేక సందేహములకు, అనేక అనుమానములకు గురియై, ఏకత్వాన్ని భిన్నత్వం గావిస్తున్నారు. ఇవన్నీ కూడనూ నీ ప్రేమనుండి ఆవిర్భవించినటువంటివే. కనుక **మతమునకు, ఆధ్యాత్మికమునకు, Educare**కును వున్న సంబంధం ఏమిటనేదే సందేహం. ఈమూడు కూడానూ వేరు కాదు. It is my kerchief. kerchief is separate from me. This is my Body. Body is separate from me. I am not the Body.But who am I? దీనిని విచారణ చేసుకుంటే, వీటన్నింటికినీ వస్తువుల యొక్క సమగ్రతకు వేరైనటువంటిదే ఒక వ్యక్తిత్వము. వీటన్నింటికిని Master నీవు. మిగతావన్నీ మెటీరియల్స్. కనుకనే **Master the mind be a master mind. వీటన్నింటికినీ నీవే మాష్టర్‌వు. ఆ మాష్టరే ఆత్మ. ఆ ఆత్మనే సర్వులయందునూ ఉన్నటువంటిది. అదే నీలో కూడనూ ఉన్నది.** ఇందులో ఏకాత్మభావన సులభంగా మనకు అర్థమవుతుంది. ఇక **Educare అంటే ఏమిటి? ఇంగ్లీషు భాషనుండి Education (విద్య) అనే పదము వచ్చింది. లాటిన్ నుండి Educare అనే పదము వచ్చింది. ఈ Educare నుంచే Education అనేది వచ్చింది.** ఈ రెండూ వేరు కాదు. రెండూ ఒక్కటే, Educationఅనేటటు వంటిది బయట ప్రపంచమునుంచి సంగ్రహించు కుంటున్నాం. కాని Educare అనేటటు వంటిది లోపల నుంచి బయటకు తీస్తున్నాం. ఇది రెండు విధములగా చూడవచ్చు. **1. జీవనోపాధి. 2. జీవిత పరమావధి.** మనకు తెలిసినటువంటి విషయాన్ని మనం బయట నుండి తీస్తున్నాం. మనకు తెలియనటువంటివి ఎన్నో లోపల అగోచరంగా ఉంటున్నాయి. వాటిని మనం ప్రయత్న పూర్వకంగా బయటకు తీయాలి. మొట్టమొదట మనం A,B,C,D అనే అక్షరాలు నేర్చుకున్నాం. ఇవి మనం నేర్చిన అక్షరాలు. ఇవి భౌతికమైనవి. అయితే క్రమక్రమేణా G..O..D.. అని పెట్టేటప్పటికి GOD (గాడ్) అవుతుంది. ఈ మూడూ కూడను నీవు కూర్చుకున్నటువంటివే. ఈ అక్షరాలు పూర్వమే ఉంటున్నాయి. అయితే ఈ అక్షరాలను ఒక శబ్దరూపంలో కూర్చడం... అది నీ ప్రయత్నం అదే విధముగనే ఒకటి మనకు తెలిసినటువంటి విషయాన్ని, రెండవది తెలియనటువంటి విషయాన్ని రెండింటిని

కూడనూ మనం లోపలనుంచి కూడా తీసుకోవాలి. Educare అనేదానికి లోపలనుంచి యివ్వటం అని దీని అర్థం. దేనిని లోపలనుంచి యివ్వాలి? Educare నుంచి Educationను యివ్వాలి. అది కూడనూ మనయందే ఉంటున్నది. **ఉన్నదానినే మనం యివ్వటం కనుక మతమునకు, ఆధ్యాత్మికమునకు, Educare కు ఎట్టి భేదమూ లేదు.** కేవలం రీలైజ్ చేసినటువంటిది మాత్రమే కాదు 'రెలిజియన్' రెలిజియన్ అనగా Love(ప్రేమ). ఈ ప్రేమ అనేదాని వలననే ఒక విధమైన 'రీలైజేషన్' జరుగుతున్నది. నీవు కొన్ని తప్పు పనులు చేసివుంటే, ఆ తప్పుపనులు చేసిన వానిని చూసేటప్పటికి నీలోవున్న తప్పుపనులన్నీ బయటకు వస్తుంటాయి. నీవు మంచి పనులు చేసివుంటే, మంచి పనులు చేసినవానిని చూచినప్పుడు, నీలో వున్న మంచితనమంతా బయటకు వస్తుంది. కేవలం అతని నుంచి నీవు చూసి కాదు. నీలో వున్న మంచిచెడ్డలే బయటపడుతున్నాయి. కనుక మనం **ఎవరినో చెడ్డవాడని అంటున్నాం. అతను చెడ్డవాడు కాదు. అతనిపైన ఉన్న నీ భావం చెడ్డది కాని, అతను చెడ్డవాడు కాదు ఇంకొకడ్ని 'మంచి వాడు' అంటున్నాం. కాని అతని యందున్న మంచితనం నీకు కనిపించడంలేదు.** నీకు అతనిపై ఉన్న మంచిభావమే అవిధంగా అనిపిస్తున్నది. కాబట్టి **మంచి చెడ్డలన్ని కూడనూ Reflection of the inner being. అవన్నీ నీ యొక్క Reflection, Reaction, Resound లే.** కనుక ప్రతిదానికీ కూడనూ తన తత్త్వమే తనకు బయట స్వరూపకంగా కనిపిస్తుంది. కనుక మనం ఎవర్ని చెడ్డ అని భావించకూడదు. 'చెడ్డ' అని చెప్పడానికి నీకు ఏ అధికారం వుంటున్నాది? అతనిలో చెడ్డ ఉన్నదని ఏవిధంగా గుర్తింపజేస్తున్నావు? **ఇది కేవలం నీకు కొన్ని అపకారములు జరగటం వలన అతను చెడ్డవాడంటున్నావు. కాని అతనిలో ఇంకా ఎంత మంచి ఉన్నదో? అది నీకు ఏమాత్రం గుర్తించడానికి వీలులేదు.** ఒక చిన్న ఉదాహరణ. ఇతను అనిల్ కుమార్ అని గుర్తించడానికి కొన్ని గుర్తులు చెప్పుతారు. కాని అవన్నీ మీ నేత్రాలకు మాత్రమే కనిపిస్తాయి గాని, మీ నేత్రాలకు కనిపించనివి ఎన్నో అనిల్‌కుమార్‌లో ఉంటున్నాయి. Height, Fat, Colour - ఈ మూడింటినీ చూడగలుగుతారు కాని అతనిలో ఇంకా ఎన్ని మంచి గుణాలున్నాయో! అతని యందు ప్రేమ, దయలు ఉండవచ్చును, క్రోధం కూడా ఉండవచ్చును. కాని అవి నీకు కనిపించవే! అతని Height, Fat, Colour చెప్పినంత మాత్రమున అతనిని నీవు గుర్తించినవాడవు కాదు. నీవు గుర్తించనటువంటివి అతనిలో ఎన్నో ఉన్నాయి. ఈ అన్నింటినీ గుర్తించడానికి ప్రయత్నం చేసినప్పుడే, అతని స్వరూపస్వభావాలు నీకు బాగా అర్థమవుతాయి. కనుకనే ఈనాడు లోకంలోపల ఆకారమును పురస్కరించుకొని, కేవలం తాను చేసేటటువంటి చర్యలను పురస్కరించుకొని అతని మంచి చెడ్డలుగా నీవు నిరూపిస్తున్నావు. ఇది చాలా తప్పు. నీలో ఎలాంటి తప్పులున్నాయో, అలాంటి నేత్రములతోనే అతనిని నీవు చూస్తున్నావు. కనుక అతనిది నీకు తప్పుగా కనిపిస్తున్నది. **కాబట్టి తప్పు అనేది ఎదుటి వ్యక్తి యందుకనిపించేదికాదు. నీదృష్టిలోని దోషమేగాని, సృష్టిలోని దోషము కాదు.** నీవు ఎర్రటి రంగు గ్లాసులు పెట్టుకుంటే, అంతా ఎర్రగానే కనిపిస్తుంది. నీవు ఏ కలరు గ్లాసులు పెట్టుకుంటే ఆ కలరుగానే కనిపిస్తుంది. కనుక ఇవి వ్యక్తి యొక్క దోషములే తప్ప వేరు కాదు. ఇలాంటి సత్యమును గుర్తించని మూర్ఖులే ఇతరులను విమర్శిస్తుంటారు. భగవంతుని యందు ఎంతో విలువైనవి ఉన్నాయి. కాని **నీవు వచ్చి నాకు ఒక లాకెట్ ఇవ్వండి స్వామీ! అంటావు. ఎందుకు ఆవిధంగా లాకెట్‌ను అడుగుతున్నావు? అతను ఇంకా ఎలాంటిది గొప్పది ఇవ్వదలచుకున్నాడో! అది నీవు గుర్తించుకొనలేక చిన్న దానిని నీవు కోరుతున్నావు. భగవంతుడు నీకు ఎంతో గొప్పది యివ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. అతనివద్ద లేనటువంటిది లేదు. ఎంతో విలువైనవి ఉన్నాయి. అలాంటి విలువైనవి ఉన్నప్పుడు విలువైనదే ఇస్తాడో ఏమో! కనుక భగవంతుడ్ని ఏమీ కోరుకూడదు. ఒక్కొక్క సమయంలో**

తానే అడిగి యిస్తుంటాడు. కాబట్టి దైవత్వం యొక్క విషయమును సామాన్యులు ఎవరూ అర్థం చేసుకోలేరు. అర్థంచేసుకోలేని మూర్ఖులే, అనర్థాలకుగురియైపోయి, యథార్థాన్ని మరచిపోయి, వివేకమైనదానిని ఏమాత్రం గుర్తించుకొనక, అనర్థాలను పెంచుతున్నారు. ఇలాంటి దానికి మనం లోబడకూడదు. కనుక మతము అనేదిగాని, ఆధ్యాత్మికము అనేదిగాని Educare అనేదిగాని ప్రత్యేకమైనటు వంటివికావు. ఉదాహరణ. ఇది ఒక ఉంగరం, ఇది ఒక గొలుసు, ఇది ఒక బంగారు విగ్రహము. కాని దీనిలో ఉన్న బంగారం మాత్రం ఒక్కటే. అదే విధముగా **దైవత్వమనే దివ్యత్వం ఒక్కటే.** ఈ దివ్యత్వంలో అనేక రూపనామములు కనిపించవచ్చు. కాని **అన్ని రూపనామములకు మూలాధారమైనటు వంటిది ప్రేమ ఒక్కటే. ఆ ప్రేమను ఇచ్చుకో! ఆ ప్రేమను పుచ్చుకో!** ఆ రెండింటియందునూ ఉన్నటువంటి దివ్యశక్తులు మరెక్కడా కనిపించవు. **రెలిజయన్ అనే దానిని ప్రక్కన పెట్టు. Religion of Love Educare అనగా లోపల వున్నదానిని బయటకు తీయటం. అదియే నీ ప్రేమను బయటకు యివ్వటం. ఈ ప్రేమస్వరూపమే భక్తి అనే రూపాన్ని పొందుతున్నది. కనుకనే Love is God, Live in love.** దీనిని మొట్టమొదట మీరు తెలుసుకుంటే ఏ Educare ను మనం యోచించనవసరంలేదు. ఏమతాన్ని మనం విచారించనవసరంలేదు. అప్పుడు ఏ జగడములు జగత్తులో కనిపించవు. అందరూ ఐకమత్యంతో ఆనందంగానే ఉంటారు. భేదములు వుండనే ఉండవు. జగడములు ఉండవు. మానవులందరూ ఒక్కటే. మానవజాతి అంతా ఒక్కటే. ఆవిధమైన మానవత్వాన్ని గుర్తించుకుంటేచాలు. మానవత్వాన్ని గుర్తించుకుంటే 'మతము' అనేది వేరే కనిపించదు. **'మతములన్ని వేరు మార్గంబు ఒక్కటే'** ఈ మార్గాన్ని ఒక్కదానిని గుర్తించుకుంటే చాలు. మతములన్ని ఏకమైపోతాయి. **'మతులు మంచివైన మతమేమి చెడ్డది?'** మన మతులలో భేదాలు పెట్టుకొని, మతములలో భేదాలు వున్నాయను కోవటం చాలా పొరపాటు. **మతములను కాదు, మతులను చూడు, నీగతిని చూడు, నీ స్థితిని చూడు, నీ సంపత్తిని చూడు. అదియే నీవు నేర్చుకోవలసినది. మతి, గతి, స్థితి, సంపత్తి ఈనాల్గింటి యందే మానవత్వం ఇమిడి వుంటున్నాది. కనుక మీరు ఏకత్వాన్ని అభివృద్ధి పరుచుకోండి. అందరియందునూ వుండినటువంటి ఆత్మతత్వము ఒక్కటే అని విశ్వసించండి.**

2. ప్రశ్న What relationship should Sri Satya Sai Schools have with the Government?

(సత్యసాయి విద్యా సంస్థలకు ప్రభుత్వానికి ఏవిధమైన సంబంధ బాంధవ్యము వుండాలి?)

సమాధానం: ఇక్కడ సత్యసాయి 'ఎడ్యుకేషన్' అని, గవర్నమెంటు 'ఎడ్యుకేషన్' అని రెండు ఉన్నాయా? **ఒక్కటే ఎడ్యుకేషన్.** అయితే గవర్నమెంటు ఎడ్యుకేషన్‌కు, మన ఎడ్యుకేషన్‌కు ఉన్నటువంటి సన్నిహితసంబంధాన్ని మనం యోచన చేయాలి. మన సత్యసాయి ఇనిస్టిట్యూషన్‌లోపల ఒక 'రైట్' ఉంటున్నాది. ఎందుకంటే **సత్యసాయి అందరివాడు. కాని గవర్నమెంటు దీనిలోపల అందరిదీ గవర్నమెంటు కాదు.** దాంట్లో కొన్ని Differences ఉంటుంటాయి. వాళ్ళ Subjects, objects వేరు వేరుగా ఉంటుంటాయి. దానికి కొంత విరుద్ధంగా పోయావంటే, దానిమీద చర్య తీసుకుంటారు. కాబట్టి గవర్నమెంటు రూల్సుకు విరుద్ధంగా పోగూడదు. అనుసరిస్తూపోవాలి. మనదానికి ఏ రూల్సు లేవు. **మన రూలు ఒక్కటే Love is the rule to our institution.** ఆ ప్రేమచేతనే మన రూల్సును మనం అనుసరిస్తాం. హృదయపూర్వకంగా ప్రేమించి ఆచరణలో పెడుతాం. **నీవు గవర్నమెంటు స్కూలులో చదువుతూ కూడా, సత్యసాయి ఎడ్యుకేషన్‌ను కూడా నీవు అనుసరించవచ్చు. సత్యసాయి ఎడ్యుకేషన్ లక్ష్యం మానవతావిలువలను పెంపొందించడం, మానవతా విలువలను మొట్టమొదట కాపాడుకో. దానిని నిలబెట్టుకుంటూ గవర్నమెంటు ఎడ్యుకేషన్ అనుసరించవచ్చు. ఇది వేరు, అది వేరని భేదంగా చూడకూడదు.** ప్రభుత్వ

రూల్స్‌ను ధిక్కరించకూడదు. దినమునకు 24 గంటలు గదా! ఆరుగంటలు సేపు గవర్నమెంటు స్కూల్‌లో చదవవచ్చు. ఆరుగంటలు నిద్రకు, ఇంకో ఆరుగంటలు ఆటపాటలకు వినియోగించవచ్చు. మిగిలిన ఆరుగంట లలో మానవతా విలువలను పెంచుకోవడానికి అవకాశం వున్నది. కనుక **మానవుడు కాలమును నాలుగు భాగములుగా విభజించాలి. ఒక భాగము స్వార్థమునకు, రెండవభాగము నీ డ్యూటీస్‌కు, మూడవభాగము నిద్రాహారములకు, నాల్గవభాగము ఆధ్యాత్మికమునకు వినియోగించాలి.** కనుక గవర్నమెంటు చదువుకు, సత్యసాయి చదువులకు భేదము చూడకూడదు. మనది సత్యమైన యదార్థమైన ఎడ్యుకేషన్. **అది కేవలం Bookish Knowledge (పుస్తకజన్యజ్ఞానం) మనది Practical knowledge. అది కేవలం పుస్తక జ్ఞానం కదాయని ప్రక్కన పెట్టకూడదు. ఇహమున సుఖింప హేవతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మవిద్య" అన్నారు. ఇహమునకు గవర్నమెంటు ఎడ్యుకేషన్ అవసరం. పరమునకు ఆధ్యాత్మిక విద్య అవసరం.** కనుక ఈ రెండునూ తీసుకోవాలి. ఒకే నాణెమునకు రెండు ముఖాలుంటాయి. ఈ రెండూ ఉన్నప్పుడే ఈ నాణెం చెల్లుతుంది. కనుక దీనిలో భేదాలు ఏమాత్రం పెట్టుకోకూడదు.

3. ప్రశ్న: As teachers while improving ourselves, how can we understand the minds of students? How do teachers overcome any deep rooted weaknesses in themselves?

(ఉపాధ్యాయులుగా మనల్ని మనము సంస్కరించు కుంటూ, విద్యార్థుల మనస్సును ఏవిధంగా అర్థం చేసుకోవచ్చును? ఉపాధ్యాయులు తమలోని బలహీనతలను ఏవిధంగా పోగొట్టుకొనవచ్చును?)

సమాధానం: విద్యార్థుల మనస్సులు గుర్తించి వర్తించడానికి, విద్యార్థుల మనస్సులు ఎట్లా వుంటాయో, ఏమో తెలుసు కోవాలనుకుంటున్నారు. **మొట్టమొదట మీ మనస్సులను మీరు తెలుసుకోండి. తరువాతనే విద్యార్థుల మనస్సులను మనం చూడవచ్చును.** మీలో మంచి మనస్సును అభివృద్ధి పరుచుకుంటే, విద్యార్థుల యందు Reflection of the inner being. అది కూడా మీలో ప్రవేశిస్తుంది. కనుక అక్కడ Mind ను చూడటానికి వీలుకాదు. ఆ విద్యార్థి యొక్క ప్రవర్తనను పురస్కరించుకొని Follow (వెంబడిస్తూ) చేస్తూరా. బైట ఏవిధంగా ప్రవర్తిస్తున్నాడు? ఇంటిలో ఏవిధంగా ఉంటున్నాడు? స్కూల్‌లో అతని ప్రవర్తన ఎలా ఉన్నది? స్నేహితులతో ఎట్టా ఉంటాడు? వీటన్నింటిని చక్కగా విచారణ చేయాలి. అప్పుడే ఆ విద్యార్థిని చక్కని మార్గంలో పెట్టడానికి వీలవుతుంది. అతని చర్యలను గమనించ కుండా, అతనిని మార్చాలంటే, ఎలా సాధ్యమవుతుంది? ఇంతియే కాకుండా, ఇంట్లో తల్లిదండ్రులు మితిమీరిన స్వేచ్ఛను యిస్తుంటారు. అక్కడ స్వేచ్ఛగా వుండటంచేత ఇంట్లో స్వేచ్ఛగా ప్రవర్తిస్తుంటారు. స్నేహితులు కూడా మరింత స్వేచ్ఛను యిస్తుంటారు. కాని స్కూలుకు వచ్చేటప్పటికి ఈ స్వేచ్ఛ కొంత కట్టుదిట్టమవుతుంది. తల్లిదండ్రులకు వుండిన ప్రేమవలన వారు అమితమైన స్వేచ్ఛను యిస్తుంటారు. ఈ విషయంలో విచారణచేస్తుండాలి. ఈనాటి ఆధునిక యుగంలో తల్లిదండ్రులు పిల్లలకు కావల్సినంత స్వేచ్ఛను యిస్తున్నారు. కావల్సినంత ధనమును కూడా యిస్తున్నారు. **99 శాతం పిల్లలను తల్లిదండ్రులే పాడుచేస్తున్నారు. కావల్సినంత స్వేచ్ఛను యివ్వటం వలన పిల్లలు పెడమార్గం పడుతున్నారు. పెడమార్గంలో పోయేటప్పటికి ఏడుస్తున్నారు తల్లిదండ్రులు. ఇది తల్లిదండ్రుల తప్పు.** కనుక పిల్లలను మొదటినుంచే తల్లిదండ్రులు అదుపులో పెట్టుకుంటూ రావాలి. మంచిరోడ్డు ఉన్నప్పుడు కారులో స్పీడుగా పోతుంటాం. జనం అధికంగా ఉన్నచోట, రోడ్డు వంకరటింకరలుగా ఉన్నచోట స్పీడ్‌బ్రేకర్స్ పెడతారు. ఎందువలన? అందరి క్షేమం కోసమనే. అదే విధంగా పిల్లలక్షేమం కోసం, పిల్లల స్పీడుకు కొంత(బ్రేకులు వేయాలి. ఎలాంటి దానికి స్వేచ్ఛ యివ్వాలి? ఎలాంటి దానికి స్వేచ్ఛ యివ్వకూడదు? **విచక్షణా జ్ఞానాన్ని ప్రదర్శించాలి.**

తల్లిదండ్రులు ఒకేవళ వాడు చెడ్డ మార్గంలో పోతుంటే కఠినమైన శిక్షయివ్వాలి. అట్టివానికి స్వేచ్ఛే యివ్వకూడదు. మంచిదానికి ఎంతైనా స్వేచ్ఛ యివ్వ వచ్చును. ధనము యివ్వవచ్చును. కాని వెనుక అతని ప్రవర్తనను గమనిస్తూపో. అప్పుడే ఆ పిల్లవాడు సరియైన మార్గానికి రాగలడు. **పిల్లలను సరియైనమార్గంలో పెట్టే బాధ్యత మొదట తల్లిది. కొడుకు పాడైతే తండ్రి బాధ్యత,కూతురుది తల్లిది. ఎందుకంటే బిడ్డ తల్లిని అనుసరిస్తూ ఉంటుంది. మొత్తం మీద తల్లిదండ్రులు తమ పిల్లలకు అమితమైన స్వేచ్ఛ యిస్తుండటంవలన, వాళ్ళ ప్రవర్తనను గమనించక పోతుండటవలననే పిల్లలు పాడైపోతున్నారు.** ఆవిధంగా ప్రవర్తించకుండా ఉండే నిమిత్తమై **'స్కూల్' అనేది మూడవది పెట్టారు. అక్కడ అధ్యాపకులు ఈ బాధ్యతను స్వీకరించాలి. చక్కటి బుద్ధులను నేర్పిసరియైన మార్గంలో పిల్లలను నడిపించాలి అధ్యాపకులు. మంచి మార్గంలో నడుస్తూ ఇంటిపేరును, తల్లిదండ్రులపేరును, స్కూల్ పేరును నిలబెట్టాలని ఆధ్యాపకులు విద్యార్థులకు మంచి బోధనలు చేయాలి.** మంచి మాటలతో పిల్లలను సరియైన మార్గంలో పెట్టాలి. ఈనాడు విద్యార్థులలో వినయ విధేయతలు లేకుండాపోతున్నాయి. అట్టివారికి వినయ విధేయతలను నేర్పవలసిన బాధ్యతను సత్యసాయి సంస్థల వారు కూడా తీసుకోవాలి. విద్యార్థులను సరిదిద్దటానికి ప్రయత్నించాలి అధ్యాపకులు. అప్పుడే మీ కీర్తి కూడా అభివృద్ధి అవుతుంది. **నీవు ఆచార్యుడవు. అధ్యాపకుడవు కాదు. ఆచరించి బోధించేవాడు అచార్యుడు. నీవు ఆచరించి పిల్లలకు బోధించు. ఇక పిల్లలలో కొన్ని దురభ్యాసాలు కూడా ఉంటుంటాయి. ఆ దురభ్యాసాలను మొట్టమొదట అధ్యాపకులు వాటిని కంట్రోల్ చేసుకొని, తరువాత పిల్లలకు బోధించాలి. అధ్యాపకుడు ఏ ఒక్కటి చెడ్డది చేసినా, పిల్లలు దానిని అనుసరిస్తారు. కనుక అధ్యాపకులు చెడ్డది చేయకూడదు. మంచినిచేయి, మంచిని చెప్పు. ఇదే సరియైన విద్య లక్షణం. అప్పుడే విద్యార్థులలోవున్న మంచి కూడా బయటపడుతుంది. ఆనాటి నుంచి మంచివాడుగా ప్రవర్తిస్తాడు విద్యార్థి. ఇది నాకు బాగా తెలుసు. ఎందుకంటే నేను పిల్లలను ఎన్నో విధములుగా శిక్షిస్తుంటాను. అరుస్తుంటాను. చెబుతుంటాను, మళ్ళీ ప్రేమిస్తుంటాను, అన్నీ యిస్తుంటాను. కొన్ని సమయాల లోపల చాలా కఠినంగా కూడా ఉంటాను. అప్పుడు పిల్లలే నాదగ్గరకు వచ్చి స్వామీ! నేను చేసింది తప్పు క్షమించండని ప్రాధేయపడుతుంటారు. అలాంటి తప్పులు మరల చేయమని ఏడుస్తారు. అప్పుడు స్వామి కరిగిపోతాడు. ఇకనుంచి తప్పులు చేయకు. నేను ఏది చేసినా మీ మంచికోసమే అని చెబుతాను. టీచర్సు కూడా ఆవిధంగా చేస్తుండాలి.**

4. ప్రశ్న: What is the most important quality, a teacher must have?

ఉపాధ్యాయులకు వుండవలసిన అతి ముఖ్యమైన గుణము ఏది?

ఇది చాలా ముఖ్యమైనది. ఏది మంచిదని భావిస్తారో టీచర్సు దానిని ఆచరించి చూపించుతూ పిల్లలకు బోధిస్తూ రావాలి. పిల్లలకు ఆదర్శమైన జీవితాన్ని అందిస్తూ రావాలి అధ్యాపకులు. నేను కమలాపురంలో చదువు తున్నాను. అయ్యంగార్ అనే టీచర్ వుండేవాడు. ఆయన బజారులో వస్తుంటే చూచిన పిల్లలు భయపడి ప్రక్కకు తప్పుకునేవారు. దానిని గమనించాడు ఆయన ఆ టీచరు వస్తుంటే, ముందుగానే చింతబెత్తాలు తీసుకొని తెచ్చిపెట్టాలి. ఆ రోజులలో ఆ క్లాసుకు నేనే మానేటర్‌ను. నేనే మానేటర్‌ను కావటం వలన బెత్తాలు తీసుకొనివచ్చే బాధ్యత నాదే. ఆ విధంగానే పెట్టాను. అందులో ఒకబెత్తం తీసుకొని ఏ రాజు!రా! అన్నాడు. ధైర్యంగా వెళ్ళాను. ఎందుకంటే నేను ఏ తప్పు చేయలేదు. నన్ను చూచి, ఎందుకు ఆ సందులోకి వెళ్ళావు? అని అడిగాడు అయ్యంగార్. "మిమ్ములను నేను చూడలేదు. కాని అతని ఇంటిలోపల నా నోట్‌బుక్ ఉన్నది. దానిని తీసుకోవడానికి మాత్రమే అటువెళ్ళాను. నేను మిమ్ములను చూడలేదు సార్!" అన్నాను. ఏయి! చూడలేదా? అని గట్టిగా అరిచాడు. చూడలేదు అని గట్టిగా నేనూ చెప్పాను.

నిన్ను కొడతాను అన్నాడు. నన్ను కొట్టాలని కోరిక మీకు ఉంటే, కొట్టండి! అని చేయి యిచ్చాను. ఆ మాటలోని సత్యాన్ని గుర్తించిన ఆయనకు కంటిధారలు కారినాయి. దగ్గరకు వచ్చాడు. **రాజూ! నీవు అలాంటి పనులు చేయవని నాకు బాగా తెలుసు. కానీ నీవే అనుకొని, నాకు చాలా కోపం వచ్చింది.** ఏనాడు తప్పుచేయనివాడు ఇలాంటి తప్పు చేస్తున్నాడేమని నాకు చాలా కోపం వచ్చింది. కాని నీవు ఇలాంటి తప్పులు చేయవు. నాకు తెలుసు అని చెప్పాడు. ఆ తరువాత పిలిచి రేపు స్కూలుకు వెళ్ళేటప్పుడు మా ఇంటికి రమ్మనమని చెప్పాడు. వెళ్ళాను. వరండాలోనే నుంచున్నాను.

ఆయన భార్య వచ్చి నన్ను లోపలకు తీసుకొని వెళ్ళింది. లోపలకు వెళ్ళేను. ఆయన ప్రేమకు అంతులేదు. ఒకప్లేటులో పకోడీలు పెట్టి తీసుకొనివచ్చాడు. తినమని కోరాడు. నిన్న నేను తప్పుచేశాను. నీ మీద నాకు చాలా కోపం వచ్చింది. కొట్టాలనుకున్నాను. నీవు తప్పుచేయలేదని గ్రహించాను. బాధపడ్డాను. ఆ తప్పుకు పరిహారంగా నీతో స్నేహం చేసుకుంటున్నాను అన్నాడు. **చూశారా! మన మంచితనం, మన సత్యవాక్కులు, మన మంచిగుణములు ఎలాంటి వారినైనా కరిగిస్తుంది. కదిలిస్తుంది. వయసు ప్రధానంకాదు, చదువు ప్రధానంకాదు. హృదయం ప్రధానం.**

సహజంగా టీచర్సును చూస్తుంటే పిల్లలకు భయం. కాని నాకు భయముండేది కాదు. కారణం? నేను ఏ తప్పు చేసేవాడను కాదు. కనుక ఎందుకు భయపడాలి? అప్పుడు **మహబూబ్‌ఖాన్ అనే ఇంగ్లీషు టీచర్** కూడా వుండేవాడు. అతనికి నా క్లాసుకు రావటం అంటే మహా ఇష్టంగా ఉండేది. **నేనంటే అతనికి ప్రేమ.** అతనికి పిల్లలు లేరు. నన్ను ప్రతి దినం వచ్చి వాళ్ళ ఇంట్లో టిఫెన్ చేసి వెళ్ళమనేవాడు. 11 సంవత్సరం వచ్చేటప్పటికి ఆ స్కూలును వదిలిపెట్టాను. అయితే ఆనాటి వరకు ప్రతిరోజూ నేనే ప్రార్థన చేసేవాడను. ఆ ప్రార్థనను కూడా నన్నే వ్రాయమని మాస్టార్లు కోరారు. అప్పుడు ఈ ప్రార్థనను వ్రాసి ప్రతిరోజు చదివేవాడను.

"అహరహతవ ఆహ్వాన ప్రచారిత
సునిశిత ఉదాహరవాణి
హిందూ, బౌద్ధ, సిక్, జైన, పారశిక్
ముసల్మాన్, కిరస్తానీ
పూరబ్ పశ్చిమ్ ఆసీ
తవసింహాసన్ వాసీ
ప్రేమవాహినీ...ప్రేమ వాహినీ...
జనగణమన అధినాయక జయహే
జనగణమన అధినాయక జయహే..."

అని ప్రార్థన చేసేవాడను. అన్ని మతాల పేర్లను దానిలో పెట్టాను. ఆ ప్రార్థనను విని అందరూ ఆశ్చర్యపడ్డారు. ఆ చిన్ననాడే సర్వమత సమన్వయాన్ని బోధించాను. ఆ తరువాత ఆ స్కూలును వదిలిపెట్టాను.

"నేను సాయిని తెలియుము నిక్కముగను
మమతబాయుము యత్నముల్ మానుకొనుము
బాసె మీకు నాతోడి సంబంధమింక
కాదు నన్నట్ట మరి యెట్టి ఘనునికైన"

పిల్లలంతా బాధపడ్డారు, టీచర్సు ఆశ్చర్యబడ్డారు. రాజూ! ...రాజూ! అంటూ పిల్లలు నావెంట పడ్డారు. ఎవరికీ నేను జవాబు చెప్పలేదు. సరాసరి ఉరవకొండ వచ్చాను. ఆంజనేయులు తోటకు వెళ్ళాను. ఒక పెద్ద బండరాయి మీద కూర్చున్నాను. వచ్చిన వారందరికీ బోధ చేస్తూ వచ్చాను.

'మానసభజరే గురుచరణం దుస్తర భవసాగర తరణం'

ఇది నా మొదటి బోధ. రాజు లేని స్కూలులో నేనుండను అని ఒక తెలుగు టీచర్ రాజీనామా చేశాడు. తరువాత మహబూబ్‌ఖాన్ టీచర్ కూడా రాజీనామా చేశాడు. రెండవ దినం గొంతు బాగున్నదని ఒక మహమ్మదీయ విద్యార్థిని ప్రార్థన చేయడానికి నిలబెట్టారు. అతనే స్టేజి ఎక్కాడు. స్వామి కనిపించకపోయేటప్పటికి, ఏడ్వడం మొదలు పెట్టాడు. అందరు పిల్లలూ ఏడ్వడం మొదలుపెట్టారు. **ఆనాటి నుంచి ఆ ప్రార్థన మానేశారు.** పిల్లలు మాష్టర్లు ఆ విధంగా నన్ను ప్రేమించారు. నా మీద అంత ఆప్యాయత

వారికి ఉండేది. మన ప్రేమ ద్వారా ఎలాంటి గురువులనైనా చక్కగా కైవసం చేసుకోవచ్చును. పిల్లలనుకూడా మన వశం చేసుకోవచ్చును. మన ప్రేమను బట్టే వారంతా ప్రేమిస్తుంటారు. కనుక టీచర్సు పిల్లల యొక్క స్వభావాన్ని చక్కగా కనిపెట్టాలి. మొట్టమొదట మనలో రావల్సింది సత్యం. మన **భారతీయ సంస్కృతిలో కూడానూ, 'మొట్ట మొదట సత్యంవద, ధర్మం చర'** అన్నారు. నేను ఎప్పుడూ వినయంతో పలుకరించేవాడ్ని. ఇప్పుడు కూడనూ పిల్లలకు అదే చెబుతుంటాను. **'You cannot always oblize, but you can speak always oblizingly'** అని చెబుతుంటాను. వినయంతో మాట్లాడే మాటలు హృదయాలను కరిగించి వేస్తాయి. అయితే కొన్ని కొన్ని సమయాలలో కఠినంగా చెప్పవలసివస్తుంది. **కఠిన విషయంలో నేను వజ్రము కంటే కఠినమే. ప్రేమలో వెన్న కంటే చాల మెత్తనే. కనుక పిల్లలను మనం వశం చేసుకోవాలంటే సరియైన ప్రేమతో వారిని దగ్గరకు చేర్చాలి.** వారిలో తప్పులు ఏమైనా వుంటే వారికి చక్కగా చెప్పి సరియైన మార్గంలో పెట్టాలి. అప్పుడే వారికి చక్కగా చెప్పి సరియైన మార్గంలో పెట్టాలి. అప్పుడే వారు మంచి మార్గంలోనికి వస్తారు. వారి తప్పులను మన దగ్గర ఒప్పుకుంటారు. అయితే ఒప్పుకున్న తరువాత తిరిగి ఆ తప్పులు చేయకుండా చూడాలి. ఆ విధమైన మార్గమును అధ్యాపకులు అనుసరిస్తుంటే, ఎంతయో దేశానికి ఉపకారం చేసినవారవుతారు. దేశమును అంతా బాగు చేయాలనుకుంటే అధ్యాపకులు, పిల్లలపైన మంచి ఆదర్శవంతమైన ప్రేమను పెంచుకోవాలి. అప్పుడే ప్రపంచంలో ఎంతమంది మంచి విద్యార్థులనైనా తయారు చేయవచ్చును.

5. ప్రశ్న: How to implement educare in the case of children from deprived from slum areas including children from broken homes who present discipline problems in a class.

సమాధానము: పరిశుభ్రం చేయడానికి 'సేవాదళ్' ఏర్పాటు చేయబడింది. ఎక్కడకుపోయినా **'cleanliness is Godliness'** అన్నారు గదా! ఇల్లు చిన్నదైనప్పటికినీ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని బోధించాలి. వారానికొక పర్యాయం పల్లెలకు వెళ్ళి మనమే పరిసరాలను శుభ్రం చేస్తూ పోతుంటే, వాళ్ళే ముందుకు వచ్చి పరిశుభ్రం చేయటం మొదలుపెడతారు. ఇటువంటి పనులు అధ్యాపకులు పిల్లలచేత చేయిస్తూండాలి.

6. ప్రశ్న: How do we motivate children in the Educare Programme?

ఎడ్యుకేర్ కార్యక్రమములో పాల్గొనేటట్లు పిల్లలను ఎలా ప్రోత్సహించాలి?

సమాధానము : **పిల్లలలో ఈ Eduare Programmeను అమలు పరచటం సాధ్యం కాదు. ఎందుకంటే వారి వయస్సు చాలా చిన్నది. Educare కార్యక్రమాన్ని కాలేజీలలో అమలు చేయవచ్చును. అంతకు పూర్వం అనగా చిన్నతనంలో చిన్న చిన్న కథలు ద్వారావారి మనస్సులలో మంచి బీజాలు నాట వచ్చును.** మహానుభావుల చరిత్రలు కథలుగా చెప్పవచ్చును. ఆవిధంగా చెబుతూ పిల్లల మనస్సులను మారుస్తూరావాలి.

7. ప్రశ్న : How do we attract Non-devotee children to Sathya Sai Schools?

సత్యసాయి భక్తులుకాని కుటుంబాలలోని పిల్లలను సత్యసాయి స్కూల్స్‌లోనికి ఏవిధంగా ఆకర్షించగలము?

సమాధానము : ఇది చాలా ముఖ్యమైనటు వంటిది. తల్లిదండ్రులకు సత్యసాయిబాబా విషయం తెలియదు. మన స్కూళ్ళకు వచ్చేవారికి మాత్రం తెలుసు. అలాంటి పిల్లలను దగ్గర కూర్చోపెట్టుకొని మంచిగా అర్థమయ్యే టట్లుగా వివరించి చెప్పాలి. స్కూల్‌లో వారు నేర్చుకొనిన మంచి విషయాలను తిరిగి వారి వారి తల్లిదండ్రులకు పిల్లల చేతనే చెప్పించే ప్రయత్నం జరగాలి. సత్యసాయి స్కూలుకు వెళ్ళటం వలననే నాకు యిన్ని మంచి విషయాలు తెలిసాయని పిల్లలే తల్లిదండ్రులకు చెబితే వుండే ప్రభావం అంతటిది ఇంతటిది కాదు. భోజనం

చేసే ముందు మన విద్యాసంస్థలలో **'బ్రహ్మార్పణం, బ్రహ్మ హవి:'** అనే శ్లోకం చెబుతాం. ఇంటికి వెళ్ళినపుడు కూడా విద్యార్థులు ఈ శ్లోకం చెప్పి అన్నం తింటుంటే, తల్లిదండ్రులు ఎంతో ఆనందిస్తారు. మన వాడికి భక్తి పెరిగిందని సంతోషిస్తారు. ఆ శ్లోకం అర్థం చెబితే తల్లి దండ్రులు యింకా సంతోషిస్తారు. మన విద్యాసంస్థల యెడల సదభిప్రాయం ఏర్పడుతుంది. మనం తినే అన్నం, ఈ శ్లోకం చెప్పి తింటే, ఆ అన్నం ప్రసాదంగా మారిపోతుందని, ఆ ప్రసాదంలో ఎట్టి దోషములూ ఉండవని తల్లి దండ్రులకు ఇంటి వద్ద పిల్లలు చెబితే ఎంతో సంతోషించి, **వారు కూడా అన్నం తినేముందు ప్రతిపూట ఈ శ్లోకం చదవటం మొదలు పెడుతారు.** పిల్లల ద్వారా వారి వారి తల్లిదండ్రులను కూడా మంచి మార్గంలో పెట్టవచ్చును. కనుక మొట్ట మొదట పిల్లలను మంచి మార్గంలో పెట్టి, వారి ద్వారా వారి తల్లిదండ్రులను కూడా సన్మార్గంలో ప్రవేశపెట్టవచ్చును. కనుక పిల్లలకు వారి వారి క్లాసులలో మంచి విషయాలను బోధించాలి. నేర్చుకొనిన మంచి విషయాలను పిల్లలు తమ ఇంటి వద్ద ఆచరణలో పెట్టేటట్లుగా చూడాలి. అప్పుడు దాని ప్రభావం తల్లిదండ్రుల మీద కూడా ఉంటుంది. మనస్కూళ్ళలో చెప్పే విషయాల మీద తల్లిదండ్రులకు సదభిప్రాయం కూడా ఏర్పడుతుంది. పిల్లలను ప్రోత్సహిస్తారు. కనుక మొట్టమొదట మనవద్దకు చదువుకోవడానికి వచ్చే పిల్లలను మంచి మార్గంలోనికి మార్చాలి. అప్పుడు ఆ పిల్లలే వారి వారి తల్లిదండ్రులను మారుస్తారు. **ఉదాహరణ: మన విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు మాంసాహారం తినటం మానివేస్తారు. ఇంటికి వెళ్ళిన తరువాత ఆ పిల్లల ప్రవర్తనను చూచి, వారి మాటలను విని, మాంసాహారం మానివేసిన తల్లిదండ్రులెందరో ఉన్నారు. కనుక పిల్లల ద్వారా వారి వారి తలిదండ్రులను కూడా మార్చవచ్చును.**

8వ ప్రశ్న: How to actively involve parents in educare programme?

తల్లి దండ్రులు ఎడ్యుకేర్ ప్రోగ్రాములో చురుకుగా పాల్గొనేందుకు ఏం చేయాలి?

సమాధానం : ఈ Educare ప్రోగ్రాంలోపల తల్లి దండ్రులను కూడా ప్రవేశపెట్టడం సాధ్యం కాదు. దీనిని పిల్లల చేత ఆచరింపజేయించి వారి ద్వారా దీనిని వారికి నేర్పించాలి. అర్థం తెలిసిన పిల్లలు దీనిని ఆచరిస్తూ పోతుంటే, తల్లిదండ్రులు కూడా అనుసరిస్తుంటారు.

9 ప్రశ్న: What is the role of Technology such as computer and its effects on education?

విద్యా విధానంపై నేటి కంప్యూటర్ టెక్నాలజీ పాత్ర, దాని ప్రభావము ఏమిటి?

సమాధానం : **ఈ టెక్నాలజీ నాకొక 'ట్రిక్ నాలెడ్జి'గా కనిపిస్తున్నది. ఎందుకంటే ఈ కంప్యూటర్స్ మీద నాకు నమ్మకం లేదు. ఈనాడు కాదు, 5 సంవత్సరాలుగా నేను చెబుతూనే ఉన్నాను.** అన్నిటికీ రోగాలు వచ్చినట్లుగా ఈ కంప్యూటర్‌కు కూడా ఏదో ఒక రోగం వస్తుందని నేను ఏనాడో చెప్పాను. ఇప్పుడు వచ్చింది. నేను అప్పుడే ఒక విషయం చెప్పాను. **నీవు 'కంపోజర్'వి కాని 'కంప్యూటర్' వి కాకూడదు అన్నాను. 'కంప్యూటర్' అనేది చెడిపోతుంది. ఎప్పుడు? 'కంపోజర్' చెడిపోయినప్పుడే 'కంప్యూటర్' చెడిపోతుంది.** ఈనాడు ప్రతి చిన్నదానికీ 'కంప్యూటర్స్' మీద ఆధారపడుతున్నారు. ఏ షాపుకు వెళ్ళినా, ప్రతి చిన్న లెక్కకు కాలిక్యులేటర్‌ను ఉపయోగిస్తున్నారు. **భగవంతుడు ప్రసాదించిన మేధస్సును ఉపయోగించుకోవటంలేదు. కృత్రిమమైన వాటి మీద ఆధారపడుతున్నారు. అవి చెడిపోతే నిరాశపడుతున్నారు. నేను కంప్యూటర్లను వద్దని చెప్పటం లేదు. కొన్ని స్థాయిలలో అవి అవసరమే. కాని అన్ని స్థాయిలలో మాత్రం కాదు.** పూర్వం ప్రతి ఒక్కరు ఒళ్ళు వంచి పనిచేసేవారు. తెల్లవారినప్పటి నుంచి రాత్రి పరుండే వరకు పనిచేసేవారు. కాని నూరుమంది చేసే పని ఇప్పుడు ఒక 'కంప్యూటర్' చేస్తున్నది. అందువలన చాలా మందికి పనిలేకుండా పోతున్నది. పనిలేకపోవటం వలన చాలామంది పెడమార్గాన పడుతున్నారు. కనుక **ప్రతి చేతికి పని కల్పించాలి. ప్రతి చేనుకు నీరు అందించాలి. ప్రతి ఇంటిని ఒక పరిశ్రమగా**

తయారుచేయాలి. అప్పుడు అందరికీ పని ఏర్పడుతుంది. కేవలం మిషన్లపైననే మనం ఆధారపడకూడదు.

10. ప్రశ్న : How to go about starting the first Sri Sathya Sai School in a country?

ఏదైనా ఒక దేశంలో ప్రథమంగా సత్యసాయి స్కూలు ప్రారంభించాలనుకుంటే ఏమి చెయ్యాలి?

సమాధానం : **అందరూ స్కూళ్ళు కట్టలేరు, నడపలేరు, అంతటి శక్తి సామర్థ్యములు అందరికీ ఉండవు. కాని 'బాల వికాస్' లను ప్రారంభించండి.** ఆ విధంగా చేస్తూ పోతుంటే, దానికి ఆకర్షితులై ఆ గ్రామస్తులే చిన్న స్కూల్‌ను కడతారు. ఎవరి శక్తిని బట్టి వారు పనిచేయండి. **ఏ దేశంలో చూచినా సరే బాలవికాస్ కార్యక్రమాలు స్త్రీలే బాగా చేస్తున్నారు.** వారి వారి ఇంటిపనులను చూచుకుంటూ 'బాలవికాస్' కార్యక్రమాలను చక్కగా నిర్వహిస్తున్నారు స్త్రీలు. కనుక పెద్ద పెద్ద స్కూళ్ళు కట్టించలేదని బాధపడకండి. పదిమంది పిల్లలను ఒక వరండాలో చేర్చి మంచివిషయాలను చెప్పండి. మానవతా విలువలను బోధించండి. సత్య ధర్మ శాంతి ప్రేమ అహింసలను గురించి చక్కగా వివరించండి. వాటికి సంబంధించిన చిన్న చిన్న కథలను చెప్పండి. ఆ విధంగా చెబుతూ పిల్లలను తీర్చిదిద్దండి.

11. ప్రశ్న : What is Sai Baba's vision for the future of Sathya Sai Schools around the world?

ప్రపంచవ్యాప్తంగా నడుపబడుతున్న సత్యసాయి విద్యా సంస్థల భవిష్యత్తు గురించిన స్వామి ధృక్పదం ఏమిటి?

సమాధానం : ముమ్ముందు ఏవిధంగా ఉండాలనేది మీరు అనుకోనక్కరలేదు. ఇప్పుడు చేయవలసింది మీరు చక్కగా చేస్తూరాండి! ఇప్పుడు మీరు చక్కగా చేస్తే, ముమ్ముందు అదే చక్కబడిపోతుంది. కనుక భవిష్యత్తు (future) ను గురించి యోచన చేయకండి. Future is not sure, It is not in your hand, Present is very important. Present also is not ordinary present. This is Omini - Present. **అమ్ని ప్రెజెంట్‌ను ప్రజెంట్‌గా తీసుకోండి.** తరువాత future లో అదే మార్పు చెందుతుంది. మీరు ఈనాడు ఈ స్థితికి వస్తారని మీరు ఏనాడైనా అనుకున్నారా? లేదు. మీరు మంచి పని చేస్తూ పోతుంటే, ఆ మంచి పనే మీలో ప్రమోషన్ యిస్తుంటుంది.

12. ప్రశ్న: Is it necessary to admit students from KG classes or can they be admitted directly to higher classes in Sri Sathya Sai Schools?

సత్యసాయి స్కూల్స్ నందు కె.జి.తరగతి నుండే పిల్లలను చేర్పించుకొనుట అవసరమా లేక మధ్యలో కూడా చేర్పించుకొనవచ్చునా?

సమాధానము : నా ఉద్దేశ్యము మన మన స్థాయిని బట్టి మనం ప్రయత్నము చేయవచ్చును. మన శక్తి పురస్కరించుకొని మనం దానిని ఎన్నుకోవాలి. కె.జి.నుంచి తీసుకోవచ్చును. IIIrd Class, IVth Class లనుండి తీసుకోవచ్చును. మన అనుకూలాలను బట్టి తీసుకోవచ్చును, దానికి నిర్భంధమేదీ లేదు.

13.ప్రశ్న: Should 'Gayatri Mantra' be chanted in western Satya Sai Schools?

పాశ్చాత్య దేశాలలోని సత్యసాయి స్కూల్స్‌లో 'గాయత్రీ మంత్రం' పఠించుట తప్పనిసరా?

స్వామి సమాధానం: దీనికి నేను సమాధానం చెప్పను. ఎందు కంటే, ఎవరిష్టం వారిది. నీ హృదయాన్ని నీవు అనుసరించు. ఈ గాయత్రి చెప్పటం వలన మంచి జరిగిందని మీరు భావిస్తే తప్పక చేస్తూరాండి. **గాయత్రి అనేది ఒక స్త్రీ కాదు, ఒక మతం కాదు. ఒక దేశానికి సంబంధించినదికాదు. ఇదంతా ఒక దేవతా స్వరూపమైనటువంటిది. ఇది మంత్ర స్వరూపంలో ఒక విధమైనటువంటి శక్తితో కూడినటువంటిది. అది ప్రతి మానవుని యందూ ఉంటున్నది. 'భూర్, భువః సువః' 'భూర్' Body Materialisation భువః Mind, Vibration. సువఃఅనగా Radiation. ఈ మూడింటి యొక్క తత్వమే మానవత్వము. భూర్, భువః, సువః - ఇది ఏ దేశం వారికైనా, ఏ మతం వారికైనా అవసరమే. ఓం భూర్‌భువస్సువః తత్స వితర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి థియోయోనః ప్రబోదయాత్. 'భర్గో' అనగా చీకటి. అనగా**

సంధ్య

అజ్ఞానము. కనుక ఈ అజ్ఞానమును పారద్రోలి నాకు మంచిబుద్ధిని ప్రసాదించు అని చెబుతున్నది. గాయత్రి మంత్రం. ఇది ఏ దేశం వారికైనా కావాలి. కనుక ఏదేశంవారైనా, ఏజాతివారైనా ఏకులం వారైనా గాయత్రి మంత్రం చేయవచ్చును. ఇది వారి వారి ఇష్టమును పురస్కరించుకొని చేసుకొనవచ్చును. ఇందులో ఏమాత్రం వదిలినా తప్పులేదు. మొత్తం పఠించినా తప్పులేదు. **నేను ఎప్పుడూ ఎవరినీ Forceతో చేయమని చెప్పను, నాదంతా Source, మిలటరీది పోర్సు. కనుక ఆ మిలటరీ పని నేను చేయను. నా పోర్సు ప్రేమ. కనుక ప్రేమతో చేయమని చెబుతాను.**

ఇంకా చాలా ప్రశ్నలున్నాయి. వాటన్నింటికీ సమాధానం చెప్పడానికి సమయం లేదు. ముఖ్యంగా మీరందరూ హృదయాన్ని పరిశుద్ధం చేసుకోండి. పవిత్రమైన దైవ ఆజ్ఞలను శిరసా వహించండి. **రామా! అనండి. అల్లా! అనండి. ఏసూ! అనండి. కృష్ణా! అనండి. ఎవరిని తలచినా ఫరవాలేదు. ఎట్టి భేదమూలేదు. వారిని తలచుకుంటూ, మీ గుణములను పవిత్రం గావించుకోండి. నాలో ఏమాత్రం స్వార్థం లేదు. నేను ఏది చెప్పినా, శిరసావహించి చేయండి. అంతా మీ మంచికే...మీ మంచికే...కనుక మీరు అనుసరించి ఆనందించి అందిరికీ పంచి పెట్టండి. అదే నేను ఆశించేటటువంటిది.**

(శ్రీ.డి.2001 పు. 37/40 మరియు జ2002 పు.20/22)

సంధ్య

(చూ॥ గాయత్రి, విధులు, సంధ్యావందనము)

సంధ్యావందనము

మానవుని అనుకూలముల బట్టి ధర్మములు మారవు! ధర్మమునకు చలనము లేదు. ఆనాడు, నేడు, యేనాడూ, ధర్మము ధర్మముగానే యుండును.

"కాలే సంధ్యా సమాచరేత్" అనగా సకాలమునకు సంధ్యా వందనం చేయవలెను.

సంధ్యావందనము అను వ్యుత్పత్తిని బట్టి, సమ్-సమ్యక్; లెస్సగా భగవంతుని యందు, ధ్యై - చింతన (మనస్సును నిలుపుట). లెస్సగా భగవంతునియందు మనస్సు నిలుపుటయే సంధ్యయనబడును.

(శ్రీ.స.సూ.పు.110/111)

పూర్వము ఋషులు చెప్పినట్లు!

'సంధ్యాహీనో ఽశుచిర్నిత్యమనర్హస్సర్వకర్మ యదన్య త్కురుతే కర్మ నతస్య ఫలభాగ్భవేత్" అనగా, ద్విజుడు సంధ్యావందనము పరిత్యజించినచో భ్రష్టుడగునని సర్వస్మృతులు తెలుపుచున్నవి. సంధ్యావందనముచేయని వారు ఎట్టి అన్యకర్మలు చేయుటకు అర్హులుకారు. దీనిని పట్టి చూడ ఆనాటి ఋషులు దీర్ఘకాలము సంధ్యను ఉపాసించే వారగుటచే దీర్ఘాయువును, యశస్సును, కీర్తిని, ప్రజ్ఞను, బ్రహ్మవర్చసును పొంది యుండిరని మనువు కూడనూ చెప్పెను కదా! కాని దీనిని పట్టి చూచిన **గాయత్రి ధ్యానము లేనివాడు బ్రాహ్మణుడు కాజాలడు.** ఇక్కడే బ్రాహ్మణుడన బ్రహ్మతత్త్వము పొందిన, బ్రహ్మోపాసనచే పవిత్రుడైన, ఆత్మార్థపురుషుని అంశమైన, నేటి మానవపురుషుడు; ఇక్కడ జాతి మత భేదములకు సమకట్టకూడదు. ప్రత్యేకించి, బ్రాహ్మణుడను నామము సాంప్రదాయాను గుణ్యముగా వచ్చినవారు, దీనిని ప్రధానముగా పాటించ వలెను.

(ధ.పు.52/53)

సంపద

అన్న దానముకన్న నధికదానం బేది
తల్లి దండ్రులకన్న దైవమేది?
జపతపంబులకన్న సత్యశీలంబేది?
దయకంటె నెక్కువ ధర్మమేది?
సృజన సంతతికన్న చూడ లాభంబేది?
క్రోధంబుకన్న శత్రుత్వమేది?
ఋణముకంటెను నరునకు రోగమేది?

ధరణినపకీర్తి కంటెను మరణమేది?
సర్వదా కీర్తికంటెను సంపదేది?
స్మరణకంటెను మించు నాభరణ మేది?

(స.సా.ఏ.2001 పు.386)

సంపర్కము

ఉపనిషత్తులు బ్రహ్మమునకు కాని, ఈశ్వరునకుగాని, ఎట్టి వ్యత్యాసమును తెలుపుటలేదు. వేదాంత వాక్యములన్నిటి చేత జగత్కారణము చేతనవస్తువే యని తెలిసికొనవలెను. జగత్తు జడమైనదే అయివుండిన ఆకర్షణీయమైవుండుటకు కారణమేమి అని కొందరు శంకింతురు. జడమైనది, ప్రకాశరహితమైనది అయి వుండిన అది అట్లే పడి యుండవలెను కదా! అట్లు కాదు. అది పరమాత్మ, **ఉపాదాన నిమిత్తకారణాలతో,** అంతర్బాహ్యములందు వున్నాడు కనుక దీనికి యింత **ప్రకాశము, ఆకర్షణ. 'పిష్టాదిర్గుడ సంపర్కాత్' - పిష్ట అనగా పిండి.** అది బియ్యపు పిండి కావచ్చు, గోధుమపిండి కావచ్చు. లేక బేడల పిండి కావచ్చు. ఆ పిండికి యెట్టి రుచిలేకపోయినప్పటికిని, **గుడ సంపర్కాత్ గుడ అంటే బెల్లము - ఆ బెల్లము సంపర్కముచేత, రుచిరహితమైన ఆ పిండికి కూడా రుచి యేర్పడుచున్నది. అదే విధముగా ఈ ప్రపంచమున యెక్కడెక్కడ ఆకర్షణ, సౌందర్యము ఉండునో అది అంతయూ పరమాత్మ స్వరూపము కాని వేరు కాదు అని స్పష్టముగుచున్నది. శ్రుతి వాక్యప్రకారము, ఈ జగత్తును ఆయనే సృష్టించి, ఆయనే పోషించి, ఆయనే లాలించి, ఆయనే పాలించి, కడకు ఆయనయందే లయం చేసికొనుచున్నాడు. జగత్తునకు కర్త, భోక్త, భర్త ఆ పరమాత్మయే అని శ్రుతి చాటుచున్నది.**

(సూ.వా.పు.45)

సంపూర్ణావతారము

(చూ॥ దివ్యప్రకటనలు)

సంప్రదాయము

ప్రాచీన కాలము నుండి హైందవ సంప్రదాయము **'లోకాస్సమస్తాస్సుఖినోభవంతు'.** అందరు సుఖముగా ఉండాలి అనేది భారతీయుల సంప్రదాయము. తన ఆధ్యాత్మిక సంపత్తి వల్ల అన్ని దేశములకు సుస్థిర మైన శాంతి భద్రతలు చేకూర్చుతూ వచ్చింది భారతదేశము.

(బ్ర.త్ర.పు.7)

ఒక వ్యక్తి తాను ప్రేమించి జీవించే సంస్కృతిని ప్రతిబింబించే విధంగా వ్యక్తిత్వాన్ని ఏర్పరుచుకున్నాక మధ్యలో ఏదో చిన్న చాపల్యంతో ఆ సంప్రదాయాన్ని మార్చటం మంచి పద్ధతి కాదు.

(శ్రీ.స.ప్రే.ప్ర.పు.244)

వేదమునకు రెండు విధములైన సంప్రదాయము లుంటున్నాయి. **ఒకటి బ్రహ్మసంప్రదాయము. రెండవది ఆదిత్యసంప్రదాయము. యాజ్ఞవల్క్యుడు వమనము చేసినదానికి బ్రహ్మసంప్రదాయమని పేరొచ్చింది. దీనినే కృష్ణ యజుర్వేదము అన్నారు.** తదుపరి యాజ్ఞవల్క్యుడు తన దోషాన్ని తాను గుర్తించి గురువు ఆజ్ఞను ఉల్లంఘించిన తప్పుచేత ఆహారపానీయములు మాని కఠినమైన సూర్యోపాసన సలుపుతూ వచ్చాడు. **పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తము అని ఈ విధమైన ప్రాయశ్చిత్తాన్ని అనుభవిస్తూ వచ్చాడు.** తరువాత సూర్యుడు ప్రత్యక్షమై వాజి రూపమును ధరించి నాయనా! గడచినది గడచినది. తిరిగి ఇట్టి దోషమును నీవు ఆచరించరాదు. **గురుద్రోహము దైవద్రోహము మహా ప్రమాదము.** నీవు జాగ్రత్తగా ఉండుమని తిరిగి వేదములను సూర్యుడే ఉపదేశించాడు. వాజిరూపములో సూర్యుడు ఎందుకు ప్రత్యక్షమయ్యాడు? **యాజ్ఞవల్క్యని పూర్వీకులు నిరంతరము అన్నదానము సలిపేవారు. కనుక ఆ కుటుంబమునకు వాజసం అని పేరు వచ్చింది.** వాజసమనే పేరు రావటంచేతనే వాజిస్వరూపాన్ని ధరించి ఇతనికి వేదోపదేశం చేశాడు. **దీనికే శుక్లయుజుర్వేదమని** పేరు వచ్చింది. **వాజసస్కంధము అని మరొక పేరు వచ్చింది.**

సంబంధము

ఆదిత్యఖండమని ఇంకొక పేరు వచ్చింది. సూర్యోపాసనచేత లభ్యమైనది కనుకనే దీనికి **ఆదిత్యస్కంధము** అని వాజసరూపములో ప్రత్యక్షమై బోధించటంచేత ఇది **వాజసస్కంధమని,** ఈవిధంగా ఒక్కొక్క విధమైన రూపమును ధరిస్తూ వచ్చింది. యజుర్వేదము రెండుగా విభజింపబడినది. వేదములు నాలుగైనప్పటికిని యజుర్వేదము విభజించటంచేత ఐదుగా రూపొందుతూ వచ్చాయి. ఋగ్వేద యజుర్వేద సామవేద అధర్వణ వేదములు. యజుర్వేదములో కృష్ణయజుర్వేదము శుక్లయజుర్వేదమని రెండుగా విభజించటంచేత ఐదు వేదములుగా రూపొందినాయి.

(బృ.త్ర.పు.184/185)

సంబంధము

పాండవులకు నాకు (కృష్ణుడు) గల సంబంధము (దుర్యోధనుతో) చెప్పెను. ఈదేహమునకు ప్రధానమైన శిరస్సు వంటివాడు ధర్మజుడు; భుజము వంటివాడు అర్జునుడు: ఉదరము వంటివాడు భీముడు; రెండు పాదములవంటి వారు నకుల సహదేవులు. ఇట్టి దేహములోని హృదయమే ఈ కృష్ణుడు.

(భా.వా.పు.69)

(చూ॥ వ్యత్యాసము)

సంభవించినవి

(చూ॥ తత్త్వజ్ఞానము)

సంభర్త

(చూ॥ భగవంతుడు)

సంభాషణ

(చూ॥ దర్శనం)

సంయమము

మానవజీవితమునకు సంయమమే మాణిక్యము. సంయమము అంటే నిగ్రహము. ఆధ్యాత్మిక మార్గమందు సంయమమే ప్రధమ సోపానము. మానవుడుగా ప్రకాశించుటకు ఆశించు వారందరూ, సంయమము నభ్యసించుట, అత్యవసరము. క్రూరస్వభావము కొందరు మానవులకు సహజమైననూ, దానిని మార్చుకొనుట కవకాశము వున్నది. పెద్దల దర్శనము వలన, వారి సంభాషణమును హృదయమందు చేర్చుకొనుట వలన, మనస్సులోని దుర్భావములను నివారించుటకు వీలున్నది. దీనివలనే మానవజన్మము ఉత్కృష్టమైనది.

నిర్మల హృదయమే భగవంతుని నివాసస్థలము, దయ గలిగిన హృదయమే దైవమందిరం. బాహ్యసౌందర్యము కేవలం క్షణికమైనది. భగవంతుణ్ణి పూజించుటకు పురుగులు లేని పుష్పములనే ఏరి పెట్టుకోవాలి. హృదయ పుష్పమును ప్రేమజలములో కడిగి, కామక్రోధలోభాలు అనే పురుగుల సంపర్కము లేకుండా; అర్పితభావముతో భగవంతుని కియ్యాలి. భగవంతుడు సర్వవ్యాపి. **నమస్కారము చేసే చోటంతా భగవంతుని పాదములు లేకపోలేదు. ఏమి చేసినా సర్వాంతర్యామి అయిన అతనికి అర్పితమే. ఈ భావమే సరైన సాధన. భగవంతుని కొరకు తపించేదే తపస్సు. అది లేకపోతే, తమస్సు సంయము బుద్ధితో ఆ భగవద్దర్శనమునకై ఆవేదనపడాలి, అదే నిజసాధన.**

(ఆ.పు.15/16)

(చూ॥ దమము)

సంయోగము

దుర్మార్గులకు ఒక నమస్కారం, సన్మార్గులకు ఒక నమస్కారం అన్నాడు కబీరు. అప్పుడు శిష్యులు సన్మార్గులకు నమస్కారం చేయటంలో ఒక సార్థకత ఉన్నది. కాని, దుర్మార్గులకు నమస్కారం చేయటంలో ఏమి సార్థకత ఉన్నది? అని ప్రశ్నించారు. **అప్పుడు కబీరు**

దుర్మార్గులకు మీ వియోగం అవసరమని, సన్మార్గులకు మీ సంయోగం, అవసరమని నమస్కారం చేయమన్నాడు. అనగా సాధు పురుషుల సంయోగం, దుష్టుల వియోగం కావాలి. దుష్టులకు దూరంగా ఉండాలి. సాధుపుంగవులకు సమీపంలో ఉండాలి. ఈ రెండింటి ద్వారా మనకు సుఖం లభిస్తుంది. **'సమ్యక్ యోగం ఇతిసంయోగం'**. ఈ సంయోగం చేతనే నిజమైన యోగం మనకు ప్రాప్తిస్తుంది. కనుక ఇట్టి యోగాన్ని సాధ్యమైనంత వరకు మీరు సాధించి, ఆదర్శమూర్తులుగా, ఇతరులకుకూడా బోధించి,కీర్తిని సాధిస్తారని నేను ఆశిస్తున్నాను.

(శ్రీ.డి.2001 పు.26)

(చూ॥ బ్రహ్మసాక్షాత్కారజ్ఞానము)

సంయోగవియోగములు

(చూ॥ మంచిచెడ్డలు)

సంరక్షణ

(చూ॥ స్త్రీ హత్య)

సంవత్సరాది

సంవత్సరాది పండుగ అంటే ఏమిటి? **భగవంతుని పేరుతో వచ్చేది సంవత్సరాది పండుగ. కనుకనే కాలమంతా భగవంతుని స్వరూపమే.** భగవంతునియొక్క సహస్ర నామములలో కూడను 'సంవత్సరాయనమః' అని ఒక పేరుంది. సహస్రనామముల లోపల కాలకాలాయనమః, కాలదర్పదమనాయనమః కాలాతీతాయనమః, కాల స్వరూపాయనమః - ఇవన్నియూ భగవంతుని యొక్క పేర్లే. కనుక సంవత్సరాది పండుగ అనగా పరమాత్ముని పేరుతో వచ్చిన పండుగ.

(స.సా.ఏ.91పు.93/94)

సంశయము

సంశయము సామాన్యమైనది కాదు. **'కంటిలోని నలుసు చెవిలోని జోరీగ, చెప్పులోని రాయి, కాలిలోని ముల్లు యే విధముగ శాంతి లేకుండా చేయునో అటులనే ఒంటిలోని సంశయము యింటిలోని పోరువలె హింసించును.** ఇట్టి సంశయము ప్రజా ప్రతినిధిగా నిలచిన అర్జునునకు కలుగుటలో ప్రజల సంశయమనే భావించవలెను. దీనిని మానవాతీతమయిన మాధవుడే తీర్చగలడుకాని మానవ మాత్రులకు సాధ్యముకాదు.

కృష్ణా! నీవు పూర్వము ఈ యోగమును సూర్యునకు ఉపదేశించినట్లును తదుపరి సూర్యుడు మనువునకు బోధించినట్లునూ తెలిపితివి, సూర్యుడూ మనువూ యే కాలమువారలు! నీవే కాలమువాడవు? పోనీ, ఏ కాలమైననూ సరే! ఈ దేహముతోనే ఉపదేశించితివా? లేక మరొక దేహముతో ఉపదేశించితివా? ఆ దేహముతోనే ఉపదేశించితిని అందునా! అదీ నమ్మ వీలుకాదు. ఈ దేహము నాతోపాటు ఇంచుమించు మూడు నాలుగు సంవత్సరములు పెద్దవాడనే కాని అంతకంటే ముందు వాడవు కాదు! నాకు తెలియక యెప్పుడు ఉపదేశించితివి? సూర్యుడు చూతమా నీకంటే యెన్నో వేల రెట్లు పెద్దవాడు! ఆదికాలము వాడు! ఊహించుటకు కూడనూ వీలుకానిది. బావా: నేనే కాదు. ఈ విషయమును ఎంతటి తెలివి తేటలుగల వాడైననూ నమ్మడు. పోనీ, ఈ దేహమెకాదు! ఈ యుగమే కాదు! వేరొక యుగమూ, వేరొక దేహమని అందువా? అది మరింత అతుకనిమాట. **యే జన్మమునలో చేసిన కర్మలు ఈ జన్మమును యెట్లు జ్ఞాపకముండును?** కాని వుండునని నీవు ఒప్పుకున్నా నీవలె నాకునూ గడచిన జన్మలకర్మలు జ్ఞాపక ముండవలెనుకదా! యేదో దివ్య పురుషులకు మాత్రమే జన్మాంతర విషయము జ్ఞాపకముండునని శాస్త్రములు తెలిపినవి కానీ సామాన్య లందరికీ వుండవీలులేదు కదా! పోనీ నీవు దివ్య పురుషుడవని నిమ్మననూ సూర్యుడు స్వయంగా దివ్యపురుషుడే! ఇద్దరు సమానమేనా! అదియునూ నరియని ఒప్పుకొన్నా సరిసమానమైనవారే కాని ఒకరికొకరు ఉపదేశించుకొనుట జరుగదే! నీవు ఉపదేశించితివన్న నీవు గురువు. సూర్యుడు శిష్యుడూ కావలెనుగదా! అప్పుడు

నీవు సూర్యునికంటే గొప్పవాడుగా వుండవలెను కదా! వుండనీ గొప్పవాడవే, భగవంతుడవే అని విస్పసించిన మరింత సంశయమునకు చోటు యేర్పడును కదా! నీవు భగవంతుడవే అయిన సామాన్య మానవులవలె కర్మ పరతంత్రుడవై జనన మరణాది క్లేశములకు కట్టుపడు టెందులకు? నీవు అయిదడుగుల దేహముతో మానవా కారుడుగా **సంచరించుట నీ నిరాకార సర్వ వ్యాపకత్వము నకు భంగము కాదా**.

"అంతటి అనంతస్థానమైన సర్వవ్యాపకత్వము నుండి అల్ప స్థానమునకు జారుటకు కారణమేమి? యేమో! కృష్ణా! యెన్ని విధముల తర్కించినను నాకేమీ బోధపడుటలేదు! నీ మాటలు నీకే సరి; నా తల తిరుగు చున్నది. యేదో సరియైన సమాధానము చెప్పి నన్ను అనుగ్రహించుము" అని అర్జునుడు ప్రార్థించెను.

(గీ.పు.58/61)

సంశయములేవైనా స్ఫురించినపుడెల్లా ఇష్టమొచ్చినటుల ప్రశ్నించక, తరుణము, సమయము చక్కగా పున్నవేళ వాటిని శాంతమనస్కుడై మహనీయునికి తెలిపి దానిని నివారణ చేసుకొనవలెను కానీ వూరికే బండెడు పుస్తకములు చదివినంతమాత్రమున, ఉపన్యాసాలు గంటలు కొట్టినట్లు ఖంగుమనిపించిన గానీ, చిలక పలుకులు పలికిన గానీ, లేక దొంగ వేషముతో కాషాయములు ధరించి ఊర్ధ్వదృష్టితో బుర్రలూగించిన గానీ అది జ్ఞాని లక్షణము కాదు.

"వాటివలన జ్ఞానము చేకూరదు. దీనిని అనుభవజ్ఞులైన మహనీయుల ద్వారానే లభింపజేసుకొనవలెను,వారలను ఆశ్రయించవలెను. మానవుని సంశయములు **తీరవలెనన్న శాస్త్రపఠనముతో, గ్రంథపఠనముతో తీరునది కాదు. వీటిద్వారా మరింత సంశయములు అభివృద్ధియగును ఇవి కేవలము తెలుపునవే కానీ చేసి చూపించలేవు. చేసి చూపించువారు తత్వవేత్తలే కాన వారలను ఎంతో కాలమైననూ ఆశ్రయించక లభించు నట్టిది కాదు.** ఈ పవిత్ర జ్ఞానము సముద్ర జలమును సరాసరి త్రాగిన దాహము యేమాత్రమూ తీరదు; అది పోను నాలుకను కూడా చెఱచును. అట్లే శాస్త్రములనుండి సరాసరి సంశయము తీరదు. ఇంతియేగాక జ్ఞానమును కోరువారి స్థితిని కూడనూ గమనించవలెను. అట్టివానికి భక్తి శ్రద్ధలతోపాటు సరళభావముకూడా యుండవలెను. అట్టి స్థితిని కలిగినవానికే జ్ఞానము సిద్ధించును. అట్లు గాక ఆతృతకొద్దీ గురువును విసిగించకూడదు. ఎంత కాలమైననూ ఆశ్రయించి ఓపికతో సాధించవలెనే కానీ **ఆతృత పనికిరాదు**. గురువు చెప్పినదానిని జవదాటక ఆచరించుచూ నిత్యానుభవమునకు తేవలెను. విన్నవాటినీ, తిన్నవాటినీ దినమొకటిగా రుచి చూచుకొంటూ, త్వర త్వరగా జ్ఞానికావలెనని **దురాశపరుడై** తనకు తోచినట్లంతా సాధనను మార్చుకొనుచుండిన అజ్ఞాని కాగలడు. ఒకపరి అట్లుకూడనూ అయిన యెంతో మేలు. రెండునూ కాక పూర్తిగా పిచ్చివాడయిపోవును. కాన ఈ విషయమును అతి జాగ్రత్త వహించవలెను.

(గీ.పు.86/87)

అనంతమైన అగాధమైనటువంటిది సంశయము. ఈ సంశయమే మానవుని **మింగేటటువంటి పెనుభూతము**. సంశయముండిన మానవునకు ఏమాత్రముకూడను **గట్టిగా నిద్ర ఉండదు**. వంటికి విశ్రాంతి ఉండదు. కేవలము ప్రేమ అనేటటువంటి పుష్పమునకు కీటకము వంటిది ఈయొక్క సందియము. కనుక సందియములతో కూడినటువంటి హృదయము గబ్బిలములయొక్క మందిరము. కనుక మనము ఎట్టి సందియానికికూడను అవకాశమివ్వకుండా సర్వత్రా దైవత్వ మున్న దనేటటువంటి సత్యాన్ని నిరూపణ చేయాలి.

(సా.సా.1.పు.19)

సంసారజీవితము

మానవునికి సంసారము కంటి అద్దాలవలె ఉండ వలయును. కంటి అద్దాలు దృష్టిని అభివృద్ధి జేయునేగాని, అడ్డము రావుకదా! అటులనే సంసార జీవితము

భగవద్దృష్టిని అభివృద్ధి జేయవలయునుకాని, దానిని తగ్గించేదిగా ఉండకూడదు. కళ్ళకు అడ్డమయ్యే అద్దాలు వేసుకొని తిరిగేవాడు అమాయకుడే కదా!

(స.సా.ఏ.96 పు.112)

సంసారము

సంసారము కదిలే మేఘాలవంటిది. పెండ్లికి ముందు భార్య ఎవరు? భర్త ఎవరు? బాటసారి చెట్టు క్రింద నీడలో కూర్చొనట్లు కొంత కాలము కలసి యుండవచ్చును. తరువాత విడిపోవచ్చును. **ఈ సంబంధాలు కదిలే మేఘాలవంటివి.** ఒక బాటసారి అలసిపోయి ఒక చెట్టు నీడను కూర్చున్నాడు. అతడు హాయి అనుభవిస్తున్నాడు. కాని చెట్టుకు మాత్రము తన నీడను అనుభవిస్తున్నాడనే గర్వముగాని, అహంకారము గాని ఎంతమాత్రమే లేదు. **నీడ ఇవ్వడం చెట్టు సహజ గుణము.** కాని ఏ కోశానా అహంకారము లేని చెట్టు ఎప్పుడూ ఆనందముగానే యుంటుంది. **జీవిత వృక్షమనే భార్య పిల్లలు, తన నీడను. తన రక్షణలోవుంటున్నారనే అభిమానము, అహంకారము ఉండుటవల్ల 'నాకు దుఃఖము కలుగుతోంది' అని అనుకుంటాడు.** మార్గమధ్యలో ఏర్పడ్డ సంబంధాలు యివన్నీ కొంతసేపు విశ్రమించిన తరువాత వెళ్ళిపోతాడు.

(సా.పు.36)

(చూ॥ తామరపువ్వు, నియమం)

సంస్కారము

సంస్కారమనగా ఏమిటి? **నిత్యజీవితంలో మనల్ని వెంబడించే దుర్గుణములు, దురాలోచనలు, దుశ్చింతలు దూరంగావించి సద్గుణములు, సదాలోచనలు, సచ్చింతలు, సద్భావనలు మనయందు ఆవిర్భవింపజేసుకోవటమే సంస్కారము.** అనగా చెడ్డను దూరం చేసి మంచిని స్వీకరించాలి. ఇంతేకాదు **విశాలత్వమును పెంపొందించేది సంస్కారము.**

(శ్రీ.జ.2002పు.28)

సంస్కారమనగా ఏమిటి సత్సంకల్పం. సద్భావం. సద్గుణం. అనగా మానవుని యొక్క నడతలు పవిత్రమైనవిగా ఉంటుండాలి. భావములు, ఆలోచనలు సమాజ క్షేమమును గూర్చినటువంటివిగా ఉండాలి.

(శ్రీ.జ.95 పు.5)

ప్రతిచూపులో ప్రేమ క్షీణించి పోతున్నది. ప్రతి ఆశలోపల దూరదృష్టి నశించిపోతున్నది. ప్రతికోరిక స్వార్థరూపాన్ని ధరిస్తున్నాది. మానవుని యందు అభ్యుదయ భావాలు అడుగంటి పోతున్నాయి. చైతన్యము చల్లబడిపోతున్నది. కులమత బేధములంతా మారణహోమము సలుపు తున్నవి. రాగద్వేషములు స్వేచ్ఛా విహారములు సలుపుతున్నాయి. నిజము చెప్పాలంటే మానవత్వమే పూర్తి నశించిపోయింది. మనకు ఈనాడు క్వాలిటీ కావాలిగాని క్వాంటిటీ గాదు. **ఒక టీ స్పూన్ కామిల్క్ ఈజ్ యూజ్‌ఫుల్; వై బారల్స్ ఆఫ్ డాన్కీస్ మిల్క్? మనకు సంపాదన కాదు** ప్రధానము. **సంస్కారము చాలా ప్రధానము** ఈనాడు సంస్కారమనేదే మానవులలో అడుగంటి పోయింది.

(ఉ.బ.పు.5)

ప్రపంచములో ఏవస్తువైనను సంస్కరింపబడినప్పుడే ఉపయోగకరమవుతుంది. స్వతః విలువ గలిగిన వస్తువు సంస్కరింపబడుటచేత అది మరింత విలువైనదిగా పరిణమిస్తుంది. అది మరొక రూపాన్ని కూడను ధరిస్తుంది. కనుకనే పవిత్ర భారతదేశమందు ప్రాచీన కాలమునుండి **'సంస్కరించాలి, సంస్కరింపబడాలి'** అని చెబుతూ వచ్చారు. మలిన భావములను సంస్కారముచేత పవిత్రమైన భావములుగా, ఉత్తమమైన భావములుగా తీర్చిదిద్దుకోవాలి. నిత్యం మనము భుజించే ఆహారాన్ని, ధరించే వస్త్రాలను సంస్కారమువల్లనే మనము పునఃఉపయోగించుకుంటూ వస్తున్నాము. ప్రత్తిని మనము అట్లే ధరించలేము. దానిని దారముగా చేసి తదుపరి మగ్గములో నేసి వస్త్రముగా తయారుచేసి మనము కట్టుకుంటున్నాము.వడ్లను దంచి పొట్టును తీసిన తదుపరి

సంస్కృతి

దానిని అగ్నితో పక్వము గావించుకొని భుజిస్తున్నామేగాని ఎట్లాపుట్టిన వడ్లను అట్లే మనము భుజించడం లేదు. కొండలో గుండుగా ఉన్న బండరాయిని సుత్తి వేట్లతో, ఉలిదెబ్బలతో సంస్కరింపచేసి, తదుపరి మందిరములో షోడశోపచారములతో దానికి పూజలు సల్పుతున్నాము. చెట్టులో నున్న కట్ట, గొడ్డలి దెబ్బలు తిని, ఉంపముతో కోయించుకొని, తదుపరి ఉలులచేత తాను **సంస్కరింప బడుటచేత**, 'చైర్' గా తయారైంది. కోతలు కోసి సంస్కరించడం చేత వజ్రము కూడా గొప్ప విలువైనదిగా రాణిస్తుంది. భూమిలో చిక్కిన ముతక బంగారము సంస్కరింపబడటం చేత పవిత్రమైన అపరంజిగా రూపొందుతుంది. అదేవిధంగా **ఎట్లా పుట్టిన మానవుడు అట్లానే తన జీవితము గడుపుతూ ఉంటే ప్రయోజనంలేదు. ఇది కేవలం మట్టి ముద్దవలె, మాంసపు ముద్దవలె కనిపించవచ్చు. కాని దీనిని విద్య, సాధన, తపస్సు, ధ్యానములచేత సంస్కరించినప్పుడు దివ్యమైన మానవత్వంగా రూపొందుతుంది.**

(షి.పు.1/2)

(చూ॥ అవతారము, నిత్యకార్యక్రమములు, సంస్కృతి, స్వధర్మాచరణ)

సంస్కృతి

సంస్కృతి అంటే సంస్కారము నుండి వచ్చేది. ఈ సంస్కృతియే మన ధర్మము. ధర్మంటే ఏమిటి? దీనిని మానవులందరు ఉచ్చరిస్తుంటారు. కానీ దానిని యెవరూ ఆచరించడానికి, నిరూపించడానికి, సాహసించడం లేదు. ధర్మమంటే కేవలము నేను క్షేమముగా ఉండాలి, నాకుటుంబము క్షేమముగా ఉండాలి అనుకోవడం కాదు. దానికి కావలసిన కర్తవ్యకార్యములు చేయడం. ఇదే ధర్మం అనుకుంటున్నాము. మన లౌకిక జీవితములో ఆచరించే ఏవో కొన్ని నిబంధనలకు గురియైన కర్మలు, ధర్మమని అనుకుంటున్నాము. ఇది చాలా పొరపాటు. "ధార ఇతీతి ధర్మః" - ధరించినటువంటిది ధర్మము. హృదయం వరించి నటువంటిది ధర్మం. మనసును కరిగించినటువంటిది ధర్మము. సమత్వమును ప్రేరేపించునది ధర్మము. నిత్యత్వాన్ని కలిగేటటు వంటిది ధర్మము. సత్యమే ధర్మమునకు పునాది. అందువలననే సత్యం నాస్తి పరో ధర్మః అన్నారు. ధర్మమనే భవనానికి సత్యము పునాది. సత్యం అనేటటువంటిది మారేదికాదు. కదిలేదికాదు. మనల్ని వదిలేదికాదు. "లోకాః సమస్తాస్సుఖినో భవంతు" ఇది మానవ ధర్మము. దీని అర్థమేమిటి? తనవారు, పరులు, అనే భేదము లేకుండ తన గ్రామము వారే కాదు, రాష్ట్రమువారేకాదు, యావత్ప్రపంచము క్షేమంగా ఉండాలనుకునే తత్త్వమును గ్రహించునట్టిది ధర్మము. అంతేకాని స్వార్థము ననుసరించేది కాదు ధర్మము. పవిత్రమైనటువంటి, విశాలమైనటువంటి దివ్యతేజోపుంజముతో కూడిన దైవత్వానికి చేర్పించేదే ధర్మము.

(శ్రీ.ది. పు.41/42)

వృద్ధులైనవారు ప్రయాణము చేయవలసిన దూరము కొంచెమే: కానీ పసివారు చాలా దూరము ప్రయాణము చేయవలసి ఉన్నదని గర్తుంచుకొనండి. వారే జాతిని, అటు నరకములోనికో యిటు స్వర్గములోనికో, తీసుకొని వెళ్లుతారు. నేటి సంక్షోభ సంఘర్షణలలో, మన సంస్కృతి శాంతి భద్రతల నందివ్వగలదని మన ప్రాచీన ఋషులు చక్కగా గుర్తెరిగి ఉన్నారు. అందుచేతనే వారు, పిన్నలకు పెద్దలకు ఉపదేశత్రయమును నిర్ణయించినారు; ఈ ఉపదేశములే "మాతృదేవోభవ పితృదేవోభవ, ఆచార్య దేవోభవ" ఈ ఆదర్శముల నాధారము చేసికొని జాతి పురోగమించు చున్నంత వరకు. దాని నెవ్వరూ వ్రేళ్ళతో పెకిలించి నశింప చేయలేరు. తల్లి, తండ్రిని గురువును దైవసమానులుగా గౌరవించి ఆదరించు చున్నారనగా ఆ మహాయోగిపుంగవులు మనకందించిన పవిత్ర వారసత్వమును నేటి తరమువారు ఆదరించుచున్నారని అర్థము.

(స.సా.ఏ.75 పు.31)

సంస్కృతియే లేకుండిన మానవజీవితమే లేదు. It is a way of life. దీనిని ధిక్కరించి పెడమార్గమును అనుసరించుచు మనము శాంతి భద్రతలకు దూరమై పోతున్నాము. ప్రతివ్యక్తి సుఖము సుఖమనే దానిని ఆశిస్తున్నాడు. సుఖమంటే యేమిటో గుర్తించటానికి ప్రయత్నించటము లేదు. దినమునకు నాలుగు పర్యాయములు భుజించటము, చక్కగా నిద్రించటము, మూడు పర్యాయములో లేక నాలుగు పర్యాయములో టెలివిజనో, సినిమాయో చూడటము, ప్రపంచమునే మరచి వుండటము, సుఖముగా భావిస్తున్నారు. **తినటము త్రాగుటము నిద్రించటము ప్రపంచమును మరచటము దీనికి మానవునిగా పుట్టవలసివచ్చిందా? పవుపక్షి మృగాదుల తినటం లేదా? నిద్రించటం లేదా? ప్రపంచాన్ని మరచటం లేదా? ఇంతమాత్రానికి మానవుడుగా జన్మించటానికి అవసరమేమి వచ్చింది? 'జంతూనాం నరజన్మదుర్లభమ్'** అట్టి ఉత్తమమైన మానవత్వమును ఈనాడు మనము మరచిపోతున్నాము. మన సంస్కృతి యేమిటో గుర్తించటానికి ఏమాత్రము ప్రయత్నించలేక పోతున్నాము. **భారతీయసంస్కృతియందు జీవనోపాధి మాత్రమే కాక జీవితపరమావధి తత్వాన్ని చక్కగా వర్ణించి వివరించి బోధించిన** దివ్యమైన భావములున్నవి. **సంస్కరింప బడినదే సంస్కృతి. ఈసంస్కృతి సంస్కృతమునుండి ఆవిర్భవించినది.** ప్రపంచమునందు సహజముగా ఆవిర్భవించిన ప్రతిపదార్థమును సంస్కరించిన తరువాత అనుభవించునదే. ఒక చిన్న ఉదాహరణము. మనము నిత్యము బియ్యమును భుజిస్తున్నాము. ఐతే బియ్యము భుజించే యీస్థాయికి రావటానికి పూర్వము ఎన్ని విధములైన సంస్కారములు పొందింది? గడ్డితోనున్న వడ్లను వేరు చేయటము, ఆ వడ్లపైనన్ను పొట్టును విడతీయటము, విడదీసిన బియ్యమును ఉడకపెట్టటము, పరిపక్వమైన పదార్థము మనము భుజించటము ఈ బియ్యము ఇన్ని రకములైన సంస్కారములు జరగటం చేతనే మనము భుజించుటకు వీలవుతున్నది. సంస్కారము చేత ఇవి తమ విలువలు పెంచుకుంటున్నాయి. ఒక మూట వడ్లకు ఒక నూరు రూపాయలు మాత్రమే యివ్వగలము. దానిని సంస్కరింపచేసి దాని పొట్టును వేరు చేసి అనుభవించగలిగే యోగ్యతకు తెప్పించటం చేతనే ఒక మూట 600 రూపాయలుగా పెరుగుతుండాది. ఒక్క మూట నూరు రూపాయలుగా వుండిన వడ్లు ఒక్కమూట బియ్యముగా మారినప్పుడు 600గా పెరగటానికి ఏది కారణము? ఈ వడ్లను సంస్కరించిన ఫలితమే దానికి విలువ. మన చేతియందు ఒక గడియారము కట్టుకుంటాం. ఈ గడియారము నిప్పులో వేస్తే రెండణాలు Stailnless steelమనకు చిక్కదు. కానీ ఆగడియారమునకు వేయి రూపాయలు ఇచ్చి పొందటానికి యేమి కారణము? సంస్కారమే దీనికి కారణము. దానిని సరియైన స్థితిలో మనము అనుభవించే యోగ్యతగా తీర్చి దిద్దారు. Bolts nuts screws pins గంటలు అన్నింటిని సక్రమముగా నవరించటంచేతనే సంస్కారముగా మారింది. ఇదే విలువ పెరగటం. ఇదే విధముగనే భారతీయులు ప్రాచీనకాలమునుండి ప్రతిపదార్థమును సంస్కరింపచేసి అనుభవిస్తూ వచ్చారు ఇది ఒక వస్త్రము. ఇది వస్త్రముగా మారటానికి ఎన్నిరకములైన సంస్కారములు పొందింది? ప్రత్తిగా వుంటుండి తదుపరి నూలుగా మారి ఈనూలు నేయటంచేత ఒక వస్త్రముగా తీర్చిదిద్దినాము. ప్రత్తిని ప్రత్తిగానే మనము అనుభవించటం లేదు. ప్రత్తిని అనేక విధములగా సంస్కరింపచేసి తదుపరి దానిని ధరిస్తున్నాము. అదేవిధముగనే **మానవుడుగా పుట్టినవాడు మానవుడుగానే జీవించటము వ్యర్థము.** మానవాతీతమైన దివ్యత్వముగా మనము తీర్చిదిద్దుకోవాలి. ఇలాంటి సంస్కారమునకు తగిన కృషి మనము చేయ్యాలి. కనుక **విద్యార్థులకు ఈనాడు విద్యతోపాటు వినయము, వినయముతోపాటు వివేకము, వివేకముతోబాటు విచక్షణ యీరకమైన సంస్కారములచేత మానవత్వము పరిపూర్ణత్వము పొందటానికి వీలవుతుంది.**

(బృ.త్ర.పు.5/6)

సగుణభక్తి

దేశకాల పరిస్థితుల ప్రభావమునకు అతీతమైనది భారతీయ సంస్కృతి.

(బృ.త్ర.పు.10)

(చూ॥ దైవగుణము, భారతదేశము, సత్యము)

సగుణభక్తి

సగుణ నిర్గుణములు భగవంతునకు పాదముల వంటివి. దానికి అది ప్రధానమే. ఆధారమే, ఒకటి శ్రేష్ఠమనియూ మరొకటి శ్రేష్ఠము కాదనియూ చెప్పవీలులేదు. అయితే కుడి యెడమలని మాత్రము చెప్పక తప్పదు; సగుణము యెడమకాలనియూ, నిర్గుణము కుడికాలనియూ చెప్పవచ్చును. **ఏ మంగళ కార్యమునందయినా కుడికాలు మొదట పెట్టినటుల, మోక్ష సాధమునకు నిర్గుణమును కుడికాలును మొదట పెట్టవలెను! అదే మంగళము. అనగా మోక్షసాధమునకు నిర్గుణుడు మొదట ప్రవేశించును తరువాత సగుణుడు ప్రవేశించును.** ప్రవేశము ఇరువురికీ కలదు. అట్లు లేదని చెప్పుటకు వీలులేదు. ఎవరైననూ ఒక పాదము లోపల, మరొక పాదము వెలుపల, ఎంత సేపని పెట్టుకోగలడు! అట్టుండిననూ యేమి ప్రయోజనము! **కాన సగుణ భక్తిని సాధనంగాను, నిర్గుణభక్తిని సాధ్యంగానూ తలంచవచ్చును. అనగా నిర్గుణునకు విశ్వమంతయు విశ్వేశ్వరుని వలే కనుపించ వచ్చును. సగుణుడు విశ్వము వేరుగాను, విశ్వేశ్వరుని వేరుగానూ తలంచవచ్చును.** చూడవచ్చును. ఈ రెండునూ లక్ష్యార్థమున చూచిన ఒక్కటియే. ఎట్లన కొన్నిచోట్ల దారముగా వున్న వస్తువే మరొకచోట వస్త్రముగా కనిపించును. వస్త్రము వేరు, దారము వేరుగా ఉండును కానీ, దారమే వస్త్రము, వస్త్రమే దారము. **దారమును వేరుగా, వస్త్రమును వేరుగా, చూచుట సగుణోపాసన తత్త్వము.** దారముయొక్క సమ్మేళనే వస్త్రమని రెండిటినీ యేకముగా చూచుటే నిర్గుణనియొక్క తత్వముగా భావించవలెను.

(గీ. పు.192/193)

సగుణోపాసన

ద్వాపరయుగంలో రాధ, రాధిక అనే ఇద్దరు అక్కచెల్లెళ్ళు ఉండేవారు. రాధ నిర్గుణోపాసకురాలు, రాధిక సగుణోపాసకురాలు. రాధిక ఒక్క కృష్ణుణ్ణి తప్ప మరి దేనినీ ఆశించేది కాదు. మధురకు పోయిన కృష్ణుడు తిరిగి రాలేదని ఆమె అన్నపానాదులను త్యజించి కన్నీరు కార్చుతూ ఉండేది. చివరికి ఆమె "కృష్ణా! నీ రూపమనే కమలాన్ని ఇంత కాలము నా హృదయంలో పెట్టుకుని దానిని కన్నీటి ధారలతో కాపాడుతున్నాను. ఇప్పుడు నా దేహం శుష్కించిపోయింది? నా కంటిలో నీరు కూడా ఇంకి పోయింది. ఇంక, నీ రూపాన్ని నా హృదయంలో ఏరీతిగా కాపాడుకోగలను? కనుక, **ఏ హృదయాన్ని నీవు నాకు ఇచ్చావో దానిని తిరిగి నీకే అర్పితం చేస్తున్నాను".**

"ఏ హృదయంబు నొసగితివొ ఈశ నాకు
మగిడి దానినే అర్పింతు మహితమూర్తి
పరగ వేరేది తెత్తు నీ పాదార్చనకును
అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు"

అని తనను తానే ఇచ్చుకుంది కృష్ణునకు. అంతకు పూర్వం **రాధ సగుణోపాసనకంటే నిర్గుణోపాసనయే చాల గొప్పది అనుకునేది. కానీ, రాధిక కృష్ణునికి అర్పితమైన తరువాత నిర్గుణోపాసనకంటే సగుణోపాసనయే చాల శ్రేష్ఠమని నిర్ణయించుకుంది.** తాను కూడా కృష్ణుని రూపాన్ని హృదయంలో నిల్చుకుని నిరంతరం కృష్ణచింతన చేస్తూ వచ్చింది. తులసీదాసు భగవంతుని సర్వాంగములనూ కమలములతో పోల్చుతూ **"నవ కంజలోచన, కంజ ముఖకర కంజ పద.."** అని వర్ణించాడు. అలాంటి పరమ భక్తులు ఆనాడు లోకంలో ఎంతో మంది ఉండేవారు. కానీ, ~~ఈ~~ **కలియుగంలో 'పార్ట్-టైం' భక్తి పెరిగిపోయింది.** ఈనాటి భక్తులకు దైవమందిరాన్ని చూసినప్పుడు మాత్రమే దైవం జ్ఞాపకం వస్తాడు. కృష్ణ మందిరాన్ని చూస్తే 'కృష్ణా! కృష్ణా! అని లెంపలేసుకుంటారు; ఆ తరువాత కృష్ణుణ్ణి మర్చిపోయి లౌకిక విషయాలలో మునిగిపోతారు.

ఇలాంటివారు పేరుకుమాత్రమే భక్తులుగాని, పెన్నిధి భక్తులు కారు.

(స.సా.అ.99పు.258/259

సగుణోపాసనతత్త్వము

(చూ॥ సగుణభక్తి)

సచ్చిదానంద

సచ్చిదానంద స్వరూపునకు అన్నిరూపులు తానే, అంతయూ తానే కాదా? కాన త్రికాలములందు మారనటువంటి పరమాత్మ ఏదో అదే నీవు **కాని మారునట్టి దేహము మాత్రము నీవు కాదు,** ఈ భావన తెలిసికొని నిరంతరమూ నేను పరబ్రహ్మ స్వరూపుడనని ఎవరు **తలంతురో వాడు జ్ఞాని, మనసు ఎంతవరకు వస్తువునందు మనుష్యుని యందు స్థలమునందూ ఆసక్తి కలిగియుండునో అది బంధన, వాటి వేటినీ అంటకుండు స్థితి యుండుటే ముక్తి, కావున అనురాగమే బంధన, మృత్యువు. విముక్తియే శాశ్వత జీవితము.**

"మనయేవ మనుష్యాణామ్ కారణం బంధమోక్షయోః"

అన్నట్లు మనస్సే మానవుని బంధనకు స్వాతంత్ర్యమునకు కారణము, ఆసక్తియే రాగము, అట్టి అనురాగమే కర్మకు కారణము. అనురాగమే ఇంద్రియములను చలింపజేయుచున్నది.

భయము, క్రోధము, అనురాగముయొక్క మొదటి స్నేహితులే కాక, ముఖ్య స్నేహితులు కూడను, ప్రాణ స్నేహితులు. అనురాగ మెక్కడున్నదో క్రోధము. భయము. అక్కడే యున్నవి. ప్రక్కనే యున్నవి. అందుకనే పతంజలికూడను రాగమునుగూర్చి ఈ క్రింది రీతిగా తెలిపెను.

'సుఖానుశయీ రాగః' సౌఖ్యమును ఆకర్షించుటకు కారణము అసక్తియే. అని చెప్పియున్నారు. **ఏది సౌఖ్యమో అది అంతయు అనురాగము. విషయముల నంటి యుండుటచేత ఆసక్తి ఏర్పడుచున్నది. ఆసక్తిద్వారా కోరికలు పుట్టుచున్నవి, కోరికల నుండి క్రోధము; వాటిమూలమున సుఖదుఃఖములు, మంచిచెడ్డలను చక్రమున ఇరుకుకొని తపించుచుండుటే అజ్ఞానము.**

బాగుగా కాల్చిన బంగారమునందున్న మాలిన్యము పోయి ధగధగ మెరయునో, అట్లే గాఢమైన వివేకముచే విచారణచే రాజస, తామసములను భ్రాంతులు, వాంఛలు క్రోధములు, అను **మాలిన్యము పోయి ఆత్మజ్ఞానమను ప్రకాశమును దర్శింపగలరు.** తీవ్రమగు గాలి దుమారముచేత చెదిరిపోయిన నల్లని మబ్బులవలె వాసనలను సంకల్పములను తృష్ణలను నిర్మూలించిన వెనుక మనసు పరబ్రహ్మైక్యము కాగలదు. ఎట్టి కష్టసమయములందును మనసును జారవిడువరాదు. **ఉన్నతదృష్టిచేత మనసును అరికట్టవలెను. పవిత్ర అంతఃకరణములతో కలిమి చేసికొని ఆత్మను శరణుజొచ్చవలెను. అప్పుడు సవికల్ప సమాధినుండి నిర్వికల్ప సమాధిలోనిక పోగలరు. పూర్తి నిర్మోహము కలిగినపుడే నిర్వికల్పసమాధి లభించును. అదే సంపూర్ణ ఆత్మజ్ఞాన ముదయించుటకు పునాది, నిర్వికల్ప సమాధి ద్వారా పరబ్రహ్మను చేరగలిగినపుడే అవిద్య, కర్మ, కామము మొదలగు బంధనలను త్రెంచి వేయవచ్చును. సమాధిలో లగ్నము చేయబడిన మనస్సుతోనే ఆత్మ సందర్శనము సాధ్యము.**

బ్రహ్మ జ్ఞానమును అనుభవించుటకు ప్రయత్నించేవాడు దేహమందు భ్రాంతి పూర్తిగాపోయి దానిని. **పాము విడుచు కూసమువలె నిర్లక్ష్యముగా చూడవలెను.**

(జ్ఞా.వా.పు.21/23)

(చూ॥ ఆనందమయుడవు, సత్యం శివం సుందరం)

సతతంయోగినం

దైవమానవత్వము - "సతతం యోగినం" **సర్వమూదైవమే నని, సర్వత్ర దైవము నిండిపున్నాడని భావించేది దైవ మానవత్వము.** అయితే దీనియందు ఒక్కొక్కదానికి ఒక్కొక్క అవాంతరం పట్టి పీడిస్తున్నది. దీనినే **ఆధి**

సత్కర్మలు

దైవికము, ఆధిభౌతికము, ఆధ్యాత్మికము అని మూడు తెఱగులుగ విభజించాడు.

1. ఆధిభౌతికము: పంచభూతములతో కూడిన మానవత్వము వల్ల అతనికి బాధలు కలుగవచ్చు. మృగములవల్ల, క్రిమి కీటకాదుల వల్ల బాధలు సంభవించవచ్చును.

2. ఆధ్యాత్మికము: వాత పిత్త శ్లేష్మాదులచే, రోగములచే, దుర్గుణములచే, దురాలోచనలచే కలుగు బాధలకు ఆధ్యాత్మికము అని పేరు.

3. ఆధిదైవికము: ఇది కేవలం దైవికంగా సంభవించేది. అనగా అతివృష్టి, అనావృష్టి, పిడుగు ఇత్యాదులచే మానవునికి కలుగు కష్టములు దైవికములు.

ఇట్టి మూడు బాధలనుండి విముక్తిపొంది ఆనందం అనుభవించటానికి ప్రేమ అవసరము. మానవుని యందున్న ప్రేమను దివ్యప్రేమగా మార్చటానికి కొన్ని సాధనములు సలపాలి. **వ్యక్తి అనే స్థానమునుండి సమిష్టికి చేసే ప్రయాణము మానవత్వము. "స్వం" స్థానమునుండి "సోహం" స్థానమునకు చేసే ప్రయాణమే మానవత్వము కనుక మన స్వార్థమును పదార్థముగా మార్చుటయే త్యాగము అని పిలిచింది వేదాంతము.** ప్రతి కర్మ పదార్థభావంచేత అనుభవించిననే ప్రేమ తత్త్వము అభివృద్ధి అవుతుంది. అట్టిదే ప్రేమ. **ఇచ్చేదే ప్రేమ. కాని తిరిగి యివ్వమని కోరేది ప్రేమకాదు.** మనము యిచ్చినప్పుడే ప్రేమను అందుకుంటాము. **తైలము జ్యోతిని వెలిగిస్తుంది. ప్రేమ జీవితాన్నే వెలిగిస్తుంది. ప్రేమ ఆల్‌జిబ్రా లెక్కల వంటిది.** ఎన్ని వరుసలు వేసినా అటుఇటు రెండు ఒక్కటిగా ఉంటుంది. ప్రేమ మహా శక్తివంతము. ప్రేమ త్యాగాన్ని కోరితో, **Self ప్రేమను కోరుతుంది.** కనుక నిజముగా స్వార్థరహితమైనది ప్రేమయే. అనగా మొదట నే నెవరు? అని గుర్తించిన ఆత్మతత్త్వము అర్థమవుతుంది. సంస్కృత అక్షరములన్ని తెలుస్తాయి. **అట్లే "అహం" స్వరూపాన్ని తెలుసుకున్నపుడు చిత్త శుద్ధి కలుగుతుంది. "నేను" అనగా ఎవరు?** అది గుర్తించిన అహంకార నిర్మూలన ఆత్మశాంతి కలుగుతుంది. ఈ రెండు ప్రేమవల్లనే సాధ్యము.

(సా.సా.1.పు.26/27)

(చూ॥ దైవమానవత్వము)

సత్కర్మలు

(చూ॥ కర్మకాండలు, జన్మ, భగవదన్వేషణ)

సత్కీర్తి

కన్న తల్లిదండ్రులకు, జన్మనిచ్చిన దేశానికి సత్కీర్తిని తెండి. అదే శ్రీరాముడు చెప్పాడు. "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" విదేశభ్రాంతులనేవి ఉండవచ్చును. మీరు పోయి రండి. **కాని, మన మాతృప్రేమను మాత్రము మరువకూడదు.** విదేశీయులు ఎంతో సుఖసంతోషములతో, భోగభాగ్యాలతో నిండియుండవచ్చును. కాని, భారతదేశం ఏమీ తక్కువ కాదు. ఇందులో కూడా మీరాశించే భోగభాగ్యములున్నాయి. కాని, ఈ కలియుగ ప్రభావం చేత ఆధునిక విద్యార్థులు - "పాచిపోయినా పక్కింటి పప్పురుచి" అంటారు. ఇంట్లో ఎంత రుచికరంగా తల్లి వండిపెడితే అవి రుచించవు.

మన భారతదేశం మహాభాగ్యభూమి. అన్నపూర్ణాదేవి. భోగభాగ్యాలకు ఏమాత్రం తక్కువలేదు. కాని, అట్టి భావముతో అనుభవించే వ్యక్తులు లేరు. అట్టి వ్యక్తులనే భారతదేశం ఆశిస్తున్నది.బయట దేశాలకు పోయిన మనం ఎన్ని కష్టాలకైనా గురి అవుతాము కాని ఆ కష్టాలనే మనదేశములో అనుభవించడానికి ఒప్పుకోము. కొందరు తమ ఇంట్లోనే వడ్డించిన 'తట్ట'నైనా కడుగరు. కాని, విదేశాలకు పోతే జేబులో డబ్బు లేకపోతే హోటల్స్‌లో 'ప్లేట్లు' కడిగి ఆయినా డబ్బు సంపాదించుకొంటారు. అదే పని మనదేశంలో ఎందుకు చేయకూడదు? ఈ దురభిమానం ఎందుకు? మనదేశానికి సేవ చేస్తే తప్పేముంది? అన్ని దేశములను, అన్ని మతములను ఆశించండి, అందరికీ మనం గౌరవము ఇవ్వవలసిందే, కాని, **నీ దేశానికి నీవు మొట్టమొదట Respect ఇవ్వాలి. అది ప్రధానము.**

(శ్రీ.భ.ఉ.పు.141/142)

సత్ చిత్ ఆనందము

" The one you think you are is SAT, The one others think you are is CHIT, The one you are really are is ANANDAM". కనుక యీ సత్, చిత్, ఆనంద మనేటటువంటిది మానవునియొక్క హక్కు. మానవుని యొక్క స్వభావము. మానవనియొక్క సహజత్వము. యిలాంటిదానిని మనము చక్కగా గుర్తించుకొనలేక **పరులను దూషించడము, పరులను కొంతవరకు హేళన చేయడము యీ విధమైనదానిలో మనము పోయి వారి పాపము లను మనము పంచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాము.**

"పరిహాసము పాపనాశనం" అన్నారు. ఇతరులను పరిహాసం చేయకూడదు. ఇతరులను ఏమాత్రంకూడను మనం నొప్పించడానికి ప్రయత్నం చేయకూడదు. ఒక వేళ ఇది ప్రాకృత మైనటువంటి దోషంగా మీకు కనిపించనపుడు మంచి మాటలచేత వారిని సవరించడానికి ప్రయత్నించాలి.

(సా.సా.1. పు.19)

(చూ॥ నాదబిందుకళలు)

సత్ప్రవర్తన

"చదువుకొనుట ధనార్జన కొరకే కాదు. **The end of education is character. The end of knowledge is love.** కనుకనే మనము ఈ జ్ఞానము (Knowledge) ను పెంచుకోవాలి. నిజమైనటువంటి విద్య (Education) ఏమిటంటే శీలము (Character) కనుక మనము శీలము (Character) పెంచుకోవాలి. పెంచుకోవలసినది ధనము కాదు. ధనము యొక్క గుణమేమిటి?

Money comes and goes; but Morality comes and grows.

డబ్బు వస్తుంది పోతుంది, నీతిగనుక వస్తే అది క్రమంగా పెరుగుతుంది. కనుక ఈ పవిత్రమైన విషయమును అర్థం చేసుకొని, మీ ప్రవర్తనలను, భావములను సరిదిద్దుకోటానికి ప్రయత్నించి, ఆదర్శవంతమైన, నవజీవితమును అనుభవించి, ఇతరులకు అందించాలి."

(ఉదయం ప్రత్యేక అనుబంధం పు.5)

సత్సంకల్పము

(చూ॥ సంకల్పములు)

సత్సంగము

(చూ॥ జ్ఞానగుణము, మాయ, సత్సంగము)

సతి

తల్లితండ్రులును, సోదరులును, సోదరీమణులును, అత్తమామలును, సుతులును, గురువులును, బంధువులను వీరందరూ సకలగుణసంపన్నులయిననూ - **సతికి సుఖము నిచ్చువాడు పతియే; పతితప్ప అన్యగతి వుండదు. నాథా! తనువును, ధనమును, గృహమును, పురమును, రాజ్యమును ఇవి పతి దూరమైన సతికి దుఃఖమునే ఇచ్చునుగానీ ఆనందమును అందించలేవు. పతిలేని భోగములు రోగమును బోలినవే.**

(రా.వా.మొ.పు.242)

సీతాదేవి దశరథుని పాదములకు నమస్కరించి, "మామా! నా మనసు రామసేవనే ఆశించుచున్నది. అట్టి సేవాభాగ్యము అరణ్యమున నాకు అమితముగా లభించును. **అట్టి ఘనఫలమును వీడి నేనుండలేను. సతికి, అత్తమామల సేవలూ తల్లిదండ్రులు సేవలూ అంత సంతృప్తిని అందించవు. పతిసేవకు మించిన ఆనందము,** సుఖము యందునూ చిక్కదు. మీరు అడ్డుచెప్పక ఆశీర్వదించి నన్ను రామచంద్రునితో పంపుడని ప్రార్థించిన సీత వాంఛను అర్థము చేసుకొని, దశరథుడు సీత యొక్క గుణములను నానావిధముల వర్ణించి కైకకు తెలిపెను.

(రా.వా.మొ.పు.247)

సత్పురుషులు-దుర్మార్గులు-తారతమ్యము

వాలి భార్య అయిన తార వచ్చి వాలి కళేబరముపైబడి **"ఓ నాథా! యెన్నియో విధముల నేను హితమును బోధించిననూ వినకపోతివి గదా, పతికి యే సతియైనను హితమును లక్ష్యమందుంచుకొనే బోధించును కదా. పతికంటే సతికి హితమైనవారు మరొకరుండరు కదా!** యే మహనీయులైనను కొంత స్వార్థమునైననూ లక్ష్యమందుంచుకొని హితము చేయుదురు. సతి అట్లుకాదు కదా పతి క్షేమమునే లక్ష్యముందుంచుకుని చేయును కదా! అయ్యో నాథా! విధికృతమువలన నా బోధనలు నీ మనస్సుకు పట్టలేదు.

(రా.వా.రె.పు.80/81)

సత్పురుషులు-దుర్మార్గులు-తారతమ్యము

"ఓ స్వామి! నీవు సకలగుణసంపన్నుడవు. సత్పురుషులకు దుర్మార్గులకు గల తారతమ్యమును వివరించి చెప్పుము" అని ప్రార్థించెను.

"ఓ తమ్ముడా! వేదపురాణములలో చెప్పిన విధమున **సత్పురుషుల గుణములు అనంతములు.** చందన తరువునకును గొడ్డలికిని యెట్టి **సంబంధము కలదో సత్పురుషులకు దుర్మార్గులకు అట్టి సంబంధము కలదు. చూడుము. గొడ్డలి చందనతరువును నరికినను దాని సుగంధమును గొడ్డలికిచ్చును కదా!** ప్రాణమును దీసుకొన వచ్చినదానికి సహితము అది సుగంధము నిచ్చును. అందుచేత శ్రీగంధము సర్వజనసమ్మతము. దేవతలు దానిని శిరస్సుపై ధరింతురు. హితవు చేసిన వృక్షమున కపకారము చేయుటవలన గొడ్డలికి వచ్చిన పాట్లు చూడుము. దానిని నిప్పులో కాల్చి సుత్తితో కొట్టుచుందురు కదా. ఈ ప్రకారమే ఖలులు సత్పురుషులకు దుఃఖము నిచ్చెదరు. అయినను **సజ్జనులెప్పుడును వారికి ఉపకారమే చేయుచుందురు.** దీని ఫలమేమి? సజ్జనులు స్వర్గమునకు పోదురు. అనగా నిరంతర మానందముగ నుందురు. దుర్జనులు నిరంతరము అసంతృప్తితో, దుఃఖములతో కుములుచుందురు. వారలు నరకయాతనల ననుభవించు దురు. నిందలు నిష్కారములతోపైకి ఉల్లాసముగా కనిపించినను లోలోన కృశించుచుందురు.

సత్పురుషుల గుణములను చెప్పెదను వినుము. వారు విషయాసక్తులు కారు. సకలగుణశీలసంపన్నులు. ఇతరుల సుఖమును చూచి సంతసించి వారల దుఃఖములను చూచి దుఃఖింతురు వారు సమదర్శనులు! వారికి శత్రువులు లేరు. వారికి శత్రుబాధలే లేవు. వారు జ్ఞానవిజ్ఞానవైరాగ్య సంపన్నులు. వారల చిత్తములు కోమలములు, దీనులయందు వారికి దయ మెండు. త్రికరణశుద్ధిగా వారు నా పాదములను సేవింతురు. వారికి మానభిమానములన్నవి ఉండవు. వారు నిరంతరము పరోపకారమును చేతురే కాని స్వార్థమును కలయందైనను కోరరు. వారల ప్రవర్తన సరళము. వారల **హృదయములు శీతలములు, వారు త్యాగశీలులు** ఎల్లప్పుడూ వారు సంతోషముగనే యుందురు. తమ్ముడా యా లక్షణముల నెవ్వడు కలిగియుండునో **అతడు ఆత్మస్వరూపుడు అని తెలిసికొనుము.** ఆత్మస్వరూపుడేమిటి, నేను వారు వారేనేను అని గ్రహింపుము. వారలకు దూషణ భూషణములు సమానము.

ఇక దుర్జనుల లక్షణాలను చెప్పెదను వినుము. వారల సాంగత్యమును అన్ని విధములా విడిచిపెట్టవలెను. వారల సహవాసము వలన దుఃఖము ప్రాప్తించును. పరుల సంపదలను చూచి వారి హృదయము లెప్పుడును పరితపించును. పరదూషణ వినివారు సంపద వచ్చినట్లు తలంచి సంతసింతురు. అరిషడ్వర్గములు వారిని ఆశ్రయించియుండును. ఆశ్రితులు చెప్పినట్లు వారు సంచరింతురు. వారికి **దయాదాక్షిణ్యములు శూన్యము. కుటిలులు, కారణము లేకయే పరులతో కలహింతురు. ఉపకారము చేసిన వారితోసహా వారు విరోధించెదరు.** వారిమాటలు వారి కార్యములు, వారిబోధనములు, యిచ్చిపుచ్చుకొనుటయు సర్వమూ అసత్యములు. వారి హృదయములు కఠోరములు. నెమలి పైకి చూచుటకు చక్కగా నుండును. దానికేక విన సొంపుగా నుండును.

అయిననది పాములను భక్షించును కదా! **అటులనే దుర్జనులని తెలిసికొనుము. పరహింసాపరాయణులు, పరదారాసక్తులు, పరనిందారతులు, పాపకర్మలు పాపాత్ములు మనుజాధములు.** వారికి యముని భయము లేదు. ఇతరుల అభివృద్ధినొందుట చూచి, విని, పసిపట్టినట్లు వారు తలనొప్పిచే బాధపడుచుందురు. ఇతరుల విపత్తుల జూచి వారు సంతసింతురు. పరుల కష్టములను చూచి దేశమునకు రాజయినట్లు వారు సంతోషింతురు. వారలకు స్వార్థము తప్ప పరోపకారమన్నది స్వప్న ముందైనను వుండదు. **వారి హృదయము కామక్రోధాదులకు పుట్టినిల్లు. వీరికి తల్లిదండ్రులని, గురువులని, పెద్దలని, లక్ష్యములేదు. సత్పురుషులన్నను, భగవంతుడన్నను, వారలకు తలనొప్పి వచ్చును.** వారు మందమతులు, అవగుణధాములు, కామాంధులు, వీరిని అధికముగా కలియుగములో చూడవచ్చును. ఓ తమ్ముడా! పరోపకారముకంటే ధర్మము మరొకటి లేదు. పరహింసకంటే అధికమగు పాపము లేదు. ఇదియే వేదపురాణముల సారము. ఇదియే నత్పురుషుల మతము. మనుజులై వుట్టి పరహింసచేయువారు నీచయోనులయందు పుట్టి చచ్చుచుందురు. మనుజులు అజ్ఞానాంధకారమునబడి అనేక పాపములు చేయుచుందురు. ఇట్టివారికి నేను ప్రారబ్ధ కర్మస్వరూపుడనై కాలాంతరమున ప్రత్యక్షమగు చుందును. అట్టివారిని సంసారములో పడత్రోసి వారిని శుభ, అశుభకర్మలననుభవింప చేయుదును.

ఓ భరతా! దేవతలును మునులును **మహాత్ములును శుభాశుభముల నిచ్చునట్టి కర్మలను విడిచిపెట్టి సదా వారు నన్ను భక్తితో భజించెదరు. వారు నిష్కామ్యముగ కర్మల నాచరించెదరు. కామ్య తపస్సులను, కామ్యకర్మలను చేసినయెడల వాటి శుభాశుభఫలముల ననుభవించుటకు దేహమును ధరించ జీవులు సంసారములోనికి రావలెను.** ఏ కర్మలు చేసినను వాటిఫలము నపేక్షింపక వాటి నొనరించినయెడల మనుజునకు జ్ఞానము కలుగును. భక్తిప్రపత్తులు అభివృద్ధిగాంచును. వాటిమూలమున వాడు ముక్తిని సామీప్యమున అనుభవించును. ఈ విధముగా సజ్జన దుర్జన లక్షణములను మీకు విశదపరచితిని. ఈ లక్షణములను తెలుసుకొనినవాడు సంసారసాగరములో బడి మునిగియుండడు. "తమ్ముడా! అనేక విధములగు సుగుణదుర్గుణములన్నియూ మాయా సంకల్పితములని తెలిసికొనుము. ఈ రెండు గుణములను లక్ష్యము చేయనివాడు సజ్జనుడు, మహాత్ముడు, **అతనే ఆత్మ స్వరూపుడు.** ఈ గుణముల రెండింటికి వశుడగువాడు మూర్ఖుడు. అదియే అజ్ఞాన" మని ఈ ప్రకారము రాముడు తమ్ములకు వివరించెను. శ్రీరాముని యుపదేశములు వారు విని స్వాస్థ్యము పొందిరి. వారి హృదయములు ప్రేమతో ఉప్పొంగెను. మాటిమాటికి వారు రామునకు శిరస్సులువంచి నమస్కరించిరి. అందరికంటే అధికముగా హనుమంతుడు బ్రహ్మానంద మొందెను. అనంతరము తమ్ములతో కూడి హనుమంతునితో సహా శ్రీరాముడు రాజమందిరమునకు పోయెను.

(రా.వా.రె.పు.221/225)

సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ

'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' అనంతమైన జ్ఞానమే బ్రహ్మము. అదే సత్యం అదే నిత్యం. జ్ఞాన విజ్ఞానములు సర్వము. అతని పొత్తే. ఇట్టి దైవత్వము నుండి శబ్ద స్వరూపమైన ఆకాశము. ఉదయించింది. ఆకాశము నుండి వాయువు వాయువునుండి అగ్ని, అగ్నినుండి జలము, జలమునుంచి పృథివి ఆవిర్భవించినవి. పృథివినుండి ఓషధులు, ఓషధులనుండి అన్నము, అన్నము నుండి పురుషుడు ఉద్భవించారు. ఏతావాతా బ్రహ్మ పురుషుల సంబంధము ఆవిర్భవించినము. పురుషుడు అన్న స్వరూపుడు. అన్నమయ శరీరము నుండి సూక్ష్మాతి సూక్ష్మములైన ప్రాణమ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ జీవితములు ఆవిర్భవిస్తూ వచ్చినవి.

(సా.పు.481/482)

(చూ॥ మంత్రము, మంత్రవర్ణికమేవచ, స్వరూపలక్షణము)

సత్యం శివం సుందరం

సర్వ నామ ధరం శాంతం
సర్వరూపధరం శివం
సచ్చిదానంద రూపం అద్వైతం
సత్యం శివం సుందరం!

(లో. పు.4)

"సర్వ రూప ధరం శాంతం
సర్వ నామ ధరం శివం
సచ్చిదానంద రూపం అద్వైతం
సత్యం శివం సుందరం"

(శ్రీ.ఏ.96 పు.25)

ఈ సమావేశంలో మొదట కస్తూరికి, తిరుమలాచారికి శాలువాలు కప్పి ఆశీర్వదించాను. వారు నా జీవిత చరిత్రను ఇంగ్లీషులో, తెలుగులో సత్యం శివం సుందరం అనే పేరుతో రచించారు. నా జీవితంపై ఇలా పుస్తకం ప్రచురించటం నేను ఎందుకు ఇష్టపడ్డానా అని కొందరు ఆశ్చర్యపడవచ్చు. నేను అన్ని మంచి పనులకు ఇష్టపడతాను. అటువంటప్పుడు దీనికి మాత్రం యెందుకు ఇష్టపడను? భక్తుల ప్రార్థనలను నెరవేర్చటానికే వీరు ఈ పుస్తకాలను వ్రాయటానికి నేను అంగీకరించాను.

(శ్రీ.వ. 61-62 పు. 139)

మీలో కొందరికి నా జీవిత చరిత్ర ఎందుకు ప్రచురించటమూ అనే ఆశ్యర్యం కలిగి ఉండవచ్చు. నా జీవిత చరిత్ర తెలుసుకోవాలని ప్రార్థించిన నా భక్తుల ప్రార్థనను ఆలకించి వారిని వ్రాయటానికి అనుమతించాను.

'రమయతి ఇతి రామః'

రమింపచేసే వాడు రాముడు. అంటే ఆనందాన్ని కలుగచేసేవాడు. **భక్తుని సంతోషమే భగవంతునికి ఆనందం. భగవంతుని ఆనందమే భక్తునకు గొప్ప బహుమానం.**

పుస్తకానికి పెట్టిన ఈ పేరు పూర్తిగా అర్థవంతమై ఉన్నది. నేను మీ అందరి హృదయాలలోనూ అంతర్గతంగా ఉన్నానన్న విషయాన్ని ఈ పుస్తకం తెలియచేస్తుంది. మీ **అందరిలోనూ ప్రాథమికంగా ఉన్న మూలతత్వాన్ని 'సత్యమే'** నని గుర్తుంచుకోండి. అందుచేతనే మిమ్మల్ని ఎవరైనా అబద్దాలకోరు అంటే మీకు చాలా కోపం వస్తుంది. నిజమైన నీవు "అబద్దం" తెలియనటువంటి అమాయకుడవు. నిజమైన నీవు ఆరోపణను స్వీకరించలేవు. నిజమైన నీవు సచ్ఛీలానికి, మంచి తనానికి, సంతోషానికి, **ఆనందానికి, పవిత్రతకూ ప్రత్యేకమైన 'శివం' అయిఉన్నావు. నువ్వు 'శివం' కాని శవం కాదు. అది నిత్యమైనది, శుభమైనది. ఆనందకరమైనది.** అటువంటప్పుడు మంచి అని చెప్పుకోవలసిన నిన్ను చెడ్డగా చిత్రీకరిస్తే ఎలా సహించగలుగుతావు? **నీవునిజమైన సౌందర్యానికి ప్రతీకవు.** అందవిహీనంగా ఉన్నారని ఎవరైనా అంటే నీవు సహించవు. ఒప్పుకోవు. **నీవు నిజానికి ఆత్మవు కాబట్టి నీ వాహనానికి** (దేహమునకు) కల లోపాలను నీకు అంటగడితే నీవు సహించలేవు'

(శ్రీ.స.ప్రే.ప్ర.పు.237)

(చూ॥ కస్తూరి, దూపాటి తిరుమలాచారి, నేను)

సత్యజీవి

(చూ॥ సర్వమూ భగవంతుడే!)

సత్యభామ

(చూ॥ అర్జునుడు, నరకచతుర్దశి, భక్తి)

సత్యము

భారతీయులకు ప్రధాన అంగం వేదం.

"సత్యం వద - ధర్మం చర" అని బోధించింది వేదం. సత్యమును ఉచ్చరించు, ధర్మమును ఆచరించు అని చెప్పింది వేదం. ఈనాడు సత్యమును ఉచ్చరించడంలేదు. ధర్మమును ఉచ్చరిస్తూన్నారేకాని, ఆచరించటంలేదు. ధర్మమును ఆచరించాలి. **" ధర్మోరక్షతి రక్షితః"** ధర్మమే మనలను రక్షించేది.

ధర్మమంటే ఏమిటి? మన ఆచారాలు సాంప్రదాయాలు మాత్రమే కావు. **"మనస్సేకం, వచస్సేకం, కర్మణ్యేకం" ఇదే మానవుని యొక్క ధర్మము. The proper Study of Mankind is man.** ఈ మూడింటినీ ఏకత్వము గావించాలి. అప్పుడే త్రికరణశుద్ధి ఏర్పడుతుంది. ఆత్రికరణశుద్ధి యే మానవుని ధర్మం.

ఈనాడు మాటలు వేరు, తలంపులు వేరు, క్రియలు వేరు, కావటము చేతనే ధర్మము క్షీనించిపోయినది.

"సత్యాన్న ప్రమదితవ్యం" ఎలాంటి పరిస్థితులుయందు నను సత్యాన్ని వదలవద్దనీ, **"ధర్మాన్న ప్రమదితవ్యం"** ధర్మాన్ని వదలవద్దనీ, ఉపనిషత్తులు తెలుపుచున్నవి. ఎలాంటి సమయములో నైనా - ప్రాణాపాయం సంభవించినా, ధర్మాన్ని వదలరాదు. అదే హరిశ్చంద్రుడు సాధించిన వ్రతం. ఉపనిషత్తులు ఇటువంటి పవిత్రమైన సత్యాన్ని భోధిస్తూవచ్చాయి.

సత్యమునకే విజయము. విజయాన్ని సాధించవలసినవాడు ధర్మాన్ని అనుసరించాలి.

ధృతరాష్ట్రుడుసంజయడ్ని ప్రశ్నించాడు పాండవులు, కౌరవులు, ఇరువురూ యుద్ధభూమిలో చేరినారు. వారు ఏమి చేస్తున్నారు? యుద్ధభూమికి పోయినవారు యుద్ధంచేస్తారు కాని విందు చేయరుకదా? యుద్ధము సంభవించినది. యుద్ధం చేస్తున్నారని సంజయుడు తెలిపినాడు. నీ ఉద్దేశముతో ఎవరికి విజయము సంభవిస్తుందని ప్రశ్నించాడు ధృతరాష్ట్రుడు.

ఇంద్రియములను లొంగదీసుకున్నవాడు సంజయుడు. ఇలా అన్నాడు -

"యత్ర యోగేశ్వరః కృష్ణో, యత్ర పార్థో ధనుర్ధరః,
తత్ర శ్రీర్విజయోభూతి ర్ధ్రువా నీతి ర్మతిర్మమ"-

ఓ మహారాజా! ఎక్కడ **సర్వశక్తిమంతుడైన భగవంతుడు, ఎక్కడ సర్వధర్మపరాయణుడైన నిర్మలుడు అర్జునుడు ఉందురో, అక్కడే విజయము.** ఈ విజయానికి సత్యధర్మ స్వరూపమైన భగవదనుగ్రహమే ప్రధానమని భోధించినాడు.

(దే.యు.పు.42/43)

మానవునికి దైవవిశ్వాసం చాల ప్రధానమైనది. దేవుడు ఎవరు? ఎక్కడున్నాడు? అని అనేకమంది ప్రశ్నిస్తుంటారు. **సత్యమే దైవం, ప్రేమయే దైవం.** భారతీయుల సత్యం, అమెరికన్ సత్యం, జర్మన్ సత్యం అనే భేదం లేదు. **ప్రపంచమునకంతా సత్యం ఒక్కటే, అదే దైవం. అదేవిధంగా ప్రేమయే దైవం. కనుక, ప్రేమలో జీవించండి. ఈ ప్రేమ దేహసంబంధమైనది కాదు, హృదయ సంబంధమైనది. దేహమొక నీటి బుడగ, మనస్సాక పిచ్చికోతి. కనుక, దేహాన్ని, మనస్సును విశ్వసించకండి, అంతరాత్మను అనుసరించండి. అప్పుడే మీకు సత్యం గోచరిస్తుంది.**

(స.సా.డి.99.పు.366)

నేను సత్యస్య సత్యమ్ - నేను సత్యములలో సత్యమును

(శ్రీ.ప్రే.స.పు.224)

రమణీ శిరోమణి రావచ్చు పోవచ్చు
శాశ్వతమైనది సత్యమెక్కడ ।
రాజ్యభోగములెల్ల రావచ్చు పోవచ్చు
శాశ్వతమైనది సత్యమెక్కడ ।
భ్రాతలు బంధువుల్ రావచ్చు పోవచ్చు
శాశ్వతమైనది సత్యమెక్కడ ।
లోకమందు అధికార భోగముల్ రావచ్చు పోవచ్చు
శాశ్వతమైనది సత్యమెక్కడ ।
సరస సన్మార్గ తత్వంబు తెలియజెప్పి
అమృతమ్ము - అదియె సకల సేభాగ్యమందు
భువినీ సత్యంబె పరమ సౌభాగ్యమందు

(ది.ఉ.=19.11.2000)

సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
సత్యమందణగె సర్వసృష్టి
సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న
శుద్ధ సత్వ మిదియె చూడరయ్య

(ద.స.98పు.3)

పుడమిన అవతరించిన ప్రతిమానవునకు సత్యమే ప్రత్యక్ష దైవము. ఈచరాచర ప్రపంచమంతయు సత్యము నుండియే ఆవిర్భవించి సత్యమునందే జీవించి సత్యమునందే లీనమగుచున్నది. **'సత్యం జ్ఞానమనంతం**

సత్యము

బ్రహ్మ' బ్రహ్మ సత్యము. అనంతమైనదీ సత్యము. ఈ బ్రహ్మకు ఆత్మ అని పేరు నిత్యమైనబ్రహ్మను "సత్య" అన్నారు వేదాంతులు. ప్రతి మానవుడు గౌరవించవలసినది సత్యమునుమాత్రమే. భారతీయులు సత్యవ్రతులు, ధర్మపరాచణులు. జ్ఞానమే భారతీయుల ఆటపట్టు. ప్రతిమానవుడు సత్య ధర్మములకు వారసుడే. సహృదయులు, శాంతికాములు అయిన యువతీయువకులు సత్యాన్వేషణకై సత్యాచరణకై తగిన కృషి చెయ్యాలి. **లోకహితమే భారతీయుల అభిమతము. అదియే యువకుల వ్రతము; అదియే మనమతము. ఇట్టి పవిత్రమైన సత్యమును సంస్కృతిని ఈనాడు విస్మరించటము చేతనే జాతి సమైక్యతను దేశ సమగ్రతను మనము సాధించలేక పోతున్నాము. సత్యము ధర్మము దేనికిని లొంగవు. భుజబలము, బుద్ధిబలము, అధికారబలము, ఆయుధ బలము కూడను. సత్యధర్మములకే లొంగవలసినవి.** కాని సత్యధర్మములు దేనికీ లొంగునవి కావు. విజయము ఎల్లప్పుడు సత్యధర్మములనే వరిస్తూ వుంటాది.

(బృ.త్ర.పు.12)

కనులకగుపడు దృశ్యంబు, గాంచి మీరు
సత్యమిదియని ఎంచక, సంబరమున
తెరనుదాగిన సత్యంబు, తెలిసికొనగ
విశ్రమింపకనాతో, వెడలిరండు.

(సా.పు.204)

సమస్త ధర్మములకు సత్యమే ఆధారం **"సత్యంనాస్తి పరోధర్మ:"**

(స.సా.జూ.1989పు.143)

సత్యమే ఈశ్వరలోకే
సత్యం పద్మాసితాసమ్
సత్యమూలం ఇదం పుణ్యం
సత్యం నాస్తి పరం సుఖమ్''
ప్రేమస్వరూపులారా!
ఈ ప్రపంచమంతయూ సత్యంతోనే నిండియున్నది. సత్యం సర్వత్రా వ్యాపించినటువంటిది. ధనకనక వస్తు వాహనాదులు, భోగభాగ్యములు కూడనూ సత్యమునే ఆశ్రయించి వున్నవి. సత్యమే లేకుండిన లోకమేలేదు. ఈనాడు సత్యమును కోల్పోవటంచేతనే, మానవులు అనేక విధములైన కష్టములకు గురి అవతూ వస్తున్నారు. సత్యము చాలా విలువైనటువంటిది. ఒకరు దాచితే దాచేది కాదు. ఒకరు మార్చితే మారేటటువంటిదికాదు. **"త్రికాల భాజ్యం సత్యం"**. మూడు కాలములయందునూ మారనటువంటిదే సత్యం. ప్రాచీనకాలము నుండి భారతీయులు సత్యమునే ఆశ్రయించి, సత్యమునే పలుకుతూ, సత్యజీవితం గడుపుతూ రావటం చేతనే, భారతదేశం నాటినుండి నేటివరకునూ సుక్షేమంగా వుండగలిగింది. సత్యం చేతనే భారతీయులు యావత్ ప్రపంచానికి ఆధ్యాత్మిక జీవితమును ప్రకటించగలిగారు. **"లోకాస్సమస్తా స్సుఖినో భవంతు"** అనే ఆదర్శము ఈ సత్యమువలననే ఆవిర్భవించింది. ఇట్టి పవిత్రమైన, నిత్యసత్యమైన సత్యమును ఈనాడు మానవులు మరచి పోతున్నారు. సత్యమేలేకుండిన ధర్మమేలేదు. **'సత్యం నాస్తి పరోధర్మ:'** సత్యమే మనకు ప్రధానమైన ధర్మము. సత్యమే మానవులకు ప్రాణం. సత్యమే లేకుండిన మానవత్వమే లేదు. మానవతావిలువలు సత్యము పైననే ఆధారపడి ఉన్నాయి.

ప్రేమస్వరూపులారా! సత్యం చాలా గొప్పది. ఈ సత్యం కోసం ఆలుబిడ్డలను ఆమ్ముకొని కాటికాపరి అయినాడు సత్యహరిశ్చంద్రుడు.

'సత్యంబు నందుండి సర్వంబు సృష్టించె
సత్యంబు నందణగె సర్వసృష్టి
సత్యమహిమలేని స్థలమేది కనుగొన్న
శుద్ధ సత్యమిదియె చూడరయ్య!''

సత్యము చిన్ని పదముగా మనకు గోచరిస్తుంది. కాని సత్యమును అర్థం చేసుకోవటం చాలా కష్టం. ఈ సత్యము నందే సర్వస్వమూ యిమిడిఉన్నది. యావత్ ప్రపంచమూ ఈ సత్యము పైననే ఆధారపడి ఉన్నది. అట్టి ఆధారమైన సత్యమును మనం కోల్పోయిన, మన జీవితం ఏగతి

పాలవుతుంది? సత్యంలేని స్థానమే లేదు. సత్యం సర్వత్రా వ్యాపించినటువంటిది.

(శ్రీ.అ.2001పు.7)

ఒకానొక సమయంలో ఇంద్రుడు ప్రహ్లాదునివద్దకు వెళ్లి అతని శీలము దానమిమ్మని కోరాడు. అడిగిన వారికి లేదనక ఇచ్చే స్వభావము ప్రహ్లాదునిది. ఇంద్రుడు కోరినట్లుగా తన శీలమును ధారపోశాడు. శీలముతోపాటు శౌర్యము, యశస్సు, కూడా అతనిని వదలిపెట్టి వెళ్ళి పోయాయి. కాని ప్రహ్లాదుడు లెక్క చేయలేదు. కాని కట్టకడపటికి సత్యము కూడా అతనిని వదిలిపెట్టిపోవడానికి ప్రయత్నించగా ప్రహ్లాదుడు అడ్డుకుని **"ఎవరు పోయిన నాకు దుఃఖము లేదుగాని నీవు మాత్రము నన్ను వదలిపోకూడదు" అని ప్రార్థించాడు. ఎప్పుడైతే సత్యము ప్రహ్లాదుని దగ్గర నిల్చిపోయిందో అప్పుడు పోయిన యశస్సు, సంపద సర్వస్వము వెనుకకు తిరిగి వచ్చాయి. విద్యార్థులారా! మీరు ఆఫీసులోనైనా, ఫ్యాక్టరీలోనైనా ఏమాత్రము జంకు లేక సత్యమునే పాటించండి; ధర్మాన్ని అనుసరించండి.** ఏమిటి ధర్మము? **అంతరాత్మ (కాన్షియన్స్) ను అనుసరించడమే నిజమైన ధర్మము.** వేదము సత్యం వద, ధర్మంచర'' అని బోధించింది. పూర్వకాలంలో విద్యార్థులు ఋషుల దగ్గర విద్య నభ్యసించి గురుకులమును వదిలి వెళ్ళే ముందుగా వారిని చేరదీసి ఋషులు వారికి ఈవిధమైన సద్బోధలు గావించేవారు. దీనినే స్నాతకోత్సవము(కాన్వొకేషన్)అని అన్నారు.

(స.సా.డి.96పు.321)

(చూ॥ అనన్యభక్తి, అనహంకారము, అష్టవిధపుష్పము, కీర్తి, నగ్నసత్యం, నరజన్మ, బుద్ధి, భూషణం, మైలురాళ్ళు, రథసారథి, శాశ్వతము, సంకల్పములు)

సత్యవతీ ఆరాధన

(చూ॥ దైవారాధన)

సత్యవిద్య

రామకృష్ణపరమహంస, జయదేవ, గౌరాంగ, తుకారాం, తులసీదాసు, రామదాసు, కబీర్‌దాసు, శారదాదేవి, మీరా, సక్కుబాయి, మల్లమ్మ మొదలయినవారికి బాహ్యచదువు లంతగా లేకపోయినప్పటికినీ ఈనాడు ప్రపంచమంతా అన్ని మతములవారు అన్నితెగలవారు అన్ని రాష్ట్రముల వారు వారిని పూజించుచూ, గౌరవించు చున్నారంటే, వారల చిత్తశుద్ధితో కూడిన ఆత్మవిశ్వాసమే మూల కారణము. **చిత్తశుద్ధిని చేకూర్చునదే సత్యవిద్య.**

(వి.వా.పు.7)

సత్యసాయి

సత్యసాయి అంటే సత్యమునే ఆధారముగా నిర్ణయించుకొన్నవాడు అని అర్థం. సత్యము నిండుకొన్న హృదయాలలో స్థాయిగా నిలుచువాడు. సత్యస్య సత్యమైన సాయి మీ హృదయంలో శయనించియున్నాడు అనేది ఈ పేరుయొక్క అంతరార్థం.

(స.సా.న.99పు.308)

ఇంకా ముమ్ముందు ఎన్నో గొప్ప కార్యములు జరగ బోతున్నాయి. **సత్యసాయి చేయలేని కార్యము ఏదీ లేదు. అందరికీ ఆశ్చర్యం కలిగించే చర్యలు చేయగలడు. "లోకాస్సమస్తాః సుఖినో భవంతు", అందరూ సుఖంగా ఉండాలి, అన్నదే సాయి ఆశయం.** అందరి సుఖం కోరేవారికి ఎట్టి కష్టములూ రావు; వచ్చినా అవి వారిని ఏమీ చేయలేవు. ఒక చిన్న ఉదాహరణ: ఒక పర్యాయం **బుద్ధుడు** ఎక్కడికో వెళుతున్నప్పుడు అసూయా రాక్షసి అతనికి ఎదురు వచ్చి "బుద్ధా! నిన్ను నేను చంపి భుజిస్తాను," అని బెదిరించింది. బుద్ధుడు చిరునవ్వు నవ్వి "నాపై అసూయతో నన్ను చంపాలని వస్తున్నావా? నిన్ను కూడా నేను ప్రేమిస్తున్నాను,'' అన్నాడు. బుద్ధుడు ఈవిధంగా పలికేసరికి ఆ అసూయా రాక్షసి శాంతి, ప్రేమలకు

చిహ్నమైన పావురంగా మారి ఎగిరిపోయింది. **కనుక, అసూయను, క్రోధమును, ద్వేషమును ప్రేమతో జయించాలి. శాంతమును పెంచుకోవాలి. అప్పుడే మీరు నిజమైన భక్తులవుతారు. పొగిడితే ఆనందించడం, తెగిడితే ద్వేషించడం మంచిది కాదు. రెండింటిపట్ల మనం సమత్వం వహించాలి. దూషించినారని వారిపట్ల ద్వేషం పెట్టుకోకూడదు. భూషించినారని వారితో స్నేహం పెంచుకోకూడదు. దూషణ, భూషణ, తిరస్కారములు వారి నోటికేగాని, మనకు కాదు.** కనుక, మీరు ఎవరిపైనా ద్వేషం పెట్టుకోకండి. ఎక్కడైనా మంచిని చూడండి, తీసుకోండి; చెడ్డ ఎక్కడున్నా దానిని చూడకుండా వదలిపెట్టండి. **దూషణ, భూషణ, తిరస్కారములు ఎన్ని కల్గినప్పటికీ సాయిని కదిలించేవాడు లేడు. సాయి ఎప్పుడూ సత్యములో నిలిచినవాడు.** సత్యాన్ని ఎవ్వరూ ఏమాత్రమూ కదిలించలేరు. ఈవిధమైన దృఢ నమ్మకంతో జీవించండి; దైవవిశ్వాసాన్ని దినదినానికి పెంచుకోండి. **అది పెరిగితే ఈ దుర్మార్గమంతా భస్మమైపోతుంది. మీరు విన్న విషయాలను హృదయంలో పదిలపరచుకొని, మీరు చేస్తున్న సాధనలను కొసాగించండి.**

(స.సా.జ.2001పు.5/6)

'సత్యసాయి' అనే పదము యొక్క అంతరార్థమేమిటి? 'సత్య' అనగా ఋగ్వేదమని అర్థము. 'సా' అనగా సామవేదము. 'అ' అనగా అథర్వణవేదము. 'య' అనగా యజుర్వేదము. కనుక సర్వవేదముల సారమే ఈ సత్యసాయి.

(స.సా.ఏ. 2002 పు. 98)

(చూ॥ దివ్యప్రకటనలు, పుట్టపర్తి, పువ్వులు)

సత్యసాయికాలేజిలు

భారతీయ సంస్కృతిలో మాతృదేవోభవ, పితృదేవోభవ అనేవి ప్రధానమైన వాక్యములు. ఈనాడు మనం మన తల్లిదండ్రులకు సంతృప్తి కావించినప్పుడే మన బిడ్డలు మనకు సంతృప్తి కావించటానికి పూనుకుంటారు. ఈనాడు కాలేజీలో విద్యార్థినులుగా ఉన్నవాళ్లు రేపు మాతృమూర్తులుగా తయారవుతారు. కనుక రేపు మాతృమూర్తులుగా తయారే ఈనాటి విద్యార్థినులు ఈనాటి తల్లిదండ్రులకు తగినట్లు సంతృప్తి కావించే నడకను నేర్చుకోవాలి. స్త్రీకి ప్రధానమైన స్థానాన్ని అందించి మన భరతమాత యొక్క క్షేమాన్ని, సంస్కృతిని విశిష్టతను నిలబెట్టటానికి విద్యార్థినులు పూనుకోవాలి. **గృహలక్ష్మి, ఇల్లాలు ధర్మపత్ని అనే సార్థక నామములు గైకొన్నటువంటి స్త్రీ. ఆదర్శవంతమైన జీవితాన్ని ప్రకటించుటకై ప్రచార కార్యక్రమానికి పూనుకోవాలి.**

గృహిణియొక్క కర్తవ్యాన్ని స్త్రీ నిర్వహించాలి. దేశము యొక్క కీర్తి అపకీర్తులకు స్త్రీలే కారణం. కనుకనే దేశంయొక్క పేరే మాతృభూమి, ఇంతియే కాదు మన చరిత్రయందున్న పావనమైన పురుష దేవులు సీతా రామ, లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, పార్వతీ పరమేశ్వర! దీనిలో స్త్రీల పేర్లు ప్రథమంలో కనిపిస్తూ ఉంటాయి. ఇట్టి ప్రథమ స్థానమునలంకిరంచినటువంటి స్త్రీలు సక్రమమైన ధర్మమును ప్రచురించుట కొరకు సత్యసాయి కాలేజిలను స్థాపించటమైనది.

(స.సా.జూ.75పు.95)

సత్యసాయి మహితోక్తులు

1) ఎండమావులెంత పారినా తడవనట్లు శ్రద్ధలేకున్న కర్మలెన్ని చేసినను చిత్తశుద్ధి కలుగదు. 2) ఎక్కడ భగవన్నామ సంకీర్తన జరుగునో అదియే వైకుంఠం. 3) ఏకాంతమనగా ఎవరిచేతనూ బాధ కలుగకుండా ఉండునట్టి స్థలము. 4) ఏకాకి అనగా రెండవవారు లేకుండుట. 5) ఏడ్చేవాడు నరుడు, నవ్వేవాడు నారాయణుడు, 6) ఐహిక సంబంధమునకు మాయయే కారణము. 7) ఓర్పే మానవునకు సర్వబలము. 8) కరిగే ఆయుస్సు, కదిలే జలము తిరిగిరావు. 9) కర్తవ్యపాలనయే ధర్మం. 10) ధర్మబద్ధమైన జీవితమే సత్ ప్రవర్తన. 11) కర్మజిజ్ఞాస ఉంటే, ధర్మజిజ్ఞాస ఉంటుంది. ధర్మజిజ్ఞాస

ఉంటే బ్రహ్మజిజ్ఞాస అనుభవింపగలం. 12) కర్మసంబంధి జీవుడు, భక్తి సంబంధి దేవుడు. 13) ఎల్లడ భగవంతుడున్నాడని విశ్వసించితే, ఎందెందు వెదకి చూచిన భగవంతుడు అందందే కానవచ్చును.

(స.సా. మే. 91 పు. 138)

సత్యసాయి శకము

"సత్యసాయి సమస్తమానవులకు హృదయస్థసాయి అయ్యే ఈ నూతన సత్యసాయి శకారంభమును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలి. మానవజాతి నంతటినీ ఒకే కుటుంబముగా ఏకము చేసి మీలో ప్రతి ఒక్కరిలో అత్మసత్యమును స్థిరముగా నెలకొల్పి ప్రకాశింప జేయటానికే నేను అవతరించాను. ఇదే మీ అందరికీ సాయి యొక్క సందేశము: నవయుగానికి వైతాళికులు కండి! స్వార్థము, దురాశ, ద్వేషము హింసలను వదలి పెట్టండి. మీకు మీరు జ్యోతి స్వరూపులుగా ఉండండి: ఇతరులకు వెలుగుబాటను చూపించండి.

(ధై.పు.323)

సత్యసాయిసెంట్రల్‌ట్రస్టు

మీరు అన్నివిధములైన దినపత్రికలు చదువుతుంటారు. అందుకోసమే చెప్పవలసివస్తున్నది. మా సత్యసాయి సెంట్రల్ ట్రస్టు అనేది అగ్నితో కూడా కాలదు. అంత పవిత్రమైనది! ఇందులోని ప్రతీ నయాపైసను ఎంత పవిత్రమైన రీతిలో ఉపయోగపడుతున్నామో మాకు తెలుసుకాని, జగత్తుకు తెలియదు. సెంట్రల్ ట్రస్ట్‌మెంబర్సంతా 20 సం॥ల నుండి నిస్వార్థ మైన సేవ చేస్తున్నారు. ఎక్కడైనా ఢిల్లీలోనో, మద్రాసులోనో, బొంబాయిలోనో పని పడిందంటే వారు తమ స్వంత ఖర్చులతో వెళ్ళి వస్తారుకాని, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్‌లోని నయాపైసను కూడా ముట్టరు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టువారు ఇంత పవిత్రంగా దీనిని ఉపయోగపడుతున్నారు. కాని, వారు ఏవో పదవుల కోసం పాటుపడుతున్నారని ఈనాడు ప్రచారం జరుగుతోంది. వారికెట్టి పదవులూ అక్కరలేదు. వారికి పదవులు ఏమైనా తక్కువనా? వారు పదవులనాశించి వచ్చిన వారు కాదు, స్వామి ప్రేమనాశించి వచ్చినవారే! ఇంక ట్రస్టుకు సంబంధించి బ్యాంకు నుండి మేము డబ్బు 'డ్రా' చేస్తున్న విధాన మును కూడా మీరు చక్కగా గుర్తించాలి. ఇరువది సంవత్సరాల నుండి **బ్యాంకు ద్వారా డబ్బు (Cash) ఒక్క దినమైనా తీయలేదు. ప్రతీ ఒక్కటి చెక్కుల ద్వారానే జరుగుతుంది. మా ఇన్‌స్టిట్యూట్ టీచర్స్ జీతాలు కూడా ప్రతీనెల బ్యాంకులో వారివారి అక్కౌంట్స్‌కే పంపుతుంటారు.** ఇంత Strictగా మేము ఉంటున్నాము, ఇంత పవిత్రంగా వినియోగిస్తున్నాము. మేము ఎవ్వరినీ అశించనక్కరలేదు. ఆశించటం లేదు. ఈ శరీరమునకు ఇప్పుడు 67 సంవత్సరములు. ఏక్షణములోను నేను చేయిజాపి ఎవ్వరినీ అడగలేదు. పవిత్రమైన కార్యము చేయాలంటే మనం ఎవ్వరినీ ఆశించ నక్కర లేదు. మన పవిత్రతే దానిని తెప్పిస్తున్నది. ఈనాడు మంచి కార్యాలు చేసే వ్యక్తులు లేకపోతున్నారు కాని, నిజంగా చేసే వ్యక్తులే ఉంటే డబ్బుకేమాత్రం కొదువలేదు.

మేము ఒక్క నయాపైస కూడా దుర్వినియోగం చేయటం లేదు. పోనీ వేరొకరెవరైనా మా డబ్బును డ్రా చేస్తున్నారనుకుంటే - మా ట్రస్టులో అట్టి అవకాశమే లేదు. ప్రతీ దానికి రెండు సంతకాలు పెట్టాలి. **ప్రతీ చెక్కులో నా సంతకం ఉండాలి, లేకుండా ఎవ్వరూ తీసుకోవడానికి వీలులేదు. "ట్రస్టుకి ఎన్నో కోట్ల రూపాయలు వచ్చాయి, అంతా తినే సారు" అని అనుకొంటున్నారు ఇది చాలా శుద్ధ అబద్ధము.** Cash (డబ్బు) ను మేము ముట్టటమే లేదు. ఎవరైనా అంతో ఇంతో ఇస్తున్నారంటే వారి ఇంటికే మా ట్రస్టువారు, బ్యాంకు మేనేజర్ వెళ్ళి వారి ద్వారానే బ్యాంకులో జమకడుతున్నారు. ఈ విషయములో ఎవ్వరూ వ్రేలెత్తి చూపడానికి వీలే లేదు. ఇలాంటి పరిస్థితిలో సెంట్రల్

సత్యసాయి సేవలు

ట్రస్టు గురించి దుష్ప్రచారం చేయటం మహాపాపం. జగత్తులో ఎక్కడ విచారించినా ఇంత పవిత్రముగా ధనము వినియోగము జరగటం లేదు. కనుకనే, **మా సంస్థ దినదినాభివృద్ధి నొందుతున్నది. ఇప్పుడే కాదు, సూర్య చంద్రాదులున్నంతవరకు మా సంస్థకు ఏమాత్రం దెబ్బలేదు.** ప్రశాంతంగా ఉండిన ఈ ప్రపంచంలో అసూయాపరులు తమ ప్రచారముల చేత ఆశాంతిని చెలరేపి లేని పాపాలను మూటకట్టుకుంటున్నారు. ఇది మంచిది కాదు. చేత నైతే ఉపకారం చేయి, లేకపోతే నోరు మూసుకొని కూర్చో. అపకారం చేయకుండా ఉండటమే పెద్ద ఉపకారము!!

ఐతే, ఇంతకాలం స్వామి దీనికి తగినటు వంటి జవాబు లివ్వలేదెందుకని ఊహించవచ్చును. ప్రతీదానికి ఒక సమయం రావాలి. కౌరవులు పాండవులను అనేక విధాలుగా బాధిస్తూ వచ్చారు; అవమానిస్తూ వచ్చారు. పాండవులలో ఒక్కొక్కరి యందు ఎంతో ఘనమైన శక్తులు ఉండినవి. కాని, వారు తమ శక్తులను ఏమాత్రం ఉపయోగ పెట్టక మౌనం వహిస్తూ వచ్చారు. కాని, ఆ మౌనాన్ని కౌరవులు పిరికితనమని భావించారు. కాదు, కాదు. సహనంలో ఉన్న మహత్తరమైన శక్తిని ఎవ్వరూ గుర్తించ లేరు. కనుకనే మా సత్యసాయి ట్రస్టు సహనంతో అంతటినీ భరించుతూ వచ్చింది; అనునయించుకొంటూ వచ్చింది. ఈ సహనమే సర్వస్వము. **"క్షమ సత్యము, క్షమ, ధర్మము, క్షమ వేదము, క్షమ అహింస, క్షమ సర్వస్వము",** ఈ క్షమలో ఉండే శక్తిని ఎవ్వరూ గుర్తించటానికి వీలు కాదు.

(స.సా.జూలై.1993 పు.172/173)

సత్యసాయి సేవలు

తమ జీవితంబు త్యాగంబు గావించు।
ధర్మాత్ములందురు ధరణియందు,
పరుల సౌఖ్యము కోరి బలియైన వారెందరో।
ఉందురు ఈ కాలమందు కూడ,
కలలో కూడ ఇలలేని సౌఖ్యంబుల్।
కలవరింపనివారు కలరు ధరణి
కాని దేహేంద్రియముల । అరికట్టి మనసునిలిపి
సత్యసేవలు కావించెడి వారు కలరా।

(సా।పు.282)

సత్యాన్వేషణ

అనాది కాలము నుండి **సత్యాన్వేషణ** నిమిత్తమై అనేకమంది మహర్షులు, మహనీయులు సాధనలు సల్పుతూ వచ్చారు. పవిత్రమైన భావమును, విశిష్టమైన విశ్వాసమును, దృఢ సంకల్పమును ఉంచుకొని సత్యాన్ని దర్శించే వరకు తమ దీక్ష వీడమని అనేకమంది మహర్షులు తపస్సు చేశారు. కొంత కాలమునకు వారే ప్రజలలో ప్రవేశించి, "ఓ ప్రజలారా! మేము భగవంతుని ప్రత్యక్షంగా చూడ గలిగాము. ఆ భగవంతుడు తేజోమయుడు; దివ్యమైన ప్రకాశముతో ఉన్నాడు; అజ్ఞానమనే తమోగుణమునకు ఆవల నున్నాడు. భగవంతుడు ఎక్కడో దూరముగా లేడు. మేము ఎక్కడో బయట వెతకలేదు. **మృణ్మయమైన ఈ దేహమందే ఆ చిన్మయమూర్తిని మేము చూడగలిగాము"** అన్నారు. కనుక దేహమును సామాన్య మైనదిగా భావించరాదు.

(ద.స.98పు.3/4)

సత్యాన్వేషణ అంటారు. ఏమిటి అన్వేషణ? అయితే సత్యము సర్వత్రా ఉంటున్నదే. దీనికి ఒక ఉదాహరణము. మన కన్నులు అమ్మను చూస్తుండాలి. అదే కన్నులు బిడ్డను చూస్తుంది. అదే కన్నులు భార్యను చూస్తుంది. అదే కన్నులు వంటి మనిషిని చూస్తుంది. అయితే తల్లిని చూచే సమయంలో ఏమనసుతో చూడాలి? బిడ్డను చేసే సమయంలో ఏభావముతో చూడాలి? భార్యను చూచే సమయంలో ఏ తలంపుతోచూడాలి. **ఇదియే సత్యాన్వేషణ. వీరు నలుగురు ఆడవారే. చూచేదికన్నులు ఒక్కటే. కాని ఎవరిని ఏదృష్టితో ఏ భావంతో చూడాలన్నదే సత్యాన్వేషణ. అదేవిధముగనే నాలుక ఉన్నది. అనత్యమాడేది,**

సత్యమాడేదే ఒకనాలుకే. పరులను దూషణ చేసేది, భూషణచేసేది ఒకనాలుకే. అయితే ఒకే నాలుక అయినప్పుడు ఎవరిని దూషించాలి? **ఎవరిని భూషించాలి? ఎవరిని ప్రేమించాలి? ఎవరిని ఆరాధించాలి? అనేటటు వంటిదే సత్యాన్వేషణ. 'సత్యాన్వేషణ' అనగా అన్నింటి యందూ ఉన్నది సత్యము,** పదార్థానికి తగిన ప్రయోగమే సత్యము.

వెన్న ఉన్నది వ్రేలితో కొట్టవచ్చు. ఇనుము ఉన్నది సుత్తితోనే కొట్టాలి. **పదార్థానికి తగిన ప్రయోగమే సత్యాన్వేషణ.** ఇనుమును వ్రేలితో కొడితే వ్రేలు కూడా తెగిపోతుంది. వెన్నను సుత్తితో కొడితే చిన్నా భిన్నమై పోతుంది. **దేనికి ఏవిధమైన దానిని ఉపయోగించాలి. అన్నదే సత్యాన్వేషణ.** కనుక సర్వత్రా ఉండిన దైవత్వాన్ని అన్వేషణ చేయడమంటే మనలో భావమార్పురావాలి. దైవభావమును మనలో ఆవిర్భవింప చేసుకొనప్పుడే సర్వుల యందు కూడనూ ఏకాత్మ భావాన్ని మనం దర్శించవచ్చు.

(శ్రీ.ఏ.1995 పు.34/35

(చూ॥ దైవాన్వేషణ)

సత్త్వగుణము

(చూ॥ త్రిగుణములు, ధ్యానము, శబ్దస్పర్శరూపరస గంధములు)

సత్త్వరజస్తమో గుణములు

(చూ॥ గుణములు)

సత్సంగము

సత్సంగములోని పవిత్రత్వము అనుభవముతో అర్థమవుతుందికానీ, కేవలము మాటలతో అర్థముకాదు. ఉన్నతస్థాయికి పోవుటకు కానీ, అధమస్థాయికి దిగజారుటకు కానీ సంగమే కారణము. **సంగమనగా స్నేహము.** ఇసుక, గాలితో స్నేహముచేసి గగనము వరకు ఎగిరిపోతుంది. అదే ఇసుక, నీటితో చేరి గుంటలోపలకు దిగిపోతుంది. ఆకాశమున కెగురుటకు ఇసుకకు రెక్కలు లేవు. క్రింద గుంటకు దిగుటకు కాళ్ళు లేవు. పైకి పోవుటకు కానీ క్రిందికి దిగజారుటకు కానీ అది గాలిలోను నీటితోను చేసిన స్నేహమే కారణము. ఇనుమును మట్టిలోవేసినపుడు త్రుప్పుపడుతుంది. దానియొక్క శక్తిని కూడను కోల్పోతుంది. అదే ఇనుమును అగ్నిలో వేసినపుడు అది తనయొక్క రూపమును మార్చుకుంటుంది. మెత్త దనమును చేకూర్చుకుంటుంది. తనలో ఉన్నటువంటి మాలిన్యమును కూడను పోగొట్టుకుంటుంది. అట్టి పరిస్థితులకు అది మట్టితోను, అగ్నితోను చేసిన స్నేహమే కారణము. కనకనే, మానవునికి సత్సంగమనేది చాలా ప్రధాన మైనది. శంకరాచార్యులు చెప్పారు.

"సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం, నిశ్చలతత్వే జీవన్ముక్తిః" అని జీవన్ముక్తికి సత్సంగమే చాలా ప్రధానమైనటువంటిది. అదే ప్రథమ సోపానము.

(ఆ.రా.పు.81/82)

"జన్మచేత జనులు పరిశుద్ధ హృదయులే
పాడుచేయుచుండె పరిసరములు
అంతరాత్మ బోధ ఆలకించుడు మీరు
సమత మమత మనుజు హక్కుకాదె!"

ప్రేమస్వరూపులారా!

జన్మించినప్పుడు మానవుని హృదయము నిర్మలంగా నిశ్చలంగా నిస్వార్థంగా ఉంటుంది. క్రమక్రమేణ పరిసరముల వాతావరణము, స్నేహితుల సంబంధం ఇత్యాది గుణముల చేత తన సౌశీల్యమును మానవుడు పోగొట్టుకుంటున్నాడు. ఈ లౌకిక సంబంధబాంధవ్యముల చేత మానవుడు తన హృదయమును కలుషితం గావించుకుంటున్నాడు. మానవుడు చెడిపోవటానికి గాని, బాగుపడుటకుగాని పరిసరముల ప్రభావం పైననే ఆధారపడి ఉంటుంది. దీనిని పురస్కరించుకొనియే ...మనం ఎట్టివారి సంఘముతో సంచరిస్తామో, వారి

యొక్క ప్రభావం మన మీద పడుతుంది. కనుక మానవుడు మంచి సంఘమును కోరుకోవాలి. ఇలాంటి మంచి సంఘములో చేరినప్పుడు మానవుడు ఉన్నత స్థితికి చేరుకుంటాడు. కనుక ఈనాడు మానవుడు తన సంకల్పం, సంపర్కముల చేతనే చెడిపోవటంగాని, బాగుపడడంగాని జరుగుతున్నది.

లోకంలో జన్మతః అంతా మంచివారే. కాని ఈ చెడు స్నేహములచేతనే మానవుడు తన జీవితాన్ని పాడుచేసుకుంటున్నాడు. ఈనాడు మంచిచెడ్డలను గురించి ఏమాత్రం విచారించటంలేదు. కాని మంచి చెడ్డలను సరీగా విచారించి మంచివారితో స్నేహం చేస్తుండాలి. కనుకనే వేదాంతము:

'సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం, నిశ్చల తత్వే జీవన్ముక్తిః'

అని బోదించింది. కనుక మన సర్వేంద్రియములు మనకు హస్తగతం కావాలనుకున్నప్పుడు సత్సంగంలో చేరాలి. 'సత్' అనగా శాశ్వతము. ఈ జగత్‌లో ఏది శాశ్వతము? అన్నీయూ అశాశ్వతములే, ఒక్కక దైవత్వం మాత్రమే శాశ్వతము. కనుక అట్టి శాశ్వతమైనటువంగటి దైవ సంబంధాన్ని మనం కల్పించునప్పుడే మన భావములు శాశ్వతమైనటువంటివిగా, ఉత్తమమైనటువంటివిగా, ఆదర్శవంతమైనటువంటివిగా అమృతతత్వమైనటువంటివిగా, అమరత్వమైనటువంటివిగా రూపొందుతాయి. కనుక మొట్టమొదట **సంఘదోషము వలన మనం చెడిపోతున్నామనే సత్యాన్ని గుర్తించటం అత్యవసరం.**

(శ్రీ.ఫి.2000 పు.7)

సత్సంగమనగా ఏమిటి? ఏదో కొంతమంది సత్పురుషులతో చేరి ఆధ్యాత్మిక విషయాలను, భగవత్తత్వమును సంప్రదించడమే సత్సంగముగా మీరు భావిస్తున్నారు. కానీ, అది కాదు సత్సంగము. ఇంతకు ముందు సచ్చిదానందం కూడా తన ప్రసంగంలో సత్సంగము గురించి చెప్పాడు.

సత్సంగత్వే నిస్సంగత్యం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం
నిశ్చల తత్వే జీవన్ముక్తిః

పదిమందితో చేరటం కాదు సత్సంగము. **'సత్ - అనగా దైవం కనుక, దైవముతో చేరడమే సత్సంగము. అంగములోని జంగము, జంగములోని సంగము, సంగములోని లింగము, ఆ లింగమే ఆత్మస్వరూపం. అంగములోని జంగమే జీవితత్వము. జంగములోని సంగమే సత్య ధర్మ శాంతి ప్రేమల సంగము. ఆ సంగములోని లింగమే ఆత్మస్వరూపం. కనుక, దైవంతో కూడుకున్నదే సత్సంగము. సత్ - దైవత్వం, చిత్ - జీవిత్వం. ఈ రెండింటి ఏకత్వమే ఆనందము. జీవబ్రహ్మ ఐక్యానుసంధానమే ఆనందము.** అందరూ ఆనందం కావాలని ఆశిస్తున్నారు. కానీ ఎక్కడ లభిస్తుంది **ఆనందం?** దండిగా ధనం సంపాదించవచ్చు. కానీ, దానితో **ఆనందం వస్తుందా?** ధనమునకు ఏ ప్రమాదం సంభవించునో అని భయం వస్తుందిగాని, ఆనందం రాదు. మీరు సర్వ విధముల కీర్తిని సంపాదించవచ్చు. కానీ కీర్తివల్ల కలిగే ఆనందం ఆనందం కాదు, అదంగా తాత్కాలికమైన ఆనందం. మీరు గొప్ప బిరుదులు అందుకోవచ్చు. కానీ, ఈ బిరుదులన్నీ వచ్చిపోయేవే. **ఏది మీ నిజమైన బిరుదు? "శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రాః"** అన్నది వేదం. కనుక, మీరు ధనంకోసం, పేరుప్రతిష్ఠలకోసం ప్రాకులాడవద్దు, దివ్యమైన ఆనందంకోసం ప్రాకులాడండి. కానీ, ఈనాటి మానవుల పరిస్థితి ఏవిధంగా ఉన్నది?

ధనము కోసం దైవధ్యానాలు బోనాలు
కోటి పన్నాగాలు పన్నేరయా
భూమి సూర్యునిచుట్టు జనులు ధనముచుట్టు
గిరగిరా తిరుగుచుంటారయా.

శాశ్వతమైన ఆనందం దైవప్రేమవల్లనే ప్రాప్తిస్తుందిగాని, ధనం వల్ల లభించదు. దైవ ప్రేమను పొందుటయే ఆనందము. అట్టి దైవత్వాన్ని పొందే నిమిత్తమై సత్సంగంలో చేరాలి. అదియే మాణిక్యవాచికర్ చేసిన జ్ఞానబోధ.

(సా.శు.పు.71/73)

సత్సంగము పామరులను పావనులుగా మారుస్తుంది.

(ము.ము.పు.37)

సత్సాంగత్యము

సత్సాంగత్యముచేతను, మహనీయుల సందర్శనము చేతను, వారి దివ్యబోధనలను ఆలకించుటచేతను, భగవదనుగ్రహముచేతను మీ మనో ప్రవృత్తులు మారవచ్చును. అంగుళీమాలునికి బుద్ధభగవానుని దర్శన సంభాషణలచేత జ్ఞానోదయం కలిగింది. రత్నాకారుడు నారద మహర్షియొక్క **ప్రబోధలచేత వాల్మీకి మహర్షిగా మారిన ఉదంతము మీకు తెలియనది కాదు.** క్షాత్ర ధర్మమును విస్మరించి, దర్మపరిరక్షణమనే కర్తవ్యాన్ని మరచి తమోగుణముచే విచారగ్రస్థుడై వ్యర్థ ప్రసంగము చేయుచున్న పార్థునికి కృష్ణుడు గీతబోధ ద్వారా కర్తవ్యాన్ని గుర్తు చేసి కురుక్షేత్ర సంగ్రామమును నడిపించిన సంగతి మీరెఱింగినదే. జనకుడు యాజ్ఞవల్క్యుని బోధనలచే సంపూర్ణ వైరాగ్యమును పొంది, దివ్యత్వమును అనుభవించి, శుద్ధ సత్వగుణ ప్రధానుడై జ్ఞానిగా నిలిచినాడు. రజోగుణ సంపన్నుడైన విశ్వామిత్రుడు వశిష్ఠుని శరణుజొచ్చి, సత్వగుణ శోభితుడై బ్రహ్మర్షి అయినాడు. ఈ ప్రకారం మీరు సాధనద్వారా భగవదనుగ్రహమును పొంది మీ జీవితాన్ని సార్థకం చేసుకోవచ్చును.

(స.సా.డి.99పు.375)

సద్గుణములు

"ఉత్సాహం సాహసం ధైర్యం, బుద్ధి శక్తిః పరాక్రమః
షడేతే యత్ర తిష్ఠన్తి తత్ర దేవస్సహాయకృత్".

ప్రేమస్వరూపులారా!

ఏరంగమునందైనను, ఏకాలమునందైనను, ఏ మానవుడైనను ఈ ఆరు సద్గుణములు కలిగినటువంటి వాడు సర్వత్రా విజయమునే సాధిస్తాడు. ఈ సద్గుణములే మానవుని సకలైశ్వర్య సంపన్నుని గావిస్తాయి. ఈ సద్గుణములు కలిగినటువంటి మానవుడ్ని సర్వ విజయములూ వరిస్తాయి. అయితే ఈ సద్గుణములకు అనేక విధములైన అవాంతరములు అడ్డు తగులుతూ ఉంటాయి. అవాంతరములు, కష్టములు, నష్టములు, విచారములు ఇవి ఒక విధంగా తమ భవిష్యత్తుకు ఉన్నత సోపానములే. **వీటినన్నింటిని ధైర్యంతో, ఆత్మ విశ్వాసంతో ఎదుర్కొని తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగిపోవటం నేర్చుకోవాలి.**

(శ్రీ.మా.97 పు.5)

(చూ॥ అనాధుడు, అలవర్చుకోవాలి, చింత, సాయి శరీరము, స్త్రీజాతి)

సద్భావములు

(చూ॥ దివ్యప్రకటనలు)

సద్వినియోగము

చేసి చూపించాలి. పరుల తృప్తి కోసం కాదు. మన తృప్తికోసం చేయాలి. చేసిన పని, చెప్పే మాట హృదయ సాక్షిగా ఉండాలి.

నేను చెప్పేది నా కోసం కాదు. కేవలం జగత్ కల్యాణం. జనుల సేవ. గ్రామాల సేవ చేస్తుంటే మీ జన్మ సార్థక మవుతుంది. పూర్వపు ఋషులు ఎన్నో విధముల శక్తిని సాధించుకోంటూ వచ్చారు. **షేక్స్పియరు గొప్ప నాటక కర్త. అతని నాటకాలు హృదయాన్ని కరగింప జేస్తాయి. అతను మీరు పశుబలాన్ని, రాక్షస శక్తి ఎంతైనా సంపాదించవచ్చు. కాని, సంపాదించిన బలాన్ని రాక్షసుని వలె ఉపయోగించకండి,** అన్నాడు. దేహబలాన్ని పుష్టిగా సంపాదించుకోండి. తప్పులేదు. కాని, దానిని రాక్షసుని వలె కాకుండా మానవుని వలె వినియోగించాలి. అది నిజమైన బలం. **ధన బలం. భుజబలం, బుద్ధిబలం, జనబలం దుర్వినియోగం చేసుకోకూడదు. సద్వినియోగం చేసుకోవాలి. సద్వినియోగం చేసుకోవటానికి మనిషి జన్మ వచ్చింది.** దేహమనే పడవకు చిల్లులు పడి శిధిలం కాకముందే గట్టుకు **చేరడానికి ప్రయత్నించాలి.**

(వ.1984 పు.104)

దివ్యత్వము మానవాకారము ధరించినంత మాత్రమున అలక్ష్యంగా చూడటం మంచిదికాదు. చిక్కిన అవకాశాన్ని

దక్కించుకొని తద్ద్వారా ధన్యులు కావడానికి కృషిచేయాలి. ఇది తిరిగి చిక్కునది కాదు.

"చిక్కిన సాయిని వక్కలేయక చక్క చేసుకోండి
పోయిన చిక్కదు పర్తీశుని ఈ పాదసేవయండి
భక్తిని ఇచ్చి శక్తిలో ముంచి ముక్తి జేర్చునండి
ఏకమనసుతో నమ్మి సాయిని ఎంచి కొలువబోండి
ఇతరుల మాటల నింపుగ నమ్మి కొంపతీయకండి"

చిక్కిన అవకాశాన్ని మీరు సద్వినియోగం చేసుకోండి. భగవంతునికి ఏది ఇష్టమో దానిని ఆచరించండి. భగవంతుడు కోరేది నిశ్చల నిర్మల నిస్స్వార్థ ప్రేమ ఒక్కటే. ఈ ప్రేమకు ప్రతిఫలం తిరిగి ఎంతైనా ఇస్తాడు. భగవంతుడు. కాని, ప్రతిఫలం నిమిత్తమై మీరు ప్రేమించకండి. అలా చేస్తే అది వ్యాపారంగా మారి పోతుంది. **"ఓ భగవంతుడా! నా కోరిక నెరవేర్చు. నీకు రెండు కొబ్బరికాయలు కొడతాను" అని కండీషన్లు పెట్టకూడదు.** పవిత్రమైన గోపీగోపాలుర భక్తిలో వేయింట ఒక భాగమైనా మీరు అనుభవించడానికి కృషి చేయండి.

(స.సా.అ.95 పు.266)

సన్‌ఇన్‌లాలు (Sons-in law)

(చూ॥ దక్షుడు)

సనాతన ధర్మము

సనాతన ధర్మము అతి ప్రాచీనమైనది. ఇది ఆచరణ యోగ్యమై అభీష్టము ననుసరించి దివ్యానుభవము నందించునట్టిది. టైలరు ఎవరి కొలతలకు తగిన డ్రస్సు వారికి కుట్టిస్తాడు కదా. అట్లే సనాతన ధర్మము మానవానుకూలములను బట్టి, వివిధ మనో ప్రవృత్తులను బట్టి, సంస్కారములను బట్టి వేర్వేరు మార్గములను నిర్దేశిస్తుంది. కొందరికి రామునిపైన గురి ఉంటుంది. మరికొందరికి కృష్ణునిపైన గురి ఉంటుంది. ఇష్టదేవతారాధన వారివారి అభిరుచులపై ఆధారపడి ఉంటుంది. ఇదే వైవిధ్యానికి కారణాలు.

మీరు **నాదస్వరం వినే ఉంటారు. ఆ వాయిద్యంతో అన్ని రాగములు. కృతులు, పాటలు వినిపించవచ్చు.** కానీ, **శృతిపెట్టే ఒకే ఒక ధ్వనిని వినిపిస్తుంది. అదేవిధంగా, ఒకే పద్ధతిలో వినిపించే శృతిపెట్టెవంటిది మతము. సనాతన ధర్మమును అన్ని రాగాలు వినిపించే నాదస్వరముతో పోల్చవచ్చును** యూనివర్సిటీలో అన్ని రకములైన కోర్సులుంటాయి. B.Sc డీగ్రీ ఒక్కటే అయినప్పటికీ గ్రూపులు భిన్నంగా వుంటాయి. M.P.C కావచ్చును లేక C.B.Z కావచ్చును. అలాగే, వ్యాసుడు స్థాపించిన యూనివర్సిటీలో వేదాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు అన్నీ ఉన్నాయి. మీరు ఏ కోర్సు అయినా తీసుకోవచ్చు. ఇది సనాతన ధర్మ వైవిధ్యంలోని మర్మము.

ఒక ఉదాహరణ: ఒక మెడికల్ షాప్ యజమానికి, ఒక హోటల్ యజమానికి ఒకేసారి తలనొప్పి వచ్చింది. మెడికల్ షాప్ యజమాని తన తలనొప్పి తగ్గటానికి ఒక కప్పు కాఫీకోసం హోటల్‌కు వచ్చాడు; హోటల్ యజమాని తన తలనొప్పి తగ్గటానికి టాబ్లెట్‌కోసం మెడికల్ షాప్‌కు వచ్చాడు. మెడికల్ షాప్ యజమానికి కాఫీపైన నమ్మకం, కాఫీ హోటల్ యజమానికి టాబ్లెట్‌పైన నమ్మకం. అలాగే **మీ విశ్వాసానికి తగిన మార్గాన్ని అనుసరించి తరించడానికే సనాతన ధర్మంలో వివిధ సాధనా మార్గాలు, శాస్త్రాలు ఏర్పడ్డాయి.**

(స.సా.సె.99పు.249)

లోకమున సర్వ మతములకు,సర్వ సాంప్రదాయములకు, సర్వ ధర్మములకు సనాతన ధర్మమే తల్లి. అట్టి తల్లి పుట్టినిల్లే ఈ భారతదేశము. ఆహా! భారతీయులెంతటి భాగ్యశాలురో ఈ భారతదేశమెంత భవ్యమైనదో: యోచింపుడు.

లోకమంతయు లోకేశుని దేహముగా ఉన్నను, ఆ దేహమున ప్రత్యేక సూత్రమయిన నేత్రములవంటిది, ఈ భారతదేశము నేత్ర హీనమయిన దేహము పరాధీనమే కదా? భారతదేశము వేదశాస్త్రములను నేత్రములతో అలంకరింపబడినది. అందుమూలముననే భారతీయులు

పొందినంత సంస్కారమును మరేదేశీయులు పొందలేరని చెప్పుటలో సందియము లేదు. **సర్వ మత సత్యత్వమును, సహనమును బోధించిన సనాతన ధర్మమే** సర్వుల ధర్మము. వివిధ ప్రదేశములలో పుట్టి వివిధ మార్గములుగా ప్రవహించి, కడకు నదులు సముద్రమున ఎట్లు చేరుచున్నవో, అటులనే వివిధ ప్రదేశములలో ఉద్భవించి, వివిధ ధర్మమార్గముల ప్రవర్తించి, వివిధారాధనలతో సర్వేశ్వరుని సన్నిధి అను సాగరమును చేరుచున్నారు. **నానాదిశలకు ప్రాకునట్టి ఈ భిన్న మార్గములన్నియు కలియునట్టి కేంద్రస్థానమే సనాతన ధర్మము.** సర్వమతములవారు సత్యవాక్పరులుగా ఉండుట, ఈర్ష్వా కోపారహితులై యుండుట. ప్రేమహృదయులై ప్రవర్తించుట, ఇట్టి సనాతన ధర్మము అనుష్ఠించవలెను. వీటిని **పట్టువిడక పాధించువాడే భారతీయుడు.** ఆదికాలము నుండియు నేటివరకు అగ్రస్థానమును వహించి, శాశ్వతముగా నిలిచియుండునది ఒక్కహిందూ మతము మాత్రమే. నాటి చారిత్రక యుగములనుండియు నాశమెరుంగని వారు ఒక్క భారతీయులే. ప్రేమ, సమంజసము, కృతజ్ఞతా సహితమగు జీవితమును ఈ మతమునందు గడిపినటుల మరేమతము నందును గడుపలేదు. తత్త్వావిష్కరణమూలమున, వేదమూలమున హిందువులు వారి ధర్మమును పొందియున్నారు. అది అంత్యములులేని వేదశాస్త్రముల సారమును గ్రోలినవారు ఈ భారతీయులు. ఇట్టి పవిత్ర భారతదేశము లోకమునకు ఆధ్యాత్మిక గనివంటిది. ఈ బ్రహ్మాండమైన భూగర్భమున ఒక్కొక్క ప్రదేశమందు ఒక్కొక్క లోహము కనుపించినట్లే **ఈ భారతదేశమందు సర్వశాస్త్రవేద ఉపనిషత్ తత్త్వములసారమైన సనాతన ధర్మము ఉత్పత్తి అయినది.** భారతీయుల భాగ్యమా అన్నట్లు వారి పుట్టినిల్లుగా ఉన్న **ఈ సనాతన ధర్మపు గనులు ఎచ్చట ప్రారంభమవునో అచ్చటనే అందునిమిత్తమైన నాయకులు, విచారకులు, విమర్శకులు, ప్రచారకులు, ప్రబోధకులు ఉద్భవింతురు.** అట్టి మతమునకు చెందిన వారగు మహా పురుషులు, నిష్కామ కర్మయోగులు. పండితోత్తములు, ప్రజ్ఞావంతులు, ఋషులు, దైవాంశ సంభూతులు, యజ్ఞ పురుషులు ఈ భారతదేశమందే అనేకులు ఉద్భవించిరి. వీరల ఆధారముల వలననే ఇట్టి అనుభవసిద్ధమైన ఆధ్యాత్మికసారము దేశమంతయు ప్రవహించినది. ఈరీతిగా లోకమంతయు సనాతన ధర్మము సారవంతమై అభివృద్ధిచెంది నది. ఎన్ని దేశముల ప్రవహించినను, **ఆదిస్థానము భారతదేశమే.** నేడు లోకమున చూడుడు. ఏదో కొన్ని కొన్ని కొత్తరకమైనటువంటి మిషన్‌లు కార్లు, ఇంజనులు, ఇతర దేశములలో కనిపెట్టి వాటిని తదితర దేశములకు ఎగుమతిచేసినను, వాటి ఆది స్థానము మాత్రము మరువరానిదిగా నున్నది. వాటి అనుభవ ఆధారమూలముననే అట్టి మిషనులే అట్టి కార్లే తయారు చేయవచ్చును. అయితే ఆది ఆధారములేక ఏమియు చేయలేరు. అటులనే భారతదేశమందు సనాతన ధర్మము ఉద్భవించి, దాని ప్రవాహమును మహాపురుషుల మూలమున, వారు రచించిన శాస్త్ర గ్రంథమూలమున పరదేశీయులు పొందిరేకానీ ఆదిస్థానాధారమును వీడలేదు. అది అసాధ్యము, అట్టి పావనధర్మములను పాలతో పెంపబడిన పుణ్యపురుషుల పుట్టినిల్లయిన ఈ భారతదేశమున నేటి నవీన పద్ధతులే మన ధర్మమని, సనాతన ధర్మపు సారమును రుచిచూడక, దాని అర్థమును సహితము తెలిసికొనక, వ్యర్థపు వాదనలతో దానిని మరుగుపరచి, పరదేశీయులకు ఒప్పజెప్పి వగచుచుండుట చూచి విచారముగా నున్నది. ఇందుకు కారణము సరియైన మార్గదర్శకులు లేకుండుటే. ఉండినను ఇప్పటి నవీన పద్ధతులకు ప్రవేశమిచ్చి వాటి వాసనలమూలమున తరిగిపోవుచున్నారు. ఇవి కేవలము సంత పకోడీలవంటివి. వట్టి వాసనలను పట్టి ఒళ్ళును పాడుచేసుకొందురు కానీ యదార్థపు పదార్థమును పరిశీలించరు. సనాతన ధర్మమైన స్వధర్మమునందు ఎంతో పరిశుభ్రమైన పదార్థముండియు ఆడంబరముచే ఆకర్షించు వాసనలు లేకపోవుటె ఇట్టి ఆశ్రద్ధకు కారణము. **సత్యమునకు అట్టి ఆడంబరములు**

సనాతన మతము

అనవసరము. రుచియే ప్రధానము. ఇప్పటి మానవులు కేవలము వాసనా ఇష్టులై చరించుటె ఇందుకు మూలము. యదార్థమును వదలి పరధర్మముల పాటించుట పరిపాటయినది. ఇది చాలా పొరపాటు. ఆకర్షించు వాసనలు, పైపద్ధతులను చూచి భ్రమించుట భారతీయులకు ధర్మవిర్ధము. సనాతన ధర్మములో లేని సత్యము, పరమప్రేమ మరేధర్మమందును లేవు, రావు, సనాతన ధర్మము సత్యస్వరూపము, అది సర్వుల సొత్తు. పవిత్రతకు ఏనీమములు ఉండవు. పవిత్రత ఒక్కటియే రెండుకాదు కదా?

అట్టి సనాతన ధర్మమును అనుష్టించి జీవన్ముక్తులైనవారు, భగవదనుగ్రహమును పొందినవారు. సత్యస్వరూపమును తెలిసికొన్నవారు. **సాక్షాత్కారమును సాధించినవారు భారతీయులే. ఆ పవిత్రస్థానమును పొందినవారలను జాతిమత లింగభేదములులేక భారతీయులే పూజించినారు.** అట్టి సమయమున పవిత్రత సర్వనిబంధనలను భస్మముచేయును.కాని ఆ స్థానమును పొందకమునుపే సర్వము సమానభావమున తలంచ సాధ్యముకానిది. అయితే అట్టి పవిత్ర సనాతనధర్మమును సాధించుటకు సాహసించవలెను. ఇది భారతీయుల రక్తధర్మము.

((ప్రే.వా. పు.34/38)

"వేదములు, ఉపనిషత్తులు
సనాతన ధర్మ హర్మ్యమునకు
పునాదులు, సాక్షాత్తూ
భగవంతుడే ఈ సనాతన ధర్మమునకు
ప్రవక్త, ఆయనే వ్యవస్థాపకుడు.
మానవుని సామ్రాజ్యంలో
సనాతన ధర్మమే చట్టము,
వేదములే రాజ్యాంగము".

(దై.మ. పు.139)

(చూ॥ మానవుడు)

సనాతన మతము

అసలు ఉపనిషత్తులనుండే భూగోళిక; జ్యోతిష; అర్థ శాస్త్రములునూ; స్కంద; శివ, గరుడ మున్నగు 18 పురాణములునూ తాంత్రిక మాంత్రిక, భక్తి, జ్ఞాన, కర్మయోగములునూ మహా ఋషులచే లోకమునకు అందింపబడినవి. వేదోపనిషత్తులే సనాతన మతములు. **ఇందులో ఒక విచిత్రము, ఇతర మతములవలే మన భారతదేశమున మతస్థాపకులు కనుపించరు. ఆ కనుపించని మతగురువే; స్థాపకుడే; జ్ఞానస్వరూపుడగు ఈశ్వరుడు. అతడే మన ప్రవక్త; అతని అనుగ్రహమును పొంది అతని అంశలో ఐక్యమైన మహాఋషులే మత ప్రవక్తలు.కాని మానవనైతిక ధర్మములు క్షీణించుటచేతనే, మన భారతదేశమున పెక్కుచోట్ల ఈశ్వరుడు మానవ రూపమున ప్రవక్తగా నుద్భవించుచున్నాడు. ఈ సత్యజ్ఞానమును మానవుడు ఉననిషత్తులద్వారానే తెలిసికొన సాధ్యమగును.**

(ఉ.వా.పు.6/7)

సనాతన సారథి

"సనాతన సారథి" నా సంకల్పము, నా ఉత్సాహము, నా ఆనందముల ఫలితమే. నేను ఏదైన నిర్ణయం తీసికొంటే నా మార్గానికి అడ్డు ఉండదు. పరమాత్మ తత్వం మానవ శరీరం ధరించి వచ్చినప్పుడు మహాశక్తితో, మహాస్వరూపంతో కాక మాయాశక్తితో మాయా స్వరూపంతో ఉంటుంది. అందువల్ల చంచలత్వం కలిగిన మీకు దానిని కనుగొనటం కష్టమవుతుంది. ఒక్కసారి మీరు ఆ తత్వాన్ని గ్రహించారా అన్ని సందేహాలు పటాపంచలవుతాయి.

(శ్రీ.వ. 61-62 పు. 14)

వేదములు, శాస్త్రములు, విశ్వాసాన్ని పెంపొందించే ఇతర మతగ్రంధాలు అన్యాయం, అసత్యం, అవనీతి క్రూరత్వం, హింస మొదలగు శక్తులపైపోరాడుతున్న విధంగా ఈనాటి నుండీ మన **"సనాతనసారథి"** కూడా **సత్యమేవజయతే అన్న విధంగా సత్యముజయించేలా విజయపథంలో నడిపిస్తుంది.** ఈపత్రిక స్థాపించటానికి ముఖ్యకారణం ఇదే. లోకకల్యాణం కోసమై ఈ పత్రిక పోరాడుతుంది.

విశ్వవ్యాప్తంగా ఆనందం సంస్థాపించబడినప్పుడు ఈ పత్రిక విజయనీతికలను ఆలపించి తీరుతుంది.''.

(స.శి.సు.నా.పు.119)

నేటి నుండి "మన సనాతన సారథి'' పురాతన వేదశాస్త్ర ఉపనిషత్తులను సైన్యముతో అన్యాయ, అక్రమ, అసత్య అనాచారములనబడు అహంకారమును హతమార్చ బయలుదేరినది.

ఈ సారధి లోక క్షేమమునకు పోరాడి జయభేరి మ్రోగించి, జనుల ఆనందమునకు ఆధారమగుగాక!

(మహాశివరాత్రి 1958)

(స.సా.60వ జన్మదినోత్సవ సమర్పణ మొదటి పుట)

గొప్పవారు తమ స్థిరత్వమును యెన్నడూ కోల్పోరు. ప్రశాంతిస్థితిని కాపాడుకొనుట ద్వారా మనము ఆటంకములను అనుకూలముగా మార్చుకొనవచ్చును. ఎప్పుడు ఎట్టి సమయమందైననూ నిరుత్సాహమునకు చోటివ్వరాదు.

ఎప్పుడు మానవుడు సమస్తమును ఆత్మయేనని అనుభూతికి తెచ్చుకొనునో అప్పుడిక తా నెట్టి పదార్థమును ఆశించడు.

అంతయూ తానేయని నిరంతరానందమును అనుభవించును.

అట్టి స్థితిని పొందుటే మానవుని ప్రధాన కర్తవ్యము.

అట్టిదాని నందించుటే "సనాతన సారథి'' విధి. ఇదే భక్తుల పాలిట పెన్నిధి.

(60వ జన్మదిన సంచిక రెండవ పుట.)

రాక్షసత్వంలో నడపబడే అన్యాయం, అక్రమం, అసత్యం, క్రూరత్వం అనే పాశవిక బలాలపై ఆధ్యాత్మిక ప్రసంగాలు, ఆధ్యాత్మిక చింతన అనే సైన్యం సహాయంతో ఈ 'సనాతన సారథి' తిరుగుబాటు చేస్తుంది. ప్రపంచంలో సుస్థిరశాంతి స్థాపనకై ఈ సారథి పోరాటం కొనసాగుతుంది. తన విజయ ధ్వంకా మ్రోగిస్తూ మానవలోకానికి ఆనందం ప్రాసాదిస్తుంది.

(శ్రీ.స.ప్రే.ప్ర.పు.220/221)

శ్రీ సత్యసాయిబాబా Sri Satya Sai Baba SSSB అంటే మొదటి **S-Sangha (సంఘము-Society)**. మొదటి 'S'సంఘాన్ని ఉద్దేశించి ఉన్నది. సంఘాన్ని ప్రకాశవంతం చేయటానికి, వ్యక్తిగత ఉన్నతికి సాధనంగా సంఘ సమైక్యతను ఉపయోగించటం ద్వారా సంఘంలో ఒకడిగా, సంఘంద్వారా పరమోన్నతి పొందటానికి ఉపకరిస్తుంది. **రెండవ 's' సంస్కృతిని సూచిస్తుంది.** మానవసహజ స్వభావమైన మానవత, ఉత్సాహము, రసస్ఫూర్తి మొదలగు భావాలను ఉన్నత స్థాయికి కొనిపోవటానికి కృషి చేసి వ్యక్తిగత పవిత్రత, మాధుర్యమును పెంపొందింప చేయటం ద్వారా సంఘంలో ఐకమత్యమును, అన్యోన్యతను, మధురిమను కలుగచేయటాన్ని సూచిస్తుంది.

మూడవ 's' సనాతనత్వాన్ని తెలియచేస్తుంది. అనాదిగా వస్తున్న మానవత్వపు విలువలను పెంపొందించటాన్ని సూచిస్తుంది.

అన్ని ప్రాంతాలకు అన్ని యుగాలకు చెందిన అనేకమంది తత్వవేత్తలు, సాధువులు, ఋషులు మొదలైన వారిచే కనుగొనబడిన, వర్ణించబడిన మానవత్వపు విలువలను పరిపూర్ణం చెయ్యటానికి, సంరక్షించటానికి సంకల్పించాను. ఇక ఆఖరి పదమైన **'బాబా'లో మొదటి అక్షరం 'బి'** అనేది 'Block'ను తెలియచేస్తుంది. మొదటి మూడు 'యస్'లు మానవజీవితోద్ధారణకై స్వామి అవలంబిస్తున్న పధకాన్ని తెలియచేస్తుంటే ఈ 'బి' అనే అక్షరం దానికి సంబంధించని ఏ యితర విషయమైనా 'Blocked' అక్కరలేనిది అని తెలియ చేస్తోంది. అవితప్ప మరే యితర విషయాలైనా అనవసరము, ఆప్రస్తుతము.

కాబట్టి సనాతన సారథి ఈ మూడు అంశాలపైనా ఆధారపడి ప్రచురించబడుతున్నది. ఇందుకు సంబంధించని ఏవిధమైనా ప్రచురణకు అనర్హమే అవసరమే.

(శ్రీ.స.ప్రే.ప్ర.పు.222)

దైవభక్తి, మత, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన రచనలు మాత్రమే పాఠకులు ప్రచురణకు పంపించాలి. చెప్పే విషయంకాని, వ్రాసే విషయం కాని, ఆచరణలో స్వయంగా పెట్టగలిగినవారే అటువంటి విషయాలను ప్రచురణకు పంపించాలి. రాజకీయమైన, బహి రంగమైన

సనాతన సంప్రదాయములు

విషయాలకు సంబంధించిన వార్తలు కాని, అట్టి వార్తలపై వ్యాఖ్యలు కాని ప్రచురణకు పంపించరాదు. మొరటు పదజాలం కాని, వ్యక్తిగత దూషణలు కాని రచనలలో చోటు చేసుకొనరాదు.

(శ్రీ.స.ప్రే.ప్ర.పు.225)

(చూ॥ కస్తూరి)

సనాతన సంప్రదాయములు

భారతీయ సనాతన సంప్రదాయములన్నీ అంతరార్థము కలిగినట్టివి. అనాదిగా వస్తున్న ఆచార విధులన్నీ మానవునికి దైవానుభూతిని అందించునట్టివే. కానీ, కాలానుగతిన వానిని విస్మరించి, బాహ్యాడంబరములకు లోనై లక్ష్యానికి దూరమవుతున్నారు. నేటి ఆస్తికులు. కనుకనే క్రతువులన్నీ యాంత్రికములైనవి. వీనిని సరియైన పద్ధతిలో బోధించే వారు తెలిసినవారు, ఆచరించేవారు చాల అరుదు. **మనిషి కాదు మారవలసినది, మనస్సు మారాలి.** నీవు దూర ప్రదేశానికి ప్రయాణమైనప్పుడు దారిలో భోజన సదుపాయం లేక వస్తున్నావనుకో. అది ఉపవాస మవుతుందా? అనారోగ్య కారణంగా నీవు భోజనం చేయలేదనుకో. అది ఉపవాస మవుతుందా? ఆధ్యాత్మిక ప్రయోజనాన్నందిస్తుందా? భగవంతుడు **నీలోనే ఉన్నాడని భావించడమే నిజమైన ఉపవాసము. 'ఉప' అనగా, సమీపము; 'వాసము' అనగా నివసించుట. కనుక, అనునిత్యము భగవద్భావనలో, ఆత్మచింతనలో ఉండుటయే ఉపవాసము.** కొంతమంది ఏకాదశి రోజున ఉపవాస ముంటారు. ఆ రోజున ఉమ్మిని కూడా మింగరు. తరువాత రోజూ తినేదానికంటే రెట్టింపు భుజిస్తారు! మరి కొందరు ఏకాదశి ఉపవాసం ఉండాలని నలభై దోసెలకు సరిపడా పిండి కలుపుతారుः ఇంకా జాగరణ. దేనికి ఈ జాగరణ? ఎందుకు? విషయములపై, ప్రాపంచిక సుఖములపై నిర్లప్తునివై నిద్రించి ఆత్మానుభవంపై జాగరూకతతో వర్తించడమే నిజమైన జాగరణ. ఆత్మవిషయంలో మేల్కొని ఉండు. **నిత్య సత్యమైన దైవవిషయంలో సదా అప్రమత్తుడవై ఉండు. ఇదే జాగరణ.** అంతేగాని, నిద్ర మానుకుని రాత్రంతా మేలుకొని ఉండడం జాగరణ కానేరదు. రాత్రంతా పేకాట ఆడుతూ, సినిమాలు చూస్తూ మేలుకోవడం జాగరణ అవుతుందా? వాచ్‌మెన్లు హాస్పిటల్‌లో పని చేసే నర్సులు, రైల్వే స్టేషన్ మాస్టర్లు రాత్రంతా మేల్కొని డ్యూటీ చేస్తుంటారు. అది జాగరణ అవుతుందా? కానే కాదు. **భగవద్విషయంలో జాగరూకతతో వర్తించడమే నిజమైన జాగరణ.** ఈ రకంగా అర్థం చేసుకొనక బాహ్యాచారంగా పాటించడంచేత మన క్రతువులు, ఆచారాలు హాస్యాస్పదములైనాయి.

(స.సా.న.99పు.342)

సన్నిహిత సంబంధ బాంధవ్యము

పాండవులకు నాకు ఉన్న సన్నిహితసంబంధబాంధవ్యము నేను చెప్తున్నాను. ఎవరు నన్ను ఆశ్రయిస్తారో, ఎవరు నన్ను సరియైన మార్గములో ఎన్నుకుంటారో, ఎవరు నాకు శరణాగతి అవుతారో వారిని నేను ఆదరించక తప్పదు. ఒకానొక సమయములో నారదుడు అడిగాడు. నారాయణా! నీవు ఎక్కడ ఉంటావో నాకు తెలియదు. నీకు Branch offices లు చాలా ఉన్నాయి. నీ సరియైన అడ్రసు నాకివ్వమన్నాడు. ఇది నా అడ్రసు అన్నాను. **'మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద'** ఎవరు తమ హృదయములందు నన్ను పరిపూర్ణమైన ప్రేమతో చింతిస్తుంటారో అక్కడే నేను శాశ్వతంగా ఉంటాను. ఇది Branch office కాదు, హెడ్ ఆఫీసే. పాండవులకు నాకు ఉన్న సంబంధము నీకు చెప్తున్నాను వినుమన్నాడు. ఇది దేహము దీనికి రెండు కాళ్ళు ఉన్నాయి, కడుపొకటి ఉంటుండాది, భుజములు రెండు ఉన్నాయి, ఒక తల ఉంటుండాది. ఇవన్నీ చేరితేనే దేహము. **ధర్మజుడు శిరస్సు, అర్జునుడు భుజములు, భీముడు కడుపు, నకుల సహదేవులు కాళ్ళు. ఈ దేశములో కృష్ణుడు గుండెవంటివాడు. ఈ గుండె లేకపోతే దేహము లేదు. దేహము లేకపోతే గుండె కనిపించదు. కనుక పాండవులకు**

నాకు ఉన్న సన్నిహితసంబంధబాంధవ్యమిది అన్నాడు. అదే విధముగనే దేహము, ఇంద్రియములు, మనస్సు. బుద్ధి ఈ అన్నింటితోపాటు చేరుకున్నదే ఆత్మ. ఇవన్నీ కలిసినదే ఒక రూపము. 'ఏకం సత్' ఉన్నది ఒక్కటే.

(బృ.త్ర.పు.67)

సన్మార్గతత్వము

(చూ॥ శాశ్వతము)

సన్యాసము

ప్రకృతి సంబంధమైన సర్వ విషయ వాసనలకు అతీతుడై, సర్వదా సర్వకాలము, సర్వత్ర సర్వేశ్వర చింతనే తన శ్వాసయని భావించి, ఆచరించి, ఆనందించునదే సన్యాసములోని నిజసారము. గృహస్థమును రోసి, జననీ జనక సతీసుతులను బంధు మిత్ర ధన కనక వస్తు వాహనములు, జనన మరణాది దుఃఖములు యావత్తు అస్థిరములని ధృడముగా తెలిసికొని రాగవిరాగదూరుడై, శిక యజ్ఞోపవీతముల విసర్జించి, కాషాయ వస్త్రములను ధరించి, గ్రామవాసము చేయక చిక్కిన అల్పాహారాలు భుజించి, చిక్కనిచో ఆహారములేదని చింతించక, తిన్న చోట తినక నిద్రించినచోట నిద్రించక, **నిద్రాహారములను జయించి, భగవంతుని నిరంతరము ధ్యానించుచు, జపించుచు, కాలప్రమాణములను మీరి వర్తించునదే నిజమైన సన్యాస మనబడును.**

(ప్ర.శో.వా.పు.11/12)

ఆనాటి పరిస్థితులను బట్టి కాలడిప్రజలు శంకరులవారు తన తల్లికి అంత్యక్రియలు చేయడాన్ని వ్యతిరేకించారు. ఎందుచేతనంటే సన్యాసియైనవాడు కర్మకాండలో ప్రవేశించకూడదు. అసలు సన్యాసమనగా ఏమిటి? **సమస్త ఆశలను త్యజించడమే సన్యాసము.** విద్యార్థులకు అర్థమయ్యే నిమిత్తమై నేను కొంచెం లోతుగా వివరించవలసి వస్తున్నది. సన్న్యాసము స్వీకరించేవారు **మొట్టమొదట విరజాహోమము చేస్తారు. అనగా తాము మరణించినట్లు భావించి తమ శ్రాద్ధకర్మలు తామే చేసుకొని మాతనమైన నామమును, సనాతనమైన వేషమును దరిస్తారు.** పూర్వపు రూపము పోతుంది,పూర్వపు నామము కూడా పోతుంది, క్రొత్తపేరు వస్తుంది. లోకానంద, నాగానంద అని తమ పేరు చివర ఆనందాన్ని తగుల్చుకుంటారుకాని వారిలో కించిత్తైనా ఆనంద ముండదు! ఈవిధంగా విరజాహోమంలో తమ తద్దినమును తామే పెట్టుకున్న తరువాత ఇంక తల్లి ఎక్కడ! తండ్రి ఎక్కడ! కనుకనే సన్న్యాసికి ఎవరితోను సంబంధ ముండకూడదు, తాను కర్మకాండలో ప్రవేశించకూడదు.

(స.సా.జూలై.97పు.185)

సన్యాసమంటే ఏమిటి? **కేవలము 'గుణము మారాలికానీ గుడ్డలు మారితే ప్రయోజనం లేదు. మనస్సు మారాలి కాని, మనిషి మారితే ప్రయోజనం లేదు'.** కనుకనే, **తాను సర్వేంద్రియములను అరికట్టి, సర్వసంగపరిత్యాగి అయినటువంటివాడే సన్యాసి.** ఈనాడు సన్యాసులకున్నన్ని ఆశలు గృహస్థునకు కూడా లేవు. దేనికి ఈ ఆశలు? ఎవరికోసం ఈ ఆశలు? **"ఇదంతా తొమ్మిది చిల్లుల తోలు తిత్తియే కాని కాంతి కల్గిన వజ్రఘటముకాదు."** నిమిషనిమిషమునకు నీరు లూరునే కాని పునుకు జివ్వాజీలు పుట్టబోవు. **'కడుపులోని మలము కడమెల్ల ఎముకలు తరచిచూడ పైన మురికి తోలు' కనుక మరణమునకు భయపడరాదు. అభివృద్ధికి పొంగిపోరాదు. ఏమిటి ఈ అభివృద్ధులు? మరణాలు? ఇవికేవలము జీవితములో తరంగాలు, సముద్రములో నుండి వచ్చేటటువంటి తరంగముల వంటివి. పుట్టిన దానికి చావు తప్పదు. కనుకనే ఈ రెండూ సహజమైనవేకాని దీనికి విచారించనక్కరలేదు.** అయితే ఈ ప్రాకృతమైన జగత్తునందు, జీవించు నంతవరకు కూడానూ Ideal boy, Ideal girl మంచి ఆదర్శవంతమైనటువంటి జీవితంగా మనం జీవించాలి. కాని ఈనాటి విద్యార్థినీ విద్యార్థులు ఈ భౌతిక ప్రభావమునకు మునిగి, ఈ

సన్యాసి

లౌకిక వాంఛలలో మునిగి కేవలము తాత్కాలికమైన జీవితము గడిపే నిమిత్తమై కృషి చేస్తున్నారు. చదివిన చదువులు దేనినిమిత్తం? పొట్టకూటికా? కాదు.. కాదు... పొట్టకూడు కూడా అవసరమే! కాని చదివిన చదువును పదిమందికి ఆదర్శవంత మయినటువంటి మార్గములో దీనిని అందించటానికి ప్రయత్నించాలి. **"సద్గుణములు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనములు నేర్పునదే విద్య విద్యార్థి నేర్వవలయు".**

(శ్రీ.మా.95.పు.8)

(చూ॥ మానవజీవితము)

సన్యాసి

(చూ॥ పండితుడు, సన్యాసి, సన్యాసము)

సమత్వము

స్వార్థలూ, పోటీలూ లేకుండా అందరిలో సమత్వం సహకారం పెంపొందించటం, ఇది కేవలం ప్రేమ, సత్యాల ద్వారాసాధ్యం. ముఖ్యం అయిన విషయం ఏమిటంటే, యిరువర్గాలవాళ్లని ఒకే ఒకవర్గంగా సమ్మిశితం చెయ్యటం వాళ్లని ఒకే తాటిమీద నడిపించటం అసలైన సమస్య. ధనవంతులు ఒకవైపు, బీదవాళ్లు ఒకవైపు ఎవరికివారు విడివిడిగా ప్రత్యేకంగా నివసిస్తుంటారు. వాళ్లని ఒకదగ్గరకు చేర్చేదెట్లా?

నేను వాళ్ల మధ్యవుండే బీద గొప్పభావాలు పోయేవిధంగా, వారిలో ఏకత్వభావాలు వృద్ధిచెందే విధంగాను పనిచేస్తున్నాను. ఈ ఆశ్రమంలో అందరూ కలిసి మెలసి సమభావంతో పని చెయ్యటం మీరు చూడవచ్చు. ఇక్కడ గొప్పవాళ్ళకి ప్రత్యేకమైన సదుపాయాలేమీ లేవు. వాళ్లు బీదవారిలాగే జీవిస్తారు. భుజిస్తారు, పనిచేస్తారు, పూజిస్తారు, నిద్రిస్తారు. అందరూ ఒక శ్రామిక వర్గంలాగా యీ ఆశ్రమపు నీతి నియమాల్ని పాటిస్తూ జీవిస్తారు.

ఇక్కడ యిన్ని కఠిన నిబంధనలున్నప్పటికీ వాణిజ్య వేత్తలు పారిశ్రామిక వేత్తలు వస్తూనే వుంటారు. ఎందువల్ల? ధనంగానీ, అధికారంగానీ సంపాదించి పెట్టలేని మనశ్శాంతి వాళ్ళకిక్కడ దొరుకుతుంది.

ఇక్కడ ఒక ఆధ్యాత్మిక, ఆత్మ తత్వంలో కూడిన ఒక వినూత్న ప్రపంచం వుంది. ఇందులో ప్రవేశించటానికి కొన్ని లొక్యాలు చెయ్యవలసి వుంటుంది. **వాళ్ళకి, అందరూ ఆశించే మనశ్శాంతికి దారి చూపించటం నా ఆశయం. ఈ ఆధ్యాత్మిక పరివర్తనలో, ఆనందం అనేది ధనం వల్లగానీ, తదితర మార్గాలవల్ల లభించేదికాదనీ, తనలోనే వుందనీ, జిజ్ఞాసువు గ్రహించగలుతాడు. ఈ ఆనందం అందరిలోనూ అంతర్లీనమై వున్న, విశ్వవ్యాప్తమైన దివ్యత్వ పరిగ్రహణద్వారా మాత్రమే లభిస్తుంది.**

ఈ భావం యిచ్చివుచ్చుకునే స్నేహితత్వాన్ని పెంపొందిస్తుంది. తమ అవసరానికిమించి సంపద కలిగినవాళ్ళు త్యాగంచెయ్యటానికి, అవసరానికి తగినంతగా లేనివాళ్ళకి వాళ్ళకికావలసినవి, పొందటానికి అవకాశం వుంటుంది. ఆధ్యాత్మికంగా అందరూ ఒకే మతానికి వర్గానికి చెందిన వాళ్ళు, ఒకే ఒక దైవంనుంచి అన్నిమతాల సిద్ధాంతాలు ఉద్భవించాయి. ఈ మూలాధారమైన ఏకత్వపు అనుభవం వాళ్ళకి ఆత్మ సత్యాల అవగాహన ద్వారా కలగాలి, అప్పుడు వాళ్ళు ఒకే ఒక మతమైన "WORK WORSHIP AND WISDOM" కి చెందుతారు. కృషి, ఆరాధన, మరియు జ్ఞానం.

(స.ప్ర.పు.24/25)

కర్మ సుకౌశలం; సమత్వం యోగం; ఈ రెండింటినీ మనము అవలంభించాలి. సమత్వమే యోగం యోగమే కర్మ సుకౌశలం. సమత్వమును మనము గుర్తించుటకు ప్రయత్నము చేయాలి. **యోగము ద్వారా మానవుడు తనంతట తాను ఉద్ధరింపబడతాడు. భోగము చేత తనంతట తాను పతనమై పోతున్నాడు. కనుక భోగమా ప్రధానము? యోగమా ఆధారము? దీనిని విచారించాలి.** మనము భోగ నిమిత్తమై, కాలమును, కాయమును, కర్తవ్యమును వ్యర్థము గావించుచున్నాము. యోగము నిమిత్తమై మనము ప్రయత్నము చేయడములేదు.

యోగమే కర్మ. కర్మయే కౌశలము, కౌశలమే సమత్వము. ఇట్టి సమత్వమనే తత్వాన్ని చేపట్టాలి.

యోగమనే తత్వములో ప్రధానముగ ఐదు రకములనున్నవి.

మొదటిది ప్రకృతి యొక్క సమత్వము
రెండవది సమాజము యొక్క సమత్వము
మూడవది జ్ఞానము యొక్క సమత్వము
నాలుగవది కర్మ యొక్క సమత్వము
ఐదవది భక్తి యొక్క సమత్వము

(శ్రీ.ది.పు.156/157)

(చూ॥ కర్మయోగి)

సమత్వస్థితి

సమత్వస్థితి మంచి చెడ్డలయందును, సుఖ దుఃఖముల యందును, శీతోష్ణముల యందును సమానభావము వుంచుట.

(గీ.పు.211)

(చూ॥ ఇరువది గుణములు)

సమాజము

సమాజమనగా కంటికి కనిపించే నేల కాదు, **సజీవమైన మానవ సమూహమే సమాజము. సమాజంలో ఐకమత్యం అత్యవసరం.** ఐకమత్యంచేత మానవుడు సాధించలని కార్యము ఈ జగత్తునందు కానరాదు. ల్లలందరికీ చక్కగా తెలుసు - a ను a తోను, b ను b తోను హెచ్చించి, రెండింటినీ కలిపితే అది a^2+b^2 అవుతుంది. కానీ (a+b)ని (a+b)తో హెచ్చిస్తే అది a^2+b^2+2ab అవుతున్నది ఇక్కడ 2ab అనే పదం అధికంగా రావడానికి కారణమేమిటి? a, b లకూడికయే అనగా **ఐకమత్యంవల్ల బలం అధికమైపోతుంది.** ఎంతటి ఘనకార్యమునైనా ఐకమత్యంచేత సులభంగా సాధించవచ్చు. ఇట్టి ఐకమత్యమును సాధించే నిమితమై విద్య తోడ్పడాలి. కానీ ఈనాటి విద్యార్థులు ఐకమత్యాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు, కేవలం ఉద్యోగమును, ధనార్జనను లక్ష్యంగా పట్టుకొని విద్యనభ్యసిస్తున్నారు. **విద్య విజ్ఞానం కోసం, కృషి కూటి కోసమనే సత్యాన్ని విద్యార్థులు గుర్తించాలి.**

(స.సా.అ1998పు.265)

మనజీవితమంతా సమాజముతో కట్టబడి వుంటున్నాది. సమాజము క్షేమంగా వుంటున్నప్పుడే మనక్షేమం. ఈ సత్యాన్ని విద్యావంతులు గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. **మానవుడు వ్యక్తి, కుటుంబము, సమాజము మూడింటి ద్వారా ప్రయాణము చేయాలి. ఫ్రమ్ ఐ టు వి**(we) నిరంతరము, ఐ,ఐ ఏమిటి ఈ ఐ? రెండు రకములైన ఐలు వుంటున్నాయి. వన్ లెటర్, ఐ ఈజ్ వన్ 1, త్రీ లెటర్ eye ఈజ్ ఐ.త్రీ లెటర్ ఆనదర్ ఈజ్ బాడీ, వన్‌లెటర్ ఐ ఈజ్ సెల్ఫ్. అదే సోల్. నీవు బాడీ కాదు. బాడీ నీకొక ఇన్‌స్ట్రుమెంట్; మనస్సు నీకొక ఇన్‌స్ట్రుమెంట్ (ఉపకరణం) సెన్సెస్ (ఇందియములు ఇన్ స్ట్రుమెంట్ ఉపకరణము). వీటిని సహాయము చేసుకొని యీ ఏకాక్షరమైన ఐని ఆధారము చేసుకోవాలి. తెల్లవారి మొదలు రాత్రి పరుండనంత వరకు ఐ,ఐ.దిస్ ఈజ్ మై హౌస్, దిస్ ఈజ్ మై కార్, మై పాంట్, మై షర్ట్ అంటారు. హుఆర్‌యు? హు యామ్‌ఐ? ఈ ప్రశ్న వేసుకునే విద్యార్థులు ఎక్కడా కనుపించటం లేదు. మై బాడీ మీన్స్ బాడీ ఈజ్ సెపరేట్ ఫ్రమ్ మి. ఈ సత్యాన్ని మనము గుర్తించినప్పుడే నిజమైన ఆధ్యాత్మికము అభివృద్ధి గాంచుతుంది.

(ఉ.బ.పు.6/7)

విద్యార్థులు ముమ్ముందు దీనిని (సమాజసేవ) లక్ష్యము నందుంచుకొని తమ శక్తిని తమ యొక్క పవిత్రతను తాము అనుభవించుటే కాకుండా సమాజమునకు కూడను వినియోగించాలి. ఎందుకనగా నీవు కూడను సమాజములో ఒక వ్యక్తివి. నీవు సమాజమునకు దూరముగా లేవు. నీ క్షేమము సమాజక్షేమముపైనే ఆధారపడి వుంటుంది. అప్పుడే నీ క్షేమము అభివృద్ధి అవుతుంది. ఇదే మానవుని కర్తవ్యము.

(బ్ర.త్ర.పు.119)

(చూ॥ భావాలు, విద్యావంతుడు)

సమాజసేవ

ఈనాడు నిజమైన సమాజ సేవ (Social Service) మచ్చుకైనా కనిపించడం లేదు. అంతా Show Service గాను, Slow Service గాను ఉంటున్నది. సేవ వేరెవరికో చేస్తున్నామనే భావాన్ని విడనాడండి. మీ తృప్తికి మీ ఆనందానికి, మీరు తరించడానికి చేస్తున్నా మని భావించండి. మీరు ఏ పని చేసినా అంతరాత్మ తృప్తి పడాలి. ఇతరుల మెప్పుకోసం సేవ చేయకూడదు. **మీ అంతరాత్మ మెచ్చుకుంటే చాలు. ఎందుకంటే మీ అంతరాత్మయే దైవం.**

(స.సా.డి.99పు.375)

సమాధానము

(చూ॥ అథాతోబ్రహ్మజిజ్ఞాస)

సమాధి

వృత్తులను నిగ్రహించి మనస్సును పరమాత్మయందు లెస్సగా యుంచుట అని అర్థము.స్వస్వరూపస్థితినే సమాధి అందురు. **ద్వైతరహితమై యుండునదే సమాధి. గాలిలేనిచోట దీపమెట్లు నిశ్చలంగా వుండునో ఆ విధముగా చిత్తము నిశ్చలముగ నుండునది సమాధి అందురు.**

(ప్రశ్నో.వా.పు.64)

సమానత్వము

సమానత్వం మీరెట్లు కోరుకుంటారు. అందరి మనస్సు ఒకటిగా ఉంటుందా? అవి వారి పూర్వజన్మ కర్మలను బట్టి యుంటాయి. ఈ కర్మ తత్త్వానికి అవల నున్నదే ఆత్మతత్త్వం.

(సా. పు.554)

సమానబుద్ధి

(చూ॥ కర్మయోగి, నిర్గుణోపాసన)

సమానులే

మానవమర్యాదలు కానీ, పేరు ప్రతిష్ఠలు కానీ అగౌరవ అపకీర్తులుకాని, దుశ్శీల దుర్గుణములుకానీ, స్త్రీలకు పురుషులకూ సమానములే.

స్త్రీలు మాత్రమే నిబంధనకు బద్ధులనియు, పురుషులు స్వతంత్రులనియు లేదు. స్త్రీలైనను, పురుషులైనను ధర్మముల పాటించవలెను. **స్త్రీలు పురుషుల చేతి కీలు బొమ్మలు కాదు. ధర్మకర్మలయందు ఇద్దరూ సమాన హక్కుకలవారే, దర్మాచరణల యందు, ఇద్దరూ, శాంతి, సత్య, ప్రేమ, అహింసలను పాటించ వలెను.** ఈనాలుగు పవిత్రపద భావములను పాటించక, ప్రవర్తించిన, ధర్మరహితులగుదురు. **స్త్రీ లెట్లు కొన్నింటి యందు అస్వతంత్రులో, పురుషులు కూడనూ అట్లే కొన్నింటి యందధికారములేదు. ఇవి సతిపతుల ప్రమాణనిబంధనల లోకాన్ని.**

(ధ.పు.50)

సమిష్టి

విద్యార్థులారా! మీరు ఉద్యోగాలకోసం ప్రాకులాడకండి అయితే, ఉద్యోగాలూ చేయండి. కానీ, **భారతీయ సంసన్కృతి ప్రబోధించే "సత్యం వద, ధర్మం చర" అనే సత్య సూక్తిని ఆచరణలో పెట్టడానికి మీ ప్రాణాలనైనా త్యాగం చేయటానికి సిద్ధంగా ఉండండి. గ్రామసేవలో పాల్గొనండి. దీనులకు, దిక్కులేనివారికి సహాయం చేయండి. దేశక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోండి. "దేశంలో నేనొక వ్యక్తిని. కాబట్టే దేశం బాగున్నప్పుడే నేను కూడా బాగుంటాను"** అని గుర్తించండి. **పరమేష్టి నుండి సృష్టి ఆవిర్భవించింది. సృష్టినుండి సమిష్టి(సమాజం)ఏర్పడింది. సమిష్టి నుండి వ్యష్టి (వ్యక్తి) ఉద్భవించినాడు. కనుక, మీరు వ్యష్టి నుండి సమిష్టి లోకి, సమిష్టి నుండి సృష్టిలోకి ప్రయాణించి, చివరికి పరమేష్టిలో లీనమైపోవాలి. ఇదియే దివ్యత్వానికి రాచబాట.** దీనిని విడిచిపెట్టి, 'ముళ్ళకంపల' తో కూడిన ప్రవృత్తి మార్గంలో ఎందుకు ప్రయాణమవు

తున్నారు? "ఏమిటి సాయిబాబా ఇలాంటి బోధలు చేస్తున్నాడు" అని నన్ను ఎవరేమని తిట్టుకున్నా నాకు నష్టం లేదు. ఎందుకంటే, నేను చెప్పేది మంచి, మంచి, మంచి! మీరు మంచి సంకల్పాలను అభివృద్ధిపర్చుకొని, మంచి విషయాలను ఆచరణలో పెట్టినప్పుడే దివ్యమైన గమ్యాన్ని చేరుకుంటారు. ఇలాంటి దివ్యమైన మార్గాన్ని వదలిపెట్టి ఎందుకు మీరు అవస్థ పడుతున్నారు? **లేత వయస్సులో మీ పంచేంద్రియాలను అరిషడ్వర్గములనే రాక్షసులకు అర్పితం చేసి వృద్ధ్యాప్యంలో ఏడుస్తూ కూర్చుంటే వచ్చే ఫలితమేమిటి? లేత వయస్సులోనే ఇంద్రియాలను దైవార్పితం చేయాలి.** ఇంతవరకు తెలిసో, తిలియకనో పొరపాటు జరిగియుండవచ్చు. దాని గూర్చి విచారిస్తూకూర్చుంటే ప్రయోజనం లేదు. **కనీసం ఇప్పుడైనా మేల్కొని, భగవచ్చింతనతో జన్మ సార్థకం గావించుకోండి. మీ తుది శ్వాస కూడా దైవచింతనతో వదలండి.**

(స.సా.జూ.99 పు.154)

మానవునిది సమిష్టి సాంప్రదాయమే కాని, వ్యష్టి సాంప్రదాయము కాదు. ఈజగత్తులో మానవుడు వ్యష్టిగా జీవించలేడు. మానవుడు ఈ జగత్తునందు సుఖశాంతులతో జీవించవలెనన్న సమిష్టి భావాన్ని పోషించుకోవాలి.

శ్లో॥ ఓం సహనా వవతు సహనౌభునక్తు సహ వీర్యమ్ కరవావహై
తేజస్వినా వధీతమస్తు మావిద్విషావహై

దీని అంతరార్థం ఏమిటి?

కలిసి మెలసి తిరుగుదాం
కలిసి మెలసి పెరుగుదాం
కలిసి మెలసి తెలుసుకున్న తెలివిన పోషించుదాం
కలిసి మెలసి కలత లేక చెలిమితో జీవించుదాం.
మన జీవితము సమిష్టి స్వరూపమైనది. కనుకనే
"సహస్రశీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాత్...." అనే సమిష్టి స్వరూపమును నిరూపిస్తూ వచ్చింది వేదము.

(శ్రీ.బ.ఉ.పు.19)

(చూ॥ పురుషుడు)

సమిష్టిభావము

అన్ని దేహములందును ఏకత్వమైయున్న చైతన్యమే సమిష్టిభావము.

కారణ సమిష్టి స్వరూపము - ఈశ్వరుడు
కారణ వ్యష్టి స్వరూపము - ప్రాజ్ఞుడు.
కార్య వ్యష్టి స్వరూపము - జీవుడు.
సూక్ష్మ సమిష్టి స్వరూపము - హిరణ్యగర్భుడు.
సూక్ష్మ వ్యష్టి స్వరూపము - తైజసుడు.
స్థూల సమిష్టి స్వరూపము - విరాట్ స్వరూపుడు.
స్థూల వ్యష్టి స్వరూపము - విశ్వడు.
స్థూల దేహమునకు సంబంధించిన చైతన్యమునకు విశ్వడనియు, సూక్ష్మ దేహమైన మనస్తత్వమునకు తేజసుడనియు, కారణదేహమైన ఆత్మతత్వమునకు ఈశ్వరుడనియు పేర్లు. ఇట్టి పవిత్రస్వరూపముధరించి, ఒక్కమానవునియందే మూడు ఆకారములు వికసింపజేసి తద్వారా, లోకమునకు ప్రకటింపచేయటానికి ఈ ఆత్మతత్వమును బోధిస్తూవచ్చారు.

(ఆ.రా.పు.352)

సముద్రము

(చూ॥ భగవంతుడు,)

సముద్రుడు

ఒకానొక సమయములోపల **దక్షిణామూర్తి** దేశసంచారము చేస్తూ వచ్చాడు. **ఈ సంచారములో ఒక్కొక్క వస్తువును, ఒక్కొక్క విషయాన్ని తన గురువుగా స్వీకరిస్తూవచ్చాడు.** దక్షిణామూర్తికి ముప్పది నాల్గుమంది గురువులున్నారని కొంతమంది, అరువదినాల్గుమంది గురువులున్నారని కొంతమంది చెప్తారు. ఒకనాడు సముద్రము దగ్గరగా వచ్చి యిసుక తిన్నెమీద కూర్చొని ఆ సముద్రముయొక్క అలలను ఆశ్చర్యముగా ఆనందముగా తిలకిస్తున్నాడు. ఒక నిముషమునకు సముద్రములో గాలికి యేదో చెత్త

వచ్చి పడింది. తత్‌క్షణమే సముద్రము ఒకదానిపైన ఒకటి అలలను పంపిచి ఆ చెత్తను గట్టుకు పంపించింది. దక్షిణామూర్తి అనుకున్నాడు. అగాధమైన లోతు కల్గిన యీ అనంతమైన సముద్రములో ఒక చిన్న చెత్త వచ్చి పడితే దానికి యేమి నష్టము? ఎందుకోసము యీ విధముగా యింత తీవ్రంగా దానిని తత్‌క్షణమే వెనుకకు నెట్టివేస్తున్నాది. అని యోచించాడు. తదుపరి ధ్యాన దృష్టితో దీనియొక్క అంతరార్థమును గుర్తించాడు. **ఈనాడు కొంత చెత్త వచ్చి పడితే దానిని తాను ప్రవేశపెట్టుకుంటే అదే విధముగనే చెత్త, చెత్త... దండిగా వచ్చి కట్టకడపటికి సముద్రము రూపును కూడా మరపింపచేస్తుంది. సముద్రమును కప్పివేస్తుంది. కనుకనే మొట్టమొదటిలోనే జాగ్రత్తపడి చిన్న చెత్తను కూడ తాను లోపల చేర్చకపోతే తనకు ఏవిధమైన అపవిత్రత వుండదు కదా.** అనే వుద్దేశముతో సముద్రము యీరకముగా చేస్తుండాదని భావించుకున్నాడు.

(శ్రీ.గీ.పు.143/144)

ఒకానొక సమయంలో దక్షిణామూర్తి సముద్రపుటొడ్డున నడుస్తూ ఉండగా ఇంతలో ఎక్కడినుండియో గాలికి కాస్త చెత్త కొట్టుకువచ్చి సముద్రంలో పడింది. తక్షణమే సముద్రము ఒక అల తరువాత మరొక అలను పంపించి ఆ చెత్తను గట్టుకు నెట్టేసింది. ఈ దృశ్యాన్ని చూసిన దక్షిణామూర్తికి చాల విచారం కల్గింది. "ఓ సముద్రుడా! నీవు అనంతంగా, అగాథంగా ఉన్నప్పటికీ కాస్త చెత్తకు నీలో చోటివ్వలేకపోతున్నావు. **ఇంత స్వార్థమా నీకు! కాస్త చెత్త నీలో పడితే నీకు వచ్చే నష్టమేమిటి?"** అనుకొని ధ్యానంలో కూర్చున్నాడు. అప్పుడా ధ్యానంలో సముద్రుడు కనిపించి "దక్షిణామూర్తీ! నాయందు రత్నములు, ముత్యములు మొదలైన అనేక విలువైన పదార్థములున్నాయి. నాయందు చెత్తకు చోటిచ్చానంటే అది క్రమక్రమేణ పెరిగిపోయి నా రూపాన్నే మరుగు పర్చుతుంది," **అన్నాడు. సముద్రానికి అలలే శృంగారం. గ్రామానికి ఇళ్ళే శృంగారం. గగనానికి చంద్రుడే శృంగారం. మానవునికి గుణమే శృంగారం. కాబట్టి, మానవుడు తనలో దుర్భావాలకు ఏమాత్రము చోటిచ్చినా అవి క్రమక్రమేణ పెరిగి పోయి మనవత్వాన్నే మరుగు పర్చుతాయి.**

(స.సా.జు.2000పు.209)

(చూ॥ చతుర్విధపురుషార్థాలు, నీలవర్ణము)

సమ్యక్ కర్మ

(చూ॥ ఇంద్రియనిగ్రహం, నిర్వాణం, బుద్ధుడు)

సమ్యక్ జ్ఞానము

(చూ॥ అభేదజ్ఞానము)

సమ్యక్ దృష్టి

(చూ॥ ఇంద్రియనిగ్రహం, నిర్వాణం, బుద్ధుడు)

సమ్యక్ భావము

(చూ॥ ఇంద్రియనిగ్రహం, నిర్వాణం, బుద్ధుడు)

సమ్యక్ వాక్కు

(చూ॥ ఇంద్రియనిగ్రహం, నిర్వాణం, బుద్ధుడు)

సమ్యక్ శ్రవణం

(చూ॥ ఇంద్రియనిగ్రహం, నిర్వాణం)

సమ్యక్ సాధన

(చూ॥ బుద్ధుడు)

సరస్వతి

అనాదికాలమునుండి భారతదేశమునందు తల్లులను కూడా దైవస్వరూపంగా విశ్వసిస్తూ వచ్చారు. దుర్గా, సరస్వతి

- వీరందరూ తల్లులతో సమానమే. వారికి వేరువేరుగా పేర్లుపెట్టుకొనినప్పటికీ, వారందరినీ తల్లులు గానే భావిస్తూ వచ్చారు. సరస్వతియొక్క స్వరూపాన్ని విశ్వసించి, ఆనందించి, అనుభవించాలి. కొంతమంది, **కొంతకాలం క్రిందట 'సరస్వతి' పేరు కూడా చెప్పకూడదని చెప్పారు. ఇదిచాలా అజ్ఞానము. ఇది చాలా ఆమాయకత్వం. తల్లితో సమానమైనటువంటి సరస్వతిని విస్మరించడం కడుశోచనీయం. సరస్వతిని స్మరించకుండా,** ఏ ఒక్క అక్షరమును మనం వల్లించలేం. ప్రాచీన కాలంలో మనఋషులు సరస్వతిని వర్ణించారు.

"సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతుమే సదా
పద్మపత్ర విశాలాక్షీ పద్మకేసరవర్ణినీ
నిత్యం పద్మాలయా దేవీ సామాంపాతు సరస్వతీ"

మన భారతదేశమునకు కూడనూ ఈ సరస్వతి పేరు పెట్టారు. సరస్వతికి 'భారతి' అని పేరు కూడా ఒకటి ఉన్నది. ఈ భారతియొక్క పేరు సరస్వతి పేరే. ఈ **సరస్వతి పేరే భారతదేశమునకు పెట్టారుగాని, ఏదో ఒక రాజుపేరుకాదు. దుష్యంతుని కుమారుడైన భరతుని పేరు ఈ దేశమునకు పెట్టారనుకుంటున్నారు.** అంతకు పూర్వం ఈ దేశమునకు ఏమిపేరు? ఇవన్నీ తీసుకుంటే దైవము నుంచి వచ్చిన పేర్లే ఇవన్నీ. సరస్వతి పేరు ప్రపంచంలో అన్నింటిలోనూ లీనమై ఉంటున్నది. ఈమెకు 'బ్రహ్మపత్ని' అని ఒకపేరు. బ్రహ్మ అనగా సృష్టికర్త యొక్క అనంతమైన శక్తిని మనం విశ్వసించాలి. సృష్టికర్తయొక్క దివ్యత్వాన్ని తెలుసుకోవాలి.

(శ్రీ.డి.98 పు.14)

(చూ॥ ఆరాధన, ఆహుతి, గాయత్రి, శరన్నవరాత్రులు)

సర్వజ్ఞుడను

(చూ॥ జన్మ, దివ్యప్రకటనలు)

సర్వచింతలు

"సర్వచింతలు జూపెడి సాయిప్రేమ
గొనుడు ఇకనైన ప్రజలార ప్రేమతోడ".

సర్వచింతలూ దీనివల్లనే పరిహారమౌతాయి. కనుక, మీరు సాయిప్రేమను పొందటానికి కృషిచేయండి. దైవప్రేమచేత మీరు దేనినైనా సాధించవచ్చు. కేవలం భారతీయులు మాత్రమే కాదు. విదేశీయులలో కూడా దైవప్రేమ చేత ఎన్నియో ఘనకార్యములు సాధించిన వారున్నారు.

(దివ్యసందేశము. 23.11.2001పు.7)

సర్వత్యాగము

కైవల్యోపనిషత్తునందు **"నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకేన అమృతత్వమానశుః"** అని తెలిపినట్లుగా; సకర్మణా అనగా యజ్ఞయాగాదులు, వ్రతములు, దానధర్మాదులు, తీర్థయాత్రలు, నదీ సాగర స్నానములు మున్నగు కర్మలవల్ల మోక్షము కలుగదు. అనగా అజ్ఞానం నివృత్తి కాదు. అనగా అధికార సంపదలు, బుద్ధి చాతుర్యము, కీర్తి ప్రతిష్ఠలు, సౌందర్యం, పుష్టి, పుత్రులు. మున్నగువాటివల్ల ముక్తి పొందజాలరు. నధనేన పైన తెటిపిన కర్మలన్నియు దనసహాయముతో జరుపబడునవి. ధనము లేని యెడల అట్టి కర్మలు జరుపబడజాలవు. అయితే జ్ఞానమును ధనముతో కొనలేరు. ధనమునకూ జ్ఞానమునకూ సంబంధము లేదు. కాబట్టి ధనము వలన ముక్తిని సంపాదించుకొనజాలరు. ఇది ధన సాధనము కాదు. అట్లయిన ముక్తికి సాధనమేమి? త్యాగేనైకేన అమృతత్వమానశుః జగత్తు లేనే లేదను జ్ఞానమువల్లను, ఉన్నట్లు కనబడినను అది మిథ్యా మాత్రమేనని తెలుసుకొనుటవల్లను, ఇహపరములలోగల భోగముల ఆశలు వదలుకొనుట వల్లను - **అనగా సర్వంత్యాగము - సర్వత్యాగము వల్లనూ ముక్తి కలుగును అని దీని అర్థము.** అనగా ఆత్మ తత్వజ్ఞానముచేత మాత్రమే, దాని ఫలమైన సంసారము దుఃఖము నశించును. కేవలము కర్మలవల్ల అవి నాశము కావు అని ఉపనిషత్తు చెప్పుచున్నది.

(సూ.వా.పు.1/2)

సర్వత్రాపసిద్ధోపదేశాత్

వేదాంత వాక్యములందు అన్ని చోట్లను ప్రసిద్ధమగు బ్రహ్మపదమునే చెప్పియుండుట వలన, ప్రస్తుత వాక్యమున కంతటికినీ **గుణము కలవాడు పరబ్రహ్మమే కానీ జీవుడు కాడని కొందరు విమర్శకులు చెప్పుచు వచ్చిరి. ప్రసిద్ధమగు బ్రహ్మమే 'స్వరం ఖల్విదం బ్రహ్మ'.** ఈ కనబడునదంతయు పరబ్రహ్మమే అనునట్టి ఉపక్రమ వాక్యమునుండు ప్రయోగిపంబడియున్నది. శ్రుతి వాక్యానుసారము జగత్తు పరబ్రహ్మ స్వరూపమే. ఎట్లనగా దీని యునికి బ్రహ్మకు భిన్నము కాదు. రాగ ద్వేషాదులకు దూరముగా నుండి చూచిన సమస్తహేతురూపము బ్రహ్మమే. కాని, రాగ ద్వేషాల దృష్టితో చూచిన అంతా భిన్నమే. రాగ ద్వేషములు ఏకత్వాన్ని అనేకత్వంగా చూచును. శాంతి అనేకత్వమును ఏకత్వంగా భావించును. శాంతి రహితులైన వారు, భిన్నభావములతో పరికించుట చేత బ్రహ్మం వేరు జగత్తు వేరు అని భావింతురు. **దృష్టిని బట్టి సృష్టి.**

(సు.వా. పు.54/55)

సర్వదుఃఖములు

(చూ॥ అజ్ఞానము)

సర్వధర్మాన్ పరిత్యజ్య

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మమేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥

అను వాక్యములను పట్టి పరమాత్ముడు "సర్వధర్మాన్ పరిత్యజ్య" అని మాత్రమే అన్నాడు; కానీ "సర్వకర్మాన్" అని అనలేదు. అనగా, ధర్మవిచారణ చేయక, భగవత్ప్రీతిగ అజ్ఞరూప ధర్మకర్మలను చేయవలెననియే దీనిభావము. అనన్యగతికులై సర్వభారమును పరమాత్మపైననే వేచి, జనకాదులవలె, తాము పొందవలసిన దేదియు లేకయున్నను లోకసంగ్రమ కర్మనాచరించవలెను. ఎందుకన, సర్వభూతాంతరాత్మ తన ఆత్మకన్ననూ వేరుకాదు కనుక, **సర్వభూత హితానురక్తుడై నిష్కామబుద్ధితో విధివిహిత కర్మలను ఆచరించునట్టిదే నిష్కామకర్మయనబడును.** కాన, గీతను అవగాహన చేసుకొని తదా దేశానుగుణంగా నిష్కామకర్మనిష్ఠులై స్వధర్యమును చక్కగానెరింగి సర్వమును హరి ప్రసాదముగా భావించి కర్మలు చేయుటమాత్రమే కర్తవ్యము: **ఫలాపేక్ష లేక సాత్విక ప్రవర్తనకలిగి హరికృపా కటాక్షములకు పాత్రులైనవారి జీవితములే ధన్యములు. ధర్మము నాశ్రయించినవారికి ఐహికమున దుర్భరమైన కష్టములు యెదురైనను చివరకు వారికే సంపూర్ణ విజయము చేకూరును.** అధర్మపరులు ఐహికమున సర్వసంపదలతో తులతూగి నప్పటి కినీ తుదకు వారికి సర్వనాశనము సంభవించక తప్పదు. ఈ విషయమున పాండవ, కౌరవుల పరిస్థితి మానవ లోకమునకు ప్రత్యక్షసాక్షి. అధర్మమూర్తులయిన కౌరవులు ధూర్తులై ధర్మమూర్తులగు పాండవులను నానాబాధలకు గురిచేసిననూ కడకు ధర్మమూర్తులకే విజయము. అధర్మమూర్తులకు సర్వనాశనము సంభవించును. అధర్ములకు యెన్ని విధములైన బలములు అండ దండలుగా వుండిననూ గ్రహబలము లేనిదే అన్నియూ వ్యర్థములేయని భారతము భారతీయులకు గొప్ప సత్యమును అందించెను. పవిత్ర ధర్మమును నిరూపించెను. సత్యధర్మముల సౌధమే భారతమునందలి **గీతాభవనము. భక్తిశ్రద్ధలతో పవిత్రగీతను పఠించి అందలి నిబంధనలను అనుష్ఠాన రూపమున ఆచరించిన అట్టి వారికి ఆత్మారాముడు అరచేతియందే కనుపించును;** అరనిమిషమందే కరుణించును, బ్రహ్మాండమంతయు బొజ్జలో నుంచుకొన్న పరమాత్మను కోరిన అష్టఐశ్వర్య సంపదలతో ఐహికమును అనుభవించుటేకాక, సత్యానంద నిలయమైన సత్యజ్ఞానమును **కైవల్యమును కూడనూ పొందవచ్చును.** వెన్నచిక్కిన నేతికొఱకు యోచించనక్కర లేదు కదా! అందు వలననే, **పరమాత్ముని శరణుజొచ్చి**

పరమాత్మ ఆజ్ఞకర్మల ననుసరించిన మోక్షాపేక్ష కూడనూ అక్కరలేదు. అట్టి వానికి కావలసినదేదియో యోగ్యమయిన దేదియో భగవానుడే అందించును. తన కొఱకు తపించవలెను కానీ మోక్షము కొఱకు కాదనియు, తనను శరణుజొచ్చి మోక్షమును కూడనూ త్యజించిన, అట్టివాని సర్వపాపములను నాశనము జేతుననియూ, పరమాత్ముడు గట్టి మాటనిచ్చి అర్జునునకు తిరిగి పుట్టుకలేకుండా చేసెను. కావున, పుట్టుకకోరని వారందరునూ ఇట్టి గట్టి చట్టము ననుసరించి పరమాత్మను మెప్పించి, అతనిని శరణు జొచ్చిన, సర్వసిద్ధినీ సాధించవచ్చును.

(గీ.పు.240/241)

సర్వభారములు

సర్వభారములూ పరమాత్ముని మీద వేసి మీ తలమీద బరువు తగ్గించుకోవాలి. అన్నింటినీ ఆయన సంకల్పమునకూ శాసనమునకూ వదిలి వేస్తే మీకు దుఃఖం మరి వుండదు. సత్సంగం సత్ప్రవర్తన, సర్వేశ్వర చింతనములనే మధురమైన ఆహారంతో మనస్సులు నింపుకోండి. అప్పుడు ఆనంద పరిపూర్ణులు కాగలరు. నేను ఆనంద స్వరూపుడను. ఆనందం అందుకోవాలని ప్రార్థనలు చేయండి. ఆనందం మీద మీ దృష్టి నిలిపి సంపూర్ణమైన శాంతిని అనుభవించండి.

(వ.1963పు.196)

సర్వభావములు

(చూ॥ తత్త్వజ్ఞానము)

సర్వభూతదయ

(చూ॥ అష్టవిధపుష్పములు)

సర్వమతసమ్మతము

(చూ॥ ఒక్కడే)

సర్వమతసామరస్యము

దేవుడు హిందూకాదు. దేవుడు ముస్లింకాదు. దేవుడు క్రిస్టియన్ కాదు. మతానికో దేవుడూ లేడు. దేవుడుకో మతం లేదు. అన్ని మతాలు మార్గాలు. దైవానుగ్రహం. గమ్యం. దేవుడికి కూడా మతాన్ని అంటగట్టే మతోన్మాదులే మతకలహాలకి కారణం. మతబోధకులు తమతమ మతసిద్ధాంతాలను ప్రచారం చెయ్యడంతో బాటు ఇతర మతాలను ద్వేషించడాన్ని ప్రోత్సహించడం వల్లనే మానవులు మతులు చెడి మత విభేదాలు పెంచి మానవత్వాన్ని మంట కల్పుతున్నారు. ఈ సత్యాన్ని చరిత్ర రుజువు చేసింది. ఆచారాలు ఆరాధనా విధానాలు వేరుకావచ్చు. కాని అన్ని మతాలు మంచినే బోధిస్తున్నాయి. "Be good, see good and do good"అన్నదే సర్వమత సిద్ధాంతసారం. ప్రతి హిందువుని ఆదర్శహిందువుగాను, ప్రతి క్రిస్టియన్నీ ఆదర్శ క్రిస్టియన్‌గానూ, ప్రతి ముస్లింని ఆదర్శ ముస్లింగానూ, అలాగే వివిధ మతస్థులను వాళ్ళవాళ్ల మతాలలో ఆదర్శమతస్థులుగా తీర్చి దిద్దడమే నాధ్యేయం. అన్ని మతాలు దైవ పితృత్వాన్ని మానవ సోదరత్వాన్ని బోధిస్తాయన్న సత్యాన్ని గుర్తు చేసి సర్వమతసమానత్వాన్ని ఆచరణలో ప్రచారం చెయ్యడమే నాలక్ష్యం.

(ప్రే.బ.పు.99)

(చూ॥ ప్రార్థన గీతము, మతబాంధవ్యము, స్వామి బాల్యము)

సర్వమూ భగవంతుడే!

సమస్త మంచిచెడ్డలకు తానేకారణమనియు, సర్వమూ తననుండే పుట్టినవనియు, అట్లుండియూ నాటి దోషములు తన నేమాత్రము బంధించుటకానీ, బాధించుటకానీ చేయవనియూ వాటితో తనకేమీ సంబంధము లేదనియు, అన్నిటికినీ అతీతమై యున్నాననియూ తెలుపుటలో మానవుడు చేయు మంచి చెడ్డలకు మానవుడు యే మాత్రము కర్తకానీ, కారణముకానీ కాదనియూ, యెట్టి మంచి చెడ్డలయిననూ భగవంతుని

సర్వవస్తువులు

ప్రేరణవలననే ననియూ, మానవుడు యెట్టి పాప పుణ్యములకూ బాధ్యుడు కాడని తలంచ వచ్చును. నిజమే. అయితే, ఇట్టి విశ్వాసము నిశ్చలమైన, నిర్మలమైన నిస్వార్థమైన ప్రేమ పరమాత్మునిపై కలిగి యుండిన ఇంతకంటే ధన్యము, పుణ్యము మరేయున్నది? తెలిసికొనవలసినదీ స్థిరముచేసుకొనవలసినదీ ఇదే. **'సర్వమూ భగవంతుడే,' నా కేమాత్రమూ ఈ లోకముతో కానీ, భావముతో కానీ సంబంధము లేదని, నేను వీటన్నింటికి అతీతమైనవాడ' ననీ యే మానవుడు తెలిసికొనునో వాడే సత్యజీవి.** అయితే మాటల్లో మాత్రము 'సర్వమూ భగవంతుడే, నేనతని చేతిలో కీలుబొమ్మ. అతని ఆధీనంలో నున్నవాడను నాదేమీలేదని చిలుక పలుకులు పలుకుచూ, మంచిదానిని మాత్రము 'నేను చేసిన'దనియూ, చెడ్డ మాత్రము భగవత్ప్రేరణ అనియూ, కీర్తి మర్యాదలు గౌరవ ప్రతిష్టలు వచ్చు పనులు ఉపదేశములు అరచుట, తప్పులో, అపకీర్తియో, ఆగౌరవములో జరిగిన అవన్నియూ' నావి కాదు, నేను నిమిత్త మాత్రమయిన వాడను సర్వమూ భగవంతుడు చేయించుచున్నా డనుట నేటి మానవులకు పరిపాటయినది. **అది ఒక నూతన 'ఫ్యాషన్' కూడా!** ఇట్టి గడియారం 'పెండ్యులం' వంటి మాటలు ఆటలు, సత్యములు కాలేవు. **మనోవాక్కాయ కర్మలందు కూడా సర్వమూ భగవంతుని లీలావిభూతియే అని దృఢవిశ్వాసమును కలిగియుండుట చక్కటి తత్వము.** మంచి చెడ్డలు మానవుని దృష్టి దోషములే; వీటిని భగవంతునియందు నిరూపించుట ధర్మవిరుద్ధము.

(గీ.పు.109/110)

సర్వవస్తువులు

(చూ॥ తత్త్వజ్ఞానము)

సర్వవ్యాపకుడవు

లోకములో అన్ని విధములైన జీవితములను క్షణకాలములో గడచి పోతున్నవి. **అన్నీ అనిత్యములు, అసత్యములే.** మనము పగలు చూచిన దంతయు, రాత్రి స్వప్నములో మనకు అదృశ్యముగా ఉంటుంది. మనము స్వప్నములో చూచిన దృశ్యములన్నియు, జాగ్రత్తలో అదృశ్యముగా ఉంటున్నవి. ఇది పగటినిద్ర; అది రాత్రినిద్ర. ఇది పగటి కల; అది రాత్రి కల. ఈ పగటి స్వప్నమునందు రాత్రి స్వప్నము లేదు.రాత్రి స్వప్నమునందు పగటి స్వప్నము లేదు. కానీ, నీవు నైట్ డ్రీమ్ (Night Dream) లోనూ ఉంటున్నావు; డే డ్రీమ్ (Day Dream) లోనూ ఉంటున్నావు; నీవు రెండు డ్రీమ్ (Dream) ల లోనూ ఉంటున్నావు. కనుక **'నీవు' ఆమ్ని ప్రజంట్ (Omnipresent); అనగా సర్వవ్యాపకుడవు. నీవు ఈ సత్యమును గుర్తించుకోటం అత్యవసరం. ఇప్పుడు ఇదొక మాల. ఇది మాలయొక్క కుచ్చు. నేను ఈ మాలను హస్తము పైన వేసుకున్నాను. ఈ మాలలో కుచ్చు ఫ్యూచర్ (Future) గా ఉంటుంది. మిగతా మాల ప్రజెంట్ (Present) గా ఉంటున్నది. ఇటువైపు పాస్టు (Past) గా ఉంటున్నది. ఈ మాలను ఈవిధంగా త్రిప్పుతూ పోయినా మనుకోండి. తిరుగుతూ, తిరుగుతూ వచ్చేటప్పటికి, యీకుచ్చు ప్రజంట్ (Present) గా వచ్చింది. కానీ కొంత తిరిగేటప్పటికి, ఇది ప్రజంట్ (Present) నుంచి పాస్టు (Past) కు వెళ్ళిపోతున్నది. కానీ ఈ కుచ్చుకు మాత్రమే ప్రజెంట్ (Present), పాస్టు (past) ఫ్యూచరు (Future) ఈ మూడు కాలములు ఇందులో తిరుగుతూ ఉన్నవికానీ, నా హస్తమునకు మాత్రము, ఎప్పుడూ ఒక కాలముగనే ఉంటున్నది. కాబట్టి యీహస్తమనేటువంటిది ఆమ్నిప్రజెంట్ (Omnipresent). ఇందులో తిరిగేటువంటి కాలమే, ఫ్యూచరు (Future), ప్రెజెంట్ (Present) పాస్టు (Past). ఈ మూడును, కాలముయొక్క మార్పులే. ఈ ఫ్యూచరు (Future) ప్రజెంట్ (Present) పాస్టు (Past) లలో కూడను ఒకేకాలమే వుంటున్నది. కాలము ఒక్కటే. Time is one. Time is everything. Don't waste Time. Time wasted is life wasted.కనుక, దానిని పురస్కరించు కొనియే "కాలాయనమః, కాల**

కాలాయనమః, కాలాతీతాయనమః, కాలస్వరూపాయనమః, కాలనియమితాయనమః, అన్నారు. **అన్నింటికిని కాలమే ప్రమాణము. కాలమే ప్రధానము. కాలమార్పుచేతనే మంచిచెడ్డలు కలుగుచున్నవి కాని, కాలమే లేకపోతే మంచి చెడ్డలనేటువంటివే మనకు లేవు.**

(ఆ.రా. పు.35/36)

సర్వసంగపరిత్యాగి

సర్వసంగపరిత్యాగి అన్న, జటకాషాయ వస్త్రధారియై తపస్సుచే శరీరమును కృశింప జేయ నక్కరలేదు. నీవు చేయు సర్వకర్మలు ఈశ్వరార్పణ బుద్ధితో నిష్కామకర్మ లాచరించిన చాలును. తప్పక నన్ను పొందగలవు. ముక్తుడవు కాగలవు. ఇది సత్యము. ఇదే ఇందులోని పరమ రహస్యము.

(గీ.పు.162/163)

(చూ॥ స్త్రీహత్య)

సర్వసిద్ధి

(చూ॥ సర్వధర్మాన్ పరిత్యజ్య)

సర్వస్యధాతార

(చూ॥ పండితుడు)

సర్వాంతర్యామి

"నేను సర్వాంతర్యామిగా అందరిలోనూ వున్నాననీ, సర్వసాక్షి భూతునిగా అన్నీ గమనించు చున్నావనీ మీ మనస్సులో దృఢముగా విశ్వసించుట ద్వారా **మీ సేవా సధనలోనూ, అధ్యయనములోనూ, ప్రవర్తనలోనూ ఆదర్శప్రాయముగా పురోగమించెదరు.** మీరింతవరకూ సాధించిన విజయానందముతో ద్విగుణీకృత నూతనోత్సాహముతో మరింత శ్రద్ధాసక్తులతో ముందు ముందు మీ కార్యకలాపములు కొనసాగించువలెనని నా ఆశయము. నా ఆశీర్వాదము. ప్రేమ, గౌరవము, సహనము, పరస్పర సహకారములు ప్రతి హృదయము నుండి ప్రతి హృదయములోనికి ప్రవహించవలెను. మీరందరూ ఒకే ఒక శరీరమందలి - సాయి **శరీరమందలి అంగములే.**

(స.శి.సు.తృ. పు.133/134)

(చూ॥ మనస్సు)

సర్వాధారుడు

(చూ॥ స్మరింతురు)

సర్వారంభపరిత్యాగి

(చూ॥ అనపేక్ష, భక్తుడు)

సర్వేశ్వర పూజ

సర్వజీవ ప్రేమయే సర్వేశ్వర పూజ. సర్వ రసముల సారమే కరుణారసము. సర్వమతముల ధర్మమే చిత్త నైర్మల్యము. సర్వసాధనల గమ్యమే సాధము.

(ఆ.పు.2)

సవతితల్లి

ఏదేశం వారు ఆ దేశంపై అభిమానమును అభివృద్ధి పరచుకోవచ్చును. తప్పులేదు. కాని ఈనాడు కన్న తల్లిని వదిలిపెట్టి సవతి తల్లిని మాత్రం ప్రేమిస్తున్నారు. మనదేశం యొక్క క్షేమాన్ని విస్మరించి, విదేశీయుల క్షేమాన్ని కోరుతున్నాం. ఇది తప్పు. స్వదేశీ క్షేమాన్ని కోరుతూ, విదేశీ క్షేమాన్ని కూడా అభిలషించండి. "లోకాస్సమస్తా స్సుఖినోభవంతు" అన్ని దేశములూ సుఖంగా ఉండాలని మన అభిలాష, ఇటువంటి విశాలమైన భావాలను మనవిద్యా సంస్థలలో నేర్చుకొని వెళ్ళాలి. ఇదే స్వామి అందించే ప్రధాన మైన ప్రేమ సందేశం.

(శ్రీ.జ.95పు.10)

సస్వరూపము

(చూ॥ హిరణ్యగర్భుడు)

సహజ లక్షణములు

నా సంకల్పముతో ఆనందారోగ్యములు ప్రసాదించుట కాని, పదార్థ సృష్టికాని నా ప్రత్యేక లక్షణములు కావు. వాటి వెనుకన్ను ప్రేమయే నా ప్రత్యేక లక్షణము. వేటిని నా లీలలుగా దివ్యలక్షణములుగా పరిగణిస్తారో అవి కేవలము **నా సహజ లక్షణములు. మిమ్మల్ని నావద్దకు ఆకర్షించేదీ. సత్యాన్వేషకుల వైపు నన్ను త్రోయునదీ. తీర్థయాత్రలలో యిబ్బందిపడు వారిని రక్షించ పురిగొల్పునదీ, నేనే సాయిబాబా యని ప్రకటింపచేసిందీ నా నిజతత్వమైన ప్రేమయే.** నీ ప్రతిచర్యనూ ప్రేమపూరితము కావించుము. **మనసావాచా కర్మణా ఎవ్వరికీ బాధ కలిగించవద్దు. మీరందరూ ఒక్కటే. నీవితరులను బాధించితే నిన్ను నువ్వు బాధించుకున్నట్లే నీవు సాయివి. అందరూ సాయి స్వరూపులే.** నీ శరీరములో ఒక భాగమైన చెయ్యి మరొక భాగమైన కంటిని పెరికివేస్తుందా.ఈ భావనయే సరియైన సాధన. **మీ హృదయజ్యోతులను ప్రకాశింపజేయుటకే నేను వచ్చినది. ఆ వెలుగునందు మీరు ప్రతి వారిలోనూ సాయిని చూడగలరు"**

(స.శి.సు.తృ.పు.129/130)

అన్నిటి కంటే ముఖ్యం శాస్త్రాలలో చెప్పిన విధులు పాటిస్తూ మీ జన్మభూమి సంస్కృతిని గౌరవిస్తూ మాతృదేశానికి గౌరవం సమకూర్చాలి. **దైవప్రీతీ పాపభీతి భారతీయులకు సహజ లక్షణాలు. వృద్ధులైన జననీ జనకులను సేవించండి. గౌరవించండి. నీ మాతను గౌరవిస్తే విశ్వజనని నిన్ను ఆపదలనుంచి కాపాడుగలదు. నీ తండ్రిని గౌరవిస్తే జగత్పిత నిన్ను రక్షించగలడు. నీ మాతాపితలను నువ్వు గౌరవిస్తే నీ బిడ్డలు నిన్ను ఆదరిస్తారనే మాట నిజం.**

(వ.1963. పు.107)

సహనము (Patience)

(చూ॥ దివ్యప్రకటనలు)

సాంఖ్యదర్శనము

ప్రాకృతమైనట్టి జీవితమున అనంతమైనట్టి శక్తులతో అప్రమాణమైన జీవితాన్ని గడపటము మానవమాత్రులకు సహజము కాదు. **ధనమును సాధించిన వాడే దాంతుడు. దాంతుడైనవాడే వేదాంతుడు. దాంతవేదాంతములయొక్క సమన్వయాన్ని, సత్య స్వరూపాన్ని అనుభూతుల విభూతిగా లోకానికి అందించినవారే ప్రాచీనమహర్షులు. న్యాయ వైశేషిక దర్శనములను, పదార్థము యొక్క సిద్ధాంతము లను అణుశక్తియొక్క సిద్ధాంతమును ఈ సాంఖ్యము అంగీకరించలేదు.** ప్రపంచమంతయూ విరుద్ధమైన శక్తులయొక్క సమన్వయ స్వరూపమని ఈ సాంఖ్యము ప్రబోధిస్తూ వచ్చింది. **దీనికర్త కపిల మహర్షి కనుకనే ఈ సాంఖ్య దర్శనమునకు 'కాపిల్య' అని మరొక పేరు. సంఖ్యలయొక్క సమన్వయముచేత ఈ ప్రకృతి ఉండటంచేత దీనికి సాంఖ్యమని మరొకపేరు వచ్చింది. నువ్వులలో తైలముండినట్లుగా కర్రలలో నిప్పు ఉండినట్లుగా పువ్వులలో పరిమళముండినట్లుగా ఈ ప్రకృతియందు పరమాత్మతత్వము కారణరూపమై యుంటున్నది. పరమాత్ముడు కారణ స్వరూపుడు. ప్రకృతి కార్యస్వరూపము. కార్య కారణములు అవినాభావ సంబంధములు, కనుక ప్రకృతి ప్రత్యేకమైనది కాదనియు పరమాత్మునియొక్క బాహ్యస్వరూపమేననియూ ఈ సాంఖ్యము ప్రబోధిస్తూ వచ్చింది. 'సాంఖ్య' మనగా 'తత్వము' అని అర్థము. తత్వమనగా విచారణాశక్తి, నిత్యానిత్య విషయపరిశీలనచేసే పవిత్రమైన శక్తికి తత్వమని పేరు.** ఒక్క పదార్థముచేత సృష్టి యేర్పడుటకు వీలు కాదు. రెండు పదార్థములు చేరినప్పుడే మూడవ శక్తి ఆవిర్భవిస్తుంది. ఒక హస్తముచేత శబ్దము యేర్పడదు. రెండు హస్తములు చేరినప్పుడే శబ్దము యేర్పడుతుంది. ఒక్క శక్తిచేత వేడి మనకు సంభవించదు. రెండు

శక్తులయొక్క రాపిడి చేతనే, వేడి ఆవిర్భవిస్తున్నది. అటులనే **ప్రకృతి పరమాత్మలయొక్క సమ్మిళిత స్వరూపమే సృష్టికి మూలకారణము, కనుక ప్రకృతి ప్రత్యేకమైన స్వరూపమని భావించటము అజ్ఞానమే.** అంతర్భూతమై అవ్యక్తముగా దివ్యమైన పరతత్వము ఇందులో వున్నదని సాంఖ్యము ప్రబోధిస్తూ వచ్చింది.

ఈ ప్రకృతికి 24 తత్వములున్నవని చెప్పింది. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు ప్రాణములు, పంచతన్మాత్రలు, అంతర్భూతమైన మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము ఇవన్నీ చేరి 24 తత్వములతో కూడినట్టిది ఈ ప్రపంచము. ఈ 24 తత్వములు పరస్పర విరుద్ధములైనవిగా వుంటున్నవి. నీరుంటే నిప్పుండదు. ఇవి ఒకదానికొకటి విరుద్ధమైన శక్తులయొక్క సమన్వయమే ఈ ప్రపంచము. ఇట్టి విరుద్ధమైన శక్తులయొక్క సమన్వయస్వరూపమైన ఈ ప్రపంచమును మూడు భాగములుగా పోలుస్తూ వచ్చింది ఈ సాంఖ్యము. మానవుడు దైవత్వాన్ని పొందుటకు ఈ మూడే మూలకారణమని నిరూపిస్తూ వచ్చింది. కేవలము ప్రకృతిని విసర్జించి ఏకాంత జీవితము గడపడము మోక్షము కాదని విమర్శించింది. ఈ ప్రకృతియొక్క 24 తత్వములతో పురుషుడు చేరినప్పుడు 25వ తత్వముగా రూపొందుతాడు. ఈ 24 తత్వములూ పురుషునకు విషయములనికూడ ప్రబోధించింది. జీవుడు ప్రకృతిని విసర్జించి కొంత వరకూ విభాగము సల్పి 26వ తత్వమైన పరమాత్మతో, శివునితో లీనమవుతూ వచ్చింది. కనుక **ఈ 24వ తత్వములు ప్రకృతిని, పురుషుడు 25వ తత్వము వాడు, ఈశ్వరుడు 26వ తత్వము. ఈ 26 తత్వములతో కూడినట్టిదే ఈ మానవతత్వము. మానవుడియందే ప్రకృతి పురుష జీవతత్వములు ఏర్పడియుంటున్నవి.**

జీవుడుండె దేహమందు హృదయమందు **దేవుడుండె**
రెండుకూడి ఆటలాడి ఒకరినొకరు వీడుచుండు
బొమ్మలాటలాడించె సూత్రధారి ఒకడు కలడు
మంచి చెడ్డ బొమ్మలుండె ఒకటిలోన రెండువుండె

ఒకటిలోనే రెండు ఉన్నతత్వమును మనము ఏవిధముగా గుర్తించాలి? ఏకత్వమునందు అనేకత్వము భావించటం సామాన్య మానవునియొక్క స్వభావము. కానీ అనేకత్వము నందలి ఏకత్వాన్ని గుర్తించటమే మహనీయులయొక్క లక్షణము. మానవత్వము కేవలము దైవముతో కూడిన ఏకత్వమే కాని భిన్నత్వము కాదని ఈ సాంఖ్యము ప్రబోధిస్తూ వచ్చింది.

(స.ది. పు.127/129)

జఠరాగ్ని లోపల భగవంతుడు వైశ్వానర రూపములో ఉన్నాడు. అనే విశ్వాసముతో చేయాలి. ఈ విధమైన ప్రార్థనలు ఒక నిర్బంధముగా భావిస్తున్నారు కొంతమంది మూర్ఖులైన విద్యార్థులు. హాస్టల్‌లో భుజించిన సమయమునందే ప్రార్థన చేస్తారు. ఇంటికి పోయిన తరువాత ప్రార్థనా లేదు, ఏమీ లేదు. అర్థంలేని జీవితంగా వుంటుంది. ఇంకా ఈనాటి భోజనాలు ఎలాంటి విధంగా జరుగుతున్నాయో తెలుసునా! పాపం సంవత్సరమంతా పుట్టపర్తిలోనూ, బెంగుళూరులోనూ నివసించి టి.వి.లు వీడియోలు చూసే అవకాశంలేదు పాపం. హాలిడేస్‌లో వచ్చారని అమ్మా నాన్నా బాబూ టి.వీ చూడాలి. దానిముందే భోజనములుకూడా తెచ్చి వడ్డించితే, **అక్కడ టి.వీ చూస్తూనే తింటూ వుంటాడు వాడు. అవి చూస్తూ వాటి భావముతో భుజించటంచేత ఆ ఆలోచనలు, భావాలు వీడికి వస్తున్నాయి.** హాలిడేస్‌కి బయటకు పోయిన పిల్లలు చెడటాన్కి మూలకారణమిదే. ఎందుకంటే **తినే ఆహారము ఎంతమాత్రము భగవంతునికి అర్పించటం లేదు. ఆహారశుద్ధి అత్యవసరమనికూడను సాంఖ్యము ఖండితముగా గుర్తించింది. ఎందుకంటే పంచప్రాణములకూ అంతర్భూతముగా ఉండినది ఈ ఆహారము. ఈ దేహమే ఆహారముయొక్క స్వభావము. ఆహారమే ఆహారాన్ని భుజిస్తుంది. ఇది చక్కగా మీరు గుర్తించాలి. అన్నమయజీవితము మన దేహము. తిరిగి భుజించేది కూడా అన్నమే. కనుకనే ఆహారము మహాప్రధానమని బోధిస్తూ వచ్చింది. సాంఖ్యదర్శనము.** ఈ చిన్న చిన్న

సాంఖ్యయోగము

సూక్ష్మమైన విషయాలను ఎవ్వరూ గ్రంథములలో విచారించరు. **అతిసూక్ష్మమైనదానియందే అతి ఘనమైనవి, అతి ముఖ్యమైనవి ఉంటాయి.** చిన్నవికదాయని మనము అలక్ష్యం చేస్తే అదే ఒక పెద్ద సముద్రముగా రూపొందుతుంది. చిన్న చిన్న చెదలు కర్రకు పట్టి క్షణములోపల కర్రను భస్మం చేస్తాయి. కనుక చిన్నది కదాయని మనము అలక్ష్యం చేయకూడదు.

(స.ది.పు.134/135)

సాంఖ్యయోగము

జ్ఞానామృతము నింపే నిమిత్తమై, శోకమోహములను దూరము గావించుటకై ప్రయత్నము చేసిన యోగమే యీ సాంఖ్యయోగము.

(శ్రీ.గీ. పు.131)

సాకారోపాసన

(చూ॥ ప్రసన్నుడు)

సాక్షాత్కారము

జగత్తంతా ప్రేమచేతే నిండి ప్రేమపైనే ఆధారపడుతుంది. సర్వాన్నీ అనుగ్రహింపగల ప్రేమతత్వాన్ని మానవుడు గుర్తించలేక ఐహిక వాంఛలకు లొంగిపోతున్నాడు. త్యాగం, ధర్మం, సత్యం మొదలైన వాటికి తిలోదకాలిస్తున్నాడు. మానవత్వంలోని ఏకత్వాన్నీ దివ్యత్వాన్నీ నిరూపించేది కూడా ప్రేమ ఒక్కటే. భగవంతుని ప్రేమను పొందడానికి ప్రేమతో హృదయాన్ని నింపుకుని ఆహృదయాన్ని స్వామికి సమర్పించుకోవాలి. **ప్రేమ రాహిత్యమే నేటి అనర్థాలకు మూలం.**

నిజంగా మీకు భగవంతుడు కావాలనుకుంటే ప్రహ్లాదునివలే నిరంతరమూ 'ఓం నమో నారాయణాయ నమః' అని స్మరించండి. రాధా మీరాల వలె నిత్యం భగవంతుని స్మరణలోనే జీవించండి. జయదేవుడు, గౌరంగుడు, తుకారాంల వలె నిరంతరమూ భగవంతుని ప్రార్థించండి. రామకృష్ణునివలె భగవద్దర్శనం కోసం వెక్కి వెక్కి ఏడ్వండి. అప్పుడే భగవానుడు సాక్షాత్కరిస్తాడు. ప్రేమస్వరూపుని కేవలం ప్రేమతోనే పొందండి. ప్రేమతో కృష్ణనామాన్ని స్మరిస్తున్న రుక్మిణి సమర్పించిన తులసీ దళానికా ఆ అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు తూగలేదా? భగవంతుని పొందాలన్నా, తూచాలన్నా ప్రేమద్వారానే సాధ్యమవుతుంది. మీలో ప్రేమను పెంచుకోనప్పుడు భగవంతుడు కావాలంటే మీకు చిక్కుతాడా?

'సర్వం విష్ణుమయం జగత్' అణువణువునా భగవత్ స్వరూపమే, మీ శత్రువులను కూడా ప్రేమించి విశ్వప్రేమ తత్వానికి వారుసులుకండి. భగవంతునికి దగ్గర కండి. నా జీవితమంతా ప్రేమమయమే నాలోని ప్రేమే అందరి హృదయాలను ప్రేమమయం చేస్తుంది. ఈ ప్రేమవలననే స్వామితత్వం జగత్తంతా వ్యాప్తి చెందుతోంది. **నాలోని ప్రేమ అనే ఆయస్కాంతమే మిమ్మల్ని నాదగ్గరకు ఆకర్షిస్తోంది.**

మీ రెక్కడ వున్నా మీ హృదయాన్ని పవిత్రం చేసుకోండి. పవిత్ర ప్రేమతో మీ జన్మను సార్థకం చేసుకోండి. మిమ్మల్ని ద్వేషించేవారిని నిర్మలమైన చిరునవ్వుతో మీజన్మను సార్థకం చేసుకోండి. మిమ్మల్ని ద్వేషించేవారిని నిర్మలమైన చిరునవ్వులతో మీ వారిని చేసుకోండి. విశ్వ ప్రేమతత్వాన్ని పదిమందికి పంచి ఇవ్వండి.

పవిత్రత ఎక్కడుంటే ప్రేమ అక్కడ ఆవిర్భవిస్తుంది. అక్కడే ఆనందం వెల్లి విస్తుంది.

(భ.పు.2)

ఆత్మకు అనువరతము అడ్డు తగులునది మనస్సు. సూర్యుని వేడివల్ల ఆవిర్భవించిన మేఘములు సూర్యుని ఏవిధముగా మరుగు చేయుచున్నవో అదే విధముగనే ఆత్మనుండి పుట్టిన మనస్సు - మనస్సంమాతమైన మేఘములు - ఆత్మకు అడ్డు తగులు తున్నాయి. మనస్సుండినంతవరకు మానవుడు ఆత్మ తత్వాన్నిగాని ఆత్మ జ్ఞానముగాని ఆత్మ విషయాన్నిగాని అర్థము

చేసుకోలేడు. **సర్వకాల సర్వావస్థలయందును ఆత్మను గుర్తించే స్థితియే సాక్షాత్కారమని చెప్పబడుతుంది.**

(బృ.త్ర.పు.123)

(చూ॥ అవతారము, ఇరువదిగుణములు, తల్లులు, మాయ)

సాక్షి

(చూ॥ ఒకటే, స్మరింతురు)

సాక్షీభూతుడు

ఒక చెట్టుమీద రెండు పక్షులు కూర్చొని ఉన్నాయి. అందులో ఒకొటి ఆచెట్టు పండ్లను తింటున్నది. రెండవది ఊరక సాక్షీమాత్రంగా చూస్తున్నది. అని ఉపనిషత్తులో చిన్న సన్నివేశం ఉంది. **దాని తత్వం ఏమిటంటే ఆ చెట్టు దేహము. పండ్లు ప్రాపించిక సుఖదుఃఖాలు. ఆ పండ్లు ననుభవించే పక్షి జీవాత్మ, సాక్షిగా చూస్తున్న పక్షి పరమాత్మ.** అవి రెండుగా కనిపిస్తున్నప్పటికీ వస్తుతః అవి రెండు ఒకటే. పరమాత్మయొక్క ఆభాస రూపమే జీవాత్మ. అయినప్పటికీ **సుఖ దుఃఖానుభవము జీవాత్మకేగాని పరమాత్మకు ఉండదు. పరమాత్మ కేవలం సాక్షీభూతుడు.**

(త.పు.182)

సాగరము

(చూ॥ నియమం)

సాటిరారు

ఎంఏలు, బిఏలు ఏర్పడ జదివియు
పేరుగాంచిన పెద్దవారలైన
సంపదలుండియు సద్దానపరులౌచు
పుడమికీర్తినిగన్న పుణ్యులైన
ఆయురారోగ్యము లనవరతంబుండి
పరిపూర్ణ బలులగువారలైన
జపములు తపములు సతతంబు చేయుచు
వేదంబులను నేర్పు విప్రులైన
సాటిరారు భక్తులకు నేనాటికైన
దైవమును గొల్వనిదె రాదు దండిశక్తి
ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

(శ్రీ.స.వా.పు.123)

సాత్త్విక

(చూ॥ గుణములు, జగదీశుడు, తత్త్వజ్ఞానము, సాత్వికగుణము, స్థితత్వములు)

సాత్త్వికాహారము

సాత్త్వికాహారమంటే ఏమిటి? కారం, ఉప్పు, చింతపండు, మసాల తక్కువగా ఉండాలి. అంతేగాక, అది చాలా వరకు తైలముతో కూడి ఉండాలి. **తాజాగా ఉండాలి. చల్లగా ఉండకూడదు. ఉదయం వండినది సాయంత్రం భుజించకూడదు.** అనేకమంది సాత్వికాహారం పేరుతో పాలు, పెరుగు, పండ్లను భుజిస్తుంటారు. ఇది సాత్వికమైనవే. **కాని మితిమీరితే,** ఇవి తామసికంగా మారుతాయి. **పెరుగేకదా! అని దానిని మనము ఊరికే భుజిస్తే అది తమోగుణంగా రూపొందుతుంది.** పాలను కూడా మనం అధికంగా తీసుకోరాదు. **పాలు చిక్కగా ఉంటే మనము తీసుకోకూడదు. అందులో సగం పాలు, సగం నీళ్ళు కలసి ఉండాలి.** ఈనాడు అదృష్ట వశాత్తూ పాలు చిక్కగా దొరకటం లేదు. పాలుపోసేవారే దానిలో నీళ్ళు కలుపుకొని వచ్చి మనకు సహాయం చేస్తున్నారు. కనుక, **పాలు, పెరుగులను అమితంగా భుజించరాదు.** ఆ విధంగా భుజించేవానికి నిద్ర ఎక్కువగా వస్తుంది. **నిద్ర తమో గుణము యొక్క తమ్ముడు, కనుక, నిద్ర రాకుండా ఉండే ఆహారాన్ని భుజించాలి.**

(శ్రీ.భ.ఉ. పు.139)

సాదృశ్యము

(చూ॥ ఆత్మార్పణ)

సాధకుడు/సాధకులు

సాధకుడు కడు జాగ్రత్తగా ఉండవలెను. ఇంద్రియముల తిరుగుబాటు ఎప్పుడైనను రావచ్చును. మముక్షుత్వము గానీ, యోగముగానీ వచ్చిననూ మరలిపోవుచుండును. అందుకనే ప్రపంచ ధోరణియందుండు వారితో, ఆ సంబంధమైన వస్తువులతో కలియుట ఎక్కువ పొరపాటు. ఎల్లప్పుడూ సత్యాన్వేషణయందే మునిగియుండ వలెను. కోరికలను వృద్ధిపొందించుకొనుట, కాలమును వృధా పుచ్చుట చేయరాదు. ఒక సుఖము మరొక సుఖమును కోరును; అట్లు కోరుట వలన మనస్సు విడిచిన వాంఛలను మరల పొందుటకు సమయమునకు వేచియుండును. సాధకుడు మనస్సును నిగ్రహమందుంచు కొనుటకు పట్టుదలతో యుండవలెను. ఇంద్రియ భోగములనుండి మనస్సును పట్టుపట్టి త్రిప్పవలెను. **ప్రార్థనలు కూడా తిరుగచూ ప్రార్థించరాదు. ఒకే స్థలమందు కూర్చొని ప్రార్థించవలెను.** అట్టి వానికి **ఆత్మయేబలము. ఆత్మయే ధనము.**

(జ్ఞా.వా.పు.12)

ఇప్పుడు సాధకులు చేయవలసిన దేమన, **మొదటిది,** వివేకము పెంపొందించుకొనవలెను. అనగా, నిత్య అనిత్య విషయమును పరిశీలించుట, అందులో, ఏది యోగ్యమైన దానిని అనుభవింప ప్రయత్నించుట. రెండవది యోగ్యమైన సత్యమైన దానిని అనుభవింప ప్రయత్నించుట. మూడవది, అట్టి ప్రయత్నములలో ఎన్ని అవాంతరములు వచ్చినా చలించక, యోగ్యమైనదని తెలిసికొన్నదానిని వదల కుండుట. ఈ మూడు విషయములనే **నిజతపస్సు అనికూడ అందురు. ఆ తపస్సులోనే నిజశాంతి, సంతోషము ఉద్భవించును. ఇప్పుడు లోకమున, పిపీలికాది బ్రహ్మపర్యంతము నిమిష నిమిషమునకు ఏదో ఒకవిధమైన మార్పు చెందుతూనే యున్నవి.** మార్పు చెందని వస్తువుకానీ, మార్పుచెందని జీవికానీ లేనేలేదు. సృష్టి యావత్తూ మార్పు చెందునదే, ఐతే **అట్టి మార్పులో రెండు విధములైన మార్పులు కలవు. బహిర్ముఖమైన మార్పులు ప్రతిజీవికి తెలియును; తెలిసికొనుటకు వీలగును. ఐతే అంతర్ముఖమార్పు తెలియదు; తెలిసికొనుట సులభముకాదు. అందుకనే తెలిసికొన సాధ్యమైన బహిర్ముఖ కర్మలలో మొదట క్రమశిక్షణలను ప్రారంభించి క్రమక్రమముగా అంతర్ముఖముగా ఆచరించవలెను. ఇందులో ఏదైనను మనస్ఫూర్తిగా ఎవరికివారు సాక్షిగా చేయవలెను. కాని ఇతరుల మెప్పుకొఱకు, ఇతరులను మోసపుచ్చుట కొఱకు, ఇతను చాలా గొప్పభక్తుడు అని అనుకొనవలెనను ఉద్దేశ్యముతో చేయకూడదు. అది ఆత్మద్రోహముగా మారును. భగవంతుడు భావప్రియుడేకాని బాహ్య ప్రియుడుకాడు. ఐతే బాహ్యమును మానరాదు.** బాహ్యములోకూడ భావమును చేర్చిననే శాంతి అనుభవమునకు అవకాశము చిక్కును. మనోవాక్కాయ కర్మలందుకూడ శాంతిని చవిచూడవలెను. ఈ నాల్గింటియందు ఏకముగా అనుభవించినపుడే, **పరిపూర్ణ శాంతి, అనగా, మనో వలయము; మనోవలయమునే శాంతి అనియు, యోగ మనియూ అందురు.**

(ప్ర.వా.పు.8/9)

సాధకుడు పట్టినపట్టు విడువక ఎన్ని కష్టములైనను, ఎన్ని బాధలనైనను సహించుకొని సర్వోత్కృష్టమైన బ్రహ్మమును దర్శించవలెను. అట్టి కష్టములను, బాధలను భరించుకొను శక్తిని ప్రసాదించునదే శాంతిసూత్రము. **శాంతి మూలమునే భక్తి వికశించును. భక్తివలన జ్ఞానము** బలపడును. శాంతిజ్ఞానమే మనిషికి అలంకారము. అదే యదార్థమునుచూపు ఏకైకమార్గము, సంపూర్ణత, **సంపూర్ణత అనగా చావులేని జీవితము, లేక పావన జీవితము సంపాదించుటే. నేను ఎవడిని అను విచారణ ఆత్మసాక్షాత్కారమునకు లేక బ్రహ్మజ్ఞానమునకు దారితీయును.** కాన మానవుడైనవాడు అట్టి ప్రాప్తిని

పొందగోరువాడు భగవంతుని ప్రేమను, భగవత్ జ్ఞానమునునమ్మి, శాంతితో భయము, ఆత్రముల నిర్బంధన లేకుండా ఉండవలెను. ఇట్టి విచక్షణగల మనిషి ఎల్లప్పుడు శ్రద్ధ కలిగి ఉంటాడు. చేసిన తప్పిదములకు పశ్చాత్తాపపడుతాడు. తనను క్షమించమని దేవుణ్ణి వేడుకొంటాడు. ఇట్టి గుణముల ప్రసాదించునట్టిదే ప్రవిత్రశాంతి. అంతియేగాక భగవంతుడు ఎక్కడపడితే అక్కడే ఉన్నాడను భావము మూలముగా మానవుడు భయములేనివాడుగా వుండగలుగు శక్తిని ప్రసాదించి, శాంతి సుఖములను అనుభవింపజేయును. **ఇట్టి పవిత్ర శాంతికి పరమ శత్రువైన కోపమును జయించవలెను. కోపము చిత్తవికారముయొక్క పంటఫలము. కోపము మనసును తన బానిసగా చేస్తుంది. దేనినీ అర్థము చేసుకొనకుండచేయును.** సర్వవిషయములు అర్థము చేసుకొనవలెనన్నను, సర్వేశ్వరభక్తి బలపరుచుకొన వలెనన్నను, నీవు శాశ్వత పరమానందమును అనుభవించ వలెనన్నను, శాంతి భక్తియే సర్వోత్కృష్టము. అద్యంతములులేని శాంతియొక్క దూతలు కావలెను. దాని మూలమున ప్రపంచమందుండు ప్రాణులకు శాంతివెలుగును చూపండి. అట్టి ఉత్తమోత్తమమైన ఆదర్శజీవితమును గడపండి. ఎవడు ఎల్లవేళలా తృప్తిగా ఆనందముగా ఉండునో వాడు శాంతిని పొందగలడు.

(ప్ర.వా. పు.10/11)

సాధకుడైన ప్రతిమానవుడు ఇట్టివారి బాధలను, గుణములను ఆధారముగా తీసుకొన్న ఎట్టి విసుగు విరక్తి, కోపము రానేరదు. భక్తులు భగవత్‌శక్తి సామర్థ్యములు సహజములు అని వర్ణించినను, పరిహసించును మారునవి కావు. సాధకుని భావములు సాధనమువలన సాధించునవి. అట్టివాటికి అప్పుడప్పుడు మార్పులు కలుగుచుండును. కనుక అట్టిమార్పు కలుగునపుడెల్లను పై సాధకభక్తులు ఎన్ని ఇక్కట్లకు గురియగుచుండినదియు, వాటిని ఏ మూలమున జయించుచుండినదియు స్వానుభవ మూలమున తెలిసికొని నడచుకొనవీలగునట్లు చేయును. కాన, **అప్పుడప్పుడు పై సాధకులు ఎట్టిబాధలనైనను జయించి ఎట్టకేలకు గట్టుచేరిన మార్గమును స్మరణకు తెచ్చుకొనిన, శాంతి అభివృద్ధి కాగలదు. అట్టి శాంతియే వారల తరింపజేసిన ముఖ్యఆయుధము. ఆ ఆయుధముల మూలముననే కోప, తాప, అసూయ, అహంకార, విసుగు, విరక్తి, ఇట్టి దుర్మార్గులను జయించిరి,** వారిబారినుండి తప్పించుకొనిరి. కాన సాధకులైన మానవులారా! శాంతి ఆయుధమును సర్వేశ్వర అనుగ్రహముతో సాధించండి. అందుకై సాధన సల్పండి. ఎన్ని కష్టములైనను, ఎంతటిబాధలైనను స్మరణమూలమున సాధించండి. పవిత్రతను ప్రధానముగా కోరండి. **భీష్ముడుచూడు, అంపశయ్యపై యుండియు, శారీర మానసిక బాధలు భరింపరానివైనప్పటికిని ఉత్తమకాలము వచ్చునంతవరకు ఓపికతో కాచుకొనెనేకాని, "బాధలు భరింపలేను,** ఏకాలమైననుసరే త్వరలో నన్ను తీసుకొనిపో"మ్మని పరమాత్మను కోరెనా? లేదు. **ఎంతటి బాధలకైనను, ఎన్నిదినములకైనను భరింతును. ఉత్తమకాలము వచ్చునంత వరకు ఉంచుము.** ఉత్తమకాలము రాగానే నీలో చేర్చుకొమ్మని ప్రార్థించెను. అందుకనే **భీష్మునకు శాంతిభక్తులలో అగ్రగణ్యుడను సార్థకనామము స్థిరముగా నిలిచెను.** ఎట్టివారికైనను శాంతి అవసరము. అది వున్నప్పుడే అన్నియూ ఉండును. అది లేదా ఏదియూలేదు. ఇది మానవుని స్వభావమైనప్పటికిని కామక్రోధములే దీనిని కప్పిపుచ్చునవి. వాటిని తీసివేసిన, ఇది తనంతటతానే ప్రకాశించును.

(ప్ర.వా.పు.12/13)

సాధకునకు కలుగు అపజయములు, లోపములు, తప్పులు మొదలగువాటి విషయమై దీర్ఘముగా ఆలోచించరాదు. అట్లు ఆలోచించిన, శాంతివల్ల సాధించిన ఇచ్ఛాశక్తి బలహీనమగును. **లోపములను యథాప్రకారముగా వదలివేయవలెను. ఇచ్ఛాశక్తి నిర్మలమై బలమైన తరువాత, ఆ లోపములు జ్ఞాపకమునకు రానీయకచేయును.** అట్లు వచ్చినది, ఎక్కడ వచ్చినది అను యోచన ప్రారంభమైన,

సాధన

దానితోపాటు మరి కొన్ని తప్పులు చేయుదురు. **అది తప్పు అని తెలిసిన తరువాత, దాని పుట్టు పూర్వోత్తరముల యోచించ పనేమున్నది?** కావలసిన, అనుభవించ వలసిన మంచివాటిని యోచించినను కాలము ఒక సత్ చింతగా నుండును.అవసరము లేనిదానిని ఎట్లుపోయిన మనకేమి? దాని చింతనే వద్దు ఇట్టి. **కుశలబుద్ధిని** పెంపొందించు కొనుట సాధకునికి ఎంతయో ఉపకారము.

(ప్ర.వా.పు.15/16)

ఈనాటి సాధకులకు Part - Time devotion వుంది. Full - time devotion లేదు. ఫలితముకూడా అటులే వుంటుంది.

(భ.ప్ర.పు.1)

సత్‌శీలమే సంపద. సదాచారమే ధనము. ఆత్మజ్ఞానమే ఐశ్వర్యము ఈ మూడు సాధకునకు అత్యవసరము. లౌకికసంబంధమైన సంపద, ధనము, ఐశ్వర్యము జీవిత కాలమందే కోల్పోతారు. తదనంతరము వాటికి అతనికి యెట్టి సంబంధము వుండదు. బ్రతికినప్పుడే దరిద్రదేవత తాండవమాడి యనేకబాధలకు గురియైన సంపదలు కోల్పోతువుంటారు. ఐశ్వర్యాన్ని వీడుతుంటారు. ఇట్టి సంపదలు, ధనము, ఐశ్వర్యములకు జీవితతదనంతరము అతనితో యేమాత్రము సంబంధముండదు. కానీ **సత్‌శీలము, సదాచారము, జ్ఞానము జీవితపర్యంతమే కాకుండా మోక్షాపర్యంతము అతనివెంటనే వుండి అతన్ని సాయుజ్యంలో చేరుస్తాయి. మానవుని యొక్క కీర్తి, రూపసౌందర్యములతో లేదు; ధనకనక వస్తువాహనాదులతో రాదు. ఇది శీలముతో మాత్రమే ప్రాప్తిస్తుంది.** కనుక మానవుడు సత్‌శీలుడై సదాచారుడై ఆత్మజ్ఞానమునకు అన్వేషణ సలపటానికి ప్రయత్నించాలని ప్రబోధించింది గీత.

(శ్రీ.గీ.పు.67)

సాధకుడు, స్వల్ప విషయములందుకూడా త్వరగా కోపించకూడదు. అట్లుండిన ధ్యానమందు ఎంతమాత్రము వృద్ధికలుగదు. అతడు సౌమ్యముతో కూడిన ప్రేమభావము అలవరచుకొనవలెను. అప్పుడు చెడు అలవాట్లు తప్పిపోవును. **చెడు అలవాట్లు అభ్యసించుటకు కోపమే ప్రథమ పీఠము.** అది ఉండిన ఏ నిమిషమందైనా, ఎట్టిదానియందైనా, ఏవిధమైన చెడ్డలనయినా చేయవచ్చును. కాన, మొదట దానిని, రూపు మాపవలెను. క్రమేణా ప్రయత్నించవలెను. **సాధకులకు తన తప్పులు ఎవరైనా బయట పెట్టిన, అప్పుడు ఓపికతో దానిని సర్దుకొనుటకు ప్రయత్నించి, తన తప్పును తెలిపినవారికి కృతజ్ఞతగా ఉండవలెను. కానీ తెలిపిరికదా అని వారిపై కోపించరాదు.** అప్పుడు మంచికి ద్వేషి అయినట్లగును. మంచిని ద్వేషము చేసిన అలవడునవే చెడుగా ఉండును. **కాన మంచిని ప్రేమించి, చెడ్డను వదలవలెను.** వాటిపై ననూ ద్వేషించరాదు. అట్టివాడు ఆధ్యాత్మిక జ్ఞానము నందునూ, ధ్యానమునందునూ వృద్ధి పొందగలడు.

(ధ్యా.పు.90)

(చూ॥ అవసరం, స్థైర్యము)

సాధన

సాధన అనగా జపం, ధ్యానం చేయటం కాదు. ఏ పని చేసినా దైవసేవగా భావించడమే నిజమైన సాధన. Every work is God's work. God is everywhere. దీనిని పురస్కరించుకొనియే భగవద్గీత చెప్పింది.

సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖం
సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి

"నేనీ పని చేస్తున్నట్లు ఎవ్వరికీ తెలియదు" అనుకుంటావు. చాల పొరపాటు భగవంతుడు చూస్తూనే ఉన్నాడు. కన్నుల్లో వెలుగు ఉన్నట్లుగా భగవంతుడు నీలోనే ఉన్నాడు. సర్వమునకు భగవంతుడు ఆధారం. **భగవత్సంకల్పము లేనిదే గడ్డిపోచ కూడా కదలదు. పిపీలికాది బ్రహ్మపర్యంతం తాను వ్యాపించుయున్నాడు.** కాని, ఈ సత్యాన్ని గుర్తించుకోలేక కొంతమంది తాము గొప్ప వివేక వంతులమని, ఎన్నో ఘనకార్యాలు చేస్తున్నామని అహంకారపడుతుంటారు. **చేయించేది, అనుభవించేది,**

ఆనందించేది అంతా ఆ భగవంతుడే అని గుర్తించండి. మీకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా మీ మంచికే అని భావించండి. అప్పుడు అంతా మీకు మంచియే జరుగుతుంది. వైద్యుడు మలేరియా జ్వరం వచ్చినవానికి చేదుగా ఉండే క్వినైన్ మందు ఇస్తాడు. ఆ చేదు మందును త్రాగినప్పుడే వచ్చిన జ్వరం నివారణవుతుంది. అదేరీతిగా, మీకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా మీ 'రోగ' నివారణకే అని గుర్తించండి. ప్రతి కార్యమునకు ఒక కారణం ఉంటుంది. **భగవంతుడు కారణం లేని కార్యం ఏదీ చేయడు. కార్యకారణ సంబంధాన్ని గుర్తించుకోలేక మానవుడు "దేవుడు నన్ను బాధపెడుతున్నాడు"** అని భావిస్తాడు. **దేవుడు ఎవ్వరినీ బాధ పెట్టడు. చేసేదీ తానే, అనుభవించేదీ తానే. ఈ సత్యాన్ని మానవుడు గుర్తించాలి.**

(స.సా.ఫి.2000 పు.54/55)

జ్ఞానము మానవుడు సాధించవలెనన్న, రెండు మార్గములు కలవు. **ఒకటి బహిరంగ సాధన, రెండవది అంతరంగ సాధన. అనగా నిష్కామ కర్మ; అంతరంగ సాధన, అనగా ధ్యానసమాధులు, ఇట్టి స్థితికి ఆత్మసంయమమని కూడనూ అందురు.** వేదాంత పరిభాషలో దీనినే నిధిధ్యాసనమని పిలుతురు. దీనిని పొందవలెనన్న శ్రవణ మన నాదులు ఆధారము వాటిద్వారానే ధ్యానము సాధించవలెను. కానీ శ్రవణ మననాదులు లేక ధ్యానసిద్ధి కలుగదు.

(గీ.పు.122)

ఉపనిషత్తులో ఉన్నట్లు, **"యమేవ వృణుతే తేన లభ్యః"** అనగా ఇది భగవంతుడు ఏర్పాటు చేసినవారికే లభ్య మగును. దీనిలో సాధకులకు సంశయము గలుగవచ్చును. భగవంతుడు ఏర్పాటుచేసిన వారలకే కలుగునట్లయిన మీరుచేయ సాధనయొక్క ఉపయోగమేమి? అని, ఐతే ఇందులో ఒక స్వతంత్రత ఉండును. **భక్తితో పరమాత్ముని తలంచు వాడు ఎట్టి ప్రారబ్ధసంచితములనైనా దాటగలడు. తన అనుగ్రహమునకు పాత్రుడై పొందలేని ఆనందమును గూడ పొందవచ్చును. సాధనవల్ల ప్రయోజనమేమి అను అనుమానమే అనవసరము. సాధన నిష్ప్రయోజన మేనాటికీకాదు. ఎవ్వరికీ కాదు,** దానిని దృఢము చేసికొనవలెను. నిశ్చల భక్తి గల మనుజునకు దైవానుగ్రహము కలుగుటలో ఆశ్చర్యమేమీలేదు. దీనికి గజేంద్రుని కథయే ఆధారము

(ప్ర.వా.పు.10)

అద్భుతమైన దర్శనాలు, దృశ్యాలు అన్నీ స్వామి నీకు అనుగ్రహించిన వరాలని నువ్వు అనవచ్చును. కాని అది తప్పు. నేను ఎల్లప్పుడూ చెప్పేదేమంటే **సాధన ముందు సంకల్పము తరువాత.**

తీవ్రమైన సాధనద్వారా భగవదనుగ్రహం పొంది భగవత్సంకల్పంచే తమ బాధలను పోగొట్టు కొనగలమనే సత్యాన్ని చాలా మంది గ్రహించలేరు.

(శ్రీ.స.స.పు.151)

దీపాలు వెలిగించుకొనేందుకు విద్యుదుత్పాదక కేంద్రం నుండి విద్యుత్తును మీ ఇంటికి తెచ్చుకోవాలంటే ఒక క్రమ పద్ధతి ప్రకారంగా మధ్య దూరం ఉండేటట్లుగా స్తంభాలుపాతి 'కేబుల్స్' సహాయంతో మీ ఇంటిని విద్యుదుత్పాదక కేంద్రంతో కలపాలి. అదే విధంగా **భగవంతుని అనుగ్రహం మీరు సంపాదించాలంటే ఒక క్రమ పద్ధతిలో నిర్ణీత సమయాల్లో సాధన చేయండి. స్మరణ అనే 'కేబుల్' సహాయంతో మిమ్మల్ని మీరు భగవంతునితో కలుపుకొండి."**

(లో.పు.125)

సాధనలో ఆచరణశుద్ధి, అనుష్ఠానశుద్ధి ముఖ్యమైనవి. హనుమంతుడు రామసేవాబలముతో, రామనామ బలముతో పెద్ద కొండను మోయగల్గినాడు. కాని, ఈనాడు అరవై సంవత్సరములు అఖండముగా సుందర కాండ పారాయణ చేసినవారు ఒక చిన్న 'కుండ'ను కూడా మోయలేకపోతున్నారు. అనగా, వారిలో ఏ చిన్న కష్టనష్టములనైనా సహించుకునే శక్తి లేదు. **హనుమంతుడు దృఢమైన నమ్మకంతో భగవదాజ్ఞను శిరసావహించినాడు కనుకనే, అతనికి అది సాధ్యమైంది. మనస్సు శ్రీరామనామ స్మరణార్థము, దేహము శ్రీరామసేవార్థము అని**

సాధనచతుష్టయము

మనోదేహములను అర్పించవలయును. మర్కటములై పుట్టి భగవత్కింకరులుగా సేవ చేసి సాక్షాత్కార సౌభాగ్యములను పొందినవారు వానరులు. అయితే, నరులు వానరులకన్న తక్కువ కాదే! మరి భగవచ్చింతనలో భగవదారాధనలో నరులు తమ జీవితము నెందుకు వినియోగం చేయరు?

(స.సా.డి.2000పు.వెనుకపుట)

ప్రతి పనియందును చిత్తైకాగ్రత (శ్రద్ధ) అత్యవసరము. వ్యవహారిక విషయములకును, పారమార్థికమునకును కావలసిన సద్గుణములు వేరు వేరనుకొనుట సరికాదు. వ్యవహారమును పరిశుద్ధ పరచుటే పారమార్థము. అందులోని సఫలత విఫలత **ఏకాగ్రతమీద ఆధారపడి యుండును.** ఈ ఏకాగ్రతకూడనూ సాధనే; అనగా జపధ్యానములు. **ఆ సాధనలో రెండు మార్గములున్నవి. 1. శూన్యావస్థ 2. అనేకాగ్రత. శూన్యావస్థ అనగా నిద్ర, లేక తమోగుణము అంటారు. అనేకాగ్రత అనగా రజోగుణము, కన్నులు విప్పి సృష్టియందున్న దృశ్యముపై మరల్చుట. అట్లుకాక, ఈ రెండు దృశ్యములనూ వదలి,** అనగా పూర్తిగా కన్నులు తెరచుకొనుట, పూర్తిగా కన్నులు మూసుకొనుట, రెండనూ లేక, **అర్ధ నిమీలిత నేత్రుడై ముక్కు కొనను దృష్టినిల్పిన సత్యగుణ స్వభావుడు కాగలడు.** అట్లున్న చిత్తైకాగ్రత సులభముగా ఏర్పడును. అయితే, ముక్కు కొసన దృష్టి నిల్పినంతమాత్రమున సత్వగుణుడు కాడు. ప్రారంభమున అట్లు నిల్పి, **ఆ దృష్టిని స్మరించు నామరూపునిపై మరల్చుటయే ధ్యానము.**

(ధ్యా.వా.పు.50)

సాధనలు చేసి ఫలమేమి **శమములేక**
యోగములు పూని ఫలమేమి, **ఓర్పులేక**
జపములొనరించి, ఫలమేమి **శాంతిలేక**
చవిటి భూమి దున్నిన సరణి **కాదె**

(సా.పు.312)

ఇంద్రియ నిగ్రహమే విద్యార్థుల ప్రథమ ఆదర్శము. విషయ సంబంధమైన భోగభాగ్యములు శాశ్వతములు కావు. ఇవి అల్ప సుఖమును, అనంతదుఃఖమును అందించును. ఇంద్రియములకంటె ఇంద్రియార్థములు బలమైనవి. అవియే శబ్ద స్పర్శరూప రస గంధములు. ఇంద్రియము లన్నింటిలోను ప్రధానమైనది **వాక్కు. వాక్కును జయించిన అన్ని ఇంద్రియములను జయించి నట్లే. తినుట, మాటాడుట ఈరెండు నోటితో పనులు. వీటినే అహోరవిహోరములని పిలుస్తుంటారు.** ఈరెండింటిని ఏమానవుడు జయించునో అట్టె మానవుని తత్వము దివ్యతత్వము నందు లీనమవుతుంది. అప్పటి నుండి మాటలు స్తంభించి మనస్సు మాటాడుటకు ప్రయత్నిస్తుంది. మనస్సు యొక్క నోరును మూయించే నిమిత్తమై బుద్ధిని మేల్కొలుపవలసివస్తుంది. క్రమముగా బుద్ధికి బుద్ధి చెప్పి ఆబుద్ధిని ఆత్మవైపుమరల్చుటకు కృషి చేయాలి. **వాక్కు మనస్సునందు మనస్సు బుద్ధియందు, బుద్ధి ఆత్మ సన్నిధిని చేర్చే ఉపాయమే సాధన.**

(బృ.త్ర.పు.54/55)

మనోనాశనం నిమిత్తమై ఆచరించే సాధనలే ఆత్మా న్వేషణకు సరియైన సాధనలు.

(బృ.త్ర.పు.126)

(చూ॥ అన్నం,అలవర్చుకోవాలి, అలవాట్లు, దర్శనం, ధ్యానం, ధ్యానమార్గము, నగరసంకీర్తనము, నిర్యాణం, భవానీశంకర, భారతదేశము, మహిమలు, వేదము, సంయమము, సగుణభక్తి, సీలింగ్‌ఆన్‌డిజర్సు,స్వస్థానము)

సాధనచతుష్టయము

(చూ॥ ప్రస్థానత్రయము, బ్రహ్మసూత్రము)

సాధన లక్ష్యము

ఆత్మస్వరూపుణ్ణి అని తెలుసుకోవడమే సాధనలక్ష్యం.
"కోహం" నేను ఎవరిని? అనే ఆత్మవిచారణ
"సోహం" - "అదే నేను" అనే సమాధానంతో వస్తుంది.
దేహం - నాహం - కోహం - సోహం అనే క్రమంలో ఈ విచారణ కొనసాగుతుంది. ఆత్మస్వరూపుణ్ణి అని తెలుసుకోవడమే సాధన లక్ష్యం.

(శ్రీ.స.ది.వా. పు. 25)

సాధ్యము

(చూ॥ సగుణభక్తి)

సాధించుట

(చూ॥ సర్వధర్మాన్ పరిత్యజ్య)

సాధు/సాధువు

కాషాయవస్త్రంబు కట్టిన మాత్రాన
కరతలాములకంబు కాదు భక్తి
నోటితో మంత్రంబునుచ్చరించిన యంత
పరతత్త్వమహిమ పట్టుబడదు
గీతను చేబట్టి కేకలు వేసిన
పుణ్యమన యింట ప్రోగుపడదు
చెప్పుమాటలకు చేసిన పనులకు
బంధమున్న వాడు సాధువగును

(ము.ము.పు.46)

(చూ॥ త్యజ, ధర్మోద్ధరణ)

సాధుత్వము

(చూ॥ అవతారము)

సాఫల్యత

(చూ॥ వేరు)

సామాన్యభక్తి

(చూ॥ భక్తి)

సామీప్యము

(చూ॥ ఆధ్యాత్మికము)

సామీప్యముక్తి

(చూ॥ ముక్తి)

సాయి

పత్రి గ్రామ సముద్భూతం ద్వారకామాయి వాసినం
భక్తాభీష్టప్రదం దేవం సాయినాథం నమామ్యహం

మహాల్సాపతి మొట్టమొదట బాబాను 'సాయి' అని ప్రకటించాడు. మన్మాడు తాలూకాలో పత్రిగ్రామంలో అవతరించి, ద్వారకామాయిలో ఉంటుండి భక్తులయొక్క అభీష్టములు నెరవేర్చ నిమిత్తము తాను అవతరించాడు.

(షి.పు.1)

సాయి యొక్కడే నాకు ప్రతిపన్న భాగ్యంబు
జీవనాధారంబు జీవితంబు!
సాయి యొక్కడే నాకు ప్రేమ బంధు బలంబు
సకల భోగ ఫలంబు సమ్మతంబు!
సాయి యొక్కడే నాకు ప్రాకట దైవంబు
సేవింప భజియింప శ్రీకరంబు!
సాయి యొక్కడె నాకు రక్షక రాజ్యంబు
సంసార క్షితినార్వ సత్పదంబు!
సాయి సేవయె నా మది కామితంబు
సాయి ప్రేమయె నాకింక ధీమతంబు
సాయి భజనయె సుజన విభ్రాజితంబు
సాయి నామమె భువిలో సుధీమతంబు.
(బాబా 1949)

(బ.పు.2)

వ్యక్తిని, సమాజమును పరిశుద్ధం గావించి లోకమును పవిత్రం గావించుటకు ఆధ్యాత్మికం అత్యవసరం. **ఆధ్యాత్మికమంటే ఏమిటి? మానవునియందున్న పశుత్వాన్ని నిర్మూలం గావించి, మానవత్వాన్ని పోషించి దివ్యత్వాన్ని చేకూర్చునదే అధ్యాత్మికము.**పూజలు భజనలు, వ్రతములు ఇవన్నీ కొన్ని విధములైన సత్కర్మలే తప్ప నిజమైన ఆధ్యాత్మికమునకు సంబంధించినవి కాదు. **మానవునియందున్న పశుత్వాన్ని నిర్మూలం గావించాలి; మానవత్వాన్ని పోషించి దివ్యత్వంతో చేర్చాలి. ఇదియే ఆధ్యాత్మికము (Spirituality) యొక్క అంతరార్థం. SAI (సాయి) అనే పదములో S - Spiritual Transfor-**

సాయి అపేక్ష

mation (ఆధ్యాత్మిక పరిణామము)ను, A - Association Transformation, (సామాజిక పరిణామము) ను - Individual Transformation (వ్యక్తి పరిణామము)ను సూచిస్తున్నాయి. ఈనాడు వ్యక్తి పరిణామము, సామాజిక పరిణామము, ఆధ్యాత్మిక పరిణామము మూడూ అత్యవసరమని SAI (సాయి) అనే పదము లోకానికి చాటుతున్నది.

(సా.శు.పు.27)

దైవత్వాన్ని గుర్తించటానికి కర్మోపాసనజ్ఞానములు ముఖ్యం. కర్మమార్గమునందు ప్రవేశించి, ఉపాసనా మార్గమునందు నిల్చి, జ్ఞానమార్గంలో అంత్యం కావాలి. కర్మమార్గం పూవువంటిది. భక్తిమార్గం కాయవంటిది. జ్ఞానమార్గం పరిపూర్ణ ఫలంవంటిది. ఫలమును భుజించినప్పుడే దాని మాధుర్యమును పొందవచ్చునుగాని, కేవలం కాయను మాత్రమే భుజిస్తే ఆమాధుర్యము నందుకోలేము. కనుక, మొదట కర్మమార్గమందు ప్రవేశించి, ఉపాసనామార్గమందు జీవితమును గడిపి జ్ఞానమార్గంలో అంత్యం చేసుకోవాలి. అప్పుడే దివ్యమైన పరిపూర్ణత్వమును పొందటానికి మీరు అర్హులవుతారు. ఇదియే సాయి అనే పదముయొక్క సత్యరహస్యము. **సాయి (SAI) అనే పదంలో Sఅనగా** Service **(కర్మమార్గం), Aఅనగా Adoration (ఉపాసనామార్గం) - అనగా Illumination (జ్ఞానమార్గం).** కర్మోపాసనా మార్గములందు జ్ఞానమును పొందే పరిపూర్ణ స్థితియే సాయి బోధించే ఆధ్యాత్మిక మార్గం. మానవత్వమునే అర్థం చేసుకోలేనివాడు ఇంక దైవత్వమును ఏమాత్రం గుర్తించలేడు. కనుక, మొట్టమొదట మానవత్వమును అర్థం చేసుకోవాలి.

(సా.శు.పు.67)

(చూ॥ స్వామి బాల్యము, ప్రతిష్టించు, హాయి, చక్కచేసుకోండి, సద్వినియెగం)

సాయి అపేక్ష

వెన్నెలవంటి చూపు, వెన్నెలవంటి హృదయము, తేనెవంటిమాట, సాయి భక్తులకు సహజమై వెలగాలి. స్వార్థరహితమైన సమత్వ ప్రేమ సాయి స్వరూపము. అన్యోన్యమైన సమంజస ప్రేమసాయి దృష్టి. ఈ రెంటిని పాటించిన వారే సాయి భక్తులు. పరమాత్ముడు ప్రేమకు వశుడు గాని పదార్థమునకు వశుడుకాడు. భక్తికి తగిన ప్రవర్తనలను మానవుడు ప్రధాన నేత్రములుగా ధరించవలెను, నేత్రములు ప్రేమమయములైనపుడే లోకమంతా బ్రహ్మ మయమగును. వ్రతములు, ఊరేగింపులు, అర్చన, అభిషేకము లంటే, సత్కర్మలతో, సదాచారములతో, సద్వాక్యములతో సాయిని సేవింపుడు. అదే సాయికి ప్రీతియైన పదార్థము. అదే యధార్థము. ఇదే ఆనంద బిందువుల ఆరగింపు. ఇదే సాయి అపేక్ష, భక్త బృందము నకు శ్రీరామ రక్ష.

(జ.పు.88)

సాయి అవతారము

"శ్రీరామచంద్రుడు తన అవసాన దశలో ఒక విషయం చెప్పాడు. మనల్ని ఈ శరీరం వదలమనుపే మనం ఈ శరీరాన్ని వదలివేయగలగాలి. అదే నేను కూడా చేస్తాను. ఏమీ భయపడకు. స్వామి ఈ శరీరంలో 95-98 సంవత్సరాలుంటాడు. 62 సం.లో ఏ విధంగా వున్నాడో ఈ స్వామి అఖరివరకు ఆ విధంగానే ఉంటాడు. ఏ మాత్రం మార్పు ఉండదు. **ఇంతవరకు వచ్చిన అవతారములలో ఇది చాలా విశిష్టమైన అవతారము.**

(ప్రే.జో.పు.198)

సర్వజనులపైనా ప్రేమామృతమును వర్షించుటకే నారాకకు కారణం.

(సా.పు.53)

"నేను మోక్షమివ్వడానికే వచ్చాను"

(సా.పు.104)

నేను 8 సం॥లు సమాధిలో నుండి శ్రీసత్యసాయి రూపమున వచ్చితిని. పుట్టపర్తి నాయకుఁ కాయము, గోత్రము, సూత్రము, శక్తి జ్ఞానము లోక కల్యాణ నిమిత్తములైన ధర్మములన్నియు నాతో తెచ్చితిని.

(సా.పు.107)

మానవుల హృదయాలన్ని మంచివైపు మార్చుటయే నాకర్తవ్యం.

(సా.పు.110)

సాయిఆశయము

(చూ॥ సత్యసాయి)

సాయి తత్వము

సాయి తత్వమేమిటి? Sఅనగా Service (సేన) Aఅనగా Adoration (ఉపాసన), Iఅనగా Illumination (జ్ఞానము) అనగా, మొట్టమొదట సేవ చేయాలి. ఉపాసన సల్పాలి. తరువాత జ్ఞాన తత్వమును పొందాలి. ఈనాడు ఎట్టి పనులు చేయక, తిని కూర్చుని, సుఖాన్ని అనుభవించేవాడు గొప్ప అదృష్టవంతుడని మనం భావిస్తున్నాము. **ఇది అదృష్టం కాదు, దురదృష్టం! మనం పనిచేయడానికి తినాలి గాని, తినడానికి పుట్టలేదు.** కనుక కర్మాధిపత్యమును వహించాలి. ఇదే మన ప్రాచీన సంస్కృతి భోధించినది. మొట్ట మొదట ఎవరి కర్తవ్యమును వారు నిర్వర్తించాలి. కాని, దురదృష్టవశాత్తు, ఈనాడు అది జరగడంలేదు. సుఖంగా భుజించి, ఆనందంగా కాలం గడపాలని భావిస్తున్నారు. నిజంగా ఆనందమంటే, ఏమిటో తెలియని మూర్ఖులే ఇలా భావిస్తారు. **ఆనందము కర్మయందే ఉన్నది.** కర్మలేక ఆనందము లేదు. కనుక, **మొదట సమాజ సేవలో పాల్గొనాలి.** ప్రాచీన కాలము నుండి భారతదేశము సమాజానికి ఎంతో విలువ నందిస్తూ వచ్చింది. **నీ సర్వశక్తులూ సంఘసేవకు ధారపోయాలి.** కేవలం సంఘం కోసం కాదు. నీసంతోషం నిమిత్తమై నీవు సంఘసేవలో పాల్గొనాలి. అట్లు కాకుండా నీటిపై తైలపు బొట్టువలె సంఘంతో ఏ మాత్రం సంబంధం లేకుండా జీవించడం మరణంతో సమానం. అట్టి వానిని జీవచ్ఛవమని చెప్పవచ్చు.

(శ్రీ.భ.ఉ. పు.212/213)

సాయిదేవుడు

"ప్రేమ తత్వము ప్రబోధించి
మమత సమతను పొందుపరచి
మానవత్వము విలువదెలిపిన
ప్రేమమూర్తియె సాయిదేవుడు"

(శ్రీ.ఫి.1995 పు.2)

సాయినామము

నా కాలిగోరు మొదలుకొని తల వెంట్రుకవరకు అంతా ప్రేమయే. ఈ ప్రేమచేతనే స్వామితత్వం జగత్తంతావ్యాప్తి అవుతున్నది. ఆ ఒక్కటే నేను ఆశించటం లేదు **నాయందు మూడు P లు** ఉంటూన్నయి ఏమిటవి? మొదటి P-Purity పవిత్రత; రెండవ P-Patience (సహనం); మూడవ P-Perseverence పట్టుదల. **సాయినామం జగద్వ్యాప్తి కావడానికి కారణం ఈ మూడే.**

(స.సా.డి.96పు.315)

సాయిప్రేమ

(చూ॥ సర్వచింతలు)

సాయిబాబా

'సాయిబాబా' అంటే సరియైన అర్థం ఏమిటి? సా అంటే సహస్ర పద్మ అని, సాక్షాత్కార అని అర్థాలున్నాయి. అయి అంటే తల్లి. బాబా అంటే తండ్రి అంటే తల్లి తండ్రి అయినటువంటి, యోగుల పరమగమ్యమైనటువంటి వాడు అని అర్థం.

(వ.61-62 పు.7)

సాయిబాబాకే పూజ

మాయాంధకారంబూ మా యించి జ్ఞానంబూ
సాయేశుఁడొసగు మనలకూ
వేగయే సత్యంబు జూపు మనలకూ.. ॥సాయి॥

సాయిభక్తులు

సాయీశుడే యిట్లు సత్యనారాయణుడై
మాయింట వెలసినిప్పుడూ
మాకొరకై ఈ లీలనవతరించెనూ ॥సాయి॥

(భ.పు.57)

సాయిభక్తులు

(చూ॥ సాయిసంస్థలు)

సాయిమతము

"అన్ని మతాలను ఒక్కటిగా చేర్చేది. అన్ని మతాలలోను సామాన్యంగా ఉన్న గొప్ప ధనాన్ని గురించి వివరించి తెలిపేదే సాయిమతం''

(స.శి.సు.నా.పు.55)

అన్ని మతములు అహింసను, ప్రేమను బోధించును. సాయి మతము సర్వమత సామరస్యమును బోధించును. అందువలన ఎట్టి భేదభావము పెట్టుకొనక అందరితోను కలసి పని చేయవలెను. నీలో ప్రేమ వున్న నిన్నందరూ గౌరవించెదరు. లోక సంరక్షణార్థమే నేను వచ్చినది. మీరందరూ పరస్పరానురాగముతో జీవించిన యెట్టి కలతలు వుండవు. అట్టి ప్రవర్తనయే నాకు ఆనందము కలిగించును.

(స.శి.సు.తృ.పు.133)

సాయిమయము

అంతా **సాయిమయం,** జగమంతా సాయి మయం అని మీరు భజన కీర్తనలు పాడుతున్నారు కదా! మరి ఈ సాయి ఒక్కడి మీదనే మీకు ప్రేమ ఎట్లా ఉంటుంది? భజన హాలులో స్వామి పటాలు చాలా ఉంటాయి. "ఈ పటము బాగా లేదు'' అని ఎవరైనా అంటే వాళ్ళమీద మీకు కోపం వస్తుంది. అనగా, ప్రతి పటమూ నేనేనని భావించి మీరు గౌరవిస్తున్నారు. పటము ముందు నిలబడి ఆనందంతో "స్వామీ!'' అని సంబోధిస్తున్నారు. అదే విధంగా ప్రతి మనిషీ నా పటమే, ప్రతి జీవి నేను. అంతా సాయి మయం కదా! కనుక, **మీరు ఎవరినైనా కఠినంగా చూస్తే నన్ను కఠినంగా చూసినట్లే ఎవరినైనా అవమానిస్తే నన్ను అవమానించినట్లే.**

(శ్రీ.భ.ఉ. పు.158)

సాయియే దిక్కు

అసూయా భావములు రాగద్వేషములు మున్నగు దుర్గుణాలన్నిటినీ దూరంచేస్తే ఎక్కడున్నా మీరు నావారే, నేను మీవాడనే.

అడవులందున్న ఆకసమున నున్న
పట్టణమున నున్న పల్లెనున్న
గుట్టమీదనున్న నట్టేట బడియున్న
దిక్కులేని వారికి సాయియే దిక్కు

మీరెక్కడున్నప్పటికి మీహృదయాన్ని పవిత్రం చేసుకోండి. పవిత్రమైన ప్రేమను పెంచుకోండి. ఆప్రేమచేత మీజన్మను సార్థకం గావించుకోవడమే గాక మీ పరివారాన్ని పరిసర ప్రాంతాలవారిని కూడా పవిత్రం చేయడానికి అవకాశ ముంటుంది.

(స.సా.డి.96పు.315)

సాయిరాం

"సా'' అనగా దివ్యత్వము "అయి'' అనగా తల్లి. "రామ'' అనగా శుద్ధ జ్యోతి స్వరూపునిగా హృదయమందున్న పరమాత్మ. "సాయిరాం'' అనగా దివ్యత్వమును కలిగియున్న తల్లి, దండ్రి. సోహం, సాయిరాం, శివోహం, సాంబశివ - వీటన్నిటికి అర్థము ఇదే.

(ప.పు.183)

సాయిశరీరము

మీరందరు నా యొక్క అవయవములు. సాయి శరీరము యొక్క అంగములు. సద్గుణము, విశ్వాసము, సుశిక్షణ,

వినయము మొదలగు మధురమైన, వాంఛనీయమైన విషయములను సాయికి మీరిచ్చిన మీరేమి చేయు చున్నను, ఎక్కడున్నను, సాయి మీకు సహాయ సహకారము లందించును.

(శ్రీ.స.సూ. పు.95)

(చూ॥ సర్వాంతర్యామి)

సాయిసంకల్పము

నా దగ్గరకు వచ్చే వాళ్ళు తమ యిబ్బందులను గురించీ, రోగాలను గురించీ విన్నవించుకొంటుంటారు. వాళ్ళ రోగాలను నయం చేయటం, యిబ్బందులను తొలగించటం యిదేనా నాపని? కాదు నేనువచ్చిన పని అంతకన్నా ఎంతో ముఖ్యమైనది.

మామిడి చెట్టు వుంది, దానికి ఆకులూ, కొమ్మలూ, మొదలూ అన్నీవున్నాయి. ఒక్కొక్కటి మనకు ఒక్కొక్క రకంగా వుపయోగపడుతుంది. మామిడి చెట్టు వుపయోగం అంతేనా? మామిడి పండ్లు ప్రధానం, యివికాదు.

అరటి చెట్లు వల్ల ఎన్ని వుపయోగాలున్నాయి? అరటి ఆకు వేసుకొని భోంచేస్తావు. అరటి పూవును, పూచను కూరచేస్తావు. కాని ఇవన్నీ కొసరు. అరటిపండ్లు అసలు. అలాగే వేదశాస్త్రాలను భరత వర్షంలో పునఃప్రతిష్ట చేయటం, వేద విజ్ఞానాన్ని తిరిగి వ్యాప్తిచేయటం నా ప్రధాన లక్ష్యం. భక్తుల బాధలను తొలగించటం అన్నది అనుషంగికం మాత్రమే.

ఈరోజు ప్రపంచమంతటా సత్యసాయి కీర్తి మార్మ్రోగుతూ వుండటం మీరు చూస్తున్నారు. ఎప్పుడో భవిష్యత్తులోకాక ఈ శరీరం యిక్కడ వుండగానే, యీ సంగతి మీకు కనిపిస్తూవున్నది. కాని, ఇదేదీ నాకు పట్టదు. సనాతనమైన ధర్మం, ప్రజలందరి సంక్షేమం కోసం వేదాలచే ప్రతిష్టితమైన ధర్మం, తన సహజస్థాయిలో తిరిగి స్థాపించబడే రోజు తొందరలోనే వస్తున్నది. అదేనేను కోరేది. **వేద ధర్మ పునఃస్థాపనమే సాయి సంకల్పము. నా విభూతులచే ప్రజలను ఆకర్షించటమే కాదు, నా సంకల్పంతో ధర్మాన్ని తిరిగి స్థాపించటం కూడా జరుగుతున్నది.** అసత్యాన్ని నిర్మూలించి సత్యాన్ని ప్రతిష్టించటం, మిమ్ములందరిని ఆవిజయోత్సాహంతో పరవశింప **చేయటమే సాయి సంకల్పము.**

(శ్రీ.సా.గీ. పు.397/398)

సాయిసంస్థలు

ఈనాడు సాయిసంస్థలలో పని చేస్తున్నవారు గొప్ప త్యాగభావంతో, ఎలాంటి కష్టాలనైనా సహించుకొని, హృదయపూర్వకంగా సేవలు చేస్తున్నారు. **ముమ్మందు మీరు త్యాగాన్ని మరింత అభివృద్ధి పర్చుకొని పవిత్రమైన సేవలలో పాల్గొని సాయిభక్తులనే సార్థక నామధేయులు కావాలని నేను ఆశిస్తున్నాను.** మీరు ఎక్కడికి వెళ్ళినప్పటికీ మీరు చేసే సేవను చూసి **"వీళ్లు సాయిసంస్థలకు చెందినవారు," అని ప్రజలు గుర్తించగల్గాలి.** జాతి, మత భేదములకు అవకాశమివ్వకుండా అందరూ భగవంతుని బిడ్డలేనని భావించాలి. All are one, be alike to every one (అందరూ ఒక్కటే, అందరిపట్ల సమత్వాన్ని వహించాలి).

ప్రేమస్వరూపులారా! ఈ నూతన సంవత్సరంలో పవిత్రమైన, ఆదర్శవంతమైన భావాలు మీలో ఉట్టూతలూగాలి. అహంకార, ఆడంబరాలకు స్వస్తి చెప్పి, వినయవిధేయతలతో, **ప్రేమతో సమాజ సేవలో పాల్గొనండి.** ప్రేమతో సేవ చేయడంకంటే మించిన తపస్సు మరొకటి లేదు. హృదయంలో ప్రేమ లేకుండా చేసే సాధనలన్నీ చిల్లులు పడిన పాత్రలో నీరు పోసినట్లుగా వ్యర్థమైపోతాయి. మీరు ఎక్కడికి పోయినప్పటికీ సాయిభక్తులనే పేరుకు తగినట్లు ప్రవర్తించాలి. మీ పనులయందు, మాటలయందు, నడతయందు సాయి యొక్క **ప్రేమతత్త్వం ప్రతిబింబించాలి.** దైవానుస్మరణ గావిస్తూ సమాజ సేవలో పాల్గొనాలి. అప్పుడే మీ జీవితం ధన్యమౌతుంది.

(స.సా.జూ.2000పు.180/181)

సాయుజ్యము

(చూ॥ ఆత్మార్పణ, ఆధ్యాత్మికము)

సారథి

నీవు భగవద్గీత గాని, ఉపనిషత్తులు గాని పఠించ నవసరము లేదు. నీ హృదయమునందాతడు సారథిగా ప్రతిష్ఠింపబడి యున్నాడు. గాన ఆవేదనతో పిలిచిన భగవంతుడు నీకు కూడ ప్రత్యేకమైన 'గీత'ను వినిపించును. నీవు అడిగిన అతడిచ్చును. జప ధ్యానములకు కూర్చొనినపుడు నీ కిష్టమైన ఏదో ఒక రూపమును మనస్సు నందుంచు కొనుము. ఆ నామమును స్మరించుము. ఏ రూపము నీ ముందు లేనపుడు నీకు సమాధాన మిచ్చు వారెవరు? నీలో నీవే ఎల్లప్పుడూ మాట్లాడుకోలేవుగదా! **నీవు ధ్యానించు రూపము తప్పక నీ ప్రార్థన లాలకించును.**

(స.సా.న.78 పు.206)

సార్థకత

ప్రతి వ్యక్తి ఒక కర్మయోగిగా మారాలి. ఆకర్మనే ధర్మంగా రూపొందుతుంది. ఆ ధర్మమే జన్మను సార్థకత గావిస్తుంది. కనుక దైవభావమును హృదయమునందుంచుకొని కర్మయోగంలో మనం మునిగి, దివ్యమైన జీవితమును ధన్యం గావించుకోవటము ప్రతివ్యక్తి కర్తవ్యమని విశ్వసించాలి.

(స.సా.డి.1990 పు.313)

సార్థకము

(చూ॥ కాలస్వరూపుడు)

సారూప్యము

(చూ॥ ఆధ్యాత్మికము)

సారూప్యముక్తి

(చూ॥ ముక్తి)

సాలోక్యము

(చూ॥ ఆత్మార్పణ, ఆధ్యాత్మికము, ముక్తి)

సావిత్రి

(చూ॥ గాయత్రి)

సాహచర్యము

మట్టితో చేర్య ఇనుమున పట్టు తుప్పు
అగ్నితోచేరి ఇనుమును అదియువీడు
సాహచర్యంబుచే నిట్లు జరుగుచుండు
సత్యమైనట్టి బాట శ్రీసాయి మాట.

(ము.ము.పు.33)

సిక్కు

(చూ॥ హిందువులు)

సినిమాపిల్లలు

ఆడవారు పవిత్రమైన గ్రంథాలు చదవాలి. పవిత్రమైన దృశ్యములనే చూడాలి. ఈనాడు ఆడవారు గర్భవతులుగా ఉన్నప్పుడు రోజుకు మూడు, **నాలుగు సినిమాలు చూస్తుంటారు. అందుచేత వారికి పుట్టే పిల్లలు కూడా "సినిమాపిల్లలు"గా** ఉంటున్నారు. దీనికి కారణం ఏమిటి? మన భారతదేశ చరిత్ర నుండి దీనికొక చిన్న ఉదాహరణను మీరు గుర్తించాలి. సుభద్ర గర్భవతిగా ఉన్నప్పుడు ఒకనాడు అర్జునుడు ఆమెకు "పద్మవ్యూహమును" గూర్చి కొంత చెప్పినాడు. ఆమె గర్భంలో నున్న అభిమన్యుడు ఈ పద్మవ్యూహాన్ని గూర్చిన విషయాలను విన్నాడు. అదే విధంగా, **లీలావతి గర్భవతిగా ఉన్నప్పుడు ఒకనాడు నారదుడు ఆమెకు పవిత్రమైన "బ్రహ్మభావమును" గురించి బోధించినాడు. అదంతా ప్రహ్లాదుడు చక్కగా విన్నాడు. కనుక, గర్భములో ఉన్న శిశువునకు ఈ విధమైన భావములు చేరిపోతాయి.** అందుచేత తల్లులు

తగిన శ్రద్ధబూని పవిత్రమైన దృశ్యములను చూచుటకు పవిత్రమైన పలుకులు శ్రవణము చేయుటకు తగిన ప్రయత్నం చేయాలి.

(శ్రీ.భ.ఉ.పు.131/132)

సినిమాలు

తత్త్వ మడుగంటె సినిమాలు తలకు బట్టె
ఒప్పులన్నియు సంఘాన తప్పులయ్యె
ఇట్టి కేంద్రాలుగా మారె భక్తి యందు
సత్యమును తెల్పు మాట యీ సాయి మాట.

(భ.ప్ర. పు.18)

సిద్ధ

(చూ॥ అమోఘుడు)

సిద్ధి

(చూ॥ గణపతి, వినాయకుడు)

సీత

రాముడు అరణ్యానికి బయలుదేరి ముందు సీత వద్దకు వెళ్ళి, పితృవాక్య పరిపాలన నిమిత్తం తాను అడవికి వెళుతున్నానని తెలియజేశాడు. అప్పుడు సీత పతి అడుగుజాడలను అనుసరించుటయే సతికి ధర్మము కాబట్టి, తాను కూడా వస్తానన్నది. ''అడవులలో క్రూరమృగములుంటాయి; భయంకర మైన రాక్షసులు నివసిస్తుంటారు. వారివల్ల నీకేదైనా అపాయం సంభవిచవచ్చును. కాబట్టి, నీ ఆలోచనను విరమించుకో'' అని రాముడు అడ్డు చెప్పాడు. అప్పుడు సీత ''రామచంద్రా! జగద్రక్షకుడివైన నీకు నన్ను రక్షించడమేమీ కష్టం కాదు'' అని పలికింది. రాముడు ఆమెను సమాధానపరుస్తూ, ''సీతా! నేను అరణ్యమునకు వెళ్ళిన సమయంలో వృద్ధులైన నా తల్లిదండ్రులు నాకొరకు దుఃఖిస్తారు. కనుక, నీవు ఆయోధ్యలోనే ఉండి నీ అత్తమామలకు తగిన సేవ చేస్తూ, వారికి ధైర్యం చేకూర్చడం నీ కర్తవ్యం'' అన్నాడు. అప్పుడు సీత, ''నాథా! నిన్ను వదలి ఉండలేక తాను కూడా అడవికి వస్తానన్న నీ తల్లి కౌసల్యకు పతిసేవయే సతికి ప్రధాన కర్తవ్యమని బోధించావు. ఇప్పుడు నాచెంతకు రాగానే అత్తమామల సేవయే కర్తవ్యమని బోధిస్తున్నావు. ఏది సత్యమో నీవే యోచింపుము. అంతేకాదు, **నీవు రామచంద్రుడవు. నేను సీతను. అనగా, శీతలమైన వెన్నెలవంటి దానను. చంద్రుడు అరణ్యమందును, వెన్నెల అయోధ్యయందును ఉండ వీలుండదు కదా! చంద్రు డెక్కడో అక్కడే వెన్నెల కూడా ఉండి తీరవలసిందే.** కాబట్టి నేను కూడా నీవెంట వస్తున్నాను.'' అని దృఢంగా పలికింది. ఈ విధంగా, **పతియే సతికి దైవంగా భావించి, పతి అడుగుజాడల ననుసరించడానికి ఎన్ని కష్టాలనైనా ఎదుర్కోవడానికి సిద్ధమై సీత గొప్ప ఆదర్శాన్ని కనబర్చింది.**

(స.సా.మే.2000 పు.146/147)

ఓ సీతా! నీ మూలమున తల్లిదండ్రుల వంశము అత్తమామల వంశము రెండునూ పవిత్రమయ్యెను. నీ కీర్తి లోకవ్యాప్తి కాగలదు. తల్లీ, నీ కీర్తి అను నదికి పై రెండు వంశములును రెండు గట్లు, **గంగానదికి భూలోకమున మూడు పుణ్యతీర్థములు మాత్రమే కలవు. హరిద్వారము, ప్రయాగ, సాగరసంగమము. అయితే నీ కీర్తి బ్రహ్మాండ ప్రవాహమై సర్వుల హృదయ క్షేత్రము లందూ తీర్థరూపమున సార్థకమును గావింతువు గాక అని ఈ విధముగ వాత్సల్యముచే పలికిన తల్లి (సునయన) సత్య వాక్కులను సీత విని సిగ్గుపడినటుల నటించుచు తల్లీ!** యెంతటి మాట యెక్కడి సంబంధము? పవిత్ర గంగకూ, నాకూ పోలిక యేమిటి? అని భక్తి శ్రద్ధలతో గంగకు నమస్కరించునటుల ప్రదర్శించి నిలిచెను.

(రా.వా.మొ.పు.354)

సీతారాములు అరణ్యవాసం చేస్తున్నప్పుడు ఒకనాడు లక్ష్మణుడికికూడా తెలియకుండా సీతాదేవి తన దివ్యాంశలన్నిటినీ అగ్నిలో నిక్షిప్తంచేసింది. ఈ రహస్యం

సీత తత్వము

ఆమెకు రామచంద్రునికి మాత్రమే తెలుసు. **సామాన్య స్త్రీగావున్న సీతనే రావణాసురుడు స్పృశించి అపహరించాడు. లేకపోతే ఆమె పతివ్రతా మహిమవల్ల భస్మమైపోయేవాడు. అందువల్లనే ఆశోకవనములో ఆమె సామాన్య స్త్రీలా చాలాఅగచాట్లు పడింది. రాక్షస సంహారానంతరము రాములవారు ఆమెచేత అగ్నిప్రవేశం చేయించి అగ్నిలో నిక్షిప్తమైన శక్తులను తిరిగి సంపాదించుకొనేట్లుచేసి, అటుపిమ్మట ఆమెను స్వీకరించి ఆయోధ్యకు తరలివచ్చాడు. అగ్నిప్రవేశములో దాగియున్న రహస్యం యిది. అంతేకాని సీతాదేవి సౌశీల్యాన్ని రాముడు శంకించాడనుకోవటం పొరబాటు. ఆమెగుణాలు పూర్తిగా తెలిసిన రాముడు ఆమెను శంకిస్తాడా!**

(స.పు.18)

(చూ॥ త్యాగము, దైవస్వరూపులు, భగవత్ప్రేమ, మంగళవారము, స్త్రీజాతి, స్త్రీలు, షడ్‌చక్రములు, హిరణ్యగర్భతత్వం)

సీత తత్వము

"పాపాల పుట్టినిల్లు పావనాంగా! ఈ
కోపమన్న రావణుండు కోమలాంగా!
ఏపుమీర పదితలల పాపరాజు వీని
రూపుమాపి మా తాపమాపవయ్యా,"

అని ప్రార్థించారు దేవతలు. కనుక, మనయందున్న కోపమనేటువంటి రావణుడు, మనలోనున్న ప్రజ్ఞానమనేటువంటి, విజ్ఞానమనేటువంటి, సుజ్ఞానమనేటువంటి సీతను అపహరించడానికి పూనుకుంటున్నాడు, కనుక, **విజ్ఞాన ప్రజ్ఞాన సుజ్ఞాన మయమైనటువంటి స్వరూపమే సీతయొక్క తత్వము. ఈమెనే శక్తిస్వరూపము. ఇటువంటి నిర్మల నిశ్చల నిస్వార్థమైనటువంటి సీతతత్వాన్ని విశ్వామిత్రుడు ఆత్మస్వరూపమైన రామునికి అందించ డానికి పూనుకొన్నాడు. ఈ ఇరువురి సమావేశమే, సంయోగమే లోకళ్యాణము అని నిరూపించింది ఈ రామాయణము.** ఈ కళ్యాణమును చూచుటకు, మనో భావములైన దేవభావములు అన్నియు ఆనందోత్సాహముతో పురికొల్పుకుంటూ, పురకాంతలు అందరూ బలయు దేరి వస్తున్నారు. వీరందరుకూడను, ప్రకృతిస్వరూపమైన సీతయొక్క తత్వాన్నంతా వర్ణిస్తూవచ్చారు. సీత అనగా భూజాత అనే తత్వాన్ని నిరూపిస్తూ, భూమియందున్నటు వంటి కళలన్నీకూడను వర్ణిస్తూవచ్చారు.

"శ్రీలు మించిన దిక్కుటాలు,
వింతల బంగళాలు, ముత్యపు తోరణాలు
మూలల కిటికిటీలు, వజ్రాల తలుపులూ
తాపిననీలాలు, నీలాలు వెయ్యార్లు నూరార్లు బజార్లు
రారే చూడగ పోదాము;
రాములపెండ్లి రారే చూడగ పోదాము."

ఈ ఉద్భావములైనటువంటి సద్భావములన్నియూ కూడను, ఇలాంటిరీతిగా వర్ణిస్తూవచ్చారు.

స్రీలకెక్కువ భూషణాలు, ఉత్తరదర్భాలు
సీతకు రాముడు సూత్రము గట్టుతాడు
ఇద్దరి నొక్క ఈడుజోడుగ గూర్చినాడు
సీతకు తగువాడు శ్రీరాముడు
రారే చూడగ పోదాము;
రాముల పెండ్లి రారే చూడగ పోదాము.
మించి మగలకడనుంచి సిగ్గున తలవంచి
వసిష్ఠ రప్పించి, ఖడ్గములు తెప్పించి
దూలాలపై గుప్పించి, గుప్పించి, యిప్పించి
మెప్పించి, రప్పించుట
రారే చూడగపోదాము; రాముల పెండ్లి
రారే చూడగ పోదాము.

ఈ పదములయొక్క అంతరార్థమును, మనం చక్కగా విచారణ చేసినప్పుడు, ప్రకృతియొక్క సద్గుణములు, ప్రకృతియొక్క కళలు, ప్రకృతి యొక్క సౌందర్యములు కలిగిన భూజాతైన సీత, రాములను వరించుటకై వెళ్ళుచున్నది అనే అంతరార్థము చక్కగా మనకు బోధపడుతున్నది.

కనుక, రాములకళ్యాణ మనేటువంటిది, కేవలము ఒక దశరథుని యొక్క కుమారునికి, జనకరాజుయొక్క

కుమార్తెకు జరిగిన కళ్యాణము అని మాత్రము మనము భావించుకొనకూడదు. **మనహృదయమునందుండే పరిశుద్ధమైన ఆత్మభావము, నిస్సంశయమైనటువంటి, చిత్తశుద్ధియైనటువంటి జ్ఞానము ఈ రెండింటియొక్క సంయోగమే జీవితమునయొక్క కళ్యాణముగా భావించుకొంటుండాలని ఇందులో నిరూపిస్తూవచ్చాడు విశ్వామిత్రుడు. అనగా జీవతత్వము, పరతత్వము రెండింటియొక్క ఏకత్వమే లగ్నము అనికూడను చెప్పబడుతుంది. మన మనస్సు భగవంతునియందు లీనమై నపుడుకూడను అది లగ్నమని పిలవబడుతుంది.** అనేకమంది ప్రశ్నిస్తుంటారు. "స్వామీ! నా మనస్సు భగవంతునియందు లగ్నము కావడంలేదు ఎందుకు?" అని, ప్రకృతియొక్క విషయమునందు కూడను మనముచూసినపుడు, ఒకరిబిడ్డను ఒకరి కుమారునకు యిచ్చి పెండ్లిచేసేటువంటి విషయములోకూడను లగ్నపత్రిక అంటారు. అచటకూడను లగ్నము అను పదమును ఉపయోగపడుతూవచ్చారు. **లగ్నమనగా, కేవలము జీవాత్మపరమాత్మలయొక్క సంయోగమే. అదే నిజమైన లగ్నము. ఇట్టి లగ్నము జరిగినటువంటి రాత్రియే, జీవాత్మపరమాత్మలకు ఏకత్వమును నిరూపిస్తూ, విశ్వామిత్రుడు అంతర్ధానమయ్యాడు.** ఈ లగ్నము అయ్యేంతవరకుకూడను, భగవత్తత్వమును అతి రహస్యంగా ఉంచుకున్నాడు విశ్వామిత్రుడు.

(ఆ.రా. పు.281/283)

సీత హితబోధ

పంచవటిలో సీతారామలక్ష్మణులు చక్కని పర్ణశాల నిర్మించుకొని సుఖంగా కాలం గడుపుతున్నారు. అయితే రామలక్ష్మణులు నిత్యమూ జీవహింసకు పాల్పడటం చూసి సీత చాలా బాధపడుతూ వచ్చింది. ఒకనాడు లక్ష్మణుడు కందమూలాదులను తేవడానికి బయటకి వెళ్ళిన సమయంలో సీత రాముని సమీపించి, **'నాథా! కోరికలు గలవానికి మూడు దుర్గుణములు ఉంటాయి. మొదటిది అసత్య మాడటం, రెండవది పరపత్నిని గమనించడం, మూడవది జీవహింస చేయడం, అయితే మీరు అసత్యమాడరు. ఇంతకు పూర్వమెన్నడూ మీరు అసత్యమాడలేదు. ఇకముందు కూడా అసత్యమాడబోరు. మీరు సత్యస్వరూపులని నాకు తెలుసు'** అన్నది. **అప్పుడు రాముడు, "సీతా! పతి మంచివాడని సతి అంగీకరించినప్పుడే పతి అనే పదానికి సరియైన విలువ వుంటుంది.** నేను సత్యవంతుడనని నీవు అంగీకరించావు. అదే సంతోషము" అన్నాడు. **'పరపత్నీ గమనము కూడా మీలో లేదు. మీరు పరస్త్రీలను ఎప్పుడూ చూడరు. ఇట్ట గొప్ప గుణమును కూడా మీలో గమనించాను. కాని, మీరు జీవహింసకు పాల్పడుతున్నారు.** దీనికి మాత్రం నేను అంగీకరించను. అయోధ్యలో ఉన్నప్పుడు ఆయుధాలు అవసరముకాని, అరణ్యంలో తాపసవేషం ధరించి ఎట్టి అపకారమూ చేయని జంతువులను హింసించడం ధర్మం కాదు. అంతేగాకుండా, ఈ రాక్షసులు మీకేమీ అపకారం చేశారు? వారు మీ జోలికి రావటం లేదు కదా! అలాంటివారిని నిష్కారణంగా హింసించడం ఎంత తప్పు! **పురుషసింహములకు ఉండవలసిన లక్షణములు రెండు మాత్రమే ఉన్నాయి మీలో, మూడవది లేదు"** అన్నది.

సీత ఏనాడు నోరు విప్పి ఈ విధంగా పలికినటువంటిది కాదు. రాముడు మెల్లగా నవ్వుతూ, **"సీతా! నీవు చెప్పినది నిజమే. కాని, రాక్షసులు ఋషులకు కష్టం కలిగిస్తున్నారు. నేను నా వలన ఏమి సహాయం కావాలి? అని వారిని అడుగక పూర్వమే వారే వచ్చి; రామా! రాక్షసులను సంహరించి మా తపస్సులకు భంగం వాటిల్లకుండా చూసుకో, అని ప్రార్థిస్తున్నారు. వారిని రక్షిస్తానని వాగ్దాన మిచ్చాను. ఇచ్చినమాట తప్పడంకంటే పాపమున్నదా! నిన్నైనా వదులుతాను, లక్ష్మణుడినైనా వదులుతాను కాని, నామాటను తప్పను. అంతేగాక ఈ తాపసులు చేసే యజ్ఞయాగాది క్రతువల వల్ల జగత్తుకు ఎంతో శ్రేయస్సు కల్గుతున్నది. కనుక, సీతా! నీవు దీనిని మరచిపో, నా నిమిత్తమై కాదు, విశ్వశ్రేయస్సు నిమిత్తమై ఈ హింస చేయక తప్పదు"** అన్నాడు.

సీతాకళ్యాణము

సాధ్వీమణులైన స్త్రీలకు పతులు దారితప్పి నడుస్తున్నప్పుడు వారికి సన్మార్గము బోధించే అధికారమున్నది. ఎందుకనగా సతి పతిలో అర్ధభాగము కదా! సీత తిరిగి రామునితో **"రామచంద్రా! నేను నీ అర్ధాంగిని, ధర్మపత్నిని, నీకింత మాత్రం చెప్పే అధికారం నాకు లేదా? నీవు అంగీకరించు, అంగీకరించకపో.** నీవు చేసేది తప్పే. నీవు రాకపూర్వము ఈ ఋషులు అరణ్యంలో జీవించడం లేదా? ఇప్పుడు నీవు తేరగా చిక్కావని నీ వద్దకు వచ్చి రక్షింపుమని ప్రార్థిస్తున్నారు. అంతమాత్రమున రాక్షసులను హింసించడం మంచిది కాదు'' అన్నది కాని, ఈ మాటలు రాముని చెవికి సోకలేదు. "నేను ఋషులను సంరక్షించక తప్పదు. నా కంటి ఎదుట వారు బాధపడుతుంటే నేను సహించలేను. **"ధర్మో రక్షతి రక్షితః" దైవము ధర్మాన్ని రక్షిస్తే, ధర్మమే దేశాన్ని రక్షిస్తుంది.** కనుక, సీతా! ఈ విషయంలో నీవు జోక్యం చేసుకోవద్దు'' అన్నాడు. సీత రాముని పాదములంటి, **"నాకు తోచినది చెప్పాను, నన్ను క్షమించు"** అని ప్రార్థించింది. కాని, తనలో తాను చాల బాధపడింది. '' ఈ దండకారణ్యమునకు రావటమే ఒక దండనగా ఉన్నది. ముమ్ముందు ఎన్ని ప్రమాదాలు సంభవిస్తాయో!'' అని తనలో తాను చింతించింది. **పవిత్రమైన స్త్రీల హృదయాలలో భవిష్యత్తు చక్కగా ప్రతిబింబిస్తుంది.**

(శ్రీ.భ.ఉ. పు.67/68)

సీతాకళ్యాణము

కన్యాదానం జరిగింది. జనకమహారాజు తన భార్యయైన సునేత్రితో కూడి ఒకవైపున సీతను, మరొకవైపున పెంపుడు బిడ్డయైన ఊర్మిళను తీసుకొని రాగా అతని తమ్ముడైన కుశధ్వజుడు మాండవి, శ్రుతకీర్తి అనే పేర్లుగల తన ఇరువురు కుమార్తెలను వెంటబెట్టుకొని వచ్చాడు. కల్యాణమండపంలో రామలక్ష్మణ భరతశత్రుఘ్నులను తూర్పువైపు ముఖం పెట్టి కూర్చోబెట్టారు. వీరికి ఎదురుగా సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తిలను కూర్చోబెట్టారు. వధూవరులకు మధ్యలో ఒక తెర కట్టారు. ఎందుచేత? **వివాహము జరుగక పూర్వము కన్యను వరుడు చూడకూడదు.** అయితే శుభముహూర్తసమయంలో తెర తీసినప్పుడు కూడా రాముడు ఎటోచూస్తున్నాడు కాని, సీతవైపు చూడలేదు. జనకుడు వచ్చి "రామా!మమపుత్రి ఇదం సీతా'' అన్నాడు కాని, రాముడు వినిపించుకోలేదు. జనకుడు, "రామా! సీత ఇక్కడుంది, నీవు ఎక్కడో చూస్తున్నావు'' అని రెండు మూడు పర్యాయములు అన్నాడు. "ఇంకా మంగళ సూత్రం కట్టలేదు. **వివాహం కాని స్త్రీని చూడటం మహాపాపం కనుక, నేను చూడను" అన్నాడు రాముడు.** దీనిని బట్టి **రాముని ఆదర్శం ఎంత ఉన్నతమైనదో గుర్తించవచ్చు.**

"స్త్రీల కెక్కువ భూషణాలు ఉత్తర దర్పాలు
సీతకు రాముడు సూత్రము కట్టుతాడు
ఇద్దరినొక్క ఈడు జోడుగ కూర్చినాడు
సీతకు తగువాడు శ్రీరాముడు
రారె చూడగపోదాము...''

అని పాడుకుంటూ ప్రజలందరూ గుంపులు, గుంపులుగా పరుగెత్తి వచ్చారు. మంగళ వాయిద్యాలు మారుమ్రోగగా మంగళసూత్రధారణ జరిగింది.

వధూవరులు ఒకరికొకరు పూల మాలలు వేసుకోవాల్సిన సమయం వచ్చింది. రాముడు ఆజానుబాహుడు. చెలికత్తెలు తెచ్చిన పూలమాలను సీత చేతిలో పట్టుకుంది కాని, ఎంత సేపైనా రాముని మెడలో వేయలేదు. కారణ మేమిటి? రాముడు సీతకంటె చాల ఎత్తుగా ఉన్నాడు. అతని మెడలో వేయడానికి వీలుగాక తల దించుకొని నిలబడింది. దీనిని గుర్తించిన రాముడు లక్ష్మణునివైపు చూసి, "నీవు ఆదివేషుడవు కదా! సీత నిలబడిన చోటును కొంత పైకి ఎత్తు'' అన్నట్లు సైగ చేశాడు. "ఎత్తుతే భూమినంతా ఎత్తాలి. సీతనిలబడినచోటును మాత్రమే ఎత్తడానికి వీలుకాదు'' అన్నట్లుగా లక్ష్మణుడు తిరిగి రామునికి సైగ చేశాడు. రాముడు మాత్రం దండ వేయించుకోవడానికి తల వంచలేదు. **కేవలం భక్తునికే శిరస్సు వంచాలికాని, స్త్రీల ముందు శిరస్సు**

వంచకూడదన్నది రాముని ప్రతిజ్ఞ, లక్ష్మణుడు సూక్ష్మబుద్ధి గలవాడు కనుక, పరిస్థితిని గమనించి ఒక్కసారిగా రాముని పాదాలపై పడ్డాడు. వెంటనే లక్ష్మణుని లేవనెత్తే నిమిత్తమై రాముడు వంగాడు. ఇదే ఛాన్సు అనుకొని సీత తన చేతిలోని దండను రాముని మెడలో వేసింది. తదుపరి ఒక చెలికత్తె సరయూనదీ జలమును ఒక పాత్రలో తెచ్చింది. ఆ జలముతో సీత రాముని పాదాలు కడగాలి. అయితే సీత ఆ పాత్రను పట్టుకొని కూర్చుందికాని, ఎంతసేపైనా పాదాలు కడగలేదు. కారణ మేమిటి? వివాహానికి ముందుగా రాముని పాదధూళి సోకి రాయి స్త్రీగా మారింది కదా! అందుచేత రాముని పాదధూళి సోకి తన చేతి ఆభరణాలు కూడా స్త్రీలుగా మారునేమోనని సంకోచిస్తూ కూర్చుందట. అప్పుడు లక్ష్మణుడు తన అంగవస్త్రమును తీసి రాముని పాదాలు తుడిచాడు. తదుపరి సీత రాముని పాదాలు కడిగి ఆ నీటిని శిరస్సుపై చల్లుకొంది.

అగ్ని చుట్టూ ప్రదక్షిణ చేసిన తరువాత జనకుడు రామునితో, "రామా! ఇదిగో నా పుత్రియైన **సీతను నీకు దానం చేస్తున్నాను, అందుకో"** అన్నాడు. అప్పుడు వరుడు తాను స్వీకరింస్తునట్లుగా చెప్పాలి. కాని, రాముడు ఆవిధంగా చెప్పటం లేదు. పురోహితుడు వచ్చి, "రామా! కాలహరణ మవుతున్నది త్వరగా ఒప్పుకో" అన్నాడు. అప్పుడు రాముడు **"మాది ఇక్ష్వాకుల వంశం. మేము దానము ఇస్తామేకాని పుచ్చుకునే అలవాటు మాకు లేదు.** కనుక, దానము అనే పదమును తీసివేస్తే నేను ఒప్పుకుంటాను" అన్నాడు. జనక మహారాజు ఈ ధర్మ సూక్ష్మాన్ని గుర్తించి దానమనే పదమును తీసివేశాడు. "నా పుత్రి సీతాదేవి తల్లి లేని బిడ్డ, భూమాతకు పుట్టింది. ఈమెను చక్కగా చూసుకో" అన్నాడు. అప్పుడు రాముని పురోహితుడు, "అయ్యా! జనక మహారాజా! **సీతమ్మ తల్లిలేని బిడ్డ, రాముడు తండ్రిలేని బిడ్డ, అనగా పాయసం నుండి పుట్టినవాడు రాముడు. ఇరువురూ ప్రకృతీ పరమాత్మ స్వరూపులు. కనుక, సీతను కాపాడుకొమ్మని రాముని ప్రత్యేకంగా నీవు కోరనక్కరలేదు"** అన్నాడు తరువాత వరుడు 'ధర్మేచ, అర్థేచ, కామేచ...' అని ప్రమాణం చేయాలి. అనగా ధర్మమునందు ధనమునందు, వాంఛలందు అన్ని విధములుగా ఈమెను సంతృప్తి పరుస్తాను అని చెప్పాలి. కాని, **రాముడు దీనికి కూడా అంగీకరించ లేదు. 'అన్నింటియందు ఈమెను సంతృప్తి పర్చటానికి వీలుగాక పోవచ్చు. ప్రభువుగా నాకు కొన్ని బాధ్యత లుంటాయి. ప్రజాక్షేమాన్ని ప్రజాహితాన్ని నేను కోరవలసివస్తుంది. ఒకవేళ ప్రజాక్షేమానికి అడ్డు తగిలితే సీతనైనా త్యజిస్తానుకాని, ప్రజలను వదలను" అని ప్రమాణం చేశాడు.** అందువల్లనే ఒకానొక సమయంలో ఒక చాకలివాడు ఏదో మాట అన్నాడని సీతను అడవికి పంపాడుకాని, ఆచాకలివానికి ఎట్టి శిక్షయు విధించలేదు. ఈనాడు వివాహ సమయంలో పురోహితుడు ఏమి చెప్పినా, "మమ, మమ..." అని గ్రుడ్డిగా ఒప్పుకుంటారు. కాని ఆనాటి రాజులు అంత సులభంగా ఒప్పుకునే వారు కాదు. అంతరార్థాన్ని గుర్తించి వర్తించేవారు ఆనాడు, చివరికి జనకుడు రామునికి ఏదీ చెప్పే అవసరం లేదని గుర్తించి, "రామా! సీతను నీ ఇష్టం వచ్చినట్లు చూసుకో" అన్నాడు, **"ఎవ్వరిని ఎప్పుడు ఎక్కడ ఏవిధంగా సంతోష పెట్టాలో నాకు తెలుసు. నాకు వదలి పెట్టండి" అన్నాడు రాముడు** ఈవిధంగా వివాహం జరిగిపోయింది.

అందరూ కలసి వధువు ఇంటికి వెళ్ళారు. అక్కడికి విశ్వామిత్రుడు వచ్చాడు. "రామలక్ష్మణులారా ఇదే నా కడపటి ఆశీర్వాదము. **నేనింత కాలమూ సీతారాముల కల్యాణముకోసం వేచియున్నాను. సాక్షాత్తు లక్ష్మీ నారాయణుల కల్యాణము నా చేతుల మీదుగా జరగటం నా అదృష్టం.** ఇంతకు మించిన అదృష్టం లేదు. ఇంక నాకేదీ అక్కరలేదు. ఇక్కడి నుండి నేరుగా హిమాలయా లకు వెడుతున్నాను" అన్నాడు. అందరూ విశ్వామిత్రునికి నమస్కరించారు. దశరథుడు విశ్వామిత్రునికి కృతజ్ఞతలు తెల్పుకొని కన్నీటి ధారాలు కార్చుతూ సాగనంపాడు. దీని తరువాత రామాయణంలో మళ్ళీ విశ్వామిత్రుని ప్రసక్తి లేనే లేదు.

(శ్రీ.భ.ఉ. పు.58/60)

సీతాపహరణము

(చూ॥ ధర్మసూక్ష్మము)

సీలింగ్ ఆన్ డిజైర్సు

"ఈ దేహము భగవంతునిదే" అని అనుకొన్నప్పుడు దీనితో పాపకార్యములను ఏ మాత్రము చేయము. "నా ధనము, నా శక్తి భగవంతునివే" అనుకొనప్పుడు వాటిని దుర్వినియోగం చేయవు. సదుద్దేశముతో సత్ప్రవర్తనలో వాటిని ప్రవేశపెడతావు. కనుకనే, సత్యాసాయి సంస్థలలో Ceiling on desires అనేది ప్రవేవపెట్టాము.

1. Don't waste Food. Food is God. నీ శరీరము ఆహారము (food) తో ఆవిర్భవించినదే. తల్లిదండ్రులు food యొక్క స్వరూపమే నీ దేహము. అన్నం బ్రహ్మ. దానిని నీవు వ్యర్థం చేయవద్దు. నీకు ఎంత అవసరమో అంత తిను. కాని వృధాచేస్తే భగవంతుని శక్తినే వృధా చేసిన వాడవౌతావు.

2. Don't waste Money, God is wealth నీవు ధనమును waste చేయవద్దు. MIsuse of Money is evil అన్నారు. సత్కార్యములు చేయి, వస్త్రదానము చేయి, శక్తి హీనులకు దానము చేయి. అంతేగాని ధనాన్ని దుర్వినియోగం చేయడం పాపమే.

3. Don't waste Time,Time waste is life waste. భగవంతుని కాలాయనమః, కాలకాలయనమః, కాలతీతాయనమః, కాల స్వరూపాయనమః అని కీరిస్తాము. అంతా కాలమే. కనుక అవసరమైన మాటలతో కాలాన్ని వ్యర్థం చేయవద్దు. కాలాన్ని వ్యర్థం చేయడమే భగవంతుని వ్యర్థం చేయడమే అవుతుంది.

4. Don't waste energy చెడ్డ ఆలోచనలు, చెడ్డచూపులు, చెడ్డతలంపులు, చెడ్డ చర్యలు - వీటన్నిటి ద్వారా నీ శరీరంలో ఉండే శక్తిని అంతా వృధా చేస్తున్నావు. కనుక, See good, Do god, Be good మంచినే చూడాలి, మంచినే చేయాలి, మంచినే వినాలి, మంచినే తలంచాలి. అప్పుడే నీ శక్తిని సద్వినియోగం చేసిన వాడవౌతావు. అదే సాధన. అదే భగవంతుని సేవ!

ఈ విధంగా చేస్తుంటే మనస్సు యొక్క ప్రభావము చచ్చిపోతుంది. మనోలయమౌతుంది. కనుక మనోతీత మైన స్థితికి పోవాలంటే, ఈ విధమైన మార్గాలలో ప్రవేశించాలి. మనస్సును దుర్లక్షణముల అధీనము చేసే మార్గాలలో ప్రవేశించరాదు. మనస్సును క్రమక్రమేణా మర్చిపోయే స్థితిలో మనం సాధన చేయాలి.

(దే.యు. పు.90)

మనకు ceiling on desires లోపల నాలుగు రకములుగా బోధిస్తూ వచ్చాము. మొదటిది don't waste food ఎందుకోసము వేస్ట్ చేయకూడదు? Food is god. **ఈ food నుంచి వచ్చిన ఆకారమే మన జీవితము.** ఇది ఆహార మయమైన జీవితము. ఇది అన్నమయమైన **జీవితము. ఇది అన్నగత ప్రాణము.** ఆహారము వ్యర్థము చేసినప్పుడు మన జీవితము వ్యర్థము గావించుకున్న వారమవుతాము. ఇంక don't waste money; misuse of money is evil. ఈనాడు యువకులు అనవసరమైన ఖర్చులు చేస్తున్నారు. ఇది దురభ్యాసము. ఇది దరుర్మార్గములో ప్రవేశింపచేస్తుంది. అశాంతికి గురి చేస్తుంది. సాధ్యమైనంతవరకు దీనిని తగ్గించుకోవటానికి ప్రయత్నించాలి. మన భారతదేశము ఆర్థికముగా అనేకరకములైన చిక్కులలో చేరి వుంటున్నాది. స్వార్థము అభివృద్ధి కావటంచేత ఈ ఆర్థికమైన హీనపరిస్థితి ఏర్పడింది. **స్వార్థము, స్వప్రయోజనము దూరము గావించినప్పుడే మనదేశము బాగుపడుతుంది. సమిష్టి భావమును మనము పెంచుకోవాలి. జాతి సమైక్యతను పెంచుకోవాలి. దేశము యొక్క సమగ్రతను కాపాడు కోవాలి. అప్పుడే మన ఆర్థిక పరిస్థితిగాని ఆధ్యాత్మికమైన హీనపరిస్థితి గాని సరియైన స్థితిలో balance గా వుంటుంది. మన జీవిత మంతయు ఒక balance పైన ఆధారపడి ఉంటుండాది.** నడచటానికి బాలెన్స్‌కావాలి, కూర్చోవటానికి బాలెన్స్ కావాలి. సైకిలు తొక్కటానికి బాలెన్స్‌కావాలి. కారు డ్రైవ్ చేయటానికి బాలెన్స్ కావాలి. యోచన చేయటానికి బాలెన్స్ కావాలి. Life అంతా ఒక

balance. ఈ balance యీనాడు తప్పిపోయింది. కారణం ఏమిటి? మితిమీరిన తెలివి పెరిగి పోయింది. నాలెడ్జి చాలా అధికమైపోయింది. ఈ **knowledge ని సక్రమమైన మార్గములో పెట్టాలంటే దీనిని skillచెయ్యాలి. ఈ knowledge ని skill చేసినప్పుడే balance సక్రమంగా వుంటుంది. కాని దురదృష్టవశాత్తు యీనాటి యువకుల Knowledge ని kill చేస్తున్నారు.** దానివల్లె Balance తప్పిపోయింది. దేనితో Kill చేస్తున్నారు? **మనచూపులలోపల మన నాలెడ్జి అంతా వ్యర్థమైపోతున్నది. మనవినికిడి లోపల మన నాలెడ్జి వ్యర్థమై పోతున్నది. మాటల చేతను నాలెడ్జి వ్యర్థమై పోతున్నది. తలపుల చేతను నాలెడ్జి వ్యర్థమై పోతున్నది.** దీనికి ఒక ఉదాహరణము. ఒక రేడియో వుంటుంది. ఒక స్టేషన్ మనం పెట్టుకున్నాము. దాని వాల్యూము పెద్దగా పెట్టుకో వచ్చును. చిన్నగ పెట్టుకోవచ్చును. దానిని start చేసి పెట్టావంటె, నీవు వినుచున్నపో, అది పెద్ద శబ్దముగా పెట్టు, చిన్నశబ్దముగా పెట్టు, ఎన్నియో యూనిట్లు కరెంటు వ్యర్థమవుతున్నది. అదే విధముగా మన దేహము ఒక రేడియో వంటిది. మనము నిరంతరము యోచన చేస్తున్నాము, మాట్లాడుతున్నాము; గట్టిగా మాట్లాడు తున్నాము; తనలో తాను మాట్లాడుతున్నాము. నిద్రలో మాట్లాడుతున్నాము; నిద్ర వచ్చేంతవరకు మాట్లాడు తున్నాము. తెల్లవారి లేచిన మొదలు మనలో మన మాటలు జరుగుతూ వుంటున్నాయి. తద్ద్వారా ఎంత ఎనర్జీగా మారిపోతుంది జీవితము. కనుక యీ దేహము నందుండిన శక్తిని సద్వినియోగపరచుకోవటానికి తగిన కృషి చేయాలి. అప్పుడే మనకు చక్కని బాలెన్స్ ఏర్పడుతుంది.

(బ్ర.త్ర.పు.33/34)

(చూ॥ మనోతీతమైన స్థితి)

సుందరాకాండము

రామయణములో వేయిశ్లోకములకొక అక్షరముగా గాయత్రీ మంత్రము ఇమిడి యున్నదనియూ, వేదపాఠమే అది అనియూ, రామాయణము కూడ, గానము చేసినవాళ్లను 'త్రాయతి' (తరిపంజేయును) అని చెప్పిరి. **స (బ్రహ్మతత్వము) ఈ (సృష్టితత్వము) త (ప్రీతి సూచికము) ఆ (సంహార సూచకము) - ఈ నాలుగు చేరి సీతా' అనే పదమయినది;** సీతా అనే పదమునకు ప్రకృతిలో సృష్టి - సంహారములు గావించు బ్రహ్మ శక్తి అనేదే అంతరార్థము, **సీతా - భూజాతా మాత్రము కాదు, సృష్టిసంహారములు గావించు పరాశక్తి. శిష్టపరిపాలన, దుష్టసంహారం - ఈరెండూ సీతవలనే జరిగినవి. దానికే రామాయణమును సీతాయాశ్చరితం మహత్ అని పెద్దలు కొనియాడిరి.** సుందరకాండ అవి ఆకాండమునకు పేరు రావటమునకు కూడ సీతనే కారణము. లంకలో రావణుడు మొదలుకొని, అందరూ వికార రూపులు వికార స్వభావులు వికార బుద్ధులే! అట్టి వికార భూయిష్టమైన లంకలో సుందర రూపు స్వభావము బుద్ధిగల సీత చేరి, వారిని పరిశుద్ధముచేసిన వివరములు ఈకాండములో ఉన్నవి. దానికే సందురకాండమని పేరు''.

(స.సా.న.73 పు.274)

సుఖము

జీవితంలో కేవలం సుఖం మాత్రమే ఉండాలని ఆశించరాదు. **"నసుఖాత్ లభ్యతే సుఖమ్". సుఖము నుండి సుఖము రాదు. దుఃఖము నుండే సుఖము ప్రాప్తిస్తుంది.**

(స.సా.మా.96పు.57)

ప్రతి ప్రాణి ప్రపంచములో సుఖమునే కోరును. దుఃఖము కోరదు. వాస్తముమైన సుఖము ఏమిటో తెలిసిన వారు, తెలిసికొన్న వారు చాలా అరుదు. **సుఖము మూడు రకములుగా యున్నది. ఆరంభమున విషయముపలె యుండి, విపాకమునందు అమృతముపలె యుండును. ఇది ఆత్మబుద్ధిచేత లభించు సుఖము. యోగవాసిష్ఠములో, ఓరామా! మహాసముద్రమునైనా తేలికగా పానము చేయవచ్చును. మేరు పర్వమునైనా తేలికగా ఊడ**

సుఖదుఃఖములు

పెరకవచ్చును. అగ్నిని అనాయాసంగా భుజించవచ్చును. కాని మనో నిగ్రహమును గాంచితిమా అదే అమృతత్వము. అట్టి అమృతత్వమును పొందుటకు పూర్వము అతి శ్రమయనక మనో నిగ్రహమునకై ప్రయత్నించుట ప్రధాన సుఖము. విపాకముగా నిర్వికల్ప సమాధిలో లభించు సుఖము వర్ణనాతీతము. ఇది అమృతముతో సమానము. నిర్వికల్పమనగా సంకల్పరహిత స్థితియే. వికల్పము లేనిది నిర్వికల్పము. దీనిని సాధనచే సాధింపవచ్చును. **నిర్వికల్పసమాధి రెండు విధములు. ఒకటి అద్వైత భావ రూపము. రెండవ ద్వైతావస్థ రూపము.** దీనినే నిర్వికల్పసమాధి అంటారు. దీనిని సాత్విక సుఖము అని కూడా అంటారు. **"నసుఖాలభ్యతే సుఖం". సుఖము నుండి సుఖము చిక్కదు. కష్టములోనే సుఖమున్నది. అన్న సత్యాన్ని గుర్తించాలి.**

(సా. పు.252)

(చూ॥ కష్టం, నరుడు, పద్నాలుగులోకములు, శాంతము)

సుఖదుఃఖములు

సముద్ర కెరటాలవలె సుఖదుఃఖాలు వస్తూపోతూ ఉంటాయి. అవి ఉచ్ఛ్వాస నిశ్వాసముల వింటివి. వాటితో ఉంటూ ప్రశాంతిని మీరు పొందగలిగితే మీరున్నచోటే కాశి అవుతుంది. మీరు చేసే ప్రతిపని శివపూజ అవుతుంది. మీరు మీ మనస్సుతో పాటే సంచరించండి. దాని భావాలు, రహస్యాలు మీకు అర్థమవుతాయి. మీ సామ్రాజ్యాలకు మీరు అధికారులు కాకుండగా ఇతర దేశాలలో సంచరిద్దామని భావించకండి. **ముందు మీ సంగతి, తరువాత ఇతరుల సంగతి. మిమ్మల్ని మీరు తెలుసుకోండి. ~~ఈ~~పాఠం ఒక్కసారి నేర్చుకుంటే మీరు ఇతరులను వేగంగా స్పష్టంగా తెలుసుకోవచ్చు.**

~~ఈ~~ జీవితాన్ని ఇతరులసేవకై అంకితం చేయండి. ఇతరులు అంటే మీ లోపల ఉన్న భగవంతుని ప్రతిరూపాలే. మానవుడు భగవంతుణ్ణి చేరే పురాతనమైన రాజమార్గం పాడయిపోయింది. ఆ మార్గాన్ని మరమ్మత్తులు చేయటానికే నేను వచ్చింది. నిజాయితీగల ఆలోచనా పరులుగా, ఇంజనీర్లుగా, పనివాళ్ళుగా తయారై నన్ను చేరండి. వేదములు, ఉపనిషత్తులు, శాస్త్రములే నేను చెప్పిన మార్గము. **దానిని అందరికీ ప్రకటించి సంస్కరించటానికే నేను వచ్చింది.**

(వ.61-62 పు.182)

(చూ॥ భయం)

సుఖశయన ప్రార్థన

తథాకృతం దేవ। యథైవకారితం
తథామతం దేవ। యథైవజ్ఞాపితం
తథోదితం దేవ। యథైవ వాదితం
సమాప్తమత్రైవవిభో దినవ్రతం॥
సుషుప్తైనాయ యాస్మాం తద్దేవ త్వాం ప్రార్థయామహే।
త్వమత్సంగః ప్రభో। ఏకం చిరశాంతి సుఖాస్పదమ్॥
ఓం శాంతి శ్శాంతి శాంతిః

అర్థము: నేను యింతవరకు నీవు చేయించిన పనులను చేసినాను. నీవు ప్రేరేపించిన తలంపులనే తలచినాను. నీవు మాట్లాడించిన మాటలనే పలికినాను. నేను నడచిన నడకలు, పలికిన పలుకులు,తలంచిన తలంపులు అన్నియు నీవే నడిపించి, చేయించి తలపించినవి. ~~ఈ~~ దినమున నిత్యవ్రతము సమాప్తి అయినది. నన్ను యింక నిద్రలోనికి తీసుకో. పరమాత్మా నాకు చిరశాంతి చిరసుఖములను ప్రసాదించేది నీ యొడి ఒక్కటే.

(భ.శ్రీ.స.సా.పూ.వి.పు.91)

సుఖానందములు

ఆనందసుఖములు అందించే నిమిత్తమై, అందుకొనే నిమిత్తమై దేహేంద్రియమనోబుద్ధులు ఏర్పడినాయి. దురదృష్టవశాత్తు ~~ఈ~~ శరీరేంద్రియమనోబుద్ధులలో దోషములు చేరిపోవుటచే తన స్వభావమును స్వరూపమును మరచి మానవుడు విచారమగ్నుడగు తున్నాడు. దేహమున రాగద్వేషములనే మాలిన్యము

కప్పినది. ఇంద్రియములను భోగభాగ్యములనే మాలిన్యము కప్పినది. మనస్సు ఈ రెండింటిచేత అనగా రాగ ద్వేషములు భోగభాగ్యముల చేత కప్పబడింది. కనుకనే మానవుడు తన స్వరూపాన్ని తాను తెలుసుకలేక పోతున్నాడు. ఈ భౌతికమైన లౌకికమైన భోగభాగ్యములు సుఖసంతోషములే తన ఆధారములని తన స్వరూపము లని విశ్వసిస్తున్నాడు. ఇవి కేవలము కదలిపోయే మేఘములు. సుఖానందములు శాశ్వతమైనవి.

(బ్ర.త్ర. పు.105)

సుగుణములు

బాలకృష్ణుని నడుముచుట్టూ తాడు బిగించి - తనవైపు లాగుకోదలచినపుడు యశోద కనుగొనలేకపోయింది. ఆ త్రాడు అహంకారం - భగవంతుని **అహంకారపు** త్రాడుతో బంధించ గలరా? ఎన్నిసార్లు కట్టడానికి తలపెట్టినప్పటికీ రెండు జానలు తక్కువైంది తాడు. ఆరెండు జానలూ - **ధర్మనిష్ట - బ్రహ్మనిష్ట అనే రెండు సుగుణాలు.** అవి కూడా చేరినపుడే తాడు సరిపోగలదు.

(త.శ.మ.పు.156)

శాస్త్రప్రమాణము ననుసరించి, ఉత్సాహము, సాహసము, ధైర్యము, సద్బుద్ధి, శక్తి, పరాక్రమము అను ఆరు సుగుణములును ఉండుచోట సాక్షాత్ భగవానుడయి వసించును. ఇట్టి గుణములను ప్రభోదించుటే, **గణపతి పూజ అనగా ప్రారంభము.** పిరికిపందలకు ఆధ్యాత్మ క్షేత్రమున చోటే లేదు. దుర్జనులు దృఢవిశ్వాసము లేనివారు, సందేహస్తులు యేడుపుముఖము వారు, వైద్యులకు శిష్యులుగా వుండవలసినవారే కానీ యోగులెన్నటికీకానేరరు. **జ్ఞానికి అజ్ఞానికి ఇదే భేదము.** "ప్రవాసన్నివ" కృష్ణుడు ఆనందాతిరేకములతో నవ్వుచూ పలుకుట, అర్జునుడు దుఃఖాకులుడై వినుట, జ్ఞాని యెల్లపుడును నవ్వుతాడు, అజ్ఞాని యేడుస్తూవుండును.

(స.వా.పు.163)

(చూ॥ శిష్యుడు, హెచ్చరించుకోండి)

సుజ్ఞాన, విజ్ఞాన ప్రజ్ఞానములు

(చూ॥ రావణుడు)

సుదర్శనము

(చూ॥ ప్రాచీన భారతీయ సంస్కృతి)

సుదర్శనము - సమ్యక్‌దృష్టి

సమ్యక్ దృష్టి యనగా సుదర్శనము అని చెప్పవచ్చును. ఇట్టి సుదర్శనమును కలిగినవాడే దైవాత్మస్వరూపుడు. మహావిష్ణువు హస్తమునందు సుదర్శనమనే చక్రమున్నదని. దీని కొక కథ. సమ్యక్‌దృష్టి కలిగినవాడు భగవంతుని హస్తంలో వుంటుంటాడు అని దీని అంతరార్థము. భగవంతుని స్వాధీనమునందుండుట మాత్రమే కాకుండా భగవంతుడు కూడను కాగలడు. భగవత్‌తత్వమును కలిగిన వ్యక్తిత్వమును, భగవత్‌స్వరూపాన్ని, పొందగలడనే అంతరార్థమును ఆధారము చేసుకొనియే "బ్రహ్మవిత్ బ్రహ్మైన భవతి" అన్నారు. "స్థితప్రజ్ఞుడు కాగలిగినవాడవు నీవు సుదర్శనమును అభివృద్ధి పరచుకోవాలి. **సుదర్శనమనగా అనేకత్వమునందున్న యేకత్వాన్ని గుర్తించుట. దైవతత్వమనేది ఒక్క ఆత్మతత్వము తప్ప అన్యము కాదు. కనుక నీదృష్టిని అత్మవైపు మరల్చు"మని బోధించాడు కృష్ణుడు.**

(శ్రీ.గీ.పు.254)

(చూ॥ త్రివిధ దృష్టులు)

సుద్దులు

(చూ॥ వరలక్ష్మీవ్రతము)

సున్నా

మోక్ష సాధనకు వుపయోగపడే జ్ఞానాన్ని మనిషి ఎలా సంపాదించుకోగలుగుతాడు? ప్రార్థన వల్ల; ప్రేమ వల్ల; దైవానుగ్రహం వల్ల. కేవలం మంచి పనులు చేయటం

సుబ్బమ్మ

వల్ల గమ్యాన్ని చేరలేవు. God ను చేరేందుకు కేవలం Good చాలదు. God లోకన్న Good లో ఒక 'o' ఎక్కువ వుంది. నీలో కలిగే కోరికయే ఆసున్నా. ఫలాపేక్షయే ఆ సున్నా. కీర్తికాంక్షయే ఆ సున్నా **good లోంచి ఆ సున్నా పోతే మిగిలేది god.** కోరిక, ఫలాపేక్ష, కీర్తికాంక్ష లేకుండా సేవ చేయాలనీ, మంచి పనులు చేయాలనీ తలచే స్వార్థం లేని పరమార్థ తత్వమే ఆ పరమాత్మతత్వం. **జీవితం+కోరిక= మనిషి; జీవితం-కోరిక=దేవుడు.**

(శ్రీ.సా.గీ.పు.120)

సుబ్బమ్మ

(చూ॥ స్వామి బాల్యము)

సుభాష్‌చంద్రబోస్

సుభాష్ చంద్రబోస్ కలకత్తా యూనివర్సిటీలో చదువుతున్న సమయమున ఒక బ్రిటిష్ లెక్చరర్ భారతదేశాన్ని, భారతీయులను గురించి హేళనగా, అలక్ష్యంగా చెప్పడం జరిగింది. సుభాష్ చంద్రబోస్ మాతృదేశ దూషణమును వినలేకపోయాడు. **"ఇది నా ప్రియ మాతృదేశము. ఇది నా ప్రియమాతృభాష ఇదే నా మతము" అని మాతృదేశమునకై త్యాగము చెయ్యాలని సంకల్పించుకొన్న వ్యక్తి.** అతడు లెక్చరర్ మాటలను వినలేకపోయాడు. కొంతసేపు ఓపికపట్టినాడు. ఒక్కతూరి మూడు డెస్కులంతా ఎగిరిపోయేసి ఆ బ్రిటిష్ లెక్చరర్ తలపట్టుకొని, చెప్పుతీసుకొని ఊరికే కొట్టేశాడు. **"దేనినైనా నేను సహిస్తాను. నా మాతృదేశాన్ని దూషించటం నేను సహించలేను. నేను నరకమునకు పొయినా ఫరవాలేదు, నా దేశగౌరవాన్ని నేను కాపాడుకోవాలి"** అని దేశాభిమానం వ్యక్తం చేసాడు. తక్కిన విద్యార్థులు ఏమీ చేయలేక పోయారు. పులిపిల్లలవలె ఎగిరి అతడిని అనేక రకములుగా హింసించాడు. లెక్చరర్ Help me, help me అంటున్నాడు. కానీ ఎవరూ సహాయం చేయలేదు.

ఈ వార్త యూనివర్సిటీ అంతా ప్రాకిపోయింది. అధికారులు ఎమర్జెన్సీ మీటింగ్ పెట్టుకొని 5 సం॥లు కలకత్తా యూనివర్సిటీలో సుభాష్ చదవటానికి వీలు లేదని నిర్ణయం తెలియచేశారు. దానితో సుభాష్ చదువును త్యాగం చేసినాడు. అటుపిమ్మట తండ్రి ఈ విషయాన్ని తెలుసుకొని లండన్ పంపించినాడు. అక్కడ **శ్రద్ధాభక్తులతో చదివి ICS Pass అయ్యాడు. భారతదేశానికి తిరిగివచ్చి మాతృ దేశాభిమానముతో** రాజకీయరంగంలో ప్రవేశించి నాడు. **ఇదే నిజమైన త్యాగము. స్వార్థాన్ని త్యాగం చేసి పరార్థాన్ని విశ్వసించి పరమార్థాన్ని పొందాలి.**

(స.సా.మే91 పు.137/138)

సుమంతుడు

కన్యాకుమారి మొదలగు కాశ్మీరువరకు, ఉత్తర దక్షిణ తూర్పు పడమర సముద్రముల తీరముల వరకుగల క్షేత్రములను మూడు నాలుగు మాసములు సంచారము సలిపి, మధ్య మధ్య ఆయారాజ్యములందుగల కొన్ని ప్రజా అననుకూలములను, యాత్రికుల అననుకూలము లను గుర్తించి, మంత్రితో చెప్పి వాటిని సరిచేయించుచు, దైవ మందిరములకు తగిన యేర్పాట్లు భద్రతలు కల్పించుచు అనేక విధముల యాత్రీకులకు నీటి వసతులు, వృక్షచ్ఛాయలను, చలివేంద్రలను, సత్రములను ఆరోగ్య కేంద్రములను **నీమించమని రాముడు తెలుపగా రామాభీష్టములకు అడ్డుచెప్పక కోరిన వాటినన్నింటిని అతి శీఘ్రములోనే చేయించుచూ** వచ్చుచున్న సుమంతుని చూచి, పిల్లలు తమలో తాము ఆనందించుచూ, **మన మంత్రివంటి మంత్రులు లోకమున వుండిన, లోకక్షేమము నకు కొదువ రాదని ఒకరికొకరు గుసగుసలాడేవారు.**

(రా.వా.మొ. పు.48)

సుమతి

(చూ॥ నామంచికే)

సుమిత్ర

లక్ష్మణుడు సీతారాములవెంట అరణ్యానికి వెళ్ళే సమయంలో అతని తల్లి సుమిత్ర, "లక్ష్మణా! నీవు అరణ్యానికి వెళుతున్నానని భావించవద్దు. **సీతా రాములు లేని ~~ఈ~~ అయోధ్యయే మాకు అరణ్యము, సీతారాములున్న ఆ అరణ్యమే నీకు అయోధ్య. కనుక, వారిని నీ తల్లి తండ్రులుగా భావించి, సేవించు, వారికి ఎట్టి లోపమూ రాకుండా చూసుకో" అని కుమారుణ్ణి ఆశీర్వదించి చెప్పింది. ఆమె పేరే సుమిత్ర. అనగా, మంచి మిత్రురాలు. సుమిత్రవంటి తల్లులు, సీతవంటి భార్యలు లక్ష్మణుని వంటి సోదరులు ~~ఈ~~నాడు తయారు కావాలి.** ఐకమత్యం అభివృద్ధి కావాలి. ఐకమత్యంవల్లనే జగత్తు సంరక్షింప బడుతుంది.

(స.సామే.99పు.118)

సుమిత్ర గుణవంతురాలు. ఆమె పేరే సు-మిత్ర, అనగా, ఆమె అందరికీ మంచి స్నేహితురాలు. ఆమె ఆదర్శము సాటిలేనిది. రాముడు అరణ్యానికి వెళ్ళేముందు తల్లియైన కౌసల్యకు నమస్కరించినప్పుడు ఆమె "నాయనా! నేను నిన్ను విడిచి క్షణమైనా ఉండలేను" అని విలపించింది. అప్పుడు సుమిత్ర **కౌసల్యను సమీపించి "అక్కా! ఏమిటి అజ్ఞానము! సాక్షాత్తు నారాయణుడే నీ గర్భమునందు శ్రీరాముని గా జన్మించాడు. మానవాకారం ధరించి నందుకు అతడు కాల, కర్మ, కారణ, కర్తవ్యాలను పురస్కరించుకొని ప్రవర్తించాలి.** కాబట్టి, రాముడు అరణ్యానికి వెళుతున్నాడని నీవు బాధపడవద్దు. త్వరలోనే అయోధ్యకు తిరిగి రాగలడు" అని సమాధాన పరిచింది. తన కుమారుడైన లక్ష్మణుడు వచ్చి తనకు నమస్కరించి నప్పుడు సుమిత్ర అతనికి ఏమని బోధించింది? "నాయనా! నీవు అరణ్యానికి వెళుతున్నానని భావించవద్దు. సీతా రాములు లేని అయోధ్యయే అరణ్యము. సీతారాములున్న అరణ్యమే అయోధ్య **రాముడే నీ తండ్రి, సీతయే నీ తల్లి. కాబట్టి, వారిని ప్రేమతో సేవించడమే నీ ప్రధాన కర్తవ్యం"** అన్నది. అట్లే, **ఆమె రెండవ కుమారుడైన శతృఘ్నుడు భరతుని సేవిస్తూ వచ్చాడు.**

(స.సా.మే.2000 పు.143/144)

(చూ॥ హనుమంతుడు)

సుప్రభాతము

(చూ॥ దూపాటి తిరుమలాచార్యులు)

సుప్రీంకోర్టు

(చూ॥ ఆదర్శము, సుప్రీంస్టేజి)

సుప్రీంస్టేజి

"~~ఈ~~నాడు ఆకార మానవుడు కనిపిస్తున్నాడేకాని, ఆచార మానవుడు కనిపించుటంలేదు. ఆచార **మానవులుగా తయారై 'సుప్రీంస్టేజి'కి వెళ్ళడానికి ప్రయత్నం చేయాలి. అయితే ~~ఈ~~నాడు "సుప్రీంస్టేజి'కి వెళ్ళడానికి ప్రయత్నం చేయటంలేదుకాని,** 'సుప్రీంకోర్టు' కు మాత్రం పోతున్నారు. కనుక మనం Supreme Courtకు కాదు, Supreme Stageకు వెళ్ళాలి. అదియే Supreme Divine Self. **అట్టి పవిత్రమైన దివ్యజీవితాన్ని మనం అనుభవించాలి."**

(శ్రీ.న.2000పు.28)

సుషుప్తి

(చూ॥ ఆత్మ)

సుషుమ్ననాడి

చదివే సమయములో సరియైన స్థితిలో కూర్చొని చదువుకోవాలి. ఎందుకనగా ~~ఈ~~ దేహమున కొక ప్రత్యేకమైన విశిష్టత ఉన్నది. పశువులకు మృగములకు వెన్నెముక వంగి ఉంటాది. కానీ మనిషికి చక్కగా ఉంటాది. మూలాధారమునుండి సహస్రారము వరకు పోయే మార్గము సరియైన స్థితిలో ఉంటుంది. కనుకనే సరియైన ఆలోచనలు సలుపుతుంటుంది. అట్లు కాకుండా వంగిపోతే ఆలోచనలు కూడ సక్రమమైన మార్గమును

సూక్ష్మదేహము

అవలంబించవు. ప్రతి మానవునియందు 101 నాళములు ఉంటాయి. అందులో ఒక్క నాళము మాత్రమే ప్రత్యేకంగా ఉంటుండాది. అది సహస్రారముతో సంబంధమై ఉంటుంది. ఇది ఆధ్యాత్మికమార్గములో ధ్యాననిష్ఠలో నుండిన **వారికే సహాయకారిగా ఉంటుంటాది. దీనినే సుషుమ్ననాడి అన్నారు. ఇడ పింగళ సుషుమ్న నాడులలో భ్రూమధ్యమునుండి చేరినపుడే ఈ సుషుమ్ననాడి ఏకాగ్రతను అందిస్తుంది.** వెన్నుముకలో 33 రింగ్స్ ఉన్నాయి. అందులో 9 నుండి 12 వరకు ఉండినవాని యందే సుషుమ్ననాడి చక్కగా వెలుగుతుంది. **"నీలతో యద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా, నీవారశూకవత్తన్వీ పీతా భాస్వత్య ణూపమా" అని వేదము నల్లటి మేఘములమధ్య ఒక్కతూరి మెరుపు మించినపుడు ఎంత ప్రకాశంగా ఉంటుందో మన వెన్నెముకలోపల అదేవిధంగా విద్యుల్లేఖ మించు తుంటాదట. అదే మన ప్రాణాధారము. కుండలీయోగము చేసేవారికి ఇది అర్థమవుతుంది.** ఏ యోగమయినా చేయి. యోగము చేయనప్పటికినీ సరియైన స్థితిలోనే దేహాన్ని ఉంచుకోవాలి.

(బృ.త్ర.పు.62/63)

సూక్ష్మదేహము

జ్ఞానేంద్రియములు అయిదు, శబ్దాదులు అయిదు, ప్రాణాదులు అయిదు, మనస్సు, బుద్ధి రెండు. అనగా పదునేడు తత్వములు కలిపిన దానినే సూక్ష్మ దేహ మందురు.

(ప్ర.శో.వా.పు.3)

సూక్ష్మము

బుద్ధిని మధ్య మధ్య అహంకారము ఆవరిస్తుంటాది. **శరీరముకంటె ఇంద్రియములు, ఇంద్రియములకంటె మనస్సు, మనస్సుకంటె బుద్ధి, బుద్ధికంటె ఆత్మ మరింతసూక్ష్మమైనవి. సూక్ష్మమైన బుద్ధిని అహంకారము ఆవరించిన దంటే అహంకారము బుద్ధికంటె సూక్ష్మమైనది.** ఇది సర్వత్రా ప్రవేశిస్తుంది. సర్వకర్మలయందు ప్రవేశిస్తుంది. కనుకనే మానవుడు ఈ అహంకారమును దాటి ఆత్మను చేరలేకపోతున్నాడు.

(బృ.త్ర.పు.94)

(చూ॥ పంచభూతములు, స్మరింతురు)

సూక్ష్మరామాయణము

జీవిరూపుడైన జడము బ్రహ్మజ్ఞానమను చైతన్యమును వరించును. **ఆ బ్రహ్మజ్ఞానచైతన్యమే సీత** అను పేరున పుట్టినది. అప్పుడు ఈ **జడచైతన్యములు ఒకటిగా ఏకమగును. వాటినే సీతారాములను పేర్లతో సంబోధించు చున్నారు.** ఈ రెండూ ఏకముగా ఉన్నంతకాలమూ ఏబాధలూ ఉండవు. ఈ రెండింటియొక్క యెడబాటే కష్టప్రారంభము.

బ్రహ్మజ్ఞాన మను సీత, జీవిరూపమందున్న ఆత్మను వదలిన అంధకార మను జీవితఅడవిలో పడకతప్పదు. జీవి బ్రహ్మజ్ఞాన మను సీతను పోగొట్టుకొనుటవల్ల అంధకార మను అడవిలో సంచరించక తప్పదను అర్థమును చూపుటకొరకే రాముడు అట్లు నటించినాడు. అట్టి అంధకారమైన జీవితఅడవిలో వంటరిగా వద్దు, **మనస్సు అనే లక్ష్మణుని** ఎడమీయక ఉండ మని తెలిపినాడు.

అట్టి అంధకారజీవితములో సంచరించుసమయమున దీనత్వము, వివేకము అనేవి రెండూ వైరముతో ఉండుననియూ, అట్టి సమయమున దీనత్వ మను వాలిని తెగటార్చవలెననియూ చూపినాడు. **ఆ దీనత్వవివేకములే వాలిసుగ్రీవులు. దీనత్వమే వాలి,** వివేకమే సుగ్రీవుడు. దీనత్వమును తెగటార్చుటకు తగిన సహాయకారి. అతనే ధైర్యమను రూపమున ఉన్నాడు. ఆ ధైర్యమను **హనుమంతుని విశ్వాసము** చేసికొనునటువల్లనే మోహసాగరమును సప్తసముద్రములనూ జీవి సులభము గా దాటగల డను నిశ్చయమును చూపుతూ లంకకు హనుమంతునితో సేతువుకట్టించినట్లు చూపినాడు.

రాముడు (సేతువు దాటి) మోహమును దాటిన తక్షణము **రజోగుణతమోగుణము లను రావణుని, కుంభకర్ణుని చంపివేసెను.** మిగిలిన చిన్నతమ్ముడైన **సత్వగుణము అనగా విభీషణునకు** పట్టముగట్టెను. కాన, మూడు గుణములనూ ముగ్గురుఅన్నదమ్ములవలె చూపి, వారినే రావణ, కుంభకర్ణ, విభీషణులను పేర్లతో చూపించినాడు. తరువాత అనుభవజ్ఞానమైన సీత అను చైతన్యమును చేరుట: **ఎప్పుడు తిరిగి జడ చైతన్యములు చేరునో అదే పట్టాభిషేకము అనగా జీవన్ముక్తి.** కాన, **రామాయణములో సారమేమన, మానవునియందున్న జీవి, మనసూ, జ్ఞానమూ, దీనత్వము, వివేకము. మోహము, ధైర్యము, రజస్సు, తమస్సు, సత్వము వీటిని ఒక్కొక్క దానిని ఒక్కొక్క రూపనామముగా సృష్టించి, ఏవీ రీతిగా జయించవలెను. సాధించవలెను. అను విధానమును ఆత్మస్వరూపుడు రామస్వరూపమున వచ్చి నటించి, నడిపించి, చూపించి, చేపించి నాడు. కాన, ఆనాటితో రామాయణము ముగియలేదు. ఎవరెవరిజీవితము ఇన్ని మార్గముల సాధించి, కడకు అనుభవజ్ఞానమును పొంది, సత్వగుణమునకు పట్టముకట్టుదురో అంత వరకూ వారివారి హృదయభూమియందు రామాయణము జరుగుచునేయుండును.**

జీవితరామాయణమున ఆత్మే రాముడనీ, మనస్సే లక్ష్మణుడు, బ్రహ్మజ్ఞానమే సీత అనియూ, ఆ సీతను రాములు వదలిన, జీవిత మను అడవిలో పడుదురనియు, ఆ జీవిత మను అడవిలో దీనత్వ, వివేకములను వాలిసుగ్రీవులుందురనియూ, దీనత్వమును వాలిని హతమార్చవలెననియూ, అప్పుడు మోహమను సముద్రము అడ్డువచ్చుననియూ, వాటిని దాటుటకు ధైర్య మను హనుమంతుని సహాయముగా ఉంచుకొనవలెననియూ, ఆ ధైర్యమను హనుమంతుని మనము చెలిమిచేసిన వాని సైన్యమైన ఉత్సాహ **బలస్థైర్యగాంభీర్యములను జాంబవంత అంగదాది సైన్యములతో** మోహమును దాటవచ్చు ననియూ, అది దాటిన తక్షణమే రజోగుణతమోగుణము లను రావణ కుంభకర్ణులను హతమార్చవచ్చుననియు, మిగిలినసత్వగుణమను విభీషణునికి పట్టాభిషేకము కట్టవలెననియూ, తరువాత అనుభవజ్ఞానమైన సీతను చేరవచ్చుననియూ, ఆ జడ చైతన్యమైన **సీతారాముచేరికే ఆత్మానంద మనియూ, అదే జీవన్ముక్తి.** దశరథకుమారుడై జరిపిన రామాయణమునే అందరిహృదయములందు పై చెప్పిన గుణఇంద్రియరూపములతో సూక్ష్మ రామాయణముగ జరుపుచున్నాడు.

(స.ని.పు.89/92)

(చూ॥ దశేంద్రియములు)

సూక్ష్మరూపము

(చూ॥ మహాభారతము, రామాయణము)

సూక్ష్మరూపుడు

(చూ॥ స్మరింతురు)

సూత్రము

భూమి మీద ముండ్లు రాళ్ళు అసలు లేకుండా ఎవరు చేయగలరు? చేయలేరు. చెప్పులు వేసుకొని వాటి బాధనుండి తప్పించుకొన ప్రయత్నించ వలనే కానీ వేరు మార్గముండదు. వేదాంత దర్శనము, సత్యదృష్టి చేత, స్వస్వరూప బ్రహ్మ దృష్టిచేత, సత్యస్వాతంత్ర్య ధర్మమును పొందవచ్చునని తెలుపుచున్నది. బాహ్మ పరివర్తనాలు తాత్కాలిక కోప శమనోపాయాలు మాత్రమే. సర్వవిధ దాస్యములకూ సంబంధించిన దేహమునకు నేను బానిసనుకాను. ఈ దేహము నా బానిస నేను సర్వనియంతయు ముక్తి స్వరూపుడును అనే నిత్య సంభావనలతో ఎవడు అహంభావాన్ని కాలరాస్తాడో అతడే విముక్తుడు. ధర్మములు అహంకార బంధ విముక్తికి దారి తీసేవిగా నుండవలెను. ధర్మము. అహంకార వికార ప్రేరితాలు కాకూడదు. ఇదే సూత్రము, ఇదే స్వతంత్రము.

(ధ.పు.14/15)

(చూ॥ జగదీశుడు)

సూత్రాత్మకుడు

(చూ॥ బ్రహ్మవిద్య)

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి/సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (పుట్టపర్తి)

ఈ ఆసుపత్రి (వైట్‌ఫీల్డ్ శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్) అందంగా ఉందని అందరూ కొనియాడుతున్నారు. కేవలం అందంగా ఉంటే ఏమి ప్రయోజనం? **అందరికీ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని చేకూర్చాలి. బీదలు సంతోషపడినప్పుడే మనకు ఆనందం కల్గుతుంది.** బీదలవద్ద మందులు కొనటానికి డబ్బు ఉండదు. కాబట్టి వారికి కావలసిన మందులన్నీ మేమే ఉచితంగా ఇస్తాము. మీరు ఈ ఆసుపత్రిని తక్కువ అంచనా వేయకండి. ఈ ఆసుపత్రిని గురించి ఇప్పుడు మీకు అంతగా తెలియదు. ముందుముందు ఇది గొప్ప స్థితిని పొందుతుంది. వివిధ దేశాల ప్రజలు ఇక్కడికి వచ్చి చికిత్స చేయించుకుంటారు. అలాంటి దివ్యమైన శక్తి ఈ హాస్పిటల్‌లో ఉన్నది. పూర్వం పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టినప్పుడు దానిని కొంతమంది తక్కువ అంచనా వేశారు. కాని, **నేడు పుట్టపర్తి చుట్టుప్రక్కల గ్రామాలలో ఒక్క హార్ట్ పేషంట్‌కూడా కనిపించదు. ఆ ఆసుపత్రిలో హార్ట్ ఆపరేషన్ చేయించుకోవాలంటే చిన్న పిల్లవాడుకూడా ఏమాత్రమూ భయం లోకుండా నవ్వుతూ వస్తాడు. అదేరీతిగా ఈ కర్ణాటక రాష్ట్రంలోకూడా ఎవ్వరికీ గుండె జబ్బులు లేకుండా చేయాలి.** రోగపీడితులైన పల్లె ప్రజలను తీసుకువచ్చి వారికి తగిన వైద్యం చేయించాలి. ఎవరినైనా తీసుకురండి. మాకు ఎట్టి అభ్యంతరమూ లేదు. **ఈ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడానికి అందరికీ సమాన హక్కుంది. ఏ కులంవారైనా, ఏ మతంవారైనా ఏ దేశంవారైనా వచ్చి ఈ ఆసుపత్రిలో చికిత్స పొందవచ్చు. మాకు ఎలాంటి భేదమూ లేదు. అందరికీ ఉచితంగా ట్రీట్‌మెంట్ ఇస్తాం. అప్పులైనా చేసి ఉచిత వైద్య సేవలందిస్తాం. ధనంకోసం ఏమాత్రమూ వెనుకంజ వేయం, రోగనివారణ గావించి ప్రాణాలను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం.** మీరుకూడా ఈ ఆదర్శాన్ని అనుసరించండి. **'లోకాస్సమస్తాః సుఖినో భవంతు'**, అందరూ సుఖంగా ఉండాలి. **నాయొక్క వాంఛ అదియే. దానినిమిత్తమై నేను ఏమైనా చేస్తాను. నా ప్రాణాన్నైనా అర్పితం చేస్తాను.** ప్రజాక్షేమం కోరని వ్యక్తి ఉండి ప్రయోజన మేమిటి? నేనెప్పుడూ అందరి మంచినీ కోరతాను. **మనం చేసే పని మంచిదైనప్పుడు, మన భావాలు మంచివైనప్పుడు డబ్బుకోసం వెఱవనక్కరలేదు, దానంతటదే నడుచుకుంటూ వస్తుంది.**

(స.సా.ఫి.2001 పు.36/37)

(చూ॥ సంగీతవిశ్వవిద్యాలయము)

సూరదాసు

గ్రుడ్డివాడైన సూరదాసు గానం చేసేటప్పుడు కృష్ణుడు గోవులు కాచేవానివలె వచ్చి ఆ పాటకు తగినట్లు మనోహరంగా మురళి నూదుతూ కూర్చునేవాడు. అందరూ భగవంతుని రూపాలేనని తాను పాట పాడుతున్నప్పటికీ తన యెదుట ఉన్నది గోపాలబాలుడని అనుకున్నాడు సూరదాసు. ఒకరోజున కృష్ణుడు తానెవరో సూరదాసుకి స్పష్టపరచాడు. తన దివ్యహస్తంతో సూరదాసు నేత్రాలమీద మెల్లగా స్పృశించాడు! సూరదాసు కళ్ళు తెరచి చూచే సరికి ఎదురుగా కృష్ణుడు! మధురాధరముల నుంచి మోహన మురళీగానం వినిసిస్తోంది. ఆయన దివ్యరూపంపైన మనస్సు లగ్నం చేశాడు సూరదాసు. అప్పుడతడు కృష్ణుని దివ్య రూపాన్ని దర్శించిన తనకింక భౌతికమైన నేత్రాలు అవసరం లేదని, **తనకు అంతర్నేత్రములు చాలునని అన్నాడు. పరిశుద్ధమైన అంతర్దృష్టి అతనికి శాశ్వతమైన ఆనందాన్ని ఇచ్చింది. దానివల్ల అతడు ఎంతో ఆరోగ్యంగా జీవించాడు.**

(వ.61-62.పు.59)

(చూ॥ శరణాగతి)

సూర్యశక్తి

(చూ॥ విశ్వామిత్రుడు)

సూర్యుడు

సూర్యుని ప్రకాశములోని ఏడు వర్ణములు సమానమైనపుడు తెల్లదనమే కనిపించును. త్రిగుణములు సమానముగా ఉండిన శాంతి చేకూరును. **ప్రశాంతి నిలయమనునది మీ హృదయమే కానీ ఈ కట్టడముకాదు. ధనవ్యయము చేసి ఇక్కడికి మీరు అనేక పర్యాయములు రానక్కరలేదు. ఉన్నచోటనే ఉండి ప్రేమతో భజించిన, దీనుల సేవచేసిన అనుగ్రహము ఆనందము దొరుకును.**

స్వామి అంతటా ఉన్నాడు. ఎక్కడ చూచినా కనిపించేవన్ని ఈ పరమాత్ముని స్వరూపమే. పరబ్రహ్మము తప్ప వేరేమియూ ఎక్కడనూ లేదు. సర్వమూ భగవంతుడే. సర్వ భూతాంతరాత్మ అంటే అదే అర్థము. తనది కాని రూపము లేదు. తనదికాని పేరు లేదు. రాతిలోనూ భగవంతుని చూడవలెను. కాని రాతినే భగవంతుని చేయకూడదు.

(స.సా.సె.77పు.162)

సూర్యుడు ఉదయించక పూర్వము, కిరణములు ముందు ప్రకాశిస్తాయి. కిరణములు వచ్చిన తరువాతనే అరుణుడు ఉదయిస్తాడు. అయితే **కిరణములకు అరుణునకు అవినాభావ సంబంధము** ఉంది-ఎట్టి భేదము కూడా లేదు. అరుణునితో చేరినదే కిరణము. **కిరణములు కలిగినటువంటిదే అరుణము.** అదే విధముగ దివ్య తేజమైన చైతన్యము ఒక విధమైన అరుణుని వంటిది. ఈ కిరణములే ఒక అవతార తత్వము. అయితే అవతారములో - దిగి రావటంలో - కొన్ని గుణములు చేర్చుకొని రావాలి. అది పూర్ణత్వమైనప్పటికి గుణముల చేరికవలన అసంపూర్ణమైనదిగా ఉంటుంది. దేహ, గుణ మనో బుద్ధులు లేకుండా అవతరించిన మానవులకు బోధించటం కాని, మానవులకు ఆదర్శవంతమైన జీవితాన్ని నిరూపించటం కాని సాధ్యం కాదు. కనుక అవతారమునకు నిర్గుణ నిరంజన, సనాతనమైన ఆత్మతత్వ చైతన్యమునకు ఉన్న వ్యత్యాసము కొంత వరకు మీరు నిరూపించాలి. నిత్య శుద్ధ బుద్ధ తత్వము - **ఇదే ఆస్తి భాతి ప్రియము. అట్టి ఆస్తి భాతి ప్రియమునకు రూప నామములు కల్పించినదే అవతారము. అక్కడ మూడు, ఇక్కడ అయిదు. కనుకనే దీనికి పంచకములు అని పేరు పంచకమనగా ప్రపంచమే.**

(స.సా.జ.85 పు.14)

భారతీయులకు సూర్యునికి సన్నిహిత సంబంధము కలదు. ఆనాది కాలము నుండి సూర్యుని స్థానము భారత వీరులైన క్షత్రియులకే కాక సామాన్య ప్రజలకు కూడనూ ప్రధాన స్థానమే కాక, పవిత్రమగు పీఠమును ధరించినది, వహించినది. క్షత్రియ జాతికి మూలపురుషుడు సూర్యభగవానుడు. భారత సంస్కృతిలో ఇట్టి పవిత్ర స్థానము మరెవ్వరికీ లేదు.

భారతీయులే కాక యావత్ప్రపంచమునకు **సూర్యుడు ప్రత్యక్ష భగవానుడు. ప్రపంచమంతయూ కాలముచే నడుచుచున్నది. కనుక కాలానికి కూడనూ ప్రధాన ఆధారము సూర్యుడు కాలము తనవలననే కలుగుచున్నది. కనుక కాలుడు సూర్యుని పుత్రుడని కూడ వాడు చున్నాము. ప్రతి మానవుని జీవితమూ కాలముచే కట్టుబడినది కనుక జీవితమునకు సూర్యుడే ఆధార, ఆరాధ్య దేవుడై యున్నాడు. యెవరికి అర్పితము చేసిననూ చేయకున్ననూ మానవుని సర్వ కర్మలూ సూర్యునకు మాత్రము అర్పితము చేయక తప్పించుకొన వీలులేదు.**

మానవుని జీవిత ప్రమాణమును దినదినమునూ కరిగించి హరించు చున్నాడు. అంతియేకాక అతనిద్వారా ఈ లోకమునకు ఎంత ఉపకార మనునదీ వేయిమాటలతో చెప్పనక్కరలేదు. నిత్యానుభవమే ప్రత్యక్ష సాక్షి. లోకమునందలి పాడిపంటలకు సస్యశ్యామలములకు మూల కారకుడు సూర్యుడే. అతని కిరణముల చలువ సోక కుండిన పాడిపంటల యందు పటుత్వముండదు. తన సూటియైన కిరణముల ద్వారా సముద్ర జలమును

పైకిచ్చేది అక్కడ తనచే సృష్టింపబడిన మేఘముల స్వరూపమున ఇమిడ్చి, వాటిని ప్రజల యొక్క ధర్మ కర్మల ఫలముల ననుసరించి ఆయా స్థానములందు క్రిందికి వర్షరూపమున అందించుచున్నాడు. అతను నిరంతరము ధర్మదేవత స్వరూపమును ధరించి తారతమ్యమును పాటించక తన కెదురైన వాటన్నింటినీ పలుకరించుచూ, తన తేజస్సును వాటితో చేర్చుచున్నాడు. **సూర్యుడు మహాత్యాగి, ఒక నిమిషమయిననూ తన సుఖమును కానీ విశ్రాంతిని కానీ ఆశించక కర్తవ్యకర్మ నాచరించు నిష్కామకర్మయోగి. నిరాడంబరముకల నిగర్వి, లోకమునకు యెవ్వరూ చేయనంతటి ఉపకారమునూ క్షేమమునూ తాను చేయుచూ, అందించు చుండిననూ తానేమీ చేయనివానివలె నటించుచుండును.** ఇన్ని కార్యములు నా వలన లోకమునకు జరుగుచున్నవి కదా! నేను లేకుండిన లోక మేగతి పట్టియుండునో అని ఏనాడూ గర్వముతో తలంచడు.

ఎంత వేడయిననూ సహించి వోపికతో యెంతపని అయిననూ చేసి లోకక్షేమమును అందించుచున్నాడు! సూర్యుడే శ్రమ అని తలంచినట్లయివుండిన లోక మేస్థితిలో ఉండెడిదో ఊహలకుకూడనూ అందదు. అసలు మానవుని దేహమందు ఈమాత్రపు వేడి నిలిచియున్నదన్న దీనికి కారణము సూర్యు డంతటి వేడిని సహించుకొనుటయేకాని వేరుకాదు. దీనినిబట్టి చూడగా దేహమునుకూడనూ తానే కాపాడుచున్నాడు. తన శక్తిని కొంత దేహమున ఇముడ్చును. ఆ సూర్యకాంతే దేహమున కొంత లేకుండిన అది ఒక జడమయి నిస్సారమయి యుండెడిదికదా!

సూర్యుడే విసుగు విరక్తిచెందిన లోకమంతా ఒక నిమిషములో మండిపోయివుండెడిది. కాన అతడు యేవిధమయిన విసుగూలేక అతి వోపికతో లోకమును రక్షించుచున్నాడు. **ఇది అతను సహజమని భావించు చున్నాడు.** కాని సర్వులకోసమని భావించుటలేదు.

సహజ కర్మలయందే ఓర్పు పుట్టిపడును కానీ అసహజ కర్మలందు అంత శాంతము చేరుటకు వీలులేదు. సహజకర్మలు యెప్పటికీ యే ఒకరికి భారమనిపించవు: **అహంకారమున ఆచరించిన కర్మలయందే విసుగు, విరక్తి, అశాంతి, భారమూ తాండవమాడును.** అందుకు ఆశ్చర్యము కూడనూ తోడగును, సహజమునకు అట్టివి చేరవు.

మానవుడు యెవడైనా సుఖంగా జీవించుచుండిన యెవ్వరూ యేమయ్యా సుఖంగా వున్నావని ప్రశ్నించరు. అదే దుఃఖముగా నుండిన ప్రతివాడూ యెందుకయ్యా దుఃఖముగా నున్నావని ప్రశ్నలవర్షము కురిపింతురు. కారణమేమి? **మానవుడు సుఖ స్వభావము కలవాడు;** అందువలన ఆశ్చర్యము కలుగదు. అందులో **దుఃఖము మానవునకు అస్వభావము** కనుక అంత ఆశ్చర్యము కలిగించి అనేక ప్రశ్నలకు గురిచేయును. దుఃఖము భ్రాంతితో యేర్పడినది కాని అది సహజమైనది కాదు. అందువలననే అన్ని **వికారములు కలుగును**

దీనిని బట్టి చూడ సహజమునకు విసుగు కానీ, భారము కానీ ఆశ్చర్యము కానీ, గర్వముకానీ, విరుద్ధమయిన కల్పిత వికారములని సూర్యభగవానుడు ప్రత్యక్షముగా మానవులకు బోధించుచున్నాడు.

సూర్యభగవానుని కర్మ కృత్రిమము కాదు. కనుకనే ఏ ఆర్భాటము కానీ ప్రచారాలు కానీ లేక నిశ్శబ్దముతో సకాలమునకు సక్రమ పద్ధతిని సాగించుచున్నాడు. **తనవలన కలిగిన కాలమును కూడా పృథాగావించక దానినే మానవుల జీవిత ప్రమాణముగా నియమించి కాలమువలన ఆనంద ఆహారములనేగాక మంచి చెడ్డలనుకూడా నిర్ణయించి జీవులకు మార్గదర్శకుడై మెలగుచున్నాడు. జీవులకు సద్గతి మార్గమును సమకూర్చుచున్నాడు. ఇట్టి గుణవంతుడూ మహాత్యాగీ నిష్కామకర్మయోగి కనుకనే భగవంతుడు మనుపు ఈ యోగమును సూర్యునకు బోధించియుండుట;** లేకున్న సామాన్యులకు యిట్టిది సాధ్యమా! ఇప్పుడు ఈ అవ్యయమయిన ఈ యోగమును తిరిగి ప్రజాప్రతినిధిగా నిలచిన అర్జునునికి బోధించుచున్నాడన్న, అర్జునుడు

సూర్యునంతటి గుణశాలి అయివుండవలెను గదా! ఇతని చరిత్ర యెంతటిదయివుండునో పాఠకులు యోచించ వచ్చును. అంతటి పవిత్రతే ఈ అర్జునునియందు లేకుండిన కృష్ణపరమాత్మ ఇంత ప్రయత్నము ఎందుకు సంకల్పించి యుండును **అర్హతలేనిదే అందరికీ భగవంతుడు అందు బాటులో వుండడు.** తన సంకల్పమునకు తగిన అర్హత అర్జునునియందు ఉన్నదనుటలో సందియములేదు.

(గీ.పు.49/52)

సూర్యుడు తన కిరణములచే దశదిశల వ్యాపించి అచటి ప్రాణిజాతము సుద్దీపింపజేయుచున్నాడు. ప్రజాపతి యొక్క స్వాత్మభావమగుటచే దిగ్జాతములకు కూడా ప్రజాపత్య స్వాత్మభావము కలుగుచున్నది. కనుక ప్రాణశబ్దముచే ఆదిత్యుడు చెప్పబడుచున్నాడు. సమస్తజీవులు భోక్తరూపమున నాదిత్యస్వరూపులగుటచే అతడు **వైశ్వానరు డనబడుచున్నాడు. సకల ప్రపంచ మతని స్వరూపమగుటచే అతడు విశ్వరూపుడని కూడా చెప్పబడుచున్నాడు. విశ్వమునందలి నరుల స్వరూపుడు గనుక వైశ్వానరుడనియు, విశ్వమే అతని స్వరూపము కనుక విశ్వరూపుడనియు** అతనికి ప్రసిద్ధి గలిగినది.

ఇక్కడ సంవత్సరశబ్దము కాలమునకుపలక్షణము. అహోరాత్రముల సముదాయమే కాలము. సూర్య సంచారముచే అహోరాత్రములు, చంద్రసంచారముచే తిథులు నేర్పడుచున్నవి. చంద్ర సూర్య మిథునము ప్రజాపతి సమూద్భూత మగుటచే సంవత్సరము, ఆయనములు మొదలగు విభాగములగు కాలముకూడా ప్రజాపతి స్వరూపమే అగుచున్నది. ప్రజాపతికి దక్షిణోత్తరమార్గములు రెండును కలవు. **ప్రజాపత్యుపాసన మిచట జ్ఞానమని చెప్పబడుచున్నది. జితేంద్రియత్వము, వేదములయందు విశ్వాసము, జ్ఞానము ఇవిగల ప్రాణస్వరూపమగు ఆత్మ తానేయనీ తెలిసికొని యుత్తరాయణమార్గమున సూర్యలోకమునకు పోవును.** ఈలోకము సకలప్రాణులకు ఆశ్రయము. ఉపాసనా సహితమగు నిష్కామకర్మ నాచరించువాడును అచటకే పోవును. కాలాత్మకుడగు సూర్యుడు వసంతాదిఋతు పంచకము పాదములుగా గలవాడనియు, ద్వాదశమాసము లతని ఆకారములనియు, అదిత్యుడు సర్వలోక కారణుడనియు నాలుగు, ఆరు మంత్రములలో చూపబడుచున్నది. వర్షము ఆదిత్యునిచే కలుగుటవలన అతడు మూడవదియగు ద్యులోకమున జలముగలవాడని తెలియుచున్నది.

(ఉ.వా.పు.44/45)

మానవుడు తలయెత్తి పైకి చూచినప్పుడు అనంతాకాశములో ప్రకాశిస్తున్న సూర్యుడు దేదీప్యమానంగా కనుపిస్తుంటాడు. అంతులేని ఆకాశములో అనంతముగా ప్రకాశించే సూర్యుడు ఒక్కడే.

(ఉ.బ.పు.14)

మనము తెలుసుకున్నది తక్కువ తెలుసుకొనవలసినది ఎక్కువ అని అర్థము చేసుకోండి. మానవుడు భూమిని చేయలేడు; నీటిని సృష్టించలేడు. కొమ్మకు కొమ్మకు రాపిడి జరిగినప్పుడు అగ్ని కలుగుతున్నదేగాని కొమ్మలో అగ్నినిపెట్టి నిలబెట్టలేడు. ఇది మానవుని చేతకాని పని. కొమ్మలో అగ్ని వుందిగాని ఆ అగ్ని కొమ్మను కాల్చకుండా కాపాడుకుంటున్నది. ఆ పనిని మానవుడు చేయలేడు. ఈ విధముగా మన కంటికి కనుపించక చెవులకు వినిపించక, మనస్సుకు అనిపించక ఏదో ఒక విధమైన శక్తి అంతర్భూతమై వున్నది అని గుర్తించి అది మానవాతీతమైన శక్తిగా వుండవచ్చును అని ఉపాసిస్తూ వచ్చాడు. ఏశక్తికైనా ప్రత్యక్షప్రమాణము అవసరము. ప్రత్యక్ష ప్రమాణమునకు ఏది సరియైన సాక్ష్యము అని విచారించి ప్రత్యక్ష ప్రమాణము సూర్యుడేయని విశ్వసిస్తూ వచ్చాడు. సూర్యుడే లేకపోయిన వెలుతురు లేదు. వెలుతురు లేకపోతే సృష్టిస్తంభించి పోతుంది. ఈ ప్రపంచమునందు వృక్షములు అభివృద్ధి కావలెనన్నను, పంటలు పండవలెనన్నను, జీవి పెరగవలెనన్నను వీటన్నింటికి హైడ్రోజను అత్యవసరము. సూర్యుని ప్రధానమైనశక్తి

హైడ్రోజన్, హీలియం. హైడ్రోజను, హీలియం రెండూ లేకుండాపోతే జగత్తే లేదు. ఈ విధముగా ప్రత్యక్ష ప్రమాణము సూర్యుడేయని విశ్వసించి ఈ సూర్యతత్వము నందు కొన్ని రహస్యములు గుర్తించినారు.

(ఉ.బ.పు.15)

సమస్తకర్మలకు కర్మాధికారి, కర్మనిష్ఠుడు - సూర్యుడే. నిర్విరామ కృషిచేత నిరంతర తాపత్రయముతో, అంతులేని ఆశలతో, అర్థంకాని ఆవేదనతో ఆ ప్రాప్యమునకై ప్రకులాడెడి మానవులకు మార్గదర్శకుడిగా నిలచి, వారికి ప్రశాంతిని కల్గించి, కర్మ శూరుడిగా నిలచినవాడు-సూర్యుడు. సూర్యునకు ఏమాత్రం విశ్రాంతి లేదు. ఈతడు దూషణ భూషణలకు ఏమాత్రం క్రుంగడు, పొంగడు, ఇతడు సమరస భావంతో, పరమ శాంతితో తన కర్తవ్యాన్ని నిర్వరిస్తుంటాడు. ప్రపంచానికి తాను చేసినదంతయు ఉపకారమే గాని అపకారము కాదు.

సూర్యుడు నిరంతరం నిర్విరామంగా పని చేస్తున్నాడు. అతడు ఒక్క అర్ధ దినమైనా సెలవు (Leave) తీసుకొంటే, ప్రపంచమే మునిగిపోతుంది. ఒక్క గంటైనా తాను సెలవు తీసుకోవడం లేదు. నిరంతర కృషిగావించే కర్మశూరుడు, కర్మవీరుడు సూర్యుడు.

అందుచేతనే భగవద్గీత యందు శ్రీకృష్ణుడు **"కర్మచేసి తీరాలి, ఇది నా కర్తవ్యం" అన్నాడు. భగవంతునికి కర్మాచరణ కర్తవ్యమైనప్పుడు మానవులు తాము కర్మ నాచరించకుండా కర్మ సన్యాసం పుచ్చుకుంటామంటే - ఇది కేవలం పిరికితనం, బలహీనత. కర్మ సన్యాసం కంటే కర్మ యోగమే ఉత్తమమైనది "యోగః కర్మ సుకౌశలం", కర్మల నాచరించుటయే మన యోగం. ఈ కర్మను సన్మార్గంలో ప్రవేశ పెట్టాలి. సదుద్దేశముతో కర్మల నాచరించి, సదానందమును అనుభవించాలి. అలాంటిదే నిజమైన కర్మ. నిరాశతో, నిస్పృహతో కర్మల నాచరించ రాదు, ఆనందంగా కర్మలయందు ప్రవేశించాలి. అప్పుడే నీవు కర్మాధికారివి కాగలవు. సూర్యుని యందు ఎట్టి అహంకారము లేదు. ఇతను లేకపోయినచో సృష్టియే లేదు.** ఇతని యందున్న హైడ్రోజన్ వలన పర్వతములు, వృక్షములు మొదలగునవి ఆవిర్భవిస్తున్నాయి. సమస్త జీవులు, సమస్త పంటలు సూర్యుని నుండియే ఆవిర్భవిస్తున్నాయి. ఇంత పని తానే చేస్తున్నాడనే అహంకారం అతని యందు ఏ మాత్రం లేదు. కనుకనే, "నాయనా! నీవు గొప్పపని చేస్తున్నావని, పరోపకారము చేస్తున్నావని గర్వపడవద్దు, నన్ను నీవు అనుసరించు" అని సూర్యుడు ప్రబోధిస్తూ ఉన్నాడు.

మానవ హృదయమే హిమాయలం

మనం సూర్యుని అనుసరించాలి. ఈనాడే **ఉత్తరాయణం ప్రారంభమైనది.** మహాజ్ఞాని, మహాత్యాగి, మహాదీక్షాపరుడైన భీష్ముడుకూడా తన ప్రాణాన్ని ఉత్తరాయణ పుణ్యకాలము నందే వదలవలెనని 56 దినాలు శరతల్పంపై పరుండినాడు. ఈనాటి నుండి సూర్యుడు ఉత్తర దిశకు ప్రయాణిస్తుంటాడు. ఉత్తర దిశగా హిమాలయ పర్వతములున్నవి. ఈ హిమాలయములు ఈశ్వరుని యొక్క నివాసం. హిమాచలం అనగా ఏమిటి? **హిమం తెల్లగా ఉంటుంది. అనగా, ఇది పవిత్రమైనది** అని ఒక అర్థము. దీని గుణం ఎటువంటిది? దీని **గుణం-చల్లదనం, ఇది ప్రశాంతిని సూచిస్తుంది. ఇంక, అచలము అనగా చలనం లేకుండా స్థిరంగా ఉండేది. కనుక నిర్మలంగా నిశ్చలంగా, ప్రశాంతముగా ఉండిన మన హృదయమే హిమాచలం.** ఈ హిమాచలము నందే ఈశ్వరుడు ఉంటున్నాడు. హిమాచలమునకు చేరుకోవాలంటే ఎక్కడో ఋషికేశ్, హరిద్వారములకు మనం ప్రయాణం చేయనక్కరలేదు. మన దృష్టి బహిర్ముఖం గాకుండా, అంతర్ముఖము గావించి, మన నిశ్చల ప్రశాంతమైన హృదయమనే - హిమాచలమునకు ప్రయాణం చేయించమని సూర్యుడు ప్రబోధిస్తున్నాడు.

(స.సా.ఫి.మా.92పు.31/32)

సూర్యుడు తన కిరణములచే సముద్రజలమును ఆవిరిగా మార్చి మేఘములుగా రూపొందించి, వర్షముగా కురిపించి, తీయని నీటిని సమస్త జీవరాసులకు అందిస్తాడు.

అదేవిధంగా మనము మన జ్ఞానేంద్రియములద్వారా గ్రహించిన విషయ పరిజ్ఞానమును జ్ఞానముగా మార్చి మానవాళికి అందించాలి.

(సా.యా.పు.1)

మన నిత్య జీవితంలో నిత్య కర్మలాచరించడానికి, జీవిత రహస్యముల గుర్తించడానికి ప్రధాన ఆధార పురుషుడు సూర్యుడు. సూర్యుడనియే మొదట గుర్తించారు. సూర్యుడు లేకున్న దినములు లేవు. మానవుడే కాదు; ఏ ప్రాణి కూడా ఉద్భవించడానికి వీలు లేదు. సమస్త ప్రాణులు పశు పక్షులు, వృక్షాలతో సహా సూర్యోదయముతోడనే అభివృద్ధి గాంచుచున్నవి. కమలములు, కలువలు సూర్యోదయాస్తమానము తోటే విచ్చుకొంటున్నవి. కనుక సమస్త సృష్టికి, పోషణకు, క్షీణమునకు సూర్యుడే మూలకారకుడని భావించారు. ప్రత్యక్ష స్వరూపుడేయైన సూర్యుడేనని ఆనాటి నుండియు ఆరాధనలు ప్రారంభంచేశారు. **విశ్వామిత్రుడు గాయత్రి మంత్రముతో సూర్యునికే ప్రధాన స్థానము ఇచ్చాడు.**

(సా.పు.635)

(చూ॥ ఏడువర్ణములు, జగత్సేవకుడు, గాయత్రి, న్యూస్, ప్రకాశము, విశ్వామిత్రుడు, సంశయము, హిమాచలం)

సృష్టి

"భగవంతుడే మొదట జడ ప్రపంచమును సృష్టించి తానే జీవరూపమున అందులో ప్రవేశించి జగత్తును చైతన్య వంతముగా చేసెనని వేదముల స్పష్టముగా తెలుపుచునే యున్నవికదా! **అపరాప్రకృతి పరమేశ్వరుని స్వభావమనియు పరాప్రకృతి పరమేశ్వరుని స్వరూప మనియు ఈ స్వరూప స్వభావములు భిన్నము కాదనియు విశ్వసించవలెను.** చైతన్యమునకు జడము స్వాధీనమయి వుండును. చైతన్యము సర్వస్వతంత్రముతో నుండును. జడము అట్లుగాక పరతంత్రమై యుండును. జీవుడనగా ప్రాణధారము చేసేవాడు. జీవుడు తన శక్తి సామర్థ్యములచే ప్రాణాన్ని పట్టి యున్నాడు. జీవుడు అంతర్యామియై అన్నింటియందూ ప్రవేశించియున్నాడు. కనుక పరాప్రకృతి అనునది కూడనూ పరమాత్ముడే. జడ చైతన్యములతో గోచరించునది, ఒకే వస్తువు అని తెలిసికొనవలెను. సమస్త ప్రపంచమునకూ జగ చైతన్యములే ప్రధానములు. ఆ రెండింటి సమ్మేళన ఈ ప్రకృతి స్వరూపము లోనన్ను చైతన్యశక్తి భోక్తగా స్వకర్మముచే వాటిని ధరించును. జగ ప్రకృతి దేహరూపమును ధరించును. బావా! ఈ రెండూ నా ప్రకృతులే కాన వీటి మూలమున సమస్త జగత్తుయొక్క **సృష్టి స్థితి లయమునకు కారణమైన ఈశ్వరుడను నేనేనని తెలుసుకో.** నాకంటే ఈ లోకమున వేరు పదార్థముకానీ, పరమార్థము కానీ లేనేలేదు. **అన్నింటికీ మూలకారణము నేనే. మూలవస్తువు నేను. 'యేకోహం బహుస్యాం' అన్నీ నేనే సృష్టి సంకల్పము చేసితిని.** ఆ సంకల్పము ద్వారా మాయశక్తిలో చలనం కలిగింది. అదే మహత్తత్వంగా మారింది. అదే ప్రకృతి మొదటి పరిణామం. **ఒక విత్తనము భూమిలో పాతినా మనుకో, పాతిన తరువాత నీరుపోస్తే, ఒకటి రెండు దినములకు ఆ విత్తనము మెత్తగా నాని ఉబ్బిపోవును. అది విత్తనమునకు మొదటి మార్పు. కానీ మొలకరాదు. అదే మహత్తత్వం యొక్క స్వరూపం. ఆ తరువాత భగవంతుని సంకల్పముచే అందులోనుండి ఒక మొలక పైకి కనిపించును. అదే మహదహంకారం. దానినుండి పంచశాఖలు పుట్టును. అవే సూక్ష్మ పంచభూతములు. ప్రకృతిశక్తి ఒకటి మహతత్వం ఒకటి, అహంకారమొకటి. ఈ పంచభూతములు అన్నియూ చేరి యెనిమిది. ఈ యెనిమిదింటితోనే జడజగత్తు యేర్పడినది."**

(గీ. పు.100/101)

ప్రతి మానవునియందు పంచభూతములున్నాయి. భగవంతుడు అంతా మంచినే సృష్టించాడు. కాని, మీరే దానిని చెడ్డగా మార్చుకుంటున్నారు. ఒకానొక సమయంలో నారదుడు విష్ణువును దర్శించడానికి వెళ్ళాడు. అప్పుడు విష్ణువు చిరునవ్వుతో "నారదా! ఎక్కడి నుండి వస్తున్నావు?" అని అడిగాడు. "స్వామీ! నాకేమి? ఇల్లూవాకిళ్ళా? భార్యా

సృష్టి

బిడ్డలా? అన్నిచోట్ల తిరుగుతుంటాను, ప్రపంచమంతా సంచరిస్తుంటాను,'' అన్నాడు నారదుడు. "అయితే , నా సృష్టి రహస్యాన్ని ఏమైనా గుర్తించావా?'' అని అడిగాడు విష్ణువు. "నేను గుర్తించలేనా! గుర్తించాను స్వామీ! అన్నాడు. "అన్నీ నేను మంచివే సృష్టిస్తున్నాను. నా సృష్టిలో నీకేదైనా చెడ్డది కనిపించిందా?'' అని అడిగాడు. నారదుడు కొద్దిసేపు యోచించి "క్షమించండి స్వామీ! ఒకటి చూశాను,'' అన్నాడు. "నా సృష్టిలో చెడ్డది ఉండటానికి వీల్లేదు,'' అన్నాడు విష్ణువు. "ఉంది స్వామీ!'' అన్నాడు నారదుడు. ఏమిటది? అని ప్రశ్నించగా "మలము'' అన్నాడు నారదుడు. "దాని దగ్గరకు కూడా పోవడానికి వీలుకాదు. ఎందుకు మీరింత చెడ్డపదార్థమును సృష్టించారు?'' అని అడిగాడు. విష్ణువు "నారదా! అది చెడ్డది కానే కాదు. కావాలంటే నీవొకతూరి వెళ్ళి దానినే అడుగు,'' అన్నాడు. నారదుడు "దాని దగ్గరకు కూడా పోలేను స్వామీ!'' అన్నాడు. "నా ఆజ్ఞప్రకారం నడుచుకో,'' అన్నాడు విష్ణువు. సరే, నారదుడు వెళ్ళాడు. దగ్గరకు పోతూనే మలము "ఛీ, నారదా! దూరంగా ఉండు,'' అంది. "అదేమిటి! ఎందుకు నేను నీ దగ్గరకు రాకుడదు?'' అని అడిగాడు. "నిన్నటి దినము నేను పవిత్రమైన ఫలముగా ఉన్నాను. భగవంతునికి నైవేద్యం పెట్టిన పదార్థంగా ఉన్నాను. కాని, ఒక్కతూరి మానవునితో చేరేటప్పటికి నాకీ గతి పట్టింది. రెండవతూరి చేరితే ఇంకేగతి పడుతుందో! కాబట్టి, నాదగ్గరకు రావద్దు,'' అంది కనుక, **లోకంలో చెడ్డది ఏదీ లేదు; అన్నీ మంచివే. కాని, సంగదోషంచేత కొన్ని చెడ్డవిగా మారిపోతున్నాయి.**

(స.సా.జు.2000 పు.198)

దైవత్వం యొక్క స్వరూపం ఎట్టిది? అది నిర్గుణం, నిరంజనం, సనాతనం. దానికి ఎవ్వరూ పేరు పెట్టలేరు. భగవంతునికి పేరుపెట్టాలంటే భగవంతుని కంటే ముందు ఎవరైనా ఉండి ఉండాలి కదా! కానీ, సృష్టియే లేదు. కొన్ని కోట్ల సంవత్సరములు అంతా అంధకారంగానే ఉండినది. సూర్య చంద్రాదులు కూడా కనిపించలేదు. జీవరాసులు లేవు. ఏ రూపమూ కనిపించలేదు. తరువాత కొన్ని సంవత్సరములు వర్షములు కురిసి కురిసి సముద్రాలు తయారైనాయి. ఈ తరువాత నదులు తయారైనాయి. అప్పుడే జగత్తు నందు కొంచెం వెలుగు ప్రారంభమైంది. వెలుగు ప్రారంభమైన తరువాత సూర్యచంద్రాదులు కనిపించారు. ఇది జరిగిన అనేక కోట్ల సంవత్సరముల తరువాత మానవత్వం ప్రారంభమైనది.

((స.సా.జూ.99 పు.160)

సృష్టి అనాది కాలమునుండి జరుగుచున్నది. సృష్ట్యాది యందు నారాయణుని నాభినుండి వక కమల ముద్భవించెను. ఆ కమలమందే నారాయణుడు బ్రహ్మరూపమున పుట్టెను బ్రహ్మ నలుదిక్కులా వక పరి చూడవలెనని సంకల్పించెను. అంత నలుదిక్కులా నాలుగు ముఖములుగా రూపొందెను. అంతటితో సంకల్పము ఆగక యెనిమిది దిక్కులా చూడవలెనని సంకల్పించిన చతురాననుడాయెను. దిశలు పది అగుటచే అయిదు ముఖము లుండెను. ఆ అయిదవ ముఖము శివరూపుడై ఉత్తరించెను. తపము లేక యే పనియూ సాగదని పద్మాసనాసీనులై, హృత్పద్మమందు సమస్త సృష్టిని స్మరించి తలంచెను.

(భా.వా.పు.184/185)

బ్రహ్మ సృష్టిని గావిస్తాడు. అయితే సృష్టిని గావించే విధానమును ఎవ్వరూ గుర్తించుకోలేరు. ఇదికంటికి కానరాదు; హృదయానికి అర్థం కాదు. ఇలాంటి అతీతమైన దివ్యతత్వాన్ని తల్లి బోధిస్తున్నది. **ఎందుకనగా తల్లికూడా సృష్టిస్తున్నది.** కనుకనే మొట్టమొదట **"మాతృదేవో భవ" అన్నారు. తల్లియే బ్రహ్మ స్వరూపము. బ్రహ్మ యొక్క స్థానంలో తల్లిని ఉంచుకోవాలి. తల్లిని గౌరవించాలి; తల్లిని సేవించాలి; తల్లిని విశ్వసించాలి. ఇదియే బ్రహ్మ విశ్వాసమునకు సంకేతము.**

ఇంక తల్లి సృష్టించిన బిడ్డను పోషించి ఉన్నత స్థాయికిగొని పోతుంటాడు. **తండ్రి. రక్షణ కర్తను విష్ణువుగా భావిస్తున్నారు. అట్టి విష్ణువు యొక్క ప్రతి రూపమే తండ్రి. కనుకనే, 'పితృ దేవోభవ" అన్నారు. తల్లిదండ్రులు ఇరువురూ బ్రహ్మ విష్ణువుల యొక్క ప్రతి రూపాలే.**

ఇంక మూడవ **ఈశ్వరుడు.** ఇతడు అడిగిన వారందరికీ వరములిస్తుంటాడు. కాబట్టి ఇతనికి భోళా శంకరుడు అని పేరు. ఎవ్వరినీ కాదనలేడు. **ఇట్టి శివ స్వరూపాన్ని ధరించినవాడు గురువు.** కనుకనే, **"ఆచార్య దేవో భవ" అన్నారు.** బ్రహ్మచేత సృష్టింబడి, విష్ణువు చేత కాపాడబడే ఈ జగత్తును సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టి దివ్యత్వానికి దారి చూపే వాడే శివుడు.

సత్వ, రజస్తమ గుణ స్వరూపులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రతి మానవునియందు ఉంటున్నారు. కనుకనే **"ఈశ్వరః సర్వ భూతానాం" "ఈశా వాస్య మిదం జగత్'** అన్నారు. **సర్వత్ర ఉన్న దివ్యత్వము ఈ గుణముల యొక్క స్వరూపమే.**

(శ్రీ.భ.ఉ.పు.186/187)

(చూ॥ ఈక్షతేర్నాశబ్ద, ధర్మము, మాయ, సర్వత్రా ప్రసిద్ధోపదేశాత్)

సృష్టికర్త

(చూ॥ జన్మాద్యస్యయతః)

స్మృతిభ్రష్టుడు

మానవ జీవితమేకాక **సమస్త ప్రాణులూ అరిషడ్వర్గముల చేత** కప్పబడినవి. **ఈ అరిషడ్వర్గములలో మొట్టమొదటివి కామ, క్రోధములు, కామక్రోధములని రెండున్నప్పటికి మొదటి పదము యొక్క పరిణామమే రెండవపదము. లోభ, మోహ, మద, మాత్సర్యములు కూడ మొదటిపదము యొక్క పరిణామములే. అరిషడ్వర్గములు కామ పరిణామములే.** కామము యొక్క పరివర్తనే వీటి యొక్క స్వరూపస్వభావములకు మూలకారణం. కామము వలన అపేక్ష పెరుగుచున్నది. ఈ అపేక్ష విషయసంబంధమైన అపేక్షగా, అది విఫలమైన క్రోధముగా మారుచున్నది. ఈ క్రోధమే సమ్మోహనంగా తిరుగుచున్నది. ఈ సమ్మోహనమే పెరిగి పెరిగి కట్టకడపటికి **స్మృతి భ్రష్టుని** గావించుచున్నది. ఈ స్మృతి భ్రష్టునకు కష్టము వల్ల బుద్ధి క్షీణించుచున్నది. **ఈ బుద్ధినాశనము వలన సర్వమూ నాశనమగుచున్నది.** సర్వదుఃఖములకు, సర్వనాశనము నకు, అపకీర్తికి ఈ కామమే కారణము. సర్వవాంఛలను తగినంత అదుపులో నుంచుకొని తగిన రీతిగా మీరు జీవించటానికి ప్రయత్నించాలి.

(షి.పు.25)

స్మృతులు

వేదాంతము తరువాత స్మృతులు బయలుదేరెను. అవి పవిత్ర తపశ్శక్తి సంపన్నులైన, అనుభవజ్ఞులైన ఋషుల విరచితములే. అయితే వేదాంతమునకు వుండునంతటి, ప్రమాణిక స్మృతులకు లేదనే చెప్పవచ్చును. తక్కిన మతములవారికి, వారి శాస్త్రములకును యెట్టి సంబంధము వున్నదో అటులనే స్మృతులకును, భారతీయులకునూ అట్టి సంబంధము కలదు. వారి వారి శాస్త్రములు యెట్లు మహాపురుషుల నిర్మితములో అటులనే భారతీముల స్మృతులు కూడనూ మహాపురుషుల నిర్మితములే అని అంగీకరించక తప్పదు, అంగీకరించవలెను. ఇతర మతములకునూ, భారతీయ మతములకును వున్న సామ్యమిదియే. అయితే ఈ ఋషి నిర్మితములైన స్మృతులు కాలక్రమమున మారుతూవచ్చినవి. ఒక స్మృతి కృతయుగమునకును, ఒక స్మృతి త్రేతాయుగమునకునూ, మరొకటి ద్వాపరయుగమునకు, కొన్ని స్మృతులు కలియుగమునకును ప్రమాణికములై యుండవలెనని చెప్పబడియున్నవి. కాలగతులు మారగా, పలువిధములగు, క్రొత్త సందర్భములు జాతిని యెదుర్కొనగా ఆయా జాతియొక్క మర్యాదలు, ఆచారములూ, మార్పుచెందు కొంటూ, చెందవలసి వచ్చుచుండెను. దానికి అనుసారముగా ఈ స్మృతులను కూడా ముఖ్యముగా జాతియొక్క ఆచార, మర్యాద వ్యవహారములను గుర్చినవే కనుక అప్పుడప్పుడు మార్చుచుండుట అవసరమయ్యెను.

(స.వా.పు.67/68)

సెయింటు (Saint)

మహర్షులకు inner Vision ఉండటం చేత వారిని saints అన్నారు. Outer vision కలవారలను Scintists అన్నారు. సైంటిస్టుకి సెయింటికి చాల తేడావుంది. scientist "What is this" "what is this" అంటూ పోతుంటారు. saints "what is that" "What is that" అని విచారణ సలుపుతారు. This అనగా near దగ్గర ఉన్నది. దేనికి దగ్గర? మన sense కు దగ్గర That అంటే దూరం దేనికి దూరం? మన sense కు దూరం. Below sense is science Beyond sense is divinity.

(వే.ప్ర. పు.46/47)

సైంటిస్టు

(చూ॥ దోషము, బుద్ధి, సైన్సు)

సైన్సు

ఈనాడు **సైంటిస్టులు** చాలా క్రొత్త విషయాలను కనుగొంటున్నారు. **కానీ మానవత్వమందున్న దివ్యశక్తిని వారు తెలుసుకొనలేక పోతున్నారు.** కారణమేమిటి? ఇది సైన్సు చెప్పదు. దైవశక్తి ఇట్టిదీ, అట్టిదీ అని ఎవరూ చెప్పలేరు. విజ్ఞానమునకు, ఆధ్యాత్మికమునకు ప్రధాన భేదమేమిటంటే, బాహ్యమైన జగత్తును సైన్సు పరిశీలన చేస్తుంది. అంతః సంబంధమైన దివ్యతతత్వాన్ని ఆధ్యాత్మికము పరిశీలన చేస్తుంది. **బహిర్ దృష్టి కలవాడు Scientist అంతర్ దృష్టికలవాడు Saint, సృష్టిని పరిశీలన చేసేవాడు Scientist సృష్టికర్తను పరిశీలించేవాడు Saint వీరిద్దరికీ ఎంతో తేడా ఉన్నది. సైంటిస్టు సృష్టిని మాత్రమే పరిశీలన చేస్తున్నాడు. కానీ సృష్టికర్తను పరిశీలిస్తే, సృష్టి అంతా బాగా అర్థమవుతుంది. ఈనాడు సైంటిస్టులు ప్రేమతత్వాన్ని విభజించి, పదార్థ తత్వాన్ని మాత్రమే ప్రకటిస్తున్నారు. Splitting of Love is Science, Spirit of Love is Spirituality.**

(శ్రీ.జూ.97 పు.53)

(చూ॥ అజ్ఞానం, అహింస, విజ్ఞానశాస్త్రము)

సేవ

ఇది నా అదృష్టము. నా భాగ్యము, **ఈ సేవచేసే ప్రాప్తి నాకు లభించింది అని ఉత్సాహపూరితమైన హృదయంతో మీరు సేవలలో పాల్గొనాలి.** మీ ఆస్తిపాస్తులనుబట్టిగానీ, మీ పేరు ప్రతిష్టను బట్టిగానీ మిమ్మల్ని ఎంపిక చేయలేదు. మీ ప్రాప్తినిబట్టి మిమ్మల్ని నియమించాం. ఆ సుసంస్కారాన్ని మీరు సద్వినియోగ పరచుకోవాలి. ఇది పోయిందంటే మరి లభించేదికాదు. ఇదేదో సులభంగా లభిస్తుందని మీరు భావించరాదు. సముద్రములో ఉండే ముత్యము ఎంతో లోతుకు మునిగి, శ్రమపడి, క్రూరమృగముల బారినుండి తప్పించుకొని వాటిని వెతికే శక్తి సామర్థ్యము లుండినపుడే చేతికి చిక్కుతుంది. **సంసారమే సాగరము. దైవత్వమే ముత్యము. అలాంటి ముత్యమును సంపాదించుకున్నారు. అది జారిపోతే తిరిగి చిక్కేదికాదు.**

(జ.పు.190)

ముక్కు మూసుకొని 'సోహం..సోహం' అంటూ కూర్చోవటాన్ని ప్రోత్సహించటం సాయి సిద్ధాంతం కాదు. సాధకా ! లే! నడుం కట్టుకి సమాజ సేవలో ప్రవేశించు, అని చెప్పటమే సాయి సిద్ధాంతం. సోమరితనానికి అవకాశం ఇవ్వకుండా వుండాలి. ఇంద్రియ తత్వాన్ని అర్థం చేసుకొని సాధక వృత్తిలో ప్రవేశించాలి. **సేవ చేయని జీవితం చీకటి మందిరం. దయ్యాల కొంప.** సేవ దివ్యభావాలను దర్శింపజేస్తుంది. మానవత్వాన్ని దివ్యత్వంగా మార్చుతుంది.

(సే.యో.పు.5)

సేవ అనేది ఒక పదునైన కత్తివంటిది. దాని ప్రయోజనమును చక్కగా గుర్తెరిగి వ్యక్తిచేతిలో వున్నప్పుడు అది ఉపకారం చేస్తుంది. దాని స్థితిగతులు గుర్తెరుగనివారి చేతిలో వుంటే అపకారం చేస్తుంది. కర్మతత్వాన్ని గుర్తెరుగని వ్యక్తులు కర్మక్షేత్రంతో ప్రవేశించి స్వార్థరహిత కర్మలకు స్వస్తి చెప్పి కేవలము స్వార్థ ప్రయోజనములకే అంకితము కావించుకొనుటచేత సేవ విలువ సన్నగిల్లుతున్నది.

(సే.యో.పు.6)

సేవ అనేది మనం ఎవరినీ ఆకర్షించేందుకు చేసే Art కాదు. మన సేవ Heart నుంచి వచ్చేది. Art is External, Heart is Internal అప్పుడే Self Satisfaction ఉంటుంది. చెప్పేది చేయాలి. చేసింది చెప్పాలి, చెయ్యందే చెప్పరాదు.

(సే.యో.పు.35)

క్రమశిక్షణను కలిగి సేవాదీక్షను పొంది, సాధనాబలమును సంపాదించి, భక్తిశ్రద్ధలతో అందరిలోనూ నివసించే భగవంతుని గురుతెరింగి వారికి సేవ అనే పూజ సలుపవలయును.

(సే.యో.పు.43)

శ్రీసత్యసాయి సంస్థలయందు కేవలం ఆధ్యాత్మిక మార్గమేకాకుండా సర్వమూ ఆధ్యాత్మికముగా మార్చటానికి ప్రయత్నించాలి. మానవత్వములో ఏకత్వమును అభివృద్ధి పరచుకోవటం నిజమైన అధ్యాత్మికం. ఈ ఏకత్వం ఎలావస్తుంది? చేరిక (యోగం) అనేది మనస్సుయొక్క పరిశుద్ధత ద్వారానే చేకూరుతుంది. పరిశుద్ధ హృదయం లేకపోతే ఈ చేరిక ఏర్పడదు. కనుక హృదయాన్ని పరిశుద్ధం కావించి సేవయందే జీవితాన్ని అంకితం కావించాలి. సేవయందు పరులకు కావించే ఉపకారం కంటె తనకె ఎక్కువ ఉపకారం జరుగుచున్నది...**సేవను యిచ్చుకోవాలి. ప్రేమను పుచ్చుకోవాలి. సేవవన్‌వే ట్రాఫిక్ కాదు.** పుచ్చుకోవలసింది ప్రేమనే కానీ పదార్థాన్ని కాదు. మనలో ఉన్న శక్తిని పరులకు అందిస్తూ కట్టకడపటి శ్వాసను సేవయందే వదలాలి. ఇదే సాయి ప్రధానాశయం.

(సే.యో.పు.52/53)

సేవకు ప్రధానమైన గుణములు దయ, వినయము, త్యాగము, ఇట్టి గుణములు కలిగిన వ్యక్తి మాత్రమే స్వార్థరహితమైన సేవలు సలిపి జగత్తుకు ఆదర్శాన్ని అందివ్వగలడు. అహంకారము, ఆడంబరమూ, అభిమానములతో ప్రవేశించినవాడు సేవ చేయలేడు. అహంకారము వలన మూలతత్వాన్ని విమర్శిస్తాడు. అభిమానము వలన పశుత్వాన్ని పొందుతాడు. అహంకారం ఆడంబరం ఉన్నంతవరకూ ఆత్మవిశ్వాసం కలగదు. **ఆత్మవిశ్వాసం లేనివాడు తనను తాను నమ్మలేనివాడు సమాజానికి ఏరీతిగా సేవ చేయగలడు.** కనుక సేవలో పాల్గొనాలని ఉత్సాహపడేవాడు మొట్టమొదట తన అహంకారాన్ని అభిమానాన్ని అవతలికి నెట్టాలి. **అహంకారం పోయినప్పుడు వినయం ప్రాప్తిస్తుంది.** వినయవంతుగే సమాజ సేవలో పాల్గొనుటకు అధికారి అవుతాడు. కనుక ప్రతి మానవునియందున్న దివ్యశక్తి ఏకత్వమేనని గుర్తించి, ఏకాత్మభావం కలుగునంతవరకూ సేవకు అధికారి కాలేడు. **ఈనాడు సేవా విధానము గుర్తించలేని వ్యక్తులు నాయకులు కావటం చేతనే లోకం అల్లకల్లోలాలకు ఆలవాలం అయింది.**

(సే.యో.పు.58/59)

"నీవు పూజ చేయుచున్నప్పుడు కాని, ధ్యానము చేయుచున్నప్పుడు కాని **సహాయము కొరకు పిలుపు వినబడిన తక్షణమే విడిచివెళ్ళి సహాయము చెయ్యి. ధ్యానము, పూజలవల్ల, నీవు సంపాదించు ఆధ్యాత్మిక ఫలముకన్న అట్టి సేవవలన లభించు ఫలము ఉత్కృష్టమైనది"**

(స.శి.సు.తృ.పు.136)

జీవితమనే పరిమళ పుష్పములోని మకరందమే మనగా, ప్రేమతో ఇతరులకర్పించు సేవయే! **అదే మానవులను దైవసన్నిధి చేర్చు పెన్నిధి. మానవులందరూ సోదర సోదరీలనే ఏకత్వ భావమును సేవ దృఢపరచును.అన్యోన్య సన్నిహిత సంబంధమును స్పష్టముగా వెల్లడించును. సేవ వలన అహంకారము నిర్మూలమగును.** అశాంతి దుఃఖములను దూరము చేసి. సంతోషముల నందించును. **ఎవరికి సేవ చేసినా ఏమి చేసినా, అవన్నీ ఈశ్వరార్పణ బుద్ధితో చేయవలెను. సర్వ భూతాంతరాత్మయే ఈశ్వరుడు.**

(స.సా.జ.76పు.262)

శిలల పూజలందు శ్రేష్ఠుండు నీవయ్యి
ప్రజల మెప్పుకొరకు పాటుపడియు

సేవాదళసభ్యులు

ఇట్టి పూజలెల్ల ప్రజలు మెచ్చిరి కాని
శివుడు మెచ్చు సేవ చేయవలయు

పర్షియాదేశీయుడైన **అబూబెన్ ఏడం** మానవతా వాదిగా పేరు పొందాడు. పేద సాదలకీ, రోగ గ్రస్తులకీ చేతనయిన సహాయం చేసేవాడు. అయితే ఖురాన్ పఠన, మసీద్‌లో ప్రార్థన, రంజాన్ ఉపవాస దీక్షవంటి మతపరమైన ఆచారాలపట్ల విముఖత చూపేవాడు. అతడెన్నడూ దైవాన్ని తలంచలేదు.

అబూబెన్ ఏడంకి పరిచయస్తుడైన ముల్లా (మత ప్రచారకుడు) అబూని తరుచు కులుసుకుని ఇస్లాం మతాచారాలను నిర్లక్ష్యం చేయడంవల్ల భగవదనుగ్రహానికి దూరమౌతున్నావు అంటూ హెచ్చరించేవాడు.

ఒక రాత్రి అతనికలలో ఒక దేవదూత బంగారు పుస్తకంలో ఏదో రాస్తూ కనపడ్డాడు. ఏమిటి రాస్తున్నారు. అని అబూ అడిగేడు. దైవాన్ని ప్రేమించిన భక్తుల పేర్లు అని దేవదూత చెప్పేడు. అందులో నా పేరుందా అని అబూ అడుగగా లేదని దేవదూత చెప్పేడు. ముల్లాచేసిన హెచ్చరిక గుర్తుకొచ్చింది. ఆశ్చర్యపడలేదు. అయినా, అతడిలో మార్పురాలేదు. దైవారాధనపట్ల ఆసక్తి కలుగలేదు.

కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ ఓ రాత్రి ఆ దేవదూత కల్లో కనపడ్డాడు. ఇంకా మీ జాబితా పూర్తవ్వలేదా అని అబూ ప్రశ్నించేడు. ఈసారి దైవం ప్రేమించిన వ్యక్తుల పేర్లు రాస్తున్నాను అన్నాడు. అందులో నాపేరుందా? అని అబూఅడిగేడు. మొట్టమొదటి పేరు నీదే అని దేవదూత ఆ జాబితాను చూపెట్టేడు.

పూజలు, వ్రతాలు, తీర్థ యాత్రలు దైవంలోని విశ్వాసానికి ప్రదర్శనలు. నువ్వు దైవాన్ని ప్రేమిస్తే చాలదు. దైవం నిన్ను ప్రేమించేలా చేసుకోవాలి. ప్రేమ స్వరూపుడైన భగవంతుడు చూసేది తోటి మానవుల పట్ల నీ ప్రవర్తన. సమాజ సేవ ద్వారానే మనిషి దైవానికి దగ్గరౌతాడు.

(శ్రీ.స.వా.పు.14)

ఆచరణయందులేని గుణములు యెన్ని వున్నప్పటికీ,
వాడు గుణహీనుడేగానీ గుణవంతుడుకాడు.
వాసనలను దూరంచేయకున్న వాసుదేవుని పొత్తు కుదరదు.
ఆ వాసనలను దూరంచేయునదే సేవ.
దాచుకొన్నట్టిధనం తనదికాదు. ఇచ్చుకొన్నదే తనది అని నేర్పునదే నిజమైన సేవ.

(అ.శ.పు.235)

(చూ॥ ఏడువర్ణములు, ధనము, నగరసంకీర్తనము, భగవంతుడు, మాతృదేవోభవ, వైద్యుడు)

సేవాదళసభ్యులు

సేవాదళసభ్యులు తమ విశ్రాంతి సమయమును సత్ సంగములో గడపవలెను; **అన్యధావృధా చేయరాదు.** సద్గ్రంథములనుండి చదువు రానివారికి చదివి చెప్పండి. మన సంస్కృతిని గురించి తెలిసికొను అవకాశము లేనివారికి దానిని గురించి తెలుపండి. **గ్రామములలో, పాకలలో, మురికివాడలలో నివసించువారికి సహాయము చేయండి.** నగరవాసులు పిచ్చి పిచ్చి కథలు నవలలు చదివి, వారి మనస్సులను బుద్ధిని పాడుచేసుకొను చున్నారు. కానీ, గ్రామీణులు, బీదలు మీరు చెప్పు కథలు, మహాపురుషుల జీవితములు, అవతార పురుషుల జన్మవృత్తాంతములు ఆసక్తితో ఆలకించుతారు. వీరికి అన్ని మతములను గురించి అందరు మహాత్ములను గురించి చెప్పండి. సాయిని గురించి, సత్యసాయి సందేశమును గురించి ప్రచారము చేయుట మాత్రమే మీ పనిగా భావించవద్దు. కానీ యీ నామసందేహముల ద్వారా ప్రతి వారిలో దైవభక్తి దైవమునందు విశ్వాసము కలిగించండి. వారిలో ఆధ్యాత్మిక చింతనను కలిగించి వృద్ధి చేయండి. **వారు ఏ నామరూపములను పూజించినప్పటికి ఫరవాలేదు.** వారికిష్టమైన రూపనామముల ద్వారా, వారిని భక్తి, సాధన మార్గములో నిలపండి.

(స.సా.మా.75 పు.13)

(చూ॥ బ్రహ్మర్షి)

సేవాదళ్

నా పనులకు ఎవరూ అడ్డు పెట్టడానికి వీలు కాదు. అవి జరిగి పోతూనే ఉంటాయి. పోయిన నవంబర్ 19వ తేదీన మహిళా దినోత్సవ సందర్భంగా ఇక్కడకు స్త్రీలందరూ వచ్చి చేరారు. 'స్వామీ! ఈ 19వ తేదిని మీరు స్త్రీల పర్వదినంగా నిర్ణయించారు. మే మంతా మీరిచ్చిన చీరలు కట్టు కున్నాము. ఆనందము ననుభవిస్తున్నాము. ఈ సందర్భంగా మేమేమి సేవ చేయాలి?' అని అడిగారు. "మీరేమీ చేయనక్కర లేదు. ఆనందము ననుభవించండి. అంతే చాలు" అన్నాను. కానీ ఒకరిద్దరు మాత్రం "స్వామీ! ఇక్కడికి చాలమంది సేవాదళంవారు వస్తున్నారు. వారికి భోజన సౌకర్యం కల్పించే అవకాశాన్ని మా కు అనుగ్రహించండి" అన్నారు. "రాబోయే సంవత్సరం నుండి ఇది జరుగు తుంది. నేను ముందే సంకల్పించుకున్నాను. దీని గురించి మీరేమీ యోచన పెట్టుకోవద్దు" అన్నాను. రేపటి నుండి సంవత్సరం పొడవునా ప్రతి దినము సేవాదళంవారికి చక్కని భోజనం పెట్టాలని సంకల్పించు కున్నాను. షెడ్లు వేయించాను.ఈ సంగతి ఎవ్వరికీ తెలియదు. "సత్యసాయి సైలెంట్ వర్కర్" గ్యాస్ సిలిండర్లు తెప్పించాము. పెద్దపెద్ద పాత్రలను తెప్పించాము. తట్టలు, స్పూనులు, బియ్యము, బేడలు తదితర వంటసామాగ్రి సర్వమూ సంసిద్ధమైపోయాయి. సేవకు వచ్చేవారిలో బీదవారున్నారు. మధ్యరకం వారున్నారు. ఉన్నత స్థాయి వారు కూడా ఉన్నారు. అన్ని రకాలవారూ సేవకు వస్తున్నారు. భోజనం మేము ఉచితంగా పెట్టవచ్చును గాని రైల్వేవారు ఊరికే విడుస్తారా? రైల్వే ఛార్జీలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. పూర్వ కేవలం 20 రూపాయలతో ఇక్కడి నుండి మాద్రాసుకు వెళ్ళడానికి వీలయ్యేది. కానీ ఇప్పుడు 200రూపాయలు కూడా చాలవు. ఇంతగా పెరిగి పోయాయి రైల్వే ఛార్జీలు. కనుక రైల్వే అధికారులతో మాట్లాడి, సేవాదళ్‌వారికి 'కన్షెషన్' ఇప్పించవలసిందిగా నేను సెంట్రల్ ట్రస్ట్ సభ్యులకు చెప్పాను. కొంతమంది సభ్యులు ఢిల్లీలో ఉంటున్నారు. "మేము పల్లెలో ఉన్నాం, మీరు ఢిల్లీలో ఉన్నారు. ఈ పని చేయలేకపోతే మీరు ఢిల్లీలో ఉండి ప్రయోజనమేమిటి? ఈ పని చేస్తే చేయండి, లేకపోతే రిజైన్ చేసి పొండి" అని కఠినంగా చెప్పాను. **నేను మాట్లాడేటప్పుడు మధురంగా మాట్లాడుతానుగాని, డ్యూటీ విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తాను. ఏదైనా కఠినమైనది జరిగినప్పుడే మనిషి కొంచెం కదులుతాడు.** సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు వెళ్ళి రైల్వే అధికారులతో మాట్లాడారు. వెంటనే సేవాదళ్‌వారికి రైల్వేకనెక్షన్ సేంక్షన్ అయిపోయింది. రైల్వేవారు ఎంతో ఆనందించారు. "స్వామీ ! భక్తులకు సేవ చేసే మహద్భాగ్యం మాకు లభించింది. ధన్యవాదములు" అన్నారు.

(స.సా.ఫి.99పు.35/36)

(చూ॥ రైల్వేస్టేషన్)

సేవాసాధన

(1970లో నవంబరు 20,21,22 తేదీలలో ప్రశాంతి నిలయంలో 4వ అఖిల భారత సేవాదళ సమ్మేళనం జరిగింది. ఆ సందర్భంలో భగవాన్ బాబావారు 4 దివ్యోపన్యాసాలను సేవాసాధకులకు అనుగ్రహించారు. సేవ అనేది ఆత్మ సాక్షాత్కార సాధనమనీ, దైవసందర్శన యోగమనీ ఆ ప్రసంగాలలో ప్రబోధించారు. భగవాన్ శ్రీసత్యసాయి సేవాసంస్థలలో జరిగే శిక్షణ శిబిరాల్లో, సాధన శిబిరాల్లోనూ ఈనాలుగు దివ్యోపన్యాసాల సారాంశాన్ని సాధకులు తెలుసుకుంటారు. ఈ దివ్యోపన్యాసాలు "సేవాసాధన" అనే పుస్తకంగా వెలువడినది. "సాయిసేవకులు ఈ ప్రసంగాలను క్షుణ్ణంగా చదవాలి, సారాన్ని గ్రహించాలి. సేవాతత్వాన్ని తెలుసుకొని ఆచరించాలి, ఇలా ఆచరించగలిగినప్పుడే సేవాసాధకులు భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి ధర్మ సంస్థాపన కార్యక్రమంలో ఉపకరణములుగా తమ పాత్రలను నిర్వహించగలరు అని శ్రీ ఎన్.కస్తూరిగారు తమ పీఠికలో వ్రాశారు.)

"సేవాసాదన" అనే దివ్యోపన్యాసముల సారాంశం యిది.

సేవాసాధన

దివ్య ప్రసంగం - 1

1. సేవాసాధకుడు క్రమశిక్షణ అలవరచుకోవాలి. క్రమశిక్షణ లేకపోతే ఏ సాధన ఫలించదు.

2. సేవ చేయటానికి యింద్రియ నిగ్రమం అవసరం. అనివార్యం.

3. ద్వందాలకు అతీతంగా జీవించగలిగే మానసిక సమత్వాన్ని సేవా సాధకుడు ఏర్పరచుకోవాలి.

4. శ్రీసత్యసాయి సేవా సంస్థల్లో వివిధ మతములకు చెందినవారు సేవచేస్తారు. కనుక సకల మతములకూ సారమైన ప్రేమ అహింసలను అలవరచుకోవాలి. నిత్య జీవితంలో ఈ ప్రేమ అహింసలను ఆచరించి చూపటానికే శ్రీసత్యసాయి సేవాసంస్థ ఆవిర్భవించింది.

5. దేహం నాహం - కోహం-సోహం (దేహాన్ని తాను, మరి ఎవరిని ఆ దివ్యత్వాన్నే నేను) అనే నాలుగు విమర్శలను ప్రతి సభ్యుడూ చేసుకోవాలి.

6. ధర్మార్థ కామమోక్షములనే నాలుగు పురుషార్థములను ప్రతి మనుజుడు సాధించాలి. ధర్మాన్ని ముందుగా పోషిస్తే మిగతా మూడు పురుషార్థాలను అదే సమకూర్చుతుంది.

7. శ్రీ సత్యసాయి సేవా సంస్థల్లోని ప్రతిసభ్యుడూ వేర్పాటు ధోరణిని పోగొట్టుకోవాలి. కుల, మత, జాతి, ధనిక, బీద మొదలగు తేడాలకు వారు చోటివ్వకుండా అందరూ కలసి తోటివ్యక్తుల కష్టాల్లో పాలుపంచుకోవాలి.

8. అపోహలు ఏవైనా కలిగితే వాటిని సహనంతో, ప్రేమతో తొలగించుకోవాలి. అంతేగానీ చిత్తస్థయిర్యాన్ని కోల్పోయి, కోపోద్రేకాలకు చోటివ్వరాదు.

9.విశాల భావాన్ని అలవరచుకొని ప్రేమభావంతో మీజీవితాన్ని నర్వేశ్వరుని పాదలచెంత సమర్పించుకోవటమే జీవితలక్ష్యంగా గుర్తుంచుకోవాలి.

10. సహనం, ప్రేమ, విశ్వాసం, వినయం వీటితో ఎదుటివారిని గౌరవించాలి.

11. కల్లోలాలతో, భయాందోళనలతో నిండిన నేటి ప్రపంచంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు సభ్యులు, తమ వ్యక్తిగతమైన ప్రభావంచేత ప్రేమద్వారా, సమాజంలోని వ్యక్తులలో ప్రశాంతిని వ్యాపింపజేయాలి.

12. ప్రపంచాన్ని రక్షించాలంటే అది ఆత్మశక్తితోనే సాధ్యం అవుతుంది. ఆత్మశక్తిని ప్రతి ఒక్కరూ సాధనద్వారా మేల్కొల్పాలి. ప్రేమద్వారా భగవత్ కృషను పొందాలి. పవిత్రత, ప్రేమ ఈ రెండూ లోపించిన చోట ప్రళయం తథ్యం.

13. ఇంట్లో చూస్తే తండ్రికి కొడుక్కూ భార్యకూ, అన్నకూ తమ్ముడికీ మధ్య ప్రేమభావన కనిపించదు. అలా జరగటానికి వీల్లేదు. మీ ప్రవర్తన ద్వారా, **ఆత్మజ్ఞాన జనితమైన ప్రేమభావాన్ని మీరు ప్రదర్శించక తప్పదు. ఇదే ప్రపంచ సమస్యలన్నింటికీ కూడా పరిష్కారమార్గం. మరుక్షణంలో ఏం జరుగుతుందో వూహించలేక భయంతో మనుష్యులు బ్రతుకుతున్నారు. వారికి దోవ చూపించే దీపాలుగా మీరు ప్రవర్తించాలి. అదే నెరవేరితే యింకా మీకు జపతపాలతో పని లేదు.** ప్రేమభావంతో నరరూప నారాయణులను సేవించటం ద్వారా తప్పక భగవత్ కటాక్షం మీకు లభిస్తుంది. కాబట్టి ఈనాడే మీరంత ఒక నిర్ణయం తీసుకొండి ప్రేమతత్వాన్ని మీ హృదయాల్లో ఆవిష్కరించండి. దాన్ని విశ్వవ్యాప్తం చేయండి. మీరంతా స్వార్థ సంకల్పాలు విడనాడి ప్రేమ స్వరూపులు కావాలి.

14. నాకు ఏ జిల్లాలో అధిక సంఖ్యలో సమితులున్నాయనేది ముఖ్యంకాదు. **ప్రేమగల హృదయంతో ఎక్కడ నిస్వార్థ సేవ జరుగుతుందో అదే నేను గమనిస్తాను.** పేరుకోసం వందలకొలది సేవాదళ్ యూనిట్లు నెలకొల్పటం కాదు కావలసింది. ఒకటి, రెండు యూనిట్లలో ఆలాటి సేవ జరిగినా చాలు.

15. మీలో తొలగించుకోవలసిన దుర్గుణాలున్నాయి. అలాగే అలవరచుకోవలసిన సుగుణాలూవున్నాయి. ఈనాడే మీరు ప్రతిజ్ఞ తీసుకొని మిమ్మల్ని మీరు సరి చేసుకొని ముందుకు నడవండి.

దివ్యప్రసంగం -2

1. విజ్ఞానానికే మరొక పేరు వేదం, ఈనాడు మానవజాతి ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం 'విజ్ఞత' ద్వారా

పొందాలి. శ్రీ సత్యసాయి సంస్థల ఆదర్శం కూడా పవిత్రమైన ఈ సంస్కృతిని పోషించటమే.

2. మానవజాతి పురోగతికి **నైతిక సంపద, శీల సంపద ప్రధానం.** కనుక వీటిని మీరు అలవరచుకోండి. ముందు **ఆత్మదృష్టి అలవడినపుడే శీల సంపద, నైతికదృష్టి పెంపొందుతాయి.** కేవలం భౌతికదృష్టి పశుప్రవృత్తినీ, పశువాంఛలను పోషిస్తుంది.

3. ఇమిటేషన్ (అనుకరణ) పనికిరాదు.

4. WATCH అనే మాటలో గల అంతరార్థాన్ని మీరు తెలుసుకోవాలి.

W - watch your words
A - watch your actions
T - watch your thoughts
C - watch your character
H - watch your heart

5 మీలో గల సత్వరజస్తమో గుణాల ప్రభావాన్ని గుర్తించండి. **సాత్వికంగా వున్నారా, మీ ఆత్మయే పరబ్రహ్మగా గోచరిస్తుంది. రజోగుణంతో వున్నారా, మీ ఆత్మే మీకు జీవుడుగా కనిపించుతుంది. తమస్సులో ఉన్నారా దేహమే మీరుగా భావిస్తారు.**

దివ్యప్రసంగం - 3

1. జీవితాన్ని భగవత్ ప్రేమతో నింపుకోవటంలోనూ, ఆ ప్రేమను మానవరూపంలోని మాధవునికి అంకితం చేయటంలోనూ జన్మసాఫల్యం వుంది. **ప్రేమలేని జీవితం భూమికి భారం.**

2. ముందుగా మానసిక పరిశుద్ధత పొందాలి. అప్పుడే ఆ మనస్సు అజ్ఞానపు పొరను చీల్చగలుగుతుంది. శరీరానికి ఆరోగ్యం ఎంత అవసరమో మనస్సుకు పరిశుద్ధత అంత అవసరం.

3. ఆహార శుద్ధివలనే మనశ్శుద్ధి ఏర్పడుతుంది. శరీరం ఒక టార్చిలైటు. కళ్ళు బల్బులు, బుద్ధి స్విచ్, మనస్సు అనేది సెల్ వంటిది.

4. జాగ్రతావస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ-ఈ మూడు అవస్థలకు గల తారతమ్యాలు తెలుసుకోవాలి. వీటికి మూలప్రాయమైనది దివ్య చైతన్య స్థితి. దీనినే 'భూమా' అంటాయి. ఉపనిషత్తులు. ఈ భూమాయే నేను ఇది దేశానికి, కాలానికి అతీతమైనది. అయితే సూర్యుని నుంచి పుట్టిన మబ్బు సూర్యుని ఆవరించినట్లు ఈ భూమా నుంచి నేను నుంచి అజ్ఞానం పుట్టి ఆత్మ స్వరూపమైన నేనును ఆవరిస్తోంది. సాధనవల్ల ఈ ఆవరణ తొలగిపోతుంది. ఈనాడు మీరు చేసే సాధన ప్రేమతో కూడిన సేవా సాధన. **ఈ సేవ దేవునికోసం కాదు, నీ కోసం.**

5. ఎవరో నగరసంకీర్తనలు వారానికి రెండుసార్లు చేస్తున్నారు. కనుక మనం వారానికి మూడుసార్లు నగర సంకీర్తన చేయాలి. అప్పుడు వారికంటే గొప్ప సేవకులం అనిపించుకుందాం, అని కొందరు చేస్తూ వుంటారు. అది తప్పు కొందరు హఠయోగము, రాజయోగము, క్రియాయోగమూ సాధన చేయాలని అనుకుంటారు. అవన్నీ భౌతికమైన కొన్ని ప్రయోజనాలు నెరవేర్చేవే. **మీరు సాధించవలసింది ఈయోగాలు కావు. ప్రేమతో కూడిన సేవాయోగాన్ని సాధన చేయాలి.**

6. **సోహం భావనే నిజమైన ధ్యానం.** దానిని సాధించి రూపధ్యానం చేయాలి. కనీసం 15 నిమిషాలు సోహం భావనతో రూపధ్యానం చేయాలి. అప్పుడు మీ యిష్టదైవం యొక్క స్వరూపాన్నే సర్వత్ర దర్శిస్తారు.

దివ్య ప్రసంగం - 4

1. ఆలోచనలు, మాటలు, చేతలు, అలవాట్లు, శీలం (వీటికి గల క్రమ పరిణామాన్ని భగవాన్ బాబా వివరించారు.) అన్నింటికీ మూలం మీ ఆలోచనలు కనుక మీ ఆలోచనలను ముందుగా ప్రేమతో నింపుకోవాలి.

2.సేవాదళం శిక్షణ శిబిరం ఒక మిష మాత్రమే (Pre-text) దీనిద్వారా భగవాన్ శ్రీ సత్యసాయిబాబా తమ అనుగ్రహాన్ని వర్షిస్తున్నారు. అందుకే సేవాదళంలోకి మిమ్మల్ని భగవాన్ ఆకర్షించారు.

3. మీరు చేసే సేవద్వారా మీకు దైవ కృప ప్రాప్తిస్తుంది. మానవసేవే మాధవ సేవ, దైవం మానవ రూపంలో అవతరించి సేవచేయటానికి నడుం కట్టగా, మానవు

లందరూ కూడా ఈ సేవాసాధన స్వీకరించటం భగవంతునికి ఎంత ప్రీతికరమో యోచించండి.

4. ఈ సేవ చేస్తున్నందుకు మీరు గర్వించనవసరం లేదు. మీ సంపద, శక్తి, పదవి, భగవంతుని చేత మీకు అనుగ్రహించబడినవే. భగవంతుని అనుగ్రహించినదానినే సేవద్వారా మీరు భగవంతునికి అర్పించుతున్నారు. గంగాజలాన్ని గంగలోనే కలుపుతున్నారు. **సర్వే సర్వత్రా మీరు దైవాన్ని సందర్శించండి. కష్టసుఖాల్లో, జయాపజయాల్లో దైవాన్ని చూడండి.**

5. మీ మనో చాంచల్యంవల్ల మీలో ద్వంద్వభావాలు కలుగుతున్నాయి. ఏకత్వాన్ని దర్శించలేక మీ మనస్సు అనేకత్వాన్ని, వైవిధ్యాన్ని చూస్తోంది. ఇట్టి మనస్సుకు మీరు శాశ్వతమైన విలువలు చూడటంతో శిక్షణ యివ్వాలి. మొదట్లో ఈ సాధన కష్టంగానే వుంటుంది. కానీ చివరకు ఈ సాధన ద్వారా దేశాతీతమూ, కాలాతీతమూ, కార్యకారణ సంబంధముల కతీతము అయిన తత్వాన్ని మీరు గ్రహించాలి. మొట్ట మొదటగా యిందుకు సగుణ స్వరూపాన్ని, ఏదో ఒక నామాన్ని, రూపాన్ని అనురక్తితో ధ్యానించాలి తర్వాత నిర్గుణ నిరాకారతత్వాన్ని అందుకోవాలి. **ఈ సాధనలోని వివిధ దశలే భజనలు. ధ్యానము సంకీర్తనం, నగర సంకీర్తనం.**

6. మానవుని పట్టి పీడించే నిజమైన **వ్యాధులు నివారించే మందులు**

అనేకత్వం, భిన్నత్వం - ఏకత్వ సాధన
ద్వేషం అనే రోగానికి మందు - ప్రేమసాధన
అహంకారం అనే రోగానికి మందు - నిరహంకార సాధన
Attachment అనే రోగానికి మందు - జపధ్యానాలు

5. మందులు తీసుకున్నంత మాత్రాన రోగం తగ్గదు. మందు తీసుకొనేవారు అపథ్యం చేస్తే రోగం తగ్గదు. చిల్లిపడిన పాత్రలో నీరు పోస్తే నిలవదు. అలాగే శాంతి కావాలనుకుంటూ అశాంతి కలిగించే పనులు, ఆలోచనలూ చేయరాదు. సర్వత్రా వ్యాపించిన సర్వేశ్వరుణ్ణి చూడలేకపోతే అది దృష్టి దోషం.

6. నేను స్వామికి 20 సంవత్సరాలు దగ్గరగా వున్నాను. అతడు గత 2 సంవత్సరాలు మాత్రమే దగ్గరగా వున్నాడు. అతని మీద స్వామికి అనుగ్రహం కలిగింది. నాపైన అనుగ్రహం కలుగలేదు, అనుకుంటారు కొందరు. అతడు 20 దెబ్బలు గత జన్మలో వేశాడు. ఈ జన్మలో 2 దెబ్బలతోనే అతనికి ఒక నిధి దొరికింది కాబట్టి కృపాసిద్ధి కోరేముందు మీ మనస్సును మీ ఆలోచనలనూ సరియైన తీరుగా మలచుకోండి. యద్భావం తద్భవతి.

7. పచ్చిగా వున్న పిందె పక్వం అయి మధురఫలం అవుతుంది. అలాగే యింద్రియాలతోటిగల సంపర్కాని విడదీసి మీ మనస్సుకు పరమేశ్వరుని తోటి సాంగత్యాన్ని అలవరచండి. దివ్యమైన ఆనందం లభిస్తుంది. ఒకసారి ఈ దివ్యానందం రుచిచేసే మీ యింద్రియాలన్నీ ఆనందాన్ని చూస్తాయి. ఆనందాన్నే వింటాయి. ఆనందాన్నే గ్రహిస్తాయి.

8. పాలతో వెన్నవలె భగవంతుడు సర్వత్రా వున్నాడు. సాధనచేసి వెన్నను వేరు చేసినట్లే, భగవంతునికూడా సాధన ద్వారా దర్శించగలరు. చాతకపక్షి ఆకాశంలోవున్న నీటిబొట్టునే గ్రహిస్తుంది. నేలమీద పడిన నీటిని గ్రహించదు. అలాగే ధైర్యంతో మానవుడు సాధన చేయాలి. దివ్యానుభవం అనే అమృత బిందువులు పొందాలి.

9. నామస్మరణ నగర సంకీర్తనల మహిమను (స్వామి వివరించినవి) మననంచేసుకొని ఆచరణలో వుంచాలి.

10. ఎంతో సాహసంతో ఆధ్యాత్మిక సాధనలో పురోగమించాలి. లోకాన్నంతటినీ నీవు జయించగలిగినా నిన్ను నీవు జయించుకోవటం చాలా కష్టం, ఈ కష్టతరమైన సాహసమే చీకటినుండి వెలుగులోకి, అసత్యం నుంచి సత్యంలోకి, మరణంనుంచి అమరత్వంలోకి జరిపే ప్రయాణం. ఈ ప్రయాణానికి స్త్రీలు, పురుషులు అనే తేడాలు లేవు.

11. నేను ఎల్లెడలా ఉన్నాననీ, అంతటినీ చూస్తూన్నాననీ మీరు గ్రహించితే మీ సాధనలో నిజాయితీ, చిత్తశుద్ధీ క్రమశిక్షణ అలవడుతాయి. సేవా సమితిలో మీరందరూ

ఆనందోత్సాహంతో ఉప్పొంగుతూ వుండాలి. చేసిన కృషికి మించినటువంటి సేవలను చేయటంకోసం మీరు భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించుకోవాలి. ఇందుకు ప్రేమభావన సద్భావన పరస్పర సహకారం, సహనం అనేవి ఎల్లప్పుడూ మీ హృదయాల్లో ప్రవహించాలి.

12. ఈ సేవాదళ్ లోని వివిధమైన యూనిట్లు సాయి స్వరూపంలోని వివిధమైన అంగాలుగా మీరు భావించాలి.

(సే.యో.పు.67/73)

సోదరప్రేమ

అన్ని రంగాల్లోను ఆదర్శమూర్తియై నిలిచి జగత్తునకు విలువల నందించినవాడు రాముడు. వారి సోదర ప్రేమ అపురూపము. అద్వితీయము, అసమానము. **అట్టి ప్రేమ ఆ సోదరులను సుప్రీమ్ స్టేజికి తీసుకు వెళ్ళింది. కానీ ఈనాటి సోదరప్రేమ సుప్రీమ్ కోర్టుకు తీసుకు వెళుతోంది!** రాముణ్ణి వనవాసానికి పంపినందుకు సోదరుడైన భరతుడు తన తల్లిపై ఎంత కోపగించాడో వర్ణింప శక్యం కాదు. రామునిపై అతని ప్రేమ అలాంటిది. భరతుని నీడవలె వెంట నున్నవాడు శత్రుఘ్నుడు. ఇక రామ లక్ష్మణుల గూర్చి చెప్పనక్కర లేదు. పసిబిడ్డలుగా ఉన్న రామలక్ష్మణులను చెరొక ఊయలపైన పరుండబెట్టినప్పుడు ఇరువురూ ఏడుపు లంకించుకొన్నారు. ఎన్ని సపర్యల చేసినప్పటికీ వారు ఏడుపు మానలేదు. అప్పుడు తల్లులు వశిష్టులవారి సలహా అడుగుగా ఆయన "అమ్మా! రామలక్ష్మణులను ఒకే ఊయలపై పడుకోబెట్టండి" అన్నాడు. ఆ ప్రకారం చేయగా ఇరువురూ ఏడుపు మాని ప్రశాంతంగా నిద్రించారు. శైశవదశ నుండి రామలక్ష్మణులు కలసిమెలసి ఎంతో ప్రేమతో మసలేవారు. వనవాస సమయంలో సీతారాములను కంటికి రెప్పవలె చూసుకున్నాడు. లక్ష్మణుడు. యుద్ధసమయంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు రాముడు చాల దుఃఖించాడు. **"ప్రపంచంలో కౌసల్యవంటి తల్లినైనా పొందవచ్చును, సీతవంటి భార్యనైనా పొంద వచ్చును. కానీ లక్ష్మణునివంటి సోదరుణ్ణి పొందలేను"** **అన్నాడు. ఇంక అందరికంటే గొప్పవాడు భరతుడు.** రామనామంతో రామాజ్ఞ ప్రకారం రామపాదుకలను ప్రతిష్టించుకొని రాజ్య పాలన చేస్తూ రామ పునరాగమనం కొరకు ఎదురు చూశాడు. ఇక్కడ **ప్రత్యక్షంగా సేవించిన లక్ష్మణునిది సాకార ఆరాధన. పరోక్షంగా చింతించిన భరతునిది నిరాకార ఆరాధన. వనవాస సమయంలో పంచవటి సమీపంలో రాముడు "లక్ష్మణా! నీ ఇష్ట మొచ్చినచోట ఒక పర్ణశాలను నిర్మించు"** అని ఆజ్ఞాపించాడు. వెంటనే లక్ష్మణుడు రాముని పాదాలపై పడి "స్వామీ! నేనేం పాపం చేశానని పర్ణశాలను నా ఇష్టమొచ్చినచోట నిర్మించమంటున్నావు? **రామసేవలో ఉన్న నాకు ప్రత్యేకంగా ఒక ఇష్టమున్నదా? మీ ఇష్టమే నా ఇష్టం కాదా?" అని చాల బాధ పడ్డాడు. ఇట్టిది వారి అపూర్వ సోదర ప్రేమ. ఈ ప్రకారం రామాయణం సోదర ప్రేమ అనే ఆదర్శాన్ని జగత్తుకు చాటింది.**

(స.సా.జూలై.98 పు.194)

సోమవారము

(చూ॥ హిరణ్యగర్భతత్త్వం)

సోమశేఖరుడు

(చూ॥ హిరణ్యగర్భతత్త్వం)

సోషలిజమ్

ఈనాడు లోకములో మానవులందరినీ సమానులుగా భావించవలెననీ, వారి సమానమైన అధికారములను - వివాహము, భూములు, ఆహారవిహారములు. మొదలగువానిని - అందించవలెనని భావిస్తున్నారు. **దీనినే సోషలిజమ్ అంటున్నారు. ఇది నిజముగా సోషలిజమ్ కానేరదు.** ఆస్తిపాస్తులను, భౌతిక సుఖములను, ధనకనక వస్తువాహనములను సమానముగా పంచిపెట్టాలని భావించుట పవిత్రమైన కార్యమే కాని; **మానవుల ఆశలను**

సోహం

సమానముగా పోషించుటకు ఏమాత్రము వీలుకాదు. ఏనాడు వాంఛలు సమానముగా ఉంటాయో ఆనాడే ఆస్తిపాస్తులు సమానముగా పంచుటకు వీలవుతుంది. ఆస్తిపాస్తులను మాత్రము పంచిపెట్టటము, వారికి సమభావము, సమానమైన ఆశలు లేక పోవటముతో అరాచకమునకు, మూలకారణ మవుతుంది. కార్మికుడు మొదలు కర్షకుని వరకును ఇది సమంగా ఉంటుంది. వీరి దాసత్వమును నిర్మూలించవలెనని ఇది ఘోంచి విప్లవముతో ప్రారంభమైనది. క్రమంగా ఈ భావమే సామాన్యుడు కూడ అధికారము చేపట్టాలని రష్యా విప్లవముతో ప్రారంభమైనది. అదే క్రమేణా వికార మార్గములు పొంది 'కమ్యూనిజమ్' అయినది. ఈ రెండు విప్లవములయందున్న ఆశయాలు ఉత్తమాశయాలే. అవి సరియైన విధముగా ఆచరణలో పెట్టకపోవటమువలన వికారమార్గమును పొందినవి. సమత్వమనే భావము లోకములో ఈనాడు వ్యాపించినట్లు భావిస్తున్నారు. కాని అది ఈనాటిది కాదు. ఏబది శతాబ్దములకు పూర్వము సోషలిజము అనేదానిని స్థాపించిన సామాజికమూర్తి ఆ కృష్ణమూర్తి. నవభారత సమాజమును స్థాపించుటకు మూలాధారమైన చరిత్ర పురుషుడు శ్రీకృష్ణుడు. కార్మికుని కర్షకుని, విజ్ఞానినికూడ సమానముగా భావించి వారికి తగిన కర్తవ్యకర్మలను నియమించి, తద్వార లోకవినాశకులు, ద్రోహులైన రాజకీయ నాయకులను, సాంఘిక ద్రోహులను ఖండించి కిరీటములేని మహారాజుగా ఏలినమూర్తి ఈ కృష్ణమూర్తి.

(ని.పు.14/15)

అందరికీ ఒక్క హృదయము, అందరికీ ఒక్క భావము, అందరికీ బలము ఇమ్మని కోరింది యజుర్వేదము. సమష్టితత్వాన్ని అనేక విధములుగా బోధిస్తున్నది. సహజ స్వరూపాన్ని కూడా స్పష్టముగా విమర్శించింది. ఏనాడు మనము **సోషలిజం సోషలిజం అంటున్నాము. అందరూ సమానముగా ఉండాలని. ఇది ఈనాడు పుట్టినది కాదు. వేద కాలమునుండే ఉన్నది.** మానవులు మాత్రమే ఒకటిగా ఉండాలని సంకుచితభావముతో కోరుతున్నాము. కాని, వేదముల అట్లా కాదు. **లోకాస్సమస్తా స్సుఖినోభవంతు - సర్వ ప్రాణులు సుఖముగా ఉండాలని ఆశిస్తుంది వేదము.** వేద రహస్యాన్ని వేదముల మంత్రార్థాన్ని చక్కగా గుర్తిస్తే ఇది కేవలము ఒక తెగకు, కులమునకు, ఒక జాతికి మాత్రమే సంబంధించినది కాదని మనకు స్పష్టమవు తుంది. వేదము కేవలము విప్రులకు, పండితులకు, జ్ఞానులకు మాత్రమే ఏర్పడినదని మనము భావిస్తున్నాము. ఇది చాలా తప్పు. **లోక కళ్యాణ నిమిత్తమై ఏర్పడినటు వంటిదే ఈ వేదము త్రికాలాబాధ్యమైనటువంటిది వేదము. ముల్లోక వాసుల యోగ క్షేమాలను కోరేది వేదము. ఇంతటి విశాలమైన వేదార్థాన్ని గ్రహించక సంకుచిత భావముతో కొందరు ప్రవేశపెట్టడం చేత ఇది అపకీర్తి పాలవుతున్నది.**

(ఆ.ప్ర.న.92పు.38)

సోహం

అహం భావన క్రిందకు దింపుతుంది సోహం భావన పైకి తీసుకు వెళుతుంది.

(శ్రీ.స.ది.పు.4)

మన నిత్య జీవితములో ఉచ్ఛ్వాస నిశ్వాసములు జరుగుతున్నాయి. మనము గాలిని పీల్చుకొను సమయము లోపల 'సో' అని, విడుచు లోపల 'హమ్'అని "సోహమ్' ' అగుచున్నది. ఈ రెండింటి ఏకత్వములోపల, నిజమైన "ఓంకారము'' ఉంటున్నది. 'సో'అనే అక్షరములోపల 'హమ్' అనే అక్షరముల లోపల ఉండినటువంటి అంతరార్థమును మనము గుర్తించుకొంటే? **"సోహం" అదే నేను. అది కూడా "తత్ త్వం ఆసి" ఈ మూడు అక్షరములలో ఉండినటువంటిది ఏకాక్షరమని చెబుతున్నాము. "ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ".** అనగా ఏకాక్షరం బ్రహ్మ. ఒకే అక్షరం అంటున్నామే, ఇది ఏవిధముగా ఒక అక్షరమవు తుంది? 'సోహం..' ఇందులో సాలోక్య, సారూప్య సామీప్య, సాయుజ్యములకు సంబంధించి నటువంటి 'స' కారము

మైనస్ అవుతుంది. ఎప్పుడీ 'స' కారము మైనస్ అవుతుంది? జాగ్రత్తను మరచి నిద్రావస్థలో నిలిచినప్పుడు జాగ్రత్త యొక్క మంచి చెడ్డలను మనము విస్మరించి నప్పుడు, ఈ 'సో' అనే శబ్దము లోపల, 'స' కారము మైనస్ అయిపోయి కేవలం 'ఓ' అవుతుంది. 'హమ్' అనే నిశ్వాసం లోపల 'హ' కారం మైనస్ అవుతుంది. జాగ్రత్తలో ఉండినంత వరకే 'స' కార 'హ' కారములు, ఈ 'ఓం' కారములో లీనమవుతూ ఉంటాయి. ఈ జాగ్రత్తను విస్మరించి, గాఢ నిద్రలో ఉండినప్పుడు ఈ 'స' కార 'హ' కారములు రెండూ అంతర్ధానమవుతాయి. కనుక 'సో' అనే అక్షరములో 'స' కారము పోయినప్పుడు 'ఓ' అవుతుంది. 'హమ్' అనే నిశ్వాసంలోపల 'హ' కారము పోయినప్పుడు 'మ్' అవుతుంది. **"ఓ+మ్" = "ఓమ్" అయిపోయింది. 'స' కారము, 'హ' కారము, రెండూ చేరినప్పుడు "సోహం" అయిపోయింది. ఈ 'స' కారము, 'హ' కారము రెండూ పోయినప్పుడు "ఓమ్" అవుతుంది.** అనగా జాగ్రదవస్థలో ఉండినంతవరకు మానవుడు ఈ ప్రాకృతమైన జీవితంలో లీనమైపోయి, తద్వారా "ఏకాక్షరం బ్రహ్మ" అనే సత్యాన్ని మరచిపోతున్నాడు.

(శ్రీ.భ.ఉ.పు.115/116)

(చూ॥ అమృతపుత్రులు, చదువు, దాసోహం, నేను, హనుమంతుడు)

సోహం తత్త్వము

ప్రేమకు రూపంలేదు. ఇది అనిర్వచనీయమైనది, అవాఙ్మానస గోచరమైనది. అనుభూతికి మాత్రమే లభ్యమయ్యేది. ప్రేమను ఎంత సమీపిస్తారో అంత ఆనందాన్ని మీరు. అందుకోగలరు. ఈనాడు లోకంలో **అన్ని అవస్థలకు మూలకారణం మీలో ప్రేమలేకపోవడమే** అయితే ప్రేమ ఉన్నది కాని అది శారీరకమైన స్వార్థపరమైన ప్రేమగా ఉంటున్నది. మీరు దేహాత్మభావమునే ఆశిస్తున్నారు. కాని, పరమాత్మభావమును ఆశించడం లేదు; ఉపాధికి ఆధారమైన ఆత్మతత్త్వాన్ని విశ్వసించడం లేదు. ఆధారాన్ని విస్మరించి ఆధేయాన్ని ఆశ్రయిస్తే ప్రయోజనమేమిటి? అన్నిటికీ ఆధారము అన్నిటికీ ప్రధానము ప్రేమ ఒక్కటే. ప్రేమ ఎక్కడ పుడుతుంది? ఎక్కడ అంత్యమవుతుంది? **ఇది 'దాసోహం' తత్వము నుండి ప్రారంభమై 'సోహం' తత్వములో అంత్యమవుతుంది.** దాసోహం అనే భావన లేక సోహం తత్త్వాన్ని అనుభవించుటకు వీల్లేదు. అసోహంతత్వమే ప్రేమతత్వము. ఆత్మయే ప్రేమ, ఆత్మయే బ్రహ్మ. ఈ భూలోకంలో మానవునికి **ధర్మార్థకామమోక్షములనే చతుర్విధ పురుషార్థములున్నాయి. పరమ ప్రేమయే ఐదవ పురుషార్థము. దీనిని పొందినప్పుడే జగత్తంతా నిత్య కళ్యాణంగా ఉంటుంది.**

(స.సా.డి.96 పు.311)

సౌఖ్యము

(చూ॥ పూర్ణప్రేమ)

సౌభాగ్యము

"రమణీ శిరోమణుల్ రావచ్చు పోవచ్చు
శాశ్వతమైనది సత్యమొకటె
రాజ్యభోగములెన్నో రావచ్చు పోవచ్చు
శాశ్వతమైనది సత్యమొకటె
భ్రాతలు బంధువుల్ రావచ్చు పోవచ్చు
శాశ్వతమైనది సత్యమొకటె
లోకమందు అధికార భోగముల్ రావచ్చు పోవచ్చు
శాశ్వతమైనది సత్యమొకటె
సరససన్మార్గ పత్రంబు తెలియజెప్పి
అమృతము అదియె సకల సౌభాగ్యమందు
భువిని సత్యంబె యరయ సౌభాగ్యమందు'

(శ్రీ.డి.2000పు.25)

స్టడీసర్కిల్

స్టడీసర్కిల్సు (Stucy Circles) గురించి నా సలహా ఇది - ఎంత విలువైనవైనను విచక్షణలేని గ్రంధపఠనము

స్త్రీ

నాకిష్టములేదు. **బహుళ గ్రంథ పఠనము (పరిచయము) మనస్సును కలవరపరచును. అది కుతర్కములకు, అహంకారమునకు దారితీయును. మీరు చదివిన విషయములలో కనీసము ఒకటి రెండైనను ఆచరణలో పెట్టవలెనని నేనాశింతును. అదియునుకాక, పుస్తకము కేవలము మార్గదర్శి, గుఱుతు స్థంభమని జ్ఞప్తియందుంచుకొనవలెను. గ్రంథపఠనతో జీవనయాత్ర సమాప్తి చెందినట్లుకాదు. అది మొదటి మెట్టు మాత్రమే. ఆచరణకోసము చదివవలెను. చదువుట కొరకు కాదు.** అలమార్లలో, గూళ్ళలో ఉన్న అనేక మందుసీసాలెట్లు వ్యక్తి యొక్క శారీరక రుగ్మతను వ్యక్తపరచునో, అట్లే అనేక పుస్తకములు మానవుని మానసిక రుగ్మతను తెలియజేయును. **అందుచే భజనకు ముందుకాని, తర్వాతకాని పుస్తకములను చదువుట, కొన్ని కొన్ని భాగములు చదువుట అనవసరము. అట్టిపని వేరే సమయములలో చేయుట ఉత్తమము.**

(శ్రీ.స.సూ. పు.101/102)

స్త్రీ

దేవి అనగా స్త్రీ స్వరూపం. ఆ జగత్తంతా త్రిగుణాత్మక స్వరూపం. **అయితే ఈ 'స్త్రీ' అనునది 'స' కార, 'త' కార, 'ర' కారములతో చేరియుంటున్నది. 'స' కారము సాత్వికమును గుర్తింపజేస్తున్నది. సాత్వికగుణము ప్రప్రథమంగా ఆవిర్భవించేది తల్లి నుండియే. తల్లి తన రక్తమును ప్రేమ మయంగా మార్చి బిడ్డలకందిస్తుంది. కనుకనే తల్లి ప్రేమను వర్ణించి చెప్పుటకు వీలుకాదు. రెండవది, తకారము. బిడియము, అభిమానము మొదలగునవి తకారమునకు చెందిన లక్షణాలు. స్త్రీలలో సిగ్గుపడే గుణము అమితంగా ఉంటుంది. వారు తమ గౌరవ మర్యాదల కోసం నిరంతరం పాటుపడుతుంటారు. స్త్రీలు ఇట్టి పవిత్రమైన గుణములను కలిగినటువంటివారు. అని ఈ తకారము సూచిస్తుంది. అంతేగాని, తినడం - నిద్రించడం వంటి లక్షణాలను కలిగియుండుట కాదు. మూడవది: రకారము. ఇది రాజసిక లక్షణాన్ని గుర్తింపజేస్తుంది. స్త్రీల యందు అమితంగా ఉండే త్యాగము, ఔదార్యము వంటి గుణాలు రకారమునకు సంబంధించినవే.** స్త్రీలు కష్టనష్టాలకు విచారించక, తమ గౌరవాన్ని నిలుపుకొనే నిమిత్తమై వట్టి త్యాగానికైనా పాల్పడుతారు, అవసరం వస్తే ప్రాణ త్యాగానికైనా పాల్పడుతారు, అవసరం వస్తే ప్రాణ త్యాగానికైనా వెనుదీయరు. సాత్వికమునకు విరుద్ధముగా దండెత్తి వచ్చే తమోగుణములను నిర్మూలించడానికి తాము నిరంతరం సంసిద్ధులై ఉంటారు. **కనుక 'దేవి' - అనగా రజోగుణాన్ని ధరించి దర్గుణాలను నిర్మూలం గావించి, సాత్వికమును పోషించే శక్తి స్వరూపిణియే.**

(స.సా.న.91.పు.305)

దయ, త్యాగము, సహనము, సానుభూతి, ప్రేమ ఇత్యాది సద్గుణములు స్త్రీలయందే ఎక్కువగా ఉంటాయి. స్త్రీలు ప్రకృతి స్వరూపులు, చాల పుణ్యవంతులు చాలమంది అనుకుంటూ ఉంటారు - స్త్రీ జన్మ ఎత్తే బదులు పురుష జన్మ ఎత్తి ఉంటే స్వేచ్ఛగా తిరిగేవారమని. ఇది చాల పొరపాటు. పురుషులకంటే స్త్రీలయందే గొప్ప శక్తి ఉంటున్నది, స్త్రీలే గొప్ప ప్రాప్తిని పొందగల్గుతున్నారు. కనుక, స్త్రీలను చులకనగా చూడకూడదు. పవిత్రమైన హృదయంతో వారిని గౌరవించాలి. ఎన్ని కష్ట నష్టములు కలిగినప్పటికీ **స్త్రీలలో సత్య ధర్యములకు విరుద్ధంగా నడుచుకునేవారు చాల తక్కువ.**

సీత అశోక వనంలో ఉన్నప్పుడు హనుమంతుడు వెళ్ళి ఆమెను దర్శించాడు. ఆమె చుట్టూ ఉన్న రాక్షసులు ఆమెను అనేక విధాలుగా బాధ పెట్టడం కన్నులారా చూశాడు. తిరిగి రామునివద్దకు వచ్చి సీత పడుతున్న బాధలను గురించి హృదయం కరిగేటట్లుగా చెప్పాడు. తక్షణమే రామలక్ష్మణులు వానరులతో కలసి లంకకు వచ్చి రావణ వధ చేశారు. రామాజ్ఞను శిరసావహించి హనుమంతుడు సీత దగ్గరకు వెళ్ళి, "తల్లీ! రావణుడు హతమైపోయాడు, రాములవారు విజయం సాధించారు.

మీరు వచ్చి రాములవారిని దర్శించండి'' అని చెప్పాడు. **"తల్లీ ! మీ చుట్టూ ఉన్న ఈ రాక్షసులందరూ ఇంతకాలం మిమ్మల్ని చాల హింసించారు. కనుక, మీరు అనుమతిస్తే వీరినందరినీ ఒక్క క్షణంలో భస్మం చేస్తాను" అన్నాడు. అప్పుడు సీత, "నాయనా! ప్రభువుయొక్క ఆజ్ఞను పాలించటం ప్రజల కర్తవ్యం నీవు నీ ప్రభువుయొక్క ఆజ్ఞను ఏవిధంగా శిరసావహిస్తున్నావో అదేరీతిగా, ఈ రాక్షసులు కూడా తమ ప్రభువుయొక్క ఆజ్ఞను పాలిస్తూ వచ్చారు. ఇది వీరి దోషం కాదు. కనుక, వీరిని హింసించటం న్యాయం కాదు"** అని పలుకుతూ, ఒక చిన్న కథ చెప్పింది. ఒక పులి ఒక వేటగానిని తరుముకుంటూ రాగా అతడు అలసిపోయి ఒక చెట్టు నెక్కాడు. ఆ పులి వచ్చి చెట్టు క్రింద కూర్చుంది. అతనిని ఏవిధంగానైనా ఆరగించాలని పట్టుదలతో ఉంది. ఆ చెట్టుపైన ఒక కరడి (ఎలుగుబంటు) నివసిస్తున్నది. దానిని చూసి ఈ పులి చెపుతున్నది - "ఓ కరడీ! నాకు చాల ఆకలిగా ఉండటంచేత ఆ వేటగానిని తరుముకుంటూ వచ్చాను వానిని క్రిందికి నెట్టు, నేను భుజించి వెళ్ళిపోతాను'' అప్పుడా కరడి **"ఇతడు నా ఇంటికి అతిథిగా వచ్చాడు. అతిథి, అభ్యాగతులను ఆదరించటం నా ధర్మం. కనుక, నేనితనిని క్రిందికి నెట్టను" అన్నది.** సరే, ఇంక చేసేదేమీ లేక వేటగాడు క్రిందికి దిగకపోతాడా, అని పులి కాచుకొని ఉన్నది. కొంతసేపు అయిన తరువాత కరడికి నిద్ర వచ్చింది. అప్పుడా పులి వేటగాడిని ఉద్దేశించి, "అయ్యా! ఇంతవరకు నిన్ను తరుము కుంటూ వచ్చాను. నాకు ఆకలి తీరటం ప్రధానంగాని, నీవైతే నేమి, ఆ కరడి అయితే నేమి! నా కడుపు నిండితే చాలు. కనుక, నిద్రలో ఉన్న ఆ కరడిని క్రిందికి నెట్టు. నేను దానిని భుజించి నిన్ను వదలిపెట్టి వెళ్ళిపోతాను'' అన్నది. కరడికున్న నీతి కూడా ఆ వేటగానికి లేకపోయింది. అది తనకు చేసిన ఉపకారమును మరచిపోయి, కృతఘ్నుడై దానిని క్రిందికి నెట్టివేశాడు. ఐతే అది క్రింద పడిపోతూ అదృష్టవశాత్తు ఒక చిన్న కొమ్మను చిక్కించుకొని తిరిగి పైకి ఎగబ్రాకి తన ప్రాణాన్ని రక్షించుకుంది. అప్పుడు పులి, "ఓ కరడి! నీవు ఎంతో దయతో వేటగానిని రక్షించావు. కానీ, అతడు కృతఘ్నుడై నీకు ద్రోహం తలపెట్టాడు. మనుష్యులను నీవు నమ్మరాదు. కనుక, అతనిని తక్షణమే క్రిందికి నెట్టివేయ్'' అన్నది. అప్పుడు కరడి చెప్పింది- "ఎవరి పాపం వారిది. నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తించాను. ఉపకారం చేయడమే నా స్వభావం. **అతడు నాకు అపకారం తలపెట్టినాడని నేను తిరిగి అతనికి అపకారం చేయను."**

ఈ కథ చెప్పి సీత, "హనుమంతా! ఈ రాక్షసులందరూ నన్ను హింసించిన మాట నిజమే. కానీ **సాక్షాత్తు శ్రీరామచంద్రుని పత్నినైయుండి నేను కూడా ప్రతీకారం కోసం ప్రాకులాడతానా? వారిని హింసించడానికి వీనాటికీ అంగీకరించను"** అన్నది. అప్పుడు హనుమంతుడు, **"తల్లీ! గొప్పవారి హృదయం కూడా గొప్పగానే ఉంటుంది. దివ్యతేజోవంతుడైన శ్రీరామచంద్రుని ధర్మపత్ని ఇంత ధర్మస్వరూపురాలని నేను గుర్తించుకోలేకపోయాను నన్ను క్షమించు" అన్నాడు. అప్పుడు సీత, "నాయనా! నాకు మాత్రమే కాదు, మా స్త్రీజాతి అంతటికీ కరుణ, దయ సహజము"** అన్నది.

(స.సా.జూ.99పు.142/143)

ఒక దేశముయొక్క గౌరవప్రతిష్ఠలు ఆదేశములోని స్త్రీలచేతులలో ఉంటాయి. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక సాంప్రదాయములలో స్త్రీలకు ఎప్పుడు ఒక విశిష్టమైన స్థానము కల్పించబడింది. సమాజముయొక్క శక్తి సామర్థ్యములన్ని స్త్రీలపై ఆధారపడియున్నాయి. **స్త్రీ తన భర్తకు తోడునీడగా, మార్గదర్శిగా ఉంటూ, తన పిల్లలకు మొట్టమొదటి గురువై సమాజంపట్ల వారికి సరియైన వైఖరిని పెంపొందిస్తూ, వారికి ఆదర్శవంతమైన సంభాషణ నేర్పుతూ, వారి మానసికానందమును సంరక్షిస్తుంది.** క్లుప్తంగా చెప్పాలంటే, **స్త్రీలు బాల్యదశలో భావి భారతపౌరులను తీర్చిదిద్దే అదర్శగురువులు".**

(ధై.ది.పు.361)

స్త్రీలు **గాయత్రీ మంత్రాన్ని** జపించవచ్చా? అని చాలమంది అడుగుతుంటారు. **తప్పక జపించవచ్చు. అసలు**

స్త్రీ జాతి

గాయత్రియే స్త్రీ కదా! అలాంటప్పుడు **స్త్రీలు గాయత్రీ మంత్రాన్ని జపించకూడదనడంలో అర్థం లేదు. ప్రాచీన కాలంలో స్త్రీలకు కూడ ఉపనయనాలు జరిగేవి.** కానీ తమతో పాటు స్త్రీలు కూడా మూడు వేళల సంధ్యావార్చుతూ పూజాపునస్కారాలలో మునిగి ఉంటే ఇంటి పనులెవరు చేస్తారని భావించి **మగవారు స్వార్థంతో యజ్ఞోపవీతాన్ని మంగళ సూత్రంగా మార్చి స్త్రీల మెడలో కట్టడం ప్రారంభించారు.**

(స.సా.జులై.98పు.172)

స్త్రీలు త్రిగుణాత్మకమైన స్త్రీతత్వము. స్త్రీ అనే పదమునందు మూడు అక్షరాలున్నాయి. **స,త,ర! స-సత్వగుణ సూచకం; స్త్రీలలో సాత్విక గుణము ప్రధానమైనది.** దానివలనే వారికి సహనము, వినయము, విధేయత సహజముగానే అలవడును. తదుపరి, **త-అక్షరము తమోగుణ సూచకము.** దీనివలన, **స్త్రీలలో భయము, సిగ్గు, లజ్జ మొదలగు స్వభావములు ప్రకటితమగును. రజోగుణమును సూచించునది ర అనే మూడవ అక్షరము. స్త్రీలలో రజోగుణము అభివృద్ధి అయినపుడు సర్వనాశము స్వతస్సిద్ధము.** పురుషునికి ఒకే గృహము. స్త్రీకి రెండు గృహములున్నవి. స్త్రీ పుట్టిన ఇల్లు, మెట్టిన ఇల్లు రెండింటి గౌరవములను, సత్కీర్తిని నిలబెట్టి పోషించవలసి యున్నది. స్వేచ్ఛావిహారము వలన స్త్రీలు రెండు కుటుంబములకూ అపకీర్తితెస్తారు. **కాబట్టి, స్త్రీలలో సాత్విక గుణము అతి ప్రధానము. రజోగుణము అప్రధానము.**

(స.సా.ఆ.78 పు.125)

(చూ॥ అర్ధనారీశ్వరుడు, ఈనాటిస్త్రీలు, గాయత్రి, గృహలక్ష్మి, రోగము, వరలక్ష్మివ్రతము, సమానులే, హనుమంతుడు)

స్త్రీ జాతి

(చూ॥ స్త్రీలు)

స్త్రీ తత్వము

అనసూయ తన పతిభక్తినీ, స్త్రీ ధర్మమును అనేక విధముల సీతకు తెలుపుతూ ఆమె ఆదేశములను అందించుమని ప్రార్థించుచూ, సీతయొక్క గుణగణములను వేనోళ్ళ కొనియాడెను. **సీత లోకమున జన్మించిన ప్రతి ప్రాణి, ప్రతి జీవి, ప్రతి భూతము స్త్రీ తత్వము కలవారనియూ, జగన్నాటక రంగమునకు స్త్రీ పురుషులుగా కనిపించిననూ బలతత్వాలలో, భావరాగాలలో, కష్టసుఖాలలో అందరూ స్త్రీలేననియు, తన భర్తయైన రాము డొక్కడే పురుషుడనియు, ఆయన యందు ద్వంద్వభావములు యేనాటికి లేవు, రావు అనియు, అతడు అభయ స్వరూపుడనియు, ప్రకృతికే పురుషుడై ప్రకృతిని వరించినాడనియు వివిధనామరూపములతో గోచరించెడి ఈ జగత్తు యేకాత్మస్వరూపమేననియూ అనసూయకు రామ తత్వమును చక్కగా ఉపదేశించెను.**

(రా.వా.రె.పు.2/3)

శ్రీరామచంద్రుని జీవితములో ప్రప్రథమములో తన యొక్క పండెండ్రు వర్షములలో మూడు విధములైనటు వంటి స్త్రీ తత్వములు తటస్థపడినవి. తాను యాగ సంరక్షణార్థమై విశ్వామిత్రునితో ప్రయాణమై వెళ్ళు చున్నప్పుడు **"తాటకి" అనే స్త్రీ తటస్థపడినది. ఆ తాటకిని నిర్మొహమాటంగా నిర్దాక్షిణ్యంగా హతమార్చినాడు.** విశ్వామిత్రుని యాగ సంరక్షణ జరిగిన తరువాత మిథిలాపురమునకు వెళ్ళేసమయము లోపల "రాయి" గా మారిన **'అహల్య'** తటస్థించినది. **ఆమెకు జీవితము కలిగించి, ఆమె యొక్క దోషములను పశ్చాత్తాపముచే పరిహారంగావించి ఆమెను పతిని చేర్చి వెళ్ళినాడు.** మిథిలాపురము చేరిన తరువాత **సీత** తటస్థించినది. **ఆమెను ఎట్టి విచారణచేయక అనుగ్రహంతో స్వీకరించినాడు.** దీనియొక్క అంతరార్థమేమిటి? బాల్యమునందే యువకుడిగా ఉండినప్పుడే ఈవిధమైన సాధనను **ఆదర్శప్రాయుడిగా లోకానికి అందించి నటువంటి మూర్తి శ్రీరామ చంద్రమూర్తి.**

శ్రీరామునికి మొట్ట మెదట తటస్థపడినటువంటి **'తాటకి' తమోగుణము. తమోగుణమును హతమార్చినాడు. ఇంక రాయిగా మారినటువంటి "అహల్య" రజోగుణమును రజోగుణమునకు బుద్ధి నేర్పి ఆమెస్వస్థానమునకు**

అందించి, సంరక్షణగా అమె దోషమును పరిహారము గావించి వెళ్ళినాడు. సాత్వికమైనటువంటి సీతను తాను అనుగ్రహించినాడు. భగవంతుడు ఆశించేది, కోరేది, అనుగ్రహించేది సాత్వికమే. ఆసాత్వికాన్నే అభిలషిస్తాడు. దానినే పోషిస్తాడు. అట్లు కానివాడు, ఒక్కొక్కరి యందు, ఒక్కొక్కగుణము ప్రసరిస్తూ వస్తుంది. తాటకి తమో గుణము అహల్య రజోగుణము - సీత సాత్వికము.

(స.సా.జూ.1989 పు.143/144)

స్త్రీ ధర్మము

సుగుణమే తన సౌందర్యమువలె, శీలమే తన శ్వాసమువలె, లజ్జనే తన ప్రాణమువలె, సత్య ప్రవర్తనే తన నిత్య కర్తవ్య కృత్యమువలె తలంచి పాపభీతి, దైవభీతిని తన హృదయమున మొలకలుగా నాటుకొని పెంచి స్త్రీ నిజాయితిని నిలబెట్టి, స్త్రీ ధర్మమును ధార్మిక, నైతిక, భౌతిక మార్గములందుకూడనూ, మానసిక, శారీరక వాక్కులందు సహితము, తన సత్య ధర్మమును నడిపించి సర్వవిద్యలలోని సారము అదియేనని గ్రహించి, మాన మర్యాదలతో ప్రాణము వొడ్డి, పతివ్రత ధర్మమును పాటించుటే స్త్రీల యొక్క అతి ముఖ్య ధర్మము. వారి జన్మమునకు కారణమే ఈ ధర్మము.

(శ్రీ.స.సూ. పు.110)

స్త్రీ పురుష బేధములు

రామాయణతత్వమంతా అద్వైతతత్వంగా నిరూపిస్తూ వచ్చింది. **మానవజీవితములో సాధించవలసినది ఏమిటి? విసర్జించవలసినది ఏమిటి?** అనే సత్యాన్ని రామాయణం చక్కగా ప్రబోధిస్తూ వచ్చింది. **స్త్రీ పురుషుల ఉపాధి భేదములే తప్ప మానసికసంబంధమైన పరిస్థితులు ఇరువురకు సమానమే.** దుఃఖమొస్తే వీరు బాధపడతారు, వారు బాధపడతారు. క్రోధముచేత వీరు ఉగ్రులౌతారు. వారు ఉగ్రులౌతారు. ఆకలి వేస్తే వీరు తింటారు, వారు తింటారు. బాధలు వస్తే వీరు బాధపడతారు. వారు బాధపడతారు. ఇందులో ఒక విధమై వ్యత్యాసమున్నది? ఒకరు నిగ్రహించుకోవచ్చు. ఒకరు నిగ్రహించుకోలేక పోవచ్చు. నిగ్రహానుగ్రహములు రెండు మనస్సు ప్రతిబింబములే కాని అన్యము కాదు. **కనుక దివ్యత్వాన్ని సమత్వంగా భావించుకోవటమే అత్యవసరమైన ఆధ్యాత్మికం. వ్యక్తిత్వాన్ని ఆధారం చేసుకొని మానవులు అహంకారంతో మిడిసిపడుతుంటారు.** ఇది సరికాదు. ఒకానొక సమయములో పురుషులము అధికారులమని పురుషులకన్న శక్తి స్త్రీలకు లేదని పురుషులు అన్నింటియందు ముందంజవేసే ధీరులని, వీరులని, గంభీరులని భావిస్తుంటారు. **స్త్రీలు బలహీనులని వారికి అధికారము లేదని, వారు దీనిని సాధించలేరని వారి శక్తిసామర్థ్యములు చాలవని ఊహిస్తుంటాము. ఇదికూడ వారి భావములలో భేదము తప్ప అన్యము కాదు.**

ఒక ఇంటికి కొత్తగా అల్లుడై వచ్చాడు. ఆ యింటిలో చక్కగా విందును ఆరగించి తాంబూలములు వేసుకోవటానికి కూర్చున్నారు. అతను మహాతేజో వంతుడని గొప్ప తెలివి తేటలు కలవాడని మహాత్యాగి అని అనేక రకములుగా వర్ణించుకుంటూ పోతున్నాడు. ఇంతటి మేధాశక్తి కలిగిన అల్లుడు తనకు లభించాడని మామకూడను వెర్రివాడై విర్రవీగుతూ వచ్చాడు. ఈ మేధాశక్తి యందు కవిత్వము కూడను తెలుసునని తన పితృము ప్రకటించినది. తాంబూలమునకు తగిన పదార్థములన్ని తట్టలోనే ఉన్నాయి. తాంబూలమునకు కావలసినవేమిటి? వక్క ఆకు సున్ననము - ఈ మూడు కావాలి. ఇవన్ని ఉండినప్పటికి **తన శక్తిసామర్థ్యముల అహంకారముచేత** ఏదో ఒకటి ప్రశ్నించాలని మరదలిని అగౌరపరచాలని సంకల్పించుకున్నాడు.

"పర్వతశ్రేష్ఠ పుత్రిక పతివిరోధి
అన్న పెండ్లాము అత్తను గన్న తండ్రి
ప్రేమమీరంగ నాతని పెద్దబిడ్డ
సున్న మిప్పుడు తేగదే సన్ను తాంగి"

అన్నాడట. దీని అర్థమేమనగా పర్వతశ్రేష్ఠపుత్రి = పార్వతి. పతివిరోధి అన్న పెండ్లాము అత్తనుగన్నతండ్రి. పతి ఎవరు? ఈశ్వరుడు. ఈశ్వరునికి ఎవరు విరోధి? మన్మధుడు. అతని అన్న బ్రహ్మ. ఆయన పెండ్లాము అత్తను గన్న తండ్రి. ఆయన పెండ్లాము సరస్వతి. ఆ

సరస్వతి అత్త లక్ష్మి. ప్రేమమీరంగ అతని పెద్దబిడ్డ. ఆమె తండ్రి పేరు సముద్రుడు. ఆయన పెద్దబిడ్డ దరిద్రదేవత. **కనుక ఓ దరిద్రదేవతా! సున్నము తీసుకొనిరా** అన్నాడు. కవిత్వములో ఆమె ఈయనకంటె **గొప్ప తెలివితేటలు గలిగిన స్త్రీ**. ఆమె లోపలికి పోయి సున్నం తీసుకొని వచ్చింది. చేతిలో పట్టుకుంది. బావగారి కందించలేదు.

"శతపత్రంబుల మిత్రుని
సుతు చంపినవాని బావ నూనుని మామన్
సతతము దాల్చెడు అతని
సుతువాహన వైరివైరి సున్నం బిదిగో"

అనిందట ఆయమ్మ. శతపత్రంబుల మిత్రుని. శతపత్రమనగా కమలము. ఈ కమలము మిత్రుడైనవాడు సూర్యుడు. ఈ సూర్యుని చూస్తే కమలము విచ్చుతుంది. సుతుడెవడు? కర్ణుడు. కర్ణుని చంపిందెవరు? అర్జునుడు. అతనియొక్క బావ కృష్ణుడు. అతని కుమారుడు మన్మధుడు. **"మదనో మన్మథో మారః ప్రద్యుమ్నో మీనకేతనః కందర్పో దర్పకో ఽనంగః కామః పంచశరః స్మరః"** మన్మధునరికి ప్రద్యుమ్నుడని పేరు. ఈ మన్మధుడు కృష్ణుని కుమారుడు. అతనిమామ చంద్రుడు. చంద్రుని ఎప్పుడు తలపైన పెట్టుకునేవాడు ఈశ్వరుడు. అతని కుమారుడెవరు? గణపతి. అతని వాహనమేమిటి? ఎలుక. ఆ ఎలుకకు వైరి ఎవరు? పిల్లి. ఆ పిల్లికి వైరి ఎవరు? కుక్క. ఓ కుక్కా! ఇదిగో సున్నము అనింది. చూచారా! **మగవారి అహంకారం ఎంతట్లో అణగిపోయింది. పురుషుడు శక్తిసామర్థ్యములు గలిగిన వ్యక్తిగా మనం భావిస్తున్నాము కాని అంతకంటె శక్తిసామర్థ్యములు కలిగిన స్త్రీలు లేక పోలేదు. ఉపాధిభేదములచేత జగత్తునందు స్త్రీపురుషభేదములు భావించవచ్చునేగాని దైవతత్త్వము నందు సర్వులు ఒక్కటే. దరిద్రదేవత అని చెప్పనక్కరలేదు. చెప్పకుండా ఉంటే కుక్కా అనిపించుకోనక్కరలేదు.** ఇదే విధముగనే మానవుడు ప్రాకృతమైన భావములను అభివృద్ధి పరచుకొని ప్రాకృతచర్యలయందే తన జీవితాన్ని వ్యర్థం గావించుకుంటున్నాడు.

(శ్రీ.స.వి.వా. పు.99/101)

స్త్రీలు - విద్య

స్త్రీలకు కానీ పురుషులకు కానీ విద్య అవసరము. ఐతే స్త్రీలకు సరియగు మార్గముల విద్య గరుపవలెను. **సంస్కృతి గల స్త్రీలు లోకమునకు ధర్మదేవతలు.** ఆరీతిగా సద్విద్యాసంపన్నురాలుగా చేయుటకు తల్లి దండ్రులు కూడా తోడ్పడవలెను, **స్త్రీలకు కొన్నింటియందు స్వేచ్ఛనివ్వరాదు.** అట్టి వినాశమొనర్చు విద్యలందు స్త్రీలకు స్వేచ్ఛపట్ల నేననుకూలుడనుకాను; వాటిని నేనంగీకరింపను. వారిని ఆదర్శ స్త్రీలు గా తయారుచేయు విద్యాసంస్కృతులను చేకూర్చవలెను. **పరిపూర్ణ స్వేచ్ఛ ధర్మనాశనమగును.** అట్టి దానివలన తమ్ముతాము పాడుచేసుకుందురు. **విచక్షణాహీనమైన కలసిమెలగుట విధ్వంసకారక ఫలితమునకు గొంపోవును.**

అట్టి విద్యావంతులగు స్త్రీలు ఆనాడుకూడను అనేకులుండియూ వారిధర్మమును వీడక, ఆత్మానందమును లక్ష్య మందుంచుకొని తిరిగిరికదా? విద్య అనేక ఆధారమున పెరగ వలెను. సులభ, సావిత్రి, అనసూయ, గార్గి, నాలాయనివంటి పతివ్రతలు, మీరావంటి భక్తులు, చూడాలవంటి యోగినులు మన భారతదేశమునందే జనించి, ధర్మమును ధర్మవిద్యను నిలిపిరి కదా? ఒకానొక సమయమున **సులభ** తన విద్యా శక్తిచే ఆత్మ విచారమును గూర్చి ప్రసంగించినా జనకుడు సహితము స్థంభించి పోయెను. అట్టి మహా ఘనాత్మలు, వారి పవిత్రతలు, వారల భక్తిజ్ఞానములతో కూడిన నడవడికల మూలముననే నేటికినీ మన భారతదేశ స్త్రీల హృదయములలో యింతమాత్రమైనను సరళత, దైవికత్వమును, వినమ్రత గలదు; కలవారు కూడా కలరు.

అధునాతన కాలపు స్త్రీలు వారినుండి యావేశము కొనవలెను; అట్టి స్త్రీ రత్నములు గడిపిన జీవితములను ఇప్పటివారు గడుపవలెను. హిందూ స్త్రీయొక్క స్వేచ్ఛాదర్శయెప్పుడును ధార్మిక ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగి యుండవలెను. ఎంతటి నవీన విద్యలయందు త్తీర్ణులై యుండినను, ఆత్మార్థమును మరువక అంతర్

దృష్టిని బలపరుచు వేదాంత తత్వముయొక్క జ్ఞేత్రవిద్య నవలంబింపవలెను. అట్టి విద్యలేని స్త్రీ అండలేని బండవంటిది. చూడు! అట్టి విద్య నవలంబించిన **సులభవంటి బ్రహ్మవాదినుల** భారతదేశము ఉత్పత్తి జేసెను. చదివిన పండితులు విద్వాంసులు సహితము వారి వద్దకు త్తేజమునకై వచ్చెడివారు.

దేనిపై సమస్తము ఆధారపడునో అట్టి ప్రధాన అంశమే మనగా, **దేశముయొక్క పురోభివృద్ధిగానీ, సమాజము యొక్క పురోభివృద్ధిగానీ, జాతియొక్క సద్విద్యపై సంపూర్ణముగా ఆధారపడినది. స్త్రీల ఆత్మతత్త్వ విద్యనే దేశమును తన స్వాభావిక స్థితికి లేవనెత్తగలదు. స్త్రీలకు సత్‌శీల పోషణ సద్గుణ పోషణగల విద్యలు గరపిన, యావత్తు దేశమునకు క్షేమమును, శాంతిని గలిగించిన వారగుదురు. ఆనాటి భారత దేశముయొక్క పవిత్రతకు నేటి అపవిత్రతకు ఆనాటి శాంతి సుఖములకు నేటి అశాంతి అక్రమములకూ స్త్రీల ధర్మమే కారణము.** ఆనాటి ధర్మవిద్య ఈనాటి అధర్మ విద్య ఈ రెండింటివలన కలిగినవే యుగమార్పులు. కానీ యుగమార్పులన్న భూమి ఆకాశములు మారవు, మారలేదు, మారబోవు.

నేటి విద్యలు పేరుకు విద్యలేకానీ ప్రవర్తనలకు ప్రతిష్టలకు అవిద్యలు; ఇవి ధర్మ విద్యలుకావు. ఆత్మానందమును అనుభవించి, ఆత్మార్థమును గ్రహించి, ఆచరించి అనుగ్రహమును పొందిన, అదియే ఆనాటి విద్యకు తగిన పట్టము. **నైతిక కృషి ఆత్మజ్ఞానము, సాధు స్వభావము, పునరుద్ధరణ, ఉత్తమ నడవడి, పరిశుభ్రరీతులు. ఇంద్రియ శిక్షణ, ఘనమగు దివ్య సుగుణముల పెంపొందించుటలో ప్రాధాన్యత.** వీటిని సాధించిన వారు అనుగ్రహమను పట్టమును అలంకరించు చుండిరి; నేడట్లుకాక, కొన్ని పుస్తకముల కంఠస్థ మొనరించిన పట్టమును (డిగ్రీని) పొందవచ్చును! నేటికాలపు విద్యలలో పై చెప్పిన ఘనమగు విద్యాశిక్షణ నొందజాలరు.

స్త్రీకి సక్రమ మార్గమున విద్య గరుపవలెను. దేశీయ సమస్యల నవగాహనము చేసికొనగలిగి యుండవలెను. అట్టి స్త్రీ దేశమునకుగానీ సమాజమునకుగానీ తన సహాయమును సేవను తన జీవితమున కామోదిత నియమములకు అనుగుణమగు విధమున నొసంగవలెను. **ఏదేశమైనను నిర్మింపబడవలెనన్న స్త్రీలు ఉచితమగు తగు సంస్కృతి గలిగియుండవలెను. భావివంశము నేటిమాతపై ఆధారపడియుండును. నేటి వంశము పురాతన మాతపై ఆధారపడి ఉండకుండుటే, నేటి అధర్మ అక్రమములకు కారణము! గడచినది గడచిపోయినది. వచ్చుదాని నయిననూ వర్ధిల్లు జేయుటకు వనితలు పురాతన మాతల ప్రవర్తనలను పాటించవలెను.**

ఏ కాలమునకై ననూ మాతలు దేశమునకు వెన్నెముక వంటివారు; హృదయమువంటివారు; శ్వాసమువంటివారు. ఈ ప్రపంచనాటకమునకు మాతలే ప్రాధాన పవిత్రపాత్ర వహించవలెను. ఆమెనే జాతినీ, నీతినీ నిర్మించుటకు దృఢపడవలెను. స్త్రీయే ప్రపంచపు భావిపౌరులగు బిడ్డలను తర్ఫీదొనర్పవలెను. బిడ్డలకు నైతిక, ధార్మిక శిక్షణలు నొసంగవలెను. తల్లి ధార్మిక అగుటవలన బిడ్డలు ధార్మికు లగుదురు. **తల్లి నైతిక విద్యను పొంది యుండుటవలన బిడ్డలు నైతిక స్వభావులు కాగలరు. కాన దేశ నాశనమునకు, దేశపోషణకు స్త్రీలయొక్క విద్యయే కారణము; ప్రవర్తనయే పాశము.**

దీనికి పెద్దలైన తల్లిదండ్రులుకూడనూ మూలమని చెప్పవచ్చును. నేటి విద్యార్థులు చూతమా, సంస్కార గంధమే వారియందు గనుపించదు. ఆత్మార్థమే వారికి హాస్యముగా కనుపించును. భాషలు నేర్చుట, వేషములు మార్చుట, నేటి భారత సాంప్రదాయమైనది! ఇది వాస్తవిక సంస్కృతి కాదు. నేటి విద్యావంతులు గృహకృత్యములు చేయజాలని వారై యున్నారు. గృహమనగా ఒక హోటలువలె భావించుచున్నారు. సదా వంటవారిపై, దాసీలపై ఆధారపడియున్నారు. నేటి విద్యావంతురాలగు స్త్రీ కేవలము గృహము చిత్రబొమ్మ యైనది; అట్టి స్త్రీలు భర్తకు బరువైన గుండువంటివారే. అంతేకాక వారు అమితజబ్బులకు గురియగుచున్నారు. ఇంటి యందలి

కఠిన కార్యములలో భాగము వహించకుండినందున తినటము నిద్రించుటవలన సోమరితనము బలిసి, జీర్ణశక్తిచచ్చి, కడకు శరీరమును జీర్ణముచేయుటకు, చంపుటకు, సిద్ధమగుచున్నారు.

నేటి స్త్రీలు స్వేచ్ఛను ఆవిరళముగా వినియోగించు కొనుటచే ధర్మగ్లాని ఆవరించినది. చదివిన విద్యను వివేకముతో సద్గుణప్రవర్తనలను సత్‌శీల అభివృద్ధికి వినియోగించక, కేవలము లోకభాగానందములే ప్రధానములని తలంచి, కపటస్వేచ్ఛ ననుపుగొనుటచేత తమను తాము హింసించుకొనుచున్నారు. ఉద్యోగములు చేయుట, డిగ్రీలు పొందుట, వివేక విచక్షణలేక సర్వులతో సంచరించుట; పెద్దలన్న వినయము, పాపమన్నను చెడుకార్యమన్నను భయము; మంచి, దైవము అన్న విశ్వాసము ఇవి లేకుండుట; పతిని కీలుబొమ్మలవలె చేతి యందుంచుకొని ఆడించటము; తన యిచ్ఛారతులను అనుభవించడము; గడచిన తప్పునకు పశ్చాత్తాపము పడకుండటము; ఇవి విద్యలయొక్క స్వరూపములా? కాదు కాదు! ఏనాటికిని కాదు! ఆవిద్యయొక్క విపరీత స్వరూపములు, ఆకారమును నిర్మూలమొనర్చు అహంకారములు, ఇవి విద్యలకే చెడ్డపేరుసంపాదించును. ఇక స్త్రీ ధర్మమునకు హానిచేయవా? పతి గృహమును సతి పవిత్రమైన మందిరముగా తలంచిన సర్వ విద్యలు ఆ భవనమందే సంప్రాప్తమగును. దానికి మించిన ప్రదేశము యేదేశమందునూ లేదు. అందుకనే ఒక మహాభక్తుడు ఈ క్రిందివిధమున తెలిపెను.

"తల్లికైవడి అన్ని తప్పుల సైచి
పుణ్యమొసగు సతుల దేవాలయంబు:
వలదన్న సద్గ్రంథ పఠన కష్టములేక
పలుశాస్త్రములు నేర్పు పాఠశాల;
శ్రమలేక తమయంత సర్వంబు సమకూర్చు
ఆనందమొసగు విహారభూమి;
అజహరాదులనైన ఆడింపగల భవ్య
మహిమ చేకూర్చు సన్మంత్రశాల!
సతుల యనురాగ సర్వార్థ సాధనంబు
కాంత సౌభాగ్య కల్యాణ కల్పకంబు
ప్రణయ త్యాగోపదేశ వైరాగ్యశాల;
పతిగృహంబె సతులకు పాఠశాల!"

విద్యావంతులగు స్త్రీలు మానవసంఘమునకు తమ సామర్థ్యము, అభిరుచి, మానసికతత్వము, అభిలాష, స్వభావము, విద్యయొక్క అంతస్థులనుపట్టి వారి జీవితవిధానధర్మము, లేదా సుప్రతిష్టిత నియమముల కనుగుణమగు, లేదా సంపూర్తి పొందియగురీతిగ ఎట్టి ప్రయోజనకారక సేవనైననూ చేయనగును. తమపైనను తమ కుటుంబముపైననూ, తల్లిదండ్రుల పైననూ, అమర్యాదను లేదా అపకీర్తిని, తమ శీలమునకు మచ్చనుగాని తెచ్చుదాని వారొనర్చరాదు. **శీలము లేనిది స్త్రీలు బ్రతికియుండియు చచ్చినవారుగ పరగణింప బడుదురు.**

వారు లోకమున సంచరించినపుడు చాల జాగ్రత్తగా, మెలకువగా నుండవలెను. పురుషులతో అధిక ప్రసంగము, అత్యధికముగ కలసి మెలగుటలు త్యజించవలెను. భర్తయొక్క కీర్తిమర్యాదలకు భర్తయొక్క ఉత్తమ గౌరవములకు కళంకమురాని ప్రవర్తనలో మెలగుటే విద్యయొక్క వివేకసారము. అందుకనే, "చదువు కొన్నందుకు సార్థకమేమన సద్గుణ నడకలే సారము" అని మహనీయు లనుచుందురు.

నేటి విద్యలు నేర్వకూడదనియు, నేటి సమాజములో తిరుగాడకూడదనియు నే శాసించుటలేదు. ఏ చదువు చదివినను, యే సమాజములో తిరిగినను, సద్గుణములతో పాటు సత్‌ప్రవర్తన, సత్‌ప్రవర్తనలతోపాటు సమాజములు, సమాజములతోపాటు సచ్ఛీలము, సచ్ఛీలముతో పాటు సనాతన ధర్మ విచారణలు ఉండిన చదువేమి చేయును, సమాజమేమిచేయును? చదువులు సమాజములు చెడుపు లేదు; అవి చెడుపుటకు రాలేదు. వాటిని పొందువారి గుణతత్వములనుబట్టి అవి వారికి తోడ్పడునేకానీ, స్వయముగా వాటికి చెడుపుస్వభావములు లేవు. పిల్లి

తన పిల్లలనూ, యెలుకలనూ రెండింటినీ ఒకే నోటితోనే పట్టుకొనును. కాని యెలుకలను చంపివేయును, తన పిల్లలను రక్షించును. ఇది నోటియొక్క స్వభావమా? కాదు తన గుణము స్వభావముచే నోటిచే ఆ కార్యము చేసినది. అట్లే విద్య వివేకమార్గమున అభివృద్ధిపరచి పరోపకారమూ చేయును; పరమార్థమునూ విచారించును, పరతత్వమునూ వెతకించును; పరమహంసలనూ చూపించును.

అట్లుకాక విద్యను అవివేకమార్గమున అజ్ఞానదృష్టతో చూచిన అనాచార, అక్రమ, అన్యాయ, అసత్యమును బల పరచి అనేక చెడుమార్గముల నడపించి మానవజీవితమునే మసి జేయును. ప్రేమనే విషముగాచేయును.

(ధ.వా.పు.35/42)

(చూ॥ స్త్రీ యొక్క ధర్మము)

స్త్రీ హత్య

రాముడు, అందుకొని "స్వామీ! సరి, బ్రహ్మానుగ్రహముతో పుట్టుటచే తపశక్తినే పొందుటచే, మహర్షుల శాపముచే ఘోరమయిన రాక్షసాకారము కలుగుటచే మహా బలముతో, పరాక్రమములతో స్వేచ్ఛా విహారము జరుపుచుండ వచ్చును. ఎంత బలశక్తులుండిననూ తాను అబలయే కదా? **స్త్రీ హత్యా పాపము ఘోరమైనది. కదా?** అందువలననే అగస్త్యుడుకూడనూ ఆమెను చంపక ఇట్టి వికార రూపముకమ్మని శాపమొసగెను. లేకున్న పతిని శపించిన మహర్షి సతిని శపించలేకపోయెనా? స్త్రీ హత్యకు పూనుకొనుట పురుషసింహములకు తగిన సార్థకము కానేరదని వినియుంటిని. ఇందుకేమి చేయుమందురో? ఆజ్ఞ యెసగుడు" అని తనలోని సందియములను విశ్వామిత్రుని ముందు పెట్టగా,

విశ్వామిత్రుడు కూడనూ సంతసించి, "రామా! **స్త్రీ హత్య మహా పాతకమని నాకుమాత్రము తెలియకపోలేదు. అయితే గో, బ్రాహ్మణ సాధు సంరక్షణ అత్యంత ప్రధానములు. ధర్మముపై మూడింటిలో ఇమిడియున్నది. ధర్మరక్షణకై అధర్మమును నిర్మూలము చేయుటలో యెట్టి దోషమును రాదు. "ధర్మోరక్షతి రక్షితః". అన్న ఆర్యోక్తి నీవెరుగవా? ఇది స్వార్థమునకు సలుపు హింస. కానేరదు. లోకరక్షణకై చేయుటలో యెట్టి దోషమూ అంటదనియే నానుడి. అంతియేకాక, సృష్టి, స్థితి లయములు దైవ సంకల్పములు. అవి మానవమాత్రుల కల్పితములు కానేరవు. నీవు దైవాంశసంభూతుడవు. నీకట్టి అధికారము కలదు. అగ్ని కెట్టి మాలిన్యమూ అంటనటుల, దైవమునకు ఎట్టి పాపమూ అంటదు. రక్షించుట కెంత అధికారమో, సృష్టించుట కెట్టి సంకల్పమో శిక్షించుటకూ అట్టిసంకల్ప అధికారములుండును. పాపమునకు తగిన శిక్ష యేనాటికైనను తప్పునది కాదు.** ఇంకను అనేక పాపములు చేసి పూర్తిగ హీనమగుట కంటె, ఈనాడు నీ హస్తములతో మరణించుట ఆ తాటకి పుణ్యమే అని చెప్పవచ్చును. నీవు దానికిని, దేశమునకునూ ఉపకారము చేసినవాడవే అగుదువు. కానీ, అపకారముకానీ పాపముకానీ చేసిన వాడవు కానేరవు. ఈనాడు నీవు దయతలచి వదలినచో, లోకమునకు తీరని లోటు ధర్మమునకు హాని కలుగుటయేకాక, ఆ **తాటకి పాపమును కూడనూ అధికము గావించినవాడ వగుదువు. వేయేటికి దివ్యదృష్టితో నేనెరిగితిని.నీవు రాక్షససంహారమునకే అవతరించితివి. ఇది నీపని. నేడు చేయునది కానీ మున్ముందు చేయనవిగానీ, ధర్మరక్షణ, రాక్షసమర్దన ఈ రెండూ నీ జన్మకు కారణములు, యీ సత్యమును నే తెలిసికొనియే నీ చెంతకు పరుగిడి వచ్చితిని. లేకున్న నిన్ను ఆశ్రయించవలసినవి నాకేమున్నది. మహాఋషులు, సాధు పుంగవులు లోకక్షేమ నిమిత్తమై రాజులు నాశ్రయించు చుందురే కానీ వారి స్వార్థమునకు కాదు. సర్వ సంగ పరిత్యాగులై కాయములను కంద మూలాదులతో కొంతకాలము నింపి కడకు అట్టి ఆహారమును కూడనూ విసర్జించి, కాయముల నలక్ష్యపరచి కాంతిలో లీనము కానున్నవారలు పరుల రక్షణెందులకు ఆశింతురు? ఏమి జరిగిన వారి కేమి నష్టము? అయితే జ్ఞానులు,**

స్థలప్రభావము

తమకు తాము తరించుటేకాక తాము తెలిసికొన్న సత్యమును, లోకులకు తెలిపి, ఆచరించి అనుసరింపజేసి లోకమున జీవులను తరింపజేయ సంకల్పింతురు. లోకముతో మాకేమియని జ్ఞానులు తమ మార్గమునే తాము చూచుకొన్న జీవులు భ్రష్టులయి, ధర్మమును నశింపజేతురు.

ఇట్టి పవిత్ర లక్ష్యమును పక్షమున నిడుకొనియే **మహాఋషులు** లోకులతో సంబంధమును కలిగియుండిరే కానీ, వారికెట్టి స్వార్థమును ఉండదు. వారు **జలములోని తామరల వంటివారు. లోకులతో కలసి మెలసి యున్ననూ లోకవాసనలను వారలలో చేర్చరు. లోకోద్ధారము మాత్రమే చూతురు. ధర్మరక్షణ మాత్రమే చేతురు. దైవమును మాత్రమే చూతురు. ధర్మరక్షణ మాత్రమే చేతురు. దైవమును మాత్రమే ఆశ్రయింతురు."** అని ఉన్న సత్యమును రామునికి విన్నవించగనే రాముడు యేమియూ తెలియని వానివలే "స్వామీ! **మహాఋషుల అంతర్ భావములు మహాపవిత్రమైన అర్థములతో కూడి యుండుట లోకులు గమనింపరు కదా? వారు తెలిసికొను నిమిత్తమై తమరిని నేనీ ప్రశ్న వేసితినే కానీ, వేరు భావము కాదు. ఏవెటులైననేమి? నా తండ్రి ఆజ్ఞ ననుసరించి నేనడుతను. విశ్వామిత్రులవారు చెప్పినటుల నడచు కొమ్మని నాతండ్రియగు దశరథుడు తెలిపెను కనుక పితృవాక్యపరిపాలనయే నా వ్రతము. తాము మహా ఋషులు. మహాతపస్సంపన్నులు, అట్టి మీరే తాటకి వధ న్యాయమని తెలుపుటచే నా తప్పేమియునూ లేదు. అంతియేకాక గోబ్రాహ్మణ హితము కోసము, ప్రజా క్షేమము కోసము ధర్మరక్షణ కోసము, తామాజ్ఞాపించిన యే కార్యమైననూ చేయుటకు నేను సంసిద్ధుడనని, వింటిని పిడికిటితో పట్టి దశదిశలు మారుమ్రోగునట్లు టంకారము చేసను.**

(రా.వా.మొ. పు.78/80)

స్థలప్రభావము

ఒక నాడు రామలక్ష్మణులు సీతను పర్ణశాలలో వదిలిపెట్టి చుట్టుప్రక్కల ప్రాంతాలలో సంచిరిస్తున్నారు. రామ చరణమే తనకు శరణమని భావించుకున్న లక్ష్మణుడు ఒక ప్రదేశమునకు వెళ్ళేసరికి 'అన్నా! నేనింక ఈ అడవిలో ఉండలేను. **ఈ బాధలను భరించలేను. తక్షణమే ఆయోధ్యకు వెళ్ళిపోతాను' అన్నాడు. రాముడు నవ్వుతూ 'లక్ష్మణా! తొందర పడకు, తొందరపడకు. పర్ణశాలకు పోయిన తరువాత ఈ విషయం ఆలోచిద్దాము'** అన్నాడు. కొంతదూరం నడచి ఇరువురూ ఒక చెట్టు క్రింద చల్లని ఛాయలో కూర్చున్నారు. అప్పటికి లక్ష్మణుని మనస్సు మారి పోయింది. రాముడు లక్ష్మణా! ఎప్పుడు వెళతావు ఆయోధ్యకు? అని ప్రశ్నించాడు. లక్ష్మణుడు నిర్ఘాంతపోయి 'రామా! అయోధ్యతో నాకేమి పని ఉంది? నీవే నా సర్వస్వము. నిన్ను వదలి ఆయోధ్యకు వెళ్ళాలనే భావం నాకు కలలో కూడా లేదు' అన్నాడు. **'మరి కొద్దిసేపటి క్రితం అయోధ్యకు వెళ్ళిపోతానని చెప్పావు కదా!' అన్నాడు రాముడు. 'ఆవిధంగా ఎందుకు అన్నానో నాకు తెలియదు' అన్నాడు లక్ష్మణుడు.** అప్పుడు రాముడు చెపుతున్నాడు: 'లక్ష్మణా! **దీనికి కారణం స్థలప్రభావమే.** ఇంతకు ముందు మనం శూర్పణఖ సంచిరించిన ప్రదేశంలో సంచరించాము. కాబట్టి ఆ శూర్పణఖ భావాలే నీలో ఆవిర్భవించాయి. ఆ ప్రదేశం దాటి ఇప్పుడు మనం చిత్రకూట పర్వతంపైకి వచ్చాము. ఇది మహర్షులు నివసించిన ప్రదేశము. కాబట్టి ఇక్కడకు వచ్చేసరికి నీలో మహర్షుల భావాలు ఆవిర్భవించాయి.'

మీరు సంచిరంచే ప్రదేశం కూడా పవిత్ర మైనదిగా ఉండాలి. దుష్టులు, దుర్మార్గులు సంచరించే ప్రదేశంలో మీరు ఉండకూడదు. **'త్యజ దుర్జన సంసర్గం',** చెడు ఉన్నదంటే దాని నుండి బయటికి పోవాలి. **'భుజ సాదు సమాగమం'.** మంచితో సంబంధము నేర్పర్చుకోవాలి. **'కురు పుణ్య మహోరాత్రం'.** నిరంతరము మంచినే చేస్తూ జీవించాలి. **'స్మర్మ నిత్య మనిత్యతాం', ఏది నిత్యము? ఏది అసత్యము? అనే విచారణ చేయాలి.** ఇవే మీరు చేయవలసిన సాధనలు. కంటికి కనిపించేదంతా అనిత్యమే. **నిత్యసత్యమైనది ఆత్మతత్వ మొక్కటే. దానిని**

ఆశ్రయించడమే శరణాగతి. కనుక ఆత్మ భావాన్ని పెంచుకొని. ఆత్మచింతనతో మీ జీవితాన్ని సార్థకం గావించుకోండి. ఈవిధమైన సాధన చేసినప్పుడు **దైవం మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉండి మిమ్మల్ని అన్ని విధాలుగా కాపాడుతాడు.**

(స.సా.అ.98పు.280)

స్థితప్రజ్ఞుడు

స్థితప్రజ్ఞుని లక్షణములను తెలుపుమని కేశవుని ప్రార్థించగా! "పార్థా! మనోగతాలైన సర్వవాంఛలను సంపూర్ణముగా యెపుడు వదలి ఆత్మయందు ఆత్మలో సంతోషించువాడై యున్నాడో అట్టివాడే స్థిత ప్రజ్ఞుడు" అని చెప్పి ఈ విధముగా విశదీకరించెను.

"ఇందులో రెండు పద్ధతులున్నవి. ఒకటి విధ్వంసకపద్ధతి. రెండవది విధాయకపద్ధతి మనసునందుకల సర్వఆశలూ వదలుట విధ్వంసకము; అంతఃకరణములో సంతోషముగా ఉండుట విధాయకము! హృదయ భూమిలో మొలిచిన మలినపు మొక్కలను పెరికి వేయుట-హృదయమును నిర్మలముచేయుట - విద్వంసకము! నిర్మలమైన హృదయభూమిలో భగవత్‌రతిని నాటుట - విధాయకము! కావలసిన పంటను పెంచుకొనుట విధాయకము. అవసరములేని మలినపు మొక్కలను పెరికివేయుట విధ్వంసకము! ఇందులో విషయ వాసనలు అవసరములేని మొక్కలు; భగవత్‌రతి అవసరమయిన మొక్క అని భావించవలెను. కోర్కెల యొక్క మూటే మనసు, ఎప్పుడు కోర్కెలు పోవునో అప్పుడు మనసు వుండదుకదా!

(గీ.పు.37/38)

కోరికలేకపోయిన మనసుకు రూపమేలేదు. యెప్పుడు మనసే లేకుండునో అప్పుడే స్థిత ప్రజ్ఞుడు; కాన, కామముల నిగ్రహము సాధించవలెను!

(గీ.పు.38)

స్థితప్రజ్ఞుని ఆత్మానందమునకు బాహ్య వస్తువులు వినియోగ పడవు.

(గీ.పు.39)

సుఖములు కానీ దుఃఖములు కానీ మూడు విధములు. ఒకటి ఆధ్యాత్మికము; రెండవది అధిభౌతికము; మూడవది ఆధి దైవికము. సుఖ దుఃఖములు పాప పుణ్యముల సంబంధములు. పాపములను చేయవద్దని చెప్పుటకే దుఃఖములు వచ్చుచున్నవనియు, పుణ్యములు చెయ్యమని చెప్పుటకే సుఖములు వచ్చుచున్నవనియు తలంచవలెను. **కానీ స్థితప్రజ్ఞుని యే దుఃఖమూ బాధించదు; యే సుఖమూ ఆకర్షించదు! కష్టములకు కలతపడడు! సుఖములకు లొట్టలువేయడు. ఆత్మవిషయము తెలియనివారే ఈ రెంటికీ పొంగి కృంగేది.**

స్థిత ప్రజ్ఞుడు మననశీలుడు. అనగా ముని అందురు. స్థితబుద్ధి కలవాడే స్థితప్రజ్ఞుడు. ఇంద్రియ నిగ్రహం సాధకునకు అగత్యం; అయితే అదే సర్వస్వము కాదు అని తెలిసికొనవలెను. విషయానిక్తి మనస్సును శేషించి యున్నంతవరకూ ఇంద్రియ నిగ్రహం పూర్ణత్వము పొందదు. అందుకనే అర్జునునకు, "బావా! ఇంద్రియములను నిగ్రహించుము; అపుడు నీవు కోరలు పెరికిన పాముయెడలవలె భయము లేక ఉందువు. విషయ చింతన ప్రారంభ మయినదన్న తన నికృత స్వరూపాన్ని చూడవలసివచ్చును; అనుభవించవలసివచ్చును. **గణితానికి అంతులేదు; కామానికి పూర్తిలేదు అన్నట్లు బాహ్యేంద్రియ నిగ్రహముతో పాటు మనోనిగ్రహము కూడా వుండిననే స్థితప్రజ్ఞుడు; అట్లులేకున్న దానికి విరుద్ధమైన గత ప్రజ్ఞుడు కాగలడు. గత ప్రజ్ఞ స్థానము అధోగతి, స్థితప్రజ్ఞస్థానము ఊర్ధ్వగతి, మనస్సును నిగ్రహించిన చాలును. బాహ్యేంద్రియములను నిగ్రహించకపోయిననూ అంత ప్రమాదము సంభవించదు. మనసున విషయాసక్తి నశించిన, రాగద్వేషములు నిరాశ్రయమై దిక్కుతోచక తమకుతామే లొంగిపోవును. రాగద్వేషములు నశించిన తర్వాత ఇంద్రియములు విషయాలతో ప్రవర్తించిననూ బంధానికి అవకాశముండదు. ఆత్మప్రసాదలబ్ధునకు సంసారిక దుఃఖము లెక్కడివి!** సూర్యుడుదయించినంతనే నక్షత్రము లగుపించనటుల, జ్ఞాన ప్రసాదలాభముతో

దుఃఖ అశాంతులు, అజ్ఞాన స్వరూపాలు పలాయనమగును. మానవునకు **మూడు ముఖ్యమైన ఉపకరణాలు కలవు; మనస్సు బుద్ధి, యింద్రియములు!**ఇవి ఒకదానితో ఒకటి సమ్మేళన కలిగినపుడే వరించినపుడే, వాటి తత్వములయిన సంసారప్రాప్తి. ఆత్మప్రాప్తి చేకూరుచున్నవి.

(గీ.పు.39/40)

ఇంద్రియములను సర్వతోముఖంగా నిగ్రహించుట స్థితప్రజ్ఞ లక్షణము. అన్ని భూతములకూ ఏది రాత్రియో స్థితప్రజ్ఞుడు అందులో మేల్కొనియుండును. అన్ని భూతములు మేల్కొనియున్న కాలములో స్థితప్రజ్ఞుడు నిద్రించు చుండును. (అనగా పగలు రాత్రిగను రాత్రి పగలుగనూ) దీనికి సామాన్యముగా లోకమున అక్షరార్థమును తీసుకొనుచున్నారు. అది స్థిత ప్రజ్ఞుని లక్షణమునకు సరితూగదు. అంటే, సామాన్య మానవులు రాత్రి నిద్రించు సమయమున స్థిత ప్రజ్ఞుడు మేలుకొనుననియు, సామాన్య మానవులు మేలుకొనిన పగలు, స్థితప్రజ్ఞునికి రాత్రి అనియు తలంతురు. దీనికి గూఢార్థము అతి సున్నితము. లౌకిక విషయములందు సామాన్య మానవులు జాగ్రత వహించుచుందురు. అనగా విషయేంద్రియములందు విజృంభించి యుండుటే మేలుకొనుట. కానీ, స్థితప్రజ్ఞుడు ఇట్టి విషయేంద్రియములందు విముఖుడై యుండును: అనగా నిద్రించును, **విషయేంద్రియములను అరికట్టుటే నిద్రించుట; విషయములను రేకెత్తించుటే మేలుకొనుట, సామాన్యమానవులు ఇంద్రియములను విజృంభింప జేయునపుడు స్థితప్రజ్ఞుని ఇంద్రియములు నిద్రించును. దీనినే, మరొకరీతిగా కూడనూ చెప్పవచ్చును. ఆత్మస్థితిని మరచుట, దేహస్థితిని పొందుట. ఇవి సామాన్య మానవుల స్థితులు. సామాన్య మానవులు ఆత్మస్థితియందు మరచి నింద్రించుచూ దేహ స్థితిలో మేల్కొనుచుందురు. స్థిత ప్రజ్ఞుడు అట్లుకాక ఆత్మస్థితిలో మేల్కొని దేహస్థితిలో నిద్రించును; ఇదే స్థిత ప్రజ్ఞస్థితి. సామాన్య మానవులు అజాగ్రత్తలో వున్న ఆత్మస్థితిలో స్థితప్రజ్ఞుడు జాగ్రత్తతోను, సామాన్యులు జాగ్రతలో వున్న విషయవాసనలలో స్థితప్రజ్ఞుడు అజాగ్రతతోనూ మెలగును. ఇదియే సూక్ష్మార్థము.** కానీ, అందరూ మేలు కొన్న సమయమున స్థితప్రజ్ఞుడు నిద్రించుననియు **అందరూ నిద్రించు సమయమున స్థితప్రజ్ఞుడు మేలుకొనుననియు అక్షరార్థమునే తెలిపిన దొంగలు ఘూర్కాలు, పహరావారు, ఇట్టి వారందరూ రాత్రులందు మేల్కొని పగలు నిద్రింతురు కదా! వీరందరూ స్థితప్రజ్ఞులు కావలసిన దేనా!**

సర్వకామములనూ వదలి యెవ్వడు నిస్పృహుడై అహంకారమమకార రహితుడై సంచరించునో వాడే శాంతిని పొందును. స్థిత ప్రజ్ఞ లక్షణమును కామనాత్యాగ ప్రసంగంతో కృష్ణుడు ముగిస్తాడు. ఈ సాంఖ్యయోగము అద్వితీయమయినది గీతాసారమంతా ఇందులో యిమిడ్చబడినది.

జీవిత కురుక్షేత్ర సంగ్రామ రంగమున అతిదీనుడై విభ్రాంతుడై దిక్కుతెన్నూ తోచక నిర్వేదించే మానవునకు మాధవుడు సాంఖ్యయోగోపదేశము ప్రసాదించెను. తక్కిన అధ్యాయములు వ్యాఖ్యానములుగా ఈ రెండవ అధ్యాయమైన సాంఖ్యయోగమునందే అమరి ఉన్నవి. ఇందులో సందియము లేదు. అర్జునా! మనసును వదలి నీలో నీవు తన్మయుడవై యుండుటకు సిద్దము కమ్ము. **తాబేలు వలె యెవడు శబ్దాది విషయముల నుండి తన యింద్రియములను అన్ని విధముల నిగ్రహింపగల్గునో వాడే స్థితప్రజ్ఞుడు"** అని కృష్ణపరమాత్మ ఈ రెండవ అధ్యాయమున పదకొండవ శ్లోకము నుండి ముప్పదవ శ్లోకమువరకూ ఆత్మతత్వమును వివులముగా పండువలచి అందించునటుల అర్జునునకు అందించెను.

(గీ.పు.39/42)

రెండవ అధ్యాయము యేబది ఆరవశ్లోకము మొదలు డెబ్బది రెండవ శ్లోకము వరకు స్థితప్రజ్ఞుని లక్షణములు, దాని మహిమను విశదీకరించెను;

(గీ.పు.43)

ఇంద్రియ నిగ్రహము గల వానికి శీతోష్ణ సుఖ, దుఃఖ, మానవమానములన్నియూ సమముగానే యుండును.

బాహ్యేంద్రియ నిగ్రహముతో బాటు, మనోనిగ్రహము ఉండి స్థితప్రజ్ఞుడు మనస్సును నిగ్రహించిన చాలును. మనస్సున విషయాసక్తి నశించిన రాగద్వేషములు నిరాశ్రయమై, దిక్కులు తోచక, తమకు తామే లొంగిపోవును. ఇది కేవలము శీతోష్ణముల వలె నుండును. శీతలము వేడికాలమున సుఖమును, హాయిని ఇచ్చును. అటులనే ఉష్ణము కూడాను. శీతాకాలమున సుఖమును, హాయిని అందించును. అటులనే విషయస్పర్శలు కూడానూ, ప్రపంచమున్నంతవరకూ బయట విషయములు తప్పవు. అయితే వాటిని భరించుకొను విద్యను ఉపాయమును నేర్చుకొనవలెను.

(శ్రీ.భ.ఉ.పు.20)

స్థితి

(చూ॥ సృష్టి)

స్థూలరూపము

(చూ॥ మహాభారతయుద్ధము, రామాయణము)

స్థైర్యము

స్థైర్యము చపలచిత్తము లేకుండుట, నిమిషమున కొక భావము, దినమునకొక ఆట కాక యేదైననూ మంచిదని విశ్వసించిన తరువాత యెన్ని ఇక్కట్లు సంభవించినను సాధకుడు పట్టువదలక శ్రద్ధతో అనుష్ఠించవలెను. **దీనినే దీక్ష అని కూడనూ అందరు.** దౌర్బల్యము పనికిరాదని దీని అంతరార్థము.

(గీ.పు.209)

(చూ॥ ఇరువది గుణములు)

స్నాతకోత్సవము

(చూ॥ విద్య)

స్నానము

(చూ॥ ఆరోగ్యము, విధులు, శౌచము)

స్నేహభావము

దైవాన్ని కూడా ప్రియమైన స్నేహితునిగా భావించు కున్నప్పుడు మన భావాలన్నీ స్పష్టంగా చెప్పుకోవటానికి ఒక ధైర్యం వస్తుంది. **త్యాగరాజు దైవాన్ని తన పాతస్నేహితునిగా భావించి గౌరవ మర్యాదలు ఏమియు పాటించక ఏకత్వంగా పోయాడు.** గౌరవ మర్యాదలు యివ్వడానికి అనేకత్వంగా, భిన్నత్వంగా భావించలేదు. భగవంతుని తన యింటికి రారా యని పిలుస్తాడు.

'రా రా మాఇంటి దాకా (రాము)
రాము రారా మా ఇంటి దాక ॥రా
రఘువీర సుకుమార నే మొక్కెద ॥రా॥
రారా దశరథ కుమార నన్నేలుకోరా నే తాళలేరా॥ రా॥
పిలిచి, పిలిచి, విసుగెత్తినది
ఎంత వేడుకొందు 'ఓ రాఘవా
పంతమేలరా ఓ రాఘవా ॥ఎం॥
అప్పటికి అతని తృప్తి లేదు
మారు బలక్కకున్నవేమిరా। (రాము)
మామనోరమణా ॥మా॥
జారచోర, భజన చేసితిరా
సాకేతా, సదన ॥మా॥
మరికొంతసేపు చూశాడు రామ చంద్రుని గూర్చి నిన్ను నేనెందు వెదకుదురా ।ఓరామా॥ని॥

ఈ విధంగా **అనేక మంది భక్తులు, భగవంతుని స్నేహ భావము చేత ఏక వచనంగా సంబోధించి,** ఆరాధనలు సలిపారు.

(సా.పు.99/105)

స్నేహము

స్వామి బాల్యంలో తన స్నేహితునితో "నీకు నాకు మధ్య స్నేహము కలకాలము ఉండాలంటే మనం ఈ రకంగా

స్నేహితుడు/స్నేహితులు

వస్తువులను ఇచ్చి పుచ్చుకోకూడదు. అవసరములోనున్న ఒక వ్యక్తి ఎవరైనా ధనవంతుని వద్ద నుండి ఏదైనా తీసుకున్నప్పుడు దానిని తిరిగి ఎలా చెల్లించాలా అనే ఆందోళన అతని మనస్సులో బాధిస్తూంటుంది. అలాగే ఆ వస్తువును ఇచ్చిన వారి మనస్సును వారు చేసిన "దానము" మలిన పరుస్తుంది. **నిజమైన స్నేహము అనేది రెండు హృదయముల మధ్య ఉండాలి. ఇచ్చి పుచ్చుకునే పద్ధతి మీద మనం స్నేహబంధము పెంచుకున్నప్పుడు తీసుకునే వ్యక్తి కించపడగా, ఇచ్చిన వ్యక్తి గర్వపడతాడు. అటువంటి స్నేహము తొందరలోనే విచ్ఛిన్నమవుతుంది.** అందువలన నీవు పంపిన దుస్తులను నేను తీసుకోవడం లేదు. ఈ ఉత్తరంతో వాటిని త్రిప్పి పంపిస్తున్నాను."

(దై.ది.పు.307)

(చూ॥ ఆనందము, క్షేత్రము)

స్నేహితుడు/స్నేహితులు

అసలు లోకంలో ~~ఈనాడు~~ **నిజమైన స్నేహితులు లేనే లేరు.** ఎవరీ స్నేహితులు? ఎన్నాళ్ళు? కాలేజీలో చదివేంత వరకే కదా! ఆ తరువాత? **'ఎవరికి వారే యమునా తీరే'.** నీ తండ్రి మంచి పదవిలో ఉండి, నీ జేబులో పైకం దండిగా ఉన్నంత కాలం అందరూ 'హలో, హలో' అంటూ దగ్గర చేరతారు. తండ్రి రిటైరైన తరువాత,జేబులు ఖాళీ అయిన తరువాత కనీసం 'గుడ్‌బై' చెప్పేవారు కూడా ఉండరు. **మైత్రి అనగా త్రికరణ శుద్ధిగా స్నేహం చేయడం.** అలాంటివారున్నారా ఈ లోకంలో? లేనే లేరు. నిజమైన స్నేహితు డెవరు? **God is the only real friend. God is the only ture friend. సర్వకాల సర్వావస్థలయందు నీవెంట జంట కంట ఉండే భగవంతుడే నీ నిజమైన మిత్రుడు.** ఇంకెవ్వరూ కాదు. **Tell me your company, I shall tell you what you are.** నీ స్నేహితులను బట్టి నీవెలాంటివాడవో చెప్పవచ్చును. **వీరాధివీరుడైన, శూరాధిశూరుడైన కర్ణుడంతటివాడు దుష్టసాంగత్యంచేత దుష్ట చతుష్టయంలో ఒకడై అపకీర్తి పాలైనాడు. ఇంక బంధువులెవరు? మరణానంతరం ఎవరికి ఎవరు? అందరూ మధ్యలో వచ్చి మధ్యలో విడిపోయేవారే కదా! కదిలేపోయే మేఘములవంటివారే కదా! మరణానంతరం బంధువులు వాకిలి వరకే ,ఆలుబిడ్డలు వల్లకాటి వరకే. నీ వెంట ఉండేది జగద్బంధువైన దైవమొక్కడే. నీవైనా ఎంతకాలం? నీవు పుట్టక ముందు, నీ జీవిత కాలంలో, నీ మరణానంతరం కూడా ఉన్నాడు దైవం. ఆ దైవమే సత్యం, నిత్యం. ఆ దైవాన్ని విశ్వసించు, అనుసరించు కారణం? ఏనాటికైనా నీవు ఈ లోకాన్ని విడువవలసిందే. Catch hold of God with your 'right' hand. It is always the 'right' thing to do. Catch hold of the world with your 'left' hand. One day or the other it has to be 'left'. ఈ ప్రపంచాన్ని నీవు ఏనాటికైనా విడువవలసిందే దైవాన్ని గట్టిగా పట్టుకో. అదే మంచిది ('Right')**

(స.సా.ఫి.99 పు.52)

(చూ॥ నరజన్మ)

స్పర్శ

(చూ॥ పంచభూతములు)

స్పర్శనం

(చూ॥ దర్శనం)

స్పెషలైజేషన్

ఈ వైద్య విధానములో నేను డాక్టర్‌ను కాదు. కాని, మీరందరూ డాక్టర్లే. కనుక, ఈ విషయాన్ని మీరు చక్కగా యోచించాలి. నేడు ఎవరికివారు తమ **స్వార్థాన్ని పురస్కరించుకొని ఈ Subject లో Specializations చేస్తున్నారు. ఉన్నది ఒకే గుండె కాని, దీనిలో వంద Specializations ఉంటున్నాయి. ఒకరు చిన్న Valves మీద, మరొకరు పెద్ద Valves మీద, ఇంకొకరు Cells మీద** - ఈ విధముగా ఒక్కొక్కరు ఒక్కొక్క దానిపై Specialization చేస్తున్నారు. కాని, **నా ఉద్దేశ్యమేమిటంటే**

- ఈ స్పెషలైజేషన్‌లతో గెండెను ముక్కలు ముక్కలు చేయకుండా, గుండె సంతటిని ఒక్కటిగా స్పెషలైజ్ చేయాలి. నీవు కేవలం Cells గురించి మాత్రమే స్పెషలైజ్ చేసి యున్నావనుకో--ఎవరైనా నీ వద్దకు వచ్చి గుండె Valves పనిచేయటం లేదంటే - అతనిని నీవే ఇంకొక డాక్టరు వద్దకు పంపించాలి. నీవే డాక్టరైయుండి నీ దగ్గరకు వచ్చిన **వారిని వేరొక డాక్టరు వద్దకు పంపడం అవమానకరం కాదా?** కనుక, నీవు గుండెనంతటినీ స్పెషలైజ్ చేసి అన్నీ చేతిలో పెట్టుకోవాలి. **ఏజబ్బు నైనా నివారణ చేయడానికి పూనుకోవాలి. ఈ స్పెషలేజేషన్ అనేది జగత్తుకే చాలా చెడుపు చేస్తున్నది. కనుక, స్పెషలైజేషన్ అనేది ఉండకూడదు. అన్నింటియందు మనము ఆరితేరాలి.**

(స.సా.మా.93 పు.63)

స్మరణ/స్మరణలు

"నాస్తి నాస్తి మహాభాగ కలికాల సమం యుగం
స్మరణా చ్చింతనాదేవ, ప్రాప్తాహి పరమా గతిః"

(ఆ.రా.పు.7)

స్మరణ చింతన రెండూ ఒకటికాదు. ఒక నామాన్ని జపించటం స్మరణ. అనుభవించిన దానిని మరల జ్ఞప్తికి తెచ్చుకోవటం, మననం చేయటం చింతన. రామ రామ అనో కృష్ణ కృష్ణ అనో అంటుంటే అది స్మరణ. రాముని కృష్ణుని లీలలను వారు చేసిన కార్యములను తలచుకోవటం చింతన. అయితే స్మరణలో అనేక నామములుండ కూడదు. ఒకే నామం ఉండాలి.

(స.సా.డి.86పు.317)

స్మరించు

మృకండ మహర్షి కుమారుడైన మార్కండేయునికి ఈశ్వరుడు 16 సంవత్సరాల ఆయుస్సును ప్రసాదించాడు. ఈ రహస్యం మార్కండేయునికి తెలియదు. ఒకనాటి రాత్రి మృకండుడు, అతని భార్య ఇంట్లో కూర్చుని విలపిస్తున్నారు. మార్కండేయుడు "అమ్మా! నాన్నా! మీ విచారమునకు కారణమేమిటి?" అని ప్రశ్నించాడు. "నాయనా! ఈశ్వరుడు నీకు 16 సంవత్సరముల ఆయుస్సును మాత్రమే అనుగ్రహించాడు. ఈనాటితో నీకు 16 సంవత్సరములు నిండుతున్నాయి. ఇంక నీకు, మాకు ఎట్టి సంబంధమూ ఉండదు" అని చెప్పారు. "ఈ మాట నాకు ముందే ఎందుకు చెప్పలేదు? ఈశ్వరానుగ్రహంచేత ఎలాగైనా నా ఆయుస్సును పొడగించుకుంటాను" అని పలికి అతడు తక్షణమే ఈశ్వరాలయానికి వెళ్ళి శివలింగాన్ని గట్టిగా కౌగలించుకుని, "ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ.." అని నామస్మరణ చేస్తూ కూర్చున్నాడు. అర్ధరాత్రి సమయంలో యముడు వచ్చి మార్కండేయునిపై తన పాశం విసిరాడు. ఆ సమయంలో మార్కండేయుడు శివలింగాన్ని గట్టిగా కౌగిలించుకుని ఉండడంచత యమపాశం ఈశ్వరునిపై కూడా పడింది. తక్షణమే ఈశ్వరుడు ప్రత్యక్షమై "ఓ యముడా! నాపై కూడా పాశం వేసేటంత ధైర్యం ఉందా నీకు!" అని అతనిని భస్మం చేశాడు. ఈవిధంగా, **మార్కండేయునికి రావలసిన చావు యమునికి పోయింది. యముని యొక్క చిరంజీవత్వం మార్కండేయునికి వచ్చింది.** కనుక **దైవస్పర్శచేత, దైవానుగ్రహంచేత, దైవప్రార్థన చేత మీరు ఎటువంటి కర్మలనైనా మార్చుకోవచ్చును.** అందుచేత, దైవాన్ని నిరంతరం ప్రార్థించడం, స్మరించడం పూజించడం అత్యవసరం. దైవం ఎక్కడో ప్రత్యేకమైన స్థానంలో లేడు; మీయందే ఉన్నాడు. దేహమే దేవాలయం. అట్టి అంతర్ముఖమైన దైవాన్ని మీరు నిరంతరం స్మరిస్తూ రావాలి.

(స.సా.న.99 పు.287/288)

శ్లో॥ చేతసా సర్వకర్మాణి మయిసన్న్యస్య మత్పరః
బుద్ధి యోగముపాశ్రిత్య మచ్చిత్త స్సతతం భవ

అర్జునా! జరామరణములనే దుఃఖము నుండి విముక్తి పొందు నిమిత్తము, నన్నాశ్రయించి ఎవడు సాధన చేయునో వాడు బ్రహ్మను, సంపూర్ణమైన ఆధ్యాత్మికాన్ని, కర్మను

స్మరింతురు

తెలుసు కొన్నవాడగును. అధిభూత, అధిదైవ, అధియజ్ఞములతో గూడిన నన్ను ఎవడు ఆరాధన చేయునో, అట్టివాడు సమాహితచిత్త వృత్తి గలవాడై దేహము వీడు సమయమునందు గూడా నన్ను మరువక చింతించును. **అంత్యకాలమునగా ఎప్పుడో కాదు. ఎప్పటికప్పుడే! నశ్వర శరీరములకు, ప్రతిక్షణము అంత్యమే! అట్టి అంత్య సమయమున ఏమి స్మరింతురో, అదియే తదుపరి పరిస్థితులకు అనుకూలమగును. అనగా పునర్జన్మకు పునాది. అట్టి సమయమున నన్ను స్మరించినవాడు నా భావాన్ని పొందును.** అనగా నన్నే చేరును.

నాస్తి నాస్తి మహాభాగ
కలికాల సమయుగం
స్మరణాత్ ఉచ్చరణాత్తేవ
ప్రాప్నోతి పరమాం గతిః

అన్నట్లు ఇప్పుడు నామ సంకీర్తన చెయ్యకపోతే ఇంకెప్పుడు మనము చేసేది. నీ యొక్క హృదయాన్ని అనుసరించు. నీ ఆత్మతో సంబంధము పెట్టుకో.

(శ్రీ.భ.ఉ.పు.33)

స్మరింతురు

లోకములో మానవులు భగవంతుని మూడు విధములుగా **వర్ణింతురు.** అవియేవన 1. నిర్గుణ నిరాకార రూపము. 2. సగుణ నిరాకార రూపము. 3. సగుణ సాకార రూపము. భగవంతుని మరో విధముగా కూడా **స్మరింతురు. "కవి అనియు, పురాణుడనియు, అనుశాసితుడనియు, సూక్ష్ముల న్నికంటే సూక్ష్మ రూపుడనియు, సర్వాధారుడనియు, అచింత్య రూపుడనియు, ఆదిత్యవర్ణుడనియు, తమస్సుకు అతీతుడనియు వర్ణింతురు.**

1. **కవి.** కవి అనగా కేవలము కావ్యములు పద్యములు వ్రాయుటకాదు. కవి అనగా **"సర్వజ్ఞత్వం". కాన, భగవంతుడే త్రికాల దర్శి. అతనే సర్వజ్ఞుడు. భగవంతుడు అక్షరకవి. అతని కవిత్వం అమృతకావ్యం.**

2. **పురాణుడు.** పురాణుడన ఎంత పాత వాడయిననూ అంతవరకూ క్రొత్తవాడగు చుండును. అట్టివాడు భగవంతుడు. అతనే సనాతనుడు. యెప్పటికప్పుడు నూతనుడు. అందుకనే పురాతనమితి పురాణం అని అన్నారు.

3. **అనుశాసితుడు.** అను శాసితుడనగా సర్వసతంత్ర స్వతంత్రుడు. అతడు అందరియందునూ శాసనము చేయువాడు. 'మనస్సునైనా శాసించేవాడు భగవంతుడు. కనుకనే అతనిని అనుశాసితుడు అన్నారు.'

4. **సూక్ష్మరూపుడు.** నిర్గుణుడని అర్థము. దీనిని ఇంద్రియములతో తెలిసికొన సాధ్యము కాదు. పంచభూతములు అను సూక్ష్మవస్తువులకంటే, తాను అతీతుడయి వుండుటచే అతని యందు యే గుణములూ లేనందున భగవంతుడు సూక్ష్మాతి సూక్ష్మస్వరూపుడయి వున్నాడు.

5. **సర్వాధారుడు.** లోకమున ఆధారము, ఆధేయము అని రెండు కలవు. మన కంటికి కనుపించు, చెవులకు వినుపించు చరాచరజగత్తుకు ఆధారమైనవాడు భగవంతుడు.

6. **అచింత్యరూపుడు.** అనగా చింతింప వీలుకాని వాడు అని అర్థము. మనసుతో చింతవీలు కాదని అర్థము.

7. **ఆదిత్యవర్ణుడు.** ఆదిత్యవర్ణం, **అనగా సూర్యునివలె స్వయం ప్రకాశకుడు.** భగవంతుడని అర్థం. అంతేకాదు, **సూర్యుని ప్రకాశము కూడనూ పరమాత్ముడే. లోకమును ప్రకాశింప జేయువాడు భగవంతుడు.** కనుక అతనికి ఆదిత్యుడని పేరు వచ్చినది. 'ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' ప్రతి మానవుని యందు అజ్ఞానమనే చీకటికి ఆవల తేజోవంతుడై ప్రకాశిస్తున్నాడు.

8. **తమస్సుపరుడు.** తమస్సు అనగా అజ్ఞానము. పరుడనగా సాక్షి. అజ్ఞానమునకు సాక్షి అని అర్థము. మాయ అన్ననూ, అజ్ఞానమన్ననూ ఒకటే కనుక, అట్టి మాయకు అతీతమైనవాడు పరమాత్ముడు అని కూడనూ తలంచవచ్చును.

(శ్రీ.స.సూ. పు. 219/221 మరియు స.సా.అ.96 పు. 265)

స్వంత ఆస్తి

సత్యభామ కృష్ణుని బంగారంతో తూచడానికి ప్రయత్నించి విఫలమైంది. కాని రుక్మిణి కేవలం తులసి దళంతో కృష్ణుని తూచగలిగింది. **భగవంతుడు బంగారమునకు చిక్కడు. ధనమునకు దొరకడు. గుణమునకు మాత్రమే చిక్కుతాడు. ప్రేమకు లొంగుతాడు. కనుక ప్రేమను పెంచుకోండి. మీ అభిష్టములన్నీ నెరవేరతాయి. ద్వేషించకండి. ఇదియే మీకు సరియైన ఆదర్శము. ఇది ముఖ్యమైనటువంటి సందేశము.** ప్రేమస్వరూపులు మీరు కావాలి. ప్రేమానందమును మీరు అనుభవించాలి. **ఇదియే ~~ఈనాడు~~ నేను మీకు యిచ్చేటటువంటి గొప్పGift. నాదగ్గర ఉన్నటువంటి స్వంత ఆస్తి అది ఒక్కటే. ప్రేమనే....ప్రేమనే...కనుక ఆ ప్రేమను మీకు ఎంతైనా యిస్తాను. కడపటికి దేహమునైనా మీకు యిస్తాను.** మీరు ఆనందంగా జీవించండి! ఆదర్శవంతులుగా బ్రతకండి! అప్పుడే నాకు నిజమైన ఆనందం కలుగుతుంది. **ఏదిచ్చినా నాకు ఆనందం కాదు. మీ ప్రేమనే నాకు ఆనందం. నా ప్రేమనే మీకు సౌభాగ్యం.** కనుక మీరు దానిని కాపాడుకోవాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

(శ్రీ.డి.2000పు.8)

స్వధర్మము

శ్లో॥శ్రేయాన్ స్వధర్మో విగుణః
పరధర్మా త్స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః
పరధర్మో భయావహః

కృష్ణుడు స్వధర్మము, పరధర్మము అనే వాటిని బోధిస్తూ వచ్చాడు.పరధర్మమంటే ఏమిటి? ఇంకొకరి ధర్మమా? పరధర్మమంటే ఇతరుల ధర్మము కాదు. అట్లే స్వధర్మమంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు సంబంధించిన **కుల ధర్మములు కాదు. 'స్వధర్మము' అనగా 'ఆత్మధర్మము.' పరధర్మమనగా దేహ ధర్మము. స్వ అనేది కేవలం ఆత్మకు మాత్రమే సంబంధించినది. "స్వ+ఇచ్ఛ=స్వేచ్ఛ" ఆత్మ నుండి ఆవిర్భవించినదే స్వేచ్ఛ. అదే స్వధర్మము. అదే నివృత్తి; అదే నిశ్చలమైన తత్వము.**

(శ్రీ.భ.ఉ.పు.28)

పరధర్మమనగా దేహధర్మము. స్వధర్మమనగా ఆత్మ ధర్మము అంతేకాని స్వధర్మమంటే క్షత్రియ ధర్మము. వైశ్య ధర్మము, శూద్రధర్మము, బ్రాహ్మణ ధర్మము యీ కులములకు సంబంధించినది కాదు. స్వధర్మము అనగా ఆత్మధర్మము, ఆత్మధర్మము ఎప్పటికి భయమును అందించదు. "పరధర్మోభయావహః" ఈ దేహ ధర్మము అనుసరించినప్పుడే మనకు భయము ఆవిర్భవిస్తుంది.

(బృ.త్ర.పు.154)

స్వధర్మాచరణ

చేతులు పవిత్ర కర్మలయందు నియుక్తములు కావలెను.లోపల ఈశ్వరస్మరణ, **బైట స్వధర్మాచరణ, చేతితో సేవాకర్మ, మనసున వికర్మ.** ఇవి నిత్యకార్యక్రమము కావలెను. సంస్కారములన ప్రవాహము ఒక దిశలోనే పారుచుండవలెను. పర్వతములపై పడిన వర్షము అన్ని దిశలోనే పారుచుండవలెను. పర్వతములపై పడిన వర్షము అన్నిదిశలకునూ ప్రవహించిన దానివలన నది యేర్పడదు. అట్లుకాక నీరంతయూ ఒక దిశకే ప్రవహించినో దానివలన సెలయేరుగా, తరువాత ప్రవాహముగా, ప్రవాహము నదిగా నది మహానదిగా విస్తరిల్లుచూ వెళ్లి వెళ్లి సముద్రమును చేరును. ఒకవైపుననే ప్రవహించు నీరు సముద్రము చేరును. నలువైపులకూ ప్రవహించు నీరు ఏ కొందూరమోపోయి ఇమిడిపోవును. సంస్కారముకూడా ఇట్టిదే. సంస్కారములు ఇటువచ్చుచు అటుపోవుచు నున్నచో ప్రయోజనమేమి? **సంస్కారముల పవిత్రవాహిని జీవితములో నిరంతరము పవిత్రభావములతోనే ప్రవహించుచున్నదో చివరకు మరణము మహానందమునకు నిలయమునిపించును. ఎవడు ఇట్టి గమ్యమును చేరునో వాడు ధన్యుడు.**

(ప్రే.వా. పు.5/6)

స్వధా

(చూ॥ ఆహుతి, స్వాహా)

స్వప్న తుల్యము

సంపార: స్వప్నతుల్యోహి రాగ ద్వేషాది సంకులః
సంభవం సత్యవద్భాతి ప్రమోదే సత్య సత్య నాన్.
ప్రేమ స్వరూపులారా!
కలలు కంటున్నంతవరకు అన్నీ సత్యమనే అనిపిస్తాయి, వినిపిస్తాయి, కనిపిస్తాయి. అటులనే రాగద్వేషాదులతో కూడిన సంసారము జ్ఞానోదయమునకు పూర్వము సత్యముగానే. గోచరిస్తుంది. పరమార్థదశలో ప్రవేశించినప్పుడు ప్రపంచమంతయు స్వప్నతుల్యమవుతుంది.

(శ్రీ.వ.1990 పు.98)

స్వప్నలోకము

స్వప్నలోకము - ఈ అనుభూతి క్షణికము కాని ఆత్మజ్ఞానికి ఇది చిరస్థాయిగా నుండును. అక్షర పరబ్రహ్మను అక్షయలోకములో అనవరతరము సాక్షాత్కరించుకోగలవాడే సర్వజ్ఞుడు. అంతా తానని తెలుసుకొన్న వానికే సర్వం బ్రహ్మం.

(సూ.వా. పు.44)

స్వప్రకాశము

(చూ॥ బ్రహ్మ)

స్వభావము

ప్రేమయే మానవునకు స్వభావము. మానవుడు ప్రేమలేక ఒక నిమిషమైననూ నిలువలేడు. ఇంతవరకూ ప్రేమించుచుండిన చెడు గుణములనబడు కామక్రోధ మోహాదులు మానవుని హృదయము వీడిపోగానే ప్రేమ వంటరిగా నుండనొల్లక, వంటరితనమును సహించలేక, హృదయ పీఠముపై స్థానము నేర్పరచుకొని యుండిన, నిర్మల, నిస్వార్థ స్వరూపుడగు నీల నీరదవిగ్రహుడైన మదనమోహనుని ప్రేమించుటకు ప్రయత్నించును; ప్రాకులాడును. వేరొకరికి అందులో స్థానములేదు కనుక, ఇంకొకరు చేరుటకు వీలుకానందున, విధిలేక పరమాత్మ ప్రేమయే క్రమముగ గాఢమై, నిర్మలమై నిస్స్వార్థమై సర్వసంగ పరిత్యాగ స్థితినిపొంది, సాయుజ్యమును సాధించును.

(భా.వా.పు.7/8)

(చూ॥ ఆనందము, నేను)

స్వయం కృతము

కొందరు సుఖులై జన్మింతురు. పరిపూర్ణ ఆరోగ్యభాగ్యము లనుభవింతురు. మరొ కొందరు నిర్భాగ్యులై జన్మింతురు. కొందరికి కాలు చేతులుండవు. కొందరు మతిహీనులు అయి పుట్టుదురు. వారందరినీ సృజించిన వాడెవడు? అతను న్యాయశీలుడు, దయామయుడు అని అందురు కదా! అట్టి సమదృష్టి కల పరమాత్మకు ఇట్టి పక్షపాతబుద్ధి యేలనని వాదించినా వాదించవచ్చును. ఈశ్వర పరిపాలనా రాజ్యములో ఇట్టి భేదములు యేల కలుగవలెనని ఊహించవచ్చును. అయితే **మానవుని కష్టసుఖములకు, దైర్భాగ్య భాగ్యములకు కారణము పరమాత్మకాడు. ఈ జన్మమునకు పూర్వము చేసిన కర్మలు కారణము. ఇవి స్వయంకృతములు. పూర్వజన్మ కర్మలు, మానవుల యొక్క శరీరముల పోకడలు వారికి వంశపారంపర్యంగా సంక్రమించిన లక్షణ విశేషములు.**

(జ. పు.89)

ఒకడు సుఖియై జన్మించును. మరొకడు అసుఖియై జన్మించును. ఒకడు భాగ్యవంతుడైతే మరొకడు పరమ దరిద్రుడగును. ఒకజీవి మరొక జీవిని భక్షించును. బలవంతుడు బలహీనుని అణగద్రొక్కును. ఈ ఘోరము రేయింబవలు జరుగుచునే యున్నది. ఇదియే లోకమున గల స్థితి. ఇది నిర్మించినది ఈశ్వరుడయ్యేనేని ఆ ఈశ్వరుడు క్రూరుడై యుండవలెను అని సామాన్య

మానవులు భావింతురు. కాని ఈ పక్షపాతమునకు, స్పర్థలకు కారణభూతుడు ఈశ్వరుడు కానే కాదు. మరి దానిని కల్పించిన వాడెవడు? మనమే. మేఘము అన్ని పొలముల మీద సమముగా వర్షించును. కాని చక్కగా దుక్కిచేయబడిన పొలము మాత్రమే వర్షము వలన ఉపకారము నొందును. దున్నక బీడుగా పడవేసి ఉంచిన పొలమునకు ఆ ఉపకారము లభింపదు. ఇది మేఘముల తప్పా? లేక వర్షము తప్పా? లేక భూమిని దున్నక బీడుగా పెట్టుకున్న వాని తప్పా? ఈశ్వర కృప సర్వదా ఉండునదే. దాని యందు మార్పులే ఉండవు. **భేద కల్పన చేయునది మనమే.** కొందరు సుఖులుగా కొందరు అసుఖులుగా జన్మించుట. కేమి కారణము? **వ్యత్యాసములు కల్పించు కార్యములు వారీ జన్మమున చేయకపోవచ్చును. కాని పూర్వ జన్మముల చేసిరి ఆ పురాకృత కర్మనే ఆ భిన్నతకు కారణము!**

(జ.పు.112)

స్వయంనిర్ణయాధికారము (Free will)

వాస్తవానికి ఇంద్రియాలకు, ప్రవృత్తికి లోబడిన నీవు Free **కాదే!**

(స.సా.సె.2000 పు.283)

స్వయం సేవకులు

ఈ మానవాకారాన్ని దాని శక్తి సామర్థ్యాలన్నింటితోపాటుగా మీరు ఏ కార్యంకోసం సంపాదించుకొన్నారో బాగా తెలిసి కొన్నప్పుడు **'స్వయం సేవకులుగా మీ విధిని సక్రమంగా నిర్వహించ గలుగుతారు. ప్రేమలోనే పెరిగి ప్రేమను బలపరచుకొని, చివరకు కలసిపోవడమే 'ఆ కార్యం'!** మీరు ప్రేమగా, ప్రేమతో, ప్రేమక కొరకు మీ జీవితమంతా గడపాలి. అంటే, ఆ ప్రేమను మీనుండి ఆకర్షించుకొనే వారికి చేసే సేవ రూపంలో ప్రేమ ప్రకటనవుతుంది. ఈ ప్రేమాకర్షణ, ప్రేమను పెంపొందించుకోడానికి ప్రగాఢం చేసుకోడానికి తోడ్పడుతుంది. ఆ ప్రేమకు కాలువలుతీసి పారించి హృదయక్షేత్రానికి నీరు పెట్టేందుకు ఆధ్యాత్మిక క్రమశిక్షణను రూపొందించుకోవాలి. లేకుంటే, **హృదయ క్షేత్రం ఎండిపోతుంది.**"

(లో.పు.153/154)

స్వరూపలక్షణము

స్వరూపలక్షణము సత్య లక్షణము. అదే సత్యజ్ఞాన మనంతం బ్రహ్మ. బ్రహ్మ స్వరూపము సత్యమైనది. జ్ఞాన స్వరూపమైనది. అనంతమైనది. ప్రపంచములోని ప్రతి వస్తువునందును ఈ లక్షణములు ఇమిడియున్నవి. **తటస్థ లక్షణమనగా తాత్కాలికముగా ఉన్న గుర్తును ఆధారము చేసుకొని**-అనగా ఇతర వస్తువులకు లేక ఇతర వ్యక్తులకు **ప్రత్యేకముగా తాత్కాలిక గుర్తులను చూసి నిరూపించునట్టి దానిని తటస్థ లక్షణమందురు.** ఉదాహరణకు అందని చందమామను వ్రేలితో చూపినట్లు. అదిగో ఆ చెట్టు కొసకొమ్మపైనన్ను నక్షత్రము ఫలానా నక్షత్రము అని అందుము. చెట్టు ఎక్కడ నక్షత్ర మెక్కడ? అది తాత్కాలికముగా ఆ కొమ్మ దగ్గర ఉన్నట్లు కనుపించును. తదుపరి అది మార్పు చెందును. మనము చూచునప్పుడు అప్పటికప్పుడు ప్రమాణమును నిరూపించును, కాని అది శాశ్వత ప్రమాణము కాదు. అట్టి దానిని **తటస్థ లక్షణమని అందురు.**

స్వరూప లక్షణము అట్టిదికాదు. ప్రతిదానియందు శాశ్వతమైనదై ఉండును. రూపనామములు మారినను, దేశకాలములు మారినను స్వరూప లక్షణములు మారవు. **వాటినే అస్తి, భాతి, ప్రియమని** కూడా వేదాంత పరిభాషలో ప్రయోగింతురు. వస్తువు ఉన్నది. ఎట్లు ఉన్నది. అని కాదు. ఏమి ఉన్నది అని కాదు. **ఒక వస్తువు ఉన్నది అనునది అస్తి.** అయితే ఆ వస్తువు ఉన్నట్లు మనకు తెలుపును. అది ప్రకాశము ద్వారా నిరూపించును. ప్రకాశమే లేకున్న ఆ వస్తువు ఉన్నట్లు మనకు తెలియదు. కాన **తెలుపునట్టి ప్రకాశమే భాతి అని.** అట్టి వస్తువును మన ప్రయోజన నిమిత్తము ప్రీతింతుము. ఇష్టపడుదుము. ఆ

స్వర్గము

ఇష్టమునే ప్రియమని అందుము. పై తెలిపిన **అస్తి భాతి ప్రియము - ఈ మూడు భగవంతుని లక్షణములు. వీటిని ఆధారము చేసుకొని రూపములు ఏర్పడును. రూపమును ఆధారము చేసుకొని నామము. ఈ రూప నామములు మారునవి. కనుక వీటిని మాయాతత్వములని పిలుతురు. అన్నింటికి ఆధారము పరమాత్మయే. మిగిలిన వన్నియు ఆధేయములు.**

ఆధేయములు మార్పు చెందు రూప నామములు. ఇవి తటస్థలక్షణములు. మారని పరమాత్మ స్వరూప లక్షణము. స్వరూప లక్షణముల ద్వారానే తెలిసికొనవలెను. దీనినే 'బ్రహ్మవిద్‌బ్రహ్మైన భవతి' అని శ్రుతి తెలుపుచున్నది. అయితే ఆధార ఆధేయములకు రెండింటికీ పరబ్రహ్మయే కారణము. బ్రహ్మను జిజ్ఞాస ద్వారా అవగతము చేసుకొన్న జీవితము ధన్యము.

'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ'. ఈ మూడు లోకాల్లో నిలువగలిగిన అనంతమైన జ్ఞానమూ బ్రహ్మ. బ్రహ్మము నుండి ఆకాశము, ఆకాశమునుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలమునుండి పృథ్వి, పృథ్వినుండి ఓషధులు, ఓషధులనుండి అన్నము, అన్నము నుండి పురుషుడు. ఈ విధముగా సృష్టిక్రమమే కొనసాగివచ్చియున్నది. **మొదటిది బ్రహ్మ. చివరిది పురుషుడు.** పురుషునకు బ్రహ్మకు సంబంధం సన్నిహితమై ఉన్నది.

(సూ.వా. పు.21/23)

స్వర్గము

ఏగృహమున భార్య భర్తలు ఆదర్శ జీవితము గడుపుదురో భగవన్నామమును సంకీర్తింతురో, సత్కారములు ఆచరింతురో, సత్యం, ప్రేమ, శాంతులతో ధార్మిక గ్రంథముల పారాయణ మొనర్తురో, ఇంద్రియముల వశపరచుకొని సర్వ జీవులయందును సమాన దృష్టితో సాధింతురో, ప్రేమను యిచ్చుదురో, అట్టి స్త్రీ నివసించు గృహము నిజముగా స్వర్గమే అగును.

అట్టి **ఉత్తమ గృహిణియే నిజమగు భార్య.** ఏ స్త్రీ తన భర్తపట్ల హృదయమున అనురాగ బద్ధమై యుండునో ఆమెయే నిజమగు **గృహలక్ష్మి.** ఈ స్త్రీ తనభర్తపట్ల విశ్వసనీయమై యుండునో ఆమెయే నిజమగు **ఇల్లాలు.** ఆమెయే **ధర్మపత్ని.** భార్య ధర్మార్థ కామములకు మూలము. **భర్త మనస్సెరిగి మధురముగా సంభాషించు స్త్రీ, భర్తకు భార్యమాత్రమే కాదు, ఒక్కొక్క సమయమున ధార్మిక కృత్యావసరముల తండ్రి వంటిది; వ్యాధి బాధల సమయములందు ఆమె తల్లి వంటిది.**

(ధ.పు.33/34)

(చూ॥ త్రికరణశుద్ధి, దైవం, ప్రాణము)

స్వస్థానము

ఉపనిషత్తులు మానవుణ్ణి 'ఆనంద పిపాసి' అంటున్నాయి. కారణం ఏమిటి? ఏ పని చేసినా నాకు ఆనందము కావాలి అంటున్నాడు. తాను ఆనందము నుండి పుట్టినవాడు కనుకనే తన స్వస్థానమును కోరుతున్నాడు. జలములో పుట్టిన **చేపను** తెచ్చి వజ్రవైఢూర్య గోమేధిక పుష్య రాగములతో పొదగబడిన బంగారు కప్పులో వేస్తే దానికేమైనా ఆనందం కలుగుతుందా? కలుగదు. దానిని **తిరిగి జలములో విడిచి పెట్టినప్పుడే ఆనందమును అనుభవిస్తుంది. అదేవిధంగా, ఆనందము నుండి ఉద్భవించిన మానవుడు తన స్వస్థానమును తాను చేరేంత వరకు అనేక విధాలుగా పరితపిస్తున్నాడు.** నిజంగా ఈ లౌకిక విషయాలలో ఆనందమే ఉంటే ఎందుకీ పరితాపం? **భగవద్గీత "అనిత్యం అసుఖం లోకం" అని చెప్పింది.** ఏదో మీ పొట్టను పోషించుకొనే నిమిత్తమై మీరీ ప్రపంచంలో వచ్చి పడ్డారు. కనుక, జీవనోపాధి సంబంధమైన పనులుమీరు చేసుకోవచ్చు. కాని, మనస్సును దైవంపై ఉంచుకోండి. అప్పుడే మీకు శాంతిసుఖములు లభిస్తాయి. **ఆనందము ప్రాపంచిక విషయాలలో లభించదు. ఒక్క దైవచింతనలోనే లభిస్తుంది.** నిజంగా ఆ ఆనందము ఎవ్వరికీ తెలియదు. **"చెలగి మధువు గ్రోల చేదు**

రుచించునా?" నిజంగా ఆ ఆనందమునే అనుభవిస్తే ఈ ప్రాపంచిక విషయాలపై మనస్సు పోదు.

(స.సా.ఏ.99 పు.101)

ఆధ్యాత్మిక సాధనలో మొట్టమొదటి మెట్టు-ఇచ్ఛను అరికట్టుట. ఇచ్ఛనరికట్టకున్నచో, అది, విషయముల ననుసరించుటకు ఇంద్రియములను పురికొల్పును, విషయవాసన మానవుడు చేయుకర్మను నీచపరచును, భగవద్వాసన ఆ కర్మను పవిత్రీకరించును.

భక్తి, జబ్బునపడ్డవాడు - పథ్యపుతిండితో - నిమ్మకాయ ఊరగాయను వాడుకొన్నట్లు, ఎప్పుడో అరుదుగా వాడుకోవలసినది కాదు. ప్రధానాహారమువలె నిత్య సేవ్యము. అదే ఆత్మకు బలమునిచ్చు మంచి ఆహారము. **నీ పుట్టుక యొక్కడనో యెక్కడినుండి దారితప్పి నీ విక్కడికి వచ్చితివో, యెప్పుడైనను తెలిసికొనుము. ఇట్లెంత కాలము తిరుగగలవు? నూరు జన్మలెత్తినను, తుదకు నీవు నీ స్వస్థానమును చేరుకొనవలసినదే. దానికి భగవద్ధ్యానమే మార్గము.** కానీ, నీ మనసు, లౌకిక విషయములమీద నిల్చినట్లు భగవద్విషయమున నిలువదు. **భగవచ్చింతనకు** పూనుకొనగనే, అది చపల చేష్టలు ప్రారంభించును. నీవు దానిని నామ స్మరణముచేత మచ్చిక చేసుకొని, భగవంతుని వైపు నకు మరలింపుము. **ఈ సందేశ మిచ్చుటకే నే నిచ్చటికి వచ్చినది. భగవంతుని నామమును నాలుకమీదను, రూపమును కన్నులలోను, మహిమను మనసులోను స్థిరముగా నిలుపుకొనుము.** అప్పుడు నీ ధ్యానమునకు భంగముండదు. **పిడుగులు పడినను నీ మనసు చలింపదు.**

(ఆ.శా. పు.21/22)

స్వాతంత్ర్యము

విదేశీయులు పోయినతరువాత స్వదేశీయులు స్వాతంత్ర్యము పొందినారనుకొన్నాము. ఎందులో స్వాతంత్ర్యమును పొందాము? స్వాతంత్ర్యము అన్నంత మాత్రమున ప్రయోజనము లేదు. **ఐక్యతను సాధించినప్పుడే స్వాతంత్ర్యము.** ఐక్యతను సాధించక స్వాతంత్ర్య మనుకుంటే మాటల స్వాతంత్ర్యమేగాని జీవి స్వాతంత్ర్యము కాదు. **స్వాతంత్ర్యమనేది హృదయస్థానమునుండి ఏర్పడాలి.** హృదయమంటే ఏమిటి? రక్తమాంసములతో కూడిన గుండెకాయ కాదు. **హృదయం ఒక స్థానమునకు గాని ఒక కాలమునకుగాని ఒక వ్యక్తికిగాని ఒక దేశమునకు గాని సంబంధించినది కాదు. సర్వత్ర సర్వకాలములందు సర్వదేశములందు సర్వవ్యక్తులయందు సమత్వముగా వుండే దివ్యతత్త్వమే హృదయము. ఈ హృదయమునకు రూపము లేదు.** మానవుని దేహమునందు దేనిని మనము హృదయముగా భావిస్తున్నామో అది మధ్యలో వచ్చి మధ్యలో పోయేది. **దేనిని గుర్తిస్తే సర్వమును గుర్తించిన వాడౌతాడో అలాంటి దివ్యతత్త్వమును గుర్తించటమే నిజమైన స్వాతంత్ర్యము.**

(బృ.త్ర.పు.142)

నిజమైన స్వాతంత్ర్యము ఎప్పుడు వస్తుంది? **ఈ మనస్సునేదానిని నిర్మూలము గావించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యము వస్తుంది. స్వ అదే ఏకం స్వ+భావము అది స్వభావము. స్వ+ఇచ్ఛ= స్వేచ్ఛ. స్వ అనగా ఆత్మ కనుక ఆత్మ ఇచ్ఛనే స్వాతంత్ర్యము. అదే స్వేచ్ఛ.** అంతేగాని దేహేంద్రియమనోబుద్ధులతో ఆచరించే కర్మలన్నియు స్వాతంత్ర్యములు కాదు. కొన్ని Law of Nature. ప్రకృతిననుసరించి మనము ఆచరిస్తూనే ఉంటాము. ఇది స్వాతంత్ర్యము కాదు Law of Nature. ఒకటి Rules and Regulations మరొకటి. ఈ రెండింటి మధ్యలోనే మానవజీవితము సాగుతున్నది. అంతేకాని ఎవరికి వారు నేను స్వతంత్రుడను నేను స్వతంత్రుడను అని అనుకోవటానికి వీలులేదు. **దివ్యత్వము ఒక్కటి మాత్రమే స్వతంత్రము.** దానినీ స్వాతంత్ర్యమని చెప్పటానికి వీలు లేదు. ఉన్నది ఒక్కటే. ఆ పదమునకు అక్కడ స్థానమే లేదు.

(బృ.త్ర.పు.145)

(చూ॥ ఆధ్యాత్మికము, ఆనందము, కర్తవ్యము, కర్తృత్యము, మనస్సు, సూత్రము)

స్వాధ్యాయము

స్వాధ్యాయము

(చూ॥ వేదం)

స్వాప్యయాత్

స్వ-అనగా తనయందు, అనగా బ్రహ్మయందు, అప్యయాత్ - అనగా లయమగుట వలన; అని ఈ పదమునకు అర్థము. అంటే ఈ జీవుడు బ్రహ్మమందు లయమగునని చెప్పియుండుటవలన, జీవుడు సుషుప్తి కాలమున సద్రూపుడగుచున్నాడు. తన్ను తాను పొందుట వలన అతడు ఆత్మయే యగుచున్నాడు. స్వప్నరహితమగు సుషుప్తియందు ఆత్మ ఆత్మ యందు లయమగు చుండును. అనగా సత్‌తో ఏకమగునని దీని అంతరార్థము. సర్వ వేదాంత వాక్యముల సారము, బ్రహ్మజగత్కారణ మనీ, బ్రహ్మ ఒక్కడే అగుచేత జడమగు పదార్థము లేదని చెప్పబడుచున్నది. **జగత్కారణము చేతనమగు బ్రహ్మమని బోధించుట యందు వేదాంత వాక్యము లన్నియు యేకీభవించుచున్నవి. శ్రుతి కూడా బ్రహ్మమే జగత్కారణమని తెలుపుచున్నది.**

(సూ.వా.పు.42)

జీవుడు చేతన స్వరూపుడనీ, అట్టి చేతన స్వరూపుడు, చేతన స్వరూపుడైన పరమాత్మయందే లయమగును కాని; అచేతనమునందు లయము కాజాలడు కనుక, సచ్ఛబ్దము పరమాత్మకే అన్వయము కాని ప్రకృతికి కాదని, ఈ సూత్రము హెచ్చరించుచున్నది.

(సూ.వా.పు.44)

స్వామి

(చూ॥ అణుస్వరూపము, నామస్మరణ)

స్వామికోరిక

విద్యార్థులారా! నేను కోరేది ఒక్కటే. మంచి పేరు తెచ్చుకోండి. మీ తల్లి తండ్రులకు, మీరు చదివిన ఇన్‌స్టిట్యూట్‌కు మంచి పేరు తెప్పించండి. మీకు సహజంగానే మంచి పేరు ప్రాప్తిస్తుంది. కీడుచేయడం గొప్పతనం కాదు. కీడు కీటకమైనా చేస్తుంది. మానవులై పుట్టినందుకు మీరు సమాజానికి మేలు చేయాలి. మీరు దేనికీ భయపడనక్కరలేదు. మీరు భయపడటానికి పశువులు కాదు. భయపెట్టటానికి క్రూరమృగములు కాదు. మీరు మానవులు. కనుక మీరు భయపడకూడదు, భయపెట్టకూడదు. ఈ సత్యాన్ని మీరు గుర్తించి వర్తించినప్పుడే సమాజం కూడా బాగుపడుతుంది. విద్యార్థులారా! మీరు బాగుపడటంతోపాటు మీ స్నేహితులను కూడా ఈ పవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టి వారిని ధన్యులు చేయడానికి ప్రయత్నిస్తారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

(స.సా.డి.96 పు.321)

స్వామి దయ

ఈనాడు మీరింత దగ్గరగా కూర్చున్నారుగాని కొంత కాలానికి కొన్ని మైళ్ళ నుండి స్వామిని చూడవలసి వస్తుంది. ఐతే స్వామి దయ ఉన్నప్పుడు ఎక్కడున్నా మీరు స్వామివారే అవుతారు, ఎల్లప్పుడు స్వామి మీ వెంటనే ఉంటాడు. కనుక స్వామి మీకు దూరమౌతాడనే భ్రాంతికి అవకాశ మివ్వకండి.

(స.సా.ఫి.99పు.35)

స్వామిపాడిన పాటలు

కర్మదాటవశమా నరుడా కర్మదాటవశమా
ధనికుడు త్రుటిలో బికారికాడా
పండితుడింతలో పశువైపోడా
క్రరేపామై కరువనురాదా
కర్మే హేతువు కర్మే మూలము "కర్మ"
చిన్న చెలిమిలో ముంచినగానీ
ఎన్ని సముద్రముల్ నించినగానీ
కడవెంతోరా నీరంతేరా

కావాలన్నను యెక్కువ రాదురా "కర్మ"
అని చక్కగా రాగాలాపనలో పాడేవారు
దయచేత ధన్యులు కావలేరా. యింతటివారు "దయ"
అసురుడైనా భూసురుడైనా అఖండ తెలివి
కలవాడైనా "దయ"
కాషాయవస్త్రము వేసినగానీ కంఠమాల ధరియించినగానీ
గడగడమని జపమాల త్రిప్పినా
కడకు నీ యొద్దకు రావలె బాబా "దయ"
విద్య నేర్చి వాదాడినగానీ
పద్యము లెంతో పాడినగానీ
బాగుగ గడ్డము పెంచిన గానీ
పట్టెనామాలు పెట్టినగానీ "దయ"

(అ.శ.నా.పు.11)

"శిర్షిపీఠికమునందేమున్నదోగాని, మ్రోగుచున్నది నిన్ను మ్రొక్కినపుడు హృదయ పీఠము నందేహమున్నదో గాని, తోణకుచున్నది నిన్ను తలచినపుడు ఈమనః పీఠమునందేమున్నదోగాని, జారుచున్నది నిన్ను కోరినపుడు"

పాటువైనది చెట్టురా. పట్టువైనది కొమ్మరా
పాటుతప్పి పట్టువిడచితే పరబ్రహ్మమే చేరురా
సారమైనది చమురురా. సత్యమైనది వత్తిరా
వెలుగుతీరిపోయేటపుడు వెంట యెవ్వరూ రారురా"
వత్తిరాదు, నూనె రాదు, మరి తాను యెక్కడవుంటాడురా అంటే,
కోటయేడు చుట్టరా. కోటలోపల తోటరా
తోటలోనికి పోదమంటే. దారి తెలియదు యెట్టరా॥
మదిలో పొంగే ప్రీతిపూట. అనురాగమనే ఆ నీట
తడుపబడిన హృదయతోట. ప్రేమమొలక అందులో
నాట మనసులోని మనమాట. అదియేమధురబాట॥

(అ.శ.నా. పు.206)

"సిరులను కోరను. సర్వ భాగ్యతతుల చెల్లారనిమ్మంచు నే వరముల్ వేడను. నెల్లవేళలా భవత్పాదారవిందంబు. నా యురమందుంచు. శక్తి నిమ్మని సదాయుల్లంబున గోరితి తరమా నిన్ను నుతింపనాకు. దయలేదా సత్యసాయి ప్రభూ"

(అ.శ.నా. పు.18)

స్వామి బాల్యము

సామాన్య మానవుడు మొదలుకొని దేవతల వరకు ప్రతి ఒక్కరికి ఒక నియమమునేది ఉండాలి. నియమమే లేనప్పుడు ఎంతటి శక్తి వంతుడైనా ఎట్టి చిన్న కార్యమునైనా సాధించలేడు. భగవంతుడు సర్వశక్తిమయుడు, సర్వ వ్యాపకుడు, అయినప్పటికీ తాను కూడా నియమానుసారంగానే ప్రవర్తిస్తాడు. తాను మానవాకారం ధరించినప్పుడు కూడా కొన్ని నియమాలను అనుసరిస్తూ, తద్ద్వారా జగత్కల్యాణమునకు పాటుపడతాడు. **రామకృష్ణాది అవతారములు కొన్ని నియమములను నియమించుకొనియే తమ కర్తవ్యకర్మలను ఆచరిస్తూ వచ్చారు. రాముడు ఒకే మాట, ఒకే బాణము, ఒకే పత్ని అనే మూడు నియమాలను నియమించుకొని,** ఎట్టి పరిస్థితులందూ వాటిని జవదాట లేదు. **కృష్ణుడు కూడా అంతే, "ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" "యోగక్షేమం వహామ్యహం", "మోక్షయిష్యామి మా శుచః"** అని మూడు ప్రతిజ్ఞలు చేశాడు. **నేను కూడా కొన్ని నియమాలనుసరిస్తాను. నేను ఇచ్చిన మాట తప్పను. ఇది నా మొట్టమొదటి ప్రమాణము. నా మాటను తీసుకున్న వ్యక్తి నాకు విరుద్ధంగా ప్రవర్తించినా నేను అతనిని ఏమాత్రము శిక్షించను; అతను నా ఆజ్ఞకు విరుద్ధమైన మార్గమును అవలంబించినప్పటికీ నేను అతనిని ఏమాత్రము దూరం చేయను. "ఏ జనాఃపర్యుపాసతే", ఏ జనుడైనా ఫరవాలేదు. ఇది నా ప్రేమతత్వము. నేను ఎవ్వరినీ ఇంతవరకు ద్వేషించ లేదు. ద్వేషమంటే ఏమిటో నాకు తెలియదు.** ఎట్టి పరిస్థితి యందైనా ఒకరు కష్టములను అనుభవించాలని నేను సంకల్పించను. అయితే, ఎవరు చేసినది వారు అనుభవించక తప్పదు.

ఎవరు చేసిన కర్మ వారనుభవించక
ఏరికైనను తప్పదన్నా!

ఏనాడు ఏతీరు ఎవరు చెప్పాగలరు?
అనుభవించుట సిద్ధమన్నా!

ప్రేమతత్త్వంలోనున్న మాధుర్యము, ప్రేమయొక్క శక్తిసామర్థ్యములు ప్రేమకు తప్ప అన్యులకు అర్థం కావు. నాకు ~~ఈ~~ **జగత్తునందు ఎందు చూసినా ద్వేషులనేవారే కన్పించడం లేదు. అందరూ నాకు ప్రియులే. అందరూ నా ఫ్రెండ్సే (స్నేహితులే); నేను అందరికీ ఫ్రెండనే! నేను ఫ్రెండ్‌ని కాదనుకున్నవారికి కూడా నేను ఫ్రెండ్‌నే!**

వేదము "బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి" అన్నది మీరు ఎట్టి చింతన చేస్తారో అట్టి స్వరూపాన్నే పొందుతారు. పూర్వం **డార్విన్ అనే గొప్ప శాస్త్రజ్ఞుడుండేవాడు.అతడు గొప్ప గుణవంతుడు, విశాలహృదయుడు. అతనికి హెన్‌స్లో అనే ఒక శిష్యుడుండేవాడు.** ఆ శిష్యుడు సర్వకాల సర్వావస్థలయందు డార్విన్‌ను స్మరిస్తూ ఆయన బోధలను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించేవాడు. తత్ఫలితంగా కొంతకాలానికి అతడు డార్విన్ రూపాన్ని పొందాడు. ఒక పర్యాయం కొంతమంది మిత్రులు ఆ గురుశిష్యులిద్దరినీ ఒకే ప్రదేశంలో చూసినప్పుడు వారిలో ఎవరు డార్వినో, ఎవరు హెన్‌స్లోనో నిర్ణయించుకోలేకపోయారు. విదేశీయుల చరిత్రల వరకు మనం పోనక్కరలేదు. భాగవతాన్నే ఉదాహరణంగా తీసుకుందాం. **ప్రహ్లాదుడు రాక్షస కుమారుడు. కాని, అతడు నిరంతరము హరి నామమును స్మరించడంచేత అతని ముఖంలో హరితేజస్సు ఉట్టి పడింది.** దారులు కొట్టే దొంగ **రత్నకారుడు.** అతడు సప్త ఋషుల ప్రబోధచేత ప్రభావితుడై నిరంతరము **రామనామాన్ని స్మరించడం చేత అతని ముఖం రాముని తేజస్సుతో ప్రకాశించింది. రాముడు లోకదాత అయితే వాల్మీకి రామాయణాన్ని రచించి శ్లోకదాత అయినాడు. కనుక, భక్తిప్రపత్తులందున్న మహత్తర శక్తి** ఇట్టిది, అట్టిది అని ఎవరూ ఊహించలేరు.

క్రోధము, ద్వేషము, అసూయ అనేవి రాక్షస గుణములు. కనుక, వాటిని నిర్మూలించుకొని మానవతా విలువలను అభివృద్ధి పర్చుకోవాలి. వేదము "సత్యం వద, ధర్మం చర" అన్నది. చిన్నప్పుడు అనేకమంది పిల్లలు నా దగ్గర చేరి ఆడుతూ, పాడుతూ, ఆనందంగా ఉండేవారు. ఆ సమయంలో నేను వారికి అనేక విషయాలు బోధించేవాడిని. "మిమ్మల్ని నవమాసములు మోసి, కని పెంచి పెద్ద చేస్తుంది తల్లి; అనేక కష్టనష్టములకు ఓర్చుకొని మిమ్మల్ని పోషిస్తాడు తండ్రి. కాబట్టి, మొట్టమొదట మీ తల్లి దండ్రులను ప్రేమించండి. మీ నిత్యజీవితంలో ఎలాంటి పరిస్థితులందైనా సత్యాన్ని వదలవద్దు. మీ తల్లితండ్రులు కొడతారనే భయంతో మీరు చేసిన తప్పును కప్పిపుచ్చు కోవడానికి అసత్యం చెప్పవద్దు. మీ తల్లిదండ్రులు కొట్టినా, తిట్టినా ఫరవాలేదు. మీరు మాత్రం సత్యమే పలకండి. **సత్యమునకున్న శక్తి ఆటంబాంబు, హైడ్రోజన్ బాంబులకు కూడా లేదు. సత్యమును మించిన అస్త్రము మరొకటి లేదు. అదే మిమ్మల్ని కాపాడుతుంది.** అయితే, **సత్యమును ఎట్లా పలకాలి? "అను ద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితం చ యత్", మీరు పలికే సత్యము ఉద్వేగకరంగా ఉండకూడదు: సత్యము చెప్పాలనుకుంటే ఇదే సత్యము అంటే గట్టిగా చెప్పనక్కర్లేదు. సత్యాన్ని కూడా శాంతంగా పలకాలి; ప్రియంగా, హితంగా చెప్పాలి. క్రోధము, ద్వేషము, అసూయ మున్నగు దుర్గుణాలు త్యజించాలి"** అని బోధించేవాడిని. సాధారణంగా చిన్న పిల్లలకు ఏదైనా ఇష్టమైన వస్తువు కనిపిస్తే పెన్ను అవసరమైతే తోటి విద్యార్థిని అడిగి తీసుకోండి; అంతేగాని అతనికి తెలియకుండా తీసుకోకూడదు" అని బోధించేవాడిని.

ఆ రోజుల్లో ఈ గ్రామంలో మహమ్మదీయులు కూడా ఎక్కువ సంఖ్యలో ఉండేవారు. వారు పీర్ల పండుగ జరుపుకునేవారు. ఆ పండుగలో కొందరు హిందువులు కూడా పాల్గొని పూజలు చేసేవారు. **"మతము ప్రధానం కాదు, నీతియే ప్రధానం. నీతియే ప్రాణసమానం. కాబట్టి మతభేదాలను దూరం నెట్టి అందరితో స్నేహంగా ఉండండి. మీరు కూడా పీర్ల పండుగలో పాల్గొనండి"** అని పిల్లలకు చెప్పేవాడిని. ఒక పిల్లవాడు "రాజూ! మేము బ్రహ్మణులం. దీనికి మా అమ్మ నాన్న అంగీకరించరు" అన్నాడు.

"నయనా! నీవు మానవుడవు. నీది మానవ కులము, నీది ప్రేమమతము. దీనిని లక్ష్యమునందుంచుకో" అని చెప్పాను. నేను ఈ విధంగా కుల మత భేదాలను త్యజించమని పిల్లలకు బోధిస్తున్నానని తెలుసుకొని వారి తల్లి దండ్రులు "ఏమి రాజూ, కులమత భేదాలుండ కూడదని చెప్పి నీవు మా పిల్లలను చెడగొట్టుతున్నావే" అని జగడానికి వచ్చేవారు. ఈ లోకంలో ప్రేమమతమును మించిన మతం లేదని నేను వారితో గట్టిగా వాదించేవాడిని. దేనికీ నేను భయపడలేదు. సత్యానికి భయమెందుకు?! సత్యంతో దేనినైనా సాధించవచ్చు.

ఒకనాడు పిల్లలందరూ సమావేశమై "రాజు మనకు ఎన్నో మంచి విషయాలు బోధిస్తున్నాడు. **కాని, అందులో ఒక్కటైనా మనం ఆచరణలో పెడుతున్నామా?"** అని చర్చించుకున్నారు. ఎవరెంత ఆచరణలో పెడుతున్నారని ఒకరి నొకరు ప్రశ్నించుకున్నారు. వారిలో ఒకడు **"ఎలాంటి పరిస్థితుల్లో నైనా నేను సత్యమే చెప్పడానికి ప్రయత్నిస్తున్నాను" అన్నాడు. మరొకడు "ఎలాంటి పరిస్థితులందైనా నేను దైవాన్ని ప్రేమిస్తాను. దైవమే నాతల్లి, దైవమే నా తండ్రి, దైవమే నా ప్రాణం" అన్నాడు. వాడి పేరు కేశన్న**. వాడు బుగ్గపల్లి అచ్చమ్మ కుమారుడు. ఆమె ఒక చిన్న కొట్టు పెట్టుకుని బీడీటు, సిగరెట్లు అమ్ముకునేది. పాపం! మరొక పిల్లవాడు **"రాజు బోధించే మంచి విషయాలన్నీ పాటించడానికి నాకు సాధ్యం కాదుగాని, రాజు చెపుతుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. రాజు మాటలు వినడమే పెద్ద ఆనందము" అన్నాడు**. "రాజు అంత మధురంగా, అంత ప్రేమతో బోధిస్తుంటే వినకుండా ఎలా ఉండగలము! రాజు అంటే నాకు ఎంతో ప్రేమ" అన్నాడు మరొకడు. "నీతో మాత్రమే రాజు అంటే ప్రేమనే? మాకు లేదా?" అన్నారు మిగిలిన పిల్లలు.

ఒకనాడు అందరం కలసి **కరణం సుబ్బమ్మ ఇంటికి వెళ్ళాము. ఆమె మహా సాధ్వీమణి, విశాల హృదయం కల్గినది**. "రాజూ! నీవు పిల్లలను తీసుకు వచ్చావుగాని, నేనీనాడు ఏమీ చేసి పెట్టలేదే! రేపటి దినము ఈ పిల్లలందరినీ తప్పక తీసుకొనిరా, నేను వంట వండిపెడతాను" అంది. నాకిష్టమని ఆనాడు పితుకుబేడల పులుసు చేసింది. అందరం కూర్చున్నాం. నేను ముందుగానే పిల్లలతో "వారు బ్రాహ్మణులు అంత త్వరగా వారు కులమత భేదాలను విసర్జించడం కష్టం. కాబట్టి, సాధ్యమైనంతవరకు దూరంగానే కూర్చోండి" అని చెప్పాను. ఆమె ఒక పాత్రలో అన్నము, పులుసు రెండూ కలిపి తెచ్చింది. అందరి చేతుల్లో ముద్దమాదిరి చేసి వేస్తుంటే, వారందరూ చక్కగా భుజించారు. **రాజు తనకు పెడితే తృప్తి పడడు, పిల్లలకు పెడితేనే తృప్తి పడతాడు**. అనే సత్యాన్ని ఆమె గుర్తించింది. కనుకనే, మొట్టమొదట పిల్లలందరికీ పెట్టింది. చిట్టచివరికి చాల కొద్ది అన్నము మాత్రమే మిగిలింది. "అయ్యో, రాజుకు నేను పెట్టలేక పోతున్నానే!" అని బాధ పడి ఆ మిగిలిన కొద్దిపాటి అన్నమును నా నోట్లో పెట్టింది. "మా అందరికీ చేతిలో వేసి రాజుకు మాత్రమే ఎందుకు నోట్లో పెట్టింది?" అని పిల్లలు తమలో తాము గుసగుస లాడుకోవడం ప్రారంభించారు. నేను "సుబ్బమ్మా! మీరు చేసిన పనివల్ల పిల్లల్లో ఆశాంతి ప్రారంభమైంది, చూడండి" అన్నాను. అప్పుడు సుబ్బమ్మ పిల్లలతో "నాకు మీపైన ప్రేమ లేక కాదు. కాని, **రాజుకు ముందు మీరు తింటేనే తృప్తి. మీపైన రాజుకున్న ప్రేమ అలాంటిది. అందుచేత, నేను ముందు మీకే పెట్టాను. చివరికి నా దగ్గర చాల కొద్ది అన్నం మాత్రమే మిగిలింది. దానిని ముద్ద చేసి చేతిలో వేయడానికి వీలుకాలేదు. అందుచేతనే, దానిని రాజు నోట్లో పెట్టాను. పదిమందిని సంతృప్తిపరచి తాను సంతృప్తిపడే స్వభావం రాజుది. అతనిలో స్వార్థం ఏమాత్రం కనిపించదు. మీరు కూడా రాజు మాదిరి తయారు కావాలి**. స్వార్థ, స్వప్రయోజనాపేక్షను వీడి, ప్రేమను పెంచుకొని, తోటి మానవుని ఆనందమే మీ ఆనందంగా భావించుకున్నప్పుడు మీకు ఎంతైనా శ్రేయస్సు కల్గుతుంది. మీ భవిష్యత్తు ఆదర్శవంతమైనదిగా రూపొందుతుంది" అని వారికి చక్కగా బోధించి, "రాజూ! నేను సాయంత్రం

చిత్రాన్నం వండుకుంటాను. ఆ చెట్టు ఎక్కి ఇంత కరివేపాకు కోసుకురా''. అని నన్ను యుక్తిగా అక్కడి నుండి పంపించేది. నేను వయస్సులో అక్కడున్న పిల్లలకంటే పెద్దవాడినేగాని ఎత్తులో చాల తక్కువే. కాని, నేను చెట్లు బాగా ఎక్కేవాడిని. సుబ్బమ్మ కోరినట్లుగా చెట్టు ఎక్కి కరివేపాకు కోశాను. అయితే, సుబ్బమ్మ నన్ను కరివేపాకు కోయడానికి పంపించింది. ఎందుకోసమో తెలుసునా? పిల్లలకు నా గురించి చెప్పడానికి "పిల్లల్లారా! **రాజుయొక్క స్నేహాన్ని పొందిన మీరెంత అదృష్టవంతులో! రాజు సామాన్యుడు కాదు. అతను రాజాధిరాజు. రాజులకే రాజుగా తయారౌతాడు. మీరు అతని ఆజ్ఞను శిరసావహించండి;** ఏ విషయంలోను అతని మాటను జవదాటకండి. అతనిపై ఎప్పుడూ కోపగించుకోకండి. మీరు అతనిపై కోపగించుకుంటే, దేవతలందరూ మీపై కోపగించుకుంటారు. అతనిని ఆనందపర్చి, మీరు ఆనందించండి. రాజు తనకు అసంతృప్తి కలిగితే చెప్పడు. కాని, దాని ఫలితం మాత్రం మీకు తప్పదు. కాబట్టి, రాజుకు అసంతృప్తి కల్గకుండా చూసుకోండి'' అని సుబ్బమ్మ పిల్లలకు బోధించసాగింది. సుబ్బమ్మ భర్తకు కమలమ్మ అని మరొక భార్య కూడా ఉండేది. ఆమె వచ్చి "ఏమిటి అక్కా, ఈ చిన్న చిన్న పిల్లలకు నీవు బోధించే వేదాంతం ఎలా అర్థమౌతుంది?'' అన్నది. సుబ్బమ్మ "ఇది వేదాంతం కాదే చెల్లెలా, నిత్య జీవితంలో పిల్లలు ఆచరించవలసినవి బోధిస్తున్నాను. **నాకు పిల్లలు లేరు కాబట్టి ఈ పిల్లలే నా పిల్లలు. ఈ పిల్లలు రాజు వెంట ఉండే పిల్లలు. రాజు అంటే నాకు ప్రాణం"** అన్నది.

ఒకనాడు ఆమె ఇంటో వడలు చేసింది. అవి పిల్లలందరికీ సరిపోవు. అందుచేత నన్ను మాత్రమే ప్రత్యేకంగా పిల్చి ఇవ్వాలని మిద్దె ఎక్కింది. ఆమెది పెద్ద ఇల్లు. ఆ ఇంటి ప్రక్కనే ఈ దేహానికి సంబంధించిన ఇల్లు ఉండేది. కిటికీలో నుండి చూస్తూ "రాజూ, రాజూ, ఒక్కసారి ఇలా రా'' అంది నేను పరుగెత్తివెళ్ళాను. ఆ కిటికీలో నుండి చిన్న పొట్లాన్ని నాకు అందించింది. అప్పుడు నేను **"సుబ్బమ్మా! పిల్లలకు ఇవ్వకుండా నాకు మాత్రమే ఇవ్వడం న్యాయం కాదు. మీరు హృదయాన్ని విశాలం చేసుకోవాలి" అన్నాను. "ఈనాటికి మాత్రం క్షమించు రాజూ, రేపటినుండి అందరికీ సమానంగా పెడతాను"** అంది. ఆమె ఇచ్చిన వదలను సాయంత్రం పిల్లందరికీ కొంచెం కొంచెం పెట్టాను. **నా ప్రేమతత్వమును నా సమత్వమును, నా దివ్యత్వమును మీరు వేయింట ఒక భాగమైనా అర్థం చేసుకోలేరు. నా ప్రేమ చాల విశాలమైనది. దాని గురించి ఎంత వర్ణించినా ఇంకా తక్కువే అవుతుంది. కాని, చాలమంది నా ప్రేమను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం లేదు. "లోకాస్సమస్తా సుఖినోభవంతు"**, అందరూ సుఖంగా ఉండాలి; ఎవ్వరూ కష్టాలకు గురి కాకూడదు అనేదే నా సంకల్పము.

మీకు తెలుసు - బుక్కపట్నం నుండి గుండా సత్యనారాయణ అనే వ్యక్తి ఇక్కడికి వస్తుంటాడు. ఇప్పుడు ఇక్కడే ఉన్నాడు. అతను కూడా నా క్లాసుమేటే! చూడండి ఎట్లా అయి పోయినాడో!

(అని పలుకుతూ శ్రీవారు శ్రీసత్యనారాయణను వేదికపైకి రావలసిందిగా సౌంజ్ఞ చేశారు. కలలోనైనా ఊహించని ఈ మహాభాగ్యానికి ఆయన ఆనందంతో పొంగిపోతూ వేదికపైకి వెళ్ళి శ్రీవారికి ప్రణమిల్లారు. శ్రీవారి అనుమతితో, బాల్యం నుండి శ్రీవారు తనపై ఏ విధంగా ప్రేమ వాత్సల్యములను కురిపిస్తున్నదీ వివరిస్తూ ఆయన కొద్దిసేపు ప్రసంగించారు. అనంతరం శ్రీవారి దివ్యోపన్యాసం ఈ విధంగా కొనసాగింది)

నేను, కొంతమంది పిల్లలు చేరి బుక్కపట్నం స్కూలుకు వెళ్ళేవారం. అప్పుడు 5వ క్లాసు చదువుతున్నాము. ఆ సమయంలో ఈ కుటుంబం చాలా బీదది. గ్రామంలో ఉన్న పిల్లలు కూడా చాల బీదపిల్లలే. గృహం అమ్మాయి ఇంత సంకటి చేసేది. సంకటి మధ్యలో గుంత మాదిరి చేసి దానిలో శనక్కాయ పచ్చడి వేసేది. ఆ రోజుల్లో టిఫిన్ క్యారియర్లు లేవు. ఆ సంకటని పాత గుడ్డలో మూటకట్టి వీపుపైన వేసుకొని బుక్కపట్నం వేళ్ళేవాడిని. స్కూల్లో 12

గంటలకు భోజనానికి 'బెల్' కొట్టేవారు. వెంటనే మేము పరుగెత్తుకొని చెఱువుకు పోయేవారం. సంకటి మూటను వెంటనే విప్పడానికి వీల్లేదు. ఎందుకంటే, సంకటి బట్టకంతా అంటుకొని ఉంటుంది. ఆ మూటను కొద్దిసేపు నీటిలో పెట్టిన తరువాతనే ఆ గుడ్డ సంకటిని వీడిపోతుంది. ఆ పిల్లల్లో ఒక శ్రీమంతుని బిడ్డ ఉండేవాడు. ఆ పిల్లవాడు మంచి తెలివి గలవాడు. వాడు అన్నం, పులుసు కలుపుకొని తెచ్చేవాడు. దానిని పిల్లలకు తలొక ముద్ద పెట్టేవాడు. నేను కూడా అందరికీ సంకటి పెట్టేవాడిని. ఈవిధంగా, **మేము ఆహార విహారాల్లో కూడా ఐకమత్యాన్ని అనుభవిస్తూ వచ్చాము. ఐకమత్యంలో ఎంతో ఆనందమున్నది.** కాని, ఈనాటి విద్యావంతులలో ఐకమత్యం, ప్రేమతత్వం క్షీణించిపోయాయి: అసూయ, ద్వేషాలు పెరిగిపోతున్నాయి. అరవ తరగతి పూర్తి కావచ్చింది. అప్పుడే ESLC అని పబ్లిక్ ఎక్జామినేషన్ వచ్చింది. ఆ పరీక్షను పెనుకొండలో పెట్టారు. "అయ్యో, పరీక్షకు ఎన్నో మైళ్ళ దూరం వెళ్ళాలట" అని పిల్లలందరూ భయపడ్డారు. అప్పుడు బస్సులు లేవు. మేమందరం కలసి ఒక ఎడ్ల బండి తీసుకున్నాము. ఆ ఎడ్లబండిలో సామాను పెట్టుకుని మేము నడుచుకుంటూ వెళ్ళాలి. అప్పుడు గృహం అమ్మాయి "మీరక్కడ మూడు దినములుండవలసి వస్తుంది. వంట వండుకోవడం మీకు కష్టమౌతుంది" అని చెప్పి అందరికీ సజ్జరొట్టెలు చేసి, అందులో ఇంత కారం వేసి మూట కట్టి ఇచ్చింది. వెంకమ్మ కూడా తగిన సహాయం చేసింది. **"అమ్మా! మన సత్యం సంగతి నీకు తెలుసు కదా! పిల్లలకు పెట్టకుండా తాను భుజించడు.** కాబట్టి పిల్లలకు కొంచెం అధికంగా పంపిద్దాం" అని చెప్పింది గృహం అమ్మాయి. అలాగే ఆమె చేసి పంపించేది పాపం! సామాన్లన్నీ బండిలో పెట్టుకొని పెనుకొండ వెళ్లినాము. అక్కడకు వెళ్ళిన తరువాత ఒక తమాషా జరిగింది. అక్కడ దిగడానికి ఇల్లు లేదు. కాబట్టి, ఆ మూడు దినములు చెట్ల క్రిందనే గడిపాము. వర్షం వచ్చినప్పుడు బండిలోపల తల దాచుకునేవారం.

క్లాసులో ముగ్గురు పిల్లలం ఒకే డెస్కు పైన కూర్చునేవాళ్ళం. నేను మధ్యలో కూర్చునేవాడిని; నాకిరుప్రక్కల **రమేశ్, సురేశ్ కూర్చునేవారు. వారిరువురూ చదువులో చాల మొద్దులు.** నూటికి ఒక్క మార్కు తెచ్చుకోవడం కూడా వారికి కష్టమే! క్లాసులో నేను వారికి సహాయం చేస్తూ వచ్చాను. కాని ESLC పరీక్షకోసం పెనుకొండకు వెళ్ళినప్పుడు వారు చాల భయపడిపోయారు. "రాజూ! నీవే మాకు దిక్కు" అన్నారు. "భయపడితే ప్రయోజన మేమిటి? ధైర్యంగా ఉండాలి" అని చెప్పాను. **చిన్నప్పటి నుండి పిల్లలకు ధైర్యం బోధించేవాడిని.**

పరీక్షా హాలులో పేపర్లు వారే ఇచ్చేవారు. మేము ఏదీ తీసుకు వెళ్ళడానికి వీల్లేదు. అక్కడికి వెళ్ళిన తరువాత టీచర్లు పిల్లల జేబులు,చేతులు పరీక్షగా చూశారు. వారు జేబుల్లో ఏమైనా దాచుకున్నారేమోనని టీచర్లకు అనుమానం. ఇంతలో ఒక టీచరు వచ్చి ఇంకొక టీచరుతో "కొండప్పా! ఈ పిల్లలు ఎవరనుకున్నావు? **వీరు రాజు గుంపుకు చెందినవారు. వీరు దొంగతనం చేయరు, కాపీ కొట్టరు; సత్యమార్గాన్ని అనుసరిస్తారు"అని చెప్పాడు.** అతను కూడా "నాకు తెలుసు. ఆ పిల్లవాని ముఖంలోని తేజస్సును చూస్తేనే తెలుస్తోంది" అన్నాడు. లోపలికి వెళ్ళాము.

అది మొట్టమొదటి పరీక్ష. మా ముగ్గురి నెంబర్ల మధ్య చాల వ్యత్యాసం ఉండటంచేత, మేము ముగ్గురం ఒకరి కొకరు చాల దూరంగా కూర్చోవలసివచ్చింది. దాంతో రమేశ్, సురేశ్ చాల భయపడి పోయారు. అప్పుడు నేను **" మీ ఆన్సర్ పేపర్లు కూడా నేనే వ్రాసి అక్కడ పెడతాను. మీరేమీ భయపడకండి. నేను చెప్పినట్లు చేయండి. ఈ నాటకం నేనాడతాను",** అని చెప్పాను. **నటన సూత్రధారివి నేను. ఇంత లోకాన్నే ఆడించేవాడిని. ఈ ముగ్గురి ఆట ఆడలేనా!** మొట్టమొదట ఇచ్చిన పేపరు మీద చక్కని ఆన్సర్లు స్పీడుగా వ్రాశాను. దానిపైన నా నెంబరు, పేరు వ్రాసి మడత వేసి ప్రక్కన పెట్టుకున్నాను. మరొక పేపరు తీసుకొని రమేశ్ హెండ్ రైటింగుతో చక్కని జవాబులు వ్రాసి, దానిపై అతని పేరు, నెంబరు వ్రాశాను. అదేరీతిగా,

స్వామి బాల్యము

ఇంకొక పేపరుపై సురేశ్ హెండ్ రైటింగుతో చక్కని జవాబులు వ్రాశాను. ఆ మూడు పేపర్లను నాదగ్గరే పెట్టుకున్నాను. ఇంతలో బెల్లు కొట్టారు. "టైమ్ అయి పోయింది. పేపర్లు ఇచ్చేయండి" అంటూ టీచర్లు తొందర పెట్టారు. పిల్లలు అటూ, ఇటూ చూస్తున్నారు. **రమేశ్‌ని, సురేశ్‌ని బయటికి పొమ్మని చెప్పాను.** వారు బయటికి పోయారు. నేను ఈ మూడు పేపర్లు అక్కడ పెట్టాను. వారం రోజుల తరువాత పరీక్షా ఫలితాలు వచ్చాయి. **మా ముగ్గురికీ ఫస్ట్ క్లాస్ వచ్చింది.** నూటికి నూరు మార్కులు వచ్చాయి. హెడ్ మాస్టర్ కేశవరావు Very Very Very Good అని వ్రాశాడు. రమేశ్, సురేశ్‌లు "రాజూ! నీ మూలంగానే మాకు ఫస్ట్ క్లాసు వచ్చింది. అని కృతజ్ఞతలు తెల్పుకున్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తిలో పెద్ద ఊరేగింపు జరిగింది. ఊరేగింపులో తల్లిదండ్రులు, క్లాసుపిల్లలు, ఇంకా అనేకమంది మాకు పూలమాలలు వేశారు? తప్పెట్లతో, ఇతర వాయిద్యాలతో సత్యమ్మ గుడి వరకు మమ్మల్ని ఊరేగించారు.

నేను స్కూల్లో చదువుతున్నప్పుడు పిల్లలకు అనేక పాటలు వ్రాసి ఇచ్చేవాడిని. "రాజూ! నీకు ఎలా వచ్చింది ఈ కవిత్వం!" అని వారు ఎంతో ఆశ్చర్యపోయేవారు. ఆ పాటలను పాడుకొని ఎంతో ఆనందించేవారు. **బుక్కపట్నం స్కూల్లో ప్రార్థనా గీతాన్ని నేనే ప్రారంభించాను. హెడ్ మాస్టరు ప్రార్థనకు సంబంధించిన పాటను కూడా నన్నే వ్రాసి పెట్టమన్నాడు. అప్పుడు నేనొక పాట వ్రాశాను.**

అహరహతవ ఆహ్వాన ప్రచారిత
సునిశిత ఉదారవాణి
హిందు బౌద్ధ సిక జైన పారశీక
ముసల్మాన కిరస్తానీ....

ఈ విధంగా అన్ని మతములూ ఏకమైపోవాలని నేను ఆనాడే బోధించాను. గ్రామస్థులందరూ నన్ను 'వేదాంతి' అని పిలిచేవారు. ఈ గ్రామంలో సుబ్బారాయుడు అనే 70 సంవత్సరాల వ్యక్తి ఉండేవాడు. అతడు సత్యమ్మ గుడి దగ్గరకు వచ్చి కాళ్ళు కడుక్కొని అరుగుపై కూర్చునేవాడు. ఒకనాడు నేను అక్కడి నుండి వస్తుంటే "రాజూ, రాజూ, ఇటు రా" అని పిలిచాడు. నేను దగ్గరకి వెళ్ళి ఏం కావాలని అడిగితే "రాజూ! నేను లావుగా ఉన్నాను. నా తొడకూడా పెద్దదిగానే ఉన్నది. కొద్దిసేపు నీవు నా తొడపై కూర్చో" అన్నాడు. "నేను మీ తొడపై కూర్చొవడం వలన మీకు వచ్చే ఫలితం ఏమిటి? అని అడిగాను. "ఆ ఫలితాన్ని నేను మాటలలో వర్ణించలేను. అది అనంతమైన, అద్భుతమైన ఫలితం" అన్నాడు. **అంతేగాదు "రాజూ! నీవు పుట్టపర్తికి ఒక పెద్ద జ్యోతివంటి వాడివి. నీపేరు, నీ ప్రభావము ప్రపంచ మంతా వ్యాపించి పోతాయి" అన్నాడు.** ఆనాడు ఆయన చెప్పిన మాట ఈనాడు అక్షరాలా సత్యమైంది. **రాజు పేరుప్రతిష్ఠలు, ఈ పుట్టపర్తి పేరు ప్రతిష్ఠలు కేవలం భారత దేశంలోనేకాదు, యావత్ ప్రపంచ మంతటా వ్యాపించుపోయాయి.** ఆనాడు పుట్టపర్తికి కాలి నడకన చేరడానికి కూడా కష్టమయ్యేది. అలాంటి కుగ్రామమైన పుట్టపర్తి ఈనాడు ప్రపంచ మ్యాపులో ప్రధానమైన స్థానాన్ని ఆక్రమించుకుంది. **ఇంత గొప్ప పేరు వస్తుందని సుబ్బారాయుడు అనాడే చెప్పాడు.** ఆయనకు పిల్లలు లేరు పాపం! గట్టిగా నన్ను కౌగిలించు కున్నాడు. "రాజూ! ఈ ప్రాప్తిని పొందిన నేనెంత అదృష్టవంతుడనో!" అని ఆనందించాడు. అయితే, "నాకు మీ నాన్నకు మధ్య మాటలు లేవు. నేను నీతో మాట్లాడటం కూడా మీ నాన్నకు ఇష్టం ఉండదు. కాబట్టి, ఈ సంగతి ఆయనకు చెప్పవద్దు" అన్నాడు. "తప్పేమీ లేదు, నేను యథార్థం చెపుతాను. ఆయన చాల మంచివాడు" అన్నాను. నేను ఇంటికి పోయిన తరువాత **గృహం అబ్బాయి "ఆ సుబ్బారాయుడితో ఎందుకు మాట్లాడతావు నీవు?"** అన్నాడు. "ఎందుకు అతనితో మాట్లాడకూడదు"? అని నేను ప్రశ్నించాను. **"నాకు వాడు విరోధి" అన్నాడాయన. "మీకు విరోధి కావచ్చుగాని, నాకు విరోధి కాడు. కాబట్టి, నేను అతనితో మాట్లాడాను. తప్పులేదు"** అని చెప్పి నేను రెండు చేతులు జోడించి **"చూడండి పెద్దలైన మీరు ఎవ్వరినీ ద్వేషించకూడదు. ద్వేషాన్ని దూరం చేసుకొని**

ఐకమత్యంచేత గ్రామాన్ని అభివృద్ధి పరచండి"అన్నాను. "ఆ సుబ్బారాయుడు ఏమిటి నీతో మాట్లాడుతున్నది?" అని అడిగాడు. "నా ప్రభావం చేత ఈ పుట్టపర్తి గ్రామం ప్రపంచానికే ఒక ఆదర్శవంతమైన జ్యోతిగా వెలుగొందుతుందని అన్నాడు" అని జవాబిచ్చాను. ఆయనకు కోపం వచ్చేసింది. "ఏమిట్రా నీ ప్రభావము? ఆ సుబ్బారాయుడు ఏమిటో గొప్పగా వర్ణిస్తున్నాడు" అన్నాడు. **నేను అక్కడి నుండి వెళ్ళి రెండు చేతులలో పూలు తెచ్చాను "నేను ఎవరినో తెలుసునా?**

నేను సాయిని తెలియుము నిక్కముగను
మమత బాయుము యత్నముల్ మానుకొనుము
బాసె మీకు నాతోడి సంబంధమింక
కాదు నప్పట్ట మరియెట్టి ఘనునికైన

అని పలికి ఆ పువ్వులను క్రిందికి విసిరాను. అవి "శ్రీసత్యసాయిబాబా" అనే అక్షరాలుగా ఏర్పడ్డాయి. అప్పటి నుండి గృహం అబ్బాయి నా విషయంలో చాల జాగ్రత్తగా ఉన్నాడు. ఆ విధంగా నేను చిన్నప్పటి నుండి పిల్లలకే కాదు, పెద్దలకు కూడా హితబోధలు చేస్తూ వచ్చాను.

సత్యనారాయణ కూడా చాల గొప్పవాడు. ఒక రోజున నా చొక్కా చినిగిపోయింది. అతడు చూశాడు. ఆ రోజుల్లో ఒకటిన్నర అణాకు చొక్కా, నిక్కరు రెండూ వచ్చేవి. అతడు రెండింటినీ మడత పెట్టి నా దగ్గరికి తెచ్చి "రాజూ! నీవు ఏమీ అనుకోకూడదు. నేను ఎంతో ప్రేమతో తెచ్చాను. వీటిని నీవు కుట్టించుకోవాలి" అన్నాడు. "నీకు నాకు శాశ్వత మైన సంబంధ బాంధవ్యము ఉండాలనుకుంటే వీటిని నాకివ్వకూడదు. నేను వీటిని ముట్టను" అన్నాను. ఇంతవరకు నేను ఇతరులవద్ద నయాపైసా ముట్టలేదు. ఏదీ నాకు అవసరం లేదు. **నాకు అవసరమైనది దానంతటదే నాదగ్గరకు వస్తుంది. కనుక, నేను ఎవరివద్ద చేయి జాచలేదు. బాల్యము నుండి నేటి వరకు, ఇంకేనాటివరకైనా నాచేయి ఇచ్చేదేకాని పుచ్చుకునేది కాదు. నాకు ఇచ్చుకోవడమే ఆనందంగాని, పుచ్చుకోవడం కాదు. కొంతమంది అసూయాపరులు తమకు ఇవ్వలేదని నన్ను దూషించవచ్చు. గట్టిగా దూషిస్తే గాలిలో కలిసిపోతుంది. వారిలో వారు తిట్టుకుంటే అది వారికే చేరిపోతుంది. అది నావరకు రావడానికి అవకాశమే లేదు. నేను ఎవ్వరినీ ద్వేషించలేదు, దూషించలేదు, పరిహసించలేదు. నన్ను పరిహసించినవారిని కూడా నేను ఆనందంగా పలకరించే వాడిని.**

ఒకనాడు **సుబ్బమ్మ వచ్చి తమాషాకు "రాజూ!** నీ వు ఇంతమందికి ఇన్ని సద్బోధలు చేస్తున్నావు. మా **ఆయన కొంచెం చెడుమార్గంలో పోతున్నాడు.** ఆయనను సరిదిద్దవచ్చు కదా!" అంది. "నీవు ఏమీ అనుకోకపోతే తప్పక చేస్తాను" అని చెప్పాను. ఆయన ప్రతి రోజు సాయంకాలం బృందావనం దగ్గర కూర్చునేవాడు. నేను ఒక పాట వ్రాసి, దానికి చక్కని రాగం కూర్చి పిల్లలకు నేర్పించి కరణం ముందర పాడుకుంటూ వెళ్ళమని చెప్పాను.

వింటకత్తెల చెరకు పోకు
ఖండితముగ నీవు కడు నీచుడౌతావు
కులమువారలు నిన్ను కుండ ముట్టనివ్వరు
బంధువులు నిను చూస్తే బయటెళ్ళగొడతారు
స్నేహితులు నిను చూస్తే చెప్పుతో కొడతారు.

ఈ విధంగా, పిల్లలు పాడుకుంటూ వెళుతుంటే **కరణానికి కోపం వచ్చింది.** తక్షణమే లోపలికి వెళ్ళిపోయాడు. తరువాత మనిషిని పంపించి పిల్లలను పిలిపించాడు. "మీకీపాట ఎవరు రాసిచ్చారు?" అని అడిగాడు. పిల్లలు భయపడుతూ "రాజు రాసిచ్చాడు" అని చెప్పారు. ఈ పనికి సూత్రధారిని నేనేనని, నేను తప్ప ఈ పని ఇంకెవ్వరూ చేయలేరని ఆయనకు కూడా తెలుసు. మరునాడు నన్ను పిలిచి మంచి మామిడి పళ్ళు ఇచ్చి "రాజూ! దయచేసి పిల్లలకు ఇలాంటి పాటలు నేర్పించకు" అన్నాడు. **"కరణంగారూ! పెద్దవారైన మీరు కూడా అలాంటి పనులు చేయకూడదు" అన్నాను.** ఆయన **ఇకమీదట చేయనని నాకు మాటిచ్చాడు. నేను కూడా ఇలాంటి పాటలు వ్రాసి ఆయనను ఇబ్బంది పెట్టనని మాటిచ్చాను. ఈ విషయం**

తెలుసుకొని సుబ్బమ్మ చాల సంతోషించింది. ఈవిధంగా, చిన్నతనంలోనే నేను పెద్దవారిలో మార్పు తెప్పించే వాడిని. సుబ్బమ్మ తన భర్త పోయిన తరువాత తన జీవితాన్నంతా స్వామిసేవకే అంకితం చేసింది. కట్టకడపటికి తన ప్రాణం పోయేంతవరకు స్వామి సేవలోనే కాలం గడిపింది. నిజంగా ఆమె భక్తి ప్రపత్తులను గురించి మీరు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. వచ్చిన భక్తులందరికీ ఆమె ఉచితంగా భోజనం పెట్టేది పాపం! ఒకరోజు బండిలో వెళుతున్నాం మేము. "సుబ్బమ్మా! ఏమి కావాలి నీకు?" అని అడిగాను. అటూ ఇటూ చూసింది. ఎవ్వరూ లేరని గుర్తించి "స్వామీ! నాకు ఏమీ వద్దుగాని, నా ప్రాణం పోయే ముందు మీ చేతిమీదుగా నా నోట్లో నీరు పోయాలి" అంది. **తప్పక ఆమె అభీష్టాన్ని నెరవేరుస్తానని మాట ఇచ్చాను.**

సరే, ఒకనాడు మద్రాసువారు నన్ను తొందరపెట్టి తీసుకు పోయారు. అక్కడ పది దినములు ఉండవలసి వచ్చింది. అది యుద్ధ సమయం. మద్రాసులో గంటకు ఒక సైరన్ వినిపించేది. సైరన్ వచ్చేసరికి రోడ్లన్నీ ఖాళీ అయిపోయేవి. ఈ లోపల సుబ్బమ్మకు సీరియస్ అయింది. కాని, మేము రావడానికి వీలులేకపోయింది. ఆమెను బుక్కపట్నం తీసుకు వెళ్ళారు. అక్కడ ప్రాణం పోయింది. బంధువులందరూ **"సాయిబాబా ఆమె ప్రాణం పోయే ముందు నోట్లో నీరు పోస్తానని మాట ఇచ్చాడు. ప్రాణం పోయింది. కాని, ఎక్కడొచ్చాడు సాయిబాబా? ఎక్కడకు పోయాడో!" అంటూ అనేక రకాలుగా మాట్లాడుతూ వచ్చారు.**

నేను వచ్చే దారిలోనే ఉన్నది Burial Ground(స్మశానం) అక్కడ కట్టెలు పేర్చి అందరూ కాచుకొని ఉన్నారు. "ఎవరిని కాలుస్తున్నారు?" అని అడిగాను. అక్కడ చాకలి సుబ్బన్న ఉన్నాడు. "స్వామీ! సుబ్బమ్మగారు పోయినారు"? అన్నాడు. "పోయినారా? ఎప్పుడు పోయినారు?" అని అడిగాను. "మూడు దినాలైపోయింది స్వామీ!" అన్నాడు నేను ఇంటి దగ్గరకు వెళ్ళాను. అందరూ సుబ్బమ్మ మృత దేహాన్ని తీసుకు వెళ్ళడానికి సిద్ధమౌతున్నారు. నన్ను చూస్తూనే ఆమె సిస్టర్ గట్టిగా ఏడ్చింది. **"బాబా! నీవు వచ్చి తన గొంతులో నీరు పోస్తావని ఎంతో ఆశించింది. నిన్ను చూడాలని కన్నులు కాయలు కాచేటట్లు ఎదరు చూసింది.** కట్టకడపటికి నిరాశతో ప్రాణం విడిచింది" అని విలపించింది. అలా జరగడానికి వీల్లేదని చెప్పి, **ఒక టంబ్లరులో నీరు తెప్పించాను. అందులో తులసీ దళం వేశాను. సుబ్బమ్మ దేహం వద్దకు వెళ్ళి పైన కప్పిన బట్ట తీశాను.** అంతా చీమలు పట్టినాయి. పాపం! ప్రాణం పోయి మూడు దినములైపోయింది. **"సుబ్బమ్మా! అని పిలిచాను. తక్షణమే కళ్లు తెరిచింది! నా రెండు చేతులు గట్టిగా పట్టుకుని కన్నీటి ధారలు కార్చింది. "సుబ్బమ్మా! బాగా చూడు"** అన్నాను. టవలు తీసి బాగా తుడిచాను. **"ప్రశాంతంగా కన్ను మూసుకో" అని చెప్పి ఆమె నోట్లో తులసీ తీర్థం పోసి నా మాటను నిలబెట్టుకున్నాను.**

చాకలి సుబ్బన్న చాల బలవంతుడు. చంద్రప్పగారి సుబ్బన్న ఏడడుగుల ఎత్తువాడు. వారిద్దరిలో **ఎవరో ఒకరు ఎప్పుడూ నావెంట ఉండాలని సుబ్బమ్మ శాసించేది. వారితో "బాబా ఎప్పుడంటే అప్పుడు నదికి వెళుతుంటాడు. చిన్న వాడు, నడవలేడు. కాబట్టి, మీరు భుజంపై ఎక్కించుకుని తీసుకు వెళ్ళాలి" అని చెప్పేది.** ఈవిధంగా, **ఆమె నా సౌకర్యంకోసం అనేక ఏర్పాట్లు చేస్తూ వచ్చింది. ఆమె గుణము చాల విశాలమైనది.** తాను ఏది చేసినా స్వామితృప్తికోసం చేసేది. ఒకనాడు **ఎట్టి గంగప్ప అనే హరిజనుడు నన్ను భోజనానికి రావలసిందని ప్రార్థించాడు. అతను ఇప్పుడు కూడా ఉన్నాడు.** ఇప్పుడతని వయస్సు 90 సంవత్సరాలు. అతని కుమారుడు మన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులో పనిచేస్తున్నాడు. **నేను సుబ్బమ్మతో ఎట్టి గంగప్ప ఇంటికి భోజనానికి వెళుతున్నానని చెప్పాను. తాను కూడా వస్తానన్నది. "నేను హరిజనుల ఇండ్లకు పోతున్నావు. నువ్వు రావద్దు" అని చెప్పాను. "ఏమిటి స్వామీ, మీరు వెళుతుంటే నేనెందుకు రాకూడదు? నాకెలాంటి భేదమూ లేదు. నేనూ వస్తాను" అని నావెంట వచ్చింది. ఆ ఇంట్లో భోజనం చేశాము. "సుబ్బమ్మగారు మాలిండ్లకు వచ్చారే!" అని గంగప్ప**

చాల భయపడిపోయాడు. "మీరు ఆవిధంగా భావించకండి. కులమత భేదాలను వీడి ఐకమత్యంతో ఆనందంగా ఉండండి" అని చెప్పాను. ఈ విధంగా, చిన్నప్పటి నుండియే ఇలాంటి భేదాలను దూరం చేస్తూ వచ్చాను. ఇలా చెపుతూ పోతే ఎంతో చరిత్ర ఉన్నది.

ఈనాటి పిల్లలు మంచి గుణవంతులు కావాలి. ద్వేషము, క్రోధము, డంబము, అసూయ ఇత్యాది దుర్గుణములను త్యజించాలి. అహంకారములను త్యజించాలి. అహంకారము నకు అసలే అవకాశ మివ్వకూడదు. ప్రేమనే మీరు పెంచుకోవాలి. ప్రేమయే మీ జీవితంగా ఉండాలి. **ప్రేమ లేకపోతే మీరు శవంతో సమానం. ఎలాంటి పరిస్థితి యందైనా ప్రేమను మాత్రం దూరం చేసుకోకూడదు. ఈనాడు మీరు ఇక్కడ కాకపోయినా ఎక్కడైనా నేను మిమ్మల్ని రక్షించక తప్పదు. అప్పుడు తెలుసుకొని పశ్చాత్తాపపడితే ప్రయోజన మేమిటి? ఈనాడే మీరు తెలుసుకోవడానికి ప్రయత్నించండి.**

(స.సా.ఏ.2000 పు.110/119)

(చూ॥ ప్రార్థనగీతము, మత బాంధవ్యము, సర్వమత సామరస్యము)

స్వామిభోజనము

నాకు కాఫీ, టీ వంటివి గిట్టవు. ఎక్కువ నూనెతో చేసినవి నచ్చవు. బిస్కెట్లు, చాక్లెట్లు ముట్టనే ముట్టను. వాటి వాసనకూడా గిట్టదు. రాగిముద్ద, కొద్దిగా వేరుశనగ పచ్చడి తీసుకుంటానంతే. ఇంకేమీ తీసుకోను. స్కూలులో చదువుకునే రోజుల్లో జొన్నరొట్టి మధ్యలో గుంతగా చేసి అందులో వేరుశెనగ చట్నీ వేసుకొని గుడ్డలో చుట్టుకొని తీసు కువేళ్ళేవాడిని. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అందరూ ఒక ప్రక్కన కూర్చుని భోజనం చేస్తుంటే, నేను మాత్రం ప్రత్యేకంగా కూర్చుని తినేవాడిని, అన్నారు. "స్వామీ! రొట్టి గట్టి పడుతుందంటారు. తినటం కష్టం కదా!" అన్నాను. "ఏమిుండదు. నీళ్ళలో ముంచేసరికి మెత్తబడుతుంది. అప్పుడు తినవచ్చు."

బ్రహ్మాండమంతయు బొజ్జలో నుండగ, భక్ష్య భోజ్యంబులు నాకు పెట్ట తగున?"

(స.సా.ఫి.2001 పు.61)

స్వామి శివానంద

నేను ఋషీకేశ్‌లోని గెస్ట్‌హౌస్‌లో దిగాను. మిగిలిన రెండువందలమందికి రామకృష్ణారావు వసతి ఏర్పాటు చేశాడు. ఆనాడు స్వామిశివానంద వారిశిష్యులు గస్ట్‌హౌస్‌కు వచ్చి, "రేపు శివానందులవారి 70వ బర్త్‌డే. కాబట్టి స్వామి తప్పక రావాలి" అని కోరారు. నేను, **"ఇది శివానంద బర్త్‌డే కాదు, కుప్పుస్వామి బర్త్‌డే" అన్నాను. శివానంద పేరుతో సన్న్యాసము తీసుకోక పూర్వము ఆయన పేరు డా॥ కుప్పుస్వామి.** సన్న్యాసము తీసుకోవడంతో ఆ కుప్పుస్వామి 'చనిపోయాడు',ఆ వేషమే మారిపోయింది. అప్పుడే తాను శివానంద అని పేరు పెట్టుకున్నాడు. అది జరిగి అప్పటికి 26 సం॥లు అయినది. కాబట్టి, 'కుప్పుస్వామికి 70 ఏళ్ళు, శివానందకు 26 ఏళ్ళు' అని అన్నాను. అప్పుడు శివానంద, "స్వామీ! ఈ దేహానికి 70 ఏళ్ళు పూర్తి యైనవి. కాని, ఇంతవరకు ఎవ్వరూ ఈ విధంగా నన్ను సుత్తితో కొట్టియుండులేదు" అన్నాడు. పుట్టినది మొదలు దేహము గిట్టునంత వరకు ఒకే రూపము, ఒకే నామమనేది కేవలం దైవమునకు, అవతారములకు తప్ప అన్యులకు సాధ్యం కాదు.

(స.సా.జూలై.97 పు.185/186)

స్వార్థము

(చూ॥ దేశశ్రేయస్సు)

స్వాహా

ఫలత్యాగ కర్మలలో, పదే పదే స్వాహా అనుచు అర్పితము గావించుచుందురు. ఈ స్వాహా శబ్దసాంప్రదాయములకు గతములైన శబ్దములు అర్థములను చూతము. కేశవాయ

స్వాహా

స్వాహా, ప్రాణాయస్వాహా, ఇంద్రాయస్వాహా, ఇత్యాది స్వరములయందు, **'స్వాహా' పదమునకు సామాన్యముగ "హవిస్సు సుహుతమగు గాక" అని అర్థము చెప్పుదురు. "సుహుత" మన నేమి?** అగ్నియందు విడువబడిన యజ్ఞాది ద్రవ్యములు దగ్ధమగు గాక, జీర్ణమగుగాక, అని ఇక్కడ ఒక సందేహము కలుగవచ్చు. అగ్నిలో వేసిన సమస్త పదార్థములు, సహజంగానే దగ్ధమగును. జీర్ణమగును కదా. ఇక స్వాహాకారము చేయుటచేత కలుగు ప్రత్యేకత ఏమి? **స్వాహుతి అనగా వస్తువులను దగ్ధము చేయుట,** జీర్ణముచేయుట మాత్రమే శ్రుతితాత్పర్యము కాదు. దగ్ధ మగుట ప్రత్యక్షగోచరము మాత్రమే; వైదిక దృష్టివేరు. కుమారసంభవ కావ్యమందు, కాళిదాసు, హిమాలయమును వర్ణించుచూ "దేవతాత్మా" అని అన్నాడు. అనగా దేవతా శరీరము, భౌతిక శరీరము అని ప్రతిదానికి రెండు శరీరములు కలవు. ఇది శ్రుతి సమ్మతము. దేవతా శరీరము అతీంద్రియం, భౌతిక శరీరం ఇంద్రియములతో కూడినది. దేవతా శరీరమున అగ్ని ప్రాణాగ్ని అగుచున్నది. అందులో అహుతి హవిస్సు అగుచున్నది. అహుతియొక్క స్వరూపమును శ్రుతి యిట్లు వివరించుచున్నది. **అత్తా, అద్యము అనగా భోక్త, భోగ్యరూపమగు ఈ జగత్తు ఏకీభూతమయినపుడు, రెంటినీ కలిపి అత్తా అనియే అనగా భోక్త అనియే, వ్యవహారము. ఆ భోక్త యెవరు? అదే అగ్ని. అది దైవికముగ ఆదిత్యుడు; ఆధ్యాత్మికముగ ప్రాణము. అట్టి ప్రాణాగ్ని యందు సమంత్రముగ నుంచబడెడి అన్నాది హవిస్సులకు "అహితయుః" అని పేరు. స్వాహా శబ్దము కేవలము హోమ సూచకమైన సాంకేతిక పదము మాత్రమే కాదు. సార్థకమగు వాఙ్మయము.**

ఛందయతిః ఆహ్లాద, చాదనమనగా బలవంతుడగుట, **ప్రాణశక్తి వంతుడగుట,** ఆచ్ఛాదించుట. ఇట్టి ధర్మ బలముండుటచేతనే వేదములకు చందస్సులని పేరు. ఇట్టి వేదము నాచ్ఛాదించు వారలను సుశక్తి వంతులను తైత్తరీయ శ్రుతి యెంతయో విపులపరచినది. ఇట్టి క్రతువు ఒక వ్యక్తికే కాక లోకోత్తరాహ్లాదమనే కలిగించునదై యున్నది. **"యజ్ఞాంగుః యజ్ఞ వాహనుః వృషరథుః" ఇత్యాది నామములు శ్రుతి, స్మృతులయందు పరమేశ్వరునకు చెప్పబడినవి. హిరణ్యగర్భుడు సువర్ణ ఛందోయముడు, సువర్ణమనగా గరుత్మంతుడు. ఛందోమయమును గరుడుని వాహనముగా స్వీకరించినవాడు.**

వృష అనగా ధర్మస్వరూపము. ధర్మమునే వాహనముగా చేసుకొనుట. **విష్ణు ఆలయములందు గరుడ, శివాలయములందు వృషభం స్తంభములను ద్వారముల ముందు యుంచి యుండుటలో ఇదే అంతరార్థము.**

ఛాదనమనగ సంసారవృక్ష రక్షణము. ఫలకాములై కర్మల యందు చరించు వారికి తత్త్వము నాచ్ఛాదించి, ధర్మనిష్టులగావించి, సంసార వృక్షమును రక్షించు చుండును. కర్మిష్టులన ధర్మరూపమృత్యువునుండియు జ్ఞానులను సంసార రూపమృత్యువునుండియు నాచ్ఛాదించి రక్షించును. అట్లు రక్షించునట్టి వానినే ఛందస్సులనియు, అవే వేదములనియు చెప్పబడెను. **"ఛాదనాత్ ఛందాసి" మృత్యువునుండి రక్షించగలుగునదని ఛందస్సులు శర్మ హేతువులు.** యజ్ఞము దేవతలనుండి తొలగి పోయి కృష్ణమృగరూపమై సంచరించుచుండ దేవతలు వెన్నంటి, కడకు దాని చర్మమును గ్రహించగల్గిరి. **యజ్ఞశరీరమే కృష్ణాజినము. దానియందలి శుక్ల కృష్ణ, బబ్రువర్ణములు ఋగ్వేద, యజుఃసామములయొక్క రూపములు.** కనుక కృష్ణాజినము ఋగ్, యజుర్, సామవేదస్వరూపమనే నిర్ణయము గావించిరి. **దీనిని త్రయీ విద్యారూపమనిరి. త్రయీ విహిత కర్మ సాధ్యమగుటచే యజ్ఞముకూడా త్రయీస్వరూపము.** ఇట్టి కృష్ణాజినమును గ్రహించుటచేతనే, యజ్ఞదీక్షితుడగు యజమానుడు, ఛందస్సుల ప్రేరేపించును.

శుక్ల, కృష్ణ బబ్రు వర్ణములుకల కృష్ణాజినము లోకత్రయారూపము. కాన కృష్ణాజినము ధరించి యజమానుడు లోకత్రయ దీక్షితుడగుచున్నాడు. దీక్షితుడైన యజమాని గర్భస్థశిశుతల్యుడు. గర్భస్థ శిశువు యేరీతిగ

వ్రేళ్ళుముడిచి గుప్పిలిపట్టి మాత్రు శరీరచ్ఛాదితుడై యుండునో యజమానుడును అట్లే గుప్పిలిపట్టి త్రయీ విద్యారూప ఛందోమాతృశరీరచ్ఛాదితుడై కృష్ణాజినధారుడై యుండవలెను.

కృష్ణాజినము మానుషదృష్టిలో చర్మము. అది దేవతా ప్రీతికర మైనదగుటచేత, యజ్ఞకర్మల యందు శర్మమగుచున్నది. అందువలన యేయజమానుడు, యజ్ఞసమయమున "నీవు శర్మస్వరూపివి. నాకు శర్మ నిమ్ము" అని సంబోధించును.

శర్మమనగా సుఖము, ఆనందము. ఆనందస్వరూపుడు విష్ణువు. విష్ణువు యజ్ఞస్వరూపుడు. "యజ్ఞోవైవిష్ణుః" ఆ విష్ణు త్రయీ విద్యా స్వరూపుడు.

(స.వా.పు.168/171)

స్వాహా అను పదము వేదవాచకము కాదని యున్నది. సామాన్యముగా హోమార్థమైన మంత్రమనియు, ఇది హోమసూచకమైన సాంకేతిక పదమనియూ తలంతురు. ఈ **పదమునకు స్వాహాదేవి అనియు, హవిష్ప్రధాన మనియు రెండు అర్థములున్నవి. దేవతలను ఉద్దేశించి స్వాహా అనియు, పితరులను ఉద్దేశించి స్వధా అని హవిస్సులు వేయబడుచుండును. స్వాహా అనుపదము వేదములో వాగ్దేవత అను అర్థము నిచ్చుచున్నది.** నిత్యనైమిత్తి కర్మలు, యాగాది క్రియలు అన్నియూ స్వాహాకార పూర్వకమగు నాచమన క్రియలతో ఆరంభ మగుచున్నవి. స్వాహా, స్వధాకార వర్జితములైన హోమములు సామాన్యముగా ఉండవు.

స్వాహా, స్వధామంత్రములు చేర్చి హవిర్దానముల గావించుట చేత దేవతలు, పితరులు తృప్తి పడుదురు. స్వాహా అను నామమును ఉచ్చరించకవేద విదులు యజ్ఞములందు హోమము మొనర్చినచో దేవతలు ఆయజ్ఞ భాగములను పొందలేరు. స్వాహా, స్వధా అనురెండు శబ్దములు దేవతా ప్రీతి కరములును దేవతా జీవన హేతువులును అగుమంత్రములు.

"స్వాహాస్తోమస్యవర్చసా" ఋగ్వేదము. స్వాహా పదమునకు (1) స్వాహాకారపూర్వకమైన హవిర్దానము (2) స్తుతిలక్షణ మగు వేదవాక్కు అని రెండు అర్థములు ప్రసిద్ధములు. ఏ యర్థమును చెప్పినను లేక రెండు అర్థములు చెప్పినను స్వాహాపదోచ్చారణముచే దేవతలు ప్రీతి నొందుటయు, అట్లు ప్రీతి నొందిన దేవతలు స్తోత్రము చేయుస్తోతను వర్ధిల్లు జేయుటయు జరుగును.

స్తోత్ర యొక్క వేద మంత్ర రూపమైన వాక్కులో నొక విధమగు ప్రభావమును చేకూర్చి ఉచ్ఛ్వసించుట అని అర్థము.

కేశ వాయ స్వాహా, ప్రాణాయస్వాహా, ఇంద్రాయస్వాహా, ఇత్యాది స్థలములందు స్వాహా పదమునకు స్వాహుతమస్తు, సుహుతమస్తు అనగా సుహోత మగు గాక స్వాహతమగు గాక అని అర్థము. అర్పిత ద్రవ్యములు దగ్ధమగును గాక అనగా జీర్ణమగును గాక అని కూడా యర్థము.

స్వాహుతి అనగా వస్తువులను అగ్నిలో చక్కగా దగ్ధము చేయుట, లేక జీర్ణము చేయుట అని మాత్రమే కాదు. లౌకికముగా వస్తువులు అగ్నిలో దగ్ధమైపోవుట మాత్రమే చూతురు కాని అగ్నికి దేవతాస్వరూపము, భౌతిక స్వరూపము రెండునూ కలవని తెలిసికొనరు. దేవతా శరీరము అతీంద్రియమగుటచే కర్మానుష్ఠాన సమయమున ఆయా దివ్యరూపముల ఆరాధించుట శ్రుతి సమ్మతము. "అగ్నిర్వై దేవ యోనిః" అనేది శ్రుతి ననుసరించి అగ్ని యొక్క దేవతాత్మకత్వమును అటులనే యజమానికి కలుగు దివ్యత్వమును ఎవరు తెలిసికొనగలరో అట్టివారికి అమృతత్వము సిద్ధించును.

భోక్త, భోగ్యము అని జగత్తు ద్వివిధము. భోక్త భోగ్య రూపమగు ఈ జగత్తు ఏకీభూతమగునపుడు, ఈ రెండింటినీ కలిపి అత్తా అనియె లేక భోక్త అనియో వ్యవహారము. భోగ్యము అను వ్యవహారము లేదు. భోక్త యెవరు? అగ్నియే హవిస్సుల గ్రహించేది.

అధిదైవికము ఆదిత్యుడు. ఆధ్యాత్మికముగ ప్రాణము. ప్రాణాగ్ని ఇట్లు అగ్ని యందు ఆజ్య. సోమ ఆది హవిస్తులకు "అహితయః" అని పేరు. పరోక్షముగ అహుతులు అని చెప్పబడినవి. దేవతలు పరోక్ష ప్రియులు.

స్వేచ్ఛ

అగ్రిః సర్వమునకు అగ్రమున అనగా పూర్వమున సృజింపబడినవాడు అని అర్థము అగ్నిః పరోక్షనామము. దేవతలనుద్దేశించి హూమము చేయబడునది. అంత మాత్రమే గాక దేవతా ఆహ్వాన రూపమని విశేషార్థము. స్వాహాకార వషట్కార పూర్వకము కాని అహుతులు దేవతలకు చెందనే చెందవు.

సరస్వతి శబ్దము ఒక దేవికిని, వేదవాక్కునకును ప్రసిద్ధము. అంతేకాదు. ఆత్మను గురించి చెప్పునది కనుక స్వాహా అని అర్థము. దేవీ భాగవతమునందు పరాదేవతయే గాయత్రి అనియు, స్వాహా అనియు చెప్పబడినది. లలితా సహస్రనామములో పరాదేవత స్వాహా, స్వధా అను శబ్దములతో పేర్కొనబడినది. స్వాహా అను శబ్దము హవిర్దాన వాచకము కూడా.

(లీ.వా.పు.19/23)

స్వేచ్ఛ

పక్షులు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. మృగములు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. అలాంటప్పుడు మానవుడు యెందుకు స్వేచ్ఛగా చరించరాదు. అని ప్రశ్నిస్తున్నారు. కొంతమంది యువకులు నిజమే! నీవు కూడ స్వేచ్ఛను అనుసరించు. కానీ పక్షలు యేస్వేచ్ఛను అనుసరిస్తున్నాయి? పక్షి యొక్క స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. నీవు మానవుడు కాబట్టి మానవస్వేచ్ఛను అనుభవించు. రాక్షసస్వేచ్ఛను అనుభవించ రాదు. మానవుడని చెప్పుకుంటూ రాక్షసస్వేచ్ఛను అనుభవించటం విరుద్ధమైనట్టిది. నీవు మానవుడుగా సంచరించు. మానవుడుగా సంచరించే సమయములో మానవత్వాన్ని పెంచుకో. **త్యాగము నీతి, నిజాయితీ, దయ, కరుణ, ప్రేమ, అహింస ఇలాంటి భావములతో మానవత్వాన్ని పెంచుకోవాలి. కనుక మానవునికి రాకూడనటువంటి గుణములు కోపము, అసూయ స్వార్థము యిలాంటి గుణములు పెంచుకోవటం చేత మృగలక్షణాలను పెంచుకున్నవార మౌతాము. మానవునియందు ముఖ్యముగా అహంకారము, స్వార్థము, అసూయ, యీమూడు చాలా దుర్మార్గమైన గుణములు అభివృద్ధి అవుతున్నాయి. ఈ మూడింటిని అదుపులో పెట్టుకోవాలను కొన్నపుడు ఆహారమును వాక్కును అదుపులో పెట్టుకోవాలి. యోగమునకు సింహద్వారము జిహ్వ, కనుక యీజిహ్వను ఆహారము చేతను, మాటల చేతను పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టుకోవటము ప్రధానమైన సాధనగా బోధిస్తూ వచ్చింది భక్తియోగము.**

(శ్రీ.గీ.పు.57)

పశువులు మృగములు తమ తమ స్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. మానవుడు స్వేచ్ఛననుభవించ నక్కరలేదా? అంటారు. నిజమే నీవు స్వేచ్ఛను అనుభవించు. పక్షులు మృగములు ఏస్వేచ్ఛను అనుభవిస్తున్నాయి? పక్షిస్వేచ్ఛను మృగస్వేచ్ఛను అనుభవిస్తున్నాయి. నీవు మనిషివి మనిషి స్వేచ్ఛననుభవించు. తప్పులేదు. నీవు మనిషివై మృగస్వేచ్ఛననుభవిస్తే దోషముకాదా! కనుక యీ ఫ్రీడం అనేదానిని పెడర్థములతో అనర్థములతో నానార్థములతో అభివృద్ధిపరచుకొని యదార్థమును మరచిపోతున్నాము. ఇది కాదు నిజమైన ఫ్రీడం. ఫ్రీడం అంటే ఏమిటి స్వేచ్ఛగా సంచరించటమేనా? ఇంద్రియములను విచ్చలవిడిగావదలి పెట్టటమా? కాదు కాదు. ఆత్మజ్ఞానము. ఆత్మనిగ్రహము ఆత్మానందము **యిది ఫ్రీడం.**

(బృ.త్ర. పు.52)

హంసగాయత్రి

ఈనాడు "నేనెవరు" అని ప్రశ్న వేసుకోకుండా "నీవెవరు, అతనెవరు ఇతనెవరు" అని ప్రశ్నివేస్తే మీరంతా గొట్టెలతో సమానమే. **మొట్టమొదటనేనెవరు? అనిప్రశ్నవేసుకో Who am I?** పుట్టినపుడు నీవు ఏరీతిలో పుట్టావో. గిట్టినప్పుడు కూడా ఆరీతిలో గిట్టరాదు. పుట్టినపుడు నీకు కోహం కోహం అని ఏడ్చినావు. **కోహం అనగా నేనెవరు అని అర్థము. చచ్చేదాకా నేనెవరు అని చస్తే పుట్టి ప్రయోజనమేమి? పుట్టినపుడు కోహం అని పుట్టావు చచ్చినపుడు సోహం అని చావాలి.** అదే సార్థకము. కనుక మానవుని యందున్న అహంకారతత్వాన్ని నిర్మూలం గావించుకోవాలంటే ఒక మార్గాన్ని అనుసరించాలి. ఒక్క భగవత్ మార్గములో తప్ప అన్యమైన యేమార్గము లోనూ యిది ఫలింపచేయదు. అహంకారము కల్గినపుడు నీ వొక ప్రదేశములో కూర్చో, నీ శ్వాసను నీవు పరిక్ష గావించు. నీ ఉచ్ఛ్వాసనిశ్వాసములు యేమి పలుకు తున్నాయో విచారణచేయి. అదే సౌండ్ 'సో**ఽ**హం.' 'సో**ఽ**హం' శ్వాసను నీవు చక్కగా అనుసరించు **సః అహం** ఈ రెండు పదములు చేరి సోహం అయినది. సః =బ్రహ్మ అహం = నేను = అహం బ్రహ్మాస్మి, **అహంబ్రహ్మాస్మి,** అనే భావమును మనలో ఆవిర్భవింప చేసుకొని అభివృద్ధి గావించుకొంటూ వస్తే ఈ అహం యే మాత్రమూ భాధించదు. **దీనినే వేదాంత పరిభాష యందు హంసగాయత్రి అంటారు. హం అనగా హంస. హంసగాయత్రే ఈ సోహం.**

(బృ.త్ర.పు.102)

మానవుడు ఇన్ని పనులు చేస్తున్నాడు. ఇన్ని విచారములు సల్పుతున్నాడు. ఇన్ని విధములైన ఘనకార్యములు సాధిస్తున్నాడు. దీనికి యేది లైఫ్‌సోర్సు? **అదే ఆత్మ.** లోపల వుండటంచేతనే దేహము యిన్ని పనులు చేస్తున్నది. ఈ కాన్షన్‌నెస్ నీవు అని నీకు బోధిస్తున్నది. ఈ కాన్షష్‌నెస్ సో. అదే. గాడ్. హమ్-ఐ ఐ యామ్ గాడ్. ఇదే అంతర్వాణిగా బోధిస్తున్నది. దీనిని హంసగాయత్రి అని చెపుతూ వచ్చారు. **హంస అనగా ఏమిటి? మంచి చెడ్డలను విభాగము చేసేది హంస. ఏమిటి గాయత్రి. గాయత్రి అనగా మాస్టర్ ఆఫ్ సెన్సెస్. ఈ గాయత్రికే రెండవ పేరు సావిత్రి. మాస్టర్**

హక్కు

ఆఫ్ లైఫ్. ఈ గాయత్రికే సరస్వతి అని మూడవపేరు. సరస్వతి అనగా వాక్‌దేవతా స్వరూపిణి. ఈ సెన్సెస్‌కి మాస్టర్, లైఫ్‌కి మాస్టర్, వాక్‌కి మాస్టర్ అయిన తత్వము గాయత్రినీలో ఉచ్ఛ్వాస నిశ్వాసములతో ఉన్నది. దీనినే భూర్భువఃస్సువః అన్నది **గాయత్రి భూ హు- బాడీ; భువః - లైఫ్, మూడవది ప్రజ్ఞ. దీనినే రేడియేషన్, వైబ్రేషన్, మెటీరియలైజేషన్ అన్నారు. రేడియేషన్ - ప్రజ్ఞాశక్తివైబ్రేషన్ - ప్రాణశక్తి దేహమే మెటీరియలైజేషన్.** కనుక భూర్భువస్సువః ఎక్కడో భూలోకము, భువర్లోకము, స్వర్గలోకమూ కాదు. దేహమే భూర్భువ స్సువః మూడులోకములూ మనయందే వుంటూన్నాయి. కనుక మానవుడు సామాన్యుడు కాడు. **మానవుడు సాక్షాత్తూ చైతన్యస్వరూపుడే. కాస్మిక్ డివైన్.**

(శ్రీ.స.ది.పు.11)

హక్కు

జన్మచేత జనులు పరిశుద్ధ హృదయులే
పాడు చేయుచుండె పరిసరములు
అంతరాత్మ బోధ అలకించుడు మీరు
సమత మమత **మనుజ హక్కు** కాదె!

(స.సా.జ.2000పు.8)

(చూ॥ అమోఘుడు)

హజరత్ మహమ్మద్

(చూ॥ ఖురాన్, రంజాన్)

హద్దు

కోటీశ్వరునికైనా కూడుగుడ్డయెగాని - బంగారమును తిని బ్రతుకలేడు
కాలమే గాకున్న కట్టయే పామగు - కలసి వచ్చిన మట్టి కనకమగును
పండితు డొకచోట పశువుగా మారును - మూర్ఖుండొకతరిని మునిగ మారు
ధనవంతు నొకపరి దారిద్ర్య దేవత - వరియించి వానితో వరుసలాడు
ప్రాకులాడుటయెగాని ప్రాప్తి లేకున్న
దమ్మిడయిన నీకు దరికి రాదు
వద్దురా బాబు **నీఆశ హద్దు మీరి**
బుద్ధి కలిగి జీవించుమో పెద్దమనిషి.

(స.సా.ఏ.99పు.102)

ప్రేమస్వరూపులారా! మీకు తినడానికి ఇంత తిండి కావాలి: ధరించడానికి వస్త్రం కావాలి: ఉండటానికి కొంప కావాలి: రోగం వస్తే మందు త్రాగడానికి అంతో ఇంతో డబ్బు కావాలి. ఇంతేగాని, మితిమీరిన ఆశకు లోనుకావద్దు. అందుచేతనే "వద్దురా నరుడ ఏ ఆశ హద్దు మీరి, బుద్ధి కలిగి జీవించుమో పెద్ద మనిషి" అన్నాను. **ఎంత అవసరమో అంతటితో తృప్తి పడాలి. తృప్తియే సుఖము. కనుక, కోరికలను తగ్గించుకుంటూ రావాలి. దీనినే వైరాగ్య మన్నారు.** వైరాగ్యమునకు నిన్న మార్గం చూపించాను. ఈ భౌతిక జగత్తంతా జడమని భావించండి, అతి సూక్ష్మమైన జగత్తంతా ప్రతిబింబమని భావించండి. అప్పుడు మీకింక కోరికలే ఉండవు. లౌకికమైన ఆశలు తగ్గే కొద్దీ దైవాశ పెరుగుతూ పోతుంది. కామము, క్రోధము ఇత్యాది దుర్గుణాలను త్యజించినప్పుడే మీకు అమృతత్వం ప్రాప్తిస్తుంది. అది చేయకుండా అమృతత్వం కావాలంటే ఎట్లా చిక్కుతుంది?

"ఏమీ లేని బుట్టలోన ఏమైనా నింపవచ్చు
ఏమేమో నిండియున్న తలబుట్ట ఖాళీ అగునా?
తలబుట్ట ఖాళీ కాక ఇల సుకృతము నింపనగునా?"

ఈ నాటి మానవుడు తన హృదయాన్ని అనేక చింతలతో నింపుకున్నాడు. **"పుట్టుట ఒక చింత, భూమి నుండుట చింత, సంసారమొక చింత, చావు చింత, బాల్యమంతయు చింత, వార్ధక్య మొక చింత జీవించు టొక చింత, చెడుపు చింత, కర్మలన్నియు చింత, కష్టములొక చింత, సంతన మొక చింత, వింత చింత!"** మానవుడు ప్రతి చిన్నవిషయానికి చింత పడుతున్నాడు. పెండ్లి చేయాలంటే

చింత, ఆదాయం రావాలంటే చింత. జీవితమంతా ఇన్ని చింతలతో నిండినప్పుడు ఇంక సంతోషం ఎలా చిక్కుతుంది?

(స.సా.ఏ.99పు.105)

హనుమంతుడు

గద్ద తన్నుకొని పోయిన సుమిత్రయొక్క పాయసపు కప్పు ఎక్కడికి పోయింది? గద్ద ఆ కప్పును ఒక పర్వతంపై వదలిపెట్టింది. అది అంజనీ దేవికి చిక్కగా ఆమె ఆ పాయసాన్ని త్రాగింది. తత్ఫలితంగా ఆమె గర్భంలో హనుమంతుడు జన్మించాడు. హనుమంతునికి, రామలలక్ష్మణభరత శత్రుఘ్నులకు గల ఇట్టి సన్నిహిత సంబంధం ఎవ్వరికీ తెలియదు. హనుమంతుడు కూడా దశరథునికి యజ్ఞము నుండి లభించిన పాయసము యొక్క భాగమే.

పట్టాభిషేక సమయంలో రాముడు విభీషనునికి, సుగ్రీవునికి, ఇంకా అనేకమంది వానర వీరులకు బహుమతుల నందజేశాడు. కాని, హనుమంతునికి మాత్రం ఏమీ ఇవ్వలేదు. సీత ఈ విషయాన్ని గమనించి "స్వామీ! హనుమంతునికి కూడా ఏదైనా బహుమతి ఇస్తే బాగుంటుంది కదా!'' అన్నది. అప్పుడు రాముడు "సీతా! హనుమంతుడు బహుమతులను ఆశించడు. అవి అతనికి అక్కర్లేదు. **అలాంటి గొప్ప భక్తునకు ఇవ్వదగిన బహుమతి నావద్ద ఏమీ లేదు"** అన్నాడు. అప్పుడు సీత తన మెడలోని ముత్యాల హారాన్ని తీసి హనుమంతునికి అందించింది. హనుమంతుడు దానిని అందుకొని ఒక్కొక్క ముత్యమును కొరికి, చెవి దగ్గర పెట్టుకొని నిరుత్సాహంతో పారవేయసాగాడు. ఈ దృశ్యాన్ని చూసి సీత "హనుమంతా! ఇంకా నీ కోతిబుద్ధిని పోనిచ్చుకున్నావు కాదు. అది నా తండ్రి నాకిచ్చిన విలువైన ముత్యాల హారము. కాని, నీవు దాని విలువ తెలుసుకోకుండా కొరికి పారవేస్తున్నావు'' అన్నది. **హనుమంతుడు "తల్లీ! క్షమించు. రామ నామం లేనిది రత్నమైనా, ముత్యమైనా నాకు రాయితో సమానం. నా రోమరోమమూ రామనామంతో నిండియున్నది. కావాలంటే చూడు" అని పలుకుతూ తన చేతి నుండి ఒక రోమమును తీసి సీత చెవి దగ్గర పెట్టాడు. ఆ రోమము నుండి కూడా రామనామం వినబడుతూ ఉండినది!**

రామాయణం జరగడానవకి మూలకారణం హనుమంతుడే. హనుమంతుడే లేకపోతే రామాయణమే లేదు. అతడు పరమ పవిత్రమైన భక్తిస్వరూపుడు. ఎక్కడ రామనామం ఉంటుందో అక్కడ హనుమంతుడుంటాడు. నామరూపముల ఏకత్వాన్ని దర్శించాడు హనుమంతుడు. ఇదే నిజమైన అద్వైతము. ఇట్టి పవిత్రమైన హనుమంతుని ఆదర్శాన్ని భక్తులెవరైనా అనుసరిస్తున్నారా? ఎన్ని పర్యాయములు రామాయణాన్ని పారాయణం చేసినా బుద్ధులు మారకపోతే ప్రయోజన మేమిటి? ఈనాడు అనేకమంది రామభక్తులమని చెప్పుకొంటున్నారుగాని, నిజమైన రామభక్తులు ఎక్కడా కనిపించడం లేదు. **ఈనాటి భక్తులలో ఆడంబరం పెరిగిపోయింది. ఆచరణ శూన్యమైపోయింది. ఆడంబరం భక్తికి విరుద్ధమైనది. రాముడు అహంకారమును, ఆడంబరమును ఏనాడూ అంగీకరించడు; ఆచరణకే ప్రాధాన్యత నిస్తాడు.** రాముని జన్మదినమును పండుగగా జరుపుకున్నంత మాత్రాన చాలదు, రామచరిత్ర హృదయంలో చిత్రించుకోవాలి. రాముని ఆదర్శాలను ఆచరణలో నింపుకోవాలి. రాముడు సత్యవాక్పరిపాలకుడు, ధర్మపరాయణుడు.

(స.సా.మే2000పు.147/148)

హనుమంతుడు తన జీవితపర్యంతము **'దాసో..హం కోసలేంద్రస్య'**. నేను యెప్పుడు రామునియొక్క దాసుడనే అని భావిస్తూ ఆచరిస్తూ ఆనందాన్ని అనుభవిస్తూ వచ్చాడు. అయితే యిది యెంత వరకు? **ప్రభువు యొక్క దాసుడుగా వుండినంతవరకు దాసోహం అన్నాడు. కొంతకాలమునకు ప్రభువు యొక్క వియోగం ప్రాప్తించింది. ప్రభువు వియోగము లోపల తాను బాధలకు గురి కావలసి వస్తుంది. సోహంలో అట్టిది లేదు. దైవముతోనే యేకము కావటంవల్ల దైవముయొక్క యెడబాటు అనేబాధ అతనికి తెలియదు.**

దాసోహంలో ప్రభువుకును, భక్తునకును యెడబాటు వుంటుండాది. సోహంలో ప్రభువుకు దాసునకు యెట్టి యెడబాటు వుండదు. ఎడబాటు లేని స్థితిలో ఆనందమునకు కూడను యేవిధమైన అభ్యంతరముండదు. ముఖ్యముగా దివ్యత్వాన్ని పొందగోరే సాధకుడు వాంఛలను క్రోధమును మొట్టమొదట అరికట్టుకోవాలి.

(శ్రీ.గీ. పు. 70)

హనుమంతునిలో కామము అనేదిలేదు. కామమునకు గురికాక, శ్రీరాముని అనుగ్రహమును సంపాదించినాడు. హృదయమును చల్లార్చుటకు అయనకు రామచింతన జాలును. సీతాన్వేషణ సందర్భమున, స్త్రీల విహార స్థానమైన రావణుని అంతఃపురమును ప్రవేశింపవలసి వచ్చినది. సీతను వెతకాలి అంటే, స్త్రీలమధ్య కదా వెతుకుట? హనుమంతుడు ఒక్కొక్క స్త్రీనూ చూచుచూ ముందుసాగినాడు. రాముడు చెప్పిన లక్షణములుగల ముక్కు చెవులు అందచందాలున్నవా అని ప్రతి స్త్రీనూ గమనిస్తూ వచ్చాడు. తరువాత నిరాశుడై సముద్రపు ఒడ్డున కూర్చున్నాడు. "ఛ, ఛ, ఎంత పాపిని నేను! ఇన్ని స్త్రీలను చూచినాను గదా? ఇంకా నేనెట్లు రామచంద్రుని దర్శించేది. ఆత్మహత్యయే నాకు కఠినశిక్ష." అని దుఃఖించాడు. అయితే, రామ నామ సంకీర్తనము వలన మనసుకు కొంత ఉప శాంతి లభించినది. **ఆత్మహత్య, ఆత్మస్వరూపుడైన రామునికి అపచారమే** అని తలంచి, రామాజ్ఞ కదా. అని సమాధానము తెచ్చికొని, తన అన్వేషణలో స్త్రీలను చూడటము వలన ఎట్టి దోషము తన కంటదని ధైర్యముతెచ్చుకొని, తదుపరి వెతుకుటకు ప్రారంభించినాడు.

ఈ విషయమును ఈనాటి యువకులు బాగా గుర్తించాలి. **ప్రతి స్త్రీని మాతృ భావముతోనే చూడవలెను. హనుమంతుడు కూడ తల్లినే వెతకినాడు. కేవలము ఒక స్త్రీనికాదు.**

(స.సా.ఆ.77పు.134/135)

శాంతుడు గుణపుంతుడు, బలవంతుడు హనుమంతుడు. అతడు నవ వ్యాకరణ వేత్తయైనప్పటికీ, మహాభక్తుడైనప్పటికీ రావణుని దర్బారులో నీవెవరనే ప్రశ్నకు సమాధానంగా "దాసోహం కోసలేంద్రస్య" అన్నాడు. అనగా "నేను శ్రీరామదాసుడను" అని సగర్వంగా చెప్పుకున్న వినయ సంపన్నుడు. సీతాన్వేషణకు పూర్వం సముద్ర తీరమున రాముడు వానర వీరులను వరుసగా, "సాగరోల్లంఘన ఎవరు చేయగలరు?" అని ప్రశ్నించాడు. కొందరు 10 యోజనములు దాటగలవమనీ, కొందరు 30 యోజనములు దాటగలమనీ తలొక రీతిగా సమాధానాలు చెప్పారు. కానీ హనుమంతుడు మాత్రం, "స్వామీ! శతయోజన విస్తీర్ణ సముద్రమును అవలీలగ దాటి, లంకకు చేరి, సీతా మహాసాధ్వి అన్వేషణలో తప్పక కృతకృత్యుడనై తిరిగి రాగలను" అన్నాడు. "నాయనా! అంత దూరం ఎలా ప్రయాణించగలవు? మున్నెన్నడూ చూడని సీతామాతను ఎట్లా గుర్తించగలవు?" అని రాముడు అడిగినప్పుడు హనుమంతుడు **"స్వామీ! ఈ మహత్కార్యాన్ని నెరవేర్చమని మీరు నన్ను ఆజ్ఞాపించినప్పుడు దీనికి కావలసిన ధైర్యాన్ని బలాన్ని, శక్తిని, యుక్తిని కూడా మీరే ప్రసాదిస్తారు కదా! వాటితో నేను విజయాన్ని సాధించగలను" అన్నాడు. ఇది అతడి భక్తి. యువకులు గ్రహించవలసింది ఇదే! భగవదాజ్ఞను తు.చ తప్పక ఆచరించాలి. ఏ సందర్భంలోను సందేహించకూడదు, విమర్శించకూడదు. దీనినే 'శరణాగతి' అని కూడా చెప్పవచ్చును. దీనివల్ల తప్పక విజయాన్ని అందుకోగలరు.** హనుమంతుడు సముద్రాన్ని దాటే సమయంలో ఎంతో ధైర్యసాహసాలను, కార్యదీక్షను కనబర్చాడు. కొద్దిసేపు తనపై వ్రాలి విశ్రాంతి తీసుకోవలసినదిగా మైనాకుడు కోరగా రామకార్యం పూర్తయ్యేవరకు తాను విశ్రాంతి తీసుకోనని అతని ఆహ్వానాన్ని తిరస్కరించాడు. రామ కార్యమే ప్రధానమని భావించాడు. భక్తి భావంచేత ఉదయించిన ఆత్మవిశ్వాసంతో రావణునికి బుద్ధి చెప్పాడు. రామాజ్ఞను నిర్వర్తించి రామానుగ్రహానికి పాత్రుడైనాడు.

చంచలత్వానికి పుట్టినిల్లు, పెట్టింది పేరు అయిన కోతి రామాజ్ఞను పాటించుటచేత ఆంజనేయస్వామిగా ఆరాధింపబడుతున్నాడు.

పట్టాభిషేక సమయంలో సీత హనుమంతునికి ముత్యాలహారం బహూకరించింది. అతడు ఆ హారాన్ని త్రుంచి, ముత్యాలను కొరికి నేలపై కొట్టి ఛిన్నాభిన్నం చేయడం గమనించిన సీత "ఆంజనేయా! నీ పూర్వబుద్ధులను ఇంకా పొగొట్టుకున్నట్లు లేదే!" అన్నది. అది విని ఆంజనేయుడు "అమ్మా! ఏ ముత్యంలోనుండైనా రామనామం వినబడుతోందా అని పరీక్షిస్తున్నాను. రామనామం వినిపించని ముత్యాలు నాకెందుకు తల్లీ!" అన్నాడు. అనగా భగవన్నామమే అన్నింటికంటే విలువైనదని చాటినాడు.

ఆనాడు సభ పూర్తయింది. సీతారాములు శయనాగారమునకు వెళుతున్నారు. ముందుగా రాముడు, వెనుక సీత సాగిపోతున్నారు. సీత బంగారు పాత్రలో పాలను తీసుకు వెళుతున్నది. ఆంజనేయుడు కూడా వారివెంట వెళ్లడానికి సిద్ధపడ్డాడు. ఇది రాముడు గమనించి "ఆంజనేయా! నేటి కార్యకలాపములు సమాప్తమైనవి. నిద్రించే సమయ మాసన్నమైనది. ఇక నీవు వెళ్ళి రావచ్చును" అన్నాడు. అప్పుడు హనుమంతుడు "స్వామీ! మీ వెంట సీతమ్మవారు వస్తున్నారు కదా! నేను కూడా వస్తాను" అన్నాడు. దానికి సమాధానంగా, సూచనప్రాయంగా, అర్థం తెలిసేటట్లుగా రాముడు చెప్పాడు: "సీతకు నొసట తిలకమున్నది కదా! అందువల్ల ఆమె రావచ్చును" ఇది విన్న హనుమంతుడు వెంటనే ఆయోధ్యలో ఉన్న అంగళ్ళలో దూరి తిలకాన్ని ప్రోగుచేసుకున్నాడు. శరీరమంతా పూసుకున్నాడు. తిరిగి అంతఃపురం చేరి రామునితో "రామా! కేవలం నొసట తిలకమును ధరించినంత మాత్రమున సీతమ్మవారు నీవెంట వచ్చుటకు హక్కు కలిగియున్నప్పుడు శరీరమంతా తిలకం పూసుకున్న నేను మాత్రం నీ వెంట ఎందుకు రాకూడదు!" అని ప్రశ్నించాడు.

పట్టాభిషేకానంతరం రాముని సోదరులు చేరి రామసేవను తామే పూర్తిగా చేయాలని సంకల్పించుకున్నారు. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు రామునికి చేయవలసిన సేవలన్నింటినీ తమలో తాము చక్కగా పంచుకున్నారు. అక్కడే ఉన్న ఆంజనేయునితో 'నీవు రామకార్యమును నెరవేర్చిన భాగ్యశాలివి. రామసేవను పూర్తిగా చేసుకున్నవాడవు. ఇక నీవు విశ్రాంతి తీసుకొని మాకీ అవకాశాన్ని అందించు" అన్నారు ఆంజనేయుడు వినమ్రతతో వారివద్ద ఉన్న లిస్ట్ చూశాడు. "అయ్యా! అన్నీ వ్రాసుకున్నారు. **మీ ప్రకారమే కానీయండి. కానీ ఒకటి మీరు మరిచారు. రాముడు మహారాజు ఆయన ఆవలించినప్పుడు చేతి వ్రేళ్ళతో చిటికె వేయాలి కదా! ఆసేవ నాకివ్వండి చాలు" అన్నారు. దానికి వీరు అంగీకరించారు. వెంటనే హనుమంతుడు రాముని వెంట బయలుదేరినాడు వాళ్ళు ఆశ్చర్యపడి కారణమడుగగా "రామచంద్రుడు ఎప్పుడు ఆవలిస్తాడో ఏమో ఎవరు చెప్పగలరు? చిటికె వేయడానికి నేనెప్పుడూ రాముని వెంట సిద్ధంగా ఉండాలి కదా!" అన్నాడు. ఇట్టి అసమానమైన భక్తి హనుమంతునిది. పట్టుదలకు, దీక్షకు, భక్తికి, వినయమునకు ఆంజనేయుడు పెట్టింది పేరు. మాట, సంకల్పం, క్రియ ఈ మూడింటి ఏకత్వం అతనిలో కనిపిస్తుంది. తలచింది చెప్పాడు, చెప్పింది చేశాడు. "మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం: మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనాం" అన్నారు కనుక మనస్సు, మాట క్రియ ఒక్కటిగా ఉండాలి. ఈ మూడింటి ఏకత్వమే శీలము (character).**

ఒకానొక సమయంలో హనుమంతుడు రామునితో అన్నాడు: **"స్వామీ! దేహభావంలో నీవు ప్రభువు. నేను దాసుడను. జీవభావంలో నీపు దేవుడవు. నేను నీ అంశమును. ఇంక ఆత్మభావంలో నీవు. నేను ఒక్కటే" అన్నాడు. ఈ ప్రకారం ప్రభువు - సేవకుడు అన్న భావనలో ద్వైతమును, జీవుడు - దేవుడు అన్న భావనలో విశిష్టాద్వైతమును, నీవు నేను ఒక్కటే అన్న ప్రకటనలో అద్వైతమును అనుభవ జ్ఞానంతో ప్రపంచానికి చాటినాడు.** సీతాన్వేషణ సమయంలో హనుమంతుడు రావణుని

హరినామము

అంతఃపురంలో ప్రవేశించినప్పుడు అనేకమంది స్త్రీలను పరిశీలించి చూడవలసి వచ్చింది. తాను బ్రహ్మచారి. కానీ తల్లిని గుర్తించడానికి చూశాడు. అనగా **మాతృ భావంతో వర్తించిన జితేంద్రియుడు హనుమంతుడు. రామాజ్ఞ పాలనలో పట్టుదలలో, జ్ఞానంలో, ధైర్యంలో, ఇంద్రియ నిగ్రహంలో, వినయ విధేయతలతో, భక్తి ప్రపత్తులతో అగ్రగణ్యుడైన హనుమంతుడు యువతకు ఆదర్శప్రాయుడు.**

(స.సా.జూలై98పు.194 /196)

(చూ॥ దైవ స్వరూపులు, ప్రదక్షిణ, భగవత్ప్రేమ, మంగళ వారము, రావణుడు, స్త్రీజాతి,స్త్రీలు, హిరణ్యగర్భతత్త్వం)

హరినామము

లోకమున సమస్త పదార్థములకంటెను, మధురమైనది యును, సమస్త మంగళవస్తువుల కంటెను మంగళకర మైనదియును, సమస్త పవిత్ర పదార్థములకంటె పవిత్రమైనదియును ఏదైన యున్నచో అది కేవలము హరినామము లేక హరి మాత్రమే. ప్రాపంచిక చిత్తులగు అసురగుణముల సహవాసమును త్యజింపుము. సమస్త దుష్కార్యముల నుండి దూరముగా తొలగుడు. సత్సంగమును (జ్ఞానుల సహవాసమును) కలియుడు. నారాయణునిలో శరణమన్వేషింపుడు.

ఆ పరమ పవిత్రుడే శాంతి, సౌఖ్యము, జ్ఞానులయొక్క మూర్తీ భావము. అట్టి శ్రీహరి అందరియందు ఆసీనుడై యున్నాడు. ఏ ప్రదేశమున తన భక్తులు భక్తితో హరినామమును నితరమునుకాక గాన మొనర్తురో అచట ఆ పరమాత్ముడు నిరంతరము వసించుచున్నాడు. మొదట మీరు అట్టి పరమాత్మునిపై భక్తి నభ్యసించవలెను. అప్పుడే మీరు వాస్తవిక శాశ్వతసౌఖ్యము జ్ఞానముల నొందగలరు.

(ప్ర.వా.పు.70)

(చూ॥ తరమా!)

హరియొక్క చిత్ర లీలలు

(చూ॥ ధన్వంతరి)

హళ్ళికి హళ్ళి

మీరు పుట్టపర్తి వస్తారు. ఇక్కడ స్వామి పోటో ఒకటి కొంటారు. ఇంటికి తీసుకొని వెళ్ళి పూజిస్తారు. రోజు లేకపోతే వారానికొక రోజు ఏ గురువారం నాడో భజన చేస్తారు. మంచిదే. అది సత్కర్మే. కాని అది సరిపోతుందా? **సద్గుణం కూడా కావాలి.** మంచి అలవాట్లు, మంచిగా ఆలోచించటం, మంచి శీలాన్ని పెంపొందించుకోవటం, మంచి నడవిడి - ఇవన్నీ సద్గుణాలు. ఇంతేకాదు. భారం స్వామిపైవేసి, సేవాభావంతో మెలగండి! లేకపోతే? పుణ్యం, పాపం ఒకదాన్నొకటి రద్దుచేసి కొంటూ పోతాయి. సున్నకు సున్నా - హళ్ళికి హళ్ళి.

(శ్రీ.సా.గీపు.388)

హాని

(చూ॥ నగర సంకీర్తన)

హాయి

సాయి ఒకటే హాయి! కలియుగంలో. రాక్షసులకు నరసింహ నామం భీతి కలిగిస్తుంది. నామాన్ని నాలుకపైన, మనస్సులోను కాంతితో స్పష్టంగా ప్రకాశించనీయండి. ఆ నామమునకు సంబంధించిన రూపాన్ని మీ కనుల యెదుట, మీ మనోనేత్రం యెదుట ఉంచండి. అప్పుడు ఏదీ మీకు అపకారం కలిగించలేదు. **పిల్లలకు చిన్నప్పటి నుంచి నామస్మరణ చేయటం, నామమును నమ్ముకొనటం నేర్పండి. తల్లిపాలతో దానిని పోయండి. మీరు వారి ఎదుట ఆచరిస్తూ, మీరు దాని వల్ల పొందిన శాంతిని ఉదహరిస్తూ వారికి శిక్షణ నివ్వండి. వెనుక అడుగు వేయకండి. ముందుకు సాగండి. సంకోచించకండి, సందేహించకండి. మీరుపొందిన ఆనందాన్ని మీరు పొందిన ధైర్యాన్ని కాదనకండి. మీకు ఇంకా సందేహంగా ఉంటే మీకు కలిగే లాభమే పోతుంది.**

(వ.61-62 పు.165)

(చూ॥ నగరసంకీర్తన, విశ్వాసము)

హిందువులు

హృదయమందు ప్రేమ పంటను పండించు కొనువాడే నిజమైన క్రిష్టయన్: వాడే నిజమైన సిక్కు: వాడే నిజమైన హిందువు. కానీ మానవుడు హృదయంలో ప్రేమ విత్తనాలనే నాటుకోవడం లేదు. ఇంక, పంట ఎట్లా పండుతుంది? ఇటీవల విశ్వ హిందూ పరిషత్‌వాళ్ళు ఇక్కడికి వచ్చినప్పుడు 'హిందూ' అంటే అర్థ మేమిటి? అని అడిగాను. "స్వామీ! హిందువంటే దయతో కూడినవాడు, ధర్మాన్ని ఆచరించే వాడు, దానం సల్పేవాడు" అని అనేక అర్థాలు చెప్పుకుంటూ వచ్చారు. **'హిందూ' అనే పదానికి అంగ్ల భాషలో స్పెల్లింగ్ ఏమిటి? అని అడిగాను. H I N D U అని చెప్పారు. అప్పుడు నేను చెప్పాను. H-Humanity (మానవత్వం); I-Individuality (వ్యక్తిత్వం); N-Nationality (జాతీయభావం); D-Divinity (దివ్యత్వం); U-Unity (ఐకమత్యం) ఈ ఐదు లక్షణములతో కూడినవాడే హిందువు"** వీటన్నిటియందూ అంతర్వాహినిగా ప్రవహించు నటువంటిదే ప్రేమ. ఇట్టి ప్రేమతత్వాన్ని పండించు కొనువాడే నిజమైన హిందువు. ఇంక ముస్లిం అనగా ఎవరు? **శాంతంగా జీవితం గడిపేటటువంటివాడే ముస్లిం. శాంతం ఎప్పుడు ప్రాప్తిస్తుంది? హృదయం ప్రేమతో నిండినప్పుడే శాంతం ఆవిర్భవిస్తుంది. కనుక ప్రతి జాతియందు, ప్రతి మతమునందు, ప్రతి వ్యక్తియందు హృదయం ప్రేమమయం కావాలి. ప్రేమనే 'శివం' అన్నారు. అదే మంగళం. ప్రేమ ఎప్పుడూ ఎవ్వరినీ బాధించదు. బాధించనటువంటిదే మంగళకరమైనది. అదియే శివత్వం. ప్రేమతో కూడినవాడే శివస్వరూపుడు: ప్రేమ లేనివాడు శవస్వరూపుడే.**

(స.సా.మా.99పు.60)

ఈనాటి మానవుడు తనయందున్న దోషాన్ని తాను గుర్తించుకోవటానికి ప్రయత్నించటం లేదు. పరులయందు ఉన్నటువంటి లేని దోషాలను కూడా వెదకటానికి సహస్ర నేత్రములతో చూడటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇదియే ఈనాడు మానవత్వంలో చేరినటువంటి **మాలిన్యం. పవిత్రమైనటువంటి హృదయంలోపల అపవిత్రమైన భావములను చేర్చుకోవటం చేతనే ఈ మాలిన్యం ఈ రూపాన్ని ధరించింది.**

ప్రపంచంలో ఎక్కడ చూచినా ఒకరినొకరు దూషించు కోవటమే; ఒకరినొకరు విమర్శించుకోవటమే. ఒకరిలోన్ను తప్పులు మరొకరు వేలిత్తి చూపటమే. **తప్పులు వెదకేవారే కనపడుతున్నారుగాని మంచిని వెదికే మానవులు కనిపించటం లేదు. మంచిన వెదికేవాడే నిజమైన మానవుడు. "హృదయమునందు ప్రేమపంటను పండించు కొనేవాడే, వాడె క్రైస్తవుండు" A Christian should be an ideal Christian. అనగా తన హృదయము నందు ప్రేమ పంటను పండించుకోవాలి. అతనే నిజమైన క్రైస్తవుండు. సిక్కులనగా ఎవరు?టర్బన్ పెట్టుకొని కత్తిగల వారు మాత్రమే కాదు. తన హృదయమునందు ప్రేమ పంటను పండించుకున్నవాడే నిజమైన సిక్కు. పరులను చంపటం, పరులను హింసించటం సిక్కుల లక్షణం కాదు.**

ఇక **హిందువెడెవరు? 'హృదయమునందు ప్రేమపంటను పండించుకొనువాడే హైందవుడు"** కాని ఈనాడు ఆ ప్రేమపంట ఎక్కడా కనిపించటం లేదు. ప్రేమ విత్తనాలకు కూడా నాటటం లేదు. ఇంక పంట ఎట్లా పండుతుంది? ప్రేమ లేనిమానవడు 'హిందు' అని చెప్పటానికి ఎలా సాధ్యమవుతుంది. ప్రేమతత్వమును పండించుకొనకుండా నేను హిందువుని, హిందువుని అనుకుంటే ఏమి ప్రయోజనం? **ఇంక ముస్లిం. ఇతను కూడా ప్రేమపంటను పండించుకొనువాడే.** వీరు 'అల్లా' అని పిలుస్తారు. అల్లా అనగా దేవుడు. 'అల్లాహో అక్బర్' అనగా దేవుడు గొప్పవాడు. శాంతంగా జీవితాన్ని గడిపేటటువంటివాడే 'ఇస్లాం'. ఈ శాంతం మనలో ఎప్పుడు ప్రారంభమవుతోంది? ప్రేమతో హృదయము నిండినప్పుడే మనలో శాంతం ఆవిర్భవిస్తుంది, కనుక ప్రేమలేకుండా శాంతిలేదు. కనుక ప్రతి జాతి యందు, ప్రతి మతమునందు ప్రతి వ్యక్తియందు ప్రేమ మయమైనటువంటి హృదయం కావాలి.

(శ్రీ.మా.99పు.4/5)

(చూ॥మానవుడుకాడు)

హిందూమతము

మనకు సంభవించుచుండు మంచిచెడ్డలకు మూల కారణము మన కర్మలే. మన జన్మకు హేతువుకూడా కర్మనే. కర్మము. జన్మము, పునర్జన్మము అను మూడు లక్షణములను విశ్వసించినది హిందూ మతము.

(ఆ.రా.పు.60)

హింస

హింస యే కంసుడు, అహింసయే పరమహంస.

(స.సా.జూన్.91పు.151)

(చూ॥ అష్టవిధ పుష్పములు)

హిట్లరు

(చూ॥ నరకాసురుడు)

హితభాష

నేటి అధ్యాపకులు, విద్యార్థులు మితభాషను, హితభాషను అభ్యసించటం అత్యవసరమని గుర్తించాలి. అతిభాష మతిహాని, మితభాష అతి హాయి. ఏ విషయంలోనూ అతి పనికి రాదు. అతి అరిష్టానికి దారితీస్తుంది. మితంగా మాట్లాడేవారిని గౌరవిస్తారు. అంతేకాదు హితంగా మాట్లాడేవారిని మరింత గౌరవిస్తారు. కనుక మితంగా, హితంగా మాట్లాడటం నేర్చుకోవాలి.

(శ్రీ.వా.జూ.97 పు.99)

హిపోక్రసీ

మీలో ఎవరికైనా స్వామి సాక్షాత్తు దైవమన్న ప్రజ్ఞ అసలున్నదా అని! ఆ అవగాహనే మీలో నిజంగా ఉన్న ట్లైతే అదే మేడపైన ఉంటున్నది దైవమని గుర్తించి, భక్తిశ్రద్ధలతో 'గవ్‌చివ్' మని నిశ్శబ్దముగా కూర్చొని, ధ్యానమో, జపమో చేస్తూ ఉండేవారు! ఇలా ఊకదంపుడు కబుర్లు, మీ ఇంటి విషయాలు, స్వంత వ్యవహారములు చెప్పుకొంటూ కాలమును వ్యర్థము చేస్తున్నారే! ప్రజల సొమ్మును వాడి మీ కొరకేమైనా చావడీగానీ రచ్చబండగానీ కట్టిపెట్టనా నేను? **ఏదో 'ఆర్గనైజేషన్' విషయములను చర్చించినట్లైతే ఫరవాలేదు. జపధ్యానాదులను చేయువారికే ఇచ్చట ప్రవేశార్హత ఉన్నది. ఇదేమైనా క్లబ్బా!? సామాన్య గృహస్థు ఇల్లా!? దైవము నివసించు దేవాలయమెలా ఉండాలి?** దైవమందిరములో ఎలా ప్రవర్తించాలో మీకు తెలియదా? అయినా మీరెవరు? స్వామి ఆర్గనైజేషన్‌లో సభ్యులు! **ప్రధాన కార్యకర్తలు! మీరు ఇతర భక్తులకు Examples గా (ఉదాహరణములుగా, ఆదర్శప్రాయముగా) ఉండవద్దా! మీలోనే భయము భక్తి, వినయ విధేయతలు లేనప్పుడు, మీరు ఇతర వ్యక్తులతో నా దైవత్వము గురించి ప్రగల్భములు పలుకుట హాస్యాస్పదముగా లేదా? అది 'హిపోక్రసీ' ఆత్మవంచన కాదా?** ఏదో మీరు 'ఆర్గనైజేషన్'లో ప్రధాన కార్యకర్తలు కదాయని మిగిలిన 'డివోటిన్' (భక్తులు) వలె కాక మీకు 'స్పెషల్‌గా' ఈ మందిరములోనికి ప్రవేశార్హత నొసగుటే పెద్ద తప్పు, స్వామి చేసిన పెద్ద తప్పు!

(లీ.నా.పు.60)

హిమాచలము

భారతీయ సంస్కృతియందు ఉత్తరాయణ కాలం చాల మంచిదన్నారు. ఈ కారణంవల్లనే భీష్ముడు కూడా తన దేహాన్ని ఉత్తరాయణ పుణ్య కాలంలో త్యజించాలని శరతల్పంపై 56 దినములు కాచుకొని ఉన్నాడు. ఉత్తరాయణంలో సూర్యుడు ఉత్తర దిశకు ప్రయాణం చేస్తుంటాడు. ఉత్తర దిశలో హిమాచల పర్వతమున్నది, అక్కడే ఈశ్వరుడు నివసిస్తున్నాడంటారు. సూర్యుడే ఉత్తర దిశకు ప్రయాణం చేస్తున్నాడు కాబట్టి, మన దృష్టిని కూడా ఉత్తర దిశకు మరల్చాలి. అయితే, "ఈశ్వర స్సర్వ భూతానాం", ఈశ్వరుడు సర్వత్ర ఉన్నాడు కదా! మరి హిమాచలంలో నివసిస్తున్నాడనటంలో అంతరార్థమేమిటి? **హిమమనగా చల్లనిది. తెల్లనిది. అచలమనగా చలించనటు**

వంటిది. కనుక, పవిత్రమైన, ప్రశాంతమైన, చలించనటు వంటి హృదయమే హిమాలయము. అందులోనే ఈశ్వరుడుంటున్నాడు. కనుక, ఈశ్వరుణ్ణి దర్శించాలంటే మీరు ఎక్కడికో ప్రయాణమై పోనక్కర లేదు: మీ దృష్టిని అంతర్ముఖం గావించుకుంటే చాలు.

(స.సా. మే99పు.135/136)

హిమ మనగా మంచు. మంచు చల్లగా ఉంటుంది. చల్లగా ఉండటమే కాదు, తెల్లగా ఉంటుంది. అచలంగా ఉండేది పర్వతం. హిమ + అచలము = హిమాచలము అన్నారు. హిమాచలమనగా మన హృదయమే. అది చల్లగా ఉండాలి. ఏ కోపమో, తాపమో, ఈర్ష్యనో, డంబమో ప్రవేశించ కూడదు. **పరిపూర్ణమైన, పరిశుద్ధమైన, ప్రశాంతమైన, చలించని హృదయమే హిమాచలము.** హిమాచలములో ఈశ్వరుడున్నాడని అక్కడికి నీవు ప్రయాణమై పోనక్కర లేదు. అచలమైన, శాంతమైన, పవిత్రమైన, నిర్మలమైన నీ హృదయమందే ఈశ్వరుడున్నాడు. కనుక నీ దృష్టిని అంతర్ముఖము గావించుకోవాలి. చలించే హృదయం హిమాచలం కాదు. మాలిన్యమైన హృదయం హిమాచలం కాదు. అశాంతితో నున్న హృదయం హిమాచలం కాదు. **ప్రశాంతమైన, పవిత్రమైన, నిర్మలమైన, నిశ్చలమైన హృదయమే హిమాచలము.**

(ద.స. 98 పు. 76)

(చూ॥ సూర్యుడు)

హిరణ్యము

శరీరమునందు అన్ని లోహములూ ఉన్నవి. అదే ప్రకారము అందరిలోను హిరణ్యమున్నది. ఆకారణముచేతనే ఆయుర్వేదంలోను సువర్ణ భస్మాన్ని ఉపయోగిస్తారు. ద్రవరూపములో సువర్ణభస్మాన్ని ఘనీభవించేసరికి ఉష్ణం జనిస్తుంది. ఆ విధంగా **ఆవిర్భవించిన హిరణ్యగర్భలింగం ఫోర్సుతో వెలువడింది.**

(స.సా.జూ.2001 పు.192)

హిరణ్యకశిపుడు

హిరణ్యకశిపుడు గొప్ప సైంటిస్టు. పంచ భూతములను అన్ని విధముల పరిశీలించినాడు. అంతేకాదు-ప్రకృతి వైపరీత్యములకు కారణం ఏమిటి? ఈ ప్రకృతి ఏ విధంగా నడుస్తుంది? అనే మూల సూత్రములను గుర్తించటానికి ప్రయత్నించినవాడు. ఈనాటి ప్రపంచము ఋతువులు రాత్రింబవళ్ళు ఏ విధంగా సంభవిస్తున్నవనే రహస్యములు గుర్తించటానికి సూర్యమండలం వెళ్ళటానికి ప్రయత్నించాడు. ధ్రువనక్షత్రమునకు అతి సమీపమునందే (23.5°) భూమి వాలిందని చూచాడు. 'ఆ విధముగా వాలటంచేత రాత్రింబవళ్ళు జరుగుతున్నవి. అనేక సంపదలు ఉద్భవిస్తున్నాయి. జీవరాసులు పోషింప బడుతున్నాయి, అని తెలుసుకొని సంతోషించాడు. ఇంకా కొంచెం వాలిన ఏమి జరుగునోయని మరింత వంచటానికి ప్రయత్నించాడు. కానీ ప్రళయం సంభవిస్తూ వచ్చింది. అది చాలా ప్రమాదమని దానిని విరమించుకున్నాడు. సూర్యాచంద్రాదులను వశము గావించుకున్నాను. భగవంతునికి ఏ శక్తులు లేవు. సర్వ శక్తులునాయందే ఉంటున్నవి. సర్వము జయించానని చెప్పేటప్పటికి ప్రహ్లాదుడు ఫక్కున నవ్వాడు. **నాన్నా! అన్నీ జయించావు గానీ ఇంద్రియములను జయించలేక పోతున్నావు.** ఇంద్రియములను జయించలేనివాడవు బయటి ప్రపంచమును జయించటమేమిటి?

'లోని శత్రువులకు లొంగిపోయినవాడు
బయటి రిపులనెట్లు పట్టగలడు?...

నీలోనున్న ఇంద్రియములనే సాధించలేనివాడవు బయటి శక్తులను ఏవిధంగా సాధించగలవు? నాన్నా! ఇది కేవలము అహంకారముతో పలికే పలుకులు. మొట్టమొదట నాన్నా నీ అహంకారమును నిర్మూలము చేసుకో. దైవముపైన ప్రేమను పెంచుకో. నీ జీవితమే కాదు, నీ రాజ్యమేకాదు, నీ సంపదలన్నీ అభివృద్ధి అవుతాయి.

(భ.మ.పు.125/126)

(చూ॥ కామక్రోధలోభములు, బుద్ధిదోషము, భావములు, మంచతనము,)

హిరణ్యగర్భతత్త్వము

(శ్రీవారు హిరణ్య గర్భ లింగమును భక్తులకు చూపిస్తూ), **~~ఈ హిరణ్యస్వరూపం కేవలం ఈ దేహంలో మాత్రమే కాక ప్రతి ఒక్కరి హృదయమునందూ ఉన్నది. ఇది ప్రతి ఒక్కరి కుడిభాగమునందున్నది.~~**_అయితే ఇది ఈ దేహమంతా వ్యాపించి ఉంది; నేను సంకల్పించినప్పుడు ఒక స్వరూపాన్ని ధరిస్తుంది. **ఇది ఆవిర్భావమయ్యే సమయంలో ఎవరు చూశారో వారికి ఇక జన్మ లేదు. వచ్చేసమయంలో దీని ఆకారం చూడాలి. మీ జీవితాలను పావనం గావించే నిమిత్తమే ఇలాంటి పవిత్రమైన దర్శనమును నేను అప్పుడప్పుడు అనుగ్రహించవలసి వస్తుంది.** దీనివల్ల మానవత్వంలోని దివ్యత్వం మీకు అర్థమవుతుంది. ఈ హిరణ్యగర్భ లింగం ఎక్కడ వేసినా పగిలేది కాదు. చూడండి పగలదు (హిరణ్యగర్భ లింగమును మూడు పర్యాయములు గట్టిగా క్రిందికి కొట్టి చూపించారు). ఇది ఎక్కడ వేసినా పగలదు. ఏవిధంగాను మారదు. సామాన్యమైన బంగారమైతే క్రిందికి విసిరి కొడితే ముక్కలవుతుందిగాని, ఇది ఎక్కడ కొట్టినా పగలదు. **ఇదే అమృతత్వము.** ఇలాంటి దివ్యత్వము జగత్తులో ఎక్కడా కానరాదు: ఇది ఒక్క దైవం దగ్గర మాత్రమే నిరూపణ అవుతుంది.

శివ శివ శివ అనరాదా
మీ చింతలెల్ల బాపుకొని మనరాదా
శివమెత్తి జగమంత తిరిగేవు
ఓ చిత్తమా, నీకెంత సిగ్గు లేదె
అవని సుఖంబుల కల్లాడెడి
మీకావలికి మిగిలే దదియేది?

గడచిన 22 సంవత్సరముల నుండి లింగోద్భవమును చూపించలేదు. కారణమేమనగా, పూర్ణచంద్ర హాలు చాల చిన్నదిగా ఉన్నది. లింగోద్భవమును దర్శించాలని లక్షలాదిమంది జనులు వచ్చేవారు. ఒకరి నొకరు నెట్టుకోవడంచేత త్రొక్కిసలాట జరిగేది. అందువల్ల, భక్తులకు ఏమాత్రము ఇబ్బంది కల్గించకూడదని లింగోద్భవమును చూపించడం మానివేశాను. ఇంతేకాదు, **మూడు రకములైన లింగములు ఆవిర్భవిస్తాయి - "భూర్ భువ స్సువః" భూర్ - అనగా మెటీరీయలైజేషన్ (దేహము): భువః - అనగా, వైబ్రేషన్ (ప్రాణము): సువః - అనగా, రేడియేషన్ (ఆత్మ). ప్రతి శివరాత్రినాడు మూడూ ఆవిర్భవించేవి.** ఇప్పుడు కూడా మళ్ళీ ప్రారంభమైందిగాని, నేను అణగద్రొక్కాను. ఎందుకంటే, దీని విషయం మీకు ఇంకా చెప్పాలి. ముందు ముందు దీని స్వరూపాన్ని మీరు చక్కగా చూడగలరు. ఒక్క దైవత్వము దగ్గర తప్ప ఇంకెక్కడా ఈ ఆనందము ప్రాప్తించదని తెలుసుకోవాలి మీరు. **ఏదో నేను మీవలె నడుస్తున్నాను. మీ వలె మాట్లాడుతున్నాను. నవ్వుతున్నాను, మీవలె తింటున్నాను, తిరుగుతున్నాను అని ఈ దేహాన్ని మాత్రమే ఆధారం చేసుకోకండి. నేను ఏది చేసినా నిస్స్వార్థమే, నిస్స్వార్థమే. ఒక వెంట్రుక మందమైనా నాలో స్వార్థం లేదు. అంతా పరార్థమే, పరార్థమే. ఈ సత్యాన్ని మీరు దృఢంగా విశ్వసించండి. మీలో దృఢమైన విశ్వాసమే ఉంటే, మీరు అడుగనక్కరలేదు, ఎక్కడున్నా మీ అభీష్టములు నెరవేరుతూనే ఉంటాయి. సంపూర్ణ విశ్వాసం లేనివారికే కష్టములు, నష్టములు కల్గుతుంటాయి. కనుక మొట్టమొదట ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోండి. ఇదే మీరు చేయవలసిన సాధన.**

నిజంగా మీరెంతో అదృష్టవంతులు. ~~ఈనాడు~~ సోమవారము. ఇది సోమశేఖరునియొక్క స్వరూపమే. ~~ఈశ్వరునికి~~ సోమవారం చాల ముఖ్యం. కనుకనే, ~~ఈశ్వరుణ్ణి~~ 'సోమేశ్వరా! సోమశేఖరా!' అని వర్ణిస్తారు ~~ఈ~~ దేహము పుట్టినది కూడా సోమవారమే. శివాలయంలో సోమవారంనాడు ప్రత్యేకమైన ఆరాధన సల్పుతుంటారు. సోమవారం తరువాత మంగళవారం వస్తుంది. మంగళవారంనాడు హనుమంతుణ్ణి పూజిస్తుంటారు. యుద్ధంలో రాముడు విజయం సాధించిన తరువాత హనుమంతుడు సీతవద్దకు పరుగెత్తుకొని వెళ్ళి "తల్లీ! రాముడు విజయం సాధించాడు, రావణుడు మరణించాడు"

అని చెప్పాడు. ఈ ఆనందవార్త విన్న తక్షణమే సీత "హనుమంతా! ఈనాడు ఏ దినమో నాకు తెలియదుగాని, నీవు నాకు మంగళకరమైన వార్తను వినిపించావు కాబట్టి, ఈనాడు మంగళవారంగా పరిగణింపబడు గాక! ఈనాడు నీ పూజ జరుగు గాక!" అని ఆశ్వీరదించింది. ఆనాడు త్రేతాయుగంలో సోమవారం, మంగళవారం - ఇలాంటివేమీ లేవు. ఈ వారాలు ఇప్పుడిప్పుడు వచ్చినవే. మన భారతీయ కల్చర్ (సంస్కృతి) ఎంతో అంతరార్థం కలిగినది. కానీ ఈనాడు భారతీయులే భారతీయ కల్చర్‌ను తెలుసుకోవడం లేదు. ఈ కల్చర్‌ను తెలుసుకోలేనివారే దీనికి అనేక పెడార్థములను కల్పించుకొని, అనర్థములలో మునిగిపోతున్నారు. మనకు కల్చరే ప్రధానంగాని క్యాస్ట్ (కులం) **కాదు. క్యాస్ట్ మారినా, పోయినా ఫరవాలేదుగాని, కల్చర్‌ను లక్ష్యంలో పెట్టుకోవాలి.**

(స.సా.మా.99పు.72/73)

హిరణ్యగర్భుడు

హిరణ్యగర్భుడు ప్రతి మానవుని హృదయమునందున్నాడు. కేవలం మానవుని యందే కాదు, పశుపక్షి మృగాదులందు కూడా ఉన్నాడు. కనుకనే వేదము **"ఈశావాస్య మిదం జగత్" "ఈశ్వర సర్వ భూతానాం" అన్నది.** ఈ హిరణ్య గర్భుని నుండి వచ్చునదే ప్రేమ. ప్రేమ హిరణ్యగర్భుని ప్రతిబింబమే. **ప్రేమ హిరణ్యగర్భుని ప్రతిరూపమే.** ఇదే మానవుని స్వస్వరూపము. ఇట్టి స్వస్వరూపాన్ని గుర్తించుకోలేక మానవుడు అనిత్యమైన లోక సంబంధమైన వాంఛలకు తన జీవితాన్ని అంకితం గావించు కుంటున్నాడు. స్వార్థపరమైన ప్రేమ వదలిపోతుంది. మరిచి పోతుందిగాని **భగవత్‌ప్రేమ వదలేది కాదు. విడిచేది కాదు. మరచేది కాదు. మారిపోయేది కాదు, పారిపోయేది కాదు, జారిపోయేది కాదు. అట్టి దివ్యమైన ప్రేమతత్త్వం మానవునికి అత్యవసరం.**

(స.సా.మా99.పు.68)

(చూ॥ ప్రధమజా, ప్రశ్నోపనిషత్తు, బంగారు, హిరణ్య గర్భతత్త్వం)

హీనుడు

చదువులన్నియు చదివి చదివి।
మదిని తానెరుగడు మందమతుడు
ఎంత చదువు చదివిన ఏ రీతి నున్నను।
హీను డవ గుణంబు మానలేడు ॥

(సా॥పు.595)

దాన ధర్మములేక దయయు లేక
మానసంబున మంచి నీతి లేక
చెడుగుణంబులతో చెలగాడు చున్నట్టి హీనుడు
ఇలను చెడును, పరము చెడును

(సా.పు.158)

హీరో

(చూ॥ ఆదరణ, ఒక్కటే, జీరో)

హూమన్ (Human)

Human అనగా ఏమిటి? H- Higher value of Mankind. U - Understanding (అనగా, మైండ్‌ను చక్కగా అర్థం చేసుకోవటం. M-Mindful of one's own duty. A - Ananda. N-Name of God in Heart. కనుక, దైవనామాన్ని నిరంతరమూ స్మరించాలి.

(స.సా. ఏ. 1994 పు. 93)

హృదయకమలము

(చూ॥ పూవులు)

హృదయమందిరము

(చూ॥ ప్రథమస్థానము)

హృదయము (Heart)

సమస్త సంకల్పములు హృదయమునుండే ఆవిర్భవిస్తున్నాయి. హృదయాన్ని **మధురంగా మనం ఉంచుకున్నప్పుడు మన**

పలుకులు, మనచేష్టలు, సర్వమూ మధురంగానే ఉంటాయి. మన హృదయం పవిత్రంగా, నిర్మలంగా ఉంటే మన ఆలోచనలు, మన కర్మలు కూడా పవిత్రంగా, ఆదర్శంగా ఉంటాయి. ప్రతి వ్యక్తి యొక్క హృదయమనే పుష్పము నుండి ఆనందమనే సుగంధము వెలువడుతుంది. అట్టి హృదయం పరిపూర్ణంగా ఉంటుంది.

క్షీరసాగరమైన మన హృదయాన్ని ఈనాడు క్షారసాగరంగా మార్చుకుంటున్నాము. క్షీరసాగరంలో విష్ణువు పవ్వళించేడు. అది క్షారసాగరంగా మారితే తిమింగిలాలకు నిలయమవుతుంది. క్షీర సాగరమైన మానవ హృదయాన్ని క్షార సాగరముగా మార్చి నిర్మలమైన మన హృదయాలను కలుషితము చేయకండి. క్షీరసాగరమంటే పాలసముద్రం. పాలు తెల్లగా ఉంటాయి. అనగా హృదయం నిర్మలంగా ఉంటుంది. ఆ నిర్మలమైన హృదయంలోపల క్షీరసాగరుడు పవ్వళిస్తాడు. అతనే విష్ణువు. సర్వ వ్యాపకుడైన హృదయవాసిగా ఉంటాడతడు. కావున మీ హృదయం క్షీరసాగరము. దానిని క్షారసాగరముగా మార్చుకోకండి.

(దే.యు. పు.27)

హృదయమనే దానికి సరియైన అర్థమే తెలుసుకుంటే దీనికి ఏదో ఒక హద్దులో పెట్టటానికి వీలుకాదు. నీలో ఏ హృదయముందో ఎదుట వానియందు అదే హృదయ ముంది. నీ యొక్క ద్వేషియందు కూడను ఇదే హృదయమే వుంది. సర్వులయందు ఒకే హృదయమే ఉంటుండాది. సర్వులయందు ఒకే హృదయముండినప్పుడు సర్వుల భావములు ఒక్కటి గానే రావాలి కదా. ఈ భావములు మనః కల్పితములు. విద్యార్థులారా! ఈ భేదము యీ భావములు ఈ చర్చలు అన్నీ మనస్సు తోవచ్చినవేకాని హృదయముతో వచ్చేవి కావు. Heart అంటే Physical heart ఒకటి వుంటుండాది; Spiritual heart ఒకటి వుంటున్నది Heart అంటే Physical heart కి సంబంధించినది కాదు. ఇది **Spiritual heart ఇది సర్వత్రా వుండినటువంటిది. దీనికి రూపము లేదుగానీ అన్ని రూపములు తానే. "సర్వతః ప్రాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖమ్ సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్టతి"** అన్నింటిలోను తాను ఏకమై వుంటున్నాది. ఏవిధంగా అంటే చక్కెర పాకము చేసి దానితో ఏనుగు కుక్క నక్క పులి గాడిద గుఱ్ఱము అని అన్ని విధములుగా ప్రింటుకొట్టి పెట్టాము. చిన్న పిల్లలంతా వచ్చి నాకు కుక్క కావాలి. నక్క కావాలి పులి కావాలి ఏనుగు కావాలి సింహం కావాలి. అని ఒక్కొక్కరు ఒక్కొక్కటి తీసుకొని భుజిస్తారు. ఆ పిల్లల దృష్టిలోపల యివి వివిధమైన జంతువులుగా కనుపిస్తున్నాయి. గాని చక్కెరలో యీజంతుస్వరూపమే లేదు. చక్కెరలో ఎట్టి భేదము లేదు. అదే హృదయము.

ఈ భేదములన్నియు మానసిక ప్రతిబింబములే ఒకరిని నీవే ద్వేషిస్తున్నావంటే అది నీయొక్క ప్రతిబింబమే. ఒకరిని ప్రేమిస్తున్నావంటే అది నీ ప్రతిబింబమే. ఒకరిని హాస్యము చేస్తున్నావంటే అది నీ ప్రతిబింబమే. కనుకనే నీయొక్క Reaction, Resound, Reflections యీజగత్తునందు స్వరూప స్వభావములుగా కనుపిస్తున్నాయి. ఈ Reaction Resound, Reflection ను విసర్జించి Reality అనే హృదయాన్ని పట్టుకొంటే యీభావములు, భేదముల ఏమాత్రము కలుగవు.

(బృ.త్ర.పు.151/152)

మీ హృదయమే ఒక పెద్ద Lock. అది ఏKeys తో తెరవటానికి వీలుకాదు. అది చాలా భద్రమైనది. మన మైండు దీనికి Key ఈ మైండు అనే Key ని హృదయమనే Lock లోపెట్టి Right Side Turn చేస్తే, open అవుతుంది. Left Side Turn చేస్తే, Lock అవుతుంది. అదే విధముగనే మనము ప్రపంచము వైపునకు Turn చేస్తే, Attachment అనగా బంధన, దివ్యత్వము వైపునకు Turn చేస్తే, ఇది Detachment కనుక Attachment, Detachment లకు Turning difference. Same Lock and Same Key మనము OUt look లో పోతున్నాము. కాబట్టి అంతా బంధనలొపడిపోతున్నాము. అంతర్దృష్టిని మనము అభివృద్ధిచేసుకోవాలి. ఇదే నిజమైన చదువు. ఈ

చదువుతోబాటు మనకు ఈ లౌకిక విద్య అవసరమే. ఈ చదువులు చదువకూడదని చెప్పటం లేదు. ఏది చేసినప్పటికిని, నీవు శ్రద్ధగా చెయ్యాలి. ప్రతీ పని ప్రేమతో చెయ్యాలి. "నా కిష్టమైన పని మాత్రం ప్రేమతో చేస్తున్నా నంటే' ఇది సరియైన సమాధానము కాదు, సరియైన పనికాదు. ఏ పనిచేసినా శ్రద్ధగా చెయ్యాలి. **ఏపనిచేసినా ఒక సాధన క్రింద, దైవార్పితము క్రింద చెయ్యాలి.**

(స.సా.జూన్ 91పు.146)

(చూ॥ కైలాసం, క్షేత్రములు, దేవాలయము, నేనే, పరిశుద్ధము, ప్రథమకర్తవ్యం, ప్రథమస్థానము, భద్రము, శాంతము, హిమాచలం, హిరణ్యగర్భుడు)

హృదయవాసి

ఛాతివద్ద ఎడమవైపున ఉన్న గుండె 'ఫిజికల్ హార్ట్' (భౌతికమైన గుండె). భగవంతుని స్థానం 'స్పిరిచువల్ హార్ట్'. దానినే హృదయ మన్నారు. దయ (Compassion) తో కూడినదే హృదయం. కానీ, **ఈనాడు Compassion పోయి Fashion వచ్చేసింది. (Come-Fashion!)** ఛాతివద్ద ఎడమవైపున ఉన్నది 'ఫిజికల్ హార్ట్', కుడివైపున ఉన్నది స్పిరిచువల్ హార్ట్'. అదే దేవుని మందిరం. **"ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి" అన్నాడు కృష్ణుడు. విషయ పరిజ్ఞానము, లౌకిక భౌతిక సాంఘిక రాజకీయ శాస్త్రజ్ఞానములు తలకు సంబంధించినవి: సత్యము, ధర్మము, న్యాయము, త్యాగము, దయ, ప్రేమ ఇవన్నీ హృదయానికి సంబంధించినవి.**

(స.సా.జూ.99 పు.192)

ఆధ్యాత్మిక మార్గంలో వేదాంతము మరొకవిధంగా బోధించింది. "నాయనా! నీ హృదయ మనేది సింగిల్ చైర్. ఇది డబుల్ సోఫా కాదు, మ్యూజికల్ చైర్ కాదు. కనుక ఇందులో ఒక్క భగవంతునికి మాత్రమే చోటివ్వు. అయితే తల్లిదండ్రులను ప్రేమించు, వారికి తగిన కృతజ్ఞత నందించు. కాని వారు శాశ్వతం కాదు''.

'మాతా నాస్తి పితా నాస్తి, నాస్తి బంధు సహోదరః
అర్థం నాస్తి గృహం నాస్తి, తస్మాత్ జాగ్రత జాగ్రత'

ఈ దేహములన్నీ కదలిపోయే మేఘములవంటివి. **నిజమైన మాతృమూర్తి ఒక్కదైవమే. తల్లి గృహవాసి, తండ్రి గృహవాసి, గురువు ఆశ్రమవాసి. దైవ మొక్కడే హృదయవాసి.** ఈ సత్యాన్ని గుర్తించాలి. ఈ లోకసంబంధమైన రీతిగా తల్లిని దైవంగా భావించి గౌరవించవచ్చును. కాని, హృదయంలో నిల్చుకోవలసింది ఒక్క భగవంతుణ్ణి మాత్రమే. హృదయంలో ఉండే అర్హత ఒక్క భగవంతునికి మాత్రమే ఉన్నది.

(స.సా. జూ. 97, పు. 141,142)

నేనెక్కడకైన బయటికి పోవాలనుకుంటే బయట అనే ప్రదేశముంటే కదా! బయట అనేదే లేదు. అందువలనే ఒకానొక సమయములో రాధ చెప్పింది.

వేయబోవని తలుపు తీయమంటూ పిలుపు
రాధ కెందుకో నవ్వు గొలుపు
నాలోన నీలోన నిండెవెలిగే వలపు
మేలుకొంటే లేదు పిలుపు
విశ్వమంతా ప్రాణవిభుని మందిరమయిన
పిలుపేది తలుపేది వీధి వాకిలి యేది
వీణతంత్రులు మీటి ప్రాణతంత్రులు నాటి
ఆనందబాష్పములే మీటి ప్రాణతంత్రులు నాటి
ఆనందబాష్పములే ఆత్మార్పణము చేయ
కైలాసమే కానరా వీధి వాకిలి అదియెరా.

సందేహము వచ్చినప్పుడు అయ్యో! **నేను ఒంటరిగానే వున్నానే. తలుపు వేద్దామంటే కాన్వస్ తీయమంటూ పిలుపు. వేయి, తీయి అని. ఆనందభాష్పములే వీధి వాకిలి. కన్నులలో నుండిన నీరు ధారలు కారుతుంది. కైలాసము వైకుంఠము. కుంఠితము కానటువంటిది వైకుంఠము. నిరంతరమూ ఆనందముతో నుండేదే కైలాసము.** కైలాసమని వేరే పట్టణములేదు. వైకుంఠమనే వేరే పట్టణము లేదు. నారదుడు 'భగవంతుడా! **నీ హెడ్ క్వార్టర్స్ ఎక్కడా" అని ప్రశ్నిస్తే 'మద్భక్తాః యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి నారద!"** అన్నారు. ఎక్కడ నాభక్తులు హృదయంతో గానం చేస్తారో అక్కడ నేను ప్రతిష్ట

హృదయసంబంధము

అవుతానన్నాడు భగవంతుడు. కైలాసం వైకుంఠం, స్వర్గం ఇవన్నీ బ్రాంచాఫీసు అడ్రసులు. **పర్మనెంటు అడ్రస్ ఒక్కటే. అదియే హృదయస్థానము. భగవంతుడు హృదయములోనే వుంటున్నాడు.** "హేద్వారక వాసా, హేబృందావన సంచారీ, హే మధురాపుర వాసా," అని అనేకవిధములుగా ప్రార్థించింది ద్రౌపది. కానీ ఎంత వర్ణించినా ప్రార్థించినా కృష్ణుడు రాలేదు. అలసి పోయింది. స్వరముకూడా పోయింది. **"హే హృదయవాసీ అని వ్రాలిపోయింది. వెంటనే కృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు.** కొంతకాలమయిన తరువాత ఒంటరిగా ఉన్నప్పుడు సోదరా! ఆనాడు నాకు పరాభవము జరుగుచున్నప్పుడు ఎన్ని పర్యాయములు పిలిచినప్పటికీ ఎందుకు రాలేదు? ఔనామ్మ రాలేదు. ఓ! ద్వారకా వాసీ! అని పిలిచావు. నేను నీకు దగ్గరవున్నా నీ మాట నిలబెట్టటాన్కి నేను ద్వారకకు పోయిరావాలి. ఆకాలంలో హెలికాప్టర్లు, యేరోప్లేన్లు లేవు. బృందావన విహారీ అంటే బృందావనాన్కి పోయిరావాలి. అక్కడకి పోయిరావడంలో అలస్యమయింది. హృదయ వాసి అని పిలిచినప్పుడు నేను తక్షణమే వచ్చాను. భక్తుల మాటను నిలబెట్టుటకై భగవంతుడు అనేక మార్పులు చేయవలసివస్తుంది నీవు బృందావన విహారి అని పిలిచినప్పుడు నేను బృందవనాన్కి పోకుంటే నీ మాటకు విలువ ఉండదు.

(స.ది.పు.28/30)

హృదయసంబంధము

పిల్లలు అల్లరి చేసి స్వామిని బాధపెట్టడంచేత స్వామికి వారిపై విసుగు పుట్టి మాట్లాడటం లేదని నిన్న ఒక దినపత్రికలో వార్త వచ్చింది. ఇలాంటి 'న్యూసెన్సు' వార్తలవల్ల అసలైన 'న్యూస్' మరుగున పడిపోతున్నది. నేను మొట్ట మొదట చెప్పాను. 'నాకు గొంతు సరిగా లేదు. రెండు, మూడు దినములు మీరే మాట్లాడండి, తరువాత నేను మాట్లాడతాను' అని దీనిపైన స్వామికి పిల్లలపైన కోపం వచ్చిందని పెద్ద పుకారు పుట్టింది. దీనిని అమెరికాలో గోల్డ్‌స్టీన్ ఇంటర్‌నెట్‌లో చూసి, చాల బాధ పడి రాత్రి ఫోను చేశాడు. ఈవిధమైన చెడ్డ వ్రాతలను మీరు నమ్మకూడదు. నన్ను ఎవ్వరూ బాధపెట్టలేదు. పిల్లలందరూ మంచి పిల్లలే. సత్యాన్ని తెలుసుకోకుండా ఆసత్యాన్ని ప్రచారం చేసి పవిత్రమైన హృదయాలకు బాధ కలిగించకూడదు. మందిరం యొక్క వరండాలో కూర్చునే కొంతమంది పెద్దలు కూడా ఇంటర్‌నెట్‌లో లేనిపోని విషయాలను చేర్చుతున్నారు. మరి కొంతమంది స్వామి మాకు కోర్కెల రూమ్‌లో ఈవిధంగా చెప్పాడు. ఆవిధంగా చెప్పాడు. అని ప్రచారం చేసుకుంటున్నారు. అలాంటివారిని ఇక మీదట నేను కోర్కెల రూమ్‌కు పిలవను. **మంచి వారు మౌనంగా ఉంటారు. వారి మాటలు, వీరి మాటలు మీకెందుకు? మీరు వచ్చింది దీనికోసమా! అనవసరమైన మాటలవల్ల ప్రమాదాలు జరుగుతాయి; కాలం వ్యర్థమౌతుంది. మౌనం పాటించినప్పుడే మీకు పవిత్రత చేకూరుతుంది.** ఈనాడు 'సైన్స్ అండ్ టెక్నాలజీ' ఎంతో అభివృద్ధి చెందాయి. కాని, **'సైన్స్' అభివృద్ధి అయ్యే కొలది 'సెన్సెస్' (ఇంద్రియాలు) దిగజారిపోతున్నవి. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగిందో అజ్ఞానం కూడా అంత పెరిగిపోయింది.** అందుచేతనే ప్రపంచానికి ఇన్ని విధములైన కష్టములు నష్టములు సంభవిస్తున్నాయి. **ఇది టెక్నాలజీ కాదు, 'ట్రిక్-నాలజీ' అనే చెప్పవచ్చును. స్వామిని పొందాలంటే ప్రేమ తప్ప మరో మార్గం లేదు.**

పిల్లలారా! మనకు 'ఇంటర్‌నెట్ ఏమీ సంబంధం లేదు. దానితో మనం సంబంధమే పెట్టుకోకుండా ఉండాలి. దుర్భావములకు, దుశ్చింతలకు చోటివ్వకండి. ఇవన్నీ పట్టణాల నుండి వచ్చే 'జబ్బులు'. ఇవి పల్లెలకు ప్రాకి పల్లెల్లోని వాతావరణాన్ని కూడా పాడుచేస్తున్నవి. పట్టణపు 'జబ్బుల' ను పల్లెల్లో ప్రవేశపెట్టకండి. **పల్లెలయందు పవిత్రమైన ప్రేమ, దివ్యమైన శాంతి ఉంటున్నవి.** అట్టి ప్రేమను శాంతిని అభివృద్ధి పర్చుకున్నప్పుడే మీ జీవితం ఆనందమయం అవుతుంది. పిచ్చిపిచ్చి మాటలకు అవకాశం ఇవ్వకండి. ఈనాడు అనేకమంది పెద్దవారు

ఏమీ తెలియని అమాయకులైన పిల్లల హృదయాలను పాడు చేస్తున్నారు. పెద్దవారైనా సరే పిచ్చిపిచ్చి మాటలకు అవకాశం ఇవ్వకండి. పెద్దవారైనా సరే పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే 'అయ్యా! ఈ చిల్లర బుద్ధులు మీకెందుకు? అని వారికి బుద్ధి చెప్పండి. **పెద్దలు తమ స్థాయికి తగినట్లు ప్రవర్తించాలి. వయస్సులోనే కాక ప్రవర్తనలో కూడా పెద్దలేనని నిరూపించుకోవాలి.** ఇంటర్‌నెట్‌తో నాకు ఎట్టి సంబంధమూ లేదు. ఇప్పుడే కాదు, ఎప్పుడూ ఉండదు. **నాకు మీతోనే సంబంధము, అది హృదయ సంబంధము.**

(స.సా.మా.2000పు.73/74)

హృదయస్థాయి

(చూ॥ కర్తృత్వము)

హృషీకేశుడు

ఇంద్రియముల కధిపతి కృష్ణుడు. ఇంద్రియములను స్వాధీనమునకు తెచ్చుకున్న వాడు అర్జునుడు. అందుకనే కృష్ణునికి హృషీకేశుడనియు, అర్జునునకు గూడా కేశుడనియూ పేర్లుగలవు.

(గీ.పు.21)

హెచ్చరించుకొండి

ఈనాటి యువకులయొక్క ప్రవర్తన చాల వికారంగా ఉన్నది. మంచితనమును పోషించుకున్నప్పుడే యువతకు సరియైన కీర్తి వస్తుంది. ఇష్టం వచ్చినట్లు సంచరించేది కుక్కనేగాని, మనిషి కాదు. **"నేను మనిషిని" అనుకున్నప్పుడు మనిషికి తగిన ప్రవర్తన కలిగియుండాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు జంతు లక్షణాలేగాని, మానవ లక్షణాలు కావు.** ఇవి ఆహార దోషంవల్ల ఏర్పడుతున్నాయి. వీటివల్లనే మానవుడు మానవత్వాన్ని కోల్పోయి దివ్యత్వాన్ని విస్మరిస్తున్నాడు. **క్రోధం కుక్క లక్షణం.** కాబట్టి, మీకు క్రోధం వచ్చినప్పుడు "నేను కుక్కను కాదు, నేను మనిషిని" అని పదేపదే జ్ఞాపకం చేసుకోండి. **చంచలత్వము కోతి లక్షణం.** కనుక, మీలో పిచ్చిపిచ్చి భావాలు కల్గినప్పుడు "నేను కోతిని కాదు, నేను మనిషిని" **అని మిమ్మల్ని మీరు హెచ్చరించుకోండి. ఈ దుర్గుణములను నివారించే దివ్యౌషధం మీయందే ఉన్నది. సద్గుణములను అభివృద్ధి పర్చుకుంటే దుర్గుణములు వాటంతటవే దూరమౌతాయి.**

(స.సా.డి.99పు.367/368)

హెచ్చరిక

కొందరు హిస్టీరియా వంటి వ్యాధిగ్రస్తులు, బలహీనమైన మనస్తత్వం గలవారు. నేను వారిద్వారా మాట్లాడుతున్నానని, నేను వారి ద్వారా ప్రవర్తిస్తున్నానని చెప్తున్నారు! నేనిప్పుడే చెప్తున్నాను. **అటువంటి అసహ్యపు వ్యక్తులతో నాకు సంబంధం లేదు. నేను ఎవరినీ నా వాహికలుగా వాడుకోను. అటువంటి అవసరం నాకులేదు. నేను ఆవిధంగా ఊగిపోతూ పిచ్చిమాటలు మాట్లాడను. సంవత్సరాల తరబడి తపస్సుచేసి శరీరాన్ని బాధపెట్టుకున్నవారు, శరీరం చుట్టూ పుట్టలు కట్టినా కూడా చలించని వారు భగవంతుణ్ణి గ్రహించటం కష్టమని తెలుసుకున్నారు. అటువంటిది ఈ సోమరులు, తిండిపోతులు, ఇంద్రియలోలురు తేలికగా భగవంతుణ్ని ఎలా తెలిసికోగలరు? వారి అభినయాలు, మాటలు, చేతలు అన్నీ దొంగవేషాలు. కొందరు అటువంటి వారి ఎదుట ధూపం వేస్తూ, వారిని కొలుస్తూ నా నుండి దూరంగా వెళ్ళిపోతున్నారు. అసత్యము వెంట పరుగులు పెడుతున్నారు.**

పరిపూర్ణుడైన పరమాత్ముడు తుచ్ఛమైన మోసపూరితమైన శరీరాలలో ఎలా ప్రవేశిస్తాడు? భగవంతుడు రూపం ధరించి వచ్చినప్పుడు ఆయన అర్హతలేని పాత్రలు నింపడు. కలుషితమైన శరీరాలలో ప్రవేశింపడు. కాబట్టి మీరు అటువంటి వారి వెనుకబడి వారి అసత్యపు

హెడ్‌క్వార్టర్స్

తత్త్వాన్నిస్తుతించకండి. వారితో కఠినంగా ప్రవర్తించండి. అప్పుడు వారు దారికి వస్తారు. మిరుమిట్లు గొలిపే వజ్రాన్ని చూసిన వారు తళుకు బెళుకుల గాజుముక్కలు చూసి మోసపోరు. మీరు ఏ పేరుతో పిలిచినా భగవంతుడు వజ్రం వంటివాడు. ఎవరు ఎంత పొగడినా, వాదించినా గాజుముక్క వజ్రంగా మారదు.

(వ.61-62 పు.145)

మీకు ఒక హెచ్చరిక చేయాలి. కొందరు నాపేరు చెప్పి భోజనాలు పెడతామని, దేవాలయాలు కడతామని, పూజలు చేస్తామని చందాలు వసూలు చేస్తున్నారు. వాటిని ఎంతమాత్రము నమ్మకండి. అవి నా ఆశయాలకు, సూచనలకు పూర్తీ వ్యతిరేకం. అటువంటి వాటిని నేను ఖండిస్తున్నాను. మీరు వాటిని ఏ మాత్రము ప్రోత్సహించకండి. మరికొందరున్నారు. వారిపై నేను పూనానని, వారి ద్వారా నేను మాట్లాడుతున్నానని చెప్పి ప్రచారం చేసుకుంటున్నారు. అటువంటివారి నందరిని మోసగాళ్ళుగా గ్రహించండి. లేకపోతే మీరు కూడా వారి మోసంలో పాలుపంచుకుంటున్నారని భావించవలసి వస్తుంది.

మరికొందరు నేను వారికి ఒక విగ్రహమునో, ఒక బొమ్మనో ఇచ్చానని చూపించి డబ్బు వసూలు చేస్తున్నారు. "బాబా నన్ను మీ దగ్గర నుంచి డబ్బు తెమ్మని పంపించారు," "బాబా నాకు ఇది ఇచ్చారు", "బాబా ప్రత్యేకంగా ఆశీర్వదించారు" అని మాయ మాటలు చెప్పి మీ దగ్గర డబ్బు ప్రోగుచేస్తున్నారు. ఇటువంటివారిని ఎవరైనప్పటికి వారిని మీరు బహిష్కరించి, బయటకు పంపించి వేయండి.

(వ.61-62 పు.246)

హెడ్‌క్వార్టర్స్

(చూ॥ హృదయవాసి)

హేయత్వావ చనాచ్చ

కారణమొక్కదానిని దెలుసుకొనిన కార్యము లన్నింటిని తెలుసుకొనవచ్చును. ప్రపంచమంతయూ భగవత్ సంకల్పము చేత ఏర్పడినది. ఇది కార్యము, **ఏ వస్తువు నిర్మాణము కావలెనన్ననూ కారణము అవసరము. కారణము లేని కార్యము జగత్తున జరుగనేరదు.**

కేవలము నామరూపములను చూచి మోహించుట, భ్రమించుట విచారించుట, దుఃఖించుట ఇది కుదర్శనము. ఇవి నానా రూపములతో కనుపించు జడములు. ఈ రూపనామములలో అనగా **అనేకత్వములో ఏకత్వమును నిరూపించుట, చూచుట, ఆనందించుట, అనుభవించుట దీనిని సుదర్శనమని యందురు.**

అనేకత్వములేని ఏకత్వమే పరతత్వము. దానిని ఆశ్రయించుటే మోక్షము. అదే బ్రహ్మనిష్ఠ అని యనవచ్చును. ప్రతిజీవియు ఈ స్థితిని అనగా మోక్షము లేక బ్రహ్మ ప్రాప్తి పొందియే తీరవలెను. అహంకార మమకారములకు చిక్కి ఖేదమోదముల ననుసరించు బద్ధుడైన మానవునకు ఈ బద్ధత్వమునుండి విముక్తి కావాలనే వాంఛ ఏనాటికైనా ఉదయించకతప్పదు. అట్టి బంధము నుండి విముక్తి కోరుటే ముక్తి. **చావని త్రోవనే మోక్షము. దానిని వెదుకుటయే బుద్ధిమంతుల లక్షణము. ధుఃఖమునందున్నవాడు ఆనందము గలవానిని ఆశ్రయించవలెను.** బంధనిరంతర దుఃఖముతో కూడి యుండును. **నిరంతర ఆనందస్వరూపుడు భగవంతుడు కనుక, అట్టి ఆనందమయుడైన భగవంతుని ఆశ్రయించుటే దుఃఖ విముక్తి. దుఃఖ నివృత్తి ఆనందప్రాప్తి, మోక్షమని గుర్తించవలెను.**

అఖండ రసైక స్వరూపుడు, ఆనందనిలయుడు ఒక పరమాత్మనే. అతనిని ఆశ్రయించిన వారికే అనంతత్వము ప్రాప్తించును. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ప్రవేశము లేని ఈ పరమ పదం ఆద్యంతరహితమైనది. క్రమంగా దానికోసం ప్రయత్నించాలి. **స్థూలమునుండి సూక్ష్మములో, సూక్ష్మమునుండి కారణములో కారణమునుండి మహాకారణము నందు లయము కావాలి. ఇదే సక్రమమైన మార్గము.**

సామాన్యమానవులు భౌతిక భోగ భాగ్యములకోసం ప్రాకులాడుచున్నారు. కానీ, అంతరంగమున ఉన్న

ఆత్మానందమును చూడలేకపోవుచున్నారు. అనుభవించ లేకపోవుచున్నారు. దానికై తగిన ప్రయత్నము కూడనూ చేయలేకున్నారు. వారి దృష్టి ఎంతసేపూ బయటి ప్రపంచమునందు ప్రసరించునేకాని అంతరంగమునకు ప్రసరించదు. **'పశ్యతి ఇతి పశుః' బయట దృష్టి కలిగి ఉండుట పశు లక్షణము మానవలక్షణముకాదు.** చిన్న ఉదాహరణము మన దేహములే నున్న ప్రధాన అంగములు కన్ను, ముక్కు,నోరు,ఇత్యాది అన్ని అంగములూ బయటకే తెరచుకొని ఉన్నవి. అందువలన దేహదృష్టిపూర్తి పశుదృష్టి అని చెప్పక తప్పదు.

బాహ్యవిషయాలు అందుబాటులో ఉన్నట్లు, అంతర్లోకం అంతుపట్టదు. ఎవరో నూటికి కొక్కరు ఈ అంతర్ దృష్టిని, అంతరాత్మను సాక్షాత్కరింతురు. అట్టివారే బుద్ధిమంతులు. మానవుడై పుట్టిన వాడు ఇట్టి ఆధారమైన అనంతమైన ఆనందతత్వమును పొందవలెను. అది జీవిత పరమార్థము, అదే జన్మ సార్థకము. అయితే బాహ్య ప్రపంచమునకు, అంతర్ జగత్తుకు అవినాభావ సంబంధమున్నది. అన్నింటినీ చూచి విని అనుభవించేది, మురిసిపోయేది శరీరము అని అనుకొనుచుందురు సామాన్య మానవులు. కాదు కాదు, **ఇంద్రియాలకు, మనసుకు, బుద్ధికి, అన్నింటికి అతీతమైన, అన్నింటిని అదుపులో ఉంచగల, పాలించగల శక్తి మరొకటి ఉన్నది. అదే ఆత్మ.** దానిని లక్ష్యములో ఉంచుకొని ఇంద్రియాలతో, మనసుతో, బుద్ధితో నీవు జగత్తును అనుభవించ'మని తెలుపుతుందీ సూత్రము.

కొండలపైన కురిసిన వర్షము నానాదిక్కులజారి పాయలై ప్రవహించును. అదే వర్షము నిర్మలనదియందు లేక, నిర్మల సరోవరము నందు పడిన, నీటిలో నీరు చేరి, కలసి, నిర్మలముగా మారును. అలాగే ఆత్మతత్వం తెలిసిన మునులు నిర్మలమైన, నిశ్చలమైన, నిస్వార్థమైన రీతిగా మారుతారు. అంతఃకరణపరిశుద్ధి చేసుకున్న ఆత్మ మన స్వరూపమే అవుతుంది. అప్పుడు రాగద్వేషములు, అభిమాన మమకారములు, శాంతి అశాంతులు, దూషణ భూషణలు, మనలను ఏమాత్రము చేరవు, బాధించవు. అవికూడా మనకు సమత్వమును నిరూపించును. అనగా ఆత్మ తరంగములని బోధించును. నిరూపించును. ఇదే **నిజమైన ఆత్మ దృష్టి బ్రహ్మదృష్టి ఏకదృష్టి.**

(సు.వా.పు.38/42)

హోమము

(చూ॥ విధులు)

అనుబంధము

అటాచ్‌మెంట్

(చూ॥ సమత్వము)

అనుగ్రహము

(చూ॥ ఈశ్వరాంబ, హృదయావేదన)

అహింస

(చూ॥ భారతదేశము)

ఆదర్శపుత్రుడు

లింకని చూసిన తరువాత అందరిలోను ఆత్మవిశ్వాసం, దైవ విశ్వాసం అభివృద్ధి చెందాయి. అలాంటి **ఆదర్శ పుత్రుడు** ఒక్కడున్నా చాలు.

ప్రదోషే దీపకశ్చంద్రః ప్రభాతే దీపకోరవిః
త్రైలోక్యే దీపకోధర్మః సుపుత్రా కులదీపకః

పగటి పూట ప్రకాశాన్ని అందించేవాడు సూర్యుడు. రాత్రి వేళ ప్రకాశాన్ని చేకూర్చేవాడు చంద్రుడు. ముల్లోకములకూ ప్రకాశాన్ని అందిస్తుంది ధర్మము. కులగౌరవాన్ని నిలబెట్టేవాడు సుపుత్రుడు.

(స.సా.జూ. 2002 పు. 175)

ఆదర్శప్రాయులు

(చూ॥ ఊర్మిళ)

ఆదర్శము

(చూ॥ ఊర్మిళ, భారతదేశము, రామరావణయుద్ధము)

ఆదిశేషుడు

(చూ॥ ఊర్మిళ)

ఆనంద పిపాసి

(చూ॥ బొమ్మలాట)

ఆనందప్రాప్తి

(చూ॥ హృదయావేదన)

ఆనందము

(చూ॥ ఉపకారము, బొమ్మలాట, సంపూర్ణ జీవనము)

ఆవేదన

(చూ॥ హృదయావేదన)

ఇష్టాయిష్టాలు

"ఇష్టముగాని, అయిష్టముగాని పదార్థములో లేదు, నీలోనే ఉన్నది. ఆవకాయ, గోంగూర పచ్చళ్ళంటే నీకు ఇష్టము, మరొకరికి అయిష్టము. పదార్థంలో ఎట్టి మార్పూ లేదు. ఇష్టాయిష్టాలు నీకు సంబంధించినవి. అయితే, కొన్ని సందర్భాల్లో నీలో ఉన్న ఒక దోషం కూడా కారణం కావచ్చు. ఉదాహరణకు, నీకు మిఠాయి అంటే ఇష్టమున్నప్పటికీ డయాబెటిస్ ఉంటే తినలేవు. ఇక్కడ దోషం డయాబెటిస్‌దేగాని, మిఠాయిది కాదు కదా! ఈ సృష్టిలో పాజిటివ్, నెగెటివ్‌లు రెండూ కలసి ఉంటాయి. నీ దృష్టిలో మంచిచెడ్డలున్నాయి. కాని, భగవంతుని సృష్టిలో అంతా సమానమే. కాలప్రభావంవలన కూడా మంచిచెడ్డలు ఏర్పడుతున్నాయి. ఈ సాయంకాలం నీవు ఆపిల్ తిన్నావు, గులాబ్‌జామ్ తిన్నావు, జిలేబి తిన్నావు. ఇవన్నీ ఇప్పటికి మంచివే. కాని, రేపటికి అవి మలిన పదార్థాలుగా మారి విసర్జింపబడినప్పుడు నీకు వాటిపట్ల అసహ్యం, అయిష్టం కల్గుతాయి. దీనికి కాలమే కదా కారణం."

(స.సా.మే. 2002 పు. 156)

ఈశ్వరత్వము

(చూ॥ సమత్వము)

ఈశ్వరాంబ

పేరు ప్రతిష్ఠలకోసం నేను చెప్పటంలేదు. ఈ శరీరానికి తల్లియైన **ఈశ్వరాంబ, చిన్నప్పటి నుంచీ ఎంతో వినయంతో, ధర్మంతో, విశాలమైన భావంతో అందరినీ చూస్తుండేది.** చిన్న పిల్లలను చూస్తేచాలు, ప్రేమతో ఎత్తుకొని లాలించేది. ఒకానొక సమయంలో కరణం సుబ్బమ్మకు బిడ్డలు లేక చాలా విచారిస్తూ ఉండేది. అప్పుడప్పుడూ నీ పిల్లవాడినెవరినైనా మా ఇంటికి పంపమని ఈశ్వరాంబను అడుగుతుండేది. ఆ విధంగా అడిగి స్వామిని తీసుకొని వెళ్ళి ఎంతో లాలించేది. ఈనాడు ఇలాంటి తల్లులు ఎందరో ఉంటున్నారు.

ఒకనాడు తాను కరణం సుబ్బమ్మ ఇంటిలో వుండగా పరుగెత్తుకుంటూ ఈశ్వరమ్మ వచ్చింది. కారణం అడిగాను. **"స్వామీ! పక్కింటి అమ్మాయికి చాలా జబ్బుచేసింది. తల్లి చాలా బాధపడుతున్నది. ఆ బాధను చూడలేకపోయాను. అందులో ఈ కుగ్రామంలో కనీసం చిన్న ఆసుపత్రి కూడా లేదు. మందులిచ్చే దిక్కులేదు.** ఎందరో బాధపడుతున్నారు. మీవద్దకు ఎందరో భక్తులు నిత్యమూ వస్తున్నారు గదా! వారి వారి బాధలను చెప్పుకుంటున్నారు. ఎదుటి వారి బాధలను ఎవరూ పట్టించుకోవటం లేదు. ఆ పని మీరు ఒక్కరు మాత్రమే చేయగలరని నా విశ్వాసం. పేద ప్రజల బాధలను నివృత్తిచేసే నిమిత్తమై ఒక చిన్న ఆసుపత్రిని ఈ కుగ్రామంలో ఏర్పాటు చేస్తే బాగుంటుంది అన్నది ఈశ్వరమ్మ. అప్పుడు నేను చెప్పాను.

'ఈ చిన్నదానికోసం ఎందుకు ఇంత గాబరా పడుతున్నావు. ప్రతిదానికి సమయం రావాలి. తొందరపడవద్దు' అని చెప్పి బయటకు వెళ్ళాను. అయితే ఆనాటి నుంచీ దీనిని గురించి ఆలోచిస్తునే ఉన్నాను. పరోపకార సంబంధమైన ఆమె కోరికను నెరవేర్చాలని సంకల్పించుకున్నాను. రెండవ నాటి నుంచే పని ప్రారంభింపజేయించాను. నెలరోజులు తిరగకమునుపే ఆసుపత్రిని ఏర్పాటు చేయించాను. **'బ్రహ్మము' అనే డాక్టర్‌ను నియమించాను. కొంత కాలానికి మిక్కిలి సీతారామయ్య వచ్చి ఆ ఆసుపత్రి బాధ్యత తనకు వప్పజెప్పమన్నాడు. ఆయన స్వామి భక్తుడు. ఆనాటి నుంచి కట్టకడపటి శ్వాస వదిలేంతవరకు ఆసుపత్రిలోనే వుండి సేవలు అందించిన సేవాతత్పరుడు. కాని ఈనాడు అటువంటి డాక్టర్లు చాలా అరుదుగా కనిపిస్తున్నారు.** డబ్బే ప్రధానంగా భావిస్తున్నారు. పల్లెలకు వెళ్ళి సేవలు చేయడానికి ముందుకు రావటంలేదు. నగరాలలోనే ఉండాలి. సౌకర్యాలు అనుభవించాలి. డబ్బు సంపాదించాలి. ఇదే భావం ఈనాడు చాలామంది డాక్టర్లలో కనిపిస్తున్నది. ధనం శాశ్వతంకాదు. సేవలు చేయాలి.

"రూపాయి కోసమే లోపాయికారిగా అడ్డమైన గడ్డి తింటారయా!" గడ్డి అయినా తింటారు గాని, రూపాయి సంపాదించాలి. కాని వీరికి **భగవంతుని .. (అనుగ్రహం) కావాలి. ఎక్కడనుంచి వస్తుంది? వీరికి ...(గడ్డి) చిక్కుతుందిగాని భగవంతుని ..(అనుగ్రహం) మాత్రం చిక్కదు.**

ఈనాడు త్యాగమూర్తులు తయారుకావాలి. ఈనాడు భక్తి శ్రద్ధలు కాదు ముఖ్యం. ప్రజల బాధలను గుర్తించి, నివారణోపాయాన్ని వెదికేవారు కావాలి. సమాజ సంక్షేమాన్ని ఆశించేవారు కావాలి. సమాజ సంక్షేమాన్ని కోరే డాక్టర్ల అవసరం ఈనాడు ఎంతైనా ఉన్నది. ఈనాడు సేవకులు కావాలిగాని నాయకులు కాదు. **సేవకుడుకాని వాడు నాయకుడైనా ప్రయోజనంలేదు. నాయకుడైనవాడు సేవకుడుగా వున్నప్పుడే దేశానికి ఎంతైనా సేవ చేయగలడు.**

(శ్రీ.జూ. 2002 పు. 7/8)

(చూ॥ ఉపకారము, తల్లితండ్రులు)

ఈశ్వరార్పణము

(చూ॥ సంపూర్ణ జీవనము)

ఈషణ త్రయము

ధనేషణ, దారేషణ, పుత్రేషణ - ఈ ఈషణ త్రయమే మానవుణ్ణి బంధితుని గావించి అనేక చిక్కులకు గురి

ఉపకారము

చేస్తున్నాయి. ప్రాచీనకాలంలో ఎందరో రాజులు ఎంతో ధనమును ప్రోగు చేసుకున్నారు. కాని, ఏమి సాధించారు? **ధనము ఏనాటికీ మానవుణ్ణి ఉద్ధరించలేదు.** ధనముచేత మానవుడు శాశ్వతమైన ఆనందమును పొందలేదు. **ఆధ్యాత్మిక ధనమే నిజమైన ధనము.** ధనమువలన తాను శాశ్వతమైన సుఖమును అనుభవించలేక పోయినప్పటికీ ధనంకోసం మానవుడు ఆరాట పడుతూనే ఉన్నాడు. ధనం అవసరమే. కాని, దానిని పరిమితంగా అనుభవించాలి. **రెండవది దారేషణ.** మానవుడు ధనమును సంపాదించి ఆలుబిడ్డలతో కలసి కొంతకాలం సుఖాన్ని అనుభవించవచ్చు. కాని, **శాశ్వతసుఖాన్ని పొందగలనను కోవడం వెఱ్ఱితనం. అట్టి సుఖం అనిత్యమైనది, అసత్యమైనది. మూడవది పుత్రేషణ.** మానవుడు తనకు పుత్రుడు కలగాలని ఆశిస్తాడు. ఆశించడంలో తప్పులేదు. అయితే, **ధృతరాష్ట్రునకు అనేకమంది పుత్రులు కలిగారు. కాని, వారి వల్ల తానేమి సుఖం పొందాడు? పుత్రులు లేనందువల్ల శుకునకేమైనా దుర్గతి కల్గిందా? లేదు.** కనుక పుత్రులున్నవారు మాత్రమే సుఖపడతారని, లేనివారు కష్టపడతారని అనుకోవడం వట్టి భ్రమ. దుర్మార్గులైన పుత్రులు ఎంతమంది ఉన్నప్పటికి ఏమి ప్రయోజనం? **సత్పుత్రుడు ఒక్కడున్నా చాలు.** దీనికి చక్కని ఉదాహరణ రామాయణం.

(స.సా.మే 2002 పు. 1)

(చూ॥ పల్లెసీమల సేవ)

ఉపకారము

"ఉపకారికి ఉపకారము
విపరీతముకాదు సేయ వివరింపంగా
అపకారికి ఉపకారము
నెపమెన్నగ సేయువాడె నేర్పరి సుమతీ!"

ఎవరు మనకు అపకారం చేశారో, వారికి కూడా ఉపకారం చేయాలి. **ఈ విషయంలో నా ప్రతిజ్ఞ ఒకటే. ఎవరు నాకు అపకారం చేసినప్పటికినీ, ఎవరు నన్ను దూషించినప్పటికినీ వారిని నేను ఆనందంగా చూస్తాను.** My life is My message. ఎవరు ఈనాడు ఈ విధంగా నడచుకుంటున్నారు? ఎవ్వరూ నడచుకోవటంలేదు. వారు నడచుకోవటంలేదని నేను ఏ మాత్రం బాధపడను. నడచుకున్నవారు బాగుపడుతారు. నడచుకోనివారు అవస్థలకు గురి అవుతారు. నా అడుగు జాడలలో నడవండి! మీకు ఎట్టి అపకారం జరగదు. లక్షలాది మంది పిల్లలకు ఉచిత విద్య నిస్తున్నాను. పిహెచ్.డి.లు చేస్తున్నారు. ఈనాడు ఒక కాన్వెంట్‌లో చేరాలంటే వేలాది రూపాయిలు ఖర్చు చేయవలసి వస్తున్నది. అలాంటి పరిస్థితులలో పిల్లలందరికీ ఉచిత విద్యను అందిస్తున్నాను. **ఈ గుణాలన్నీ తల్లి ఈశ్వరాంబ నుండే నేర్చుకున్నాను. చిన్ననాట భర్తలను కోల్పోయిన అభాగ్యులను దగ్గరకు చేర్చి ఓదార్చేది. వారిలో విశ్వాసాన్ని పెంపొందించేది. మనం కూడా ఆ విధంగా కృషి చేయాలి.** ముఖ్యంగా మనం ఈనాడు కృతజ్ఞతను పెంచుకోవాలి. కృతఘ్నులు కాకూడదు. మనకు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేయాలి. చేతనైనంత సహాయం చేయాలి. అపకారం చేసినవారికి కూడా ఉపకారం చేయాలి. వీడు మనవాడా! ఇతరుడా! అని చూడకండి. బాధపడేవారిని చూస్తే, తక్షణమే సహాయం చేయండి. ఇదే నిజమైన చదువు. ఇతరులకు సహాయపడని చదువు వుండి ప్రయోజనం ఏమిటి?

(శ్రీ. జూ. 2002 పు.9/10)

(చూ॥ నా ప్రతిజ్ఞ)

ఊర్మిళ

లక్ష్మణుని భార్య ఊర్మిళ. సుమిత్రవలె ఆమె కూడా గొప్ప గుణవంతురాలు. ఆమెకున్న త్యాగము, ఔదార్యము ఎవ్వరికీ లేవు. అరణ్యానికి వెళ్ళిన తరువాత పధ్నాల్గు సంవత్సరాలపాటు తిరిగి రావడానికి వీలుండదు కదా! కనుక, ఆమెకు ఒకతూరి చెప్పిపోదామని లక్ష్మణుడు వెళ్ళాడు. ఆ సమయంలో ఆమె తన గదిలో కూర్చుని **సీతారామపట్టాభిషేక ఘట్టమును రంగులతో చిత్రిస్తున్నది.**

ఆమె చిత్రకళలో గొప్ప ప్రావీణ్యం కల్గినది. ఆ చిత్రమును తన తండ్రియైన జనకునికి పంపాలని ఆమె ఉద్దేశ్యం. ఇంతలో లక్ష్మణుడు వెళ్ళి "ఊర్మిళా!" అని కాస్త గట్టిగా పిలిచాడు. ఆమె ఉలిక్కిపడి లేచింది. లేచేటప్పటికి ఆమె ప్రక్కనున్న రంగంతా తాను గీసిన చిత్రముపై ఒలికిపోయింది. "అయ్యో, దీనిని చెడగొట్టుకున్నానే" అని బాధపడింది. అప్పుడు లక్ష్మణుడు "ఊర్మిళా! విచారించకు. రాముని యొక్క పట్టాభిషేకమును కైకేయి చెడగొట్టింది. నీవు గీసిన పట్టాభిషేక చిత్రమును నీ భర్తయైన లక్ష్మణుడు చెడగొట్టాడు. కాబట్టి, నీవు బాధపడనక్కర్లేదు" అన్నాడు. జరిగిన సంగతి వివరించి, తాను రామసేవ నిమిత్తం అరణ్యానికి వెళుతున్నట్లు చెప్పాడు. ఆమె ఆనందంగా అంగీకరించింది. తనను వదలిపెట్టి వెళుతున్నాడని బాధపడలేదు. తనను కూడా తీసుకువెళ్ళమని ఏమాత్రం ఒత్తిడి చేయలేదు.

"నాథా! నిన్ను, నీ సోదరుడైన శత్రుఘ్నుణ్ణి నా అత్తగారు సేవకోసమే కన్నారు. నీవు రామసేవ చేయడానికే జన్మించావు. శత్రుఘ్నుడు భరతునికి సేవ చేయడానికే జన్మించాడు. కాబట్టి, నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించు. అయితే, నాకొక మాట ఇవ్వాలి. నీవు అరణ్యంలో ఉండే పధ్నాల్గు సంవత్సరాలలో ఒక్క క్షణం కూడా నన్ను తలంచకూడదు. నన్ను తలుచుకుంటే సీతారాముల సేవకు అభ్యంతరం కల్గుతుంది. కనుక, నీవు నిరంతరం వారినే స్మరిస్తూ వారికి ఎలాంటి ఇబ్బందీ కల్గకుండా చూసుకో. ఈ పధ్నాల్గు సంవత్సరాలపాటు నన్ను పూర్తిగా మరచిపో" అని చెప్పింది. ఏ భార్యయైనా ఈ రీతిగా చెబుతుందా? ఎవ్వరూ చెప్పరు. ఆమెయొక్క విశాలమైన భావములకు లక్ష్మణుడే కరిగిపోయి కన్నీరు కార్చాడు. **"ఊర్మిళా! నీకింతటి విశాలమైన భావాలున్నాయని నేను అనుకోలేదు. నీ విశాలమైన భావాలను నేను హృదయంలో నిల్పుకుంటాను" అన్నాడు. అప్పుడు ఊర్మిళ "నా భావాలను కూడా నీవు తలంచవద్దు. సీతారాములయొక్క విశాలమైన భావాలను నీ హృదయంలో నిల్పుకో. వారి ఆజ్ఞను శిరసావహించు. వారికి ఎలాంటి కష్టమూ కల్గకుండా చూసుకో" అని కోరింది.**

సుమిత్ర, ఊర్మిళలయొక్క గుణసంపత్తిని ఎవ్వరూ వర్ణించలేరు. ఊర్మిళవంటి గుణవంతురాలైన భార్య, సుమిత్రవంటి ఆదర్శవంతురాలైన మాతృమూర్తి ఈనాడు ఎక్కడా కనిపించడం లేదు.

యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు రాముడు "లక్ష్మణా! ఈ ప్రపంచంలో వెతికితే సీతవంటి భార్యయైనా నాకు లభించవచ్చు. కాని, నీవంటి సోదరుడు లభించడు. నిన్ను కోల్పోయిన తరువాత ఇంక నేనెందుకు బ్రతికి యుండాలి?" అని పరితపించాడు. అక్కడున్న వైద్యులు సంజీవని మూలికద్వారా లక్ష్మణుణ్ణి బ్రతికించడానికి వీలౌతుందని చెప్పారు. వెంటనే హనుమంతుడు ఆకాశమార్గాన సంజీవని మూలికయున్న పర్వతం వద్దకు వెళ్ళాడు. కాని, ఆ మూలిక ఎలా ఉంటుందో అతనికి తెలియకపోవడంచేత ఆ పర్వతాన్నంతటినీ పెకలించుకొని బయలుదేరాడు. నందిగ్రామంమీదుగా వెళుతూంటే భరతుడు అతనిని చూసి ఎవరో రాక్షసుడని భావించి అంబులు వదిలాడు. వెంటనే హనుమంతుడు పర్వతంతోపాటు క్రిందపడ్డాడు. నందిగ్రామ ప్రజలు, అయోధ్యావాసులు పరిగెత్తుకొని వచ్చి హనుమంతుని చుట్టూ గుమికూడారు. హనుమంతుడు అందరికీ నమస్కరించి, భరతునివైపు చూసి "భరతా! నీ సోదరుడైన లక్ష్మణుడు యుద్ధంలో మూర్ఛిల్లినాడు. అతనిని బ్రతికించే నిమిత్తం వైద్యులు సంజీవనిమూలికను తీసికొని రమ్మన్నారు. సంజీవని ఎలా ఉంటుందో నాకు తెలియదు. అందుచేత, ఆ మూలికయున్న పర్వతాన్నంతటినీ తీసికొని వెళుతున్నాను" అన్నాడు. లక్ష్మణుడు మూర్ఛిల్లిన వార్త వినగానే అందరూ "అయ్యో, లక్ష్మణుడు మూర్ఛిల్లినాడా? రాముడు బాధపడుతున్నాడా? ఎందుకు వీరికిన్ని కష్టాలు?" అని కన్నీరు కార్చారు; ఇంక ఆడవారైతే చెప్పనక్కర్లేదు. **కాని, ఒక్క స్త్రీ మాత్రం కన్నీరు కార్చలేదు. ఆమెయే సుమిత్ర. "రామునికి ఎట్టి బాధలూ కల్గవు. నిరంతరం**

రామనామాన్ని స్మరించే నా కుమారుడైన లక్ష్మణునికి కూడా ఎట్టి ఆపదా సంభవించదు.” అనే దృఢవిశ్వాసంతో ఆమె ధైర్యంగా ఉన్నది.

భరతుడు హనుమంతుణ్ణి ఊర్మిళవద్దకు తీసుకు వెళ్ళాడు. ఆమె తన గదినుండి బయటికి రాలేదు. లక్ష్మణుడు అరణ్యానికి వెళ్ళేటప్పుడు తాను ఏ గదిలోనైతే ఉన్నదో, అతడు తిరిగి వచ్చేంతవరకు అదే గదిని వదలకుండా ఉన్నది. ఆమె ప్రతిజ్ఞ అంత దృఢమైనది. భరతుడు “వదినా! ఇదిగో ఇతడు హనుమంతుడు” అని పరిచయం చేశాడు. “నాయనా! ఎక్కడినుండి వచ్చావు?” అని ఊర్మిళ ప్రశ్నించగా, “అమ్మా! రామరావణయుద్ధంలో నీ భర్తయైన లక్ష్మణుడు మూర్ఛిల్లినాడు. ‘లక్ష్మణా! నీవు లేని బ్రతుకు నాకెందుకు?’ అని రాముడు పరితపిస్తున్నాడు. లక్ష్మణుణ్ణి బ్రతికించే నిమిత్తం నేను సంజీవనిమూలికను తీసుకువెళుతున్నాను” అన్నాడు. **ఆ మాటలకు ఊర్మిళ పక్కున నవ్వింది. “హనుమాన్! నీకు కూడా ఇంతమాత్రం తెలియదా? లక్ష్మణుని ఉచ్ఛ్వాసనిశ్వాసములందు కూడా రామనామం నిండియున్నది. అలాంటివానికి ఎట్టి ప్రమాదమూ జరగడానికి వీల్లేదు” అని పలికింది.**

ప్రేమస్వరూపులారా! **సుమిత్ర, ఊర్మిళల యొక్క భక్తి ప్రపత్తులను గురించి రామాయణం ఎక్కడా వర్ణించలేదు. ధర్మమూర్తియైన మాతృమూర్తి సుమిత్ర. ప్రేమమూర్తియైన సతి ఊర్మిళ. ఈ ఇరువురూ జగత్తుకు ఎంతో గొప్ప ఆదర్శాన్ని అందించారు. మీరుకూడా ‘సుమిత్ర’లు కావాలి. సుపుత్రులు కావాలి. అదియే ఈనాడు దేశం కోరుతున్నది.** భారతదేశంలో రామచరిత్రను వినని వారుండరు. కొన్ని వేల సంవత్సరములు గడచి పోయినప్పటికీ ఈనాటికీ రామాయణం నిత్యనూతనంగా ప్రకాశిస్తోంది. **నిరంతరం రామనామాన్ని స్మరించేవారికి, రామరూపాన్ని దర్శించే వారికి పునర్జన్మ ఉండదు.**

రాముణ్ణి వీడి తాను క్షణమైనా ఉండలేనని సీత అరణ్యానికి బయలుదేరింది. **లక్ష్మణుని భార్య ఊర్మిళ. సుమిత్రవలె ఈమె పేరు కూడా రామాయణంలో ఎక్కువగా కనిపించదు. సుమిత్ర, ఊర్మిళ ఇరువురూ త్యాగమయమైన జీవితాన్ని గడిపిన వ్యక్తులు, ఆదర్శప్రాయులు.** లక్ష్మణుడు సీతారాముల వెంట తాను అరణ్యానికి వెళుతున్నానని చెప్పినప్పుడు ఊర్మిళ ఏమాత్రం విచారించలేదు. తన భర్త పధ్నాల్గు సంవత్సరాలపాటు తనను విడిచి అరణ్యానికి వెళుతున్నాడంటే, ఏ భార్యయైనా ఊరుకుంటుందా? ఎన్ని ప్రశ్నలో వేస్తుంది. “అతని వెంట నీవు వెళ్ళవలసిన అవసరమేముంది? నీవు వెళ్ళాలనే నిబంధన ఏమీ లేదు కదా! కనుక, నీవు వెళ్ళనక్కర్లేదు” అని వాదిస్తుంది. కాని, ఊర్మిళ ఏమాత్రం అడ్డుచెప్పలేదు. **“నాథా! సీతారాములను సేవించే భాగ్యం నీకు మాత్రమే లభించింది. నీవు చాలా అదృష్టవంతుడవు. ఇంక క్షణమైనా ఆలస్యం చేయకుండా బయలుదేరు.”** అని చెప్పింది. “ఊర్మిళా! ఇంక పధ్నాల్గు సంవత్సరాలపాటు నీవు సీతారాములను దర్శించడానికి వీలుకాదు కదా! కనుక, నీవు ఒక్కసారి వెళ్ళి సీతామాతను దర్శించుకొనిరా” అని చెప్పాడు లక్ష్మణుడు. కాని, ఊర్మిళ అక్కడినుండి కదల్లేదు. “నాథా! నీవు సీతారాములవెంట వెళ్ళడానికి నావలన ఏమైనా అభ్యంతరం కలుగవచ్చు. కనుక, ఆలస్యం చేయక తక్షణమే బయలుదేరు. వారి సేవలో పాల్గొను. నీ పవిత్రసేవలకు అడ్డురాకుండా ఉండే నిమిత్తం నేనిక్కడే ఉంటాను.” అన్నది. లక్ష్మణుడు పట్టలేని ఆనందాన్ని పొందాడు. లోకంలో ఇంతటి త్యాగభావం కల్గిన పత్నులు కూడా ఉంటారా, అని ఆశ్చర్యపోయాడు.

యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు హనుమంతుడు సంజీవని మూలికయున్న పర్వతాన్ని పెకలించి పట్టుకొని ఆకాశమార్గాన నందిగ్రామం మీదుగా వెళుతున్నాడు. భరతుడు అతనిని చూసి ఎవరో రాక్షసుడని భావించి అంబులు ప్రయోగించాడు. హనుమంతుడు పర్వతంతో పాటు క్రింద పడ్డాడు. భరతునికి నమస్కరించి, యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినాడని, అతనిని పునర్జీవితుణ్ణి గావించే నిమిత్తం తాను సంజీవనిమూలికను తీసికొని వెళుతున్నానని చెప్పాడు. **లక్ష్మణుడు మూర్ఛిల్లిన వార్త**

విని కౌసల్య దుఃఖించింది. కాని, సుమిత్ర ఏమాత్రం బాధపడలేదు. "నా కుమారుడు రామసేవ నిమిత్తం వెళ్ళినాడు. కనుక, అతనికి ఎట్టి ఆపదా సంభవించదు" అన్నది. దుఃఖంలో మునిగియున్న కౌసల్యకు ధైర్యం చెప్తూ "అక్కా! నీవు విచారించవలసిన విషయం కాదిది. రామునికి ఎలాంటి ఆపదా సంభవించదు. **రామునికి సహాయంగా లక్ష్మణుడున్నాడు కదా! ఒకవేళ లక్ష్మణుడు శాశ్వతంగా కన్నుమూస్తే నా రెండవ కుమారుడై శత్రుఘ్నుణ్ణి రామసేవకై పంపుతాను" అన్నది. ఏ తల్లియైనా ఇంతటి త్యాగానికి పూనుకోగలదా?**

హనుమంతుడు ఊర్మిళతో "అమ్మా! రాముడు లక్ష్మణుణ్ణి తన రెండవ శరీరంగా, తన రెండవ ప్రాణంగా భావిస్తాడు. అలాంటి లక్ష్మణుడు మూర్ఛిల్లడంచేత రాముడు చాలా దుఃఖిస్తున్నాడు" అని చెప్పాడు. అప్పుడు ఊర్మిళ పక్కున నవ్వి, "హనుమంతా! శ్రీరామునియొక్క స్వభావమును ఈ జగత్తులో ఎవ్వరూ గుర్తించలేరు. రాముడు సాక్షాత్తు పరమాత్ముడు. అతను విచారించవలసిన అవసరం లేదు. ఇదంతా కేవలం అతని లీలానాటకమే. ఇంక నా పతియైన లక్ష్మణుని విషయానికి వస్తే, అతని శరీరంలో అణువణువులోనూ, కణకణములోనూ రామనామమే నిండి యున్నది. కనుక, అతనికెట్టి ప్రమాదమూ జరగడానికి వీల్లేదు. నిజానికి అది మూర్ఛ కాదు. తాను హాయిగా, ప్రశాంతంగా నిద్రిస్తున్నాడు" అన్నది. ఇంక క్షణమైనా ఆలస్యం చేయక హనుమంతుణ్ణి బయలుదేరమని చెప్పింది. **"నేను జనకమహారాజు కుమార్తెను, దశరథ మహారాజు కోడల్ని, లక్ష్మణుని భార్యను. కనుక, నాకు ఎలాంటి భయమూ లేదు. నా భర్తకు ఎట్టి ఆపదా సంభవించదు" అన్నది.**

ఊర్మిళ స్వభావం నిర్మలమైనది, నిత్యశుద్ధమైనది, నిస్వార్థమైనది. కాని, ఆమె గొప్పతనాన్ని ఈనాటివరకు భారతీయులే గుర్తించుకోలేదు. సుమిత్రగురించి కూడా భారతీయులకు తెలియదు. ప్రజలు సీతారాములను మాత్రమే గొప్పగా వర్ణిస్తారుగాని, లక్ష్మణశత్రుఘ్నులు చేసిన సేవలను గురించి, వారి పత్నుల ఆదర్శం గురించి ఎవ్వరూ చెప్పుకోరు. **కేవలం సీతారాములను స్మరిస్తే సరిపోదు; రాముని సోదరులు, వారి పత్నులు అందించిన ఆదర్శాలనుకూడా మనం స్మరించాలి. దశరథుని పుత్రులు నల్గురూ నాల్గు వేదముల వంటివారు. ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణవేదములే రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల రూపాలను ధరించి దశరథ మహారాజు ఇంట్లో ఆడుకున్నాయని వసిష్ఠులవారు వర్ణించారు.**

ముఖ్యంగా మీరు గుర్తించవలసిందేమిటంటే, **భగవంతునికి ఎట్టి ఆపదలూ సంభవించవు. లోకానికి ఆదర్శమును అందించే నిమిత్తం తాను ఈవిధమైన నాటకమాడుతుంటాడు. ఎవరి హృదయం పవిత్రంగా ఉంటుందో అట్టి మహనీయులకు మాత్రమే ఈ సత్యాన్ని గుర్తించడానికి వీలౌతుంది. లక్ష్మణునియొక్క పవిత్ర చిత్తమును ఒక్క ఊర్మిళ మాత్రమే కనిపెట్టగల్గింది. సుమిత్ర తల్లి కాబట్టి తన కుమారుల తత్త్వమును అర్థం చేసుకోగల్గింది.** సుమిత్రవంటి పవిత్రమైన మాతృమూర్తులు ఈనాడు ప్రపంచానికి అత్యవసరం. రామాయణము నందు తెలుపనటువంటి విషయాలు ఇంకా ఎన్నో చిత్రవిచిత్రమైనవి ఉన్నాయి. వాటినన్నింటినీ మీరు గుర్తించి వర్తించాలి.

ఊర్మిళ జనకమహారాజు యొక్క స్వంతబిడ్డ. సీత భూమిని దున్నేటప్పుడు దొరికిన బిడ్డ. ఆమె శక్తిస్వరూపిణి. సీత భూజాత కాబట్టి ఆమెలో నూటికి నూరుశాతం Magnetic Power **(ఆకర్షణశక్తి) ఉన్నది. రాముడు పరమాత్మ కాబట్టి, అతనిలోకూడా ఆకర్షణశక్తి పరిపూర్ణంగా ఉన్నది. కనుకనే, జనకుడు సీతను రామునికిచ్చాడు. ఊర్మిళను లక్ష్మణునికిచ్చాడు. లక్ష్మణుడెవరు? ప్రపంచాన్నే మోసే ఆదిశేషుడు. ఊర్మిళ గొప్ప గుణవంతురాలు.** ఈనాడు ప్రజలు కైక పేరు, మంథర పేరు జ్ఞాపకం పెట్టుకుంటారు గాని, ఊర్మిళ పేరును ఎవ్వరూ జ్ఞాపకం పెట్టుకోరు. ఊర్మిళ స్వభావం చాలా సున్నితమైనది. పతి అరణ్యానికి వెళ్ళే సమయంలో తాను ఏ గదిలో ఉన్నదో అతను తిరిగి

కస్తూరి (కస్తూరి రంగనాధశర్మ)

వచ్చేంతవరకు **ఆ గదిలోనే ఉంది. "నాథా! నీవు పధ్నాల్గు సంవత్సరాల తరువాత తిరిగి వచ్చేంతవరకు నేనిక్కడే ఉంటాను" అని చెప్పింది. ఆమె చిత్రకళ యందు ప్రవీణురాలు. తన సమయాన్నంతా చిత్రకళకే వినియోగించింది.** దృశ్యకల్పితమైన జగత్తుపై ఆమె ఎలాంటి కోరికలూ పెట్టుకోలేదు. నేను చెప్పవచ్చునుగాని, అందరూ అర్థం చేసుకోలేరు. **సీత పట్టాభిషేకంకోసం పసుపుపచ్చని చీర కట్టుకున్నది. ఆ చీరతోనే అరణ్యంలో పధ్నాల్గు సంవత్సరాలున్నది. ఊర్మిళ కూడా అంతే. లక్ష్మణుడు తనను వదలిపెట్టి వెళ్ళే సమయంలో ఏ చీర ధరించిందో పధ్నాల్గు సంవత్సరాల తరువాత అతను తిరిగి వచ్చేంతవరకు అదే చీరతో ఉన్నది. దేహభ్రాంతి లేనటువంటివారు జనకుని బిడ్డలు. జనకుడు దేహాభిమానం లేనటువంటివాడు కనుకనే, అతనికి వైదేహిరాజు అని పేరు వచ్చింది.**

(స.సా.మే. 2002 పు. 144/153)

కస్తూరి (కస్తూరి రంగనాధశర్మ)

'బ్రాహ్మణులు నిధి వలెకాపాడిన సంస్కృత భాషను ఈ కస్తూరి బ్రాహ్మణుడై ఉండి కూడా నేర్చుకోలేక ఎ, బి, సి, డిలలో ప్రవేశించి ఎంతో విలువైన అవకాశాన్ని పోగొట్టుకున్నాడు.'

'పాపం! ఆంగ్ల భాషావ్యామోహంలో పడి కస్తూరి ప్రాచీన భాష అయిన సంస్కృతంలో అధికారం లేకుండా చేసుకున్నాడు' (పుట్టపర్తిలో నేను సంస్కృతం పట్టుదలగా నేర్చుకొని రోజూ జరిగే పూజా కార్యక్రమాలలో నమకం, చమకం చదవటంలో పాలు పంచుకోగలిగాను).

"తరువాత యూనివర్శిటీ ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాక వచ్చేసి నా దగ్గరే ఉందువుగాని. నువ్వు నా జీవిత చరిత్ర వ్రాయాలి! నువ్వే! వివరాల కోసం నా తల్లిదండ్రులను, సోదరులను, బంధువులను, స్నేహితులను, ఇరుగుపొరుగు వారిని గురువులను, యింకా ఎవరెవరిని కలుసుకోవాలో నేను చెపుతాను. నేను కూడా సహాయం చేస్తాను".

"బాబా గబగబ నా దగ్గరకు వచ్చి నా భుజంపై చేయి వేస్తూ ఇంక నీకు పుట్టపర్తిలో యిపుడు కావలసినంత పని ఉంది. ఒక మాస పత్రిక త్వరలో ప్రారంభించబడబోతుంది. **సంకల్పించిన పేరు 'సనాతన సారథి'" అన్నారు.**

(శ్రీ. స. ప్రే. ప్ర. పు. 15, 17, 68, 69, 218)

ఒక పర్యాయం నేను ఉన్నట్లుండి దేహాన్ని వదలి పెట్టాను. ఆ సమయంలో కస్తూరి, లోకనాథం, సూరయ్యలు అక్కడే ఉన్నారు. వాళ్ళు ముగ్గురూ చాలా గొప్ప భక్తులు, పరిపూర్ణమైన విశ్వాసంతో ఉండేవారు. నేను పరుండేంత వరకు అక్కడే కూర్చునేవారు. "ఏమిటిది, బాబా దేహాన్ని వదలిపెట్టి వెళ్ళారే!" అని కన్నీరు కార్చుతున్నారు. లోకనాథం స్వామి పాదాలపై పడి ఒకటే ఏడుపు. అయితే, కస్తూరికి కొంచెం తెలుసు. "ఏడ్వకండి. దీనికి మనం ఆనందించాలి. ఎక్కడ ఏ భక్తులు ఏడ్చినారో ఏమో! వారి బాధను నివారించడానికి స్వామి వెళ్ళారు" అంటూ వారికి ధైర్యం చెప్పాడు. రెండు గంటల తరువాత నేను తిరిగి దేహంలో ప్రవేశించాను. అప్పుడు కస్తూరి "స్వామీ! **మీరు భక్తరక్షణ చేయవద్దని నేను చెప్పను. పరమ భక్తులను రక్షించడానికి మీరు వెళ్ళేటప్పుడు వద్దని చెప్పటానికి మాకు అధికారం లేదు. కాని దేహాన్ని మాత్రం వదలిపెట్టి వెళ్ళకండి. మీరిక్కడే ఉంటూ అక్కడ భక్తులను రక్షించవచ్చు కదా!" అని ప్రాధేయపడ్డాడు.** ఇలాంటి చిత్రవిచిత్రమైనవి ఎన్నో జరుగుతుంటాయి.

(స.సా.జూ. 2002 పు. 185)

(చూ॥ విరాట్ పురుషుని విశ్వరూపము, సత్యం శివం సుందరం)

కృతజ్ఞత

(చూ॥ ఉపకారము)

కొండమరాజు (తండ్రి)

(చూ॥ తల్లి తండ్రులు)

కైకేయి

(చూ॥ సుమిత్ర)

కౌసల్య

(చూ॥ సుమిత్ర)

గడ్డి

(చూ॥ ఈశ్వరాంబ)

గుణములు

(చూ॥ ఉపకారము, సమత్వము)

ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి - ఋషి*

యుగయుగాలనుండి, తరతరాలనుండి కోటానుకోట్ల కంఠాలతో కీర్తించబడిన భారతీయ సంస్కృతి అందులోని వేదప్రమాణము కాలప్రభావంచేత, మానవుని మనఃప్రభావం చేత దినదినము తరిగిపోవుచున్నది.

ఈనాడు వేద, వేదాంత శాస్త్రార్థములను చక్కగా సామాన్య ప్రజలకు అర్థమగునట్లు బోధించువ్యక్తులు కరువై పోయినారు. ఈనాడు వేదములను సముద్ధరించలేక పోయిన యడల, భవిష్యత్తులో భారతదేశ స్థితిగతులు ఏ విధంగా మారునోకదా!

వేద ప్రమాణములు నశించిన, భారతీయ కీర్తియే నశించిపోవును. భారతీయ ప్రాణముఃప్రమాణము వేదములపైనే ఆధారపడియున్నవి. కనుక, తిరిగి వేదములను పునరుద్ధరించునిమిత్తము సత్యసాయి సంస్థలు అనేక విధములయిన ప్రయత్నములకు సంసిద్ధమైయున్నవి.

ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి శతవర్షములు జీవించిన వేదపండు, వేద, వేదాంత వేదార్థములను గుర్తించిన మహాపండితుడు. విజయనగర సంస్థానమందు తన పాండిత్యమును ప్రకటించి గొప్ప కీర్తి సాధించినటు వంటివాడు. ఆంధ్రదేశములో సాటిలేని మేటి.

అతడు కేవలం వేదప్రమాణములతోనే కాక, భక్తి ప్రపత్తులయందుకూడ తనజీవితమును పూర్ణము గావించిన వ్యక్తి. అతనికి స్వామిపై మక్కువ ఎక్కువ. అతని విశ్వాసమెట్టిదనగా, సర్వవేదసారమును గుర్తించి మహాపండితుడయి సత్యసాయి సర్వదేవతా స్వరూపుడనే సత్యాన్ని గుర్తించి తన అంత్య జీవితమును స్వామి సన్నిధియందే గడుపుతూ వచ్చాడు. ప్రశాంతినిలయంలో "శతవర్షములు" నింపుకున్నాడు.

అతని జ్ఞాపకార్థం వేదశాస్త్ర అభివృద్ధి నిమిత్తమై శ్రీ సత్యసాయి ఘండికోట సుబ్రహ్మణ్యశాస్త్రి వేదశాస్త్ర పరిషత్‌ను నేడు ప్రారంభించుచున్నాను.

అతడు ఎంతకాలమైనప్పటికి అమరుడనే చెప్పవచ్చును. అనంతమైన, అమృతమైన హృదయము కలవాడు కనుక అమరత్వాని కతనికి అధికారమున్నది.

అందుచే అతని ఆదర్శాలను, సద్గుణములను వేదార్థములను విరివిగా చాటవలయును. వేదప్రమాణములను ప్రధాన ఆధారముగ భారతీయులు అనుసరించి, వేదసంస్కృతిని పునరుద్ధరింపజేసిన, తిరిగి మన భారతదేశం ప్రాచీన వైభవంతో రూపొందునని ఆశిస్తూ ఆశీర్వదించుచున్నాను."

(శ్రీసత్యసాయి అవతార వైభవము పు. iv/vi)

(★ఋషి ముఖతః సాయి గాయత్రీ మంత్రం వెలువడింది)

చైతన్యము

"సమస్తమూ చైతన్యమే. అంతా దైవమే" "ఈశావాస్య మిదం సర్వం" ఈ చరాచరసృష్టి అంతా దైవస్వరూపమే.

దుర్లభమైన మానవజన్మ ఎత్తిన నీకు నీవు కూర్చున్న ఈ మెట్లకు "Body consciousness" (దేహాభిమానం)లో తేడా వచ్చింది. నీవు కూర్చున్న మెట్లలో కూడా చైతన్యముంది. ఆ మెట్టును నీవు చేతితో గట్టిగా కొట్టినావనుకో, నీకు నొప్పి కల్గింది కదా! అనగా, అది కూడా తిరిని నిన్ను కొట్టిందన్నమాట. దానిలో ఆ శక్తి ఉన్నది. అదే చైతన్యము.

(స.సా.మే. 2002 పు. 156)

జనన మరణాలు

(చూ॥ తల్లి తండ్రులు)

జన్మ

(చూ॥ తల్లి తండ్రులు)

జీవిత చరిత్ర

(చూ॥ కస్తూరి, సత్యం శివం సుందరం)

డాక్టర్లు

(చూ॥ ఈశ్వరాంబ)

తల్లి తండ్రులు

దూషణభూషణాలకు, తిరస్కారపురస్కారములకు వీమాత్రం లొంగకండి. ప్రేమ తత్వాన్ని మాత్రం వదలకుండా చూచుకోండి. ఇదే ఈశ్వరాంబ చెప్పింది. ఆమె ఒకసారి వేసవి తరగతులకు వచ్చింది. గోగినేని వారింటికి నడచి వెళ్ళింది. తిరిగివచ్చింది. కాఫీ త్రాగి కూర్చొంది **"ఏం స్వామి! ఈనాడు వేసవి తరగతుల క్లాసులు ఇంకా జరగటం లేదే?** అన్నది. టైం ప్రకారం జరుగుతాయని చెప్పాను కూర్చుంది. **'స్వామి! స్వామీ! స్వామీ'** అని మూడు సార్లు కేకవేసింది". **"వస్తున్నాను వస్తున్నాను... వస్తున్నాను"** అని మూడు సార్లు సమాధానం చెప్పాను. "రండి త్వరగా ... రండి త్వరగా ఇలగా రండి త్వరగా.." అన్నది వచ్చాను. చేయి పట్టుకుంది. **"మీరు ఈ ప్రపంచానికి ఎంతైనా మంచి చేయగలరు. పెద్దలకంటే పిల్లలకు చేయాలి. మొదట విద్యార్థులను మార్చాలి. విద్యావంతులుగా కాదు, గుణవంతులుగా మార్చాలి" అని చెప్పి నా రెండు చేతులను తీసుకొని తన కండ్ల దగ్గర పెట్టుకుంది. ప్రాణం విడిచింది.**

'దేహాలు వస్తుంటాయి. పోతుంటాయి విచారించ నక్కరలేదు' అని చెప్పి వ్యాన్ తెప్పించాను. దానిలో ఆమె మృతశరీరాన్ని పెట్టించి, ప్రశాంతి నిలయం తీసుకొని పొమ్మనమని చెప్పాను. **వెంట రామబ్రహ్మమును పంపించాను. రామబ్రహ్మం చాలా మంచివాడు. ఏపని అయినా సరే శ్రద్ధతో పనిచేసేవాడు. కాబట్టి అతనిని పంపించాను.** మరునాడు గోకాక్, భగవంతములు వచ్చారు. వేసవి తరగతులు లేవని ప్రకటించారు. ఎందుకు క్లాసులు లేవన్నారు? అని అడిగాను. తల్లిగారు పరమపదించారు గదా! అన్నారు. మరణించుతే మరణించవచ్చు. క్లాసులు ఎందుకు రద్దు చేయాలి? అన్నాను. గోకాక్ ఆశ్చర్యపోయాడు. **నన్ను కాదనలేక క్లాసులు జరుగుతాయని మరల ప్రకటించాడు. క్లాసులు యథా ప్రకారం ప్రారంభమైనాయి.** ప్రతి దినం క్లాసుకు మొదట నేను వెళ్ళాలి కదా! 'స్వామి వస్తారో, రారో అని పిల్లలు భయపడుతున్నారు. యథా ప్రకారం నేను వెళ్ళాను. వెళ్ళేటప్పటికి పిల్లలంతా కంటి ధారలు కార్చారు. **'పుట్టినవారు చావక తప్పదు. చచ్చినవారు పుట్టక తప్పదు'** అని చెప్పి క్లాసులు జరిపించాను. ఆ విధంగా ప్రతిదానికి నేను తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగటం చేతనే నా కీర్తి గౌరవాలు పెరుగుతూ వచ్చాయి. సామాన్యులు అయితే భయపడుతారు. నేను ఆ విధంగా ప్రవర్తించలేదు. **రామబ్రహ్మం వెళ్ళేటప్పుడు తమరు వస్తే బాగుంటుంది గదా! అన్నాడు. అప్పుడు నేను "ఇవన్నీ ప్రాపంచిక సంబంధమైన విషయాలు. నాకు ఏ సంబంధమూ లేదు.** అందులో నేను యిక్కడనే చూచాను గదా! ఇక్కడనే నేను ఆశీర్వదించాను. నేను చెప్పినట్లు చేయి" అన్నాను. అదే విధంగా చేశాడు రామబ్రహ్మం. **ఆమెది కూడా సునాయాసమైన మరణం. ఇంకా ఏం కావాలి? ఆమె భర్త, అనగా ఈ శరీరానికి తండ్రిది కూడా సునాయాస మరణమే.** ఒకసారి ప్రశాంతి నిలయంలో భక్తులతో మాట్లాడు తుండగా ఆయన నా వద్దకు వచ్చాడు. ఎందుకు వచ్చావు? అని అడిగాను. స్వామీ! రెండు మాటలు చెప్పాలన్నాడు. "అయితే కూర్చో! వీళ్ళను చూచి తరువాత, నీతో మాట్లాడుతాను" అన్నాను. **నాకు వీరు నా వారు, వారు**

పరాయివారు అనే భేదమే లేదు. అందరూ సమానమే. ఆ భక్తులతో మాట్లాడి ప్రసాదం యిచ్చి పంపించాను. ఆ తరువాత ఆయనను లోపలికి పిలిచి "ఎందుకు వచ్చావు?" అని అడిగాను. అప్పుడు ఆయన బొడ్డులో దాచుకొనిన వందరూపాయిల నోటును తీసి నాకిస్తూ "నేను బీదవాడను. నాకు మరేవిధమైన ఆదాయంలేదు. **ఈ డబ్బు తీసుకొని, నా పన్నెండవ దినమున, నా సమారాధన చక్కగా జరిపించండి" అన్నాడు. ఇంటికి వెళ్ళాడు. ఇంతలో జానకిరామయ్య కొడుకు రత్నాకర్! చిన్న పిల్లవాడు. తాతా! తాతా! అంటూ దగ్గరకు వచ్చాడు.** పడుకొని, తన రొమ్ముల మీద ఆ పసిపిల్లవాడ్ని కూర్చోపెట్టుకున్నాడు. నేనిప్పుడే స్వామిని చూచి వచ్చాను, నాకు ఏ శ్రమా లేదు. బాధలు అంతకన్నా లేవని చెప్పాడు. తన భార్యను పిలిచాడు. నీళ్ళు తీసుకొని రమ్మన్నాడు. నీరు తీసుకొని వచ్చింది. ఆ నీటిని త్రాగించమని చెప్పాడు. ఆమె ఆ నీరును త్రాగిస్తూ ఉన్నది. కన్నుమూశాడు. **మంచివారికి ఇలాంటి మరణాలే వస్తుంటాయి. ఆయనది కూడా సునాయాస మరణమే. జన్మలు మారినప్పటికీ దాని శేషం వుంటూనే ఉంటుంది.** ఫాన్ స్పీడ్‌గా తిరుగుతున్నప్పుడు స్విచ్ ఆపివేసినా మరికొంత సేపు ఫాన్ తిరుగుతూ తిరుగుతూ నిదానంగా ఆగిపోతుంది. తక్షణమే ఆగదు. అదేరీతిగా **జన్మ సార్థకానికి, జన్మ జన్మలూ తీసుకుంటారు. జననమరణాల తత్వాన్ని కూడా అర్థం చేసుకోవాలి. ఏ గర్భమున ఎవరు ఎప్పుడు జన్మించాలో సాధారణంగా ఎంపిక చేసే దివ్యశక్తి వేరొకటి ఉంటుంది. కాని నా జన్మను నేనే ఎంపిక చేసుకున్నాను. నా సెలక్షన్ కరెక్ట్‌గానే ఉంటుంది. అందువలననే వారు వారి జీవితాలను చాలా ఆనందంగా గడిపారు. కనుక ప్రతిమానవుడు కూడనూ అలాంటి తల్లి దండ్రులను కలిగి ఉండాలి.** అలాంటి తల్లిదండ్రులకు తగిన సేవలు మీరు చేయాలి. ఆ సేవలలోనే ఉంటుంది ముక్తి. **"న తపాంసి న తీర్థానాం న శాస్త్రానాం జపానహీ సంసార సాగరో ద్ధారే సజ్జనం సేవనం వినా" తపస్సు చేయనవసరం లేదు. యోగం చేయనక్కర లేదు. ధ్యానం చేయనవసరం లేదు. యజ్ఞయాగాదులు చేయనక్కరలేదు. 'నామస్మరణ' ఒక్కటే చాలు. అప్పుడే అందరికీ పవిత్రమైన మరణం కలుగుతుంది.**

ప్రేమస్వరూపులారా!

మన భవిష్యత్తును మనం ఈనాడే నిర్ణయం చేసుకోవాలి. మంచి భావంతో బ్రతకాలి. పరోపకారం చేయాలి. పిల్లల్ని ప్రేమించాలి. పెద్దలను గౌరవించాలి. ఆ గుణాలను పెంచుకుంటే చాలు. ఇంతకన్నా వేరొకటి చేయనవసరం లేదు. భజనలు... భజనలు.. భజనలు చేస్తున్నారు. భజనలే ముఖ్యంకాదు. మన ప్రవర్తన చాలా ముఖ్యం. దీనిని మీ హృదయాలలో వుంచుకొని, **తల్లిదండ్రులకు ఆనందాన్ని అందించండి. అప్పుడే మీ జన్మ సార్థకమవుతుంది.**

(శ్రీ. జూ. 2002 పు. 10/12)

దశరథుడు

(చూ॥ రాముని ఆశయము)

దివ్య ప్రకటనలు

(ఇండియా వచ్చిన కొద్ది వారాలకే బాబా ఆర్నాల్డ్ షూమన్‌కు యిచ్చిన మొట్టమొదటి ఇంటర్వ్యూలో యిలా అన్నారు)

మీకు అర్థం కాదు! నిన్ను నేను కోరుకున్నాను. అందుకే నిన్ను పుస్తకం వ్రాయమన్నాను. అర్థమయిందా? పుస్తకాలు కేవలం ప్రచారం కోసం. **నాకు కావలసింది ప్రచారం కాదు. నాకు కావలసింది మీరు. నాకు మీ విశ్వాసం కావాలి. మీ ప్రేమకావాలి. ఇక్కడకు వచ్చిన వాళ్ళంతా తామేదో పథకం ప్రకారం ఏర్పాట్లు చేసుకుని ఇక్కడకు వచ్చామని అనుకుంటూ ఉంటారు. కాని ఇది కేవలం నా ఏర్పాటు మాత్రమే. సమయం ఆసన్నమైనప్పుడు, వారు నాకు దగ్గరవటానికి సిద్ధంగా ఉన్నప్పుడు, వారిని నేను పిలిపించుకున్నప్పుడు మాత్రమే వారు నా దగ్గరకు రాగలరు. నా సంకల్పం లేకుండా మరొకలాగా యింకెవ్వరూ నా దగ్గరకు రాలేరు. నాకు మీ ఆత్మకావాలి. ఎందుకంటే యింక నువ్వు చంచలత్వాన్ని వదలి పెట్టవలసిన సమయం ఆసన్నమైంది.**

(శ్రీ.స.ప్రే.స్ర.పు. 69)

దూపాటి తిరుమలాచారి

(చూ॥ సత్యం శివం సుందరం)

దూషణభూషణలు

(చూ॥ తల్లితండ్రులు)

దేహాభిమానము

(చూ॥ ఊర్మిళ, నరకము)

నరకము

నరకమంటే దేహాభిమానమే. దేహాభిమానమే దైవ విముఖత్వము యొక్క వేరొక రూపము.

(శ్రీ.స.సూ. పు. 107)

నా ప్రతిజ్ఞ

(చూ॥ ఉపకారము)

నామస్మరణ

(చూ॥ తల్లి తండ్రులు, పుట్టపర్తి)

నాయకుడు

(చూ॥ ఈశ్వరాంబ)

నేనెవరు

"చూడండి. మీరు ఎదుటివ్యక్తిని 'నీవెవరు?' అని ప్రశ్నిస్తున్నారేగాని, 'నేనెవరు?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోవడం లేదు. **"నేను" ఎవరో తెలిస్తే మీకంతా తెలిసిపోతుంది.** "నీవెవరు?" అని అడిగినప్పుడు "నేను అనిల్‌కుమార్‌ను, గుంటూరు వాడిని, ప్రొఫెసర్‌ను" అని నీ పేరును, నీ ప్రాంతమును, నీ వృత్తిని గురించి చెబుతావు. ఇది సరియైన జవాబు కాదు. **'నేను నేనే' అన్నదే సరియైన సమాధానం. ఈ 'నేను' అనేదానిని నీవు తెలుసుకుంటే ప్రతి ఒక్కరిలో ఉన్న 'నేను' నీకు తెలిసిపోతుంది.** ఒకటి ప్రక్కన సున్నలు పెట్టే కొలదీ ఆ సున్నలకు కూడా విలువ పెరుగుతుంది. ఆ ఒకటియే 'నేను'. దానిని తెలుసుకోవాలి. నీవు ఎంత తెలుసుకున్నప్పటికీ నీవెవరో నీకు తెలియక పోతే ఏమి ప్రయోజనం?"

(స.సా.మే 2002 పు. 158)

పిలుపు

(చూ॥ సంకల్పము)

పుట్టపర్తి

ప్రవహించు నేపురి పరిధిగా పాయలై
చిత్రావతీనది విచిత్రగతులు
క్రాలు నేపట్టణ కల్యాణకరముగా
చుట్టును మేలైన చూతతరులు
కాపుండు నేపురి కడల నాల్గిటి యందు
పార్వతీశ్వరులెప్డు బాయకుండ
కొలువుండు నేపురి విలసితంబగు మధ్య
మహిమాన్వితుండైన మాధవుండు
మండలావని గణుతించు మెండు మహిమ
చిక్కవడియరు కట్టిన చెఱువుతోడ
బుక్కరాయల చిరకీర్తి భువనమెంచ
పాసగ చాటు నేపురము ఆ పుట్టపురము

పుట్టపర్తి అంటే ఏమిటి అర్థము? పర్తి అనగా, ప్రకాశము. పుట్టినటువంటి ప్రకాశమే పుట్టపర్తి. పూర్వం దీనికి 'పుట్టపర్థిని' అని పేరు. ఎక్కడ చూసినా పుట్టలు పెరిగేవి. పాములు సంచరించేవి. దానివల్లనే ఆ పేరు వచ్చింది. రామాయణం రచించిన **వాల్మీకి** ఎక్కడివాడు? పుట్టలోనుండి పుట్టినటువంటివాడే. అతనిపైన పుట్టలు పెరిగాయి. పాములు సంచరించాయి. కనుక, పుట్టలనుండి పుట్టినటువంటిదే రామాయణం. **మీ హృదయమనే పుట్టలో దుర్గుణములు, దురాచారములు అనే పాములున్నాయి.**

అవన్నీ బయటపడిపోవాలంటే మీరు భగవన్నామస్మరణ చేయాలి. నాదస్వరం వినిపిస్తే పుట్టలోని పాములన్నీ బయటికి వచ్చినట్లుగా, మీరు నామస్మరణ చేస్తే మీ హృదయంలోని దుర్గుణాలన్నీ తొలగిపోతాయి.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతి రన్యథా

నామస్మరణ చాలా పవిత్రమైనది. ఈనాడు నామస్మరణ తగ్గిపోవడంచేతనే దేశంలో బాధలు పెరిగిపోతున్నాయి. వీధివీధియందు నామస్మరణ చేయండి. మీ శరీరంలోని అణువణువునూ, కణకణమునూ భగవన్నామంతో నింపుకోండి. నామస్మరణవలన కలిగే ఆనందము, ధైర్యసాహసాలు ఇంక దేనివల్లనూ లభించవు.

(స.సా. మే. 2002 పు. 154)

(చూ॥ సంకల్పము)

పునర్జన్మ

(చూ॥ ఊర్మిళ)

ప్రాచీన సంస్కృతి

(చూ॥ రాముని ఆదర్శము)

బల - అతిబల

(చూ॥ బింబము - ప్రతిబింబము)

బింబము - ప్రతిబింబము

"దశరథా! నీ పుత్రులు సామాన్యులు కారు. దైవ సంకల్పానుసారం నీకు లభించిన వరప్రసాదాలు, అగ్ని నుండి ఆవిర్భవించిన జ్ఞాన భాస్కరులు. వారికి ఎట్టి ఆపదలూ సంభవించవు. కనుక, నీవిచ్చిన మాట ప్రకారం రాముణ్ణి విశ్వామిత్రునివెంట పంపించు" అని వశిష్ఠుల వారు నచ్చచెప్పారు.

ఇక్కడ మీరొక ముఖ్య విషయాన్ని గుర్తించాలి. విశ్వామిత్రుడు రాముడొక్కడినే కోరాడు. రాముడు అతని వెంట బయలుదేరాడు. లక్ష్మణుణ్ణి తనవెంట రమ్మని పిలువలేదు. వెళ్ళవలసిందిగా తండ్రి ఆజ్ఞాపించలేదు, రమ్మని విశ్వామిత్రుడూ కోరలేదు. కాని, **బింబము వెంట ప్రతిబింబము వెళ్ళినట్లుగా రాముని వెంట లక్ష్మణుడు కూడా బయలుదేరాడు. ఎందుకంటే, అతడు రాముని అంశమందలి వాడు.** విశ్వామిత్రుడు అది దైవసంకల్పమని భావించాడు. తాను వెళ్ళేముందుగా దశరథునితో "దశరథా! **నాలో లేని శక్తులు లేవు.** కాని, నేను యజ్ఞదీక్షలో కూర్చున్నప్పుడు ఎలాంటి హింసకూ పూనుకోకూడదు, రాక్షసులనైనా చంపకూడదు. అది యజ్ఞదీక్షకు సంబంధించిన నియమం. అందుచేతనే రాముణ్ణి నావెంట పంపవలసిందిగా నిన్ను కోరాను" అన్నాడు.

ముగ్గురూ సరయూ తీరానికి చేరుకున్నారు. విశ్వామిత్రుడు "రామా, ఇటురా" అని పిలిచాడు. తాను రాముణ్ణి మాత్రమే పిలిచాడుగాని, లక్ష్మణుణ్ణి పిలువలేదు. అయినప్పటికీ **రామునితో పాటు లక్ష్మణుడు కూడా వెళ్ళి విశ్వామిత్రుని దగ్గర కూర్చున్నాడు.** అప్పుడు విశ్వామిత్రుడు "రామలక్ష్మణులారా! ఇది అరణ్యంలో జరిగే యజ్ఞము. నేనుండేది సిద్ధాశ్రమము. అక్కడ వంటావార్పు చేయడానికి వీలుకాదు. మీరు రాజపుత్రులు, రుచికరమైన భోజనమునకు సౌఖ్యవంతమైన జీవితమునకు అలవాటుపడిన వారు; ఇప్పుడు నావెంట యజ్ఞసంరక్షణకై వస్తున్నారు. అక్కడ మీరెన్ని దినములు ఉండవలసి వస్తుందో! మీకు నిద్ర రాకూడదు. కనుక, నేను మీకు **'బల', 'అతిబల' అనే మంత్రములనుపదేశిస్తాను. వాటి ప్రభావం చేత మీకు నిద్రరాదు, ఆకలి దప్పులుండవు."** అని పలికాడు. రామలక్ష్మణులకు ఆ మంత్రముల నుపదేశించాడు.

(స.సా.మే. 2002 పు. 139/140)

బుద్ధుడు

(చూ॥ భారతదేశము)

బొమ్మలాట

ప్రేమస్వరూపులారా! **సుఖముగాని, ఆనందము గాని మనకు ధనకనకవస్తు వాహనాదులవలన లభ్యం కాదు. వ్యక్తులవలన అనలే లభ్యం కాదు. ఆనందము హృదయముననుండియే ఆవిర్భవిస్తుంది.** కనుక, మీ దృష్టిని హృదయంవైపు మరల్చుకోండి. **"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః" అనే సత్యాన్ని గుర్తించండి. మానవుడు ఆనందపిపాసి.** అయితే, ఆనందాన్ని బయట వెతకనక్కర్లేదు. ఆనందం మన ఇంటనే, వెంటనే, జంటనే ఉన్నది. అంతర్దృష్టిని అభివృద్ధి పరచుకున్నప్పుడు ఆనందం మనం పిలువకనే ప్రత్యక్షమౌతుంది. మానవుడు భౌతికమైన సుఖాలకోసం ప్రాకులాడుతున్నాడు. ఏమిటీ సుఖాలు?

"మలినపు కొంప రోగముల మ్రగ్గెడు
సేవక గంప జాత సం
చలనము పొందు దుంప భవసాగర
మీదగలేని కంప అం
బులపొది లెమ్ము చూడ మనమెప్పు
దలంప దేహమింక ని
శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము
లాశ్రయింపవే!"

ఇలాంటి దేహంతో మనకు శాశ్వత సుఖం ఎలా లభిస్తుంది? **హరిపాదములే మనకు శాశ్వత సుఖాన్ని అందిస్తాయి.** హరిచింతనయే నిజమైన సుఖము. కాని, ఈనాడు భారతదేశంలో భక్తి ప్రపత్తులు సన్నగిల్లుతున్నాయి. భౌతికమైన, ప్రాకృతమైన విషయాలపై మనస్సు భ్రమిస్తున్నది. **ఏమిటీ భ్రమలు? ఏమిటీ సుఖాలు? ఇదంతా కేవలం బొమ్మలాటగా కనిపిస్తున్నది.**

ఈ లోకపు లీలానటన
ఒక **బొమ్మల ఆటయె** కాదా!
అతడొక రాజా, ఇతడొక కూలీ
కాదని ఎవరనినా అదేగా
అవునని ఎవరనిగా ఇదేగా
లోకములోని పోకడ చూడ
ఈ గతి కాదా బాగా తెలియ
లోకములోని చీకటి చూడ
ఈ గతి కాదా బాగా తెలియ..."

లోకంలో అంతా చీకటే. అదే అజ్ఞానం. ఇది కేవలం తమోగుణ ప్రభావమే. తమోగుణంలో జీవిస్తూ సాత్వికతత్వాన్ని గుర్తించాలంటే ఎలా సాధ్యమౌతుంది?

(స.సా.మే. 2002 పు. 151/152)

బ్రాహ్మణులు

(చూ॥ కస్తూరి)

భక్త రక్షణ

(చూ॥ కస్తూరి)

భగవన్నామ స్మరణ

(చూ॥ రామనామము)

భరతుడు

(చూ॥ ఊర్మిళ, సుమిత్ర)

భారతదేశము

అనాది కాలమునుండి మన భారతదేశం ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచినది. భారతదేశానికి ఉత్తరదిశన హిమాలయపర్వతములు ఎల్లలుగా ఉన్నవి. హిమము తెల్లనైనది, చల్లనైనది. కనుక, హిమాలయములు పవిత్రతకు, ప్రశాంతతకు చిహ్నములు. **భక్తిజ్ఞానవైరాగ్యములకు ప్రతీకలైన గంగాయమునాసరస్వతులు ఈ పవిత్రమైన భారత దేశమునందు ప్రవహిస్తున్నాయి. ఇంతియేకాదు. రామాయణ, భారత, భాగవతములనే పవిత్ర గ్రంథాలను లోకానికి అందించినదీ దేశం. ప్రపంచంలో సర్వవ్యాపకమైన ఏకత్వాన్ని ప్రబోధించే భగవద్గీత ఆవిర్భవించిన పుణ్య భూమి ఈ భరతభూమి. "అహింసా పరమో ధర్మః" అని ప్రబోధించిన బుద్ధుడు జన్మించిన పవిత్రభూమి ఇది.**

భారతదేశ చరిత్ర ఎంత గొప్పదో, ఎంత దివ్యమైనదో మీరు గుర్తించాలి. అనాది కాలము నుండి భారతదేశము **ఆధ్యాత్మికతత్త్వ ప్రచారంచేత అన్ని దేశములకూ శాంతిభద్రతలను అందిస్తూ వచ్చింది.**

ప్రేమస్వరూపులారా! **భారతదేశంలో పుట్టడమనేది ఎంతో గొప్ప అదృష్టం. భారతదేశంలో** జీవించడం మరింత గొప్ప అదృష్టం. కాని, భారతదేశంయొక్క గొప్పతనాన్ని భారతీయులే మరచిపోతున్నారు. "నేను భారతీయుడను" అని మీరు సగర్వంగా చాటుకోవాలి. ఇదే మీకున్న గొప్ప డిగ్రీ. భారతీయుడనే పదముయొక్క అంతరార్థమును మీరు గుర్తించి వర్తించాలి. భారతీయులారా! మీరు అదర్శవంతమైన జీవితాన్ని గడిపి ఆనందాన్ని అనుభవించి, ఆ ఆనందాన్ని అన్ని దేశములవారికీ అందించడానికి తగిన కృషి చేయాలి. **ప్రాచీన కాలమునుండి మానవతా విలువలను ఆచరించి, ప్రపంచానికి ఆదర్శాన్ని అందించిన మహనీయులెందరో మన భారత దేశంలో జన్మించారు.** ఆ మహనీయులయొక్క ఆదర్శాలను, వారి పవిత్రమైన చరిత్రలను మీరు మరువకూడదు. ఏదో పాతపురాణాలని వాటిని ప్రక్కన పెట్టకూడదు. వాటిలో ఉన్న మహత్తరమైన విషయాలు మీకు అంత సులభంగా అర్థం కావు. మీరెంతో కాలమునుండి రామాయణమును చదువుతున్నారు. కాని, సుమిత్రయొక్క సద్భావములను, ఊర్మిళయొక్క పవిత్రతను ఏమైనా అర్థం చేసుకోగలిగారా? లేదు.

రామాయణంలో నిగూఢమైన అంతరార్థములున్నాయి. కాని, భారతీయులు కూడా వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం లేదు. రామాయణమంతా చదివిన తరువాత ఒక వ్యక్తిని రాముని భార్య ఎవరని అడిగితే 'మిసెస్ రామ' అని చెప్పినాడట! అంతటి అజ్ఞానంలో మునిగి యున్నారు భారతీయులు; ఆధునిక నాగరికతపై మోజు పెంచుకొని ప్రాచీన చరిత్రను, సంస్కృతిని విస్మరిస్తున్నారు; తమ ప్రవర్తనచేత దేశంయొక్క పేరు ప్రఖ్యాతులను కూడా పాడుచేస్తున్నారు. **మనకున్నది ఒకే మిత్రుడు, అతడే భగవంతుడు. మనకున్నది ఒకే గ్రంథము. అదే భారతదేశచరిత్ర. దానినే మనం చదవాలి.** పిచ్చిపిచ్చి నవలలను చదివి మీ హృదయాన్ని పాడుచేసుకోవద్దు. హృదయాన్ని పరిశుద్ధం గావించుకున్న వ్యక్తికే పవిత్రమైన భావములు కల్గుతాయి.

ప్రేమస్వరూపులారా! ఈ నూతన సంవత్సరం నుండి మీరు పవిత్రమైన రామచరిత్రలో ఉన్న ఆదర్శప్రాయులైన స్త్రీపురుషుల సద్గుణాలను మీ హృదయంలో నిల్పుకొని, వారి అడుగుజాడలలో నడవడానికి ప్రయత్నించండి. భారతదేశంయొక్క పవిత్రతను ప్రపంచానికి చాటిచెప్పండి. **భారత దేశం మన మాతృభూమి. ఇట్టి పవిత్రభూమిని మీరెన్నటికీ మరువకూడదు.**

(స.సా.మే. 2002 పు. 152/153)

భారతీయ సంస్కృతి

(చూ॥ రాముని ఆదర్శము)

మరణము

(చూ॥ తల్లితండ్రులు)

మానవతా విలువలు

(చూ॥ భారతదేశము, హ్యూమానిటి)

మానవ ధర్మము

"శాంతి, సహనం, సత్యం, దయ, సానుభూతి, త్యాగం... ఇలాంటి సద్గుణాలను పోషించుకోవడమే **మానవధర్మం.** అయితే, సమాజంలో కూడా మానవధర్మాన్ని అనుసరించ వలసియుంటుంది. నీకేది మంచిదని అనుకుంటున్నావో అది ఇతరులకు కూడా మంచిదని, అందరికీ మంచియే జరగాలని భావించు. నీకు ఏది చెడ్డదనిపిస్తుందో ఇతరులకు కూడా అది చెడ్డదే అని, ఎవ్వరికీ చెడు జరుగకూడదని భావించు. ఈ ప్రకారం వైయక్తిక ధర్మం సామాజిక ధర్మంగా పరిణమిస్తుంది.

(స.సా. మే. 2002 పు. 157/158)

యుక్తి ప్రయుక్తులు

(చూ॥ రాముని ఆదర్శము)

రామనామము

దైవనామాన్ని ఉచ్చరించడానికి భయమెందుకు? వీధివీధిలోనూ, వాడవాడలోనూ దైవనామాన్ని చాటండి. రామనామంగాని, కృష్ణనామం గాని, శివనామంగాని... మీకు ఏ నామం ఇష్టమైతే ఆ నామాన్ని స్మరించండి. ఈనాడు భగవన్నామస్మరణ సన్నగిల్లడంచేతనే ఇంటింటి యందు చిక్కులు బయలుదేరుతున్నాయి, అన్న దమ్ములమధ్య కూడా కలహాలు ప్రారంభమౌతున్నాయి. కారణమేమిటి? హృదయంలో పవిత్రత లోపించడంచేత బయటినుండి అపవిత్రత ప్రవేశిస్తున్నది. అందరూ ధనంకోసం, పదవుల కోసం ప్రాకులాడుతున్నారు. ఏమిటీ ధనం? ఏమిటీ పదవులు? ఇవి మనలను రక్షించగలవా? ఎంతమంది ధనవంతులు లేరీ ప్రపంచంలో! ఎంతమంది అధికారులు లేదీ ప్రపంచంలో! వారేమైనా సుఖశాంతులను పొందగల్గుతున్నారా? లేదు. లేదు. **మానవునికి సుఖశాంతులను ఆనందాన్ని అందించేది భగవన్నామ స్మరణ ఒక్కటే. భగవన్నామాన్ని అలక్ష్యం చేసేవారికి అధోగతి తప్పదు.**

"ఓం నమశ్శివాయ" అనే పంచాక్షరీ మంత్రానికి 'మ' కారము ప్రాణసమానం. దానిని తొలగిస్తే అది 'నశ్శివాయ' అవుతుంది; అనగా, అమంగళకరమై పోతుంది. అట్లే, "ఓం నమో నారాయణాయ" అనే అష్టాక్షరీమంత్రానికి 'ర' కారము ప్రాణ సమానం. 'ర'కారము లేకపోతే అది కూడా అమంగళకరమైపోతుంది. పంచాక్షరీ మంత్రానికి ప్రాణసమానమైన 'మ'కారము, అష్టాక్షరీమంత్రానికి ప్రాణసమానమైన 'ర'కారము... ఈ రెండింటి చేరికచేత ఏర్పడినదే రామనామము.

విద్యార్థులారా ప్రజలారా! భక్తులారా! భగవన్నామస్మరణ తప్ప మిమ్మల్ని రక్షించేది మరొకటి లేదు. ధనము, పదవులు ఈనాడు వస్తాయి, రేపు పోతాయి. వాటికోసం మీరు ప్రాకులాడకూడదు. ఎవరికైనా అధికారబలము రావచ్చును. దేనివల్ల? రాజకీయాలవల్ల. అలాంటి అధికారం ఎంతకాలముంటుంది? ఊపితే పోతుంది. కనుక, రాజకీయాలవల్ల లభించే అధికారంకోసం ప్రాకులాడవద్దు. ఎవరి హృదయంలో భగవన్నామం నిండియుంటుందో వారే నిజంగా ధన్యులు, పుణ్యులు. ఇష్టం లేనివారు వద్దని చెప్పవచ్చును. రాముడే లేడని మీతో వాదించవచ్చును. "రాముడు నీకు లేకపోవచ్చును. కాని, నాకున్నాడు. నా రాముడు లేడనటానికి నీవెవరు?" అని వారికి మీరు బుద్ధి చెప్పాలి. **ఎలాంటి పరిస్థితిలోనూ భగవన్నామ స్మరణను మాత్రం వదలకండి. 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనం' చేయండి.**

రామ రామ రామ సీతా
రామ రామ రామ సీతా

1. శ్రీమద్రవికులమందు జనించి
   సీతాదేవిని ప్రీతి వరించి
   ప్రేమ నహల్యా శాపము దీర్చి
   ప్రియభక్తుల రక్షించిన శ్రీరఘు ॥రామ॥
2. గురునాజ్ఞను వనమందొనరించి
   గుహుని భక్తి కానందము చెంది
   పరమాదరమున భరతుని గాంచి
   పాదుక లొసగిన పావనచరితుడు ॥రామ॥
3. ఖరదూషణాది దనుజుల ద్రుంచి
   కరుణ జటాయువు గతి సవరించి
   శరభంగాది మునీంద్రుల బ్రోచి
   శబరిఫలమ్ములు ప్రేమ భుజించిన ॥రామ॥
4. ముందుగ హనుమంతుని దీవించి
   ముదమలరగ రవిసుతు పాలించి
   చెంగిన కినుకతొ వాలిని ద్రుంచి
   చేరిన వానర వీరుల బ్రోచిన ॥రామ॥
5. రావణాది సురవైరుల ద్రుంచి
   రమణితోడ సాధుల పాలించి

దేవతలెల్ల నుతింపగజేసి
దేవి గూడి పురి జేరిన శ్రీరఘు ॥రామ॥

6. నిజసహోదరులు నిను సేవింపగ
నిన్ను కూడి ప్రజలెల్ల సుఖింపగ
అజహరాది సురులెల్ల నుతింపగ
ఆనందముతో నయోధ్యనేలిన ॥రామ॥

రామనామమను ప్రసాదమిదిగో! రండి భక్తురాలా!
భూమిలొ దొరకెడి ప్రసాదములు దిని
పామరులై చెడిపోవకురండీ ॥రామ॥
వేదసారమను గోధుమపిండిలొ
వేదవాక్యమను క్షీరమె బోసీ
ఆధారమైన పెద్ద భాండము దీసీ
ఆదిమునులు దీని పాకము బట్టిరి ॥రామ॥
నిబద్ధియను కండచక్కర దెచ్చీ
సుబుద్ధియను యావు నెయ్యే వేసి
అబద్ధమనియెటి మలినము దీసి
ఆదిమునులు దీని పాకము బట్టిరి ॥రామ॥

(స.సా.మే. 2002 పు 146/147)

రామబ్రహ్మం

(చూ॥ తల్లి తండ్రులు)

రామరావణ యుద్ధము

రాముడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు కదా! మరి తాను కూడా ఎందుకిన్ని కష్టాలను అనుభవించవలసివచ్చింది? అని మీరు ప్రశ్నించవచ్చు. **భగవంతుడైనప్పటికీ శరీరమును ధరించిన తరువాత ప్రవృత్తి ధర్మాన్నే అనుసరించాలి. అవతారపురుషులు కొన్ని సమయములందు మాత్రమే తమ దైవత్వాన్ని వెల్లడి చేస్తారుగాని, మిగిలిన అన్ని సమయములందు మానవత్వపు ప్రవృత్తినే ప్రకటిస్తుంటారు. రాముడు మానవాకారము ధరించినప్పటికీ తాను మానవుడు కాదనే సత్యము తనకు తెలుసు. అయితే, శారీరకంగా లోకానికి ఆదర్శమునందించే నిమిత్తం తాను కూడా ఒక సామాన్య మానవునివలె మాయచేత కప్పబడినట్లు, భార్యావియోగంతో కుమిలిపోయినట్లు, యుద్ధం చేసి విజయం సాధించినట్లు నటిస్తూ వచ్చాడు. సత్యాసత్యములకు, ధర్మాధర్మములకు, మంచిచెడ్డలకు మధ్య జరిగిన సంఘర్షణే రామరావణ యుద్ధం.**

(స.సా. మే. 2002 పు. 155)

రామాయణము

(చూ॥ ఈషణత్రయము, ఊర్మిళ, భారతదేశము)

రాముడు

(చూ॥ ఊర్మిళ, బింబము - ప్రతిబింబము, సుమిత్ర)

రాముని ఆశయము

ఒకనాడు తెల్లవారు ఝామున మూడు గంటలకు దశరథునికి ఒక పీడకల వచ్చింది. ఆ సమయంలో వచ్చిన స్వప్నం నిజమౌతుందని దశరథుని విశ్వాసం. తాను వృద్ధుడై పోయినట్లు, తన చేతులు, కాళ్ళు వణుకుతున్నట్లు అనేక అపశకునాలు కనిపించాయి. చాలా బాధపడుతూ లేచాడు. "ఇంక నేనెంతో కాలం ఉండను. కనుక, రామునికి వెంటనే పట్టాభిషేకం చేయాలి. దీనికి ఏర్పాట్లేమీ అవసరం లేదు" అని అప్పటికప్పుడు సంకల్పించుకున్నాడు. వశిష్ఠులవారిని సంప్రదించి ఆయన అనుమతి పొందాడు. రాముణ్ణి పిలిపించి **"రామా! రేపటిదినం నీకు పట్టాభిషేకం చేయాలని సంకల్పించుకున్నాను. సిద్ధంగా ఉండు" అన్నాడు. రాముడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకుడు. అయినప్పటికీ తండ్రిమాటకు ఎదురు చెప్పడం మంచిది కాదని కొద్దిసేపు యోచించి "నాన్నా! భరత శత్రుఘ్నులు ఇక్కడ లేరు కదా! వాళ్ళు కూడా రావాలి కదా!"** అన్నాడు. "అది నీకనవసరం. నా ఆజ్ఞను నీవు శిరసావహించు" అన్నాడు దశరథుడు. అప్పుడు రాముడు **"మేము నల్గురమూ**

లక్ష్మణుడు

యజ్ఞపాయసమునుండి పుట్టాము, మా నల్గురికీ నామకరణం, అక్షరాభ్యాసం, ఉపనయనం, వివాహాలు సమానంగా ఒకేరోజున చేశారు. మరి ఇప్పుడు నాకు ఒక్కనికే పట్టాభిషేకం ఎందుకు చేయాలి? ఒకే పర్యాయం మా నల్గురికీ పట్టాభిషేకం చేయండి" అని పలుకగా దశరథుడు "నాయనా! రాజ్యం ఒక్కటే. కనుక, రాజు కూడా ఒక్కడే ఉండాలి. నలుగురికీ పట్టం కట్టడానికి వీలుకాదు'' అన్నాడు. ''రాజ్యాన్ని నాల్గుభాగాలుగా విభజించి, మా నల్గురికీ ఒకే పర్యాయం పట్టాభిషేకం చేయవచ్చు'' అన్నాడు రాముడు. దశరథునికి తల తిరిగింది. "రామా! నీవు కొద్దిసేపు బయటికి వెళ్ళు'' అన్నాడు. రాముణ్ణి పంపించి, వసిష్ఠులవారిని పిలిపించి ఆయనతో ఈ విషయాన్ని చర్చించాడు. వసిష్ఠులవారు రామునికి నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. "రామా! తరతరములనుండి మన రాజ్యం విభజనకు గురి కాకుండా ఒక్కరి ఆధిపత్యంలోనే ఉంటూవచ్చింది. **ఇప్పుడు నీవు రాజ్యాన్ని విభజించాలంటున్నావు. అది శ్రేయస్కరం కాదు" అన్నాడు. "విభజించనక్కర్లేదు. ఒక్కొక్క ప్రాంతాన్ని ఒక్కొక్కరు పరిపాలించవచ్చు" అన్నాడు రాముడు. కాని, దశరథుడు అంగీకరించలేదు.**

రాముడు సమత్వమునకు, సాంఘికన్యాయానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చాడు. అందరూ సమత్వంగా జీవించాలి. హెచ్చుతగ్గులు ఏమాత్రం ఉండకూడదు, భేదములకు అవకాశం అందించకూడదు. ఇదీ రాముని ఆశయం. కాని, దశరథుడు వృద్ధాప్యంవలన రాముడు చెప్పే మాటలను అర్థం చేసుకునే స్థితిలో లేడు. అందుచేత, రాముడు "భరత శత్రుఘ్నులు కూడా రావాలి'' అన్నాడు. వాళ్ళు రావడానికి కనీసం పదహైదు రోజులు పడుతుంది. కాబట్టి, ఈలోపల తగినరీతిగా యోచన చేసుకోవచ్చని భావించాడు. అప్పటికి పట్టాభిషేకం నిలిచిపోయింది. రాముని శక్తిసామర్థ్యములు, యుక్తిప్రయుక్తులు చాలా చిత్రమైనవి, విచిత్రమైనవి. అందరూ సమత్వంగా ఉండాలన్నదే భారతీయ సంస్కృతియొక్క ప్రధాన సందేశం. **"సర్వే జనాః సుఖినో భవంతు", "లోకాస్సమస్తాః సుఖినో భవంతు". అందరూ సుఖంగా ఉండాలి. ఇలాంటి ప్రాచీన సంస్కృతిని రాముడు పాటిస్తూ వచ్చాడు.** ఈనాడు అనేకమంది రామాయణం చదువుతున్నారు; పెద్దపెద్ద తలదిండ్ల మాదిరి ఉండే పుస్తకాలను తెచ్చి పెట్టుకుంటున్నారు. శ్లోకాలను కంఠస్థం చేస్తున్నారు. కాని, సారాన్ని కించిత్తైనా గ్రహించడం లేదు.

(స.సా.మే. 2002 పు. 142/143)

లక్ష్మణుడు

(చూ॥ ఊర్మిళ, బింబము-ప్రతిబింబము, సుమిత్ర)

లీలానాటకము

(చూ॥ ఊర్మిళ)

విరాట్ పురుషుని విశ్వరూపము

"ఋగ్వేదంలో చెప్పబడ్డ విరాట్ పురుషుని సహస్ర శీర్షములు, సహస్ర బాహువులు అంటూ వర్ణించబడి ఉన్న విషయాన్ని స్వయంగా మీరు అర్థం చేసుకోగలగటం కోసమే నాతో మిమ్మల్ని యిలా వివిధ ప్రదేశాలకు తీసుకు వెళ్తున్నాను. (కస్తూరిని కూడా తీసుకు వెళ్ళారు) ఇదే విరాట్పురుషుని విశ్వరూపం. చూడండి! వృత్తాకారపు పరిధిలోని ప్రజలు కేంద్ర బిందువు వైపు అంటే మూలం వైపు ఎలా పరుగు లిడివస్తున్నారో'' అన్నారు బాబా.

(శ్రీ.స.ప్రే.స్ర.పు. 269)

వశిష్ఠుడు

(చూ॥ రాముని ఆశయము)

వాల్మీకి

(చూ॥ పుట్టపర్తి)

విశ్వామిత్రుడు

(చూ॥ బింబము-ప్రతిబింబము)

విశ్వాసము

భగవంతుని చరిత్రను వర్ణించాలంటే సాధ్యం కాదు. పానకంలోని పంచ దారవలె ప్రతి మానవుని యందు దైవత్వ మున్నది. వేదము "రసోవైసః" అన్నది. భగవంతుడు రసస్వరూపుడై ప్రతి మానవుని యందున్నాడు. ఆ రసమే లేకపోతే మానవుడు నీరసించి పోతాడు. దివ్యత్వం తనయందే ఉందన్న విశ్వాసాన్ని మానవుడు పెంచుకోవాలి. విశ్వాసం గలవానికి ఇంకొకరి సహాయం చేస్తుంటాడు. విశ్వాసం లేనివానికి ఎంతమంది సహాయం చేసినా ప్రయోజనముండదు. Dead body కి Decoration (నిర్జీవమైన దేహానికి అలంకరణ) ఉన్నప్పుడే ఏదైనా చేయవచ్చు. అలాంటి విశ్వాసం వల్లనే సావిత్రి గతించిన తన పతిని బ్రతికించుకోగల్గింది. చంద్రమతి భయంకర మైన దావాగ్నిని చల్లార్చ గల్గింది. సీత అగ్నిగుండంలో దూకి తన పవిత్రతను నిరూపించుకుంది. దమయంతి కామాంధుడైన కిరాతకుణ్ణి భస్మంగావించింది. ఇలాంటి మహాపతివ్రతలకు జన్మభూమి మన భరతభూమి.

(స.సా.జూ.2002 పు. 185/186)

వేసవితరగతులు

(చూ॥ తల్లి తండ్రులు)

వైదేహరాజు (జనకమహారాజు)

(చూ॥ ఊర్మిళ)

శంఖుస్థాపన

"నేను శంఖుస్థాపనకు అంతగా ప్రాధాన్యత ఇవ్వను. ప్రారంభపు తేదీని ముందుగానే నిర్ణయిస్తాను. అదే ప్రధానం."

(స.సా.జూ. 2002 పు. 172)

శక్తిసామర్థ్యములు

(చూ॥ రాముని ఆదర్శము)

శత్రుఘ్నుడు

(చూ॥ ఊర్మిళ, సుమిత్ర)

షడ్గైశ్వర్యసంపన్నుడు

(చూ॥ సమత్వము)

సంకల్పము

నా సంకల్పము, పిలుపులేనిదే ఎవ్వరూ పుట్టపర్తికి రాలేరు. నన్ను చూడటానికి 'సిద్ధంగా' ఉన్న వ్యక్తులను మాత్రమే నేను పిలుస్తాను. కాని ఈ సిద్ధంగా ఉండటం అనేది ఆయా వ్యక్తులకు వేరువేరు స్థాయిలలో ఉంటుంది.

(శ్రీ.స.ప్రే.స్ర.పు. 372)

(చూ॥ కస్తూరి, దివ్య ప్రకటనలు, సత్యం శివం సుందరం)

సంపూర్ణ జీవనము

ప్రతి ఒక్కటియు ఈశ్వరార్పణ యొనర్చిన, బాధలకు గానీ, దుఃఖములకు కానీ, సంతోషమునకు కానీ, స్థాన ముండదు. అట్లు ఏదీ తనకు సంబంధము లేనట్లుండిన శాంతికి భంగము లేదు. అంతానాది, నేను, నావారు, నీది, నీవారు అను వ్యత్యాస భావనలు మనమున కదిలినపుడే శాంతికి అన్ని విధములైన ఆటంకములు అడ్డు వచ్చును. అట్టి **ఈశ్వరార్పణ చేయుట కూడా ఆత్మవిశ్వాసముతో చేరిన ప్రేమ కావలెను. అదియే భక్తి.** దానిని నిత్యము క్రమముగా తప్పక ఆరాధించుచూ ఆనందించు చుండవలెను. దానితోపాటు సమర సమగు మనము కలిగి యుండవలెను. **ఆధ్యాత్మిక జీవనమునది వ్యర్థమైన సంభాషణకాదు.** ఆత్మయందు నిజముగా జీవించుటే. అది నిర్మలమైన ఆనందముయొక్క ఉత్కృష్టనుభవమే. **అదియే సంపూర్ణ జీవనము.**

(స.సా.న 1989 పు. 304)

సంస్కృతము

సంస్కృతము

(చూ॥ కస్తూరి)

సనాతన సారథి

(చూ॥ కస్తూరి)

సమత్వము

"సమత్వాన్ని పోషించుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. అందుచేతనే, నాకు ఎప్పుడూ ఆనందమే. మీరేమన్నా "సంతోషం, సంతోషం'' అంటాను. "స్వామీ! నా భార్య చనిపోయింది'' అంటే, "సంతోషం'' అంటాను. "స్వామీ! నా కాలు విరిగింది'' అంటే "సంతోషం'' అంటాను. "ఏమి, నా కాలు విరిగితే స్వామికి సంతోషమా!'' అని మీరు అనుకోవచ్చును. కాని, నాకు అన్నింటికీ సంతోషమే.''

సమత్వమనేది లౌకికంగా, వ్యావహారికంగా అనుభవానికి తప్పక వస్తుంది. లౌకికంగా కూడా అంతే. ఉదాహరణకు, బిడ్డ పుట్టినప్పుడు నవ్వుతావు, వృద్ధుడు మరణించినప్పుడు ఏడుస్తావు. పుట్టిన బిడ్డ నవ్వమని చెప్పలేదు, మరణించే వృద్ధుడు ఏడ్వమని చెప్పలేదు. ఈ రెండూ నీ **'అటాచ్‌మెంట్'** వలన వచ్చినవే. ఇప్పుడు నీకు, నీ ప్రక్కనున్న టీచర్‌కు విరోధం కల్గిందనుకో. అప్పుడు నీవేమి చేయాలి? విరోధమును పెంచుకోకూడదు. 'నాలో ఉన్న పంచభూతములే ఇతనిలోనూ ఉన్నవి, ఏమీ తేడా లేదు' అని అనుకున్నప్పుడు సమత్వము ప్రాపంచికంగా కూడా అనుభవానికి వస్తుంది.

"మానవునికి భౌతిక, మానసిక, ఆధ్యాత్మికతత్త్వములు ప్రధానమైనవి. 'అటాచ్‌మెంట్' అనేది భౌతికము (Physical). మానసికమునకు సంబంధించినవి సత్వరజస్తమో గుణములు. మూడవదైన ఆధ్యాత్మికము ఆత్మసంబంధమైనది. ఆత్మయే ఈశ్వరత్వం. ధర్మము, ఐశ్వర్యము, యశస్సు, శక్తి, జ్ఞాన, వైరాగ్యములే ఈశ్వర లక్షణములు. కనుకనే, **ఈశ్వరుణ్ణి షడైశ్వర్యసంపన్నుడంటారు.** ఈశ్వరత్వంతో కూడిన మానవునికి ఉండవలసినవి ఇట్టి ఉత్తమగుణములేగాని, ఉత్తగుణములు, చెత్తగుణములు కాదు.''

(స.సా.మే 2002 పు. 156/157)

(చూ॥ రాముని ఆశయము)

సాంఘిక న్యాయము

(చూ॥ రాముని ఆశయము)

సాధన

(చూ॥ హృదయావేదన)

సార్థకము

(చూ॥ తల్లి తండ్రులు)

సునాయాస మరణము

(చూ॥ తల్లి తండ్రులు)

సుమిత్ర

కౌసల్య చాలా గుణవంతురాలు. ఆమె పట్టపు రాణి కాబట్టి, అందరూ ఆమె ఆజ్ఞను శిరసా వహించేవారు. ఇంక, దశరథుని మూడవ భార్యయైన కైకేయి ఆజ్ఞకు ఏమాత్రం అడ్డు లేదు. దశరథుడైనా సరే, కూర్చో అంటే కూర్చోవాలి. లెమ్మంటే లేవాలి. ఈవిధంగా, ఆమె దశరథుణ్ణి తన చేతిలో పెట్టుకొని నాటకమాడుతూ వచ్చింది. కాని, సుమిత్రను పట్టించుకునేవారు ఎవ్వరూ లేరు. రాముడు పధ్నాల్గు సంవత్సరాలు అరణ్యవాసం చేయాలని కైకేయి కోరడంతో పట్టాభిషేకం జరగలేదు. రాముడు అరణ్యానికి బయలుదేరే ముందు తల్లియైన కౌసల్యకు నమస్కారం చేయడానికి వెళ్ళాడు. ఆమె ఘొల్లున ఏడుస్తున్నది. అంతఃపురమంతా ఏడ్పులే! ఇంక,

లక్ష్మణుడు సుమిత్రకు నమస్కారం చేయడానికి వెళ్ళాడు. అప్పుడామె "నాయనా లక్ష్మణా! నీవు అరణ్యానికి వెళుతున్నానని భావించవద్దు. అది అరణ్యం కాదు. సీతారాములు లేనటువంటి అయోధ్యయే అరణ్యం. సీతారాములు నివసించే అరణ్యమే అయోధ్య. కాబట్టి, నీవు అరణ్యంలో ఉన్నప్పటికీ అయోధ్యలోనే ఉన్నట్లుగా భావించు. రాముడే నీ తండ్రి. సీతయే నీ తల్లి. వారి సేవలకు ఎట్టి ఆటంకమూ కల్గకుండా చూసుకో" అని హితబోధ చేసింది. ఏ తల్లియైనా ఈరీతిగా చెప్తుందా? "దశరథుడు" కైకేయికిచ్చిన వరముననుసరించి రాముడు మాత్రమే అరణ్యానికి వెళ్ళాలి. నీవు వెళ్ళనక్కర్లేదు" అని తాను లక్ష్మణుణ్ణి అడ్డుకో వచ్చును. కాని, **సుమిత్ర ఆవిధంగా చేయలేదు. మాతృమూర్తియందు ఉండవలసిన సుగుణములన్నీ ఆమె యందు గోచరించాయి.**

ఇది చైత్రమాసం, రాముడు అవతరించినది ఈనెలలోనే. చైత్రశుద్ధనవమిరోజే శ్రీరామచంద్రుడు జన్మించాడు. దశరథమహారాజుయొక్క మువ్వురు భార్యలలో **రెండవ భార్యయైన సుమిత్ర గురించిన ప్రస్తావన రామాయణంలో మనకంతగా కనపించదు.**

రాముని వల్ల **కౌసల్యకు సత్కీర్తి కల్గింది. "కౌసల్యాసుప్రజా రామా..." అని సుప్రభాతంలో కౌసల్య పేరే మొట్టమొదట వస్తుంది.** కైకేయి తన కుమారుడైన భరతుడే రాజు కావాలని ఆశించింది. కాని, **సుమిత్రకు ఎలాంటి వాంఛలూ లేవు. ఆమె సద్గుణవంతురాలు, సదాచారసంపన్నురాలు, మితభాషిణి, హితభాషిణి, పేరుకు తగ్గ ప్రవర్తన గలది.** ఆమె కుమారులైన లక్ష్మణ శత్రుఘ్నులకు రాజ్యాధికారం దక్కే అవకాశం లేదు. **సుమిత్రకు అలాంటి కోరిక కూడా లేదు. ఆమె తన కుమారులిద్దరినీ సేవామార్గంలో ప్రవేశపెట్టి యావత్ ప్రపంచానికే గొప్ప ఆదర్శాన్ని అందించింది. "శ్రీరామచంద్రుడు రాజైనప్పుడు లక్ష్మణుడు అతనికి ప్రధానమైన సేవకుడుగా ఉండాలి" అని ఆశించింది. "యజమాని ప్రక్కనే సేవకుడుంటాడు. నా కుమారునికి రామసేవయే ప్రధానమైనది. రామసేవలో లక్ష్మణుడు తరించాలి" అని ఆశించింది. అదేవిధంగా, శత్రుఘ్నుడు భరతుణ్ణి సేవించాలని ఆశించింది.** సేవలో ఉన్న పవిత్రతను గుర్తించి తన కుమారులను సేవకే అంకితం చేసింది. మీరు రామచరిత్రను చక్కగా విచారణ చేసినప్పుడు సుమిత్రయొక్క భావములెంత విశాలమైనవో, ఎంత ఘనమైనవో, ఎంత ఆదర్శవంతమైనవో అర్థం చేసుకోగలరు.

రాముడు అరణ్యానికి బయలుదేరేటప్పుడు కౌసల్య చాలా దుఃఖించింది. కాని, సుమిత్ర మాత్రం కన్నీరు కార్చలేదు. పైగా కౌసల్యను ఓదార్చుతూ **"అక్కా! లక్ష్మణుడు రామునికి సేవ చేయడానికి వెళుతున్నాడు. రాముణ్ణి కంటికి రెప్పవలె చూసుకుంటాడు. రామునికి ఎట్టి ఇక్కట్లుగాని, ఆపదలుగాని సంభవించవు." అని ధైర్యం చెప్పింది. "లక్ష్మణుడు రామునికి సేవ చేయడానికే పుట్టాడు. అతడు రాముని చేతిలో ఒక పనిముట్టు. కాబట్టి, రాముడు తనే పనిముట్టును తనవెంట తీసుకువెళుతున్నాడు. అది నేను పంపడమూ కాదు. లక్ష్మణుడు వెళ్ళడమూ కాదు. లక్ష్మణుణ్ణి తన వెంట తీసుకువెళ్ళడానికి రామునికి అధికారమున్నది. అది అతని హక్కు." అని భావించింది.** కనుకనే, ఆమె లక్ష్మణుణ్ణి ఆశీర్వదిస్తూ "నాయనా! నీవు సీతారాములను చక్కగా సేవించు" అని బోధించింది. లక్ష్మణుడు సదా రాముణ్ణి అనుసరించినట్లుగా శత్రుఘ్నుడు ఎల్లప్పుడు భరతునివెంట ఉండేవాడు. **భరతుడు తన మేనమామయైన కేకయరాజు ఇంటికి బయలుదేరేటప్పుడు శత్రుఘ్నునికి ఉండమని గాని, రమ్మనిగాని ఎలాంటి సమాచారమూ అందలేదు. కాని, భరతునికి సేవ చేసే నిమిత్తం అతని వెంట వెళ్ళడానికి శత్రుఘ్నుడు తనంతట తానే సంసిద్ధుడయ్యాడు. ఈరీతిగా, తల్లియైన సుమిత్ర చేసిన సద్బోధల ఫలితంగా లక్ష్మణ శత్రుఘ్నులు సేవకే తమ జీవితాన్ని అంకితం గావించారు.**

(స.సా.మే. 2002 పు. 143/149)

సేవ

(చూ॥ సుమిత్ర)

సేవకుడు

(చూ॥ ఈశ్వరాంబ)

స్వప్నము

(చూ॥ రాముని ఆశయము)

స్వామి హృదయము

(చూ॥ హృదయావేదన)

హనుమంతుడు

(చూ॥ ఊర్మిళ)

హృదయావేదన

ఆనందప్రాప్తి, మోక్షప్రాప్తి చేకూరవలెనని నోటితో పలుకుచూ, కాగితముపై వ్రాసినంత మాత్రాన ఫలితం ఉండదు. దానికి క్రుంగి, ''అయ్యో, స్వామి అనుగ్రహించలేదు'' అని నిరాశకు చోటిచ్చిన లాభం లేదు. స్వామి అనుగ్రహమును సంపాదించే నిమిత్తం సాధన సలుపవలెను. **స్వామి హృదయం నవనీతము వంటిదే,** సరే! కాని, వెన్న అయినా కరగవలెనంటే, కొంచెం వేడి చూపించవలెను కదా! ఏమిటా వేడి? **హృదయావేదన. భగవత్ కటాక్షమును, కరుణను పొందవలెనన్న ఆవేదనతో పిలువవలెను. ఆవేదనయే భగవంతుణ్ణి కరిగించి కదిలించే శక్తి గల వేడి.** ఎన్ని నవరాత్రులు, ఎన్ని శివరాత్రులు గడచినాయో! ఇంకా మీలో ఆ వేడి బయలుదేరలేదంటే, జీవితమునే ఒక నిరంతర రాత్రిగా గడుపుతున్నారన్నమాట. రాత్రి జీవితమును త్యజించి, జయించి నిరంతరం పగటి జీవితమును గడుపవలెననే ఆశతో **సాధన** చేయండి. **తేజోవంతమైన జీవితమే పగటి జీవితము. అదే యోగుల జీవితము.**

(స.సా.మే 2002 వెనుక కవరు పుట)

హ్యూమానిటి (Humanity)

హ్యూమానిటి (Humanity) అనేది ఒక ప్రవాహం లాంటిది. (Human values) (మానవతా విలువలు ఆకాశంలో ఉన్న మేఘాల వంటివి. అవి వర్షించినప్పుడు ప్రవాహం జోరుగా సాగుతుంది. ఆసమయంలో ఆనందమనే చల్లని గాలి వీస్తుంది.

(స.సా.జూ. 2002 పు. 169)

సాయిత్రీ

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

తెలిసి, శ్రవణ, మనన, నిధిధ్యాసనములతో సాయిత్రీ

సాయి ఈశ్వర గాయత్రీ	"ఓం సాయీశ్వరాయ విద్మహే। సత్య దేవాయ ధీమహి। తన్నః సర్వః ప్రచోదయాత్॥"	= సాయియే ఈశ్వరుడు. అసత్య స్వరూపుని ధ్యానించుచున్నాము. ఆ పరమాత్మమమ్ము ముక్తి మార్గంలో నడిపించ ప్రార్థన. ప్రంచముఖీ గాయత్రీ హృదయంతో సాయి రూపాన్ని ధ్యానించుట	ప్రాతఃకాలము 4 నుంచి 10 వరకు
సాయి సూర్య గాయత్రీ	"ఓం శ్రీ భాస్కరాయ విద్మహే। సాయి దేవాయ ధీమహి। తన్నః సూర్యః ప్రచోదయాత్"	= సాయి స్వప్రకాశ దివ్యమూర్తి. ఆ సాయి సూర్యునిని ధ్యానిస్తూ, మూఢజ్ఞాన అంధకారాన్ని తొలగించమని ప్రార్థిస్తున్నాము. స్వర్ణ ఆదిత్య రధాసీనువైయున్న సాయి సూర్యుని ధ్యానిస్తు	ప్రాతఃకాలము ఉ॥ 10 నుంచి సా॥ 4 గం॥ వరకు
సాయి హిరణ్య గర్భ గాయత్రీ	"ఓం ప్రేమాత్మనాయ విద్మహే। హిరణ్య గర్భాయ ధీమహి। తన్నః సత్యః ప్రచోదయాత్"	= దివ్య ప్రేమమూర్తిసాయి. ఆ హిరణ్య గర్భాని ధ్యానిస్తున్నాము. ఈ సత్యావతారి - మమ్ముతరింప చేయుగాక! హిరణ్యగర్భ లింగోద్భవ రూపాన్ని ధ్యానం.	సాయం కాలం మ. 4గం. రా. 10 గం.
అద్వైత సాయి పంచాక్షరి	సాయి శివో ఽహం	= నేను సాక్షాత్తు సాయిశివుడనే అయి ఉన్నాను - శివలింగ మధ్యలో సాయితో తాదాత్మ భావనతో ధ్యానం.	అంతర్ముఖ భావన

ధ్యానించి, స్మరించి భగవాన్
శ్రీసత్యసాయి
సాక్షాత్కారము పొంది తరించుదాము

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

శ్రీ సత్యసాయి ప్రభోదామృతం తప్పు ఒప్పుల పట్టీ

పుట	కాలం	పంక్తినెం.	తప్పు	ఒప్పు
xxix	12		చాతుర్వర్ణవ్యవస్థ	చాతుర్వర్ణ్యవ్యవస్థ
13	2	15	అతి	అది
14	1	3	సాధించుటే	సారించుటే
56	1	1	జాన్మాంతర	జన్మాంతర
61	2	3	షడ్ఫైశ్వర్య	షడైశ్వర్య
108	1	3	(చూ॥లోకనాటకము) జేర్చు	
148	1	12	(చూ॥ పరమావధి, భక్తి)	(చూ॥ భక్తిపరమావధి)
214	1	32	కురుక్షత్ర	కురుక్షేత్ర
215	2	9	పాద్భ్యగ్ం	పాద్భ్యగ్ం
236	1	8	ఇవనీనయు	ఇవన్నియు
	1	14	తీయాలంటె	తీయాలంటే
			ముల్లె	ముల్లే
		24	మూలధారమైన	మూలాధారమైన
	2	5		'చల్లి' తరువాత చేర్చుము"సుఖసం తోషములను పంటను పండించుకొ నును పాపబీజము లనుచలి"
256	1	26	నిందించేవాడు	నందించేవాడు
274	1	13	అనుభవించునటు	అనుభవించుట
278	2	25	చాతుర్వర్ణవ్యవస్థ	చాతుర్వర్ణ్యవ్యవస్థ
279,280,281 పుట		సూచిక	చాతుర్వర్ణవ్యవస్థ	చాతుర్వర్ణ్యవ్యవస్థ
291	2	10	కనుపించదు	కనిపించవు
		16	హింసించినవాని	హింసించనివాని
		17	హింసించినవాని	హింసించనివాని
367	1	26	చరయంచువారని	చరియించువారల
		29/30 మధ్య	"మంచి చెడ్డలు కూడ మనసులో సమముగా భావించు చుండుటే భక్తినాకు"	జతచేయి
		30	నిష్టలతోటి	నిష్టలతోడ
	2	2/3 మధ్య	నెట్టికుచితము	మదికినే నేర్పకుందు
		3	చెడట	చెడుట
		4	(శ్రీ.స.పు.11)	(స.సా.వా॥ యు ఆసాపు31.....)
374	1	11	ప్రపాంచికమైన	ప్రాపంచికమైన
400	2	20	బృందవనానికి	బృందావనానికి

Edited by Foxit PDF Editor
Copyright (c) by Foxit Software Company, 2004 - 2007
For Evaluation Only.

409	1	18	ధరించనిదే	ధరించినదే
		24		'ఆకర్షింపజేస్తుంది' దీనికి ముందర 'కోమలత్వముతో' చేర్చు
410	2	17	ధర్మార్థకామ	ధర్మార్థకామ
411	1	4	వాధ్యు	వ్యాధు
		14	22/23	32/33
	2	25	నాశ్రయించబడి	నాశ్రయించండి
		29	అనుకోకండి	అనుకోండి
413	2	2	(చూ॥ద్వారములు)	(చూ॥నవద్వారములు)
458	1	15	వినయుండుగాక	సవినయుండుగాక
	2	19	పుణ్యను	పుణ్యమును
492	1	29	మానవశిరము	మానవశరీరము
547	2	6	స్వరూపిని	స్వరూపిణి
		24	సంతృత్తి	సంతృప్తి
554	1	28	ఐక్యమ.త్యంబు	ఐకమత్యంబు
567			ప్రహ్లాదుడు చూ॥ యాస్తికుడు - తీసివేయుము	
569	2	15	దైవమనే	దైవమునే
670	2	10	యువకులైన	యువకులైనమీరు
688	2	21	ఆస్థిక	ఆస్తిక
		23	ఇంతకాన్నా	ఇంతకన్నా
707	2	29	అమెహత్వాన్ని	అమోహత్వాన్ని
711	2	22	మిశ్శయ్యా	మెస్సయ్య
		24	జెరోసెలెమ్	జెరూసెలెమ్
		28	స్వభావముల కూడె	స్వభావములుకూడా
		29	జెరూసలమ్	జెరూసలెమ్
		29	జెరూసెలెమ్ తరువాత చేర్చు వశపర్చుకొన్నాడు అప్పటి నుంచి ఈ 'జరూసెలెమ్'	
826	2	17	ప్రవత్తు	ప్రమత్తు
850	1	14	మీతిమీరి	మితిమీరి
916	1	8	మానవకారము	మానవాకారము
		22	హక్కును	వాక్కును
943	2	31	మొట్టమొదటిగా	మొట్టమొదటిదిగా
948	1	17	రోగాలందరికీ	రోగులందరికీ
962	1	27	పిల్లవాని	పిల్లవానిని
967	2	10	పుచ్చుకొమ్మనాడు	పుచ్చుకొమ్మన్నాడు
1049	2	18	పితృత్తాని	పితృత్వాన్ని
1083	2	25	మానవతీతమైన	మానవాతీతమైన
1084	2	32	రూపిందించి	రూపొందించి
1122	2	5	వదడలను	వదలను